శ్రీవ్యాసమహర్షి ప్రణీతం

బ్రహ్మమహాపురాణం

ద్వితీయ భాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ బి. లక్ష్మణాచార్యులు

సంపాదకులు

'మహామహోపాధ్యాయ'

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2020

BRAHMAMAHAPURANAM
SECOND PART
(With Telugu Translation)

Translated by
Dr. B.Lakshmanacharyulu

Chief Editor
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No. 1380

First Print : 2020

Copies: 1000

Published by
Sri Anilkumar Singhal, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design and
D.T.P. Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.


Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు



శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు
(సలహామండలి)

అధ్యక్షులు

శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.యస్. గారు

కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు.

సభ్యులు

శ్రీ పి.బసంత్ కుమార్, ఐ.ఏ.యస్. గారు

సంయుక్తకార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి.

డా॥ కందాడై రామానుజాచార్యులు గారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల
హైదరాబాద్

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యం గారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ – హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణి గారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ గారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం – తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు గారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల – తిరుపతి

డా॥ కె.ప్రతాప్ గారు
విశ్రాంత ఆచార్యులు
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

కన్వీనర్

డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
ప్రత్యేకాధికారి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

పరిష్కరణ పరిషత్తు

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ. శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.వి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి

ఆచార్య శ్రీపాద సత్యనారాయణమూర్తి
విశ్రాంత ఉపకులపతి
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల,రాజమండ్రి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ, హైదరాబాద్

కన్వీనర్
డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

విషయానుక్రమణిక

బ్రహ్మమహాపురాణం - ద్వితీయభాగం - గౌతమీ మాహాత్మ్యం

తొలిపలుకు

భారతదేశం సనాతన ధర్మానికి నిలయమైంది. ధర్మమూలకమైన వేదాలు మనం పాటించదగిన ధర్మాలను నిరూపిస్తున్నవి. నిరూపించడమేకాక ప్రభువులాగా ఆ ధర్మాలను తప్పక ఆచరించాలని ఆదేశిస్తున్నవి. అందుకే వేదాలను ప్రభువుతో సమానమైనవిగా అభిజ్ఞులు వర్ణించారు.

వేదాలు వివరించిన ధార్మిక విషయాలనే పురాణాలు పేర్కొంటున్నాయి. అయితే అవి ప్రభువులాగా ఆజ్ఞాపించక మిత్రునిలాగా ప్రేమతో ఉపదేశిస్తాయి. అనేక కథల ద్వారా ధర్మతత్త్వాన్ని పాఠకుల హృదయాలలో హత్తుకొనేటట్లు బోధిస్తాయి.

అందువల్ల మన ప్రాచీనవాఙ్మయంలో పురాణాలు అతిముఖ్యమైనవిగా పరిగణింపబడుతున్నాయి. 'అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః' అన్నట్లు పదునెనిమిది పురాణాలను వ్యాసభగవానుడు రచించాడు.

తి.తి.దే. నిర్వహిస్తున్న పలు ధార్మిక కార్యక్రమములలో ధార్మిక గ్రంథప్రచురణ ఎంతో ప్రాధాన్యం వహిస్తున్నది. పూర్వం వ్యాసభాగవతం 14 సంపుటములుగానూ, వాల్మీకిరామాయణం 8 సంపుటములుగానూ వ్యాఖ్యానాలతో సహా భాగవతం ప్రాజెక్టు ద్వారా తి.తి.దే ప్రచురించింది.

ప్రస్తుతం పురాణ ఇతిహాస ప్రాజెక్టు ద్వారా పురాణాలన్నింటినీ తెలుగు అనువాదంతో సహా ప్రచురించాలని తి.తి.దే. నిర్ణయించింది. పలువురు ప్రసిద్ధ పండితులు అనువాద కార్యక్రమం చేపట్టి ఇందుకు సహకరించారు.

మొదట కూర్మపురాణం ముద్రితమై ఆవిష్కరింపబడింది. విష్ణుపురాణం, బ్రహ్మపురాణం-ప్రథమభాగం ముద్రణలో ఉన్నవి. ఇప్పుడు బ్రహ్మపురాణం రెండవభాగాన్ని ముద్రణకు యోగ్యంగా సిద్ధం చేయడమైనది.

ఈ పురాణాన్ని అనువదించిన పండితులు డా॥ బి. లక్ష్మణాచార్యులు గారినీ, దీనికి సంపాదకత్వం వహించిన ప్రాజెక్టు పూర్వ ప్రత్యేకాధికారి డా॥ సముద్రాల లక్ష్మణయ్యనూ అభినందిస్తున్నాము. దీనిని పరిష్కరించడంలో సహకరించిన పండితులకు మరియు పండిత పరిషత్తు సభ్యులకు మా అభివందనములు.

భగవదనుగ్రహంతో అష్టాదశపురాణాల ప్రచురణ త్వరలో సఫలమగుగాక! ఈ జ్ఞానయజ్ఞంలో పాల్గొన్నవారినందరినీ ఏడుకొండలప్రభువు అనుగ్రహించుగాక!

కె.యస్. జవహర్ రెడ్డి
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో ద్విజః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

వేదాంగాలు, ఉపనిషత్తులతో గూడిన నాలుగు వేదాలు గ్రహించినవాడైనా ఏ విప్రుడు పురాణజ్ఞానం లేనివాడో, అతడు విచక్షణుడు కానేరడు.

ఎవరు భారతదేశానికి చెందిన జ్ఞానవిజ్ఞానాలతో పరిచయం కావాలనుకొంటారో వారు తప్పక పురాణాలను పఠించాలి. కథాకథనం ద్వారా పురాణాలు మానవులు గ్రహించవలసిన పలువిషయాలను మిక్కిలి ఆసక్తిదాయకంగా నిరూపించాయి. వేదాలలో సూక్ష్మంగా ప్రతిపాదింపబడిన విషయాలను పురాణాలు విస్తృతంగా వివరించాయి.

మహాపురాణాలు, ఉపపురాణాలు అని పురాణాలు రెండు విధాలుగా ఉన్నాయి. పదునెనిమిది మహాపురాణాల నామాలను ప్రథమాక్షరాలతో ఈ క్రింది శ్లోకము నిర్దేశిస్తున్నది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగకూస్కాని పురాణాని పృథక్ పృథక్ ॥

మత్స్య-మార్కండేయ-భాగవత-భవిష్య-బ్రహ్మ-బ్రహ్మాండ-బ్రహ్మవైవర్త-విష్ణు-వరాహ-వామన-వాయు-అగ్ని-నారద-పద్మ-లింగ-గరుడ-కూర్మ-స్కాంద-పురాణాలను పై శ్లోకంలో సంగ్రహంగా ప్రతిపాదించడమయింది.

తిరుమల తిరుపతి దేవస్థానం మొదట భాగవతం ప్రాజెక్టు ఆధ్వర్యవంలో వ్యాసభాగవతాన్ని మూడు వ్యాఖ్యలతో పదునాల్గు బృహత్సంపుటాలుగా ప్రచురించింది. తదుపరి వాల్మీకిరామాయణాన్ని రెండు వ్యాఖ్యలతో ఎనిమిది సంపుటాలుగా ప్రకటించింది.

తర్వాత పురాణ-ఇతిహాసప్రాజెక్టును స్థాపించింది. తద్ద్వారా వ్యాసవిరచితమైన అష్టాదశపురాణాలను తెలుగు అనువాదంతో సహా ప్రచురించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికనుగుణంగా 50 మంది సుప్రసిద్ధ పండితుల నెన్నుకొని వారిద్వారా అనువాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇప్పటికి 3 లక్షల శ్లోకాలకు పైగా అనువాదం పూర్తి అయింది. అనువదించిన భాగాలను పరిష్కరించడానికి నిష్ణాతులయిన విద్వాంసులతో ఒక పరిష్కరణ పరిషత్తు గూడా ఏర్పాటు చేయించబడింది. ఆ పండితులు తమ పరిష్కరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

కూర్మపురాణం, విష్ణుపురాణం, బ్రహ్మపురాణం-ప్రథమభాగం వీటిని ముద్రణకు సిద్ధంచేసి సమర్పించడమయింది. అందులో కూర్మపురాణం ముద్రితమై 16-7-2019 గురుపూర్ణిమనాడు ఆవిష్కరింపబడింది. తక్కిన రెండు పురాణాలు ముద్రణలో ఉన్నాయి.

ప్రస్తుతం బ్రహ్మపురాణం రెండవ భాగం కూడా ముద్రణయోగ్యంగా సిద్ధమయింది. మొదటిభాగాన్ని ప్రఖ్యాత సంస్కృత విద్వాంసులు డా॥ అంబడిపూడి నాగభూషణంగారు, ఈ ద్వితీయభాగాన్ని విద్వద్వర్యులు డా॥ బి. లక్ష్మణాచార్యులుగారు అనువదించారు. వారికి కృతజ్ఞతాభివందనాలు.

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇందులో ఎన్నో ఆఖ్యానాలు-ఉపాఖ్యానాలు ఉన్నాయి. అవి తత్త్వ-నీతి-ధర్మాలను బోధిస్తున్నాయి. బ్రహ్మపురాణంలో పదివేల శ్లోకాలు వున్నట్లు 'బ్రాహ్మం దశ సహస్రాణి' అనే ప్రమాణాన్ని బట్టి తెలుస్తున్నది. కాని మాకు లభించిన బ్రహ్మపురాణంలో 14 వేల శ్లోకాలు ఉండడం వల్ల దీనిని రెండు భాగాలుగా ప్రచురించడం జరిగింది. వేద సదృశమైన ఈ పురాణాన్ని నిత్యం శ్రద్ధతో పఠించువారు వైకుంఠం చేరుకొంటారని ఈ పురాణం నిర్దేశిస్తున్నది.

ఈ సంపుటాన్ని శ్రద్ధతో పరిష్కరించిన పరిష్కరణ పరిషత్సభ్యులకు వందనాలు.

ప్రాజెక్టు సహాయపరిశోధకులు శ్రీ యస్.బి.యస్.భట్టాచార్యులను, డా॥ యస్.దశరథను, డా॥ పూర్ణవల్లిని అభినందిస్తున్నాం. దీనిని ముద్రణయోగ్యంగా రూపొందించిన డి.టి.పి. ఆపరేటర్ శ్రీ బి.వెంకట్రాయులుకు అభినందనలు.

ప్రాజెక్టుకు తగిన ప్రోత్సాహం ఇస్తూ పురాణాలు ఈ రీతిగా ప్రచురణ పొందడానికి తోడ్పడిన తి.తి.దే. ధర్మకర్తల మండలివారికీ, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్ ఐ.ఏ.యస్.గారికీ, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి. బసంత్‌కుమార్ ఐ.ఏ.యస్. గారికీ, ప్రాజెక్టు పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు.


అష్టాదశపురాణాల అనువాదకార్యక్రమం నిర్విఘ్నంగా నెరవేరునట్లు శ్రీ వేంకటేశ్వరస్వామి కృపతో అనుగ్రహించుగాక!

సముద్రాల లక్ష్మణయ్య

ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దే.,

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి
(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామాథర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూలమైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యంకాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీసుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలి వుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।
కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథాకథనం ద్వారా ధర్మస్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణకథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞాన వైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితాస్సర్వే పురాణే నాత్ర సంశయః' పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానావిధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక –చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్ద నిర్వచనం

పురాణం అంటే – పురా భవం ప్రాచీనకాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం – ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి – ఆగతానాగతే కథయతీతి పురాణం – అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచః సామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11–7–24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం.

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేదస్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2–4–10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు, శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్య నివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూప నిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥

ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయపురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడి మోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆ యా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్యపురాణం (2) మార్కండేయపురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మపురాణం (2) బ్రహ్మాండపురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణుపురాణం (2) వాయుపురాణం (3) వామనపురాణం (4) వరాహపురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడపురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రిందివిధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్తలింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మసంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు–

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు–

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతర దేవతల కంటె అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానా నామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది. –

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడు రూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మపురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥
చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశభాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతః పరమ్ ॥
కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥
మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్తమపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు-(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతం ప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణలక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం - ఆ యా ఋషుల, రాజుల వంశాలు.
4. మన్వంతరాలు - మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆ యా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.
5. వంశానుచరితం-ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పది లక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం-అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది-

(1) సర్గం:-భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:-విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:-వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:-భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:-కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:-మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:- భగవదవతారాలు, భక్తులు-వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:-జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:-వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:- అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆ యా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥
దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశ పఞ్చ చతుశ్శతమ్ ॥
చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చ శతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥
చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥
కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥
త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । (భాగవతం-12-13-2-9)

1. బ్రహ్మపురాణం	–	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	–	55,000	,,
3. విష్ణుపురాణం	–	23,000	,,
4. వాయుపురాణం	–	24,000	,,
5. భాగవతపురాణం	–	18,000	,,
6. నారదపురాణం	–	25,000	,,
7. మార్కండేయపురాణం	–	9,000	,,
8. అగ్నిపురాణం	–	15,400	,,
9. భవిష్యపురాణం	–	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	–	18,000	,,
11. లింగపురాణం	–	11,000	,,
12. వరాహపురాణం	–	24,000	,,
13. స్కందపురాణం	–	81,100	,,
14. వామనపురాణం	–	10,000	,,
15. కూర్మపురాణం	–	17,000	,,
16. మత్స్యపురాణం	–	14,000	,,
17. గరుడపురాణం	–	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	–	12,000	,,
మొత్తం శ్లోకాలు	–	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆ యా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా

కథనంలో ఉపమా, రూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహమైం దనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణశ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలు గూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి, అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచితసంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణుపురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సంll పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ సమాజ స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు– వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తి నివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకర రామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాది కథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణ వృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణ సారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితాలని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వత నైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతి ప్రాచీన కాలంనుండి నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతి పురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

బ్రహ్మపురాణం
రెండవభాగం - కథాసారం

శ్రాద్ధవిధులు

శ్రాద్ధవిధులను గురించి చెప్పమని కోరిన మునులతో వ్యాసుడు ఇలా చెప్తున్నాడు. అన్నివర్ణాలవారు వాళ్లవాళ్ల విధానాలను అనుసరించి శ్రాద్ధవిధులు ఆచరించాలి. శ్రాద్ధాలు కృష్ణపక్షంలో ఆచరించడం శ్రేష్ఠం. పుష్కరాలు, పుణ్యనదులు, సంగమప్రదేశాలు, క్షేత్రాలు, మొదలైన స్థలాలలో తప్పక ఆచరించాలి. నర్మద తూర్పుతీరం, సింధు ఉత్తరతీరం మొదలుగా కొన్ని ఆచరించగూడని ప్రదేశాలు గూడ ఉన్నాయి. సూర్యుడు కన్యారాశిలో ఉన్న భాద్రపదమాసం కృష్ణపక్షం పదిహేనురోజులకు పితృపక్షం అని పేరు. ఆ రోజుల్లో పితృకార్యాలు చేయడం ఉత్తమం. ఆ యా తిథులు, నక్షత్రాలలో చేసిన పితృకార్యాలకు ప్రత్యేకంగా ఆ యా ఫలితాలు సిద్ధిస్తాయి. అలాగే శ్రాద్ధక్రియలలో సమర్పించే ద్రవ్యాలనూ, ద్రవ్యవిశేషాలనూ బట్టి ఆ యా విశేష ఫలితాలు కలుగుతాయి. పితృకర్మలను చేయడానికి సందర్భాన్నిబట్టి ఎవరెవరికి అధికారం ఉంటుందో వివరించాడు వ్యాసుడు. శ్రాద్ధకర్మలో భోక్తకు ఉండవలసిన అర్హతలు కలిగినవాడినే నిమంత్రించాలి అని చెప్పి, ఆ అర్హతలను తెలియజేశాడు. అక్కడ శ్రాద్ధకర్మ నిర్వహణ క్రమంలోని ప్రతి అంశాన్ని వ్యాసుడు వివరించి చెప్పాడు.

సదాచారం

బ్రాహ్మీముహూర్తంలో నిద్ర లేవాలి. స్నానం, సంధ్య యథావిధిగా చేయాలి. ఉదయిస్తున్న, అస్తమిస్తున్న సూర్యుడిని చూడగూడదు. సూర్యుడు ఉదయించేటప్పుడు, అస్తమించేటప్పుడు నిద్రపోగూడదు. తూర్పు లేదా ఉత్తరం ముఖంగా మౌనంగా దంతధావనం చేసుకోవాలి. జనం సంచరించే దారులలో, దున్నినపొలాలలో మలమూత్రవిసర్జన చేయగూడదు. నిల్చుని, నడుస్తూ మూత్రవిసర్జన చేయగూడదు. నగ్నంగా స్నానం, భోజనం, నిద్రించడం చేయగూడదు. దేవ, పితృకార్యాలు చేసేముందు తలస్నానం చేయాలి. స్నానం చేయకుండా భోజనం చేయగూడదు. కాళ్లు ముడుచుకుని, కూర్చుని భోజనం చేయాలి. ఎంగిలిఅన్నం తినగూడదు. ఎంగిలినోటితో మాట్లాడగూడదు. ఒక్కవస్త్రంతో దైవకార్యాలు, భోజనం చేయగూడదు. ఇతరులు వాడిన చెప్పులు, బట్టలు మొదలైనవి ఉపయోగించగూడదు. చిరిగిన, పాతబడిన బట్టలను కట్టరాదు. నిప్పు, నీరు కలిపి పట్టుకోగూడదు. దోసిలితో నీళ్లు తాగగూడదు. అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎడతెగకపారుఏరు లేని ఊళ్లో ఉండగూడదు. ఇలా సదాచారం అంటే, అందరూ తప్పకుండా ఆచరించవలసిన ధర్మం చాల విస్తృతంగా ఉంది.

బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలవారు, బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలవారు తమకు విహితమైన ధర్మాలను ఆచరించాలి. ఒకరి ధర్మాలను ఇంకొకరు ఆచరిస్తే వర్ణసంకరం అవుతుంది. లోకంలో మానవుడు తాను సుఖంగా జీవిస్తూ, ఇతరులు కూడా సుఖంగా జీవించడానికి కొన్నిపద్ధతులను తప్పక అనుసరించాలి. అవి సాధారణ ధర్మాలు.

జన్మసంసారబంధంనుండి విముక్తులు అయ్యే మార్గం ఏమిటి? అని ఒకసారి మహర్షులు పరమేశ్వరుడిని అడిగారు. వసుదేవాత్మజుడైన కృష్ణుడిని ఆశ్రయించడం ఒక్కటే మార్గం అన్నాడు శివుడు. ఆ స్వామిని ఆశ్రయించినవారు క్రమంగా ఆ యా ఉత్తమ లోకాలను పొంది, తుదికి ముక్తులవుతారని, శివుడు శ్రీకృష్ణుడి రూపవైభవాలను ప్రశంసించాడు.

ఏకాదశీమాహాత్మ్యాన్ని గురించి అడిగిన మునులకు వ్యాసుడు ఇలా చెప్తున్నాడు.

మాలదాసరి

పూర్వం అవంతీనగరంలో శ్రీమహావిష్ణువు శంఖచక్రగదాపాణి అయి ఉన్నాడు. ఆ ఊరికి చివర ఒక మాలవాడున్నాడు. అతడు గానవిద్యాప్రవీణుడు. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, విష్ణువును గూర్చి గానం చేస్తూ, రాత్రంతా జాగరణం చేస్తూ, ద్వాదశినాడు బంధువులకు అందరికీ భోజనం పెట్టి తానూ తినేవాడు. ఒకసారి చైత్రమాసం, కృష్ణపక్షంలో ఏకాదశినాడు విష్ణుపూజకు పూలు తేవడంకోసం అడవికి వెళ్లాడు. క్షిప్రానదీతీరంలో ఒకతాటిచెట్టుకింద ఉన్న ఒక బ్రహ్మరాక్షసుడు ఇతడిని తిందామని పట్టుకున్నాడు. మాలవాడు ఈరోజు ఏకాదశి. నాకు ఉపవాస నియమం ఉంది. రేపు ఉదయమే వస్తాను తిందువు గాని అన్నాడు. రాక్షసుడు అంగీకరించ లేదు. రకరకాల ప్రతిజ్ఞలు చేసి, రాక్షసుడిని ఒప్పించి, మాల వెళ్లిపోయి, తనవ్రతం పూర్తిచేసుకుని వచ్చాడు. తిరిగి వచ్చిన చండాలుడి సత్యనిష్ఠకు సంతోషించాడు రాక్షసుడు. ఇరవై సంవత్సరాలుగా జాగరణ చేస్తున్న చండాలుడిని ఒకరోజు జాగరణఫలం తనకిస్తే విడిచిపెడతానన్నాడు. మాల అంగీకరించ లేదు. రెండుజాముల జాగరణఫలమైనా ఇమ్మన్నాడు రాక్షసుడు. ఒప్పుకోకపోవడంతో ఒకజాముఫలమైనా ఇమ్మన్నాడు. కనీసం రాత్రి చివరజాము చివరలో పాడినపాటఫలమైనా ఇచ్చి తనను ఉద్ధరించమన్నాడు. అప్పుడు మాల నీకీ రాక్షసజన్మ ఎలా వచ్చిందని అడిగాడు. దాసరి పూర్వజన్మలో నేను సోమశర్మ అనే వేదపండితుడిని. యజ్ఞనిర్వహణలో స్వరమంత్రదోషంవలన ఈ బ్రహ్మరాక్షసజన్మ కలిగిందని చెప్పాడు రాక్షసుడు. జీవులను చంపడం మానేస్తానని మాట ఇచ్చిన తరువాత మాల పాటఫలం ఇచ్చాడు. రాక్షసుడు అక్కడినుండి పృథూదకం అనే తీర్థం వద్దకు వెళ్లి, నిరాహారదీక్షతో, మాలవాని పాటవలన వచ్చిన పుణ్యఫలంతో రాక్షసజన్మనుండి విముక్తుడైనాడు. మాలవాడు పుణ్యతీర్థాలు సేవించి, పూర్వజన్మజ్ఞానం పొందాడు. ఏకాదశీవ్రతం, జాగరణాలవల్ల ముక్తి పొందాడు.

వైష్ణవమాయ

పూర్వం ఆగ్నీధ్రుడు అనే రాజుండేవాడు. అతని కొడుకు కామదమనుడు. సంసారానికి విముఖుడైన అతడు పెండ్లి చేసుకోలేదు. అతడు పూర్వజన్మలో ఒకప్పుడు విష్ణువు ప్రత్యక్షం కాగా, మాయను గూర్చి చెప్పమని అడిగాడు. అపుడు విష్ణువు ఇలా చెప్పాడు. పూర్వం నారదుడు ఇలాగే అడిగాడు. నీళ్లలో మునిగితే తెలుస్తుందన్నాను. అతడు అలాగే మునిగి, తరువాత కాశిరాజుకు సుశీల అనే కూతురుగా పుట్టాడు. ఆమెకు విదర్భరాజు సుధర్ముడితో పెండ్లి అయింది. కొన్నాళ్లకు సుధర్ముడికి కాశిరాజుతో యుద్ధం జరిగింది. యుద్ధంలో

ఇద్దరూ సంతానంతో సహా నశించిపోయారు. భర్త, పిల్లలకు చితి ఏర్పరచి, ఆ చితిలో ప్రవేశించిన సుశీల నారదుడుగా మారింది. అగ్ని స్ఫటికమయింది. అది కరిగి సరస్సు అయింది. దానిలోనుండి విష్ణువు వచ్చాడు. భార్య ఎక్కడ? సంతాన మెక్కడ? వైష్ణవమైన ఆ మాయను తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదన్నాడు స్వామి. అయితే భక్తినీ, నిరంతరం స్వామిదర్శనాన్నీ ఇమ్మన్నాడు నారదుడు. నారదుడి కోరికపై విష్ణువు ఆ సరస్సులో ఉంటున్నాడు. బ్రహ్మశిరస్సును ఖండించి, ఆ కపాలం తనకు అంటుకోగా, ఆ కపాలం విడిపడ్డంకోసం వచ్చి, శివుడు కూడ అక్కడే ఉన్నాడు. కపాలం శివుడిని విడిచిన ఆ తీర్థం కపాలమోచనతీర్థం అయింది. ఇలా విష్ణుమాయ తెలియరానిదని మరి కొన్ని దృష్టాంతాలు తెలిపాడు విష్ణువు.

భవిష్యవృత్తాంతం

మానవుల కాలంలో ఒకమాసం పితృదేవతలకు ఒక పగలూ, రాత్రీ అవుతుంది. (శుక్లపక్షం – పగలు, కృష్ణపక్షం – రాత్రి) మానవుల కాలంలో ఒకసంవత్సరం దేవతలకు ఒక పగలూ, ఒక రాత్రీ అవుతుంది. (ఉత్తరాయణం – పగలు, దక్షిణాయనం – రాత్రి) కృత, త్రేత, ద్వాపర, కలి అని యుగాలు నాలుగు. ఈ యుగాలు నాలుగు వేయిసార్లు ఆవృత్తమైతే, అది బ్రహ్మకు ఒక పగలు అవుతుంది. అంతే కాలం ఒక రాత్రి. ఇలాగే మరొక లెక్క ప్రకారం దేవతల సంవత్సరాలు వెయ్యి బ్రహ్మకు పగలు. (మానవ సంవత్సరం ఒకటి దేవతలకు ఒక రోజు కాగా, 360 మానవ సంవత్సరాలు దేవతలకు ఒక సంవత్సరం. అటువంటి సంవత్సరాలు వేయి అయితే బ్రహ్మకు ఒక పగలు. అంతే కాలం రాత్రి. (ఇలాంటి రోజులతో వందసంవత్సరాలైతే బ్రహ్మ ఆయువు అవుతుంది. తరువాత మరొకరు బ్రహ్మస్థానంలోకి వస్తారు).

ఆ యా యుగాలలో జరిగే పనులు, జీవుల లక్షణాలు, ప్రవర్తనలూ, ద్వాపర కలియుగాలలో మానవుల మనఃప్రవృత్తులూ, బాహ్యవర్తనాలు, ధర్మస్థితి, అంతంలో ప్రళయాలు జరిగే విధానం మొదలైన అంశాలను వ్యాసుడు మునులకు విపులంగా వివరించాడు. ఇలా జరగబోయే కాలంలో మానవజీవితాలు కూడ వ్యాసుడు చెప్పాడు.

వ్యాసగీత

పిదప వ్యాసుడు యోగాన్ని ఎక్కడ, ఎలా చేయాలో, ఆహారనియమం మొదలుగా యోగాభ్యాసం గురించి, సమగ్రంగా నిరూపించాడు. **'న చ పద్మాసనాద్ యోగో, న నాసాగ్రనిరీక్షణాత్, మనసశ్చేంద్రియాణాం చ, సంయోగో యోగ ఉచ్యతే' (107.29)** అని యోగస్వరూపాన్ని సూత్రించాడు. **విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని, శుని చైవ శ్వపాకే చ, పండితా స్సమదర్శినః (128.20)** ఇలాగే 30, 32శ్లో. ఇలా సాంఖ్యయోగం, సాంఖ్యయోగవిశేషాలు, క్షరాక్షరనిరూపణం మొదలైన అంశాలను వ్యాసుడు వివరించాడు. ఈ అంశాలు అర్థం చేసుకుని, శ్రద్ధగా ఆచరించవలసినవి.

బ్రహ్మపురాణమహత్త్వం

ఇది పురాణాలలో మొదటిది. వేదసంమితం. సమస్తమైన కోరికలను తీర్చేది. వ్యాసుడివలన దీనిని శ్రద్ధగా విన్న మునులు వ్యాసుడిని కృతజ్ఞలతో స్తుతించారు.

వ్యాసుడు అక్కడి మునులకు చెప్పిన ఈ పురాణాన్ని వ్యాసానుగ్రహంతో సూతుడు నైమిశారణ్యంలోని మునులకు వినిపించాడు. వైష్ణవమైన ఈ పురాణం విన్నవారికి సకలపాపాలు నశిస్తాయి. ప్రయాగ మొదలైన పుణ్యక్షేత్రాలలో ఉపవాసం చేసినంతటి పుణ్యం లభిస్తుంది. ఏది కావాలనుకుంటే అది ఈ పురాణంవలన లభిస్తుంది. అందరూ తప్పక చదవవలసినదీ, వినవలసినది ఈ బ్రహ్మపురాణం.

గౌతమీతీర్థమాహాత్మ్యం

తీర్థమాహాత్మ్యం గురించి బ్రహ్మ నారదుడికి వివరించాడు. ఆ విషయాన్నే వ్యాసుడు మహర్షులకు చెప్తున్నాడు. యజ్ఞదానతపస్సులకంటె తీర్థసేవ ఉత్తమం. కృతయుగంనుంచీ సులువుగా కోరికలు తీరడానికి తీర్థసేవనం తప్ప మరొక ఉపాయం లేదు. అటువంటి తీర్థాలు దైవికాలు, ఆసురాలు, ఆర్షాలు, మానుషాలు అని నాలుగువిధాలు. వాటిలో బ్రహ్మాదిదేవతలు నిర్మించినవి దైవికాలు. తీర్థాలన్నింటిలో దైవికతీర్థాలు శ్రేష్ఠం. వాటిలో కూడా బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ముగ్గురూ కలిసి ఏర్పరచిన త్రిదైవత్యం అయిన తీర్థం సర్వోత్తమం. అలా త్రిదైవత్యమైనది గంగ.

గంగాగౌతమీప్రాదుర్భావం

పూర్వం తారకుడు అనే రాక్షసుడు లోకాలను పీడిస్తుండేవాడు. వాడిని పదిసంవత్సరాలలోపు బాలుడు మాత్రమే చంపగలడు. ఆ రాక్షససంహారంకోసం దేవతలు విష్ణువువద్ద మొర పెట్టుకున్నారు. శ్రీహరి పరమేశ్వరుని కుమారుడు మాత్రమే చంపగలడన్నాడు. అప్పటికి శివుడికి వివాహమే కాలేదు. దేవతలు హిమవంతుడిని ప్రార్థించారు. దాక్షాయణి హిమవంతుడికి గౌరిగా కూతురై పుట్టింది. గౌరి శివుడికోసం తపస్సు చేసింది. గౌరీశంకరుల వివాహం ఘనంగా జరిగింది. వారి పెళ్లిలో బ్రహ్మ దుష్టసంకల్పం వలన అవమానపడ్డాడు. శివుడు బ్రహ్మపాపాన్ని పోగొట్టి, లోకాలకు కూడా మేలు చేయాలనుకున్నాడు.

పాపాలను నిర్మూలించడానికి భూమి, నీరు అనేవి రెండు సాధనాలు. వాటిలోని సారాన్ని సంగ్రహించి శివుడు భూమిని కమండలం చేశాడు. అందులో నీటిని ఉంచాడు. అదే గంగ. ఆ జలాలను మంత్రించి, అందులో మూడులోకాలను పవిత్రం చేయగలశక్తిని నిక్షేపించాడు. ఆ కమండలాన్ని బ్రహ్మ కిచ్చాడు.

ఆ కాలంలో భూలోకంలో బలి అనే రాక్షసరాజు ముల్లోకాలను ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నాడు. అతడు విష్ణుభక్తుడు. దేవతలకోరిక నేరవేర్చడానికి శ్రీహరి అదితికశ్యపులకు వామనుడుగా జన్మించాడు. బలి చేస్తున్న యజ్ఞానికి వెళ్లి, మూడడుగులు దానం అడిగాడు. శుక్రుడు వారించినా బలి దానానికి సిద్ధపడ్డాడు. వామనుడు విశ్వమంతా నిండి, ఒక పాదం కూర్మంమీద బలి యజ్ఞవాటిక వరకూ, రెండవ పాదం బ్రహ్మలోకంలోనూ

ఉంచాడు. మూడవ పాదానికి చోటు అడిగాడు. **పృష్ఠే హి పదం న్యస** అని తన పృష్ఠంపై ఉంచమన్నాడు బలి. శ్రీహరి సంతోషించి, బలికి రసాతలాధిపత్యం, తరువాతి కాలంలో ఇంద్రపదవీ, ఇంకా పెక్కు వరాలిచ్చాడు.

తన లోకానికి వచ్చిన త్రివిక్రముడి పాదాన్ని చూచి, బ్రహ్మ ఆనందంతో శివుడిచ్చిన కమండలంలోని జలంతో సమంత్రకంగా అభిషేకించాడు. శ్రీహరి పాదాలనుండి జారిన ఆనీరు భూలోకంలో మేరుపర్వతంపై పడింది. అక్కడినుండి నాలుగుపాయలుగా భూమిపై నాలుగు దిక్కులకు వెళ్ళింది. అందులో దక్షిణదిక్కులో పడిన జలం శివుడి జటాజూటంలోకి చేరుకుంది. దానిని గౌతముడు, భగీరథుడు అనే ఇద్దరు భూమిమీదకు తెచ్చారు. పార్వతి తన భర్త తలపై ఉన్న సవతి గంగను వదిలించమని వినాయకుడిని కోరింది. అదే సమయంలో భూలోకంలో 24సంవత్సరాల పెద్దకరువు వచ్చింది. కాని గౌతమమహర్షి ఆశ్రమప్రాంతంలో మాత్రం దాని ప్రభావం లేదు. విఘ్నేశ్వరుడు విప్రరూపంలో అక్కడికి వెళ్లాడు. పార్వతిచెలికత్తె అయిన జయను ఆవుగా మారి, గౌతమాశ్రమ ప్రాంతంలో ధాన్యం తింటూ అదిలిస్తే చచ్చినట్టు పడిపొమ్మన్నాడు. అది అలాగే చేసింది. గౌతముడు గడ్డిపరకతో వారించాడు. ఆవు చచ్చినట్లు పడిపోయింది. విప్రుడైన విఘ్నేశ్వరుడు. ఆ పాపంనుండి విముక్తి కలగాలంటే శివుడి జటాజూటంలో ఉన్న గంగాజలంతో అభిషేకించాలన్నాడు. గౌతముడు శివుడిని ప్రసన్నం చేసుకుని, జటలలోని గంగను బ్రహ్మగిరిపై వదిలిపెట్టే విధంగా వరం పొందాడు పూర్వం బ్రహ్మ తపస్సు చేసిన స్థలం బ్రహ్మగిరి. అలా గౌతముడివల్ల భూమిపైకి వచ్చిన గంగానది గౌతమి అనే పేరుతో ప్రసిద్ధమైంది. దీనికి గోదావరి అని కూడా వ్యవహారం.

భాగీరథి

బూడిద అయిన తన పితరులకు ఉత్తమగతులు కలగడంకోసం భగీరథుడు విశ్వప్రయత్నం చేసి, శివుడి జటాజూటంలో ఉన్న గంగను భూలోకంద్వారా పాతాళలోకానికి తీసుకువెళ్లాడు. అది భాగీరథిగా సుప్రసిద్ధం. **మహేశ్వరజటావారి ఏవం ద్వైవిధ్యమాగతమ్, వింధ్యస్య దక్షిణే గంగా గౌతమీ సా నిగద్యతే, ఉత్తరే సాపి వింధ్యస్య భాగీరథ్యభిధీయతే**. ఈవిధంగా గంగ వింధ్యపర్వతానికి దక్షిణభాగంలో గౌతమి అనీ, ఉత్తరభాగంలో భాగీరథి అనీ రెండువిధాలైంది. శివుడు కూర్చిన కమండలంలో ఉండి, బ్రహ్మవద్దకు చేరి, శ్రీహరి పాదాలను తడిపి, మళ్లీ మహేశ్వరుడి ద్వారా నేలపైకి వచ్చిన గంగ త్రిమూర్తులవలన ఏర్పడింది కాబట్టి త్రిదైవత్యమైన తీర్థం అయింది.

1. వరాహతీర్థం

పూర్వం సింధుసేనుడు అనే రాక్షసుడు దేవతలవద్ద ఉన్న యజ్ఞాన్ని లాక్కుని రసాతలానికి తీసుకునివెళ్లాడు. శ్రీహరి వరాహరూపం ధరించి, ఆ రాక్షసుడిని చంపి, యజ్ఞాన్ని మోరపై పెట్టుకుని తెచ్చి దేవతల కిచ్చాడు. తనకంటిన రక్తాన్ని బ్రహ్మగిరిలో గౌతమీగంగలో కడుక్కున్నాడు. అప్పటినుండి అది వరాహతీర్థం అయింది.

2. కుమారతీర్థం

తారకాసురవధానంతరం కార్తికేయుడు దేవకాంతలను పొందుతూ ఉన్నాడు. దానిని వారించడానికి పార్వతి వారందరిలో తాను కనిపించసాగింది. అప్పుడు కార్తికేయుడు స్త్రీ లందరూ మాతృమూర్తులని గ్రహించాడు. కాని అంతకు ముందు చేసిన పాపం పోవడానికి గౌతమిలో స్నానం చేసి, శివుడిని ఆరాధించాడు. గురుపత్నిని కలవడంవంటి మహాపాపాలు కూడ అక్కడ గౌతమిలో స్నానం చేసినవాళ్లకు నశించిపోయేవిధంగా శివుడివలన వరం పొందాడు. అప్పటినుండి అది కుమారతీర్థంగా ప్రసిద్ధం అయింది.

3. కృత్తికాతీర్థం

తారకాసురవధకై సంతానంకోసం ప్రవర్తించిన శివుడి రేతస్సును అగ్ని (కవి) తాగాడు. శివరేతస్సుతో కాంతిమంతుడైన అగ్నిని అరుంధతి తప్ప మిగిలిన ఋషిపత్నులు ఆరుగురూ పొందారు. వాళ్లు తమ గర్భాలను గంగవద్ద స్రవింపజేసుకున్నారు. అవి సముద్రంలో కలిసి, గాలివలన నురుగురూపంలో ఒక్కటయింది. దానినుండి షణ్ముఖుడు జన్మించాడు. ఋషులు తప్పు చేసిన తమ పత్నులను విడిచిపెట్టారు. నారదుడు వారిని షణ్ముఖునివద్దకు వెళ్లమన్నాడు. అతడు చెప్పినవిధంగా కృత్తికలు గౌతమిలో స్నానం చేసి, శివుడిని అర్చించి, పవిత్రలయి సురమందిరానికి వెళ్లారు. అప్పటినుండి అక్కడి గౌతమి కృత్తికాతీర్థం అని పేరు పొందింది.

4. అహల్యాసంగమతీర్థం

అహల్యను పెండ్లి చేసుకుని గౌతముడు బ్రహ్మగిరిపై కాపురం ఉండేవాడు. పెళ్లిలోనే ఇంద్రుడికి అహల్యపై కోరిక కలిగింది. ఒకరోజు గౌతముడు పూర్వాహ్ణకర్మలన్నీ పూర్తి చేసుకుని గౌతమీ విప్రాదులను చూచిరావడానికి బయటకు వెళ్లాడు. ఇంద్రుడు గౌతముడివేషంలో వచ్చి అహల్యను పొందాడు. తిరిగివచ్చిన గౌతముడిని చూచి ఇంద్రుడు ఇంట్లోనే పిల్లిగా మారి దాక్కున్నాడు. సంగమంవల్ల రూపం చెదరిఉన్న అహల్యను చూచి గౌతముడు దివ్యదృష్టితో జరిగింది గ్రహించాడు. అహల్యను నువ్వు నదివై, గౌతమీనదిలో కలిసిన తరువాత నీ అసలు రూపం పొందుతావన్నాడు. ఇంద్రుడిని సహస్రయోనివి కమ్మని శపించాడు. ఇంద్రుడు శరణు వేడగా, అహల్య గౌతమీనదిలో కలిసినచోట స్నానం చేసిన తరువాత ఇంద్రుడికి శాపం నివృత్తి అవుతుందన్నాడు. అహల్య (నది) గౌతమీనదిలో సంగమించినచోటు అహల్యాసంగమం అనే పుణ్యతీర్థం అయింది. దీనికే ఇంద్రతీర్థం అని కూడ పేరు.

5. చక్రతీర్థం

దక్షుడు యజ్ఞం చేస్తున్నాడు. దేవతలందరూ వచ్చారు. అల్లుడైన శివుడు కూడా భార్యతో కలిసివచ్చాడు. పిలవకుండా ఎందుకు వచ్చావని దక్షుడు శివుడిని నిందించాడు. శివసతికి కోపం వచ్చింది. మగని నింద వినడం మహాపాపమని యోగశక్తితో తనువు చాలించింది. కోపంతో శివుడు దక్షయజ్ఞం ధ్వంసం చేశాడు. భయపడిన

దేవతలు విష్ణువును ఆశ్రయించారు. విష్ణువు శివుడిపై చక్రాయుధం ప్రయోగించాడు. శివుడు దానిని కబళంలాగా మింగేశాడు. దక్షుడు శివుడిని స్తుతించాడు. యజ్ఞం పూర్తయింది. చక్రం పోగొట్టుకున్న విష్ణువు దానికోసం గౌతమీతీరంలో శివుడిని సేవించాడు. సహస్ర కమలాలతో అర్చింపదలచిన విష్ణువుకు వేయికి ఒకటి తగ్గింది. తన కన్ను తీసి దానితో వెయ్యి తామరలను శివుడికి సమర్పించాడు. శివుడు ప్రత్యక్షమై, అనేక వరాలిచ్చాడు. విష్ణువు సమర్పించిన కన్నే చక్రం అయి, విష్ణువును చేరింది. అప్పటినుండి అక్కడ గౌతమి చక్రతీర్థంగా ప్రసిద్ధమైంది.

6. నాగతీర్థం

శూరసేనుడు అనే రాజుకు చాలాకాలం తర్వాత సంతానం కలిగింది. అది భయంకరమైన సర్పం. నాగేశ్వరుడు అని పేరు. తమ సంతానం పాము అనే విషయం ఎవరికీ తెలియకుండా బాధతో పెంచుతున్నారు. కొంచెం పెద్ద అయిన తరువాత ఆ సర్పం చూడాకర్మ (పుట్టువెంట్రుకలు తీయడం) అనే సంస్కారం చేయమంది. తరువాత ఉపనయనం గూడ చేశాడు. పిదప వివాహం చేయమన్నాడు నాగేశ్వరుడు. వృద్ధమంత్రి మంత్రాంగంతో భోగవతి అనే రాజకన్యతో పెండ్లి నిశ్చయించాడు. నాగేశ్వరుడు లేకుండా ప్రతినిధిగా ఆయుధంతో వివాహం జరిపించి భోగవతిని తీసుకువచ్చాడు. కొన్నాళ్లకు ఆమె తన భర్త సర్పం అని తెలుసుకున్నది. అయినా, అతడిని భర్తగా సేవించింది. ఒకనాడు సర్పానికి తన పూర్వజన్మవృత్తాంతం గుర్తుకు వచ్చింది. దాని ప్రకారం భోగవతి భర్తను తీసుకునివెళ్లి గౌతమిలో స్నానం చేయించి, తీరంలో శివపూజ చేయించింది. శివుడు ఉత్తమరూపాన్ని అనుగ్రహించాడు. రాజ్యపాలనం చేసి, చివరికి శివపురానికి చేరుకున్నాడు. నాగేశ్వరుడికి శాపవిముక్తిని కలిగించిన నాటినుండి ఇక్కడ గౌతమి నాగేశ్వరతీర్థం అని పేరు పొందింది.

7. రామతీర్థం

దశరథుని కుమారుడైన రాముడు విశ్వామిత్రుడివద్ద మహేశ్వర మహావిద్యనూ, గజ, అశ్వ, రథ, సర్ప, ఆదివిద్యలను నేర్చుకున్నాడు. మిథిలలో ధనుర్విద్య ప్రదర్శించి, సీతను వివాహమాడాడు. కైకకు ఇచ్చిన వరంవల్ల రాముడు సీతతో అరణ్యాలకు వెళ్లాడు. ఆ బాధతో దశరథుడు మరణించాడు. బ్రహ్మహత్యాపాపంవలన దశరథుడిని యమదూతలు భయంకరమైన వేరు వేరు నరకాలలో ఉంచి, రకరకాలుగా బాధిస్తున్నారు. రాముడు అరణ్యవాసంలో క్రమంగా చిత్రకూటంనుంచి దండకారణ్యానికి వెళ్లాడు. అక్కడ గౌతమీతీరంవెంట వెళ్తున్నాడు. అపుడు యముడు తన కింకరులతో రాముడు గౌతమీనదిని దాటి ఐదు యోజనాల దూరం వెళ్లేంతవరకు దశరథుడిని ఏవిధంగానూ బాధించవద్దు అన్నాడు. కుమారుడు గౌతమిని స్మరించినంతమాత్రంచేతనే ఆ వంశంలోని పితరులు ఎంతటి పాపులయినా నరకాలనుండి బయటపడతారు అన్నాడు యముడు. యమదూత దశరథుని నరకంనుండి బయటకు తీసుకువచ్చి, నీ కుమారులు గౌతమిలో స్నానం చేసి అక్కడ పిండప్రదానం చేస్తే నీకు ఉత్తమగతులు గలుగుతాయన్నాడు. వారి అనుమతితో దశరథుడు గౌతమీతీరానికి వెళ్లాడు. రామలక్ష్మణులు

గౌతమీనదిలో స్నానం చేసి, ఇంగుదీఫలాలతో పిండం చేసి, దశరథునిముందు ఉంచారు. మరుక్షణమే దశరథుడు విమానంలో స్వర్గానికి వెళ్ళి, దేవతలతో కలిసి ప్రకాశించాడు. రాముడు శివుడిని పూజించి స్తుతించాడు. శివుడు ప్రసన్నుడై అనేక వరాలిచ్చాడు. అక్కడ గౌతమిలో స్నానం చేసినా, ఆ తీరంలో ఏ కొంచెం దానం చేసినా, అన్నం పెట్టినా, వారి పితరులు స్వర్గం చేరుకుంటారన్నాడు. రాముడు స్నానం చేసిన పుణ్యతీర్థం రామతీర్థంగా ప్రసిద్ధమైంది. అలాగే సీతాతీర్థం, లక్ష్మణతీర్థం, లక్ష్మణునిబాణం పడినచోటు బాణతీర్థం అయ్యాయి.

8. కాలంజర(యాయాత)తీర్థం

పూర్వం యయాతి అనే మహారాజు ఉన్నాడు. అతడికి దేవయాని, శర్మిష్ఠ అని ఇద్దరు భార్యలు. దేవయానికి యదుడు, తుర్వసుడు అని ఇద్దరు కుమారులు. శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనుడు, పూరుడు అని ముగ్గురు కొడుకులు. సవతికంటె తనకు తక్కువ సంతానమని దేవయాని తండ్రివద్ద బాధపడింది. శుక్రుడు యయాతిని ముసలివాడివి కమ్మని శపించాడు. తరువాత యయాతి తప్పేమీ లేదని గ్రహించాడు. యయాతి ఎవరికైనా తన ముసలితనం ఇవ్వాలనుకుంటే, వాళ్లకు వెళ్లిపోతుందని శాపనివృత్తి చెప్పాడు. కుమారులు మొదటి నలుగురు తిరస్కరించారు. పూరుడు తండ్రి ముసలితనం తీసుకున్నాడు. వేయిసంవత్సరాల తరువాత యయాతి మళ్లీ తన ముసలితనం ఇచ్చి పూరుడి యౌవనం తీసుకోమన్నాడు. పూరుడు ఇచ్చినది తిరిగి తీసుకోనన్నాడు. నేనే సాధించుకుంటానన్నాడు. గౌతమి దక్షిణతీరానికి వెళ్లాడు. అక్కడ శివుడు కాలంజరుడు అనే పేరుతో ఉన్నాడు. పూరుడు అక్కడ గొప్ప తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై, పూరుడి ముసలితనాన్నీ, అతడి సోదరుల కిచ్చిన శాపాన్నీ తొలగిస్తూ వరమిచ్చాడు. అప్పటినుండి అక్కడ తీర్థం జరారోగహరతీర్థం అనీ, యాయాత (యయాతి కొడుకుకు సంబంధించినది) తీర్థం అనీ, కాలంజరతీర్థమనీ లోకంలో పేరు గాంచింది. ఇంకా అక్కడ ఇలాంటివి 108 తీర్థాలు ఉన్నాయి.

9. నందితీర్థం

అత్రిమహర్షి కుమారుడు చంద్రుడు. అతడు బృహస్పతివద్ద సకలవిద్యలు నేర్చుకున్నాడు. గురుపూజ చేయాలనుకున్న చంద్రుడిని తనభార్య తారతో మాట్లాడమన్నాడు గురుడు. చంద్రుడు వెళ్లి తారతో కలిశాడు. చంద్రుడిని శిక్షించలేక గురువు శుక్రుడిని ఆశ్రయించాడు. శుక్రుడు శివుడిని ఆరాధించి వరాలు పొందాడు. గురువును తీసుకుని శుక్రుడు చంద్రుడిని కుష్ఠరోగివి కమ్మని శపించాడు. చంద్రుడు తారను విడిచిపెట్టాడు. శుక్రుడు దేవతలు, ఋషులు మొదలైనవారిని పిలిచి, తార శుద్ధురాలు అయ్యే మార్గం విచారించాడు. గురుడితో కలిసి, గౌతమీనదిలో స్నానం చేస్తే తార చేసిన పాపం నశిస్తుందని శ్రుతి చెప్పింది. తార, గురుడు అలాగే చేశారు. తార పవిత్ర అయింది. అపుడు గురుడు గౌతమితో 'నీవు అందరి పాపాలను నాశనం చేసే పూజ్యురాలివి. ముఖ్యంగా నేను (గురుడు) సింహరాశిలో ఉన్నపుడు సమస్తతీర్థాలు నీలోనే ఉంటాయి. **'షష్టివర్షసహస్రాణి భాగీరథ్యవగాహనమ్, సకృద్ గోదావరీస్నానం సింహయుక్తే బృహస్పతౌ'** అపుడు స్నానదానాదులు చేసినవాళ్లకు కోరికలు తీరి, చివరకు ఉత్తమగతులు పొందుతారు అన్నాడు. అప్పటినుండి ఆనందతీర్థం, నందితీర్థం అని ఇది పేరు గాంచింది.

10. మన్యుతీర్థం

దేవదానవుల యుద్ధంలో దానవులు గెలిచారు. ఓడిపోయిన దేవతలు నా(బ్రహ్మ)వద్దకు వచ్చి, తమకు దానవభయం లేని స్థితి కావాలని అడిగారు. నేను 'గౌతమీగంగాతీరం వెళ్లి, అక్కడ మహాదేవుడిని సేవించండి' అని చెప్పాను. వాళ్లు అలాగే చేశారు. శివుడు ప్రత్యక్షమైనాడు. దేవతలు యుద్ధంలో తమకు ముందు నిలిచి, విజయం సాధించిపెట్టే పురుషుడిని ఇమ్మని అడిగారు. శివుడు తన మూడవకంటినుండి మన్యువు అనే భయంకర పురుషుడిని సృష్టించాడు. రుద్రస్వరూపుడైన ఆ మన్యువు శివుడే. అతడితో దేవసైన్యం దానవులపై యుద్ధానికి వెళ్లింది. మన్యురూపం చూసి దానవులు భయపడ్డారు. అపుడు దేవతలు మన్యువును తమ సైన్యానికి అధిపతిని చేసుకున్నారు. అతడు దేవసైన్యం అందరిలో వేరువేరుగా ఏర్పడ్డాడు. యుద్ధంలో దేవతలు విజయం సాధించారు. దేవతలు స్నానం చేసి, శివుడిని సేవించి, మన్యువును పొందిన గౌతమీప్రదేశం మన్యుతీర్థం అని ప్రఖ్యాతమయింది.

అసంఖ్యాక తీర్థాలు

ఈవిధంగా బ్రహ్మ నారదుడికి గౌతమీ గంగాతీర్థంతో ఏర్పడిన కపోతతీర్థం, దశాశ్వమేధికతీర్థం, ధౌతపాపతీర్థం మొదలుగా లెక్కలేనన్ని పుణ్యతీర్థాలను పేరుకొన్నాడు. పెక్కు పుణ్యతీర్థాలను గూర్చి అవి ఏర్పడిన వృత్తాంతాలతో సహా వివరించి చెప్పాడు. ఇలా ఏర్పడిన తీర్థాలు అసంఖ్యాకంగా ఉన్నాయనీ, వాటినన్నిటినీ సమగ్రంగా వర్ణించడం సాధ్యం కాదనీ గౌతమీతీర్థమాహాత్మ్యాన్ని బ్రహ్మ బహుముఖాలుగా ప్రశంసించాడు.

ఇయం తు గౌతమీ పుత్ర! యత్ర క్వాపి శివాజ్ఞయా, సర్వేషాం సర్వదా నృణాం స్నానాన్ముక్తిం ప్రదాస్యతి' గౌతమిలో ఎక్కడ ఎప్పుడు స్నానం చేసినా, మోక్షం వస్తుంది.

గౌతమీమాహాత్మ్యం - ఫలం

శివుడి కమండలంనుండి గంగ బ్రహ్మద్వారా విష్ణువుపాదాలను చేరుకుంది. త్రిదైవత్యమైన ఈ తీర్థం గౌతముడి తేజస్సు ప్రభావంతో బ్రహ్మగిరి చేరుకుంది. అక్కడినుంచి తూర్పుసముద్రంలోకి చేరింది. గౌతముడి కోరికపై బ్రహ్మగిరినుండి బయలుదేరి సముద్రంలో కలిసేంతవరకు ఉన్న గౌతమిలో అన్నిప్రాంతాలలో, అన్నిసమయాలలో శివుడు సన్నిహితమై ఉన్నాడు. **'తస్మాద్ గోదావరీ గంగా త్వయా నీతా భవిష్యతి, సర్వపాపక్షయకరీ సర్వాభీష్టప్రదా'** అని శివుడు గౌతముడికి వరమిచ్చాడు. ఎవరైనా యాత్రగా వచ్చి, ఇక్కడ స్నానం, దానం, పితృతర్పణం చేసినా, గౌతమీమాహాత్మ్యం విన్నా, చదివినా, స్మరించినా, మొత్తం భూమండలం దానంచేసినంత పుణ్యం కలుగుతుంది. గౌతమిలో స్నానాదులు చేసినవారికి సూర్య చంద్ర గ్రహణ సమయాలలో శివసన్నిధిలో విష్ణువుకు దూడలతో ఆవులను దానంచేసిన దానికంటె ఎక్కువ పుణ్యం లభిస్తుంది.

అశ్వమేధసహస్రాణి వాజపేయశతాని చ ।
కృత్వా యత్ఫలమాప్నోతి తదస్య శ్రవణాద్భవేత్ ॥

డా॥ అంబడిపూడి నాగభూషణం

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

14,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్ర సగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడ మయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమ క్షేత్రమనే పూరీ జగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటె బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగి వున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగ ధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడి యుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తు డవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతి హేతువులైన, మానవ జీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడి వున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహంవల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణుధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తన ప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణ కర్మ నామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర! ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి.

కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం-అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పన్నెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'–అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీ చింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణ కర్మ నామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి, అలసిపోయి, తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతని మాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవత శ్రవణమే అని చెప్పి భాగవత ప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతార ప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలి స్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నా కథలు పఠించేవాడు, వినేవాడు, నా కథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరి సుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు-అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు. పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు. పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు. ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడి వున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్షపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణ భారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన

వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ,

ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగరవర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నా మాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందుకా దేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహసంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతర పురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈ గ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాది కథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగర పరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తు లవుతారని చెప్పడం విశేషం. '**కాశ్యాం తు మరణాన్ముక్తిః**' అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగి వున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలలో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తిజనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకల పాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి-ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు-అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని, భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు-ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14,000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి-మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమల మధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం. ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాజ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గల జ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండపురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. **"బ్రహ్మాండం చాస్థి గీయతే"** అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తరభాగంలో

44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూల కారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

బ్రహ్మమహాపురాణమ్

ద్వితీయభాగం

ఏకాదశాధికశతతమోఽధ్యాయః - నూట పదకొండవ అధ్యాయం

వ్యాసఋషి సంవాదః - వ్యాసఋషి సంవాదం

శ్రాద్ధకల్పమ్

మునయ ఊచుః :- మునులు పలికారు.

భూయః ప్రబ్రూహి భగవన్ శ్రాద్ధకల్పం సువిస్తరాత్ ।
కథం క్వ చ కదా కేషు కైస్తద్బ్రూహి తపోధన ॥ 1 ॥

భగవన్! శ్రాద్ధకల్పమును గూర్చి సవిస్తరంగా తెలుపండి. ఓ తపోధనా! ఎవరు, ఎప్పుడు, ఎట్లు, ఎవరి విషయంలో, ఎవరిచే చేయవలెను వివరించండి.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

శృణుధ్వం మునిశార్దూలాః శ్రాద్ధకల్పం సువిస్తరాత్ ।
యథా యత్ర యదా యేషు యైర్ద్రవ్యైస్తద్వదామ్యహమ్ ॥ 2 ॥

ఓ మునులారా! ఏ విషయములందు, ఏ ద్రవ్యములతో ఎప్పుడు ఎక్కడ ఎట్లు చేయవలెనో వివరించే శ్రాద్ధకల్పమును నేను సువిస్తరంగా చెబుతాను వినండి.

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః శ్రాద్ధం స్వవరణోదితమ్ ।
స్వధర్మమనుతిష్ఠద్భిర్దాతవ్యం మంత్రపూర్వకమ్ ॥ 3 ॥

స్వధర్మానుష్ఠానమును నిర్వర్తించు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు వారి వారి వర్ణములకు విధించబడిన రీతిగా మంత్రపూర్వకంగా శ్రాద్ధాన్ని చేయాలి.

స్త్రీభిర్వర్ణావరైః శూద్రైః విప్రాణామనుశాసనాత్ ।
అమంత్రకం విధిపూర్వం వహ్నియాగవివర్జితమ్ ॥ 4 ॥

స్త్రీలు, ఇతర వర్ణములవారయిన, శూద్రులు, బ్రాహ్మణులు చెప్పినట్లుగా విధిపూర్వకంగా మంత్రం లేకుండా, అగ్నికార్యం లేకుండా శ్రాద్ధమాచరించాలి.

పుష్కరాదిషు తీర్థేషు పుణ్యేష్వాయతనేషు చ ।
శిఖరేషు గిరీంద్రాణాం పుణ్యదేశేషు భో ద్విజాః ॥ 5 ॥

సరిత్సు పుణ్యతోయాసు నదేషు చ సరస్సు చ ।
సంగమేషు నదీనాం చ సముద్రేషు చ సప్తసు ॥ 6 ॥

స్వనులిప్తేషు గేహేషు స్వేష్వనుజ్ఞాపితేషు చ ।
దివ్యపాదపమూలేషు యజ్ఞియేషు హ్రదేషు చ ॥ 7 ॥

శ్రాద్ధమేతేషు దాతవ్యం వర్జ్యమేతేషు చోచ్యతే ।
కిరాతేషు కళింగేషు కోంకణేషు కృమిష్వపి ॥ 8 ॥

దశార్ణేషు కుమార్యేషు తంగణేషు క్రథేష్వపి ।
సింధోరుత్తరకూలేషు నర్మదాయాశ్చ దక్షిణే ॥ 9 ॥

పూర్వేషు కరతోయాయా న దేయం శ్రాద్ధముచ్యతే । 10 ॥

పితృదేవతలకు శ్రాద్ధమును సమర్పించవలసిన ప్రదేశములను చెబుతున్నాను. పుష్కరాదితీర్థములు, పవిత్రక్షేత్రములు, దేవాలయములు, పర్వత శిఖరములు, పవిత్రమైన నదులు, సరస్సులు, నదములు, నదీసంగమ ప్రదేశములు, సప్తసముద్రములు, చక్కగా అలికిన తమ ఇండ్లు, అనుమతింపబడిన ఇతరుల గృహాలలోనూ దివ్య వృక్షముల క్రిందనూ యజ్ఞం చేసేందుకు యోగ్యమైన ప్రదేశములూ హ్రదములు, పితృయజ్ఞమగు శ్రాద్ధము నాచరించుటకు తగినవి.

శ్రాద్ధం చేయకూడని ప్రదేశములు చెబుతున్నాను – కిరాత, కళింగ, కొంకణ, కృమి, దశార్ణ, కుమార, తంగణ, క్రథ అను దేశములు, సింధునది ఉత్తర తీరము, నర్మదానది దక్షిణ తీరము, కరతోయానదికి తూర్పుదిక్కుగా శ్రాద్ధము చేసేందుకు పనికిరావు.

శ్రాద్ధం దేయముశంతీహ మాసి మాస్యుడుపక్షయే ।
పౌర్ణమాసేషు శ్రాద్ధం చ కర్తవ్యమృక్షగోచరే ।
నిత్యశ్రాద్ధమదైవం చ మనుష్యైః సహ గీయతే । 11 ॥

నైమిత్తికం సురైః సార్ధం నిత్యం నైమిత్తికం తథా ।
కామ్యాన్యన్యాని శ్రాద్ధాని ప్రతిసంవత్సరం ద్విజైః ॥ 12 ॥

వృద్ధిశ్రాద్ధం చ కర్తవ్యం జాతకర్మాదికేషు చ ।
తత్ర యుగ్మాన్ద్విజానాహుర్మంత్రపూర్వం తు వై ద్విజాః! ॥ 13 ॥

ప్రతి మాసంలోనూ కృష్ణపక్షములో శ్రాద్ధమును ఆచరించాలి. శ్రాద్ధములు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు. వీటిని ద్విజులు ప్రతి సంవత్సరము ఆచరించాలి. నిత్య శ్రాద్ధము పున్నమినాడు చేయవలసి వస్తే ఆ పున్నమికి సంబంధించిన నక్షత్రమున్నపుడే చేయాలి. (అనగా చాంద్రమానమునందు చిత్తా నక్షత్రంతో కూడిన పున్నమి చైత్రమాసము, విశాఖ నక్షత్రంతో కూడిన పున్నమి వైశాఖ మాసముగా లెక్కిస్తారు.) అందువల్ల ఆ నక్షత్రంలో పున్నమి యున్నపుడే శ్రాద్ధము నాచరించాలి. నిత్యశ్రాద్ధము అదైవంగా అనగా విశ్వేదేవతలు, విష్ణువు లేకుండా కేవలం వసు, రుద్ర, ఆదిత్య స్వరూపులగు వారికి మాత్రమే పెట్టాలి. నైమిత్తిక శ్రాద్ధము నాచరించునపుడు విశ్వేదేవతలతోనూ, విష్ణువుతోనూ కలిపి ఆచరించాలి. జాతకర్మాదులు చేయునపుడు నాంది శ్రాద్ధమును చేయవలెను.

దీనినే వృద్ధిశ్రాద్ధమని, అభ్యుదయ శ్రాద్ధమని అంటారు. ఇది చేయునపుడు మాతృపూర్వులైన మాతామహ, మాతృ పితామహు లిద్దరిని నిమంత్రించవలెను.

కన్యా గతే సవితరి దినాని దశపంచ చ ।
పూర్వేణైవేహ విధినా శ్రాద్ధం తత్ర విధీయతే ॥ 14 ॥

సూర్యుడు కన్యారాశిలో ఉన్నప్పుడు పదిహేను దినములు అనగా భాద్రపదమాసంలో సూర్యుడు కన్యారాశియందున్నప్పుడు పితృపక్షమని అంటారు. కావున ఆ దినములలో ముందుచెప్పినట్లే శ్రాద్ధము నాచరించుట ఉత్తమము.

ప్రతిపద్ధనలాభాయ ద్వితీయా ద్విపదప్రదా! ।
పుత్రార్థినీ తృతీయా తు చతుర్థీ శత్రునాశినీ ॥ 15 ॥

శ్రియమాప్నోతి పంచమ్యాం షష్ఠ్యాం పూజ్యో భవేన్నరః ।
గణాధిపత్యం సప్తమ్యామష్టమ్యాం బుద్ధిముత్తమామ్ ॥ 16 ॥

స్త్రియో నవమ్యాం ప్రాప్నోతి దశమ్యాం పూర్ణకామతామ్ ।
వేదాంస్తథాఽఽప్నుయాత్సర్వానేకాదశ్యాం క్రియాపరః ॥ 17 ॥

ద్వాదశ్యాం జయలాభం చ ప్రాప్నోతి పితృపూజకః ।
ప్రజావృద్ధిం పశుం మేధాం స్వాతంత్ర్యం పుష్టిముత్తమమ్ ॥ 18 ॥

దీర్ఘాయురథ వైశ్వర్యం కుర్వాణస్తు త్రయోదశీమ్ ।
అవాప్నోతి న సందేహః శ్రాద్ధం శ్రద్ధాసమన్వితః ॥ 19 ॥

యథా సంభవినాఽన్నేన శ్రాద్ధం శ్రద్ధాసమన్వితః ।
యువానః పితరో యస్య మృతాః శస్త్రేణ వా హతాః ॥ 20 ॥

తేన కార్యం చతుర్దశ్యాం తేషాం తృప్తిమభీప్సునా ।
శ్రాద్ధం కుర్వన్నమావాస్యాం యత్నేన పురుషః శుచిః ॥ 21 ॥

సర్వాన్కామానవాప్నోతి స్వర్గం చానంతమశ్నుతే । 22 ॥

శ్రాద్ధము నాయా తిథులందు పెట్టినప్పుడు పొందు ఫలితాలను చెబుతున్నారు. పాడ్యమిలో ధనలాభం, విదియలో సంతానసంపద, తదియలో పుత్రలాభం, చతుర్థిలో శత్రునాశనం, పంచమిలో ధనం, షష్ఠిలో లోకపూజ్యత, సప్తమిలో గణాధిపత్యం, అష్టమిలో ఉత్తమమైన జ్ఞానం, నవమిలో స్త్రీలాభం, దశమిలో పూర్తిగా కోరికలు తీరినవాడవుతాడు. ఏకాదశిలో సమస్తవేదవిజ్ఞానమును, ద్వాదశిలో జయలాభమూ, త్రయోదశిలో దీర్ఘాయువు, ఐశ్వర్యమూ, సంతానవృద్ధి, పశుసంపద, మంచి బుద్ధి, స్వాతంత్ర్యం, ఉత్తమమైన పుష్టి పొందగలడు. దీనిలో సందేహం లేదు. ఎవని తల్లిదండ్రులు వయస్సులో ఉండగానే చనిపోతారో! ఆయుధం చేత మృతి పొందుతారో,

ఆ కుమారుడు వారి తృప్తిని కోరేవాడైతే చతుర్దశి తిథినాడు అతనికి లభించిన అన్నంతో శ్రద్ధగా శ్రాద్ధము పెట్టాలి. అమావాస్యలో ప్రయత్నంతో శుచిగా శ్రాద్ధము నాచరిస్తే అనంతమైన కోరికలను పొంది స్వర్గమును పొందగలడు.

ఏ ఏ తిథులలో శ్రాద్ధము నాచరిస్తే దానివల్ల పొందు ఫలములను ఈక్రింది పట్టికలో చూడవచ్చు.

తిథి	**ఫలం**
పాడ్యమి	ధనలాభం
విదియ	సంతానసంపద
తదియ	పుత్రలాభం
చవితి	శత్రునాశనం
పంచమి	ధనలాభం
షష్ఠి	గణాధిపత్యం, నాయకత్వం
సప్తమి	ఉత్తమమైన జ్ఞానసంపద
నవమి	స్త్రీలాభం
దశమి	సంపూర్ణంగా కోరికలు తీరుతాయి
ఏకాదశి	సమస్తవేదవిజ్ఞానం
ద్వాదశి	జయలాభం
త్రయోదశి	దీర్ఘాయువు, సంతానవృద్ధి, పశుసంపద, మంచి మేధస్సు, స్వాతంత్ర్యము, మంచిబలము
చతుర్దశి	లభించిన అన్న శ్రాద్ధంతోనే పితరుల తృప్తి
అమావాస్య	అన్ని కోరికలు తీరి అనంత స్వర్గప్రాప్తి

అతః పరం మునిశ్రేష్ఠాః శృణుధ్వం వదతో మమ ॥ 23 ॥

పితౄణాం ప్రీతయే యత్ర యద్దేశం ప్రీతికారిణా ।
మాసం తృప్తిః పితౄణాం తు హవిష్యాన్నేన జాయతే ॥ 23 ॥

మాసద్వయం మత్స్యమాంసైః తృప్తిం యాంతి పితామహాః ।
త్రీన్మాసాన్హారిణం మాంసం విజ్ఞేయం పితృతృప్తయే ॥ 24 ॥

పుష్ణాతి చతురో మాసాన్ శశస్య పిశితం పితౄన్ ।
శాకునం పంచ వై మాసాన్ షణ్మాసాన్ శూకరామిషమ్ ॥ 25 ॥

ఛాగలం సప్త వై మాసాన్ ఐణేయం చాష్టమాసకాన్ ।
కరోతి తృప్తిం నవ వై రురుమాంసం న సంశయః ॥ 26 ॥

గవ్యం మాంసం పితృతృప్తిం కరోతి దశమాసికీమ్ ।
తథైకాదశమాసాంస్తు ఔరభ్రం పితృతృప్తిదమ్ ॥ 27 ॥

సంవత్సరం తథా గవ్యం పయః పాయసమేవ చ ।
వార్ధ్రీణమాంసం సల్లోహం కాలశాకం తథా మధు ॥ 28 ॥

రోహితామిషమన్నం చ దత్తాన్యాత్మకులోద్భవైః ।
అనంతం వై ప్రయచ్ఛంతి తృప్తియోగం సుతాంస్తథా ॥ 29 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! పితరులు ప్రీతిని పొందుటకు శ్రాద్ధమునందు వినియోగించవలసిన ద్రవ్యములను, ప్రదేశమును గూర్చి చెబుతున్నాను వినండి. హవిష్యాన్నముతో పితరులకు శ్రాద్ధమును పెడితే పితృదేవతలు నెలరోజులు తృప్తిని పొందుతారు. మత్స్యమాంసములతో పితామహులు రెండు నెలలు తృప్తిని పొందుతారు. లేడి మాంసంతో చేసిన శ్రాద్ధంవల్ల మూడు నెలలు తృప్తిని పొందుతారు. కుందేలు మాంసంతో చేసిన శ్రాద్ధంచే పితరులకు నాలుగు నెలలు తృప్తి కలుగుతుంది. పక్షుల మాంసంతో శ్రాద్ధము నాచరిస్తే ఐదు నెలలు తృప్తిని పొందుతారు.

అడవిపంది మాంసంతో ఆరు నెలలు తృప్తిపడతారు. మేక మాంసంతో చేసిన శ్రాద్ధమువల్ల ఏడు నెలలు తృప్తిపడతారు. జింక మాంసంతో పెట్టిన శ్రాద్ధంవల్ల ఎనిమిది నెలలు తృప్తిని, నల్లచారలదుప్పి మాంసంవల్ల తొమ్మిది నెలలు తృప్తినీ పొందుతారు. ఈ విషయంలో సంశయం లేదు.

గోమాంసంతో లేదా ఆవుపాలు, పెరుగు మొదలగు వానితో శ్రాద్ధం చేస్తే పితరులు పది నెలలు తృప్తిని పొందుతారు. ఔరభ్రం అనగా కొండమేక మాంసంతో శ్రాద్ధం పితరులకు పదుకొండు మాసములు తృప్తిని కలుగజేస్తుంది. ఆవుపాలు పాయసముతో శ్రాద్ధం వల్ల సంవత్సరకాలం తృప్తి చెందుతారు. గండకపక్షి మాంసము, (వార్ధ్రీణ) కరివేపాకు కూర (కాలశాకము,) పొన్నగంటికూర, తేనె, చమరీమృగమాంసంతో కూడిన అన్నమును తమ పితరులకు ఆ కులంలో పుట్టినవారు శ్రాద్ధంలో సమర్పిస్తే అనంతమైన తృప్తినీ, సంతానమునూ ఇస్తారు. (ఇది కృత, త్రేత, ద్వాపరములలో మాత్రమే! "కలౌ శ్రాద్ధే తు మాంసం చ వర్జయేత్ తృప్తిమిచ్ఛతా" అను పరాశరస్మృతి వాక్యం ప్రమాణం.)

పితౄణాం నాత్ర సందేహో గయాశ్రాద్ధం చ భో ద్విజాః ।
యో దదాతి గుడోన్మిశ్రాంస్తిలాన్వా శ్రాద్ధకర్మణి ॥ 30 ॥

మధు వా మధుమిశ్రం వా అక్షయం సర్వమేవ తత్ ।
అపి నః స కులే భూయాద్యో నో దద్యాజ్జలాంజలిమ్ ॥ 31 ॥

పాయసం మధుసంయుక్తం వర్షాసు చ మఘాసు చ ।
ఏష్టవ్యా బహవః పుత్రా యద్యేకోఽపి గయాం వ్రజేత్ ॥ 32 ॥

గౌరీం సముద్వహేత్కన్యాం నీలం వా వృషముత్సృజేత్ ।
కృత్తికాసు పితౄనర్చ్య స్వర్గమాప్నోతి మానవః ॥ 33 ॥

అపత్యకామో రోహిణ్యాం సౌమ్యే తేజస్వితాం లభేత్ ।
శౌర్యమార్ద్రాసు చాఽఽప్నోతి క్షేత్రాణి చ పునర్వసౌ ॥ 34 ॥

పుష్యే తు ధనమక్షయ్యమాశ్లేషే చాఽఽయురుత్తమమ్ ।
మఘాసు చ ప్రజాం పుష్టిం, సౌభాగ్యం ఫాల్గునీషు చ ॥ 35 ॥

ప్రదానశీలో భవతి సాపత్యశ్చోత్తరాసు చ ।
ప్రయాతి శ్రేష్ఠతాం శాస్త్రే హస్తే శ్రాద్ధప్రదో నరః ॥ 36 ॥

రూపం తేజశ్చ చిత్రాసు తథాఽపత్యమవాప్నుయాత్ ।
వాణిజ్యలాభదా స్వాతీ విశాఖా పుత్రదా సదా ॥ 37 ॥

కుర్వంతాం చానురాధాసు తా దద్యుశ్చక్రవర్తితామ్ ।
ఆధిపత్యం చ జ్యేష్ఠాసు మూలే చాఽఽరోగ్యముత్తమమ్ ॥ 38 ॥

ఆషాఢా సుయశః ప్రాప్తిరుత్తరాసు విశేషతః ।
శ్రవణే చ శుభాన్కామాన్ధనిష్ఠాసు ధనం మహత్ ॥ 39 ॥

వేదవిత్త్వమభిజితి భిషక్సిద్ధిం చ వారుణే ।
అజావికం ప్రౌష్ఠపద్యాం విందేద్గావస్తథోత్తరే ॥ 40 ॥

రేవతీషు తథా కుప్యమాశ్వినీషు తురంగమాన్ ।
శ్రాద్ధం కుర్వంస్తథాఽఽప్నోతి భరణీష్వాయురుత్తమమ్ ॥ 41 ॥

ఏవం ఫలమవాప్నోతి ఋక్షేష్వేతేషు తత్త్వవిత్ ।
తస్మాత్కామ్యాని శ్రాద్ధాని దేయాని విధివద్ద్విజాః ॥ 42 ॥

ఓ ద్విజులారా! కుమారులు గయా శ్రాద్ధమునాచరిస్తే పితరులు తృప్తినొందుతారనడంలో సందేహమే లేదు. బెల్లంతో మిశ్రితమైన నువ్వులను శ్రాద్ధమునందుపయోగిస్తే విశేషఫలము లభిస్తుంది. తేనె కాని, తేనెతో కూడిన పదార్థములను గాని పితృదేవతలకు సమర్పిస్తే అక్షయఫలమునిస్తారు. తమ వంశంలో పుట్టినవాడు మాకు జలాంజలిని (పితృతర్పణములను) ఇచ్చి తేనెతో కూడిన పాయసమును వర్షఋతువునందు, మఘా నక్షత్రములందు లేదా మాఘమాసమునందు గాని ఎప్పుడు సమర్పిస్తారని ఎదురు చూస్తుంటారు. పుత్రులు తమకు అనేక పుత్ర సంతానము కావలెనని కోరి వారిని పొంది, వారిలో ఒక్కడైనను గయకు వెళతాడు కదా అని, తమ పుత్రులలో ఒక్కడైనా పది సంవత్సరముల వయస్సుగల కన్యకు (గౌరీ) వివాహము చేస్తాడా అని, నీలవృషభోత్సర్జనము చేస్తాడా అని పితృదేవతలు నిరీక్షిస్తుంటారు.

ఇక ఏ నక్షత్రమునందు శ్రాద్ధం ఆచరిస్తే ఏ ఫలాన్ని పొందుతారో వివరిస్తున్నారు. కృత్తికా నక్షత్రమునందు పితరులకు శ్రాద్ధము నాచరిస్తే స్వర్గమును, రోహిణియందు సంతానమును, మృగశిరయందు తేజస్సును, ఆర్ద్రా నక్షత్రమందు శౌర్యమును, పునర్వసు నక్షత్రమందు భూసంపదనీ, పుష్యమీ నక్షత్రమందు అక్షయ ధనసంపదను, ఆశ్లేషయందు పూర్ణాయుర్దాయమును, మఘయందు మంచి సంతానమును, పుష్టిని పూర్వఫల్గుణీ నక్షత్రమందు, సౌభాగ్యమును ఉత్తర ఫల్గుణియందు, ఉత్తరలో చక్కని దానశీలతను, హస్తయందు శాస్త్రపారంగత్వమును, చిత్రా

నక్షత్రమందు రూపమును, తేజస్సును, సంతానమును, స్వాతియందు వ్యాపారలాభమును, విశాఖయందు పుత్రసంతానమును, అనూరాధా నక్షత్రమందు చేసిన శ్రాద్ధంవల్ల చక్రవర్తిత్వమును, జ్యేష్ఠా నక్షత్రమునందు ఆధిపత్యమును, మూలానక్షత్రమునందు ఉత్తమమైన ఆరోగ్యమును, పూర్వాషాఢా నక్షత్రమందు కీర్తిని, ఉత్తరాషాఢా నక్షత్రమందు దుఃఖమును పోగొట్టే విశేషమైన కీర్తిని, శ్రవణమునందు శుభకామనలను, ధనిష్ఠయందు ధనసమృద్ధిని, అభిజిత్తుయందు వేదవిజ్ఞానమును, శతభిషా నక్షత్రమందు వైద్యశాస్త్ర విజ్ఞానమును, పూర్వాభాద్రా నక్షత్రమందు మేకల, గొఱ్ఱెల సంపదలను, ఉత్తరాభాద్రా నక్షత్రమునందు గోసంపదను, రేవతీ నక్షత్రమందు కంచు, వెండి మొదలగు లోహములను, అశ్వినీ నక్షత్రమందు గుఱ్ఱములను, భరణీ నక్షత్రమునందు శ్రాద్ధము నాచరించిన వాడు ఉత్తమమైన ఆయువును పొందగలడు. ఈవిధంగా ఆయా నక్షత్రములందు పితరులకు శ్రాద్ధంచేసేవాడు వారి అనుగ్రహంతో పైన చెప్పిన ఫలములను పొందగలడు. అందువలన బ్రాహ్మణక్షత్రియశూద్రులు ఆయా కోరికలను తీర్చే శ్రాద్ధములను, పితరులను గూర్చి విధిపూర్వకంగా ఆచరించవలెను. దానివల్ల పితరులు ప్రీతి నొందుతారు.

ఆయా నక్షత్రమునందు పితరులకు శ్రాద్ధమును ఆచరించిన కలుగు ఫలముల పట్టిక ఫలితాలు

నక్షత్రము	**ఫలము**
కృత్తిక	స్వర్గం
రోహిణి	సంతానం
మృగశిర	తేజస్సు
ఆర్ద్ర	శౌర్యం
పునర్వసు	పుణ్యక్షేత్ర సందర్శనం
పుష్యమి	అక్షయ ధనసంపద
ఆశ్లేష	పూర్ణాయుర్దాయం
మఘ	సత్సంతానం, పుష్టి
పూర్వఫల్గుణి	సౌభాగ్యం
ఉత్తరఫల్గుణి	దానశీలత
హస్త	శాస్త్రపారంగత్వము
చిత్ర	రూపం, తేజస్సు సంతానం
స్వాతి	వ్యాపార లాభం
విశాఖ	పుత్రసంతానం
అనూరాధ	చక్రవర్తిత్వం
జ్యేష్ఠ	ఆధిపత్యం
మూల	ఉత్తమ ఆరోగ్యం
పూర్వాషాఢ	కీర్తి

ఉత్తరాషాఢ	దుఃఖమును పోగొట్టే విశేషకీర్తి
శ్రవణం	శుభకామనలు
ధనిష్ఠ	ధనసమృద్ధి
అభిజిత్తు	వేదవిజ్ఞానం
శతభిషం	వైద్యశాస్త్ర విజ్ఞానం
పూర్వాభాద్ర	అజా, అవి సంపదలు (మేకల,గొర్రెల)
ఉత్తరాభాద్ర	గోసంపద
రేవతి	కంచు, వెండి లోహములు
అశ్విని	గుఱ్ఱములు
భరణి	ఉత్తమమైన ఆయువు

మహాలయశ్రాద్ధమ్

కన్యారాశిగతే సూర్యే ఫలమత్యంతమిచ్ఛతా ।
యాన్యాన్కామానభిధ్యాయన్కన్యారాశిగతే రవౌ ॥ 43 ॥

శ్రాద్ధం కుర్వంతి మనుజాస్తాంస్తాన్కామాంల్లభంతి తే ।
నాందీముఖానాం కర్తవ్యం కన్యారాశిగతే రవౌ ॥ 44 ॥

పౌర్ణమాస్యాం తు కర్తవ్యం వారాహవచనం యథా ।
దివ్యభౌమాంతరిక్షాణి స్థావరాణి చరాణి చ ॥ 45 ॥

పిండమిచ్ఛంతి పితరః కన్యారాశిగతే రవౌ ।
కన్యాం గతే సవితరి యాన్యహాని తు షోడశ ॥ 46 ॥

క్రతుభిస్తాని తుల్యాని దేవోనారాయణోఽబ్రవీత్ ।
రాజసూయాశ్వమేధాభ్యాం య ఇచ్ఛేద్దుర్లభం ఫలమ్ ॥ 47 ॥

అప్యంబుశాకమూలాద్యైః పితౄన్కన్యాగతేఽర్చయేత్ ।
ఉత్తరా హస్తనక్షత్రగతే తీక్ష్ణాంశుమాలిని ॥ 48 ॥

యోఽర్చయేత్స్వపితౄన్భక్త్యా తస్య వాసస్త్రివిష్టపే ।
హస్తర్క్షగే దినకరే పితృరాజానుశాసనాత్ ॥ 49 ॥

తావత్పితృపురీ శూన్యా యావద్వృశ్చికదర్శనమ్ ।
వృశ్చికే సమతిక్రాంతే పితరో దైవతైః సహ ॥ 50 ॥

నిఃశ్వస్య ప్రతిగచ్ఛంతి శాపం దత్వా సుదుస్సహమ్ ।
అష్టకాసు చ కర్తవ్యం శ్రాద్ధం మన్వంతరాసు వై ॥ 51 ॥

అన్వష్టకాసు క్రమశో మాతృపూర్వం తదిష్యతే ।
గ్రహణే చ వ్యతీపాతే రవిచంద్రసమాగమే ॥ 52 ॥

జన్మర్క్షేగ్రహపీడాయాం శ్రాద్ధం పార్వణముచ్యతే ।
అయనద్వితయే శ్రాద్ధం విషువద్వితయే తథా ॥ 53 ॥

సంక్రాంతిషు చ కర్తవ్యం శ్రాద్ధం విధివదుత్తమమ్ ।
శ్రాద్ధమేతేషు కర్తవ్యం పిండనిర్వాపణాదృతే ॥ 54 ॥

వైశాఖస్య తృతీయాయాం నవమ్యాం కార్తికస్య చ ।
శ్రాద్ధం కార్యం తు శుక్లాయాం సంక్రాంతివిధినా నరైః ॥ 55 ॥

త్రయోదశ్యాం భాద్రపదే మాఘే చంద్రక్షయేఽహని ।
శ్రాద్ధం కార్యం పాయసేన దక్షిణాయనవచ్చ తత్ ॥ 56 ॥

యదా చ శ్రోత్రియోఽభ్యేతి గేహం వేదవిదగ్నిమాన్ ।
తేనైకేన చ కర్తవ్యం శ్రాద్ధం విధివదుత్తమమ్ ॥ 57 ॥

సూర్యుడు కన్యారాశియందున్నప్పుడు ఏ ఏ కోరికలు మనస్సులో ధ్యానించుకొని పితరులకు శ్రాద్ధమునాచరిస్తారో ఆయా కోరికలు ఫలవంతములవుతాయి. కన్యారాశియందు సూర్యుడున్నప్పుడు నాందీముఖాదులు చేయవలెను. వరాహపురాణంలో చెప్పినట్లుగా పౌర్ణమియందు పితృశ్రాద్ధమును ఆచరించవలెను. దివ్యభౌమ, అంతరిక్ష, స్థావర, స్వర్గంలో, భూలోకంలో, భువర్లోకంలో ఎక్కడ ఉన్నా, కదిలేవిగా, కదలని రూపాలుగా ఎలా ఉన్నా పితరులు తమసంతానం వల్ల సూర్యుడు కన్యారాశిలో ఉండగా పిండప్రదానం కోరుతారు. సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించిననాటి నుండి పదహారు దినములు ఋతువులతో సమానమని సాక్షాత్తుగా దేవుడైన నారాయణ భగవానుడే చెప్పాడు. అంతేకాక రాజసూయాశ్వమేధముల వల్ల కూడా లభించని ఉన్నతమైన దుర్లభమైన ఫలమును కన్యారాశియందు సూర్యుడున్నపుడు నీరు, శాకములు, కందమూల ఫలాదులతో పితరులకు శ్రాద్ధము నాచరించిన పొందగలరు. ఉత్తరా, హస్తా నక్షత్రములలో పితృదేవతలను భక్తితో నర్చించే వారు స్వర్గమునందు నివసిస్తారు. హస్తానక్షత్రమును ప్రవేశించిన సూర్యుడు వృశ్చికరాశిలో చేరువరకు యమపురి శూన్యంగానే యుండునని ముని శాసనం. సూర్యుడు వృశ్చికరాశిని దాటిన తర్వాత పితృదేవతలు దేవతలతో గూడా కలిసి బరువుగా నిట్టూర్చి సహించడానికి వీల్లేని శాపమునిచ్చి తిరిగివెళ్ళి పోతారు. అష్టకములందు, మన్వంతరములందు, అన్వష్టకములందు మాతృపూర్వకంగా శాస్త్రవిధి ననుసరించి శ్రాద్ధమునాచరించవలెను. జన్మనక్షత్రమందు, గ్రహములకు పీడలు కలిగినప్పుడు, సూర్యచంద్ర గ్రహణములయందు, అమావాస్యయందు, వ్యతీపాతమునందు చేయు శ్రాద్ధమును పిండప్రదాన సహితముగా పార్వణమని చెబుతారు. అయనద్వితయమునందు అనగా ఉత్తరాయణ, దక్షిణాయన ప్రవేశకాలములలో విషువద్వితయమునందు అనగా మేష తులారాశి ప్రవేశాలలో, సంక్రాంతులయందును కూడా శ్రాద్ధం విధిపూర్వకంగా నాచరించుట ఉత్తమం. ఇటువంటి సమయములలో పిండప్రదానము లేకుండా శ్రాద్ధము నాచరించవలెను. వైశాఖమాసము నందలి శుద్ధ తదియయందు, కార్తికమాసముయొక్క శుద్ధ నవమియందు

సంక్రమణ విధిననుసరించి మానవులు శ్రాద్ధము నాచరించవలెను. భాద్రపద శుద్ధ త్రయోదశియందు, మాఘమాసమందు, చంద్రక్షయమగు అమావాస్యయందు, దక్షిణాయనమునందు చేసినట్లువలె పాయసంతో శ్రాద్ధము నాచరించవలెను. ఎప్పుడైనా వేదము తెలిసిన, నిత్యాగ్నిహోత్రియైన శ్రోత్రియుడు ఇంటికి వచ్చినట్లయితే అతనొక్కనితోనైనా శ్రాద్ధమునాచరించుట ఉత్తమమైనది.

శ్రాద్ధీయద్రవ్యసంప్రాప్తిర్యదాస్యాత్సాధుసంమతా ।
పార్వణేన విధానేన శ్రాద్ధం కార్యం ద్విజోత్తమైః ॥ 58 ॥

సాధుసమ్మతమైన శ్రాద్ధ ద్రవ్యములు సంపాదించుకొన్నపుడు బ్రాహ్మణోత్తములతో పార్వణ విధానముననుసరించి పితరులకు శ్రాద్ధము నాచరించవలెను.

ప్రతిసంవత్సరం కార్యం మాతాపిత్రోర్మృతేఽహని ।
పితృవ్యస్యాప్యపుత్రస్య భ్రాతుర్జ్యేష్ఠస్య చైవ హి ॥ 59 ॥

తల్లిదండ్రులు మరణించిన దినముననుసరించి ఆ దినముననే ప్రతి సంవత్సరము శ్రాద్ధమునాచరించ వలెను. అట్లే కుమారులు లేని పినతండ్రికి, పెద్ద అన్నకు కూడా వారు మరణించిన దినముననే ప్రతి సంవత్సరము శ్రాద్ధము పెట్టవలెను.

పార్వణం దేవపూర్వం స్యాదేకోద్దిష్టం సురైర్వినా ।
ద్వౌ దైవే పితృకార్యే త్రీనేకైకముభయత్ర వా ॥ 60 ॥

విశ్వేదేవపూర్వకంగా పార్వణమును, విశ్వేదేవతలు లేకుండా ఏకోద్దిష్ట శ్రాద్ధమును పెట్టవలెను. ఏకోద్దిష్ట శ్రాద్ధమునందు దైవస్థానమునందిద్దరిని, పితృకార్యము నందు ముగ్గురిని లేదా రెండు చోట్ల ఒక్కొక్కరిని గాని బ్రాహ్మణులను శ్రాద్ధభోజనానికి తప్పనిసరిగా నియమించవలెను.

మాతామహానామప్యేవం సర్వమూహేన కీర్తితమ్ ।
ప్రేతీభూతస్య సతతం భువి పిండం జలం తథా ॥ 61 ॥

సతిలం సకుశం దద్యాద్బహిర్జలసమీపతః ।
తృతీయేఽహ్ని చ కర్తవ్యం ప్రేతాస్థిచయనం ద్విజైః ॥ 62 ॥

దశాహే బ్రాహ్మణాః శుద్ధా ద్వాదశాహేన క్షత్రియాః ।
వైశ్యాః పంచ దశాహేన శూద్రో మాసేన శుద్ధ్యతి ॥ 63 ॥

మాతామహులవిషయంలో కూడా ఈవిధంగానే అర్చించవలెను. ప్రేతయైన జీవునకు ఎప్పుడూ భూమిపై పిండమునూ, జలమునూ ఈయవలెను. నువ్వులతో, దర్భలతో బయట జలసమీపమున పెట్టవలెను. చనిపోయిన మూడవరోజున బ్రాహ్మణులచే అస్థిచయనం చేయదగినది. మృతాశౌచమునుండి బ్రాహ్మణులు పదవ రోజున, క్షత్రియులు పన్నెండవ రోజున, వైశ్యులు పదిహేనవ రోజున, శూద్రులు నెల రోజులకు శుద్ధిని పొందుతారు.

సూతకాన్తే గృహే శ్రాద్ధమేకోద్దిష్టం ప్రచక్షతే ।
ద్వాదశేఽహని మాసే చ త్రిపక్షే చ తతః పరమ్ ॥ 64 ॥

సూతకముయొక్క చివరలో ఇంట్లో చేసే శ్రాద్ధమును ఏకోద్దిష్టమంటారు. పన్నెండవ రోజున ద్వాదశాహం, మాసమునకు నెలమాసికము, నలుబది ఐదు రోజులకు త్రిపక్షము అందురు.

మాసి మాసి చ కర్తవ్యం యావత్సంవత్సరం ద్విజాః ।
తతః పరతరం కార్యం సపిండీకరణం క్రమాత్ ॥ 65 ॥

పన్నెండవ రోజున షోడశము నాచరించిన తర్వాత సపండీకరణము చేయవలెను. ప్రతి నెలకొకటి చొప్పున సంవత్సరం వరకు మాసికములు పెట్టవలెను.

కృతే సపండీకరణే పార్వణం ప్రోచ్యతే పునః ।
తతః ప్రభృతి నిర్ముక్తాః ప్రేతత్వాత్పితృతాం గతాః ॥ 66 ॥

సపిండీకరణం అయ్యాక తిరిగి పార్వణ విధి చెప్పబడింది. పిమ్మట జీవులు ప్రేతత్వము నుండి విముక్తులై పితృదేవతాత్వమును పొందుతారు.

అమూర్తా మూర్తిమంతశ్చ పితరో ద్వివిధాః స్మృతాః ।
నాందీముఖాస్త్వమూర్తాః స్యుర్మూర్తిమంతోఽథ పార్వణాః ॥ 67 ॥

పితృదేవతలు అమూర్తులని, మూర్తిమంతులని రెండు విధములుగా నుంటారు. వీరిలో నాందీముఖులు అమూర్తులు. పార్వణులు మూర్తిమంతులు.

ఏకోద్దిష్టాశినః ప్రేతాః పితౄణాం నిర్ణయస్త్రిధా ।

ఏకోద్దిష్టమైన శ్రాద్ధపిండాన్ని భుజించేవారిని ప్రేతలు అని పితృదేవతలను మూడు విధములుగా నిర్ణయించారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే 'శ్రాద్ధకల్పే' ఏకాదశోత్తర శతతమోఽధ్యాయః. ॥ 111 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో 'శ్రాద్ధ కల్పం' అనే నూట పదకొండవ అధ్యాయము సంపూర్ణం.

ద్వాదశోత్తర శతతమోఽధ్యాయః - నూట పన్నెండవ అధ్యాయం
సపిండీకరణ నిరూపణమ్ - సపిండీకరణమును నిరూపించుట

మునయ ఊచుః :- మునులు పలికారు.

కథం సపిండీకరణం కర్తవ్యం ద్విజసత్తమ ।
ప్రేతీభూతస్య విధివద్బ్రూహి నో వదతాం వర ॥ 1 ॥

చక్కగా బోధించే శ్రేష్ఠమైన ఓ బ్రాహ్మణోత్తమా! ప్రేతగా నున్నవారికి సపిండీకరణమును ఎలా చేయాలో మాకు తెలియజేయండి.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

సపిండీకరణం విప్రాః శృణుధ్వం వదతో మమ ।
తచ్చాపి దేవరహితమేకార్ఘ్యైకపవిత్రకమ్ ॥ 2 ॥

ఓ బ్రాహ్మణులారా! నేను సపిండీకరణమును గూర్చి చెబుతున్నాను వినండి. అది విశ్వేదేవరహితము. ఏకార్ఘ్యమూ, ఏక పవిత్రంతోనూ చేయవలెను.

నైవాగ్నౌ కరణం తత్ర తచ్చాఽఽవాహనవర్జితమ్ ।
అపసవ్యం చ తత్రాపి భోజయేదయుజో ద్విజాన్ ॥ 3 ॥

అగ్నియందు చేయకూడనిది, ఆవాహనాదులు కూడా లేనిది అయిన ఈ సపిండీకరణంలో అపసవ్యంగా (విశే.అపసవ్య యజ్ఞోపవీతమును ఎడమ భుజంనుండి కుడి భుజం మీదకు మార్చుకొనుట) బేసి సంఖ్యగల బ్రాహ్మణులకు భోజనమును పెట్టవలెను.

విశేషస్తత్ర చాన్యోఽస్తి ప్రతిమాసక్రియాదికః ।
తం కథ్యమానమేకాగ్రాః శృణుధ్వం మే ద్విజోత్తమాః ॥ 4 ॥

ముఖ్యంగా ప్రతినెలకు చేయవలసిన విశేషమైన క్రియాకలాపములు వేరుగా ఉన్నాయి. బ్రాహ్మణులారా! వాటిని చెబుతున్నాను. శ్రద్ధగా వినండి.

తిలగంధోదకైర్యుక్తం తత్ర పాత్ర చతుష్టయమ్ ।
కుర్యాత్పితౄణాం త్రితయమేకం ప్రేతస్య చ ద్విజాః ॥ 5 ॥

దీనిలో అర్ఘ్యంకొఱకు నాలుగు పాత్రలను సిద్ధము చేసుకొనవలెను. ఆ పాత్రలలో నువ్వులు, గంధం, నీరు పోయవలెను. మూడు పాత్రలతో పితృదేవతల కొఱకు, ఒక పాత్ర ప్రేతకొఱకు ఉపయోగించ వలెను.

పాత్రత్రయే ప్రేతపాత్రాదర్ఘ్యం చైవ ప్రసేచయేత్ ।
యే సమానా ఇతి జపన్పూర్వవచ్ఛేషమాచరేత్ ॥ 6 ॥

ప్రేత పాత్రలోనున్న తిల గంధ జలముతో మొదట చెప్పిన పితృదేవతల మూడు పాత్రలలో నర్ఘ్యమిచ్చి తడుపవలెను. "యే సమానా" అను మంత్రమును జపిస్తూ మొదటి వలెనే మిగిలిన వాటిల్లో చల్లుతూ కార్యక్రమము చేయవలెను.

స్త్రీణామప్యేవమేవ స్యాదేకోద్దిష్టముదాహృతమ్ ।
సపిండీకరణం తాసాం పుత్రాభావే న విద్యతే ॥ 7 ॥

స్త్రీలకు కూడా ఏకోద్దిష్టమును ఈవిధంగానే చెప్పారు. కాని పుత్రులులేని స్త్రీలకు సపిండీకరణ ముండదు.

ప్రతి సంవత్సరం కార్యమేకోద్దిష్టం నరైః స్త్రియాః ।
మృతాహని చ తత్కార్యం పితౄణాం విధిచోదితమ్ ॥ 8 ॥

స్త్రీలకుకూడా ప్రతి సంవత్సరము ఏకోద్దిష్టమును పితృదేవతలకు చేసినట్లే వారు మరణించిన దినముననే చేయవలెను.

పుత్రాభావే సపిండాస్తు తదభావే సహోదరాః ।
కుర్యురేతం విధిం సమ్యక్పుత్రస్య చ సుతాసుతాః ॥ 9 ॥

పుత్రులులేని స్త్రీలకు సపిండులు అనగా జ్ఞాతులు, జ్ఞాతులు కూడా లేనపుడు సోదరులు శ్రాద్ధమును పెట్టవలెను. మాతామహులకు దౌహిత్రులు అనగా కూతురు కుమారులు చేయవలెను.

కుర్యాన్మాతామహానాం తు పుత్రికా తనయస్తథా ।
ద్వ్యాముష్యాయణ సంజ్ఞాస్తు మాతామహపితామహాన్ ॥ 10 ॥

పూజయేయుర్యథాన్యాయం శ్రాద్ధైర్నైమిత్తికైరపి ।
సర్వాభావే స్త్రియః కుర్యుః స్వభర్తౄణామమంత్రకమ్ ॥ 11 ॥

తదభావే చ నృపతిః కారయే త్స్వకుటుంబినామ్ ।
తజ్జాతీయైర్నరైః సమ్యగ్దాహాద్యాః సకలాః క్రియాః ॥ 12 ॥

తల్లి తండ్రికి, తండ్రి తండ్రికి ద్వ్యాముష్యాయణ సంజ్ఞ కలవారు అనగా పితృమాతృకుల ఉద్ధారకునిగా కన్యాదాన సమయంలో కన్యావర పితరులు నిర్ణయించిన వారు పుత్రికా ధర్మంతో కన్యాదానంగా చేసిన వధువుకు పుట్టినవాడు చేయవలెను. ఎవరూ లేనట్లయితే తమ భర్తలకు స్త్రీలే అమంత్రకంగా చేసెదరు గాక. నిత్యశ్రాద్ధంతోపాటు నైమిత్తిక శ్రాద్ధములు కూడా న్యాయము ననుసరించి కూతురు కుమారుడు చేయవలెను. ఆ స్త్రీలు కూడా లేనపుడు, కుటుంబంలోని వారెవరూ లేనపుడు రాజు చేయించవలెను. ఎవరూ దిక్కులేని జీవులకు వారి జాతివారిచేత స్మశానానికి పంపించుట మొదలుకొని అన్ని కర్మలను రాజే చేయించవలెను.

సర్వేషామేవ వర్ణానాం బాంధవో నృపతిర్యతః ।
ఏతావః కథితా విప్రా నిత్యానైమిత్తికాస్తథా ॥ 13 ॥

ఎందుకనగా అన్ని వర్ణములవారికి బంధువు రాజే కదా! ఈవిధంగా వ్యాసుడు మునులకు సపిండీకరణ విధానాన్ని వివరించాడు.

వక్ష్యే శ్రాద్ధాశ్రయామన్యాం నిత్యనైమిత్తికీం క్రియామ్ ।
దర్శస్తత్ర నిమిత్తం తు విద్యాదిందుక్షయాన్వితః ॥ 14 ॥

ఇక శ్రాద్ధమునాశ్రయించి యుండే మరొక నిత్య నైమిత్తిక శ్రాద్ధమును చెబుతాను వినండి. అక్కడ చంద్ర క్షయంతో కూడుకున్న నిమిత్తకర్మను 'దర్శ' అంటారు.

నిత్యస్తు నియతః కాలస్తస్మిన్కుర్యాద్యథోదితమ్ ।
సపిండీకరణాదూర్ధ్వం పితుర్యః ప్రపితామహః ॥ 15 ॥

స తు లేపభుజం యాతి ప్రలుప్తః పితృపిండతః ।
తేషాం హి యశ్చతుర్థోఽన్యః స తు లేపభుజో భవేత్ ॥ 16 ॥

నిత్యశ్రాద్ధమనేది నియతకాలంతో యథావిధిగా చేయవలెను. నిత్యశ్రాద్ధము సపిండీకరణము తరువాత జరుపవలెను. తండ్రికి పెట్టిన పిండమునుండి లేపమును ప్రపితామహుడు (ముత్తాత) పొందగలడు. ఇతడు పితృపిండము లోపిస్తే లేపభుజుడవుతాడు. ఈ నాలుగవవాడు లేపభుజుడగును.

సోఽపి సంబంధతో హీనముపభోగం ప్రపద్యతే ।
పితా పితామహశ్చైవ తథైవ ప్రపితామహః ॥ 17 ॥

పిండసంబంధినో హ్యేతే విజ్ఞేయాః పురుషాస్త్రయః ।
లేపసంబంధినశ్చాన్యే పితామహపితామహాత్ ॥ 18 ॥

ప్రభృత్యుక్తాస్త్రయస్తేషాం యజమానశ్చ సప్తమః ।
ఇత్యేష మునిభిః ప్రోక్తః సంబంధః సాప్తపౌరుషః ॥ 19 ॥

అతడు కూడా ఏ సంబంధము లేనిచో ఉపభోగమును పొందుతాడు. తండ్రి, తాత, ముత్తాతలు (పితా, పితామహ, ప్రపితామహులు) ఈ ముగ్గురు పురుషులూ పిండసంబంధులని తెలుసుకొనవలెను. పితామహ పితామహులు అనగా వారి కంటె పైనున్న మూడు తరములవారు ముగ్గురు లేపసంబంధులు. వారిలో ఏడవవాడు యజమానుడు. దీనినే మునులు సాప్తపౌరుష సంబంధమని చెప్పారు.

యజమానాత్ప్రభృత్యూర్ధ్వమనులేపభుజస్తథా ।
తతోఽన్యే పూర్వజాః సర్వే యే చాన్యే నరకౌకసః ॥ 20 ॥

ఈ ఏడవ పురుషుడైన యజమానునినుండి పైన ఉన్నటువంటి వారిని 'అనులేపభుజు' లంటారు. వారికంటె ముందు వారు 'పూర్వభుజు' లని, ఇంకా ఇతరమైన వారిని 'నరకౌకసులు' అనగా నరకాదులకు వెళ్ళిన వారంటారు.

యేఽపి తిర్యక్త్వమాపన్నా యే చ భూతాదిసంస్థితాః ।
తాన్సర్వాన్యజమానో వై శ్రాద్ధం కుర్వన్యథావిధి ॥ 21 ॥

యజమానుడు తిర్యక్‌జాతి అనగా పశుపక్ష్యాది జన్మలను పొందినవారికి, పంచభూత తన్మాత్రలలో సంచరించు వారికి యథావిధిగా శ్రాద్ధమును పెట్టి సంతృప్తి పరుచవలెను.

స సమాప్యాయతే విప్రా యేన యేన వదామి తత్ ।
అన్నప్రకిరణం యత్తు మనుష్యైః క్రియతే భువి ॥ 22 ॥

తేన తృప్తిముపాయాంతి యే పిశాచత్వమాగతాః ।
యదంబుస్నానవస్త్రోత్థం భూమౌ పతతి భో ద్విజాః ॥ 23 ॥

తేన యే తరుతాం ప్రాప్తాస్తేషాం తృప్తిః ప్రజాయతే ।
యాస్తు గంధాంబుకణికాః పతంతి ధరణీతలే ॥ 24 ॥

తాభిరాప్యాయనం తేషాం దేవత్వం యే కులే గతాః ।
ఉద్ధృతేష్వథ పిండేషు యాశ్చాంబుకణికా భువి ॥ 25 ॥

తాభిరాప్యాయనం తేషాం యే తిర్యక్త్వం కులే గతాః ।
యే చాదంతాః కులే బాలాః క్రియాయోగాద్బహిష్కృతాః ॥ 26 ॥

విపన్నాస్త్వనధికారాః సంమార్జితజలాశినః ।
భుక్త్వా చాఽఽచామతాం యచ్చ యజ్జలం చాంఘ్రిశౌచజమ్ ॥ 27 ॥

బ్రాహ్మణానాం తథైవాన్యత్తేన తృప్తిః ప్రయాంతి వై ।
ఏవం యో యజమానస్య యశ్చ తేషాం ద్విజన్మనామ్ ॥ 28 ॥

కశ్చిజ్జలాన్నవిక్షేపః శుచిరుచ్ఛిష్ట ఏవ వా ।
తేనాన్నేన కులే తత్ర యే చ యోన్యంతరం గతాః ॥ 29 ॥

ఇట్లు సంతృప్తిపరుచుటను 'అన్న ప్రకిరణము' అంటారు. అనగా అన్నపు మెతుకులను చల్లుట అను క్రియాకలాపమును చేస్తారు. ఈ అన్న ప్రకిరణము మనుష్యులు చేయుటవల్ల పిశాచత్వమును పొందినవారు కూడా తృప్తి పడతారు. వస్త్రోత్థంతో అనగా స్నానముచేసిన బట్టను పిండిన నీటితో ఈ భూమిమీద వృక్షజన్మను పొందినవారు తృప్తిని పొందుతారు. 'ఈ భూమిమీద సువాసనతో కూడిన నీటిబిందువులు చల్లగానే ఆ కులంలో మరణించిన వారికీ, దేవత్వము పొందిన వారికి ఆప్యాయనము కలుగుతుంది. పిండములనెత్తిన తర్వాత చల్లిన నీటిచినుకులతో పశుపక్ష్యాది జన్మలెత్తినవారు తృప్తి పడతారు. పళ్లుకూడా రాని పసిపిల్లలు, కర్మబహిష్కృతులైన వారు, విపన్నులు, అనధికారులుగా మరణించినవారు పితృస్థానములో సమ్మార్జనము చేసిన జలముతో, బ్రాహ్మణులకు పాద ప్రక్షాళనము చేసిన నీటితో, భోజనము చేసిన తరువాత ఆచమనము చేసిన జలముతో తృప్తిని పొందుతారు.

ఈవిధంగా శ్రాద్ధ సమయంలో బ్రాహ్మణులకు చిలకరించిన జలగంధాదులు, అన్న ప్రకిరణము శుచిగా ఉన్నా ఒక్కోసారి ఉచ్ఛిష్టమైనా కూడా వాటితో ఇతర యోనులయందు పుట్టినవారు కూడా ఆ కులంవారు ఆప్యాయనము నొందుతారు.

ప్రయాంత్యాప్యాయనం విప్రాః సమ్యక్ శ్రాద్ధక్రియావతామ్ ।
అన్యాయోపార్జితైరర్థైర్యచ్ఛ్రాద్ధం క్రియతే నరైః ॥ 30 ॥

తృప్యంతే తేన చాండాల పుల్కసాద్యాసు యోనిషు ।
ఏవమాప్యాయనం విప్రాః బహూనామేవ బాంధవైః ॥ 31 ॥

శ్రాద్ధం కుర్వద్భిరత్రాంబువిక్షేపైః సంప్రజాయతే ।
తస్మాచ్ఛ్రాద్ధం నరో భక్త్యా శాకేనాపి యథావిధి ॥ 32 ॥

కుర్వీత కుర్వతః శ్రాద్ధం కులే కశ్చిన్న సీదతి ।
శ్రాద్ధం దేయం తు విప్రేషు సంయతేష్వగ్నిహోత్రిషు ॥ 33 ॥

అవదాతేషు విద్వత్సు శ్రోత్రియేషు విశేషతః ।
త్రిణాచికేతస్త్రిమధుస్త్రిసుపర్ణః షడంగవిత్ ॥ 34 ॥

మాతాపితృపరశ్చైవ స్వస్రీయః సామవేదవిత్ ।
ఋత్విక్పురోహితాచార్యముపాధ్యాయం చ భోజయేత్ ॥ 35 ॥

విధివిధానము ననుసరించి శ్రాద్ధమును చక్కగా నాచరిస్తే పితృదేవతలు తృప్తిని పొందుతారు. అన్యాయంగా సంపాదించిన ధనంతో శ్రాద్ధం పెడితే చండాల పుల్కసాది యోనులలో పుట్టిన వారికి తృప్తి కలుగుతుంది. ఇదే విధంగా శ్రాద్ధసమయంలో బంధువులు చల్లిన నీటి విక్షేపంతో చాలామందికి తృప్తి కలుగుతుంది. అందువల్ల కనీసం ఆకుకూరలతోగానీ, కూరగాయలతోగానీ యథావిధిగా శ్రాద్ధము నాచరించవలెను. ఈవిధంగా భక్తితో శ్రాద్ధము నాచరించే వాని కులమునందు ఏ ఒక్కడు దుఃఖమునొందడు.

ఈ శ్రాద్ధము చేయునపుడు నిత్యాగ్నిహోత్రులయిన వారిని, ఆచారనిష్ఠులను, మంచి జ్ఞానవంతులైన వారిని, శ్రోత్రియులను, విద్వాంసులను, భోక్తలుగా నియంత్రించి శ్రాద్ధము చేయుట విశేషమని చెప్పవచ్చును. త్రినాచికేత విద్య, త్రిమధు విద్య, త్రిసుపర్ణ విద్యలను మూడింటిని అధ్యయనముచేసి వాటి అర్థమును బాగుగా నెరిగి అనుష్ఠించు వారిని, వేదాంగములైన శిక్షా, వ్యాకరణం, జ్యోతిషం, ఛందస్సు, నిరుక్తం, కల్పమనే వాటిని బాగుగా తెలిసిన వారిని, తలిదండ్రులయందు భక్తిగలవారిని, సోదరి కుమారుని, (మేనల్లుని) సామవేదాధ్యయనము చేసినవారిని, యజ్ఞము చేయు ఋత్విక్కును, పురోహితునిని, తన ఆచార్యుని, ఉపాధ్యాయుని, శ్రాద్ధమునందు భోక్తగా నియమించుకొనవలెను.

మాతులః శ్వశురః శ్యాలః సంబంధీ ద్రోణపాఠకః ।
మండలబ్రాహ్మణో యస్తు పురాణార్థవిశారదః ॥ 36 ॥

అకల్పః కల్పసంతుష్టః ప్రతిగ్రహవివర్జితః ।
ఏతే శ్రాద్ధే నియోక్తవ్యా బ్రాహ్మణాః పంక్తిపావనాః ॥ 37 ॥

మేనమామను, బావమరిదిని, తనకు పిల్లనిచ్చిన మామను, తనతో సంబంధము కలుపుకున్న వియ్యంకుని, ద్రోణపాఠమును చదువుకున్నవానిని, తన మండలములోని పురాణార్థములను చక్కగా వివరించు సామర్థ్యము గల ముఖ్య బ్రాహ్మణుని, చెడు సంకల్పములు లేనివానిని, మంచి సంకల్పములతో సంతుష్టి నొందువానిని, ఇతరుల వద్దనుండి దానమును గ్రహించని వానిని, వీరిని పంక్తిపావనులైన బ్రాహ్మణులుగా శ్రాద్ధములో నియంత్రించు కొనవలెను, నియమించు కొనవలెను.

నిమన్త్రయేత్తు పూర్వేద్యుః పూర్వోక్తాన్ద్విజసత్తమాన్ ।
దైవే నియోగే పిత్ర్యే చ తాంస్తథైవోపకల్పయేత్ ॥ 38 ॥

శ్రాద్ధమునకు ముందురోజుననే ముందు చెప్పిన విధంగా బ్రాహ్మణోత్తములను పిలుచుకొని విశ్వేదేవతల స్థానంలో, పితృదేవతల స్థానంలో కూర్చుండబెట్టవలెను.

తైశ్చ సంయమిభిర్భావ్యం యస్తు శ్రాద్ధం కరిష్యతి ।
శ్రాద్ధం దత్వా చ భుక్త్వా చ మైథునం యోఽధిగచ్ఛతి ॥ 39 ॥

పితరస్తస్య వై మాసం తస్మిన్ రేతసి శేరతే ।

శ్రాద్ధమును ఆచరించు కర్తకూడా బ్రాహ్మణోత్తములతోపాటు మౌనవ్రతము నాచరించవలెను. శ్రాద్ధమునాచరించిన యజమానుడూ, శ్రాద్ధమునందు భోక్తగా కూర్చున్న బ్రాహ్మణుడూ ఒకవేళ మైథునము నందు పాల్గొన్నట్లయితే అతని పితరులు ఆ మైథున రేతస్సులోనే నెలరోజుల వరకు పడియుంటారు.

గత్వా చ యోషితం శ్రాద్ధే యో భుంక్తే యస్తు గచ్ఛతి ॥ 40 ॥

రేతో మూత్రకృతాహారాస్తం మాసం పితరస్తయోః ।
తస్మాత్తు ప్రథమం కార్యం ప్రాజ్ఞేనోపనిమంత్రణమ్ ॥ 41 ॥

ఎవడు స్త్రీని పొంది శ్రాద్ధమునందు భోక్తగా కూర్చుండి భోజనమును చేయునో, వారిద్దరియొక్క రేతో మూత్రములనే ఆహారంగా తీసుకుంటూ నెలరోజుల వరకు పితరులందులోనే యుంటారు. అందువలన ఉత్తముడైన బ్రాహ్మణుడెవరో తెలుసుకొని అటువంటి వానినే ప్రాజ్ఞుడు నిమంత్రణము చేయవలెను. ఇదే ప్రథమకర్తవ్యంగా భావించవలెను.

అప్రాప్తౌ తద్దినే వాఽపి వర్జ్యా యోషిత్ప్రసంగినః ।
భిక్షార్థమాగతాంశ్చాపి కాలేన సంయతాన్యతీన్ ॥ 42 ॥

భోజయేత్ప్రణిపాతాద్యైః ప్రసాద్య యతమానసః ।
యోగినశ్చ తదా శ్రాద్ధే భోజనీయా విపశ్చితా ॥ 43 ॥

శ్రాద్ధము నాచరించే రోజు స్త్రీమైథునప్రసంగం చేయువారిని కూడా నిమంత్రించకూడదు. ఒకవేళ ఉత్తమ బ్రాహ్మణుడు లభించనట్లయితే శ్రాద్ధసమయంలో ఇంటికి భిక్షకొరకు వచ్చినవారిని గానీ, యోగులనూ, యతులనూ గాని, సాష్టాంగనమస్కారం మున్నగువానితో వారిని ప్రసన్నులుగా చేసుకొని శ్రాద్ధమునందు ఆ యోగులకు భోజనం పెట్టవలెను.

యోగాధారా హి పితరః తస్మాత్తాన్ పూజయేత్సదా ।
బ్రాహ్మణానాం సహస్రాణి ఏకో యోగీ భవేద్యది ॥ 44 ॥

పితృదేవతలు యోగంమీద ఆధారపడి ఉంటారు. కావున వారి ప్రీతికొరకు సర్వదా యోగులను పూజించవలెను. వేలమంది బ్రాహ్మణులలో ఒక్కడే యోగి కాగలడు.

యజమానం చ భోక్తౄంశ్చ నౌరివాంభసి తారయేత్ ।
పితృగాథా తథైవాత్ర గీయతే బ్రహ్మవాదిభిః ॥ 45 ॥

యజమానునీ, భోక్తలను నీటిపైన నావ దాటించినట్లుగా ఆ యోగి తరింపచేయగలడు. అని ఈ విషయాన్నే బ్రహ్మవాదులు పితృగాథలుగా గానము చేస్తున్నారు.

యా గీతా పితృభిః పూర్వమైలస్యాఽఽసీన్మహీపతేః ।
కదా నః సంతతావగ్ర్యః కస్యచిద్భవితా సుతః ॥ 46 ॥

పూర్వం ఐలుడనే రాజును గూర్చి పితృదేవతలు మా సంతతిలో ఎవరికైనా, ఎప్పుడైనా శ్రేష్ఠుడైన కుమారుడు పుడతాడా? అని అడిగారు.

యో యోగిభుక్తశేషాన్నో భువి పిండాన్ప్రదాస్యతి ।
గయాయామథవా పిండం ఖడ్గమాంసం తథా హవిః ॥ 47 ॥

ఎవరైనా యోగులు తినగా మిగిలిన అన్నమును తిని ఈ భూమిమీద పిండములను పెట్టగలడా? గయాశ్రాద్ధమును చేయగలడా? గయలో పిండమును పెట్టగలడా? ఖడ్గమృగ మాంసమును, హవిస్సును సమర్పించగలడా?

కాలశాకం తిలాజ్యం చ తృప్తయే కృసరం చ నః ।
వైశ్వదేవం చ సౌమ్యం చ ఖడ్గమాంసం పరం హవిః ॥ 48 ॥

మాకు కాలశాకము (వెంపలికూర) ను, నువ్వులను, నేతిని, వైశ్వదేవమును, ఖడ్గమృగ మాంసమును, శ్రేష్ఠమైన హవిస్సును, సాత్వికమైన ఆహారము, కృసరము (పులగము) ను సమర్పించి తృప్తి పరుస్తాడా?

విషాణవర్జం శిరస ఆపాదాదాశిషామహే ।
దద్యాచ్ఛ్రాద్ధం త్రయోదశ్యాం మఘాసు చ యథావిధి ॥ 49 ॥

మఖా నక్షత్రమునందు, త్రయోదశినాడు కొమ్ములను మాత్రము వదిలి పాదములనుండి శిరస్సు వరకు గల ఖడ్గమృగ మాంసమును శ్రాద్ధమునందు యథావిధిగా సమర్పించునా?

మధుసర్పిఃసమాయుక్తం పాయసం దక్షిణాయనే ।
తస్మాత్సంపూజయేద్భక్త్యా స్వపితౄన్విధివన్నరః ॥ 50 ॥

దక్షిణాయనమునందు తేనె, నెయ్యితో కలిపిన పాయసమును ఎవడు సమర్పించునా అని ఎదిరి చూస్తుంటారు. అందువల్ల మనుష్యుడు భక్తితో విధిపూర్వకంగా పితృదేవతలను (ఆ ద్రవ్యములతో) పూజించవలెను.

కామానభీప్సన్సకలాన్పాపాదాత్మవిమోచనమ్ ।
వసూన్రుద్రాంస్తథాఽఽదిత్యాన్నక్షత్రగ్రహతారకాః ॥ 51 ॥

ప్రీణయంతి మనుష్యాణాం పితరః శ్రాద్ధతర్పితాః ।
ఆయుః ప్రజాం ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ ॥ 52 ॥

కోరికలు తీరిన పితరులను, వసు, రుద్ర, ఆదిత్యస్వరూపులను అర్చించిన సకలపాపములు తొలగించి ఆత్మవిమోచనమునిస్తారు. నక్షత్రగ్రహతారకలను సంతృప్తి పరిస్తే శ్రాద్ధంచే తృప్తినొందిన పితరులు మనుష్యులకు ఆయువు, సంతానము, ధనము, విద్య, స్వర్గము, మోక్షము, సుఖములనిచ్చి సంతోషపెడతారు.

ప్రయచ్ఛంతి తథా రాజ్యం పితరః శ్రాద్ధతర్పితాః ।
తథాఽపరాహ్ణః పూర్వాహ్ణాత్పితౄణామతిరిచ్యతే ॥ 53 ॥

అదే విధంగా శ్రాద్ధంచే తృప్తులయిన పితరులు రాజ్యమునిస్తారు. పితృదేవతలకు పూర్వాహ్ణము కంటె అపరాహ్ణము ముఖ్యమైనది.

సంపూజ్య స్వాగతేనైతాన్సదనేఽభ్యాగతాన్ద్విజాన్ ।
పవిత్రపాణిరాచాన్తానాసనేషూపవేశయేత్ ॥ 54 ॥

ఈ అపరాహ్ణ సమయంలో ఇంటికి వచ్చిన అభ్యాగతులైన బ్రాహ్మణులకు స్వాగతం పలికి పవిత్రపాణియై ఆచమనాదులిచ్చి ఉచితాసనంలో కూర్చొనబెట్టవలెను.

శ్రాద్ధం కృత్వా విధానేన సంభోజ్య చ ద్విజోత్తమాన్ ।
విసర్జయేత్ప్రియాణ్యుక్త్వా ప్రణిపత్య చ భక్తితః ॥ 55 ॥

విధిపూర్వకంగా శ్రాద్ధమాచరించి, ఆ బ్రాహ్మణోత్తములకు తృప్తిగా భోజనమును పెట్టి, ప్రియమైన మాటలను చెప్పి, భక్తిపూర్వకంగా నమస్కరించి వీడ్కోలు పలుకవలెను.

ఆద్వారమనుగచ్ఛేచ్చ ఆగచ్ఛేదనుమోదితః ।
తతో నిత్యక్రియాం కుర్యాద్భోజయేచ్చ తథాఽతిథీన్ ॥ 56 ॥

ద్వారంవరకు వెళ్ళి వారిని సాగనంపి వారి అనుమతితో తిరిగివచ్చి నిత్యకర్మను పూర్తిచేసుకొని అతిథులకు తృప్తి కలుగునట్లుగా భోజనం పెట్టవలెను.

నిత్యక్రియాం పితౄణాం చ కేచిదిచ్ఛంతి సత్తమాః ।
న పితౄణాం తథైవాన్యే శేషం పూర్వవదాచరేత్ ॥ 57 ॥

ఈ సమయంలోనే పితృదేవతలకు నిత్యక్రియగా తర్పణాదులను కూడా చేయవలెనని కొందరు పెద్దలు చెబుతారు. కొందరు ఆ విధంగా పితృదేవతలను గూర్చి చేయవలసిన అవసరం లేదని అంటారు. మిగిలినవి పూర్వంవలె చేయవలెను.

పృథక్త్వేన వదంత్యన్యే కేచిత్పూర్వం చ పూర్వవత్ ।
తతస్తదన్నం భుంజీత సహ భృత్యాదిభిర్నరః ॥ 58 ॥

కొంతమంది వేరుగా చేయవలెనని చెబుతారు. కొంతమంది పూర్వం చెప్పినట్లుగా ముందే చేయవలెనని చెబుతారు. ఆ తరువాత యజమాని శ్రాద్ధాన్నమును తమ కుటుంబసభ్యులతో, పరివారంతో కలిసి భుజించవలెను.

ఏవం కుర్వీత ధర్మజ్ఞః శ్రాద్ధం పిత్ర్యం సమాహితః ।
యథా చ విప్రముఖ్యానాం పరితోషోఽభిజాయతే ॥ 59 ॥

ఈవిధంగా ధర్మజ్ఞుడైన బ్రాహ్మణుడు ఏవిధంగా ముఖ్య బ్రాహ్మణులందరూ సంతోషిస్తారో ఆ విధంగా పితృదేవతల సంబంధమైన శ్రాద్ధమును చేయవలెను.

ఇదానీం సంప్రవక్ష్యామి వర్జనీయాన్ద్విజాధమాన్ ।
మిత్రధ్రుక్కునఖీ క్లీబః క్షయీ శుక్లీ వణిక్పథః ॥ 60 ॥

ఇక శ్రాద్ధమునందు భోక్తలుగా వర్జింపదగిన బ్రాహ్మణాధములను గూర్చి చెబుతాను. మిత్రులకు ద్రోహము చేయువాడు, గోళ్లను పెంచుకున్నవాడు, నపుంసకుడు, క్షయవ్యాధి గలవాడు, తెల్లమచ్చలు (బొల్లి) గలవాడు, వ్యాపారమును చేయువాడు.

శ్యావదంతోఽథ ఖల్వాటః కాణోఽంధో బధిరో జడః ।
మూకః పంగుః కుణిః షండో దుశ్చర్మా వ్యంగకేకరౌ ॥ 61 ॥

పళ్లు గార పట్టినవాడు, బట్టతల గలవాడు, ఒంటికన్ను గలవాడు, గ్రుడ్డివాడు, చెవిటివాడు, మందబుద్ధి గలవాడు, మూగవాడు, కుంటివాడు, వంకరలు గలవాడు, పౌరుషం లేనివాడు, చర్మవ్యాధి గలవాడు, అంగహీనుడూ, మెల్లకన్నువాడూ భోక్తగా పనికిరాడు.

కుష్ఠీ రక్తేక్షణః కుబ్జో వామనో వికటోఽలసః ।
మిత్రశత్రుర్దుష్కులీనః పశుపాలో నిరాకృతిః ॥ 62 ॥

కుష్ఠువ్యాధి గలవాడు, వంకర లేదా పీల చేతులు గలవాడు, ఎఱ్ఱని కండ్లవాడు, గూనివాడు, పొట్టివాడు, వికటంగా నుండువాడు, సోమరిపోతు, మనమిత్రులకు శత్రువైన వాడు, చెడ్డ వంశంలో పుట్టినవాడు, పశువులను మేపి జీవించువాడు, సంఘబహిష్కృతుడు –

పరివిత్తిః పరివేత్తా పరివేదనికాసుతః ।
వృషలీపతిస్తత్సుతశ్చ న భవేచ్ఛ్రాద్ధభుగ్ద్విజః ॥ 63 ॥

తన తమ్మునికి వివాహమైన తరువాత తాను వివాహమును చేసుకున్న అన్న, అన్న కంటే ముందే పెళ్లిని చేసుకున్న తమ్ముడు, అన్నకంటే ముందు వివాహము చేసుకున్న తమ్ముని భార్య గర్భంలో పుట్టిన కుమారుడు, శూద్రస్త్రీని వివాహము చేసుకున్న బ్రాహ్మణుడు, శూద్రస్త్రీని వివాహము చేసుకున్న వాని కుమారుడు ఇటువంటి వారిని శ్రాద్ధమునందు భోక్తలుగా పిలువకూడదు.

వృషలీపుత్రసంస్కర్తా అనూఢో దిధిషూపతిః ।
భృతకాధ్యాపకో యస్తు భృతకాధ్యాపితశ్చ యః ॥ 64 ॥

శూద్రస్త్రీని వివాహము చేసుకొనగా వారికి పుట్టిన కుమారునికి ఉపనయన సంస్కారము చేసిన బ్రాహ్మణుడు, బ్రహ్మచారి, భర్త మరణించిన తర్వాత వివాహమును చేసుకున్న స్త్రీ యొక్క భర్త, వేతనం తీసుకొని వేదాధ్యయనం చేయించువాడు, వేతనమిచ్చి వేదమును నేర్చుకునేవాడు –

సూతకాన్నోపజీవీ చ మృగయుః సోమవిక్రయీ ।
అభిశస్తః తథా స్తేనః పతితో వార్ధుషిః శఠః ॥ 65 ॥

సూత కాన్నమును తిని జీవించువాడు, మృగములను వేటాడువాడు, సోమలతలను సోమరసమును అమ్మువాడు, న్యాయస్థానంలో దోషిగా నిరూపించబడిన పాపి, దొంగ, పతితుడు, వడ్డీవ్యాపారం చేసేవాడు, కుటిలుడు –

పిశునో వేదసంత్యాగీ దానాగ్నిత్యాగనిష్ఠురః ।
రాజ్ఞః పురోహితో భృత్యో విద్యాహీనోఽథమత్సరీ ॥ 66 ॥

చాడీలు చెప్పేవాడు, వేదాధ్యయనం వదిలినవాడు, దానాగ్నిహోత్రములను వదిలి కఠినంగా నుండేవాడు, రాజపురోహితుడు, రాజసేవకుడు, విద్యాహీనుడు మరియు మత్సరం కలవాడు లేదా ఇతరులను చూసి ఈర్ష్యపడేవాడు –

వృద్ధ ద్విడ్ దుర్ధరః క్రూరో మూఢో దేవలకస్తథా ।
నక్షత్రసూచకశ్చైవ పర్వకారశ్చ గర్హితః ॥ 67 ॥

పెద్దలను ద్వేషించేవాడు, దుష్టుడు, క్రూరుడు, మూఢుడు, అర్చకుడు, జ్యోతిష్యవిద్యచే జీవించువాడు, పర్వకారుడు, లోకనిందను పొందినవాడు –

అయాజ్య యాజకః షంఢో గర్హితా యే చ యేఽధమాః ।
న తే శ్రాద్ధే నియోక్తవ్యా దృష్టాఽమీ పంక్తిదూషకాః ॥ 68 ॥

చేయకూడని వారితో చేయకూడని యాగములను చేయించేవాడు, నపుంసకుడు, నిందించబడినవారు అధములూ ఇటువంటి వారిని పంక్తిదూషకులుగా చెబుతారు. కావున భోక్తలుగా నియమించరాదు.

అసతాం ప్రగ్రహో యత్ర సతాం చైవావమాననా ।
దండో దైవకృతస్తత్ర సద్యః పతతి దారుణః ॥ 69 ॥

తీసుకొనకూడని దానములను తీసుకునే వానికి, సత్పురుషుల నవమానించేవానికి, దైవము వెంటనే వారికి దారుణమైన శిక్షను విధిస్తుంది.

హిత్వాఽఽగమం సువిహితం బాలిశం యస్తు భోజయేత్ ।
ఆదిధర్మం సముత్సృజ్య దాతా తత్ర వినశ్యతి ॥ 70 ॥

ఆగమ శాస్త్రము నాచరించువానిని వదిలి మూర్ఖునికి శ్రాద్ధభోజనం పెట్టిన యజమానుడు ధర్మమూలమునకే దూరుడై నశిస్తాడు.

యస్త్వాశ్రితం ద్విజం త్యక్త్వా అన్యమానీయ భోజయేత్ ।
తన్నిఃశ్వాసాగ్నినిర్దగ్ధస్తత్ర దాతా వినశ్యతి ॥ 71 ॥

తన నాశ్రయించి యున్న బ్రాహ్మణుని వదిలి ఇతరుని తీసుకుని వచ్చి భోజనం పెడితే తన నాశ్రయించిన బ్రాహ్మణుని నిట్టూర్పులనే అగ్నితో దహించబడి యజమానుడు నశిస్తాడు.

వస్త్రాభావే క్రియా నాస్తి యజ్ఞా వేదాస్తపాంసి చ ।
తస్మాద్వాసాంసి దేయాని శ్రాద్ధకాలే విశేషతః ॥ 72 ॥

వస్త్రదానం లేకుండా ఏ క్రియలూ ఉండవు. యజ్ఞములు లేవు, వేదములు లేవు, తపస్సులు లేవు. అందువల్ల శ్రాద్ధకాలమునందు విశేషంగా వస్త్రముల నీయవలెను.

కౌశేయం క్షౌమాకార్పాసం దుకూలమహతం తథా ।
శ్రాద్ధే త్వేతాని యో దద్యాత్కామానాప్నోతి చోత్తమాన్ ॥ 73 ॥

పట్టు వస్త్రములు, పొత్తు వస్త్రములు, నూలు వస్త్రములు, దుకూల (సన్నని) మంచివస్త్రములు కానీ శ్రాద్ధ కాలంలో ఇచ్చిన యజమానుడు ఉత్తమమైన ఫలితములను పొందగలడు.

యథా గోషు ప్రభూతాసు వత్సో విందతి మాతరమ్ ।
తథాఽన్నం తత్ర విప్రాణాం జంతుర్యత్రావతిష్ఠతే ॥ 74 ॥

ఆవుల మందలో లేగదూడ తన తల్లి పొదుగు దగ్గరకు చేరునట్లు శ్రాద్ధంలో బ్రాహ్మణులకు పెట్టిన అన్నము పితృదేవతలనే జీవికే చేరుతుంది.

నామగోత్రం చ మంత్రాంశ్చ దత్తమన్నం నయంతి తే ।
అపి యే నిధనం ప్రాప్తాస్తృప్తిస్తానుపతిష్ఠతే ॥ 75 ॥

నామము, గోత్రము, మంత్రములనునవి ఈ శ్రాద్ధాన్నమును ఆయా స్థానములందున్న వారికి అనగా ఆ వంశమునందు మరణించిన వారికందించి తృప్తిని కలిగిస్తుంది.

దేవతాభ్యః పితృభ్యశ్చ మహాయోగిభ్య ఏవ చ ।
నమః స్వాహాయై స్వధాయై నిత్యమేవ నమో నమః ॥ 76 ॥

ఆద్యావసానే శ్రాద్ధస్య త్రిరావృత్యా జపేత్తదా ।
పిండనిర్వపణే వాఽపి జపేదేవం సమాహితః ॥ 77 ॥

దేవతలకు, పితరులకు, మహాయోగులకు, స్వాహాదేవికి, స్వధాదేవికి సర్వదా నమస్కారములు. అంటూ శ్రాద్ధ సమయంలో మొదట చివర కూడా మూడు మార్లు జపించవలెను. అట్లే పిండ నిర్వాపణ సమయంలో కూడా ఇదే విధంగా ఏకాగ్రతతో జపించవలెను.

క్షిప్రమాయాన్తి పితరో రాక్షసాః ప్రద్రవన్తి చ ।
ప్రీయన్తే త్రిషు లోకేషు మన్త్రోఽయం తారయత్యుత ॥ 78 ॥

ఈవిధంగా మంత్రమును జపిస్తే పితృదేవతలు వస్తారు. రాక్షసులు పారిపోతారు. ముల్లోకములందున్న వారూ సంతోషిస్తారు. ఇది తరింపచేసే మంత్రం.

క్షౌమసూత్రం నవం దద్యాచ్ఛాణం కార్పాసికం తథా ।
పత్రోర్ణం పట్టసూత్రం చ కౌశేయం చ వివర్జయేత్ ॥ 79 ॥

క్రొత్త పట్టుదారమును, నూలు దారమును, శాణమును ఇచ్చి, ఆకులనుండి తీసిన దారమును, పట్టసూత్రమును, కౌశేయము మాత్రం వదిలి వేయవలెను.

వర్జయేచ్ఛాదశం ప్రాజ్ఞో యద్యప్యవ్యాహతం భవేత్ ।
న ప్రీణయన్త్యథైతాని దాతుశ్చాప్యనయో భవేత్ ॥ 80 ॥

ప్రాజ్ఞుడైన వాడు ఎట్లైనా అవ్యాహతమైన దానిని వదిలిపెట్టవలెను. ఇవి సంతోష పెట్టవు. దాతకు కూడా న్యాయం కాదు.

న నివేద్యో భవేత్పిణ్డః పితౄణాం యస్తు జీవతి ।
ఇష్టేనాన్నేన భక్ష్యేణ భోజయేత్తం యథావిధి ॥ 81 ॥

జీవించియున్న పితరులకు పిండము నివేదించ కూడదు. ఇష్టాన్నంతో, భక్ష్యంతో యథావిధిగా భోజనం పెట్టవలెను.

పిండమగ్నౌ సదా దద్యాచ్ఛ్రద్ధాభక్తియుతో నరః ।
పత్న్యై దద్యాత్ప్రజార్థీ చ మధ్యమం మంత్రపూర్వకమ్ ॥ 82 ॥

పిండమునెప్పుడూ శ్రద్ధగా భక్తియుతుడై అగ్నియందు ఉంచవలెను. సంతానమును కోరేవాడు మధ్య పిండమును మంత్రపూర్వకంగా భార్యకివ్వవలెను.

ఉత్తమాం ద్యుతిమన్విచ్ఛన్పిండం గోషు ప్రయచ్ఛతి ।
ప్రజ్ఞాం చైవ యశః కీర్తిమప్సు చైవ నివేదయేత్ ॥ 83 ॥

మంచి కాంతిని గోరేవాడు పిండమును గోవులకు పెట్టవలెను. మంచి ప్రజ్ఞను, యశస్సును కోరేవాడు పిండమును నీటియందు వేయవలెను.

ప్రార్థయన్దీర్ఘమాయుశ్చ వాయసేభ్యః ప్రయచ్ఛతి ।
కుమారశాలామన్విచ్ఛన్కుక్కుటేభ్యః ప్రయచ్ఛతి ॥ 84 ॥

దీర్ఘాయువును గోరేవాడు పిండమును కాకులకు పెట్టవలెను. కుమారశాలను గోరువాడు కోళ్లకు పిండమును నివేదించవలెను.

ఏకే విప్రాః పునః ప్రాహుః పిణ్డోద్ధరణమగ్రతః ।
అనుజ్ఞాతస్తు విప్రైస్తైః కామముద్ధ్రియతామితి ॥ 85 ॥

కొందరు పండితులు పిండోద్ధరణము అగ్రభాగంనుండి చేయవలెనని చెప్పారు. కొందరు ఇష్టం వచ్చిన రీతిగా పిండోద్ధరణము చేయుమని అనుజ్ఞనిచ్చారు.

తస్మాచ్ఛ్రాద్ధం తథాకార్యం యథోక్తమృషిభిః పురా ।
అన్యథా తు భవేద్దోషః పితౄణాం నోపతిష్ఠతి ॥ 86 ॥

అందువల్ల పూర్వం ఋషులు చెప్పిన విధంగానే శ్రాద్ధము నాచరించవలెను. మరొక విధంగా చేస్తే దోషం కలుగుటే కాక పితృదేవతలకు అది చేరదు.

యవైర్వ్రీహితిలైర్మాషైర్గోధూమైశ్చణకైస్తథా ।
సంతర్పయేత్పితౄన్ముద్గైః శ్యామాకైః సర్షపద్రవైః ॥ 87 ॥

పితృదేవతలను గూర్చి యవలతో, వ్రీహులతో, నువ్వులతో, మినుములతో, గోధుమలతో, శనగలతో అదేవిధంగా పెసలతో, చామలతో, ఆవాలతో కూడిన నీటితో తర్పణములను వదలవలెను.

నీవారైర్హస్తిశ్యామాకైః ప్రియఙ్గుభిస్తథాఽర్చయేత్ ।
ప్రసాతికాం సతృణికాం దద్యాచ్ఛ్రాద్ధే విచక్షణః ॥ 88 ॥

నీవారములతో, హస్తిశ్యామాకములతో అనగా ఏనుగు వంటి నల్లని సార్వా అనే పేరుగల ధాన్యంతో, ప్రియంగులతో అర్చన చేయవలెను. ప్రసాతికములనే అణువ్రీహులు చిన్న ధాన్యములు దర్భ (గరిక) తో కలిపి శ్రాద్ధమునందు భోక్త కీయవలెను.

ఆమ్రమామ్రాతకం బిల్వం దాడిమం బీజపూరకమ్ ।
ప్రాచీనామలకం క్షీరం నారికేళం పరూషకమ్ ॥ 89 ॥

వత్సకం చ సఖర్జూరం ద్రాక్షానీలకపిత్థకమ్ ।
పటోలం చ ప్రియాలం చ కర్కన్ధూబదరాణి చ ॥ 90 ॥

వైకంకతం చ నారింగం బీజపూరమథాపి వా ।
ఏతాని ఫలజాతాని శ్రాద్ధే దేయాని యత్నతః ॥ 91 ॥

మామిడిపండు, ఆమ్రాతకం, మారేడుపండు, గింజలతోనిండిన దాన్నిమ్మ పండు (మాదీఫలం), పాత ఉసిరిపండు, పాలు, గత సంవత్సరం తీసిన పాత కొబ్బరికాయ కుటజమును, ఖర్జూరములతో కలిపి నల్లద్రాక్షలు, వెలగపండును, పటోలము లేదా పరవలములు, ప్రియాలములు (సారపప్పు చిరంజి పప్పు) కర్కందు ఫలాలు (ఇరాన్ దేశపు రేగుపళ్లు) మరియు మనదేశపు రేగుపళ్లు వైకంకతములు, గింజలుగల నారింజలు లేదా గాజర మొదలైన పండ్లను తప్పక ప్రయత్నించి తెచ్చి శ్రాద్ధమునం దీయవలెను.

గుడశర్కరమత్సణ్డీర్దేయం ఫాణితమూర్మురమ్ ।
గవ్యం పయో దధి ఘృతం తైలం చ తిలసంభవమ్ ॥ 92 ॥

సైంధవం సాగరోత్థం చ లవణం సారసం తథా ।
నివేదయేచ్ఛుచీన్గంధాంశ్చన్దనాగరుకుంకుమాన్ ॥ 93 ॥

బెల్లము, శర్కర, కలకండ (మిశ్ర శుద్ధిచేయని దొడ్డ శర్కర) సత్తుపిండి, ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునేయి, నువ్వుల నూనె రాతిఉప్పు, సముద్రపుటుప్పును, రుచిగల దానిని నివేదించవలెను. అలాగే స్వచ్ఛమైన గంధములను, చందనములను, అగరులను, కుంకుమలను సమర్పించవలెను.

కాలశాకం తన్దులీయం వాస్తుకం మూలకం తథా ।
శాకమారణ్యకం చాపి దద్యాత్పుష్పాణ్యమూని చ ॥ 94 ॥

కాలశాకము (కరివెము) తందులీయము, వాస్తుకము, మూలకములు, అడవిలో దొరికే శాకములను ఈ క్రింద చెప్పబోవు పూవులను కూడా ఈయవలెను.

జాతిచంపకలోధ్రాశ్చ మల్లికాబాణబర్బరీ ।
వృంతాశోకాటరూపం చ తులసీ తిలకం తథా ॥ 95 ॥

పావంతీం శతపత్రాం చ గంధశేఫాలికామపి ।
కుబ్జకం తగరం చైవ మృగమారణ్యకేతకీమ్ ॥ 96 ॥

యూధికామతిముక్తం చ శ్రాద్ధయోగ్యాని భో ద్విజాః ।
కమలం కుముదం పద్మం పుణ్డరీకం చ యత్నతః ॥ 97 ॥

జాజి, చంపకము, లొద్దుగ, మల్లె, బాణకుసుమం, బర్బరము, (అడవి తులసి,) వృంతాశోకము, ఆటరూపము తులసి తిలకములు –పావంతిని, పద్మము, నీలసింధువారము, కుబ్జకము, తగరము, మృగపుష్పమూ అడవి జాతి మొగిలిపూలు. ఓ ద్విజులారా! యూధికము (జూహీ అనే పుష్పము), మాధవీలతల పుష్పం, కమలం, కుముదం, పద్మం, పుండరీకములనే పుష్పములను శ్రాద్ధయోగ్యములైనవిగా చెప్పారు.

ఇందీవరం కోకనదం కల్హారం చ నియోజయేత్ ।
కుష్ఠం మాంసీవాలకం చ కుక్కుటీ జాతిపత్రకమ్ ॥ 98 ॥

నల్ల కలువలు, ఎఱ్ఱ కలువలు, ఎఱ్ఱ తామరలు, కుష్ఠము, మాంసివాలుకం, శాల్మలములు, జాతి పత్రములు, (జాపత్రి) –

నలికోశీరముస్తం చ గ్రంథిపర్ణీ చ సుందరీ ।
పునరప్యేవమాదీని గంధయోగ్యాని చక్షిరే ॥ 99 ॥

నలికం, ఉశీరం, ముస్తగడ్డి, గ్రంథిపర్ణి మొదలగునవి గంధ యోగ్యములని చెబుతారు.

గుగ్గులుం చందనం చైవ శ్రీవాసమగరుం తథా ।
ధూపాని యాని యోగ్యాని ఋషిగుగ్గులమేవ చ ॥ 100 ॥

గుగ్గులం, చందనం, శ్రీవాసం, అగరు, ఋషిగుగ్గులం –ఇవి పితృదేవతలకు యోగ్యమైన ధూపములు.

రాజమాషాంశ్చ చనకాన్ మసూరాన్ కోరదూషకాన్ ।
విప్రుషాన్మర్కటాంశ్చైవ కోద్రవాంశ్చైవ వర్జయేత్ ॥ 101 ॥

రాజమాషములు (బొబ్బర్లు), శనగలు, మసూరములు, కోరదూషకములు, విప్రుషములు, మర్కటములు, కోద్రవములు పితృకార్యమునందు వదిలిపెట్టవలెను. అవి పనికిరావు.

మాహిషం చామరం మార్గమావికైకశఫోద్భవమ్ ।
స్త్రైణమౌష్ట్రమావికం చ దధిక్షీరం ఘృతం త్యజేత్ ॥ 102 ॥

గేదెపాలు, చమరీ మృగం పాలు, జింకపాలు, అవిక అనే గొఱ్ఱెపాలు, ఏకశఫ జంతువులనుండి వచ్చిన పాలు, ఆడువారిస్తన్యం, ఒంటెపాలు గాని, పై జంతువుల పాలతోచేసిన పెరుగుగాని, వాటి నెయ్యి కాని పితృశ్రాద్ధమునందు నిషిద్ధములు.

తాలం వరుణ కాకోలౌ బహుపత్రార్జునీఫలమ్ ।
జంబీరం రక్తబిల్వం చ శాలస్యాపి ఫలం త్యజేత్ ॥ 103 ॥

తాటిపండు, వరుణ, కాకోలము, ఎఱ్ఱమారేడు బహుపత్రము, అర్జునఫలము, జంబీరము, శాలఫలములు కూడా నిషిద్ధములే.

మత్స్యసూకర కూర్మాంశ్చ గావో వర్జ్యా విశేషతః ।
పూతికం మృగనాభిం చ రోచనాం పద్మచందనమ్ ॥ 104 ॥

చేప, పంది, తాబేలు, ఆవు మాంసములు, దుర్గంధమైన పూతకము, కస్తూరి, గొర్జోచనము, పద్మ చందనములు విశేషంగా నిషిద్ధములని తెలుసుకొనవలెను.

కాలేయకం తూగ్రగంధం తురుష్కం చాపి వర్జయేత్ ।
పాలంకం చ కుమారీం చ కిరాతం పిండమూలకమ్ ॥ 105 ॥

కాలేయకము, ఉగ్రగంధము, తురుష్కము, పాలంకము(= పాలకూర,) కుమారి(= నల్లపక్షి,) కిరాతము, పిండిగాజర దుంపలు కూడా నిషిద్ధములే.

గృంజనం చుక్రికాం చుక్రం వరుమాంచన పత్రికామ్ ।
జీవం చ శతపుష్పాం చ నాలికాం గంధశూకరమ్ ॥ 106 ॥

హలభృత్యం సర్షపం చ పలాండుం లశునం త్యజేత్ ।
మానస్కందం విషస్కందం వజ్రకందం గదాస్థికమ్ ॥ 107 ॥

గృంజనము= గంజాయి, చుక్రికము, చుక్రము (చింతచెట్టు పండు,) వరుమమూ, చనపత్రిక, జీవము, శతపుష్పము, నాళిక, గంధశూకరం, హలభృత్యము, ఆవాలు, నీరుల్లి, వెల్లుల్లి, మానస్కందము, విషస్కందము, వజ్రకందము, గదాస్థికములు శ్రాద్ధమునందు నిషిద్ధములు.

పురుషాల్వం సపిండాలుం శ్రాద్ధకర్మణి వర్జయేత్ ।
అలావుం తిక్తపర్ణాం చ కూష్మాండం కటుకత్రయమ్ ॥ 108 ॥

పురుషాల్వము, పిండాలువులు, అలావులు (తుంబి), తిక్క పర్ణము (ఒగరు రుచిగల ఆకులు), గుమ్మడికాయ, ఆనపకాయ (సొరకాయ), త్రికటుకములు శ్రాద్ధకర్మయందు నిషిద్ధములు.

వార్తాకం శివజాతం చ లోమశాని వటాని చ ।
కాలీయం రక్తవర్ణా చ బలాకా లకుచం తథా ॥ 109 ॥

వంకాయ, శివజాతము, లోమశములు, వటములు, కాలీయము, రక్తవర్ణములు, బలాకా, గజనిమ్మలూ నిషిద్ధములు.

శ్రాద్ధకర్మణి వర్జ్యాని విభీతకఫలం తథా ।
ఆరనాలం చ శుక్తం చ శీర్ణం పర్యుషితం తథా ॥ 110 ॥

విభీతకఫలము, (తాండ్ర) ఆరనాలము, శుక్తము, పాడైనవి, పాచిపట్టినవీ శ్రాద్ధకర్మయందు వాడకూడదు.

నోగ్రగంధం చ దాతవ్యం కోవిదారకశిగ్రుకౌ ।
అత్యామ్లం పిచ్ఛలం రూక్షం యాతయామం చ సత్తమాః ॥ 111 ॥

ఉగ్రగంధము, కోవిదారము (కాంచన వృక్షం), కశిగ్రుకము (ములగ), మిక్కిలి పులుపుగల వాటిని, పిచ్ఛిలము, రూక్షములైన పదార్థములు, పాచిపోయిన పదార్థములను శ్రాద్ధకర్మ యందుపయోగించ కూడదు. ఇవ్వకూడదు.

న చ దేయం గతరసం మద్యగంధం వివర్జయేత్ ।
హింగూగ్రగంధం ఫణిశం భూనింబం నింబరాజికే ॥ 112 ॥

రసహీనములైన వానిని, మద్యగంధము, ఇంగువ, ఉగ్రగంధము, ఫణిశము, భూనింబము, నింబరాజకము వీటిని శ్రాద్ధమునం దుపయోగించ కూడదు.

కుస్తుంబురుం కలింగోత్థం వర్జయేదమ్లవేతసమ్ ।
దాడిమం మాగధీం చైవ నాగరార్ద్రకతిత్తిడీః ॥ 113 ॥

కొత్తిమీర, కళింగమూ అమ్లవేతసము (పుల్ల ప్రబ్బలి) నిషేధములు. దానిమ్మ, మాగధి, నాగరార్ద్రకము (అల్లం), తిత్తిడి శ్రాద్ధమునం దుపయోగించవచ్చు.

ఆమ్రాతకం జీవకం చ తుంబురుం చ నియోజయేత్ ।
పాయసం శాల్మలీముద్గాన్మోదకాదీంశ్చ భక్తితః ॥ 114 ॥

ఆమ్రాతకం, జీవకం, తుంబురు, పాయసం, శాల్మలీ (కజ్జకాయలు), పెసర గారెలు, లడ్డూలు మున్నగునవి శ్రాద్ధమునందు భక్తితో వడ్డించ వలెను.

పానకం చ రసాలం చ గోక్షీరం చ నివేదయేత్ ।
యాని చాభ్యవహార్యాణి స్వాదు స్నిగ్ధాని భో ద్విజాః ॥ 115 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! పానకం, మామిడి రసాలు, ఆవుపాలు మొదలగు రుచికరములైన పదార్థములను, స్నిగ్ధములైన వాటిని శ్రాద్ధమునందు నివేదించవలెను.

ఈషదమ్లకటూన్యేవ దేయాని శ్రాద్ధకర్మణి ।
అత్యమ్లం చాతిలవణమతితిక్తకటూని చ ॥ 116 ॥

శ్రాద్ధమునందు కొంచెం పులుపు, కారం గలిగిన వాటినే వడ్డించవలెను. మిక్కిలి పులుపు గలవానిని ఉప్పెక్కువగా నున్నవాటిని, చాలా ఒగరుగా ఉన్నవాటిని, చాలా కారంగా నున్న పదార్థములను వడ్డించకూడదు.

ఆసురాణీహభోజ్యాని తాని శ్రాద్ధే న యోజయేత్ ।
మిష్టస్నిగ్ధాని యాని స్యురీషత్కట్వమ్లకాని చ ॥ 117 ॥

తామసగుణాన్ని కలిగించే ఆసురమైన భోజనపదార్థములను శ్రాద్ధమునందుపయోగించకూడదు. తీపితో గూడిన స్నిగ్ధపదార్థములను, కొంచెం కారంగా, కొంచెం పులుపుగా నున్నవాటిని శ్రాద్ధమునందుపయగించ వలెను.

స్వాదూని దేవభోజ్యాని తాని శ్రాద్ధే నియోజయేత్ ।
ఛాగమాంసం వార్తికం చ తైత్తిరం శశకామిషమ్ ॥ 118 ॥

స్వాదుగానున్న దేవభోజ్యములను అనగా సాత్త్వికాహారమును మాత్రమే శ్రాద్ధము నందుపయోగించ వలెను. ఛాగ (మేక) మాంసము, వార్తికము, తిత్తిరిపక్షి, కుందేలు మాంసములను శ్రాద్ధమునందుపయోగించ వచ్చు.

శివాలావక రాజీవమాంసం శ్రాద్ధే నియోజయేత్ ।
వార్ధ్రీణసం రక్తశివం లోహం శల్క సమన్వితమ్ ॥ 119 ॥

శివాలము, లావకపక్షి, రైయ చేపమాంసము, రక్తశివం, వార్ధ్రీణసం, లోహం శల్క సమన్వితంగా శ్రాద్ధమునందుపయోగింపవచ్చు.

సింహతుండం చ ఖడ్గం చ శ్రాద్ధే యోజ్యం తథోచ్యతే ।
యదప్యుక్తం హి మనునా రోహితం ప్రతియోజయేత్ ॥ 120 ॥

అదే విధంగా సింహతుండము, ఖడ్గమృగం, రోహితం (చేప) మాంసం కూడా పెట్టవచ్చని మనువు చెప్పాడు.

యోక్తవ్యం హవ్యకవ్యేషు తథా న విప్రయోజయేత్ ।
ఏవముక్తం మయా విప్రా వారాహేణావలోకితమ్ ॥ 121 ॥

హవ్యకవ్యములందు నేను చెప్పినవి తప్ప ఇతరములుపయోగించకూడదు. దీనిని వారాహుడు కూడా తన శ్రాద్ధకల్పంలో సమ్మతించాడు.

మయా నిషిద్ధం భుంజానో రౌరవం నరకం వ్రజేత్ ।
ఏతానిచ నిషిద్ధాని వారాహేణ తపోధనాః ॥ 122 ॥

ఓ తపోధనులారా! నేను వేటిని నిషేధములని చెప్పానో వాటిని భుజించినవారు రౌరవమనే నరకమును పొందుతారు. వారాహుడు కూడా వీనినే నిషిద్ధములని చెప్పాడు.

అభక్ష్యాణి ద్విజాతీనాం న దేయాని పితృష్వపి ।
రోహితం శూకరం కూర్మం గోధా హంసం చ వర్జయేత్ ॥ 123 ॥

బ్రాహ్మణులకు అభక్ష్యములైన వాటిని పెట్టకూడదు. అవి ఏమనగా రోహితం (రోహుచేప) శూకరం, కూర్మం, ఉడుము, హంసల మాంసములు– వీటిని శ్రాద్ధమునందు పితృదేవతలకు కూడా పెట్టకూడదు.

చక్రవాకం చ మద్గుం చ శల్కహీనాంశ్చ మత్స్యకాన్ ।
కురరం చ నిరస్థిం చ వాసహారిం చ కుక్కుటాన్ ॥ 124 ॥

కలవింకమయూరాంశ్చ భారద్వాజాంశ్చ శార్ఙ్గకాన్ ।
నకులోలూకమార్జారాన్ లోపానన్యాన్ సుదుర్గ్రహాన్ ॥ 125 ॥

టిట్టిభాన్ సార్థజంబూకాన్ వ్యాఘ్రఋక్షతరక్షుకాన్ ।
ఏతానన్యాంశ్చ సందుష్టాన్యో భక్షయతి దుర్మతిః ॥ 126 ॥

స మహాపాపకారీ తు రౌరవం నరకం వ్రజేత్ ।
పితృష్వేతాంస్తు యో దద్యాత్పాపాత్మా గర్హితామిషాన్ ॥ 127 ॥

చక్రవాకం, (నీటికాకి పై పొలుసు లేని చేపలు, క్రౌంచపక్షి, ఎముకలు లేనిది, వాసహారి, కోడిమాంసమూ శ్రాద్ధంలో నిషిద్ధములు. కలవింకము (ఊరపిచ్చుకలు) లేదా గౌరేయా పక్షి లేదా తెల్లని చమరీమృగం, నెమలి, భారద్వాజ పక్షులు, సారంగి పక్షులు, ముంగిసలు, గుడ్లగూబలు, పిల్లులు ఇతరములైన దూకే జంతువులు, పట్టుకొనుటకు వీలుగాని జంతువులు కూడా శ్రాద్ధంలో నిషిద్ధములే.

టిట్ టిట్ అని శబ్దం చేసేవి టిట్టిభములు, నక్కలు, పులులు, ఎలుగుబంట్లు, సివంగులు మొదలగు ఇతరమైన కరిచే స్వభావంగల జంతువుల నే దుర్మతి ఐతే తింటాడో – ఏ పాపాత్ముడైతే ఇటువంటి గర్హితములైన మాంసములను శ్రాద్ధంలో పితృదేవతలకు పెట్టాడో అతడు మిక్కిలి పాపకారి. అతడు రౌరవమనే నరకమును పొందగలడు. అంతేకాక

స స్వర్గస్థానపి పితౄన్నరకే పాతయిష్యతి ।
కుసుంభశాకం జంబీరం శిగ్రుకం కోవిదారకమ్ ॥ 128 ॥

పిణ్యాకం విప్రుషం చైవ మసూరం గృంజనం శణమ్ ।
కోద్రవం కోకిలాక్షం చ చుక్రం కంబుకపద్మకమ్ ॥ 129 ॥

చకోరశ్యేనమాంసం చ వర్తులాలాబుతాలినీమ్ ।
ఫలం తాలతరూణాం చ భుక్త్వా నరకమృచ్ఛతి ॥ 130 ॥

స్వర్గమునందున్న పితృదేవతలను నరకంలో పడవేయగలడు. కుసుంబశాకము (కుంకుమపూవు), జంబీరము (నిమ్మ), శిగ్రుకము (మునగ) కోవిదారకము (ఎఱ్ఱకాంచనము) మరియు పిణ్యాకము (తెలకపిండి) విప్రుషం, మసూరం (చిరుశనగలు), గృంజనం (వెల్లుల్లి), శణం (జనప), కోద్రవము (గాజుప్పు), కోకిలాక్షం (గొబ్బి గింజలు), చుక్రము (చుక్కకూర), కంబుక పద్మకములు (పెన్నేరు పద్మములు), శ్రాద్ధమునందు పనికిరావు. చకోరపక్షి మాంసం, గ్రద్దమాంసం, పుచ్చకాయ, కర్బూజ, సొరకాయ, తాటికల్లు, తాటిపండ్లు శ్రాద్ధమునందుపయోగించిన నరకమును పొందుతాడు.

దత్త్వా పితృషు తైః సార్ధం వ్రజేత్పూయవహం నరః ।
తస్మాత్సర్వప్రయత్నేన నాఽఽహరేత్తు విచక్షణః ॥ 131 ॥

ఈవిధంగా పితృదేవతలకు శ్రాద్ధమునందు అభక్ష్యములనిచ్చినచో తాను నరకమును పొందగలడు. అందువలన విచక్షుణుడైన వాడు వాటిని సంపాదించుకొనకూడదు. సర్వ ప్రయత్నములను చేసి వాటిని నిషేధించవలెను.

నిషిద్ధాని వరాహేణ స్వయం పిత్రర్థమాదరాత్ ।
వరమేవాఽఽత్మ మాంసస్య భక్షణం మునయః కృతమ్ ॥ 132 ॥

పితృదేవతల యందాదరంతో వరాహునిచే నిషేధించబడిన వాటిని స్వయంగా వదిలివేయవలెను. అలా కానిచో తన మాంసమును తానే భుజించుట శ్రేష్ఠమని భావించినట్లని మునులు చెప్పారు.

న త్వేవ హి నిషిద్ధానామాదానం పుంభిరాదరాత్ ।
అజ్ఞానాద్వా ప్రమాదాద్వా సకృదేతాని చ ద్విజాః ॥ 133 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అజ్ఞానంతో గాని, ప్రమాదమువల్ల గాని పితృదేవతలయందు ఆదరంతో నిషేధించిన వీటిని ఒక్కసారి కూడా ఉపయోగించకూడదు.

భక్షితాని నిషిద్ధాని ప్రాయశ్చిత్తం తతశ్చరేత్ ।
ఫలమూలదధిక్షీరతక్రగోమూత్రయావకైః ॥ 134 ॥

నిషిద్ధములైన పదార్థములను తిన్నపుడు ప్రాయశ్చిత్తము చేసుకొనవలెను. (వారం రోజులవరకు) పండ్లు, కందమూలములు, పెరుగు, పాలు, మజ్జిగ, గోమూత్రము, మినుములు లేదా ఉలువలను ప్రాయశ్చిత్తంగా భుజించవలెను.

భోజ్యాన్న భోజ్యసంభుక్తే ప్రత్యేకం దినసప్తకమ్ ।
ఏవం నిషిద్ధాచరణే కృతే సకృదపి ద్విజైః ॥ 135 ॥

తినకూడనటువంటి నిషిద్ధ పదార్థములను తిన్నటువంటి బ్రాహ్మణులు ఒక్కసారి తిన్నా కూడా ఏడు రోజుల వరకు పైన చెప్పిన ఫలాది పదార్థములను తిని ప్రాయశ్చిత్తం చేసుకొనవలెను.

శుద్ధిం నేయం శరీరం తు విష్ణుభక్తైర్విశేషతః ।
నిషిద్ధం వర్జయేద్ద్రవ్యం యథోక్తం చ తపోధనాః ॥ 136 ॥

ఓ తపోధనులారా! విష్ణుభక్తులైన వారు విశేషంగా శరీరమును శుద్ధిచేసుకొనవలెను. అందువలన ఇంతకు పూర్వం చెప్పినట్లుగా (వరాహశ్రాద్ధ కల్పమునందు కూడా) నిషేధించిన ద్రవ్యముల నుపయోగించ కూడదు.

సమాహృత్య తతః శ్రాద్ధం కర్తవ్యం నిజశక్తితః ।
ఏవం విధానతః శ్రాద్ధం కృత్వా స్వవిభవోచితమ్ ।
ఆబ్రహ్మస్తంబపర్యన్తం జగత్ప్రీణాతి మానవః ॥ 137 ॥

అందువలన తన శక్తిననుసరించి, తన సంపదకు తగినట్లుగా విధివిధానము ననుసరించి శ్రద్ధతో శ్రాద్ధము నాచరించవలెను. ఇలా చేసినట్లయితే బ్రహ్మ మొదలుకొని స్తంబము వరకు గల జగత్తునంతా సంతోషపెట్టిన మానవుడవుతాడు.

మునయః ఊచుః :– మునులు పలికారు.

పితా జీవతి యస్యాథ మృతౌ ద్వౌ పితరౌ పితుః ।
కథం శ్రాద్ధం హి కర్తవ్యమేతద్విస్తరతో వద ॥ 138 ॥

అయ్యా! తన తండ్రి జీవించియుండగా తండ్రియొక్క తలిదండ్రులు మరణించిన ట్లయితే శ్రాద్ధము నెట్లాచరించ వలెనో విస్తరంగా చెప్పండి.

వ్యాస ఉవాచ :-వ్యాసుడు పలికాడు.

యస్మై దద్యాత్పితా శ్రాద్ధం తస్మై దద్యాత్సుతః స్వయమ్ ।
ఏవం న హీయతే ధర్మో లౌకికో వైదికస్తథా ॥ 139 ॥

బ్రతికియున్న తండ్రి ఎవరికి శ్రాద్ధమును పెట్టుటకు సంకల్పించు కున్నాడో అతని కుమారుడు కూడా స్వయంగా వారికి పెట్టవచ్చు. ఇలా శ్రాద్ధమును పెట్టినట్లైతే లౌకికధర్మమునకుగాని, వైదిక ధర్మమునకుగాని ఏవిధమైన లోపం కలుగదు.

మునయః ఊచుః :-మునులు పలికారు.

మృతః పితా జీవతి చ యస్య బ్రహ్మన్! పితామహః ।
స హి శ్రాద్ధం కథం కుర్యాదేతత్త్వం వక్తుమర్హసి ॥ 140 ॥

తండ్రి మరణించి, పితామహుడు ఎవనికి జీవించియుంటాడో అటువంటి వాడు శ్రాద్ధము నెట్లాచరించవలెనో తెలియజేయండి.

వ్యాస ఉవాచ :-వ్యాసుడు పలికాడు.

పితుః పిండం ప్రదద్యాచ్చ భోజయేచ్చ పితామహమ్ ।
ప్రపితామహస్య పిండం వై హ్యాయం శాస్త్రేషు నిర్ణయః ॥ 141 ॥

తండ్రి మరణించి, పితామహుడు జీవించియున్నట్లయితే మొదట తండ్రికి పిండంను పెట్టి, పితామహునికి భోజనంపెట్టి ఆ తరువాత ప్రపితామహునికి పిండం పెట్టవలెనని శాస్త్రములయందు నిర్ణయించారు.

మృతేషు పిండం దాతవ్యం జీవన్తం చాపి భోజయేత్ ।
సపిండీకరణం నాస్తి న చ పార్వణమిష్యతే ॥ 142 ॥

మరణించిన వారికి పిండమును పెట్టవలెను. బ్రతికియున్నవారికి భోజనం పెట్టవలెను. వారికి సపిండీకరణం, పార్వణ విధానం లేదు.

ఆచారమాచరేద్యస్తు పితృమేధాశ్రితం నరః ।
ఆయుషా ధనపుత్రైశ్చ వర్ధత్యాశు న సంశయః ॥ 143 ॥

పితృమేధమును చేసేవాడు ఇటువంటి విధానమును ఆచరించినట్లయితే దీర్ఘాయువు, ధనము, పుత్రులతో అభివృద్ధి నొందుతాడు. ఈ విషయంలో ఎటువంటి సంశయమూ లేదు.

పితృమేధామృతమిదం శ్రాద్ధకాలేషు యః పఠేత్ ।
తదన్నమస్య పితరోఽశ్నంతి చ త్రియుగం ద్విజాః ॥ 144 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈపితృమేధామృతమును శ్రాద్ధకాలంలో ఎవరు పఠిస్తారో అతడు సమర్పించిన అన్నమును మూడు యుగముల వరకు పితృదేవతలు భుజిస్తారు.

ఏవం మయోక్తః పితృమేధకల్పః పాపాపహో పుణ్యవివర్ధనశ్చ ।
శ్రోతవ్య ఏష ప్రయతైర్నరైశ్చ శ్రాద్ధేషు చైవాప్యనుకీర్తయేత ॥ 145 ॥

ఈవిధంగా నేను చెప్పిన పితృమేధకల్పం సమస్త పాపములను తొలగించి పుణ్యమును అభివృద్ధి పరుచునది. ఇటువంటి పితృమేధ కల్పమును శ్రాద్ధసమయంలో తప్పక ప్రయత్నపూర్వకంగా పఠించవలెను, వినవలెను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షి సంవాదే శ్రాద్ధకల్పే 'సపిండీకరణాది నిరూపణం' నామ ద్వాదశోత్తర శతతమోఽధ్యాయః. ॥ 112 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని శ్రాద్ధకల్పంలో 'సపిండీకరణ నిరూపణం' అనే నూటపన్నెండవ అధ్యాయము సంపూర్ణం.

త్రయోదశాధికశతతమోఽధ్యాయః – నూట పదమూడవ అధ్యాయం

సదాచార నిరూపణమ్ – సదాచారమును నిరూపించుట

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

ఏవం సమ్యగ్గృహస్థేన దేవతాః పితరస్తథా ।
సంపూజ్యా హవ్యకవ్యాభ్యామన్నేనాతిథిబాంధవాః ॥ 1 ॥

గృహస్థుడైనవాడు ఈవిధంగా దేవతలకు, పితృదేవతలకు చక్కగా హవ్యకవ్యముల నాచరిస్తూ అతిథులను, బంధువులను అన్నంతో సంతృప్తి పరుచవలెను.

భూతాని భృత్యాః సకలాః పశుపక్షిపిపీలికాః ।
భిక్షవో యాచమానాశ్చ యే చాన్యే పాంథకా గృహే ॥ 2 ॥

తన యింటిలోని జీవులను, సేవకులను, పశు పక్షి పిపీలికములను, భిక్షుకులను, యాచకులను, ఇతర బాటసారులను భోజనాదులతో సంతృప్తి పరుచవలెను.

సదాచారరతా విప్రాః సాధునా గృహమేధినా ।
పాపం భుంక్తే సముల్లంఘ్య నిత్యనైమిత్తికీః క్రియాః ॥ 3 ॥

ఓ బ్రాహ్మణులారా! సాధువైన గృహస్థుడు సదాచారరతుడై సంధ్యావందనాది నిత్యకర్మలను, ఆయా పర్వదినములలో ఆచరించవలసిన నైమిత్తిక క్రియలు చేయవలెను. అలాచేయక ఉల్లంఘిస్తే పాపభోజుడవుతాడు.

మునయ ఊచుః :– మునులు పలికారు.

కథితం భవతా విప్ర నిత్యనైమిత్తికం చ యత్ ।
నిత్యం నైమిత్తికం కామ్యం త్రివిధం కర్మ పౌరుషమ్ ॥ 4 ॥

ఓ మహానుభావా! విధిగా చేయవలసిన నిత్యకర్మలను గూర్చి, ఏవైనా కోరికలు తీరవలెనని చేసే కామ్యములైన కర్మలగూర్చి, నైమిత్తిక కర్మలనుగూర్చి మానవుడు నిర్వర్తించ వలసిన కర్తవ్యములను మూడింటిని మీరు చెప్పగా విని తెలుసుకున్నాం.

సదాచారం మునే శ్రోతుమిచ్ఛామో వదతస్తవ ।
యం కుర్వన్ సుఖమాప్నోతి పరత్రేహ చ మానవః ॥ 5 ॥

ఓ మునీ! మానవుడు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ దేనిని ఆచరిస్తే సుఖాన్ని పొందుతాడో అలాంటి సదాచారాన్ని గూర్చి మీరు చెప్పగా వినాలని కుతూహలంగా ఉన్నాం.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

గృహస్థేన సదా కార్యమాచారపరిరక్షణమ్ ।
న హ్యాచారవిహీనస్య భద్రమత్ర పరత్ర వా ॥ 6 ॥

గృహస్థుడైనవాడు ఎల్లపుడు ఆచారపరిరక్షణను చేయవలెను. ఆచారవిహీనుడైన వానికి ఈ లోకములోనూ, పరలోకంలోనూ శుభం కలుగుతుంది.

యజ్ఞదానతపాంసీహ పురుషస్య న భూతయే ।
భవంతి యః సదాచారం సముల్లంఘ్య ప్రవర్తతే ॥ 7 ॥

సదాచారము నుల్లంఘించి ప్రవర్తించేవాడు ఈ లోకంలో యజ్ఞ, దాన, తపస్సులు ఎన్ని చేసినా ఫలించవు.

సదాచారో హి పురుషో బ్రహ్మాయుర్విందతే మహత్ ।
కార్యో ధర్మః సదాచారః ఆచారస్యైవ లక్షణమ్ ॥ 8 ॥

సదాచారము నాచరించువాడే బ్రహ్మవలె దీర్ఘాయువును పొందగలడు. ఆచారమునకు లక్షణం ధర్మమును ఆచరించుట. అదే సదాచారము.

తస్య స్వరూపం వక్ష్యామి సదాచారస్య భో ద్విజాః ।
ఆత్మనైకమనా భూత్వా తథైవ పరిపాలయేత్ ॥ 9 ॥

ఓ విప్రులారా! సదాచారము యొక్క లక్షణం, స్వరూపమును గూర్చి చెబుతున్నాను. అందరూ ఏకాగ్ర చిత్తంతో విని అలాగే ఆచరించండి.

త్రివర్గసాధనే యత్నః కర్తవ్యో గృహమేధినా ।
తత్సంసిద్ధౌ గృహస్థస్య సిద్ధిరత్ర పరత్ర చ ॥ 10 ॥

గృహస్థుడైనవాడు ధర్మార్థ కామములనే త్రివర్గమును సాధించుటకు ప్రయత్నము చేయవలెను. అటువంటి ప్రయత్నంలో సఫలుడైతే ఆ గృహస్థుడు ఇహపరలోకముల రెండింటియందు సిద్ధినొందుతాడు.

పాదేనాప్యస్య పారత్ర్యం కుర్యాచ్ఛ్రేయః స్వమాత్మవాన్ ।
అర్థేన చాఽఽత్మ భరణం నిత్యనైమిత్తికాని చ ॥ 11 ॥

అలా చేసే దానిలో పావుభాగమైనా యత్నించిన వానికి శ్రేయస్సు నా పరమాత్మ కలిగిస్తాడు. నిత్య నైమిత్తికములు సగభాగము ఆత్మభరణమును కలుగజేస్తుంది.

పాదేనైవ తథాఽప్యస్య మూలభూతం వివర్ధయేత్ ।
ఏవమాచరతో విప్రా అర్థః సాఫల్యమృచ్ఛతి ॥ 12 ॥

పావుభాగం చేతనైనా ఇతనికి మూలభూతధర్మము అభివృద్ధి చెందుతుంది. ఓ విప్రులారా! ఇలాచరిస్తే అర్థసాఫల్యమును పొందగలడు.

తద్వత్పాపనిషేధార్థం ధర్మః కార్యో విపశ్చితా ।
పరత్రార్థస్తథైవాన్యః కార్యోఽత్రైవ ఫలప్రదః ॥ 13 ॥

అదేవిధంగా పండితుడైనవాడు పాపనిషేధంకొరకు ధర్మము నాచరించవలెను. పరసాధనకొరకు అదేవిధంగా చేస్తే ఇక్కడే అది ఫలమునిస్తుంది.

ప్రత్యవాయభయాత్కామస్తథాఽన్యశ్చావిరోధవాన్ ।
ద్విధా కామోఽపి రచితస్త్రివర్గాయావిరోధకృత్ ॥ 14 ॥

ప్రత్యవాయ భయంవల్ల కామము, మరియు ఇతర విరోధములను కల్గించేది కూడా త్రివర్గ సాధనమునకు విరోధమును కల్గించనిరీతిగా కామము రచించబడింది.

పరస్పరానుబంధాంశ్చ సర్వానేతాన్విచింతయేత్ ।
విపరీతానుబంధాంశ్చ బుధ్యధ్వం తాన్ద్విజోత్తమాః ॥ 15 ॥

ఓ ద్విజోత్తములారా! పురుషార్థములు పరస్పరానుబంధములా, విపరీతానుబంధములా అని వాటిని గూర్చి మీరు చక్కగా తెలుసుకోండి.

ధర్మో ధర్మానుబంధార్థో ధర్మోఽనాత్మార్థపీడకః ।
ఉభాభ్యాం చ ద్విధా కామం తేన తౌ చ ద్విధా పునః ॥ 16 ॥

ధర్మము ధర్మానుబంధార్థము, ధర్మము అనాత్మార్థపీడకమని రెండు విధములు. ఈ రెంటిచేత ధర్మార్థముల రెంటిని, వీటితో కామము, కామముచేత బాధింపబడని ధర్మార్థములను తెలుసుకొనవలెను. అనగా పురుషార్థములు ఒకదానితో నొకటి పరస్పర విరుద్ధములు కాకుండా, ఆత్మబాధకములు కాకుండా జాగ్రత్త వహిస్తే మానవుడు వీటన్నింటియొక్క ఫలమును సంపూర్ణంగా నొందగలడు.

బ్రాహ్మే ముహూర్తే బుధ్యేత ధర్మార్థావనుచింతయేత్ ।
సముత్థాయ తథాఽఽచమ్య ప్రస్నాతో నియతః శుచిః ॥ 17 ॥

బ్రాహ్మీ ముహూర్తమునందు మేల్కొని ధర్మార్థములను గూర్చి ఆలోచించవలెను. ఆ తరువాత పడక నుంచి లేచి ఆచమనం చేసి నియమపూర్వకంగా స్నానంచేసి శుచిగా నుండవలెను.

పూర్వాం సంధ్యాం సనక్షత్రాం పశ్చిమాం సదివాకరామ్ ।
ఉపాసీత యథాన్యాయం నైనాం జహ్యాదనాపది ॥ 18 ॥

ప్రాతఃకాలసంధ్యావందనమును నక్షత్రములతో కూడియున్న సమయమునందు, సాయంకాల సంధ్యావందనమును సూర్యాస్తమయము కాకముందే చేయవలెను. ఆపదలు లేనప్పుడు సంధ్యా వందనమును చేయవలెనే కాని ఎప్పుడూ మానకూడదు.

అసత్ప్రలాపమనృతం వాక్పారుష్యం చ వర్జయేత్ ।
అసచ్ఛాస్త్రమసద్వాదమసత్సేవాం చ వై ద్విజాః ॥ 19 ॥

ఓ బ్రాహ్మణులారా! చెడ్డమాటలను, అసత్యమును, వాక్కాఠిన్యమును వదిలిపెట్టవలెను. నాస్తికాది అసత్ శాస్త్రములను, దుష్టమైన వాదములను, అసాధువులను సేవించుట చేయకూడదు.

సాయం ప్రాతస్తథా హోమం కుర్వీత నియతాత్మవాన్ ।
నోదయాస్తమనే చైవముదీక్షేత వివస్వతః ॥ 20 ॥

నియమంతో ప్రాతఃకాలమునందు, సాయం సమయమునందు హోమమును చేయవలెను. ఉదయిస్తున్న సూర్యుని, అస్తమిస్తున్న సూర్యుని చూడకూడదు.

కేశప్రసాధనాదర్శదంతధావనమంజనమ్ ।
పూర్వాహ్ణ ఏవ కార్యాణి దేవతానాం చ తర్పణమ్ ॥ 21 ॥

తలను దువ్వుకొనడం, అద్దం చూడడం, దంత ధావనం, కాటుకను పెట్టుకొనుట, దేవతా తర్పణములు ఇవన్నీ పూర్వాహ్ణమునందే చేయవలెను.

గ్రామావసథర్థానాం క్షేత్రాణాం చైవ వర్త్మని ।
న విణ్మూత్రమనుష్ఠేయం న చ కృష్టే న గోవ్రజే ॥ 22 ॥

గ్రామములు, గృహములు, తీర్థములు, క్షేత్రములలోనూ, వాటికి వెళ్లు మార్గములోనూ, దున్నిన పొలంలోనూ, గోశాలలోనూ మలమూత్ర విసర్జనలను చేయకూడదు.

నగ్నాం పరస్త్రియం నేక్షేన్న పశ్యేదాత్మనః శకృత్ ।
ఉదక్యాదర్శనం స్పర్శమేవం సంభాషణం తథా ॥ 23 ॥

నగ్నముగానున్న పరస్త్రీని, తన పురీశమును చూడకూడదు. రజస్వల లేదా బహిష్టు అయిన స్త్రీని చూడడంగాని, తాకటంగాని, ఆమెతో మాట్లాడటం కాని చేయకూడదు.

నాప్సు మూత్రం పురీషం వా మైథునం వా సమాచరేత్ ।
నాధితిష్ఠేచ్ఛకృన్మూత్రే కేశభస్మసపాలికాః ॥ 24 ॥

నీటిలో మూత్ర పురీష విసర్జనం, మైథునమూ చేయకూడదు. పురీషమున్నచోట, మూత్రమున్నచోట, వెంట్రుకలు ఉన్నచోట, బూడిద ఉన్నచోట, బొగ్గులున్నచోట నిలబడకూడదు.

తుషాంగారవిశీర్ణాని రజ్జువస్త్రాదికాని చ ।
నాధితిష్ఠేత్తథా ప్రాజ్ఞః పథి వస్త్రాణి వా భువి ॥ 25 ॥

పొట్టు, నిప్పులు, తెగిపోయిన త్రాళ్లు, గుడ్డ పేలికలు మొదలగునవి యున్న మార్గంలోనూ, చింపిరి గుడ్డలున్న స్థలంలోనూ నిలువకూడదు. వాటిని త్రొక్కకూడదు.

పితృదేవమనుష్యాణాం భూతానాం చ తథాఽర్చనమ్ ।
కృత్వా విభవతః పశ్చాద్గృహస్థో భోక్తుమర్హతి ॥ 26 ॥

గృహస్థుడు తన శక్తికొలది సంపద ననుసరించి పితృదేవతలకు, దేవతలకు, మనుష్యులకు, జీవరాశులకు తగిన విధంగా ఆరాధన చేసి, అర్చించి, తాను భుజించవలెను.

ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాఽపి స్వాచాంతో వాగ్యతః శుచిః ।
భుంజీత చాన్నం తచ్చిత్తో హ్యంతర్జానుః సదా నరః ॥ 27 ॥

భోజనం చేయునప్పుడు తూర్పు దిక్కునకు గాని, ఉత్తరపు దిక్కునకు గాని ముఖంచేసి తినవలెను. తినుటకు ముందు ఆచమనం చేసి మౌనంగానుండి శుచిగా మనస్సులో భగవంతుని ధ్యానం చేస్తూ మోకాళ్లను, పిక్కలను లోపలికి ముడుచుకొని (బాసిలిపీట) భోజనం చేయవలెను.

ఉపఘాతమృతే దోషాన్నాన్నస్యోదీరయేద్బుధః ।
ప్రత్యక్షలవణం వర్జ్యమన్నముచ్ఛిష్టమేవ చ ॥ 28 ॥

బుద్ధిమంతుడైనవాడు పాచిన అన్నం విషయములో తప్ప మిగతా అన్న దోషమును తెలుపకూడదు. ప్రత్యేకంగా భోజనమునందు ఉప్పు వడ్డించుకోకూడదు. ఎంగిలి అన్నము విడిచిపెట్టాలి.

న గచ్ఛన్న చ తిష్ఠన్వై విణ్మూత్రోత్సర్గమాత్మవాన్ ।
కుర్వీత చైవముచ్ఛిష్టం న కించిదపి భక్షయేత్ ॥ 29 ॥

నడుస్తూ కాని, నిలబడి కాని మలమూత్ర విసర్జన చేయకూడదు. అదే విధంగా ఎంగిలి పదార్థములను కొంచము కూడా తినకూడదు.

ఉచ్ఛిష్టోనాలపేత్కించిత్స్వాధ్యాయం చ వివర్జయేత్ ।
న పశ్యేచ్చ రవిం చేందుం నక్షత్రాణి చ కామతః ॥ 30 ॥

తింటూ ఎంగిలి నోటితో మాట్లాడకూడదు. ఎంగిలి నోటితో వేదం చదువకూడదు. సూర్యుని, చంద్రుని, నక్షత్రములను కోరికతో చూడకూడదు.

భిన్నాసనం చ శయ్యాం చ భాజనం చ వివర్జయేత్ ।
గురూణామాసనం దేయమభ్యుత్థానాది సత్కృతమ్ ॥ 31 ॥

విరిగిన ఆసనమును, విరిగిన మంచమును, పగిలిపోయిన పాత్రలను వాడరాదు. పెద్దలు, గురువులు వచ్చినపుడు లేచి నిలబడి ఎదురేగి వారికి తగిన ఆసనమిచ్చి సత్కరించవలెను.

అనుకూలం తథాఽఽలాపమభికుర్వీత బుద్ధిమాన్ ।
తత్రానుగమనం కుర్యాత్ప్రతికూలం న సంచరేత్ ॥ 32 ॥

బుద్ధిమంతుడైన వాడు వారితో అనుకూలమైన మాటలను పలుకవలెను. వారు వెళ్లునపుడు కొంతదూరం వారిననుసరించి వెళ్ళి సాగనంపవలెను. వారికి ప్రతికూలంగా ప్రవర్తింపరాదు.

నైకవస్త్రశ్చ భుంజీత న కుర్యాద్దేవతార్చనమ్ ।
నాఽఽవాహయేద్ద్విజానగ్నౌ హోమం కుర్వీత బుద్ధిమాన్ ॥ 33 ॥

ఒక వస్త్రం మాత్రమే ధరించి భోజనం చేయకూడదు. దేవతార్చనమూ చేయకూడదు. బ్రాహ్మణులను ఆహ్వానించకూడదు. అగ్నియందు హోమం చేయకూడదు.

న స్నాయీత నరో నగ్నో న శయీత కదాచన ।
న పాణిభ్యాముభాభ్యాం తు కండూయేత శిరస్తథా ॥ 34 ॥

ఎప్పుడు కూడా నగ్నంగా దిగంబరియై స్నానం చేయకూడదు. నగ్నంగా శయనించ కూడదు. రెండు చేతులతో తలను గోకుకొనకూడదు.

న చాభీక్ష్ణం శిరఃస్నానం కార్యం నిష్కారణం బుధైః ।
శిరఃస్నాతశ్చ తైలేన నాంగం కించిదుపస్పృశేత్ ॥ 35 ॥

ఏ కారణం లేకుండా మాటిమాటికి తలస్నానం చేయకూడదు. తలంటు స్నానం చేసి, నూనెతో అంగమును ముట్టుకోకూడదు.

అనాధ్యాయేషు సర్వేషు స్వాధ్యాయం చ వివర్జయేత్ ।
బ్రాహ్మణానలగోసూర్యాన్నావమన్యేత్కదాచన ॥ 36 ॥

అనధ్యయన త్రయమునందు (అనగా చతుర్దశీ పూర్ణిమా, పాడ్యమి, చతుర్దశీ అమావాస్య, పాడ్యమి బహుళ అష్టమి) తిథులలో వేదాధ్యయనం చేయకూడదు. ఎప్పుడు కూడా బ్రాహ్మణులను, అగ్నిని, గోవును, సూర్యుని అవమానించకూడదు.

ఉదఙ్ముఖో దివారాత్రావుత్సర్గం దక్షిణాముఖః ।
ఆబాధాసు యథాకామం కుర్యాన్మూత్రపురీషయోః ॥ 37 ॥

పగటిపూట ఉత్తరాభిముఖంగా రాత్రిపూట దక్షిణాభిముఖంగా, సంకటపరిస్థితులలో యథేష్టంగా మలమూత్ర విసర్జనము చేయవలెను.

దుష్కృతం న గురోర్బ్రూయాత్క్రుద్ధం చైనం ప్రసాదయేత్ ।
పరివాదం న శృణుయాదన్యేషామపి కుర్వతామ్ ॥ 38 ॥

గురువుగారి దుష్కృతములను గూర్చి చెప్పకూడదు. గురువుగారు కోపంగానున్న బ్రతిమాలి ప్రసన్నునిగా చేసుకొనవలెను. గురువుగారిని గూర్చి ఇతరులు పలికే అపవాదములను వినకూడదు.

పంథా దేయో బ్రాహ్మణానాం రాజ్ఞో దుఃఖాతురస్య చ ।
విద్యాధికస్య గర్భిణ్యా రోగార్తస్య మహీయసః ॥ 39 ॥

మూకాంధబధిరాణాం చ మత్తస్యోన్మత్తకస్య చ ।
దేవాలయం చైద్యతరుం తథైవ చ చతుష్పథమ్ ॥ 40 ॥

విద్యాధికం గురుం చైవ బుధః కుర్యాత్ప్రదక్షిణమ్ ।
ఉపానద్వస్త్రమాల్యాది ధృతమన్యైర్న ధారయేత్ ॥ 41 ॥

బ్రాహ్మణులకు, రాజుకు, దుఃఖార్తునకు, విద్యాధికునకు, గర్భిణీస్త్రీకి, రోగార్తునకు, పూజ్యునకు దారినివ్వవలెను. మూగవానికి, గ్రుడ్డివానికి, చెవిటివానికి, మత్తులోనున్నవానికి, పిచ్చివానికి కూడా దారినిచ్చి

ప్రక్కనుండి వెళ్లవలెను. దేవాలయమునకు, దేవాలయాది పవిత్ర స్థలములలో నాటిన రావి మొదలగు పవిత్ర వృక్షములకు, నాలుగు దారులు కలిసే కూడలికి ప్రదక్షిణ పూర్వకంగా వెళ్లవలెను. విద్యాధికునకు, గురువునకు పండితుడైనవాడు ప్రదక్షిణం చేయవలెను. ఇతరులు వాడిన చెప్పులను, వస్త్రములను, పూలమాలలను ధరించకూడదు.

చతుర్దశ్యాం తథాஉష్టమ్యాం పంచదశ్యాం చ పర్వసు ।
తైలాభ్యంగం తథా భోగం యోషితశ్చ వివర్జయేత్ ॥ 42 ॥

అష్టమి, చతుర్దశి, పౌర్ణమి, అమావాస్య తిథులలో, పుణ్య దినములలో నూనె పెట్టుకొని అభ్యంగ స్నానం చేయకూడదు. అదే విధంగా స్త్రీ సంభోగం చేయకూడదు.

నోత్క్షిప్తబాహుజంఘశ్చ ప్రాజ్ఞస్తిష్ఠేత్కదాచన ।
న చాపి విక్షిపేత్పాదౌ పాదం పాదేన నాஉஉక్రమేత్ ॥ 43 ॥

ప్రాజ్ఞుడైనవాడు బాహువులు, పిక్కలు పైకెత్తి ఎప్పుడూ నిలబడరాదు. పాదముల నటు నిటు కదిలించకూడదు. ఒక పాదంతో మరొక పాదంను త్రొక్కకూడదు.

పుంశ్చల్యాః కృతకార్యస్య బాలస్య పతితస్య చ ।
మర్మాభిఘాతమాక్రోశం పైశున్యం చ వివర్జయేత్ ॥ 44 ॥

వేశ్యను, తప్పు చేసిన తర్వాత బాలుని, పతితుని, బాధపడేలా దెప్పుచు సాధించకూడదు. వారిపై ఆక్రోశం ప్రదర్శించకూడదు.

దంభాభిమానం తైక్ష్ణ్యం చ న కుర్వీత విచక్షణః ।
మూర్ఖోన్మత్తవ్యసనినో విరూపానపి వా తథా ॥ 45 ॥

అదేవిధంగా మూర్ఖులపైన, పిచ్చివాళ్లపైన, వ్యసనములకు లోబడిన వారిపైన విచక్షణుడైన వాడు దంభమును, తీక్ష్ణభావమును ప్రదర్శించకూడదు.

న్యూనాంగాంశ్చాధనాంశ్చైవ నోపహాసేన దూషయేత్ ।
పరస్య దండం నోద్యచ్ఛేచ్ఛిక్షార్థం శిష్యపుత్రయోః ॥ 46 ॥

అంగవైకల్యం కలవారిని, ధనము లేనివారిని అపహాస్యం చేస్తూ దూషించకూడదు. శిష్యునిగాని, పుత్రునిగాని శిక్షించుటకు మరొకరి చేతికి దండం ఇవ్వకూడదు.

తద్వన్నోపవిశేత్ప్రాజ్ఞః పాదేనాஉஉకృష్యచాஉஉసనమ్ ।
సంయావం కృశరం మాంసం నాஉஉత్మార్థముపసాధయేత్ ॥ 47 ॥

అదేవిధంగా ప్రాజ్ఞుడు తాను కూర్చుండు ఆసనమును కాలితో లాగుకొని కూర్చోకూడదు. పిండి నెయ్యితో కలిపి చేసిన 'హల్వా' లాంటి పదార్థమును, నువ్వులు బియ్యంతో కలిపి చేసిన 'కిచిడీ' లాంటి పదార్థమును, మాంసమును తన స్వార్థం కొరకు తెచ్చుకోకూడదు.

సాయం ప్రాతశ్చ భోక్తవ్యం కృత్వా చాతిథిపూజనమ్ ।
ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాఽపి వాగ్యతో దంతధావనమ్ ॥ 48 ॥

ఉదయం సాయంత్రం అతిథిని పూజించిన తరువాతనే భోజనం చేయవలెను. తూర్పుముఖం చేసిగాని, ఉత్తరముఖం చేసికాని మౌనంగా దంతధావనమును చేసుకొనవలెను.

కుర్వీత సతతం విప్రా వర్జయేద్వర్జ్యవీరుధమ్ ।
నోదక్శిరాః స్వపేజ్జాతు న చ ప్రత్యక్శిరా నరః ॥ 49 ॥

నిషిద్ధములైన దంతకాష్ఠముల నుపయోగించ కూడదు. ఉత్తరదిశగా తలపెట్టికాని, పడమరదిశగా తలపెట్టికాని పరుండకూడదు.

ఆగస్త్యాం శిర ఆధాయ శయీతాథ పురందరీమ్ ।
న తు గంధవతీస్వప్సు స్నాయీత న తథోషసి ॥ 50 ॥

తూర్పు దిశకుగాని, దక్షిణ దిశకుగాని తలపెట్టి పరుండవలెను. సుగంధంతో గూడిన నీటియందుగాని, ఉషఃకాలమునందుగాని స్నానం చేయకూడదు.

ఉపరాగే పరం స్నానమృతే దినముదాహృతమ్ ।
అపమృజ్యాన్నవస్త్రాంతైర్గాత్రాణ్యంబరపాణిభిః ॥ 51 ॥

గ్రహణసమయములలో గ్రహణము విడిచిన తరువాత ఆ రాత్రే వెంటనే స్నానం చేయవలెను. శరీరావయవములను తడిచేతులతో, తడివస్త్రపుకొనలతో రుద్దుకొని స్నానం చేయకూడదు.

న చావధూనయేత్కేశాన్వాససీ న చ నిర్ధునేత్ ।
అనులేపనమాదద్యాన్నా స్నాతః కర్హిచిద్బుధః ॥ 52 ॥

వెంట్రుకలను తడి ఆరడంకోసం ఎగురవేయరాదు. వస్త్రమునందు వెంట్రుకలను కత్తిరించ కూడదు, దులుపకూడదు. స్నానం చేయకుండా అనులేపనములను పూసుకొనకూడదు.

న చాపి రక్తవాసాః స్యాచ్చిత్రాసితధరోఽపి వా ।
న చ కుర్యాద్విపర్యాసం వాససోర్నాపి భూషయోః ॥ 53 ॥

ఎర్రనివీ, అనేక వర్ణములు కలవీ, నల్లనివీ అయిన బట్టలు ధరింపరాదు. అలాగే బట్టల్నీ, ఆభరణాల్నీ స్థానచలనం చేసి ధరింపరాదు.

వర్జ్యం చ విదిశం వస్త్రమత్యంతోపహతం చ యత్ ।
కీటకేశావపన్నం చ తథా శ్వభిరవేక్షితమ్ ॥ 54 ॥

చిరిగిన, పాతబడిన, పురుగులు, వెంట్రుకలు గల, శునకాదులు నాకిన, వాసన చూచిన వస్త్రములను ఉపయోగించకూడదు.

అవలీఢం శునా చైవ సారోద్ధరణదూషితమ్ ।
పృష్ఠమాంసం వృథామాంసం వర్జ్యమాంసం చ వర్జయేత్ ॥ 55 ॥

కుక్కలు నాకిన మాంసం, సారమంతా తీయుట వల్ల కలుషితమైన మాంసం, జంతువు వెనుకభాగంనుండి తీసిన మాంసం, వృథా మాంసం, తినకూడనటువంటి పశుపక్ష్యాదుల మాంసమును వదిలి పెట్టవలెను.

న భక్షయేచ్చ సతతం ప్రత్యక్షం లవణం నరః ।
వర్జ్యం చిరోషితం విప్రాః శుష్కం పర్యుషితం చ యత్ ॥ 56 ॥

ఎప్పుడు కూడా నేరుగా ఉప్పును వడ్డించుకొనకూడదు. చల్లారిపోయిన, నిలువవున్న, ఎండిపోయిన, పాచిపోయిన పదార్థములను తినకూడదు.

పిష్టశాకేక్షుపయసాం వికారా ద్విజసత్తమాః ।
తథా మాంసవికారాశ్చ నైవ వర్జ్యాశ్చిరోషితాః ॥ 57 ॥

ఓ బ్రాహ్మణులారా! పిండి, కూరలతో చేసిన, చెరుకురసంతో, పాలతో చేసిన పదార్థములను గాని, మాంసంతో తయారుచేసిన పదార్థములను గాని చాలాకాలం నిలువవుంచుకున్నవైనా తినవచ్చును.

ఉదయాస్తమనే భానోః శయనం చ వివర్జయేత్ ।
నా స్నాతో నైవ సంవిష్టో న చైవాన్యమనా నరః ॥ 58 ॥

న చైవ శయనే నోర్వ్యాముపవిష్టో న శబ్దకృత్ ।
ప్రేష్యాణామప్రదాయాథ న భుంజీత కదాచన ॥ 59 ॥

సూర్యోదయాస్తమయాది సమయములయందు నిద్రించకూడదు. స్నానం చేయకుండా, కూర్చొనకుండా, మనస్సు నిలుపకుండా భోజనం చేయకూడదు. పండుకొనికాని, ఉత్తినేల మీద కూర్చొనిగాని, శబ్దంచేస్తూ లేక మాట్లాడుతూ గాని, సేవకులకు పెట్టకుండా కాని భోజనం చేయకూడదు.

భుంజీత పురుషః స్నాతః సాయంప్రాతర్యథావిధి ।
పరదారా న గంతవ్యాః పురుషేణ విపశ్చితా ॥ 60 ॥

పురుషుడు ఉదయం, సాయంత్రం యథావిధిగా స్నానంచేసి భోజనం చేయవలెను. పరస్త్రీ సంగమం చేయకూడదు.

ఇష్టాపూర్తాయుషాం హంత్రీ పరదారగతిర్నృణామ్ ।
న హీదృశమనాయుష్యం లోకే కించన విద్యతే ॥ 61 ॥

యాదృశం పురుషస్యేహ పరదారాభిమర్శనమ్ ।

పరస్త్రీ సంగమం చేసినట్లయితే ఇష్టాపూర్తములు (ఇష్టములనగా యజ్ఞములు, పూర్తములనగా వాపీకూప తటాకాది నిర్మాణములు, అన్న సత్రములు పెట్టుట, గోడలను కట్టించుట, తోటలను వేయించుట

మొదలైన పుణ్యకార్యములను) చేసినందువల్ల వచ్చిన ఆయుర్దాయం హరించివేయును. పురుషునకు పరదార గమనమున కంటె గొప్ప దోషము ఈ లోకమునందు మరొకటి లేదు.

దేవాగ్నిపితృకార్యాణి తథా గుర్వభివాదనమ్ ॥ 62 ॥

కుర్వీత సమ్యగాచమ్య తద్వదన్నభుజిక్రియామ్ ।
అఫేనశబ్దగంధాభిరద్భిరచ్ఛాభిరాదరాత్ ॥ 63 ॥

ఆచామేచ్చైవతద్వచ్చ ప్రాఙ్ముఖోదఙ్ముఖోఽపి వా ।

చక్కగా ఆచమనం చేసి దేవ, అగ్ని, పితృకార్యములను, అట్లే గురువుకు అభివాదనం చేయవలెను. ఆ తరువాతనే భోజనం చేయవలెను. భోజననానికి ముందాచమనం చేయవలెను. ఆచమనం చేయునపుడు నురగలుకాని, శబ్దముగాని రాకూడదు. స్వచ్ఛమైన వాసనలేని నీటితో ఆచమనం చేయవలెను. ఆచమనం చేయునపుడు తూర్పుదిక్కునకు గాని, ఉత్తరదిక్కునకుగాని ముఖంచేసి ఆచమనం చేయవలెను.

అంతర్జలాదావసథాద్వల్మీకాన్మూషికాస్థలాత్ ॥ 64 ॥

కృత శౌచావశిష్టాశ్చ వర్జయేత్పంచ వై మృదః ।
ప్రక్షాళ్య హస్తౌ పాదౌ చ సమభ్యుక్ష్య సమాహితః ॥ 65 ॥

ఇక శౌచక్రియకు పయోగించే మట్టిని గూర్చి చెబుతున్నాను. నీటిలో నుండి తీసినది, ఇంటి ఆవరణలోనున్నది, పుట్టలో నుండి తీసినది, ఎలుక కన్నంలోనుండి తీసినది. ఇంతకుముందు శౌచక్రియ కుపయోగించగా మిగిలిన ఈ ఐదు విధములైన మట్టిని శౌచక్రియ యందుపయోగించ కూడదు. ఇక ఆచమనవిధి ఏమనగా కాళ్లను, చేతులను కడుగుకొని స్థిరమనస్కుడై, తలపై నీటిని ప్రోక్షించుకొనవలెను.

అంతర్జానుస్తథాఽఽచామేత్త్రిశ్చతుర్వాఽపి వై నరః ।
పరిమృజ్య ద్విరావర్త్య ఖాని మూర్ధానమేవ చ ॥ 66 ॥

మోకాళ్లమధ్యలో చేతులనుంచుకొని మూడుమార్లుగాని, నాలుగుమార్లుగాని ఆచమనం చేయవలెను. రెండుమార్లు పెదవులను తుడుచుకొనవలెను. రెండుమార్లు ఇంద్రియములను, తలను స్పృశించవలెను.

సమ్యగాచమ్య తోయేన క్రియాం కుర్వీత వై శుచిః ।
క్షుతేఽవలీఢే వాతే చ తథా నిష్ఠీవనాదిషు ॥ 67॥

నీటితో చక్కగా ఆచమనం చేసి, శుచియై సంధ్యావందనం చేయవలెను. తుమ్మినా, నాకినా, అపానవాయువును విడిచినా, ఉమ్మివేసినా మరల ఆచమనం చేయవలెను.

కుర్యాదాచమనం స్పర్శే వాఽస్పృష్టస్యార్కదర్శనమ్ ।
కుర్వీతాఽఽలంభనం చాపి దక్షిణశ్రవణస్య వా ॥ 68 ॥

ఒకవేళ అస్పృశ్యుని ముట్టుకుంటే సూర్యదర్శనముగాని లేదా కుడిచెవిని కానీ స్పృశించవలెను.

యథా విభవతో హ్యేతత్పూర్వాఽభావే తతః పరమ్ ।
న విద్యమానే పూర్వోక్త ఉత్తరప్రాప్తిరిష్యతే ॥ 69 ॥

ఒకవేళ ఇవి చేయుటకు సూర్యదర్శనం కాకున్నచో కుడిచెవిని స్పృశించవలెను. అంతేకాని సూర్యదర్శనము అయినపుడు తరువాతది అవసరం లేదు.

న కుర్యాద్దంతసంఘర్షం నాఽఽత్మనో దేహతాడనమ్ ।
స్వపన్ధ్యాయంస్తథా భుంజన్స్వాధ్యాయం చ వివర్జయేత్ ॥ 70 ॥

తన దంతములను తాను కొరుకుకొన కూడదు. తన దేహమును తాను గ్రుద్దుకొన కూడదు. ముఖ్యంగా పండుకొనినపుడు, ధ్యానం చేయునపుడు, అదే విధంగా భోజనం చేయునపుడు, వేదాధ్యయనం చేయరాదు.

సంధ్యాయాం మైథునం చాపి తథా ప్రస్థానమేవ చ ।
తథాఽపరాహ్ణే కుర్వీత శ్రద్ధయా పితృతర్పణమ్ ॥ 71 ॥

సంధ్యాకాలంలో, ప్రయాణమూ మైథునమూ చేయకూడదు. అదే విధంగా అపరాహ్ణంలో శ్రద్ధగా పితృతర్పణం చేయవలెను.

శిరఃస్నానం చ కుర్వీత దైవం పిత్ర్యమథాపి చ ।
ప్రాఙ్ముఖోదఙ్ముఖో వాఽపి శ్మశ్రుకర్మ చ కారయేత్ ॥ 72 ॥

దైవకార్యములను, పితృకర్మలను చేయుటకు ముందు శిరఃస్నానం చేయవలెను. క్షురకర్మను చేసికొనునపుడు, స్నానం చేయునపుడు తూర్పు ముఖంగాని, ఉత్తరాభిముఖంగానీ ఉండవలెను.

వ్యంగినీం వర్జయేత్కన్యాం కులజాం వాఽప్యరోగిణీమ్ ।
ఉద్వహేత్పితృమాత్రోశ్చ సప్తమీం పంచమీం తథా ॥ 73 ॥

వివాహవిషయములో తండ్రివైపున ఏడవ తరమునకు చెందిన దానిని, తల్లివైపున ఐదవ తరమునకు చెందిన కన్యను మాత్రమే వివాహమాడవలెను. వికలాంగిని వివాహమాడకూడదు. ఉత్తమ కులంలో పుట్టినదానిని, ఎటువంటి రోగములులేని కన్యను వివాహమాడవలెను.

రక్షేద్దారాం స్త్యజేదీర్ష్యాం తథాఽహ్ని స్వప్నమైథునే ।
పరోపతాపకం కర్మ జంతు పీడాం చ సర్వదా ॥ 74 ॥

సర్వదా భార్యను రక్షించవలెను. అదేవిధంగా ఈర్ష్యను, పగటినిద్రనూ, సంభోగమునూ, ఇతరులకు తాపం కలిగించే పనులనూ, జంతువులను పీడించుటయూ చేయకూడదు.

ఉదక్యా సర్వవర్ణానాం వర్జ్యా రాత్రిచతుష్టయమ్ ।
స్త్రీజన్మపరిహారార్థం పంచమీం చాపి వర్జయేత్ ॥ 75 ॥

రజస్వల అయిన స్త్రీని అన్ని కులములు వారు నాలుగు రాత్రులు దూరంగా నుంచవలెను. అలాగే సంతానం కలుగకుండా ఉండవలెననిన ఐదవ దినంకూడా దూరంగా నుంచవలెను.

తతః షష్ఠ్యాం వ్రజేద్రాత్ర్యాం జ్యేష్ఠయుగ్మాసు రాత్రిషు ।
యుగ్మాసు పుత్రా జాయంతే స్త్రియోఽయుగ్మాసు రాత్రిషు ॥ 76 ॥

ఆరవ రోజు రాత్రియందు స్త్రీసంగమం చేయవలెను. ఋతు దినములయందు మొదటి పదహారు దినములలో సరి రాత్రులయందు భార్యను గూడితే పుత్రసంతానం కలుగుతుంది. బేసి రాత్రులయందు కూడితే ఆడపిల్లలు పుడతారు.

విధర్మిణో వై పర్వాదౌ సంధ్యాకాలేషు షంఢకాః ।
క్షురకర్మణి రిక్తాం వై వర్జయీత విచక్షణః ॥ 77 ॥

పవిత్రమైన దినములలో, సంధ్యా సమయములలో ఎవరైనా అధర్మపరులు స్త్రీసంగమం జరిపినట్లైతే వారికి నపుంసకులు పుడతారు. అలాగే క్షవరం చేయించుకొన్న రోజునా, శూన్యతిథియందూ కూడా స్త్రీసంగమం విడువవలెను.

బ్రువతామవినీతానాం న శ్రోతవ్యం కదాచన ।
న చోత్కృష్టాసనం దేయమనుత్కృష్టస్య చాఽదరాత్ ॥ 78 ॥

ఎప్పుడు కూడా వినయం లేనివాళ్లు ఏదైనా చెప్పినపుడు దానిని వినకూడదు. నీచుడైన వానికి ఆదరంతో ఉన్నతస్థాన మీయకూడదు.

క్షురకర్మణి వాంఽతే చ స్త్రీసంభోగే చ భో ద్విజాః ।
స్నాయీత చైలవాన్ప్రాజ్ఞః కటభూమిముపేత్య చ ॥ 79 ॥

క్షురకర్మను చేసుకున్నప్పుడు, స్త్రీసంభోగం జరిపిన తరువాత, సంతకు వెళ్లి వచ్చిన తరువాత, లేదా శ్మశానము నుండి వచ్చిన తరువాత సచేలస్నానం చేయవలెను. (అనగా ఆ ధరించిన బట్టతోనే స్నానం చెయ్యాలి.)

దేవవేదద్విజాతీనాం సాధుసత్యమహాత్మనామ్ ।
గురోః పతివ్రతానాం చ బ్రహ్మయజ్ఞతపస్వినామ్ ॥ 80 ॥

పరివాదం న కుర్వీత పరిహాసం చ భో ద్విజాః ।
ధవలాంబరసంవీతః సితపుష్పవిభూషితః ॥ 81 ॥

విప్రులారా! దేవతలను, వేదమును, బ్రాహ్మణులను, సాధువులను, సత్యవంతులను, గురువులను, మహాత్ములను, పతివ్రతలను, బ్రహ్మయజ్ఞములు తపస్సులు చేయువారిని, దూషింపకూడదు. పరిహసింపకూడదు. ఎల్లప్పుడు తెల్లని వస్త్రములను, తెల్లని పూవులను ధరించవలెను.

సదా మాంగల్యవేషః స్యాన్న వాఽమాంగల్యవాన్భవేత్ ।
నోద్ధతోన్మత్తమూఢైశ్చ నావినీతైశ్చ పండితః ॥ 82 ॥

ఎప్పుడూ మంగళకరమైన వేషంతో నుండవలెను. అటువంటి వారికెప్పుడూ అమంగళములు కలుగవు. గర్వంగలవారితో, పిచ్చివారితో, మూర్ఖులతో, అవినీతులతో పండితుడైన వాడు స్నేహం చేయకూడదు.

గచ్ఛేన్మైత్రీమశీలేన న వయోజాతిదూషితైః ।
న చాతివ్యయశీలైశ్చ పురుషైర్నైవ వైరిభిః ॥ 83 ॥

శీలం లేనివానితో, వయస్సుచేత, జాతిచేత దూషింపబడినవానితో, ఎక్కువగా వ్యయంచేసే స్వభావం గల వానితో, శత్రువుతో స్నేహం చేయకూడదు.

కార్యాక్షమైర్నిందితైర్న న చైవ విటసంగిభిః ।
నిస్స్వైర్న వాదైకపరైర్నరైశ్చాన్యైస్తథాఽధమైః ॥ 84 ॥

కార్యములు చేయ సమర్థులు గానివారితో, నిందలను పొందిన వారితో, జారులతో కలిసి తిరిగే వారితో, నిరుపేదలతో, వాదనలు చేయువారితో, అనేక విధములుగా అధములుగా నున్న వారితో స్నేహం చేయకూడదు.

సుహృద్దీక్షితభూపాలస్నాతకశ్వశురైః సహ ।
ఉత్తిష్ఠేద్విభవాచ్చైనానర్చయేద్గృహమాగతాన్ ॥ 85 ॥

తన ఇంటికి స్నేహితుడు, దీక్షలోనున్నవాడు, ప్రభువూ, స్నాతకుడు అనగా గురుకులంలో విద్యను పూర్తిచేసినవాడు, పిల్లనిచ్చిన మామ, వారితో కలిసి వచ్చిన వారెవరైనా వస్తే వెంటనే లేచి వారికెదురేగి తనకున్నంతలో వారికి లోటు చేయకుండా పూజించవలెను.

యథా విభవతో విప్రాన్ ప్రతిసంవత్సరోషితాన్ ।
సమ్యగ్గృహేఽర్చనం కృత్వా యథాస్థానమనుక్రమాత్ ॥ 86 ॥

ప్రతి సంవత్సరమున కొకసారి ఆబ్దికం సమయంలో వచ్చే విశ్వేదేవతలను, పితృదేవతలను తన ఇంటిలో స్థానక్రమము ననుసరించి తన వైభవమునకు తగినట్లుగా అర్చన చేయవలెను.

సంపూజయేత్తథా వహ్నౌ ప్రదద్యాచ్చాఽఽహుతీః క్రమాత్ ।
ప్రథమాం బ్రహ్మణే దద్యాత్ప్రజానాం పతయే తతః ॥ 87 ॥

వైశ్వదేవ, పితృదేవతలకు క్రమము ననుసరించి పూజించుటేకాక, అగ్నియందు క్రమంగా ఆహుతులను కూడా సమర్పించవలెను. మొదట బ్రహ్మకు, తరువాత ప్రజాపతికి నివ్వవలెను.

తృతీయాం చైవ గృహ్యేభ్యః కశ్యపాయ తథాఽపరామ్ ।
తతోఽనుమతయే దత్త్వా దద్యాద్గృహబలిం తతః ॥ 88 ॥

మూడవ ఆహుతి ఇంటి దేవతలకు, తరువాత మరొకటి కశ్యపునకు, ఆ తరువాత అనుమతికోసం గృహము కొఱకు బలిని పెట్టవలెను.

పూర్వం ఖ్యాతా మయా యా తు నిత్యక్రమవిధౌ క్రియా ।
వైశ్వదేవం తతః కుర్యాద్వదతః శృణుత ద్విజాః ॥ 89 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! నేనింతవరకు చెప్పినదంతా నిత్యకర్మవిధిలో చేయవలసిన క్రియ మాత్రమే. ఇక తరువాత నేను వైశ్వదేవమును గూర్చి చెప్పబోవుతున్నాను వినండి.

యథాస్థానవిభాగం తు దేవానుద్దిశ్య వై పృథక్ ।
పర్జన్యాపో ధరిత్రీణాం దద్యాత్తు మణికే త్రయమ్ ॥ 90 ॥

దేవతలనుద్దేశించి మరల స్థానవిభాగం చేయవలెను. పర్జన్య, వరుణ (ఆప) ధరిత్రులనే ముగ్గురు దేవతలకు విడివిడిగా మూడు స్థానములందు బలిని మట్టిపాత్రలో సమర్పించవలెను.

వాయవే చ ప్రతిదిశం దిగ్భ్యః ప్రాచ్యాదిషు క్రమాత్ ।
బ్రహ్మణే చాంతరిక్షాయ సూర్యాయ చ యథాక్రమాత్ ॥ 91 ॥

వాయువునకు వాయవ్య దిశయందు, దిగ్దేవతలకు వరుసగా తూర్పునుండి ప్రారంభించి క్రమంగా బలిని సమర్పించి, తరువాత బ్రహ్మకు, అంతరిక్షమునకు, సూర్యునకు క్రమంగా నీయవలెను.

విశ్వేభ్యశ్చైవ దేవేభ్యో విశ్వభూతేభ్య ఏవ చ ।
ఉషసే భూతపతయే దద్యాద్వోత్తరతః శుచిః ॥ 92 ॥

ఆ తరువాత క్రమంగా విశ్వేదేవతలకు, విశ్వభూతములకు, ఉషస్సుకు, భూతపతిఐన శివునకు ఉత్తరపు దిక్కునందు శుచిగా బలిని సమర్పించవలెను.

స్వధా చ నమ ఇత్యుక్త్వా పితృభ్యశ్చైవ దక్షిణే ।
కృత్వాఽపసవ్యం వాయవ్యాం యక్ష్మై తత్తేతి సంవదన్ ॥ 93 ॥

'స్వధాయై నమః' అని దక్షిణపు దిక్కునందు పితృదేవతలకు అపసవ్యంతో సమర్పించవలెను. 'యక్ష్మై తత్తే' అను మంత్రమును చదువుతూ వాయవ్య దిశయందునూ. ఆహుతి నీయవలెను.

అన్నావశేషమిశ్రం వై తోయం దద్యాద్యథావిధి ।
దేవానాం చ తతః కుర్యాద్బ్రాహ్మణానాం నమస్క్రియామ్ ॥ 94 ॥

మిగిలిన అన్న మిశ్రమమును, ఉదకమును యథావిధిగా సమర్పించి, అటు తర్వాత దేవతలకు, బ్రాహ్మణులకు నమస్కరించవలెను.

అంగుష్ఠోత్తరతో రేఖా పాణేర్యా దక్షిణస్య చ ।
ఏతద్బ్రాహ్మమితి ఖ్యాతం తీర్థమాచమనాయ వై ॥ 95 ॥

కుడిచేతి బొటన వ్రేలికి ఉత్తరముగానున్న రేఖను బ్రహ్మతీర్థమంటారు. దీనితో ఆచమనం చేయవలెను.

తర్జన్యంగుష్ఠయోరంతః పిత్ర్యం తీర్థముదాహృతమ్ ।
పితౄణాం తేన తోయాని దద్యాన్నాందీముఖాదృతే ॥ 96 ॥

చూపుడు వ్రేలుకు (తర్జనికి) బొటనవ్రేలికి మధ్యనున్న రేఖను పితృతీర్థమందురు. నాందీముఖంలో తప్ప ఇతర విధులయందు పితృదేవతలకు తర్పణాదులు ఈ తీర్థంతోనే చేయవలెను.

అంగుల్యగ్రే తథా దైవం తేన దివ్యక్రియా విధిః ।
తీర్థం కనిష్ఠికామూలే కాయం తత్ర ప్రజాపతేః ॥ 97 ॥

వ్రేళ్లకొనలయందుండు రేఖలను దైవతీర్థములంటారు. దేవతలనుద్దేశించి చేయు తర్పణాది క్రియలన్నీ ఈ తీర్థంతోనే చేయవలెను. చిటికెన వ్రేలు మొదటనున్న రేఖ ప్రజాపతి తీర్థమంటారు. ప్రజాపతికి తర్పణం ఈ వ్రేలితో చేయవలెను. (కాండర్షి (ఋషిని) ప్రజాపతి అంటారు. కావున ఋషి తీర్థంతో చేయవలెను)

ఏవమేభిః సదా తీర్థైర్విధానం పితృభిః సహ ।
సదా కార్యాణి కుర్వీత నాన్యతీర్థైః కదాచన ॥ 98 ॥

ఈవిధంగా ఈ వ్రేళ్లతో తీర్థములతో సర్వదా పితృదేవతలకు గూడా విధివిధానంగా తర్పణాది క్రియలను చేయవలెను. ఇతర తీర్థములతో ఎప్పుడూ చేయకూడదు.

బ్రాహ్మేణాఽఽచమనం శస్తం పైత్ర్యం పిత్ర్యేణ సర్వదా! ।
దేవతీర్థేన దేవానాం ప్రాజాపత్యం జితేన చ ॥ 99 ॥

బ్రహ్మతీర్థంతో ఆచమనమూ, పితృక్రియలకు పితృతీర్థంతో, దేవతలకు దేవతీర్థంతో, ప్రజాపతికి చిటికెన వ్రేలుతోనూ తర్పణం చేయవలెను.

నాందీముఖానాం కుర్వీత ప్రాజ్ఞః పిండోదకక్రియామ్ ।
ప్రాజాపత్యేన తీర్థేన యచ్చ కించిత్ప్రజాపతేః ॥ 100 ॥

నాందీముఖదేవతలకు పిండతర్పణాదులు ప్రజాపతికి చేసినట్లే ప్రాజాపత్యతీర్థంతో చిటికెన వ్రేలితో చేయవలెను.

యుగపజ్జలమగ్నిం చ బిభృయాన్న విచక్షణః ।
గురుదేవపితౄన్విప్రాన్న చ పాదౌ ప్రసారయేత్ ॥ 101 ॥

విచక్షణ గలిగినవాడు నిప్పును, నీటిని ఒకేసారి కలిపి పట్టుకోకూడదు. గురువులు, దేవతలు, తల్లిదండ్రులు, బ్రాహ్మణులున్నవైపు పాదములను చాచకూడదు.

నాఽఽచక్షీత ధయంతీం గాం జలం నాంజలినా పిబేత్ ।
శౌచకాలేషు సర్వేషు గురుష్వల్పేషు వా పునః ॥
న విలంబేత మేధావీ న ముఖేనానలం ధమేత్ ॥ 102 ॥

లేగదూడకు పాలు గుడుపుతున్న ఆవును చూడకూడదు. దోసిలితో నీటిని త్రాగకూడదు. శౌచకాలము లన్నింటియందు అనగా లఘుశంక, గురుశంకలను తీర్చుకునే సమయములందుకాని (కాళ్లు కడిగి ఆచమనం చేయుట) ఆలస్యం చేయకూడదు. నోటితో నిప్పు నూదకూడదు.

తత్ర విప్రా న వస్తవ్యం యత్ర నాస్తి చతుష్టయమ్ ।
ఋణప్రదాతా వైద్యశ్చ శ్రోత్రియః సజలా నదీ ॥ 103 ॥

ఋణము నిచ్చేవాడు, వైద్యుడు, బ్రాహ్మణుడు, నిరంతరము ప్రవహించేనది ఈ నాలుగు లేనటువంటి గ్రామంలో నివసించరాదు. (దీనినే సుమతి శతకకారుడు 'అప్పిచ్చువాడు' అను పద్యమునందు చెప్పినాడు.)

జితభృత్యో నృపో యత్ర బలవాన్ధర్మతత్పరః ।
తత్ర నిత్యం వసేత్ప్రాజ్ఞః కుతః కునృపతౌ సుఖమ్ ॥ 104 ॥

సేవకులను జయించినవాడు, బలశాలి, ధర్మతత్పరుడైన రాజు ఎక్కడ ఉండునో అక్కడనే ప్రాజ్ఞుడైనవాడు నివసించవలెను. చెడ్డవాడైన రాజున్నచోట నివసిస్తే సుఖమెక్కడిది?

పౌరాః సుసంహతా యత్ర సతతం న్యాయవర్తినః ।
శాంతాఽమత్సరిణో లోకాస్తత్ర వాసః సుఖోదయః ॥ 105 ॥

ఎక్కడైతే పౌరులు న్యాయవర్తనులై ఉండి, శాంతంతో, మాత్సర్యం లేకుండా కలిసిమెలిసి వుంటారో అటువంటి ప్రదేశంలో నివసిస్తే సుఖోదయమవుతుంది.

యస్మిన్కృషీవలా రాష్ట్రే ప్రాయశో నాతిమానినః ।
యత్రౌషధాన్యశేషాణి వసేత్తత్ర విచక్షణః ॥ 106 ॥

తరచుగా ఎక్కడ దురభిమానులైన రైతులు ఉండరో, ఎక్కడైతే ఔషధములెక్కువగా లభిస్తాయో, అటువంటి రాష్ట్రంలో విచక్షణుడైనవాడు నివసించవలెను.

తత్ర విప్రా న వస్తవ్యం యత్రైతత్త్రితయం సదా ।
జిగీషుః పూర్వవైరశ్చ జనశ్చ సతతోత్సవః ॥ 107 ॥

ఎక్కడైతే గెలవాలనే కోరికగల వారుంటారో, పూర్వవైరంగల వారుంటారో, జనులు ఎప్పుడూ వేడుకలు చేయాలని ఉత్సాహపడుతుంటారో అటువంటి ఈ మూడు చోట్ల నివసించకూడదు.

వసేన్నిత్యం సుశీలేషు సహచారిషు పండితః ।
యత్రాప్రధృష్యో నృపతిర్యత్ర సస్యప్రదా మహీ ॥ 108 ॥

ఉత్తమ శీలంగల సహచరులు, శత్రువుల బెదిరింపులకు లొంగని రాజు, చక్కని పంటలు పండే భూమి ఎక్కడ ఉంటుందో అక్కడ పండితుడు నివసించవలెను.

ఇత్యేతత్కథితం విప్రా మయా వో హితకామ్యయా ।
అతః పరం ప్రవక్ష్యామి భక్ష్యభోజ్యవిధిక్రియామ్ ॥ 109 ॥

ఓ బ్రాహ్మణులారా! మీకు హితం కలగాలనే కోరికతో ఇదంతా చెప్పాను. ఇక భక్ష్య భోజ్య విధానాన్ని తెలుపుతున్నాను.

భోజ్యమన్నం పర్యుషితం స్నేహాక్తం చిరసంభృతమ్ ।
అస్నేహా అపి గోధూమయవగోరసవిక్రియాః ॥ 110 ॥

అన్నముపాచినదైనా, చాలాకాలం నిల్వఉన్నదైనా, నూనెతో కూడినదైతే తినవచ్చును. అలాగే గోధుమలతో, యవలతో, గోరసాలైన ఆవుపాలు, నెయ్యి, పెరుగులతో చేసినవైతే నూనెతో కూడనివైనా తినవచ్చును.

శశకః కచ్ఛపో గోధా శ్వావిన్మత్స్యో౽థ శల్యకః ।
భక్ష్యాశ్చైతే తథా వర్జ్యౌ గ్రామసూకరకుక్కుటౌ ॥ 111 ॥

కుందేలు, తాబేలు, ఉడుము, ఏదుపంది, చేప, ముళ్లచేప వీటిని తినవచ్చు. కాని ఊరపంది మాంసం, కోడిమాంసం తినకూడదు.

పితృదేవాదిశేషం చ శ్రాద్ధే బ్రాహ్మణకామ్యయా ।
ప్రోక్షితం చౌషధార్థం చ ఖాదన్మాంసం న దుష్యతి ॥ 112 ॥

పితృశేషము, దేవశేషము, శ్రాద్ధంలో బ్రాహ్మణులకు పెట్టవలెననే కోరికతో ప్రోక్షించినది, ఔషధము కొఱకుపయోగించిన (అనగా ఔషధంలో కలిసి ఉన్న) మాంసమును తింటే దోషం కలుగదు.

శంఖాశ్మస్వర్ణరూప్యాణాం రజ్జూనామథవాససామ్ ।
శాకమూలఫలానాం చ తథా విదలచర్మణామ్ ॥ 113 ॥

మణివస్త్రప్రవాలానాం తథా ముక్తాఫలస్య చ ।
పాత్రాణాం చమసానాం చ అంబునా శౌచమిష్యతే ॥ 114 ॥

శంఖం, రాయి, బంగారం, వెండి, దారముల త్రాళ్లు, వస్త్రములు, కూరలు, దుంపలు, పండ్లు, పప్పులు, చర్మములు నీటితో కడిగిన శుద్ధములవుతాయి. అట్లే మణులు, వస్త్రములు, పగడములు, ముత్యములు, నాలుగు మూలలు గల చమసపాత్రలు (యజ్ఞపాత్రలు) నీటితో కడిగిన శుద్ధములవుతాయి.

తథా౽శ్మకానాం తోయేన అశ్మసంఘర్షణేన చ ।
సస్నేహానాం చ పాత్రాణాం శుద్ధిరుష్ణేన వారిణా ॥ 115 ॥

అదేవిధంగా రాతిచిప్పలను నీటితోగాని, లేదా మరో రాతితో గట్టిగా సంఘర్షణచేసి (రుద్ది) గాని, శుద్ధి చేసుకోవచ్చు. ఇక నూనెజిడ్డు కలిగిన పాత్రలను వేడినీటితో కడిగిన శుద్ధియవుతుంది.

శూర్పాణామజినానాం చ ముశలోలూఖలస్య చ ।
సంహతానాం చ వస్త్రాణాం ప్రోక్షణాత్సంచయస్య చ ॥ 116 ॥

ఇక చేటలు, జింక చర్మములు, రోలు, రోకలి, కుట్టిన బట్టలు మున్నగువాటికి నీటిని ప్రోక్షించినచో శుద్ధియవుతాయి.

వల్కలానామశేషాణామంబుమృచ్ఛౌచమిష్యతే ।
ఆవికానాం సమస్తానాం కేశానాం చైవ మిష్యతే ॥ 117 ॥

నారబట్టలు నీటిమట్టి (చవుడు మట్టి)తో రుద్దిన శుద్ధియవుతాయి. (లేదా ఎండలో వేసిన శుద్ధియవుతాయి.) అట్లే ధావళులు (ఒక రకమైన గొఱ్ఱె ఉన్నితో చేసిన గొంగళి లాంటివి) కూడా పైవిధంగానే శుద్ధి చేయవచ్చు.

సిద్ధార్థకానాం కల్కేన తిలకల్కేన వా పునః ।
శోధనం చైవ భవతి ఉపఘూతవతాం సదా ॥ 118 ॥

ఈ ధావళులను, ముతక బట్టలను తెల్లఆవాల ముద్దతోగాని, నువ్వులముద్దతోగాని రుద్దితే శుద్ధములవుతాయి.

తథా కార్పాసికానాం చ శుద్ధిః స్యాజ్జలభస్మనా ।
దారుదంతాస్థిశృంగాణాం తక్షణాచ్ఛుద్ధిరిష్యతే ॥ 119 ॥

అదేవిధంగా నూలు బట్టలను నీటితో కానీ, భస్మముతోకానీ శుద్ధిచేయవలెను. కఱ్ఱతో, దంతములతో, ఎముకలతో, జంతువుల కొమ్ములతో చేసిన వస్తువులను నీటితోగాని, బూడిదతోగాని రుద్ది కడిగితే శుద్ధములవుతాయి.

పునః పాకేన భాండానాం పార్థివానామమేధ్యతా ।
శుద్ధం భైక్ష్యం కారుహస్తః ఏణ్యం యోషిన్ముఖం తథా ॥ 120 ॥

అంట్లతోనున్న మట్టికుండలు మరల వంటకు పనికిరావు. వాటిని చక్కగా తోమి మరల వంట చేసుకొన వలెను. సన్యాసి లేదా యాచకుని భిక్షాపాత్ర, శిల్పి, వడ్రంగి మొదలగు వారు, నల్లజింక చర్మము, స్త్రీముఖం ఇవన్నీ పరిశుద్ధములైనవి.

రథ్యాగమనవిజ్ఞానం దాసవర్గేణ సంస్కృతమ్ ।
ప్రాక్ప్రశస్తం చిరాతీతమనేకాంతరితం లఘు ॥ 121 ॥

దారిలో వచ్చేటప్పుడు అనుకోకుండా ముట్టుకున్నది లేదా తాకినది, త్రొక్కినది, సేవకవర్గంచే సంస్కరింప బడినది, పూర్వం పరిశుద్ధమైనది, చాలా పాతది, అనేకాంతరితమైనది, (చాలావాటితో వ్యవధాన మున్నది) చిన్నదైనను శుద్ధమే.

అంతః ప్రభూతం బాలం చ వృద్ధాంతరవిచేష్టితమ్ ।
కర్మాంతాగారశాలాశ్చ స్తనద్వయం శుచిస్త్రియాః ॥ 122 ॥

అంతః ప్రభూతములైన కేశములుకలది (స్థానభ్రష్టముకానికేశములు), బాలలు, వృద్ధులు, లోగిళ్లు, (సత్కర్మలుచేసి వదిలినవి) స్త్రీల స్తనద్వయం శుద్ధములు.

శుచయశ్చ తథైవాఽఽపః స్రవంత్యో గంధవర్జితాః ।
భూమిర్విశుధ్యతే కాలాద్దాహమార్జన గోకులైః ॥ 123 ॥

అదేవిధంగా ప్రవాహజలము, వాసనలేని నీరు పరిశుద్ధమైనవి. కాలంవల్ల అగ్నిదాహముచేత, నీటిని చల్లుటచేత ఆవులు సంచరించి త్రొక్కినచోట భూమిశుద్ధియవుతుంది.

లేపాదుల్లేఖనాత్సేకాద్వేశ్మసంమార్జనాదినా ।
కేశకీటావపన్నే చ గోఘ్రాతే మక్షికాన్వితే ॥ 124 ॥

మృదంబు భస్మ చాప్యన్నే ప్రక్షేప్తవ్యం విశుద్ధయే ।
ఔదుంబరాణామమ్లేన వారిణా త్రపుసీసయోః ॥ 125 ॥

ఇంటిని అలుకుట, ముగ్గులు వేయుట, కడుగుట, నీటిని చల్లుట వలన తుడుచుట వల్లనూ శుచియగును. అన్నములో వెంట్రుకలు పడినపుడు, పురుగులు చేరినపుడు, ఆవులు వాసన చూసినా, ఈగలు చేరినపుడూ పరిశుద్ధము కాదు. కాని శుద్ధికొరకు మట్టిని గాని, నీటినిగాని బూడిదనుగాని అన్నంపై చల్లవలెను. మేడితోచేసిన పాత్రలను చింత పండుపులుసుతో శుద్ధిచేయవలెను. త్రపు, సీసములు నీటితో శుద్ధియగును.

భస్మాంబుభిశ్చ కాంస్యానాం శుద్ధిః ప్లావో ద్రవస్య చ ।
అమేద్యాక్తస్య మృత్తోయైర్గంధాపహరణేన చ ॥ 126 ॥

కాంస్య (కంచు) పాత్రలు బూడిదతోనూ, నీటితోనూ శుద్ధియగును. ద్రవపదార్థములు అశుచివైతే దానిలోని ద్రవము కొంచము పారబోయుట వల్ల శుద్ధియగును. అపవిత్రమైన వస్తువులను, దానితో గూడిన ద్రవ్యములనుగాని మట్టితో వాసనపోవునంత వరకు తోమి నీటితో కడిగిన పవిత్రమగును.

అన్యేషాం చైవ ద్రవ్యాణాం వర్ణగంధాంశ్చ హారయేత్ ।
శుచి మాంసం తు చాండాలక్రవ్యాదైర్వినిపాతితమ్ ॥ 127 ॥

ఇతరమైన ద్రవ్యములకు వాటిరంగును వాసనను తొలగిస్తే పవిత్రములగును. చండాలుడూ, పచ్చి మాంసమును తినేవాడు తెచ్చిన మాంసము శుచియే అగును.

రథ్యాగతం చ తైలాది శుచిగోతృప్తిదం పయః ।
రజోఽగ్నిరశ్వగోఛాయా రశ్మయః పవనో మహీ ।128 ॥

దుకాణమునుండి కొనితెచ్చిన నూనె, ఆవులకు తృప్తి కలిగించిన నీరు లేదా గోవులు తృప్తిపడియిచ్చిన పాలు, ధూళి, అగ్ని, గుఱ్ఱముల యొక్క గోవుల యొక్క నీడ, కిరణములు, గాలి, భూమి పవిత్రములైనవి.

విప్లుషో మక్షికాద్యాశ్చ దుష్టసంగాదదోషిణః ।
అజాశ్వం ముఖతో మేధ్యం న గోర్వత్సస్య చాఽఽననమ్ ॥ 129 ॥

నీటి చినుకులతో తడిసినవి, ఈగలు మొదలైనవి వాలి దుష్ట స్పర్శపొందినవైనా దూషితములు కావు. మేకలు, గుఱ్ఱములు, ఆవు, దూడ ముఖం పవిత్రం కాదు. ముఖంతోనే పవిత్రములు.

మాతుః ప్రస్రవణం మేధ్యం శకునిః ఫలపాతనే ।
ఆసనం శయనం యానం తటే నద్యాస్తృణాని చ ॥ 130 ॥

తల్లిపాలు, పక్షులు చెట్టు మీదినుండి పడవేసిన ఫలములు, చిత్రాసనము, పడక, వాహనము, నదీతీరమునందున్న గడ్డి పవిత్రములైనవి.

సోమసూర్యాంశుపవనైః శుధ్యంతే తాని పణ్యవత్ ।
రథ్యాపసర్పణే స్నానే క్షుత్పానానాం చ కర్మసు ॥ 131 ॥

ఆచామేత యథాన్యాయం వాససః పరిధాపనే ।
స్పృష్టానామథ సంస్పర్శైర్ద్విరథ్యాకర్దమాంభసి ॥ 132 ॥

పక్వేష్టకచితానాం చ మేధ్యతా వాయుసంశ్రయాత్ ।
ప్రభూతోపహతాదన్నాదగ్రముద్ధృత్య సంత్యజేత్ ॥ 133 ॥

సూర్యచంద్రులకిరణములు సోకిన గాలులతో అంగడినుండి తెచ్చిన వాటివలెనే అవి పరిశుద్ధములగును. వీధిలో వెళ్తున్నప్పుడూ, స్నానసమయంలో, ఆకలిదప్పికలు తీర్చుకొనునప్పుడూ వస్త్రపరిధాపనమునందు న్యాయము ననుసరించి ఆచమనం చేయవలెను. రెండు దారుల మధ్య, మార్గమధ్యంలో ముట్టుకున్న నీటిని స్పృశించిన ఆ పాపము తొలగును. వండిన అన్నసముదాయము గాలిసోకినందువల్ల శుద్ధియగును. ఎక్కువగా పాడైన అన్నమును పైభాగమును కొంత తీసివేయాలి.

శేషస్య ప్రోక్షణం కుర్యాదాచమ్యాద్భిస్తథా మృదా ।
ఉపవాస త్రిరాత్రం తు దుష్ట భుక్తాశినో భవేత్ ॥ 134 ॥

ఆ మిగిలిన అన్నము నీటితో మట్టితో ప్రోక్షించవలెను. దుష్టాన్నం భుజించినవారు మూడు రాత్రులు ఉపవాసం చేయవలెను.

అజ్ఞానే జ్ఞానపూర్వే తు తద్దోషోపశమేన తు ।
ఉదక్యాం వా వలగ్నాం చ సూతికాన్త్యావసాయినః ॥ 135 ॥

జాతాశౌచం పోవుట కొఱకు శిశుజననం గూర్చి ముందే తెలిసినా లేదా తమకు తెలియక పోయినా ఆ దోషం పోవుటకొరకు పురిటి చివరి దినంలో నీటియందు నడుములోతు వరకు దిగి స్నానమాచరించిన ఆ దోషముపశమించును.

స్పృష్ట్వా స్నాయీత శౌచార్థం తథైవ మృతహారిణః ।
నారం స్పృష్ట్వాఽస్థి సస్నేహం స్నాత్వా విప్రో విశుధ్యతి ॥ 136 ॥

అట్లే మృత శరీరమును మోసిన వాళ్లు, ముట్టుకున్న వాళ్లు శౌచం కొఱకై స్నానం చేయవలెను. మృతాశౌచములోనున్న వారిని తగిలినా, అస్థికలను ముట్టుకున్నా, మరణించిన వారియందు ప్రేమతో స్నానమునాచరించిన అతడు పరిశుద్ధుడు కాగలడు.

ఆచమ్యైవ తు నిస్నేహం గామాలభ్యార్కమీక్ష్య వా ।
న లంఘయేత్తథైవాథ ష్ఠీవనోద్వర్తనాని చ ॥ 137 ॥

ఆ తరువాత నీటితో ఆచమనం చేసినా, గోవును ముట్టుకున్నా, సూర్యుని చూసినా పవిత్రుడగును. అదే విధంగా ష్ఠీవనోద్వర్తనములను దాటకూడదు అలా చేస్తే పైన చెప్పినట్లు గానే చేయవలెను.

గృహాదుచ్ఛిష్టవిణ్మూత్రం పాదాంభస్తక్షిపేద్బహిః ।
పంచ పిండాననుద్ధృత్య న స్నాయాత్పరవారిణి ॥ 138 ॥

ఎంగిళ్లు, మూత్ర పురీషములు, కాళ్లు కడిగిన నీళ్లను ఇంటి బయటనే ఉంచవలెను. పంచ పిండములను తీయకుండా బయటి నీటియందు స్నానం చేయకూడదు.

స్నాయీత దేవఖాతేషు గంగాహ్రదసరిత్సు చ ।
నోద్యానాదౌ వికాలేషు ప్రాజ్ఞస్తిష్ఠేత్కదాచన । 139 ॥

దేవకూపములందు, గంగానదియందు, సరస్సులందు, నదులయందు స్నానము నాచరించవలెను. ప్రాజ్ఞుడైన వాడు వేళకాని వేళలలో ఉద్యానాదులయం దుండకూడదు.

నాఽఽలపేజ్జనవిద్విష్టాన్వీరహీనాస్తథా స్త్రియః ।
దేవతా పితృ సచ్ఛాస్త్రయజ్వి సంన్యాసినిందకైః ॥ 140 ॥

ప్రజలను ద్వేషించే వారిని గూర్చి, అబలలైన స్త్రీలను గూర్చి, దేవతలనూ, తలిదండ్రులనూ నిందించే వారితో, మంచి శాస్త్రములను చదువుకున్న వారిని నిందించే వారితో, యజ్ఞములను నిందించే వారితో, సన్యాసులను నిందించే వారితో మాట్లాడకూడదు.

కృత్వా తు స్పర్శనాలాపం శుధ్యత్యర్కావలోకనాత్ ।
అవలోక్య తథోదక్యాం సంన్యస్తం పతితం శవమ్ ॥ 141 ॥

అటువంటి వారితో మాట్లాడినా, వారిని స్పృశించినా అట్టి దోషం సూర్యదర్శనం వల్ల శుద్ధి అవుతుంది. అదే విధంగా నీటిలో పడి మరణించిన వారి శవమును చూసినా ఆ దోషం సూర్యదర్శనం వల్ల నశిస్తుంది.

విధర్మిసూతికాషణ్డవివస్త్రాన్త్యావసాయినః ।
మృతనిర్యాతకాంశ్చైవ పరదారరతాశ్చ యే ॥ 142 ॥

విధర్ములను, సూతకులను, షండులను, వివస్త్రులను, అంత్యకులం వారినీ శవదహనానికి వెళ్లి వచ్చిన వారినీ, ఇతరుల భార్యలతో రమించే వారినీ చూచినప్పుడు కూడా సూర్యదర్శనంతో శుద్ధి కలుగుతుంది.

ఏతదేవ హి కర్తవ్యం ప్రాజ్ఞైః శోధనమాత్మనః ।
అభోజ్యభిక్షుపాఖండమార్జారఖరకుక్కుటాన్ ॥ 143 ॥

తినకూడని వాటిని తిన్నప్పుడు, భిక్షుకులను, పాఖండులను, పిల్లులను, గాడిదలను, కోళ్లను చూసినపుడు తమ పరిశుద్ధికొరకు ఇట్లే సూర్యదర్శనం చేయవలెను.

పతితాపవిద్ధచాండాలమృతాహారాంశ్చ ధర్మవిత్ ।
సంస్పృశ్య శుధ్యతే స్నానాదుదక్యా గ్రామశూకరౌ ॥ 144 ॥

క్రింద పడిన, పారవేసిన, చండాలసంబంధమైన, శవాన్ని మోసుకువెళ్లేవారినీ, రజస్వలనూ, గ్రామ శూకరములనూ ముట్టుకొన్నచో ధర్మము తెలిసినవాడు నీటితో స్నానం చేస్తే ఆ దోషం పోయి పరిశుద్ధుడవుతాడు.

తద్వచ్చ సూతికాశౌచదూషితౌ పురుషావపి ।
యస్య చానుదినం హానిర్గృహే నిత్యస్య కర్మణః ॥ 145 ॥

ప్రతిదినం నిత్య కర్మలకు హానిని కలిగించే పురుడు, మైల వచ్చిన పురుషులను స్పృశించినా అట్లే నీటితో స్నానం చేసినచో దోషం తొలగును.

యస్తు బ్రాహ్మణ సంత్యక్తః కిల్బిషాశీ నరాధమః ।
నిత్యస్య కర్మణో హానిం న కుర్వీత కదాచన ॥ 146 ॥

ఎవడు బ్రాహ్మణులచేత విడిచిపెట్టబడ్డాడో, పాపాన్ని మూటకట్టుకొన్నాడో, అట్టి దుర్మార్గుడు కూడా నిత్యకర్మలు విడిచిపెట్టకూడదు.

తస్య త్వకరణం వక్ష్యే కేవలం మృతజన్మసు ।
దశాహం బ్రాహ్మణస్తిష్ఠేద్దానహోమాదివర్జితః ॥ 147 ॥

అటువంటి వారి విషయంలో జాతకర్మ, మృతకర్మల విషయంలో చెబుతున్నాను. అటువంటి సమయంలో పది రోజులవరకు బ్రాహ్మణుడు దానములు, హోమములు మున్నగు వాటిని వదిలివేసి యుండవలెను.

క్షత్రియో ద్వాదశాహం చ వైశ్యో మాసార్ధమేవ చ ।
శూద్రశ్చ మాసమాసీత నిత్యకర్మవివర్జితః ॥ 148 ॥

క్షత్రియుడు పన్నెండు రోజులవరకు, వైశ్యుడు పదిహేను రోజులూ, శూద్రుడొక మాసం వరకూ నిత్యకర్మలను వదిలివేయవలెను.

తతః పరం నిజం కర్మ కుర్యుః సర్వే యథోచితమ్ ।
ప్రేతాయ సలిలం దేయం బహిర్గత్వా తు గోత్రకైః ॥ 149 ॥

ఆ తరువాత అందరూ యథోచితంగా నిత్యకర్మలను చేసుకొనవలెను. సగోత్రికులైనవారు ఊరి బయటకు వెళ్లి ప్రేతకొఱకు తర్పణములను చేయవలెను.

ప్రథమేఽహ్ని చతుర్థే చ సప్తమే నవమే తథా ।
తస్యాస్థిసంచయః కార్యశ్చతుర్థేఽహని గోత్రకైః । 150 ॥

మొదటి రోజు, నాల్గవ రోజు, ఏడవ రోజు, తొమ్మిదవ రోజు సగోత్రులు ప్రేతకొఱకు తర్పణములను చేయవలెను. నాల్గవ రోజు అస్థిసంచయం చేయవలెను.

ఊర్ధ్వం సంచయనాత్తేషామంగస్పర్శో విధీయతే ।
గోత్రకైస్తు క్రియాః సర్వాః కార్యాః సంచయనాత్పరమ్ ॥ 151 ॥

సగోత్రులు అస్థిసంచయనం తరువాత అంగస్పర్శను చేయవలెను. అట్లే తమ పనులన్నీ సంచయనం తర్వాత చేసుకొనవలెను.

స్పర్శ ఏవ సపిండానాం మృతాహని తథోభయోః ।
అన్వర్థమిచ్ఛయా శస్త్రరజ్జుబంధనవహ్నిషు ॥ 152 ॥

సపిండులైన వారికీ, కర్తలకు కూడా ఇద్దరికి మరణించిన రోజున స్పృశించినవారికీ, శస్త్ర, (కత్తిమున్నగునవి) రజ్జుబంధన (ఉరి) అగ్నిప్రమాదంలో మరణించిన వారికీ కూడా అంగస్పర్శ విధింపబడింది.

విషప్రతాపాదిమృతే ప్రాయానాశకయోరపి ।
బాలే దేశాంతరస్థే చ తథా ప్రవ్రజితే మృతే ॥ 153 ॥

సద్యః శౌచం మనుష్యాణాం త్ర్యహముక్తమశౌచకమ్ ।
సపిండానాం సపిండస్తు మృతేఽన్యస్మిన్మృతే యది ॥ 154 ॥

పూర్వశౌచం సమాఖ్యాతం కార్యాస్తత్ర దినక్రియాః ।
ఏష ఏవ విధిర్దృష్టో జన్మన్యపి హి సూతకే ॥ 155 ॥

విషంత్రాగి, కాలి, యుక్తవయస్సులో మరణించినా, బాల్యంలో మరణించినా, విదేశంలో నున్నవారు మరణించినా, సన్యాసులు మరణించినా కూడా అది తెలిసిన రోజునుండి మూడు రోజుల వరకు అశౌచ ముంటుంది. ఒక వేళ ఒకరు మరణించినపుడు మరొక సపిండుడు మరణించినట్లైతే పూర్వ శౌచాన్నే పాటించి వారికి చేయవలసిన నిత్య కర్మలను చేయవలెను. ఇట్లే ప్రసూతి విషయంలో కూడా సూతకమును పాటించవలెను.

సపిండానాం సపిండేషు యథా వత్సోదకేషు చ ।
పుత్రే జాతే పితుః స్నానం సచైలస్య విధీయతే ॥ 156 ॥

సపిండులైనవారు మరణించినా గాని, వారింట్లో ప్రసూతి అయిన గాని తండ్రి ఆ కట్టుకొన్న బట్టలతోనే నీటిలో స్నానం చేయవలెను.

తత్రాపి యది వాఽన్యస్మిన్ననుయాతస్తతః పరమ్
తత్రాపి శుద్ధిరుదితా పూర్వజన్మవతో దినైః ॥ 157 ॥

అక్కడ కూడా ఒక వేళ సపిండుల ఇండ్లలో ఎవరైనా పుట్టినా అక్కడ కూడా మొదలు పుట్టినవారి రోజునుండే పూర్వంవలె శుద్ధి చెప్పబడింది.

దశద్వాదశమాసార్ధమాససంఖ్యైర్దినైర్గతైః ।
స్వాః స్వాః కర్మక్రియాః కుర్యుః సర్వే వర్ణా యథావిధి ॥ 158 ॥

బ్రాహ్మణులు పది రోజులు, క్షత్రియులు పన్నెండు రోజులు వైశ్యులు పదిహేనురోజులు, శూద్రులు నెలరోజులు అశౌచమును పాటించి ఆ తరువాత వారి వారి వర్ణధర్మానుసారంగా యథావిధిగా తమ తమ కర్మక్రియలను చేసుకొనవలెను.

ప్రేతముద్దిశ్య కర్తవ్యమేకోద్దిష్టమతః పరమ్ ।
దానాని చైవ దేయాని బ్రాహ్మణేభ్యో మనీషిభిః ॥ 159 ॥

ఆ తరువాత ప్రేతనుద్దేశించి ఏకోద్దిష్టము నాచరించవలెను. బ్రాహ్మణులకు దానముల నీయవలెను.

యద్యదిష్టతమం లోకే యచ్చాస్య దయితం గృహే ।
తత్తద్గుణవతే దేయం తదేవాక్షయమిచ్ఛతా ॥ 160 ॥

మరణించినవారికి ఈ లోకంలో జీవించియున్నప్పుడు ఏవేవి ఇష్టమైనవో, అతనింట్లో అతనికిష్టమైన వేవియున్నవో వాటిని మరణించిన వారికి అక్షయమును గోరువారు గుణవంతులయిన వారికి దానమీయ వలెను.

పూర్ణైస్తు దివసైః స్పృష్ట్వా సలిలం వాహనాయుధైః ।
దత్తప్రేతోదపిండాశ్చ సర్వే వర్ణాః కృతక్రియాః ॥ 161

అన్ని వర్ణములవారు కర్మకాండ జరుపు దినములన్నింటిలోను వాహనములు, ఆయుధములు మున్నగునవి ప్రేతకు పిండోదకములను ఇచ్చే సమయంలో నీటిని స్పృశించి (నీరు వదిలి) దానమీయవలెను.

కుర్యుః సమగ్రాః శుచినః పరత్రేహ చ భూతయే ।
అధ్యేతవ్యా త్రయీ నిత్యం భవితవ్యం విపశ్చితా ॥162 ॥

ఇహలోక పరలోక ఐశ్వర్యంకొఱకు ఇవన్నీ శుచిగా సమగ్రంగా చేయవలెను. ఇంటిలో ప్రతినిత్యం వేదపండితునిచేత వేదపారాయణం చేయించవలెను.

ధర్మతో ధనమాహార్యం యష్టవ్యం చాపి యత్నతః ।
యేన ప్రకుపితో నాఽఽత్మా జుగుప్సామేతి భో ద్విజాః । 163 ॥

ఓ బ్రాహ్మణులారా! ధర్మబద్ధంగా ధనమును సంపాదించవలెను. దానితో ప్రయత్నపూర్వకంగా యజ్ఞయాగాదులను చేయవలెను. అలా చేయకపోతే ఆత్మ కోపించి జుగుప్సని వహిస్తుంది.

తత్కర్తవ్యమశంకేన యన్న గోప్యం మహాజనైః ।
ఏవమాచరతో విప్రాః పురుషస్య గృహే సతః ॥ 164 ॥

ప్రతి ఇంటిలోనూ మన పెద్దలు ఏది శంకించకుండా, రహస్యంగా దాచుకోకుండా మనకు బోధించారో, విశద పరచారో, వారు ఆచరించారో వాటిని మనం తప్పకుండా ఆచరించవలెను.

ధర్మార్థకామం సంప్రాప్య పరత్రేహ చ శోభనమ్ ।
ఇదం రహస్యమాయుష్యం ధన్యం బుద్ధివివర్ధనమ్ ॥ 165 ॥

ఇలా ధర్మార్థకామములను పొంది, ఇహపరలోకములందు శుభమును కలిగించే ఈ రహస్యం తెలుసుకున్న వారికి ఆయుష్షునూ, ధనమునూ, బుద్ధినీ పెంపొందిస్తుంది.

సర్వపాపహరం పుణ్యం శ్రీపుష్ట్యారోగ్యదం శివమ్ ।
యశః కీర్తిప్రదం నృణాం తేజోబలవివర్ధనమ్ ॥ 166 ॥

అంతేకాక సమస్త పాపములను పోగొడుతుంది. పుణ్యం కలిగిస్తుంది. శ్రీ, పుష్టి, ఆరోగ్యముల నిస్తుంది. శుభమైనటువంటిది. యశస్సునూ, కీర్తినీ ఇస్తుంది. తేజస్సును, బలమును, వృద్ధిపరుస్తుంది.

అనుష్ఠేయం సదా పుంభిః స్వర్గసాధనముత్తమమ్ ।
బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః శూద్రైశ్చ మునిసత్తమాః ॥ 167 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఇటువంటి స్వర్గసాధనమైన ఉత్తమమైన దానిని బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, సర్వవర్ణములవారు సర్వదా అనుష్ఠించవలెను.

జ్ఞాతవ్యం సుప్రయత్నేన సమ్యక్శ్రేయోఽభికాంక్షిభిః ।
జ్ఞాత్వైవ యః సదా కాలమనుష్ఠానం కరోతి వై ॥ 168 ॥

మంచి శ్రేయస్సును కోరుకునేవారు తమప్రయత్నంతో దీనిని చక్కగా తెలుసుకొనవలెను. ఇలా తెలుసుకొనుటే కాక సర్వదా దీనిని ఆచరించవలెను.

సర్వపాపవినిర్ముక్తః స్వర్గలోకే మహీయతే ।
సారాత్సారతరం చేదమాఖ్యాతం ద్విజసత్తమాః ॥ 169 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! అన్ని సారములకంటె ఉత్తమసారంగా చెప్పబడిన దీనిని తెలుసుకొని, ఆచరించే వారికి సమస్త పాపములూ తొలగి వారు స్వర్గలోకము నలంకరిస్తారు.

శ్రుతిస్మృత్యుదితం ధర్మం న దేయం యస్య కస్యచిత్ ।
న నాస్తికాయ దాతవ్యం న దుష్టమతయే ద్విజాః ॥ 170 ॥

ఇటువంటి శ్రుతి స్మృతులలో చెప్పబడిన ధర్మమును నాస్తికునకు గాని, దుష్టమతికి గాని, దాంభికునకు గాని, మూర్ఖునకు గాని, కుతర్కంతో వాదించే వానికి గాని బోధించకూడదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే 'సదాచార నిరూపణం' నామ త్రయోదశాధిక శతతమోఽధ్యాయః. ॥ 113 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని వ్యాస, ఋషిసంవాదంలో 'సదాచార నిరూపణం' అనే నూట పదమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్దశాధికశతతమోఽధ్యాయః – నూట పద్నాల్గవ అధ్యాయం

వర్ణాశ్రమధర్మవర్ణనమ్ – వర్ణాశ్రమ ధర్మములను వర్ణించడం

మునయ ఊచుః :– మునులు పలికిరి.

శ్రోతుమిచ్ఛామహే బ్రహ్మన్వర్ణధర్మాన్విశేషతః ।
చతురాశ్రమధర్మాంశ్చ ద్విజవర్య! బ్రవీహి తాన్ ॥ 1 ॥

స్వామీ! వర్ణధర్మములనుగూర్చి విశేషముగా తెలుసుకొనగోరుచున్నాము. కావున ఓ బ్రాహ్మణోత్తమా! మాకు ఆ చతురాశ్రమధర్మాలను గూర్చి వివరించండి.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ యథాక్రమమ్ ।
శృణుధ్వం సంయతా భూత్వా వర్ణధర్మాన్మయోదితాన్ ॥ 2 ॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల వర్ణాశ్రమ ధర్మములనుగూర్చి యథాక్రమముగా నేను చెప్పబోవుదానిని శ్రద్ధగా వినుడు.

దయాదానతపోదేవయజ్ఞస్వాధ్యాయతత్పరః ।
నిత్యోదకీ భవేద్విప్రః కుర్యాచ్చాగ్నిపరిగ్రహమ్ ॥ 3 ॥

బ్రాహ్మణుడు దయా, దానము, తపము, దేవయజ్ఞము, స్వాధ్యాయము, నిత్యతర్పణములు, శ్రద్ధగా అనుష్ఠించువాడై నిత్యాగ్నిహోత్రియై యుండవలయును.

వృత్త్యర్థం యాజయేత్త్వన్యాన్ద్విజా నధ్యాపయేత్తథా ।
కుర్యాత్ప్రతిగ్రహాదానం యజ్ఞార్థం జ్ఞానతో ద్విజాః ॥ 4 ॥

అదే విధముగా వృత్తికొఱకు, యజ్ఞములు చేయవలయును. ఇతర బ్రాహ్మణులకు వేదమును బోధించ వలయును. జ్ఞానము ననుసరించి యజ్ఞములకొఱకు దానముల నిచ్చుట దానములను తీసుకొనుట చేయవలయును.

సర్వలోకహితం కుర్యాన్నాహితం కస్యచిద్ద్విజాః ।
మైత్రీ సమస్తసత్త్వేషు బ్రాహ్మణస్యోత్తమం ధనమ్ । 5 ॥

బ్రాహ్మణులైనవారు సర్వలోకహితమునే చేయవలయునుగాని, ఎవరికీ అపకారమును చేయకూడదు. సమస్త ప్రాణులయందు మైత్రిని కలిగియుండుటయే బ్రాహ్మణునకు ఉత్తమమైన ధనము.

గవి రత్నే చ పారక్యే సమబుద్ధిర్భవేద్ద్విజాః ।
ఋతావభిగమః పత్న్యాం శస్యతే వాఽస్య భో ద్విజాః! ॥ 6 ॥

ఓ బ్రాహ్మణులారా! బ్రాహ్మణులైనవారు గోవులయందు, రత్నములయందు, పరలోక సంబంధ విషయముల యందు సమబుద్ధి కలిగి యుండవలయును. ఋతువునందభిగమము కలిగి ఋతుమతియైన భార్యను కూడుట అభినందించబడుచున్నది.

దానాని దద్యాదిచ్ఛాతో ద్విజేభ్యః క్షత్రియోఽపి హి ।
యజేచ్చ వివిధైర్యజ్ఞైరధీయాత చ భో ద్విజాః! ॥ 7 ॥

ఇక, క్షత్రియుడు కూడా ఇష్టముతో బ్రాహ్మణులకు దానముల నీయవలయును. అట్లే, వివిధములైన యజ్ఞములను చేయవలయును. బ్రాహ్మణులకు చదువు చెప్పించవలయును.

శస్త్రాజీవో మహీరక్షా ప్రవరా తస్య జీవికా ।
తస్యాపి ప్రథమే కల్పే పృథివీపరిపాలనమ్ ॥ 8 ॥

క్షత్రియుడైనవాడు శస్త్రాజీవియై భూమిని రక్షించుటే జీవితధ్యేయముగా శ్రేష్ఠుడై యుండవలయును. మొదటి కల్పమునందు క్షత్రియునకు భూపరిపాలనమే శ్రేష్ఠమైనది.

ధరిత్రీపాలనేనైవ కృతకృత్యా నరాధిపాః ।
భవంతి నృపతే రక్షా యతో యజ్ఞాదికర్మణామ్ ॥ 9 ॥

రాజులు భూమిని పాలించుటచేతనే కృతకృత్యులగుదురు. యజ్ఞయాగాది కర్మలను రక్షించుటచేతనే ధన్యులగుదురు.

దుష్టానాం శాసనాద్రాజా శిష్టానాం పరిపాలనాత్ ।
ప్రాప్నోత్యభిమతాంల్లోకాన్వర్ణసంస్థాపకో నృపః ॥ 10 ॥

రాజు దుష్టులను శిక్షించుటవలన, శిష్టులను రక్షించుటవలన తను కోరిన లోకములను పొందుతాడు. వర్ణాశ్రమ ధర్మములను కాపాడినవాడవుతాడు.

పాశుపాల్యం వణిజ్యాం చ కృషిం చ మునిసత్తమాః ।
వైశ్యాయ జీవికాం బ్రహ్మా దదౌ లోకపితామహః ॥ 11 ॥

ఓ మునిసత్తములారా! లోకపితామహుడైన బ్రహ్మ వైశ్యునకు జీవికగా పశుపోషణను, వ్యాపారమును వ్యవసాయము నిచ్చెను.

తస్యాప్యధ్యయనం యజ్ఞో దానం ధర్మశ్చ శస్యతే ।
నిత్యనైమిత్తికాదీనామనుష్ఠానం చ కర్మణామ్ ॥ 12 ॥

వైశ్యునకు కూడా వేదాధ్యయనము, యజ్ఞము, దానము, ధర్మము, నిత్యనైమిత్తికానుష్ఠానములు కూడా విధించబడుచున్నవి.

ద్విజాతిసంశ్రయం కర్మ తదర్థం తేన పోషణమ్ ।
క్రయవిక్రయజైర్వాఽపి ధనైః కారుభవైస్తు వా ॥13 ॥

బ్రాహ్మణుల నాశ్రయించి, వారికి కావలసిన పనులు చేయుచు, క్రయవిక్రయాదులచే వచ్చే ధనముతో శూద్రులు జీవించవలయును.

దానం దద్యాచ్చ శూద్రోఽపి పాకయజ్ఞైర్యజేత చ ।
పిత్ర్యాదికం చ వై సర్వం శూద్రః కుర్వీత తేన వై ॥ 14 ॥

శూద్రులు కూడా దానమును చేయవలయును. వంటలు చేయుటయే యజ్ఞముగా భావించవలయును. పితృకర్మలను ఆచరించవలయును.

భృత్యాదిభరణార్థాయ సర్వేషాం చ పరిగ్రహః ।
ఋతుకాలాభిగమనం స్వదారేషు ద్విజోత్తమాః ॥ 15 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! సేవకులు మున్నగువారి పోషణమునకై అన్నింటిని దానముగా తీసుకొనవలయును. అట్లే, ఋతుకాలమునందు మాత్రమే పత్నీసంగమమును చేయవలయును.

దయా సమస్తభూతేషు తితిక్షా నాభిమానితా ।
సత్యం శౌచమనాయాసో మంగళం ప్రియవాదితా ॥ 16 ॥

సమస్తజీవులయందు దయ, ఓర్పు, దురభిమానము లేకపోవుట, సత్యము, శౌచము, అనాయాసము, మంగళము, ప్రియవాదిత్వమును అందరూ పాటించవలయును.

మైత్రీ చైవాస్పృహా తద్వదకార్పణ్యం ద్విజోత్తమాః ।
అనసూయా చ సామాన్యా వర్ణానాం కథితా గుణాః ॥ 17 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! స్నేహము, అస్పృహ, దైన్యము లేకపోవుట (పిసినారి కాకపోవుట) అసూయ లేకపోవుట అనునవి అన్ని వర్ణములవారికి సామాన్య గుణములుగా చెప్పబడినవి.

ఆశ్రమాణాం చ సర్వేషామేతే సామాన్యలక్షణాః ।
గుణాస్తథోపధర్మాశ్చ విప్రాదీనామిమే ద్విజాః ॥ 18 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా అన్ని ఆశ్రమములవారికి అన్ని వర్ణములవారికి ఇవి చెప్పబడినవి. ఇక విప్రాదులకు గుణములను, ఉపధర్మములను వేరుగా చెప్పుచున్నాను.

క్షాత్రం కర్మ ద్విజస్యోక్తం వైశ్యకర్మ తథాఽఽపది ।
రాజన్యస్య చ వైశ్యోక్తం శూద్రకర్మాణి చైతయోః । 19 ॥

బ్రాహ్మణుడు తనకు ఆపదలేర్పడినప్పుడు క్షాత్రకర్మ, వైశ్యకర్మలు చేయవచ్చును. రాజు ఆపదలయందు వైశ్యకర్మ, శూద్రకర్మలు చేయవచ్చును.

అసామర్థ్యే సతి త్యాజ్యముభాభ్యామపి చ ద్విజాః ।
తదేవాఽఽపది కర్తవ్యం న కుర్యాత్కర్మసంకరమ్ ॥ 20 ॥

ఆపదలు వచ్చినపుడు మాత్రమే ఈ కర్మలను బ్రాహ్మణులు చేయవలయును. సామర్థ్యము లేనపుడు వాటిని వదిలిపెట్టవలయును. అంతేకాని కర్మసంకరమును చేయకూడదు.

ఇత్యేతే కథితా విప్రా వర్ణధర్మా మయాఽద్య వై ।
ధర్మమాశ్రమిణాం సమ్యగ్బ్రువతోఽపి నిబోధత ॥ 21 ॥

ఓ విప్రులారా! ఈ రోజు మీకు ఈ వర్ణధర్మాలనుగూర్చి వివరించినాను. ఆయా ఆశ్రమాలను నిర్వర్తించువారు ఈ ధర్మములనుగూర్చి చక్కగా తెలుసుకొనుడు.

బాలః కృతోపనయనో వేదాహరణతత్పరః ।
గురోర్గేహే వసన్విప్రా బ్రహ్మచారీ సమాహితః ॥ 22 ॥

ఉపనయన సంస్కారమును పొందిన బాలుడు, వేదాధ్యయనము చేయవలయునను కోరిక గలవాడు బ్రహ్మచారిగా గురువుగారింటిలో వినయమును కలవాడై నివసించవలయును.

శౌచాచారరతస్తత్ర కార్యం శుశ్రూషణం గురోః ।
వ్రతాని చరతా గ్రాహ్యో వేదశ్చ కృతబుద్ధినా ॥ 23 ॥

శౌచమునందు, ఆచారమునందు శ్రద్ధ కలవాడై, గురుకులంలో గురుశుశ్రూషను చేయవలెను. వ్రతములను ఆచరిస్తూ, కృతబుద్ధితో వేదమును గ్రహించవలయును.

ఉభే సంధ్యే రవిం విప్రాస్తథైవాగ్నిం సమాహితః ।
ఉపతిష్ఠేత్తథా కుర్యాద్గురోరప్యభివాదనమ్ ॥ 24 ॥

ప్రాతః సాయం సంధ్యలలో సంధ్యోపాసనతో సూర్యుని ఆరాధిస్తూ, అట్లే అగ్నికార్యము నాచరిస్తూ, గురువుగారికి కూడా అభివాదమును చేయవలయును.

స్థితే తిష్ఠేద్వ్రజేద్యాతి నీచైరాసీత చాఽఽసితే ।
శిష్యో గురౌ ద్విజశ్రేష్ఠాః ప్రతికూలం చ సంత్యజేత్ । 25 ॥

శిష్యుడు గురువుగారు నిలచినప్పుడు నిలచి, నడిచినప్పుడు నడిచి, కూర్చున్నపుడు దగ్గరగా కూర్చొనవలయును. గురువుయందు ప్రతికూలమైన దానిని వదిలి పెట్టవలయును.

తేనైవోక్తం పఠేద్వేదం నాన్యచిత్తః పురః స్థితః ।
అనుజ్ఞాతం చ భిక్షాన్నమశ్నీయాద్గురుణా తతః ॥ 26 ॥

అన్యచిత్తము లేకుండా గురువుగారి కెదురుగానుండి గురువుగారు చెప్పిన వేదమును మాత్రమే చదువవలయును. ఆ తరువాత గురువుగారి అనుజ్ఞతో భిక్షాన్నమును భుజించవలయును.

అవగాహేదపః పూర్వమాచార్యేణావగాహితాః ।
సమిజ్జలాదికం చాస్య కల్యకల్యముపానయేత్ ॥ 27 ॥

గురువుగారు స్నానము చేయకముందే శిష్యుడు స్నానము నాచరించవలయును. సమిధలు, నీరు మున్నగు వాటిని చతురతతో శుశ్రూషాతత్పరుడై సిద్ధము చేయవలయును.

గృహీతగ్రాహ్యవేదశ్చ తతోఽనుజ్ఞామవాప్య వై ।
గార్హస్థ్యమావసేత్ప్రాజ్ఞో నిష్పన్నగురునిష్కృతిః ॥ 28 ॥

గురువుగారి వద్దనుండి వేదాధ్యయనముద్వారా జ్ఞానమును పొంది, గురువుగారి అనుజ్ఞ తీసుకొని, గురుదక్షిణను సమర్పించి ఋణవిముక్తుడై, గృహస్థాశ్రమమును స్వీకరించవలయును.

విధినాఽవాప్తదారస్తు ధనం ప్రాప్య స్వకర్మణా ।
గృహస్థకార్యమఖిలం కుర్యాద్విప్రాః స్వశక్తితః ॥ 29 ॥

విధిపూర్వకముగా భార్యను పొందినవాడై తన కర్మలతో ధనమును సంపాదించి, తన శక్తిననుసరించి సమస్త గృహస్థ విధులను నిర్వర్తించవలయును.

నిర్వాపేణ పితౄనర్చ్య యజ్ఞైర్దేవాంస్తథాఽతిథీన్ ।
అన్నైర్మునీంశ్చ స్వాధ్యాయైరపత్యేన ప్రజాపతిమ్ ॥ 30 ॥

పిండప్రదానాలతో పితృదేవతలను, యజ్ఞములతో దేవతలను, భోజనాది సంతర్పణలతో అతిథులను, స్వాధ్యాయములతో మునులను, సంతానముతో ప్రజాపతిని అర్చించవలయును.

బలికర్మణా భూతాని వాక్సత్యేనాఖిలం జగత్ ।
ప్రాప్నోతి లోకాన్ పురుషో నిజకర్మసమార్జితాన్ ॥ 31 ॥

బలికర్మలతో సమస్త భూతములను, సత్యవాక్కుతో సమస్త జగత్తును సంభావించినట్లైతే ఆ పురుషుడు తన కర్మలచే ఆర్జించుకున్న ఉత్తమమైన లోకములను పొందగలడు.

భిక్షాభుజశ్చ యే కేచిత్పరివ్రాడ్బ్రహ్మచారిణః ।
తేఽప్యత్ర ప్రతితిష్ఠంతి గార్హస్థ్యం తేన వై పరమ్ ॥ 32 ॥

గృహస్థుడైనవాని వద్దకు భిక్షాటనమును చేసి జీవించే పరివ్రాజకులు, బ్రహ్మచారులు కూడా వస్తారు. దానితో ఆ గృహస్థుడు పరమానంద స్థానమును పొందగలడు.

వేదాహరణకార్యేణ తీర్థస్నానాయ చ ద్విజాః ।
అటంతి వసుధాం విప్రాః పృథివీదర్శనాయ చ ॥ 33 ॥

ఓ బ్రాహ్మణులారా! వేదాధ్యయనమును చేయవలయునను జిజ్ఞాసతో, పుణ్యతీర్థములలో స్నానమును చేయవలయునను సంకల్పముతో, క్షేత్రదర్శనాభిలాషతోనూ బ్రాహ్మణులు భూభాగము నంతటిని సంచరింతురు.

అనికేతా హ్యనాహారా యే తు సాయం గృహాస్తు తే ।
తేషాం గృహస్థః సతతం ప్రతిష్ఠా యోనిరుచ్యతే ॥ 34 ॥

అనికేతులు - అనగా - స్థిరమైన నివాసములు లేక ఊరూరా సంచరించువారు, ఉపవాసములతో ఆహారము లేక తిరిగేవారు సాయం సంధ్యాదుల నాచరించే వారెవరైనా అటువంటివారికి గృహస్థుడే ఎల్లప్పుడు సాదరమైన ఉత్తమమైన స్థానము.

తేషాం స్వాగతదానాని వక్తవ్యం మధురం సదా ।
గృహాగతానాం దద్యాచ్చ శయనాసనభోజనమ్ ॥ 35 ॥

అట్లు వచ్చినటువంటివారికి మధురవాక్కులతో స్వాగతమును పలికి, తన ఇంటికి వచ్చినవారికి కూర్చునుటకు ఆసనమును, తినుటకు భోజనమును, నిద్రించుటకు పడకను గృహస్థుడు సమకూర్చవలయును.

అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతినివర్తతే ।
స దత్వా దుష్కృతం తస్మై పుణ్యమాదాయ గచ్ఛతి ॥ 36 ॥

ఇంటికి వచ్చిన అతిథి తన కోరిక తీరకుండా ఆ యింటినుండి వెళ్ళినట్లయితే అతడు ఆ ఇంటి యజమానికి తన పాపమును ఇచ్చి, యజమాని పుణ్యమును తీసుకొని వెళ్లగలడు.

అవజ్ఞానమహంకారో దంభశ్చాపి గృహే సతః ।
పరివాదోపఘాతౌ చ పారుష్యం చ న శస్యతే ॥ 37 ॥

తన యింటిలో సత్పురుషులను అవహేళనము చేయుట, అహంకారమును ప్రదర్శించుట, దంభమును చూపుట, నిందించుట, కొట్టుట, తిరస్కరించుట, పరుషంగా మాట్లాడుట మున్నగునవి ప్రశంసించబడవు.

యశ్చ సమ్యక్కరోత్యేవం గృహస్థః పరమం విధిమ్ ।
సర్వబంధవినిర్ముక్తో లోకానాప్నోతి చోత్తమాన్ ॥ 38 ॥

ఈ విధంగా గృహస్థుడు తన విధిని చక్కగా నిర్వర్తించినచో సమస్త బంధనములనుండి విముక్తుడై ఉత్తమమైన లోకములను పొందగలడు.

వయఃపరిణతౌ విప్రాః కృతకృత్యో గృహాశ్రమే ।
పుత్రేషు భార్యాం నిక్షిప్య వనం గచ్ఛేత్సహైవ వా ॥ 39 ॥

వయస్సు పండిన తరువాత గృహస్థాశ్రమము నందున్నవాడు కృతకృత్యుడై తన, పుత్రులకు భార్య నప్పగించి వానప్రస్థాశ్రమమును స్వీకరించవలయును. లేదా, భార్యతో కూడా వనమునకు వెళ్ళవచ్చును.

పర్ణమూలఫలాహారః కేశశ్మశ్రుజటాధరః ।
భూమిశాయీ భవేత్తత్ర మునిః సర్వాతిథిః ద్విజాః ॥ 40 ॥

అరణ్యంలో గడ్డము మీసములు జడలను ధరించి, ఆకులను, కందమూల ఫలములను ఆహారముగా స్వీకరిస్తూ, భూశయనం చేస్తూ, అందరికీ ఆతిథ్యమిస్తూ, మునిగా జీవించవలయును.

చర్మకాశకుశైః కుర్యాత్పరిధానోత్తరీయకే ।
తద్వత్త్రిషవణం స్నానం శస్తమస్య ద్విజోత్తమాః ॥ 41 ॥

ఓ బ్రాహ్మణులారా! చర్మముతో చేసిన, లేదా గడ్డిదర్భలతో చేసిన వస్త్రములను ధరించి, త్రిశ్రవణము, త్రికాల స్నానమును చేస్తూ జీవించవలయునని శాస్త్రము బోధించుచున్నది.

దేవతాభ్యర్చనం హోమః సర్వాభ్యాగతపూజనమ్ ।
భిక్షాబలిప్రదానం తు శస్తమస్య ప్రశస్యతే ॥ 42 ॥

దేవతల నర్చించుట, హోమమును చేయుట, వచ్చినటువంటి అభ్యాగతులందరిని పూజించుట, భిక్ష నొసంగుట, బలిప్రదానము చేయుట ఇవన్నియు ఇతనికి విధించబడినవి. అవే ఆచరించవలసి యున్నవి.

వన్యస్నేహేన గాత్రాణామభ్యంగశ్చాపి శస్యతే ।
తపస్యా తస్య విప్రేంద్రాః శీతోష్ణాదిసహిష్ణుతా ॥ 43 ॥

అడవిలో దొరికే నీటితోనే శరీరావయవములకు అభ్యంగ స్నానమును చేస్తూ, తపస్సు, శీతోష్ణములను సహించుట విధింపబడినవి.

యస్త్వేతా నియతశ్చర్యా వానప్రస్థశ్చరేన్మునిః ।
స దహత్యగ్నివద్దోషాన్ జయేల్లోకాంశ్చ శాశ్వతాన్ ॥ 44 ॥

ఈ విధముగా నియతముగా వీటిని ఆచరిస్తూ మునిగా వానప్రస్థాశ్రమమును గడిపినచో అతడు చేసిన దోషములన్నియు అగ్ని దహించినట్లు దహించుటయే కాక శాశ్వతమైన లోకములను జయించగలడు.

చతుర్థశ్చాశ్రమో భిక్షోః ప్రోచ్యతే యో మనీషిభిః ।
తస్య స్వరూపం గదతో బుధ్యధ్వం మమ సత్తమాః ॥ 45 ॥

ఓ శ్రేష్ఠులారా! ఇక నాల్గవ ఆశ్రమము భిక్షుకునిదిగా పెద్దలు ఏదైతే చెప్పినారో దాని స్వరూపమునుగూర్చి చెప్పబోవుచున్నాను. దానిని శ్రద్ధగా తెలుసుకొనుడు.

పుత్రద్రవ్యకలత్రేషు త్యజేత్స్నేహం ద్విజోత్తమాః ।
చతుర్థమాశ్రమస్థానం గచ్ఛేన్నిర్ధూతమత్సరః ॥ 46 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! పుత్రులయందు, ద్రవ్యమునందు, భార్యయందు స్నేహమును వదలి, మాత్సర్యమును వదలినవాడై చతుర్థాశ్రమస్థానమైన సన్న్యాసమును పొందవలయును.

త్రైవర్ణికాంస్త్యజేత్సర్వానారంభాన్ద్విజసత్తమాః ।
మిత్రాదిషు సమో మైత్రః సమస్తేష్వేవ జంతుషు ॥ 47 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే త్రివర్ణముల వారాచరించు కర్మల నన్నింటిని వదిలి పెట్టవలయును. మిత్రాదులయందెంత స్నేహముగానుండునో అట్లే సమస్తజీవులయందు సమానమైన స్నేహము గలవాడై యుండవలయును.

జరాయుజాండజాదీనాం వాఙ్మనఃకర్మభిః క్వచిత్ ।
యుక్తః కుర్వీత న ద్రోహం సర్వసంగాంశ్చ వర్జయేత్ ॥ 48 ॥

మానవులకు, జంతువులకు, పక్ష్యాదులకు మనోవాక్కాయకర్మలతో ద్రోహము చేయకూడదు. అన్ని బంధములను వదలవలయును.

ఏకరాత్రస్థితిర్గ్రామే పంచరాత్రస్థితిః పురే ।
తథా ప్రీతిర్న తిర్యక్షు ద్వేషో వా నాస్య జాయతే ॥ 49 ॥

గ్రామమునందొక రాత్రి, పురమునందు ఐదు రాత్రులు నివసిస్తూ పశుపక్ష్యాదులయందు ప్రీతి కాని, ద్వేషము కాని లేకుండా ఉన్నట్లయితే అతనికి దోషమంటదు.

ప్రాణయాత్రానిమిత్తం చ వ్యంగారేఽభుక్తవజ్జనే ।
కాలే ప్రశస్తవర్ణానాం భిక్షార్థీ పర్యటేద్గృహాన్ ॥ 50 ॥

ఇక ప్రాణము నిల్పుకొనుటకై భిక్షకొఱకు వెళ్లునపుడు అగ్నిహోత్రము నాచరించి, ప్రశస్తములైన వారిండ్లకు వారు భోజనమును చేయుటకంటే ముందే భిక్షకై వెళ్లవలయును.

అలాభే న విషాదీ స్యాల్లాభేనైవ చ హర్షయేత్ ।
ప్రాణయాత్రికమాత్రః స్యాన్మాత్రాసంగాద్వినిర్గతః ॥ 51 ॥

దొరకనప్పుడు దుఃఖపడకూడదు. దొరికినప్పుడు సంతోషించకూడదు. తన కాపూట కెంత కావలయునో అంతే సంపాదించుకొన వలయును. అంతకంటె ఎక్కువైనదానిని వదిలి వేయవలయును.

అతిపూజితలాభాంస్తు జుగుప్సంశ్చైవ సర్వతః ।
అతిపూజితలాభైస్తు యతిర్ముక్తోఽపి బధ్యతే ॥ 52 ॥

మిక్కిలి లాభమును కాని, పూజింపబడుటను కాని సర్వదా వదిలి పెట్టవలయును. యతియైనవాడు మిక్కిలి పూజాలాభములచే ముక్తుడైనను బంధింపబడుచున్నాడు.

కామః క్రోధస్తథా దర్పో లోభమోహాదయశ్చ యే ।
తాంస్తు దోషాన్పరిత్యజ్య పరివ్రాణ్నిర్మమో భవేత్ ॥ 53 ॥

కామము, క్రోధము, దర్పము, లోభము, మోహము మున్నగు దోషములను సన్న్యాసి అయినవాడు వదిలిపెట్టి నవాడై, నాది అనేది ఏదీ లేని వాడుగా నుండవలయును.

అభయం సర్వసత్త్వేభ్యో దత్త్వా యశ్చరతే మహీమ్ ।
తస్య దేహాద్విముక్తస్య భయం నోత్పద్యతే క్వచిత్ ॥ 54 ॥

సమస్తజీవులకు అభయమునిస్తూ ఎవడైతే ఈ భూమియందు సంచరిస్తాడో అటువంటివాడు దేహవిముక్తుడైనా ఎటువంటి భయము కలుగదు.

కృత్వాఽగ్నిహోత్రం స్వశరీరసంస్థం శరీరమగ్నిం స్వముఖే జుహోతి ।
విప్రస్తు భిక్షోపగతైర్హవిర్భిశ్చితాగ్నినా స వ్రజతి స్మ లోకాన్ ॥ 55 ॥

ఎవరైతే తన శరీరమునందున్న శారీరిక అగ్నిహోత్రమును రగిల్చి, భిక్షగా స్వీకరించిన హవిస్సులతో తన ముఖమునందున్న అగ్నిహోత్రమును వ్రేల్చునో అటువంటి విప్రుడు ఆ అగ్నితోనే ఉత్తమలోకములను పొందగలడు.

మోక్షాశ్రమం యశ్చరతే యథోక్తం శుచిశ్చ సంకల్పితబుద్ధియుక్తః ।
అనింధనం జ్యోతిరివ ప్రశాంతం స బ్రహ్మలోకం వ్రజతి ద్విజాతిః ॥ 56 ॥

ఎవడు మోక్షాశ్రమమైన సన్న్యాసాశ్రమమునందు ఈ చెప్పబడిన విధముగా శుచియై, సంకల్పబుద్ధి కలిగి ప్రవర్తించునో, అటువంటి బ్రాహ్మణుడు ఇంధనము లేకుండానే ప్రకాశించే జ్యోతివలె ప్రశాంతమైన బ్రహ్మలోకమును చేరగలడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే వర్ణాశ్రమధర్మవర్ణనం నామ చతుర్దశాధికశతతమోఽధ్యాయః. ॥ 114 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని వ్యాస-ఋషి సంవాదమునందలి వర్ణాశ్రమధర్మములను వర్ణించడమనే నూట పదునాల్గవ అధ్యాయము సంపూర్ణం.

పంచదశాధికశతతమోఽధ్యాయః - నూట పదునైదవ అధ్యాయం
సంకరజాతిలక్షణవర్ణనమ్ - సంకరజాతి లక్షణములను వర్ణించడం

మునయ ఊచు :- మునులు పలికిరి.

సర్వజ్ఞస్త్వం మహాభాగ! సర్వభూతహితే రతః ।
భూతం భవ్యం భవిష్యం చ నతేఽస్త్యవిదితం మునే ॥ 1 ॥

ఓ మునీ! ఓ మహానుభావా! నీవు సర్వజ్ఞుడవు, సమస్తభూతముల హితమును కోరేవాడవు. భూత భవిష్యద్వర్తమానములలో నీకు తెలియనిది లేదు.

కర్మణా కేన వర్ణానామధమా జాయతే గతిః ।
ఉత్తమా చ భవేత్కేన బ్రూహి తేషాం మహామతే! ।2 ॥

ఓ మహామతీ! ఏ కర్మతో అన్ని వర్ణములవారికి అధమగతి కలుగగలదో, ఏ కర్మచేత వారికి ఉత్తమగతి కలుగగలదో దానినిగూర్చి చెప్పండి.

శూద్రస్తు కర్మణా కేన బ్రాహ్మణత్వం చ గచ్ఛతి ।
శ్రోతుమిచ్ఛామహే కేన బ్రాహ్మణః శూద్రతామియాత్ ॥ 3 ॥

ఏ కర్మచేత శూద్రుడు బ్రాహ్మణత్వమును పొందగలడో, ఏ కర్మచేత బ్రాహ్మణుడు శూద్రత్వమును పొందగలడో మేము వినగోరుచున్నాము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

హిమవచ్ఛిఖరే రమ్యే నానాధాతువిభూషితే ।
నానాద్రుమలతాకీర్ణే నానాశ్చర్యసమన్వితే ॥ 4 ॥

తత్ర స్థితం మహాదేవం త్రిపురఘ్నం త్రిలోచనమ్ ।
శైలరాజసుతా దేవీ ప్రణిపత్య సురేశ్వరమ్ ॥ 5 ॥

ఇమం ప్రశ్నం పురా విప్రా అపృచ్ఛచ్చారులోచనా ।
తదహం సంప్రవక్ష్యామి శృణుధ్వం మునిసత్తమాః ॥ 6 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! అనేక ధాతువులతో అలంకరించబడిన, అనేక వృక్షలతాదులతో నిండిన, అనేకాశ్చర్యములతో కూడియున్న సుందరమైన హిమాలయ శిఖరమునందు త్రిపురాసుర సంహారమును చేసిన, ముక్కంటియైన మహాదేవుని చూచి, ఆ సురేశ్వరునికి నమస్కరించి శైలరాజపుత్రికయైన దేవి సుందరమైన నేత్రముల గల పార్వతి శివుని పూర్వమడిగిన ఆ ప్రశ్నను గూర్చి చెప్పబోవుచున్నాను వినండి.

ఉమోవాచ :- ఉమ పలికింది.

భగవన్! భగనేత్రఘ్న! పూష్ణో దంతవినాశన! ।
దక్షక్రతుహర! త్ర్యక్ష! సంశయో మే మహానయమ్ ॥ 7 ॥

స్వామీ! భగనేత్రమును నశింపచేసినవాడా! వీరభద్రావతారములో సూర్యుని దంతములను నశింపచేసిన వాడా! దక్షయజ్ఞమును హరించినవాడా! త్రినేత్రా!నాకొక గొప్ప సంశయము కలదు అదేమనగా

చాతుర్వర్ణ్యం భగవతా పూర్వం సృష్టం స్వయంభువా ।
కేన కర్మవిపాకేన వైశ్యో గచ్ఛతి శూద్రతామ్ ॥ 8 ॥

పూజ్యుడైన స్వయంభువునిచేత పూర్వము నాలుగు వర్ణములు సృష్టించబడినవి. ఏ కర్మ పరిపక్వత పొందుటచేత వైశ్యుడు శూద్రత్వమును పొందగలడు?

వైశ్యో వా క్షత్రియః కేన ద్విజో వా క్షత్రియో భవేత్ ।
ప్రతిలోమే కథం దేవ! శక్యో ధర్మో నివర్తితుమ్ ॥ 9 ॥

క్షత్రియుడేకర్మచేత వైశ్యత్వమును పొందగలడు? బ్రాహ్మణుడు ఏ కర్మచేత క్షత్రియత్వమును పొందగలడు? ప్రతిలోమవిధానమునందు ధర్మమునెట్లు నిర్వర్తించుటకు శక్యమగును?

కేన వా కర్మణా విప్రః శూద్రయోనౌ ప్రజాయతే ।
క్షత్రియః శూద్రతామేతి కేన వా కర్మణా విభో! ॥ 10 ॥

ఓ ప్రభూ! ఏకర్మను చేయుటవల్ల బ్రాహ్మణుడు శూద్రజాతియందు పుట్టగలడు? ఏ కర్మనాచరించుటచేత క్షత్రియుడు శూద్రజాతివాడగును?

ఏతం మే సంశయం దేవ! వద భూతపతే! తథా ।
త్రయో వర్ణాః ప్రకృత్యేహ కథం బ్రాహ్మణ్యమాప్నుయుః ॥ 11 ॥

ఓ భూతపతీ! దేవా! ప్రకృతిసంబంధము గల క్షత్రియ వైశ్య శూద్రులు అనే మూడు వర్ణములవారు బ్రాహ్మణత్వమునెట్లు పొందగలరు? అని నా సంశయము. కావున దీనినిగూర్చి వివరించండి.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

బ్రాహ్మణ్యం దేవి! దుష్ప్రాపం నిసర్గాద్బ్రాహ్మణాః శుభాః ।
క్షత్రియా వైశ్యశూద్రా వా నిసర్గాదితి మే మతిః ॥ 12 ॥

దేవీ! ప్రకృతివలన బ్రాహ్మణ్యమును పొందుట చాలా కష్టము. ప్రకృతిననుసరించి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అందరూ మంచివారనే నా అభిప్రాయము.

కర్మణా దుష్కృతేనేహ స్థానాద్భ్రంశ్యతి వై ద్విజాః ।
శ్రేష్ఠం వర్ణమనుప్రాప్య తస్మాదాక్షిప్యతే పునః ॥ 13 ॥

తమ తమ దుష్కృతకర్మలచేతనే బ్రాహ్మణులు స్థానభ్రంశమును పొందుచున్నారు. శ్రేష్ఠమైన వర్ణమును పొందికూడా దానినుండి తొలగించబడుచున్నాడు.

స్థితో బ్రాహ్మణధర్మేణ బ్రాహ్మణ్యముపజీవతి ।
క్షత్రియో వాఽథ వైశ్యో వా బ్రహ్మభూయం స గచ్ఛతి ॥ 14 ॥

బ్రాహ్మణధర్మము ననుసరించి యున్నపుడే బ్రాహ్మణ్యము జీవించగలదు. క్షత్రియుడు కాని, వైశ్యుడు కాని బ్రహ్మణ్యాన్ని పొందగలడు.

యశ్చ విప్రత్వముత్సృజ్య క్షాత్రధర్మం నిషేవతే ।
బ్రాహ్మణ్యాత్స పరిభ్రష్టః క్షత్రయోనౌ ప్రజాయతే ॥ 15 ॥

ఎవడైతే తన బ్రాహ్మణధర్మమును వదిలిపెట్టి క్షత్రియ ధర్మమునాచరిస్తాడో అటువంటివాడు బ్రాహ్మణ్యమునుండి భ్రష్టుడై క్షత్రియజాతియందు పుట్టును.

వైశ్యకర్మ చ యో విప్రో లోభమోహవ్యపాశ్రయః ।
బ్రాహ్మణ్యం దుర్లభం ప్రాప్య కరోత్యల్పమతిః సదా ॥ 16 ॥

స ద్విజో వైశ్యతామేతి వైశ్యో వా శూద్రతామియాత్ ।
స్వధర్మాత్ప్రచ్యుతో విప్రస్తతః శూద్రత్వమాప్నుయాత్ ॥ 17 ॥

ఏ బ్రాహ్మణుడైతే దుర్లభమైన బ్రాహ్మణ్యమును పొందికూడా లోభమోహములు కలవాడై, అల్పమతియై, వైశ్యకర్మల నాచరించునో అటువంటి బ్రాహ్మణుడు వైశ్యజన్మను పొందును. ఒక వేళ వైశ్యుడట్లాచరించినచో శూద్రత్వమును పొందును. తన ధర్మమునుండి చ్యుతుడైన బ్రాహ్మణుడు తరువాత శూద్రత్వమును పొందును.

తత్రాసౌ నిరయం ప్రాప్తో వర్ణభ్రష్టో బహిష్కృతః ।
బ్రహ్మలోకాత్పరిభ్రష్టః శూద్రయోనౌ ప్రజాయతే ॥ 18 ॥

అటువంటివాడు ధ్వంసమును పొంది, వర్ణభ్రష్టుడై, బహిష్కరించబడును. అంతేకాక బ్రహ్మలోకమునుండి భ్రష్టుడై శూద్రజాతియందు పుట్టును.

క్షత్రియో వా మహాభాగే! వైశ్యో వా ధర్మచారిణి! ।
స్వాని కర్మాణ్యపాకృత్య శూద్రకర్మ నిషేవతే ॥ 19 ॥

స్వస్థానాత్సపరిభ్రష్టో వర్ణసంకరతాం గతః ।
బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః శూద్రత్వం చ నిషేవతే ॥ 20 ॥

మహానుభావురాలా! ధర్మచారిణీ! క్షత్రియుడు గాని, వైశ్యుడుగాని తన ధర్మములను వదిలి పెట్టి శూద్రకర్మలను ఆచరిస్తే, అతడు తన స్థానమునుండి భ్రష్టుడై, వర్ణసంకరమును పొంది బ్రాహ్మణుడు, క్షత్రియుడు మరియు వైశ్యుడు శూద్రత్వమును పొందును.

యస్తు శూద్రః స్వధర్మేణ జ్ఞానవిజ్ఞానవాంచ్ఛుచిః ।
ధర్మజ్ఞో ధర్మనిరతః స ధర్మఫలమశ్నుతే ॥ 21 ॥

ఏ శూద్రుడైతే తన ధర్మమునాచరించి జ్ఞానవిజ్ఞానవంతుడై శుచిగానుండునో, ధర్మజ్ఞుడై, ధర్మనిరతుడై యుండునో అట్టివాడు ఆ ధర్మఫలము ననుభవించును.

ఇదం చైవాపరం దేవి! బ్రహ్మణా సముదాహృతమ్ ।
అధ్యాత్మం నైష్ఠికీ సిద్ధిర్ధర్మకామైర్నిషేవ్యతే ॥ 22 ॥

దేవీ! ఇంకొక విషయమును కూడా బ్రహ్మ తెలిపాడు. నైష్ఠికమైన సిద్ధి ధర్మకామములతో పొందబడుచున్నది.

ఉగ్రాన్నం గర్హితం దేవి! గణాన్నం శ్రాద్ధసూతకమ్ ।
ఘుష్టాన్నం నైవ భోక్తవ్యం శూద్రాన్నం నైవ వా క్వచిత్ ॥ 23 ॥

ఓ దేవీ! ఉగ్రాన్నమును, గర్హితమైన శ్రాద్ధసూతక గణాన్నమును ఘుష్టాన్నమును తినకూడదు. అంతేకాక, శూద్రాన్నము నెప్పుడూ తినకూడదు.

శూద్రాన్నం గర్హితం దేవి సదా దేవైర్మహాత్మభిః ।
పితామహముఖోత్సృష్టం ప్రమాణమితి మే మతిః । 24 ॥

ఓ దేవీ! శూద్రాన్నము దేవతలచేత, మహాత్ములచేత సర్వదా గర్హించబడినది. ఇది పితామహుని ముఖారవిందమునుండి స్వయముగా చెప్పబడిన ప్రమాణమని నా అభిప్రాయము.

శూద్రాన్నేనావశేషేణ జఠరే మ్రియతే ద్విజః ।
ఆహితాగ్నిస్తథా యజ్వా స శూద్రగతిభాగ్భవేత్ ॥ 25 ॥

శూద్రాన్నము కడుపులో మిగిలి యుండగా మరణించిన బ్రాహ్మణుడు అతడు ఆహితాగ్ని అయినా, అదేవిధముగా యజ్ఞములు చేసేవాడయినా, అతడు శూద్రగతిని పొందును.

తేన శూద్రాన్నశేషేణ బ్రహ్మస్థానాదపాకృతః ।
బ్రాహ్మణః శూద్రతామేతి నాస్తి తత్ర విచారణా ॥ 26 ॥

ఆ శూద్రాన్నశేషముతో బ్రహ్మస్థానమునుండి చ్యుతుడై బ్రాహ్మణుడు శూద్రత్వమును పొందగలడు. దాని విషయంలో ఏ విచారణ అవసరం లేదు.

యస్యాన్నేనావశేషేణ జఠరే మ్రియతే ద్విజః ।
తస్య యోనిం వ్రజేద్విప్రో యస్యాన్నముపజీవతి ॥ 27 ॥

ఏ బ్రాహ్మణుడు ఎవని అన్నశేషము కడుపులోనుండగా మరణించునో, ఆ బ్రాహ్మణుడు వానియొక్క జాతియందు పుట్టి వాని యన్నమునే తిని జీవించును.

బ్రాహ్మణత్వం సుఖం ప్రాప్య దుర్లభం యోఽవమన్యతే ।
అభోజ్యాన్నాని యోఽశ్నాతి స ద్విజత్వాత్పతేత వై ॥ 28 ॥

ఎవడైతే దుర్లభమైన బ్రాహ్మణత్వమును సుఖముగా పొంది దానిని అవమానించునో, అభోజ్యములైన అన్నములను తినునో, అతడు ద్విజత్వమునుండి పతితుడగును.

సురాపో బ్రహ్మహా స్తేయీ చోరో భగ్నవ్రతోఽశుచిః ।
స్వాధ్యాయవర్జితః పాపో లుబ్ధో నైకృతికః శఠః ॥ 29 ॥

అవ్రతీ వృషలీభర్తా కుండాశీ సోమవిక్రయీ ।
విహీనసేవీ విప్రో హి పతతే బ్రహ్మయోనితః ॥ 30 ॥

సురాపానమును చేయువాడు, బ్రాహ్మణులను చంపువాడు, స్తేయము నాచరించువాడు, చోరవృత్తిలో నున్నవాడు, వ్రతభంగమైనవాడు, అశుచిగానుండువాడు, స్వాధ్యాయమును వదిలిపెట్టినవాడు, పాపి, లుబ్ధుడు, శఠుడు, నిష్కృతి లేనివాడు. వ్రతము నాచరించనివాడు, శూద్రస్త్రీ భర్త, జారపుత్రునితో భుజించేవాడు, సోమమునమ్ముకునేవాడు, హీనులను సేవించేవాడు అయిన బ్రాహ్మణుడు బ్రాహ్మణత్వమునుండి పతితుడగును.

గురుతల్పీ గురుద్వేషీ గురుకుత్సారతిశ్చ యః ।
బ్రహ్మద్విట్ వాఽపి పతతి బ్రాహ్మణో బ్రహ్మయోనితః ॥ 31 ॥

గురువుగారి భార్యతో రమించువాడు, గురువును ద్వేషించువాడు, గురువున కపకారమును చేయువాడు, బ్రహ్మత్వమును ద్వేషించువాడు అయిన బ్రాహ్మణుడు బ్రహ్మత్వమునుండి పతితుడగును.

ఏభిస్తు కర్మభిర్దేవి! శుభైరాచరితైస్తథా ।
శూద్రో బ్రాహ్మణతాం గచ్ఛేద్వైశ్యః క్షత్రియతాం వ్రజేత్ ॥ 32 ॥

అదేవిధముగా, ఈ క్రింద చెప్పబోవు శుభకర్మల నాచరించుటచేత శూద్రుడు బ్రాహ్మణత్వమును పొందగలడు. వైశ్యుడు క్షత్రియత్వమును పొందగలడు.

శూద్రః కర్మాణి సర్వాణి యథాన్యాయం యథావిధి ।
సర్వాతిథ్యముపాతిష్ఠన్ శేషాన్నకృతభోజనః ॥ 33 ॥

శూద్రుడు యథావిధిగా, యథాన్యాయముగా సమస్త కర్మల నాచరించినవాడు, అందరికీ ఆతిథ్యమిచ్చి శేషాన్నమును భుజించినవాడు,

శుశ్రూషాం పరిచర్యాం యో జ్యేష్ఠవర్ణే ప్రయత్నతః ।
కుర్యాదవిమనాః శ్రేష్ఠః సతతం సత్పథే స్థితః ॥ 34 ॥

తాను ప్రయత్నించి శ్రేష్ఠమైన వర్ణములవారికి శుశ్రూషను, అవమానమని భావించక, పరిచర్యను చేస్తూ ఎప్పుడూ సన్మార్గంలో ఉన్నటువంటి శ్రేష్ఠుడు.

దేవద్విజాతిసత్కర్తా సర్వాతిథ్యకృతవ్రతః ।
ఋతుకాలాభిగామీ చ నియతో నియతాశనః । 35 ॥

దేవతలను, బ్రాహ్మణులను సత్కరిస్తూ, అందరికీ ఆతిథ్యమునివ్వాలనే సద్వ్రతము నాచరించువాడు, ఋతు కాలమునందు భార్యతో మాత్రమే సంగమించువాడు, నియమముగానుంటూ, నియమప్రకారం భోజనమును చేసేవాడు,

దక్షః శిష్టజనాన్వేషీ శేషాన్నకృతభోజనః ।
వృథామాంసం న భుంజీత శూద్రో వైశ్యత్వమృచ్ఛతి ॥ 36 ॥

సమర్థుడై, శిష్టులనుగూర్చి అన్వేషించువాడై, శేషాన్నమును మాత్రమే భుజించువాడై, వృథాగా మాంసమును తిననివాడైయుండునో అటువంటి శూద్రుడు వైశ్యత్వమును పొందగలడు.

ఋతవాగనహంవాదీ నిర్ద్వంద్వః సామకోవిదః ।
యజతే నిత్యయజ్ఞైశ్చ స్వాధ్యాయపరమః శుచిః ॥ 37 ॥

సత్యమును మాట్లాడువాడు, అహంకారరహితుడు, ద్వంద్వభావము లేనివాడు, సామవేదమునందు పండితుడు, నిత్యము యజ్ఞములతో నారాధించువాడు, స్వాధ్యాయము నాచరించువాడు, శుచియైనవాడు.

దాంతో బ్రాహ్మణసత్కర్తా సర్వవర్ణానసూయకః ।
గృహస్థవ్రతమాతిష్ఠన్ ద్వికాలకృతభోజనః ॥ 38 ॥

దాంతుడు, బ్రాహ్మణులను సత్కరించువాడు, అన్ని వర్ణములయందును అసూయ లేనివాడు, గృహస్థవ్రతమును ఆచరిస్తూ రెండు పూటలయందు మాత్రమే భుజించువాడు.

శేషాశీ విజితాహారో నిష్కామో నిరహంవదః ।
అగ్నిహోత్రముపాసీనో జుహ్వానశ్చ యథావిధి ॥ 39 ॥

అందరికి పెట్టగా మిగిలిన అన్నమును మాత్రమే భుజించువాడు, ఆహారపు రుచులను జయించినవాడు, కోరికలు లేనివాడు, నేనను అహంకారమును చూపనివాడు, అగ్నిహోత్రము నుపాసించువాడు, యథావిధిగా యజ్ఞములు చేయువాడు,

సర్వాతిథ్యముపాతిష్ఠన్ శేషాన్నకృతభోజనః ।
త్రేతాగ్నిమాత్రవిహితం వైశ్యో భవతి చ ద్విజః ॥ 40 ॥

అందరికీ ఆతిథ్యమొసగి తాను భుజించువాడు, విహితమైన త్రేతాగ్నులను వ్రేల్చువాడైన వైశ్యుడు బ్రాహ్మణునిగా పుట్టును.

స వైశ్యః క్షత్రియకులే శుచిమర్హతి జాయతే ।
స వైశ్యః క్షత్రియో జాతో జన్మప్రభృతి సంస్కృతః ॥ 41 ॥

శుచిగానున్న వైశ్యుడు గొప్పనైన క్షత్రియకులంలో పుట్టును. అటువంటివాడు తాను పుట్టినప్పటినుండి సంస్కారవంతుడై క్షత్రియునిగానుండును.

ఉపనీతో వ్రతపరో ద్విజో భవతి సంస్కృతః ।
దదాతి యజతే యజ్ఞైః సమృద్ధైరాప్తదక్షిణైః ॥ 42 ॥

అతడే ఉపనీతుడై వ్రతమునాచరించి సంస్కారవంతుడై బ్రాహ్మణునిగా జన్మిస్తాడు. తాను సంపాదించిన ధనముతో యజ్ఞములనాచరించి సమృద్ధిగా దక్షిణలనిస్తాడు.

అధీత్య స్వర్గమన్విచ్ఛం స్త్రేతాగ్నిశరణః సదా ।
ఆర్ద్రహస్తప్రదో నిత్యం ప్రజా ధర్మేణ పాలయన్ ॥ 43 ॥

సత్యః సత్యాని కురుతే నిత్యం యః శుద్ధిదర్శనః ।
ధర్మదండేన నిర్దగ్ధో ధర్మకామార్థసాధకః ॥ 44 ॥

వేదముల నభ్యసించి, స్వర్గమును కోరుతూ, ఎప్పుడూ యజ్ఞయాగాదుల నాచరిస్తూ, తడియారని చేతులతో దానములనిస్తూ సర్వదా ధర్మమార్గంలో ప్రజలను పాలించుతూ నిత్యసత్య వ్యవహారములను చేస్తూ, పవిత్ర విచారములను చేస్తూ ధర్మదండము ధరించువాడై, ధర్మకామార్థసాధకుడై, సత్యములను మాత్రమే ఆచరించునో,

యంత్రితః కార్యకరణైః షడ్భాగకృతలక్షణః ।
గ్రామ్యధర్మాన్న సేవేత స్వచ్ఛందేనార్థకోవిదః ॥ 45 ॥

తన కార్యకరణములతో నియంత్రించబడినవాడై, స్వచ్ఛందముగా అర్థకోవిదుడై, పన్నుగా ఆరవభాగమును మాత్రమే స్వీకరించుట యందు కృతలక్షణుడై, గ్రామ్యధర్మములను సేవించనివాడై,

ఋతుకాలే తు ధర్మాత్మా స్వపత్నీమాశ్రయేత్సదా ।
సదోపవాసీ నియతః స్వాధ్యాయనిరతః శుచిః ॥ 46 ॥

ఎప్పుడూ ఋతుకాలములందు మాత్రమే తన ధర్మపత్నితో సంపర్కమును పొందే ధర్మాత్ముడు, నియమ పూర్వకముగా ఎప్పుడూ ఉపవాసముల నాచరిస్తూ, శుచియై, స్వాధ్యాయమునందు నిరతుడైయుండువాడు,

వహిస్మాంతరితే(?) నిత్యం శయానోఽస్తి సదా గృహే ।
సర్వాతిథ్యం త్రివర్గస్య కుర్వాణః సుమనాః సదా ॥ 47 ॥

త్రివర్గముల వారికందరికీ మంచి మనస్సుతో ఎప్పుడూ ఆతిథ్యమునిస్తూ, నిత్యం దోషరహితుడు, ఇంటిలో మాత్రమే ప్రతిదినము నిద్రిస్తూ మంచిమనస్సుతో ఉండేవాడు,

శూద్రాణాం చాన్నకామానాం నిత్యం సిద్ధమితి బ్రువన్ ।
స్వార్థాద్వా యది వా కామాన్న కించిదుపలక్షయేత్ ॥ 48 ॥

అన్నమును కోరే శూద్రులకు ప్రతిదినమూ అన్నము సిద్ధము అని చెప్పుచు, స్వార్థంతో కాని, కోరికతో కాని, దేనినీ కొంచము కూడా కోరకుండా యుండునో,

పితృదేవాతిథికృతే సాధనం కురుతే చ తత్ ।
స్వవేశ్మని యథాన్యాయముపాస్తే భైక్ష్యమేవ చ ॥ 49 ॥

తన ఇంటిలో పితృదేవతలకు, అతిథులకు పూజచేసేవాడు, న్యాయపూర్వకముగా భిక్షను మాత్రమే సాధనముగా చేయుచు దానినే ఉపాసనగా ఆచరించువాడు.

ద్వికాలమగ్నిహోత్రం చ జుహ్వానో వై యథావిధి ।
గోబ్రాహ్మణహితార్థాయ రణే చాభిముఖో హతః ॥ 50 ॥

యథావిధిగా రెండు పూటలా అగ్నిహోత్రమును వ్రేల్చువాడు, గోవులకు, బ్రాహ్మణులకు హితమును కలిగించుట కొరకు యుద్ధములో అభిముఖముగా వెళ్లి మరణించు క్షత్రియుడు

త్రేతాగ్నిమంత్రపూతేన సమావిశ్య ద్విజో భవేత్ ।
జ్ఞానవిజ్ఞానసంపన్నః సంస్కృతో వేదపారగః ॥ 51 ॥

త్రేతాగ్నులయొక్క మంత్రములతో పవిత్రుడై బ్రాహ్మణునిగా పుట్టును. జ్ఞానవిజ్ఞానసంపన్నుడై వేద పారంగతునిగా సంస్కరించబడును.

వైశ్యో భవతి ధర్మాత్మా క్షత్రియః స్వేన కర్మణా ।
ఏతైః కర్మఫలైర్దేవి న్యూనజాతికులోద్భవః ॥ 52 ॥

శూద్రోఽప్యాగమసంపన్నో ద్విజో భవతి సంస్కృతః ।
బ్రాహ్మణో వాఽప్యసద్వృత్తః సర్వసంస్కారభోజనః ॥ 53 ॥

వైశ్యుడు ధర్మాత్ముడై తన కర్మలతో క్షత్రియునిగా పుట్టును. ఓ దేవీ! ఈ విధముగా కర్మఫలములతో తక్కువజాతిలో పుట్టినవాడైనా, శూద్రుడు కూడా సంస్కరించబడి, ఆగమసంపన్నుడై బ్రాహ్మణుడగును. బ్రాహ్మణుడు కూడా సర్వసంస్కార భోజనుడైనట్లైతే, చెడు నడతగలవాడైనట్లయితే

స బ్రాహ్మణ్యం సముత్సృజ్య శూద్రో భవతి తాదృశః ।
కర్మభిః శుచిభిర్దేవి! శుద్ధాత్మా విజితేంద్రియః ॥ 54 ॥

అతడు తన బ్రాహ్మణత్వమును వదిలి శూద్రుడగును. దేవీ! శుచియైన తన కర్మలచేత ఇంద్రియములను జయించినవాడై పరిశుద్ధాత్ముడైనవాడు.

శూద్రోఽపి ద్విజవత్సేవ్య ఇతి బ్రహ్మాఽబ్రవీత్స్వయమ్ ।
స్వభావకర్మణా చైవ యశ్చ శూద్రోఽధితిష్ఠతి ॥ 55 ॥

తన స్వభావకర్మచేత ఏ శూద్రుడైతే ఆయాకర్మల నాచరించునో ఆ శూద్రుడుకూడా బ్రాహ్మణుని వలెనే సేవించదగినవాడని సాక్షాత్తుగా బ్రహ్మయే చెప్పెను.

విశుద్ధః స ద్విజాతిభ్యో విజ్ఞేయ ఇతి మే మతిః ।
న యోని ర్నాపి సంస్కారో న శ్రుతిర్న చ సంతతిః ॥ 56 ॥

కారణాని ద్విజత్వస్య వృత్తమేవ తు కారణమ్ ।
సర్వోఽయం బ్రాహ్మణో లోకే వృత్తేన తు విధీయతే ॥ 57 ॥

అటువంటి పరిశుద్ధుడు బ్రాహ్మణజాతివారలచేత తెలుసుకొనదగినవాడని నా అభిప్రాయము. అతడు పుట్టిన యోనికాని, అతని సంస్కారముకాని, శ్రుతికాని, సంతతికాని, బ్రాహ్మణత్వమునకు కారణం కాదని, అతని నడవడిక (వృత్తమే) యే కారణమగునని, లోకమునందు ఇదంతా అతని నడవడిక ననుసరించియే కారణముగా విధించబడుచున్నది.

వృత్తే స్థితశ్చ శూద్రోఽపి బ్రాహ్మణత్వం చ గచ్ఛతి ।
బ్రహ్మస్వభావః సుశ్రోణి! సమః సర్వత్ర మే మతః ॥ 58 ॥

చక్కని నడవడికగల, చరిత్ర గలిగిన శూద్రుడుకూడ బ్రహ్మత్వమును పొందగలడు. (చక్కని పిరుదులు కలదానా!) దేవీ! అందరియందు సమస్వభావమును కలిగి యుండుటయే బ్రహ్మస్వభావమని నా అభిప్రాయము.

నిర్గుణం నిర్మలం బ్రహ్మ యత్ర తిష్ఠతి స ద్విజః ।
ఏతే యే విమలా దేవి స్థానభావనిదర్శకాః ॥ 59 ॥

ఓ దేవీ! ఎక్కడైతే నిర్గుణము, నిర్మలము అయిన బ్రహ్మముండునో అతడే బ్రాహ్మణుడు. ఈ పరిశుద్ధములైనవి ఏవైతే ఉన్నవో అవి స్థానభావ నిదర్శకములు అని,

స్వయం చ వరదేనోక్తా బ్రహ్మణా సృజతా ప్రజాః ।
బ్రాహ్మణో హి మహత్క్షేత్రం లోకే చరతి పాదవత్ ॥ 60 ॥

ప్రజలను సృష్టించినప్పుడే వరదాత అయిన బ్రహ్మ స్వయంగా చెప్పాడు. బ్రాహ్మణుడనేవాడు ఈ లోకమునందు మహత్క్షేత్రమునుగూర్చి నడిచే పాదమువంటివాడు.

యస్తత్ర బీజం వపతి సా కృషిః ప్రేత్య భావినీ ।
సంతుష్టేన సదా భావ్యం సత్పథాలంబినా సదా ॥ 61 ॥

అటువంటివాడు ఏ బీజమును నాటునో దానికి తగిన ఫలమే కలుగును. చక్కని మార్గము నవలంబించ కోరేవాడు ఎల్లప్పుడు సంతోషముతో భావించవలయును.

బ్రాహ్మం హి మార్గమాక్రమ్య వర్తితవ్యం బుభూషతా ।
సంహితాధ్యాయినా భావ్యం గృహే వై గృహమేధినా ॥ 62 ॥

భోగమును అనుభవించగోరినవాడు బుభూషులైనవారు బ్రాహ్మణుడు ఆచరించే మార్గముననుసరించి ప్రవర్తించవలయును. సంహితాధ్యయనమును చేసినవాడు, గృహమేధి అయినవాడు తన ఇంటిలోనే భావించ వలయును.

నిత్యం స్వాధ్యాయయుక్తేన న చాధ్యయనజీవినా ।
ఏవంభూతో హి యో విప్రః సతతం సత్పథే స్థితః ॥ 63 ॥

ఆహితాగ్నిరధీయానో బ్రహ్మభూయాయ కల్పతే ।
బ్రాహ్మణ్యం దేవి సంప్రాప్య రక్షితవ్యం యతాత్మనా ॥ 64 ॥

నిత్యము స్వాధ్యాయము చేసేవాడు, అధ్యయనముతోనే జీవనముసాగించనివాడు అయిన ఏ బ్రాహ్మణుడు ఎప్పుడూ మంచిమార్గంలో ఉంటాడో, ఆహితాగ్నియై, అధ్యయనమును చేసేవాడు బ్రాహ్మణత్వమును పొందును. అటువంటివాడు యతాత్ముడై బ్రాహ్మణ్యమును పొంది రక్షించవలయును.

యోని ప్రతిగ్రహాదానైః కర్మభిశ్చ శుచిస్మితే! ।
ఏతత్తే గుహ్యమాఖ్యాతం యథా శూద్రో భవేద్ద్విజః ॥
బ్రాహ్మణో వా చ్యుతో ధర్మాద్యథా శూద్రత్వమాప్నుయాత్ ॥ 65 ॥

ఓ శుచిస్మితా! ఈ విధముగా యోని ప్రతిగ్రహాదానములనే కర్మలతో శూద్రుడు బ్రాహ్మణునిగా ఎలా అవుతాడో, ధర్మమునుండి చ్యుతుడైన బ్రాహ్మణుడు శూద్రుడెలా అవుతాడో ఇటువంటి రహస్యమును నీకు వివరించితిని.

ఇతి శ్రీ బ్రహ్మపురాణే ఉమామహేశ్వరసంవాదే సంకరజాతి లక్షణవర్ణనం నామ పంచదశాధికశతతమోఽధ్యాయః. ॥ 115 ॥

శ్రీబ్రహ్మపురాణమునందలి ఉమామహేశ్వర సంవాదములోని సంకరజాతి లక్షణవర్ణనమనే పేరుగల నూట పదిహేనవ అధ్యాయము సంపూర్ణం.

షోడశాధికశతతమోఽధ్యాయః – నూట పదహారవ అధ్యాయం

ధర్మనిరూపణమ్ – ధర్మమును నిరూపించుట

ఉమోవాచ :– పార్వతి పలికింది.

భగవన్! సర్వభూతేశ! సురాసుర నమస్కృత! ।
ధర్మాధర్మే నృణాం దేవ బ్రూహి మే సంశయం విభో! ॥ 1 ॥

భగవన్! సమస్త భూతములకు నాథుడా! సురాసురులచేత నమస్కరించబడువాడా! ధర్మాధర్మములయందు మానవులాచరించవలసిన విధానమునుగూర్చి నాకు సందేహము కలదు. ఓ ప్రభూ! దానినిగూర్చి వివరించుడు.

కర్మణా మనసా వాచా త్రివిధైర్దేహినః సదా ।
బధ్యంతే బంధనైః కైర్వా ముచ్యంతే చ యథా పునః ॥ 2 ॥

జీవులు కర్మతో, మనస్సుతో, వాక్కుతో మూడు విధములుగా ఎల్లప్పుడూ బంధింపబడుచుందురు. ఇట్లు బంధింపబడినవారు మరల వేటితో బంధవిముక్తులగుదురో వివరింపుడు.

కేన శీలేన వై దేవ! కర్మణా కీదృశేన వా ।
సమాచారైర్గుణైః కైర్వా స్వర్గం యాంతీహ మానవాః ॥ 3 ॥

దేవా! మానవులు ఏ శీలముతో, ఏ కర్మతో, ఏ మంచి ఆచారగుణములతో స్వర్గమును పొందుదురో వివరించుడు.

మహేశ్వర ఉవాచ :– మహేశ్వరుడు పలికాడు.

దేవి! ధర్మార్థతత్త్వజ్ఞే! ధర్మనిత్యే! ఉమే! సదా ।
సర్వప్రాణిహితః ప్రశ్నః శ్రూయతాం బుద్ధివర్ధనః ॥ 4 ॥

ధర్మార్థతత్త్వమును తెలిసినదానా! నిత్యమూ ధర్మము నాచరించుదానా! ఓ పార్వతీ! సర్వప్రాణిహితమును గోరిన బుద్ధిని పెంపొందించే ప్రశ్ననడిగినావు. దానికి సమాధానమును వినుము.

సత్యధర్మరతాః శాంతాః సర్వలింగవివర్జితాః ।
నాధర్మేణ న ధర్మేణ బధ్యంతే ఛిన్నసంశయాః ॥ 5 ॥

సత్యధర్మవ్రతులైనవారు, శాంతము కలిగినవారు, ఏ విధమైన చిహ్నములేనివారు, సంశయములు తొలగినవారు, ధర్మముతోగాని, అధర్మముతోగాని కట్టుబడరు.

ప్రళయోత్పత్తితత్త్వజ్ఞాః సర్వజ్ఞాః సర్వదర్శినః ।
వీతరాగా విముచ్యంతే పురుషాః కర్మబంధనైః ॥ 6 ॥

సృష్టిలయల తత్త్వమును తెలిసినవారు, అన్నింటినీ సమానముగా చూసే సర్వజ్ఞులైనవారు, వీతరాగులైనవారు కర్మబంధనములనుండి విముక్తులగుచున్నారు.

కర్మణా మనసా వాచా యే న హింసంతి కించన ।
యే న మజ్జంతి కస్మింశ్చి త్తే న బధ్నంతి కర్మభిః ॥ 7 ॥

తమ పనులతో, ఆలోచనలతో, మాటలతో ఇతరులను హింసించరో, తమ కర్మలతో దేనియందును బంధింపబడరో, ఏ విధమైన మానసికదుర్గ్ధలో మునుగరో వారు కర్మలచే బంధింపబడరు.

ప్రాణాతిపాతాద్విరతాః శీలవంతో దయాన్వితాః ।
తుల్యద్వేష్యప్రియా దాంతా ముచ్యంతే కర్మబంధనైః ॥ 8 ॥

ఎవరు ప్రాణిహింస చేయరో, ఎవరు శీలవంతులో, దయావంతులో, ఇష్టమైన వాటియందు ద్వేషించదగిన వాటియందు, సమబుద్ధి కలవారో, దాంతులో, అటువంటివారు కర్మ బంధనములనుండి విముక్తులగుచున్నారు.

సర్వభూతదయావంతో విశ్వాస్యాః సర్వజంతుషు ।
త్యక్తహింస్రసమాచారాస్తే నరాః స్వర్గగామినః ॥ 9 ॥

సమస్తజీవులయందు దయను చూపెట్టువారు, సమస్తజీవులయందు విశ్వాసమును చూపెట్టువారు, హింసను వదిలి పెట్టినవారు, చక్కని ఆచారముకలవారు స్వర్గమును పొందుదురు.

పరస్వనిర్మమా నిత్యం పరదారవివర్జితాః ।
ధర్మలబ్ధార్థభోక్తారస్తే నరాః స్వర్గగామినః ॥ 10 ॥

నిత్యము ఇతరులది నాదను మమకారము లేనివారు, ఇతరుల భార్యలనుగూర్చి తలపనివారు, ధర్మముగా సంపాదించిన ధనము ననుభవించేవారు స్వర్గమును పొందుదురు.

మాతృవత్స్వసృవచ్చైవ నిత్యం దుహితృవచ్చ యే ।
పరదారేషు వర్తంతే తే నరాః స్వర్గగామినః ॥ 11 ॥

ఇతర స్త్రీలను తల్లిగా, సోదరిగా, కూతురుగా భావిస్తూ వారితో అట్లే ప్రవర్తించువారు స్వర్గమును పొందుదురు.

స్వదారనిరతా యే చ ఋతుకాలాభిగామినః ।
అగ్రామ్యసుఖభోగాచ్చ తే నరాః స్వర్గగామినః ॥ 12 ॥

తమ భార్యలయందు మాత్రమే యనురాగముగలిగి, ఋతుకాలములయందు తమ భార్యలతో మాత్రమే సంగమించువారు, గ్రామ్యసుఖ భోగముల ననుభవించనివారు స్వర్గమును పొందుదురు.

స్తైన్యాన్నివృత్తాః సతతం సంతుష్టాః స్వధనేన చ ।
స్వభాగ్యాన్యుపజీవంతి తే నరాః స్వర్గగామినః ॥ 13 ॥

దొంగసొత్తు నాశించకుండా, తన ధనముతో మాత్రమే సంతుష్టుడై, సర్వదా తన భాగ్యములతోనే జీవించేవారు స్వర్గమును పొందుదురు.

పరదారేషు యే నిత్యం చారిత్రావృతలోచనాః ।
జితేంద్రియాః శీలపరాస్తే నరాః స్వర్గగామినః ॥ 14 ॥

ఇతరుల భార్యలయందెవరు సర్వదా వారి చరిత్రలను గూర్చి విచారించనివారై ఉంటారో, ఎవరు జితేంద్రియులో, ఎవరు శీలమునకు ప్రాధాన్యత నిస్తారో, అటువంటివారు స్వర్గమును పొందుతారు.

ఏష దైవకృతో మార్గః సేవితవ్యః సదా నరైః ।
అకషాయకృతశ్చైవ మార్గః సేవ్యః సదా బుధైః ॥ 15 ॥

ఇది దైవదత్తమైన మార్గము. దీనిని సర్వదా సేవించవలయును. బుద్ధిమంతులైనవారు ఇట్టి పాపరహితమైన మార్గమునే అనుసరించవలయును.

అవృథాపకృతశ్చైవ మార్గః సేవ్యః సదా బుధైః ।
దానకర్మతపోయుక్తః శీలశౌచదయాత్మకః ॥
స్వర్గమార్గమభీప్సద్భిర్న సేవ్యస్తుత ఉత్తరః ॥ 16 ॥

వ్యర్థముగా అపకారములను చేయని మార్గమునే తెలివిగలవారు సర్వదా సేవించవలయును. దానకర్మ తపోయుక్తుడై, శీలశౌచదయాత్మకుడై, స్వర్గమార్గమును కోరేవానికి ఇంతకంటె సేవించవలసినది ఇతరమైనదేదీలేదు.

ఉమోవాచ :– ఉమ పలికింది.

వాచా తు బధ్యతే యేన ముచ్యతే హ్యథవా పునః ।
తాని కర్మాణి మే దేవ వద! భూతపతేఽనఘ! ॥ 17 ॥

దేవా! ఓ భూతపతీ! పాపరహితుడా! మానవుడు ఏ మాటచేత బంధింపబడుచున్నాడో, తిరిగి దేనిచేత బంధ విముక్తుడగుచున్నాడో, ఆ కర్మలనుగూర్చి నాకు వివరింపుడు.

మహేశ్వర ఉవాచ :– మహేశ్వరుడు పలికాడు.

ఆత్మహేతోః పరార్థే వా అధర్మాశ్రితమేవ చ ।
యే మృషా న వదంతీహ తే నరాః స్వర్గగామినః ॥ 18 ॥

తన కొరకుగాని, ఇతరుల కొరకుగాని, అధర్మానికి అనుగుణంకాని దానిని, అసత్యములను చెప్పరో అటువంటివారు స్వర్గమును పొందుదురు.

వృత్త్యర్థం ధర్మహేతోర్వా కామకారాత్తథైవ చ ।
అనృతం యే న భాషంతే తే నరాః స్వర్గగామినః ॥ 19 ॥

వృత్తికొరకు గాని, ధర్మముకొఱకు గాని, కోరికతో గాని అబద్ధమును ఎవరు మాట్లాడరో వారు స్వర్గమును పొందుదురు.

శ్లక్ష్ణాం వాణీం స్వచ్ఛవర్ణాం మధురాం పాపవర్జితామ్ ।
స్వాగతేనాభిభాషంతే తే నరాః స్వర్గగామినః ॥ 20 ॥

స్పష్టమైన వర్ణోచ్చరణతో, పాపపుటాలోచనలు లేకుండా స్వాగతపూర్వకముగా తియ్యగా ఎవరైతే మాట్లాడుతారో వారు స్వర్గమును పొందుదురు.

పరుషం యే న భాషంతే కటుకం నిష్ఠురం తథా ।
అపైశున్యరతాః సంతస్తే నరాః స్వర్గగామినః । 21 ॥

పరుషముగా ఎవరు మాట్లాడరో, కటువుగా ఎవరు నిష్ఠురోక్తులను పలుకరో, ఇతరులను వ్రేలెత్తి చూపకుండా వుంటారో, అటువంటి సత్పురుషులు స్వర్గమును పొందుదురు.

పిశునం న ప్రభాషంతే మిత్రభేదకరీర్గిరః ।
పరపీడాకరాశ్చైవ తే నరాః స్వర్గగామినః ॥ 22 ॥

ఇద్దరు మిత్రులను విడదీయాలనే భావంతో చాడీలను చెప్పకుండా ఎవరుంటారో, ఇతరులకు బాధను కలిగించే విధంగా ఎవరు మాట్లాడరో అటువంటివారు స్వర్గమును పొందుదురు.

యే వర్జయంతి పరుషం పరద్రోహం చ మానవాః ।
సర్వభూతసమాః శాంతాస్తే నరాః స్వర్గగామినః ॥ 23 ॥

ఎవరైతే పరద్రోహమును, పరుషవాక్కులను వదిలిపెడతారో, సర్వభూతములయందు సమత్వమును కలిగియుంటారో, శాంతమును కలిగియుంటారో అటువంటివారు స్వర్గమును పొందుదురు.

శఠప్రలాపాద్విరతా విరుద్ధపరివర్జకాః ।
సౌమ్యప్రలాపినో నిత్యం తే నరాః స్వర్గగామినః ॥ 24 ॥

మూర్ఖప్రలాపములను విడిచిపెట్టినవారు, విరుద్ధమైన విధంగా మాట్లాడనివారు, ఎల్లప్పుడు సౌమ్యంగా మాట్లాడే స్వభావం గలవారు స్వర్గమును పొందుదురు.

న కోపాద్వ్యాహరంతే యే వాచం హృదయదారిణీమ్ ।
శాంతిం విందంతి యేఽక్రుద్ధాస్తే నరాః స్వర్గగామినః ॥ 25 ॥

హృదయపరితాపమును కల్గించే మాటలను కోపంతో ఎవరైతే పలుకరో, కోపంలేకుండా శాంతచిత్తంతో ఎవరైతే ఉంటారో వారు స్వర్గమును పొందుదురు.

ఏష వాణీ కృతో దేవి ధర్మః సేవ్యః సదా నరైః ।
శుభసత్యగుణైర్నిత్యం వర్జనీయా మృషా బుధైః ॥ 26 ॥

దేవీ! మానవులెప్పుడూ ఇటువంటి మాటలతో కూడిన ధర్మమును సేవించవలయును. శుభసత్య గుణములతో సర్వదా అబద్ధమును వదిలి పెట్టవలమును.

ఉమోవాచ :- పార్వతి పలికింది.

మనసా బధ్యతే యేన కర్మణా పురుషః సదా ।
తన్మే బ్రూహి మహాభాగ! దేవదేవ! పినాకధృక్ ॥ 27 ॥

దేవ దేవ! పినాకమను ధనుస్సును ధరించిన మహానుభావా! మానవుడే కర్మలచేత ఎప్పుడూ మనస్సుతో బంధిపబడతాడో దానినిగూర్చి నాకు వివరించుడు.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

మానసేనేహ ధర్మేణ సంయుక్తాః పురుషాః సదా ।
స్వర్గం గచ్ఛంతి కల్యాణి! తన్మే కీర్తయతః శృణు ॥ 28 ॥

కల్యాణీ! ఏ మానసికధర్మంతో సదా కూడుకొని ఉండే మానవులు నన్ను కీర్తించి స్వర్గమును పొందుదురో, దానిని తెల్పెదను, వినుము.

దుష్ప్రణీతేన మనసా దుష్ప్రణీతాంతరాకృతిః ।
నరో బధ్యేత యేనేహ శృణు వా తం శుభాననే ॥ 29 ॥

చక్కని ముఖం గల పార్వతీ! దూషితమైన మనస్సుతో అంతరాకృతి దూషిత మగును. ఇక ఈ లోకంలో నరుడు దేనిచేతనైతే బంధింపబడతాడో దానినిగూర్చి చెప్పుచున్నాను వినుము.

అరణ్యే విజనే న్యస్తం పరస్వం దృశ్యతే యదా ।
మనసాఽపి న గృహ్ణంతి తే నరాః స్వర్గగామినః ॥ 30 ॥

ఇతరులెవరూ లేనిచోటకాని, అరణ్యంలో కాని ఉంచబడిన ఇతరుల ద్రవ్యమును పొందాలని మనస్సుతో కూడా భావించని వారు స్వర్గమును పొందుదురు.

గ్రామే గృహే వా యద్ద్రవ్యం పారక్యం విజనే స్థితమ్ ।
నాభినందంతి వై నిత్యం తే నరాః స్వర్గగామినః ॥ 31 ॥

ఇంటిలోగాని, గ్రామంలోకాని, ఎవరూ లేనటువంటి ప్రదేశంలోకాని ఉంచబడిన ఇతరుల ద్రవ్యమును చూచి ఆహా! లభించినదికదా అని ఎవరైతే సంతోషించరో అటువంటివారు స్వర్గమును పొందుదురు.

తథైవ పరదారాన్యే కామవృత్తా రహోగతాః ।
మనసాఽపి న గృహ్ణంతి తే నరాః స్వర్గగామినః ॥ 32 ॥

అదే విధముగా ఇతరుల భార్యలను, ఏకాంతమైనచోట చూచినా మనస్సులో వారిని ఏమాత్రం. కాంక్షించకుండా ఉంటారో వారు స్వర్గమును పొందుదురు.

శత్రుం మిత్రం చ యే నిత్యం తుల్యేన మనసా నరాః ।
భజంతి మైత్ర్యం సంగమ్య తే నరాః స్వర్గగామినః ॥ 33 ॥

ఎవరైతే శత్రువుని, మిత్రుని కూడా మనస్సులో ఎల్లప్పుడు సమానముగా చూస్తూ, వారితో కలిసి మిత్రత్వమును ప్రదర్శిస్తారో అటువంటివారు స్వర్గమును పొందుదురు.

శ్రుతవంతో దయావంతః శుచయః సత్యసంగరాః ।
స్వధనైః పరిసంతుష్టాస్తే నరాః స్వర్గగామినః ॥ 34 ॥

వేదాధ్యయనమును చేసినవారు, దయను కలిగియున్నవారు, శుచిగా ఉండేవారు, ధర్మయుద్ధమును చేసేవారు, తన ధనముతోనే సంతుష్టిచెందు మానవులు స్వర్గమును పొందుదురు.

అవైరా యే త్వనాయాసా మైత్రచిత్తరతాః సదా ।
సర్వభూతదయావంతస్తే నరాః స్వర్గగామినః ॥ 35 ॥

శత్రుత్వమును పెట్టుకొననివారు, ఆయాసము లేనివారు, ఎప్పుడూ మనస్సులో స్నేహమునే కోరేవారు, సమస్తజీవులయందు దయను కలిగియుండువారు స్వర్గమును పొందుదురు.

జ్ఞానవంతః క్రియావంతః క్షమావంతః సుహృత్ప్రియాః ।
ధర్మాధర్మవిదో నిత్యం తే నరాః స్వర్గగామినః ॥ 36 ॥

జ్ఞానవంతులు, కార్యశూరులు, క్షమాగుణము కలిగినవారు, స్నేహితులకు ప్రియమైనవారు, ఎప్పుడూ ధర్మాధర్మవిచక్షణను తెలిసి పాటించువారు స్వర్గమును పొందుదురు.

శుభానామశుభానాం చ కర్మణాం ఫలసంచయే ।
నిరాకాంక్షాశ్చ యే దేవి! తే నరాః స్వర్గగామినః ॥ 37 ॥

ఓ దేవీ! శుభాశుభకర్మలయొక్క ఫలానుభవమునందు ఏ కోరికా లేనటువంటివారు స్వర్గమును పొందుదురు.

పాపోపేతాన్వర్జయంతి దేవద్విజపరాః సదా ।
సముత్థానమనుప్రాప్తాస్తే నరాః స్వర్గగామినః ॥ 38 ॥

పాపులను విడచిపెట్టువారు, దేవతల, ద్విజుల పట్ల సదా భక్తిని కలవారు, తమ ధర్మముపట్ల శ్రద్ధకలవారు స్వర్గములను చేరుదురు.

శుభైః కర్మఫలైర్దేవి మయైతే పరికీర్తితాః ।
స్వర్గమార్గపరా భూయః కిం త్వం శ్రోతుమిహేచ్ఛసి ॥ 39 ॥

ఓ పార్వతీ! స్వర్గమార్గమును జూపెట్టెడి శుభకర్మల ఫలితములనుగూర్చి నేను చెప్పితిని. తిరిగి ఇంకా నీవు ఏమి వినగోరుచున్నావో తెలుపుము.

ఉమోవాచ :– పార్వతి పలికింది.

మహాన్మే సంశయః కశ్చిన్మర్త్యాన్ప్రతి మహేశ్వర ।
తస్మాత్త్వం నిపుణేనాద్య మమ వ్యాఖ్యాతుమర్హసి ॥ 40 ॥

ఓ మహేశ్వరా! మానవులనుగూర్చి నాకొక గొప్ప సంశయము కలదు. అందువలన నైపుణ్యముగల నీవలన ఈనాడు దాని వ్యాఖ్యానమును వినగోరుచున్నాను.

కేనాఽఽయుర్లభతే దీర్ఘం కర్మణా మానుషః ప్రభో ।
తపసా వాఽపి దేవేశ కేనాఽఽయుర్లభతే మహత్ ॥ 41 ॥

ఓ ప్రభూ! ఏ కర్మను చేయుటచేత మానవులకు దీర్ఘాయువు లభించును? దేవేశా! ఏ తపస్సు చేయుటచేత దీర్ఘాయువు లభించును?

క్షీణాయుః కేన భవతి కర్మణా భువి మానవః ।
విపాకం కర్మణాం దేవ వక్తుమర్హస్యనిందిత ॥ 42 ॥

ఈ లోకంలో మానవునికి క్షీణాయువు ఏ కర్మతో కలుగును? నిందారహితుడవైన దేవా! మానవుని యొక్క కర్మల పరిపక్వతనుగూర్చి తెలుసుకొన గోరుచున్నాను.

అపరే చ మహాభాగ్యా మందభాగ్యాస్తథాఽపరే ।
అకులీనాః కులీనాశ్చ సంభవంతి తథాఽపరే । 43 ॥

దుర్దర్శాః కేచిదాభాంతి నరాః కాష్ఠమయా ఇవ ।
ప్రియదర్శాంస్తథా చాన్యే దర్శనాదేవ మానవాః ॥ 44 ॥

కొందరు మహాభాగ్యవంతులుగా, కొందరు మందభాగ్యులుగా, కొంతమంది గొప్పవంశములోను, మరి కొందరు చెడ్డవంశములోను (పుట్టుట ఎందుకు జరుగును?) మానవులు కొందరు సన్నగా చీపురుపుల్లలాగా చూడ శక్యము గానివారిగా, మరి కొందరు చూడగానే ఆనందము కలిగేటట్లుగా ప్రియదర్శనులుగానుందురు (ఎందుకు?)

దుష్ప్రజ్ఞాః కేచిదాభాంతి కేచిదాభాంతి పండితాః ।
మహాప్రాజ్ఞాస్తథా చాన్యే జ్ఞానవిజ్ఞానభావినః ॥ 45 ॥

కొందరు మూర్ఖులుగా కనిపింతురు. మరికొందరేమో పండితులుగా కన్పింతురు. కొందరు జ్ఞానవిజ్ఞాన గనులవలె మహాప్రాజ్ఞులుగా నుందురు. (ఎందుకు?)

అల్పవాచస్తథా కేచిన్మహావాచస్తథాఽపరే ।
దృశ్యంతే పురుషా దేవ తతో వ్యాఖ్యాతుమర్హసి ॥ 46 ॥

దేవా! కొందరు అల్పవాక్కులుగా, మరికొందరు ఎక్కువ మాట్లాడేవారుగా కన్పట్టుదురు. అందువలన వీరిని గూర్చి వివరించ వేడుచున్నాను.

మహేశ్వర ఉవాచ :– మహేశ్వరుడు పలికాడు.

హంత తేఽహం ప్రవక్ష్యామి దేవి కర్మఫలోదయమ్ ।
మర్త్యలోకే నరః సర్వో యేన స్వం ఫలమశ్నుతే ॥ 47 ॥

ఓ దేవీ! మానవలోకంలో ప్రతి మనుష్యుడు దేనిచేత తన ఫలము ననుభవించుచున్నాడో, ఏ కర్మకు ఏ ఫలోదయమగుచున్నదో, నేను నీకు చెప్పబోవుచున్నాను వినుము.

ప్రాణాతిపాతీ యోగీంద్రో దండహస్తో నరః సదా ।
నిత్యముద్యతశస్త్రశ్చ హంతి భూతగణాన్నరః ॥ 48 ॥

ప్రాణాతిపాతి ఐనవాడు, యోగీంద్రుడు, దండధారి అయిన మానవుడు ప్రతినిత్యము ఆయుధములతో జీవసమూహమును చంపుచునే యున్నాడు.

నిర్దయః సర్వభూతేభ్యో నిత్యముద్వేగకారకః ।
అపి కీటపతంగానామశరణ్యః సునిర్ఘృణః ॥ 49 ॥

ప్రతిదినము ఉద్వేగకారకుడై జీవులయందేమాత్రమును దయలేక, కీటకములకు, పక్షులకు రక్షణ కల్పించకుండా మిక్కిలి దుర్మార్గుడై వాటిని నాశనము చేయుచున్నాడు.

ఏవంభూతో నరో దేవి! నిరయం ప్రతిపద్యతే ।
విపరీతస్తు ధర్మాత్మా స్వరూపేణాభిజాయతే ॥ 50 ॥

దేవీ! ఈ విధముగా ప్రవర్తించిన మానవుడు నరకమును పొందుచున్నాడు. దీనికి భిన్నముగా నుండు ధర్మాత్ముడు స్వరూపముతో గొప్పవంశములో జన్మిస్తున్నాడు.

నిరయం యాతి హింసాత్మా యాతి స్వర్గమహింసకః ।
యాతనాం నిరయే రౌద్రాం స కృచ్ఛ్రాం లభతే నరః ॥ 51 ॥

హింసనాచరించినవాడు నరకమును చేరును. అహింసావ్రతము నాచరించువాడు స్వర్గమును చేరును. హింసాత్ముడైనవాడు నరకంలో కఠినమైన భీకరమైన యాతనను పొందగలడు.

యః కశ్చిన్నిరయాత్తస్మాత్సముత్తరతి కర్హిచిత్ ।
మానుష్యం లభతే వాఽపి హీనాయుస్తత్ర జాయతే ॥ 52 ॥

ఎవడో ఒకడు ఎప్పుడైనా ఆ నరకమునుండి విడుదలై మనుష్యజన్మ పొందినప్పటికినీ క్షీణాయువుగా పుట్టును.

పాపేన కర్మణా దేవి! యుక్తో హింసాదిభిర్యతః ।
అహితః సర్వభూతానాం హీనాయురుపజాయతే ॥ 53 ॥

ఎందుకనగా ఓ దేవీ! పాపకర్మలచేత హింసాదికర్మలతో కూడినవాడై సర్వ భూతములకు అహితమును కలిగించినందున హీనాయువుగా పుట్టును.

శుభేన కర్మణా దేవి ప్రాణిఘాత వివర్జితః ।
నిక్షిప్తశస్త్రో నిర్దండో న హింసతి కదాచన ॥ 54 ॥

ఓ దేవీ! శుభకర్మతో ప్రాణిహింసను వదిలిపెట్టి, ఆయుధములను వదిలినవాడై, దండించకుండా ఉండి ఎప్పుడు కూడా హింసను ఆచరించడో

న ఘాతయతి నో హంతి ఘ్నంతం నైవానుమోదతే ।
సర్వభూతేషు సస్నేహో యథాஉஉత్మని తథాపరే ॥ 55 ॥

ఈదృశః పురుషో నిత్యం దేవి దేవత్వమశ్నుతే ।
ఉపపన్నాన్సుఖాన్భోగాన్సదాஉశ్నాతి ముదా యుతః ॥ 56 ॥

అథ చేన్మానుషే లోకే కదాచిదుపపద్యతే ।
ఏష దీర్ఘాయుషాం మార్గః సువృత్తానాం సుకర్మణామ్ ॥
ప్రాణిహింసావిమోక్షేణ బ్రహ్మణా సముదీరితః ॥ 57 ॥

కొట్టకుండా, చంపకుండా, చంపేవానిని కూడా ఒప్పుకోకుండా అడ్డుపడి, తనలాగే ఇతరులు కూడా అనే భావంతో నిత్యం సర్వ జీవులయందు మంచిస్నేహమును కలిగియుండునో ఇటువంటి మనుష్యుడు దేవత్వమును పొందగలడు. దేవీ! ఇటువంటివాడే తనకు లభించిన సుఖములను, భోగములను సంతోషముతో ననుభవించును. మనుష్యలోకంలో ప్రాణిహింసను వదులట ద్వారామంచిపనులను చేసేవారికి, మంచినడవడిక గలవారికి దీర్ఘాయువుల మార్గము ఎప్పుడో ఒకప్పుడు లభిస్తుందని బ్రహ్మ చక్కగా చెప్పాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఉమామహేశ్వరసంవాదే ధర్మనిరూపణం నామ షోడశాధికశతతమోஉధ్యాయః. ॥ 116 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని ఉమామహేశ్వర సంవాదమునందలి ధర్మాన్ని నిరూపించమనే నూట పదహారవ అధ్యాయము సంపూర్ణం.

సప్తదశాధికశతతమోऽధ్యాయః - నూట పదిహేడవ అధ్యాయం

ధర్మనిరూపణమ్ - ధర్మమును నిరూపించుట

ఉమోవాచ :- పార్వతి చెప్పింది.

కిం శీలః కిం సమాచారః పురుషః కైశ్చ కర్మభిః ।
స్వర్గం సమభిపద్యేత సంప్రదానేన కేన వా ॥ 1 ॥

మానవుడు ఎటువంటి శీలముచేత, ఏ మంచి ఆచారముచేత, ఏ కర్మలచేత దేనిని దానము చేయుటచేత స్వర్గమును పొందగలడో వివరించుడు.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

దాతా బ్రాహ్మణసత్కర్తా దీనార్తకృపణాదిషు ।
భక్ష్య భోజ్యాన్నపానానాం వాససాం చ మహామతిః ॥ 2 ॥

ప్రతిశ్రయాన్సభాః కుర్యాత్ప్రపాః పుష్కరిణీస్తథా ।
నిత్యకాదీని కర్మాణి కరోతి ప్రయతః శుచిః ॥ 3 ॥

ఆసనం శయనం యానం గృహం రత్నం ధనం తథా ।
సస్యజాతాని సర్వాణి సుక్షేత్రాణ్యథ యోషితః ॥ 4 ॥

సుప్రశాంతమనా నిత్యం యః ప్రయచ్ఛతి మానవః ।
ఏవంభూతో నరో దేవి దేవలోకేऽభిజాయతే ॥ 5 ॥

దాత అయినవాడు, బ్రాహ్మణులను సత్కరించేవాడు, దీనులకు, ఆర్తులకు, కృపణాదులకు తినుటకు కావలసిన భక్ష్య భోజ్యాన్నములను, త్రాగుటకు నీటిని, కట్టుకొనుటకు వస్త్రములను ఉండుటకు వసతిని, చలివేంద్రాలని పెట్టుట, చెరువులను త్రవ్వించుట, మున్నగు నిత్యావసరమగు వాటిని ఏ బుద్ధిమంతుడు ప్రయత్నించి శుచిగా ఆ కార్యములను ఆచరించునో కూర్చునుటకు ఆసనమును, పడుకొనుటకు శయ్యను, వెళ్ళుటకు వాహనమును, ఉండుటకు ఇంటిని, ధరించుటకు రత్నమును, జీవించుటకు ధనమును అదేవిధముగా, పండిన పంటలన్నింటిని, మంచిపంట భూములను, స్త్రీలను చక్కని ప్రశాంతమైన మనస్సుతో ప్రతినిత్యము ఏ మానవుడైతే దానం చేస్తాడో అటువంటివాడు దేవ లోకమునందు పుట్టును.

తత్రోష్య సుచిరం కాలం భుక్త్వా భోగాననుత్తమాన్ ।
సహాప్సరోభిర్ముదితో రమిత్వా నందనాదిషు ॥ 6 ॥

స్వర్గచ్యుతో మహేశాని మానుషేషూపజాయతే ।
మహాభాగకులే దేవి ధనధాన్యసమన్వితే ॥ 7 ॥

తత్ర కామగుణైః సర్వైః సముపేతో ముదాన్వితః ।
మహాకార్యో మహాభోగో ధనీ భవతి మానవః ॥ 8 ॥

దేవీ! పార్వతీ! అక్కడ చాలా కాలము వరకుండి ఉత్తమోత్తమములైన భోగముల నుభవించి, నందనాది వనాలలో అప్సరసలతో సంతోషముగా రమించి, స్వర్గమునుండి చ్యుతుడై, మనుష్యులలో ధనధాన్య సంపదలతో కూడిన గొప్పకులములో పుట్టును. అక్కడ సమస్త కామగుణములతో సంతోషముతో కూడుకొనియున్నవాడై ఆ మానవుడు గొప్ప కార్యములను చేసేవానిగా, గొప్ప భోగముల ననుభవించేవానిగా, గొప్ప ధనవంతునిగా నగును.

ఏతే దేవి మహాభాగాః ప్రాణినో దానశీలినః ।
బ్రహ్మణా వై పురా ప్రోక్తాః సర్వస్య ప్రియదర్శనాః ॥ 9 ॥

వీరే మహానుభావులైనవారు, సమస్త ప్రాణులకు దానమును చేసే స్వభావము కలవారు, చూపరులందరిచేత ఇష్టపడువారు వారే బ్రాహ్మణులు అని పూర్వమే బ్రహ్మ చెప్పాడు.

అపరే మానవా దేవి ప్రదానకృపణా ద్విజాః ।
యేఽన్నాని న ప్రయచ్ఛంతి విద్యమానేఽప్యబుద్ధయః ॥ 10 ॥

దేవీ! ఇతరులైన మానవులు గాని, బ్రాహ్మణులు గాని తమ కున్నప్పటికి ఇతరులకు అన్నాదులను పెట్టనటువంటివారు మూర్ఖులు, దానహీనులు.

దీనాంధకృపణాన్దృష్ట్వా భిక్షుకానతిథీనపి ।
యాచ్యమానా నివర్తంతే జిహ్వాలోభసమన్వితాః ॥ 11 ॥

అటువంటివారు దీనులను, అంధులను బాధలలో ఉన్నవారినీ, భిక్షుకులను, అతిథులను, యాచించేవారిని చూచి కూడా తమ నాలుకరుచికొరకు మాత్రమే ఆశపడి వెనుదిరిగేవారు.

న ధనాని న వాసాంసి న భోగాన్న చ కాంచనమ్ ।
న గాశ్చ నాన్నవికృతిం ప్రయచ్ఛంతి కదాచన ॥ 12 ॥

అప్రలుబ్ధాశ్చ యే లుబ్ధా నాస్తికా దానవర్జితాః ।
ఏవంభూతా నరా దేవి నిరయం యాంత్యబుద్ధయః ॥ 13 ॥

ధనములనుకాని, వస్త్రములనుకాని, భోగములనుకాని, బంగారమునుకాని, ఆవులనుకాని, భోజన పదార్థములనుకాని ఎప్పుడైనను, ఎవరికైనను దానమును చేయరో అటువంటి దానవర్జితులైన అప్రలుబ్ధులైన లుబ్ధులు నాస్తికులు. ఓ దేవీ! ఇటువంటి మానవులు బుద్ధిహీనులై నరకమును పొందుదురు.

తే వై మనుష్యతాం యాంతి యదా కాలస్య పర్యయాత్ ।
ధనరిక్తే కులే జన్మ లభంతే తేఽల్పబుద్ధయః ॥ 14 ॥

ఇటువంటివారు కాల పరిభ్రమణంలో మనుష్యజన్మను పొంది అల్పబుద్ధులై ధనహీన కులములో పుట్టుదురు.

క్షుత్పిపాసాపరీతాశ్చ సర్వలోకబహిష్కృతాః ।
నిరాశాః సర్వభోగేభ్యో జీవంత్యధర్మజీవికాః ॥ 15 ॥

ఆకలి దప్పులతో అలమటించి పోయి, లోకులందరి చేత బహిష్కరించబడి, సమస్త భోగములనుండి నిరాశను పొంది, అధర్మమార్గమున సంపాదించి జీవింతురు.

అల్పభోగకులే జాతా అల్పభోగరతా నరాః ।
అనేన కర్మణా దేవి భవంత్యధనినో నరాః ॥ 16 ॥

ఓ దేవీ! అల్పమైన భోగములుకల కులంలో పుట్టినవారు, అల్పభోగాలపైన ఆసక్తి కల మానవులు ఈ కర్మతో ధనహీనులగుచున్నారు.

అపరే దంభినో నిత్యం మానినః పరతో రతాః ।
ఆసనార్హస్య యే పీఠం న యచ్ఛంత్యల్పచేతసః ॥ 17 ॥

మరికొందరు దంభమును ప్రదర్శించువారై నిత్యము స్వాభిమానమును ప్రదర్శిస్తూ, ఇతరములందాసక్తులై అల్పమనస్సుతో ఆసనార్హత కలిగినవారికి ఆ స్థానమును దక్కనీయరు.

మార్గార్హస్య చ యే మార్గం న ప్రయచ్ఛంత్యబుద్ధయః ।
అర్ఘ్యార్హాన్న చ సంస్కారైరర్చయంతి యథావిధి ॥ 18 ॥

అల్పబుద్ధులైనవారు దారిన వెళ్లేవారికి త్రోవ వదలరు. యోగ్యులైనవారికి యథావిధిగా సంస్కారములతో అర్ఘ్యాదులనిచ్చి వారిని సత్కరించరు.

పాద్యమాచమనీయం వా న ప్రయచ్ఛంత్యబుద్ధయః ।
శుభం చాభిమతం ప్రేమ్ణా గురుం నాభివందతి యే ॥ 19 ॥

తెలివిలేనివారు పెద్దలకు పాద్యము ఆచమనీయములను కూడా ఇవ్వరు. వారికభిమతమైన శుభమును చేయరు. ప్రేమతో గురువుకు నమస్కరించరు.

అభిమానప్రవృద్ధేన లోభేన సమమాస్థితాః ।
సంమాన్యాంశ్చావమన్యంతే వృద్ధాన్పరిభవంతి చ ॥ 20 ॥

అభిమాన గర్వముతో, లోభముతోనుంటూ సమ్మానించ దగిన వారిని అవమానింతురు. వృద్ధులను పరిభవింతురు.

ఏవం విధా నరా దేవి సర్వే నిరయగామినః ।
తే చేద్యది నరాస్తస్మాన్నిరయాదుత్తరంతి చ ॥ 21 ॥

వర్షపూగైస్తతో జన్మ లభంతే కుత్సితే కులే ।
శ్వపాకపుల్కసాదీనాం కుత్సితానామచేతసామ్ ॥ 22 ॥

కులేషు తేఽభిజాయంతే గురువృద్ధావమానినః ।

దేవీ! ఇటువంటి నరులందరూ నరకమునకు వెళ్ళువారే. అటువంటి నరులు నరకమునుండి ఉత్తీర్ణులయినా కూడా ఆ తరువాత చెడుమనస్సుకలిగి కుక్కమాంసం తినేవాడు, చండాలుడు, కుత్సితులైన శ్వపాక, పుల్కస మున్నగు నీచమైన కులమునందు అనేక సంవత్సరముల పర్యంతము కొన్ని లక్షల సంవత్సరముల వరకు జన్మను పొందుదురు. ఎవరు గురువులను, వృద్ధులను అవమానింతురో వారు పై కులములలో పుట్టుదురు.

న దంభీ న చ మానీ యో దేవతాతిథిపూజకః ॥ 23 ॥

లోకపూజ్యో నమస్కర్తా ప్రసూతో మధురం వచః ।
సర్వకర్మప్రియకరః సర్వభూతప్రియః సదా ॥ 24 ॥

ఇక ఎవరు దంభముగానుండరో, ఎవరికి దురభిమానములేదో, ఎవరు దేవతాతిథులకు పూజలను చేయునో ఎవరు నమస్కరింతురో, తియ్యగా మధురవచనములు పలుకునో, సర్వకర్మలను ప్రియముగా చేయునో, సర్వభూతములకు హితమును కలిగించునో అతడు సర్వదా లోకపూజ్యుడు.

అద్వేషీ సుముఖః శ్లక్ష్ణః స్నిగ్ధవాణీప్రదః సదా ।
స్వాగతేనైవ సర్వేషాం భూతానామవిహింసకః ॥ 25 ॥

యథార్థం సత్క్రియాపూర్వమర్చయన్నవతిష్ఠతే ।
మార్గార్హాయ దదన్మార్గం గురుమభ్యర్చయన్సదా ॥ 26 ॥

అతిథిప్రగ్రహరతస్తథాఽభ్యాగతపూజకః ।
ఏవంభూతో నరో దేవి స్వర్గతిం ప్రతిపద్యతే ॥ 27 ॥

తతో మానుష్యమాసాద్య విశిష్టకులజో భవేత్ ।
తత్రాసౌ విపులైర్భోగైః సర్వరత్నసమాయుతః ॥ 28 ॥

యథార్హదాతా చార్హేషు ధర్మచర్యాపరో భవేత్ ।
సమ్మతః సర్వభూతానాం సర్వలోకనమస్కృతః ॥ 29 ॥

దేవీ! ద్వేషము లేనివాడు, సుముఖుడు, ప్రియవాది, స్వాగతంతో ఎప్పుడూ స్నిగ్ధవాక్కులను పలుకువాడు, ఏ జీవినీ హింసించనివాడు, యథార్థమైన సత్కారములతో పూజిస్తూ ఉంటాడో, త్రోవఇవ్వటానికి తగినవారికి త్రోవనిస్తూ ఎప్పుడూ గురువును పూజిస్తాడో అతిథులను ఆదరముతో స్వీకరించువాడు, అభ్యాగతులను పూజించేవాడు ఇటువంటి వాడు స్వర్గమును పొందును. ఆ తరువాత మనుష్య జన్మనెత్తి విశిష్ట కులంలో పుట్టును. అక్కడితడు విశేషమైన భోగములతో, సమస్తరత్నములతో కూడుకొని యున్నవాడై యోగ్యులైన వారికి వారివారి

యోగ్యతననుసరించి దానములను చేసే దాతగా, ధర్మమునాచరించుట యందు ఆసక్తి చూపును. సమస్త జీవులకు సమ్మతుడై లోకమునందు అందరిచేత నమస్కరించబడును.

స్వకర్మఫలమాప్నోతి స్వయమేవ నరః సదా ।
ఏష ధర్మో మయా ప్రోక్తో విధాత్రా స్వయమీరితః । 30 ॥

నరుడెప్పుడూ తన కర్మఫలమును తానే పొందును. నేను చెప్పిన ఈ ధర్మము స్వయముగా బ్రహ్మ చెప్పినదే.

యస్తు రౌద్రసమాచారః సర్వసత్వభయంకరః ।
హస్తాభ్యాం యదివా పద్భ్యాం రజ్వా దండేన వా పునః ॥ 31 ॥

లోష్టైః స్తంభైరుపాయైర్వా జంతూన్బాధేత శోభనే ।
హింసార్థం నిష్కృతిప్రజ్ఞః ప్రోద్వేజయతి చైవ హి ॥ 32 ॥

ఉపక్రామతి జంతూంశ్చ ఉద్వేగజననః సదా ।
ఏవం శీలసమాచారో నిరయం ప్రతిపద్యతే ॥ 33 ॥

మంగళకరులారా! ఎవడైతే తీక్ష్ణమైన ఆచారము కలవాడో, జీవులన్నింటికి భయమును కలిగించువాడో, చేతులతోకాని, కాళ్లతో కాని త్రాడుతోకాని మరియు కఱ్ఱతోకాని, రాళ్ళతోకాని స్తంభం మొదలైన ఉపాయములతో గాని జీవులను బాధించునో, హింసకై దుర్మార్గమైన తెలివిని ప్రదర్శిస్తూ మిక్కలి బాధించునో, ఎప్పుడూ ప్రాణులకుద్వేగము కలిగించుటకై ప్రయత్నించునో, ఇటువంటి శీలముతో ఆచరించువాడు నరకమును పొందును.

స చేన్మనుష్యతాం గచ్ఛేద్యది కాలస్య పర్యయాత్ ।
బహు బాధాపరిక్లిష్టే కులే భవతి సోఽధమే ॥ 34 ॥

ఒక వేళ కాలవిధి వశమున అతడు మనుష్యజన్మను ఎత్తవలసి వచ్చినట్లయితే అనేకబాధలతో కూడిన క్లిష్టమైన అధమకులములో జన్మించును.

లోకద్విష్టోఽధమః పుంసాం స్వయం కర్మకృతైః ఫలైః ।
ఏష దేవి మనుష్యేషు బోద్ధవ్యో జ్ఞాతిబంధుషు ॥ 35 ॥

ఓ దేవీ! ఇతడు తాను చేసిన కర్మల ఫలితాలచేత మానవులందు, జ్ఞాతి బంధువులందు, పురుషులలోనే లోకం చేత ద్వేషింపబడేవాడుగానూ, అధముడుగాను తెలియతగినవాడు.

అపరః సర్వభూతాని దయావాననుపశ్యతి ।
మైత్రీదృష్టిః పితృసమో నిర్వైరో నియతేంద్రియః ॥ 36 ॥

నోద్వేజయతి భూతాని న చ హంతి దయాపరః ।
హస్తపాదైశ్చ నియతైర్విశ్వాస్యః సర్వజంతుషు ॥ 37 ॥

న రజ్వా న చ దండేన న లోష్టైర్నాఽఽయుధేన చ ।
ఉద్వేజయతి భూతాని శుభకర్మా సదా నరః ॥ 38 ॥

ఏవం శీలసమాచారః స్వర్గే సముపజాయతే ।
తత్రాసౌ భవనే దివ్యే ముదా వసతి దేవవత్ ॥ 39 ॥

మరొకడు జీవరాశుల నన్నింటిని దయతో చూచువాడై, స్నేహదృష్టి కలవాడై, తండ్రితో సమానముగా నుండి, ఏమాత్రము శత్రుత్వములేక, ఇంద్రియనిగ్రహము కలవాడై, తన కాళ్లతో, చేతులతో జీవుల కుద్వేగమును కలిగించకుండా, చంపకుండా, సమస్త జీవులయందు నిగ్రహముతో దయాపరుడై విశ్వాసమును కలిగించువాడై, త్రాడుతోగాని, కర్రతోగాని, రాళ్ళతోగాని, ఆయుధముతోగాని జీవులకు బాధను కలిగించక ఎప్పుడూ మంచి కర్మలనే చేయునో, ఇటువంటి శీలముతో మంచి ఆచారము కలిగినవాడు స్వర్గమును పొందును. అక్కడితడు దివ్యమైన భవనంలో దేవతలవలె సంతోషముగా నివసించగలడు.

స చేత్స్వర్గక్షయాన్మర్త్యో మనుష్యేషూపజాయతే ।
అల్పాయాసో నిరాతంకః స జాతః సుఖమేధతే ॥ 40 ॥

అక్కడ స్వర్గసుఖాలననుభవించి, పుణ్యక్షయమైన తరువాత మనుష్యలోకంలో మానవునిగాపుట్టి తక్కువ కష్టములతో ఏ ఆటంకములేక సుఖమును పొందగలడు.

సుఖభాగీ నిరాయాసో నిరుద్వేగః సదా నరః ।
ఏష దేవి సతాం మార్గో బాధా యత్ర న విద్యతే ॥ 41 ॥

దేవీ! ఎక్కడైతే బాధ లేకుండా, ఉద్వేగము లేకుండా ఆయాసము లేకుండా మానవుడెల్లప్పుడు సుఖభాగి అవుతాడో అదే సత్పురుషుల మార్గము.

ఉమోవాచ :– ఉమ పలికింది.

ఇమే మనుష్యా దృశ్యంతే మహోత్సాహా విశారదాః ।
జ్ఞానవిజ్ఞానసంపన్నాః ప్రజ్ఞావంతోఽర్థకోవిదాః ॥ 42 ॥

లోకంలో కొందరు మనుష్యులు గొప్ప ఉత్సాహవంతులుగా, విశారదులుగా, జ్ఞానవిజ్ఞాన సంపన్నులుగా, ప్రజ్ఞావంతులుగా, అర్థకోవిదులుగా కన్పించుచున్నారు.

దుష్ప్రజ్ఞాశ్చాపరే దేవ జ్ఞానవిజ్ఞానవర్జితాః ।
కేన కర్మవిపాకేన ప్రజ్ఞావాన్పురుషో భవేత్ ॥ 43 ॥

దేవా! కొందరైతే ప్రజ్ఞ లేని వారలుగా, జ్ఞానవిజ్ఞానములులేనివారిగా కన్పించుచున్నారు. ఏ కర్మ పరిపక్వముతో పురుషుడు ప్రజ్ఞావంతుడగును?

అల్పప్రజ్ఞో విరూపాక్ష కథం భవతి మానవః ।
ఏవం త్వం సంశయం ఛింధి సర్వధర్మభృతాంవర ॥ 44 ॥

సమస్తధర్మముల భారమును వహించువారిలో శ్రేష్ఠుడా! ఓ విరూపాక్షా! మానవుడు ఎందువలన అల్పమైన ప్రజ్ఞకలవాడు అవుతాడు? ఈ నా సంశయమును తీర్చుము.

జాత్యంధాశ్చాపరే దేవ రోగార్తాశ్చాపరే తథా ।
నరాః క్లీబాశ్చ దృశ్యంతే కారణం బ్రూహి తత్ర వై ॥ 45 ॥

కొందరు రోగార్తులుగా, కొందరు పుట్టుగ్రుడ్డిగా, అట్లే కొందరు నపుంసకులుగా కన్పించుచున్నారు. అట్లుండుటకుగల కారణమేమో తెల్పుడు.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

బ్రాహ్మణాన్వేదవిదుషః సిద్ధాన్ధర్మవిదస్తథా ।
పరిపృచ్ఛన్త్యహరహః కుశలాకుశలం సదా ॥ 46 ॥

వర్జయంతో౽ శుభం కర్మ సేవమానాః శుభం తథా ।
లభంతే స్వర్గతిం నిత్యమిహలోకే యథాసుఖమ్ ॥ 47 ॥

వేదవిద్వాంసులైన బ్రాహ్మణులను, అదే విధముగా ధర్మవిదులైన సిద్ధులను మాటిమాటికి మంచిచెడ్డలను, యోగక్షేమములను విచారిస్తూ, అశుభకర్మలను వదిలివేసి అట్లే శుభకర్మలను సేవిస్తూ ఉండేవారు ఈ లోకంలో సుఖముననుభవించి నిత్యమైన స్వర్గలోకమును పొందగలరు.

స చేన్మానుష్యతాం యాతి మేధావీ తత్ర జాయతే ।
శ్రుతం యజ్ఞానుగం యస్య కల్యాణముపజాయతే ॥ 48 ॥

అటువంటివాడు భూలోకంలో మనుష్యునిగా జన్మించినపుడు మేధావిగా పుట్టును. వేదాలను చదివి, యజ్ఞముల నాచరించిన శుభమును పొందగలడు.

పరదారేషు యే చాపి చక్షుర్దుష్టం ప్రయుంజతే ।
తేన దుష్టస్వభావేన జాత్యంధాస్తే భవంతి హి ॥ 49 ॥

ఇతర స్త్రీలయందెవరు వక్రదృష్టితో చూచెదరో అటువంటి స్వభావము చేతనే వారు పుట్టుగ్రుడ్డిగా జన్మింతురు.

మనసా౽ పి ప్రదుష్టేన నగ్నాం పశ్యతి యే స్త్రియమ్ ।
రోగార్తాస్తే భవంతీహ నరా దుష్కృతకారిణః ॥ 50 ॥

దుష్టమనస్సుతో నూహించి నగ్నముగానున్న స్త్రీనెవరు చూచెదరో అటువంటి దుష్కృతిని చేసినవారు రోగార్తులగుదురు.

యే తు మూఢా దురాచారా వియోనౌ మైథునే రతాః ।
పురుషేషు సుదుష్ప్రజ్ఞాః క్లీబత్వముపయాంతి తే ॥ 51 ॥

ఎవరైతే మూఢులై, దురాచారులై విరుద్ధజాతియందు మైథునము నాచరించెదరో అటువంటివారు మనుష్యులలో దుష్ప్రజ్ఞులై నపుంసకత్వమును పొందెదరు.

పశూంశ్చ యే వై బధ్నంతి యే చైవ గురుతల్పగాః ।
ప్రకీర్ణమైథునా యే చ క్లీబా జాయంతి వై నరాః ॥ 52 ॥

ఎవరు పశువులను బంధిస్తారో, ఎవరు గురుపుశయ్యపై పడుకుంటారో, అసంబద్ధ మైథునంలో ఎవరు పాల్గొంటారో అటువంటివారు నపుంసకులుగా జన్మిస్తారు.

ఉమోవాచ :- ఉమ పలికింది.

అవద్యం కిం ను వై కర్మ నిరవద్యం తథైవ చ ।
శ్రేయః కుర్వన్నవాప్నోతి మానవో దేవసత్తమ ॥ 53 ॥

ఓ దేవతాశ్రేష్ఠుడా! నింద్యమైన కర్మ ఏది? అట్లే అనింద్యమైన కర్మ ఏది? ఏ కర్మను చేసిన మానవుడు శ్రేయస్సును పొందగలడు?

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

శ్రేయాంసం మార్గమన్విచ్ఛన్సదా యః పృచ్ఛతి ద్విజాన్ ।
ధర్మాన్వేషీ గుణాకాంక్షీ స స్వర్గం సముపాశ్నుతే ॥ 54 ॥

ఎవడైతే ధర్మాన్వేషకుడై, గుణములను కోరువాడై, సదా శ్రేయోమార్గమును వెదకుచూ బ్రాహ్మణుల నడుగుతాడో అటువంటివాటు స్వర్గమును పొందును.

యది మనుష్యతాం దేవి కదాచిత్సంనియచ్ఛతి ।
మేధావీ ధారణాయుక్తః ప్రాజ్ఞస్తత్రాపి జాయతే ॥ 55 ॥

దేవీ! ఒకవేళ ఎప్పుడో ఒకప్పుడు మానవునిగా పుట్టినపుడు మేధావిగా, ధారణాయుక్తునిగా, ప్రాజ్ఞునిగా పుట్టును.

ఏష దేవి సతాం ధర్మో గంతవ్యో భూతికారకః ।
నృణాం హితార్థాయ సదా మయా చైవముదాహృతః ॥ 56 ॥

దేవీ! ఐశ్వర్యమును కోరువాడు సత్పురుషు లాచరించిన ధర్మమును అనుసరించ వలయును. ఎల్లప్పుడు మానవుల హితమును గోరి నేనీ విధంగా చెప్పాను.

ఉమోవాచ :-ఉమ పలికింది.

అపరే స్వల్పవిజ్ఞానా ధర్మవిద్వేషిణో నరాః ।
బ్రాహ్మణాన్వేదవిదుషో నేచ్ఛంతి పరిసర్పితుమ్ ॥ 57 ॥

కొందరు కొంచం తెలివిగలవారై, ధర్మాన్ని ద్వేషించేవారై, వేద విదులైన బ్రాహ్మణుల నాశ్రయించుటకు ఇష్టపడరు.

వ్రతవంతో నరాః కేచిచ్ఛ్రద్ధాదమపరాయణాః ।
అవ్రతా భ్రష్టనియమాస్తథాఽన్యే రాక్షసోపమాః ॥ 58 ॥

కొందరు శ్రద్ధ, దమములతో కూడుకొని యున్నవారై వ్రతములను చేస్తారు. కొందరు నియమములను వదిలిపెట్టి వ్రతములను చేయక రాక్షసులతో పోల్చదగిన వారుగా నుంటారు.

యజ్వానశ్చ తథైవాన్యే నిర్మోహాశ్చ తథాపరే ।
కేన కర్మవిపాకేన భవంతీ హ వదస్వ మే ॥ 59 ॥

కొంతమంది యజ్ఞములను చేస్తూ, మరికొందరు మోహమును లేనివారుగా నుందురు. ఏ కర్మ పరిపక్వమైనపుడు ఇట్లుందురో నాకు తెలియజేయుడు.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

ఆగమా లోకధర్మాణాం మర్యాదాః పూర్వనిర్మితాః ।
ప్రమాణేనానువర్తంతే దృశ్యంతే చ దృఢవ్రతాః ॥ 60 ॥

ఆగమశాస్త్రములు లోకధర్మమర్యాదా పూర్వకములుగా రచించబడినవి. దృఢవ్రతులైనవారు ప్రమాణములననుసరించి నడుతురు, ప్రమాణానుసారమే చూతురు.

అధర్మం ధర్మమిత్యాహుర్యే చ మోహవశంగతాః ।
అవ్రతా నష్టమర్యాదాస్తే ప్రోక్తా బ్రహ్మరాక్షసాః ॥ 61 ॥

ఎవరైతే మోహపరవశులై అధర్మమును ధర్మమని చెప్పుదురో, వ్రతములను చేయరో, మర్యాదను పోగొట్టుకొందురో, వారిని బ్రహ్మ రాక్షసులందురు.

తే చేత్కాలకృతోద్యోగాత్సంభవంతీహ మానవాః ।
నిర్హోమా నిర్వషట్కారాస్తే భవంతి నరాధమాః ॥ 62 ॥

ఎవరైతే కాలపరిపాకముచే మానవులుగా పుట్టి కూడా హెూమములను చేయకుండా, ఋత్విక్కులు కాకుండా ఉంటారో వారు నరాధములగుదురు.

ఏష దేవి మయా సర్వసంశయచ్ఛేదనాయ తే ।
కుశలాకుశలో నృణాం వ్యాఖ్యాతో ధర్మసాగరః ॥ 63 ॥

దేవీ! నీ సమస్త సంశయములను తీర్చుటకై మానవుల యొక్క క్షేమాక్షేమములను, ధర్మసాగరమును వివరించితిని.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఉమామహేశ్వరసంవాదే ధర్మనిరూపణం నామ సప్తదశాధికశతతమోఽధ్యాయః. ॥117॥

శ్రీ బ్రహ్మపురాణమునందలి ఉమామహేశ్వరసంవాదములోని ధర్మనిరూపణమనే పేరుగల నూట పదిహేడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాదశాధికశతతమోఽధ్యాయః – నూట పదునెనిమిదవ అధ్యాయం
ఋషిమహేశ్వరసంవాదః – ఋషి మహేశ్వరుల సంవాదం

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

శ్రుత్వైవం సా జగన్మాతా భర్తుర్వచనమాదితః ।
హృష్టా బభూవ సుప్రీతా విస్మితా చ తదా ద్విజాః ॥ 1 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా జగన్మాత అయిన పార్వతి భర్త అయిన ఈశ్వరుని మాటలను మొదటినుండి విని అప్పుడు ఆశ్చర్యమును, సంతోషమును పొందినది.

యే తత్రాఽఽసన్మునివరాస్త్రిపురారేః సమీపతః ।
తీర్థయాత్రాప్రసంగేన గతాస్తస్మిన్గిరౌ ద్విజాః ॥ 2 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ కొండయందున్న మునులు తీర్థయాత్రాప్రసంగమునుచేస్తూ త్రిపురాంతకుడైన ఈశ్వరుని వద్దకు వెళ్ళారు.

తేఽపి సంపూజ్య తం దేవం శూలపాణిం ప్రణమ్య చ ।
పప్రచ్ఛుః సంశయం చైవ లోకానాం హితకామ్యయా ॥ 3 ॥

వారు శూలపాణియైన శివునికి నమస్కరించి, పూజించి, లోకమునకు హితమును గోరిన వారై వారి సంశయము నిలా అడిగారు.

మునయః ఊచుః :– మునులు పలికారు.

త్రిలోచన! నమస్తేఽస్తు దక్షక్రతువినాశన! ।
పృచ్ఛామస్త్వాం జగన్నాథ! సంశయం హృది సంస్థితమ్ ॥ 4 ॥

దక్షుని యజ్ఞమును వినాశనము చేసిన త్రిలోచనా! నీకు నమస్కారము. ఓ జగన్నాథా! మా హృదయము నందున్న సందేహమును అడుగుచున్నాము.

సంసారేఽస్మిన్మహాఘోరే భైరవే లోమహర్షణే ।
భ్రమంతి సుచిరం కాలం పురుషాశ్చాల్పమేధసః ॥ 5 ॥

మహాఘోరమైన భీతిని, రోమాంచములను కలిగించే ఈ సంసారములో మానవులు అల్పమేధస్సు గలవారై చాలాకాలము వరకు తిరుగుచున్నారు.

యేనోపాయేన ముచ్యంతే జన్మసంసారబంధనాత్ ।
బ్రూహి తచ్ఛ్రోతుమిచ్ఛామః పరం కౌతూహలం హి నః ॥ 6 ॥

ఏ ఉపాయముతో జన్మసంసారబంధనమునుండి విముక్తులవుతారో చెప్పండి. అది వినుటకు మేము మిక్కిలి కుతూహలముతో వున్నాము.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

కర్మపాశనిబద్ధానాం నరాణాం దుఃఖభాగినామ్ ।
నాన్యోపాయం ప్రపశ్యామి వాసుదేవాత్పరం ద్విజాః ॥ 7 ॥

ఓ బ్రాహ్మణులారా! కర్మపాశబద్ధులై దుఃఖభాగులైన ఈ మానవులకు వాసుదేవుడు తప్ప ఇతరమైన ఉపాయమేదీ నాకు కనిపించుట లేదు.

యే పూజయంతి తం దేవం శంఖచక్రగదాధరమ్ ।
వాఙ్మనఃకర్మభిః సమ్యక్తే యాంతి పరమం పదమ్ ॥ 8 ॥

మనోవాక్కాయకర్మలతో శంఖచక్రగదాధరుడైన శ్రీమన్నారాయణుని చక్కగా పూజించేవారు పరమపదమును పొందగలరు.

కిం తేషాం జీవితేనేహ పశువచ్చేష్టితేన చ ।
యేషాం న ప్రవణం చిత్తం వాసుదేవే జగన్మయే ॥ 9 ॥

జగత్తంతా నిండియున్న వాసుదేవునియందు ప్రవర్తించని మనస్సుగల, పశుచేష్టలతో కూడియున్న వారి జీవితమిక ఎందుకు?

ఋషయః ఊచుః :- ఋషులు పలికారు.

పినాకిన్భగనేత్రఘ్న! సర్వలోక నమస్కృత! ।
మాహాత్మ్యం వాసుదేవస్య శ్రోతుమిచ్ఛామ శంకర ॥ 10 ॥

ఓ శంకరా! పినాకమును ధరించినవాడా! భగుడు అను ఆదిత్యుని నేత్రమును పోగొట్టినవాడా! సమస్త లోకములచే నమస్కరించబడువాడా! మేము వాసుదేవుని యొక్క మాహాత్మ్యమును వినగోరుచున్నాము.

మహేశ్వర ఉవాచ :- మహేశ్వరుడు పలికాడు.

పితామహాదపి వరః శాశ్వతః పురుషో హరిః ।
కృష్ణో జాంబూనదాభాసో వ్యభ్రే సూర్య ఇవోదితః ॥ 11 ॥

శ్రీహరి బ్రహ్మకంటె శ్రేష్ఠుడు, శాశ్వతమైన పురుషుడు, బంగారంవలె ప్రకాశించువాడు, అపరిమితమైన ఆనందమును కలిగించువాడు, శ్యామవర్ణం కలవాడు, మబ్బులేని ఆకాశంలో సూర్యునివలె ఉదయించినాడు.

దశబాహుర్మహాతేజా దేవతారి నిషూదనః ।
శ్రీవత్సాంకో హృషీకేశః సర్వదైవతయూథపః ॥ 12 ॥

దేవ శత్రువులను నశింప చేయువాడు, మహాతేజస్సుతో కూడుకొని యున్నవాడు, శ్రీవత్సచిహ్నముకల వాడు, హృషీకేశుడు, పది బాహువులు కలిగినవాడు, సమస్త దేవతా సమూహములను రక్షించువాడు.

బ్రహ్మా తస్యోదరభవస్తస్యాహం చ శిరోభవః ।
శిరోరుహేభ్యో జ్యోతీంషి రోమభ్యశ్చ సురాసురాః ॥ 13 ॥

బ్రహ్మ అతని ఉదరమునుండి పుట్టినవాడు. నేనతని శిరోభాగమునుండి పుట్టిన వానిని. అతని తలవెంట్రుకలనుండి నక్షత్రాలుద్భవించాయి. అతని రోమములనుండి దేవతలు, రాక్షసులుద్భవించినారు.

ఋషయో దేహసంభూతాస్తస్య లోకాశ్చ శాశ్వతాః ।
పితామహగృహం సాక్షాత్సర్వదేవగృహం చ సః ॥ 14 ॥

అతని దేహమునుండే శాశ్వతాలైన సమస్త లోకములు, ఋషులుద్భవించారు. పితామహునికి, సమస్త, దేవతలకు పుట్టినిల్లు అతడే.

సోఽస్యాః పృథివ్యాః కృత్స్నాయాః స్రష్టా త్రిభువనేశ్వరః ।
సంహర్తా చైవ భూతానాం స్థావరస్య చరస్య చ ॥ 15 ॥

అతడే ఈ భూమికి, సకల చరాచర జగత్తున కంతటికి సృష్టికర్త.ముల్లోకములకు ఈశ్వరుడు. స్థావర జంగమ భూతములన్నింటిని సంహరించేవాడూ అతడే.

స హి దేవవరః సాక్షాద్దేవనాథః పరంతప ।
సర్వజ్ఞః సర్వసంస్రష్టా సర్వగః సర్వతోముఖః ॥ 16 ॥

న తస్మాత్పరమం భూతం త్రిషు లోకేషు కించన ।
సనాతనో మహాభాగో గోవింద ఇతి విశ్రుతః ॥ 17 ॥

ఋషులారా! అతడే దేవతా శ్రేష్ఠుడు, సాక్షాత్తుగా దేవనాథుడు, సర్వజ్ఞుడు, చక్కగా అన్నింటిని సృష్టించువాడు, అన్ని దిక్కులకు వెళ్ళువాడు, సర్వతోముఖుడు. ముల్లోకములలో అతని కంటె ఉత్కృష్టమైన ఇతరమైన భూతము మరేదీ లేదు. సనాతనుడుమూడుకాలలో ఉండేవాడు. పరమపూజ్యుడు. అతడు గోవిందుడని పేరొందినవాడు.

స సర్వాన్పార్థివాన్సంఖ్యే ఘాతయిష్యతి మానదః ।
సురకార్యార్థముత్పన్నో మానుష్యం వపురాస్థితః ॥ 18 ॥

అహంకారాన్ని నాశనం చేసే అతడు క్షత్రియులందరిని చంపగలడు. దేవతల కార్యమును సాధించుట కొరకు మానవశరీరముతో నున్నాడు.

న హి దేవగణాః శక్తాస్త్రివిక్రమవినాకృతాః ।
భువనే దేవకార్యాణి కర్తుం నాయకవర్జితాః ॥ 19 ॥

లోకంలో త్రివిక్రముడు లేకపోతే నాయకుడులేని దేవతలెవ్వరు ఏ కార్యమును సాధించలేరు.

నాయకః సర్వభూతానాం సర్వభూత నమస్కృతః ।
ఏతస్య దేవనాథస్య కార్యస్య చ పరస్య చ ॥ 20 ॥

బ్రహ్మభూతస్య సతతం బ్రహ్మర్షిశరణస్య చ ।
బ్రహ్మే వసతి నాభిస్థః శరీరేఽహం చ సంస్థితః ॥ 21 ॥

సమస్త భూతములకు నాయకుడు, సమస్త భూతములచే నమస్కరింప బడువాడు, ఇటువంటి దేవనాథునకు, కార్యరూపునకు, అన్నింటికి పరమైనవానికిని, పరబ్రహ్మం అయినట్టియు, బ్రహ్మర్షులందరకు శరణం అయిన వానియొక్క నాభియందు బ్రహ్మ ఉన్నాడు. అతని శరీరమునందు నేనుందును.

సర్వాః సుఖం సంస్థితాశ్చ శరీరే తస్య దేవతాః ।
స దేవః పుండరీకాక్షః శ్రీగర్భః శ్రీసహోషితః ॥ 22 ॥

అతని శరీరములోనే సమస్త దేవతలు సుఖముగా నుందురు. అతడే పుండరీకములవంటి నేత్రములు కలవాడు. వేదములు మూలంగా కలవాడు. లక్ష్మీదేవితో కూడుకొని యున్నవాడు.

శార్ఙ్గచక్రాయుధః ఖడ్గీ సర్వనాగరిపుధ్వజః ।
ఉత్తమేన సుశీలేన శౌచేన చ దమేన చ ॥ 23 ॥

పరాక్రమేణ వీర్యేణ వపుషా దర్శనేన చ ।
ఆరోహణప్రమాణేన వీర్యేణాఽఽర్జవసంపదా ॥ 24 ॥

ఆనృశంస్యేన రూపేణ బలేన చ సమన్వితః ।
అస్త్రైః సముదితః సర్వైర్దివ్యైరద్భుతదర్శనైః ॥ 25 ॥

యోగమాయా సహస్రాక్షో విరూపాక్షో మహామనాః ।
వాచా మిత్రజనశ్లాఘీ జ్ఞాతిబంధుజనప్రియః ॥ 26 ॥

క్షమావాంశ్చానహంవాదీ స దేవో బ్రహ్మదాయకః ।
భయహర్తా భయార్తానాం మిత్రానందవివర్ధనః ॥ 27 ॥

శరణ్యః సర్వభూతానాం దీనానాం పాలనే రతః ।
శ్రుతవానర్థసంపన్నః సర్వభూతనమస్కృతః ॥ 28 ॥

సమాశ్రితానాముపకృచ్ఛతౄణాం భయకృత్తథా ।
నీతిజ్ఞో నీతిసంపన్నో బ్రహ్మవాదీ జితేంద్రియః ॥ 29 ॥

భవార్థమేవ దేవానాం బుద్ధ్యా పరమయా యుతః ।

అతడే శంఖము, చక్రము, ఖడ్గము మున్నగు ఆయుధములను ధరించినవాడు. సమస్తనాగులకు శత్రువైన గరుత్మంతుడే ధ్వజముగా గలవాడు. ఉత్తమమైన శీలముతో, శుచితో, దమముతోను, పరాక్రమముతోను, వీర్యముతోను, శరీరకాంతితో దర్శనంతో, ఆరోహణ ప్రమాణముతో పరాక్రమముతో స్వచ్ఛమైన శీల సంపదతోనూ, దయార్ద్రమైన, రూపముతో, బలముతో కూడుకొనియుండి, చూచుట కాశ్చర్యమును గొలిపే దివ్యమైన సమస్త

అస్త్రసంపద గలవాడు. యోగమాయతో కూడి వేయి కన్నులు గలవాడు, విరూపాక్షుడు, గొప్పమనస్సు కలవాడు, మిత్రజనుల వాక్కులతో పొగడబడువాడు, జ్ఞాతి బంధుజనప్రియుడు, క్షమాగుణం కలిగినవాడు, నిరహంకారి. ఆ దేవుడే బ్రహ్మను సృష్టించినవాడు, భయముతో కూడిన ఆర్తులకు భయమును పోగొట్టువాడు, మిత్రుల కానందమును పెంచువాడు, సర్వభూతములు శరణు పొందదగినవాడు, దీనులను రక్షించుటయందు ఆసక్తి చూపువాడు, జ్ఞాని, ధనసంపదగలిగినవాడు, సమస్త భూతములచే నమస్కరించబడువాడు, తన నాశ్రయించినవారికి ఉపకారమును చేయువాడు, అదేవిధముగా శతృవులకు భయమును కలిగించువాడు, నీతిజ్ఞుడు, నీతిసంపన్నుడు, బ్రహ్మావాది, ఇంద్రియములను జయించినవాడు, దేవతల యొక్క ఉనికికోసమే పరమమైన బుద్ధితో కూడుకొనియుండువాడు.

ప్రాజాపత్యే శుభే మార్గే మానవే ధర్మసంస్కృతే ॥ 30 ॥

సముత్పత్స్యతి గోవిందో మనోర్వంశే మహాత్మనః ।
అంశో నామ మనోఃపుత్రో హ్యంతర్ధామా తతః పరమ్ ॥ 31 ॥

ధర్మసంస్కృతమైన, శుభమైన, మానవమార్గములో, మహాత్ముడైన మను ప్రజాపతి వంశములో గోవిందుడు ఉద్భవించగలడు. ఆ తరువాత మనువునకు 'అంశ'అనే అతడు కుమారుడు. ఆ అంశునకు 'అంతర్ధామ' కొడుకు.

అంతర్ధామ్నో హవిర్ధామా ప్రజాపతిరనిందితః ।
ప్రాచీన బర్హిర్భవితా హవిర్ధామ్నః సుతో ద్విజాః ॥ 32 ॥

ఓ బ్రాహ్మణులారా! ఏ నిందలూ పొందని అంతర్ధామునకు హవిర్ధాముడను ప్రజాపతి కుమారుడుగా నుండెను. హవిర్ధాముని యొక్క కుమారుడు ప్రాచీనబర్హియను పేరుగలవాడు.

తస్య ప్రచేతః ప్రముఖా భవిష్యంతి దశాఽఽత్మజాః ।
ప్రాచేతసస్తథా దక్షో భవితేహ ప్రజాపతిః ॥ 33 ॥

ప్రాచీనబర్హికి ప్రచేతసుడు మొదలగు పదిమంది కుమారులు గలుగుదురు. అదేవిధముగా ప్రాచేతసులలో దక్షుడనేవాడు ప్రజాపతియగును.

దాక్షాయణ్యస్తథాఽఽదిత్యో మనురాదిత్యతస్తతః ।
మనోశ్చ వంశజ ఇలా సుద్యుమ్నశ్చ భవిష్యతి ॥ 34 ॥

దక్షునికి ఆదిత్యుడు, ఆ తరువాత ఆదిత్యునకు మనువు, మనువువంశంలో ఇలా, సుద్యుమ్నుడు అను పేర్లుగలవారు పుట్టగలరు.

బుధాత్పురూరవాశ్చాపి తస్మాదాయుర్భవిష్యతి ।
నహుషో భవితా తస్మాద్యయాతిస్తస్య చాఽఽత్మజః ॥ 35 ॥

బుధునికి పురూరవుడు, పురూరవునికి ఆయువనువాడు కుమారుడు. అతనికి నహుషుడు, నహుషునకు యయాతి అను కుమారుడుదయించును.

యదుస్తస్మాన్మహాసత్త్వః క్రోష్టా తస్మాద్భవిష్యతి ।
క్రోష్టుశ్చైవ మహాన్పుత్రో వృజినీవాన్భవిష్యతి ॥ 36 ॥

యయాతికి మహాసత్త్వుడైన యదు, యదునకు క్రోష్టా అను పుత్రుడుదయించును. క్రోష్టునకు వృజినీవంతుడను గొప్ప కుమారుడు కలుగ గలడు.

వృజినీవతశ్చ భవితా ఉషంగురపరాజితః ।
ఉషంగోర్భవితా పుత్రః శూరశ్చిత్రరథస్తథా ॥ 37 ॥

వృజినీవంతునకు పరాజయమునెరుగని ఉషంగుడనువాడు పుత్రునిగా జన్మించును. అట్లే ఉషంగుడనువానికి శూరుడైన చిత్రరథుడనే కుమారుడుదయించును.

తస్య త్వవరజః పుత్రః శూరో నామ భవిష్యతి ।
తేషాం విఖ్యాతవీర్యాణాం చారిత్రరుణశాలినామ్ ॥ 38 ॥

యజ్వినాం చ విశుద్ధానాం వంశే బ్రాహ్మణసత్తమాః ।
స శూరః క్షత్రియశ్రేష్ఠో మహావీర్యో మహాయశాః ॥ 39 ॥

ఓ బ్రహ్మణోత్తములారా! చిత్రరథునకు శూరుడనే కుమారుడు కలుగును. పరాక్రమంలో ప్రఖ్యాతి పొందిన, చారిత్రిక గుణశాలులైనటువంటి, యజ్ఞయాగాదులు నిర్వహించే విశుద్ధులైనవారి వంశమునందు ఆ శూరుడను రాజు. గొప్పకీర్తి కలిగి, గొప్ప వీరుడై క్షత్రియులలో శ్రేష్ఠుడవుతాడు.

స్వవంశవిస్తారకం జనయిష్యతి మానదమ్ ।
వసుదేవమితి ఖ్యాతం పుత్రమానకదుందుభిమ్ ॥ 40 ॥

ఆ శూరుడు తన వంశమును విస్తరించేవాడు, అభిమానమును పంచేవాడు, ఆనకదుందుభి అని పేరుపొందే వసుదేవుడనే కుమారుని కనగలడు.

తస్య పుత్రశ్చతుర్బాహుర్వాసుదేవో భవిష్యతి ।
దాతా బ్రాహ్మణసత్కర్తా బ్రహ్మభూతో ద్విజప్రియః ॥ 41 ॥

అటువంటి వసుదేవునకు బ్రాహ్మణులకు ప్రియమైనవాడు, బ్రాహ్మణులను సత్కరించేవాడు, దాత, బ్రహ్మభూతుడైన, నాలుగు చేతులు కలిగిన వాసుదేవుడనే పుత్రుడు కలుగును.

రాజ్ఞో బద్ధాన్స సర్వాన్వై మోక్షయిష్యతి యాదవః ।
జరాసంధం తు రాజానం నిర్జిత్య గిరిగహ్వరే ॥ 42 ॥

యాదవుడైన వాసుదేవుడు పర్వతగుహలోనున్న జరాసంధుడనే రాజును ఓడించి ఆ రాజుచే బంధింపబడిన రాజులందరిని బంధవిముక్తులను చేయగలదు.

సర్వపార్థివరత్నాఢ్యో భవిష్యతి స వీర్యవాన్ ।
పృథివ్యామప్రతిహతో వీర్యేణాపి భవిష్యతి ॥ 43 ॥

ఆ వీర్యవంతుడు సమస్తరాజరత్నములలో ముఖ్యుడగును. ఈ భూమియందు తన పరాక్రమముతో ఎదురులేనివాడు కాగలడు.

విక్రమేణ చ సంపన్నః సర్వపార్థివపార్థివః ।
శూరః సంహననో భూతో ద్వారకాయాం వసన్ప్రభుః ॥ 44 ॥

తన పరాక్రమముతో దోషులందరినీ నశింపచేయుచు శూరుడైన ఆ ప్రభువు సంపన్నుడై, సర్వరాజాధిరాజుగా ద్వారకలో నివసించును.

పాలయిష్యతి గాం దేవీం వినిర్జిత్య దురాశయాన్ ।
తం భవంతః సమాసాద్య బ్రాహ్మణైరర్హణైర్వరైః ॥ 45 ॥

అర్చయంతు యథాన్యాయం బ్రహ్మాణమివ శాశ్వతమ్ ।
యో హి మాం ద్రష్టుమిచ్ఛేత బ్రహ్మాణం చ పితామహమ్ ॥ 46 ॥

ద్రష్టవ్యస్తేన భగవాన్వాసుదేవః ప్రతాపవాన్ ।
దృష్టే తస్మిన్నహం దృష్టో న మేఽత్రాస్తి విచారణా ॥ 47 ॥

దురాశయముతో కూడుకొనియున్న వారిని ఓడించి, భూదేవిని పరిపాలించగలడు. మీరు అటువంటి మహానుభావుని వద్దకు శ్రేష్ఠమైన, యోగ్యులైన బ్రాహ్మణులతో కలిసివెళ్లి, ఆ శూరుని శాశ్వతుడైన బ్రహ్మనువలె యథావిధిగా పూజించండి. ఎవడు నన్నూ, పితామహుడైన బ్రహ్మనూ చూడాలని కోరతాడో అతని చేత ప్రతాపవంతుడూ భగవంతుడూ అయిన వాసుదేవుడు చూడదగినవాడు. అతన్ని దర్శించితే నన్ను దర్శించినట్లే. ఈ విషయంలో నాకు వేరే విచారమేదీ లేదు.

పితామహో వాసుదేవ ఇతి విత్త తపోధనాః ।
స యస్య పుండరీకాక్షః ప్రీతియుక్తో భవిష్యతి ॥ 48 ॥

తస్య దేవగణః ప్రీతో బ్రహ్మపూర్వో భవిష్యతి ।
యస్తు తం మానవో లోకే సంశ్రయిష్యతి కేశవమ్ ॥ 49 ॥

ఓ తపోధనులారా! వాసుదేవుడే పితామహునిగా తెలుసుకొనుడు. ఎవరికైతే ఆ పుండరీకాక్షుడు ప్రీతియుక్తుడగునో ఏ మానవుడు ఆ కేశవుని ఈ లోకమునందు ఆశ్రయించగలడో అతడు దేవగణములతో ప్రీతినొంది బ్రహ్మపూర్వుడగును.

తస్య కీర్తిర్యశశ్చైవ స్వర్గశ్చైవ భవిష్యతి ।
ధర్మాణాం దేశికః సాక్షాద్భవిష్యతి స ధర్మవాన్ ॥ 50 ॥

అట్లు దర్శించిన వారికి కీర్తి, యశము, స్వర్గము లభించును. ధర్మములన్నింటికి ధర్మస్వరూపుడైన ఆ వాసుదేవుడే సాక్షాత్తుగా దేశికుడు కాగలడు.

ధర్మవిద్భిః స దేవేశో నమస్కార్యః సదాఽచ్యుతః ।
ధర్మ ఏవ సదా హి స్యాదస్మిన్నభ్యర్చితే విభౌ ॥ 51 ॥

ధర్మము తెలిసినవారిచేత ఆ అచ్యుతుడైన దేవేశుడు ఎల్లప్పుడు నమస్కరింపదగినవాడు. ఈ విభుని అర్చించుటయందే ధర్మమెల్లప్పుడుండును.

స హి దేవో మహాతేజాః ప్రజాహిత చికీర్షయా ।
ధర్మార్థం పురుషవ్యాఘ్ర ఋషికోటీః ససర్జ చ ॥ 52 ॥

ఆ మహాతేజస్సు కలిగిన దేవుడే ప్రజలకు హితమును చేయవలయునను కోరికతో, ధర్మమును రక్షించుటకై ఆ పురుషవ్యాఘ్రుడు ఋషి కోటులను సృజించెను.

తాః సృష్టాస్తేన విధినా పర్వతే గంధమాదనే ।
సనత్కుమార ప్రముఖాస్తిష్ఠంతి తపసాఽన్వితాః ॥ 53 ॥

అతని ఆజ్ఞతోనే అతని చేత సృష్టించబడిన సనత్కుమారుడు మున్నగు ప్రముఖులైన ఋషులు గంధమాదన పర్వతముపై తపస్సును చేయుచున్నారు.

తస్మాత్స వాగ్మీ ధర్మజ్ఞో నమస్యో ద్విజపుంగవాః ।
వందితో హి స వందేత మానితో మానయీత చ ॥ 54 ॥

అందువలన ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! వాగ్మి, ధర్మజ్ఞుడైన అతడు నమస్కరింపదగినవాడు. అంతేకాక ఇంతకు పూర్వమే స్తోత్రముచేయబడిన వాడైనప్పటికిని స్తోత్రము చేయవలయును. గౌరవించబడిన వాడైనప్పటికిని గౌరవించవలయును.

దృష్టః పశ్యేదహరహః సంశ్రితః ప్రతిసంశ్రయేత్ ।
అర్చితశ్చార్చయేన్నిత్యం స దేవో ద్విజసత్తమాః ॥ 55 ॥

ఇది వరకు చూడబడిన వాడైనప్పటికిని మరల మాటిమాటికి దర్శించవలయును. ఇది వరకే ఆశ్రయించబడిన వాడైనప్పటికిని మరల ఆశ్రయించవలయును. ఆ దేవుడే అర్చనలనందుకున్న వాడైనప్పటికిని నిత్యమర్చించవలయును.

ఏవం తస్యానవద్యస్య విష్ణోర్వై పరమం తపః ।
ఆదిదేవస్య మహతః సజ్జనాచరితం సదా ॥ 56 ॥

ఈవిధముగా ఆదిదేవుడైన అనవద్యుడైన ఆ విష్ణువును గూర్చి సజ్జనులు పరమమైన తపస్సును ఎల్లప్పుడు ఆచరించారు.

భువనేఽభ్యర్చితో నిత్యం దేవైరపి సనాతనః ।
అభయేనానురూపేణ ప్రపద్య తమనువ్రతాః ॥ 57 ॥

ఈ భువనమునందు దేవతలందరిచేతను నిత్యమూ ఆ సనాతనుడర్చించబడినాడు. తదనుగుణమైన అభయమును పొంది ప్రపన్నులై అతనిని అనుసరించారు.

కర్మణా మనసా వాచా స నమస్యో ద్విజైః సదా ।
యత్నవద్భిరవశ్యోఽయం ద్రష్టవ్యో దేవకీసుతః ॥ 58 ॥

ఏష వై విహితో మార్గో మయా వై మునిసత్తమాః ।
తం దృష్ట్వా సర్వదేవేశం హృష్టాః స్యుః సురసత్తమాః ॥ 59 ॥

మనోవాక్కాయ కర్మలతో అతనిని పొందాలని ప్రయత్నించే బ్రాహ్మణులందరిచేతను తప్పక చూడదగినవాడు, నమస్కరింపదగినవాడు ఆ దేవకీసుతుడే. ఓ మునిసత్తములారా! నేను మీకు విహితముగా చెప్పునది ఈ మార్గమే. ఆ సర్వదేవేశుడైన స్వామిని చూచి సురసత్తములందరు సంతోషము నొందుదురుగాక!

మహావరాహం తం దేవం సర్వలోకపితామహమ్ ।
అహం చైవ నమస్యామి నిత్యమేవ జగత్పతిమ్ ॥ 60 ॥

సర్వలోకపితామహుడు, జగత్పతి, దేవదేవుడైన ఆ మహావరాహుని గూర్చి నేను నిత్యము నమస్కరించుచున్నాను.

తత్ర చ త్రితయం దృష్టం భవిష్యతి న సంశయః ।
సమస్తా హి వయం దేవాస్తస్య దేహే వసామహే ॥ 61 ॥

అతనియందు త్రితయమును దర్శింతుమనుటలో ఏ సందేహము లేదు. మేము దేవతలందరము అతని దేహమునందే నివసించుచున్నాము.

తస్యైవ చాగ్రతో భ్రాతా సితాద్రినిచయప్రభః ।
హరిః బల ఇతి ఖ్యాతో భవిష్యతి ధరాధరః ॥ 62 ॥

అతనికి అన్నగా ముందు పుట్టువాడు, తెల్లనికొండవలె ప్రకాశించువాడు, హలమును ధరించువాడు 'బల' అను పేరుతో రాజుగా ఖ్యాతినొందగలడు.

త్రిశిరాస్తస్య దేవస్య దృష్టోఽనంత ఇతి ప్రభోః ।
సుపర్ణో యస్య వీర్యేణ కశ్యపస్యాఽఽత్మజో బలీ ॥ 63 ॥

అతడే అనంతుడను పేరుగలవాడు, అతడే ధనమునందు కుబేరుడు, కశ్యప కుమారుడైన గరుత్మంతునంతటి వీర్యము గల బలశాలి.

అంతం నైవాశకద్ద్రష్టుం దేవస్య పరమాత్మనః ।
స చ శేషో విచరతే పరయా వై ముదా యుతః ॥ 64 ॥

ఆ దేవుడైన పరమాత్ముని అంతమేదో తెలుసుకొనజాలము, చూపున కందనిది, అతడే శేషుడై పరమానందముతో సంచరించును.

అంతర్వసతి భోగేన పరిరభ్య వసుంధరామ్ ।
య ఏష విష్ణుః సోఽనంతో భగవాన్వసుధాధరః ॥ 65 ॥

భూమిని తన భోగముతో సంతోషపరుస్తూ లోపలనుండగలడు. అతడే పూజ్యుడైన విష్ణువు. అతడే ఈ భూమండలమును ధరించు అనంతుడు.

యో రామః స హృషీకేశోఽచ్యుతః సర్వధరాధరః ।
తావుభౌ పురుషవ్యాఘ్రౌ దివ్యౌ దివ్యపరాక్రమౌ ॥ 66 ॥

ఏ రాముడైతే ఉన్నాడో అతడే హృషీకేశుడు, అతడే సమస్త భూమండలమును ధరించు అచ్యుతుడు, వారిద్దరు పురుషవ్యాఘ్రములు, దివ్యమైన పరాక్రమము గల దివ్యులు.

ద్రష్టవ్యౌ మాననీయౌ చ చక్రలాంగలధారిణౌ ।
ఏష వోఽనుగ్రహః ప్రోక్తో మయా పుణ్యస్తపోధనాః ॥
తద్భవంతో యదుశ్రేష్ఠం పూజయేయుః ప్రయత్నతః ॥ 67 ॥

ఓ తపోధనులారా! చక్రమును, హలమును ధరించు ఆ మహానుభావులు దర్శింపదగినవారు. నేను చెప్పిన ఈ పుణ్య స్వరూపము వారి అనుగ్రహము వలన చెప్పినదే. అందువలన మీరంతా ప్రయత్నించి ఆ యదుశ్రేష్ఠుని పూజింతురుగాక.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఋషిమహేశ్వర సంవాదేఽష్టాదశాధికశతతమోఽధ్యాయః. ॥ 118 ॥

శ్రీబ్రహ్మపురాణములోని ఋషి-మహేశ్వరుల సంవాదమునందలి నూట పదునెనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనవింశాధికశతతమోఽధ్యాయః – నూట పందొమ్మిదవ అధ్యాయం

వైష్ణవానాం గతిఖ్యాపనః – విష్ణుభక్తుల మార్గమును తెలుపుట.

మునయః ఊచుః :– మునులు పలికారు.

అహో కృష్ణస్య మాహాత్మ్యం శ్రుతమస్మాభిరద్భుతమ్ ।
సర్వపాపహరం పుణ్యం ధన్యం సంసారనాశనమ్ ॥ 1 ॥

ఆహా! సమస్తపాపములను తొలగించునటువంటి, సంసారమును నశింపచేయునటువంటి, ధన్యమైన, పుణ్యమైన, అద్భుతమైన శ్రీకృష్ణుని మాహాత్మ్యమును మేము వింటిమి.

సంపూజ్య విధివద్భక్త్యా వాసుదేవం మహామునే ।
కాం గతిం యాంతి మనుజా వాసుదేవార్చనే రతాః ॥ 2 ॥

ఓ మహామునీ! వాసుదేవుని అర్చించుట యందాసక్తి గలిగినవారు భక్తితో విధిపూర్వకముగా వాసుదేవుని ఆరాధించినవారు ఏ గతిని పొందగలరు?

కిం ప్రాప్నువంతి తే మోక్షం కిం వా స్వర్గం మహామునే ।
అథవా కిం మునిశ్రేష్ఠ ప్రాప్నువంత్యుభయం ఫలమ్ ॥ 3 ॥

ఓ మహామునీ! మునిశ్రేష్ఠుడా! వాసుదేవుని పూజించినందువలన మోక్షమును పొందుదురా? స్వర్గమును పొందుదురా? లేక ఈ రెంటిని ఫలముగా పొందుదురా?

ఛేత్తుమర్హసి సర్వజ్ఞ సంశయం నో హృది స్థితమ్ ।
ఛేత్తా నాన్యోఽస్తి లోకేఽస్మింస్త్వదృతే మునిసత్తమ ॥ 4 ॥

ఓ మునిసత్తమా! సర్వమునూ తెలిసినవాడా! మా హృదయమందున్న ఈ సంశయమును తొలగించుము. నీవు తప్ప ఈ లోకంలో ఈ సంశయమును తీర్చువాడు మరొకడు లేడు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

సాధు సాధు మునిశ్రేష్ఠా భవద్భిర్యదుదాహృతమ్ ।
శృణుధ్వమానుపూర్వ్యేణ వైష్ణవానాం సుఖావహమ్ ॥ 5 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! మీరు బాగుగా పలికితిరి. విష్ణుభక్తులకు ఆనందమును సుఖమును కలిగించునది విశదముగా చెప్పుచున్నాను వినుడు.

దీక్షామాత్రేణ కృష్ణస్య నరా మోక్షం వ్రజంతి వై ।
కిం పునర్యే సదా భక్త్యా పూజయంత్యచ్యుతం ద్విజాః ॥ 6 ॥

దీక్షను తీసుకున్నంత మాత్రాన విష్ణుభక్తులు మోక్షమును పొందగలరు. ఓ ద్విజులారా! ఇక సర్వదా అచ్యుతుని పూజించువారి విషయములో చెప్పవలసినదేమున్నది?

న తేషాం దుర్లభః స్వర్గో మోక్షశ్చ మునిసత్తమాః ।
లభంతే వైష్ణవాః కామాన్యాన్యాన్వాంఛంతి దుర్లభాన్ ॥ 7 ॥

అటువంటి వారికి స్వర్గముగాని మోక్షముగాని దుర్లభముగాదు. ఓ మునిసత్తములారా! దుర్లభమైన కోరికలేవైనా ఉంటే అటువంటి వాటిని కూడా విష్ణుభక్తులు పొందగలరు.

రత్నపర్వతమారుహ్య నరో రత్నం యథాఽఽదదేత్ ।
స్వేచ్ఛయా మునిశార్దూలాస్తథా కృష్ణాన్మనోరథాన్ ॥ 8 ॥

ఓ మునిపుంగవులారా! రత్నపర్వతమునెక్కిన మానవుడు రత్నమునెంత సులభముగా తీసికొనగలడో అట్లే కృష్ణునినుండి తన మనోరథములను స్వేచ్ఛగా పొందగలడు.

కల్పవృక్షం సమాసాద్య ఫలాని స్వేచ్ఛయా యథా ।
గృహ్ణాతి పురుషో విప్రాస్తథా కృష్ణాన్మనోరథాన్ ॥ 9 ॥

ఓ విప్రులారా! కల్పవృక్షము దగ్గరకు వెళ్ళినవాడు ఫలములనెంత సులభముగా పొందగలడో అదే విధముగా మానవుడు కృష్ణునినుండి తన మనోరథములను పొందగలడు.

శ్రద్ధయా విధివత్పూజ్య వాసుదేవం జగద్గురుమ్ ।
ధర్మార్థకామమోక్షాణాం ప్రాప్నువంతి నరాః ఫలమ్ ॥ 10 ॥

జగద్గురువైన వాసుదేవుని శ్రద్ధతో విధిపూర్వకముగా పూజించి ధర్మార్థకామమోక్షములకే ఫలమున్నదో దానిని మానవులు పొందగలరు.

ఆరాధ్య తం జగన్నాథం విశుద్ధేనాంతరాత్మనా ।
ప్రాప్నువంతి నరాః కామాన్సురాణామపి దుర్లభాన్ ॥ 11 ॥

విశుద్ధమైన అంతరాత్మతో మనస్సుతో ఆ జగన్నాథుని ఆరాధించి దేవతలు కూడా పొందలేని ఫలములను మానవులు పొందగలరు.

యేఽర్చయంతి సదా భక్త్యా వాసుదేవాఖ్యమవ్యయమ్ ।
న తేషాం దుర్లభం కించి ద్విద్యతే భువనత్రయే ॥ 12 ॥

అవ్యయుడైన వాసుదేవుడనే వానినెవరు సర్వదా భక్తితో అర్చింతురో వారికి ముల్లోకములలో దుర్లభమనున దేదీలేదు.

ధన్యాస్తే పురుషా లోకే యేఽర్చయంతి సదా హరిమ్ ।
సర్వపాపహరం దేవం సర్వకామఫలప్రదమ్ ॥ 13 ॥

ఈ లోకంలో సమస్తపాపములను పోగొట్టే, సర్వకామఫలప్రదుడైన, దేవదేవుడైన శ్రీహరిని సర్వదా పూజించేవారు ధన్యులు.

**బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియః శూద్రాన్త్యజాతయః ।
సంపూజ్య తం సురవరం ప్రాప్నువంతి పరాం గతిమ్ ॥ 14 ॥**

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, స్త్రీలు, శూద్రులు, అంత్యజాతులవారు ఆ దేవతాశ్రేష్ఠుడైన కృష్ణుని పూజించి మోక్షమును పొందగలరు.

**తస్మాచ్ఛృణుధ్వం మునయో యత్పృచ్ఛత మమానఘాః ।
ప్రవక్ష్యామి సమాసేన గతిం తేషాం మహాత్మనామ్ ॥ 15 ॥**

అందువలన ఓ పాపరహితులైన మునులారా! మీరు నన్నడిగిన దానిని గూర్చి, ఆ మహాత్ములను గూర్చి విశదముగా చెప్పబోవుచున్నాను వినుడు.

**త్యక్త్వా మానుష్యకం దేహం రోగాయతనమధ్రువమ్ ।
జరామరణసంయుక్తం జలబుద్బుదసంనిభమ్ ॥ 16 ॥**

**మాంసశోణితదుర్గంధం విష్మామూత్రాది సంయుతమ్ ।
అస్థిస్థూణమమేధ్యం చ స్నాయుచర్మశిరాన్వితమ్ ॥ 17 ॥**

**కామగేన విమానేన దివ్యగంధర్వనాదినా ।
తరుణాదిత్యవర్ణేన కింకిణీజాలమాలినా ॥ 18 ॥**

**ఉపగీయమానా గంధర్వైరప్సరోభిరలంకృతాః ।
వ్రజంతి లోకపాలానాం భవనం తే పృథక్ పృథక్ ॥ 19 ॥**

రోగములకు నిలయమైన, అశాశ్వతమైన, జరామరణములతో కూడియున్న నీటిబుడగవంటిది ఈ శరీరం. రక్తమాంసములతో దుర్గంధమైన, పురీష మూత్రములతో కూడుకొని, ఎముకలస్తంభములతో కూడుకొని, అమేధ్యమై స్నాయు చర్మ శిరములతో నిండుకొనియున్నదీ శరీరం. కోరికలనే విమానంతో, దివ్యగంధర్వనాదంతో, యవ్వన సూర్యతేజస్సుతో, చిరుగజ్జెల సవ్వడితో, గంధర్వులు గానం చేస్తుండగా, అప్సరసలచే నలంకరింపబడినవారై ఈ మనుష్యదేహమును వదిలిన జీవులు లోకపాలకులయొక్క భవనమును వేరు వేరుగా పొందుతారు.

**మన్వంతర ప్రమాణం తు భుక్త్వా కాలం పృథక్ పృథక్ ।
భువనాని పృథక్తేషాం సర్వభోగైరలంకృతాః ॥ 20 ॥**

సమస్త ఆభరణములతో నలంకరింపబడినవారై ఒక్కొక్క మన్వంతర కాలమువరకు భోగముల ననుభవిస్తూ ఒక్కొక్క భువనమునందు సంచరిస్తారు.

**తతోఽంతరిక్షలోకం తే యాంతి సర్వసుఖప్రదమ్ ।
తత్ర భుక్త్వా వరాన్భోగాన్దశ మన్వంతరం ద్విజాః ॥ 21 ॥**

**తస్మాద్గంధర్వలోకం తు యాంతి వై వైష్ణవా ద్విజాః ।
వింశన్మన్వంతరం కాలం తత్ర భుక్త్వా మనోరమాన్ ॥ 22 ॥**

భోగానాదిత్యలోకం తు తస్మాద్యాంతి సుపూజితాః ।
త్రింశన్మన్వంతరం తత్ర భోగాన్భుక్త్వాఽతిదైవతాన్ ॥ 23 ॥

తస్మాద్వ్రజంతి తే విప్రాశ్చంద్రలోకం సుఖప్రదమ్ ।
మన్వంతరాణాం తే తత్ర చత్వారింశద్గుణాన్వితమ్ ॥ 24 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ తరువాత అక్కడ శ్రేష్ఠమైన భోగములననుభవించి, అంతరిక్షమనే సర్వ సుఖ ప్రదలోకమున పదిమన్వంతర కాలముల వరకు చక్కని భోగములననుభవించి, అక్కడినుండి ఆ విష్ణుభక్తులు గంధర్వలోకమును చేరుదురు. అక్కడ ఇరువది మన్వంతరముల కాలంవరకు మనస్సున కానందమును కల్గించే భోగముల ననుభవించినవారై, చక్కని పూజలందుకొని అక్కడినుండి ఆదిత్యలోకమును చేరుకుంటారు. అక్కడ ముప్పది మన్వంతరముల కాలం వరకు అతిదైవతములైన భోగములననుభవించి, ఆ తరువాత వారు సుఖప్రదమైన గుణాన్వితమైన చంద్రలోకమును చేరుదురు. వారక్కడ నలుబది మన్వంతరములుంటారు.

కాలం భుక్త్వా శుభాన్భోగాన్ జరామరణవర్జితాః ।
తస్మాన్నక్షత్రలోకం తు విమానైః సమలంకృతమ్ ॥ 25 ॥

అక్కడ జరామరణములు లేకుండా నలుబది మన్వంతరాలు శుభమైన భోగముల ననుభవించి, విమానములతో చక్కగా నలంకరించబడిన నక్షత్రలోకమును చేరుదురు.

వ్రజంతి తే మునిశ్రేష్ఠా గుణైః సర్వైరలంకృతాః ।
మన్వంతరాణాం పంచాశద్భుక్త్వా భోగాన్యథేప్సితాన్ ॥ 26 ॥

తస్మాద్వ్రజంతి తే విప్రా దేవలోకం సుదుర్లభమ్ ।
షష్టిమన్వంతరం యావత్తత్ర భుక్త్వా సుదుర్లభాన్ ॥ 27 ॥

భోగాన్నానావిధాన్విప్రా సిద్ధ్యష్టకసమన్వితాన్ ।
శక్రలోకం పునస్తస్మాద్గచ్ఛంతి సురపూజితాః ॥ 28 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! వారక్కడ సమస్తగుణములతోనలంకరింపబడినవారై ఆ నక్షత్రలోకంలో యాభై మన్వంతరముల కాలం వరకు తాము కోరిన భోగముల ననుభవించి, వారు ఆ లోకమునుండి బయలుదేరి సుదుర్లభమైన దేవలోకమును చేరుదురు. అక్కడ అరువది మన్వంతరముల కాలం వరకు సుదుర్లభమైన భోగముల ననుభవించి, అంతేకాక అణిమాది అష్టసిద్ధులతో కూడిన అనేక విధములైన భోగములను కూడా పొంది, దేవతలచే పూజింపబడినవారై అక్కడినుండి ఇంద్రలోకమును చేరుదురు.

మన్వంతరాణాం తత్రైవ భుక్త్వా కాలం చ సప్తతిమ్ ।
భోగానుచ్చావచాన్దివ్యాన్మనసః ప్రీతివర్ధనాన్ ॥ 29 ॥

తస్మాద్వ్రజంతి తే లోకం ప్రాజాపత్యమనుత్తమమ్ ।
భుక్త్వా తత్రేప్సితాన్భోగాన్సర్వకామగుణాన్వితాన్ ॥ 30 ॥

మన్వంతరమశీతిం చ కాలం సర్వసుఖప్రదమ్ ।
తస్మాత్పైతామహం లోకం యాంతి తే వైష్ణవా ద్విజాః ॥ 31 ॥

ఓ ద్విజులారా! ఆ విష్ణుభక్తులు మనస్సునకు ప్రీతిని పెంచే ఉచ్చావచములనే దివ్యమైన భోగములను డెబ్బది మన్వంతరముల కాలమువరకు అక్కడే అనుభవించి, అక్కడినుండి అత్యుత్తమమైన ప్రాజాపత్యమనే లోకమును చేరి అక్కడ సమస్త కోరికలను తీర్చే గుణములతో కూడియున్న భోగముల నన్నింటిని ఎనభై మన్వంతరముల కాలము వరకు సుఖప్రదమైన ఆ ప్రాజాపత్యలోకంలో అనుభవించినవారై అక్కడనుండి పితామహలోకమును చేరుదురు.

మన్వంతరాణాం నవతి క్రీడిత్వా తత్ర వై సుఖమ్ ।
ఇహాఽఽగత్య పునస్తస్మాద్విప్రాణాం ప్రవరే కులే ॥ 32 ॥

పితామహ లోకమునందు తొంభై మన్వంతరముల కాలము వరకు సుఖముగా ఆనందము ననుభవించి తిరిగి శ్రేష్ఠమైన విప్రుల కులమునందు జన్మింతురు.

జాయంతే యోగినో విప్రా వేదశాస్త్రార్థపారగాః ।
ఏవం సర్వేషు లోకేషు భుక్త్వా భోగాన్యథేప్సితాన్ ॥ 33 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా సమస్త లోకములయందు యథేచ్ఛగా భోగముల ననుభవించి, ఈ లోకంలో వేదశాస్త్రార్థములు తెలిసిన పండితులుగా, యోగులుగా జన్మింతురు.

ఇహాఽఽగత్య పునర్యాంతి ఉపర్యుపరి చ క్రమాత్ ।
సంభవే సంభవే తే తు శతవర్షం ద్విజోత్తమాః ॥ 34 ॥

ఓ ద్విజోత్తములారా! తిరిగి ఈ లోకమునందు మరల మరల క్రమము ననుసరించి ఊర్ధ్వలోకములను చేరుదురు. మరల మరల జన్మిస్తూ నూరేండ్లు జీవింతురు.

భుక్త్వా యథేప్సితాన్భోగాన్యాంతి లోకాంతరం తతః ।
దశ జన్మ యదా తేషాం క్రమేణైవం ప్రపూర్యతే ॥ 35 ॥

తదా లోకం హరేర్దివ్యం బ్రహ్మలోకాద్వ్రజంతి తే ।
గత్వా తత్రాక్షయాన్భోగాన్భుక్త్వా సర్వగుణాన్వితాన్ ॥ 36 ॥

మన్వంతరశతం యావజ్జన్మమృత్యువివర్జితాః ।
గచ్ఛంతి భువనం పశ్చాద్వారాహస్య ద్విజోత్తమాః ॥ 37 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ విధముగా యథేచ్ఛగా భోగముల ననుభవించి, ఆ తరువాత లోకాంతరములకు వెళ్ళుదురు. ఈ విధముగా ఎప్పుడైతే పది జన్మలు పూర్తవుతాయో, అప్పుడు వారు బ్రహ్మలోకముద్వారా విష్ణువు యొక్క దివ్యమైన 'లోకము'ను చేరుదురు. అక్కడకు వెళ్ళి అక్షయమైన సర్వగుణాన్వితమైన భోగముల ననుభవించి, నూరు మన్వంతరముల కాలము జనన మరణములు లేకుండా 'ఆ లోకము'నందుండి ఆ తరువాత 'వారాహ' మనే భువనమును చేరుదురు.

దివ్యదేహాః కుండలినో మహాకాయా మహాబలాః ।
క్రీడంతి తత్ర విప్రేంద్రాః కృత్వా రూపం చతుర్భుజమ్ ॥ 38 ॥

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! అక్కడ గొప్ప శరీరము గలవారై, మహాబలవంతులై, నాలుగు భుజములు గల రూపముతో కుండలములను ధరించిన దివ్యదేహములు గలవారై క్రీడింతురు.

దశకోటిసహస్రాణి వర్షాణాం ద్విజసత్తమాః ।
తిష్ఠంతి శాశ్వతే భావే సర్వదేవైర్నమస్కృతాః ॥ 39 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! సమస్తదేవతలతో నమస్కరింపబడుతూ శాశ్వతమైన భావముతో పదివేల కోట్ల సంవత్సరము లక్కడ నుందురు.

తతో యాంతి తు తే ధీరాః నరసింహగృహం ద్విజాః ।
క్రీడంతే తత్ర ముదితా వర్షకోట్యయుతాని చ ॥ 40 ॥

ఆ తరువాత ఆ ధీరులు 'నరసింహగేహ' మనే స్థానమును చేరుదురు. అక్కడ కోటి అయుతముల వర్షముల పర్యంతము సంతోషముతో ఆనందము ననుభవింతురు.

తదంతే వైష్ణవం యాంతి పురం సిద్ధనిషేవితమ్ ।
క్రీడంతే తత్ర సౌఖ్యేన వర్షాణా మయుతాని చ ॥ 41 ॥

ఆ తరువాత చివరగా సిద్ధులచే సేవించబడుచున్న విష్ణుపురమునకు చేరుదురు. అక్కడ పదివేల సంవత్సరాల వరకు సుఖముగా క్రీడింతురు.

బ్రహ్మలోకే పునర్విప్రా గచ్ఛంతి సాధకోత్తమాః ।
తత్ర స్థిత్వా చిరం కాలం వర్షకోటిశతాన్బహూన్ ॥ 42 ॥

నారాయణపురం యాంతి తతస్తే సాధకేశ్వరాః ।
భుక్త్వా భోగాంశ్చ వివిధాన్వర్షకోట్యర్బుదాని చ ॥ 43 ॥

అనిరుద్ధపురం పశ్చాద్దివ్యరూపా మహాబలాః ।
గచ్ఛంతి సాధకవరాః స్తూయమానాః సురాసురైః ॥ 44 ॥

ఓ సాధకోత్తములైన విప్రులారా! తిరిగి వారు బ్రహ్మలోకమును చేరుదురు. అక్కడ అనేక వందలకోట్ల సంవత్సరములుండి, ఓ సాధకేశ్వరులారా! ఆ తరువాత వారు 'నారాయణపురమును' చేరుదురు. అక్కడ కోట్ల అర్బుదముల కాలము వివిధములైన భోగములను అనుభవించి, ఓ సాధకోత్తములారా! మహాబలులైన, దివ్యరూపులైన వారు సురాసురులచేత స్తోత్రమును చేయబడిన వారై తరువాత నారాయణ పురమునుండి 'అనిరుద్ధ' పురమును చేరుదురు.

తత్ర కోటిసహస్రాణి వర్షాణాం చ చతుర్దశ ।
తిష్ఠంతి వైష్ణవాస్తత్ర జరామరణవర్జితాః ॥ 45 ॥

అక్కడ ఈ విష్ణుభక్తులు జరామరణములు లేనివారై పదునాలుగు వేల కోట్ల సంవత్సరములుందురు.

ప్రద్యుమ్నస్య పురం పశ్చాద్గచ్ఛంతి విగతజ్వరాః ।
తత్ర తిష్ఠంతి తే విప్రా లక్షకోటిశతత్రయమ్ ॥ 46 ॥

ఆ తరువాత విగతజ్వరులై వారు 'ప్రద్యుమ్న' పురమును చేరుదురు. ఆ ప్రద్యుమ్నపురంలో మూడు వందల లక్షల కోట్ల సంవత్సరము లుందురు.

స్వచ్ఛందగామినో హృష్టా బలశక్తిసమన్వితాః ।
గచ్ఛంతి యోగినః పశ్చాద్యత్ర సంకర్షణః ప్రభుః ॥ 47 ॥

అక్కడ బలశక్తిసమన్వితులై, స్వేచ్ఛాసంచారులై సంతోషించిన వారు అక్కడినుండి 'సంకర్షణ ప్రభువు' వుండే చోటునకు చేరుదురు.

తత్రోషిత్వా చిరం కాలం భుక్త్వా భోగాన్సహస్రశః ।
విశంతి వాసుదేవేతి విరూపాఖ్యే నిరంజనే ॥ 48 ॥

అక్కడ చాలా కాలముండి వేల విధములుగా భోగములను అనుభవించి, నిరంజనమైన విరూపమనే పేరుగల 'వాసుదేవ'మనే స్థానమునకు చేరుదురు.

వినిర్ముక్తాః పరే తత్త్వే జరామరణవర్జితే ।
తత్ర గత్వా విముక్తాస్తే భవేయుర్నాత్ర సంశయః ॥ 49 ॥

లౌకిక జీవసంబంధములనుండి విముక్తులై, జరామరణ వర్జితులైన వారు మరెప్పుడూ జరా మరణములు రాని పరతత్త్వమునందు ముక్తులుగా పిలువబడుదురు. ఈ విషయంలో ఏ సందేహమునూ లేదు.

ఏవం క్రమేణ భుక్తిం తే ప్రాప్నువంతి మనీషిణః ।
ముక్తిం చ మునిశార్దూలా వాసుదేవార్చనే రతాః ॥ 50 ॥

ఓ మునిపుంగవులారా! మనీషులైన వారు ఈ విధముగా వాసుదేవుని యర్చించుట యందాసక్తులై క్రమముగా భుక్తిని, ముక్తిని గూడా పొందుదురు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వైష్ణవానాం గతిఖ్యాపనం నామైకోనవింశాధికశతతమోఽధ్యాయః. ॥ 119 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని 'విష్ణుభక్తుల మార్గమును తెలుపుట' అను పేరుగల నూటపందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

వింశత్యధికశతతమోఽధ్యాయః - నూట ఇరవైయవ అధ్యాయం

ఏకాదశీ జాగరణ గీతికాఫలః - ఏకాదశీ జాగరణ గీతికాఫలం

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఏకాదశ్యాముభే పక్షే నిరాహారః సమాహితః ।
స్నాత్వా సమ్యగ్విధానేన ధౌతవాసా జితేంద్రియః ॥ 1 ॥

ప్రతి మాసమునందు శుక్ల కృష్ణ పక్షములయందు వచ్చే ఏకాదశీ తిథులయందు విధివిధానము ననుసరించి స్నానముచేసి, తెల్లని వస్త్రములను ధరించి నిరాహారముగానుండి, జితేంద్రియుడై,

సంపూజ్య విధివద్విష్ణుం శ్రద్ధయా సుసమాహితః ।
పుష్పైర్గంధై స్తథా దీపైర్ధూపైర్నైవేద్యకైస్తథా ॥ 2 ॥

పుష్పధూపదీప గంధనైవేద్యాది అనేక ఉపచారములతో విధిపూర్వకముగా శ్రద్ధతో, (శ్రీమహావిష్ణువును పూజించి)

ఉపహారైర్బహువిధైర్జప్యై ర్హోమప్రదక్షిణైః ।
స్తోత్రై ర్నానావిధైర్దివ్యైర్గీతవాద్యైర్మనోహరైః ॥ 3 ॥

అనేక విధములైన ఉపహారములతో, జపములతో, హోమములతో, ప్రదక్షిణములతో, స్తోత్రములతో, అనేక విధములైన మనోహరములైన గీత వాద్యములతో,

దండవత్ప్రణిపాతైశ్చ జయశబ్దై స్తథోత్తమైః ।
ఏవం సంపూజ్య విధివద్రాత్రౌ కృత్వా ప్రజాగరమ్ ॥ 4 ॥

ఉత్తమములైన జయ జయ ధ్వానములతోను, దండవత్ప్రణామములతోనూ శ్రీమహావిష్ణువును పూజించి, విధిపూర్వకముగా రాత్రియందు చక్కగా జాగరణమును చేసి,

కథాం వా గీతికాం విష్ణోర్గాయన్విష్ణుపరాయణః ।
యాతి విష్ణోః పరం స్థానం నరో నాస్త్యత్ర సంశయః ॥ 5 ॥

విష్ణుసంబంధమైన కథనుకాని, గీతమునుకాని పాడుతూ విష్ణుపరాయణుడైయుండినచో అటువంటి మానవుడు తప్పక విష్ణుస్థానమును పొందుననుటలో సందేహములేదు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

ప్రజాగరే గీతికాయాః ఫలం విష్ణోర్మహామునే ।
బ్రూహి తచ్ఛ్రోతుమిచ్ఛామః పరం కౌతూహలం హి నః ॥ 6 ॥

ఓ మహామునీ! విష్ణువుయొక్క గీతములను పాడుటవలన, ప్రజాగరమును చేసినందువలన కలుగు ఫలమేదో వినవలెనని మాకు మిక్కిలి కుతూహలముగానున్నది. కావున దయచేసి దానిని గూర్చి వివరించుడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

శృణుధ్వం మునిశార్దూలా ప్రవక్ష్యామ్యనుపూర్వశః ।
గీతికాయాః ఫలం విష్ణోర్జాగరే యదుదాహృతమ్ ॥ 7 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! విష్ణువును గూర్చి గీతములు పాడుటవలన, జాగరణము చేయుటవలన కలుగు ఫలము నిదివరకేమనిచెప్పిరో దానిని వివరముగా చెప్పబోవుచున్నాను వినుడు.

అవంతీ నామ నగరీ బభూవ భువి విశ్రుతా ।
తత్రాఽఽస్తే భగవాన్విష్ణుః శంఖచక్రగదాధరః ॥ 8 ॥

భూలోకమునందు 'అవంతీ' అనుపేరుగల ప్రసిద్ధమైన నగరముండెను. అక్కడ పూజ్యుడు శంఖ చక్రగదాధరుడైన విష్ణువుండెను.

తస్యా నగర్యాః పర్యంతే చాండాలో గీతికోవిదః ।
సద్వృత్త్యోత్పాదితధనో భృత్యానాం భరణే రతః ॥ 9 ॥

ఆ నగరపు చివరన గానకళా విశారదుడైన ఒక చండాలుడుండెను. అతడు మంచి పనులను చేసి ధనమును సంపాదించి, తన సేవకులను పోషించుటయందాసక్తి కలవాడైయుండెను.

విష్ణుభక్తః స చండాలో మాసి మాసి దృఢవ్రతః ।
ఏకాదశ్యాం సమాగమ్య సోపవాసోఽథ గాయతి ॥ 10 ॥

ఆ విష్ణుభక్తుడైన చండాలుడు ప్రతి నెలయందు కూడా దృఢముగా ఏకాదశీవ్రతమును ఆచరిస్తూ ఉపవాసముండి గానము చేయుచుండును.

గీతికా విష్ణు నామాంకాః ప్రాదుర్భావ సమాశ్రితాః ।
గాంధార షడ్జనైషాద స్వరపంచమధైవతైః ॥ 11 ॥

రాత్రి జాగరణే విష్ణుం గాథాభిరుపగాయతి ।
ప్రభాతే చ ప్రణమ్యేశం ద్వాదశ్యాం గృహమేత్య చ ॥ 12 ॥

జామాతృ భాగినేయాంశ్చ భోజయిత్వా సకన్యకాః ।
తతః సపరివారస్తు పశ్చాద్భుంక్తే ద్విజోత్తమాః ॥ 13 ॥

విష్ణువు యొక్క అవతారములకు సంబంధించిన నామములతో కూడుకొనియున్న గీతములను గాంధార, షడ్జమ, నిషాద, ధైవతరాగములను పంచమ స్వరములో ఆలాపించి, రాత్రంతా జాగరణం చేసి విష్ణు కథలను గానం చేశాడు. ద్వాదశినాడు ఉదయముననే భగవంతునికి నమస్కరించి ఇంటికి వెళ్ళి, ఓ బ్రాహ్మణోత్తములారా!

అల్లునికి, సోదరికుమారులకు వారి అమ్మాయిలకు కూడా భోజనములను పెట్టి ఆ తరువాత తన పరివారముతో కలిసి భుజించును.

ఏవం తస్యాఽ ఽ సతస్తత్ర కుర్వతో విష్ణుప్రీణనమ్ ।
గీతికాభిర్విచిత్రాభిర్వయః ప్రతిగతం బహు ॥ 14 ॥

ఈ విధముగా చిత్రవిచిత్రములైన గీతములతో శ్రీమన్నారాయణునకు ఆనందమును కల్గిస్తూ అతని వయస్సు చాలా కాలము గడిచినది.

ఏకదా చైత్రమాసే తు కృష్ణైకాదశిగోచరే ।
విష్ణు శుశ్రూషణార్థాయ యయౌ వనమనుత్తమమ్ ॥ 15 ॥

ఒకానొకమారు చైత్రమాసంలో కృష్ణపక్షంలో ఏకాదశి రాగా విష్ణుమూర్తికి సేవచేయుటకై పవిత్రమైన వనమునకు వెళ్ళెను.

వనజాతాని పుష్పాణి గ్రహీతుం భక్తితత్పరః ।
క్షిప్రాతటే మహారణ్యే విభీతకతరోరధః । 16 ॥

దృష్టః సః రాక్షసేనాథ గృహీతశ్చాపి భక్షితుమ్ ।
చండాలస్తమథోవాచ నాద్య భక్ష్యస్త్వయాహ్యహమ్ ॥ 17 ॥

ప్రాతర్భోక్ష్యసి కల్యాణ సత్యమేష్యామ్యహం పునః ।
అద్య కార్యం మమ మహత్తస్మాన్ముంచస్వ రాక్షస ॥ 18 ॥

క్షిప్రానది ఒడ్డున ఉన్న ఆ మహారణ్యంలో భక్తితత్పరుడై అడవిలో దొరికే పుష్పాలను తెచ్చుటకు వెళ్ళగా ఆ అరణ్యంలోని ఒక విభీతకమనే వృక్షంక్రింద, ఒక రాక్షసుడతనిని చూచెను. అంతేకాక ఆ రాక్షసునిచేత అతడు భక్షించుటకై పట్టుకొనబడెను కూడా. అప్పడా చండాలుడు రాక్షసునితో అయ్యా! ఈ రోజు నన్ను నీవు తినకూడదని పలికెను. ఓ క్షేమకరుడా! రాక్షసుడా! ఈరోజు నేను చేయవలసిన గొప్ప కార్యమున్నది. రేపు ఉదయముననే నన్ను నీవు తప్పక తినగలవని ప్రమాణ పూర్వకముగా చెప్పుచున్నాను కావున నన్ను వదలమని పలికెను.

శ్వః సత్యేన సమేష్యామి తతః ఖాదస్వ మామితి ।
విష్ణు శుశ్రూషణార్థాయ రాత్రి జాగరణం మయా ॥
కార్యం న వ్రతవిఘ్నం మే కర్తుమర్హసి రాక్షస ॥ 19 ॥

ఈరోజు నేను విష్ణుమూర్తి సేవకై జాగరణము చేయవలసియున్నది. రేపు ఉదయముననే తప్పకరాగలను అప్పుడు నన్ను తప్పకతినగలవు. ఓ రాక్షసా! నా వ్రతమునకు విఘ్నమును కలిగించకుము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తం రాక్షసం ప్రత్యువాచ దశరాత్రమభోజనమ్ ।
మమాభూదద్యచ భవాన్మయా లబ్ధో మతంగజ ॥ 20 ॥

ఓ మతంగజా! నాకు పది రోజులనుండి భోజనములేదు. ఈ రోజు నీవు లభించితివి అని ఆ రాక్షసుడు చండాలునితో బదులు పలికెను.

న మోక్ష్యే భక్షయిష్యామి క్షుధయా పీడితో భృశమ్ ।
నిశాచర వచః శ్రుత్వా మతంగస్తమువాచ హ ॥
సాంత్వయన్ శ్లక్ష్ణయా వాచా స సత్యవచనైర్దృఢైః ॥ 21 ॥

నేను మిక్కిలి బాధపడుచున్నాను కావున వదిలి పెట్టను, తింటాను అని పలికెను. అప్పుడా రాక్షసుని మాటలను విని మాతంగుడతనితో సాంత్వన పూర్వకముగా, మృదువుగా, సత్య శీలతతో దృఢముగా నిట్లు పలికెను.

మాతంగ ఉవాచ :- మాతంగుడు పలికాడు

సత్యమూలం జగత్సర్వం బ్రహ్మరాక్షస తచ్ఛృణు ।
సత్యేనాహం శపిష్యామి పునరాగమనాయ చ ॥ 22 ॥

ఓ బ్రహ్మ రాక్షసా! ఈ లోకమున కంతటికి మూలము సత్యము. కావున ఆ సత్యము మీద ఒట్టు పెట్టుకొని చెప్పగలను మరల తిరిగి వస్తానని

ఆదిత్యశ్చంద్రమా వహ్నిర్వాయుర్భూర్ద్యౌర్జలం మనః ।
అహోరాత్రం యమః సంధ్యే ద్వే విదుర్నరచేష్టితమ్ ॥ 23 ॥

సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, భూమి, ఆకాశము, నీరు, మనస్సు, రాత్రింబగళ్లు, మృత్యువు, రెండు సంధ్యలు మానవుని చేష్టలను తెలిసికుంటవి.

పరదారేషు యత్పాపం యత్పరద్రవ్యహారిషు ।
యచ్చ బ్రహ్మహనః పాపం సురాపే గురుతల్పగే ॥ 24 ॥

వంధ్యాపతేశ్చ యత్పాపం యత్పాపం వృషలీపతేః ।
యచ్చ దేవలకే పాపం మత్స్య మాంసాశినశ్చ యత్ ॥ 25 ॥

క్రోడమాంసాశినో యచ్చ కూర్మమాంసాశినశ్చ యత్ ।
వృథా మాంసాశినో యచ్చ పృష్ఠమాంసాశినశ్చ యత్ । 26 ॥

మిత్రఘాతిని యత్పాపం కృతఘ్నే దిధిషూపతౌ ।
సూతకస్య చ యత్పాపం యత్పాపం క్రూరకర్మణః ॥ 27 ॥

కృపణస్య చ యత్పాపం యచ్చ వంధ్యాతిథేరపి ।
అమావాస్యాష్టమీ షష్ఠీ కృష్ణ శుక్ల చతుర్దశీ ॥ 28 ॥

తాసు యద్గమనాత్పాపం యద్విప్రో వ్రజతిస్త్రియమ్ ।
రజస్వలాం తథా పశ్చాచ్ఛ్రాద్ధం కృత్వా స్త్రియం వ్రజేత్ ॥ 29 ॥

సర్వస్వస్నాత భోజ్యానాం యత్పాపం మలభోజనే ।
మిత్రభార్యాం గచ్ఛతాం చ యత్పాపం పిశునస్య చ ॥ 30 ॥

దంభ మాయానురక్తే చ యత్పాపం మధుఘాతినః ।
బ్రాహ్మణస్య ప్రతిశ్రుత్య యత్పాపం తదయచ్ఛతః ॥ 31 ॥

యచ్చ కన్యా కృతే పాపం యచ్చ గోఽశ్వతరానృతే ।
స్త్రీ బాలహంతుర్యత్పాపం యచ్చమిథ్యాఽభిభాషిణః ॥ 32 ॥

దేవవేదద్విజ నృప పుత్ర మిత్ర సతీస్త్రియః ।
యచ్చ నిద్రయతాం పాపం గురు మిథ్యాపచారతః ॥ 33 ॥

అగ్నిదాయిషు యత్పాప మగ్నిదాయిషు యద్వనే ।
గృహేష్వ్యా పాతకే యచ్చ యద్గోఘ్నే యద్విజాధమే ॥ 34 ॥

యత్పాపం పరివిత్తే చ యత్పాపం పరివేదినః ।
తయోర్దాతు గ్రహీత్రోశ్చ యత్పాపం భ్రూణఘాతినః ॥ 35 ॥

కించాత్ర బహుభిః ప్రోక్తైః శపథైస్తవ రాక్షస ।
శ్రూయతాం శపథం భీమం దుర్వాచ్యమపి కథ్యతే ॥ 36 ॥

ఇతరుల భార్యలతో గూడిన ఏ పాపమువచ్చునో, ఇతరుల ద్రవ్యము నపహరించిన ఏ దోషము గల్గునో, బ్రహ్మహత్య చేసిన ఏ పాపమంటునో, సురాపానము చేసినందువలన ఏ పాపముగల్గునో, గురుతల్పమునందు శయనించిన ఏ పాపము వచ్చునో, గొడ్రాలికి భర్తగా నున్నందున ఏ పాపము గలుగునో, వృషలీపతిగానుంటే ఏ పాపము వచ్చునో, భక్తికి దేవరకు పూజరిగానున్న ఏ పాపముగలుగునో, మత్స్య మాంసములను దిన్న ఏ పాపముగలుగునో, వరాహ మాంసమును, తాబేలు మాంసమును, వృథా మాంసమును, పృష్ఠ మాంసమును తిన్నందువలన ఏ పాపమంటునో, మిత్రుని చంపినందువలన, చేసిన మేలుమరచి అపకారమును చేసినందువలన, రాజును భర్తను ధిక్కరించినందువలన, సూతకమువలన, క్రూరకర్మలను చేసినందువలన ఏ పాపము కలుగునో, కృపణునకే పాపమో, గొడ్రాలియాతిథ్యమునకే పాపమో, అమావాస్య, అష్టమీ, షష్ఠీ, శుక్ల కృష్ణ పక్షములయందలి చతుర్దశీ తిథులలో సంగమించినందువల్ల ఏ పాపమో, రజస్వల అయిన స్త్రీని పొందిన ఏ పాపమో, శ్రాద్ధము నాచరించి రతిలో పాల్గొన్నందువలన ఏ పాపము గల్గునో, స్నానమును చేయకుండానే భోజనమును చేయువారందరకు ఏ పాపమో, మలభోజనమును చేసినందువలన ఏ పాపమో, మిత్రుని భార్యను గూడిన ఏ పాపమో, ఒకరితో నొకరికి భేదమును కల్గించినందువలన ఏ పాపమో, దంభము, మాయలయందనురక్తుడయిన వానికి, తేనెతెట్టెను కొట్టిన వానికి, బ్రాహ్మణునకు ఇస్తానని మాటనిచ్చి ఇవ్వకున్నవానికి ఏ పాపముగల్గునో, కన్య విషయంలోను, ఆవులను గూర్చి, గుఱ్ఱములను గూర్చి అసత్యములు పలికినవానికి, స్త్రీలను, బాలలను చంపినవానికి, మిథ్యా భాషణములను చేసినవానికి ఏ పాపముగలుగునో, దేవతలను, వేదమును, బ్రాహ్మణులను, రాజులను, పుత్రులను, మిత్రులను, పతివ్రతా స్త్రీలను నిందించినందువలన, గురువులయెడ మిథ్యా పూర్వకముగా అపచారములను చేసినందువలన

ఏ పాపము గలుగునో, అగ్నినిచ్చే వారియందు, వనమునందగ్నినుంచే వారియందు, ఇంటిని తగులబెట్టినందు వలన, ఆవును చంపినందువలన, బ్రాహ్మణాధమునియందు ఏ పాపము గలుగునో, అన్నకంటె ముందు వివాహం చేసికున్నవాని యందును, అనర్హునిశ్రాద్ధానికి పెడితే ఏ పాపమో, వారికి దానముచేసినందువలన, వారినుండి దానము తీసుకున్నందు వలన, ఏ పాపమో భ్రూణహత్యలను చేసినందువలన ఏ పాపముగలుగునో, ఓ రాక్షసా! ఇంతకంటే అనేక విధములైన శపథములతో పనియేమి? నీకు ఇంకా భయంకరమైనది, చెప్పకూడనిదైనా చెప్పుచున్నాను వినుము.

స్వకన్యా జీవినః పాపం కూటసత్యేన సాక్షిణః ।
అయాజ్య యాజకే షండే యత్పాపం శ్రవణేఽధమే ॥ 37 ॥

ప్రవ్యజ్యా వసితే యచ్చ బ్రహ్మచారిణి కాముకే ।
ఏతైస్తు పాపైర్లిప్యేఽహం యది నేష్యామి తేఽంతికమ్ ॥ 38 ॥

తన కూతుళ్ల సంపాదనవలన జీవించేవారికి, సాక్షులుచెప్పే సమూహ సత్యముతోనూ, చేయకూడని యజ్ఞములను చేసే యాజ్ఞికునికి, నపుంసకునికి, అధముని మాట విన్నందువలన వచ్చే ఏ పాపమైతే వుందో, సన్యాసియై గృహనివాసం చేసినవానికి బ్రహ్మచర్యంలో ఉండి కాముకతతో ప్రవర్తించు బ్రహ్మచారికే పాపము తగులుతుందో, అటువంటి పాపములన్నీ ఒకవేళ నేను నీదగ్గరకురాకుంటే నాకు అంటుకొనుగాక!

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

మాతంగవచనం శ్రుత్వా విస్మితో బ్రహ్మరాక్షసః ।
ప్రాహ గచ్ఛస్వ సత్యేన సమయం చైవ పాలయ ॥ 39 ॥

మాతంగుడు పలికిన ఈ మాటలను విని బ్రహ్మరాక్షసుడు ఆశ్చర్యపడెను. సరే అలాగే వెళ్ళుము కాని సత్యముగా సమయమును మాత్రము పాటించుమనెను.

ఇత్యుక్తః కుణపాశేన శ్వపాకః కుసుమాని తు ।
సమాదాయాగమచ్చైవ విష్ణోః స నిలయం గతః ॥ 40 ॥

ఈ విధముగా రాక్షసుడు పలుకగానే ఆ చండాలుడు పూలను తీసుకొని విష్ణ్వాలయమునకు వెళ్ళెను.

తాని ప్రాదాద్బ్రాహ్మణాయ సోఽపి ప్రక్షాల్య చాంభసా ।
విష్ణుమభ్యర్చ్య నిలయం జగామ స తపోధనాః ॥ 41 ॥

ఓ తపోధనులారా! అక్కడ ఆ పూలను బ్రాహ్మణున కిచ్చెను. అతడు వాటిని నీటితో కడిగి విష్ణుమూర్తికి అర్చన చేసి అతడు కూడా ఇంటికి వెళ్ళెను.

సోఽపి మాతంగ దాయాదః సోపవాసస్తుతాం నిశామ్ ।
గాయన్హి బాహ్యభూమిష్ఠః ప్రజాగరముపాకరోత్ ॥ 42 ॥

ఆ మాతంగుడు మాత్రం ఆ రాత్రి అక్కడే ఉపవాసముతోనుండి దేవాలయము బయటనే విష్ణువును కీర్తిస్తూ రాత్రంతా జాగారము చేసెను.

ప్రభాతాయాం చ శర్వర్యాం స్తుత్వా దేవం నమస్య చ ।
సత్యం స సమయం కర్తుం ప్రతస్థే యత్ర రాక్షసః ॥ 43 ॥

తెల్లవారుఝామునే లేచి భగవంతుని స్తోత్రమును చేసి నమస్కరించి తను చెప్పిన ప్రకారముగా సమయపాలన సత్యముగా నిరూపించుటకై రాక్షసుడున్నచోటునకు వెళ్ళెను.

తం వ్రజంతం పథి నరః ప్రాహ భద్ర క్వ గచ్ఛసి ।
స తథాఽకథయత్సర్వం సోఽప్యేనం పునరబ్రవీత్ ॥ 44 ॥

అతడు వెళ్ళుచుండగా మార్గమధ్యమున నొకడు కలిసి భద్రా! ఎచ్చటకు వెళ్ళుచున్నావని ప్రశ్నించెను. అప్పుడామాతంగుడు జరిగిన విషయమునంతయును వివరించెను. అప్పుడా బాటసారి మాతంగునితో మరల నిట్లు పలికెను.

ధర్మార్థ కామమోక్షాణాం శరీరం సాధనం యతః ।
మహతా తు ప్రయత్నేన శరీరం పాలయేద్బుధః ॥ 45 ॥

ఈ శరీరము ధర్మార్థ కామమోక్షములకు సాధనమైనది. బుద్ధిమంతుడైనవాడు మిక్కిలి ప్రయత్నముతో దీనిని రక్షించుకొనవలయును.

జీవన్ ధర్మార్థ సుఖం నరస్తథాఽఽప్నోతి మోక్షగతిమగ్ర్యామ్ ।
జీవన్కీర్తిముపైతి చ భవతి మృతస్య కా కథా లోకే ॥ 46 ॥

మానవుడు జీవించియే ధర్మార్థసుఖమును పొందగలడు. ఆ తరువాతనే మోక్షము. లోకంలో జీవించియున్నప్పుడే కీర్తిని పొందగలడు. మరణించిన తరువాత ఇంక ఏమున్నది? అనెను.

మాతంగస్తద్వచః శ్రుత్వా ప్రత్యువాచాథ హేతుమత్ ॥ 47 ॥

ఆమాటలను విన్న మాతంగుడు హేతుమంతముగా నిట్లు బదులు పలికెను.

మాతంగ ఉవాచ :- మాతంగుడు పలికాడు.

భద్ర సత్యం పురస్కృత్య గచ్ఛామి శపథాః కృతాః ॥ 48 ॥

మిత్రమా! నేను చేసిన శపథములకు తగినట్లుగా సత్యవ్రతుడనై వెళ్ళుచున్నాననెను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తం భూయః ప్రత్యువాచాథ కిమేవం మూఢధీర్భవాన్ ।
కిం న శ్రుతం త్వయా సాధో మనునా యదుదీరితమ్ ॥ 49 ॥

మరల ఆ బాటసారి మాతంగునితో నిట్లనెను. నీ వెంత మూర్ఖునివయ్యా! ఓ సాధుపురుషా! మనువు చెప్పినది నీవు వినలేదా?

గో స్త్రీద్విజానాం పరిరక్షణార్థం వివాహకాలే సుహృదాం ప్రసంగే ।
ప్రాణాత్యయే సర్వధనాపహారే పంచానృతాన్యాహురపాతకాని ॥ 50 ॥

గోవులను, స్త్రీలను, బ్రాహ్మణులను రక్షించుటయందు, వివాహకాలమునందు, మిత్ర ప్రసంగమునందు, ప్రాణమునకాపద వచ్చినపుడు, తన సమస్త ధనమును అపహరించినపుడు అనే ఈ ఐదు సమయాలలో అసత్యము నాడ వచ్చును. అవి పాపములు కావు.

ధర్మవాక్యం న చ స్త్రీషు న వివాహే తథా రిపౌ ।
వంచనే చార్థహానౌ చ స్వనాశేఽనృతకే తథా ॥
ఏవం తద్వాక్యమాకర్ణ్య మాతంగః ప్రత్యువాచ హ ॥ 51 ॥

స్త్రీల విషయంలోను, వివాహవిషయంలోను, అట్లే శత్రువుల విషయంలోను, మోసగించబడినప్పుడు, ధనహాని కలిగినప్పుడు, తన కాపదవచ్చినపుడు అసత్యమాడుటలో తప్పులేదు. ఇక్కడ ధర్మవాక్యము వర్తించదు. అని ఈ విధముగా పలికిన బాటసారిమాటలనువిని, మాతంగుడిట్లు బదులు పలికెను.

మాతంగ ఉవాచ :– మాతంగుడు పలికాడు.

మైవం వదస్వ భద్రం తే సత్యం లోకేషు పూజ్యతే ।
సత్యేనావాప్యతే సౌఖ్యం యత్కించి జ్జగతీ గతమ్ ॥ 52 ॥

అయ్యా! మీరిట్లు పలుకకుడు మీకు శుభము కలుగు గాక! అన్నిలోకాల్లో సత్యము పూజించ బడుచున్నది. ఈ లోకంలో సుఖమంటూ ఏదైనా పొందితే అది సత్యముతోనే పొందుతున్నాము.

సత్యేనార్కః ప్రతపతి సత్యేనాఽఽపో రసాత్మికాః ।
జ్వలత్యగ్నిశ్చ సత్యేన వాతి సత్యేన మారుతః ॥ 53 ॥

సత్యముతోనే సూర్యుడెండనిస్తున్నాడు. సత్యముతోనే నీరు రసాత్మికమగుచున్నది. సత్యముతోనే అగ్నిమండుచున్నది. గాలికి వీచే స్వభావము సత్యము వలననే వచ్చినది.

ధర్మార్థ కామసంప్రాప్తిర్మోక్షప్రాప్తిశ్చ దుర్లభా ।
సత్యేన జాయతే పుంసాం తస్మాత్సత్యం న సంత్యజేత్ ॥ 54 ॥

దుర్లభమైన ధర్మార్థ కామమోక్షములనేవి మానవులకు సత్యము వలననే కలుగుచున్నవి. అందువలన సత్యమును వదలకూడదు.

సత్యం బ్రహ్మ పరం లోకే సత్యం యజ్ఞేషు చోత్తమమ్ ।
సత్యం స్వర్గ సమాయాతం తస్మాత్సత్సం న సంత్యజేత్ ॥ 55 ॥

సత్యము పరబ్రహ్మ స్వరూపము, లోకమునందు యజ్ఞములయందు ఉత్తమమైనది సత్యము. స్వర్గసోపానము సత్యము, అందువలన సత్యమును వదలకూడదు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఇత్యుక్త్వా సోఽథ మాతంగస్తం ప్రక్షిప్య నరోత్తమమ్ ।
జగామ తత్ర యత్రాఽస్తే ప్రాణిహా బ్రహ్మరాక్షసః ॥ 56 ॥

ఈ విధముగా ఆ మాతంగుడు నరోత్తముడైన ఆ బాటసారిని వదిలి పెట్టి ఎక్కడైతే ప్రాణులను హింసించే బ్రహ్మరాక్షసుదున్నాడో అక్కడికి వెళ్ళెను.

తమాగతం సమీక్ష్యాసౌ చాండాలం బ్రహ్మరాక్షసః ।
విస్మయోత్ఫుల్లనయనః శిరః కంపం తమబ్రవీత్ ॥ 57 ॥

బ్రహ్మరాక్షసుడు అట్లు వచ్చిన చండాలుని ఆశ్చర్యంతో విచ్చుకున్న కన్నులతో అతనిని చూస్తూ తలనాడిస్తూ ఆ చండాలునితో నిట్లు పలికెను.

బ్రహ్మరాక్షస ఉవాచ :- బ్రహ్మరాక్షసుడు పలికాడు.

సాధు సాధు మహాభాగ! సత్యవాక్యానుపాలక! ।
న మాతంగమహం మన్యే భవంతం సత్యలక్షణమ్ ॥ 58 ॥

సత్యవాక్యమును పాటించేవాడా! మహానుభావా! బాగుబాగు సత్యలక్షణుడవైన నిన్ను నేను మాతంగునిగా భావించుటలేదు.

కర్మణాఽనేన మన్యే త్వాం బ్రాహ్మణం శుచి మవ్యయమ్ ।
యత్కించిత్త్వాం భద్రముఖం ప్రవక్ష్యే ధర్మసంశ్రయమ్ ।
కిం తత్ర భవతా రాత్రౌ కృతం విష్ణుగృహే వద ॥ 59 ॥

ఈ మరల తిరిగి వచ్చుట అనే పనితో నేను నిన్ను అవ్యయమైన శుచిగల బ్రాహ్మణునిగా తలచుచున్నాను. ధర్మాన్ని ఆశ్రయించిన భద్రముఖుడవైన నిన్ను ఒకటి అడుగ దలచుకున్నాను రాత్రి విష్ణుమూర్తి ఆలయంలో నీవు ఏమి చేసినావో చెప్పుము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తమభ్యువాచ మాతంగః శృణు విష్ణుగృహే మయా ।
యత్కృతం రజనీభాగే యథాతథ్యం వదామి తే ॥ 60 ॥

అట్లడిగిన రాక్షసునితో మాతంగుడిట్లు బదులు పలికెను. రాత్రి విష్ణుమూర్తి ఆలయంలో నేనేంచేసితినో ప్రమాణపూర్వకముగా నీకు చెప్పుచున్నాను వినుము.

విష్ణోర్దేవ కలస్యాధః స్థితేనాఽఽనమ్రమూర్తినా ।
ప్రజాగరః కృతో రాత్రౌ గాయతా విష్ణుగీతికామ్ ॥ 61 ॥

విష్ణుమూర్తి దేవాలయం క్రింది భాగమున వినయపూర్వకముగా శిరస్సు వంచి విష్ణుకీర్తనలను గానం చేస్తూ జాగరణము చేసితిని.

తం బ్రహ్మరాక్షసః ప్రాహ కియంతం కాలముచ్యతామ్ ।
ప్రజాగరో విష్ణుగృహే కృతో భక్తిమతా వద ॥ 62 ॥

అప్పుడు బ్రహ్మరాక్షసుడు నీవెంతకాలము భక్తితో విష్ణుమూర్తి ఆలయములో జాగరణము చేసితివో చెప్పుమని యడిగెను.

తమభ్యువాచ ప్రహసన్వింశత్యబ్దాని రాక్షస ।
ఏకాదశ్యాం మాసి మాసి కృతస్తత్ర ప్రజాగరః ॥
మాతంగవచనం శ్రుత్వా ప్రోవాచ బ్రహ్మరాక్షసః ॥ 63 ॥

అప్పుడా మాతంగుడు నవ్వుతూ ఓ రాక్షసా! గత ఇరువది సంవత్సరములనుండి ప్రతినెల ప్రతి ఏకాదశియందు జాగరణము చేయుచున్నానని బదులు పలికెను. అప్పుడా మాతంగుని మాటలువిని బ్రహ్మరాక్షసుడిట్లు పలికెను.

బ్రహ్మరాక్షస ఉవాచ :- బ్రహ్మరాక్షసుడు పలికాడు.

యదద్య త్వాం ప్రవక్ష్యామి తద్భవాన్కర్తుమర్హతి ।
ఏకరాత్రి కృతం సాధో మమ దేహి ప్రజాగరమ్ ॥ 64 ॥

ఓ సాధుపుంగవా! అట్లైన నేను నిన్నొకటి అడుగబోవుచున్నాను. అది నీవు చేయుము. అదేమనగా నీవొకరోజు చేసిన జాగరణపు ఫలమును నాకిచ్చివేయుము.

ఏవం త్వాం మోక్షయిష్యామి మోక్షయిష్యామి నాన్యథా ।
త్రిః సత్యేన మహాభాగ ఇత్యుక్త్వా విరరామ హ ॥ 65 ॥

అట్లు ఫలమునిచ్చినట్లైతేనే నిన్ను వదిలి పెట్టగలను. వేరే విధముగా వదిలిపెట్టలేను. ఇది సత్యము అని ముమ్మారు పలికి ఊరకుండెను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

మాతంగ స్తమువాచాథ మయాఽఽత్మా తే నిశాచర ।
నివేదితః కిముక్తేన ఖాదస్వ స్వేచ్ఛయాఽపి మామ్ ॥ 66 ॥

అప్పుడు మాతంగుడన్నాడు. ఓ నిశాచరా! నన్నునేను నీకు అర్పించుకున్నాను. ఇక మాటలేల స్వేచ్ఛగా నన్ను తినుము.

తమాహ రాక్షసో భూయో యామద్వయ ప్రజాగరమ్ ।
స గీతం మే ప్రయచ్ఛస్వ కృపాం కర్తుం త్వమర్హసి ॥ 67 ॥

అప్పుడా రాక్షసుడు మళ్లీ అన్నాడు గీతముతో కూడిన రెండు ఝాముల జాగరణ ఫలమునైనా నాకిచ్చివేయుము. అట్లైన నీమీద దయ చూపెట్టగలను.

మాతంగో రాక్షసం ప్రాహ కిమసంబద్ధముచ్యతే ।
ఖాదస్వ స్వేచ్ఛయా మాం త్వం న ప్రదాస్యే ప్రజాగరమ్ ॥
మాతంగవచనం శృత్వా ప్రాహ తం బ్రహ్మరాక్షసః ॥ 68 ॥

అప్పుడు మాతంగుడు రాక్షసునితో అన్నాడు - ఎందుకయ్యా అసంబద్ధముగా మాట్లాడుతావు. నీవు నన్ను స్వేచ్ఛగా తిను. అంతేకాని ప్రజాగరఫలమును మాత్రమివ్వను. మాతంగుని మాటలనువిని బ్రహ్మరాక్షసుడతనితో నిట్లనెను.

బ్రహ్మరాక్షస ఉవాచ :- బ్రహ్మరాక్షసుడు పలికాడు.

కోహి దుష్టమతిర్మందో భవంతం ద్రష్టుముత్సహేత్ ।
ప్రబాధితుం పీడితుం వా రక్షితం ధర్మకర్మణా ॥ 69 ॥

ధర్మకర్మతో రక్షించబడిన నిన్ను ఏ దుష్టబుద్ధిగలవాడు మూర్ఖుడు బాధింపచూచుటకు, పీడింపచూచుట కుత్సాహపడును?

దీనస్య పాపగ్రస్తస్య విషయై ర్మోహితస్య చ ।
నరకార్తస్య మూఢస్య సాధవః స్యుర్దయాన్వితాః । 70 ॥

దీనుల విషయంలో, పాపగ్రస్తుల విషయంలో విషయవాంఛలతో మోహితుడైనవాని విషయంలో, నరకార్తుని విషయంలో, మూఢుని విషయంలో సాధువులు దయాన్వితులగుదురు.

తన్మమ త్వం మహాభాగ కృపాం కృత్వా ప్రజాగరమ్ ।
యామస్యైకస్య మే దేహి గచ్ఛ వా నిలయం స్వకమ్ ॥ 71 ॥

అందువలన ఓ మహానుభావా! ఒక జాము జాగరణపు ఫలమునైనా నాకిచ్చి నీయింటికి నీవు వెళ్ళుము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తం పునః ప్రాహ చాండాలో న యాస్యామి నిజం గృహమ్ ।
న చాపి తవ దాస్యామి కథంచిద్యామజాగరమ్ ॥
తం విహస్యాథ చాండాలం ప్రోవాచ బ్రహ్మరాక్షసః ॥ 72 ॥

అపుడా చాండాలుడు అతనితో మళ్ళీ అన్నాడు ఎట్టి పరిస్థితులలోనూ నేను నాయింటికి వెళ్ళను. యామ కాలపు జాగరణ ఫలమును కూడా ఇవ్వను. అది విని నవ్వి ఆ బ్రహ్మరాక్షసుడు చాండాలునితో నిట్లనెను.

బ్రహ్మారాక్షస ఉవాచ :- బ్రహ్మారాక్షసుడు పలికాడు.

రాత్ర్యవసానే యా గీతా గీతికా కౌతుకాశ్రయా ।
తస్యాః ఫలం ప్రయచ్ఛస్వ త్రాహి పాపాత్సముద్ధర ॥ 73 ॥

రాత్రిముగిసేముందు పరమాత్మాశ్రయమైన ఏ గీతమునైతే ఆలాపించావో కనీసం దాని ఫలితమునైనా ఇచ్చి నన్ను రక్షించుము. పాపమునుండి ఉద్ధరించుము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఏవముచ్చరితే తేన మాతంగస్తమువాచ హ ॥ 74 ॥

ఈ విధముగా రాక్షసుడు పలుకగానే మాతంగుడతనితో నిట్లనెను.

మాతంగ ఉవాచ :- మాతంగుడు పలికాడు.

కిం పూర్వం భవతా కర్మ వికృతం కృతమంజసా ।
యేన త్వం దోషజాతేన సంభూతో బ్రహ్మారాక్షసః ॥ 75 ॥

ఆలోచన చెయ్యకుండగా మునుపు నీ చేత యే పాపకర్మ చెయ్యబడింది? యే దోషం చేత నీవు బ్రహ్మారాక్షసుడవు అయినావు?

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తస్య తద్వాక్యమాకర్ణ్య మాతంగం బ్రహ్మారాక్షసః ।
ప్రోవాచ దుఃఖసంతప్తః సంస్మృత్య స్వకృతం కృతమ్ ॥ 76 ॥

ఈ విధముగా పలికిన మాతంగుని మాటలను విని బ్రహ్మారాక్షసుడు తాను గతంలో చేసిన దానిని గుర్తు తెచ్చుకొని దుఃఖసంతప్తుడై ఇట్లు పలికెను.

బ్రహ్మారాక్షస ఉవాచ :- బ్రహ్మారాక్షసుడు పలికాడు.

శ్రూయతాం యోఽహమాసం వై పూర్వం యచ్చ మయా కృతమ్ ।
యస్మి న్కృతే పాపయోనిం గతవానస్మి రాక్షసీమ్ ॥ 77 ॥

అయ్యా! నేను పూర్వ మెట్లుంటినో, నేనేమి చేసితినో, దేనిని చేసినందువలన పాపమునకు స్థానమైన రాక్షసజన్మను పొందితినో వినుడు.

సోమ శర్మేతి విఖ్యాతః పూర్వమాసమహం ద్విజః ।
పుత్రోఽధ్యయనశీలస్య దేవశర్మస్య యజ్వనః ॥ 78 ॥

పూర్వము నేను యజ్ఞయాగాది క్రతువులను చేస్తూ, అధ్యయన శీలుడైన దేవశర్మయొక్క పుత్రునిగా సోమశర్మ అనే బ్రాహ్మణునిగా పేరు పొందితిని.

కస్యచిద్యజమానస్య సూత్రమంత్ర బహిష్కృతః ।
నృపస్య కర్మసక్తేన యూపకర్మసు నిష్ఠితః ॥ 79 ॥

ఒక యజమాని యొక్క క్రతువులో కల్పసూత్రమూ ప్రయోగానికి కావలసిన మంత్రాలు రాక బహిష్కరించబడింది. కాని యజ్ఞకర్మల యందు ఆసక్తి ఉన్నందువలన ఒక రాజుయొక్క యజ్ఞంలో యూపకర్మలయందు నియమించబడింది.

ఆగ్నీధ్రం చాకరోద్యజ్ఞే లోభమోహప్రపీడితః ।
తస్మిన్పరిసమాప్తే తు మౌర్ఖ్యాద్దంభమనుష్ఠితః ॥ 80 ॥

ఆ యజ్ఞములో లోభమోహములతో పీడింపబడి యజ్ఞకార్యనిర్వాహకత్వం కూడా చేసితిని. అది పరిసమాప్తి అగునంతలో మూర్ఖముగా దంభమును కూడా ప్రదర్శించితిని.

యష్టుమారబ్ధవానస్మి ద్వాదశాహం మహాక్రతుమ్ ।
ప్రవర్తమానే తస్మింస్తు కుక్షిశూలోఽభవన్మమ । 81 ॥

పన్నెండు రోజుల దీక్షగల మహాక్రతువునారంభించితిని. ఇట్లు దానిని ఆచరిస్తుండగానే నాకు కడుపు నొప్పి ఆరంభమాయెను.

సంపూర్ణే దశరాత్రే తు న సమాప్తే తథా క్రతౌ ।
విరూపాక్షస్య దీయన్త్యా మాహుత్యాం రాక్షసే క్షణే ॥ 82 ॥

మృతోఽహం తేన దోషేణ సంభూతో బ్రహ్మరాక్షసః ।
మూర్ఖేణ మంత్రహీనేన సూత్రస్వరవివర్జితమ్ ॥ 83 ॥

పది రోజుల తర్వాత ఇంకా క్రతువు పూర్తికాకుండానే విరూపాక్షునకు ఆహుతి నిచ్చే రాక్షస క్షణంలో నేను మృతి నొందితిని. మూర్ఖముగా సూత్ర స్వరములు పోయినందున మంత్ర హీనమనే దోషముతో బ్రహ్మ రాక్షసునిగా పుట్టితిని.

అజానతా యజ్ఞవిద్యాం యదిష్టం యాజితం చ యత్ ।
తేన కర్మ విపాకేన సంభూతో బ్రహ్మరాక్షసః ॥ 84 ॥

యజ్ఞవిద్య తెలియకుండా ఇష్టానుసారముగా ఏయాగమును, యిష్టిని చేయించితినో ఆ కర్మ ఫలముతోనే బ్రహ్మరాక్షసునిగా పుట్టితిని.

తన్మాం పాపమహాంభోధౌ నిమగ్నం త్వం సముద్ధర ।
ప్రజాగరే గీతికాం వై పశ్చిమాం దాతుమర్హసి ॥ 85 ॥

అందువలన నీ ప్రజాగరణములోని చివరి గీతమునైనా ఇచ్చి పాపమనే మహాసముద్రంలో మునిగిపోతున్న నన్నుద్ధరించుము.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

తమువాచాథ చాండాలో యది ప్రాణవధాద్భవాన్ ।
నివృత్తిః కురుతే దద్యాం తతః పశ్చిమగీతికామ్ ॥ 86 ॥

అప్పుడా చాండాలుడు రాక్షసునితో ఒకవేళ నీవు ప్రాణులను చంపుట మానివేసినట్లయితే నేను పశ్చిమ గీతికా ఫలమునిచ్చెదననెను.

బాఢమిత్యవదత్సోఽపి మాతంగోఽపి దదౌ తదా ।
గీతికాఫలమామంత్ర్య ముహూర్తార్ధ ప్రజాగరమ్ ॥ 87 ॥

అప్పుడా రాక్షసుడు సరేయనెను. ఆ మాతంగుడు కూడా ముహూర్తార్ధ ప్రజాగర గీతికా ఫలమును మంత్రించి యిచ్చెను.

తస్మిన్గీతిఫలే దత్తే మాతంగం బ్రహ్మరాక్షసః ।
ప్రణమ్య ప్రయయౌ హృష్టస్తీర్థవర్యం పృథూదకమ్ ॥ 88 ॥

అట్లు ఆ గీతికాఫలమును మాతంగుడివ్వగానే ఆ బ్రహ్మరాక్షసుడు సంతష్టుడై మాతంగునకు నమస్కరించి 'పృథూదకమ'నే శ్రేష్ఠమైన తీర్థమునకు వెళ్ళెను.

తత్రానశనసంకల్పం కృత్వా ప్రాణాన్జహౌ ద్విజాః ।
రాక్షసత్వా ద్వినిర్ముక్తో గీతికాఫలబృంహితః ॥ 89 ॥

ఓ బ్రాహ్మణులారా! అక్కడా రాక్షసుడు నిరాహార సంకల్పమును చేసుకొని గీతికా ఫల శక్తితో రాక్షసత్వమునుండి విముక్తుడై ప్రాణములను విడిచెను.

పృథూదక ప్రభావాచ్చ బ్రహ్మలోకం చ దుర్లభమ్ ।
దశ వర్ష సహస్రాణి నిరాతంకోఽవసత్తతః ॥ 90 ॥

గీతికా ఫలముతో పాటు పృథూదక ప్రభావము వలన నిరాతంకముగా అతడు దుర్లభమైన బ్రహ్మలోకమునందు పదివేల సంవత్సరములుండెను.

తస్యాంతే బ్రాహ్మణో జాతో బభూవ స్మృతిమాన్వశీ ।
తస్యాహం చరితం భూయః కథయిష్యామి భో ద్విజాః ॥ 91 ॥

ఓ బ్రాహ్మణులారా! అతడు బ్రహ్మలోక నివాసం తరువాత స్మృతిజ్ఞానము ఇంద్రియనిగ్రహం కలిగిన బ్రాహ్మణునిగా పుట్టెను. అతని కథను నేను తరువాత చెప్పగలను.

మాతంగస్య కథాశేషం శృణుధ్వం గదతో మమ ।
రాక్షసే తు గతే ధీమాన్గృహమేత్య యతాత్మవాన్ ॥ 92 ॥

తద్విప్రచరితం స్మృత్వా నిర్విణ్ణః శుచిరప్యసౌ ।
పుత్రేషు భార్యాం నిక్షిప్య దదౌ భూమ్యాః ప్రదక్షిణమ్ ॥ 93 ॥

ఇక ఆ మాతంగుని గూర్చి మిగతా కథను చెపుతాను వినండి. రాక్షసుడు వెళ్లిన తరువాత ఆ మాతంగుడు యతాత్ముడై ఇంటికి వెళ్ళి, తాను పరిశుద్ధుడైనా కూడా ఆ బ్రాహ్మణుని చరిత్రను తలుచుకొని తనకుమారులకు భార్యనప్పగించి భూప్రదక్షిణమునకై వెళ్ళెను.

కోకాముఖాత్సమారభ్య యావద్వై స్కందదర్శనమ్ ।
దృష్ట్వా స్కందం యయౌ ధారా చక్రేచాపి ప్రదక్షిణమ్ ॥ 94 ॥

అతడు 'కోకాముఖము' అనే తీర్థం నుండి ఆరంభించి స్కందదర్శనము అయ్యేంతవరకు ప్రయాణించి అక్కడ స్కందుని దర్శించి, తిరిగి భూమండలమందు ప్రదక్షిణమును చేసెను.

తతోఽ ద్రివరమాగమ్య వింధ్యముచ్చశిలోచ్చయమ్ ।
పాప ప్రమోచనం తీర్థమాససాద స తు ద్విజాః ॥ 95 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ తరువాత అతడు ఎత్తైన శిలలతో గూడిన శ్రేష్ఠమైన వింధ్య పర్వతము దగ్గరకు వచ్చి 'పాప ప్రమోచన' మనే తీర్థమును చేరెను.

స్నానం పాపహరం చక్రే స తు చాండాలవంశజః ।
విముక్తపాపః సస్మార పూర్వ జాతీరనేకశః ॥ 96 ॥

ఆ చాండాల వంశములో పుట్టినవాడు ఆ తీర్థములో స్నానమును చేసి పాపములను పోగొట్టు కొనెను. పాపము దీరిన అతడు తాను పూర్వము పొందిన అనేక జన్మలను స్మరించెను.

స పూర్వ జన్మన్యభవద్భిక్షుః సంయతవాఙ్మనాః ।
యతకాయశ్చ మతిమాన్వేదవేదాంగపారగః ॥ 97 ॥

అతడు పూర్వ జన్మలో వాక్కును మనస్సును నియంత్రించుకొని యతకాయుడై, వేదవేదాంగ పారంగతుడై, బుద్ధిమంతుడైన భిక్షువుగా నుండెను.

ఏకదా గోషు నగరాద్ధ్రియమాణాసు తస్కరైః ।
భిక్షాఽ వధూతా రజసా ముక్తా తేనాథ భిక్షుణా ॥ 98 ॥

ఒకసారి దొంగలు నగరమునుండి గోవులనపహరించగా ఇతడు రజోగుణముతో అవధూతత్వమును, భిక్షను వదిలిపెట్టెను.

స తేనాధర్మదోషేణ చాండాలీం యోనిమాగతః ।
పాప ప్రమోచనే స్నాతః స మృతో నర్మదా తటే ॥ 99 ॥

ఆ అధర్మ దోషముతో అతడు చాండాల జాతిలో పుట్టెను. పాపాలను పోగొట్టే నర్మదా నదిలో స్నానము చేసి ఒడ్డున మృతినొందెను.

మూర్ఖోఽభూద్బ్రాహ్మణవరో వారాణస్యాం చ భో ద్విజాః ।
తత్రాస్య వసతోఽబ్దైస్తు త్రింశద్భిః సిద్ధపూరుషః ॥ 100 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు కాశియందొక మూర్ఖునిగా నుండి ముప్పది సంవత్సరములు నివసించెను. అక్కడొక సిద్ధపురుషుడుండెను.

విరూప రూపీ బభ్రామ యోగమాయా బలాన్వితః ।
తం దృష్ట్వా సోపహాసార్థమభివాద్యాభ్యువాచ హ ॥ 101 ॥

అక్కడ యోగమాయా బలాన్వితుడై, విరూపరూపియై ఆ సిద్ధుడు తిరిగెను. అక్కడ అతనినిచూచి అవహేళనా పూర్వకముగా నమస్కరించి ఇట్లడిగెను.

కుశలం సిద్ధపురుష! కుతస్త్వాగమ్యతే త్వయా ॥ 102 ॥

ఓ సిద్ధపురుషా! క్షేమమేనా తమరెక్కడినుండి వచ్చుచున్నారు?

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఏవం సంభాషితస్తేన జ్ఞాతోఽహమితి చింత్యతు ।
ప్రత్యువాచాథ వంద్యస్తం స్వర్గలోకాదుపాగతః ॥ 103 ॥

ఇట్లు మాట్లాడగా ఆలోచించి తానుతెలిసికొనబడితినని తలచి ఆ వంద్యుడు నేను స్వర్గలోకమునుండి వచ్చితినని అతనితో బదులు పలికెను.

తం సిద్ధం ప్రాహ మూర్ఖోఽసౌ కిం త్వం వేత్సి త్రివిష్టపే ।
నారాయణోరు ప్రభవామూర్వశీమప్సరో వరామ్ ॥ 104 ॥

అప్పుడీ మూర్ఖుడు అయితే ఆ స్వర్గంలో నారాయణుని తోడ నుండి పుట్టిన అప్సరసలలో శ్రేష్ఠమైన ఊర్వశిని నీ వెరుగుదువా? అని సిద్ధుని అడిగెను.

సిద్ధస్తమాహ తాం వేద్మి శక్ర చామరధారిణీమ్ ।
స్వర్గస్యాఽఽభరణం ముఖ్యముర్వశీం సాధుసంభవామ్ ॥ 105 ॥

అప్పుడా సిద్ధుడు ఇంద్రునికి చామరము వీయునటువంటి, స్వర్గానికే ముఖ్య ఆభరణమైనటువంటి, సాధుసంభవియైన ఆ ఊర్వశిని నేనెరుగుదునని అతనితో పలికెను.

విప్రః సిద్ధమువాచాథ ఋజుమార్గవివర్జితః ।
తన్మిత్ర మత్కృతే వార్తాచోర్వశ్యా భవతాఽఽదరాత్ ॥ 106 ॥

అప్పుడా విప్రుడు కపటముగా సిద్ధునితో నిట్లనెను. అయితే మిత్రమా! దయచేసి నన్ను గూర్చి ఊర్వశికో వార్త చెప్పవలెను.

కథనీయా యచ్చ సా తే బ్రూయాదాఖ్యాస్యతే భవాన్ ।
బాఢమిత్య బ్రవీత్సిద్ధః సోఽపి విప్రో ముదాన్వితః ॥ 107 ॥

అంతేకాక ఆమె చెప్పినది కూడా నీవు నాకు చెప్పవలెననగా సిద్ధుడు సరెయనెను. ఆ విప్రుడు కూడా సంతోషించెను.

బభూవ సిద్ధోఽపి యయౌ మేరుపృష్ఠం సురాలయమ్ ।
సమేత్య చోర్వశీం ప్రాహ యదుక్తోఽసౌ ద్విజేన తు ॥ 108 ॥

ఆ సిద్ధుడు కూడా మేరు పర్వతపు వెనుక భాగమైన స్వర్గమునకు వెళ్ళెను. ఊర్వశి దగ్గరకు వెళ్లి బ్రాహ్మణుడు చెప్పిన మాటను ఊర్వశికి చెప్పెను.

సా ప్రాహ తం సిద్ధవరం నాహం కాశిపతిం ద్విజమ్ ।
జానామి సత్యముక్తం తే న చేతసి మమ స్థితమ్ ॥ 109 ॥

అప్పుడా సిద్ధవరునితో ఊర్వశి నీవు సత్యమునే పలికితివి కాని నామనస్సులోలేని ఆ కాశిపతియైన బ్రాహ్మణుని గూర్చి నేనెరుగననెను.

ఇత్యుక్తః ప్రయయౌ సోఽపి కాలేన బహునా పునః ।
వారాణసీం యయౌ సిద్ధో దృష్టో మూర్ఖేణ వై పునః ॥ 110 ॥

చాలా కాలం తరువాత సిద్ధుడు మరల కాశిని చేరెను. మరల అక్కడతనిని మూర్ఖుడు చూచెను.

దృష్టః పృష్టస్తదా భూయః కిమాహోరుభవా తవ ।
సిద్ధోఽబ్రవీన్న జానామి మామువాచోర్వశీ స్వయమ్ ॥ 111 ॥

మరల సిద్ధుని ఆ మూర్ఖుడు నీవు ఊరుభవ అయిన ఊర్వశిని చూచితివా అని అడిగెను. ఆ మాటవిని సిద్ధుడు ఊర్వశి స్వయముగా తాను నిన్నెరుగనని చెప్పెననెను.

సిద్ధవాక్యం తతః శ్రుత్వా స్మితభిన్నోష్ఠ సంపుటః ।
పునః ప్రాహ కథం వేత్సీత్యేవం వాచ్యా త్వయోర్వశీ ॥ 112 ॥

సిద్ధుని మాటలు విన్న తరువాత చెరిగిన చిరునవ్వుగల పెదవులతో మరల ఇటువంటి మాటగల నీవు ఊర్వశి నెట్లు ఎరుగుదువనెను.

బాఢ మేవం కరిష్యామీత్యుక్త్వా సిద్ధో దివం గతః ।
దదర్శ శక్ర భవనాన్నిష్క్రామంతీమథోర్వశీమ్ ॥ 113 ॥

సరే అలాగే నే నిట్లు చేస్తానని చెప్పి సిద్ధుడు మరల స్వర్గమునకు వెళ్ళెను. అక్కడ ఇంద్రుని భవనమునుండి బయటకు వస్తున్న ఊర్వశిని చూచెను.

ప్రోవాచ తాం సిద్ధవరః సా చ తం సిద్ధమబ్రవీత్ ।
నియమం కించిదపి హి కరోతు ద్విజసత్తమః ॥ 114 ॥

సిద్ధుడా ఊర్వశిని యడిగెను. ఆమె కూడా సిద్ధునితో ఆ బ్రాహ్మణుడేదైనా నియమమును చేయుగాక!

యేనాహం కర్మణా సిద్ధ తం జానామి న చాన్యథా ।
తాదృశీ వచోఽభ్యేత్య తస్మై మూర్ఖద్విజాయ తు ॥ 115 ॥

కథయామాస సిద్ధస్తు సోఽపీమం నియమం జగౌ ।
తవాగ్రే సిద్ధపురుష నియమోఽయం కృతో మయా ॥ 116 ॥

ఓ సిద్ధుడా! నేనేవిధమైన కర్మతోనూ, వేరువిధముగానూ అతనిని నేనెరుగననెను. సిద్ధుడా మాటను మూర్ఖద్విజుని వద్దకు వెళ్ళి, సిద్ధుడతనితో ఊర్వశి నియమమును గూర్చి చెప్పెను. అప్పుడాతడు ఓ సిద్ధపురుషా! నీ ముందు నేను ఈ నియమమును చెప్పుచున్నాను ప్రతిజ్ఞ చేయుచున్నాను.

న భోక్ష్యేఽద్య ప్రభృతి వై శకటం సత్యమీరితమ్ ।
ఇత్యుక్తః ప్రయయౌ సిద్ధః స్వర్గే దృష్టోర్వశీమథ ॥ 117 ॥

ఈ రోజునుండి నా శరీరమును గూర్చి ఏ విధమైన శకటమును తీసుకొనను. ఇది నేను ప్రమాణ పూర్వకముగా చెప్పుచున్నాననెను. అదివిని మరల స్వర్గమునకు వెళ్ళి ఊర్వశిని చూచెను.

ప్రాహాసౌ శకటం భోక్ష్యే నాద్య ప్రభృతి కర్హిచిత్ ।
తం సిద్ధ మూర్వశీ ప్రాహ జ్ఞాతోఽసౌ సాంప్రతం మయా ॥ 118 ॥

అతడు తన శరీరరక్షణకై ఈ రోజునుండి ఆహారమును స్వీకరించనని చెప్పెనని పలికెను. అప్పుడా ఊర్వశి సిద్ధునితో ఇప్పుడు నాకతనెవరో తెలిసినదనెను.

నియమగ్రహణాదేవ మూర్ఖోఽయముపహాసకః ।
ఇత్యుక్త్వా ప్రయయౌ శీఘ్రం వాసం నారాయణాత్మజా ॥ 119 ॥

అతడా విధముగా నియమము పెట్టుటతోడనే అతడొక హేళన చేయువాడు మూర్ఖుడని తెలిసినది అని చెప్పి ఆ నారాయణాత్మజయగు ఊర్వశి తన నివాసానికి వెళ్ళింది.

సిద్ధోఽపి విచచారాసౌ కామచారీ మహీతలమ్ ।
ఊర్వశ్యపి వరారోహా గత్వా వారాణసీం పురీమ్ ॥ 120 ॥
మత్స్యోదరీ జలే స్నానం చక్రే దివ్యవపుర్ధరా ।
అథా సావపి మూర్ఖస్తు నదీం మత్స్యోదరీం మునే ॥ 121 ॥

ఈ స్వేచ్ఛా సంచారియైన సిద్ధుడు కూడా భూమండలమును తిరిగెను. వరారోహయైన ఊర్వశి కూడా కాశీనగరమునకు వెళ్ళి, ఓ మునీ! ఆ ఊర్వశి దివ్య వేషధారియై మత్స్యోదరీ జలము (గంగ) నందు స్నానము చేసెను. అదే సమయంలో ఈ మూర్ఖుడు కూడా గంగానది వద్దకు వెళ్ళెను.

జగామాథ దదర్శాసౌ స్నాయమానామథోర్వశీమ్ ।
తాం దృష్ట్వా వవృధేఽథాస్య మన్మథః క్షోభకృద్భృశమ్ ॥ 122 ॥

అక్కడితడు స్నానమును చేయుచున్న ఊర్వశిని చూచెను. ఆమెను చూడగానే అతనికి క్షోభను కలిగించే మన్మథుని తాపము ఎక్కువాయెను.

చకార మూర్ఖచేష్టాశ్చ తం వివేదోర్వశీ స్వయమ్ ।
తం మూర్ఖం సిద్ధ గదితం జ్ఞాత్వా సస్మితమాహ తమ్ ॥ 123 ॥

అతడనేక విధములైన మూర్ఖచేష్టలను ప్రదర్శించెను. అప్పుడు ఊర్వశి సిద్ధుడు చెప్పిన మూర్ఖుడితడేయని నిశ్చయించుకొని చిరునవ్వునవ్వుతూ ఆ మూర్ఖునితో నిట్లనెను.

ఊర్వశ్యువాచ :- ఊర్వశి పలికింది.

కిమిచ్ఛసి మహాభాగ మత్తః శీఘ్రమిహోచ్యతామ్ ।
కరిష్యామి వచస్తుభ్యం త్వం విస్రబ్ధం కరిష్యసి ॥ 124 ॥

ఓ మహానుభావా! నీవు అతి (శయము)గా ప్రవర్తించుచున్నావు. నీవు నానుండి ఏమి కోరుచున్నావో తొందరగా చెప్పుము. నీ మాటను నేను నెరవేర్చగలను అని పలికెను.

మూర్ఖ బ్రాహ్మణ ఉవాచ :- మూర్ఖ బ్రాహ్మణుడు పలికాడు.

ఆత్మప్రదానేన మమ ప్రాణాన్రక్ష శుచిస్మితే! ॥ 125 ॥

ఓ స్వచ్ఛమైన చిరునవ్వుగలదానా! నాకు నిన్నర్పించుకుని నా ప్రాణములను రక్షించుమని పలికెను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

తం ప్రాహాథోర్వశీ విప్రం నియమస్థాఽస్మి సాంప్రతమ్ ।
త్వం తిష్ఠస్వ క్షణమథ ప్రతీక్షస్వాఽఽగతం మమ ॥ 126 ॥

అప్పుడు ఊర్వశి అతనితో నేనిప్పుడు నియమములోనున్నాను. క్షణకాలమాగుము. నేను వచ్చువరకు వేచియుండుమని పలికెను.

0స్థితోఽస్మీత్యబ్రవీద్విప్రః సాఽపి స్వర్గం జగామ హ ।
మాసమాత్రేణ సాఽఽయాతా దదర్శ తం కృశం ద్విజమ్ ॥ 127 ॥

అప్పుడా బ్రాహ్మణుడు అలాగే ఉందుననెను. ఊర్వశి స్వర్గమునకు వెళ్ళెను. నెలరోజుల్లోనే ఊర్వశి తిరిగి వచ్చి అక్కడ కృశించియున్న బ్రాహ్మణుని చూచెను.

స్థితం మాసం నదీతీరే నిరాహారం సురాంగనా ।
తం దృష్ట్వా నిశ్చయయతం భూత్వా వృద్ధ వపుస్తతః ॥ 128 ॥

సా చకార నదీతీరే శకటం శర్కరావృతమ్ ।
ఘృతేన మధునా చైవ నదీం మత్స్యోదరీం గతా ॥ 129 ॥

నెల రోజులనుండి నిరాహారునిగా కఠోరమైన నియమముతోనుండి కృశించి ముదుసలి శరీరముతోనున్న అతనిని ఆ ఊర్వశి చూచి, ఆ తరువాత ఆమె నదీతీరంలో నేతితో తేనెతో శర్కరావృతముగా ఒక బండిని చేసినది. తరువాత మత్స్యోదరీనదిలోకి వెళ్ళెను.

భూమౌ వసంతీ స్నాత్వాఽథ శకటం చ యథార్థతః ।
తం బ్రాహ్మణం సమాహూయ వాక్యమాహ సులోచనా ॥ 130 ॥

తరువాత ఒడ్డుకు వచ్చి యథార్థమైన శరీరముతో స్నానమును చేసి చక్కని నేత్రములు గల ఆ ఊర్వశి ఆ బ్రాహ్మణుని పిలిచి ఈ విధముగా పలికెను.

ఊర్వశ్యువాచ :- ఊర్వశి పలికింది.

మయా తీవ్రం వ్రతం విప్ర చీర్ణసౌభాగ్యకారణాత్ ।
వ్రతాంతే నిష్కృతిం దద్యాం ప్రతిగృహ్ణీష్వ భో ద్విజ ॥ 131 ॥

ఓ బ్రాహ్మణుడా! సౌభాగ్యకారణమువలన నేను తీవ్రమైన వ్రతమునాచరించితిని. ఆ వ్రతాంతముగా దాని నిష్కృతిని నీకు సమర్పించుకుంటున్నాను. దానిని స్వీకరించుమని పలికెను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

స ప్రాహ కిమిదం లోకే దీయతే శర్కరావృతమ్ ।
క్షుత్క్షామకంఠః పృచ్ఛామి సాధు భద్రే సమీరయ ॥ 132 ॥

అప్పుడా బ్రాహ్మణుడన్నాడు ఏమిది? లోకంలో ఎవరైనా శర్కరావృతమైన దానినిచ్చెదరా? ఆకలితో అలమటించి పోయి అడుగుతున్నాను. సరె బాగుంది. ఓ మంగళకరురాలా! చెప్పుము.

సా ప్రాహ శకటో విప్ర శర్కరాపిష్టసంయుతః ।
ఇమం త్వం సముపాదాయ ప్రాణం తర్పయ మాచిరమ్ ॥ 133 ॥

అప్పుడామె ఓ బ్రాహ్మణుడా! ఈ శకటము పిండిశర్కరలతో కూడియున్నది. మొదట దీనిని పొంది తొందరగా ప్రాణం పోగొట్టుకోకుండా ఉంటావు.

స తచ్ఛ్రుత్వాఽథ సంస్మృత్య క్షుధయా పీడితోఽపి సన్ ।
ప్రాహ భద్రే న గృహ్ణామి నియమో హి కృతో మయా ॥ 134 ॥

ఆ మాటవిని ఆ బ్రాహ్మణుడు ఆకలితో కూడుకొనియున్నవాడైనప్పటికి తాను చేసిన ప్రతిజ్ఞను తలుచుకొని ఓ శుభంకరీ! నేను స్వీకరించను, ఎందుకనగా నేనింతకుముందే ప్రతిజ్ఞ చేసియుంటిని.

పురతః సిద్ధవర్యస్య న భోక్ష్యే శకటంత్వితి ।
పరిజ్ఞానార్థముర్వశ్యా దదస్వాన్యస్య కస్యచిత్ ॥ 135 ॥

ఊర్వశి నన్ను గుర్తించువరకు నా శరీరమును రక్షించుకొనుటకై ఆహారమును తీసుకొనననని సిద్ధవర్యునిముందు ప్రతిజ్ఞ చేసితిని. కావున ఇతరులకెవరికైనా దానము చేయుమనెను.

సాఽబ్రవీ న్నియమో భద్ర కృతః కాష్ఠమయే త్వయా ।
నాసౌ కాష్ఠమయో భుంక్ష్వ క్షుధయా చాతిపీడితః ॥ 136 ॥

ఓ మిత్రమా! కఱ్ఱవిషయంతో కదా నీవు ప్రతిజ్ఞ చేసినది. నీవు మిక్కిలి ఆకలితోనున్నావు. ఇది కఱ్ఱతోచేసినది కాదు. కావున దీనిని తినుమనెను.

తాం బ్రాహ్మణః ప్రత్యువాచ న మయా తద్విశేషణమ్ ।
కృతం భద్రేఽథ నియమః సామాన్యేనైవ మే కృతః ॥ 137 ॥

దానికి ఆ బ్రాహ్మణుడు ఆమెతో ఇలా బదులు పలికాడు. ఓ మంగళకరురాలా! నేనావిధంగా కఱ్ఱ నుద్దేశించి పలుకలేదు. సామాన్యముగానే నేను ప్రతిజ్ఞ చేసితినని బదులు పలికెను.

తం భూయః ప్రాహ సా తన్వీ న చేద్భోక్ష్యసి బ్రాహ్మణ ।
గృహం గృహీత్వా గచ్ఛస్వ కుటుంబం తవ భోక్ష్యతి ॥ 138 ॥

మళ్ళీ ఆ సుందరాంగి ఓ బ్రాహ్మణుడా! ఒకవేళ నీవు తినకుంటే ఇంటికి తీసుకొని వెళ్లు. నీ కుటుంబము తినుననెను.

స తాముహాచ సుదతి న తావ ద్యామి మందిరమ్ ।
ఇహాఽఽయాతా వరారోహా త్రైలోక్యేఽప్యధికా గుణైః ॥ 139 ॥

ఓ సుందరీ! ముల్లోకములలో గుణములచే అధికురాలైన ఊర్వశి ఇక్కడికి వచ్చేంతవరకూ నేనింటికి వెళ్లనని పలికెను.

సా మయా మదనార్తేన ప్రార్థితాఽఽశ్వాసితస్తయా ।
స్థీయతాం క్షణమిత్యేవం స్థాస్యామీతి మయోదితమ్ ॥ 140 ॥

మదనార్తుడనైన నే నామెను ప్రార్థించగా ఆమెనన్నోదార్చినది. క్షణకాలముండమని చెప్పి వెళ్ళినది. నేనట్లే ఉందునంటిని.

మాసమాత్రం గతాయాస్తు తస్యా భద్రే స్థితస్య చ ।
మమ సత్యానురక్తస్య సంగమాయ ధృతవ్రతే ॥ 141 ॥

వ్రతధరీ! భద్రురాలా! ఆమె వెళ్ళి ఒక్కనెల మాత్రమే అయినది అట్లు నెల రోజులనుండి సత్యముపై అభిమానంతో ఆమె కలయిక కొరకు నియమముగా నున్నానని పలికెను.

తస్య సా వచనం శ్రుత్వా కృత్వా స్వం రూపముత్తమమ్ ।
విహస్య భావగంభీరముర్వశీ ప్రాహ తం ద్విజమ్ ॥ 142 ॥

ఆమె అతని మాటలను విని ఉత్తమమైన తన నిజరూపమును ధరించి, భావగంభీరమైన నవ్వునవ్వి, ఆ బ్రాహ్మణునితో నిట్లనెను.

ఊర్వశ్యువాచ :– ఊర్వశి పలికింది.

సాధు సత్యం త్వయా విప్ర వ్రతం నిష్ఠితచేతసా ।
నిష్పాదితం హఠాదేవ మమ దర్శనమిచ్ఛతా ॥ 143 ॥

ఓ బ్రాహ్మణుడా! బాగు బాగు నీవు నీ వ్రతమును నిజముగా నిష్ఠాయుక్తమైన మనస్సుతో చేసితివి. నీ నియమముతోనే నన్ను చూడగోరి చేయుచున్నానని చెప్పి సిద్ధినొందితివి.

అహమేవోర్వశీ విప్ర త్వజ్జిజ్ఞాసార్థమాగతా ।
పరీక్షితో నిశ్చితవాన్భవాన్సత్య తపొఋషిః ॥ 144 ॥

ఓ బ్రాహ్మణుడా! నేనే ఊర్వశిని నిన్ను తెలుసుకొనవలెననే ఇక్కడకు వచ్చితిని. నాచే పరీక్షించబడితివి. నీవు సత్యమైన తపస్సుతో ఋషివంటివానివి.

గచ్ఛ సూకర వోద్దేశం రూప తీర్థేతి విశ్రుతమ్ ।
సిద్ధిం యాస్యసి విప్రేంద్ర తతస్త్వం మామవాప్స్యసి ॥ 145 ॥

'సూకరవ'మనే ప్రదేశంలో ప్రసిద్ధి గాంచిన 'రూపతీర్థ'మనే సరోవరమున్నది అక్కడకు వెళ్లుము. ఓ బ్రాహ్మణోత్తమా! నీవక్కడ సిద్ధిని పొందగలవు. ఆ తరువాత నన్ను పొందగలవు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

ఇత్యుక్త్వా దివముత్పత్య సా జగామోర్వశీ ద్విజాః ।
స చ సత్యతపా విప్రో రూపతీర్థం జగామ హ ॥ 146 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా చెప్పి ఆ ఊర్వశి ఆకాశ మార్గాన స్వర్గమునకు వెళ్ళెను. ఆ సత్యతాపసియైన విప్రుడు రూప తీర్థమునకు వెళ్ళెను.

తత్ర శాంతిపరో భూత్వా నియమవ్రత ధృక్శుచిః ।
దేహోత్సర్గే జగామాసౌ గాంధర్వం లోకముత్తమమ్ । 147 ॥

అక్కడ నియమవ్రతాన్ని ధరించి, శుచిగా శాంతచిత్తుడైయుండి, దేహావసానమున ఉత్తమమైన గంధర్వలోకమును చేరెను.

తత్ర మన్వంతరశతం భోగాన్భుక్త్వా యథార్థతః ।
బభూవ సుకులే రాజా ప్రజారంజనతత్పరః ॥ 148 ॥

అక్కడ నూరుమన్వంతరముల వరకు యథార్థముగా భోగములననుభవించి, మంచికులములో పుట్టి ప్రజారంజన తత్పరుడైన రాజాయెను.

స యజ్వా వివిధైర్యజ్ఞైః సమాప్తవరదక్షిణైః ।
పుత్రేషు రాజ్యం నిక్షిప్య యయౌ శౌకరవం పునః ॥ 149 ॥

అతడు అనేక విధములైన యజ్ఞములను చేసి, యజ్ఞ సమాప్తియందు గొప్ప దక్షిణల నిచ్చి, తన కుమారులకు రాజ్యము నప్పగించి 'శౌకరవ'మనే (చిలుకల గుంపుల శబ్దములుగల) ప్రదేశమునకువెళ్ళెను.

రూపతీర్థే మృతో భూయః శక్రలోకముపాగతః ।
తత్ర మన్వంతరశతం భోగాన్భుక్త్వా తతశ్చ్యుతః ॥ 150 ॥

ప్రతిష్ఠానే పురవరే బుధపుత్రః పురూరవాః ।
బభూవ తత్ర చోర్వశ్యాః సంగమాయ తపోధనాః ॥ 151 ॥

తిరిగి రూప తీర్థములో మరణించి ఇంద్రలోకమును చేరుకొనెను. అక్కడనూరు మన్వంతరముల కాలము భోగములననుభవించి అక్కడినుండి చ్యుతుడై, ఓ తపోధనులారా! ఆ బ్రాహ్మణుడు శ్రేష్ఠమైన ప్రతిష్ఠానమనే పేరుగల నగరంలో ఊర్వశి సంగమము కొరకు పురూరవునిగా పుట్టెను.

ఏవం పురా సత్య తపాద్విజాతి స్తీర్థే ప్రసిద్ధే స హి రూపసంజ్ఞే ।
ఆరాధ్య జన్మన్యథ చార్చ్య విష్ణు మవాప్య భోగానథ ముక్తిమేతి ॥ 152 ॥

ఈ విధముగా సత్యమైన తపస్సు చేసిన బ్రాహ్మణుడు ప్రసిద్ధమైన రూపతీర్థమనే సరస్సులో స్నానం చేసి, ఆ జన్మలో విష్ణువు నారాధించి, అర్చించి అనేక భోగములను పొంది, చివరకు ముక్తినొందెను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే ప్రజాగరే గీతికాయాః ప్రశంసా నిరూపణం నామ వింశత్యధిక శతతమోఽధ్యాయః ॥ 120 ॥

శ్రీబ్రహ్మ పురాణమునందలి వ్యాస ఋషి సంవాదములోని ప్రజాగరే గీతికాయాః ప్రశంసానిరూపణమనే పేరుగల నూట ఇరవైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకవింశాధికశతతమోఽధ్యాయః - నూట ఇరవైఒకటవ అధ్యాయం

మాయా ప్రాదుర్భావ నిరూపణః - మాయా ప్రాదుర్భావ నిరూపణం

మునయ ఊచుః :- మునులు పలికారు.

శ్రుతం ఫలం గీతికాయా అస్మాభిః సుప్రజాగరే ।
కృష్ణస్య యేన చాండాలో గతోఽసౌ పరమాంగతిమ్ ॥ 1 ॥

కృష్ణుని కీర్తించినందువలన, ప్రజాగరము నాచరించినందువలన ఈ చండాలు డెట్లు పరమగతిని పొందినాడో, ఆ ప్రజాగరమునకు, గీతములకు గలిగిన ఫలమేమిటో మేము వింటిమి.

యథా విష్ణౌ భవేద్భక్తిస్తన్నో బ్రూహి మహామతే ।
తపసా కర్మణా యేన శ్రోతుమిచ్ఛామ సాంప్రతమ్ ॥ 2 ॥

ఓ మహామతీ! ఏ తపస్సుచేత, ఏ కర్మచేత విష్ణువుయందు భక్తి కలుగుతుందో దానిని గూర్చిచెప్పుము. మేమిప్పుడు దానిని వినగోరుచున్నాము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రవక్ష్యామ్యనుపూర్వశః ।
యథా కృష్ణే భవేద్భక్తిః పురుషస్య మహాఫలా ॥ 3 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! దేనివల్లనైతే మానవునికి మహానుభావుడైన కృష్ణునియందు మహాఫలమును కల్గించే భక్తి కలుగుతుందో దానిని సవిస్తరముగా చెప్పబోవుచున్నాను వినుడు.

సంసారేఽస్మిన్మహాఘోరే సర్వభూత భయావహే ।
మహద్దుఃఖకరే నృణాం నానాదుఃఖశతాకులే ॥ 4 ॥

తిర్యగ్యోని సహస్రేషు జాయమానః పునః పునః ।
కథంచిల్లభతే జన్మ దేహీ మానుష్యకం ద్విజాః ॥ 5 ॥

సమస్త జీవులకు భయమును కలిగించే, మానవులకు మహాదుఃఖమును కలిగించే, అనేక వందల దుఃఖములకు నిలయమైనటువంటి ఈ మహాఘోరమైన సంసారమునందు ఓ బ్రాహ్మణులారా! పశు పక్ష్యాది వేల జన్మలను మాటిమాటికి పొంది, ఏదో ఒక పుణ్య విశేషము వలన జీవి మానవజన్మను పొందుతాడు.

మానుషత్వేఽపి విప్రత్వం విప్రత్వేఽపి వివేకితా ।
వివేకాద్ధర్మబుద్ధిస్తు బుద్ధ్యా తు శ్రేయసాం గ్రహః ॥ 6 ॥

అందులో మనుష్యులలో బ్రాహ్మణునిగా, దానిలో గూడా వివేకవంతునిగా, దానిలో ధర్మబుద్ధి గలవానిగా, ఆ ధర్మబుద్ధి గలవారిలో గూడా శ్రేయస్సును గ్రహించేవానిగా పుట్టుట కష్టము.

యావత్పాపక్షయః పుంసాం న భవేజ్జన్మసంచితః ।
తావన్నజాయతే భక్తిర్వాసుదేవే జగన్మయే ॥ 7 ॥

ఎంతవరకైతే అనేక జన్మలనుండి సంపాదించుకున్న పాపము నశించదో అంతవరకు మానవులకు జగన్మయుడైన వాసుదేవునియందు భక్తి కలుగదు.

తస్మాద్వక్ష్యామి భో విప్రా భక్తిః కృష్ణే యథా భవేత్ ।
అన్యదేవేషు యా భక్తిః పురుషస్యేహ జాయతే ॥ 8 ॥

అందువలన ఓ బ్రాహ్మణులారా! ఈ లోకంలో ఇతర దేవతలయందే భక్తికలుగునో, ఏ విధంగానైతే కృష్ణునియందు భక్తి కలుగునో దానిని గూర్చి చెప్పబోవుచున్నాను.

కర్మణా మనసా వాచా తద్గతేనాంతరాత్మనా ।
తేన తస్య భవేద్భక్తిర్యజనే మునిసత్తమాః ॥ 9 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! మనో వాక్కాయ కర్మలతో, తనయందే నిలచియున్న పరమాత్మతో యజ్ఞమునాచరించిన వానికి భక్తి కలుగును.

స కరోతి తతో విప్రా భక్తిం చాగ్నేః సమాహితః ।
తుష్టే హుతాశనే తస్య భక్తిర్భవతి భాస్కరే ॥ 10 ॥

ఓ విప్రులారా! అగ్నితో కూడుకున్నవాడై యజ్ఞమునాచరించగా ఆ తరువాత ఆ అగ్ని సంతోషించగా అతనికి సూర్యునియందు భక్తి కలుగును.

పూజాం కరోతి సతతమాదిత్యస్య తతో ద్విజాః ।
ప్రసన్నే భాస్కరే తస్య భక్తిర్భవతి శంకరే ॥ 11 ॥

ఓ ద్విజులారా! అప్పుడతడు నిత్యము సూర్యుని పూజించగలడు. అతని పూజకు సూర్యుడు సంతోషించగా అతనికి శంకరునియందు భక్తి కలుగును.

పూజాం కరోతి విధివత్సతు శంభోః ప్రయత్నతః ।
తుష్టే త్రిలోచనే తస్య భక్తిర్భవతి కేశవే ॥ 12 ॥

అతడనేక ప్రయత్నములతో విధిపూర్వకముగా శివుని పూజించిన అతని పూజకు శివుడు సంతోషించగా అతని యనుగ్రహముతో కేశవునియందు భక్తి కలుగును.

సంపూజ్య తం జగన్నాథం వాసుదేవాఖ్యమవ్యయమ్ ।
తతో భుక్తిం చ ముక్తిం చ స ప్రాప్నోతి ద్విజోత్తమాః ॥ 13 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! వాసుదేవుడనే పేరుగల అవ్యయుడైన ఆ జగన్నాథుని పూజించగా ఆయన అనుగ్రహముతో మానవుడు భుక్తిని ముక్తిని పొందగలడు.

మునయ ఊచుః :– మునులు పలికారు.

అవైష్ణవా నరా యే తు దృశ్యంతే చ మహామునే ।
కిం తే విష్ణుం నార్చయంతి బ్రూహి తత్కారణం ద్విజ ॥ 14 ॥

ఓ మహామునీ! బ్రాహ్మణోత్తమా! ఎవరైతె వైష్ణవులుగానివారు కన్పించుచున్నారో, వారు విష్ణువు నెందుకు ఆరాధించరో, దానికిగల కారణమేమిటో వివరించుడు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

ద్వౌ భూతసర్గౌ విఖ్యాతౌ లోకేఽస్మిన్మునిసత్తమాః ।
ఆసురశ్చ తథా దైవః పురా సృష్టః స్వయంభువా ॥ 15 ॥

ఓ మునిసత్తములారా! ఈ లోకంలో భూత సర్గములనునవి రెండు ప్రసిద్ధములైనవి. బ్రహ్మ పూర్వము అసురదైవములనే రెండు ప్రకృతులను సృష్టించాడు.

దైవీం ప్రకృతిమాసాద్య పూజయంతి తతోఽచ్యుతమ్ ।
ఆసురీం యోనిమాపన్నా దూషయంతి నరా హరిమ్ ॥ 16 ॥

దైవ ప్రకృతిని పొందినవారు అచ్యుతుని ఆరాధించెదరు. ఆసురయోనియందు పుట్టినవారు ఎల్లప్పుడు హరిని ద్వేషింతురు.

మాయయా హతవిజ్ఞానా విష్ణోస్తే తు నరాధమాః ।
అప్రాప్య తం హరిం విప్రాస్తతో యాన్త్యధమాం గతిమ్ ॥ 17 ॥

ఓ విప్రులారా! విష్ణుమాయచేత ఆ అజ్ఞానులైన నరాధములైతే హరిని పొందక అధమగతి నందగలరు.

తస్య యా గహ్వరీ మాయా దుర్విజ్ఞేయా సురాసురైః ।
మహామోహకరీ నృణాం దుస్తరా చాకృతాత్మభిః ॥ 18 ॥

ఆ విష్ణుమాయ చాలా గంభీరమైనది, మానవులకు మోహమును కల్గించేది, మిక్కిలి దుస్తరమైనది. సుకృతంలేని వారిచేత తెలుసుకొన శక్యముగానిది.

మునయ ఊచుః :– మునులు పలికారు.

ఇచ్ఛామస్తాం సమాజ్ఞాతుం విష్ణోర్మాయాం సుదుస్తరామ్ ।
వక్తుమర్హసి ధర్మజ్ఞ పరం కౌతూహలం హి నః ॥ 19 ॥

ఓ ధర్మజ్ఞుడా! ఆ దుస్తరమైన విష్ణుమాయను గూర్చి మాకు తెలుసు కొనవలయునని మిక్కిలి కోరికగాయున్నది కావున వివరింపుడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

స్వప్నేంద్రజాలసంకాశా మాయా సా లోకకర్షిణీ ।
కః శక్నోతి హరేర్మాయాం విజ్ఞాతుం కేశవాదృతే ॥ 20 ॥

స్వప్నంలో ఇంద్రజాలంలాగా ఆకర్షించే స్వభావం గలది ఆ మాయ. అటువంటి విష్ణుమాయను ఆ కేశవుడు తప్ప మరొకడెవడు తెలుసుకొనగలడు?

యా వృత్తా బ్రాహ్మణస్యాఽఽసీన్మాయార్థే నారదస్య చ ।
విడమ్బనాం తు తాం విప్రాః శృణుధ్వం గదతో మమ ॥ 21 ॥

ఈ మాయ విషయంలో బ్రాహ్మణునకు మరియు నారదునకు జరిగిన ఒక వృత్తాంతము కలదు. ఓ బ్రాహ్మణులారా! అటువంటి మోసకారియయిన మాయను గూర్చి చెప్పుచున్నాను వినుడు.

ప్రాగాసీన్నృపతిః శ్రీమానాగ్నీధ్ర ఇతి విశ్రుతః ।
నగరే కామదమనస్తస్యాథ తనయః శుచిః ॥ 22 ॥

పూర్వ కాలమున నొకానొక నగరమందు ఆగ్నీధ్రుడనే పేరుగల ప్రసిద్ధుడైన రాజుండెను. అతనికి పరిశుద్ధుడైన కామదమనుడనే పేరుగల కుమారుడుండెను.

ధర్మారామః క్షమాశీలః పితృశుశ్రూషణే రతః ।
ప్రజానురంజకో దక్షః శ్రుతి శాస్త్రకృతశ్రమః ॥ 23 ॥

అతడు పవిత్రుడు ధర్మాచరణము నందానందము నొందువాడు, క్షమా గుణము కలిగినవాడు, తల్లి దండ్రులకు సేవచేయుటయందాసక్తికలవాడు, వేద శాస్త్రములయందు బాగా పరిశ్రమ చేసినవాడు, ప్రజానురంజకముగా పరిపాలించుటలో సమర్థుడు.

పితాఽస్య త్వకరోద్యత్నం వివాహాయ న చైచ్ఛత ।
తం పితా ప్రాహ కిమితి నేచ్ఛసే దారసంగ్రహమ్ ॥ 24 ॥

అతని తండ్రి అతనికి వివాహమును చేయుటకు ప్రయత్నించెను. కాని అతడిష్ట పడలేదు. అప్పుడా తండ్రి నీవు వివాహమును చేసుకొనుట కెందుకిష్టపడుటలేదని ప్రశ్నించెను.

సర్వమేతత్సుఖార్థం హి వాంఛంతి మనుజాః కిల ।
సుఖమూలా హి దారాశ్చ తస్మాత్తం త్వం సమాచర ॥ 25 ॥

మానవులందరూ సుఖమునే కోరుకొందురు కదా! ఆ సుఖానికి మూలము భార్యయెకదా అందువలన నీవు వివాహము చేసుకొమ్మనెను.

స పితుర్వచనం శ్రుత్వా తూష్ణీమాస్తే చ గౌరవాత్ ।
ముహుర్ముహుస్తం చ పితా చోదయామాస భో ద్విజాః ॥ 26 ॥

తన తండ్రి మాటలను విని అతని యందు గౌరవముతో మాట్లాడకుండెను. ఓ బ్రాహ్మణులారా! తండ్రి ఆ కుమారుని వివాహమునకై మాటిమాటికి ప్రోత్సహించుచుండెను.

అథాసౌ పితరం ప్రాహ తాత నామానురూపతా ।
మయా సమాశ్రితా వ్యక్తా వైష్ణవీ పరిపాలినీ ॥ 27 ॥

అప్పుడాకుమారుడు తండ్రితో తండ్రీ! (నా) పేరుకు తగినట్లుగా నేను పరిపాలకురాలైన వైష్ణవీదేవిని ఆశ్రయించితినని పలికెను.

తం పితా ప్రాహ సంగమ్య నైష ధర్మోఽస్తి పుత్రక ।
న విధారయితవ్యాస్యాత్పురుషేణ విపశ్చితా ॥ 28 ॥

అపుడాతండ్రి దగ్గరగా వెళ్ళి నాయనా! ఇది ధర్మముకాదు. బుద్ధిమంతుడైనవాడు విధినతిక్రమించ కూడదు.

కురు మద్వచనం పుత్ర ప్రభురస్మి పితా తవ ।
మా నిమజ్జ కులం మహ్యం నరకే సంతతిక్షయాత్ ॥ 29 ॥

అందువలన నా కొఱకైనా కుమారా! నామాటవిను నేనురాజునే కాక నీకు తండ్రిని కూడా సంతాన క్షయంతో మన వంశాన్ని నరకంలో పడత్రోయకుము.

స హితం పితురాదేశం శ్రుత్వా ప్రాహ సుతో వశీ ।
ప్రీతః సంస్మృత్య పౌరాణీం సంసారస్య విచిత్రతామ్ ॥ 30 ॥

తండ్రి యాజ్ఞను విన్న ఆ కుమారుడు పురాణగాథల్లో వర్ణించిన సంసారముయొక్క విచిత్రతను స్మరించుకొని ప్రీతుడై తండ్రితో నిట్లనెను.

పుత్ర ఉవాచ :– కుమారుడు పలికాడు.

శ్రుణు తాత వచో మహ్యం తత్త్వవాక్యం సహేతుకమ్ ।
నామానురూపం కర్తవ్యం సత్యం భవతి పార్థివ ॥ 31 ॥

తండ్రీ! నేను చెప్పబోవు సహేతుకమైన తత్త్వవాక్యమును వినుడు. ఓ రాజా! పేరుకు తగినట్లుగా చేయుటే సత్యమగును.

మయా జన్మసహస్రాణి జరామృత్యుశతాని చ ।
ప్రాప్తాని దారసంయోగవియోగాని చ సర్వశః ॥ 32 ॥

నేను వేల జన్మలను, వందల కొలది జరామరణములను, భార్యాసంయోగవియోగములను అనేకములుగా పొందితిని.

తృణగుల్మలతావల్లీ సరీసృపమృగద్విజాః ।
పశుస్త్రీపురుషాద్యాని ప్రాప్తాని శతశో మయా ॥ 33 ॥

నేను గడ్డిగా, పొదగా, తీగగా, పాముగా, మృగముగా, బ్రాహ్మణునిగా, పశువుగా, స్త్రీగా, పురుషునిగా వందల కొలది జన్మల నొందితిని.

గణకింనరగంధర్వ విద్యాధరమహోరగాః ।
యక్షగుహ్యాకరక్షాంసి దానవాప్సరసః సురాః ॥ 34 ॥

నదీశ్వర సహస్రం చ ప్రాప్తం తాత పునః పునః ।
సృష్టస్తు బహుశః సృష్టౌ సంహారే చాపి సంహృతః ॥ 35 ॥

గణచారిగా, కింన్నర, గంధర్వ, విద్యాధర, నాగ, యక్ష, గుహ్యక (ధనాగార రక్షకునిగా) రాక్షసునిగా, దానవునిగా, అప్సరసగా, దేవతగాను, నదిగాను, రాజుగాను ఇట్లు మాటిమాటికి వేలకొలది జన్మల నొందితిని. తండ్రీ! సృష్టిలో అనేక విధములుగా సృష్టించబడితిని. ప్రళయంలోను అనేకమార్లు చంపబడితిని.

దారసంయోగయుక్తస్య తాతేదృఙ్మే విడంబనా ।
ఇతస్తృతీయే యద్వృత్తం మమ జన్మని తచ్ఛృణు ॥
కథయామి సమాసేన తీర్థమాహాత్మ్యసంభవమ్ ॥ 36 ॥

తండ్రీ! భార్యాసంయోగంతో కూడుకున్న మాయతోనే నేనిట్లయితిని. ఇక నా గడచిన మూడవ జన్మలోని కథ చెపుతాను. తీర్థమాహాత్మ్యమువల్ల జరిగినదేమిటో విపులముగా చెప్పుచున్నాను వినుడు.

అతీత్య జన్మాని బహూని తాత నృదేవగంధర్వమహోరగాణామ్ ।
విద్యాధరాణాం ఖగ కింనరాణాం జాతో హి వంశే సుతపామహర్షిః ॥ 37 ॥

తండ్రీ! నేను మానవునిగా, దేవతగా, గంధర్వునిగా, గొప్పనాగజాతివానిగా, విద్యాధరునిగా, ఆకాశగామిగా, కింనరునిగా అనేక జన్మలతపః ఫలముగా సుతపుడనే మహర్షిగా పుట్టితిని.

తతో మమాభూదచలా హి భక్తిర్జనార్దనే లోకపతౌ మధుఘ్నే ।
వ్రతోపవాసైర్వివిధైశ్చ భక్త్యా సంతోషితశ్చక్రగదాస్త్రధారీ ॥ 38 ॥

ఆ తరువాత మధువనే రాక్షసుని చంపిన, లోకముల కంతటికీ ప్రభువైన శ్రీమహావిష్ణువుయందచంచలమైన భక్తి కలిగినది. నేను అనేకవిధములైన వ్రతములతో, ఉపవాసములతో, భక్తితో చక్రగదాద్యస్త్రములను ధరించు స్వామిని సంతోషపెట్టితిని.

తుష్టోఽభ్యగాత్పక్షిపతిం మహాత్మా విష్ణుః సమారుహ్య వరప్రదో మే ।
ప్రాహోచ్చ శబ్దం వ్రియతాం ద్విజాతే వరో హి యం వాంఛసి తం ప్రదాస్యే ॥ 39 ॥

వరప్రదుడైన శ్రీమన్నారాయణుడు గరుత్మంతునధిరోహించి వచ్చి సంతోషించి నాయనా! నీకే వరం కావాలో కోరుకో దానిని నేనిచ్చెదనని గట్టిగా పలికెను.

తతోఽహమూచే హరిమీశితారం తుష్టోఽసి చేత్కేశవ తద్వృణోమి ।
యా సా త్వదీయా పరమా హి మాయా తాం వేత్తుమిచ్ఛామి జనార్దనాహమ్ ॥ 40 ॥

అప్పుడు నేను సమస్తకోరికలను తీర్చే ఆ శ్రీహరితో నిట్లు పలికితిని. ఓ కేశవా! జనార్దనా! నీవు నా భక్తికి సంతోషించినట్లయితే వరమును కోరుచున్నాను. అదేమనగా నేను నీ పరమమాయ అనేది ఏదైతే ఉన్నదో దానిని తెలియగోరుచున్నాను.

అథాబ్రవీన్మే మధుకైటభారిః కిం తే తయా బ్రహ్మన్మాయయా వై ।
ధర్మార్థకామాని దదాని తుభ్యం పుత్రాణి ముఖ్యాని నిరామయత్వమ్ ॥ 41 ॥

అప్పుడు మధుకైటభులకు శత్రువైన శ్రీహరి నాతో ఓ బ్రాహ్మణుడా! నీకు ఆ మాయతో పని యేమి? నీకు ముఖ్యమైన ధర్మార్థకామములను, పుత్రులను, సంతోషమును (వ్యాధిలేని ఆరోగ్యాన్ని) నిచ్చెదననెను.

తతో మురారిం పునరుక్తవానహం భూయోఽర్థధర్మార్థజిగీషితైవ యత్ ।
మాయాం తవేమామిహ వేత్తుమిచ్ఛే మమాద్య తాం దర్శయ పుష్కరాక్ష! ॥ 42 ॥

అప్పుడు ముర అను రాక్షసుని సంహరించిన ఆ స్వామితో మళ్లీ నేనన్నాను. ఓ పుష్కరాక్షా! ఆ ధర్మార్థములను జయించాలనే కోరికతోనున్నాను. ఈ రోజు నీ మాయను తెలుసుకోవాలనుకుంటున్నాను. కావున నాకీరోజు దానిని చూపించుము.

తతోఽభ్యువాచాథ నృసింహముఖ్యః శ్రీశః ప్రభుర్విష్ణురిదం వచో మే ।
మాయాం మదీయాం న హి వేత్తి కశ్చిన్న చాపి వా వేత్స్యతి కశ్చిదేవ ॥ 43 ॥

ఆ తరువాత నృసింహాద్యవతారములను ధరించినవాడు, లక్ష్మీపతి, ప్రభువైన విష్ణువు నాతో ఇట్లన్నాడు. నా మాయను ఎవడు తెలుసుకొనుట లేదు. ఇక ముందు కూడా తెలుసుకోలేడు.

పూర్వం సురర్షిర్ద్విజనారదాఖ్యో బ్రహ్మాత్మజోఽభూన్మమ భక్తియుక్తః ।
తేనాపి పూర్వం భవతా యథైవ సంతోషితో భక్తిమతా హి తద్వత్ ॥ 44 ॥

ఓ బ్రాహ్మణుడా! పూర్వము దేవర్షి అయిన నారదుడు నాయందు భక్తిని కలిగి యుండుట చేతనే బ్రహ్మకు కుమారునిగా జన్మించాడు. అతడు కూడా నీలాగానే తన భక్తితో నన్ను సంతోషపెట్టినాడు.

వరం చ దాతుం గతవానహం చ స చాపి వవ్రే వ్రతమేతమేవ ।
నివారితో మామతిమూఢభావాద్వవాన్యథైవం వృతవాన్వరం చ ॥ 45 ॥

నేనతనికి వరమివ్వాలని కూడా వెళ్ళాను. అతడు కూడా నీవడిగిన వరమునే అడిగినాడు. నిన్ను వారించినట్లు గానే అతనిని వారించాను. కాని మూర్ఖపు పట్టుదలతో మళ్లీ నీలాగా అదే వరం కావాలన్నాడు.

తతో మయోక్తోఽమ్భసి నారద త్వం మాయాం హి మే వేత్స్యసి సంనిమగ్నః ।
తతో నిమగ్నోఽమ్భసి నారదోఽసౌ కన్యా బభౌ కాశిపతేః సుశీలా ॥ 46 ॥

అప్పుడు నేనన్నాను నారదా! నీవు సముద్రంలో (నీటిలో) మునిగినట్లైతే నా మాయను తెలుసుకోగలవు. అతడు అట్లే అని నీటిలో మునుగగా కాశిరాజుకు సుశీల అనుపేరుతో కుమార్తెగా జన్మించెను.

తాం యౌవనాఢ్యామథ చారుధర్మిణే విదర్భరాజ్ఞస్తనయాయ వై దదౌ ।
సుధర్మణే సోఽపి తయా సమేతః సిషేవ కామానతులా న్మహర్షిః ॥ 47 ॥

ఆ తరువాత యౌవనవయస్సుకు వచ్చిన ఆమెను చక్కని ధర్మచారి అయిన విదర్భరాజ కుమారుడగు సుధర్మునకిచ్చి వివాహము చేసెను. ఆ ధర్మశీలుడైన సుధర్ముడు (మహర్షి) ఆమెతో కలిసి అనేక సౌఖ్యముల ననుభవించెను.

స్వర్గే గతేఽసౌ పితరి ప్రతాపవాన్రాజ్యం క్రమాయాత మవాప్య హృష్టః ।
విదర్భరాష్ట్రం పరిపాలయానః పుత్రైః సపౌత్రైర్బహుభిర్వృతోఽభూత్ ॥ 48 ॥

తన తండ్రి గతించిన తరువాత వంశపారంపర్యముగా వచ్చిన రాజ్యమును ప్రతాపవంతుడైన సుధర్ముడు పొంది సంతోషించెను. విదర్భరాష్ట్రమును చక్కగా పరిపాలిస్తూ అనేకమంది పుత్ర, పౌత్రులతో కూడుకొనియుండెను.

అథాభవద్భూమిపతేః సుధర్మణః కాశీశ్వరేణాథ సమం సయుద్ధమ్ ।
తత్ర క్షయం ప్రాప సపుత్రపౌత్రో విదర్భరాట్ కాశిపతిశ్చ యుద్ధే ॥ 49 ॥

ఆ తరువాత రాజైన సుధర్మునకు కాశిపతితో ఘోరయుద్ధము సంభవించెను. ఆ యుద్ధములో విదర్భరాజు, కాశిరాజు ఇద్దరు కూడా తమ పుత్రపౌత్రులతో సహ నాశనమైరి.

తతః సుశీలా పితరం స పుత్రం జ్ఞాత్వా పతిం చాపి సపుత్రపౌత్రమ్ ।
పురాద్వినిఃసృత్య రణావనిం గతా దృష్ట్వా సుశీలా కదనం మహత్తత్ ॥ 50 ॥

భర్తుర్బలే తత్ర పితుర్బలే చ దుఃఖాన్వితా సా సుచిరం విలప్య ।
జగామ సా మాతర మార్తరూపా భ్రాతౄన్సుతాన్భ్రాతృసుతాన్స పౌత్రాన్ ॥ 51 ॥

భర్తారమేషా పితరం చ గృహ్య మహాస్మశానే మహాచితిం సా ।
కృత్వా హుతాశం ప్రదదౌ స్వయం చ యదా సమిద్ధో హుతభుగ్బభూవ ॥ 52 ॥

తదా సుశీలా ప్రవివేశవేగాద్ధా పుత్ర హా పుత్ర ఇతి బ్రువాణా ।
తదా పునఃసా మునిర్నారదోఽభూత్స చాపి వహ్నిః స్ఫటికామలాభః ॥ 53 ॥

ఆ తరువాత సుశీల అంతః పురమునుండి బయలుదేరి యుద్ధభూమికి వెళ్ళింది. అక్కడ ఆ గొప్ప యుద్ధ భూమిలో మరణించిన పుత్రునితో కూడుకొనియున్న తండ్రిని, పుత్ర పౌత్రులతో కూడుకొనియున్న తనభర్తనుచూచి, తన భర్తబలమును, తండ్రి బలమును చూచి చాలా సేపటి వరకు దుఃఖించి, ఆర్తురాలై తాను తనతల్లిదగ్గరకు వెళ్ళింది. సోదరులను, కుమారులను సోదరుని కుమారులను మనుమలతోసహ భర్తను, తండ్రిని కూడా తీసుకొని మహాస్మశానానికి వెళ్ళి, చితిని పేర్చి స్వయముగా నిప్పు పెట్టి దహన సంస్కారమును చేసెను. ఎప్పుడైతే సమిధలతో మండుచున్న అగ్ని హవిస్సును స్వీకరించే హుతభుక్‌గా ప్రజ్వలించాడో ఆ సమయంలోనే సుశీల వేగముగా హాపుత్రా! హాపుత్రా! అంటూ చితిలోనికి ప్రవేశించెను. వెంటనే ఆ సుశీల మళ్ళీ నారదమునిగా మారెను. అగ్ని కూడా స్వచ్ఛమైన స్ఫటికముగా మారెను.

పూర్ణం సరోఽభూదథచోత్తతార తస్యాగ్రతో దేవవరస్తు కేశవః ।
చతుర్భుజః శంఖగదారిహస్తః ప్రహస్య దేవర్షిమువాచ నారదమ్ ॥ 54 ॥

అది ఎదురుగా నిండిన సరస్సుగా ఏర్పడెను. దానినుండి శంఖ చక్రగదాది ఆయుధములను ధరించిన చతుర్భుజుడు, దేవతా శ్రేష్ఠుడైన శ్రీమన్నారాయణుడవతరించి నవ్వుతూ దేవర్షి అయిన నారదునితో ఈ విధముగా అన్నాడు.

కస్తే తు పుత్రో వద మే మహర్షే మృతం చ కం శోచసి నష్టబుద్ధిః ।
వ్రీడాన్వితోఽభూదథ నారదోఽసౌ తతోఽహమేనం పునరేవ చాఽఽహ ॥ 55 ॥

ఓ మహర్షీ! నీ కుమారుడెవడో చెప్పుము. మరణించినవానెవని గూర్చి నష్టబుద్ధివై దుఃఖిస్తున్నావు? అప్పుడా నారదుడు తిరిగి నేను మళ్ళీ అడిగితినని తెలుసుకొని సిగ్గుపడెను.

ఇతీదృశీ నారద కష్టరూపా మాయా మదీయా కమలాసనాద్యైః ।
శక్యా న వేత్తుం సమహేంద్రరుద్రైః కథం భవాన్వేత్స్యతి దుర్విభావ్యా ॥ 56 ॥

ఇటువంటి నారదునికే కష్టరూపమైనటువంటి నా మాయను గూర్చి బ్రహ్మ రుద్ర ఇంద్రాది దేవతలకే తెలుసుకొనుటకే శక్యము కానప్పుడు నీ వెట్లు దాన్ని గూర్చి ఊహించటానికి కూడా శక్యముగాని మాయను ఎట్లు తెలుసుకోగలవు?

స వాక్యమాకర్ణ్య మహామహర్షిరువాచ భక్తిం మమ దేహి విష్ణో ।
ప్రాప్తేఽథ కాలే స్మరణం తథైవ సదా చ సందర్శనమీశ తేఽస్తు ॥ 57 ॥

అప్పుడాతని మాటలనువిని ఆ గొప్పమహర్షి ఇట్లు పలికెను. నారాయణా! నాకు భక్తిని ప్రసాదించుము, అట్లే నా అంత్యకాలము సమీపించినప్పుడు నీ స్మరణ కలుగ చేయుము. ఎప్పుడూ నీ దర్శనమును నా కనుగ్రహించుము.

యత్రాహ మార్తశ్చితి మధ్యరూఢస్తత్తీర్థమస్త్వచ్యుత పాపహన్త్రా ।
అధిష్ఠితం కేశవ నిత్యమేవ త్వయా సహాఽఽసం కమలోద్భవేన ॥ 58 ॥

ఓ కేశవా! నేనెక్కడ ఆర్తుడనై చితినెక్కితినో అక్కడ అది సరస్సు అగుగాక! పాపములను తొలగించేదిగాను, దానియందు బ్రహ్మను సృష్టించిన నీవును నిత్యముగా అధిష్ఠించియుండవలయును.

తతో మయోక్తో ద్విజ నారదోఽసౌ తీర్థే సితో దేహి చితిస్తవాస్తు ।
స్థాస్యామ్యహం చాత్ర సదైవ విష్ణుర్మహేశ్వరః స్థాస్యతి చోత్తరేణ ॥ 59 ॥

ఓ ద్విజుడా! అప్పుడు నేను నారదునితో అన్నాను నీ చితి ఆ సరస్సులోనే ఉండుగాక! నెనెప్పుడు విష్ణురూపుడనై ఇక్కడనే యుందును. ఆ ఉత్తర భాగమున మహేశ్వరుడుండగలడు.

యదా విరించేర్వదనం త్రినేత్రః సచ్ఛేత్స్యతేఽయం త్వథ చోగ్రవాచమ్ ।
తదా కపాలస్య తు మోచనాయ సమేష్యతే తీర్థమిదం త్వదీయమ్ ॥ 60 ॥

ఎప్పుడైతే ఉగ్రవాక్కుగల బ్రహ్మ శిరస్సును శివుడు త్రెంచుతాడో ఆ సమయమున కపాలమోక్షముకొరకు తాను ఈ నీ తీర్థమువద్దకు వచ్చును.

స్నాతస్య తీర్థే త్రిపురాంతకస్య పతిష్యతే భూమితలే కపాలమ్ ।
తతస్తు తీర్థేతి కపాలమోచనం ఖ్యాతం పృథివ్యాం చ భవిష్యతే తత్ ॥ 61 ॥

ఎప్పుడైతే ఈ తీర్థములో స్నానముచేస్తాడో అప్పుడాత్రిపురాంతకుని కపాలము భూమిమీద పడుతుంది. భవిష్యత్కాలంలో ఈ భూమిమీద ఈ తీర్థమునకు కపాలమోచన తీర్థమని పేరు కలుగుతుంది.

తదా ప్రభృత్యంబుదవాహనోఽసౌ న మోక్ష్యతే తీర్థవరం సుపుణ్యమ్ ।
న చైవ తస్మిన్ ద్విజ సంప్రచక్షతే తత్‌క్షేత్రముగ్రం త్వథ బ్రహ్మవధ్యా ॥ 62 ॥

అప్పటినుండి ఈ ఇంద్రుడు ఈ పవిత్రమైన శ్రేష్ఠమైన తీర్థమును వదలుటలేదు ఓ బ్రాహ్మణుడా! అంతేకాక ఆ క్షేత్రమును ఉగ్రమని బ్రహ్మవధ్యమని చెప్పుటలేదు.

యదా న మోక్షత్యమరారిహన్తా తత్ క్షేత్రముఖ్యం మహదాప్తపుణ్యమ్ ।
తదా విముక్తేతి సురైరహస్యం తీర్థం స్తుతం పుణ్యదమవ్యయాఖ్యమ్ ॥ 63 ॥

గొప్పనైన పుణ్యమును సంపాదించిన ముఖ్యమైన ఆ క్షేత్రమును దేవతా శత్రువులైన రాక్షసులను సంహరించిన శ్రీమన్నారాయణుడు వదలిపెట్టకుండా వున్నాడో అప్పుడాదేవతలందరు ఆ సరస్సును 'విముక్తా' అని పుణ్యము నిచ్చె 'అవ్యయ' మని స్తోత్రము చేసిరి.

కృత్వా తు పాపాని నరో మహాన్తి తస్మిన్ప్రవిష్టః శుచిరప్రమాదీ ।
యదా తు మాం చిన్తయతే స శుద్ధః ప్రయాతి మోక్షం భగవత్ప్రసాదాత్! ॥ 64 ॥

మానవుడు అనేకములైన గొప్పపాపములను చేసినవాడైనా ఎప్పుడైతే ఆ సరస్సులో మునిగి నన్ను స్మరిస్తాడో అటువంటివాడు ఏ ప్రమాదములేనివాడై శుచియై, పరిశుద్ధుడై భగవంతుని యనుగ్రహముతో మోక్షమును పొందగలడు.

భూత్వా తస్మిన్ రుద్రపిశాచసంజ్ఞో యోన్యంతరే దుఃఖముపాశ్నుతేఽసౌ ।
విముక్తపాపో బహువర్షపూగైరుత్పత్తిమాయాస్యతి విప్రగేహే ॥ 65 ॥

రుద్రపిశాచత్వమును పొందినవాడు, ఇతర యోనులయందు పుట్టి అనేక దుఃఖములననుభవించినవాడు ఈ సరస్సులో స్నానం చేసినచో అనేకసంవత్సరములనుండి చేసిన పాపములనుండి విముక్తుడై బ్రాహ్మణగృహంలో జన్మించగలడు.

శుచిర్యతాత్మాఽస్య తతోఽన్తకాలే రుద్రో హితం తారకమస్య కీర్తయేత్ ।
ఇత్యేవ ముక్త్వా ద్విజవర్య నారదం గతోఽస్మి దుగ్ధార్ణవ మాత్మగేహమ్ ॥ 66 ॥

ఈ విధముగా నతడు బ్రాహ్మణగృహంలో శుచిగా యతాత్ముడై యుంటుండగా అతనియొక్క అంత్యకాలమునందు ఇతనికి హితమును గూర్చే తారకమంత్రమును రుద్రుడుపదేశించును. ఓ బ్రాహ్మణోత్తమా! ఈ విధముగా నారదునికి చెప్పి ఇక నేను నా నివాసస్థానమైన క్షీరసాగరమునకు వెళ్ళితినని చెప్పెను.

స చాపి విప్రస్త్రిదివం చచార గంధర్వరాజేన సమర్చ్యమానః ।
ఏతత్తవోక్తం నను బోధనాయ మాయా మదీయా న హి శక్యతే సా ॥ 67 ॥

ఆ బ్రాహ్మణుడు కూడా గంధర్వరాజుతో పూజింపబడుచు స్వర్గమునందు సంచరించెను. ఇదంతా నీకు తెలియాలని చెప్పాను. నా మాయ తెలుసుకొన శక్యము గానిది.

జ్ఞాతుం భవానిచ్ఛతి చేత్తతోఽద్య ఏవం విశస్వాప్సు చ వేత్సి యేన ।
ఏవం ద్విజాతిర్హరిణా ప్రబోధితో భావ్యర్థయోగాన్నిమమజ్జ తోయే ॥68 ॥

ఒకవేళ నీకు తెలుసుకోవాలనే కోరిక వుంటే ఈ రోజే ఆ నీటిలో ప్రవేశించుము. దానిచేతనే తెలుసు కొనగలవు. అని శ్రీహరి ఆ బ్రాహ్మణునితో పలుకగానే అతడు జరుగబోయేదానిని తెలుసుకొనుట కాసరస్సులో మునిగెను.

కోకాముఖే తాత తతో హి కన్యా చాండాలవేశ్మన్యభవద్ద్విజః సః ।
రూపాన్వితా శీలగుణోపపన్నా అవాప సా యౌవనమాససాద ॥ 69 ॥

నాయనా! ఆ తరువాత ఆ బ్రహ్మణుడు కోకాముఖమునందొకమునకవేయగా చండాలుని ఇంటిలో కన్యగా జన్మించెను. చక్కని రూపంతోనూ మంచి గుణశీలములతో యౌవనవయస్సునకు వచ్చెను.

చాండాల పుత్రేణ సుబాహునాఽపి వివాహితా రూపవివర్జితేన ।
పతిర్వ్రతస్యాహి మతో బభూవ సా తస్యచైవాభిమతా బభూవ ॥ 70 ॥

సుబాహువనే పేరుగల అనాకారి అయిన ఒక చాండాల పుత్రునితో ఆమెకు వివాహము చేసిరి. భర్తంటే ఆమెకు ఇష్టములేకుండెను కాని అతనికి మాత్రము ఆమె ఇష్టురాలాయెను.

పుత్రద్వయం నేత్రహీనం బభూవ కన్యా చ పశ్చాద్బధిరా తథాఽన్యా ।
పతిర్దరిద్రస్త్వథ సాఽపి ముగ్ధా నదీ గతా రోదితి తత్ర నిత్యమ్ ॥ 71 ॥

వారికి గ్రుడ్డి వారైన ఇద్దరు కుమారులు, తరువాత చెవిటిదైన ఒక కూతురు కలిగిరి. భర్త ధనహీనుడు. ఆ ముగ్ధరాలు ప్రతినిత్యము నదివద్దకు వెళ్ళి రోదించుచుండెను.

గతా కదాచితక్కలశం గృహీత్వా సాఽన్తర్జలం స్నాతుమథ ప్రవిష్టా ।
యావద్ద్విజోఽసౌ పునరేవ తావజ్జాతః క్రియాయోగ రతః సుశీలః ॥ 72 ॥

ఒక రోజు బిందె తీసుకొని నదిదగ్గరకు వెళ్ళింది. స్నానం చేయుటకు నదిలో ఎప్పుడైతే ప్రవేశించిందో వెంటనే తిరిగి మంచిశీలము కలిగినటువంటి యజ్ఞయాగాది క్రియాయోగములయందాసక్తి కలిగిన బ్రాహ్మణునిగా మారిపోయెను.

తస్యాః స భర్తాఽథ చిరంగతేతి ద్రష్టుం జగామాథ నదీం సుపుణ్యామ్ ।
దదర్శ కుంభం న చ తాం తటస్థాం తతోఽతిదుఃఖాత్ప్రరురోద నాదయన్ ॥ 73 ॥

తరువాత ఆమె చాలాసేపటివరకు రాలేదని చూచి ఆమెను చూచుటకై ఆమె భర్త ఆ పవిత్రమైన నది దగ్గరకు వెళ్ళెను. అక్కడ ఒడ్డున బిందె మాత్రమే యుండి ఆమె కనిపించకపోవుటచే అతడు తలబాదుకుంటూ మిక్కిలి దుఃఖించెను.

తతోఽన్ధయుగ్మం బధిరా చ కన్యా దుఃఖాన్వితాఽసౌ సముపాజగామ ।
తే వై రుదన్తం పితరం చ దృష్ట్వా దుఃఖాన్వితా వై రురుదుర్భృశార్తాః ॥ 74 ॥

ఆ తరువాత గ్రుడ్డివారైన ఇద్దరు కుమారులు, చెవిటిదైన కూతురు ఏడ్చుకుంటా అతని దగ్గరకు వచ్చిరి. తమ తండ్రి ఏడ్పును చూచి వారు మిక్కిలి ఆర్తులై ఇంకా ఎక్కువగా ఏడ్చిరి.

తతః స పప్రచ్ఛ నదీతటస్థాన్ ద్విజాన్ భవద్భిర్యది యోషిదేకా ।
దృష్టా తు తోయార్థముపాద్రవన్తీ ఆఖ్యాతతే ప్రోచురిమాం ప్రవిష్టా ॥ 75 ॥

నదీం న భూయస్తు సముత్తతార ఏతావదేవేహ సమీహితం నః ।
స తద్వచో ఘోరతరం నిశమ్య రురోద శోకాశ్రు పరిప్లుతాక్షః ॥ 76 ॥

అప్పుడా భర్త నది ఒడ్డుననున్న బ్రాహ్మణులతో అయ్యా! నీటి కొరకు వచ్చిన స్త్రీ నొకామెను మీరెవరైనా చూశారా అని అడిగెను. వారు ఆమె నదిలోనికి ప్రవేశించుటను చూచితిమి కాని, నదిలోనుండి మళ్ళీ బయటకు రాలేదు, మేమింతవరకు మాత్రమే చూచితిమని చెప్పిరి. ఆ ఘోరతరమైన మాటను విని శోకముతో కళ్లలో నీరు నిండినవాడై రోదించెను.

తం వై రుదన్తం ససుతం సకన్యం దృష్ట్వాఽహమార్తః సుతరాం బభూవ ।
ఆర్తిశ్చ మేఽభూదథ సంస్మృతిశ్చ చాండాలయోషాఽహమితి క్షితీశ ॥ 77 ॥

అట్లు కుమారులతో కూతురుతో కూడుకొని రోదిస్తున్న అతనిని చూచి నేను మిక్కిలి దుఃఖించితిని. నాకు చాలా జాలి కలిగినది. ఓ రాజా! నేను చాండాలయువతినని కూడా స్మరణకు వచ్చెను.

తతోఽబ్రవం తం నృపతే మతంగం కిమర్థమార్తేన హి రుద్యతే త్వయా ।
తస్యా న లాభో భవితాఽతిమౌర్ఖ్యాదాక్రందితేనేహ వృథా హి కిం తే ॥ 78 ॥

ఓ రాజా! అప్పుడు నేనన్నాను నీ వెందుకు ఆర్తుడవై ఏడ్చుచున్నావు? మిక్కిలి మూర్ఖతతో ఏడ్చినందువలన ఆమెకెట్టి లాభము కలుగదు ఇక నీ కేమి కలుగును? కావున నీ వేడ్చుట వ్యర్థమే.

స మామువాచాఽఽత్మజయుగ్మ మంధం కన్యా చైకా బధిరేయం తథైవ ।
కథం ద్విజాతే అధునాఽఽర్తమేతమాశ్వాసయిష్యేఽప్యథ పోషయిష్యే ॥ 79 ॥

అప్పుడతడు నాతో ఇట్లా పలికాడు ఓ బ్రాహ్మణుడా! కుమారులిద్దరూ గ్రుడ్డివారు. అట్లే కూతురు చెవిటిది. ఆర్తులైన వీరినెట్లోదార్చగలను? ఇక ఎట్లు పోషించగలను?

ఇత్యేవముక్త్వా స సుతైశ్చ సార్థం ఫూత్కృత్య ఫూత్కృత్య చ రోదితిస్మ ।
యథా యథా రోదితి స శ్వపాకస్తథా తథా మే హ్యభవత్కృపాఽపి ॥ 80 ॥

అతడీవిధంగా అని మాటిమాటికి ఫూత్కారమును చేస్తూ రోదించెను. ఆ చండాలుడెట్లెట్లు రోదించెనో అట్లు అట్లు నా కతనిపై దయ కలిగెను.

తతోఽహమార్తం తు నివార్య తం వై స్వవంశవృత్తాంతమథాఽఽచచక్షే ।
తతః స దుఃఖాత్సహ పుత్రకైః సంవివేశ కోకాముఖమార్తరూపః ॥ 81 ॥

ఆ తరువాత నేను ఆ ఆర్తుని నివారించి అతని వంశవృత్తాంతమును చెప్పితిని. అతడార్తుడై దుఃఖముతో తన సంతానముతో ఆ నదిలో మునిగెను.

ప్రవిష్టమాత్రే సలిలే మతంగస్తీర్థప్రభావాచ్చ విముక్తపాపః ।
విమానమారుహ్య శశిప్రకాశం యయౌ దివం తాత మమోపపశ్యతః ॥ 82 ॥

నాయనా! ఆ నదిలో మతంగుడు ప్రవేశించగానే ఆ తీర్థప్రభావముతో పాపములనుండి విముక్తుడై ఆ చంద్రునివంటి ప్రకాశముగల విమానమునెక్కి చూస్తుండగానే స్వర్గమును చేరెను.

తస్మిన్ప్రవిష్టే సలిలే మృతే చ మమార్తిరాసీదతిమోహకర్త్రీ ।
తతోఽతిపుణ్యే నృపవర్యకోకాజలే ప్రవిష్టస్త్రిదివం గతశ్చ ॥ 83 ॥

ఓ రాజా! తరువాత అతడు అతిపవిత్రమైన ఆ నీటిలో ప్రవేశించి మరణించగానే అతనియందు నాకు మోహమును కలిగించే జాలి కలిగెను. కోకాజలమునందు ప్రవేశించినందున ఆతడు స్వర్గమును చేరెను.

భూయోఽభవం వైశ్యకులే వ్యథార్తో జాతిస్మరస్తీర్థవరప్రసాదాత్ ।
తతోఽతినిర్విణ్ణమనా గతోఽహం కోకాముఖం సంయతవాక్యచిత్తః ॥ 84 ॥

ఆ తరువాత మరల నేను వైశ్యకులములో పుట్టితిని. నా జాతిని స్మరించుకుంటా మిక్కిలి వ్యధను పొంది ఆ తరువాత మిక్కిలి నిర్విణ్ణున్నయి ఆయన వరప్రసాదంతో మనోవాక్కులను నిగ్రహించుకొని కోకాముఖమునకు వెళ్ళితిని.

వ్రతం సమాస్థాయ కలేబరం స్వం సంశోషయిత్వా దివమారురోహ ।
తస్మాచ్చ్యుతస్త్వద్భవనే చ జాతో జాతిస్మరస్తాత హరిప్రసాదాత్ ॥ 85 ॥

నాయనా! అక్కడ వ్రతనిష్ఠుడనై ఈ శరీరమును కృశింపచేసి స్వర్గమును చేరితిని. ఆ శ్రీహరి అనుగ్రహము వలన అక్కడనుండి నీ భవనమునందు నా జాతి విస్మరిస్తూ పుట్టితిని.

సోఽహం సమారాధ్య మురారిదేవం కోకాముఖే త్యక్తశుభాశుభేచ్ఛః ।
ఇత్యేవముక్త్వా పితరం ప్రణమ్య గత్వా చ కోకాముఖమగ్ర్యతీర్థమ్ ॥
విష్ణుం సమారాధ్య వరాహరూపమవాప సిద్ధిం మనుజర్షభోఽసౌ ॥ 86 ॥

ఈ విధంగా నేను కోకాముఖమునందు శుభాశుభాలైన కోరికలను వదిలిపెట్టి మురారి అయిన ఆ స్వామిని ఆరాధించితిని. ఈ విధంగా చెప్పి తండ్రికి నమస్కరించి, గొప్పదైన కోకాముఖ తీర్థమునకు వెళ్ళి, ఆ మానవశ్రేష్ఠుడు విష్ణువు నారాధించి సిద్ధిని పొంది వరాహరూపమునందెను.

ఇత్థం స కామదమనః సహపుత్రపౌత్రః కోకాముఖే తీర్థవరే సుపుణ్యే ।
త్యక్త్వా తనుం దోషమయీం తతస్తు గతో దివం సూర్యసమైర్విమానైః ॥ 87 ॥

ఈ విధముగా కామదమనుడు మంచి పుణ్యవంతమైన శ్రేష్ఠమైన కోకాముఖతీర్థమునందు స్నాన మాచరించి దోషభూయిష్ఠమైన శరీరమును వదిలిపెట్టి తన పుత్రులతోను పౌత్రులతోను కలిసి సూర్యునితో సమానమగు విమానములలో స్వర్గమును చేరెను.

ఏవం మయోక్తా పరమేశ్వరస్య మాయా సురాణామపి దుర్విచిన్త్యా ।
స్వప్నేంద్రజాలప్రతిమా మురారేర్యయా జగన్మోహముపైతి విప్రాః ॥ 88 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా నేను చెప్పినటువంటి మురారియొక్క ఏ మాయైతే ఉన్నదో అది జగత్తును మోహంలో పడవేస్తుంది. స్వప్నంలో ఇంద్రజాలంలాగా ఉండే ఈ పరమేశ్వరునియొక్క మాయ దేవతలకు కూడా ఊహించ శక్యము కానిది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే విష్ణుధర్మానుకీర్తనే మాయాప్రాదుర్భావనిరూపణం నామైకవింశాధికశతతమోఽధ్యాయః ॥ 121 ॥

శ్రీబ్రహ్మపురాణమునందలి విష్ణుధర్మానుకీర్తనములో మాయాప్రాదుర్భావనిరూపణమనే పేరుగల నూట ఇరువది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వావింశాధికశతతమోఽధ్యాయః - నూట ఇరవై రెండవ అధ్యాయం

భవిష్యకథనమ్ - భవిష్యకథనం

మునయ ఊచుః :- మునులు పలికిరి.

అస్మాభిస్తు శ్రుతం వ్యాస యత్త్వయా సముదాహృతమ్ ।
ప్రాదుర్భావాశ్రితం పుణ్యం మాయాం విష్ణోశ్చ దుర్విదామ్ ॥ 1 ॥

ఓ వ్యాసమహర్షీ! ఎంతకష్టపడినా తెలుసుకొనశక్యముగాని విష్ణువు యొక్క మాయను గూర్చి పవిత్రమైన మాయాప్రాదుర్భావాశ్రితమైన దానిని నీవు వివరించగా మేము వింటిమి.

శ్రోతుమిచ్ఛామహే త్వత్తః యథావదుపసంహృతిమ్ ।
మహాప్రళయసంజ్ఞాం చ కల్పాంతే చ మహామునే ॥ 2 ॥

ఓ మహర్షీ! కల్పాంతమునందు మహాప్రళయమనే పేరుతో యథాక్రమముగా సృష్టి ఉపసంహారము జరుగుటను గూర్చి మీనుండి వినగోరుచున్నాను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

శ్రూయతాం భో మునిశ్రేష్ఠా యథావదుపసంహృతిః ।
కల్పాంతే ప్రాకృతే చైవ ప్రళయే జాయతే యథా ॥ 3 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! కల్పాంతమునందు ప్రాకృతికమైన ప్రళయము సంభవించినపుడు సృష్టియొక్క ఉపసంహారము ఎట్లు జరుగుతుందో వివరిస్తాను వినుడు.

అహోరాత్రం పితౄణాం తు మాసోఽబ్దం త్రిదివౌకసామ్
చతుర్యుగసహస్రే తు బ్రహ్మణోఽహర్ద్విజోత్తమాః ॥ 4 ॥

ఓ ద్విజోత్తములారా! పితృదేవతలకు పగలురాత్రులతో ఒక నెల కాలము వెయ్యి మహాయుగాలైతే అనగా 432 కోట్ల సంవత్సరాలైతే దేవతలకు ఒక సంవత్సర కాలమగును. అట్లు బ్రహ్మకు ఒక పగలు కాలమగును.

కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చేతి చతుర్యుగమ్ ।
దేవైర్వర్షసహస్రైస్తు తద్ద్వాదశభిరుచ్యతే ॥ 5 ॥

కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అని నాలుగు యుగములు. పన్నెండు వేల దైవసంవత్సరముల కాలమని చెప్పుదురు.

చతుర్యుగాణ్యశేషాణి సదృశాని స్వరూపతః ।
ఆద్యం కృతయుగం ప్రోక్తం మునయోఽన్త్యం తథా కలిమ్ ॥ 6 ॥

నాలుగు యుగములు లెక్కలేనన్నియున్న అవన్నియు స్వరూపంలో సమానమే. వాటిని మునులు మొదటిది కృతయుగమని, చివరిదానిని కలియుగమని చెప్పిరి.

ఆద్యే కృతయుగే సర్గో బ్రహ్మణా క్రియతే యతః ।
క్రియతే చోపసంహారస్తథాన్తేఽపి కలౌ యుగే ॥ 7 ॥

మొదటిదైన కృతయుగంలో బ్రహ్మ సృష్టిని చేస్తాడు. అట్లే చివరి కలియుగంలో ఉపసంహారమును అనగా ప్రళయమును కూడా చేస్తాడు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

కలేః స్వరూపం భగవన్విస్తరాద్వక్తుమర్హసి ।
ధర్మశ్చతుష్పాద్భగవాన్యస్మిన్వైకల్యమృచ్ఛతి ॥ 8 ॥

ఓ పూజ్యుడా! నాలుగు పాదములుగల ధర్మము ఏ యుగంలో వైకల్యమును పొందుతుందో అటువంటి కలియుగము యొక్క స్వరూపమును విస్తరముగా వివరించుడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

కలిస్వరూపం భో విప్రా యత్పృచ్ఛధ్వం మమానఘాః ।
నిబోధధ్వం సమాసేన వర్తతే యన్మహత్తరమ్ ॥ 9 ॥

పాపరహితులైన ఓ విప్రులారా! మీరు ఏ కలిస్వరూపమును గూర్చి యడిగినారో ఆ కలియొక్క మహత్తు ఎలా వుంటుందో వివరంగా చెప్పుచున్నాను వినుడు.

వర్ణాశ్రమాచారవతీ ప్రవృత్తిర్న కలౌ నృణామ్ ।
న సామఋగ్యజుర్వేదవినిష్పాదనహైతుకీ ॥ 10 ॥

కలియుగమునందు మానవులకు వర్ణాశ్రమాచారములయందు ప్రవర్తించుటయుండదు. దానికి కారణం ఋగ్వేదము, యజుర్వేదము సామవేదములను అధ్యయనము చేయకపోవుటయే.

వివాహా న కలౌ ధర్మ్యా న శిష్యా గురుసంస్థితాః ।
న పుత్రా ధార్మికాశ్చైవ న చ వహ్నిక్రియాక్రమః ॥ 11 ॥

కలియుగమునందు వివాహములు ధర్మముననుసరించి జరుగవు. శిష్యులు గురువుల దగ్గర చేరి శుశ్రూషలు చేయరు. కుమారులు తమ పుత్రధర్మమునాచరించరు. గృహస్థులు నిత్యాగ్నిహోత్రమును గాని యజ్ఞయాగాదిక్రియాకలాపములను గాని చేయరు.

యత్ర తత్ర కులే జాతో బలీ సర్వేశ్వరః కలౌ ।
సర్వేభ్య ఏవ వర్ణేభ్యో నరః కన్యోపజీవినః ॥ 12 ॥

ఈ కలియుగంలో ఎక్కడో ఏ కులంలో పుట్టిన మనిషి అయినా సరే అతడు బలవంతుడైతే చాలు అతడే సర్వేశ్వరుడు. అన్ని జాతులవారు కూడా కన్యోపజీవులుగానే యుందురు.

యేన తేనైవ యోగేన ద్విజాతిర్దీక్షితః కలౌ ।
యైవ సైవ చ విప్రేన్ద్రాః ప్రాయశ్చిత్తక్రియాకలౌ ॥ 13 ॥

ఓ విప్రశ్రేష్ఠులారా! ఈ కలియుగమునందు బ్రాహ్మణజాతివారు ఏదో ఒక యోగముతో దీక్షితులుగా నుందురు అట్లే ఏదో ఒక ప్రాయశ్చిత్తక్రియలను చేయుదురు.

సర్వమేవ కలౌ శాస్త్రం యస్య యద్వచనం ద్విజాః ।
దేవతాశ్చ కలౌ సర్వాః సర్వః సర్వస్య చాఽఽశ్రమః ॥ 14 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ కలియుగంలో ఎవడేది మాట్లాడితే అదంతయూ శాస్త్రమే. అందరూ దేవతలే, ప్రతివానికి ఒక ఆశ్రమమూ ఉంటుంది.

ఉపవాసస్తథాఽఽయాసో విత్తోత్సర్గస్తథా కలౌ ।
ధర్మో యథాభిరుచితైరనుష్ఠానైరనుష్ఠితః ॥ 15 ॥

కలియుగమునందు ఉపవాసము కాని ఆయాసముకాని ధనముననుసరించియే యుండును. వారి వారి యభిరుచిననుసరించి చేసిన అనుష్ఠానములతో ధర్మము అనుష్ఠించబడును.

విత్తేన భవితా పుంసాం స్వల్పేనైవ మదః కలౌ ।
స్త్రీణాం రూపమదశ్చైవ కేశైరేవ భవిష్యతి ॥ 16 ॥

కలియుగంలో పురుషులకు స్వల్పమైన ధనమున్నంతమాత్రముననే మదము కలుగును. స్త్రీలకు తమ కేశపాశములతోనే సౌందర్యమదము కలుగును.

సువర్ణమణిరత్నాదౌ వస్త్రే చోపక్షయం గతే ।
కలౌ స్త్రియో భవిష్యన్తి తదా కేశైరలంకృతాః ॥ 17 ॥

ఈ కలియుగంలో బంగారము మణిరత్నాదులయందు, వస్త్రములయందు ఉపక్షయము కలుగగా అప్పుడు స్త్రీలు కేశాలంకరణమునందు ఆసక్తిగలవారై యుందురు.

పరిత్యక్ష్యంతి భర్తారం ధనహీనం తథా స్త్రియః ।
భర్తా భవిష్యతి కలౌ విత్తవానేవ యోషితామ్ ॥ 18 ॥

కలియుగంలో స్త్రీలు ధనహీనుడైన భర్తను వదిలి వేయుదురు. స్త్రీలకు డబ్బు గలవాడే భర్తయగును.

యో యో దదాతి బహులం స స స్వామీ తదా నృణామ్ ।
స్వామిత్వహేతుసంబంధో భవితాఽభిజనస్తదా ॥ 19 ॥

ఎవడెవడు ఎక్కువగా ఇస్తాడో అతడే ఈ నరులకు యజమాని. అతడు యజమానిగా ఉండుట అనే సంబంధకారణంగానే గుర్తింపు లభిస్తుంది.

గృహాన్తా ద్రవ్యసంఘాతా ద్రవ్యాన్తా చ తథా మతిః ।
అర్థాశ్చాథోపభోగాన్తా భవిష్యన్తి తదా కలౌ ॥ 20 ॥

కలియుగమునందు ధనమునకు గృహమే పరమప్రయోజనము. బుద్ధికి ధనము సంపాదించుటే పరమప్రయోజనము. ధనమునకు అనుభవించుటే పరమప్రయోజనము.

స్త్రియః కలౌ భవిష్యన్తి స్వైరిణ్యో లలితస్పృహాః ।
అన్యాయావాప్తవిత్తేషు పురుషేషు స్పృహాలవః ॥ 21 ॥

కలియుగమునందు స్త్రీలు విలాసములందభిలాషగలవారై స్వేచ్ఛాసంచారముకలవారగుదురు. అన్యాయముగా ధనమును సంపాదించే పురుషులయందు కోరికగలవారైయుందురు.

అభ్యర్థితోఽపి సుహృదా స్వార్థహానిం తు మానవః ।
పణస్యార్ధార్ధమాత్రేఽపి కరిష్యన్తి తదా ద్విజాః ॥ 22 ॥

స్నేహితులు అభ్యర్థించినా కూడా మానవులు అల్పాల్పధనము కొరకు కూడా పరుల ప్రయోజనానికి భంగం కలిగిస్తారు.

సదా స పౌరుషం చేతో భావి విప్ర తదా కలౌ ।
క్షీరప్రదానసంబంధి భాతి గోషు చ గౌరవమ్ ॥ 23 ॥

ఓ బ్రాహ్మణుడా! కలియుగమునందు మానవుడు తానెప్పుడూ పౌరుషవంతుడనని మనస్సులో భావిస్తూ, పాలనిచ్చేవి కనుక ఆ సంబంధము చేతనే గోవులయందు గౌరవము కలవానిగా కన్పిస్తాడు.

అనావృష్టిభయాత్ప్రాయః ప్రజాః క్షుద్భయకాతరాః ।
భవిష్యన్తి తదా సర్వా గగనాసక్తదృష్టయః ॥ 24 ॥

తరచుగా ప్రజలందరూ అనావృష్టిభయముతో, ఆకలిభయముతో అలమటిస్తూ ఆకాశం వంక చూచే వారగుదురు.

మూలపర్ణఫలాహారాస్తాపసా ఇవ మానవాః ।
ఆత్మానం ఘాతయిష్యన్తి తదాఽవృష్ట్యాఽభిదుఃఖితాః ॥ 25 ॥

మానవులు కంద మూలములను, ఆకులను, పండ్లను తింటూ మునులవలే యుందురు. అప్పుడు వర్షాలు పడక పోవడం చేత మిక్కిలి దుఃఖించిన వారై ఒకరినొకరు చంపుకుంటారు.

దుర్భిక్షమేవ సతతం సదా క్లేశమనీశ్వరాః ।
ప్రాప్స్యన్తి వ్యాహతసుఖం ప్రమాదాన్మానవాః కలౌ ॥ 26 ॥

కలియుగమునందు రాజులు లేక, ఎప్పుడూ దుర్భిక్షము కలగగా, సుఖములు నశించగా సదా క్లేశముల ననుభవిస్తూ ప్రమాదములను పొందుదురు.

అస్నాతభోజినో నాగ్నిదేవతాతిథిపూజనమ్ ।
కరిష్యన్తి కలౌ ప్రాప్తే న చ పిండోదకక్రియామ్ ॥ 27 ॥

కలి ప్రాప్తించగా స్నానమును చేయకుండా భోజనమును చేయువారై అగ్నికి, దేవతలకు, అతిథులకు పూజలను చేయరు. అంతేకాక పితృదేవతలకు పిండోదకక్రియలను కూడా ఆచరించరు.

లోలుపా హ్రస్వదేహాశ్చ బహ్వాన్నాదనతత్పరాః ।
బహుప్రజాల్పభాగ్యాశ్చ భవిష్యన్తి కలౌ స్త్రియః ॥ 28 ॥

కలియుగమునందు స్త్రీలు గర్వించదగ్గ ఉత్సుకత కలవారుగా, పొట్టి శరీరములు కలవారుగా, ఎక్కువ ఆహారమును తీసుకొనుటయందాసక్తి కలవారుగా, తక్కువ భాగ్యము ఎక్కువ సంతానము కలవారుగానుందురు.

ఉభాభ్యామథ పాణిభ్యాం శిరః కణ్డూయనం స్త్రియః ।
కుర్వన్త్యో గురుభర్తౄణామాజ్ఞాం భేత్స్యన్త్యనావృతాః ॥ 29 ॥

స్త్రీలు రెండు చేతులతో తలనుగోక్కుంటూ ఉంటారు. సరియైన శరీరాచ్ఛాదనము లేకయే గురువుల ఆజ్ఞను భర్త ఆజ్ఞను ధిక్కరిస్తూ ఉంటారు.

స్వపోషణ పరాః కృద్ధా దేహసంస్కారవర్జితాః ।
పరుషానృతభాషిణ్యో భవిష్యన్తి కలౌ స్త్రియః ॥ 30 ॥

కలియుగమునందు స్త్రీలు తమను మాత్రమే పోషించుకొనువారుగా, దేహసంస్కారమును వదిలిపెట్టిన వారుగా, కోపిష్ఠులుగా, పరుషముగా అసత్యముగా మాట్లాడే వారుగానుందురు.

దుఃశీలా దుష్టశీలేషు కుర్వన్త్యః సతతం స్పృహామ్ ।
అసద్వృత్తా భవిష్యన్తి పురుషేషు కులాంగనాః ॥ 31 ॥

కులస్త్రీలు చెడునడత కలవారియందెప్పుడూ ఆసక్తులై తాము కూడా శీలమును పోగొట్టుకొని ఆ పురుషులయందాసక్తులై చెడ్డ చరిత్ర కలవారగుదురు.

వేదాదానం కరిష్యన్తి బాడవాశ్చ తథాఽవ్రతాః ।
గృహస్థాశ్చ న హెూష్యన్తి న దాస్యన్త్యుచితాన్యపి ॥ 32 ॥

ఎట్టి ఉపనయనాది సంస్కారములు లేకయే బ్రాహ్మణులు వేదాధ్యయనము చేయుదురు. గృహస్థులైన వారు యజ్ఞయాగాది క్రతువులనాచరించరు. ఉచితమైన వాటిని దానము చేయరు.

భవేయుర్వనవాసా వై గ్రామ్యాహారపరిగ్రహాః ।
భిక్షవశ్చాపి పుత్రా హి స్నేహసంబంధయన్త్రకాః ॥ 33 ॥

వనవాసం చేస్తూ జీవిస్తున్న వారు కూడా గ్రామీణుల ఆహారమును స్వీకరిస్తారు. భిక్షుకులు కూడా పుత్రాదులతో స్నేహసంబంధముల బంధనాల్లో కూరుకొని పోతారు.

అరక్షితారో హర్తారః శుల్కవ్యాజేన పార్థివాః ।
హారిణో జనవిత్తానాం సంప్రాప్తే చ కలౌ యుగే ॥ 34 ॥

కలియుగంలో ప్రజల సొమ్మును దొంగలు హరిస్తుంటారు. రక్షించకుండా రాజులు పన్నులరూపంలో ప్రజల సొత్తును అపహరిస్తారు. అంతేకాక రక్షించే వారుగా వుండవలసిన రాజులు భక్షించే వారిగానుంటారు.

యో యోఽశ్వరథనాగాఢ్యః స స రాజా భవిష్యతి ।
యశ్చ యశ్చాబలః సర్వః స స భృత్యః కలౌయుగే ॥ 35 ॥

ఎవరెవరైతే గుఱ్ఱములు, రథములు, ఏనుగులు కలవాడో అతడే ఈ కలియుగంలో రాజు కాగలడు. ఎవరైతే బలహీనంగా ఉంటారో వారు సేవకులుగా జీవిస్తారు.

వైశ్యాః కృషివాణిజ్యాది సంత్యజ్య నిజకర్మ యత్ ।
శూద్రవృత్త్యా భవిష్యన్తి కారుకర్మోపజీవినః ॥ 36 ॥

వైశ్యులు తమకుద్దిష్టమైన వ్యవసాయ, వ్యాపార, గోరక్షణ మున్నగు వాటిని వదిలి వడ్రంగము మొదలగువృత్తితో జీవిస్తారు.

భైక్ష్యవ్రతాస్తథా శూద్రాః ప్రవ్రజ్యాలింగినోఽధమాః ।
పాఖండసంశ్రయాం వృత్తిమాశ్రయిష్యన్త్యసంస్కృతాః ॥ 37 ॥

శూద్రులు భిక్షావృత్తినాశ్రయించెదరు. అధములు సన్న్యాసాశ్రమస్వీకారమందు ఆసక్తిగలవారై వేదధర్మ విరుద్ధులైన వారి వృత్తినాశ్రయించి సంస్కారహీనులుగా నుందురు.

దుర్భిక్షకరపీడాభిరతీవోపద్రుతా జనాః ।
గోధూమాన్నయవాన్నాద్యాన్దేశాన్యాస్యంతి దుఃఖితాః ॥ 38 ॥

జనులు కరువుకాటకములు, పన్నులు వంటి ఉపద్రవములకు లోనై ఆ పీడలచేత బాధింపబడి మిక్కిలి దుఃఖించినవారై గోధుమలు యవలు ఆహారముగా స్వీకరించే దేశాలకు వలస పోవుదురు.

వేదమార్గే ప్రలీనే చ పాఖండాఢ్యే తతో జనే ।
అధర్మవృద్ధ్యా లోకానామల్పమాయుర్భవిష్యతి ॥ 39 ॥

వేదమార్గము పతనమై నాస్తికధర్మము ప్రబలగా జనులయందధర్మం వృద్ధియగుటచే లోకులకు ఆయువు క్షీణించును. జనులు అల్పాయువులగుదురు.

అశాస్త్రవిహితం ఘోరం తప్యమానేషు వై తపః ।
నరేషు నృపదోషేణ బాలమృత్యుర్భవిష్యతి ॥ 40 ॥

మానవులు శాస్త్రవిహితముకాని ఘోరమైన తపస్సును ఆచరించుచుండగా, అందుకు కారణమైన రాజ దోషమువలన దేశమందు బాలమరణములు సంభవించును.

భవిత్రీ యోషితాం సూతిః పంచ షట్ సప్త వార్షికీ ।
నవాష్ట దశ వర్షాణాం మనుష్యాణాం తథా కలౌ ॥ 41 ॥

ఈ కలియుగంలోని మనుష్యులకు ఐదు, ఆరు, ఏడు ఎనిమిది, తొమ్మిది, పది సంవత్సరములు వయస్సున్న స్త్రీలు ప్రసవించి సంతానమును కనుట సంభవించును.

పలితోద్గమశ్చ భవితా తదా ద్వాదశవార్షికః ।
న జీవిష్యతి వై కశ్చిత్కలౌ వర్షాణి వింశతిమ్ ॥ 42 ॥

పన్నెండు సంవత్సరముల వయస్సుగల పిల్లలకే తలనెరిసి తెల్ల వెంట్రుకలేర్పడును. కొందరైతే ఈ కలియుగంలో ఇరువది సంవత్సరాలు కూడా జీవించలేరు.

అల్పప్రజ్ఞా వృథాలింగా దుష్టాన్తఃకరణాః కలౌ ।
యతస్తతో వినశ్యన్తి కాలేనాల్పేన మానవాః ॥ 43 ॥

ఈ కలియుగంలో మానవులు దుష్టమైన అంతఃకరణము గలవారిగా, తక్కువ తెలివిగల వారిగా, వ్యర్థమైన వేషాలు కలవారుగా వుంటారో అందువల్ల వారు తక్కువ వయస్సులోనే నశిస్తారు.

యదా యదా హి పాఖణ్డవృత్తిరత్రోపలక్ష్యతే ।
తదా తదా కలేర్వృద్ధిరనుమేయా విచక్షణైః ॥ 44 ॥

ఎప్పుడెప్పుడైతే మానవులు కూడా పాఖణ్డ వృత్తి నవలంబించెదరో అప్పుడప్పుడు కలి వృద్ధిచెందుటను పండితులు ఊహించవలెను.

యదా యదా సతాం హానిర్వేదమార్గానుసారిణామ్ ।
తదా తదా కలేర్వృద్ధిరనుమేయా విచక్షణైః ॥ 45 ॥

ఎప్పుడెప్పుడైతే వేద మార్గాన్ననుసరించేవారికి హాని జరుగుతుందో అప్పుడు విచక్షణులైనవారు ఇదంతా కలిమాహాత్మ్యమని ఊహించవలయును.

ప్రారమ్భాశ్చావసీదన్తి యదా ధర్మకృతాం నృణామ్ ।
తదాऽనుమేయం ప్రాధాన్యం కలేర్విప్రా విచక్షణైః ॥ 46 ॥

ఓ బ్రాహ్మణులారా! ఎప్పుడైతే ధర్మాన్నాచరించే మానవుల ప్రయత్నాలు నిష్ఫలమవుతాయో అప్పుడు విచక్షణ కలిగినవారు అది కలియుగప్రాధాన్యమని తెలుసుకోవాలి.

యదా యదా న యజ్ఞానామీశ్వరః పురుషోత్తమః ।
ఇజ్యతే పురుషైర్యజ్ఞైస్తదా జ్ఞేయం కలేర్బలమ్ ॥ 47 ॥

మానవులెప్పుడైతే యజ్ఞములకీశ్వరుడైన పురుషోత్తముని యజ్ఞములతో ఆరాధించరో అప్పుడే కలియొక్క బలప్రభావమిదియని తెలుసుకొనవలయును.

న ప్రీతిర్వేదవాదేషు పాఖండేషు యదా రతిః ।
కలేర్వృద్ధిస్తదా ప్రాజ్ఞైరనుమేయా విచక్షణైః ॥ 48 ॥

వైదికవిచారణములయందాసక్తి లేక నాస్తికవిషయాల్లో ఎప్పుడైతే ఆసక్తి పెరుగుతుందో అప్పుడు కలియొక్క వృద్ధి జరుగుతున్నదని విచక్షణులైనవారు తెలుసుకొనవలెను.

కలౌ జగత్పతిం విష్ణుం సర్వస్రష్టారమీశ్వరమ్ ।
నార్చయిష్యన్తి భో విప్రాః పాఖండోపహతా నరాః ॥ 49 ॥

ఓ విప్రులారా! ఈ కలియుగంలో నాస్తికవాదులతో దెబ్బతిన్న మానవులు సమస్తమును సృష్టించిన ఈశ్వరుని, అన్నింటియందు వ్యాపించియున్న జగత్తునకంతా ప్రభువైన విష్ణువునూ ఆరాధించరు.

కిం దేవైః కిం ద్విజైర్వేదైః కిం శౌచేనామ్బుజన్మనా ।
ఇత్యేవం ప్రలపిష్యన్తి పాఖండోపహతా నరాః ॥ 50 ॥

నాస్తికవాదములచేత ఉపహతులైనవారు ఈ దేవతలతో, బ్రాహ్మణులతో, వేదములతో, శుచితో, స్నానముతో పనియేమి? అని ప్రేలాపనలు చేయుచుందురు.

అల్పవృష్టిశ్చ పర్జన్యః స్వల్పం సస్యఫలం తదా ।
ఫలం తథాऽల్పసారం చ విప్రాః ప్రాప్తే కలౌ యుగే ॥ 51 ॥

ఓ విప్రులారా! కలియుగము రాగా మేఘుడు తక్కువగా వర్షించును. పంటల ఫలము స్వల్పముగా నుండును. ఆ ఫలితమైనను తక్కువ సారము కలదిగానుండును.

జాను ప్రాయాణి వస్త్రాణి శమీప్రాయా మహీరుహాః ।
శూద్రప్రాయాస్తథా వర్ణా భవిష్యన్తి కలౌ యుగే ॥ 52 ॥

ఈ కలియుగంలో వస్త్రాలు జానెడు, చెట్లు శమీప్రాయములు, బ్రాహ్మణవైశ్యాదిసమస్తవర్ణాలు శూద్ర ప్రాయములుగా నుండును.

అణుప్రాయాణి ధాన్యాని ఆజప్రాయం తథా పయః ।
భవిష్యతి కలౌ ప్రాప్త ఔశీరం చానులేపనమ్ ॥ 53 ॥

కలియుగము ప్రాప్తించగా గింజలు అణువులలాగా, పాలు మేకపాల వలె, శరీరానికి పూసుకునే లేపనాలు చౌడువలె అగును.

శ్వశ్రూశ్వశురభూయిష్ఠా గురవశ్చ నృణాం కలౌ ।
శాలాద్యాహారిభార్యాశ్చ సుహృదో మునిసత్తమాః ॥ 54 ॥

కలియుగంలో మానవులకు గురువులు అత్తమామలలాగా ఉంటారు, ఇక భార్యలు ఇంటినే తినే వారుగావుంటారు. మిత్రులు ఉపాయము చెప్పకుండా మౌనంగా మునులలాగా ఉంటారు, అన్నీ హరిస్తారు.

కస్య మాతా పితా కస్య యదా కర్మాత్మకః పుమాన్ ।
ఇతి చోదాహరిష్యన్తి శ్వశురానుగతా నరాః ॥ 55 ॥

అత్తమామలే ముఖ్యమని భావించే మానవులు తల్లిదండ్రులసేవ చేయవలసివచ్చినప్పుడు ఎవరి తల్లిదండ్రులు వీరు అని మాటలాడెదరు.

వాఙ్మనఃకాయజైర్దోషైరభిభూతాః పునః పునః ।
నరాః పాపాన్యనుదినం కరిష్యన్త్యల్పమేధసః ॥ 56 ॥

మానవులు తెలివి తక్కువవారై మనోవాక్కాయకర్మలతో ప్రతిదినము మాటిమాటికి పాపములను చేస్తుంటారు.

నిఃసత్యానామశౌచానాం నిర్హ్రీకాణాం తథా ద్విజాః ।
యద్యద్దుఃఖాయ తత్సర్వం కలికాలే భవిష్యతి ॥ 57 ॥

ఓ ద్విజులారా! అబద్ధములాడే వారికి, శుచిగానుండని వారికి, నిర్లజ్జగా ప్రవర్తించే వారికి ఏదేది దుఃఖాన్ని కలిగిస్తుందో అదంతయు ఈ కలికాలమున సంభవించుచుండును.

నిఃస్వాధ్యాయ వషట్కారే స్వధాస్వాహావివర్జితే ।
తదా ప్రవిరలో విప్రః కశ్చిల్లోకే భవిష్యతి ॥ 58 ॥

వేదాధ్యయనము కాని, యజ్ఞాచరణగాని, పితృకార్యములుగాని, హోమములు గాని లేని ఈ కలికాలమందు ధర్మాచరణకలిగిన విప్రులు విరళముగా నుందురు.

తత్రాల్పేనైవ కాలేన పుణ్యస్కంధమనుత్తమమ్ ।
కరోతి యః కృతయుగే క్రియతే తపసా హి యః ॥ 59 ॥

కృతయుగమునందు ఎక్కువ కాలములో తపస్సుతో సాధించే ఉత్తమమైన దానిని ఇక్కడ తక్కువ కాలములోనే పుణ్యముగా పొందగలడు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

కస్మిన్కాలేఽల్పకో ధర్మో దదాతి సుమహాఫలమ్ ।
వక్తుమర్హస్య శేషేణ శ్రోతుం వాంఛా ప్రవర్తతే ॥ 60 ॥

ఏ కాలంలో స్వల్పమైన ధర్మము గొప్పమంచి ఫలాన్నిస్తుందో దానిని గూర్చి వినవలెనని కోరికగానున్నది కావున వివరముగా చెప్పుడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ధన్యే కలౌ భవేద్విప్రాస్త్వల్పక్లేశైర్మహత్ఫలమ్ ।
తథా భవేతాం స్త్రీశూద్రౌ ధన్యౌ చాన్యన్నిబోధత ॥ 61 ॥

ఓ విప్రులారా! ఈ కలియుగమునందు స్వల్పదుఃఖముతో గొప్ప ఫలితమును పొందగలరు. అట్లే స్త్రీలు, శూద్రులు ధన్యులగుదురని తెలుసుకొనుడు.

యత్కృతే దశభిర్వర్షైస్త్రేతాయాం హాయనేన తత్ ।
ద్వాపరే తచ్చ మాసేన అహోరాత్రేణ తత్కలౌ ॥ 62 ॥

కృతయుగంలో పదిసంవత్సరములలో పొందే దానిని త్రేతాయుగంలో ఒక సంవత్సరంలో పొందగలరు. ద్వాపరయుగంలో ఒక నెలలో, కలియుగంలో ఒకే రోజులో పొందగలరు.

తపసో బ్రహ్మచర్యస్య జపాదేశ్చ ఫలం ద్విజాః ।
ప్రాప్నోతి పురుషస్తేన కలౌ సాధ్వితి భాషణాత్ ॥ 63 ॥

ఓ ద్విజులారా! తపస్సు, బ్రహ్మచర్యము, జపాదులు వీటిఫలము గొప్పదని చెప్పినందువలన మానవుడు ఆ ఫలమును పొందును.

ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైస్త్రేతాయాం ద్వాపరేఽర్చయన్ ।
యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్ ॥ 64 ॥

కృతయుగమునందు ధ్యానముచేసినందువలన, త్రేతాయుగమునందు యజ్ఞములను చేసినందువలన, ద్వాపరయుగమునందు అర్చించినందువలన ఏ ఫలితమైతే కలుగుతుందో, ఆ ఫలితము కలియుగమునందు కేవలం కేశవుని నామసంకీర్తనమును చేయుటవలన లభించును.

ధర్మోత్కర్షమతీవాత్ర ప్రాప్నోతి పురుషః కలౌ ।
స్వల్పాయాసేన ధర్మజ్ఞాస్తేన తుష్టోఽస్మ్యహం కలౌ ॥ 65 ॥

ఓ ధర్మజ్ఞులారా! ఈ కలియుగమునందు మానవుడు తక్కువ ప్రయత్నముతో, కష్టముతో ధర్మముయొక్క ఉత్కర్షనెక్కువగా పొందగలడు. దానితో నేను మిక్కిలి సంతుష్టుడనగుచున్నాను.

వ్రతచర్యా పరైర్గ్రాహ్యా వేదాః పూర్వం ద్విజాతిభిః ।
తతస్తు ధర్మసంప్రాప్తైర్యష్టవ్యం విధివద్ధనైః ॥ 66 ॥

వ్రతములను ఆచారములను ఆసక్తిగానాచరించే బ్రాహ్మణులు మొదట వేదములను అధ్యయనము చేయవలెను. ఆ తరువాత ధర్మమును గూర్చి తెలిసిన వీరు తమ ధనములతో యజ్ఞయాగాదులను చేయవలయును.

వృథా కథా వృథా భోజ్యం వృథా స్వం చ ద్విజన్మనామ్ ।
పతనాయ తథా భావ్యం తైస్తు సంయతిభిః సహ ॥ 67 ॥

బ్రాహ్మణులైనవారు తమ ధనమును, ఆహారమును, చరితను వ్యర్థముగానుపయోగించినచో అట్టిది పతనమునకు కారణముగా భావించవలయును. వాటి విషయంలో సంయమనముతో ప్రవర్తించవలెను.

అసమ్యక్కరణే దోషాస్తేషాం సర్వేషు వస్తుషు ।
భోజ్యపేయాదికం చైషాం నేచ్ఛాప్రాప్తికరం ద్విజాః ॥ 68 ॥

ఓ ద్విజులారా! విధ్యుక్తప్రకారము కార్యములనాచరించనట్లయితే వాటికి సంబంధించిన వస్తువులన్నింటి యందు దోషములు సంభవించును. వీరికి తినదగిన, త్రాగదగిన పదార్థములు కేవలము కోరుకొనుటవలన సంభవించవు.

పారతంత్ర్యాత్సమస్తేషు తేషాం కార్యేషు వై తతః ।
లోకాన్ క్లేశేన మహతా యజన్తి వినయాన్వితాః ॥ 69 ॥

సమస్త కార్యములయందు వారికి పారతంత్ర్యముండుటవలన, వినయాన్వితులై మిక్కిలి కష్టముతో ఇతరలోకములనుగూర్చి యజ్ఞములను చేయుదురు.

ద్విజశుశ్రూషణేనైవ పాకయజ్ఞాధికారవాన్ ।
నిజం జయతి వై లోకం శూద్రో ధన్యతరస్తతః ॥ 70 ॥

పాకయజ్ఞమునకధికారి అయినవాడు కూడా బ్రాహ్మణశుశ్రూష చేయుట చేతనే సత్యలోకమును చేరగలడు. ఆ తరువాత వానికంటే కూడా శూద్రుడు ధన్యుడు.

భక్ష్యాభక్ష్యేషు నాత్రాస్తి యేషాం పాపేషు వా యతః ।
నియమో మునిశార్దూలాస్తేనాసౌ సాధ్వితీరితమ్ ॥ 71 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఇక్కడ వారి పాపముల విషయంలో కాని, భోజ్యాభోజ్యపదార్థముల విషయంలో కాని నియమమేదీ లేదు. అందువలన ఇది చాలా ఉత్తమమైనదని చెప్పిరి.

స్వధర్మస్యావిరోధేన నరైర్లబ్ధం ధనం సదా ।
ప్రతిపాదనీయం పాత్రేషు యష్టవ్యం చ యథావిధి ॥ 72 ॥

మానవులు తన ధర్మమునకు విరోధము లేకుండా సంపాదించిన ధనమును యోగ్యులైన వారికి దానము చేయుటయందు, యథావిధిగా యజ్ఞములు చేయుట యందు సర్వదా ఉపయోగించవలయును.

తస్యార్జనే మహాన్ క్లేశః పాలనేన ద్విజోత్తమాః ।
తథా సద్వినియోగాయ విజ్ఞేయం గహనం నృణామ్ ॥ 73 ॥

ఓ బ్రాహ్మణులారా! మానవులు దానిని సంపాదించుటలో చాలా క్లేశముండును. సంపాదించినదానిని రక్షించుట మరింత కష్టము, అల్లే దానిని సద్వినియోగమునకై ఉపయోగించుటను గూర్చి తెలుసుకొనుట మరీకష్టము.

ఏభిరన్యైస్తథా క్లేశైః పురుషా ద్విజసత్తమాః ।
నిజాన్ జయన్తి వై లోకాన్ ప్రాజాపత్యాదికాన్ క్రమాత్ ॥ 74 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! వీటితోపాటు ఇతర దుఃఖములచేత కూడా మానవులు క్రమముగా ప్రాజా పత్యాది బ్రహ్మాది లోకములను పొందగలరు.

యోషిచ్ఛుశ్రూషణాద్భర్తుః కర్మణా మనసా గిరా ।
ఏతద్విషయమాప్నోతి తత్సాలోక్యం యతో ద్విజాః ॥ 75 ॥

మనోవాక్కాయకర్మలతో ఏ స్త్రీ యైతే భర్తకు సేవ చేస్తుందో ఆమె ఈ విషయాన్నంతటినీ తెలుసు కోవటమేకాక ఆ సాలోక్యమోక్షమును పొందగలదు.

నాతిక్లేశేన మహతా తానేవ పురుషో యథా ।
తృతీయం వ్యాహృతం తేన మయా సాధ్వితి యోషితః ॥ 76 ॥

పురుషుడు ఎక్కువగా కష్టపడకుండానే వేటినైతే పొందుతున్నాడో స్త్రీ పతివ్రతయను దృష్టితో నేను మూడవపర్యాయము సాధువాదము చేసితిని.

ఏతద్వః కథితం విప్రా యన్నిమిత్తమిహాఽఽగతాః ।
తత్పృచ్ఛధ్వం యథా కామమహం వక్ష్యామి వః స్ఫుటమ్ ॥ 77 ॥

ఓ బ్రాహ్మణులారా! దేనిని గూర్చి మీరిచ్చుటకు వచ్చినారో దానిని గూర్చి మీకంతయు చెప్పితిని. ఇక మీకేమి తెలుసుకొనవలయునని యున్నదో అడుగుడు దానిని స్పష్టముగా మీకు చెప్పుదును.

అల్పేనైవ ప్రయత్నేన ధర్మః సిధ్యతి వై కలౌ ।
నరైరాత్మగుణాంభోభిః క్షాళితాఖిల కిల్బిషైః ॥ 78 ॥

కలియుగంలో మానవులు ఆత్మగుణములనే నీటి చేత సమస్త పాపములను కడుగవేసిన వారై చిన్న ప్రయత్నము చేతనే వారికి ధర్మము సిద్ధించును.

శూద్రైశ్చ ద్విజశుశ్రూషా తత్పరైర్మునిసత్తమాః ।
తథా స్త్రీభిరనాయాసాత్పతిశుశ్రూషయైవ హి ॥ 79 ॥

ఓ ముని సత్తములారా! బ్రాహ్మణులకు సేవ చేసినందు వల్ల శూద్రులెట్లు పొందుదురో భర్తకుసేవ చేసినందు వలన స్త్రీలట్లే పొందుదురు.

తతస్త్రితయమప్యేతన్మమ ధన్యతమం మతమ్ ।
ధర్మ సంరాధనే క్లేశో ద్విజాతీనాం కృతాదిషు ॥ 80 ॥

అందువలన స్త్రీశూద్రద్విజులు ముప్పురూ కలియుగమందు ధన్యులని నా అభిమతము. ద్విజులకు కృతాదియుగములలో ధర్మమును ఆరాధించుట మిక్కిలి క్లేశకరము.

తథా స్వల్పేన తపసా సిద్ధిం యాస్యంతి మానవాః ।
ధన్యాః ధర్మం చరిష్యన్తి యుగాన్తే మునిసత్తమాః ॥ 81 ॥

ఓ మునిసత్తములారా! ఈ కలియుగమందు మానవులు స్వల్పమైన తపస్సుతోనే సిద్ధిని పొందగలరు, ఈ యుగమందు ధర్మమును ఆచరించువారు ధన్యులు.

భవద్భిర్యదభిప్రేతం తదేతత్కథితం మయా ।
అపృష్టేనాపి ధర్మజ్ఞాః కిమన్యత్క్రియతాం ద్విజాః ॥ 82 ॥

ఓ ద్విజులారా! మీరడగకపోయినా మీ మనస్సులో ఏ అభిప్రాయమున్నదో దానినే నేను చెప్పితిని. ఓ ధర్మజ్ఞులారా! ఇంకా ఏమిచేయాలి?

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే భవిష్యకథనం నామ ద్వావింశాధికశతతమోఽధ్యాయః ॥ 122 ॥

శ్రీబ్రహ్మపురాణమునందలి వ్యాస ఋషుల సంవాదములోని భవిష్యకథనమనే పేరుగల నూట ఇరవై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రయోవింశాధిక శతతమోఽధ్యాయః - నూట ఇరవైమూడవ అధ్యాయం

భవిష్యకథనమ్ – భవిష్యకథనం

మునయ ఊచుః :– మునులు పలికారు.

ఆసన్నం విప్రకృష్టం వా యది కాలం న విద్మహే ।
తతో ద్వాపరవిధ్వంసం యుగాన్తం స్పృహయామహే ॥ 1 ॥

ఒకవేళ కాలం సమీపించినదనో దూరమైనదనో గొప్పదనో తెలుసుకొనలేము, ద్వాపరయుగ విధ్వంసమే యుగాన్తముగా తలచుచున్నాము.

ప్రాప్తా వయం హి తత్కాలమనయా ధర్మతృష్ణయా ।
ఆదద్యామ పరం ధర్మం సుఖమల్పేన కర్మణా ॥ 2 ॥

ఈ ధర్మమునందుండే కోరికచేత మేమాకాలమును పొందితిమి. అల్పమైన కర్మతోనే సుఖమయమైన పరమధర్మమును పొందగలము.

సంత్రాసోద్వేగజననం యుగాన్తం సముపస్థితమ్ ।
ప్రణష్టధర్మం ధర్మజ్ఞ నిమిత్తైర్వక్తుమర్హసి ॥ 3 ॥

ఓ ధర్మజ్ఞుడా! భయమును ఉద్వేగమును కల్గించునటువంటి, ధర్మము నశించునటువంటి యుగాంతమును గూర్చి దానికిగల కారణములేవో తెలుపుతూ వివరించుడు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

అరక్షితారో హర్తారో బలిభాగస్య పార్థివాః ।
యుగాన్తే ప్రభవిష్యన్తి స్వరక్షణపరాయణాః ॥ 4 ॥

రాజులు బలిభాగమును రక్షించకుండా హరించే వారుగా, తమ రక్షణను మాత్రమే చూచుకునే వారుగాను యుగాంతము నందు పుట్టగలరు.

అక్షత్రియాశ్చ రాజానో విప్రాః శూద్రోపజీవినః ।
శూద్రాశ్చ బ్రాహ్మణాచారా భవిష్యన్తి యుగక్షయే ॥ 5 ॥

యుగక్షయమునందు క్షత్రియులు కాని వారు రాజులుగాను, బ్రాహ్మణులు శూద్రుల వలె జీవించు వారుగాను, శూద్రులు బ్రాహ్మణాచారములను చక్కగా పాటించువారగుదురు.

శ్రోత్రియాః కాణ్డపృష్ఠాశ్చ నిష్కర్మాణి హవీంషి చ ।
ఏకపంక్త్యామశిష్యన్తి యుగాన్తే మునిసత్తమాః ॥ 6 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! శ్రోత్రియులైనవారు కేవలం కాండములను మాత్రమే అధ్యయనము చేయువారై, కర్మలనేవీ ఆచరించక, యజ్ఞాదిక్రియలతో హవిస్సుల నీయక ఈ యుగాంతమునందు ఏకపంక్తి భోజనమును చేయుచుందురు.

అశిష్టవంతోఽర్థపరా నరా మద్యామిషప్రియాః ।
మిత్రభార్యాం భజిష్యన్తి యుగాంతే పురుషాధమాః ॥ 7 ॥

యుగాంతమునందు శిష్టాచారమిననుసరించక, కేవలం ధనమునందే ఆసక్తులై, మద్యమునందు మాంసమునందు మిక్కిలి ప్రేమకలవారై, మిత్రుల భార్యలకు సేవచేస్తూ పురుషాధములుగా నుందురు.

రాజవృత్తిస్థితాశ్చౌరా రాజానశ్చౌరశాలినః ।
భృత్యా హ్యనిర్దిష్టభుజో భవిష్యన్తి యుగక్షయే ॥ 8 ॥

దొంగలు రాజులుగా ప్రవర్తించుచు, రాజులు దొంగలుగా ప్రవర్తిస్తూ, సేవకులు దిశానిర్దేశములేని శక్తికలవారుగా ఈ యుగము యొక్క చివరయందు ప్రవర్తించెదరు.

ధనాని శ్లాఘనీయాని సతాం వృత్తమపూజితమ్ ।
అకుత్సనా చ పతితే భవిష్యతి యుగక్షయే ॥ 9 ॥

యుగక్షయమైనప్పుడు ధనమే ప్రధానముగా కొనియాడబడుతూ, సత్పురుషుల నడవడిక విలువలేనిదిగా నుంటూ, పతితులయందే మాత్రము నిందను చూపకుండా యుండును.

ప్రణష్టనాసాః పురుషా ముక్తకేశా విరూపిణః ।
ఊనషోడశవర్షాశ్చ ప్రసోష్యన్తి తథా స్త్రియః ॥ 10 ॥

పురుషులు నశించిన ముక్కులు కలిగినవారుగానూ, జుట్టుముడి వేసుకొనక జుట్టును విరగబోసినవారుగానూ, వికృతమైన రూపము కలిగినవారుగానూ ఉందురు. స్త్రీలు పదహారుసంవత్సరాల లోపలే ప్రసవించి తల్లులుగా అయ్యేవారుగానూ ఉందురు.

అట్టశూలా జనపదాః శివశూలాశ్చతుష్పథాః ।
ప్రమదాః కేశశూలాశ్చ భవిష్యన్తి యుగక్షయే ॥ 11 ॥

పల్లెలు అన్నాన్ని అమ్ముకునేవిగా, నాలుగు వీధుల కూడళ్ళు వేదములను అమ్ముకొనేవిగా, స్త్రీలు వ్యభిచారిణులుగానూ కలియుగాంతమందు మారగలరు.

సర్వే బ్రహ్మ వదిష్యన్తి ద్విజా వాజసనేయికాః ।
శూద్రాభా వాదినశ్చైవ బ్రాహ్మణాశ్చాన్త్యవాసినః ॥ 12 ॥

యజుర్వేదమును పఠించు బ్రాహ్మణులు బ్రహ్మవాదులగుదురు, బ్రాహ్మణులు శూద్రులవలే తేజోవిహీనులై వితండవాదములను చేసెదరు.

శుక్లదన్తా జితాక్షాశ్చ ముండాః కాషాయవాససః ।
శూద్రా ధర్మం వదిష్యన్తి శాఠ్యబుద్ధ్యోపజీవినః ॥ 13 ॥

శఠబుద్ధితో జీవించు శూద్రులు తెల్లని పలువరుసగలవారై చూపులను జయించినవారై, ముండనము చేసుకొని, కాషాయ వస్త్రములను ధరించి ధర్మమును బోధిస్తారు.

శ్వాపద ప్రచురత్వం చ గవాం చైవ పరిక్షయః ।
సాధూనాం పరివృత్తిశ్చ విద్యాదన్తగతే యుగే ॥ 14 ॥

యుగ సమాప్తియందు కుక్కలను పెంచుట అధికమై, గోవులను నశింప చేసే వారధికమై, సాధువులు తమ మాట మీద నిలుకడలేనివారై మారుతుంటారు అని తెలుసుకొనవలెను.

అన్త్యా మధ్యే నివత్స్యన్తి మధ్యాశ్చాన్త్యనివాసినః ।
నిర్హ్రీకాశ్చ ప్రజాః సర్వా నష్టాస్తత్ర యుగక్షయే ॥ 15 ॥

అక్కడ యుగాన్తమునందు శూద్రులు క్షత్రియులుగానూ, క్షత్రియులు శూద్రులుగానూ నివసిస్తూ సిగ్గులేనివారై నాశము చెందెదరు.

తపోయజ్ఞఫలానాం చ విక్రేతారో ద్విజోత్తమాః ।
ఋతవో విపరీతాశ్చ భవిష్యన్తి యుగక్షయే ॥ 16 ॥

బ్రాహ్మణోత్తములు తాము చేసిన తపస్సుల, యజ్ఞముల ఫలములను అమ్ముకునే వారుగానుండి యుగాంతమునందు ఋతుఫలములు తారుమారు అగును.

తథా ద్విహాయనా దమ్యాః కలౌ లాంగలధారిణః ।
చిత్రవర్షీ చ పర్జన్యః యుగే క్షీణే భవిష్యతి ॥ 17 ॥

కలియుగాంతమందు రెండేళ్ళగిత్తలచే నాగళ్ళు లాగించబడును. మేఘుడు క్రమముననుసరించక కురియు చుండును.

సర్వే శూరకులే జాతాః క్షమానాథా భవన్తి హి ।
యథా నిమ్నాః ప్రజాః సర్వా భవిష్యన్తి యుగక్షయే ॥ 18 ॥

యుగక్షయమునందు వీరుల కులంలో పుట్టినవారందరు క్షమించమని యాచింతురు. సమస్త ప్రజలు నిమ్నజాతుల వారగుదురు.

పితృదేయాని దత్తాని భవిష్యన్తి తథా సుతాః ।
న చ ధర్మం చరిష్యన్తి మానవా నిర్గతే యుగే ॥ 19 ॥

యుగాన్తమునందు కుమారులు తలిదండ్రులకిచ్చే వాటిని కూడా దానముగా భావిస్తారు. అంతేకాక మానవులు ధర్మము నాచరించరు.

ఊషరా బహులా భూమిః పన్థానస్తస్కరావృతాః ।
సర్వేఽపి వణిజాశ్చైవ భవిష్యన్తి యుగక్షయే ॥ 20 ॥

యుగక్షయమునందు ఇంచుమించు భూమి అంతా ఊషర క్షేత్రమగును. మార్గములన్నియూ దొంగలచే నిండియుండును. అందరూ వ్యాపారమును చేయువారుగానుందురు.

పితృదాయాన్యదత్తాని విభజన్తి తథా సుతాః ।
హరణే యత్నవన్తోఽపి లోభాదిభిర్విరోధినః ॥ 21 ॥

కుమారులు తండ్రి తాతలనుండి సంక్రమించే ఆస్తులను వారు ఇవ్వకయే పంచుకుంటారు. ఆ ఆస్తులను హరించుటలో సమానప్రయత్నము కలవారైననూ లోభాదిగుణములచే శత్రువులగుదురు.

సౌకుమార్యే తథా రూపే రత్నే చోపక్షయంగతే ।
భవిష్యన్తి యుగస్యాన్తే నార్యః కేశైరలంకృతాః ॥ 22 ॥

యుగాంతమునందు స్త్రీలు సౌకుమార్యము, రూపము మరియు రత్నములు మొదలగునవన్నీ క్షయమైనా కేశములతో మాత్రము అలంకృతులగుదురు.

నిర్వీర్యస్య రతిస్తత్ర గృహస్థస్య భవిష్యతి ।
యుగాన్తే సమనుప్రాప్తే నాన్యా భార్యాసమారతిః ॥ 23 ॥

యుగాంతము ప్రాప్తించగా గృహస్థు వీర్యహీనుడైనా భార్యతో సుఖించాలని కోరుకుంటాడు. స్త్రీసౌఖ్యమందే ఎల్లపుడూ ఆసక్తుడై ఉంటాడు.

కుశీలానార్యభూయిష్ఠా వృథారూపసమన్వితాః ।
పురుషాల్పం బహుస్త్రీకం తద్యుగాన్తస్య లక్షణమ్ ॥ 24 ॥

ఈ యుగాన్తలక్షణమేమనగా జనులు శీలరహితులుగానూ, అనార్యులుగానూ, వ్యర్థమైన రూపముతో కూడుకొని యుందురు. అంతేకాక పురుషులల్పసంఖ్యాకులుగాను, స్త్రీలు ఎక్కువగానూ ఉందురు.

బహుయాచనకో లోకో న దాస్యతి పరస్పరమ్ ।
రాజచౌరాగ్నిదండాదిక్షీణః క్షయ ముపైష్యతి ॥ 25 ॥

ఈ సమాజము అనేక విధములుగా యాచించునదై, పరస్పరముగా ఇచ్చుకొని సహకరించదు. రాజులచే దొంగలచే, అగ్నితో, శిక్షలతో క్షీణించిపోయి నశించును.

అఫలాని చ సస్యాని తరుణా వృద్ధశీలినః ।
అశీలాః సుఖినో లోకే భవిష్యన్తి యుగక్షయే ॥ 26 ॥

పంటలు సరియైన ఫలితము నీయవు, యౌవనవయసుననుండు వారు ముసలివారుగా ప్రవర్తింతురు. శీలరహితులైనవారు సుఖముగా జీవింతురు. ఇవే ఈ యుగాంతము నందుండే లక్షణములు.

వర్షాసు పరుషా వాతా నీచాః శర్కరవర్షిణః ।
సందిగ్ధః పరలోకశ్చ భవిష్యతి యుగక్షయే ॥ 27 ॥

యుగాంతమునందు వర్షాకాలమునందు కఠినమైన చెడ్డ గాలులు వీచును. అవి ఇసుకను వర్షించును. పరలోకము గూర్చి సందేహముండును.

వైశ్యా ఇవ చ రాజన్యా ధనధాన్యోపజీవినః ।
యుగాపక్రమణే పూర్వం భవిష్యన్తి న బాంధవాః ॥ 28 ॥

యుగాంతమునకు ముందు రాజులు వైశ్యులవలె ధన ధాన్యములను వృత్తిగా చేసుకొని జీవింతురు. బంధువులనే వారెవరూ లేకుండా యుందురు.

అప్రవృత్తాః ప్రపశ్యన్తి సమయాః శపథాస్తథా ।
ఋణం సవినయభ్రంశం యుగే క్షీణే భవిష్యతి ॥ 29 ॥

యుగము క్షీణించుచుండగా నియమాలు, శపథాలు పాటింపబడవు. అప్పు తీసుకున్నవారు తిరిగి ఇచ్చుటలో వారి వినయమును మాత్రమే ప్రదర్శించి ధన మీయకుండా ఉందురు.

భవిష్యత్యఫలో హర్షః క్రోధశ్చ సఫలో నృణామ్ ।
అజాశ్చాపి నిరోత్స్యన్తి పయసోఽర్థే యుగక్షయే ॥ 30 ॥

యుగక్షయము సంభవించునపుడు మానవులకు సంతోషము ఫలించదు. కోపము సఫలమగును. పాలకొఱకై మేకలను కూడా బంధిస్తారు.

అశాస్త్ర విహితో యజ్ఞ ఏవమేవ భవిష్యతి ।
అప్రమాణం కరిష్యన్తి నరాః పండితమానినః ॥ 31 ॥

యజ్ఞములు శాస్త్రమునందు చెప్పినట్లు చేయకుండా ఏదో ముగించినామన్నట్లగును. తమనే పండితులుగా భావించుకొనుచు మానవులు ప్రమాణరహితముగా పనులు చేయుదురు.

శాస్త్రోక్తస్యాప్రవక్తారో భవిష్యన్తి న సంశయః ।
సర్వః సర్వం విజానాతి వృద్ధాననుపసేవ్య వై ॥ 32 ॥

శాస్త్రములో చెప్పిన దానిని వివరించే వారెవరూ ఉండరని చెప్పుటలో సందేహములేదు. పెద్దలను సేవించ కుండానే ప్రతివాడు తనను సర్వజ్ఞుడుగా భావిస్తాడు.

న కశ్చిదకవిర్నామ యుగాన్తే సముపస్థితే ।
నక్షత్రాణి వియోగాని న కర్మస్థా ద్విజాతయః ॥ 33 ॥

యుగాంతము సమీపిస్తుండగా కవిగానివాడెవడూ ఉండడు, బ్రాహ్మణులు కర్మల నాచరించరు, నక్షత్రములు యోగములను కలిగించవు.

చౌరప్రాయాశ్చ రాజానో యుగాన్తే సముపస్థితే ।
కుండీవృషా నైకృతికా సురాపా బ్రహ్మవాదినః ॥ 34 ॥

యుగాంతము ఉపస్థితము కాగా ఇంచుమించుగా రాజులందరు దొంగలగుదురు, వ్యభిచారము చేయువారి సంతానము, క్రూరకర్మలాచరించువారు, సురాపానము చేయువారు బ్రహ్మవాదులగుదురు.

అశ్వమేధేన యక్ష్యన్తే యుగాన్తే ద్విజసత్తమాః ।
యాజయిష్యన్త్యయాజ్యాంస్తు తథాఽఽభక్ష్యస్య భక్షిణః ॥ 35 ॥

యుగాన్తమునందు బ్రాహ్మణులు తినకూడని పదార్థములను తినువారై, చేయకూడని వారిచేత యజ్ఞములను చేయించువారై వారిచేత అశ్వమేధయాగాన్ని చేయిస్తారు.

బ్రాహ్మణా ధనతృష్ణార్తా యుగాన్తే సముపస్థితే ।
భోః శబ్దమభిధాస్యన్తి న చ కశ్చిత్పఠిష్యతి । 36 ॥

యుగాంతమునందు బ్రాహ్మణులు ధనాశతో పీడింపబడినవారై, అయ్యా! ఏమండీ! వంటి గౌరవ వాచకపదములను స్వప్రయోజనాపేక్షతో పలుకుతారు. ఒక్కడు కూడా వేదాలను పఠించడు.

ఏకశంఖాస్తథా నార్యో గవేధుకపినద్ధకాః ।
నక్షత్రాణి వివర్ణాని విపరీతా దిశో దశ ॥ 37 ॥

స్త్రీలు ఏకశంఖులుగా, అనగా ఒక చేతికి మాత్రమే దంతపుగాజును ధరిస్తారు. ఆవులు తినే ఒకరకమైన గడ్డితో చేసిన వస్త్రములు ధరించే వారుగానుందురు. నక్షత్రములు వివర్ణములగును. పదిదిక్కులు విపరీతములగును.

సంధ్యారాగో విదగ్ధాంగో భవిష్యతి యుగక్షయే ।
ప్రేషయంతి పితౄన్ పుత్రా వధూః శ్వశ్రూః స్వకర్మసు ॥ 38 ॥

యుగక్షయము జరుగు సమయమున సంధ్యా సమయంలో విభిన్నమైన వర్ణము లేర్పడి మార్పు కనిపించును. ఇంటిలో కుమారులుండి తమ పనులకై తండ్రులను పంపుదురు. అట్లే కోడండ్లు అత్తలతో తమ పనులను చేసుకుందురు.

యుగేష్వేవం నివత్స్యన్తి ప్రమదాశ్చ నరాస్తథా ।
అకృత్వాఽగ్ర్యాణి భోక్ష్యన్తి ద్విజాశ్చైవాహుతాగ్నయః ॥ 39 ॥

ఈ విధంగా స్త్రీలు, మానవులు చేయవలసిన విధులు, యజ్ఞములు చేయకుండానే భుజింతురు. బ్రాహ్మణులు నిత్యాగ్నిహోత్రములు చేయకుండానే భోజనమునుచేస్తూ జీవింతురు.

భిక్షాం బలిమదత్వా చ భోక్ష్యన్తి పురుషాః స్వయమ్ ।
వంచయిత్వా పతీన్ గుప్తాన్ గమిష్యన్తి స్త్రియోఽన్యతః ॥ 40 ॥

మానవులు అభ్యాగతులకు భిక్షను, జీవులకు బలిప్రదానమును చేయకుండానే తాము భుజింతురు. స్త్రీలు భర్తలను వంచించి రహస్యముగా ఇతర పురుషుల దగ్గరకు వెళ్ళుదురు.

న వ్యాధితాన్నాప్యరూపాన్నోద్యతాన్నాప్యసూయకాన్ ।
కృతే చ న ప్రతికర్తా చ యుగే క్షీణే భవిష్యతి ॥ 41 ॥

యుగము క్షీణించు సమయమునందు వ్యాధిగ్రస్తులను ఆదుకోరు, అంగ సౌష్టవము లేనివారినాదరించరు, అసూయారహితులైన వారిని అనుసరించరు, ప్రయత్నించే వారిని చూచి హర్షించరు, సహాయము నందించిన వారికి ప్రత్యుపకారమును చేయరు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

ఏవం విలంబితే ధర్మే మానుషాః కరపీడితాః ।
కుత్ర దేశే నివత్స్యన్తి కిమాహారవిహారిణః ॥ 42 ॥

ఈ విధముగా ధర్మములోపించినప్పుడు మానవులు పన్నులతో పీడింపబడినవారై ఎటువంటి ఆహార విహారములను సలుపుతూ ఏ దేశమున నివసింతురు?

కిం కర్మాణః కిమీహన్తి కింప్రమాణాః కిమాయుషః ।
కాంచ కాష్ఠాం సమాసాద్య ప్రపత్స్యంతి కృతం యుగమ్ ॥ 43 ॥

ఆ సమయమున వారే పనులను చేయుదురు? వేటిని కోరుకొందురు? ఏ ప్రమాణములను పాటింతురు? ఏ వయస్సు వరకు జీవింతురు? ఎటువంటి చరమసీమను చేరి తిరిగి కృతయుగమును పొందుదురు?

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

అత ఊర్ధ్వం చ్యుతే ధర్మే గుణహీనాః ప్రజాస్తథా ।
శీలవ్యసనమాసాద్య ప్రాప్స్యన్తి హ్రాసమాయుషః ॥ 44 ॥

ఇక ఆ పైన ధర్మము నశించగా ప్రజలు గుణహీనులగుదురు. దుర్వ్యసనములకు లోనై, శీలమును పోగొట్టుకొని అల్పాయుష్షును పొందుదురు.

ఆయుర్హాన్యా బలగ్లానిర్బలగ్లాన్యా వివర్ణతా ।
వైవర్ణ్యాద్వ్యాధిసంపీడా నిర్వేదో వ్యాధిపీడనాత్ ॥ 45 ॥

ఆయువు తగ్గినందువలన బలహీనత ఏర్పడును, బలహీనత వలన శరీరము నందు కాంతిహీనతను పొందుదురు. వైవర్ణ్యము వలన వ్యాధులచే పీడింపబడుదురు. వ్యాధులచే పీడింపబడుట వలన నిర్వేదమేర్పడును.

నిర్వేదాదాత్మసంబోధః సంబోధాద్ధర్మశీలతా ।
ఏవం గత్వా పరాం కాష్ఠాం ప్రపత్స్యన్తి కృతం యుగమ్ ॥ 46 ॥

నిర్వేదము వల్ల ఆత్మజ్ఞానము కలుగును. ఆత్మజ్ఞానము కలిగినందువలన ధర్మమునందు ప్రవర్తించు వారగుదురు. ఈ విధముగా చరమసీమను చేరి కృతయుగాన్ని పొందుతారు.

ఉద్దేశతో ధర్మశీలాః కేచిన్మధ్యస్థతాం గతాః ।
కిం ధర్మశీలాః కేచిత్తు కేచిదత్ర కుతూహలాః ॥ 47 ॥

ఇట్లు పొందిన వారిలో కొందరు ఉద్దేశపూర్వకముగా ధర్మమును పాటింతురు. కొందరు మధ్యస్థులుగా నుందురు. కొందరు ఈ ధర్మమునాచరించుట ఏమిటి? అని వ్యతిరేకులు గానుందురు. కొందరు ధర్మమేమిటో తెలుసుకోవాలని కుతూహలముతోనుందురు.

ప్రత్యక్షమనుమానం చ ప్రమాణమితి నిశ్చితాః ।
అప్రమాణం కరిష్యన్తి సర్వమిత్యపరే జనాః ॥ 48 ॥

దీనిలో కొందరు ప్రత్యక్ష ప్రమాణమును, అనుమాన ప్రమాణమును అంగీకరింతురు. ఇక మిగతావారందరూ ఏ ప్రమాణమునూ తెలుసుకొనక తమ ఇష్టము వచ్చినట్లుగా చేయుదురు.

నాస్తిక్యాభిరతాశ్చాపి కేచిద్ధర్మవిలోపకాః ।
భవిష్యన్తి నరా మూఢా ద్విజాః పండితమానినః ॥ 49 ॥

మానవులు కొందరు నాస్తికవాదమునందభిరుచి కలిగియుందురు. కొందరు ధర్మవిలోపకులుగా నుందురు. బ్రాహ్మణులు తమను పండితులనుగా భావించుకొని మూఢులగుదురు.

తదాత్వమాత్రశ్రద్ధేయాః శాస్త్రజ్ఞానబహిష్కృతాః ।
దాంభికాస్తే భవిష్యన్తి నరా జ్ఞానవిలోపితాః ॥ 50 ॥

మానవులు శాస్త్ర జ్ఞానమునందు శ్రద్ధ చూపక, అప్పటికి మాత్రము సరిపడేదానిపై శ్రద్ధ పెట్టి, తెలివి తక్కువవారై, దంభమును ప్రదర్శించేవారుగా నుందురు.

తథా విలులితే ధర్మే జనాః శ్రేష్ఠపురస్కృతాః ।
శుభాన్ సమాచరిష్యన్తి దానశీలపరాయణాః ॥ 51 ॥

ఈ విధంగా క్రమభంగముతో ధర్మభ్రష్టులైన జనులు తిరిగి శ్రేష్ఠులైన పెద్దలను ముందుంచుకొని దాన ధర్మాలనాచరించుటయందాసక్తులై శుభమైన కర్మల నాచరించెదరు.

సర్వభక్షాః స్వయంగుప్తాః నిర్ఘృణా నిరపత్రపాః ।
భవిష్యన్తి తదా లోకే తత్కషాయస్య లక్షణమ్ ॥ 52 ॥

అన్నింటిని భంజించేవారుగా, రహస్యముగానుండు వారుగా, దయలేనివారుగా, లజ్జ విహీనులుగా జీవించుచు లోకమునందు ఉంటారు. అదే కలి లక్షణముగా తెలుసుకొనవలెను.

కషాయోపప్లవే కాలే జ్ఞాననిష్ఠాప్రణాశనే ।
సిద్ధిమల్పేన కాలేన ప్రాప్స్యన్తి నిరుపస్కృతాః ॥ 53 ॥

కలియొక్క ఉపద్రవకాలమందు మనుష్యులయొక్క జ్ఞాననిష్ఠ నశించును. నిష్ప్రయోజనమైన విషయాలు స్వల్పకాలంలోనే సిద్ధిస్తాయి.

విప్రాణాం శాశ్వతీం వృత్తిం యదా వర్ణావరే జనాః ।
సంశ్రయిష్యన్తి భో విప్రాస్తత్కషాయస్య లక్షణమ్ ॥ 54 ॥

ఓ బ్రాహ్మణులారా! ఎప్పుడైతే ఇతరవర్ణములవారు బ్రాహ్మణులయొక్క అధ్యయనాధ్యాపనాదివృత్తిని స్వీకరిస్తారో అప్పుడది కలి లక్షణమని తెలుసుకొనవలెను.

మహాయుద్ధం మహావర్షం మహావాతం మహాతపః ।
భవిష్యతి యుగే క్షీణే తత్కషాయస్య లక్షణమ్ ॥ 55 ॥

యుగాంతమునందెప్పుడైతే మహాయుద్ధము, అతివర్షము, పెనుగాలి, తీవ్రమైన ఎండ ఏర్పడునో అప్పుడది కలి లక్షణమని యెరుంగవలెను.

విప్రరూపేణ రక్షాంసి రాజానః కర్ణవేదినః ।
పృథివీముపభోక్ష్యన్తి యుగాన్తే సముపస్థితే ॥ 56 ॥

యుగాంతము సమీపించినపుడు రాక్షసులు బ్రాహ్మణరూపంలో ప్రవర్తిస్తారు. రాజులు చెప్పుడుమాటలు వింటూ ఈ భూమిని అనుభవించగలరు.

నిఃస్వాధ్యాయ వషట్కారాః కునేతారోఽభిమానినః ।
క్రవ్యాదా బ్రహ్మరూపేణ సర్వభక్ష్యా వృథావ్రతాః ॥ 57 ॥

అటువంటి బ్రాహ్మణులు, అటువంటి రాక్షసులు వేదాధ్యయనమును చేయకుండా, మంత్రానుష్ఠానములను సల్పకుండా, దురభిమానము కలవారై జనులను చెడ్డమార్గంలో నడిపిస్తూ మాంసభక్షకులై అభక్ష్యములను కూడా తినుచూ వ్యర్థమైన వ్రతాచరణ కలవారై బ్రాహ్మణరూపంలో సంచరిస్తూ ఉంటారు.

మూర్ఖాశ్చార్థపరా లుబ్ధాః క్షుద్రాః క్షుద్రపరిచ్ఛదాః ।
వ్యవహారోపవృత్తాశ్చ చ్యుతా ధర్మాచ్చ శాశ్వతాత్ ॥ 58 ॥

శాశ్వతమైన ధర్మమునుండి చ్యుతులైన వారు మూర్ఖులు గాను, కేవలం ధనం సంపాదించుటే ముఖ్యమనుకునే వారు గాను, లోభులుగాను, క్షుద్రులుగాను, క్షద్రులు చుట్టూ గల వారుగాను, వ్యాపారములను సల్పువారుగాను జీవింతురు.

హర్తారః పరరత్నానాం పరదారప్రధర్షకాః ।
కామాత్మానో దురాత్మానః సోపధాః ప్రియసాహసాః ॥ 59 ॥

ఇతరుల రత్నములను దొంగిలించేవారు, ఇతరుల భార్యలను చెరపట్టువారు, సర్వదా కాముకులుగాను, దుర్మార్గులుగాను, కపటులుగా, ప్రియసాహసికులుగా నుందురు.

తేషు ప్రభవమానేషు జనేష్వపి చ సర్వశః ।
అభావినో భవిష్యన్తి మునయో బహురూపిణః ॥ 60 ॥

జనులందరూ ఇట్టివారగుచుండగా భావరహితులుగా నుందురు. మునులు బహురూపులుగా నుందురు అనగా విపరీతలక్షణములు కల్గియుందురు.

కలౌ యుగే సముత్పన్నాః ప్రధానపురుషాశ్చ యే ।
కథాయోగేన తాన్ సర్వాన్ పూజయిష్యన్తి మానవాః ॥ 61 ॥

అట్లు కలియుగమునందు పుట్టినవారెవరైతే ప్రధానమైన పురుషులున్నారో అటువంటి మానవులు కథా యోగముతో వారినందరిని పూజించగలరు.

సస్యచౌరా భవిష్యన్తి తథా చేలాపహారిణః ।
భోక్ష్యభోజ్యహరాశ్చైవ కరండానాం చ హారిణః ॥ 62 ॥

పంటలను కొల్లగొట్టేవారు, భూములను హరించేవారు, తిండి పదార్థములను దొంగిలించేవారు కరండములను తేనెతుట్టెలను దొంగిలించేవారు ఉందురు.

చౌరాశ్చౌరస్య హర్తారః హన్తా హన్తుర్భవిష్యతి ।
చౌరైశ్చౌరక్షయే చాపి కృతే క్షేమం భవిష్యతి ॥ 63 ॥

దొంగల దగ్గరి సొత్తునే దొంగిలించే చోరులుగాను, హత్యలను చేసేవారినే చంపే హంతకులుగాను కాగలరు దొంగలే దొంగలను అంతమొందించగా క్షేమం కలుగును.

నిఃసారే క్షుభితే కాలే నిష్క్రియే సంవ్యవస్థితే ।
నరా వనం శ్రయిష్యన్తి కరభారప్రపీడితాః ॥ 64 ॥

భూమి సారవంతమును కోలుపోయి క్షోభించుచున్న సమయంలో, పనులేవీ దొరకనటువంటి వ్యవస్థ ఏర్పడి పన్నులభారం చేత పీడింపబడిన ప్రజలు వనమును ఆశ్రయించగలరు.

యజ్ఞకర్మణ్యుపరతే రక్షాంసి శ్వాపదాని చ ।
కీటమూషకసర్పాశ్చ ధర్షయిష్యన్తి మానవాన్ ॥ 65 ॥

యజ్ఞకర్మలు మానివేయగా రాక్షసులు, శ్వాపదములు అనగా క్రూరమృగములు, కీటకములు, ఎలుకలు, సర్పములు మానవులను బాధించును.

క్షేమం సుభిక్షమారోగ్యం సామగ్ర్యం చైవ బంధుషు ।
ఉద్దేశేషు నరాః శ్రేష్ఠా భవిష్యన్తి యుగక్షయే ॥ 66 ॥

యుగాంతమునందు మానవులు తమ ఉద్దేశములందు శ్రేష్ఠులై క్షేమమును, సుభిక్షమును, ఆరోగ్యమును, బంధువులయందు సామగ్ర్యమును పొందుదురు.

స్వయంపాలాః స్వయంచౌరాః ప్లవసంభారసంభృతాః ।
మండలైః సంభవిష్యన్తి దేశే దేశే పృథక్ పృథక్ ॥ 67 ॥

మానవులు స్వయముగా పాలకులుగాను, స్వయముగా దొంగిలించే వారుగాను, ఉపద్రవపీడితులై దేశాటనచేస్తూ గుంపులు గుంపులుగా ఏర్పడతారు.

స్వదేశేభ్యః పరిభ్రష్టా నిఃసారా సహ బంధుభిః ।
నరాః సర్వే భవిష్యన్తి తదా కాలపరిక్షయాత్ ॥ 68 ॥

కాలపరిక్షయము వలన ప్రజలందరు నిఃసారులై తమ బంధువులతో గూడా తమ దేశములనుండి భ్రష్టులగుదురు.

తతః సర్వే సమాదాయ కుమారాన్ ప్రద్రుతా భయాత్ ।
కౌశికీం సంతరిష్యన్తి నరాః క్షుధ్భయపీడితాః ॥ 69 ॥

అప్పుడు ప్రజలందరు కూడా ఆ కలిభయంతో పీడింపబడినవారై త్వరత్వరగా తమ కుమారులను తీసుకొని భయంతో కౌశికీనదిని దాటగలరు.

అంగాన్వంగాన్కలింగాంశ్చ కాశ్మీరానథ కోశలాన్ ।
ఋషికాన్తగిరిద్రోణీః సంశ్రయిష్యన్తి మానవాః ॥ 70 ॥

ఇట్లు దాటినవారు అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కోసల దేశములను దాటి ఋషులచే కోరబడిన కొండలను, సరస్సులను, గుహలను ఆశ్రయించగలరు.

కృత్స్నం చ హిమవత్పార్శ్వం కూలం చ లవణాంభసః ।
వివిధం జీర్ణపత్రం చ వల్కలాన్యజినాని చ ॥ 71 ॥

స్వయం కృత్వా నివత్స్యన్తి తస్మిన్ భూతే యుగక్షయే ।
అరణ్యేషు చ వత్స్యన్తి నరా మ్లేచ్ఛగణైః సహ ॥ 72 ॥

హిమవత్పర్వత ప్రాంతపు ప్రక్కలందు అంతట, ఉప్పు సముద్ర తీరంలోను, అనేక విధములైన ఎండుటాకులను, నార వస్త్రములను, అజినములను స్వయముగా సిద్ధము చేసుకొని నివసించెదరు. యుగాంతము జరిగినపుడు మ్లేచ్ఛసమూహములతో గూడి అరణ్యములలో నివసించెదరు.

నైవ శూన్యా నవారణ్యా భవిష్యతి వసుంధరా ।
అగోప్తారశ్చ గోప్తారో భవిష్యన్తి నరాధిపాః ॥ 73 ॥

అప్పుడీ భూమి శూన్యముగానూ ఉండదు. అరణ్యములతో కూడుకొనీ ఉండదు. రక్షకులుగా ఉండవలసినవారు రక్షకులుగా నుండరు.

మృగైర్మత్స్యైర్విహంగైశ్చ శ్వాపదైః సర్పకీటకైః ।
మధుశాక ఫలైర్మూలైర్వర్తయిష్యన్తి మానవాః ॥ 74 ॥

అపుడు మానవులు మృగములు, చేపలు, పక్షులు, క్రూరమృగాలు సర్పములు, కీటకములు, తేనె, శాకములు, పండ్లు, దుంపలు మున్నగు వాటిని తింటూ జీవింతురు.

శీర్ణపర్ణఫలాహారా వల్కలాన్యజినాని చ ।
స్వయంకృత్వా నివత్స్యన్తి యథా మునిజనాస్తథా ॥ 75 ॥

ఋషులేవిధంగా నారవస్త్రములను, జంతుచర్మములను తామే సిద్ధంచేసుకుని ధరిస్తారో, వారేవిధంగా ఆకులను, అలములను, పళ్లను ఆహారంగా తీసుకుంటారో అట్లే వారిని ఈ ప్రజలంతా అనుసరిస్తూ నివసింతురు.

బీజానామకృతస్నేహా ఆహతాః కాష్ఠశంకుభిః ।
అజైడకం ఖరోష్ట్రం చ పాలయిష్యన్తి నిత్యశః ॥ 76 ॥

గింజలయందు ఏ మాత్రము శ్రద్ధ లేక వెదురుబొంగులతో కొట్టుకుంటూ మేకలను అడవి జంతువులను గాడిదలను ఒంటెలను ప్రతిరోజు మేపుదురు.

నదీస్రోతాంసి రోత్స్యన్తి తోయార్థం కూలమాశ్రితాః ।
పక్వాన్నవ్యవహారేణ విపణన్తః పరస్పరమ్ ॥ 77 ॥

నీటి కొఱకు తీరముల నాశ్రయించుచు నదీజలప్రవాహములను అడ్డుకట్టలతో అడ్డుకొందురు. వండిన పదార్థములను అమ్ముకొని జీవింతురు.

తనూరుహైర్యథాజాతైః సమలాన్తరసంభృతైః ।
బహ్వపత్యాః ప్రజాహీనాః కులశీలవివర్జితాః ॥ 78 ॥

వారి శరీరములు పెద్దపెద్ద వెంట్రుకలతోనూ, లోనున్న మలముతోను నిండియుండును, వారిలో కొందరికి బహుసంతానము, కొందరికి అసలు సంతానము లేకపోవుట ఉండును. వారు కులశీలములు లేనివారై యుందురు.

ఏవం భవిష్యన్తి తదా నరాశ్చాధర్మజీవినః ।
హీనాహీనం తథా ధర్మం ప్రజా సమనువత్స్యతి ॥ 79 ॥

ఈ విధంగా మానవులు అధర్మ జీవులగుదురు. అట్లే ప్రజలు హెచ్చుతగ్గులు కలిగిన ధర్మాన్ని కలిగియుంటారు.

ఆయుస్తత్ర చ మర్త్యానాం పరం త్రింశద్భవిష్యతి ।
దుర్బలా విషయగ్లానా జరాశోకైరభిప్లుతాః ॥ 80 ॥

అప్పుడా మానవులకు ఆయువు ముప్పది సంవత్సరములు మాత్రమే యుండి వారు దుర్బలులుగా, విషయముల వల్ల దుఃఖములననుభవించు వారిగా, ముసలితనముతోనూ పీడింపబడుదురు.

భవిష్యన్తి తదా తేషాం రోగైరింద్రియసంక్షయః ।
ఆయుః ప్రత్యయసంరోధాద్విషయాదుపరంస్యతే ॥ 81 ॥

అప్పుడు రోగములతో వారికి ఇంద్రియనాశము కలుగును. తమ ఆయుర్దాయమందు విశ్వాసము లేని కారణముగా విషయభోగముల నుండి విరమించును.

శూశ్రూషవో భవిష్యన్తి సాధూనాం దర్శనే రతాః ।
సత్యం చ ప్రతిపత్స్యన్తి వ్యవహారోపసంక్షయాత్ ॥ 82 ॥

వ్యవహారములన్నీ నశించుట వలన వారంతా సాధుదర్శనము చేయుటకు, వారికి శుశ్రూషలను చేయుటకిష్ట పడుతూ సత్యవాక్కులనే పలుకుదురు.

భవిష్యన్తి చ కామానామలాభాద్ధర్మశీలినః ।
కరిష్యన్తి చ సంస్కారం స్వయం చ క్షయపీడితాః ॥ 83 ॥

కోరికలేవీ తీరనందువలన ధర్మశీలురగుదురు. నాశమువల్ల పీడింపబడినవారై తమను తాము సంస్కరించుకొందురు.

ఏవం శుశ్రూషవో దానే సత్యే ప్రాణ్యభిరక్షణే ।
తతః పాదప్రవృత్తే తు ధర్మే శ్రేయో నిపత్స్యతే ॥ 84 ॥

ఈ విధంగా వారు శుశ్రూషలను చేస్తూ దానముచేయుటయందు, సత్యమును మాట్లాడుటయందు, ప్రాణులను రక్షించుటయందు ఆసక్తులగుదురు. అంతట ధర్మము ఏకపాదమందు ప్రవృత్తముకాగా శ్రేయస్సు కలుగుతుంది.

తేషాం లబ్ధానుమానానాం గుణేషు పరివర్తతామ్ ।
స్వాదు కింత్వితి విజ్ఞాయ ధర్మ ఏవ చ దృశ్యతే ॥ 85 ॥

ధర్మము విషయములో ఏదిమంచో ఏది చెడ్డో అనుమానము కలిగి, ఆయా గుణములందు సక్రమ మార్గమందు పరివర్తనము చెందుచున్న ఆ మానవులు ఏది రుచికరమైనదో తెలుసుకొనుటవలన వారి యందు ధర్మము కనిపించుచున్నది.

యథా హానిక్రమం ప్రాప్తాస్తథా బుద్ధిక్రమం గతాః ।
ప్రగృహీతే తతో ధర్మే ప్రవిశ్యన్తి కృతం యుగమ్ ॥ 86 ॥

వారింతకు ముందు ఏ క్రమంలో హానిని పొందినారో, అదే క్రమంలో ఇప్పుడు వృద్ధిని పొంది తరువాత ధర్మమును స్వీకరించి కృతయుగంలో ప్రవేశింతురు.

సాధు వృత్తిః కృతయుగే కషాయే హానిరుచ్యతే ।
ఏక ఏవ తు కాలోఽయం హీనవర్ణో యథా శశీ ॥ 87 ॥

కృతయుగంలో సత్ప్రవర్తన ఉంటుంది. కలియుగంలో దానికి హాని కల్గుతుంది. ప్రకాశము తగ్గినా, హెచ్చినా కూడా చంద్రుడు ఒక్కడే అన్నట్లు ధర్మమునకు వృద్ధి కలిగినా హాని కలిగినా కాలము ఒక్కటే.

ఛన్నశ్చ తమసా సోమో యథా కలియుగం తథా ।
ముక్తశ్చ తమసా సోమ ఏవం కృతయుగం చ తత్ ॥ 88 ॥

చీకటి చేత (రాహువుచేత) కప్పబడిన చంద్రుడెలా వుంటాడో అటువంటిది కలియుగము. చీకటినుండి (రాహువునుండి) విడిబడిన తర్వాత చంద్రుడెలా ప్రకాశిస్తాడో అటువంటిది కృతయుగము.

అర్థవాదః పరం బ్రహ్మ వేదార్థ ఇతి తం విదుః ।
అవివిక్తమవిజ్ఞాతం దాయాద్యమిహ ధార్యతే ॥ 89 ॥

వేదార్థమైన బ్రహ్మమును అర్థవాదముగా అనగా కేవలము ప్రశంసారూపంగా కలియుగంలో జనులు భావించుచున్నారు. ఆ తత్త్వము కలియుగంలో వివేచింపరానిదై, తెలియరానిదై శత్రుభావముతో చూడబడును.

ఇష్టవాదస్తపోనామ తపో హి స్థవిరీకృతః ।
గుణైః కర్మాభినిర్వృత్తిర్గుణాః శుధ్యన్తి కర్మణా ॥ 90 ॥

కలియుగంలో తపస్సును ఇష్టవాదముగా అనగా వేడుక కొరకని జనులు భావించుచున్నారు. ఆ తపస్సు కలికాలమందు శిథిలమైనది. సద్గుణములచే కర్మలు నిర్వర్తింపబడుచున్నవి. కర్మలచే సద్గుణములు సంభవించుచున్నవి.

ఆశీస్తు పురుషం దృష్ట్వా దేశకాలానువర్తినీ ।
యుగే యుగే యథాకాలమృషిభిః సముదాహృతా ॥ 91 ॥

ఆయా యుగములందు దేశకాలములననుసరించి ఋషిజనులు మనుష్యులను చూచి ఆశీర్వదింతురని చెప్పబడినది.

ధర్మార్థ కామమోక్షాణాం దేవానాం చ ప్రతిక్రియా ।
ఆశిషశ్చ శివాః పుణ్యాస్తథైవాఽఽయుర్యుగే యుగే ॥ 92 ॥

ధర్మార్థకామమోక్షముల కొరకైన అనుష్ఠానము, దేవతానుగ్రహముకొరకు చేసే అనుష్ఠానము, మంగళకరములు పుణ్యప్రదములూ అగు ఆశీస్సులు, ఆయుర్దాయము యుగయుగమునకు మారుచుండును.

తథా యుగానాం పరివర్తనాని చిరప్రవృత్తాని విధిస్వభావాత్ ।
క్షణం న సంతిష్ఠతి జీవలోకః క్షయోదయాభ్యాం పరివర్తమానః ॥ 93 ॥

అదే విధముగా విధిస్వభావాన్ననుసరించి యుగములు పరివర్తన చెందుట అనాదిగా జరుగుచున్నది. ఈ జీవలోకము క్షయవృద్ధులచే పరివర్తన చెందకుండా క్షణకాలం కూడా ఉండదు.

ఇతి శ్రీ బ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే భవిష్యకథనం నామ త్రయోవింశాధిక శతతమోఽధ్యాయః ॥ 123 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని వ్యాస-ఋషిసంవాదములోని భవిష్యకథనమను నూట ఇరవైమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్వింశాధిక శతతమోఽధ్యాయః – నూట ఇరవైనాల్గవ అధ్యాయం

సంహారలక్షణ కథనమ్ – సంహారలక్షణ కథనం

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

సర్వేషామేవ భూతానాం త్రివిధః ప్రతిసంచరః ।
నైమిత్తికః ప్రాకృతికస్తథైవాఽఽత్యన్తికో మతః ॥ 1 ॥

సమస్త జీవులకు మూడు విధములైన ప్రళయములుండును. ఈ ప్రళయాలలో విశ్వమంతా ప్రకృతిలో లయమవుతుంది. అవి నైమిత్తికము, ప్రాకృతికము, ఆత్యంతికమని పేరుగలవి.

బ్రాహ్మో నైమిత్తికస్తేషాం కల్పాన్తే ప్రతిసంచరః ।
ఆత్యన్తికో వై మోక్షశ్చ ప్రాకృతో ద్విపరార్ధకః ॥ 2 ॥

వాటిలో బ్రహ్మ ప్రళయము కల్పాన్తమునందు జరుగు దానిని నైమిత్తి కమందురు. మోక్షమును ఆత్యన్తిక ప్రళయమందురు. బ్రహ్మయొక్క ఆయువులోని రెండు భాగములు గల దానిని ప్రాకృతిక ప్రళయమందురు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

పరార్ధ సంఖ్యాం భగవన్ త్వమాచక్ష్వ యథోదితామ్ ।
ద్విగుణీకృతో యథా జ్ఞేయః ప్రాకృతః ప్రతిసంచరః ॥ 3 ॥

భగవన్! నీవు చెప్పిన పరార్ధ సంఖ్యను గూర్చి తెలుపుడు. ప్రాకృత ప్రళయమును ద్విగుణీకృతమైన దానిని గూర్చి ఎట్లు తెలుసుకొనవలయునో వివరింపుడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

స్థానాత్ స్థానం దశగుణమేకైకం గణ్యతే ద్విజాః ।
తతోఽష్టాదశమే భాగే పరార్ధమభిధీయతే ॥ 4 ॥

ఓ బ్రాహ్మణులారా! ఒక స్థానమునుండి మరొకస్థానమునకు ఒక్కొక్కదానిని పదింతలుగా లెక్కింతురు. ఆతరువాత పద్దెనిమిదవ భాగమునందు పరార్ధమని చెప్పుదురు.

పరార్ధం ద్విగుణం యత్తు ప్రాకృతః సలయోద్విజాః ।
తదాఽవ్యక్తేఽఖిలం వ్యక్తం సహేతౌ లయమేతి వై ॥ 5 ॥

ద్విగుణమైన ఏ పరార్థమైతే ఉన్నదో దానిని ప్రాకృతలయమందురు. అప్పుడు సహేతుకమైన అవ్యక్తమునందు సమస్తవ్యక్తమూ (ప్రకృతి) లయమునొందును.

నిమేషో మానుషో యోఽయం మాత్రామాత్ర ప్రమాణతః ।
తైః పంచదశభిః కాష్ఠా త్రింశత్కాష్ఠాస్తథా కలాః ॥ 6 ॥

మానుషమైన 'నిమేషము' అనునది మాత్రామాత్ర ప్రమాణము వల్ల ఏర్పడునది. అటువంటి పదిహేను నిమేషములు ఒక 'కాష్ఠ' అనబడును. ముప్పది కాష్ఠలను అదేవిధముగా కళలందురు. (ముప్పది కళలు ఒక క్షణమందురు.)

నాడికా తు ప్రమాణేన కళాశ్చ దశ పంచ చ ।
ఉన్మానే నాంభసః సాతు పలాన్యర్థ త్రయోదశ ॥ 7 ॥

నాడికా ప్రమాణముననుసరించి (అనగా ఇరవైనాలుగు నిమిషముల కాలమును నాడిక అందురు) కళలు పదిహేను. నీటి చుక్కల లెక్కననుసరించి 1 పలము నాలుగు కర్షల సమానము అనగా సమయమును లెక్కించునపుడు (60) అరవై విపలములు అనగా 24 సెకెండ్లుగా చెప్పవచ్చును. అటువంటివి పదమూడన్నర పలములు ఒక కళ అని చెప్పవచ్చును.

హేమమాషైః కృతచ్ఛిద్రా చతుర్భిశ్చతురంగులైః ।
మాగధేన ప్రమాణేన జలప్రస్థస్తు స స్మృతః ॥ 8 ॥

నాలుగు అంగుళముల వెడల్పు, లోతూ గలిగిన బంగారు మినపగింజలమూసలతో మగధ దేశపు కొలతలననుసరించి దానిని జలప్రస్థమందురు.

నాడికాభ్యామథ ద్వాభ్యాం ముహూర్తో ద్విజసత్తమాః ।
అహోరాత్రం ముహూర్తాస్తు త్రింశన్మాసో దినైస్తథా ॥ 9 ॥

ఓ బ్రాహ్మణులారా! రెండు నాడికలను ముహూర్తమందురు. ముప్పది ముహూర్తములను ఒక అహోరాత్రము అనగా రోజు అందురు. ముప్పది దినములు ఒక మాసమందురు.

మాసైర్ద్వాదశభిర్వర్షమహోరాత్రం తు తద్దివి ।
త్రిభిర్వర్షశతైర్వర్షం షష్ట్యా చైవాసురద్విషామ్ ॥ 10 ॥

నరులకు 12 మాసములు 1 సంవత్సరం. మానవుల 1 సంవత్సరము దేవతలకు ఒకరోజు. మానవుల 360 సంవత్సరములు రాక్షస శత్రువులైన దేవతలకు ఒక సంవత్సరం అవుతుంది.

తైస్తు ద్వాదశ సాహస్రైశ్చతుర్యుగముదాహృతమ్ ।
చతుర్యుగసహస్రంతు కథ్యతే బ్రహ్మణోదినమ్ ॥ 11 ॥

అటువంటి పన్నెండు వేల సంవత్సరములు నరులకు నాలుగు యుగములు. అటువంటి నాలుగు వేల యుగములు గడిస్తే బ్రహ్మకు ఒక దినము (1200 వేల సం॥ దేవతలకొక యుగము) అనగా మానవులకు వెయ్యిమహాయుగాలు.

స కల్పస్తత్ర మనవశ్చతుర్దశ ద్విజోత్తమాః ।
తదన్తేచైవ భో విప్రా బ్రహ్మనైమిత్తికో లయః ॥ 12 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! కృతత్రేత ద్వాపర కలియుగములు వేయి మారులయిన ఒక కల్పమందురు. పదునాలుగుమంది మనువుల కాలమది. కల్పాన్తమునందు అనగా బ్రహ్మసృష్టి చివరన బ్రహ్మకు నైమిత్తిక లయము కలుగును.

తస్యస్వరూపమత్యుగ్రం ద్విజేన్ద్రా గదతో మమ ।
శృణుధ్వం ప్రాకృతం భూయః తతో వక్ష్యామ్యహం లయమ్ ॥ 13 ॥

ఆ ప్రళయము యొక్క స్వరూపము మిక్కిలి భయంకరమైనది. తిరిగి మరల ప్రాకృతిక ప్రళయమును గూర్చి చెప్పుచున్నాను వినుడు.

చతుర్యుగ సహస్రాంతే క్షీణప్రాయే మహీతలే ।
అనావృష్టిరతీవోగ్రా జాయతే శతవార్షికీ ॥ 14 ॥

నాలుగు యుగములు వేయి మార్లు అయిన పిదప క్షీణప్రాయమైన ఈ భూమియందు నూరుసంవత్సరముల వరకు తీవ్రమైన అనావృష్టి యేర్పడును.

తతో యాన్యల్పసారాణి తాని సత్వాన్యనేకశః ।
క్షయం యాన్తి మునిశ్రేష్ఠాః పార్థివాన్యతిపీడనాత్ ॥ 15 ॥

ఆ తరువాత మిక్కిలి కష్టంవల్ల మునిశ్రేష్ఠులారా! భూమిలోని తక్కువబలం గలిగినటువంటి ప్రాణులన్నియు ఒకేసారి నాశనమును పొందగలవు.

తతః స భగవాన్ కృష్ణో రుద్రరూపధరోఽవ్యయః ।
క్షయాయ యతతే కర్తుమాత్మస్థాః సకలా ప్రజాః ॥ 16 ॥

ఆ తరువాత నాశములేనటువంటి భగవంతుడైన కృష్ణుడు రుద్రరూపమును ధరించి తన లోనున్న సమస్త జీవులను నశింప చేయుటకు యత్నించును.

తతః స భగవాన్విష్ణు ర్భానోః సప్తసు రశ్మిషు ।
స్థితః పిబత్యశేషాణి జలాని మునిసత్తమాః ॥ 17 ॥

ఓ ముని సత్తములారా! ఆతరువాత ఆ భగవంతుడైన విష్ణువు సూర్యుని యొక్క ఏడు కిరణాల్లోచేరి సమస్త జలములను త్రాగును.

పీత్వాఽంభాంసి సమస్తాని ప్రాణిభూతగతాని వై ।
శోషం నయతి భో విప్రాః సమస్తం పృథివీతలమ్ ॥ 18 ॥

ఓ బ్రాహ్మణులారా! సకలప్రాణులయందూ ఉన్న నీటిని పూర్తిగా త్రాగి భూమండలము ఎండిపోవును.

సముద్రాన్ సరితః శైలాన్ శైలప్రస్రవణాని చ ।
పాతాలేషు చ యత్తోయం తత్సర్వం నయతిక్షయమ్ ॥ 19 ॥

సముద్రములను, పర్వతములను, నదులను, కొండలనుండి జారిపడు జలపాతములను, పాతాళములయందు కూడా యున్న నీటినంతటిని (విష్ణువు) నశింప చేయును.

తతస్తస్యాప్యభావేన తోయాహారోపబృంహితాః ।
సహస్రరశ్మయఃసప్త జాయంతే తత్ర భాస్కరాః ॥ 20 ॥

అక్కడ కూడా నీరు లేనందున నీటినే ఆహారముగా స్వీకరించే వేల కిరణాలు గల సూర్యులు ఏడుగురిగా జనింతురు.

అథశ్చోర్ధ్వం చ తే దీప్తాస్తతః సప్తదివాకరాః ।
దహన్త్యశేషం త్రైలోక్యం సపాతాలతలం ద్విజాః ॥ 21 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ తరువాత ఆ ఏడుగురు సూర్యులు క్రింది భాగమున పైభాగమున కూడా మండుచూ భూమినుండి పైనుండు భువర్లోకాది ఏడు లోకములను పాతాళం వరకుండే అధోలోకాలను కలిపి ముల్లోకాల్నీ దహించి వేయుదురు.

దహ్యమానం తు తైర్దీప్తైస్త్రైలోక్యం దీప్తభాస్కరైః ।
సాద్రివృక్షార్ణవాభోగం నిః స్నేహమభిజాయతే ॥ 22 ॥

ఆ విధముగా మండుచున్న సూర్యులచేత పర్వతములు, వృక్షములు, సముద్రములూ, పాతాళం వరకూ దహించబడుచూ, ఏమాత్రం తడి లేకుండా అగును.

తతో నిర్దగ్ధవృక్షాంబు త్రైలోక్యమఖిలం ద్విజాః ।
భవత్యేషా చ వసుధా కూర్మపృష్ఠోపమాకృతిః ॥ 23 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధముగా వృక్షములూ, జలములతో బాటు ముల్లోకమంతయు దహింపబడగా, ఈ భూమి తాబేటి మూపురమును బోలినట్లుగానుండును.

తతః కాలాగ్నిరుద్రోఽసౌ భూతసర్గహరోహరః ।
శేషాహిశ్వాససంతాపాత్పాతాలాని దహత్యధః ॥ 24 ॥

ఆ తరువాత జీవసృష్టి నంతటనీ హరింప చేసే హరుడు ఈ కాలాగ్ని రుద్రుడు ఆదిశేషుని యొక్క శ్వాసతో సంతాపమునొంది క్రింది భాగముననున్న పాతాళాది లోకములను దహించి వేయును.

పాతాళాని సమస్తాని స దగ్ధ్వా జ్వలనో మహాన్ ।
భూమిమభ్యేత్య సకలం దగ్ధ్వా తు వసుధాతలమ్ ॥ 25 ॥

అతడు (హరుడు) గొప్పగా మండుచూ పాతాలాది సమస్తలోకములను దహించి భూమిపైకి వచ్చి ఈ వసుధాతలము నంతటిని దహించును.

భువోలోకం తతః సర్వం స్వర్గలోకం చ దారుణః ।
జ్వాలామాలామహావర్తస్తత్రైవ పరివర్తతే ॥ 26 ॥

అంతరిక్షమూ మరియు స్వర్గలోకమును దారుణమైన జ్వాలలతో కూడి అక్కడే మాలాకారముగా తిరుగును.

అమ్బరీషమివాఽఽభాతి త్రైలోక్యమఖిలం తదా ।
జ్వాలావర్తపరీవారముపక్షీణబలాస్తతః ॥ 27 ॥

అప్పుడా ముల్లోకములు ఒక మూకుడులో వేగినట్లుండును. మంటల మాలలు చుట్టిముట్టినట్లు వారు బలము క్షీణించిన వారగుదురు.

తతస్తాపపరీతాస్తు లోకద్వయనివాసినః ।
హతావకాశా గచ్ఛన్తి మహర్లోకం ద్విజాస్తదా ॥ 28 ॥

ఓ ద్విజులారా! ఆ రెండులోకములలో నివసించువారు ఆ తాపముతో చుట్టుకొనబడినవారై చావగా మిగిలినవారు మహర్లోకము చేరుదురు.

తస్మాదపి మహాతాపతప్తా లోకాస్తతః పరమ్ ।
గచ్ఛన్తి జనలోకం తే దశావృత్యా పరైషిణః ॥ 29 ॥

ఆ తరువాత మహర్లోకమున కంటే కూడా పదింతలు తపించినవారై పరలోకమును చేరుకోవాలనే కోరికతో వారు జనలోకమునకు వెళ్ళెదరు.

తతో దగ్ధ్వా జగత్సర్వం రుద్రరూపీ జనార్దనః ।
ముఖ నిఃశ్వాసజాన్ మేఘాన్ కరోతి మునిసత్తమాః ॥ 30 ॥

ఆ తరువాత రుద్ర రూపమును ధరించిన జనార్దనుడు జగత్తునంతటిని దగ్ధముచేసి ఓ ముని శ్రేష్ఠులారా! ఆ తరువాత నోటిద్వారా నిఃశ్వాసముచే మేఘములను సృష్టించును.

తతో గజకులప్రఖ్యాస్తడిద్వన్తో నినాదినః ।
ఉత్తిష్ఠన్తి తదా వ్యోమ్ని ఘోరాః సంవర్తకా ఘనాః । 31 ॥

ఆ తరువాత గొప్ప ఏనుగుల సమూహముల సదృశముగా మెరుపులతో ఉరుములతో గర్జిస్తూ ఆకాశమునందు సంవర్తనములనే మేఘములు భయంకరముగా లేవగలవు.

కేచిదంజన సంకాశాః కేచిత్కుముదసన్నిభాః ।
ధూమవర్ణా ఘనాః కేచిత్కేచిత్పీతాః పయోధరాః ॥ 32 ॥

కొన్ని మేఘములు నల్లగాను, కొన్ని ఎఱ్ఱని పద్మాలవలెనూ, కొన్ని పొగ రంగులోనూ కొన్ని పసుపు పచ్చని రంగులోనూ

కేచిద్ధరిద్రా వర్ణాభా లాక్షారసనిభాస్తథా ।
కేచిద్వైదూర్యసంకాశా ఇంద్రనీలనిభాస్తథా ॥ 33 ॥

కొన్ని పసుపు వర్ణపు కాంతి కలిగినవి. కొన్ని లత్తుక రాగమువలెనున్నవి. కొన్ని వైడూర్యమువలె ప్రకాశించునవి. మరికొన్ని ఇంద్రనీలమణివలె ప్రకాశించునవి.

శంఖకున్దనిభాశ్చాన్యే జాతీః కున్దనిభాస్తథా ।
ఇన్ద్రగోపనిభాః కేచిన్మనఃశిలానిభాస్తథా ॥ 34 ॥

కొన్ని శంఖములవలె కొండమల్లెలవలె ప్రకాశించునవి, కొన్ని జాజిమల్లెలవలె ప్రకాశించునవి, ఆరుద్ర పురుగువలె ప్రకాశించునవి కొన్ని, మణిశిల లేదా ఎఱ్ఱపాషాణములాగానుండేవి కొన్ని,

పద్మపత్రనిభాః కేచిదుత్తిష్ఠన్తి ఘనాఘనాః ।
కేచిత్పురవరాకారాః కేచిత్పర్వతసన్నిభాః ॥ 35 ॥

పద్మ పత్రముల వలెను కొన్ని, మేఘములు ఆకాశంలో వ్యాపించును. పట్టణాకారములలో కొన్ని, పర్వతముల వలె కొన్నీ యుండును.

కూటాగార నిభాశ్చాన్యే కేచిత్ స్థలనిభాఘనాః ।
మహాకాయా మహారావాః పూరయన్తి నభస్తలమ్ ॥ 36 ॥

కొన్నిమేడ మీది ఇంటి వలెనూ కొన్ని క్రీడా గృహము వలెనూ, మెట్టనేలలవలె కొన్నియూ, గొప్ప శరీరముగలవి కొన్నియూ, గొప్ప శబ్దమును చేయునవి కొన్నియూ మేఘములు ఆకాశమునంతా ఆవరించియుండును.

వర్షన్తస్తే మహాసారాస్తమగ్నిమతిభైరవమ్ ।
శమయన్త్యఖిలం విప్రాస్త్రైలోక్యాన్తరవిస్తృతమ్ ॥ 37 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ మేఘములు మిక్కిలి వర్షిస్తూ ముల్లోకముల లోనూ వ్యాపించినదీ అతిభయంకరమైనదీ అయిన ఆ అగ్నినంతనూ ఆర్పుతాయి.

నష్టే చాగ్నౌ శతం తేఽపి వర్షాణామధికం ఘనాః ।
ప్లావయన్తో జగత్సర్వం వర్షన్తి మునిసత్తమాః ॥ 38 ॥

ఓ ముని శ్రేష్ఠులారా! అగ్ని నశించినప్పటికిని వందల కొలది ఆ మేఘములు వంద సంవత్సరముల వరకు వర్షించి జగత్తునంతటినీ తమ వర్షముతో ముంచెత్తును.

ధారాభిరక్షమాత్రాభిః ప్లావయిత్వాఽఖిలాం భువమ్ ।
భువో లోకం తథైవోర్ధ్వం ప్లావయన్తి దివం ద్విజాః ॥ 39 ॥

ఓ ద్విజులారా! మేఘము బండి ఇరుసంత లావైన జలధారలతో సమస్తభూలోకమును ముంచెత్తుటే కాక స్వర్గమును కూడా తడిపివేసి ముంచును.

అంధకారీ కృతే లోకే నష్టే స్థావరజంగమే ।
వర్షన్తి తే మహామేఘా వర్షాణామధికం శతమ్ ॥ 40 ॥

లోకములన్నియు చీకటి క్రమ్మగా, స్థావర జంగమములన్నియు నశించగా ఆ మహామేఘములు వంద సంవత్సరములకు పైగా వర్షించును.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే సంహారలక్షణకథనం నామ చతుర్వింశాధిక శతతమోఽధ్యాయః ॥ 124 ॥

శ్రీ బ్రహ్మపురాణమునందలి వ్యాస ఋషి సంవాదములోని సంహారలక్షణమను నూట ఇరవై నాల్గవఅధ్యాయము సంపూర్ణం.

పంచవింశాధిక శతతమోఽధ్యాయః - నూట ఇరవైఐదవ అధ్యాయం

ప్రాకృతలయనిరూపణమ్ - ప్రాకృతలయనిరూపణం

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

సప్తర్షిస్థానమాక్రమ్య స్థితేఽమ్భసి ద్విజోత్తమాః ।
ఏకార్ణవం భవత్యేతత్త్రైలోక్యమఖిలం తతః ॥ 1 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! సప్తర్షిమండలము నాక్రమించిన నీటిలో ఆ తరువాత ఈ ముల్లో కములు సమస్తము ఏకార్ణవముగా మారును.

అథ నిఃశ్వాసజో విష్ణోర్వాయుస్తాన్ జలదాంస్తతః ।
నాశం నయతి భో విప్రా వర్షాణామధికం శతమ్ ॥ 2 ॥

ఓ విప్రులారా! ఆ తరువాత విష్ణువు నిఃశ్వాసమునుండి పుట్టిన వాయువు ఆ మేఘములను వంద సంవత్సరాలకంటే ఎక్కువగా నశింపచేయును.

సర్వభూతమయోఽచిన్త్యో భగవాన్ భూతభావనః ।
అనాదిరాదిర్విశ్వస్య పీత్వా వాయుమశేషతః ॥ 3 ॥

సర్వ జీవమయుడైన, చింతించ శక్యముగానివాడైన, భూతభావనుడైన, అనాదియైన విశ్వమున కాది భూతుడైన భగవాన్ శ్రీమన్నారాయణుడు గాలినంతటిని పీల్చివేసి,

ఏకార్ణవే పునస్తస్మిన్ శేషశయ్యాస్థితఃప్రభుః ।
బ్రహ్మరూపధరఃశేతే భగవానాదికృద్ధరిః ॥ 4 ॥

మరల ఆ ఏకార్ణవమునందు ఆ ప్రభువు భగవానుడు సృష్ట్యాదిని సిద్ధము చేయు విష్ణువు విస్తారమైన రూపమును ధరించి ఆదిశేషుని శయ్యగా చేసుకొని పరుండును.

జనలోకగతైః సిద్ధైః సనకాద్యైరభిష్టుతః ।
బ్రహ్మలోక గతైశ్చైవ చిన్త్యమానో ముముక్షుభిః ॥ 5 ॥

జనలోకమునకు సంబంధించిన సనక సనందన సనత్కుమార మున్నగు సిద్ధులతో స్తోత్రము చేయబడి, మోక్షమును గోరే బ్రహ్మలోకగతులైన వారిచే చింతించబడుచు,

ఆత్మ మాయా మయీం యోగనిద్రాం సమాస్థితః ।
ఆత్మానం వాసుదేవాఖ్యం చిన్తయన్ పరమేశ్వరః ॥ 6 ॥

ఆ పరమేశ్వరుడు ఆత్మమాయామయమైన యోగనిద్రలో సమాధి స్థితియందున్నవాడై తనను వాసుదేవునిగా చింతించును.

ఏష నైమిత్తికో నామ విప్రేంద్రాః ప్రతిసంచరః ।
నిమిత్తం తత్ర యచ్ఛేతే బ్రహ్మరూపధరో హరిః ॥ 7 ॥

ఓ బ్రాహ్మణ శ్రేష్ఠులారా! దీనిని నైమిత్తిక ప్రళయమనే పేరుతో పిలుస్తారు. అక్కడ బ్రహ్మరూపధరుడైన హరి ఆ నిమిత్తప్రళయంలో శయనించియుంటాడు.

యదా జాగర్తి సర్వాత్మా స తదా చేష్టతే జగత్ ।
నిమీలత్యేతదఖిలం మాయా శయ్యాశయేఽచ్యుతే ॥ 8 ॥

ఎప్పుడైతే ఈ జగత్తునంతా సృష్టించాలని జాగృతం చెందుతాడో అప్పుడు ఈ సమస్తమూ అచ్యుతుని మాయా శయ్యయందు నిమీలితమగును.

పద్మయోనేర్దినం యత్తు చతుర్యుగసహస్రకమ్ ।
ఏకార్ణవకృతే లోకే తావతీ రాత్రిరుచ్యతే ॥ 9 ॥

వేయి చతుర్యుగములు బ్రహ్మకు పగలు. లోకమునందు ప్రళయ మేర్పడు అంతపరిమితి కాలము రాత్రిగా చెప్పబడును.

తతః ప్రబుద్ధో రాత్ర్యన్తే పునః సృష్టిం కరోత్యజః ।
బ్రహ్మస్వరూప ధృగ్విష్ణుర్యథా వః కథితః పురా ॥ 10 ॥

ఆ తరువాత ఇంతకుముందే చెప్పినట్లుగా ఆ రాత్రి యొక్క చివర కాలమున బ్రహ్మస్వరూపమును ధరించిన అజుడైన విష్ణువులేచి మరల సృష్టిని చేయును.

ఇత్యేష కల్పసంహారో అంతర ప్రలయోద్విజాః ।
నైమిత్తికో వః కథితః శృణుధ్వం ప్రాకృతం పరమ్ ॥ 11 ॥

ఓ బ్రాహ్మణులారా! నైమిత్తికమైన ఆంతర ప్రలయమనే కల్పసంహారమును గూర్చి చెప్పితిని ఇక ప్రాకృతమైన పరమును గూర్చి చెపుతున్నాను వినుడు.

అవృష్ట్యగ్న్యాదిభిః సమ్యక్కృతే శయ్యాలయే ద్విజాః ।
సమస్తేష్వేవ లోకేషు పాతాలేష్వఖిలేషు చ ॥ 12 ॥

ఓ ద్విజులారా! తన శయనాగారంలో ఈ అనావృష్టీ అగ్నిమున్నగు వాటితో పాతాలాది సమస్తలోకముల యందు కూడా ఆ విధంగా జరుగుచుండగా.

మహదాదేర్వికారస్య విశేషాత్తత్ర సంక్షయే ।
కృష్ణేచ్ఛా కారితే తస్మిన్ ప్రవృత్తే ప్రతి సంచరే । 13 ॥

మహత్తత్త్వముల యొక్క విశేషము వలన ప్రళయమునందు నశించిన వాటియందు భగవత్సంకల్పము కలిగి దానిలో ప్రవర్తించగా,

ఆపో గ్రసన్తి వై పూర్వం భూమేర్గంధాదికం గుణమ్ ।
ఆత్తగంధా తతో భూమిః ప్రళయాయ ప్రకల్పతే ॥ 14 ॥

'గంధవతీ పృథివీ' అన్నట్లు భూమి యొక్క గంధాది గుణమును మొదట నీరు గ్రహిస్తుంది ఆతరువాత పోయిన గంధ తన్మాత్ర అయిన భూమి ప్రళయాన్ని కల్పిస్తుంది.

ప్రణష్టే గంధ తన్మాత్రే భవత్యుర్వీ జలాత్మికా ।
ఆపస్తదా ప్రవృత్తాస్తు వేగవత్యో మహాస్వనాః ॥ 15 ॥

గంధతన్మాత్ర నశించగా భూమంతయు జలాత్మికమగును. అప్పుడానీరు గొప్ప శబ్దములను చేస్తూ వేగముగా ప్రవర్తించును.

సర్వమాపూరయన్తీదం తిష్ఠన్తి విచరన్తి చ ।
సలిలేనైవోర్మిమతా లోకాలోకః సమన్తతః ॥ 16 ॥

లోకాలోకమునంతటను నురగలతో కూడుకున్న నీరంతయు అంతటనూ వ్యాపించి ప్రవహించును.

అపామపి గుణో యస్తు జ్యోతిషా పీయతే తు సః ।
నశ్యన్త్యాపః సుతప్తాశ్చ రసతన్మాత్రసంక్షయాత్ ॥ 17 ॥

నీటి యొక్క గుణమైన రసమును సూర్యుడు పీల్చివేయును. రసతన్మాత్ర నశించినందువలన నీరంతయు తప్తమై నశించును.

తతశ్చాఽఽపోఽమృత రసాజ్యోతిష్ట్వం ప్రాప్నువన్తి వై ।
అగ్న్యవస్థే తు సలిలే తేజసా సర్వతో వృతే ॥ 18 ॥

ఆ తరువాత నీటియందు అగ్ని అవస్థ కలుగగా తేజస్సుతో అంతటనూ ఆవరించబడగా అమృత రసములైన నీరు అగ్నిత్వాన్ని పొందగలవు.

స చాగ్నిః సర్వతో వ్యాప్య ఆ దత్తే తజ్జలం తదా ।
సర్వ మాపూరయత్యగ్నిః తదా జగదిదం శనైః ॥ 19 ॥

అప్పుడు ఆ అగ్ని అంతటనూ వ్యాపించి ఆ నీటిని గ్రహించును అన్నింటియందు నారసమును పూరింపగా అవి అగ్నిత్వమును పొందును.

అర్చిర్భిః సంతతే తస్మింస్తిర్య గూర్ధ్వ మధస్తథా ।
జ్యోతిషోఽపి పరం రూపం వాయురత్తి ప్రభాకరమ్ ॥ 20 ॥

మండుతున్న ఆ కిరణములు ఊర్ధ్వ భాగమున, అధోభాగమున తిర్యగ్భాగముల యందంతటను వ్యాపించగా జ్యోతిస్సులయొక్క గొప్ప రూపుడైన ఆ సూర్యుని వాయువు భక్షించును.

ప్రలీనే చ తతస్తస్మిన్ వాయు భూతేఽఖిలాత్మకే ।
ప్రణష్టే రూపతన్మాత్రే కృత రూపో విభావసుః ॥ 21 ॥

ఆ తరువాత వాయు భూతమునందు అఖిలాత్మికమైనది అగ్నిలీనము కాగా, రూపతన్మాత్రమునందు లయంచెందిన (అగ్ని) సూర్యుడు నశించగా,

ప్రశామ్యతి తదా జ్యోతిర్వాయుర్దోధూయతే మహాన్ ।
నిరాలోకే తదా లోకే వాయు సంస్థే చ తేజసి ॥ 22 ॥

అప్పుడు సూర్యగోళములోని అగ్ని శాంతించును. వాయువు తీవ్రముగా వీచును. వాయువుయందు తేజస్సుండుట వలన గాఢాంధకారమేర్పడి లోకములు చీకటి కాగా,

తతః ప్రళయ మాసాద్య వాయుసంభవమాత్మనః ।
ఊర్ధ్వం చ వాయుస్తిర్యక్చ దోధవీతి దిశోదశ ॥ 23 ॥

ఆ తరువాత ప్రళయమేర్పడి అది వాయుసంభవమై పది దిక్కులయందు తీవ్రముగాపైన క్రింద అడ్డముగా వీచుచుండును.

వాయోరపి గుణం స్పర్శమాకాశం గ్రసతే తతః ।
ప్రశామ్యతి తదా వాయుః ఖంతు తిష్ఠత్యనావృతమ్ ॥ 24 ॥

వాయువు యొక్క గుణమైన స్పర్శను ఆకాశము గ్రహించును. ఆ తరువాత వాయువు శాంతించును. ఆ కాశము మాత్రము ఆవరణములులేకుండగా (భూతములు నాలుగు యొక్క) నుండును.

అరూపమరస స్పర్శమగంధవద మూర్తిమత్ ।
సర్వమాపూరయచ్చైవ సుమహత్తత్ప్రకాశతే ॥ 25 ॥

రూపరస గంధస్పర్శ మూర్తులు లేకుండా ఆకాశమనే ఆ మహత్తత్త్వమంతటా వ్యాపించి ప్రకాశించును.

పరిమండలతస్తత్తు ఆకాశం శబ్దలక్షణమ్ ।
శబ్దమాత్రం తథాఽఽకాశం సర్వమావృత్య తిష్ఠతి ॥ 26 ॥

'శబ్దగుణకం ఆకాశం' అని లక్షణము చెప్పినట్లుగా పరిమండలమునందంతటను ఆవరించి కేవలం శబ్దమొక్కటేయున్నట్లుగా నుండును.

తతః శబ్దగుణం తస్య భూతాదిర్గ్రసతే పునః ।
భూతేంద్రియేషు యుగపద్భూతాదౌ సంస్థితేషు వై ॥ 27 ॥

ఆ తరువాత ఆ ఆకాశము యొక్క శబ్దగుణమును మరల భూతాదులను మ్రింగివేయును. భూతేంద్రియములన్నీ భూతాదియందుండగా

అభిమానాత్మకో హ్యేష భూతాదిస్తామసః స్మృతః ।
భూతాదిం గ్రసతే చాపి మహాబుద్ధిర్విచక్షణా ॥ 28 ॥

అభిమానాత్మకమైన దీనిని అనగా భూతాదిని తామసమనియంటారు. విచక్షణగల మహత్తత్త్వము భూతాదినిలయం చేసికోగా

ఉర్వీ మహాంశ్చ జగతః ప్రాన్తేఽన్తర్బాహ్యతస్తథా ।
ఏవం సప్తమహాబుద్ధిః క్రమాత్ప్రకృతయస్తథా ॥ 29 ॥

భూమి, మహత్తు, జగత్తు యొక్క లోపలి భాగము, వెలుపలి భాగములనునవి సప్తమహాబుద్ధి ఇవే క్రమముగా ప్రకృతులగును.

ప్రత్యాహారైస్తు తాః సర్వాః ప్రవిశన్తి పరస్పరమ్ ।
యేనేదమావృతం సర్వమండమప్సు ప్రలీయతే ॥ 30 ॥

ఇవన్నియు పరస్పరముగా ఒకదానిలో ఒకటి లయించి ప్రవేశించును. ఈ విధముగా ఈ మహత్తుచేత చేత ఆవరించబడిన అండమంతా నీటిలో లీనమగును.

సప్తద్వీపసముద్రాన్తం సప్తలోకం సపర్వతమ్ ।
ఉదకావరణంహ్యత్ర జ్యోతిషా పీయతేతు తత్ ॥ 31 ॥

ఏడు ద్వీపలములతో కూడుకున్న సముద్రాంతమును, ఏడు లోకములతో ఏడు పర్వతములతో కూడుకు ఉదకావరణమునంతటిని సూర్యుడు త్రాగివేయును.

జ్యోతిర్వాయౌ లయం యాతి యాత్యాకాశే సమీరణః ।
ఆకాశం చైవ భూతాదిర్గ్రసతే తం తథా మహాన్ ॥ 32 ॥

జ్యోతిస్సు వాయువుయందు లయమగును, వాయువు ఆకాశమునందు లయమగును. ఆకాశము భూతాదియందు లయమగును, భూతాది మహత్తత్త్వమునందు లయమగును.

మహాన్తమేభిస్సహితం ప్రకృతిర్గ్రసతే ద్విజాః ।
గుణసామ్యమనుద్రిక్తమన్యూనం చ ద్విజోత్తమాః ॥ 33 ॥

ఓ ద్విజోత్తములారా! సత్వరజస్తమో గుణాల సామ్యము గలిగిన, ఉద్రిక్తముగాని, న్యూనమునూగాని వీటితో గూడిన భూతాలతో మహత్తత్త్వమును ప్రకృతి గ్రహించును.

ప్రోచ్యతే ప్రకృతిర్హేతుః ప్రధానం కారణం పరమ్ ।
ఇత్యేషా ప్రకృతిః సర్వా వ్యక్తావ్యక్తస్వరూపిణీ ॥ 34 ॥

ఇక్కడ ప్రకృతి ప్రధానమనీ, కారణం అనీ, పర అని చెప్పబడుతున్నది. ఈ ప్రకృతంతయు వ్యక్తావ్యక్త స్వరూపముగలది.

వ్యక్తస్వరూప మవ్యక్తే తస్యాం విప్రాః ప్రలీయతే ।
ఏకః శుద్ధో౽క్షరో నిత్యః సర్వవ్యాపీ తథా పునః ॥ 35 ॥

ఓ విప్రులారా! వ్యక్తస్వరూపమైన ప్రకృతి అవ్యక్తమునందు లీనమగును. అప్పుడది ఒకటిగా శుద్ధముగా, అక్షరమైనదిగా, నిత్యమైనదిగా, సర్వవ్యాపిగానుండును.

సో౽ప్యంశః సర్వభూతస్య ద్విజేంద్రాః పరమాత్మనః ।
నశ్యన్తి సర్వా యత్రాపి నామజాత్యాదికల్పనాః ॥ 36 ॥

ఓ ద్విజ శ్రేష్ఠులారా! అది కూడా సర్వభూత స్వరూపుడైన పరమాత్మ యొక్క ఒక్క అంశ మాత్రమే. ఎక్కడైతే నామజాత్యాది కల్పన చేయబడినవన్నీ నశించి పోతాయో అవన్నియు అంశ స్వరూపము మాత్రమే.

సత్తామాత్రాత్మకే జ్ఞేయే జ్ఞానాత్మన్యాత్మనః పరే ।
స బ్రహ్మ తత్పరం ధామ పరమాత్మా పరేశ్వరః ॥ 37 ॥

జ్ఞానాత్మయందు జీవాత్మకంటే పరమైనటువంటి సత్త అనునది ఏదైతే తెలుసుకొనవలసినది కలదో అదే పరంధామము అతడే పరమాత్మ, అతడే పరేశ్వరుడు అతడే బ్రహ్మ.

సవిష్ణుః సర్వమేవేదం యతో నాఽఽవర్తతే పునః ।
ప్రకృతిర్యా మయాఖ్యాతా వ్యక్తావ్యక్త స్వరూపిణీ ॥ 38 ॥

అతడే ఈ విశ్వమంతా. నేను యే ప్రకృతి వ్యక్తావ్యక్త స్వరూపిణి అని చెప్పానో ఆ ప్రకృతీ. ఎక్కడికి వెళ్ళితే తిరిగి మళ్ళీ రాలేమో ఆ స్థానమే ఇది. అతడే విష్ణువు అందురు.

పురుషశ్చాప్యుభావేతౌ లీయేతే పరమాత్మని ।
పరమాత్మా చ సర్వేషామాధారః పరమేశ్వరః ॥ 39 ॥

పురుషుడు ఇద్దరూ కూడా పరమాత్మయందు లీనమగుదురు. పరమేశ్వరుడైన పరమాత్మయే అన్నింటికీ ఆధారము.

విష్ణునామ్నా స వేదేషు వేదాన్తేషు చ గీయతే ।
ప్రవృత్తం చ నివృత్తం చ ద్వివిధం కర్మవైదికమ్ ॥ 40 ॥

అతడే విష్ణువనే పేరుతో వేదవేదాంతములయందు గానము చేయబడుచున్నాడు. ఇక వైదిక కర్మ ప్రవృత్తమని నివృత్తమని రెండు విధములు.

తాభ్యాముభాభ్యాం పురుషై ర్యజ్ఞమూర్తిః స ఇజ్యతే ।
ఋగ్యజుస్సామభిర్మార్గైః ప్రవృత్తైరిజ్యతే హ్యసౌ ॥ 41 ॥

మానవులతనిని ఆయజ్ఞ మూర్తిని ప్రవృత్త, నివృత్త కర్మలతో యజ్ఞమును చేయుదురు. ప్రవృత్తి కర్మలతో ఋగ్యజుస్సామ వేదమంత్రముల ననుసరించి యజ్ఞమును చేయుదురు.

యజ్ఞేశ్వరో యజ్ఞపుమాన్ పురుషైః పురుషోత్తమః ।
జ్ఞానాత్మా జ్ఞానయోగేన జ్ఞానమూర్తిః స ఇజ్యతే ॥ 42 ॥

మానవులచేత యజ్ఞ పురుషుడు యజ్ఞేశ్వరుడైన పురుషోత్తముడూ, జ్ఞానయోగముచేత జ్ఞానాత్మ జ్ఞాన మూర్తియైనవాడూ యజ్ఞమునందు పూజింపబడుచున్నారు.

నివృత్తైర్యోగమార్గైశ్చ విష్ణుర్ముక్తి ఫలప్రదః ।
హ్రస్వదీర్ఘ ప్లుతైర్యత్తు కించిద్వస్త్వభిధీయతే ॥ 43 ॥

భౌతికవిషయాలనుండి మరలిన విష్ణువు మోక్షఫలితాన్నిస్తాడు. యోగమార్గములైన కర్మలతో హ్రస్వ దీర్ఘప్లుతాలతో కొంచెం అయినా యే వస్తువు చెప్పబడుతున్నదో

యచ్చ వాచామవిషయం తత్సర్వం విష్ణురవ్యయః ।
వ్యక్తః స ఏవమవ్యక్తః స ఏవ పురుషోఽవ్యయః ॥ 44 ॥

యేదైతే వాక్కులకు అందదో విషయముగాదో అదంతా అవ్యయుడైన విష్ణువే. అతడే వ్యక్తమయ్యేవాడు, అతడే అవ్యక్తునిగా నుండువాడు ఆ పురుషుడే అవ్యయుడు.

పరమాత్మా చ విశ్వాత్మా విశ్వరూపధరో హరిః ।
వ్యక్తావ్యక్తాత్మికా తస్మిన్ ప్రకృతిః సా ప్రలీయతే ॥ 45 ॥

విశ్వరూపధరుడైనవాడు, విశ్వాని కంతటికీ ఆత్మఅయినవాడు, పరమాత్మయే శ్రీమన్నారాయణుడు, వ్యక్తావ్యక్త స్వరూపిణి అయిన ఈ ప్రకృతంతయు అతనిలోనే లీనమగును.

పురుషశ్చాపి భో విప్రా యస్తదవ్యాకృతాత్మని ।
ద్విపరార్ధాత్మకః కాలః కథితో యో మయా ద్విజాః ॥ 46 ॥

ఓ విప్రులారా! నేను చెప్పిన ఆద్విపరార్ధాత్మకమైన కాలము ఏదైతే ఉందో అదీ పురుషుడూ ఆ అవ్యాకృతాత్మయందున్నారు.

తదహస్తస్య విప్రేన్ద్రా విష్ణో రీశస్య కథ్యతే ।
వ్యక్తే తు ప్రకృతౌ లీనే ప్రకృత్యాం పురుషే తథా ॥ 47 ॥

ఓ విప్రశ్రేష్ఠులారా! ఆ ఈశుడు అయిన విష్ణువునకు పగటి సమయము చెప్పబడుతున్నది. వ్యక్తము ప్రకృతియందు లీనముకాగా ప్రకృతికూడా పురుషుని యందు లీనంకాగా

తత్రాఽఽస్థితే నిశా తస్య తత్ప్రమాణా తపోధనాః ।
నైవాహస్తస్య చ నిశా నిత్యస్య పరమాత్మనః ॥ 48 ॥

ఓ తపోధనులారా! అక్కడ ప్రకృతి ఉన్నసమయమే రాత్రి కానీ నిత్యుడైన పరమాత్మకు పగలు రాత్రులను నవి లేవు.

ఉపచారాత్తథాప్యేతత్తస్యేశస్య తు కథ్యతే ।
ఇత్యేష మునిశార్దూలాః కథితః ప్రాకృతో లయః ॥ 49 ॥

ఇది కూడా ఆ ప్రభువుకు ఔపచారికముగా చెప్పినదే. ఈ విధముగా ఓ మునులారా! ప్రాకృతిక లయమును చెప్పితిని.

ఇతి శ్రీ బ్రహ్మ పురాణే ప్రాకృతలయ నిరూపణం నామ పంచవింశాధిక శతతమోఽధ్యాయః ॥ 125 ॥

శ్రీ బ్రహ్మపురాణమునందలి ప్రాకృతలయమనే పేరుగల నూటఇరవై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షడ్వింశాధిక శతతమోఽధ్యాయః - నూట ఇరవైఆరవ అధ్యాయం

ఆత్యంతికలయ నిరూపణమ్ - ఆత్యంతికలయ నిరూపణం

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఆధ్యాత్మికాది భో విప్రా జ్ఞాత్వా తాపత్రయం బుధః ।
ఉత్పన్నజ్ఞానవైరాగ్యః ప్రాప్నోత్యాంతికం లయమ్ ॥ 1 ॥

ఓ విప్రులారా! బుద్ధిమంతుడైనవాడు ఆధ్యాత్మికాది తాపత్రయములను తెలుసుకొని జ్ఞానవైరాగ్యములను పొంది సర్వాధికమైన శాశ్వతలయమును పొందును.

ఆధ్యాత్మికోఽపి ద్వివిధః శారీరో మనసస్తథా ।
శారీరో బహుభిర్భేదైర్భిద్యతే శ్రూయతాం చ సః ॥ 2 ॥

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక అను మూడు తాపత్రయములలో ఆధ్యాత్మిక తాపము శారీరికమని మానసికమని రెండు విధములు. వీటిలో శారీరిక తాపము అనేక భేదములతో భిన్న భిన్నములుగా నుండును. ఆ ఆధ్యాత్మికమైన దానిని గూర్చి చెప్పుచున్నాను వినుడు.

శిరోరోగ ప్రతిశ్యాయ జ్వర శూల భగందరైః ।
గుల్మార్శః శ్వయథుశ్వాసచ్ఛర్ద్యాదిభిరనేకధా ॥ 3 ॥

తలనొప్పి, జలుబు, జ్వరము, శూల, భగందరమనే గుద వ్రణము, కడుపులో గడ్డలు, అర్శమొలలు, వాతరోగము శోఫ, ఉబ్బసం, వాంతులు మొదలగువాటితో అనేకవిధాలు.

తథ్యాక్షి రోగాతీసారకుష్ఠాంగామయ సంజ్ఞకైః ।
భిద్యతే దేహజస్తాపో మానసం శ్రోతుమర్హథ ॥ 4 ॥

ఇంకా నేత్రరోగము, అతిసారవ్యాధి, కుష్ఠు, ఆమవాత నొప్పులు మొదలగుపేరులతో శారీరక వ్యాధి అనేకవిధాలైంది. దేహమునందు పుట్టుతాపము, ఇక మానసికమైన తాపమును గూర్చి చెప్పుచున్నాను వినుడు

కామక్రోధ భయద్వేష లోభమోహవిషాదజః ।
శోకాసూయావమానేర్ష్యా మాత్సర్యాభిభవస్తథా ॥ 5 ॥

కామము, క్రోధము, భయము, ద్వేషము, లోభము, మోహము విషాదము వల్ల పుట్టినది, దుఃఖము, అసూయ, అవమానము ఈర్ష్య, మాత్సర్యము, తిరస్కారము మొదలగునవి. ఆ విధంగా

మానసోఽపి ద్విజ శ్రేష్ఠాస్తాపో భవతి నైకధా ।
ఇత్యేవమాదిభిర్భేదైర్భిద్యతే మునిసత్తమాః ॥ 6 ॥

ఓ మునిసత్తములారా! మానసికమైన తాపము అనేక విధములుగా నుండును. ఓ ద్విజ శ్రేష్ఠులారా! ఈ విధముగా భిన్న భిన్నమైనవిగా కూడా నుండును.

మృగపక్షిమనుష్యాద్యైః పిశాచోరగరాక్షసైః ।
సరీసృపాద్యైశ్చ నృణాం జాయతే చాఽఽధిభౌతికః ॥ 7 ॥

మృగములు, పక్షులు, మనుష్యులు, పిశాచములు, ఉరగములు, రాక్షసులు పాములు మున్నగు పాకే జంతువులతోను మానువులకు కలిగే తాపమును ఆధిభౌతిక తాపమందురు.

శీతోష్ణవాత వర్షామ్బు వైద్యుతాది సముద్భవః ।
తాపో ద్విజవరశ్రేష్ఠాః కథ్యతే చాఽఽధిదైవికః ॥ 8 ॥

ఓ ద్విజవరులలో శ్రేష్ఠులారా! శీతము, ఉష్ణము, వర్షపునీరు, మెరుపులేదా విద్యుత్తు వలన కలిగే తాపమును ఆధిదైవిక తాపమందురు.

గర్భ జన్మ జరా జ్ఞాన మృత్యునారకజం తథా ।
దుఃఖం సహస్రశో భేదైర్భిద్యతే మునిసత్తమాః ॥ 9 ॥

ఓ ముని సత్తములారా! గర్భంలోను, పుట్టుకలోను, ముసలితనంలోను జ్ఞానంలోను, మృత్యువులోను, నరకంలోను కలిగే దుఃఖము వేల విధములుగా భిన్న భిన్న రూపములతో నుండును.

సుకుమార తనుర్గర్భే జన్తుర్బహు మలావృతే ।
ఉల్బసంవేష్టితో భగ్న పృష్ఠగ్రీవాస్థి సంహతిః ॥ 10 ॥

గర్భంలో ఉన్నప్పుడు సుకుమారమైన ఆ జీవుడు గర్భపిండము జరాయువుతో చుట్టబడి పృష్ఠము, గ్రీవము, అస్థులు భగ్నమైపోయినవాడై

అత్యామ్ల కటు తీక్ష్ణోష్ణలవణైర్మాతృ భోజనైః ।
అతితాపిభిరత్యర్థం బాధ్యమానోఽతివేదనః ॥ 11 ॥

గర్భముతోనున్నపుడు తల్లి తినే భోజనంలో మిక్కిలి పులుపు కారం, చేదు, వేడి, ఉప్పు కలిగియుండుట వలన, మిక్కిలి తాపంతో బాధ పెట్టబడి వేదన ననుభవించు ఆ శిశువు తల్లి గర్భంలో,

ప్రసారణాకుంచనాదౌ నాంగానాం ప్రభురాత్మనః ।
శకృన్మూత్రమహా పంకశాయీ సర్వత్ర పీడితః ॥ 12 ॥

తన శరీరావయవములకు తాను అధికారి కానట్లుగా చాచుటకుగాని ముడుచుకొనుటకు గాని వీలు పడక, మూత్ర పురీషములనే బురదలో కూరుకుని పోయి పరుండి అంతటా పీడింపబడుచు,

నిరుచ్ఛ్వాసః సచైతన్యః స్మరన్ జన్మశతాన్యథ ।
ఆస్తే గర్భేఽతి దుఃఖేన నిజకర్మనిబంధనః ॥ 13 ॥

చైతన్యముండి కూడా గాలిని పీల్చుకోలేక తాను పొందిన వందల కొలది జన్మలను స్మరించుకుంటూ, తాను చేసిన కర్మలకు తానే బందీ అయి మిక్కిలి దుఃఖమును అనుభవిస్తూ గర్భము నందుండును.

జాయమానః పురీషాసృక్ మూత్రశుక్రా విలాననః ।
ప్రాజాపత్యేన వాతేన పీడ్యమానాస్థి బంధనః ॥ 14 ॥

జన్మించబోవు శిశువు మలమూత్ర పురీష శుక్రములలో ఆడుగొట్టె ముఖముగలవాడై, ప్రాజాపత్యమనే గాలిచేత పీడింపబడుచున్న ఎముకల గూడు కలవాడై,

అధోముఖస్తైః క్రియతే ప్రబలైః సూతి మారుతైః ।
క్లేశైర్నిష్క్రాన్తి మాప్నోతి జఠరాత్ మాతురాతురః ॥ 15 ॥

అధోముఖముగా గలిగిన మిక్కిలి బలము గలగినటువంటి సూతికా వాయువులతో క్లేశముగలగినవాడై అవి తలక్రిందులుగా చేయగా త్వరపడి తల్లి గర్భమునుండి బయట పడును.

మూర్ఛామవాప్య మహతీం సంస్పృష్టో బాహ్యవాయునా ।
విజ్ఞాన భ్రంశమాప్నోతి జాతశ్చ మునిసత్తమాః ॥ 16 ॥

ఓ ముని శ్రేష్ఠులారా! బాహ్యవాయువు సోకగా గొప్పమూర్ఛను పొందినవాడై పుట్టిన తరువాత విజ్ఞానం పోయినవాడగును.

కంటకైరివ తున్నాంగః క్రకచైరివదారితః ।
పూతివ్రణాన్నిపతితో ధరణ్యాం కృమికో యథా ॥ 17 ॥

ముళ్లచేత గుచ్చబడిన అవయవములతో, రంపంతో కోయబడినట్లు దుర్గంధ భూయిష్ఠమైన వ్రణమునుండి భూమిమీద పడిన కీటకమువలె నుండును.

కండూయనేఽపి చాశక్తః పరివర్తేఽప్యనీశ్వరః ।
స్తనపానాదికాహార మవాప్నోతి పరేచ్ఛయా ॥ 18 ॥

తనకు తాను గోకుకోవడంలోను అశక్తుడై ప్రక్కకు తిరుగుటకు కూడా స్వతంత్రత లేక ఇతరుల ఇచ్ఛాను సారము మాత్రమే స్తన పానాది ఆహారమును పొందగలడు.

అశుచి స్స్రస్తరే సుప్తః కీటదంశాదిభిస్తథా ।
భక్ష్యమాణోఽపి నైవేషాం సమర్థో వినివారణే ॥ 19 ॥

అశుచి అయిన ప్రక్కలో నిద్రిస్తూ కీటకములు కరుస్తున్నా అవి తనను తింటున్నా కూడా వాటిని నివారించుటలో అసమర్థునిగా ఉండును.

జన్మదుఃఖాన్యనేకాని జననోఽనన్తరాణి చ ।
బాల భావేయదాప్నోతి ఆధిభూతాధికాని చ ॥ 20 ॥

బాల భావమునందు ఆధిభౌతికములైన వాటిని, అనేకములైన జన్మ దుఃఖములను, జననానన్తర దుఃఖములను పొందగలడు.

అజ్ఞానతమసా ఛిన్నో మూఢాన్తః కరణో నరః ।
న జానాతి కుతః కోఽహం కుత్ర గన్తా కిమాత్మకః ॥ 21 ॥

మూఢాన్తఃకరణము గల ఈ నరుడు అజ్ఞానమనే చీకటితో ఛిన్నమై పోయి తానెక్కడినుండి వచ్చినాడో, తానెవరో, తాను ఎక్కడికి చేరవలయునో తన కాత్మ ఎవరో తెలుసుకొనజాలదు.

కేన బంధేన బద్ధోఽహం కారణం కిమకారణమ్ ।
కిం కార్యం కిమ కార్యం వా కిం వాచ్యం కిం న చోచ్యతే ॥ 22 ॥

తాను ఏ బంధం చేత ఇట్లు కట్టుబడియున్నాడో దానికి గల కారణాకారణములేమిటో తానేం చేయాలో చేయకూడదో తానేంమాట్లాడాలో మాట్లాడ కూడదో,

కో ధర్మః కశ్చ వాఽధర్మః కస్మిన్ వర్తేత వై కథమ్ ।
కిం కర్తవ్యమకర్తవ్యం కిం వా కిం గుణదోషవత్ ॥ 23 ॥

ఏదిధర్మము? ఏదధర్మము? దేనియందెట్లు ప్రవర్తించవలయును. కర్తవ్యా కర్తవ్యములేవి? గుణదోషములేవి? అనితెలియక

ఏవం పశుసమైర్మూఢైరజ్ఞానప్రభవం మహత్ ।
అవాప్యతే నరైర్దుఃఖం శిశ్నోదరపరాయణైః ॥ 24 ॥

కేవల ఆహారాన్ని తినడం కామాన్ని అనుభవించడం అనే పశుసమానమైన గుణములు గలమూఢులు అజ్ఞానము చేత కలిగిన గొప్పదుఃఖమును పొందుదురు.

అజ్ఞానం తమసోభావః కార్యారంభ ప్రవృత్తయః ।
అజ్ఞానినాం ప్రవర్తన్తే కర్మలోపస్తతో ద్విజాః ॥ 25 ॥

ఓ ద్విజులారా! అజ్ఞానము అనునది తమస్సుయొక్క భావము. కార్యమును ప్రారంభించు సమయమునందు అజ్ఞానులయందు ఏ ఏ ప్రవృత్తులు ఏర్పడునో అప్పుడు కర్మలోపము జరుగును.

నరకం కర్మణాం లోపాత్ఫల మాహుర్మహర్షయః ।
తస్మా దజ్ఞానినాం దుఃఖమిహ చాముత్ర చోత్తమమ్ ॥ 26 ॥

కర్మలోపములకు ఫలమునరకమని మహర్షులు చెప్పుదురు. అందువలన అజ్ఞానులకు ఈ లోకములోనూ పైలోకములోను గొప్ప దుఃఖము సంభవించును.

జరా జర్జర దేహశ్చ శిథిలావయవః పుమాన్ ।
విచలచ్ఛీర్ణ దశనో బలిస్నాయు శిరావృతః ॥ 27 ॥

ముసలితనంతో దేహం వంగిపోయి అవయవములన్నియు శిథిలమైపోయి, దంతములు కదులుతూ శీర్ణములైపోయి బలిస్నాయు శిరావృతమైయుండును.

దూర ప్రణష్టనయనో వ్యోమాన్తర్గత తారకః ।
నాసా వివర నిర్యాత రోమ పుంజశ్చలద్వపుః ॥ 28 ॥

దూరపుచూపును చూడలేని కన్నులు, ఆకాశమునందు శూన్యములాగా ఉన్న కంటి పూవుగలిగి, ముక్కు పుటాల్లో వెంట్రుకలు పెరిగి వణుకుచున్న శరీరము కలవాడై,

ప్రకటీభూత సర్వాస్థిర్నత పృష్ఠాస్థి సంహితః ।
ఉత్పన్న జఠరాగ్నిత్వాదల్పాహారోఽల్పచేష్టితః ॥ 29 ॥

పైకి ఎముకలు తేలినవాడై, వెన్నెముక వంగి పోయినవాడై జఠరాగ్ని శక్తితగ్గుటచేత తక్కువ ఆహారమును స్వీకరిస్తూ తక్కువ కదలిక కల్గినవాడై,

కృచ్ఛ్ర చంక్రమణోత్థాన శయనాసనచేష్టితః ।
మన్దీభవచ్ఛ్రోత్రనేత్ర గలల్లాలవిలాననః ॥ 30 ॥

కదులుటకు, లేచుటకు, పడుకొనుటకు, కూర్చొనుటకు మిక్కిలి అవస్థ పడుతూ చెవులు వినపడక, కళ్ళుకనబడక గొంతులోనుండి మాట రాక ముఖమంతా కంది పోయి, చొల్లుగారుతూ అసహ్యామైపోయి,

అనాయత్తైః సమస్తైశ్చ కరణైర్మరణోన్ముఖః ।
తత్క్షణేఽప్యనుభూతానా మస్మర్తాఽఖిలవస్తునామ్ ॥ 31 ॥

శరీర సాధనములైన అవయవములన్నియు కుంటుపడి మరణానికి సిద్ధపడి, ఆక్షణమునందు కూడా అనుభవించిన సమస్తవస్తువుల యొక్క స్మృతిని కోల్పోయినవాడై,

సకృదుచ్చారితే వాక్యే సముద్భూత మహాశ్రమః ।
శ్వాస కాసామయాయాస సముద్భూత ప్రజాగరః ॥ 32 ॥

ఒక్క మాట నుచ్చరించుట కెంతో శ్రమపడుతూ, శ్వాస పీల్చుకోలేక దగ్గు ఆయాసము గలిగి నిద్రలేమితో,

అన్యేనోత్థాప్యతేఽన్యేన తథా సంవేశ్యతే జరీ ।
భృత్యాత్మ పుత్ర దారాణామపమాన పరాకృతః ॥ 33 ॥

ఒకరిచేత లేపబడుతూ, మరొకరిచేత పడుకోబెట్టబడుతూ ముసలితనంలో తన భార్యాబిడ్డలతో సేవకులతో మిక్కిలి అవమానించబడుచు,

ప్రక్షీణాఖిల శౌచశ్చ విహారాహార సంస్పృహః ।
హాస్యః పరిజనస్యాపి నిర్విణ్ణాశేష బాంధవః ॥ 34 ॥

మలమూత్రాది విసర్జన కష్టమౌతుంది అయినా ఆహార విహారముల పట్ల ఎంతో లాలసతో నుంటాడు. అతని పరిజనమంతా అవహేళన చేస్తుంటారు. బంధువులందరు అతనియందు విరక్తిని ప్రదర్శిస్తారు.

అనుభూతమివాన్యస్మిన్ జన్మన్యాత్మ విచేష్టితమ్ ।
సంస్మరన్ యౌవనే దీర్ఘం నిశ్వసిత్యతి తాపితః ॥ 35 ॥

తానిదివరకటి జన్మలలో చేసిన వాటిని, యౌవనవయస్సులో నున్నపుడు ప్రవర్తించినతీరును తలుచుకొని మిక్కిలి తపించిపోయి దీర్ఘముగా నిట్టూర్చును.

ఏవమాదీని దుఃఖాని జరాయామనుభూయ చ ।
మరణే యాని దుఃఖాని ప్రాప్నోతి శృణుతాన్యపి ॥ 36 ॥

ఈ విధముగా వృద్ధావస్థలో అనేక దుఃఖములననుభవించును. ఇక మరణసమయమునందెటువంటి దుఃఖములను పొందునో చెప్పుచున్నాను వినుము.

శ్లథగ్రీవాంఘ్రిహస్తోఽథ ప్రాప్తో వేపథునా నరః ।
ముహుర్గ్లాని పరశ్చాసౌ ముహుర్జ్ఞాన బలాన్వితః ॥ 37 ॥

మృత్యు కాలమునందు మానవుని కంఠము, కాళ్ళు చేతులు శిథిలమైపోతాయి. అతని శరీరం వణుకుతుంది. మాటిమాటికి మూర్ఛపోతాడు. అప్పుడప్పుడు కొంచెం చైతన్యం పొందుతాడు.

హిరణ్యధాన్యతనయభార్యాభృత్యగృహాదిషు ।
ఏతే కథం భవిష్యన్తీత్యతీవ మమతాకులః ॥ 38 ॥

ఆ చైతన్యం పొందిన కొద్ది సమయంలో తానుసంపాదించిన బంగారము, ధాన్యము, సంతానము, భార్య, సేవకులుమరియు ఇంటిని గూర్చి వాటియందలి మమతను వదల లేక మిక్కిలి వ్యాకుల పడుతు అయ్యో! నేను లేకుండా ఇవన్నీ ఏమయి పోతాయో అని చింతిస్తాడు.

మర్మవిద్భిర్మహారోగైః క్రకచైరివ దారుణైః ।
శరైరివాన్తకస్యోగ్రైశ్ఛిద్యమానాస్థిబంధనః ॥ 39 ॥

మహా గుప్తరోగములతో, దారుణమైన క్రకచములతో యముని యొక్క ఉగ్రమైన బాణపరంపరలతోవలె అతని శరీరాస్థి బంధనములన్నింటిని త్రుంచబడినవాడై,

పరివర్తమానతారాక్షి హస్తపాదం ముహుః క్షిపన్ ।
సంశుష్యమాణ తాల్వోష్ఠ కంఠో ఘురఘురాయతే ॥ 40 ॥

అతని కళ్లలో కనుగ్రుడ్లు తిరుగుతుంటాయి, కాళ్ళుచేతులు కటకటలాడుతాయి, పెదవులు దవడలు ఎండుకు పోయి కంఠము జీరబోయి గురుగురుశబ్దం చేస్తుంది.

నిరుద్ధ కంఠదేశోఽపి ఉదాన శ్వాసపీడితః ।
తాపేన మహతా వ్యాప్తస్తృషార్తశ్చ క్షుధాతురః ॥ 41 ॥

ఉదాన వాయువుచే పీడింపబడి కంఠము బుద్ధమౌతుంది. ఆ అవస్థలో కూడా మిక్కిలి తాపముతో ఆకలి దప్పులతో పీడింపబడుతాడు.

క్లేశాదుత్క్రాన్తిమాప్నోతి యామ్యకింకర పీడితః ।
తతశ్చ యాతనా దేహం క్లేశేన ప్రతిపద్యతే ॥ 42 ॥

యమ దూతలు పెట్టె బాధలను సహిస్తూ మిక్కిలి కష్టంతో ప్రాణాన్ని వదులుతాడు. ఆ తరువాత ఆక్లేశంతోనే అతనికి యాతనా దేహం లభిస్తుంది.

ఏతాన్యన్యాని చోగ్రాణి దుఃఖాని మరణే నృణామ్ ।
శృణుధ్వం నరకే యాని ప్రాప్యన్తే పురుషైర్మృతైః ॥ 43 ॥

మానవులకు మరణమునందు నరకంలో ఎటువంటి భయంకరమైన దుఃఖములు కలుగునో చెప్పుచున్నాను వినుడు.

యామ్య కింకర పాశాది గ్రహణం దండతాడనమ్ ।
యమస్య దర్శనం చోగ్ర ముగ్రమార్గివిలోకనమ్ ॥44 ॥

యమకింకరులు పాశములతో లాగుట, కఱ్ఱలతో కొట్టుట, భయంకరమైన మార్గమును చూచుట, యముని యొక్క భయంకరమైన రూపమును దర్శించుట.

కరమ్భువాలుకా వహ్నియన్త్ర శస్త్రాది భీషణే ।
ప్రత్యేకం యాతనాయాశ్చ యాతనాది ద్విజోత్తమాః ॥ 45 ॥

ఓ ద్విజ శ్రేష్ఠులారా! పెరుగుతో కలిపిన పేలపిండివంటి కాలిన ఇసుకతోను అగ్నియంత్రములతోను, శస్త్రములతోను యాతనా శరీరమును ప్రత్యేకముగా యాతనతో హింసించెదరు.

క్రకచైః పీడ్యమానానాం మూషాయాంచాపి ధ్మాప్యతామ్ ।
కుఠారైః పాట్యమానానాం భూమోచాపి నిఖన్యతామ్ ॥ 46 ॥

క్రకచములతో పీడిస్తూ, మూసల్లో పెట్టి ఊదుతూ, గొడ్డళ్లతో చీరుతూ, భూమిలో పెట్టి త్రవ్వుతూ,

శూలేష్వారోప్యమాణానాం వ్యాఘ్ర వక్త్రే ప్రవేశ్యతామ్ ।
గృధ్రైః సంభక్ష్యమాణానాం ద్వీపిభిశ్చోపభుజ్యతామ్ ॥ 47 ॥

శూలములపైకెక్కించుచు, పులినోట్లోకి ప్రవేశపెడ్తూ, గ్రద్దల చేత, చిరుతల చేత తినిపించబడుతూ, లేదా ద్వీపములలోనుండే క్రూర జంతువుల చేత కరిపిస్తూ,

క్వథ్యతాం తైలమధ్యే చ క్లిద్యతాం క్షార కర్దమే ।
ఉచ్చాన్నిపాత్య మానానాం క్షిప్యతాం క్షేపయంత్రకైః ॥ 48 ॥

నూనెలో వేగించుచు, ఉప్పుపాతర వేస్తూ, పైనుండి క్రిందికి పడవేస్తూ, గోఫనయంత్రముల ద్వారా దూరముగా చిమ్ముతూ,

నరకే యాని దుఃఖాని పాపహేతూద్భవాని వై ।
ప్రాప్యన్తే నారకైర్విప్రాస్తేషాం సంఖ్యా న విద్యతే ॥ 49 ॥

పాపహేతువువలన కలిగేవి ఎన్ని దుఃఖములున్నాయో అవన్నియు నరకమునందు పొందగలరు. ఓ బ్రాహ్మణులారా! ఆ దుఃఖముల సంఖ్య ఇన్ని అని చెప్పుటకు వీలుకాదు. వాటి సంఖ్య అనంతములు.

న కేవలం ద్విజశ్రేష్ఠా నరకే దుఃఖ పద్ధతిః ।
స్వర్గేఽపి పాపభీతస్య క్షయిష్ణోర్నాస్తి నిర్వృతిః ॥ 50 ॥

ఓ ద్విజ శ్రేష్ఠులారా! కేవలము నరకమునందే ఈ దుఃఖ పరంపర ఉందని కాదు స్వర్గమునందు కూడా పుణ్యం అయినకొద్దీ క్రిందకు భూమిపైన పడిపోతాననే భయానికి అంతులేదు. వానికి వాని పుణ్యము క్షీణిస్తున్న కొలది అతడు పాపభీతితో భయపడును. అతనికి శాంతిలేదు.

పునశ్చ గర్భోభవతి జాయతే చ పునర్నరః ।
గర్భే విలీయతే భూయో జాయమానోఽస్తమేతి చ ॥ 51 ॥

జీవుడు మాటి మాటికి గర్భంలో ప్రవేశిస్తాడు, మాటి మాటికి జన్మిస్తాడు. ఒక్కోసారి గర్భంలోనే మృతిచెందుతాడు తిరిగి మళ్ళీ జన్మిస్తాడు ఒక్కోసారి జన్మించే సమయంలోనే మరణిస్తాడు.

జాతమాత్రశ్చ మ్రియతే బాలభావే చ యౌవనే ।
యద్యత్ప్రీతికరం పుంసాం వస్తువిప్రాః ప్రజాయతే ॥ 52 ॥

ఒక్కోసారి పుట్టగానే మరణిస్తాడు. ఒక్కసారి బాల్యంలోను ఒక్కసారి యౌవన వయస్సులోను మరణిస్తాడు. ఓ విప్రులారా! మానవులకేది ప్రీతికరమైన వస్తువో దానికొరకు తిరిగి జన్మిస్తాడు.

తదేవ దుఃఖవృక్షస్య బీజత్వముపగచ్ఛతి ।
కళత్రపుత్రమిత్రాది గృహ క్షేత్ర ధనాదికైః । 53 ॥

ఆ ప్రీతియే దుఃఖమనే వృక్షమునకు బీజముకాగలదు. భార్యా పుత్రులు స్నేహితులు ఇళ్లు, భూములు, ధనము మున్నగువాటితో

క్రియతే న తథా భూరి సుఖం పుంసాం యథాఽసుఖమ్ ।
ఇతి సంసార దుఃఖార్క తాపతాపితచేతసామ్ ॥ 54 ॥

మానవులకు అంతగా సుఖము కలుగదు. పైగా అంతకంతకు దుఃఖము మాత్రమే వాటివల్ల కలుగును. ఈ సంసారమనే సూర్యునితాపము వల్ల సంతప్తచిత్తులయిన మానవులకు,

విముక్తిపాదపచ్ఛాయా మృతే కుత్ర సుఖం నృణామ్ ।
తదస్య త్రివిధస్యాపి దుఃఖజాతస్య పండితైః ॥ 55 ॥

మోక్ష రూపమైన వృక్షము యొక్క శీతల ఛాయ తప్ప వేరొక చోట సుఖమెక్కడిది? దానికి మూడు విధములైన దుఃఖములననుభవించుటకై పుట్టేవారిని గూర్చి పండితులిలా అంటారు.

గర్భజన్మజరాద్యేషు స్థానేషు ప్రభవిష్యతః ।
నిరస్తాతిశయాహ్లాదం సుఖభావైకలక్షణమ్ ॥ 56 ॥

గర్భంలో పడుట, జన్మించుట, ముసలి తనమునొందుట అనెడి స్థానములలో కలిగే ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధిదైవికములనే మూడు విధములైన దుఃఖ సమూహములను దూరము చేయిటకై నిరస్తాతి శయాహ్లాద రూపమైన సుఖభావప్రాప్తి కలుగుటకు లక్షణముగా,

భేషజం భగవత్ప్రాప్తిరేకా చాౖ ఉ త్యన్తికీ మతా ।
తస్మాత్తత్ప్రాప్తయే యత్నః కర్తవ్యః పండితైర్నరైః ॥ 57 ॥

భగవత్ప్రాప్తియే అమోఘమైన ఔషధమని తెల్పినారు. కావున పండితులైన మానవులు దానిని పొందుటకు యత్నించవలయును.

తత్ప్రాప్తిహేతు ర్జ్ఞానం చ కర్మ చోక్తం ద్విజోత్తమాః ।
ఆగమోత్థం వివేకాచ్చ ద్విధా జ్ఞానం తథోచ్యతే ॥ 58 ॥

ఓ ద్విజోత్తములారా! అది పొందుటకు జ్ఞానము కర్మ అను రెండు హేతువులు ఆ విధముగా భగవత్ప్రాప్తిని పొందుటకు హేతువైన జ్ఞాన మనునది కూడా రెండు విధములు అవి శాస్త్రజన్యము, వివేకజన్యము అని.

శబ్ద బ్రహ్మౌ ఉ గమమయం పరం బ్రహ్మ వివేకజమ్ ।
అన్ధం తమ ఇవాజ్ఞానం దీపవచ్చేన్ద్రియోద్భవమ్ ॥ 59 ॥

ఆగమమయమైన శాస్త్రజన్యమైన జ్ఞానము శబ్ద బ్రహ్మస్వరూపము గాను, వివేకజన్యమైన జ్ఞానము పరబ్రహ్మ స్వరూపముగాను తెలుసుకొనవలయును. అజ్ఞాన మనునది గాఢమైన అంధకారము వంటిది. దాన్ని తీసివేసేది ఇంద్రియోద్భవమైన దీపమువంటిది శాస్త్ర జన్యమైన జ్ఞానము.

యథా సూర్యస్తథా జ్ఞానం యద్వై విప్రా వివేకజమ్ ।
మనురప్యాహ వేదార్థం స్మృత్వా యన్మునిసత్తమాః ॥ 60 ॥

ఓ విప్రులారా! ఆ అంధకారమును తీసివేసినట్లే, వివేక జన్యమైన జ్ఞానము సాక్షాత్ సూర్యునిగా తెలుసు కొనవలయును. మనువు ఏ విధముగానైతే వేదార్థమును స్మరించి ఈ విషయంలో తన అభిప్రాయాన్ని తెలిపినాడో దానిని గూర్చి మీకు వివరిస్తాను వినుడు.

తదేతచ్ఛ్రూయతామత్ర సంబంధే గదతో మమ ।
ద్వే బ్రహ్మణీ వేదితవ్యే శబ్ద బ్రహ్మపరం చ యత్ ॥ 61 ॥

బ్రహ్మయొక్క స్వరూపములు రెండని తెలుసుకొనవలయును. దానిలో నొకటి శబ్దబ్రహ్మ రెండవది పరబ్రహ్మ వాటి రెంటికిగల సంబంధ మేమిటో చెప్పుచున్నాను వినుడు.

శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరం బ్రహ్మాధిగచ్ఛతి ।
ద్వే విద్యే వై వేదితవ్యే ఇతి చాఽఽథర్వణీశ్రుతిః ॥ 62 ॥

ఎవరైతే శబ్దబ్రహ్మలో పారంగతుడౌతాడో అతడు పరబ్రహ్మను పొందగలడు. ఇది తెలుసుకొనుటకు పరా–అపరా అను రెండు విద్యలను తెలుసుకొనవలయునని అథర్వణవేదము చెప్పుచున్నది.

పరయా హ్యక్షర ప్రాప్తిః ఋగ్వేదాదిమయాఽపరా ।
యత్తదవ్యక్తమజరమచిన్త్యమజమవ్యయమ్ ॥ 63 ॥

పరా విద్యతో అక్షర బ్రహ్మ ప్రాప్తి కలుగుతుంది. ఋగ్వేదాది శాస్త్రమే అపరా విద్యా అంటారు. ఏదైతే అవ్యక్తము, అజరము, అచిన్త్యము, అజము, అవ్యయము,

అనిర్దేశ్యమరూపం చ పాణి పాదాద్యసంయుతమ్ ।
విత్తం సర్వగతం నిత్యం భూతయోనిమకారణమ్ ॥ 64 ॥

అనిర్దేశ్యము, రూపరహితము, హస్తపాదాది రహితము, అన్నింటియందు వ్యాపించియున్నది, నిత్యమైనది, భూతములన్నింటికి కారణమైనదేదో, అట్లే స్వయముగా కారణరహితమైనదో,

వ్యాప్యం వ్యాప్తం యతః సర్వం తద్వై పశ్యన్తి సూరయః ।
తద్బ్రహ్మ తత్పరం ధామ తద్ధ్యేయం మోక్షకాంక్షిభిః ॥ 65 ॥

దేని వల్లనైతే వాప్యమైన సమస్తమైన నివాంసించబడినదో, దేనినైతే జ్ఞానులైన వారు జ్ఞాన దృష్టితో దర్శిస్తారో, అదే పరబ్రహ్మ అదే పరంధామము మోక్షమును కోరేవారు ధ్యానము చేయవలసినదదే.

శ్రుతి వాక్యోదితం సూక్ష్మం తద్విష్ణోః పరమం పదమ్ ।
ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ॥ 66 ॥

వేద వాక్యములచే చెప్పబడినది, సూక్ష్మమైనది, సమస్త జీవోత్పత్తికి, ప్రళయమునకు, జీవుల గమనమునకు, జీవులు చేరవలసినది అదే విష్ణువు యొక్క పరమపదము.

వేత్తి విద్యా మవిద్యాం చ స వాచ్యో భగవానితి ।
జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజాంస్యశేషతః ॥ 67 ॥

ప్రపంచం పుట్టుకను, ప్రళయాన్ని భూతములయొక్క రాకని పోకని విద్యని అవిద్యని తెలిసినవాడు భగవన్తుడు. జ్ఞానశక్తి బల ఐశ్వర్యవీర్య తేజస్సు అనే ఆరు భగశబ్దంతో చెప్పబడువాడు భగవన్తుడు.

భగవచ్ఛబ్ద వాచ్యాని వినా హేయైర్గుణాదిభిః ।
సర్వాణి తత్ర భూతాని నివసన్తి పరాత్మని ॥ 68 ॥

పైవి 'భగవత్' అను శబ్దమునకు వాచ్యార్థములు. హేయ గుణాదులు ఏవీ లేకుండా సమస్త భూతములన్నియును పరమాత్మయందే నివసించును. అతడే శ్రీమన్నారాయణుడు.

భూతేషు చ స సర్వాత్మా వాసుదేవస్తతః స్మృతః ।
ఉవాచేదం మహర్షిభ్యః పురా పృష్టః ప్రజాపతిః ॥ 69 ॥

అతడే సమస్త భూతములయందు ఆత్మ స్వరూపునిగానుండువాడు. అతనినే ఆ తరువాత వాసుదేవుడని తలచిరి. పూర్వము బ్రహ్మను మహర్షులడుగగా ఆయనే స్వయముగా అనంత భగవానుడు వాసుదేవుడని చెప్పెను.

నామవ్యాఖ్యామనన్తస్య వాసుదేవస్య తత్త్వతః ।
భూతేషు వసతే యోఽన్తర్వసన్త్యత్ర చ తాని యత్ ॥
ధాతా విధాతా జగతాం వాసుదేవస్తతః ప్రభుః ॥ 70 ॥

అనన్తవాసుదేవుడనే పేరునకు వ్యాఖ్యానము చేయుచు అతని తత్త్వమునీ విధముగా వివేచించినారు. సమస్త భూతములందు వసించువాడు ఎవడో, ఎవనియందు సమస్త భూతములు వసించునో, ఈ జగత్తున కంతటికిని ధాత, విధాత అయిన వాడెవడో! ఆ ప్రభువైన శ్రీమన్నారాయణుడే వాసుదేవుడు.

స సర్వభూత ప్రకృతిర్గుణాంశ్చ దోషాంశ్చ సర్వాన్సగుణో హ్యతీతః ।
అతీతసర్వావరణోఽఖిలాత్మా తేనాఽఽవృతం యద్భువనాన్తరాలమ్ ॥ 71 ॥

అతడే సమస్త భూతములకు ప్రకృతి అయినవాడు. గుణములకు దోషములన్నింటికి అతడే సగుణస్వరూపుడు. అతడే అన్నిగుణములకు అతీతుడైనవాడు. అతడే నిర్గుణస్వరూపుడు. అన్ని ఆవరణములకతడు అతీతుడు. సమస్త జీవులకతడే ఆత్మ. ఈ సమస్త భువనాంతరాళములలో అంతటా అతనే ఆవరించియున్నాడు.

సమస్తకల్యాణగుణాత్మకో హి స్వశక్తిలేశాద్ధృతభూతసర్గః ।
ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహః సంసాధితాశేషజగద్ధితోఽసౌ ॥ 72 ॥

సమస్త కల్యాణ గుణములు అతని స్వరూపమే. ఆయనే తన శక్తిలోని లేశమాత్రము చేతనే సమస్త జీవులను సృష్టించెను. ఆయన తన ఇచ్ఛా శక్తిచేతనే తనకిష్టమైన దేహమును ధరించువాడు. తానే ఈ జగత్తునంతటికినీ అశేషమైన హితమును కలిగించువాడు.

తేజోబలైశ్వర్య మహావరోధః స్వ వీర్య శక్త్యాదిగుణైకరాశిః ।
పరః పరాణాం సకలా న యత్ర క్లేశాదయః సన్తి పరాపరేశే ॥ 73 ॥

ఆయనే తన తేజోబలైశ్వర్యములకు స్థానమైనవాడు. తన వీర్యశక్త్యాదిగుణములేక రాశిగా గలవాడు, సమస్త పరములన్నింటికిని తానే పరమైనవాడు. ఆ పరమేశ్వరులో ఏక్లేశాదులనేవి కలుగవు.

స ఈశ్వరో వ్యష్టిసమిష్టిరూపోఽవ్యక్తస్వరూపః ప్రకటస్వరూపః ।
సర్వేశ్వరః సర్వదృక్ సర్వవేత్తా సమస్తశక్తిః పరమేశ్వరాఖ్యః ॥ 74 ॥

ఆ ఈశ్వరుడు వ్యష్టిరూపుడు. సమిష్టిరూపుడు. వ్యక్త స్వరూపుడు అవ్యక్త స్వరూపుడు. అందరికీ ఈశ్వరుడు. అందరికతడే ద్రష్ట. అన్నీ తెలిసినవాడతడే. సమస్త శక్తిమంతుడతడే. అతనినే పరమేశ్వరుడనే పేరుతో పిలుస్తారు.

సంజ్ఞాయతే యేన తదస్తదోషం
శుద్ధం పరం నిర్మలమేకరూపమ్ ॥
సందృశ్యతే వాఽప్యథగమ్యతే వా
తజ్జ్ఞానమజ్ఞానమతోఽన్యదుక్తమ్ ॥ 75 ॥

దేని చేతనైతే దోషరహితమైన, పరమశుద్ధమైన, నిర్మలమైన, అదేవిధముగా ఏక రూపమైన పరమాత్మ యొక్క జ్ఞానముగాని, సాక్షాత్కారము గాని కలుగుతుందో, అదే జ్ఞానమందురు. దానికంటే విపరీతమైన దానిని అజ్ఞానమనియందురు.

ఇతి శ్రీ బ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే ఆత్యంతికలయ నిరూపణం నామ షడ్వింశాధిక శతతమోఽధ్యాయః ॥ 126 ॥

శ్రీ బ్రహ్మ పురాణమునందలి వ్యాస–ఋషి సంవాదములోని ఆత్యంతికలయ నిరూపణమనే పేరుగల నూట ఇరవై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తవింశాధిక శతతమోఽధ్యాయః – నూట ఇరవైఏడవ అధ్యాయం

యోగాభ్యాస నిరూపణమ్ – యోగాభ్యాస నిరూపణం

మునయ ఊచుః :– మునులు పలికారు.

> **ఇదానీం బ్రూహి యోగం చ దుఃఖసంయోగభేషజమ్ ।**
> **యం విదిత్వావ్యయం తత్ర యుంజామః పురుషోత్తమమ్ ॥ 1 ॥**

ఓ మహర్షీ! ఏదైతే దుఃఖమనే రోగమును దూరం చేసే ఔషధమో, దేన్ని తెలుసుకున్నందువలన అవ్యయుడైన పురుషోత్తముని పొందగలమో అటువంటి యోగమును గూర్చి మాకు ఉపదేశించుము.

సూత ఉవాచ :– సూతుడు పలికాడు.

> **శ్రుత్వా స వచనం తేషాం కృష్ణద్వైపాయనస్తదా ।**
> **అబ్రవీత్పరమప్రీతో యోగీ యోగవిదాం వరః ॥ 2 ॥**

వారి మాటలనువిన్న, యోగమును తెలుసుకున్న వారిలో శ్రేష్ఠుడైన కృష్ణద్వైపాయనయోగి మిక్కిలి సంతోషించినవాడై ఇట్లు పలికెను.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

> **యోగం వక్ష్యామి భో విప్రాః శృణుధ్వం భవనాశనమ్ ।**
> **యమభ్యస్యాఽఽప్నుయాద్యోగీ మోక్షం పరమదుర్లభమ్ ॥ 3 ॥**

ఓ విప్రులారా! దేనిని అభ్యాసం చేసినందువలన యోగి అయినవాడు పరమ దుర్లభమైన మోక్షమును పొందగలడో అటువంటి భవనాశకారి అయిన యోగమును గూర్చి చెప్పబోవుచున్నాను వినుడు.

> **శ్రుత్వాఽఽదౌ యోగశాస్త్రాణి గురుమారాధ్య భక్తితః ।**
> **ఇతిహాసం పురాణం చ వేదాంశ్చైవ విచక్షణః ॥ 4 ॥**

యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం కలిగిన బుద్ధిమంతుడు మొదట గురువును భక్తి పూర్వకముగా ఆరాధించి యోగశాస్త్రములను, ఇతిహాసమును, పురాణమును, వేదములను వినవలెను.

> **ఆహారం యోగదోషాంశ్చ దేశకాలం చ బుద్ధిమాన్ ।**
> **జ్ఞాత్వా సమభ్యసేద్యోగం నిర్ద్వన్ద్వో నిష్పరిగ్రహః ॥ 5 ॥**

బుద్ధిమంతుడైనవాడు ఆహారమును గూర్చి, యోగదోషముల గూర్చి దేశకాలములను గూర్చి తెలుసుకొని, దేనినీ స్వీకరించకుండా నిర్ద్వంద్వుడై యోగమును అభ్యసించవలయును.

> **భుంజన్సక్తుం యవాగూం చ తక్రమూలం ఫలం పయః ।**
> **యావకం కణపిణ్యాకమాహారం యోగసాధనమ్ ॥ 6 ॥**

యోగసాధనకు ఆహారముగా సత్తుపిండి (పేలాలపిండి), నూకలగంజి (జావ) మజ్జిగ, కంద మూలములు, ఫలములు, పాలు, యవలు లేదా గోధుమల పిండితో చేసినవి కానీ, నూకలతో, తెలకపిండితో వండిన పదార్థములు తినవచ్చును.

న మనో వికలే ధ్మాతే న శ్రాన్తే క్షుధితే తథా ।
న ద్వంద్వే న చ శీతే చ న చోష్ణేనానిలాత్మకే ॥ 7 ॥

యోగ సాధన చేయు సమయమున మనోవైకల్యము గానీ, చెవులలో ఏ విధమైన శబ్దముగాని, ఆకలిదప్పులు గాని, హర్ష శోకములనే ద్వంద్వములుగాని, శీతోష్ణములుగాని, శరీరములోపల వాయుబాధగాని ఉండకూడదు.

సశబ్దే సజలాభ్యాసే(శే) జీర్ణగోష్ఠే చతుష్పథే ।
సరీసృపే శ్మశానే చ న నద్యన్తేఽగ్ని సన్నిధౌ ॥ 8 ॥

శబ్దములు వినబడుచోట, నీటిలో ఈదే సమయంలో, జీర్ణమైన పశువుల కొట్టంలో, నాలుగు వీధుల కూడలిలో, పాములు తిరుగు ప్రదేశంలో, శ్మశానంలో, నదిఒడ్డున, నిప్పుకు దగ్గరగా యోగసాధన కూడదు.

న చైత్యే న చ వల్మీకే సభయే కూపసన్నిధౌ ।
న శుష్క పర్ణనిచయే యోగం యుంజీత కర్హిచిత్ ॥ 9 ॥

దేవతా వృక్షాల క్రిందగాని, పాములు తేళ్ళు తిరుగుతూ భయాన్ని కలిగించే పుట్ట దగ్గరగాని, బావిదగ్గరగాని ఎండుటాకులపై గాని ఎప్పుడూ యోగాభ్యాసం చేయకూడదు.

దేశానేతాననాదృత్య మూఢత్వాద్యో యునక్తి వై ।
ప్రవక్ష్యే తస్య యే దోషా జాయన్తే విఘ్నకారకాః ॥ 10 ॥

ఇంతవరకు చెప్పిన వాటిని ఆదరించక మూర్ఖతవల్ల ఎవరైనా యోగాభ్యాసం చేసినట్లయితే దానికి విఘ్న కారకములైన దోషాలేవి కలుగుతాయో చెప్పుచున్నాను.

బాధిర్యం జడతా లోపః స్మృతేర్మూకత్వమన్ధతా ।
జ్వరశ్చ జాయతే సద్యస్తద్వదజ్ఞానసంభవః ॥ 11 ॥

చెవిటితనము, మందత్వమూ, స్మరణ శక్తిలోపించుట, మూగతనము, గ్రుడ్డితనము, జ్వరము వచ్చుటయే కాక అజ్ఞానముకూడా సంభవించును.

తస్మాత్సర్వాత్మనాకార్యా రక్షా యోగవిదా సదా ।
ధర్మార్థకామమోక్షాణాం శరీరం సాధనం యతః ॥ 12 ॥

అందువలన యోగాభ్యాసంచేసే వారు అన్ని విధాలా సర్వదా శరీరమును రక్షించుకొనవలయును, ఎందుకంటే ధర్మార్థకామ మోక్షములను పొందుటకు శరీరమే కదా సాధనము.

ఆశ్రమే విజనే గుహ్యే నిఃశబ్దే నిర్భయే నగే ।
శూన్యాగారే శుచౌ రమ్యే చైకాన్తే దేవతాలయే ॥ 13 ॥

ఆశ్రమమునందు కాని, జనులెవరూ లేని రహస్య ప్రదేశమున గాని, ఏ శబ్దమూ వినిపించని భయములేని కొండగుహలో కాని, ఎవరూ లేని ఇంటిలోగాని, శుచియైన సుందరమైన ఏకాంత ప్రదేశములో గాని, దేవాలయములో గానీ యోగాభ్యాసం చేయవలెను.

రజన్యాః పశ్చిమే యామే పూర్వే చ సుసమాహితః ।
పూర్వాహ్ణే మధ్యమే చాహ్ని యుక్తాహారో జితేంద్రియః ॥ 14 ॥

రాత్రి మొదటి జామున గాని, చివరి జామున గాని, పగలు పూర్వాహ్ణమునగాని, మధ్యాహ్నమునగాని, యోగ్యమైన సాత్వికాహారమును నియమపూర్వకముగా తీసుకుంటూ, ఇంద్రియములను తన ఆధీనంలో నుంచుకొని యోగం చేయవలయును.

ఆసీనః ప్రాఙ్ముఖో రమ్య ఆసనే సుఖనిశ్చలే ।
న చోచ్ఛ్రితే నాతినీచే నిస్పృహః సత్యవాక్శుచిః ॥ 15 ॥

యోగ సాధకుడు ఏ మాత్రం కోరికలేకుండా సత్యవాచియై శుచిగా నుండి మిక్కిలిఎత్తుగాని, మిక్కిలి క్రిందికిగాని లేనటువంటి, సుఖమైన నిశ్చలమైన సుందరమైన ఆసనమును సమకూర్చుకొని తూర్పు ముఖముగా దానిపై కూర్చుండి యోగమును చేయవలయును.

యుక్తనిద్రో జితక్రోధః సర్వభూతహితే రతః ।
సర్వద్వంద్వ సహో ధీరః సమకాయాంఘ్రిమస్తకః ॥ 16 ॥

తగిన సమయంలో నిద్రపోతూ, కోపాన్ని జయించినవాడై, సమస్త జీవులకు హితమును కలిగించుట యందాసక్తి కలవాడై, సుఖ దుఃఖాది ద్వంద్వములను సహించు ధీరుడై, తనశరీరమును కాళ్లను తలను సమాన స్థాయిలోనుంచి యోగము చేయవలెను.

నాభౌ నిధాయ హస్తౌద్వౌ శాన్తః పద్మాసనే స్థితః ।
సంస్థాప్య దృష్టిం నాసాగ్రే ప్రాణానాయమ్య వాగ్యతః ॥ 17 ॥

రెండు చేతులను నాభిపైన ఉంచుకొని శాంతుడై పద్మాసనమును వేసుకుని కూర్చుండి, ముక్కు యొక్క చివరి భాగమున దృష్టిని కేంద్రీకరించి, వాక్కును నియంత్రించుకొని ప్రాణాయామమును చేయవలయును. మౌనముగా నుండవలయును.

సమాహృత్యేన్ద్రియగ్రామం మనసా హృదయే మునిః ।
ప్రణవం దీర్ఘముద్దిశ్య సంవృతాస్యః సునిశ్చలః ॥ 18 ॥

ఇంద్రియములన్నింటిని విషయములపైకి వెళ్ళకుండా హృదయంలోకి చేర్చి, మౌనంగా మనస్సుతో బంధించి, ఓంకారమును దీర్ఘముగా పలుకుతూ సునిశ్చలుడై నోటిని మూసుకొని యుండవలయును.

రజసా తమసోవృత్తిం సత్వేన రజసస్తథా ।
సంఛాద్య నిర్మలే శాన్తే స్థితః సంవృతలోచనః ॥ 19 ॥

యోగియైనవాడు తన రెండు కన్నులను మూసుకొని తనలోనున్న తమోగుణవృత్తిని రజోగుణముతోను, రజోగుణవృత్తిని సత్త్వగుణముతోను ఆచ్ఛాదన చేసి నిర్మలుడై శాంతమైన స్థితిలో నుండవలయును.

హృత్పద్మకోటరే లీనం సర్వవ్యాపి నిరంజనమ్ ।
యుంజీత సతతం యోగీ ముక్తిదం పురుషోత్తమమ్ ॥ 20 ॥

యోగ సాధకుడు ఆ సమయమున తన హృదయ కమలకర్ణికలో లీనమైయున్న సర్వవాపీ, నిరంజనుడూ, మోక్షపు దాతా అయిన పురుషోత్తముని ధ్యానించవలయును.

కరణేంద్రియ భూతాని క్షేత్రజ్ఞే ప్రథమం న్యసేత్ ।
క్షేత్రజ్ఞశ్చ పరే యోజ్యస్తతో యుంజతి యోగవిత్ ॥ 21 ॥

యోగ సాధకుడు మొదట అంతః కరణముతో సహా తన ఇంద్రియములను పృథివ్యాది పంచభూతములను క్షేత్రజ్ఞునియందు లగ్నము చేయవలయును. క్షేత్రజ్ఞుని పరమాత్మయందు నియుక్తుని చేయవలయును. ఆ తరువాత యోగాభ్యాసమును చేయవలయును.

వాలాగ్రశతధాభాగలక్షణం పరమం పదమ్ ।
మనోదీపేన పశ్యన్తి యోగినో ధ్యానతత్పరాః ।
ఇన్ద్రియాణి సమాహృత్య కూర్మోఽంగానీవ యోగవిత్ ॥ 22 ॥

వాలాగ్రశతధా భాగలక్షణము గలది పరమపదము. అనగా కేశము యొక్క చివరభాగంలో నూరవవంతు కలది. తాబేలు ఏ విధంగా తన అంగములనన్నింటిని లోపలికి ముడుచు కుంటుందో అట్లే సమస్త ఇంద్రియములను అంతర్ముఖంగా చేసి ధ్యానతత్పరుడు కావాలి యోగి. అటువంటి యోగులే మనో దీపముతో సూక్ష్మమైన పరమపదమును దర్శించగలరు.

మనోయస్యాన్తమభ్యేతి పరమాత్మని చంచలమ్ ।
సంతజ్య విషయాంస్తస్య యోగసిద్ధిః ప్రకాశితా ॥ 23 ॥

ఏ యోగసాధకునియొక్క చంచలమైన మనస్సు సమస్త విషయాలను వదిలి పెట్టి పరమాత్మయందు లగ్నమౌతుందో అతనికి యోగసిద్ధి ప్రకాశించును.

యదా నిర్విషయం చిత్తం పరే బ్రహ్మణి లీయతే ।
సమాధౌ యోగయుక్తస్య తదాఽభ్యేతి పరం పదమ్ ॥ 24 ॥

యోగ సాధకుడైన వాడు సమాధియందు తనమనస్సును విషయములనుండి మరల్చి పరబ్రహ్మలో లీనం చేసినట్లైతే పరమపదమును పొందగలడు.

అసంసక్తం యదా చిత్తం యోగినః సర్వకర్మసు ।
భవత్యానందమాసాద్య తదా నిర్వాణమృచ్ఛతి ॥ 25 ॥

యోగుల మనస్సు ఏ కర్మములయందూ ఆసక్తి లేకుండాచేసుకొన్నట్లయితే ఆనందమును పొంది ముక్తిని పొందును.

శుద్ధం ధామత్రయాతీతం తుర్యాఖ్యం పురుషోత్తమమ్ ।
ప్రాప్యయోగ బలాద్యోగీ ముచ్యతే నాత్ర సంశయః ॥ 26 ॥

యోగి తన యోగ బలముచేత శుద్ధుడూ, సూక్ష్ముడూ ధామత్రయాతీతుడూ, సత్త్వగుణసంపన్నుడూ ఐన పురుషోత్తముని పొంది మోక్షమును పొందగలడు ఈ విషయంలో ఏ సందేహములేదు.

నిః స్పృహః సర్వ కామేభ్యః సర్వత్ర ప్రియదర్శనః ।
సర్వత్ర నిత్య బుద్ధిస్తు యోగీ ముచ్యేత నాన్యథా ॥ 27 ॥

సమస్తమైన భౌతిక భోగముల పట్ల నిస్పృహను, అన్నింటియందు ప్రేమపూర్ణమైన దృష్టియూ గలిగి, అదే విధముగా అనాత్మ పదార్థములయందు అనిత్య బుద్ధి కలిగి అంతటా నిత్యబుద్ధి కలిగియున్న యోగిమోక్షమును పొందును.

ఇన్ద్రియాణి న సేవేత వైరాగ్యేణ చ యోగవిత్ ।
సదా చాభ్యాసయోగేన ముచ్యతే నాత్ర సంశయః ॥ 28 ॥

యోగ సాధకుడైనవాడు వైరాగ్యంతో ఇంద్రియాది విషయములను సేవించకూడదు. సర్వదా అభ్యాస యోగంతో తప్పక మోక్షమును పొందుననుటలో సందేహం లేదు.

న చ పద్మాసనాద్యోగో న నాసాగ్రనిరీక్షణాత్ ।
మనసశ్చేన్ద్రియాణాం చ సంయోగో యోగ ఉచ్యతే ॥ 29 ॥

కేవలం పద్మాసనం వేసుకుని కూర్చున్నందు వల్లనో, కేవలం ముక్కు చివర దృష్టి నిల్పియుంచినందు వల్లనో యోగమనరు. వాస్తవంగా మనస్సు ఇంద్రియముల సంయోగము కలిగి సాధకుడు ఏకాగ్రతతో ఉన్నప్పుడే దానిని యోగమందురు.

ఏవం మయా ముని శ్రేష్ఠా యోగః ప్రోక్తో విముక్తిదః ।
సంసార మోక్ష హేతుశ్చ కిమన్యచ్ఛ్రోతు మిచ్ఛథ ॥ 30 ॥

ఓ ముని శ్రేష్ఠులారా! ఈ విధముగా నేను మోక్షము నిచ్చే యోగమును గూర్చి చెప్పితిని. ఈ సంసారమునుండి విముక్తిని కలిగించే దానిని వివరించితిని ఇంకా మీరు ఏమి వినగోరుచున్నారో తెల్పుడు.

లోమహర్షణ ఉవాచ :– లోమహర్షణుడు పలికాడు.

శ్రుత్వా తే వచనం తస్య సాధు సాధ్వితి చా బ్రువన్ ।
వ్యాసం ప్రశస్య సంపూజ్య పునః ప్రష్టుం సముద్యతాః ॥ 31 ॥

అతని మాటలను విని వారు బాగు బాగు అని వ్యాసుని ప్రశంసించి అతనిని పూజించి తిరిగి మరల అడుగుటకు సిద్ధమైనారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షి సంవాదే యోగాభ్యాస నిరూపణం నామ సప్తవింశాధిక శతతమోఽధ్యాయః ॥ 127 ॥

శ్రీబ్రహ్మ పురాణమునందలి వ్యాస ఋషిసంవాదములోని యోగాభ్యాస నిరూపణమనే నూటఇరవై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టావింశాధిక శతతమోऽధ్యాయః – నూట ఇరవైఎనిమిదవ అధ్యాయం

సాంఖ్యయోగ నిరూపణమ్ – సాంఖ్యయోగ నిరూపణం

మునయ ఊచుః :– మునులు పలికారు.

తవ వక్త్రాబ్ధి సంభూతమమృతం వాఙ్మయం మునే ।
పిబతాం నో ద్విజశ్రేష్ఠ న తృప్తిరిహ దృశ్యతే ॥ 1 ॥

ఓ ద్విజ శ్రేష్ఠుడా! నీ ముఖమనే పాలసముద్రమునుండి జాలువారిన పురాణ వాఙ్మయమనే అమృతమును ఎంత త్రావినను మాకు తృప్తికలుగుటలేదు.

తస్మాద్యోగం మునే బ్రూహి విస్తరేణ చ ముక్తిదమ్ ।
సాంఖ్యం చ ద్విపదాం శ్రేష్ఠ! శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥ 2 ॥

ఓ వ్యాసమునీ! అందువలన మోక్షమునిచ్చునటువంటి యోగము మరియు సాంఖ్యమును గూర్చి విస్తరముగా వివరించుము. ఓ పురుషోత్తమా! వాటిని వినవలయునని మేమెంతో కుతూహలముగానున్నాము.

ప్రజ్ఞావాన్ శ్రోత్రియో యజ్వా ఖ్యాతః ప్రాజ్ఞోऽనసూయకః ।
సత్యధర్మమతిర్బ్రహ్మన్ కథం బ్రహ్మాధిగచ్ఛతి ॥ 3 ॥

ఓ పూజ్యుడా! ప్రజ్ఞావంతుడు, శ్రోత్రియుడు, యజ్ఞములనాచరించువాడు, ప్రసిద్ధుడు, విశేషముగా అన్నివిషయములు తెలిసినవాడు, అసూయలేనివాడు సత్యధర్మములయందు స్థిరమైన బుద్ధి గలిగినవాడూ అయినవ్యక్తి బ్రహ్మ నెట్లు పొందగలడో వివరించుడు.

తపసా బ్రహ్మచర్యేణ సర్వత్యాగేన మేధయా ।
సాంఖ్యే వా యది వా యోగ ఏతత్పృష్టో వదస్వ నః ॥ 4 ॥

తపస్సు, బ్రహ్మచర్యము, సర్వకర్మ ఫలత్యాగము మేధయూ కలిగి ఉన్నప్పటికీ సాంఖ్యమూ యోగములలో దేనివల్ల ముక్తికలుగునో మాకు చెప్పుము.

మనసశ్చేంద్రియాణాం చ యథైకాగ్ర్యమవాప్యతే ।
యేనోపాయేన పురుషస్తత్త్వం వ్యాఖ్యాతుమర్హసి ॥ 5 ॥

మనస్సునకూ, ఇంద్రియములకూ ఏ ఉపాయం చేత ఏకాగ్రత సిద్ధించునో! దాన్ని నీవు చెప్పుటకర్హుడవు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

నాన్యత్ర జ్ఞానతపసోర్నాన్యత్రేంద్రియనిగ్రహాత్ ।
నాన్యత్ర సర్వసంత్యాగాత్సిద్ధిం విన్దతి కశ్చన ॥ 6 ॥

జ్ఞానము, తపస్సు, ఇంద్రియనిగ్రహము, సర్వసంగ పరిత్యాగము ఇవి లేనిదే ఎవరూ కూడా సిద్ధిని పొందలేరు.

మహాభూతాని సర్వాణి పూర్వసృష్టిః స్వయంభువః ।
భూయిష్ఠం ప్రాణభృద్గ్రామే నివిష్టాని శరీరిషు ॥ 7 ॥

స్వయంభూ బ్రహ్మయొక్క ప్రథమ సృష్టియందు పృథివ్యాది పంచమహా భూతములను జీవుల యొక్క శరీరములయందుంచబడినవి.

భూమేర్దేహో జలాత్స్నేహో జ్యోతిషశ్చక్షుషీస్మృతే ।
ప్రాణాపానాశ్రయో వాయుః కోష్ఠాకాశం శరీరిణామ్ ॥ 8 ॥

భూమినుండి దేహము, నీటినుండి ద్రవరూపాంశము, అగ్నినుండి నేత్రాంశము, వాయువునుండి ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన అనే ఐదు అంశములూ, ఆకాశమునుండి ఉదరము అనునవి ఈ జీవుల కేర్పడినవి.

క్రాన్తౌ విష్ణుర్బలే శక్రః కోష్ఠేఽగ్నిర్భోక్తుమిచ్ఛతి ।
కర్ణయోః ప్రదిశః శ్రోత్రే జిహ్వాయాం వాక్ సరస్వతీ ॥ 9 ॥

జీవుల గమనమందు విష్ణువూ, బలమునందు ఇంద్రుడూ, ఉదరమునందు జఠరాగ్ని రూపంలో అగ్నియూ ఉండి ఆకలిని కలిగించును. చెవులలో శ్రోత్రేంద్రియములుగా దిక్కులు, నాలుకయందు వాగ్రూపమైన సరస్వతియూ ఉండును.

కర్ణౌ త్వక్ చక్షుషీ జిహ్వా నాసికా చైవ పంచమీ ।
దశతానింద్రియోక్తాని ద్వారాణ్యాహారసిద్ధయే ॥ 10 ॥

చెవులు, చర్మము, నేత్రములు, నాలుక, ముక్కు అనే ఈ ఐదు జ్ఞానేంద్రియములూ వాక్ పాణి పాద పాయు ఉపస్థ అను ఐదు కర్మేంద్రియములతో కలిసి పది ఇంద్రియములును తమ ఆహారమును సిద్ధింపచేసుకొనుటకై ప్రవేశద్వారములుగానున్నవి.

శబ్దస్పర్శౌ తథా రూపం రసం గంధం చ పంచమమ్ ।
ఇంద్రియార్థాన్ పృథక్విద్యాదింద్రియేభ్యస్తు నిత్యదా ॥ 11 ॥

శబ్ద స్పర్శ రూపరస గంధములనె ఐదు ఇంద్రియార్థాలూ ఇంద్రియాల కంటే ఎప్పుడూ వేరుగా ఉండును. ఆయా కర్మేంద్రియములనుండి పొందుటకు సర్వదా ప్రయత్నించును.

ఇంద్రియాణి మనో యుంక్తే అవశానివ వాజినః ।
మనశ్చాపి సదా యుంక్తే భూతాత్మా హృదయాశ్రితః ॥ 12 ॥

ఇంద్రియాలు గుర్రాలు వంటివి. వానిని మనస్సు కలుస్తుంది. ఆ మనస్సు కూడా ఎల్లప్పుడూ దేహాన్ని ఆశ్రయించి ఉన్న హృదయంలో ఉన్న జీవాత్మతో కలిసి ఉంటుంది.

ఇంద్రియాణాం తథైవేషాం సర్వేషామీశ్వరం మనః ।
నియమే చ విసర్గే చ భూతాత్మా మనసస్తథా ॥ 13 ॥

ఈ ఇంద్రియములన్నింటికీ ఈశ్వరుడు మనస్సు. అలాగే దానిని నియమించుటయందు, ప్రేరేపించుట యందు జీవుడు ప్రభువౌతాడు.

ఇంద్రియాణీంద్రియార్థాశ్చ స్వభావశ్చేతనా మనః ।
ప్రాణాపానౌ చ జీవశ్చ నిత్యం దేహేషు దేహినామ్ ॥ 14 ॥

చైతన్యంగల మనస్సుకు ఇంద్రియములూ అవి జరుపు వ్యాపారమూ సహజమైనది. జీవుల శరీరములలో ప్రాణాపానములూ, జీవుడూ, దేహములందు నిత్యముగానుండును.

ఆశ్రయో నాస్తి సత్త్వస్య గుణశబ్దో న చేతనాః ।
సత్త్వం హి తేజః సృజతి న గుణాన్వై కథంచన ॥ 15 ॥

సత్త్వమునకాశ్రయములేదు. శబ్దగుణమూ, చేతనములూ కూడా లేవు. తేజస్సును సత్త్వమే సృష్టిస్తుంది. కాని గుణములనెప్పుడూ సృష్టించదు.

ఏవం సప్తదశం దేహం వృతం షోడశభిర్గుణైః ।
మనీషీ మనసా విప్రాః పశ్యత్యాత్మానమాత్మని ॥ 16 ॥

ఓ విప్రులారా! ఈ విధముగా దేహం 16 గుణాలతో కూడి ఉంది. తాను 17వది. విజ్ఞుడైనవాడు తన ఆత్మను ఆత్మయందే దర్శిస్తాడు.

న హ్యయం చక్షుషా దృశ్యో న చ సర్వైరపీంద్రియైః ।
మనసా తు ప్రదీప్తేన మహానాత్మా ప్రకాశతే ॥ 17 ॥

ఆ ఆత్మకంటితో గాని, సమస్త ఇంద్రియముల చేతగాని చూచుటకు అనుభవించుటకు వీలుకాదు. ప్రకాశమునొందిన మనస్సుతో మాత్రమే ఆత్మను దర్శించవీలగును.

అశబ్దస్పర్శరూపంతు రసగంధవివర్జితమ్ ।
అశరీరం శరీరే స్వే నిరీక్షేత నిరింద్రియమ్ ॥ 18 ॥

పరమాత్మ శబ్దస్పర్శరూప రసగంధములు లేని, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు లేని, శరీరము లేనివానిగా తన శరీరమునందు దర్శించవలయును. అనుసంధానము చేయవలెను.

అవ్యక్తం సర్వదేహేషు మర్త్యేషు పరమార్చితమ్ ।
యోఽనుపశ్యతి సప్రేత్య కల్పతే బ్రహ్మభూ యతః ॥ 19 ॥

జీవుడు మరణ శీలముగల సమస్త దేహములయందు అవ్యక్తము గానున్న, పరమ పూజితుడైన పరమాత్మను జ్ఞానమయదృష్టితోనెప్పుడు చూడగలడో అప్పుడు తానే బ్రహ్మగా మారగలడు.

విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 20 ॥

విద్యా వినయసంపద గల బ్రాహ్మణునియందు, ఆవునందు, ఏనుగునందు, కుక్కయందు, చండాలునియందు సమాన భావముతోనుండు వారు జ్ఞానులు.

స హి సర్వేషు భూతేషు జంగమేషు ధ్రువేషు చ ।
వసత్యేకో మహానాత్మా యేన సర్వమిదం తతమ్ ॥ 21 ॥

ఎవరి చేతనైతే ఇదంతయు సృష్టించబడినదో (వ్యాప్తి చెయ్యబడిందో) ఆ పరమాత్మ ఈ కనబడే ప్రపంచము నందంతటను, సమస్త జీవులయందు స్థావర జంగమములందు వ్యాపించి ఉన్నాడు.

సర్వ భూతేషు చాత్మానం సర్వ భూతాని చాత్మని ।
యదా పశ్యతి భూతాత్మా బ్రహ్మ సంపద్యతే తదా ॥ 22 ॥

జీవుడు సమస్త భూతములయందు తనకంటే వేరుగాని పరమాత్మనూ, తనలో సమస్త భూతములనూ ఎప్పుడు చూడగలుగుతాడో అప్పుడు తానే సాక్షాత్తుగా బ్రహ్మమగును.

యావానాత్మని వేదాత్మా తావానాత్మా పరాత్మని ।
య ఏవం సతతం వేద సోఽమృతత్వాయ కల్పతే ॥ 23 ॥

ఈ కనబడే ప్రపంచమునందు ఏ రూపమునందు ఎంత ఆత్మకలదో, అంతేతత్త్వము పరమాత్మయందు కూడా కలదని ఎవరైతే తెలుసుకుంటాడో! వాడు మోక్షమనే అమృతత్వమును పొందును.

సర్వభూతాత్మభూతస్య సర్వభూత హితస్య చ ।
దేవా పి మార్గే ముహ్యన్తి అపదస్య పదైషిణః ॥ 24 ॥

సమస్త భూతములకు ఆత్మ భూతమైన వాడు, సమస్త జీవులకు హితమును కలిగించువాడూ పరమాత్మ. ఒక నిర్దిష్టమైన స్థానము లేనియాతని మార్గమును పొందగోరి దేవతలందరూ కూడా అతనిని గూర్చి తెలుసుకొన జాలరు.

శకున్తానామివాకాశే మత్స్యానామివ చోదకే ।
యథా గతిర్నదృశ్యేత తథా జ్ఞాన విదాంగతిః ॥ 25 ॥

ఆకాశంలో ప్రయాణించే పక్షుల మార్గమును, నీటిలో తిరుగాడే చేపలమార్గము నెట్లు తెలుసుకొనలేమో అట్లే జ్ఞానులు సంచరించే మార్గమును కూడా తెలుసుకొనలేము.

కాలః పచతి భూతాని సర్వాణ్యేవాఽఽత్మనాఽఽత్మని ।
యస్మింస్తు పచ్యతే కాలస్తన్న వేదేహ కశ్చన ॥ 26 ॥

సమస్త భూతములను కాలము పరిపక్వమొందించి తనకు లోబరుచుకొని స్వాధీనము నందుంచు కొనును కాని అటువంటి కాలమును కూడా పరిపాకము నొందించుచు తనయధీనమున నుంచుకొను పరతత్త్వమును గూర్చి ఈ లోకమున ఏ వ్యక్తీ తెలుసుకోలేదు.

న తదూర్ధ్వం న తిర్యక్చ నాధో న చ పునః పునః ।
న మధ్యే ప్రతిగృహ్ణీతే నైవ కించిన్న కశ్చన ॥ 27 ॥

ఆ పరతత్త్వము కంటే ఉన్నతి ఇంకలేదు. అడ్డములేదు. క్రిందుకానీ మధ్యకానీలేదు. వేరుగా ఉండుట లేదు. దాన్ని ఎవ్వరూ ఏ కొంచెమూ తెలుసుకొనలేరు.

సర్వే తత్స్థా ఇమే లోకా బాహ్యమేషాం న కించన ।
యద్యప్యగ్రే సమాగచ్ఛేద్యథా బాణో గుణచ్యుతః ॥ 28 ॥

ఈ లోకములన్నియు అతని యందున్నవే. వానికంటె బాహ్యప్రపంచం ఏ కొంచమూ కూడా లేదు. అది సర్వదా ముందుకే ప్రయాణించును. అల్లెత్రాడునుండి విడిపడిన బాణమెలా ముందుకు మాత్రమే ప్రయాణము చేయునో అట్లే ఇది కూడా పురోగమనము గలదైయుండును.

నైవాన్తం కారణస్యేయాద్యద్యపి స్యాన్మనోజవః ।
తస్మాత్ సూక్ష్మతరం నాస్తి నాస్తి స్థూలతరం తథా ॥ 29 ॥

ఆ కారణతత్త్వాన్ని మనస్సు వంటి వేగంతో ప్రయాణించినా అంతంతెలియదు. దానికంటే సూక్ష్మమైనదీలేదు. అంతకంటే పెద్దదీ లేదు.

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥ 30 ॥

ఈలోకమునందంతట వ్యాపించిన చేతులూ, కాళ్ళుగలది. అంతట వ్యాపించి నేత్ర శిరోముఖములు గలది. అంతటనూ వ్యాపించి శోత్రములుగలిగిన శక్తిగలదొక్కటి మాత్రమేయున్నది.

తదేవాణోరణుతరం తన్మహద్భ్యో మహత్తరమ్ ।
తదన్తః సర్వభూతానాం ధ్రువం తిష్ఠన్న దృశ్యతే ॥ 31 ॥

'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్నట్లుగా అదే అణువులన్నింటికన్నా చిన్నది. భయమును కల్గించే మహత్తులన్నింటికన్నా పెద్దది. సమస్త భూతములకు అదే అంతము, కాని అది స్థిరముగానున్నట్లు ఎక్కడా కనిపించదు.

అక్షరం చ క్షరం చైవ ద్వేధా భావోఽయమాత్మనః ।
క్షరః సర్వేషు భూతేషు దివ్యం త్వమృతమక్షరమ్ ॥ 32 ॥

ఆత్మకు క్షరమని అక్షరమని రెండు విధముల భావముండును. అందులో ఈ క్షరమనునది సమస్త భూతములలోనుండే భావము. ఇక అక్షరము మాత్రము దివ్యము అమృతత్వమును కలిగియుండును. క్షరమువినాశి, అక్షరమవినాశి.

నవద్వారం పురం కృత్వా హంసో హి నియతో వశీ ।
ఈదృశః సర్వభూతస్య స్థావరస్య చరస్య చ ॥ 33 ॥

ఈ విధముగా చరాచరములైన సర్వ భూతముల యొక్క నవరంధ్రములుగల శరీరమును వశము చేసుకొని ఆత్మ దానియందు నియతముగానుండును.

హానేనాభివికల్పానాం నరాణాం సంచయేన చ ।
శరీరాణామజస్యాఽఽహుర్హంసత్వం పారదర్శినః ॥ 34 ॥

వికల్పములు లేకపోవుటచేతనూ, మానవుల శరీరములను తన అధీనమందుంచుకొనుటచేతనూ పండితులు ఆ పరమాత్మను హంసగా చెప్పారు.

హంసోక్తం చ క్షరం చైవ కూటస్థం యత్తదక్షరమ్ ।
తద్విద్వానక్షరం ప్రాప్య జహాతి ప్రాణజన్మనీ ॥ 35 ॥

హంసగా చెప్పబడిన ప్రపంచము క్షరరూపము. రూపాదులులేని సాక్షిగా ఉన్నది. నాశములేని అక్షరము. కనుక జ్ఞాని అదితెలిసికొని సంసారచక్రాల నుండి బయటపడతాడు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

భవతాం పృచ్ఛతాం విప్రా యథావదిహతత్త్వతః ।
సాంఖ్యం జ్ఞానేన సంయుక్తం యదేతత్కీర్తితం మయా ॥ 36 ॥

ఓ విప్రులారా! ఈ విధముగా మీరడిగినారు కనుక నేను జ్ఞానయుక్తమగు సాంఖ్యమును గూర్చి ఉన్నదున్నట్లుగా వివరించితిని.

యోగ కృత్యంతు భో విప్రాః కీర్తయిష్యామ్యతః పరమ్ ।
ఏకత్వం బుద్ధిమనసోరింద్రియాణాం చ సర్వశః ॥ 37 ॥

విప్రులారా! ఇక మీదట బుద్ధినీ, మనస్సునూ, ఇంద్రియములనూ వాటి వాటి ప్రవృత్తులనుండి అన్నివిధములుగా ఏకత్వము నొందునట్లు చేయుచు, యోగప్రకారమును వివరింతును.

ఆత్మనో వ్యాపినో జ్ఞానం జ్ఞానమేతదనుత్తమమ్ ।
తదేతదుపశాంతేన దాన్తేనాధ్యాత్మశీలినా ॥ 38 ॥

ఆత్మారామేణ బుద్ధేన బోద్ధవ్యం శుచికర్మణా ।
యోగదోషాన్ సముచ్ఛిద్య పంచయాన్ కవయోవిదుః ॥ 39 ॥

సర్వవ్యాపి యగు ఆత్మను తెలుసుకొను ఉత్తమజ్ఞానము కలిగియుండుటయే యోగశాస్త్రమతములో ఉత్తమమైన జ్ఞానము. యోగియైనవాడు మనస్సును, బాహ్యేంద్రియములను, నిగ్రహించుకొని ఆధ్యాత్మశీలుడై, ఆత్మాజ్ఞాని అయిన పండితుడు ఏ ఐదింటిని యోగదోషములుగా కవులు పేర్కొన్నారో! ఆ ఐదింటినీ నాశనము చేసుకొని పవిత్రముగా యోగవిద్యను తెలుసుకోవలసియున్నది.

కామం క్రోధం చ లోభం చ భయం స్వప్నం చ పంచమమ్ ।
క్రోధం శమేన జయతి కామం సంకల్పవర్జనాత్ ॥ 40 ॥

కామము, క్రోధము, లోభము, భయము, స్వప్నము అను ఈ ఐదు యోగదోషములు. మనోనిగ్రహముతో క్రోధమును, సంకల్పములను వదలిపెట్టుటవలన కామమును జయించవలెను.

సత్త్వ సంసేవనాద్ధీరో నిద్రాముచ్ఛేత్తుమర్హతి ।
ధృత్యా శిశ్నోదరం రక్షేత్ పాణిపాదం చ చక్షుషా ॥ 41 ॥

సాత్త్వికగుణసేవనమువల్ల నిద్రను నశింపచేయవచ్చును. ధైర్యము ద్వారా యోగి అయినవాడు శిశ్నోదరములను రక్షించుకొనవలయును. మంచిచూపుతో కాళ్లను చేతులను రక్షించకొనవలయును.

చక్షుః శ్రోత్రం చ మనసా మనోవాచం చ కర్మణా ।
అప్రమాదాద్భయం జహ్యాత్ దంభం ప్రాజ్ఞోపసేవనాత్ ॥ 42 ॥

మనస్సుద్వారా నేత్రములను, కర్ణములను, పవిత్ర కర్మద్వారా మనస్సును, వాక్కును రక్షించుకొనవలయును. ప్రమాదములకు దూరముగానుండుట వలన భయమును, విద్వాంసులను సేవించుటవలన దంభమును పోగొట్టు కొనవలయును.

ఏవమేతాన్యోగదోషాన్ జయేన్నిత్యమతన్ద్రితః ।
అగ్నీంశ్చ బ్రాహ్మణాంశ్చాథ దేవతాః ప్రణమేత్సదా ॥ 43 ॥

ఈ విధముగా యోగసాధకుడైనవాడు ఈ యోగదోషములను ప్రయత్నముతో జయించవలయును. సర్వదా అగ్నికి, బ్రాహ్మణులకు, దేవతలకు నమస్కరించవలయును.

వర్జయేదుద్ధతాం వాచం హింసాయుక్తాం మనోనుగామ్ ।
బ్రహ్మతేజోమయం శుక్రం యస్య సర్వమిదం జగత్ ॥ 44 ।

మనస్సుపై ప్రభావాన్ని చూపే హింసాయుక్తమైన పరుషవాక్కులను పలుక కూడదు. ఈ చరాచర జగత్తు అంతా పరమాత్మ వీర్యశక్తితో కూడి ఉంది.

ఏతస్య భూతభూతస్య దృష్టం స్థావరజంగమమ్ ।
ధ్యానమధ్యయనం దానం సత్యం హ్రీరార్జవం క్షమా ॥ 45 ॥

శౌచం చైవాఽఽత్మనః శుద్ధిరింద్రియాణాం చ నిగ్రహః ।
ఏతైర్వివర్ధతే తేజః పాప్మానం చాపకర్షతి ॥ 46 ॥

ఈ కనిపించే దంతయు స్థావర జంగమాత్మకము అతని కార్యమే. అతని సంకల్పముతోనే ఈవిధముగా పరిణమించినది. ధ్యానము, వేదాధ్యయనము, దానము, సత్యము, సిగ్గు, ఋజుత్వము, ఓర్పు, శౌచము, మనః శుద్ధి, ఇంద్రియనిగ్రహము అనునవి సాధనములు. వీటితో తేజస్సు వృద్ధి పొందును. అంతేకాక పాపములు నశించును.

సమః సర్వేషు భూతేషు లభ్యాలభ్యేన వర్తయన్ ।
ధూతపాప్మా తు తేజస్వీ లఘ్వాహారో జితేంద్రియః ॥ 47 ॥

సమస్త భూతములయందు సమబుద్ధి కలిగియుండి తన ప్రయత్నములేకుండానే దొరికినదానితోనే జీవిస్తూ, పాపములను వదిలిపెట్టి తేజస్సును పెంచుకొని మితాహారమును స్వీకరిస్తూ జితేంద్రియుడై,

కామ క్రోధౌ వశే కృత్వా నిషేవేద్బ్రహ్మణః పదమ్ ।
మనసశ్చేంద్రియాణాం చ కృత్వైకాగ్ర్యం సమాహితః ॥ 48 ॥

మనస్సును, ఇంద్రియములను ఏకముచేసి జితేంద్రియుడై, కామక్రోధములను తన వశమునందుంచుకొని బ్రహ్మపదమును సేవించవలయును.

పూర్వరాత్రే పరార్ధే చ ధారయేన్మన ఆత్మని ।
జంతోః పంచేంద్రియస్యాస్య యద్యేకం క్లిన్నమింద్రియమ్ ॥ 49 ॥

తతోఽస్య స్రవతి ప్రజ్ఞా గిరేః పాదాదివోదకమ్ ।
మనసః పూర్వమాదద్యాత్ కూర్మాణామివ మత్స్యహా ॥ 50 ॥

రాత్రి మొదటి చివరి జాములయందు మనస్సును ఇంద్రియములను ఏకాగ్రములుగా చేసి ధ్యానమునందుండి మనస్సును పరతత్త్వమునందు నిలిపి తత్త్వసాధనమును చేయవలయును. ఆ సమయమున అయిదింటిలోని ఏ ఒక్క ఇంద్రియమైనను ఈ యోగసాధకునిది తడిసినచో, పర్వత సానువులనుండి పల్లమునకు నీరు జారినట్లుగా, జీవుని ప్రజ్ఞ పరతత్త్వమునుండి క్రిందికి జారును. అందువలన చేపలను పట్టే జాలరి కూర్మములను గాలము వేసి పట్టినట్లుగా మొదట మనస్సును బంధించవలయును.

తతః శ్రోత్రం తతశ్చక్షుర్జిహ్వాఘ్రాణం చ యోగవిత్ ।
తత ఏతాని సంయమ్య మనసి స్థాపయేద్హృది ॥ 51 ॥

ఆ తరువాత యోగసాధకుడు కన్నులు, నాలుక, నాసికనూ నిగ్రహించి వాటినన్నింటిని స్వాధీన పరుచుకొని ఇంద్రియములను మనుస్సునందు నిలుపవలెను.

తథైవాపోహ్య సంకల్పాన్మనోహ్యాత్మని ధారయేత్ ।
పంచేంద్రియాణి మనసి హృది సంస్థాపయేద్హృది ॥ 52 ॥

అదే విధముగా పంచేంద్రియములను మనస్సునందు నిలిపి మనస్సును కూడా సంకల్పములనుండి అణిచి దానిని తన హృదయమునందు నిలుపవలయును.

యదైతాన్యవతిష్ఠన్యే మనః షష్ఠాని చాత్మని ।
ప్రసీదంతి చ సంస్థాయాం తదా బ్రహ్మ ప్రకాశతే ॥ 53 ॥

ఎప్పుడైతే మనస్సుతో కూడా ఈ ఆరు ఆత్మయందు ప్రసన్నంగా ఉంటాయో అప్పుడు పరమాత్మతత్త్వము ప్రకాశించును.

విధూమ ఇవ దీప్తార్చిరాదిత్య ఇవ దీప్తిమాన్ ।
వైద్యుతోఽగ్నిరివాఽఽకాశే పశ్యన్త్యాత్మానమాత్మని ॥ 54 ॥

అప్పుడా యోగసాధకుడు పొగలేకుండా మండే అగ్నివలె, మేఘా వరణములేకుండా ప్రకాశించే సూర్యునివలె, ఆకాశమునందుండే మెరుపుతీగలాగా ఉన్న పరమాత్మతత్త్వమును తనయందున్నట్లుగాను తాను దానియందున్నట్లుగాను దర్శించును.

సర్వం తత్ర తు సర్వత్ర వ్యాపకత్వాచ్చ దృశ్యతే ।
తం పశ్యంతి మహాత్మానో బ్రాహ్మణా యే మనీషిణః ॥ 55 ॥

అన్నియును ఆత్మయందుండును. ఆత్మ అన్నింటియందు వ్యాపించి యుండును. ఇందువల్లనే అది అంతటను దృష్టిగోచరమగును. బ్రహ్మతత్త్వమునందు శ్రద్ధగలమనీషులు మహాత్ములు మాత్రమే దానిని దర్శించగలరు.

ధృతిమంతో మహాప్రాజ్ఞాః సర్వభూతహితేరతాః ।
ఏవం పరిమితం కాలమాచరన్ సంశితవ్రతః ॥ 56 ॥

ధైర్యవంతులు, గొప్పవివేకవంతులు, సమస్త భూతములకు హితమును కోరువారు మాత్రమే ఆ తత్త్వమును దర్శించగలరు. ఇలా యోగి నిర్దిష్టమైన కాలాన్ని దీక్షతో ఆచరించాలి.

ఆసీనో హి రహస్యేకో గచ్ఛేదక్షర సామ్యతామ్ ।
ప్రమోహో భ్రమ ఆవర్తో ఘ్రాణం శ్రవణదర్శనే ॥ 57 ॥

అతడు ఈ విధముగా రహస్యముగా ఏకాంతముగా చేసినచో అక్షర పరబ్రహ్మము యొక్క సామ్యమును పొందగలడు. ఈ యోగ సాధనలో ముందుకు పోవుచున్నప్పుడు ఒక్కోసారి మోహము, భ్రమ, ఆవర్తమనే విఘ్నములు కలుగవచ్చును. దివ్యమైన సుగంధములు వచ్చినపుడు ఘ్రాణేంద్రియము, చక్కని సంగీతాది శబ్దములు వచ్చినపుడు శ్రవణేంద్రియము, అదే విధముగా సుందర దృశ్యములు కన్పించినపుడు చక్షురింద్రియము ప్రవర్తించును.

అద్భుతాని చ సంస్పర్శః శీతోష్ణమారుతాకృతిః ।
ప్రతిభానుపసర్గాంశ్చ ప్రతిసంగృహ్యయోగతః ॥ 58 ॥

ఒక్కోసారి అలౌకికమైన చల్లదనమూ, వేడిమీ, వాతములూ స్పర్శ కలుగును. ఇచ్ఛానురూపమైన శీతోష్ణములు పొందవచ్చును. వాయువు వలె ఆకాశమునందు యథేచ్ఛగావిహరించు శక్తికలుగును. ప్రతిభ పెరుగుతుంది. ఉపద్రవాలేవీ కలుగవు. యోగముతో ఈ సిద్ధులు కలిగినప్పటికి కూడా,

తాంస్తత్త్వవిదానాదృత్య సామ్యేనైవ నివర్తయేత్ ।
కుర్యాత్పరిచయం యోగే త్రైలోక్యే నియతోమునిః ॥ 59 ॥

తత్త్వవేత్త అయినవాడు వాటిని ఉపేక్షించి వానియందే ఆదరమును చూపక, వాటిని సమభావన తోనే నివర్తింపచేయవలయును. ఇలా వశ్యేంద్రియుడై ముల్లోకములందూ యోగమందభ్యాసము చేయవలెను.

గిరిశృంగే తథా చైత్యే వృక్షమూలేషు యో జయేత్ ।
సంనియమ్యేంద్రియగ్రామం కోష్ఠే భాండమనా ఇవ ॥ 60 ॥

పర్వత శిఖరములపైన, దేవాలయములలోన, లేదా వృక్షముల క్రింద కూర్చొని ఇంద్రియ సముదాయము నంతటిని నిగ్రహించుకొని కోష్ఠమునందు భాండమనము (ఆయా కోశములందు భాండమువలె మనస్సునుంచి) వలెనుంచి, యోగాభ్యాసమును చేయవలయును.

ఏకాగ్రం చింతయేన్నిత్యం యోగాన్నో ద్విజతే మనః ।
యేనోపాయేన శక్యేత నియంతుం చంచలం మనః ॥ 61 ॥

ఏకాగ్రచిత్తంతో నిరంతరము ఆత్మను గూర్చి చింతించవలయును. యోగంతో మనస్సు ఉద్వేగమును పొందకుండా చూచుకొనవలయును. చంచలమైన మనస్సును ఏ ఉపాయంతో నియంత్రించుటకు వీలవుతుందో దాని గూర్చియే ఆలోచించవలయును.

తత్ర యుక్తో నిషేవేత న చైవ విచలేత్తతః ।
శూన్యాగారాణి చైకాగ్రో నివాసార్థముపక్రమేత్ ॥ 62 ॥

ఆలోచించిన ఆ ఉపాయమునందు లీనమై ప్రయత్నించవలయును. ఆ సాధన నుండి ఎప్పుడును విచలితుడు కారాదు. తానునివసించుట కొరకు శూన్య గృహములనెంచుకొని ఏకాగ్రచిత్తంతో ప్రయత్నించ వలయును.

నాతి వ్రజేత్పరం వాచా కర్మణా మనసాఽపి వా ।
ఉపేక్షకో యతాహారో లబ్ధాలబ్ధసమో భవేత్ ॥ 63 ॥

యోగసాధకుడు మనోవాక్కాయ కర్మలలో దేనియందాసక్తుడుకాకూడదు. వాటియందుపేక్ష బుద్ధితో నుండి మితాహారమును తీసుకుంటూ ఏది లభించినా లభించకపోయినా లాభాలాభములయందు సమత్వ బుద్ధితోనుండ వలయును.

యశ్చైనమభినందేత యశ్చైనమభివాదయేత్ ।
సమస్తయోశ్చాప్యుభయోర్నాభిధ్యాయేచ్ఛుభాశుభమ్ ॥ 64 ॥

ఎవరు తనను ప్రశంసించినా, నమస్కరించినా వారిద్దరియందు కూడా సమత్వభావనతోనుండి వారిలో ఎవ్వరియందును మంచిచెడులు తలపరాదు.

న ప్రహృష్యేత లాభేషు నాలాభేషు చ చింతయేత్ ।
సమః సర్వేషు భూతేషు సధర్మా మాతరిశ్వనః ॥ 65 ॥

లాభాలు వచ్చినపుడు సంతోషించక, నష్టాలు వచ్చినప్పుడు క్రుంగిపోక వాయువేవిధంగా సమస్త జీవులయందు సమానభావముతోనుండునో అట్లే సర్వ ప్రాణులయందు సమానదృష్టితోనుండవలయును.

ఏవం స్వస్థాత్మనః సాధోః సర్వత్ర సమదర్శినః ।
షణ్మాసాన్నిత్యయుక్తస్య శబ్దబ్రహ్మాభివర్తతే ॥ 66 ॥

ఈ విధంగా స్వస్థచిత్తుడై సర్వజీవులయందు సమదర్శియైన సాధకుడు ఆరుమాసములు నిరంతరము యోగాభ్యాసమునందు లగ్నుడైనచో అతనికి ఓంకారరూప శబ్ద బ్రహ్మాసాక్షాత్కారము కలుగును.

వేదనార్తాన్పరాన్ దృష్ట్వా సమలోష్టాశ్మకాంచనః ।
ఏవంతు నిరతో మార్గం విరమేన్న విమోహితః ॥ 67 ॥

ఇది మట్టి పెల్ల, ఇదిరాయి, ఇది బంగారము, ఇది గొప్పది ఇది కాదు అని తలచుచు లోకులు పొందే దుఃఖములను చూచి తాను ఆ భేదభావమును వదలి పెట్టవలయును. ఎప్పుడు కూడా అజ్ఞానముతో ఈ యోగాభ్యాసమును వదలకూడదు.

అపి వర్ణావకృష్టస్తు నారీవాధర్మకాంక్షిణీ ।
తావప్యేతేన మార్గేణ గచ్ఛేతాం పరమాంగతిమ్ ॥ 68 ॥

ఈ విధముగా చేసినట్లైతే ఎంత తక్కువ కులంలో పుట్టినవాడైనా, ధర్మకాంక్షిణియైన స్త్రీ అయినప్పటికీ ఈ మార్గంలో వెళ్ళినట్లైతే పరమపదమును పొందుదురు.

అజం పురాణమజరం సనాతనం ।
యమింద్రియాతిగమగోచరం ద్విజాః ॥
అవేక్ష్య చేమాం పరమేష్ఠిసామ్యతాం ।
ప్రయాంత్యనావృత్తిగతిం మనీషిణః ॥ 69 ॥

ఓ బ్రాహ్మణులారా! మనీషులైనవారు ఇటువంటి మార్గమును అనుసరించినట్లైతే జన్మ లేనివాడు, సనాతనుడు, పురాణుడు, ముసలి తనములేనివాడు, ఇంద్రియములకు గోచరముకాని ఆ వాసుదేవుని దర్శించి, అతనితో సామ్యమును పొంది, మళ్ళీ తిరిగి రానటువంటి స్థానమును పొందుదురు.

ఇతి శ్రీ బ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే సాంఖ్యయోగ నిరూపణంనామ అష్టావింశాధిక శతతమోఽధ్యాయః ॥ 128 ॥

శ్రీ బ్రహ్మ పురాణమునందలి వ్యాస ఋషిసంవాదములో సాంఖ్యయోగ నిరూపణమను నూటఇరవై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోన త్రింశనధిక శతతమోఽధ్యాయః – నూట ఇరవై తొమ్మిదవ అధ్యాయం

సాంఖ్యయోగ నిరూపణమ్ – సాంఖ్యయోగ నిరూపణం

మునయః ఊచుః :– మునులు పలికారు.

యద్యేవం వేదవచనం కురు కర్మ త్యజేతి చ ।
కాం దిశం విద్యయా యాంతి కాం చ గచ్ఛంతి కర్మణా ॥ 1 ॥

ఓ మహర్షీ! వేదవిధిననుసరించి 'కర్మలను చేయుమని', 'కర్మలను త్యాగము చేయుమ'ని చెప్పుచున్నారు. కావున కర్మల నాచరించినందువలన ఏ గతి కలుగును? వాటిని విడిచి విద్యను జ్ఞానము నాశ్రయించినందువలన ఏ గతి కలుగును?

ఏతద్వై శ్రోతుమిచ్ఛామ స్తద్భవాన్ ప్రబ్రవీతు నః ।
ఏతదన్యోన్యవైరూప్యం వర్తతే ప్రతికూలతః ॥ 2 ॥

దానినిగూర్చి మేము వినగోరుతున్నాము. ఎందుకంటే, ఈ రెండు విధములైన వేదవాక్యములు పరస్పర విరుద్ధములుగానున్నవి కావున, వాటినిగూర్చి మాకు మీరు వివరింపుడు.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

శృణుధ్వం మునిశార్దూలా యత్పృచ్ఛధ్వం సమాసతః ।
కర్మవిద్యామయో చోభౌ వ్యాఖ్యాస్యామి క్షరాక్షరౌ ॥ 3 ॥

ఓ మునిసత్తములారా! మీరడిగినదానికి వివరముగా చెప్పెదను. కర్మమయమగు క్షరతత్త్వమును, విద్యామయ మగు అక్షరతత్త్వమును ఈ రెంటినిగూడ వ్యాఖ్యానించబోవుచున్నాను.

యాం దిశం విద్యయా యాంతి యాం చ గచ్ఛంతి కర్మణా ।
శృణుధ్వం సాంప్రతం విప్రా గహనం హ్యేతదుత్తరమ్ ॥ 4 ॥

ఓ విప్రులారా! విద్యాలాభమువలన ఏ గతిని పొందుదురో, కర్మానుష్ఠానము వలన ఏ గతిని పొందుదురో ఆ గంభీరమైన విషయమునుగూర్చి మీకిప్పుడు సమాధానముగా చెప్పుచున్నాను, వినుడు.

అస్తి ధర్మ ఇతి యుక్తం నాస్తి తత్రైవ యో వదేత్ ।
యక్షస్య సాదృశ్యమిదం యక్షస్యేదం భవేదథ ॥ 5 ॥

ధర్మమున్నది అంటూనే ధర్మము లేదని చెప్పుట పరస్పర విరుద్ధము. ఏ విధంగా? అంటే; అది యక్ష సదృశమైనది అది యక్షసదృశముకాదని అనడం వంటిది.

ద్వావిమావథ పంథానౌ యత్ర వేదాః ప్రతిష్ఠితాః।
ప్రవృత్తిలక్షణో ధర్మో నివృత్తో వా విభాషితః ॥ 6 ॥

వేదములు ప్రతిపాదించినవి రెండు మార్గములు; ఒకటి వేదానుసారియైన ప్రవృత్తిమార్గము, రెండవది విద్యానుసారియగు నివృత్తిమార్గము అని చెప్పిరి.

కర్మణా బధ్యతే జంతుర్విద్యయా చ విముచ్యతే ।
తస్మాత్కర్మ న కుర్వంతి యతయః పారదర్శినః ॥ 7 ॥

'కర్మ'అనగా అవిద్యతో జీవుడు బంధనంలో చిక్కుకుంటాడు. 'విద్య' అనగా జ్ఞానంతో ముక్తిని పొందుతాడు అందువలన తత్త్వదర్శులైన మునులు కర్మలను ఆచరించరు.

కర్మణా జాయతే ప్రేత్య మూర్తిమాన్ షోడశాత్మకః ।
విద్యయా జాయతే నిత్యమవ్యక్తం హ్యక్షరాత్మకమ్ ॥ 8 ॥

కర్మలను ఆచరించుటవలన షోడషాత్మికుడైన జీవుడు మరణించి మరల ప్రశ్నోపనిషత్ పుట్టును. విద్యతో నిత్యమైన అక్షరాత్మకమైన అవ్యక్తస్వరూపమైన ముక్తిని పొందును. (షోడశాత్మకుడనగా ప్రశ్నోపనిషత్‌లోని నాల్గవ మంత్రము చెప్పినట్లుగా అవి ముఖ్యప్రాణము, శ్రద్ధ, పంచభూతములు, ఇంద్రియములు, మనస్సు, అన్నము, వీర్యము, తపస్సు, వేదమంత్రములు, కర్మలు, లోకములు, నామము అనునవి. వీటితోనే జీవుడు జననమరణ పరంపరలో చిక్కి దేహముతోనే ఆనందించుచుండును.)

కర్మ త్వేకే ప్రశంసంతి స్వల్పబుద్ధిరతాః నరాః ।
తేన తే దేహజాలేన రమయంత ఉపాసతే ॥ 9 ॥

మందబుద్ధులైన కొందరు మానవులు ఒక్క కర్మను మాత్రమే ప్రశంసిస్తారు. ఎందుకంటే అదే వారికి రుచికరము. అందువల్లనే వారు మాటిమాటికి దేహజాలములో చిక్కుకొని, దానినే సేవిస్తూ ఆనందిస్తారు.

యే తు బుద్ధిం పరాం ప్రాప్తా ధర్మనైపుణ్యదర్శినః ।
న తే కర్మ ప్రశంసంతి కూపం నద్యాం పిబన్నివ ॥ 10 ॥

ఎవరైతే ధర్మతత్త్వమునెరిగినవారు పరావిద్యనాశ్రయించినవారుంటారో, అటువంటివారు, నదీజలమును త్రాగువారు బావినీటిని మెచ్చునట్లుగా, కర్మమార్గమును మెచ్చుకొనరు.

కర్మణాం ఫలమాప్నోతి సుఖదుఃఖే భవాభవౌ ।
విద్యయా తదవాప్నోతి యత్ర గత్వా న శోచతి ॥ 11 ॥

కర్మానుష్ఠానము నాచరించినందువలన సుఖదుఃఖములను, జననమరణములను దానికి ఫలముగా పొందును. విద్యచేతనైతే ఈ సుఖదుఃఖములను, జననమరణములనుకాక ఎక్కడికి వెళ్ళితే ఇక దుఃఖమనేది కలుగదో అటువంటి స్థానమును పొందును.

యత్ర గత్వా న మ్రియతే యత్ర గత్వా న జాయతే ।
న జీయతే యత్ర గత్వా యత్ర గత్వా న వర్ధతే ॥ 12 ॥

ఎక్కడికి వెళ్ళితే మరణం లేదో, ఎక్కడికి వెళ్ళితే పుట్టుక లేదో, ఎక్కడికి వెళ్ళితే హాని కలుగదో, ఎక్కడికి వెళ్లితే వృద్ధిలేదో,

యత్ర తద్బ్రహ్మ పరమ మవ్యక్తమచలం ధ్రువమ్ ।
అవ్యాకృత మనాయామ మమృతం చాధియోగవిత్ ॥ 13 ॥

ఎక్కడైతే అవ్యక్తము, అచలము, ధ్రువము, అవ్యాకృతము, అనామయము, అమృతము, యోగముతో లభించే అట్టి పరబ్రహ్మ స్థానమును పొందుదురో,

ద్వంద్వైర్న యత్ర బాధ్యంతే మానసే న చ కర్మణా ।
సమాః సర్వత్ర మైత్రాశ్చ సర్వభూతహితే రతాః ॥ 14 ॥

అటువంటివారు అక్కడ సుఖదుఃఖములనే ద్వంద్వములతోను బాధపడరు. మానసికవికారముల ద్వారాగాని, కర్మల ద్వారాగాని కష్టపడరు. అంతేకాక వారు సమస్త ప్రాణులయందు మైత్రీ భావమును, సమభావమును కలిగియుండి, సమస్తభూతములయందు హితమును కోరేవారుగానుందురు.

విద్యామయోఽన్యః పురుషో ద్విజాః కర్మమయోఽపరః ।
విప్రా శ్చంద్రసమస్పర్శః సూక్ష్మయా కలయా స్థితః ॥ 15 ॥

ఓ బ్రాహ్మణులారా! జీవుడు విద్యామయుడు, కర్మమయుడని రెండు విధములు. వీరిలో, కర్మమయుడైన వాడు చంద్రునితో సమానమైన స్పర్శ కలిగి, చంద్రకళవంటి సూక్ష్మకళారూపముగా నుండును.

తదేతదృషిణా ప్రోక్తం విస్తరేణానుగీయతే ।
న వక్తుం శక్యతే ద్రష్టుం చక్రతంతుమివాంబరే ॥ 16 ॥

ఈ మాటలను ఋగ్వేదపురుషుడు చెప్పెను. దానినే విస్తరించి అనుగానము చేయుదురు. వస్త్రములోని చక్రతంతువువలెనుండు ఆ సూక్ష్మతత్త్వమును మాటలతో చెప్పుటకుగాని, ఇంద్రియములతో చూచుటకుగాని శక్యముగాదు.

ఏకాదశవికారాత్మా కలాసంభారసంభృతః ।
మూర్తిమానితి తం విద్యాత్ విప్రాః కర్మ గుణాత్మకమ్ ॥ 17 ॥

ఓ విప్రులారా! పంచతన్మాత్రలు, గుణత్రయము, మనోబుద్ధి అహంకారములు అనే అంతఃకరణత్రయము ఏకాదశతత్త్వవికారములు, షోడశకళలు, కర్మలు, గుణములు కలిగిన తత్త్వముగా ఆ కర్మమయపురుషుని తెలుసుకొనవలయును.

దేవో యః సంశ్రితస్తస్మిన్ బుద్ధీందురివ పుష్కరే ।
క్షేత్రజ్ఞం తం విజానీయాన్నిత్యం యోగజితాత్మకమ్ ॥ 18 ॥

ఎవడైతే షోడశకళామయమగు శరీరము నాశ్రయించి, పుష్కర జలమునందు ప్రతిబింబించిన చంద్రునిలాగ ఉండి, నిత్యయోగసాధనచే జయించబడిన తత్త్వమైయుండునో అతడే క్షేత్రజ్ఞుడని తెలుసుకొనవలయును.

తమో రజశ్చ సత్త్వం చ జ్ఞేయం జీవగుణాత్మకమ్ ।
జీవ మాత్మగుణం విద్యాదాత్మానం పరమాత్మనః ॥ 19 ॥

సత్వరజస్తమస్సులనేవి మూడును జీవుని గుణములు. జీవుడు ఆత్మయొక్క గుణము. ఆత్మ పరమాత్మ యొక్కగుణమని తెలుసుకొనవలయును.

సచేతనం జీవగుణం వదంతి సచేష్టతే జీవగుణం చ సర్వమ్ ।
తతః పరం క్షేత్రవిదో వదంతి ప్రకల్పయంతో భువనాని సప్త ॥ 20 ॥

కనిపించే గుణత్రయాత్మకమైన దృశ్యప్రపంచమంతయును, సప్తలోకములును ఈ జీవుని సృష్టియే అని క్షేత్రతత్త్వమును తెలిసినవారందురు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ప్రకృత్యాస్తు వికారా యే క్షేత్రజ్ఞాస్తే పరిశ్రుతాః ।
తే చైనం న ప్రజానంతి న జానాతి స తానపి ॥ 21 ॥

ప్రకృతియొక్క వికారములగు ఈ కనబడే ప్రపంచము, క్షేత్రజ్ఞుడనబడే ఆత్మతత్త్వము అనే వీటిని అతడు కూడా ఎరుగడు. అవికూడా అతని నెరుగవు.

తైశ్చైవ కురుతే కార్యం మనఃషష్ఠై రిహేంద్రియైః ।
సుదాంతైరివ సంయంతా దృఢః పరమవాజిభిః ॥ 22 ॥

బలిష్ఠుడు, సమర్థుడు అయిన సారథి ఉత్తమమైన గుఱ్ఱములతో రథమును నడిపినట్లు, మనస్సుతో పంచ జ్ఞానేంద్రియములతో ఆయా పనులను చేయించును.

ఇంద్రియేభ్యః పరం హ్యర్థా అర్థేభ్యః పరమం మనః ।
మనసస్తు పరా బుద్ధిర్బుద్ధేరాత్మా మహాన్ పరః ॥ 23 ॥

ఇంద్రియములకంటే వాటి విషయములను అనుభవించేవి (శబ్దాది తన్మాత్రలు) శ్రేష్ఠమైనవి, విషయముల కంటే మనస్సు శ్రేష్ఠము. మనస్సుకంటే బుద్ధి శ్రేష్ఠము. బుద్ధికంటే మహత్తత్త్వమైన హిరణ్య గర్భుడనుతత్త్వము శ్రేష్ఠము.

మహతః పరమవ్యక్త మవ్యక్తాత్పరతోఽమృతమ్ ।
అమృతాన్న పరం కించిత్సా కాష్ఠా పరమాగతిః ॥ 24 ॥

మహత్తుకంటె జగద్బీజమైన అవ్యక్తమనే ఈశ్వరతత్త్వము శ్రేష్ఠము. మూలతత్త్వము కంటె అమృతత్త్వము శ్రేష్ఠము. వీటిలో ఒక దానికంటె ఒకటి సూక్ష్మతరములు. అమృతత్త్వము కంటె సూక్ష్మతరము లేదు. అదే అందరూ చేరుకోవలసిన చివరి గమ్యస్థానము.

ఏవం సర్వేషు భూతేషు గూఢాత్మా న ప్రకాశతే ।
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః ॥ 25 ॥

ఈ విధంగా సమస్త భూతములలోపల రహస్యంగా దాగివుండే పరమాత్మతత్త్వము బయటకు ప్రకాశింపక కనబడకయుండును. సూక్ష్మ దృష్టిగల జ్ఞానులు మాత్రమే తమ నిశితమైన బుద్ధితో దానిని దర్శించగలరు.

అంతరాత్మని సంలీయ మనః షష్ఠాని మేధయా ।
ఇంద్రియైరింద్రియార్థాంశ్చ బహుచిత్తమచింతయన్ ॥ 26 ॥

జ్ఞానేంద్రియములనైదింటిని మనస్సున లీనముచేసి తన మేధస్సుతో ఆ ఆరింటితో సుఖ విషయములను గూర్చి ఆలోచన చేయకుండ,

ధ్యానేఽపి పరమం కృత్వా విద్యాసంపాదితం మనః ।
అనీశ్వరః ప్రశాంతాత్మా తతో గచ్ఛేత్పరం పదమ్ ॥ 27 ॥

జ్ఞానంతో సుసంపన్నమైన మనస్సును ధ్యానంలో లీనంచేసి, తనపై ఇంద్రియాలేవీ దాడిచేయకుండా రక్షించుకుని ప్రశాంతమైన మనస్సు గలిగినవాడు తరువాత పరమపదాన్ని చేరుతాడు.

ఇంద్రియాణాం తు సర్వేషాం వశ్యాత్మా చలితస్మృతిః ।
ఆత్మనః సంప్రదానేన మర్త్యో మృత్యుముపాశ్నుతే ॥ 28 ॥

ఇంద్రియాలన్నింటికి వశమైనవాడు, చలించే మనస్సుకల వాడు, తన ఆత్మను ధ్యానంపై నిలుపని మానవుడు మృత్యువును, సంసారాన్ని పొందుతాడు.

విహత్య సర్వసంకల్పాన్ సత్త్వే చిత్తం నివేశయేత్ ।
సత్త్వే చిత్తం సమావేశ్య తతః కాలంజరో భవేత్ ॥ 29 ॥

కోరికలన్నీ అణచుకొని చిత్తాన్ని సత్త్వగుణంలో నిలపాలి. అలా నిలిపి తత్త్వవిచారణా పరుడు కావాలి.

చిత్తప్రసాదేన యతిర్జహాతీహ శుభాశుభమ్ ।
ప్రసన్నాత్మాఽఽత్మని స్థిత్వా సుఖమత్యంత మశ్నుతే ॥ 30 ॥

యతి అయినవాడు చిత్త ప్రసాదంతో ఇది శుభం, ఇది అశుభం అనే భేదబుద్ధిని వదల గలడు. అప్పుడతడు తనలోనే ప్రసన్నాత్ముడై మిక్కిలి సుఖముననుభవించగలడు.

లక్షణం తు ప్రసాదస్య యథా స్వప్నే సుఖం భవేత్ ।
నిర్వాతే వా యథా దీపో దీప్యమానో న కంపతే ॥ 31 ॥

చిత్తప్రసాదము యొక్క లక్షణము గాఢసుషుప్తి అవస్థలో (నిద్రలో) సుఖము పొందినట్లుగావుంటుంది, స్వచ్ఛమైనది కూడా. అప్పుడా చిత్తం గాలిలేనిచోట దీపమేవిధంగా కదలకుండా వుండి ప్రకాశిస్తుందో అలా నిశ్చలంగా వుంటుంది.

ఏవం పూర్వాపరే రాత్రే యుంజన్నాత్మానమాత్మనా ।
లఘ్వాహారో విశుద్ధాత్మా పశ్యత్యాత్మానమాత్మని ॥ 32 ॥

ఈ విధంగా పూర్వాపర రాత్రులలో ఆత్మ పరమాత్మతో కలసివుంటుంది. మితాహారి పరిశుద్ధాత్మకలవాడు మాత్రమే అంతర్ముఖుడై తనలోని పరమాత్మను దర్శించగలడు.

రహస్యం సర్వవేదానా మనౌపమ్యమనామయమ్ ।
ఆత్మప్రత్యాయకం శాస్త్రమిదం పుత్రానుశాసనమ్ ॥ 33 ॥

ఈ తత్త్వవిచార శాస్త్రం సర్వవేద రహస్యమైనది. దీనికి పోలిక మరొకటి లేదు. ఇది ఏ పురాణేతిహాసాల ద్వారానో, ఆగమాల ద్వారానో లభించదు. ఇది పరమాత్మను తెలుసుకొనుట కుద్దేశించిన శాస్త్రం. దీనిని ఉత్తమమైన శిష్యునికి గాని పుత్రునికి గాని బోధించాలి.

ధర్మాఖ్యానేషు సర్వేషు సత్యాఖ్యానేషు యద్వసు ।
దశవర్షసహస్రాణి నిర్మథ్యామృత ముద్ధృతమ్ ॥ 34 ॥

ధర్మాఖ్యానాలన్నింటిలో, సత్యాఖ్యానాలతో సారభూతమైన ఏ వస్తువున్నదో దానిని పదివేల సంవత్సరాల వరకు మథించి తత్త్వవేత్తలైనవారు ముక్షువుల నుద్ధరించడానికి ఈ అమృతాన్ని ప్రకాశింపజేశారు.

నవనీతం యథా దధ్నః కాష్ఠాదగ్నిర్యథైవ చ ।
తథైవ విదుషాం జ్ఞానం ముక్తిహేతోః సముద్ధృతమ్ ॥ 35 ॥

పెరుగును చిలికి వెన్న దీసినట్లుగా, కట్టెలను రాపిడి చేసి అగ్నిని పుట్టించినట్లుగా దీనిని బయటకు తీశారు. మోక్షాన్ని గోరే వారి గూర్చి దీనిని ప్రకటించారు. అటువంటి దీనిని విద్వాంసుల జ్ఞానంగా తెలుసుకోవాలి.

స్నాతకానామిదం శాస్త్రం వాచ్యం పుత్రానుశాసనమ్ ।
తదిదం నాప్రశాంతాయ నాదాంతాయ తపస్వినే ॥ 36 ॥

వేదవిద్యనుఅధ్యయనం చేసిన స్నాతకునికే ఈ శాస్త్రా నుపదేశించాలి. ప్రశాంతచిత్తం లేనివానికి, ఇంద్రియనిగ్రహంలేనివానికి, తపస్సును చేయనివానికి తెలుపరాదు.

నావేదవిదుషే వాచ్యం తథా నానుగతాయ చ ।
నాసూయకాయానృజవే న చానిర్దిష్టకారిణే ॥ 37 ॥

వేదార్థజ్ఞానంలేని వానికి, పెద్దలననుసరించనివానికి, అసూయ గలవానికి, సత్యవర్తనం లేనివానికి, చెప్పినట్లు చేయనివానికి ఉపదేశించకూడదు.

న తర్కశాస్త్రదగ్ధాయ తథైవ పిశునాయ చ ।
శ్లాఘినే శ్లాఘనీయాయ ప్రశాంతాయ తపస్వినే ॥ 38 ॥

తర్కశాస్త్రజ్ఞానంతో బుద్ధిచెడినవానికి, ఇతరులపై చాడీలను చెప్పేవానికి, తనను తాను పొగడుకునే వానికి ఉపదేశించకూడదు. ఎవడైతే ప్రశంసనీయుడో, ప్రశాంతంగావుంటాడో, తపస్సునాచరిస్తాడో,

ఇదం ప్రియాయ పుత్రాయ శిష్యాయానుగతాయ తు ।
రహస్యధర్మం వక్తవ్యం నాన్యస్మై తు కథంచన ॥ 39 ॥

ఎవడు తన కనుకూలంగా ప్రవర్తించే శిష్యుడో లేదా తన ననుసరించే ప్రియ పుత్రునికి గాని ఈ రహస్యమైన ధర్మాన్ని గూర్చి చెప్పాలి. అంతేకాని, ఇతరులకెవరికీ ఎప్పుడూ బోధించకూడదు.

యదప్యస్య మహీం దద్యాద్రత్నపూర్ణా మిమాం నరః ।
ఇదమేవ తతః శ్రేయ ఇతి మన్యేత తత్త్వవిత్ ॥ 40 ॥

రత్నాలతోనిండిన భూమిని ఇచ్చినా, తత్త్వవేత్త అయిన మానవుడు ఈ శాస్త్రజ్ఞానాన్నే దానికంటే శ్రేష్ఠమని భావిస్తాడు.

అతో గుహ్యతరార్థం త దధ్యాత్మ మతిమానుషమ్ ।
యత్తన్మహర్షిభి ర్దృష్టం వేదాంతేషు చ గీయతే ॥ 41 ॥

అందువలన ఉపనిషత్తులన్నింటిలో ఏది వర్ణించబడిందో, మహర్షులందరూ దేనిని దర్శించారో అటువంటి మానవాతీతమైన, మిక్కిలి రహస్యమైన అధ్యాత్మజ్ఞానాన్ని గూర్చి, (మీకు నేనుపదేశిస్తాను.)

తద్యుష్మభ్యం ప్రయచ్ఛామి యన్మాం పృచ్ఛత సత్తమాః ।
యన్మే మనసి వర్తేత యస్తు వో హృది సంశయః ॥ 42 ॥

ఓ ముని శ్రేష్ఠులారా! మీరు నన్నడిగిన దాని కంతంటికి సమాధానంగా మీకు నా మనస్సులో నిశ్చయంగావున్న దాని నంతటిని వివరించాను. ఇంకా మీకేమైనా సందేహముంటే అడగండి, దానిని మీకు చెబుతాను.

మునయః ఊచుః :– మునులు పలికారు.

అధ్యాత్మం విస్తరేణేహ పునరేవ వదస్వ నః ।
యదధ్యాత్మం యథా విద్మో భగవన్ ఋషిసత్తమ ॥ 43 ॥

ఓ ఋషిశ్రేష్ఠుడా! మాకు మళ్ళీ అధ్యాత్మమంటే ఏమిటో, దానిని ఎట్లు తెలుసుకోవాలో వినవలెనని కుతూహలముగానున్నది. కావున ఆ అధ్యాత్మ జ్ఞానమునుగూర్చి విస్తారముగా అనుగ్రహించండి.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

అధ్యాత్మం యదిదం విప్రాః పురుషస్యేహ పఠ్యతే ।
యుష్మభ్యం కథయిష్యామి తస్య వ్యాఖ్యాఽవధార్యతామ్ ॥ 44 ॥

ఓ విప్రులారా! ఏ పరమపురుషునియొక్క ఉనికి దేనియందు కలదో, అదే అధ్యాత్మము. దానిని వ్యాఖ్యాన రూపముగా మీకు చెప్పబోవుచున్నాను. శ్రద్ధగా వినుడు.

భూమిరాపస్తథా జ్యోతిర్వాయు రాకాశమేవ చ ।
మహాభూతాని యశ్చైవ సర్వభూతేషు భూతకృత్ ॥ 45 ॥

పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములనే పంచమహాభూతములను, వాటియందే యున్న సమస్త ప్రాణులను, ప్రతిశరీరమునందు ఈ పంచభూతములుండేటట్లుగా సృష్టిచేసిన ఆ పరమాత్మయే అధ్యాత్మము.

మునయః ఊచుః :– మునులు పలికారు.

ఆకారం తు భవేద్యస్య యస్మిన్ దేహం న పశ్యతి ।
ఆకాశాద్యం శరీరేషు కథం తదుపవర్ణయేత్ ॥ 46 ॥

ఈ పంచభూతములలో దేనికి రూపమున్నది? దేనికి రూపము లేదు? ఈ ఆకాశాది పంచభూతములు శరీరములయందెట్లుండును? దానిని ఏ విధంగా వర్ణించవలెను?

ఇంద్రియాణాం గుణాః కేచిత్కథం తానుపలక్షయేత్ ।

ఈ ఇంద్రియములకున్న గుణములేమిటి? వాటి నెట్లు గుర్తించవలయును?

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

ఏతద్వో వర్ణయిష్యామి యథావదనుదర్శనమ్ ।
శృణుధ్వం తదిహైకాగ్ర్యాద్యథాతత్త్వం యథా చ తత్ ॥ 47 ॥

నేను దర్శించినదానిని ఉన్నదున్నట్లుగా వర్ణించబోవుచున్నాను. అది ఎట్లుండునో దాని తత్త్వమేమిటో దానిని గూర్చి మీరు ఇక ఏకాగ్రచిత్తముతో వినుడు.

శబ్దః శ్రోత్రం తథా ఖాని త్రయమాకాశలక్షణమ్ ।
ప్రాణశ్చేష్టా తథా స్పర్శ ఏతే వాయుగుణాస్త్రయః ॥ 48 ॥

ఆకాశలక్షణములు మూడు. అవి ఏవనగా – శబ్దము ఆకాశముయొక్క గుణము, చెవి ఆ శబ్దమును గ్రహించు ఇంద్రియము. నవరంధ్రములతో కూడుకొనియున్న శరీరము దానికి, అనగా – ఆ శూన్యమునకు స్థానము. స్పర్శ అనునది వాయువుయొక్క గుణము, శరీరమునందున్న ప్రాణవాయువు దాని రూపము. చేష్ట, అనగా – కదలిక దాని వ్యాపారము. ఈ మూడును వాయువునకు లక్షణములు.

రూపం చక్షుర్విపాకశ్చ త్రిధా జ్యోతిర్విధీయతే ।
రసోఽథ రసనం స్వేదో గుణాస్త్వేతే త్రయోఽంభసామ్ ॥ 49 ॥

రూపమనునది అగ్నికి గుణము, కన్ను దాని ఇంద్రియము, శరీరమునందు విపాకము దాని వ్యాపారము. నీటికి రసము, అనగా – రుచియనునది గుణము, నాలుక దాని ఇంద్రియము, శరీరమున చెమట దాని రూపము, ఈ మూడును నీటి లక్షణములు.

ఘ్రేయం ఘ్రాణం శరీరం చ భూమే రేతే గుణాస్త్రయః ।
ఏతావానింద్రియగ్రామో వ్యాఖ్యాతః పాంచభౌతికః ॥ 50 ॥

భూమికి గంధము గుణము, ముక్కు దానికి ఇంద్రియము, శరీరము దాని రూపము. ఈ విధముగా ఈ శరీరము పాంచభౌతికమని వివరించబడినది.

వాయోః స్పర్శో రసో௨ద్భ్యశ్చ జ్యోతిషో రూపముచ్యతే ।
ఆకాశప్రభవః శబ్దో గంధో భూమిగుణః స్మృతః ॥ 51 ॥

వాయువుకు స్పర్శ, నీటికి రసము, తేజస్సుకు రూపము, ఆకాశమునకు శబ్దము, భూమికి గంధము గుణములుగా చెప్పిరి.

మనో బుద్ధిః స్వభావశ్చ గుణా ఏతే స్వయోనిజాః ।
తే గుణానతివర్తంతే గుణేభ్యః పరమా మతాః ॥ 52 ॥

మనస్సు, బుద్ధి, స్వభావము అనునవి స్వతఃసిద్ధములైనవి. ఇవి, ఈ భూత గుణముల కతీతములైనవి. అందువలననే ఇవి వాటికంటేకూడా శ్రేష్ఠములైనవి.

యథా కూర్మ ఇవాంగాని ప్రసార్య సంనియచ్ఛతి ।
ఏవమేవేంద్రియగ్రామం బుద్ధిశ్రేష్ఠో నియచ్ఛతి ॥ 53 ॥

తాబేలు ఏ విధముగానైతే తన అవయవములను చాచుకొని, తిరిగి తనలోనికి ఇముడ్చుకొంటుందో, అట్లే బుద్ధిమంతుడు తన బుద్ధితో ఇంద్రియములను నిగ్రహించుకొనును.

యదూర్ధ్వం పాదతలయోరర్వాగధశ్చ పశ్యతి ।
ఏతస్మిన్నేవ కృత్యే సా వర్తతే బుద్ధిరుత్తమా ॥ 54 ॥

ఈ బుద్ధికి, పాదతలములయందు, ప్రక్కకు, క్రింది భాగమును చూచుటయందెప్పుడు ప్రవర్తించునో దానిని ఉత్తమబుద్ధియందురు.

గుణైస్తు నీయతే బుద్ధిర్బుద్ధిరేవేంద్రియాణ్యపి ।
మనఃషష్ఠాని సర్వాణి బుద్ధ్యభావాత్కుతో గుణాః ॥ 55 ॥

శబ్దాదివిషయములు బుద్ధిని ప్రేరేపించును. బుద్ధి ఇంద్రియములను ప్రేరేపించును. మనస్సుతో కలిసి ఇంద్రియములు ఆరు బుద్ధియొక్క ప్రేరణ లేకుంటే ఇక గుణవిషయానుభము ఎక్కడిది?

ఇంద్రియాణి నరైః పంచ షష్ఠం తన్మన ఉచ్యతే ।
సప్తమీం బుద్ధిమేవా௨௨హుః క్షేత్రజ్ఞం విద్ధి చాష్టమమ్ ॥ 56 ॥

కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మము అనునవి ఐదింద్రియములు. ఆరవది మనస్సు. ఏడవది బుద్ధి, క్షేత్రజ్ఞుడైన జీవుడు ఎనిమిదవ తత్త్వముగా తెలుసుకొనవలయును. (క్షేత్రమనగా దేహము. ఈ దేహమునందుండి ఆయా కర్మలను చేయుచు వాటివల్ల వచ్చే ఫలములననుభవించే జీవుడు క్షేత్రజ్ఞుడు,)

చక్షురాలోకనాయైవ సంశయం కురుతే మనః ।
బుద్ధిరధ్యవసానాయ సాక్షీ క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥ 57 ॥

కన్ను చూచుటకొరకే యున్నది. మనస్సు సంశయమును కల్గించును. బుద్ధి 'ఇది ఇటువంటిది' అనే నిశ్చయ జ్ఞానమును కలిగించును. ఈ క్షేత్రజ్ఞుడు (వీటియొక్క సహాయంతో ఆయా పనుల చేస్తూ) సాక్షిగా యుండును.

రజస్తమశ్చ సత్త్వం చ త్రయ ఏతే స్వయోనిజాః ।
సమాః సర్వేషు భూతేషు తాన్ గుణానుపలక్షయేత్ ॥ 58 ॥

సత్త్వరజస్తమో గుణములనేవి స్వతఃసిద్ధములైనవి. ఇవి అన్ని ప్రాణులయందు సమత్వముతోనే యుండును. కాని జీవులయందు ఏగుణము అధికముగానుండునో దానినిబట్టి ఆయా ప్రవృత్తిని తెలుసుకొనవలయును.

తత్ర యత్ప్రీతిసంయుక్తం కించిదాత్మని లక్షయేత్ ।
ప్రశాంతమివ సంయుక్తం సత్త్వం తదుపధారయేత్ ॥ 59 ॥

దానిలో, అంతఃకరణములో ఎప్పుడైతే కొంచం ప్రీతి, ఆనందం కలుగుతుందో, మిక్కిలి ప్రశాంతత ఏర్పడుతుందో అప్పుడది సత్త్వగుణలక్షణమని తెలుసుకొనవలయును.

యత్తు సంతాపసంయుక్తం కాయే మనసి వా భవేత్ ।
ప్రవృత్తం రజ ఇత్యేవ తత్ర చాప్యుపలక్షయేత్ ॥ 60 ॥

శరీరములోను, మనస్సులోను తాపము కలిగినట్లుగా అనిపిస్తే అది రజోగుణప్రవృత్తియని తెలుసుకొన వలయును.

యత్తు వ్యామోహసంయుక్తమవ్యక్తం విషమం భవేత్ ।
అప్రతర్క్యమవిజ్ఞేయం తమస్తదుపధారయేత్ ॥ 61 ॥

అంతఃకరణములో మిక్కిలి మోహము, మూఢత్వము, బద్ధకము, ఏమరుపాటు, నిద్ర మున్నగునవి, తెలియవలసినదానినిగూడ తెలుసుకొనలేక పోయినప్పుడు అది తమోగుణలక్షణముగా నెరుగవలయును.

ప్రహర్షః ప్రీతిరానందః స్వామ్యం స్వస్థాత్మచిత్తతా ।
అకస్మాద్యది వా కస్మాద్వదంతి సాత్త్వికాన్ గుణాన్ ॥ 62 ॥

ఎప్పుడైనా అకస్మాత్తుగా గాని, లేదా, ఏదో ఒక కారణంవలనగాని మిక్కిలి ప్రహర్షమో, ప్రీతియో,ఆనందమో, స్వామ్యమో, స్వస్థచిత్తమో అంతఃకరణమునందు కలిగినట్లయితే దాన్ని సాత్త్వికగుణప్రభావముగా పెద్దలు చెప్పుదురు.

అభిమానో మృషావాదో లోభో మోహస్తథాఽక్షమా ।
లింగాని రజసస్తాని వర్తంతే హేతుతత్త్వతః ॥ 63 ॥

అభిమానంగాని, వ్యర్థముగా మాట్లాడుటగాని, అసత్యభాషణముగాని, లోభముగాని, మోహముగాని, అసహనం గాని అంతః కరణమునందు కలిగినట్లయితే దానికి కారణం రజోగుణప్రభావమని తెలుసుకొనవలయును.

తథా మోహః ప్రమాదశ్చ తంద్రీ నిద్రాఽప్రబోధితా ।
కథంచిదభివర్తంతే విజ్ఞేయాస్తామసా గుణాః ॥ 64 ॥

అట్లే, మిక్కిలి మోహము, ప్రమాదము, అలసత్వము, నిద్ర, అజ్ఞానము మున్నగుగుణములు అంతఃకరణము నందున్నట్లుగా గుర్తించినట్లయితే, అది తామసగుణప్రభావమని తెలుసుకొనవలయును.

మనః ప్రసృజతే భావం బుద్ధిరధ్యవసాయినీ ।
హృదయం ప్రియమేవేహ త్రివిధా కర్మచోదనా ॥ 65 ॥

మనలో భావములను సృష్టించేది మనస్సు నిశ్చయ జ్ఞానమును, అధ్యవసాయమును కలిగించేది బుద్ధి, ఆనందాదిభావములతో అనుభూతిని పొందేది హృదయంఅని కర్మల కొరకీ జీవుని ప్రేరేపించే తత్త్వములు మూడు విధములు.

ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః ।
మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా పరః స్మృతః ॥ 66 ॥

శబ్దస్పర్శరూపరసగంధములనే విషయములు ఇంద్రియములకంటే సూక్ష్మతరములు. విషయముల కంటే సూక్ష్మతరము మనస్సు. మనస్సుకంటే సూక్ష్మతరము బుద్ధి, బుద్ధికంటే సూక్ష్మతరమై, వీటన్నింటిచేత పనిని చేయించువాడు జీవుడు.

బుద్ధి రాత్మా మనుష్యస్య బుద్ధి రేవాఽఽత్మనాయికా ।
యదా వికురుతే భావం తదా భవతి సా మనః ॥ 67 ॥

మనుష్యునకు ఆత్మయే బుద్ధి, ఆత్మనాయికకూడా బుద్ధియే. ఆ బుద్ధిలో సంకల్పవికల్పములనే భావమేర్పడినపుడు కలిగే స్థితియే మనస్సు.

ఇంద్రియాణాం పృథక్భావాత్ బుద్ధిర్వికురుతే హ్యను ।
శృణ్వతీ భవతి శ్రోత్రం స్పృశతీ స్పర్శ ఉచ్యతే ॥ 68 ॥

ఇంద్రియాల వేర్వేరు వ్యాపారాలను బుద్ధియే నిర్వహిస్తున్నది. అదే విధముగా, స్వతంత్రశక్తిగల బుద్ధి వింటే శ్రోత్రమనే ఇంద్రియము, స్పృశిస్తే త్వక్ అనే ఇంద్రియమని చెప్పుదురు.

పశ్యన్తీ చ భవేద్దృష్టీ రసన్తీ రసనా భవేత్ ।
జిఘ్రన్తీ భవతి ఘ్రాణం బుద్ధిర్వికురుతే పృథక్ ॥ 69 ॥

ఆ బుద్ధి చూస్తే చక్షురింద్రియము, రుచి చూచినచో రసనేంద్రియము, వాసన చూచినచో ఘ్రాణేంద్రియము అని వేరు వేరుగా వ్యవహరించబడును.

ఇంద్రియాణి తు తాన్యాహుస్తేషాం వృత్త్యా వితిష్ఠతి ।
తిష్ఠతీ పురుషే బుద్ధిర్బుద్ధిభావవ్యవస్థితా ॥ 70 ॥

బుద్ధినే ఇంద్రియాలుగా పలుకుతారు. బుద్ధి ఆ ఇంద్రియాల వ్యాపారంలో వర్తిస్తుంది. జీవుని ఆశ్రయించి ఉండే ఈ బుద్ధి ఆయా భావములనుబట్టి వ్యవస్థ నొందుచుండును.

కదాచిల్లభతే ప్రీతిం కదాచిదపి శోచతి ।
న సుఖేన చ దుఃఖేన కదాచిదిహ ముహ్యతే ॥ 71 ॥

ఒకానొకసారి సంతోషము నొందును, ఒకానొకసారి దుఃఖమును పొందును, మరొకసారి సుఖ దుఃఖము లేవీ తెలియని మూఢస్థితి నొందును. ఈ బుద్ధి ఈ మూడు ప్రభావములకతీతమైనది.

స్వయం భావాత్మికా భావాంస్త్రీనేతానాభివర్తతే ।
సరితాం సాగరో భర్తా మహా వేలామివోర్మిమాన్ ॥ 72 ॥

నదులన్నింటికీ భర్తయైన సముద్రుడు నదులను, తన నురగలతో కూడుకొనియున్నవాడై చెలియలి కట్టను కూడా తనయందెట్లు ఇముడ్చుకొనునో, అట్లే, స్వయంభావాత్మికమైన బుద్ధికూడా ఆయా భావములను తనలో నిముడ్చుకొనును.

యదా ప్రార్థయతే కించిత్తదా భవతి సా మనః ।
అధిష్ఠానే చ వై బుద్ధ్యా పృథగేతాని వై స్మరేత్ ॥ 73 ॥

ఎప్పుడైతే కొంచం ప్రార్థిస్తుందో అప్పుడా బుద్ధి మనస్సుగా మారుతుంది. అధిష్ఠానమునందు బుద్ధి తిరిగి వీటిని స్మరిస్తుంది.

ఇంద్రియాణి చ మేధ్యాని విచేతవ్యాని కృత్స్నశః ।
సర్వాణ్యేవానుపూర్వ్యేణ యద్యదా చ విధీయతే ॥ 74 ॥

మేధ్యములైన ఇంద్రియములను నేరుగా విడదీసి చూడవలయును. ఒకదాని తర్వాత నొకటిగా ఆనుపూర్వినసరించి ఏవి విధించబడునో గ్రహించ వలయును.

అవిభాగమనా బుద్ధిర్భావో మనసి వర్తతే ।
ప్రవర్తమానస్తు రజః సత్త్వమప్యతివర్తతే ॥ 75 ॥

బుద్ధి అవిభాగముగానున్నపుడు యేయే భావమునందు ప్రవర్తించునో అప్పుడా మూడు గుణములు తమ ప్రభావమును చూపును. ప్రవృత్తి కాలమునందు రజోగుణము సత్త్వగుణముపై తన ప్రభావము చూపును.

యే వై భావేన వర్తంతే సర్వేష్వేతేషు తే త్రిషు ।
అన్వర్థాన్ సంప్రవర్తంతే రథనేమిమరా ఇవ ॥ 76 ॥

ఈ సత్త్వరజస్తమములనే మూడు గుణములు రథమునకుండే చక్రముయొక్క నాభి నేముల మధ్యన ఉండే చక్రపు అరలఆకులవలె బుద్ధియందు ఇమిడియుండి, ఆయా విషయములననుసరించి ప్రవర్తించుచుండును.

ప్రదీపార్థం మనః కుర్యాదింద్రియైర్బుద్ధిసత్తమైః ।
నిశ్చరద్భిర్యథాయోగ ముదాసీనైర్యదృచ్ఛయా ॥ 77 ॥

యోగాభ్యాసమునందెట్లు నిశ్చలముగాను ఉదాసీనముగా నుండు బుద్ధిమంతులైనవారు, ఈ ఇంద్రియములను మనస్సును ఆత్మతత్త్వమును సాక్షాత్కరించుకొనుటకే వినియోగించుకొనవలెను.

ఏవం స్వభావమేవేదమితి బుద్ధ్వా న ముహ్యతి ।
అశోచన్ సంప్రహృష్యంశ్చ నిత్యం విగతమత్సరః ॥ 78 ॥

ఇట్లు సుఖదుఃఖముల కతీతుడై, మాత్సర్యమును వదిలినవాడై ఇది దీని స్వభావమని తెలిసినవాడు బుద్ధితో మూఢస్థితి నొందదు.

న హ్యాత్మా శక్యతే ద్రష్టుమింద్రియైః కామగోచరైః ।
ప్రవర్తమానైరనేకైర్దుర్ధరై రకృతాత్మభిః ॥ 79 ॥

మనస్సును తన యధీనమునందుంచు కొననిదే, తమ తమ విషయముల మీద ఇంద్రియములు స్వేచ్ఛగా ప్రవర్తించుచున్నంతవరకు ఆత్మసాక్షాత్కారము పొందుట సాధ్యము కాదు.

తేషాం తు మనసా రశ్మీన్ యదా సమ్యక్ నియచ్ఛతి ।
తదా ప్రకాశతే హ్యాత్మా దీపదీప్తా యథాఽఽకృతిః ॥ 80 ॥

ఇంద్రియములను మనస్సు యొక్క సహాయముతో వివేకముతో, నిగ్రహించినట్లయితే, చీకట్లు తొలగగానే లోకమునందున్నవారికి కిరణముల కాంతితో ఆ యా వస్తువులెట్లు కనబడునో, అట్లే, అజ్ఞానము తొలగగానే దీపపుకాంతిలో కనబడినట్లు ఆత్మసాక్షాత్కారము కలుగును.

సర్వేషామేవ భూతానాం తమస్యుపగతే యథా ।
ప్రకాశం భవతే సర్వం తథైవముపధార్యతామ్ ॥ 81 ॥

సమస్త ప్రాణులకు చీకట్లు తొలగిన తర్వాత ప్రాణులకు కనబడునో అట్లే ఇతని మనస్సులో ఆత్మ ప్రకాశము కలుగును.

యథా వారిచరః పక్షీ న లిప్యతి జలే చరన్ ।
విముక్తాత్మా తథా యోగీ గుణదోషైర్న లిప్యతే ॥ 82 ॥

నీటిపక్షి నీటిలో తిరుగుచున్నప్పటికి నీరు కాని, ఆ నీటిలోని మలినములు కాని ఎట్లుఅంటుకోవో అట్లే విముక్తాత్ముడైన యోగికి ఇంద్రియవిషయములయందు సంచరించినను వాటి గుణదోషములంటుకొనవు.

ఏవమేవ కృత ప్రజ్ఞో న దోషైర్విషయాంశ్చరన్ ।
అసజ్జమానః సర్వేషు న కథంచిత్ప్రలిప్యతే ॥ 83 ॥

ఇదే విధముగా కృత ప్రజ్ఞుడైన వాడు విషయములయందాసక్తి కనబరచని కారణంగా వాటి ననుభవించినను వాటి యొక్క దోషములంటవు.

త్యక్త్వా పూర్వకృతం కర్మ రతిర్యస్య మహాత్మని ।
సర్వభూతాత్మభూతస్య గుణసంగేన సజ్జతః ॥ 84 ॥

ఎవరైతే సర్వదా పరమాత్మ చింతనయందే మునిగియుంటాడో అతడు తాను పూర్వజన్మలలో చేసినకర్మల నుండి విముక్తుడై సమస్త ప్రాణుల కాత్మ అవుతాడు అంతేకాక విషయములయందెప్పుడూ ఆసక్తుడుకాదు.

స్వయ మాత్మా ప్రసవతి గుణేష్వపి కదాచన ।
న గుణా విదురాత్మానం గుణాన్వేద స సర్వదా ॥ 85 ॥

ఆత్మ తాను స్వయముగా గుణములందు ఒకానొకపుడు ఆసక్తమగును. ఆత్మగుణముల నెరుగును కాని గుణములాత్మ నెరుగవు.

పరిదధ్యాద్గుణానాం స ద్రష్టా చైవ యథాతథమ్ ।
సత్త్వక్షేత్రజ్ఞయోరేవమంతరం లక్షయేన్నరః ॥ 86 ॥

అతడు ధ్యానయోగముతో యథాతథముగా సత్త్వరజస్తమో గుణముల యొక్క తత్త్వమును గ్రహించగలడు. అతడు ద్రష్ట అంతే కాక ప్రకృతి ఆత్మల యొక్క అంతరమును తెలుసుకొనగలడు.

సృజతే తు గుణానేక ఏకో న సృజతే గుణాన్ ।
పృథగ్భూతౌ ప్రకృత్యేతౌ సంప్రయుక్తౌ చ సర్వదా ॥ 87 ॥

ప్రకృత్రైతే గుణములను సృష్టిస్తుంది కాని ఆత్మ గుణములను సృష్టించదు. ఈ రెండు స్వభావముతో భిన్న భిన్నమైనప్పటికిని ఎప్పుడూ ఒక దానితో నొకటి కలిసే ఉంటుంది.

యథాఽశ్మనా హిరణ్యస్య సంప్రయుక్తౌ తథైవ తౌ ।
మశకోదుంబరౌ వాఽపి సంప్రయుక్తౌ యథా సహ ॥ 88 ॥

గనులలోని రాళ్లలో బంగారము ఎట్లు కలిసియుంటుందో, మేడి పండులో పురుగులెట్లుంటాయో (మేడి పండు జూడ మేలిమైయుండును పొట్టవిప్పిచూడ పురుగులుండు) అట్లే వేరు వేరు తత్త్వములైనా కలిసి యేయుండును.

ఇషీకా వా యథా ముంజే పృథక్చ సహ చైవ హి ।
తథైవ సహితా వేతావన్యోన్యస్మిన్ ప్రతిష్ఠితౌ ॥ 89 ॥

ముంజగడ్డిలో ముల్లు కలిసియున్నట్లు తత్త్వములు వేరు వేరైనప్పటికి ప్రకృతి పురుషుడు పరస్పరం కలిసే ఉంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షి సంవాదే సాంఖ్యయోగ నిరూపణం నామైకోనత్రింశాధిక శతతమోఽధ్యాయః ॥129॥

శ్రీబ్రహ్మపురాణమునందలి వ్యాస – ఋషి సంవాదములోని సాంఖ్యయోగ నిరూపణమనే పేరు గల నూట ఇరువది తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

త్రింశాధిక శతతమోఽధ్యాయః – నూట ముప్పైయవ అధ్యాయం

సాంఖ్య యోగనిరూపణమ్ – సాంఖ్య యోగనిరూపణం

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

సృజతే తు గుణాన్ సత్త్వం క్షేత్రజ్ఞస్త్వధితిష్ఠతి ।
గుణాన్విక్రియతః సర్వానుదాసీనవదీశ్వరః ॥ 1 ॥

సత్తా – సత్త్వము – ప్రకృతి అనునది గుణత్రయమును సృష్టిస్తుంది. ఇక క్షేత్రజ్ఞుడైన ఆత్మతత్త్వం ఈ గుణత్రయమునకు, సత్త్వమునకు తాను అధిష్ఠాతయై పరిణామంపొందే గుణములను ఉదాసీనభావంతో చూస్తూ ఈశ్వరుడైయుంటాడు.

స్వభావయుక్తం తత్సర్వం యదిమాన్ సృజతే గుణాన్ ।
ఊర్ణనాభిర్యథా సూత్రం సృజతే తద్గుణాంస్తథా ॥ 2 ॥

ప్రకృతి సత్త్వము ఈగుణములను సృష్టించుట అనునది స్వాభావికమైన కర్మ. సాలెపురుగు తనలోనుండే పదార్థంతోనే దారం తీసి గూడు అల్లినట్లుగానే ఈసమస్తగుణములసృష్టి జరుగుతుంది.

ప్రవృత్తా న నివర్తంతే ప్రవృత్తిర్నోపలభ్యతే ।
ఏవమేకే వ్యవస్యంతి నివృత్తిమితి చాపరే ॥ 3 ॥

గుణములెప్పుడు ప్రవృత్తివైపే ఉండి ముందుకు పోతున్నవి కాని వెనుకకు తిరిగి రావు. ఈప్రవృత్తి మనకు గోచరంకాదు అని కొందరు. నివృత్తి కూడా వాటికున్నదని కొందరంటారు.

ఉభయం సంప్రధార్యైతదధ్యవస్యేద్యథామతి ।
అనేన చ విధానేన భవేద్వై సంశయో మహాన్ ॥ 4 ॥

ఈవిధానంవల్ల గొప్ప సంశయం కలుగుతుంది. ఈ రెంటిని గూడా బాగా విచారించి యథామతి దానిని నిర్ణయించుకొనవలె.

అనాదినిధనో హ్యాత్మా తం బుద్ధ్వా విహరేన్నరః ।
అక్రుధ్యన్నప్రహృష్యంశ్చ నిత్యం విగతమత్సరః ॥ 5 ॥

ఈఆత్మతత్త్వం అనాది. దానికి మరణంలేదు, కోపంను సంతోషం ప్రకటించక, మాత్సర్యంలేనివాడై దానిని తెలుసుకొని మసలు కొనవలెను.

ఇత్యేవం హృదయే సర్వో బుద్ధిచింతామయం దృఢమ్ ।
అనిత్యం సుఖమాసీనమశోచ్యం ఛిన్నసంశయః ॥ 6 ॥

ఈ విధముగా ప్రతివాడు బుద్ధి చింతాస్వరూపుడు దృఢముగా హృదయమున సుఖముగా ఆసీనుడైన పరమాత్మ దుఃఖరహితుడని లోకము అనిత్యమని ఆలోచించవలయును.

తారయేత్ప్రచ్యుతాం పృథ్వీం యథాపూర్ణాం నదీం నరః ।
అవగాహ్య చ విద్వాంసో విప్రా లోకమిమం తథా ॥ 7 ॥

ఈదటం తెలిసినవాడు నిండుగా ప్రవహిస్తున్న నదిలో పడ్డా కూడా భూమిమీద నడిచినట్లుగా కష్టంలేకుండా దాటగలినట్లు ఓ విప్రులారా! జ్ఞానస్వరూపుడైన తత్త్వవేత్త, విద్వాంసుడు ఈ సంసారసాగరంలో మునిగినా కూడా తిరిగి అలా దాన్ని అవలీలగా దాటగలడు.

న తు తప్యతి వై విద్వాన్ స్థలే చరతి తత్త్వవిత్ ।
ఏవం విచింత్య చాఽఽత్మానం కేవలం జ్ఞానమాత్మనః ॥ 8 ॥

ఈలోకంలో ఉంటూ కూడా తత్త్వజ్ఞానమును తెలుసుకుని విద్వాంసుడు ఏమాత్రం చింతించడు. జ్ఞాన స్వరూపమైన ఆత్మను తెలుసుకున్న తత్త్వవేత్త సంసారసాగరమును దాటగలడు.

తాం చ బుద్ధ్వా నరః సర్గం భూతానామాగతిం గతిమ్ ।
సమవేక్ష్య చ వై సమ్యక్ లభతే శమముత్తమమ్ ॥ 9 ॥

ఈవిధంగా మానవుడు జీవులయొక్క ఆగమమును, గతిని, సృష్టిని చక్కగా తెలుసుకొని ఉత్తమమైన శాంతిని పొందుతాడు.

ఏతద్ద్విజన్మ సామగ్ర్యం బ్రాహ్మణస్య విశేషతః ।
ఆత్మజ్ఞానసమస్నేహ పర్యాప్తం తత్పరాయణమ్ ॥ 10 ॥

ఆత్మజ్ఞానమునందు సమానమైన స్నేహముతో తృప్తిపొందుట దానియందే ఆసక్తమై యుండుట ద్విజులకు పొందదగినది విశేషించి బ్రాహ్మణులకు

తత్త్వం బుద్ధ్వా భవేద్బుద్ధః కిమన్యద్బుద్ధలక్షణమ్ ।
విజ్ఞాయైతద్విముచ్యన్తే కృతకృత్యా మనీషిణః ॥ 11 ॥

తత్త్వజ్ఞానం పొందినవాడు జ్ఞాని కాగలడు. ఇంతకంటే జ్ఞానికి కావలసిన లక్షణమేమున్నది? కృతకృత్యులైన బుద్ధిమంతులు ఈఆత్మతత్త్వం తెలుసుకున్నవారై సంసారబంధములనుండి విముక్తులవుతారు.

న భవతి విదుషాం మహద్భయం యదవిదుషాం సుమహద్భయం పరత్ర ।
న హి గతిరధికాఽస్తి కస్యచిద్భవతి హి యా విదుషః సనాతనీ ॥ 12 ॥

అజ్ఞాని అయిన వానికి పరలోకంగూర్చి ఏభయముంటుందో అటువంటి భయం జ్ఞానికి ఉండదు. జ్ఞానియైన వానికి ఏసనాతనమైన గతి లభిస్తుందో అంతకంటే ఉత్తమమైన రెండవ గతిమరెవ్వరికీ కలుగదు.

లోకమాతరమసూయతే నరస్తత్ర దేవమనిరీక్ష్య శోచతే ।
తత్ర చేత్కుశలతా న శోచతే యే విదుస్తదుభయం కృతాకృతమ్ ॥ 13 ॥

నరుడు లోకమాతయైన ప్రకృతిలో దోషమును చూస్తాడు. ఆ ప్రకృతిలో దైవాన్ని చూడడు. ప్రకృతిలో దైవాన్ని చూడగల కుశలత ఉన్నచో కర్తవ్యాకర్తవ్యమును తెలిసినవాడై దుఃఖించడు.

యత్కరోత్యనభిసంధిపూర్వకం తచ్చ నిర్దహతి యత్పురాకృతమ్ ।
యత్ప్రియం తదుభయం న వా౽ప్రియం తస్య తజ్జనయతీహ కుర్వతః ॥ 14 ॥

తత్త్వమును తెలుసుకొని ఫలంపై అభిసంధిలేక కర్మలను చేయువాడు తాను పూర్వజన్మలలో కర్మలుచేసి సంపాదించుకొన్న సంచితకర్మను కూడా నశింప చేసుకొంటాడు. అనగా మోక్షము నందగలడు. ఫలంపై అభిసంధితో కర్మలను చేయువానికి ఇది ప్రియమైనది ఇది అప్రియమైనదనే భావముంటుంది.

మునయ ఊచుః :– మునులు పలికారు.

యస్మాద్ధర్మాత్పరో ధర్మో విద్యతే నేహ కశ్చన ।
యో విశిష్టశ్చ భూతేభ్యస్తద్భవాన్ప్రబ్రవీతు నః ॥ 15 ॥

ఈ లోకంలో అన్ని ధర్మముల కంటే ఉత్తమమైనదేదిలేదో అన్ని భూతతత్త్వములకంటే ఉత్తమమైన తత్త్వమేదో దాన్ని గూర్చి మీరు మాకు వివరించండి.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

ధర్మం చ సంప్రవక్ష్యామి పురాణమృషిభిః స్తుతమ్ ।
విశిష్టం సర్వధర్మేభ్యః శృణుధ్వం మునిసత్తమాః ॥ 16 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! మిక్కిలి ప్రాచీనమైనది, ఋషులందరుకొనియాడినది, అన్ని ధర్మములకంటే కూడా విశిష్టమైన ధర్మమును గూర్చి చెబుతున్నాను వినండి.

ఇంద్రియాణి ప్రమాథీని బుద్ధ్యా సంయమ్య తత్త్వతః ।
సర్వతః ప్రసృతానీహ పితా బాలాని వా౽౽త్మజాన్ ॥ 17 ॥

ఇంద్రియములు జీవుని కలవరపెట్టేవి. కనుక వాటిని బుద్ధితో నియంత్రించవలెను. ఆ ఇంద్రియ ములంతటికీ పరుగెత్తేవి కనుక తండ్రి బాల్యచేష్టలతో అటునిటు పరుగెత్తే తనపిల్లల అదుపులో నుంచుకొనునట్లు ఇంద్రియముల నదుపులో పెట్టుకొనవలెను.

మనసశ్చేంద్రియాణాం చాప్యైకాగ్ర్యం పరమం తపః ।
తచ్ఛ్రేష్ఠం సర్వధర్మేభ్యః స ధర్మః పర ఉచ్యతే ॥ 18 ॥

మనస్సుకు, ఇంద్రియములకు ఏకాగ్రత అనేది ఉత్తమతపస్సని చెబుతారు. అన్ని ధర్మములకంటే అదే శ్రేష్ఠమైనది. దానినే పరమధర్మమంటారు.

తాని సర్వాణి సంధాయ మనః షష్ఠాని విద్యయా ।
ఆత్మతృప్తః స ఏవాఽఽసీద్బహుచిన్త్యమచిన్తయన్ ॥ 19 ॥

(జ్ఞానంతో) విద్యతో, మనస్సుతో కూడుకొనియున్న ఆ ఆరింటిని గూడ సంధానపరచి అనేక విధములుగా చింతించవలసిన వాటినిగూర్చి చింతించక ఉండువాడు ఆత్మతృప్తుడై యుంటాడు.

గోచరేభ్యో నివృత్తాని యథా స్థాస్యన్తి వేశ్మని ।
తదా చైవాఽఽత్మనాఽఽత్మానం పరం ద్రక్ష్యథ శాశ్వతమ్ ॥ 20 ॥

విషయములనుండి నివృత్తములైన ఇంద్రియములు తమతమ స్థానములందు నిలిచి ఉండునపుడు ఆత్మ శాశ్వతమైన పరమాత్మను సాక్షాత్కరించుకొనును.

సర్వాత్మానం మహాత్మానం విధూమమివ పావకమ్ ।
ప్రపశ్యన్తి మహాత్మానం బ్రాహ్మణా యే మనీషిణః ॥ 21 ॥

ఓ బ్రాహ్మణులారా! జ్ఞానులు పొగలేకుండా ప్రజ్వరిల్లుతున్న అగ్నిలాగా ఉన్నటువంటి మహాత్ముడు, సమస్తజగత్తునకు ఆత్మగాగల పరమాత్మను దర్శిస్తారు.

యథా పుష్పఫలోపేతో బహుశాఖో మహాద్రుమః ।
ఆత్మనో నాభిజానీతే క్వ మే పుష్పం క్వ మే ఫలమ్ ॥ 22 ॥

ఏవమాత్మా న జానీతే క్వ గమిష్యే కుతోఽన్వహమ్ ।
అన్యో హ్యస్యాన్తరాత్మాఽస్తి యః సర్వమనుపశ్యతి ॥ 23 ॥

అనేక శాఖలతో విస్తరించి ఫలపుష్పాలతో కూడియున్న మహావృక్షం తనలో ఏ పుష్పమెక్కడుందో, ఏ ఫలం ఎక్కడుందో ఎట్లు తానెరుగదో, అట్లే జీవుడు కూడా అనేక వస్తుభేదములతోనిండిన ఈ సంసారములో తానెవడో ఎక్కడనుండి వచ్చినాడో, ఎక్కడకు వెళ్ళవలెనో తెలియ కుంటాడు. కాని జ్ఞానంతో తనలో మరొక ఆత్మ యున్నదని తెలుసుకొనువాడు తనలో అన్నింటినీ దర్శిస్తాడు.

జ్ఞానదీప్తేన మనసా పశ్యత్యాత్మానమాత్మనా ।
దృష్ట్వాఽఽత్మానం తథా యూయం విరాగా భవత ద్విజాః ॥ 24 ॥

ఓ బ్రాహ్మణులారా! జ్ఞానముతో ప్రకాశించు మనస్సుతో తన ఆత్మలో తనను దర్శించుకున్నట్లుగా మీరు కూడా మీలో మీ ఆత్మను దర్శించి, వైరాగ్యమును పొందండి.

విముక్తాః సర్వపాపేభ్యో ముక్తత్వచ ఇవోరగాః ।
పరాం బుద్ధిమవాప్యేహాప్యచిన్తావిగతజ్వరాః ॥ 25 ॥

ఆ వైరాగ్యంతో కుబుసం విడిచిన పామువలె సమస్తపాపములనుండి విముక్తులవుతారు. గొప్ప జ్ఞానమును పొంది ఈలోకమునందు కూడా చింతాసంతాపములను పోగొట్టుకొంటారు.

సర్వతః స్రోతసం ఘోరాం నదీం లోకప్రవాహిణీమ్ ।
పంచేన్ద్రియగ్రాహవతీం మనస్సంకల్పరోధసమ్ ॥ 26 ॥

లోకమనేది అంతటా ప్రవహించు నది. దీనియందు ఇంద్రియములనే మొసల్లుండును. దీనికి మనస్సు, సంకల్పమని రెండుగట్లుండును. ఇదిచాలా భయంకరమైనది.

లోభమోహ తృణాచ్ఛన్నాం కామక్రోధసరీసృపామ్ ।
సత్యతీర్థానృతక్షోభాం క్రోధపంకాం సరిద్వరామ్ ॥ 27 ॥

ఈనది లోభమోహములనే గడ్డిచే కప్పబడినది, కామక్రోధములనే పాములీ నది యందుంటాయి. దీనికి సత్యమనునది దిగే రేవు. అబద్ధమనేది కల్లోలము, క్రోధమనే బురదగలిగినదీ నది.

అవ్యక్తప్రభవాం శీఘ్రాం కామక్రోధసమాకులామ్ ।
ప్రతరధ్వం నదీం బుద్ధ్యా దుస్తరామకృతాత్మభిః ॥ 28 ॥

ఇది అవ్యక్తంనుండి పుట్టింది, చాలా వేగం కలది, కామ క్రోధములనే సుడులతో కూడుకుంది, బుద్ధితో ఈ నదిని దాటుడు. ఇంద్రియజయములేనివారు దాటశక్యముకానిది.

సంసారసాగరగమాం యోనిపాతాలదుస్తరామ్ ।
ఆత్మజన్మోద్భవాం తాం తు జిహ్వావర్తాం దురాసదామ్ ॥ 29 ॥

ఇది సంసారసాగరంలో కలుస్తుంది. జన్మపరంపరలనే పాతాళముచే దాటరానిది. జిహ్వాచాపల్యం దీని సుడులు. దీనిని జ్ఞానవంతులు మాత్రమే దాటగలరు.

యాం తరన్తి కృతప్రజ్ఞా ధృతిమన్తో మనీషిణః ।
తాం తీర్ణః సర్వతో ముక్తో విధూతాత్మాఽఽత్మవాన్ శుచిః ॥ 30 ॥

కృతప్రజ్ఞులు, ధృతిమన్తులు అయిన మనీషులు మాత్రమే దీనిని దాటగలరు. దీనిని దాటినవాడు సమస్తబంధనములనుండి విముక్తుడై, పవిత్రుడై ఆత్మవంతుడౌతాడు.

ఉత్తమాం బుద్ధిమాస్థాయ బ్రహ్మభూయాయ కల్పతే ।
ఉత్తీర్ణః సర్వసంక్లేశా న్ప్రసన్నాత్మా వికల్మషః ॥ 31 ॥

ఉత్తమమైన బుద్ధిని పొంది బ్రహ్మస్వరూపుడవుతాడు. అతడే సమస్తక్లేశములను దాటగలడు. అతడే ప్రసన్నమైన మనస్సు కలవాడౌతాడు.

భూయిష్ఠానీవ భూతాని సర్వస్థానాన్నిరీక్ష్య చ ।
అకృధ్యన్నప్రసీదంశ్చ న నృశంసమతిస్తథా ॥ 32 ॥

భూతములన్నింటినీ అన్నిటియందు చూసినవాడై, కోపమునూ ఆనందమునూ పొందక, నింద్యమైన బుద్ధి లేకుండా ఉంటాడు.

తతో ద్రక్ష్యథ సర్వేషాం భూతానాం ప్రభవాప్యయమ్ ।
ఏతద్ధి సర్వధర్మేభ్యో విశిష్టం మేనిరే బుధాః ॥ 33 ॥

ఇటువంటి బుద్ధితోనే మీరు సమస్తప్రాణులయొక్క ఉత్పత్తిప్రళయములను చూస్తారు. దీనినే పెద్దలు సర్వధర్మములయందు విశిష్టమైన దానినిగా పేర్కొన్నారు.

ధర్మం ధర్మభృతాం శ్రేష్ఠా మునయః సత్యవాదినః ।
ఆత్మానో వ్యాపినో విప్రా ఇతి పుత్రానుశాసనమ్ ॥ 34 ॥

ధర్మజ్ఞులలో శ్రేష్ఠులైన, సత్యవాదులును నైన మునులు దీనినే ఉత్తమధర్మంగా నమ్మి దానినే పితృశాసనముగా వ్యాపింపజేశారు.

ప్రయతాయ ప్రవక్తవ్యం హితాయానుగతాయ చ ।
ఆత్మజ్ఞానమిదం గుహ్యం సర్వగుహ్యతమం మహత్ ॥ 35 ॥

ఈ ఆత్మజ్ఞానం రహస్యములన్నింటిలోనూ మిక్కిలి రహస్యమైనది. అటువంటి దీనిని హితమును మిక్కిలి ప్రయత్నించి వినయసంపన్నునకే బోధించవలెను.

అబ్రవం యదహం విప్రా ఆత్మసాక్షికమఞ్జసా ।
నైవ స్త్రీ న పుమానేవం న చైవేదం నపుంసకమ్ ॥ 36 ॥

ఓ బ్రాహ్మణులారా! నేనింతవరకే జ్ఞానమనే ఆత్మసాక్షాత్కారమును పొందానో దానితోనే మీరనాయాసంగా ఆత్మ సాక్షాత్కారంను పొందగలరని చెప్పాను. ఆ ఆత్మతత్త్వం స్త్రీగాని, పురుషుడుగాని, నపుంసకముగాని కాదు.

అదుఃఖమసుఖం బ్రహ్మ భూతభవ్యభవాత్మకమ్ ।
నైతజ్జ్ఞాత్వా పుమాన్ స్త్రీ వా పునర్భవమవాప్నుయాత్ ॥ 37 ॥

దీనిలో దుఃఖంగాని సుఖంగాని లేదు. భూతభవిష్యద్వర్తమానములనేవి దాని స్వరూపమే. అదే బ్రహ్మస్వరూపం. దీనిని తెలుసుకున్న స్త్రీపురుషులెవరైనా వారు తిరిగి జన్మనొందరు.

యథా మతాని సర్వాణి తథైతాని యథా తథా ।
కథితాని మయా విప్రా భవన్తి న భవన్తి చ ॥ 38 ॥

ఓ బ్రాహ్మణులారా! మతములన్నీ అనేక విధములుగా ఈవిషయాన్ని గూర్చియే ఎట్లు ప్రతిపాదించాయో దానికనుకూలంగానే ఇవి ఉండును లేకపోవును నేను వాటిని గూర్చి వివరించాను.

తత్ప్రీతియుక్తేన గుణాన్వితేన పుత్రేణ సత్పుత్ర దయాన్వితేన ।
దృష్ట్వా హితం ప్రీతిమనా యదర్థం బ్రూయాత్సుతస్యేహ యదుక్తమేతత్ ॥ 39 ॥

ఒక గుణవంతుడు, తన సంతానమునందు దయగలవాడు, వారియందమిత ప్రీతిగలవాడు, వారి హితాన్ని కోరి ప్రేమతో సదర్థమునుగూర్చి వివరించిన దానినే ఇప్పుడు వివరించాను.

మునయః ఊచుః :– మునులు పలికారు.

మోక్షః పితామహేనోక్త ఉపాయాన్నానుపాయతః ।
తముపాయం యథాన్యాయం శ్రోతుమిచ్ఛామహే మునే ॥ 40 ॥

ఓ మునీ! బ్రహ్మ మోక్షమును పొందుటకేదో ఉపాయముందనే వివరించాడు. అది ఉపాయం లేకుండా లేదు. మేమంతా ఆ న్యాయానుకూలంగా ఆ ఉపాయమును గూర్చి తెలుసుకోవాలనుకుంటున్నాము.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

అస్మాసు తన్మహాప్రాజ్ఞా యుక్తం నిపుణదర్శనమ్ ।
యదుపాయేన సర్వార్థాన్మృగయధ్వం సదాఽనఘాః ॥ 41 ॥

ఓ మహాప్రాజ్ఞులారా! మాలాంటి వారియందిటువంటి నైపుణ్యదృష్టి కలిగియుండటయే యుచితమైనది. ఓ పాపరహితులారా! ఉపాయంతోనే పురుషార్థములనన్నింటిని ఎప్పుడూ వివేచించండి. వెతుకండి.

ఘటోపకరణే బుద్ధిర్ఘటోత్పత్తౌ న సా మతా ।
ఏవం ధర్మాద్యుపాయార్థే నాన్యధర్మేషు కారణమ్ ॥ 42 ॥

కుండను సాధనంగా చేసుకునేవాడు కుండను తయారుచేయమంటే చేయలేడు. ఇట్లే ధర్మాది ఉపాయముల కొరకు ఇతర ధర్మములయందు వెదకుట కారణంగాదు.

పూర్వే సముద్రే యః పన్థా న స గచ్ఛతి పశ్చిమమ్ ।
ఏకః పన్థా హి మోక్షస్య తచ్ఛృణుధ్వం మమానఘాః ॥ 43 ॥

తూర్పుసముద్రమునకు చేరవలసిన దారి పడమటివైపు వెళ్ళను. అందువల్ల ఓ పాపరహితులారా! మోక్షమునకు వెళ్ళవలసిన మార్గము ఒకటే. దానిని గూర్చి చెబుతున్నాను వినండి.

క్షమయా క్రోధముచ్ఛిన్ద్యాత్కామం సంకల్పవర్జనాత్ ।
సత్త్వసంసేవనాద్ధీరో నిద్రాముచ్ఛేత్తుమర్హతి ॥ 44 ॥

క్షమతో క్రోధమును నశింప చేయాలి. కామమును సంకల్పంతో నశింపచేయాలి. సాత్త్వికతను సేవించుట వలన ధీరుడైనవాడు నిద్రను నశింప చేయగలడు.

అప్రమాదాత్ భయం రక్షేద్రక్షేత్ క్షేత్రం చ సంవిదమ్ ।
ఇచ్ఛాం ద్వేషం చ కామం చ ధైర్యేణ వినివర్తయేత్ ॥ 45 ॥

భయమును అప్రమాదాలవల్ల రక్షించుకోవాలి. ఇచ్ఛను ద్వేషాన్ని, కామాన్ని ధైర్యంతో శమింపచేయాలి. క్షేత్రమును శరీరమును జ్ఞానంతో రక్షించుకోవాలి.

నిద్రాం చ ప్రతిభాం చైవ జ్ఞానాభ్యాసేన తత్త్వవిత్ ।
ఉపద్రవాంస్తథా యోగీ హితజీర్ణమితాశనాత్ ॥ 46 ॥

తత్త్వవేత్త అయిన యోగి జ్ఞానాభ్యాసాలతో నిద్రను మరియు భేదబుద్ధిని వదిలి వేయవలెను. అట్లే హితకరమైన, సులభంగా జీర్ణమయ్యే ఆహారమును మితంగా తీసుకుంటూ ఉపద్రవములను దూరం చేసుకొనవలెను.

లోభం మోహం చ సంతోషాద్విషయాంస్తత్త్వదర్శనాత్ ।
అనుక్రోశాదధర్మం చ జయేద్ధర్మముపేక్షయా ॥ 47 ॥

విద్వాంసుడైనవాడు సంతోషంతో లోభమోహములను, తాత్త్వికదృష్టితో విషయములందాసక్తిని, దయతో అధర్మమును, ప్రయోజనమునందుపేక్షతో ధర్మమును జయించవలెను.

ఆయత్యా చ జయేదాశాం సామర్థ్యం సఙ్గవర్జనాత్ ।
అనిత్యత్వేన చ స్నేహం క్షుధాం యోగేన పణ్డితః ॥ 48 ॥

అభ్యుదయంతో ఆశను, సంగవర్జనంతో సామర్థ్యమును, అన్నింటియందనిత్యబుద్ధితో స్నేహమును, యోగసాధనతో ఆకలిని పండితుడైనవాడు నివారించవలెను.

కారుణ్యేనాఽఽత్మనాఽఽత్మానం తృష్ణాం చ పరితోషతః ।
ఉత్థానేన జయేత్తన్ద్రాం వితర్కం నిశ్చయాజ్జయేత్ ॥ 49 ॥

తన కారుణ్యంతోనే తనను, తృప్తితో తృష్ణను, లేవటంతో సోమరితనమును, నిశ్చయజ్ఞానంతో వితర్కమును జయించవలెను.

మౌనేన బహుభాషాం చ శౌర్యేణ చ భయం జయేత్ ।
యచ్ఛేద్వాఙ్మనసీ బుద్ధ్యా తాం యచ్ఛేజ్జ్ఞానచక్షుషా ॥ 50 ॥

మౌనంతో వాచాలత్వమును, శౌర్యంతో భయమును జయించాలి. బుద్ధితో వాక్కును, మనస్సును, జ్ఞాన దృష్టితో బుద్ధిని పొందవలెను.

జ్ఞానమాత్మా మహాన్యచ్ఛేత్తం యచ్ఛేచ్ఛాన్తిరాత్మనః ।
తదేతదుపశాన్తేన బోద్ధవ్యం శుచి కర్మణా ॥ 51 ॥

అన్నింటికంటే గొప్పదైన ఆత్మజ్ఞానమును తెలియవలనను జ్ఞానమని తెలుసుకొనవలెను. ఆ జ్ఞానమె ఆత్మకు శాంతిగా తలచి, ఆ శాంతచిత్తంతో పవిత్రమైన కర్మలననుష్ఠిస్తూ దీనిని గ్రహించవలెను.

యోగ దోషాన్ సముచ్ఛిద్య పఞ్చ యాన్కవయో విదుః ।
కామం క్రోధం చ లోభం చ భయం స్వప్నం చ పఞ్చమమ్ ॥ 52 ॥

కామం, క్రోధం, లోభం, భయం, స్వప్నమనే ఐదు యోగదోషములని పెద్దలంటారు. ఈ ఐదింటిని వదలవలెను.

పరిత్యజ్య నిషేవేత యథావద్యోగసాధనాత్ ।
ధ్యానమధ్యయనం దానం సత్యం హ్రీరార్జవం క్షమా ॥ 53 ॥

శౌచమాచారతః శుద్ధిరింద్రియాణాం చ సంయమః ।
ఏతైర్వివర్ధతే తేజః పాప్మానముపహన్తి చ ॥ 54 ॥

యోగ సాధనంతో పై ఐదింటిని వదిలివేసి ధ్యానం, అధ్యయనం, దానం, సత్యం, సిగ్గు, ఋజుత్వం, క్షమ, శౌచం, ఆచారంతో శుద్ధి, ఇంద్రియనిగ్రహమనునవి పాటించవలెను. దీనివల్ల పాపం నశించి తేజస్సు వృద్ధి పొందుతుంది.

సిధ్యన్తి చాస్య సంకల్పా విజ్ఞానం చ ప్రవర్తతే ।
ధూతపాపః స తేజస్వీ లఘ్వాహారో జితేన్ద్రియః ॥ 55 ॥

దీనివల్ల విజ్ఞానం ప్రవర్తించినవాడై అతని సంకల్పములు సిద్ధిస్తాయి. అతడు తక్కువ ఆహారమును తీసుకొన్నవాడై, జితేంద్రియుడై, తేజోవంతుడై పాపములను పోగొట్టుకొంటాడు.

కామక్రోధౌ వశే కృత్వా నిర్విశేద్బ్రహ్మణః పదమ్ ।
అమూఢత్వమసఙ్గిత్వం కామక్రోధవివర్జనమ్ ॥ 56 ॥

అదైన్యమను దీర్ణత్వమనుద్వేగో హ్యవస్థితిః ।
ఏష మార్గో హి మోక్షస్య ప్రసన్నో విమలః శుచిః ॥
తథా వాక్కాయమనసాం నియమాః కామతోఽవ్యయాః ॥ 57 ॥

కామక్రోధములను వశం చేసుకున్నందువల్ల అతడు బ్రహ్మ పదమును పొందుతాడు. మూఢత్వం లేకపోవుట, దేనితో సంగమంలేకపోవుట, కామక్రోధములను వదలుట, దైన్యం లేకపోవుట, దుష్టత్వం లేకపోవుట, ఉద్వేగంను పొందకుండుట, అవస్థితి లేకుండుట (అనునవే మోక్షమునకు మార్గములు) ప్రసన్నత్వం, నిర్మలత్వం, శుచి, అట్లే మనోవాక్కాయముల శుచిగా నుండుట, కోరికలనదుపులో నుంచుకొనుట అను శాశ్వతములైన నియమములు మోక్షమునకు మార్గము.

ఇతి శ్రీబ్రహ్మ పురాణే 'సాంఖ్యయోగ నిరూపణం' నామ త్రింశాధిక శతతమోఽధ్యాయః ॥ 130 ॥

శ్రీబ్రహ్మ పురాణంలో 'సాంఖ్య యోగనిరూపణ' మనే నూట ముప్పైయవ అధ్యాయం సంపూర్ణం.

త్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైఒకటవ అధ్యాయం

యోగవిధినిరూ0పణమ్ - యోగవిధి నిరూపణం

మునయ ఊచుః :- మునులు పలికారు.

సాంఖ్యం యోగస్య నో విప్ర విశేషం వక్తుమర్హసి ।
తవ ధర్మజ్ఞ సర్వం హి విదితం మునిసత్తమ ॥ 1 ॥

ఓ మునిసత్తమా! ధర్మజ్ఞుడా! బ్రాహ్మణోత్తమా! నీకు యోగమునుగూర్చి సాంఖ్యమును గూర్చి బాగుగా తెలుసు. కావున దాని విశేషమును గూర్చి చెప్పగోరుతున్నాము.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

సాంఖ్యాః సాంఖ్యం ప్రశంసన్తి యోగాన్ యోగవిదుత్తమాః ।
వదన్తి కారణైః శ్రేష్ఠైః స్వపక్షోద్భవనాయ వై ॥ 2 ॥

సాంఖ్యులు సాంఖ్యమును ప్రశంసిస్తారు, యోగవేత్తలైనవారు యోగములను గొప్పవంటారు. ఎవరికి వారే తమ పక్షమును సమర్థించుటకై శ్రేష్ఠమైన కారణములను గూడ చెబుతారు.

అనీశ్వరః కథం ముచ్యేదిత్యేవం మునిసత్తమాః ।
వదన్తి కారణైః శ్రేష్ఠం యోగం సమ్యఙ్మనీషిణః ॥ 3 ॥

ఓ మునిసత్తములారా! అసమర్థుడు మోక్ష మెట్లు పొందుతాడు? అందువల్ల అనేక కారణములతో యోగమే శ్రేష్ఠమైనదని, మంచిదని పెద్దలు చెబుతారు.

వదన్తి కారణం చేదం సాంఖ్యం సమ్యగ్విజాతయః ।
విజ్ఞాయేహ గతీః సర్వా విరక్తో విషయేషు యః ॥ 4 ॥

విషయములయందు విరక్తులైనవారు అన్ని మార్గములను తెలుసుకున్నవారై ఇతరుల మార్గాలన్నింటికంటే కూడా సాంఖ్యమే గొప్పదని చెబుతారు.

ఊర్ధ్వం స దేహాత్సువ్యక్తం విముచ్యేదితి నాన్యథా ।
ఏతదాహుర్మహాప్రాజ్ఞాః సాంఖ్యం వై మోక్షదర్శనమ్ ॥ 5 ॥

జీవి ఈశరీరమునుండి విడివడిన తరువాత పైకి వెళ్ళుననేది సుస్పష్టం, దీనికి వేరే మార్గమేదీలేదు. అందువల్ల సాంఖ్యమే ఉత్తమమైనదిగా ప్రాజ్ఞులైనవారు చెబుతారు. అదే మోక్షదర్శనమనియంటారు.

స్వపక్షే కారణం గ్రాహ్యం సమర్థం వచనం హితమ్ ।
శ్రేష్ఠానాం హి మతం గ్రాహ్యం భవద్భిః శిష్టసంమతైః ॥ 6 ॥

మీపక్షంలో హితమైన సమర్థమైన మాటను గ్రహించండి. అట్లే శిష్టసమ్మతులైన మీరు శ్రేష్ఠులయొక్క మాటను గ్రహించండి.

ప్రత్యక్షం హేతవో యోగాః సాంఖ్యాః శాస్త్రవినిశ్చయాః ।
ఉభే చైతే మతే తత్త్వే సమవేతే ద్విజోత్తమాః ॥ 7 ॥

యోగములు ప్రత్యక్షకారణములు గలవి, సాంఖ్యములు శాస్త్రములచే నిశ్చయింపబడినవి. ఓ బ్రాహ్మణోత్తములారా! ఈరెండు మతములుకూడా తత్త్వమునందొకటిగానే కలుస్తాయి.

ఉభే చైతే మతే జ్ఞాతే మునిభిః శిష్టసంమతే ।
అనుష్ఠితే యథాశాస్త్రం నయేతాం పరమాం గతిమ్ ॥ 8 ॥

మునులు శిష్టసంమతమైన ఈరెంటిని తెల్సుకొని శాస్త్రానుసారంగా అనుష్ఠించినట్లైతే ఇవి మోక్షాన్నిస్తాయి.

తుల్యం శౌచం తయోర్యుక్తం దయా భూతేషు చానఘాః ।
వ్రతానాం ధారణం తుల్యం దర్శనం న సమం తయోః ॥ 9 ॥

ఓ పాపరహితులారా! ఆ రెంటితో కలిసియుండుట అనునది శౌచంతోను, భూతములందుండే దయతోను, వ్రతముల నాచరించినందువల్ల వచ్చే ఫలితంతో సమానం కాని శాస్త్రంతో సమానం మాత్రంకాదు.

మునయ ఊచుః :– మునులు పలికారు.

యది తుల్యం వ్రతం శౌచం దయా చాత్ర మహామునే ।
తుల్యం తద్దర్శనం కస్మాత్తన్నో బ్రూహి ద్విజోత్తమ ॥ 10 ॥

ఓ మహామునీ! మరిక్కడ వ్రతం, శౌచం, దయ వానికి సమానమన్నారు. ఓ ద్విజోత్తమా! దేనివల్ల దర్శనంతో సమానమవుతుందో దాన్ని గూర్చి మాకు వివరించండి.

వ్యాస ఉవాచ :– వ్యాసుడు పలికాడు.

రాగం మోహం తథా స్నేహం కామం క్రోధం చ కేవలమ్ ।
యోగాస్థిరోదితాన్దోషాన్పఞ్చైతాన్ప్రాప్నువన్తి తాన్ ॥ 11 ॥

యోగం స్థిరంగా చేయకపోయినట్లయితే రాగం, మోహం, స్నేహం, కామం, క్రోధం– అను ఈ ఐదింటిని దోషములను పొందుతారు.

యథా వా౽నిమిషాః స్థూలం జాలం ఛిత్త్వా పునర్జలమ్ ।
ప్రాప్నువన్తి తథా యోగాత్తత్పదం వీతకల్మషాః ॥ 12 ॥

చేపలు ఏ విధంగా స్థూలమైన వలను ఛేదించుకుని తిరిగి నీటిలో ప్రవేశిస్తాయో అట్లే కల్మషమును వదిలినవారు యోగంవల్ల అటువంటి స్థానమును పొందుతారు.

తథైవ వాగురాం ఛిత్త్వా బలవంతో యథా మృగాః ।
ప్రాప్నుయుర్విమలం మార్గం విముక్తాః సర్వబంధనైః ॥ 13 ॥

బలవంతములైన మృగములెట్లు తమను బంధించిన వలలను త్రెంచుకొని స్వేచ్ఛగా నుండగలవో అట్లే బంధనములన్నింటిచే విముక్తులైన వారు స్వచ్ఛమైన మార్గమును పొందుతారు.

లోభజాని తథా విప్రా బంధనాని బలాన్వితాః ।
ఛిత్వా యోగాత్ పరం మార్గం గచ్ఛన్తి విమలం శుభమ్ ॥ 14 ॥

ఓ విప్రులారా! ఈబంధనములు లోభం వల్ల కలిగేవి. బలాన్వితులైనవారు యోగసాధనవల్ల దీన్ని ఛేదించుకొని విమలమైన శుభమైన పరలోకమునకు శ్రేష్ఠమార్గమును పొందుతారు.

అచలాస్త్వావిలా విప్రా వాగురాసు తథాఽపరే ।
వినశ్యన్తి న సందేహస్తద్వద్యోగ బలాదృతే ॥ 15 ॥

ఓ విప్రులారా! కలుషిత బుద్ధులు కలవారై కదలలేక నశించునట్లు వలలయందు ఇతరములెట్లు నశించునో యోగబలంలేనివారు అట్లే నశిస్తారు. ఈవిషయంలో ఏ సందేహమూ లేదు.

బలహీనాశ్చ విప్రేన్ద్రాః యథాజాలం గతా ద్విజాః ।
బంధం న గచ్ఛన్త్యనఘా యోగాస్తే తు సుదుర్లభాః ॥ 16 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! బలహీనమైన పక్షులెలా వలలో చిక్కుకుంటాయో ఆ విధంగా యోగులను బంధించుట సాధ్యంకాదు. ఆ యోగులు చాలా దుర్లభులు.

యథా చ శకునాః సూక్ష్మం ప్రాప్య జాలమరిందమాః ।
తత్రాశక్తా విపద్యన్తే ముచ్యన్తే చ బలాన్వితాః ॥ 17 ॥

పక్షులు సూక్ష్మమైన వలయందు చిక్కుకొని శత్రువులతో నెట్లు బాధింప బడతాయో, వాటిలో బలహీనమైనవి బయటపడలేక నశించి పోతాయి. బలంకలిగినవి దానినుండి విముక్తములవుతాయి.

కర్మజైర్బంధనైర్బద్ధాస్తద్వద్యోగపరా ద్విజాః ।
అబలా వై వినశ్యన్తి ముచ్యన్తే తు బలాన్వితాః ॥ 18 ॥

అట్లే యోగపరులైన ద్విజులు కర్మల బంధములచేత బంధింపబడి బలహీనులు నశిస్తారు, బలవంతులు బయటపడతారు.

అల్పకశ్చ యథా విప్రా వహ్నిః శామ్యతి దుర్బలః ।
ఆక్రాన్తఇన్ధనైః స్థూలైస్తద్వద్యోగబలః స్మృతః ॥ 19 ॥

ఓ విప్రులారా! ఇంధనములతో నా క్రమించబడిన అగ్ని దుర్బలమైతే అల్పకమై ఎలా నశిస్తుందో అలాగే యోగ బలం అల్పమైనచో నశిస్తుందని తెలుసుకొనవలెను.

స ఏవ చ తదా విప్రా వహ్నిర్జాతబలః పునః ।
సమీరణగతః కృత్స్నాం దహేత్ క్షిప్రం మహీమిమామ్ ॥ 20 ॥

అదే అగ్ని వాయువుతో గూడినదై మళ్ళీ బలాన్ని పొంది వెంటనే భూమినంతటిని కాల్చివేసే శక్తిగలదవుతుంది.

తత్త్వజ్ఞానబలో యోగీ దీప్తతేజా మహాబలః ।
అంతకాల ఇవాఽఽదిత్యః కృత్స్నం సంశోషయేజ్జగత్ ॥ 21 ॥

తత్త్వజ్ఞానబలం కలిగిన యోగి ప్రకాశించే తేజస్సుతో మహాబలుడై ప్రళయకాలంలోని సూర్యునివలె జగత్తునంతా శోషింపచేస్తాడు.

దుర్బలశ్చ యథా విప్రాః స్రోతసా హ్రియతే నరః ।
బలహీనస్తథా యోగీ విషయైర్హ్రియతే చ సః ॥ 22 ॥

ఓ విప్రులారా! దుర్బలుడైనవాడెలా ప్రవాహంచేత లాగుకొని పోబడతాడో అలాగే బలహీనుడైన యోగి విషయములచే లాగబడతాడు. వాటిలో కొట్టుకు పోతాడు.

తదేవ తు యథా స్రోతో విష్కంభయతి వారణః ।
తద్వద్యోగబలం లబ్ధ్వా న భవేద్విషయైర్వృతః ॥ 23 ॥

అదే ప్రవాహం అడ్డుకట్టయున్నప్పుడాగిపోవును. అలాగే యోగబలం పొందినవాడు విషయములచే కొట్టుకొని పోడు.

విశన్తి వా వశాద్వాఽథ యోగాద్యోగబలాన్వితాః ।
ప్రజాపతీన్మనూన్సర్వాన్మహాభూతాని చేశ్వరాః ॥ 24 ॥

మనస్సును వశమునందు కలవారుగాని, యోగబలంతో కూడుకున్న వారుగాని ఈశ్వరులై ప్రజాపతులను, మనువులందరిని మహాభూతములను చేరుతారు.

న యమో నాన్తకః క్రుద్ధో న మృత్యుర్భీమవిక్రమః ।
విశన్తే తద్ద్విజాః సర్వే యోగస్యామితతేజసః ॥ 25 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈయోగంయొక్క అమితతేజస్సువల్ల యముడుగాని, కోపంగల అంతకుడు కాని, భీమవిక్రముడైన మృత్యువుగాని వీరెవ్వరునూ ప్రవేశింపలేరు.

ఆత్మనాం చ సహస్రాణి బహూని ద్విజసత్తమాః ।
యోగం కుర్యాద్బలం ప్రాప్య తైశ్చ సర్వైర్మహీం చరేత్ ॥ 26 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! అనేక వేలకొలది జీవులు, ఆత్మలకుకూడా యోగంచేసి బలమును పొంది వాటన్నింటితో కలిసి ఈభూమియందు చరించవలెను.

ప్రాప్నుయాద్విషయాన్కశ్చిత్పునశ్చోగ్రం తపశ్చరేత్ ।
సంక్షిపేచ్చ పునర్విప్రః సూర్యస్తేజో గుణానివ ॥ 27 ॥

ఓ విప్రులారా! సూర్యుడేవిధంగా తన తేజోగుణములను కలిగియుంటాడో అట్లే ఈలోకంలోని విషయాలను పొంది, తిరిగి మళ్ళీ ఉగ్రమైన తపస్సుచేసి తిరిగి వాటిని సంక్షేపించుకొనవలెను.

బలస్థస్య హి యోగస్య బలార్థం మునిసత్తమాః ।
విమోక్షప్రభవం విష్ణుముపపన్నమసంశయమ్ ॥ 28 ॥

ఓ మునిసత్తములారా! బలమైన యోగమునకు, మనకు బలము కల్గించుటకై సంశయరహితుడు, విశేషమై మోక్షమునిచ్చువాడునైన విష్ణువు నాశ్రయించవలెను.

బలాని యోగప్రోక్తాని మయైతాని ద్విజోత్తమాః ।
నిదర్శనార్థం సూక్ష్మాణి వక్ష్యామి చ పునర్ద్విజాః ॥ 29 ॥

ఓ ద్విజోత్తములారా! నేనీయోగ ప్రోక్తములైన బలముల గూర్చి చెప్పాను. ఇక మీకు నిదర్శనం కొఱకు సూక్ష్మములైన వాటిని తిరిగి చెప్పబోతున్నాను. వినండి.

ఆత్మనశ్చ సమాధానే ధారణం ప్రతి వా ద్విజాః ।
నిదర్శనాని సూక్ష్మాణి శృణుధ్వం మునిసత్తమాః ॥ 30 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఓ బ్రాహ్మణులారా! ఆత్మకు సమాధానంగాగాని, దానిని ధరించుట కొరకు కాని ఈ సూక్ష్మమైన నిదర్శనములను వినండి.

అప్రమత్తో యథా ధన్వీ లక్ష్యం హన్తి సమాహితః ।
యుక్తః సమ్యక్తథా యోగీ మోక్షం ప్రాప్నోత్యసంశయమ్ ॥ 31 ॥

అప్రమత్తుడైన విలుకాడు గురిపెట్టి ఎట్లు లక్ష్యమును ఛేదిస్తాడో అట్లే యోగ్యుడైన యోగి చక్కగా మోక్షమును పొందుతాడు. ఈవిషయంలో ఏ సందేహమూ లేదు.

స్నేహపాత్రే యథా పూర్ణే మన ఆధాయ నిశ్చలమ్ ।
పురుషో యుక్త ఆరోహేత్సోపానం యుక్తమానసః ॥ 32 ॥

నూనెతో నిండిన పాత్రను తీసుకువెళ్ళడాని కెట్లు నిశ్చలమనస్సుతో జాగ్రత్తగా నుంటాడో అట్లే యోగియైనవాడు మనస్సును పరమాత్మయందు లగ్నంచేసి పరమపురుషునితో కూడుకొనియున్న మోక్షమనే సోపానమునధిరోహిస్తాడు.

ముక్తస్తథాఽయమాత్మానం యోగం తద్వత్సునిశ్చలమ్ ।
కరోత్యమలమాత్మానం భాస్కరోపమదర్శనే ॥ 33 ॥

అట్లు నిశ్చలమైన యోగమభ్యసించి తనను ముక్తునిగాచేసుకొని మలరహితుడై, చూచుటకు సూర్యునితో ఉపమానంగా చెప్పుకొనేట్లుగా చేసుకొంటాడు.

యథా చ నావం విప్రేన్ద్రాః కర్ణధారః సమాహితః ।
మహార్ణవగతాం శీఘ్రం నయేద్విప్రాంస్తు పత్తనమ్ ॥ 34 ॥

తద్వదాత్మసమాధానం యుక్తో యోగేన యోగవిత్ ।
దుర్గమం స్థానమాప్నోతి హిత్వా దేహమిమం ద్విజాః ॥ 35 ॥

సుడులలో చిక్కుకుని సముద్రంలో మునిగిపోతున్న నావను జాగరూకుడైన నావికుడు జాగ్రత్తగా దానిని సముద్రపు ఒడ్డుకు తీసుకొని వచ్చి ఎలాదానిలోనున్న వారిని నగరానికి చేరుస్తాడో ఓ బ్రాహ్మణులారా! యోగంను తెలిసినవాడు యోగసాధనతో అట్లే సమాధిద్వారా మనస్సును పరమాత్మయందులగ్నంచేసి ఈదేహం విడిచినతర్వాత ఆత్మ సమాధానమైన, దుర్గమస్థానమైన మోక్షమును పొందుతాడు.

సారథిశ్చ యథా విప్రాః సదశ్వాన్సుసమాహితః ।
దేశమిష్టం నయత్యాశు ధన్వినం పురుషర్షభమ్ ॥ 36 ॥

తథైవ చ ద్విజా యోగీ ధారణాసు సమాహితః ।
ప్రాప్నోత్యాశు పరం స్థానం లక్ష్యముక్త ఇవాశుగః ॥ 37 ॥

ఓ బ్రాహ్మణులారా! సారథి ఏ విధంగానైతే రథమునకు మంచి గుఱ్ఱాలను పూన్చి ధనుర్ధారియైన పురుష శ్రేష్ఠుని యతని యిష్ట ప్రదేశమునకు త్వరగా చేర్చునో, అట్లే ఓ బ్రాహ్మణులారా! యోగియైనవాడు ధారణాదుల యందు శ్రద్ధగలవాడై తన లక్ష్యమును చెప్పినట్లుగానే బాణంవలె శీఘ్రగామియై త్వరగా మోక్షస్థానమును పొందుతాడు.

ఆవిశ్యాఽఽత్మని చాఽఽత్మానం యోఽవతిష్ఠతి సోఽచలః ।
పాశం హత్వేవ మీనానాం పదమాప్నోతి సోఽజరమ్ ॥ 38 ॥

తన ఆత్మను పరమాత్మయందావేశింపజేసి నిశ్చలభావంతో ఉండేవాడు వలనుంచి బయటపడిన చేపలవలె నశించని పరమపదంను పొందుతాడు.

నాభ్యాం శీర్షే చ కుక్షౌ చ హృది వక్షసి పార్శ్వయోః ।
దర్శనే శ్రవణే వాఽపి ఘ్రాణే చామితవిక్రమః ॥ 39 ॥

స్థానేష్వేతేషు యో యోగీ మహావ్రతసమాహితః ।
ఆత్మనా సూక్ష్మమాత్మానం యుంక్తే సమ్యగ్ద్విజోత్తమాః ॥ 40 ॥

యోగవ్రతంలో ఏకాగ్రచిత్తంతో ఉండే యోగి నాభి, తల, పొట్ట, హృదయం, వక్షఃస్థలం, రెండు ప్రక్క భాగములు, కన్ను, చెవి, ముక్కు మొదలగు స్థానములయందు ధారణద్వారా మిక్కిలి శక్తి కలవాడై, ఓ బ్రాహ్మణోత్తములారా! తనయోగంతో ఆయా స్థానములయందు మహావ్రతంతో ఆత్మకంటే సూక్ష్మమైన పరమాత్మతో చక్కగా జత కలుపుతాడు.

సుశీఘ్రమచలప్రఖ్యం కర్మ దగ్ధ్వా శుభాశుభమ్ ।
ఉత్తమం యోగమాస్థాయ యదీచ్ఛతి విముచ్యతే ॥ 41 ॥

అప్పుడు పర్వతాకారంతో సమానమైన తన శుభాశుభకర్మలను దహించివేసి, తన ఇచ్ఛానుసారంగా ఉత్తమమైన యోగాలంబనంతో మోక్షమును పొందుతాడు.

మునయ ఊచుః :- మునులు పలికారు.

ఆహారాన్కీదృశాన్ కృత్వా కాని జిత్వా చ సత్తమ ।
యోగీ బలమవాప్నోతి తద్భవాన్వక్తుమర్హసి ॥ 42 ॥

ఓ యోగిసత్తమా! ఎటువంటి ఆహారం తీసుకున్నందువల్ల, వేనిని జయించినందువల్ల యోగి అయిన వాడు బలమును పొందగలడో దానిని గూర్చి వివరించండి.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

భుఞ్జానో యావకం రూక్షం దీర్ఘకాలం ద్విజోత్తమాః ।
ఏకాహారీ విశుద్ధాత్మా యోగీ బలమవాప్నుయాత్ ॥ 43 ॥

కఠినమైన యవలను చాలాకాలంవరకు దినము ఒకే పూటగా స్వీకరిస్తున్న విశుద్ధాత్ముడైన యోగి బలమును పొందుతాడు.

పక్షాన్మాసానృతూంశ్చిత్రాన్సంచరంశ్చ గుహాస్తథా ।
అపః పీత్వా పయోమిశ్రా యోగీ బలమవాప్నుయాత్ ॥ 44 ॥

పక్షములు, మాసములు, ఋతువులు, సంవత్సరముల కాలం ఒక గుహనుండి మరొక గుహకు తిరుగుతూ కూడా పాలు కలిపిన నీటిని త్రాగినట్లయితే యోగి బలవంతుడవుతాడు.

అఖండమపి వా మాసం సతతం మునిసత్తమాః ।
ఉపోష్య సమ్యక్ శుద్ధాత్మా యోగీ బలమవాప్నుయాత్ । 45 ॥

ఓ మునులారా! నెలంతా పూర్తిగా ఉపవాసమున్నప్పటికీ శుద్ధాత్ముడైన యోగి చక్కని బలమును పొందగలడు.

కామం జిత్వా తథా క్రోధం శీతోష్ణం వర్షమేవ చ ।
భయం శోకం తథా స్వాపం పౌరుషాన్విషయాంస్తథా ॥ 46 ॥

అరతిం దుర్జయాంచైవ ఘోరాం దృష్ట్వా చ భో ద్విజాః ।
స్పర్శం నిద్రాం తథా తన్ద్రాం దుర్జయాం మునిసత్తమాః ॥ 47 ॥

దీపయన్తి మహాత్మానం సూక్ష్మమాత్మానమాత్మనా ।
వీతరాగా మహాప్రాజ్ఞా ధ్యానాధ్యయనసంపదా ॥ 48 ॥

కామం, క్రోధం, శీతము, ఉష్ణము, వర్షం, భయం, శోకం, నిద్ర, అట్లే లౌకికమైన విషయములనుజయించి, ఓ మునులారా! అట్లే జయించశక్యంగాని అరతిని ఘోరమైన దానినిగా చూసి, స్పర్శను, నిద్రను అట్లే తన్ద్రమును కూడా జయించి, ధ్యానాధ్యయనసంపదతో మహాప్రాజ్ఞులైనవారు వీతరాగులై తమ ఆత్మతో తమను సూక్ష్మమైన మహాత్మునిగా ప్రకాశింప చేస్తారు.

దుర్గస్త్వేష మతః పన్థా బ్రాహ్మణానాం విపశ్చితామ్ ।
యః కశ్చిద్వ్రజతి క్షిప్రం క్షేమేణ మునిసత్తమాః ॥ 49 ॥

సాధకులైన బ్రాహ్మణులకు ఈమార్గం చాలా కఠినమైనదని అంటారు. ఓ మునిసత్తములారా! ఎవరో ఒకరు ఈమార్గంలో తొందరగా క్షేమంగా చేరుతారు.

యథా కశ్చిద్వనం ఘోరం బహుసర్పసరీసృపమ్ ।
శ్వభ్రవత్తోయహీనం చ దుర్గమం బహుకణ్టకమ్ ॥ 50 ॥

అభక్తమటవీప్రాయం దావదగ్ధ మహీరుహమ్ ।
పన్థానం తస్కరాకీర్ణం క్షేమేణాభిపతేత్తథా ॥ 51 ॥

యోగమార్గం సమాసాద్య యః కశ్చిద్వ్రజతే ద్విజః ।
క్షేమేణోపరమేన్మార్గాద్బహు దోషోఽపి సంమతః ॥ 52 ॥

అనేక సర్పకోరలు గల పాములతో కూడిన, అనేక ముళ్ళుగల, చౌరశక్యంగాని, తెల్లనిమేఘంలాగా నీరులేని, భయంకరమైన వనమును ఒకానొకడు, దట్టమైన అడవిలాగా ఉన్న, దావానలంతో దగ్ధమైన చెట్లుగల, దారి పొడుగునా దొంగలతో నిండిన మార్గమును క్షేమంగా దాటి ముందుకు వెళ్ళినట్లుగా, యోగ మార్గముననుసరించి ఎవరో ఒక బ్రాహ్మణుడు వెళ్ళును. అనేక దోషములుకలవాడైనా క్షేమంగా ఆ మార్గము ననుసరించినట్లయితే అది సమ్మతమే.

ఆస్థేయం క్షురధారాసు నిశితాసు ద్విజోత్తమాః ।
ధారణా సా తు యోగస్య దుర్గేయమకృతాత్మభిః ॥ 53 ॥

ఓ ద్విజోత్తములారా! నిశితమైన అసిధారా వ్రతంవలె ఉండదగినది. మనసును గెలవలేనివారు ఈ యోగధారణ చేయుట అనునది చాలా కష్టమైనది.

విషమా ధారణా విప్రా యాన్తి వై న శుభాం గతిమ్ ।
నేతృహీనా యథా నావః పురుషాణాం తు వై ద్విజాః ॥ 54 ॥

ఓ ద్విజులారా! నడిపేవారు లేని నావలు ఎట్లు అవతలి వొడ్డుకు చేరలేవో, అట్లే ఈ యోగధారణ అనునది మిక్కిలి విషమమైనది. శుభగతిని కలిగించలేదు.

యస్తు తిష్ఠతి యోగాన్వై ధారణాసు యథావిధి ।
మరణం జన్మ దుఃఖిత్వం సుఖిత్వం స విశిష్యతే ॥ 55 ॥

యథావిధిగా యోగధారణచేసే వానికి మరణం, జన్మదుఃఖిత్వం, సుఖిత్వమును అతను అతిక్రమించును.

నానాశాస్త్రేషు నియతం నానామునినిషేవితమ్ ।
పరం యోగస్య పన్థానం నిశ్చితం తం ద్విజాతిషు ॥ 56 ॥

అనేక శాస్త్రములందు నియమంగా ఉండాలి, అనేక మునిగణములచే సేవించబడునది అను వానికంటె కూడా బ్రాహ్మణులకు నిశ్చయంగా విధించినది యోగమార్గమును ఉత్తమమార్గముగా తెలియవలయును.

పరం హి తద్బ్రహ్మమయం మునీంద్రో బ్రహ్మాణమీశం వరదం చ విష్ణుమ్ ।
భవం చ ధర్మం చ మహానుభావం యద్బ్రహ్మ పుత్రాన్ సుమహానుభావాన్ ॥ 57 ॥

తమశ్చ కష్టం సుమహద్రజశ్చ సత్త్వం చ శుద్ధం ప్రకృతిం పరాం చ ।
సిద్ధిం చ దేవీం వరుణస్య పత్నీం తేజశ్చ కృత్స్నం సుమహచ్చ ధైర్యమ్ ॥ 58 ॥

తారాధిపం ఖే విమలస్వభావం విశ్వాంశ్చ దేవానురగాన్ పితౄంశ్చ ।
శైలాంశ్చ కృత్స్నానుదధీంశ్చ ఘోరాన్ నదీశ్చ సర్వాః సనగాంశ్చ నాగాన్ ॥ 59 ॥

సాంధ్యాంస్తథా యక్షగణాన్దిశశ్చ గన్ధర్వసిద్ధాన్ పురుషాంస్త్రియశ్చ ।
పరస్పరం ప్రాప్య మహాన్మహాత్మా విశేత యోగీ న చిరాద్విముక్తః ॥ 60 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! బ్రహ్మను, ఈశ్వరుని, వరములనిచ్చే విష్ణువును, భవుణ్ణి, మహాను భావుడైన యముణ్ణి, మంచి మహానుభావులైన బ్రహ్మమానసపుత్రులను, మొదలగు వారికంటె కూడా, కష్టమైన తమస్సును, గొప్పనైన రజస్సును, శుద్ధమైన సత్త్వమును, పరమైన ప్రకృతిని, వరుణ పత్నిని, సిద్ధిని, దేవిని, తేజస్సును, గొప్పధైర్యమును వీటికంటె కూడా, ఆకాశంలో స్వచ్ఛమైన స్వభావంతో ఉండే తారాధిపుడైన చంద్రుని, విశ్వేదేవతలను, పితృదేవతలను, నాగులను, పర్వతములను, ఘోరమైన సముద్రములను, నదులన్నింటిని, నాగులతో కూడుకొనియున్న కొండలను, వీటికంటె కూడా, త్రిసంధ్యలను, యక్షగణములను, దిక్కులను, గంధర్వులను, సిద్ధులను, పురుషులను, స్త్రీలను పరస్పరంగా పొంది వీరందరికంటె కూడా గొప్పవాడైన మహాత్ముడైన యోగి తొందరగా విముక్తుడై మోక్షమును ప్రవేశిస్తాడు.

కథా చ యా విప్రవరాః ప్రసక్తా దైవే మహావీర్యమతౌ శుభేయమ్ ।
యోగాన్స సర్వాననుభూయ మర్త్యా నారాయణం తం ద్రుతమాప్నువన్తి ॥ 61 ॥

ఓ విప్రులారా! ఇంతవరకే కథా ప్రసంగం జరిగిందో అది దైవమునందు, వీర్యమతమునందు మిక్కిలి శుభకరం. అటువంటి యోగములనన్నింటిని అనుభవించి మానవులు త్వరలోనే ఆ నారాయణుని పొందగలరు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే 'యోగవిధి నిరూపణం' నామైకత్రింశాధికశతతమోఽధ్యాయః ॥ 131 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస–ఋషిసంవాదములో 'యోగ విధి నిరూపణ'మనే నూటముప్పై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వాత్రింశాధిక శతతమోఽధ్యాయః - నూట ముప్పైరెండవ అధ్యాయం

సాంఖ్యవిధినిరూపణమ్ - సాంఖ్యవిధినిరూపణం

మునయః ఊచుః :- మునులు పలికారు.

> **సమ్యక్క్రియేయం విప్రేన్ద్ర వర్ణితా శిష్టసంమతా ।**
> **యోగమార్గో యథాన్యాయం శిష్యాయేహ హితైషిణా ॥ 1 ॥**

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! శిష్యుని హితం కోరి న్యాయముననుసరించీ యోగమార్గమును శిష్టసమ్మతంగా చక్కని క్రియగా వర్ణించావు.

> **సాంఖ్యే త్విదానీం ధర్మస్య విధిం ప్రబ్రూహి తత్త్వతః ।**
> **త్రిషు లోకేషు యద్ జ్ఞానం సర్వం తద్విదితం హి తే ॥ 2 ॥**

మూడు లోకములందె జ్ఞానమైతే ఉందో అదంత మీకు తెలిసినదే. ఇపుడు సాంఖ్యమునందున్న ధర్మవిధిని, దాని తత్త్వమును గూర్చి వివరించండి.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

> **శృణుధ్వం మునయః సర్వే సాంఖ్యానాం విదితాత్మనామ్ ।**
> **విహితం యతిభిర్వృద్ధైః కపిలాదిభిరీశ్వరైః ॥ 3 ॥**

ఓ మునులారా! కపిలుడు మొదలైనవారు యతులు, వృద్ధులు ఈశ్వర సాంఖ్యమును గూర్చి తెలిసిన వారందరూ విహితమని చెప్పినదా గూర్చి చెబుతున్నాను వినండి.

> **యస్మిన్ సువిభ్రమాః కేచిద్దృశ్యన్తే మునిసత్తమాః ।**
> **గుణాశ్చ యస్మిన్బహవో దోషహానిశ్చ కేవలా ॥ 4 ॥**

ఓ మునిశ్రేష్ఠులారా! దీనిలో కొందరు భ్రమపడినవారు కూడా కన్పిస్తున్నారు. దేనిలోనైతే ఎక్కువ గుణాలు దోషము లేవో వానిని గూర్చి,

> **జ్ఞానేన పరిసంఖ్యాయ సదోషాన్విషయాన్ద్విజాః ।**
> **మానుషాన్ దుర్జయాన్ కృత్స్నాన్ పైశాచాన్విషయాంస్తథా ॥ 5 ॥**

ఓ బ్రాహ్మణులారా! వాటిలో మానవులు జయించలేనివి, మిక్కిలి పైశాచిక చేష్టలు గల విషయాలను, దోషములతో కూడుకొని యున్నవాటిని జ్ఞానంతో చక్కగా పరిశీలించి,

> **విషయానౌరగాన్ జ్ఞాత్వా గన్ధర్వవిషయాంస్తథా ।**
> **పితౄణాం విషయాన్ జ్ఞాత్వా తిర్యక్త్వం చరతాం ద్విజాః ॥ 6 ॥**

నాగసంబంధమైన, గన్ధర్వసంబంధమైన, పితృదేవతలసంబంధమైన, పశుపక్ష్యాదిసంబంధములైన విషయములను చక్కగా తెలుసుకొని,

సుపర్ణవిషయాన్ జ్ఞాత్వా మరుతాం విషయాంస్తథా ।
మహర్షివిషయాంశ్చైవ రాజర్షివిషయాస్తథా ॥ 7 ॥

గరుడజాతి విషయములను, మరుత్తుల విషయములను, మహర్షుల విషయములను అట్లే రాజర్షుల విషయములను,

ఆసురాన్ విషయాన్ జ్ఞాత్వా వైశ్వదేవాంస్తథైవ చ ।
దేవర్షి విషయాన్ జ్ఞాత్వా యోగానామపి వై పరాన్ ॥ 8 ॥

అసుర సంబంధమైన, విశ్వేదేవతలకు సంబంధించిన, దేవర్షులకు సంబంధించిన, యోగులకు సంబంధించిన, పరలోక విషయములను కూడా తెలుసుకొని,

విషయాంశ్చాద్యమానస్య బ్రహ్మణో విషయం తథా ।
ఆయుషశ్చ పరం కాలం లోకైర్విజ్ఞాయ తత్త్వతః ॥ 9 ॥

మొదట బ్రహ్మయొక్క విషయమును, ఆయా లోకములు, వారియొక్క ఆయుష్షును, పరకాలమును గూర్చి పూర్తిగా తెలుసుకొని,

సుఖస్య చ పరం కాలం విజ్ఞాయ మునిసత్తమాః ।
ప్రాప్తకాలే చ యద్దుఃఖం పతతాం విషయైషిణామ్ ॥ 10 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! విషయాసక్తులైనవారు పొందే సుఖదుఃఖములెంత కాలం వరకుంటాయో తెలుసుకొని,

తిర్యక్త్వే పతతాం విప్రాస్తథైవ నరకేషు యత్ ।
స్వర్గస్య చ గుణాన్ జ్ఞాత్వా దోషాన్ సర్వాంశ్చ భో ద్విజాః ॥ 11 ॥

ఓ ద్విజులారా! పశుపక్ష్యాది జన్మలెత్తుటకు, స్వర్గనరకాదిలోకములను పొందుటకు వాటిల్లో ఉండే గుణదోషములను తెలుసుకొని,

వేదవాదే చ యే దోషా గుణా యే చాపి వైదికాః ।
జ్ఞానయోగే చ యే దోషా జ్ఞానయోగే చ యే గుణాః ॥ 12 ॥

వేదవాదమునందే దోషములు గలవో, వైదికాచారములందు ఏ గుణములు గలవో, జ్ఞానయోగము నందే గుణములు దోషములునూ గలవో,

సాంఖ్యజ్ఞానే చ యే దోషాస్తథైవ చ గుణా ద్విజాః ।
సత్త్వం దశగుణం జ్ఞాత్వా రజో నవగుణం తథా ॥ 13 ॥

ఓ ద్విజులారా! సాంఖ్యజ్ఞానమునందు ఏ దోషములు, గుణములున్నవో, సత్త్వమును పది గుణములు గలదానిగా, రజో గుణమును తొమ్మిది గుణములు గల దానిగా,

తమశ్చాష్ట గుణం జ్ఞాత్వా బుద్ధిః సప్తగుణం తథా ।
షడ్గుణం చ నభో జ్ఞాత్వా తమశ్చ త్రిగుణం మహత్ ॥ 14 ॥

తమస్సు ఎనిమిది గుణములు గలదానిగా, బుద్ధి ఏడు గుణములు గలదానిగా, ఆకాశము ఆరు గుణములు గలదానిగా, తిరిగి తమస్సును త్రిగుణముగల మహత్తుగా తెలుసుకొని,

ద్విగుణం చ రజో జ్ఞాత్వా సత్త్వం చైక గుణం పునః ।
మార్గం విజ్ఞాయ తత్త్వేన ప్రలయప్రేక్షణేన తు ॥ 15 ॥

రజస్సును ద్విగుణంగాను, తిరిగి సత్త్వమునేక గుణంగలదానినిగా తెలుసుకొని, ప్రలయ కాలమునందు తత్త్వముతో మార్గమును తెలుసుకొని,

జ్ఞానవిజ్ఞానసంపన్నాః కారణైర్భావితాత్మభిః ।
ప్రాప్నువన్తి శుభం మోక్షం సూక్ష్మా ఇవ నభః పరమ్ ॥ 16 ॥

అనేక కారణములతో భావించేవారు ఆకాశమునకవతల జ్ఞాన విజ్ఞాన సంపన్నులై సూక్ష్మములు గలవని తెలిసి ఆ అవతలనున్న శుభమైన మోక్షమును పొందుతారు.

రూపేణ దృష్టిం సంయుక్తాం ఘ్రాణం గంధగుణేన చ ।
శబ్దగ్రాహ్యం తథా శ్రోత్రం జిహ్వాం రసగుణేన చ ॥ 17 ॥

కన్నును రూపంతో కూడుకొన్న దానిగా, ముక్కును గంధగుణంతో కూడిన దానిగా, చెవిని శబ్దము గ్రహించే దానిగా, నాలుకను రుచిని గ్రహించేదానిగా,

త్వచం స్పర్శం తథా శక్యం వాయుం చైవ తదాశ్రితమ్ ।
మోహం తమసి సంయుక్తం లోభం మోహేషు సంశ్రితమ్ ॥ 18 ॥

చర్మమును స్పర్శజ్ఞానమును తెల్పేదానిగా, దానినాశ్రయించినదానిని వాయువుగా, తమోగుణంలో నున్నవి మోహంగా, మోహములందాశ్రయించియున్నదానిని లోభంగా,

విష్ణుం క్రాన్తే బలే శక్రం కోష్ఠే సక్తం తథాఽనలమ్ ।
అప్సు దేవీం సమాయుక్తామాపస్తేజసి సంశ్రితాః ॥ 19 ॥

వ్యాపించినందున విష్ణువును, బలమునందు ఇంద్రుని, (కోష్ఠము) ఉదరము నందున్న వానిని అగ్నిగా, నీటియందు సమాయుక్తమైనది భూదేవిగా, నీటిని తేజస్సు నాశ్రయించినదానిగా,

తేజో వాయౌ తు సంయుక్తం వాయుం నభసి చాఽఽశ్రితమ్ ।
నభో మహతి సంయుక్తం తమో మహసి సంస్థితమ్ ॥ 20 ॥

తేజస్సు వాయువునందున్న దానిగా, ఆకాశము నా(శయించిన దానిని వాయువుగా, ఆకాశము మహత్తుతో కూడినదానిగా, మహత్తునందున్నది తమోగుణంగా,

రజః సత్త్వం తథా సక్తం సత్త్వం సక్తం తథాఽఽత్మని ।
సక్తమాత్మానమీశే చ దేవే నారాయణే తథా ॥ 21 ॥

రజస్సు సత్త్వాసక్తమైనదిగా, సత్త్వము ఆత్మయందాసక్తమైనదిగా, ఈశ్వరునియందు సక్తమైనదాత్మగా, అదే దేవుడైన నారాయణునందున్న దానిగా,

దేవం మోక్షే చ సంయుక్తం తతో మోక్షం చ న క్వచిత్ ।
జ్ఞాత్వా సత్త్వగుణం దేహం వృతం షోడశభిర్గుణైః ॥ 22 ॥

(నారాయణ) దేవసంయుక్తమైన దానిని మోక్షంగా మోక్షం తర్వాత మరేమీ లేదని తెలుసుకొని, స్థూల దేహమును పదహారు గుణములతో నావరించిన సత్త్వగుణంగా తెలుసుకొని,

స్వభావం భావనాం చైవ జ్ఞాత్వా దేహసమా(శితామ్ ।
మధ్యస్థమివ చాఽఽత్మానం పాపం యస్మిన్న విద్యతే ॥ 23 ॥

దేహము నా(శయించినవి భావనను స్వభావములుగా, దేనియందైతే పాపం లేదో దానిని మధ్యస్థము వలె నున్న ఆత్మగా తెలుసుకొని,

ద్వితీయం కర్మ వై జ్ఞాత్వా వి(ప్రే(న్ద్రా విషయైషిణామ్ ।
ఇం(ద్రియాణీ(న్ద్రియార్థాంశ్చ సర్వానాత్మని సంస్థితాన్ ॥ 24 ॥

విషయములందాసక్తిగలవారి కర్మ రెండవదానిగా, ఇం(ద్రియములను ఇం(ద్రియార్థములనన్నింటిని ఆత్మయందున్న వాటినిగా తెలుసుకొని,

దుర్లభత్వం చ మోక్షస్య విజ్ఞాయ (శుతిపూర్వకమ్ ।
(ప్రాణాపానౌ సమానం చ వ్యానోదానౌ చ తత్త్వతః ॥ 25 ॥

శా(స్త్ర(ప్రమాణంగా మోక్షం దుర్లభమని తెలుసుకొనవలెను. (ప్రాణాపానవ్యానోదాన సమాన అను వాయువులను (ప్రాణతత్త్వోత్పత్తిని కలిగించేవానిగా,

ఆద్యం చైవానిలం జ్ఞాత్వా (ప్రభవం చానిలం పునః ।
సప్తధా తాంస్తథా శేషాన్ సప్తధా విధివత్పునః ॥ 26 ॥

వానిలో మొదట వాయువును తెలిసికొని దానినుండి (ప్రాణోత్పత్తిని ఏడు విధములుగా నున్న శేషములగు (ప్రాణములనుగా తెలుసుకొనవలెను.

(ప్రజాపతీనృషీంశ్చైవ సర్గాశ్చ సుబహూన్ వరాన్ ।
సప్తర్షీంశ్చ బహూన్ జ్ఞాత్వా రాజర్షీంశ్చ పరంతపాన్ ॥ 27 ॥

ప్రజాపతులను, ఋషులను, సృష్టులను అనగా అనేక విధములుగా, శ్రేష్ఠముగా సృష్టించే సర్గలను, సప్తర్షులను, పరలోకమునుగూర్చి తపస్సులనాచరించే అనేకులైన రాజర్షులను,

సురర్షీన్మరుతశ్చాన్యాన్ బ్రహ్మర్షీన్ సూర్యసంనిభాన్ ।
ఐశ్వర్యాచ్చ్యావితాన్ దృష్ట్వా కాలేన మహతా ద్విజాః ॥ 28 ॥

దేవర్షులను, మరుత్తులను, సూర్యతేజస్సుతో సమానమైన ఇతర బ్రహ్మర్షులను, ఉత్తమలోక సుఖానుభవములను పొంది చాలాకాలం తరువాత అక్కడినుండి జారి అధోగతి పొందినవారిని,

మహతాం భూతసంఘానాం శ్రుత్వా నాశం చ భో ద్విజాః ।
గతిం వాచాం శుభాం జ్ఞాత్వా అర్చార్హాః పాపకర్మణామ్ ॥ 29 ॥

పూజింపదగిన బ్రాహ్మణులారా! మహాభూత సంఘనాశమును విని, శుభమగు వాక్కులగతులను విని, పాపకర్ములగతి గూర్చి తెలుసుకో,

వైతరణ్యాం చ యద్దుఃఖం పతితానాం యమక్షయే ।
యోనిషు చ విచిత్రాసు సంచారానశుభాస్తథా ॥ 30 ॥

వైతరణి నదియందు పడినప్పుడే దుఃఖం కలుగునో, యమలోకంనందున్నపుడే దుఃఖం కలుగునో అట్లే యమబాధల ననుభవించిన తరువాత అనేక యోనులయందు జన్మించుట వల్ల కలిగే విచిత్రమైన ఆ జాతుల భిన్నం వల్ల అశుభములను,

జఠరే చాశుభే వాసం శోణితోదకభాజనే ।
శ్లేష్మమూత్రపురీషే చ తీవ్రగంధసమన్వితే ॥ 31 ॥

శోణితం, ఉదకం, శ్లేష్మం, మూత్ర పురీషములతో తీవ్ర దుర్గంధము గలిగిన తల్లి గర్భమునందు నివాసము,

శుక్రశోణితసంఘాతే మజ్జాస్నాయుపరిగ్రహే ।
శిరాశతసమాకీర్ణే నవద్వారపురేఽథ వై ॥ 32 ॥

శుక్రము, శోణితము, మజ్జా, స్నాయువులతో వందలకొలది సిరలతో కూడుకొనియున్న నవ ద్వారములుగల ఈ శరీరమునందు గల జీవుడు

విజ్ఞాయ హితమాత్మానం యోగాంశ్చ వివిధాన్ ద్విజాః ।
తామసానాం చ జంతూనాం రమణీయానృతాత్మనామ్ ॥ 33 ॥

ఓ బ్రాహ్మణులారా! తనకు హితమైన దానిని, సత్త్వరజస్తమోగుణములు గల ప్రాణులు సాధించగల వివిధ యోగములను, అసత్యగతిలో తామసప్రవృత్తిగల సాధకులవారి యోగసాధనములను

సాత్త్వికానాం చ జంతూనాం కుత్సితం మునిసత్తమాః ।
గర్హితం మహతామర్థే సాంఖ్యానాం విదితాత్మనామ్ ॥ 34 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఆత్మతత్త్వమును తెలుసుకొన్న సాంఖ్యులు ఉత్తమమైన విషయములను సాధించుటలో పొందే ఉపద్రవములను

ఉపద్రవాంస్తథా ఘోరాన్ శశినస్తే జసస్తథా ।
తారాణాం పతనం దృష్ట్వా నక్షత్రాణాం చ పర్యయమ్ ॥ 35 ॥

చంద్రునియొక్క, తేజస్సుయొక్క ఘోరమైన ఉపద్రవములను, చుక్కలు రాలుటను, నక్షత్రములు యొక్క విపర్యయములను చూసి, చంద్రుని తేజస్సునుండి మారుటను చూసి,

ద్వంద్వానాం విప్రయోగం చ విజ్ఞాయ కృపణం ద్విజాః ।
అన్యోన్యభక్షణం దృష్ట్వా భూతానామపి చాశుభమ్ ॥ 36 ॥

పరస్పరంగా ద్వంద్వములయందుండే విప్రయోగమును తెలుసుకొని, జీవులలో ఒకదానిని ఒకటి చంపుకొని తినే అశుభమైన కర్మలను చూసి,

బాల్యే మోహం చ విజ్ఞాయ పక్షదేహస్య చాశుభమ్ ।
రాగం మోహం చ సంప్రాప్తం క్వచిత్సత్త్వం సమాశ్రితమ్ ॥ 37 ॥

బాల్యదశలోనే మోహమును, పక్షదేహమునకశుభము, ఒకానొక చోట సత్త్వమునకే రాగము, మోహము కలుగుటను తెలుసుకొని,

సహస్రేషు నరః కశ్చిన్మోహబుద్ధిం సమాశ్రితః ।
దుర్లభత్వం చ మోక్షస్య విజ్ఞానం శ్రుతి పూర్వకమ్ ॥ 38 ॥

వేలమందిలో ఒక మనుష్యుడు మోహబుద్ధి నాశ్రయించినవాడై, మోక్షమార్గమును పొందుట కష్టమని తలచి శ్రుతిపూర్వకంగా ఆ విజ్ఞానంగూర్చి తెలుసుకొని,

బహుమానమలబ్ధేషు లబ్ధే మధ్యస్థతాం పునః ।
విషయాణాం చ దౌరాత్మ్యం విజ్ఞాయ చ పునర్ద్విజాః ॥ 39 ॥

గౌరవించదగని వారియందు గౌరవం లభించగానే తిరిగి మధ్యస్థునిగా నుండి, తిరిగి విషయాదుల దుర్మార్గమును తెలుసుకొని,

గతాసూనాం చ సత్త్వానాం దేహం భిత్వా తథా శుభాన్ ।
వాసం కులేషు జన్తూనాం మరణాయ ధృతాత్మనామ్ ॥ 40 ॥

ఈశరీరమును భేదించుకుని బయటకు వెళ్ళిన ప్రాణములుగల జీవులను, అనేక సమూహములలో ఆయా శరీరములయందు కొంతకాలం నుండి తిరిగి మరణించే జీవుల, శరీరవాసమును

సాత్త్వికానాం చ జన్తూనాం దుఃఖం విజ్ఞాయ భో ద్విజాః ।
బ్రహ్మఘ్నానాం గతిం జ్ఞాత్వా పతితానాం సుదారుణామ్ ॥ 41 ॥

సాత్త్వికులైన జీవుల దుఃఖమును, పతితులైనవారి స్థితిని, దారుణమైన బ్రహ్మహత్యాపాతకమును పొందినవారి గతిని తెలుసుకొని,

సురాపానే చ సక్తానాం బ్రాహ్మణానాం దురాత్మనామ్ ।
గురుదారప్రసక్తానాం గతిం విజ్ఞాయ చాశుభామ్ ॥ 42 ॥

సురాపానమునందాసక్తులైన దుర్మార్గులైన బ్రాహ్మణులకు, గురుపత్ని యందు ఆసక్తులైన శిష్యు లేదుర్గతిని పొందుతారో తెలుసుకొని,

జననీషు చ వర్తన్తే యే న సమ్యగ్ద్విజోత్తమాః ।
సదైవకేషు లోకేషు యే న వర్తన్తి మానవాః ॥ 43 ॥

ఓ ద్విజోత్తములారా! దేనిచేతనైతే తల్లిదండ్రులయందు చక్కగా ప్రవర్తిస్తారో, మానవులు దేనిచేతనైతే దేవతలయందు వారి లోకములయందు జ్ఞానవంతులుగా ప్రవర్తించుట నెరుగుదురో,

తేన జ్ఞానేన విజ్ఞాయ గతిం చాశుభకర్మణామ్ ।
తిర్యగ్యోనిగతానాం చ విజ్ఞాయ చ గతీః పృథక్ ॥ 44 ॥

ఆ జ్ఞానంచేత శుభాశుభకర్మలవల్ల పొందే గతిని తెలుసుకొని, పశుపక్ష్యాది జీవులనుగూర్చి, అవి పొందే గతులనుగూర్చి వేరుగా తెలుసుకొని,

వేదవాదాంస్తథా చిత్రానృతూనాం పర్యయాం స్తథా ।
క్షయం సంవత్సరాణాం చ మాసానాం చ క్షయం తథా ॥ 45 ॥

వేదవాదములను, ఋతువుల చిత్రమైన మార్పులను, అట్లే మాసముల, సంవత్సరములయొక్క క్షయమును,

పక్ష క్షయం తథా దృష్ట్వా దివసానాం చ సంక్షయమ్ ।
క్షయం వృద్ధిం చ చంద్రస్య దృష్ట్వా ప్రత్యక్షతస్తథా ॥ 46 ॥

చంద్రునియొక్క వృద్ధి క్షయములను ప్రత్యక్షంగా చూసి, అట్లే దినములయొక్క, పక్షములయొక్క క్షయములను చూసి,

వృద్ధిం దృష్ట్వా సముద్రాణాం క్షయం తేషాం తథా పునః ।
క్షయం ధనానాం దృష్ట్వా చ పునర్వృద్ధిం తథైవ చ ॥ 47 ॥

సముద్రములయొక్క వృద్ధి క్షయములను, అట్లే ధనములయొక్క వృద్ధి క్షయములను చూసి,

సంయోగానాం తథా దృష్ట్వా యుగానాం చ విశేషతః ।
అహం వైక్లవ్యతాం చైవ సమ్యగ్విజ్ఞాయ తత్త్వతః ॥ 48 ॥

యుగములయొక్క కలయికను, యుగసంధిని విశేషంగా చూసి తత్త్వపూర్వకంగా అహంకార స్వరూపమును, దీనత్వస్వరూపమును చక్కగా తెలుసుకొని,

ఆత్మదోషాంశ్చ విజ్ఞాయ సర్వానాత్మని సంస్థితాన్ ।
స్వదేహాదుత్థితాన్దోషాంస్తథా విజ్ఞాయ చాశుభాన్ ॥ 49 ॥

తనలో నున్న సమస్త ఆత్మదోషములను తెలుసుకొని, అట్లే తన దేహమునందుద్భవించే అశుభాలను కలుగజేసే దోషములను గూర్చి తెలుసుకొనవలెను. దానికి తగిన విధంగా ప్రవర్తించవలెను.

మునయ ఊచుః :- మునులు పలికారు.

కానుత్పాతభవాన్దోషాన్పశ్యసి బ్రహ్మవిత్తమ ।
ఏతం నః సంశయం కృత్స్నం వక్తుమర్హస్యశేషతః ॥ 50 ॥

ఓ బ్రహ్మజ్ఞానీ! ఉత్పాతములవల్ల కలిగే దోషములను మీరు దర్శిస్తున్నారో వాటిని గూర్చి వివరంగా మాకు చెప్పి మా సంశయమును దీర్చండి.

వ్యాస ఊచుః :- వ్యాసుడు పలికాడు.

పంచదోషాన్ద్విజా దేహే ప్రవదన్తి మనీషిణః ।
మార్గజ్ఞాః కాపిలాః సాంఖ్యాః శృణుధ్వం మునిసత్తమాః ॥ 51 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! మనీషులైన కపిలులు, సాంఖ్యులు దేహమునందు ఐదు దోషములున్నట్లు చెబుతారు. వాటిని గూర్చి మీకు వివరిస్తున్నాను వినండి.

కామక్రోధౌ భయం నిద్రా పంచమః శ్వాస ఉచ్యతే ।
ఏతే దోషాః శరీరేషు దృశ్యన్తే సర్వదేహినామ్ ॥ 52 ॥

కామం, క్రోధం, భయం, నిద్ర, శ్వాస అనునవి ఐదు దోషములు. ఇవి సమస్తప్రాణులయందు కన్పిస్తున్నాయి.

ఛిన్దన్తి క్షమయా క్రోధం కామం సంకల్పవర్జనాత్ ।
సత్త్వసంసేవనాన్నిద్రామప్రమాదాత్ భయం తథా ॥ 53 ॥

క్షమవల్ల క్రోధం, సంకల్పములను వదిలివేయుట వల్ల కామం, సాత్త్వికభావమును పెంపొందించు కొనుటవల్ల నిద్ర, ప్రమాదములు నివారించుటవల్ల భయం,

ఛిన్దన్తి పంచమం శ్వాసమల్పాహారతయా ద్విజాః ।
గుణాన్గుణశతైర్జ్ఞత్వా దోషాన్దోషశతైరపి ॥ 54 ॥

అల్పాహారంవల్ల ఐదవదైన శ్వాసను నియంత్రించుట జరుగుతుంది. గుణదోషముల స్వరూపములను నూరు విధములుగా బాగా ఆలోచించి తెలుసుకొని,

హేతూన్ హేతుశతైశ్చిత్రైశ్చిత్రాన్ విజ్ఞాయ తత్త్వతః ।
అపాం ఫేనోపమం లోకం విష్ణోర్మాయాశతైః కృతమ్ ॥ 55 ॥

విష్ణుమాయా విచిత్రంవల్ల అనేక విధములుగా చేయబడిన ఈహేతువులను నీటిలో నురుగు వంటి లోకమును తత్త్వతః తెలుసుకొని,

చిత్రభిత్తిప్రతీకాశం నలసారమనర్థకమ్ ।
తమః సంభ్రమితం దృష్ట్వా వర్షబుద్బుదసన్నిభమ్ ॥ 56 ॥

చిత్రమైన బొమ్మలు గల గోడవలె, అనర్థమైన నలసారంవలె, వర్షాకాలములోని బుడగలవలె తమోగుణంతో భ్రమింపచేసే దానిని చూసి,

నాశప్రాయం సుఖాధానం నాశోత్తరమహాభయమ్ ।
రజస్తమసిసంమగ్నం పంకే ద్విపమివావశమ్ ॥ 57 ॥

నాశప్రాయమైన సుఖమునిచ్చేది, నశించిన తర్వాత మహాభయాన్ని కల్గించేది, బురదలో చిక్కిన ఏనుగువలె రజస్తమోగుణములలో మునిగి బయటకు రానివ్వనటువంటి,

సాంఖ్యా విప్రా మహాప్రాజ్ఞాస్త్యక్త్వా స్నేహం ప్రజాకృతమ్ ।
జ్ఞానజ్ఞేయేన సాంఖ్యేన వ్యాపినా మహతా ద్విజాః ॥ 58 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈప్రజాకృతమైన స్నేహమును మహాప్రాజ్ఞులైన సాంఖ్యులు గొప్పగా వ్యాపించిన జ్ఞానంచేత తెలుసుకోదగిన సాంఖ్యంతో వదిలిపెట్టి,

రాజసానశుభాన్గంధాంస్తామసాంశ్చ తథా విధాన్ ।
పుణ్యాంశ్చ సాత్త్వికాన్గంధాన్ స్పర్శజాన్దేహసంశ్రితాన్ ॥ 59 ॥

దేహమునాశ్రయించియుండే అశుభములైన తామస, రాజసగంధములను, స్పర్శవల్ల పుట్టే పుణ్యములైన సాత్త్వికగంధములను,

ఛిత్వాఽఽత్మజ్ఞానశస్త్రేణ తపోదండేన సత్తమాః ।
తతో దుఃఖోదకం ఘోరం చిన్తాశోక మహాహ్రదమ్ ॥ 60 ॥

ఓ మునిసత్తములారా! వాటిని ఆత్మజ్ఞానమనే శస్త్రంతో ఛేదించి, తపస్సనే దండంతో దుఃఖమనే ఉదకమును, చిన్త, శోకమనే మహాహ్రదమును ఘోరమైన దానినిగా తలచి,

వ్యాధిమృత్యుమహాఘోరం మహాభయమహోరగమ్ ।
తమఃకూర్మం రజోమీనం ప్రజ్ఞయా సంతరంత్యుత ॥ 61 ॥

మహాఘోరమైన వ్యాధి మృత్యువును, మహాభయమనే సర్పమును, తమోగుణమనే తాబేలును, రజోగుణమనే మొసలి లేదా మీనమును ప్రజ్ఞతో జయిస్తారు.

స్నేహపంకం జరాదుర్గం స్పర్శద్వీపం ద్విజోత్తమాః ।
కర్మాగాధం సత్యతీరం స్థితం వ్రత మనీషిణః ॥ 62 ॥

ఓ ద్విజోత్తములారా! మనీషులైనవారు స్నేహమనే బురదను, ముసలితనమనే దుర్గమును, స్పర్శ అనే ద్వీపమును, కర్మమనే అగాధమును దాటి వ్రతధరులై సత్యతీరమును చేరుతారు.

హింసా శీఘ్రమహావేగం నానారససమాకులమ్ ।
నానాప్రీతిమహారత్నం దుఃఖజ్వరసమీరితమ్ ॥ 63 ॥

త్వరగా మహావేగంగా ప్రవహించే హింసను, అనేక రసములతో వ్యాకులమైన దానిని, అనేక ప్రీతులనే వాటితో కూడియున్న రత్నమును, దుఃఖమనే జ్వరము అనే గాలితో కూడుకొని యున్నదానిని,

శోకతృష్ణా మహావర్తం తీక్ష్ణవ్యాధి మహారుజమ్ ।
అస్థిసంఘాతసంఘట్టం శ్లేష్మయోగం ద్విజోత్తమాః ॥ 64 ॥

శోకం తృష్ణలనే గొప్ప సుడిగుండమును, తీక్ష్ణమైన వ్యాధులనే ముసలితనమును, ఎముకలతో కూడియున్న రేవును, శ్లేష్మంతో కూడియున్నదానిని,

దానముక్తాకరం ఘోరం శోణితోద్గారవిద్రుమమ్ ।
హసితోత్కృష్టనిర్ఘోషం నానాజ్ఞానసుదుష్కరమ్ ॥ 65 ॥

దానములు వదలుటకు స్థానమైన ఘోరమైన దానిని రక్తోద్గారమైన విద్రుమమును, హేళనతో కూడిన గొప్ప నిర్ఘోషమును, వివిధజ్ఞానములతో దుష్కరమైన దానిని,

రోదనాశ్రుమలక్షారం సంగయోగపరాయణమ్ ।
ప్రలబ్ధ్వా జన్మలోకోఽయం పుత్రబాంధవపత్తనమ్ ॥ 66 ॥

ఏడ్చుటవల్ల వచ్చే అశ్రుమలంతో క్షారమైనదానిని, సంగమించుటయే యోగమనే ఆసక్తిగలదానిని, పుత్రులు, బంధువులనే సంబంధముగల జన్మించుట అనే లోకమును, శరీరమును పొంది,

అహింసా సత్యమర్యాదం ప్రాణయోగమయోర్మిలమ్ ।
వృందానుగామినం క్షీరం సర్వభూతపయోదధిమ్ ॥ 67 ॥

అహింసయనే సత్యమర్యాదను, ప్రాణయోగమనే నురగను, సమూహముననుసరించుట యనే పాలను, సమస్త భూతములకు స్థానమైన పాలసముద్రమును,

మోక్షదుర్లభవిషయం వాడవాసుఖసాగరమ్ ।
తరన్తి యతయః సిద్ధా జ్ఞానయోగేన చానఘాః ॥ 68 ॥

ఓ పాపరహితులారా! దుర్లభమైన మోక్షమునకడ్డుగా నుండు విషయములను, సుఖములనే బడబాగ్ని దాగియున్న సాగరమును సిద్ధులు, యతులు జ్ఞానయోగంతో దాటుతారు.

తీర్త్వా చ దుస్తరం జన్మ విశన్తి విమలం నభః ।
తతస్తానాగతాన్ దృష్ట్వా సూర్యో వహతి రశ్మిభిః ॥ 69 ॥

అట్లు వారు దుస్తరమైన జన్మను దాటి పరిశుద్ధమైన ఆకాశంలో ప్రవేశిస్తారు. ఆ తరువాత అలా వచ్చిన వారిని చూసి సూర్యుడు తన కిరణములతో మోస్తాడు.

పద్మతన్తువదావిశ్య ప్రవహన్విషయాన్ద్విజాః ।
తత్ర తాన్ ప్రవహో వాయుః ప్రతిగృహ్ణాతి చానఘాః ॥ 70 ॥

ఓ బ్రాహ్మణులారా! పుణ్యాత్ములారా! తామరతూడులోనికి దారం గ్రుచ్చినట్లుగా ప్రవేశించిన నారవలె విషయములను ప్రవహిస్తుండగా వాటిని అక్కడ వాయువు గ్రహిస్తుంది.

వీతరాగాన్యతీన్సిద్ధాన్వీర్యయుక్తాంస్తపోధనాన్ ।
సూక్ష్మశీతః సుగంధశ్చ సుఖస్పర్శశ్చ భో ద్విజాః ॥ 71 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! వీతరాగులను, యతులను, సిద్ధులను, వీర్యవంతులను, తపోధనులను సూక్ష్మశీతం, సుగంధం, సుఖస్పర్శ సేవిస్తుంది.

సప్తానాం మరుతో శ్రేష్ఠో లోకాన్ గచ్ఛతి యః శుభాన్ ।
స తాన్వహతి విప్రేన్ద్రా నభసః పరమాం గతిమ్ ॥ 72 ॥

ఉత్తముడైనవాడు సప్తమరుత్తులయొక్క శుభమైన లోకములను చేరితే వాయువు వారిని వహించి ఆకాశమార్గంగా పరమపదం చేరుస్తుంది.

నభో వహతి లోకేశాన్ రజసః పరమాం గతిమ్ ।
రజో వహతి విప్రేన్ద్రాః సత్త్వస్య పరమాం గతిమ్ ॥ 73 ॥

ఓ విప్రశ్రేష్ఠులారా! లోకేశుల నందరిని ఆకాశంవహించి రజోమార్గంద్వారా పయనింపచేస్తుంది, రజస్సు ఉత్తమమైన సత్త్వమార్గమునకు చేరుస్తుంది.

సత్త్వం వహతి శుద్ధాత్మా పరం నారాయణం శుభమ్ ।
ప్రభుర్వహతి శుద్ధాత్మా పరమాత్మానమాత్మనా ॥ 74 ॥

ఈసత్త్వగుణం దానిని శుద్ధాత్మదగ్గరకు చేరుస్తుంది. శుద్ధాత్మను ప్రభువు వహిస్తాడు. పరంలో నున్న శుభకరుడైన పరమాత్మ తన ఆత్మతో ఈశుద్ధాత్మ చేరుతుంది.

పరమాత్మానమాసాద్య గతదోషాః సదాఽమలాః ।
అమృతత్వాయ కల్పన్తే న నివర్తన్తి చ ద్విజాః ॥ 75 ॥

ఓ బ్రాహ్మణులారా! ఎప్పుడైతే ఈ ఆత్మ (లు) పరమాత్ముని పొందుతుందో అప్పుడు దోషములన్నీ పోయి, స్వచ్ఛంగానుండి అమృతంగా కల్పించబడుతుంది. తిరిగి జన్మనెత్తుటకు వెనుకకు రావు (దు).

పరమా సా గతిర్విప్రా నిర్ద్వంద్వానాం మహాత్మనామ్ ।
సత్యార్జవరతానాం చ సర్వభూతదయావతామ్ ॥ 76 ॥

ఓ విప్రులారా! ద్వంద్వాతీతులైన మహాత్ములకు, సత్యం నిజాయితీయందాసక్తిగల వారికి, సమస్త జీవులయందు దయగలవారికి పరమనే ఉత్తమస్థానం లభిస్తుంది.

మునయ ఊచుః :– మునులు పలికారు.

స్థానముత్తమమాసాద్య భగవన్తం స్థిరవ్రతాః ।
ఆజన్మమరణం వా తే రమన్తే తత్ర వా న వా ॥ 77 ॥

స్థిరవ్రతులైన అటువంటివారు ఉత్తమమైన భగవత్‌స్థానమును చేరిన తర్వాత తిరిగి జనన మరణ చక్రములోనికి వస్తారా? లేక వారక్కడే ఆనందమనుభవిస్తారా లేదా?

యదత్ర తథ్యం తత్త్వం నో యథావద్వక్తుమర్హసి ।
త్వదృతే మానవం నాన్యం ప్రష్టుమర్హామ సత్తమ ॥ 78 ॥

ఓ శ్రేష్ఠుడా! ఈవిషయంలో సత్యమైన తత్త్వమేదో మాకు విశదంగా చెప్పుటకు నీవే తగియున్నావు. నిన్ను తప్ప మరొక మానవుని మేము అడుగలేము.

మోక్షదోషో మహానేష ప్రాప్య సిద్ధిం గతానృషీన్ ।
యది తత్రైవ విజ్ఞానే వర్తన్తే యతయః పరే ॥ 79 ॥

అటువంటివారికి ఋషులకు మోక్షము మహాదోషము కదా! ఆ మునులు అక్కడే పరంలోనే విజ్ఞానమునందే ఉన్నట్లయితే,

ప్రవృత్తిలక్షణం ధర్మం పశ్యామ పరమం ద్విజ ।
మగ్నస్య హి పరే జ్ఞానే కింతు దుఃఖాంతరం భవేత్ ॥ 80 ॥

ఓ ద్విజుడా! మనం పరమమైన ప్రవృత్తి లక్షణమును చూస్తున్నాము. కాని పరజ్ఞానమునందు మునిగినవానికి కూడా ఇతర దుఃఖములు కలుగును.

వ్యాస ఉవాచ :–వ్యాసుడు పలికాడు.

యథాన్యాయం మునిశ్రేష్ఠా ప్రశ్నః పృష్టశ్చ సంకటః ।
బుధానామపి సంమోహః ప్రశ్నేఽస్మిన్ మునిసత్తమాః ॥ 81 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! మీరు న్యాయమైన విధంగానే నన్నొక సంకటమైన ప్రశ్ననడిగారు. ఈప్రశ్నలో పండితులకు కూడా సంమోహం కల్గించే విషయమున్నది.

అత్రాపి తత్త్వం పరమం శృణుధ్వం వచనం మమ ।
బుద్ధిశ్చ పరమా యత్ర కపిలానాం మహాత్మనామ్ ॥ 82 ॥

ఇక్కడ కూడా ఆ పరమతత్త్వమును గూర్చి మహాత్ములైన సాంఖ్యుల బుద్ధి ఎంత గొప్పదో దానిని గూర్చి చెబున్నాను వినండి.

ఇంద్రియాణ్యపి బుధ్యన్తే స్వదేహం దేహినాం ద్విజాః ।
కరణాన్యాత్మనస్తాని సూక్ష్మం పశ్యన్తి తైస్తు సః ॥ 83 ॥

ఓ ద్విజులారా! జీవుల ఇంద్రియములుకూడా తమ దేహమునుగూర్చి తెలుసుకుంటాయి. మనుష్యుడు ఆ ఇంద్రియములతో ఆత్మసూక్ష్మతత్త్వమును దర్శిస్తాడు.

ఆత్మనా విప్రహీనాని పాపకర్మకృతాని చ ।
వినశ్యన్తి న సందేహో వేలా ఇవ మహార్ణవే ॥ 84 ॥

మహాసముద్రంలోని అలలు తీరమును తాకి తిరిగి సముద్రములోకే చేరినట్లుగా, ఆత్మదర్శనము లేకుండా చేయబడిన పాపకర్మలు కూడా ఫలితముల నిచ్చి మరల నశిస్తాయి.

ఇంద్రియైః సహ సుప్తస్య దేహినో వ్యాకులస్య చ ।
సూక్ష్మశ్చరతి సర్వత్ర నభసేవ సమీరణః ॥ 85 ॥

జీవులలో ఇంద్రియములతో వ్యాకులంచెంది నిదురించిన ఆత్మ సూక్ష్మరూపముగా అంతటా ఆకాశమున వాయువువలె సంచరించును.

స పశ్యతి యథాన్యాయం స్మృత్వా స్పృశతి చానఘాః ।
బుధ్యమానో యథాపూర్వమఖిలేనేహ భో ద్విజాః ॥ 86 ॥

ఓ పాపరహితులారా! ద్విజులారా! ఆత్మ అట్లున్న దానిని సమగ్రముగా, పూర్వమున్న దానిగా తెలుసుకొని యథాన్యాయంగా చూచును, స్మరించి స్పృశించును కూడా.

ఇంద్రియాణి హ సర్వాణి స్వే స్వే స్థానే యథావిధి ।
అనీశత్వాత్ప్రలీయన్తే సర్పా విషహతా ఇవ ॥ 87 ॥

విషహతములైన సర్పములు నశించునట్లు ఇంద్రియములు కూడా అసామర్థ్యము వలన వాటివాటి స్థానములలో లయమౌతాయి.

ఇంద్రియాణాం తు సర్వేషాం స్వస్థానేష్వేవ సర్వశః ।
ఆక్రమ్య గతయః సూక్ష్మాశ్చరత్యాత్మా న సంశయః ॥ 88 ॥

అందరిలోకూడా ఇంద్రియములు తమ స్థానములందుంటూనే సూక్ష్మరూపమును పొంది అంతటా ఆక్రమించి సంచరిస్తున్నట్లుగా ఆత్మకూడా సూక్ష్మరూపంగా సంచరిస్తుంది. దీనిలో సందేహం లేదు.

సత్త్వస్య చ గుణాంస్తాంస్తాన్రజసశ్చ గుణాన్ పునః ।
గుణాంశ్చ తమసః సర్వాన్ గుణాన్ బుద్ధేశ్చ సత్తమాః ॥ 89 ॥

ఓ పండితులారా! సత్త్వంయొక్క, రజస్సుయొక్క, తమస్సుయొక్క, బుద్ధియొక్క సమస్త గుణములను,

గుణాంశ్చ మనసశ్చాపి నభసశ్చ గుణాంస్తథా ।
గుణాన్వాయోశ్చ సర్వజ్ఞాః స్నేహజాంశ్చ గుణాన్పునః ॥ 90 ॥

ఓ సర్వజ్ఞులారా! మనస్సుయొక్క గుణములను, ఆకాశముయొక్క గుణములను, వాయువుయొక్క గుణములను, తిరిగి స్నేహంవల్ల కలిగిన గుణములను,

అపాం గుణాంస్తథా విప్రాః పార్థివాంశ్చ గుణానపి ।
సర్వానేవ గుణై ర్వ్యాప్య క్షేత్రజ్ఞేషు ద్విజోత్తమాః ॥ 91 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! నీటియొక్క గుణములను, పృథివియొక్క గుణములన్నింటిని కలిపి ఆయా గుణములచే జీవులయందు వ్యాపించి,

ఆత్మా చరతి క్షేత్రజ్ఞ కర్మణా చ శుభాశుభే ।
శిష్యా ఇవ మహాత్మాన మింద్రియాణి చ తం ద్విజాః ॥ 92 ॥

ఓ ద్విజులారా! తమ ఆచార్యుని యాశ్రయించి శిష్యులేవిధంగా సంచరిస్తారో వాటిని అనుసరించి ఆత్మకూడా సంచరిస్తుంది. శుభాశుభములయందు జీవుని కర్మచేత ఈఇంద్రియములు కూడా

ప్రకృతిం చాప్యతిక్రమ్య శుద్ధం సూక్ష్మం పరాయణమ్ ।
నారాయణం మహాత్మానం నిర్వికారం పరాత్పరమ్ ॥ 93 ॥

ఈ ప్రకృతిని గూడా దాటి వికారరహితుడైన, పరాత్పరుడైన, మహాత్ముడైన, శుద్ధుడు, సూక్ష్ముడు, పరాయణుడైన నారాయణుని,

విముక్తం సర్వపాపేభ్యః ప్రవిష్టం చ హ్యనామయమ్ ।
పరమాత్మానమగుణం నిర్వృతం తం చ సత్తమాః ॥ 94 ॥

సమస్తపాపములనుండి విముక్తుడైన, గుణరహితుడైన, వికారములేని పరమానందస్వరూపుడైన ఆ పరమాత్మను చేరి తృప్తి పొందినట్లు

శ్రేష్ఠం తత్ర మనో విప్రా ఇంద్రియాణి చ భో ద్విజాః ।
ఆగచ్ఛన్తి యథాకాలం గురోః సందేశకారిణః ॥ 95 ॥

ఓ ద్విజులారా! విప్రులారా! సందేశమునందించే గురువు వద్దకు శిష్యులు సమయమాసన్నమైనప్పుడు వచ్చినట్లుగా అక్కడ మనస్సు, ఇంద్రియములుకూడా శ్రేష్ఠమైన పరమాత్మ దగ్గరకు చేరుతాయి.

శక్యం చాల్పేన కాలేన శాన్తిం ప్రాప్తుం గుణాంస్తథా ।
ఏవముక్తేన విప్రేన్ద్రాః సాంఖ్యయోగేన మోక్షిణీమ్ ॥ 96 ॥

ఇట్లు చెప్పుటచేత ఓ విప్రశ్రేష్ఠులారా! చాలా తక్కువ సమయంలోనే ఇంద్రియ గుణములన్నీ విడిపించు శాంతిని పొందుటకు మార్గమని సాంఖ్యయోగము చేత చెప్పబడింది.

సాంఖ్యా విప్రా మహాప్రాజ్ఞా గచ్ఛన్తి పరమాం గతిమ్ ।
జ్ఞానేనానేన విప్రేన్ద్రాస్తుల్యం జ్ఞానం న విద్యతే ॥ 97 ॥

ఓ విప్రశ్రేష్ఠులారా! మహాప్రాజ్ఞులైన సాంఖ్యులు ఈజ్ఞానంచేతనే పరమగతిని పొందుతారు. ఈ జ్ఞానంతో సమానమైన మరే జ్ఞానమూ లేదు.

అత్ర వః సంశయో మాభూత్ జ్ఞానం సాంఖ్యం పరం మతమ్ ।
అక్షరం ధ్రువమేవోక్తం పూర్వం బ్రహ్మ సనాతనమ్ ॥ 98 ॥

సాంఖ్యజ్ఞానమునకంటే ఉత్కృష్టమైనది మరొకటి లేదు. ఈవిషయంలో మీకు సందేహం అవసరం లేదు. సనాతనమైన బ్రహ్మ అక్షరము ధ్రువమని పూర్వమే చెప్పాను.

అనాది మధ్య నిధనం నిర్ద్వంద్వం కర్తృశాశ్వతమ్ ।
కూటస్థం చైవ నిత్యం చ యద్వదన్తి శమాత్మకాః ॥ 99 ॥

ఇంద్రియనిగ్రహము కలవారు దేనిని గూర్చి ఆదిమధ్యాంతములు లేనిదని, శీతోష్ణాది జంటలు లేనిదని, శాశ్వతమని, వికారము లేనిదని, నిత్యమని చెప్పారో,

యతః సర్వాః ప్రవర్తన్తే సర్గప్రళయవిక్రియాః ।
ఏవం శంసన్తి శాస్త్రేషు ప్రవక్తారో మహర్షయః ॥ 100 ॥

సృష్టిస్థితిలయములు ఆ పరమాత్మనుండే ప్రవర్తించుచున్నవని ప్రవక్తలైన మహర్షులు శాస్త్రములను చెప్పుచున్నారు.

సర్వే విప్రాశ్చ వేదాశ్చ తథా సామవిదో జనాః ।
బ్రహ్మణ్యం పరమం దేవమనన్తం పరమాచ్యుతమ్ ॥ 101 ॥

సామవేదజ్ఞులైన జనులు, విప్రులు, వేదములన్నీ అచ్యుతుడు, పరము, అనన్తము, పరబ్రహ్మ దేవుడని చెప్పారో,

ప్రార్థయన్తశ్చ తం విప్రా వదన్తి గుణబుద్ధయః ।
పరయుక్తాస్తథా యోగాః సాంఖ్యాశ్చామితదర్శనాః ॥ 102 ॥

సాంఖ్యయోగమనభ్యసించక గుణము యందే బుద్ధికలిగిన విప్రులు పరమజ్ఞానము కలవారై అనంతుని చూచినవారై, అతనిని ప్రార్థిస్తూ చెపుతారు.

అమూర్తిస్తస్య విప్రేన్ద్రాః సాంఖ్యం మూర్తిరితి శ్రుతిః ।
అభిజ్ఞానాని తస్యాఽఽహుర్మహాన్తి మునిసత్తమాః ॥ 103 ॥

ఓ విప్రశ్రేష్ఠులారా! స్వరూపంలేని యతనికి జ్ఞానమే మూర్తియని శ్రుతి చెబుతున్నది. ఓ మునిశ్రేష్ఠులారా! అతనికనేక చిహ్నములు కలవంటారు.

ద్వివిధాని హి భూతాని పృథివ్యాం ద్విజసత్తమాః ।
అగమ్యగమ్యసంజ్ఞాని జంగమం తు విశిష్యతే ॥ 104 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఈలోకంలో భూతములు రెండు విధములు.చలించేవి, చలించనివి అగమ్యములని వాటికి పేర్లు. వీనిలో జంగమములు విశేషములైనవి.

జ్ఞానం మహద్ద్వై మహతశ్చ విప్రా వేదేషు సాంఖ్యేషు తథైవ యోగే ।
యచ్చాపి దృష్టం విధివత్పురాణే సాంఖ్యాగతం తన్నిఖిలం మునీంద్రాః ॥ 105 ॥

ఓ విప్రులారా! వేదములయందు, సాంఖ్యులయందు, యోగమునందు, పురాణమునందు విధిపూర్వకంగా దర్శించిన ఆ జ్ఞానమంతా చాలా గొప్పదని సాంఖ్యగతమని యెరుగవలెను.

యచ్చేతిహాసేషు మహత్సు దృష్టం యథార్థశాస్త్రేషు విశిష్టదృష్టమ్ ।
జ్ఞానం చ లోకే యదిహాస్తి కించిత్ సాంఖ్యాగతం తచ్చ మహామునీంద్రాః ॥ 106 ॥

ఓ మహామునులారా! గొప్ప ఇతిహాసములలో, విశేషంగా యథార్థ శాస్త్రములలో చూచినది, ఈలోకంలో కించిత్తు జ్ఞానమంటూ ఉన్నదంతా సాంఖ్యగతమనే తెలుసుకొనవలెను.

సమస్తదృష్టం పరమం బలం చ జ్ఞానం చ మోక్షశ్చ యథావదుక్తమ్ ।
తపాంసి సూక్ష్మాణి చ యాని చైవ సాంఖ్యే యథావద్విహితాని విప్రాః ॥ 107 ॥

ఈదృష్టి గోచరమైన సమస్తం, పరమం, బలం, జ్ఞానం, మోక్షం, సూక్ష్మమైన అవన్నీ, తపస్సులు మొ॥ వాటిని గూర్చి చెప్పినవన్నీ సాంఖ్యమునందున్నవున్నట్లుగా చెప్పారు.

విపర్యయం తస్య హితం సదైవ గచ్ఛన్తి సాంఖ్యాః సతతం సుఖేన ।
తాంశ్చాపి సంధార్య తతః కృతార్థాః పతన్తి విప్రాయతనేషు భూయః ॥ 108 ॥

సాంఖ్యులెప్పుడు సంసారానికి విపర్యయమైన హితమును, సుఖమును పొందుతారు. వానిని ఆచరించి కృతార్థులై తిరిగి విప్రులగృహములలో జన్మిస్తారు.

భిత్వా చ దేహం ప్రవిశన్తి మోక్షం దివౌకసశ్చాపి చ యోగసాంఖ్యాః ।
అతోఽధికం తేఽభిరతా మహార్హే సాంఖ్యే ద్విజా భో ఇహ శిష్టజుష్టే ॥ 109 ॥

ఓ ద్విజులారా! గొప్ప అర్హత కలిగిన, శిష్టులచే సేవించబడిన ఈసాంఖ్యము నాశ్రయించినవారు దేవతలుకూడా సౌఖ్యములను పొందుటయే కాక ఈసాంఖ్యయోగము ననుసరించినవారు దేహమును భేదించుకొని మోక్షమును పొందుతారు.

తేషాం తు తిర్యగ్గమనం హి దృష్టం నాథో గతిః పాపకృతాం నివాసః ।
న వా ప్రధానా అపి తే ద్విజాతయో యే జ్ఞానమేతన్మునయో న సక్తాః ॥ 110 ॥

మునులకు కూడా ఆసక్తి జ్ఞానమును ప్రధానంగా పొందినట్లు యమలోకమునుగాని, అధోగతినిగాని, పశుపక్ష్యాది జన్మలనుగాని పొందరు.

సాంఖ్యం విశాలం పరమం పురాణం మహార్ణవం విమలముదారకాన్తమ్ ।
కృత్స్నం హి సాంఖ్యా మునయో మహాత్మ నారాయణే ధారయతాఽప్రమేయమ్ ॥ 111 ॥

ఓ మునులారా! విశాలం, పరమ పురాణం, విమలం గొప్ప సముద్రమువంటి, ఉదారమైన ప్రకాశంగల ఈసాంఖ్యమును బాగుగా అభ్యసించి ఈమహత్తుగల సాంఖ్యంతో అప్రమేయుడైన నారాయణునియందు స్థానమును పొందండి.

ఏతన్మయోక్తం పరమం హి తత్త్వం నారాయణాద్విశ్వమిదం పురాణమ్ ।
స సర్గకాలే చ కరోతి సర్గం సంహారకాలే చ హరేత భూయః ॥ 112 ॥

నేను చెప్పిన ఈసాంఖ్యతత్త్వం మిక్కిలి పరమమైనది. పురాతనమైనది నారాయణునినుండి సృష్టించబడినదీ విశ్వం నారాయణునిచే సృష్టికాలంలో సృష్టించబడుతుంది, లయకాలంలో తిరిగిలయముచేయబడుతుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షి సంవాదే 'సాంఖ్యవిధి నిరూపణం' నామ ద్వాత్రింశాధికశతతమోఽధ్యాయః॥132॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాసఋషిసంవాదములో 'సాంఖ్యనిరూపణమనే' నూట ముప్పై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రయస్త్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైమూడవ అధ్యాయం
క్షరాక్షరవిచార నిరూపణమ్ - క్షరాక్షరవిచార నిరూపణం

మునయ ఊచుః :- మునులు పలికారు.

కిం తదక్షరమిత్యుక్తం యస్మాన్నావర్తతే పునః ॥ 1 ॥

దేనినుండైతే తిరిగిరాదో దాన్ని అక్షరమని చెప్పారు, అదేమిటి?

అక్షరాక్షరయోర్వ్యక్తిం పృచ్ఛామస్త్వాం మహామునే ।
ఉపలబ్ధుం మునిశ్రేష్ఠ తత్త్వేన మునిపుంగవ ॥ 2 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! అక్షరక్షరములలోని వివరణను గూర్చిన తత్త్వమును తెలియగోరుతున్నాము. అందుకే మహాముని పుంగవుడు, మహామునియైన నిన్నడుగుతున్నాము.

త్వం హి జ్ఞానవిదాం శ్రేష్ఠః ప్రోచ్యసే వేదపారగైః ।
ఋషిభిశ్చ మహాభాగైర్యతిభిశ్చ మహాత్మభిః ॥ 3 ॥

వేదపారగులైనవారు నీవే జ్ఞానవిదులలో శ్రేష్ఠుడవని చెబుతారు. మహాత్ములైన యతులు, మహాభాగులైన ఋషులు నీవే శ్రేష్ఠుడవంటారు.

తదేతచ్ఛ్రోతుమిచ్ఛామస్త్వత్తః సర్వం మహామతే ।
న తృప్తిమధిగచ్ఛామః శృణ్వన్తోఽమృతముత్తమమ్ ॥ 4 ॥

ఓ మహామతీ! దీనినంతటి మీ నుండి వినగోరుతున్నాము. మీ వాగమృతము ఉత్తమమైనది. దానినెంతగా విన్నా ఇంకా తృప్తి పొందటం లేదు.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

అత్ర వో వర్ణయిష్యామి ఇతిహాసం పురాతనమ్ ।
వసిష్ఠస్య చ సంవాదం కరాల జనకస్య చ ॥ 5 ॥

ఇక్కడ మీకొరకు వసిష్ఠమహర్షి కరాలజనకుల మధ్య జరిగిన పురాతనమైన ఇతిహాసమునుగూర్చి వర్ణించబోవు తున్నాను.

వసిష్ఠం శ్రేష్ఠమాసీనం ఋషీణాం భాస్కరాకృతిమ్ ।
పప్రచ్ఛ జనకో రాజా జ్ఞానం నైఃశ్రేయసం పరమ్ ॥ 6 ॥

ఋషుల మధ్యలో సూర్యునివలె శ్రేష్ఠునిగా కూర్చొన్న వసిష్ఠుని జనకమహారాజు మోక్షపరమైన జ్ఞానమును గూర్చి యడిగాడు.

పరమాత్మని కుశలమధ్యాత్మగతినిశ్చయమ్ ।
మైత్రావరుణిమాసీనమభివాద్య కృతాంజలిః ॥ 7 ॥

అధ్యాత్మమార్గంలో నిశ్చయజ్ఞానం గలిగిన, పరమాత్మయందు భావుకుడైన, ఋషి మండలమందాసీనుడైన మైత్రావరుణి అయిన వశిష్ఠ మహర్షికి చేతులు జోడించి నమస్కరించి,

స్వచ్ఛన్దం సుకృతం చైవ మధురం చాప్యనుల్బణమ్ ।
పప్రచ్ఛర్షివరం రాజా కరాలజనకః పురా ॥ 8 ॥

పూర్వమొకప్పుడు కరాలజనకమహారాజు స్వచ్ఛన్దముగా సుకృతుడైన, మధురంగా మాట్లాడే స్వభావంగల, ప్రశాంతమైన ఋషిశ్రేష్ఠుడైన వసిష్ఠుని యడిగాడు.

జనక ఉవాచ :– జనకుడు పలికాడు.

భగవన్ శ్రోతుమిచ్ఛామి పరం బ్రహ్మ సనాతనమ్ ।
యస్మిన్నపునరావృత్తిం ప్రాప్నువన్తి మనీషిణః ॥ 9 ॥

ఓ పూజ్యుడా! ఎవనిలో చేరుటవల్ల మనీషులైనవారు తిరిగి జన్మను పొందకుండా ఉండే సనాతనమైన బ్రహ్మను గూర్చి వినగోరుతున్నాను.

యచ్చ తత్ క్షరమిత్యుక్తం యత్రేదం క్షరతే జగత్ ।
యచ్చాక్షరమితి ప్రోక్తం శివం క్షేమమనామయమ్ ॥ 10 ॥

నశిస్తున్న ఈ జగత్తును క్షరమని చెప్పారు. ఏది అనామయమో, క్షేమమును కలిగిస్తుందో, శుభమును చేకూరుస్తుందో దానిని అక్షరమని చెప్పారు.

వసిష్ఠ ఉవాచ :– వసిష్ఠుడు పలికాడు.

శ్రూయతాం జగతీపాల క్షరతీదం యథా జగత్ ।
యత్ర క్షరతి పూర్వేణ యావత్కాలేన చాప్యథ ॥ 11 ॥

ఓ రాజా! ఎంతకాలానికి పూర్వమున్న ఈజగత్తంతా ఎలా క్షరమవుతుందో చెబుతున్నాను వినండి.

యుగం ద్వాదశ సాహస్రం కల్పం విద్ధి చతుర్యుగమ్ ।
చతుఃకల్పశతావర్తమహస్తద్బ్రాహ్మముచ్యతే ॥ 12 ॥

నాలుగు యుగాలు పన్నెండువేల మార్లు ఆ వృత్తి జరిగితే దాన్ని కల్పమంటారు. నాలుగు వందలమార్లు కల్పావృత్తి జరిగితే దాన్ని బ్రాహ్మ అహస్సంటారు.

రాత్రిశ్చైతావతీ రాజన్ యస్యాన్తే ప్రతిబుధ్యతే ।
సృజత్యనన్తకర్మాణి మహాన్తం భూతమగ్రజమ్ ॥ 13 ॥

ఓ రాజా! ఇదే విధంగా రాత్రి కూడా జరుగగా రాత్రి జరిగిన తర్వాత మేలుకొనును తరువాత అనన్త కర్మలను, అగ్రజమైన మహాభూతమైన దానిని సృష్టిస్తుంది.

మూర్తిమన్తమమూర్తాత్మా విశ్వం శంభుః స్వయంభువః ।
యత్రోత్పత్తిం ప్రవక్ష్యామి మూలతో నృపసత్తమ ॥ 14 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! రూపములేని స్వయంభువునుండే రూపముగల విశ్వము, శంభుడు ఉద్భవిస్తున్నాడు. ఆ ఉత్పత్తియొక్క మూలమును గూర్చి చెబుతాను శ్రద్ధగా వినండి.

అణిమా లఘిమా ప్రాప్తిరీశానం జ్యోతిరవ్యయమ్ ।
సర్వతః పాణిపాదాన్తం సర్వతోఽ_క్షిశిరోముఖమ్ ॥ 15 ॥

సర్వతః శ్రుతిమల్లోకే స్వమావృత్య తిష్ఠతి ।
హిరణ్యగర్భో భగవానేష బుద్ధి రితి స్మృతః ॥ 16 ॥

అణిమా, మహిమా, గరిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వవశిత్వమనే అష్ట సిద్ధులు, అవ్యయమైన జ్యోతి స్స్వరూపము, కరచరణాద్యవయవములు, నేత్రములు, ముఖము, శిరస్సును కలిగి, ఈశ్రుతిమత్తయిన లోకము నందంతటా ఆవరించియుండే, ఈవృద్ధినే భగవానుడైన హిరణ్యగర్భుడని యంటారు.

మహానితి చ యోగేషు విరించిరితి చాప్యథ ।
సాంఖ్యే చ పఠ్యతే శాస్త్రే నామభిర్బహుధాత్మకః ॥ 17 ॥

యోగశాస్త్రములలో మహత్తత్త్వమని, విరించియని, సాంఖ్యశాస్త్రంలో అనేక స్వరూపాలు కలవాడని అనేక పేర్లతో పిలుస్తారు.

విచిత్రరూపో విశ్వాత్మా ఏకాక్షర ఇతి స్మృతః ।
ధృతమేకాత్మకం యేన కృత్స్నం త్రైలోక్యమాత్మనా ॥ 18 ॥

ఈముల్లోకములు ఎవరిచేత సమిష్టిగా, ఏకాత్మకంగా ధరించబడ్డాయో అతనిని విచిత్రరూపుడని, విశ్వాత్మయని, ఏకాక్షరుడని యంటారు.

తథైవ బహురూపత్వాద్విశ్వరూప ఇతి శ్రుతః ।
ఏష వై విక్రియాపన్నః సృజత్యాత్మానమాత్మనా ॥ 19 ॥

ఇతనికి అనేకరూపములున్నందున విశ్వరూపుడంటారు. వికారమును పొందిన ఇతనే తనకుతాను సృజించును.

ప్రధానం తస్య సంయోగాదుత్పన్నం సుమహత్పురమ్ ।
అహంకారం మహాతేజాః ప్రజాపతినమస్కృతమ్ ॥ 20 ॥

అతని సంయోగంచే చాలా గొప్ప పురము ఉత్పన్నమైనది ప్రజాపతిచే నమస్కరించబడివున్నది దానినే మహాతేజస్సు గలిగిన అహంకారతత్త్వమంటారు.

అవ్యక్తాద్వ్యక్తిమాపన్నం విద్యాసర్గం వదన్తి తమ్ ।
మహాన్తం చాప్యహంకారమవిద్యా సర్గ ఏవ చ ॥ 21 ॥

అవ్యక్తమునుండి వ్యక్తమైన దానిని విద్యాసృష్టియంటారు. మహత్తునుండి వచ్చిన అహంకార తత్త్వమును అవిద్యా సృష్టియంటారు.

అచరశ్చ చరశ్చైవ సముత్పన్నౌ తథైకతః ।
విద్యాఽవిద్యేతి విఖ్యాతే శ్రుతిశాస్త్రానుచిన్తకైః ॥ 22 ॥

అదేవిధంగా ఏకైకతత్త్వమునుండియే అచరము, చరములు ఉత్పన్నములైనాయి. అట్లే శ్రుతిశాస్త్రాను చింతకులు విద్య, అవిద్య అని ప్రసిద్ధిని కలిగించినారు.

భూతసర్గమహంకారాత్తృతీయం విద్ధి పార్థివ ।
అహంకారేషు నృపతే చతుర్థం విద్ధి వైకృతమ్ ॥ 23 ॥

ఓ రాజా! అహంకారమునుండే మూడవదైన భూతసృష్టి జరిగింది. అహంకారములయందు నాల్గవది వైకృత అహంకారమని తెలియవలయును.

వాయుర్జ్యోతిరథాఽఽకాశమాపోఽథ పృథివీ తథా ।
శబ్దస్పర్శౌ చ రూపం చ రసో గన్ధస్తథైవ చ ॥ 24 ॥

ఏవం యుగపదుత్పన్నం దశవర్గమసంశయమ్ ।
పంచమం విద్ధి రాజేన్ద్ర భౌతికం సర్గమర్థవత్ ॥ 25 ॥

పృథివ్యప్తేజో వాయువు ఆకాశములనే పంచభూతములు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే పంచతన్మాత్రలు. ఓ రాజా! ఈవిధంగా ఒకేసారి ఉత్పన్నమైన ఈపదింటిని ఐదవదైన భౌతిక సృష్టియని తెలుసుకొనవలెను.

శ్రోత్రం త్వక్చక్షుషీ జిహ్వా ఘ్రాణమేవ చ పంచమమ్ ।
వాగ్ఘస్తౌ చైవ పాదౌ చ పాయుర్మేఢ్రం తథైవ చ ॥ 26 ॥

బుద్ధీన్ద్రియాణి చైతాని తథా కర్మేన్ద్రియాణి చ ।
సంభూతానీహ యుగపన్మనసా సహ పార్థివ ॥ 27 ॥

త్వక్చక్షుః శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములనే ఐదు జ్ఞానేంద్రియములు, వాక్పాణిపాదపాయూపస్థములను ఐదు కర్మేంద్రియములు, ఓ రాజా! మనస్సుతోగూడ చిత్తము బుద్ధి, పంచతన్మాత్రలు, పంచభూతములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములనేవి ఒకేసారి కలిగినవి.

ఏషా తత్త్వచతుర్వింశా సర్వాఽఽకృతిః ప్రవర్తతే ।
యాం జ్ఞాత్వా నాభిశోచన్తి బ్రాహ్మణాస్తత్త్వదర్శినః ॥ 28 ॥

ప్రకృతి ఈఇరువది నాలుగు తత్త్వములన్నీ అన్నిరూపముకలదై ప్రవర్తిస్తుంది. తత్త్వదర్శులైన బ్రాహ్మణులు తెలుసుకొని చింతించరు (విచారించరు).

ఏవమేతత్సముత్పన్నం త్రైలోక్యమిదముత్తమమ్ ।
వేదితవ్యం నరశ్రేష్ఠ సదైవ నరకార్ణవే ॥ 29 ॥

ఓ రాజా! ఇట్లే ఈ ఉత్తమమైన మూడు లోకములు, నరక సాగరములకు ఉత్పన్నమైనాయని తెలుసుకొన వలెను.

సయక్షభూతగన్ధర్వే సకిన్నరమహోరగే ।
సచారణపిశాచే వై సదేవర్షినిశాచరే ॥ 30 ॥

సదంశకీటమశకే సపూతికృమిమూషకే ।
శునిశ్వపాకే చైణేయే సచాణ్డాలే సపుల్కసే ॥ 31 ॥

హస్త్యశ్వఖరశార్దూలే సవృకే గవి చైవ హ ।
యా చ మూర్తిశ్చ యత్కించిత్సర్వత్రైతన్నిదర్శనమ్ ॥ 32 ॥

యక్షులు, భూతములు, గన్ధర్వులు, కిన్నరులు, నాగులు, చారణులు, పిశాచాలు, దేవర్షులు, నిశాచరులు, కరిచే పురుగులు, దోమలు, దుర్వాసనగల క్రిములు, ఎలుకలు, కుక్కలు, శ్వపాచకులు, జింకలు, దుప్పులు, చండాలురు, పుల్కసులు,ఏనుగులు, గుఱ్ఱములు, గాడిదలు, పులులు, తోడేళ్ళు, మెకములు, గోవులు మున్నగు వానియందు కనిపిస్తున్నరూపము అదంతా ప్రకృతికి నిదర్శనమే.

జలే భువి తథాఽఽకాశే నాన్యత్రేతి వినిశ్చయః ।
స్థానం దేహవతామాసీదిత్యేవమనుశుశ్రుమ ॥ 33 ॥

శరీరంగల ప్రాణులన్నీ, నీటియందున్నవి, భూమియందున్నవి, ఆకాశమునందున్నవి స్థిర చర రూపములైన ప్రాణులన్నీ పరమాత్మ అనే స్థానమునందున్నవే అని వింటున్నాము.

కృత్స్నమేతావతస్తాత క్షరతేఽవ్యక్తసంజ్ఞకః ।
అహన్యహని భూతాత్మా యచ్చాక్షర ఇతి స్మృతమ్ ॥ 34 ॥

వత్సా! ఇదంతా అవ్యక్తమను పేరుతో ప్రతిరోజు నాశమునొందును. భూతాత్మ అయినది అవ్యక్తమనబడును.

తతస్తత్క్షరమిత్యుక్తం క్షరతీదం యథా జగత్ ।
జగన్మోహాత్మకం చాఽఽహురవ్యక్తాద్వ్యక్తసంజ్ఞకః ॥ 35 ॥

ఈలోకమంతా నశిస్తుంది కనుక దానిని క్షరమన్నారు. అవ్యక్తమునుండి వచ్చిన వ్యక్తమనబడు ఈ జగత్తు మోహస్వరూపము కలది అనుచున్నారు. కనుక అతనిని అక్షరుడన్నారు.

మహాంశ్చైవాక్షరో నిత్యమేతత్ క్షరవివర్జనమ్ ।
కథితం తే మహారాజ యస్మాన్నాఽఽవర్తతే పునః ॥ 36 ॥

ఓ మహారాజా! ఈ క్షరములేని మహత్తత్త్వము నిత్యమైనది. దీనిని పొందిన తర్వాత తిరిగి వచ్చుట, జన్మనొందుట అనునవి యుండవు అట్టి అక్షరమైనదానిని గూర్చి చెప్పాను.

పంచవింశతికోఽమూర్తః స నిత్యస్తత్త్వసంజ్ఞకః ।
సత్త్వసంశ్రయణాత్తత్త్వం సత్త్వమాహుర్మనీషిణః ॥ 37 ॥

ఇరువది ఐదవదైన ఈ తత్త్వము సత్త్వసంజ్ఞకమైనది, అది రూపములేనిది అంటారు. అది నిత్యమైనది. ఆ తత్త్వము సత్త్వమునాశ్రయించినందువల్ల సత్త్వగుణప్రధానమైనదని బుద్ధిమంతులు పల్కుతారు.

యదమూర్తిః సృజద్వ్యక్తం తన్మూర్తిమధితిష్ఠతి ।
చతుర్వింశతిమో వ్యక్తో హ్యమూర్తిః పంచవింశకః ॥ 38 ॥

ఆకారములేని అవ్యక్తము ప్రధానము, ప్రకృతిని వ్యక్తమును సృజించినది అవ్యక్తము రూపమును ఆశ్రయించినది. 24వది వ్యక్తము. 25వది రూపములేనిది? అనగా ఆత్మ,

స ఏవ హృది సర్వాసు మూర్తిష్వాతిష్ఠతాఽఽత్మవాన్ ।
చేతయంశ్చేతనే నిత్యం సర్వమూర్తిరమూర్తిమాన్ ॥ 39 ॥

అతడే సమస్తమూర్తుల యందలి హృదయస్థానముననున్న ఆత్మవంతుడు. అన్నింటియందు చైతన్యమును కలుగచేసే చేతనుడై అన్నింటిలో స్వరూపము కలవాడై ఏ స్వరూపము లేనివానిగా వుండును.

సర్గప్రలయధర్మేణ స సర్గప్రలయాత్మకః ।
గోచరే వర్తతే నిత్యం నిర్గుణో గుణసంజ్ఞితః ॥ 40 ॥

అతడే సృష్టిప్రళయధర్మముచే సృష్టిప్రళయాత్మకుడవుతాడు, నిర్గుణుడైనా గుణమను పేరుకలవాడై మన ఇంద్రియములచే గ్రహించబడువానిగా నిత్యముంటాడు.

ఏవమేవ మహాత్మా చ సర్గప్రళయకోటిశః ।
వికుర్వాణః ప్రకృతిమాన్నాభిమన్యేత బుద్ధిమాన్ ॥ 41 ॥

ఇట్లు కోట్ల కొలది సృష్టి ప్రళయములు జరగుతున్నా ప్రకృతి కలవాడు వికారమును పొందుచున్నా అభిమానమును జూపక బుద్ధిమంతుడుంటాడు.

తమః సత్త్వరజోయుక్తస్తాసు తాస్విహ యోనిషు ।
లీయతే ప్రతిబుద్ధత్వాదబుద్ధజనసేవనాత్ ॥ 42 ॥

ఇట్లు తమ సత్త్వరజోగుణయుక్తుడై అజ్ఞానజనులను సేవించుట వలన తెలిసియున్ననూ ఆయా కారణముల యందు లేదా జాతులయందు లయమగును.

సహవాస నివాసత్వాన్నాన్యోఽహమితి మన్యతే ।
యోఽహం న సోఽహమిత్యుక్తో గుణానేవానువర్తతే ॥ 43 ॥

సత్త్వరజస్తమోగుణాత్మకమైన వాటితో సహవాసము చేయుటవల్ల, వాటితో కలిసియుండుటవల్ల తాను వాటికంటే వేరుకాదని తలస్తాడు. ఆ నేనెవరినో అది నేనుకాదని, నేను కాదంటూ ఆ గుణములనే అనుసరిస్తాడు.

తమసా తామసాన్భావాన్వివిధాన్ప్రతిపద్యతే ।
రజసా రాజసాంశ్చైవ సాత్త్వికాన్ సత్త్వసంశ్రయాత్ ॥ 44 ॥

సత్త్వగుణమునాశ్రయించినందువల్ల సాత్త్విక భావాలను, రజోగుణములనాశ్రయించినందువల్ల రాజసభావాలను (పొందుతాడు), తమోగుణమునాశ్రయించినందువల్ల తామసభావాలను ఇట్లు వివిధ భావములనాశ్రయిస్తుంటాడు.

శుక్లలోహితకృష్ణాని రూపాణ్యేతాని త్రీణి తు ।
సర్వాణ్యేతాని రూపాణి జానీహి ప్రాకృతాని తు ॥ 45 ॥

సత్త్వము శుక్లరూపము, రజస్సు లోహితరూపము, తమస్సు కృష్ణము. ఇట్లు మూడుగుణములు మూడు రూపములు గలవిగా నుండును. సత్త్వరజస్తమోగుణములనే వ్యవహారము ఇవన్నీ ప్రకృతి రూపములుగా తెలుసుకొనవలెను.

తమసా నిరయం యాన్తి రజసా మానుషం తథా ।
సాత్త్వికా దేవలోకాయ గచ్ఛన్తి సుఖభాగినః ॥ 46 ॥

తమోగుణమునాశ్రయించిన వారు నరకమును పొందుతారు. రజోగుణభావమును కల్గినవారు మనుష్య లోకమును చేరుతారు. సాత్త్వికమునాశ్రయించినవారు దేవలోకమును చేరి సుఖమును పొందుతారు.

ఆముష్మికేణ పాపేన తిర్యగ్యోనిమవాప్నుయాత్ ।
పుణ్యపాపేషు మానుష్యం పుణ్యమాత్రేణ దేవతాః ॥ 47 ॥

ఇహలోకము పరలోకములలో ఆచరించిన పాపముతో పాపములను చేయుటచే పశుపక్ష్యాది తిర్యగ్జన్మలను పొందుతారు. పుణ్యపాపముల నాచరించుటవల్ల మానవజన్మను పొందుతారు. పరలోకమును గూర్చి పుణ్యముల నాచరించినవారు దేవత్వమును పొందుతారు.

ఏవమవ్యక్తవిషయం మోక్షమాహుర్మనీషిణః ।
పంచవింశతిమో యోఽయం జ్ఞానాదేవ ప్రవర్తతే ॥ 48 ॥

ఈవిధంగా అవ్యక్తుడైన వాని విషయమే మోక్షమని పెద్దలు చెబుతారు. ఈఇరువది ఐదవ తత్త్వ స్వరూపుడైన జీవుడు జ్ఞానంవల్లనే ప్రవర్తిస్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వసిష్ఠసంవాదే 'క్షరాక్షర విచార నిరూపణం' నామ త్రయస్త్రింశాధికశతతమోఽధ్యాయః ॥ 133 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వసిష్ఠ కరాల జనకుల సంవాదంలో 'క్షరాక్షరవిచార నిరూపణ'మనే నూటముప్పది మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుస్త్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైనాల్గవ అధ్యాయం

వసిష్ఠకరాలజనకసంవాదః - వసిష్ఠ కరాల జనకుల సంవాదం

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

ఏవమప్రతిబుద్ధత్వాదబుద్ధమనువర్తతే ।
దేహాద్దేహ సహస్రాణి తథా చ న స భిద్యతే ॥ 1 ॥

ఈ విధంగా తెలియనందున ఆ జ్ఞానములేని శరీరమును అనుసరించును. ఒక దేహమునుండి మరొక దేహములోనికి ప్రవేశిస్తూ వేలకొలది జన్మలను పొందుచూ వాటికంటే భిన్నంగా తాను ఉండడు.

తిర్యగ్యోని సహస్రేషు కదాచిద్దేవతాస్వపి ।
ఉత్పద్యతి తపోయోగాద్గుణైః సహ గుణక్షయాత్ ॥ 2 ॥

గుణక్షయంతో వేలకొలది పశుపక్ష్యాది జాతులయందు పుడ్తాడు, తపోయోగము వల్ల మంచి గుణములతో దేవతలయందు కూడా జన్మిస్తాడు.

మనుష్యత్వాద్దివం యాతి దేవో మానుష్యమేతి చ ।
మానుష్యాన్నిరయస్థానమాలయం ప్రతిపద్యతే ॥ 3 ॥

మనుష్యునిగా నుండి పుణ్యములు చేయుటవల్ల దైవత్వంపొంది స్వర్గమును చేరుతాడు. పుణ్యక్షయమైన తర్వాత దేవతగానున్నవాడు తిరిగి మానవునిగా పుడతాడు. మానవజన్మలో పాపాలు చేయుటవల్ల నరకమును ప్రళయము వరకు పొందుతాడు.

కోశకారో యథాఽఽత్మానం కీటః సమభిరున్ధతి ।
సూత్రతన్తుగుణైర్నిత్యం తథాఽయమగుణో గుణైః ॥ 4 ॥

సాలెపురుగు తాను సృష్టించిన దారములతో తననే చుట్టుకొన్నట్లుగా, గుణాతీతుడైన అక్షరుడు త్రిగుణములతో తానే బందీయవుతాడు.

ద్వన్ద్వమేతి చ నిర్ద్వంద్వస్తాసు తాస్విహ యోనిషు ।
శీర్షరోగేఽక్షిరోగే చ దన్తశూలే గలగ్రహే ॥ 5 ॥

సుఖదుఃఖాదులకు అతీతమైనవాడు సుఖదుఃఖరూపములైన ద్వంద్వములకు లోబడి ఆయా జాతులయందు పుట్టి శిరోరోగము, నేత్రరోగము, దంతశూలము, గొంతునొప్పి,

జలోదరేఽతిసారే చ గండమాలా విచర్చికే ।
శ్విత్రకుష్ఠేఽగ్నిదగ్ధే చ సిధ్మాపస్మారయోరపి ॥ 6 ॥

పొట్టకు నీరుపట్టి ఉబ్బే రోగము, విరేచనాలు, కంఠం చుట్టూ గడ్డలుండే రోగము, క్షుద్రకుష్ఠు లేదా గజ్జి, అగ్ని దగ్ధము, బొల్లి, మూర్ఛలును,

యాని చాన్యాని ద్వంద్వాని ప్రాకృతాని శరీరిణామ్ ।
ఉత్పద్యన్తే విచిత్రాణి తాన్యేవాఽఽఽత్మాఽభిమన్యతే ॥ 7 ॥

శరీరము గలవారికి ఎన్నెన్ని ప్రకృతిసంబంధమైన ఇతర సుఖదుఃఖముండునో, విచిత్రములైనవి కలుగునో అవన్నీ నావే అని ఆత్మ తలచును.

అభిమానాతిమానానాం తథైవ సుకృతాన్యపి ।
ఏకవాసాశ్చతుర్వాసాః శాయీ నిత్యమధ స్తథా ॥ 8 ॥

ద్వంద్వములవల్ల కలిగే అభిమానంవల్ల దేహాత్మాభిమానములవలన, అహంకారమమకారములకు వశమై కొన్ని సుకృతములనాచరిస్తాడు. వాటిలో కొన్ని ఏక వస్త్రమును ధరించుట, నాలుగు వస్త్రములు ధరించుట, ప్రతి నిత్యమూ నేలమీద పరుండుట (భూశయనము),

మండూకశాయీ చ తథా వీరాసనగతస్తథా ।
వీరమాసనమాకాశే తథా శయనమేవ చ ॥ 9 ॥

కప్పవలె పడుకొనుట, మోకాళ్ళపై నిలిచి పరుండుట అదే విధంగా ఆకాశంలో వీరాసనంలో పడుకొనుట,

ఇష్టకాప్రస్తరే చైవ చక్రకప్రస్తరే తథా ।
భస్మప్రస్తరశాయీ చ భూమిశయ్యానులేపనః ॥ 10 ॥

ఇటుకల కుప్పమీద, చక్రాకారపు కుప్పమీద, బూడిద కుప్పమీద, అట్లే లేపనము కలవాడై భూమిమీద పడుకొనుట,

వీరస్థానాంబుపాకే చ శయనం ఫలకేషు చ ।
వివిధాసు చ శయ్యాసు ఫలగృహ్యాన్వితాసు చ ॥ 11 ॥

వీరస్థానంలోన, వేడినీటిలో, కర్ర, రాతి పలకలపైన పడుకొనుట, వివిధములైన పడకల యందు పండ్లునిండిన ఇండ్లలో పడుకొనుట

ఉద్యానే ఖలలగ్నే త్వక్ క్షౌమకృష్ణాజినాన్వితః ।
మణివాలపరీధానో వ్యాఘ్రచర్మపరిచ్ఛదః ॥ 12 ॥

ఉద్యానవనములలో, కళ్లములలో, చర్మంతో చేసిన వస్త్రములు, నారచీరలు, కృష్ణాజినములను, చమరీమృగాల వెంట్రుకలతో సిద్ధం చేసిన వస్త్రములు, పులిచర్మములను ధరించినవాడై

సింహచర్మపరీధానః పట్టవాసాస్తథైవ చ ।
ఫలకం పరిధానం చ తథా కటకవస్త్రధృక్ ॥ 13 ॥

సింహ చర్మమును, పట్టువస్త్రములు, చక్కలతో, చాపలను వస్త్రంగా చుట్టుకొనిగాని,

కటైక వసనశ్చైవ చీరవాసాస్తథైవ చ ।
వస్త్రాణి చాన్యాని బహూన్యభిమత్య చ బుద్ధిమాన్ ॥ 14 ॥

ఆ బుద్ధిమంతుడు కేవలం చాపలనుగాని, నారచీరలనుగాని లేదా తన అభిరుచిననుసరించి ఇతరములైన అనేక విధములైన వస్త్రములనుగాని ధరించినవాడై

భోజనాని విచిత్రాణి రత్నాని వివిధాని చ ।
ఏకరాత్రాంతరాశిత్వమైకకాలిక భోజనమ్ ॥ 15 ॥

దినంలో నొక్కమారుగాని, లేదా ఒకరాత్రి వదిలి మరొక రాత్రియందుగాని విచిత్రమైన భోజనం చేస్తూ, విచిత్రమైన రత్నములను ధరిస్తూ,

చతుర్థాష్టమకాలం చ షష్ఠకాలికమేవ చ ।
షడ్రాత్రభోజనశ్చైవ తథా చాష్టాహభోజనః ॥ 16 ॥

రెండురోజులకొకసారి, నాలుగురోజులకొకసారి, మూడురోజుల కొకసారి, ఆరురోజులకొకసారి, ఎనిమిదిరోజులకొకసారి భోజనము చేయుచూ

మాసోపవాసీ మూలాశీ ఫలాహారస్తథైవ చ ।
వాయుభక్షశ్చ పిణ్యాక దధిగోమయభోజనః ॥ 17 ॥

నెలరోజులుపవాసముండిగానీ, కందమూలఫలములను తింటూగాని, కేవలం వాయుభక్షణ చేస్తూగానీ, తెలకపిండి తింటూగాని, పెరుగు తింటూగాని, పేడను తింటూగాని,

గోమూత్రభోజనశ్చైవ కాశపుష్పాశనస్తథా ।
శైవాలభోజనశ్చైవ తథా చాన్యేన వర్తయన్ ॥ 18 ॥

గోమూత్రం త్రాగుతూగాని, రెల్లుపూలు తింటూగాని, నాచునుగాని, మరే ఇతరములైన వాటిని తింటూగాని బ్రతుకుచు

వర్తయన్ శీర్ణపర్ణైశ్చ ప్రకీర్ణఫలభోజనః ।
వివిధాని చ కృచ్ఛ్రాణి సేవతే సిద్ధకాంక్షయా ॥ 19 ॥

రాలిపడిన ఆకులను తింటూగాని, నేలరాలిన పండ్లను తింటూగాని, కోరికలను సిద్ధింపచేసుకొనుటకు కృచ్ఛ్రాది వ్రతములనాచరిస్తాడు.

చాంద్రాయణాని విధివల్లింగాని వివిధాని చ ।
చాతురాశ్రమ్యయుక్తాని ధర్మాధర్మాశ్రయాణ్యపి ॥ 20 ॥

చాంద్రాయణాది వివిధములైన కఠినవ్రతములను, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసమను నాలుగు ఆశ్రమాలకు తగినట్లుగా, ధర్మాధర్మములనాశ్రయిస్తూ దానికి తగిన వేషధారణం చేస్తూ

ఉపాశ్రయాన్యృపరాన్ పాఖండాన్ వివిధానపి ।
వివిక్తాశ్చ శిలాఛాయాస్తథా ప్రస్రవణాని చ ॥ 21 ॥

అట్లే వాటికి సన్నిహితమైన ఇతర లక్షణములుగల వేదవిరుద్ధములైన పాఖండులాచరించేవాటిని ఏకాంతములైన శిలల నీడలను, సెలయేళ్ళనాశ్రయించి,

పులినాని వివిక్తాని వివిధాని వనాని చ ।
కాననేషు వివిక్తాశ్చ శైలానాం మహతీర్గుహాః ॥ 22 ॥

ఏకాంతములైన అనేకములైన ఇసుక తిన్నెలలో, ఒంటరిగా అడవులలో, వివిధ మహాపర్వత గుహలలో,

నియమాన్వివిధాంశ్చాపి వివిధాని తపాంసి చ ।
యజ్ఞాంశ్చ వివిధాకారాన్ విద్యాశ్చ వివిధాస్తథా ॥ 23 ॥

అనేక నియమములను, వివిధ తపస్సులను, అనేక విధములైన యజ్ఞములను, అనేక విద్యలను నేర్చుకుంటూ,

వణిక్పథం ద్విజక్షత్రవైశ్యశూద్రాంస్తథైవ చ ।
దానం చ వివిధాకారం దీనాంధకృపణాదిషు ॥ 24 ॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతుల ధర్మములలో తనకు తోచిన దానిననుసరించి దీనులకు, గ్రుడ్డివారికి, బీదవారికి వ్యాపారమార్గమున వివిధ రూపములుగా దానములను చేస్తూంటాడు.

అభిమన్యేత సంఘాతుం తథైవ వివిధాన్గుణాన్ ।
సత్త్వం రజస్తమశ్చైవ ధర్మార్థౌ కామ ఏవ చ ॥ 25 ॥

వివిధగుణస్వభావముల ననుసరిస్తూ సత్త్వరజస్తమోగుణములలో, ధర్మార్థ కామములలో తన కభిమతమైన పురుషార్థముననుసరిస్తాడు. తలుస్తాడు.

సత్కృత్యాఽఽత్మానమేవాఽఽత్మా ఏవం ప్రతిభజత్యత ।
స్వాహాకారవషట్కారౌ స్వధాకారనమస్క్రియే ॥ 26 ॥

ఇలా స్వాహా, వషట్, స్వధా నమస్కారములను చేస్తూ ఆత్మ తనకు తానే సత్కరించుకొని సేవిస్తాడు.

యజనాధ్యయనే దానం తథైవాఽఽహుః ప్రతిగ్రహమ్ ।
యాజనాధ్యాపనే చైవ తథాఽన్యదపి కించన ॥ 27 ॥

యజ్ఞములు చేయుట, చేయించుట, అధ్యయనం చేయుట, అధ్యాపనం చేయుట, దానం చేయుట, ప్రతి గ్రహించుట, అట్లే ఇతరములైనవాటిని కూడా చేయుట,

జన్మమృత్యువిధానేన తథా విశసనేన చ ।
శుభాశుభభయం సర్వమేతదాహుః సనాతనమ్ ॥ 28 ॥

జన్మ, మృత్యు, జరా, హింసలు, శుభాశుభభయములు, కర్మలుఇవన్నీ సనాతనమని అభిమానవశమున కల్గుతాయని చెప్పారు.

ప్రకృతిః కురుతే దేవీ భయం ప్రలయమేవ చ ।
దివసాన్తే గుణానేతానతీత్యైకోఽవతిష్ఠతే ॥ 29 ॥

ప్రకృతి స్వరూపంగా భయమును, ప్రలయమును కల్గిస్తుంది. దివసావసానమున త్రిగుణములను అతిక్రమించి ఒక్కడిగానే ఉంటాడు.

రశ్మిజాలమివాఽఽదిత్యో యథాకాలం నియచ్ఛతి ।
ఏవమేవైష తత్సర్వం క్రీడార్థమభిమన్యతే ॥ 30 ॥

సూర్యుడు పగలు, రాత్రియని తన కిరణసమూహమును ఎలా నిగ్రహిస్తాడో అట్లే ఇదంతా పరమాత్మ తన క్రీడారూపంగా తలుస్తాడు.

ఆత్మరూపగుణానేతాన్ వివిధాన్ హృదయప్రియాన్ ।
ఏవమేతాం ప్రకుర్వాణః సర్గప్రలయధర్మిణీమ్ ॥ 31 ॥

తన హృదయమునకు ప్రియములైన ఈవివిధ శరీరరూపగుణములను తనవి అను భావంతో చూస్తూ దీనిని సృష్టిప్రలయ ధర్మములు కలదానినిగా చేయుచు

క్రియాం క్రియాపథే రక్తస్త్రిగుణస్త్రిగుణాధిపః ।
క్రియా క్రియాపథోపేతస్తథా తదితి మన్యతే ॥ 32 ॥

సత్త్వరజస్తమోగుణుడైన ఆ త్రిగుణాధిపుడు యజ్ఞయాగాది క్రియామార్గమందాసక్తుడై, క్రియ క్రియామార్గములతో కూడినవాడై అదే తన లీలావిధానంగా తలస్తూ ముందుకు పోతాడు.

ప్రకృత్యా సర్వమేవేదం జగదంధీకృతం విభో ।
రజసా తమసా చైవ వ్యాప్తం సర్వమనేకధా ॥ 33 ॥

ఓ రాజా! ఈజగత్తంతా ప్రకృతితో చీకటిగా చేయబడింది. రజస్తమోగుణములతో అనేక విధములుగా అంతట వ్యాపించింది.

ఏవం ద్వంద్వాన్యతీతాని మమ వర్తన్తి నిత్యశః ।
మత్త ఏతాని జాయన్తే ప్రలయే యాన్తి మామపి ॥ 34 ॥

ఇలా ఆ శీతోష్ణసుఖదుఃఖాదులకు అతీతములైనవి నానుండే ఉత్పన్నములై నిత్యము ప్రవర్తించి, తిరిగి నాలోనే లయమగుచున్నవని.

నిస్తర్తవ్యాణ్యథైతాని సర్వాణీతి నరాధిప ।
మన్యతే పక్షబుద్ధిత్వాత్తథైవ సుకృతాన్యపి ॥ 35 ॥

ఓ రాజా! వీటిని అన్నిటిని నేనే దాటాలి. ఏకపక్షబుద్ధికావున సుకృతములను కూడా దాటాలని తలుస్తాడు.

భోక్తవ్యాని మమైతాని దేవలోకగతేన వై ।
ఇహైవ చైనం భోక్ష్యామి శుభాశుభఫలోదయమ్ ॥ 36 ॥

ఈలోకంలో నున్నప్పుడు కర్మవశమున కలిగే శుభాశుభ ఫలితములననుభవించవలెను, దేవలోకమునకు వెళ్ళినా గూడా ఈఫలముల ననుభవించవలెను.

సుఖమేవం తు కర్తవ్యం సకృత్కృత్వా సుఖం మమ ।
యావదేవ తు మే సౌఖ్యం జాత్యాం జాత్యాం భవిష్యతి ॥ 37 ॥

ఎలాగైనా నేను సుఖకరమైన కర్మలను ఒకసారి ఆచరించి సుఖములనే సంపాదించవలెను. అంతేకాక ప్రతి జన్మలో కూడా సుఖం లభించేవరకు కర్మలను చేయవలెను.

భవిష్యతి న మే దుఃఖం కృతేనేహాప్యనన్తకమ్ ।
సర్వదుఃఖం హి మానుష్యం నిరయే చాపి మజ్జనమ్ ॥ 38 ॥

ఇక్కడ నేను చేసినందువలన అనన్తదుఃఖములు కలుగకూడదు. సమస్తదుఃఖములను కలిగించే మనుష్యత్వంగాని, నరకంలో పడిపోయి యాతనలననుభవించుటకాని యుండకూడదు.

నిరయాచ్చాపి మానుష్యం కాలేనైష్యామ్యహం పునః ।
మనుష్యత్వాచ్చ దేవత్వం దేవత్వాత్పౌరుషం పునః ॥ 39 ॥

ఒకవేళ నేను నరకమునుండి తిరిగి మానవజన్మను పొందుతాను. తిరిగి కాలక్రమంలో మనుష్యత్వం నుండి దేవత్వమును పొందుతాను. మరల దేవత్వంనుండి మనుష్యత్వమును పొందుతాను.అని

మనుష్యత్వాచ్చ నిరయం పర్యాయేణోపగచ్ఛతి ।
ఏష ఏవం ద్విజాతీనామాత్మా వై సగుణైర్వృతః ॥ 40 ॥

మనుష్యత్వమునుండి మార్చిమార్చి నరకమును పొందును. ఇట్లే ద్విజుల ఆత్మగుణములతో ఆవరించి ఉండును.

తేన దేవమనుష్యేషు నిరయం చోపపద్యతే ।
మమత్వేనాఽఽవృతో నిత్యం తత్రైవ పరివర్తతే ॥ 41 ॥

ఇలా మమకారవశంలో ఆవరించబడి దానితో దేవమనుష్యులలో సంచరిస్తూ, నరకమును పొందుతూ, ఈజనన, మరణ, రూపసంసారచక్రములో తిరుగుతూంటాడు.

సర్గకోటి సహస్రాణి మరణాన్తాసు మూర్తిషు ।
య ఏవం కురుతే కర్మ శుభాశుభఫలాత్మకమ్ ॥ 42 ॥

ఈవిధంగా జీవుడు సృష్టిలోని కోట్లకొలది మరణాన్తంగలిగిన శరీరములను పొందుతూ శుభాశుభ ఫలాత్మకమైన కర్మ చేస్తుంటాడు.

స ఏవం ఫలమశ్నాతి త్రిషు లోకేషు మూర్తిమాన్ ।
ప్రకృతిః కురుతే కర్మ శుభాశుభఫలాత్మకమ్ ॥ 43 ॥

ముల్లోకములయందా యా రూపములను పొందిన జీవుడు శుభాశుభ ఫలాత్మకమైన కర్మవల్ల వచ్చే ఫలమును ఆ లోకములందే యనుభవించును. ఈ కర్మను ప్రకృతియే చేయును.

ప్రకృతిశ్చ తథాఽఽప్నోతి త్రిషు లోకేషు కామగా ।
తిర్యగ్యోని మనుష్యత్వే దేవలోకే తథైవ చ ॥ 44 ॥

పశు, పక్షి, మనుష్య, దేవత్వములను పొందుటలో, ముల్లోకములలో కోరికలననుసరిస్తూ ప్రకృతి కారణంగానే ఫలమును పొందును.

త్రీణి స్థానాని చైతాని జానీయాత్ప్రాకృతాని హ ।
అలింగప్రకృతిత్వాచ్చ లింగైరప్యనుమీయతే ॥ 45 ॥

ఈమూడు స్థానములు గూడా ప్రాకృతములని తెలుసుకొనవలెను. ప్రకృతికి చిహ్నములేకున్నా కార్యరూపములైన చిహ్నములను బట్టి అనుమానించబడుతున్నది.

తథైవ పౌరుషం లింగమనుమానాద్ధి మన్యతే ।
స లింగాంతరమాసాద్య ప్రాకృతం లింగమచ్యుతమ్ ॥ 46 ॥

అట్లే అనుమానప్రమాణంచే జీవుని చిహ్నములను ఒప్పుకొనుట, అది ఇతర చిహ్నములను పొందినా గూడా నాశములేనిది ప్రాకృత చిహ్నమే.

ప్రాణద్వారాణ్యధిష్ఠాయ కర్మాణ్యాత్మని మన్యతే ।
క్షేత్రాదీని తు సర్వాణి పంచ కర్మేంద్రియాణ్యథ ॥ 47 ॥

త్వక్ చక్షుః శ్రోత్ర జిహ్వా ఘ్రాణములనే జ్ఞానేంద్రియములు, వాక్పాణిపాదపాయూపస్థలను కర్మేంద్రియములు ఈశరీరమునందుండి ప్రాణద్వారముల నధిష్ఠించిన జీవుడు ఈ ఇంద్రియములు చేయు కర్మలన్నీ తనవే యని తలస్తాడు.

రాగాదీని ప్రవర్తన్తే గుణేష్విహ గుణైః సహ ।
అహమేతాని వై కుర్వన్మమైతానీంద్రియాణి చ ॥ 48 ॥

సత్త్వరజస్తమోగుణము వలన కలుగు రాగద్వేషములు కలవగానే ఈజీవుడు అహంకార మమకారములు కలిగి ఇవి నా ఇంద్రియములు, ఇవి నేనే చేయుచున్నాననుకొంటాడు.

నిరింద్రియో హి మన్యేత వ్రణవానస్మి నిర్వ్రణః ।
అలింగో లింగమాత్మానమకాలం కాలమాత్మనః ॥ 49 ॥

ఇంద్రియములు లేని తాను ఇంద్రియములు కలవాడనుకుంటాడు. వ్రణములేని తాను వ్రణముగల వానిననుకొంటాడు. ఏ చిహ్నములేని తాను తనను తానే చిహ్నమనుకుంటాడు. ఏకాలనియమములేనివాడు కాలనియమాలను భావిస్తాడు.

అసత్త్వం సత్త్వమాత్మానమమృతం మృతమాత్మనః ।
అమృత్యుం మృత్యుమాత్మానమచరం చరమాత్మనః ॥ 50 ॥

ఎల్లపుడూ ఉండే తానులేనివానిగా మరణించిన తాను మరణించువానిగా మృత్యువులేనివాడు మృత్యువుగలవానిగా, కదలికలేని తాను కదులుచున్నాడని అనుకుంటాడు.

అక్షేత్రం క్షేత్రమాత్మానమసంగం సంగమాత్మనః ।
అతత్త్వం తత్త్వమాత్మానామభవం భవమాత్మనః ॥ 51 ॥

ఏ క్షేత్రమూ (నివాసము) లేనితాను నివాసముగా ఏ సంబంధము లేని తాను సంబంధము కలవానిగా ఏ స్వరూపములేనితాను స్వరూపము కలవానిగా పుట్టుకలేని తాను పుట్టుక కలవానిగా తలుస్తాడు.

అక్షరం క్షరమాత్మానమబుద్ధత్వాద్ధి మన్యతే ।
ఏవమప్రతిబుద్ధత్వాదబుద్ధజనసేవనాత్ ॥ 52 ॥

అజ్ఞానవశంలో నశించనితాను తాను నశించువాడని అజ్ఞానంతో అనుకుంటాడు. ఇట్లు అజ్ఞానము వలన అజ్ఞానులను సేవించుటవలన తలుస్తాడు.

సర్గకోటి సహస్రాణి పతనాన్తాని గచ్ఛతి ।
జన్మాంతర సహస్రాణి మరణాన్తాని గచ్ఛతి ॥ 53 ॥

వేలకోట్ల సృష్టులు కూడా చివరకు పతనమును పొందుతాయి. వేలకొలది జన్మలెత్తినా మరణముతోనే ముగుస్తుంది.

తిర్యగ్యోని మనుష్యత్వే దేవలోకే తథైవ చ ।
చంద్రమా ఇవ కోశానాం పునస్తత్ర సహస్రశః ॥ 54 ॥

పశుపక్ష్యాది జన్మలు, మనుష్యత్వ దైవత్వములుగా మాటిమాటికి వేలకొలది జన్మలనెత్తుతాడు. చంద్రుని షోడశ కళలలో వేలకొలది వృద్ధి క్షయములు కల్గునట్లుగా వేల జన్మమరణాలను పొందుతాడు.

నీయతేఽ ప్రతిబుద్ధత్వాదేవమేవ కుబుద్ధిమాన్ ।
కలా పంచదశీ యోనిస్తద్ధామ ఇతి పఠ్యతే ॥ 55 ॥

జ్ఞానములేనందువలన దుష్టబుద్ధి కలిగినందున ఇట్లే జన్మపరంపరలను పొందుతాడు. చంద్రునికి 15వ కల నివాసమైనట్లుగా జీవునికి ఆకాశము నివాసమౌతుంది.

నిత్యమేవ విజానీహి సోమం వై షోడశాంశకైః ।
కలాయాం జాయతేఽజస్రం పునః పునరబుద్ధిమాన్ ॥ 56 ॥

పదహారు కళలతో నున్న చంద్రుని నిత్యునిగా తెలుసుకో. అట్లే అజ్ఞానియైనవాడు సర్వదా జన్మిస్తాడు.

ధీమాంశ్చాయం న భవతి నృప ఏవం హి జాయతే ।
షోడశీ తు కళా సూక్ష్మా స సోమ ఉపధార్యతామ్ ॥ 57 ॥

ఓ రాజా! అతడు ధీమంతుడు కాడు, ఇట్లే జన్మిస్తాడు. పదహారవ కళ తేజస్సు మిక్కిలి సూక్ష్మమైనది. అతడే సోముడని తెలుసుకో.

న తూపయుజ్యతే దేవైర్దేవానపి యునక్తి సః
మమత్వం క్షపయిత్వా తు జాయతే నృపసత్తమ
ప్రకృతేస్త్రిగుణాయాస్తు స ఏవ త్రిగుణో భవేత్ ॥ 58 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! దేవతల చేత కూడి ఉండడు తాను దేవతలను కలుపుతాడు, మమత్వమును నశింపజేసి అతడు జన్మిస్తుంటాడు. త్రిగుణాత్మకమైన ప్రకృతివల్ల అతడే సత్త్వరజస్తమోగుణోపేతుడవుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వసిష్ఠకరాలజనకసంవాదే చతుస్త్రింశాధికశతతమోఽధ్యాయః ॥ 134 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వసిష్ఠ కరాల జనకుల సంవాదంలో నూటముప్పైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచత్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైఐదవ అధ్యాయం

వసిష్ఠ కరాల జనక సంవాదమ్ - వసిష్ఠ జనక సంవాదం

జనక ఉవాచ :- జనకుడు పలికాడు.

అక్షరక్షరయోరేష ద్వయోః సంబంధ ఇష్యతే ।
స్త్రీపుంసయోర్వా సంబంధః స వై పురుష ఉచ్యతే ॥ 1 ॥

వసిష్ఠ మహర్షీ! క్షర అక్షరములకు రెంటికి సంబంధము అంగీకరించబడినది. స్త్రీపురుషులయందుండే సంబంధమే పురుషుడనుబడుతాడు (జీవుడు)

ఋతే తు పురుషం నేహ స్త్రీ గర్భాన్ధారయత్యుత ।
ఋతే స్త్రియం న పురుషో రూపం నిర్వర్తతే తథా ॥ 2 ॥

పురుషుడు లేకుండా స్త్రీగర్భం ధరించలేదు. స్త్రీలేకుండా పురుషుడు తన స్వరూపాన్ని పొందలేడు.

అన్యోన్యస్యాభిసంబంధాదన్యోన్యగుణసంశ్రయాత్ ।
రూపం నిర్వర్తయేదేతదేవం సర్వాసు యోనిషు ॥ 3 ॥

అన్ని ప్రాణులయందు కూడా స్త్రీ పురుషులు పరస్పరంగా సంబంధమేర్చుకొనుటవల్ల అన్యోన్యగుణముల ఆశ్రయించుటవలన మరొక ప్రాణియొక్క రూపమేర్పడుతున్నది.

రత్యర్థమతిసంయోగాదన్యోన్య గుణసంశ్రయాత్ ।
ఋతౌ నిర్వర్తతే రూపం తద్వక్ష్యామి నిదర్శనమ్ ॥4 ॥

రతి కొఱకు బుద్ధి సంయోగమేర్పడుటవల్ల, స్త్రీ పురుషులిద్దరూ పరస్పరం గుణముల నొకచోట చేర్చినందు వల్ల సంగమమందు రూపం యేర్పడుతుంది. దానికి నిదర్శనం చెప్పబోతున్నాను.

యే గుణాః పురుషస్యేహ యే చ మాతుర్గుణాస్తథా ।
అస్థిస్నాయు చ మజ్జా చ జానీమః పితృతో ద్విజ ॥ 5 ॥

ఓ బ్రాహ్మణుడా! జీవి పుట్టుటలో తల్లిదండ్రుల గుణములేవో తెలుసుకొనవలెనన్న ఎముకలు, నరములు, స్నాయు, గుజ్జు యనేవి తండ్రి నుండి ఏర్పడుతున్నాయని తెలుసుకో,

త్వఙ్మాంసశోణితం చేతి మాతృజాన్యనుశుశ్రుమ ।
ఏవమేతద్ద్విజశ్రేష్ఠ వేదశాస్త్రేషు పఠ్యతే ॥ 6 ॥

చర్మము, మాంసము, రక్తములు తల్లినుండి ఏర్పడుతున్నవని వేదశాస్త్రములయందు చెప్పినట్లుగా వింటున్నాము.

ప్రమాణం యచ్చ వేదోక్తం శాస్త్రోక్తం యచ్చ పఠ్యతే ।
వేదశాస్త్రప్రమాణం చ ప్రమాణం తత్సనాతనమ్ ॥ 7 ॥

దేనిని వేదము ప్రమాణంగా చెప్పిందో, శాస్త్రములేవి ఘోషిస్తున్నాయో ఆ వేదశాస్త్రములే ప్రమాణములు అదియే సనాతనమైనది.

ఏవమేవాభిసంబంధౌ నిత్యం ప్రకృతిపూరుషౌ ।
యచ్చాపి భగవంస్తస్మాన్మోక్షధర్మో న విద్యతే ॥ 8 ॥

ఇలా ఓ పూజ్యుడా! క్షరతత్త్వమైన ప్రకృతి, అక్షరతత్త్వమైన పరతత్త్వరూప పురుషులిద్దరు పరస్పరం సంబంధం కలిగియుండుట నిత్యమైనది. అందువలన మోక్షధర్మముండదు.

అథవాఽనన్తరకృతం కించిదేవ నిదర్శనమ్ ।
తన్మమాఽఽచక్ష్వ తత్త్వేన ప్రత్యక్షో హ్యసి సర్వదా ॥ 9 ॥

కావున ఆ తరువాత దానికి గల నిదర్శనమేదో ఆ తత్త్వమును గూర్చి నాకు వివరించండి. ఎందుకనగా మీరే మాకు దానికి ప్రత్యక్షంగా సర్వదా నుంటారు కదా!

మోక్షకామా వయం చాపి కాంక్షామో యదనామయమ్ ।
అజేయమజరం నిత్యమతీంద్రియమనీశ్వరమ్ ॥ 10 ॥

మేము మోక్షమును కొరేవారం వినాశములేవి జయించజాలనిదో, నశించనిదో నిత్యమైనదో, ఇంద్రియములను అతిశయించినదో, శాసకుడులేనిదో ఆ పరతత్త్వమును గూర్చి మాకు వివరించండి.

వసిష్ఠ ఉవాచ :– వసిష్ఠుడు పలికాడు.

యదేతదుక్తం భవతా వేదశాస్త్రనిదర్శనమ్ ।
ఏవమేతద్యథా వక్ష్యే తత్త్వగ్రాహీ యథా భవాన్ ॥ 11 ॥

జనక మహారాజా! నీవు చెప్పినట్లుగానే విషయ నిర్ణయమునకు వేదశాస్త్రములే ప్రమాణములు. నీవు తత్త్వమును గ్రహించు సామర్థ్యం గలవానివి. దానికి తగినట్లుగానే చెప్పబోవుతున్నాను.

ధార్యతే హి త్వయా గ్రన్థ ఉభయోర్వేదశాస్త్రయోః ।
భవ గ్రన్థస్య తత్త్వజ్ఞో యాథాతథ్యేన భూమిప ॥ 12 ॥

ఓ రాజా! నీవు వేదశాస్త్ర గ్రంథములను రెంటిని ధరించినవాడవు. ఇప్పుడు యథాతథంగా ఆ గ్రంథముయొక్క తత్త్వజ్ఞానివి కమ్ము.

యో హి వేదే చ శాస్త్రే చ గ్రన్థధారణతత్పరః ।
న చ గ్రన్థార్థతత్త్వజ్ఞస్తస్య తద్ధారణం వృథా ॥ 13 ॥

వేదశాస్త్రములను గ్రన్థములుగా అధ్యయనము చేసి ధారణచేసినంత మాత్రంచే ప్రయోజనం లేదు. ఆ గ్రంథమునందలి విషయములను తెలుసుకొనకున్నచో అతనికి ఆ గ్రంథధారణం వ్యర్థమే.

భారం స వహతే తస్య గ్రన్థస్యార్థం న వేత్తి యః ।
యస్తు గ్రన్థార్థతత్త్వజ్ఞో నాస్య గ్రంథాగమో వృథా ॥ 14 ॥

గ్రంథమునకర్థ వివేచన చేసి ఎవడు తెలుసుకోడో ఆ గ్రంథభారమును మోయుటేకాని వేరే ప్రయోజనం లేదు. గ్రంథములో నున్న విషయమును, తత్త్వమును చక్కగా తెలుసుకొనేవానికి గ్రంథములతో పనిలేదు.

గ్రన్థస్యార్థం స పృష్టస్తు మాదృశో వక్తుమర్హతి ।
యథా తత్త్వాభిగమనాదర్థం తస్య స విన్దతి ॥ 15 ॥

అతడు ఆ గ్రంథముయొక్క అర్థమునడిగినట్లయితే మాలాంటివారు దానిని ఉన్నదున్నట్లుగా చెప్పుటకు తగినవాడు. అట్లు దానిని తత్త్వమును తెలుసుకున్నందువల్ల అతడు అర్థమును తెలుసుకుంటాడు.

న యః సముత్సుకః కశ్చిత్ గ్రన్థార్థం స్థూలబుద్ధిమాన్ ।
స కథం మన్దవిజ్ఞానో గ్రంథం వక్ష్యతి నిర్ణయాత్ ॥ 16 ॥

స్థూలబుద్ధి గలవాడు గ్రంథార్థమును చక్కగా తెలుసుకొనుటకుత్సాహం చూపనిచో మందబుద్ధి గలవాడు ఆ గ్రంథమునుగూర్చి ఇదమిత్థమని ఉన్నదున్నట్లుగా ఎట్లు చెప్పగలడు?

అజ్ఞాత్వా గ్రన్థతత్త్వాని వ్యాఖ్యాం యః కురుతే నరః ।
లోభాద్వాఽప్యథవా దమ్భాత్స పాపీ నిరయం వ్రజేత్ ॥ 17 ॥

గ్రంథంగూర్చి అవగాహన లేకుండా లోభంతోకాని, దంభంతోగాని ఆ తత్త్వములనుగూర్చి దుర్వ్యాఖ్యానం చేసే పాపాత్ముడు నరకమును పొందుతాడు.

నిర్ణయం చాపి ఛిద్రాత్మా న తద్వక్ష్యతి తత్త్వతః ।
సోఽపీహాస్యార్థతత్త్వజ్ఞో యస్మాన్నైవాఽఽత్మవానపి॥ 18 ॥

జ్ఞానశూన్యుడు తత్త్వతః నిర్ణయమును గూడా చెప్పలేడు. ఎందుకంటే అట్లు చెప్పిననాడు వాడు ఈ గ్రంథమునకు అర్థతత్త్వమును తెలియనివాడే ఆత్మవంటివాడు కాదు.

తస్మాత్త్వం శృణు రాజేన్ద్ర యథైతదనుదృశ్యతే ।
యథా తత్త్వేన సాంఖ్యేషు యోగేషు చ మహాత్మసు ॥ 19 ॥

ఓ రాజా! అందువలన నీవు సాంఖ్యములలో, యోగములలో, మహాత్ములలో యథార్థముగా తెలియబడుచున్న తత్త్వమును వినుము.

యదేవ యోగాః పశ్యన్తి సాంఖ్యం తదనుగమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స బుద్ధిమాన్ ॥ 20 ॥

యోగులు తమ శాస్త్రంలో చూచుచున్న తత్త్వమునే సాంఖ్యులు కూడా చూచుచున్నారు. అట్లు సాంఖ్యులు, యోగులు చెప్పే తత్త్వము నొకటిగా చూసేవాడే బుద్ధిమంతుడు.

త్వఙ్మాంసం రుధిరం మేదః పిత్తం మజ్జాఽస్థి స్నాయు చ ।
ఏతదైన్ద్రియకం తాత యద్భవానిత్థమాత్థ మామ్ ॥ 21 ॥

నాయనా! నీవు నాతో చెప్పినది సత్యం. త్వక్, మాంసం, రక్తం, మేద, పిత్తం, మజ్జ, అస్థి, స్నాయువులు ఇవన్నీ ప్రాకృతికములు. ఇంద్రియములనుండి పుట్టాయి.

ద్రవ్యాద్ద్రవ్యస్య నిర్వృత్తిరింద్రియాదింద్రియం తథా ।
దేహోద్దేహమవాప్నోతి బీజాద్బీజం తథైవ చ ॥ 22 ॥

ద్రవ్యమునుండి ద్రవ్యము, ఇంద్రియమునుండి ఇంద్రియము అట్లే దేహమునుండి దేహము, బీజము నుండి బీజము పుడుతుంది.

నిరింద్రియస్య బీజస్య నిర్ద్రవ్యస్యాపి దేహినః ।
కథం గుణా భవిష్యన్తి నిర్గుణత్వాన్మహాత్మనః ॥ 23 ॥

ఇంద్రియములులేని బీజమునకు ద్రవ్యములేని దేహికి గుణములెట్లు కలుగును? ఆ మహానుభావుడు నిర్గుణుడుకూడా.

గుణా గుణేషు జాయన్తే తత్రైవ విరమన్తి చ ।
ఏవం గుణాః ప్రకృతిజా జాయన్తే న చ యాన్తి చ ॥ 24 ॥

గుణములయందే గుణములు పుడుతున్నాయి. తిరిగి ఆ గుణములయందే లయమునందుచున్నాయి. ఇట్లు ప్రకృతియందు పుట్టిన గుణములు మాత్రము తిరిగి వెళ్ళవు.

త్వఙ్మాంసం రుధిరం మేదః పిత్తం మజ్జాఽస్థి స్నాయు చ ।
అష్టౌ తాన్యథ శుక్రేణ జానీహి ప్రాకృతేన వై ॥ 25 ॥

త్వక్, మాంసం, రక్తం, మేద, పిత్తం, మజ్జా, అస్థి, స్నాయు అనునవి ఎనిమిది ప్రకృతినుండి పుట్టిన శుక్రంతోనే అని తెలుసుకొనవలెను.

పుమాంశ్చైవాపుమాంశ్చైవ స్త్రీలింగం ప్రాకృతం స్మృతమ్ ।
వాయురేష పుమాంశ్చైవ రస ఇత్యభిధీయతే ॥ 26 ॥

పురుషుడైనా పురుషుడుకాకున్నా స్త్రీలింగము ప్రకృతి సంబంధము పురుషుడు వాయువురసమనబడును.

అలింగాత్ప్రకృతిర్లింగైరుపలభ్యతే సాఽఽత్మజైః ।
యథా పుష్పఫలైర్నిత్యం మూర్తే చామూర్తయస్తథా ॥ 27 ॥

ప్రకృతి లింగము లేనిది. ఆ ప్రకృతే తనలో నుండి వచ్చిన లింగములు అనగా గుర్తులతో హేతువులతో కన్పిస్తున్నది. మనకు నిత్యం కనిపించే పుష్పాలు, పండ్లు ఒక ఆకారముగ కన్పిస్తున్నాయి. నిజమునకు ముందు అవి అమూర్తములే కదా!

ఏవమప్యనుమానేన స లింగముపలభ్యతే ।
పంచ వింశతికస్తాత లింగేషు నియతాత్మకః ॥ 28 ॥

ఇట్లే 'పర్వతో వహ్నిమాన్ ధూమాత్' అని చెప్పినట్లుగా అనుమానప్రమాణంచేత గూడా ఆ లింగమును తెలుసుకొనవచ్చు. ఇరువది ఐదవ తత్త్వమైన ఆత్మ ఆయా లింగములందు నియతముగా వుండును.

అనాదినిధనోఽ నన్తః సర్వదర్శనకేవలః ।
కేవలం త్వభిమానిత్వాద్గుణేషు గుణ ఉచ్యతే ॥ 29 ॥

ఆయన ఆద్యన్తములు లేనివాడు, అనన్తుడు, కేవలము అన్నీ చూచేవాడు, కేవలం అభిమానం వల్ల గుణములయందు గుణముగా చెబుతున్నాం.

గుణా గుణవతః సన్తి నిర్గుణస్య కుతో గుణాః ।
తస్మాదేవం విజానన్తి యే జనా గుణదర్శినః ॥ 30 ॥

గుణవత్తయిన దానికే గుణములు, కాని నిర్గుణుడైన వానికి గుణము లెక్కడివి? అందువలననే గుణములను దర్శించేవారు మాత్రమే ఇట్లు తెలుసుకుంటారు.

యదా త్వేష గుణానేతాన్ ప్రాకృతానభిమన్యతే ।
తదా స గుణవానేవ గుణభేదాన్ ప్రపశ్యతి ॥ 31 ॥

ఇతను ఈగుణములనన్నింటిని ప్రాకృతములని తలుస్తాడో అప్పుడే అతను గుణవంతుడు అవుతాడు అతనే గుణభేదములను చూడగలడు.

యత్తద్బుద్ధేః పరం ప్రాహుః సాంఖ్యయోగం చ సర్వశః ।
బుధ్యమానం మహాప్రాజ్ఞాః ప్రబుద్ధపరివర్జనాత్ ॥ 32 ॥

మహాప్రాజ్ఞులైనవారు ప్రకృతిని వదిలి పెట్టుటవల్ల అంతటా తెలుసుకొనవలసింది, బుద్ధికంటే పరమైన దానినే సాంఖ్యయోగమని చెబుతారు.

అప్రబుద్ధం యథా వ్యక్తం స్వగుణైః ప్రాహురీశ్వరమ్ ।
నిర్గుణా చేశ్వరం నిత్యమధిష్ఠాతారమేవ చ ॥ 33 ॥

తన గుణములతో వ్యక్తమైనది ఎవరికి తెలియనిదే ఈశ్వరతత్త్వమంటారు. ఈశ్వరుడు నిర్గుణుడు. నిర్గుణులు ఈశ్వరుని ఆశ్రయించి ఉంటారు.

ప్రకృతేశ్చ గుణానాం చ పంచ వింశతికం బుధాః ।
సాంఖ్యయోగే చ కుశలా బుధ్యన్తే పరమైషిణః ॥ 34 ॥

ప్రకృతితత్త్వములను ఇరవై నాలిగింటిని, వాటికి అతీతమైన ఇరవై ఐదవ తత్త్వమును, పరతత్త్వము తెలిసినవారు, సాంఖ్యయోగముల యందెవరు కుశలురో అటువంటి పండితులే దానిని తెలుసుకొనగలరు.

యదా ప్రబుద్ధమవ్యక్తమవస్థాపనభీరవః ।
బుధ్యమానం న బుధ్యన్తేఽవగచ్ఛన్తి సమం తదా ॥ 35 ॥

అవ్యక్తమైన ప్రకృతిని విడిగా చూచుటకు భయపడువారు తెలియవలసిన దానిని తెలియజాలరు. సమానముగా తెలుసుకుంటారు.

ఏతన్నిదర్శనం సమ్యజ్ న సమ్యగనుదర్శనమ్ ।
బుధ్యమానం ప్రబుధ్యన్తే ద్వాభ్యాం పృథగరిందమ ॥ 36 ॥

ఓ అంతఃశత్రువులను జయించిన రాజా! ఇది బాగుగా నిదర్శనము, ఇదె బాగుదర్శనము అని రెంటితోనూ తెలియవలసినదానిని చక్కగా తెలుసుకొంటారు.

పరస్పరేణైతదుక్తం క్షరాక్షరనిదర్శనమ్ ।
ఏకత్వమక్షరం ప్రాహుర్నానాత్వం క్షరముచ్యతే ॥ 37 ॥

పరస్పరంగా ఈక్షరాక్షర నిదర్శనమును చెప్పాను. ఏకత్వం అక్షరమని, నానాత్వం క్షరమని యంటారు.

పంచవింశతి నిష్ఠోఽయం తదా సమ్యక్ప్రచక్షతే ।
ఏకత్వదర్శనం చాస్య నానాత్వం చాస్య దర్శనమ్ ॥ 38 ॥

ఇది ఇరవై ఐదవ తత్త్వము. దీనిని ఒకటిగా అనేకములుగా చెపుతారు.

తత్త్వవిత్తత్త్వయోరేవ పృథగేతన్నిదర్శనమ్ ।
పంచవింశతిభిస్తత్త్వం తత్త్వమాహుర్మనీషిణః ॥ 39 ॥

తత్త్వవిత్తుకు, తత్త్వములకు వేరువేరుగానే ఈనిదర్శనము చూపబడినది. ఇరవై ఐదు తత్త్వములతోనే తత్త్వమును జ్ఞానులు చెబుతారు.

నిస్తత్త్వం పంచవింశస్య పరమాహుర్మనీషిణః ।
వర్జ్యస్య వర్జ్యమాచారం తత్త్వం తత్త్వాత్సనాతనమ్ ॥ 40 ॥

ఇరవై ఐదవ దానికి తత్త్వము లేకుండుటే పరమమైనది. వదలవలసిన దానిని వదిలివేయడమే ఆచారము. ఆ తత్త్వము వలననే సనాతనమైన పరమతత్త్వమని పండితులు పేర్కొంటారు.

జనక ఉవాచ :- జనకుడు పలికాడు.

నానాత్వైకత్వమిత్యుక్తం త్వయైతద్ద్విజసత్తమ ।
పశ్యతస్తద్ధి సందిగ్ధమేతయోర్వై నిదర్శనమ్ ॥ 41 ॥

ఓ ద్విజసత్తమా! ఏకత్వమక్షరతత్త్వమని, నానాత్వం క్షరతత్త్వమని మీరు చెప్పారు. చూడగా ఈ రెంటికి నిదర్శనం నాకు సందిగ్ధంగా నున్నది.

తథా బుద్ధప్రబుద్ధాభ్యాం బుధ్యమానస్య చానఘ ।
స్థూలబుద్ధ్యా న పశ్యామి తత్త్వమేతన్న సంశయః ॥ 42 ॥

అట్లే ఓ అనఘుడా! బుద్ధప్రబుద్ధములలో బుద్ధమై దానిని గూర్చి నిదర్శనమేమిటో నాకవగతమగుట లేదు. ఈతత్త్వమేమిటో సంశయం కూడా తీరడం లేదు.

అక్షరక్షరయోరుక్తం త్వయా యదపి కారణమ్ ।
తదప్యస్థిరబుద్ధిత్వాత్ప్రణష్టమివ మేఽనఘ ॥ 43 ॥

ఓ పాపరహితుడా! క్షరాక్షరములను గూర్చి వివేచించుకొనుటకు మరే హేతువులను కారణాలుగా చెప్పారో అవి కూడా నా బుద్ధి అస్థిరమగుటచే అవగతం కాలేదు.

తదేతచ్ఛ్రోతుమిచ్ఛామి నానాత్వైకత్వదర్శనమ్ ।
ద్వంద్వం చైవానిరుద్ధం చ బుధ్యమానం చ తత్త్వతః ॥ 44 ॥

అందువల్ల ఏకత్వ, నానాత్వములతో నెట్లు దర్శింపవలెనో, ద్వంద్వముల యొక్క స్థితిని, ఆ ద్వంద్వములడ్డగించకుండా నుండే స్థితిని, తెలియవలసిన, యథార్థముగా దాన్ని గూర్చి వినగోరుతున్నాను.

విద్యావిద్యేవ భగవన్నక్షరం క్షరమేవ చ ।
సాంఖ్యం యోగం చ కార్త్స్న్యేన బుద్ధాబుద్ధిం పృథక్ పృథక్ ॥ 45 ॥

విద్య అవిద్య స్వరూపములను, క్షరఅక్షరస్వరూపమును సాంఖ్య విధానమును, యోగ విధానమును, తత్త్వము వివేచించే బుద్ధ - అబుద్ధ స్థితులను గూర్చి చక్కగా వేరువేరుగా మీ నుండి తెలుసుకొనగోరు తున్నాను.

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

హన్త తే సంప్రవక్ష్యామి య ఏతదనుపృచ్ఛసి ।
యోగకృత్యం మహారాజ పృథగేవ శృణుష్వ మే ॥ 46 ॥

ఓ మహారాజా! నీవు దేన్నిగూర్చి అయితే అడుగుతున్నావో వానిలో యోగశాస్త్రానుసారియైన తత్త్వవివేచన ప్రక్రియను గూర్చి చెబుతున్నాను. చక్కగా విను.

యోగకృత్యం తు యోగానాం ధ్యానమేవ పరం బలమ్ ।
తచ్చాపి ద్వివిధం ధ్యానమాహుర్విద్యావిదో జనాః ॥ 47 ॥

ఈ ప్రక్రియలో యోగసాధనమునకు బలమును చేకూర్చేది ధ్యానమే. అటువంటి ధ్యానము రెండు విధములని విద్యను తెలిసిన పెద్దలు చెబుతారు.

ఏకాగ్రతా చ మనసః ప్రాణాయామస్తథైవ చ ।
ప్రాణాయామస్తు సగుణో నిర్గుణో మనసస్తథా ॥ 48 ॥

అవి మనస్సుయొక్క ఏకాగ్రత, ప్రాణాయామమని రెండు విధములు. ఈరెండింటిలో సగుణధ్యాన ప్రక్రియ ప్రాణాయామము, నిర్గుణధ్యానప్రక్రియ మానస ఏకాగ్రతారూప ధ్యానం.

మూత్రోత్సర్గే పురీషే చ భోజనే చ నరాధిప ।
ద్వికాలం నోపభుంజీత శేషం భుంజీత తత్పరః ॥ 49 ॥

ఓ రాజా! ఈరెండు విధములైన ధ్యానము చేసే ప్రక్రియలను సాధన చేయుటలో ముఖ్యంగా కొన్ని నియమములను పాటించవలెను. అవేవనగా మొదట మలమూత్ర విసర్జనమును నియంత్రించు కొనవలెను. అందుకు ఆహారనియమమును పాటించవలెను. దానికి ప్రతిరోజు రెండుమార్లు భుజించకూడదు. భగవంతునికి నివేదించిన శేషమునే తత్పరుడై భుజించవలెను.

ఇంద్రియాణీంద్రియార్థేభ్యో నివర్త్య మనసా మునిః ।
దశ ద్వాదశభిర్వాఽపి చతుర్వింశాత్పరం యతః ॥ 50 ॥

ఇంద్రియములను ఆయా ఇంద్రియముల విషయముల నుండి మనసుతో మరలించి నిగ్రహంగా నుంచవలెను. మౌనమును పాటించవలెను. ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు మొత్తం పదింటిని వాటి విషయములనుండి మరల్చవలెను. ఆ పదింటికి మనస్సు, బుద్ధి యను రెంటిని చేరిస్తే పన్నెండు. వాటిని నిగ్రహించి ధ్యానంతో ఇరువది నాలుగు తత్త్వముల కతీతమైన తత్త్వమును సాక్షాత్కరించుకొనవలెను.

స చోదనాదిభిర్మతిమాన్నాఽఽత్మానం చోదయేదథ ।
తిష్ఠన్తమచరం తం తు యత్తదుక్తం మనీషిభిః ॥ 51 ॥

బుద్ధిమంతుడైనవాడు తన మనస్సును చోదనాదులతో ప్రేరేపించ కూడదు. జ్ఞానులు చెప్పిన ఆ తత్త్వము అచరము, దానినుపాసించవలెను.

విశ్వాత్మా సతతం జ్ఞేయ ఇత్యేవమనుశుశ్రుమ ।
ద్రవ్యం హ్యహీన మనసో నాన్యథేతి వినిశ్చయః ॥ 52

విశ్వాత్మకుడైన పరమాత్మనే నిత్యము తెలియవలయును, ఉన్నతమైన మనస్సుగల సాధకుడు తెలుసుకోదగినది, సాక్షాత్కరించుకోదగినది ఈతత్త్వమునే. మరేదీ కాదను విషయం నిశ్చయము.

విముక్తః సర్వసంగేభ్యో లఘ్వాహారో జితేంద్రియః ।
పూర్వరాత్రే పరార్ధే చ ధారయేత మనో హృది ॥ 53 ॥

సంగములన్నింటిని వదిలి, త్వరగా జీర్ణమయ్యే ఆహారమును తక్కువగా తీసుకుంటూ, జితేంద్రియుడై, మొదటి రాత్రిలో అనగా రాత్రి మొదటి జాములో చివరి సగముజాములో హృదయంలో మనస్సు నిలిపి, తత్త్వమును సాధన చేయవలెను.

స్థిరీకృత్యేంద్రియగ్రామం మనసా మిథిలేశ్వర ।
మనోబుద్ధ్యా స్థిరం కృత్వా పాషాణ ఇవ నిశ్చలః ॥ 54 ॥

ఓ మిథిల మహారాజా! బుద్ధితో మనస్సును స్థిరం చేసుకొని, మనస్సుతో ఇంద్రియసమూహమైన ఈశరీరమును స్థిరంగా నుంచుకొని రాయివలె నిశ్చలుడై యుండవలెను.

స్థాణువచ్చాప్యకంపః స్యాద్దారువచ్చాపి నిశ్చలః ।
బుద్ధ్యా విధివిధానజ్ఞస్తతో యుక్తం ప్రచక్షతే ॥ 55 ॥

మొద్దులాగానో, కదలనివాడై, చక్కలాగా నిశ్చలుడై బుద్ధితో విధివిధానమును తెలుసుకొనినవాడే యుక్తుడని చెబుతారు.

న శృణోతి న చాఽఽఘ్రాతి న చ పశ్యతి కించన ।
న చ స్పర్శం విజానాతి న చ సంకల్పతే మనః ॥ 56 ॥

అప్పుడా సాధకుడు ఏమియు వినడు, దేనిని వాసన చూడడు, దేనిని చూడడు, ఏ స్పర్శను కూడా అనుభవించడు. అతని మనస్సు దేనిని కూడా సంకల్పించదు.

న చాపి మన్యతే కించిన్న చ బుద్ధ్యేత కాష్ఠవత్ ।
తదా ప్రకృతిమాపన్నం యుక్తమాహుర్మనీషిణః ॥ 57 ॥

కట్టెలాగా దేనినీ తలచడు, దేనినీ తెలుసుకొనలేడు. కేవలం తన సహజస్థితిని పొందినవాడు యుక్తుడని పండితులు చెబుతారు.

న భాతి హి యథా దీపో దీప్తిస్తద్వచ్చ దృశ్యతే ।
నిలింగశ్చాధశ్చోర్ధ్వం చ తిర్యగ్గతిమవాప్నుయాత్ ॥ 58 ॥

దీపము ప్రకాశించకున్నా సూర్యకాంతి అంతటా కనపడునట్లు ఆత్మయే లింగములేకుండా పైకిక్రిందికి అడ్డముగా సంచరించును.

తదా తదుపపన్నశ్చ యస్మిన్ దృష్టే చ కథ్యతే ।
హృదయస్థోఽన్తరాత్మేతి జ్ఞేయో జ్ఞస్తాత మద్విధైః ॥ 59 ॥

ఆ తత్త్వదర్శనం కలుగగానే ఈసాధకుడు ఆత్మదర్శనంతో కూడినవాడయ్యేనని చెబుతారు. అతడే హృదయమునందుండెడి అంతరాత్మయని, అతడే జ్ఞేయుడని అనగా తెలియదగిన వాడని, జ్ఞః అనగా అన్నీ తెలిసిన వాడని నావంటి తత్త్వవేత్తలు చెబుతారు.

నిర్ధూమ ఇవ సప్తార్చిరాదిత్య ఇవ రశ్మివాన్ ।
వైద్యుతోఽగ్నిరివాఽఽకాశే పశ్యత్యాత్మానమాత్మని ॥ 60 ॥

ఆ తత్త్వం ధూమంలేని అగ్ని వంటిది. సూర్యునివలె కిరణములు గల ఆకాశమునందు ప్రకాశించు మెరుపులాంటిది. అటువంటి తత్త్వమును తమలో తామే దర్శిస్తారు.

యం పశ్యన్తి మహాత్మానో ధృతిమన్తో మనీషిణః ।
బ్రాహ్మణాః బ్రహ్మయోనిస్థా హ్యయోనిమమృతాత్మకమ్ ॥ 61 ॥

ధృతిమంతులు నిశ్చల చిత్తంగలవారు, మహాత్ములు, జ్ఞానులు, బ్రహ్మనిష్ఠ కలిగినవారు అమృతాత్మకమైన, పుట్టుకలేని ఈతత్త్వమును తమలో తామే దర్శిస్తారు.

తదేవాఽఽహురణుభ్యోఽణుస్తన్మహద్భ్యో మహత్తరమ్ ।
సర్వత్ర సర్వభూతేషు ధ్రువం తిష్ఠన్న దృశ్యతే ॥ 62 ॥

'అణోరణీయాన్ మహతో మహీయాన్' అని చెప్పినట్లుగా ఆదియె అణువుకంటే అణుతరము, మహత్తుల కంటే మహత్తరము. అంతటా అన్నిభూతములయందు నిశ్చలంగానుంటూ కూడా కనిపించదు.

బుద్ధిద్రవ్యేన దృశ్యేన మనోదీపేన లోకకృత్ ।
మహతస్తమసస్తాత పారే తిష్ఠన్న తామసః ॥ 63 ॥

నాయనా! లోక కర్త అయిన ఈతడు మహాతమస్సున కావలనుంటూ కూడా తమోగుణంచే నావరించినవాడు కాదు. బుద్ధి అను ద్రవ్యం (నూనె) తో వెలిగించిన మనోదీపంయొక్క ప్రకాశంతో చూచుటకు సాధ్యమవుతుంది. అయితే వేదతత్త్వజ్ఞులగు పెద్దలు ఈతత్త్వమునుగూర్చి 'తమసః పరస్తాత్', 'తమసస్తు పారే' అని చెబుతారు.

తమసో దూర ఇత్యుక్త స్తత్త్వజ్ఞైర్వేదపారగైః ।
విమలో విమతశ్చైవ నిర్లింగోఽలింగసంజ్ఞకః ॥ 64 ॥

అందుకే వేదతత్త్వజ్ఞులైన పెద్దలు ఈతత్త్వమునుగూర్చి "తమసః పరస్తాత్" "తమసస్తు పారే" తమస్సునకు ఆవల దూరంగా నున్నవాడు అని చెబుతారు. అతడు విమలుడు, ఏ అభిప్రాయములేనివాడు, దేహాది ఉపాధులు అనగా చిహ్నరహితుడై కూడా లింగసంజ్ఞకుడుగా నుంటాడు.

యోగ ఏవ హి లోకానాం కిమన్యద్యోగలక్షణమ్ ।
ఏవం పశ్యన్ ప్రపశ్యేత ఆత్మానమజరం పరమ్ ॥ 65 ॥

ఈలోకాలకు యోగశాస్త్రానికంటే ఇతరమైన దేమున్నది? ఈ యోగదర్శనము ననుష్ఠించినవారు అజరుడు, పరుడు, నాశరహితుడు అయిన పరమాత్మను దర్శించగలరు.

యోగదర్శనమేతావదుక్తం తే తత్త్వతో మయా ।
సాంఖ్యజ్ఞానం ప్రవక్ష్యామి పరిసంఖ్యానిదర్శనమ్ ॥ 66 ॥

నేనింతవరకు నీకు తాత్త్వికంగా యోగదర్శనమునుగూర్చి తెలిపాను. ఇక పరిసంఖ్యానిదర్శనమైన సాంఖ్యజ్ఞానదర్శనమునుగూర్చి తెలుపుతాను.

అవ్యక్తమాహుః ప్రఖ్యానం పరాం ప్రకృతిమాత్మనః ।
తస్మాన్మహత్సముత్పన్నం ద్వితీయం రాజసత్తమ ॥ 67 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! పరా ప్రకృతినే అవ్యక్తమంటారు. దానికి మూలమైన దానినుండి ఉత్పన్నమైనదే రెండవది మహత్తు.

అహంకారస్తు మహతస్తృతీయ ఇతి నః శ్రుతమ్ ।
పంచభూతాన్యహంకారాదాహుః సాంఖ్యాత్మదర్శినః ॥ 68 ॥

మహత్తత్త్వమునుండి మూడవది అహంకారము పుట్టినది. అహంకారంనుండి ఏర్పడినవే సూక్ష్మ పంచ భూతములని నాల్గవ దశగా సాంఖ్యాత్మదర్శనులగువారు చెబుతారు.

ఏతాః ప్రకృతయస్త్వష్టౌ వికారాశ్చాపి షోడశ ।
పంచ చైవ విశేషాశ్చ తథా పంచేంద్రియాణి చ ॥ 69 ॥

మహత్తు, అహంకారము, మనస్సు, పంచభూతములు అను ఈఎనిమిదింటిని ప్రకృతి అంటారు. పంచవిశేషాలు, పంచఇంద్రియాలు, పంచవికారములు, మనసు ఇవి వీటిని షోడశ వికారాలు అంటారు.

ఏతావదేవ తత్త్వానాం సాంఖ్యమాహుర్మనీషిణః ।
సాంఖ్యే సాంఖ్యవిధానజ్ఞా నిత్యం సాంఖ్యపదే స్థితాః ॥ 70 ॥

త్వక్, చక్షుః, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములు ఐదు జ్ఞానేంద్రియములు, వాక్, పాణి, పాద, పాయూపస్థలు ఐదు కర్మేంద్రియములు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఐదు తన్మాత్రలు, మనస్సు ఈ మొత్తం కలిపి పదహారు వికారములు. వీటిలో ఐదు తన్మాత్రలు స్థూలమైన భూత సృష్టికి మూలము. కావున వాటిని ఐదు విశేషములన్నారు. నిత్యము సాంఖ్య పదమునందున్నవారు, సాంఖ్య విధానమును తెలిసినటువంటివారు మహానుభావులు ఈతత్త్వములనే సాంఖ్యయోగమని చెప్పారు.

యస్మాద్యదభిజాయేత తత్తత్రైవ ప్రలీయతే ।
లీయన్తే ప్రతిలోమాని గృహ్యన్తే చాన్తరాత్మనా ॥ 71 ॥

దేనియందు సృష్టించబడ్డాయో తిరిగి దానియందే లయం చెందుతాయి. ఇక్కడ లయం తలక్రిందులుగా జరుగుతుంది. వాటినన్నింటిని అంతరాత్మ గ్రహిస్తుంది.

ఆనులోమ్యేన జాయన్తే లీయన్తే ప్రతిలోమతః ।
గుణా గుణేషు సతతం సాగరస్యోర్మయో యథా ॥ 72 ॥

సముద్రంలో అలలవలె గుణములయందు గుణములు అనులోమంగా పుట్టి ప్రతిలోమంగా లయం చెందుతాయి.

సర్గప్రలయ ఏతావాన్ ప్రకృతేర్నృపసత్తమ ।
ఏకత్వం ప్రలయం చాస్య బహుత్వం చ తథా సృజి ॥ 73 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! సృష్టి ప్రలయములనేవి ప్రకృతి సంబంధములైనవి ఇంతమాత్రమే. దీని సృష్టియందు బహుత్వం, లయం ఏకత్వ ఉంటుంది.

ఏవమేవ చ రాజేంద్ర విజ్ఞేయం జ్ఞానకోవిదైః ।
అధిష్ఠాతారమవ్యక్తమస్యాప్యేతన్నిదర్శనమ్ ॥ 74 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! దీనికి అధిష్ఠాత అవ్యక్తమని జ్ఞానకోవిదులైనవారు తెలుసుకొనదగినది. దీనికి నిదర్శనమని ఎరుగవలెను.

ఏకత్వం చ బహుత్వం చ ప్రకృతేరనుతత్త్వవాన్ ।
ఏకత్వం ప్రలయే చాస్య బహుత్వం చ ప్రవర్తనాత్ ॥ 75 ॥

ప్రకృతికి అనుతత్త్వమైన ఏకత్వము బహుత్వమని రెండు విధములుగా కనిపిస్తుంది. ప్రలయమునకు తరువాత ఏకత్వం ప్రలయమునకు ముందున్న సృష్టికాలంలో ప్రవర్తించుటను బట్టి బహుత్వం.

బహుధాఽఽత్మా ప్రకుర్వీత ప్రకృతిం ప్రసవాత్మికామ్ ।
తచ్చ క్షేత్రం మహానాత్మా పంచవింశోఽవతిష్ఠతే ॥ 76 ॥

ప్రసవాత్మిక అయిన ఈప్రకృతిని పరమాత్మ ఒకటిగా నున్నదానిని అనేక విధములుగా చేస్తాడు. అట్లు ఏర్పడిన భౌతిక దేహమే క్షేత్రము దానిలో ఈమహాన్ ఆత్మా ఇరవై ఐదవవానిగా నుంటాడు.

అధిష్ఠాతేతి రాజేన్ద్ర ప్రోచ్యతే యతిసత్తమైః ।
అధిష్ఠానాదధిష్ఠాతా క్షేత్రాణామితి నః శ్రుతమ్ ॥ 77 ॥

ఓ రాజేంద్రా! యతిశ్రేష్ఠులందరు ఇతనిని అధిష్ఠాత అంటారు. క్షేత్రములన్నింటియందు తాను నిలిచి యుండువాడు కనుక అతనికి అధిష్ఠాతా అను పేరు గలదు.

క్షేత్రం జానాతి చావ్యక్తం క్షేత్రజ్ఞ ఇతి చోచ్యతే ।
అవ్యక్తికే పురే శేతే పురుషశ్చేతి కథ్యతే ॥ 78 ॥

అవ్యక్తమును క్షేత్రముగా నెరుగును. 'క్షేత్రం జానాతి ఇతి క్షేత్రజ్ఞః' క్షేత్రమును తెలిసినవాడు గాన క్షేత్రజ్ఞుడు అను వ్యుత్పత్తి వలన ఇతడు ఆత్మ క్షేత్రజ్ఞుడు. అవ్యక్తమగు పురమున నివసించునుగాన పురుషుడు అనబడతాడు 'పురి శేతే ఇతి పురుషః', 'పురు సనోతి ఇతి చాలా ఇచ్చేవాడు.

అన్యదేవ చ క్షేత్రం స్యాదన్యః క్షేత్రజ్ఞ ఉచ్యతే ।
క్షేత్రమవ్యక్త ఇత్యుక్తం జ్ఞాతారం పంచవింశకమ్ ॥ 79 ॥

క్షేత్రమును అవ్యక్తము అంటారు. క్షేత్రజ్ఞుని 25వ వాడు ఆత్మ అంటారు. ఒకటి క్షేత్రము మరొకటి క్షేత్రజ్ఞుడు అని చెప్పబడుతాడు.

అన్యదేవ చ జ్ఞానం స్యాత్ అన్యత్ జ్ఞేయం తదుచ్యతే ।
జ్ఞానమవ్యక్తమిత్యుక్తం జ్ఞేయో వై పంచవింశకః ॥ 80 ॥

ఒకటి జ్ఞానము, మరొకటి జ్ఞేయము అనగా తెలుసుకొనదగినది. జ్ఞానమును అవ్యక్తమని, జ్ఞేయమును ఇరవై ఐదవ తత్త్వమని చెప్పారు.

అవ్యక్తం క్షేత్రమిత్యుక్తం తథా సత్త్వం తథేశ్వరమ్ ।
అనీశ్వరమతత్త్వం చ తత్త్వం తత్ పంచవింశకమ్ ॥ 81 ॥

అవ్యక్తమును క్షేత్రమన్నారు. అట్లే సత్త్వము ఈశ్వరుడు. తత్త్వము కానిది శాసకము కాదు. తత్త్వము ఇరవై ఐదవ వది ఆత్మ.

సాంఖ్యదర్శనమేతావత్పరిసంఖ్యా న విద్యతే ।
సంఖ్యా ప్రకురుతే చైవ ప్రకృతిం చ ప్రవక్ష్యతే ॥ 82 ॥

దీనికి సాంఖ్యదర్శనము ఇంతవరకే పరిసంఖ్య అనేది లేదు. లెక్కించుచూ ప్రకృతిని గూర్చి చెబుతున్నారు.

చత్వారింశచ్చతుర్వింశత్ ప్రతి సంఖ్యాయ తత్త్వతః ।
సంఖ్యా సహస్ర కృత్యా తు నిస్తత్వః పంచవింశకః ॥ 83 ॥

ప్రతి సంఖ్యను గూర్చి తత్త్వతః ఇరువది నాలుగు, నలభై, లేదా సంఖ్యా సహస్రంను చేయుటచేత నిస్తత్త్వము ఇరవై ఐదవది మాత్రమే అనగా ఆత్మ.

పంచవింశత్ప్రబుద్ధాత్మా బుధ్యమాన ఇతి శ్రుతః ।
యదా బుధ్యతి ఆత్మానం తదా భవతి కేవలః ॥ 84 ॥

ఇరవై ఐదవ తత్త్వంగా తెలియువాడగు వాడు ప్రబుద్ధాత్మ తనను తాను తెలుసుకున్నపుడు కేవలుడౌతాడు.

సమ్యగ్దర్శనమేతావద్భాషితం తవ తత్త్వతః ।
ఏవమేతద్విజానన్తః సామ్యతాం ప్రతియాన్త్యుత ॥ 85 ॥

ఇంతవరకు నీకు తత్త్వతః సాంఖ్యదర్శనమునుగూర్చి చక్కగా వివరించాను. ఈవిధంగా దీనిని తెలుసుకొన్నందువల్ల దీని సామ్యతను పొందుతారు.

సమ్యఙ్నిదర్శనం నామ ప్రత్యక్షం ప్రకృతే స్తథా ।
గుణవత్త్వాద్యథైతాని నిర్గుణేభ్యస్తథా భవేత్ ॥ 86 ॥

వాస్తవమైన నిదర్శనమంటే పరాప్రకృతిని సాక్షాత్కరించుకొనుటయే. ఇవి నీ గుణములు కలవగుట వలన నిర్గుణములనుండి తాను ఏర్పడవలయును.

న త్వేవం వర్తమానానామావృత్తి ర్వర్తతే పునః ।
విద్యతే క్షరభావశ్చ న పరస్పరమవ్యయమ్ ॥ 87 ॥

ఇట్లున్నవారికి పునరావృత్తి యనునదుండదు. పరస్పరముగా అవికారముకాని, క్షరభావంగాని యుండదు.

పశ్యన్త్యమతయో యే న సమ్యక్తేషు చ దర్శనమ్ ।
తే వ్యక్తిం ప్రతిపాద్యన్తే పునః పునరరిందమ ॥ 88 ॥

ఓ అరిందమా! ఎవరైతే మందమతులుంటారో వారు తమ యందున్న దానిని చక్కగా దర్శించలేరు. వారు మాటి మాటికి వ్యక్తిని మాత్రమే ప్రతిపాదిస్తారు.

సర్వమేతద్విజానన్తో న సర్వస్య ప్రబోధనాత్ ।
వ్యక్తీభూతా భవిష్యన్తి వ్యక్తస్యైవానువర్తనాత్ ॥ 89 ॥

వారు అవ్యక్త తత్త్వమును సకలమును తెలియుటవలననే సర్వమును బోధించుటవలన కాదు, వ్యక్తతత్త్వమునే అనుసరించుటవల్ల దానినే అనువర్తిస్తూ యుంటారు. ప్రకృతి భావమునే పొందుతారు .

సర్వమవ్యక్త మిత్యుక్తమసర్వః పంచవింశకః ।
య ఏవమభిజానన్తి న భయం తేషు విద్యతే ॥ 90 ॥

అంతా అవ్యక్తమని చెప్పాము. సర్వముకానిది 25వ ఆత్మ. ఇట్లు తెలిసినవారికి భయముండదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వసిష్ఠ కరాల జనక సంవాదే పంచత్రింశాధికశతతమోఽధ్యాయః ॥ 135 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వసిష్ఠ జనక సంవాదములో నూట ముప్పై అయిదవ అధ్యాయం సంపూర్ణం.

షట్త్రింశాధికశతతమోఽధ్యాయః – నూట ముప్పైఆరవ అధ్యాయం
వసిష్ఠ కరాల జనకసంవాదమ్ – వసిష్ఠ జనక సంవాదం

వసిష్ఠ ఉవాచ :– వసిష్ఠుడు పలికాడు.

సాంఖ్యదర్శనమేతావదుక్తం తే నృపసత్తమ ।
విద్యావిద్యే త్విదానీం మే త్వం నిబోధానుపూర్వశః ॥ 1 ॥

ఓ నృపసత్తమా! ఇంతవరకు నీకు సాంఖ్యదర్శనమునుగూర్చి వివరించాను. ఇప్పుడు విద్య అవిద్యలను వరుసగా నా నుండి నీవు తెలుసుకొనుము.

అభేద్యమాహురవ్యక్తం సర్గప్రలయధర్మిణః ।
సర్గప్రలయ ఇత్యుక్తం విద్యావిద్యే చ వింశకః ॥ 2 ॥

అవ్యక్తమును అభేద్యమంటారు. ఇది సృష్టి ప్రలయధర్మములు కలది. విద్య అవిద్యలను సృష్టి ప్రలయ మయటారు.

పరస్పరస్య విద్యా వై తన్నిబోధానుపూర్వశః ।
యథోక్తమృషిభిస్తాత సాంఖ్యస్యాభినివేదనమ్ ॥ 3 ॥

నాయనా! విద్య – అవిద్య అనేవి పరస్పరంగా నెట్లుంటాయో, క్రమముగా దానిని. తెలుసుకొను. ఋషులందరు సాంఖ్యమును తెలుపుటకు ఎలా చెప్పారో దానిని విను.

కర్మేంద్రియాణాం సర్వేషాం విద్యాబుద్ధీంద్రియం స్మృతమ్ ।
బుద్ధీంద్రియాణాం చ తథా విశేషా ఇతి నః శ్రుతమ్ ॥ 4 ॥

కర్మేంద్రియములన్నింటికి విద్య బుద్ధీంద్రియమని చెప్పారు. బుద్ధీంద్రియములకన్నిటికి అట్లే విశేషములని విన్నాము.

విషయాణాం మనస్తేషాం విద్యామాహుర్మనీషిణః ।
మనసః పంచభూతాని విద్యా ఇత్యభిచక్షతే ॥ 5 ॥

ఆ విషయములన్నింటికి మనస్సు విద్య అని, మనస్సునకు పంచభూతములు విద్య అని జ్ఞానులు చెబుతారు.

అహంకారస్తు భూతానాం పంచానాం నాత్ర సంశయః ।
అహంకారస్తథా విద్యా బుద్ధిర్విద్యా నరేశ్వర ॥ 6 ॥

ఓ మహారాజా! పంచభూతములకు అహంకారము, విద్య, ఆ అహంకారమునకు బుద్ధి విద్య. ఇందులో సందేహము లేదు.

బుద్ధ్యా ప్రకృతిరవ్యక్తం తత్త్వానాం పరమేశ్వరః ।
విద్యా జ్ఞేయా నరశ్రేష్ఠ విధిశ్చ పరమః స్మృతః ॥ 7 ॥

ఓ రాజా! బుద్ధిచేత ప్రకృతిని విద్యగా తెలుసుకొనవలెను. తత్త్వములకు విద్య పరమేశ్వరుడు. అదియే విధి. అదే పరమమని, విద్యని తెలుసుకొనవలెను.

ఇక్కడ విద్యాతత్త్వమును అవిద్యాతత్త్వమును చక్కగా చెప్పారు. సృష్టిప్రళయములలో జనన, మరణములు ధర్మములుగా నున్న సంసార చక్రములో పడినవాడు అవ్యక్త తత్త్వమును తెలుసుకొనజాలడు. పైన చెప్పిన, వాటిలో ఒక దానికంటె మరియొకటి ఉత్తరోత్తరంగా విద్యారూపమైనది, విద్య – అవిద్య అనునవి రెండు భేదములు. పైదానికంటె ముందరిది అవిద్యారూపమైనది. అవెట్లనగా 1.కరేంద్రియములు, 2.జ్ఞానేంద్రియములు, 3. పంచతన్మాత్రలు లేదా విషయములు, 4.మనస్సు, 5.పంచభూతములు, 6.అహంకారం, 7.బుద్ధి, 8.అవ్యక్తం. ఇవి వరుసగా ఒకదాని కంటె మరియొకటి విద్యారూపమైనది. అంటే ఉత్తరోత్తరం సూక్ష్మతరమైనవి.

అవ్యక్తమపరం ప్రాహుర్విద్యా వై పంచవింశకః ।
సర్వస్య సర్వమిత్యుక్తం జ్ఞేయజ్ఞానస్య పారగః ॥ 8 ॥

అన్నింటికీ సర్వమైనది, తెలుసుకొనదగినటువంటి దానికి చివరైనది, అవ్యక్తమైనటువంటి ఇరవై ఐదవ తత్త్వమేదైతే ఉన్నదో అదే విద్యయని చెబుతారు. అవ్యక్తమును అపరమందురు.

జ్ఞానమవ్యక్తమిత్యుక్తం జ్ఞేయం వై పంచవింశకమ్ ।
తథైవ జ్ఞానమవ్యక్తం విజ్ఞాతా పంచవింశకః ॥ 9 ॥

ఎట్లైతే జ్ఞానము అవ్యక్తం, జ్ఞేయం, 25వది అని చెప్పారో అట్లే జ్ఞానం, అవ్యక్తం, విజ్ఞాత 25వ వాడు.

విద్యావిద్యే తు తత్త్వేన మయోక్తే వై విశేషతః ।
అక్షరం చ క్షరం చైవ యదుక్తం తన్నిబోధ మే ॥ 10 ॥

విద్య – అవిద్య అని విశేషంగా తాత్త్వికంగా నేను రెంటిని గూర్చి చెప్పాను. ఇక అక్షరము – క్షరము అను దానిని నానుండి వినుము.

ఉభావేతౌ క్షరావుక్తౌ ఉభావేతా వనక్షరౌ ।
కారణం తు ప్రవక్ష్యామి యథా జ్ఞానం తు జ్ఞానతః ॥ 11 ॥

వ్యక్తావ్యక్తములగు ఈరెంటినీ కూడా క్షరములు అంటారు, అక్షరములు అంటారు. నాకున్న జ్ఞానముననుసరించి వాటినిగూర్చి వివరిస్తాను. దానికి గల కారణమేమో తెలుసుకొను.

అనాదినిధనావేతౌ ఉభావేవేశ్వరౌ మతౌ ।
తత్త్వసంజ్ఞావుభావేవ ప్రోచ్యతే జ్ఞానచింతకైః ॥ 12 ॥

ఈరెండును వాస్తవంగా పుట్టుక నాశము లేనివే. రెండునూ కూడా సర్వశక్తిమంతములైన ఈశ్వరతత్త్వములే. రెండూ కూడా తత్త్వములే అని జ్ఞానచింతకులంటారు.

సర్గప్రలయధర్మిత్వాదవ్యక్తం ప్రాహురవ్యయమ్ ।
తదేత ద్గుణసర్గాయ వికుర్వాణం పునః పునః ॥ 13 ॥

సృష్టి ప్రలయ ధర్మములు గలది కావున అవ్యక్తమును అవ్యయమంటారు. ఆ అవ్యక్తమే గుణములను సృజించుటకు మాటిమాటికి వికారమును చెందును.

గుణానాం మహదాదీనాముత్పద్యతి పరస్పరమ్ ।
అధిష్ఠానం క్షేత్రమాహురేతద్వై పంచవింశకమ్ ॥ 14 ॥

ఈ అవ్యక్తము గుణసృష్టి కొరకు మహదాది గుణములను పరస్పరంగా సృష్టిస్తుంది. ఈ పంచవింశమునే క్షేత్రము, అధిష్ఠానమంటారు.

యదన్తర్గుణజాలం తు తద్వ్యక్తాత్మని సంక్షిపేత్ ।
తదహం తద్గుణైస్తైస్తు పంచవింశో విలీయతే ॥ 15 ॥

అంతర్గుణసమూహములైన పంచతన్మాత్రలు, గుణత్రయము, మనస్సు, బుద్ధి, అహంకారము, అంతఃకరణ త్రయములనే పదకొండు వ్యక్తాత్మలో సంక్షేపించవలయును. అహంకారము దాని గుణములతో 25వది లయమగును.

గుణా గుణేషు లీయన్తే తదేకా ప్రకృతిర్భవేత్ ।
క్షేత్రజ్ఞోఽ పి తదా తావత్ క్షేత్రజ్ఞః సంప్రణీయతే ॥ 16 ॥

గుణములన్నీ గుణములయందే లీనమవుతాయి. అప్పుడదంతా ఒకే ప్రకృతిగా నుంటుంది. అపుడు క్షేత్రజ్ఞుడు క్షేత్రజ్ఞునిగా చెప్పబడుతాడు.

యదాఽ క్షరం ప్రకృతిర్యం గచ్ఛతే గుణసంజ్ఞితా ।
నిర్గుణత్వం చ వై దేహే గుణేషు పరివర్తనాత్ ॥ 17 ॥

ప్రకృతి అక్షరమును పొందినపుడు గుణమనబడును. దేహములో గుణములలో మార్పువలన నిర్గుణత్వమునొందును.

ఏవ మేవ చ క్షేత్రజ్ఞః క్షేత్రజ్ఞానపరిక్షయాత్ ।
ప్రకృత్యా నిర్గుణస్తేష ఇత్యేవమనుశుశ్రుమ ॥ 18 ॥

ఇట్లే క్షేత్రజ్ఞానం నశించుటవల్ల ప్రకృతిచేత ఈక్షేత్రజ్ఞుడు నిర్గుణుడే అవుతాడని వింటున్నాం.

క్షరో భవత్యేష యదా గుణవతీ గుణేష్వథ ।
ప్రకృతిం త్వథ జానాతి నిర్గుణత్వం తథాఽ ఽ త్మనః ॥ 19 ॥

ఈ ప్రకృతి గుణములయందు గుణవతి అయినపుడు క్షరయగును. ఆత్మ యొక్క ప్రకృతి నిర్గుణత్వమని తెలుసుకొనును.

తదా విశుద్ధో భవతి ప్రకృతేః పరివర్జనాత్ ।
అన్యోఽహమన్యే యమితి యదా బుద్ధ్యతి బుద్ధిమాన్ ॥ 20 ॥

నేను వేరు, ఇది వేరు అని బుద్ధిమంతుడై ఎపుడు తెలుసుకొంటాడో అప్పుడు ఈప్రకృతిని పరివర్జించుటవల్ల విశుద్ధుడవుతాడు.

తదైషోఽవ్యథతామేతి న చ మిశ్రత్వమావ్రజేత్ ।
ప్రకృత్యా చైష రాజేంద్ర మిశ్రోఽన్యోఽన్యస్య దృశ్యతే ॥ 21 ॥

ఓ రాజా! అప్పుడితడే దుఃఖములను పొందదు; సంకరమును కూడా పొందదు. సుఖ దుఃఖములుండవు. ప్రకృతివలననే ఇతడు సంకరునిగా, ఇతరునిగా ఇతరులకు కనిపిస్తాడు.

యదా తు గుణజాలం తత్ప్రాకృతం విజుగుప్సతే ।
పశ్యతే చ పరం పశ్యంస్తదా పశ్యన్ను సంసృజేత్ ॥ 22 ॥

ప్రాకృతికమైన గుణజాలములయందు జుగుప్స ఏర్పడినప్పుడు పరమునే దర్శించును పరమును చూచుచు సృజించును.

కిం మయా కృతమేతావద్యోఽహం కాలనిమజ్జనః ।
యథామత్స్యోఽహ్యభి ధనువర్తితవాన్ జలమ్ ॥ 23 ॥

సుఖదుఃఖమిశ్రితమైన ఈసంసారమునందుగల దోషములను గుర్తించి విరక్తుడైన ఈజీవుడు అయ్యో! ఇంతవరకు ఈకాలచక్రంలో మునిగిపోయిన నేను ఏమి చేసినాను? నీటిలో నున్న చేప నీరు వేరు, నేను వేరు అని అజ్ఞానంతో తెలుసుకొన నట్లయితిని గదా యనుకొంటుంది.

అహమేవ హి సంమోహాదన్యమన్యం జనాజ్జనమ్ ।
మత్స్యో యథోదకజ్ఞానాదనువర్తితవానిహ ॥ 24 ॥

నేనే సంమోహము వలన వేరు జనముకంటే ఈ జనమును వేరుగా తెలియజాలక మత్స్యము నీటిని అనువర్తించినట్లు నేను అనుసరింతిని.

మత్స్యోఽన్యత్వమథాజ్ఞానాదుదకాన్నాభిమన్యతే ।
ఆత్మానం తదవజ్ఞానాదన్యం చైవ న వేద్మ్యహమ్ ॥ 25 ॥

అజ్ఞానంతో చేప తను తిరిగే నీరు కంటే తానువేరని తెలియనట్లు అజ్ఞానముతో నేను ప్రకృతి కంటే వేరని తెలియలేదు.

మమాస్తు ధిక్కుబుద్ధస్య యోఽహం మగ్న ఇమం పునః ।
అనువర్తితవాన్మోహాదన్యమన్యం జనాజ్జనమ్ ॥ 26 ॥

ఛీ ఛీ బుద్ధిలేని నేను మళ్ళీ దీనిలోనే పడిపోయాను. మోహంతో జననమరణములకతీతమైన తత్త్వమున్నదని ఎరుగక ఇతరుని ఇతరజనమును అనువర్తించితిని.

అయమనుభవేద్బంధురనేన సహ మే క్షయమ్ ।
సామ్యమేకత్వతాం యాతో యాదృశస్తాదృశస్త్విహ ॥ 27 ॥

ఈనా బంధువులైన వీరు క్షయమును పొందినట్లు ఈ బంధువు అనుభవించినాడు. నేను కూడా క్షయమును పొందుతాను. వారెటువంటి స్థితిలోనున్నారో నేను కూడా వారితో సామ్యమును ఏకత్వమునిక్కడ పొందాను.

తుల్యతామిహ పశ్యామి సదృశోఽహమనేన వై ।
అయం హి విమలో వ్యక్తమహమీదృశకస్తదా ॥ 28 ॥

నేను అజ్ఞానంచే కలిగిన సంమోహంతో వీరితో సదృశుడనై సమానత్వమును చూస్తున్నాను. ఇతను అక్షరుడు, జ్ఞేయుడు. విమలమైన తత్త్వము. నేను వ్యక్తునిగా, ఇటువంటివానిగా నున్నాను.

యోఽహమజ్ఞానసంమోహాదజ్ఞయా సంప్రవృత్తవాన్ ।
సంసర్గాదతిసంసర్గాత్ స్థితః కాలమిమం త్వహమ్ ॥ 29 ॥

నేను అజ్ఞానసంమోహంతో అజ్ఞానిగా ప్రవర్తించాను. దీనికంతటికి కారణం ప్రకృతితో సంసర్గము – అతి సంసర్గము. అందువలననే ఇంతకాలం ఈ స్థితిలోనున్నాను.

సోఽహమేవం వశీభూతః కాలమేతం న బుద్ధవాన్ ।
ఉత్తమాధమమధ్యానాం తామహం కథమావసే ॥ 30 ॥

అలాంటి నేను ఇంతకాలం దానికి వశీభూతుడనై ఉత్తమమధ్యమ అధమ స్థితులనుగూర్చి, వాటి వ్యత్యాసములను గూర్చి తెలుసుకొనలేకపోయాను. ఇంకా నేనెట్లా ఈ స్థితిలో నుండగలను?

సమానమాయయా చేహ సహవాసమహం కథమ్ ।
గచ్ఛామ్యబుద్ధభావత్వాదిహేదానీం స్థిరోఽభవమ్ ॥ 31 ॥

ఇంతకాలం ఈ మాయతో సహవాసంతో, దానితో సమానమైన మాయలో పడ్డాను. ఇంకెట్లుండగలను? ఇక ఇక్కడ స్థిరంగా నుంటాను. అజ్ఞానము వల్ల నిర్వికారత్వమును ఎట్లు పొందుతాను.

సహవాసం న యాస్యామి కాలమేతం వివంచనాత్ ।
వంచితో హ్యనయా యద్ధి నిర్వికారో వికారయా ॥ 32 ॥

నన్ను వంచించినందువలన వికారంగల దీనితో నిర్వికారుడనైన నేను ఇంతకాలం వంచించబడ్డాను. కనుక ఇక ఈ వంచనవలన నేను దీనితో సహవాసం చేయను.

న తత్తదపరాద్ధం స్యాదపరాధో హ్యయం మమ ।
యోఽహమత్రాభవం సక్తః పరాఙ్ముఖముపస్థితః ॥ 33 ॥

నిజానికిది ప్రకృతియొక్క అపరాధంకాదు. ఇది నా స్వయంకృతాపరాధమే. నేనీ మాయా కల్పిత సుఖభోగములయందాసక్తుడనై తాత్త్వికస్థితికి పరాఙ్ముఖుడనయ్యాను.

తతోఽస్మిన్ బహురూపోఽథ స్థితో మూర్తిరమూర్తిమాన్।
అమూర్తిశ్చాప్యమూర్తాత్మా మమత్వేన ప్రధర్షితః ॥ 34 ॥

వాస్తవంగానే రూపంలేని నేను బహురూపుడనై యున్నాను. ఆకారము గల నేను ఆకారము లేనివాడనయ్యాను. ఆకారములేని వాడనైనందుకు ఆకారములేని ప్రకృతిని, నేననుకున్నాను నాదను అహంకార మమకారములకు వశుడనయ్యాను.

ప్రకృత్యా చ తయా తేన తాసు తాస్విహ యోనిషు ।
నిర్మమస్య మమత్వేన వికృతం తాసు తాసు చ ॥ 35 ॥

నిర్మముడనైన నేను ప్రకృతికి వశుడనై ఆయా యోనులయందు పుడుతూ, వికారములను పొందుతూ, జన్మలయందు వికృతరూపుడనై అవి నావే అని మమకారము పొందాను.

యోనిషు వర్తమానేన నష్టసంజ్ఞేన చేతసా ।
సమతా న మయా కాచిదహంకారే కృతా మయా ॥ 36 ॥

ఆయా యోనులయందుండుటవలన తెలివిని కోల్పోయి, అహంకరించి, సమత్వమును పొందలేదు.

ఆత్మానం బహుధా కృత్వా సోఽయం భూయో యునక్తి మామ్ ।
ఇదానీమవబుద్ధోఽస్మి నిర్మమో నిరహంకృతః ॥ 37 ॥

తన్ను తాను బహురూపములుగా పరిణమింపచేసుకున్న ప్రకృతి తిరిగి నన్ను కూర్చుటకు యత్నిస్తున్నది. ఇప్పుడు నేను అహంకారమమకారరహితుడనని తెలుసుకొన్నాను.

మమత్వం మనసా నిత్యమహంకారకృతాత్మకమ్ ।
అపలగ్నామిమాం హిత్వా సంశ్రయిష్యే నిరామయమ్ ॥ 38 ॥

నిత్యమూ అహంకారమమకారములవంచించు స్వభావంగలవారిలో ముందుండు సంబంధములేని దీనిని మనసా జయించి నిరామయమైన స్థితి నాశ్రయిస్తాను.

అనేన సామ్యం యాస్యామి నానయాఽహమచేతసా ।
క్షేమం మమ సహానేన నైవైకమనయా సహ ॥ 39 ॥

మనసులేని దీనితో నేను సామ్యమును పొందలేను. దీనితో సామ్యమును పొందితే నాకు క్షేమం కలుగదు. దీని సహవాసంతో నేను దీనితో ఒకటి కాను.

ఏవం పరమ సంబోధాత్పంచవింశోఽనుబుద్ధవాన్ ।
అక్షరత్వం నిగచ్ఛతి త్యక్త్వా క్షరమనామయమ్ ॥ 40 ॥

ఇలా ప్రతిబుద్ధుడైనవాడు 25వ జీవుడు అక్షరమును అనామయమును పొందును. క్షరత్వమును విడుచును.

అవ్యక్తం వ్యక్తధర్మాణం సగుణం నిర్గుణం తథా ।
నిర్గుణం ప్రథమం దృష్ట్వా తాదృగ్భవతి మైథిల ॥ 41 ॥

ఓ మిథిలాధిపతీ! ఇలా ప్రతిబద్ధుడైనవాడు వ్యక్తస్థితినుండి అవ్యక్తమును, సగుణమునుండి నిర్గుణమునకు పయనించి నిర్గుణుని చూసి తాను నిర్గుణునిగా మారిపోతాడు.

అక్షరక్షరయోరేతదుక్తం తవ నిదర్శనమ్ ।
మయేహజ్ఞాన సంపన్నం యథా శ్రుతినిదర్శనాత్ ॥ 42 ॥

శ్రుతి యందు చెప్పినట్లుగా జ్ఞానసంపన్నమైన క్షర – అక్షర తత్త్వముల యొక్క వివేచనప్రకారంగా నిదర్శనంతో నీకు వివరించాను.

నిఃసందిగ్ధం చ సూక్ష్మం చ విశుద్ధం విమలం తథా ।
ప్రవక్ష్యామి తు తే భూయస్తన్నిబోధ యథాశ్రుతమ్ ॥ 43 ॥

సందేహరహితమైనది, సూక్ష్మమైనది, విశుద్ధమైనది, అట్లే విమలమైనదైన దానిని, నేను విన్న దానిని విన్నట్లుగా మరల నీకు చెప్పబోతున్నాను. వినుము.

సాంఖ్యయోగో మయా ప్రోక్తః శాస్త్రద్వయనిదర్శనాత్ ।
యదేవ సాంఖ్యశాస్త్రోక్తం యోగదర్శనమేవ తత్ ॥ 44 ॥

రెండుశాస్త్రముల నిదర్శనములవల్ల నేను నీకు సాంఖ్యము యోగము ఈ రెంటిని చెప్పాను. సాంఖ్యదర్శనమందు చెప్పినదే యోగదర్శనమునందు చెప్పారు.

ప్రబోధనపరం జ్ఞానం సాంఖ్యానామవనీపతే! ।
విస్పష్టం ప్రోచ్యతే తత్ర శిష్యాణాం హితకామ్యయా ॥ 45 ॥

ఓ రాజా! శిష్యులకు హితం కలగాలనే కోరికతో సాంఖ్యులయొక్క ప్రబోధన పరమైన జ్ఞానమును, ఆ తత్త్వమును సాంఖ్యదర్శనం విస్పష్టంగా వివేచించి ప్రతిపాదిస్తుంది.

బృహచ్చైవమిదం శాస్త్రమిత్యాహుర్విదుషో జనాః ।
అస్మింశ్చ శాస్త్రే యోగానాం పునర్భవపురస్సరమ్ ॥ 46 ॥

ఈసాంఖ్యదర్శనంలో ప్రతిపాదించిన విషయమునే పునర్జన్మతోపాటుగా యోగదర్శనము నందు చెప్పారు. అందుకే దీనిని చాలా గొప్పదని విద్వాంసులు చెబుతారు.

పంచవింశాత్పరం తత్త్వం పఠ్యతే చ నరాధిప ।
సాంఖ్యానాం తు పరం తత్త్వం యథావదనువర్ణితమ్ ॥ 47 ॥

ఓ జనక మహారాజా! ఇంతవరకు సాంఖ్యులు చెప్పిన ప్రకారంగా 25వ దానికంటే పరమైన పరమార్థ తత్త్వమును గూర్చి శాస్త్రప్రమాణానుసారం వివేచించి వర్ణించాను.

బుద్ధమప్రతిబుద్ధం చ బుధ్యమానం చ తత్త్వతః ।
బుధ్యమానం చ బుద్ధత్వం ప్రాహుర్యోగనిదర్శనమ్ ॥ 48 ॥

బుద్ధం - అప్రతిబుద్ధం అనగా అక్షరం - క్షరం, బుధ్యమానం అను మూడును తత్త్వతః సాంఖ్య దర్శనమునందు వివేచిస్తారు. బోధాత్మకమైన పరమార్థతత్త్వము బుద్ధము, అపరాప్రకృతికి మూలమైన మాయా తత్త్వమైన అప్రతిబుద్ధము, మముక్షువాచరించి సాధించే ఆత్మదర్శనదశలును వివరించాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వసిష్ఠ కరాల జనకసంవాదే షట్త్రింశాధికశతతమోఽధ్యాయః ॥ 136 ॥

శ్రీబ్రహ్మపురాణమునందలి వసిష్ఠ జనక సంవాదములోని నూటముప్పై ఆరవఅధ్యాయం సంపూర్ణం.

సప్తత్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైఏడవ అధ్యాయం

వసిష్ఠ కరాలజనకసంవాదసమాప్తినిరూపణమ్ - వసిష్ఠ కరాలజనక సంవాద సమాప్తి నిరూపణం

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

అప్రబుద్ధమథావ్యక్తమిమం గుణనిధిం సదా ।
గుణానాం ధార్యతాం తత్త్వం సృజత్యాక్షిపతే తథా ॥ 1 ॥

అప్రబుద్ధావస్థలో నున్న జీవుడు ఇరవై ఐదవ తత్త్వంగానున్న అవ్యక్తము అయిన ఈ గుణనిధిని ఎపుడూ గుణతత్త్వము ధరించు గుణములను సృజించును ఆక్షేపించును.

అజో హి క్రీడయా భూప విక్రియాం ప్రాప్త ఇత్యుత ।
ఆత్మానం బహుధా కృత్వా నానేవ ప్రతిచక్షతే ॥ 2 ॥

ఓ రాజా! మూలతత్త్వము జన్మరహితుడు అయినప్పటికి తన క్రీడార్థము వికారములను పొందుతున్నాడు. తనొక్కడే ఐనప్పటికి అనేక తత్త్వముల రూపములను కల్పించుకొని నానారూపములను పొందినవాడని చెబుతారు.

ఏతదేవం వికుర్వాణో బుధ్యమానో న బుధ్యతే ।
గుణానాచరతే హ్యేష సృజత్యాక్షిపతే తథా ॥ 3 ॥

ఈవిధంగా వికృతిని పొందుతుండి కూడా బుధ్యమానుడను తానని ఎరుగలేక పోవుతున్నాడు. గుణములనాచరిస్తూ సృష్టిస్తున్నాడు. ఉపసంహరించుచున్న ట్లనుకొంటున్నాడు.

అవ్యక్తబోధనాచ్చైవ బుధ్యమానం వదన్త్యపి ।
న త్వేవం బుధ్యతేఽవ్యక్తం సగుణం న చ నిర్గుణమ్ ॥ 4 ॥

అవ్యక్తతత్త్వమిది యని తత్త్వబోధ చేయునపుడు ఇతడు బుధ్యమానుడని వ్యవహరిస్తారు. అట్లు వ్యవహరించినా కూడా సగుణమైన దానినిగా, అవ్యక్తతత్త్వమును నిర్గుణమైనదానినిగా తెలుసుకొన లేకపోవుచున్నాడు.

కదాచిత్త్వేవ ఖల్వేతత్తదాహుః ప్రతిబుద్ధకమ్ ।
బుధ్యతే యది వాఽవ్యక్తమేతద్వై పంచవింశకమ్ ॥ 5 ॥

పంచవింశకమైన ఈ అవ్యక్త తత్త్వమును, దాని నిర్గుణత్వమును ఎప్పుడైనా తెలుసుకొనగలిగితే ఇతడు ప్రతిబుద్ధుడంటారు.

బుధ్యమానో భవత్యేవ మమాత్మక ఇతి శ్రుతిః ।
అన్యోన్య ప్రతిబుద్ధేన వదన్త్యవ్యక్తమచ్యుతమ్ ॥ 6 ॥

మమకారావృతుడైన జీవుడు బుధ్యమానుడు అని శ్రుతి, ఒకదానిని ఒకటి తెలిసినందున దానిని అవ్యక్తము, అచ్యుతము అంటారు.

అవ్యక్తబోధనాచ్చైవ బుధ్యమానం వదన్త్యుత ।
పంచవింశం మహాత్మానం న చాసావపి బుధ్యతే ॥ 7 ॥

ఒకవేళ అవ్యక్తబోధన వల్ల బుధ్యమానుడితడే యని చెప్పిన ఇరవై ఐదవ తత్త్వమీతడే యని, మహాత్ముడని తెలుసుకొనుటకు కూడా వీలుకాదు.

షడ్వింశం విమలం బుద్ధమప్రమేయం సనాతనమ్ ।
సతతం పంచవింశం చ చతుర్వింశం చ బుధ్యతే ॥ 8 ॥

విమలుడు, అప్రమేయుడు, సనాతనుడైన ఇరవై యారవ తత్త్వమైన బుద్ధని ఎప్పుడూ కూడా ఇరవై ఐదవ వానిగానో, ఇరవై నాల్గవవానిగానో అనుకుంటారు.

దృశ్యాదృశ్యే హ్యనుగతతత్స్వభావే మహాద్యుతే ।
అవ్యక్తం చైవ తద్బ్రహ్మ బుధ్యతే తాత కేవలమ్ ॥ 9 ॥

నాయనా! దృశ్యాదృశ్యములు రెండూ వాటి ననుసరించియుండే స్వభావమున మహాప్రకాశంలో కేవలం అవ్యక్తమునే బ్రహ్మయని తలుస్తారు.

పంచవింశం చతుర్వింశమాత్మానమనుపశ్యతి ।
బుధ్యమానో యదాఽఽత్మానమన్యోఽహమితి మన్యతే ॥10 ॥

తనను ఇరవై నాల్గవ తత్త్వంగా, ఇరవై ఐదవ తత్త్వంగాను తెలుసుకొనునపుడు బుధ్యమానుడు తనను వేరు వానిగా తలుస్తాడు.

తదా ప్రకృతిమానేష భవత్యవ్యక్తలోచనః ।
బుధ్యతే చ పరాం బుద్ధిం విశుద్ధిమమలాం యదా ॥ 11 ॥

అప్పుడు ప్రకృతివంతుడైన ఇతడు అవ్యక్తలోచనుడవుతాడు. విశుద్ధము, అమలము, పరమగు బుద్ధిని తెలుసుకొన్నప్పు డవ్యక్తలోచనుడు.

షడ్వింశం రాజశార్దూల తదా బుద్ధః కృతో వ్రజేత్ ।
తతస్త్యజతి సోఽవ్యక్తం సర్గప్రలయధర్మిణమ్ ॥ 12 ॥

ఓ రాజశార్దూలా! అతడప్పుడు బుద్ధునిగా చేయబడి ఇరవై యారవ తత్త్వమును పొందుతాడు. ఆ తరువాత అతడు సృష్టి ప్రలయ ధర్మములుగల అవ్యక్తతత్త్వమును వదిలి పెడతాడు.

నిర్గుణాం ప్రకృతిం వేద గుణయుక్తామచేతనామ్ ।
తతః కేవలధర్మాఽసౌ భవత్యవ్యక్తదర్శనాత్ ॥ 13 ॥

గుణములతో కూడుకొనియున్న అచేతనమైన ప్రకృతిని నిర్గుణమైనదానిగా తెలుసుకొనును. ఆ తరువాత అవ్యక్తదర్శనములవల్ల ఇతడు కేవల ధర్ముడవుతాడు.

కేవలేన సమాగమ్య విముక్తాత్మానమాప్నుయాత్ ।
ఏతత్తు తత్త్వమిత్యాహుర్నిస్తత్త్వమజరామరమ్ ॥ 14 ॥

కేవలునితో సమాగమం పొంది, విముక్తాత్ముని పొందుతుంది. దీనినే తత్త్వమని యంటారు. నిస్తత్త్వము అజరామరము.

తత్త్వసంశ్రయణాదేవ తత్త్వజ్ఞో జాయతే నృప ।
పంచవింశతి తత్త్వాని ప్రవదన్తి మనీషిణః ॥ 15 ॥

ఓ రాజా! తత్త్వసంశ్రయణం వల్లనే తత్త్వజ్ఞుడవుతాడు. ఈవిధంగా ఇరవై ఐదు తత్త్వములని మనీషులు చెబుతారు.

న చైవ తత్త్వవాంస్తాత సంసారేషు నిమజ్జతి ।
ఏషాముపైతి తత్త్వం హి క్షిప్రం బుధ్యస్వ లక్షణమ్ ॥ 16 ॥

నాయనా! తత్త్వమును తెలుసుకొన్నవాడు సంసారములలో పడిపోతాడు. వేటినైతే పొందుచున్నాడో ఆ తత్త్వమును గూర్చి, దాని లక్షణమును త్వరగా తెలుసుకొనుము.

షడ్వింశోఽయమితి ప్రాజ్ఞో గృహ్యమాణోఽజరామరః ।
కేవలేన బలేనైవ సమతాం యాత్యసంశయమ్ ॥ 17 ॥

ఇతడు అజరామరుడైన షడ్వింశుడు అనగా ఇరవై యారవ తత్త్వమని ప్రాజ్ఞుడు గ్రహించునపుడు కేవలాత్ముని బలంతోనే సమానత్వమును పొందుతాడు. ఈవిషయంలో సంశయం లేదు.

షడ్వింశేన ప్రబుద్ధేన బుధ్యమానోఽప్యబుద్ధిమాన్ ।
ఏతన్నానాత్వమిత్యుక్తం సాంఖ్యశ్రుతినిదర్శనాత్ ॥ 18 ॥

అజ్ఞానుడైనవాడు షడ్వింశుడైన ప్రబుద్ధునితో బుధ్యమానుడైనప్పటికి అబుద్ధిమంతుడౌతాడు. ఈ తత్త్వము సాంఖ్యశ్రుతి నిదర్శనము వలన నానాత్వమని చెప్పబడింది.

చేతనేన సమేతస్య పంచవింశతికస్య హ ।
ఏకత్వం వై భవేత్తస్య యదా బుధ్యాఽనుబుధ్యతే ॥ 19 ॥

బుధ్యమానేన బుద్ధేన సమతాం యాతి మైథిల ।
సంగధర్మా భవత్యేవ నిఃసంగాత్మా నరాధిప ॥ 20 ॥

ఎప్పుడైతే జీవుడు చేతనునితో కూడుకొనియున్న పంచవింశకుని తన బుద్ధితో తెలుసుకొనినవాడై ఆ పంచవింశక తత్త్వంతో నేకత్వము పొందుతాడో ఓ మిథిలాధిపతీ! అప్పుడు బుధ్యమానుడు బుద్ధుడగువానితో సమానత్వమును పొందుతాడు. ఓ రాజా! సంగధర్ముడగు వాడు నిఃసంగాత్ముడవుతాడు.

నిఃసంగాత్మానమాసాద్య షడ్వింశం కర్మజం విదుః ।
విభుస్త్యజతి చావ్యక్తం యదా త్వేతద్విబుధ్యతే ॥ 21 ॥

నిఃసంగాత్ముని పొందిన షడ్వింశుని కర్మజునిగా తెలుసుకొనును. ఈ తత్త్వమును తెలుసుకున్నప్పుడు విభుడు అవ్యక్తమును వదిలిపెడతాడు.

చతుర్వింశమగాధం చ షడ్వింశస్య ప్రబోధనాత్ ।
ఏవం హ్యప్రతిబుద్ధశ్చ బుధ్యమానస్తు తేఽనఘ ॥ 22 ॥

ఓ పాపరహితుడా! అగాధమగు ఈ చతుర్వింశతి తత్త్వముల నెరుగుట కూడా ఇరవై యారవ తత్త్వమునెరిగి ముక్తిని పొందుటకు సాధనముగానే ఇట్లు నీకు సాంఖ్యవిధానమున అప్రతిబుద్ధుడు అనగా తెలియనివాడు బుధ్యమానుడు తెలియువాడౌతాడు.

ప్రోక్తో బుద్ధశ్చ తత్త్వేన యథా శ్రుతినిదర్శనాత్ ।
మశకోదుమ్బరే యద్వదన్యత్వం తద్వదేతయోః ॥ 23 ॥

శ్రుతి నిదర్శనంగా నీకు బుద్ధుని తత్త్వముతో తెలిపాను. ఆ సంబంధము మేడిపండుకు, దానిలో నుండే పురుగుకు అన్యత్వముండునట్లు, ఈ రెంటికి అన్యత్వము ఉండును.

"మేడిపండు జూడ మేలిమై యుండును
పొట్టవిప్పి చూడ పురుగులుండు"

మత్స్యోదకే యథా తద్వదన్యత్వముపలభ్యతే ।
ఏవమేవ చ మన్తవ్యం నానాత్వైకత్వమేతయోః ॥ 24 ॥

నీటియందున్న చేపకు, నీటికి పరస్పర సంబంధముండునట్లే అన్యత్వముంటుంది. నానాత్వ, ఏకత్వములను కూడా ఇట్లే తెలియవలయును.

ఏతావాన్ మోక్ష ఇత్యుక్తో జ్ఞానవిజ్ఞానసంజ్ఞితః ।
పంచవింశతికస్యాఽఽశు యోఽయం దేహే ప్రవర్తతే ॥ 25 ॥

ఈ దేహమున ప్రవర్తించు పంచవింశక తత్త్వమైన జీవుని జ్ఞాన విజ్ఞానము లనబడు ఇదియే మోక్షమనబడును.

ఏష మోక్షయితవ్యేతి ప్రాహురవ్యక్తగోచరాత్ ।
సోఽయమేవం విముచ్యేత నాన్యథేతి వినిశ్చయః ॥ 26 ॥

అవ్యక్తతత్త్వ గోచరమువల్లనే అతడు ముక్తిని పొందుట కర్త్వుడవుతున్నాడు అని అంటారు. అతడీపద్ధతిలోనే ముక్తిని పొందవలె తప్ప వేరే మార్గం లేదనేది నిశ్చయం.

పరశ్చ పరధర్మా చ భవత్యేవ సమేత్య వై ।
విశుద్ధిధర్మా శుద్ధేన నాశుద్ధేన చ బుద్ధిమాన్ ॥ 27 ॥

పరుడుకలిసి పరధర్ముడౌతాడు. విశుద్ధి ధర్ముడు బుద్ధిమంతుడు కావున శుద్ధునితో కలుస్తాడు. అశుద్ధునితో కలియడు.

విముక్తధర్మా బుద్ధేన సమేత్య పురుషర్షభ ।
వియోగధర్మిణా చైవ విముక్తాత్మా భవత్యథ ॥ 28 ॥

ఓ రాజా! బుద్ధునితో కూడిన విముక్తధర్ముడు ఇక వియోగధర్మితో గూడి విముక్తాత్ముడు అవుతాడు.

విమోక్షిణా విమోక్షశ్చ సమేత్యేహ తథా భవేత్ ।
శుచికర్మా శుచిశ్చైవ భవత్యమితబుద్ధిమాన్ ॥ 29 ॥

విమోక్షుడు విమోక్షితో కలిసి అమితబుద్ధి కలిగి శుచికర్మ శుచి అవుతాడు.

విమలాత్మా చ భవతి సమేత్య విమలాత్మనా ।
కేవలాత్మా తథా చైవ కేవలేన సమేత్య వై ॥
స్వతన్త్రశ్చ స్వతంత్రేణ స్వతంత్ర మవాప్యతే ॥ 30 ॥

విమలాత్మునితో కలిసి విమలాత్మునిగా, కేవలునితో కలిసి అట్లే కేవలాత్మగా అవుతున్నాడు. స్వతంత్రునితో కలిసి స్వతంత్రుడై స్వాతంత్ర్యమును పొందుతున్నాడు.

ఏతావదేతత్కథితం మయా తే తథ్యం మహారాజ యథార్థతత్త్వమ్ ।
అమత్సరత్వం ప్రతిగృహ్య బుద్ధ్వా సనాతనం బ్రహ్మ విశుద్ధమాద్యమ్ ॥ 31 ॥

ఓ మహారాజా! నేనింతవరకు నీకు సత్యమైన యథార్థతత్త్వమునుగూర్చి తెలిపాను. నీవు విశుద్ధం, ఆద్యం, సనాతనమైన బ్రహ్మతత్త్వమును అమత్సరుడవై, మనోదోషము లేనివాడవై బుద్ధితో, గ్రహించావు.

నావేదనిష్ఠస్య జనస్య రాజన్ ప్రదేయమేతత్పరమం త్వయా భవేత్ ।
విధిత్సమానాయ నిబోధకారకం ప్రబోధ హేతోః ప్రణతస్య శాసనమ్ ॥ 32 ॥

ఓ రాజా! ఈ విద్యానుశాసనమును వేదనిష్ఠలేనివానికి నీవు ఇవ్వకూడదు. వేదశాస్త్రములలో ప్రామాణ్య బుద్ధి కలిగి ప్రబోధము నొందుటకు ప్రణిపాతముచేసి తెలుసుకొనగోరిన వానికే, యాచించిన వానికే ఇవ్వాలి.

న దేయమేతచ్చ యథాఽనృతాత్మనే శఠాయ క్లీబాయ న జిహ్మబుద్ధయే ।
న పండితజ్ఞానపరోపతాపినే దేయం తథా శిష్యవిబోధనాయ ॥ 33 ॥

ఈ విద్యను అసత్యం పలికేవానికి, మోసగానికి, నపుంసకునకు, కపటబుద్ధిగల వానికి, జ్ఞానపరులైన పండితులకు బాధ కలిగించువానికి, ఇతరులను బాధపెట్టువానికి, అట్లే శిష్యులకు బోధించని వానికి ఇవ్వరాదు.

శ్రద్ధాన్వితాయాథ గుణాన్వితాయ పరాపవాదాద్విరతాయ నిత్యమ్ ।
విశుద్ధయోగాయ బుధాయ చైవ క్షమావతేఽథ కృపయా యుతాయ ॥ 34 ॥

శ్రద్ధగలవానికి, సద్గుణములు గలిగినవానికి, ఇతరులను నిందించనివానికి, నిత్యము విశుద్ధమైన యోగము నభ్యసించువానికి, బుద్ధిమంతునకు, క్షమాగుణము కలిగినవానికి, కృపతో కూడుకొనియున్న వానికివ్వాలి.

వివిక్తశీలాయ విధిప్రియాయ వివాదహీనాయ బహుశ్రుతాయ ।
వినీతవేషాయ న హైతుకాత్మనే సదైవ గుహ్యం త్విదమేవ దేయమ్ ॥ 35 ॥

యుక్తాయుక్త వివేచనాశీలునకు, వేదశాస్త్ర విధులందు ప్రీతిగలవానికి, వివాదములు చేయనివానికి, పెద్దలవలన అనేక శాస్త్రములను విన్నవానికి, వినయమును ప్రకటించే స్వభావము కలవానికి, హేతువాదమును సల్పనివానికి మాత్రమే సర్వదా రహస్యంగా నుండే ఈ విశుద్ధమైన పరబ్రహ్మతత్త్వమును తెలుపవలెను.

ఏతైర్గుణైర్హీనతమే న దేయమేతత్పరం బ్రహ్మ విశుద్ధమాహుః ।
న శ్రేయసే యోక్ష్యతి తాదృశే కృతం ధర్మప్రవక్తారమపాత్రదానాత్ ॥ 36 ॥

పరం, విశుద్ధమైన ఈ పరబ్రహ్మతత్త్వమును గుణహీనుడైన వాని కివ్వరాదు. ఒకవేళ ధర్మప్రవక్త అయిన గురువు అపాత్రుడైన శిష్యునకు బోధిస్తే ఆ గురువునకు కూడా శ్రేయస్సు కలుగదు.

పృథ్వీమిమాం వా యది రత్నపూర్ణాం దద్యాదదేయం త్విదమవ్రతాయ ।
జితేన్ద్రియాయ ప్రయతాయ దేయం దేయం పరంతత్త్వవిదే నరేన్ద్ర ॥ 37 ॥

ఓ రాజా! వ్రతనియమం లేనివాడు తాను సమస్త రత్నములతోనిండిన ఈ భూమిని తాను పొందిన విద్యకు ప్రతిఫలంగా ఇస్తానని చెప్పినా అటువంటివానికి ఈ పరబ్రహ్మతత్త్వమును బోధించకూడదు. జితేంద్రియుడై, వ్రతనిష్ఠ కలిగిన తత్త్వవేత్తకు మాత్రమే ఈపరతత్త్వమును బోధించవలెను.

కరాల మా తే భయమస్తు కించిత్ ఏతచ్ఛ్రుతం బ్రహ్మ పరం త్వయాఽద్య ।
యథావదుక్తం పరమం పవిత్రం విశోకమత్యన్తమనాదిమధ్యమ్ ॥ 38 ॥

ఓ కరాలజనక మహారాజా! నీవు పరమ పవిత్రము, ఆదిమధ్యాంతరహితము, శోకరహితమును అయిన ఈ పరబ్రహ్మతత్త్వము నీరోజు నీకు చెప్పితిని. నీవు వింటివి. ఇక నీకు సంసారభయమన్నది కొంచెముకూడా కలుగదు.

అగాధమేతదజరామరం చ నిరామయం వీతభయం శివం చ ।
సమీక్ష్య మోహం పరవాదసంజ్ఞమేతస్య తత్త్వార్థమిమం విదిత్వా ॥ 39 ॥

ఈ పరబ్రహ్మ తత్త్వం అగాధం. అజరామరం, నిరామయం, మంగళకరం, భయరహితము నైన ఈ పరతత్త్వవాద మనబడు దానిని చక్కగా తెలుసుకొని, మోహస్వరూపమును గుర్తించి విడిచిపెట్టు.

అవాప్తమేతద్ధి పురా సనాతనాత్ హిరణ్యగర్భాద్ధి తతో నరాధిప ।
ప్రసాద్య యత్నేన తముగ్రతేజసం సనాతనం బ్రహ్మ యథా త్వయైతత్ ॥ 40 ॥

పృష్టస్త్వయా చాస్మి యథా నరేంద్ర తథా మయేదం త్వయి నోక్తమన్యత్ ।
యథాఽవాప్తం బ్రహ్మణో మే నరేన్ద్ర మహాజ్ఞానం మోక్షవిదాం పరాయణమ్ ॥ 41 ॥

ఓ రాజా! ఈ విద్యను పూర్వం హిరణ్యగర్భ బ్రహ్మ అయిన సనాతన పరమాత్మనుండి పొందారు. మహోగ్ర తేజస్సు గల బ్రహ్మనుండి నేనది ప్రయత్నం చేసి ఆయన అనుగ్రహం పొంది సంపాదించాను. నీవడిగినట్లుగా నేనడిగి తెలుసుకున్నాను. సనాతనుడైన బ్రహ్మనుండి తెలుసుకొన్న దానినంతా, ఓ రాజా! మోక్షాన్ని కోరేవారికి పొందదగిన ఈ మహాజ్ఞానమును దానినున్నదున్నట్లుగా ఏమాత్రం మార్పులు, చేర్పులు లేకుండా నీవడిగావని వివరించాను.

వ్యాస ఉవాచ :- వ్యాసుడు పలికాడు.

ఏతదుక్తం పరంబ్రహ్మ యస్మాన్నాఽఽవర్తతే పునః ।
పంచవింశం మునిశ్రేష్ఠా వసిష్ఠేన యథా పురా ॥ 42 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! పరబ్రహ్మను పొందిన తర్వాత తిరిగి పునర్జన్మ ఉండని, అటువంటి పంచవింశ తత్త్వమును గూర్చి నాకు పూర్వం వసిష్ఠమహర్షి వివరించిన విధంగా నేను మీకు చెప్పాను.

పునరావృత్తిమాప్నోతి పరమం జ్ఞానమవ్యయమ్ ।
నాతిబుధ్యతి తత్త్వేన బుధ్యమానోఽజరామరమ్ ॥ 43 ॥

ఇది పరమమైన జ్ఞానం. ఈ తత్త్వమును తెలుసుకొని ఇరువది యారవ తత్త్వమైన పరమాత్మను పొందువారికి జననమరణ రూపమైన సంసారంలో పడడం యుండదు. ఎవరు తెలుసుకొనలేరో వారికి పునరావృత్తి యుంటుంది.

ఏతన్నిఃశ్రేయసకరం జ్ఞానం భోః పరమం మయా ।
కథితం తత్త్వతో విప్రాః శ్రుత్వా దేవర్షితో ద్విజాః ॥ 44 ॥

ఓ ద్విజులారా! మోక్షప్రదమైన ఈ పరమజ్ఞానాన్ని దేవర్షియైన నారదుని దగ్గరనుండి విని దానిని నేనున్నదున్నట్లుగా మీకు వివరించాను.

హిరణ్యగర్భాదృషిణా వసిష్ఠేన సమాహృతమ్ ।
వసిష్ఠాదృషిశార్దూలో నారదోఽవాప్తవానిదమ్ ॥ 45 ॥

ఈ జ్ఞానమును హిరణ్యగర్భునినుండి వసిష్ఠుడు సంపాదించాడు. వసిష్ఠునినుండి మునిశ్రేష్ఠుడైన నారదుడు పొందాడు.

నారదాద్విదితం మహ్యామేతదుక్తం సనాతనమ్ ।
మా శుచధ్వం మునిశ్రేష్ఠాః శ్రుత్వైతత్పరమం పదమ్ ॥ 46 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఈ పరమపదము, సనాతమైన తత్త్వమును నేను నారదునివల్ల తెలుసుకొన్నాను. ఇటువంటి దీన్ని మీరు విన్నందున మీరు విచారించవలదు.

యేన క్షరాక్షరే భిన్నే న భయం తస్య విద్యతే ।
విద్యతే తు భయం యస్య యో నైనం వేత్తి తత్త్వతః ॥ 47 ॥

క్షరాక్షర తత్త్వములను, భిన్నములుగా (వేరువేరుగా) తెలుసుకున్న వారికి భయముండదు. దీనిని యథార్థముగా తెలుసుకొనలేనివారికి జన్మపరంపరముల భయముంటుంది.

అవిజ్ఞానాచ్చ మూఢాత్మా పునః పునరుపద్రవాన్ ।
ప్రేత్య జాతిసహస్రాణి మరణాన్తాన్యుపాశ్నుతే ॥ 48 ॥

మూఢాత్ముడు తెలుసుకొనలేకపోవుటవల్ల మాటిమాటికి ఉపద్రవములను పొంది, మరణాంతములైన వేలకొలది (దేవ తిర్యక్ మనుష్యాది) జాతులలో పుడుతూ వాటి ఫలముల ననుభవిస్తాడు.

దేవలోకం తథా తిర్యజ్ మానుష్యమపి చాశ్నుతే ।
యది వా ముచ్యతే వాఽపి తస్మాదజ్ఞానసాగరాత్ ॥ 49 ॥

అజ్ఞానసాగరే ఘోరే హ్యవ్యక్తాగాధ ఉచ్యతే ।
అహన్యహని మజ్జన్తి యత్ర భూతాని భో ద్విజాః ॥ 50 ॥

దేవలోకము, తిర్యగ్యోనులు, మనుష్యజన్మ ఇట్లు అనేక జన్మల పునరావృత్తిని పొందుతాడు. ఒకవేళ ఆ అజ్ఞాన సాగరమునుండి బయట పడినా కూడా, ఓ ద్విజులారా! అవ్యక్తమైన, అగాధమైన, ఘోరమైన అజ్ఞాన సముద్రములో పడి జీవులుండే ఆ భూత ప్రపంచంలోనే మాటిమాటికి మునుగుతుంటారు.

ఏవం మయా మునిశ్రేష్ఠాః సారాత్సారతరం పరమ్ ।
కథితం పరమం మోక్షం యం జ్ఞాత్వా న నివర్తతే ॥ 51 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! దేనిని తెలుసుకున్న తరువాత మళ్ళీ తిరిగి జన్మించుట యనేది యుండదో సారములన్నింటిలో నుత్తమసారమైన ఆ పరమమోక్షమును గూర్చి చెప్పాను.

న నాస్తికాయ దాతవ్యం నాభక్తాయ కదాచన ।
న దుష్టమతయే విప్రా న శ్రద్ధావిముఖాయ చ ॥ 52 ॥

ఓ విప్రులారా! ఈ తత్వమునుగూర్చి నాస్తికునకు, భక్తుడు కానివానికి, దుష్టమతికి, శ్రద్ధావిముఖనకు గాని ఎట్టి పరిస్థితులలోనూ బోధించకూడదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే 'వసిష్ఠ కరాలజనక సంవాద సమాప్తి నిరూపణం' నామ సప్తత్రింశాధికశతతమోఽధ్యాయః. ॥137॥

శ్రీ బ్రహ్మపురాణంలో 'వసిష్ఠ జనక సంవాద సమాప్తి నిరూపణ'మనే నూట ముప్పైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టత్రింశాధికశతతమోఽధ్యాయః - నూట ముప్పైఎనిమిదవ అధ్యాయం

పురాణప్రంశంసనమ్ - పురాణ ప్రశంసనం

లోమహర్షణ ఉవాచ :- లోమహర్షణుడు పలికాడు.

ఏవం పురా మునీన్ వ్యాసః పురాణం శ్లక్ష్ణయా గిరా ।
దశాష్టదోషరహితైర్వాక్యైః సారతరైర్ద్విజాః ॥ 1 ॥

పూర్ణమస్తమలైః శుద్ధైర్నానాశాస్త్రసముచ్చయైః ।
జాతిశుద్ధసమాయుక్తం సాంఖ్యయోగోపశోభితమ్ ॥ 2 ॥

పూర్వపక్షోక్తిసిద్ధాన్తపరినిష్ఠాసమన్వితమ్ ।
శ్రావయిత్వా యథాన్యాయం విరరామ మహామతిః ॥ 3 ॥

ఓ ద్విజులారా! ఈవిధంగా పూర్వం వ్యాసమహర్షి రహస్యమైన, కోమలమైన వాక్కులతో, వ్యాకరణ శాస్త్ర రీత్యా ఉచ్చారణా సంబంధమైన పద్దెనిమిది దోషములు లేని అనేక శాస్త్రసారతరములైన వాక్యములతో మునులకు ఈ బ్రహ్మపురాణమును, ఏవిధములైన మలినము లంటకుండా శుద్ధములైన, అనేక శాస్త్ర సముచ్చయములతో నిండిన, జాతి శుద్ధ సమాయుక్తమైన సాంఖ్యదర్శన, యోగదర్శనములతో శోభితమైన, మీమాంసా శాస్త్రముననుసరించి పూర్వపక్ష సిద్ధాంతముల పరినిష్ఠతో కూడి, అధికరణలక్షణములతో విషయ ప్రతిపాదనచేసి, యథాన్యాయంగా మునులందరికీ వినిపించి, ఆ మహామతియైన వ్యాసుడు విరమించాడు.

తేఽపి శ్రుత్వా మునిశ్రేష్ఠాః పురాణం వేదసంమితమ్ ।
ఆద్యం బ్రహ్మాభిధానం చ సర్వవాంఛాఫలప్రదమ్ ॥ 4 ॥

వేదసంమితమైన, సమస్త కోరికలకు తగ్గ ఫలములనిచ్చే మొదటి బ్రహ్మతో చెప్పబడిన ఈ బ్రహ్మపురాణము నా మునిశ్రేష్ఠులందరూ విని,

హృష్టా బభూవుః సంప్రీతా విస్మితాశ్చ పునః పునః ।
ప్రశశంసుస్తదా వ్యాసం కృష్ణద్వైపాయనం మునిమ్ ॥ 5 ॥

సంప్రీతులై, ఆనందమును పొందారు. మాటి మాటికాశ్చర్యపడుతూ వారు కృష్ణద్వైపాయనుడైన వ్యాసమునిని ప్రశంసించారు.

మునయ ఊచతుః :-మునులు పలికారు.

అహో త్వయా మునిశ్రేష్ఠ పురాణం శ్రుతిసంమితమ్ ।
సర్వాభిప్రేతఫలదం సర్వపాపహరం పరమ్ ॥ 6 ॥

ప్రోక్తం శ్రుతం తథాఽస్మాభిర్విచిత్రపదమక్షరమ్ ।
న తేఽస్త్వవిదితం కించిత్త్రిషు లోకేషు వై ప్రభో ॥ 7 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! శ్రుతులతో సమానమైనది, సకల కోరికలను దీర్చేది, సమస్త పాపములను నశింపచేయునది, పరమును గూర్చునదైన పురాణమును, ఓ ప్రభూ! విచిత్ర పదాక్షర గుంఫితమైన దానిని నీవు చెప్పగా విన్నాము. ఈ ముల్లోకాలలో నీకు తెలియనిది లేదు.

సర్వజ్ఞత్వం మహాభాగ దేవేష్వివ బృహస్పతిః ।
నమస్యామో మహాప్రాజ్ఞం బ్రహ్మిష్ఠం త్వాం మహామునిమ్ ॥ 8 ॥

ఓ మహాభాగా! మహాప్రాజ్ఞుడవు, బ్రహ్మిష్ఠుడవు, మహామునివి, దేవతలలో బృహస్పతివంటి సర్వజ్ఞుడవగు నీకు నమస్కరిస్తున్నాము.

యేన త్వయా తు వేదార్థా భారతే ప్రకటీకృతాః ।
కః శక్నోతి గుణాన్వక్తుం తవ సర్వాన్మహామునే ॥ 9 ॥

ఓ మహామునీ! నీవు రచించిన భారత గ్రంథంలో సమస్త వేదార్థములను ప్రకటించావు. నీ గుణము లన్నింటిని కొనియాడుట కెవరికి శక్యం?

అధీత్య చతురో వేదాన్ సాంగాన్వ్యాకరణాని చ ।
కృతవాన్ భారతం శాస్త్రం తస్మై జ్ఞానాత్మనే నమః ॥ 10 ॥

శిక్షా, వ్యాకరణం, జ్యోతిషం, ఛందస్సు, నిరుక్తం, కల్పమనే ఆరు అంగాలతో గూడిన ఋగ్యజుస్సా మాథర్వణములనే నాలుగు వేదములను, నవ వ్యాకరణముల నధ్యయనంచేసి భారతమనే శాస్త్రమును రచించిన వాడవు. అట్టి జ్ఞానాత్ముడవైన నీకు నమస్కారం.

నమో౽స్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిన్దాయతపత్రనేత్ర ।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయప్రదీపః ॥ 11 ॥

వికసించిన పద్మపు రేకులవంటి కన్నులు గలవాడా! విశాలబుద్ధీ! వ్యాసమహర్షీ! భారతమనే తైలంతో నిండిన ప్రమిదలో జ్ఞానమయమైన దీపమును ప్రకాశింపచేసిన నీకు నమస్కారం.

అజ్ఞానతిమిరాన్ధానాం భ్రామితానాం కుదృష్టిభిః ।
జ్ఞానాంజనశలాకేన త్వయా చోన్మీలతా దృశః ॥ 12 ॥

కుదృష్టులతో అజ్ఞానమనే గాఢాంధకారంలో దిక్కుతోచక తిరుగుతున్న వారికి జ్ఞానమనే కాటుక పుల్లవంటి నీ చేతనే కదా నేత్రోన్మీలనం జరిగి చూపు కలిగింది.

ఏవముక్త్వా సమభ్యర్చ్య వ్యాసం తే చైవ పూజితాః ।
జగ్ముర్యథాగతం సర్వే కృతకృత్యాః స్వమాశ్రమమ్ ॥ 13 ॥

ఇట్లా ఋషులందరూ పలికి వ్యాసుని చక్కగా గౌరవించి పూజించారు. ఆ తరువాత వారందరూ కృతకృత్యులై తమ తమ ఆశ్రమాలకు వెళ్ళారు.

తథా మయా మునిశ్రేష్ఠాః కథితం హి సనాతనమ్ ।
పురాణం సుమహాపుణ్యం సర్వపాపప్రణాశనమ్ ॥ 14 ॥

ఓ మునిశ్రేష్ఠులారా! సమస్త పాపములను నశింపచేసేది, సనాతనమైనది, మహాపుణ్యప్రదమైన ఈ బ్రహ్మపురాణమును మీకు చెప్పాను.

యథా భవద్భిః పృష్టోఽహం సంప్రశ్నం ద్విజసత్తమాః ।
వ్యాసప్రసాదాత్తత్సర్వం మయా సంపరికీర్తితమ్ ॥ 15 ॥

ఓ ద్విజసత్తములారా! మీరడిగిన ప్రశ్నలననుసరించి దానికి తగిన సమాధానములను వ్యాసమహర్షి యొక్క అనుగ్రహంతో చక్కగా వివరించాను.

ఇదం గృహస్థైః శ్రోతవ్యం యతిభిర్బ్రహ్మచారిభిః ।
ధనసౌఖ్యప్రదం నృణాం సర్వపాతకనాశనమ్ ॥ 16 ॥

మానవుల సర్వపాతకములను నశింపచేసి, ధన సౌఖ్యములనిచ్చే ఈపురాణమును గృహస్థులు, యతులు, బ్రహ్మచారులు వినవలయును.

తథా బ్రహ్మపరైర్విప్రైః బ్రాహ్మణాద్యైః సుసంయతైః ।
శ్రోతవ్యం సుప్రయత్నేన సమ్యక్ శ్రేయోభికాంక్షిభిః ॥ 17 ॥

అట్లే బ్రహ్మతత్త్వమును తెలుసుకొనగోరు ఆచారశీలులైన విప్రులు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది వర్ణములవారు, చక్కని శ్రేయస్సును కోరుకునేవారు మంచిప్రయత్నంతో శ్రద్ధగా వినవలెను.

ప్రాప్నోతి బ్రాహ్మణో విద్యాం క్షత్రియో విజయం రణే ।
వైశ్యస్తు ధనమక్షయ్యం శూద్రః సుఖమవాప్నుయాత్ ॥ 18 ॥

ఈ పురాణమును విన్నందువలన బ్రాహ్మణుడు విద్యను, క్షత్రియుడు యుద్ధంలో జయమును, వైశ్యుడు అక్షయమైన ధనమును, శూద్రుడు సుఖమును పొందుతాడు.

యం యం కామమభిధ్యాయన్ శృణోతి పురుషః శుచిః ।
తం తం కామమవాప్నోతి నరో నాస్త్యత్ర సంశయః ॥ 19 ॥

మానవుడు శుచియై ఏ ఏ కోరికలను మనస్సునందు తలుచుకొని ఈ పురాణమును వింటాడో ఆయా కోరికలను సఫలము చేసుకొనగలడు. ఈ విషయమునందే మాత్రము సందేహం లేదు.

పురాణం వైష్ణవం త్వేతత్సర్వకిల్బిషనాశనమ్ ।
విశిష్టం సర్వశాస్త్రేభ్యః పురుషార్థోపపాదకమ్ ॥ 20 ॥

ఈ పురాణం విష్ణుపరమైంది. ఇది సర్వపాపాలను నశింపచేసేది. అన్ని శాస్త్రములలో విశిష్టమైనది. ధర్మార్థకామమోక్షములను పురాషార్థములన్నింటిని సంపాదింపచేసేది.

ఏతద్వో యన్మయాఽఽఖ్యాతం పురాణం వేదసంమితమ్ ।
శ్రుతేఽస్మిన్సర్వదోషోత్థః పాపరాశిః ప్రణశ్యతి ॥ 21 ॥

నేను మీకు చెప్పిన ఈ బ్రహ్మపురాణము వేదసంమితమైనది. దీనిని వినినంతనే సమస్త దోషముల వలన కలిగిన పాపరాశియంతా నశిస్తుంది.

ప్రయాగే పుష్కరే చైవ కురుక్షేత్రే తథాఽర్బుదే ।
ఉపోష్య యదవాప్నోతి తదస్య శ్రవణాన్నరః ॥ 22 ॥

నరుడు ప్రయాగ, పుష్కర, కురుక్షేత్ర, పర్వత విశేషములలో లేదా కోటి క్షేత్రములలో ఉపవాసం చేసి పొందే ఫలం ఈ పురాణ శ్రవణమువల్ల పొందుతాడు.

యదగ్నిహోత్రే సుహుతే వర్షేణాఽఽప్నోతి వై ఫలమ్ ।
మహాపుణ్యమయం విప్రాస్తదస్య శ్రవణాత్సకృత్ ॥ 23 ॥

ఓ విప్రులారా! సంవత్సరకాలం నిత్యాగ్నిహోత్రిగా హవిస్సు నిచ్చినందువలన మహాపుణ్యమయమైన ఫలం ఈ పురాణశ్రవణమువలన వెంటనే లభిస్తుంది.

ప్రౌష్ఠపద్యాం చ ద్వాదశ్యాం స్నాత్వా వై యమునాజలే ।
మథురాయాం హరిం దృష్ట్వా ప్రాప్నోతి పురుషః ఫలమ్ ॥ 24 ॥
తదాప్నోతి ఫలం సమ్యక్ సమాధానేన కీర్తనాత్ ।
పురాణేఽస్య హి భో విప్రాః కేశవార్పితమానసః ॥ 25 ॥

భాద్రపదమాసమునందలి ద్వాదశి తిథిరోజున యమునా నదిలో స్నానమాచరించి, మథురలో నున్న శ్రీకృష్ణుని దర్శించినవాడు పొందే ఫలము, మనస్సును కేశవునందునిలిపి మనస్సమాధానంతో చక్కగా హరికీర్తనము చేయువాడు పొందు ఫలము నీ పురాణపఠనమువలన పొందగలడు.

యత్ఫలం శ్రియమాలోక్య పురుషోఽథ లభేన్నరః ।
తత్ఫలం సమవాప్నోతి యః పఠేచ్ఛృణుయాదపి ॥ 26 ॥

లక్ష్మిని చూసిన లేదా ఆశ్రయించిన మానవుడు పొందేఫలమును ఈ పురాణ పఠనం వలన లేదా శ్రవణం వలనపొందుతాడు.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసంమితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భవనం హరేః ॥ 27 ॥

వేదసంమితమైన ఈ పురాణమును శ్రద్ధగా చదివినవాడు శ్రీహరి భవనమును చేరును.

త్రిసంధ్యం యః పఠేద్విద్వాన్ శ్రద్ధయా సుసమాహితః ।
ఇదం వరిష్ఠమాఖ్యానం స సర్వమీప్సితం లభేత్ ॥ 28 ॥

విద్వాంసుడు ఈ పురాణమును చక్కని మనస్సమాధానంతో, శ్రద్ధతో చదివితే శ్రేష్ఠమైన ఆఖ్యానము వలన కోరికలన్నింటినీ పొందుతాడు.

రోగార్తో ముచ్యతే రోగాత్ బద్ధో ముచ్యేత బంధనాత్ ।
భయాన్ముచ్యేత భీతస్తు ఆపదాపన్న ఆపదః ॥ 29 ॥

రోగార్తులు రోగమును పోగొట్టుకొంటారు. బంధించబడినవారు బంధవిముక్తులవుతారు. భీరువు భయముక్తుడవుతాడు. ఆపదలలో నున్నవానికి ఆపదలు తొలగుతాయి.

జాతిస్మరత్వం విద్యాం చ పుత్రాన్మేధాం పశూన్ ధృతిమ్ ।
ధర్మం చార్థం చ కామం చ మోక్షం తు లభతే నరః ॥ 30 ॥

ఈ పురాణమువల్ల నరుడు పూర్వజన్మను తెలుసుకొంటాడు. విద్యను, పుత్రులను, పశుసంపదను, ధృతిని, ధర్మార్థకామమోక్షములను కూడా పొందగలడు.

యాన్యాన్కామానభిప్రేత్య పఠేత్ప్రయతమానసః ।
తాంస్తాన్సర్వానవాప్నోతి పురుషో నాత్ర సంశయః ॥ 31 ॥

శ్రద్ధానియత మానసుడై ఏ ఏ కోరికలతో ఈ పురాణమును పఠించునో అతడు ఆయా కోరికల నన్నింటిని పొందగలడు. ఇందులో సందేహం లేదు.

యశ్చేదం సతతం శృణోతి మనుజః స్వర్గాపవర్గప్రదం
విష్ణుం లోకగురుం ప్రణమ్య వరదం భక్త్యైకచిత్తః శుచిః ।
భుక్త్వా చాత్ర సుఖం విముక్తకలుషః స్వర్గే చ దివ్యం సుఖం
పశ్చాద్యాతి హరేః పదం సువిమలం ముక్తో గుణైః ప్రాకృతైః ॥ 34 ॥

లోకగురువైన, వరములనిచ్చే విష్ణువును శుచియై, భక్తియందే మనసు నిలిపి నమస్కరించి, ఈ స్వర్గాపవర్గ ప్రదమైన పురాణము నెప్పుడూ వింటుండేవాడు ఈ లోకమునందు సుఖభోగముల ననుభవించి, సమస్త పాపములనుండి విముక్తుడై, స్వర్గాది లోకములయందు దివ్యమైన సుఖములను పొంది, ప్రాకృతికములైన గుణములనుండి విముక్తుడై ఆ తరువాత సువిమలమైన విష్ణువుయొక్క స్థానమైన వైకుంఠమునకు వెళతాడు.

తస్మాద్విప్రవరైః స్వధర్మనిరతైర్ముక్త్యైకమార్గేప్సుభి
స్తద్వత్ క్షత్రియపుంగవైస్తు నియతైః శ్రేయోఽర్థిభిః సర్వదా ।
వైశ్యైశ్చానుదినం విశుద్ధకులజైః శూద్రైస్తథా ధార్మికైః
శ్రోతవ్యం త్విదముత్తమం బహుఫలం ధర్మార్థమోక్షప్రదమ్ ॥ 35 ॥

అందువలన తమ ధర్మాన్నాచరించుటయందు నిరతులై ముక్తిని మాత్రమే కావాలని కోరి ఆ మార్గము ననుసరించే శ్రేష్ఠమైన విప్రులు, అట్లే సర్వదా సమాజ శ్రేయస్సునే నియతంగా కోరే క్షత్రియులు, విశుద్ధ కులమునందు

పుట్టిన వైశ్యులు, ధార్మికులైన శూద్రులు అనేక ఫలముల నిచ్చే ధర్మార్థ కామ మోక్షముల నొసంగే ఈ ఉత్తమమైన బ్రహ్మపురాణమును ప్రతిదినము వినవలెను.

ధర్మే మతిర్భవతు వః పురుషోత్తమానాం స హ్యేక ఏవ పరలోకగతస్య బంధుః ।
అర్థాః స్త్రియశ్చ నిపుణైరపి సేవ్యమానా నైవ ప్రభావముపయాన్తి న చ స్థిరత్వమ్ ॥ 36 ॥

ఉత్తమపురుషులకు ధర్మమునందు బుద్ధి ప్రసరించుగాక! పరలోకమునకు వెళ్ళువానికి ధర్మమొక్కటే బంధువు. సంపదలు, స్త్రీలు, నైపుణ్యము గలవారందరు సేవించినా కూడా ప్రభావమును పొందరు. స్థిరత్వమును పొందరు.

ధర్మేణ రాజ్యం లభతే మనుష్యః స్వర్గం చ ధర్మేణ నరః ప్రయాతి ।
ఆయుశ్చ కీర్తిం చ తపశ్చ ధర్మే ధర్మేణ మోక్షం లభతే మనుష్యః ॥ 37 ॥

మానవుడు ధర్మంతోనే రాజ్యమును, స్వర్గమును, ఆయువును, కీర్తిని, తపస్సును, మోక్షమును పొందగలడు.

ధర్మోఽత్ర మాతాపితరౌ నరస్య ధర్మః సఖా చాత్ర పరే చ లోకే ।
త్రాతా చ ధర్మస్త్విహ మోక్షదశ్చ ధర్మాదృతే నాస్తి తు కించిదేవ ॥ 38 ॥

ఇక్కడ మానవునకు ధర్మమే తల్లిదండ్రులు, ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ధర్మమే మిత్రుడు, ధర్మమే రక్షకుడు, మోక్షప్రదాత. ధర్మమునకంటే మించినదేదీ లేదు.

ఇదం రహస్యం శ్రేష్ఠం చ పురాణం వేదసంమితమ్ ।
న దేయం పాపమతయే నాస్తికాయ విశేషతః ॥ 39 ॥

ఈ బ్రహ్మపురాణం వేదసంమితము, రహస్యమైనది, శ్రేష్ఠమైనది. పాపాత్ములకు ముఖ్యంగా నాస్తికులకు దీనిని బోధించకూడదు.

ఇదం మయోక్తం ప్రవరం పురాణం పాపాపహం ధర్మవివర్ధనం చ ।
శ్రుతం భవద్భిః పరమం రహస్యమాజ్ఞాపయధ్వం మునయో వ్రజామి ॥ 40 ॥

ఓ మునులారా! నేను చెప్పిన ఈ బ్రహ్మపురాణం శ్రేష్ఠమైనది. పాపములను పోగొట్టేది. ధర్మము నభివృద్ధిచేసేది. ఈ పరమరహస్యమైన దానిని మీరు విన్నారు. ఇక నాకు సెలవీయండి. నేను వెళతాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే రోమహర్షణ ముని సంవాదే 'పురాణ ప్రశంసనం' నామ అష్టత్రింశాధికశతతమోఽధ్యాయః. ॥ 138 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని రోమహర్షణ ముని సంవాదములో 'పురాణ ప్రంశంస'మనే పేరుగల నూటముప్పై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

సమాప్తం త్వేతద్బ్రహ్మ మహాపురాణమ్, అతఃపరం గౌతమీ మాహాత్మ్యమ్ ॥

ఈ బ్రహ్మ మహాపురాణం సమాప్తమైనది ఇక తరువాత గౌతమీ మాహాత్మ్యం

గౌతమీ మాహాత్మ్యం

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

తీర్థభేద వర్ణనమ్ - తీర్థభేద వర్ణనం

మునయః ఊచుః :- మునులు పలికిరి.

నహి నస్తృప్తి రస్తీహ శృణ్వతాం తీర్థవిస్తరమ్ ।
పునరేవ పరం గుహ్యం వక్తుమర్హస్యశేషతః ॥ 1 ॥
పరం తీర్థస్య మాహాత్మ్యం సర్వతీర్థోత్తమోత్తమమ్ ।

విస్తారమైన తీర్థ మాహాత్మ్యమునెంత విన్ననూ మాకు తనివి తీరుటలేదు. మళ్ళీ ఒకమారు పరమరహస్య మైన దానిని పూర్తిగా మాకు వివరించండి. సర్వతీర్థముల యందుత్తమోత్తమమైన తీర్థముయొక్క మాహాత్మ్యమును తెలుసుకొనగోరుచున్నాము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇమమేవ పురా ప్రశ్నం పృష్టోఽహం ద్విజసత్తమాః ।
నారదేన ప్రయత్నేన తదా తం ప్రోక్తవానహమ్ ॥ 2 ॥

ఓ ద్విజసత్తములారా! ఇంతకు పూర్వము నారదుడెంతో ప్రయత్నించి నన్నీ ప్రశ్న అడిగాడు. అప్పుడాతనికి నేనిలా చెప్పాను.

నారద ఉవాచ :- నారదుడడిగాడు.

తపసో యజ్ఞదానానాం తీర్థసేవనముత్తమమ్ ।
ఇతి శ్రుతం మయా త్వత్తో జగద్యోనే జగత్ప్రభో ॥ 3 ॥

జగత్తునకు మూలమైనవాడా! ఓ జగత్ప్రభూ! తపస్సునకంటె, యజ్ఞదానముల కంటే తీర్థములను సేవించుటే ఉత్తమమైనదని మీనుండి నేను వింటిని.

దైవాని మునిశార్దూల ఆసురాణ్యార్షాణి చ ।
కియద్భేదాని తీర్థాని కిం ఫలాని సురేశ్వర ॥ 4 ॥

సర్వేషామేవ తీర్థానాం సర్వదా కిం విశిష్యతే ॥

ఓ మునిశార్దూలా! దైవతములు, ఆసురములు, ఆర్షములని తీర్థములు మూడు విధములని చెప్పితిరి. ఆ తీర్థములలో భేదములెన్ని? వాటివల్ల వచ్చు ఫలమేమి? ఓ సురేశ్వరా! ఈ తీర్థము లన్నింటిలోను విశిష్టమైన తీర్థమేదో తెలుపుదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

చతుర్విధాని తీర్థాని స్వర్గే మర్త్యే రసాతలే ।
దైవాని మునిశార్దూల ఆసురాణ్యాఋషాణి చ ॥ 5 ॥

ఓ మునిశార్దూలా! స్వర్గ మర్త్య రసాతలములందున్న తీర్థములు నాలుగు విధములు. అవి దైవతములు, ఆసురములు, ఆర్షములు ఇంకా.

మానుషాణి త్రిలోకేషు విఖ్యాతాని సురాదిభిః ।
మానుషేభ్యశ్చ తీర్థేభ్య ఆర్షికం సార్వకామికమ్ ॥ 6 ॥

మానుషములని యందురు. ఈ నాలుగు ముల్లోకములలోను దేవతలతో విఖ్యాతి పొందినవి. మానుష తీర్థములలో ఆర్షికమైన తీర్థము అన్ని కోరికలను నెరవేర్చునది.

ఆర్షికేభ్యస్తు తీర్థేభ్య ఆసురం బహుపుణ్యదమ్ ।
ఆసురేభ్యస్తథా పుత్ర దైవం తత్సార్వకామికమ్ ॥ 7 ॥

నాయనా! ఆర్షిక తీర్థములకంటె ఆసుర తీర్థములనేక పుణ్య ఫలదములు. ఆసురతీర్థముల కంటె కూడా దైవతీర్థములు అన్నికోరికలను తీర్చునవి.

బ్రహ్మ విష్ణు మహేశాద్యైర్నిర్మితం దైవముచ్యతే ।
త్రిభ్యో యదేకం జాయేత తస్మాన్నాతః పరం విదుః ॥ 8 ॥

బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు సృష్టించిన తీర్థములను దైవతీర్థములందురు. ఆ ముగ్గురివలన సృష్టింపబడిన దానిని ఉత్తమమని అందురు.

త్రయాణామపి లోకానాం తీర్థం మర్త్యముదాహృతమ్ ।
తత్రాపి జామ్బవం ద్వీపం తీర్థం బహుగుణోత్తమమ్ ॥ 9 ॥

ఈ ముల్లోకములలో తీర్థములన్నింటిలోను మర్త్యలోకములోని తీర్థములు శ్రేష్ఠమైనవి. వానిలో కూడా జంబూద్వీపములో నున్న తీర్థములు మిక్కిలి ఉత్తమగుణములు గలవి.

జామ్బవే భారతం వర్షం తీర్థం శ్రుతిషు విశ్రుతమ్ ।
భారతే దణ్డకారణ్యం సర్వతీర్థమనుత్తమమ్ ॥
కర్మభూమిర్యతః పుత్ర తస్మాత్తీర్థం తదుచ్యతే ॥ 10 ॥

జంబూద్వీపంలో భారతవర్షం పవిత్ర తీర్థంగా వేదాలలో ప్రసిద్ధం. భారతదేశంలో దణ్డకారణ్యము సమస్త తీర్థములలో నుత్తమమైనది. నాయనా! ఈ నేల కర్మభూమి. అందువలననే ఈ తీర్థమునే ఉత్తమమైన దన్నారు.

తత్రైవ సర్వతీర్థాని యాన్యుక్తాని మయా తవ ।
తేషాం నామాని సంక్షేపాత్కథ్యమానాని మే శృణు ॥ 11 ॥

నేను నీకు చెప్పినవన్ని భారతదేశములోనే యున్నవి. ఇప్పుడు వాటి పేర్లను క్లుప్తముగా చెప్పుచున్నాను వినుము.

దైవాని చాసురార్షాణి మానుషాణీతిభేదతః ।
హిమవద్వింధ్యయోర్మధ్యే షణ్ణద్యో దేవసమ్భవాః ॥ 12 ॥

దైవ, ఆసుర ఆర్ష, మానుషములని తీర్థములు నాలుగు విధములుగా నున్నవి. వాటిలో హిమవత్పర్వతము వింధ్యపర్వత మధ్యభాగమున దేవసమ్భవములగు ఆరు తీర్థములున్నవి.

తథైవ దేవజా బ్రహ్మన్ దక్షిణార్ణవవిన్ధ్యయోః ।
ఏతా ద్వాదశ నద్యస్తు ప్రాధాన్యేన ప్రకీర్తితాః ॥ 13 ॥

ఓ నారదా! అదే విధముగా దక్షిణ సముద్రము వింధ్యపర్వతముల మధ్యలో ముఖ్యమైనవిగా పన్నెండు నదులను కీర్తించారు.

అభిసంపూజితం యస్మాద్భారతం బహుపుణ్యదమ్ ।
కర్మభూమిరతో దేవైర్వర్షం తస్మాత్ప్రకీర్తితమ్ ॥ 14 ॥

ఈ భారతవర్షము కర్మభూమి. అనేక పుణ్యముల నిచ్చునది. అందరూ పూజించునది. అందువలననే దేవత లందరూ దీనిని కీర్తించారు.

పార్వతాని చ తీర్థాని దేవజాని క్వచిత్ క్వచిత్ ।
అసురైరావృతం యత్తు తదేవాఽఽసురముచ్యతే ॥ 15 ॥

దేవతల వలన పుట్టి, పర్వతసంబంధంకల తీర్థములని అక్కడక్కడ కొన్నింటిని అసురు లాక్రమించినందువలన వాటిని ఆసుర తీర్థములందురు.

దైవేష్వేవ ప్రదేశేషు తపస్తప్త్వా మహర్షయః ।
దైవప్రభావాత్తపస ఆర్షాణ్యపి చ తాన్యపి ॥ 16 ॥

దేవతలున్న ప్రదేశాలలో మహర్షులు తపస్సు చేసి, ఆ తపస్సు యొక్క దైవమహిమవలన యేర్పడిన తీర్థాలు కూడా ఆర్షతీర్థాలే.

ఆత్మనః శ్రేయసే ముక్త్యై పూజాయై భూతయేఽథవా ।
ఆత్మనః ఫలభూత్యర్థం యశసోఽవాప్తయే పునః ॥ 17 ॥

తమ శ్రేయస్సుకొరకు,ముక్తికొరకు, ఆరాధనకొరకు, ఐశ్వర్యముకొరకు, తమకు యశస్సు కలుగుటకొరకు, తాము ఫలైశ్వర్యముల నందుటకొరకు.

మానుషైః కారితాన్యాహుర్మానుషాణీతి నారద ।
ఏవం చతుర్విధో భేదస్తీర్థానాం మునిసత్తమ ॥ 18 ॥

ఓ నారదా! మానవులేర్పరిచినవి కనుక వాటిని మానుషతీర్థములన్నారు. ఓ మునిసత్తమా! ఇలా తీర్థములలో నాలుగు విధములైన భేదములు కలవు.

భేదం న కశ్చిజ్జానాతి శ్రోతుం యుక్తోఽసి నారద ।
బహవః పండితంమన్యాః శృణ్వన్తి కథయన్తి చ ॥ 19 ॥

సుకృతీ కోఽపి జానాతి వక్తుం శ్రోతుం నిజైర్గుణైః ॥

ఓ నారదా! చాలా మంది తాము పండితులమని భావించేవారు వింటారు, చెబుతారు కూడా. కాని వానిలో భేదమును మాత్రము ఏ ఒక్కరూ ఎరుగరు. నీవు మాత్రమే వినుటకు అర్హుడవు. పుణ్యాత్ముడైన ఏ ఒక్కడో దానిని గూర్చి చెప్పుటకు వినుటకు తన గుణములతో తెలుసుకొనగలడు.

నారద ఉవాచ :–నారదదు పలికెను.

తేషాం స్వరూపం భేదం చ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ।
యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముక్తిర్భవతి శాశ్వతీ ॥ 20 ॥

ఏ తీర్థములను గూర్చి వినుటవలన సమస్తపాపముల నుండి శాశ్వతమైన ముక్తి కలుగతుందో అటువంటి తీర్థముల యొక్క స్వరూపమును, భేదములగూర్చి వాస్తవాన్ని వినగోరుచున్నాను.

బ్రహ్మన్ కృతయుగస్యాదౌ హ్యుపాయోఽన్యో న విద్యతే ।
తీర్థసేవాం వినా స్వల్పాయాసేనాభీష్టదాయినీమ్ ॥ 21 ॥

పూజ్యుడా! కృతయుగాదియందు తక్కువ శ్రమతో అభీష్టములు తీర్చే ఉపాయము తీర్థసేవనము తప్ప మరొక ఉపాయము లేకుండినది.

న త్వయా సదృశో ధాతర్వక్తా జ్ఞాతాఽథవా క్వచిత్ ।
త్వం నాభికమలే విష్ణోః సంజాతోఽఖిలపూర్వజః ॥ 22 ॥

ఓ బ్రహ్మదేవా! నీవు విష్ణుమూర్తియొక్క నాభి కమలమునందు అందరికంటె ముందు పుట్టినవాడవు. నీతో సమానముగా తెలుసుకున్నవాడు కాని, చెప్పేవాడు కాని ఏ ఒక్కడూ లేడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

గోదావరీ భీమరథీ తుంగభద్రా చ వేణికా ।
తాపీ పయోష్ణీ విన్ధ్యస్య దక్షిణే తు ప్రకీర్తితాః ॥ 23 ॥

గోదావరి, (త్ర్యంబక క్షేత్రములో పుట్టినది) భీమరథి, (సహ్యపర్వత ప్రాంతంలో పుట్టినది) తుంగభద్ర (కృష్ణానదికి ఉపనది) కృష్ణవేణి, తాపి, పయోష్ణి (వేడినీరుగల నది) ఇవి వింధ్యకు దక్షిణప్రాంతమున నున్నవని కీర్తించారు.

భాగీరథీ, నర్మదా తు యమునా చ సరస్వతీ ।
విశోకా చ వితస్తా చ హిమవత్పర్వతాశ్రితాః ॥ 24 ॥

హిమవత్పర్వతము నాశ్రయించి ప్రవహించే నదులు భాగీరథి (ఇది రఘువంశపు రాజైన భగీరథుడు తపస్సు చేసి సాధించినది) నర్మద, యమున. సరస్వతి, విశోక, వితస్త అనునవి.

ఏతా నద్యః పుణ్యతమా దేవతీర్థాన్యుదాహృతాః ।
గయః కోలాసురో వృత్రస్త్రిపురో హ్యన్ధకస్తథా ॥ 25 ॥

ఈ నదులు పుణ్యతమములు, దేవతీర్థములని చెప్పారు. గయుడు, కోలాసురుడు, వృత్రుడు, త్రిపురుడు, అంధకుడు,

హయమూర్ధా చ లవణో నముచిః శృంగకస్తథా ।
యమః పాతాలకేతుశ్చ మధుః పుష్కర ఏవ చ ॥ 26 ॥

హయగ్రీవుడు, లవణుడు, నముచి, శృంగకుడు, యముడు, పాతాలకేతువు, మధువు, పుష్కరుడు, మొదలగు.

ఏతైరావృతతీర్థాని ఆసురాణి శుభాని చ ।
ప్రభాసో భార్గవోఽగస్తిర్నరనారాయణౌ తథా ॥ 27 ॥

ఈ అసురులతో ఆవరించబడిన తీర్థములను ఆసురతీర్థములంటారు. ఇవి శుభములను కలుగజేయునవి. ప్రభాసుడు, భార్గవుడు, అగస్త్యుడు, నరనారాయణులు,

వసిష్ఠశ్చ భరద్వాజో గౌతమః కశ్యపో మనుః ।
ఇత్యాదిమునిజుష్టాని ఋషితీర్థాని నారద ॥ 28 ॥

ఓ నారదా! వసిష్ఠుడు, భరద్వాజుడు, గౌతముడు, కశ్యపుడు, మనువు మున్నగు వారు సేవించినవి ఋషి తీర్థములు.

అమ్బరీషో హరిశ్చంద్రో నహుషో రామ ఏవ చ ।
కురుః కనఖలశ్చైవ భరతః సగరస్తథా ॥ 29 ॥

అంబరీషుడు, హరిశ్చంద్రుడు, నహుషుడు, బలరాముడు, కురు,కనఖల,భరత, సగరులు మొదలగువారు, అలాగే.

అశ్వయూపో, నాచికేతో వృషా కపి రరిందమః ।
ఇత్యాది మానుషైర్విప్ర నిర్మితాని శుభాని చ ॥ 30 ॥

అశ్వయూపుడు, నాచికేతుడు, వృషాకపి, అరిందముడు మున్నగు రాజులచేత సేవించబడిన తీర్థములు మానుషతీర్థములు.

యశసః ఫలభూత్యర్థం నిర్మితానీహ నారద ।
స్వతోద్భూతాని దైవాని యత్ర క్వాపి జగత్త్రయే ॥ 31 ॥

నారదా! ఈ తీర్థములు తమ కీర్తికొరకు, ఫలైశ్వర్యములకొరకు నిర్మించబడినవి. ఈ ముల్లోకములలో అక్కడక్కడ స్వయముగా నుద్భవించిన దైవతీర్థములు కలవు.

పుణ్యతీర్థాని తాన్యాహుస్తీర్థభేదో మయోదితః ।
యన్న ఖాతం తు కేనాపి దేవఖాతం తదుచ్యతే ॥ 32 ॥

వాటి నన్నింటిని పుణ్యతీర్థము లంటారు. ఆ తీర్థభేదములను మాత్రమే నేను చెప్పాను. ఎవరిచేత కూడా త్రవ్వబడని వాటిని దేవతలు త్రవ్వినవని అంటారు.

సంక్షేపేణోదితోఽయం తే తీర్థభేదో మయా మునే ।
ముచ్యతే సర్వపాపేభ్యో నరో యజ్జ్ఞానమాత్రతః ॥ 33 ॥

ఓ మహర్షీ! మానవుడు వేటిని తెలుసుకున్నంత మాత్రముననే సమస్త పాపములనుండి విముక్తుడవుతాడో, అటువంటి తీర్థభేదములను గూర్చి నేను నీకు సంక్షిప్తముగా చెప్పాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయంభునారదసంవాదే తీర్థభేదవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః. ॥ 1 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి బ్రహ్మ-నారద మహర్షుల సంవాదములోని తీర్థ భేద వర్ణన మను పేరుగల మొదటి అధ్యాయము సంపూర్ణం.

ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

గంగోత్పత్తౌ శంభువివాహసంభవః - గంగ ఆవిర్భావంలో శంభుని వివాహం సంభవించుట

నారదఉవాచ :- నారదుడడిగాడు.

త్రిదైవత్యం తు యత్తీర్థం సర్వేభ్యో హ్యుత్తమోత్తమమ్ ।
తస్య స్వరూపం భేదం చ విస్తరేణ బ్రవీతు మే ॥ 1 ॥

తండ్రీ! మీరు త్రిదైవత్యమనే తీర్థము అన్ని తీర్థముల కంటె ఉత్తమోత్తమ మన్నారు. ఆ తీర్థము యొక్క స్వరూపము, భేదమును నాకు వివరముగా చెప్పండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ ఇట్లు చెప్పాడు.

తావదన్యాని తీర్థాని తావత్తాః పుణ్యభూమయః ।
తావద్యజ్ఞాదయో యావత్త్రిదైవత్యం న దృశ్యతే ॥ 2 ॥

ఇతరములైన తీర్థములుగాని, ఇతరములైన పుణ్యభూములుగాని ఇతరములైన యజ్ఞములుగాని త్రిదైవత్య తీర్థాన్ని చూడనంతవరకే. త్రిదైవత్య తీర్థాన్ని చూస్తేచాలు. వాటి అవసరం ఉండదు.

వ్రతోపవాసకృచ్ఛ్రేభ్యో గంగాసేవా మహాఫలా ।
కృచ్ఛ్రకాః సర్వతీర్థేషు దృశ్యన్తే తేషు దేహినామ్ ॥ 3 ॥

వ్రతములకంటె, ఉపవాసములకంటె, సాంతపనాది వ్రతములకంటె, గంగను సేవించుట మిక్కిలి ఫలమునిస్తుంది. ఆ తీర్థాలన్నింటిలోనూ మానవులలో కృచ్ఛ్రవ్రతం చేసేవారు కనిపిస్తారు.

ద్రవ్యాత్మమాతృజనకాద్యా శుద్ధిర్దేహినాం మునే ।
త్రిదైవత్యం విహాయేహ కథం పాపక్షయో భవేత్ ॥
స్మృతా దృష్టాఽథవా స్పృష్టా యా సర్వాకాంక్షితప్రదా ॥ 4 ॥

ఓ మునీ! జీవులకు ద్రవ్యము, ఆత్మ, తల్లిదండ్రులు మున్నగునవి శుద్ధిని కలిగించునవి. లోకమునందు త్రిదైవత్య-గంగ లేకుండా పాపక్షయ మెట్లగును? దాన్ని స్మరించినా, చూచినా, లేదా స్పృశించినా సమస్త పాపములు నశించుటే కాక ఆ గంగ సమస్త కోరికల నిచ్చునది కాదా! గంగా గంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతైరపి ముచ్యతే సర్వపాపాని" అని చెప్పారు కదా!

గంగేయం సరితాం శ్రేష్ఠా సర్వకామప్రదాయినీ ।
త్రిదైవత్యా మునిశ్రేష్ఠ! తదుత్పత్తిమితః శృణు ॥ 5 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! నదులన్నింటిలోనూ ఈ గంగానది శ్రేష్ఠమైనది, సమస్త కోరికలను దీర్చునది. ఇక ఆ త్రిదైవత్యమైన గంగయొక్క పుట్టుకను గూర్చి విను.

వర్షాణామయుతాత్పూర్వం దేవకార్య ఉపస్థితే ।
తారకో బలవానాసీన్మద్వరాదతిగర్వితః ॥ 6 ॥

పదివేల సమువత్సరములకు పూర్వము దేవకార్యము సంభవించినప్పుడు ఆ సమయమున తారకుడనే వాడు నా వరప్రభావము వలన బలవంతుడై మిక్కిలి గర్విస్తూ ఉండినాడు.

దేవానాం పరమైశ్వర్యం హృతం తేన బలీయసా ।
తతస్తే శరణం జగ్ముర్దేవాః సేన్ద్రపురోగమాః ॥ 7 ॥

ఆ బలవంతుడైన తారకుడు దేవతల పరమైశ్వర్యమును హరించెను. ఆ తరువాత దేవతలందరు ఇంద్రుని ముందుంచుకొని విష్ణువును శరణు పొందారు.

క్షీరోదశాయినం దేవం జగతాం ప్రపితామహమ్ ।
కృతాంజలిపుటాః దేవాః విష్ణుమూచురనన్యగాః ॥ 8 ॥

పాలసముద్రమునందు శయనించియున్న, జగత్తులన్నిటికిని ప్రపితామహుడైన విష్ణుదేవుని ఆ దేవతులు మరొక మార్గములేనివారై, దోసిలొగ్గి ప్రార్థించారు.

దేవా ఊచుః :–దేవతలు పలికారు.

త్వం త్రాతా జగతాం నాథ దేవానాం కీర్తివర్ధన ।
సర్వేశ్వర జగద్యోనే త్రయీమూర్తే నమోఽస్తు తే ॥ 9 ॥

ప్రభూ! నీవు లోకములకు రక్షకుడవు, దేవతల కీర్తిని పెంపొందించేవాడివి, జగత్తుకు సృష్టికర్తవు, ఋగ్యజుస్సామములనే మూడు వేదములే రూపంగా కలవాడా! సర్వేశ్వరా! నీకు నమస్కారము.

లోకస్రష్టాఽసురహన్తా త్వమేవ జగతాం పతిః ।
స్థిత్యుత్పత్తివినాశానాం కారణం త్వం జగన్మయ ॥ 10 ॥

లోకములను సృష్టించేవానివి, అసురులను సంహరించేవానివి, జగములకు ప్రభువూ నీవే. ఓ జగద్వ్యాపీ! నీవు సృష్టి స్థితి లయములకు కారణభూతుడవు.

త్రాతా న కోఽప్యస్తి జగత్త్రయేఽపి
శరీరిణాం సర్వవిపద్గతానామ్ ।
త్వయా వినా వారిజపత్రనేత్ర
తాపత్రయాణాం శమనం న చాన్యత్ ॥ 11 ॥

ఓ కమలదళేక్షణా! సమస్త ఆపదల్లో చిక్కుకునే జీవులను రక్షించుటకు నీవు తప్ప ముల్లోకములందు మరొకడెవడు లేడు. ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధి దైవికములనే తాపత్రయములను శమింప చేసేవాడు నీకన్న మరొకడు లేడు.

పితా చ మాతా జగతోఽఖిలస్య
త్వమేవ సేవా సులభోఽసి దేవ
ప్రసీద పాహీశ మహాభయేభ్యోఽ
స్మదార్తిహన్తా వద కస్త్వదన్యః ॥ 12 ॥

ఓ దేవా! సమస్త జగత్తునకు నీవే తల్లివి. నీవే తండ్రివి. సేవ చేసినంత మాత్రముననే నీవు సులభుడవౌతావు. మహా భయములనుండి అనుగ్రహించుము. నా ఆర్తిని బాపేవాడు నీ కంటె మరొకడెవరున్నారు? నన్ను రక్షింపుము.

ఆదికర్తా వరాహస్త్వం మత్స్యః కూర్మస్తథైవ చ ।
ఇత్యాది రూపభేదైర్నో రక్షసే భయ ఆగతే ॥ 13 ॥

మత్స్య కూర్మ వరాహావతారము లెత్తిన ఆదికర్తవు నీవే. ఇటువంటి రూప భేదములను పొంది ఆ అవతారములతో మాకు భయము కలిగినప్పుడు రక్షించుచున్నావు.

హృతస్వామ్యాన్ సురగణాన్ హృతదారాన్ హృతస్థలాన్ ।
కస్మాన్న రక్షసే దేవ అనన్య శరణాన్ హరే ॥ 14 ॥

ఓ దేవా! హరీ! స్థలములను, భార్యలను, స్వామిత్వ పదవులను పోగొట్టుకొని నీవు తప్ప మరొకరు శరణుకాదు అని ధ్యానించుచున్న దేవతాగణమును ఎందుకు రక్షించుట లేదు?

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తతః ప్రోవాచ భగవాన్ శేషశాయీ శ్రియః పతిః ।
కస్మాద్వో భయమాపన్నం తద్బ్రువన్తు గతజ్వరాః ॥ 15 ॥

తతః శ్రియః పతిం ప్రాహుస్తం తారకవధం ప్రతి ॥

ఆ తరువాత శేషశాయి, లక్ష్మీపతియైన భగవానుడు ఇలా అన్నాడు. మీకు ఎవని నుండి భయమేర్పడినది? భయమును వదలి దానిని చెప్పండి. అనగా. అప్పుడు శ్రియఃపతితో ఆ తారకవధను గూర్చి చెప్పారు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

తారకాద్భయమాపన్నం భీషణం రోమహర్షణమ్ ।
న యుద్ధైస్తపసా శాపైర్హన్తుమేనం క్షమా వయమ్ ॥ 16 ॥

మా రోమములు నిక్కబొడుచుకునే విధంగా ఆ తారకాసురునివలన భీషణమైన భయము కలుగుచున్నది. ఇతనిని మేము యుద్ధములతో గాని, తపస్సుతోగాని, శాపములతోగాని చంపుటకు సమర్థులము కాము.

అర్వాగ్దశాహాద్యో బాలస్తస్మాన్మృత్యుమవాప్స్యతి ।
తస్మాద్దేవ న చాన్యేభ్యస్తత్ర నీతిర్విధీయతామ్ ॥ 17 ॥

ఎవరైతే పదిదినములలోపలి బాలుడుంటాడో అటువంటివానితో తారకుడు మృత్యువును పొందగలడు. ఓ దేవా! వాడు ఇతరులవలన మరణింపజాలడు అందువలన మరొక మార్గమును సూచించుడు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

పునర్నారాయణః ప్రాహ నాహం బలోత్కటః సురాః ।
న మత్తో మదపత్యాచ్చ న దేవేభ్యో వధో భవేత్ ॥ 18 ॥

అప్పుడు తిరిగి నారాయణుడన్నాడు ఓ దేవతలారా! నేనంత బలవంతుడను కాను, నా వల్ల గాని, నా సంతానము వలన గాని, దేవతలవలన గాని అతని మరణము జరుగదు.

ఈశ్వరాద్యత్తు జాయేత హ్యపత్యం బహుశక్తిమత్ ।
తస్మాద్వధమవాప్నోతి తారకో లోకతాపనః ॥ 19 ॥

ఒకవేళ శివునికి మహా శక్తివంతమైన సంతానము కల్గినట్లైతే అతని వలన లోకానికి బాధను కలిగించే తారకుడు మరణమును పొందగలడు.

తద్గచ్ఛామః సురాః సర్వే యతితుం ఋషిభిః సహ ।
భార్యార్థం ప్రథమో యత్నః కర్తవ్యః ప్రభవిష్ణుభిః ॥ 20 ॥

అందువలన సమర్థులైన ఋషులందరితో కలిసి దేవతలమందరము వెళ్ళుదము. మొదట భార్యకొరకు ప్రయత్నమును చేయవలయును.

తథేత్యుక్త్వా సురగణా జగ్ముస్సర్వే నగోత్తమమ్ ।
హిమవన్తం రత్నమయం మేనాం చ హిమవత్ప్రియామ్ ॥ 21 ॥

సరే అలాగే అని దేవతలందరు పర్వతశ్రేష్ఠుడు, రత్నమయుడు అయిన హిమవంతుని, హిమవంతుని భార్య అయిన మేనాదేవి దగ్గరకు వెళ్ళిరి.

ఇదమూచుః సర్వ ఏవ సభార్యం తుహినం గిరిమ్ ।

అందరూ కూడా భార్యతో కలిసియున్న హిమవంతునితో ఇలా అన్నారు.

దేవా ఊచుః :- దేవతలన్నారు.

దాక్షాయణీ లోకమాతా యా శక్తిః సంస్థితా శివా ।
బుద్ధిః ప్రజ్ఞా ధృతిర్మేధా లజ్జా పుష్టిః సరస్వతీ ॥ 23 ॥

బుద్ధి, ప్రజ్ఞ,ధృతి, మేధ, లజ్జ, పుష్టి. సరస్వతి,శివా అనే పేర్లతో ఏ శక్తి అయితే ఉన్నదో ఆ లోకమాత అయిన దాక్షాయణి,

ఏవం త్వనేకధా లోకే యా స్థితా లోకపావనీ ।
దేవానాం కార్యసిద్ధ్యర్థం యువయోః గర్భమావిశత్ ॥ 24 ॥

ఇలా అనేక విధములుగా లోకంలో లోకపావనిగా ఎవరైతే ఉన్నారో ఆమె దేవతల కార్యము సిద్ధించుట కొరకు మీ గర్భమునందు ప్రవేశించినది.

సా తూత్పన్నా జగన్మాతా శంభోః పత్నీ భవిష్యతి ।
అస్మాకం భవతాం చాపి పాలనీ చ భవిష్యతి ॥ 25 ॥

అలా జన్మించిన ఆ జగన్మాత శివునికి భార్య కాగలదు. అంతేకాక మీకు, మాకు కూడా పాలకురాలవుతుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

హిమవానపి తద్వాక్యం సురాణామభినంద్య చ ।
మేనా చాపి మహోత్సాహా అస్త్విత్యేవం వచోఽబ్రవీత్ ॥ 26 ॥

ఆ దేవతల మాటలు విని హిమవంతుడు కూడా వారినభినందించెను. మేనాదేవి కూడా మిక్కిలి ఉత్సాహముతో అట్లే అగుగాక అని పలికెను.

తదోత్పన్నా జగద్ధాత్రీ గౌరీ హిమవతో గృహే ।
శివధ్యానరతా నిత్యం తత్ప్రియా తత్పరాయణా ॥ 27 ॥

అప్పుడు జగద్ధాత్రి అయిన గౌరి హిమవంతుని యింట పుట్టింది. నిత్యమూ ఆమె శివుని ఆరాధిస్తూ అతన్నే ప్రియునిగా తలచి శివపరాయణురాలై యుండినది.

తాం చ ప్రోచుః సురగణా ఈశార్థే తప ఆవిశ ।
తతో హిమవతః పృష్ఠే గౌరీ తేపే తపో మహత్ ॥28 ॥

అప్పుడు దేవతలామెను ఈశ్వరుని గూర్చి తపమాచరించుమని చెప్పారు. ఆ తరువాత గౌరి హిమవత్పర్వతముపై గొప్ప తపస్సు చేసింది.

పునః సంమంత్రయామాసురీశో ధ్యాయతి తాం కథమ్ ।
ఆత్మానం వా తథాఽన్యద్వా న జానీమః కథం భవః ॥ 29 ॥

మళ్ళీ ఆ దేవతలందరు ఇలా ఆలోచించారు. శివుడు ధ్యానంలో ఉన్నాడు. తనను తాను గాని, పార్వతిని గాని, ఇతరమైన విషయములను గాని తలచుట లేదు. ఇప్పుడెలా ఏమి చేయాలో తోచుటలే దనుకొన్నారు.

మేనకాయాః సుతాయాం తు చిత్తం దధ్యాత్సురేశ్వరః ।
తత్ర నీతిర్విధాతవ్యా తతః శ్రేష్ఠ్యమవాప్స్యథ ॥
తతః ప్రాహ మహాబుద్ధిర్వాచస్పతి రుదారధీః ॥ 30 ॥

మేనాదేవి సుతయం దీశ్వరుడు చిత్తము నుంచవలయును. ఆ తరువాత ఫలమును పొందవలెనని అనుకొంటుండగా అప్పుడు ఉదారబుద్ధి, మహాజ్ఞాని అయిన బృహస్పతి ఇలా అన్నాడు.

బృహస్పతిరువాచ :- బృహస్పతి పలికాడు.

యస్త్వసౌ మదనో ధీమాన్ కందర్పః పుష్పచాపధృక్ ।
స విధ్యతు శివం శాన్తం బాణైః పుష్పమయైః శుభైః ॥ 31 ॥

ఎవడు పూలధనుస్సును పట్టుకొనియుంటాడో ఆ కందర్పుడైన మన్మథుడు తన పుష్పమయములైన శుభకరములగు బాణములతో శాంతముగానున్న శివుని కొట్టవలయును.

తేన విద్ధస్త్రినేత్రోఽపి ఈశాయాం బుద్ధిమాదధేత్ ।
పరిణేష్యత్యసౌ నూనం తదా తాం గిరిజాం హరః ॥ 32 ॥

మన్మథుని బాణపు దెబ్బను తిన్న మూడు నేత్రములు గల శివుడు కూడా గౌరియందు ఆసక్తుడగును. అప్పుడా శివుడు ఆ గిరిపుత్రికను తప్పక పరిణయము చేసుకొనును.

జయినః పంచబాణస్య న బాణాః క్వాపి కుంఠితాః ।
తథోఢాయాం జగద్ధాత్ర్యాం శంభోః పుత్రో భవిష్యతి ॥ 33 ॥

విజయస్వభావము గల మన్మథుని బాణములు ఎప్పుడు కూడా వ్యర్థము కానివి. అలా జగద్ధాత్రి అయిన పార్వతిని వివాహమాడిన శివునకు కొడుకు పుడతాడు.

జాతః పుత్రస్త్రినేత్రస్య తారకం స హనిష్యతి ।
వసన్తం చ సహాయార్థం శోభిష్ఠం కుసుమాకరమ్ ॥ 34 ॥

ఆహ్లాదనం చ మనసా కామాయైనం ప్రయచ్ఛథ ॥ 35 ॥

త్రినేత్రునకు పుట్టిన ఆ పుత్రుడు తారకుని చంపును. మన్మథునకు సహాయము చేయుటకు శోభను కలుగజేయు కుసుమాకరుడైన వసంతుని మనస్సుతో సంతోషపెట్టువానిని మన్మథునికివ్వండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా సురగణా మదనం కుసుమాకరమ్ ।
ప్రేషయామాసురవ్యగ్రాః శివాన్తికమరిందమాః ॥ 36 ॥

శత్రువులను అణచివేసే దేవతలు సరే అట్లేయని మన్మథుని, వసంతుని శివుని దగ్గరకు త్వరపడి పంపారు.

స జగామ త్వరా కామో ధృతచాపో సమాధవః ।
రత్యా చ సహితః కామః కర్తుం కర్మ సుదుష్కరమ్ ॥ 37 ॥

వసంతునితో గూడి ఆ ధనుస్సును ధరించిన మన్మథుడు రతీదేవితో కలిసి సుదుష్కరమైన పనిని చేయుటకు త్వరపడి వెళ్ళాడు.

గృహీత్వా సశరం చాపమీశ్వరస్య పురోఽభవత్ ।
మయా వేధ్యస్త్వవేధ్యో వై శమ్భుర్లోకగురుః ప్రభుః ॥ 38 ॥

ధనుర్బాణములను తీసుకొని శివునిముందుకు వెళ్ళాడు. లోకగురువు, ప్రభువు, కొట్టుటకు సాధ్యం కానటువంటి శివుని నేనిప్పుడు బాణములతో కొట్టాలి.

త్రైలోక్యజయినో బాణాః శంభౌ మే కిం దృఢా న వా ।
తేనాసౌ చాగ్నినేత్రేణ భస్మశేషస్తదా కృతః ॥ 39 ॥

ముల్లోకములను జయించే నా బాణములు శంభుని విషయంలో దృఢంగా ఉండగలవా లేవా? అగ్నినేత్రుడైన ఆ శివుడు అప్పుడు కేవలం బూడిదమాత్రమే మిగులునట్లు చేశాడు.

తదేవ కర్మ సుదృఢమీక్షితుం సురసత్తమాః ।
ఆజగ్ముస్తత్ర యద్వృత్తం శృణు విస్మయకారకమ్ ॥ 40 ॥

దేవతాశ్రేష్ఠులందరూ ఆ పనినే ఆసక్తితో చూచుటకు అక్కడికి వచ్చారు. ఆ ఆశ్చర్యకరమైన వృత్తాంతమును విను.

శంభుం దృష్ట్వా సురగణా యావత్పశ్యన్తి మన్మథమ్ ।
తావచ్చ భస్మసాద్భూతం కామం దృష్ట్వా భయాతురాః ॥
తుష్టువుస్త్రిదశేశానం కృతాంజలిపుటాః సురాః ॥ 41 ॥

ఆ దేవతాగణమంతా శివుణ్ణి చూచి మన్మథుని చూడ భయాతురులై, పరమేశ్వరునికి చేతులెత్తి స్తోత్రము చేశారు.

దేవా ఊచుః :– దేవతలిలా పలికారు.

తారకాద్భయమాపన్నం కురు పత్నీం గిరేః సుతామ్ ।

తారకుని వలన భయమేర్పడినది. గిరిసుత అయిన పార్వతిని భార్యగా చేసుకొనుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

విద్ధచిత్తో హరోఽప్యాశు మేనే వాక్యం సురోదితమ్ ॥ 42 ॥

గాయపడిన మనస్సుగలవాడైనా శివుడు వెంటనే దేవతలు చెప్పిన మాటను తెలుసుకొన్నాడు.

గణయన్తి మహాత్మానః పరార్థే న హితాహితమ్ ।
అరున్ధతీం వసిష్ఠం చ మాం తు చక్రధరం తథా ॥ 43 ॥

మహాత్ములెప్పుడూ ఇతరుల హితము కొరకు తమ హితములను లెక్కపెట్టరు. అప్పుడు దేవతలందరూ అరుంధతీ వశిష్ఠులను, నన్ను అట్లే నారాయణుని

ప్రేషయామాసురమరా వివాహాయ పరస్పరమ్ ।
సంబంధోఽపి తథాఽప్యాసీద్ధిమవల్లోకనాథయోః ॥ 44 ॥

వివాహనికి పంపించారు. అదేవిధముగా హిమవంతునకు లోకనాథుడైన శివునకు పరస్పరము సంబంధము గూడా కలిసినది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యేస్వయంభునారదసంవాదే గంగోత్పత్తౌ శంభువివాహసంభవో నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి స్వయంభువు నారదసంవాదములో గంగోత్పత్తి యందలి శంభువువివాహం సంభవించడ మనేపేరుగల రెండవ అధ్యాయం సంపూర్ణం.

తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

బ్రహ్మకమణ్డలుదానమ్ - బ్రహ్మకు పరమశివుడు కమండల మిచ్చుట

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

హిమవత్పర్వతే శ్రేష్ఠే నానారత్నవిచిత్రితే ।
నానావృక్షలతాకీర్ణే నానాద్విజనిషేవితే ॥ 1 ॥

నదీనదసరఃకూపతడాగాదిభిరావృతే ।
దేవగంధర్వయక్షాదిసిద్ధచారణసేవితే ॥ 2 ॥

శుభమారుతసంపన్నే హర్షోత్కర్షైకకారణే ।
మేరుమన్దరకైలాసమైనాకాదినగైర్వృతే ॥ 3 ॥

వసిష్ఠాగస్త్యపౌలస్త్యలోమశాదిభిరావృతే ।
మహోత్సవే వర్తమానే వివాహః సమజాయత ॥ 4 ॥

అనేక రత్నములతో చిత్రించిన, అనేక చెట్లతో తీగలతో నిండిన, అనేక విధములగు పక్షుల చేత సేవించబడిన హిమాలయపర్వతమునందు అనేక నదులతోను, నదములతోను, బావులతోను, చెరువులతోను కూడిన, దేవ గంధర్వ యక్ష సిద్ధ చారణులను వారిచేత సేవించబడి చక్కని వాయు సంపద గలిగన, ఎక్కువ ఆనందానికి కారణమైన, మేరు, మందర, కైలాస, మైనాక మున్నగు పర్వతములు చుట్టూ కలిగి, వసిష్ఠ, అగస్త్య, పౌలస్త్య, లోమశ మున్నగు ఋషుల సమక్షమున ఆ హిమాలయమునందు గౌరీ శంకరుల వివాహము జరిగింది.

తత్ర వేదీ రత్నమయీ సూన్నతా స్వర్ణభూషితా ।
రచితా మండపే దివ్యే మనోజ్ఞా విశ్వకర్మణా ॥
వజ్రమాణిక్యవైదూర్యతన్మయస్తంభశోభితా ॥ 5 ॥

ఆ హిమవత్పర్వతము నందు మంచి ఎత్తైన బంగారంతో అలంకరించిన, సుందరమూ దివ్యమూ అయిన మండపమును విశ్వకర్మయను దేవశిల్పి వజ్రమాణిక్య వైదూర్యములతో కూడిన స్తంభములతో శోభాయమానంగా నిర్మించాడు.

జయాలక్ష్మీశుభాక్షాన్తికీర్తిపుష్ట్యాదిసంవృతా ।
మేరుమన్దరకైలాసరైవతైః పరిశోభితైః ॥ 6 ॥

జయా, లక్ష్మీ, శుభా, క్షాంతి, కీర్తి, పుష్టి మున్నగువారితో గూడి, మేరు, మన్దర, కైలాస, రైవత అను పర్వతములతో కూడా ప్రకాశింప చేయబడినట్టియు

పూజితో లోకనాథేన విష్ణునా ప్రభవిష్ణునా ।
మైనాకః పర్వతశ్రేష్ఠో రేజే తత్ర హిరణ్మయః ॥ 7 ॥

సమర్థుడు లోకనాథుడు అయిన విష్ణువుతో పర్వతశ్రేష్ఠుడు, స్వర్ణమయుడూ అయిన మైనాకుడు పూజింపబడి ప్రకాశించాడు.

ఋషయో లోకపాలాశ్చ ఆదిత్యాః సమరుద్గణాః ।
వివాహే వేదికాం చక్రుర్దేవదేవస్య శూలినః ॥ 8 ॥

దేవదేవుడైన శంకరుని వివాహమునందు ఋషులు, ఇంద్రాది లోకపాలురు, ద్వాదశాదిత్యులు, సప్త మరుద్గణములతో గూడి కల్యాణవేదికను సిద్ధపరచారు.

విశ్వకర్మా స్వయం త్వష్టా వేదీం చక్రే సుతోరణామ్ ।
సురభిర్నందినీ నందా సునందా కామదోహినీ ॥ 9 ॥

స్వయముగా దేవశిల్పి అయిన విశ్వకర్మ, వేదికకు తోరణములను కట్టాడు. సురభి, నందిని, నంద, సునంద కామధేనువు మున్నగు వాటితో

ఆభిస్తు శోభితే కాన్తే వివాహః సమజాయత ।
సముద్రాః సరితో నాగా ఋషయో లోకమాతరః ॥ 10 ॥

శివుని వివాహము శోభతో కాంతివంత మయింది. సంద్రాలు, నదులు, నాగులు, ఋషులు, షోడశమాతృకలు,

సవనస్పతిబీజాశ్చ సర్వే తత్ర సమాయయుః ।
భువః కర్మ ఇలా చక్రే ఓషధ్యస్త్వన్న కర్మ చ ॥ 11 ॥

బీజములతో కూడిన, వృక్ష సమూహములు అన్నీ కల్యాణ మంటపమును చేరినవి. ఇల భూమికర్మను, ఓషధులు అన్నమును సిద్ధపరచినవి.

వరుణః పానకర్మాణి దానకర్మ ధనాధిపః ।
అగ్నిశ్చకార యచ్చేష్టం హిమవల్లోకనాథయోః ॥ 12 ॥

జలపానాది కర్మలను వరుణుడు, వివాహమునందు చేయవలసిన దానకర్మలను కుబేరుడు, హిమవంతునకు లోకనాథుడైన ఈశ్వరునికి చేయవలసిన ఇష్టమైన యజ్ఞకర్మలను, అతిథిసత్కారములను అగ్ని చేసినారు.

తత్ర తత్ర పృథక్ పూజాం చక్రే విష్ణుః సనాతనః ।
వేదాశ్చ సరహస్యా వై గాయన్తి చ వదన్తి చ ॥ 13 ॥

సనాతనుడైన విష్ణుమూర్తి వివాహమునందు చేయవలసిన పృథక్ పూజలను చేశాడు. ఋషులు వేదములను గానం చేశారు. అట్లే వాటి రహస్యములను వివరించారు.

నృత్యన్త్యప్సరసః సర్వా జగుర్గంధర్వ కింనరాః ।
లాజాధృక్ చాపి మైనాకో బభూవ మునిసత్తమ ॥ 14 ॥

ఓ మునిసత్తమా! అప్సరసలందరు నాట్యమును చేశారు, గంధర్వులు, కింనరులు గానము చేశారు. మైనాకుడు లాజల(వరిపేలాల)ను చల్లాడు. పట్టుకొన్నాడు.

పుణ్యాహవాచనం వృత్తమన్తర్వేశ్మని నారద ।
వేదికాయాముపావిష్టౌ దంపతీ సురసత్తమౌ ॥ 15 ॥

నారదా! వేదికయందా దేవతాశ్రేష్ఠులైన దంపతులు కూర్చొని పుణ్యాహవాచన కార్యక్రమమును చక్కగా చేసినారు.

అగ్నిం ప్రజ్వాల్య విధివదశ్మానం చాపి పుత్రక ।
హుత్వా లాజాంశ్చ విధివత్ప్రదక్షిణమథాకరోత్ ॥ 16 ॥

శివుడు అగ్నిని ప్రజ్వలింపచేసి, విధిపూర్వకముగా లాజలతో హెూమమును చేసి, సన్నికల్లు తొక్కి, విధి పూర్వకముగా అగ్నికి ప్రదక్షిణం చేశాడు.

అశ్మనః స్పర్శహేతోశ్చ దేవ్యంగుష్ఠం కరేఽస్పృశత్ ।
విష్ణునా ప్రేరితః శమ్భుర్దక్షిణస్య పదస్య చ ॥ 17 ॥

సన్నికల్లు తొక్కిన కారణంగా విష్ణువు ప్రేరేపించగా శివుడు పార్వతి వ్రేలికి బంగారు ఉంగరం తొడిగే నెపంతో ఆమె వ్రేలున్న కుడి చేతిని స్పృశించాడు. అట్లే మట్టెల నెపముతో కుడి పాదమును స్పృశించాడు.

తామదర్శమహం తత్ర హెూమం కుర్వన్ హరాన్తికే ।
దృష్టేఽంగుష్ఠే దుష్టబుద్ధ్యా వీర్యం సుస్రావ మే తదా ॥ 18 ॥

శివునితో కలిసి హెూమమును చేస్తున్న పార్వతిని నేను చూశాను. ఆమె వ్రేలిని చూడగానే అప్పుడు దుష్టబుద్ధితో నా వీర్యము స్రవించింది.

విడమ్బితో న కామేన కోఽప్యస్మిన్ భువనత్రయే ।
లజ్జయా కలుషీభూతః స్కన్నంవీర్యమచూర్ణయమ్ ॥ 19 ॥

ఈ భువనత్రయములో కామముతో మోసగించబడని వాడెవడూ లేడు. కలుషితుడనైన నేను సిగ్గుతో స్ఖలించిన వీర్యమును చూర్ణముగా చేశాను.

మద్వీర్యాచ్చూర్ణితాత్సూక్ష్మాద్వాలఖిల్యాః ప్రజజ్ఞిరే ।
తతో మహానభూత్తత్ర హాహాకారః సురోదితః ॥
లజ్జయా పరిభూతోఽహం నిర్గతస్తు తదాసనాత్ ॥ 20 ॥

నా వీర్యమును చూర్ణముగా చేసినందువలన సూక్ష్మకణములనుండి వాలఖిల్యులు పుట్టినారు. ఆ తరువాత దేవతలందరు అక్కడ మహా హాహాకారము చేశారు. అవమానించబడిన నేను సిగ్గుతో ఆ ఆసనము నుండి లేచి బయటకు వెళ్ళాను.

పశ్యత్సు దేవసంఘేషు తూష్ణీంభూతేషు నారద ।
గచ్ఛన్తం మాం మహాదేవో దృష్ట్వా నందినమబ్రవీత్ ॥ 21 ॥

దేవతల సంఘాలు మౌనంగా చూస్తుండగా వెళ్ళుతున్న నన్ను చూచి పరమేశ్వరుడు నందితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

బ్రహ్మాణమాహ్వయస్వేహ గతపాపం కరోమ్యహమ్ ।
కృతాపరాధేఽపి జనే సన్తః సకృపమానసాః ॥
మోహయన్త్యపి విద్వాంసం విషయాణామియం స్థితిః ॥ 22 ॥

ఇక్కడకు బ్రహ్మను ఆహ్వానించుము. నేను పాపం పోయేటట్లుగా చేస్తాను. అపరాధం చేసిన జనుల యందు కూడా సత్పురుషులు కృపామనస్సును కలిగియుంటారు. విషయములు విద్వాంసులను కూడా మోహింపచేయగలవు. విషయములయొక్క స్థితి ఈ విధంగా ఉంటుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా స భగవానుమయా సహితో హరః ।
మమానుకమ్పయా చైవ లోకానాం హితకామ్యయా ॥ 23 ॥

ఇలా చెప్పి పార్వతీదేవితో కూడిన పూజ్యుడైన శివుడు నన్ననుగ్రహించుటకు, లోకములకు హితమును కోరినవాడై

ఏతచ్చకార లోకేశః శృణు నారద యత్నతః ।
పాపినాం పాపమోక్షాయ భూమిరాపో భవిష్యతి ॥ 24 ॥

ఓ నారదా! శ్రద్ధగా వినుము. లోకేశుడిలా చేశాడు. పాపుల పాపములను తొలగించుటకు భూమి, నీరు ఉన్నవి. ఈ రెండు పాపవిముక్తిని కలిగించును.

తయోశ్చ సారసర్వస్వమాహరిష్యామి పావనమ్ ।
ఏవం నిశ్చిత్య భగవాంస్తయోః సారం సమాహరత్ ॥ 25 ॥

ఆ రెంటి యొక్క పావనమైన సారమునంతయు తీయగలనని నిశ్చయించి భగవానుడైన శివుడు ఆ రెంటి సారమును సంగ్రహించాడు.

భూమిం కమణ్డలుం కృత్వా తత్రాపః సంనివేశ్య చ ।
పావమాన్యాదిభిః సూక్తైరభిమన్త్ర్య చ యత్నతః ॥ 26 ॥

భూమిని కమండలంగా చేసి దానిలో నీటిని ఉంచి, పవమానసూక్తము మున్నగు వానిచే చక్కగా అభిమంత్రించి,

త్రిజగత్పావనీం శక్తిం తత్ర సస్మార పాపహా ।
మామువాచాథ లోకేశో గృహాణేమం కమణ్డలుమ్ ॥ 27 ॥

అక్కడ పాపములను పోగొట్టే శివుడు ముల్లోకములను పావనము చేయు శక్తిని స్మరించాడు. ఆ తరువాత ఆ లోకేశుడు నాతో ఈ కమండలమును తీసుకొనమన్నాడు.

ఆపో వై మాతరో దేవ్యో భూమిర్మాతా తథాఽపరా ।
స్థిత్యుత్పత్తి వినాశానాం హేతుత్వముభయోః స్థితమ్ ॥ 28 ॥

భూమి తల్లి, జలము కూడా దివ్యమైన తల్లే. ఈ భూ జలములుండుటయే సృష్టిస్థితిలయములకు కారణము.

అత్ర ప్రతిష్ఠితో ధర్మో హ్యత్ర యజ్ఞః సనాతనః ।
అత్ర భుక్తిశ్చ ముక్తిశ్చ స్థావరం జంగమం చ యత్ ॥ 29 ॥

ఇక్కడే ధర్మము, సనాతనమైన యజ్ఞము, భుక్తి, ముక్తి మరియు స్థావరజంగమ సమూహము ప్రతిష్ఠించ బడినది.

స్మరణాన్మానసం పాపం వందనాద్వాచికం తథా ।
స్నానపానాభిషేకాచ్చ వినశ్యత్యపి కాయికమ్ ॥ 30 ॥

దీనిని స్మరించినందువలన మానసిక పాపము, నమస్కరించినందువలన వాచిక పాపము, స్నాన పాన అభిషేకములవలన శారీరక పాపము నశించును.

ఏతదేవామృతం లోకే నైతస్మాత్పావనం పరమ్ ।
మయాఽభిమంత్రితం బ్రహ్మన్ గృహాణేమం కమణ్డలుమ్ ॥ 31 ॥

ఈ లోకంలో ఇదే అమృతము. దీని కంటె పవిత్రమైనది మరొకటి లేదు. నేను దీని నభిమంత్రించినాను. ఓ బ్రహ్మా! ఈ కమండలమును తీసుకొనుము.

అత్రత్యం వారి యః కశ్చిత్ స్మరేదపి పిబేదపి ।
స సర్వకామానాప్నోతి గృహాణేమం కమణ్డలుమ్ ॥ 32 ॥

దీనిలో నున్న నీటి నెవరు స్మరించినా, త్రాగినా అట్టివాడు సమస్త కోరికలను పొందును. ఈ కమండలమును తీసుకొనుము.

భూతేభ్యశ్చాపి పంచభ్య ఆపో భూతం మహోదయమ్ ।
తాసాముత్కృష్టమేతస్మాద్గృహాణేమం కమణ్డలుమ్ ॥ 33 ॥

పంచభూతము లన్నిటిలోను నీరనే ఈ భూతము గొప్పశుభమును కలిగిస్తుంది. అటువంటి నీటి కన్న ఈ కమండలం చాలా గొప్పది. కనుక ఈ కమండలమును తీసుకొనుము.

అత్ర యద్వారి శోభిష్ఠం పుణ్యం పావనమేవ చ ।
స్పృష్ట్వా స్మృత్వా చ దృష్ట్వా వా బ్రహ్మన్ పాపాద్విమోక్ష్యసే ॥ 34 ॥

ఓ బ్రహ్మా! దీనిలో నే నీరున్నదో అది బాగా ప్రకాశవంతము, పుణ్యము, పవిత్రమునైనది. దీనిని తాకినా, స్మరించినా, చూచినా పాపమునుండి విముక్తినందగలవు.

ఏవముక్త్వా మహాదేవః ప్రాదాన్మమ కమణ్డలుమ్ ।
తతః సురగణాః సర్వే ముదా ప్రోచుః సురేశ్వరమ్ ॥
ఆహ్లాదశ్చ మహాంస్తత్ర జయశబ్దో వ్యవర్తత ॥ 35 ॥

ఈ విధముగా చెప్పి ఆ మహాదేవుడు నా కా కమండలము నిచ్చాడు. ఆ తరువాత దేవతాగణమంతా సంతోషముగా నా సురేశ్వరునితో ఇలా అన్నారు. చాలా సంతోషముతో వారంతా గూడా గొప్ప జయ జయ ధ్వానములు చేశారు.

దేవోత్సవే మాతురహం పదాగ్రం
సమీక్ష్య పాపాత్పతితత్వమాప ।
ప్రాదాత్కృపాలుః స్మరణాత్పవిత్రాం
గంగాం పితా పుణ్యకమండలుస్థామ్ ॥ 36 ॥

ఈ దేవోత్సవమునందు పార్వతీ మాత పాదాగ్రమును చూచి నేను పాపముతో పతితుడనైతిని. దయగల ఆ తండ్రి స్మరించినంత మాత్రముననే పవిత్రముగా చేయు శక్తిగల కమండలమునందున్న గంగను నా కనుగ్రహించాడు.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే గంగోత్పత్తౌ 'బ్రహ్మకమణ్డలు దానం' నామ తృతీయోఽధ్యాయః ॥ 3 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి స్వయమ్భు నారద సంవాదంలోని గంగోత్పత్తియందు బ్రహ్మకు పరమశివుడు కమండల మిచ్చుట అను పేరు గల మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

గంగాయాః మహేశ్వరజటాగమననిరూపణమ్ - గంగ మహేశ్వరుని జడలలో ప్రవేశించుట

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

కమణ్డలు స్థితా దేవీ తవ పుణ్యవివర్ధినీ ।
యథా మర్త్యం గతా నాథ తన్మే విస్తరతో వద ॥ 1 ॥

ఓ ప్రభూ! నీకు పుణ్యములను పెంచు ఈ గంగాదేవి కమండలంలో ఉన్నది. ఎట్లు మర్త్యలోకమునకు వెళ్ళినదో ఆ వృత్తాంతమును నాకు విస్తరించి చెప్పుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

బలిర్నామ మహాదైత్యో దేవారిరపరాజితః ।
ధర్మేణ యశసా చైవ ప్రజాసంరక్షణేన చ ॥ 2 ॥

దేవతలకు శత్రువు, ఓడించ శక్యముగానివాడు అయిన బలి అను పేరు గల మహాదైత్యుడుండినాడు. అతడు ప్రజలను ధర్మమార్గముతో రక్షిస్తూ కీర్తితో నుండినాడు.

గురుభక్త్యా చ సత్యేన వీర్యేణ చ బలేన చ ।
త్యాగేన క్షమయా చైవ త్రైలోక్యే నోపమీయతే ॥ 3 ॥

గురుభక్తియందు, సత్యమునందు, పరాక్రమమునందు, బలమునందు, త్యాగమునందు, క్షమయందీ ముల్లోకములలో నతనికెవరూ సాటిరారు.

తస్యర్ధిమున్నతాం దృష్ట్వా దేవాశ్చిన్తాపరాయణాః ।
మిథః సమూచురమరా జేష్యామో వై కథం బలిమ్ ॥ 4 ॥

అతని ఔన్నత్యమును, వృద్ధిని చూచిన దేవతలు చింతాక్రాంతులై మనమీ బలినెట్లు జయించగలమని పరస్పరం మాట్లాడుకొనుచుండిరి.

తస్మిన్ శాసతి రాజ్యం తు త్రైలోక్యం హతకణ్టకమ్ ।
నారయో వ్యాధయో వాఽపి నాఽఽధయో వా కథంచన ॥ 5 ॥

అతడు రాజ్యము నేలుచుండగా ముల్లోకములందాతనికి ఎదురు లేకుండెను. అతని రాజ్యములో శత్రువులుగాని, వ్యాధులుగాని, మనోవ్యథలుగాని లేకుండెను.

అనావృష్టిరధర్మో వా నాస్తి శబ్దో న దుర్జనః ।
స్వప్నేఽపి నైవ దృశ్యేత బలౌ రాజ్యం ప్రశాసతి ॥ 6 ॥

బలి రాజ్యము నేలుచుండగా అనావృష్టి, అధర్మము అనే మాట వినబడదు. అక్కడ దుర్జనుడను మాట కలలో కూడా కనిపించదు.

తస్యోన్నతిశరైర్భగ్నాః కీర్తిఖడ్గద్విధాకృతాః ।
తస్యాఽఽజ్ఞాశక్తిభిన్నాంగా దేవా శ్శర్మ న లేభిరే ॥ 7 ॥

అతని పెరుగుదల అనే బాణాలచేత భంగపడి కీర్తి అనే ఖడ్గముచే రెండుగా చీల్చబడి, అతని ఆజ్ఞాశక్తితో భిన్నాంగులైన దేవతలు సుఖమును పొందలేక పోయిరి.

తతః సంమంత్రయామాసుః కృత్వా మాత్సర్యమగ్రతః ।
తద్యశోఽగ్ని ప్రదీప్తాంగా విష్ణుం జగ్ముః సువిహ్వలాః ॥ 8 ॥

అతని కీర్తియనే అగ్నిజ్వాలలతో కాల్చబడినవారై, మాత్సర్యముతో కూడి తమలో తాము చర్చించుకొని విలవిలలాడి విష్ణువు వద్దకు వెళ్ళారు.

దేవా ఊచుః :- దేవతలిలా అన్నారు.

ఆర్తాః స్మ జగతామీశ శంఖచక్రగదాధర ।
అస్మదర్థే భవాన్నిత్యమాయుధాని బిభర్తి చ ॥ 9 ॥

ఓ జగత్ప్రభూ! శంఖ చక్ర గదాధరా! మేం ఆర్తులమై యున్నాము. మా రక్షణకే కదా సర్వదా నీవు ఆయుధములను ధరించి ఉంటున్నావు.

త్వయి నాథే జగన్నాథాప్యస్మాకం దుఃఖమీదృశమ్ ।
త్వాం వై ప్రణమతాం శీర్షం కథం దైత్యం నమస్యతి ॥ 10 ॥

ఓ జగన్నాథా! నీవు ప్రభువైయుండగా మా కిటువంటి దుఃఖ మేల? నీకు నమస్కరించే మా శిరస్సు ఆ దైత్యుని ముందెలా నమస్కారముతో వంగుతుంది?

మనసా కర్మణా వాచా త్వామేవ శరణం గతాః ।
త్వదంఘ్రి శరణాః సన్తః కథం దైత్యం నమేమహి ॥ 11 ॥

మనో వాక్కాయ కర్మలతో నిన్నే శరణు పొందితిమి. నీ పాదయుగళమునే శరణు పొందియుండగా ఆ దైత్యున కెలా నమస్కరిస్తాము?

యజామస్త్వాం మహాయజ్ఞైర్వదామో వాగ్భిరచ్యుత ।
త్వదేకశరణాః సన్తః కథం దైత్యం నమేమహి ॥ 12 ॥

ఓ అచ్యుతా! నీ గూర్చే మహా యజ్ఞములను చేయుచున్నాము. మా మాటలచే నిన్నే కీర్తించుచున్నాము. నిన్నొక్కనినే శరణు పొందియున్న మేము దైత్యునికెలా నమస్కరించగలము?

త్వద్వీర్యమాశ్రితా నిత్యం దేవాః సేంద్రపురోగమాః ।
త్వయా దత్తం పదం ప్రాప్య కథం దైత్యం నమేమహి ॥ 13 ॥

ఇంద్రుని ముందుపెట్టుకొని నడిచే దేవతలందరు నీ పరాక్రమమునే నిత్యమూ ఆశ్రయించేవారు. నీవు దయతో దానం చేసిన పదవిని పొందిన ఆ దైత్యున కెలా నమస్కరిస్తాము?

స్రష్టా త్వం బ్రహ్మమూర్త్యా తు విష్ణుర్భూత్వా తు రక్షసి ।
సంహర్తా రుద్ర శక్త్యా త్వం కథం దైత్యం నమేమహి ॥ 14 ॥

నీవు బ్రహ్మ స్వరూపముతో సృష్టికార్యమును చేయుచున్నావు. విష్ణురూపుడవై రక్షించుచున్నావు. రుద్రశక్తితో లయము చేయుచున్నావు. మేమా దైత్యునకెలా నమస్కరిస్తాము?

ఐశ్వర్యం కారణం లోకే వినైశ్వర్యం తు నిష్ఫలమ్ ।
హతైశ్వర్యాః సురేశాన కథం దైత్యం నమేమహి ॥ 15 ॥

ఈ లోకమునందన్నిటికీ కారణం ఐశ్వర్యం. ఐశ్వర్యం లేకుంటే అంతా నిష్ఫలమే. ఓ దేవతలకు ప్రభువైనవాడా! ఈ దేవతల మందరమిప్పుడు ఐశ్వర్యహీనులము. దైత్యున కెలా నమస్కరిస్తాము?

అనాదిస్త్వం జగద్ధాతరనన్తస్త్వం జగద్గురుః ।
అన్తవన్తమము శత్రుం కథం దైత్యం నమేమహి ॥ 16 ॥

ఓ లోకసృష్టికర్తా! నీవు ఆది లేనివాడవు, నీవు అనంతడవు, జగత్తునకంతా గురుడవు నీవు. మరణించు స్వభావముగల శత్రువైన ఈ దైత్యున కెలా నమస్కరిస్తాము?

తవైశ్వర్యేణ పుష్టాంగా జిత్వా త్రైలోక్యమోజసా ।
స్థిరాః స్యామః సురేశాన కథం దైత్యం నమేమహి ॥ 17 ॥

నీ ఐశ్వర్యముతో బలిష్ఠులమైన మేము పరాక్రమముతో ముల్లోకములను జయించి స్థిరంగా ఉంటాం. మేమెలా దైత్యునకు నమస్కరిస్తాము?

బ్రహ్మోవాచ :–బ్రహ్మ పలికాడు.

ఇత్యేతద్దేవవచనం శ్రుత్వా దైతేయసూదనః ।
ఉవాచ సర్వానమరాన్ దేవానాం కార్యసిద్ధయే ॥ 18 ॥

ఈ విధముగా పలికిన దేవతల మాటలను విని ఆ దైతేయ సూదనుడు(అనగా దితియొక్క గర్భమునందు పుట్టినవారిని మట్టు పెట్టేవాడు) దేవతల కార్యము సిద్ధించుట కొరకు ఆ దేవతలందరితో ఇలా అన్నాడు.

వాసుదేవ ఉవాచ :– వాసుదేవుడు పలికాడు.

మద్భక్తోఽసౌ బలిర్దైత్యో హ్యజయోఽసౌ సురాసురైః ।
యథా భవన్తో మత్పోష్యాస్తథా పోష్యో బలిర్మమ ॥ 19 ॥

ఈ దైత్యుడైన బలి నా భక్తుడు. ఇతనిని సురాసురులు జయించలేరు. మీరెట్లు నాచే పోషింపదగినవారో అట్లే బలి కూడా పోషింపదగినవాడు.

వినా చ సంగరం దేవా హృత్వా రాజ్యం త్రివిష్టపమ్ ।
బలిం నిబధ్య మంత్రోక్త్యా రాజ్యం వః ప్రదదామ్యహమ్ ॥ 20 ॥

ఓ దేవతలారా! యుద్ధము లేకుండానే ఒక చక్కని ఆలోచనాపరమైన మాటతో బలిని, బంధించి, స్వర్గలోక రాజ్యమును హరించి, ఆ రాజ్యమును నేను మీకీయగలను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా సురగణాః సంజగ్ముర్దివమేవ చ ।
భగవానపి దేవేశో హ్యదిత్యా గర్భమావిశత్ ॥ 21 ॥

సరే అట్లే కానిమ్మని దేవతాగణాలన్నీ స్వర్గమునకు వెళ్ళారు. దేవేశుడైన ఆ భగవానుడు అదితి గర్భమున ప్రవేశించాడు.

తస్మిన్నుత్పద్యమానే తు ఉత్సవాశ్చ బభూవిరే ।
జాతోఽసౌ వామనో బ్రహ్మన్ యజ్ఞేశో యజ్ఞపూరుషః ॥ 22 ॥

అతని పుట్టుకను గూర్చి ఉత్సవములు జరిగెను. ఓ పూజ్యుడా! యజ్ఞేశుడు, యజ్ఞపురుషుడైన శ్రీమహావిష్ణువు వామనుడై పుట్టాడు.

ఏతస్మిన్నంతరే బ్రహ్మన్ హయమేధాయ దీక్షితః ।
బలిర్బలవతాం శ్రేష్ఠ ఋషిముఖ్యైః సమాహితః ॥ 23 ॥

బ్రహ్మర్షీ! ఇంతలో బలవంతులలో శ్రేష్ఠుడైన ఆ బలి అశ్వమేధయాగము చేయుటకై దీక్ష తీసికొని ఋషులందరితో సమావేశమయ్యాడు.

పురోధసా చ శుక్రేణ వేదవేదాంగవేదినా ।
మఖే తస్మిన్వర్తమానే యజమానే బలౌ తథా ॥ 24 ॥

వేదాలు వేదాంగాలు తెలిసినవాడైన శుక్రుడా యాగమునందు పురోహితునిగా నుండగా అట్లే బలి యజమానిగా నున్నాడు.

ఆర్త్విజ్యే ఋషిముఖ్యే తు శుక్రే తత్ర పురోధసి ।
హవిర్భాగార్థ మాసీనే దేవగంధర్వపన్నగే ॥ 25 ॥

అక్కడ శుక్రుడు పురోతునిగా నుండి ఆ యాగమునందు ఋత్విక్కుగా ఋషిముఖ్యునిగా ముఖ్య భూమికను చేయుచుండగా హవిర్భాగమును తీసుకొనుటకు దేవతలు, గంధర్వులు, పన్నగులు ఉచితాసనముల నలంకరించగా

దీయతాం భుజ్యతాం పూజా క్రియతాం చ పృథక్ పృథక్ ।
పరిపూర్ణం పునః పూర్ణమేవం వాక్యే ప్రవర్తతి ॥ 26 ॥

అక్కడ ఆ సమయమున చాలా కోలాహలముగా నుండినది. కొందరు ఇవ్వండి, తినండి తినండి, పూజ చేయండి ఆ అయిపోయింది. ఆ ఆ పూర్తయింది అంటూ మాటి మాటికి ఇటువంటి మాటలే విన బడుచుండగా.

శనైస్తద్దేశమభ్యాగాద్వామనః సామగాయనః ।
యజ్ఞవాటమనుప్రాప్తో వామనశ్ఛత్రకుణ్డలః ॥ 27 ॥

అక్కడికి సామగానమును చేస్తూ మెల్లగా వామనుడు వచ్చాడు. ఆ యజ్ఞవాటికకు వచ్చిన వామనుడు ఛత్రము, కుండలములను ధరించి యున్నాడు.

ప్రశంసమానస్తం యజ్ఞం వామనం ప్రేక్ష్య భార్గవః ।
బ్రహ్మరూపధరం దేవం వామనం దైత్యసూదనమ్ ॥ 28 ॥

ఆ యజ్ఞమును కొనియాడుచున్న వామనుని శుక్రాచార్యుడుచూచి, బ్రాహ్మణవేషం ధరించి దైత్యులను నశింపచేయు దేవుడైన వామనుని.

దాతారం యజ్ఞతపసాం నిహన్తారం చ రక్షసామ్ ।
జ్ఞాత్వా త్వరన్నథోవాచ రాజానం భూరితేజసమ్ ॥ 29 ॥

తపో యజ్ఞములకు ఫలితము నిచ్చే వానిని, రాక్షసులను సంహరించే వానినిగా తెలుసుకొని తొందర పడుతూ గొప్పతేజస్సు గలిగిన బలిచక్రవర్తితో ఇలా అన్నాడు.

జేతారం క్షత్రధర్మేణ దాతారం భక్తితో ధనమ్ ।
బలిం బలవతాం శ్రేష్ఠం సభార్యం దీక్షితం మఖే ॥ 30 ॥

క్షత్రియధర్మముతో జయించువాడు, భక్తితో ధనమును దానము చేయువాడు, బలవంతులలో శ్రేష్ఠుడైనవాడు, భార్యతో కలిసి యజ్ఞమునందు దీక్షతోనున్నట్టి బలిని

ధ్యాయన్తం యజ్ఞపురుషముత్సృజన్తం హవిః పృథక్ ।
తమాహ భృగుశార్దూలః శుక్రః పరమబుద్ధిమాన్ ॥ 31 ॥

యజ్ఞపురుషుని ధ్యానిస్తున్నవాడు, హవిస్సును మరల మరల యిచ్చి పైకి జ్వాలలను సృష్టించుచున్న వాడునైన బలితో భృగువంశములో శ్రేష్ఠుడు, పరమబుద్ధిమంతుడునైన శుక్రుడిలా అన్నాడు.

శుక్ర ఉవాచ :– శుక్రుడు పలికాడు.

యోఽసౌ తవ మఖం ప్రాప్తో బ్రాహ్మణో వామనాకృతిః ।
నాసౌ విప్రో బలే సత్యం యజ్ఞేశో యజ్ఞభావనః ॥ 32 ॥

ఓ బలిచక్రవర్తీ! ఈ నీ యజ్ఞము దగ్గరకు వామనాకృతిలో బ్రాహ్మణునిగా వచ్చినవాడు విప్రుడు కాడు. ఇతడు సాక్షాత్తుగా యజ్ఞాన్ని భావన చేసేవాడూ, యజ్ఞానికి ప్రభువూ అయినవాడు. (విష్ణువే) ఇది సత్యము.

స తు త్వాం యాచితుం ప్రాప్తో యః పరః పరతః పుమాన్ ।
మయా చ సహ సంమన్త్ర్య పశ్చాద్దేయం త్వయా ప్రభో ॥ 33 ॥

ఎవడైతే పరమున కంటె కూడా పరముగా నుండే పరమపురుషుడో అతడే నిన్ను యాచించుటకు వచ్చిన వాడు. ఓ ప్రభూ! నీవు నాతో ఆలోచించిన తరువాతనే అతనికి దానము నీయవలయును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు

బలిస్తు భార్గవం ప్రాహ పురోధసమరిందమః ॥ 34 ॥

శత్రువులను జయించేవాడైన బలి పురోహితుడైన శుక్రునితో ఇలా అన్నాడు.

బలి రువాచ :– బలిచక్రవర్తి పలికాడు.

ధన్యోఽహం మమ యజ్ఞేశో గృహమాయాత్యచిన్తితః ।
ఆగత్య యాచతే కించిత్ కిం విచార్యం మమాధునా ॥ 35 ॥

నేనే మాత్రము తలువకుండానే యజ్ఞేశుడు నా ఇంటికి వచ్చు చున్నాడు. నేను ధన్యుడను. పైగా వచ్చి నన్ను కొంచము యాచించుచున్నాడు. ఇక నేను ఇప్పుడు విచారించవలసిన దేమున్నది?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్తః సభార్యోఽసౌ శుక్రేణ చ పురోధసా ।
జగామ యత్ర విప్రేన్ద్రో వామనోఽదితినన్దనః ॥ 36 ॥

ఈ విధముగా అని భార్యతోగూడ ఆ బలిచక్రవర్తి పురోహితుడైన శుక్రుని ముందుంచుకొని ఎక్కడైతే అదితి కుమారుడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అయిన వామనుడున్నాడో అక్కడికి వెళ్ళాడు.

కృతాంజలిపుటో భూత్వా కిమర్థం త్వం తు తద్వద ।
వామనోఽపి తదా ప్రాహ పదత్రయమితాం భువమ్ ॥ 37 ॥

నివేశనాయ సందేయా నాన్యదిచ్ఛామి కించన ।
తథేత్యుక్త్వా తు కలశాన్నానారత్నవిభూషితాత్ ॥ 38 ॥

వారిధారాం పురస్కృత్య వామనాయ భువం దదౌ ।
పశ్యత్సు ఋషిముఖ్యేషు శుక్రే చైవ పురోధసి ॥ 39 ॥

చేతులను జోడించి నమస్కరిస్తూ నీకేధనము కావాలని వచ్చావో చెప్పు అన్నాడు. అప్పుడు వామనుడు మూడడుగుల పరిమితమగు స్థలమును నేను ఉండటానికి ఇవ్వవలెనని కోరాడు ఇంతకన్న నేను దేనిని కోరను

అని అన్నాడు. అప్పుడా బలి చక్రవర్తి సరే యని నానా రత్నములచే అలంకరించబడిన కలశమునుండి ముఖ్యులైన ఋషులందరూ, పురోహితుడైన శుక్రుడు చూస్తుండగా జలధారాపూర్వకముగా వామనునకు కోరిన స్థానమును దానము చేశాడు.

పశ్యత్సు దేవముఖ్యేషు వామనాయ భువం దదౌ ।
పశ్యత్సు దైత్యసంఘేషు జయశబ్దో వ్యవర్తత ॥ 40 ॥

దేవతాముఖ్యలు చూస్తుండగా, దైత్య సంఘములు చూస్తుండగా బలిచక్రవర్తి వామనుడడిగిన భూమిని దానము చేశాడు. అప్పుడు జయ జయ ధ్వానములు మార్మోగినాయి.

శనైస్తు వామనః ప్రాహ స్వస్తి రాజన్ సుఖీ భవ ।
దేహి మే సంమితాం భూమిం త్రిపదం యత్ప్రతిశ్రుతమ్ ॥ 41 ॥

అప్పుడు వామనుడు మెల్లగా ఇలా అన్నాడు. ఓ రాజా! నీకు శుభమగుగాక! నీవు సుఖముగా నుండుము. నీవిస్తానన్న మూడడుగుల పరిమితమైన భూమిని నాకివ్వు.

గృహ్యతాముక్త మాత్రే తు యద్వృత్తం తన్నిశామయ ।
తథేత్యువాచ దైత్యేశో యావత్పశ్యతి వామనమ్ ॥ 42 ॥

అప్పుడా బలి చక్రవర్తి తీసికొనుమని అనగానే యేమి జరిగెనో దానిని వినుము. అట్లే అని బలి అనెను. తరువాత వామనుని చూచుచుండగనే

వవృధే యజ్ఞపురుషశ్చన్ద్రాదిత్యౌ స్తనాన్తరే ।
యథా స్యాతాం సురా మూర్ధ్ని వవృధే విక్రమాకృతిః ॥ 43 ॥

అనన్తశ్చాచ్యుతో దేవో లోకకర్తా జగన్మయః ।
తం దృష్ట్వా దైత్యరాట్ ప్రాహ సభార్యో వినయాన్వితః ॥ 44 ॥

ఆ యజ్ఞపురుషుడు సూర్యచంద్రులు వక్షఃస్థల మధ్యము నందున్నట్లుగా, దేవతలు తలభాగమునందున్నట్లుగా అంతం లేనివాడూ, నాశనం లేనివాడూ, స్వయంగా ప్రకాశించేవాడూ, లోకాన్ని సృష్టించినవాడూ, జగత్తునంతా వ్యాపించిన వాడూ అయిన వామనుడు పరాక్రమంతో కూడిన ఆకారం కలవాడై పెరిగాడు. ఆ వామనుని చూచి భార్యతో కలిసియున్న దైత్యరాజగు బలిచక్రవర్తి వినయముతో ఇలా అన్నాడు.

బలిరువాచ :– బలిచక్రవర్తి పలికాడు.

క్రమస్వ విష్ణో లోకేశ యావచ్ఛక్తి జగన్మయ ।
జితం మయా సురేశాన సర్వభావేన విశ్వకృత్ ॥ 45 ॥

ఓ విష్ణూ! లోకేశ్వరా! జగద్వ్యాపీ! జగన్మయా! నీ శక్తి యున్నంతవరకు ఆక్రమించు. ఓ సురేశ్వరా! మనో వాక్కాయ కర్మలన్నింటితోనూ నేను విశ్వకర్తవైన నిన్ను జయించాను.

తద్వాక్యసమకాలం చ శుక్రోఽప్యాహ భృశం తదా ।
నిర్వాపితోఽసి రాజేంద్ర మయా బుద్ధ్వా యతః పురా ॥
తద్వాక్యసమకాలం తు విష్ణుః ప్రాహ మహాక్రతుః ॥ 46 ॥

ఆ మాట విన్నంతనే శుక్రాచార్యుడు ఓ రాజేంద్రా! నాచేత ప్రజ్ఞతో ముందుగా హెచ్చరించబడినప్పటికీ నీవు దానము చేశావు. అని అనగా వెంటనే మహాక్రతువగు విష్ణువు ఇలా అన్నాడు.

విష్ణురువాచ :– విష్ణువు పలికాడు.

దైత్యేశ్వర మహాబాహో క్రమిష్యే పశ్య దైత్యరాట్ ।
ఏవం వదన్తం స ప్రాహ క్రమ విష్ణో పునః పునః ॥ 47 ॥

ఓ దైత్యరాజా! చూడు, ఓ మహాబాహూ! దైత్యేశ్వరా! ఆక్రమించగల ననగా ఇలా పలుకుతున్న విష్ణువు మాటలు విని బలిచక్రవర్తి ఇంకా ఇంకా ఆక్రమించు అన్నాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

కూర్మపృష్ఠే పదం న్యస్య బలియజ్ఞే పదం న్యసత్ ।
ద్వితీయం తు పదం ప్రాదాన్మమలోకే సనాతనమ్ ॥ 48 ॥

ఒక అడుగును బలి యజ్ఞశాలతో కూడిన కూర్మపృష్ఠంపైనతాబేలు వీపువంటి భూమిపైన ఉంచాడు. సనాతనమైన రెండవ పాదమును నా లోకమునం దుంచాడు.

తృతీయస్య పదస్యాత్ర స్థానం నాస్త్యసురేశ్వర ।
క్వ క్రమిష్యే భువం దేహి బలిం తం హరిరబ్రవీత్ ॥
విహస్య బలిరప్యాహ సభార్యః స కృతాంజలిః ॥ 49 ॥

ఓ రాక్షసరాజా! మూడవ పాదమునుంచుట కిక్కడ స్థానము లేదు. నేనెక్కడ ఆక్రమించాలో ఆ స్థలము నివ్వుమని ఆ బలిని హరి యడిగాడు. అప్పుడా బలి నవ్వి భార్యతో కలసి నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

బలిరువాచ :– బలిచక్రవర్తి పలికాడు.

త్వయా సృష్టం జగత్సర్వం న స్రష్టాఽహం సురేశ్వర ।
త్వద్దోషాదల్పమభవత్కిం కరోమి జగన్మయ ॥ 50 ॥

ఓ సురేశ్వరా! ఈ జగత్తంతయు నీవు సృష్టించినదే. నేను సృష్టించిన వానిని కాదు. ఓ జగన్మయా! నీ తప్పు వలననే ఇది అల్పమైనది నే నేమి చేయుదును?

తథాఽపి నానృతం పూర్వం కదాచిత్ వచ్మి కేశవ ।
సత్యవాక్యం చ మాం కుర్వన్మత్పృష్ఠే హి పదం న్యస ॥ 51 ॥

అయినప్పటికి ఓ కేశవా! నే నెప్పుడూ అబద్ధమాడను. నన్ను సత్యవాక్పరిపాలకునిగా చేస్తూ నా పృష్ఠమునందు నీ పాదమునుంచుము.

తతః ప్రసన్నో భగవాన్ త్రయీమూర్తిః సురార్చితః ।
వరం వృణీష్వ భద్రం తే భక్త్యా ప్రీతోఽస్మి దైత్యరాట్ ॥ 52 ॥

అప్పుడు దేవతలచే పూజింపబడువాడూ, వేదరూపుడూ, భగవంతుడూ అయిన నారాయణుడు ప్రసన్నుడై ఓ దైత్యరాజా! నీ భక్తికి ప్రీతిచెందాను. నీకు శుభము కలుగుగాక! వరమును కోరుకో అన్నాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

స తు ప్రాహ జగన్నాథం న యాచే త్వాం త్రివిక్రమ ।
స తు ప్రాదాత్ స్వయం విష్ణుః ప్రీతః సన్మనసేప్సితమ్ ॥ 53 ॥

అప్పుడా బలిచక్రవర్తి జగన్నాథునితో త్రివిక్రమా! నేను నిన్ను యాచించనన్నాడు. అప్పుడు విష్ణువు సంతోషించిన వాడై స్వయంగా బలి మనోవాంఛితాన్ని దీర్చాడు.

రసాతలపతిత్వం చ భావి చేంద్ర పదం పునః ।
ఆత్మాధిపత్యం చ హరిరవినాశి యశో బహు ॥ 54 ॥

శ్రీహరి బలి చక్రవర్తికి, పాతాలలోక ప్రభుత్వాన్ని, రాబోవు కాలములో ఇంద్ర పదవినీ, తిరిగి ఆత్మాధిపత్యమును, నశించని యశస్సును

ఏవం దత్వా బలేః సర్వం ససుతం భార్యయాఽన్వితమ్ ।
రసాతలే హరిః స్థాప్య బలిం త్వమరవైరిణమ్ ॥ 55 ॥

ఈ విధముగా బలిచక్రవర్తి కన్ని వరములనిచ్చి, ఆ దేవతల శత్రువైన బలిని అతని భార్యాబిడ్డల నందరితో గూడ రసాతలమునందు నిలిపి,

శతక్రతోస్తథా ప్రాదాత్సురరాజ్యం యథాభవమ్ ।
ఏతస్మిన్నన్తరే తత్ర పదం ప్రాగాత్సురార్చితమ్ ॥ 56 ॥

దేవేంద్రునకు దేవరాజ్యాన్ని పూర్వం ఉన్నట్లుగా ఇచ్చాడు. ఇంతలో అక్కడ దేవతలందరి చేత పూజించబడే పాదము వచ్చింది.(వెళ్ళింది.)

ద్వితీయం తత్పదం విష్ణోః పితుర్మమ మహామతే ।
యత్పదం సమనుప్రాప్తం గృహం దృష్ట్వాఽప్యచిన్తయమ్ ॥ 57 ॥

ఓ గొప్పజ్ఞానీ! నా తండ్రియైన విష్ణుమూర్తియొక్క ఏ రెండవ పాదమైతే ఉందో అది నా ఇంటికి (లోకమునకు) వచ్చుటను చూచి నేనలా అనుకొన్నాను.

కిం కృత్యం యచ్ఛుభం మే స్యాత్పదే విష్ణోః సమాగతే ।
సర్వస్వం చ సమాలోక్య శ్రేష్ఠో మే స్యాత్కమణ్డలుః ॥ 58 ॥

ఈ విష్ణుపాదము నా దగ్గరకు వచ్చుటకు నేనేమిచేసితిని? నాకే శుభము కలుగును? దీనినంతటిని చూస్తే నా కమండలము శ్రేష్ఠమైనది కావచ్చు.

తద్వారి యత్పుణ్యతమం దత్తం చ త్రిపురారిణా ।
వరం వరేణ్యం వరదం శాన్తం శాన్తికరం పరమ్ ॥ 59 ॥

ఏది పుణ్యతమమైన జలమో దానిని నాకు శివుడు ఇచ్చాడు. శ్రేష్ఠమైనది, ముఖ్యమైనది, వరములనిచ్చేది, శాంతమైనది, శాంతినిచ్చెది, పరమైనదీ జలము.

శుభం చ శుభదం నిత్యం భుక్తిముక్తిప్రదాయకమ్ ।
మాతృస్వరూపం లోకానామమృతం భేషజం శుచి ॥ 60 ॥

ఈ జలము శుభమైనది, శుభములనిచ్చునది, నిత్యమైనది, భుక్తిముక్తులనిచ్చునది, లోకముల కన్నింటికి మాతృ స్వరూపమైనది, అమృతముతో సమానమైనది, మందు వంటిది, శుచియైనది.

పవిత్రం పావనం పూజ్యం జ్యేష్ఠం శ్రేష్ఠం శుభావహమ్ ।
స్మరణాదేవ లోకానాం పావనం కిం ను దర్శనాత్ ॥ 61 ॥

పవిత్రమైనది, పావనమైనది, పూజించదగినది, గౌరవించదగినది, శ్రేష్టమైనది, శుభములను కల్గించునది. స్మరించినంత మాత్రముననే లోకములను పావనముచేయు ఈ జలము ఇక చూచినందు వలన జరిగే ఫలితము గూర్చి చెప్పవలసినదేమున్నది?

తాదృగ్వారి శుచిర్భూత్వా కల్పయేఽర్ఘాయ మే పితుః ।
ఇతి సంచిన్త్య తద్వారి గృహీత్వాఽర్ఘాయ కల్పితమ్ ॥ 62 ॥

అటువంటి నీటిని శుచినై నా తండ్రికి అర్ఘ్యముగా నిస్తాను. అని అనుకొని ఆ నీటిని తీసుకొని విష్ణువు (వామనునకు) అర్ఘ్యముగా చేశాడు.

విష్ణోఃపాదే తు పతితమర్ఘవారి సమన్త్రితమ్ ।
తద్వారి పతితం మేరౌ చతుర్ధా వ్యగమద్భువమ్ ॥ 63 ॥

మంత్రపూర్వకముగా అర్ఘ్యముగానిచ్చిన ఆ నీరు విష్ణువుయొక్క పాదమునందు పడింది. అలా పడిన నీరు మేరు పర్వతమునందు పడి నాలుగు పాయలుగా భూమికి చేరింది.

పూర్వే తు దక్షిణే చైవ పశ్చిమే చోత్తరే తథా ।
దక్షిణే యత్తు పతితం జటాభిః శంకరో మునే ॥ 64 ॥

ఓ మునీ! భూమియందది తూరుపు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిక్కుల యందు పడింది. వాటిలో దక్షిణపు దిక్కున పడిన జలమును శివుడు తన జటాజూటమున గ్రహించాడు.

జగ్రాహ పశ్చిమే యత్తు పునః ప్రాయాత్కమణ్డలుమ్ ।
ఉత్తరే పతితం యత్తు విష్ణుర్జగ్రాహ తజ్జలమ్ ॥ 65 ॥

పడమర దిక్కునకు పడిన నీరు తిరిగి కమండలమును చేరింది. ఉత్తరపు దిక్కున పడిన జలమును విష్ణువు గ్రహించాడు.

పూర్వేఽస్మిన్ ఋషయో దేవాః పితరో లోకపాలకాః ।
జగృహుః శుభదం వారి తస్మాత్ శ్రేష్ఠం తదుచ్యతే ॥ 66 ॥

తూరుపు భాగమున పడిన నీటిని ఋషులు, దేవతలు, పితృదేవతలు, లోకపాలకులు గ్రహించారు. అందు వలననే ఆ నీటిని శుభముల నిచ్చేదిగా, శ్రేష్ఠమైనదిగా చెబుతారు.

యా దక్షిణాం దిశం ప్రాప్తా ఆపో వై లోకమాతరః ।
విష్ణుపాదప్రసృతాస్తా బ్రహ్మణ్యా లోకమాతరః ॥ 67 ॥

విష్ణుపాదమునుండి దక్షిణపు దిక్కునకు ప్రవహించిన నీరు లోకమాతలుగా, బ్రహ్మజ్ఞానము నిచ్చేవి.

మహేశ్వరజటాసంస్థా ఏవం జాతా శుభోదయాః ।
తాసాం ప్రభావస్మరణా త్సర్వకామానవాప్నుయాత్ ॥ 68 ॥

ఇలా పరమశివుడి జటలలో వున్న నీరు శుభములను కలిగించేవిగా పుట్టినవి. వాటి ప్రభావమును స్మరించుట వలన కోరికలన్నీ సిద్ధిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే గంగాయాం మహేశ్వర జటాగమననిరూపణం నామ చతుర్థోఽధ్యాయః. ॥ 4 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి బ్రహ్మనారదసంవాదములోని తీర్థ మాహాత్మ్యమునందు గంగ మహేశ్వరుని జడలలో ప్రవేశించుట అను పేరుగల నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

వినాయక గౌతమ వ్యాపార నిరూపణమ్ - వినాయక గౌతమ వ్యాపార నిరూపణం

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

కమణ్డలుస్థితా దేవీ మహేశ్వరజటాగతా ।
శ్రుతా దేవ యథా మర్త్యమాగతా తద్బ్రవీతు మే ॥ 1 ॥

ఓ దేవా! కమండలంలో వున్న గంగాదేవి (జలము) మహేశ్వరుని జడలలోనికి వెళ్ళినదని విన్నాను. మరి మర్త్యలోకమున కెలా వచ్చినదో నాకు చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మహేశ్వరజటాస్థా యా ఆపో దేవ్యో మహామతే ।
తాసాం చ ద్వివిధో భేద ఆహర్తుర్ద్వయకారణాత్ ॥ 2 ॥

ఓ మహామతీ! మహేశ్వరుని జడలలో నున్న ఆ జలము ఇద్దరి స్వీకర్తల కారణముగా రెండు విధములుగా అయింది.

ఏకాంశో బ్రాహ్మణేనాత్ర వ్రతదానసమాధినా ।
గౌతమేన శివం పూజ్య ఆహృతో లోకవిశ్రుతః ॥ 3 ॥

వానిలో ఒక పాయను వ్రతదానసమాధులను చేసి లోకమునందు పేరు పొందిన గౌతముడనే బ్రాహ్మణుడు శివుని పూజించి తెచ్చుకొనెను (ఆకర్షించెను).

అపరస్తు మహాప్రాజ్ఞ క్షత్రియేణ బలీయసా ।
ఆరాధ్య శంకరం దేవం తపోభిర్నియమై స్తథా ॥ 4 ॥

మహాప్రాజ్ఞా! మరొకటి బలవంతుడైన క్షత్రియుడు తన తపో నియమములతో దేవుడైన శంకరుని ఆరాధించి

భగీరథేన భూపేన ఆహృతోఽంశోఽపరస్తథా ।
ఏవం ద్వైరూప్యమభవద్గంగాయా మునిసత్తమ ॥ 5 ॥

ఓ మునిసత్తమా! ఆ రెండవ అంశమును తెచ్చుకున్నవాడు క్షత్రియరాజైన భగీరథుడు. ఈ విధముగా గంగ రెండు రూపములుగా మారినది.

నారద ఉవాచ:- నారదుడు పలికాడు.

మహేశ్వరజటాస్థా యా హేతునా కేన గౌతమః ।
ఆహర్తా క్షత్రియేణాపి ఆహృతా కేన తద్వద ॥ 6 ॥

మహేశ్వరుని జడల యందున్న దానిని గౌతముడు ఏకారణమున తెచ్చుకొన్నాడు. క్షత్రియుడైన భగీరథుడు ఏ కారణమున తెచ్చుకున్నాడో దానిని నాకు చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాదు.

యథాऽऽనీతా పురా వత్స బ్రాహ్మణేనేతరేణ వా ।
తత్సర్వం విస్తరేణాహం వదిష్యే ప్రీతయే తవ ॥ 7 ॥

నాయనా! పూర్వ కాలమున బ్రాహ్మణుడైన గౌతముడు క్షత్రియుడైన భగీరథుడు దానినెలా తీసుకొని వచ్చినారో అదంతయు నీకు ప్రీతికలిగించుటకు నేను వివరముగా చెబుతాను.

యస్మిన్కాలే సురేశస్య ఉమాపత్న్యభవత్ప్రియా ।
తస్మిన్నేవాభవద్గంగా ప్రియా శంభోర్మహాద్యుతేః ॥ 8 ॥

ఎప్పుడైతే సురేశుడైన శంభునకు పార్వతి ప్రియమైన భార్య అయినదో ఆ సమయములోనే మహా ప్రకాశవంతుడైన ఆ శివునకు గంగ ప్రియరాలైనది.

మమ దోషాపనుత్త్యర్థం చిన్తయానః శివస్తథా ।
ఉమయా సహితః శ్రీమాన్ దేవీం ప్రేక్ష్య విశేషతః ॥ 9 ॥

నా దోషమును తొలగించుటకు ఆలోచించుచున్న శివుడు పార్వతితో కూడి శ్రీమంతుడై, విశేషంగా ప్రియురాలైన గంగా దేవిని చూచి,

రసవృత్తౌ స్థితో యస్మాన్నిర్మమే రసముత్తమమ్ ।
రసికత్వాత్ ప్రియత్వాచ్చ స్త్రైణత్వాత్ పావనత్వతః ॥ 10 ॥

రసికుడైనందున, ప్రియుడైనందున, స్త్రీభావము కల్గియున్నందున, పావనుడైనందున, రసికవృత్తిలో ఉండి ఉత్తమమైన రసోత్పత్తిని చేసెను.

సర్వాభ్యో హ్యధికా ప్రీతిర్గంగాऽభూద్ద్విజసత్తమ ।
ఆత్మనో మస్తకే గంగాం జానాత్యేవ ఉమేతి వై ॥ 11 ॥
తామేవ చిన్తయానోऽసౌ సర్వదాऽऽస్తే మహేశ్వరః ॥

ఓ ద్విజసత్తమా! ఆ శివునికి అందరి కంటె కూడా గంగ ఎక్కువ ఇష్టమైనదాయెను. తన తలమీద ఉన్న గంగను పార్వతి యని భావించుచుండెను. ఈ శివుడెప్పుడూ ఆమెను చింతిస్తూ ఉండేవాడు.

సైవోద్భూతా జటామార్గాత్ కస్మింశ్చిత్కారణాన్తరే ।
స తు సంగోపయామాస గంగాం శంభుర్జటాగతామ్ ॥ 12 ॥

ఒకానొక కారణాంతరం వలన ఆయన యొక్క జటా మార్గము నుండి ఆమెయే ఉద్భవించింది. తన జడలయందున్న గంగను శివుడు దాచి యుంచాడు.

శిరసా విధృతాం జ్ఞాత్వా న శశాక ఉమా తదా ।
సోఢుం బ్రహ్మన్ జటాజూటే స్థితాం దృష్ట్వా పునః పునః ॥ 13 ॥

ఓ బ్రహ్మవిదుడా! జటాజూటమునందున్న దానినీ, తలమీద ధరించబడిన గంగను తెలుసుకొని ఆ పార్వతి అప్పుడు సహించలేకపోయింది. మాటి మాటికి ఆ గంగను చూచి,

అమర్షేణ భవం గౌరీ ప్రాహిణస్వేత్యభాషత ।
నైవాసౌ ప్రాహిణోచ్ఛంభూ రసికో రసముత్తమమ్ ॥ 14 ॥

పార్వతి అసహనంతో గంగను వదిలిపెట్టమని శివునకు చెప్పింది. రసికుడైన శివుడు ఉత్తమరస అయిన గంగను వదిలి పెట్టలేదు.

ఉమా ఉవాచ తద్దుఃఖాదనాథాస్మీతి వై తదా ।
జటాస్వేవ తదా దేవీం గోపయన్తం విమృశ్య సా ॥
వినాయకం జయాం స్కన్దం రహో వచనమబ్రవీత్ ॥ 15 ॥

అప్పుడు ఆ దుఃఖం వలన నేను అనాథనయ్యానని ఉమ అన్నది. జటలయందే గంగను దాచుచున్న శివుని గూర్చి విచారించి ఆ పార్వతి, ఏకాంతంతో వినాయక, జయస్కన్దులతో ఇలా అన్నది.

నైవాయం త్రిదశేశానో గంగాం త్యజతి కాముకః ॥ 16 ॥

కాముకుడైన ఈ శివుడు గంగను వదలడు.

సాఽపి ప్రియా శివస్యాద్య కథం త్యజతి తాం ప్రియామ్ ।
ఏవం విమృశ్య బహుశో గౌరీ చాఽఽహ వినాయకమ్ ॥ 17 ॥

ఇపుడు ఆ గంగ శివునకు ప్రియురాలు. ఆ ప్రియురాలిని ఎలా వదిలి పెడతాడు? ఈ విధముగా పార్వతి అనేక విధములుగా ఆలోచించి వినాయకునితో ఇలా అన్నది.

పార్వత్యువాచ :- పార్వతి పలికింది.

న దేవైర్నాసురైర్యక్షైర్న సిద్ధైర్భవతాఽపి చ ।
న చ భూపైరథాన్యైర్వా స గంగాం త్యజతి ప్రభుః ॥ 18 ॥

దేవతలు, అసురులు, యక్షులు, సిద్ధులు, రాజులు, ఇతరులుగాని చివరకు నీవు ప్రయత్నించినా కూడా ఆ ప్రభువైన శివుడు గంగను వదిలి పెట్టడు.

పునస్తప్స్యామి వా గత్వా హిమవన్తం నగోత్తమమ్ ।
అథవా బ్రాహ్మణైః పుణ్యైస్తపోభిర్హతకల్మషైః ॥ 19 ॥

నేనే పర్వతశ్రేష్ఠమైన హిమవత్పర్వతమునకు వెళ్ళి తపస్సు చేస్తాను. లేదా కల్మషము లేని పుణ్యమైన తపస్సులు చేసిన బ్రాహ్మణుల చేతనైనా ప్రయత్నించగలను.

తైర్వా జటాస్థితా గంగా ప్రార్థితా భువమాప్నుయాత్ ॥ 20 ॥

వారి ప్రార్థనతోనైనా శివుని జటలయందున్న గంగ భూమికి వచ్చుగాక.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా మాతృవాక్యం మాతరం ప్రాహ విఘ్నరాట్ ।
భ్రాత్రా స్కందేన జయయా సమంత్ర్యేహ చ యుజ్యతే ॥ 21 ॥

ఇలా పలికిన తల్లి మాటను విని విఘ్నరాజు తల్లితో ఈ విషయాన్ని గూర్చి సోదరుడైన స్కందునితోనూ, నీ చెలికత్తె అయిన జయతోనూ ఆలోచించిన బాగుండు నన్నాడు.

తత్కుర్మో మస్తకాద్గంగాం యథా త్యజతి మే పితా ।
ఏతస్మిన్నన్తరే బ్రహ్మన్ అనావృష్టిరజాయత ॥ 22 ॥

నా తండ్రి తన తల మీదనున్న గంగను ఏ విధంగా త్యజిస్తాడో అలా చేద్దాము. ఇంతలోనే అనావృష్టి ఏర్పడినది.

ద్వివ్ద్వాదశసమా మర్త్యే సర్వప్రాణిభయావహా ।
తతో వినష్టమభవజ్జగత్ స్థావరజంగమమ్ ॥ 23 ॥

మర్త్యలోకమున సర్వప్రాణులకు భయమును కలిగించే విధంగా ఇరువదినాలుగు సంవత్సరములు అనావృష్టి కలిగింది. ఆ తరువాత స్థావరజంగమాత్మకమైన జగత్తు చాలా నష్టమయింది.

వినా తు గౌతమం పుణ్యమాశ్రమం సర్వకామదమ్ ।
స్రష్టుకామః పురా పుత్ర స్థావరం జంగమం తథా ॥ 24 ॥

నాయనా! అన్ని కోరికలను తీర్చే గౌతమ మహర్షి యొక్క పవిత్రమైన ఆశ్రమము తప్ప అంతా నశించింది. పూర్వమున్నట్లు స్థావరజంగమములను సృష్టించుటకు కోరిక కలవాడై

కృతో యజ్ఞో మయా పూర్వం స దేవజనో గిరిః ।
మన్నామా తత్ర విఖ్యాతస్తతో బ్రహ్మగిరిః సదా ॥ 25 ॥

నేనింతకు ముందు యజ్ఞముచేసిన ప్రదేశము దేవజనమను పేరుగలది. ఇప్పుడా పర్వతము నా పేరుతో సర్వదా బ్రహ్మగిరి యని ప్రఖ్యాతి పొందినది.

తమాశ్రిత్య నగశ్రేష్ఠం సర్వదాऽऽస్తే స గౌతమః ।
తస్యాऽऽశ్రమే మహాపుణ్యే శ్రేష్ఠే బ్రహ్మగిరౌ శుభే ॥ 26 ॥

ఆ పర్వత శ్రేష్ఠమునాశ్రయించి గౌతముడెప్పుడూ అక్కడే ఉంటాడు. ఆ శుభకరమైన, మహాపుణ్యప్రదమైన, శ్రేష్ఠమైన బ్రహ్మగిరియందున్న ఆ గౌతమమహర్షి ఆశ్రమంలో,

ఆధయో వ్యాధయో వాऽపి దుర్భిక్షం చాऽప్యవర్షణమ్ ।
భయశోకౌ చ దారిద్ర్యం న శ్రూయన్తే కదాచన ॥ 27 ॥

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికములగునవి అనగా యక్ష రాక్షస పిశాచములు కలిగించే మానసిక బాధలుగాని, వ్యాఘ్ర సర్పాదుల వల్లగాని పంచ భూతములవల్ల కలిగే బాధగాని, అగ్ని వాయ్వాది దేవతా ప్రేరితముగా వచ్చే బాధలుగాని, రోగములుగాని, దుర్భిక్షములు గాని, అనావృష్టికాని, భయ శోకములుగాని, దారిద్ర్య బాధగాని అక్కడ ఎప్పుడూ వినబడవు.

తదాశ్రమం వినాऽన్యత్ర హవ్యం వా కవ్యమేవ వా ।
నాస్తి పుత్ర తథా దాతా హోతా యష్టా తథైవ చ ॥ 28 ॥

నాయనా! పితృదేవతలకు సమర్పించే పిండాది అన్నములు, దేవతలకి సమర్పించే హవిస్సులకుగానీ స్థానమా ఆశ్రమము తప్ప మరొకటి లేదు. గౌతముని వంటి దాతగాని, యజ్ఞములు చేయు హోతగాని, యిష్టులను చేయువాడుగాని మరొకడు లేడు.

యదైవ గౌతమో విప్రో దదాతి చ జుహోతి చ ।
తదైవాప్యాయనం స్వర్గే సురాణామపి నాన్యథా ॥ 29 ॥

ఎప్పుడైతే గౌతముడు దానములు, యజ్ఞములు చేస్తాడో, అప్పుడే స్వర్గములో ఉండే దేవతలకు సంతృప్తి గలుగుతుంది. మరొకవిధంగా కలుగదు.

దేవలోకేऽపి మర్త్యే వా శ్రూయతే గౌతమో మునిః ।
స ఏవ దాతా భోక్తా చ స ఏ వేతి విదుర్జనాః ॥ 30 ॥

ఆ గౌతముడే దాత, భోక్త యని జనులందరకు తెలుసును. దేవలోకంలోనూమర్త్యలోకంలోనూ ఆ గౌతమముని అందరికీ ప్రసిద్ధుడు.

తచ్ఛ్రుత్వా మునయః సర్వే నానాశ్రమనివాసినః ।
గౌతమాశ్రమమాపృచ్ఛన్నాగచ్ఛన్తి తపోధనాః ॥ 31 ॥

ఆ ప్రశంసను విన్న మునులందరు, తపోధనులైనవారు, అనేక ఆశ్రమములందుండేవారు గౌతమ మహర్షి ఆశ్రమమెక్కడ అని అడుగుతూ అక్కడికి వస్తారు.

తథా మునీనాం సర్వేషామాగతానాం స గౌతమః ।
శిష్యవత్పుత్రవద్భక్త్యా పితృవత్పోషకోऽభవత్ ॥ 32 ॥

అట్లు వచ్చిన ఆ మునులందరికి గౌతమ మహర్షి కుమారునివలె, శిష్యునివలె, తండ్రివలె భక్తితో పోషకునిగా ఉండెడివాడు.

యస్య యచ్చేప్సితం కామం యథా యోగ్యం యథాక్రమమ్ ।
యథాऽనురూపం సర్వేషాం శుశ్రూషామకరోన్మునిః ॥ 33 ॥

ఏది ఎవరికి కావలయునో, ఏదెవరికి యోగ్యమైనదో ఎవరికే క్రమంలో చేయాలో దానికనుగుణముగా ఆ గౌతముడు మునులందరకు తగినవిధముగా శుశ్రూష చేశాడు.

ఆజ్ఞయా గౌతమస్యాఽఽసన్నోషధ్యో లోకమాతరః ।
ఆరాధితాః పునస్తేన బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥ 34 ॥

గౌతముని ఆజ్ఞానుసారముగ లోకమాతలగు ఓషధులు ప్రవర్తించు చుండెడివి. తిరిగి ఆ గౌతముడు బ్రహ్మవిష్ణు మహేశ్వరుల నారాధించెడివాడు.

అజాయన్త తదోషధ్యో భుజ్యన్తే చ తథైవ హి ।
సంకల్ప్యన్తే తద్గోప్యన్తే గౌతమస్య తపోబలాత్ ॥ 35 ॥

ఆ ఓషధులన్నీ అక్కడే పుట్టేవి, సంకల్పించగానే వచ్చేవి, అవే ఆహారముగా నయ్యేవి తిరిగి రహస్యముగా నుండేవి.

సర్వాః సమృద్ధయస్తస్య సంసిధ్యన్తే మనోగతాః ।
ప్రత్యహం వక్తి వినయాద్గౌతమస్స్వాగతాన్ మునీన్ ॥ 36 ॥

అతని మనస్సులోని కోరికలన్నీ సమృద్ధిగా సిద్ధిస్తాయి. ఆవిషయమునే వచ్చిన ముని లందరకు గౌతముడు ప్రతిదినము వినయముగా విన్నవిస్తాడు.

పుత్రవచ్ఛిష్యవచ్చైవ ప్రేష్యవత్కరవాణి కిమ్ ।
పితృవత్పోషయామాస సంవత్సరగణాన్ బహూన్ ॥ 37 ॥

పుత్రుని వలె, శిష్యుని వలె, సేవకుని వలె అయ్యా మీకేమి చేయవలయునని ప్రశ్నిస్తాడు. తండ్రి వలె అనేక సంవత్సరములు వారిని పోషించాడు.

ఏవం స గౌతమః పుత్ర ఖ్యాతిం ప్రాప్తో మహత్తరామ్ ।
తతో వినాయకః ప్రాహ మాతరం భ్రాతరం జయామ్ ॥ 38 ॥

నాయనా! ఈ విధముగా గౌతముడు గొప్ప పేరు పొందాడు. అని చెప్పగా అప్పుడు వినాయకుడు తల్లితోను, సోదరునితోను, జయతోను ఇలా అన్నాడు.

వినాయక ఉవాచ :-వినాయకుడు చెప్పాడు.

దేవానాం సదనే మాతర్గీయతే గౌతమో ద్విజః ।
యన్న సాధ్యం సురగణైర్గౌతమో కృతవానితి ॥ 39 ॥

అమ్మా! దేవతలెంతో ప్రయత్నముతో కూడా సాధించలేనివాటిని గౌతముడు సులభంగా చేసినాడని దేవసభలో ద్విజుడైన గౌతముని కీర్తిస్తారు.

ఏవం శ్రుతం మయా దేవి బ్రాహ్మణస్య తపోబలమ్ ।
సవిప్రశ్చాలయేదేనాం మాతర్గంగాం జటాగతామ్ ॥ 40 ॥

అమ్మా! నేను ఆ బ్రాహ్మణుని తపోబలమును గూర్చి వినియుంటిని. ఈయన జటాజూటంలో ఉన్న ఈ గంగను తరలించుటకు గౌతముడే సమర్థుడు.

తపసా వాఽన్యతో వాఽపి పూజయిత్వా త్రిలోచనమ్ ।
స ఏవ యాచయేదేనాం జటాస్థాం మే పితృప్రియామ్ ॥ 41॥

తపస్సు చేసైనా లేక ఇతర మార్గములోనైనా ఆ ముక్కంటిని పూజించి, నా తండ్రి ప్రియురాలైన, జటలలో నున్న గంగను ఆ గౌతముడే యాచించవలెను.

తత్ర నీతిర్విధాతవ్యా తాం విప్రో యాచయేద్యథా ।
తత్ప్రభావాత్సరిచ్ఛ్రేష్ఠా శిరసోఽవతరిష్యతి ॥ 42 ॥

ఆ విప్రుడు గంగను యాచించే విధంగా ఒక పన్నాగమును పన్నవలయును. దాని ప్రభావమువలన నదులలో శ్రేష్ఠమైన గంగ తలనుండి క్రిందికి దిగగలదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా మాతరం భ్రాత్రా జయయా సహ విఘ్నరాట్ ।
జగామ గౌతమో యత్ర బ్రహ్మసూత్రధరః కృశః ॥ 43 ॥

ఈ విధంగా తల్లియైన పార్వతికి చెప్పి సోదరుడైన స్కంధునితో, జయతో కలిసి ఆ వినాయకుడు ఎక్కడైతే యజ్ఞోపవీతమును ధరించి, కృశించిన గౌతమ మహర్షి యున్నాడో అక్కడికి వెళ్ళాడు.

వసన్కతిపయాహఃసు గౌతమాశ్రమమండలే ।
ఉవాచ బ్రాహ్మణాన్ సర్వాన్నాత్ర స్థేయం చ విఘ్నరాట్ ॥ 44 ॥

వినాయకుడు గౌతమాశ్రమమండలంలో కొంత కాలముండి అక్కడ వున్న బ్రాహ్మణులందరితో మీరిక్కడ ఉండరాదని చెప్పాడు.

గచ్ఛామః స్వమధిష్ఠానమాశ్రమాణి శుచీని చ ।
పుష్టాః స్మ గౌతమాన్నేన పృచ్ఛామో గౌతమం మునిమ్ ॥ 45 ॥

మనం గౌతమమహర్షి ఇచ్చిన అన్నంతో పోషించబడినాము. మనకు ఆశ్రయం అయిన శుచులైన ఆశ్రమాలకి వెళదాము. గౌతమ మహర్షి అనుమతిని అడుగుదాము అని మునిశ్రేష్ఠులైన మహర్షులు గౌతమముని అనుమతిని అడిగినారు.

ఇతి సంమన్త్ర్య పృచ్ఛన్తి మునయో మునిసత్తమాః ।
స తాన్నివారయామాస స్నేహబుద్ధ్యా మునీన్ పృథక్ ॥ 46 ॥

ఈ విధంగా ఆలోచించి మునులడుగగా ఆ గౌతముడు స్నేహపూర్వకంగా ఆ మునులను నివారించాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

కృతాంజలిః సవినయమాసధ్వమిహ చైవ హి ।
యుష్మచ్చరణశుశ్రూషాం కరోమి మునిపుంగవాః ॥ 47 ॥

ఓ మునిపుంగవులారా! నేను మీ పాదశుశ్రూష చేసుకొంటాను. మీరిక్కడనే ఉండండని వినయముగా నమస్కరిస్తూ పలికాడు.

శుశ్రూషౌ పుత్రవన్నిత్యం మయి తిష్ఠతి నోచితమ్ ।
భవతాం భూమిదేవానామాశ్రమాన్తరసేవనమ్ ॥ 48 ॥

భూసురులైన మీకు నేను నిత్యమూ పుత్రునివలె సేవ చెయ్యదలచాను. మీరు మరొక ఆశ్రమమునకు వెళ్ళుట ఉచితము గాదు.

అయమేవాఽఽశ్రమః పుణ్యః సర్వేషామితి మే మతిః ।
అలమన్యేన మునయ ఆశ్రమేణ గతేన వా ॥ 49 ॥

అన్ని ఆశ్రమములలో ఈ ఆశ్రమమే పుణ్యమైనది. ఓ మునులారా! మీరు మరొక ఆశ్రమమునకు వెళ్ళుట అనవసరం (వెళ్ళకుడు).

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా మునేర్వాక్యం విఘ్నకృత్యమనుస్మరన్ ।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా బ్రాహ్మణాన్ స గణాధిపః ॥ 50 ॥

ఈ విధముగా మాట్లాడిన గౌతముని వాక్యములను విని విఘ్నకార్యమును స్మరిస్తూ, ఆ వినాయకుడు బ్రాహ్మణులందరికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

గణాధిప ఉవాచ :- గణాధిపుడు పలికాడు.

అన్నక్రీతా వయం కిం నో నివారయతి గౌతమః ।
సామ్నా నైవ వయం శక్తా గన్తుం స్వం స్వం నివేశనమ్ ॥ 51 ॥

ఈ గౌతముడు మననెందుకు నివారిస్తున్నాడు? మనమేమైనా అన్నానికి అమ్ముడు పోయామా? సామోపాయంతో మనం మన నివాసానికి వెళ్ళుటకు సమర్థులం కాము.

నాయమర్హతి దండం వా ఉపకారీ ద్విజోత్తమః ।
తస్మాత్ బుద్ధ్యా వ్యవస్యామి తత్సర్వైరనుమన్యతామ్ ॥ 52 ॥

ఈ ఉపకారము చేసే స్వభావము గల ద్విజోత్తముడు దండనకర్హుడు కాదు. అందువలన తెలివితో ప్రయత్నిస్తాను. దానికి మీరందరూ అనుమతించవలయును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః సర్వే ద్విజశ్రేష్ఠాః క్రియతామిత్యనుబ్రువన్ ।
ఏతస్య తూపకారాయ లోకానాం హితకామ్యయా ॥ 53 ॥

అప్పుడు ఈ గౌతమునికి ఉపకారము చేయుటకు, లోకములకు హితమును కలిగించు కోరికతో ఆ ద్విజ శ్రేష్ఠులందరూ చేయుమని చెప్పారు.

బ్రాహ్మణానాం చ సర్వేషాం శ్రేయో యత్స్యాత్తథా కురు ।
బ్రాహ్మణానాం వచః శ్రుత్వా మేనే వాక్యం గణాధిపః ॥ 54 ॥

బ్రాహ్మణులందరకు శ్రేయస్సును కలిగించే విధముగా నీవాపని చేయుమని చెప్పగా అప్పుడా గణాధిపుడు వారి మాటలు విని అంగీకరించాడు.

వినాయక ఉవాచ :– వినాయకుడు పలికాడు.

క్రియతే గుణరూపం యద్గౌతమస్య విశేషతః ॥ 55 ॥

గౌతముని యొక్క సేవాగుణానికి తగినట్లుగా విశేషముగా జరుగుతుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అనుమాన్య ద్విజాన్ సర్వాన్ పునః పునరుదారధీః ।
స్వయం చ బ్రాహ్మణో భూత్వా ప్రణమ్య బ్రాహ్మణాన్ పునః ॥
మాతుర్మతే స్థితో విద్వాన్ జయాం ప్రాహ గణేశ్వరః ॥ 56 ॥

ఉదారబుద్ధి గల వినాయకుడు మళ్ళీ మళ్ళీ ఆ ద్విజులందరినీ ఒప్పించి, తాను స్వయముగా బ్రాహ్మణుడై బ్రాహ్మణులందరకు తిరిగి నమస్కరించి, తల్లి అభిప్రాయము ననుసరించి విద్వాంసుడైన గణేశుడు జయతో ఇలా అన్నాడు.

వినాయక ఉవాచ :– వినాయకుడు పలికాడు.

యథా నాన్యో విజానీతే తథా కురు శుభాననే ।
గోరూపధారిణీ గచ్ఛ గౌతమో యత్ర తిష్ఠతి ॥ 57 ॥

ఓ శుభాననా! ఇతరులెవరూ నిన్ను గుర్తుపట్టకుండగా గోరూపమును ధరించి ఆ గౌతముడున్న చోటుకు వెళ్ళు.

శాలీన్ఖాద వినాశ్యాథ వికారం కురు భామిని ।
కృతే ప్రహారే హుంకారే ప్రేక్షితే చాపి కించన ॥
ఉచ్చైస్తత్ర స్వనం కృత్వా న మ్రియస్వ న జీవ చ ॥ 58 ॥

అక్కడ అతని పోలంలోకి వెళ్ళి దానిని వికారంగా చేసి గింజలను తినుము. వాళ్ళు చూచి దెబ్బలు కొట్టినా, హుంకరించినా, భయం కలిగించే విధంగా చూచినా అక్కడ పెద్దగా అరచి మరణించకు జీవించకు (అనగా చచ్చినట్లుగా పడిఉండే దశ)

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథా చకార విజయా విఘ్నేశ్వరమతే స్థితా ।
యత్రాఽఽసీ ద్గౌతమో విప్రో జయా గోరూపధారిణీ ॥ 59 ॥

గోరూపమును ధరించిన విజయ వినాయకుని సూచన ప్రకారంగా ఆ విప్రుడైన గౌతముని ఆశ్రమ ప్రాంతమునకు వెళ్ళి అలాగే చేసింది.

జగామ శాలీన్ ఖాదన్తీ తాం దదర్శ స గౌతమః ।
గాం దృష్ట్వా వికృతాం విప్రస్తాం తృణేన న్యవారయత్ ॥ 60 ॥

గింజలను తింటూ అక్కడికి వెళ్ళిన గోవును గౌతముడు చూచాడు. పంట పొలాన్ని వికృతంగా చేసిన ఆ గోవును చూచి గౌతముడు దానిని గడ్డితో(దర్భతో) నివారించాడు.

నివార్యమాణా సా తేన స్వనం కృత్వా పపాత గౌః ।
తస్యాం చ పతితాయాం చ హాహాకారో మహానభూత్ ॥ 61 ॥

ఎప్పుడైతే గౌతము దదిలించాడో ఆ ఆవు వెంటనే పెద్ద శబ్దము చేస్తూ క్రింద పడిపోయింది. అది క్రింద పడగానే అక్కడ గొప్ప హాహాకారం పుట్టింది.

స్వనం శ్రుత్వా చ దృష్ట్వా చ గౌతమస్య విచేష్టితమ్ ।
వ్యథితా బ్రాహ్మణాః ప్రాహుర్విఘ్నరాజ పురస్కృతాః ॥ 62 ॥

గోవు ఆక్రందనను విని, క్రింద పడిపోవుటను చూచి గౌతముడు కొయ్యబారిపోవుటను గమనించి బాధ పడ్డ బ్రాహ్మణులు వినాయకుని ముందుంచుకొని ఇలా అన్నారు.

బ్రాహ్మణాః ఊచుః :- బ్రాహ్మణులు పలికారు.

ఇతో గచ్ఛామహే సర్వే న స్థాతవ్యం తవాఽఽశ్రమే ।
పుత్రవత్పోషితాః సర్వే పృష్టోఽసి మునిపుంగవ ॥ 63 ॥

ఓ మునిపుంగవా! మమ్ములనందరిని నీవు పుత్రులవలె పోషించినావు. ఇక మేమీ ఆశ్రమములో నుండ కూడదు. కావున మేమంతా ఇక్కడి నుండి వెళ్ళుట కనుమతి నీయవలనసినదిగా అడుగుచున్నాము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా మునిర్వాక్యం విప్రాణాం గచ్ఛతాం తదా ।
వజ్రాఽహత ఇవాఽఽసీత్స విప్రాణాం పురతోఽపతత్ ॥ 64 ॥

ఇలా పలికిన వారి మాటను విని, వారు వెళ్ళిపోవుటను చూచి, వజ్రాయుధముతో కొట్టినట్లుగా ఆ గౌతముడు మునులముందు పడిపోయాడు.

తమూచుర్బ్రాహ్మణాః సర్వే పశ్యేమాం పతితాం భువి ।
రుద్రాణాం మాతరం దేవీం జగతాం పావనీం ప్రియామ్ ॥ 65 ॥

అప్పుడు బ్రాహ్మణులందరూ ఇలా పలికారు. ఈ క్రిందపడిన గోవును చూడు. ఇది జగత్తునంతా పావనము చేయునది, ప్రియమైనది, రుద్రులందరకూ తల్లి. ఈ దేవిని చూడు.

తీర్థదేవస్వరూపిణ్యామస్యాం గవి విధేర్బలాత్ ।
పతితాయాం మునిశ్రేష్ఠ గన్తవ్యమవశిష్యతే ॥ 66 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! దేవతీర్థస్వరూపిణియైన ఈ గోవు విధివశాత్తు పడిపోయింది. ఇది చూచిన మేమిక ఇక్కడినుండి వెళ్ళిపోవడమే మిగిలి వున్నది.

చీర్ణం వ్రతం క్షయం యాతి యథా వాసస్త్వదాశ్రమే ।
వయం నాన్యధనా బ్రహ్మన్ కేవలం తు తపోధనాః ॥ 67 ॥

మేము నీ ఆశ్రమములో నుంటే మేము నియమనిష్ఠలతో అధ్యయనాదులతో సంపాదించిన వ్రతము క్షయము నొందుతుంది. ఓ బ్రహ్మఋషి! మేము కేవలం తపోధనులమే! మా దగ్గర ఇతరమైన ధనము లేవీ లేవు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విప్రాణాం పురతః స్థిత్వా వినీతః ప్రాహ గౌతమః ॥ 68 ॥

ఆ బ్రాహ్మణుల ఎదురుగా నిలబడి గౌతముడు వినయముగా ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

భవన్త ఏవ శరణం పూతం మాం కర్తుమర్హథ ॥ 69 ॥

మీరే నాకు దిక్కు. నన్ను పవిత్రునిగా చేయు సమర్థులు మీరే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రోవాచ భగవాన్ విఘ్నకృద్బ్రాహ్మణైర్వృతః ॥ 70 ॥

అప్పుడు బ్రాహ్మణులందరితో కూడినట్టి పూజ్యుడైన విఘ్నరాజిలా అన్నాడు.

విఘ్నరాజ ఉవాచ :- విఘ్నరాజిలా పలికాడు.

నైవేయం మ్రియతే తత్ర నైవ జీవతి తత్ర కిమ్ ।
వదామోఽస్మిన్ సుసందిగ్ధే నిష్కృతిం గతిమేవ వా ॥ 71 ॥

ఈ గోవు మరణిస్తుందో, బ్రతుకుందో, దాంతో మనకేమి? ఈ సందిగ్ధమైన విషయంలో దీనికి గల నిష్కృతిని గానీ (ప్రాయశ్చిత్తంగానీ), త్రోవనిగానీ యేమని చెప్పగలం?

గౌతమీ ఉవాచ :– గౌతముడు పలికాడు.

న చ మూర్ఛిష్యతీయం గౌర్మరిష్యతి న సంశయః ।
కథముత్థాస్యతీయం గౌరథ చాస్మింశ్చ నిష్కృతిమ్ ॥
వక్తుమర్హథ తత్సర్వం కరిష్యేఽహమసంశయమ్ ॥ 72 ॥

ఈ గోవు మూర్ఛ పోయినది గాదు. చనిపోతుంది. సంశయం లేదు. ఈ గోవెలా లేస్తుంది? ఇక దీనికి నిష్కృతి ఎలా? అదంతా చెప్పుటకు మీరే సమర్థులు. దానినంతటిని ఏ సందేహమూ లేక చేయగలను.

బ్రాహ్మణా ఊచుః :– బ్రాహ్మణులు పలికారు.

సర్వేషాం చ మతే నాయం వదిష్యతి చ బుద్ధిమాన్ ।
ఏతద్వాక్యమథాస్మాకం ప్రమాణం తవ గౌతమ ॥ 73 ॥

ఓ గౌతమమహర్షీ! మాయందరి అభిప్రాయమును ఈ బుద్ధిమంతుడు చెప్పగలడు. ఈ మాట మాకును నీకును ప్రమాణము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

బ్రాహ్మణైః ప్రేర్యమాణోఽసౌ గౌతమేన బలీయసా ।
విఘ్నకృత్ బ్రహ్మవపుషా ప్రాహ సర్వానిదం వచః ॥ 74 ॥

బ్రాహ్మణులతోను, బలిష్ఠుడైన గౌతమునితోను ప్రేరేపించబడినవాడై బ్రాహ్మణవేషంలో వున్న వినాయకుడు అందరితో నిలా పలికాడు.

విఘ్నరాజ ఉవాచ :– విఘ్నరాజు పలికాడు.

సర్వేషాం చ మతేనాహం వదిష్యామి యథార్థవత్ ।
అనుమన్యన్తు మునయో మద్వాక్యం గౌతమోఽపి చ ॥ 75 ॥

అందరి అభిప్రాయం ప్రకారంగా నేను యథార్థమైన దానిని చెప్పబోవుచున్నాను. నా మాటను మునులందరు, గౌతముడు కూడా ఆమోదింతురు గాక.

మహేశ్వరజటాజూటే బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
కమణ్డలుస్థితం వారి తిష్ఠతీతి హి శుశ్రుమ ॥ 76 ॥

అవ్యక్తం నుండి (ప్రకృతి నుండి) పుట్టిన బ్రహ్మయొక్క కమండలంలో ఉన్న నీరు మహేశ్వరుని జటాజూటము నందున్నదని మనం విన్నాము కదా!

తదానయస్వ తరసా తపసా నియమేన చ ।
తేనాభిషించ గామేతాం భగవన్ భువమాశ్రితామ్ ॥
తతో వత్స్యామహే సర్వే పూర్వవత్తవ వేశ్మని ॥ 77 ॥

ఓ పూజ్యుడా! తపస్సుతో నియమముతో త్వరగా దానిని తీసికొనిరండి. నేలమీదపడి యున్న ఈ గోవును ఆ నీటితో అభిషేకము చేయండి. తరువాత మేమంతా పూర్వం వలె నీ ఆశ్రమములో ఉంటాము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్తవతి విప్రేన్ద్రే బ్రాహ్మణానాం చ సంసది ।
తత్రాపతత్పుష్పవృష్టిర్జయశబ్దో వ్యవర్ధత ॥
తతః కృతాఞ్జలిః నమ్రో వాజాక్యమబ్రవీత్ ॥ 78 ॥

ఈ విధముగా నా విప్రేంద్రుడు బ్రాహ్మణసభలో చెప్పగానే అక్కడ పుష్పవర్షం కురిసింది. జయ జయ ధ్వనులు మార్మోగినవి. అప్పుడు గౌతముడు వినయముగా నమస్కరిస్తూ ఇలా పలికాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

తపసాగ్నిప్రసాదేన దేవబ్రహ్మప్రసాదతః ।
భవతాం చ ప్రసాదేన మత్సంకల్పోఽనుసిధ్యతామ్ ॥ 79 ॥

తపస్సుతోనూ, అగ్నియొక్క అనుగ్రహముతోనూ, దేవతల, బ్రాహ్మణుల, అనుగ్రహమువలన, మీయొక్క కృపతో నా సంకల్పము నెరవేరుగాక.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి తం విప్రా ఆపృచ్ఛ్య మునిపుంగవమ్ ।
స్వాని స్థానాని తే జగ్ముః సమృద్ధాన్యన్నవారిభిః ॥ 80 ॥

సరే ఆ విధముగానే జరుగుగాక అని ఆ బ్రాహ్మణులు మునిశ్రేష్ఠుడైన గౌతముని వద్ద సెలవు దీసుకొని సమృద్ధమైన జలాన్నములతో కూడిన వారి వారి స్థానములకు వెళ్ళారు.

గతేషు తేషు విప్రేషు భ్రాత్రా సహ గణేశ్వరః ।
జయయా సహ సుప్రీతః కృతకృత్యో న్యవర్తత ॥ 81 ॥

ఆ విప్రులందరూ వెళ్ళిపోగానే గణేశుడు కృతకృత్యుడై సంతోషముతో సోదరుడైన స్కందునితోను, జయతోను కలిసి వెళ్ళిపోయాడు.

గతేషు బ్రహ్మవృందేషు గణేశే చ గతే తథా ।
గౌతమోఽపి మునిశ్రేష్ఠస్తపసా హతకల్మషః ॥ 82 ॥

మునిబృందములు, గణేశుడు వెళ్ళిన తరువాత తపస్సుతో పాపము పోయిన మునిశ్రేష్ఠుడైన గౌతముడుకూడా.

ధ్యాయంస్తదర్థం స మునిః కిమిదం మమ సంస్థితమ్ ।
ఇత్యేవం బహుశో ధ్యాయన్ జ్ఞానేన జ్ఞాతవాన్ ద్విజః ॥ 83 ॥

ఏమిటి ఈ విధంగా జరిగింది? అనుకొని ఆలోచిస్తూ దానికొరకు ధ్యానము చేసి ఆ బ్రహ్మర్షి ఓహో ఇలాగా అని అనేకవిధములుగా తన జ్ఞానముతో తెలుసుకొన్నాడు.

నిశ్చిత్య దేవకార్యార్థమాత్మనః కిల్బిషాం గతిమ్ ।
లోకానాముపకారం చ శంభోః ప్రీణనమేవ చ ॥ 84 ॥

ఇది నిశ్చయముగ దేవకార్యార్థమే ఈ పాపము, దోషము జరిగినది. ఇదంతా లోకోపకారం కొరకు, శివునికి ఆనందం కలుగుట కొఱకే.

ఉమాయాః ప్రీణనం చాపి గంగానయనమేవ చ ।
సర్వం శ్రేయస్కరం మన్యే మయి నైవ చ కిల్బిషమ్ ॥ 85 ॥

పార్వతికి ఆనందం కలిగించుటే ఈ గంగను రప్పించుట. ఇదంతా శ్రేయస్సును కలిగించుట కొరకే అని తలచుచున్నాను. దీనిలో నా దోషమేదీ లేదు.

ఇత్యేవం మనసా ధ్యాయన్ సుప్రీతోఽభూద్ద్విజోత్తమః ।
భార్యయా సహ సంమన్త్ర్య ఇదమాహ ద్విజోత్తమః ॥
ఆరాధ్య జగతామీశం త్రినేత్రం వృషభధ్వజమ్ ॥ 86 ॥

ఈ విధముగా మనస్సులో తలపోస్తూ ఆ ద్విజోత్తముడు సంతోషించాడు. తన భార్యతో సంప్రదించి ఇలా పలికాడు. జగత్తున కంతా ప్రభువు, వృషభధ్వజుడు అయిన ముక్కంటిని ఆరాధించి

ఆనయిష్యే సరిచ్ఛ్రేష్ఠాం ప్రీణయిష్యే గిరేః సుతామ్ ।
సపత్నీం జగదంబాయా మహేశ్వరజటాస్థితామ్ ॥ 87 ॥

జగదంబ అయిన పార్వతికి సవతిగా మహేశ్వరుని జటాజూటమునందున్న నదీశ్రేష్ఠయైన గంగను తీసుకురాగలను. గిరిపుత్రిక అయిన పార్వతిని సంతోషపెట్టగలను.

ఏవం హి సంకల్ప్య మునిప్రవీరః
స గౌతమో బ్రహ్మగిరేర్జగామ ।
కైలాసమాధిష్ఠితముగ్రవర్చసం
సురార్చితం ప్రీణయితుం హి శంభుమ్ ॥ 88 ॥

ఇలా ఆ మునిప్రవీరుడైన గౌతముడు సంకల్పించి దేవతలందరిచే అర్చించునట్టివాడూ, ఉగ్రవర్చసుడు, కైలాసము నధిష్ఠించినవాడు నగు శంభుని సంతోషపెట్టుటకై బ్రహ్మగిరి నుండి వెళ్ళాడు.

ఇతి బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే వినాయక గౌతమ వ్యాపారనిరూపణం నామ పంచమోఽధ్యాయః. ॥ 5 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మహాత్మ్యము నందలి స్వయంభు నారదసంవాదములోని తీర్థ మాహాత్మ్యములో వినాయక గౌతమ వ్యాపార నిరూపణమను పేరుగల ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం

గౌతమ్యానయనమ్ – గౌతమిని తెచ్చుట

నారద ఉవాచ:– నారదుడు అడిగాడు.

కైలాసశిఖరే గత్వా గౌతమో భగవాన్ ఋషిః ।
కిం చకార తపో వాఽపి కాం చక్రే స్తుతిముత్తమామ్ ॥ 1 ॥

పూజ్యుడైన గౌతమ మహర్షి కైలాస శిఖరమునకు వెళ్ళి ఏ తపస్సు చేశాడు? ఏ ఉత్తమమైన స్తోత్రమును చేశాడు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ ఇలా చెప్పాడు.

గిరిం గత్వా తతో వత్స వాచం సంయమ్య గౌతమః ।
ఆస్తీర్య స కుశాన్ ప్రాజ్ఞః కైలాసే పర్వతోత్తమే ॥ 2 ॥

నాయనా! ఆ గౌతముడు ఆ ఉత్తమమైన పర్వతమగు కైలాసగిరికి వెళ్ళి, దర్భలను పరచుకొని, ప్రాజ్ఞుడై మౌన వ్రతమును చేపట్టి,

ఉపవిశ్య శుచిర్భూత్వా స్తోత్రం చేదం తతో జగౌ ।
అపతత్పుష్పవృష్టిశ్చ స్తూయమానే మహేశ్వరే ॥ 3 ॥

శుచియై కూర్చుండి ఈ స్తోత్రమును చేశాడు. శివుని స్తోత్రము చేయగానే పుష్పవృష్టి కురిసింది.

గౌతమ ఉవాచ :– గౌతముడు చెప్పాడు.

భోగార్థినాం భోగమభీప్సితం చ దాతుం మహాన్త్యష్టవపూంషి ధత్తే ।
సోమో జనానాం గుణవన్తి నిత్యం దేవం మహాదేవమితి స్తువన్తి ॥ 4 ॥

భోగములను కోరేవారికి కోరిన భోగముల నిచ్చుటకు పృథివ్యప్తేజో వాయురాకాశ సూర్య చంద్ర ఋత్విజ అనే ఎనిమిది రూపములను ధరించినవాడు, ఇక తలమీద నున్న చంద్రుడు స్వామి గుణములను నిత్యమూ లెక్కించుచు వాటిని ఇంకా గుణవంతముగా చేయుచున్న దేవుని మహాదేవుడని స్తోత్రము చేస్తారు.

కర్తుం స్వకీయైర్విషయైః సుఖాని భర్తుం సమస్తం సచరాచరం చ ।
సంపత్తయే హ్యస్య వివృద్ధయే చ మహీమయం రూపమితీశ్వరస్య ॥ 5 ॥

తన విషయములతో సుఖములను కలుగచేయుటకు, సమస్త స్థావర జంగమములను భరించుటకు, సంపద కొరకైనా, వృద్ధి కొరకైనా ఈ భూమి నంతటినీ ఈశ్వరుని రూపమంటారు.

సృష్టేః స్థితేః సంహరణాయ భూమేరాధారమాధాతుమపాం స్వరూపమ్ ।
భేజే శివః శాన్తతనుర్జనానాం సుఖాయ ధర్మాయ జగత్ప్రతిష్ఠితమ్ ॥ 6 ॥

సృష్టి స్థితి సంహారముల కొరకు, జనులందరికి సుఖము కలుగుట కొరకు, ధర్మమును స్థాపించుట కొరకు భూమికి ఆధారమును కల్పించుట కొరకు శాంతతనువుగల శివుడు జగత్ప్రతిష్ఠితమైన నీటి స్వరూపమును పొందాడు.

కాలప్రతిష్ఠామమృతస్రవం చ జీవస్థితిం సృష్టిమథో వినాశమ్ ।
ముదం ప్రజానాం సుఖమున్నతిం చ చక్రేఽర్కచంద్రాగ్నిమయం శరీరమ్ ॥ 7 ॥

కాలప్రతిష్ఠకు, అమృత స్రావమునకు, జీవులయొక్క సృష్టిస్థితి వినాశనాలకు, ప్రజల సంతోషమునకు, సుఖమునకు, అభివృద్ధికిగాను, సూర్యచంద్రాగ్ని మయమైన శరీరమును ధరించాడు.

వృద్ధిం గతిం శక్తిమథాక్షరాణి జీవవ్యవస్థాం ముదమప్యనేకామ్ ।
స్రష్టుం కృతం వాయురితీశరూపం త్వం వేత్సి నూనం భగవన్ భవన్తమ్ ॥ 8 ॥

వృద్ధిని, గతిని, శక్తిని మరియు అక్షరములను, అనేక విధములైన సంతోషమును, జీవవ్యవస్థను సృష్టించుటకు వాయువని ఈశరూపమును చేశాడు. ఇదినీకు తెలుసును. ఓ పుజ్యుడా! నీవెవరో కూడా నీకు నిశ్చయముగా తెలుసును.

భేదైర్వినా నైవ కృతిర్న ధర్మో నాఽఽత్మీయమన్యన్న దిశోఽన్తరిక్షమ్ ।
ద్యావాపృథివ్యౌ న చ భుక్తిముక్తీ తస్మాదిదం వ్యోమవపుస్తవేశ ॥ 9 ॥

భేదములేకుండా కృతి కార్యముగాని, ధర్మముగాని, ఆత్మసంబంధముగాని, దిక్కులుగాని, అంతరిక్షము గాని, ద్యావాపృథ్వులుగాని,భుక్తిముక్తులుగాని లేవు. అందువలననే ఓ ఈశ్వరుడా! నీది వ్యోమశరీరమంటారు.

ధర్మం వ్యవస్థాపయితుం విభజ్య ఋక్సామశాస్త్రాణి యజుశ్చ శాఖాః ।
లోకే చ గాథాః స్మృతయః పురాణమిత్యాదిశబ్దాత్మకతాముపైతి ॥ 10 ॥

లోకంలో ధర్మాన్ని నిలుపుటకు ఋగ్యజుస్సామాధర్వణ వేదములని, శిక్షా వ్యాకరణం జ్యోతిష్యం ఛందస్సు నిరుక్తం కల్పమను వేదాంగాలని, శాఖాభేదంతో యజుర్వేదమని, అష్టాదశ పురాణములని, గాథలని, పరాశరాది స్మృతులని విభజించి ఈ మొదలైనది నీరు శబ్దరూపాన్ని పొందుతున్నది.

యష్టా క్రతుర్యాన్యపి సాధనాని ఋత్విక్ స్వరూపం ఫలదేశకాలాః ।
త్వమేవ శంభో పరమార్థతత్త్వం వదన్తి యజ్ఞాంగమయం వపుస్తే ॥ 11 ॥

ఓ శివా! యజ్ఞం చేసేవాడూ, యాగమూ, యాగసాధనాలూ, ఋత్విక్కూ, ఫలితమూ, దేశమూ, కాలమూ, ఇవి అన్నీ పరమార్థతత్త్వంగా నీవే. అందువల్లనే నీ శరీరము యజ్ఞాంగమయమని చెబుతారు.

కర్తా ప్రదాతా ప్రతిభూః ప్రదానం సర్వజ్ఞసాక్షీ పురుషః పరశ్చ ।
ప్రత్యాత్మభూతః పరమార్థరూపస్త్వమేవ సర్వం కిం వాగ్విలాసైః ॥ 12 ॥

నీవే కర్తవు, ప్రదాతవు, మధ్యవర్తివి, ప్రదానం, సర్వజ్ఞడవు, సాక్ష్యమిచ్చే పురుషుడవు, పరుడవు, ప్రతి దేహంలో ఆత్మగా నుండేవానివి, పరమార్థరూపుడవు సర్వమూ నీవే. ఇక వేడుక మాటలేల?

న వేదశాస్త్రైర్గురుభిః ప్రదిష్టో న నాసి బుద్ధ్యాదిభిరప్రధృష్యః ।
అజో౽ప్రమేయః శివశబ్దవాచ్యస్త్వమేవ సత్యం భగవన్నమస్తే ॥ 13 ॥

ఓ భగవంతుడా! వేదశాస్త్రముల చేతగాని, గురువుల చేతగాని నీవాదేశితుడవు కాలేదు. నీవు లేవు అని చెప్పే బుద్ధ్యాదులకు నీవు లొంగవు. నీవజుడవు, అప్రమేయుడవు, శివశబ్దవాచ్యుడవు, నీవే సత్య స్వరూపుడవు, నీకు నమస్కారము.

ఆత్మైకతాం స్వప్రకృతిం కదాచిదైక్షచ్ఛివః సంపదియం మమేతి ।
పృథక్తథైవాభవద ప్రతర్క్యాచిన్త్యప్రభావో బహువిశ్వమూర్తిః ॥ 14 ॥

ఆత్మైకత్వముగల తన ప్రకృతిని, శివుడు ఇది తనయొక్క సంపదగా ఒక్కప్పుడు (పరమార్ధదశలో) తలచాడు. హేతువులతో కూడిన ఊహకి (తర్కం), ఆలోచనలకీ (మనస్సుకీ) అందని మహిమగల విశ్వమూర్తి (శివుడు) ఆ విధంగా వేరుగా అనేక విధాలుగా అయ్యాడు.

భావే౽భివృద్ధా చ భవే భవే చ స్వకారణం కారణమాస్థితా చ ।
నిత్యా శివా సర్వసులక్షణా వా విలక్షణా విశ్వకరస్య శక్తిః ॥ 15 ॥

తనకు కారణం అయిన ఈశ్వరుడనే కారణాన్ని ఆశ్రయించినదై నిత్యమైనదీ, మంగళకరమైనదీ, సమస్త ఉత్తమ లక్షణాలు కలదీ, అన్నిటికన్న విలక్షణమైన పరమేశ్వరశక్తి ప్రతిజన్మలోనూ భావంలో అభివృద్ధిని పొందుతుంది.

ఉత్పాదనం సంస్థితిరన్నవృద్ధిలయాః సతాం యత్ర సనాతనో౽ర్థః ।
ఏషైవ భూమిర్న సమాస్తి కించిదసాధ్యమస్యా దయితా హరస్య ॥ 16 ॥

ఉత్పత్తి చేయుట, రక్షించుట, అన్నవృద్ధి చేయుట, లయము చేయుట అనునవి సనాతనాలు. వాటికి శివుని ప్రియురాలైన శక్తే మూలం. ఈమెకు సాటి వేరొకటి లేదు. అసాధ్యం కొంచెమైనా లేదు.

యథార్థమన్నాని ధనాని జీవా యచ్ఛన్తి కుర్వన్తి తపాంసి ధర్మాన్ ।
సా౽పీయమమ్బా జగతో జనిత్రీ ప్రయాతు సోమస్య మహాసుకీర్తిః ॥ 17 ॥

నిజానికి జీవులు అన్నములను, ధనములను దానము చేస్తూంటారు. తపస్సులు, ధర్మములను, ఆచరిస్తూంటారు. ఈ పార్వతీమాత జగత్తునంతా కన్నతల్లి, చంద్రునకు ఇష్టురాలు. ఆమె గొప్ప కీర్తి గలది.

యదీక్షితం కాంక్షతి వాసవో౽పి యన్నామతో మంగళమాప్నుయాచ్చ ।
యా వ్యాప్య విశ్వం విమలీకరోతి సోమా సదా సోమసమానరూపా ॥ 18 ॥

ఇంద్రుడేది చూచి కావాలని కోరి పొందుతాడో, ఎవరి పేరును తలచి శుభముల నందుతాడో, ఎవరు విశ్వము నంతటినీ వ్యాపించి విమలము గావించుచున్నారో, ఎప్పుడూ సోమలతతో పోలిక కలదో, చంద్రుని ప్రకాశము వంటిదో, సోమసమానమగు రూపము గలదో ఆమెయే సా+ఉమా=పార్వతి.సోమ.

బ్రహ్మాదిజీవస్య చరాచరస్య బుద్ధ్యక్షిచైతన్యమనఃసుఖాని ।
యస్యాః ప్రసాదాత్ఫలవన్తి నిత్యం వాగీశ్వరీ లోకగురోః సురమ్యా ॥ 19 ॥

ఆదిజీవుడైన బ్రహ్మ మొదలుకొని సకల చరాచరమునకు బుద్ధి, కన్ను, చైతన్యము, మనస్సు, సుఖములు మొదలైనవి ఏ తల్లి అనుగ్రహముతో నిత్యమూ ఫలవంతములగుచున్నవో అట్టి చక్కని సుందరి లోకగురువైన శివునకు వాగీశ్వరి.

చతుర్ముఖస్యాపి మనో మలీనం కిమన్యజంతోరితి చిన్త్యమానా ।
గంగాఽవతారం వివిధైరుపాయైః సర్వం జగత్పావయితుం చకార ॥ 20 ॥

బ్రహ్మ మనస్సే మలినమైనప్పుడు ఇక మిగతా జీవుల గూర్చి ఏమని చింతించగలము? అందుకే అనేక ఉపాయములతో ఈ జగత్తునంతా పావనము చేయుటకు గంగావతారము చేసింది.

శ్రుతీః సమాలక్ష్య హరప్రభుత్వం విశ్వస్య లోకః సకలైః ప్రమాణైః ।
కృత్వా చ ధర్మాన్ బుభుజే చ భోగాన్ విభూతిరేషా తు సదాశివస్య ॥ 21 ॥

వేదములన్నింటిని లక్ష్యముగా పెట్టుకొని, సకల ప్రమాణములతో చూచి, లోకంలో విశ్వానికి శివ ప్రభుత్వమును చేసి సమస్త ధర్మములను, భోగములను అనుభవించింది. ఇదంతా సదాశివుని యొక్క విభూతియే, ఐశ్వర్యమే.

కార్యక్రియాకారకసాధనానాం వేదోదితానామథ లౌకికానామ్ ।
యత్సాధ్యముత్కృష్టతమం ప్రియం చ ప్రోక్తా చ సా సిద్ధిరనాదికర్తుః ॥ 22 ॥

వేదమునందు లౌకికగ్రంథములందు చెప్పిన కార్య క్రియా కారక సాధనములకు ఏది ఉత్కృష్టమైనదో, ప్రియమైనదో, ఏది సాధ్యమో ఆ సిద్ధినే అనాదికర్త అయిన వాడు చెప్పినది.

ధ్యాత్వా వరం బ్రహ్మపరం ప్రధానం యత్సారభూతం యదుపాసితవ్యమ్ ।
యత్ప్రాప్య ముక్తా న పునర్భవన్తి సద్యోగినో ముక్తిరుమాపతిః సః ॥ 23 ॥

దేనిని బ్రహ్మ పరమైనదని, ప్రధానమైనదని, శ్రేష్ఠమని ఏది సారభూతమైనదని, ఏది ఉపాసించ దగినదని, ఏ సత్తును పొంది ముక్తులై యోగులు మళ్ళీ పునర్జన్మ నెత్తరో ఆ ముక్తియే ఆ ఉమాపతియైన శివుడు.

యథా యథా శమ్భురమేయమాయా రూపాణి ధత్తే జగతో హితాయ ।
తద్యోగయోగ్యాని తథైవ ధత్సే పతివ్రతాత్వం త్వయి మాతరేవమ్ ॥ 24 ॥

తల్లీ! శివుడేవిధముగా యోగయోగ్యములైన అమేయ మాయా రూపములను జగత్తుయొక్క హితము కొరకు ధరించుచున్నాడో అట్లే నీవు కూడా ధరించుచున్నావు. అదే నీయం దీవిధముగా నున్న పతివ్రతాత్వము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యేవం స్తువతస్తస్య పురస్తాద్వృషభధ్వజః ।
ఉమయా సహితః శ్రీమాన్గణేశాది గణైర్వృతః ॥ 25 ॥

ఇట్లు స్తుతించుచున్న గౌతముని కెదురుగా గణేశాది గణములతో గూడి పార్వతీ దేవితో కలిసి శ్రీమంతుడైన శివుడు

సాక్షాదాగత్య తం శంభుః ప్రసన్నో వాక్యమబ్రవీత్ । 26 ॥

ప్రత్యక్షమై ప్రసన్న వదనముతో ఆ గౌతమునితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

కిం తే గౌతమ దాస్యామి భక్తిస్తోత్రవ్రతైః శుభైః ।
పరితుష్టోఽస్మి యాచస్వ దేవానామపి దుర్లభమ్ ॥ 27 ॥

ఓ గౌతమమహర్షీ! నీ శోభనములైన భక్తి స్తోత్ర వ్రతములతో నేను చాలా సంతోషించాను. నీ కేమి కావాలీ? దేవతలకు దుర్లభమైనదైనా సరే కోరుకో. నేనిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా జగన్మూర్తేర్వాక్యం వాక్యవిశారదః ।
హర్షబాష్ప పరీతాంగో గౌతమః పర్యచిన్తయత్ ॥ 28 ॥

ఈ విధముగా పలికిన జగన్మూర్తియైన శివుని మాటలను విని వాక్యవిశారదుడైన గౌతముడు ఆనందబాష్పములతో నిండిన శరీరము గలవాడై ఆలోచించాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

అహో దైవమహో ధర్మో హ్యహో వై విప్రపూజనమ్ ।
అహో లోకగతిశ్చిత్రా అహో ధాతర్నమోఽస్తు తే ॥ 29 ॥

ఆహా! ఏమి దైవత్వము! ఏమి ధర్మము! ఏమి బ్రాహ్మణ గౌరవము! ఏమీ చిత్రమైన లోకగతి! ఓ బ్రహ్మా! నీకు నమస్కారము.

జటాస్థితాం శుభాం గంగాం దేహి మే త్రిదశార్చిత ।
యది తుష్టోఽసి దేవేశ త్రయీధామ నమోఽస్తు తే ॥ 30 ॥

ఓ దేవేశా! వేదనివాసా! దేవతలచే అర్చింపబడినవాడా! ఒకవేళ నీవు సంతసించి నట్లైతే నీ జటాజూటమునందున్న, శుభములను గూర్చే గంగను నాకివ్వుము. నీకు నమస్కారము.

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు పలికాడు.

త్రయాణాముపకారార్థం లోకానాం యాచితం త్వయా ।
ఆత్మనస్తూపకారాయ తద్యాచస్వాకుతో భయః ॥ 31 ॥

ముల్లోకముల కుపకారము కల్గుటకు నీవు యాచించినావు. నీకుపకారము కల్గుటకేమి కావలయునో భయం లేకుండా అడుగుము.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

స్తోత్రేణానేన యే భక్తాస్త్వాం చ దేవీం స్తువన్తి వై ।
సర్వకామసమృద్ధాః స్యురేతద్ధి వరయామ్యహమ్ ॥ 32 ॥

భక్తులైనవారెవరైనా ఈ స్తోత్రముతో నిన్ను, తల్లియగు పార్వతిని స్తుతిస్తారో వారు సర్వకామ సమృద్ధిని పొందవలయును. ఇదే నేను నీనుండి వరముగా కోరుచున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి దేవేశః పరితుష్టోఽబ్రవీద్వచః ।
అన్యానపి వరాన్మత్తో యాచస్వ విగతజ్వరః ॥ 33 ॥

అప్పుడా దేవేశు డానందపడి అలాగే అగుగాక అని పలికి ఇంకా ఇతరమైన వరములను కూడా ఏ మాత్రం భయం లేకుండా నానుండి పొందు అన్నాడు.

ఏవముక్తస్తు హర్షేణ గౌతమః ప్రాహ శంకరమ్ ॥ 34 ॥

ఇలా పలుకగానే గౌతముడు హర్షముతో శంకరునితో అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

ఇమాం దేవీం జటాసంస్థాం పావనీం లోకమాతరమ్ ।
తవ ప్రియాం జగన్నాథ ఉత్సృజ బ్రహ్మణో గిరౌ ॥ 35 ॥

ఓ జగన్నాథా! పావనురాలు, లోకమాత, నీకిష్టమైనదగు, నీ జటాజూటంనందున్న ఈ గంగాదేవిని బ్రహ్మగిరియందు వదిలి పెట్టుము.

సర్వాసాం తీర్థభూతా తు యావద్గచ్ఛతి సాగరమ్ ।
బ్రహ్మహత్యాది పాపాని మనోవాక్కాయికాని తు ॥ 36 ॥

అన్ని నదులకు తీర్థభూతమైన ఈ గంగ సముద్రమును చేరునంతవరకు బ్రహ్మహత్య మున్నగు పాపములు, మానసిక, వాచిక, కాయికమగు పాపములును

స్నానమాత్రేణ సర్వాణి విలయం యాన్తు శంకర ।
చంద్రసూర్యోపరాగే చ అయనే విషువే తథా ॥ 37 ॥

శంకరా! స్నానము చేసినంత మాత్రముననే ఆ పాపములన్నీ నశించుగాక. చంద్ర సూర్యగ్రహణము లేర్పడినప్పుడు, ఉత్తరాయణ దక్షిణాయన సంక్రమణములందు, విషువత్తిథులందు (జ్యోతిషశాస్త్రరీత్యా మేరువందు రేఖ ఏర్పడినప్పుడు)

సంక్రాన్తౌ వై ధృతౌ పుణ్యతీర్థేష్వన్యేషు యత్ఫలమ్ ।
అస్యాస్తు స్మరణాదేవ తత్పుణ్యం జాయతాం హర ॥ 38 ॥

సంక్రమణములందు, పుణ్యతీర్థములందు, వైధృతి యోగమునందే ఫలము కలుగునో ఈ గంగాదేవిని స్మరించినంత మాత్రముననే ఓ శివా! ఆ పుణ్యము కలుగవలయును.

శ్లాఘ్యం కృతే తపః ప్రోక్తం త్రేతాయాం యజ్ఞకర్మ చ ।
ద్వాపరే యజ్ఞదానే చ దానమేవ కలౌ యుగే ॥ 39 ॥

కృతయుగమునందు తపస్సు, త్రేతాయుగమునందు యజ్ఞకర్మ, ద్వాపరయుగమునందు యజ్ఞ దానములు, కలియుగమునందు కేవలం దానమే కొనియాడ దగినదని చెప్పారు.

యుగధర్మాశ్చ యే సర్వే దేశధర్మాస్తథైవ చ ।
దేశకాలాదిసంయోగే యో ధర్మో యత్ర శస్యతే ॥ 40 ॥

యుగ ధర్మములు, దేశధర్మము లెన్నియున్నవో, అట్లే దేశకాలాది సంయోగమునందు ఏ ధర్మమెక్కడ చెప్పబడినదో

యదన్యత్ర కృతం పుణ్యం స్నానదానాదిసంయమైః ।
అస్యాస్తు స్మరణా దేవ తత్పుణ్యం జాయతాం హర ॥ 41 ॥

ఓ శివా! యతులేవిధముగా నియమముగా నుండి స్నాన దానాదులు చేసి, మరొకచోట (చేసిన) పుణ్యం సంపాదించారో అటువంటి పుణ్యము ఈ గంగాదేవిని స్మరించినంత మాత్రముననే కలుగుగాక.

యత్ర యత్ర త్వియం యాతి యావత్సాగరగామినీ ।
తత తత్ర త్వయా భావ్యమేష చాస్తు వరో వరః ॥ 42 ॥

ఎక్కడెక్కడ ఈ గంగానది ప్రవహిస్తూ సముద్రపర్యంతము వెళ్ళుచున్నదో అక్కడక్కడ నీవు ఉండాలి. ఇదే నాకు శ్రేష్ఠమైన వరముగా ప్రసాదించుము. అది చాలు.

యోజనానాం తూపరి తు దశ యావచ్చ సంఖ్యయా ।
తదన్తరప్రవిష్టానాం మహాపాతకినామపి ॥ 43 ॥
తత్పితౄణాం చ తేషాం చ స్నానాయాఽఽగచ్ఛతాం శివ ।
స్నానేనాపీతరో మర్త్యా ముక్తిభాజో భవన్తు వై ॥ 44 ॥

పదియోజనముల పైన ఎంతసంఖ్యయున్నదో అంతసంఖ్యవరకు ఆ గంగలో ప్రవేశించిన మహాపాపులకు కూడా వారి వారి తల్లిదండ్రులకు, ఇంకా స్నానమునకు వచ్చే ఇతరులకు కూడా ముక్తిని ప్రసాదించేది అగుగాక, వారు ముక్తినందుదురుగాక.

ఏకతః సర్వతీర్థాని స్వర్గమర్త్యరసాతలే ।
ఏషా తేభ్యో విశిష్టా తు అలం శంభో నమోఽస్తు తే ॥ 45 ॥

స్వర్గ మర్త్య రసాతలములలో ప్రవహించే సమస్త తీర్థములొక వైపుండగా వాటన్నింటికంటె కూడా ఈ గంగ విశిష్టముగానుండుట చాలు ఓ శంకరా! నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్గౌతమవచః శ్రుత్వా తథాఽస్త్విత్యబ్రవీచ్ఛివః ।
అస్యాః పరతరం తీర్థం న భూతం న భవిష్యతి ॥ 46 ॥

ఆ గౌతముని మాటలను విని శివుడు అట్లే అగుగాక అని ఈ గంగ కంటె ఉత్తమమైన తీర్థమింతకు పూర్వము లేదు. భవిష్యత్కాలమున ఉండదని చెప్పాడు.

సత్యం సత్యం పునః సత్యం వేదే చ పరినిష్ఠితమ్ ।
సర్వేషాం గౌతమీ పుణ్యా ఇత్యుక్త్వాఽన్తరధీయత ॥ 47 ॥

సత్యము, సత్యము, ముమ్మాటికి సత్యము. వేదమునందు కూడా నైపుణ్యముతో చెప్పబడినది. అన్ని నదుల కంటె కూడా గౌతమీ నది పవిత్రమైనది అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

తతో గతే భగవతి లోకపూజితే తదాజ్ఞయా పూర్ణబలః స గౌతమః ।
జటాం సమాదాయ సరిద్వరాం తాం సురైర్వృతో బ్రహ్మగిరిం వివేశ ॥ 48 ॥

ఆ తరువాత లోకపూజితుడైన శివుడు అంతర్ధానమైన తదుపరి అతని ఆజ్ఞతో సంపూర్ణబలమును పొందిన ఆ గౌతముడు నదీశ్రేష్ఠమగు ఆ గంగను తీసుకొని దేవతలందరితో కలిసి బ్రహ్మ గిరికి చేరాడు.

తతస్తు గౌతమే ప్రాప్తే జటామాదాయ నారద ।
పుష్ప వృష్టిరభూత్తత్ర సమాజగ్ముః సురేశ్వరాః ॥ 49 ॥

ఓ నారదా! జటను, తీసుకొని గౌతముడు బ్రహ్మగిరికి రాగానే అక్కడ పుష్పవర్షము కురిసింది. దేవతలు వచ్చారు.

ఋషయశ్చ మహాభాగా బ్రాహ్మణాః క్షత్రియాస్తథా ।
జయశబ్దేన తం విప్రం పూజయన్తో ముదాన్వితాః ॥ 50 ॥

మహానుభావులైన ఋషులు, బ్రాహ్మణులు, క్షత్రియులు చాలా సంతోషముతో జయజయ ధ్వనులతో ఆ గౌతముని పూజించారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే గౌతమ్యానయనం నామ షష్ఠోఽధ్యాయః. ॥ 6 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి స్వయమ్భు నారద సంవాదములోని తీర్థమాహాత్మ్యములో గౌతమిని తెచ్చుట అను పేరుగల ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం
తీర్థమాహాత్మ్యమ్ - తీర్థమాహాత్మ్యం

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

మహేశ్వరజటాజూటాద్గంగా మాదాయ గౌతమః ।
ఆగత్య బ్రహ్మణః పుణ్యే తతః కిమకరోద్గిరౌ ॥ 1 ॥

ఆ గౌతముడు శివుని జటాజూటమునుండి గంగను తీసుకొనివచ్చి ఆ తరువాత పవిత్రమైన బ్రహ్మగిరియందు ఏమిచేశాడని నారదుడడిగాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆదాయ గౌతమో గంగాం శుచిః ప్రయతమానసః ।
పూజితో దేవగన్ధర్వైస్తథా గిరినివాసిభిః ॥ 2 ॥

శుచి, నమ్రమనస్కుడు అయిన ఆ గౌతముడు గంగను తీసుకొనిరాగానే బ్రహ్మగిరి యందు దేవతలు, గంధర్వులు, అట్లే గిరినివాసులందరు అతనిని పూజించారు.

గిరేర్మూర్ధ్ని జటాం స్థాప్య స్మరన్దేవం త్రిలోచనమ్ ।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా గంగాం స ద్విజసత్తమః ॥ 3 ॥

ఆ పర్వత శిఖరముపై త్రిలోచనుడైన శివుని స్మరిస్తూ జటను ఉంచి ఆ ద్విజసత్తముడైన గౌతముడు నమస్కరిస్తూ గంగతో ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

త్రిలోచనజటోద్భూతే సర్వకామప్రదాయిని ।
క్షమస్వ మాతః శాన్తాఽసి సుఖం యాహి హితం కురు ॥ 4 ॥

ముక్కంటి జటాజూటమునుండి ఉద్భవించినదానా! సమస్తకోరికలను నెరవేర్చేదానా! తల్లీ! నీవు శాంత స్వభావురాలవు. క్షమించుము. సుఖముగా వెళ్ళుము. హితమును కలిగించుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్తా గౌతమేన గంగా ప్రోవాచ గౌతమమ్ ।
దివ్యరూపధరా దేవీ దివ్యస్రగనులేపనా ॥ 5 ॥

ఈవిధముగా గౌతముడు పలుకగానే దివ్య మాల్యములు, లేపనములతో గూడి, దివ్యరూపాన్ని ధరించిన ఆ గంగ గౌతమునితో ఇలా అన్నది.

గంగోవాచ :- గంగ పలికింది.

గచ్ఛేయం దేవసదనమథవాఽపి కమణ్డలుమ్ ।
రసాతలం వా గచ్ఛేయం జాతస్త్వం సత్యవాగసి ॥ 6 ॥

నీవు సత్యవాక్పరిపాలకునిగా నున్నావు. నేను స్వర్గమునకు గాని, రసాతలమునకుగాని లేదా కమండలమునకు గాని వెళ్ళుదును.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

త్రయాణాముపకారార్థం లోకానాం యాచితం మయా ।
శమ్భునా చ తథా దత్తా దేవి తన్నాన్యథా భవేత్ ॥ 7 ॥

దేవీ! నేను ముల్లోకముల కుపకారము కొరకు యాచించాను. అలాగే శివుడు కూడా ఇచ్చాడు. అది వేరే విధంగా జరుగకూడదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్గౌతమవచః శ్రుత్వా గంగా మేనే ద్విజేరితమ్ ।
త్రేధాఽఽత్మానం విభజ్యాథ స్వర్గమర్త్యరసాతలే ॥ 8 ॥

ఆ గౌతముడు చెప్పిన దానిని విని గంగ ఆ బ్రాహ్మణుడు చెప్పిన దాని కంగీకరించింది. ఆ తరువాత స్వర్గ, మర్త్య, రసాతలములం దుండేటట్లుగా తనను మూడు భాగములుగా విభజించుకొంది.

స్వర్గే చతుర్ధా వ్యగమత్సప్తధా మర్త్యమణ్డలే ।
రసాతలే చతుర్ధైవ సైవం పంచదశాకృతిః ॥ 9 ॥

ఆ గంగ స్వర్గములో నాలుగు విధములుగా, మర్త్యలోకములో ఏడు విధములుగా, రసాతలంలో నాలుగు విధములుగా మొత్తం పదిహేను విధములుగా తన ఆకృతిని మార్చుకొంది.

సర్వత్ర సర్వభూతైవ సర్వపాపవినాశినీ ।
సర్వకామప్రదా నిత్యం సైవ వేదే ప్రగీయతే ॥ 10 ॥

అంతటా అన్నిటియందున్నదిగా, సర్వపాపవినాశినిగా సమస్త కోరికల నిచ్చేదానిగానే ఆ గంగను వేదమునందు నిత్యం స్తుతిస్తారు.

మర్త్యా మర్త్యగతామేవ పశ్యన్తి న తలం గతామ్ ।
నైవ స్వర్గగతం మర్త్యాః పశ్యన్త్యజ్ఞానబుద్ధయః ॥ 11 ॥

మానవులు భూలోకమున నున్న గంగను మాత్రమే చూస్తారు. జ్ఞానహీనులైన మానవులు రసాతలమునకు వెళ్ళిన గంగను గాని, స్వర్గలోకమునకు వెళ్ళిన గంగను గాని చూడలేరు.

యావత్సాగరగా దేవీ తావద్దేవమయీ స్మృతా ।
ఉత్సృష్టా గౌతమేనైవ ప్రాయాత్పూర్వార్ణవం ప్రతి ॥ 12 ॥

గౌతముడు పంపిన గంగ తూరుపు సముద్రమువైపు వెళ్ళింది. సముద్రము వరకు వెళ్ళేంతవరకా గంగా దేవిని దేవమయి అని అంటారు.

తతో దేవర్షిభిర్జుష్టాం మాతరం జగతః శుభామ్ ।
గౌతమో మునిశార్దూలః ప్రదక్షిణమథాకరోత్ ॥ 13 ॥

దేవర్షులు స్తోత్రము చేయునట్టిది, లోకమునకు శుభము కలుగ జేసే తల్లియైన గంగాదేవికి శ్రేష్ఠమునియైన గౌతముడు ప్రదక్షిణమును చేశాడు.

త్రిలోచనం సురేశానం ప్రథమం పూజ్యగౌతమః ।
ఉభయోస్తీరయోః స్నానం కరోమీతి దధే మతిమ్ ॥ 14 ॥

ఆ గౌతముడు మొదట సురేశానుడైన త్రిలోచనుని పూజించి, రెండు తీరములందు స్నానము చేస్తానని సంకల్పించుకొన్నాడు.

స్మృతమాత్రస్తదా తత్రాఽఽవిరాసీత్కరుణార్ణవః ।
కృతాంజలిపుటో భూత్వా భక్తినమ్రస్త్రిలోచనమ్ ॥ 15 ॥

తలచినంతలోనే కరుణాసముద్రుడైన శివుడు ప్రత్యక్షమయ్యాడు. గౌతముడు శివునకు చేతులు జోడిస్తూ వినయ పూర్వకముగా భక్తితో

తత్ర స్నానం కథం సిధ్యేదిత్యేవం శర్వమబ్రవీత్ ॥16 ॥

అక్కడ స్నానం చేయుట ఎలా సిద్ధిస్తుందని శివుని యడిగాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

దేవ దేవ మహేశాన తీర్థస్నానవిధిం మమ ।
బ్రూహి సమ్యక్ మహేశాన లోకానాం హితకామ్యయా ॥ 17 ॥

దేవదేవా! మహేశ్వరా! లోకములకు హితమును కలిగించుటకై తీర్థస్నాన విధిని గూర్చి నాకు చక్కగా వివరించు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

మహర్షే శృణు సర్వం చ విధిం గోదావరీభవమ్ ।
పూర్వం నాన్దీముఖం కృత్వా దేహశుద్ధిం విధాయ చ ॥ 18 ॥

ఓ మహర్షీ! గోదావరినుండి ఏర్పడినటువంటి తీర్థ స్నాన విధినంతటిని శ్రద్ధగా విను. మొదట నాందీముఖము అనగా భేరీతాడనాదులతో దేవతాస్తుతి చేసి, బ్రాహ్మణాశీర్వాదమును పొంది, దేహమును శుద్ధి చేసుకొని,

బ్రాహ్మణాన్ భోజయిత్వా చ తేషామాజ్ఞాం ప్రగృహ్య చ ।
బ్రహ్మచర్యేణ గచ్ఛన్తి పతితాలాపవర్జితాః ॥ 19 ॥

బ్రాహ్మణులకు భోజనమును పెట్టి, వారి యాజ్ఞను పొంది, వ్యర్థమైన మాటలు పలుకక, బ్రహ్మచర్యమును పాటించి,

యస్య హస్తౌ చ పాదౌ చ మనశ్చైవ సుసంయతమ్ ।
విద్యా తపశ్చ కీర్తిశ్చ స తీర్థఫలమశ్నుతే ॥ 20 ॥

కాళ్లను, చేతులను, మనస్సును శుచిగా నియంత్రించినవాడు విద్యా, తపస్సు, కీర్తి కలవాడై తీర్థఫలమును పొందుతాడు.

దుష్టభావం పరిత్యజ్య స్వధర్మపరినిష్ఠితః ।
శ్రాన్తసంవాహనం కుర్వన్ దద్యాదన్నం యథోచితమ్ ॥ 21 ॥

దుష్ట భావమును వదిలి పెట్టి, స్వధర్మమునందు నిరతుడై, పెద్దలకు, సన్యాసులకు సేవ చేస్తూ, యథో చితముగా అన్నదానము చేయాలి.

అకించనేభ్యః సాధుభ్యో దద్యాద్వస్త్రాణి కంబలాన్ ।
శృణ్వన్ హరికథాం దివ్యాం తథా గంగాసముద్భవామ్ ॥ 22 ॥

దిక్కులేని వారికి వస్త్రములను, సాధువులకు కంబళ్లను దానము చేయాలి. దివ్యమైన హరికథను అలాగే గంగోత్పత్తి కథలను వింటూ ఉండాలి.

అనేన విధినా గచ్ఛన్ సమ్యక్ తీర్థఫలం లభేత్ ।
త్ర్యంబకశ్చాపరం ప్రాహ గౌతమం మునిభిర్వృతమ్ ॥ 23 ॥

ఈ విధము ననుసరించినట్లైతే చక్కని తీర్థఫలమును పొందవచ్చు. మునులందరితో కూడుకున్న గౌతమమహర్షికి శివుడు మరొక దానిని గూడ చెప్పాడు.

ద్విహస్తమాత్రే తీర్థాని సంభవిష్యన్తి గౌతమ ।
సర్వత్రాహం సంనిహితః సర్వకామప్రదస్తథా ॥ 24 ॥

ఓ గౌతమా! తీర్థములు రెండు చేతుల పరిమాణంనందే సంభవించగలవు. అప్పుడు నేనంతటను దగ్గరగా నుండి అలా సమస్త కోరికలను నెరవేర్చగలను.

గంగాద్వారే ప్రయాగే చ తథా సాగరసంగమే ।
ఏతేషు పుణ్యదా పుంసాం ముక్తిదా సా భగీరథీ ॥ 25 ॥

ఆ గంగ ప్రయాగయందు (అలహాబాదు) త్రివేణీసంగమం, గంగాద్వారమందు (హరిద్వార్) అట్లే సముద్ర సంగమ ప్రదేశమునందు ఈ ప్రదేశములలో పుణ్యమును, ముక్తిని ఇస్తుంది.

నర్మదా తు సరిచ్ఛ్రేష్ఠా పర్వతేఽమరకణ్టకే ।
యమునా సంగతా తత్ర ప్రభాసే తు సరస్వతీ ॥ 26 ॥

నదులలో శ్రేష్ఠురాలైన నర్మద అమరకంటక పర్వతంపైన యమునతో కలుస్తుంది. ప్రభాస (తీర్థము) క్షేత్రమునందు సరస్వతీనది కలుస్తుంది.

కృష్ణా భీమరథీ చైవ తుంగభద్రా తు నారద ।
తిసృణాం సంగమో యత్ర తత్తీర్థం ముక్తిదం నృణామ్ ॥ 27 ॥

ఓ నారదా! కృష్ణా భీమరథీ తుంగభద్రానదులు మూడు ఎక్కడ కలుస్తాయో ఆ తీర్థము మానవులకు ముక్తి నిచ్చేది.

పయోష్ణీ సంగతా యత్ర తత్రత్యా తచ్చ ముక్తిదమ్ ।
ఇయం తు గౌతమీ వత్స యత్ర క్వాపి మమాజ్ఞయా ॥ 28 ॥

పయోష్ణి నది ఎక్కడ సంగమిస్తుందో అక్కడి వారి కది ముక్తినిస్తుంది. నాయనా! ఈ గౌతమి మాత్రము నా ఆజ్ఞతో ఎక్కడవున్నా,

సర్వేషాం సర్వదా నౄణాం స్నానాన్ముక్తిం ప్రదాస్యతి ।
కించిత్కాలే పుణ్యతమే కించిత్తీర్థే సురాగమే ॥
సర్వేషాం సర్వదా తీర్థం గౌతమీ నాత్ర సంశయః ॥ 29 ॥

ఎప్పుడూ మానవులందరికి స్నానము చేసినంతమాత్రముననే ముక్తినిస్తుంది. కొద్ది కాలమునందే అఖండపుణ్యమును, కొద్ది తీర్థముతోనే స్వర్గమును ప్రసాదించునదీ గౌతమీ తీర్థము. ఈ విషయమున నే మాత్రము సందేహము లేదు.

షష్ఠివర్షసహస్రాణి భాగీరథ్యవగాహనమ్ ।
సకృద్గోదావరీస్నానం సింహస్థే చ బృహస్పతౌ ॥ 30 ॥

అరువదివేల సంవత్సరములు భాగీరథి యందు స్నానము చేసినందువలన ఏ ఫలము లభించునో అటువంటి ఫలము సింహరాశిలో బృహస్పతియున్నప్పుడు గోదావరినదిలో ఒక్కసారి స్నానం చేస్తే వస్తుంది.

విశేషాద్రామచరణప్రదానాత్తీర్థసంశ్రయాత్ ।
సింహస్థితే సురగురౌ దుర్లభా గౌతమీ నృణామ్ ॥ 31 ॥

విశేషంగా శ్రీరామచంద్రుని పాదుకాప్రదానమువలన, తీర్థసంశ్రయమువలన పవిత్రత ఏర్పడినది. సింహరాశిలో బృహస్పతియుండుట అను సమయమున మానవులకు గౌతమీనది లభించుట దుర్లభము.

భాగీరథీ నర్మదా చ యమునా చ సరస్వతీ ।
ఆయాన్తి భీమరథ్యాద్యాః స్నాతుం సింహగతే రవౌ ॥ 32 ॥

సింహరాశిలో సూర్యుడున్నప్పుడు భాగీరథి, నర్మద, యమున, సరస్వతి, భీమరథి నదులు స్నానమునకు వస్తాయి.

విహాయ గౌతమీం గంగాం తీర్థాన్యన్యాని సేవితుమ్ ।
యే యాన్తి మూఢాస్తే యాన్తి నిరయం సింహగే గురౌ ॥ 33 ॥

గురువు (బృహస్పతి) సింహరాశిలో యున్నప్పుడు ఎవరైతే గౌతమీ గంగను వదిలి ఇతర తీర్థములను సేవిస్తారో అటువంటి మూఢులు నరకమును పొందుతారు.

తిస్రః కోట్యోఽర్థకోటీ చ యోజనానాం శతద్వయే ।
తీర్థాని మునిశార్దూల సమ్భవిష్యన్తి గౌతమ ॥ 34 ॥

ఓ మునిశ్రేష్ఠా! రెండువందల యోజనాల పరిధిలో మూడున్నరకోట్ల తీర్థములు యేర్పడును.

ఇయం మాహేశ్వరీ గంగా గౌతమీ వైష్ణవీతి చ ।

ఈ గంగ మాహేశ్వరి, గౌతమి, వైష్ణవి

బ్రాహ్మీ గోదావరీ నన్దా సునన్దా కామదాయినీ ।
బ్రహ్మతేజః సమానీతా సర్వపాపప్రణాశినీ ॥ 35 ॥

బ్రాహ్మీ, గోదావరీ, నంద సునంద, కామదాయిని, బ్రహ్మతేజస్సునుండి తీసుకొని రాబడినది, సమస్త పాపములను నశింపచేయునది.

స్మరణాదేవ పాపౌఘహన్త్రీ మమ సదా ప్రియా ।
పంచానామపి భూతానామాపః శ్రేష్ఠత్వమాగతః ॥ 36 ॥

నాకు ఎల్లప్పుడూ ప్రియమైనది, స్మరించినంత మాత్రముననే పాపరాశిని నశింప చేయునది, పంచ మహా భూతములలో నీరు శ్రేష్ఠత్వమును పొందినది.

తత్రాపి తీర్థభూతాస్తు తస్మాదాపః పరాః స్మృతాః ।
తాసాం భాగీరథీ శ్రేష్ఠా తాభ్యో యా గౌతమీ త్వయా ॥ 37 ॥

అందువలన తీర్థభూతములైన వాటటలో నీటటని గొప్పగా భావించారు. వాటిలో గంగ శ్రేష్ఠమైనది. అంతకంటె గౌతమి.

ఆనీతా సజటా గంగా అస్యా నాన్యచ్ఛుభావహమ్ ।
స్వర్గే చ భూతలే వాఽపి తీర్థం సర్వార్థదం మునే ॥ 38 ॥

నీవు తీసుకొనివచ్చిన సజటాగంగశ్రేష్ఠము. దానికంటె మరొకటి స్వర్గ మర్త్య పాతాల లోకములందు లేదు. ఓ మునీ! ఈ తీర్థము సమస్త కోరికలు, సంపదలిస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యేతత్కథితం పుత్ర గౌతమాయ మహాత్మనే ।
సాక్షాద్ధరేణ తుష్టేన మయా తవ నివేదితమ్ ॥ 39 ॥

కుమారా! నారదా! స్వయముగా శివుడు సంతోషించి ఆ మహాత్ముడైన గౌతమునకు చెప్పిన దానిని ఈ విధముగా నీకు వివరించాను.

ఏవం సా గౌతమీ గంగా సర్వేభ్యోఽ ప్యధికా మతా ।
తత్స్వరూపం చ కథితం కుతోఽ న్యా శ్రవణస్పృహా ॥ 40 ॥

ఈ విధముగా గౌతమీ గంగా అన్నింటి కంటె అధికమైనది. నేను నీకు దాని స్వరూపమును చెప్పాను. ఇంకా వేరే దానిని వినాలనే కుతూహల మెందుకు ?

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే సప్తమోఽ ధ్యాయః ॥ 7 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములో ఏడవఅధ్యాయం సంపూర్ణం.

అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం

భాగీరథ్యవతరణం - భాగీరథీ అవతరణం

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

ద్వివిధా సైవ గదితా ఏకాఽపి సురసత్తమ ।
ఏకో భేదస్తు కథితో బ్రాహ్మణేనాఽఽహృతో యతః ॥ 1 ॥

ఓ దేవతాశ్రేష్ఠుడా! ఒకే దానిని రెండు విధములుగా నున్నదని చెప్పితివి. వాటిలో బ్రాహ్మణుడు తీసుకొని వచ్చిన ఒక దానిని గూర్చిన అంశమును నీవు చెప్పగా విన్నాను.

క్షత్రియేణాపరోఽప్యంశో జటాస్వేవ వ్యవస్థితః ।
భవస్య దేవదేవస్య ఆహృతస్తద్వదస్వ మే ॥ 2 ॥

దేవదేవుడైన శివునియొక్క జటాజూటము నందేయున్న మరొక అంశమును క్షత్రియుడు తెచ్చినాడన్నారు దానినిగూర్చి నాకు వివరించండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వైవస్వతాన్వయే జాత ఇక్ష్వాకుకులసమ్భవః ।
సగరో నామ రాజాఽఽసీద్యన్నామ్నా సాగరో మునే ॥ 3 ॥

ఓ నారదమునీ! వైవస్వతుడనే మనువువంశంలో ఇక్ష్వాకుడనే రాజకులంలో సగరుడనే రాజుండినాడు. ఆ రాజు పేరుతోనే సాగరము అని పేరు ఏర్పడినది.

యజ్వా దానపరో నిత్యం ధర్మాచారవిచారవాన్ ।
తస్య భార్యాద్వయం చాఽఽసీత్పతిభక్తిపరాయణమ్ ॥ 4 ॥

ఆ సగరడు యజ్ఞములు చేసేవాడు. నిత్యం దానములను చేసేవాడు. ధర్మాచారవిచారుడు. అతనికి భక్తి పరాయణులైన భార్యలిద్దరుండినారు.

తస్య వై సంతతిర్నాభూదితి చిన్తాపరోఽభవత్ ।
వసిష్ఠం గృహమాహూయ సంపూజ్య విధివత్తతః ॥ 5 ॥

సగరుడు తనకు సంతానము కలుగలేదని చింతించుచుండినాడు. ఒకనాడు గురువైనవసిష్ఠుని తన ఇంటికి ఆహ్వానించి విధిపూర్వకము పూజించి ఆ తరువాత

ఉవాచ వచనం రాజా సంతతేః కారణం ప్రతి ।
ఇతి తద్వచనం శ్రుత్వా ధ్యాత్వా రాజానమబ్రవీత్ ॥ 6 ॥

తనకు సంతానము కలుగపోవుటకు కారణమేమని రాజడిగినాడు. అతని మాట విన్న వసిష్ఠుడు కొంతసేపు ధ్యానము చేసి రాజుతో ఇలా అన్నాడు.

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

సపత్నీకః సదా రాజన్ ఋషిపూజాపరో భవ ॥ 7 ॥

ఓ రాజా! ఎప్పుడూ భార్యలతో కలిసి ఋషులను పూజించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా స మునిర్విప్ర యథాస్థానం జగామ హ ।
ఏకదా తస్య రాజర్షేర్గృహమాగాత్తపోనిధిః ॥ 8 ॥

ఓ విప్రుడా! ఈ విధముగా పలికి వసిష్ఠుడు తిరిగి తన ఆశ్రమమునకు వెళ్ళినాడు. ఒకప్పుడు ఆ రాజర్షి ఇంటికి తపోధను డొకడు వచ్చినాడు.

తస్యర్షేః పూజనం చక్రే స సంతుష్టోఽబ్రవీద్వచః ।
వరం బ్రూహి మహాభాగేత్యుక్తే పుత్రాన్సచాఽఽవృణోత్ ॥ 9 ॥

వచ్చిన ఆ మహర్షిని పూజించినాడు. దానికి సంతోషించిన ఆ మహర్షి వరమును కోరుకొమ్మన్నాడు. దానికతడు తనకు సంతానము కావలయునని కోరాడు.

స మునిః ప్రాహ రాజానమేకస్యాం వంశధారకః ।
పుత్రో భూయాత్తథాన్యస్యాం షష్టిసాహస్రకం సుతాః ॥ 10 ॥

అప్పుడు ఆ ముని రాజుతో ఇలా అన్నాడు. నీ ఇద్దరు భార్యలలో ఒకామె యందు వంశమునుద్ధరించే కుమారుడు, మరొకామె యందు అరువది వేల మంది కుమారులు కలుగునని వరమిచ్చాడు.

వరం దత్వా మునౌ యాతే పుత్రా జాతాః సహస్రశః ।
స యజ్ఞాన్సుబహూంశ్చక్రే హయమేధాన్సుదక్షిణాన్ ॥ 11 ॥

ఈవిధముగా వరమునిచ్చి ఆ ముని వెళ్ళిపోగానే అతనికి వేలమంది కుమారులు కలిగారు. ఆ తరువాత ఆ సగరుడు చక్కని దక్షిణలను ఇచ్చి అనేక అశ్వమేధయాగములను చేశాడు.

ఏకస్మిన్ హయమేధే వై దీక్షితో విధివన్నృపః ।
పుత్రాన్యయోజయద్రాజా ససైన్యాన్ హయరక్షణే ॥ 12 ॥

ఒకానొక అశ్వమేధయాగము నందు విధిపూర్వకముగా దీక్షలోనున్న రాజు సైన్యముతో కూడిన పుత్రులను హయరక్షణమునకై నియోగించాడు.

క్వచిదన్తరమాసాద్య హయం జహ్రే శతక్రతుః ।
మార్గమాణాంశ్చ తే పుత్రా నైవాపశ్యన్ హయం తదా ॥ 13 ॥

మార్గమధ్యంలో కొంచెం దూరముండుట చూచి ఇంద్రుడా గుఱ్ఱమునపహరించాడు. ఆ కుమారులు ఆ గుఱ్ఱమును వెదుకుచూ కూడా గుఱ్ఱమును చూడలేకపోయారు.

సహస్రాణాం తథా షష్టిర్నానాయుద్ధవిశారదాః ।
తేషు పశ్యత్సు రక్షాంసి పుత్రేషు సగరస్య హి ॥ 14 ॥

అనేక యుద్ధాలలో నిపుణులైన సగరకుమారులు అరవైవేల మంది చూస్తూ ఉండగానే రాక్షసులు

ప్రోక్షితం తద్ధయం నీత్వా తే రసాతలమాగమన్ ।
రాక్షసాన్ మాయయా యుక్తాన్నైవాపశ్యన్త సాగరాః ॥ 15 ॥

యజ్ఞము కొరకై జలమును ప్రోక్షించి పవిత్రముగా చేసిన గుఱ్ఱమును తీసుకొని రసాతలమునకు వెళ్ళారు. రాక్షసమాయ గలిగినటువంటివారిని సగరపుత్రులు చూడలేదు.

న దృష్ట్వా తే హయం పుత్రాః సగరస్య బలీయసః ।
ఇతశ్చేతశ్చరన్తస్తే నైవాపశ్యన్ హయం తదా ॥ 16 ॥

బలవంతుడైన సగరునియొక్క కుమారులు అప్పుడు గుఱ్ఱము కనిపించక ఇటు అటు తిరుగుతూ దాన్ని కనుక్కొనలేక పోయారు.

దేవలోకం తదా జగ్ముః పర్వతాంసి సరాంసి చ ।
వనాని చ విచిన్వన్తో నైవాపశ్యన్ హయం తదా ॥ 17 ॥

అప్పుడు వారు దేవలోకమునకు వెళ్ళారు. కొండలు, సరస్సులు, వనములు అన్నింటా కూడా వెతికినా గుఱ్ఱముకనబడలేదు.

కృతస్వస్త్యయనో రాజా ఋత్విగ్భిః కృతమంగలః ।
అదృష్ట్వా తు పశుం రమ్యం రాజా చిన్తాముపేయివాన్ ॥ 18 ॥

రాజు ఋత్విక్కులందరితో శుభకరమైన స్వస్త్యయనమును చేశాడు. కాని సుందరమైన ఆ గుఱ్ఱమును చూడక రాజు చింతాక్రాంతుడయ్యాడు.

అటన్తః సాగరాః సర్వే దేవలోకముపాగమన్ ।
హయం తమనుచిన్వన్తస్తత్రాపి న హయోఽభవత్ ॥ 19 ॥

గుఱ్ఱమును వెదుకుతూ సగరకుమారులు దేవలోకమునకు వెళ్ళారు. అక్కడ గుఱ్ఱమును వెదకినా కూడా అక్కడా వారికి గుఱ్ఱము కనిపించలేదు.

తతో మహీం సమాజగ్ముః పర్వతాంశ్చ వనాని చ ।
తత్రాపి చ హయం నైవ దృష్టవన్తో నృపాత్మజాః ॥ 20 ॥

ఆ తరువాత భూలోకమునకు వచ్చారు. అక్కడ పర్వతములలో, వనములలో, వెదకారు. అక్కడ కూడా ఆ రాకుమారులు గుఱ్ఱమును చూడలేక పోయారు.

ఏతస్మిన్నన్తరే తత్ర దైవీవాగభవత్తదా ।
రసాతలే హయో బద్ధ ఆస్తే నాన్యత్ర సాగరాః ॥ 21 ॥

ఇంతలో అశరీరవాణి వినిపించినది. ఓ సగర పుత్రులారా! గుఱ్ఱము రసాతలమునందు బంధింపబడి ఉన్నది. మరొక చోట లేదు.

ఇతి శ్రుత్వా తతో వాక్యం గన్తుకామా రసాతలమ్ ।
అఖనన్ పృథివీం సర్వాం పరితః సాగరాస్తతః ॥ 22 ॥

ఈ మాటను విన్న సగరపుత్రులు రసాతలమునకు వెళ్ళుదామని నిశ్చయించి భూమినంతటిని చుట్టు ప్రక్కల త్రవ్వారు.

తే క్షుధార్తా మృదం శుష్కాం భక్షయన్తస్త్వహర్నిశమ్ ।
న్యఖనంశ్చాపి జగ్ముశ్చ సత్వరాస్తే రసాతలమ్ ॥ 23 ॥

వారు ఆకలి వేసినప్పుడు ఎండిన మట్టిని తింటూ రేయింబవళ్ళు త్వరత్వరగా భూమిని త్రవ్వుతూ రసాతలానికి (పాతాళలోకానికి) వెళ్ళారు.

తానాగతాన్ భూపసుతాన్ సాగరాన్ బలినః కృతీన్ ।
శ్రుత్వా రక్షాంసి సంత్రస్తా వ్యగమన్ కపిలాంతికమ్ ॥ 24 ॥

త్రవ్వుతూ వచ్చిన బలవంతులైన సగరకుమారుల గూర్చి విన్న రాక్షసులు భయంతో కపిలమహర్షి వద్దకు వెళ్ళారు.

కపిలోఽపి మహా ప్రాజ్ఞస్తత్ర శేతే రసాతలే ।
పురా చ సాధితం తేన దేవానాం కార్యముత్తమమ్ ॥ 25 ॥

మహా ప్రాజ్ఞుడైన కపిలుడు అక్కడ ఆ రసాతలము నందు శయనించుచున్నాడు. పూర్వమతడు దేవతల కుత్తమమైన కార్యము నెరవేర్చాడు.

వినిద్రేణ తతః శ్రాన్తః సిద్ధే కార్యే సురాన్ ప్రతి ।
అబ్రవీత్కపిలః శ్రీమాన్నిద్రాస్థానం ప్రయచ్ఛథ ॥ 26 ॥

దేవతల కార్యమును నిద్రపోకుండా సాధించిన తర్వాత దేవతలకు కార్యము సిద్ధించగానే పూజ్యుడైన కపిలుడు అలసినవాడై తనకు నిద్రాస్థానమును చూపించమని దేవతల నడిగాడు.

రసాతలం దదుస్తస్మై పునరాహ సురాన్మునిః ।
యో మాముత్థాపయేన్మర్త్యో భస్మీభూయాచ్చ సత్వరమ్ ॥ 27 ॥

దేవతలతనికి రసాతలమునిచ్చారు. అప్పుడా కపిలుడు దేవతలతో ఇలా అన్నాడు. ఎవడు మందుడై నాకు నిద్రా భంగమును కలిగిస్తాడో, అతడు వెంటనే భస్మము కావాలి.

తతః శయే తలగతో నో చేన్న స్వప్న ఏవ హి ।
తథేత్యుక్తః సురగణై స్తత్ర శేతే రసాతలే ॥ 28 ॥

అట్లైతేనే రసాతలంలో శయనిస్తాను. లేకుంటే మాకది స్వప్న సదృశమే కాని, నిద్రా కాదు అనగానే అప్పుడా దేవగణము సరే అన్నారు. అప్పుడతడు రసాతలమున నిద్రించాడు.

తస్య ప్రభావం తే జ్ఞాత్వా రాక్షసా మాయయా యుతాః ।
సాగరాణాం చ సర్వేషాం వధోపాయం ప్రచక్రిరే ॥ 29 ॥

కపిలుని ప్రభావమును తెలుసుకున్న రాక్షసులు తమ మాయతో కూడుకొని ఉన్నవారై సగరకుమారుల నందరిని చంపుట కుపాయమును పన్నారు.

వినా యుద్ధేన తే భీతా రాక్షసా సత్వరాస్తదా ।
ఆగత్య యత్ర స మునిః కపిలః కోపనో మహాన్ ॥ 30 ॥

యుద్ధము లేకుండానే భయపడిన రాక్షసులు అప్పుడు త్వరత్వరగా మిక్కిలి కోపం గలిగిన కపిలముని ఉన్న చోటుకు వచ్చి.

శిరోదేశే హయం తే వై బద్ధ్వాఽథ త్వరయాన్వితాః ।
దూరే స్థిత్వా మౌనినశ్చ ప్రేక్షన్తః కిం భవేదితి ॥ 31 ॥

కపిలముని తలవైపు ఆ గుఱ్ఱమును గట్టిగా కట్టివేసి, త్వరత్వరగా దూరంగా వెళ్ళిమౌనంగా వుండి, ఏమి జరుగుతుందో నని చూస్తున్నారు.

తతస్తు సాగరాః సర్వే నిర్విశన్తో రసాతలమ్ ।
దదృశుస్తే హయం బద్ధం శయానం పురుషం తథా ॥ 32 ॥

ఆ తరువాత సగరపుత్రులందరూ రసాతలమును చేరి అక్కడ బంధించబడివున్న గుఱ్ఱమును, అలాగే నిద్రపోతున్న పురుషుని చూచారు.

తం మేనిరే చ హర్తారం క్రతుహన్తారమేవ చ ।
ఏనం హత్వా మహాపాపం నయామోఽశ్వం నృపాన్తికమ్ ॥ 33 ॥

అతడే క్రతువిఘ్నము చేసి హయము నపహరించినవాడని అనుకున్నారు. ఈ మహాపాపిని చంపి అశ్వాన్ని రాజు వద్దకు తీసుకొని వెళ్తామని తలచారు.

కేచిదూచుః పశుం బద్ధం నయామోఽనేన కిం ఫలమ్ ।
తదాఽఽహురపరే శూరా రాజానః శాసకా వయమ్ ॥ 34 ॥

ఇతనితో మనకు ప్రయోజనమేమి? బంధించియున్న హయమును తీసుకొని వెళ్ళుదామని కొందరనగా అప్పుడితర వీరులు మనం రాజులు, శాసించేవారు అన్నారు.

ఉత్థాప్యైనం మహాపాపం హన్మః క్షాత్రేణ వర్చసా ।
తే తం జఘ్నుర్మునిం పాదైర్బ్రువన్తో నిష్ఠురాణి చ ॥ 35 ॥

ఈ మహాపాపిని లేపి మన క్షత్రియ పరాక్రమంతో చంపుదాం అని వారు కఠినములైన మాటలను పలుకుతూ ఆ మునిని కాళ్ళతో తన్నారు.

తతః కోపేన మహతా కపిలో మునిసత్తమః ।
సాగరానీక్షయామాస తాన్కోపాద్భస్మసాత్కరోత్ ॥ 36 ॥

అప్పుడు కపిలుడు మిక్కిలి కోపముతో చూశాడు. ఆ మునిసత్తముడు సగర కుమారులను భస్మముగా చేశాడు.

జజ్వలుస్తే తతస్తత్ర సాగరాః సర్వ ఏవ హి ।
తత్తు సర్వం న జానాతి దీక్షితః సగరో నృపః ॥ 37 ॥

అక్కడ సగర కుమారులందరు మాడి మసైనారు. దీక్షలో ఉన్న సగరరాజు దీని నంతటి నెరుగనే ఎరుగడు.

నారదః కథయామాస సగరాయ మహాత్మనే ।
కపిలస్య తు సంస్థానం హయస్యాపి తు సంస్థితమ్ ॥ 38 ॥

మహాత్ముడైన సగరునకు కపిలుడున్న స్థానమును గూర్చి, గుఱ్ఱమున్న ప్రదేశమును గూర్చి నారదుడు చెప్పాడు.

రాక్షసానాం చ వికృతిం సాగరాణాం చ నాశనమ్ ।
తతశ్చిన్తాపరో రాజా కర్తవ్యం నావబుధ్యత ॥ 39 ॥

రాక్షసుల వికృతకార్యమును, తనకుమారుల నాశనమును విన్న రాజు చింతించాడు. ఆ తరువాత ఏమి చేయవలెనో తెలియక కర్తవ్యవిమూఢుడై ఉండినాడు.

అపరోఽపి సుతశ్చాఽఽసీదసమంజా ఇతి శ్రుతః ।
స తు బాలాంస్తథా పౌరాన్మౌర్ఖ్యాత్ క్షిపతి చామ్భసి ॥ 40 ॥

ఆ సగరునకు అసమంజుడనే మరొక కుమారుదుండినాడు. అతడు మూర్ఖంగా ఆ పురములో నున్న బాలురను నీటిలో ముంచు చుండినాడు.

సగరోఽప్యథ విజ్ఞప్తః పౌరైః సమ్మిలితైస్తదా ।
దుర్నయం తస్య తం జ్ఞాత్వా తతః క్రుద్ధోఽబ్రవీన్నృపః ॥ 41 ॥

అపుడు పౌరజనులందరు వచ్చి అసమంజసుడు చేయుచున్న దుర్నయమును గూర్చి సగరునకు విన్నవించారు. సగరుడా విషయమును తెలుసుకొని కోపముతో ఇలా అన్నాడు.

స్వానమాత్యాంస్తదా రాజా దేశత్యాగం కరోత్వయమ్ ।
అసమంజాః క్షత్రధర్మత్యాగీ వై బలఘాతకః ॥ 42 ॥

క్షత్రియధర్మమును వదిలి, పిల్లలను చంపుతున్న ఈ అసమంజసుడు దేశమును వదిలిపెట్టి పోవలయును అని రాజు తన మంత్రులను ఆజ్ఞాపించాడు.

సగరస్య తు తద్వాక్యం శ్రుత్వాఽమాత్యాస్త్వరాన్వితాః ।
తత్యజుర్నృపతేః పుత్రమసమంజా గతో వనమ్ ॥ 43 ॥

సగరుని మాటను విన్న మంత్రులు వెంటనే రాజకుమారుని బహిష్కరించారు. అసమంజసుడు అడివికి వెళ్ళాడు.

సాగరా బ్రహ్మశాపేన నష్టాః సర్వే రసాతలే ।
ఏకోఽపి చ వనం ప్రాప్త ఇదానీం కా గతిర్మమ ॥ 44 ॥

సగర పుత్రులందరు కపిలుని శాపంతో రసాతలమున నశించారు. ఉన్న ఒక్కడూ అడవులను పట్టుకుని వెళ్ళాడు. ఇక నా గతి ఏమి? అని రాజు చింతించాడు.

అంశుమానితి విఖ్యాతః పుత్రస్తస్యాసమంజసః ।
ఆనాయ్య బాలకం రాజా కార్యం తస్మై న్యవేదయత్ ॥ 45 ॥

అసమంజసునకు అంశుమంతుడని ప్రసిద్ధి పొందిన కుమారుడుండినాడు. సగరరాజు ఆ బాలకుని రప్పించి చేయవలసిన పనిని గూర్చి అంశుమంతునకు నివేదించాడు.

కపిలం చ సమారాధ్య అంశుమానపి బాలకః ।
సగరాయ హయం ప్రాదాత్తతః పూర్ణోఽభవత్క్రతుః ॥ 46 ॥

బాలకుడైన అంశుమంతుడు కపిలుని ఆరాధించి, సగరునికా యాగాశ్వమును తెచ్చి ఇచ్చాడు. దానితో సగరుని యాగం సమాప్తమైంది.

తస్యాపి పుత్రస్తేజస్వీ దిలీప ఇతి ధార్మికః ।
తస్యాపి పుత్రో మతిమాన్ భగీరథ ఇతి శ్రుతః ॥ 47 ॥

అంశుమంతునకు తేజోవంతుడు, ధార్మికుడునైన దిలీపుడను కుమారుడుండినాడు. ఆ దిలీపునకు బుద్ధిమంతుడగు భగీరథుడను కుమారుడుండినాడు.

పితామహానాం సర్వేషాం గతిం శ్రుత్వా సుదుఃఖితః ।
సగరం నృపశార్దూలం పప్రచ్ఛ వినయాన్వితః ॥ 48 ॥

భగీరథుడు తన తాతలందరు పొందిన దుర్గతిని విని మిక్కిలి దుఃఖించి, రాజశ్రేష్ఠుడైన సగరరాజును వినయముగా నడిగినాడు.

సాగరాణాం తు సర్వేషాం నిష్కృతిస్తు కథం భవేత్ ।
భగీరథం నృపః ప్రాహ కపిలో వేత్తి పుత్రక ॥ 49 ॥

సగరపుత్రులందరకు నిష్కృతి ఎలా కలుగుతుంది? అప్పుడు సగరరాజు నాయనా! ఆ విషయము కపిలు డెరుగు నన్నాడు.

తస్య తద్వచనం శ్రుత్వా బాలఃప్రాయాద్రసాతలమ్ ।
కపిలం చ నమస్కృత్వా సర్వం తస్మై న్యవేదయత్ ॥ 50 ॥

సగరుని మాటలు విన్న ఆ బాలుడైన భగీరథుడు రసాతలమును చేరాడు. కపిలునికి నమస్కరించి, జరిగిన దంతా కపిలునకు నివేదించాడు.

స మునిస్తు చిరం ధ్యాత్వా తపసాఽఽరాధ్య శంకరమ్ ।
జటాజలేన స్వపితౄనాప్లావ్య నృపసత్తమ ॥ 51 ॥

అప్పుడా కపిలుడు కొంచం సేపు ధ్యానించి, తెలుసుకొని, ఓ నృపసత్తమా! తపస్సు చేసి శంకరుని ఆరాధించి అతని జటాజూటము నందున్న నీటితో నీ పితృదేవతలను తరింప జేయి.

తతః కృతార్థో భవితా త్వం చ తేపితరస్తథా ।
తథా కరోమీతి మునిం ప్రణమ్య పునరబ్రవీత్ ॥ 52 ॥

ఆవిధముగా చేసినట్లయితే నీవు, నీ పితరులు కృతార్థులు కాగలరని చెప్పగా సరే అట్లే చేయుదునని మునికి నమస్కరించి తిరిగి ఇలా అన్నాడు.

క్వ గచ్ఛేఽహం మునిశ్రేష్ఠ కర్తవ్యం చాపి తద్వద ॥ 53 ॥

ఓ మునిశ్రేష్ఠా! నేనెక్కడకు వెళ్ళాలి? నా కర్తవ్యమేమిటో చెప్పండి.

కపిల ఉవాచ :- కపిలుడు పలికాడు.

కైలాసం తం నగశ్రేష్ఠం గత్వా స్తుహి మహేశ్వరమ్ ।
తపః కురు యథాశక్తి తతస్త్వేష్టమవాప్స్యసి ॥ 54 ॥

శ్రేష్ఠమైన కైలాసగిరికి వెళ్ళి మహేశ్వరుని స్తుతించు. నీ శక్తికొద్ది తపస్సు చెయ్యి. అప్పుడు నీ అభీష్టము నెరవేరుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా స మునేర్వాక్యం మునిం నత్వా త్వగాన్నగమ్ ।
కైలాసం స శుచిర్భూత్వా బాలో బాలక్రియాన్వితః ॥
తపసే నిశ్చయం కృత్వా ఉవాచ స భగీరథః ॥ 55 ॥

ముని మాటలను విన్న భగీరథుడు మునికి నమస్కరించి కైలాసగిరి చేరాడు. అక్కడా బాలుడు శుచియై పిల్లచేష్టలు కలవాడై తపస్సు చేయుటకు నిశ్చయించుకొని ఇలా అన్నాడు.

భగీరథ ఉవాచ :- భగీరథుడు పలికాడు.

బాలోఽహం బాలబుద్ధిశ్చ బాలచంద్రధర ప్రభో ।
నాహం కించన జానామి తతః ప్రీతో భవ ప్రభో ॥ 56 ॥

బాలచంద్రుని తలమీద ధరించిన శంకరా! నేను బాలుడను, బాలబుద్ధిని, అజ్ఞానిని, నాకేమీ తెలియదు. అందువలన ఓ ప్రభూ! ప్రసన్నుడవు కమ్ము.

వాగ్భిర్మనోభిః కృతిభిః కదాచిన్మమోపకుర్వన్తి హితే రతా యే ।
తేభ్యో హితార్థం త్విహ చామరేశ సోమ నమస్యామి సురాదిపూజ్యమ్ ॥ 57 ॥

మనో వాక్కాయకర్మలతో నా హితమును గూర్చి ఎవరు నాకుపకారము చేయుటయందాసక్తి గలవారో అటువంటి వారి హితంకోసం దేవతాగణములు పూజించే దేవతాచంద్రమా! నమస్కారం చేస్తున్నాను.

ఉత్పాదితో యై రభివర్ధితశ్చ సమానగోత్రశ్చ సమానధర్మా ।
తేషామభీష్టాని శివః కరోతు బాలేన్దుమౌలిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥ 58 ॥

ఎవరు నా జన్మకు కారణమైనారో, ఎవరు నా అభివృద్ధికి కారణమైనారో, అట్టి నా గోత్రము వారి యొక్క నా పూర్వ క్షత్రియ ధర్మము నాచరించిన వారి యొక్క కోరికలకు మంగళము కలిగించుగాక! అట్టి శుభకరుడైన బాలేందుమౌళికి నేను నిత్యము నమస్కరిస్తున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతస్తస్య పురస్తాదభవచ్ఛివః ।
వరేణ ఛన్దయానో వై భగీరథమువాచ హ ॥ 59 ॥

ఈ విధముగా స్తోత్రము చేయుచున్న అతని ఎదుట శివుడు ప్రత్యక్షమయ్యాడు. వరముతో అతని అభిలాషను తీర్చుటకై భగీరథునితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

యన్న సాధ్యం సురగణైర్దేయం తత్తే మయా ధ్రువమ్ ।
వదస్వ నిర్భయో భూత్వా భగీరథ మహామతే ॥ 60 ॥

దేవతలకు కూడా ఏది అసాధ్యమో అది నీకిస్తాను. ఇది నిశ్చయం. మహామతీ! భగీరథా! భయం లేకుండా చెప్పు

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భగీరథః ప్రణమ్యేశం హృష్టః ప్రోవాచ శంకరమ్ ॥ 61 ॥

భగీరథుడు సంతోషించి శివునకు నమస్కరించి ఇలా అన్నాడు.

భగీరథ ఉవాచ :- భగీరథుడు పలికాడు.

జటాస్థితాం పితౄణాం మే పావనాయ సరిద్వరామ్ ।
తామేవ దేహి దేవేశ సర్వం పూర్ణం తతో భవేత్ ॥ 62 ॥

ఓ దేవదేవా! మా పితృదేవతలను పవిత్రము చేయుటకు నీ జటాజూటము నందున్న నదీశ్రేష్ఠయైన గంగా దేవినే అనుగ్రహించు. దాని వలన అంతా పరిపూర్ణమవుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మహేశోఽపి విహస్యాథ భగీరథమువాచ హ ॥ 63 ॥

అప్పుడు మహేశుడు నవ్వి భగీరథునితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

దత్తా మయేయం తే పుత్ర పునస్తాం స్తుహి సువ్రత ॥ 64 ॥

నాయనా! నీకు నేనీ గంగ నిస్తున్నాను. ఓ సువ్రతా! నీవు మరల ఆమెను స్తుతించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్దేవవచనం శ్రుత్వా తదర్థం తు తపో మహత్ ।
స్తుతిం చకార గంగాయా భక్త్యా ప్రయతమానసః ॥ 65 ॥

ఆ పరమశివుని మాటను విని భగీరథుడు భక్తితో కూడి, నియమమానసుడై గంగాదేవి కొరకు గొప్ప తపస్సును, స్తోత్రమును చేశాడు.

తస్యా అపి ప్రసాదం చ ప్రాప్య బాలోఽప్యబాలవత్ ।
గంగాం మహేశ్వరాత్ప్రాప్తామాదాయాగాద్రసాతలమ్ ॥ 66 ॥

బాలుడైనా కూడా పెద్దవానిగా ప్రవర్తించి గంగాదేవి యొక్క అనుగ్రహమును పొంది, శివునివల్ల పొందిన గంగను తీసుకొని రసాతలమునకు వెళ్ళాడు.

న్యవేదయత్స మునయే కపిలాయ మహాత్మనే ।
యథోదితప్రకారేణ గంగాం సంస్థాప్య యత్నతః ॥ 67 ॥

మహాత్ముడైన కపిలమునికి నివేదించాడు. కపిలుడు చెప్పిన ప్రకారముగా ప్రయత్నముతో నా భగీరథుడు గంగను అక్కడ ఉంచి,

ప్రదక్షిణమథాఽవర్త్య కృతాంజలిపుటోఽబ్రవీత్ ॥ 68 ॥

చుట్టూ ప్రదక్షిణము చేసి నమస్కరించి ఇలా అన్నాడు.

భగీరథ ఉవాచ :– భగీరథుడు పలికాడు.

దేవి మే పితరః శాపాత్కపిలస్య మహామునేః ।
ప్రాప్తాస్తే విగతిం మాతస్తస్మాత్త్రాన్పాతుమర్హసి ॥ 69 ॥

దేవీ! మహాముని యైన కపిలుని యొక్క శాపము వలన నా పితరులు అధోగతిని పొందినారు. తల్లీ! వారి నా విగతి నుండి రక్షించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా సురనదీ సర్వేషాముపకారికా ।
లోకానాముపకారార్థం పితౄణాం పావనాయ చ ॥ 70 ॥

అందరికీ ఉపకారము చేయు స్వభావము గల ఆ గంగానది లోకోపకారము కొరకు, భగీరథుని పితరులను పావనము చేయుట కొరకును

అగస్త్యపీతస్యామ్భోధేః పూరణాయ విశేషతః ।
స్మరణాదేవ పాపానాం నాశాయ సురనిమ్నగా ॥ 71 ॥

ఆసురనది స్మరించినంత మాత్రముననే పాపములను పోగొట్టుటకు విశేషంగా అగస్త్యుడు త్రాగిన సముద్రమును నింపుటకై

భగీరథోదితం చక్రే రసాతలతలే స్థితాన్ ।
భస్మీభూతాన్నృపసుతాన్సాగరాన్ బ్రహ్మశాపతః ॥ 72 ॥

భగీరథుడు చెప్పినట్లు చేసింది. కపిలమహర్షి శాపము వలన భస్మరాశులుగా మారి రసాతలము నందున్న

వినిర్దగ్ధానథాఽఽప్లావ్య ఖాతపూర మథాకరోత్ ।
తతో మేరుం సమాప్లావ్య స్థితాం బాలోఽబ్రవీన్నృపః ॥ 73 ॥

శాపదగ్ధులైన సగరకుమారులపై ప్రవహించి ఇంతకు పూర్వము త్రవ్విన దానిని నింపింది. తరువాత మేరు పర్వతముపై ప్రవహించి నిలచియున్న గంగను చూచి రాజకుమారుడైన భగీరథుడిలా అన్నాడు.

కర్మభూమౌ త్వయా భావ్యం తథేత్యాగాద్ధిమాలయమ్ ।
హిమవత్పర్వతాత్పుణ్యా ద్భారతం వర్షమభ్యగాత్ ॥ 74 ॥

నీవు కర్మభూమియం దుండవలయు ననగా, సరేయని హిమాలయమునకు చేరింది. పవిత్రమైన హిమవత్పర్వతము నుండి భారతవర్షము చేరింది.

తన్మధ్యతః పుణ్యనదీ ప్రాయాత్పూర్వార్ణవం ప్రతి ।
ఏవమేషాఽపి తే ప్రోక్తా గంగా క్షాత్రా మహామునే ॥ 75 ॥

మార్గమధ్యమున ఆ పుణ్యనది తూర్పు సముద్రము వైపు వెళ్ళింది. ఓ మహామునీ! ఈ విధముగా క్షత్రియుడు అయిన భగీరథుడు ప్రయత్నించి తెచ్చిన గంగను గూర్చి నీకు వివరించాను.

మాహేశ్వరీ వైష్ణవీ చ సైవ బ్రాహ్మీ చ పావనీ ।
భాగీరథీ దేవనదీ హిమవత్సాగరాశ్రయా ॥ 76 ॥

ఆ పావని యైన దేవనదియే మాహేశ్వరి, వైష్ణవి, బ్రాహ్మి, భాగీరథి అను పేర్లతో హిమవత్పర్వతము నుండి సముద్రములోనికి వెళ్ళినది.

మహేశ్వరజటావారి ఏవం ద్వైవిధ్యమాగతమ్ ।
విన్ధ్యస్య దక్షిణే గంగా గౌతమీ సా నిగద్యతే ॥
ఉత్తరే సాఽపి విన్ధ్యస్య భాగీరథ్యభిధీయతే ॥ 77 ॥

మహేశ్వరుని జటా జూటమునందున్న నీరు వింధ్య పర్వతమునకు దక్షిణదిశన ఉన్న గంగ, గౌతమి అని, ఉత్తరదిశన భాగీరథి యని రెండు విధములుగా నున్నది.

ఇతి శ్రీ బ్రహ్మ పురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే భాగీరథ్యవతరణం నామాష్టమోఽధ్యాయః. ॥ 8 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి బ్రహ్మ నారద సంవాదములో భాగీరథీ అవతరణమను పేరుగల ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

వరాహతీర్థవర్ణనమ్ - వరాహతీర్థ వర్ణనం

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

న మనస్తృప్తిమాధత్తే కథాః శృణ్వన్ త్వయేరితాః ।
పృథక్తీర్థఫలం శ్రోతుం ప్రవృత్తం మమ మానసమ్ ॥ 1 ॥

మీరు చెప్పిన కథలను వింటూ నా మనస్సు తృప్తిచెంద లేదు. ఇంకా తీర్థ ఫలమును వినాలని నా మనస్సు కోరుతున్నది.

క్రమశో బ్రాహ్మణానీతాం గంగాం మే ప్రథమం వద ।
పృథక్తీర్థఫలం పుణ్యం సేతిహాసం యథాక్రమమ్ ॥ 2 ॥

మొదట బ్రాహ్మణుడు తెచ్చిన గంగనుగూర్చి చెప్పండి. తరువాత తీర్థము వలన కలుగు ఫలమును, పుణ్యమును గూర్చిన ఇతిహాసములను క్రమముగా తెలుపండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తీర్థానాం పృథగ్భావం ఫలం మాహాత్మ్యమేవ చ ।
సర్వం వక్తుం న శక్నోమి న చ త్వం శ్రవణే క్షమః ॥ 3 ॥

భిన్న భిన్న తీర్థము లిచ్చే ఫలమును, వాటిమాహాత్మ్యమును పూర్తిగా వివరించుటకు నాకు శక్తి లేదు. అంతేకాక వాటిని వినే సామర్థ్యము నీకు కూడా లేదు.

తథాఽపి కించిద్వక్ష్యామి శృణు నారద యత్నతః ।
యాన్యుక్తాని చ తీర్థాని శ్రుతివాక్యాని యాని చ ॥ 4 ॥

అయినప్పటికిని కొంచము చెప్పగలను. నారదా! శ్రద్ధగా వినుము. యే శ్రుతి వాక్యములు తీర్థములను గూర్చి చెప్పినవో?

తాని వక్ష్యామి సంక్షేపాన్నమస్కృత్వా త్రిలోచనమ్ ।
యత్రాసౌ భగవానాసీత్త్రత్యక్షస్త్ర్యమ్బకో మునే ॥ 5 ॥

వాటిని గూర్చి ఆ త్రిలోచనునకు నమస్కరించి సంక్షేపముగా చెప్పగలను. ఓ మునీ! ఎక్కడైతే త్ర్యంబకుడనే పేరుతో భగవానుడున్నాడో

త్ర్యంబకం నామ తత్తీర్థం భుక్తిముక్తిప్రదాయకమ్ ।
వారాహమపరం తీర్థం త్రిషు లోకేషు విశ్రుతమ్ ॥ 6 ॥

అది త్ర్యంబకమను పేరు గల తీర్థము. ఆ తీర్థము భుక్తిని, ముక్తిని ఇచ్చునది. అట్లే ముల్లోకములలో ప్రసిద్ధి చెందిన మరొక తీర్థము వారాహ తీర్థము.

తస్య రూపం ప్రవక్ష్యామి నామ విష్ణోర్యథా౽భవత్ ।
పురా దేవాన్ పరాభూయ యజ్ఞమాదాయ రాక్షసః ॥ 7 ॥

దాని రూపమును, దానికా పేరు ఎలా వచ్చినదో తెలుపబోవుచున్నాను. పూర్వకాలమున ఒక రాక్షసుడు దేవతల నందరినీ అవమానించి యజ్ఞమును తీసుకొని

రసాతలమనుప్రాప్తః సిన్ధుసేన ఇతి శ్రుతః ।
యజ్ఞే తలమనుప్రాప్తే నిర్యజ్ఞా హ్యభవన్మహీ ॥ 8 ॥

రసాతలమునకు వచ్చాడు. అతని పేరు సింధుసేనుడు. ఎప్పుడైతే యజ్ఞము రసాతలము చేరినదో అప్పుడీ భూలోకము యజ్ఞ రహితముగానైనది.

నాయం లోకో౽స్తి న పరో యజ్ఞే నష్టే తదాభవత్ ।
సురాస్తమేవ వివిశూ రసాతలమనుద్విషమ్ ॥ 9 ॥

యజ్ఞము నష్టము కాగా ఎవరికీ ఇహపర లోకములు రెండూ లభించకుండా పోయినవి. దానితో దేవతలు ఆ రాక్షసుని ద్వేషిస్తూ రసాతలమును ప్రవేశించారు.

నాశక్నువంస్తు తం జేతుం దేవా ఇన్ద్రపురోగమాః ।
విష్ణుం పురాణ పురుషం గత్వా తస్మై న్యవేదయన్ ॥ 10 ॥

యుద్ధములో దేవతలా సింధుసేనుని జయించలేక పోయారు. అప్పుడు ఇంద్రుని ముందుంచుకొని పురాణ పురుషుడైన విష్ణువు దగ్గరకు వెళ్ళి ఆయనకు మొరపెట్టుకొన్నారు.

రాక్షసస్య తు తత్కర్మ యజ్ఞభ్రంశమశేషతః ।
తతః ప్రోవాచ భగవాన్ వారాహం వపురాస్థితః ॥ 11 ॥

రాక్షసుడు చేసిన పని వలన యజ్ఞము భ్రంశమైన విధమును గూర్చి విశేషముగా వివరించారు. అప్పుడు భగవంతుడైన విష్ణువు వరాహరూపమును ధరించి ఇలా అన్నాడు.

శంఖచక్రగదాపాణిర్గత్వా చైవ రసాతలమ్ ।
ఆనయిష్యే మఖం పుణ్యం హత్వా రాక్షసపుంగవాన్ ॥ 12 ॥

నేను శంఖ చక్ర గదలను ధరించి, రసాతలమునకు వెళ్ళి, రాక్షసశ్రేష్ఠులను సంహరించి, పవిత్రమైన ఆ యజ్ఞమును తీసుకొనిరాగలను.

స్వః ప్రయాన్తు సురాః సర్వే వ్యేతు వో మానసో జ్వరః ।
యేన గంగా తలం ప్రాప్తా పథా తేనైవ చక్రధృక్ ॥ 13 ॥

ఓ దేవతలారా! మీరంతా మీ మానసికాందోళనలు వదిలిపెట్టి మీ మీ స్థానములకు వెళ్ళింది అని చెప్పి ఆ చక్రధారి గంగ ఏ మార్గమున వెళ్ళినదో అదే మార్గమున రసాతలమునకు వెళ్ళాడు.

జగామ తరసా పుత్ర భువం భిత్త్వా రసాతలమ్ ।
స వరాహవపుః శ్రీమాన్ రసాతలనివాసినః ॥ 14 ॥

నాయనా! వరాహరూపును ధరించిన శ్రీమన్నారాయణుడు భూమిని చీల్చుకొని రసాతలమునకు వెళ్ళి, అక్కడ రసాతల నివాసులైన

రాక్షసాన్ దానవాన్ హత్వా ముఖే ధృత్వా మహాధ్వరమ్ ।
వరాహరూపీ భగవాన్ మఖమాదాయ యజ్ఞభుక్ ॥ 15 ॥

రాక్షసులను, దానవులను సంహరించి, యజ్ఞభోక్త అయిన, వరాహ రూపములో నున్న ఆ శ్రీమహా విష్ణువు తన ముఖమునందా మహాయజ్ఞమును ధరించినవాడై,

యేన ప్రాప తలం విష్ణుః పథా తేనైవ శత్రుజిత్ ।
ముఖే న్యస్య మహాయజ్ఞం నిశ్చక్రామ రసాతలమ్ ॥ 16 ॥

తాను రసాతలమున కే మార్గమున వెళ్ళినాడో అదే మార్గములోనే శత్రువులను జయించిన విష్ణువు తనకోరయందా మహాయజ్ఞము నుంచుకొని రసాతలమునుండి వచ్చాడు.

తత్ర బ్రహ్మగిరౌ దేవాః ప్రతీక్షాం చక్రిరే హరేః ।
పథస్తస్మాద్వినిఃసృత్య గంగాస్రవణమభ్యగాత్ ॥ 17 ॥

అక్కడ బ్రహ్మగిరియందు దేవతలు శ్రీహరిని గూర్చి ఎదురు చూస్తున్నారు. ఆ మార్గము నుండి వచ్చిన వరాహస్వామి గంగా ప్రవాహమునందు మునిగాడు.

ప్రక్షాలయచ్చ స్వాంగాని అసృగ్లిప్తాని నారద ।
గంగాంభసా తత్ర కుండం వారాహమభవత్తతః ॥ 18 ॥

ఓ నారదా! రక్తమంటిన తన అవయవములను చక్కగా ప్రక్షాలన చేసుకొన్నాడు. వరాహస్వామి ప్రక్షాలన చేసుకున్న స్థలమును, గంగచే శుద్ధి అయిన ఆ ప్రదేశమును వరాహకుండమనే పేరుతో పిలుస్తారు.

ముఖే న్యస్తం మహాయజ్ఞం దేవానాం పురతో హరిః ।
దత్తవాన్ త్రిదశశ్రేష్ఠో ముఖాద్యజ్ఞోఽభ్యజాయత ॥ 19 ॥

హరి తనముఖమునందున్న ఆ మహా యజ్ఞమును దేవతలముందు పెట్టాడు. దేవతాశ్రేష్ఠుడైన ఆ శ్రీమహావిష్ణువు ముఖమునుండి యజ్ఞము పుట్టింది.

తతః ప్రభృతి యజ్ఞాంగం ప్రధానం స్రువ ఉచ్యతే ।
వారాహరూపమభవదేవం వై కారణాన్తరాత్ ॥ 20 ॥

అప్పటి నుండి 'స్రువము' యజ్ఞమునకు ప్రధానాంగముగా చెబుతారు. ఈ విధముగా కారణాంతరము వలన వరాహరూపమైనది.

తస్మాత్పుణ్యతమం తీర్థం వారాహం సర్వకామదమ్ ।
తత్ర స్నానం చ దానం చ సర్వక్రతుఫలప్రదమ్ ॥ 21 ॥

అందువలన వారాహతీర్థము మిక్కిలి పవిత్రమైనది. వారాహతీర్థము సమస్తకోరికలను తీర్చునది. ఆ తీర్థము నందు స్నానము చేసినా, దానమును చేసినా సమస్త క్రతువుల నాచరించుటవలన వచ్చే ఫలము లభిస్తుంది.

తత్ర స్థితో௨పి యః కశ్చిత్పితౄన్ స్మరతి పుణ్యకృత్ ।
విముక్తాః సర్వపాపేభ్యః పితరః స్వర్గమాప్నుయుః ॥ 22 ॥

వారాహతీర్థము నందెవరైనా పుణ్యాత్ముడు పితృదేవతలను స్మరించిన ఆ పితరులు సర్వపాపములనుండి విముక్తులై స్వర్గమును పొందుతారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే వరాహతీర్థవర్ణనం నామ నవమో௨ధ్యాయః. ॥ 9 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థ మాహాత్మ్యములోని వరాహతీర్థ వర్ణనమను పేరుగల తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం
కపోతతీర్థవర్ణనమ్ - కపోతతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

> **కుశావర్తస్య మాహాత్మ్యమహం వక్తుం న తే క్షమః ।**
> **తస్య స్మరణమాత్రేణ కృతకృత్యో భవేన్నరః ॥ 1 ॥**

కుశావర్త తీర్థమును గూర్చి నీకు వివరించుటకు నాకు సామర్థ్యము లేదు. ఆ తీర్థమును స్మరించిన మాత్రముననే మానవుడు కృతకృత్యుడవుతాడు.

> **కుశావర్తమితి ఖ్యాతం నరాణాం సర్వకామదమ్ ।**
> **కుశేనాఽఽవర్తితం యత్ర గౌతమేన మహాత్మనా ॥ 2 ॥**

ఎక్కడైతే మహాత్ముడైన గౌతముడు దర్భలతో నావర్తనము చేసినాడో, ఆ స్థలముననున్న దానిని కుశావర్తమని పిలుతురు. అది మానవులకు కోరికలన్నిటినీ తీర్చునది.

> **కుశేనాఽఽవర్తయిత్వా తు ఆనయామాస తాం మునిః ।**
> **తత్ర స్నానం చ దానం చ పితౄణాం తృప్తిదాయకమ్ ॥ 3 ॥**

ఆ గౌతమ ముని దర్భతో చుట్టి దానిని తెచ్చాడు. దానిలో స్నానము చేసినా, దానమును చేసినా పితృదేవతలకు తృప్తి కలుగుతుంది.

> **నీలగంగా సరిచ్ఛ్రేష్ఠా నిఃసృతా నీలపర్వతాత్ ।**
> **తత్ర స్నానాది యత్కించిత్కరోతి ప్రయతో నరః ॥ 4 ॥**

నీలపర్వతమునుండి ప్రవహించిన శ్రేష్ఠమైన నదిని నీలగంగయని అంటారు. నియమంతో ఆ నదిలో స్నానాదులు ఏ కొంచ మాచరించినా

> **సర్వం తదక్షయం విద్యాత్పితౄణాం తృప్తిదాయకమ్ ।**
> **విశ్రుతం త్రిషు లోకేషు కపోతం తీర్థముత్తమమ్ ॥ 5 ॥**

వారందరికి అక్షయమైన ఫలము లభింస్తుంది. అంతేకాక పితృదేవతలందరికి నీలనది తృప్తి కలిగిస్తుంది. ఇక ముల్లోకములం దుత్తమమైన తీర్థముగా ప్రసిద్ధి నొందినది కపోత తీర్థము.

> **తస్య స్వరూపం వక్ష్యామి మునే శృణు మహాఫలమ్ ।**
> **తత్ర బ్రహ్మగిరౌ కశ్చిద్వ్యాధః పరమదారుణః ॥ 6 ॥**

ఓ మునీశ్వరా! ఆ కపోత తీర్థమును గూర్చి చెబుతాను విను. అది మహాఫలము నిస్తుంది. బ్రహ్మగిరియందు పరమ దుర్మార్గుడగు నొకానొక బోయవాడు కలడు.

హినస్తి బ్రాహ్మణాన్ సాధూన్యతీన్గోపక్షిణో మృగాన్ ।
ఏవంభూతః స పాపాత్మా క్రోధనోఽనృత భాషణః ॥ 7 ॥

అతడు పాపాత్ముడు. బ్రాహ్మణులను, సాధువులను, యతులను, గోవులను, పక్షులను, మృగములను చంపుచుండెడివాడు. వాడు మిక్కిలి కోపముగలవాడు, అసత్యము లాడెడివాడు.

భీషణాకృతిరత్యుగ్రో నీలాక్షో హ్రస్వబాహుకః ।
దన్తురో నష్టనాసాక్షో హ్రస్వపాత్పృథుకుక్షికః ॥ 8 ॥

భయంకరాకారము, మిక్కిలి తీవ్ర స్వభావం, నల్లటి కళ్ళు, పొట్టి చేతులు, ఎత్తుపళ్ళు, చప్పిడిముక్క, గుంత కళ్ళు, పొట్టికాళ్ళు, ఎత్తు పొట్ట గలిగి,

హ్రస్వోదరో హ్రస్వభుజో వికృతో గార్దభ స్వనః ।
పాశహస్తః పాపచిత్తః పాపిష్ఠః సధనుః సదా ॥ 9 ॥

చిన్న పొట్ట, చిన్న భుజములు, వికృతాకారము, గాడిదగొంతు గలిగి , చేతిలో పాశము, మనస్సులో పాప చింతన, పాపిష్ఠుడెప్పుడూ ధనుస్సును చేతిలో పట్టుకుని ఉంటాడు.

తస్య భార్యా తథాభూతా అపత్యాన్యపి నారద ।
తయా తు ప్రేర్యమాణోఽసౌ వివేశ గహనం వనమ్ ॥ 10 ॥

ఓ నారదా! వాని భార్యాబిడ్డలు కూడా అటువంటి వారే. ఒకనాడు వాని భార్య ప్రేరేపించగా ఆ బోయవాడు దట్టమైన అడవిలోకి వెళ్ళాడు.

స జఘాన మృగాన్పాపః పక్షిణో బహురూపిణః ।
పంజరే ప్రాక్షిపత్కాంశ్చిజ్జీవమానాంస్తథేతరాన్ ॥ 11 ॥

ఆ పాపాత్ముడు పలు వన్నెలుగల జంతువులను, పక్షులను చంపాడు. కొన్ని జీవించియున్న వానిని, ఇతరములైన వానిని పంజరములో బంధించాడు.

క్షుధయా పరితప్తాంగో విహ్వలస్తృషయా తథా ।
భ్రాన్తదేశో బహుతరం న్యవర్తత గృహం ప్రతి ॥ 12 ॥

ఆకలితో పరితపించిన శరీరము కలవాడై, దాహంతో వ్యాకుల పడి, అనేక చోట్ల తిరుగుతూ ఇంటి ముఖం పట్టాడు.

తతోఽపరాహ్ణే సంప్రాప్తే నివృత్తే మధుమాధవే ।
క్షణాత్తడిద్గర్జితం చ సాభ్రం చైవాభవత్తదా ॥ 13 ॥

అప్పుడు మధ్యాహ్న సమయము దాటి ప్రొద్దు గ్రుంకు సమయమున నొక్క సారిగా ఆకాశమంతా ఉరుములు, మెరుపులతో నిండింది.

వవౌ వాయుః సాశ్మవర్షో వారి ధారాతిభీషణః ।
స గచ్ఛన్ లుబ్ధకః శ్రాన్తః పన్థానం నావబుధ్యత ॥ 14 ॥

గాలి బాగా వీచింది. ధారాపాతంగా, భయంకరంగా రాళ్ళ వర్షము కురిసింది. ఆ కిరాతుడలసి పోయాడు. వెళ్ళుతూ దారి తెలుసుకొనలేక పోయాడు.

జలం స్థలం గర్తమథో పన్థానమథవా దిశః ।
న బుబోధ తదా పాపః శ్రాన్తః శరణమప్యథ ॥ 15 ॥

అక్కడ నీరుందా? నేల ఉందా? క్రింద గుంత ఉందా? ఇది దారియా, ఇది దిక్కేనా అనుకొని ఏదీ తెలియక ఆ పాపి అలసిపోయి దిక్కెవరని యోచించాడు.

క్వ గచ్ఛామి క్వ తిష్ఠేయం కిం కరోమీత్యచిన్తయత్ ।
సర్వేషాం ప్రాణినాం ప్రాణానాహర్తాఽహం యథాఽన్తకః ॥ 16 ॥

నేనిప్పుడెక్కడికి వెళ్ళాలి? ఎక్కడ నిలబడాలి? ఏమి చేయాలి? యముని వలె అన్ని జీవుల ప్రాణాలను హరించాను అని చింతించాడు.

మమాప్యన్తకరం భూతం సంప్రాప్తం చాశ్మ వర్షణమ్ ।
త్రాతారం నైవ పశ్యామి శిలాం వా వృక్షమన్తికే ॥ 17 ॥

ఈ రాళ్ళవర్ష మొకటి నన్ను చంపే భూతంవలె దాపురించింది. ఒక రాయో, చెట్టో సమీపంలో నన్ను రక్షించువారెవరూ కనిపించుట లేదు.

ఏవం బహువిధం వ్యాధో విచిన్త్యాపశ్యదన్తికే ।
వనే వనస్పతిమివ నక్షత్రాణాం యథాఽత్రిజమ్ ॥ 18 ॥

ఇలా ఆ కిరాతుడనేక విధములుగా చింతించుచుండగా తనకు సమీపంలో అడవిలో పూలులేకుండానే ఫలాలనిచ్చే వృక్షమువలె, నక్షత్రములన్నింటికి ఆనందమును కలిగించే చంద్రునివలె

మృగాణాం చ యథా సింహమాశ్రమాణాం గృహాధిపమ్ ।
ఇంద్రియాణాం మన ఇవ త్రాతారం ప్రాణినాం నగమ్ ॥ 19 ॥

మృగంలన్నింటికి సింహమువలె, ఆశ్రమములన్నింటిలో గృహస్థాశ్రమము వలె, ఇంద్రియము లన్నింటికి మనస్సువలె, ప్రాణులన్నింటినీ రక్షించే పర్వతం వలె

శ్రేష్ఠం విటపినం శుభ్రం శాఖాపల్లవమండితమ్ ।
తమాశ్రిత్యోపవిష్టోఽభూత్క్లిన్నవాసాః స లుబ్ధకః ॥ 20 ॥

తెల్లని కొమ్మలతో, చిగుళ్ళతో నిండిన ఒకశ్రేష్ఠమైన మఱ్ఱిచెట్టు కనిపించగా తడిసిన బట్టలతో నున్న ఆ కిరాతుడు దాన్నాశ్రయించి కూర్చున్నాడు.

స్మరన్ భార్యామపత్యాని జీవేయురథవా న వా ।
ఏతస్మిన్నన్తరే తత్ర చాస్తం ప్రాప్తో దివాకరః ॥ 21 ॥

తన భార్యాపిల్లలు జీవించి యున్నారో, లేదో అని వారిని గూర్చి స్మరించుకొనుచుండగా ఇంతలో సూర్యుడస్తమించాడు.

తమేవ నగమాశ్రిత్య కపోతో భార్యయా సహ ।
పుత్రపౌత్రైః పరివృతో హ్యాస్తే తత్ర నగోత్తమే ॥ 22 ॥

ఆ శ్రేష్ఠమైన మఱ్ఱిచెట్టు నందు ఒక కపోతం తన భార్య, పుత్ర, పౌత్రాదులతో కలిసి జీవిస్తున్నది.

సుఖేన నిర్భయో భూత్వా సుతృప్తః ప్రీత ఏవ చ ।
బహవో వత్సరాః యాతా వసతస్తస్య పక్షిణః ॥ 23 ॥

అనేక సంవత్సరములనుండి ఆ పక్షులు సుఖముగా, నిర్భయముగా, తృప్తిగా, సంతోషముగా ఆ చెట్టుపై గడుపుచుండినది.

పతివ్రతా తస్య భార్యా సుప్రీతా తేన చైవ హి ।
కోటరే తన్నగే శ్రేష్ఠే జలవాయ్వగ్నివర్జితే ॥ 24 ॥

ఆ మఱ్ఱిచెట్టు తొఱ్ఱలో నీరు, వాయువు అగ్ని మొదలగు వాని భయము లేక ఆ కపోతము భార్య పతివ్రతయై, భర్తతో సంప్రీతురాలై యుండినది.

భార్యాపుత్రైః పరివృతః సర్వదాఽఽస్తే కపోతకః ।
తస్మిన్దినే దైవవశా త్కపోతశ్చ కపోతకీ ॥ 25 ॥

తన భార్యాబిడ్డలతో ఆ కపోతము ఎప్పుడూ ఆ తొఱ్ఱలో నివసించుచుండినది. దైవఘటన వలన ఆ దినమున ఆడపావురము మగపావురము రెండునూ

భక్ష్యార్థం తు ఉభౌ యాతౌ కపోతో నగమభ్యగాత్ ।
సాఽపి దైవవశాత్పుత్ర పంజరస్థైవ వర్తతే ॥ 26 ॥

ఆహారమునకై వెళ్ళినవి. మగ పావురము చెట్టు దగ్గరకు చేరినది. కాని నాయనా! దైవవశము వలన ఆడపావురము పంజరమునందు బంధింపబడింది.

గృహీతా లుబ్ధకేనాథ జీవమానేన వర్తతే ।
కపోతకోఽప్యపత్యాని మాతృహీనాన్యుదీక్ష్య చ ॥ 27 ॥

ఆ కిరాతుడు దానిని పట్టుకొన్నాడు. అది జీవించియే యున్నది. మగపావురము తల్లిలేని పిల్లలను చూచి.

వర్షం చ భీషణం ప్రాప్తమస్తం యాతో దివాకరః ।
స్వకోటరం తథా హీనమాలోక్య విలలాప సః ॥ 28 ॥

అవతల భయంకరమైన వర్షం పడుతున్నది. సూర్యుడస్తమించాడు. తన నివాసమగు కోటరము ఆడ పావురము లేక హీనముగా నుండుట చూచి కపోతము దుఃఖించింది.

తాం బద్ధాం పంజరస్థాం వా న బుబోధ కపోతరాట్ ।
అన్వారేభే కపోతో వై ప్రియాయా గుణకీర్తనమ్ ॥ 29 ॥

ఆ కపోతరాజు ఆడపావురము బంధింపబడినదని కాని, పంజరములో నున్నదని కాని తెలుసుకొన లేదు. తన ప్రియురాలి గుణములను కీర్తించుట ప్రారంభించింది.

నాద్యాప్యాయాతి కల్యాణీ మమ హర్షవివర్ధినీ ।
సమధర్మస్య జననీ మమ దేహస్య చేశ్వరీ ॥ 30 ॥

నా కానందమును పెంపొందించేది, సమధర్మానికి తల్లి. నా శరీరమునకు యజమానురాలు అయిన ఆ మంగళకరురాలు ఇంకా రావడం లేదు.

ధర్మార్థకామమోక్షాణాం సైవ నిత్యం సహాయినీ ।
తుష్టే హసన్తీ రుష్టే చ మమ దుఃఖప్రమార్జనీ ॥ 31 ॥

చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థకామమోక్షములలో నాకు తోడు నీడగా ఉండేది. నేను సంతోషిస్తే తాను నవ్వి, నేను దుఃఖిస్తే నా దుఃఖమును తొలగించేది.

సఖీ మన్త్రేషు సా నిత్యం మమ వాక్యరతా సదా ।
నాద్యాప్యాయాతి కల్యాణీ సంప్రయాతేఽపి భాస్కరే ॥ 32 ॥

ఆలోచనలయందు స్నేహితురాలుగా మార్గం చూపేది, ఎప్పుడూ నా మాటను ఇష్టంగా స్వీకరించి ఆనందపడేది. సూర్యుడస్తమించినా కూడా నా కల్యాణి ఇంకా రాలేదు.

న జానాతి వ్రతం మంత్రం దైవం ధర్మార్థమేవ చ ।
పతివ్రతా పతిప్రాణా పతిమన్త్రా పతిప్రియా ॥ 33 ॥

ఆమె వ్రతము, మంత్రము, దైవము, ధర్మార్థములను గురించి కూడా ఎరుగదు. భర్తయే వ్రతము, ప్రాణము, మంత్రము అని తెలిసి భర్తనే ప్రియంగా చూసుకునేది.

నాద్యాప్యాయాతి కల్యాణీ కిం కరోమి క్వ యామి వా ।
కిం మే గృహం కాననం చ తయా హీనం హి దృశ్యతే ॥ 34 ॥

నా పాలిటి కల్యాణి అయిన ఆమె ఇంకా రాలేదు. నేనేం చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? నాకింకా ఇల్లెందుకు? ఆమె లేని ఇల్లు నా కడవిలాగే కనిపిస్తున్నది.

తయా యుక్తం శ్రియా యుక్తం భీషణం వాఽపి శోభనమ్ ।
నాద్యాప్యాయాతి మే కాన్తా యయా గృహముదీరితమ్ ॥ 35 ॥

ఆమెతో ఉంటే లక్ష్మీదేవితో యున్నట్లే. ఎంతభయంకరమైనా శుభకరమే. ఆమె నా ప్రియురాలు ఇంకా రాలేదు. ఇల్లంటే 'గృహిణీ గృహముచ్యతే' అని చెప్పినట్లు ఆమెతోనేగదా ఇల్లు.

వినాఽ నయా న జీవిష్యే త్యజే వాఽ పి ప్రియాం తనుమ్ ।
కిం కుర్వన్తు త్వపత్యాని లుప్తధర్మస్త్వహం పునః ॥ 36 ॥

ఆమె లేకుండా జీవించలేను. ఇష్టమైన నా శరీరమును వదిలివేయుటకు కూడా సిద్ధమే. ఈ సంతానము ఏమి చేస్తుంది? నేను తిరిగి ధర్మలోపినయ్యాను.

ఏవం విలపతస్తస్య భర్తుర్వాక్యం నిశమ్య వై ।
పంజరస్థైవ సా వాక్యం భర్తారమిదమబ్రవీత్ ॥ 37 ॥

ఈ విధంగా దుఃఖిస్తున్న భర్తయొక్క మాటలను విని పంజరంలో ఉండే ఆ కపోతకి భర్తతో ఇలా అన్నది.

కపోతక్యువాచ :- కపోతకి పలికింది.

అత్రాహమస్మి బద్ధైవ వివశాఽ స్మి ఖగోత్తమ ।
ఆనీతాఽ హం లుబ్ధకేన బద్ధా పాశైర్మహామతే ॥ 38 ॥

ఓ ఖగోత్తమా! నేనిక్కడే బంధింప బడియున్నాను. ఓ మహామతీ! కిరాతుడు నన్ను పాశములతో బంధించి ఇక్కడకు తీసుకొని వచ్చినాడు.

ధన్యాఽ స్మ్యనుగృహీతాఽ స్మి పతిర్వక్తి గుణాన్మమ ।
సతో వాఽ ప్యసతో వాఽ పి కృతార్థాఽ హం న సంశయః ॥ 39 ॥

నేను చాలా ధన్యురాలను. నా భర్త నా గుణములను పొగుడుతున్నాడు, అనుగ్రహించాడు. మంచివాడో, చెడ్డవాడో అయినా నేను మాత్రం కృతార్థురాలనయ్యాను. దీనిలో సందేహము లేదు.

తుష్టే భర్తరి నారీణాం తుష్టాః స్యుః సర్వదేవతాః ।
విపర్యయే తు నారీణామవశ్యం నాశమాప్నుయాత్ ॥ 40 ॥

స్త్రీలకు భర్త సంతోషంగా ఉంటే సర్వదేవతలు సంతోషించినట్లే. వారికి వ్యతిరేకంగా ఉంటే స్త్రీలు సర్వనాశనమును పొందుతారు.

త్వం దైవం త్వం ప్రభుర్మహ్యం త్వం సుహృత్త్వం పరాయణమ్ ।
త్వం వ్రతం త్వం పరంబ్రహ్మ స్వర్గోమోక్షస్త్వమేవ చ ॥ 41 ॥

నీవే నాకు దైవము, ప్రభువు, మిత్రునివి, పరాయణుడవు, వ్రతము, పరబ్రహ్మవు, స్వర్గము, మోక్షము, సర్వమూ నీవే.

మా చిన్తాం కురు కల్యాణ ధర్మే బుద్ధిం స్థిరాం కురు ।
త్వత్ప్రసాదాచ్చ భుక్తా హి భోగాశ్చ వివిధా మయా ॥ 42 ॥

ఓ శుభకరుడా! నీ వేమీ చింతించకు. ధర్మమునందు బుద్ధి స్థిరముగానుంచు. నీ అనుగ్రహము వలననే నేను అనేక విధములైన భోగముల ననుభవించాను.

అలం ఖేదేన మజ్జేన ధర్మే బుద్ధిం కురు స్థిరామ్ ॥ 43 ॥

నన్ను గూర్చి దుఃఖించుట వలదు. ధర్మము నందు స్థిరబుద్ధి నుంచు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా ప్రియావాక్యముత్తతార నగోత్తమాత్ ।
యత్ర సా పంజరస్థా తు కపోతీ వర్తతే ద్రుతమ్ ॥ 44 ॥

ఇలా పలికిన తన ప్రియురాలి మాటలు విన్నంతనే ఆ కపోతం ఆ చెట్టు నుండి ఎగిరి పంజరమునందున్న కపోతకి దగ్గరకు వేగముగా వెళ్ళింది.

తామాగత్య ప్రియాం దృష్ట్వా మృతవచ్చాపి లుబ్ధకమ్ ।
మోచయామీతి తామాహ నిశ్చేష్టో లుబ్ధకోఽధునా ॥ 45 ॥

అక్కడికి వచ్చి తన ప్రియురాలును చూచి చచ్చినట్లు పడియున్న కిరాతుని చూచి, తన ప్రియురాలుతో ఇప్పుడు కిరాతుడు కదలిక లేకుండా యున్నాడు. నిన్నీ పంజరం నుండి విడిపిస్తానన్నది.

మా ముంచస్వ మహాభాగ జ్ఞాత్వా సంబంధమస్థిరమ్ ।
లుబ్ధానాం ఖేచరా హ్యన్నం జీవో జీవస్య చాశనమ్ ॥ 46 ॥

ఓ మహాభాగా! సంబంధము స్థిరము కాదని నీకు తెలుసు. కావున నన్ను విడిపించకు. ఎందుకనగా కిరాతుల కాహారం పక్షులు. జీవున కాహారం మరొక జీవి కదా!

నాపరాధం స్మరామ్యస్య ధర్మబుద్ధిం స్థిరాం కురు ।
గురురగ్నిర్ద్విజాతీనాం వర్ణానాం బ్రాహ్మణో గురుః ॥ 47 ॥

ఇది ఇతని తప్పుగా నేను భావించుట లేదు. ధర్మం పై స్థిరబుద్ధి నుంచుము. బ్రాహ్మణులకు గురువు అగ్ని. వర్ణములన్నింటికి బ్రాహ్మణుడు గురువు.

పతిరేవ గురుః స్త్రీణాం సర్వస్యాభ్యాగతో గురుః ।
అభ్యాగతమనుప్రాప్తం వచనైస్తోషయన్తి యే ॥ 48 ॥

స్త్రీలకు భర్తే గురువు. అందరికి అభ్యాగతుడే, అనగా అనుకోకుండా వచ్చిన అతిథియే గురువు. అలా వచ్చిన అతిథిని ఎవరైతే కుశల ప్రశ్నలతో సంతోషింపచేస్తారో

తేషాం వాగీశ్వరీ దేవీ తృప్తా భవతి నిశ్చితమ్ ।
తస్యాన్నస్య ప్రదానేన శక్రస్తృప్తిమవాప్నుయాత్ ॥ 49 ॥

అటువంటివారి మాటతో సరస్వతీదేవి తృప్తిపడుతుంది. ఇది నిశ్చయం. అంతేకాక అలా ఇంటికి వచ్చిన అతిథికి అన్నమును పెట్టినట్లైతే ఇంద్రుడు తృప్తిని చెందుతాడు.

పితరః పాదశౌచేన అన్నాద్యేన ప్రజాపతిః ।
తస్యోపచారాద్వై లక్ష్మీర్విష్ణునా ప్రీతిమాప్నుయాత్ ॥ 50 ॥

అతిథికి పాద ప్రక్షాళనముతో పితృదేవతలు, అన్నాదులతో ప్రజాపతి, ఉపచారములతో లక్ష్మీ నారాయణులు ప్రీతి పొందుతారు.

శయనే సర్వదేవాస్తు తస్మాత్పూజ్యతమోఽతిథిః ।
అభ్యాగతమనుశ్రాన్తం సూర్యోఢం గృహమాగతమ్ ॥
తం విద్యాద్దేవరూపేణ సర్వక్రతుఫలో హ్యసౌ ॥ 51 ॥

అతిథికి నిద్రించుటకు శయనమేర్పరచినచో సమస్త దేవతలు తృప్తిని పొంది సంతోషిస్తారు. అందువలన అతిథి అందరి కన్నా పూజ్యుడు. సాక్షాత్తు దేవరూపునిగా భావించాలి. అలా భావించి. సేవించిన వారికి సమస్త యజ్ఞముల ఫలము లభిస్తుంది.

అభ్యాగతం శ్రాన్తమనువ్రజన్తి
దేవాశ్చ సర్వే పితరోఽగ్నయశ్చ ।
తస్మిన్ హి తృప్తే ముదమాప్నువన్తి
గతే నిరాశేఽపి చ తే నిరాశాః ॥ 52 ॥

అలసిన అతిథిని సమస్త దేవతలు, పితరులు, అగ్నులు అనుసరించి ఉంటారు. ఆ అతిథి తృప్తి పడినపుడు వారంతా ఆనందిస్తారు. అతడు నిరాశతో వెళ్తే వారు నిరాశులౌతారు.

తస్మాత్సర్వాత్మనా కాన్త దుఃఖం త్యక్త్వా శమం వ్రజ ।
కృత్వా తిష్ఠ స్థిరాం బుద్ధిం ధర్మకృత్యం సమాచర ॥ 53 ॥

అందువలన ఓ ప్రియుడా! నీవిక పూర్తిగా దుఃఖాన్ని వదలి, శమమును పొందు. బుద్ధిని స్థిరముగా చేసుకొని ఉండు. ధర్మకార్యాచరణమునకు పూనుకో.

ఉపకారోఽపకారశ్చ ప్రవరావితి సంమతౌ ।
ఉపకారిషు సర్వోఽపి కరోత్యుపకృతిం పునః ॥ 54 ॥

ఉపకారము గాని, అపకారము గాని ఫలము నిచ్చేవిగా చెప్పారు. ఎవరైనా ఉపకారం చేసినప్పుడు తిరిగి ఉపకారం చేయాలని అందరూ చెబుతారు.

అపకారిషు యః సాధుః పుణ్యభాక్ స ఉదాహృతః ॥ 55 ॥

అపకారం చేసిన వారికి కూడా ఉపకారము చేసే సాధుజనులు పుణ్యవంతులని చెబుతారు.

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయు వాడె నేర్పరి సుమతీ!
అని సుమతి శతకకారుని వచనము.

కపోత ఉవాచ :- మగ పావురము పలికింది.

ఆవయోరనురూపం చ త్వయోక్తం సాధు మన్యసే ।
కింతు వక్తవ్యమప్యస్తి తచ్ఛృణుష్వ వరాననే ॥ 56 ॥

ఓ శ్రేష్ఠమైనదానా! పరస్పరముగా మన అభిప్రాయములు ఒకే విధంగా ఉన్నాయి. దానికి తగినట్లుగా నీవు చెప్పినది అంతా బాగానే ఉంది కాని, నేను చెప్పవలసినది కూడా ఉన్నది. విను.

సహస్రం భరతే కశ్చిచ్ఛతమన్యో దశాపరః ।
ఆత్మానం చ సుఖేనాన్యో వయం కష్టోదరంభరాః ॥ 57 ॥

కొందరు పదిమందిని, మరి కొందరు వందమందిని, ఇంకొందరు వేయి మందిని భరిస్తారు. మరొకడు తన సుఖమును మాత్రమే చూచుకొంటాడు. మనము కష్టపడి కడుపు నింపుకునేవారము.

గర్తధాన్యధనాః కేచిత్కుశూలధనినోఽపరే ।
ఘటక్షిప్తధనాః కేచిచ్చంచుక్షిప్తధనా వయమ్ ॥ 58 ॥

కొందరు గాదెలలో, బిలములలో ధాన్యమును దాచుకొని ధనవంతులుగా నుంటారు. కొందరు భాండాగారములలో దాచుకొని ధనవంతులుగా నుంటారు. కొందరు కుండలలో ధనమును దాచుకొంటారు.కాని మనం మన ముక్కులలోనే దాచుకొంటాము. కేవలం నోటిలో పట్టినంత ఆహారం మాత్రమే మనవద్ద ఉంటుంది.

పూజయామి కథం శ్రాన్తమభ్యాగతమిమం శుభే ॥ 59 ॥

ఓ శుభాంగీ! మన దగ్గరకు అలసి వచ్చిన ఈ అతిథి నెలా పూజిస్తాను?

కపోత్యువాచ :- ఆడపావురం పలికినది.

అగ్నిరాపః శుభా వాణీ తృణకాష్ఠాదికం చ యత్ ।
ఏతదప్యర్థినే దేయం శీతార్తో లుబ్ధకస్త్వయమ్ ॥ 60 ॥

ఇంటికి వచ్చిన అతిథికి చక్కగా మాట్లాడి అతని అవసరాన్ని బట్టి నీరో, నిప్పో, గడ్డియో, పుల్లలో ఏదో ఒకటి సమకూర్చాలి. ఈ కిరాతుడు ఇప్పుడు చలితో బాధపడుతున్నాడు. వెచ్చదనమును కలిగించాలి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా ప్రియావాక్యం వృక్షమారుహ్య పక్షిరాట్ ।
ఆలోకయామాస తదా వహ్నిం దూరం దదర్శ హ ॥ 61 ॥

ఈ విధముగా మాట్లాడిన ఆడపావురము మాటను విని మగ పావురము చెట్టు నెక్కి పరికించి చూచింది. కొంత దూరమున అగ్ని వున్నట్లు కనుగొన్నది.

స తు గత్వా వహ్నిదేశం చంచునోల్ముకమాహరత్ ।
పురోఽగ్నిం జ్వాలయామాస లుబ్ధకస్య కపోతకః ॥ 62 ॥

అప్పుడా కపోతకుడు వెళ్ళి తన ముక్కుతో ఒక నిప్పుకర్రను తీసుకొని వచ్చాడు. దానితో ఆ కిరాతుని ఎదుట నిప్పురాజవేసి మంట పెట్టాడు.

శుష్కకాష్ఠాని పర్ణాని తృణాని చ పునః పునః ।
అగ్నౌ నిక్షేపయామాస నిశీథే స కపోతరాట్ ॥ 63 ॥

ఆ చీకట్లో ఎండిన కర్రలు, ఆకులు, గడ్డి మాటి మాటికి తెచ్చి ఆ కపోతరాజు నిప్పులో వేశాడు.

తమగ్నిం జ్వలితం దృష్ట్వా లుబ్ధకః శీతదుఃఖితః ।
అవశాని స్వకాంగాని ప్రతాప్య సుఖమాప్తవాన్ ॥ 64 ॥

మండుతున్న అగ్నిని చూచి చలితో వణుకుతున్న కిరాతుడు పట్టు దప్పిన తన శరీరావయవములను కాపు కాచుకొని సంతుష్టుడయ్యాడు.

క్షుధాగ్నినా దహ్యమానం వ్యాధం దృష్ట్వా కపోతకీ ।
మాం ముంచస్వ మహాభాగ ఇతి భర్తారమబ్రవీత్ ॥ 65 ॥

ఆకలితో అలమటించి పోతున్న ఆ కిరాతుని చూచిన కపోతకి ఓ మహాభాగా! నన్ను వదిలి వేయుమని భర్తతో చెప్పింది.

స్వశరీరేణ దుఃఖార్తం లుబ్ధకం ప్రీణయామి తమ్ ।
ఇష్టాతిథీనాం యే లోకాస్తాంస్త్వం ప్రాప్నుహి సువ్రత ॥ 66 ॥

ఓ సువ్రతా! నేను నా శరీరముతో దుఃఖార్తుడైన ఆ కిరాతుని సంతోష పెడతాను. అతిథి కిష్టమైన వాటిని సమకూర్చినందువలన ఏ లోకములు సంప్రాప్తిస్తాయో వాటిని నీవు పొందగలవు.

కపోత ఉవాచ :– కపోతుడు పలికాడు.

మయి తిష్ఠతి నైవాయం తవ ధర్మో విధీయతే ।
ఇష్టాతిథిర్భవామీహ అనుజానీహి మాం శుభే ॥ 67 ॥

ఓ శుభకరురాలా! నేనుండగా నీ కది ధర్మమని విధించుట పద్ధతి కాదు. అతిథి కిష్టమైన ఆహారముగా నేనౌతాను. నా కనుమతి నివ్వు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వాఽగ్నిం త్రిరావర్త్య స్మరన్ దేవం చతుర్భుజమ్ ।
విశ్వాత్మకం మహావిష్ణుం శరణ్యం భక్తవత్సలమ్ ॥ 68 ॥

అని పలికి ఆ కపోతుడు చతుర్భుజుడు, విశ్వాత్మకుడు, శరణ్యుడు, భక్తవత్సలుడైన శ్రీమన్నారాయణుని స్మరించి, ముమ్మారు ఆ అగ్నికి ప్రదక్షిణమును చేసి,

యథా సుఖం జుషస్వేతి వదన్నగ్నిం తథాఽఽవిశత్ ।
తం దృష్ట్వాఽగ్నౌ క్షిప్తజీవం లుబ్ధకో వాక్యమబ్రవీత్ ॥ 69 ॥

నీకు అనుకూలమైన రీతిగా ననుభవించు అని పలుకుతూ అలాగే అగ్నిలో ప్రవేశించాడు. అగ్నిలో పడి తన ప్రాణములను సమర్పించిన కపోతకుని చూచి కిరాతు డిలా అన్నాడు.

లుబ్ధక ఉవాచ :- లుబ్ధకుడు పలికాడు.

అహెూ మానుషదేహస్య ధిగ్జీవితమిదం మమ ।
యదిదం పక్షిరాజేన మదర్థే సాహసం కృతమ్ ॥ 70 ॥

అయ్యో! మానవ శరీరమును ధరించిన నా జీవితము వ్యర్థం. ఈ పక్షిరాజు నా కొరకింత సాహసము చేశాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం బ్రువన్తం తం లుబ్ధం పక్షిణీ వాక్యమబ్రవీత్ ॥ 71 ॥

ఈ విధముగా పలుకుతున్న కిరాతునితో కపోతకి ఇలా అన్నది.

కపోతక్యువాచ :- కపోతకి పలికింది.

మాం త్వం ముంచ మహాభాగ దూరం యాత్యేష మే పతిః ॥ 72 ॥

ఓ మహానుభావా! నా భర్త దూరముగా వెళ్ళుతున్నాడు. నన్ను నీవు వదిలి పెట్టు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తస్యాస్తద్వచనం శ్రుత్వా పంజరస్థాం కపోతకీమ్ ।
లుబ్ధకో మోచయామాస తరసా భీతవత్తదా ॥ 73 ॥

ఆ విధముగా పలికిన కపోతకి మాటలను విని లుబ్ధకుడు భయపడి అప్పుడు పంజరములో నున్న కపోతకిని వెంటనే వదిలిపెట్టాడు.

సాఽపి ప్రదక్షిణం కృత్వా పతిమగ్నిం తదా జగౌ ॥ 74 ॥

అప్పుడా కపోతకి భర్తకు, అగ్నికి ప్రదక్షిణము చేసి భర్తను గూర్చి ఇలా అన్నది.

కపోత్యువాచ :- ఆడపావురమిలా పలికింది.

స్త్రీణామయం పరో ధర్మో యద్భర్తురనువేశనమ్ ।
వేదే చ విహితో మార్గః సర్వలోకేషు పూజితః ॥ 75 ॥

భర్తననుసరించి అగ్నిలో ప్రవేశించుట యను నది స్త్రీలకు ఇది ఉత్తమమైన ధర్మము. ఈ మార్గము వేదవిహితమైనది. సమస్తలోకములు ఈ మార్గమును గౌరవించినవి.

వ్యాలగ్రాహీ యథా వ్యాలం బిలాదుద్ధరతే బలాత్ ।
ఏవం త్వనుగతా నారీ సహ భర్త్రా దివం వ్రజేత్ ॥ 76 ॥

పాములను పట్టేవాడు బిలంలోనుండి పాము నేవిధంగా బలంగా బయటకు తీస్తాడో, అలాగే భర్తను అనుసరించిన స్త్రీ భర్తతో గూడ స్వర్గమును పొందుతుంది.

తిస్రః కోట్యోఽర్ధకోటీ చ యాని రోమాణి మానుషే ।
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి ॥ 77 ॥

మానవుని శరీరంలో మూడున్నరకోట్ల రోమములు ఏవైతే ఉన్నాయో అంతకాలము భర్తననుసరించి వెళ్ళిన భార్య స్వర్గమునందు నివసిస్తుంది.

నమస్కృత్వా భువం దేవాన్ గంగాం చాపి వనస్పతీన్ ।
ఆశ్వాస్య తాన్యపత్యాని లుబ్ధకం వాక్యమబ్రవీత్ ॥ 78 ॥

ఆ ఆడపావురము భూమికి, దేవతలకు, గంగకు, వనస్పతులకు నమస్కరించి, తన సంతానము నోదార్చి కిరాతునితో ఇలా అన్నది.

కపోత్యువాచ :– కపోతకి పలికింది.

తిస్రః కోట్యోఽర్ధకోటీ చ యావద్రోమాణి మానుషే ।
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యాఽనుగచ్ఛతి ॥ 79 ॥

భర్తననుసరించి ఏ స్త్రీ సహగమనం చేస్తుందో అటువంటి స్త్రీ మానవ శరీరంలో నున్న మూడున్నరకోట్ల సంఖ్యగల రోమముల సంఖ్యతో సమానమైన కాలంవరకు స్వర్గంలో నివసిస్తుంది.

త్వత్ప్రసాదాన్మహాభాగ ఉపపన్నం మమేదృశమ్ ।
అపత్యానాం క్షమస్వేహ భర్త్రా యామి త్రివిష్టపమ్ ॥ 80 ॥

ఓ మహానుభావా! నీ యనుగ్రహంవలన నాకిటువంటి అదృష్టము లభించినది. నా పిల్లలను క్షమించుము. ఇక నా భర్తతో స్వర్గమునకు వెళ్ళుచున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా పక్షిణీ సాధ్వీ ప్రవివేశ హుతాశనమ్ ।
ప్రవిష్టాయాం హుతవహే జయశబ్దో వ్యవర్తత ॥ 81 ॥

ఈ విధముగా పలికి పతివ్రత అయిన ఆ ఆడపావురము అగ్నియందు ప్రవేశించింది. అగ్నిలో నామె ప్రవేశించగానే జయ జయ ధ్వానములంతట వ్యాపించినాయి.

గగనే సూర్యసంకాశం విమానమతిశోభనమ్ ।
తదాఽఽరూఢౌ సురనిభౌ దమ్పతీ దదృశే తతః ॥ 82 ॥

అప్పుడు ఆకాశంలో సూర్యుని వలెనున్న మిక్కిలి సుందరమైన విమానమునెక్కి దేవతలవలెనున్న దంపతులు కనిపించారు.

హర్షేణ ప్రోచతురుభౌ లుబ్ధకం విస్మయాన్వితమ్ ॥ 83 ॥

అప్పుడు ఆశ్చర్యపడుతున్న కిరాతునితో ఆ దంపతులు సంతోషముతో పలికారు.

దంపతీ ఊచతుః :– దంపతులు పలికారు.

గచ్ఛావస్త్రిదశస్థానమాపృష్టోఽసి మహామతే ।
ఆవయోః స్వర్గసోపానమతిథిస్త్వం నమోఽస్తు తే ॥ 84 ॥

ఓ మహామతీ! మేము స్వర్గమునకు వెళ్ళుచున్నాము. నీ యనుజ్ఞ కోరుతున్నాము. నీవు మాకు అతిథివి. మేము స్వర్గమునకు వెళ్ళుటకు మెట్టు వంటి వానివి, నీకు మా నమస్కారము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మపలికాడు.

విమానవరమారూఢౌ తౌ దృష్ట్వా లుబ్ధకోఽపి సః ।
సధనుః పంజరం త్యక్త్వా కృతాంజలిరభాషత ॥ 85 ॥

శ్రేష్ఠమైన ఆ విమానము నెక్కిన దంపతులను చూచి కిరాతుడు ధనుస్సును, పంజరమును వదిలి వేసి వినమ్రుడై పలికాడు.

లుబ్ధక ఉవాచ :– లుబ్ధకుడు పలికాడు.

న త్యక్తవ్యో మహాభాగౌ దేయం కించిదజానతే ।
అహమత్రాతిథిర్మాన్యో నిష్కృతిం వక్తుమర్హథః ॥ 86 ॥

ఓ పుణ్యాత్ములారా! నన్ను వదలకుడు. అజ్ఞానినైన నాకు కొంచ మివ్వుడు. నేనిక్కడ గౌరవము గల అతిథిని. నాకు నిష్కృతి కలిగే మార్గమును సూచించండి.

దంపతీ ఊచతుః :– దంపతులు పలికారు.

గౌతమీం గచ్ఛ భద్రం తే తస్యాః పాపం నివేదయ ।
తత్రైవాఽఽప్లవనాత్పక్షం సర్వపాపైర్విమోక్ష్యసే ॥ 87 ॥

నీవు గౌతమీ నది వద్దకు వెళ్ళు. ఆ నదీమతల్లికి నీ పాపమును నివేదించుకో. నీకు శుభము కలుగుతుంది. ఆ నదిలో పదిహేను రోజులు స్నానమాచరిస్తే నీవు సర్వపాపముల నుండి విముక్తుడ వవుతావు.

ముక్తపాపః పునస్తత్ర గంగాయామవగాహనే ।
అశ్వమేధఫలం పుణ్యం ప్రాప్య పుణ్యో భవిష్యసి ॥ 88 ॥

పాపం పోయిన నీవు తిరిగి గంగ యందు స్నానం చేసినట్లైతే అశ్వమేధయాగ ఫలమును పొంది పుణ్యాత్ముడవవుతావు.

సరిద్వరాయాం గౌతమ్యాం బ్రహ్మవిష్ణీశసంభువి ।
పునరాప్లవనాదేవ త్యక్త్వా దేహం మలీమసమ్ ॥ 89 ॥

బ్రహ్మ విష్ణు మహేశ్వరాంశములతో నీలోకమునందవతరించి సరిద్వారి యైన గౌతమి యందు తిరిగి స్నాన మాచరించిన మాలిన్యముతో నిండిన ఈ దేహమును వదిలి

విమానవరమారూఢః స్వర్గం గన్తాఽస్యసంశయమ్ ॥ 90 ॥

శ్రేష్ఠమైన విమానము నెక్కి స్వర్గమునకు వెళ్ళగలవు. సందియము లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం తాభ్యాం తథా చక్రే స లుబ్ధకః ।
విమానవరమారూఢో దివ్యరూపధరోఽభవత్ ॥ 91 ॥

ఆ దంపతుల మాటను విని ఆ కిరాతుడలాగే చేశాడు. శ్రేష్ఠమైన విమానము నధిరోహించి దివ్యరూప ధరుడయ్యాడు.

దివ్యమాల్యామ్బరధరఃపూజ్యమానోఽప్సరోగణైః ।
కపోతశ్చ కపోతీ చ తృతీయో లుబ్ధకస్తథా ॥
గంగాయాశ్చ ప్రభావేణ సర్వే వై దివమాక్రమన్ ॥ 92 ॥

దివ్య మాల్యములను దివ్య వస్త్రములను ధరించిన ఆ కిరాతుని అప్సరసలు సేవించారు. గంగయొక్క ప్రభావము వలన కపోత దంపతులతో పాటు కిరాతుడు మూడవవానిగా అందరూ స్వర్గమునకు చేరారు.

తతః ప్రభృతి తత్తీర్థం కపోతమితి విశ్రుతమ్ ।
తత్ర స్నానం చ దానం చ పితృపూజనమేవ చ ॥ 93 ॥

అప్పటి నుండి ఆ తీర్థమునకు కపోత తీర్థమని పేరు వచ్చినది. అక్కడ స్నానము గాని, దానము గాని, పితృపూజనము గాని,

జపయజ్ఞాదికం కర్మ తదానన్త్యాయ కల్పతే ॥ 94 ॥

జపయజ్ఞాది కర్మలు చేసిన అనంతమైన ఫలము లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే కపోతతీర్థవర్ణనం నామ దశమోఽధ్యాయః. ॥ 10 ॥

శ్రీబ్రహ్మ పురాణాంతర్గతమైన గౌతమీ మాహాత్మ్యం నందలి 'కపోత తీర్థ వర్ణన' మను పేరుగల పదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

కుమార తీర్థ వర్ణనమ్ - కుమారతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కార్తికేయం పరం తీర్థం కౌమారమితి విశ్రుతమ్ ।
యన్నామ శ్రవణాదేవ కులవాన్ రూపవాన్భవేత్ ॥ 1 ॥

మరొక తీర్థము కార్తికేయ సంబంధమైన కుమారతీర్థమని ప్రసిద్ధి చెందిన తీర్థము కలదు. ఆ తీర్థము పేరు విన్నంత మాత్రముననే కులవంతుడు రూపవంతుడును అగును.

నిహతే తారకే దైత్యే స్వస్థే జాతే త్రివిష్టపే ।
కార్తికేయం సుతం జ్యేష్ఠం ప్రీత్యా ప్రోవాచ పార్వతీ ॥ 2 ॥

దైత్యుడైన తారకాసురవధ జరిగి స్వర్గము సుఖమయముగా నిర్భయముగా నుండగా, తన పెద్ద కుమారుడగు కార్తికేయునితో పార్వతి ప్రేమగా నిట్లనెను.

యథా సుఖం భుంక్ష్వ భోగాన్ త్రైలోక్యే మనసఃప్రియాన్ ।
మదాజ్ఞయా ప్రీతమనాః పితు శ్చైవ ప్రసాదతః ॥ 3 ॥

నీ తండ్రిగారి అనుగ్రహమువలన నా ఆజ్ఞతో నీవు ముల్లోకములందున్న, నీకు నచ్చిన వాటిని సమస్తభోగములను సంతోషముతో ననుభవించుము.

ఏవముక్తః స వై మాత్రా విశాఖో దేవతా ప్రియః ।
యథా సుఖం బలాద్రేమే దేవపత్న్యోఽపి రేమిరే ॥ 4 ॥

అని ఇట్లు తల్లి చెప్పగా దేవతాప్రియుడైన ఆ విశాఖుడు (కుమారస్వామి) బలముతో సుఖముగా రమించెను. దేవపత్నులు గూడా సుఖించిరి.

తతః సంభుజ్యమానాసు దేవపత్నీషు నారద ।
నా శక్నువన్వారయితుం కార్తికేయం దివౌకసః ॥ 5 ॥

ఓ నారదా! అటు పిమ్మట దేవపత్నులను అనుభవించుచున్న కార్తికేయుని వారించుటకు దేవతలు అశక్తులైరి.

తతో నివేదయామాసుః పార్వత్యై పుత్రకర్మ తత్ ।
అసకృద్వార్యమాణోఽపి మాత్రా దేవైః స శక్తిధృక్ ॥ 6 ॥

తరువాత వెళ్ళి పార్వతీ దేవితో కుమారుడు చేస్తున్న పనిని గూర్చి వివరించిరి. మాటి మాటికి తల్లి పార్వతి, మరియు దేవతలు వారించినప్పటికిని ఆ శక్తిధారుడైన

నైవాసావకరోద్వాక్యం స్త్రీష్వాసక్తస్తు షణ్ముఖః ।
అభిశాపభయాద్భీతా పార్వతీ పర్యచిన్తయత్ ॥ 7 ॥

షణ్ముఖుడు స్త్రీలయందాసక్తి గలవాడగుటచే వారి మాట వినలేదు. ఎక్కడ అతనిని శపిస్తారోయని పార్వతి మిక్కిలి చింతించెను.

పుత్రస్నేహాత్తథైవేశా దేవానాం కార్యసిద్ధయే ।
దేవపత్న్యశ్చిరం రక్ష్యా ఇతి మత్వా పునః పునః ॥ 8 ॥

పుత్రవాత్సల్యంతో నా పార్వతి అట్లే, దేవతల కార్యము సిద్ధించుటకు దేవతల భార్యలను వెంటనే రక్షించవలయునని మాటి మాటికి తలచి

యస్యాం తు రమతే స్కన్దః పార్వతీత్వపి తాదృశీ ॥ 9 ॥

స్కందుడు ఏ స్త్రీతో రమించునో పార్వతి కూడా అటువంటిది అయినది.

తద్రూపమాత్మనః కృత్వా వర్తయామాస పార్వతీ ।
ఇంద్రస్య వరుణస్యాపి భార్యామాహూయ షణ్ముఖః ॥
యావత్పశ్యతి తస్యాం తు మాతృరూపమపశ్యత ॥ 10 ॥

వారిలో తన రూపమును కనిపించేటట్లుండెను. షణ్ముఖుడు ఇంద్రుని భార్యను, వరుణుని భార్యను తనతో రమించుటకు రమ్మని పిలిచి చూడగా వారిలో తన తల్లి రూపమును చూచెను.

తామపాస్య నమస్యాథ పునరన్యామథాఽఽహ్వయత్ ।
తస్యాం తు మాతృరూపం స ప్రేక్ష్య లజ్జాముపేయివాన్ ॥ 11 ॥

వారికి నమస్కరించి వెళ్ళి పొమ్మని మరొకస్త్రీని పిలిచెను. ఆమెలో కూడా నతడు తల్లి రూపమును చూచి సిగ్గుచెందెను.

ఏవం బహ్వీషు తద్రూపం దృష్ట్వా మాతృమయం జగత్ ।
ఇతి సంచిన్త్య గాంగేయో వైరాగ్య మగమత్తదా ॥ 12 ॥

ఇట్లు చాలా మందిలో తన తల్లి రూపమునే చూచి, ఈ జగత్తంతా మాతృమయమని చింతించి అప్పుడా గాంగేయుడు వైరాగ్యమును పొందెను.

స తు మాతృకృతం జ్ఞాత్వా ప్రవృత్తస్య నివర్తనమ్ ।
నివార్యశ్చేదహం భోగాత్కింతు పూర్వం ప్రవర్తితః ॥ 13 ॥

తన ప్రవర్తనను మార్చుట కిది తల్లి చేసిన ప్రయత్నమని తెలుసుకొని, నేనిప్పుడు భోగములనుండి నివారింపదగినవాడనైతే కాని ఇంతకు పూర్వము వాటి యందు ప్రవర్తించినాను కదా!

తస్మాన్మాతృకృతం సర్వం మమ హాస్యాస్పదం త్వితి ।
లజ్జయా పరయా యుక్తో గౌతమీ మగమత్తదా ॥ 14 ॥

అందువలన తల్లి చేసినదంతయు నాకు హాస్యాస్పదముగా అవమానముగాను ఉన్నదని తలచి మిక్కిలి సిగ్గుపడినవాడై అప్పుడు గౌతమీనది వద్దకు వెళ్ళెను.

ఇయం చ మాతృరూపా మే శృణోతు మమ భాషితమ్ ।
ఇతః స్త్రీ నామధేయం యన్మమ మాతృసమం మతమ్ ॥ 15 ॥

ఈ గౌతమి నాకు తల్లి వంటిది. నామాట విను. ఇక స్త్రీ యన్నపేరేదైనా నాకు తల్లితో సమానమని భావిస్తాను.

ఏవం జ్ఞాత్వా లోకనాథః పార్వత్యా సహ శంకరః ।
పుత్రం నివారయామాస వృత్త మిత్యబ్రవీద్గురుః ॥ 16 ॥

అతని భావనను వృత్తమును లోకనాథుడు, గురువును అయిన శంకరుడు పార్వతితో గూడ జరిగిన దానిని తెలుసుకొని పుత్రుడైన షణ్ముఖుని నివారించెను.

తతః సురపతిః ప్రీతః కిం దదామీతి చిన్తయన్ ।
కృతాంజలి పుటః స్కన్దః పితరం పునరబ్రవీత్ ॥ 17 ॥

అప్పుడు శివుడు సంతోషించి ఏమి ఇచ్చెదను అని చింతించుచుండగా, స్కందుడు చేతులు జోడించి నమస్కరిస్తూ తిరిగి తండ్రితో నిట్లనెను.

స్కన్దఉవాచ :- స్కందుదు పలికాడు.

సేనాపతిః సురపతిస్తవ పుత్రోఽహమిత్యపి ।
అలమేతేన దేవేశ కిం వరైః సురపూజిత ॥ 18 ॥

దేవతలచే పూజింపబడువాడా! సురపతివైన నీకు నేను కుమారుడను, సేనాపతిని కూడా. ఓ దేవేశ ఇంతకంటే ఇంకావరములెందుకు?

అథవా దాతుకామోఽసి లోకానాం హితకామ్యయా ।
యా చేఽహం నాఽత్మనా దేవ తదనుజ్ఞాతుమర్హసి ॥ 19 ॥

దేవా! ఒక వేళ మీకు ఇవ్వాలని యుంటే లోకహితమును గోరి యాచించెదను. నా కొరకేమీ అడగను. దానికి మీరు నా కనుజ్ఞ నీయవలయును.

మహాపాతకినః కేచిద్గురు దారాభిగామినః ।
అత్రాఽఽప్లవనమాత్రేణ ధౌత పాపా భవన్తు తే ॥ 20 ॥

కొందరు మహా పాతకులు గురుభార్యను పొందుదురు. అటువంటివారు ఈ తీర్థములో స్నానము చేసినంత మాత్రముననే వారి పాపములు నశించవలయును.

ఆప్నువన్త్యుత్తమాం జాతిం తిర్యంచోఽపి సురేశ్వర ।
కురూపో రూప సంపత్తిమత్ర స్నానాదవాప్నుయాత్ ॥ 21 ॥

ఓ సురేశ్వరా! ఈ తీర్థములో స్నానము చేసినందువలన తిర్యగ్జాతులు కూడా ఉత్తమజన్మను పొందవలయును. కురూపులు కూడా చక్కని రూపమునంద వలయును.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి తం శంభుః ప్రత్యనందత్సుతేరితమ్ ।
తతః ప్రభృతి తత్తీర్థం కార్తికేయమితి శ్రుతమ్ ॥ 22 ॥

కుమారుడు చెప్పిన మాటలు విని సంతోషించి అలాగే అగుగాక! అని షణ్ముఖునితో చెప్పెను. అప్పటి నుండి ఆ తీర్థమునకు కార్తికేయతీర్థమని పేరు వచ్చినది.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే కుమారతీర్థ వర్ణనం నామైకాదశోఽధ్యాయః ॥ 11 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి కుమారతీర్థ వర్ణనమను పేరుగల పదకొండవ అధ్యాయం సంపూర్ణం.

ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం
కృత్తికా తీర్థ వర్ణనమ్ - కృత్తికాతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యత్ఖ్యాతం కృత్తికాతీర్థం కార్తికేయాదనన్తరమ్ ।
తస్య శ్రవణమాత్రేణ సోమపానఫలం లభేత్ ॥ 1 ॥

కార్తికేయ తీర్థము తరువాత కృత్తికాతీర్థము చాలా ప్రసిద్ధి చెందినది. కృత్తికా తీర్థము పేరు విన్నంత మాత్రముననే సోమపానఫలము లభించును.

పురా తారక సంశాంత్యై భవరేతోఽపిబత్కవిః ।
రేతో గర్భం కవిం దృష్ట్వా ఋషిపత్న్యోఽస్పృహన్ మునే ॥ 2 ॥

ఓమహర్షీ! పూర్వము తారకాసురసంహారము కొరకు శివుని రేతస్సును కవి త్రాగెను. రేతో గర్భుడైన కవినిచూచి ఋషిపత్నులు కామించిరి.

సప్తర్షీణాం ఋతుస్నాతాం వర్జయిత్వా త్వరున్ధతీమ్ ।
తాసు గర్భః సమభవత్ షట్సు స్త్రీషు తదాఽగ్నితః ॥ 3 ॥

అప్పుడు ఋతుస్నాత అయిన అరుంధతి తప్ప సప్తర్షుల భార్యల ఆరుగురిలో అగ్ని వలన గర్భమాయెను.

తప్యమానాస్తు శోభిష్టా ఋతుస్నాతా స్తుతా మునే ।
కిం వా కుర్మః క్వ గచ్ఛామః కిం కృత్వా సుకృతం భవేత్ ॥ 4 ॥

ఓ మునీ! ఋతు స్నాతలైన వారు తపించినప్పటికిని శోభించినారు. ఏమి చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? వెళ్ళలేము ఏది చేస్తే మాకు సుకృతము కలుగును?

ఇత్యుక్త్వా తామిథో గంగాం వ్యగ్రా గత్వా వ్యపీడయన్ ।
తాభ్యస్తే నిఃసృతాః గర్భాః ఫేనరూపాస్తదామ్భసి ॥ 5 ॥

ఈవిధముగా వారు పరస్పరం చింతించి గంగ వద్దకు వెళ్ళి గర్భములను పీడించిరి. వారినుండి స్రవించిన గర్భములు అప్పుడు నురుగు రూపముగా సముద్రములో కలిసెను.

అమ్భసా త్వేకతాం ప్రాప్తా వాయునా సర్వ ఏవ హి ।
ఏకరూపస్తదా తాభ్యః షణ్ముఖః సమజాయత ॥ 6 ॥

గాలి వీచుట చేత నురగలన్నియు నీటితో ఒక్కటిగా మారినవి. వాటినుండి అప్పుడు ఏకరూపముగా షణ్ముఖుడు పుట్టెను.

స్రావయిత్వా తు తాన్గర్భానృషిపత్న్యో గృహాన్యయుః ।
తాసాం వికృతరూపాణి దృష్ట్వా తే ఋషయోఽబ్రువన్ ॥ 7 ॥

ఋషిపత్నులు తమ గర్భములను స్రవింప చేసుకొని తమ తమ ఇండ్లకు వెళ్ళిరి. వారి వికృత రూపములను చూచి ఆ ఋషులిట్ల నిరి.

గమ్యతాం గమ్యతాం శీఘ్రం స్వైరీవృత్తిర్నయుజ్యతే ।
స్త్రీణామితి తతో వత్స నిరస్తాః పతిభిస్తు తాః ॥ 8 ॥

పొండి పొండి త్వరగా వెళ్ళండి. స్త్రీలకు విచ్చలవిడితనము తగినది కాదు అని తరువాత నాయనా! భర్తలు వారిని తిరస్కరించి వెళ్ళ గొట్టిరి.

తతో దుఃఖం సమావిష్టాస్త్యక్తాః స్వపతిభిశ్చ షట్ ।
తా దృష్ట్వా నారదః ప్రాహ కార్తికేయో హరోద్భవః ॥ 9 ॥

పతులు తిరస్కరించిన ఆ ఆరుగురు మిక్కిలి దుఃఖమునకు లోనైరి. అప్పుడు నారదుడు వారిని చూచి కార్తికేయుడు శివుని వలన పుట్టినవాడు.

గాంగేయోఽగ్నిభవశ్చేతి విఖ్యాతస్తారకాంతకః ।
తం యాన్తు న చిరాదేవ ప్రీతో భోగం ప్రదాస్యతి ॥ 10 ॥

అతడే గాంగేయుడు, అగ్నిభవుడు, తారకాంతకుడని పేరు పొందినవాడు. మీరతని వద్దకు వెళ్ళుడు. అతడు సంతోషించి మీకు త్వరలోనే మీ మీ స్థానములను భోగముల నివ్వగలడు.

దేవర్షేర్వచనాదేవ సమభ్యేత్య చ షణ్ముఖమ్ ।
కృత్తికాః స్వయమేవైత ద్యథా వృత్తం న్యవేదయన్ ॥ 11 ॥

నారదుడు చెప్పిన ప్రకారముగా నా కృత్తికలు షణ్ముఖుని వద్దకు వెళ్ళి స్వయముగా జరిగిన వృత్తాంతము నంతయును నివేదించిరి.

తాభ్యో వాక్యం కృత్తికాభ్యః కార్తికేయోఽనుమన్య చ ।
గౌతమీం యాన్తు సర్వాశ్చ స్నాత్వాఽఽపూజ్య మహేశ్వరమ్ ॥ 12 ॥

ఆ కృత్తికలు చెప్పిన మాటను కార్తికేయుడంగీకరించి మీరంతా గౌతమీ నదికి వెళ్ళి స్నానము చేసి శివుని పూజించుడు.

ఏష్యామి చాహం తత్రైవ నేష్యామి సురమన్దిరమ్ ।
తథేత్యుక్త్వా కృత్తికాశ్చ స్నాత్వా గంగాం చ గౌతమీమ్ ॥ 13 ॥

నేనక్కడికి వచ్చి మిమ్ము సురమందిరమునకు తీసుకొని వెళ్ళుదుననెను. కృత్తికలు కూడా సరేయని పలికి గంగలోను గౌతమిలోనూ స్నానమును చేసి.

దేవేశ్వరం చ సంపూజ్య కార్తికేయానుశాసనాత్ ।
దేవేశ్వరప్రసాదేన ప్రయయుః సురమన్దిరమ్ ॥ 14 ॥

కార్తికేయుని ఆజ్ఞ ప్రకారముగా శివుని పూజించి దేవేశ్వరుని అనుగ్రహముతో సురమందిరమునకు వెళ్ళిరి.

తతఃప్రభృతి తత్తీర్థం కృత్తికా తీర్థముచ్యతే ।
కార్తిక్యాం కృత్తికా యోగే తత్ర యః స్నానమాచరేత్ ॥ 15 ॥

అప్పటి నుండి ఆ తీర్థమునకు కృత్తికాతీర్థమని పేరువచ్చినది. కార్తికమాసములో కృత్తికా నక్షత్రముతో యోగమున్నప్పుడు ఈ తీర్థమందెవరు స్నానమాచరింతురో.

సర్వక్రతుఫలం ప్రాప్య రాజా భవతి ధార్మికః ।
తత్తీర్థ స్మరణం వాఽపి యః కరోతి శృణోతి చ ॥
సర్వపాపవినిర్ముక్తో దీర్ఘమాయురవాప్నుయాత్ ॥ 16 ॥

అట్టివారు సమస్తయజ్ఞముల ఫలమును పొంది ధార్మికుడైన రాజగును. కృత్తికా తీర్థమును గూర్చి స్మరించినా వినినా కూడా సమస్త పాపముల నుండి విముక్తుడై దీర్ఘాయువును పొందును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థ మాహాత్మ్యే కృత్తికా తీర్థ వర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థ మాహాత్మ్యములో కృత్తికా తీర్థ వర్ణనమను పేరుగల పన్నెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం
దశాశ్వమేధ తీర్థ వర్ణనమ్ - దశాశ్వమేధతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దశాశ్వమేధికం తీర్థం తచ్ఛృణుష్వ మహామునే ।
యస్య శ్రవణమాత్రేణ హయమేధఫలం లభేత్ ॥ 1 ॥

ఓ మహామునీ! ఏ తీర్థమును గూర్చి విన్నంతమాత్రముననే అశ్వమేధఫలము లభించునో అట్టి దశాశ్వమేధిక తీర్థం గూర్చి వినుము.

విశ్వకర్మ సుతః శ్రీమాన్ విశ్వరూపో మహాబలః ।
తస్యాపి ప్రమతిః పుత్రస్తత్పుత్రో భౌవనో విభుః ॥ 2 ॥

విశ్వకర్మకు కుమారుడు శ్రీమంతుడు, మహాబలుడును ఐన విశ్వరూపుడనువాడు కలడు. అతని కుమారుడైన ప్రమతి కుమారుడు భౌవనుడు. అతడు రాజుగా ఉన్నాడు.

పురోధాః కశ్యపస్తస్య సర్వజ్ఞాన విశారదః ।
తమపృచ్ఛన్మహాబాహు ర్భౌవనః సార్వభౌవనః ॥ 3 ॥

సమస్తజ్ఞానసంపన్నుడగు కశ్యపుడా రాజుకు పురోహితునిగా వున్నాడు. గొప్ప బాహుబలముగల చక్రవర్తి అయిన భౌవనుడు కశ్యపునిట్లడిగాడు.

యక్ష్యేఽహం హయమేధైశ్చ యుగపద్దశభిర్మునే ।
ఇత్యపృచ్ఛద్గురుం విప్రం క్వ యక్ష్యామి సురానితి ॥ 4 ॥

నే నొకసారే పది అశ్వమేధయాగములను చేయాలనుకుంటున్నాను. ఎక్కడ దేవతల గూర్చి యజ్ఞము నాచరించవలయునో తెలుపుడని గురువగు కశ్యపుని యడిగాడు.

సోఽవదద్దేవయజనం తత్ర తత్ర నృపోత్తమ ।
యత్ర యత్ర ద్విజశ్రేష్ఠాః ప్రావర్తంత మహాక్రతూన్ ॥ 5 ॥

ఓ రాజశ్రేష్ఠా! ఎక్కడెక్కడ ద్విజశ్రేష్ఠులు మహాక్రతువులను చేశారో అక్కడక్కడ దేవతా యజ్ఞములను చేయవచ్చునని కశ్యపుడు చెప్పాడు.

తత్రాభవన్ ఋషిగణా ఆర్త్విజ్యే మఖమణ్డలే ।
యుగపద్దశమేధాని ప్రవృత్తాని పురోధసా ॥ 6 ॥

యజ్ఞమండలంలో ఋషిగణములు ఋత్విక్కులయ్యారు. పురోహితుడు ఒకేసారి పది అశ్వమేధములను ప్రారంభించాడు.

పూర్ణతాం నాఽఽయయుస్తాని దృష్ట్వా చిన్తాపరో నృపః ।
విహాయ దేవమజనం పునరన్యత్ర తాన్ క్రతూన్ ॥ 7 ॥

ఉపాక్రమత్తథా తత్ర విఘ్నదోషాం స్తమాయయుః ।
దృష్ట్వాఽపూర్ణాంస్తతో యజ్ఞాన్ రాజా గురుమభాషత ॥ 8 ॥

కాని ఆ యజ్ఞములు పూర్తికాలేదు. రాజు అది చూసి చాలా చింతించాడు. ఆ దేవయజనాన్ని వదిలిపెట్టి మరొకచోట క్రతువులను చేయడం ప్రారంభించాడు. అలా ప్రారంభించినా ఆ రాజుకు విఘ్నదోషములు సంప్రాప్తించాయి. అసంపూర్ణములైన యజ్ఞములను చూచి రాజు గురువుతో ఇలా పలికాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

దేశదోషాత్కాలదోషాన్మమదోషాత్తవాపి వా ।
పూర్ణతాం నాఽఽప్నువన్తిస్మ దశమేధాని వాజినః ॥ 9 ॥

దేశదోషము వలన, కాలదోషము వలన, నాదోషము వలన లేదా నీ దోషం వలన కాని ఈ పది అశ్వమేధ యాగములు పూర్తికాలేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతశ్చ దుఃఖితో రాజా కశ్యపేన పురోధసా ।
గీష్పతేర్భ్రాతరం జ్యేష్ఠం గత్వా సంవర్తమూచతుః ॥ 10 ॥

తరువాత దుఃఖించినటువంటి రాజు పురోహితుడైన కశ్యపునితో కూడా బృహస్పతి జ్యేష్ఠ సోదరుడైన సంవర్తుని వద్దకు వెళ్ళి అడిగాడు.

కశ్యప భౌవనావూచతుః :- కశ్యప భౌవనులడిగారు.

భగవన్ యుగపత్కార్యాణ్యశ్వమేధాని మానద ।
దశ సంపూర్ణతాం యాన్తి తం దేశం తం గురుం వద ॥ 11 ॥

గౌరవప్రదుడవైన ఓ భగవంతుడా! పది అశ్వమేధ యాగములు సంపూర్ణం కావాలి. అటువంటి ప్రదేశమును ఆ మార్గమును తెలుపు గురువును తెలపండి.

తతో ధ్యాత్వా ఋషిశ్రేష్ఠః సంవర్తో భౌవనం తదా ।
అబ్రవీద్గచ్ఛ బ్రహ్మాణం గురుం దేశం వదిష్యతి ॥ 12 ॥

అప్పుడు సంవర్త ఋషి కొంతసేపు ధ్యానించి, నీవు బ్రహ్మ దగ్గరకు పొమ్ము. అతడు గురువును గూర్చి, చేయవలసిన ప్రదేశమును గూర్చి చెబుతాడని భౌవనునితో చెప్పాడు.

భౌవనోఽపి మహాప్రాజ్ఞః కశ్యపేన మహాత్మనా ।
ఆగత్య మామబ్రవీచ్చ గురుం దేశాదికం చ యత్ ॥ 13 ॥

మహా జ్ఞానియైన భౌవనుడు మహాత్ముడైన కశ్యపునితో కలిసి నా దగ్గరకు వచ్చి దశాశ్వమేధములు చేయుటకు అనువైన ప్రదేశము, గురువు మున్నగు వానిని గూర్చి అడిగారు.

తతో౽హమబ్రవం పుత్ర భౌవనం కశ్యపం తథా ।
గౌతమీం గచ్ఛ రాజేన్ద్ర స దేశః క్రతుపుణ్యవాన్ ॥ 14 ॥

నాయనా! అప్పుడు నేను ఓ రాజా! గౌతమి దగ్గరకు వెళ్ళుము. ఆ ప్రదేశం క్రతువులు చేసిన పవిత్ర స్థలమని భౌవన కశ్యపులతో చెప్పాను.

అయమేవ గురుః శ్రేష్ఠః కశ్యపో వేదపారగః ।
గురోరస్య ప్రసాదేన గౌతమ్యాశ్చ ప్రసాదతః ॥ 15 ॥

ఏకేన హయమేధేన తత్ర స్నానేన వా పునః ।
సేత్స్యన్తి తత్ర నృపతే దశమేధాని వాజినః ॥ 16 ॥

వేదపారగుడైన కశ్యపుడే దానికి బ్రహ్మ. ఈయనే దానికి గురువు. ఈ గురువు అనుగ్రహముతో, గౌతమి అనుగ్రహముతోను ఒక అశ్వమేధ యజ్ఞం చేసినా, గౌతమియందు స్నానం చేసినా ఓ రాజా! అక్కడ పది అశ్వమేధాలను చేసిన ఫలం లభిస్తుంది.

తచ్ఛ్రుత్వా భౌవనో రాజా గౌతమీ తీరమభ్యగాత్ ।
కశ్యపేన సహాయేన హయమేధాయ దీక్షితః ॥ 17 ॥

ఆ మాటను విని భౌవనరాజు గౌతమీ తీరమును చేరాడు. కశ్యపుని సహాయంతో అశ్వమేధ దీక్షను స్వీకరించెను.

తతః ప్రవృత్తే యజ్ఞేశే హయమేధే మహాక్రతౌ ।
సంపూర్ణే తు తదా రాజా పృథివీం దాతుముద్యతః ॥ 18 ॥

అశ్వమేధ క్రతువులో యజ్ఞేశుడనుగ్రహించి ప్రత్యక్షమై యజ్ఞం సంపూర్ణంకాగా అప్పుడు రాజు భూమిని దానం చేయడానికి సిద్ధపడ్డాడు.

తతో౽న్తరిక్షే వాగుచ్చైరువాచ నృపసత్తమమ్ ।
పూజయిత్వా స్థితం విప్రాన్ ఋత్విజో౽థ సదస్పతీన్ ॥ 19 ॥

అప్పుడాకాశమునుండి గట్టిగా నొక వాణి విప్రులను, ఋత్విక్కులను, సభాపతులను పూజించిన రాజుతో ఇలా పలికింది.

ఆకాశవాగువాచ :- ఆకాశవాణి పలికింది.

పురోధసే కశ్యపాయ సశైల వనకాననామ్ ।
పృథివీం దాతు కామేన దత్తం సర్వం త్వయా నృప ॥ 20 ॥

ఓ రాజా! పురోహితుడైన కశ్యపునకు భూదానమునివ్వాలనే కోరికతో పర్వత, కానన వనములతో కూడిన దానినంతా దానం చేశావు.

భూమి దాన స్పృహాం త్యక్త్వా అన్నం దేహి మహాఫలమ్ ।
నాన్నదానసమం పుణ్యం త్రిషు లోకేషు విద్యతే ॥ 21 ॥

భూమిని దానం చేయాలనే స్పృహను వదలిపెట్టి అన్నదానమును చేయము. అది మహాఫలము నిచ్చును. అన్నదానముతో సమానమైన పుణ్యము ముల్లోకములలో మరేదీలేదు.

విశేషతస్తు గంగాయాః శ్రద్ధయా పులినే మునే ।
త్వయా తు హయమేధోఽయం కృతః సబహుదక్షిణః ॥ 22 ॥

ఓ మునీ! విశేషముగా నీవు ఈ గంగా తీరంలో శ్రద్ధతో అనేక దక్షిణలనిచ్చి అశ్వమేధయాగమును చేసి కృతకృత్యుడవయ్యావు. ఈ విషయంలో ఇంకా ఏవిచారము అవసరములేదు. నీకు శుభమగుగాక!

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథాఽపి దాతుకామం తం మహీ ప్రోవాచ భౌవనమ్ ॥ 23 ॥

అట్లు చెప్పినా కూడా దానం చేయాలనే కోరికతో నున్న ఆ భౌవనునితో భూమి పలికింది.

పృథివ్యువాచ :– భూదేవి పలికింది.

విశ్వకర్మాత్మజ! న మాం త్వం దేహీతి పునః పునః ।
గౌతమీతీరమాశ్రిత్య గ్రాసమేకం దదాతి యః ॥ 24 ॥

తేనాహం సకలా దత్తా కిం మాం దాస్యసి భౌవన ।
నిమజ్జే జలమధ్యేఽహం తన్న మాం దాతుమర్హసి ॥ 25 ॥

ఓ విశ్వకర్మ కుమారుడా! నీవు నన్ను ఇవ్వకుమని మాటి మాటికి చెబుతున్నాను. ఎవరైనా గౌతమీ తీరమునకు వచ్చి గడ్డిపోచనొక దానినైనా దానము చేసినచో, అటువంటివానిచే నేను సకలము నివ్వబడింది. ఓ భౌవనా! ఇంకెందుకు నన్ను దానం చేస్తావు? నీటి మధ్యలో నున్న నన్ను మాత్రం దానం చేయకు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతశ్చ భౌవనో భీతః కిం దేయమితి చాబ్రవీత్ ।
పునశ్చోవాచ సా పృథ్వీ భౌవనం బ్రాహ్మణైర్వృతమ్ ॥ 26 ॥

అప్పుడు భౌవనుడు భయపడి ఏమివ్వవలయునని అడిగాడు. అప్పుడు బ్రాహ్మణులతో కూడిన భౌవనునితో భూమి మరల ఇలా అన్నది.

భూమ్యువాచ :- భూమి పలికింది.

తిలాగావో ధనం ధాన్యం యత్కించిద్గౌతమీతటే ।
సర్వం తదక్షయం దానం కిం మాం భౌవన దాస్యసి ॥ 27 ॥

గౌతమీ నది ఒడ్డున నువ్వులు, ఆవులు, ధనములు, ధాన్యము మొ॥ ఏవైనా ఏ కొంచమైనా దానం చేస్తే అది అక్షయమైన ఫలాన్నిచ్చే అన్ని దానాలు చేసినంత పుణ్యము లభిస్తుంది. ఓ భౌవనా! ఇంకా నన్నెందుకు దానమిస్తావు?

గంగాతీరం సమాశ్రిత్య గ్రాసమేకం దదాతి యః ।
తేనాహం సకలా దత్తా కిం మాం భౌవన దాస్యసి? ॥ 28 ॥

గంగా తీరమునకు వచ్చి ఒక్క గడ్డిపోచను దానం చేసినా అతనికి ఫలితంగా నేను సకలమునిస్తాను. ఓ భౌవనా! ఇంక నన్నెందుకు దానంగా ఇస్తావు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్భువో వచనం శ్రుత్వా భౌవనః సార్వభౌవనః ।
తథేతి మత్వా విప్రేభ్యో హ్యన్నం ప్రాదాత్సువిస్తరమ్ ॥ 29 ॥

చక్రవర్తియైన భౌవనుడు భూమి మాటలు విని అలాగే అని తలచి బ్రాహ్మణులకు విస్తారంగా అన్నదానం చేశాడు.

తతః ప్రభృతి తత్తీర్థం దశాశ్వమేధికం విదుః ।
దశానామశ్వమేధానాం ఫలం స్నానాదవాప్యతే ॥ 30 ॥

అప్పటి నుండి ఆ తీర్థానికి దశాశ్వమేధతీర్థమని పేరు వచ్చింది. ఆ తీర్థంలో స్నానం చేస్తే దశాశ్వమేధయాగ ఫలం లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే దశాశ్వమేధతీర్థవర్ణనంనామ త్రయోదశోఽధ్యాయః ॥ 13 ॥

శ్రీబ్రహ్మ పురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి దశాశ్వమేధ తీర్థ వర్ణనమను పేరుగల పదమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్దశోఽధ్యాయః - పదునాల్గవ అధ్యాయం

పైశాచికతీర్థవర్ణనమ్ - పైశాచికతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పైశాచం తీర్థమపరం పూజితం బ్రహ్మవాదిభిః ।
తస్య స్వరూపం వక్ష్యామి గౌతమ్యా దక్షిణే తటే ॥ 1 ॥

గౌతమీ నదికి దక్షిణ తీరమున బ్రహ్మవాదులు పూజించే పైశాచ తీర్థమని మరి యొకటి ఉన్నది. దాని స్వరూపమును చెబుతాను

గిరిర్బ్రహ్మగిరేః పార్శ్వే అంజనో నామ నారద ।
తస్మిన్ శైలే మునివర శాపభ్రష్టా వరాప్సరా ॥ 2 ॥

మునిశ్రేష్ఠుడవైన నారదా! బ్రహ్మగిరి ప్రక్కన అంజన యను పేరు గల పర్వతము గలదు. ఆ పర్వతమునందు శాపభ్రష్టురాలైన ఒక అప్సర కలదు.

అంజనా నామ తత్రాఽఽసీదుత్తమాంగేన వానరీ ।
కేసరీ నామ తద్భర్తా అద్రికేతి తథాఽపరా ॥ 3 ॥

ఉత్తమశరీరం కలిగిన అంజనా అను పేరుగల ఆడుకోతి కలదు. కేసరి అను పేరు గల వానరమామె భర్త. అక్కడ కేసరికి అద్రికా అను పేరు గల మరొక భార్య కలదు.

సాపి కేసరిణో భార్యా శాపభ్రష్టా వరాప్సరా ।
ఉత్తమాంగేన మార్జారీ సాఽప్యాస్తేఽంజన పర్వతే ॥ 4 ॥

ఆమెకూడా కేసరి భార్యయే; శాపగ్రస్తురాలై ఒక పిల్లి రూపంలో అంజన పర్వతమునందున్నది.

దక్షిణార్ణవ మభ్యగాత్ కేసరీ లోకవిశ్రుతః ।
ఏతస్మిన్నంతరేఽగస్త్యోఽంజనం పర్వతమభ్యగాత్ ॥ 5 ॥

లోక ప్రసిద్ధుడైన కేసరి దక్షిణ సముద్రము వైపు వెళ్ళాడు. ఇంతలో అగస్త్యమహర్షి అంజనపర్వతము వద్దకు వచ్చాడు.

అంజనా చాద్రికా చైవ అగస్త్యమృషిసత్తమమ్ ।
పూజయామాసతురుభే యథాన్యాయం యథాసుఖమ్ ॥ 6 ॥

అంజనా అద్రిక లిద్దరు అక్కడికి వచ్చిన ఋషిశ్రేష్ఠుడైన ఆ అగస్త్యుని శాస్త్రోక్తంగా సుఖం కలుగునట్లుగా పూజించారు.

తతః ప్రసన్నో భగవానాహోభే వ్రియతాం వరః ।
తే ఆహతురుభేఽగస్త్యం పుత్రౌ దేహి మునీశ్వర ॥ 7 ॥

అప్పుడు ప్రసన్నుడైన ఋషి వారిద్దరిని వరం కోరుకొమ్మన్నాడు. అప్పుడు వారిద్దరు ఓమునీశ్వరా! మాకు పుత్రుల నిమ్మని కోరారు.

సర్వేభ్యో బలినౌ శ్రేష్ఠౌ సర్వలోకోపకారకౌ ।
తథేత్యుక్త్వా మునిశ్రేష్ఠో జగామాౖౖశాం స దక్షిణామ్ ॥ 8 ॥

ఆ పుత్రులు అందరిలో బలవంతులు, శ్రేష్ఠులు లోకముల కన్నింటికి ఉపకారమును చేసే వారుగా నుండవలయుననగా ఆ మునిశ్రేష్ఠుడు అట్లే కలుగుగాక యని దీవించి దక్షిణ దిక్కునకు వెళ్ళాడు.

తతః కదాచిత్తే అంజనా చాద్రికా తథా ।
గీతం నృత్యం చ హాస్యం చ కుర్వత్యౌ గిరిమూర్ధని ॥ 9 ॥

వాయుశ్చ నిరృతి శ్చాపి తే దృష్ట్వా సస్మితౌ సురౌ ।
కామాక్రాన్తధియౌ చోభౌ తదా సత్వర మీయతుః ॥ 10 ॥

తరువాత కొంతకాలమునకు అంజన, అద్రిక ఇద్దరు పర్వతం పైన పాటలు పాడుతూ నాట్యం చేస్తూ హాస్యాలాడుతూ ఉన్న సమయంలో, వాయువు, నిరృతి అను దేవతలు ఆ అంజన అద్రికలను చూచి చిరునవ్వుతో, కామంతో పీడితులై వారిద్దరు త్వరగా వారి వద్దకు వచ్చారు.

భార్యే భవేతాముభయోరావాం దేవౌ వరప్రదౌ ।
తే అప్యూచతురస్త్వేతద్రేమాతే గిరిమూర్ధని ॥ 11 ॥

మేము వరముల నిచ్చే దేవతలము. మాయిద్దరికి మీరిద్దరు భార్యలు కండు అని పలుకగానే వారిద్దరు కూడా సరే అలాగే అని అంగీకరించారు. ఆ కొండ శిఖరముపై వారు రమించారు.

అంజనాయాం తథా వాయోర్హనుమాన్ సమజాయత ।
అద్రికాయాం చ నిరృతేరద్రిర్నామ పిశాచరాట్ ॥ 12 ॥

వాయువు వలన అంజనయందు హనుమంతుడు పుట్టాడు. నిరృతివలన అద్రికయందు అద్రి అనుపేరు గల పిశాచరాజు పుట్టాడు.

పునస్తే ఆహతురుభే పుత్రౌ జాతౌ మునీశ్వరాత్ ।
ఆవయోర్వికృతం రూపముత్తమాంగేన దూషితమ్ ॥ 13 ॥

మునివరంవలన పుత్రులు పుట్టారు. మా ఉత్తమశరీరాలు దూషితాలై రూపాలు వికృతాలైనాయని మరల వారిద్దరన్నారు.

శాపాచ్ఛచీపతేస్తత్ర యువామాజ్ఞాతు మర్హథః ।
తతః ప్రోవాచ భగవాన్వాయుశ్చ నిరృతిస్తథా ॥ 14 ॥

ఇది శచీపతియైన ఇంద్రుని శాపము వలన జరిగినది. మీరు ఆజ్ఞాపించుటకు అర్హులు అని అనగానే పూజ్యులైన వాయువు నిర్బతి ఇట్లు పలికారు.

గౌతమ్యాం స్నానకరణాచ్ఛాపమోక్షో భవిష్యతి ।
ఇత్యుక్త్వా తావుభౌ ప్రీతౌ తత్రైవాన్తర ధీయతామ్ ॥ 15 ॥

గౌతమీ నదియందు స్నానమాచరించుటవలన మీకు శాపమోక్షము కలుగునని చెప్పి వారిద్దరు సంతోషము తో అక్కడే అంతర్ధానము నొందిరి.

తతోఽ౨ంజనాం సమాదాయ అద్రిఃపైశాచ మూర్తిమాన్ ।
భ్రాతుర్హనుమతః ప్రీత్యై స్నాపయామాస మాతరమ్ ॥ 16 ॥

అటు తరువాత పిశాచ మూర్తిగా నున్న అద్రి అంజనను తీసుకొని వచ్చి హనుమంతుని ప్రీతికొరకు సోదరునితల్లికి గంగలో స్నానమును చేయించింది.

తథైవ హనుమాన్ గంగా మాదాయాద్రి మతిత్వరన్ ।
మార్జార రూపిణీం నీత్వా గౌతమ్యాస్తీరమాప్తవాన్ ॥ 17 ॥

అలాగే హనుమంతుడు మార్జారరూపంలో వున్న అద్రిని తీసుకొని త్వర త్వరగా గౌతమీ తీరమును చేరాడు.

తతః ప్రభృతి తత్తీర్థం పైశాచం చాఽ౨ఽ౨ంజనం తథా ।
బ్రహ్మణో గిరిమాసాద్య సర్వకామప్రదం శుభమ్ ॥ 18 ॥

అప్పటి నుండి బ్రహ్మగిరిపైన ప్రవహిస్తున్న సమస్త కోరికలను తీరుస్తున్న ఆ తీర్థాన్ని పైశాచ తీర్థమని, అంజన తీర్థమని పిలుస్తున్నారు.

యోజనానాం త్రిపంచాశన్మార్జారం పర్వతో భవేత్ ।
మార్జార సంజ్ఞితాత్తస్మాద్ధనూమన్తం వృషాకపిమ్ ॥ 19 ॥

మార్జార పర్వతము యాభై మూడు యోజనములున్నది. మార్జారసంజ్ఞిత మైనందువలన హనుమంతుని వృషాకపిని మార్జారసంజ్ఞితునిగా పిలుస్తారు.

ఫేనా సంగమ మాఖ్యాతం సర్వకామప్రదం శుభమ్ ।
తస్య స్వరూపం వృష్టిశ్చ తత్రైవ ప్రోచ్యతే శుభా ॥ 20 ॥

నురుగు సంగమమును సర్వకామములను తీర్చేదని శుభమైనదని దాని స్వరూపమును, సమృద్ధిని శుభపరిణామమును అక్కడే చెబుతారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమహాత్మ్యే పైశాచికతీర్థవర్ణనం నామ చతుర్దశోఽ౨ధ్యాయః. ॥14॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థ మాహాత్మ్యములోని పైశాచిక తీర్థ వర్ణనమను పేరుగల పదునాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచదశోఽధ్యాయః - పదహైదవ అధ్యాయం

క్షుధాతీర్థవర్ణనమ్ - క్షుధాతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

క్షుధాతీర్థమితి ఖ్యాతం శృణు నారద తన్మనాః ।
కథ్యమానం మహాపుణ్యం సర్వకామప్రదం నృణామ్ ॥ 1 ॥

ఓ నారదా! మానవులకు కోరికలన్నింటిని ఇచ్చేది, మహాపుణ్యప్రదమైనది. క్షుధాతీర్థమను ప్రసిద్ధి చెందిన తీర్థమున్నది. దానిని గూర్చి చెబుతాను. సావధానంగా విను.

ఋషిరాసీత్పురా కణ్వస్తపస్వీ వేదవిత్తమః ।
పరిభ్రమన్నాశ్రమాణి క్షుధయా పరిపీడితః ॥ 2 ॥

పూర్వం వేదవిదుడు, తపస్వి అయిన కణ్వుడనే ఋషి ఉండేవాడు. ఆయన ఆకలితో బాధపడుతూ ఆశ్రమాలన్నీ తిరుగుతుండేవాడు.

గౌతమస్యాఽఽశ్రమం పుణ్యం సమృద్ధం చాన్నవారిణా ।
ఆత్మానం చ క్షుధాయుక్తం సమృద్ధం చాపి గౌతమమ్ ॥ 3 ॥

వీక్ష్య కణ్వోఽథ వైషమ్యం వైరాగ్యమగమత్తదా ।
గౌతమోఽపి ద్విజశ్రేష్ఠో హ్యహం తపసి నిష్ఠితః ॥ 4 ॥

గౌతముని ఆశ్రమం జలాన్నసమృద్ధి కలిగి, పవిత్రంగా ఉండినది. గౌతముడు సమృద్ధిగానుండుట, తానేమో ఆకలితో నుండుటను చూచి కణ్వుడు వైషమ్యాన్నీ, వైరాగ్యాన్నీ పొందాడు. ద్విజశ్రేష్ఠుడైన గౌతముడు నేను తపోనిష్ఠులము.

సమేన యాంచాఽయుక్తా స్యాత్తస్మాద్గౌతమవేశ్మని ।
న భక్ష్యేఽహం క్షుధార్తోఽపి పీడితేఽపి కలేబరే ॥ 5 ॥

అందువలన నాతో సమానమైన గౌతముని గృహంలోయాచించుట తగదు. శరీరంలో బాధ కలిగినా ఆకలితో అలమటించినా నేను తినను.

గచ్ఛేయం గౌతమీం గంగామర్జయేయం చ సంపదమ్ ।
ఇతి నిశ్చిత్య మేధావీ గత్వా గంగాం చ పావనీమ్ ॥ 6 ॥

స్నాత్వా శుచిర్యతమనా ఉపవిశ్య కుశాసనే ।
తుష్టావ గౌతమీం గంగాం క్షుధాం చ పరమాపదమ్ ॥ 7 ॥

నేను గౌతమీగంగదగ్గరకు వెళ్ళి సంపదనార్జిస్తానని నిశ్చయించుకొని ఆ మేధావి పవిత్రమైన గంగ దగ్గరకు వెళ్ళి, స్నానము చేసి, శుచియై నియమంగా దర్భాసనంపై కూర్చుని గౌతమీగంగను, విపత్కరమైన ఆకలిని స్తోత్రం చేశాడు.

కణ్వఉవాచ :- కణ్వుడు పలికాడు.

నమోఽస్తు గంగే పరమార్తిహారిణి నమః క్షుధే సర్వజనార్తికారిణి ।
నమో మహేశానజటోద్భవే శుభే నమో మహామృత్యు ముఖాద్వినిఃసృతే ॥ 8 ॥

మిక్కిలి దుఃఖములను తొలగించే ఓ గంగానదీ నీకు నమస్కారం. మహేశ్వరుని జటాజూటమునందు పుట్టిన శుభకరురాలలైన గంగా! నీకు నమస్కారం. మహామృత్యుముఖద్వారమునుండి వెడలిన ఓ ఆకలీ! నీకు నమస్కారం. సమస్త జనుల ఆర్తికి కారణభూతురాలా! ఓ ఆకలీ! నీకు నమస్కారం.

పుణ్యాత్మనాం శాన్తరూపే క్రోధరూపే దురాత్మనామ్ ।
సరిద్రూపేణ సర్వేషాం తాపపాపాపహారిణి ॥ 9 ॥

పుణ్యాత్ములకు శాంతిరూపిణిగా, దుర్మార్గులకు క్రోధరూపిణిగా నదీరూపంగా అందరి పాపతాపాలను హరించేదానా! నీకు నమస్కారం.

క్షుధారూపేణ సర్వేషాం తాపపాపప్రదే నమః ।
నమః శ్రేయస్కరే దేవి నమః పాపప్రమర్దిని ॥
నమః శాన్తికరే దేవి నమో దారిద్ర్యనాశిని ॥ 10 ॥

క్షుధా రూపిణిగా అందరికి తాపము, పాపము కలిగించేదానా! నీకు నమస్కారం. పాపములను మర్దించేదానా! శ్రేయస్సును కలిగించే దేవీ! నీకు నా నమస్కారం. ఓ దారిద్ర్యనాశినీ! శాంతిని కలిగించే దేవీ! నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యేవం స్తువతస్తస్య పురస్తాదభవద్ద్వయమ్ ।
ఏకం గాంగం మనోహారి హ్యపరం భీషణాకృతి ।
పునః కృతాంజలిర్భూత్వా నమస్కృత్వా ద్విజోత్తమః ॥ 11 ॥

ఈ విధముగా స్తోత్రం చేస్తున్న కణ్వుని కెదురుగా ఒకరు మనోహరమైన గంగా స్వరూపము, మరొకటి భీషణాకారము కనిపించాయి. ఆ బ్రాహ్మణోత్తముడు తిరిగి చేతులు జోడించి నమస్కరించి, (పైకి అన్వయము)

కణ్వఉవాచ :- కణ్వుడు పలికాడు.

సర్వమంగళమాంగల్యే బ్రాహ్మి మాహేశ్వరి శుభే ।
వైష్ణవి త్ర్యంబకే దేవి గోదావరి నమోఽస్తు తే ॥ 12 ॥

సమస్త శుభములకు మంగళస్వరూపురాలా! సరస్వతీ! పార్వతీ! శుభకరురాలా! వైష్ణవీ! త్ర్యంబకా! దేవీ! గోదావరీ! నీకు నమస్కారం.

త్ర్యంబకస్య జటోద్భూతే గౌతమస్యాఘనాశిని ।
సప్తధా సాగరం యాన్తి గోదావరి నమోఽస్తు తే ॥ 13 ॥

శివుని జటమునందుద్భవించినదానా! గౌతముని పాపమును తొలగించినదానా! ఏడు పాయలుగా సముద్రమును పొందినదానా! గోదావరీ! నీకు నమస్కారము.

సర్వపాపకృతాం పాపే ధర్మకామార్థనాశిని ।
దుఃఖలోభమయే దేవి క్షుధే తుభ్యం నమో నమః ॥ 14 ॥

సమస్తపాపములాచరించేవారి విషయంలో పాపురాలా! ధర్మకామార్థములను నశింపచేయుదానా! దుఃఖలోభములు నిండినదానా! ఓ క్షుధాదేవీ! నీకు నమస్కారము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్కణ్వవచనం శ్రుత్వా సుప్రీతే ఆహతుర్ద్విజమ్ ॥ 15 ॥

ఆ కణ్వుని స్తోత్రమును విని సంతోషించి వారు కణ్వునితో ఇలా అన్నారు.

గంగాక్షుధే ఊచతుః :- గంగాదేవి, క్షుధాదేవి పలికారు.

అభీష్టం వద కల్యాణ వరాన్ వరయ సువ్రత ॥ 16 ॥

ఓ శుభకరుడా! నీ అభీష్టాన్ని చెప్పు. ఓ సువ్రతా! వరములు కోరుకో.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ప్రోవాచ ప్రణతో గంగాం కణ్వః క్షుధాం యథాక్రమమ్ ॥ 17 ॥

కణ్వుడు మొదట గంగకు నమస్కరించి, తరువాత క్షుధకు నమస్కరించి ఇలా అన్నాడు.

కణ్వ ఉవాచ :- కణ్వుడు పలికాడు.

దేహి దేవి మనోజ్ఞాని కామాని విభవం మమ ।
ఆయుర్విత్తం చ భుక్తిం చ ముక్తిం గంగే ప్రయచ్ఛ మే ॥ 18 ॥

దేవీ! నా మనస్సులోని కోరికలు, ఐశ్వర్యము నాకివ్వు. ఓ గంగాదేవీ! ఆయువు, ధనము, భుక్తి, ముక్తిని నాకు ప్రసాదించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా గౌతమీం గంగాం క్షుధాం చాఽహ ద్విజోత్తమః ॥ 19 ॥

అని ఆ ద్విజోత్తముడు గౌతమీగంగతో, క్షుధతో అన్నాడు.

కణ్వ ఉవాచ :- కణ్వుడు పలికాడు.

మయి మద్వంశజే చాపి క్షుధే తృష్ణే దరిద్రిణి ।
యాహి పాపేతరే రూక్షే న భూయా స్త్వం కదాచన ॥ 20 ॥

నేనుగాని, మావంశంలో పుట్టినవారుగాని ఆకలి, దప్పిక దరిద్రంలో పడగూడదు. ఇతర పాపములు గాని, నీరసము గాని ఎప్పుడూ పొందకూడదు.

స్తవేనానేన యే వై త్వాం స్తువన్తి క్షుధయాఽఽతురాః ।
తేషాం దారిద్ర్యదుఃఖాని న భవేయుర్వరోఽపరః ॥ 21 ॥

ఈ స్తోత్రంతో నిన్నెవరైతే ఆకలిగొన్నవారు స్తోత్రంచేస్తారో వారికి దారిద్ర్య దుఃఖాలు ఉండ కూడదు. ఇది నేను కోరే రెండవ వరము.

అస్మింస్తీర్థే మహాపుణ్యే స్నానదానజపాదికమ్ ।
యే కుర్వన్తి నరా భక్త్యా లక్ష్మీభాజో భవన్తు తే ॥ 22 ॥

ఈ పవిత్రమైన క్షుధాతీర్థంలో ఎవరైతే స్నాన దాన జపాదులు చేస్తారో వారికి సంపదలు కలుగవలయును.

యస్త్విదం పఠతే స్తోత్రం తీర్థే వా యది వా గృహే ।
తస్య దారిద్ర్య దుఃఖేభ్యో న భయం స్యాద్వరోఽపరః ॥ 23 ॥

ఈ స్తోత్రాన్ని తీర్థమునందు గాని, ఇంటిలో గాని ఎవరైతే చదువుతారో వారికి దారిద్ర్య దుఃఖములవలన భయముండకూడదని నేను మరొక వరము కోరుతున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవ మస్త్వితి చోక్త్వా తే కణ్వం యాతే స్వమాలయమ్ ।
తతఃప్రభృతి తత్తీర్థం కణ్వం గాంగం క్షుధాభిదమ్ ॥ 24 ॥

సర్వపాపహరం వత్స పితౄణాం ప్రీతివర్ధనమ్ ॥

అప్పుడు వారు కణ్వునితో అట్లే యగుగాక అని చెప్పి తమతమ స్థానాలకు వెళ్ళారు. అప్పటి నుండి ఈ తీర్థము కాణ్వమని, గాంగమని, క్షుధా, తీర్థమని పేరు పొందింది. నాయనా! ఈ క్షుధాతీర్థం సర్వపాపాలను హరించేది. పితృ దేవతలకు ప్రీతిని పెంపొందించేది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే క్షుధాతీర్థవర్ణనం నామ పంచదశోఽధ్యాయః ॥ 15 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థమాహాత్మ్యంలోని క్షుధా తీర్థ వర్ణనమను పేరు గల పదహైదవ అధ్యాయం సంపూర్ణం.

షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం

అహల్యా సంగమేంద్ర తీర్థవర్ణనమ్ - అహల్యా సంగమేంద్ర తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అహల్యాసంగమం చేహ తీర్థం త్రైలోక్యపావనమ్ ।
శృణు సమ్యక్ మునిశ్రేష్ఠ తత్ర వృత్తమిదం యథా ॥ 1 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! అహల్యాసంగమమనే తీర్థం ముల్లోకాలను పావనం చేస్తుంది. ఇప్పుడు దాని వృత్తాంతాన్ని చెబుతున్నాను. చక్కగా విను.

కౌతుకేనాతి మహతా మయా పూర్వం మునీశ్వర ।
సృష్టాః కన్యా బహువిధా రూపవత్యో గుణాన్వితాః ॥ 2 ॥

ఓ మునీశ్వరా! నేను పూర్వం మిక్కిలి కుతూహలంతో అనేక విధాలైన రూపవతులు, గుణవంతురాళ్ళైన కుమార్తెలను సృష్టించాను.

తాసామేకాం శ్రేష్ఠతమాం నిర్మమే శుభలక్షణామ్ ।
తాం బాలాం చారుసర్వాంగీం దృష్ట్వా రూపగుణాన్వితామ్ ॥ 3 ॥

కో వాఽస్యాః పోషణే శక్త ఇతి మే బుద్ధిరావిశత్ ।
న దైత్యానాం సురాణాం చ న మునీనాం తథైవ చ ॥ 4 ॥

వారిలో ఒకదానిని శ్రేష్ఠమైనదానినిగా, శుభలక్షణములు గల దానినిగా పెంచాను. సుందరమైన అన్ని అవయవములు, గుణ రూపములు గలిగిన ఆ బాలికను చూచి, ఈ బాలికను వివాహమాడటానికి (పోషించడానికి) ఎవడు తగినవాడని చింతించాను. దైత్యులలో గాని, దేవతలలోగాని అలాగే మునులలో గాని అటువంటి శక్తిగలవారు లేరు.

నాస్త్యస్యాః పోషణే శక్తిరితి మే బుద్ధిరన్వభూత్ ।
గుణజ్యేష్ఠాయ విప్రాయ తపోయుక్తాయ ధీమతే ॥ 5 ॥

సర్వలక్షణయుక్తాయ వేదవేదాంగవేదినే ।
గౌతమాయ మహాప్రాజ్ఞామదదాం పోషణాయ తామ్ ॥ 6 ॥

ఈమెను పోషించే శక్తి వీరెవరికీ లేదని నాబుద్ధి చెబుతున్నది. మంచి గుణాలు గలవారిలో జ్యేష్ఠుడు, తపస్సు చేసేవాడు, మంచి తెలివి గలవాడు, బ్రాహ్మణుడు, వేదములు నాలుగింటిని, శిక్షా వ్యాకరణాది ఆరు వేదాంగాలను తెలిసినవాడు, సర్వలక్షణాలతో కూడివున్న గౌతమునికి ఈ మహాప్రాజ్ఞురాలైన అహల్యను పోషణానికి ఇస్తాను.

పాలయస్వ మునిశ్రేష్ఠ యావదాప్నృతి యౌవనమ్ ।
యౌవనస్థాం పునః సాధ్వీం మానయేథా మమాన్తికమ్ ॥ 7 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! యౌవనమున్నంత వరకు ఈమెను పోషించు. తిరిగి ఈ సాధ్విని యౌవన దశవున్నప్పుడే నా వద్దకు తీసుకొనిరమ్ము.

ఏవముక్త్వా గౌతమాయ ప్రాదాం కన్యాం సుమధ్యమామ్ ।
తామాదాయ మునిశ్రేష్ఠః తపసా హతకల్మషః ॥ 8 ॥

పోషయిత్వా చ విధివదలంకృత్య మమాన్తికమ్ ।
నిర్వికారో మునిశ్రేష్ఠో హ్యహల్యామానయత్తదా ॥ 9 ॥

ఇలా చెప్పి చక్కనినడుము గలిగి సౌందర్యవతియైన ఆ కన్యను గౌతమున కిచ్చాను. ఆ అహల్యను స్వీకరించిన మునిశ్రేష్ఠుడైన గౌతముడు తపస్సుతో కల్మషరహితుడై విధిపూర్వకంగా పోషించి, కొంతకాలానికి నిర్వికారుడైన ఆ మునిశ్రేష్ఠుడామెను యధావిధిగా అలంకరించి ఆ అహల్యను నా వద్దకు తీసుకొనివచ్చాడు. అప్పుడు,

తాం దృష్ట్వా విబుధాః సర్వే శక్రాగ్నివరుణాదయః ।
మమ దేయా సురేశాన ఇత్యూచుస్తే పృథక్ పృథక్ ॥ 10 ॥

ఆమెను చూచిన ఇంద్రుడు, వరుణుడు మొదలగు దేవతలందరు ఓ దేవతా పూజ్యుడా! ఆమెను నాకివ్వమంటూ మాటి మాటికి అడిగారు.

తథైవ మునయః సాధ్యా దానవా యక్షరాక్షసాః ।
తాన్సర్వానాగతాన్ దృష్ట్వా కన్యార్థమథ సంగతాన్ ॥ 11 ॥

అలాగే మునులు, సాధ్యులు, దానవులు, యక్షులు, రాక్షసులు మొదలగు వారందరు కన్యకోసం వచ్చిన వారందరిని చూచి.

ఇంద్రస్య తు విశేషేణ మహాంశ్చాభూత్తదా గ్రహః ।
గౌతమస్య తు మాహాత్మ్యం గామ్భీర్యం ధైర్యమేవ చ ॥ 12 ॥

స్మృత్వా సువిస్మితో భూత్వా మమైవమభవత్సుధీః ।
దేయేయం గౌతమాయైవ నాన్యయోగ్యా శుభాననా ॥ 13 ॥

ఇంద్రునికి విశేషంగా ఆమెయందెక్కువ అనురాగం కలిగింది. కాని గౌతముని మాహాత్మ్యాన్ని, గంభీర్యాన్ని, ధైర్యాన్ని. తలచి ఆశ్చర్యపడి ఆ బుద్ధిమంతుడు నాతో ఇలా అన్నాడు. ఈ అహల్యను గౌతమునికే ఇవ్వాలి. ఈ శుభానన మరొకరికివ్వడానికి యోగ్యురాలు కాదని చెప్పాడు.

తస్మా ఏవ తు తాం దాస్యే తథాఽప్యేవమచిన్తయమ్ ।
సర్వేషాం చ మతిర్ధైర్యం మథితం బాలయాఽనయా ॥ 14 ॥

అందువలన ఆమె నా గౌతమునికిస్తాను. అంతేకాక నేనిలా ఆలోచించాను. అందరిలో కూడా ఈమె బుద్ధిని, ధైర్యాన్ని మథించింది.

అహల్యేతి సురైః ప్రోక్తం మయా చ ఋషిభిస్తదా ।
దేవానృషీంస్తదా వీక్ష్య మయా తత్రోక్తముచ్చకైః ॥ 15 ॥

అందువలన దేవతలు, ఋషులు, నేనుకూడా 'అహల్య' అని పిలిచాము. అప్పుడు దేవతలను, ఋషులను చూచి నేనక్కడ గట్టిగా ఇలా ప్రకటించాను.

తస్మై సా దీయతే సుభ్రూర్యః పృథివ్యాః ప్రదక్షిణామ్ ।
కృత్వోపతిష్ఠతే పూర్వం న చాన్యస్మై పునః పునః ॥ 16 ॥

ఎవరీ భూమిని ప్రదక్షిణం చేసి ముందుగా వచ్చి నిలుస్తారో వారికీ అందమైన కనుబొమలు కలిగిన అహల్య నిస్తాను. వేరే వారి కివ్వనని మాటి మాటికి ప్రకటించాను.

తతః సర్వే సురగణాః శ్రుత్వా వాక్యం మయేరితమ్ ।
అహల్యార్థం సురా జగ్ముః పృథివ్యాశ్చ ప్రదక్షిణే ॥ 17 ॥

అప్పుడు దేవతలందరు నా మాట విని అహల్యను పొందాలనే కోరికతో భూప్రదక్షిణానికై వెళ్ళారు.

గతేషు సురసంఘేషు గౌతమోఽపి మునీశ్వరః ।
ప్రయత్నమకరోత్కించిదహల్యార్థమిమం తథా ॥ 18 ॥

దేవతా గణాలు వెళ్ళిన తరువాత మునీశ్వరుడైన గౌతముడు గూడ అహల్యను పొందడానికి కొంచెం ప్రయత్నం చేశాడు.

ఏతస్మిన్నంతరే బ్రహ్మన్ సురభిః సర్వకామధుక్ ।
అర్ధప్రసూతాం హ్యభవత్తాం దదర్శ స గౌతమః ॥ 19 ॥

ఓ పూజ్యుడా! ఇంతలోనే కోరికలన్నిటినీ తీర్చే సురభి అర్ధప్రసూతగా ప్రత్యక్షమయింది. అప్పుడా గౌతముడా సురభిని చూచాడు.

తస్యాః ప్రదక్షిణం చక్రే ఇయముర్వీతి సంస్మరన్ ।
లింగస్య చ సురేశస్య ప్రదక్షిణమథాకరోత్ ॥ 20 ॥

ఈమే పృథివిఅని స్మరిస్తూ ఆ సురభి చుట్టూ ప్రదక్షిణం చేశాడు. అలాగే సురేశుడైన శివుని లింగానికి కూడా ప్రదక్షిణం చేశాడు.

తయోః ప్రదక్షిణం కృత్వా గౌతమో మునిసత్తమః ।
సర్వేషాం చైవ దేవానామేకం చాపి ప్రదక్షిణమ్ ॥ 21 ॥

నైవాభవద్ధ్రువో గన్తుః సంజాతం ద్వితయం మమ ।
ఏవం నిశ్చిత్య స మునిర్మమాన్తికమథాభ్యగాత్ ॥ 22 ॥

ఇలా మునిశ్రేష్ఠుడైన గౌతముడు వారిద్దరికి ప్రదక్షిణం చేసి దేవతలందరు ఒక్క ప్రదక్షిణమైన కూడా కాకుండానే నాకు భూప్రదక్షిణం రెండుసార్లయిందని నిశ్చయించి ఆ ముని నా దగ్గరికి వచ్చాడు.

నమస్కృత్వాఽబ్రవీద్వాక్యం గౌతమో మాం మహామతిః ।
కమలాసన విశ్వాత్మన్నమస్తేఽస్తు పునః పునః ॥ 23 ॥

మహామతియైన ఆ గౌతముడు నాకు నమస్కరించి నాతో ఇలా అన్నాడు. విశ్వాత్మా! కమలాసనా! నీకు మాటిమాటికి నమస్కారం.

ప్రదక్షిణీకృతా బ్రహ్మన్మయేయం వసుధాఽఖిలా ।
యదత్ర యుక్తం దేవేశ జానీతే తద్భవాన్ స్వయమ్ ॥ 24 ॥

బ్రహ్మదేవా! నేనీ భూమండలాన్నంతా ప్రదక్షిణం చేశాను. ఓ దేవేశా! ఇక్కడేది యుక్తమైందో మీరు స్వయంగా నెరుగుదురు.

అహం తు ధ్యానయోగేన జ్ఞాత్వా గౌతమ మబ్రవమ్ ।
తవైవ దీయతే సుభ్రూః ప్రదక్షిణమిదం కృతమ్ ॥ 25 ॥

నేను ధ్యానయోగంతో జరిగిన దానిని తెలుసుకొని, గౌతమునితో నీవు ప్రదక్షిణం చేశావు కనుక నీకే ఈ చక్కని కనుబొమలుగల దానిని (అహల్యను) ఇస్తానన్నాను.

ధర్మం జానీహి విప్రర్షే దుర్జ్ఞేయం నిగమైరపి ।
అర్ధప్రసూతా సురభిః సప్తద్వీపవతీ మహీ ॥ 26 ॥

ఓ బ్రహ్మర్షీ! శాస్త్రాలు కూడా తెలుసుకోలేని ధర్మాన్ని తెలుసుకో. అదేమనగా అర్ధప్రసూత అయిన సురభి సప్తద్వీపాలతో కూడివున్న భూమితో సమానం.

కృతా ప్రదిక్షిణా తస్యాః పృథివ్యాః సా కృతా భవేత్ ।
లింగం ప్రదక్షిణీకృత్య తదేవ ఫలమాప్నుయాత్ ॥ 27 ॥

ఆ సురభికి ప్రదక్షిణం చేసినందువలన అది భూమికి ప్రదక్షిణం చేసినట్లవుతుంది. లింగానికి ప్రదక్షిణం చేసినా ఆ ఫలమే లభిస్తుంది.

తస్మాత్సర్వప్రయత్నేన మునే గౌతమ సువ్రత ।
తుష్టోఽహం తవ ధైర్యేణ జ్ఞానేన తపసా తథా ॥ 28 ॥

ఓ మునీ! సువ్రతా! గౌతమా! నేను నీ తపస్సుకు, నీవు చేసిన సర్వప్రయత్నాలతో కూడిన ధైర్యానికి జ్ఞానానికి సంతుష్టుడనైనాను.

దత్తేయ మృషిశార్దూల కన్యా లోకవరా మయా ।
ఇత్యుక్త్వాఽహం గౌతమాయ అహల్యామదదం మునే ॥ 29 ॥

ఓ ఋషి శార్దూలా! లోకోత్తరమైన ఈ కన్యను నేను నీకిస్తున్నానని చెప్పి మునీ! చెప్పి అహల్యను గౌతమునికిచ్చాను.

జాతే వివాహే తే దేవాః కృత్వేలాయాః ప్రదక్షిణమ్ ।
శనైః శనైరథాఽఽగత్య దదృశుః సర్వ ఏవ తే ॥ 30 ॥

వారిరువురికి వివాహం జరుగుగగా దేవతలందరు మెల్ల మెల్లగా భూప్రదక్షిణం చేసి వచ్చి వారిని చూశారు.

తం గౌతమ మహల్యాం చ దాంపత్యం ప్రీతివర్ధనమ్ ।
తే చాఽఽగత్యాథ పశ్యన్తో విస్మితాశ్చాభవన్సురాః ॥ 31 ॥

ప్రీతి వర్ధనమైన అహల్యా గౌతముల దాంపత్యాన్ని చూచి ఆ వచ్చిన దేవతలాశ్చర్యం పొందారు.

అతిక్రాన్తే వివాహే తు సురాః సర్వే దివం యయుః ।
సమత్సరః శచీభర్తా తామీక్ష్య చ దివం యయౌ ॥ 32 ॥

వివాహం పూర్తికాగానే దేవతలందరు స్వర్గమునకు వెళ్ళారు. శచీదేవి భర్తయగు ఇంద్రుడు ఆ అహల్యను మాత్సర్యంతో చూచి స్వర్గమునకు వెళ్ళాడు.

తతః ప్రీతమనాస్తస్మై గౌతమాయ మహాత్మనే ।
ప్రాదాం బ్రహ్మగిరిం పుణ్యం సర్వకామప్రదం శుభమ్ ॥ 33 ॥

తరువాత సమస్త కోరికలను తీర్చునది, శుభమైనది, పవిత్రమైనది అయిన బ్రహ్మగిరిని సంతుష్టుడు, మహాత్ముడు అయిన గౌతమున కిచ్చాను.

అహల్యాయాం మునిశ్రేష్ఠో రేమే తత్ర స గౌతమః ।
గౌతమస్య కథాం పుణ్యాం శ్రుత్వా శక్రస్త్రివిష్టపే ॥ 34 ॥

తమాశ్రమం తం చ మునిం తస్య భార్యామనిందితామ్ ।
భూత్వా బ్రాహ్మణవేషేణ ద్రష్టుమాగాచ్ఛతక్రతుః ॥ 35 ॥

ఆ బ్రహ్మగిరియందు మునిశ్రేష్ఠుడైన గౌతముడు అహల్యతో నానందంగా రమించెను. గౌతముని పవిత్ర కథను విని స్వర్గములో ఇంద్రుడు, ఆ గౌతముని, అతని ఆశ్రమమును, పతివ్రత అయిన అతని భార్యను చూచుటకు బ్రాహ్మణవేషమును ధరించి వచ్చాడు.

స దృష్ట్వా భవనం తస్య భార్యాం చ విభవం తథా ।
పాపీయసీం మతిం కృత్వా అహల్యాం సముదైక్షత ॥ 36 ॥

ఇంద్రుడు గౌతముని భవనమును, అతని భార్యను, అతని వైభవమును చూచి పాపపుటాలోచనతో అహల్యను చూచాడు.

నాఽఽత్మానం న పరం దేశం కాలం శాపాదృషేర్భయమ్ ।
న బుబోధ తదా వత్స కామాకృష్టః శతక్రతుః ॥ 37 ॥

నాయనా! కామానికి లోబడిన ఆ ఇంద్రుడు తనను గాని, పరదేశమని కాని, సమయం గాని సమయ మని గాని, ఋషిశాపమువలన కలిగే పరిణామమును కాని, భయమును కాని తెలుసుకొనలేకపోయాడు.

తద్ధ్యాన పరమో నిత్యం సురరాజ్యేన గర్వితః ।
సంతప్తాంగః కథం కుర్యాం ప్రవేశో మే కథం భవేత్ ॥ 38 ॥

ఏవం వసన్ విప్రరూపో నాన్తరం త్వధ్యగచ్ఛత ।
స కదాచిత్ మహాప్రాజ్ఞః కృత్వా పౌర్వాహ్ణికీం క్రియామ్ ॥ 39 ॥

సహితో గౌతమః శిష్యైర్నిర్గతశ్చాఽఽశ్రమాద్బహిః ।
ఆశ్రమం గౌతమీం విప్రాన్ ధాన్యాని వివిధాని చ ॥ 40 ॥

ద్రష్టుం గతో మునివర ఇంద్రస్తం సముదైక్షత ।
ఇదమన్తరమిత్యుక్త్వా చక్రే కార్యం మనః ప్రియామ్ ॥ 41 ॥

ఆ అహల్యనే సర్వదా ధ్యానిస్తూ, నిత్యమూ కామంతో కాలిపోతూ, తనకున్న స్వర్గరాజ్యపదవితో గర్విస్తూ నేనెలా ఆ ఆశ్రమంలో ప్రవేశిస్తాను? నాకా అహల్య ఎలా వశమవుతుందని చింతిస్తూ ఇలా బ్రాహ్మణరూపంలో ఉన్న ఆ ఇంద్రుడు లోపలికి వెళ్ళలేకపోయాడు. ఒకనాడు మహాప్రాజ్ఞుడైన గౌతముడు పూర్వాహ్ణ క్రియలను పూర్తిచేసుకొని, శిష్యులతో కలిసి యా గౌతముడు ఆశ్రమం నుండి బయటకు వచ్చి, ఆశ్రమమును, గౌతమిని, బ్రాహ్మణులను, వివిధ ధాన్యములను చూచుటకు వెళ్ళాడు. ఓ మునివరా! ఇంద్రుడు గౌతముడు వెళ్ళుటను చూచాడు. ఇదే సమయమనుకొని తన మనస్సులోని కోరికలను తీర్చుకొనుటకు పని ప్రారంభించాడు.

రూపం కృత్వా గౌతమస్య ప్రియేప్సుః స శతక్రతుః ।
తాం దృష్ట్వా చారుసర్వాంగీమహల్యాం వాక్యమబ్రవీత్ ॥ 42 ॥

ప్రియురాలిని పొందాలనే కోరికతో నా ఇంద్రుడు గౌతమ రూపమును ధరించి, సుందర దేహము కలిగిన ఆ అహల్యను చూచి ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

ఆకృష్టోఽహం తవ గుణైరూపం స్మృత్వా స్ఖలత్పదః ।
ఇతి బ్రువన్ హసన్హస్తమాదాయాన్తః సమావిశత్ ॥ 43 ॥

నీ గుణములచే నాకర్షించబడి, నీ రూపమును తలచి నా అడుగులుముందుకు పడలేదు అని నవ్వుకుంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని లోపలికి ప్రవేశించాడు.

న బుబోధ త్వహల్యా తం జారం మేనే తు గౌతమమ్ ।
రమమాణా యథా సౌఖ్యం ప్రాగాచ్ఛిష్యైః స గౌతమః ॥ 44 ॥

అహల్య అతనిని గౌతముని (ఇంద్రుని) గానే భావించెను కాని జారుడని తెలుసుకొనలేక పోయింది. ఆమె అతనితో సుఖంగా రమిస్తుండగా ఆ గౌతముడు శిష్యులతో వచ్చాడు.

ఆగచ్ఛన్తం నిత్యమేవ అహల్యా ప్రియవాదినీ ।
ప్రతియాతి ప్రియం వక్తి తోషయన్తీ చ తం గుణైః ॥ 45 ॥

ప్రతిరోజు ఆశ్రమానికి వచ్చిన గౌతమునికి ఎదురుగా వెళ్ళి చక్కగా ప్రియముగా మాట్లాడేది. అహల్య అతనిని తన గుణాలతో సంతోష పెట్టేది.

తామదృష్ట్వా మహాప్రాజ్ఞో మేనే తన్మహదద్భుతమ్ ।
ద్వారస్థితం మునిశ్రేష్ఠం సర్వే పశ్యన్తి నారద ॥ 46 ॥

ఆమెను చూడకనే ఆ మహాప్రాజ్ఞుడైన గౌతముడు దానిని ఆశ్చర్యంగా భావించాడు. నారదా! ద్వారంలో వున్న మునిశ్రేష్ఠుడైన గౌతముని అందరూ చూచారు.

అగ్నిహోత్రస్య శాలాయా రక్షణో గృహకర్మిణః ।
ఊచుర్మునివరం భీతా గౌతమం విస్మయాన్వితాః ॥ 47 ॥

యాగశాలను రక్షించే ఇంటి పనివారు భయపడి విస్మయంతో మునిశ్రేష్ఠుడైన గౌతమునితో ఇలా అన్నారు.

రక్షిణ ఊచుః :– రక్షకులు పలికారు.

భగవన్ కిమిదం చిత్రం బహిరన్తశ్చ దృశ్యసే ।
ప్రియయాఽన్తః ప్రవిష్టోఽసి తథైవ చ బహిర్భవాన్ ॥ 48 ॥
అహో తపః ప్రభావోఽయం నానారూపధరో భవాన్ ॥

ఓ పూజ్యుడా! ఇదేమి చిత్రం? లోపల వెలుపలను కనబడుతున్నావు? నీ ప్రియురాలితో లోనికి వెళ్ళితివి. అలాగే బయట కూడా కనబడుతున్నావు. ఆహా! ఏమి ఈ తపఃప్రభావం. నీవు నానారూపధారివి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా విస్మిత స్త్వన్తః ప్రవిష్టః కోనుతిష్ఠతి ।
ప్రియే అహల్యే భవతి కిం మాం న ప్రతిభాషసే ॥ 49 ॥

ఆ మాటలు విని ఆశ్చర్యపడి ఎవడు లోపలనున్నాడు? నా ప్రియమైన అహల్యా! నీ వెందుకు బదులు పలుకడం లేదు?

ఇతి ఋషేర్వచనం శ్రుత్వా అహల్యా జారమబ్రవీత్ ॥ 50 ॥

గౌతముని మాటలు విన్న అహల్య జారునితో నిట్లనెను.

అహల్యోవాచ :– అహల్య పలికింది.

కో భవాన్మునిరూపేణ పాపం త్వం కృతవానసి ।
ఇతి బ్రువంతీ శయనాదుత్థితా సత్వరం భయాత్ ॥ 51 ॥

నీవెవరు? మునిరూపంలో ఉండి పాపం చేశావని అంటూ వెంటనే భయంతో పడకనుండి లేచింది.

స చాపి పాపకృచ్ఛక్రో బిడాలోఽ భూన్మునేర్భయాత్ ।
అహల్యాం వికృతాం దృష్ట్వా ఘర్షితాం స్వప్రియాం బలాత్ ॥ 52 ॥

ఉవాచ స మునిః కోపాత్కిమిదం సాహసం కృతమ్ ।
ఇతి బ్రువన్తం భర్తారం సాఽపి నోవాచ లజ్జితా ॥ 53 ॥

ఆ ఇంద్రుడు పాపకారియైన మునివలన భయముతో పిల్లి అయ్యాడు. బలవంతంగా చెరచబడిన వికృతస్వరూపిణిగా మారిన తనప్రియురాలైన అహల్యను చూచి, నీవింత సాహసం ఎందుకు చేసితివని గౌతముడు కోపంతో పలుకగా అలా మాట్లాడిన భర్తతో ఆ అహల్య సిగ్గుతో మాట్లాడలేక పోయింది.

భ్రమమాణం భయోద్విగ్నం బిడాలం దదృశే మునిః ।
కో భవానితి తం ప్రాహ భస్మీకుర్యాం మృషావచాః ॥ 54 ॥

గౌతముడు భయపడుతూ భయోద్విగ్నతతో ఇటునటు తిరుగుతున్న పిల్లిని చూచాడు. నీ వెవరు నిజం చెప్పు. అబద్ధాలాడితే నిన్ను భస్మం చేస్తానని గౌతముడన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

కృతాంజలి పుటో భూత్వా చైవ మాహ శచీపతిః ।
శచీ భర్తా పురాం భేత్తా తపోధన పురుష్టుతః ॥ 55 ॥

శచీదేవిభర్త, పురములను భేదించినవాడు, పురువుచే స్తోత్రం చేయబడినవాడైన ఇంద్రుడు రెండు చేతులతో నమస్కరిస్తూ ఇలా అన్నాడు. ఓ తపోధనా!

మమేదం పాపమాపన్నం సత్యముక్తం మయాఽనఘ ।
మహద్విగర్హితం కర్మ కృతవానస్మ్యహం మునే ॥ 56 ॥

ఓ మునీ! నేను మిక్కిలి అసహ్యించవలసిన పని చేశాను. నేను సత్యాన్నే పలుకుతున్నాను. ఓ అనఘా! నాకు పాపం వచ్చింది.

స్మరసాయకనిర్భిన్నహృదయాః కిం న కుర్వతే ।
బ్రహ్మన్ మయి మహాపాపే క్షమస్వ కరుణానిధే ॥ 57 ॥

మన్మథబాణములచే హృదయము భిన్నమైనవారు ఏమి చేయకుండా వుంటారు? కాముకులెంతకైనా తెగిస్తారు. బ్రహ్మన్! కరుణానిధీ! మహాపాపినైన నన్ను క్షమించు.

సన్తః కృతాపరాధేఽపి న రౌక్ష్యం జాతు కుర్వతే ।
నిశమ్య తద్వచో విప్రో హరిమాహ రుషాన్వితః ॥ 58 ॥

సత్పురుషులు అపరాధం చేసినా వానియందు కూడా కాఠన్యం చూపరు. ఆ మాట విని గౌతముడు కోపంతో ఇంద్రునితో ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

భగప్రీత్యా కృతం పాపం సహస్ర భగవాన్ భవ ।
తామప్యాహ మునిః కోపాత్త్వంచ శుష్కనదీ భవ ॥ 59 ॥

నీవు యోనియందుండే ప్రీతితో పాపం చేశావు. కావున నీవు సహస్రయోనివగుము అని పలికి ఆ అహల్యను నీవు ఎండిన నదివౌదువు గాక యని కోపంతో శపించాడు.

అహల్యోవాచ :- అహల్య పలికింది.

తతః ప్రసాదయామాస కథయన్తీ తదాకృతిమ్ ॥ 60 ॥

తరువాత ఆ ఆకృతిని గూర్చి అనుగ్రహంతో ఇలా అన్నది.

మనసాఽ పృన్యపురుషం పాపిష్ఠాః కామయన్తి యాః ।
అక్షయాన్యాన్తి నరకాం స్తాసాం సర్వేఽ పి పూర్వజాః ॥ 61 ॥

ఏ పాపాత్ములు మనస్సులోనైనా అన్యపురుషులను కామిస్తారో, అటువంటి పాపిష్ఠులు, వాళ్ళపూర్వతరాల వాళ్ళు కూడా అంతంలేని నరకాలను పొందుతారు.

భూత్వా ప్రసన్నా భగవన్నవధారయ మద్వచః ।
తవ రూపేణ చాఽ ఽ గత్య మామగాత్సాక్షిణస్త్విమే ॥ 62 ॥

ఓ పూజ్యుడా! నీవు ప్రసన్నుడవై నా మాటలు విను. ఇంద్రుడు నీరూపంలో వచ్చి నన్ను పొందాడు, దీనికి వీరే సాక్షులు.

తథేతి రక్షిణః ప్రోచు రహల్యా సత్యవాదినీ ।
ధ్యానేనాపి మునిర్జ్ఞాత్వా శాన్తః ప్రాహ పతివ్రతామ్ ॥ 63 ॥

అవును, అహల్య సత్యాన్నే చెప్పిందని రక్షకులన్నారు. గౌతముడు కూడా ధ్యానం ద్వారా సత్యాన్ని గ్రహించి శాంతచిత్తుడై పతివ్రతయైన అహల్యతో ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

యదా తు సంగతా భద్రే గౌతమ్యా సరిదీశయా ।
నదీ భూత్వా పునా రూపం ప్రాప్స్యసే ప్రియకృన్మమ ॥ 64 ॥

ఓ మంగళకరురాలా! ఈశ్వరునినుండి వచ్చిన దేవనదియైన గౌతమితో సాంగత్యమేర్పడినప్పుడు నాకు ప్రియమును కలిగించుటకై నదీ రూపంనుండి తిరిగి నీరూపాన్ని పొందుతావు.

ఇతి ఋషేర్వచనం శ్రుత్వా తథా చక్రే పతివ్రతా ।
తయా సంగతా దేవ్యా అహల్యా గౌతమప్రియా ॥ 65 ॥

ఈవిధంగా ఋషి మాటలను విని ఆ పతివ్రత అలాగే చేసింది. అప్పుడా గౌతముని ప్రియపత్నియైన అహల్య దేవియైన గౌతమితో కలిసింది.

పునస్తద్రూపమభవద్యన్మయా నిర్మితం పురా ।
తతః కృతాంజలిపుటః సురరాట్ ప్రాహ గౌతమమ్ ॥ 66 ॥

నేనింతకు ముందిచ్చిన రూపాన్నే ఆ అహల్య పొందింది. అప్పుడు ఇంద్రుడు నమస్కరిస్తూ గౌతమునితో ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

మాం పాహి మునిశార్దూల పాపిష్ఠం గృహమాగతమ్ ।
పాదయోః పతితం దృష్ట్వా కృపయా ప్రాహ గౌతమః ॥ 67 ॥

ఓ మునిశ్రేష్ఠా! పాపియైన నేను నీ ఇల్లు జొచ్చితిని. నన్ను రక్షించుమని వేడగా తన పాదముల మీద పడ్డ ఇంద్రుని చూచి గౌతముడు దయతో ఇలా అన్నాడు.

ప్రసాదితో దేవగణైర్గౌతమో మునిసత్తమః ।
ఇంద్రస్య చ శచీభర్తుః కుర్వన్ శాపవిమోక్షణమ్ ॥ 68 ॥

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

అహల్యా సంగమే తీర్థే పుణ్యే స్నాత్వా శచీపతే ।
క్షణాన్నిర్ధూత పాపస్త్వం సహస్రాక్షో భవిష్యసి ॥ 69 ॥

దేవతలందరిచే అనుగ్రహించబడిన, మునిశ్రేష్ఠుడైన గౌతముడు శచీభర్త యైన ఇంద్రునికి శాపవిమోక్షణమును చేయుచు, ఓ ఇంద్రా! అహల్యా సంగమ తీర్థమునందు స్నానము చేసిన క్షణములోనే నీవు పాపము తొలగి సహస్రాక్షుడవు కాగలవు.

ఉభయం విస్మయకరం దృష్టవానస్మి నారద ।
అహల్యాయాః పునర్భావం శచీభర్తా సహస్రదృక్ ॥ 70 ॥

ఓ నారదా! అహల్య తిరిగి పూర్వమురూపముపొందుటను, శచీభర్త అయిన ఇంద్రుడు సహస్రాక్షుడగుటను ఆశ్చర్యకరమైన వానిగా ఈరెంటిని నేను చూచాను.

తతః ప్రభృతి తత్తీర్థమహల్యాసంగమం శుభమ్ ।
ఇంద్రతీర్థమితి ఖ్యాతం సర్వకామప్రదం నృణామ్ ॥ 71 ॥

అప్పటి నుండి ఆ తీర్థం పవిత్రమైనదని, అహల్యా సంగమమని, ఇంద్రతీర్థమని, మానవులకు సమస్త కోరికలను తీర్చునదని ప్రసిద్ధి పొందినది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే అహల్యాసంగమేంద్రతీర్థవర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥ 16 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి అహల్యా సంగమం, ఇంద్రతీర్థవర్ణనమను పేరుగల పదహారవ అధ్యాయం సంపూర్ణం.

సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

జనస్థానతీర్థవర్ణనమ్ - జనస్థానతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తస్మాదప్యపరం తీర్థం జనస్థానమితి శ్రుతమ్ ।
చతుర్యోజనవిస్తీర్ణం స్మరణాన్ముక్తిదం నృణామ్ ॥ 1 ॥

దానికంటె మరొక తీర్థము జనస్థాన మనునది ప్రసిద్ధి చెందినది కలదు. అది నాలుగు యోజనముల విస్తీర్ణము కలిగి వున్నది. దానిని స్మరించినంతమాత్రముననే మానవులకు ముక్తినిచ్చు శక్తి గలది.

వైవస్వతాన్వయే జాతో రాజాఽభూజ్జనకః పురా ।
సోఽపాంపతేస్తు తనుజా ముపయేమే గుణార్ణవామ్ ॥ 2 ॥

ధర్మార్థ కామమోక్షాణాం జనకాం జనకో నృపః ।
అనురూపగుణత్వాచ్చ తస్య భార్యా గుణార్ణవా ॥ 3 ॥

పూర్వము వైవస్వతమనువు వంశంలో పుట్టిన జనకుడను రాజుండినాడు. అతడు సుగుణసముద్రురాలైన ధర్మార్థకామ మోక్షములనే నాలుగు పురుషార్థములకు నెలవైన వరుణుని కుమార్తెను వివాహమాడినాడు జనక మహారాజు. ఆయనకు తగిన గుణ రూపములు గలిగినందువలన అతని భార్య గుణసముద్రమువంటిది.

యాజ్ఞవల్క్యశ్చ విప్రేన్ద్రస్తస్య రాజ్ఞః పురోహితః ।
తమపృచ్ఛన్నృపశ్రేష్ఠో యాజ్ఞవల్క్యం పురోహితమ్ ॥ 4 ॥

ఆ రాజుకు యాజ్ఞవల్క్యుడను విప్రశ్రేష్ఠుడు పురోహితుడు. ఆ రాజశ్రేష్ఠుడు పురోహితుడైన యాజ్ఞవల్క్యునిలా అడిగాడు.

జనక ఉవాచ:- జనకుడు పలికాడు.

భుక్తి ముక్తీ ఉభే శ్రేష్ఠే నిర్ణీతే మునిసత్తమైః ।
దాసీ దాసేభతురగ రథాద్యైర్భుక్తిరుత్తమా ॥ 5 ॥

మునిశ్రేష్ఠులైనవారు భుక్తిని, ముక్తిని రెంటిని శ్రేష్ఠమైన వానినిగా నిర్ణయించారు. దాసదాసీజనము, ఏనుగులు, గుఱ్ఱములు, రథములు మున్నగు వానివలన భుక్తి ఉత్తమమైనది.

కిన్త్వన్తవిరసా భుక్తిః ముక్తిరేకా నిరత్యయా ।
భుక్తేర్ముక్తిః శ్రేష్ఠతమా భుక్త్వా ముక్తిం కథం వ్రజేత్ ॥ 6 ॥

కానీ, భుక్తి కడపట విరసమవుతుంది. ముక్తి మాత్రం శాశ్వతమైంది కూడా. శ్రేష్ఠతమము కూడా. అటువంటి భుక్తితో ముక్తి ఎలా లభిస్తుంది?

సర్వసంగపరిత్యాగాన్ముక్తిప్రాప్తిః సుదుఃఖతః ।
తద్ బ్రూహి ద్విజశార్దూల సుఖాన్ముక్తిః కథం వ్రజేత్ ॥ 7 ॥

ద్విజశ్రేష్ఠుడా! లోకమునందలి సంబంధములను వదలిపెడితేనే అతికష్టంమీద ముక్తి లభిస్తుంది. అటువంటిది సుఖంగా ముక్తి ఎలా లభిస్తుందో దానిని గూర్చి నాకు వివరించు.

యాజ్ఞవల్క్య ఉవాచ :– యాజ్ఞవల్క్యుడు పలికాడు.

అపాంపతి స్తవగురుః శ్వశురః ప్రియకృత్తథా ।
తం గత్వా పృచ్ఛ నృపతే ఉపదేక్ష్యతి తే హితమ్ ॥ 8 ॥

జలాధిదేవతయగు వరుణుడు నీకు గురువు. అట్లే ప్రియమును కలిగించే మామ. ఓ రాజా! నీవు వెళ్ళి అతనిని అడుగుము. అతడు నీకు హితమును ఉపదేశించగలడు.

యాజ్ఞవల్క్యశ్చ జనకో రాజానం వరుణం తదా ।
గత్వా చోచతురవ్యగ్రౌ ముక్తిమార్గం యథాక్రమమ్ ॥ 9 ॥

అప్పుడు యాజ్ఞవల్క్యుడు, జనకుడు వరుణుని వద్దకు వెళ్ళి వినయంగా ముక్తిమార్గాన్ని గూర్చి వివరించుమని కోరారు.

వరుణ ఉవాచ:– వరుణుడు పలికాడు.

ద్విధా తు సంస్థితా ముక్తిః కర్మద్వారేఽప్యకర్మణి ।
వేదే చ నిశ్చితో మార్గః కర్మజ్యాయోహ్యకర్మణః ॥ 10 ॥

కర్మద్వారాను మరియు కర్మచేయకుండాను రెండు విధములుగా ముక్తి లభిస్తుంది. వేదమునందు కూడా ఈ రెండు విధములుగా ముక్తి మార్గాన్ని నిశ్చయించారు. అకర్మ కంటె కర్మ శ్రేష్ఠం కదా!

సర్వం చ కర్మణా బద్ధం పురుషార్థచతుష్టయమ్ ।
అకర్మణైవాఽఽప్యయతే ముక్తిమార్గో మృషోచ్యతే ॥ 11 ॥

ధర్మార్థకామమోక్షములను నాలుగున్నూ కర్మచేతనే బద్ధమైనవి. ముక్తి మార్గము కర్మచేయకుండానే లభించునను మాట అసత్యమే.

కర్మణా సర్వధాన్యాని సేత్స్యన్తి నృపసత్తమ ।
తస్మాత్సర్వాత్మనా కర్మ కర్తవ్యం వైదికం నృభిః ॥ 12 ॥

ఓ రాజశ్రేష్ఠా! కర్మచేతనే సమస్తధాన్యములు పండించబడుతున్నవి. అందువలన మానవులందరు తప్పకుండా వైదికకర్మనాచరించాలి.

తేన భుక్తిం చ ముక్తిం చ ప్రాప్నువన్తీహ మానవాః ।
అకర్మణః కర్మ పుణ్యం కర్మ చాప్యాశ్రమేషు చ ॥ 13 ॥

వైదికకర్మలాచరించడం వలన మానవులు భుక్తిముక్తులను పొందుతారు. అకర్మ కంటె కర్మ పవిత్రమైనది. నాలుగు ఆశ్రమాల్లో కూడా కర్మ ఉన్నది కదా!

జాత్యాశ్రితం చ రాజేన్ద్ర తత్రాపి శృణు ధర్మవిత్ ।
ఆశ్రమాణి చ చత్వారి కర్మద్వారాణి మానద ॥ 14 ॥

ఓ రాజేంద్రా! అక్కడ కూడా జాత్యాశ్రితమైన కర్మను గూర్చి గూడా వినుము. నీవు ధర్మము తెలిసిన వానివికదా! ఓ గౌరవము నిచ్చేవాడా! నాలుగు ఆశ్రమములు కూడా కర్మద్వారములే సుమా!

చతుర్ణామాశ్రమాణాం చ గార్హస్థ్యం పుణ్యదం స్మృతమ్ ।
తస్మాద్భుక్తిశ్చ ముక్తిశ్చ భవతీతి మతిర్మమ ॥ 15 ॥

ఈ నాలుగు ఆశ్రమములలోను గృహస్థాశ్రమము పుణ్యముల నిచ్చేదని చెప్పారు. గృహస్థాశ్రమమువలన భుక్తి ముక్తి కలుగుతుందని నా అభిప్రాయం.

బ్రహ్మోవాచ:–బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా తు జనకో యాజ్ఞవల్క్యశ్చ బుద్ధిమాన్ ।
వరుణం పూజయిత్వా తు పునర్వచనమూచతుః ॥ 16 ॥

ఇట్లు పలికిన వరుణుని మాటలను విన్న బుద్ధిమంతుడైన జనకుడు యాజ్ఞవల్క్యుడున్ను వరుణుని పూజించి తిరిగి వరుణునితో ఇలా అన్నారు.

కో దేశః కిం చ తీర్థం స్యాద్భుక్తిముక్తిప్రదాయకమ్ ।
తద్వదస్వ సురశ్రేష్ఠ సర్వజ్ఞోఽసి నమోఽస్తు తే ॥ 17 ॥

భుక్తిని, ముక్తినీ కలిగించే ప్రదేశమేది? తీర్థమేది? ఓ దేవతా శ్రేష్ఠా! సర్వజ్ఞుడవైన నీవు వానిని గూర్చి వివరించు. నీకు నమస్కారం.

వరుణ ఉవాచ :– వరుణుడు పలికాడు.

పృథివ్యాం భారతం వర్షం దణ్డకం తత్ర పుణ్యదమ్ ।
తస్మిన్ క్షేత్రే కృతం కర్మ భుక్తిముక్తిప్రదం నృణామ్ ॥ 18 ॥

ఈ భూమిమీద భారతదేశము, దానిలో దండకారణ్యప్రాంతము, చాలా పవిత్రమైనవి. ఆ క్షేత్రంలో చూసే పుణ్యకర్మ నా మానవులకు భుక్తిని, ముక్తిని, ఇస్తుంది.

తీర్థానాం గౌతమీగంగా శ్రేష్ఠా ముక్తిప్రదా నృణామ్ ।
తత్ర యజ్ఞేన దానేన భోగాన్ముక్తి మవాప్స్యతి ॥ 19 ॥

తీర్థములలో గౌతమీనది శ్రేష్ఠమైనది. మానవులకు ముక్తిని కలిగించునది. అక్కడ యజ్ఞమును చేసినా, దానమును చేసినా భోగములను, ముక్తిని పొందుతారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యాజ్ఞవల్క్యశ్చ జనకో వాచం శ్రుత్వా హ్యపాంపతేః ।
వరుణేనహ్యనుమతౌ స్వపురీం జగ్మతుస్తదా ॥ 20 ॥

జలాధిదేవత అయిన వరుణుని మాటను విన్న యాజ్ఞవల్క్యుడు, జనకుడు ఆ వరుణుని వద్ద అనుమతి పొంది తమ నగరానికి వెళ్ళారు.

అశ్వమేధాదికం కర్మ చకార జనకో నృపః ।
యాజయామాస విప్రేన్ద్రో యాజ్ఞవల్క్యశ్చ తం నృపమ్ ॥ 21 ॥

యాజ్ఞవల్క్యఋషి రాజుతో యజ్ఞమును చేయించాడు. ఆ జనకమహారాజు అశ్వమేధాది యజ్ఞకర్మనాచరించాడు.

గంగాతీరం సమాశ్రిత్య యజ్ఞాన్ముక్తిమవాప రాట్ ।
తథా జనకరాజానో బహవస్తత్ర కర్మణా ॥ 22 ॥

ముక్తిం ప్రాపుర్మహాభాగా గౌతమ్యాశ్చ ప్రసాదతః ।
తతః ప్రభృతి తత్తీర్థం జనస్థానేతి విశ్రుతమ్ ॥ 23 ॥

ఆ రాజు గంగానది యొడ్డున యజ్ఞము చేసినందువలన ముక్తిని పొందెను. అట్లే మహాభాగులైన జనక వంశరాజులెందరో కర్మవలన ఆ గౌతమీ అనుగ్రహంతో ముక్తిని పొందారు. అప్పటినుండి ఆ తీర్థం జనస్థానమనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

జనకానాం యజ్ఞసదో జనస్థానం ప్రకీర్తితమ్ ।
చతుర్యోజనవిస్తీర్ణం స్మరణాత్సర్వపాపనుత్ ॥ 24 ॥

జనకుడు యజ్ఞము చేసిన ప్రదేశము నాలుగు యోజనముల వీస్తీర్ణము కలది. దానినే జనస్థానమంటారు. దానిని స్మరించినంత మాత్రముననే సమస్తపాపములు నశిస్తాయి.

తత్ర స్నానేన దానేన తు పిత్ళూణాం తర్పణేన తు ।
తీర్థస్య స్మరణాద్వాఽపి గమనాద్భక్తిసేవనాత్ ॥ 25 ॥

సర్వాన్కామానవాప్నోతి ముక్తిం చ సమవాప్నుయాత్ ॥ 26 ॥

ఆ జనస్థానంలో స్నానం చేసినా, దానం చేసినా, పితృదేవతలకు తర్పణం చేసినా, ఆ తీర్థాన్ని స్మరించినా, దాని దగ్గరకు వెళ్ళినా, భక్తితో సేవించినా, కోరికలన్నీ తీరుతాయి. ముక్తిని కూడా లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే జనస్థాన తీర్థవర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥17 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ తీర్థమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని జనస్థాన తీర్థ వర్ణనమను పేరుగల పదిహేడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాదశోఽధ్యాయః - పదునెనిమిదవ అధ్యాయం

చక్రతీర్థగణికాసంగమవర్ణనమ్ - చక్రతీర్థ గణికాసంగమ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాదు.

> **అస్తి బ్రహ్మన్మహాతీర్థం చక్రతీర్థమితి శ్రుతమ్ ।**
> **తత్ర స్నానాన్నరో భక్త్యా హరేర్లోకమవాప్నుయాత్ ॥ 1 ॥**

బ్రహ్మన్! చక్రతీర్థమను పేరుగల మరొక మహాతీర్థమున్నది. ఆ తీర్థమునందు భక్తితో స్నానమును చేసిన నరుడు విష్ణులోకాన్ని పొందుతాడు.

> **ఏకాదశ్యాం తు శుక్లాయాముపోష్య పృథివీపతే ।**
> **గణికాసంగమే స్నాత్వా ప్రాప్నుయాదక్షయం పదమ్ ॥ 2 ॥**

ఓ రాజా! శుక్లపక్షంలోని ఏకాదశియందు ఉపవాసముండి గణికాసంగమమునందు స్నానం చేస్తే అక్షయమైన స్థానాన్ని పొందుతాడు.

> **పురా తత్ర యథావృత్తం తన్మే నిగదితం శృణు ।**
> **ఆసీద్విశ్వవరా నామ వైశ్యో బహుధనాన్వితః ॥ 3 ॥**

పూర్వమక్కడ జరిగిన వృత్తాంతాన్ని చెబుతున్నాను విను. పూర్వమక్కడ విశ్వవరుడను పేరుగల మిక్కిలి ధనవంతడగు వైశ్యుదున్నాడు.

> **ఉత్తరే వయసి శ్రేష్ఠస్తస్య పుత్రోఽభవదృషే ।**
> **గుణవాన్రూపసంపన్నో విలాసీ శుభదర్శనః ॥ 4 ॥**

ఓ ఋషీ! అతనికి ముదిమివయస్సులో నొకపుత్రుడు కలిగాడు. అతడు చక్కని రూపము గుణసంపదలు గలిగిన విలాసి.

> **ప్రాణేభ్యోఽపి ప్రియః పుత్రః కాలే పంచత్వమాగతః ।**
> **తథా దృష్ట్వాతు తం పుత్రం దంపతీ దుఃఖపీడితౌ ॥ 5 ॥**

ప్రాణాల కన్న మిన్నగా ప్రియమైన పుత్రుడు కాలము దీరి మరణించాడు. అలా మరణించిన కుమారుని స్థితి చూచి ఆ దంపతులు మిక్కిలి దుఃఖించారు.

> **కుర్వతేఽస్మ తదా తేన సహైవ మరణే మతిమ్ ।**
> **హా పుత్ర హన్త కాలేన పాపేన సుదురాత్మనా ॥ 6 ॥**

అయ్యో కుమారా! పాపాత్ముడు, దుర్మార్గుడునైన ఆ యముడు నిన్ను తీసుకు వెళ్ళాడు కదా! అని ఆ కుమారునితో పాటు తామూ మరణించుటకు సిద్ధపడినారు.

యౌవనే వర్తమానోఽపి నీతోఽసి గుణసాగర ।
ఆవయోశ్చ తథైవ త్వం ప్రాణేభ్యోఽపి సుదుర్లభః ॥ 7 ॥

నీవు యౌవనంలో వున్నా ఆ యముడు నిన్ను తీసుకొని పోయాడు. మా యిద్దరి ప్రాణాలకంటె నీవు దుర్లభుడవు.

ఇత్థం తు రుదితం శ్రుత్వా దంపత్యోః కరుణం యమః ।
త్యక్త్వా నిజపురం తూర్ణం కృపయాఽఽవిష్టమానసః ॥ 8 ॥

గోదావర్యాః శుభే తీరే స్థితో ధ్యాయన్ జనార్దనమ్ ।
అపి స్వల్పేన కాలేన ప్రజా వృద్ధాః సమన్తతః ॥ 9 ॥

ఇలా కరుణ కలిగించే ఏడుపును విని యముడు కృపాతరంగుడై తన పట్టణాన్ని వదలి వెంటనే గోదావరీ తీరానికి వచ్చాడు. పవిత్రమైన ఆ గోదావరీ తీరము నందున్నవాడై అతడు జనార్దనునిగూర్చి తపమాచరించాడు. స్వల్పకాలంలోనే అక్కడి ప్రజలందరు వృద్ధిచెందారు.

ఇయత్య ఇతి మే పృథ్వీ కథ్యతాం కేన పూరితా ।
న కశ్చిన్మ్రియతే జన్తుర్భారాక్రాన్తా వసున్ధరా ॥ 10 ॥

ఇట్లున్న స్థితిలో ఏ ఒక్కరూ కూడా మరణించుట లేదు. ఈ భూమి భారముతో క్రుంగి పోయినది. ఇదెట్లు పూరింపబడునో దీనికి మార్గమేమిటని అనుకొన్నది.

తతో దేవీ గతా తూర్ణం వసుధా మునిసత్తమ ।
యత్రాస్తి సురసంయుక్తః శక్రః పరపురంజయః ॥ 11 ॥
దృష్ట్వా వసున్ధరామింద్రః ప్రణిపత్యేదమబ్రవీత్ ॥

ఓ మునిసత్తమా! అప్పుడా భూదేవి తొందరగా పరపురములను జయించి దేవతలనందరితో కూడియున్న ఇంద్రుడెచ్చటనుండునో ఆ స్వర్గమునకు వెళ్ళెను. అప్పుడా ఇంద్రుడు భూదేవికి నమస్కరించి ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ:– ఇంద్రుడు పలికాడు.

కిమాగమనకార్యం త ఇతి మే పృథ్వి కథ్యతామ్ ॥ 12 ॥

ఓ భూదేవీ! నీరాకకు గల కారణమేమో చెప్పు.

ధరోవాచ:– భూదేవి పలికింది.

భారేణ గురుణా శక్ర పీడితాఽహం వినా వధమ్ ।
కారణం ప్రష్టుమాయాతా కిమిదం కథ్యతాం మమ ॥ 13 ॥

ఓ ఇంద్రా! నేను పాపభారముతో క్రుంగిపోతున్నాను, ఒక్క మరణం కూడా లేదు. దీనికి కారణమేమిటో అడుగుటకై వచ్చాను. ఇలా ఎందుకు జరుగుతున్నదో చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా మహీవాక్య మింద్రో వచనమబ్రవీత్ ॥ 14 ॥

ఈ మాటలు విన్న ఇంద్రుడిలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

కారణం యది నామ స్యాత్తదానీం జ్ఞాయతే మయా ।
సురాణాం హి పతిర్యస్మాత్సర్వేషామచలే త్వహమ్ ॥ 15 ॥

ఓ భూమీ! ఆ కారణమేదైనా ఉంటే సురపతినైన నాకు తెలుస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అథ పృథ్వీ తదా వాక్యం శ్రుత్వా చాऽऽహ శచీపతిమ్ ।
యమ ఆదిశ్యతాం తర్హి యథా సంహరతే ప్రజాః ॥ 16 ॥

ఆ మాట విని భూదేవి ఇంద్రునితో ఇలా అన్నది. ప్రజలను సంహరించునట్లు ఆదేశించు.

ఇతి శ్రుత్వా వచో మహ్యా ఆదిష్టాః సిద్ధకిన్నరాః ।
యమస్యానయనే శీఘ్రం మహేన్ద్రేణ మహామునే ॥ 17 ॥

ఓ మహామునీ! ఇలా మాటను విన్న ఇంద్రుడు యముణ్ణి త్వరగా తీసుకొని రమ్మని సిద్ధ కిన్నరులను ఆదేశించాడు.

తతస్తే సత్వరం యాతాః సర్వే వైవస్వతం పురమ్ ।
నైవాపశ్యన్యమం తత్ర తే సిద్ధాః సహ కిన్నరైః ॥ 18 ॥
తథాऽऽగత్య పునర్వేగాద్వార్తా శక్రే నివేదితా ।

వాళ్ళు వైవస్వతనగరానికి వెళ్ళారు వారికక్కడ యముడు కనబడలేదు. వెంటనే వేగముగా వారు తిరిగి వచ్చి ఆ వార్తను ఇంద్రునికి నివేదించారు.

సిద్ధకిన్నరా ఊచుః :- సిద్ధులు కిన్నరులు పలికారు.

యమో యమపురే నాథ అస్మాభిర్నావలోకితః ।
మహతాऽపి సుయత్నేన వీక్ష్యమాణః సమన్తతః ॥ 19 ॥

ప్రభూ! మేమెంతప్రయత్నించి వెదికినా యమపురంలో యముడు మాకు కనిపించలేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా వచస్తేషాం పృష్టః శక్రేణ వై తదా ।
సవితా స పితా తస్య యమః కుత్రాऽऽస్త ఇత్యథ ॥ 20 ॥

వారి మాటలను విన్న ఇంద్రుడు అతని తండ్రి యైన సూర్యుని యముడెక్కడ అని యడిగాడు.

సూర్య ఉవాచ :– సూర్యుడు పలికాడు.

శక్ర గోదావరీతీరే కృతాన్తో వర్తతేఽధునా ।
చరంస్తత్ర తపస్తీవ్రం న జానే కిం ను కారణమ్ ॥ 21 ॥

ఇంద్రా! యముడిప్పుడు గోదావరీ నదీ తీరమున ఉన్నాడు. అతడక్కడ తీవ్రమైన తపస్సు చేస్తున్నాడు. దానికి గల కారణమేమో తెలియదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా వచో భానోః శక్రః శంకాముపావిశత్ ॥ 22 ॥

ఈ విధముగా పలికిన సూర్యుని మాటలు విని ఇంద్రుడు సందేహపడ్డాడు.

శక్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

అహో కష్టం మహాకష్టం నష్టా మే సురనాథతా ।
గోదావర్యాం తపః కుర్యాద్యమో వై దుష్టచేష్టితః ॥
జిఘృక్షుర్మత్పదం నూనం దేవా ఇతి మతిర్మమ ॥ 23 ॥

ఓ దేవతలారా! అయ్యో! ఇది మహా కష్టమైనది. నా దేవేంద్ర పదవి నష్టమైనది. యముడు దురాలోచనతోనే గోదావరివద్ద తపస్సు చేస్తున్నాడు. అతడు నా స్థానాన్ని పొందుటానికే ప్రయత్నిస్తున్నాడని నే ననుకుంటున్నాను.

ఇత్యుక్త్వా సహసేన్ద్రేణ ఆహూతశ్చాప్సరోగణః ॥ 24 ॥

ఈ విధంగా చెప్పి ఇంద్రుడు అప్సరసల బృందాన్ని త్వరగా రప్పించాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

కాస్తే యుష్మాసు కాలస్య స్థితస్య తపసి ద్విషః ।
తపః ప్రణాశనే శక్తా ఇతి మే శీఘ్రముచ్యతామ్ ॥ 25 ॥

నా శత్రువైన తపస్సును నాశనం చేయగలవారు మీలో ఎవరో వెంటనే చెప్పండి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇతి శక్రవచః శ్రుత్వా నోచే కాఽపి మహామునే ।
అథ శక్రః ప్రకోపేణ ప్రత్యువాచాప్సరోగణమ్ ॥ 26 ॥

ఓ మహామునీ! ఇలా పలికిన ఇంద్రునిమాటలు విని ఒక్కరు కూడా మాట్లాడ లేదు. అప్పుడు ఇంద్రుడు కోపంతో అప్సరోగణముతో ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

ఉత్తరం నాబ్రవీత్కించిద్యామస్తర్హి వయం స్వయమ్ ।
సజ్జా భవన్తు విబుధాః సైన్యైరాయాన్తు మా చిరమ్ ॥
ఘాతయామో వయం శత్రుం తపసా స్వర్గకాముకమ్ ॥ 27 ॥

మీరేమీ ప్రత్యుత్తరమీయడం లేదు. మనమే స్వయముగా వెళ్ళుదాం. దేవతలారా! యుద్ధానికి సిద్ధం కండి. త్వరగా సైన్యాలతో రండి. తపస్సుతో స్వర్గాన్ని కోరుతున్న శత్రువును మనం సంహరిద్దాం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్తే సతి దేవానాం సేనా ప్రాదుర్బభూవ హ ।
ఇతీన్ద్రహృదయం జ్ఞాత్వా హరిణా లోకధారిణా ॥ 28 ॥

ప్రేషితం చక్రిణా చక్రం రక్షణాయ యమస్య హి ।
చక్రం యత్రాభవత్తత్ర చక్రతీర్థమనుత్తమమ్ ॥ 29 ॥

ఇట్లనగానే దేవతల సైన్యము ప్రత్యక్షమయింది. అప్పుడు లోకరక్షకుడైన విష్ణువు ఇంద్రుని హృదయమును తెలుసుకొని, చక్రధారియైన ఆ స్వామి యముని రక్షించుటకై చక్రమును పంపించాడు. ఎక్కడికైతే చక్రము వచ్చినదో ఆ విశేషమైన స్థానం చక్ర తీర్థమయింది.

అథేన్ద్రం మేనకా ప్రాహ శంకితేతి వచస్తదా ॥ 30 ॥

అప్పుడు మేనక అనుమానపడి ఇంద్రునితో ఇలా అన్నది.

మేనకోవాచ :- మేనక పలికింది.

కాలావలోకనే నాలం కాచిదస్తి సురేశ్వర ।
మరణం చ వరం దేవ భవతో న యమాత్మనః ॥ 31 ॥

ఓ సురేశ్వరా! యముని చూడడానికి కూడా మేము సమర్థులం కాము. దేవా! ఆ యముని కంటె కూడా నీ చేతిలో మరణించుట శ్రేష్ఠము.

రూప యౌవన మత్తేయం గణికాయాచనం ప్రభో ।
ప్రేషణం తత్ప్రయచ్ఛైషా స్వామిత్వం మన్యతే త్వయా ॥ 32 ॥

రూపయౌవన మదంతో నున్న ఈ వేశ్యయొక్క అభ్యర్థనను మన్నించుము. ఓ ప్రభూ! స్వామివైన నీవు నన్ను పంపుటకు అనుమతించి అనుగ్రహించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్యాః శక్రః సురవరేశ్వరః ।
ఆదిదేశాబలాం క్షామాం సత్కృత్య గణికాం తథా ॥ 33 ॥

ఈ మాటలను విన్న సురశ్రేష్ఠుడైన దేవేంద్రుడు ఆ వేశ్యను తగినవిధంగా సత్కరించి ఆ అబలను పొమ్మని ఆజ్ఞాపించాడు.

శక్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

గణికే గచ్ఛ మే కార్యం కురు సున్దరి మా చిరమ్ ।
కృతకృత్యాఽఽగతా భూయో వల్లభా మే యథా శచీ ॥ 34 ॥

ఓ సుందరీ గణికా! త్వరగా వెళ్ళి నా కార్యం పూర్తిచేయి. నీవు కృతకృత్యురాలవై తిరిగి శచీదేవివలె నాకు ప్రియురాలవు కమ్ము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యాకర్ణ్య వచః శక్రాదుత్పత్య గణికా దిశః ।
క్షణేన యమసాన్నిధ్యమాయాతా చారురూపిణీ ॥ 35 ॥

ఇంద్రుని ఈ మాటలను విన్న ఆ సుందరి అయిన గణిక ఎగిరి క్షణంలో యముని దగ్గరకు చేరింది.

యమాన్తికమనుప్రాప్తా ద్యోతయన్తీ దిశో దశ ।
సలీలం లలితం బాలా జగౌ హిన్దోలకం కలమ్ ॥ 36 ॥

తన కాంతులను పది దిక్కులలో వెదజల్లుతూ విలాసంగా యముని దగ్గరకు వెళ్ళింది. వెళ్ళుతూ చక్కని హిందోల రాగమునాలపిస్తూ డోలికలో వెళ్ళింది.

తతశ్చచాల కాలస్య మనో లోలం చలాచలమ్ ।
అథోన్మీల్య యమో నేత్రే కామపావకపూరితే ॥ 37 ॥

తస్యాం వ్యాపారయామాస శ్రేయః శత్రౌ మహామునే ।
తతో విలీయ సా సద్యః సరిత్త్వమగమత్తదా ॥ 38 ॥

అప్పుడు ఆ యముని మనస్సు ఉద్విగ్నతతో చంచల మయింది. కామాగ్నితో దహించబడినట్లుగా నిండిన అతని నేత్రములు విప్పారి, ఓ మహామునీ! శత్రువైన ఆమె యందు శ్రేయఃపూర్వకంగా ప్రవర్తించాడు. అప్పుడామె వెంటనే ఆతనిని కలసినదిగా మారిపోయింది.

గౌతమ్యాం తు సమాగమ్య గణికా గణకింకరైః ।
గీయమానా గతా స్వర్గే తతస్తీర్థప్రభావతః ॥ 39 ॥

గౌతమీనదితో సమాగమం పొంది తన స్నేహితురాళ్ళయిన గణికాగణ కింకరులు స్తోత్రం చేస్తుండగా ఆ తీర్థ ప్రభావంతో స్వర్గానికి వెళ్ళింది.

గచ్ఛన్తీం గణికాం దృష్ట్వా విమానస్థాం దివం ప్రతి ।
విస్మయం పరమం ప్రాప్తః కాలస్తరలలోచనః ॥ 40 ॥

అథాఽఽదిత్యేన చాఽఽగత్య ఏవముక్తో యమస్తదా ॥

విమానంలో స్వర్గానికి వెళ్ళుతున్న వేశ్యనుచూచి యముడు చంచలనేత్రుడై మిక్కిలి ఆశ్చర్యం చెందాడు. అప్పుడు సూర్యుడు యముని వద్దకు వచ్చి ఇలా అన్నాడు.

సూర్య ఉవాచ :- సూర్యుడు పలికాడు.

కురు పుత్ర నిజం కర్మ ప్రజానాం త్వం పరిక్షయమ్ ।
పశ్య వాతం సదా వాన్తం సృజన్తం వేధసం ప్రజాః ॥ 41 ॥
పర్యటన్తం త్రిలోకీం మాం వహన్తీం వసుధాం ప్రజాః ॥

నాయనా! నీవు ప్రజలను నశింపజేసే నీపనిని సక్రమంగా నిర్వర్తించు. ఎల్లప్పుడు వీచే గాలిని, ప్రజలను సృష్టించే బ్రహ్మను, ముల్లోకాలను పర్యటిస్తున్న నన్ను, ప్రజలను మోస్తున్న భూదేవిని చూడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మపలికాడు.

ఇతి శ్రుత్వా యమో వాక్యం పితుర్వచనమబ్రవీత్ ॥ 42 ॥

తండ్రిమాటను విన్న యముడిలా అన్నాడు.

యమ ఉవాచ :- యము డిట్లన్నాడు.

ఏతన్న గర్హితం కర్మ కుర్యామహమిదం ధ్రువమ్ ।
కర్మణ్యస్మిన్మహాక్రూరే సమాదేష్టుం న చాఽర్హసి ॥ 43 ॥

నింద్యమైన ఈ పనిని నేను చేయను. ఇది నిశ్చయం. ఇటువంటి ఘోరమైన పనిని చేయమని ఆదేశించటం మీకు తగదు.

ఇతి శ్రుత్వా చ తద్వాక్యం భానుర్వచనమబ్రవీత్ ।
కిం నామ గర్హితం కర్మ తవ కర్తుమలం యమ ॥ 44 ॥

ఇట్లు పలికిన యముని మాటను విని సూర్యుడిట్లనెను. ఓ కుమారా! యమా! నింద్యమైన పనిని చేయమని నిన్ను ఎప్పుడైనా ఆదేశిస్తానా?

కిం న దృష్టా త్వయా యాన్తీ గణికా గణకింకరైః ।
గీయమానా దివం సద్యో గౌతమీతోయమాప్లుతా ॥ 45 ॥

గణకింకరులు గానము చేయుచుండగా గౌతమీతీర్థమున స్నానము చేసిన వెంటనే స్వర్గమునకు వెళ్ళుచున్న ఆ వేశ్యను నీవు చూడలేదా?

త్వయా చాత్ర తపస్తీవ్రం కృతం పుత్ర సుదుష్కరమ్ ।
నైవాన్తం తస్య పశ్యామి తస్మాద్గచ్ఛ నిజం పురమ్ ॥ 46 ॥

నాయనా! నీవిక్కడ కఠినమైన తపస్సును తీవ్రముగా చేయుచున్నావు. అది ఎప్పుడు పూర్తి యగునో తెలియుట లేదు. అందువలన నీవు నీ యమపురికి వెళ్ళుము.

ఇత్యుక్త్వా భగవాన్భానుస్తత్ర స్నాత్వా గతో దివమ్ ।
యమోఽపి సంగమే స్నాత్వా తతో నిజపురం యయౌ ॥ 47 ॥

ఇట్లు చెప్పి పూజ్యుడైన సూర్యభగవానుడు ఆ తీర్థము నందు స్నానము చేసి స్వర్గమునకు వెళ్ళాడు. యముడు కూడా ఆ సంగమ తీర్థమునందు స్నానము చేసి తన నగరమునకు వెళ్ళాడు.

భూతహాఽపి తతః శంకాం తత్యాజ చ మహామునే ।
తథా దృష్ట్వా యమం యాన్తం చక్రే చక్రం ప్రయాణకమ్ ॥ 48 ॥

ఓ మహర్షీ! భూతహరుడు అప్పుడు శంకలేని వాడాయెను. చక్రకూడా యముడట్లువెళ్ళుటను చూచి తాను కూడా తిరుగు ప్రయాణమయ్యెను.

భగవాన్యత్ర గోవిన్దో వనమాలావిభూషితః ।
ఇతి యః శృణుయాన్మర్త్యః పఠేద్వాఽపి సమాహితః ॥
ఆపదస్తస్య నశ్యన్తి దీర్ఘమాయురవాప్నుయాత్ ॥ 49 ॥

వనమాలా విభూషితుడైన, భగవంతుడైన గోవిందుని దగ్గరకు ఆ చక్రము చేరెను. ఇట్టి చక్ర తీర్థగణికాసంగమతీర్థమాహాత్మ్యమును శ్రద్ధతో నెవరు విన్ననూ, చదివిననూ వారికి సకల ఆపదలు తొలగి దీర్ఘాయువును పొందుదురు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాంతర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే చక్రతీర్థగణికాసంగమవర్ణనం నామాష్టాదశోఽధ్యాయః॥ 18 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మమునందలి తీర్థమాహాత్మ్యములో చక్రతీర్థగణికాసంగమ వర్ణనమనే పేరుగల పద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

అరుణావరుణాసంగమాశ్వభానుతీర్థవర్ణనమ్ - అరుణావరుణాసంగమాశ్వభాను తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అరుణా వరుణా చైవ నద్యౌ పుణ్యతరే శుభే ।
తయోశ్చ సంగమః పుణ్యో గంగాయాం మునిసత్తమ ॥ 1 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! అరుణ, వరుణ అనే పేర్లు గల నదులు శుభకరములు, పవిత్రములైనవి, అవి గంగ యందు సంగమించు ప్రదేశము మిక్కిలి పుణ్యప్రదమైనది.

మానసాచ్చ ప్రయాగాచ్చ మందాకిన్యాశ్చ పుణ్యదే ।
తదుత్పత్తిం శృణుష్వేహ సర్వపాపవినాశినీమ్ ॥
కశ్యపస్య సుతో జ్యేష్ఠ ఆదిత్యో లోకవిశ్రుతః ॥ 2 ॥

ఆ నదులు మానసకంటే, ప్రయాగ కంటే, మందాకినికంటే కూడా పుణ్యమైనవి. సర్వపాపహరములగు వాని ఉత్పత్తిని గూర్చి చెబుతున్నాను విను. కశ్యపుని పెద్ద కుమారుడు సూర్యుడని లోకప్రసిద్ధం.

త్రైలోక్యచక్షుస్తీక్ష్ణాంశుః సప్తాశ్వో లోకపూజితః ।
తస్య పత్నీ ఉషా ఖ్యాతా త్వాష్ట్రీ త్రైలోక్యసున్దరీ ॥ 3 ॥

అతడు ముల్లోకములకు నేత్రము. తీక్ష్ణమైన కిరణములుగలవాడు, ఏడు గుఱ్ఱముల రథము గలవాడు, లోకపూజితుడు. అతని భార్య ఉష. ఆమె త్వష్టయొక్క కూతురు. ముల్లోకాలలో అందగత్తెయని పేరొందింది.

భర్తుః ప్రతాపతీవ్రత్వమసహన్తీ సుమధ్యమా ।
చిన్తయామాస కిం కృత్యం మమ స్యాదితి భామినీ ॥ 4 ॥

ఆ సుందరాంగి తన భర్తయొక్క ప్రతాపతీవ్రత నోర్చుకోలేక నేనేమి చేయవలెనని చింతించింది.

తస్యాః పుత్రో మహాప్రాజ్ఞో మనుర్వైవస్వతో యమః ।
యమునా చ నదీ పుణ్యా శృణు విస్మయకారణమ్ ॥ 5 ॥

ఆమె కుమారుడు చాలా తెలివి గలవాడు. అతడు సూర్యునివలన కలిగినవాడు. అతని పేరు యముడు. యమున అను నది చాలా పవిత్రమైననది. ఇక్కడ ఆశ్చర్యమునకు కారణమేమో అది విను.

సాఽకరోదాత్మనశ్ఛాయామాత్మరూపేణ యత్నతః ।
తామబ్రవీత్తతశ్చైషా త్వం చ మత్సదృశీ భవ ॥ 6 ॥

ఉష అప్పుడు మిక్కిలి ప్రయత్నంతో తనలాగే ఉండే రూపమగు ఛాయను చేసి నీవు నాలాగే ఉండుమని చెప్పింది.

భర్తారం త్వమపత్యాని పాలయస్వ మమాఽఽజ్ఞయా ।
యావదాగమనం మే స్యాత్పత్యుస్తావత్ప్రియా భవ ॥ 7 ॥

నా ఆజ్ఞగా భర్తను, పిల్లలను జాగ్రత్తగా చూసుకో. నా భర్త దగ్గరకు తిరిగి నేను వచ్చే వరకు నీవతనికి ప్రియురాలిగా నుండు.

నాఽఽఖ్యాతవ్యం త్వయా క్వాఽపి అపత్యానాం తథా ప్రియే ।
తథేత్యాహ చ సా ఛాయా నిర్జగామ గృహాదుషా ॥ 8 ॥

ఈసంగతిని పిల్లలకుకాని, ఇతరులకుకాని ఎవ్వరికీ చెప్పకూడదనగా ఆ ఛాయ సరేయన్నది. ఉష ఇంటినుండి వెళ్ళింది.

ఇత్యుక్త్వా సా జగామాఽఽశు శాన్తం రూపమభీప్సతీ ।
సా గత్వోషా గృహం త్వష్టుః పిత్రే సర్వం న్యవేదయత్ ॥
త్వష్టాఽపి చకితో ప్రాహ తాం సుతాం సుతవత్సలః ॥ 9 ॥

ఇలా చెప్పిన ఉష తనకు శాంతరూపమును కోరుకుంటూ తనతండ్రియైన త్వష్ట ఇంటికి త్వరత్వరగా వెళ్ళి సంగతంతా తన తండ్రికి నివేదించింది. పిల్లలయందు ప్రేమగలిగిన ఆ త్వష్ట ఆమె చెప్పినది విని ఆశ్చర్యపడుతూ కూతురైన ఉషతో ఇలా అన్నాడు.

త్వష్టోవాచ :– త్వష్ట పలికాడు.

నైతద్యుక్తం భర్తృమత్యా యత్స్వైరేణ ప్రవర్తనమ్ ।
అపత్యానాం కథం వృత్తిర్భర్తుర్వా సవితుస్తవ ॥
బిభేమి భద్రే శిష్టోఽహం భర్తుర్గేహం పునర్వ్రజ ॥ 10 ॥

అమ్మా! పతివ్రతాస్త్రీకి ఈవిధంగా స్వేచ్ఛాప్రవృత్తి తగినది కాదు. ఇలా ప్రవర్తిస్తే నీ భర్త సూర్యునియొక్క, నీ సంతానంయొక్క పరిస్థితి యేమి? నాకు చాలా భయంగా ఉంది తల్లీ! నీవు నీ భర్తయింటికి తిరిగి వెళ్లు! నేను ఆచారవంతుడను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్తా తు పిత్రా సా నేత్యుక్త్వా వై పునః పునః ।
ఉత్తరం చ కురోర్దేశం జగామ తపసే తదా ॥ 11 ॥

మాటి మాటికి ఇలా తండ్రి చెప్పినప్పటికీ ఆమె అంగీకరించక అప్పుడు ఉత్తర కురుదేశంలో తపస్సు చేయడానికి వెళ్ళింది.

తత్ర తేపే తపస్తీవ్రం వడవారూపధారిణీ ।
దుష్ప్రేక్ష్యం తం స్వకం కాన్తం ధ్యాయన్తీ నిశ్చలా ఉషా ॥ 12 ॥

అక్కడ చూడశక్యంగాని తనభర్తను ధ్యానిస్తూ, నిశ్చలయై ఆడుగుఱ్ఱము రూపమును ధరించి ఆ ఉష తీవ్రమైన తపస్సు చేసింది.

ఏతస్మిన్నన్తరే తాత ఛాయా చోషాస్వరూపిణీ ।
పత్యౌ సా వర్తయామాస అపత్యాన్యథ జజ్ఞిరే ॥ 13 ॥

నాయనా! ఇంతలో ఉషారూపంలోనున్న ఛాయ భర్తతో ననురాగంతో సంగమించగా నామెకు సంతాన ప్రాప్తి జరిగింది.

సావర్ణిశ్చ శనిశ్చైవ విష్టిర్యా దుష్టకన్యకా ।
సా ఛాయా వర్తయామాస వైషమ్యేణైవ నిత్యశః ॥ 14 ॥

సావర్ణి (యముడు) శని యను కుమారులు, విష్టియను దుర్మార్గురాలైన కుమార్తె గలిగారు. అయినా ఆ ఛాయ నిత్యమూ వ్యతిరేకంగానే ప్రవర్తిస్తుండేది.

స్వేష్వపత్యేషు చోషాయా యమస్తత్ర చుకోప హ ।
వైషమ్యేణ వర్తన్తీం ఛాయాం తాం మాతరం తదా ॥ 15 ॥

ఇలా తన సంతానంలో కూడా వ్యతిరేకభావంతో ప్రవర్తిస్తున్న ఆ ఛాయామాతపై యముడు కోపగించాడు.

తాడయామాస పాదేన దక్షిణాశాపతిర్యమః ।
పుత్ర దౌర్జన్యసంక్షోభాచ్ఛాయా వైవస్వతం యమమ్ ॥ 16 ॥

శశాప పాప తే పాదో విశీర్యతు మమాఽఽజ్ఞయా ।
విశీర్ణచరణో దుఃఖాద్రుదన్పితరమభ్యగాత్ ॥
సవిత్రే తం తు వృత్తాన్తం న్యవేదయదశేషతః ॥ 17 ॥

అంతే కాక ఆ దక్షిణాధిపతియైన యముడా ఛాయను కాలితో తన్నాడు. కుమారుడు చేసిన దౌర్జన్యం వలన ఏర్పడిన సంక్షోభంవలన సూర్యపుత్రుడైన యముని, ఓరి పాపాత్ముడా! నీ కాలు పడిపోను అని ఆజ్ఞా పూర్వకంగా శపించింది. ఆ శాపంతో కాలు పడిపోయి దుఃఖిస్తూ తన తండ్రి దగ్గరకు వెళ్ళాడు. సూర్యునకు జరిగిన వృత్తాంతాన్ని పూర్తిగా వివరించాడు.

యమ ఉవాచ :- యముడు పలికాడు.

నేయం మాతా సురశ్రేష్ఠ యయా శప్తోఽహమీదృశః ।
అపత్యేషు విరుద్ధేషు జననీ నైవ కుప్యతి ॥ 18 ॥

ఓ దేవతాశ్రేష్ఠుడా! ఈమె తల్లిగాదు. ఈమె శాపంవలన నేనిట్లయినాను. తల్లి అనుచితమైన ప్రవృత్తిగల పిల్లలనైనా కోపించదు.

యద్బాల్యాదబ్రవం కించిదథవా దుష్కృతం కృతమ్ ।
నైవ కుప్యతి సా మాతా తస్మాన్నేయం మమామ్బికా ॥ 19 ॥

నేను చిన్నప్పటినుండి కూడా ఏ చిన్నమాటైనా అనలేదు. ఏ చిన్న చెడ్డపనైనా చేయలేదు. అయినా కోపగించకుండా ఉంటేనే ఆమెను తల్లి యంటారు. అందువలన ఈమె నా తల్లిగాదు.

యదపత్యకృతం కించిత్సాధ్వసాధు యథా తథా ।
మాత్యస్యాం సర్వమప్యేతత్తస్మాన్మాతేతి మీయతే ॥ 20 ॥

తన సంతానం చేసిన తప్పొప్పులను ఉన్నదున్నట్లుగా లెక్కించుకొని కూడా వాటిని క్షమించే స్వభావమున్నదే తల్లి "మాతి అస్యాం సర్వమపి ఏతత్" అని మాతృశబ్దానికి వ్యుత్పత్తి. అందువల్లనే మాత అని యంటారు.

ప్రధక్ష్యన్తీవ మాం తాత నిత్యం పశ్యతి చక్షుషా ।
వక్ష్యగ్నికాలసదృశా వాచా నేయం మదమ్బికా ॥ 21 ॥

తండ్రీ! దహించుచున్నట్లుగా ఆమె నన్నెప్పుడూ చూస్తుంది. ఇక తీక్ష్ణమైన జ్వాలాసదృశమైన మాటలతో బాధిస్తుంది. ఈమె నా తల్లి గాదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తత్పుత్రవచనం శ్రుత్వా సవితాఽచిన్తయత్తతః ।
ఇయం ఛాయా నాస్య మాతా ఉషా మాతా తు సాఽన్యతః ॥ 22 ॥

తన కుమారుని మాటలు విన్న సూర్యుడాలోచించాడు. ఈ ఛాయ ఇతని తల్లి గాదు. ఇతని తల్లి ఉష మరొక చోట ఉన్నది.

మమ శాన్తిమభీప్సన్తీ దేశేఽన్యస్మింస్తపోరతా ।
ఉత్తరే చ కురౌ త్వాష్ట్రీ వడవారూపధారిణీ ॥ 23 ॥

త్వష్ట కూతురైన ఆమె ఉత్తర కురుదేశంలో ఆడుగుఱ్ఱంరూపంధరించి నాకు శాంతి కలగాలని తపోనిష్ఠలో నున్నది.

తత్రాఽఽస్తే సా ఇతి జ్ఞాత్వా జగామేశో దివాకరః ।
యత్ర సా వర్తతే కాన్తా అశ్వరూపః స్వయం తదా ॥ 24 ॥

ఆమె అక్కడ ఉన్నట్లుగా తెలుసుకొన్న సూర్యుడు తానుకూడా స్వయంగా అశ్వరూపం ధరించినవాడై ఆ ఉష ఉన్న చోటుకు వెళ్ళాడు.

తాం దృష్ట్వా వడవారూపాం పర్యధావద్ధయాకృతిః ।
కామాతురం హయం దృష్ట్వా శ్రుత్వా వై హ్రేషితస్వనమ్ ॥ 25 ॥

ఉషా పతివ్రతోపేతా పతిధ్యానపరాయణా ।
హయఘర్షణసంభీతా కో న్వయం చేత్యజానతీ ॥ 26 ॥

అపలాయత్పతౌ ప్రాప్తే దక్షిణాభిముఖీ త్వరా ।
కో ను మే రక్షకోఽత్ర స్యాదృషయో వాఽథవా సురాః ॥ 27 ॥

అశ్వరూపంలో ఉన్న ఆమెను చూసి అశ్వాకృతిలో వెళ్ళగా, కామాతురతతో కూడిన సకిలింపుస్వరంతో నున్న ఆ గుఱ్ఱమును చూసి, పాతివ్రత్యంతోగూడి, పతిధ్యానపరాయణురాలైన ఉష గుఱ్ఱంసకిలింపుకు భయపడి ఇతనెవరో తెలియక, నన్నిప్పుడిక్కడ ఎవరు రక్షిస్తారు? ఋషులా, దేవతలా అని అనుకుంటూ త్వరత్వరగా దక్షిణాభిముఖంగా భర్తను పొందుటకు పరుగెత్తింది.

ధావన్తీం తాం ప్రియామశ్వామశ్వరూపధరః స్వయమ్ ।
పర్యధావద్యతో యాతి ఉషా భానుస్తతస్తతః ॥ 28 ॥

అలా పరుగెత్తుతున్న అశ్వరూపంలోనున్న ప్రియురాలివెంట అశ్వరూపంలో ఉన్న సూర్యుడు ఆమె ఎక్కడకు వెళ్తే అక్కడికి వెళ్తూ ఆ ఉషను వెంబడించాడు.

స్మరగ్రహవశో జాతః కో దుశ్చేష్టం న చేష్టతే ।
భాగీరథీ నదీశ్చాన్యా వనాన్యుపవనాని చ ॥ 29 ॥

నర్మదా చాథ విన్ధ్యం చ దక్షిణాభిముఖావుభౌ ।
అతిక్రమ్య భయోద్విగ్నా త్వాష్ట్రీ చాగాచ్చ గౌతమీమ్ ॥ 30 ॥

మన్మథతాపానికి లోనై నీతడు ఏదైనా దుశ్చేష్ట చేయడు కదా! అని అనుకొంటూ భాగీరథీ నదిని, ఇతరనదులను, వనములను, ఉపవనములను, నర్మదానదిని, విన్ధ్యపర్వతాన్ని దాటి దక్షిణ దిక్కుగా నిద్దరూ బయలుదేరారు. భయంతో ఉద్విగ్నురాలైన ఉష గౌతమీ దగ్గరకు వెళ్ళింది.

త్రాతారః సన్తి మునయో జనస్థాన ఇతి శ్రుతమ్ ।
ఋషీణామాశ్రమం సాఽశ్వా ప్రవిష్టా గౌతమీం తథా ॥ 31 ॥

రక్షించేవారు మునులున్నారు. ఋషులుండే ఆశ్రమము జనస్థానమంటారు కదా! అని ఆ అశ్వరూపంలో నున్న ఉష గౌతమిని ప్రవేశించింది.

అనుప్రాప్తస్తథా చాశ్వో భానుస్తద్రూపవాంస్తతః ।
అశ్వం నివారయామాసుర్జనస్థాననివాసినః ॥
తతః కోపాద్వటూన్పంచ శశాపోషాపతిః ప్రభుః ॥ 32 ॥

అశ్వరూపుడైన సూర్యుడు కూడా వెను వెంటనే ప్రవేశించాడు. అప్పుడు జనస్థానమునందుండేవారు ఆ అశ్వమునడ్డగించారు. అప్పుడు ఉషాపతియైన సూర్యుడు కోపంతో వటువులైదుగురిని శపించాడు.

భానురువాచ :- సూర్యుడు పలికాడు.

నివారయథ మాం యస్మాద్వటా యూయం భవిష్యథ ॥ 33 ॥

నన్నడ్డగించారు కనుక మీరు మఱ్ఱి వృక్షములు కందు అని. (సూర్యుడు వారిని శపించాడు.)

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

జ్ఞానదృష్ట్యా తు మునయో మేనిరేऽశ్వముషాపతిమ్ ।
స్తువన్తో దేవదేవేశం భానుం తం మునయో ముదా ॥ 34 ॥

ఋషులంతా తమ జ్ఞానదృష్టితో ఆ అశ్వరూపంలో నున్నది ఉషాపతియైన సూర్యుడని తెలుసుకొన్నారు. అప్పుడా మునులందరెంతో సంతోషంతో దేవదేవుడైన సూర్యుని స్తుతించారు.

స్తూయమానో మునిగణైరశ్వాం భానురథాగమత్ ।
వడవాయా ముఖే లగ్నం ముఖం చాశ్వస్వరూపిణమ్ ॥ 35 ॥

ఇలా ఋషులు స్తోత్రం చేస్తుండగా సూర్యుడు అశ్వరూపంలోనున్న ఉషవద్దకు వెళ్ళాడు. అశ్వరూపంలోనున్న సూర్యుని ముఖము అశ్వరూపంలోనున్న ఉషముఖమునందు లగ్నమయింది.

జ్ఞాత్వా త్వాష్ట్రీ చ భర్తారం ముఖాద్వీర్యం ప్రసుస్రువే ।
తయోర్వీర్యేణ గంగాయామశ్వినౌ సమజాయతామ్ ॥ 36 ॥

త్వష్ట కూతురైన ఉష భర్తను గుర్తించి తన ముఖంనుండి వీర్యమును స్రవించింది. వారి వీర్యంతో గంగలో అశ్వినీ దేవతలు పుట్టారు.

తత్రాऽऽగచ్ఛన్సురగణాః సిద్ధాశ్చ మునయస్తథా ।
నద్యో గావస్తథౌషధ్యో దేవా జ్యోతిర్గణాస్తథా ॥ 37 ॥

అప్పుడక్కడకు సురగణములు, సిద్ధులు, మునులు, నదములు,నదులు, గోవులు అట్లే ఓషధులు, దేవతలు జ్యోతిర్గణములు వచ్చారు.

సప్తాశ్వస్య రథః పుణ్యో హ్యరుణో భానుసారథిః ।
యమో మనుశ్చ వరుణః శనిర్వైవస్వతస్తథా ॥ 38 ॥

యమునా చ నదీ పుణ్యా తాపీ చైవ మహానదీ ।
తత్తద్రూపం సమాస్థాయ నద్యస్తా విస్మయాన్మునే ॥ 39 ॥

ఓ మునీ! ఏడు గుఱ్ఱములు గల సూర్యుని రథము, అరుణుడు సూర్యరథసారథి, యముడు, మనువు, వరుణుడు, శని, వైవస్వతమనువు. పవిత్రమైన యమునానది, మహానది తాపి, ఆయా నదులు తమ తమ రూపములను పొంది ఆశ్చర్యంగా నిలచాయి.

ద్రష్టుం తే విస్మయావిష్టా ఆజగ్ముః శ్వశురస్తథా ।
అభిప్రాయం విదిత్వా తు శ్వశురం భానురబ్రవీత్ ॥ 40 ॥

అట్లాశ్చర్యం కలుగునట్లుగా వారంతా చూచుటకురాగా త్వష్ట అయిన మామగారు కూడా ఆశ్చర్యమునకు లోనయ్యారు. వారి యభిప్రాయమును గ్రహించిన సూర్యుడు తన మామగారితో నిట్లన్నాడు.

భానురువాచ :– సూర్యుడు పలికాడు.

ఉషాయాః ప్రీతయే త్వష్టః కుర్వత్యాస్తప ఉత్తమమ్ ।
యన్త్రారూఢం చ మాం కృత్వా ఛిన్ధి తేజాంస్యనేకశః ॥ 41 ॥

ఓ త్వష్టా! ఉత్తమమైన తపస్సు చేస్తున్న ఉష ప్రీతికొరకు నన్ను యంత్రంమీద ఉంచి నా కిరణములనేక విధములగునట్లుగా ఛేదించు. ఓ ప్రజాపతీ! ఈఉషకు సుఖము కలిగేంతవరకూ నీవట్లే ఛేదించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా తతస్త్వష్టా సోమనాథస్య సన్నిధౌ ।
తేజసాం ఛేదనం చక్రే ప్రభాసం తు తతో విదుః ॥ 42 ॥

ఆ తరువాత త్వష్ట సరే అలాగే అని సోమనాథుని సన్నిధిలో తేజస్సులను ఛేదించిన ఆ ప్రదేశమునే ప్రభాస తీర్థమంటారు.

భర్త్రా చ సంగతా యత్ర గౌతమ్యామశ్వరూపిణీ ।
అశ్వినోర్యత్ర చోత్పత్తిరశ్వతీర్థం తదుచ్యతే ॥ 43 ॥

ఉష అశ్వరూపంలో నుండి గౌతమీనది ప్రాంతంలో భర్తతో సంగమించిన ప్రదేశమును, అశ్వినుల యొక్క ఉత్పత్తి జరిగిన ఆ ప్రదేశమును అశ్వతీర్థమంటారు.

భానుతీర్థం తదాఖ్యాతం తథా పంచవటాశ్రమః ।
తాపీ చ యమునా చైవ పితరం ద్రష్టుమాగతే ॥ 44 ॥

తాపీ, యమునలు తండ్రిని చూచుటకు వచ్చిన ప్రదేశమును భానుతీర్థమని, పంచవటాశ్రమమని యంటారు.

అరుణావరుణానద్యోర్గంగాయాం సంగమః శుభః ।
దేవానాం తత్ర తీర్థానామాగతానాం పృథక్ పృథక్ ॥ 45 ॥

గంగానదిలో అరుణ, వరుణనదులు సంగమించిన ప్రదేశం, అక్కడికి దేవతలు మాటిమాటికి వచ్చిన ఆ ప్రదేశం చాలా శుభకరము.

నవ త్రీణి సహస్రాణి తీర్థాని గుణవన్తి చ ।
తత్ర స్నానం చ దానం చ సర్వమక్షయపుణ్యదమ్ ॥ 46 ॥

పన్నెండువేల తీర్థములు చాలా పవిత్రములైనవి. అక్కడ స్నానం చేసినా, దానం చేసినా అక్షయమైన ఫలం లభిస్తుంది.

స్మరణాత్పఠనాద్వాఽపి శ్రవణాదపి నారద ।
సర్వపాపవినిర్ముక్తో ధర్మవాన్ స సుఖీ భవేత్ ॥ 47 ॥

ఓ నారదా! ఆ తీర్థములను గూర్చి స్మరించినా, చదివినా, పఠించినా ధర్మవంతుడై, సమస్తపాపముల నుండి విముక్తుడై సుఖమును పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'అరుణావరుణా సంగమాశ్వభానుతీర్థ వర్ణనం' నామైకోనవింశోఽధ్యాయః ॥ 19 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యములో 'అరుణా వరుణాసంగమ అశ్వ భానుతీర్థవర్ణన' మనే పేరుగల పందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

ద్వావింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

గరుడతీర్థవర్ణనమ్ - గరుడతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

గారుడం నామ యత్తీర్థం సర్వవిఘ్నప్రశాన్తిదమ్ ।
తస్య ప్రభావం వక్ష్యామి శృణు నారద యత్నతః ॥ 1 ॥

ఓ నారదా! సమస్తవిఘ్నములను శాంతింపజేసే తీర్థం గరుడమనే తీర్థము. ఆ గరుడతీర్థంయొక్క ప్రభావమును చెబుతున్నాను, శ్రద్ధగా విను.

మణినాగ ఇతి త్వాసీచ్ఛేషపుత్రో మహాబలః ।
గరుడస్య భయాత్ భక్త్యా తోషయామాస శంకరమ్ ॥ 2 ॥

ఆదిశేషుని కుమారుడు మణినాగుడనే మహాబలుడు ఉండేవాడు. అతడు గరుడునివల్ల భయంతో శంకరుని గూర్చి భక్తితో తపస్సుచేసి సంతోషపెట్టాడు.

తతః ప్రసన్నో భగవాన్ పరమేష్ఠీ మహేశ్వరః ।
తమువాచ మహానాగం వరం వరయ పన్నగ ॥ 3 ॥

అప్పుడు పూజ్యుడైన మహేశ్వరుడు ప్రసన్నుడై మణినాగా! నీకేమి కావలయునో అడుగుమన్నాడు.

నాగః ప్రాహ ప్రభో మహ్యం దేహి మే గరుడాభయమ్ ।
తథేత్యాహ చ తం శంభుర్గరుడాదభయం తవ ॥ 4 ॥

అపుడు నాగుడు నాకు గరుడునివల్ల భయంలేకుండా వరం ప్రసాదించు ప్రభూ! అన్నాడు. అప్పుడు శంకరుడు అలాగే నీకు గురుడునివలన భయం కలుగకుండుగాక! అని వరమిచ్చాడు.

నిర్గతో నిర్భయో నాగో గరుడాదరుణానుజాత్ ।
క్షీరోదశాయీ యత్రాఽఽస్తే క్షీరార్ణవసమీపతః ॥ 5 ॥

అప్పుడా నాగుడు అరుణానుజుడైన గరుడిని వలన భయంతొలగి పాలసముద్రం దగ్గరనున్న శేషునిపై పాలసముద్రంలో పడుకొనియున్న శ్రీమహావిష్ణువువద్దకు వెళ్ళాడు.

ఇతశ్చేతశ్చ చరతి నాగోఽసౌ సుఖశీతలే ।
గరుడోఽపి చ యత్రాఽఽస్తే తం దేశమపి యాత్యసౌ ॥ 6 ॥

పాలసముద్రంలో నిటునటు తిరుగుతూ ఆ నాగుడు గరుడుడున్నచోటుకు కూడా వెళుతున్నాడు.

గరుడః పన్నగం దృష్ట్వా చరన్తం నిర్భయేన తు ।
తం గృహీత్వా మహానాగం ప్రాక్షిపత్ స్వస్య వేశ్మని ॥ 7 ॥

నిర్భయంగా తిరుగుతున్న నాగుని చూసి గరుడుడు ఆ మహానాగుని తీసుకొనిపోయి తన ఇంటిలో దాచిపెట్టాడు.

తం బద్ధ్వా గారుడైః పాశైర్గరుడో నాగసత్తమమ్ ।
ఏతస్మిన్నన్తరే నన్దీ ప్రోవాచేశం జగత్ప్రభుమ్ ॥ 8 ॥

తన ఇంట్లో గరుడపాశములతో ఆ నాగశ్రేష్ఠునిబంధించి యుంచాడు. ఇంతలో నంది జగత్ప్రభువైన శంకరునితో నిట్లన్నాడు.

నన్దికేశ్వర ఉవాచ :– నందికేశ్వరుడు పలికాడు.

నూనం నాగో న చాఽఽయాతి భక్షితో బద్ధ ఏవ వా ।
గరుడేన సురేశాన జీవన్నాగో న సంవ్రజేత్ ॥ 9 ॥

దేవా! నాగుడు రావడం లేదు. ఆ గరుడుడు అతణ్ణి బంధించాడో, భక్షించాడో నాగుడు బ్రతికి బయట పడలేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

నన్దినో వచనం శ్రుత్వా జ్ఞాత్వా శమ్భురథాబ్రవీత్ । 10 ॥

నందియొక్క మాటలనువిని శివుడు తెలుసుకొని యిట్లన్నాడు.

శివ ఉవాచ :– శివుడు పలికాడు.

గరుడస్య గృహే నాగో బద్ధస్తిష్ఠతి సత్వరమ్ ।
గత్వా తం జగతామీశం విష్ణుం బ్రూహి జనార్దనమ్ ॥ 11 ॥

గరుత్మంతుని ఇంట్లో నాగుడు బంధింపబడి యున్నాడు. నీవు త్వరగా వెళ్ళి జగత్తునకంతా ప్రభువు, జనార్దనుడు అగు విష్ణువుతో చెప్పు.

బద్ధం నాగం కాశ్యపేన మద్వాక్యాదానయ స్వయమ్ ।
తత్ప్రభోర్వచనం శ్రుత్వా నన్దీ గత్వా శ్రియఃపతిమ్ ॥ 12 ॥

వ్యజ్ఞాపయత్స్వయం వాక్యం విష్ణుం లోకపరాయణమ్ ।
నారాయణః ప్రీతమనా గరుడం వాక్యమబ్రవీత్ ॥ 13 ॥

"కశ్యపకుమారుడైన గరుత్మంతుడు బంధించిన నాగుని నీవు నా మాటప్రకారం స్వయంగా తీసుకొనిరా" అని శివుడనగానే ప్రభువు మాటలను విన్న నంది శ్రియఃపతియైన విష్ణువువద్దకు వెళ్ళి, లోకపరాయణుడైన విష్ణువుకు శివుని మాటలు విన్నవించాడు. నారాయణుడు సంతుష్టుడై గరుడునితో ఇట్లన్నాడు.

విష్ణురువాచ :- విష్ణువు పలికాడు.

వినతాత్మజ! మే వాక్యాన్నన్దినే దేహి పన్నగమ్ ।
వైనతేయో విదిత్వా చ నేత్యువాచ విహంగమః ॥ 14 ॥
విష్ణుమప్యబ్రవీత్కోపాత్సుపర్ణో నన్దినోఽన్తికే ॥

వినతాకుమారా! నా మాటవిని ఆ నాగుని నంది కిమ్ము, అని విష్ణువనగా పక్షియైన వైనతేయుడు నేనివ్వనన్నాడు. అంతేకాక ఆ నంది ఎదుట కోపంతో ఆ సుపర్ణుడు విష్ణువుతో నిట్లన్నాడు.

గరుడ ఉవాచ :-గరుత్మంతుడు పలికాడు.

యద్యత్ప్రియతరం కించిద్భృత్యేభ్యః ప్రభవిష్ణవః ।
దాస్యన్త్యన్యే భవాన్నైవ మయాఽఽనీతం హరిష్యతి ॥ 15 ॥

ప్రభవిష్ణులైన వారు, సంపదగలిగినవారు తమ సేవకుల కిష్టమైన దాని నిస్తుంటారు. నీవు అలా చేయడం లేదు నీవేమో నేను తెచ్చిన దానిని హరిస్తున్నావు.

పశ్య దేవం త్రినయనం నాగం మోక్ష్యతి నందినా ।
మయోపపాదితం నాగం త్వం తు దాస్యసి నందినే ॥ 16 ॥

ఆ ముక్కంటిని చూడు, నందితో నాగుని వదిలిస్తున్నాడు. నీవేమో నా కుద్దిష్టమైన నాగుని నందికే ఇస్తున్నావు.

త్వాం వహామి సదా మార్గే మమ దేయం సదా త్వయా ।
మయోపపాదితం నాగం వక్తుం దేహీతి నోచితమ్ ॥ 17 ॥

నీవన్నిమార్గములయందు ప్రయాణించుటకు నిన్ను నేను మోస్తున్నాను. కావున ఎప్పుడూ నీవే నా కీయవలెను. కాని నేను సంపాదించుకొన్న ఈ నాగుని ఇమ్మని యడుగుట నీకు ఉచితం కాదు.

సతాం ప్రభూణాం నేయం స్యాద్వృత్తిః సద్వృత్తికారిణామ్ ।
సన్తో దాస్యన్తి భృత్యేభ్యో మదుపాత్తహరో భవాన్ ॥ 18 ॥

చక్కటి నడవడిగలిగిన సత్పురుషులైన ప్రభువులిటువంటి పని చేయకూడనిది. సత్పురుషు లెప్పుడూ తమ సేవకులకు తామిస్తారు. నీవు భృత్యుడవైన నాకు చెందిన దానిని హరిస్తున్నావు.

దైత్యాన్ జయసి సంగ్రామే మద్బలేనైవ కేశవ ।
అహం మహాబలీత్యేవం ముధైవ శ్లాఘతే భవాన్ ॥ 19 ॥

ఓ కేశవా! నీవు యుద్ధంలో నాబలంతోనే రాక్షసులను జయిస్తున్నావు. నేను మహాబలుణ్ణని నీవు కొనియాడిన మాట వ్యర్థమవుతున్నది. అది వట్టిమాటే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

గరుడస్యేతి తద్వాక్యం శ్రుత్వా చక్రగదాధరః ।
విహస్య నన్దినః పార్శ్వే పశ్యద్భిర్లోకపాలకైః ॥ 20 ॥

ఇదమాహ మహాబుద్ధిర్మాం సముహ్యా కృశో భవాన్ ।
త్వద్బలాదసురాన్సర్వాన్ జేష్యేఽహం ఖగసత్తమ ॥ 21 ॥

చక్రము, గదధరించు విష్ణువు గరుడుని మాటలు విని నవ్వి, లోకపాలకులందరు నందివైపు చూస్తుండగా. ఓ పక్షిరాజా! నీవు చాలా తెలివిగలవాడివి. నన్ను మోసిమోసి నీవు చాలా చిక్కి పోయావు. నీ బలంతోనే నేను రాక్షసులందరినీ జయిస్తాను అని పలికాడు.

ఇత్యుక్త్వా శ్రీపతిర్బ్రహ్మన్ శాన్తకోపోఽబ్రవీదిదమ్ ।
వహాంగులిం కరస్యాఽఽశు కనిష్ఠాం నందినోఽన్తికే ॥ 22 ॥

ఓ బ్రహ్మస్వరూపుడా! కోపము శాంతించిన లక్ష్మీనాథుడు ఇలా అన్నాడు. ఈ నందికేశుని ఎదురుగా నా చేతివేలిని భరించు.

గరుడస్య తతో మూర్ధ్ని న్యస్యేదం పునరబ్రవీత్ ।
సత్యం మాం వదసే నిత్యం పశ్య ధర్మం విహంగమ ॥ 23 ॥

గరుడిని తలమీద తన వేలుంచి తిరిగి గరుడితో ఇట్లన్నాడు. ఓ పక్షీ! నీవెప్పుడూ సత్యమును గూర్చే చెబుతావు కదా! ధర్మమేమిటో చూడు.

న్యస్తాయాం చ తతోంఽగుల్యాం శిరః కుక్షౌ సమావిశత్ ।
కుక్షిశ్చ చరణస్యాన్తః ప్రావిశచ్చూర్ణితోఽభవత్ ॥
తతః కృతాంజలిర్దీనో వ్యథితే లజ్జయాఽన్వితః ॥ 24 ॥

తలమీద వేలుంచగానే తల కడుపులోనికి వెళ్ళింది. పొట్టకూడా పాదముల చివరవరకు వెళ్ళగా చూర్ణమయింది. అప్పుడు గరుడుడు సిగ్గుపడి బాధతో నమస్కరిస్తూ దీనంగా ఇలా పలికాడు.

గరుడ ఉవాచ :- గరుడుడు పలికాడు.

త్రాహి త్రాహి జగన్నాథ భృత్యం మామపరాధినమ్ ।
త్వం ప్రభుః సర్వలోకానాం ధర్తా ధార్యస్త్వమేవ హి ॥ 25 ॥

ఓ జగన్నాథా! అపరాధం చేసిన, నీసేవకుని అయిన నన్ను రక్షించు. రక్షించు. ప్రభువైన నీవే సమస్తలోకములను ధరించే వాడివి, వాటిచే ధరించబడేవాడివి కదా!

అపరాధసహస్రాణి క్షమన్తే ప్రభవిష్ణవః ।
కృతాపరాధేఽపి జనే మహతీ యస్య వై కృపా ॥ 26 ॥

ప్రభవిష్ణువులైన వారు వేలతప్పులనైనా క్షమిస్తారు. తప్పుచేసిన వారియందు కూడా వారి కృప చాలాగొప్పది.

వదన్తి మునయః సర్వే త్వామేవ కరుణాకరమ్ ।
రక్షస్వాఽఽర్తం జగన్మాతర్మామమ్బుజనివాసిని ॥
కమలే బాలకం దీనమార్తం తనయవత్సలే ॥ 27 ॥

అమ్మా జగన్మాతా! పద్మవాసినీ! ఋషులందరూ దయకు స్థానం నీవేనని అంటారు. ఈ నీ ఆర్తుని నన్ను రక్షించు. సంతానమందు వాత్సల్యంగలదానా! కమలా! దీనుడు, ఆర్తుడు అయిన బాలుని రక్షించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః కృపాన్వితా దేవీ శ్రీరప్యాహ జనార్దనమ్ ॥ 28 ॥

అపుడు దయాంతరంగిత అయిన శ్రీదేవి జనార్దనునితో ఇట్లన్నది.

కమలోవాచ:– లక్ష్మీదేవి పలికింది.

రక్ష నాథ స్వకం భృత్యం గరుడం విపదం గతమ్ ।
జనార్దన ఉవాచేదం నన్దినం శంభుకింకరమ్ ॥ 29 ॥

నాథా! ఆపదలలో నున్న నీ సేవకుడైన గరుడిని రక్షించు. అనగా అప్పుడు శివకింకరుడైన నందితో విష్ణువిట్లన్నాడు.

విష్ణురువాచ:–విష్ణువు పలికాడు.

నయ నాగం సగరుడం శంభోరన్తికమేవ చ ।
తత్ప్రసాదాచ్చ గరుడో మహేశ్వరనిరీక్షితః ॥ 30 ॥
ఆత్మీయం చ పునా రూపం గరుడః సమవాప్స్యతి ॥

నందికేశ్వరా! గరుడునితోగూడ నాగుని శివుని వద్దకు తీసుకొనిపో. మహేశ్వరుని చూపుపడి, అతని అనుగ్రహంతో గరుడుడు తనపూర్వరూపమును పొందుతాడు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మ పలికాడు.

అథేత్యుక్త్వా చ వృషభో నాగేన గరుడేన చ ।
శనైః స శంకరం గత్వా సర్వం తస్మై న్యవేదయత్ ॥
శంకరోఽపి గరుత్మంతం ప్రోవాచ శశిశేఖరః ॥ 31 ॥

సరే అలాగే అని ఆ నందికేశుడు నాగునితో గరుడునితోకలిసి మెల్లగా శివుని వద్దకు వెళ్ళి జరిగినదంతా నివేదించాడు. చంద్రశేఖరుడైన శంకరుడు గరుత్మంతునితో ఇట్లన్నాడు.

శివ ఉవాచ :- శంకరుడు పలికాడు.

యాహి గంగాం మహాబాహో గౌతమీం లోకపావనీమ్ ।
సర్వకామప్రదాం శాన్తాం తామాప్లుత్య పునర్వపుః ॥ 32 ॥

ప్రాప్స్యసే సర్వకామాంశ్చ శతధాఽథ సహస్రధా ।
సర్వపాపోపతప్తా యే దుర్దైవోన్మూలితోద్యమాః ॥
ప్రాణినోఽభీష్టదా తేషాం శరణం ఖగ గౌతమీ ॥ 33 ॥

మహాబాహూ! గరుడా! లోకపావనియైన గౌతమీగంగ దగ్గరకు వెళ్ళు. సమస్తకోరికలను తీర్చే శాంత స్వరూపిణియైన ఆ గంగలో స్నానమాచరించి తిరిగి నీ రూపమును, నీ సమస్తకోరికలను వందలవేల రెట్లుగా పొందగలవు. ఓ గరుడా! అనేక పాపములతో తపించిపోయే, దౌర్భాగ్యంవల్ల తమ ప్రయత్నములన్నీ ఫలించని జీవులందరికీ వారి వారి కోరికలను తీర్చేది, వారు శరణు పొందవలసినది కూడా గౌతమీనది మాత్రమే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్వాక్యం ప్రణతో భూత్వా శ్రుత్వా తు గరుడోఽభ్యగాత్ ।
గంగామాప్లుత్య గరుడః శివం విష్ణుం ననామ సః ॥ 34 ॥

శివుని మాటలను విని, నమస్కరించి గరుడుడు గంగవద్దకువెళ్ళి స్నానంచేసి, శివునకు విష్ణువుకు నమస్కరించాడు.

తతః స్వర్ణమయః పక్షీ వజ్రదేహో మహాబలః ।
వేగీభవన్మునిశ్రేష్ఠ పునర్విష్ణుమియాత్సుధీః ॥ 35 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! ఆ తరువాత గరుడుడు స్వర్ణమయుడై, వజ్రదేహంతో, మహాబలుడై, ఆ బుద్ధిమంతుడు వేగంతో తిరిగి విష్ణువువద్దకు వెళ్ళాడు.

తతః ప్రభృతి తత్తీర్థం గారుడం సర్వకామదమ్ ।
తత్ర స్నానాది యత్కించిత్కరోతి ప్రయతో నరః ॥
సర్వం తదక్షయం వత్స శివవిష్ణుప్రియావహమ్ ॥ 36 ॥

నాయనా! అప్పటినుండి ఈ తీర్థం సమస్తకోరికలను దీర్చే గారుడతీర్థంగా ప్రసిద్ధి పొందింది. ఆ తీర్థంలో స్నానాదికము లే కొంచెం చేసినా మానవులకది అక్షయమవుతుంది. ఈ తీర్థము శివునకు, విష్ణువునకు కూడా ప్రియమైనది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే గరుడతీర్థవర్ణనం నామ వింశోఽధ్యాయః ॥ 20 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలో గరుడ తీర్థ వర్ణనమనే పేరుగల ఇరవైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకవింశోఽధ్యాయః - ఇరవై ఒకటవ అధ్యాయం

గోవర్ధనతీర్థవర్ణనమ్ - గోవర్ధనతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతో గోవర్ధనం తీర్థం సర్వపాపప్రణాశనమ్ ।
పితౄణాం పుణ్యజననం స్మరణాదపి పాపనుత్ ॥ 1 ॥

ఆ తరువాత గోవర్ధనతీర్థం సమస్తపాపములను నశింపచేసేది. పితృదేవతలకు పుణ్యమును కలిగించేది. దానిని స్మరించినంతనే పాపములు తొలుగుతాయి.

తస్య ప్రభావ ఏష స్యాన్మయా దృష్టస్తు నారద ।
బ్రాహ్మణః కర్షకః కశ్చిజ్జాబాలిరితి విశ్రుతః ॥ 2 ॥

నారదా! నేనా తీర్థంయొక్క ప్రభావములను స్వయంగా దర్శించాను. జాబాలియను నొకబ్రాహ్మణుడు కర్షకవృత్తిని చేస్తూ ప్రసిద్ధినొందాడు.

న విముంచత్యనడ్వాహౌ మధ్యం యాతేఽపి భాస్కరే ।
ప్రతోదేన ప్రతుదతి పృష్ఠతోఽపి చ పార్శ్వయోః ॥ 3 ॥

ఒకనాడతడు వ్యవసాయంచేస్తూ సూర్యుడు మధ్యాహ్నసమయమునకు వచ్చినా ఎద్దులను వదలకుండా కఱ్ఱతో వాటి పిరుదులమీద, ప్రక్కన కొడుతూ అదిలిస్తుండేవాడు.

తౌ గావావశ్రుపూర్ణాక్షౌ దృష్ట్వా గౌః కామదోహినీ ।
సురభిర్జగతాం మాతా నన్దినే సర్వమబ్రవీత్ ॥ 4 ॥

ఆ ఎద్దులు రెండూ కన్నీళ్ళునిండిన రెండు కళ్ళతో నుండగా, కోరికలను తీర్చే జగన్మాత అయిన సురభి అది చూసి నందికేశ్వరునకు జరిగినదంతా వివరించింది.

స చాపి వ్యథితో భూత్వా శమ్భవే తన్న్యవేదయత్ ।
శమ్భుశ్చ వృషభం ప్రాహ సర్వం సిధ్యతు తే వచః ॥ 5 ॥

నందికేశ్వరుడు కూడా చాలా బాధపడి విషయమంతా శివునికి నివేదించాడు. శివుడు నందితో నీ మాటలన్నీ సిద్ధించుగాక! అని చెప్పాడు.

శివాజ్ఞాసహితో నన్దీ గోజాతం సర్వమాహరత్ ।
నష్టేషు గోషు సర్వేషు స్వర్గే మర్త్యే తతస్త్వరా ॥ 6 ॥

మామవోచన్సురగణా వినా గోభిర్న జీవ్యతే ।
తానవోచం సురాన్సర్వాన్ శంకరం యాత యాచత ॥ 7 ॥

శివాజ్ఞను పొందిన నంది గోజాతినంతటిని దాచి పెట్టింది. స్వర్గంలోనూ, భూలోకంలోనూ గోజాతి అంతా కన్పించకుండా పోయేసరికి దేవతలందరూ త్వరత్వరగా వచ్చి, గోజాతిలేకుండా మేము జీవించలేమని నన్ను ప్రార్థించగా, నే నా దేవతలతో మీరు వెళ్ళి శంకరుని అడగండని చెప్పాను.

తథైవేశం తు తే సర్వే స్తుత్వా కార్యం న్యవేదయన్ ।
ఈశోఽపి విబుధానాహ జానాతి వృషభో మమ ॥ 8 ॥

వారట్లే వెళ్ళి ఈశ్వరుని స్తుతించి తాము వచ్చిన పనిని గూర్చి నివేదించారు. శివుడుకూడా దేవతలతో ఈ విషయం నందికేశ్వరునకు తెలుసు, అతని నడగుమన్నాడు.

తే వృషం ప్రోచురమరా దేహి గా ఉపకారిణః ।
వృషోఽపి విబుధానాహ గోసవః క్రియతాం క్రతుః ॥ 9 ॥

అప్పుడు దేవతలు వెళ్ళి మాకుపకారము కలిగించే గోవుల నిమ్మన్నారు. నంది వారితో మీరు గోసవమను క్రతువు నాచరించుడని చెప్పాడు.

తతః ప్రాప్స్యథ గాః సర్వా యా దివ్యా యాశ్చ మానుషాః ।
తతః ప్రవర్తతే యజ్ఞో గోసవో దేవనిర్మితః ॥ 10 ॥

అప్పుడు మీరు దివ్యములు, మానుషములైన ఆ గోవులన్నింటిని పొందగలరని చెప్పగా అప్పుడు దేవతలు గోసవమనే యజ్ఞము చేశారు.

గౌతమ్యాశ్చ శుభే పార్శ్వే గావో వవృధిరే తతః ।
గోవర్ధనం తు తత్తీర్థం దేవానాం ప్రీతివర్ధనమ్ ॥ 11 ॥

అప్పుడు పవిత్రమైన గౌతమీనదిప్రక్కన గోజాతి వృద్ధి చెందింది. దానినే గోవర్ధనతీర్థమంటారు. అది దేవతలకు ప్రీతిని వృద్ధిచేసిన తీర్థం.

తత్ర స్నానం మునిశ్రేష్ఠ గోసహస్రఫలప్రదమ్ ।
కించిద్దానాదినా యత్స్యాత్ఫలం తత్తు న విద్మహే ॥ 12 ॥

ఓ మునిశ్రేష్ఠా! అక్కడ స్నానం చేస్తే వేయిగోవులను దానమిచ్చిన, పూజించిన ఫలము లభిస్తుంది. ఏ కొంచమైనా గోవర్ధనతీర్థంవద్ద దానం చేస్తే దాని ఫలమెంతో మేమెరుగము.

విలోక్య తం చ దేవేశం శంకరం గౌతమేశ్వరమ్ ।
స్వర్గలోకమవాప్నోతి యావన్మేరుశ్చ సర్వదా ॥ 13 ॥

అక్కడ గౌతమేశ్వరునిగానున్న దేవేశుడైన శివుని దర్శిస్తే మేరుపర్వతమున్నంతవరకు సర్వదా స్వర్గమును పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'గోవర్ధనతీర్థవర్ణనం' నామ ఏకవింశోఽధ్యాయః॥21॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలో 'గోవర్ధన తీర్థ వర్ణన' మనే పేరుగల ఇరవై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వావింశోఽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

ధౌతపాపమాహాత్మ్యనిరూపణమ్ - ధౌతపాపమాహాత్మ్యనిరూపణం

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

పాపప్రణాశనం నామ తీర్థం పాపభయాపహమ్ ।
నామధేయం ప్రవక్ష్యామి శృణు నారద యత్నతః ॥ 1 ॥

నారదా! పాపమును, భయమును పోగొట్టే తీర్థము పాపప్రణాశనమనే పేరు గలది యొకటున్నది. దాన్నిగూర్చి చెబుతున్నాను, శ్రద్ధగా విను.

ధృతవ్రత ఇతి ఖ్యాతో బ్రాహ్మణో లోకవిశ్రుతః ।
తస్య భార్యా మహీ నామ తరుణీ లోకసున్దరీ ॥ 2 ॥

ధృతవ్రతుడనే పేరు గల ప్రసిద్ధుడైన బ్రాహ్మణుడొకడుండేవాడు. అతని భార్య యౌవనవతి, లోకసుందరి. ఆమె పేరు మహీ అని యంటారు.

తస్య పుత్రః సూర్యనిభః సనాజ్జాత ఇతి శ్రుతః ।
ధృతవ్రతం తథాఽకర్షన్మృత్యుః కాలేరితో మునే ॥ 3 ॥

అతనికి సూర్యప్రకాశంతో సమానమైన కాంతిగల కుమారుడుండేవాడు. అతని పేరు సనాజ్జాతుడు. ఓ మునీ! కొంత కాలమునకు యమప్రేరితమైన మృత్యువు ధృతవ్రతుని కబళించింది.

తతః సా బాలవిధవా బాలపుత్రా సురూపిణీ ।
త్రాతారం నైవ పశ్యన్తీ గాలవాశ్రమమభ్యగాత్ ॥ 4 ॥

అప్పుడు చిన్న బాలుడు గలిగి, అందమైన రూపంకల బాలవిధవ అయిన మహి తనను రక్షించేవారెవరూ లేరని గాలవమహర్షి ఆశ్రమానికి వెళ్ళింది.

తస్మై పుత్రం నివేద్యాథ స్వైరిణీ పాపమోహితా ।
సా బభ్రామ బహూన్దేశాన్పుంస్కామా కామచారిణీ ॥ 5 ॥

ఆ గాలవునకు తన పుత్రుని సనాజ్జాతుని అప్పగించి, విచ్చలవిడిగా తిరిగే స్వభావంగల ఆమె పాపమోహితురాలై, కామచారిణియై పురుషులను పొంది యానందించాలనే కోరికతో అనేక దేశములను తిరిగింది.

తత్పుత్రో గాలవగృహే వేదవేదాంగపారగః ।
జాతోఽపి మాతృదోషేణ వేశ్యేరితమతిస్త్వభూత్ ॥ 6 ॥

ఆమె కుమారుడు గాలవుని ఆశ్రమంలో వేదవేదాంగపారంగతుడైనప్పటికీ, తల్లిచేసిన దోషంతో వేశ్యల యందాసక్తుడయ్యాడు.

జనస్థానమితి ఖ్యాతం నానాజాతిసమావృతమ్ ।
తత్రాసౌ పుణ్యవేషేణ అధ్యాస్తే చ మహీ తథా ॥ 7 ॥

అనేక జాతులవారు నివసిస్తున్న జనస్థాన మనేది ప్రసిద్ధమైనది. అక్కడ అతడు పవిత్రవేషధారణతో నివసిస్తుండేవాడు. అక్కడే మహి కూడా ఉండేది.

తత్సుతోఽ పి బహూన్దేశాన్పరిబభ్రామ కాముకః ।
సోఽ పి కాలవశాత్తత్ర జనస్థానేఽ వసత్తదా ॥ 8 ॥

ఆమె కుమారుడు కూడా కాముకుడై అనేక దేశములను తిరిగాడు. కాలవశంవల్ల అతడు కూడా అప్పుడు జనస్థానంలో నివాసమేర్పరుచుకొన్నాడు.

స్త్రియమాకాంక్షతే వేశ్యాం ధృతవ్రతసుతో ద్విజః ।
మహీ చాపి ధనం దాతౄన్ పురుషాన్ సమపేక్షతే ॥ 9 ॥

ధృతవ్రతుని కుమారుడైన బ్రాహ్మణుడు వేశ్యా స్త్రీని కోరుతున్నాడు. ఇక అతని తల్లి మహి డబ్బిచ్చే పురుషులను కోరుతున్నది.

మేనే న పుత్రమాత్మీయం స చాపి న తు మాతరమ్ ।
తయోః సమాగమశ్చాఽ ఽ సీద్విధినా మాతృపుత్రయోః ॥ 10 ॥

ఆమె అతనిని తన కుమారునిగా గుర్తించలేకపోయింది. అతడు కూడా తన తల్లిని గుర్తు పట్టలేదు. దైవవశంచే ఆ తల్లీకొడుకులకిద్దరికీ సమాగమమేర్పడింది.

ఏవం బహు తిథే కాలే పుత్రే మాతరి గచ్ఛతి ।
తయోః పరస్పరం జ్ఞానం నైవాఽ ఽ సీన్మాతృపుత్రయోః ॥ 11 ॥

ఇలా చాలా కాలం తల్లీకుమారులు పరస్పరం కామంతో సంగమిస్తున్నప్పటికీ వారిలో ఏ ఒక్కరికి తాము తల్లీబిడ్డలమనే జ్ఞానం కలుగలేదు.

ఏవం ప్రవర్తమానస్య పితృధర్మేణ సన్మతిః ।
ఆసీత్తస్యాప్యసద్వృత్తేః శృణు నారద చిత్రవత్ ॥ 12 ॥

ఇలా చెడ్డ ప్రవర్తనతో కూడియున్న అతనికి కూడా తన తండ్రి యాచరించిన ధర్మము నాచరించుటకు బుద్ధి కలిగింది. నారదా! ఈ చిత్రమైన పరిస్థితినిగూర్చి కూడా విను.

స్వైరస్థిత్యా వర్తమానో నేదం స పరిహాతవాన్ ।
బ్రాహ్మీం సంధ్యామనుష్ఠాయ తదూర్ధ్వం తు ధనార్జనమ్ ॥ 13 ॥

అతడెంత విచ్చలవిడిగా తిరిగినా బ్రాహ్మీముహూర్తంలో లేవడం, నిత్యసంధ్యావందనాది అనుష్ఠానం చేయడం అనేవి మాత్రం విడువ లేదు. అవన్నీ అయిన తరువాతనే ధనసంపాదనగూర్చి వెళ్ళేవాడు.

విద్యాబలేన విత్తాని బహూన్యార్జ్య దదాత్యసౌ ।
తథా స ప్రాతరుత్థాయ గంగాం గత్వా యథావిధి ॥ 14 ॥

శౌచాదిస్నాన సంధ్యాది సర్వం కార్యం యథాక్రమమ్ ।
కృత్వా తు బ్రాహ్మణాన్నత్వా తతోఽభ్యేతి హ్యకల్మషః ॥ 15 ॥

తాను విద్యాబలంతో చాలాధనమును సంపాదించి ఆమెకిచ్చేవాడు. అట్లే అతను ప్రతిదినమూ పొద్దున్నే లేచి గంగానదికివెళ్ళి శౌచాదులు, స్నానసంధ్యాది కార్యక్రమములు యథావిధిగా చేసి, బ్రాహ్మణులకు నమస్కరించి, కల్మషమేమీ లేకుండా వచ్చేవాడు.

ప్రాతఃకాలే గౌతమీం తు యదా యాతి విరూపవాన్ ।
కుష్ఠసర్వాంగశిథిలః పూయశోణితనిఃస్రవః ॥ 16 ॥

ఉదయముననే గౌతమీనదికి వెళ్ళేటపుడు అవయవములన్నీ శిథిలమైపోయి, చీము, నెత్తురు కారుతుండగా కురూపిగా వెళ్తాడు.

స్నాత్వా తు గౌతమీం గంగాం యదా యాతి సురూపధృక్ ।
శాన్తః సూర్యాగ్నిసదృశో మూర్తిమానివ భాస్కరః ॥ 17 ॥

గౌతమీనదిలో స్నానంచేసి వచ్చేటపుడు శాంతంగా సాక్షాత్తు మూర్తీభవించిన సూర్యాగ్ని తేజస్సుగలవాడై చక్కని రూపంతో ఉంటాడు.

ఏతద్రూపద్వయం స్వస్య నైవ పశ్యతి స ద్విజః ।
గాలవో యత్ర భగవాంస్తపోజ్ఞానపరాయణః ॥ 18 ॥

ఆశ్రిత్య గౌతమీం దేవీం ఆస్తే చ మునిభిర్వృతః ।
బ్రాహ్మణోఽపి చ తత్రైవ నిత్యం తీర్థం సమేత్య చ ॥ 19 ॥

గాలవం చ నమస్యాథ తతో యాతి స్వమన్దిరమ్ ।
గంగాయాః సేవనాత్పూర్వం సనాజ్జాతస్య యద్వపుః ॥ 20 ॥

స్నానసంధ్యోత్తరే కాలే పునర్యదపి తద్ద్విజే ।
ఉభయం తస్య తద్రూపం గాలవో నిత్యమేవ చ ॥ 21 ॥

దృష్ట్వా స విస్మయో మేనే కించిదస్త్యత్ర కారణమ్ ।
ఏవం స విస్మయో భూత్వా గాలవః ప్రాహ తం ద్విజమ్ ॥ 22 ॥

ఆ బ్రాహ్మణుడు తనకు గలిగిన విరూపమును గాని, సురూపమును గాని చూసుకోలేదు. ఆ గౌతమీనది నాశ్రయించి తపోజ్ఞానపరాయణుడైన పూజ్యుడైన గాలవుడు మునులందరితో కూడి ఉన్నాడు. ఆ బ్రాహ్మణుడైన

సనాజ్జాతుడు కూడా ప్రతిదినము ఈ తీర్థము వద్దకు వచ్చి, అక్కడే గాలవమహర్షికి నమస్కరించి తరువాత తనయింటికి వెళ్తాడు. గంగానదిలో స్నానంచేయకముందు సనాజ్జాతునియొక్క రూపమును, స్నానసంధ్యాద్యనుష్ఠానం తరువాత మార్పుచెందే రూపమును, ఈరెంటినీ కూడా గాలవుడు ప్రతినిత్యముకూడా చూసి, ఆశ్చర్యమిది, ఇక్కడేదో ఒక కారణముంటుంది, అని అనుకొని ఆ బ్రాహ్మణుని ఆశ్చర్యపడి అడిగాడు.

గచ్ఛన్తం తం నమస్యాథ సనాజ్జాతం గురుర్గృహమ్ ।
ఆహూయ యత్నతో ధీమాన్ కృపయా విస్మయేన చ ॥ 23 ॥

ఒకనాడు తనకు నమస్కరించి వెళ్ళుతున్న సనాజ్జాతుని తన ఇంటికి పిలిచి బుద్ధిమంతుడైన గాలవుడు ఎంతో ప్రయత్నంతో సనాజ్జాతునియందు దయతో, ఆశ్చర్యంతో ఇట్లడిగాడు.

గాలవ ఉవాచ :- గాలవుడు పలికాడు.

కో భవాన్ క్వ చ గన్తాఽసి కిం కరోషి క్వ భోక్ష్యసి ।
కిం నామా త్వం క్వ శయ్యా తే కా తే భార్యా వదస్వ మే ॥ 24 ॥

నీవెవరు? ఎక్కడకు వెళుతున్నావు? ఏమి చేస్తున్నావు? ఎక్కడ తింటున్నావు? నీ పేరేమి? ఎక్కడ నిద్రిస్తావు? నీ భార్య ఎవరు? ఆమె పేరేమి? వివరంగా నాకు చెప్పుమన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

గాలవస్య వచః శ్రుత్వా బ్రాహ్మణోఽప్యాహ తం మునిమ్ ॥ 25 ॥

గాలవుని మాటలువిని ఆ బ్రాహ్మణుడుకూడా గాలవమునితో ఇట్లన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శ్వః కథ్యతే మయా సర్వం జ్ఞాత్వా కార్యవినిర్ణయమ్ ॥ 26 ॥

నేను చేయవలసిన పనినిగూర్చి నిర్ణయమును తెలుసుకొని రేపు చెబుతానన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా గాలవం తం సనాజ్జాతో గృహం యయౌ ।
భుక్త్వా రాత్రౌ తయా సమ్యక్ శయ్యామాసాద్య బంధకీమ్ ॥ 27 ॥

ఉవాచ చకితః స్మృత్వా గాలవస్య తు యద్వచః ॥ 28 ॥

ఇలా గాలవునితో చెప్పి సనాజ్జాతుడు ఇంటికి చేరాడు. రాత్రిపూట భోజనం చేసి చక్కగా ఆమెతో గూడ పడకపైకి చేరి, ఆమెతో ఉన్నప్పుడు ఒక్కసారిగా గాలవుడడగిన మాటలు గుర్తుకు వచ్చి ఆశ్చర్యమునకు లోనై ఆమెతో ఇట్లన్నాడు.

బ్రాహ్మణ ఉవాచ :– బ్రాహ్మణుడు పలికాడు.

త్వం తు సర్వగుణోపేతా బంధక్యపి పతివ్రతా ।
ఆవయోః సదృశీ ప్రీతిర్యావజ్జీవం ప్రవర్తతామ్ ॥

నీవు వేశ్యవైనా సర్వగుణోపేతురాలవు, పతివ్రతవు. మన ఇద్దరిలో పరస్పరం సదృశంగా నున్న ప్రీతి మనం జీవించినంతకాలమిట్లే యుండవలెను.

తథాஉపి కించిత్ పృచ్ఛామి కిం నామ్నీ త్వం క్వ వా కులమ్ ।
కిం ను స్థానం క్వ వా బన్ధుర్మమ సర్వం నివేద్యతామ్ ॥ 29 ॥

అయినప్పటికీ నిన్నొకమాట అడుగుతాను, నీ పేరేమి? నీ కులమేది? నీవెక్కడి దానివి? నీ బంధువులెవరు? ఇవన్నీ నాకు తెలుపు.

బన్ధక్యువాచ :– వేశ్య పలికింది.

ధృతవ్రత ఇతి ఖ్యాతో బ్రాహ్మణో దీక్షితః శుచిః ।
తస్య భార్యా మహీ చాహం మత్పుత్రో గాలవాశ్రమే ॥ 30 ॥

ఉత్సృష్టో మతిమాన్బాలః సనాజ్జాత ఇతి శ్రుతః ।
అహం తు పూర్వదోషేణ త్యక్త్వా ధర్మం కులాగతమ్ ॥

స్వైరిణీ త్విహ వర్తేஉహం విద్ధి మాం బ్రాహ్మణీం ద్విజ ॥ 31 ॥

ధృతవ్రతుడనే పేరుగల గొప్ప దీక్షగల శుచియైన బ్రాహ్మణుడు ఉండేవాడు. నేనతనికి భార్యను. నాపేరు మహి. నా పుత్రుడు గాలవునియొక్క ఆశ్రమంలో వదలిపెట్టిన బాలుడు చాలా తెలివి గలవాడు. అతని పేరు సనాజ్జాతుడంటారు. నేను పూర్వంచేసిన పాపంవల్ల కులానుగుణంగా వచ్చిన ధర్మమును వదిలి పెట్టి, ఇప్పుడు వేశ్యగా నుంటున్నాను. ఓ ద్విజుడా! నన్ను బ్రాహ్మణస్త్రీగా తెలుసుకో.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తస్యాస్తద్వచనం శ్రుత్వా మర్మవిద్ధ ఇవాభవత్ ।
పపాత సహసా భూమౌ వేశ్యా తం వాక్యమబ్రవీత్ ॥ 32 ॥

ఆమె చెప్పిన ఆ మాటలు వినగానే అతని గుండెలపై కొట్టినట్లయింది. వెంటనే అతడు క్రింద పడిపోయాడు. అప్పుడా వేశ్య అతనితో నిట్లన్నది.

వేశ్యోవాచ :– వేశ్య పలికింది.

కిం ను జాతం ద్విజశ్రేష్ఠ క్వ చ ప్రీతిర్గతా తవ ।
కిం తు వాక్యం మయా చోక్తం తవ చిత్తవిరోధకృత్ ॥ 33 ॥

ఓ బ్రాహ్మణోత్తమా! ఏమయింది? నీప్రేమ ఎక్కడికి పోయింది? నేనేమైనా నీ మనస్సుకు వ్యతిరేకాన్ని కలిగించే మాటలేమైనా అన్నానా?

ఆత్మానమాత్మనాఽఽశ్వాస్య బ్రాహ్మణో వాక్యమబ్రవీత్ ॥ 34 ॥

బ్రాహ్మణుడు తనను తాను ఊరడించుకొని ఇట్లన్నాడు.

బ్రాహ్మణ ఉవాచ :– బ్రాహ్మణుడు పలికాడు.

ధృతవ్రతః పితా విప్రస్తత్పుత్రోఽహం సనాజ్ఞాతః ।
మాతా మహీ మమ ఇయం మమ దైవాదుపాగతా ॥ 35 ॥

ధృతవ్రతుడనే బ్రాహ్మణుడు నాతండ్రి, నేనాయనకు కుమారుడను, సనాజ్ఞాతుడను. దైవంవల్ల లభించిన ఈమె నా తల్లి మహి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు

ఏతచ్ఛ్రుత్వా తస్య వాక్యం సాఽప్యభూదతిదుఃఖితా ।
తయోస్తు శోచతోః పశ్చాత్ప్రభాతే విమలే రవౌ ॥ 36 ॥
గాలవం మునిశార్దూలం గత్వా విప్రో న్యవేదయత్ ॥

అని అతడు పలికిన ఈ మాటలు వినగానే ఆమెకూడా మిక్కిలి దుఃఖించింది. ఇట్లు వారిద్దరూ దుఃఖిస్తూండగా సూర్యుని ప్రభాతకాంతులతో తెల్లవారింది. అప్పుడా విప్రుడు మునిశ్రేష్ఠుడైన గాలవునివద్దకు వెళ్ళి నివేదించాడు.

బ్రాహ్మణ ఉవాచ:– బ్రాహ్మణుడు పలికాడు.

ధృతవ్రతసుతో బ్రహ్మంస్త్వయా పూర్వం తు పాలితః ।
ఉపనీతస్త్వయా చైవ మహీ మాతా మమ ప్రభో ॥ 37 ॥

బ్రహ్మన్! నేను ధృతవ్రతుని కుమారుడను. నా తల్లి మహీ. ప్రభూ! ఇంతకు పూర్వం నీవు నన్ను పోషించావు. అంతేకాక నీవే ఉపనయనం కూడా చేశావు.

కిం కరోమి చ కిం కృత్వా నిష్కృతిర్మమ వై భవేత్ ॥ 38 ॥

నేనేం చేయాలి? ఏది చేస్తే నాకు నిష్కృతి కలుగుతుంది?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్విప్రవచనం శ్రుత్వా కారుణ్యాత్ప్రాహ గాలవః ।
తవేదం ద్వివిధం రూపం నిత్యం పశ్యామ్యపూర్వవత్ ॥ 39 ॥

ఆ బ్రాహ్మణుని మాటలను విని గాలవుడు కరుణతో నిట్లన్నాడు. నేనింతకు ముందు చూడని అపూర్వమైన నీరెండు రూపములను ప్రతిదినమూ చూస్తున్నాను.

తతః పృష్టోఽసి వృత్తాన్తం శ్రుతం జ్ఞాతం మయా యథా ।
యత్కృత్యం తవ తత్సర్వం గంగాయాం ప్రత్యగాత్ క్షయమ్ ॥ 40 ॥

ఆ తరువాత నిన్నడిగాను. నీవృత్తాంతమంతా విన్నాను. నాకంతా తెలిసింది. నీవు చేసిన పాపమంతా గంగలో స్నానం చేయగానే నశించింది.

అస్య తీర్థస్య మాహాత్మ్యాదస్యా దేవ్యాః ప్రసాదతః ।
పూతోఽసి ప్రత్యహం వత్స నాత్ర కార్యా విచారణా ॥ 41 ॥

నాయనా! ఈ దేవి అనుగ్రహం వల్ల, ఈ తీర్థముయొక్క ప్రభావం వల్ల నీవు ప్రతిరోజు పవిత్రుడవవుతున్నావు. ఇక్కడ విచారించవలసినదేదీ లేదు.

ప్రభాతే తవ రూపాణి సపాపాని త్వహర్నిశమ్ ।
పశ్యేఽహం పునరప్యేవ రూపం తవ గుణోత్తమమ్ ॥ 42 ॥

నేను ప్రతిరోజూ ఉదయాన్నే పాపములతో నుండు రూపమును, తిరిగి స్నానం చేయగానే నీ గుణోత్తమమైన రూపమును చూస్తున్నాను.

ఆగచ్ఛన్తం త్వాగోయుక్తం గచ్ఛన్తం త్వామనాగసమ్ ।
పశ్యామి నిత్యం తస్మాత్త్వం పూతో దేవ్యా కృతోఽధునా ॥ 43 ॥

నీవు వచ్చేటప్పుడు పాపయుక్తునిగా, వెళ్ళేటప్పుడు పాపరహితునిగా నిత్యం చూస్తున్నాను. ఈ గంగాదేవి నిన్ను పవిత్రునిగా చేసింది. అందువలన నీవిప్పుడు పవిత్రుడవు.

తస్మాన్న కార్యం తే కించిదవశిష్టం భవిష్యతి ।
ఇయం చ మాతా తే విప్ర జ్ఞాతా యా చైవ బంధకీ ॥ 44 ॥

కావున నీవు చేయవలసినదేదీ మిగిలి లేదు. ఓ విప్రుడా! ఈమె నీ తల్లి, వేశ్యయని కూడా తెలిసింది.

పశ్చాత్తాపం గతాఽత్యన్తం నివృత్తా త్వథ పాతకాత్ ।
భూతానాం విషయే ప్రీతిర్వత్స స్వాభావికీ యతః ॥ 45 ॥

సత్సంగతో మహాపుణ్యాన్నివృత్తిర్దైవతో భవేత్ ।
అత్యర్థమనుతప్తేయం ప్రాగాచరితపుణ్యతః ॥ 46 ॥

నాయనా! ఆమె మిక్కిలి పశ్చాత్తాపం పొందినందువలన పాపంనుండి విముక్తురాలైంది. జీవులకు ప్రీతి యనేది సర్వసామాన్యమైనది. ఎందుకనగా, ఎంతో పుణ్యంచేస్తేగాని సత్సాంగత్యం లభించదు. అటువంటి సత్సాంగత్యము వలన, మహాపుణ్యం వలన, దైవానుగ్రహం వలన పాపనివృత్తి కలుగుతుంది. పూర్వమాచరించిన పుణ్యంవలన ఈ పాపరాశి దహించబడింది.

స్నానం కృత్వా చాత్ర తీర్థే తతః పూతా భవిష్యతి ।
తథా తౌ చక్రతురుభౌ మాతాపుత్రౌ చ నారద ॥ 47 ॥

ఈ తీర్థమునందు స్నానం చేసిన తర్వాత ఆమె పవిత్రురాలు కాగలదు, అని చెప్పగానే నారదా! వారిద్దరు తల్లీకొడుకులు స్నానం చేశారు.

స్నానాద్బభూవతురుభౌ గతపాపావసంశయమ్ ।
తతః ప్రభృతి తత్తీర్థం ధౌతపాపం ప్రచక్షతే ॥ 48 ॥

స్నానంచేయగానే వారిద్దరు పాపవిముక్తులయ్యారు. ఇక్కడ సంశయమే మాత్రంలేదు. అప్పటి నుండి ఈ తీర్థమును ధౌతపాపమనే పేరుతో పిలుస్తారు.

పాపప్రణాశనం నామ గాలవం చేతి విశ్రుతమ్ ।
మహాపాతకమల్పం వా తథా యచ్చోపపాతకమ్ ॥
తత్సర్వం నాశయేదేతద్ధౌతపాపం సుపుణ్యదమ్ ॥ 49 ॥

ఈ తీర్థం పాపప్రణాశనమని, గాలవమని ప్రసిద్ధిచెందింది. మహాపాతకంగాని, అల్పపాతకంగాని, ఉపపాతకం గాని అదేదైనా సరే ఈధౌతపాపమనే తీర్థం దానినంతా నశింపచేస్తుందని చెబుతారు. ఇది చాలా పుణ్యమును కలిగించేది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'ధౌతపాపమాహాత్మ్యనిరూపణం' నామ ద్వావింశోఽధ్యాయః ॥ 22 ॥

శ్రీబ్రహ్మ పురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'ధౌతపాపమాహాత్మ్యనిరూపణ' మనే పేరుగల ఇరవై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

విశ్వామిత్రతీర్థవర్ణనమ్ - విశ్వామిత్రతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తస్య దక్షిణతో విప్ర చాస్తి తీర్థం సుదుర్లభమ్ ।
పితృతీర్థమితి ఖ్యాతం సర్వపాపహరం శుచి ॥ 1 ॥

ఓ విప్రుడా! ధౌతపాపతీర్థమునకు దక్షిణభాగాన సుదుర్లభమైన మరొక తీర్థముంది. దానిని పితృతీర్థమంటారు. అది శుచియైనది సర్వపాపములను హరించేది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యత్ర దాశరథీ రామః సీతయా సహితో ద్విజ ।
పితౄన్సంతర్పయామాస పితృతీర్థం తతో విదుః ॥ 2 ॥

ఓ ద్విజుడా! దశరథకుమారుడైన శ్రీరాముడు సీతతో కూడినవాడై తన పితృదేవతలకు తర్పణములు చేసిన ప్రదేశాన్ని పితృతీర్థమంటారు.

తత్ర స్నానం చ దానం చ పితౄణాం తర్పణం తథా ।
సర్వమక్షయతామేతి నాత్ర కార్యా విచారణా ॥ 3 ॥

అక్కడ స్నానం, దానం, అట్లే పితృతర్పణం చేస్తే అక్షయమైన ఫలం లభిస్తుంది. ఇక్కడ విచారించ వలసినదేదీ లేదు.

యత్ర దాశరథీ రామో విశ్వామిత్రం మహామునిమ్ ।
పూజయామాస రాజేన్ద్రో మునిభిస్తత్త్వదర్శిభిః ॥ 4 ॥

విశ్వామిత్రం తు తత్తీర్థమృషిజుష్టం సుపుణ్యదమ్ ।
తత్స్వరూపం చ వక్ష్యామి పఠితం వేదవాదిభిః ॥ 5 ॥

తత్త్వదర్శులైన మునులందరితో కలిసి దశరథరాముడు విశ్వామిత్రమహామునిని పూజించినతీర్థము అయిన, వేదవేత్తలైనవారు అధ్యయనం చేసిన, ఋషిజుష్టమైన, పుణ్యమును కలిగించే తీర్థం విశ్వామిత్రతీర్థం. ఇప్పుడా తీర్థ స్వరూపమును గూర్చి చెబుతున్నాను.

అనావృష్టిరభూత్పూర్వం ప్రజానామతిభీషణా ।
విశ్వామిత్రో మహాప్రాజ్ఞః సశిష్యో గౌతమీమగాత్ ॥ 6 ॥

పూర్వం ప్రజలకు మిక్కిలి బాధకలిగించే అతిభీషణమైన అనావృష్టి ఏర్పడింది. ఆ సమయంలో మహాప్రాజ్ఞుడైన విశ్వామిత్రుడు తన శిష్యులతో కలిసి గౌతమీనది దగ్గరకు వెళ్ళాడు.

శిష్యాన్ పుత్రాంశ్చ జాయాం చ కృశాన్ దృష్ట్వా క్షుధాతురాన్ ।
వ్యథితః కౌశికః శ్రీమాన్ శిష్యానిదమువాచ హ ॥ 7 ॥

ఆకలితో భార్యాబిడ్డలను, కృశించిన శిష్యులను చూసి పూజ్యుడైన కౌశికుడు బాధపడి శిష్యులతో నిట్లన్నాడు.

విశ్వామిత్ర ఉవాచ :– విశ్వామిత్రుడు పలికాడు.

యథాకథంచిద్యత్కించిద్యత్ర క్వాపి యథా తథా ।
ఆనీయతాం కింతు భక్ష్యం భోజ్యం వా మా విలంబ్యతామ్ ॥
ఇదానీమేవ గన్తవ్యమానేతవ్యం క్షణేన తు ॥ 8 ॥

ఏదో ఒక విధంగా, ఏదో ఒకటి, ఎక్కడో అక్కడ ఉన్నదేదో ఉన్నట్లుగా భక్ష్యమో, భోజ్యమో ఏమాత్రం ఆలస్యం చేయకుండా తీసుకురండి. ఇప్పుడే వెళ్ళాలి. క్షణంలో తీసుకొని రావాలి అని చెప్పాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఋషే తద్వచనాచ్ఛిష్యాః క్షుధితాస్త్వరయా యయుః ।
అటమానా ఇతశ్చేతః శ్వానం దదృశిరే మృతమ్ ॥ 9 ॥

ఓ ఋషీ! ఆ ఋషి మాటలనువిన్న, ఆకలితో నున్న శిష్యులు త్వరగా వెళ్ళారు. వారటు నిటు తిరుగుతూ ఒక చచ్చిన కుక్కను చూశారు.

తమాదాయ త్వరాయుక్తా ఆచార్యాయ న్యవేదయన్ ।
సోఽపి తం భద్రమిత్యుక్త్వా ప్రతిజగ్రాహ పాణినా ॥ 10 ॥

దానిని తీసుకొని త్వరత్వరగా వచ్చి గురువైన విశ్వామిత్రునకు నివేదించారు. అతడు కూడా మీకు శుభం కలుగుగాక! అని ఆశీర్వదించి తన చేతితో గ్రహించెను (స్వీకరించెను.)

విశసధ్వం శ్వమాంసం చ క్షాలయధ్వం చ వారిణా ।
పచధ్వం మంత్రవచ్చాపి హుత్వాఽగ్నౌ తు యథావిధి ॥ 11 ॥

ఈ కుక్క మాంసమును కోయండి. నీటిలో వేసి కడుగండి. మంత్రపూర్వకంగా దీనిని వండండి. యథావిధిగా అగ్నికి ఆహుతులివ్వండి.

దేవానృషీన్పితౄనన్యాంస్తర్పయిత్వాఽతిథీన్ గురూన్ ।
సర్వే భోక్ష్యామహే శేషమిత్యువాచ స కౌశికః ॥ 12 ॥

దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు, అతిథులకు గురువులకు తర్పణం చేసి, వారి కర్పించి మిగిలినదానిని మనమంతా తిందాము అని కౌశికుడు చెప్పాడు.

విశ్వామిత్రవచః శ్రుత్వా శిష్యాశ్చక్రుస్తథైవ తత్ ।
పచ్యమానే శ్వమాంసే తు దేవదూతోఽగ్నిరభ్యగాత్ ॥
దేవానాం సదనే సర్వే దేవేభ్యస్తన్న్యవేదయత్ ॥ 13 ॥

విశ్వామిత్రునిమాటలు విన్న శిష్యులట్లే చేశారు. అప్పుడా కుక్కమాంసం వండగానే దేవదూత అయిన అగ్ని వచ్చాడు. దేవతల వద్దకు వెళ్ళి వారందరికి ఆహుతులద్వారా సమర్పించింది వారికిచ్చి అంతా నివేదించాడు.

అగ్నిరువాచ :- అగ్ని పలికాడు.

దేవైః శ్వమాంసం భోక్తవ్యమాపన్నమృషికల్పితమ్ ॥ 14 ॥

ఆపదలో నున్న ఋషి ఏర్పాటుచేసిన కుక్కమాంసమును దేవతలంతా తినవలెను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అగ్నేస్తద్వచనాదింద్రః శ్యేనో భూత్వా విహాయసి ।
స్థాలీమథాహరత్పూర్ణాం మాంసేన పిహితాం తదా ॥ 15 ॥

అగ్ని చెప్పిన మాటలనువిన్న ఇంద్రుడు ఆకాశంలో డేగరూపమును ధరించి అప్పుడు మాంసంతో నిండిన పళ్ళెమును (గ్రహించెను) అపహరించాడు.

తత్కర్మ దృష్ట్వా శిష్యాస్తే ఋషేః శ్యేనం న్యవేదయన్ ।
హృతా స్థాలీ మునిశ్రేష్ఠ శ్యేనేనాకృతబుద్ధినా ॥ 16 ॥

అది చూసి ఋషియొక్క శిష్యులు ఓ మునిశ్రేష్ఠా! దుర్మార్గమైన ఒక డేగ మాంసమున్న పళ్ళెము నెత్తుకొని పోయిందని ఆ శ్యేనను గురించి నివేదించారు.

తతశ్చుకోప భగవాన్ శప్తుకామస్తదా హరిమ్ ।
తతో జ్ఞాత్వా సురపతిః స్థాలీం చక్రే మధుప్లుతామ్ ॥ 17 ॥

అప్పుడా పూజ్యుడైన విశ్వామిత్రుడు కోపించాడు. ఇంద్రుని శపించుటకు పూనుకొన్నాడు. అది తెలుసుకొని దేవేంద్రుడు ఆ పళ్ళెమును మధువుతో తడిపాడు.

పునర్నివేశయామాస ఉల్కాస్వేవ ఖగో హరిః ।
మధునా తు సమాయుక్తాం విశ్వామిత్రశ్చుకోప హ ॥
స్థాలీం వీక్ష్య తతః కోపాదిదమాహ స కౌశికః ॥ 18 ॥

తిరిగి తాను ఉల్కలమార్గమునందే ఖగరూపమును ధరించిన ఇంద్రుడు ప్రవేశించాడు. మధువుతో కూడుకొనియున్న ఆ పళ్ళెమును చూసిన విశ్వామిత్రుడు కోపంతో నిట్లన్నాడు.

విశ్వామిత్ర ఉవాచ :- విశ్వామిత్రుడు పలికాడు.

శ్వమాంసమేవ నో దేహి త్వం హరామృతముత్తమమ్ ।
నో చేత్త్వాం భస్మసాత్కుర్యామింద్రో భీతస్తదాఽబ్రవీత్ ॥ 19 ॥

మాకా కుక్క మాంసమునే యివ్వు. ఉత్తమమైన అమృతమును నీవే హరించు. లేకున్న నిన్ను భస్మం చేస్తాననగా అప్పుడు ఇంద్రుడు భయపడి ఇట్లన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

మధు హుత్వా యథాన్యాయం పిబ పుత్రైః సమన్వితః ।
కిమనేన శ్వమాంసేన అమేధ్యేన మహామునే ॥ 20 ॥

ఓ మహామునీ! న్యాయమైన రీతిలో మధువుతో హోమంచేసి నీ కుమారులతో కలిసి త్రాగుము. అసహ్యమైన ఈ కుక్క మాంసమెందుకు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విశ్వామిత్రోఽపి నేత్యాహ భుక్తేనైకేన కిం ఫలమ్ ।
ప్రజాః సర్వాశ్చ సీదన్తి కిం తేన మధునా హరే ॥ 21 ॥

విశ్వామిత్రుడా మాటను తిరస్కరించాడు. ఓ ఇంద్రా! ప్రజలంతా బాధపడుతున్నారు. నేనొక్కడిని తినడంవల్ల ప్రయోజనమేమి? ఆ మధువెందుకు?

సర్వేషామమృతం చేత్స్యాద్భోక్ష్యేఽహమమృతం శుచి ।
అథవా దేవపితరో భోక్ష్యన్తీమం శ్వమాంసకమ్ ॥ 22 ॥

అమృతమందరికీ లభించినట్లయితే శుచి అయిన ఆ అమృతమును నేను తినగలను. లేదా దేవపితరులు ఈ కుక్కమాంసమునే తినగలరు.

పశ్చాదహం తచ్చ మాంసం భోక్ష్యే నానృతమస్తి మే ।
తతో భీతః సహస్రాక్షో మేఘానాహూయ తత్క్షణాత్ ॥ 23 ॥

వవర్ష చామృతం వారి హ్యమృతేనార్పితాః ప్రజాః ।
పశ్చాత్తదమృతం పుణ్యం హరిదత్తం యథావిధి ॥ 24 ॥

తర్పయిత్వా సురానాదౌ తర్పయిత్వా జగత్త్రయమ్ ।
విప్రః సంభుక్తవాన్ శిష్యైర్విశ్వామిత్రః స్వభార్యయా ॥ 25 ॥

ఆ తరువాత నేను కూడా ఆ మాంసమును తింటాను. నేను చెప్పిన దానిలో అబద్ధమేమీ లేదు. ఆ మాట వినగానే సహస్రాక్షుడు భయపడి వెంటనే మేఘములను పిలిచి, అమృతజలమును వర్షించాడు. ప్రజలందరికీ

అమృతము లభించింది. యథావిధిగా ఇంద్రుడు కురిపించిన పవిత్రమైన అమృత ధారలతో, మొదట దేవతలకు, ఆ తరువాత ముల్లోకములవారికి తర్పణములను చేసి, విప్రుడైన విశ్వామిత్రుడు తన భార్యతో గూడ, శిష్యులందరితో కలిసి భుజించాడు.

తతః ప్రభృతి తత్తీర్థమాఖ్యాతం చాతిపుణ్యదమ్ ।
యత్రాఽఽగతః సురపతిర్లోకానామమృతార్పణమ్ ॥ 26 ॥

ఎక్కడైతే ఇంద్రుడు లోకాలన్నింటికి అమృతార్పణం చేయుటకైవచ్చాడో, ఆ ప్రదేశం అప్పటినుంచి మిక్కిలి పుణ్యమునిచ్చే తీర్థముగా ప్రసిద్ధి కెక్కింది.

సంజాతం మాంసవర్జం తు తత్తీర్థం పుణ్యదం నృణామ్ ।
తత్ర స్నానం చ దానం చ సర్వక్రతుఫలప్రదమ్ ॥ 27 ॥

మాంసంలేకుండా అమృతార్పణం జరిగిన ఆ ప్రదేశం మానవులందరికి పుణ్యమిచ్చే తీర్థమైంది. అక్కడ స్నానంచేసినా, దానంచేసినా, సమస్తయజ్ఞములు చేస్తే వచ్చే ఫలం ఈ తీర్థంవల్ల వస్తుంది.

తతః ప్రభృతి తత్తీర్థం విశ్వామిత్రమితి స్మృతమ్ ।
మధుతీర్థమథైంద్రం చ శ్యైనం పర్జన్యమేవ చ ॥ 28 ॥

అప్పటినుండి ఈతీర్థమును విశ్వామిత్రతీర్థమని, మధుతీర్థమని, ఇంద్రతీర్థమని, శ్యేనతీర్థమని, పర్జన్యతీర్థమని యంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భూనారదసంవాదే తీర్థమాహాత్మ్యే 'విశ్వామిత్ర తీర్థవర్ణనం' నామ త్రయోవింశోఽధ్యాయః ॥ 23 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో స్వయంభూనారదసంవాదంలో తీర్థమాహాత్మ్యంలో 'విశ్వామిత్రతీర్థవర్ణన' మనే పేరుగల ఇరవై మాడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్వింశోఽధ్యాయః – ఇరవై నాల్గవ అధ్యాయం

ఉత్తర తీరస్థైక లక్ష ద్వాదశ సహస్ర తీర్థ, దక్షిణతీరస్థత్రింశతి సహస్రతీర్థ వర్ణనమ్

ఉత్తరతీరంలో ఒక లక్ష పన్నెండువేల తీర్థములు, దక్షిణతీరంలో ముప్పైవేల తీర్థములవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

శ్వేతతీర్థమితి ఖ్యాతం త్రైలోక్యే విశ్రుతం శుభమ్ ।
యస్య స్మరణమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 1 ॥

ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచింది, శుభమైనదియైన శ్వేతతీర్థమనే నది ఉండేది. ఈతీర్థమును స్మరించినంతననే సమస్తపాపములు నశిస్తాయి.

శ్వేతో నామ పురా విప్రో గౌతమస్య ప్రియః సఖా ।
ఆతిథ్యపూజానిరతో గౌతమీతీరమాశ్రితః ॥ 2 ॥

పూర్వం గౌతమీనదీ తీరంలో గౌతమమహర్షికి ప్రియమైనవాడు శ్వేతుడనే బ్రాహ్మణమిత్రుడు ఉండేవాడు. అతడు అతిథులను పూజించుటలో చాలా శ్రద్ధగలవాడు.

మనసా కర్మణా వాచా శివభక్తిపరాయణః ।
ధ్యాయన్తం తం ద్విజశ్రేష్ఠం పూజయన్తం సదాశివమ్ ॥ 3 ॥

పూర్ణాయుషం ద్విజవరం శివభక్తిపరాయణమ్ ।
నేతుం దూతాః సమాజగ్ముర్దక్షిణాశాపతేస్తదా ॥ 4 ॥

మనోవాక్కాయకర్మలచే అతడు శివభక్తిపరాయణుడు. అతడు సదాశివుని పూజించేవాడు. అట్లు శివుని ధ్యానిస్తున్న, పూజిస్తున్న సదా భక్తిని గలిగియున్న ఆ పూర్ణాయువు గల ద్విజశ్రేష్ఠుని దక్షిణదిక్కుకు ప్రభువైన యమధర్మరాజుయొక్క దూతలు తీసుకొని పోవుటకై వచ్చారు.

నాశక్నువన్ గృహం తస్య ప్రవేష్టుమపి నారద ।
తదా కాలే వ్యతిక్రాన్తే చిత్రకో మృత్యుమబ్రవీత్ ॥ 5 ॥

ఓ నారదా! అతని ఇంట్లో (యమదూతలు) ప్రవేశించుటకు కూడా శక్తి హీనులయ్యారు. కొంతకాలం గడవగా అప్పుడు చిత్రకుడు మృత్యువుతో ఇలా అన్నాడు.

చిత్రక ఉవాచ :– చిత్రకుడు పలికాడు.

కిం నాఽఽయాతి క్షీణజీవో మృత్యో శ్వేతః కథం త్వితి ।
నాద్యాప్యాయాన్తి దూతాస్తే మృత్యోర్నైవోచితం హి తే ॥ 6 ॥

ఓ మృత్యువా! మరణించిన ఆ శ్వేతుడు ఇంకా ఎందుకు రావడంలేదు. (ఆ) నీ దూతలు కూడా ఇంకా రావటం లేదు. మృత్యువైన నీకిది తగింది కాదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతశ్చ కుపితో మృత్యుః ప్రాయాత్ శ్వేతగృహం స్వయమ్ ।
బహిః స్థితాంస్తదా పశ్యన్ మృత్యుదూతాన్ భయార్దితాన్ ॥
ప్రోవాచ కిమిదం దూతాః మృత్యుమూచుశ్చ దూతకాః ॥ 7 ॥

అటు పిమ్మట కోపించిన ఆ మృత్యువు స్వయంగా శ్వేతుని యింటికి వెళ్ళాడు. అక్కడ మృత్యుదూతలు భయంతో శ్వేతుని యింటి బయటనే యుండుట చూసి, ఇదేమిటని యడిగాడు. అప్పుడు దూతలు మృత్యువుతో నిట్లన్నారు.

దూతా ఊచుః :- దూతలు పలికారు.

శివేన రక్షితం శ్వేతం వయం నో వీక్షితుం క్షమాః ।
యేషాం ప్రసన్నో గిరిశస్తేషాం కా నామ భీతయః ॥ 8 ॥

శివుడు రక్షిస్తున్న శ్వేతుని చూచుటకు కూడా మేము సమర్థులం కాము. శివుడు ఎవరికి ప్రసన్నుడో వారికి భయము లెక్కడివి?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పాశపాణిస్తదా మృత్యుః ప్రావిశద్యత్ర స ద్విజః ।
నాసౌ విప్రో విజానాతి మృత్యుం వా యమకింకరాన్ ॥ 9 ॥

అప్పుడు చేతిలో పాశమును పట్టుకొని మృత్యుదేవత ఆ బ్రాహ్మణుడున్న చోటుకు వెళ్ళాడు. తన దగ్గరకు మృత్యువుగాని, యమకింకరులుగాని వచ్చినట్లా బ్రాహ్మణునకు తెలియదు.

శివం పూజయతో భక్త్యా శ్వేతస్య తు సమీపతః ।
మృత్యుం పాశధరం దృష్ట్వా నన్దీ ప్రోవాచ విస్మితః ॥ 10 ॥

భక్తితో శివుని పూజిస్తూ శ్వేతుని దగ్గరనున్న పాశధరుడైన మృత్యువును చూసి నంది ఆశ్చర్యంతో ఇట్లన్నాడు.

నన్ద్యువాచ :- నంది పలికాడు.

కిమత్ర వీక్షసే మృత్యో నన్దినం మృత్యురబ్రవీత్ ॥ 11 ॥

మృత్యూ! ఇక్కడేం చూస్తున్నావు? అనగా మృత్యువు నందితో ఇట్లన్నాడు.

మృత్యురువాచ :- మృత్యువు పలికాడు.

శ్వేతం నేతుమిహాఽఽయాతస్తస్మాద్వీక్షే ద్విజోత్తమమ్ ॥ 12 ॥

ద్విజోత్తముడైన శ్వేతుని తీసుకొని పోవుటకు ఇక్కడకు వచ్చాను. అందువలన చూస్తున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

త్వం గచ్ఛేత్యబ్రవీన్నన్దీ మృత్యుః పాశానథాక్షిపత్ ।
శ్వేతాయ మునిశార్దూల తతో నన్దీ చుకోప హ ॥ 13 ॥

నీవు వెళ్ళిపో అని నంది అనగా మృత్యువు శ్వేతునిపై పాశములను వదిలాడు. ఓ మునిశ్రేష్ఠా! అప్పుడు నంది కోపించాడు.

శివదత్తేన దణ్డేన నన్దీ మృత్యుమతాడయత్ ।
తతః పాశధరో మృత్యుః పపాత ధరణీతలే ॥ 14 ॥

నంది శివుడిచ్చిన దండంతో మృత్యువును కొట్టాడు. అప్పుడా పాశధరుడైన మృత్యువు క్రింద పడ్డాడు.

తతస్తే సత్వరం దూతా హతం మృత్యుమవేక్ష్య చ ।
యమాయ సర్వమవదన్ వధం మృత్యోస్తు నందినా ॥ 15 ॥

అప్పుడు దూతలు మరణించిన మృత్యువును చూసి యముని దగ్గరకు త్వరత్వరగా వెళ్ళి నంది మృత్యువును చంపినాడని అంతా వివరంగా చెప్పారు.

తతశ్చ కుపితో ధర్మో యమో మహిషవాహనః ।
చిత్రగుప్తం చ కాలం చ యమదణ్డం చ రక్షకమ్ ॥ 16 ॥

మహిషం భూతవేతాలానాధివ్యాధీంస్తథైవ చ ।
అక్షిరోగాన్ కుక్షిరోగాన్ కర్ణశూలం తథైవ చ ॥ 17 ॥

జ్వరం చ త్రివిధం పాపం నరకాణి పృథక్ పృథక్ ।
త్వరన్తామితి తానుక్త్వా జగామ త్వరితో యమః ॥ 18 ॥

అప్పుడు మహిషవాహనుడైన యమధర్మరాజు కోపించి చిత్రగుప్తుని, కాలుని, రక్షకమైన యమదండమును. మహిషుని, భూతబేతాలులను, ఆధివ్యాధులను అట్లే నేత్రరోగములను, ఉదరరోగములను, చెవినొప్పిని మరియు జ్వరమును, మనోవాక్కాయకర్మలచే చేయు పాపములను, నరకములను భిన్న భిన్నములైన నరకములను త్వరపడండని ఆజ్ఞాపించి యముడు త్వరత్వరగా వెళ్ళాడు.

ఏతైరన్యైః పరివృతో యత్ర శ్వేతో ద్విజోత్తమః ।
తమాయాన్తం యమం దృష్ట్వా నన్దీ ప్రోవాచ సాయుధః ॥ 19 ॥

వినాయకం తథా స్కన్దం భూతనాథం తు దణ్డినమ్ ।
తత్ర తద్యుద్ధమభవత్సర్వలోకభయావహమ్ ॥ 20 ॥

వీరందరితో కూడుకొనియున్న ద్విజశ్రేష్ఠుడగు శ్వేతుని వద్దకు వచ్చుచున్న యముని చూచి ఆయుధధారియగు నంది వినాయకుని, స్కందుని, భూతనాథుని, దండిని మొదలగు వారిని ప్రేరేపించాడు. అక్కడ లోకాన్నంతటినీ భయపెట్టే గొప్ప యుద్ధం జరిగింది.

కార్తికేయః స్వయం శక్త్యా బిభేద యమకింకరాన్ ।
దక్షిణాశాపతిం చాపి నిజఘాన బలాన్వితమ్ ॥ 21 ॥

కార్తికేయుడు స్వయంగా తన శక్త్యాయుధంతో యమకింకరులను భేదించాడు. బలాన్వితుడైన దక్షిణ దిక్కుకు అధిపతియైన యముని గూడా చంపేశాడు.

హతావశిష్టా యామ్యాస్తే ఆదిత్యాయ న్యవేదయన్ ।
ఆదిత్యోఽపి సురైః సార్ధం శ్రుత్వా తన్మహదద్భుతమ్ ॥ 22 ॥

లోకపాలైరనువృతో మమాన్తికముపాగమత్ ।
అహం విష్ణుశ్చ భగవానింద్రోఽగ్నిర్వరుణస్తథా ॥ 23 ॥

చంద్రాదిత్యావశ్వినౌ చ లోకపాలా మరుద్గణాః ।
ఏతే చాన్యే చ బహవో వయం యాతా యమాన్తికమ్ ॥ 24 ॥

చావగా మిగిలిన యమకింకరులు సూర్యునికి చెప్పారు. సూర్యుడు కూడా దేవతలందరితో కలిసి ఆ ఆశ్చర్యకరమైన విషయమును విని, లోకపాలురందరితో కలిసి నా దగ్గరకు వచ్చాడు. నేను, విష్ణువు, పూజ్యుడైన ఇంద్రుడు, అగ్ని, వరుణుడు అట్లే చంద్రసూర్యులు, అశ్వినీదేవతలు, లోకపాలకులు, మరుద్గణములు వీరేకాక ఇంకా ఇతరులు, మేమంతా కలిసి యముని వద్దకు వెళ్ళాము.

మృత ఆస్తే దక్షిణేశో గంగాతీరే బలాన్వితః ।
సముద్రాశ్చ నదా నాగా నానాభూతాన్యనేకశః ॥ 25 ॥

తత్రాఽఽజగ్ముః సురేశానం ద్రష్టుం వైవస్వతం యమమ్ ।
తం దృష్ట్వా హతసైన్యం చ యమం దేవా భయార్దితాః ॥
కృతాంజలిపుటాః శంభుమూచుః సర్వే పునః పునః ॥ 26 ॥

గంగాతీరమందు తన సైనికసమూహంతోపాటు యముడు చచ్చి పడి యున్నాడు. సముద్రములు, నదములు, నాగులు ఇంకా ఇతరమైన భూతములన్నియు, సూర్యకుమారుడు, సురేశానుడైన యముని చూచుటకు వచ్చారు. సైన్యంతోపాటు మరణించిన యముని చూచి దేవతలు భయపడ్డారు. వారందరు రెండు చేతులను జోడించి శివునకు నమస్కరిస్తూ మాటి మాటికి ఇట్లన్నారు.

దేవా ఊచుః :- దేవతులు పలికారు.

భక్తప్రియత్వం తే నిత్యం దుష్టహన్తృత్వమేవ చ ।
ఆదికర్తర్నమస్తుభ్యం నీలకంఠ నమోఽస్తు తే ॥ 27 ॥
బ్రహ్మప్రియ నమస్తేఽస్తు దేవప్రియ నమోఽస్తు తే ॥

నీ వెప్పుడూ భక్తులకు ప్రియమును కలిగించి, దుష్టులను సంహరించేవానివి. ఓ ఆదికర్తా! నీలకంఠా! నీకు నమస్కారం. ఓ బ్రహ్మప్రియా, దేవప్రియా! నీకు నమస్కారం.

శ్వేతం ద్విజం భక్తమనాయుషం తే నేతుం యమాదిః సకలోఽసమర్థః ।
సంతోషమాప్తాః పరమం సమీక్ష్య భక్తప్రియత్వం త్వయి నాథ సత్యమ్ ॥ 28 ॥

నీ భక్తుడు, ఆయువురహితుడైన శ్వేతుని యమాదులెవ్వరూకూడా తీసుకొని పోవుటకు సమర్థులు కారు. స్వామీ! భక్తప్రియత్వమనేది నీ విషయంలో సత్యము. అందరూ కూడా అది చూసి మిక్కిలిసంతోషమును పొందారు.

యే తు ప్రపన్నాః శరణం కృపాలుం నాలంకృతాన్తోఽప్యనువీక్షితుం తాన్ ।
ఏవం విదిత్వా శివ ఏవ సర్వే త్వామేవ భక్త్యా పరయా భజన్తే ॥ 29 ॥

ఓ శివా! ప్రపన్నులైన వారు నిన్నే శరణు పొందుటయే కాక వారిని చూచుటకు యముడు కూడా జంకుతాడు. అది తెలుసుకొని నిన్నే పరభక్తితో అందరు భజిస్తారు.

త్వమేవ జగతాం నాథస్త్వమేవ జగతాం పతిః ।
త్వాం వినా కః సమర్థోఽత్ర వ్యవస్థాం కర్తుమీశ్వరః ॥ 30 ॥

నీవే ఈజగత్తునకంతా నాథుడవు, నీవే జగత్పతివి. నీవు కాక మరొక్కడు సమర్థుడెవరు? ఈ వ్యవస్థనంతా నడిపించుటకు నీవే సమర్థుడవు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతాం తేషాం పురస్తాదభవచ్ఛివః ।
కిం దదామీతి సానన్దమిదమూచుః సురా అపి ॥ 31 ॥

ఇట్లు స్తోత్రం చేస్తున్న వారి ముందు శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఏమి కావలెనో అడగండనగా దేవతలు సంతోషపడి ఇట్లన్నారు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

అయం వైవస్వతో ధర్మో నియన్తా సర్వదేహినామ్ ।
ధర్మాధర్మవ్యవస్థాయాం స్థాపితో లోకపాలకః ॥ 32 ॥

ఈ సూర్యకుమారుడైన యమధర్మరాజు సమస్తజీవులపట్ల నియమంగా నుండువాడు. ధర్మాధర్మ వ్యవస్థను నడిపించుటకై లోకపాలకునిగా నియమించబడ్డాడు.

నాయం వధమవాప్నోతి నాపరాధీ న పాపకృత్ ।
వినా తేన జగద్ధాతుర్నైవ కించిద్భవిష్యతి ॥ 33 ॥

ఇతడే అపరాధంచేయలేదు, ఏ పాపమూ చేయలేదు. ఇతణ్ణి చంపుటకు వీల్లేదు. అతను లేకుండా ఈ లోకంలో ఏ జీవి ఉండదు.

తస్మాజ్జీవయ దేవేశ యమం సబలవాహనమ్ ।
ప్రార్థనా సఫలా నాథ మహత్సు న వృథా భవేత్ ॥ 34 ॥

అందువలన ఓ దేవేశా! యముని, అతని సైన్యము, వాహనములతోపాటు జీవించేట్లుగా చేయి. స్వామీ! మహాత్ములను స్తోత్రం చేస్తే అది సఫలమగునేగాని వృథా కాదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రోవాచ భగవాన్ జీవయేయమసంశయమ్ ।
యమం యది వచో మేఽద్య అనుమన్యన్తి దేవతాః ॥ 35 ॥

అప్పుడు శివుడిట్లన్నాడు ఒక వేళ దేవతలందరూ నా మాటపై విశ్వాసముంచితే ఇప్పుడే ఆ యముని బ్రతికించగలను. దీనిలో నే మాత్రం సందేహం లేదు.

తతః ప్రోచుః సురాః సర్వే కుర్మో వాక్యం త్వయోదితమ్ ।
హరిబ్రహ్మాదిసహితం వశే యస్యాఖిలం జగత్ ॥ 36 ॥

హరిబ్రహ్మాదులతోపాటు ఈ జగత్తంతా నీ వశమునందేయుంది. నీవు చెప్పినట్లుగా మేము చేస్తామని దేవతలన్నారు.

తతః ప్రోవాచ భగవానమరాన్ సముపాగతాన్ ।
మద్భక్తో న మృతిం యాతు నేత్యూచురమరాః పునః ॥ 37 ॥

తన దగ్గర నున్న దేవతలతో శివుడిట్లన్నాడు. నా భక్తుడెవడూ మరణం నొందకుండుగాక! దానికి దేవతలు సమ్మతించక మరల నిట్లన్నారు.

అమరాః స్యుస్తతో దేవ సర్వలోకాశ్చరాచరాః ।
అమర్త్య మర్త్య భేదోఽయం న స్యాద్దేవ జగన్మయ ॥ 38 ॥

ఓ దేవా! అట్లయితే సమస్తలోకములందుండే చరాచరములన్నీ కూడా మరణములేనివే అవుతాయి. ఓ జగత్తంతా నిండియున్న దేవా! అప్పుడు అమర్త్యులు, మర్త్యులనే భేదమే యుండదు.

పునరప్యాహ తాన్ శంభుః శృణ్వన్తు మమ భాషితమ్ ।
మద్భక్తానాం వైష్ణవానాం గౌతమీమనుసేవతామ్ ॥ 39 ॥

దేవతల మాటవిన్న శివుడు తిరిగి వారితో ఇట్లన్నాడు నామాట వినండి. గౌతమిని సేవించినవారికి, విష్ణుభక్తులకు, నా వారికి మరణం లేదు.

వయం తు స్వామినో నిత్యం న మృత్యుః స్వామ్యమర్హతి ।
వార్తాఽప్యేషా న కర్తవ్యా యమేన తు కదాచన ॥ 40 ॥

ఆధివ్యాధ్యాదిభిర్జాతు కార్యో నాభిభవః క్వచిత్ ।
యే శివం శరణం యాతాస్తే ముక్తాస్తత్క్షణాదపి ॥ 41 ॥

సానుగస్య యమస్యాతో నమస్యాః సర్వ ఏవ తే ।
తథేత్యూచుః సురగణా దేవదేవం శివం ప్రతి ॥ 42 ॥

అపుడు దేవగణాలన్నీ దేవదేవుడైన శివునితో సరేనని ఇలా అన్నాయి–మేము సర్వదా యజమానులము, మృత్యువెప్పుడూ స్వామిత్వమునకర్హం కాదు. యముడు ఇటువంటి ఆలోచనను కూడా చేయకూడదు. శివుని శరణుపొందువారికి ఆధి, వ్యాధులు మున్నగు వానివలన వచ్చే దోషములంటవు. వారు ఆ క్షణంలోనే ముక్తులవుతారు. అందువలన అనుచరగణముతో కూడుకొన్న యమునికి ఆ ఆధివ్యాధులన్నీ నమస్కరింపదగినవే.

తతశ్చ భగవాన్నాథో నన్దినం ప్రాహ వాహనమ్ ॥ 43 ॥

ఆ తరువాత భగవంతుడైన శివుడు తనవాహనమైన నందితో నిట్లన్నాడు.

శివ ఉవాచ :– శివుడు పలికాడు.

గౌతమ్యా ఉదకేన త్వమభిషించ మృతం యమమ్ ॥ 44 ॥

నందీ! గౌతమీజలంతో మరణించిన యముని అభిషేకించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో యమాదయః సర్వే అభిషిక్తాస్తు నన్దినా ।
ఉత్థితాశ్చ సజీవాస్తే దక్షిణాశాం తతో గతాః ॥ 45 ॥

నంది యమాదులందరినీ గౌతమీజలంతో అభిషేకించగానే వారు సజీవులై లేచి దక్షిణ దిక్కుకువెళ్ళారు.

ఉత్తరే గౌతమీతీరే విష్ణ్వాద్యాః సర్వదేవతాః ।
స్థితా ఆసన్ పూజయన్తో దేవదేవం మహేశ్వరమ్ ॥ 46 ॥

గౌతమీనది ఉత్తరతీరంలో విష్ణువు మొదలైన సమస్తదేవతలు దేవదేవుడైన మహేశ్వరుని పూజిస్తు ఉండిరి.

తత్రాఽఽసన్నయుతాన్యష్ట సహస్రాణి చతుర్దశ ।
తథా షట్ చ సహస్రాణి పునః షట్ చ తథైవ చ ॥ 47 ॥

షట్ దక్షిణే తథా తీరే తీర్థానామయుతత్రయమ్ ।
పుణ్యమాఖ్యానమేతద్ధి శ్వేతతీర్థస్య నారద ॥ 48 ॥

గౌతమీనదియొక్క ఉత్తరతీరంలో అనేకమైన పవిత్రతీర్థములున్నాయి. అవి ఎనిమిది అయుతములు (80,000వేలు), చతుర్దశసహస్రములు (14000 వేలు), షట్ సహస్రములు (6000వేలు), తిరిగి షట్ సహస్రములు

(6000వేలు) అట్లే ఇంకను. షట్ సహస్రములు (6000వేలు) మొత్తం (1,12,000) ఒక లక్షా పన్నెండు వేలు ఉత్తరతీరంలో, ఇక దక్షిణతీరంలో అయుతత్రయము(30,000వేలు) ఉన్నవి. ఓ నారదా! నేనింతవరకు చెప్పింది శ్వేతతీర్థమాహాత్మ్యము. ఈఆఖ్యానం మిక్కిలి పుణ్యప్రదమైనది.

యత్రాసౌ పతితో మృత్యుర్మృత్యుతీర్థం తదుచ్యతే ।
తస్య శ్రవణమాత్రేణ సహస్రం జీవతే సమాః ॥ 49 ॥

ఎక్కడైతే యముడు కూడా మృత్యువాత పడ్డాడో దానిని మృత్యుతీర్థమని అంటారు. ఈ తీర్థమును గూర్చి నరులు విన్నంతమాత్రంచే వేయిసంవత్సరములు జీవిస్తారు.

తత్ర స్నానం చ దానం చ సర్వపాపప్రణాశనమ్ ।
శ్రవణం పఠనం చాపి స్మరణం చ మలాపహమ్ ॥
కరోతి సర్వలోకానాం భుక్తిముక్తిప్రదాయకమ్ ॥ 50 ॥

ఈ శ్వేతతీర్థంలో స్నానం చేసినా, దానం చేసినా పాపములన్నీ నశిస్తాయి. ఈ తీర్థమునుగూర్చి విన్నా, చదివినా, స్మరించినా దోషములన్నీ పోతాయి. సర్వలోకములకు భుక్తిని, ముక్తిని ప్రసాదిస్తుందీ తీర్థము.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'ఉత్తరతీరస్థైకలక్ష ద్వాదశ సహస్ర తీర్థ, దక్షిణతీరస్థత్రింశత్సహస్రతీర్థవర్ణనం' నామ చతుర్వింశోఽధ్యాయః ॥ 24 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'ఉత్తరతీరంలో ఒక లక్ష పన్నెండు వేల తీర్థములు, దక్షిణతీరంలో ముప్పదివేల తీర్థవర్ణన'మనే పేరుగల ఇరవై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచవింశోఽధ్యాయః - ఇరవై ఐదవ అధ్యాయం

శుక్రతీర్థ మృతసంజీవినీతీర్థమాహాత్మ్యనిరూపణమ్

శుక్రతీర్థ మృతసంజీవినీ తీర్థమాహాత్మ్యనిరూపణం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శుక్రతీర్థమితి ఖ్యాతం సర్వసిద్ధికరం నృణామ్ ।
సర్వపాపప్రశమనం సర్వవ్యాధివినాశనమ్ ॥ 1 ॥

మానవులకు సమస్త కోరికలను సిద్ధింప చేసేది, సమస్తపాపములను నశింపచేసేది, సమస్తవ్యాధులను, ఉపశమింపచేసేది శుక్రతీర్థమని ప్రసిద్ధిచెందింది ఉండేది.

అంగిరాశ్చ భృగుశ్చైవ ఋషీ పరమధార్మికౌ ।
తయోః పుత్రౌ మహాప్రాజ్ఞౌ రూపబుద్ధివిలాసినౌ ॥ 2 ॥

అంగిరసుడు, భృగువు అను ఇద్దరు పరమధార్మికులైన ఋషులు ఉండేవారు. వారిద్దరికి గొప్ప తెలివి, రూపం, బుద్ధి, విలాసంగల ఇద్దరు పుత్రులు కలరు.

జీవః కవిరితి ఖ్యాతౌ మాతాపిత్రోర్వశే రతౌ ।
ఉపనీతౌ సుతౌ దృష్ట్వా పితరావూచతుర్మిథః ॥ 3 ॥

వారు జీవుడు, కవి అనే పేర్లతో ప్రసిద్ధిచెందారు. తల్లిదండ్రుల ఆజ్ఞానుసారంగా నడుచుకొనేవారు. ఉపనయనమైన వారిని చూచి ఆ తండ్రులిరువురు పరస్పరం ఇలా అన్నారు.

ఋషీ ఊచతుః :- ఋషులు పలికారు.

ఆవయోరేక ఏవాస్తు శాస్తా నిత్యం చ పుత్రయోః ।
తస్మాదేకః శాసితా స్యాత్తిష్ఠత్యేకో యథాసుఖమ్ ॥ 4 ॥

మా యిద్దరిలో ఎవరో ఒకరు ఈ పుత్రులిద్దరకు అధ్యాపనం చేస్తారు. ఒకరు బోధకుడుగా ఉండగా మరొకరు యథాసుఖంగా నుంటారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా తతః శీఘ్రమంగిరాః ప్రాహ భార్గవమ్ ।
అధ్యాపయిష్యే సదృశం సుఖం తిష్ఠతు భార్గవః ॥ 5 ॥

ఈ మాట అన్న వెంటనే అంగిరసుడు భృగువుతో నేను అధ్యాపనం చేస్తాను, భృగువు సుఖంగా విశ్రాంతి తీసుకొంటాడు అన్నాడు.

ఏతచ్ఛ్రుత్వా చాంగిరసో వాక్యం భృగుకులోద్వహః ।
తథేతి మత్వాఽఙ్గిరసే శుక్రం తస్మై న్యవేదయత్ ॥ 6 ॥

అంగిరసుడు పలికిన ఈ మాటనువిన్న భృగువంశమువాడైన భృగువు సరే యని శుక్రుని అతని కప్పగించాడు.

ఉభావపి సుతౌ నిత్యమధ్యాపయతి వై పృథక్ ।
వైషమ్యబుద్ధ్యా తౌ బాలౌ చిరాచ్ఛుక్రోఽబ్రవీదిదమ్ ॥ 7 ॥

అంగిరసుడా యిద్దరు బాలకులకు, వైషమ్యబుద్ధితో విద్యనేర్పుతున్నాడు. కొంత కాలానికి శుక్రుడిట్లన్నాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు పలికాడు.

వైషమ్యేణ గురో మాం త్వమధ్యాపయసి నిత్యశః ।
గురూణాం నేదముచితం వైషమ్యం పుత్రశిష్యయోః ॥ 8 ॥

ఆచార్యా! నీవు నాకు ప్రతిదినం వేరుగా బోధిస్తున్నావు. పుత్రశిష్యులయందు భేదము చూపుట గురువులకిది ఉచితం కాదు.

వైషమ్యేణ చ వర్తన్తే మూఢాః శిష్యేషు దేశికాః ।
నైషా విషమబుద్ధీనాం సంఖ్యా పాపస్య విద్యతే ॥ 9 ॥

మూఢులైన గురువులు మాత్రమే శిష్యులయందు భేదభావమును చూపుతారు. అటువంటి విషమబుద్ధిగల గురువులకు (తగిలే) పాపసంఖ్య ఇంత అని చెప్పుట వీలుకానిది.

ఆచార్య సమ్యక్ జ్ఞాతోఽసి నమస్యేఽహం పునః పునః ।
గచ్ఛేయం గురుమన్యం వై మామనుజ్ఞాతుమర్హసి ॥ 10 ॥

ఆచార్యా! మీరు బాగా ఎరుగుదురు. మీకు మాటి మాటికి నమస్కారం. నేను మరొక గురువు వద్దకు వెళు తున్నాను. నాకు సెలవీయండి.

గచ్ఛేయం పితరం బ్రహ్మన్ యద్యసౌ విషమో భవేత్ ।
తతో వాఽన్యత్ర గచ్ఛామి స్వామిన్ పృష్టోఽసి గమ్యతే ॥ 11 ॥

ఓ బ్రహ్మస్వరూపా! మొదట నా తండ్రి వద్దకు వెళుతాను. ఒకవేళ నా తండ్రి నా విషయంలో అనుకూలించకపోతే తరువాత మరొక చోటుకు వెళతాను. స్వామీ! మిమ్మల్ని అడిగాను. నాకు సెలవివ్వండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

గురుం బృహస్పతిం పృష్ట్వా అనుజ్ఞాతస్త్వగాత్తతః ।
అవాప్తవిద్యః పితరం గచ్ఛేయం చేత్యచిన్తయత్ ॥ 12 ॥

గురువైన బృహస్పతినడిగి అతని అనుజ్ఞను పొంది, విద్య పూర్తి అయిన తరువాత నాన్నగారి వద్దకు వెళతాను అని అనుకొన్నాడు.

తస్మాత్కమనుపృచ్ఛేయముత్కృష్టః కో గురుర్భవేత్ ।
ఇతి స్మరన్మహాప్రాజ్ఞమపృచ్ఛద్వృద్ధగౌతమమ్ ॥ 13 ॥

అతని కంటె ఉత్కృష్టుడైన గురువెవరున్నారు, అని అనుకొని పూజ్యుడైన గౌతముని యడిగాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు పలికాడు.

కో గురుః స్యాన్మునిశ్రేష్ఠ మమ బ్రూహి గురుర్భవేత్ ।
త్రయాణామపి లోకనాం యో గురుస్తం వ్రజామ్యహమ్ ॥ 14 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! నాకు గురువెవరౌతారో చెప్పు. ముల్లోకములకెవరు గురువో వారి వద్దకు వెళతాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స ప్రాహ జగతామీశం శమ్భుం దేవం జగద్గురుమ్ ।
శుక్రః ప్రాహ కథం తం వై పశ్యేయం త్రిదశేశ్వరమ్ ॥
క్వాఽఽరాధయామి గిరిశమిత్యుక్తః ప్రాహ గౌతమః ॥ 15 ॥

అప్పుడు గౌతముడు జగత్తునకీశుడైన శంకరుడు జగద్గురువని చెప్పాడు. నేనా ముల్లోకాధీశుడైన శివుని ఎలా చూడగలను? ఎట్లు, ఎక్కడ ఆరాధించగలను? అని శుక్రుడడుగగా గౌతముడిట్లన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

గౌతమ్యాం చ శుచిర్భూత్వా స్తోత్రైస్తోషయ శంకరమ్ ।
తతస్తుష్టో జగన్నాథః స తే విద్యాం ప్రదాస్యతి ॥ 16 ॥

గౌతమీనదిలో స్నానంచేసి, స్తోత్రములతో శివుని సంతోషపెట్టు. అప్పుడు సంతోషించిన ఆ జగన్నాథుడు నీకు విద్య నివ్వగలడు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

గౌతమస్య తు తద్వాక్యాత్ప్రాగాద్గంగాం స భార్గవః ।
స్నాత్వా భూత్వా శుచిః సమ్యక్ స్తుతిం చక్రే స బాలకః ॥ 17 ॥

గౌతముడు చెప్పిన ప్రకారంగా శుక్రుడు గంగానదివద్దకు వెళ్ళాడు. ఆ బాలకుడు గంగానదిలో స్నానం చేసి, శుచియై, చక్కగా శంకరుని స్తోత్రం చేశాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు ఇలా స్తోత్రం చేశాడు.

దీననాథైకశరణం శమ్భో త్వాం శరణం గతః ।
బాలోఽహం బాలబుద్ధిశ్చ బాలచంద్రధర ప్రభో ॥
నాహం జానామితే కించిత్ స్తుతిం కర్తుం నమోఽస్తు తే ॥ 18 ॥

దీనులందరికీ నీవొక్కడివే దిక్కని పిలిచే ఓ శంకరా! నేను నిన్ను శరణుగోరుతున్నాను. ఓ ప్రభూ! బాలచంద్రుని ధరించినవాడా! నేనజ్ఞానిని, బాలుడను, నిన్నెట్లు స్తోత్రము చేయవలెనో కూడా తెలియని వాడిని. నీకు నమస్కారం.

పరిత్యక్తస్య గురుణా న మమాస్తి సుహృత్సఖా ।
త్వం ప్రభుః సర్వభావేన జగన్నాథ నమోఽస్తు తే ॥ 19 ॥

నా గురువు నన్ను వదిలిపెట్టాడు. నాకాత్మీయులుగాని, స్నేహితులుకాని ఎవరూ లేరు. అన్నివిధములుగా నీవే ప్రభువువు. ఓ జగన్నాథా! నీకు నమస్కారం.

గురుర్గురుమతాం దేవ మహతాం చ మహానసి ।
అహమల్పతరో బాలో జగన్మయ నమోఽస్తు తే ॥ 20 ॥

దేవా! గురువులందరికి కూడా నీవే గురువు. గొప్పవారందరికీ కూడా నీవే గొప్పవాడవు. నేనల్పులులో కెల్ల అల్పుడను. ఓ జగన్మయా! నీకు నమస్కారం.

విద్యార్థం పాహి సురేశాన నాహం వేద్మి భవద్గతిమ్ ।
మాం త్వం చ కృపయా పశ్య లోకసాక్షిన్నమోఽస్తు తే ॥ 21 ॥

ఓ సురేశానా! నీ మార్గమును నేనెరుగను. నేను విద్య నేర్చుకొనుటకు తపిస్తున్నాను. ఓ లోకసాక్షీ! నన్ను నీవు దయతో చూడు. నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతస్తస్య ప్రసన్నోఽభూత్సురేశ్వరః ॥ 22 ॥

ఇలా అతడు స్తోత్రం చేయగానే శివుడు ప్రసన్నుడయ్యాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

కామం వరయ భద్రం తే యచ్చాపి సురదుర్లభమ్ ॥ 23 ॥

దేవతలకు కూడా దుర్లభమైన వరమేదైనా కోరుకో.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కవిరప్యాహ దేవేశం కృతాంజలిరుదారధీః ॥ 24 ॥

ఉదారబుద్ధి కలిగిన శుక్రుడు కూడా శివునితో నిట్లన్నాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు పలికాడు.

బ్రహ్మాదిభిశ్చ ఋషిభిర్యా విద్యా నైవ గోచరా ।
తాం విద్యాం నాథ యాచిష్యే త్వం గురుర్మమ దైవతమ్ ॥ 25 ॥

ప్రభూ! నా దైవం, గురువు, నీవే. బ్రహ్మాదులు, ఋషులు మున్నగు వారికి కూడా గోచరంకాని విద్యను యాచిస్తున్నాను. దానిని నా కనుగ్రహించండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మృతసంజీవినీం విద్యామజ్ఞాతాం త్రిదశైరపి ।
తాం దత్తవాన్సురశ్రేష్ఠస్తస్మై శుక్రాయ యాచతే ॥ 26 ॥

దేవతాశ్రేష్ఠుడైన శివుడు తనను యాచించిన శుక్రునకు దేవతలెవరికీ తెలియని మృతసంజీవినీవిద్యను ప్రసాదించాడు.

ఇతరా లౌకికీ విద్యా వైదికీ చాన్యగోచరా ।
కిం పునః శంకరే తుష్టే విచార్యమవశిష్యతే ॥ 27 ॥

శంకరుడు ప్రసన్నుడైన తరువాత కొదవేమి ఉంటుంది? ఇతరులకు గోచరంకాని లౌకికవిద్యను, వైదిక విద్యను ఆ శుక్రున కిచ్చాడు.

స తు లబ్ధ్వా మహావిద్యాం ప్రాయాత్స్వపితరం గురుమ్ ।
దైత్యానాం చ గురుశ్చాఽసీద్విద్యయా పూజితః కవిః ॥ 28 ॥

శుక్రుడా మహావిద్యనుపొంది పూజనీయుడైన తన తండ్రివద్దకు వెళ్ళాడు. ఆ తరువాత మృతసంజీవినీ విద్యతో దైత్యులకు గురువు కూడా అయ్యాడు.

తతః కదాచిత్తాం విద్యాం కస్మిం శ్చిత్కారణాన్తరే ।
కచో బృహస్పతిసుతో విద్యాం ప్రాప్తః కవేస్తు తామ్ ॥ 29 ॥

కచాద్బృహస్పతిశ్చాపి తతో దేవాః పృథక్ పృథక్ ।
అవాపుర్మహతీం విద్యాం యామాహుర్మృతజీవినీమ్ ॥ 30 ॥

కారణాంతరములవల్ల ఆ తరువాత మృతసంజీవినీవిద్యను బృహస్పతికుమారుడైన కచుడు పొందాడు. శుక్రుడు దానిని కచునకు అనుగ్రహించగా కచునినుండి బృహస్పతి, దేవతలు వేరువేరుగా ఆ గొప్పదైన మృతసంజీవినీవిద్యను పొందారు.

యత్ర సా కవినా ప్రాప్తా విద్యాఽఽపూజ్య మహేశ్వరమ్ ।
గౌతమ్యా ఉత్తరే పారే శుక్రతీర్థం తదుచ్యతే ॥ 31 ॥

మహేశ్వరుని ప్రార్థించి శుక్రుడు మృతసంజీవినీవిద్యను పొందిన ఆ గౌతమీనదియొక్క ఉత్తర తీరంలో నున్న ఆ ప్రదేశమును శుక్రతీర్థము అని పిలుస్తారు.

మృతసంజీవినీతీర్థమాయురారోగ్యవర్ధనమ్ ।
స్నానం దానం చ యత్కించిత్సర్వమక్షయపుణ్యదమ్ ॥ 32 ॥

ఈ మృతసంజీవినీతీర్థము ఆయురారోగ్యములను వృద్ధి చేయును. ఈ తీర్థంలో స్నానం చేసినా, ఏ కొంచెం దానం చేసినా అదంతా అక్షయమైన పుణ్యమును ప్రసాదిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే స్వయమ్భూనారదసంవాదే 'శుక్రతీర్థ, మృతసంజీవినీ తీర్థమాహాత్మ్యనిరూపణం' నామ పంచవింశోఽధ్యాయః ॥ 25 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో, బ్రహ్మనారదులసంవాదములో 'శుక్రతీర్థ, మృత సంజీవినీతీర్థ మాహాత్మ్యనిరూపణ'మనే పేరుగల ఇరవై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షడ్వింశోఽధ్యాయః - ఇరవై ఆరవ అధ్యాయం

పుణ్యాసిక్తాసంగమేంద్రతీర్థాది సప్తసహస్రతీర్థవర్ణనమ్

పుణ్యాసిక్తాసంగమ ఇంద్రతీర్థాది సప్తసహస్రతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇంద్రతీర్థమితి ఖ్యాతం బ్రహ్మహత్యావినాశనమ్ ।
స్మరణాదపి పాపౌఘక్లేశసంఘవినాశనమ్ ॥ 1 ॥

ఇంద్రతీర్థమనేది చాలా ప్రసిద్ధమైనది ఉండేది. ఇది బ్రహ్మహత్యాది పాతకములనుకూడా తొలగిస్తుంది. ఈ తీర్థమును స్మరించినంతనే సమస్త పాపసమూహం నశించి దుఃఖములు తొలగుతాయి.

పురా వృత్రవధే వృత్తే బ్రహ్మహత్యా తు నారద ।
శచీపతిం చానుగతాఽబిభ్యద్దృష్ట్వా తు తాం హరిః ॥ 2 ॥

ఓ నారదా! పూర్వం వృత్రాసురవధ వృత్తాంతంలో బ్రహ్మహత్యాపాపం శచీపతియైన ఇంద్రుని వెంటాడింది. దాన్ని చూసి ఆ ఇంద్రుడు భయపడ్డాడు.

ఇన్ద్రస్తతో వృత్రహన్తా ఇతశ్చేతశ్చ ధావతి ।
యత్ర యత్ర త్వసౌ యాతి హత్యా సాఽపీన్ద్రగామినీ ॥ 3 ॥

అప్పుడు వృత్రుని చంపిన ఇంద్రుడు ఇటు నటు పరుగెత్తుతుండెను. ఎక్కడెక్కడికింద్రుడు వెళ్తే ఆ హత్యాపాపం అతనినే అనుసరిస్తుండినది.

స మహత్సర ఆవిశ్య పద్మనాలముపాగమత్ ।
తత్రాసౌ తన్తువద్భూత్వా వాసం చక్రే శచీపతిః ॥ 4 ॥

అప్పుడా ఇంద్రుడొక పెద్ద సరస్సులో ప్రవేశించి పద్మపుకాడను చేరాడు. ఆ కాడలో ఒక దారమై దానిలోనే నివసిస్తుండేవాడు.

సరస్తీరేఽపి హత్యాఽఽసీద్దివ్యం వర్షసహస్రకమ్ ।
ఏతస్మిన్నన్తరే దేవా నిరిన్ద్రా హ్యభవన్మునే ॥ 5 ॥

ఆ సరస్సు ఒడ్డునే వేల దేవతాసంవత్సరముల కాలం హత్య కూడా వేచియుండినది. ఓ మునీ! ఇంతలో దేవతలు ఇంద్రరహితులై యున్నారు.

మన్త్రయామాసురవ్యగ్రాః కథమిన్ద్రో భవేదితి ।
తత్రాహమవదం దేవాన్ హత్యాస్థానం ప్రకల్ప్య చ ॥ 6 ॥
ఇన్ద్రస్య పావనార్థాయ గౌతమ్యామభిషిచ్యతామ్ ।
యత్రాభిషిక్తః పూతాత్మా పునరింద్రో భవిష్యతి ॥ 7 ॥

ఇంద్రుడెలా వున్నాడో ఏమో అని దేవతలు ఆలోచిస్తున్నారు. అప్పుడు నేనే వారితో హత్యాస్థానమును గూర్చి వివరించి, ఇంద్రుడు పవిత్రుడగుటకు అతనిని గౌతమీనదిలో స్నానం చేయించండి. ఆ నదిలో స్నానం చేయిస్తే పూతాత్ముడై తిరిగి ఇంద్రస్థానమును పొందుతాడు అని చెప్పాను.

తథా తే నిశ్చయం కృత్వా గౌతమీం శీఘ్రమాగమన్ ।
తత్ర స్నాతం సురపతిం దేవాశ్చ ఋషయస్తథా ॥ 8 ॥

వారలాగే యని నిశ్చయించి ఇంద్రుని స్నానం చేయించుటకు దేవతలు, ఋషులు గౌతమీనదివద్దకు తొందరగా వచ్చారు.

అభిషేక్తుకామాస్తే సర్వే శచీకాన్తం చ తస్థిరే ।
అభిషిచ్యమానమింద్రం తం ప్రకోపాద్గౌతమోऽబ్రవీత్ ॥ 9 ॥

ఇంద్రుని యభిషేకించవలెననే కోరికతో ఇంద్రునివద్దకువచ్చి స్నానం చేయించబోతున్న ఇంద్రుని చూసి గౌతముడు కోపంతో ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

అభిషేక్ష్యన్తి పాపిష్ఠం మహేన్ద్రం గురుతల్పగమ్ ।
తాన్ సర్వాన్భస్మసాత్కుర్యాం శీఘ్రం యాన్త్వసురారయః ॥ 10 ॥

గురుపత్నితో సంగమించిన పాపిష్ఠుడైన మహేంద్రుని అభిషేకించాలనే వారినందరినీ భస్మం చేస్తాను. దేవతలంతా ముందిక్కడి నుండి వెళ్ళిపొండి అన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదృషేర్వచనం శ్రుత్వా పరిహత్య చ గౌతమీమ్ ।
నర్మదామగమన్సర్వ ఇన్ద్రమాదాయ సత్వరాః ॥ 11 ॥

గౌతముని మాటలను విన్నంతనే వారంతా ఇంద్రుని తీసుకొని, గౌతమిని వదిలిపెట్టి నర్మదానదికి త్వరగా వెళ్ళారు.

ఉత్తరే నర్మదాతీరే అభిషేకాయ తస్థిరే ।
అభిషేక్ష్యమాణమిన్ద్రం తం మాణ్డవ్యో భగవాన్ ఋషిః ॥ 12 ॥

నర్మదానది కుత్తరభాగంలో అభిషేకం చేయుటకై నిలచారు. అభిషేకం చేసుకోబోవుతున్న ఇంద్రునితో పూజ్యుడైన మాండవ్య మహర్షి ఇలా అన్నాడు.

అబ్రవీద్భస్మసాత్కుర్యాం యది స్యాదభిషేచనమ్ ।
పూజయామాసురమరా మాణ్డవ్యం యుక్తిభిస్స్తవైః ॥ 13 ॥

ఇక్కడ నీకభిషేకం జరిగినట్లైతే భస్మం చేయగలననగా దేవతలంతా యోగ్యమైన స్తోత్రములతో మాండవ్య మహర్షిని పూజించారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

అయమిన్ద్రః సహస్రాక్షో యస్మిన్దేశేఽభిషిచ్యతే ।
తత్రాతిదారుణం విఘ్నం మునే సముపజాయతే ॥ 14 ॥

ఓ మునీ! ఈ సహస్రాక్షుడైన ఇంద్రునకు ఎక్కడ అభిషేకం చేద్దామనుకున్నా, అక్కడ మహాఘోరమైన విఘ్నం కలుగుతున్నది.

తచ్ఛాన్తిం కురు కల్యాణ ప్రసీద వరదో భవ ।
మలనిర్యాతనం యస్మిన్ కుర్మస్తస్మిన్ వరాన్ బహూన్ ॥ 15 ॥

దేశే దాస్యామహే సర్వే తదనుజ్ఞాతుమర్హసి ।
యస్మిన్దేశే సురేన్ద్రస్య అభిషేకో భవిష్యతి ॥ 16 ॥

ఓ కల్యాణ స్వరూపా! అనుగ్రహించండి దానికి శాంతిని చేయండి. దేనియందు అతనికి దోషపరిహారమవునో సూచించండి. దానియందు చేయిస్తాము. అనేక వరములను మేమంతా ఇస్తాము. ఓ దేశికా! ఇంద్రుని కెక్కడ అభిషేకం చేయవలెనో ఆ స్థలమునుగూర్చి సెలవీయండి.

స సర్వకామదః పుంసాం ధాన్యవృక్షఫలైర్యుతః ।
నానావృష్టిర్న దుర్భిక్షం భవేదత్ర కదాచన ॥ 17 ॥

ఆ అభిషేకస్థలంలో మానవులు ధనధాన్యములతో, వృక్షఫలసంపదలతో నుండి అనావృష్టి అనేది, దుర్భిక్షమనేది లేక సమస్తకోరికలనిస్తూ పవిత్రతతో ఉంటారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మేనే తతో మునిశ్రేష్ఠో మాణ్డవ్యో లోకపూజితః ।
అభిషేకః కృతస్తత్ర మలనిర్యాతనం తథా ॥ 18 ॥

ఆ తరువాత మునిశ్రేష్ఠుడు, లోకపూజితుడైన మాండవ్యుడు అభిషేకం చేసి, మలనిర్మూలనం కూడా చేశాడు.

దేవైస్తదోక్తో మునిభిః స దేశో మాలవస్తతః ।
అభిషిక్తే సురపతౌ జాతే చ విమలే తథా ॥ 19 ॥

సురపతియైన ఇంద్రుడు అభిషేకం జరిపించుకొని, పరిశుద్ధుడుకాగా, దేవతలు, మునులు ఆ ప్రదేశమును అందుకే మాలవమనే పేరుతో పిలిచారు.

ఆనీయ గౌతమీం గంగాం తం పుణ్యాయాభిషేచిరే ।
సురాశ్చ ఋషయశ్చైవ అహం విష్ణుస్తథైవ చ ॥ 20 ॥

వసిష్ఠో గౌతమశ్చాపి అగస్త్యోఽత్రిశ్చ కశ్యపః ।
ఏతే చాన్యే చ ఋషయో దేవా యక్షాః సపన్నగాః ॥ 21 ॥

స్నానం తత్పుణ్యతో యేన అకుర్వన్నభిషేచనమ్ ।
మయా పునః శచీభర్తా కమణ్డలుభవేన చ ॥ 22 ॥

జలేనాప్యభిషిక్తశ్చ తత్ర పుణ్యాఽభవన్నదీ ।
సిక్తా చేతి చ తత్రాఽఽసీత్తే గంగాయాం చ సంగతే ॥ 23 ॥

గౌతమీగంగను తీసుకొనివచ్చి అతణ్ణి పుణ్యంకొరకై అభిషేకించారు. దేవతలు, ఋషులు,నేను అట్లే విష్ణువు, వసిష్ఠుడు, గౌతముడు, అగస్త్యుడు, అత్రి, కశ్యపుడు వీరేకాక ఇంకా ఇతర ఋషులు, దేవతలు, యక్షులు, నాగులు ఆ పవిత్రజలంతో స్నానము, అభిషేచనము చేశారు. తిరిగి నేను కమండలంలోనుండి పుట్టిన జలంతో ఇంద్రుని అభిషేకించగా అక్కడ ఆ నది పుణ్యా అని, సిక్తా అని రెండూ గంగానది సంగమ ప్రదేశంలో తీర్థములైనాయి.

సంగమౌ తత్ర విఖ్యాతౌ సర్వదా మునిసేవితౌ ।
తతః ప్రభృతి తత్తీర్థం పుణ్యాసంగమముచ్యతే ॥ 24 ॥

అక్కడ సంగమించిన ఆ తీర్థముల నెప్పుడూ మునులు సేవిస్తారు. అవి చాలా ప్రసిద్ధిచెందినవి. అప్పటినుండి ఆ తీర్థము పుణ్యాసంగమమనే పేరుతో వ్యవహరించబడుచున్నది.

సిక్తాయాః సంగమే పుణ్యమైన్ద్రం తదభిధీయతే ।
తత్ర సప్త సహస్రాణి తీర్థాన్యాసన్ శుభాని చ ॥ 25 ॥

సిక్తానది సంగమించిన పుణ్యతీర్థమును ఐంద్రతీర్థమని పిలుస్తారు. అక్కడ శుభకరములైన ఏడువేల తీర్థములున్నాయి.

తేషు స్నానం చ దానం చ విశేషేణ తు సంగమే ।
సర్వం తదక్షయం విద్యాన్నాత్ర కార్యా విచారణా ॥ 26 ॥

ఆ తీర్థములలో స్నానం చేసినా, దానం చేసినా, విశేషంగా సంగమప్రదేశంలో చేసినట్లైతే అక్షయమైన ఫలం లభిస్తుంది. ఇక్కడ సందేహమేమీ అవసరం లేదు.

యదేతత్పుణ్యమాఖ్యానం యః పఠేచ్ఛృణోతి వా ।
సర్వపాపైః స ముచ్యేత మనోవాక్కాయకర్మజైః ॥ 27 ॥

ఈ పవిత్రమైన ఆఖ్యానమెవరు చదివినా, విన్నా కూడా వారు మనోవాక్కాయకర్మలతో చేసిన సమస్తపాపములు నశిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే పుణ్యాసిక్తసంగమేంద్రతీర్థాది సప్తసహస్రతీర్థవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః. ॥ 26 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో పుణ్యాసిక్త సంగమ ఇంద్రతీర్థాది సప్తసహస్రతీర్థ వర్ణనమనే పేరుగల ఇరవై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తవింశోఽధ్యాయః - ఇరవై ఏడవ అధ్యాయం
పౌలస్త్యతీర్థవర్ణనమ్ - పౌలస్త్యతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పౌలస్త్యం తీర్థమాఖ్యాతం సర్వసిద్ధిప్రదం నృణామ్ ।
ప్రభావం తస్య వక్ష్యామి భ్రష్టరాజ్యప్రదాయకమ్ ॥ 1 ॥

మానవులకు సర్వసిద్ధులను కలుగజేసేది, పోయిన రాజ్యమును తిరిగి ఇప్పించేది పౌలస్త్యతీర్థము. దాని కథను, ప్రభావమును చెబుతున్నాను.

ఉత్తరాశాపతిః పూర్వమృద్ధిసిద్ధిసమన్వితః ।
పురా లంకాపతిశ్చాఽఽసీజ్జ్యేష్ఠో విశ్రవసః సుతః ॥ 2 ॥

పూర్వం విశ్రవసుని పెద్దకుమారుడు, ఉత్తరదిక్పతి అయిన కుబేరుడు ఋద్ధి, సిద్ధులతో కూడినవాడై దక్షిణదిక్కులో నున్న లంకకు రాజుగా నుండేవాడు.

తస్యైతే భ్రాతరశ్చాఽఽసన్ బలవన్తోఽమితప్రభాః ।
సాపత్నా రావణశ్చైవ కుమ్భకర్ణో విభీషణః ॥ 3 ॥

అతనికి బలవంతులు, మిక్కిలి ప్రభావశాలురగు రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అను సవతి సోదరులుండేవారు.

తేఽపి విశ్రవసః పుత్రా రాక్షస్యాం రాక్షసాస్తు తే ।
పుష్పకేన విమానేన ధనదో భ్రాతృభిః సహ ॥ 4 ॥

మమాన్తికం భక్తియుక్తో నిత్యమేతి తు యాతి చ ।
రావణస్య తు యా మాతా కుపితా సాఽబ్రవీత్సుతాన్ ॥ 5 ॥

వారు రాక్షసియందు విశ్రవసునకు కలిగిన కుమారులు. వారు రాక్షసులు. కుబేరుడు తన సోదరులతో కలిసి పుష్పకవిమానమెక్కి ప్రతినిత్యం నా దగ్గరికి వచ్చి పోతుండెడివాడు. రావణుని తల్లియగు రాక్షసి తన కుమారులతో కోపంగా ఇలా అన్నది.

రావణమాతోవాచ :- రావణుని తల్లి పలికింది.

మరిష్యే న చ జీవిష్యే పుత్రా వైరూప్యకారణాత్ ।
దేవాశ్చ దానవాశ్చాఽఽసన్సపత్నా భ్రాతరో మిథః ॥ 6 ॥

అన్యోన్యవధమీప్సన్తే జయైశ్వర్యవశానుగాః ।
తద్భవన్తో న పురుషా న శక్తా న జయైషిణః ॥
సాపత్నం యోఽనుమన్యేత తస్య జీవో నిరర్థకః ॥ 7 ॥

కుమారులారా! నేను నా కురూపకారణమువల్ల చావలేక బ్రతుకలేక యున్నాను. దేవతలు, దానవులు, సవతి సోదరులుగానుండి పరస్పరం జయమునకు, ఐశ్వర్యమునకు లొంగిపోయి ఒకరినొకరు చంపుటకు ఇష్టపడతారు. మీరు పురుషులు కారు, బలవంతులుకారు, జయించాలనే కోరిక మీకు లేదు. సపత్నమును, దాయాదిత్వమును అంగీకరించు వాని జన్మ వ్యర్థము అని రెచ్చగొట్టింది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తన్మాతృవచనం శ్రుత్వా భ్రాతరస్తే త్రయో మునే ।
జగ్ముస్తే తపసేఽ రణ్యం కృతవన్తస్తపో మహత్ ॥ 8 ॥

ఓ మునీ! తమ తల్లి మాటలను విన్న ఆ ముగ్గురు కుమారులు తపస్సుకై అరణ్యమునకు వెళ్ళారు. అక్కడ గొప్ప తపస్సు చేశారు.

మత్తో వరానవాపుశ్చ త్రయ ఏతే చ రాక్షసాః ।
మాతులేన మరీచేన తథా మాతామహేన తు ॥ 9 ॥

ఈ ముగ్గురు రాక్షసులు నా వలన, మేనమామయైన మరీచుని వలన, మాతామహుని వలననూ వరములను పొందారు.

తన్మాతృవచనాచ్చాపి తతో లంకామయాచత ।
రక్షోభావాన్మాతృదోషాద్భ్రాత్రోర్వైరమభూన్మహత్ ॥ 10 ॥

తల్లి ప్రోద్బలంతో తరువాత లంకనడిగారు. రాక్షసభావం వలన, తల్లిదోషం వల్ల సోదరులలో గొప్ప విరోధమేర్పడింది.

తతస్తదభవద్యుద్ధం దేవదానవయోరివ ।
యుద్ధే జిత్వాఽ గ్రజం శాన్తం ధనదం భ్రాతరం తథా ॥ 11 ॥

పుష్పకం చ పురీం లంకాం సర్వం చైవ వ్యపాహరత్ ।
రావణో ఘోషయామాస త్రైలోక్యే సచరాచరే ॥ 12 ॥

ఆ తరువాత దేవదానవ యుద్ధంవలె గొప్పయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శాంతస్వభావుడు, తనకన్నా పెద్దవాడు సోదరుడునైన కుబేరుని జయించి, రావణుడు పుష్పకమును, లంకాపురమును అన్నింటినీ కూడా అపహరించాడు. అంతేకాక ఆ రావణుడు ముల్లోకములలోనున్న చరాచరములన్నింటికీ ఇలా ఆజ్ఞాప్రకటన చేశాడు.

యో దద్యాదాశ్రయం భ్రాతుః స చ వధ్యో భవేన్మమ ।
భ్రాత్రా నిరస్తో వైశ్రవణో నైవ ప్రాపాఽ ఽ శ్రయం క్వచిత్ ॥
పితామహం పులస్త్యం తం గత్వా నత్వాఽ బ్రవీద్వచః ॥ 13 ॥

ఎవరు నా సోదరుని కాశ్రయమిస్తాడో వానిని నేను చంపుతాను. ఇలా సోదరుడైన రావణునితో వెళ్ళగొట్టబడిన కుబేరుడు ఎక్కడా ఆశ్రయాన్ని పొందలేక పోయాడు. అప్పుడు కుబేరుడు పితామహుడైన పులస్త్యుని వద్దకు వెళ్ళి నమస్కరించి ఇలా అన్నాడు.

ధనద ఉవాచ :- కుబేరుడు పలికాడు.

భ్రాత్రా నిరస్తో దుష్టేన కిం కరోమి వదస్వ మే ।
ఆశ్రయః శరణం యత్స్యాద్దైవం వా తీర్థమేవ చ ॥ 14 ॥

దుర్మార్గుడైన సోదరుడు వెళ్ళగొట్టాడు. నేనెవరిని ఆశ్రయించాలి? దైవాన్నా? తీర్థాన్నా? ఏమి చేయవలెనో నాకు చెప్పమన్నాడు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

తత్పౌత్రవచనం శ్రుత్వా పులస్త్యో వాక్యమబ్రవీత్ । 15 ॥

అలా పలికిన మనుమని మాటలు విని పులస్త్యుడిలా అన్నాడు.

పులస్త్య ఉవాచ :- పులస్త్యుడు పలికాడు.

గౌతమీం గచ్ఛ పుత్ర త్వం స్తుహి దేవం మహేశ్వరమ్ ।
తత్ర నాస్య ప్రవేశః స్యాద్గంగాయా జలమధ్యతః ॥ 16 ॥

సిద్ధిం ప్రాప్స్యసి కల్యాణీం తథా కురు మదాజ్ఞయా । 17 ॥

నాయనా! నీవు గౌతమీనది వద్దకు వెళ్ళు. అక్కడ పరమశివుని స్తోత్రం చేయి. గంగానది మధ్యభాగమందు ఆ రావణునకు ప్రవేశం లేదు. నా ఆజ్ఞప్రకారంగా చేయి. శుభకరమైన సిద్ధి పొందుతావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా జగామాసౌ సభార్యో ధనదస్తథా ।
పిత్రా మాత్రా చ వృద్ధేన పులస్త్యేన ధనేశ్వరః ॥ 18 ॥

సరే అలాగే యని తల్లిదండ్రులతో, వృద్ధుడైన పులస్త్యునితో, తన భార్యతోకూడి కుబేరుడు గౌతమివద్దకు వెళ్ళాడు.

గత్వా తు గౌతమీం గంగాం శుచిః స్నాత్వా యతవ్రతః ।
తుష్టావ దేవదేవేశం భుక్తిముక్తిప్రదం శివమ్ ॥ 19 ॥

గౌతమీగంగానదివద్దకు వెళ్ళి శుచియై, స్నానం చేసి, నియతవ్రతుడై, భుక్తిముక్తి ప్రదాయకుడు, దేవదేవుడైన శివుని మెప్పించాడు.

ధనద ఉవాచ :- కుబేరుడు పలికాడు.

స్వామీ త్వమేవాస్య చరాచరస్య
విశ్వస్య శంభో న పరోఽస్తి కశ్చిత్ ।

త్వామప్యవజ్ఞాయ యదీహ మోహాత్
ప్రగల్భతే కోఽపి స శోచ్య ఏవ ॥ 20 ॥

ఓ శివా! ఈ చరాచరజగత్తు కంతా స్వామివి నీవే, మరొకరెవరూ లేరు. ఒక వేళ మోహంతో నిన్ను తెలుసుకోక ప్రగల్భాలు పలికేవాడు దుఃఖభాగుడే అవుతాడు.

త్వమష్టమూర్త్యా సకలం బిభర్షి
త్వదాజ్ఞయా వర్తత ఏవ సర్వమ్ ।
తథాఽపి వేదేతి బుధో భవన్తం
న జాత్వవిద్వాన్మహిమా పురాతనమ్ ॥ 21 ॥

నీవెనిమిది రూపములను ధరించి సకలము భరిస్తున్నావు. ఈ జగత్తంతా నీ యాజ్ఞతోనే నడుస్తున్నది. అయినప్పటికీ పండితుడే నిన్ను తెలుసుకొనగలడు. విద్వాంసుడు కానివాడు నీ మహిమను ఎన్నడూ ఎరుగలేడు.

మలప్రసూతం యదవోచదమ్బా హాస్యాత్సుతోఽయం తవ దేవ శూరః ।
త్వత్రేక్షితాద్యః స చ విఘ్నరాజో జజ్ఞే త్వహో చేష్టితమీశదృష్టేః ॥ 22 ॥

మలప్రసూతుడైన బాలకుని చూసి పార్వతి హాస్యంగా బలవంతుడైన నీ కుమారుడన్నది. కానీ! ఓ దేవా! నీ కృపాదృష్టివలన ఆ బాలకుడే విఘ్నరాజైన వినాయకుడైనాడు. మీ కృపాదృష్టికి ఫలమిదియే.

అశ్రుప్లుతాంగీ గిరిజా సమీక్ష్య
వియుక్తదాంపత్యమితీశమూచే ।
మనోభవోఽభూన్మదనో రతిశ్చ
సౌభాగ్యపూర్ణత్వమవాప సోమాత్ ॥ 23 ॥

రతిదేవియొక్క విలాపమును విని కన్నీళ్ళతో నిండిన పార్వతీదేవి రతీమన్మథుల దాంపత్యభంగమును గూర్చి శివునికి నివేదించింది. అంతట మీ దయాదృష్టివలన మన్మథుడు మనోభవుడయ్యాడు. రతీదేవి చంద్రునివలన సౌభాగ్యపూర్ణత్వమును పొందింది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యాది స్తువతస్తస్య పురతోఽభూత్త్రిలోచనః ।
వరేణ ఛన్దయామాస హర్షాన్నోవాచ కించన ॥ 24 ॥

ఇలా స్తోత్రం చేయగా, త్రిలోచనుడైన శివుడు కుబేరుని ముందు ప్రత్యక్షమయ్యాడు. వరంతో అనుగ్రహించాడు. కాని అప్పుడు కుబేరుడు ఆనందంతో మాట్లాడలేకపోయాడు.

తూష్ణీంభూతే తు ధనదే పులస్త్యే చ మహేశ్వరే ।
పునఃపునర్వరస్వేతి శివే వాదిని హర్షితే ॥ 25 ॥

కుబేరుడు, పులస్త్యుడు ఊరకుండగా, శివుడు మళ్ళీ మళ్ళీ వరమును కోరుకొమ్మని రెట్టించగా వారలాగే ఆనందంలో మునిగిపోయారు.

ఏతస్మిన్నన్తరే తత్ర వాగువాచాశరీరిణీ ।
ప్రాప్తవ్యం ధనపాల త్వం వదన్తీదం మహేశ్వరమ్ ॥ 26 ॥

ఇంతలో అక్కడ అశరీరవాణి ఇలా పలికింది. ఓ కుబేరా! మహేశ్వరుడు చెప్పినట్లుగా నీవు వరమును పొందవలెను.

పులస్త్యస్య తు యచ్చిత్తం పితుర్వైశ్రవణస్య తు ।
విదిత్వైవ తదా వాణీ శుభమర్థముదీరయత్ ॥ 27 ॥

పులస్త్యుని యొక్క మనస్సులో, తండ్రియైన వైశ్రవణుని యొక్క మనస్సులోనూ ఏమున్నదో గ్రహించిన వాణి శుభార్థమును తెలిపింది.

భూతవద్భవితవ్యం స్యాద్దాస్యమానం తు దత్తవత్ ।
ప్రాప్తవ్యం ప్రాప్తవత్తత్ర దైవీవాగభవచ్ఛుభా ॥ 28 ॥

పూర్వంవలెనే సమృద్ధముగా రాబోవునదుండునట్లుగా, ఇవ్వబోయేది ఇచ్చినట్లుగా, పొందదగినది పొందినట్లుగా దైవీవాక్కు శుభమయింది.

ప్రభూతశత్రుః పరిభూతదుఃఖః సంపూజ్య సోమేశ్వరమాప లింగమ్ ।
దిగీశ్వరత్వం ద్రవిణప్రభుత్వం అపారదాతృత్వకలత్రపుత్రాన్ ॥ 29 ॥

ఎక్కువమంది శత్రువులు గలవాడు, అనేక కష్టాలవలన దుఃఖితుడు అయిన కుబేరుడు సోమేశ్వరలింగాన్ని పూజించి దిక్పాలపదవిని, ధనసంపదను, అపారమైన దానము చేసే శక్తిని, భార్యాపుత్రులను పొందాడు.

తాం వాచం ధనదః శ్రుత్వా దేవదేవం త్రిశూలినమ్ ।
ఏవం భవతు నామేతి ధనదో వాక్యమబ్రవీత్ ॥ 30 ॥

ఆ అశరీరవాణి పలికిన మాటలను కుబేరుడు విని దేవదేవుడైన శివుని అట్లే అనుగ్రహించండని చెప్పాడు.

తచ్చైవాస్త్వితి దేవేశో దైవీం వాచమమన్యత ।
పులస్త్యం చ వరైః పుణ్యైస్తథా విశ్రవసం మునిమ్ ॥ 31 ॥

అశరీరవాణి మాటలనువిని దేవేశుడైన శివుడు అలాగే అగుగాక అని అనుగ్రహించాడు. పులస్త్యునికి, విశ్రవసునికి అలాగే పుణ్యమైన వరములను ప్రసాదించాడు.

ధనపాలం చ దేవేశో హ్యభినంద్య యయౌ శివః ।
తతః ప్రభృతి తత్తీర్థం పౌలస్త్యం ధనదం విదుః ॥ 32 ॥

కుబేరుని అభినందించి దేవేశుడైన శివుడు వెళ్ళాడు. అప్పటినుండి ఆ తీర్థమును పౌలస్త్య తీర్థమని, కుబేరతీర్థమని (ధనద తీర్థమని) తెలుసుకొనుచున్నారు.

తథా వైశ్రవసం పుణ్యం సర్వకామప్రదం శుభమ్ ।
తేషు స్నానాది యత్కించిత్తత్సర్వం బహుపుణ్యదమ్ ॥ 33 ॥

అలాగే వైశ్రవసతీర్థము పుణ్యప్రదమైనది. సమస్త కోరికలను తీర్చునది. శుభమైనది. వాటి యందు స్నానమాచరిస్తే ఎన్నో పుణ్యములు లభిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాంతర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'పౌలస్త్యతీర్థవర్ణనం' నామ సప్తవింశోఽధ్యాయః. ॥ 27 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'పౌలస్త్యతీర్థవర్ణన'మనే పేరుగల ఇరవై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టావింశోఽధ్యాయః - ఇరవై ఎనిమిదవ అధ్యాయం

అగ్నితీర్థవర్ణనమ్ - అగ్నితీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అగ్నితీర్థమితి ఖ్యాతం సర్వక్రతుఫలప్రదమ్ ।
సర్వవిఘ్నోపశమనం తత్తీర్థస్య ఫలం శృణు ॥ 1 ॥

సమస్త క్రతుఫలముల నిచ్చునది, సమస్త విఘ్నములనుపశమింప చేయునదిగా అగ్నితీర్థమనునది ప్రసిద్ధిచెందింది. ఆ తీర్థమువలన గలుగు ఫలము విను.

జాతవేదా ఇతి ఖ్యాతో అగ్నేర్భ్రాతా స హవ్యవాట్ ।
హవ్యం వహన్తం దేవానాం గౌతమ్యాస్తీర ఏవ తు ॥ 2 ॥

అగ్నిసోదరుడు జాతవేదసుడనేవాడు హవ్యవాహనుడుగా ఉండేవాడు. అతడు దేవతలకు హవ్యమును సమర్పిస్తూ గౌతమీనది తీరమునందుండేవాడు.

ఋషీణాం సత్రసదనే అగ్నేర్భ్రాతరముత్తమమ్ ।
భ్రాతుః ప్రియం తథా దక్షం మధుర్దితిసుతో బలీ ॥ 3 ॥
జఘాన ఋషిముఖ్యేషు పశ్యత్సు చ సురేష్వపి ।
హవ్యం దేవా నైవ చాఽఽపుర్మృతే వై జాతవేదసి ॥ 4 ॥

ఋషులయొక్క సత్రమంటపంలో అగ్నిసోదరుడు, సోదరప్రియుడు, ఉత్తముడు, సమర్థుడైన జాతవేదసుని దితి కుమారుడు, మహాబలశాలియైన మధువనే వాడు ఋషిముఖ్యులు, దేవతలు చూస్తుండగా చంపాడు. జాతవేదసుడు మరణించగా దేవతలు హవ్యమును పొందలేక పోయారు.

మృతే భ్రాతరి స త్వగ్నిః ప్రియే వై జాతవేదసి ।
కోపేన మహతాఽఽవిష్టో గంగామమ్భః సమావిశత్ ॥ 5 ॥

తనకిష్టుడైన సోదరుడగు జాతవేదసుడు మరణించగా అగ్ని మిక్కిలి కోపంతో గంగానది నీటిలో ప్రవేశించాడు.

గంగామ్భసి సమావిష్టే హ్యగ్నౌ దేవాశ్చ మానుషాః ।
జీవముత్సర్జయామాసురగ్నిజీవా యతో మతాః ॥ 6 ॥

అగ్ని గంగాజలమునందు ప్రవేశించగా అగ్నిజీవులైన దేవతలు, మనుష్యులు తమ ప్రాణములను విడిచారు.

యత్రాగ్నిర్జలమావిష్టస్తం దేశం సర్వ ఏవ తే ।
ఆజగ్ముర్విబుధాః సర్వ ఋషయః పితరస్తదా ॥ 7 ॥

ఎక్కడైతే అగ్ని నీటి యందు ప్రవేశించిందో ఆ ప్రదేశమునకు ఋషులు, పితరులు, పండితులూ అందరూ వచ్చారు.

వినాఽగ్నినా న జీవామః స్తువన్తోఽగ్నిం విశేషతః ।
అగ్నిం జలగతం దృష్ట్వా ప్రియం చోచుర్దివౌకసః ॥ 8 ॥

అగ్నిలేకుండా మనం జీవించలేమని విశేషంగా అగ్నిని స్తోత్రం చేస్తూ, నీటిలోనున్న అగ్నిని చూచి దేవతలందరూ ప్రియంగా ఇలా అన్నారు.

దేవా ఊచుః :– దేవతలిలా అన్నారు.

దేవాన్ జీవయ హవ్యేన కవ్యేన చ పితౄంస్తథా ।
మానుషానన్నపాకేన బీజానాం క్లేదనేన చ ॥ 9 ॥

దేవతలను హవ్యంతో, పితృదేవతలను కవ్యంతో, మానవులను అన్నాది పాకములతో, గింజలను తడిపి జీవింపజేయి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అగ్నిరప్యాహ తాన్దేవాన్ శక్తో యో మే గతోఽనుజః ।
క్రియమాణే భవత్కార్యే యా గతిర్జాతవేదసః ॥ 10 ॥
సా వాఽపి స్యాన్మమ సురా నోత్సహే కార్యసాధనే ।
కార్యం తు సర్వతస్తస్య భవతాం జాతవేదసః ॥ 11 ॥

అప్పుడా అగ్ని దేవతలతో నిలా అన్నాడు. ఓ దేవతలారా! నా శక్తిమంతుడైన సోదరుడు గతించాడు. మీ పనినిగాని నేను నెరవేరిస్తే ఆ జాతవేదసునకు పట్టిన గతే నాకు పట్టవచ్చు. అందువలన ఈ పనిని చేయుటకు నాకుత్సాహము లేదు. ఈ పని మీకు, జాతవేదసునికి సంబంధించినది.

ఇమాం స్థితిమనుప్రాప్తో న జానే మే కథం భవేత్ ।
ఇహ చాముత్ర చ వ్యాప్తౌ శక్తిరప్యత్ర నో భవేత్ ॥ 12 ॥

ఇటువంటి స్థితిని పొందిన నాకు ఏమగునో, ఎట్లగునో తెలియడం లేదు. ఈ లోకమునందు, పై లోకము నందు కూడా వ్యాపించు శక్తి కూడా ఇప్పుడు నాకు లేదు.

అథాపి క్రియమాణే వై కార్యే సైవ గతిర్మమ ।
దేవాస్తమూచుర్భావేన సర్వేణ ఋషయస్తథా ॥ 13 ॥

ఒకవేళ నేనీ కార్యాన్ని నెరవేరిస్తే నాకు కూడా అదేగతి పడుతుంది అని అగ్ని పలుకగా దేవతలూ, ఋషులూ ప్రేమతో ఇలా పలికారు.

ఆయుఃకర్మణి చ ప్రీతిర్వ్యాప్తౌ శక్తిశ్చ దీయతే ।
ప్రయాజాననుయాజాంశ్చ దాస్యామో హవ్యవాహన ॥ 14 ॥

ఓ హవిస్సునుమోసే అగ్నీ! నీకు ఆయుష్షును, నీవు చేసే పనులయందు ప్రీతిని, ఈ లోకమందు, పై లోకమందు వ్యాపించు శక్తిని ఇస్తాము. అలాగే ప్రయాజానుయాజములను గూడా నీకే ఇస్తాము.

దేవానాం త్వం ముఖం శ్రేష్ఠమాహుత్యః ప్రథమాస్తవ ।
త్వయా దత్తం తు యద్ద్రవ్యం భోక్ష్యామః సురసత్తమ ॥ 15 ॥

ఓ సురశ్రేష్ఠుడా! నీవు దేవతలకు శ్రేష్ఠమైన ముఖస్థానీయుడవు. యజ్ఞములలో ఇచ్చే మొదటి ఆహుతులు నీకే. నీవు ఏ ద్రవ్యాన్ని మాకిస్తావో దానినే మేము భుజిస్తాము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతస్తుష్టోఽభవద్వహ్నిర్దేవవాక్యాద్యథాక్రమమ్ ।
ఇహ చాముత్ర చ వ్యాప్తౌ హవ్యే వా లౌకికే తథా ॥ 16 ॥

సర్వత్ర వహ్నిరభయః సమర్థోఽభూత్సురాజ్ఞయా ।
జాతవేదా బృహద్భానుః సప్తార్చిర్నీలలోహితః ॥ 17 ॥

జలగర్భః శమీగర్భః యజ్ఞగర్భః స ఉచ్యతే ।
జలాదాకృష్య విబుధా అభిషిచ్య విభావసుమ్ ॥ 18 ॥

దేవతలు వరుసగా పలికిన మాటలను విని అగ్ని సంతోషించాడు. ఈ లోకమునందు, పై లోకమునందు, వ్యాపించుటయందు, హవ్యముల, నందించుటయందు, మిగిలిన లౌకికకార్యములందు దేవతల ఆజ్ఞతో అగ్ని ఏమాత్రం భయంలేకుండా అంతటా సమర్థుడయ్యాడు. అతనిని జాతవేదుడని, బృహద్భానుడని, సప్తార్చియని, నీలలోహితుడని, జలగర్భుడని, శమీ(జమ్మి) గర్భుడని పిలుస్తారు. అటువంటి అగ్నిని దేవతలు నీటిలో నుండి తీసి అభిషేకించారు.

ఉభయత్ర పదే వాసః సర్వగోఽగ్నిస్తతోఽభవత్ ।
యథాగతం సురా జగ్ముర్వహ్నితీర్థం తదుచ్యతే ॥ 19 ॥

అప్పటి నుండి అగ్ని అంతటికి వెళ్ళేవాడుగా, ఈ లోకంలో, పై లోకంలో స్థానం గలవాడయ్యాడు. ఆ తరువాత దేవతలందరూ వెళ్ళారు. అప్పటినుండి ఈ తీర్థమును వహ్నితీర్థమంటారు.

తత్ర సప్త శతాన్యాసంస్తీర్థాని గుణవన్తి చ ।
తేషు స్నానం చ దానం చ యః కరోతి జితాత్మవాన్ ॥ 20 ॥

అశ్వమేధఫలం సాగ్రం ప్రాప్నోత్యవికలం శుభమ్ ।
దేవతీర్థం చ తత్రైవ ఆగ్నేయం జాతవేదసమ్ ॥ 21 ॥

అక్కడ ఏడువందల గుణవంతములైన తీర్థములున్నాయి. జితాత్ముడైన వాడెవడైనా వాటియందు స్నానం చేసినా, అక్కడ దానం చేసినా ముందు ముందుగా అవికలము, శుభము ఐన అశ్వమేధఫలమును పొందుతాడు. అక్కడే జాతవేదసము, ఆగ్నేయము అనే దేవతీర్థమున్నది.

అగ్నిప్రతిష్ఠితం లింగం తత్రాఽఽస్తేఽనేక వర్ణవత్ ।
తద్దేవదర్శనాదేవ సర్వక్రతుఫలం లభేత్ ॥ 22 ॥

అక్కడ అగ్ని ప్రతిష్ఠించిన శివలింగం అనేక వర్ణములతో శోభిస్తున్నది. ఆ దేవదేవుడైన శివలింగమును దర్శించినంతనే సమస్తక్రతుఫలము లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'అగ్నితీర్థ వర్ణనం' నామాష్టావింశోఽధ్యాయః. ॥28॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో 'అగ్నితీర్థ వర్ణన'మనే పేరుగల ఇరవై ఎనిమిదివ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనత్రింశోఽధ్యాయః - ఇరవై తొమ్మిదవ అధ్యాయం

ఋణవిమోచనతీర్థవర్ణనమ్ - ఋణవిమోచన తీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఋణప్రమోచనం నామ తీర్థం వేదవిదో విదుః ।
తస్య స్వరూపం వక్ష్యామి శృణు నారద తన్మనాః ॥ 1 ॥

ఓ నారదా! ఋణప్రమోచనమను తీర్థమునుగూర్చి వేదవేత్తలైనవారు బాగా ఎరుగుదురు. ఇప్పుడు దాని స్వరూపమును గూర్చి వివరిస్తున్నాను, శ్రద్ధగా విను.

ఆసీత్పృథుశ్రవా నామ ప్రియః కక్షీవతః సుతః ।
న దారసంగ్రహం లేభే వైరాగ్యాన్నాగ్నిపూజనమ్ ॥ 2 ॥

కక్షీవతుడను వానికి పృథుశ్రవుడను ప్రియుడైన కుమారుడు ఉండేవాడు. అతడు వైరాగ్యంవలన వివాహం చేసుకోలేదు. అగ్నిని ఆరాధించలేదు.

కనీయాంస్తు సమర్థోఽపి పరివిత్తిభయాన్మునే ।
నాకరోద్దారకర్మాది నైవాగ్నీనాముపాసనమ్ ॥ 3 ॥

ఓ మునీ! చిన్నవాడు సమర్థుడైనప్పటికి పరివిత్తి (అనగా పెద్దవాడు పెండ్లిచేసుకోకుండానే చిన్నవాడు వివాహమాడుట) భయంతో అతడు కూడా వివాహమాడలేదు, అగ్న్యుపాసన కూడా చేయలేదు.

తతః ప్రోచుః పితృగణాః పుత్రం కక్షీవతః శుభమ్ ।
జ్యేష్ఠం చైవ కనిష్ఠం చ పృథక్ పృథగిదం వచః ॥ 4 ॥

పితర ఊచుః :-పితృదేవతలిలా అన్నారు.

ఋణత్రయాపనోదాయ క్రియతాం దారసంగ్రహః ॥ 5 ॥

ఆ తరువాత పితృదేవతాగణము తమ కుమారుడైన కక్షీవంతునితో, పెద్దకుమారుడైన పృథుశ్రవునితో అలాగే చిన్నకుమారునితో వేరువేరుగా నిట్లన్నారు. దేవఋణం, ఋషిఋణం, పితృఋణమనే మూడు ఋణములను తీర్చుటకైనా మీరు వివాహము చేసుకోండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నేత్యువాచ తతో జ్యేష్ఠః కిమృణం కేన యుజ్యతే ।
కనీయాంస్తు పితౄన్ప్రాహ న యోగ్యో దారసంగ్రహః ॥ 6 ॥

పెద్దవాడంగీకరించలేదు. ఋణమేమిటి? ఎలా కలుగుతుందన్నాడు. చిన్నవాడు వివాహం యోగ్యం కాదని పితృదేవతలతో చెప్పాడు.

జ్యేష్ఠే సతి మహాప్రాజ్ఞ పరివిత్తిభయాదితి ।
తావుభౌ పునరప్యేవమూచుస్తే వై పితామహాః ॥ 7 ॥

ఓ మహాజ్ఞానీ! పెద్దవాడు చేసుకోలేదు కనుక పరివిత్తి అన్నాడు చిన్నవాడు. తిరిగి ఇద్దరితోగూడ తాతలందరూ ఇలా అన్నారు.

పితర ఊచుః :- పితృదేవతలిలా అన్నారు.

యాతాముభౌ గౌతమీం తు పుణ్యాం కక్షీవతః సుతౌ ।
కురుతాం గౌతమీస్నానం సర్వాభీష్టప్రదాయకమ్ ॥ 8 ॥

కక్షీవతుని కుమారులైన మీరిద్దరూ పవిత్రమైన గౌతమీనదికి వెళ్ళండి. సర్వాభీష్టములను నెరవేర్చు గౌతమీనది యందు స్నానం చేయండి.

గచ్ఛతాం గౌతమీం గంగాం లోకత్రితయపావనీమ్ ।
స్నానం చ తర్పణం తస్యాం కురుతాం శ్రద్ధయాన్వితౌ ॥ 9 ॥

ముల్లోకములను పావనం చేసే గౌతమీగంగకు వెళ్ళి స్నానం చేసి, శ్రద్ధతో తర్పణం చేయండి.

దృష్టావగాహితా ధ్యాతా గౌతమీ సర్వకామదా ।
న దేశకాలజాత్యాదినియమోఽత్రావగాహనే ॥
జ్యేష్ఠోఽనృణస్తతో భూయాత్పరివిత్తిర్న చేతరః ॥ 10 ॥

గౌతమిని చూసినా, ధ్యానించినా అది సమస్త కోరికలనిచ్చునది. గంగలో స్నానం చేయుటకు కుల మత దేశ కాల జాత్యాది నియమం లేదు. దానితో జ్యేష్ఠుడు త్రిఋణ విముక్తుడవుతాడు. కనిష్ఠుడు పరివిత్తివిముక్తుడవుతాడు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

తతః పృథుశ్రవా జ్యేష్ఠః కృత్వా స్నానం సతర్పణమ్ ।
త్రయాణామపి లోకానాం కాక్షీవతోఽనృణోఽభవత్ ॥ 11 ॥

అప్పుడు పృథుశ్రవుని పెద్దకుమారుడు స్నానం చేసి తర్పణ మొసగాడు. కాక్షీవతుడు ముల్లోకములనుండి ఋణవిముక్తుడయ్యాడు.

తతః ప్రభృతి తత్తీర్థమృణమోచనముచ్యతే ।
శ్రౌతస్మార్తఋణేభ్యశ్చ ఇతరేభ్యశ్చ నారద ॥
తత్ర స్నానేన దానేన ఋణీ ముక్తః సుఖీ భవేత్ ॥ 12 ॥

అప్పటినుండి దానికి ఋణవిమోచనతీర్థమని పేరు. ఓ నారదా! అక్కడ స్నానం చేసినా, దానం చేసినా శ్రౌతస్మార్తాది ఋణములనుండి, ఇతర ఋణములనుండి విముక్తుడై సుఖమును పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే 'ఋణవిమోచనతీర్థవర్ణనం' నామైకోనత్రింశోఽధ్యాయః. ॥ 29 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో 'ఋణవిమోచన తీర్థ వర్ణన'మనే పేరుగల ఇరవై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం
కద్రూసుపర్ణాసంగమతీర్థవర్ణనమ్ - కద్రూసుపర్ణాసంగమతీర్థవర్ణనం

బ్రహ్మో ఉవాచ :- బ్రహ్మ పలికాడు.

సుపర్ణాసంగమం నామ కాద్రవాసంగమం తథా ।
మహేశ్వరో యత్ర దేవో గంగాపులినమాశ్రితః ॥ 1 ॥

ఏ గంగాతీరము నాశ్రయించి మహాదేవుడైన మహేశ్వరుడున్నాడో అక్కడ సుపర్ణాసంగమం, అలాగే కాద్రవా సంగమమూ ఉన్నది.

అగ్నికుండం చ తత్రైవ రౌద్రం వైష్ణవమేవ చ ।
సౌరం సౌమ్యం తథా బ్రాహ్మం కౌమారం వారుణం తథా ॥ 2 ॥

అప్సరా చ నదీ యత్ర సంగతా గంగయా తథా ।
తత్తీర్థస్మరణాదేవ కృతకృత్యో భవేన్నరః ॥ 3 ॥

అక్కడే అగ్నికుండము, రౌద్రం, వైష్ణవం, సౌరం, సౌమ్యం, బ్రాహ్మం, కౌమారం, వారుణం ఉన్నాయి. అలాగే, గంగానదితో అప్సరా నది ఎక్కడ సంగమించిందో ఆ తీర్థమును స్మరించినంతనే నరుడు కృతకృత్యుడవుతాడు.

సర్వపాపప్రశమనం శృణు యత్నేన నారద ।
ఇంద్రేణ హింసితాః పూర్వం వాలఖిల్యా మహర్షయః ।
దత్తార్ధతపసః సర్వే ప్రోచుస్తే కాశ్యపం మునిమ్ ॥ 4 ॥

ఓ నారదా! ఈ తీర్థం సర్వపాపములను తొలగిస్తుంది. కావున శ్రద్ధగా విను. పూర్వం వాలఖిల్యులను ఋషులను ఇంద్రుడు హింసించాడు. తమ తపస్సులో సగభాగమును సమర్పించిన వాలఖిల్యులు కాశ్యపమునిని అడిగారు.

వాలఖిల్యా ఊచుః :- వాలఖిల్యులు పలికారు.

పుత్రముత్పాదయానేన ఇన్ద్రదర్పహరం శుభమ్ ।
తపసోఽర్ధం తు దాస్యామస్తథేత్యాహ మునిస్తు తాన్ ॥ 5 ॥

“మేము మా తపస్సులో సగభాగము నిస్తాము. దానితో ఇంద్రుని గర్వమునణచే శుభకరుడైన కుమారుని కనుము” అనగా ఆ కశ్యపుడు వారితో సరే అన్నాడు.

సుపర్ణాయాం తతో గర్భమాదధే స ప్రజాపతిః ।
కద్ర్వాం చైవ శనైర్బ్రహ్మన్ సర్పాణాం సర్పమాతరి ॥ 6 ॥

ఆ తరువాత ప్రజాపతిఐన ఆ కశ్యపుడు సుపర్ణయందు గర్భము నుంచాడు. ప్రజాపతీ! సర్పమాతయైన కద్రువయందు మెల్లిగా సర్పములుండునట్లు చేశాడు.

తే గర్భిణ్యావుభే ఆహ గన్తుకామః ప్రజాపతిః ।
అపరాధో న చ క్వాపి కార్యో గమనమేవ చ ॥ 7 ॥

అన్యత్ర గమనాచ్ఛాపో భవిష్యతి న సంశయః ॥ 8 ॥

వెళ్ళగోరిన ఆ ప్రజాపతి గర్భవతులైన ఇద్దరితో "ఎక్కడ కూడా అపరాధమును చేయకండి. నేను వెళ్ళవలసియుంది. మరొక చోటుకు వెళితే శాపం వచ్చుటలో సందేహం లేదు".

బ్రహ్మో ఉవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా స యయౌ పత్న్యౌ గతే భర్తరి తే ఉభే ।
తదైవ జగ్మతుః సత్రమృషీణాం భావితాత్మనామ్ ॥ 9 ॥

ఈవిధంగా భార్యలిద్దరికీ చెప్పి అతడు వెళ్ళాడు. భర్త వెళ్ళగానే భావితాత్ములైన ఋషులవాటికకు వారిద్దరు వెళ్ళారు.

బ్రహ్మవృందసమాకీర్ణం గంగాతీరసమాశ్రితమ్ ।
ఉన్మత్తే తే ఉభే నిత్యం వయఃసంపత్తిగర్వితే ॥ 10 ॥

గంగాతీరము నందున్న ఆ సత్రము బ్రాహ్మణసమూహంతో నిండింది. వారిద్దరూ అక్కడ నిత్యమూ వయస్సు, సంపదలచే మదించి యుండేవారు.

నివార్యమాణే బహుశో మునిభిస్తత్త్వదర్శిభిః ।
వికుర్వత్యౌ తత్ర సత్రే సమాని చ హవీంషి చ ॥ 11 ॥

తత్త్వదర్శులైన మునులనేకవిధములుగా వారిని నివారించుచున్నప్పటికి ఆ సత్రమునందు హోమద్రవ్యాలను పాడుచేసేవారు.

యోషితాం దుర్విలసితం కః సంవరితుమీశ్వరః ।
తే దృష్ట్వా చుక్షుభుర్విప్రా అపమార్గరతే ఉభే ॥ 12 ॥

స్త్రీలయొక్క దుర్విలాసకర్మను వారించే ప్రభువు ఎవడు? ఎవరొప్పగలరు? వక్రమార్గంలో సంచరిస్తున్న వారిద్దరిని చూచి యా విప్రులు క్షోభించారు.

అపమార్గస్థితే యస్మాదాపగే హి భవిష్యథః ।
సుపర్ణా చైవ కద్రూశ్చ నద్యౌ తే సంబభూవతుః ॥ 13 ॥

వక్రమార్గంలో సంచరిస్తున్నారు కావున మీరు ప్రవహించే నీరుగా అవుతారని శపించగా సుపర్ణ మరియు కద్రువలు ఇద్దరును నదులుగా మారారు.

స కదాచిద్గృహం ప్రాయాత్ కశ్యపోఽథ ప్రజాపతిః ।
ఋషిభ్యస్తత్ర వృత్తాన్తం శాపం తాభ్యాం సవిస్తరమ్ ॥ 14 ॥

కొంతకాలమునకు కశ్యపప్రజాపతి ఇంటికి వచ్చాడు. ఋషులు అక్కడ జరిగిన వృత్తాంతమును, వారికి శాపాన్ని వివరంగా చెప్పారు.

శ్రుత్వా తు విస్మయావిష్టః కిం కరోమీత్యచిన్తయత్ ।
ఋషిభ్యః కథయామాస వాలఖిల్యా ఇతి శ్రుతాః ॥ 15 ॥

కశ్యపుడు వారి మాటలు విని, ఆశ్చర్యమునకు లోనై, ఏమి చేయవలెనని చింతించాడు. ఋషులకు వాలఖిల్యులనే మునుల గూర్చి వివరించాడు.

త ఊచుః కశ్యపం విప్రం గత్వా గంగాం తు గౌతమీమ్ ।
తత్ర స్తుహి మహేశానం పునర్భార్యే భవిష్యతః ॥ 16 ॥

అప్పుడా ఋషులు విప్రుడైన కశ్యపునితో నిట్లన్నారు. గౌతమీగంగానదివద్దకు వెళ్ళి అక్కడ శివుని స్తుతించు. తిరిగి నీ భార్యలు లభించగలరు.

బ్రహ్మహత్యాభయాదేవ యత్ర దేవో మహేశ్వరః ।
గంగామధ్యే సదా హ్యాస్తే మధ్యమేశ్వరసంజ్ఞయా ॥ 17 ॥

తథేత్యుక్త్వా కశ్యపోఽపి స్నాత్వా గంగాం జితవ్రతః ।
తుష్టావ స్తవనైః పుణ్యైర్దేవదేవం మహేశ్వరమ్ ॥ 18 ॥

బ్రహ్మహత్యాభయంతో మహాదేవుడైన శివుడు మధ్యమేశ్వరుడనే పేరుతో ఆ గంగానదిమధ్యలో ఎల్లప్పుడూ ఉంటాడు అని చెప్పగా, సరే అలాగే, అని కశ్యపుడు గంగలో స్నానంచేసి, వ్రతనిష్ఠుడై, పవిత్రములైన స్తోత్రములతో ఆ దేవదేవుడైన మహేశ్వరుని సంతోషపెట్టాడు.

కశ్యప ఉవాచ :- కశ్యపుడు పలికాడు.

లోకత్రయైకాధిపతేర్న యస్య కుత్రాపి వస్తున్యభిమానలేశః ।
స సిద్ధనాథోఽఖిలవిశ్వకర్తా భర్తా శివాయా భవతు ప్రసన్నః ॥ 19 ॥

ముల్లోకములకు తానొక్కడే అధికారియై ఉండికూడా ఏ వస్తువునందెక్కడనూ అభిమానమొకింత కూడా లేనివాడు, సమస్త విశ్వమునకు కర్త, సిద్ధనాథుడు, పార్వతికి భర్త అయిన శివుడు ప్రసన్నుడగు గాక.

తాపత్రయోష్ణద్యుతితాపితానా
మితస్తతో వై పరిధావతాం చ ।
శరీరిణాం స్థావరజంగమానాం
త్వమేవ దుఃఖవ్యపనోద దక్షః ॥ 20 ॥

ఆధ్యాత్మిక ఆధిదైవిక, ఆధిభౌతికములనే తాపత్రయముల వేడితగిలి ఇటునటు పరుగెత్తుతున్న స్థావర జంగమములైన జీవులకు దుఃఖములను తొలగించుటకు నీవే సమర్థుడవు.

సత్త్వాదియోగస్త్రివిధోఽపి యస్య శక్రాదిభిర్వక్తుమశక్య ఏవ ।
విచిత్రవృత్తిం పరిచిన్త్య సోమం సుఖీ సదా దానపరో వరేణ్యః ॥ 21 ॥

సత్త్వరజస్తమములనే యోగములు మూడును కలిగినవాడైనా ఇంద్రాదిదేవతలచేత కూడా వర్ణించశక్యంగాని వాడతడు. విచిత్రవృత్తిగలిగిన శివుని విచారించినవాడు ఎప్పుడూ సుఖంగా ఉంటాడు. దానపరుడు, శ్రేష్ఠుడూ అవుతాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యాది స్తుతిభిర్దేవః స్తుతో గౌరీప్రియః శివః ।
ప్రసన్నో హ్యదదాచ్ఛంభుః కశ్యపాయ వరాన్ బహూన్ ॥ 22 ॥

ఈవిధమైన స్తోత్రములతో గౌరీప్రియుడైన శివుని స్తుతించాడు. శివుడు ప్రసన్నుడై కశ్యపునకు అనేక వరములను ప్రసాదించాడు.

భార్యార్థినం తు తం ప్రాహ స్యాతాం భార్యే ఉభే తు తే ।
నదీస్వరూపే పత్న్యౌ యే గంగాం ప్రాప్య సరిద్వరామ్ ॥ 23 ॥

తత్సంగమనమాత్రేణ తాభ్యాం భూయాత్స్వకం వపుః ।
తే గర్భిణ్యౌ పునర్జాతే గంగాయాశ్చ ప్రసాదతః ॥ 24 ॥

భార్యార్థియైన కశ్యపునితో "నీ ఇద్దరు భార్యలు నీకు లభిస్తారు. నదీస్వరూపంలో నున్న నీ భార్యలు సరిద్వరయగు గంగను చేరి, ఆ గంగాసంగమ మాత్రంచే తిరిగి వారి పూర్వస్వరూపమును పొందుతారు. గంగయొక్క అనుగ్రహంతో తిరిగి వారిద్దరు గర్భమును ధరిస్తారు".

తతః ప్రజాపతిః ప్రీతో భార్యే ప్రాప్య మహామనాః ।
ఆహ్వయామాస తాన్విప్రాన్ గౌతమీతీరమాశ్రితాన్ ॥ 25 ॥

అటు తర్వాత మహాత్ముడైన ప్రజాపతి కశ్యపుడు భార్యలిద్దరినీ పొంది, సంతుష్టుడై, గౌతమీనదీతీరమునందున్న విప్రులను ఆహ్వానించాడు.

సీమన్తోన్నయనం చక్రే తాభ్యాం ప్రీతః ప్రజాపతిః ।
బ్రాహ్మణాన్ భోజయామాస విధిదృష్టేన కర్మణా ॥ 26 ॥

ఆ ప్రజాపతి వారిద్దరికి సూడిదలు చేయించాడు. శాస్త్రప్రకారంగా బ్రాహ్మణులకు భోజనం పెట్టాడు.

భుక్తవత్స్వథ విప్రేషు కశ్యపస్యాథ మన్దిరే ।
భర్తుః సమీపే సంవిష్టా కద్రూర్విప్రాన్నిరీక్ష్య చ ॥ 27 ॥

తతః కద్రూః ఋషీనక్ష్ణా ప్రాహసత్తే చ చుక్షుభుః ।
యేనాక్ష్ణా హసితా పాపే భజ్యతాం తేఽక్షి పాపకృత్ ॥ 28 ॥

బ్రాహ్మణులు భుజించిన తరువాత కశ్యపమందిరంలో భర్తదగ్గర కూర్చొని కద్రువ బ్రాహ్మణులను చూస్తూ, తన కంటితో ఆ ఋషులనందరిని అపహాస్యం చేసింది. దానితో నా ఋషులు బాధపడ్డారు. దానితో వారు కోపంతో "ఓ పాపిష్ఠురాలా! ఏ కంటితోనైతే నీవు మమ్మల్ని పరిహసించావో ఆ పాపిష్ఠి కన్ను నశించుగాక!" అని శపించారు.

కాణాఽభవత్తతః కద్రూః సర్పమాతేతి యోచ్యతే ।
తతః ప్రసాదయామాస కశ్యపో భగవాన్ ఋషీన్ ॥ 29 ॥

అప్పుడు సర్పమాతయని పిలువబడే ఆ కద్రువ గ్రుడ్డిదయింది. పూజ్యుడైన కశ్యపుడు ఋషులను ప్రార్థించాడు.

తతః ప్రసన్నాస్తే ప్రోచుర్గౌతమీ సరితాం వరా ।
అపరాధసహస్రేభ్యో రక్షిష్యతి చ సేవనాత్ ॥ 30 ॥

అప్పుడు ఋషులు ప్రసన్నులై నదుల్లో శ్రేష్ఠురాలైన గౌతమిని సేవిస్తే ఆ నది వేల దోషాలను నుండి రక్షిస్తుంది అని చెప్పారు.

భార్యాన్వితస్తథా చక్రే కశ్యపో మునిసత్తమః ।
తతః ప్రభృతి తత్తీర్థముభయోః సంగమం విదుః ॥ 31 ॥

అప్పుడా మునిసత్తముడైన కశ్యపుడు భార్యతో కలిసి అలాగే చేశాడు. అప్పటినుండి యా తీర్థమునకు కద్రూసుపర్ణా సంగమమని పేరు వచ్చింది.

కద్రూః సమన్తాత్పూర్వం చ యావత్సౌపర్ణికా నదీ ।
తావజ్జటాధరం తీర్థం వారణస్యా యవాధికమ్ ॥ 32 ॥

సర్వపాపప్రశమనం సర్వక్రతుఫలప్రదమ్ ॥ 33 ॥

కద్రువ కంటె ముందు సౌపర్ణికా నది వారణాసికంటె యవాధికమగు జటాధరతీర్థంగా పేరొందింది. అది సర్వపాపములను నశింపచేస్తుంది. సమస్తయజ్ఞఫలముల నిచ్చునదీ తీర్థము.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భుఋషిసంవాదే 'కద్రూసుపర్ణాసంగమతీర్థవర్ణనం' నామ త్రింశోఽధ్యాయః. ॥ 30 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో బ్రహ్మ – ఋషి సంవాదములో 'కద్రూసుపర్ణా సంగమ తీర్థవర్ణన'మనే పేరుగల ముప్పైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకత్రింశోఽధ్యాయః - ముప్పై ఒకటవ అధ్యాయం

సరస్వతీసంగమ పురూరవస బ్రహ్మతీర్థ సిద్ధేశ్వర వర్ణనమ్

(తీర్థమాహాత్మ్యములో సరస్వతీ సంగమ తీర్థం, పురూరవసతీర్థం, బ్రహ్మతీర్థం, సిద్ధేశ్వర వర్ణనం)

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పురూరవసమాఖ్యాతం తీర్థం వేదవిదో విదుః ।
స్మరణాదేవ పాపానాం నాశనం కిం తు దర్శనమ్ ॥ 1 ॥

వేదవేత్తలైన పెద్దలు పురూరవసమను పేరుగల తీర్థమున్నదన్నారు. ఆ తీర్థమును స్మరించినంతనే పాపములన్నీ నశిస్తాయి. ఇక దాని దర్శనమైతే ఎంత ఫలమని చెప్పాలి?

పురూరవా బ్రహ్మసదః ప్రాప్య తత్ర సరస్వతీమ్ ।
యదృచ్ఛయా దేవనదీం హసన్తీం బ్రహ్మణోఽన్తికే ।
తాం దృష్ట్వా రూపసంపన్నామూర్వశీం ప్రాహ భూపతిః ॥ 2 ॥

పురూరవుడను రాజు ఒకనాడు బ్రహ్మలోకమునకు వెళ్ళి దేవనది యైన సరస్వతిని దర్శించాడు. అక్కడ బ్రహ్మదగ్గర యథేచ్ఛగా నవ్వుతున్న సౌందర్యవతియైన సరస్వతిని చూచి ఊర్వశితో రాజిలా అన్నాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

కేయం రూపవతీ సాధ్వీ స్థితేయం బ్రహ్మణోఽన్తికే ।
సర్వాసాముత్తమా యోషిద్దీపయన్తీ సభామిమామ్ ॥ 3 ॥

స్త్రీలందరిలోనూ ఉత్తమ సౌందర్యవతియై, ఈ సభనంతటిని ప్రకాశింపచేస్తూ బ్రహ్మదగ్గరవున్న ఈ సాధ్వి ఎవరు? అనగా

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఊర్వశీ ప్రాహ రాజానమియం దేవనదీ శుభా ।
సరస్వతీ బ్రహ్మసుతా నిత్యమేతి చ యాతి చ ।
తచ్ఛ్రుత్వా విస్మితో రాజా ఆనయేమాం మమాన్తికమ్ ॥ 4 ॥

ఊర్వశి రాజుతో నిట్లన్నది. ఈమె శుభకరురాలగు దేవనది, బ్రహ్మకుమార్తె సరస్వతి. నిత్యమూ వచ్చి వెళ్తూ ఉంటుంది. ఆ మాటవిని రాజు ఆశ్చర్యపడి ఆమెను నా దగ్గరికి తీసుకురమ్మన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఊర్వశీ పునరప్యాహ రాజానం భూరిదక్షిణమ్ ॥ 5 ॥

భూరిదక్షిణల నిచ్చిన రాజుతో ఊర్వశి మరల ఇలా అన్నది.

ఊర్వశ్యువాచ :- ఊర్వశి పలికింది.

ఆనీయతే మహారాజ తస్యాః సర్వం నివేద్య చ ॥ 6 ॥

మహారాజా! ఆమెకంతయూ చెప్పి తీసుకొని వస్తాను.

బ్రహ్మో ఉవాచ :- బ్రహ్మ పలికాడు.

తతస్తాం ప్రాహిణోత్తత్ర రాజా ప్రీత్యా తదోర్వశీమ్ ।
సా గత్వా రాజవచనం న్యవేదయదథోర్వశీ ॥ 7 ॥

రాజు ప్రేమతో ఆ ఊర్వశిని అక్కడికి పంపాడు. అప్పుడా ఊర్వశి వెళ్ళి రాజు మాటను నివేదించింది.

సరస్వత్యపి తన్మేనే ఊర్వశ్యా యన్నివేదితమ్ ।
సా తథేతి ప్రతిజ్ఞాయ ప్రాయాద్యత్ర పురూరవాః ॥ 8 ॥

ఊర్వశి చెప్పిన దానిని సరస్వతి కూడా అంగీకరించింది. ఆమె అట్లే అని మాటనిచ్చి పురూరవుడున్న చోటుకు వెళ్ళింది.

సరస్వత్యాస్తతస్తీరే స రేమే బహులాః సమాః ।
సరస్వానభవత్పుత్రో యస్య పుత్రో బృహద్రథః ॥ 9 ॥

పురూరవుడు సరస్వతితో ఆ తీరంలో చాలా కాలం క్రీడించాడు. వానికి సరస్వానుడనే కుమారుడు కలిగాడు. అతని కుమారుడే బృహద్రథుడు.

తాం గచ్ఛన్తీం నృపగృహం నిత్యమేవ సరస్వతీమ్ ।
సరస్వన్తం తతో లక్ష్మ జ్ఞాత్వాఽన్యేషు తథాకృతమ్ ॥ 10 ॥

తస్యై దదావహం శాపం భూయా ఇతి మహానదీ ।
మచ్ఛాపభీతా వాగీశా ప్రాగాద్దేవీం చ గౌతమీమ్ ॥ 11 ॥

ప్రతి దినము రాజుగారింటికి వెళుతున్న ఆ సరస్వతినీ, సరస్వంతున్నీ గుర్తించి తరువాత ఇతరుల యందు కూడా అలాగే చేసిందని తెలుసుకొని, నేనప్పుడు ఆమెను మహానదివి కమ్మని శాపము నిచ్చాను. నా శాపభీతురాలైన సరస్వతి గౌతమీ దేవి వద్దకు వెళ్ళింది.

కమణ్డలుభవాం పూతాం మాతరం లోకపావనీమ్ ।
తాపత్రయోపశమనీమైహికాముష్మికప్రదామ్ ॥ 12 ॥

సా గత్వా గౌతమీం దేవీం ప్రాహ మచ్ఛాపమాదితః ।
గంగాఽపి మామువాచేదం విశాపాం కర్తుమర్హసి ॥ 13 ॥

కమండలంలోనుండి పుట్టినదీ, పవిత్రమైనదీ, లోకములను పావనము చేయునదీ, తాపత్రయముల నుపశమింపచేయునదీ, ఇహపరలోకములనిచ్చు తల్లియగు గౌతమీదేవితో నా శాపవిషయమును మొదటినుండి చెప్పింది. ఆమె చెప్పింది విని గంగకూడా నాతో ఆమెను శాపవిముక్తురాలను చేయమని అడిగింది.

న యుక్తం యత్సరస్వత్యాః శాపం త్వం దత్తవానసి ।
స్త్రీణామేష స్వభావో వై పుంస్కామా యోషితో యతః ॥ 14 ॥

నీవు సరస్వతికి శాపమివ్వడం యుక్తమైనదికాదు. ఎందుకనగా స్త్రీలస్వభావమే అంత. పురుషుల్ని కోరడం స్త్రీల స్వభావం.

స్వభావచపలా బ్రహ్మన్ యోషితః సకలా అపి ।
త్వం కథం తు న జానీషే జగత్స్రష్టామ్బుజాసన ॥ 15 ॥

బ్రహ్మా! స్త్రీలందరూ చపలచిత్తలే. ఓ పద్మాసనా! జగత్సృష్టికర్తవైన నీకు ఈ సంగతి తెలియదా?

విడమ్బయతి కం వా న కామో వాఽపి స్వభావతః ।
తతో విశాపమవదం దృశ్యాఽపి స్యాత్సరస్వతీ ॥ 16 ॥

స్వభావసిద్ధంగా మన్మథుడు అందర్నీ వశం చేసుకొంటాడు. ఎవర్నీ విడిచిపెట్టడు. అందుకని శాపం తొలగించమన్నాను. సరస్వతి అదృశ్యంగానే కాక కనిపించే నదిలా కూడా ఉండునుగాక!

తస్మాచ్ఛాపాన్నదీ మర్త్యే దృశ్యాఽదృశ్యా సరస్వతీ ।
యత్రైషా సంగతా దేవీ గంగాయాం శాపవిహ్వలా ॥ 17 ॥

తత్ర ప్రాయాన్నృపవరో ధార్మికః స పురూరవాః ।
తపస్తప్త్వా సమారాధ్య దేవం సిద్ధేశ్వరం హరమ్ ॥ 18 ॥

సర్వాన్కామానథావాప గంగాయాశ్చ ప్రసాదతః ।
తతఃప్రభృతి తత్తీర్థం పురూరవసముచ్యతే ॥ 19 ॥

అందువలన భూలోకంలో ఈ నది దృశ్యాదృశ్యమవుతుంది. ఎక్కడైతే శాపవిహ్వలయైన సరస్వతి గంగానదియందు సంగమించిందో, ఆ ప్రదేశమునకా రాజశ్రేష్ఠుడు, ధార్మికుడు నైన పురూరవుడు వెళ్ళి, సిద్ధేశ్వరుడనే శంకరదేవుని గూర్చి తపస్సుచేసి, ఆరాధించి, గంగానది యనుగ్రహంవలన అన్నికోరికలు తీరినవాడయ్యాడు. అప్పటినుండి ఆ తీర్థమును పురూరవస తీర్థమని పిలుస్తారు.

సరస్వతీసంగమం చ బ్రహ్మతీర్థం తదుచ్యతే ।
సిద్ధేశ్వరో యత్ర దేవః సర్వకామప్రదం తు తత్ ॥ 20 ॥

అదే సరస్వతీ సంగమతీర్థమనీ, బ్రహ్మతీర్థమనీ పిలవబడుతోంది. సిద్ధేశ్వరుడైన దేవుడెక్కడ ఉన్నాడో! ఆ ఈ తీర్థం అన్ని కోరికలూ తీరుస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'సరస్వతీసంగమ పురూరవస బ్రహ్మతీర్థ సిద్ధేశ్వర వర్ణనం' నామైక త్రింశోఽధ్యాయః. ॥ 31 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో సరస్వతీ సంగమ తీర్థము, పురూరవసతీర్థము, బ్రహ్మతీర్థము, సిద్ధేశ్వర వర్ణనమనే పేరుగల ముప్పై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పై రెండవ అధ్యాయం
పంచతీర్థవర్ణనమ్ - పంచతీర్థ వర్ణనం

బ్రహ్మో ఉవాచ :- బ్రహ్మ పలికాడు.

సావిత్రీ చైవ గాయత్రీ శ్రద్ధా మేధా సరస్వతీ ।
ఏతాని పంచతీర్థాని పుణ్యాని మునయో విదుః ॥ 1 ॥

సావిత్రి, గాయత్రి, శ్రద్ధ, మేధ, సరస్వతి అనే ఐదు తీర్థములు చాలా పవిత్రమైనవని మునులు తెలుసుకొన్నారు.

తత్ర స్నాత్వా చ పీత్వా తు ముచ్యతే సర్వకల్మషాత్ ।
సావిత్రీ చైవ గాయత్రీ శ్రద్ధా మేధా సరస్వతీ ॥ 2 ॥

ఏతా మమ సుతా జ్యేష్ఠా ధర్మసంస్థానహేతవః ।
సర్వాసాముత్తమాం కాంచిన్నిర్మమే లోకసున్దరీమ్ ॥ 3 ॥

ఆ తీర్థములలో స్నానం చేసినా, నీరు త్రాగినా సమస్తపాపాలు నశిస్తాయి. సావిత్రి, గాయత్రి, శ్రద్ధ, మేధ, సరస్వతులు అనే ఈ ఐదుగురు ధర్మసంస్థానహేతువులుగా ముఖ్యమైన నా కుమార్తెలు. వీరిలో అందరికంటె ఉత్తమమైన దానిగా లోకసుందరిగా ఒకదానిని చేశాను.

తాం దృష్ట్వా వికృతా బుద్ధిర్మమాఽఽసీన్మునిసత్తమ ।
గృహీతుకామం మాం బాలా సా తు దృష్ట్వా పలాయితా ॥ 4 ॥

ఆమెను చూచి నాకు వికృతమైన బుద్ధి కలిగింది. ఓ మునిసత్తమా! కామంతో ఆమెను పట్టుకోబోయిన నన్ను చూచి ఆ బాలిక పారిపోయింది.

మృగీభూతా తు సా బాలా మృగోఽహమభవం తదా ।
మృగవ్యాధోఽభవచ్ఛంభుర్ధర్మసంరక్షణాయ చ ॥ 5 ॥

ఆమె ఆడజింకరూపమును ధరించగానే నేను కూడా మగజింకరూపమును ధరించి వెంటాడాను. అప్పుడు ధర్మమును రక్షించుటకు శివుడు మృగములను వేటాడే వ్యాధుడయ్యాడు.

తా మద్భీతాః పంచ సుతా గంగామీయుర్మహానదీమ్ ।
తతో మహేశ్వరః ప్రాయాద్ధర్మసంరక్షణాయ సః ॥ 6 ॥

నా ఐదుగురు కుమార్తెలు నా వలన భయంతో గంగానదిలో మునిగారు. అప్పుడా ధర్మసంరక్షకుడైన శివుడు వచ్చాడు.

ధనుర్గృహీత్వా సశరమీశోఽపి మృగరూపిణమ్ ।
మామువాచ వధిష్యే త్వాం మృగవ్యాధస్తదా హరః ॥ 7 ॥

ధనుర్బాణములను ధరించి మృగవ్యాధరూపంలో నున్న శివుడు మృగరూపంలో నున్న నన్ను చంపుతానన్నాడు.

తత్కర్మణో నివృత్తోఽహం ప్రాదాం కన్యాం వివస్వతే ।
సావిత్ర్యాద్యాః పంచ సుతా నదీరూపేణ సంగతాః ॥ 8

నేనా కాముకకర్మనుండి వెనుదిరిగి నా కూతురును సూర్యున కిచ్చాను. సావిత్ర్యాది ఐదుగురు కుమార్తెలు నదీరూపమును పొందారు.

తా ఆగతాః పునశ్చాపి స్వర్గం లోకం మమాన్తికమ్ ।
యత్ర తాః సంగతా దేవ్యా పంచ తీర్థాని నారద ॥ 9 ॥

ఓ నారదా! తిరిగి వారు స్వర్గలోకంలో నా దగ్గరికి వచ్చారు. ఆ నదులు ఎక్కడ గంగాసంగమం పొందాయో! అవే ఐదు తీర్థములు.

సంగతాని చ పుణ్యాని పంచ నద్యః సరస్వతీ ।
తేషు స్నానం తథా దానం యత్కించిత్ కురుతే నరః ॥ 10 ॥

సర్వకామప్రదం తత్స్యాన్నైష్కర్మ్యాన్ముక్తిదం స్మృతమ్ ।
తత్రాభవన్మృగవ్యాధం తీర్థం సర్వార్థదం నృణామ్ ।
స్వర్గమోక్షఫలం చాన్యద్బ్రహ్మతీర్థఫలం స్మృతమ్ ॥ 11 ॥

సరస్వతి మొదలైన ఐదు నదులెక్కడ సంగమించాయో అవి పవిత్రమైన తీర్థములు. ఆ నదులలో స్నానంగాని, దానంగాని ఏ కొంచెము చేసినా కూడా, సమస్త కోరికలూ తీరుతాయి. నిష్కామంగా చేస్తే ముక్తి లభిస్తుంది. సమస్తసంపదనూ ఇస్తుంది. మృగవ్యాధ తీర్థము. స్వర్గమోక్షఫలమును, బ్రహ్మతీర్థఫలమును గూడా మానవుల కిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'పంచతీర్థమాహాత్మ్యనిరూపణం' నామ ద్వాత్రింశోఽధ్యాయః. ॥ 32 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో 'పంచతీర్థ వర్ణన'మనే పేరుగల ముప్పై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పై మూడవ అధ్యాయం
శమ్యాదితీర్థవర్ణనమ్ - శమ్యాది తీర్థ వర్ణనం

బ్రహ్మో ఉవాచ :- బ్రహ్మ పలికాడు.

శమీతీర్థమితిఖ్యాతం సర్వపాపోపశాన్తిదమ్ ।
తస్యాఽఽఖ్యానం ప్రవక్ష్యామి శృణు యత్నేన నారద ॥ 1 ॥

ఓ నారదా! సమస్తపాపములను శమింపజేసేది, శమీతీర్థమనే ప్రసిద్ధ తీర్థమున్నది. దాని కథను చెబుతాను శ్రద్ధగా విను.

ఆసీత్ప్రియవ్రతో నామ క్షత్రియో జయతాం వరః ।
గౌతమ్యా దక్షిణే తీరే దీక్షాం చక్రే పురోధసా ॥ 2 ॥

జయించువారిలో శ్రేష్ఠుడైన ప్రియవ్రతుడనే పేరుగల క్షత్రియుడుండేవాడు. అతడు తన పురోహితుని ఆజ్ఞతో గౌతమీనదియొక్క దక్షిణతీరంలో దీక్షబూనాడు.

హయమేధ ఉపక్రాన్తే ఋత్విగ్భిరృషిభిర్వృతే ।
తస్య రాజ్ఞో మహాబాహోర్వసిష్ఠస్తు పురోహితః ॥ 3 ॥

ఋత్విక్కులు, ఋషులందరితో కలిసి అశ్వమేధయజ్ఞమును ప్రారంభించాడు. మహాబాహువైన ఆ రాజునకు వసిష్ఠుడు పురోహితుడు.

తద్యజ్ఞవాటమగమద్దానవోఽథ హిరణ్యకః ।
తం దానవమభిప్రేక్ష్య దేవాస్త్విన్ద్రపురోగమాః ॥ 4 ॥

భీతాః కేచిద్దివం జగ్ముర్హవ్యవాట్ శమిమావిశత్ ।
అశ్వత్థం విష్ణురగమద్భానురర్కం వటం శివః ॥ 5 ॥

హిరణ్యకుడనే రాక్షసుడా యజ్ఞవాటిక వద్దకు వెళ్ళాడు. ఆ దానవుని చూసి ఇంద్రుడు మున్నగు దేవతలు భయపడి కొందరు స్వర్గమునకు పారిపోయారు. అగ్ని శమీవృక్షమును, విష్ణువు అశ్వత్థవృక్షమును, సూర్యుడు జిల్లేడుచెట్టును, శివుడు మఱ్ఱివృక్షమును ఆశ్రయించారు.

సోమః పలాశమగమద్గంగామ్భో హవ్యవాహనః ।
అశ్వినౌ తు హయం గృహ్య వాయసోఽభూద్యమః స్వయమ్ ॥ 6 ॥

చంద్రుడు మోదుగువృక్షమును, గంగాజలమును హవ్యవాహనుడు, అశ్వినీ దేవతలు గుఱ్ఱమును, యముడు స్వయంగా కాకి నాశ్రయించారు.

ఏతస్మిన్నన్తరే తత్ర వసిష్ఠో భగవానృషిః ।
యష్టిమాదాయ దైతేయాన్న్యవారయదథాఽఽజ్ఞయా ॥ 7 ॥

ఇంతలో అక్కడ పూజ్యుడైన వసిష్ఠమహర్షి కఱ్ఱ దీసుకొని ఆజ్ఞాపూర్వకంగా ఆ రాక్షసులను తరిమాడు.

తతః ప్రవృత్తః పునరేవ యజ్ఞో దైత్యో గతః స్వేన బలేన యుక్తః ।
ఇమాని తీర్థాని తతః శుభాని దశాశ్వమేధస్య ఫలాని దద్యుః ॥ 8 ॥

రాక్షసుడు తన సైన్యంతో వెళ్ళిపోయాడు. ఆ తరువాత మళ్ళీ యజ్ఞం జరిగింది. అప్పటినుండి ఈ తీర్థములు పది అశ్వమేధయజ్ఞముల ఫలములనిస్తున్నాయి.

ప్రథమం తు శమీతీర్థం ద్వితీయం వైష్ణవం విదుః ।
ఆర్కం శైవం చ సౌమ్యం చ వాసిష్ఠం సర్వకామదమ్ ॥ 9 ॥

వానిలో మొదటిది శమీతీర్థం, రెండవది విష్ణుతీర్థం, అలాగే ఆర్కం, శైవం, సౌమ్యం, వాసిష్ఠం అనే ఈ తీర్థములన్నీ కోరికలన్నిటినీ, తీరుస్తాయి.

దేవాశ్చ ఋషయః సర్వే నివృత్తే మఖవిస్తరే ।
తుష్టాః ప్రోచుర్వసిష్ఠం తం యజమానం ప్రియవ్రతమ్ ॥ 10 ॥

యజ్ఞపరిసమాప్తి జరిగిన తర్వాత దేవతలు, ఋషులు వెళుతూ ఎంతో సంతోషంతో యజమానుడైన ప్రియవ్రతునితో పురోహితుడైన వసిష్ఠునితో ఇలా అన్నారు.

తాంశ్చ వృక్షాంస్తాం చ గంగాం ముదా యుక్తాః పునః పునః ।
హయమేధస్య నిష్పత్త్యై ఏతే యాతా ఇతస్తతః ॥ 11 ॥

హయమేధఫలం దద్యుస్తీర్థానీత్యవదన్ సురాః ।
తస్మాత్స్నానేన దానేన తేషు తీర్థేషు నారద ॥
హయమేధఫలం పుణ్యం ప్రాప్నోతి న మృషా వచః ॥ 12 ॥

ఆ వృక్షములతో, గంగతో ఎంతో సంతోషంతో హయమేధ యజ్ఞఫలితమునకై వారు నిటునటు తిరుగుతూ, ఈ తీర్థములు హయమేధఫలము నిస్తాయని దేవతలన్నారు. అందువలన ఓ నారదా! ఈ తీర్థములలో స్నానం చేసినా, దానం చేసినా, అశ్వమేధయాగం చేసిన పుణ్యం పొందుతాడు. ఇది సత్యము.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే 'శమ్యాదితీర్థవర్ణనం' నామ త్రయస్త్రింశోఽధ్యాయః. ॥ 33 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని బ్రహ్మ–నారద సంవాదంలో 'శమ్యాది తీర్థ వర్ణన'మనే పేరుగల ముప్పై మూడవ అధ్యాయము. ॥ 33 ॥

చతుస్త్రింశోఽధ్యాయః - ముప్పై నాల్గవ అధ్యాయం

విశ్వామిత్రాదిద్వావింశతిసహస్రతీర్థవర్ణనమ్ - విశ్వామిత్రాది ఇరవై రెండువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విశ్వామిత్రం హరిశ్చన్ద్రం శునఃశేపం చ రోహితమ్ ।
వారుణం బ్రాహ్మమాగ్నేయమైన్ద్రమైన్దవమైశ్వరమ్ ॥ 1 ॥

మైత్రం చ వైష్ణవం చైవ యామ్యమాశ్వినమౌశనమ్ ।
ఏతేషాం పుణ్యతీర్థానాం నామధేయం శృణుష్వ మే ॥ 2 ॥

విశ్వామిత్రం, హరిశ్చంద్రం, శునఃశేపం, రోహితం, వారుణం, బ్రాహ్మం, ఆగ్నేయం, ఐంద్రం, ఐందవం, ఐశ్వరం, మైత్రం, వైష్ణవం, యామ్యం, ఆశ్వినం, ఔశనం, అనే పేర్లుగల ఈ పుణ్యతీర్థములగూర్చి విను.

హరిశ్చన్ద్ర ఇతి త్వాసీదిక్ష్వాకుప్రభవో నృపః ।
తస్య గేహమనుప్రాప్తౌ నారదః పర్వతస్తథా ॥
కృత్వాఽఽతిథ్యం తయోః సమ్యగ్ఘరిశ్చన్ద్రోఽబ్రవీదృషిః ॥ 3 ॥

ఇక్ష్వాకువంశంలో హరిశ్చంద్రుడనే రాజు ఉండేవాడు. ఒకనాడు అతనింటికి నారదుడు, పర్వతుడు వచ్చారు. హరిశ్చంద్రుడు వారికి చక్కగా ఆతిథ్యమిచ్చి, వారితో ఇలా అన్నాడు.

హరిశ్చన్ద్ర ఉవాచ :- హరిశ్చంద్రుడు పలికాడు.

పుత్రార్థం క్లిశ్యతే లోకః కిం పుత్రేణ భవిష్యతి ।
జ్ఞానీ వాఽప్యథవాఽజ్ఞానీ ఉత్తమో మధ్యమోఽథవా ॥

ఏతం మే సంశయం నిత్యం బ్రూతామృషివరావుభౌ । 4 ॥

లోకంలో అందరూ కుమారుడు కావలెనని బాధపడుతూ ఉంటారు. వాడు జ్ఞానిగానీ, అజ్ఞానిగానీ, ఉత్తముడుగానీ, మధ్యముడుగానీ, ఎవరైనాసరే! అసలు పుత్రునివల్ల ఏం కలుగుతుంది? ఇది నాకు ప్రతిరోజూ కలిగే సంశయం. ఓ ఋషివరులారా! చెప్పండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తావబ్రూతాం హరిశ్చన్ద్రం పర్వతో నారదస్తథా ॥ 5 ॥

పర్వత, నారదులిద్దరూ హరిశ్చంద్రునితో ఇలా అన్నారు.

నారదపర్వతావూచతుః :- నారదపర్వతులు పలికారు.

ఏకధా దశధా రాజన్! శతధా చ సహస్రధా ।
ఉత్తరం విద్యతే సమ్యక్ తథాఽప్యేతదుదీర్యతే ॥ 6 ॥

ఓ రాజా! దానికి సమాధానం ఒకటి, పది, వంద, వేయి ఇలా అనేకవిధములుగా ఉన్నది. అయినా బాగుగా దీనిని చెబుతున్నాను, విను.

నాపుత్రస్య పరో లోకో విద్యతే నృపసత్తమ ।
ఇహలోకశ్చ నాస్త్యేవ తస్య దుష్కృతకర్మణః ॥
జాతే పుత్రే పితా స్నానం యః కరోతి జనాధిప ॥ 7 ॥

దశానామశ్వమేధానామభిషేకఫలం లభేత్ ।
ఆత్మప్రతిష్ఠా పుత్రాత్స్యాజ్జాయతే చామరోత్తమః ॥ 8 ॥

ఓ రాజా! చేయకూడని పనులుచేసిన వానికి, పుత్రసంతానంలేనివానికి ఇహలోకం, పరలోకం రెండూ లేవు. ఓ రాజా! కుమారుడు పుట్టగానే ఏ తండ్రైతే స్నానం చేస్తాడో, అతనికి పది అశ్వమేధాభిషేకముల ఫలము లభిస్తుంది. కుమారునివలన అతనికి ప్రతిష్ఠ కలుగుతుంది. అతడమరోత్తము డవుతాడు.

అమృతేనామరా దేవాః పుత్రేణ బ్రాహ్మణాదయః ।
త్రిఋణాన్మోచయేత్పుత్రః పితరం చ పితామహాన్ ॥ 9 ॥

అమృతపానంచే దేవతలమరు లవుతారు. పుత్రునిచే బ్రాహ్మణాదిజాతులు అమరులవుతారు. పుత్రుడు దేవఋణ, ఋషిఋణ, పితృఋణములనుండి తండ్రిని, తాతలను ఋణవిముక్తులను చేస్తాడు.

కింతు మూలం కిము జలం కింతు శ్మశ్రూణి కిం తపః ।
వినా పుత్రేణ రాజేన్ద్ర స్వర్గో ముక్తిః సుతాత్ స్మృతః ॥ 10 ॥

ఓ రాజేంద్రా! కుమారుడు లేకుండా చెట్లక్రింద కూర్చొని, ముక్కు మూసుకొని తపస్సులు చేయుట, గంగాది తీర్థాలలో మునుగుట, గడ్డాలు, మీసాలు పెంచుకొనుట ఇవన్నీ ఎందుకు? స్వర్గంగాని, ముక్తిగాని కావాలంటే దానికి మార్గము కుమారుడే.

పుత్ర ఏవ పరో లోకో ధర్మః కామోఽర్థ ఏవ చ ।
పుత్రో ముక్తిః పరం జ్యోతిస్తారకః సర్వదేహినామ్ ॥ 11 ॥

సమస్తమానవులకు ధర్మం, అర్థం, కామం, పరలోకం, ముక్తి అన్నీ కుమారుడే. పరంజ్యోతి అతడే. అందర్నీ తరింపచేసేవాడు పుత్రుడే.

వినా పుత్రేణ రాజేన్ద్ర స్వర్గమోక్షౌ సుదుర్లభౌ ।
పుత్ర ఏవ పరో లోకే ధర్మకామార్థసిద్ధయే ॥ 12 ॥

ఓ రాజేన్ద్రా! పుత్రుడు లేకుండా స్వర్గమోక్షములు లభించవు. పరలోకమునకు, ధర్మకామార్థములను పొందుటకు పుత్రుడే కావలెను.

వినా పుత్రేణ యద్దత్తం వినా పుత్రేణ యద్ధుతమ్ ।
వినా పుత్రేణ యజ్జన్మ వ్యర్థం తదవభాతి మే ॥
ఋణాత్పుత్రేణ నిష్కృతిర్విరజాశ్చ ప్రజా యతః ॥ 13 ॥

పుత్రుడు లేకుండా దానంచేసినా, హోమంచేసినా, జన్మెత్తినా అది నాకు వ్యర్థంగానే కనబడుతుంది. విరజానదివలన ప్రజలెలా మోక్షమును పొందుతారో, అలాగే పుత్రునిచేతనే నిష్కృతి కలుగుతుంది.

పితా పుత్రస్య జాతస్య పశ్యేచ్చేజ్జీవతో ముఖమ్ ।
యే భోగా మానుషే లోకే యే భోగాశ్చాన్తరిక్షగాః ॥
తాన్సర్వాన్సమవాప్నోతి పితా పుత్రావలోకనాత్ ॥ 14 ॥

పుట్టి తిరుగుతున్న కుమారుని ముఖం చూసే తండ్రి, మానవలోకంలో ఏ భోగము లున్నాయో, పై లోకాలలో ఏ భోగాలు ఉన్నాయో అవన్నీ పుత్రదర్శనంవలన పొందగలడు.

తస్మాత్పుత్రసమం కించిత్కామ్యం నాస్తి జగత్రయే ।
తచ్ఛ్రుత్వా విస్మితమనాస్తావువాచ నృపః పునః ॥ 15 ॥

అందువలన ఈ ముల్లోకములలో పుత్రునితో సమానమైనది ఏ కొంచెమూ కోరదగినది లేదు. ఆ మాటలు విని రాజు మరల ఆశ్చర్యంతో వారిద్దరితో ఇలా అన్నాడు.

హరిశ్చన్ద్ర ఉవాచ :- హరిశ్చంద్రుడు పలికాడు.

కథం మే స్యాత్సుతో బ్రూతాం యత్ర క్వాపి యథాతథమ్ ।
యేన కేనాప్యుపాయేన కృత్వా కించిత్తు పౌరుషమ్ ॥
మన్త్రేణ యాగదానాభ్యాముత్పాద్యోఽసౌ సుతో మయా ॥ 16 ॥

నాకు కుమారు డెప్పుడు, ఎక్కడ, ఎలా కలుగుతాడో ఉన్నదున్నట్లుగా నాకు వివరించండి. ఏదో ఒక ఉపాయంతో కొంత పురుష ప్రయత్నం చేసి మంత్రంతో కానీ, యాగదానములతో కానీ నాకు కుమారుడు కలగాలి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తావూచతుర్నృపశ్రేష్ఠం హరిశ్చన్ద్రం సుతార్థినమ్ ।
ధ్యాత్వా క్షణం తథా సమ్యగ్గౌతమీం యాహి మానద ॥ 17 ॥

వారిద్దరు కొంచెం సేపు ధ్యానం చేసి, కుమారుడు కావాలని కోరుకుంటున్న హరిశ్చంద్రునితో ఓ మర్యాదస్థుడా! నీవు చక్కగా గౌతమీనదికి వెళ్ళు.

తత్రాపాంపతిరుత్కృష్టం దదాతి మనసి స్థితమ్ ।
వరుణః సర్వదాతా వై మునిభిః పరికీర్తితః ॥ 18 ॥

అక్కడ జలాధిపతి నీ మనస్సులో వున్న ఉత్కృష్టమైన కోరికను నెరవేర్చగలడు. వరుణుడు సమస్తమూ ఈయగలడని ఋషులు కొనియాడుతారు.

స తు ప్రీతః శనైః కాలే తవ పుత్రం ప్రదాస్యతి ।
ఏతచ్ఛ్రుత్వా నృపశ్రేష్ఠో మునివాక్యం తథాఽకరోత్ ॥ 19 ॥

అతడు సంతోషించి త్వరలోనే నీకు కుమారుని అనుగ్రహించగలడు. ఇలా పలికిన మునివాక్యమును విని ఆ రాజశ్రేష్ఠుడలాగే చేశాడు.

తోషయామాస వరుణం గౌతమీతీరమాశ్రితః ।
తతశ్చ తుష్టో వరుణో హరిశ్చన్ద్రమువాచ హ ॥ 20 ॥

గౌతమీతీరంవద్దకు వెళ్ళి వరుణుని సంతోషపెట్టాడు. అప్పుడు సంతుష్టుడైన వరుణుడు హరిశ్చంద్రునితో ఇలా అన్నాడు.

వరుణ ఉవాచ :- వరుణుడు పలికాడు.

పుత్రం దాస్యామి తే రాజన్! త్వమపుత్రో యతవ్రతః ।
యది యక్ష్యసి తేనైవ తవ పుత్రో భవేద్ధ్రువమ్ ॥ 21 ॥

"రాజా! పుత్రుడు కాని! నీవు నియమంతో వ్రతం చేశావు కనుక నీకు తప్పక సుతుణ్ణి ఇస్తాను. అయితే నీవు అతణ్ణే యజ్ఞపశువుగా చేసి యజ్ఞం చెయ్యాలి. నీకు తప్పక పుత్రుడు పుడతాడు".

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

హరిశ్చన్ద్రోఽపి వరుణం యక్ష్యే తేనేత్యవోచత ।
తతో గత్వా హరిశ్చన్ద్రశ్చరుం కృత్వా తు వారుణమ్ ॥ 22 ॥

భార్యాయై నృపతిః ప్రాదాత్తతో జాతః సుతో నృపాత్ ।
జాతే పుత్రే అపామీశః ప్రోవాచ వదతాం వరః ॥ 23 ॥

హరిశ్చంద్రుడు కూడా వరుణునితో అతనితోనే యజ్ఞం చేస్తానని చెప్పాడు. తరువాత వెళ్ళి రాజు హరిశ్చంద్రుడు వారుణ చరువును చేసి, తన భార్యకిచ్చాడు. రాజుకు కుమారుడు పుట్టాడు. కుమారుడు పుట్టగానే మాట్లడంలో శ్రేష్ఠుడైన వరుణుడిట్లన్నాడు.

వరుణ ఉవాచ :-వరుణుడు పలికాడు.

అద్యైవ పుత్రో యష్టవ్యః స్మరసే వచనం పురా ॥ 24 ॥

ఈ దినముననే నీ కుమారుని యజ్ఞంలో అర్పించవలెననే పూర్వపుమాట గుర్తుందా?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

హరిశ్చన్ద్రోఽపి వరుణం ప్రోవాచేదం క్రమాగతమ్ ॥ 25 ॥

హరిశ్చంద్రుడు కూడా వరుణునితో క్రమంగా ఇలా అన్నాడు.

హరిశ్చన్ద్ర ఉవాచ :- హరిశ్చంద్రుడు పలికాడు.

నిర్దశో మేధ్యతాం యాతి పశుర్యక్ష్యే తతో హ్యహమ్ ॥ 26 ॥

దంతములు బయటపడితేనే యజ్ఞపశువు పవిత్రమౌతుంది. అప్పుడే నేను యజ్ఞం చేస్తానన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం రాజ్ఞో వరుణోఽగాత్స్వమాలయమ్ ।
నిర్దశే పునరభ్యేత్య యజస్వేత్యాహ తం నృపమ్ ॥ 27 ॥

రాజు మాటలను విన్న వరుణుడు తన స్థానమునకు వెళ్ళాడు. శిశువుకి దంతాలు అంకురించాక మళ్ళీ వచ్చి యజ్ఞం చేయమని రాజుని అడిగాడు.

రాజాఽపి వరుణం ప్రాహ నిర్దంతో నిష్ఫలః పశుః ।
పశోర్దన్తేషు జాతేషు ఏహి గచ్ఛాఽధునాఽప్పతే ॥ 28 ॥

రాజు కూడా దంతాలు లేని యజ్ఞపశువు నిష్ఫలము అని పలికి ఓ జలాధిదేవతా! యజ్ఞపశువుకు పూర్తిగా దంతములు వచ్చిన తర్వాత రా! ఇప్పుడు వెళ్లుము! అని చెప్పాడు.

తచ్ఛ్రుత్వా రాజవచనం పునః ప్రాయాదపాంపతిః ।
జాతేషు చైవ దంతేషు సప్త వర్షేషు నారద ॥ 29 ॥

పునరప్యాహ రాజానం యజస్వేతి తతోఽబ్రవీత్ ।
రాజాఽపి వరుణం ప్రాహ పతన్త్యస్మీమే అపాంపతే ॥ 30 ॥

అలా పలికిన రాజు మాటలు విని వరుణుడు తిరిగి వెళ్ళిపోయాడు. ఓ నారదా! ఏడు సంవత్సరములకు దంతములు రాగానే, వరుణుడు మళ్లీ వచ్చి రాజుతో యజ్ఞం చేయమన్నాడు. రాజు కూడా ఓ వరుణా! ఇవి ఊడిపోతున్నాయి.

సంపత్స్యన్తి తథా చాన్యే తతో యక్ష్యే వ్రజాధునా ।
పునః ప్రాయాత్స వరుణః పునర్దంతేషు నారద ।
యజస్వేతి నృపం ప్రాహ రాజా ప్రాహ త్వపాంపతిమ్ ॥ 31 ॥

కొత్తపళ్లు అన్నీ వచ్చాక యజ్ఞం చేస్తాను. ఇప్పుడు వెళ్ళమన్నాడు. తిరిగి క్రొత్త పళ్లు రాగానే ఓ నారదా! వరుణుడు మళ్ళీ వచ్చాడు. యజ్ఞం చేయమని రాజుతో అన్నాడు. అప్పుడు రాజు వరుణునితో ఇలా అన్నాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

యదా తు క్షత్రియో యజ్ఞే పశుర్భవతి వారిప ।
ధనుర్వేదం యదా వేత్తి తదా స్యాత్పశురుత్తమః ॥ 32 ॥

ఓ వరుణా! యజ్ఞంలో క్షత్రియుడు పశువు అవ్వాలంటే ధనుర్వేదం తెలిసినవాడు కావాలి. అప్పుడే ఉత్తమం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా రాజవచనం వరుణోఽగాత్స్వమాలయమ్ ।
యదాస్త్రేషు చ శస్త్రేషు సమర్థోఽభూత్స రోహితః ॥ 33 ॥

సర్వవేదేషు శాస్త్రేషు వేత్తాఽభూత్స త్వరిందమః ।
యువరాజ్యమనుప్రాప్తే రోహితే షోడశాబ్దికే ॥ 34 ॥

ప్రీతిమానగమత్తత్ర యత్ర రాజా స రోహితః ।
ఆగత్య వరుణః ప్రాహ యజస్వాద్య సుతం స్వకమ్ ॥ 35 ॥

రాజు మాటలు విన్న వరుణుడు తిరిగి తన యింటికి వెళ్ళాడు. రోహితుడు మంత్రపూతం ప్రయోగోప సంహారములైన అస్త్రములను, శస్త్రములను కూడ ప్రయోగించుటలో సమర్థుడైనాడు. సమస్త వేదములలోనూ, శాస్త్రములలోనూ నిష్ణాతుడైనాడు. ఆ శత్రుంజయుడగు రోహితుడు పదహారు సంవత్సరముల వయస్సు గలవాడై యువరాజుగా పట్టాభిషిక్తుడైనాడు. ఆ సమయంలో చాలా సంతోషంతో రోహితునితో కలిసివున్న రాజు దగ్గరకు వరుణుడు వచ్చి ఈ రోజు నీ కుమారుని యజ్ఞంలో సమర్పించమన్నాడు.

ఓమిత్యుక్త్వా నృపవర ఋత్విజః ప్రాహ భూపతిః ।
రోహితం చ సుతం జ్యేష్ఠం శృణ్వతో వరుణస్య చ ॥ 36 ॥

రాజశ్రేష్ఠుడలాగే అని వరుణుడు వింటుండగా ఋత్విక్కులతో, జ్యేష్ఠకుమారుడైన రోహితునితోను ఇలా అన్నాడు.

హరిశ్చన్ద్ర ఉవాచ :- హరిశ్చంద్రుడు పలికాడు.

ఏహి పుత్ర మహావీర యక్ష్యే త్వాం వరుణాయ హి ॥ 37 ॥

మహావీరుడవైన ఓ కుమారా! రా. నిన్నీ వరుణుని కొరకై యజ్ఞం చేస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కిమేతదిత్యథోవాచ రోహితః పితరం ప్రతి ।
పితాఽపి తద్యథావృత్తమాచచక్షే సవిస్తరమ్ ॥
రోహితో పితరం ప్రాహ శృణ్వతో వరుణస్య చ ॥ 38 ॥

అప్పుడు ఇదేమని రోహితుడు తండ్రి నడిగాడు. తండ్రి కూడా జరిగిన వృత్తాంతమంతా వివరంగా చెప్పాడు. రోహితుడప్పుడు వరుణుడు వింటుండగా తండ్రితో ఇలా అన్నాడు.

రోహిత ఉవాచ :- రోహితుడు పలికాడు.

అహం పూర్వం మహారాజ ఋత్విగ్భిః సపురోహితః ।
విష్ణవే లోకనాథాయ యక్ష్యేఽహం త్వరితం శుచిః ।
పశునా వరుణే నాథ తదనుజ్ఞాతుమర్హసి ॥ 39 ॥

మహారాజా! నేను త్వరగా శుచియై పురోహితుడు, ఋత్విక్కుల యాజ్ఞతో మొదట లోకనాథుడైన శ్రీమన్నారాయణునకు వరుణుని యజ్ఞపశువుగా చేసి యాగం చేస్తాను. అనుమతి నివ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

రోహితస్య తు తద్వాక్యం శ్రుత్వా వారీశ్వరస్తదా ।
కోపేన మహతాఽఽవిష్టో జలోదరమథాకరోత్ ॥ 40 ॥

హరిశ్చన్ద్రస్య నృపతే రోహితః స వనం యయౌ ।
గృహీత్వా స ధనుర్దివ్యం రథారూఢో గతవ్యథః ॥ 41 ॥

రోహితుడు మాట్లాడిన మాటలను విన్న వరుణుడు మిక్కిలి కోపించి హరిశ్చంద్రుణ్ణి జలోదరునిగా చేశాడు. అప్పుడు రోహితుడు బాధను దిగమ్రింగి దివ్యమైన ధనుస్సును తీసుకొని, రథమెక్కి వనమునకు వెళ్ళాడు.

యత్ర చాఽఽరాధ్య వరుణం హరిశ్చన్ద్రో జనేశ్వరః ।
గంగాయాం ప్రాప్తవాన్ పుత్రం తత్రాగాత్సోఽపి రోహితః ॥ 42 ॥

హరిశ్చంద్ర మహారాజు వరుణుని ఆరాధించి, ఏ గంగాతీరంలో తనను పుత్రునిగా పొందాడో, అక్కడికి రోహితుడు వెళ్ళాడు.

వ్యతీతాన్యథ వర్షాణి పంచ, షష్ఠే ప్రవర్తతి ।
తత్ర స్థిత్వా నృపసుతః శుశ్రావ నృపతే రుజమ్ ॥ 43 ॥

ఇలా ఐదు సంవత్సరములు గడచి, ఆరవ సంవత్సరం రాగా రాజకుమారుడు అక్కడ ఉంది రాజుకు జలోదరం గురించి విన్నాడు.

మయా పుత్రేణ జాతేన పితుర్వై క్లేశకారిణా ।
కిం ఫలం కిం ను కృత్యం స్యాదిత్యేవం పర్యచిన్తయత్ ॥ 44 ॥

తండ్రికి కష్టం కలిగే విధంగా పుట్టిన నా వంటి పుత్రుని వల్ల ఫలమేమిటి? నేనిప్పుడేం చెయ్యాలి? అని మిక్కిలి చింతించాడు.

తస్యాస్తీరే ఋషీన్ పుణ్యానపశ్యన్నృపతేః సుతః ।
గంగాతీరే చాటమానమపశ్యదృషిసత్తమమ్ ॥ 45 ॥

రాజకుమారుడు ఆ తీరమందనేక పుణ్యమూర్తులైన ఋషులను చూస్తూ, గంగా తీరమునందు సంచరిస్తున్న ఒక ఋషిసత్తముని చూశాడు.

అజీగర్తమితి ఖ్యాతమృషేస్తు వయసః సుతమ్ ।
త్రిభిః పుత్రైరనువృతం భార్యయా క్షీణవృత్తికమ్ ॥
తం దృష్ట్వా నృపతేః పుత్రో నమస్యేదం వచోఽబ్రవీత్ ॥ 46 ॥

అతని పేరు అజీగర్తుడు. భార్యతో, ముగ్గురు కుమారులతో ఏ పనీలేక దీనంగా ఉన్నాడు. అతనిని చూచి రాజకుమారుడగు రోహితుడు నమస్కరించి ఇలా అన్నాడు.

రోహిత ఉవాచ :– రోహితుడు పలికాడు.

క్షీణవృత్తిః కృశః కస్మాద్దుర్మనా ఇవ లక్ష్యసే ॥ 47 ॥

ఏ జీవికాలేక కృశించి ఉన్న నీవు మిక్కిలి బాధతో ఉన్నట్లు కనబడుతున్నావు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అజీగర్తోఽపి చోవాచ రోహితం నృపతేః సుతమ్ ॥ 48 ॥

రాజకుమారుడైన రోహితునితో అజీగర్తుడిలా అన్నాడు.

అజీగర్త ఉవాచ :– అజీగర్తుడు పలికాడు.

వర్తనం నాస్తి దేహస్య భోక్తారో బహవశ్చ మే ।
వినాఽన్నేన మరిష్యామో బ్రూహి కిం కరవామహే ॥ 49 ॥

ఈ దేహం గడిచే మార్గం లేదు. తినేవాళ్ళమేమో చాలామంది యున్నాము. తిండి లేక చనిపోయేటట్లున్నాము. మేమేమి చేయవలెనో చెప్పు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా పునరప్యాహ నృపపుత్రః ఋషిం తదా ॥ 50 ॥

ఆ మాటవిని రాజకుమారుడు మరల ఋషితో ఇలా అన్నాడు.

రోహిత ఉవాచ :–రోహితుడు పలికాడు.

తవ కిం వర్తతే చిత్తే తద్బ్రూహి వదతాం వర ॥ 51 ॥

ఓ శ్రేష్ఠుడా! నీ మనస్సులో నేమున్నదో చెప్పు.

అజీగర్త ఉవాచ :- అజీగర్తుడు పలికాడు.

హిరణ్యం రజితం గావో ధాన్యం వస్త్రాదికం న మే ।
విద్యతే నృపశార్దూల వర్తనం నాస్తి మే తతః ॥ 52 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! నా వద్ద బంగారం, వెండి, ఆవులు, ధాన్యం, వస్త్రములు మున్నగునవి లేవు. అందువలన జీవించుట కష్టంగా నున్నది.

సుతా మే సన్తి భార్యా చ అహం వై పంచమస్తథా ।
నైతేషాం కతమస్యాపి క్రేతాఽన్నేన నృపోత్తమ ॥ 53 ॥

నాకు కుమారులున్నారు. భార్య ఉన్నది. వారితో కలిసి నేను ఐదవ వాడను. ఓ రాజా! మాలో ఎవరినో ఒకరిని అన్నంతో కొనేవారు లేరు.

రోహిత ఉవాచ :- రోహితుడు పలికాడు.

కిం క్రీణాసి మహాబుద్ధేఽజీగర్త సత్యమేవ మే ।
వద నాన్యచ్చ వక్తవ్యం విప్రా వై సత్యవాదినః ॥ 54 ॥

ఓ అజీగర్తా! మహాజ్ఞానీ! నువ్వు అమ్మదలుచుకున్నావా? నిజమా! ఎందుకంటే బ్రాహ్మణులు సత్యవాదులు కదా!

అజీగర్త ఉవాచ :- అజీగర్తుడు పలికాడు.

త్రయాణామపి పుత్రాణామేకం వా మాం తథైవ చ ।
భార్యాం వాఽపి గృహాణేమాం క్రీత్వా జీవామహే వయమ్ ॥ 55 ॥

నా ముగ్గురు కొడుకులలో ఒక్కనిని గాని, నన్ను గాని, నా భార్యను గాని కొను. దానితో మేము జీవిస్తాము.

రోహిత ఉవాచ :- రోహితుడు పలికాడు.

కిం భార్యయా మహాబుద్ధే కిం త్వయా వృద్ధరూపిణా ।
యువానం దేహి పుత్రం మే పుత్రాణాం యం త్వమిచ్ఛసి ॥ 56 ॥

ఓ బుద్ధిమంతుడా? వృద్ధుడవైన నీతో గానీ, నీ భార్యతో గానీ ఏమి పని? నీకు సమ్మతమైతే నీ పుత్రులలో నొక యువకుడైన పుత్రుణ్ణి నాకివ్వు.

అజీగర్త ఉవాచ :- అజీగర్తుడు పలికాడు.

జ్యేష్ఠపుత్రం శునఃపుచ్ఛం నాహం క్రీణామి రోహిత ।
మాతా కనీయసం చాపి న క్రీణాతి తతోఽనయోః ।
మధ్యమం తు శునఃశేపం క్రీణామి వద తద్ధనమ్ ॥ 57 ॥

నా పెద్ద కుమారుడగు శునఃపుచ్ఛుని నేనమ్మను. తల్లి చిన్న కుమారుని అమ్మదు. అందువలన మా మధ్యమ కుమారుడగు శునఃశేపుని అమ్ముతున్నాను. దానికి తగిన మూల్యమెంత ఇస్తావో చెప్పు.

రోహిత ఉవాచ :- రోహితుడు పలికాడు.

వరుణాయ పశుః కల్ప్యః పురుషో గుణవత్తరః ।
యది క్రీణాసి మూల్యం త్వం వద సత్యం మహామునే ॥ 58 ॥

ఓ మహామునీ! గుణవంతుడైన పురుషుడు వరుణుని కొరకు యజ్ఞపశువుగా కావలెను. నీవొకవేళ అమ్మదలుచుకుంటే నిజమైన మూల్యమేమిటో చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా త్వజీగర్తః పుత్రమూల్యమకల్పయత్ ।
గవాం సహస్రం ధాన్యానాం నిష్కాణాం చాపి వాససామ్ ।
రాజపుత్ర! వరం దేహి దాస్యామి స్వసుతం తవ ॥ 59 ॥

అజీగర్తుడు సరేనని పుత్రమూల్యమునిలా చెప్పాడు. ఓ రాజకుమారా! వేయి ఆవులను, వేల బస్తాల ధాన్యములనూ, వేల వస్త్రములనూ, వేల నిష్కములనూ నా కివ్వు! నేను నీకు నా కుమారునిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా రోహితోఽపి ప్రాదాత్సవసనం ధనమ్ ।
దత్త్వా జగామ పితరమృషిపుత్రేణ రోహితః ॥
పిత్రే నివేదయామాస క్రయక్రీతమృషేః సుతమ్ ॥ 60 ॥

అలాగేనని పలికి రోహితుడు వస్త్రములతోపాటు తగిన ధనమును కూడా చెల్లించాడు. అలా చెల్లించి ఆ ఋషిపుత్రునితో కలిసి తండ్రి వద్దకు వెళ్ళాదు. తాను ఋషిపుత్రుని కొన్న విషయాన్ని వివరించాడు.

రోహిత ఉవాచ :- రోహితుడు పలికాడు.

వరుణాయ యజస్వ త్వం పశునా త్వమరుగ్భవ ॥ 61 ॥

ఈ యజ్ఞపశువుతో వరుణునకు యజ్ఞం చేయి. నీవు ఆరోగ్యవంతుడవు కా.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదోవాచ హరిశ్చన్ద్రః పుత్రవాక్యాదనన్తరమ్ ॥ 62 ॥

పుత్రుని మాటలను విన్న తరువాత హరిశ్చంద్రు డిలా అన్నాదు.

హరిశ్చన్ద్ర ఉవాచ :- హరిశ్చంద్రుడు పలికాడు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా రాజ్ఞా పాల్యా ఇతి శ్రుతిః ।
విశేషతస్తు వర్ణానాం గురవో హి ద్విజోత్తమాః ॥ 63 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులూ రాజు చేత రక్షింపదగినవారని శ్రుతి చెబుతున్నది. విశేషించి అన్ని వర్ణములవారికీ బ్రాహ్మణులు గురువులు కదా!

విష్ణోరపి హి యే పూజ్యా మాదృశాః కృత ఏవ హి ।
అవజ్ఞయాఽపి యేషాం స్యాన్నృపాణాం స్వకులక్షయః ॥ 64 ॥

విష్ణుమూర్తివంటి వారికే విప్రులు పూజ్యులు. మావంటి వారికింక ఆలోచించవలసిన దేమున్నది? అలాంటి బ్రాహ్మణుల్ని అవమానిస్తే రాజులకు తమ వంశనాశం తప్పదు.

సర్వతీర్థమయా విప్రాః సర్వదేవమయాస్తథా ।
నరకే పతతాం పుంసాం రక్షితారస్త ఏవ హి ॥ 65 ॥

బ్రాహ్మణులు సర్వతీర్థమయులు, అలాగే సర్వ దేవమయులు కూడా. నరకంలో పడిపోయే మానవులను రక్షించేవారు వీరే కదా!

తాన్పశూన్కృత్య కృపణం కథం రక్షితుముత్సహే ।
అహం చ బ్రాహ్మణం కుర్యాం పశుం నైతద్ధి యుజ్యతే ॥ 66 ॥

అటువంటి బ్రాహ్మణులను పశువులనుగా జేసి దీనున్ని అయిన నన్ను రక్షించుకోడానికి సహింపను. నేను బ్రాహ్మణుని యజ్ఞపశువుగా చేయను. ఈ పని యోగ్యమైనది కూడా కాదు.

వరం రుజా హి మరణం న కథంచిద్ద్విజం పశుమ్ ।
కరోమి తస్మాత్పుత్ర త్వం బ్రాహ్మణేన సుఖం వ్రజ ॥ 67 ॥

రోగంతో మరణించుటే మంచిది. కాని బ్రాహ్మణుని బలిపశువుగా చేయుట కంగీకరించను. అందువలన నాయనా! నీవు బ్రాహ్మణునితో సుఖముగా వెళ్లు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నన్తరే తత్ర వాగువాచాశరీరిణీ ॥ 68 ॥

అక్కడ ఇంతలో అశరీరవాణి పలికింది.

ఆకాశవాగువాచ :- ఆకాశవాణి పలికింది.

గౌతమీం గచ్ఛ రాజేన్ద్ర ఋత్విగ్భిః సపురోహితః ।
పశునా విప్రపుత్రేణ రోహితేన సుతేన చ ॥ 69 ॥

ఓ రాజేంద్రా! మీ పురోహితుడూ, ఋత్విక్కులూ, యజ్ఞపశువుగా నిర్దేశించిన బ్రాహ్మణకుమారుడూ, నీ పుత్రుడైన రోహితుడూ వీరందరితో కలిసి గౌతమీనది వద్దకు వెళ్ళు.

త్వయా కార్యః క్రతుశ్చైవ శునఃశేపవధం వినా ।
క్రతుః పూర్ణో భవేత్తత్ర తస్మాద్యాహి మహామతే ॥ 70 ॥

ఓ మహామతీ! నీ వక్కడికి వెళ్ళి శునఃశేపుని చంపకుండా క్రతువు చేయాలి. నీ క్రతువు పరిపూర్తి అవుతుంది. అందువలన అక్కడికి వెళ్ళు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం శీఘ్రమగాద్గంగాం నృపోత్తమః ।
విశ్వామిత్రేణ ఋషిణా వసిష్ఠేన పురోధసా ॥ 71 ॥

ఆ మాటవిన్న వెంటనే ఆ రాజు విశ్వామిత్రఋషితో, పురోహితుడైన వసిష్ఠునితో కలిసి గంగానది వద్దకు వెళ్ళాడు.

వామదేవేన ఋషిణా తథాఽన్యైః మునిభిః సహ ।
ప్రాప్య గంగాం గౌతమీం తాం నరమేధాయ దీక్షితః ॥ 72 ॥

వేదిమండపకుణ్డాది యూపపశ్వాది చాకరోత్ ।
కృత్వా సర్వం యథాన్యాయం తస్మిన్ యజ్ఞే ప్రవర్తతే ॥ 73 ॥

శునఃశేపం పశుం యూపే నిబధ్యాథ సమంత్రకమ్ ।
వారిభిః ప్రోక్షితం దృష్ట్వా విశ్వామిత్రోఽబ్రవీదిదమ్ ॥ 74 ॥

వామదేవుడు మరియు ఇతర ఋషులతోకలిసి ఆ గౌతమీగంగానది వద్దకు వెళ్ళి నరమేధమునకై దీక్ష తీసుకొని, వేదికను, మంటపమును, కుండములను, యజ్ఞపశువును కట్టుటకై యూపస్తంభము మున్నగువానిని శాస్త్రప్రకారంగా ఏర్పాటుచేసి యజ్ఞమును ప్రారంభిస్తూ, మంత్రపూతంగా నీటిని ప్రోక్షణచేస్తూ శునఃశేపుని ఆ యూపస్తంభమునకు బంధించుట చూచి విశ్వామిత్రుడిలా అన్నాడు.

విశ్వామిత్ర ఉవాచ :- విశ్వామిత్రుడు పలికాడు.

దేవాన్ ఋషీన్ హరిశ్చన్ద్రం రోహితం చ విశేషతః ।
అనుజానన్త్విమం సర్వే శునఃశేపం ద్విజోత్తమమ్ ॥ 75 ॥

దేవతలు, ఋషులు, హరిశ్చంద్రుడు ముఖ్యంగా రోహితుడు మొదలగు వారందరూ బ్రాహ్మణోత్తముని ఈ శునఃశేపుని యజ్ఞపశువుగా సమ్మతించండి.

యేభ్యస్త్వయం హవిర్దేయో దేవేభ్యోఽయం పృథక్ పృథక్ ।
అనుజానన్తు తే సర్వే శునఃశేపం విశేషతః ॥ 76 ॥

ఏ దేవతలకైతే ఇతడు వేరువేరువేరుగా హవిస్సు నీయవలసియున్నదో వారందరూ ముఖ్యంగా ఈ శునఃశేపుని అనుమతింతురుగాక!

వసాభిర్లోమభిస్త్వగ్భిర్మాంసైః సన్మంత్రితైర్మఖే ।
అగ్నౌ హోష్యః పశుశ్చాయం శునఃశేపో ద్విజోత్తమః ॥ 77 ॥

ద్విజోత్తముడైన ఈ శునఃశేపుడు. మంత్రపూతంగా యజ్ఞమునందు వసలతో, కేశములతో, చర్మములతో, మాంసముతో కూడి అగ్నియందు హోమం చేయవలసిన యజ్ఞపశువు.

ఉపాసితాః స్యుర్విప్రేన్ద్రాస్తే సర్వే త్వనుమన్య మామ్ ।
గౌతమీం యాన్తు విప్రేన్ద్రాః స్నాత్వా దేవాన్ పృథక్ పృథక్ ॥ 78 ॥

మన్త్రైః స్తోత్రైః స్తువన్తస్తే ముదం యాన్తు శివే రతాః ।
ఏనం రక్షన్తు మునయో దేవాశ్చ హవిషో భుజః ॥ 79 ॥

బ్రాహ్మణులంతా పూజింపబడి నా మాట ప్రకారం గౌతమీ నదిని చేరుదురుగాక! అక్కడ స్నానం చేసి ఆయా దేవతలను వారివారి మంత్రాలతో, స్తోత్రాలతో స్తుతిస్తూ, శుభములను కోరువారై ఆనందింతురుగాక! హవిస్సును స్వీకరించే దేవతలూ, మునులూ ఈ శునశ్శేషుని రక్షింతురు గాక!

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యూచుశ్చ మునయో మేనే చ నృపసత్తమః ।
తతో గత్వా శునఃశేపో గంగాం త్రైలోక్యపావనీమ్ ॥ 80 ॥

స్నాత్వా తుష్టావ తాన్దేవాన్యే తత్ర హవిషో భుజః ।
తతస్తుష్టాః సురగణాః శునఃశేపం చ తే మునే ॥
అవదన్త సురాః సర్వే విశ్వామిత్రస్య శృణ్వతః ॥ 81 ॥

అలాగే అని మునులూ, రాజూ అతని మాటల నంగీకరించారు. తరువాత శునఃశేపుడు ముల్లోకపావనియైన గంగానది వద్దకు వెళ్ళి, స్నానం చేసి హవిర్భోక్తలైన దేవతలను సంతోషపెట్టాడు. ఓ మునీ! సంతుష్టులైన ఆ దేవతలూ, సురగణములూ శునఃశేపుని గురించి విశ్వామిత్రుడు వినేలాగా ఇలా అన్నారు.

సురా ఊచుః :– దేవతలు పలికారు.

క్రతుః పూర్ణో భవత్వేష శునఃశేపవధం వినా ॥ 82 ॥

శునఃశేపుని వధ లేకుండానే క్రతువు పూర్ణమగుగాక.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

విశేషేణాథ వరుణశ్చావదన్నృపసత్తమమ్ ।
తతః పూర్ణోఽభవద్రాజ్ఞో నృమేధో లోకవిశ్రుతః ॥ 83 ॥

అపుడు విశేషించి వరుణుడు రాజుతో ఇలా అన్నాడు. ఈ రాజుయొక్క నరమేధము లోకప్రసిద్ధంగా పూర్తి అయింది.

దేవానాం చ ప్రసాదేన మునీనాం చ ప్రసాదతః ।
తీర్థస్య తు ప్రసాదేన రాజ్ఞః పూర్ణోఽభవత్క్రతుః ॥ 84 ॥

దేవతల అనుగ్రహంతో, మునుల దయతో, తీర్థంయొక్క అనుగ్రహంతో రాజుయొక్క ఈ నరమేధయజ్ఞం ఫలవంతం అయింది.

విశ్వామిత్రః శునఃశేపం పూజయామాస సంసది ।
అకరోదాత్మనః పుత్రం పూజయిత్వా సురాన్తికే ॥ 85 ॥

విశ్వామిత్రుడు సభలో శునఃశేపుని పూజించాడు. దేవతల సమక్షంలో ఆదరించి శునఃశేపుని తన పుత్రునిగా చేసుకొన్నాడు.

జ్యేష్ఠం చకార పుత్రాణామాత్మనః స తు కౌశికః ।
న మేనిరే యే చ పుత్రా విశ్వామిత్రస్య ధీమతః ॥ 86 ॥

ఆ విశ్వామిత్రుడు తన కుమారులందరిలోనూ శునఃశేపుని జ్యేష్ఠునిగా చేశాడు. కానీ విశ్వామిత్రుని పుత్రులు దాని నంగీకరించలేదు.

శునఃశేపస్య చ జ్యైష్ఠ్యం తాన్ శశాప స కౌశికః ।
జ్యైష్ఠ్యం యే మేనిరే పుత్రాః పూజయామాస తాన్ సుతాన్ ॥ 87 ॥

కౌశికుడు శునఃశేపునికి పెద్దకొడుకుస్థానం ఇచ్చాడు. దానికి అంగీకరించని తన కుమారుల్ని శపించాడు. అతణ్ణి జ్యేష్ఠునిగా సమ్మతించిన కుమారులను గౌరవించాడు.

వరేణ మునిశార్దూలస్తదేతత్కథితం మయా ।
ఏతత్సర్వం యత్ర వృత్తం గౌతమ్యా దక్షిణే తటే ॥ 88 ॥

సమ్మతించిన ఆ కుమారులకు మునిశ్రేష్ఠుడు వరమును కూడా యిచ్చాడు. నేను చెప్పిన ఈ కథ అంతా గౌతమీ నదియొక్క దక్షిణ తీరంలో జరిగింది.

తత్ర తీర్థాని పుణ్యాని విఖ్యాతాని సురాదిభిః ।
బహూని తేషాం నామాని మత్తః శృణు మహామతే ॥ 89 ॥

ఓ మహాజ్ఞానీ! అక్కడ ఉన్న తీర్థముల నన్నింటిని దేవతలు కొనియాడారు. అవి చాలా వున్నాయి. వాటి పేర్లను చెబుతాను. విను.

హరిశ్చన్ద్రం శునఃశేపం విశ్వామిత్రం సరోహితమ్ ।
ఇత్యాద్యష్టసహస్రాణి తీర్థాన్యథ చతుర్దశ ॥ 90 ॥

హరిశ్చంద్రమూ, శునఃశేపమూ, విశ్వామిత్రమూ, సరోహితమూ మొదలగు ఇరవై రెండువేల తీర్థములున్నాయి.

తేషు స్నానం చ దానం చ నరమేధఫలప్రదమ్ ।
ఆఖ్యాతం చాస్య మాహాత్మ్యం తీర్థస్య మునిసత్తమ ॥ 91 ॥

యః పఠేత్పాఠయేద్వాఽపి శృణుయాద్వాఽపి భక్తితః ।
అపుత్రః పుత్రమాప్నోతి యచ్చాన్యన్మనసః ప్రియమ్ ॥ 92 ॥

ఈ తీర్థములలో స్నానం చేసినా, దానం చేసినా నరమేధ యజ్ఞం చేసిన ఫలం లభిస్తుంది. ఓ మునిసత్తమా! ఈ తీర్థములయొక్క మాహాత్మ్యమును గూర్చి ప్రవచనం చేసినా, దీనిని భక్తితో పఠించినా, బోధించినా, వినినా కూడా సంతానం లేనివారు సంతానాన్ని పొందుతారు. అలాగే వారి వారి ప్రియమైన కోరికలు నెరవేరుతాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే 'విశ్వామిత్రాది ద్వావింశతిసహస్రతీర్థవర్ణనం' నామ చతుస్త్రింశోఽధ్యాయః. ॥ 34 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని బ్రహ్మ-నారదసంవాదంలోని తీర్థమాహాత్మ్యంలో 'విశ్వామిత్రాది ఇరవై రెండువేల తీర్థముల వర్ణన' మనే ముప్పైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచత్రింశోఽధ్యాయః – ముప్పై ఐదవ అధ్యాయం

పూర్ణాది పంచవింశతి నదీ దేవనదీ నద సంగమ వర్ణనమ్

నదీ దేవనదీ నద సంగమవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సోమతీర్థమితి ఖ్యాతం పితౄణాం ప్రీతివర్ధనమ్ ।
తత్ర వృత్తం మహాపుణ్యం శృణు యత్నేన నారద ॥ 1 ॥

సోమతీర్థమనునది చాలా ప్రసిద్ధిచెందినది. అది పితృదేవతలకు ప్రీతిని పెంపొందింప చేయునది. దాని చరిత్ర చాలా పవిత్రమైనది. ఓ నారదా! దానిని గూర్చి శ్రద్ధగా వినుము.

సోమో రాజాఽమృతమయో గన్ధర్వాణాం పురాఽభవత్ ।
న దేవానాం తదా దేవా మామభ్యేత్యేదమబ్రువన్ ॥ 2 ॥

పూర్వము అమృతమయుడైన సోముడను వాడు గంధర్వులకు రాజుగా నుండెను. అతడు దేవతలకు రాజు కాడు. అప్పుడు దేవతలు నా వద్దకు వచ్చి ఇలా అన్నారు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

గన్ధర్వైరాహృతః సోమో దేవానాం ప్రాణదః పురా ।
తమధ్యాయన్ సురగణా ఋషయస్త్వతిదుఃఖితాః ॥
యథా స్యాత్సోమో హ్యస్మాకం తథా నీతిర్విధీయతామ్ ॥ 3 ॥

నేడు గంధర్వులకు రాజుగానున్న సోముడు పూర్వము దేవతలకు ప్రాణదానము చేసినవాడు. మాకు చాలా ఇష్టుడు. అతనిని ధ్యానించక దేవతాగణమూ, ఋషులూ మిక్కిలి దుఃఖించుచున్నారు. కనుక మాకూ సోముడు ప్రభువుగా ఉండునట్లు మీరు ఏదైనా చర్యను తీసుకొనుడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తత్ర వాక్ విబుధానాహ గన్ధర్వాః స్త్రీషు కాముకాః ।
తేభ్యో దత్త్వాఽథ మాం దేవాః సోమమాహర్తుమర్హథ ॥ 4 ॥

అప్పుడు సరస్వతి దేవతలతో "గంధర్వులు స్త్రీలయందు కాముక ప్రవృత్తి కలవారు. దేవతలు నన్ను గంధర్వుల కిచ్చి సోముని పొందవచ్చును". అని పలికింది.

వాచం ప్రత్యూచురమరాస్త్వా దాతుం న క్షమా వయమ్ ।
వినా తేనాపి న స్థాతుం శక్యం నైవ త్వయా వినా ॥ 5 ॥

అప్పుడు దేవతలు సరస్వతితో "మేము నిన్ను వారికిచ్చుటకు సమర్థులము కాము. అతను లేకుండానూ, నీవు లేకుండానూ మేముండలేమన్నారు.

పునర్వాగబ్రవీద్దేవాన్పునరేష్యామ్యహం త్విహ ।
అత్ర బుద్ధిర్విధాతవ్యా క్రియతాం క్రతురుత్తమః ॥ 6 ॥

అప్పుడు మళ్ళీ సరస్వతి దేవతలతో "అయితే నేను మళ్ళీ వస్తాను. ఇక్కడ బుద్ధి ఉపయోగించవలసి ఉంది. ఏదైనా ఉత్తమమైన క్రతువును చేయండి". అని చెప్పింది.

గౌతమ్యా దక్షిణే తీరే భవేద్దేవాగమో యది ।
మఖం తు విషయం కృత్వా ఆయాన్తు సురసత్తమాః ॥ 7 ॥

గౌతమీ నదికి దక్షిణ తీరమునకు దేవతలు వచ్చినట్లైతే అక్కడ యజ్ఞము చేయుట అనే దానిని విషయంగా చేసుకొని దేవతలందరు రావలయును.

గన్ధర్వాః స్త్రీప్రియా నిత్యం పణధ్వం తం మయా సహ ।
తథేత్యుక్త్వా సురగణాః సరస్వత్యా వచః స్థితాః ॥ 8 ॥

"గంధర్వులు స్త్రీప్రియులు కనుక నన్ను పణంగా పెట్టి మీరు అతనిని పొందండి". అని సరస్వతి అనగా దేవతలలాగే అని సరస్వతి మాటపై నిలిచారు.

దేవదూతైః పృథగ్దేవాన్యక్షాన్గన్ధర్వపన్నగాన్ ।
ఆహ్వానం చక్రిరే తత్ర పుణ్యే దేవగిరౌ తదా ॥ 9 ॥

పుణ్యమైన దేవగిరికి రావలయునని దేవదూతలతో దేవతలను, యక్షులను, గంధర్వులను, పన్నగులను దేవతలు ఆహ్వానించారు.

తతో దేవగిరిర్నామ పర్వతస్యాభవన్మునే ।
తత్రాఽఽగమన్సురగణా గన్ధర్వా యక్షరాక్షసాః ॥ 10 ॥

ఓ మునీ! దేవతలందరూ వచ్చు స్థలము కనుక ఆ పర్వతమునకు దేవగిరి యని పేరు కలిగినది. ఆ దేవగిరికి సురగణములు గంధర్వులు, యక్షులు, రాక్షసులు వచ్చారు.

దేవాః సిద్ధాశ్చ ఋషయస్తథాఽష్టౌ దేవయోనయః ।
ఋషిభిర్గౌతమీతీరే క్రియమాణే మహాధ్వరే ॥ 11 ॥

తత్ర దేవైః పరివృతః సహస్రాక్షోఽభ్యభాషత ॥ 12 ॥

గౌతమీనదీతీరమునందు దేవతలు, సిద్ధులు, ఋషులు, దేవయోనులెనిమిదిమందీ, ఋషులందరితో చేయబోవు గొప్ప యజ్ఞమునందు, దేవతలందరూ చుట్టూ నిలువగా ఇంద్రుడిలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ : –ఇంద్రుడు పలికాడు.

గన్ధర్వానథ సంపూజ్య సరస్వత్యాః సమీపతః ।
సరస్వత్యా పణధ్వం నో యుష్మాకమమృతాత్మనా ॥ 13 ॥

గంధర్వులనందరినీ పూజించి సరస్వతీ సమీపమున "ఈ మా సరస్వతిని పణముగా నుంచినాము. మీరు మీవద్దనున్న సోమున్ని మా కిచ్చి ఈమెను గ్రహించండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛక్రవచనాత్తేవై గన్ధర్వాః స్త్రీషు కాముకాః ।
సోమం దత్వా సురేభ్యస్తు జగృహుస్తాం సరస్వతీమ్ ॥ 14 ॥

ఇంద్రుడు చెప్పిన మాట ప్రకారముగా స్త్రీకాముకులైన గంధర్వులు దేవతలకు సోమమునిచ్చి ఆ సరస్వతిని తీసుకొన్నారు.

సోమోఽభవచ్చామరాణాం గన్ధర్వాణాం సరస్వతీ ।
అవసత్తత్ర వాగీశా తథాఽపి చ సురాన్తికే ॥ 15 ॥

దేవతలకు సోమమూ, గంధర్వులకు సరస్వతీ దక్కింది. అయినా సరస్వతి దేవతల వద్ద కూడా ఉంది.

ఆయాతి చ రహో నిత్యముపాంశు క్రియతామితి ।
అత ఏవ హి సోమస్య క్రయో భవతి నారద ॥ 16 ॥

ప్రతినిత్యమూ మౌనంగా సరస్వతిని తలస్తే ఆమె వస్తోంది. ఓ నారదా! అందువలననే సోమమును అమ్మడం జరుగుతోంది.

ఉపాంశునా వర్తితవ్యం సోమక్రయణ ఏవ హి ।
తతోఽభవద్దేవతానాం సోమశ్చాపి సరస్వతీ ॥ 17 ॥

అందువల్ల సోమము కొనే సమయంలో ఉపాంశువులతో మంత్రించాలి. అలా దేవతలకు సోమమూ, సరస్వతీ కూడా ఉన్నట్లయ్యింది.

గన్ధర్వాణాం నైవ సోమో నైవాఽఽసీచ్చ సరస్వతీ ।
తత్రాగమన్సర్వ ఏవ సోమార్థం గౌతమీతటమ్ ॥ 18 ॥

గంధర్వుల కటు సోమముగాని, సరస్వతిగాని లేకపోయెను. అందువలననే అందరూ ఆ గౌతమీ తటమునకు సోమమునకై వచ్చారు.

గావో దేవాః పర్వతా యక్షరక్షాః సిద్ధాః సాధ్యా మునయో గుహ్యకాశ్చ ।
గన్ధర్వాస్తే మరుతః పన్నగాశ్చ సర్వౌషధ్యో మాతరో లోకపాలాః ॥
రుద్రాదిత్యా వసవశ్చాశ్వినౌ చ యేఽన్యే దేవా యజ్ఞభాగస్య యోగ్యాః ॥ 19 ॥

గోవులు, దేవతలు, పర్వతములు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు, సాధ్యులు, మునులు, గుహ్యకులు, గంధర్వులు, మరుత్తులు, పన్నగులు సమస్త ఓషధులు, లోకమాతలు, లోకపాలురు, రుద్రులు పదకొండుమంది,

పన్నెండు మంది సూర్యులూ, అష్టవసువులూ అశ్వనీ దేవతలూ ఇంకా యజ్ఞభాగమును స్వీకరించు యోగ్యతగల ఇతర దేవతలు కూడా వచ్చారు.

పంచవింశతి నద్యస్తు గంగాయాం సంగతా మునే ।
పూర్ణాహుతిర్యత్ర దత్తా పూర్ణాఖ్యానం తదుచ్యతే ॥ 20 ॥

ఎక్కడైతే గంగయందు ఇరువది ఐదు నదులు సంగమించాయో ఆ ప్రదేశమున కందరూ చేరారు. యజ్ఞము సంపూర్ణముగా పూర్ణాహుతి ఎక్కడ జరిగెనో ఆ ప్రదేశమునకు పూర్ణాఖ్యానమని పేరు వచ్చింది.

గౌతమ్యాం సంగతా యాస్తు సర్వాశ్చాపి యథోదితాః ।
తన్నామధేయతీర్థాని సంక్షేపాచ్ఛృణు నారద ॥ 21 ॥

ఇంతకు పూర్వము చెప్పిన నదులు గౌతమియందేవి సంగమించాయో ఓ నారదా! ఆ తీర్థముల పేర్లను సంగ్రహముగా చెప్పుచున్నాను విను.

సోమతీర్థం చ గాన్ధర్వం దేవతీర్థమతః పరమ్ ।
పూర్ణాతీర్థం తతః శాలం శ్రీపర్ణాసంగమం తథా ॥ 22 ॥

ఇలాయాః సంగమం పుణ్యం కుసుమాయాశ్చ సంగమమ్ ।
పుష్టిసంగమమాఖ్యాతం కర్ణికాసంగమం శుభమ్ ॥ 23 ॥

వైణవీసంగమశ్చైవ కృశరాసంగమస్తథా ।
వాసవీసంగమశ్చైవ శివశర్యా తథా శిఖీ ॥ 24 ॥

కుసుమ్భికా ఉపారథ్యా శాన్తిజా దేవజా తథా ।
అజో వృద్ధః సురో భద్రో గౌతమ్యా సహ సంగతాః ॥ 25 ॥

సోమతీర్థము, గాంధర్వము, దేవతీర్థము, పూర్ణాతీర్థము, శాలతీర్థము, శ్రీపర్ణా సంగమము, ఇలా సంగమము, కుసుమా సంగమము, పుష్టి సంగమము, కర్ణికా సంగమము, పుణ్య సంగమము, వైణవీ సంగమము, కృశరా సంగమము, వాసవీ సంగమము, శివ,శర్యా సంగమములు, శిఖీ సంగమము, కుసుమ్భకా సంగమము, ఉపారథ్యా సంగమము, శాస్తజా సంగమము, దేవజా సంగమము, అజో సంగమము, వృద్ధ సంగమము, సురో సంగమము, భద్ర సంగమము అనునవి గౌతమీ నదియందు సంగమించినవి.

ఏతే చాన్యే చ బహవో నదీనదసహాయగాః ।
పృథివ్యాం యాని తీర్థాని హ్యగమన్దేవపర్వతే ॥ 26 ॥

ఇవే కాక ఇంకా ఇతరమైన భూమియందు కల తీర్థాలన్నీ అనేకములు నదీనద సహాయముగా దేవగిరి పర్వతమునకు వెళ్ళాయి.

సోమార్థం వై తథా చాన్యేఽప్యాగమన్మఖమణ్డపమ్ ।
తాని తీర్థాని గంగాయాం సంగతాని యథాక్రమమ్ ॥ 27 ॥

సోమముకొరకలాగే ఇతరములైనవి కూడా యజ్ఞమండపమునకు వెళ్ళాయి. ఆ తీర్థములన్నీ యథాక్రమముగా గంగయందు సంగమించినాయి.

నదీరూపేణ కాన్యేవ నదరూపేణ కానిచిత్ ।
సరోరూపేణ కాన్యత్ర స్రవరూపేణ కానిచిత్ ॥ 28 ॥

అవి నదీ రూపముగా కొన్నీ, నదరూపములుగా కొన్నీ సరస్సుల రూపములుగా కొన్నీ, ధారరూపముగాను కొన్నీ ఉన్నాయి.

తాన్యేవ సర్వతీర్థాని విఖ్యాతాని పృథక్ పృథక్ ।
తేషు స్నానం జపో హోమః పితృతర్పణమేవ చ ॥ 29 ॥

సర్వకామప్రదం పుంసాం భుక్తిదం ముక్తిభాజనమ్ ।
ఏతేషాం పఠనం చాపి స్మరణం వా కరోతి యః ॥ 30 ॥

సర్వపాపవినిర్ముక్తో యాతి విష్ణుపురం జనః ।
పూర్ణాప్రవరయోర్మధ్యే నద్యో వింశతిరీరితాః ॥
స్తుతాస్తా దేవనద్యస్తు పంచవింశతిరీరితాః ॥ 31 ॥

ఆ తీర్థములే వేరు వేరుగా ప్రసిద్ధి చెందినవి. వాటిలో స్నానము చేసినా, జపము చేసినా, హోమము చేసినా, పితృదేవతలకు తర్పణములను చేసినా, మానవులకు కోరికలన్నీ తీరుతాయి. భుక్తీ ముక్తీ కలుగుతుంది. ఈ తీర్థములను గూర్చి చదివినా, స్మరించినా కూడా, సమస్త పాపములనుండి విముక్తుడై వైకుంఠము చేరుతాడు. ఈ నదులు పూర్ణా-ప్రవరముల మధ్యన ఇరువదున్నవి. దేవనదులుగా స్తుతించినవి ఇరువది ఐదున్నవి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే పూర్ణాదిపంచవింశతి నదీదేవనదీనదసంగమవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః. ॥ 35 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి బ్రహ్మ నారద సంవాదములోని తీర్థమాహాత్మ్యము లోని పూర్ణాది పంచవింశతి నదీ దేవనదీ నద సంగమ వర్ణనమను పేరుగల ముప్పైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్త్రింశోఽ_ధ్యాయః - ముప్పై ఆరవ అధ్యాయం
శివప్రేరితామృతాసంగమాదితీర్థవర్ణనమ్ - శివప్రేరితామృతాసంగమములనే తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ప్రవరాసంగమో నామ శ్రేష్ఠా చైవ మహానదీ ।
యత్ర సిద్ధేశ్వరో దేవః సర్వలోకోపకారకృత్ ॥ 1 ॥

సిద్ధేశ్వరుడనే దేవుడు అన్ని లోకములకూ ఉపకారమునెక్కడ చేసెనో అక్కడ ప్రవరాసంగమమనే తీర్థమున్నది. శ్రేష్ఠమై ప్రవర అనే మహానది సంగమించిన ప్రదేశం అది.

దేవానాం దానవానాం చ సంగరోఽ_భూత్సుదారుణః ।
తేషాం పరస్పరం వాఽ_పి ప్రీతిశ్చాభూన్మహామునే ॥ 2 ॥

ఓ మహామునీ! అక్కడ దేవతలకూ దానవులకూ దారుణమైన సంగరం ఏర్పడుటేకాక, వారికి పరస్పరం ప్రీతికూడా కలిగినది.

తేఽ_ప్యేవం మన్త్రయామాసుర్దేవా వై దానవా మిథః ।
మేరుపర్వతమాసాద్య పరస్పరహితైషిణః ॥ 3 ॥

ఒకరి హితమును మరొకరు కోరుకునే ఆ దేవదానవులు మేరు పర్వతమును చేరి పరస్పరమిలా ఆలోచించుకొన్నారు.

దేవదైత్యా ఊచుః :- దేవదానవులు పలికారు.

అమృతేనామరత్వం స్యాదుత్పాద్యామృతముత్తమమ్ ।
పిబామః సర్వ ఏవైతే భవామశ్చామరా వయమ్ ॥ 4 ॥

అమృతముతో అమరత్వము సిద్ధిస్తుంది. మనము అటువంటి ఉత్తమమైన అమృతము నుత్పత్తిచేసి త్రాగుతాము. అప్పుడు మనమంతా అమరులమే అవుతాము.

ఏకీభూత్వా వయం లోకాన్పాలయామః సుఖాని చ ।
ప్రాప్స్యామః సంగరం హిత్వా సంగరో దుఃఖకారణమ్ ॥ 5 ॥

మనమంతా ఒక్కటై లోకములను పాలించుదాము. యుద్ధం లేకుండా సుఖములను పొందగలము. యుద్ధము దుఃఖమునకు హేతువు.

ప్రీత్యా చైవార్జితానర్థాన్భోక్ష్యామో గతమత్సరాః ।
యతః స్నేహేన వృత్తిర్యా సాఽ_స్మాకం సుఖదా సదా ॥ 6 ॥

మాత్సర్యాన్ని వదిలిపెట్టి సంపాదించిన ధనములను ప్రీతితో అనుభవిద్దాం. ఎందుకంటే స్నేహముతో మెలుగుట యనునది మనకెప్పుడూ సుఖము నిస్తుంది.

వైపరీత్యం తు యద్వృత్తం న స్మర్తవ్యం కదాచన ।
న త్రైలోక్యరాజ్యేఽపి కైవల్యేవా సుఖం మనాక్ ॥
తదూర్ధ్వమపి వా యత్తు నిర్వైరత్వాదవాప్యతే ॥ 7 ॥

ఎప్పుడూ వ్యతిరేక వృత్తమును మాత్రం తలంపరాదు. ముల్లోకరాజ్యాధిపత్యమునగానీ, కైవల్యమునందుగానీ అటువంటి ఆనందము లభించనే లభించదు. దానికంటె పైనున్న సుఖమేదైనావుంటే అది నిర్వైరమువలననే లభిస్తుంది.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

ఏవం పరస్పరం ప్రీతాః సన్తో దేవాశ్చ దానవాః ।
ఏకీభూతాశ్చ సుప్రీతా నిర్మథ్య వరుణాలయమ్ ॥ 8 ॥

ఇలా దేవదానవులు పరస్పరము సంతోషించినవారై వారొక్కటై సముద్రమును మథించి సంతుష్టులైనారు.

మన్థానం మన్దరం కృత్వా రజ్జుం కృత్వా తు వాసుకిమ్ ।
దేవాశ్చ దానవాః సర్వే మమన్థుర్వరుణాలయమ్ ॥ 9 ॥

మన్దర పర్వతమును కవ్వముగా జేసి, వాసుకి అనే సర్పమును త్రాడుగా జేసి దేవ దానవులందరూ కలిసి సముద్రమును చిలికారు.

ఉత్పన్నం చ తతః పుణ్యమమృతం సురవల్లభమ్ ।
నిష్పన్నే చామృతే పుణ్యే తే చ ప్రోచుః పరస్పరమ్ ॥ 10 ॥

అప్పుడు సురవల్లభమూ, పవిత్రమూ అయిన అమృతము పుట్టింది. పవిత్రమైన ఆ అమృతము పుట్టగానే వారు పరస్పరం ఇలా అనుకొన్నారు.

యామః స్వం స్వమధిష్ఠానం కృతకార్యాః శ్రమం గతాః ।
సర్వే సమం చ సర్వేభ్యో యథాయోగ్యం విభజ్యతామ్ ॥ 11 ॥

మనమీ కార్యమును చేసి చాలా అలసిపోయాం, మన మన స్థానములకు వెళ్దాం. అందరికీ సమానంగా యోగ్యమైన విధంగా పంచుకొందాం.

యదా సర్వాగమో యత్ర యస్మింల్లగ్నే శుభావహే ।
విభజ్యతామిదం పుణ్యమమృతం సురసత్తమాః ॥ 12 ॥

ఓ దేవతలారా! మనం అందరం కలిశాక శాస్త్రప్రకారముగా ఏ ముహూర్తము శుభము కలిగించునో ఆ సమయమున ఈ పవిత్రమైన అమృతమును పంచుకొందాం.

ఇత్యుక్త్వా తే యయుః సర్వే దైత్య దానవ రాక్షసాః ।
గతేషు దైత్య సంఘేషు దేవాః సర్వేఽ న్వమన్త్రయన్ ॥ 13 ॥

ఇలా చెప్పి ఆ దైత్యదానవ రాక్షసులందరు వెళ్ళారు. దైత్యసమూహములు వెళ్ళిన తర్వాత దేవతలందరు ఇలా ఆలోచించారు.

దేవాఊచుః :– దేవతలు పలికారు.

గతాస్తే రిపవోఽ స్మాకం దైవయోగాదరిందమాః ।
రిపూణామమృతం నైవ దేయం భవతి సర్వదా ॥ 14 ॥

శత్రుభయంకరులారా! దైవయోగం మన శత్రువులు వెళ్ళిపోయారు. మనం మన శత్రువుల కెప్పుడూ అమృతం ఇవ్వకూడదు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మపలికాడు.

బృహస్పతిస్తథేత్యాహ పునరాహ సురానిదమ్ ॥ 15 ॥

బృహస్పతి దానికంగీకరించి దేవతలతో మళ్ళీ యిలా అన్నాడు.

బృహస్పతి రువాచ:– బృహస్పతి పలికాడు.

న జానన్తి యథా పాపాః పిబధ్వం చ తథాఽ మృతమ్ ।
అయమేవోచితో మన్త్రో యచ్ఛత్రూణాం పరాభవః ॥ 16 ॥

ఆ పాపులకు తెలియకుండా అమృతమును త్రాగండి. ఆ శత్రువుల నవమానించుట కిదే మంచి ఉపాయము.

ద్వేష్యాః సర్వాత్మనా ద్వేష్యా ఇతి నీతివిదో విదుః ।
న విశ్వాస్యా న చాఽ ఽ ఖ్యేయా నైవ మన్త్ర్యాశ్చ శత్రవః ॥ 17 ॥

ద్వేషించదగిన శత్రువులను అన్నివిధములుగా ద్వేషించవలయునని నీతికోవిదులు చెబుతారు. శత్రువులను నమ్మగూడదు. వారిని గూర్చి చెప్పగూడదు. వారికేమి చెప్పగూడదు. వారితో నేమీ ఆలోచించగూడదు.

తేభ్యో న దేయమమృతం భవేయురమరాస్తతః ।
అమరేషు చ జాతేషు తేషు దైత్యేషు శత్రుషు ॥
తాన్ జేతుం నైవ శక్ష్యామో న దేయమమృతం తతః ॥ 18 ॥

వారి కమృతము నీయగూడదు. ఇస్తే తరువాత వారు అమరులౌతారు. మనకు శత్రువులైన దైత్యులమరులైతే వారిని మనం జయించలేము. అందువలన అమృతమీయకూడదు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఇతి సంమన్త్ర్య తే దేవా వాచస్పతిమథాబ్రువన్ ॥ 19 ॥

ఇలా ఆలోచించి దేవతలు బృహస్పతితో ఇలా అన్నారు.

దేవా ఊచుః :- దేవతలు చెప్పారు.

క్వ యామః కుత్ర మన్త్రః స్యాత్క్వ పిబామః క్వ సంస్థితిః ।
కుర్మస్తదేవ ప్రథమం వద వాచస్పతే తథా ॥ 20 ॥

ఓ బృహస్పతీ! మేమెచటికి వెళ్ళవలయును? ఎక్కడ ఆలోచించాలి? ఎక్కడ త్రాగవలయును? ఎక్కడ ఉండవలయును? మా పరిస్థితి ఏమి? ఉపాయమేమి? మేము మొదట ఏమి చేయవలయునో చెప్పు.

బృహస్పతిరువాచ:- బృహస్పతి పలికాడు.

యూస్తు బ్రహ్మాణమమరాః పృచ్ఛన్త్వత్ర గతిం పరామ్
స తు జ్ఞాతా చ వక్తా చ దాతా చైవ పితామహః ॥ 21 ॥

ఓ దేవతలారా! మీరంతా బ్రహ్మ దగ్గరకు వెళ్ళండి. ఉత్కృష్టమైన మార్గమేమిటని ఆయన నడగండి. ఆ పితామహుడే దానిని గూర్చి తెలిసినవాడు. దానిని గూర్చి చెప్పగలవాడు. దాన్ని ప్రసాదించునది కూడా అతడే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

బృహస్పతేర్వచః శ్రుత్వా మదన్తికమథాఽగమన్ ।
నమస్య మాం సురాః సర్వే యద్వృత్తం తన్న్యవేదయన్ ॥ 22 ॥

బృహస్పతి చెప్పిన మాటలను విని దేవతలంతా నా వద్దకు వచ్చారు. నాకు నమస్కరించి వారంతా సమాచారమును నివేదించారు.

తద్దేవవచనాత్పుత్ర! తైః సురైరగమం హరిమ్ ।
విష్ణవే కథితం సర్వం శమ్భవే విషహారిణే ॥ 23 ॥

ఆ దేవతలు చెప్పినది విని వారితో కలిసి హరివద్దకు వెళ్ళాను. అక్కడ విష్ణునకు, విషహారియైన శివునకు కూడా విషయమునంతయును వివరించాను.

అహం విష్ణుశ్చ శమ్భుశ్చ దేవగన్ధర్వకింనరైః ।
మేరుకందరమాగత్య న జానన్తి యథాఽసురాః ॥ 24 ॥

నేను, విష్ణువు, శివుడు, దేవ గంధర్వ కిన్నరులతో కలిసి మేరు పర్వతము వద్దకు వచ్చి రాక్షసులకు తెలియకుండునట్లుగా,

రక్షకం చ హరిం కృత్వా సోమపానాయ తస్థిరే ।
ఆదిత్యస్తత్ర విజ్ఞాతా సోమభోజ్యా నథేతరాన్ ॥ 25 ॥

శ్రీహరిని రక్షకునిగా చేసుకొని అమృతపానమునకై ఉన్నారు(ము). అక్కడ సూర్యుడు దేవతలకూ ఇతరులకూ పర్యవేక్షకుడయ్యాడు.

సోమో దాతాఽమృతం భాగం చక్రధృగ్రక్షకస్త్వభూత్ ।
నైవ జానన్తి తద్దైత్యా దనుజా రాక్షసాస్తథా ॥ 26 ॥

వినా రాహుం మహాప్రాజ్ఞం సైంహికేయం చ సోమపమ్ ।
కామరూపధరో రాహుర్మరుతాం మధ్యమావిశత్ ॥ 27 ॥

సోముడు అమృతం పంచేవాడుగానూ, చక్రాన్ని ధరించే హరి రక్షకుడుగానూ అయ్యారు. ఆ విషయం, సింహికా పుత్రుడైన రాహువుతప్ప దైత్య, దనుజ, రాక్షసుల్లో ఎవ్వరూ తెలుసుకోలేకపోయారు. ఇష్టం వచ్చిన రూపాన్ని ధరింపగలవాడైన రాహువు మరుత్తుల మధ్యలో మారు రూపంలో కూర్చున్నాడు.

మరుద్రూపం సమాస్థాయ పానపాత్రధరస్తథా ।
జ్ఞాత్వా దివాకరో దైత్యం తం సోమాయ న్యవేదయత్ ॥ 28 ॥

మరుత్తుల రూపంలో ఉండి పానపాత్రను పట్టుకున్న రాహువును సూర్యుడు గుర్తించి ఆ విషయం చంద్రునికి చెప్పాడు.

తదా తదమృతం తస్మై దైత్యాయాదైత్యరూపిణే ।
దత్వా సోమం తదా సోమో విష్ణవే తన్న్యవేదయత్ ॥ 29 ॥

రాక్షసుడై యుండి కూడా దేవతారూపంలో నున్న రాహునకు అమృతము నిచ్చిన చంద్రుడు ఆ విషయము విష్ణునకు తెలిపాడు.

విష్ణుః పీతామృతం దైత్యం చక్రేణోద్యమ్య తచ్ఛిరః ।
చిచ్ఛేద తరసా వత్స! తచ్ఛిరస్త్వమరం త్వభూత్ ॥ 30 ॥

అమృతమును త్రాగిన రాహువు శిరస్సును వెంటనే విష్ణువు తన చక్రమును ప్రయోగించి ఛేదించాడు. నాయనా! ఆ శిరస్సు మాత్రము అమరత్వమును పొందింది.

శిరోమాత్రవిహీనం యద్దేహం తదపతద్భువి ।
దేహం తదమృతస్పృష్టం పతితం దక్షిణే తటే ॥ 31 ॥

తల లేకుండా మిగతా శరీరం మాత్రం నేలమీదపడింది. అమృతస్పర్శ కలిగిన ఆ దేహము గౌతమి యొక్క దక్షిణ తీరమునందు పడింది.

గౌతమ్యా మునిశార్దూలాకమ్పయద్వసుధాతలమ్ ।
దేహం చాప్యమరం పుత్ర! తదద్భుతమివాభవత్ ॥ 32 ॥

ఓ మునిశ్రేష్ఠా! గౌతమీనది దక్షిణతీరమున ఆ దేహం పడుతున్నప్పుడు భూమియంతయు కంపించింది. నాయనా! ఆ దేహము కూడా ఆశ్చర్యకరముగా అమరమయింది.

దేహం చ శిరసోఽపేక్షి శిరోదేహమపేక్షతే ।
ఉభయం చామరం జాతం దైత్యశ్చాయం మహాబలః ॥ 33 ॥

దేహమునకు శిరస్సు కావాలి, శిరస్సు దేహమును కోరుతుంది. ఇలా రెండునూ అమరమైనవి. ఆ దైత్యుడు మిక్కిలి బలవంతుడయ్యాడు.

శిరః కాయే సమావిష్టం సర్వాన్ భక్షయతే సురాన్ ।
తస్మాద్దేహమిదం పూర్వం నాశయామో మహీగతమ్ ॥
తతస్తే శంకరం ప్రాహుర్దేవాః సర్వే ససంభ్రమాః ॥ 34 ॥

తల మొండెమునకు కలిసినట్లైతే దేవతల నందరిని తినగలదు. అందువలన మొదట నేలమీదపడిన ఈ శరీరమును నాశనం చేద్దామని భావించి వెంటనే అందరూ అందోళనతో శంకరునిలా అడిగారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

మహీగతం దైత్యదేహం నాశయస్వ సురోత్తమ ।
త్వం దేవ! కరుణాసిన్ధుః శరణాగత రక్షకః ॥ 35 ॥

ఓ దేవతా శ్రేష్ఠుడా! నీవు దయాసముద్రుడవు. శరణాగత రక్షకుడవు. ఈ క్రిందబడ్డ దైత్యుని దేహమును నశింపచేయి.

శిరసా నైవ యుజ్యేత దైత్యదేహం తథా కురు ॥ 36 ॥

ఈ దైత్యుని దేహమునకు శిరస్సు అతుక్కొనకుండా ఉండేటట్లుగా చేయి.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ప్రేషయామాస చేశోఽపి శ్రేష్ఠాం శక్తిం తదాఽఽత్మనః ।
మాతృభిః సహితాం దేవీం మాతరం లోకపావనీమ్ ॥ 37 ॥

అపుడు ఈశ్వరుడు తనయొక్క శ్రేష్ఠమైన శక్తినీ, సప్తమాతృకలతో కూడి లోకాలను పావనం చేసే జగన్మాతఐన తల్లినీ కూడా ఆ పనికి పంపించాడు.

ఈశాయుధధరాదేవీ ఈశశక్తిసమన్వితా ।
మహీగతం యత్రదేహం తత్రాగాద్భక్ష్యకాంక్షిణీ ॥ 38 ॥

శివాయుధమును ధరించి శివశక్తితో గూడియున్న ఆ దేవి భూమిమీద దేహము పడివున్న చోటుకు తినుటకై వెళ్ళింది.

శిరోమాత్రం సురాః సర్వే మేరౌ తత్రైవ సాన్త్వయన్ ।
దేహో దేవ్యా పునస్తత్ర యుయుధే బహవః సమాః ॥ 39 ॥

దేవతలందరు అక్కడే మేరు పర్వతమునందు శిరోమాత్రముగానున్న వానిని ఉపశమనం కల్గించుచుండగా, దేహము మాత్రమే మిగిలియున్నవానితో దేవి అనేక సంవత్సరములు యుద్ధము చేసింది.

రాహుస్తత్ర సురానాహ భిత్వా దేహం పురా మమ ।
అత్రాఽఽస్తే రసముత్కృష్టం తదాకృష్య శరీరతః ॥ 40 ॥

పృథక్భూతే రసే దేహం ప్రవరేఽమృతముత్తమమ్ ।
భస్మీభూయాత్ క్షణేనైవ తస్మాత్కుర్వన్తు తత్పురా ॥ 41 ॥

అప్పుడు రాహువు దేవతలతో ఇలా అన్నాడు. పూర్వము నా దేహమునందు ఉత్కృష్టమైన రసమున్నది. ముందా శరీరమును భిన్నము చేసి నా శరీరమునందున్న ఆ రసమును బయటకు తీసి, రసమయదేహమూ, శరీరమూ వేరువేరుగా నుండునట్లు చేయండి. ఆ ఉత్తమమైన అమృతము వేరైన వెంటనే దేహం వెంటనే బూడిద అవుతుంది.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ అన్నాడు.

ఏతద్రాహువచః శ్రుత్వా ప్రీతాః సర్వేఽసురారయః ।
అభ్యషించన్ గ్రహాణాం త్వం గ్రహో భూయా ముదాన్వితః ॥ 42 ॥

ఇలా పలికిన రాహువు మాటలను విన్న దేవతలు సంతోషించారు. నీవు సంతోషంగా గ్రహాలలో ఒక గ్రహమవమని అభిషేకించారు.

తద్దేవవచనాచ్ఛక్తిరీశ్వరీయా నిగద్యతే ।
దేహం భిత్వా దైత్యపతేః సురశక్తి సమన్వితా ॥ 43 ॥

ఆకృష్య శీఘ్రముత్కృష్టం ప్రవరం చామృతం బహిః ।
స్థాపయిత్వా తు తద్దేహం భక్షయామాస చామ్బికా ॥ 44 ॥

ఆ దేవతల మాట ప్రకారముగా ఆ ఈశ్వరశక్తి ఏదైతే ఉన్నదో, అది రాక్షసరాజు యొక్క దేహము భిన్నము చేసి దైవశక్తితో కూడినదై ఆ దేహమునుండి ఉత్కృష్టము ప్రవరము అయిన అమృతమును బయటకు లాగి ఆ దేహమును అంబిక తినినది.

కాళరాత్రిర్భద్రకాళీ ప్రోచ్యతే యా మహాబలా ।
స్థాపితం రసముత్కృష్టం రసానాం ప్రవరం రసమ్ ॥ 45 ॥

ఆ మహాబలవంతురాలైన అంబికను కాళరాత్రియని, భద్రకాళియని అంటారు. రసములలో శ్రేష్ఠమైన ఉత్కృష్టమైన ప్రవర రసమును ఆమె అక్కడ ఉంచినది.

వ్యస్రవత్థాపితం తత్తు ప్రవరా సాఽభవన్నదీ ।
ఆకృష్టమమృతం చైవ స్థాపితం సాఽప్యభక్షయత్ ॥ 46 ॥

ఆమె అక్కడ ఉంచిన రసము శ్రేష్ఠమైన నదిగా ప్రవహించినది. అదే ప్రవరానది వేరుచేసిన అమృతమును కూడా ఆమె భక్షించింది.

తతః శ్రేష్ఠా నదీ జాతా ప్రవరాచామృతా శుభా ।
రాహుదేహసముద్భూతా రుద్రశక్తిసమన్వితా ॥ 47 ॥

అంతట రాహువు దేహమునుండి పుట్టినదీ, రుద్రుని శక్తితో కూడినదీయగు ఒక శ్రేష్ఠమైన నది పుట్టింది. అది అమృతమయమై ప్రవరమై, శుభముతో కూడింది, అయ్యింది.

నదీనాం ప్రవరా రమ్యా చామృతా ప్రేరితా తథా ।
తత్ర పంచ సహస్రాణి తీర్థాని గుణవన్తి చ ॥ 48 ॥

నదుల్లో అందమైనదీ, అమృతమయమైనదీ, మంగళకరమైనదీ ఆ ప్రవరానది. అక్కడ పవిత్రములైన ఐదువేల తీర్థాలున్నాయి.

తత్ర శమ్భుః స్వయం తస్థౌ సర్వదా సురపూజితః ।
తస్యై తుష్టాః సురాః సర్వే దేవ్యై నద్యై పృథక్పృథక్ ॥ 49 ॥

వరాన్ దదుర్ముదాయుక్తా యథా పూజామవాప్స్యతి ।
శమ్భుః సురపతిర్లోకే తథా పూజామవాప్స్యసి ॥ 50 ॥

దేవతలు పూజించే శివుడక్కడ ఎల్లప్పుడు స్వయముగా ఉంటాడు. దేవతలందరూ సంతోషించినవారై వేరువేరుగా వరాలిచ్చారు. శివుడేవిధముగా ఈ లోకమునందు పూజలందుకొనునో అదే విధముగా నీవును పూజలందు కొనగలవని దీవించారు.

నివాసం కురు దేవి త్వం లోకానాం హితకామ్యయా ।
సదా తిష్ఠ రసేశాని సర్వేషాం సర్వసిద్ధిదా ॥ 51 ॥

దేవీ! లోకముల హితము కొరకు నీవిక్కడ నివసించుము. రసేశానీ! అందరికి అన్ని విధముల కోరికలను తీర్చుచు సర్వదా ఉండుము.

స్తవనాత్కీర్తనాద్ధ్యానాత్సర్వకామప్రదాయినీ ।
త్వాం నమస్యన్తి యే భక్త్యా కించిదాపేక్ష్య సర్వదా ॥ 52 ॥

తేషాం సర్వాణి కార్యాణి భవేయుర్దేవతాజ్ఞయా ।
శివశక్త్యోర్యతస్తస్మిన్నివాసోఽభూత్సనాతనః ॥ 53 ॥

స్తోత్రమువలన, కీర్తించుటవలన, ధ్యానించుటవలన కోరికలన్నింటిని తీర్చే నిన్ను ఏ కొంచమైన కోరి భక్తితో ఎవరు నమస్కరిస్తారో, వారివారి పనులు దేవతల యాజ్ఞతో అన్నీ నెరవేరగలవు. ఎందుకనగా ఆ తీర్థమునందు సనాతనులైన శివ, శక్తుల నివాసము స్థిరమైనది.

అతో వదన్తి మునయో నివాసపురమిత్యదః ।
ప్రవరాయాః పురా దేవాః సుప్రీతాస్తే వరాన్దదుః ॥ 54 ॥

అందుకే ఆ ప్రదేశమును మునులు నివాసపురమంటారు. దేవతలు సంతోషించి ప్రవరానదికి వరములనిచ్చారు.

గంగాయాః సంగమో యస్తే విఖ్యాతః సురవల్లభః ।
తత్రాఽఽప్లుతానాం సర్వేషాం భుక్తిర్వా ముక్తిరేవచ ॥ 55 ॥

గంగానది సంగమము జరిగిన ఆ తీర్థము సురవల్లభమని ప్రసిద్ధి నందినది. అక్కడ స్నానమునాచరించిన వారికందరికీ భుక్తీ, ముక్తీ కలుగుతాయి.

యద్వాఽపి మనసః కామ్యం దేవానామపి దుర్లభమ్ ।
స్యాత్తేషాం సర్వమేవేహ ఏవం దత్వా సురా యయుః ॥ 56 ॥

దేవతలకు కూడా లభించనటువంటిది, మనమనస్సులో నున్నటువంటి కోరిక అందరికీ కూడా ఇక్కడ తీరుతుంది. అని వరముల నిచ్చి దేవతలు వెళ్ళారు. దేవతలకు కూడా లభింపశక్యముకాని మనోరథము ఏదైనా ఇక్కడ తీరుతుంది అని వరమిచ్చి దేవతలు వెళ్ళిపోయారు.

తతః ప్రభృతి తత్తీర్థం ప్రవరా సంగమం విదుః ।
ప్రేరితా దేవదేవేన శక్తిర్యా ప్రేరితా తు సా ॥ 57 ॥

అమృతాసైవ విఖ్యాతా ప్రవరేయం మహానదీ ।
ప్రవరా సంగమే తస్మిన్ స్నానదానాదికం చ యత్ ॥
సర్వం తదక్షయం విద్యాత్పితౄణాం ప్రీతిదాయకమ్ ॥ 58 ॥

అప్పటినుండి ఆ తీర్థమును ప్రవరా సంగమమంటారు. దేవదేవునిచే ప్రేరేపింపబడిన ఏశక్తి అయితే ఉ ందో ఆ శక్తి ప్రేరేపింపబడినదై అమృతమయమై ప్రవరామహానదిగా ఖ్యాతిని పొందింది. ఈ ప్రవరా సంగమమునందు స్నానదానాదికములను చేసినచో, అదంతా అక్షయమైన ఫలమునిస్తుంది. పితృదేవతలకు ప్రీతిని కలిగిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే శివప్రేరితామృతాసంగమాది తీర్థవర్ణనం నామ షట్త్రింశోఽధ్యాయః. ॥ 36 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి బ్రహ్మ-నారద సంవాదములోని శివప్రేరితాఅమృతా సంగమములనే తీర్థవర్ణనములనే పేరుగల ముప్పైయారవ అధ్యాయం సంపూర్ణం.

సప్తత్రింశోఽధ్యాయః – ముప్పై ఏడవ అధ్యాయం

వృద్ధాసంగమాద్యుభయతట సప్తదశ తీర్థ వర్ణనమ్

వృద్ధాసంగమాది ఉభయతటములందున్న పదిహేడు తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

వృద్ధాసంగమమాఖ్యాతం యత్ర వృద్ధేశ్వరః శివః ।
తస్యాఽఽఖ్యానం ప్రవక్ష్యామి శృణు పాపప్రణాశనమ్ ॥ 1 ॥

శివుడు వృద్ధేశ్వరుడనే పేరుతో నున్న ప్రదేశమును వృద్ధాసంగమతీర్థమంటారు. ఆ ఆఖ్యానము పాపము నశింపజేయునది. దానినిగూర్చి చెప్పుచున్నాను వినుము.

గౌతమో వృద్ధ ఇత్యుక్తో మునిరాసీన్మహాతపాః ।
యదా పురాఽభవద్బాలో గౌతమస్య సుతో ద్విజః ॥ 2 ॥

గౌతముడనే పేరుగల మహాతపస్సంపన్నుడైన వృద్ధముని యుండినాడు. గౌతముడు బాలుడుగా ఉన్నప్పుడు అతనికొక కొడుకు పుట్టాడు.

అనాసః స పురోత్పన్నస్తస్మాద్వికృతరూపధృక్ ।
స వైరాగ్యాజ్జగామాథ దేశం తీర్థమితస్తతః ॥ 3 ॥

అతడు ముక్కులేకుండా పుట్టినందువలన వికృతరూపముతో నుండినాడు. అతడు విరాగియై అనేక దేశములూ, తీర్థములు తిరిగాడు.

ఉపాధ్యాయేన నైవాఽఽసీల్లజ్జితస్య సమాగమః ।
శిష్యైరన్యైః సహాధ్యాయో లజ్జితస్య చ నాభవత్ ॥ 4 ॥

సిగ్గుతో కుంచించుకుపోయిన అతనికి ఏ ఉపాధ్యాయునితోనూ, ఇతర సహాధ్యాయులైన శిష్యులతోనూ సమాగమము కాలేదు.

ఉపనీతః కథంచిచ్చ పిత్రా వై గౌతమేన సః ।
ఏతావతా గౌతమోఽపి వ్యగమచ్చరితుం బహిః ॥ 5 ॥

గౌతముడతనికేదో విధముగా ఉపనయనము చేసినాడు. ఇంతలో గౌతముడు కార్యార్థియై బయట సంచరించడానికి వెళ్ళాడు.

ఏవం బహుతిథే కాలే బ్రహ్మమాత్రా ధృతే ద్విజే ।
నైవ చాధ్యయనం తస్య సంజాతం గౌతమస్య హి ॥ 6 ॥

ఉపనయనమై గాయత్రీమంత్రోపదేశమై చాలాకాలము జరిగినప్పటికిని గౌతముడతనికి విద్యలేవీ బోధించలేదు.

నైవ శాస్త్రస్య చాభ్యాసో గౌతమస్యాభవత్తదా ।
అగ్నికార్యం తతశ్చక్రే నిత్యమేవ యతవ్రతః ॥ 7 ॥

ఆ గౌతమ కుమారుడు శాస్త్రాభ్యాసమేమీ చేయలేదు. తరువాత అతడు నియమముగా నిత్యము అగ్నికార్యమును చేశాడు.

గాయత్ర్యభ్యాసమాత్రేణ బ్రాహ్మణో నామధారకః ।
అగ్న్యుపాసనమాత్రం చ గాయత్ర్యభ్యసనం తథా ॥ 8 ॥

గాయత్రీమంత్రాభ్యాసము చేయుటచే నతడు కేవలం బ్రాహ్మణనామధారిగా నుండి అగ్న్యుపాసనము, గాయత్రీ మంత్రానుష్ఠానమును మాత్రము చేయుచుండినాడు.

ఏతావతా బ్రాహ్మణత్వం గౌతమస్యాభవన్మునే ।
ఉపాసతోఽగ్నిం విధివద్గాయత్రీం చ మహాత్మనః ॥ 9 ॥

ఓ మునీ! ఇంతమాత్రముచేతనే ఆ గౌతమునికి బ్రాహ్మణత్వముండినది. ఆ మహాత్ముడు అగ్నినుపాసించుచుండినాడు. విధి పూర్వకం గాయత్రిని చేయుచుండినాడు.

తస్యాఽఽయుర్వ్యవృధే పుత్ర గౌతమస్య చిరాయుషః ।
న దారసంగ్రహం లేభే నైవ దాతాఽస్తి కన్యకామ్ ॥ 10 ॥

నాయనా! అతనికి వయస్సు మీరుచుండినది. చిరాయువు అయిన అతనికి కన్యనిచ్చేవారు లేక వివాహము కాలేదు.

తథా చరంస్తీర్థదేశే వనేషు వివిధేషు చ ।
ఆశ్రమేషు చ పుణ్యేషు అటన్నాస్తే స గౌతమః ॥ 11 ॥

ఇలా అనేక తీర్థదేశములనూ, అనేక అరణ్యములను, పవిత్రమైన ఆశ్రమములనూ ఆ గౌతముడు తిరుగుచుండినాడు.

ఏవం భ్రమన్ శీతగిరిమాశ్రిత్యాఽఽస్తే స గౌతమః ।
తత్రాపశ్యద్గుహాం రమ్యాం వల్లీవిటపమాలినీమ్ ॥ 12 ॥

ఇలా తిరుగుతూ ఆ గౌతముడు హిమగిరిని చేరాడు. అక్కడ చక్కని పూతీగలతో నల్లుకున్న వృక్షములుగల సుందరమైన గుహను చూచాడు.

తత్రోపవిశ్య విప్రేన్ద్రో వస్తుం సమకరోన్మతిమ్ ।
తదన్తస్తు ప్రవిష్టోఽసావపశ్యత్స్త్రియముత్తమామ్ ॥ 13 ॥

అక్కడ కూర్చొని ఆ విప్రశ్రేష్ఠుడు అక్కడే నివసించుటకై నిశ్చయించుకొన్నాడు. ఆ గుహలోకి ప్రవేశించిచూడగా అక్కడొక ఉత్తమస్త్రీ దర్శనమిచ్చింది.

శిథిలాంగీమథ కృశాం వృద్ధాం చ తపసి స్థితామ్ ।
బ్రహ్మచర్యేణ వర్తన్తీం కుమారీం రహసి స్థితామ్ ॥ 14 ॥

ఆ స్త్రీ బ్రహ్మచర్యమును పాటిస్తూ కన్యగానుండి అవయవములన్నీ శిథిలము కాగా కృశించి వృద్ధురాలై ఏకాంతముగా తపస్సు చేసుకొనుచుండినది.

స తాం దృష్ట్వా మునిశ్రేష్ఠో నమస్కారాయ తస్థివాన్ ।
నమస్యన్తం మునిశ్రేష్ఠం తం గౌతమమవారయత్ ॥ 15 ॥

ఆమెను చూచిన ఆ మునిశ్రేష్ఠుడు నమస్కరించబోయాడు. నమస్కరిస్తున్న మునివరుడైన గౌతముని ఆమె నివారించింది.

వృద్ధోవాచ:- వృద్ధురాలు పలికింది.

గురుస్త్వం భవితా మహ్యం న మాం వన్దితుమర్హసి ।
ఆయుర్విద్యా ధనం కీర్తిఃధర్మః స్వర్గాదికం చ యత్ ॥
తస్య నశ్యతి వై సర్వం యం నమస్యతి వై గురుః ॥ 16 ॥

మీరు నాకు గురువులు కావున నాకు నమస్కరించకూడదు. గురువు నమస్కరించినచో ఆయువు, విద్య, ధనము, కీర్తి, ధర్మము, స్వర్గాదులు మున్నగునవి నశిస్తాయి.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

కృతాంజలిపుటస్తాం వై గౌతమః ప్రాహ విస్మితః । 17 ॥

చేతులు జోడించి నమస్కరిస్తున్న ఆమెతో ఆశ్చర్యపడి గౌతముడిలా అన్నాడు.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

తపస్వినీ త్వం వృద్ధా చ గుణజ్యేష్ఠా చ భామినీ ।
అల్పవిద్యాస్త్వల్పవయా అహం తవ గురుః కథమ్ ॥ 18 ॥

నీవు స్త్రీతపస్వినివి. గుణములలోగొప్ప దానివి. వృద్ధురాలవు. నేను చిన్నవాణ్ణి. తక్కువ చదువుకున్నవాణ్ణి. నేను నీకు గురువెలా అవుతాను.

వృద్ధోవాచ:- వృద్ధురాలు పలికింది.

అస్మిన్నర్థే పురావృత్తం వదామి తవ సువ్రత ।
అర్ష్టిషేణస్య పుత్రస్య ఋతధ్వజ ఇతి శ్రుతః ॥
గుణవాన్ మతిమాన్ శూరః క్షత్రధర్మపరాయణః ॥ 19 ॥

ఓ సువ్రతా! ఈ విషయంలో పూర్వం జరిగిన కథను నీకు చెబుతాను. ఋతధ్వజుడను పేరుగల ఆర్ష్టిసేనుని ప్రియకుమారుడుండినాడు. అతడు మంచిగుణవంతుడు, బుద్ధిమంతుడు, శూరుడు క్షత్రియ ధర్మమును చక్కగా అనుసరించువాడు.

స కదాచిద్వనం ప్రాయాన్మృగయాకృష్టచేతనః ।
విశ్రామమకరోదస్యాం గుహాయాం స ఋతుధ్వజః ॥ 20 ॥

అతడొకనాడు వేటయందు మనసుపడి అడవికి వెళ్ళాడు. వేటలో అలసి ఆ ఋతుధ్వజుడు ఈ గుహలో విశ్రాంతి తీసుకొన్నాడు.

యువా స మతిమాన్దక్షో బలేన మహతా వ్రతః ।
తం విశ్రాన్తం నృపవరమప్సరా దదృశే తతః ॥ 21 ॥

అతడు యువకుడు, తెలివిగలవాడు, గొప్పబలముతో కూడుకొనియున్నవాడు, అటువంటి విశ్రాంతి తీసుకొనుచున్న రాజుశ్రేష్ఠుని అప్పుడు ఒక అప్సర చూచింది.

గన్ధర్వరాజస్య సుతా సుశ్యామా ఇతి విశ్రుతా ।
తాం దృష్ట్వా చకమే రాజా రాజానం చకమే చ సా ॥ 22 ॥

గంధర్వరాజకూతురగు ఆమె పేరు సుశ్యామ. ఆమెను చూచి రాజు కామించాడు. ఆమెకూడా రాజును ఇష్టపడింది.

రతిక్రీడా సమభవత్తయా రాజ్ఞో మహామతే ।
నివృత్తకామో రాజేన్ద్రస్తామాపృచ్ఛ్యాఽఽగమద్గృహమ్ ॥ 23 ॥

ఓ మహామతీ! ఆమెతో కూడ రాజు రతిక్రీడ సల్పాడు. కోరిక దీరిన రాజు ఆమెతో చెప్పి ఇంటికి వెళ్ళాడు.

ఉత్పన్నాఽహం తతస్తస్యాం సుశ్యామాయాం మహామతే ।
గచ్ఛన్తీ మాం తదా మాతా ఇదమాహ తపోధన ॥ 24 ॥

ఓ మహామతీ! తపోధనుడా! నేనా సుశ్యామకు పుట్టినదానిని. నా తల్లి వెళ్ళిపోతూ నాతో ఇలా అన్నది.

సుశ్యామోవాచ:– సుశ్యామ పలికింది.

యస్త్వస్యాం ప్రవిశేద్భద్రే స తే భర్తా భవిష్యతి ॥ 25 ॥

ఓ భద్రురాలా! ఈ గుహయందు ప్రవేశించినవాడు నీకు భర్త కాగలడు.

వృద్ధోవాచ:– వృద్ధురాలు పలికింది.

ఇత్యుక్త్వా సా జగామాథ మాతా మమ మహామతే ।
తస్మాదత్ర ప్రవిష్టస్త్వం పుమాన్నాన్యః కదాచన ॥ 26 ॥

ఓ మహామతీ! ఇలా చెప్పి నా తల్లి వెళ్ళిపోయింది. ఇతరులెవరూ ఎప్పుడూ ప్రవేశించని ఈ చోటునకు నీవు ప్రవేశించావు.

సహస్రాణి తథాశీతిం కృత్వా రాజ్యం పితా మమ ।
అత్రైవ చ తపస్తప్త్వా తతః స్వర్గముపేయివాన్ ॥ 27 ॥

నా తండ్రి ఎనుబై(80) వేల సంవత్సరములు రాజ్యమును పరిపాలించి, ఇక్కడే తపమాచరించి తరువాత స్వర్గం చేరుకొన్నాడు.

స్వర్గే యాతేఽపి పితరి సహస్రాణి తథా దశ ।
వర్షాణి మునిశార్దూల! రాజ్యం కృత్వా తథా పరః ॥ 28 ॥

స్వర్గం యాతో మమ భ్రాతా అహమత్రైవ సంస్థితా ।
అహం బ్రహ్మన్నాన్యవృతా న మాతా న పితా మమ ॥ 29 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! నా తండ్రి స్వర్గస్థుడైన తరువాత నా సోదరుడు పదివేల సంవత్సరములు రాజ్యమును పరిపాలించి స్వర్గం చేరాడు. నేను మాత్రం ఇక్కడే ఉన్నాను. ఓ బ్రాహ్మణుడా! నన్నెవరూ వరించలేదు. నాకు తలిదండ్రులు లేరు.

అహ మాత్మేశ్వరీ బ్రహ్మన్నివిష్టా క్షత్రకన్యకా ।
తస్మాద్భజస్వ మాం బ్రహ్మన్ వ్రతస్థాం పురుషార్థినీమ్ ॥ 30 ॥

నేను ఆత్మేశ్వరినై (నాకు నేనే స్వయంప్రత్తి కలదాన్ని) ఏకాగ్రచిత్తముగల క్షత్రియకన్యను. అందువలన ఓ బ్రాహ్మణుడా! వ్రతనియమంతో నుండి పురుషుడు (భర్త) కావలయునని కోరుచున్న నన్ను చేపట్టుము వరించుము.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

సహస్రాయురహం భద్రే మత్తస్త్వం వయసాఽధికా ।
అహం బాలస్త్వం తు వృద్ధా నైవాయం ఘటతే మిథః ॥ 31 ॥

ఓ మంగళకరురాలా! నేను వేయిసంవత్సరముల వయస్సువాడిని. నాకంటె నీవు వయోఽధికు రాలవు. నేను బాలుడను. నీవు వృద్ధురాలవు. మన కలయిక కుదరదు.

వృద్ధోవాచ:- వృద్ధురాలు పలికింది.

త్వం భర్తా మే పురా దిష్టో నాన్యో భర్తా మతో మమ ।
ధాత్రా దత్తస్తతస్త్వం మాం న నిరాకర్తుమర్హసి ॥ 32 ॥

నాకు నీవు భర్తగా పూర్వమే నియమించబడినావు. మరొకరిని నేనిష్టపడను. నీవు నాకు బ్రహ్మ ప్రసాదించిన భర్తవు. నన్ను నిరాకరించుట నీ కుచితము గాదు.

అథవా నేచ్ఛసి మాం త్వమప్రదుష్టామనువ్రతామ్ ।
తతస్త్యక్ష్యామి జీవం మే ఇదానీం తవ పశ్యతః ॥ 33 ॥

అలా కానిచో వ్రతనిష్ఠురాలనూ, పవిత్రురాలనూ అయిన నన్ను నీవంగీకరించనిచో నీవిప్పుడు చూస్తుండగానే నా జీవితాన్ని వదిలి పెడతాను.

అపేక్షితాప్రాప్తితో హి దేహినాం మరణం వరమ్ ।
అనురక్తజనత్యాగే పాతకాన్తో న విద్యతే ॥ 34 ॥

కోరినది లభించనప్పుడు జీవులకు మరణమే మేలు. ఇష్టమైన వారిని వదులుట కంటె గొప్ప పాపము లేదు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

వృద్ధాయాస్తద్వచః శ్రుత్వా గౌతమో వాక్యమబ్రవీత్ ॥ 35 ॥

వృద్ధురాలి మాటలు విన్న గౌతముడిలా అన్నాడు.

గౌతమ ఉవాచ:– గౌతముడు పలికాడు.

అహం తపోవిరహితో విద్యాహీనో హ్యకించనః ।
నాహం వరో హి యోగ్యస్తే కురూపో భోగవర్జితః ॥ 36 ॥

నేను తపస్సు చేయను, విద్యావంతుణ్ణి కాను, దిక్కులేనివాణ్ణి, కురూపిని, భోగవర్జితుడను అటువంటి నేను నీకు వరునిగా తగిన వాడను కాను.

అనాసోఽహం కిం కరోమి అతపోవిద్య ఏవ చ ।
తస్మాత్సురూపం సద్విద్యామాపాద్య ప్రథమం శుభే ॥
పశ్చాత్తే వచనం కార్యం తతో వృద్ధాఽబ్రవీద్విజమ్ ॥ 37 ॥

ముక్కులేనివాణ్ణి, నేను తపోవిద్యలు లేనివాడను, నేనేమి చేయగలను? అందువలన ఓ శుభకరురాలా! ముందు మంచి రూపవంతునిగా, మంచి విద్యావంతునిగా అయి తరువాత నీ మాట వింటాను అని చెప్పగా అపుడు ఆ వృద్ధురాలు బ్రాహ్మణునితో ఇలా అన్నది.

వృద్ధోవాచ :– వృద్ధురాలు పలికింది.

మయా సరస్వతీ దేవీ తోషితా తపసా ద్విజ ।
తథైవాఽఽపో రూపవత్యో రూపదాతాఽగ్నిరేవ చ ॥ 38 ॥

ఓ ద్విజుడా! నేను తపస్సుచేసి సరస్వతీదేవిని సంతోషపెట్టాను. అలాగే రూపమిచ్చే అగ్నినీ, రూపమిచ్చే జలదేవతల్నీ తపంతో సంతోషపెట్టాను.

తస్మాద్వాగీశ్వరీ దేవీ సా తే విద్యాం ప్రదాస్యతి ।
అగ్నిశ్చ రూపవాన్ దేవస్తవ రూపం ప్రదాస్యతి ॥ 39 ॥

అందువలన సరస్వతీదేవి నీకు విద్యను ప్రసాదిస్తుంది. రూపవంతుడైన అగ్నిదేవుడు నీకు మంచి రూపమును ప్రసాదిస్తాడు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా గౌతమం తం వృద్ధోవాచ విభావసుమ్ ।
ప్రార్థయిత్వా సువిద్యం తం సురూపం చాకరోన్మునిమ్ ॥ 40 ॥

ఇలా పలికి ఆ వృద్ధురాలు సూర్యుని ప్రార్థించి గౌతమమునిని మంచి విద్యావంతునిగానూ, మంచి రూపవంతునిగానూ చేసింది.

తతః సువిద్యః సుభగః సుకాన్తో
వృద్ధాం సపత్నీమకరోత్ప్రీతియుక్తః ।
తయా స రేమే బహులా మనోజ్ఞయా
సమాః సుఖం ప్రీతమనా గుహాయామ్ ॥ 41॥

అప్పుడా గౌతముడు విద్యావంతుడూ, సౌందర్యవంతుడూ కాంతిమంతుడుఐ, ఆ వృద్ధురాలిని ప్రీతి పూర్వకముగా భార్యగా చేసుకొని ఆమెతో నా గుహయందు అనేక సంవత్సరములు సంతుష్టుడై సుఖమును పొందాడు.

కదాచిత్తత్ర వసతోర్దంపత్యోర్ముదతో గిరౌ ।
గుహాయాం మునిశార్దూల ఆజగ్ముర్మునయో౽మలాః ॥ 42 ॥

ఓ మునిశ్రేష్ఠా! ఆ పర్వతగుహలో ఆనందంగా నివసిస్తున్న దంపతుల వద్దకు నిర్మలులైన మునులు వచ్చారు.

వసిష్ఠవామదేవాద్యా యే చాన్యే చ మహర్షయః ।
భ్రమన్తః పుణ్యతీర్థాని ప్రాప్నువంస్తస్య తాం గుహామ్ ॥ 43 ॥

వసిష్ఠ వామదేవాదులు, ఇతర మహర్షులు తీర్థయాత్రల కరుగుతూ ఒకనాడా గుహను చేరారు.

ఆగతాంస్తాన్ జ్ఞాత్వా గౌతమః సహభార్యయా ।
సత్కారమకరోత్తేషాం జహసుస్తం చ కేచన ॥ 44 ॥

వచ్చిన వారిని ఋషులనుగా నెరిగిన గౌతముడు భార్యతో కలిసి వారిని సత్కరించాడు. వారిలో కొందరు గౌతముని చూచి హేళన చేశారు.

యే బాలా యౌవనోన్మత్తా వయసా యే చ మధ్యమాః ।
వృద్ధాం చ గౌతమం ప్రేక్ష్య జహసుస్తత్ర కేచన ॥ 45 ॥

కొందరు ఋషులలో పిన్న వయస్కులు, మధ్యవయస్సులోనున్న యౌవనోన్మత్తులు వృద్ధురాలైన పత్నిని వయస్సులో ఉన్న గౌతముణ్ణి చూచి హేళనగా నవ్వారు.

కృశాం విశాలాం లంబోష్ఠీం సలోమాం శూర్పకర్ణకామ్ ।
దీర్ఘదన్తాం దీర్ఘనాసాం దీర్ఘకేశాన్తు జర్జరామ్ ॥ 46 ॥

కృశించి, విశాలముగా వ్రేలాడుతున్న పెదవులు, రోమములు, చేటలవంటి చెవులు, పొడవైన దంతములు, పొడవైన ముక్కు, పొడవైన వెంట్రుకలు గల ముసలి దానిని చూచీ,

రూపలావణ్యసౌభాగ్యవిద్యాయుక్తం చ గౌతమమ్ ।
సంప్రేక్ష్య జహసుః కేచిత్ బాలిశా ఋషిపుత్రకాః ॥ 47 ॥

రూప లావణ్య సౌభాగ్య విద్యావంతుడైన గౌతముణ్ణి చూచి కొందరు ఋషికుమారులు బాల్యచేష్టలతో నవ్వారు.

శిష్యాస్తథాఽల్పమతయస్తాం దృష్ట్వా పోచురుత్స్మితాః ॥ 48 ॥

కొందరు అల్పమతులైన శిష్యులామెను చూచి హేళనగా గట్టిగా నవ్వుతు ఇలా అన్నారు.

ఋషయ ఊచుః :- ఋషులు పలికారు.

పుత్రోఽయం తవ పౌత్రో వా వృద్ధే కో గౌతమోఽభవత్ ।
సత్యం వదస్వ కల్యాణి ఇత్యేవం జహసుర్ద్విజాః ॥ 49 ॥

ఓ ముసలి దానా! ఈ గౌతముడు నీకు కొడుకౌతాడా? మనుమడౌతాడా? ఓ కల్యాణీ! నిజం చెప్పు అని ఆ బ్రాహ్మణులు ఇలా పరాచికంగా నవ్వారు.

తపస్విని ఫలం ప్రోక్తం తపసః సత్యముత్కటమ్ ।
తపసా శమమన్వేతి శ్రమమేవ హ్యశక్తితః ॥ 50 ॥

ఓ తపస్వినీ! తపస్సుకు ఫలము ప్రబలమైన సత్యమని చెబుతారు. తపస్సువలన ఇంద్రియనిగ్రహం కలుగుతుంది. శక్తిలేనిచో శ్రమయే కదా!

సకృత్తస్యైవ తు శమం సమం పశ్య సుశోభనే ।
బహుజన్మార్జితస్యేహ రక్షణం సత్యభాషణమ్ ॥ 51 ॥

ఓ శోభనకరురాలా! ఒక్కసారి ఆ శమమునే బ్రహ్మముగా చూడు. అనేక జన్మలనుండి సంపాదించిన దానిని రక్షించేది సత్యభాషణమే సుమా!

కిమత్ర బహునోక్తేన ఫల్గుప్రాయేణ సాంప్రతమ్ ।
త్వమేవ ధన్యా లోకేఽస్మిన్వద సౌభాగ్యసంయుతే ॥ 52 ॥

ఇప్పుడు రసహీనము వ్యర్థప్రాయమైన దానిని గూర్చి ఇంక చెప్పవలసిన దేమున్నది? నిజం చెప్పు. ఓ సౌభాగ్యవంతురాలా! ఈ లోకంలో నీవే ధన్యురాలవు.

తపసా దగ్ధపాపా త్వం తపఃశ్రమసుకీర్తితా ।
స్వయం కృశా తు లోకేఽస్మిన్తపసా చ దమేన చ ॥ 53 ॥

తపస్సుతో పాపముల నన్నింటిని దహించావు. నీ తపస్సు మెచ్చదగినది. తపస్సుతో, ఇంద్రియనిగ్రహముతో, బాహ్యావృత్తులనుండి నీ మనస్సును మరల్చి బంధించుటతో ఈ లోకంలో నీవు స్వయముగా కృశించి ఉన్నావు.

ఆతిథ్యపూజనేనాపి పుత్రపాలనకేన చ ।
మా పుష్టమస్తు లోకేఽస్మిన్ శరీరం పాపసంచయాత్ ॥ 54 ॥

ఈ లోకంలో అతిథులను పూజించుట చేతను, సంతానమును రక్షించుట చేతను, పాపసమూహంతో కూడిన దేహము పెరగదు సుమా!

దయా దానం తపః సత్యం శౌచమిన్ద్రియనిగ్రహః ।
ఆతిథ్యపూజనం శాన్తిః పుత్రాదిపరిపాలనమ్ ॥ 55 ॥

స్వధర్మవర్తనం సర్వమిత్యాది పరిపాలనాత్ ।
యదాత్మోదరప్రాప్త్యర్థం వ్యాపారో యస్య కేవలమ్ ॥ 56 ॥

స్ఫుటం స నరకాయైవ శరీరీ కేవలం మతః ।
సర్వదుఃఖసహా నారీ కా లోకే వద భామిని ॥ 57 ॥

దయ, దానము, తపస్సు, శౌచము, ఇంద్రియనిగ్రహము అతిథి దేవ పూజనము, శాంతి, పుత్రదారాది సంరక్షణమూ, స్వధర్మవర్తనమూ సమస్తమని నమ్మి ఆచరించుట మొదలగునవి ప్రయోజనకరములు. తన ఉదర పోషణార్థము మాత్రమే ఎవడు పనిచేయునో అటువంటివాడు కేవలం నరకమునకు పోవుటకు మాత్రమే శరీరముతో ఉంటాడు. ఓ భామినీ! ఈ లోకములో దుఃఖముల నన్నింటినీ సహించే స్త్రీ ఎవరు? చెప్పు.

శ్వతుల్యా విద్యతే సుభ్రూః సర్వదాఽతిథిపూజనమ్ ।
అపవిత్రాసు సా జ్ఞేయా భర్తృపుత్రవివర్జితా ॥ 58 ॥

ఓ చక్కని కనుబొమలు కలిగినదానా! సుందరీ! అటువంటి స్త్రీని లోకంలో కుక్కతో సమానంగా చూస్తారు. ఎప్పుడూ అతిథులను ఆదరించాలి. అపవిత్రులైన అతిథులకు చేసిన సేవ కుక్కకు చేసినట్లే. భర్త, పిల్లలు వదలిన స్త్రీ కుక్కతో సమానమే.

సంభోజ్యాన్నా ద్విజైర్నూనం ధర్మయుక్తాసి శోభనే ।
తస్మాత్ వృద్ధతమా హి త్వం పతిహీనాప్యసంశయమ్ ॥ 59 ॥

బ్రాహ్మణులకు తృప్తిగా భోజనమును పెట్టిన నీవు తప్పక ధర్మయుక్తురాలవే. అందువలన నీవు వృద్ధురాలివైనా భర్త లేక పోయినా కూడా ధార్మికురాలవనుటలో సందేహము లేదు.

కురూపిణీ సురూపా త్వమధనాఽపి ధనాన్వితా ।
తప్తం తపస్త్వయైవోగ్రమేకాంగుష్ఠాదిదుష్కృతమ్ ॥ 60 ॥

నీవు కురూపిణివైనా అందగత్తెవే, ధనము లేక పోయినా ధనవంతురాలవే, ఒంటిర్రేలుపై నిలచి దుష్కృతమైనట్టి ఉగ్రమైన తపస్సు చేసిన దానివి నీవే.

లక్ష్మీపతిస్త్వయా భక్త్యా స్వర్చితః పూర్వజన్మని ।
సద్దానాని సుదత్తాని యజ్ఞాః స్విష్టాః సుదక్షిణాః ॥ 61 ॥

నీవు పూర్వజన్మలో శ్రీమన్నారాయణుని అర్చించావు. మంచి దానములను చక్కగా చేశావు. అనేక యజ్ఞయాగాదులు చేసి చక్కని దక్షిణల నిచ్చావు.

తీర్థసేవా కృతా సమ్యక్ ప్రదత్తం చ హుతం బహు ।
తస్మాత్పుత్రస్త్వయా లబ్ధో గౌతమో వేదపారగః ॥ 62 ॥

నీవు చక్కగా తీర్థములను సేవించావు. దానములు చేశావు. అనేక యజ్ఞములను చేశావు. అందువలననే నీకు వేదవేత్త అయిన పుత్రునిగా గౌతముడు లభించాడు.

వేదవేదాంగతత్త్వజ్ఞః సర్వశాస్త్రబహుశ్రుతః ।
త్రైలోక్య సుకృతేనాపి దుర్లభో గౌతమః సుతః ॥ 63 ॥

వేదవేదాంగములు బాగా తెలిసినవాడూ శాస్త్రములన్నింటిలో నిష్ణాతుడూ అయిన గౌతమునివంటి కుమారుడు ముల్లోకముల సుకృతముల వలన కూడా లభించడు.

నప్తా వా పుత్రపౌత్రో వా దుహితాపుత్ర ఏవ వా ।
పుత్రతృప్తికరాః శశ్వద్దౌహిత్రకుతుపాస్తిలాః ॥ 64 ॥

మునిమనుమడుగాని, మనుమడుగానీ, కుమారుడుగానీ, కూతురు కుమారుడుగానీ, ఎప్పటికి పుత్రులవలె సంతోషంగా కలిగించే కూతురు కొడుకూ, నువ్వులూ స్నేహపాత్రులై పుత్రులవలె ఇష్టం చేస్తారు.

కులం సమానం విమలం యాతి విష్ణోః పరం పదమ్ ।
అనేక చ తపోవృద్ధే నాత్ర కార్యా విచారణా ॥ 65 ॥

ఓ తపోవృద్ధురాలా! వంశము గౌరవంగా ఉండి పరిశుద్ధముగా ఉంటే విష్ణువుండే పరమపదమును చేరగలరు. ఇక్కడ ఇంక ఆలోచించవలసిన దేమీ లేదు.

కేచిదూచుస్తతశ్చైవ ఋషిశిష్యాః సవిస్మయాః ।
విషం వృద్ధస్య యువతిర్వృద్ధాయా అమృతం యువా ॥
ఇష్టానిష్టసమాయోగో దృష్టోఽస్మాభిరహో చిరాత్ ॥ 66 ॥

అప్పుడు కొంతమంది ఋషిశిష్యులు ఆశ్చర్యంతో ఇలా అన్నారు. ముసలివానికి యువతి విషతుల్యము. వృద్ధురాలికి యువకుడు అమృతముతో సమానము. ఆహా! చాలా కాలమునకు ఇష్టానిష్ట సమాయోగాన్ని చూశాను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఇత్యేవమూచిరే కేచిద్దంపత్యోః శృణ్వతోస్తదా ।
ఏవముక్త్వా కృతాతిథ్యా యయుః సర్వే మహర్షయః ॥ 67 ॥

అని ఆ దంపతులు వినేటట్లుగా పలికి ఆ ఋషులందరు ఆ దంపతుల ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళారు.

ఋషీణాం వచనం శ్రుత్వా ఉభావపి సుదుఃఖితౌ ।
లజ్జితౌ చ మహాప్రాజ్ఞో గౌతమో భార్యయా సహ ॥
పప్రచ్ఛ మునిశార్దూలమగస్త్యమృషిసత్తమమ్ ॥ 68 ॥

ఋషుల మాట విన్న దంపతులు సిగ్గుపడి దుఃఖించారు. మహాప్రాజ్ఞుడైన గౌతముడు తన భార్యతో కలిసి మునిశ్రేష్ఠుడైన అగస్త్యునివద్దకు వెళ్ళి ఇలా అడిగాడు.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

కో దేశః కిము తీర్థం వా యత్ర శ్రేయః సమాప్యతే ।
శీఘ్రమేవ మహాప్రాజ్ఞ భుక్తిముక్తిప్రదాయకమ్ ॥ 69 ॥

మహాప్రాజ్ఞా! అగస్త్యమహర్షీ! ఎక్కడ త్వరగా భుక్తి, ముక్తి కలుగుతుందో, శ్రేయః ప్రదమవుతుందో అటువంటి ప్రదేశమేది? తీర్థమేది? దాని గూర్చి వివరించు.

అగస్త్య ఉవాచ:- అగస్త్యుడు పలికాడు.

వదద్భిర్మునిభిర్బ్రహ్మన్మయా శ్రుతమిదం వచః ।
సర్వేకామాస్తత్ర పూర్ణా గౌతమ్యాం నాత్ర సంశయః ॥ 70 ॥

గౌతమా! గౌతమీ నదియందు మన కోరికలన్నీ ఫలవంతాలవుతాయని, ఈ విషయంలో సందేహమే మాత్రమూ లేదని మునులందరూ చెప్పగా నేను విన్నాను.

తస్మాద్గచ్ఛ మహాబుద్ధే గౌతమీం పాపనాశినీమ్ ।
అహం త్వామనుయాస్యామి యథేచ్ఛసి తథా కురు ॥ 71 ॥

ఓ మహాజ్ఞానీ! అందువలన పాపనాశిని యైన గౌతమీ నది వద్దకు వెళ్ళు. నేను కూడా నిన్ననుసరించి వస్తాను. నీకెలా ఇష్టమైతే అలా చెయ్యి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వాఽగస్త్యవాక్యం వృద్ధయా గౌతమోఽభ్యగాత్ ।
తత్ర తేపే తపస్తీవ్రం పత్న్యా స భగవానృషిః ॥ 72 ॥

అగస్త్యుని మాటలను విన్న పూజ్యుడైన గౌతమ ఋషి తన వృద్ధ భార్యను తీసుకొని గౌతమీనది వద్దకు వెళ్ళి అక్కడ తన భార్యతో కలిసి తీవ్రమైన తపమాచరించాడు.

స్తుతిం చకార దేవస్య శంభోర్విష్ణోస్తథైవ చ ।
గంగాం చ తోషయామాస భార్యార్థం భగవానృషిః ॥ 73 ॥

పూజ్యుడైన ఆ గౌతముడు శివున్ని, విష్ణువునూ స్తుతించాడు. తన భార్యకొరకై గంగాదేవిని కూడా సంతోషపెట్టాడు.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

ఖిన్నాత్మనామత్రభవో త్వమేవ శరణం శివ(ః) ।
మరుభూమావధ్వగానాం విటపీవ ప్రియాయుతః ॥ 74 ॥

మరుభూమిలో ప్రయాణం చేయునప్పుడు దారిలోని వృక్షమువలె ఈ లోకంలో దుఃఖాత్ములకు పార్వతీదేవితో కూడిన శివా! నీవే దిక్కు.

ఉచ్చావచానాం భూతానాం సర్వథా పాపనోదనః ।
సస్యానాం ఘనవత్కృష్ణ త్వమవగ్రహశోషిణామ్ ॥ 75 ॥

ఎండిన పంటలకు మేఘము వర్షించినట్లు ఓ కృష్ణా! హెచ్చుతగ్గులు విషమములు విభిన్నములునగు ఈ జీవుల అన్నివిధముల పాపములను తొలగించు వానివి నీవే.

వైకుంఠదుర్గనిఃశ్రేణిస్త్వం పీయూష తరంగిణీ ।
అధోగతానాం సప్తానాం శరణం భవ గౌతమి ॥ 76 ॥

పొందశక్యంకాని వైకుంఠమునకు నీవు సోపానానివి (మెట్టువు). పాపలోకాల్లో తపిస్తున్నవారికి నీవు అమృతాన్ని వర్షించే గంగవి.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తతస్తుష్టాఽవదద్వాక్యం గౌతమం వృద్ధయా యుతమ్ ।
శరణాగతదీనార్తశరణ్యా గౌతమీ ముదా ॥ 77 ॥

అటు తరువాత శరణుగోరిన దీనులకు రక్షణ కల్పించే గౌతమి చాలా సంతోషించి వృద్ధురాలితో కూడిన గౌతమునితో ఇలా అన్నది.

గౌతమ్యువాచ:- గౌతమి పలికింది.

అభిషించస్వ భార్యాం త్వం మజ్జలైర్మంత్రసంయుతైః ॥
కలశైరుపచారైశ్చ తతః పత్నీ తవ ప్రియా ॥ 78 ॥

సురూపా చారుసర్వాంగీ సుభగా చారులోచనా ।
సర్వలక్షణసంపూర్ణా రమ్యరూపమవాప్స్యతి ॥ 79 ॥

కలశోపచారములను చేసి మంత్రపూతములైన నా నీటితో నీ భార్యను అభిషేకించు. తరువాత నీ ప్రియపత్ని, చక్కని రూపమును, చక్కని అవయవములను, సుందరమైన కన్నులను, సర్వలక్షణములను పూర్తిగా పొంది సౌందర్యవతి కాగలదు.

రూపవత్యా పునస్త్వం వై భార్యయా చాభిషేచితః ।
సర్వలక్షణసంపూర్ణః కాన్తం రూపమవాప్స్యసి ॥ 80 ॥

తిరిగి రూపవతియైన నీ భార్యనిన్ను అభిషేకించగా నీవు సకలశుభలక్షణాలతో సుందరమైన రూపాన్ని పొందగలవు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తథేతి గంగావచనాద్యథోక్తం తౌ చ చక్రతుః ।
సురూపతాముభౌ ప్రాప్తౌ గౌతమ్యాశ్చ ప్రసాదతః ॥ 81 ॥

సరే! అట్లే నని గంగచెప్పినట్లుగా వారు చేశారు. గౌతమి అనుగ్రహంతో వారిద్దరూ చక్కని రూపాలను పొందారు.

అభిషేకోదకం యచ్చ సా నదీ సమజాయత ।
తస్యా నామ్నాతు విఖ్యాతా వృద్ధాయా మునిసత్తమ ॥ 82 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! వారిద్దరూ అభిషేకించుకొనిన నీరు ఒక నదిగా మారింది. ఆ నది ఆ వృద్ధ స్త్రీ పేరుతో ప్రసిద్ధి పొందినది.

వృద్ధా నదీ తు విఖ్యాతా గౌతమోఽపి తథోచ్యతే ।
వృద్ధగౌతమి ఇత్యుక్త ఋషిభిః సమవాసిభిః ॥
వృద్ధా తు గౌతమీం ప్రాహ గంగాం ప్రత్యక్షరూపిణీమ్ ॥ 83 ॥

దానిని వృద్ధానది అని అంటారు. గౌతముని వృద్ధగౌతమునిగా పిలిచారు. అక్కడ నివసిస్తున్న ఋషులు దానిని వృద్ధగౌతమీనది అన్నారు. ఆ వృద్ధురాలు ప్రత్యక్షగంగ ఐన గౌతమితో ఇలా అంది.

వృద్ధోవాచ:- వృద్ధురాలు పలికింది.

మన్నామ్నీయం నదీ దేవి వృద్ధా చేత్యభిదీయతామ్ ।
త్వయా చ సంగమస్తస్యాస్త స్యాస్తీర్థమనుత్తమమ్ ॥ 84 ॥

దేవీ! ఈ నది 'వృద్ధా' అనే నా పేరుతో పిలువబడుగాక! నీ సంగమము చేత ఏర్పడినది కావున ఇది తీర్థవిశిష్టము కావలెను.

రూపసౌభాగ్యసంపత్తిపుత్రపౌత్రప్రవర్ధనమ్ ।
ఆయురారోగ్యకల్యాణం జయప్రీతివివర్ధనమ్ ॥
స్నానదానాదిహోమైశ్చ పితౄణాం పావనం పరమ్ ॥ 85 ॥

రూపమూ, సౌభాగ్యమూ, సంపదా, పుత్రపౌత్రాభివర్ధనమూ, ఆయువూ, ఆరోగ్యమూ, మంగళమూ, జయమూ, ప్రీతివర్ధనమూ కావలెను. ఈ తీర్థమునందు స్నానము చేసినా, దానాదులు చేసినా హోమాదులు సల్పినా పితృ దేవతలుత్తమ లోకము లందవలెను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అస్త్విత్యాహ చ తాం గంగా సువృద్ధాం గౌతమప్రియామ్ ।
గౌతమస్థాపితం లింగం వృద్ధనామ్నైవ కీర్తితమ్ ॥ 86 ॥

అప్పుడాగంగ గౌతమప్రియురాలైన, మంచిరూపం ధరించిన వృద్ధురాలికి అలాగే అగుగాక అని వరమిచ్చింది. అక్కడ గౌతముడు స్థాపించిన లింగము వృద్ధలింగమనే పేరుతో ప్రసిద్ధిచెందింది.

తత్రైవ చ ముదం ప్రాప్తో వృద్ధయా మునిసత్తమః ।
తత్ర స్నానం చ దానం చ సర్వాభీష్టప్రదాయకమ్ ॥ 87 ॥

వృద్ధురాలితో కూడిన గౌతమముని అక్కడే ఆనందమును పొందాడు. అక్కడ స్నాన దానాదులు చేస్తే ఆ తీర్థము కోరికలన్నింటినీ తీరుస్తుంది.

తతః ప్రభృతి తత్తీర్థం వృద్ధాసంగమముచ్యతే ॥ 88 ॥

అప్పటినుండి ఆ తీర్థమునకు వృద్ధాసంగమ తీర్థమని పేరు వచ్చింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే వృద్ధాసంగమాద్యుభయతటసప్తదశతీర్థ వర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః. ॥ 37 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని వృద్ధాసంగమాది ఉభయ తటములందున్న పదిహేడు తీర్థముల వర్ణన అను పేరుగల ముప్పైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టత్రింశోఽధ్యాయః - ముప్పై ఎనిమిదవ అధ్యాయం

బుధేలాపురూరవోవసిష్ఠనృత్యగీతసౌభాగ్యేలేశ్వరాదిషోడశసహస్రతీర్థవర్ణనమ్.

బుధ,ఇల,పురూరవ,వసిష్ఠ,నృత్య,గీత,సౌభాగ్య, ఇలేశ్వర మొదలగు పదహారువేల తీర్థముల వర్ణనము

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇలాతీర్థమితి ఖ్యాతం సర్వసిద్ధికరం నృణామ్ ।
బ్రహ్మహత్యాదిపాపానాం పావనం సర్వకామదమ్ ॥ 1 ॥

మానవులకు సర్వసిద్ధులు కలుగజేయునది, బ్రహ్మహత్యాది పాపములను పోగొట్టునదీ, అన్ని కోరికలనూ తీర్చునదీ 'ఇలా' తీర్థమనునది కలదు.

వైవస్వతాన్వయే జాత ఇలో నామ జనేశ్వరః ।
మహత్యా సేనయా సార్ధం జగామ మృగయా వనమ్ ॥ 2 ॥

వైవస్వత మనువు వంశము నందు ఇలుడు అను ఒక రాజుండినాడు. అతడొకనాడు గొప్పసైన్యము తీసుకొని వేటకై వెళ్ళినాడు.

పరిబభ్రామ గహనం బహువ్యాలసమాకులమ్ ।
నానాకారద్విజయుతం విటపైః పరిశోభితమ్ ॥ 3 ॥

అక్కడ అనేక చిత్ర విచిత్రములైన పక్షులతోనూ, అనేక విధములైన మృగములతోనూ, మనోహరముగా చిగిర్చిన వృక్షములతోను కూడుకొనియున్న అడవిలో తిరిగినాడు.

వనే చరన్ నృపశ్రేష్ఠో మృగయాగతమానసః ।
తత్రైవ మతిమాధత్త ఇలోఽమాత్యానథాబ్రవీత్ ॥ 4 ॥

వేటయందే మనస్సు కలవాడై అడవినందు తిరుగుతున్న ఆ మహారాజు, ఆ అడవియందాసక్తుడై మంత్రులతో ఇలా అన్నాడు.

ఇల ఉవాచ:- ఇలుడు పలికాడు.

గచ్ఛన్తు నగరం సర్వే మమ పుత్రేణ పాలితమ్ ।
దేశం కోశం బలం రాజ్యం పాలయన్తు పునశ్చ తమ్ ॥ 5 ॥

మీరంతా నా కుమారుడు పరిపాలించుచున్న మన నగరమునకు వెళ్ళండి! మన దేశమునూ, కోశాగారమును, సైన్యమునూ, రాజ్యమునూ, నా కుమారునీ రక్షించండి.

వసిష్ఠోఽపి తథా యాతు ఆదాయాగ్నీన్నిత్యేవ నః ।
పత్నీభిః సహితో ధీమాన్ అరణ్యేఽహం వసామ్యథ ॥ 6 ॥

మిక్కిలి జ్ఞానీ, మాకు తండ్రివంటివాడు అయిన వసిష్ఠ మహర్షి కూడా అగ్నులనూ తీసుకొని నా భార్యలతో కలిసి అయోధ్యకు వెళ్ళునుగాక! నేను అరణ్యములో ఉంటాను.

అరణ్యభోగభుగ్భిశ్చ వాజివారణమానుషైః ।
మృగయాశీలిభిః కైశ్చిద్యాన్తు సర్వ ఇతః పురీమ్ ॥ 7 ॥

అడవిలో లభించేవాటిని భుజించేవారూ, వేటలో ఆసక్తిగలవారూ గుఱ్ఱములూ, ఏనుగులూ, పదాతులూ అయిన కొంతమందితో నేను ఈ వనంలో ఉంటాను. మిగిలిన అందరూ పట్టణానికి వెళ్లుదురు గాక!

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా యయుస్తేఽపి స్వయం ప్రాయాచ్ఛనైర్గిరిమ్ ।
హిమవన్తం రత్నమయం వసంస్తత్ర ఇలో నృపః ॥ 8 ॥

వారంతా అలాగేనని వెళ్ళిపోయారు. అప్పుడు ఇల మహారాజు రత్నమయమైన హిమవత్పర్వతమునకు నెమ్మదిగా వెళ్ళాడు.

దదర్శ కందరం తత్ర నానారత్నవిచిత్రితమ్ ।
తత్ర యక్షేశ్వరః కశ్చిత్సుమన్యురితి విశ్రుతః ॥ 9 ॥

అడవిలో ఉంటూ అప్పుడక్కడ అనేక రత్నములతో చిత్రంగా ఉన్న ఒక గుహను ఇలుడు చూచినాడు. ఆ గుహలో సుమన్యుడనే పేరుగల యక్షరాజొకడుండినాడు.

తస్య భార్యా సమానామ్నీ భర్తృవ్రతపరాయణా ।
తస్మిన్వసత్యసౌ యక్షో రమణీయే నగోత్తమే ॥ 10 ॥

ఆ సుందరమైన పర్వతోత్తమమందు సమా అనే పేరుగల పతివ్రతా శిరోమణియైన భార్యతో కలిసి ఆ యక్షుడుండినాడు.

మృగరూపేణ వ్యచరద్భార్యయా స మహామతిః ।
స్వేచ్ఛయా స్వవనే యక్షః క్రీడతే నృత్యగీతకైః ॥ 11 ॥

ఆ మహామతియైన సుమన్యు తన భార్యతో కూడి మృగరూపమును ధరించి స్వేచ్ఛగా నృత్యగీతాదులతో ఆ వనము నందు క్రీడించుచుండినాడు.

ఇత్థం స యక్షో జానాతి మృగరూపధరోఽపి చ ।
ఇలస్తు తం న జానాతి కందరం యక్షపాలితమ్ ॥ 12 ॥

మృగరూపములో ఉన్నప్పటికీ ఆ యక్షునికి ఇలుడు తెలుసుకానీ, ఇలుడు ఆ గుహ యక్షునిదని ఎరుగడు.

యక్షస్య విపులం గేహం నానారత్నవిచిత్రితమ్ ।
తత్రోపవిష్టో నృపతిర్మహత్యా సేనయా వృతః ॥ 13 ॥

అనేక రత్నములతో చిత్రించబడిన ఆ విశాలమైన గుహయందు ఇలమహారాజు తన పరివారముతో కలిసి కూర్చుండినాడు.

వాసం చక్రే చ తత్రైవ గేహే యక్షస్య ధీమతః ।
స యక్షోఽ ధర్మకోపేన భార్యయా మృగరూపధృక్ ॥ 14 ॥

ఇలం జేతుం న శక్నోమి యాచితో న దదాతి చ ।
హృతం గేహం మమానేన కింకరోమీత్యచిన్తయత్ ॥ 15 ॥

ఇలుడు ధీమంతుడైన ఆ యక్షుని గృహములో నివసించినాడు. భార్యతో కలిసి మృగరూపమున ఉన్న ఆ యక్షుడు ఇలుడు చేసిన ఆ అధర్మమునకు కోపగించి ఈ ఇలుని నేను జయించలేను. నేను యాచించినా అతడివ్వడు. నా ఇంటినాతడు అపహరించాడు. ఇప్పుడు నేనేమి చేయుదునని చింతించాడు.

యుధి మత్తం కథం హన్యాం చేతి స్థిత్వా స యక్షరాట్ ।
ఆత్మీయాన్ ప్రేషయామాస యక్షాన్ శూరాన్ ధనుర్ధరాన్ ॥ 16 ॥

మత్తుడై వున్న ఇలుని యుద్ధంలో ఎలా చంపుతాను అని అనుకొని ఆ యక్షరాజు శూరులూ, ధనుర్ధరులూ అయిన ఆత్మీయులను ఇలునిపైకి పంపించాడు.

యక్ష ఉవాచ:- యక్షుడు పలికాడు.

యుద్ధే జిత్వా చ రాజానమిలముద్ధతదన్తినమ్ ।
గృహాద్యథాఽ న్యతో యాతి మమ తత్కర్తుమర్హథ ॥ 17 ॥

మదించిన ఏనుగులు గల ఇలమహారాజును జయించి, అతడు నా ఇంటినుండి వెళ్ళునట్లుగా మీరు చేయండి.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

యక్షేశ్వరస్య తద్వాక్యాద్యక్షాస్తే యుద్ధదుర్మదాః ।
ఇలం గత్వాఽ బ్రువన్సర్వే నిర్గచ్ఛాస్మాద్గృహాలయాత్ ॥ 18 ॥

యక్షరాజు చెప్పిన ఆ మాటలు విన్న యుద్ధమదాంధులైన ఆ యక్షులు ఇలుని వద్దకు వెళ్ళి ఈ మహా స్థావరమునుండి వెళ్ళిపొమ్మని హెచ్చరించారు.

న చేద్యుద్ధాత్పరిభ్రష్టః పలాయన్నిర్గమిష్యసి।
తద్యక్షవచనాత్కోపాద్యుద్ధం చక్రే స రాజరాట్ ॥ 19 ॥

"ఒకవేళ నీవు వెళ్ళనట్లయితే మాతో యుద్ధంలో భ్రష్టుడవై పారిపోగలవు" అన్నారు. ఆ మాటలు విన్న ఇల మహారాజు కోపించి ఆ యక్షులతో యుద్ధం చేశాడు.

జిత్వా యక్షాన్బహువిధానువాస దశశర్వరీః ।
యక్షేశ్వరో మృగో భూత్వా భార్యయాఽపి వనే వసన్ ॥ 20 ॥

ఇలమహారాజు అనేక విధములుగా ఆ యక్షులను జయించి పది సంవత్సరములచ్చటనే యుండినాడు. ఆ యక్షరాజు తన భార్యతో గూడా ఆ వనంలో సంచరిస్తూ

హృతగేహో వనం ప్రాప్తో హృతభృత్యః స యక్షిణీమ్ ।
ప్రాహ చిన్తాపరో భూత్వా మృగీరూపధరాం ప్రియామ్ ॥ 21 ॥

ఇల్లు పోయి, సేవకులు మరణించి, అడవే దిక్కుగా నున్న ఆ యక్షుడు మిక్కిలి చింతించి ఆడు మృగరూపంలో నున్న తన ప్రియురాలగు యక్షిణితో ఇలా అన్నాడు.

యక్ష ఉవాచ:– యక్షుడు పలికాడు.

బలవన్తం దురాధర్షం శ్రియా శౌర్యేణ గర్వితమ్ ।
మదాన్ధం మృగయాసక్తం కథం జేష్యే నృపం ప్రియే ॥ 22 ॥

ఓ ప్రియా! బలవంతుడూ, ఆణచలేనివాడూ, సంపదతోనూ బలముతోనూ గర్వం గలవాడూ, మదాంధుడూ మృగములను వేటాడుట యందాసక్తిగల రాజును నేను ఎలా జయింపగలను? అన్నాడు.

యక్షిణ్యువాచ:– యక్షిణి పలికింది.

వద కాన్త ఉపాయోఽస్తి తస్య గర్వస్య నాశనే ।
ఉపాయో యది మద్వాక్యాత్కరిష్యామి వదస్వ మే ॥ 23 ॥

ప్రియా! అతని గర్వమును నశింపచేయుటకేమన్నా ఉపాయముంటే చెప్పు. నా మాటగా నేను చేయవలసిన దేమైనా ఉంటే ఆ ఉపాయం చెప్పు నేను చేస్తాను.

యక్ష ఉవాచ:– యక్షుడు పలికాడు.

అస్త్యుపాయో వరారోహే నృపతేర్గర్వనాశనే ।
వరేణ కేన నృపతేరస్య గర్వో వ్యపోహతి ॥ 24 ॥

తత్కురుష్వ మహాభాగే మమ ప్రియకరం శుభమ్ ।
తత్ర త్వం గచ్ఛ కల్యాణి యత్రాస్తే నృపమన్దధీః ॥ 25 ॥

ఓ ప్రియురాలా! ఏ వరంతో ఆ రాజు గర్వం నశిస్తుందో, ఆ రాజు గర్వం ఏ ఉపాయంతో పోతుందో, దానిని నీవు చేయుము. అది నాకు ప్రియమును కలిగించేది. శుభమైనది కావలయును. ఓ కల్యాణీ! మందబుద్ధి గల రాజున్న చోటుకు నీవు వెళ్ళు.

తత్ర త్వం దర్శయాత్మానమిలస్య పురతః శుభే ।
ఆకర్షేమం చ రాజానముమావనమితి శ్రుతమ్ ॥ 26 ॥

అక్కడ ఇలుని ముందు నీవు కనిపించు. ఓ శుభాంగీ! ఆ ఇల మహారాజు నాకర్షించి ఉమావనమను ప్రదేశమునకు రప్పించు.

మృగీభూత్వేవ సుభగే తచ్చ మద్గృహవర్తినమ్ ।
మృగమాసక్తమనసం స్త్రీత్వమాప్నోతు దుర్మతిః ॥ 27 ॥

ఓ సుందరీ! నీవు మృగరూపమును ధరించి నా యింటిలోనున్న వానిని, మృగమునందాసక్తమైన మనస్సుగలవానిని అట్లు రప్పించినచో ఆ దుర్మతి స్త్రీత్వమును పొందుతాడు.

రాజాఽయం దుర్మనాః కాన్తే వ్యసనాసక్తమానసః ।
అనేన యాతి విపదం తత్రోపాయో విచిన్తితః ॥ 28 ॥

ఓ కాంతా! దుష్టుడైన ఈ రాజు వేటయందాసక్తిగల మనస్సు గలవాడు. దీనిచేతనే అతడాపద పొందగలడు. దానికై నొక ఉపాయము నాలోచించినాను.

పాపర్ధివ్యసనాన్తాని రాజ్యాన్యఖిలభూభుజామ్ ।
ప్రాపయోమావనం సుభ్రూర్మృగీ భూత్వా మనోహరా ॥ 29 ॥

రాజులందరికి రాజ్యములన్నీ పాపపు వ్యసనములతోనే నశిస్తున్నారు. ఓ అందమైన కనుబొమలు గలదానా! నీవు అందమైన మృగరూపమును ధరించి అతనిని ఉమావనమునకు చేర్చు.

ప్రవిశేత్తత్ర రాజాఽయం స్త్రీ భవిష్యత్యసంశయమ్ ।
కరణీయం త్వయా భద్రే న చైతద్యుజ్యతే మమ ॥
అహం తు పురుషో యేన త్వం పునః స్త్రీచ యక్షిణీ ॥ 30 ॥

ఆ వనము ప్రవేశించినంతలోనే ఈ రాజు స్త్రీరూపమును పొందుతాడు. ఇందులో సందేహము లేదు. ఓ మంగళకరురాలా! ఈ పనిని నీవే చేయవలయును. నేను చేయుటకు వీలులేదు. ఎందుకనగా నేను పురుషుడను. నీవైతే స్త్రీవి, పైగా యక్షిణివి.

యక్షిణ్యువాచ:– యక్షిణి పలికింది.

కథం త్వయా న గన్తవ్యముమావనమనుత్తమమ్ ।
గతేఽపి త్వయి కో దోషస్తన్మే కథయ తత్త్వతః ॥ 31 ॥

నీవు శ్రేష్ఠమైన ఆ ఉమావనమున కెందుకు వెళ్ళరాదు? వెళ్ళితే కలిగే దోషమేమి? దానినిగూర్చి నాకు వివరించు.

యక్ష ఉవాచ:– యక్షుడు పలికాడు.

హిమవత్పర్వతశ్రేష్ఠే ఉమయా సహితః శివః ।
దేవైర్గణైరనువృతో విచచార యథాసుఖమ్ ॥
పార్వతీ శంకరం ప్రాహ కదాచిద్రహసి స్థితమ్ ॥ 32 ॥

శ్రేష్ఠమైన హిమవత్పర్వత ప్రాంతమున పార్వతీదేవితో కూడి దేవగణములు సేవించుచుండగా శివుడు చక్కగా సంచరించుచుండినాడు. ఒకానొకనాడు ఏకాంతమునందున్న శివుని పార్వతి ఇలా అడిగింది.

పార్వత్యువాచ:-పార్వతి పలికింది

స్త్రీణామేష స్వభావోఽస్తి రతం గోపయితం భవేత్ ।
తస్మాన్మే నియతం దేశమాజ్ఞయా రక్షితం తవ ॥ 33 ॥

దేహి మే త్రిదశేశాన ఉమావనమితి శ్రుతమ్ ।
వినా త్వయా గణేశేన కార్తికేయేన నన్దినా ॥ 34 ॥

యస్తత్ర ప్రవిశేన్నాథ స్త్రీత్వం తస్య భవేదితి ॥ 35 ॥

ఓ దేవేశా! రతి కార్యమును రహస్యముగా నుంచుట యనునది స్త్రీలకు సహజమైన స్వభావము. అందువలన నీ యాజ్ఞతో నా కటువంటి రక్షితమైన ప్రదేశము నొకదానిని, ఉమావనమను పేరుగల దానిని అనుగ్రహించు నీవు, గణేశుడు, కార్తికేయుడు, నంది తప్ప, ఇతరు డెవడు ప్రవేశించినా అతనికి స్త్రీత్వము వస్తుందని వరమును ప్రసాదించమని వేడింది.

యక్ష ఉవాచ:- యక్షుడు పలికాడు.

ఇత్యాజ్ఞోమావనే దత్తా ప్రసన్నేనేందుమౌలినా ।
కరోతి కిం న చ పుమాన్కాంతయా ప్రణయార్థితః॥
తస్మాన్మయా న గన్తవ్యముమాయా వనముత్తమమ్ ॥ 36 ॥

ప్రసన్నుడైన చంద్రశేఖరుడు అలాగే అవుతుందని ఉమావనమునందు ఆజ్ఞయిచ్చినాడు. ప్రేమతో అడిగిన ప్రియురాలికి పురుషుడేమిచేయకుండా నుండగలడు? అందువలననే నేను ఆ శ్రేష్ఠమైన ఉమావనమునకు వెళ్ళగూడదు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ అన్నాడు.

తద్భర్తృవచనం శ్రుత్వా యక్షిణీ కామరూపిణీ ।
మృగీ భూత్వా విశాలాక్షీ ఇలస్య పురతోఽభవత్ ॥ 37 ॥

కామరూపిణియైన యక్షిణి తన భర్తమాటలను విని విశాలమైన కన్నులుగల మృగముగా మారి ఇలమహారాజు ముందర నిలచినది.

యక్షస్తు సంస్థితస్తత్ర దదర్శైలో మృగీం తదా ।
మృగయాసక్తచిత్తోవై మృగీం దృష్ట్వా విశేషతః ॥ 38 ॥

ఏక ఏవ హయారూఢో నిర్యయౌ తాం మృగీమను ।
సాఽఽకర్షత శనైస్తం తు రాజానం మృగయాకులమ్ ॥ 39 ॥

యక్షుడక్కడే ఉండినాడు. ఇలుడు మృగమును చూచాడు. వేటాడుటయందాసక్తిగల ఇలుడు ముఖ్యంగా ఆడులేడిని చూచి, తానొక్కడే గుఱ్ఱమునెక్కి ఆ లేడి ననుసరిస్తూ వెళ్ళాడు. వేటలో నిమగ్నమైన ఇలుని ఆ యక్షిణి మెల్లమెల్లగా ఆకర్షించింది.

శనైర్జగామ సా తత్ర యదుమావనముచ్యతే ।
అదృశ్యా తు మృగీ తస్మై దర్శయన్తీ క్వచిత్ క్వచిత్ ॥ 40 ॥

నెమ్మదిగా ఆ లేడి ఉమావనమున్న దగ్గరకు వెళ్ళింది. ఆ జింక అప్పుడప్పుడు అతనికి కనబడుతూ అదృశ్యమయింది.

తిష్ఠన్తీ చైవ గచ్ఛన్తీ ధావన్తీ చ విభీతవత్ ।
హరిణీ చపలాక్షీ సా తమాకర్షదుమావనమ్ ॥ 41 ॥

ఒకసారి ఆగుతూ, మరొకసారి నడుస్తూ, భయపడుతున్నట్లుగా పరుగెత్తుతూ ఆ చంచలాక్షి అయిన ఆడుజింక అతనిని ఉమావనము వరకు తీసుకొని వచ్చింది.

అనుప్రాప్తో హయారూఢస్తత్ప్రాప స ఉమావనమ్ ।
ఉమావనం ప్రవిష్టం తం జ్ఞాత్వా సా యక్షిణీ తదా ॥ 42 ॥

మృగీరూపం పరిత్యజ్య యక్షిణీ కామరూపిణీ ।
దివ్యరూపం సమాస్థాయ చాశోకతరుసన్నిధౌ ॥ 43 ॥

తచ్ఛాఖాలమ్బితకరా దివ్యగంధానులేపనా ।
దివ్యరూపధరా తన్వీ కృతకార్యా సమా తదా ॥ 44 ॥

హసన్తీ నృపతిం ప్రేక్ష్య శ్రాన్తం హయగతం తదా ।
మృగీమాలోకయన్తం తం చపలాక్షమిలం తదా ॥ 45 ॥
భర్తృవాక్యమశేషేణ స్మరన్తీ ప్రాహ భూమిపమ్ ॥ 46 ॥

అశ్వాధిరూఢుడైన ఇలుడు జింక ననుసరించి ఉమావనమునకు చేరినాడు. ఉమావనమును ప్రవేశించినట్లుగా తెలుసుకున్న కామ రూపిణియైన ఆ యక్షిణి అప్పుడు. జింకరూపమును వదిలి, దివ్యమైన రూపమును ధరించి, అశోకవృక్షమువద్ద ఆ చెట్టు కొమ్మకు చేతినానించి, దివ్యగంధములు పూసుకొని, దివ్యరూపమును ధరించిన ఆ సమ అను యక్షిణి తన పని నెరవేరినట్లుగా అప్పుడు గుఱ్ఱముమీద అలసి కూర్చొని ఇటునటు మృగము కొరకు వెతుకుతూ చూస్తున్న ఆ ఇలుని చూచి నవ్వుతూ. తన భర్తచెప్పిన మాటను పూర్తిగా స్మరించుకొంటూ రాజుతో ఇలా అన్నది.

సమోవాచ:- సమ(యక్షిణి) పలికింది.

హయారూఢాఽబలా తన్వి క్వ ఏకైవ తు గచ్ఛసి ।
పురుషస్య చ వేషేణ ఇలే కమనుయాస్య సి? ॥ 47 ॥

ఓ సౌందర్యవతీ! అబలవైన నీవు గుఱ్ఱము నెక్కి ఒక్కదానివే ఎక్కడకు వెళ్ళుతున్నావు? పురుష వేషంతో ఓ ఇలా! ఎవరిని అనుసరిస్తున్నావు?

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

ఇలేతి వచనం శ్రుత్వా రాజాఽసౌ క్రోధమూర్ఛితః ।
యక్షిణీం భర్త్సయిత్వాఽసౌ తామపృచ్ఛన్మృగీం పునః ॥ 48 ॥

ఇలా అనే మాటను వినగానే ఆ రాజు క్రోధమునకు లోనయ్యాడు. ఆ యక్షిణిని భయపెడుతూ మృగమును గూర్చి అడిగాడు.

తథాఽపి యక్షిణీ ప్రాహ ఇలే కిమనువీక్షసే ।
ఇలేతి వచనం శ్రుత్వా ధృతచాపో హయస్థితః ॥ 49 ॥

కుపితో దర్శయామాస త్రైలోక్యవిజయీ ధనుః ।
పునః సా ప్రాహ నృపతిం మాహాత్మానమిలే స్వయమ్ ॥ 50 ॥

అయినా కూడా ఆ యక్షిణి రాజుతో ఇలా ఏమి చూస్తున్నావే అని పలికింది. గుఱ్ఱము మీద ధనువు పట్టుకొని కూర్చున్న రాజు ఇలా అనే మాటను వినగానే ముల్లోకములయందు విజయమును చేకూర్చిన ధనుస్సును కోపంతో చూపించాడు. అయినా యక్షిణి మహాత్ముడైన ఆ రాజును మళ్ళీ ఇలా అని పిలిచింది.

ప్రేక్షస్వ పశ్చాన్మాం బ్రూహి అసత్యాం సత్యవాదినీమ్ ।
తదా చాఽఽలోకయద్రాజా స్తనౌ తుంగౌ భుజాన్తరే ॥
కిమిదం మమ సంజాతమిత్యేవం చకితోఽభవత్ ॥ 51 ॥

ముందు నిన్ను నీవు చూసుకో! ఆ తరువాత నేను నిజం చెప్పేదానినా, అబద్ధం చెప్పేదానినా అప్పుడడుగు. అనగానే రాజు తన వక్షఃస్థలంలో ఎత్తైన స్తనములుండుటను చూచి నాకెలా ఈ విధంగా జరిగినదని ఆశ్చర్యపడినాడు.

ఇలోవాచ:– ఇల అడిగింది.

కిమిదం మమ సంజాతం జానీతే భవతీ స్ఫుటమ్ ।
వద సర్వం యథాతథ్యం త్వం కా వా వద సువ్రతే ॥ 52 ॥

నా కిలా ఎందుకు జరిగినదో నీవు చక్కగా ఎరుగుదువు. ఓ సువ్రతా! ఇలా ఎందుకు జరిగినదో నీవెవ్వరో నాకు ఉన్నదున్నట్లుగా అంతా చెప్పు.

యక్షిణ్యువాచ:– యక్షిణి పలికింది.

హిమవత్కందరశ్రేష్ఠే సుమన్యుర్వసతే పతిః ।
యక్షాణామధిపః శ్రీమాంస్తద్భార్యాఽహం తు యక్షిణీ ॥ 53 ॥

హిమవత్పర్వతశ్రేష్ఠమైన గుహలో యక్షులకు రాజైన సుమన్యుడు నివసిస్తున్నాడు. అతడు గొప్ప శ్రీమంతుడు. నేను అతని భార్యను, యక్షిణిని.

యత్కందరే భవాన్ రాజా తూపవిష్టః సుశీతలే ।
యస్య యక్షా హతా మోహాత్త్వయా హి సంగరం వినా॥ 54 ॥

ఏ చక్కని చల్లని గుహలో నీవు కూర్చున్నావో, యుద్ధం లేకుండానే మోహంతో యక్షులనందరినీ నీవు చంపినావో ఆ యక్షరాజు భార్యనే నేను.

తతోఽహం నిర్గమార్థం తే మృగీ భూత్వా ఉమావనమ్ ।
ప్రవిష్టా త్వం ప్రవిష్టోఽసి పురా ప్రాహ మహేశ్వరః ॥ 55 ॥

అందుకే నీవా గుహ నుండి వెళ్ళి పోవుటకు నేను జింకనై ఈ ఉమావనమున ప్రవేశించాను. నీవు ఈ వనమునందు ప్రవేశించావు. పూర్వము శివుడీవిధముగా చెప్పినాడు.

యస్త్వత్ర ప్రవిశేన్మన్దః పుమాన్ స్త్రీత్వమవాప్స్యతి ।
తస్మాత్ స్త్రీత్వమవాప్తోఽసి న త్వం దుఃఖితుమర్హసి ॥ 56 ॥

ఏ మందుడు ఈ ఉమావనంలో ప్రవేశిస్తాడో ఆ పురుషుడు స్త్రీగా మారగలడు. అందువలన నీవు స్త్రీత్వమును పొందినావు. నీవు దుఃఖము నొందకు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

యక్షిణీవచనం శ్రుత్వా హయారూఢస్తదాఽపతత్ ।
తమాశ్వాస్య పునః సైవ యక్షిణీ వాక్యమబ్రవీత్ ॥ 57 ॥

యక్షిణి మాట వినగానే గుఱ్ఱముపై ఉన్నవాడు క్రిందపడ్డాడు. అతనిని ఓదార్చి ఆ యక్షిణి తిరిగి ఇలా అన్నది.

యక్షిణ్యువాచ:– యక్షిణి పలికింది.

స్త్రీత్వం జాతం జాతమేవ న పుంస్త్వం కర్తుమర్హసి ।
గృహాణ విద్యాం స్త్రీయోగ్యాం నృత్యం గీతమలంకృతిమ్ ॥
స్త్రీలాలిత్యం స్త్రీవిలాసం స్త్రీకృత్యం సర్వమేవ తత్ ॥ 58 ॥

అయినదేదో అయినది. నీకు స్త్రీత్వము కలుగుట కలుగుటయే. ఇక పురుషునిగా మార్చుటకు వీలు లేదు. అందువలన స్త్రీకి యోగ్యమైన విద్యను, నృత్యమును, గీతమును, అలంకరణమును స్వీకరించు. స్త్రీలాలిత్యమును, స్త్రీవిలాసమును, స్త్రీలు చేయవలసిన అన్ని పనులను చేయుము.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

ఇలా సర్వమథావాప్య యక్షిణీం వాక్యమబ్రవీత్ ॥ 59 ॥

ఇలా అవన్నీ పొంది యక్షిణితో ఇలా అన్నది.

ఇలోవాచ:- ఇల పలికింది.

కో వా భర్తా కిం తు కృత్యం పునః పుంస్త్వం కథం భవేత్ ।
ఏతద్వదస్వ కల్యాణి దుఃఖార్తాయా విశేషతః ॥
ఆర్తానామార్తిశమనాచ్ఛ్రేయో నాభ్యధికం క్వచిత్ ॥ 60 ॥

నా భర్త ఎవరు? నేను చేయవలసినేదేమి? తిరిగి నాకు పురుషరూపమెలా వస్తుంది? దుఃఖితురాలనైన నాకు ముఖ్యముగా నిది చెప్పు. ఓ మంగళ కరురాలా! ఆర్తులైన వారికి తమ ఆర్తి తీరుట కంటె గొప్పదైన శ్రేయస్సు ఇంకేమీ ఉండదు.

యక్షిణ్యువాచ:- యక్షిణి పలికింది.

బుధః సోమసుతో నామ వనాదస్మాచ్చ పూర్వతః ।
ఆశ్రమస్తస్య సుభగే రూపయౌవనశాలినః ॥ 61 ॥

సుందరీ! చంద్రుని కుమారుడైన బుధుడు చక్కని రూపయౌవనములు కలవాడు. ఈ వనానికి ముందే (తూర్పున) అతని ఆశ్రమం ఉంది.

అనేనైవ పథా సోమం పితరం స బుధో గ్రహః ।
ద్రష్టుం యాతి తతో నిత్యం నమస్కర్తుం తథైవ చ ॥ 62 ॥

ఆ బుధుడు నవగ్రహములలో నొకడు. అతడు ప్రతిదినము ఈ త్రోవనే తన తండ్రిని చూచి నమస్కరించుటకు వెళ్ళుతుంటాడు.

యదా యాతి బుధః శాన్తస్తదాత్మానం చ దర్శయ ।
తం దృష్ట్వా త్వం తు సుభగే సర్వాన్కామానవాప్స్యసి ॥ 63 ॥

ఆ శాంతస్వభావుడైన బుధుడు వెళ్ళునప్పుడు అతనికి నీవు కనపడు. ఓ శుభకరురాలా! అతనిని చూచినంతనే నీవు సమస్తకోరికలూ పొందగలవు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తామాశ్వాస్య తతః సుభ్రూర్యక్షిణ్యన్తరధీయత ।
యక్షిణీ సా తమాచష్ట యక్షోఽపి సుఖమాప్తవాన్ ॥ 64 ॥

చక్కని కనుబొమలు కలిగిన ఆ యక్షిణి ఇలను ఊరడించి అంతర్ధానమయింది. ఆ యక్షిణి జరిగినదంతా యక్షునికి చెప్పింది. యక్షుడు కూడా ఆనందించాడు.

ఇలసైన్యం చ తత్రాఽఽసీత్తద్గతం చ యథాసుఖమ్ ।
ఉమావనస్థితా చేలా గాయన్తీ నృత్యతీ పునః ॥ 65 ॥

ఇలుని సైన్యము తామున్నచోటునే సుఖముగా ఉండినది. ఇక ఉమావనమునందున్న ఇల అక్కడ ఆడుతూపాడుతూ ఉండినది.

స్త్రీభావమనుచేష్టన్తీ స్మరన్తీ కర్మణో గతిమ్ ।
కదాచిత్క్రియమాణే తు ఇలయా నృత్య కర్మణి ॥ 66 ॥

తన కర్మను తాను తలుచుకొనుచు, స్త్రీభావాన్ని అనుకరిస్తూ ఇల ఒక రోజు నాట్యం చేస్తుండగా,

తామపశ్యద్బుధో ధీమాన్పితరం గన్తుముద్యతః ।
ఇలాం దృష్ట్వా గతిం త్యక్త్వా తామాగత్యాబ్రవీద్బుధః ॥ 67 ॥

ఒకనాడు తండ్రివద్దకు వెళ్ళుతూ బుద్ధిమంతుడైన బుధుడు ఆమెను చూచాడు. ఇలను చూచిన బుధుడు తన మార్గమును వదిలి ఆమె వద్దకు వచ్చి ఇలా అన్నాడు.

బుధ ఉవాచ:- బుధుడు పలికాడు.

భార్యా భవ మమ స్వస్థా సర్వాభ్యస్త్వం ప్రియా భవ ॥ 68 ॥

ఓ సౌందర్యవతీ! నీవు నాకు పత్నివి కా. నా భార్యలందరిలోనూ ప్రియమైన దానిగా స్వస్థురాలవై ఉండు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

బుధవాక్యమిలా భక్త్యా త్వభినంద్య తథాఽకరోత్ ।
స్మృత్వా చ యక్షిణీవాక్యం తతస్తుష్టాఽభవన్మునే ॥ 69 ॥

ఓ మునీ! ఇల యక్షిణి చెప్పిన మాటను తలచి, బుధుని మాటలు విని భక్తితో ఆదరించి అలాగే చేసింది. తరువాత మిక్కిలి సంతోషించింది.

బుధో రేమే తయా ప్రీత్యా నీత్వా స్వస్థానముత్తమమ్ ।
సా చాపి సర్వభావేన తోషయామాస తం పతిమ్ ॥
తతో బహుతిథే కాలే బుధస్తుష్టోఽవదత్ప్రియామ్ ॥ 70 ॥

బుధుడు ఆమెను తానున్న చోటుకు తీసుకొని వెళ్ళి ఆమెతో ఎంతో ప్రీతిగా సుఖించాడు. ఆమె కూడా మనస్ఫూర్తిగా ఆ భర్తను సంతోషపెట్టింది. ఇలా చాలా కాలం గడిచిన తరువాత సంతుష్టుడైన బుధుడు ప్రియురాలైన ఇలతో ఇలా అన్నాడు.

బుధ ఉవాచ:- బుధుడు పలికాడు.

కిం తే దేయం మయా భద్రే ప్రియం యన్మనసి స్థితమ్ ॥ 71 ॥

ఓ భద్రా! నేను నీ కేమివ్వాలి? నీ మనస్సులో ఏమున్నదో నీ కిష్టమైనదేదో చెప్పు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తద్వాక్యసమకాలం తు పుత్రం దేహీత్యభాషత ।
ఇలా బుధం సోమసుతం ప్రీతిమన్తం ప్రియం తథా ॥ 72 ॥

ఆ మాటవినగానే చంద్రసుతుడూ, ప్రీతిమంతుడూ ప్రియమైనవాడూ అయిన బుధుని తనకు పుత్రుని ప్రసాదించమని యడిగింది.

బుధ ఉవాచ:–బుధుడు పలికాడు.

అమోఘమేతన్మద్వీర్యం తథా ప్రీతిసముద్భవమ్ ।
పుత్రస్తే భవితా తస్మాత్ క్షత్రియో లోకవిశ్రుతః ॥ 73 ॥

నా వీర్యము అమోఘమైనది, ప్రీతిని కలిగించునది. దానినుండి నీకు లోకప్రసిద్ధుడైన క్షత్రియ కుమారుడు జన్మించగలడు.

సోమవంశకరః శ్రీమానాదిత్య ఇవ తేజసా ।
బుద్ధ్యా బృహస్పతిసమః క్షమయా పృథివీసమః ॥ 74 ॥

వీర్యేణాఽఽజౌ హరిరివ కోపేన హుతభుగ్యథా ॥ 75 ॥

సోమవంశమునుద్ధరించేవాడు, భాగ్యవంతుడు సూర్యునివలె తేజస్సు కలవాడు, బుద్ధిలో బృహస్పతి వంటివాడు, ఓర్పునందు భూదేవివంటివాడు, పరాక్రమమునందు యుద్ధరంగమునందున్న హరి వంటివాడూ, కోపంలో అగ్నివంటి వాడూ అవుతాడు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తస్మిన్నుత్పద్యమానే తు బుధపుత్రే మహాత్మని ।
జయశబ్దశ్చ సర్వత్ర త్వాసీచ్చ సురవేశ్మని ॥ 76 ॥

మహాత్ముడైన బుధునికి కుమారుడు పుట్టగానే దేవలోకమంతట జయజయధ్వనులు మిన్ను ముట్టాయి.

బుధపుత్రే సముత్పన్నే తత్రాఽఽజగ్ముః సురేశ్వరాః ।
అహమప్యగమం తత్ర ముదాయుక్తో మహామతే ॥ 77 ॥

ఓ మహామతీ! బుధునికి కుమారుడు పుట్టగానే దేవతలంతా అక్కడికి వెళ్ళారు. నేను కూడా సంతోషముతో అక్కడకు వెళ్ళాను.

జాతమాత్రః సుతో రావమకరోత్స పృథుస్వరమ్ ।
తేన సర్వేఽప్యహోచన్వై సంగతా ఋషయః సురాః ॥ 78 ॥

పుట్టిన వెంటనే ఆ బాలుడు గొప్ప స్వరముతో శబ్దము చేశాడు. అందుచేత అక్కడ చేరిన ఋషులు, దేవతలందరిలా అన్నారు.

యస్మాత్పురూ రవోఽ స్యేతి తస్మాదేష పురూరవాః ।
స్యాదిత్యేవం నామ చక్రుః సర్వే సంతుష్టమానసాః ॥ 79 ॥

ఇతడు పుట్టగానే పెద్దగా శబ్దము చెయ్యడం వల్ల ఇతని పేరు పురూరవుడని అందరూ సంతుష్టులై పేరు పెట్టారు.

బుధోఽ ప్యధ్యాపయామాస క్షత్రవిద్యాం సుతం శుభామ్ ।
ధనుర్వేదం సప్రయోగం బుధః ప్రాదాత్తదాఽ ఽ త్మనే ॥ 80 ॥

బుధుడు తన కుమారునకు శుభమైన క్షత్రియవిద్యను బోధించాడు. ప్రయోగోపసంహారములతో కూడిన ధనుర్విద్యను కూడా నేర్పాడు.

స శీఘ్రం వృద్ధిమగమచ్ఛుక్లపక్షే యథా శశీ ।
స మాతరం దుఃఖయుతాం సమీక్ష్యైలాం మహామతిః ॥
నమస్యాథ వినీతాత్మా ఇలామైలోఽ బ్రవీదిదమ్ ॥ 81 ॥

అతడు శుక్లపక్ష చంద్రునివలె త్వరగా దినదినాభివృద్ధిని పొందాడు. ఆ మహామతి దుఃఖముతో కూడివున్న తన తల్లి ఇలను చూచి నమస్కరించి వినయముతో ఆ ఐలుడు ఇలా అన్నాడు.

ఐల ఉవాచ:- ఐలుడు పలికాడు.

బుధో మాతర్మమ పితా తవ భర్తా ప్రియస్తథా ।
అహం చ పుత్రః కర్మణ్యః కస్మాత్తే మనసో జ్వరః ॥ 82 ॥

అమ్మా! నీ భర్త, ప్రియమైనవాడూ ఐన బుధుడు నా తండ్రి. నేను కర్మపూర్వుడనైన కుమారుడను ఉండగా నీకు మానసికమైన వ్యథ ఎందుకు?

ఇలోవాచ:- ఇల పలికింది.

సత్యం పుత్ర బుధో భర్తా త్వం చ పుత్రో గుణాకరః ।
భర్తృపుత్రకృతా చిన్తా న మమాస్తి కదాచన ॥ 83 ॥

నిజమే నాయనా! బుధుడు నా భర్త. చక్కని గుణాకరుడవైన కుమారుడవు నీవు. నాకు భర్త కుమారుల వలన చింతయనునది ఎన్నటికీ లేదు.

తథాఽ పి పూర్వజం కించిద్దుఃఖం స్మృత్వా పునః పునః ।
చిన్తయేయం మహాబుద్ధే తతో మాతరమబ్రవీత్ ॥ 84 ॥

ఓ మహాబుద్ధీ! అయినప్పటికీ పూర్వము కలిగిన కొంతబాధను మాటిమాటికి తలుచుకొని చింతించుచున్నాను. అనగా ఐలుడు తన తల్లితో ఇలా అన్నాడు.

ఐల ఉవాచ:- ఐలుడు పలికాడు.

నివేదయస్వ మే మాతస్తదేవ ప్రథమం మమ ॥ 85 ॥

అమ్మా! అదేమిటో ముందు నాకు చెప్పు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఇలా చైనమువాచేదం రహోవాచం కథం వదే ।
తథాఽపి పుత్ర తే వచ్మి పిత్రోః పుత్రో యతో గతిః ॥
మగ్నానాం దుఃఖపాథోఽబ్ధౌ పుత్రః ప్రవహణం పరమ్ ॥ 86 ॥

అప్పుడు ఇల అతనితో ఇలా అన్నది. నాయనా! ఇది చాలా రహస్యమైనది నీ కెలా చెబుతాను? అయినా పున్నామనరకమునుండి తలిదండ్రులను దాటించుటకు పుత్రుడే కదా దిక్కు! దుఃఖసముద్ర మార్గమున మునిగి పోయే తలిదండ్రులకు నావవంటివాడు కొడుకే కదా! అందుకే చెబుతున్నాను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తన్మాతృవచనం శ్రుత్వా వినీతః ప్రాహ మాతరమ్ ।
పాదౌ నిధాయ శిరసి సాశ్రునేత్రః సగద్గదమ్ ॥
సర్వైరుపాయైః పిత్రోర్యః పుత్రో న హరతి శ్రమమ్ ॥ 87 ॥
జీవన్మృతస్య తస్యాహో నిష్ఫలే జన్మజీవితే ।
తీర్థసేవా దానయజ్ఞో తపః ప్రభృతికాన్యపి ॥
కృతాని తేన పుణ్యాని పితరౌ యేన తోషితౌ ॥ 88 ॥

తల్లిమాటలువిన్న పురూరవుడు తల్లి పాదములకు నమస్కరించి కన్నీళ్ళు కారుచుండగా గద్గద స్వరముతో వినయముగా తల్లితో ఇలా అన్నాడు. అనేకవిధములుగా ప్రయత్నించి తలిదండ్రుల శ్రమను దూరం చేయని కుమారుడెవడో, అటువంటి కుమారుడు బ్రతికివున్నా మరణించిన వానితో సమానము. వాడు ఎన్నితీర్థములను సేవించినా, ఎన్ని దానములు చేసినా, యజ్ఞములు చేసినా, తపస్సు మొదలగునవెన్ని చేసినా వాని జన్మ, జీవితము నిష్ఫలమే. తలిదండ్రులు సంతోషపడునట్లు చేసేపుణ్యములు మంచివి.

సర్వం మనోగతం సత్యం వద మాతర్యథా తథా ।
సాఽవదత్తనయం సోష్ణనిశ్వాసశ్లథితాధరా ॥
యథావృత్తం హి దుఃఖాబ్ధౌ మజ్జమానేవ విహ్వలా ॥ 89 ॥

అమ్మా! నీ మనస్సులో నున్నదేదో దానిని ఉన్నదున్నట్లుగా చెప్పుమనగా తానొక దుఃఖసముద్రములో మునిగినట్లుగా విహ్వలయై, వేడి నిట్టూర్పులను వదలుతూ, పెదవులు వణకుచుండగా ఆ ఇల తన కుమారునితో జరిగిన దంతా చెప్పింది.

సూర్యవంశప్రసూతానామిక్ష్వాకూణాం తథా కులమ్ ।
తత్రోత్పత్తిం స్వస్య నామ రాజ్యప్రాప్తిం ప్రియాన్ సుతాన్ ॥ 90 ॥

పురోధసం వసిష్ఠం చ ప్రియాం భార్యాం స్వకం పదమ్ ।
వననిర్యాణమేవాథ అమాత్యానాం పురోధసః ॥ 91 ॥

ప్రేషణం చ నగర్యాం తాం మృగయాసక్తిమేవ చ ।
హిమవత్కన్దరగతిం యక్షేశ్వరగృహే గతిమ్ ॥ 92 ॥

సూర్యవంశములో పుట్టిన ఇక్ష్వాకు మున్నగు రాజుల గొప్పతనమును, తన వంశమును, ఆ వంశములో తన పుట్టుకను, తన పేరును, తనకు రాజ్యప్రాప్తి కలుగుటను, తన భార్యాబిడ్డలను గూర్చియూ, తన కులగురువు పురోహితుడైన వసిష్ఠునిగూర్చి, తన ప్రియమైన భార్యను గూర్చి, తన స్థానమును, తాను వనమునకు వచ్చుట, మంత్రులూ, పురోహితులను అయోధ్యా నగరానికి పంపించుటనూ, తనకు వేట యందు గల ఆసక్తినీ, తాను హిమవత్పర్వతమందలి గుహను చేరుటనూ, యక్షేశ్వరుని గుహలో ఉండుటనూ,

ఉమావన ప్రవేశం చ స్త్రీత్వప్రాప్తిమశేషతః ।
మహేశ్వరాజ్ఞయా తత్ర చాప్రవేశం నరస్య తు ॥ 93 ॥

యక్షిణీవాక్యమప్యస్య వరదానం తథైవ చ ।
బుధప్రాప్తిం తథా ప్రీతిం పుత్రోత్పత్త్యాద్యశేషతః ॥ 94 ॥

కథయామాస తత్సర్వం శ్రుత్వా మాతరమబ్రవీత్ ।
పురూరవాః కిం కరోమి కిం కృత్వా సుకృతం భవేత్ ॥ 95 ॥

ఉమావన ప్రవేశమునూ, తనకు పూర్తిగా వచ్చిన స్త్రీత్వప్రాప్తినీ, మహేశ్వరాజ్ఞతో అక్కడ మానవుని కెవ్వనికీ ప్రవేశము లేకపోవుటనూ, యక్షిణి చెప్పిన మాటలు, అలాగే ఆమె ఇచ్చిన వరము, బుధుని కలియుట, దానివలన ప్రీతి ఏర్పడుట, కుమారోత్పత్తి మున్నగు విషయములనన్నింటిని చెప్పినది. ఇదంతా విని పురూరవుడు తల్లితో అన్నాడు. అమ్మా! ఇప్పుడు నేనేమి చేయాలి? ఏది చేసిన సుకృతం కలుగుతుంది?

ఏతావతా తే తృప్తిశ్చేదలమేతేన చామ్బికే ।
యదప్యన్యమనోవర్తి తదప్యాజ్ఞాపయస్వ మే ॥ 96 ॥

ఇంత మాత్రముచేతనే నీకు తృప్తి కలిగినట్లయితే ఇక చాలు. అమ్మా! నీ మనస్సులో ఇంకా ఏమైనా ఉంటే ఆజ్ఞనివ్వు అన్నాడు.

ఇలోవాచ:- ఇల పలికింది.

ఇచ్ఛేయం పుంస్త్వముత్కృష్టమిచ్ఛేయం రాజ్యముత్తమమ్ ।
అభిషేకం చ పుత్రాణాం తవ చాపి విశేషతః ॥ 97 ॥

తిరిగి నాకు పుంస్త్వము కలగాలనీ, ఉత్తమమైన రాజ్యము లభించాలనీ, నా కుమారులకు, ముఖ్యముగా నీకు కూడా రాజ్యాభిషేకము చేయాలనీ కోరుతున్నాను.

దానం దాతుం చ యష్టుం చ ముక్తిమార్గస్య వీక్షణమ్ ।
సర్వం చ కర్తుమిచ్ఛామి తవ పుత్ర! ప్రసాదతః ॥ 98 ॥

దానాలు చేయాలనీ, యజ్ఞయాగాది క్రతువుల నాచరించాలనీ, ముక్తిమార్గమును చూడాలనీ, ఇవన్నీ నాయనా! నీ యనుగ్రహంతో పొందాలని అనుకొంటున్నాను.

పుత్ర ఉవాచ:- పుత్రుడు పలికాడు.

ఉపాయం త్వా తు పృచ్ఛామి యేన పుంస్త్వమవాప్స్యసి ।
తపసో వాఽన్యతో వాఽపి వదస్వ మమ తత్త్వతః ॥ 99 ॥

నీవు దేనితో తిరిగి పుంస్త్వమును పొందుతావో ఆ ఉపాయమును చెప్పు. తపస్సా? లేక ఇతరమైన మార్గముతోనా? దాని గూర్చి వివరముగా చెప్పు.

ఇలోవాచ:- ఇల పలికింది.

బుధం త్వం పితరం పృచ్ఛ గత్వా పుత్ర యథార్థవత్ ।
స తు సర్వం తు జానాతి ఉపదేక్ష్యతి తే హితమ్ ॥ 100 ॥

నీవు వెళ్ళి నీ తండ్రి ఐన బుధుని యడుగు. యథార్థంగా అతడు అన్నీ తెలిసినవాడు. అతడు నీకు హితమైన దానిని ఉపదేశించగలడు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తన్మాతృవచనాదైలో గత్వా పితరమంజసా ।
ఉవాచ ప్రణతో భూత్వా మాతుః కృత్యం తథాత్మనః ॥ 101 ॥

తల్లి మాటలను విన్న ఐలుడు తండ్రివద్దకు వెళ్ళి, చేతులు జోడించి, నమస్కరించి, తన తల్లిని గూర్చి తాను చేయవలసిన పనిని గూర్చి అడిగాడు.

బుధ ఉవాచ:- బుధుడు పలికాడు.

ఇలం జానే మహాప్రాజ్ఞ ఇలాం జాతాం పునస్తథా ।
ఉమావనప్రవేశం చ శంభోరాజ్ఞా తథైవ చ ॥ 102 ॥

మహాప్రాజ్ఞా! నేను ఇలుని ఎరుగుదును. అలాగే ఇలగా మారిపోవుటను కూడా ఎరుగుదును. ఉమా వనములోనికి ప్రవేశించుట, అలా ప్రవేశించిన మగవారికి శివుని నియమనమును కూడా ఎరుగుదును.

తస్మాచ్ఛంభుప్రసాదేన ఉమాయాశ్చ ప్రసాదతః ।
విశాపో భవితా పుత్ర తవారాధ్య న చాన్యథా ॥ 103 ॥

అందువలన నీవు పార్వతీ పరమేశ్వరుల నారాధించిన, ఆ ఉమా శంభుల అనుగ్రహమువలన శాపనివృత్తి అవుతుంది. దానికంటె వేరు మార్గము లేదు.

పురూరవా ఉవాచ:- పురూరవుడు పలికాడు.

పశ్యేయం తం కథం దేవం కథం వా మాతరం శివామ్ ।
తీర్థాద్వా తపసో వాఽపి తత్పితః! ప్రథమం వద ॥ 104 ॥

తండ్రీ! నేను ఆ శివునిగానీ, తల్లియగు పార్వతినిగానీ ఎలా దర్శించగలను? తీర్థము ద్వారానా, తపస్సు ద్వారానా ఎలాగో మొదట నాకు చెప్పు.

బుధ ఉవాచ:- బుధుడు పలికాడు.

గౌతమీం గచ్ఛ పుత్ర త్వం తత్రాఽస్తే సర్వదా శివః ।
ఉమయా సహితః శ్రీమాన్ శాపహన్తా వరప్రదః ॥ 105 ॥

నాయనా! నీవు గౌతమి దగ్గరకు వెళ్ళు. అక్కడ పూజ్యుడైన శివుడు పార్వతితో గూడి ఎల్లప్పుడూ ఉంటాడు. అతడే వరముల నిచ్చేవాడూ, శాపమును తొలగించేవాడు కూడా.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

పురూరవా పితుర్వాక్యం శ్రుత్వా తు ముదితోఽభవత్ ।
గౌతమీం తపసే ధీమాన్ గంగాం త్రైలోక్యపావనీమ్ ॥ 106 ॥

పుంస్త్వమిచ్ఛంస్తథా మాతుర్జగామ తపసే త్వరన్ ।
హిమవన్తం గిరిం నత్వా మాతరం పితరం గురుమ్ ॥ 107 ॥

తండ్రిమాట విన్న పురూరవుడు సంతోషించాడు. ఆ ధీమంతుడు తన తల్లికి పుంస్త్వము రావాలని ముల్లోక పావనియగు గౌతమీ గంగను గూర్చి తపస్సు చేయడానికి, తల్లికీ, తండ్రికీ, గురువుకు నమస్కరించి హిమగిరికి త్వర త్వరగా వెళ్ళాడు.

గచ్ఛన్తమన్వగాత్పుత్రమిలా సోమసుతస్తథా ।
తే సర్వే గౌతమీం ప్రాప్తా హిమవత్పర్వతోత్తమాత్ ॥ 108 ॥

అలా వెళ్ళుతున్న కుమారుని వెంబడి ఇలా మరియు బుధుడు అనుసరించారు. వారంతా హిమవత్పర్వతము నుండి గౌతమివద్దకు వెళ్ళారు.

తత్ర స్నాత్వా తపః కించిత్ కృత్వా చక్రుః స్తుతిం పరామ్ ।
భవస్య దేవదేవస్య స్తుతిక్రమమిమం శృణు ॥ 109 ॥

అక్కడ స్నానం చేసి, కొంత తపస్సు చేసి, దేవదేవుడైన శివుని స్తోత్రం చేశారు. వారేమని స్తోత్రం చేశారో విను.

బుధస్తుష్టావ ప్రథమమిలా చ తదనన్తరమ్ ।
తతః పురూరవాః పుత్రో గౌరీం దేవీం చ శంకరమ్ ॥ 110 ॥

మొదట బుధుడూ, తరువాత ఇలా, ఆ తరువాత వారి కుమారుడైన పురూరవుడూ గౌరీదేవినీ, శంకరునీ ఇలా స్తోత్రం చేశారు.

బుధ ఉవాచ:– బుధుడు పలికాడు.

యౌ తౌ రమేతే రశనారవేణ స్వభావహేమప్రతిమౌ సురూపౌ ।
యావర్చితౌ స్కన్దగణేశ్వరాభ్యాం తౌ మే శరణ్యౌ శరణం భవేతామ్ ॥ 111 ॥

మొలనూలు చిరుధ్వనులతో క్రీడించేవారూ, బంగారం వంటి సహజ దేహవర్ణంతో మంచి రూపం గలవారూ, కుమార గణపతులచే సేవించబడేవారూ అయిన శరణుపొందదగిన పార్వతీపరమేశ్వరులు నాకు శరణమగుగాక!

ఇలోవాచ:– ఇల పలికింది.

సంసారతాపత్రయదావదగ్ధాః
శరీరిణో యౌ పరిచిన్తయన్తః ।
సద్యః పరాం నిర్వృతిమాప్నువన్తి
తౌ శంకరౌ మే శరణం భవేతామ్ ॥ 112 ॥

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవకమనే తాపత్రయముతో సంసారమనే దావాగ్నిలో దహించుకుపోయే శరీరముగల జీవులు ఎవరిని చింతించినంత మాత్రముననే పరానందమును పొందుతారో! అటువంటి శుభమును కలుగజేసే జంటయైన పార్వతీపరమేశ్వరులు నాకు శరణము నిచ్చుగాక.

ఆర్తాహ్యహం పీడితమానసా తే క్లేశాది గోప్తా న పరోఽస్తి కశ్చిత్ ।
దేవ త్వదీయౌ చరణౌ సుపుణ్యౌ తౌ మే శరణ్యౌ శరణం భవేతామ్ ॥ 113 ॥

నేనార్తురాలను. పీడితమనస్కను. నా క్లేశాదులనుండి రక్షించేవారు వేరు ఎవరూ లేరు. దేవా! చక్కని పుణ్యముగల, శరణు కోరదగిన నీ పాదములు తప్ప మరొక సాధనము లేదు. కావున నీ పాదములు నాకు శరణమగుగాక.

పురూరవా ఉవాచ:- పూరూరవుడు పలికాడు.

యయోః సకాశాదిదమభ్యుదైతి ప్రయాతి చాన్తే లయమేవ సర్వమ్ ।
జగచ్ఛరణ్యౌ జగదాత్మకౌ తు గౌరీహరౌ మే శరణం భవేతామ్ ॥ 114 ॥

ఎవరినుండి ఈ సృష్టి అంతా నభివృద్ధిచెందుతుందో చివరకు ఇదంతా లయం చెందుతుందో అటువంటి జగదాత్మకులూ, జగత్తంతా శరణుపొందదగిన వారూ అయిన పార్వతీపరమేశ్వరులు నాకు శరణమగుదురు గాక!

యౌ దేవవృన్దేషు మహోత్సవే తు పాదౌ గృహాణేశ గిరీశ పుత్ర్యాః ।
ప్రోక్తం ధృతౌ ప్రీతివశాచ్ఛివేన తౌ మే శరణ్యౌ శరణం భవేతామ్ ॥ 115 ॥

దేవలోకంలో గొప్ప ఉత్సవాలలో దేవగణముల మధ్యలో శివుణ్ణి తన పాదాలు పట్టుకొనమని గౌరి అడుగగా ప్రేమతో శివుడు ఆ పాదాలు ధరించాడు. అందరూ శరణు పొందదగిన ఆ పాదాలు నాకు శరణమగుగాక!

శ్రీ దేవ్యువాచ:- శ్రీదేవి పలికింది.

కిమభీష్టం ప్రదాస్యామి యుష్మభ్యం తద్వదన్తు తే ।
కృతకృత్యాః స్థ భద్రం వో దేవానామపి దుష్కరమ్ ॥ 116 ॥

మీరు కృతకృత్యులైనారు. మీకు శుభమగుగాక. దేవతలకు కూడా అలవికాని మీ కోరిక ఏదున్నదో దానిని అడగండి. మీకు నేను దానినిస్తాను.

పురూరవా ఉవాచ:- పురూరవుడు పలికాడు.

ఇలో రాజా తవాజ్ఞాత్వా వనం ప్రావిశదమ్బికే ।
తత్ క్షమస్వ సురేశాని పుంస్త్వం దాతుం త్వమర్హసి ॥ 117 ॥

అంబికే! ఇలమహారాజు అది నీ వనమని తెలియక ప్రవేశించాడు. దానికై క్షమించు. ఓ దేవనాయకీ! ఇలకు పుంస్త్వమునివ్వడానికి నీవే సమర్థురాలవు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తథేత్యువాచ తాన్ సర్వాన్భవస్య తు మతే స్థితా ।
తతః స భగవానాహ దేవీ వాక్యరతః సదా ॥ 118 ॥

ఎల్లప్పుడు శివుని అభిమతాన్ని గౌరవించే పార్వతి వారందరితో అలాగే అవుతుందని చెప్పింది. దేవి మాటయందు సదా అనురక్తుడైన ఆ శంకరుడప్పుడిలా అన్నాడు.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

అత్రాభిషేకమాత్రేణ పుంస్త్వం ప్రాప్నోత్వయం నృపః ॥ 119 ॥

ఈ రాజు ఇక్కడ స్నానము చేసినంతనే పుంస్త్వము పొందుగాక.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

స్నాతాయా బుధభార్యాయాః శరీరాద్వారి సుస్రువే ।
నృత్యం గీతం చ లావణ్యం యక్షిణ్యా యదుపార్జితమ్ ॥ 120 ॥

తత్సర్వం వారిధారాభిర్గంగామ్భసి సమావిశత్ ।
నృత్యా గీతా చ సౌభాగ్యా ఇమా నద్యో బభూవిరే ॥ 121 ॥

బుధునిభార్య స్నానము చేయగానే ఆమె శరీరము నుండి నీరు స్రవిస్తుంది. యక్షిణి ద్వారా ఏ నృత్య గీతలావణ్యాలను పొందిందో, అవన్నీ నీటి ధారలుగా గంగానది నీటిలో ప్రవేశించాయి. అవి నృత్య, గీత, సౌభాగ్య అనే పేర్లతో నదులుగా మారినాయి.

తాశ్చాపి సంగతా గంగా తే పుణ్యాః సంగమాస్త్రయః ।
తేషు స్నానం చ దానం చ సురరాజ్యఫలప్రదమ్ ॥ 122 ॥

అవి గంగలో కలువగా ఆ మూడును పవిత్రమైన సంగమతీర్థాలైనాయి. వాటిలో స్నానం చేసినా, దానం చేసినా స్వర్గలోక ఫలం లభిస్తుంది.

ఇలా పుంస్త్వమవాప్యాథ గౌరీశంభోః ప్రసాదతః ।
మహాభ్యుదయసిద్ధ్యర్థం వాజపేయమథాకరోత్ ॥ 123 ॥

పార్వతీపరమేశ్వరుల అనుగ్రహం వలన ఇల తిరిగి పురుషునిగా మారాడు. గొప్ప అభ్యుదయం కలుగుటకై వాజపేయయాగాన్ని చేశాడు.

పురోధసం వసిష్ఠం చ భార్యాం పుత్రాంస్తథైవ చ ।
అమాత్యాంశ్చ బలం కోశమానీయ స నృపోత్తమః ॥ 124 ॥

చతురంగం బలం రాజ్యం దండకేఽస్థాపయత్తదా ।
ఇలస్య నామ్నా విఖ్యాతం తత్ర తత్పురముచ్యతే ॥ 125 ॥

పురోహితుడైన వసిష్ఠుని, తన పత్నీ పుత్రులను, మంత్రులను, సైన్యమును, ధనమును తీసుకొనివచ్చిన ఆ రాజశ్రేష్ఠుడు, తన రథగజతురగ పదాతి దళములను కూడా తెచ్చి దండకారణ్యమునందుంచినాడు. ఆ ప్రదేశము ఇలుని పేరుతో ఇలాపురమని ప్రఖ్యాతి చెందినది.

సహ్యద్రోణ్యాం మనోహారి మహేన్ద్రపురతోఽధికమ్ ।
భవోపభోగనిర్విణ్ణస్తస్మిన్పురవరోత్తమే ॥ 126 ॥

పూర్వజాతానథో పుత్రాన్ సూర్యవంశక్రమాగతే ।
రాజ్యేఽభిషిచ్య పశ్చాత్తమైలం స్నేహాదసించయత్ ॥ 127 ॥

సహ్యపర్వత కనుమలలో మహేంద్రపురముకంటె మిన్నగా మనోహరమైన ఆ శ్రేష్ఠమైన పురము ఐహికభోగభాగ్యాలతో ఉంటూ, తనకు ముందు కలిగిన సంతానమును సూర్యవంశానుగతమైన రాజ్యమున పట్టాభిషిక్తులను జేసి తరువాత ఇలారూపంలో కన్న పుత్రుడగు ఐలుని ప్రేమతో అభిషేకించాడు.

సోమవంశకరః శ్రీమానయం రాజా భవేదితి ।
సర్వేభ్యోమతిమానేభ్యో జ్యేష్ఠః శ్రేష్ఠో౽భవన్మునే ॥ 128 ॥

ఓ మునీ! శ్రీమంతుడైన ఈ రాజు చంద్రవంశకర్త అవుతాడు. ఇతడు మతిమంతులందరిలోనూ జ్యేష్ఠునిగా శ్రేష్ఠునిగా అయ్యాడు.

యత్ర చ క్రతవో వృత్తా ఇలస్య నృపతేః శుభాః ।
యత్ర పుంస్త్వమవాప్యాథ యత్ర పుత్రాః సమాగతాః ॥ 129 ॥

యక్షిణీదత్తనృత్యాదిగీత సౌభాగ్య మంగలాః ।
నద్యో భూత్వా యత్ర గంగాం సంగతాస్తాని నారద ॥ 130 ॥

ఇలమహారాజు ఎక్కడైతే క్రతువులు నిర్వహించినాడో, పుంస్త్వమును పొందినాడో, తన పుత్రులతో కలిసినాడో, ఓ నారదా! యక్షిణి ప్రసాదించిన నృత్య, గీత సౌభాగ్యములు నదులుగా మారి ఎక్కడ గంగాసంగమమును పొందినవో,

తీర్థాని శుభదాన్యాసన్ సహస్రాన్యథ షోడశ ।
ఉభయోస్తీరయోస్తాత తత్ర శమ్భురిలేశ్వరః ॥
తేషు స్నానం చ దానం చ సర్వక్రతుఫలప్రదమ్ ॥ 131 ॥

పదహారువేల తీర్థాలు శుభములనిస్తాయి. వాటి తీరాలలో ఉన్న శివునికి ఇలేశ్వరుడని పేరు వచ్చింది. ఆ తీర్థాలలో స్నానం చేసినా, దానం చేసినా సమస్త క్రతువులు చేసినందువల్ల వచ్చే ఫలము లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే బుధేలాపురూరవో వసిష్ఠనృత్యగీతసౌభాగ్యేలేశ్వరాదిషోడశసహస్రతీర్థవర్ణనం నామాష్టాత్రింశో౽ధ్యాయః ॥ 38 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి బ్రహ్మ నారద సంవాదంలోని తీర్థ మాహాత్మ్యంలో బుధ,ఇల,పురూరవ వసిష్ఠ, నృత్య, గీత, సౌభాగ్య, ఇలేశ్వర మొదలగు పదహారువేల తీర్థవర్ణనమనే పేరుగల ముప్పైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పై తొమ్మిదవ అధ్యాయం
చక్రతీర్థ వర్ణనమ్ - చక్రతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

చక్ర తీర్థమితి ఖ్యాతం బ్రహ్మహత్యాది నాశనమ్ ।
యత్ర చక్రేశ్వరోదేవశ్చక్రమాప యతో హరిః ॥ 1 ॥

ఎక్కడ నారాయణుడు చక్రమును పొంది, చక్రేశ్వరునిగా పేరుపొందెనో దానిని చక్ర తీర్థమనే పేరుతో పిలుస్తారు. ఆ తీర్థము బ్రహ్మహత్యాది పాపములను కూడా పోగొడుతుంది.

యత్ర విష్ణుః స్వయం స్థిత్వా చక్రార్థం శంకరం ప్రభుః ।
పూజయామాస తత్తీర్థం చక్రతీర్థముదాహృతమ్ ॥ 2 ॥

యస్య శ్రవణ మాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ।

ఎక్కడైతే ప్రభువగు విష్ణువు స్వయముగా నిలిచి చక్రము కొరకై శంకరుని పూజించెనో ఆ తీర్థమును చక్ర తీర్థమని పిలుతురు. దేని పేరు వినగానే సర్వపాపములు నశించునో ఆ చక్రేశ్వరుడున్నది చక్రతీర్థము.

దక్షక్రతౌ ప్రవృత్తే తు దేవానాం చ సమాగమే ॥ 3 ॥

దక్షేణ దూషితే దేవే శివే శర్వే మహేశ్వరే ।
అనాహ్వానే సురేశస్య దక్షచిత్తేమలీమసే ॥ 4 ॥

దక్షప్రజాపతి యజ్ఞము నారంభించగా దేవతలందరు కలిశారు. దక్షుని చిత్తం మలినం కావడంవల్ల ఆ దక్షయజ్ఞసభలో శివునికి ఆహ్వానం లేదు. మంగళుడూ, సుఖాలిచ్చేవాడు, మహాదేవుడు.

దాక్షాయణ్యా శ్రుతేవాక్యే అనాహ్వానస్య కారణే ।
అహల్యాయాం చోక్తవత్యాం కుపితాఽభూత్సురేశ్వరీ ॥ 5 ॥

శివుని ఆహ్వానించకపోవుటకు కారణమేదో అహల్య చెప్పగా విన్న దాక్షాయణియగు సురేశ్వరి కోపించింది.

పితరం నాశయే పాపం క్షమేయం న కథంచన ।
శృణ్వతీ దోషవాక్యాని పిత్రా చోక్తాని భర్తరి ॥ 6 ॥

తన భర్తను నిందించుచున్న మాటలను స్వయముగా విని నేనెప్పటికీ నా తండ్రి చేసిన పాపమును క్షమించను. అతనిని నాశనము చేయుదును.

పత్యుః శృణ్వన్తి యా నిన్దాం తాసాం పాపావధిః కుతః ।
యాదృశస్తాదృశో వాఽపి పతిః స్త్రీణాం పరాగతిః ॥ 7 ॥

భర్తను నిందించుచుండగా ఏ స్త్రీ వింటుందో అటువంటి స్త్రీల పాపాలకు అంతులేదు. భర్త ఎటువంటి వాడైనప్పటికినీ స్త్రీలకతడే పరాగతి.

కిం పునః సకలాధీశో మహాదేవో జగద్గురుః ।
శ్రుతం తన్నిన్దనం తర్హి ధారయామి న దేహకమ్ ॥ 8 ॥

జగద్గురుడు, సకలాధీశ్వరుడును అయిన మహాదేవుని నిందించుట ఇంకేమి అనవలయును? నేనానిందను విన్నాను కనుక నాకీ శరీరమవసరం లేదు. నేను జీవించను.

తస్మాత్త్యక్ష్య ఇమం దేహమిత్యుక్త్వా సా మహాసతీ ।
కోపేన మహతాఽఽవిష్టా ప్రజజ్వాల సురేశ్వరీ ॥ 9 ॥

అందువలన ఈ దేహమును వదులుచున్నానని మిక్కిలి కోపముతో నా సురేశ్వరియగు సతీదేవి తనదేహము దహించుకొంది.

శివైకచేతనాదేహం బలాద్యోగాచ్చ తత్త్యజే ।
మహేశ్వరోఽపి సకలం వృత్తమాకర్ణ్య నారదాత్ ॥ 10 ॥

దృష్ట్వా చుకోప పప్రచ్ఛ జయాం చ విజయాం తథా ।
తే ఊచతురుభే దేవం దక్షక్రతు వినాశనమ్ ॥ 11 ॥

దాక్షాయణ్యా ఇతి శ్రుత్వా మఖం ప్రాయాన్మహేశ్వరః ।
భీమైర్గణైః పరివృతో భూతనాథైః సమం యయౌ ॥ 12 ॥

శివుడొక్కడే తనకు చేతనా స్వరూపుడనినమ్మిన సతీదేవి యోగశక్తితో బలవంతముగా దేహమును వదిలెను. శివుడు నారదుని వలన జరిగిన వృత్తాంతమునంతా విని, జయను విజయను చూచి కోపంతో అడిగెను. వారిద్దరూ దక్షయజ్ఞ ధ్వంసమునుగూర్చి శివునకు చెప్పిరి. సతీదేవి మరణమును విన్న మహేశ్వరుడు భయంకరమైన గణములు వెంటరాగా భూతనాథులతో కలిసి యజ్ఞవాటికకు వెళ్ళెను.

మఖస్తైర్వేష్టితః సర్వో దేవ బ్రహ్మపురస్కృతః ।
దక్షేణ యజమానేన శుద్ధభావేన రక్షితః ॥ 13 ॥

ఆ యజ్ఞము ఆయా దేవతలతో కూడి ఉంది. బ్రహ్మాణులూ, విష్ణువూ వారికి ముందున్నారు. యజమానుడైన దక్షునిచే ఆ యాగము రక్షింపబడుతోంది.

వసిష్ఠాదిభిరత్యుగ్రై ర్మునిభిః పరివారితః ।
ఇన్ద్రాదిత్యాద్యైర్వసుభిః సర్వతః పరిపాలితః ॥ 14 ॥

వసిష్ఠుడూ మున్నగు ఉగ్రతపస్కులైన మునులందరూ చుట్టూ చేరియుండగా ఇంద్రుడూ, సూర్యుడూ వసువులందరి చేతా యజ్ఞం పాలింపబడుతోంది.

ఋగ్యజుస్సామవేదైశ్చ స్వాహాశబ్దైరలంకృతః ।
శ్రద్ధాపుష్టిస్తథా తుష్టిః శాన్తిర్లజ్జా సరస్వతీ ॥ 15 ॥

భూమిర్ద్యౌః శర్వరీ క్షాన్తిరుషా ఆషా జయా మతిః ।
ఏతాభిశ్చ తథాఽన్యాభి సర్వతః సమలంకృతః ॥ 16 ॥

ఋగ్యజుస్సామవేదముల మంత్రములతో స్వాహాకారములిచ్చే శబ్దములతో కూడుకొని, శ్రద్ధా పుష్టి, తుష్టి, శాంతి, లజ్జా, సరస్వతీ, భూమి, ఆకాశము, శర్వరీ, క్షాన్తి, ఉషా, ఆషా, జయ, మతి, వీరితో పాటు ఇతరమైన వారితో కూడా ఆయజ్ఞం భూషింపబడివుంది.

త్వష్ట్రా మహాత్మనా చాపి కారితో విశ్వకర్మణా ।
సురభిర్నన్దినీధేనుః కామధుక్కామదోహినీ ॥ 17 ॥

ఏతాభిః కామవర్షాభిః సర్వకామసమృద్ధిమాన్ ।
కల్పవృక్షః పారిజాతో లతాః కల్పలతాదికాః ॥ 18 ॥

యద్యదిష్టతమం కించిత్తత్ర తస్మిన్మఖే స్థితమ్ ।
స్వయం మఘవతా పూష్ణా హరిణా పరిరక్షితః ॥ 19 ॥

మహాత్ముడైన త్వష్టతో, విశ్వకర్మతో, సురభితో నందినీధేనువు, కోరికలను దీర్చు కామధేనువుతోనూ ఇట్లు కోరికలను వర్షించే కల్పవృక్షమూ పారిజాతమూ కల్పలతా మున్నగువానితో సమస్త వాంఛలూ తీర్చునదై ఎవరెవరికేదిష్టమో వారివారి రుచిననుసరించి కోరికలు తీరుచూ యజ్ఞమున్నది. ఇంద్రుడు, పూషన్, హరి మున్నగువారితో యజ్ఞము రక్షింపబడుచున్నది.

దీయతాం భుజ్యతాం వాఽపి క్రియతాం స్థీయతాం సుఖమ్ ।
ఏతైశ్చ సర్వతో వాక్యైర్దక్షస్య పూజితం మఖమ్ ॥ 20 ॥

ఇవ్వండి, తినండి, చేయండి, సుఖముగా నుండండి అనెడి మాటలు అంతటా వినబడుచు దక్షుని యజ్ఞము పూజలందినది.

ఆదౌ తు వీరభద్రోఽసౌ భద్రకాళ్యాయుతో యయౌ ।
శోకకోపపరీతాత్మా పశ్చాచ్ఛూలపినాకధృక్ ॥ 21 ॥

అభ్యాయయౌ మహాదేవో మహాభూతైరలంకృతః ।
తాని భూతాని పరితః మఖేవేష్ట్య మహేశ్వరమ్ ॥ 22 ॥

క్రతుం విధ్వంసయామాసుస్తత్ర క్షోభో మహానభూత్ ।
పలాయన్త తతః కేచిత్కేచిద్గత్వా తతః శివమ్ ॥ 23 ॥

కేచిత్స్తువన్తి దేవేశం కేచిత్ కుప్యన్తి శంకరమ్ ।
ఏవం విధ్వంసితం యజ్ఞం దృష్ట్వా పూషా సమభ్యగాత్ ॥ 24 ॥

మొదట వీరభద్రుడు భద్రకాళితో కలిసి వెళ్ళాడు. ఆ తరువాత శోకకోపాకులచిత్తుడూ శూల పినాకధారీ అయిన శివుడు మహాభూతములన్నియు వెంటరాగా మహాదేవుడు వచ్చెను. ఆ యజ్ఞములో మహేశ్వరుని చుట్టూ ఆ భూతము లన్నియుచేరి, క్రతువును ధ్వంసముచేసిరి. అక్కడ పెద్ద కోలాహలము పుట్టెను. గుంపులు గుంపులుగా కొందరు పారిపోయిరి. కొందరు శివుణ్ణి చేరి కొందరు దేవేశుని స్తోత్రము చేయుచున్నారు మరి కొందరు శంకరునిపై కోపగించుచున్నారు. ఇట్లు ధ్వంసమైన యజ్ఞమును చూచి సూర్యుడు దగ్గరకు వచ్చాడు.

పూష్ణో దన్తానథోత్పాట్య ఇన్ద్రం వ్యద్రావయత్క్షణాత్ ।
భగస్య చక్షుషీ విప్ర వీరభద్రో వ్యపాటయత్ ॥ 25 ॥

వీరభద్రుడు క్షణంలో సూర్యుని దంతాలు పెకలించి, ఇంద్రుణ్ణి పరుగెత్తించాడు. భగుని కన్నులు పీకేశాడు.

దివాకరం పునర్దోర్భ్యాం పరిభ్రామ్య సమాక్షిపత్ ।
తతః సురగణాః సర్వే విష్ణుం తే శరణం యయుః ॥ 26 ॥

అట్లే సూర్యుని తన చేతులతో గిరగిరా త్రిప్పిపడవేసెను. అప్పుడు దేవతలందరూ విష్ణువును శరణు జొచ్చిరి.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

త్రాహి త్రాహి గదాపాణే భూతనాథకృతాద్భయాత్ ।
మహేశ్వరగణః కశ్చిత్ప్రమథానాం తు నాయకః ॥
తేన దగ్ధో మఖః సర్వో వైష్ణవః పశ్యతో హరేః ॥ 27 ॥

ఓ గదాధరుడా! భూతనాథభయమునుండి రక్షింపుము రక్షింపుము. మహేశ్వరగణము, ప్రమథగణము యొక్క నాయకుడు శ్రీహరి చూచుచుండగానే వైష్ణవయజ్ఞమునంతటిని అతడు దహించివేసెను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

హరిణా చక్రముత్సృష్టం భూతనాథ వధం ప్రతి ।
భూతనాథోఽపి తచ్చక్ర మాపతచ్చ తదాఽగ్రసత్ ॥ 28 ॥

హరిచక్రమును భూతనాథుని చంపుటకు ప్రయోగించెను. అప్పుడు భూతనాథుడు తనపై పడుతున్న చక్రమును కబళించెను.

గ్రస్తే చక్రే తతో విష్ణోర్లోకపాలా భయాద్యయుః ।
తథా స్థితానవేక్ష్యాథ దక్షోయజ్ఞం సురానపి ॥
తుష్టావ శంకరం దేవం దక్షో భక్త్యా ప్రజాపతిః ॥ 29 ॥

విష్ణుచక్రమును కబలించగానే లోకపాలురు భయంతో పారిపోయిరి. ఆ స్థితిలోనున్న దేవతలనూ యజ్ఞమును చూచి దక్షప్రజాపతి భక్తితో శంకరుని స్తుతించెను.

దక్ష ఉవాచ:– దక్షుడు పలికాడు.

జయ శంకర సోమేశ జయసర్వజ్ఞ శమ్భవే ।
జయ కల్యాణభృచ్ఛమ్భో జయ కాలాత్మనే నమః ॥ 30 ॥

శంకరా! సోమేశ! సర్వజ్ఞ! నీకు జయం. కల్యాణకారకా! శంభో! నీకు జయం, కాలస్వరూపుడవైన నీకు నమస్కారం.

ఆది కర్త్రన్నమస్తేఽస్తు నీలకణ్ఠ నమోఽస్తు తే ।
బ్రహ్మప్రియ నమస్తేఽస్తు బ్రహ్మరూప! నమోఽస్తు తే ॥ 31 ॥

ఓ ఆదికర్తా! నీకు నమస్కారం. ఓ నీలకంఠా! నీకు నమస్కారం. ఓ బ్రహ్మకు ప్రియమైనవాడా! నీకు నమస్కారం. ఓ బ్రహ్మరూపుడా! నీకు నమస్కారం.

త్రిమూర్తయే నమో దేవ త్రిధామ పరమేశ్వర ।
సర్వమూర్తే నమస్తేఽస్తు త్రైలోక్యాధార కామద ॥ 32 ॥

త్రిమూర్తులస్వరూపమైన ఓ దేవా! నమస్కారం. ముల్లోకములకు కూడా పరమేశ్వరా! సమస్తసృష్టినీ ధరించినవాడా! ముల్లోకములకాధారభూతుడా! కాముని దహించినవాడా! సమస్తకోరికలనిచ్చేవాడా! నీకు మస్కారం.

నమో వేదాన్తవేద్యాయ నమస్తే పరమాత్మనే !।
యజ్ఞరూప నమస్తేఽస్తు యజ్ఞధామ నమోఽస్తు తే ॥ 33 ॥

వేదాంతవేద్యునకు నమస్కారం. పరమాత్మకు నమస్కారం. యజ్ఞరూపా! నీకు నమస్కారంయజ్ఞమునకు నెలవైనవాడా! నీకు నమస్కారం.

యజ్ఞదాన నమస్తేఽస్తు హవ్యవాహ నమోఽస్తు తే ।
యజ్ఞహర్త్రే నమస్తేఽస్తు ఫలదాయ నమోఽస్తు తే ॥ 34 ॥

యజ్ఞమును దానము చేసేవాడా! నమస్కారం. హవిస్సును మోసేవాడా! నీకు నమస్కారం. యజ్ఞమును హరించువానికి నమస్కారం. ఫలస్వరూపా? నీకు నమస్కారం.

త్రాహి త్రాహి జగన్నాథ శరణాగతవత్సల ।
భక్తానామప్యభక్తానాం త్వమేవ శరణం ప్రభో ॥ 35 ॥

ఓ జగన్నాథా! శరణాగతవత్సలా! రక్షింపుము రక్షింపుము. ఓ ప్రభూ! భక్తులైనవారికి, భక్తులుకానివారికినీ శరణము నీవే.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతస్తస్య ప్రసన్నోఽభూత్ మహేశ్వరః ।
కిం దదామీతి తం ప్రాహ క్రతుః పూర్ణోఽస్తు మే ప్రభో ॥ 36 ॥

ఇట్లు స్తోత్రము చేయగానే పరమేశ్వరుడు ప్రసన్నుడాయెను. అతనిని నీకేమికావలయునని యడిగెను. అతడు ప్రభూ! నా క్రతువు పరిపూర్ణము కావలయుననెను.

తథేత్యువాచ భగవాన్ దేవదేవో మహేశ్వరః ।
శంకరః సర్వభూతాత్మా కరుణావరుణాలయః ॥ 37 ॥

సర్వభూతాత్ముడు, కరుణాసముద్రుడు, దేవదేవుడు, పరమేశ్వరుడు అయిన భగవంతుడు శంకరుడు అట్లే యగుగాక యనెను.

క్రతుం కృత్వా తతః పూర్ణం తస్య దక్షస్య వై మునే ।
ఏవముక్త్వా స భగవాన్ భూతైరన్తరధీయత ॥ 38 ॥

ఓ మునీ! ఇట్లు చెప్పి ఆ దక్షునియొక్క క్రతువును పరిపూర్ణమగునట్లుగా చేసి ఆ శంకరుడు తన భూతములతో గూడా అంతర్ధానమాయెను.

యథాగతం సురా జగ్ముః స్వమేవ సదనం ప్రతి ।
తతః కదాచిద్దేవానాం దైత్యానాం విగ్రహో మహాన్ ॥ 39 ॥

దేవతలందరూ తమతమ నివాసములకు వెళ్ళిరి. ఆ తరువాత ఒకానొకప్పుడు దేవతలకు దైత్యులకు గొప్ప యుద్ధము జరిగెను.

బభూవ తత్ర దైత్యేభ్యో భీతా దేవాః శ్రియఃపతిమ్ ।
తుష్టువుః సర్వభావేన వచోభిస్తం జనార్దనమ్ ॥ 40 ॥

ఆ యుద్ధమునందు భీతిల్లిన దేవతలు జనార్దనుడైన లక్ష్మీపతిని తమ మనస్సునందున భావములు ప్రకటమగునట్లుగా మాటలతో స్తోత్రము చేసిరి.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

శక్రాదయోఽపి త్రిదశాః కటాక్షమపేక్ష్య యస్యాస్తప ఆచరన్తి ।
సా చాపి యత్పాదరతా చ లక్ష్మీస్తం బ్రహ్మభూతం శరణం ప్రపద్యే ॥ 41 ॥

ఇంద్రాది దేవతలు కూడా ఎవరి కటాక్షముకొరకు తపస్సుచేయుదురో! ఆ లక్ష్మి కూడా ఎవని పాదముల యందు ఆసక్తి కలదో! అటువంటి బ్రహ్మభూతుడగు వానిని గూర్చి ప్రపత్తిని చేయుచు శరణము వేడుచున్నాము.

యస్మాత్త్రిలోక్యాం న పరః సమానో న చాధికస్తార్క్ష్య రథా న్నృసింహాత్ ।
స దేవదేవోఽవతునః సమస్తాన్మహాభయేభ్యః కృపయా ప్రపన్నాన్ ॥ 42 ॥

ఈ ముల్లోకములలో అతనికి సమానుడు కానీ, అతని కన్న అధికుడుకానీ మరొకడెవడులేడో, గరుడుడే రథముగా గల నరసింహునికంటే మరొక దేవదేవుడు లేడో అటువంటిస్వామి ప్రపన్నులమైన మమ్ము ఈ సమస్తభయములనుండి దయతో కాపాడుగాక!

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తతః ప్రసన్నో భగవాన్ శంఖచక్రగదాధరః ।
కిమర్థమాగతాః సర్వే తత్కర్తాఽస్మీత్యువాచ తాన్ ॥ 43 ॥

అప్పుడు శంఖచక్రగదాధరుడైన భగవాన్నారాయణుడు ప్రసన్నుడై "మీరంతా ఎందుకువచ్చినారు? అన్నింటికీ కూడా నేనే కర్తనై అన్నీ నెరవేరుస్తాను". అన్నాడు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

భయం చ తీవ్రం దైత్యేభ్యో దేవానాం మధుసూదన ।
తతస్త్రాణాయ దేవానాం మతిం కురు జనార్దన ॥ 44 ॥

ఓ మధు అనే రాక్షసుని చంపినవాడా! దేవతలకు దైత్యుల నుండి తీవ్రమైన భయమున్నది. ఓ జనార్దనా! అందువలన దేవతలను రక్షించుటగూర్చి ఆలోచించుము.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తానాగతాన్ హరిః ప్రాహ గ్రస్తం చక్రం హరేణ మే ।
కిం కరోమి గతం చక్రం భవన్తశ్చార్తిమాగతాః ॥ 45 ॥

అప్పుడు వచ్చినట్టివారితో హరి ఇట్లనెను. నా చక్రమును శివుడు కబలించాడు. చక్రం పోయిన నేను ఏమి చేయగలను? మీరేమో ఆర్తితో వచ్చినారు.

యాన్తు సర్వే దేవగణా రక్షా వః క్రియతే మయా ॥ 46 ॥

దేవతలారా! మీరంతా వెళ్ళుడు. నేను మిమ్ము రక్షిస్తాను.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తతో గతేషు దేవేషు విష్ణుశ్చక్రార్థ ముద్యతః ।
గోదావరీం తతో గత్వా శంభోః పూజాం ప్రచక్రమే ॥ 47 ॥

దేవతలంతావెళ్ళిన తరువాత విష్ణువు చక్రము కొరకు ప్రయత్నము మొదలుపెట్టి గోదావరీనది వద్దకు వెళ్ళి శివుని పూజను ప్రారంభించెను.

సువర్ణ కమలైర్దివ్యైః సుగన్ధైర్దశభిః శతైః ।
భక్తితో నిత్యవత్పూజాం చక్రే విష్ణురుమాపతేః ॥ 48 ॥

చక్కటి సువాసనగల దివ్యములైన వేయి బంగారుకమలములతో విష్ణువు నియమంతో భక్తితో శివుని పూజించెను.

నమః సంసారకాంతారమహాభయనివారిణే ।
పినాకినే మహేశాయ సర్వాభీష్ట ప్రదాయినే ॥ 49 ॥

సంసారమనే కారడవివంటి భయమును నివారించేవాడూ, పినాకమును ధరించినవాడూ, సమస్తకోరికలను తీర్చేవాడూనగు మహేశునకు నమస్కారం.

మంత్రేణానేన భగవాన్ భక్తియుక్తేన చేతసా ।
పూజయామాస విధివద్భవానీ వల్లభం శివమ్ ॥ 50 ॥

ఈ మంత్రముతో విష్ణువు భక్తితోనిండిన మనస్సుతో విధిపూర్వకముగా భవానీ వల్లభుడైన శంకరుని పూజించెను.

ఏవం సంపూజ్యమానే తు తయోస్తత్త్వమిదం శృణు ।
కమలానాం సహస్రే తు యదైకం నైవ పూర్యతే ॥ 51 ॥

ఇట్లు పూజింపగా హరిహరులమధ్య జరిగినదాన్ని గూర్చి వినుము. వేయి కమలములలో ఒక పద్మము తగ్గుచూ వేయిసంఖ్య పూర్తి అగుటలేదు.

తదాఽ సురారిః స్వం నేత్రముత్పాట్యార్ఘ్యమకల్పయత్ ।
అర్ఘ్యపాత్రం కరే గృహ్య సహస్రకమలాన్వితమ్ ॥
ధ్యాత్వా శమ్భుం దదా వర్ఘ్యమనన్యశరణో హరిః ॥ 52 ॥

అపుడు దానవారి అయిన హరి తన కంటిని పెకలించి అర్ఘ్యంగా చేసెను. సహస్ర కమలాన్వితమైన ఒక అర్ఘ్యపాత్రను చేతితో పట్టుకొని అనన్యశరణుడైన ఆ విష్ణువు శివుని ధ్యానించి అర్ఘ్యమొసంగెను.

విష్ణురువాచ:-విష్ణువు పలికాడు.

త్వమేవ దేవ జానీషే భావమన్తర్గతం నృణామ్ ।
త్వమేవ శరణోఽ ధీశోఽ త్ర భవేత్కా విచారణా ॥ 53 ॥

ఓ దేవా! మానవులలోపల దాగియున్న భావమును నీవే ఎరుగుదువు. అధీశుడవైన నీవే శరణిచ్చువాడవు. ఇందులో సందేహమేమీ లేదు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

వదన్నుదశ్రునయనో నిలిల్యేఽ సావితీశ్వరే ।
భవానీ సహితః శంభుః పురస్తాదభవత్తదా ॥ 54 ॥

అట్లు స్తోత్రము చేయుచు ఉబికి వచ్చిన కన్నీళ్ళతో భావనతో నతడు శంకరునియందు లీనమాయెను. అప్పుడు పార్వతీదేవితో గూడా శివుడు అతని ఎదుట ప్రత్యక్షమాయెను.

గాఢమాలింగ్య వివిధైర్వరైరాపూరయద్ధరిమ్ ।
తదేవ చక్రమభవన్నేత్రం చాపి యథా పురా ॥ 55 ॥

విష్ణువును గాఢముగా ఆలింగనము చేసుకొని అతని కనేక వరములనిచ్చి సంతుష్టుని చేసెను. పూర్వము అర్ఘ్యమిచ్చిన నేత్రమే చక్రమాయెను.

తతః సురగణాః సర్వే తుష్టువుర్హరి శంకరౌ ।
గంగాం చాపి సరిచ్ఛ్రేష్ఠాం దేవం చ వృషభధ్వజమ్ ॥ 56 ॥

అప్పుడు దేవతా గణములన్నియు హరిశంకరులనూ, నదీశ్రేష్ఠురాలగు గంగనూ, వృషభధ్వజుడగు శివుణ్ణీ స్తుతించారు.

తతః ప్రభృతి తత్తీర్థం చక్రతీర్థమితి స్మృతమ్ ।
యస్యానుశ్రవణేనైవ ముచ్యతే సర్వకిల్బిషైః ॥ 57 ॥

అప్పటినుండి ఆ తీర్థమునకు చక్రతీర్థమనిపేరు వచ్చినది. ఆ తీర్థము పేరు విన్నంత మాత్రముననే సమస్త పాపములు నశించును.

తత్ర స్నానం చ దానం చ యః కుర్యాత్పితృతర్పణమ్ ।
సర్వపాపవినిర్ముక్తః పితృభిః స్వర్గభాగ్భవేత్ ॥
తత్తు చక్రాంకితం తీర్థమద్యాపి పరిదృశ్యతే ॥ 58 ॥

ఆ తీర్థమునందు స్నానముచేసినా, దానముచేసినా, పితృతర్పణములు చేసినా సమస్తపాపములు నశించి పితృదేవతలతోపాటు స్వర్గమునందగలరు. ఆ చక్ర చిహ్నముకల తీర్థము ఇప్పటికీ కనిపించుచున్నది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే చక్రతీర్థవర్ణనం నామైకోనచత్వారింశోఽధ్యాయః ॥ 39 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి చక్రతీర్థవర్ణనమను పేరుగల ముప్పైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

చత్వారింశోఽధ్యాయః - నలబైయవ అధ్యాయం

చక్రేశ్వర పిప్పలేశ్వర పాపప్రణాశన గౌతమీతీర్థ పితృతీర్థ సూర్యప్రతిష్ఠాన కోట్యాదితీర్థవర్ణనమ్

చక్రేశ్వర పిప్పలేశ్వర పాపప్రణాశన గౌతమీతీర్థ పితృతీర్థ సూర్యప్రతిష్ఠాన కోట్యాదితీర్థవర్ణనం

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

పిప్పలం తీర్థమాఖ్యాతం చక్రతీర్థాదనన్తరమ్ ॥
యత్ర చక్రేశ్వరో దేవశ్చక్రమాప యతో హరిః ॥ 1 ॥

శ్రీహరి చక్రమును ఏ స్థానమునుండి పొందాడో ఎక్కడ చక్రేశ్వరుడనే పేరుతో దేవుడున్నాడో, అక్కడ చక్రతీర్థం తరువాత పిప్పలమనే తీర్థం ప్రసిద్ధి చెందినది.

యత్ర విష్ణుః స్వయం స్థిత్వా చక్రార్థం శంకరం విభుమ్ ।
పూజయామాస తత్తీర్థం చక్రతీర్థ ముదాహృతమ్ ॥ 2 ॥

ఎక్కడైతే విష్ణువు స్వయముగా నుండి చక్రము కొరకు ప్రభువైన శంకరుని పూజించెనో ఆ తీర్థమును చక్రతీర్థమనే పేరుతో పిలుస్తారు.

యత్ర ప్రీతోఽభవద్విష్ణోః శంభుస్తత్పిప్పలం విదుః ।
మహిమానం యస్య వక్తుం న క్షమోఽప్యహి నాయకః ॥ 3 ॥

విష్ణువుచేసిన పూజలకెక్కడ శివుడు ప్రీతి నొందెనో ఆ స్థలమును పిప్పలమంటారు. దాని యొక్క మహిమను చెప్పుటకు ఆదిశేషునకు కూడా అలవికాదు.

చక్రేశ్వరో పిప్పలేశో నామధేయస్య కారణమ్ ।
శృణు నారద తద్భక్త్యా సాక్షాద్వేదోదితం మయా ॥ 4 ॥

ఓ నారదా! చక్రేశ్వరుడు అనీ, పిప్పలేశ్వరుడు అనీ పేరు వచ్చుటకు కారణమేమో నేను చెప్పుచున్నాను. నీవు భక్తితో విను సాక్షాత్తుగా తెలుసుకొనుము.

దధీచిరితి విఖ్యాతో మునిరాసీద్గుణాన్వితః ।
తస్యభార్యా మహాప్రాజ్ఞా కులీనా చ పతివ్రతా ॥ 5 ॥

పూర్వము దధీచియను పేరుగల మంచిగుణాన్వితుడు ప్రసిద్ధుడగు మునియుండెను. అతని భార్య ఉత్తమవంశసంజాత, గొప్ప ప్రాజ్ఞురాలు, పతివ్రత.

లోపాముద్రేతి యా ఖ్యాతా స్వసా తస్యా గభస్తినీ ।
ఇతి నామ్నా చ విఖ్యాతా వడవేతి ప్రకీర్తితా ॥ 6 ॥

ఆమె పేరు లోపాముద్ర అంటారు. ఆమెసోదరి గభస్తినీ. ఆమెను స్వాహా అనియు వడవా అనియూంటారు. ఆమె గుఱ్ఱమురూపంలో ఉండే అప్సరస.

దధీచేః సా ప్రియా నిత్యం తపస్తేపే తయా మహత్ ।
దధీచిరగ్నిమాన్నిత్యం గృహధర్మ పరాయణః ॥ 7 ॥

దధీచి నిత్యాగ్నిహోత్రి, గృహధర్మపరాయణుడు అతని ప్రియురాలు లోపాముద్ర గొప్పతపస్సు చేసెను.

భాగీరథీం సమాశ్రిత్య దేవాతిథిపరాయణః ।
స్వకళత్రరతః శాన్తః కుమ్భయోనిరివాపరః ॥ 8 ॥

ఆ దధీచి భాగీరథి నది యొద్దున నివసించుచూ దేవతలనూ, అతిథులనూ పూజించేవాడు. తన భార్యయందు ప్రియముగా నుండువాడు. శాంతస్వభావుడు. అతడు మరొక అగస్త్యుని వంటివాడు.

తస్య ప్రభావాత్తం దేశం నారయోదైత్యదానవాః ।
ఆజగ్ముర్మునిశార్దూల! యత్రాగస్త్యస్య చాఽఽశ్రమః ॥ 9 ॥

మునివరా! ఎక్కడ అగస్త్యమహాముని ఆశ్రమముందో, అక్కడకు ఆయన ప్రభావంతో ఆ ప్రదేశమునకు శత్రువులు కాని, దైత్యులు కాని, దానవులు కాని రారు.

తత్ర దేవా సమాజగ్మూరుద్రాదిత్యాస్తథాఽశ్వినౌ ।
ఇన్ద్రో విష్ణుర్యమోఽగ్నిశ్చ జిత్వా దైత్యానుపాగతాన్ ॥ 10 ॥

అక్కడికి రాక్షసులను జయించి రుద్రుడు, ఆదిత్యులు, అశ్వినీ దేవతలు, ఇంద్రుడు, విష్ణువు, అగ్ని మున్నగు దేవతలు వచ్చారు.

జయేన జాత సంహర్షాః స్తుతాశ్చైవ మరుద్గణైః ।
దధీచిం మునిశార్దూలం దృష్ట్వా నేముః సురేశ్వరాః ॥ 11 ॥

జయం వల్ల వారంతా సంతోషముతో నుండిరి. మరుద్గణములు వారిని స్తుతించిరి. దేవతలంతా మునిశ్రేష్ఠుడైన దధీచిని చూచి నమస్కరించారు.

దధీచిర్జాతసంహర్షః సురాన్పూజ్య పృథక్ పృథక్ ।
గృహకృత్యం తతశ్చక్రే సురేభ్యో భార్యయా సహ ॥ 12 ॥

దధీచి ఎంతో సంతోషముతో దేవతలనందరిని వేరువేరుగా పూజించి, ఆ దేవతలందరికీ గృహస్థునిగా తన భార్యతో గూడా సేవలు చేశాడు.

పృష్టాశ్చ కుశలం తేన కథాశ్చక్రుః సురా అపి ।
దధీచిమబ్రువన్ దేవా భార్యయా సుఖితం పునః ॥ 13 ॥

వారందరిని దధీచి కుశల ప్రశ్నలు వేసెను. దేవతలు గూడా వారివారి సంగతులను చెప్పిరి. దేవతలు అతనిని నీవు నీ భార్యతో గూడా సుఖముగానున్నావా అని అడిగారు.

ఆసీనం హృష్టమనస ఋషిం నత్వా పునః పునః ॥ 14 ॥

అక్కడ కూర్చునియున్న ఋషికి నమస్కరించి పునః పునః కుశలమడిగారు.

దేవా ఊచుః :-దేవతలు పలికారు.

కిమద్య దుర్లభం లోకే ఋషేఽస్మాకం భవిష్యతి ।
త్వాదృశః సకృపో యేషు మునిర్భూకల్ప పాదపః ॥ 15 ॥

ఓ మహర్షీ! ఈ లోకంలో నీవంటి భూలోక కల్పవృక్షమువంటివాడూ, దయగలిగినవాడు లభించడం వల్ల మాకు అసాధ్యమైనది ఈ లోకంలో ఏమి ఉండును?

ఏతదేవ ఫలం పుంసాం జీవతాం మునిసత్తమ ।
తీర్థాప్లుతిర్భూతదయా దర్శనం చ భవాదృశామ్ ॥ 16 ॥

మునిసత్తమా! జీవించియున్నవారికి తీర్థముల యందు స్నానము చేయుట, భూతములయందు దయను చూపించుట, నీవంటి వారిని దర్శించుట అనునదే ఫలము.

యత్స్నేహాదుచ్యతేఽస్మాభిరవధారయ తన్మునే ।
జిత్వా దైత్యానిహ ప్రాప్తా హత్వా రాక్షసపుంగవాన్ ॥ 17 ॥

ఓ మునీ! మేము నీపై యుండే స్నేహబుద్ధితో చెప్పెడి మాటలను వినుము. మేమే రాక్షసశ్రేష్ఠులను చంపి, దైత్యులను జయించి ఇక్కడికి వచ్చితిమి.

వయం చ సుఖినో బ్రహ్మంస్త్వయి దృష్టే విశేషతః ।
నాఽఽయుధైః ఫలమస్మాకం వోఢుం నైవ క్షమా వయమ్ ॥ 18 ॥

ఓ పూజ్యుడా! నీ చల్లని చూపువలన మేమంతా క్షేమమే. మాకీ ఆయుధములతో ప్రయోజనము లేదు. అంతేకాక వీటిని భరించే సామర్థ్యము కూడా మాకు లేదు.

స్థాప్యదేశం న పశ్యామ ఆయుధానాం మునీశ్వర ।
స్వర్గే సురద్విషో జ్ఞాత్వా స్థాపితాని హరన్తి చ ॥ 19 ॥

ఓ మునీశ్వరా! ఈ ఆయుధములు దాచే స్థలము కనిపించుటలేదు. స్వర్గంలో దాస్తే రాక్షసులు తెలుసుకొని దాచిన వాటిని అపహరిస్తారు.

నయేయురాయుధానీతి తథైవ చ రసాతలే ।
తస్మాత్తవాశ్రమే పుణ్యే స్థాప్యన్తేఽస్త్రాణి మానద ॥ 20 ॥

వారా ఆయుధములను రసాతలమునకు తీసుకువెళ్ళుదురు. అందువలన ఓ పూజ్యుడా మీ పవిత్రమైన ఆశ్రమమునందా ఆయుధములనుంచెదము.

నైవాత్ర కించిద్భయమస్తి విప్ర న దానవే రాక్షసేభ్యశ్చ ఘోరమ్ ।
త్వదాజ్ఞయా రక్షితపుణ్యదేశో న విద్యతే తపసా తే సమానః ॥ 21 ॥

ఓ విప్రుడా! ఇక్కడ ఘోరమైన రాక్షసులనుండి కానీ దానవులనుండి కానీ కొంచెము కూడా భయములేదు. నీ ఆజ్ఞతో ఈ పవిత్రమైన ప్రదేశము రక్షించబడుచున్నది. తపస్సునందు నీతో సమానులెవరూ లేరు.

జితారయో బ్రహ్మవిదాం వరిష్ఠం వయం చ పూర్వం నిహతా దైత్యసంఘాః ।
అస్త్రైరలం భారభూతైః కృతార్థైః స్యాప్యం స్థానం తే సమీపే మునీశ ॥ 22 ॥

ఓ మునీశా! శత్రువులను జయించాము. మేమింతకు పూర్వమే దైత్యగణమును చంపినాము. మా అస్త్రములు కృతార్థములైనవి. భారభూతములైన ఆ అస్త్రములతో మేము చేసిన పనిచాలు. బ్రాహ్మణులలో శ్రేష్ఠుడవైన నీ వద్ద నుండుటే వాటికి మంచిస్థానమని అనుకొంటున్నాం.

దివ్యాన్ భోగాన్ కామినీభిః సమేతాన్ దేవోద్యానే నన్దనే సంభజామః ।
తతోయామః కృతకార్యాః సహేన్ద్రాః స్వం స్వం స్థానం చాఽఽయుధానాం చ రక్షా ॥ 23 ॥

త్వయా కృతా జాయతాం తత్ప్రశాధి । సమర్థస్త్వం రక్షణే ధారణే చ ॥ 24 ॥

స్వర్గమునందుండే దేవతోద్యాన వనమైననందన వనమునందు అప్సరస స్త్రీలతో కూడి దివ్యమైన భోగములను అనుభవించగలము. మా పనిపూర్తి అయినది. మేము ఇంద్రునితోగూడా మా మా స్థానములకు వెళ్ళుచున్నాము. ఈ ఆయుధములను రక్షించుట నీకు అప్పగించబడినది కావున ఆజ్ఞాపింపుము. నీవు రక్షించుట యందు ధరించుటయందునూ సమర్థుడవు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తద్వాక్యమాకర్ణ్య దధీచి రేవం వాక్యం జగౌ విబుధానేవమస్తు ।
నివార్యమాణః ప్రియశీలయాస్త్రియా కిం దేవకార్యేణ విరుద్ధకారిణా ॥ 25 ॥

ఆ మాట వినగానే ప్రియశీలయైన అతని భార్య అది తగదని నివారించుచున్నప్పటికినీ ఇది దేవకార్యము ఏమవుతుంది. గభస్తి ఇలాఅంది. అని దధీచి వారితో అట్లే అగుగాక అని తనసమ్మతిని తెలిపెను.

యే జ్ఞాతశాస్త్రాః పరమార్థ నిష్ఠాః సంసారచేష్టాసు గతానురాగాః ।
తేషాం పరార్థవ్యసనేన కిం మునే యేనాత్ర వాఽఽముత్ర సుఖం న కించత్ ॥ 26 ॥

కాని అతని భార్య దానికంగీకరించక ఇలా అన్నది – ఓ మునీ! శాస్త్రజ్ఞానము కలవారికీ, పరమార్థమునందు నిష్ఠ కలవారికీ, సంసారిక భోగములందాసక్తి పోయినవారికీ, పరార్థములయందు వ్యసనమెందుకు? ఎందుకనగా వాటితో ఈ లోకమునగాని పరలోకమునగాని ఏ కొంచము కూడా సుఖము లభించదు.

దేవద్విషో ద్వేషమనుప్రయాన్తి దత్తే స్థానే విప్రవర్య శృణుష్వ ।
నష్టే హృతే చాఽఽయుధానాం మునీశ కుప్యన్తి దేవా రిపవస్తే భవన్తి ॥ 27 ॥

ఓ విప్రవర్యా! విను దేవతల ఆయుధాలు ఇక్కడ ఉంటే. ఆ దేవతా శత్రువులు మనమున్న స్థానమునందు ద్వేషమును పెంచుకుంటారు. ఓ మునీశా! ఆ ఆయుధములు దొంగిలించబడినా నష్టమైనా దేవతలు మనకు శత్రువులౌతారు కోపగిస్తారు.

తస్మాన్నేదం వేదవిదాం వరిష్ఠ యుక్తం ద్రవ్యే పరకీయే మమత్వమ్ ।
తావచ్చ మైత్రీ ద్రవ్యభావశ్చ తావన్నష్టే హృతే రిపవస్తే భవన్తి ॥ 28 ॥

అందువలన వేదవేత్తలలో శ్రేష్ఠమైనవాడా! ఇతరుల ద్రవ్యము తనదిగా భావించుట యుక్తము గాదు. ద్రవ్యము క్షేమముగానున్నంతవరకే స్నేహభావముండును. ఆ ద్రవ్యము నష్టమైనా, పోయినా వారే శత్రువులౌతారు.

చేదస్తి శక్తిర్ద్రవ్యదానే తతస్తే దాతవ్యమేవార్థినే కిం విచార్యమ్ ।
నోచేత్సన్తః పరకార్యాణి కుర్యుర్వాగ్భిర్మనోభిః కృతిభిస్తథైవ ॥ 29 ॥

నీకు ఏదైనా ద్రవ్యమును దానం చేసే శక్తియుంటే అడిగినవారికి దానముచేయవచ్చును. దీని కాలోచించవలసిన పనిలేదు. లేదా సత్పురుషులు మనోవాక్కాయకర్మలతో ఇతరులకుపకారము చేస్తారు. దానిననుసరించవచ్చును.

పరస్వసంధారణమేతదేవ సద్భిర్నిరస్తం త్యజకాన్త సద్యః ॥ 30 ॥

ఇతరుల వస్తువులను తనదిగా ధరించుటను పెద్దలు వ్యతిరేకించినారు. నాథా! వెంటనే నీవు దానిని వదిలి వేయుము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మపలికాడు.

ఏవం ప్రియాయా వచనం స విప్రో నిశమ్య భార్యామిదమాహ సుభ్రూమ్ ॥ 31 ॥

ఇట్లు మాట్లాడిన తనపత్ని మాటలను విన్న దధీచి చక్కని కనుబొమలు గల తన భార్యతో నిట్లనెను.

దధీచిరువాచ:- దధీచి పలికెను.

పురా సురాణామనుమాన్య భద్రే నేతీతి వాణీ న సుఖం మమైతి ॥ 32 ॥

ఓ భద్రా! మొదట దేవతలు చెప్పిన దానికనుమతించి ఇప్పుడు కాదనుట శ్రేయస్కరముకాదని నా అభిప్రాయము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

శ్రుత్వేరితం పత్యురితి ప్రియాయాం దైవం వినాఽన్యన్నృణాం సమర్థమ్ ।
తూష్ణీం స్థితాయాం సురసత్తమాస్తే సంస్థాప్య చాస్త్రాణ్యతిదీప్తిమన్తి ॥ 33 ॥

నత్వా మునీన్ద్రం యయురేవ లోకాన్ దైత్య ద్విషో న్యస్త శస్త్రాః కృతార్థాః ।
గతేషు దేవేషు ముని ప్రవర్యో హృష్టోఽవస ద్భార్యయా ధర్మయుక్తః ॥ 34 ॥

అలా తన భర్త అనగా విని 'దేనికైనా దైవమే సమర్థం' అనుకొని మౌనము వహింపగా, ఆ దేవతొత్తములు మిక్కిలి ప్రకాశిస్తున్న అస్త్రములను దధీచి వద్ద ఉంచి దైత్యశత్రువులైన దేవతలు ఆయుధములుంచుటచే కృతార్థులమని భావించి, మునిశ్రేష్ఠునకు నమస్కరించి తమ తమ లోకములకు వెళ్ళారు. దేవతలంతా వెళ్ళగానే ఆ మునిశ్రేష్ఠుడు ఎంతో సంతోషించి తన భార్యతో ధర్మయుక్తముగా నివసించెను.

గతే చ కాలేహ్యతి విప్రయుక్తే వర్షే సంఖ్యయా వై సహస్రే ।
నతే సురా ఆయుధానాం మునీశ వాచం మనశ్చాపి తథైవ చక్రుః ॥ 35 ॥

ఓ మునీశా! ఇట్లు వేయి సంవత్సరములు గడిచినను ఆ దేవతలు ఆయుధముల గురించి మనస్సునందే మాత్రము తలవలేదు.

దధీచిరప్యాహ గభస్తిమోజసా దేవారయో మాం ద్విషన్తీహ భద్రే ।
న తే సురా నేతు కామా భవన్తి సంస్థాపితాన్యత్ర వదస్వయుక్తమ్ ॥ 36 ॥

అప్పుడు దధీచి గభస్తితో ఓ భద్రురాలా! ఇప్పుడు దేవతా శత్రువులు తమ పరాక్రమముతో నన్ను ద్వేషించు చున్నారు. ఆ దేవతలేమో తామిక్కడనుంచిన ఆయుధములను తీసుకువెళ్ళాలనే కోరికతో లేరు. నేనిప్పుడేమి చేయవలయునో యుక్తమేదో చెప్పుము.

సా చాఽఽహ కాన్తం వినయాదుక్తమేవ త్వం జానీషే నాథ యదత్ర యుక్తమ్ ।
దైత్యా హరిష్యన్తి మహాప్రవృద్ధాస్తపోయుక్తా బలినః స్వాయుధాని ॥ 37 ॥

ఆమె దధీచితో వినయంగా స్వామీ! నేనింతకు పూర్వమే చెప్పితిని. ఇప్పుడు చేయవలసిన దేమిటో మీకు తెలియును. గొప్ప బలవంతులు, తపోయుక్తులు, మహాప్రవృద్ధులునగు దైత్యులు ఆయుధముల నపహరించగలరు.

తదస్త్రరక్షార్థ మిదం స చక్రే మన్త్రైస్తు సంక్షాల్య జలైశ్చ పుణ్యైః ।
తద్వారి సర్వాస్త్రమయం సుపుణ్యం తేజోయుక్తం తచ్చ పపౌ దధీచిః ॥ 38 ॥

దధీచి ఆ అస్త్రములను రక్షించుటకై పవిత్రములైన జలములను మంత్ర పూతజలముతో ప్రక్షాలన చేసి అస్త్రములమయమైన పుణ్యజలమును, తేజోయుక్తమైన దానిని త్రాగెను.

నిర్వీర్యరూపాణి తదాయుధాని క్షయం జగ్ముః క్రమశః కాలయోగాత్ ।
సురా సమాగత్య దధీచి మూచు ర్మహా భయం హ్యాగతం శాత్రవం నః ॥ 39 ॥

క్రమముగా కాలయోగమువలన ఆ ఆయుధములు నిర్వీర్యములై నశించినవి. కొంతకాలమునకు దేవతలు వచ్చి దధీచితో మాకు శత్రువుల వలన మహాభయము యేర్పడినదని చెప్పిరి.

దదస్వ చాస్త్రాణి మునిప్రవీర యాని త్వదన్తే నిహితాని దేవైః ।
దధీచిరప్యాహసురారి భీత్యా అనాగత్యా భవతాం చాచిరేణ ॥ 40 ॥

అస్త్రాణి పీతాని శరీర సంస్థాన్యుక్తాని యుక్తం మమ తద్వదన్తు ।
శ్రుత్వా తదుక్తం వచనం తు దేవాః ప్రోచుస్తమిత్థం వినయావనమ్రాః ॥ 41 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! దేవతలు మీ వద్ద నుంచిన అస్త్రములను ఇమ్మనగా దధీచివారితో మీరు దైత్యులవలన భయంతో, మీరు చాలాకాలం వరకు రాకపోవుట చేత నేనా అస్త్రములను త్రాగివేసితిని. అవన్నియు నాశరీరమునందున్నవున్నట్లుగా నున్నవి. ఇప్పుడేం చెయ్యాలి? అనగా దేవతలామాట విని అతనితో శిరస్సువంచి వినయముగా ఇట్లనిరి.

అస్త్రాణి దేహీతి చ వక్తుమేత చ్ఛక్యం నవాఽ న్యత్ప్రతివక్తుం మునీన్ద్ర ।
వినా చ తైః పరిభూయేమ నిత్యం పుష్టారయః క్వ ప్రయామో మునీశ ॥ 42 ॥

ఓ మునీంద్రా! అస్త్రములనిమ్మని మాత్రమే అడుగగలము కాని మరేమాటను ఎదురు చెప్పలేము. ఆ ఆయుధములు లేకుండా మేము సర్వదా ఓడిపోవుదుము. శత్రువులు చాలాబలం కలవారు ఓ మునీశా! మేమెక్కడికి వెళ్ళగలము?

న మర్త్యలోకే న తలే న నాకే వాసః సురాణాం భవితాద్య తాత ।
త్వం విప్రవర్యస్తపసా చైవయుక్తో నాన్యద్వక్తుం యుజ్యతే తే పురస్తాత్ ॥ 43 ॥

స్వామీ! దేవతలకు మర్త్యలోకంలోకాని, పాతాళంలో కాని, స్వర్గంలో కాని స్థానం లేకుండా పోయింది. నీవు బ్రాహ్మణోత్తముడవు. పైగా తపోనిష్ఠుడవు. నీ ఎదురుగా మేమేమీ మాట్లాడుటకు వీలుకాదు. సమంజసంకాదు.

విప్రస్తదోవాచ మదస్థిసంస్థా న్యస్త్రాణి గృహ్ణన్తు న సంశయోఽ త్ర ।
దేవాస్తమప్యాహు రనేన కిం నో హ్యస్త్రైర్విహీనాః స్త్రీత్వమాప్తాః సురేన్ద్రాః ॥ 44 ॥

ఆ విప్రుడప్పుడన్నాడు. నా ఎముకలలో అస్త్రాలన్నీ ఉన్నాయి. తీసుకొనుడు. దీనిలో సంశయించవలసిన పనిలేదు. అనగా అప్పుడు దేవతలతనితో దీనివల్ల ప్రయోజనమేమి? దేవతాశ్రేష్ఠులు అస్త్రములు లేకుంటే స్త్రీలేకాగలరు.

పునస్తదా చాఽ ఽ హ మునిప్రవీర స్త్యక్ష్యే జీవాన్దైహికాన్ యోగయుక్తః ।
అస్త్రాణి కుర్వన్తు మదస్థి భూతా న్యనుత్తమానుత్తమ రూపవన్తి ॥ 45 ॥

తిరిగి ఆ మునిశ్రేష్ఠుడు నేను యోగబలంతో దేహముననున్న జీవములను వదిలి పెట్టగలను. నా ఎముకలో నున్న అనుత్తమమైన అస్త్రములను ఉత్తమమైనరూపం కలవానిగా చేయుడు.

కురుష్వ చేత్యాహురదీన సత్త్వం దధీచిమిత్యుత్తర మగ్నికల్పమ్ ।
తదా తు తస్య ప్రియమీరయన్తీ న సాంనిధ్యే ప్రాతిథేయీ మునీశ ॥ 46 ॥

అప్పుడు గొప్పవాడూ! అగ్నివంటి కాంతికలవాడూ అయిన దధీచిని దేవతలు అలాగే చేయమన్నారు. మునీశ్వరా! అప్పుడు దధీచికి హితాన్ని చెప్పేదీ, అతిథిసేవ చేసేదీ అయిన అతని భార్య గభస్తి దగ్గర లేదు.

తే చాపి దేవాస్తామదృష్ట్వైవ శీఘ్రం తస్యాభీతా విప్రమూచుః కురుష్వ ।
తత్యాజ జీవాన్ దుస్త్యజాన్ ప్రీతియుక్తో యథాసుఖం దేహమిదం జుషధ్వమ్ ॥ 47 ॥

ఆ దేవతలామెను జూడకుండానే ఆమెవలన కలిగే భయముతో నా బ్రాహ్మణుని త్వరగా యోగము ననుష్ఠించుమనిరి. అప్పుడు దధీచి యథా సుఖముగా ఈ దేహమును ఉపయోగించుకొనుడనుచూ దుస్త్యజములైన ప్రాణములను ప్రీతియుక్తుడై వదిలిపెట్టెను.

మదస్థిభిః ప్రీతిమన్తో భవన్తు సురాః సర్వే కింతు దేహేన కార్యమ్ ॥ 48 ॥

నేనీ దేహముతో చేయవలసినదేమున్నది? నా ఎముకలతో దేవతలందరు సంతోషింతురుగాక!

బ్రహ్మోవాచః- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వాఽసౌ బద్ధపద్మాసనస్థో నాసాగ్రదత్తాక్షి ప్రకాశప్రసన్నః ।
వాయుం స వహ్నిం మధ్యమోద్ఘాటయోగాన్నీత్వా శనైర్దహరాకాశగర్భమ్ ॥ 49 ॥

ఇట్లుపలికి ఆ దధీచి పద్మాసనంలో కూర్చుని చూపును ముక్కుయొక్క చివరభాగమున నిలిపి ప్రకాశప్రసన్నుడై, గాలిని తేజస్సుతో కలిపి మధ్యభాగమున ప్రజ్వలింపజేసి యోగాభ్యాసంతో నిదానంగా దహరాకాశంలోనికి తీసుకుని వెళ్ళినాడు.

యదప్రమేయం పరమం పదం యద్యద్బ్రహ్మరూపం యదుపాసితవ్యమ్ ।
తత్రైవ విన్యస్య ధియం మహాత్మా సాయుజ్యతాం బ్రహ్మణోఽసౌ జగామ॥ 50 ॥

ఏది అప్రమేయమో, ఏది పరమపదమో, ఉపాసించవలసిన దేదో, బ్రహ్మస్వరూపమునందే ఈ మహాత్ముడు తన బుద్ధినుంచి ఇతడు ఆ బ్రహ్మలోనే సాయుజ్యము నొందినాడు. (సాలోక సారూప్య సామీప్య సాయుజ్యములనెడు మోక్షములలో) ఈ నీదధీచి యోగంతో నేరుగా సాయుజ్యమునందెను.

నిర్జీవతాం ప్రాప్తమభీక్ష్య దేవాః కలేవరం తస్య సురాశ్చ సమ్యక్ ।
త్వష్టారమప్యూచురతిత్వరన్తః కురుష్వ చాస్త్రాణి బహూని సద్యః ॥ 51 ॥

జీవరహితమైన కళేబరమును చూచి దేవతలందరూ త్వష్ట వద్దకు వెళ్ళి త్వరగా చక్కని అస్త్రములను వెంటనే సిద్ధము చేయుమని చెప్పాడు.

స చాపి తానాహ కథం ను కార్యం కలేవరం బ్రాహ్మణస్యేహ దేవాః ।
బిభేమి కర్తుం దారుణం చాక్షమోహం విదారితాన్యాయుధాన్యుత్తమాని ॥ 52 ॥

అతడు కూడా వారితో నిట్లనెను. ఓ దేవతలారా! ఇది బ్రాహ్మణుని కళేబరము. నాకు చేయశక్యముకాదు. ఈ దేహాన్ని దారుణముగా కోసిముక్కలను చేసి ఉత్తమమైన ఆయుధములను చేయుటకు భయపడుచున్నాను.

తదస్థిభూతాని కరోమి సద్యస్తతో దేవా గాః సమూచుస్త్వరన్తః ॥ 53 ॥

అతని అస్థికలను మాత్రము తీసి ఇచ్చినచో చేయగలను. అనగా అప్పుడు దేవతలు త్వరపడి గోవులవద్దకు వెళ్ళి ఇట్లన్నారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

వజ్రంముఖం వః క్రియతే హితార్థం గావో దేవైరాయుధార్థం క్షణేన ।
దధీచి దేహం తు విదార్య యూయమస్థీని శుద్ధాని ప్రయచ్ఛతాద్య ॥ 54 ॥

ఓ గోవులారా! మేము మా హితము కొరకు మీ ముఖమును వజ్రాయుధముగా చేయుదుము. మీరిప్పుడు దధీచి దేహమును చీల్చి ఎముకలను శుద్ధముగా చేసి ఇందు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తా దేవ వాక్యాచ్చ తథైవ చక్రుః సంలిహ్య చాస్థీని దదుః సురాణామ్ ।
సురాస్త్వరా జగ్మురదీన సత్త్వాః స్వమాలయం చాపి తథైవ గావః ॥ 55 ॥

ఆ గోవులు దేవతల మాటప్రకార మట్లే చేసినవి. ఎముకలను నాకి శుద్ధిచేసి దేవతల కిచ్చినవి. దేవతలు అదీనసత్త్వులై త్వరత్వరగా తమతమ నివాసములకు వెళ్ళిరి. అట్లే గోవులు కూడా వెళ్ళినవి.

కృత్వా తథాఽస్త్రాణి చ దేవతానాం త్వష్టా జగామాథ సురాజ్ఞయా తథా ।
తతశ్చిరాచ్ఛీలవతీ సుభద్రా భర్తుః ప్రియా బాలగర్భా త్వరన్తీ ॥ 56 ॥

కరే గృహీత్వా కలశం వారిపూర్ణ ముమాం నత్వా ఫలపుష్పైః సమేత్య ।
అగ్నిం చ భర్తారమథాఽఽశ్రమం చ సంద్రష్టుకామాహ్యాజగామాథ శీఘ్రమ్ ॥ 57 ॥

అప్పుడు త్వష్ట దేవతలకు అస్త్రములనుచేసి త్వరత్వరగావెళ్ళెను. తరువాత వెంటనే శీలవతి, భర్తృప్రియ, బాలగర్భయగు సుభద్ర త్వరత్వరగా నడుస్తూ, చేతిలో నీటితో నిండినచెంబును పట్టుకొని పార్వతీదేవికి ఫలపుష్పాలను సమర్పించి నమస్కరించి వెనుదిరిగి అగ్నిని, తన భర్తను, ఆశ్రమమును చూచుటకై త్వరత్వరగా వచ్చెను.

సంతప్తచిత్తా పథి వీక్ష్య కంఠాద్భ్రష్టాం విభూషాం పతితాం ధరాయామ్ ।
పపాత హస్తాత్కరభూషణం చ నేత్రం తథా దక్షిణముల్లలాస ॥ 58 ॥

అట్లు వచ్చుచున్న ఆమెకు మార్గమధ్యమున కంఠమునుండి జారి నేలమీదపడిపోయిన కంఠాభరణమును చేతినుండి కరభూషణ పడి పోయినది. ఆమె కుడికన్నదిరింది. దానికామె దుఃఖించింది.

హా! కిం భవిష్యద్య చిరేణ కష్టమిత్యంతరేణాపి విచిన్తయన్తీ ।
ఆగచ్ఛన్తీం తాం ప్రాతిథేయీం తదానీం నివారయామాస తదోల్కపాతః ॥
సా సంభ్రమాదాగతాచాఽఽశ్రమం స్వం నైవాపశ్యత్తత్ర భర్తారమగ్రే ॥ 59 ॥

అయ్యో! ఇంతలోనే ఈ రోజు ఏమి కష్టమురానున్నదో అని లోలోపల చింతించుచు వచ్చుచున్న ఆ ప్రాతిథేయిని ఆ సమయంలోనే ఒక పిడుగుపడి నివారించెను. ఆమె ఆశ్చర్యపడిపోతూ తమ ఆశ్రమమునకు వచ్చెను. కాని ఆమెకు ఆశ్రమము ముందర తన భర్త కనిపించలేదు.

క్వవా గతశ్చేతి సవిస్మయా సా పప్రచ్ఛ చాగ్నిం ప్రాతిథేయీ తదానీమ్ ।
అగ్ని స్తదోవాచ సవిస్తరం తాం దేవాగమం యాచనం వై శరీరమ్ ॥ 60 ॥

ఎక్కడకు వెళ్ళాడీయన అని ఆశ్చర్యపడుతు అప్పుడా ప్రాతిథేయి అగ్ని నడిగెను. అప్పుడా అగ్ని దేవతలు వచ్చుటను, అతని శరీరమును యాచించుటను మున్నగు విషయములను సవిస్తరముగా చెప్పెను.

అస్థ్నాముపాదానమథ ప్రయాణం శ్రుత్వా సర్వం దుఃఖితా సా బభూవ ।
దుఃఖోద్వేగాత్సా పపాతాథ పృథ్వ్యాం మన్దం మన్దం వహ్నినాఽఽశ్వాసితా చ ॥ 61 ॥

తన ఎముకలను దానము చేయుటను, పరలోకమునకు ప్రయాణమగుటను విషయమునంతటిని విన్న ఆమె దుఃఖితురాలాయెను. దుఃఖోద్వేగముతోనామె నేలమీద పడెను. అగ్ని ఆమెను మెల్లమెల్లగా నోదార్చెను.

ప్రాతిథేయ్యువాచ:– ప్రాతిథేయి పలికింది.

శాపేఽమరాణాం తు నాహం సమర్థా అగ్నిం ప్రాప్స్యే కిం ను కార్యం భవేన్మే ॥ 62 ॥

నేను దేవతలను శపించుటకు సమర్థురాలనుకాను. ఇక నేనేమి చేయవలెను. అగ్నినే ఆశ్రయిస్తాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

కోపం చ దుఃఖం చ నియమ్య సాధ్వీ తదాఽవదీద్ధర్మ యుక్తం చ భర్తుః ॥ 63 ॥

కోపమును దుఃఖమును దిగమింగుకొని ఆ సాధ్వి అప్పుడు తన భర్తతో ధర్మయుక్తముగా నిట్లనెను.

ప్రాతిథేయ్యువాచ:– ప్రాతిథేయి పలికింది.

ఉత్పద్యతే యత్తు వినాశి సర్వం న శోచ్యమస్తీతి మనుష్యలోకే ।
గోవిప్రదేవార్థమిహ త్యజన్తి ప్రాణాన్ ప్రియాన్ పుణ్యభాజో మనుష్యాః ॥ 64 ॥

పుట్టిన ప్రతిదీ గిట్టక మానదని మనుష్యలోకంలో దుఃఖించవలసిన అవసరం లేదని గోబ్రాహ్మణదేవతల కొరకు పుణ్యభాజనులైన మానవులు తమ ప్రియమైన ప్రాణములు వదిలి పెట్టుదురు.

సంసారచక్రే పరివర్తమానే దేహం సమర్థం ధర్మయుక్తం త్వవాప్య ।
ప్రియాన్ ప్రాణాన్ దేవవిప్రార్థహేతో స్తే వై ధన్యాః ప్రాణినో యే త్యజన్తి ॥ 65 ॥

పరివర్తన చెందు స్వభావముగల సంసారచక్రంలో ధర్మయుక్తమూ సమర్థమునూ అయిన దేహమును పొంది దేవతలకొరకూ బ్రాహ్మణుల కొరకూ తమ ప్రియమైన ప్రాణములనెవరు వదులుదురో వారే ధన్యులు.

ప్రాణాః సర్వేఽస్యాపి దేహాన్వితస్య యాతారో వై నాత్ర సందేహలేశః ।
ఏవం జ్ఞాత్వా విప్రగోదేవదీనాద్యర్థం చైనానుత్సృపన్తీశ్వరాస్తే ॥ 66 ॥

ఈ దేహాన్నాశ్రయించిన వారందరి ప్రాణములు వెళ్ళవలసినవే. దీనిలో సందేహించవలసిన దేమీలేదు. అని తెలుసుకొని బ్రాహ్మణ,గో, దేవ దీనుల కొరకు ఈ ప్రాణములను వదలేవారు ఈశ్వరులే.

నివార్యమాణోఽపి మయా ప్రపన్నయా చకార దేవాస్త్రపరిగ్రహం సః ।
మనోగతం వేత్త్యథవా విధాతుః కో మర్త్యలోకాతిగచేష్టితస్య ॥ 67 ॥

ప్రపన్ను రాలనైన నేను వారించినప్పటికిని అతడు దేవతల అస్త్రములను పరిగ్రహించినాడు. అతని మనస్సూ, అలాగే అమానుషమైన సత్యలోకంలో ఉండే బ్రహ్మగారి కృత్యమూ ఎవ్వడు తెలుసుకొంటాడు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యేవముక్త్వాఽఽ పూజ్య చాగ్నీన్యథావద్భర్తుస్త్వచాలోమభిః సా వివేశ ।
గర్భస్థితం బాలకం ప్రాతిథేయీ కుక్షిం విదార్యాథ కరే గృహీత్వా ॥ 68 ॥

ఈ ప్రకారముగా పలికి యథావిధిగా అగ్నులను పూజించి, భర్తయొక్క చర్మమూ, కేశములతో బాటు అగ్నిలో ఆమె ప్రవేశించెను. అంతకుముందు ఆ ప్రాతిథేయి కడుపును చీల్చుకొని తన గర్భమునందున్న కుమారుని చేతిలో పట్టుకొని,

నత్వా చ గంగాం భువమాశ్రమం చ వనస్పతీనోషధీరాశ్రమస్థాన్ ॥ 69 ॥

గంగానదికి, భూదేవికి, ఆశ్రమమునకు, ఆశ్రమంలోనున్న వనస్పతులకు, ఓషధులకు నమస్కరించి,

ప్రాతిథేయ్యువాచ:– ప్రాతిథేయి పలికింది.

పిత్రా హీనో బన్ధుభిర్గోత్రజైశ్చ మాత్రాహీనో బాలకః సర్వ ఏవ ।
రక్షన్తు సర్వేఽపి చ భూతసంఘాస్తదౌషధ్యో బాలకం లోకపాలాః ॥ 70 ॥

తల్లీ తండ్రీ బంధువులు సగోత్రీకులు ఎవ్వరూలేని దిక్కులేనివాడా బాలుడు. ఓ పంచభూతములారా! ఓ ఓషధులారా! ఓ దిక్పాలకులారా! మీరందరూ ఈ బాలకుని రక్షింపుడు.

యే బాలకం మాతృపితృప్రహీణం సనిర్విశేషం స్వతనుప్రరూఢైః ।
పశ్యన్తి రక్షన్తి త ఏవ నూనం బ్రహ్మాదికానామపి వన్దనీయాః ॥ 71 ॥

తల్లిదండ్రులులేనివానిని, నిర్విశేషంగా తమపుత్రులతో సమానంగా ఎవరైతే చూస్తారో రక్షిస్తారో అటువంటివారే బ్రహ్మాదులకుకూడా వందనీయులు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా చాత్యజద్బాలం భర్తృచిత్తపరాయణా ।
పిప్పలానాం సమీపేతు న్యస్య బాలం నమస్య తు ॥ 72 ॥

ఇట్లు పలికి భర్తనే మనస్సునందు నిల్పుకొన్న ఆమె రావిచెట్ల వద్ద బాలుని ఉంచి నమస్కరించి వదిలెను.

అగ్నిం ప్రదక్షిణీకృత్య యజ్ఞపాత్ర సమన్వితా ।
వివేశాగ్నిం ప్రాతిథేయీ భర్త్రాసహ దివం యయౌ ॥ 73 ॥

యజ్ఞపాత్రను పట్టుకొని అగ్నికి ప్రదక్షిణముచేసి ఆ ప్రాతిథేయి అగ్నియందు ప్రవేశించెను. భర్తతో గూడా స్వర్గమునకు వెళ్ళెను.

రురుదుశ్చాఽఽశ్రమస్థా యే వృక్షాశ్చ వనవాసినః ।
పుత్రవత్పోషితా యేన ఋషిణా చ దధీచినా ॥ 74 ॥

దధీచి మహర్షి తన ఆశ్రమంలో పుత్ర నిర్విశేషంగా పెంచిన వృక్షములు, వనవాసులు దుఃఖించిరి.

వినా తేన న జీవామస్తయా మాత్రా వినా తథా ।
మృగాశ్చ పక్షిణః సర్వే వృక్షాః ప్రోచుః పరస్పరమ్ ॥ 75 ॥

తండ్రివంటి దధీచి లేకుండా తల్లివంటి ఆమె లేకుండా మేము బ్రతుకము అని ఆ ఆశ్రమంలోనున్న మృగములూ, పక్షులూ, వృక్షములన్నియూ ఒకరితో నొకరు సంభాషించు కొన్నాయి.

వృక్షా ఊచుః :- చెట్లు పలికాయి.

స్వర్గమాసేదుషోః పిత్రోస్తదపత్యేష్వకృత్రిమమ్ ।
యే కుర్వన్త్యనిశం స్నేహం త ఏవ కృతినో నరాః ॥ 76 ॥

తల్లిదండ్రులు స్వర్గస్థులైన తర్వాత పోయిన వారియందు సంతానము నందును సహజమైన స్నేహము నెవరుచూపుతారో అటువంటి మానవులే పుణ్యాత్ములు.

దధీచిః ప్రాతిథేయీ వా వీక్షతేఽస్మాన్యథా పురా ।
తథా పితా న మాతా వా ధిగస్మాన్పాపినో వయమ్ ॥ 77 ॥

దధీచికాని ప్రాతిథేయిగానీ మమ్ము పూర్వం ఏవిధంగా చూచినారో అటువంటి తలిదండ్రులు మాకెట్లు లభింతురు? ఛీఛీ మేమెంత పాపాత్ములము.

అస్మాకమపి సర్వేషామతః ప్రభృతి నిశ్చితమ్ ।
బాలో దధీచిః ప్రాతిథేయీ బాలోధర్మః సనాతనః ॥ 78 ॥

మా అందరిదీ ఇప్పటినుండి ఒకే నిశ్చితాభిప్రాయము ఆ బాలుడే దధీచి ఆ బాలుడే ప్రాతిథేయి ఆ బాలుడే సనాతనమైన ధర్మము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తదౌషధ్యో వనస్పతిసమన్వితాః ।
సోమం రాజాన మభ్యేత్య యాచిరేఽ మృతముత్తమమ్ ॥ 79 ॥

ఇట్లు పలికి ఆ ఓషధీ వృక్షములు వనస్పతులతో గూడి రాజైన చంద్రుని వద్దకువెళ్ళి ఉత్తమమైన అమృతమును అడిగిరి.

స చాపి దత్తవాంస్తేభ్యః సోమోఽ మృతమనుత్తమమ్ ।
దదుర్బాలాయ తే చాపి అమృతం సురవల్లభమ్ ॥ 80 ॥

చంద్రుడు కూడా వారి కోరిక ప్రకారముగా వారికి ఆ ఉత్తమమైన అమృతమునిచ్చెను. వారాసురవల్లభమైన అమృతమును బాలుని కిచ్చిరి.

స తేన తృప్తో వవృధే శుక్ల పక్షే యథా శశీ ।
పిప్పలైః పాలితో యస్మాత్పిప్పలాదః స బాలకః ॥
ప్రవృద్ధః పిప్పలానేవమువాచ త్వతివిస్మితః ॥ 81 ॥

అతడా అమృతమును స్వీకరించి శుక్లపక్ష చంద్రునివలె వృద్ధిపొందెను. పిప్పలముల చేతనతడు పోషించబడిన వాడు కనుక ఆ బాలుడు పిప్పలాదుడైనాడు. పెరిగిన బాలుడాశ్చర్యముతో పిప్పలముల నిట్లడిగెను.

పిప్పలాద ఉవాచ:- పిప్పలాదుడు పలికాడు.

మానుషేభ్యో మానుషాస్తు జాయన్తే పక్షిభిః ఖగాః ।
బీజేభ్యో వీరుధో లోకే వైషమ్యం నైవ దృశ్యతే ॥
వార్క్షస్త్వహం కథం జాతో హస్తపాదాది జీవవత్ ॥ 82 ॥

మనుష్యులనుండి మనుష్యులు, పక్షుల చేత పక్షులు గింజలనుండి చెట్లు ఏవిధమగు వైషమ్యమూ లేక పుట్టుట కనబడుచున్నది. మరి నేను చెట్లనుండి ఎట్లు హస్తపాదాది జీవులవలె పుట్టినానో తెలియదు.

బ్రహ్మోవాచ:-బ్రహ్మ పలికాడు.

వృక్షాస్తద్వచనం శ్రుత్వా సర్వమూచుర్యథాక్రమమ్ ।
దధీచేర్మరణం సాధ్వ్యాస్తథా చాగ్నిప్రవేశనమ్ ॥ 83 ॥

అస్థ్నాం సంహరణం దేవైరేతత్సర్వం సవిస్తరమ్ ।
శ్రుత్వా దుఃఖ సమావిష్టో నిపపాత తథా భువి ॥ 84 ॥

ఆ మాటను విన్న చెట్లు దధీచి మరణించుట, సాధ్వి అగ్ని ప్రవేశము చేయుట మున్నగునవి జరిగినవన్నియు చెప్పిరి. దేవతలతని ఎముకలను సంహరించిన విషయమును వివరముగా చెప్పినవి. అవన్నీ విన్న అతడు దుఃఖమునకులోనై క్రిందపడెను.

ఆశ్వాసితః పునర్వృక్షైర్వాక్యైర్ధర్మార్థసంహితైః ।
ఆశ్వస్తః స పునః ప్రాహ తదౌషధివనస్పతీన్ ॥ 85 ॥

ధర్మార్థ సహితములైన మాటలుచెప్పి వృక్షములతనిని ఓదార్చినవి. తేరుకున్న అతడు తిరిగి ఆ ఓషధి వనస్పతులనడిగెను.

పిప్పలాద ఉవాచ:– పిప్పలాదుడు పలికాడు.

పితృహన్తౄన్ హనిష్యేఽహం నాన్యథా జీవితుం క్షమః ।
పితుర్మిత్రాణి శత్రూంశ్చ తథా పుత్రోఽనువర్తతే ॥ 86 ॥

నా తండ్రిచావుకు కారణమైన వారిని నేను చంపుదును. లేకుంటే నా జీవితం వ్యర్థం. తండ్రి మిత్రులను మిత్రులనుగా అట్లే శత్రువులను శత్రువులుగా కుమారుడు భావించును.

స ఏవ పుత్రో యోఽన్యస్తు పుత్రరూపో రిపుః స్మృతః ।
వదన్తి పితృమిత్రాణి తారయన్త్యహితానపి ॥ 87 ॥

అటువంటి వానినిమాత్రమే కుమారుడంటారు. అట్లు కానివానిని శత్రువంటారు. తండ్రికి స్నేహితులైనవారు అహితములనుండి దాటింతురని చెప్పుదురు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

వృక్షాస్తం బాలమాదాయ సోమాన్తికమథాఽఽయయుః ।
బాలవాక్యం తు తే వృక్షాః సోమాయాథ న్యవేదయన్ ॥
శ్రుత్వా సోమోఽపి తం బాలం పిప్పలాదమభాషత ॥ 88 ॥

అప్పుడు వృక్షములా బాలుని దీసుకొని సోమునివద్దకు వచ్చిరి. సోమునకా బాలుని మాటలను నివేదించిరి. సోము డామాటలువిని బాలుడగు పిప్పలాదునితో నిట్లనెను.

సోమ ఉవాచ:– చంద్రుడు పలికాడు.

గృహాణ విద్యాం విధివత్సమగ్రాం తపః సమృద్ధిం చ శుభాం చ వాచమ్ ।
శౌర్యం చ రూపం చ బలం చ వృద్ధిం సంప్రాప్స్యసే పుత్రమదాజ్ఞయా త్వమ్ ॥ 89 ॥

నాయనా! విధిపూర్వకము విద్యను సమగ్రముగా స్వీకరించుము, తపఃసమృద్ధిని, చక్కని వాక్కును, శౌర్యమును, రూపమును, బలమును, వృద్ధిని నా ఆజ్ఞతో నీవు పొందగలవు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

పిప్పలాదస్తమమప్యాహ ఓషధీశం వినీతవత్ ॥ 90 ॥

పిప్పలాదుడు ఓషధీశుడైన చంద్రుని వినయముగా నిట్లనెను.

**సర్వమేతద్వృథా మన్యే పితృహన్తృవినిష్కృతిమ్ ।
న కరోమ్యత్ర యావచ్చ తస్మాత్తత్ప్రథమం వద ॥ 91 ॥**

నా పితృహంతకులను ఎంతవరకైతే నేను తుదముట్టించనో అంతవరకు ఇవన్నియూ వ్యర్థమనే నా భావన. అందువలన దానిని గూర్చి మొదట నాకు చెప్పుము.

**యస్మిన్ దేశే యత్ర కాలే యస్మిన్ దేవే చ మన్త్రకే ।
యత్ర తీర్థే చ సిద్ధ్యేతతత్సంకల్పః సురోత్తమ ॥ 92 ॥**

ఓ సురోత్తమా! నా కోరిక ఏ ప్రదేశంలో ఏ సమయంలో ఏ దేవతామంత్రంతో ఏ తీర్థమునందు సిద్ధించునో చెప్పుము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

**చన్ద్రః ప్రాహ చిరం ధ్యాత్వా భుక్తిర్వా ముక్తిరేవ వా ।
సర్వం మహేశ్వరాద్దేవాజ్జాయతే నాత్ర సంశయః ॥ 93 ॥**

అప్పుడు చంద్రుడు కొంచంసేపు ధ్యానమగ్నుడై ఇట్లనెను. భుక్తికాని ముక్తికాని అన్నియును భగవంతుడైన మహేశ్వరుని వలననే కలుగును. ఈ విషయంలో సందేహమేమీ లేదు.

**స సోమం పునరప్యాహ కథం ద్రక్ష్యే మహేశ్వరమ్ ।
బాలోఽహం బాలబుద్ధిశ్చ న సామర్థ్యం తపస్తథా ॥ 94 ॥**

మళ్ళీ దధీచియడిగెను. నేను బాలుడను నా బుద్ధియు బాల్యచాపల్యము కలది. అట్లే నాకు సామర్థ్యముగాని నేను చేసిన తపస్సుగాని లేదు. నేను మహేశ్వరునెట్లు దర్శించగలను?

చన్ద్ర ఉవాచ:- చంద్రుడు పలికెను.

**గౌతమీం గచ్ఛ భద్ర త్వం స్తుహి చక్రేశ్వరం హరమ్ ।
ప్రసన్నస్తు తవేశానో హ్యల్పాయాసేన వత్సక! ॥ 95 ॥**

భద్రా! నీవు గౌతమీ తీర్థమునకువెళ్ళుము. అక్కడ చక్రేశ్వరుడైన హరుని స్తోత్రము చేయుము. వాత్సల్యము గల శివుడు నీకు తక్కువ శ్రమతోనే ప్రసన్నుడగును.

**ప్రీతో భవేన్మహాదేవః సాక్షాత్కారుణికః శివః ।
ఆస్తే సాక్షాత్కృతః శంభుర్విష్ణునా ప్రభవిష్ణునా ॥ 96 ॥**

సాక్షాత్తుగా కరుణామయుడు మంగళకరుడునగు మహాదేవుడు ప్రీతుడగును. ప్రభవిష్ణువైన విష్ణునకు శివుడు అక్కడే సాక్షాత్కరించి యుండెను.

**వరం చ దత్తవాన్ విష్ణోశ్చక్రం చ త్రిదశార్చితమ్ ।
గచ్ఛ తత్ర మహాబుద్ధే దణ్డకే గౌతమీం నదీమ్ ॥ 97 ॥**

అతనికి వరమును, దేవతలచే పూజింపబడే చక్రమును కూడా ప్రసాదించెను. కావున ఓ మహాబుద్ధీ! నీవు దండకారణ్యమున గౌతమీనది వద్దకు వెళ్ళుము.

చక్రేశ్వరం నామ తీర్థం జానన్త్యోషధయస్తు తత్ ।
తం గత్వా స్తుహి దేవేశం సర్వభావేన శంకరమ్ ॥
స తే ప్రీతమనాస్తాత సర్వాన్కామాన్ప్రదాస్యతి ॥ 98 ॥

నాయనా! ఓషధులన్నియు ఆ చక్రేశ్వరమనే పేరుగల తీర్థమును ఎరుగును. అందువలన నీవక్కడికి వెళ్ళి మనస్ఫూర్తిగా భక్తితో దేవేశుడైన ఆ శంకరుని స్తుతించుము. అతడు సంతోషించి నీ కోరికలనన్నింటినీ తీర్చును.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తద్రాజవచనాద్బ్రహ్మన్ పిప్పలాదో మహామునిః ।
ఆజగామ జగన్నాథో యత్ర రుద్రః స చక్రదః ॥ 99 ॥

బ్రహ్మర్షీ! ఆ చంద్రుని మాట ప్రకారముగ మహామునియగు పిప్పలాదుడు ఎక్కడ విష్ణువునకు చక్రమునిచ్చిన జగన్నాథుడగు రుద్రుడున్నాడో అక్కడికి వచ్చెను.

తం బాలం కృపయాఽఽవిష్టాః పిప్పలాః స్వాశ్రమాన్యయుః ।
గోదావర్యాం తతః స్నాత్వా నత్వా త్రిభువనేశ్వరమ్ ॥
తుష్టావ సర్వభావేన పిప్పలాదః శివం శుచిః ॥ 100 ॥

దయాన్వితులైన ఆ పిప్పలములు తమ ఆశ్రమానికి వెళ్ళాయి. పిప్పలాదుడు గౌతమిలో స్నానించి ముల్లోకపతియైన శివునికి నమస్కరించి, పవిత్రుడై ఏకాగ్రచిత్తంతో శివుణ్ణి స్తుతించాడు.

పిప్పలాద ఉవాచ:– పిప్పలాదుడు పలికాడు.

సర్వాణి కర్మాణి విహాయ ధీరాస్త్యక్తైషణా నిర్జితచిత్తవాతాః ।
యం యాన్తి ముక్త్యై శరణం ప్రయత్నాత్తమాది దేవం ప్రణమామి శంభుమ్ ॥ 101 ॥

ధీరులైనవారు మనఃప్రాణాల్ని, మనోకామనలూ, ధనేషణ దారేషణ పుత్రేషణలను, ఈషణత్రయమునూ సమస్తకర్మలనూ వదలి ముక్తికొరకు ప్రయత్నిస్తూ ఎవరిని శరణు పొందుతారో అటువంటి ఆదిదేవుడైన శంభునకు నమస్కరించుచున్నాను.

యం సర్వసాక్షీ సకలాన్తరాత్మా సర్వేశ్వరః సర్వకలానిధానమ్ ।
విజ్ఞాయ మచ్చిత్తగతం సమస్తం సమే స్మరారిః కరుణాం కరోతు ॥ 102 ॥

ఎవనిని సర్వసాక్షిగా, సకలజీవులకంతరాత్మగా, సర్వకళలకు స్థానముగా, సర్వేశ్వరునిగా, నాచిత్తము నందంతటను ఆవరించియున్న వానిగా తెలుసుకొన్నానో ఆ మన్మథారియైన సర్వేశ్వరుడు నాపై కరుణజూపుగాక!

దిగీశ్వరాం జిత్యసురార్చితస్య కైలాసమాందోలయతః పురారేః ।
అంగుష్ఠకృత్యైవ రసాతలాదధోగతస్య తస్యైవ దశాననస్య ॥ 103 ॥

ఆలూనకాయస్య గిరిం నిశమ్య విహస్య దేవ్యా సహ దత్తమిష్టమ్ ।
తస్మై ప్రసన్నః కుపితోఽపి తద్వదయుక్తదాతాసి మహేశ్వర త్వమ్ ॥ 104 ॥

దిక్పాలకులను జయించి, దేవతలచే పూజింపబడిన రావణుడు శివుని కైలాస పర్వతాన్ని కంపింపచెయ్యగా శివుడు తన బొటనవ్రేలితో నొక్కగా రావణుడు పాతాళలోకానికి త్రొక్కబడ్డాడు. నలిగిపోయిన దేహంగల ఆ రావణుని ఆర్తనాదాలు విని నవ్వి గౌరితోబాటు అనుగ్రహించావు. ఓ శివా! నీకు కోపం వచ్చినా ప్రసన్నుడవై అయోగ్యునికి కూడా ప్రసన్నుడవై దాత వయ్యావు.

సౌత్రామణీమృద్ధిమధః స చక్రే యోర్చాం హరే నిత్యమతీవ కృత్వా ।
బాణః ప్రశస్యః కృతవానుచ్చపూజాః రమ్యాం మనోజ్ఞాం శశిఖణ్డమౌలేః ॥ 105 ॥

ఓ హరీ! చంద్రరేఖను ధరించిన శివుని ఆర్చామూర్తిని నిత్యము మిక్కిలి పూజించి మనోజ్ఞము రమ్యము అయిన ఆ స్వరూపమును పూజించి సౌత్రామణియజ్ఞఫలాన్ని కూడా వద్దనుకొన్నావు. బాణుడు కూడా శివారాధన మనోహరంగా చేసి పూజనీయుడయ్యాడు.

జిత్వా రిపూన్దేవ గణాన్ప్రపూజ్య గురుం నమస్కర్తుమగాద్విశాఖః ।
చుకోప దృష్ట్వా గణనాథమూఢమంకే తమారోప్య జహాస సోమః ॥ 106 ॥

శత్రువులను జయించి దేవగణములను పూజించి తన తండ్రియగు శివుని నమస్కరించుటకు కార్తికేయుడు వచ్చెను. అప్పటికే తనఒడిలోఉన్న గణపతిని కూర్చొనబెట్టుకునుటను చూచి కోపించెను. అదిచూసి శివుడు నవ్వి కుమారుణ్ణికూడా ఒడికెక్కించుకొన్నాడు.

ఈశాంకరూఢోఽపి శిశుస్వభావాన్న మాతురంకం ప్రముమోచ బాలః ।
కృద్ధం సుతం బోధితుమప్య శక్తస్తతోఽర్ధ నారీత్వమవాప సోమః ॥ 107 ॥

శివుని ఒడిలో కూర్చునియున్నా ఆ గుహుడు శిశు స్వభావము వలన తల్లిఒడిని వదిలిపెట్టలేదు. కోపంతోనున్న కుమారుణ్ణి నచ్చచెప్పడానికి అశక్తుడై సగం పార్వతీదేహంతో శివుడవతరించాడు. అర్ధనారీత్వమును పొందెను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తతః స్వయంభూః సంప్రీతః పిప్పలాద మభాషత ॥ 108 ॥

అప్పుడు శివుడు సంతోషించి పిప్పలాదునితోనిట్లనెను.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

వరం వరయ భద్రం తే పిప్పలాద యథేప్సితమ్ ॥ 109 ॥

పిప్పలాద! నీకిష్టమైన వరము కోరుకొనుము. నీకు శుభమగుగాక!

పిప్పలాద ఉవాచ:– పిప్పలాదుడు పలికాడు.

హతో దేవైర్మహాదేవ పితా మమ మహాయశాః ।
అధార్మికః సత్యవాదీ తథా మాతా పతివ్రతా ॥ 110 ॥

మహాదేవా! దంభములేనివాడు, సత్యవాది, గొప్పకీర్తిగల నాతండ్రిని దేవతలు చంపినారు. నా తల్లి పతివ్రతకూడా.

దేవేభ్యశ్చ తయోర్నాశం శ్రుత్వా నాథ సవిస్తరమ్ ।
దుఃఖకోపసమావిష్టో నాహం జీవితుముత్సహే ॥ 111

ప్రభూ! దేవతలవల్ల నాతల్లిదండ్రులు నాశనమును సవిస్తరముగా విన్న నేను దుఃఖ కోపములకు లోనైనాను. నాకు జీవించాలనే కోరికలేదు.

తస్మాన్మే దేహి సామర్థ్యం నాశయేయం సురాన్ యథా ।
అవధ్య సేవ్యస్త్రైలోక్యే త్వమేవ శశిశేఖర ॥ 112 ॥

ఓ చంద్రశేఖరా! నీవు ముల్లోకములలో అశక్తసేవ్యుడవు. అందువలన నేనాదేవతలను నశింపజేసే సామర్థ్యమును నాకొసగుము.

ఈశ్వర ఉవాచ:– ఈశ్వరుడు పలికాడు.

తార్తీయం నయనం ద్రష్టుం యది శక్నోషి మేఽనఘ ।
తతః సమర్థో భవితా దేవాం చ్ఛేదయితుం భవాన్ ॥ 113 ॥

ఓ పాపరహితుడా! ఒకవేళ నీవు నా మూడవ కన్నును చూచుటకు సమర్థుడవైనచో దేవతలను సంహరించుటకు సమర్థుడవగుదువు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తతో ద్రష్టుం మనశ్చక్రే తృతీయం లోచనం విభోః ।
న శశాక తదోవాచ న శక్నోమీతి శంకరమ్ ॥ 114 ॥

అప్పుడు శివుని మూడవకన్నును చూచుటకు యత్నించెను. కాని శక్తుడు కాకపోయెను. శంకరునితో నేను చూడలేక పోతున్నాను' అన్నాడు.

ఈశ్వర ఉవాచ:– ఈశ్వరుడు పలికాడు.

కించిత్కురు తపో బాల యదా ద్రక్ష్యసి లోచనమ్ ।
తృతీయం త్వం తదాభీష్టం ప్రాప్స్యసే నాత్ర సంశయః ॥ 115 ॥

నాయనా! కొంచం తపస్సు చేయుము. నీవెప్పుడు మూడోకన్నును దర్శించగలవో అప్పుడు నీ కోరిక నెరవేరును. దీనిలో సందేహము లేదు.

బ్రహ్మోవాచ:-బ్రహ్మ పలికాడు

ఏతచ్ఛ్రుత్వేశానవాక్యం తపసే కృతనిశ్చయః ।
దధీచిసూనుర్ధర్మాత్మా తత్రైవ బహులాః సమాః ॥ 116 ॥

శివధ్యానైక నిరతో బాలోఽపి బలవానివ ।
ప్రత్యహం ప్రాతరుత్థాయ స్నాత్వా నత్వా గురూన్ క్రమాత్ ॥ 117 ॥

సుఖాసీనో మనః కృత్వా సుషుమ్నాయామనన్యధీః ।
హస్తస్వస్తికమారోప్యనాభౌ విస్మృతసంసృతిః ॥ 118 ॥

ఇట్లు చెప్పిన శివుని మాటను విని తపస్సుచేయుటకు నిశ్చయించాడు. ధర్మాత్ముడైన దధీచికుమారుడు అక్కడే చాలా సంవత్సరములు, శివధ్యానమునందే ఆసక్తుడై బాలుడైనప్పటికినీ బలవంతునివలె ప్రతిదినమూ ఉదయముననే లేచి స్నానముచేసి క్రమముగా గురువులకు నమస్కరించి, సుఖాసీనుడై నిశ్చల బుద్ధియై సుషుమ్నానాడియందు మనస్సునిలిపి నాభియందు చేతులతో స్వస్తికముద్రను వేసి భవచక్రమును విస్మరించి,

స్థానాత్స్థానాంతరోత్కర్షాన్విదధ్యౌ శాంభవం మహః ।
దదర్శ చక్షు ర్దేవస్య తృతీయం పిప్పలాశనః ॥
కృతాంజలి పుటోభూత్వా వినీత ఇదమబ్రవీత్ ॥ 119 ॥

యోగంలో మూలాధారాది చక్రాలు దాటుకొంటూ ఆ శివతేజాన్ని ధ్యానించాడు. ఆ శివుని మూడవనేత్రమును పిప్పలాదుడు దర్శించెను. రెండుచేతులతో నమస్కరిస్తూ వినయంగా నిట్లన్నాడు.

పిప్పలాద ఉవాచ:- పిప్పలాదుడు పలికెను.

శంభునా దేవదేవేన వరోదత్తః పురా మమ ।
తార్తీయచక్షుషో జ్యోతిర్యదా పశ్యతి తత్‌క్షణాత్ ॥ 120 ॥

సర్వం తే ప్రార్థితం సిద్ధ్యేదిత్యాహ త్రిదశేశ్వరః ।
తస్మాద్రిపువినాశాయ హేతుభూతాం ప్రయచ్ఛ మే ॥ 121 ॥

దేవదేవుడైన శివుడు పూర్వము నాకు వరమిచ్చెను. మూడవనేత్రము యొక్క జ్యోతిదర్శనమైన క్షణమునుండి, నీవు కోరిన దంతయు సిద్ధించునని త్రిదశేశ్వరుడు చెప్పెను. అందువలన శత్రువులను నశింపజేయుటకు హేతుభూతమైనదానిని నా కనుగ్రహించుము.

తదైవ పిప్పలాః ప్రోచు ర్వడవాఽపి మహాద్యుతే ।
మాతా తవ ప్రాతిథేయీ వదన్త్యేవం దివంగతా ॥ 122 ॥

దానినే పిప్పలులు చెప్పిరి, వడవకూడా చెప్పినది. పిప్పలాదా! నీ తల్లి ప్రాతిథేయి ఈ మాట అంటూ స్వర్గమునకు వెళ్ళినది.

పరాభి ద్రోహనిరతా విస్మృతాత్మ హితా నరాః ।
ఇతస్తతో భ్రాన్తచిత్తాః పతన్తి నరకావటే ॥ 123 ॥

తన హితమును మరచి ఇతరుల ద్రోహము చేయుట యందాసక్తిగలవారిటునటుభ్రాన్తచిత్తులై తిరుగుతూ నరకంలోపడి పోవుదురు.

తన్మాతృవచనం శ్రుత్వా కుపితః పిప్పలాశనః ।
అభిమానే జ్వలత్యన్తః సాధువాదో నిరర్థకః ॥ 124 ॥

అట్లు పలికిన తల్లిమాటను విని పిప్పలాదుడు కుపితుడై లోపల స్వాభిమానము దహిస్తూ ఉండగా సాధువాదము వ్యర్థం అయ్యింది కదా! అనుకొన్నాడు.

దేహి దేహీతి తం ప్రాహ కృత్యా నేత్రవినిర్గతా ।
వడవేతి స్మరన్ విప్రః కృత్యాఽపి వడవాకృతిః ॥ 125 ॥

అపుడు పిప్పలాదుని నేత్రముల నుండి ఒక కృత్యాశక్తి ఉద్భవించింది. ఆమె 'దేహిదేహి' అంటూ చేయవలసినపని అడగ్గా పిప్పలాదుడు 'వడవా!' అన్నాడు. అప్పుడామె ఆడుగుర్రం రూపం ధరించింది.

సర్వసత్త్వవినాశాయ ప్రభూతాఽనల గర్భిణీ ।
గభస్తినీ బాలగర్భా యా మాతా పిప్పలాశినః ॥ 126 ॥

సమస్త జీవులనూ నశింపచేయుటకు అగ్నిగర్భగా ఆమె పుట్టినది. ఆమెయే పిప్పలాదుని యొక్క తల్లి బాలగర్భగభస్తిని.

తద్ధ్యానయోగాత్తు జాతా కృత్యా సాఽనల గర్భిణీ ।
ఉత్పన్నా సా మహారౌద్రా మృత్యుజిహ్వేవ భీషణా ॥ 127 ॥

అతని ధ్యానయోగమువలన అగ్నిగర్భగా ఆ కృత్య పుట్టింది. మహారౌద్రముగలదై మృత్యువుయొక్క నాలుకవలె ఆమె భయంకరంగా ఉంది.

అవోచత్పిప్పలాదం తం కిం కృత్యం మే వదస్వ తత్ ।
పిప్పలాదోఽపి తాం ప్రాహ దేవాన్ ఖాద రిపూన్ మమ ॥ 128 ॥

ఆమె (కృత్య) పిప్పలాదునితో నేను చేయవలసిన పని ఏదో చెప్పుమనెను. పిప్పలాదుడాకృత్యతో నా శత్రువులగు దేవతలను తినుమని చెప్పెను.

జగ్రాహ సా తథేత్యుక్త్వా పిప్పలాదం పురః స్థితమ్ ।
స ప్రాహ కిమిదం కృత్యేసాచాప్యాహ త్వయోదితమ్ ॥ 129 ॥

ఆ కృత్య అట్లేయని ముందున్న పిప్పలాదుని పట్టుకొనెను. పిప్పలాదుడిదేమి కృత్యా! యనియడిగెను. ఆమె నీవేచెప్పినావు కదా యనెను.

దేవైశ్చ నిర్మితం దేహం తతో భీతః శివం యయౌ ।
తుష్టావ దేవం స మునిః కృత్యాం ప్రాహ తదా శివః ॥ 130 ॥

ఈ నీ దేహము దేవనిర్మితమైనదే కదా! అని చెప్పగా నతడు భయంతో శివుని వద్దకు వెళ్ళెను. ఆ ముని శివుని స్తోత్రము చేసెను. అప్పుడు శివుడు కృత్యనడిగెను.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

యోజనాన్తః స్థితాన్ జీవాన్న గృహాణ మదాజ్ఞయా ।
తస్మాద్యాహి తతో దూరం కృత్యే కృత్యం తతః కురు ॥ 131 ॥

ఓ కృత్యా! యోజనదూరములోపలనున్న జీవులను నీవు కబలించకు ఇది నా ఆజ్ఞ. అందువలన అంతకంటే దూరంగా వెళ్ళి అక్కడ నీ పనిని నిర్వర్తించుమనెను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తీర్థాత్తు పిప్పలాత్పూర్వం యావద్యోజనసంఖ్యయా ।
ప్రాతిష్ఠద్వడవారూపా కృత్యా సా ఋషినిర్మితా ॥ 132 ॥

పిప్పలతీర్థమునకు యోజనసంఖ్యగల ప్రదేశమునకవతల ఋషి నిర్మితమైన కృత్య వడవారూపముననుండెను.

తస్యాంజాతో మహానగ్నిర్లోక సంహరణ క్షమః ।
తం దృష్ట్వా విబుధాః సర్వే త్రస్తాః శంభుముపాగమన్ ॥ 133 ॥

ఆ కృత్యయందు పుట్టిన గొప్పఅగ్ని లోకములన్నింటిని దహించివేయు శక్తిగలది. దానిని చూచి దేవతలందరూ భయపడి శివుని వద్దకు చేరిరి.

చక్రేశ్వరం పిప్పలేశం పిప్పలాదేన తోషితమ్ ।
స్తువన్తో భీతమనసః శంభుమూచుర్దివౌకసః ॥ 134 ॥

పిప్పలాదుని చేత సంతోషించిన పిప్పలేశ్వరుడగు చక్రేశ్వరుని వద్దకువెళ్ళి భయమనస్కులైన దేవతలు ఆ శివుని స్తోత్రం చేశారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

రక్షస్వ శంభో కృత్యాఽస్మాన్ బాధతే తద్భవానలః ।
శరణం భవ సర్వేశ భీతానామభయప్రద ॥ 135 ॥

శంభో! మమ్ము రక్షింపుము. కృత్యయూ దానినుండి వచ్చే అగ్నీ మమ్ములను బాధించుచున్నది. భీతిచెందిన వారికి అభయము నిచ్చేవాడా! సర్వేశా! నిన్ను శరణు జొచ్చితిమి. రక్షించుము.

సర్వతః పరిభూతానామార్తానాం శ్రాన్తచేతసామ్ ।
సర్వేషామేవ జన్తూనాం త్వమేవ శరణం శివ ॥ 136 ॥

ఓ శివా! అంతటా తిరస్కృతులైన వారికి, ఆర్తులకు, అలసినమనస్సులు గలవారికి, సమస్తజీవులకును నీవే దిక్కు.

ఋషిణాభ్యర్థితా కృత్యా త్వచ్చక్షుర్వహ్నినిర్గతా ।
సా జిఘాంసతి లోకాంస్త్రీంస్త్వం న స్త్రాతా న చేతరః ॥ 137 ॥

ఋషి అభ్యర్థించిన కృత్య నీ నేత్రాగ్నినుండి వెలువడినది. అది ముల్లోకములను కబలించుచున్నది. నీవే మా రక్షకుడవు. మరెవరూ కాదు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తానబ్రవీజ్జగన్నాథో యోజనాన్తర్నివాసినః ।
న బాధతే త్వసౌ కృత్యా తస్మాద్యూయ మహర్నిశమ్ ॥ 138 ॥

ఇహైవాఽఽసధ్వమమరాస్తస్యా వో న భయం భవేత్ ॥ 139 ॥

అప్పుడా జగన్నాథుడు వారితో మీరు యోజనము లోపలే యున్నారు. ఆ కృత్య మిమ్ములను బాధించదు. మీరు రేయింబవళ్ళు ఇక్కడేయుండుడు. ఓ దేవతలారా! మీకు ఆ కృత్యవలన భయముండదు అనెను.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

పునరూచుః సురేశానం త్వయా దత్తం త్రివిష్టపమ్ ।
తత్త్యక్త్వాత్ర కథం నాథ వత్స్యామస్త్రిదశార్చిత ॥ 140 ॥

వారు మళ్ళీ శివునితో ఓ దేవపూజితా! నీవిచ్చిన స్వర్గమును వదిలి మేమెట్లుండగల మనిరి.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

దేవానాం వచనం శ్రుత్వా శివో వాక్య మథాబ్రవీత్ ॥ 141॥

దేవతల మాటను విని శివుడిట్లనెను.

శివ ఉవాచ:– శివుడు పలికాడు.

దేవోఽసౌ విశ్వతశ్చక్షుర్యోదేవో విశ్వతోముఖః ।
యో రశ్మిభిస్తు ధమతే నిత్యం యో జనకో మతః ॥ 142 ॥

స సూర్య ఏక ఏవాత్ర సాక్షాద్రూపేణ సర్వదా ।
స్థితిం కరోతు తన్మూర్తౌ భవిష్యన్త్యఖిలాః స్థితాః ॥ 143 ॥

ఎవడు విశ్వమునకంతటికీ నేత్రమై, విశ్వమునంతటికి ముఖముగానుండి తన కిరణములతో నిత్యము ప్రకాశిస్తూ తండ్రిగా ఆదరించబడుచున్నాడో, ఆ సూర్యుడొక్కడే ఇక్కడ ఎప్పుడూ నివసిస్తాడు. అతని మూర్తియందే దేవతలంతా నిలిచి ఉంటారు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తథేతి శంభువచనాత్పారిజాతతరోస్తదా ।
దేవా దివాకరం చక్రుస్త్వష్టా భాస్కరమబ్రవీత్ ॥ 144 ॥

శివుని మాట ప్రకారముగా అట్లేనని అప్పుడు పారిజాతవృక్షము నుండి దేవతలు సూర్యుణ్ణి ఆవిష్కరించారు. అపుడు త్వష్ట సూర్యునితో ఇలా అన్నాడు.

త్వష్టోవాచ:- త్వష్ట పలికాడు.

ఇహైవాఽఽస్వ జగత్స్వామిన్ రక్షేమాన్ విబుధాన్ స్వయమ్ ।
స్వాంశైశ్చ వయమప్యత్ర తిష్ఠామః శంభుసంనిధౌ ॥ 145 ॥

ఓ జగత్ప్రభూ! ఇక్కడే వుండుము. ఈ దేవతలనందరినీ స్వయంగా రక్షించు. ఈ శివునివద్ద మా అంశలతో మేము కూడా వుంటాము.

చక్రేశ్వరస్య పరితో యావద్యోజనసంఖ్యయా ।
గంగాయా ఉభయం తీరమాసాద్యాఽఽసన్ సురోత్తమాః ॥ 146 ॥

చక్రేశ్వరుని చుట్టూ యోజనదూరం వరకు గంగానది ఉభయతీరములనాశ్రయించి దేవతలుండిరి.

అంగుల్యార్ధధ మాత్రం తు గంగాతీరం సమాశ్రితాః ।
త్రిస్రఃకోట్య స్తథాపంచశతాని మునిసత్తమ ।
తీర్థానాం తత్ర వ్యుష్టిం చ కః శృణోతి బ్రవీతి వా ॥ 147 ॥

ఓ మునిశ్రేష్ఠుడా! ఆ దేవతలు గంగాతీరమును పావు అంగుళమునకొకరు చొప్పున మూడుకోట్ల ఐదువందల మంది ఆశ్రయించియుండిరి. ఆ మూడుకోట్ల ఐదువందల తీర్థములను గూర్చి వాని సమృద్ధిని గూర్చి వినడమూ, చెప్పడమూ ఎవని తరమూ కాదు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తతః సురగణాః సర్వే వినీతాః శివమబ్రువన్ ॥ 148 ॥

తరువాత దేవతాగణములన్ని శివునితో వినయముగా నిట్లన్నారు.

దేవా ఊచుః :-దేవతలు పలికారు.

పిప్పలాదం సురేశాన! శమం నయ జగన్మయ ॥ 149 ॥

ఓ విశ్వరూపా! ఓ దేవాదిదేవా! పిప్పలాదుని శాంతింపజేయుము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

ఓమిత్యుక్త్వా జగన్నాథః పిప్పలాదమవోచత ॥ 150 ॥

సరే అలాగే అని జగన్నాథుడు పిప్పలాదునితో ఇట్లన్నాడు.

శివోవాచ:- శివుడన్నాడు.

నాశితేష్వపి దేవేషు పితా తే నాఽఽగమిష్యతి ।
దత్తాః పిత్రా తవ ప్రాణాః దేవానాం కార్యసిద్ధయే ॥ 151 ॥

దేవతలందరినీ నశింపచేసినా నీతండ్రి తిరిగిరాడు. దేవతల కార్యము సిద్ధించుటకొరకై నీతండ్రి తన ప్రాణములనిచ్చెను.

దీనార్త కరుణా సిన్ధుః కో హి తాదృగ్భువే భవేత్ ।
తథా యాతా దివం తాత తవ మాతా పతివ్రతా ॥ 152 ॥

నాయనా! ఈ లోకంలో దీనుల ఆర్తులపట్ల అటువంటి కరుణా సముద్రుడెవడుండును? నీతండ్రియెట్లు స్వర్గమునకు వెళ్ళెనో అట్లే పతివ్రతయగు నీతల్లియూ వెళ్ళినది.

సమాకాఽఽప్యత్ర నతయా లోపాముద్రాఽఽప్యరున్ధతీ ।
యదస్థిభిః సురాః సర్వే జయినః సుఖినః సదా ॥ 153 ॥

తేనావాప్తం యశః స్ఫీతం తవ మాత్రాఽఽక్షయం కృతమ్ ।
త్వయా పుత్రేణ సర్వత్ర యశః పరతరం కృతమ్ ॥ 154 ॥

లోపాముద్రా అరుంధతీ మున్నగువారిలో నీతల్లికి సమానలెవ్వరు? ఏ ఎముకలతో దేవతలందరూ జయము కలిగి సదా సుఖులైయున్నారో. అటువంటి స్వచ్ఛమైన కీర్తినతడు పొందినాడు. నీ తల్లి దానినక్షయముగా చేసినది. కుమారునివైన నీవు అంతటా దానిని మిన్నగా చేసినావు.

త్వత్ప్రతాపభయాత్స్వర్గాచ్యుతాంస్త్వం పాతుమర్హసి ।
కాందిశీకాంస్తవ భయాదమరాంస్త్రాతుమర్హసి ॥
నాఽఽర్తత్రాణాదభ్యధికం సుకృతం భువి విద్యతే ॥ 155 ॥

నీ ప్రతాపభయంతో స్వర్గచ్యుతులైన వారిని రక్షింపుము. నీ భయంతో కాందిశీకులైన ఆ దేవతలను రక్షింపుము. ఆర్తులైన వారిని రక్షించుటకంటే అధికమైన పుణ్యము ఈ భువిలో మరేదీలేదు.

యావద్యశః స్ఫురతి చారు మనుష్యలోకే అహాని తావన్తి దివం గతస్య ।
దినే దినే వర్షసంఖ్యా పరస్మిన్ లోకే వాసో జాయతే నిర్వికారః ॥ 156 ॥

స్వర్గస్థుడైన వాని మంచిపేరు ఈ మనుష్యలోకంలో ఎన్ని దినములు ప్రకాశించునో ఆ ఒక్కొక్క దినము ఒక్కొక్క సంవత్సర సంఖ్యగా పరలోకమునందు నిర్వికారమగు నివాసము నిశ్చయముగా లభించును.

మృతాస్త ఏవాత్ర యశో న యేషామన్ధాస్త ఏవ శ్రుత వర్జితా యే ।
యే దానశీలా న నపుంసకాస్తే యే ధర్మశీలా నత ఏవ శోచ్యాః ॥ 157 ॥

ఎవరికి కీర్తిలేదో వారే మరణించినవారు, శ్రుతవర్జితులెవరో వారే గ్రుడ్డివారు. ఎవరు దానశీలురుకారో, వారు నపుంసకులు, ఎవరు ధర్మశీలురుకారో వారే చింతింపదగినవారు.

బ్రహ్మోవాచః- బ్రహ్మ పలికాడు.

భాషితం దేవదేవస్య శ్రుత్వా శాన్తోఽభవన్మునిః ।
కృతాంజలి పుటో భూత్వా నత్వా నాథమథాబ్రవీత్ ॥ 158 ॥

దేవదేవుడు చెప్పిన మాటను విన్న ముని శాంతించెను. రెండుచేతులెత్తి నమస్కరించి శివునితో నిట్లనెను.

పిప్పలాద ఉవాచః- పిప్పలాదుడు పలికాడు.

వాగ్భిర్మనోభిః కృతిభిః కదాచిత్ మమోపకుర్వన్తి హితే రతా యే ।
తేభ్యో హితార్థం త్విహ చాపరేషాం సోమం నమస్యామి సురాదిపూజ్యమ్ ॥ 159 ॥

హితమునందాసక్తి కలిగిన వారెవరైతే ఎప్పుడైనా మనోవాక్కాయ కర్మలతో నాకుగాని, ఇతరులకుగాని ఉపకారము చేసినట్లయితే వారి హితము కొరకు దేవాదిపూజ్యుడగు శివునకు నమస్కరించుచున్నాను.

సంరక్షితో యైరభివర్ధితశ్చ సమానగోత్రశ్చ సమానధర్మా ।
తేషామభీష్టాని శివః కరోతు బాలేన్దుమౌలిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥ 160 ॥

ఎవరిచేత నేను రక్షించబడినానో! అభివృద్ధిచెందినానో సమానగోత్రుడనైనానో! సమానధర్మము నాచరించగలిగానో వారి కోరికలు మంగళమగునట్లుగా చేయుమని చంద్రశేఖరునకు నమస్కరించుచున్నాను.

యైరహం వర్ధితో నిత్యం మాతృవత్పితృవత్ప్రభో ।
తన్నామ్నా జాయతాం తీర్థం దేవదేవ జగత్త్రయే ॥ 161॥

దేవవిభూ! తల్లిదండ్రుల వలె నన్నెవరు పెంచిపెద్దజేసినారో వారిపేరుతో ఈ తీర్థము ముల్లోకములలోనూ, ప్రసిద్ధి పొందునుగాక!

యశస్తు తేషాం భవితా తేభ్యోఽహ మనృణస్తతః ।
యాని క్షేత్రాణి దేవానాం యాని తీర్థాని భూతలే ॥ 162 ॥

నేను వారి కీర్తితో వెలగాలి. నేను వారికి ఋణపడియున్నాను. ఈ లోకంలో దేవతలకెన్ని క్షేత్రములు, తీర్థము లెన్నియున్నవో,

తేభ్యో యదీదమధికమనుమన్యన్తు దేవతాః ।
తతః క్షమేఽహం దేవానామపరాధం నిరన్తరమ్ ॥ 163 ॥

వాటన్నింటికంటే ఈ తీర్థమే అధికమని దేవతలంగీకరింతురుగాక! ఆ తరువాత నేను ఎడతెగకుండా చేసిన తప్పును దేవతలు క్షమింతురుగాక!

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తతః సమక్షం సురసాక్షరాం గిరం సహస్ర చక్షుః ప్రముఖాంస్తథాగ్రతః ।
ఉవాచ దేవా అపి మేనిరే వచో దధీచి పుత్రోదితమాదరేణ ॥ 164 ॥

ఇట్లు ఇంద్రాది ప్రముఖుల సమక్షమున మంచిరసవంతములైన మాటలు పలకగా దేవతలాదధీచి పుత్రునిమాటల నెంతో ఆదరించి అతని మాటలకు సమ్మతించిరి.

బాలస్య బుద్ధిం వినయం చ విద్యాం శౌర్యం బలం సాహసం సత్యవాచమ్ ।
పిత్రోర్భక్తిం భావశుద్ధిం విదిత్వా తదాఽవాదీచ్ఛంకరః పిప్పలాదమ్ ॥ 165 ॥

ఆ బాలుని బుద్ధినీ, వినయమును, విద్యనూ, శౌర్యమునూ, బలమునూ, సాహసమునూ, సత్యసంధతనూ, తల్లిదండ్రులయందలి భక్తినీ, అతని భావమునందలి శుద్ధినీ తెలుసుకొని శంకరుడు పిప్పలాదునితోనిట్లనెను.

శంకర ఉవాచ:- శంకరుడు పలికాడు.

వత్స యద్వై ప్రియం కామం యచ్చాపి సురవల్లభమ్ ।
ప్రాప్స్యసే వద కల్యాణం నాన్యథా త్వం మనఃకృథాః ॥ 166 ॥

నాయనా! నీకిష్టమైన కోరికగాని, దేవవల్లభునిగా పదవిగాని నీకు శుభాన్ని కలిగించేదేదైనా పొందగలవు కోరుకొనుము. నీమనస్సులో వేరువిధముగా బాధపడకు.

పిప్పలాద ఉవాచ:- పిప్పలాదుడు పలికాడు.

యే గంగాయామాప్లుతా ధర్మనిష్ఠాః సంపశ్యన్తి త్వత్పదాబ్జం మహేశ ।
సర్వాన్కామానాప్నువన్తు ప్రసహ్య దేహాన్తే తే పదమాయాన్తు శైవమ్ ॥ 167 ॥

ఓ మహేశా! ఎవరైతే ధర్మనిష్ఠులై గంగానదిలో స్నానంచేసి నీ పాదపద్మములను దర్శించుకుంటారో వారు తమకోరికల నత్యధికముగా పొందవలయును. మరియు దేహావసానమున కైలాసమును పొందవలయును.

తాతః ప్రాప్తస్త్వత్పదం చామ్బికా మే నాథ ప్రాప్తా పిప్పలశ్చామరాశ్చ ।
సుఖం ప్రాప్తా నాథనాథం విలోక్య త్వాం పశ్యేయుస్త్వత్పదం తే ప్రయాన్తు ॥ 168 ॥

ప్రభూ! నాతల్లిదండ్రులు చెట్లూ, రావియూ, దేవతలూ నీ స్థానమును పొందిరి. నిన్ను చూచి సుఖమును పొందిరి. వారిప్పుడు కైలాసమునకు వెళ్ళవలయును. నిన్ను చూడవలయును. నిన్నాశ్రయించియుండ వలయును.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా పిప్పలాదం దేవదేవో మహేశ్వరః ।
అభినంద్య చ తం దేవైః సార్థం వాక్యమథాబ్రవీత్ ॥ 169 ॥

దేవదేవుడైన మహేశ్వరుడు పిప్పలాదునితో నట్లేయని పలికి అభినందించి దేవతలతో నిట్లనెను.

దేవా అపి ముదా యుక్తా నిర్భయాస్తత్కృతాద్భయాత్ ।
ఇదమూచుః సర్వ ఏవ దాధీచం శివసంనిధౌ ॥ 170 ॥

దేవతలు కూడా సంతోషించినవారై, అతనివలన కలిగిన భయమునుండి విముక్తులై వారందరూ శివునిసన్నిధిలో దధీచి కుమారుడగు పిప్పలాదునితో నిట్లన్నారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

సురాణాం యదభీష్టంచ త్వయా కృతమసంశయమ్ ।
పాలితా దేవదేవస్య ఆజ్ఞా త్రైలోక్యమండనీ ॥ 171 ॥

దేవతల కిష్టమైన దానిని నీవు చేసితివి. దీనిలో సందేహమేమీ లేదు. ముల్లోకముల కలంకారమగు దేవదేవుని ఆజ్ఞను శిరసావహించితివి.

యాచితం చ త్వయా పూర్వం పరార్థం నాఽఽత్మనే ద్విజ ।
తస్మాదన్యతమం బ్రూహి కించిద్దాస్యామహే వయమ్ ॥ 172 ॥

ఓ ద్విజుడా! నీవు పూర్వం ఇతరులకొరకే కోరితివి! నీ కొరకేమియు కోరలేదు. ఇప్పుడేదైనా కోరుకొనుము కొంచమైనా మేమిత్తుము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

పునః పునస్తదేవోచుః సురసంఘా ద్విజోత్తమమ్ ।
కృతాంజలిపుటః పూర్వం నత్వా శంభుసురానిదమ్ ॥
ఉవాచ పిప్పలాదశ్చ ఉమాం నత్వా చ పిప్పలాన్ ॥ 173 ॥

ఆ బ్రాహ్మణునితో దేవతలు మాటిమాటికదేయనిరి. వారికి చేతులు జోడించి, శివునకు, పార్వతికి, పిప్పలులకు, దేవతలకు నమస్కరించి పిప్పలాదు డిట్లనెను.

పిప్పలాద ఉవాచ:- పిప్పలాదుడు పలికాడు.

పితరౌ ద్రష్టుకామోఽస్మి సదా మే శబ్దగోచరౌ ।
తే ధన్యాః ప్రాణినో లోకే మాతాపిత్రోర్వశే స్థితాః ॥ 174 ॥

నేనెప్పుడు పిలిచినా అప్పుడు నాతల్లిదండ్రులను చూడవలయును. ఈలోకంలో తలిదండ్రులవశంలో ఉండే జీవులే ధన్యులు.

శుశ్రూషణపరా నిత్యం తత్పాదాజ్ఞా ప్రతీక్షకాః ।
ఇన్ద్రియాణి శరీరం చ కులం శక్తిం ధియం వపుః ॥ 175 ॥

పరిలభ్య తయోఃకృత్యే కృతకృత్యో భవేత్స్వయమ్ ।
పశూనాం పక్షిణాం చాపి సులభం మాతృదర్శనమ్ ॥ 176 ॥

వారికి నిత్యము సేవచేయుట, వారుచెప్పినది వినుట ఈ ఇంద్రియములు, శరీరము, కులము, శక్తి, బుద్ధి, దేహసౌందర్యమూ వారి వలననే పొంది స్వయముగా కృతకృత్యుడగును. పశువులకూ, పక్షులకూ తల్లిదర్శనము సులభముగా నగును.

దుర్లభం మమ తచ్చాపి పృచ్ఛే పాపఫలంను కిమ్ ।
దుర్లభం చ తథా చేత్స్యాత్సర్వేషాం యస్యకస్యచిత్ ॥ 177 ॥

నోపపద్యేత సులభం మత్తో నాన్యోఽస్తి పాపకృత్ ।
తయోర్దర్శనమాత్రం చ యది ప్రాప్స్యే సురోత్తమాః ॥ 178 ॥

"నాకు మాతృదర్శనం లభించలేదు. నేను ఏం పాపం చేశానో చెప్పు" దానిఫలం ఏమిటి? అందరికి మాతృదర్శనం దుర్లభమే అయితే ఏ ఒక్కనికీ తల్లిని చూడ్డం సులభంగా లభించి ఉండదు కదా! నా కంటే పాపాత్ముడు మరొకడు లేడు. నాకు వారి దర్శనం చేతనే అది సులభమగును. నా అంత పాపాత్ముడు లేడు. ఓ దేవతలారా! వారి దర్శనము మాత్రము నేను పొందినట్లయితే,

మనో వాక్కాయ కర్మభ్యః ఫలం ప్రాప్తం భవిష్యతి ।
పితరౌ యే న పశ్యన్తి సముత్పన్నాస్తు సంసృతౌ ॥
తేషాం మహాపాతకానాం కః సంఖ్యా కర్తుమీశ్వరః ॥ 179 ॥

నా మనోవాక్కాయ కర్మలఫలాన్ని పొందినట్లగును. లోకంలో పుట్టి తల్లిదండ్రులను ఎవరు చూడలేరో వారుచేసిన మహాపాతకముల సంఖ్యను లెక్కించగల నాథుడెవరు?

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తదృషేర్వచనం శ్రుత్వా మిథః సంమన్త్ర్య తే సురాః ।
విమాన వరమారూఢౌ పితరౌ దంపతీ శుభౌ ॥ 180 ॥

ఇట్లుపలికిన ఋషిమాటలను విన్న దేవతలు పరస్పరమూ సంప్రదించుకొని పుణ్యదంపతులగు నీతల్లిదండ్రులు శ్రేష్ఠమైన విమానమునధిరోహించి,

తవ సందర్శనాకాంక్షౌ ద్రక్ష్యసే త్వద్య నిశ్చితమ్ ।
విషాదం లోభమోహౌ చ త్యక్త్వా చిత్తం శమం నయ ॥ 181 ॥

నిన్ను చూచుటను కోరుచున్నవారిని ఈరోజు నిశ్చయముగా నీవు దర్శించగలవు. దుఃఖమును, లోభమోహములను వదిలి శాంతినొందుము.

పశ్య పశ్యేతి తం ప్రాహుర్దాధీచం సురసత్తమాః ।
విమానవరమారుఢౌ స్వర్గిణౌ స్వర్ణభూషణౌ ॥ 182 ॥

తవ దర్శనాకాంక్షౌ పితరౌ దంపతీశుభౌ ।
వీజ్యమానౌ సురస్త్రీభిః స్తూయమానౌ చ కిన్నరైః ॥ 183 ॥

దధీచి కుమారునితో దేవతలు చూడుచూడుమనిరి. విమానమునెక్కి బంగారు ఆభరణములను ధరించిన స్వర్గలోకవాసులగు, నీ తల్లిదండ్రులిద్దరూ శుభమగు దంపతులు. దేవతాస్త్రీలు వింజామరలను వీచుచుండగా, కింనరులు స్తోత్రము చేయుచుండగా నిన్నుచూచుటకు వచ్చిరని చెప్పిరి.

దృష్ట్వా స మాతాపితరౌ ననామ శివసన్నిధౌ ।
హర్షబాష్పాశ్రునయనౌ సకథంచిదువాచ తౌ ॥ 184 ॥

శివసన్నిధిలో తన తల్లిదండ్రులను చూచి యతడు నమస్కరించెను. ఆనందాతిరేకముతో అశ్రునయనులైన వారితో అతడెలాగో ప్రయత్నించి నిట్లు పలికెను.

పుత్ర ఉవాచ:– కుమారుడు పలికాడు.

తారయన్త్యేవ పితరావన్యే పుత్రాః కులోద్వహాః ।
అహంతు మాతురుదరే కేవలం భేదకారణమ్ ॥
ఏవంభూతేఽపి తౌ మోహాత్పశ్యేయమతిదుర్మతిః ॥ 185 ॥

కులభారమును వహించు ఇతరపుత్రులు తల్లిదండ్రులను తరింపచేయుదురు. 'పున్నామనరకాత్ త్రాయత ఇతి పుత్రః' అంటారు. నేను మాత్రం తల్లి గర్భమును భేదించుటకే పుట్టియున్నాను. ఇట్లయినా కూడా మోహంతో దుర్మతినైన నేను వారిద్దరిని చూడాలని ఆశపడ్డాను.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తావాలోక్య తతో దుఃఖాద్వక్తుం నైవ శశాక సః ।
దేవాశ్చ మాతాపితరౌ పిప్పలాదమథాబ్రువన్ ॥ 186 ॥

వారిని చూచి అతడు దుఃఖోద్వేగముతో మాట్లాడలేకపోయెను. అప్పుడు దేవతలూ, అతని తల్లిదండ్రులూ పిప్పలాదునితో ఇట్లన్నారు.

దేవాఊచుః :– దేవతలు పలికారు.

ధన్యస్త్వం పుత్రలోకేషు యస్య కీర్తిర్గతా దివమ్ ।
సాక్షాత్కృతస్త్వయా త్ర్యక్షో దేవాశ్చాఽఽశ్వాసితాస్త్వయా ॥
త్వయా పుత్రేణ సల్లోకా న క్షీయన్తే కదాచన ॥ 187 ॥

నాయనా! నీవు ధన్యుడవు. నీ కీర్తిస్వర్గమువరకు వ్యాపించినది. ముక్కంటిని సాక్షాత్కరింపచేసుకున్నావు. దేవతలను కూడా ఓదార్చినావు. నీవంటి పుత్రుడుంటే పుణ్యలోకములెప్పుడూ క్షీణించవు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

పుష్పవృష్టిస్తదా స్వర్గాత్పపాత తస్య మూర్ధని ।
జయశబ్దః సురైరుక్తః ప్రాదుర్భూతో మహామునే ॥ 188 ॥

ఓ మహామునీ! అప్పుడు అతని తలపై పుష్పవర్షము కురిసెను. దేవతలందరూ జయజయధ్వానము చేసిరి.

ఆశిషం తు సుతే దత్వా దధీచిః సహభార్యయా ।
శంభుం గంగాం సురాన్నత్వా పుత్రం వాక్యమథాబ్రవీత్ ॥ 189 ॥

దధీచి తన భార్యతోగూడా కుమారుని ఆశీర్వదించి శివునకూ, గంగకూ, దేవతలకూ నమస్కరించి కొడుకుతో నిట్లనెను.

దధీచిరువాచ:– దధీచి పలికాడు.

ప్రాప్య భార్యాం శివే భక్తిం కురు గంగాం చ సేవయ ।
పుత్రానుత్పాద్య విధివద్యజ్ఞానిష్ట్వా సదక్షిణాన్ ॥
కృతకృత్యస్తతో వత్స ఆక్రమస్వ చిరం దివమ్ ॥ 190 ॥

నాయనా! వివాహమునుజేసుకుని భార్యను పొంది శివునియందు భక్తినుంచి గంగానదిని సేవించుము. విధిపూర్వకము సంతానమును గని, విధి పూర్వకముగా దక్షిణలతోగూడిన యజ్ఞములననుష్ఠించి కృతకృత్యుడవై శాశ్వతమగు స్వర్గమునలంకరించుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

కరోమ్యేవమితి ప్రాహ దధీచిం పిప్పలాశనః ।
దధీచిః పుత్రమాశ్వాస్య భార్యయా చ పునః పునః ॥ 191 ॥

అనుజ్ఞాతః సురగణైః పునః స దివమాక్రమత్ ।
దేవా అప్యూచిరే సర్వే పిప్పలాదం ససంభ్రమాః ॥ 192 ॥

దధీచికుమారుడగు పిప్పలాదుడు అట్లే చేయుదునని తండ్రికి చెప్పెను. దధీచి భార్యతో గూడ పుత్రుని మాటిమాటికి ఊరడించి, దేవతలవద్ద సెలవుదీసుకొని తిరిగి స్వర్గముచేరెను. దేవతలు కూడా ఆశ్చర్యముతో పిప్పలాదునితోనిట్లనిరి.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

కృత్యాం శమయ భద్రంతే తదుత్పన్నం మహానలమ్ ॥ 193 ॥

కృత్యనూ, దానివలన పుట్టినగొప్ప అగ్నినీ శమింపజేయుము నీకు శుభమగును.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

పిప్పలాదస్తు తానాహ న శక్తోఽహం నివారణే ।
అసత్యం నైవ వక్తాఽహం యూయం కృత్యాం తు బ్రూత తామ్ ॥ 194 ॥

పిప్పలాదుడు వారితో నేను నివారించుటకశక్తుడను. నేనబద్ధమాడుటలేదు. కావాలంటే మీరు ఆ కృత్యనడుగుడు.

మాం దృష్ట్వా సా మహారౌద్రా విపరీతం కరిష్యతి ।
తామేవ గత్వా విబుధాః ప్రోచుస్తే శాన్తికారణమ్ ॥ 195 ॥

నన్ను చూచి మహారౌద్రురాలైన కృత్య విపరీతము చేయగలదు. అప్పుడు దేవతలే కృత్యవద్దకువెళ్ళి శాంతికారణమడిగిరి.

అనలం చ యథాప్రీతి తే ఉభే నేత్యవోచ తామ్ ।
సర్వేషాం భక్షణా యైవ సృష్టాచాహం ద్విజన్మనా ॥ 196 ॥

అగ్నినిగూడా ప్రీతిపూర్వకముగా నడిగిరి. కాని వారిద్దరుకాదనిరి. అందరినీ భక్షించుటకొరకే ఆ బ్రాహ్మణుడు నన్ను సృష్టించినాడు.

తథా చ మత్ప్రసూతోఽగ్నిరన్యథా తత్కథం భవేత్ ।
మహాభూతాని పంచాపి స్థావరం జంగమం తథా ॥ 197 ॥

సర్వమస్మన్ముఖే విద్యాద్వక్తవ్యం నావశిష్యతే ।
మయా సంమన్త్ర్య తే దేవా పునరూచురుభావపి ॥ 198 ॥

అట్లే నానుండి పుట్టిన అగ్నివేరుగానెట్లుండును? పంచభూతములూ, అట్లే స్థావరములూ, జంగమములూ, అన్నియును మా నోటియందే యుండును. ఇక నాచే చెప్పదగింది ఏమీలేదు. అప్పుడు దేవతలు బాగా ఆలోచించి మళ్ళీ వారిద్దరితో ఇట్లన్నారు.

భక్షయేతాముభౌ సర్వం యథానుక్రమతస్తథా ।
వడవాऽపి సురానేవమువాచ శృణు నారద ॥ 199 ॥

మీరిద్దరూ యథానుక్రమముగా అంతయూ భక్షించుడు. ఓ నారదా! అప్పుడు వడవా కూడా దేవతలతోనిట్లనెను. వినుము.

వడవోవాచ:- వడవా పలికాడు.

భవతా మిచ్ఛయా సర్వం భక్ష్యం మే సురసత్తమాః ॥ 200 ॥

ఓ దేవతలారా! మీ కోరికప్రకారం నాకంతా తినదగినదే.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

వడవా సా నదీజాతా గంగయా సంగతా మునే ।
తద్భవస్తు మహానగ్నిర్య ఆసీదతిభీషణః ॥
తమాహురమరావహ్నిం భూతానామాదితో విదుః ॥ 201 ॥

ఓ మునీ! వడవ నదీరూపిణియై గంగతో సంగమించెను. దానినుండి పుట్టిన అగ్ని గొప్ప భీషణరూపమును ధరించెను. దానినే భూతములలో మొదటి అగ్నిగా దేవతలు తెలుసుకొన్నారు.

సురా ఊచుః :– దేవతలు పలికారు.

ఆపోజ్యేష్ఠతమాజ్ఞేయస్తథైవ ప్రథమం భవాన్ ।
తత్రాప్యపాం పతిం జ్యేష్ఠం సముద్రమశనం కురు ॥
యథైవ తు వయం బ్రూమో గచ్ఛ భుంక్ష్వ యథాసుఖమ్ ॥ 202 ॥

నీరన్నింటికన్న పెద్దది అట్లే నీవును మొదటివాడవు. అక్కడకూడా జలాధిపతియగు సముద్రుని కబలించుము. మేమెట్లుచెప్పుచున్నామో అట్లే వెళ్ళి తృప్తిగా నారగించుము.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

అనలస్త్వమరానాహ ఆపస్తత్ర కథం త్వహమ్ ।
వ్రజేయం యది మాం తత్ర ప్రాపయన్త్వుదకం మహత్ ॥ 203 ॥

భవన్త ఏవ తేఽప్యాహుః కథం తేఽగ్నే గతిర్భవేత్ ।
అగ్నిరప్యాహ తాన్దేవాన్కన్యా మాం గుణశాలినీ ॥ 204 ॥

హిరణ్యకలశే స్థాప్య నయేద్యత్ర గతిర్మమ ।
తస్య తద్వచనం శ్రుత్వా కన్యామూచుః సరస్వతీమ్ ॥ 205 ॥

అప్పుడగ్నిదేవతలతో నీరక్కడవున్నది నేనక్కడకు ఎలా వెళ్ళగలను? ఆ సముద్రమువద్దకు నన్ను మీరే చేర్చుడు. అనగానే దేవతలు ఓ అగ్నీ! నీవక్కడికి ఎలా వెళ్తావు అన్నారు. అప్పుడు అగ్ని వారితో గుణశాలినియగు కన్య నన్ను, బంగారు కలశములో నుంచుకొని నేను వెళ్ళవలసిన చోటునకు తీసుకొనిపోవలయును. అతని మాటను విన్న దేవతలు కన్యయగు సరస్వతి నడిగిరి.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

నయైనమనలం శీఘ్రం శిరసా వరుణాలయమ్ ॥ 206 ॥

ఈ అగ్నిని తలపై ధరించి త్వరగా సముద్రము వద్దకు చేర్చుము.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

సరస్వతీ సురానాహ నైకా శక్తా చ ధారణే ।
యుక్తా చతసృభిః శీఘ్రం వహేయం వరుణాలయమ్ ॥ 207 ॥

ఆ మాటవిని సరస్వతిదేవతలతో నాకొక్కదానికి దానిని ధరించుశక్తి లేదు. మరోనలుగురితోనైతే త్వరగా సముద్రమువద్దకు చేర్చుదును.

సరస్వత్వా వచః శ్రుత్వా గంగాం చ యమునాం తథా ।
నర్మదాం తపతీం చైవ సురాః ప్రోచుః పృథక్పృథక్ ॥ 208 ॥

సరస్వతి మాటను విన్న దేవతలు గంగా యమునా నర్మదా తపతులతో వేరువేరుగా చెప్పిరి.

తాభిః సమన్వితోవాహ హిరణ్యకలశేఽనలమ్ ।
సంస్థాప్య శిరసాధార్య తా జగ్ముర్వరుణాలయమ్ ॥ 209 ॥

బంగారు కలశములో నగ్నినుంచుకొని తలమీద ధరించివారితో కలిసిమోసెను. వారంతా సముద్రము వద్దకు వెళ్ళిరి.

సంస్థాప్య యత్ర దేవేశః సోమనాథో జగత్పతిః ।
అధ్యాస్తే విబుధైః సార్ధం ప్రభాసే శశిభూషణః ॥ 210 ॥

ప్రాపయామాసురనలం పంచనద్యః సరస్వతీ ।
అధ్యాస్తే చ మహానగ్నిః పిబన్ వారి శనైః శనైః ॥ 211 ॥

ఎక్కడైతే చంద్రభూషణుడు దేవేశుడు జగత్పతియగు సోమనాథుడు దేవతలందరితో కలిసి విరాజిల్లుచున్నాడో అక్కడ అగ్నినుంచి ఆ సరస్వతితో కలిసి ఐదునదులు అగ్నిని తీసుకువెళ్లి పొందించారు. ఆ గొప్ప అగ్ని మెల్లమెల్లగా నీటిని త్రాగుతు అక్కడనేయుండెను.

తతః సురగణాః సర్వే శివమూచుః సురోత్తమమ్ ॥ 212 ॥

అటు తరువాత దేవతాగణములన్నియు సురోత్తముడైన శివునడిగిరి.

దేవా ఊచుః :-దేవతలు పలికారు.

అస్థ్నాం చ పావనం బ్రూహి అస్మాకం చ గవాం తథా ॥ 213 ॥

ఎముకలూ, గోవులూ, మేము పావనమెట్లగుదుమో చెప్పుమనిరి.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

శివః ప్రాహ తదా సర్వాన్ గంగామాప్లుత్య యత్నతః ।
దేవాశ్చ గావస్తత్పాపాన్ముచ్యన్తే నాత్ర సంశయః ॥ 214 ॥

అప్పుడు శివుడు వారందరితో గంగయందు స్నానమునాచరించినచో దేవతలూ గోవులూ ఆ పాపము నుండి విముక్తులగుదురు.

ప్రక్షాలితాని చాస్థీని ఋషిదేహభవాన్యథ ।
తాని ప్రక్షాలనాదేవ తత్ర ప్రాప్తాని పూతతామ్ ॥ 215 ॥

ఋషిదేహమునుండి వచ్చిన ఎముకలను ప్రక్షాలన చేసినారు. అక్కడ ప్రక్షాలన చేసినందువలననే అవి పవిత్రత నొందినవి.

యత్ర దేవా ముక్తపాపాస్తత్తీర్థం పాపనాశనమ్ ।
తత్ర స్నానం చ దానం చ బ్రహ్మహత్యావినాశనమ్ ॥ 216 ॥

ఎక్కడ దేవతలు పాపవిముక్తులైనారో ఆ తీర్థమును పాపనాశనమంటారు. అక్కడ స్నానదానములు చేసినచో బ్రహ్మహత్యాపాపము నశించును.

గవాం చ పావనం యత్ర గోతీర్థం తదుదాహృతమ్ ।
తత్ర స్నానాన్మహాబుద్ధి ర్గోమేధఫలమాప్నుయాత్ ॥ 217 ॥

ఎక్కడ గోవులు పావనమైనవో దానిని గోతీర్థమంటారు. అక్కడ స్నానముచేసిన గొప్పబుద్ధి కలిగి గోమేధ ఫలము లభించును.

యత్ర తద్బ్రాహ్మణాస్థీని ఆసన్ పుణ్యాని నారద ।
పితృతీర్థం తు వై జ్ఞేయం పితౄణాం ప్రీతివర్ధనమ్ ॥ 218 ॥

ఓ నారదా! ఎక్కడ బ్రాహ్మణుని అస్థులు పవిత్రములైనవో దానిని పితృతీర్థమంటారు. అది పితరులకు ప్రీతిని పెంచునది.

భస్మాస్థి నఖ రోమాణి ప్రాణినో యస్య కస్యచిత్ ।
తత్ర తీర్థే సంక్రమేరన్ యావచ్చంద్రార్కతారకమ్ ॥ 219 ॥

స్వర్గే వాసో భవేత్తస్య అపి దుష్కృత కర్మిణః ।
తథా చక్రేశ్వరాత్తీర్థాత్ త్రీణి తీర్థాని నారద ॥
తతః పూతాః సురగణా గావః శంభుమథాబ్రువన్ ॥ 220 ॥

ఏ ప్రాణివైనా బూడిదా, కేశాలూ, గోళ్లూ ఆ తీర్థములో నిమజ్జనము చేసినచో చంద్రసూర్యనక్షత్రము లున్నంతవరకు, నారదా! వారికి స్వర్గలోకనివాసము లభించును. వారెంత దుష్కృత కర్మలను చేసినను సరే. అట్లే చక్రేశ్వరతీర్థమునుండి మూడు తీర్థములు వచ్చినవి. అప్పుడు పవిత్రులైన దేవతలు గోవులు శివుణ్ణి అడిగారు.

గో సురా ఊచుః :– గోవులు, దేవతలడిగారు.

యామః స్వం స్వమధిష్ఠానమత్ర సూర్యః ప్రతిష్ఠితః ।
అస్మిన్ స్థితే దినకరే సురాః సర్వే ప్రతిష్ఠితాః ॥ 221 ॥

ఇక్కడ సూర్యుడు ప్రతిష్ఠించబడినాడు. సూర్యుడున్నచో దేవతలంతా ఉన్నట్లే. ఇక మామానెలవులకు వెళ్ళెదము.

భవేయుర్జగతామీశ తదనుజ్ఞాతుమర్హసి ।
సూర్యో హ్యాత్మాఽస్య జగతస్తస్థుషశ్చ సనాతనః ॥ 222 ॥

ఓ జగన్నాథా! మాకు సెలవిప్పించుము. ఈ జగత్తునకంతా సూర్యుడే ఆత్మ, స్థిరమైనవాడు, సనాతనుడు.

దివాకరో దేవమయస్తత్రాస్మాభిః ప్రతిష్ఠితః ।
యత్ర గంగా జగద్ధాత్రీ యత్ర వై త్ర్యంబకః స్వయమ్ ॥
సురవాసం ప్రతిష్ఠానం భవేద్యత్ర చ త్ర్యంబకమ్ ॥ 223 ॥

దేవమయుడైన సూర్యుడు మాచే ప్రతిష్ఠించబడినాడు ఎక్కడైతే జగద్ధాత్రి అయిన గంగయూ, ఎక్కడైతే స్వయముగా శివుడూ ఉన్నాడో, దేవతల నిలయంగా ప్రతిష్ఠానమై యుండునో అది త్ర్యంబకము అనే తీర్థము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఆపృచ్ఛ్య పిప్పలాదం తం సురాః స్వం సదనం యయుః ।
పిప్పలాః కాలపర్యాయే స్వర్గం జగ్మురథాక్షయమ్ ॥ 224 ॥

దేవతలు పిప్పలాదుని యడిగి తమ సదనమునకు వెళ్ళిరి. పిప్పలులు కాలము తీరగానే అక్షయమగు స్వర్గమును చేరాయి.

పాదపానాం పదం విప్రః పిప్పలాదః ప్రతాపవాన్ ।
క్షేత్రాధిపత్యే సంస్థాప్య పూజయామాస శంకరమ్ ॥ 225 ॥

విప్రుడగు ప్రతాపవంతుడైన పిప్పలాదుడు వృక్షములయొక్క పాదమును క్షేత్రాధిపత్యముగా స్థాపించి శంకరుని పూజించుచుండెను.

దధీచిసూనుర్మునిరుగ్రతేజా అవాప్య భార్యాం గౌతమస్యాఽఽత్మజాం చ ।
పుత్రానవాప్యాథ శ్రియం యశశ్చ సుహృజ్జనైః స్వర్గమవాప ధీరః ॥ 226 ॥

దధీచి కుమారుడు ఉగ్రతేజుడగు ఆ ముని గౌతముని యొక్క కూతురును భార్యగా పొంది, కుమారులను గని సంపదనూ కీర్తినీ పొంది తన స్నేహజనముతో నా ధీరుడు స్వర్గమును చేరెను.

తతః ప్రభృతి తత్తీర్థం పిప్పలేశ్వరముచ్యతే ।
సర్వక్రతుఫలం పుణ్యం స్మరణాదఘనాశనమ్ ॥ 227 ॥

అప్పటినుండి ఆ తీర్థమునకు పిప్పలేశ్వరతీర్థమని పేరు. ఆ తీర్థమునుస్మరించినంతమాత్రముననే పాపములన్నియు నశించి అన్ని యాగములూ చేసిన పుణ్యము లభించును.

కిం పునః స్నానదానాభ్యామాదిత్యస్య తు దర్శనాత్ ।
చక్రేశ్వరః పిప్పలేశో దేవదేవస్య నామనీ ॥ 228 ॥

ఇంకా వేరేఏల? స్నానదానములవలన సూర్యదర్శనము వలన అన్నియు లభించును. అక్కడ దేవదేవునికి చక్రేశ్వరుడు పిప్పలేశుడని రెండు పేర్లు గలవు.

సరహస్యం విదిత్వా తు సర్వకామానవాప్నుయాత్ ।
సూర్యస్య చ ప్రతిష్ఠానాత్ సురవాసే ప్రతిష్ఠితే ॥
ప్రతిష్ఠానం తు తత్క్షేత్రం సురాణామపి వల్లభమ్ ॥ 229 ॥

రహస్యమైనతత్త్వాన్ని ఈ తెలుసుకొన్నవాడు సమస్త కోరికలను పొందును. సూర్యుని ప్రతిష్ఠించినందువలన, దేవతలనివాసము ప్రతిష్ఠించినందువలన దేవతలకుకూడా ప్రతిష్ఠానక్షేత్రం ఇష్టమైంది.

ఇతీదమాఖ్యానమతీవ పుణ్యం పఠేత వా యః శృణుయాత్ స్మరేద్వా ।
స దీర్ఘజీవీ ధనవాన్ ధర్మయుక్తశ్చాన్తే స్మరన్ శంభుముపైతి నిత్యమ్ ॥ 230 ॥

ఇట్లు ఈ ఆఖ్యానము మిక్కిలి పుణ్యమైనది. దీనినెవరు పఠించినా, విన్నా, స్మరించినా అట్టివారు దీర్ఘాయుష్మంతులై, ధనవంతులై, ధర్మయుక్తులై చివరకు శివునిస్మరిస్తూ శాశ్వతమైన స్థానమును పొందుదురు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే చక్రేశ్వర పిప్పలేశ్వర పాపప్రణాశన గౌతమీతీర్థపితృతీర్థ సూర్యప్రతిష్ఠాన కోట్యాది తీర్థవర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥ 40 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యము నందలి చక్రేశ్వర, పిప్పలేశ్వర, పాపప్రణాశన గౌతమీతీర్థపితృతీర్థ సూర్యప్రతిష్ఠాన కోట్యాది తీర్థవర్ణనమను పేరుగల నలబైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకచత్వారింశోऽధ్యాయః - నలబై ఒకటవ అధ్యాయం

నాగతీర్థ వర్ణనమ్ - నాగతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నాగతీర్థమితిఖ్యాతం సర్వకామప్రదం శుభమ్ ।
యత్ర నాగేశ్వరో దేవః శృణు తస్యాపి విస్తరమ్ ॥ 1 ॥

ఎక్కడ నాగేశ్వరుడనే దేవుడున్నాడో దానిని నాగతీర్థమని అంటారు. అది సమస్తకోరికలను తీర్చునది. శుభప్రదమైనది. దానిని గూర్చి విస్తరముగా చెప్పుచున్నాను వినుము.

ప్రతిష్ఠాన పురే రాజా శూరసేన ఇతి శ్రుతః ।
సోమవంశ భవః శ్రీమాన్ మతిమాన్ గుణసాగరః ॥ 2 ॥

ప్రతిష్ఠాన పురమున శూరసేనుడను రాజుండెను. అతడు చంద్రవంశములో పుట్టినవాడు. గొప్పశ్రీమంతుడు, మంచిబుద్ధిమంతుడు, సద్గుణసముద్రుడు.

పుత్రార్థం స మహాయత్నమకరో త్ప్రియయా సహ ।
తస్య పుత్రశ్చిరాదాసీత్సర్పో వై భీషణాకృతిః ॥ 3 ॥

ఆ రాజు తనకు పుత్రుడుకలగాలని భార్యతో గూడా ఎంతో ప్రయత్నించెను. చాలాకాలమునకతనికి భయంకరాకారము గలిగిన సర్పము పుత్రునిగా పుట్టెను.

పుత్రం తం పోషయామాస శూరసేనో మహీపతిః ।
రాజ్ఞః పుత్రః సర్ప ఇతి న కశ్చద్వేవ్దతే జనః ॥ 4 ॥

ఆ శూరసేనమహారాజు సర్పాకారంలో ఉన్న పుత్రుని పెంచుచుండెను. రాజుగారికుమారుడు సర్పమని జనులెవరికీ తెలియదు.

అన్తర్వర్తీ పరో వాऽపి మాతరం పితరం వినా ।
ధాత్రేయ్యపి న జానాతి నామాత్యో న పురోహితః ॥ 5 ॥

తల్లిదండ్రులు తప్ప అంతఃపురములోని వారు కానీ, ఇతరులు కానీ, దాది కాని, మంత్రి కాని, పురోహితుడు కాని ఎరుగరు.

తం దృష్ట్వా భీషణం సర్పం సభార్యో నృపసత్తమః ।
సంతాపం నిత్యమాప్నోతి సర్పాద్వరమపుత్రతా ॥ 6 ॥

ఆ రాజశ్రేష్ఠుడు భీషణాకారంలో నున్న ఆ సర్పమును చూచి సర్పము పుత్రుడుగా ఉండటం కంటే సంతానము లేకున్నా బాగుండునని భార్యతోగూడా బాధపడుచుండెను.

విశేషో౽త్ర మహాసర్పో వక్తి నిత్యం మనుష్యవత్ ।
స సర్పః పితరం ప్రాహ కురుచూడామపి క్రియామ్ ॥ 7 ॥

మహాసర్పము తండ్రితో మనుష్యునివలె మాట్లాడును. ఇది విశేషము ఆ సర్పమొకనాడు తండ్రితో తనకు ముండన సంస్కారము చేయుమని యడిగెను.

తథోపనయనం చాపి వేదాధ్యయనమేవ చ ।
యావద్వేదం నచాధీతే తావచ్ఛూద్రసమో ద్విజః ॥ 8 ॥

అట్లే ఉపనయనసంస్కారముచేసి వేదాధ్యయనమును ప్రారంభించుమనెను. ఎంతవరకైతే వేదమును అధ్యయనము చేయడో ఆ బ్రాహ్మణుడు శూద్రునితో సమానము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛృత్వా పుత్రవచః శూరసేనో౽తి దుఃఖితః ।
బ్రాహ్మణం కంచనా౽౽నీయ సంస్కారాది తదా౽కరోత్ ॥

అధీత వేదః సర్పో౽పి పితరం చాబ్రవీదిదమ్ ॥ 9 ॥

ఆ విధముగా పలికిన కుమారుని మాటవిని శూరసేనుడు మిక్కిలి దుఃఖించెను. అప్పుడు ఒక బ్రాహ్మణుని పిలిపించి సంస్కారాదులు చేసెను. వేదాధ్యయనము చేసిన ఆ సర్పము తండ్రితో నిట్లనెను.

సర్ప ఉవాచ:– సర్పము పలికింది.

వివాహం కురు మే రాజన్ స్త్రీ కామో౽హం నృపోత్తమ ।
అన్యథా౽పి చ కృత్యం తే న సిద్ధ్యే దితి మే మతిః ॥ 10 ॥

ఓ రాజా! నేను స్త్రీకామాతురుడనైయున్నాను. నాకు వివాహము చేయుము. ఓ రాజసత్తమా! వేరే విధముగా నీవేమి చేసినా అది సిద్ధించదని నా అభిప్రాయము.

జనయిత్వా౽౽త్మజాన్ వేద విధినా౽ఖిల సంస్కృతీః ।
న కుర్యా ద్యః పితా తస్య నరకాన్నాస్తి నిష్కృతిః ॥ 11 ॥

సంతానమును పుట్టించి వారికి విధిపూర్వకముగా సంస్కారములన్నింటిని చేయవలయునని తెలుసుకొనుము. ఏ తండ్రి అయితే అట్లు చేయడో అతనికి నరకమున కంటే వేరే నిష్కృతి లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

విస్మితః స పితా ప్రాహ సుతం తమురగాకృతిమ్ ॥ 12 ॥

శూరసేన ఉవాచ :– శూరసేనుడు పలికాడు.

యస్య శబ్దాదపి త్రాసం యాన్తి శూరాశ్చ పూరుషాః ।
తస్మై కన్యాం తు కో దద్యాత్ వద పుత్ర! కరోమి కిమ్ ॥ 13 ॥

ఆశ్చర్యమును పొందిన తండ్రి సర్పాకారంతోనున్న పుత్రునితో ఇట్ల పలికెను. సర్పము యొక్క శబ్దం వలన కూడా శూరులైన పురుషలు కూడా భయపడెదురు. ఆ సర్పమునకు కన్యను ఎవరిత్తురు? పుత్రా! ఏమి చేయవలయునో చెప్పుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్పితుర్వచనం శ్రుత్వా సర్పః ప్రాహ విచక్షణః ॥ 14 ॥

ఆ విధముగా మాట్లాడిన తండ్రిమాట విన్న విచక్షణగల సర్పమిట్లనెను.

సర్ప ఉవాచ:- సర్పము పలికింది.

వివాహా బహవో రాజన్ రాజ్ఞాం సన్తి జనేశ్వర ।
ప్రసహ్యాఽఽహరణం చాపి శస్త్రైర్వైవాహ ఏవ చ ॥ 15 ॥

రాజా! రాజులకు వివాహములనేకవిధములుగా నుండును. ఓ రాజా! ఆయుధములతో కాని బలవంతముగా తీసుకొనివచ్చికాని చేయుట వివాహపద్ధతే.

జాతే వివాహే పుత్రస్య పితాఽసౌ కృతకృద్భవేత్ ।
నో చేదత్రైవ గంగాయాం మరిష్యే నాత్ర సంశయః ॥ 16 ॥

కుమారునికి వివాహమైతే తండ్రి కృతకృత్యుడగును. లేకుంటే నెనిక్కడే ఈ గంగలో పడిమరణిస్తాను. దీనిలో సందేహమేమీ వద్దు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్పుత్ర నిశ్చయం జ్ఞాత్వా హ్యపుత్రో నృపసత్తమః ।
వివాహార్థమమాత్యాంస్తానాహూయేదం వచోఽబ్రవీత్ ॥ 17 ॥

ఆ కుమారుని నిశ్చయం తెలుసుకున్న తర్వాత అపుత్రుడైన ఆ రాజశ్రేష్ఠుడు. వివాహము కొరకు మంత్రులను పిలిపించి ఇట్లు పలికెను.

శూరసేన ఉవాచ:- శూరసేనుడు పలికాడు.

నాగేశ్వరో మమ సుతో యువరాజో గుణాకరః ।
గుణవాన్ మతిమాన్ శూరో దుర్జయః శత్రుతాపనః ॥ 18 ॥

నా కుమారుడు నాగేశ్వరుడు, యువరాజు గుణాకరుడు. మంచిగుణవంతుడు, బుద్ధిమంతుడు, శూరుడు, జయించశక్యము గానివాడు, శత్రువులను తపింపచేయువాడు.

రథే నాగే స ధనుషి పృథివ్యాం నోపమీయతే ।
వివాహస్తస్య కర్తవ్యో హ్యహం వృద్ధస్తథైవ చ ॥ 19 ॥

రథచాలనమునందు గజనియంత్రణమునందు ధనువు ప్రయోగించుటయందతడు సమానముగా చెప్పనలవి కాదు. అతనికి వివాహము చేయవలెను నేనావృద్ధుడను.

రాజ్యభారం సుతే న్యస్య నిశ్చిన్తోఽహం భవామ్యతః ।
న దార సంగ్రహో యావత్తావత్పుత్రో మమ ప్రియః ॥ 20 ॥

బాలభావం నో జహాతి తస్మాత్సర్వేఽను మన్య చ ।
వివాహాయాథ కుర్వన్తు యత్నం మమ హితే రతాః ॥ 21 ॥

నా రాజ్యభారమును కుమారుని యందుంచి నేను నిశ్చింతగా యుందును. అతనికెంతవరకు వివాహముకాదో అంతవరకు కుమారుడు నాకిష్టుడైన కుమారుడు బాల్య చాపల్యమును వదలుటలేదు. అందువలన నా హితమునుకోరే మీరంతా అనుమతించి అతని వివాహమునకై ప్రయత్నము చేయుడు.

న మే కాచిత్తదా చిన్తా కృతోద్వాహో యదాఽఽత్మజః ।
సుతే న్యస్త భరా యాన్తి కృతినస్తపసే వనమ్ ॥ 22 ॥

నా కుమారుడెప్పుడైతే గృహస్థుడౌతాడో నాకప్పుడిక ఏ చింతా ఉండదు. పుణ్యం చేసుకున్నవారు తమ కుమారుని యందు భారముంచి తపస్సుకై అడవికి వెళ్ళుదురు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అమాత్యా రాజవచనం శ్రుత్వా సర్వే వినీతవత్ ।
ఊచుః ప్రాంజలయో హర్షాద్రాజానం భూరితేజసమ్ ॥ 23 ॥

మంత్రులందరు రాజుమాటను విని వినయంగా నమస్కరించుచు గొప్పతేజస్సుగల రాజుతో సంతోషంగా, ఇట్లు పలికారు.

అమాత్యా ఊచుః :– మంత్రులు పలికారు.

తవ పుత్రో గుణజ్యేష్ఠస్త్వం చ సర్వత్ర విశ్రుతః ।
వివాహే తవ పుత్రస్య కిం మన్త్ర్యం కింతు చిన్త్యతే ॥ 24 ॥

నీ కుమారుడు గుణములలో గొప్పవాడు. నీవు అంతటా ప్రసిద్ధిచెందినవాడవు. నీ కుమారుని వివాహ విషయంలో ఇక ఆలోచన ఎందుకు? చింతించుట ఎందుకు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అమాత్యేషు తథోక్తేషు గమ్భీరో నృపసత్తమః ।
పుత్రం సర్వం త్వమాత్యానాం నచాఽఽఖ్యాతి న తే విదుః ॥ 25 ॥

మంత్రులావిధముగా అనగానే రాజశ్రేష్ఠుడు గంభీరముగానుండెను. తన పుత్రుడు సర్పమని మంత్రులకు చెప్పలేదు. ఆ మంత్రులావిషయమునెరుగరు.

రాజా పునస్తానువాచ కా స్యాత్కన్యా గుణాధికా ।
మహావంశ భవః శ్రీమాన్ కో రాజా స్యాద్గుణాశ్రయః ॥ 26 ॥

రాజు తిరిగి వారితో నిట్లనెను. గుణాధికురాలైన కన్య ఎవరు? మహావంశసంభవుడు, శ్రీమంతుడు సద్గుణాశ్రయుడైన రాజెవరున్నారు?

సంబన్ధయోగ్యః శూరశ్చ యత్సంబంధః ప్రశస్యతే ।
తద్రాజవచనం శ్రుత్వా హ్యమాత్యానాం మహామతిః ॥ 27 ॥

సంబంధం కలుపుకొనుటకు యోగ్యుడు, శూరుడైనవాడు, అందరూ ఈ సంబంధమును చూచి ప్రశంసించే యోగ్యుడెవరు? అని పలుకగా ఆ రాజుమాటను విని మంత్రులందరిలోను గొప్ప తెలివి గలవాడు,....

కులీనః సాధురత్యన్తం రాజకార్య హితేరతః ।
రాజ్ఞోమతిం విదిత్వా తు ఇంగితజ్ఞోఽబ్రవీదిదమ్ ॥ 28 ॥

మంచి వంశంలో పుట్టినవాడు, మిక్కిలిసాధువు, రాజకార్యమునందు హితముగోరువాడు, యుక్తాయుక్తవిచక్షణ గలవాడు అయిన మంత్రి రాజు భావమును గ్రహించి ఇట్లు పలికెను.

అమాత్య ఉవాచ:- మంత్రి పలికాడు.

పూర్వదేశే మహారాజ విజయోనామ భూపతిః ।
వాజి వారణరత్నానాం యస్య సంఖ్యా న విద్యతే ॥ 29 ॥

మహారాజా! తూరుపు దేశమున విజయుడను పేరుగల రాజుండెను. అతనికి అసంఖ్యాకములైన గజతురగ రత్న సంపదలుండెను.

అష్టౌ పుత్రా మహేష్వాసా మహారాజస్య ధీమతః ।
తేషాం స్వసా భోగవతీ సాక్షాల్ల క్ష్మీరివాపరా ॥
తవ పుత్రస్య యోగ్యా సా భార్యా రాజన్ మయోదితా ॥ 30 ॥

ఆ ధీమంతుడగు రాజునకు గొప్ప పరాక్రమముగల ఎనమండుగురు కుమారులుండిరి. వారికి సోదరి భోగవతీ అనునది సాక్షాత్తుగ అపరలక్ష్మివలె యుండును. ఓ రాజా! ఆమెయే నీ కుమారుని భార్యయగుటకు యోగ్యురాలని నేను చెప్పుచున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వృద్ధామాత్య వచః శ్రుత్వా రాజా తం ప్రత్యభాషత ॥ 31 ॥

వృద్ధామాత్యుని మాట విని రాజు అతనితో నిట్లనెను.

రాజోవాచ:- రాజు పలికాడు.

సుతా తస్య కథం మేఽస్య సుతస్య స్యాద్వదస్వ తత్ ॥ 32 ॥

ఆయన కూతురుతో నా కుమారునికి వివాహము ఎట్లు జరుగునో చెప్పుము.

వృద్ధామాత్య ఉవాచ:- వృద్ధమంత్రి పలికాడు.

లక్షితోఽసి మహారాజ యత్తే మనసి వర్తతే ।
యచ్ఛూరసేన కృత్యం స్యాదనుజానీహి మాం తతః ॥ 33 ॥

మహారాజా! నీ మనస్సులోనేమున్నదో తెలియబడ్డావు. శూరసేనుడేమి చేయవలయునో దానిగూర్చి నా కనుజ్ఞనీయుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వృద్ధామాత్య వచః శ్రుత్వా భూషణాచ్ఛాదనోక్తిభిః ।
సంపూజ్య ప్రేషయామాస మహత్యా సేనయా సహ ॥ 34 ॥

వృద్ధమంత్రి మాటను విని అతనికి నగలను బహుమానముగానిచ్చి గౌరవించి రహస్యముగా కొన్నిమాటలను చెప్పి గొప్ప సైన్యమునిచ్చి పంపెను.

స పూర్వదేశ మాగత్య మహారాజం సమేత్య చ ।
సంపూజ్య వివిధైర్వాక్యైరుపాయైర్నీతిసంభవైః ॥ 35 ॥

ఆ మంత్రి తూరుపుదేశమునకు వచ్చి, మహారాజువద్దకు చేరి అతనిని అనేక నీతివాక్యములతో, అనేక రాజోపయోగ ఉపాయములతో కూడిన మాటలతో గౌరవించి,

మహారాజసుతాయాశ్చ భోగవత్యా మహామతిః ।
శూరసేనస్య నృపతేః సూనో ర్నాగస్య ధీమతః ॥ 36 ॥

మహారాజు కూతురు గొప్ప తెలివిగల భోగవతికి, శూరసేన మహారాజు యొక్క కుమారుడు బుద్ధిమంతుడగు నాగునకు,

వివాహాయాకరోత్సన్ధిం మిథ్యామిథ్యవచోక్తిభిః ।
పూజయామాస నృపతిం భూషణాచ్ఛాదనాదిభిః ॥ 37 ॥

వివాహము జరిపించుటకు ఉన్నవి లేనివి కల్పించి చెప్పి రాజుగారితో సంధి కుదుర్చుకొని గౌరవంగా రాజుకు బహుమానముగా నగలు వస్త్రములు సమర్పించి గౌరవించెను.

అవాప్య పూజాం నృపతిర్దదామీత్యవదత్తదా ।
తత ఆగత్య రాజ్ఞోఽసౌ వృద్ధామాత్యో మహామతిః ॥ 38 ॥

కానుకలను స్వీకరించిన రాజు కూతురి నిత్తుననెను, అప్పుడు ఆ వృద్ధామాత్యుడు తిరిగిరాజు వద్దకు వచ్చి,

శూరసేనస్య తద్వృత్తం వైవాహిక మవేదయత్ ।
తతో బహుతిథే కాలే వృద్ధామాత్యో మహామతిః ॥ 39 ॥

శూరసేనునకా వివాహ సంబంధమైన విషయమునంతటిని నివేదించెను. ఆ తరువాత కొంతకాలమునకు ఆ మహామతియైన వృద్ధామాత్యుడు,

పునర్బలేన మహతా వస్త్రాలంకారభూషితః ।
జగామ తరసా సర్వైరన్యైశ్చ సచివైర్వృతః ॥ 40 ॥

చాలా సైన్యమును వస్త్రాలంకార భూషణములు దీసుకొని చాలామంది మంత్రులను దీసుకొని వెళ్ళెను.

వివాహాయ మహామాత్యో మహారాజస్య బుద్ధిమాన్ ।
సర్వం ప్రోవాచ వృద్ధోఽసావమాత్యః సచివైర్వృతః ॥ 41 ॥

అక్కడ మహారాజుతో బుద్ధిమంతుడైన ఆ మహామాత్యుడు మిగతా మంత్రులతో కలిసి విషయమంతయు చెప్పెను.

వృద్ధామాత్య ఉవాచ:- వృద్ధమంత్రి పలికాడు.

అత్రాఽఽగన్తుం నేచ్ఛతి స శూరసేనస్య భూపతేః ।
పుత్రో నాగ ఇతిఖ్యాతో బుద్ధిమాన్ గుణసాగరః ॥ 42 ॥

శూరసేనమహారాజు యొక్క కుమారుడు బుద్ధిమంతుడు గుణసాగరుడునగు నాగుడగు ఆ కుమారుడు ఇక్కడకు వచ్చుటకు ఇష్టపడుటలేదు.

క్షత్రియాణాం వివాహాశ్చ భవేయుర్బహుధా నృప ।
తస్మాచ్ఛస్త్రైరలంకారైర్వివాహః స్యాన్మహామతే ॥ 43 ॥

ఓ రాజా! రాజులు చేసుకునే వివాహాలు అనేక విధములుగా నుంటాయి. అందువలన ఓ మహామతీ! చక్కగా అలంకరించిన ఆయుధములకు వివాహము చేయుడు.

క్షత్రియా బ్రాహ్మణాశ్చైవ సత్యాం వాచం వదన్తి హి ।
తస్మాచ్ఛస్త్రైరలంకారైర్వివాహస్త్వనుమన్యతామ్ ॥ 44 ॥

క్షత్రియులు బ్రాహ్మణులు సత్యవాక్కునే పలుకుతారుకదా! అందువలన అలంకరించి శస్త్రములకు వివాహముచేయుటకు అనుమతించుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వృద్ధామాత్యవచః శ్రుత్వా విజయో రాజసత్తమః ।
మేనే వాక్యం తథా సత్యమమాత్యం భూపతిం తదా ॥ 45 ॥

వృద్ధమంత్రి చెప్పిన మాటవిన్న రాజసత్తముడైన విజయుడు అమాత్యుడు పలికిన సత్యమైన మాటను, అట్లేరాజును అంగీకరించెను.

వివాహమకరో ద్రాజా భోగవత్యాః సవిస్తరమ్ ।
శస్త్రేణ చ యథాశాస్త్రం ప్రేషయామాస తాం పునః ॥ 46 ॥

రాజు భోగవతికి శాస్త్రప్రకారముగా శస్త్రముతో వివాహము అంగరంగవైభవముగా చేసి తిరిగి ఆమెను పంపించెను.

స్వానమాత్యాంస్తథా గాశ్చ హిరణ్యతురగాదికమ్ ।
బహు దత్వాఽథ విజయో హర్షేణ మహతాయుతః ॥ 47 ॥

విజయమహారాజు భోగవతితో తనమంత్రులను గోవులను, బంగారము, గుఱ్ఱములు మొదలైన వానిని అనేకముగా ఎంతో సంతోషముగా ఇచ్చి పంపెను.

తామాదాయాథ సచివా వృద్ధామాత్య పురోగమాః ।
ప్రతిష్ఠానమథాభ్యేత్య శూరసేనాయ తాం స్నుషామ్ ॥ 48 ॥

ఆమెను తీసుకొని వృద్ధామాత్యునిముందుంచుకొని మంత్రులు ప్రతిష్ఠాన నగరమునకేగి శూరసేన మహారాజుకు ఆ నూతనవధువగు కోడలిని,

న్యవేదయంస్తథోచుస్తే విజయస్య వచో బహు ।
భూషణాని విచిత్రాణి దాస్యో వస్త్రాదికం చ యత్ ॥ 49 ॥

విజయుడు సమర్పించిన అనేక విచిత్రమైన భూషణములను, సేవికలను, వస్త్రాదులను సమర్పిస్తూ విజయుడు చెప్పిన కుశలాది వచనములను,

నివేద్య శూరసేనాయ కృతకృత్యా బభూవిరే ।
విజయస్య తు యేఽమాత్యా భోగవత్యా సహాఽగతాః ॥ 50 ॥

శూరసేన మహారాజుకు విన్నవించి కృతకృత్యులైనారు. భోగవతితో పాటు వచ్చిన విజయునియొక్క ఏ మంత్రులున్నారో,

తాన్ పూజయిత్వా రాజాఽసౌ బహుమాన పురఃసరమ్ ।
విజయాయ యథా ప్రీతిస్తథా కృత్వా వ్యసర్జయత్ ॥ 51 ॥

వారినందరినీ రాజు బహుమానములతో గౌరవించి, విజయునకు ప్రీతి కలుగునట్లుగా కానుకలిచ్చి పంపెను.

విజయస్య సుతా బాలా రూపయౌవనశాలినీ ।
శ్వశ్రూశ్వశురయోర్నిత్యం శుశ్రూషన్తీ సుమధ్యమా ॥ 52 ॥

విజయునికూతురు రూపయౌవన శాలినియగు ఆ బాలసుందరి తన అత్తమామలకు నిత్యము సేవలు చేయుచు,

భోగవత్యాశ్చ యో భర్తా మహాసర్పోఽతి భీషణః ।
ఏకాన్తదేశే విజనే గృహే రత్నసుశోభితే ॥ 53 ॥

భోగవతియొక్క భర్త మహాభయంకరమైన సర్పము ఏకాన్తప్రదేశంలో ఎవరూ లేని రత్నమణిమయ శోభితమైన ఇంటిలో,

సుగన్ధ కుసుమాకీర్ణే తత్రాఽఽస్తే సుఖశీతలే ।
సర్పోఽసౌ మాతరం ప్రాహ పితరం చ పునః పునః ॥ 54 ॥

మంచిసువాసనలతోనిండి చల్లని శీతలప్రదేశంలోనుంటూ ఆ సర్పము తన తల్లిదండ్రులను మాటిమాటి కడుగుచుండెను.

మమ భార్యా రాజపుత్రీ కిం మాం నైవోపసర్పతి ।
తత్పుత్ర వచనం శ్రుత్వా సర్పమాతేదమబ్రవీత్ ॥ 55 ॥

నాభార్య రాజకుమారి నాచెంతకెందుకు వచ్చుటలేదు? ఆ మాటను విని కుమారునితో నా సర్పమాత యిట్లనెను.

ధాత్రికే గచ్ఛ సుభగే శీఘ్రం భోగవతీం వద ।
తవ భర్తా సర్ప ఇతి తతః సా కిం వదిష్యతి ॥ 56 ॥

ఓ సుందరమైన చెలియా! నీవు త్వరగా వెళ్ళి భోగవతితో నీభర్త సర్పమని చెప్పుము. అప్పుడు ఆమె ఏమి చెప్పుతుందో వినుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ధాత్రికా చ తథేత్యుక్త్వా గత్వా భోగవతీం తదా ।
రహోగతా ఉవాచేదం వినీత వద పూర్వవత్ ॥ 57 ॥

ధాత్రిక కూడా అట్లే అని చెప్పి త్వరత్వరగా భోగవతి వద్దకు వెళ్ళి వినయముగా అపూర్వముగా నిట్లు పలికెను.

ధాత్రికోవాచ:– ధాత్రిక పలికాడు.

జానేఽహం సుభగే భద్రే భర్తారం తవ దైవతమ్ ।
న చాఽఽఖ్యేయం త్వయా క్వాపి సర్పో న పురుషో ధ్రువమ్ ॥ 58 ॥

ఓ మంగళకరురాలా! సుందరీ! నీ భర్తను దైవాంశ సంభూతునిగా నేను తలచుచున్నాను. నీవు ఎక్కడా చెప్పరాదు. అతడు పురుషుడు కాదు. సర్పము ఇది నిశ్చయము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తస్యాస్తద్వచనం శ్రుత్వా భోగవత్య బ్రవీదిదమ్ ॥ 59 ॥

అట్లు పలికిన ధాత్రిక మాటను విని భోగవతి యిట్లనెను.

భోగవత్యువాచ:– భోగవతి పలికింది.

మానుషీణాం మనుష్యో హి భర్తా సామాన్యతో భవేత్ ।
కిం పునర్దేవ జాతిస్తు భర్తా పుణ్యేన లభ్యతే ॥ 60 ॥

మానవులుగా పుట్టినవారికి మనిషి భర్తగా నుండుట సామాన్యముగా జరిగేది. ఎంతో పుణ్యం చేస్తే తప్ప దేవజాతివాడు భర్తగా లభించుటయనునది జరుగును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భోగవత్యాస్తు తద్వాక్యం సా చ సర్వం న్యవేదయత్ ।
సర్పాయ సర్పమాత్రే చ రాజ్ఞే చైవ యథాక్రమమ్ ॥ 61 ॥

ధాత్రిక భోగవతి పలికిన మాటలన్నియు సర్పమునకు, సర్పమాతకు, రాజుకు యథాక్రమముగా నివేదించెను.

రురోద రాజా తద్వాక్యాత్ స్మృత్వా తాం కర్మణో గతిమ్ ।
భోగవత్యపి తాం ప్రాహ ఉక్తపూర్వాం పునః సఖీమ్ ॥ 62 ॥

ఆ మాట విని రాజు కర్మగతిని తలుచుకొని దుఃఖించెను. భోగవతికూడా తిరిగి చెలికత్తెతో పూర్వము చెప్పినది చెప్పెను.

భోగవత్యువాచ:– భోగవతి పలికింది.

కాన్తం దర్శయ భద్రం తే వృథా యాతి వయో మమ ॥ 63 ॥

నాకు భర్తను చూపించు, నా వయస్సు వృథాగా పోతుంది. నీకు శుభమగును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః సా దర్శయామాస సర్పం తమతి భీషణమ్ ।
సుగంధ కుసుమాకీర్ణే శయనే సా రహోగతా ॥ 64 ॥

అటు తరువాత ఆమె వేగంగా వెళ్ళి సుగంధపరిమల భరితమైన పూల పడకమీద నిద్రించుచున్న మిక్కిలి భయంకరమైన సర్పమును చూపెను.

తం దృష్ట్వా భీషణం సర్పం భర్తారం రత్నభూషితమ్ ।
కృతాంజలి పుటా వాక్యమవదత్కాంత మంజసా ॥ 65 ॥

రత్నభూషితుడై భయంకరమగు సర్పాకారంలోనున్న తన భర్తను జూచి రెండుచేతులతో నమస్కరిస్తూ భర్తతో నిట్లనెను.

భోగవత్యువాచ:- భోగవతి పలికింది.

ధన్యాఽస్మ్యనుగృహీతాఽస్మి యస్యా మే దైవతం పతిః ॥ 66 ॥

నేను ధన్యాత్మురాలిని నాకు దైవమగువానిని భర్తగా అనుగ్రహించినారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా శయనే స్థిత్వా తం సర్పం సర్పభావనైః ।
ఖేలయామాస తన్వంగీ గీతైశ్చైవాంగ సంగమైః ॥ 67 ॥

ఇట్లు పలికి ఆ సుందరి ఆ పడకమీద కూర్చుని సర్పభావనలతో చక్కని పాటలతో అంగసంగములతో ఆ పాముతో నాడుచుండెను.

సుగంధ కుసుమైః పానైస్తోషయామాస తం పతిమ్ ।
తస్యా శ్చైవ ప్రసాదేన సర్ప స్యాసీత్ స్మృతిర్మునే ॥
స్మృత్వా సర్వం దైవకృతం రాత్రౌ సర్పోఽబ్రవీత్ ప్రియామ్ ॥ 68 ॥

ఆమె తన భర్తను చక్కని సువాసనగల పూలతో, పానములతో సంతోషపెట్టుచుండెను. ఓ మునీ! ఆమెయొక్క లాలనతో ఆ సర్పమునకు పూర్వస్మృతి కలిగెను. ఇదంతా దైవము వలననే జరిగినదని తెలుసుకున్న సర్పము రాత్రిపూట ఏకాంతమునందు తన ప్రియురాలితో చెప్పెను.

సర్ప ఉవాచ:-సర్పము పలికింది.

రాజకన్యాఽపి మాం దృష్ట్వా న భీతాఽసి కథం ప్రియే ।
సోవాచ దైవ విహితం కోఽతిక్రమితు మీశ్వరః ॥
పతిరేవ గతిః స్త్రీణాం సర్వదైవ విశేషతః ॥ 69 ॥

ఓ ప్రియా! నీవు రాజకన్యవై యుండి కూడా నన్ను చూచి భయపడుటలేదెందుకు? అప్పుడామె అతనితో దైవనిర్ణయమనే ప్రభువైనా అతిక్రమించగలడా? అన్ని దైవములకంటే స్త్రీలకు విశేషముగా భర్తయే దిక్కు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

తతః ప్రసన్నో నాగేంద్రః ప్రాహ భార్యాం మహామతిః ॥ 70 ॥

అప్పుడా నాగేంద్రుడు సంతోషించి తనభార్యతో నిట్లనెను.

సర్ప ఉవాచ:- సర్పము పలికింది.

తుష్టోఽస్మి తవ భక్త్యాహం కిం దదామి తవేప్సితమ్ ।
తవప్రసాదాచ్చార్వంగి సర్వస్మృతిరభూదియమ్ ॥ 71 ॥

ఓ సుందరీ! నీ పతిభక్తికి సంతోషించాను. నీ కేమి కావలయునో చెప్పుము ఇచ్చెదను. నీయనుగ్రహము వలన నాకు నా పూర్వస్మృతియంతయు కలిగినది.

శప్తోఽహం దేవదేవేన కుపితేన పినాకినా ।
మహేశ్వర కరే నాగః శేషపుత్రో మహాబలః ॥ 72 ॥

కోపించిన దేవదేవుడైన పినాకపాణి నన్ను శపించాడు. మహేశ్వరుని చేతిలో ఆదిశేషుని కుమారుడు మహాబలవంతుడగు నాగుడనే నేను.

సోఽహం పతిస్త్వం చ భార్యా నామ్నా భోగవతీ పురా ।
ఉమావాక్యాజ్జహాసోచ్చైః శమ్భుః ప్రీతో రహోగతః ॥ 73 ॥

నేను భర్తను, నీవు భార్యవు. నీపేరు పూర్వము భోగవతి, పార్వతి మాటలను విని ఏకాంతముననున్న శివుడు పెద్దగా నవ్వెను.

మమాపి చాఽఽగతం భద్రే హాస్యం తద్దేవ సంనిధౌ ।
తతస్తు కుపితః శంభుః ప్రాదాచ్ఛాపం మమేదృశమ్ ॥ 74 ॥

ఓ మంగళకరురాలా! అప్పుడాస్వామి సన్నిధిలో నాకు కూడా నవ్వు వచ్చినది. అప్పుడు అది చూచి కోపించిన శివుడు నాకిటువంటి శాపము నిచ్చెను.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

మనుష్యయోనౌ త్వం సర్పో భవితా జ్ఞానవాన్ ఇతి ॥ 75 ॥

మనుష్యజాతిలో జ్ఞానవంతుడగు సర్పముగా జన్మించమని శపించెను.

సర్ప ఉవాచ:- సర్పము పలికింది.

తతః ప్రసాదితః శంభుస్త్వయా భద్రే మయా సహ ।
పునశ్చోక్తం తేన భద్రే గౌతమ్యాం మమ పూజనమ్ ॥ 76 ॥

ఆ తరువాత శివుడు నీతోపాటుగా నన్ననుగ్రహించినాడు. మళ్ళీ శివుడు అన్నాడు గౌతమీనది యందు నన్ను పూజించుము.

కుర్వతో జ్ఞాన మాధాస్యే యదా సర్పాకృతేస్తవ ।
తదా విశాపో భవితా భోగవత్యాః ప్రసాదతః ॥ 77 ॥

నీవు సర్పాకారములోనున్నప్పుడు నన్ను పూజించి ఎప్పుడు జ్ఞానమును పొందుతావో అప్పుడు భోగవతి యొక్క అనుగ్రహముతో శాపవిముక్తిని పొందగలవు.

తస్మాదిదం మమాపన్నం తవ చాపి శుభాననే ।
తస్మాన్నీత్వా గౌతమీం మాం పూజాం కురు మయా సహ ॥ 78 ॥

ఓ శుభాననా! అందువలన నాతోపాటు నీకు ఇట్లు జరిగినది. అందువలన నన్ను తీసుకొని గౌతమీనది దగ్గరికి వెళ్ళి నాతోపాటు పూజచేయుము.

తతో విశాపో భవితా ఆవాం యావః శివం పునః ।
సర్వేషాం సర్వదాஉஉర్తానాం శివ ఏవ పరా గతిః ॥ 79 ॥

అప్పుడు శాపవిముక్తి కలిగి మనమిద్దరం తిరిగి శివుని చేరుకొనగలము. ఆర్తులైన వారందరికిని ఎప్పటికిని సదాశివుడే దిక్కు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా భర్తృవచనం సా భర్త్రా గౌతమీం యయౌ ।
తతః స్నాత్వా తు గౌతమ్యాం పూజాం చక్రే శివస్య తు ॥ 80 ॥

తన భర్తమాటను విని ఆమె భర్తను దీసుకొని గౌతమీనదికి వెళ్ళెను. ఆ నదిలో స్నానముచేసి గౌతమి యందు శివుని పూజను చేసెను.

తతః ప్రసన్నో భగవాన్ దివ్యరూపం దదౌ మునే ।
ఆపృచ్ఛ్య పితరౌ సర్పో భార్యయా గన్తుముద్యతః ॥
శివలోకం తతో జ్ఞాత్వా పితా ప్రాహ మహామతిః ॥ 81 ॥

ఓ మునీ! అప్పుడు శివుడు ప్రసన్నుడై దివ్యరూపమునిచ్చెను. ఆ సర్పము తలిదండ్రులనుజ్ఞ తీసుకొని భార్యతో గూడ శివలోకమునకు వెళ్ళుటకు సిద్ధమాయెను. అది తెలిసి మహామతియైన తండ్రి ఇట్లనెను.

పితోవాచ:- తండ్రి పలికాడు.

యువరాజ్యధరో జ్యేష్ఠః పుత్ర ఏకో భవానితి ।
తస్మాద్రాజ్యమశేషేణ కృత్వోత్పాద్య సుతాన్ బహూన్ ॥
యాతే మయి పరంధామ తతో యాహి శివం పురమ్ ॥ 82 ॥

జ్యేష్ఠకుమారుడు యువరాజుగా నుండవలయును. నీవొక్కడవే కుమారుడవు. అందువలన ఈ రాజ్యమును పూర్తిగా పాలించి అనేకమంది పుత్రులను గని, నేను పరమపదమునకు వెళ్ళిన తరువాత శివపురమునకు వెళ్ళుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా పితృవచస్తథేత్యాహ స నాగరాట్ ।
కామరూపమవాప్యాథ భార్యయా సహ సువ్రత ॥ 83 ॥

తండ్రిమాటను విన్న నాగరాజు అట్లేయని ఆ సువ్రతుడు తన భార్యతో గూడ కామరూపమును ధరించి,....

పిత్రామాత్రా తథా పుత్రై రాజ్యం కృత్వా సువిస్తరమ్ ।
యాతే పితరి స్వర్లోకం పుత్రాన్ స్థాప్య స్వకే పదే ॥ 84 ॥

తల్లిదండ్రులతోను అట్లే తనకుమారులతోను చాలాకాలము రాజ్యపరిపాలనచేసి, తన తండ్రి పరమపదించిన తరువాత తన కుమారులను తన స్థానంలో రాజ్యాభిషిక్తులనుచేసి,

భార్యామాత్యాదిసహితస్తతః శివ పురం యయౌ ।
తతః ప్రభృతి తత్తీర్థం నాగతీర్థమితి శ్రుతమ్ ॥ 85 ॥

ఆ తరువాత తన భార్యతో, అమాత్యులతోకలిసి శివపురమునకు వెళ్ళెను. అప్పటినుండి ఆ తీర్థమునకు నాగతీర్థమని పేరువచ్చినది.

యత్ర నాగేశ్వరో దేవో భోగవత్యా ప్రతిష్ఠితః ।
తత్ర స్నానం చ దానం చ సర్వక్రమ ఫలప్రదమ్ ॥ 86 ॥

ఎక్కడైతే భోగవతితోపాటు నాగేశ్వరదేవుని ప్రతిష్ఠించారో అక్కడ స్నానము చేసినా దానము చేసినా క్రతువులన్నీ చేసిన ఫలము లభించును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే నాగతీర్థవర్ణనం నామైక చత్వారింశోఽధ్యాయః ॥ 41 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములో నాగతీర్థవర్ణనమను పేరుగల నలభైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విచత్వారింశోఽధ్యాయః - నలభై రెండవ అధ్యాయం
దేవతీర్థమాతృతీర్థ ప్రతిష్ఠాన వర్ణనమ్ - దేవతీర్థమాతృతీర్థ ప్రతిష్ఠాన వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు

మాతృతీర్థమితి ఖ్యాతం సర్వసిద్ధి కరం నృణామ్ ।
ఆధిభిర్ముచ్యతే జన్తుస్తత్తీర్థ స్మరణాదపి ॥ 1 ॥

మాతృతీర్థమనునది చాలా ప్రసిద్ధిచెందినది కలదు. అది మానవులకు సర్వసిద్ధులను కలుగజేయును. ఆ తీర్థమును స్మరించినంతమాత్రముననే తాపత్రయములనుండి జీవుడు ముక్తుడగును.

దేవానామసురాణాం చ సంగరో భూ త్సుదారుణః ।
నాశక్నువంస్తదా జేతుం దేవా దానవసంగరమ్ ॥ 2 ॥

దేవతలకు రాక్షసులకు దారుణమైన యుద్ధము జరిగెను. దేవతలు దానవసంగరమును జయించుటకప్పుడు శక్తిలేనివారైరి.

తదాఽహమగమం దేవైస్తిష్ఠన్తం శూలపాణినమ్ ।
అస్తవం వివిధైర్వాక్యైః కృతాంజలిపుటః శనైః ॥ 3 ॥

అప్పుడు నేను దేవతలతో కొలువుతీరియున్న శివుని వద్దకు వెళ్ళితిని. అతనికి చేతులు జోడించి నమస్కరించుచు నెమ్మదిగా అనేక వాక్యములతో స్తుతించితిని.

సంమన్త్ర్య దేవైరసురైశ్చసర్వైర్యదాదృతం సంమథితుం సముద్రమ్ ।
యత్కాల కూటం సమభూన్మహేశ తత్త్వాం వినా కో గ్రసితుం సమర్థః ॥ 4 ॥

దేవాసురులందరితోను సంప్రదించి సముద్రమును మథించుటకు ఎప్పుడైతే నిశ్చయించినారో, ఆ మథించుటలో ఎప్పుడైతే కాలకూట విషము పుట్టినదో అప్పుడు ఓ మహేశా! నీవు తప్ప ఆ విషమును త్రాగుటకు సమర్థు లెవరున్నారు?

పుష్పప్రహారేణ జగత్త్రయం యః స్వాధీనమాపాదయితుం సమర్థః ।
మారో హరేఽప్యన్య సురాది వన్ద్యోవితాయమానో విలయం ప్రయాతః ॥ 5 ॥

తన పుష్పబాణములతాకిడితో ముల్లోకములను తనవశం చేసుకొనుటకు సమర్థుడు, అందరిని కలచువాడు విష్ణువు మున్నగు దేవతలందరిచే స్తుతింపబడువాడగు మన్మథుడు విలయమును పొందెను.

విమథ్య వారీశమనంగ శత్రో యదుత్తమం తత్తు దివౌకసేభ్యః ।
దత్వా విషం సంహరతేతి శోభాం ధత్తే మహత్త్వం త్వయి నిశ్చితం తత్ ॥ 6 ॥

ఓ మన్మథారీ! సముద్రమును మథించి దానినుండి ఉత్తమమైన దానిని దేవతలకిచ్చి విషమును ఉపసంహరించుమనునది నీయందునిశ్చితమైనది. అది మహత్త్వమును శోభను ధరించినది.

తతశ్చ తుష్టో భగవానాది కర్తా త్రిలోచనః ॥ 7 ॥

ఈ స్తోత్రమును విన్న పూజ్యుడు ఆదికర్తయగు ముక్కంటి సంతోషించెను.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

దాస్యేఽహం యదభీష్టం వో బ్రువన్తు సురసత్తమాః ॥ 8 ॥

ఓ దేవతా శ్రేష్ఠులారా! మీ కేమికావలయునో చెప్పుడు నేను మీకిచ్చెదను.

దేవా ఊచుః :- దేవతలు పలికిరి.

దానవేభ్యో భయం ఘోరం తత్రైహి వృషభధ్వజ ।
జహి శత్రూన్ సురాన్ పాహి నాథవన్తస్త్వయా ప్రభో ॥ 9 ॥

ఓ వృషభధ్వజా! దానవులవలన ఘోరమైన భయము ఏర్పడినది. ప్రభూ! నీవే మా రక్షకుడవు. అక్కడికి రమ్ము. శత్రువులను జయించుము. దేవతలను రక్షించుము.

నిష్కారణః సుహృచ్ఛంభో నా భవిష్యద్భవాన్యది ।
తదాఽకరిష్యన్ కిమివ దుఃఖార్తాః సర్వదేహినః ॥ 10 ॥

శివా! నీవు కారణం లేకుండానే మిత్రుడవుకాక పోయినట్లయితే దుఃఖార్తులైన సమస్తజీవులేమి చేయగలరు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్తస్తత్క్షణాత్ప్రాయాద్యత్ర తే దేవశత్రవః ।
తత్ర తద్యుద్ధమభవచ్ఛంకరేణ సురద్విషామ్ ॥ 11 ॥

ఇట్లు చెప్పగానే అతడు దానవులున్నచోటునకు వెళ్ళెను. అక్కడ శంకరునకు దానవులకు యుద్ధము జరిగెను.

తతస్త్రిలోచనః శ్రాన్తస్తమోరూపధరః శివః ।
లలాటా ద్వ్యపతంస్తస్య యుధ్యతః స్వేదబిన్దవః ॥ 12 ॥

అప్పుడా! శివుడు అలిసిపోయి తమోరూపమును ధరించెను. త్రిలోచనుడు. యుద్ధము చేయుచున్న అతని ఫాలభాగమునుండి చెమటబిందువులు పడెను.

స సంహరన్దైత్యగణాంస్తామసీం మూర్తిమాశ్రితః ।
తాం మూర్తిమసురా దృష్ట్వా మేరుపృష్ఠాద్భువం యయుః ॥ 13 ॥

అతడు తామసరూపమును ధరించి రాక్షసగణములను సంహరించుచుండెను. అసురులా తామసమూర్తిని చూచి మేరుపర్వతము వెనుక భాగమునుండి భూమిపైకి వెళ్ళిరి.

స సంహరన్ సర్వదైత్యాంస్తదాఽగచ్ఛద్భువం హరః ।
ఇతశ్చేతశ్చ భీతాస్తేఽధావన్ సర్వా మహీమిమామ్ ॥ 14 ॥

ఆ శివుడు దైత్యులందరిని చంపుకుంటూ అప్పుడు భూమిమీదకు వచ్చెను. దైత్యులందరు ఈ భూమిపైన ఇటునటు భయముతో పరుగెత్తిరి.

తథైవ కోపాద్రుద్రోఽపి శత్రూంస్తాననుధావతి ।
తథైవ యుధ్యతః శంభోః పతితాః స్వేదబిన్దవః ॥ 15 ॥

అట్లే కోపంతో శివుడు కూడా శత్రువులననుసరించి పరుగెత్తుచున్నాడు. శివుడు యుద్ధము చేయుచుండగా అట్లే చెమట బిందువులు పడెను.

యత్ర యత్ర భువం ప్రాప్తో బిన్దుర్మాహేశ్వరో మునే ।
తత్ర తత్ర శివాకారామాతరో జజ్ఞిరే తతః ॥ 16 ॥

ఓ మునీ! ఎక్కడెక్కడ శివుని చెమట బిందువులు భూమిమీద పడెనో అక్కడక్కడ వెంటనే శివాకారముతో మాతలుద్భవించిరి.

ప్రోచుర్మహేశ్వరం సర్వాః ఖాదామస్త్వసురానితి ।
తతః ప్రోవాచ భగవాన్ సర్వైః సురగణైర్వృతః ॥ 17 ॥

వారంతా మహేశ్వరునితో మేమంతా ఈ అసురులను తిందుమనిరి. అప్పుడు దేవతాగణము లన్నింటితో కూడిన పూజ్యుడగు శివుడిట్లనెను.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

స్వర్గాద్భువమనుప్రాప్తా రాక్షసాస్తే రసాతలమ్ ।
అనుప్రాప్తాస్తతః సర్వాః శృణ్వన్తు మమ భాషితమ్ ॥ 18 ॥

ఆ రాక్షసులందరు స్వర్గమునుండి భూమిని చేరారు. తరువాత భూమినుండి రసాతలమునకు చేరుదురు. మీరంతా నేను చెప్పబోవుమాట వినుడు.

యత్ర యత్ర ద్విషోయాన్తి తత్ర గచ్ఛన్తు మాతరః ।
రసాతలమను ప్రాప్తా ఇదానీం మద్భయాద్ద్విషః ॥
భవత్యోఽప్యను గచ్ఛన్తు రసాతలమనుద్విషః ॥ 19 ॥

ఎక్కడెక్కడికి శత్రువులు వెళ్ళుదురో మాతలుగూడా అక్కడికి వెళ్ళుడు. ఇప్పుడు నా వలన భయముతో శత్రువులు రసాతలమునకు చేరిరి. వారిని వెంబడించుచు మీరుకూడా రసాతలమునకు వెళ్ళుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తాశ్చ జగ్ముః భువం భిత్వా యత్ర తే దైత్య దానవాః ।
తాన్ హత్వా మాతరః సర్వాన్ దేవారీనతి భీషణాన్ ॥ 20 ॥

ఆ మాతలు భూమిని భేదించి ఆ దైత్యదానవులున్న చోటునకు వెళ్ళారు. దేవశత్రువులైన మహాభయంకరు లైన వారినందరిని ఆ మాతలు చంపి,

పునర్దేవానుపాజగ్ముః పథా తేనైవ మాతరః ।
గతాశ్చ మాతరో యావద్యావచ్చ పునరాగతాః ॥ 21 ॥

ఆ మాతలు ఏ మార్గంలో వెళ్ళినారో అదే మార్గంలో తిరిగి దేవతలను చేరిరి. ఆ మాతలు ఎంత మంది వెళ్ళినారో వారువెళ్ళి తిరిగివచ్చువరకు

తావద్దేవాః స్థితా ఆసన్ గౌతమీ తీరమాశ్రితాః ।
ప్రస్థానాత్తత్ర మాతౄణాం సురాణాంచ ప్రతిష్ఠితేః ॥ 22 ॥

మాతలు వచ్చునంతవరకు దేవతలందరు గౌతమీతీరము వద్ద ఉండిరి. ఆ మాతలు వచ్చు మార్గమున మాతల యొక్క దేవతలయొక్క ప్రతిష్ఠలు జరిగినవి.

ప్రతిష్ఠానం తు తత్క్షేత్రం పుణ్యం విజయవర్ధనమ్ ।
మాతౄణాం యత్ర చోత్పత్తిర్మాతృ తీర్థం పృథక్ పృథక్ ॥ 23 ॥

ప్రతిష్ఠలు జరిగినందువలన దానిని ప్రతిష్ఠానమన్నారు. ఆ క్షేత్రము పవిత్రమైనది. విజయమును పెంచునట్టిది. ఎక్కడ మాతలుద్భవించిరో అక్కడ వేరువేరుగా మాతృతీర్థమున్నది.

తత్ర తత్ర బిలాన్యాసన్ రసాతల గతాని చ ।
సురాస్తాభ్యో వరాన్ ప్రోచుర్లోకే పూజాం యథా శివః ॥ 24 ॥

రసాతలమువరకు కూడా అక్కడక్కడ బిలములుండెను. దేవతలా మాతలకు వరముల నిచ్చిరి. లోకంలో శివునకే విధంగా పూజలు జరుగునో,

ప్రాప్నోతి తద్వన్మాతృభ్యః పూజా భవతు సర్వదా ।
ఇత్యుక్త్వాఽన్తర్దధుర్దేవా ఆసంస్తత్రైవ మాతరః ॥ 25 ॥

అట్లే మాతలకు కూడా సర్వదా పూజయగును. అని చెప్పి దేవతలంతర్ధానమునొందిరి. మాతలక్కడే యుండిరి.

యత్ర యత్ర స్థితా దేవ్యో మాతృతీర్థం తతో విదుః ।
సురాణా మపి సేవ్యాని కిం పునర్మానుషాదిభిః ॥ 26 ॥

ఎక్కడెక్కడ మాతలున్నారో దానిని మాతృతీర్థమందరు. ఆ తీర్థములు దేవతలకు కూడా సేవించదగినవి. ఇక మనుష్యాదుల విషయములో చెప్పవలసినదేమున్నది?

తేషు స్నానమథో దానం పిత్యాణాం చైవ తర్పణమ్ ।
సర్వం తదక్షయం జ్ఞేయం శివస్య వచనం యథా ॥ 27 ॥

శివునిమాట ఎట్లు అక్షయమైనదో అట్లే ఆ తీర్థములయందు స్నానము, దానము, పితృదేవతలకు తర్పణము మున్నగు వన్నియు అక్షయమైన ఫలమునిచ్చునవని తెలియదగును.

యస్త్విదం శృణుయాన్నిత్యం స్మరేదపి పఠేత్తదా ।
ఆఖ్యానం మాతృ తీర్థానామాయుష్మాన్ స సుఖీ భవేత్ ॥ 28 ॥

ఈ మాతృతీర్థములకు సంబంధించిన ఆఖ్యానమును విన్నా, నిత్యం స్మరించినా, దీనిని చదివిన అతడు ఆయుష్మంతుడై సుఖమును పొందును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీ మాహాత్మ్యే స్వయమ్భు నారద సంవాదే దేవతీర్థ మాతృతీర్థ ప్రతిష్ఠాన వర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥ 42 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి స్వయంభువు నారద సంవాదములోని దేవతీర్థ మాతృతీర్థ ప్రతిష్ఠాన వర్ణనమను పేరుగల నలభై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిచత్వారింశోऽధ్యాయః - నలభై మూడవ అధ్యాయం
బ్రహ్మతీర్థ బ్రహ్మశిరో లింగ శివతీర్థాది షడశీతి తీర్థ వర్ణనమ్
బ్రహ్మతీర్థ బ్రహ్మశిరోలింగ శివతీర్థములు మొదలైన ఎనభైఆరు తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇదమప్యపరం తీర్థం దేవానామపి దుర్లభమ్ ।
బ్రహ్మతీర్థమితి ఖ్యాతం భుక్తిముక్తి ప్రదం నృణామ్ ॥ 1 ॥

దేవతలకు కూడా దుర్లభమైన మరొక తీర్థమున్నది. దానిని బ్రహ్మతీర్థమంటారు. ఇది మానవులకు భుక్తి ముక్తిని ప్రసాదించేది.

స్థితేషు దేవ సైన్యేషు ప్రవిష్టేషు రసాతలమ్ ।
దైత్యేషు చ మునిశ్రేష్ఠ తథా మాతృషు తానను ॥ 2 ॥

దేవతాసైన్యములు ఉండగా ఓ మునిశ్రేష్ఠా! అట్లే దైత్యులు, రసాతలమున ప్రవేశించగా మాతలు దైత్యులననుసరించిరి.

మదీయం పంచమం వక్త్రం గర్ధభాకృతి భీషణమ్
తద్వక్త్రం దేవసైన్యేషు మయి తిష్ఠత్యువాచ హ ॥ 3 ॥

నా ఐదవ ముఖము భయంకరమగు గార్ధభాకృతితో దేవసైన్యమున నేనుండగా నా ముఖము యందే ఉండునని పలికెను.

హే దైత్యాః కిం పలాయన్తే న భయం వోऽస్తు సత్వరమ్ ।
ఆగచ్ఛన్తు సురాన్ సర్వాన్ భక్షయిష్యే క్షణాదితి ॥ 4 ॥

ఓ దైత్యులారా! మీకు భయంలేదు. మీరెందుకు పరుగెత్తుతున్నారు. వారు వచ్చుచున్నారు. వారందరిని క్షణంలో భక్షించగలను.

నివారయన్తం మామేవం భక్షణాయోద్యతం తథా ।
తం దృష్ట్వా విబుధాః సర్వే విత్రస్తా విష్ణుమబ్రువన్ ॥ 5 ॥

భక్షించుటకు ప్రయత్నించుచున్న నన్నునివారించుచున్న ఆ విష్ణువును చూచి దేవతలందరు భయపడినవారే ఇట్లు పలికారు.

త్రాహి విష్ణో జగన్నాథ బ్రహ్మణోऽస్య ముఖం లున ।
చక్రభృద్విబుధానాహ ఛేద్మి చక్రేణ వై శిరః ॥ 6 ॥

ఓ జగన్నాథా! మమ్ము రక్షింపుము. ఈ బ్రహ్మ యొక్క ముఖమును ఛేదించుము. అప్పుడు చక్రధారి యగు విష్ణువు దేవతలతో ఈ చక్రముతో శిరస్సును ఛేదింతు ననెను.

కిం తు తచ్ఛిన్నమేవేదం సంహారే త్సచరా చరమ్ ।
మన్త్రం బ్రూమోఽత్ర విబుధాః శ్రూయతాం సర్వమేవ హి ॥ 7 ॥

కాని ఛేదించిన ఆ ముఖమే సకల చరాచరమును సంహరించగలదు. ఓ దేవతలారా! నేనో ఆలోచనను చెప్పుచున్నాను. అందరూ వినుడు.

త్రినేత్రః కశిరచ్ఛేత్తా స చ ధర్తే న సంశయః ।
మయా చ శంభుః సర్వైశ్చ స్తుతః ప్రోక్తస్తథైవ చ ॥ 8 ॥

శివుడు బ్రహ్మ శిరస్సును ఛేదించును. అతడు దానిని ధరించును. దీనిలో నేసంశయమూలేదు. నేను శివునికి చెప్పినాను. అందరూ శివుని స్తుతించినారు.

యాగః క్షణీ దృష్టఫలేఽసమర్థః సనైవ కర్తుః ఫలతీతి మత్వా ।
ఫలస్య దానే ప్రతిభూర్జటీతి నిశ్చిత్య లోకః ప్రతికర్మ యాతః ॥ 9 ॥

యజ్ఞము దృష్టఫలమీయజాలదని క్షణికమని ఆ కర్త ఇది ఫలించదని తలచి, ఫలము దానము చేయుటలో శివుడే సమర్థుడని నిశ్చయించి లోకము ప్రతికర్మ చేయుచున్నది.

తతః సురేశః సంతుష్టో దేవానాం కార్యసిద్ధయే ।
లోకానాముపకారార్థం తథేత్యాహ సురాన్ ప్రతి ॥ 10 ॥

అటుతర్వాత సురేశుడు అయిన శివుడు సంతుష్టుడై దేవతల కార్యము సిద్ధించుటకు, లోకమునకుపకారము చేయుటకే దేవతలతో సరే యనెను.

తద్వక్త్రం పాపరూపం యద్భీషణం లోమహర్షణమ్ ।
నికృత్య నఖశస్త్రైశ్చ క్వ స్థాప్యం చేత్యథాబ్రవీత్ ॥ 11 ॥

భయంకరముగా నుండి రోమములు నిక్కబొడుచునట్లు గగుర్పాటు కలిగించు ఆ వక్త్రము పాపరూపమని గోళ్ళనే ఆయుధములుగా చేసి ఖడించి ఎక్కడ పెట్టవలయునని యడిగెను.

తత్రేలా విబుధానాహ నాహం వోఢుం శిరః క్షమా ।
రసాతల మధో యాస్యే ఉదధిశ్చాప్యథాబ్రవీత్ ॥ 12 ॥

అప్పుడు భూమి దేవతలతో నేనీ శిరస్సును మోయుటకు శక్తిలేనిదానను. ఇక రసాతలము అనగా సముద్రముకూడా ఇట్లనెను.

శోషం యాస్యేక్షణాదేవ పునశ్చోచుః శివం సురాః ।
త్వయైవేత ద్బ్రహ్మశిరో ధార్యం లోకానుకంపయా ॥ 13 ॥

నేను క్షణంలో ఎండిపోదును అనగా తిరిగి దేవతలు శివునితో నిట్లనిరి. లోకము మీద కరుణజూపి నీవే ఈ బ్రహ్మ శిరస్సును ధరించుమని వేడిరి.

అచ్ఛేదే జగతాం నాశః ఛేదే దోషశ్చ తాదృశః ।
ఏవం విమృశ్య సోమేశో దధార కశిరస్తదా ॥ 14 ॥

దీనిని ఛేదించకుండా ఉంటే జగత్తు నశించును. ఛేదించినట్లైతే ఆ(బ్రహ్మహత్య) దోషమంటును. ఇట్లాలోచించి శివుడు బ్రహ్మశిరస్సునప్పుడు ధరించెను.

తద్దృష్ట్వా దుష్కరం కర్మ గౌతమీ తీరమాశ్రితమ్ ।
అస్తువన్ జగతామీశం ప్రణయాద్భక్తితః సురాః ॥ 15 ॥

ఆ దుష్కరమైన కర్మను చూసి దేవతలు ప్రేమతో భక్తితో గౌతమీ తీరము నాశ్రయించియున్న జగత్ప్రభువును స్తుతించిరి.

దేవేష్వమిత్రం కశిరోఽతిభీమం తాన్ భక్షణాయోపగతం నికృత్య ।
నఖాగ్రసూచ్యా శకలేన్దు మౌలి – స్త్యాగేఽపి దోషాత్కృపయాఽను ధత్తే ॥ 16 ॥

దేవతలకు శత్రువుగా మహాభయంకరమైన ఆ బ్రహ్మశిరస్సు వారినందరినీ తినుటకు రాగా దానిని ఆ చంద్రమౌలి తన గోటి చివరలను సూదులుగా చేసి ఛేదించి వదిలినా దోషమని దయతో దానిని ధరించెను.

తత్ర తే విబుధాః సర్వే స్థితా యే బ్రహ్మణోఽన్తికే ।
తుష్టువు ర్విబుధేశానం కర్మదృష్ట్వాఽతి దైవతమ్ ॥ 17 ॥

అప్పుడా బ్రహ్మదగ్గరనున్న దేవతలు శివుడు చేసిన అతిదైవతమైన పనిని చూచి ఆ శివుని స్తుతించిరి.

తతః ప్రభృతి తత్తీర్థం బ్రహ్మతీర్థమితి శ్రుతమ్ ।
అద్యాపి బ్రహ్మణో రూపం చతుర్ముఖ మవస్థితమ్ ॥ 18 ॥

ఆనాటినుండి ఆ తీర్థమునకు బ్రహ్మతీర్థమని పేరు వచ్చినది. నేటికి కూడా బ్రహ్మరూపము నాలుగు ముఖములతోనే యున్నది.

శిరోమాత్రం తు యః పశ్యేత్స గచ్ఛేద్బ్రహ్మణః పదమ్ ।
యత్ర స్థిత్వా స్వయం రుద్రో లూనవాన్ బ్రహ్మణః శిరః ॥ 19 ॥

స్వయముగా రుద్రుడు ఛేదించిన బ్రహ్మ శిరమును దర్శనం చేసుకున్నవాడు బ్రహ్మలోకమును పొందగలడు.

రుద్రతీర్థం తదేవ స్యాత్తత్ర సాక్షాద్దివాకరః ।
దేవానాం చ స్వరూపేణ స్థితో యస్మాత్తదుత్తమమ్ ॥ 20 ॥

దానినే రుద్రతీర్థమంటారు. సూర్యుడు సాక్షాత్తుగ సమస్త దేవతా స్వరూపముగ అక్కడ ఉన్నాడు కనుక అది ఉత్తమమైనది.

సూర్యతీర్థం తదాఖ్యాతం సర్వక్రతు ఫలప్రదమ్ ।
తత్ర స్నాత్వా రవిం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే ॥ 21 ॥

దానిని సూర్యతీర్థమన్నారు. అది సమస్తక్రతువుల ఫలము నొసగునది. ఆ సూర్యతీర్థమున స్నానముచేసి సూర్యుని దర్శించినచో తిరిగి పునర్జన్మ అంటూ ఉండదు.

మహాదేవేన యచ్ఛిన్నం బ్రహ్మణః పంచమం శిరః ।
క్షేత్రేఽ విముక్తే సంస్థాప్య దేవతానాం హితం కృతమ్ ॥ 22 ॥

శివుడు బ్రహ్మయొక్క ఐదవ శిరస్సును ఛేదించి అవిముక్తక్షేత్రమునందుంచి దేవతలకు హితము చేకూర్చెను.

బ్రహ్మతీర్థే శిరోమాత్రం యో దృష్ట్వా గౌతమీ తటే ।
క్షేత్రేఽ విముక్తే తస్యైవ స్థాపితం యోఽ ను పశ్యతి ॥

కపాలం బ్రహ్మణః పుణ్యం బ్రహ్మహా పూతతాం వ్రజేత్ ॥ 23 ॥

గౌతమీతీరముననున్న బ్రహ్మతీర్థమున బ్రహ్మశిరమును చూచి అవిముక్తక్షేత్రమున స్థాపించబడిన పుణ్యప్రదమైన బ్రహ్మకపాలమును చూచినవాడు బ్రహ్మహత్యా పాపమునుండి విముక్తుడై పవిత్రుడగును.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గత గౌతమీ మాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే బ్రహ్మతీర్థబ్రహ్మశిరో లింగ శివతీర్థాది షడశీతి తీర్థ వర్ణనం నామ త్రిచత్వారింశోఽ ధ్యాయః ॥ 43 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థ మాహాత్మ్యములో బ్రహ్మతీర్థ బ్రహ్మశిరోలింగ శివతీర్థములు మొదలుగాగల ఎనుబది ఆరు తీర్థముల వర్ణనమను పేరుగల నలబై మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుశ్చత్వారింశోఽధ్యాయః - నలబై నాల్గవ అధ్యాయం

అవిఘ్నతీర్థ వర్ణనమ్ - అవిఘ్నతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అవిఘ్నం తీర్థ మాఖ్యాతం సర్వవిఘ్నవినాశనమ్ ।
తత్రాపి వృత్తమాఖ్యాస్యే శృణు నారద భక్తితః ॥ 1 ॥

ఓ నారదా! సమస్త విఘ్నములను నశింపచేయునది అవిఘ్నమను తీర్థమొకటి యున్నది. దానిగూర్చి చెప్పుచున్నాను. భక్తితో వినుము.

దేవ సత్రే ప్రవృత్తే తు గౌతమ్యాశ్చోత్తరే తటే ।
సమాప్తిర్నైవ సత్రస్య సంజాతా విఘ్నదోషతః ॥ 2 ॥

గౌతమీ నదియొక్క ఉత్తరతీరములో దేవతలు యజ్ఞమును ప్రారంభించినారు. కాని విఘ్నదోషమువలన ఆ యజ్ఞము పరిసమాప్తి కాలేదు.

తతః సురగణాః సర్వే మామవోచన్ హరిం తదా ।
తతో ధ్యానగతోఽహం తానవోచం వీక్ష్య కారణమ్ ॥ 3 ॥

అప్పుడు దేవతలంతా వచ్చి నన్ను, శ్రీహరిని అడిగినారు. అప్పుడు నేను కొంతసేపు ధ్యానము చేసి దానికి కారణమును కనుగొని వారితో ఇట్లంటిని.

వినాయక కృతైర్విఘ్నైర్నతత్సత్రం సమాప్యతే ।
తస్మాత్స్తువన్తు తే సర్వే ఆదిదేవం వినాయకమ్ ॥ 4 ॥

వినాయకుడు చేసిన విఘ్నముల వలన మీ యజ్ఞము పూర్తికాలేదు. కావున వాటితో ఆదిదేవుడైన వినాయకుని స్తుతించుదురుగాక!

తథేత్యుక్త్వా సురగణాః స్నాత్వా తే గౌతమీతటే ।
అస్తువన్ భక్తితో దేవా ఆదిదేవం గణేశ్వరమ్ ॥ 5 ॥

దేవతలు అలాగే అని గౌతమీనదిలో స్నానముచేసి, బ్రహ్మ చెప్పిన ప్రకారముగా దేవతాగణమంతయు భక్తితో ఆదిదేవుడగు గణేశుని స్తుతించారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

యః సర్వకార్యేషు చ సదా సురాణామపీశవిష్ణ్వమ్బుజ సంభవానామ్ ।
పూజ్యో నమస్యః పరిచిన్తనీయ స్తం విఘ్నరాజం శరణం వ్రజామః ॥ 6 ॥

సమస్తకార్యములలో దేవతలకు, శివ విష్ణు బ్రహ్మాదులకు కూడా పూజనీయుడు, నమస్కరింప దగినవాడు, ధ్యానించదగినవాడు అయిన విఘ్నరాజును శరణుగోరుచున్నాము.

న విఘ్నరాజేన సమోఽస్తి కశ్చిద్దేవో మనోవాంఛిత సంప్రదాతా ।
నిశ్చిత్య చైతత్త్రిపురాన్తకోఽపి తం పూజయామాస వధే పురాణామ్ ॥ 7 ॥

మనస్సులో నున్న కోరికలను దీర్చువాడు. విఘ్నరాజుతో సమానమైనవాడు మరొక్కడెవడూ లేదని నిశ్చయించుకొని త్రిపురాంతకుడు కూడా త్రిపురములను సంహరించుటకు వారిని విఘ్నేశుని పూజించెను.

కరోతు సోఽస్మాకమవిఘ్నమస్మిన్మహాక్రతౌ సత్వరమామ్బికేయః ।
ధ్యాతేన యేనాఖిల దేహభాజాం పూర్ణా భవిష్యన్తి మనోఽభిలాషాః ॥ 8 ॥

ధ్యానించినంత మాత్రముననే దేహధారుల కోరికలన్నియూ సంపూర్ణంగా సిద్ధించును. అట్టి అంబికా కుమారుడగు విఘ్నరాజు ఈ క్రతువునందు మాకెటువంటి విఘ్నం రాకుండా చేయుగాక!

మహోత్సవోఽభూదఖిలస్య దేవ్యా జాతః సుతశ్చిన్తిత మాత్ర ఏవ ।
అతోఽవదన్ సురసంఘాః కృతార్థాః సద్యోజాతం విఘ్నరాజం నమన్తః ॥ 9 ॥

దేవి అనుకున్నంతమాత్రముననే కుమారుడు జన్మించినాడని అంతటా మహోత్సవము జరిగెను. దేవతలందరు సద్యోజాతుడని విఘ్నరాజుకు నమస్కరిస్తూ తాము కృతార్థులయిరి.

యో మాతురుత్సంగ గతోఽథ మాత్రా నివార్యమాణోఽపి బలాచ్చ చంద్రమ్ ।
సంగోపయామాస పితుర్జటాసు గణాధినాథస్య వినోద ఏషః ॥ 10 ॥

తల్లి ఒడిలో కూర్చొని తల్లి వద్దని వారించుచున్నా వినక బలవంతముగా చంద్రుని తండ్రి జటాజూటమునందు దాచిపెట్టెను. ఇది గణాధినాథునియొక్క వినోదక్రీడనము.

పపౌ స్తనం మాతురథాపి తృప్తో యో భ్రాతృమాత్సర్య కషాయ బుద్ధిః ।
లంబోదరస్త్వం భవ విఘ్నరాజో లంబోదరం నామ చకార శంభుః ॥ 11 ॥

తాను తృప్తిచెందికూడా తన సోదరునియందు మాత్సర్య కషాయబుద్ధియై తల్లిస్తనమునందుపాలనట్లే త్రాగుచున్నవానిని విఘ్నరాజును లంబోదరుడవు కమ్మని శివుడతనికి లంబోదరుడని పేరు పెట్టెను.

సంవేష్టితో దేవగణైర్మహేశః ప్రవర్తతాం నృత్యమితీత్యువాచ ।
సంతోషితో నూపురరావ మాత్రాద్గణేశ్వరత్వేఽభిషేచ పుత్రమ్ ॥ 12 ॥

దేవతాగణంతో పరివేష్ఠించియున్న శివుడు వినాయకుని నాట్యంచేయుమని చెప్పెను. అతడు కాలు కదుపగానే అతని అందెల సవ్వడికే సంతోషించిన శివుడు తన కుమారుడగు వినాయకుని గణేశ్వరపదవిలో అభిషేకించెను.

యో విఘ్నపాశం చ కరేణ బిభ్రత్ స్కన్దే కుఠారం చ తథా పరేణ ।
అ పూజితో విఘ్నమథోఽపి మాతుః కరోతి కో విఘ్నపతేః సమోఽన్యః ॥ 13 ॥

చేతితో విఘ్నపాశం పట్టుకొని, మరొక భుజంపై గొడ్డలిని పెట్టుకొని పూజించనందున తల్లికి కూడా విఘ్నము కలిగించిన విఘ్నపతికి సమానుడు మరొకడెవడున్నాడు?

ధర్మార్థకామాదిషు పూర్వపూజ్యో దేవాసురైః పూజ్యత ఏవ నిత్యమ్ ।
యస్యార్చనం నైవ వినాశమస్తి తం పూర్వపూజ్యం ప్రథమం నమామి ॥ 14 ॥

ధర్మార్థకామాదులతో మొదట పూజింపదగినవాడు, దేవాసురులచేత నిత్యమూ పూజలందువాడు. ఎవనిని పూజించుటతో వినాశనం జరుగదో అటువంటి పూర్వపూజ్యుని మొదట నమస్కరించుచున్నాను.

యస్యార్చనాత్ప్రార్థనయాఽనురూపాం దృష్ట్వా తు సర్వస్య ఫలస్య సిద్ధిమ్ ।
స్వతన్త్ర సామర్థ్య కృతాతిగర్వం భ్రాతృప్రియం త్వాఖు రథం తమీడే ॥ 15 ॥

ఎవరిని అర్చించినందువలన ప్రార్థన కనుకూలమగు ఫలసిద్ధిని చూచి ఇచ్చు స్వతంత్ర సామర్థ్యము వలన గర్వం హెచ్చుగా కలిగిన, సోదరునియందు ప్రీతిగల, మూషకవాహనునకు నమస్కరించుచున్నాను.

యో మాతరం సరసైః నృత్యగీతైస్తథాఽఖిలాషై రఖిలైర్వినోదైః ।
సంతోషయామాస తదాఽతితుష్టం తం శ్రీగణేశం శరణం ప్రపద్యే ॥ 16 ॥

ఎవడు తన సరసమైన నృత్యగీతములతో అట్లే తన అభిలాషలతో, సమస్తవినోదములతో తల్లిని సంతోష పెట్టుచు తాను సంతష్టుడగునో అట్టి శ్రీగణేశుని శరణం పొందుచున్నాను.

సురోపకారైరసురైశ్చ యుద్ధైః స్తోత్రైర్నమస్కారపరైశ్చ మన్త్రైః ।
పితుః ప్రసాదేన సదా సమృద్ధం తం శ్రీగణేశం శరణం ప్రపద్యే ॥ 17 ॥

దేవతలకుపకారములతో, రాక్షసులకు యుద్ధాలతో, స్తోత్రములతో, నమస్కారములు చేయువారితో, మన్త్రములతో, తండ్రి యనుగ్రహముతో సర్వదా సమృద్ధిగా నుండు శ్రీగణేషుని శరణు వేడుచున్నాను.

జయే పురాణామకరోత్ ప్రతీపం పిత్రాఽపి హర్షాత్ప్రతిపూజితో యః ।
నిర్విఘ్నతాం చాపి పునశ్చకార తస్మై గణేశాయ నమస్కరోమి ॥ 18 ॥

పురములను జయించుటయందు విలోమముగా ప్రవర్తించినా కూడా తండ్రియైన శివుడు కుమారుని హర్షముతో పూజించెనో, తిరిగి విఘ్నము లేకుండా చేసిన గణేశునకు నమస్కారము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇతి స్తుతః సురగణైర్విఘ్నేశః ప్రాహ తాన్ పునః ॥ 19 ॥

ఇట్లు దేవతలు స్తుతించగా విఘ్నేశ్వరుడు ఆ దేవతలతో ఇట్లు పలికాడు.

గణేశ ఉవాచ :– గణేశుడు పలికాడు.

ఇతో నిర్విఘ్నతా సత్రే మత్తః స్యాదసురారిణః ॥ 20 ॥

ఇకపైన దేవతలారా! నావలన మీ యజ్ఞము నిర్విఘ్నమగును.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవసత్రే నివృత్తేతు గణేశః ప్రాహ తాన్ సురాన్ ॥ 21 ॥

దేవతల యజ్ఞము సమాప్తమై గణేశుడా దేవతలతో నిట్లనెను.

గణేశ ఉవాచ :- గణేశుడు పలికాడు.

స్తోత్రేణానేన యే భక్త్యా మాం స్తోష్యన్తి యతవ్రతాః ।
తేషాం దారిద్ర్యదుఃఖాని న భవేయుః కదాచన ॥ 22 ॥

నియమనిష్ఠలతో భక్తితో నన్నిట్లు స్తోత్రము చేయు వారికెప్పుడునూ దారిద్ర్యదుఃఖములుండవు.

అత్ర యే భక్తితః స్నానం దానం కుర్యురతన్ద్రితాః ।
తేషాం సర్వాణి కార్యాణి భవేయు రితి మన్యతామ్ ॥ 23 ॥

ఇక్కడ సోమరులు కాకుండా స్నానదానాదులు భక్తితో చేయువారి పనులన్నియు ఫలవంతములగునని తలచుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్వాక్యసమకాలంతు తథేత్యూచుః సురా అపి ।
నివృత్తే తు మఖే తస్మిన్ సురా జగ్ముః సురాలయమ్ ॥ 24 ॥

ఆ మాట అంటున్నప్పుడు దేవతలంతా అట్లే అన్నారు. యజ్ఞము పరిసమాప్తికాగానే దేవతలంతా స్వర్గమునకు వెళ్ళారు.

తతః ప్రభృతి తత్తీర్థం అవిఘ్నమితి గద్యతే ।
సర్వకామప్రదం పుంసాం సర్వవిఘ్నవినాశనమ్ ॥ 25 ॥

అప్పటి నుండి ఆతీర్థమును అవిఘ్నతీర్థమంటారు. ఆ తీర్థము పురుషులకు కోరికలన్నింటిని తీర్చునది. విఘ్నములనన్నింటిని నాశనమొనర్చునది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యేఽవిఘ్నతీర్థ వర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥ 44 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థమాహాత్మ్యములోని అవిఘ్నతీర్థవర్ణనమను పేరుగల నలబై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచచత్వారింశోఽధ్యాయః - నలబై ఐదవ అధ్యాయం

శేషతీర్థ శేషేశ్వర శూలేశ్వరాగ్నికుండ రసాతల గంగా సంగమోష్ణతీర్థాద్యేక వింశతి శతతీర్థవర్ణనం

శేషతీర్థ శేషేశ్వర,శూలేశ్వర అగ్నికుండ,రసాతల గంగా సంగమ ఉష్ణతీర్థాది ఇరవై ఒక్కనూర్ల తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శేషతీర్థమితి ఖ్యాతం సర్వకామప్రదాయకమ్ ।
తస్యరూపం ప్రవక్ష్యామి యన్మయా పరిభాషితమ్ ॥ 1 ॥

సమస్తకోరికలను నెరవేర్చునది శేషతీర్థమనునది కలదు. దాని స్వరూపమును చెప్పబోవుచున్నాను.

శేషోనామ మహానాగో రసాతల పతిః ప్రభుః ।
సర్వనాగైః పరివృతో రసాతలమథాభ్యగాత్ ॥ 2 ॥

రసాతలమును పరిపాలించు ప్రభువు శేషుడను పేరుగల మహానాగుడుండెను. అతడు సమస్త నాగులతో సేవలందుచు రసాతలమునకు వెళ్ళెను.

రాక్షసా దైత్యదనుజా ప్రవిష్టా యే రసాతలమ్ ।
తైర్నిరస్తో భోగపతిర్మామువాచాథ విహ్వలః ॥ 3 ॥

రాక్షసులు, దైత్యులు, దనుజులు రసాతలమును ప్రవేశించి సర్పరాజును వెళ్లగొట్టిరి. అప్పుడా భోగపతి దుఃఖితుడై నాతో నిట్లనెను.

శేష ఉవాచ:- శేషుడు పలికాడు.

రసాతలం త్వయా దత్తం రాక్షసానాం మమాపి చ ।
తే మే స్థానం న దదతి తస్మాత్త్వాం శరణం గతః ॥ 4 ॥

నీవు నాకు రాక్షసులకు రసాతలమునిచ్చితివి. కాని వారు నా స్థానమును నాకిచ్చుటలేదు. అందువలన నేను నిన్ను శరణు జొచ్చితిని.

తతోఽహమబ్రవం నాగం గౌతమీం యాహి పన్నగ ।
తత్ర స్తుత్వా మహా దేవం లప్స్యసే త్వం మనోరథమ్ ॥ 5 ॥

అప్పుడు నేనా నాగునితో నాగరాజా! నీవు గౌతమీ నది వద్దకు వెళ్ళుము. అక్కడ మహా దేవుని స్తోత్రము చేసిన నీ మనోరథం నెరవేరగలదు అన్నాను.

నాన్యోఽస్తి లోకత్రితయే మనోరథ సమర్పకః ।
మద్వాక్య ప్రేరితో నాగో గంగా మాప్లుత్య యత్నతః ॥
కృతాంజలిపుటో భూత్వా తుష్టావ త్రిదశేశ్వరమ్ ॥ 6 ॥

ఈ ముల్లోకములలో మనోరథమును తీర్చువాడు మరొకడులేడు. నా మాటలు విన్న నాగుడు గంగానది వద్దకు వెళ్ళి స్నానం చేసి రెండు చేతులు జోడించి నమస్కరించి ఆ త్రిదశేశ్వరుని స్తుతించెను.

శేష ఉవాచ:- శేషుడు పలికాడు.

నమస్త్రైలోక్యనాథాయ దక్షయజ్ఞ విభేదినే ।
ఆదికర్త్రే నమస్తుభ్యం నమస్త్రైలోక్యరూపిణే ॥ 7 ॥

త్రిల్లోకనాథా! దక్షయజ్ఞ విధ్వంసకా! ఆదికర్తా! త్రిలోకస్వరూపా! నీకు నమస్కారం.

నమః సహస్రశిరసే నమః సంహారకారిణే ।
సోమసూర్యాగ్ని రూపాయ జలరూపాయ తే నమః ॥ 8 ॥

వేయి శిరస్సులుగలవానికి, సంహారకారణునకు చంద్రసూర్యాగ్నిరూపునకు, జలరూపునకు నీకు నమస్కారం.

సర్వదా సర్వరూపాయ కాలరూపాయ తే నమః ।
పాహి శంకర సర్వేశ పాహి సోమేశ సర్వగ ॥
జగన్నాథ నమస్తుభ్యం దేహి మే మనసేప్సితమ్ ॥ 9 ॥

సర్వకాలములయందు అనేక రూపములను, కాలరూపమును ధరించువాడా! చంద్రాధిపతీ! సర్వజ్ఞుడా! సర్వేశా! శంకరా! నన్ను రక్షింపుము. ఓ జగన్నాథా! నీకు నమస్కారం నా మనోభీష్టమును నెరవేర్చుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతో మహేశ్వరో ప్రీతః ప్రాదాన్నాగేప్సితాన్ వరాన్ ।
వినాశాయ సురారీణాం దైత్యదానవరక్షసామ్ ॥ 10 ॥

అప్పుడు శివుడు సంతుష్టుడై దేవతా శత్రువులగు దైత్యదానవ రాక్షసుల వినాశము కొరకు నాగుడు కోరిన వరములన్నియు నిచ్చెను.

శేషాయ ప్రదదౌ శూలం జహ్యనేనారి పుంగవాన్ ।
తతః ప్రోక్తః శివేనాసౌ శేషః శూలేన భోగిభిః ॥ 11 ॥

శివుడు శేషునకు శూలమునిచ్చి దీనితో నీ శత్రుశ్రేష్ఠులను జయించుము అని చెప్పెను. శేషుడా శూలమును దీసుకొని తన పడగలతో

రసాతలమథో గత్వా నిజఘాన రిపూన్ రణే ।
నిహత్య నాగః శూలేన దైత్యదానవ రాక్షసాన్ ॥ 12 ॥

క్రిందనున్న రసాతలమునకు వెళ్ళి యుద్ధమునందు శత్రువులనందరిని సంహరించెను. నాగుడు శూలముతో దైత్య దానవ రాక్షసులందరిని చంపి,

న్యవర్తత పునర్దేవో యత్ర శేషేశ్వరో హరః ।
పథా యేన సమాయాతో దేవం ద్రష్టుం స నాగరాట్ ॥ 13 ॥

తిరిగి శేషేశ్వరుడైన శివుని వద్దకు వచ్చుటకై వెనుదిరిగెను. ఆ నాగరాజు శివుని చూచుటకై ఏ మార్గము నందు వచ్చెనో,

రసాతలాద్యత్ర దేవో బిలం తత్ర వ్యజాయత ।
తస్మాద్బిలతలాద్యాతం గాంగం వార్యతిపుణ్యదమ్ ॥ 14 ॥

ఆ మార్గమున రసాతలమునుండి శివుడున్నచోటువరకొక బిలమేర్పడెను. ఆ బిలము ద్వారా ప్రవహించు గంగ నీరు అతిపవిత్రము. పుణ్యము నిచ్చునది.

తద్వారి గంగామగమద్గంగాయాః సంగమస్తతః ।
దేవస్య పురతశ్చాపి కుణ్డం తత్ర సువిస్తరమ్ ॥ 15 ॥

ఆ నీరు గంగవైపువెళ్లెను. గంగా సంగమమేర్పడెను. అక్కడ శివుని ఎదురుగా కూడా విశాలమైన కుండము కలదు.

నాగస్తత్రాకరోద్ధోమం యత్ర చాగ్నిః సదా స్థితః ।
సోష్ణం తదభవద్వారి గంగాయాస్తత్ర సంగమః ॥ 16

ఎల్లప్పుడు అగ్ని ఉండే ఆ ప్రదేశమున నాగుడు హోమము చేసెను. అక్కడ ఆ నీరు వెచ్చగా నాయెను. ఆ ప్రదేశముననే గంగా సంగమము జరిగినది.

దేవదేవం సమారాధ్య నాగః ప్రీతో మహాయశాః ।
రసాతలం తతోఽభీష్టం శివాత్ప్రాప్య తలం యయౌ ॥ 17

దేవదేవుని ఆరాధించి నాగుడు గొప్పకీర్తిగలవాడై సంతోషించెను. శివుని వలన కావలసిన కోరికలన్నియును తీర్చుకొని రసాతలమునకు వెళ్ళెను.

తతః ప్రభృతి తత్తీర్థం నాగతీర్థముదాహృతమ్ ।
సర్వకామప్రదం పుణ్యం రోగదారిద్ర్యనాశనమ్ ॥ 18 ॥

అప్పటినుండి ఆ తీర్థమునకు నాగతీర్థమనిపేరు. ఆ తీర్థము సమస్తకోరికలను దీర్చునది. పవిత్రమైనది, రోగములను దరిద్రమును నశింపజేయునది,

ఆయుర్లక్ష్మీకరం పుణ్యం స్నానదానాచ్చ ముక్తిదమ్ ।
శృణుయాద్వా పఠేద్భక్త్యా యో వాఽపి స్మరతే తు తత్ ॥ 19 ॥

ఆయుష్షును పెంచునది, సంపదలనిచ్చునది. స్నానదానములు చేసిన ముక్తినిచ్చునది. కేవలం విన్నా, చదివినా, స్మరించినా కూడా అది ముక్తినిచ్చును.

తీర్థం శేషేశ్వరో యత్ర యత్ర శక్తిప్రదః శివః ।
ఏకవింశతి తీర్థానా ముభయోస్తత్ర తీరయోః ॥
శతాని మునిశార్దూల సర్వసంపత్ప్రదాయినామ్ ॥ 20 ॥

ఓ మునిశ్రేష్ఠా! ఎక్కడ శేషేశ్వరుడున్నాడో ఎక్కడ శక్తిప్రదుడగు శివుడున్నాడో? అక్కడ గౌతమీనది కిరుప్రక్కల తీరములందు సమస్త సంపదలనిచ్చు తీర్థములు ఇరువదియొక్క నూర్లున్నవి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఉభయతీరగత శేషతీర్థ శేషేశ్వర శూలేశ్వరాగ్నికుండ రసాతల గంగా సంగమోష్ణతీర్థాద్యేక వింశతి శతతీర్థవర్ణనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥ 45 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యములోని తీర్థమాహాత్మ్యములో రెండు తీరములందున్న శేషతీర్థ శేషేశ్వర, శూలేశ్వర అగ్నికుండ, రసాతల గంగా సంగమ ఉష్ణ తీర్థాది ఇరువది యొక్క నూర్ల తీర్థవర్ణనమను పేరుగల నలబై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్ చత్వారింశోఽధ్యాయః – నలబై ఆరవ అధ్యాయం

వడవాదిసహస్ర తీర్థవర్ణనమ్ – వడవాదిసహస్ర తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

మహానలమితిఖ్యాతం వడవానల ముచ్యతే ।
మహానలో యత్ర దేవో వడవా యత్ర సా నదీ ॥ 1 ॥

మహానలుడను దేవుడున్న చోటునకు మహానలతీర్థమని పేరుగలదు. వడవా అను నది ప్రవహించు చోటును వడవానల తీర్థమని యంటారు.

తత్తీర్థం పుత్ర వక్ష్యామి మృత్యుదోషజరాపహమ్ ।
పురాసన్నైమిషారణ్యే ఋషయః సత్రకారిణః ॥ 2 ॥

నాయనా! మృత్యుదోషమును, ముసలితనమును పోగొట్టే ఆ తీర్థమును గూర్చిచెప్పదును. పూర్వము ఋషులందరు నైమిషారణ్యమునందు యజ్ఞమును చేయుటకై సంకల్పించిరి.

శమితారం చ ఋషయో మృత్యుం చక్రుస్తపస్వినః ।
వర్తమానే సత్రయాగే మృత్యౌ శమితరి స్థితే ॥ 3 ॥

తపోనిష్ఠులగు ఋషులు మృత్యువును శమించువానిగా చేసిరి. ప్రస్తుతము జరిగే సత్రయజ్ఞము నందు మృత్యువు శమించి యుండగా,

న మమార తదా కశ్చిదుభయం స్థాస్ను జంగమమ్ ।
వినా పశూన్ మునిశ్రేష్ఠ మర్త్యం చామర్త్యతాం గతమ్ ॥ 4 ॥

ఓ మునిశ్రేష్ఠా! స్థావర జంగమముల రెండింటిలో వేటికి మరణములేకుండెను. పశువులు దప్ప మర్త్యలోకములో నున్నవారు కూడా అమరులైరి.

తతస్త్రివిష్టపే శూన్యే మర్త్యే చైవాతిసంభృతే ।
మృత్యునోపేక్షితే దేవా రాక్షసానూచిరే తదా ॥ 5 ॥

అక్కడ స్వర్గమంతా శూన్యమైయుండగా, మర్త్యలోకంలో సమృద్ధిగా నున్నది. మృత్యువుపేక్షించియున్న ఆ తరుణంలో దేవతలు అప్పుడు రాక్షసులతో నిట్లనిరి.

గచ్ఛధ్వమృషిసత్రం తన్నాశయధ్వం మహాధ్వరమ్ ।
ఇతి దేవవచః శ్రుత్వా ప్రోచుస్తే రాక్షసాః సురాన్ ॥ 6 ॥

వెళ్ళుడు ఆ ఋషులు చేయుచున్న మహాయజ్ఞమును నాశనము చేయుడు అని చెప్పగా దేవతల మాటను విన్న రాక్షసులు దేవతలతో నిట్లనిరి.

విధ్వంసయామస్తం యజ్ఞమస్మాకం కిం ఫలం తతః ।
ప్రవర్తతే వినా హేతుం న కోఽపి క్వాపి జాతుచిత్ ॥ 7 ॥

మేమా యజ్ఞమును ధ్వంసము చేయుదుము కాని దానివలన మాకేం లాభము? లోకంలో ఎవడుకూడా కారణం లేకుండా ఎక్కడా ప్రవర్తించడు. 'ప్రయోజనమనుద్దిశ్య న మన్దోఽపి ప్రవర్తతే' కదా!

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవా అప్యసురానూచుర్యజ్ఞార్థం భవతామపి ।
భవేదేవ తతో యాన్తు ఋషీణాం సత్రముత్తమమ్ ॥ 8 ॥

దేవతలప్పుడు రాక్షసులతో యజ్ఞంలో భాగము మీకు కూడా ఉండును. అందువలన త్వరగా ఆ ఉత్తమ యజ్ఞము చేయుచున్న ఋషుల వద్దకు వెళ్ళుడు.

తే శ్రుత్వా త్వరితాః సర్వే యత్ర యజ్ఞః ప్రవర్తతే ।
జగ్ము స్తత్ర వినాశాయ దేవ వాక్యాద్విశేషతః ॥ 9 ॥

ఆ రాక్షసులు దేవతల వాక్యములను విశేషముగా స్పందించి విని యజ్ఞము జరుగు ప్రదేశమునకా యజ్ఞధ్వంసమునకై త్వరత్వరగా వెళ్ళిరి.

తద్ జ్ఞాత్వా ఋషయో మృత్యుమాహుః కిం కుర్మహే వయమ్ ।
ఆగతా దేవవచనా ద్రాక్షసా యజ్ఞనాశనాః ॥ 10 ॥

అది తెలుసుకొని ఋషులు మృత్యువుతో నిట్లనిరి. దేవతల మాట ప్రకారముగా యజ్ఞ నాశకులగు రాక్షసులు వచ్చిరి. ఇప్పుడు మనమేమి చేయుదుము?

మృత్యునా సహ సంమన్త్ర్య నైమిషారణ్యవాసినః ।
సర్వే త్యక్త్వా స్వాశ్రమం తం శమిత్రా సహ నారద ॥ 11 ॥

అగ్ని మాత్రముపాదాయ త్యక్త్వా పాత్రాదికం తు యత్ ।
క్రతు నిష్పత్తయే జగ్ముర్గౌతమీం ప్రతి సత్వరాః ॥ 12 ॥

ఓ నారదా! నైమిషారణ్యమునందు నివసించు వారందరు మృత్యువుతో సంప్రదించి, తమ ఆశ్రమాన్ని వదిలి మృత్యువుతో అగ్నిని మాత్రము తీసుకొని మిగతా పాత్రలన్నింటిని అక్కడే వదిలివేసి యజ్ఞమును చేయుటకై వేగముగా గౌతమీ నది వద్దకు వెళ్ళిరి.

తత్ర స్నాత్వా మహేశానం రక్షణాయోపతస్థిరే ।
కృతాంజలి పుటాస్తే తు తుష్టువుస్త్రిదశేశ్వరమ్ ॥ 13 ॥

గౌతమీ నదిలో స్నానము చేసి తమను రక్షించుమని వేడుటకై మహేశుని వద్దకు వెళ్లిరి. వారంతా బద్ధాంజలులై త్రిదశేశ్వరుని స్తోత్రము చేసిరి.

ఋషయ ఊచుః :– ఋషులు పలికిరి.

యో లీలయా విశ్వమిదం చకార ధాతా విధాతా భువనత్రయస్య ।
యో విశ్వరూపః సదసత్పరో యః సోమేశ్వరం తం శరణం ప్రజామః ॥ 14 ॥

ఎవరు తను విలాసముగా ఈ విశ్వమునంతటిని సృజించెనో, ఈ ముల్లోకములకు ధాత విధాత ఎవరో, సత్తు, అసత్తుల కంటె పరముగా ఎవరున్నారో, ఎవరు విశ్వరూపుడో అట్టి సోమేశ్వరుని శరణు గోరుచున్నాము.

మృత్యురువాచ :– మృత్యువు పలికాడు.

ఇచ్ఛామాత్రేణ యః సర్వం హన్తి పాతి కరోతి యః ।
తమహం త్రిదశేశానం శరణం యామి శంకరమ్ ॥ 15 ॥

తన ఇచ్ఛా మాత్రము చేతనే సర్వమును సృష్టించి, రక్షించి, లయమును చేయుచున్నవాడెవడో అట్టి త్రిదశేశానుడైన శంకరుని శరణం పొందుచున్నాను.

మహాబలం మహాకాయం మహానాగవిభూషణమ్ ।
మహామూర్తి ధరం దేవం శరణం యామి శంకరమ్ ॥ 16 ॥

మహాబలుడు, గొప్పశరీరముగలవాడు, పెద్దనాగులను భూషణములనుగా ధరించినవాడు, గొప్ప స్వరూపమును ధరించినవాడు నగు శంకరదేవుని శరణుపొందుచున్నాను.

బ్రహ్మోవాచ :–బ్రహ్మ పలికాడు.

తతః ప్రోవాచ భగవన్ మృత్యో కా ప్రీతిరస్తి తే ॥ 17 ॥

అప్పుడు శివుడు మృత్యువుతో ఓ మృత్యువా! నీకేమి ఇష్టమని యడిగెను.

మృత్యురువాచ:– మృత్యువు పలికాడు.

రాక్షసేభ్యో భయం ఘోరమాపన్నం త్రిదశేశ్వర ।
యజ్ఞమస్మాంశ్చ రక్షస్వ యావత్సత్రం సమాప్యతే ॥ 18 ॥

ఓ త్రిదశేశ్వరా! రాక్షసుల వలన ఘోరమైన భయం ఏర్పడినది. యజ్ఞం పరిసమాప్తియగు వరకు యజ్ఞమును మమ్ములను రక్షింపుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథా చకార భగవాన్ త్రినేత్రో వృషభధ్వజః ।
శమిత్రామృత్యునా సత్రమృషీణాం పూర్ణతాం యయౌ ॥ 19 ॥

ముక్కంటియగు వృషభధ్వజుడు అట్లే చేసెను. శమించిన మృత్యువుతో ఋషుల యజ్ఞము పరిపూర్ణమైనది.

హవిషాం భాగధేయాయ ఆజగ్మురమరాః క్రమాత్ ।
తానవోచన్మునిగణాః సంక్షుబ్ధామృత్యునా సహ ॥ 20 ॥

దేవతలు క్రమముగా హవిర్భాగమును తీసుకొనుటకు వచ్చిరి. మృత్యువుతోపాటు తత్తరపడిన ముని గణమువారితో నిట్లు పలికిరి.

ఋషయ ఊచుః- ఋషులు పలికిరి.

అస్మన్మఖ వినాశాయ రాక్షసాః ప్రేషితా యతః ।
తస్మాద్భవద్భ్యః పాపిష్ఠాః రాక్షసాః సన్తు శత్రవః ॥ 21 ॥

మా యజ్ఞమును నాశనము చేయుటకు ఎందుకు రాక్షసులను పంపించినారు? అందువలన మీకా పాపిష్ఠులైన రాక్షసులు శత్రువులగుదురుగాక!

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రభృతి దేవానాం రాక్షసా వైరిణోఽభవన్ ।
కృత్యాం చ వడవాం తత్ర దేవాశ్చ ఋషయోఽమలాః ॥ 22 ॥

అప్పటినుండి దేవతలకు రాక్షసులు శత్రువులైరి. అమరులై దేవతలు ఋషులు అక్కడ, వడవా రూపంలో నున్న కృత్యను,

మృత్యోర్భార్యా భవ త్వం తామిత్యుక్త్వా తేఽభ్యషేచయన్ ।
అభిషేకోదకం యత్తు సా నదీ వడవాఽభవత్ ॥ 23 ॥

నీవు మృత్యువునకు భార్యవుకమ్మని వడవా నభిషేకించిరి. ఆ అభిషేకజలము నదీరూపముగా మారి వడవానదియైనది.

మృత్యునా స్థాపితం లింగం మహానలమితి శ్రుతమ్ ।
తతః ప్రభృతి తత్తీర్థం వడవా సంగమం విదుః ॥ 24 ॥

మృత్యువు స్థాపించిన లింగమునకు మహానలమనిపేరు. అప్పటి నుండి ఆ తీర్థమును వడవా సంగమ మందురు.

మహానలో యత్ర దేవస్తత్తీర్థం భుక్తిముక్తిదమ్ ।
సహస్రం తత్ర తీర్థానాం సర్వాభీష్టప్రదాయినామ్ ॥
ఉభయోస్తీరయోస్తత్ర స్మరణానఘఘాతిన! ॥ 25 ॥

మహానలునిగా శివుడెక్కడనున్నాడో ఆ తీర్థము భుక్తిని ముక్తినీ ప్రసాదించునది. గౌతమీ నది ఉభయతీరములలో నున్న తీర్థములు వేయి యున్నవి. అవన్నియు స్మరించినంతమాత్రముననే పాపములను తొలగించునవి. సమస్తకోరికలను తీర్చునవి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే వడవాది సహస్రతీర్థ వర్ణనం నామ షట్ చత్వారింశోఽధ్యాయః ॥ 46 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములో వడవాది సహస్రతీర్థముల వర్ణనమను పేరుగల నలుబది యారవ అధ్యాయం సంపూర్ణం.

సప్తచత్వారింశోఽధ్యాయః - నలబై ఏడవ అధ్యాయం

ఆత్మతీర్థవర్ణనమ్ - ఆత్మతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆత్మతీర్థమితి ఖ్యాతం భుక్తిముక్తిప్రదం నృణామ్ ।
తస్య ప్రభావం వక్ష్యామి యత్ర జ్ఞానేశ్వరః శివః ॥ 1 ॥

మానవులకు భుక్తిని, ముక్తిని కలిగించునట్టి తీర్థము ఆత్మతీర్థమనునది కలదు. అక్కడ శివుడు జ్ఞానేశ్వరుడు అనే పేరుతో నున్నాడు. దాని ప్రభావమును చెప్పుచున్నాను వినుము.

దత్త ఇత్యపి విఖ్యాతః సోఽత్రి పుత్రో హరప్రియః ।
దుర్వాససః ప్రియో భ్రాతా సర్వజ్ఞానవిశారదః ॥
స గత్వా పితరం ప్రాహ వినయేన ప్రణమ్య చ ॥ 2 ॥

అత్రికుమారుడు, శివునికి ప్రియుడు, దుర్వాసునికి ప్రియమైన సోదరుడు, సర్వజ్ఞానవిశారదుడు దత్తాత్రేయుడను ప్రసిద్ధుడు కలడు. అతడొకనాడు తన తండ్రివద్దకు వెళ్ళి నమస్కరించి వినయముగా నిట్లనెను.

దత్త ఉవాచ :- దత్తుడు పలికాడు.

బ్రహ్మజ్ఞానం కథం మే స్యాత్కం పృచ్ఛామి క్వ యామి చ । 3 ॥

నాకు బ్రహ్మజ్ఞానమెట్లు కలుగును? ఎవరినడుగవలయును? ఎక్కడికి వెళ్ళవలయును?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వాఽత్రిః పుత్రవాక్యం ధ్యాత్వా వచనమబ్రవీత్ । 4 ॥

పుత్రుడడిగిన మాటను విన్న అత్రి కొంతసేపు ధ్యానమగ్నుడై దత్తునితో నిట్లనెను.

అత్రిరువాచ :- అత్రి పలికాడు.

గౌతమీం పుత్ర గచ్ఛ త్వం తత్ర స్తుహి మహేశ్వరమ్ ।
స తు ప్రీతో యదైవ స్యాత్తతో జ్ఞానమవాప్స్యసి ॥ 5 ॥

నాయనా! నీవు గౌతమీ నదివద్దకు వెళ్ళుము. అక్కడనున్న మహేశ్వరుని స్తుతించుము. అతడెప్పుడు ప్రీతినొందునో అప్పుడే నీవు జ్ఞానమును పొందగలవు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా తదాఽఽత్రేయో గంగా గత్వా శుచిర్యతః ।
కృతాంజలిపుటో భూత్వా భక్త్యా తుష్టావ శంకరమ్ ॥ 6 ॥

అత్రి కుమారుడగు దత్తుడు అట్లేయని గంగానది వద్దకు వెళ్ళి శుచియై నియమముతో రెండు చేతులతో నమస్కరించుచు స్తోత్రముచేసి భక్తితో శివునిస్తుతించెను.

దత్త ఉవాచ :- దత్తుడు పలికాడు.

సంసారకూపే పతితోఽస్మి దైవాన్మోహేన గుప్తో భవ దుఃఖపంకే ।
అజ్ఞాన నామ్నా తమసాఽఽవృతోఽహం పరం న విందామి సురాధినాథ ॥ 7 ॥

ఓ సురాధినాథా! నేను దైవవశము వలన సంసారకూపంలో పడిపోయాను. మోహంతో ఇహమనే బురదలో కూరుకొని పోయినాను. అజ్ఞానమనే పేరుగల చీకటి యావరించి యున్నది. పరమును తెలుసుకొనలేకున్నాను.

భిన్నస్త్రిశూలేన బలీయసాఽహం పాపేన చిన్తా క్షురపాటి తశ్చ ।
తప్తోఽస్మి పంచేన్ద్రియ తీవ్రతాపైః శ్రాన్తోఽస్మి సంతారయ సోమనాథ ॥ 8 ॥

ఓ సోమనాథా! బలీయమైన త్రిశూలము నన్ను పొడిచినది. నేను చేసిన పాపముతో చింత అనే చురకత్తి నన్ను కోసినది. ఐదు ఇంద్రియములు భయంకర మంటలతో కాల్చుచున్నవి. చాలా అలసి పోయినాను. నన్ను తరింపజేయుము.

బద్ధోఽస్మి దారిద్ర్యమయైశ్చ బన్ధై ర్హతోఽస్మి రోగానల తీవ్రతాపైః ।
క్రాన్తోఽస్మ్యహం మృత్యుభుజంగమేన భీతో భృశం కిం కరవాణి శంభో ॥ 9 ॥

శివా! నేను దరిద్రమయమైన బంధనములలో చిక్కుకున్నాను-రోగాగ్ని తీవ్రతాపంతో చచ్చిపోతున్నాను. మృత్యువనే సర్పము నన్ను కబలించుచున్నది. నేను చాలా భయంతో ఉన్నాను. నేనేమి చేయుదును?

భవాభవాభ్యామతి పీడితోఽహం తృష్ణాక్షుధాభ్యాం చ రజస్తమోభ్యామ్ ।
ఈదృక్షయా జరయా చాభిభూతః పశ్యావస్థాం కృపయా మేఽద్యనాథ ॥ 10 ॥

స్వామీ! నేను ఆకలి దప్పులతో, రజస్తమో గుణములతో, భవాభవములతో మిక్కిలి పీడనొందినాను. ఇటువంటి ముసలితనమునకు లోనై చిక్కియున్నాను. దయతో నేడే నా అవస్థను చూడుము.

కామేన కోపేన చ మత్సరేణ దమ్భేన దర్పాదిభిరప్యనేకైః ।
ఏకైకశః కష్టగతోఽస్మి విద్ధస్త్వం నాథవద్ధారయ నాథ శత్రూన్ ॥ 11 ॥

స్వామీ! కామము, కోపము, మాత్సర్యము, దంభము, దర్పము మున్నగు అనేకములు ఒక్కొక్కటి నన్ను కష్టపెట్టుచున్నది. నీవు ప్రభువువు, శాసకుడవు కావున నా శత్రువులనణచి నన్ను నాథునివలె నుద్ధరింపుము.

కస్యాపి కశ్చిత్పతితస్య పుంసో దుఃఖ ప్రణోదీ భవతీతి సత్యమ్ ।
వినా భవన్తం మమ సోమనాథ కుత్రాపి కారుణ్యవచోఽపి నాస్తి ॥ 12 ॥

ఎవరైనా పతితుడైనవాడు దుఃఖ ప్రేరితుడగునను మాట సత్యము. ఓ సోమనాథా! నీవు తప్ప ఎక్కడైనా ఒక దయగల మాట చెప్పేవాడెవడూ లేదు.

తావత్స కోపో భయమోహ దుఃఖా న్యజ్ఞాన దారిద్ర్యరుజాస్తథైవ ।
కామాదయో మృత్యురపీహ యావ న్నమః శివాయేతి న వచ్మి వాక్యమ్ ॥ 13 ॥

ఎంతవరకైతే కోపము, భయము, మోహము, దుఃఖము అన్యథా జ్ఞానము, దరిద్రము, ముసలితనము, కామాదులు చివరగా మృత్యువు కబలించే సమయమాసన్నమైనా కూడా అంతవరకూ నేను నమఃశివాయ అను వాక్యమునే చెప్పుట లేదు.

నమేఽస్తి ధర్మో న చ మేఽస్తి భక్తిర్నాహం వివేకీ కరుణా కుతో మే ।
దాతాఽసి తేనాఽఽశు శరణ్య చిత్తే నిధేహి సోమేతి పదం మదీయే ॥ 14 ॥

నేను ధర్మాన్నాచరించను, భక్తిలేదు, నేను వివేకవంతుని కాను, ఇకనాకు దయ ఎక్కడిది? నీవు దాతవు. ఓ శరణ్యా? అందువలన నా చిత్తములో త్వరగా సోమ అనే పదముంచుము.

యాచే స చాహం సుర భూపతిత్వం హృత్పద్మమధ్యే మమ సోమనాథ ।
శ్రీసోమపాదామ్బుజ సన్నిధానం యాచే విచార్యైవ చ తత్కురుష్వ ॥ 15 ॥

ఓ సోమనాథ! నాకు దేవాధిపత్యమవసరంలేదు. నా హృదయకమలము నందు శ్రీసోమనాధుని పద్మములవంటి పాదసన్నిధానమును చక్కగా విచారించి కృప చేయుము. నేనదే యాచించుచున్నాను.

యథా తవాహం విదితోఽస్మి పాప స్తథాఽపి విజ్ఞాపన మాశృణుష్వ ।
సంశ్రూయతే యత్ర వచః శివేతి తత్ర స్థితిః స్యాన్మమ సోమ నిత్యమ్ ॥ 16 ॥

నేనెట్లు నిన్ను తెలుసుకున్నానో అట్లే నా పాపమును తెలుసుకున్నాను. నా విన్నపమేదో అది వినుము. ఓ సోమనాథా! నిత్యమూ ఎక్కడ శివనామము వినబడుతుందో అక్కడ నేనుండునట్లుగా అనుగ్రహించుము.

గౌరీపతే శంకర సోమనాథ విశ్వేశ కారుణ్యనిధేఽఖిలాత్మన్ ।
సంస్తూయతే యత్ర సదేతి తత్ర కేషామపి స్యాత్కృతినాం నివాసః ॥ 17 ॥

గౌరీపతీ! శంకరా! సోమనాథా! విశ్వేశా! కరుణాసముద్రా! అఖిలాత్మకా! అని ఎక్కడైతే స్తోత్రము చేయుదురో అక్కడ సత్కర్మలను చేసిన వారికెవరికైనా నిత్యనివాసము లభించును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

దత్తాత్రేయ స్తుతిం శ్రుత్వా తుతోష భగవాన్ హరః ।
వరదోఽస్మీతి తం ప్రాహ యోగినం విశ్వకృద్భవః ॥ 18 ॥

దత్తాత్రేయుడు చేసిన ఈ స్తోత్రమును విని శివుడు సంతోషించెను. విశ్వము నంతా సృష్టించిన ఆ భవుడు ఆ దత్తాత్రేయునితో వరమునిత్తు ననెను.

ఆత్రేయ ఉవాచ :- ఆత్రేయుడు పలికాడు.

ఆత్మజ్ఞానం చ ముక్తిం చ భుక్తిం చ విపులాం త్వయి ।
తీర్థస్యాఽపి చ మాహాత్మ్యం వరోఽయం త్రిదశార్చిత ॥ 19 ॥

ఓ దేవతాపూజ్యుడా ! నీకు ఆత్మజ్ఞానము, ముక్తి, భుక్తి విశేషంగా తీర్థము యొక్క మాహాత్మ్యమును వరముగా ఇచ్చినది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి తం శంభు రుక్త్వాచాన్తరధీయత ।
తతః ప్రభృతి తత్తీర్థమాత్మతీర్థం విదుర్బుధాః ॥
తత్ర స్నానేన దానేన ముక్తిః స్యాదిహ నారద ॥ 20 ॥

ఓ నారదా! సరే అట్లేయగుగాక! అని చెప్పి శివుడు అంతర్ధానమొందెను. అప్పటినుండి పెద్దలు దానిని ఆత్మతీర్థమని పేర్కొనిరి. అక్కడ స్నానము దానము చేసినవారికి ముక్తి లభించును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఆత్మతీర్థ వర్ణనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥ 47 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని ఆత్మతీర్థవర్ణన మనుపేరుగల నలబై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టచత్వారింశోఽధ్యాయః – నలబై ఎనిమిదవ అధ్యాయం

అశ్వత్థాద్యష్టోత్తర షోడశ సహస్రతీర్థవర్ణనమ్ –అశ్వత్థాది అష్టోత్తర షోడశ సహస్ర (1608) తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అశ్వత్థతీర్థ మాఖ్యాతం పిప్పలం చ తతః పరమ్ ।
ఉత్తరే మన్దతీర్థం తు తత్ర వృష్టిమితః శృణు ॥ 1 ॥

అశ్వత్థతీర్థము, పిప్పలతీర్థము, ఉత్తరభాగంలోని మందతీర్థము వీటియొక్క పరిణామక్రమమును గొప్పతనమును వినుము.

పురాత్వగస్త్యో భగవాన్ దక్షిణాశాపతిః ప్రభుః ।
దేవైస్తు ప్రేరితః పూర్వం విన్ధ్యస్య ప్రార్థనం ప్రతి ॥ 2 ॥

పూర్వము దక్షిణ దిక్కునకధిపతి పూజ్యుడగు అగస్త్యుడనువాడు పూర్వము దేవతలు ప్రేరేపించగా విన్ధ్యపర్వతమునభ్యర్థించుటకు పూనుకొనెను.

స శనై ర్విన్ధ్యమభ్యాగా త్సహస్రమునిభిర్వృతః ।
తమాగత్య నగశ్రేష్ఠం బహువృక్షసమాకులమ్ ॥ 3 ॥

వేయిమంది ఋషులు వెంటరాగా ఆ అగస్త్యుడు అనేక వృక్షసమూహములతో కూడిన ఆ శ్రేష్ఠమగు వింధ్యపర్వతము వద్దకు వచ్చి,

స్పర్ధినం మేరుభానుభ్యాం విన్ధ్యం శృంగశతైర్వృతమ్ ।
అత్యున్నతం నగం ధీరో లోపాముద్రాపతిర్మునిః ॥ 4 ॥

వందలకొలది శృంగములతో నావరించి చాలా ఎత్తుగా నుండి మేరుపర్వతంతో సూర్యులతో పోటీపడుతున్న ఆ వింధ్యపర్వతమువద్దకు లోపాముద్రాపతి అయిన మునీశ్వరుడు ధీరుడగు ఆ అగస్త్యుడు,

కృతాతిథ్యో ద్విజైః సార్ధం ప్రశస్య చ నగం పునః ।
ఇదమాహ మునిశ్రేష్ఠో దేవకార్యార్థసిద్ధయే ॥ 5 ॥

వింధ్యపర్వతమిచ్చిన ఆతిథ్యమును బ్రాహ్మణులందరితో కలిసి స్వీకరించి, మరొక్కమారు ఆ విన్ధ్యను ప్రశంసించి దేవతల కార్యము సిద్ధించుటకై ఆ మునిశ్రేష్ఠుడు ఇట్లనెను.

అగస్త్య ఉవాచ :– అగస్త్యుడు పలికాడు.

అహం యామి నగశ్రేష్ఠ మునిభిస్తత్త్వదర్శిభిః ।
తీర్థయాత్రాం కరోమీతి దక్షిణాశాం వ్రజామ్యహమ్ ॥ 6 ॥

ఓ పర్వతరాజా! తత్త్వదర్శులగు మునులతో కలిసి తీర్థయాత్రలు చేయవలయునని దక్షిణమువైపు వెళ్ళుచున్నాను.

దేహి మార్గం నగపతే ఆతిథ్యం దేహి యాచతే ।
యావదాగమనం మే స్యాత్థాతవ్యం తావదేవ హి ॥ 7 ॥

ఓ నగపతీ! ఆతిథ్యమునిమ్ము. నిన్ను మార్గమునకై యాచించుచున్నాను. నేను మళ్ళీ తిరిగి వచ్చువరకు నీ వట్లే యుండవలయునని కోరుచున్నాను.

నాన్యథా భవితవ్యం తే తథేత్యాహ నగోత్తమః ।
ఆక్రామన్ దక్షిణా మాశాం తైర్వృతో మునిభిర్మునిః ॥ 8 ॥

వేరువిధముగా కారాదు అనగా ఆ నగోత్తముడు డంగీకరించెను. మునులందరితో కలిసి అగస్త్యముని దక్షిణ దిక్కునకు వెళ్ళెను.

శనైః స గౌతమీమాగాత్స ప్రయాగాయ దీక్షితః ।
యావత్సంవత్సరం సత్రమకరోదృషిభిర్వృతః ॥ 9 ॥

అతడు నెమ్మదిగా సంవత్సరకాలము యజ్ఞముచేయుటకు తాను దీక్షవహించి గౌతమీ నదివద్దకు వచ్చెను. ఆ ఋషులందరితో కలిసి సంవత్సరము పూర్తియగునంతవరకు యజ్ఞము చేసెను.

కైటభస్య సుతౌ పాపౌ రాక్షసౌ ధర్మకణ్టకౌ ।
అశ్వత్థః పిప్పలశ్చేతి విఖ్యాతౌ త్రిదశాలయే ॥ 10 ॥

కైటభుని యొక్క కుమారులు ధర్మాన్ని బాధించేవారు. పాపిష్ఠులు వారిద్దరు రాక్షసులు. స్వర్గములో వారిద్దరూ అశ్వత్థుడు, పిప్పలుడు అను పేర్లతో ప్రసిద్ధి చెందినారు.

అశ్వత్థోఽశ్వత్థరూపేణ పిప్పలో బ్రహ్మరూపధృక్ ।
తావుభావన్తరం ప్రేప్సూ యజ్ఞవిధ్వంసనాయ తు ॥ 11 ॥

అశ్వత్థుడు రావిచెట్టు రూపంతో, పిప్పలుడు బ్రాహ్మణరూపంలో వారిద్దరూ యజ్ఞమును ధ్వంసము చేయుటకై అవకాశమును పొందగోరువారై

కురుతాం కాంక్షితం రూపం దానవే పాప చేతసౌ ॥
అశ్వత్థో వృక్షరూపేణ పిప్పలోబ్రాహ్మణాకృతిః ॥ 12 ॥

పాపమనస్కులైన ఆ దానవులిద్దరూ కోరిన రూపమును ధరించువారు. అశ్వత్థుడు వృక్షరూపముతో పిప్పలుడు బ్రాహ్మణరూపంతో,

ఉభౌ తౌ బ్రాహ్మణాన్నిత్యం పీడయేతాం తపోధన ।
ఆలభన్తే చ యేఽశ్వత్థం తాంస్తానశ్నాత్యసౌ తరుః ॥ 13 ॥

ఓ తపోధనా! వారిద్దరూ బ్రాహ్మణులను నిత్యము పీడించేవారు. ఎవరైనా అశ్వత్థ వృక్షమును తాకితే వారినా అశ్వత్థ వృక్షము తినును.

పిప్పలః సామగో భూత్వా శిష్యానశ్నాతి రాక్షసః ।
తస్మాదద్యాపి విప్రేషు సామగోఽతీవ నిష్ఘృపః ॥ 14 ॥

పిప్పలుడు సామగానము చేయువానిగా నుండి తన దగ్గరికి వచ్చిన శిష్యులను రాక్షసరూపంతో తినును. అందువలననే నేటికికూడా సామవేదాన్నిగానం చేసేవారు దయారహితులుగా నుందురు.

క్షీయమానాన్ ద్విజాన్ దృష్ట్వా మునయో రాక్షసావిమౌ ।
ఇతి బుధ్వా మహాప్రాజ్ఞ దక్షిణం తీరమాశ్రితమ్ ॥ 15 ॥

దినదినమూ బ్రాహ్మణులు నశించుటను చూచి మునులు వీరిద్దరూ రాక్షసులు అని తెలుసుకొని ఓ మహాప్రాజ్ఞ! గౌతమీనదియొక్క దక్షిణతీరంను ఆశ్రయించిన

సౌరిం శనైశ్చరం మందం తపస్యన్తం ధృతవ్రతమ్ ।
గత్వా మునిగణాః సర్వే రక్షః కర్మ న్యవేదయన్ ॥ 16 ॥

నియమనిష్ఠలతో తపస్సుచేయుచున్న సౌరి, మంద అనేపేర్లు గలిగిన శనైశ్చరునివద్దకు మునిగణములన్నియు వెళ్ళి ఆ శనైశ్చరునికి తమను రక్షించవలసినదిగా మనవిచేసిరి.

సౌరిర్ముని గణానాహ పూర్ణే తపసి మే ద్విజాః ।
రాక్షసౌ హన్మ్యపూర్ణేన తపసాఽక్షమ ఏవ హి ॥ 17 ॥

అప్పుడా శనైశ్చరుడు ఓ ద్విజులారా! నా తపస్సు పూర్తి అయిన తర్వాత రాక్షసులను చంపుదును. ఇప్పుడు నా తపస్సు పూర్తికాకముందు అసమర్థుడను అని మునిగణముతో చెప్పెను.

పునః ప్రోచుర్ముని గణా దాస్యామస్తే తపో మహత్ ।
ఇత్యుక్తో బ్రాహ్మణైః సౌరిః కృతమిత్యాహ తానపి ॥ 18 ॥

తిరిగి మునులు మా తపఃశక్తిని నీకు ఇచ్చుచున్నామనిరి. అట్లువారు చెప్పగానే శనైశ్చరుడు వారితో మీపని సిద్ధించనట్లే యనెను.

సౌరిర్బ్రాహ్మణవేషేణ ప్రాయాదశ్వత్థ రూపిణమ్ ।
రాక్షసం బ్రాహ్మణో భూత్వాప్రదక్షిణమథా కరోత్ ॥ 19 ॥

సౌరి బ్రాహ్మణ వేషమును ధరించి అశ్వత్థరూపంలో నున్న రాక్షసుని వద్దకు వెళ్ళెను. బ్రాహ్మణునిగా ఆ చెట్టుకు ప్రదక్షిణముచేసెను.

ప్రదక్షిణం తు కుర్వాణం మేనే బ్రాహ్మణమేవ తమ్ ।
నిత్యవద్రాక్షసః పాపో భక్షయామాస మాయయా ॥ 20 ॥

ప్రదక్షిణము చేయుచున్న మందుని అశ్వత్థుడు బ్రాహ్మణునిగానే భావించెను. ఆ పాపియైన రాక్షసుడు తనమాయతో ఎప్పటివలె తినసాగెను.

తస్య కాయం సమావిశ్య చక్షుషాఽన్త్రాణ్యపశ్యత ।
దృష్టః సరాక్షసః పాపో మన్దేన రవిసూనునా ॥ 21 ॥

అతని శరీరంలో ప్రవేశించి లోపల నరములను చూచెను. లోపల ఉబ్బిపోయెను సూర్యకుమారుడగు శని ఆ రాక్షసునిపాపిని చూచెను.

భస్మీభూతః క్షణేనైవ గిరిః వజ్రహతో యథా ।
అశ్వత్థం భస్మసాత్కృత్వా అన్యం బ్రాహ్మణరూపిణమ్ ॥ 22 ॥

క్షణంలోనే వజ్రాయుధంతో కొట్టగా పర్వతమెట్లగునో అట్లు అశ్వత్థమును భస్మముగా చేసి, బ్రాహ్మణ రూపంలో నున్నమరొకని.

రాక్షసం పాపనిలయమేక ఏవ తమభ్యగాత్ ।
అధీయానో విప్ర ఇవ శిష్యరూపో వినీతవత్ ॥ 23 ॥

పాపస్థానుడగు రాక్షసుని వద్దకు ఒంటిరిగా వెళ్ళెను. అధ్యయనము చేయుటకు వచ్చిన బ్రాహ్మణునివలె శిష్యునిగా ఎంతో వినయమును ప్రదర్శించెను.

పిప్పలః పూర్వవచ్చాపి భక్షయామాస భానుజమ్ ।
స భక్షితః పూర్వవచ్చ కుక్షావన్త్రాణ్యవైక్షత ॥ 24 ॥

పిప్పలుడు పూర్వము మాదిరిగానే ఆ సూర్యకుమారుడగు శనిని తినెను. తింటున్న అతనికి పొట్టలోపల పేగులను చూచెను.

తేనాఽఽలోకితమాత్రోఽసౌ రాక్షసో భస్మసానభూత్ ।
ఉభౌ హత్వా భానుసుతః కిం కృత్యం మే వదన్త్వథ ॥ 25 ॥

శనైశ్చరుడు చూచినంతమాత్రముననే ఆ రాక్షసుడు భస్మరాశి ఆయెను. ఇట్లా సూర్య కుమారుడా ఇద్దరు రాక్షసులను చంపి ఇక నేనేమి చేయవలయునో చెప్పుడని మునులను ప్రశ్నించెను.

మునయో జాత సంహర్షాః సర్వ ఏవ తపస్వినః ।
తతః ప్రసన్నా హ్యభవన్ ఋషయోఽగస్త్యపూర్వకాః ॥ 26 ॥

తపోనిష్ఠులగు ఆ మునులందరూ సంతోషించిరి. అగస్త్యుడు మొదలుకొని ఆ ఋషులందరూ శనైశ్చరునికి ప్రసన్నులైరి.

వరాన్ దదుర్యథాకామం సౌరయే మన్దగామినే ।
స ప్రీతో బ్రాహ్మణా నాహ శనిః సూర్యసుతో బలీ ॥ 27 ॥

వారు ఆ మందగమనుడగు సౌరికి అతడు కోరిన వరముల నిచ్చిరి. బలవంతుడు, సూర్యపుత్రుడునగు శని సంతుష్టుడై బ్రాహ్మణులతో నిట్లనెను.

సౌరిరువాచ :- శనైశ్చరుడు పలికాడు.

మద్వారే నియతా యే చ కుర్వన్త్యశ్వత్థలమ్భనమ్ ।
తేషాం సర్వాణి కార్యాణి స్యుః పీడా మద్భవా న చ ॥ 28 ॥

శనివారమునాడు ఎవరైతే రావివృక్షమును స్పృశిస్తారో వారికి సమస్తకార్యములు నెరవేరును. నా వలన వచ్చే పీడలేవీరావు.

తీర్థే చాశ్వత్థసంజ్ఞే వై స్నానం కుర్వన్తి యే నరాః ।
తేషాం సర్వాణి కార్యాణి భవేయురపరో వరః ॥ 29 ॥

ఈ అశ్వత్థమను పేరుగల తీర్థములో స్నానము చేసినవారికి సమస్తకార్యములు నెరవేరును. ఇది మరియొక వరము.

చక్షుష్పందం భుజస్పందం దుఃస్వప్నం దుర్విచిన్తనమ్ ।
శత్రూణాం చ సముత్థానం శమయాశ్వత్థ చాశు మే ॥ 30 ॥

కన్ను అదురుట, భుజం అదురుట, చెడ్డకలలు, చెడ్డ ఆలోచనలు, శత్రువులు తిరిగి విజృంభించుట మున్నగున వన్నియును ఓ అశ్వత్థ వృక్షమా! వాటిని శమింపజేయుము.

మన్త్రేణానేన దేవర్షే శివధ్యాన పరాయణాః ।
మన్దవారే తు యేఽశ్వత్థం ప్రాతరుత్థాయ మానవాః ॥
ఆలభన్తే చ తేషాం వై గ్రహపీడా వ్యపోహతు ॥ 31 ॥

ఓ దేవర్షీ ! శివధ్యానపరాయణులైన వారెవరైనా శనివారంనాడు ఉదయముననే లేచి అశ్వత్థ వృక్షమును ఈ మంత్రమును పఠిస్తూ స్పృశించినచో వారికి గ్రహపీడలన్నియును తొలగును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రభృతి తత్తీర్థమశ్వత్థం పిప్పలం విదుః ।
తీర్థం శనైశ్చరం తత్ర తత్రాగస్త్యం చ సాత్రికమ్ ॥ 32 ॥

అప్పటినుండి ఆ తీర్థమును అశ్వత్థతీర్థమని, పిప్పలతీర్థమని, శనైశ్చరతీర్థమని, అగస్త్యతీర్థమని, సాత్రికతీర్థమని యందురు.

యాజ్ఞికం చాపి తత్తీర్థం సామగం తీర్థమేవ చ ।
ఇత్యాద్యష్టోత్తరాణ్యాసన్ సహస్రాణ్యథ షోడశ ॥
తేషు స్నానం చ దానం చ సర్వయాగఫలప్రదమ్ ॥ 33 ॥

యాజ్ఞికతీర్థమని, సామగతీర్థమని యందురు. ఇట్లు పదహారువేలఎనిమిది తీర్థములున్నవి. ఆ తీర్థముల యందు స్నానము చేసినా దానము చేసినా సమస్తక్రతువులు చేసిన ఫలము లభించును.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే అశ్వత్థాద్యష్టోత్తర షోడశ సహస్ర తీర్థవర్ణనం నామ అష్టచత్వారింశోఽధ్యాయః. ॥ 48 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యము నందలి అశ్వత్థాది అష్టోత్తర షోడశ సహస్ర (1608) తీర్థ వర్ణనము పేరుగల నలబైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనపంచాశోఽధ్యాయః – నలభై తొమ్మిదవ అధ్యాయం

సోమతీర్థవర్ణనమ్ – సోమతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సోమతీర్థమితి ఖ్యాతం తదప్యుక్తం మహాత్మభిః ।
తత్ర స్నానేన దానేన సోమపాన ఫలం భవేత్ ॥ 1 ॥

మహాత్ములు సోమతీర్థమనుదానిని గూడా చెప్పినారు. అక్కడ స్నానము చేసినా, దానము చేసినా సోమరసపానఫలము లభించును.

జగతాం మాతరః పూర్వమోషధ్యో జీవసంమతాః ।
మమాపి మాతరో దేవ్యః పూర్వాసాం పూర్వవత్తరాః ॥ 2 ॥

పూర్వము జగత్తుల కన్నింటికి జీవసమ్మతములైన ఓషధులు మాతలుగా నుండేవారు. ముందున్నవారికి వారికి ముందున్న వారే తల్లులన్నట్లుగా నాకు కూడా ఆ దేవేరులే తల్లులు.

ఆసు ప్రతిష్ఠితో ధర్మః స్వాధ్యాయో యజ్ఞకర్మ చ ।
ఆభిరేవ ధృతం సర్వం త్రైలోక్యం స చరాచరమ్ ॥ 3 ॥

ధర్మము, స్వాధ్యాయము, యజ్ఞ, కర్మలు మొదలగునవన్నియు వీనియందే ప్రతిష్ఠితమైనవి. ఈ ముల్లోకములు సమస్త చరాచర జగత్తంతయు నివే ధరించినవి.

అశేషరోగోపశమో భవత్యాభిరసంశయమ్ ।
అన్నమేతాభిరేవస్యాదశేషప్రాణరక్షణమ్ ॥
అత్రోషధ్యో జగద్వంద్యా మామూచురనహంకృతాః ॥ 4 ॥

రోగములన్నియు వీటి వలననే శమించుననుటలో నే సందేహములేదు. ప్రాణులన్నింటిని రక్షించే అన్నము వీనివలననే లభించుచున్నది. అటువంటి ఓషధులు లోకములచే కీర్తించబడుచున్నవి. ఆ నిరహంకారులైన ఓషధులో రోజు నాతో పలికినవి.

ఓషధ్య ఊచుః :– ఓషధులు పలికాయి.

అస్మాకం త్వం పతిం దేహి రాజానం సురసత్తమ ॥ 5 ॥

ఓ సురశ్రేష్ఠా! మాకు భర్తగా రాజును (చంద్రుని) ఇవ్వుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం తాసాం మయోక్తా ఓషధీరిదమ్ ।
పతిం ప్రాప్స్యథ సర్వాశ్చ రాజానం ప్రీతివర్ధనమ్ ॥ 6 ॥

వారిమాటను విన్న నేను ఓషధులతో నిట్లంటిని. మీరంతా ప్రీతివర్ధకుడైన రాజు (చంద్రు)ని భర్తగా పొందుడు.

రాజానమితి తచ్ఛ్రుత్వా తా మామూచుః పునర్మునే ।
గన్తవ్యం క్వ పునశ్చోక్తా గౌతమీం యాన్తు మాతరః ॥ 7 ॥

ఓ మునీ! రాజును అను మాటను వినగానే వారు మళ్ళీ నన్నడిగిరి. ఎక్కడికి వెళ్ళవలయును? నేను మళ్ళీ చెప్పితిని మాతలారా! గౌతమీ నది వద్దకు వెళ్ళుడు.

తుష్టాయా మథ తస్యాం వో రాజా స్యాల్లోకపూజితః ।
తాశ్చ గత్వా మునిశ్రేష్ఠ! తుష్టువు ర్గౌతమీం నదీమ్ ॥ 8 ॥

గౌతమీనది సంతోషించిన మీకు లోకపూజితుడగు రాజు భర్తగానగును. ఓ మునిశ్రేష్ఠా! వారు వెళ్ళి గౌతమీ నదిని స్తుతించిరి.

ఓషధ్య ఊచుః :– ఓషధులు పలికాయి.

కిం వాఽభవిష్యద్భువవర్తినో జనా నానాఘ సంగాభిభవోత్థ దుఃఖాః ।
న చాఽఽగమిష్యద్భువతీ భువం చేత్ పుణ్యోదకే గౌతమి శంభుకాన్తే ॥ 9 ॥

ఓ శివప్రియా! పుణ్యజలము కలదానా! గౌతమీ ! నీవు ఈ భూమి మీదకు రాకపోయినట్లయితే అనేక పాపములను చేసి వాటి సంగమంతో దుఃఖాలను పొందిన ఈ లోకంలో నివసించే జనులు ఏమైపోయేవారో కదా!

కో వేత్తి భాగ్యం నరదేహభాజాం మహీగతానాం సరితామధీశే ॥
ఏషాం మహాపాతకసంఘహన్త్రీ త్వమమ్బ గంగే సులభా సదైవ ॥ 10 ॥

అమ్మా! గంగా మాతా! మానవశరీరమును పొందిన వారి భాగ్యమునెవరెరుగుదురు? ఎందుకనగా ఈ లోకంలో ప్రవహించే నదులన్నింటికీ ఈశ్వరీ! వీరి మహాపాపసమూహములను నశింపజేసేదానివి నీవేకదా సర్వదా సులభురాలివై అనుగ్రహించేది నీవేకదా!

న తే విభూతిం నను వేత్తి కోఽపి త్రైలోకవంద్యే జగదమ్బ గంగే ।
గౌరీ సమాలింగిత విగ్రహోఽపి ధత్తే స్మరారిః శిరసాఽపి యత్త్వామ్ ॥ 11 ॥

ముల్లోకవాసులచే నమస్కరించబడుదానా! జగన్మాతా! గంగా నీ ఐశ్వర్యమునెవరైనా తెలుసుకొనగలరా! శివుడు తన అర్ధశరీరము గౌరీదేవితో కలిసియున్నప్పటికిని ఆ మన్మథారి నిన్ను తలమీద ధరించినాడు కదా!

నమోఽస్తు తే మాతరభీష్ట దాయిని నమోఽస్తు తే బ్రహ్మమయేఽఘనాశిని ।
నమోఽస్తు తే విష్ణుపదాబ్జనిఃసృతే నమోఽస్తు తే శంభుజటావినిఃసృతే ॥ 12 ॥

కోరిన కోరికలనిచ్చే మాతా! నీకు నమస్కారము. పాపనాశినీ! బ్రహ్మమయీ! నీకు నమస్కారము. విష్ణువు పాదపద్మములనుండి ఉద్భవించిన దానా! నీకు నమస్కారము. శివుని జటాజూటమునుండి ప్రవహించిన దానా! నీకు నమస్కారము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యేవం స్తువతామీశా కిం దదామీత్యవోచత ! ॥ 13 ॥

ఇట్లు వారు స్తుతించగా ఆ ఈశ్వరి ఏమివ్వవలెనని యడిగెను.

ఓషధ్య ఊచుః :- ఓషధులు పలికారు.

పతిం దేహి జగన్మాత! రాజాన మతితేజసమ్ ॥ 14 ॥

జగన్మాతా! మిక్కిలి తేజస్సుగల రాజును పతిగా నిమ్ము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదోవాచ నదీ గంగా ఓషధీస్తా ఇదం వచః ॥ 15 ॥

అప్పుడు గంగానది ఆ ఓషధులతో నిట్లనెను.

గంగోవాచ:- గంగ పలికింది.

అహం చామృత రూపాఽస్మి ఓషధ్యో మాతరోఽమృతాః ।
తాదృశం చామృతాత్మానం పతిం సోమం దదామి వః ॥ 16 ॥

నే నమృతస్వరూపురాలను. మీరు ఓషధులైన అమృతస్వరూపులైన మాతలు. అమృతాత్ముడైన అటువంటి చంద్రుని మీకు భర్తగా నిచ్చుచున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవాశ్చ ఋషయో వాక్యం మేనిరే సోమ ఏవ చ ।
ఓషధ్యశ్చాపి తద్వాక్యం తతో జగ్ముః స్వమాలయమ్ ॥ 17 ॥

దేవతలు ఋషులు ఆ మాటనంగీకరించిరి. చంద్రుడు కూడా సమ్మతిని తెలుపగా ఓషధులు సమ్మతించినవి. అటు తరువాత వారివారి నివాసములకు వెళ్ళినవి.

యత్ర చాఽఽపుర్మహౌషధ్యో రాజానమమృతాత్మకమ్ ।
సోమం సమస్తసంతాపపాపసంఘనివారకమ్ ॥ 18 ॥

సోమతీర్థం తు తత్ ఖ్యాతం సోమపానఫలప్రదమ్ ।
తత్ర స్నానేన దానేన పితరః స్వర్గమాప్నుయుః ॥ 19 ॥

ఎక్కడైతే ఓషధులు సమస్త సంతాప పాపసమూహములను నివారించే అమృతాత్మకుడగు రాజైన చంద్రుని పొందినారో, దానిని సోమతీర్థమందురు. అది సోమరసపానఫలమునిచ్చునది. ఆ తీర్థమునందు స్నానము చేసినా, దానముచేసినా స్వర్గమును పొందుదురు.

య ఇదం శృణుయాన్నిత్యం పఠేద్వా భక్తితః స్మరేత్ ।
దీర్ఘ మాయు రవాప్నోతి స పుత్రీ ధనవాన్భవేత్ ॥ 20 ॥

ఈ సోమతీర్థమును గూర్చి నిత్యము విన్నా, చదివినా భక్తితో స్మరించినా దీర్ఘాయుష్షుతోపాటు సంతానమును పొంది ధనవంతుడగును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే సోమతీర్థవర్ణనం నామైకోనపంచాశోఽధ్యాయః ॥ 49 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యము నందలి సోమతీర్థవర్ణనమను పేరుగల నలబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

పంచాశోఽధ్యాయః – యాభైయవ అధ్యాయం

షట్ శతాధిక సహస్ర తీర్థ వర్ణనమ్ – వెయ్యి ఆరువందల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ధాన్యతీర్థమితిఖ్యాతం సర్వకామప్రదం నృణామ్ ।
సుభిక్షం క్షేమదం పుంసాం సర్వాపద్వినివారణమ్ ॥ 1 ॥

మానవులకు సమస్త ఆపదలను తొలగించి, పంటలుబాగా పండించి, క్షేమాన్ని కలుగజేసి అన్నికోరికల నిచ్చునది ధాన్యతీర్థమనునది కలదు.

ఓషధ్యః సోమరాజానం పతిం ప్రాప్య ముదాన్వితాః ।
ఊచుః సర్వస్యలోకస్య గంగాయాశ్చేప్సితం వచః ॥ 2 ॥

ఓషధులు సోమరాజును 'చంద్రుని' భర్తగా పొంది సంతోషించినవారై లోకములోని వారందరికి గంగాదేవి కిష్టమైన మాటను పలికారు.

ఓషధ్య ఊచుః :– ఓషధులు పలికాయి.

వైదికీ పుణ్యగాథాఽస్తి యాం వై వేదవిదో విదుః ।
భూమిం సస్యవతీం కశ్చిన్మాతరం మాతృసంమితామ్ ॥ 3 ॥

గంగాసమీపే యో దద్యాత్సర్వాన్కామానవాప్నుయాత్ ।
భూమిం సస్యవతీం గాశ్చ ఓషధీశ్చ ముదాన్వితాః ॥ 4 ॥

విష్ణుబ్రహ్మేశరూపాయ యో దద్యాద్భక్తిమాన్నరః ।
సర్వం తదక్షయం విద్యాత్సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 5 ॥

వేదవిదులందరికీ తెలిసిన వైదికమైన పుణ్యగాథ యొకటి కలదు. ఎవరైనా మాతృసంమితమైన పంటలతో కూడిన భూమాతను (భూదానమును) గంగా సమీపమునందెవరిత్తురో వారు అన్ని కోరికలను పొందుదురు. సస్యములతో కూడిన భూమిని, గోవులను, ఓషధులను సంతోషంగా, బ్రహ్మవిష్ణుమహేశ్వరరూపుడగువానికి భక్తితో దానము చేసిన అది అక్షయముగానుండి ఆ మానవుడు కోరికలనన్నింటిని పొందును.

ఓషధ్యః సోమరాజన్యాః సోమశ్చాప్యోషధీపతిః ।
ఇతి జ్ఞాత్వా బ్రహ్మవిద ఓషధీర్యః ప్రదాస్యతి ॥ 6 ॥

సర్వాన్కామా నవాప్నోతి బ్రహ్మలోకే మహీయతే ।
తా ఏవ సోమరాజన్యాః ప్రీతా ప్రోచుః పునః పునః ॥ 7 ॥

ఓషధులు సోమరాజుభార్యలని, చంద్రుడు ఓషధులకు భర్తయని తెలుసుకున్న బ్రహ్మవేత్తలు ఓషధులను ఎవరికైతే దానమును చేయుదురో, వారు అన్నికోరికలను పొందుదురు. అంతేకాక బ్రహ్మలోకమును చేరుదురు. తిరిగి ఆ చంద్రుని పట్టపురాణులు సంతోషించి మాటిమాటి కిట్లనిరి.

ఓషధ్య ఊచుః :- ఓషధులు పలికాయి.

యోఽస్మాన్ దదాతి గంగాయాం తం రాజన్ పారయామసి ।
త్వముత్తమశ్చోషధీశ త్వదధీనం చరాచరమ్ ॥ 8 ॥

రాజా! మమ్ములనెవరు గంగయందు దానము చేయుదురో వారిని తరింపచేయుచున్నావు. ఓ ఓషధీశా! నీవుఉత్తముడవు. ఈ సమస్తచరాచరమంతయు నీ ఆధీనము.

ఓషధయః సంవదన్తే సోమేన సహ రాజ్ఞా ।
యోఽస్మాన్ దదాతి విప్రేభ్యస్తం రాజన్ పారయామసి ॥ 9 ॥

తమ రాజైన చంద్రునితో ఓషధులన్నాయి-ఓ రాజా! ఎవరైతే మమ్ములను బ్రాహ్మణులకు దానమును చేయుదురో అటువంటివారిని నీవు తరింపచేయుచున్నావు.

వయం చ బ్రహ్మరూపిణ్యః ప్రాణరూపిణ్య ఏవ చ ।
యోఽస్మాన్ దదాతి విప్రేభ్యస్తం రాజన్ పారయామసి ॥ 10 ॥

ఓ రాజా! మేము బ్రహ్మరూపిణులము, ప్రాణరూపిణులముకూడా. ఎవరైతే మమ్ముబ్రాహ్మణులకు దానమును చేయుదురో అతనిని తరింప చేయుచున్నావు.

అస్మాన్ దదాతి యో నిత్యం బ్రాహ్మణేభ్యో జితవ్రతః ।
ఉపాస్తిరస్తి సాఽస్మాకం తం రాజన్ పారయామసి ॥ 11 ॥

ఓరాజా! ప్రతినిత్యము మమ్మెవడు బ్రాహ్మణులకు దానము చేయునో, ఇంద్రియములను జయించి, వ్రతనియమంతో మమ్ము ఉపాసించునో మాకు సేవచేయునో అట్టివారిని నీవు తరింపచేయుచున్నావు.

స్థావరం జంగమః కించిదస్మాభిర్వ్యాపృతం జగత్ ।
యోఽస్మాన్ దదాతి విప్రేభ్యస్తం రాజన్ పారయామసి ॥ 12 ॥

ఓ రాజా! స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తంతయు మాచేతనే విస్తరించబడినది. బ్రాహ్మణులకు మమ్ములనెవరు దానము చేయుదురో అతనిని నీవు తరింప చేయుచున్నావు.

హవ్యం కవ్యం యదమృతం యత్కించి దుపభుజ్యతే ।
తద్గరీయశ్చ యో దద్యాత్తం రాజన్ పారయామసి ॥ 13 ॥

ఓ రాజా! దేవతలనుద్దేశించి, పితృదేవతలనుద్దేశించి ఇచ్చే హవ్యకవ్యములకన్న, అమృతముకన్నా కూడా ఓషధుల నే బ్రాహ్మణునకు దానమిత్తురో, దానినాతడు అనుభవించునో పైవాటి కన్నాకూడా గొప్పనగు నాఓషధులను దానముచేసిన వానిని తరింపచేయుచున్నావు.

ఇత్యేతాం వైదికీం గాథాం యః శృణోతి స్మరేత వా ।
పఠతే భక్తిమాపన్నస్తం రాజన్ పారయామసి ॥ 14 ॥

ఈ ప్రకారముగానున్న వైదికగాధను ఎవరు విన్నా, స్మరించినా, భక్తితో చదివినా ఓ రాజా! అతనిని తరింపచేయుచున్నావు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మ పలికాడు.

యత్రైషా పఠితా గాథా సోమేన సహ రాజ్ఞా ।
గంగాతీరే చౌషధీభిర్ధాన్యతీర్థం తదుచ్యతే ॥ 15 ॥

గంగాతీరమునందు చంద్రునితో కలిసి ఓషధులు ఈ గాథను గానముచేసిన ప్రదేశమును ధాన్యతీర్థమందురు.

తతః ప్రభృతి తత్తీర్థఔషధ్యం సౌమ్యమేవ చ ।
అమృతం వేదగాధం చ మాతృతీర్థం తథైవ చ ॥ 16 ॥

అప్పటినుండి ఆ తీర్థమును ఔషధ్యతీర్థమని, సౌమ్యతీర్థమని అమృతతీర్థమని, వేదగాథాతీర్థమని, మాతృతీర్థమని యందురు.

ఏషు స్నానం జపో హోమో దానం చ పితృతర్పణమ్ ।
అన్నదానం తు యః కుర్యాత్తదానన్త్యాయ కల్పతే ॥ 17 ॥

ఈ తీర్థములయందు స్నానము, తపము, హోమము, దానము, పితృతర్పణము, అన్నదానమునెవరు చేయుదురో అది అనంతమైన ఫలితమునిచ్చును సాక్షాద్విష్ణువునకు చెందును.

షట్‌శతాధికసాహస్రం తీర్థానాం తీరయోర్ద్వయోః ।
సర్వపాప నిహన్తౄణాం సర్వసంపద్వివర్ధనమ్ ॥ 18 ॥

గౌతమీనది కిరువైపుల తీరములందున్న ఒకవేయిపైన ఆరునూర్ల తీర్థములు సర్వపాపములను నశింపజేయుటయే కాక సమస్తసంపదలను పెంపొందించును.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే ధాన్యతీర్థాది షట్‌శతాధిక సహస్ర తీర్థ వర్ణనం నామ పంచాశోఽధ్యాయః ॥ 50 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి ధాన్యతీర్థము మొదలుగాగల వెయ్యిఆరు వందల తీర్థముల వర్ణనం అను పేరుగల యాభైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకపంచాశోఽధ్యాయః - యాభై ఒకటవ అధ్యాయం

విదర్భా సంగమ రేవతీ సంగమాది తీర్థవర్ణనమ్ - విదర్భా సంగమ, రేవతీ సంగమ తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

విదర్భాసంగమం పుణ్యం రేవతీ సంగమం తథా ।
తత్ర యద్వృత్తమాఖ్యాస్యే యత్పురాణవిదో విదుః ॥ 1 ॥

పురాణవేత్తలకు తెలిసిన పవిత్రమైన విదర్భా సంగమము అట్లే రేవతీ సంగమముల యొక్క వృత్తాంతమును చెప్పుచున్నాను.

భరద్వాజ ఇతి ఖ్యాత ఋషిరాసీత్తపోఽధికః ।
తస్య స్వసా రేవతీతి కురూపా వికృతస్వనా ॥ 2 ॥

గొప్పతపస్సుగల భరద్వాజుడను ఋషియుండెను. అతనికి కురూపి, వికృతస్వరము గలిగిన రేవతియను సోదరియుండెను.

తాం దృష్ట్వా వికృతాం భ్రాతా భరద్వాజః ప్రతాపవాన్ ।
చిన్తయా పరయా యుక్తో గంగాయా దక్షిణే తటే ॥ 3 ॥

గంగానది యొక్క దక్షిణ తీరమున కూర్చొని ఆ ప్రతాపవంతుడగు భరద్వాజుడు తన సోదరి వికృత స్వరూపమును చూచి మిక్కిలి చింతించెను.

కస్మై దద్యా మిమాం కన్యాం స్వసారం భీషణాకృతిమ్ ।
న కశ్చిత్ ప్రతిగృహ్ణాతి దాతవ్యా చ స్వసా తథా ॥ 4 ॥

ఈ భీషణా కృతిగల సోదరిని కన్యనెవరికీయ వలెను. ఏ ఒక్కడు కూడా స్వీకరించుటలేదు. ఎలాగైనా నా సోదరి ఇవ్వవలసినదే.

అహో భూయాన్నకస్యాపి కన్యా దుఃఖైకకారణమ్ ।
మరణం జీవతోఽప్యస్య ప్రాణినః స్యాత్ పదే పదే ॥ 5 ॥

ఆహో! ఎవ్వరికీ కానీ కన్య దుఃఖమునకు కారణము కాకూడదు. అటువంటి మనిషికి బ్రతుకు కూడా మాటిమాటికి మరణముతో సమానము.

ఏవం విమృశతస్తస్య స్వాశ్రమే చాతిశోభనే ।
ద్రష్టుం మునివరః ప్రాయాద్భరద్వాజం యతవ్రతమ్ ॥ 6 ॥

తన మంగళకరమగు ఆశ్రమమునందు ఇట్లు చింతించుచుండగా ఆ నియమవ్రతుడగు భరద్వాజుని చూచుటకొక మునిశ్రేష్ఠుడు వచ్చెను.

ద్వ్యష్టవర్షః శుభవపుః శాన్తో దాన్తో గుణాకరః ।
నామ్నా కఠ ఇతి ఖ్యాతో భరద్వాజం ననామ సః ॥ 7 ॥

పదహారుసంవత్సరముల వయస్సు కలిగి, మంచి సుందరదేహుడై శాంతస్వభావుడై, ఇంద్రియ నిగ్రహము కలిగి, మంచిగుణములకు నెలవైయున్న కఠుడను పేరుగలవాడు, అతడు భరద్వాజునకు నమస్కరించెను.

విధివత్పూజ్య తం విప్రం భరద్వాజః కఠం తథా ।
తస్యాఽఽగమనకార్యం చ పప్రచ్ఛ పురతః స్థితః ॥ 8 ॥

భరద్వాజుడు ఆ బ్రాహ్మణుడైన కఠుని విధిపూర్వకముగా పూజించి, అతని ఎదురుగా నిలిచి అతని రాకకు గల కారణమునడిగెను.

కఠోఽప్యాహ భరద్వాజం విద్యార్థ్యహముపాగతః ।
తథా చ దర్శనా కాంక్షీ యద్యుక్తం తద్విధీయతామ్ ॥ 9 ॥

అప్పుడు కఠుడు భరద్వాజునితో నేను విద్యార్థిగా తమ దర్శనము కోరి వచ్చినాను. ఏదియుక్తమో అది చేయుడనెను.

భరద్వాజః కఠం ప్రాహ అధీష్వ యదభీప్సితమ్ ।
పురాణం స్మృతయో వేదా ధర్మశాస్త్రాణ్యనేకశః ॥ 10 ॥

అప్పుడు భరద్వాజుడు కఠునితో పురాణము, స్మృతులు, వేదములు, అనేక ధర్మశాస్త్రములున్నవి నీకేది ఇష్టమో దానినధ్యయనము చేయుమనెను.

సర్వం వేద్మి మహాప్రాజ్ఞ రుచిరం వద మా చిరమ్ ।
కులీనో ధర్మనిరతో గురుశుశ్రూషణే రతః ॥
అభిమానీ శ్రుతధరః శిష్యః పుణ్యైరవాప్యతే ॥ 11 ॥

మహాప్రాజ్ఞ నాకంతా తెలుసు నీకేదిష్టమో త్వరగా చెప్పుము. మంచివంశములో పుట్టినవాడు, ధర్మనిరతుడు, గురువులకు సేవచేయుటయందాసక్తికలవాడు, స్వాభిమానముగలవాడు, విన్న దానిని ధరించేశక్తి గలవాడు అయిన శిష్యుడు పుణ్యవంతులకు మాత్రమే లభిస్తాడు.

కఠ ఉవాచ–కఠుడు పలికాడు.

అధ్యాపయస్వ భో బ్రహ్మన్ శిష్యం మాం వీతకల్మషమ్ ।
శుశ్రూషణ రతం భక్తం కులీనం సత్యవాదినమ్ ॥ 12 ॥

ఓ పూజ్యుడా! నేను కల్మషరహితుడను, సేవ చేయుటయందాసక్తిగలవానిని, భక్తుడను, చక్కనివంశంలో పుట్టినవానిని, సత్యమునే పలుకువానినగు నన్ను మీశిష్యునిగా స్వీకరించి బోధించుడు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా భరద్వాజః ప్రాదాద్విద్యామశేషతః ।
ప్రాప్తవిద్యో కఠః ప్రీతో భరద్వాజమథాబ్రవీత్ ॥ 13 ॥

భరద్వాజు డట్లేయని కఠునికి విద్యలన్నింటినీ బోధించెను. కఠుడా విద్యలను పొంది సంతోషించి భరద్వాజునితో నిట్లనెను.

కఠ ఉవాచ:– కఠుడు పలికాడు.

ఇచ్ఛేయం దక్షిణాం దాతుం గురో తవ మనఃప్రియామ్ ।
వదస్వ దుర్లభం వాఽపి గురో తుభ్యం నమోఽస్తు తే ॥ 14 ॥

ఆచార్యా! తమ మనస్సు కిష్టమైనదేదో చెప్పుడు. దానిని గురుదక్షిణగానిచ్చుటకిచ్ఛగించుచున్నాను. అది ఎంత దుర్లభమైనదైనాసరే. ఆచార్య! నమస్కారము.

విద్యాం ప్రాప్యాపి యే మోహాత్స్వగురోః పారితోషికమ్ ।
న ప్రయచ్ఛన్తి నిరయం తే యాన్త్యాచన్ద్రతారకమ్ ॥ 15 ॥

విద్యను నేర్చుకొని కూడా తమ గురువునకెవరు గురుదక్షిణను సమర్పించరో వారు చంద్ర తారకలున్నంతకాలము నరకముననుందురు.

భరద్వాజ ఉవాచ:–భరద్వాజుడు పలికాడు.

గృహాణ కన్యాం విధివద్భార్యాం కురు మమ స్వసామ్ ।
అస్యాం ప్రీత్యా వర్తితవ్యం యాచేయం దక్షిణామిమామ్ ॥ 16 ॥

కన్యయగు నా సోదరిని స్వీకరించుము. విధిపూర్వకముగా భార్యగా చేసుకొనుము. ఆమెయందు ప్రేమగా నడుచుకొనుము. ఇదే గురుదక్షిణగా నిన్ను యాచించుచున్నాను.

కఠ ఉవాచ:– కఠుడు పలికాడు.

భ్రాతృవత్పుత్రవచ్చాపి శిష్యః స్యాత్తు గురోః సదా ।
గురుశ్చ పితృవచ్చ స్యాత్సంబంధోఽత్ర కథం భవేత్ ॥ 17 ॥

గురువుకు శిష్యుడెప్పుడూ సోదరునివలె పుత్రునివలె యుండును. గురువు తండ్రివంటివాడు. మరి సంబంధమెట్లు కుదురును?

భరద్వాజ ఉవాచ:– భరద్వాజుడు పలికాడు.

మద్వాక్యం కురు సత్యం త్వం మమాఽఽజ్ఞా తవ దక్షిణా ।
సర్వం స్మృత్వా కఠాద్య త్వం రేవతీం భర తన్మనాః ॥ 18 ॥

కఠా! అన్నింటినీ తలుచుకొని నీవు నామాటను సత్యమైనదానిగా చేయుము. గురుదక్షిణగా నేనాజ్ఞాపించు చున్నాను. రేవతికి నచ్చునట్లుగా నీవు భర్తగా నుండుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా గురోర్వాక్యాత్కఠో జగ్రాహ పాణినా ।
రేవతీం విధివద్దత్తాం తాం సమీక్ష్య కఠస్త్వథ ॥ 19 ॥

తత్రైవ పూజయామాస దేవేశం శంకరం తదా ।
రేవత్యాం రూప సంపత్త్యై శివప్రీత్యై చ రేవతీ ॥ 20 ॥

సురూపా చారుసర్వాంగీ న రూపేణోపమీయతే ।
అభిషేకోదకం తత్ర రేవత్యా యద్వినిఃసృతమ్ ॥ 21 ॥

సాఽభవత్తత్ర గంగాయాం తస్మాత్తన్నామతో నదీ ।
రేవతీతి సమాఖ్యాతా రూప సౌభాగ్యదాయినీ ॥ 22 ॥

గురువుమాటను తలదాలిచి అలాగేనని కఠుడు విధిపూర్వకముగా దానముచేసిన రేవతి పాణిగ్రహణము చేసెను. తరువాత ఆమెను పరీక్షించి చూచి, అక్కడే దేవేశుడైన శంకరుని రేవతికి రూపసౌందర్యము కలుగవలెనని పూజించెను. రేవతికూడా శివునికి ప్రీతి కలుగవలెనని పూజించెను. ఆమె సర్వాంగసుందరియై చక్కని రూపమునందెను. అది దేనితోనూ పోల్చుటకు వీలుగానిదై యుండెను. రేవతి అక్కడ అభిషేకము చేయగా రేవతినుండి స్రవించిన నీరు, ఒక నదిగా ప్రవహించి గంగా సంగమమునొందెను. అందువలననే ఆ నది ఆమె పేరుతో రేవతీ నదిగా, రూపసౌభాగ్యములనిచ్చునదిగా ప్రసిద్ధి చెందినది.

పునర్దర్భైశ్చ వివిధై రభిషేకం చకార సః ।
పుణ్యరూపత్వ సంసిద్ధ్యై విదర్భా తదభూన్నదీ ॥ 23 ॥

తిరిగా కఠుడు వివిధ దర్భలతో నభిషేకము చేసెను. అది పుణ్యరూపత్వము కలుగుటకై చేసినది. అప్పుడా అభిషేక జలము నదిగా మారినది దానినే విదర్భానదియంటారు.

శ్రద్ధయా సంగమే స్నాత్వా రేవతీగంగయోర్నరః ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకం మహీయతే ॥ 24 ॥

గంగారేవతుల సంగమ ప్రదేశమున శ్రద్ధతో స్నానము చేసినవాడు సర్వపాపవినిర్ముక్తుడై విష్ణులోకమును పొందును.

తథా విదర్భా గౌతమ్యోః సంగమే శ్రద్ధయా మునే ।
స్నానం కరోత్యసౌ యాతి భుక్తిం ముక్తిం చ తత్క్షణాత్ ॥ 25 ॥

ఓ మునీ! అట్లే విదర్భాగౌతమీ నదుల సంగమప్రదేశమున శ్రద్ధగా నెవరు స్నానము చేయుదురో వారు ఆక్షణంలోనే భుక్తిని ముక్తిని పొందగలరు.

ఉభయోస్తీరయోస్తత్ర తీర్థానాం శతముత్తమమ్ ।
సర్వపాపక్షయకరం సర్వసిద్ధి ప్రదాయకమ్ ॥ 26 ॥

గౌతమీ నదియొక్క రెండు తీరములయందు ఉత్తమమైన నూరుతీర్థములున్నవి. అవి సమస్త పాపములను నశింపజేయునవి. సర్వసిద్ధులను కలుగజేయునవి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే విదర్భాసంగమ రేవతీ సంగమాది తీర్థవర్ణనం నామైక పంచాశోఽధ్యాయః ॥ 51 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని విదర్భాసంగమం, రేవతీసంగమం మున్నగు తీర్థవర్ణనమను పేరుగల యాభైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విపంచాశోఽధ్యాయః - యాభై రెండవ అధ్యాయం

పూర్ణతీర్థ మంగలాసంగమ గోవిన్ద సిద్ధేశ్వరాది సప్తత్రింశత్సహస్రతీర్థవర్ణనమ్

పూర్ణతీర్థ, మంగలాసంగమ, గోవింద, సిద్ధేశ్వరాదులగు ముప్పది ఏడువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పూర్ణతీర్థమితి ఖ్యాతం గంగాయా ఉత్తరే తటే ।
తత్ర స్నాత్వా నరోఽజ్ఞానాత్తథాఽపి శుభమాప్నుయాత్ ॥ 1 ॥

గంగానది యొక్క ఉత్తరతీరమున పూర్ణతీర్థమనునది విఖ్యాతినొందినది. ఆ తీర్థమునందు మానవుడు తెలియకుండగూడా స్నానముచేసినచో శుభమును పొందగలడు.

పూర్ణతీర్థస్య మాహాత్మ్యం వర్ణ్యతే కేన జన్తునా ।
స్వయం సంస్థీయతే యత్ర చక్రిణా చ పినాకినా ॥ 2 ॥

ఎక్కడైతే స్వయముగా శ్రీమహావిష్ణువు, శివుడు ఉన్నారో అటువంటి పూర్ణతీర్థముయొక్క మాహాత్మ్యమును ఎవరు వర్ణించగలరు?

పురా ధన్వన్తరిర్నామ కల్పాదావాయుషః సుతః ।
ఇష్ట్వా బహువిధైర్యజ్ఞైరశ్వమేధ పురఃసరైః ॥ 3 ॥

దత్త్వా దానాన్యనేకాని భుక్త్వా భోగాంశ్చ పుష్కలాన్ ।
విజ్ఞాయ భోగవైషమ్యం పరం వైరాగ్యమాశ్రితః ॥ 4 ॥

గిరిశృంగేఽమ్బుధేః పారే తథా గంగానదీ తటే ।
శివ విష్ణో ర్గృహే వాఽపి విశేషాత్పుణ్యసంగమే ॥ 5 ॥

తప్తం హుతం చ జప్తం చ సర్వమక్షయతాం వ్రజేత్ ।
ధన్వన్తరిరితి జ్ఞాత్వా తత్ర తేపే తపో మహత్ ॥ 6 ॥

పూర్వము కల్పాదియందు ఆయువు యొక్క కుమారుడగు ధన్వంతరి యనువాడు అశ్వమేధ పురఃసరముగా అనేక విధములగు యజ్ఞములు చేసి, అనేకములైన దానములిచ్చి, పుష్కలములైన భోగములననుభవించి, భోగములయందుండే వైషమ్యమును గ్రహించి మిక్కిలి వైరాగ్యమునొందెను. పర్వతశృంగమునందు, సముద్రముఒడ్డున, అట్లే గంగా నదిఒడ్డున, శివాలయంలో, విష్ణ్వాలయంలో ముఖ్యంగా నదీసంగమంలో, తపస్సుచేసినా, యజ్ఞముచేసినా, జపముచేసినా అవన్నియు అక్షయమైన ఫలము నిచ్చునని ధన్వన్తరి తెలుసుకొని అక్కడ గొప్ప తపస్సు చేసెను.

జ్ఞానవైరాగ్య సంపన్నో భీమేశ చరణాశ్రయః ।
తపశ్చకార విపులం గంగా సాగరసంగమే ॥ 7 ॥

అతడు జ్ఞానవైరాగ్యసంపన్నుడై భీమేశ్వరుని పాదముల నాశ్రయించి గంగాసాగర సంగమప్రదేశంలో విస్తారమైన తపస్సు చేసెను.

పురా చ నికృతో రాజ్ఞా రణం హిత్వా మహాసురః ।
సహస్రమేకం వర్షాణాం సముద్రం ప్రావిశద్భయాత్ ॥ 8 ॥

పూర్వము మహాసురుడు యుద్ధంలో ఓడిపోయి రాజుచే అవమానించబడి వేయి ఒక్కసంవత్సరములు భయముతో సముద్రమునందు దాగుండెను.

ధన్వన్తరౌ వనం ప్రాప్తే రాజ్యం ప్రాప్తే తు తత్సుతే ।
విరాగం చ గతే రాజ్ఞి తమః ప్రాయాదథార్ణవాత్ ॥ 9 ॥

వైరాగ్యమును పొందిన రాజగు ధన్వన్తరి తపస్సునకు అడవికి వెళ్ళగా, అతని కుమారునికి రాజ్యము లభించగా సముద్రమునుండి తముడనేవాడు వచ్చెను.

తపస్యన్తం తమో నామ బలవానసురో మునే ।
గంగాతీరం సమాశ్రిత్య రాజా ధన్వన్తరిర్యతః ॥ 10 ॥

జపహోమరతో నిత్యం బ్రహ్మజ్ఞానపరాయణః ।
తం రిపుం నాశయామీతి తమః ప్రాయాదథార్ణవాత్ ॥ 11 ॥

ఓ మునీ! తముడనేవాడు బలవంతుడైన అసురుడు. గంగాతీరమువద్ద ఎక్కడైతే రాజైన ధన్వంతరి తపస్సు చేసుకొనుచున్నాడో, నిత్యము జపహోమాదులయందాసక్తి గలిగి బ్రహ్మజ్ఞానమునందే పరాయణుడైయున్న తన శత్రువైన ధన్వంతరిని నశింపచేయుదునని సముద్రమునుండి తముడు వచ్చెను.

నాశితో బహుశోఽనేన రాజ్ఞా బలవతాత్వహమ్ ।
తం రిపుం నాశయామీతి తమః ప్రాయాదథార్ణవాత్ ॥ 12 ॥

ఈ బలవంతుడగు రాజు నన్ను అనేకవిధములుగా నాశనము చేసినాడు. అటువంటి ఈ నా శత్రువును నేను నశింపచేయుదునని తముడు సముద్రమునుండి వచ్చెను.

మాయయా ప్రమదా రూపం కృత్వా రాజానమభ్యగాత్ ।
నృత్యగీతవతీ సుభ్రూర్హసన్తీ చారుదర్శనా ॥ 13 ॥

మాయతో తానొక స్త్రీరూపమును ధరించి రాజు వద్దకు వచ్చెను. ఆ చక్కని కనుబొమలు కలిగిన ఆమె నృత్యమునుచేయుచు గీతములను పాడుతు, నవ్వుచు చూచుటకందముగా నుండెను.

తాం దృష్ట్వా చారుసర్వాంగీం బహుకాలం నయాన్వితామ్ ।
శాన్తామను వ్రతాం భక్తాం కృపయా చాబ్రవీదిదమ్ ॥ 14 ॥

చాలాసేపటివరకు అందమైన అవయవాలు కలిగినట్టిదీ, వినయంతో కూడినట్టిదీ, శాంతురాలైనట్టిదీ, అనుసరించేదీ, భక్తురాలైన ఆమెను చూచి దయతో ఇట్లు పలికాడు.

నృప ఉవాచ :– రాజు పలికాడు.

కాసి త్వం కస్యహేతోర్వా వర్తసే గహనే వనే ।
కం దృష్ట్వా హర్షసీవ త్వం వద కల్యాణి పృచ్ఛతే ॥ 15 ॥

ఓ కల్యాణీ! నీవెవరు? ఏ కారణంతో ఈ దట్టమైన అడవియందున్నావు? ఎవరిని చూచి నవ్వుచున్నట్లున్నావు? నేనడుగుచున్నాను చెప్పుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ప్రమదా చాపి తద్వాక్యం శ్రుత్వా రాజానమబ్రవీత్ ॥ 16 ॥

ఆ స్త్రీ రాజు మాట విని ఇట్లనెను.

ప్రమదోవాచ :– స్త్రీ పలికింది.

త్వయి తిష్ఠతి కో లోకే హేతుర్హర్షస్య మే భవేత్ ।
అహమిన్ద్రస్య యా లక్ష్మీస్త్వాం దృష్ట్వా కామసంభృతమ్ ॥ 17 ॥

హర్షాచ్చరామి పురతో రాజంస్తవ పునః పునః ।
అనన్యపుణ్యవిరహా దహం సర్వస్య దుర్లభా ॥ 18 ॥

నీవుండగా ఇంకా ఈ లోకంలో సంతోషానికి వేరు కారణం నాకేమి యుండును? నేను ఇంద్రుని లక్ష్మిని నిన్ను చూచి కామమోహితురాలనై, నీ ముందు నేను మాటిమాటికి సంతోషంతో సంచరించుచున్నాను. ఓ రాజా! గొప్ప పుణ్యములేనందువలన అందరకు నేను పొందుటకు సాధ్యం కాదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతద్వచో నిశమ్యాశు తపస్త్యక్త్వా సుదుష్కరమ్ ।
తామేవ మనసా ధ్యాయంస్తన్నిష్ఠస్తత్పరాయణః ॥ 19 ॥

తదేకశరణో రాజా బభూవ స యదా తమః ।
అన్తర్ధానం గతో బ్రహ్మన్నాశయిత్వా తపోబృహత్ ॥ 20 ॥

ఆ మాటలువినిన వెంటనే సుదుష్కరమైన తన తపస్సును వదిలి ఆమెనే మనస్సునందు ధ్యానించుచు, ఆమెయందే నిష్ఠగలవాడై, ఆమె యందాసక్తిమరలుగొనగా, ఓ బ్రహ్మర్షీ! ఆ రాజు ఆమెయే శరణమన్నస్థితికి వెళ్ళగా, ఆ అసురుడైన తముడు అతని గొప్పతపస్సును నశింపచేసి అంతర్ధానమాయెను.

ఏతస్మిన్నంతరేఽహం వై వరాన్ దాతుం సమభ్యగామ్ ।
తం దృష్ట్వా విహ్వలీభూతం తపోభ్రష్టం యథామృతమ్ ॥ 21 ॥

తమాశ్వాస్యాథ వివిధైర్హేతుభిర్నృపసత్తమమ్ ।
తవ శత్రుస్తమో నామ కృత్వా తే తపసశ్చ్యుతిమ్ ॥ 22 ॥

చరితార్థో గతో రాజన్నత్వం శోచితుమర్హసి ।
ఆనన్దయన్తి ప్రమదా స్తాపయన్తి చ మానవమ్ ॥ 23 ॥

ఇంతలో నేనతనికి వరాలనిచ్చుటకై వెళ్ళితిని. తపోభ్రష్టుడై, మృతునివలెయుండి వ్యాకులపడుచున్న వానినిచూచి, ఆ రాజశ్రేష్ఠుని అనేకవిధముల ఓదార్చి నీశత్రువైన తముడనేవాడు నిన్ను నీ తపస్సునుండి దిగజార్చి కృతార్థుడై వెళ్ళినాడు. ఓరాజా! నీవు దుఃఖింపకు. స్త్రీలు మానవులను ఆనందింపచేస్తారు బాధపెడతారు కూడా.

సర్వా ఏవ విశేషేణ కిము మాయామయీ తు సా ।
తతః కృతాంజలీ రాజా మామాహ విగతభ్రమః ॥ 24 ॥

ఇది అందరూస్త్రీలు చేసేదే, విశేషంగా ఆమె మాయలాడి ఇక చెప్పునదేమున్నది? అప్పుడు రాజు భ్రమనువీడి నాకు నమస్కరించుచు ఇట్లనెను.

రాజోవాచ :- రాజు పలికాడు.

కథం సమీహిత ప్రాప్తిర్బ్రహ్మన్ మమ భవిష్యతి ।
కిం కరోమి కథం బ్రహ్మన్ తపసః పారమాప్నుయామ్ ॥ 25 ॥

పితామాహా! నేను కోరిన కోరిక ఎట్లు ఫలించును? ఇప్పుడు నేనేం చేయవలయును? నా తపస్సు ఎట్లు పరిపూర్ణమగును?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతస్తస్యోత్తరం ప్రాదాం దేవదేవం జనార్దనమ్ ।
స్తుహి సర్వప్రయత్నేన తతః సిద్ధిమవాప్స్యసి ॥ 26 ॥

అప్పుడతనికిట్లు సమాధానమును చెప్పితిని. సర్వప్రయత్నములను చేసి దేవదేవుడైన జనార్దనుని స్తుతించుము. అప్పుడు నీవు సిద్ధినొందగలవు.

స హ్యశేషజగత్స్రష్టా వేదవేద్యః పురాతనః ।
సర్వార్థసిద్ధిదః పుంసాం నాన్యోఽస్తి భువనత్రయే ॥ 27 ॥

అతడు సమస్త జగత్తును సృష్టించినవాడు. వేదవేద్యుడు. మిక్కిలి పురాతనమైనవాడు. మూడులోకాలలో మానవులకు సమస్తమూ ఇచ్చేవాడతడే మరొకడెవడూ లేదు.

స జగామ నగశ్రేష్ఠం హిమవన్తం నృపోత్తమః ।
కృతాంజలిపుటో భూత్వా విష్ణుం తుష్టావ భక్తితః ॥ 28 ॥

అప్పుడారాజు పర్వతశ్రేష్ఠమైన హిమవత్పర్వతమునకు వెళ్ళెను. అక్కడ భక్తితో కైమోడ్పులర్పించుచు విష్ణువును స్తుతించెను.

ధన్వన్తరిరువాచ :- ధన్వంతరి పలికాడు.

జయ విష్ణో జయాచిన్త్య జయజిష్ణో జయాచ్యుత ।
జయగోపాల లక్ష్మీశ జయకృష్ణ జగన్మయ ॥ 29 ॥

ఓ విష్ణూ! అచిన్త్య! జిష్ణూ! అచ్యుతా! గోపాలా! లక్ష్మీశ! కృష్ణా! జగన్మయా! జయము జయము.

జయ భూతపతే నాథ జయ పన్నగశాయినే ।
జయ సర్వగ గోవిన్ద జయ విశ్వకృతే నమః ॥ 30 ॥

ఓ భూతపతీ! నాథా! ఆదిశేషుని మీదపడుకొని యుండువాడా! అన్నిచోటులకు వెళ్ళువాడా! గోవిన్దా! విశ్వమునంతటిని సృజించినవాడా! నీకుజయము నమస్కారము.

జయ విశ్వభుజే దేవ జయ విశ్వధృతే నమః ।
జయేశ సదసత్వం వై జయ మాధవ ధర్మిణే ॥ 31 ॥

విశ్వమంతానిండిన భుజములు గల దేవా! విశ్వమును ధరించువాడా! ఈశ్వరా! సత్తు అసత్తు నీవే అయినవాడా! మాధవా! ధర్మస్వరూపా! జయము జయము నీకు నమస్కారము.

జయ కామద కామత్వం జయరామగుణార్ణవ ।
జయ పుష్టిద పుష్టీశ జయకల్యాణదాయినే ॥ 32 ॥

ఓ కోరికలనిచ్చేవాడా! ఇచ్ఛాస్వరూపుడవు నీవే ఓ శ్రీరామా! సద్గుణసాగరా! పుష్టినిచ్చేవాడా! పుష్టికి ప్రభువా! శుభములనిచ్చేవాడా! నీకు జయము జయము.

జయ భూతప భూతేశ జయ మాన విధాయినే ।
జయ కర్మద కర్మత్వం జయ పీతామ్బరచ్ఛద ॥ 33 ॥

ఓ జీవులను పాలించేవాడా! భూతేశా! అభిమానమును విధించేవాడా! కర్మలనిచ్చేవాడా! కర్మ స్వరూపుడవు నీవే ఓ పీతాంబరధరా! నీకు జయము జయము.

జయ సర్వేశ సర్వస్త్వం జయమంగళరూపిణే ।
జయ సత్వాధినాథాయ జయ వేదవిదే నమః ॥ 34 ॥

ఓ సర్వేశ్వరుడా! సర్వ స్వరూపుడవు నీవే. మంగళరూపా! సత్త్వగుణమునకధినాయకా! వేదవేద్యా నమస్కారము.

జయ జన్మద జన్మిస్థ పరమాత్మన్నమోఽస్తు తే ।
జయ ముక్తిద ముక్తిస్త్వం జయ భుక్తిద కేశవ ॥ 35 ॥

ఓ జన్మలనిచ్చేవాడా! నీకు జన్మలులేకున్నా జన్మనొందువాడా! పరమాత్మా! నీకు నమస్కారము. ఓ ముక్తినిచ్చేవాడా! ముక్తివి నీవే. భుక్తిని ప్రసాదించేవాడా! కేశవా! జయము.

జయ లోకద లోకేశ జయ పాపవినాశన ।
జయ వత్సల భక్తానాం జయ చక్రధృతే నమః ॥ 36 ॥

ఓ లోకములనిచ్చేవాడా! లోకాధిపతీ! పాపవినాశనా! భక్తులపై వాత్సల్యముచూపేవాడా! చక్రధారీ! నమస్కారము.

జయ మానద మానస్త్వం జయ లోకనమస్కృత ।
జయ ధర్మద ధర్మస్త్వం జయ సంసారపారగ ॥ 37 ॥

ఓ అభిమానమునిచ్చువాడా! అభిమానస్వరూపుడవు నీవే? లోకముల నమస్కారములు పొందువాడా! నీకు జయము. ఓ ధర్మమును ప్రవర్తింపచేయువాడా! ధర్మస్వరూపుడవు నీవే సంసార సముద్రమును దాటించువాడా నీకు జయము జయము.

జయ అన్నద అన్నం త్వం జయ వాచస్పతే నమః ।
జయ శక్తిద శక్తిస్త్వం జయ జైత్రవరప్రద ॥ 38 ॥

ఓ అన్నమునిచ్చేవాడా! అన్న స్వరూపుడవు నీవే. ఓ వాక్పతీ! నీకు నమస్కారము. ఓ శక్తినిచ్చేవాడా! శక్తి స్వరూపడవు నీవే. విజయవరమునిచ్చేవాడా! జయము జయము.

జయ యజ్ఞద యజ్ఞస్త్వం జయ పద్మదలేక్షణ ।
జయ దానద దానం త్వం జయ కైటభసూదన ॥ 39 ॥

ఓ యజ్ఞముల నిచ్చేవాడా! యజ్ఞస్వరూపుడవు నీవే. ఓ పద్మపురేకులవంటి కన్నులుగలవాడా! జయము. ఓ దానములు చేయువాడా! దానస్వరూపుడవు నీవే. కైటభుడనే రాక్షసుని సంహరించినవాడా! జయము జయము.

జయ కీర్తిద కీర్తిస్త్వం జయమూర్తిద మూర్తిధృక్ ।
జయ సౌఖ్యద సౌఖ్యాత్మన్ జయ పావన పావన ॥ 40 ॥

ఓ కీర్తినిచ్చేవాడా! కీర్తిస్వరూపడవు నీవే. ఓ మూర్తిని ఇచ్చేవాడా! మూర్తిరూపమును ధరించినవాడవు నీవే. ఓ సౌఖ్యం నిచ్చేవాడా! ఓ సౌఖ్యాత్ముడా! ఓ పావన పావనా జయం జయం.

జయ శాన్తిద శాన్తిస్త్వం జయ శంకర సంభవ ।
జయ పానద పానస్త్వం జయ జ్యోతిః స్వరూపిణే ॥ 41 ॥

ఓ శాంతి నిచ్చేవాడా! నీవే శాంతిస్వరూపుడవు. శుభమును కలిగించుటకై ఉద్భవించేవాడా! జయము. జలమునిచ్చేవాడా! నీవే జలస్వరూపుడవు. ఓ జ్యోతిఃస్వరూపా! నీకు జయము జయము.

జయ వామన విత్తేశ జయ ధూమపతాకినే ।
జయ సర్వస్య జగతో దాతృమూర్తే నమోఽస్తు తే ॥ 42 ॥

ఓ ముల్లోకములు కొలిచిన వామనా! ఓ ధనేశా! జయము. సమస్త జగమునకంతటికి దాతృస్వరూపా! నీకు నమస్కారము.

త్వమేవ లోకత్రయవర్తి నికాయ సంక్లేశవినాశదక్ష ।
శ్రీపుండరీకాక్ష కృపానిధే త్వం నిధేహి పాణిం మమ మూర్ధ్ని విష్ణో ॥ 43 ॥

ముల్లోకములలో నివసించేవారి శరీరములందున్న క్లేశములను నశింపజేయుటకు సమర్థుడా! శ్రీపుండరీకముల వంటి కన్నులు గలవాడా! దయానిధీ! శ్రీమన్నారాయణా! నీ చేతిని నా తలమీదనుంచుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం స్తువన్తం భగవాన్ శంఖచక్రగదాధరః ।
వరేణ ఛన్దయామాస సర్వకామసమృద్ధిదః ॥ 44 ॥

ఇట్లు స్తుతించగా సర్వకామసమృద్ధినిచ్చు పూజ్యుడగు శంఖచక్రగదాధరుడగు శ్రీమన్నారాయణుడు వరమునిచ్చి అనుగ్రహించెను.

ధన్వన్తరిః ప్రీతమనా వరదానేన చక్రిణః ।
వరదానాయ దేవేశం గోవిన్దం సంస్థితం పురః ॥ 45 ॥

తమాహ నృపతిః ప్రహ్వః సురరాజ్యం మమేప్సితమ్ ।
తచ్చ దత్తం త్వయా విష్ణో ప్రాప్తోఽస్మి కృతకృత్యతామ్ ॥ 46 ॥

చక్రధరుడిచ్చిన వరముతో ధన్వంతరి సంతోషించి తన ఎదురుగా నున్న దేవేశుడైన గోవిందుని వరమిచ్చుటకై, నిలచిన విష్ణువుతో రాజు వినయంగా నేను కోరిన సురరాజ్యమునుగూడా ఇచ్చితిని. ఓ విష్ణూ! నేను కృతార్థుడనైనాను.

స్తుతః సంపూజితో విష్ణుస్తత్రైవాన్తరధీయత ।
తథైవ త్రిదశేశత్వమవాప నృపతిః క్రమాత్ ॥ 47 ॥

స్తుతించబడి పూజించబడిన విష్ణువక్కడే అంతర్ధానమాయెను. అట్లే రాజు క్రమముగా దేవేశత్వమును పొందెను.

ప్రాగర్జితానేక కర్మ పరిపాక వశాత్తతః ।
త్రిః కృత్వో నాశమగమత్సహస్రాక్షః స్వకాత్పదాత్ ॥ 48 ॥

ఆ తరువాత పూర్వము తానుపొందిన కర్మలు పరిపక్వత నొందుట వలన ముల్లోకములను పరిపాలించిన ఇంద్రుడు పదవీచ్యుతుడాయెను.

నహుషాత్వృత్ర హత్యాయాః సిన్ధుసేనవధాత్తతః ।
అహల్యాయాం చ గమనాద్యేన కేన చ హేతునా ॥ 49 ॥

స్మారం స్మారం తత్తదిన్ద్రశ్చిన్తా సంతాప దుర్మనాః ।
తతః సురపతిః ప్రాహ వాచస్పతి మిదం వచః ॥ 50 ॥

నహుషునివలన, వృత్రాసుని చంపినందువలన, సింధుసేనను చంపినందువలన, అహల్యా విషయంలో జారునిగా ప్రవర్తించినందువలన, ఏదో ఒక కారణంతో, మాటిమాటికి వాటిని స్మరించుకుంటూ చిన్తతో సంతాపముతో మనస్సు చెడిన ఇంద్రుడు తరువాత బ్రహ్మను ఇట్లడిగెను.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

హేతునా కేన వాగీశ భ్రష్టరాజ్యో భవామ్యహమ్ ।
మధ్యే మధ్యే పదభ్రంశాద్వరం నిః శ్రీకతానృణామ్ ॥ 51 ॥

వాణీశా! నేను ఏ కారణంచేత రాజ్యభ్రష్టుడనగుచున్నాను? అసలు మానవులకు మధ్య మధ్యలో పదవిపోవుటకన్న దరిద్రులుగా నుండుటే మేలు.

గహనాం కర్మణాం జీవగతిం కో వేత్తి తత్త్వతః ।
రహస్యం సర్వభావానాం జ్ఞాతుం నాన్యః ప్రగల్భతే ॥ 52 ॥

ప్రచండము క్లిష్టమునగు కర్మలను, జీవగతిని సరిగా తెలుసుకునేవాడెవడు? భావములన్నింటి యొక్క రహస్యమును తెలుసుకొనుటకు ఇతరుడెవడూ ప్రగల్భములను పలుకడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

బృహస్పతిర్హరిం ప్రాహ బ్రహ్మాణం పృచ్ఛ గచ్ఛ తమ్ ।
స తు జానాతి యద్భూతం భవిష్యచ్చాపి వర్తనమ్ ॥ 53 ॥

అప్పుడు బృహస్పతి ఇంద్రునితో వెళ్ళి ఆ బ్రహ్మనడుగుము. అతడైతే భూత భవిష్యద్వర్తమానములు తెలిసినవాడు.

స తు వక్ష్యతి యేనేదం జాతం తచ్చ మహామతే ।
తావాగత్య మహాప్రాజ్ఞా నమస్కృత్య మమాన్తికమ్ ॥
కృతాంజలి పుటౌ భూత్వా మామూచతు రిదం వచః ॥ 54 ॥

ఓ మహామతీ! ఇదంతా ఏకారణం చేత జరిగినదో అతడైతే చెప్పగలడు. అప్పుడు ఇంద్రుడు బృహస్పతియును ఇద్దరు నా వద్దకు వచ్చి రెండు చేతులు జోడించి, నమస్కరించి నాతో నిట్లనిరి.

ఇన్ద్రబృహస్పతీ ఊచతుః :- ఇంద్రబృహస్పతులు పలికారు.

భగవన్! కేన దోషేణ శచీభర్తా ఉదారధీః ।
రాజ్యాత్ప్రభ్రశ్యతే నాథ సంశయం ఛేత్తుమర్హసి ॥ 55 ॥

పూజ్యుడా! ఉదారబుద్ధిగలిగిన శచీదేవిభర్త అయిన ఇంద్రుడు ఏ దోషంవలన రాజ్యభ్రష్టుడగుచున్నాడు? ప్రభూ! ఈ నా సంశయమును దీర్చుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదాఽహమబ్రవం బ్రహ్మంశ్చిరం ధ్యాత్వా బృహస్పతిమ్ ।
ఖండధర్మాఖ్యదోషేణ తేన రాజ్యపదాచ్చ్యుతః ॥ 56 ॥

నేనప్పుడు కొంచంసేపు ఆలోచించి బృహస్పతితో నిట్లంటిని. బ్రహ్మర్షీ! ఖండధర్మమనే దోషముతో నతడు రాజ్యపదవీచ్యుతుడైనాడు.

దేశకాలాదిదోషేణ శ్రద్ధామంత్రవిపర్యయాత్ ।
యథావద్దక్షిణాదానాదసద్ద్రవ్య ప్రదానతః ॥ 57 ॥

దేవ భూదేవతావజ్ఞాపాతకాచ్చ విశేషతః ।
యత్ఖండత్వం స్వధర్మస్య దేహినాముపజాయతే ॥ 58 ॥

దేశకాలాది దోషమువలన, శ్రద్ధ లోపించుట వలన, మంత్ర విపర్యయమేర్పడుటవలన, సరియైన దక్షిణ లీయకపోవుటవలన, అన్యాయార్జిత విత్తమును దానముగా నీయుటవలన, దేవబ్రాహ్మణుల నవమానించుటవలన వచ్చిన పాపమువలన, విధిగా చేయవలసిన తన ధర్మాన్ని ఆచరించనందువలన మానవులకు ఖండధర్మమనే దోషము వచ్చును.

తేనాతిమానసస్తాపః పదహానిశ్చ దుస్త్యజా ।
కృతోఽపి ధర్మోఽనిష్టాయ జాయతే క్షుబ్ధచేతసామ్ ॥ 59 ॥

ఆ దోషముచే మిక్కిలి మనస్తాపము, పదవీచ్యుతి, మిక్కిలి కష్టం కల్గును. నిలకడలేని మనసు గలవారికి అతడు ధర్మము నాచరించినా అనిష్టమే కలుగును.

కార్యస్య న భవేత్సిద్ధ్యై తస్మాదవ్యాకులాయ చ ।
అసంపూర్ణే స్వధర్మే హి కిమనిష్టం న జాయతే ॥ 60 ॥

అందువలన వ్యాకుల మనస్సు లేకపోయిన ఖండధర్మదోషం కార్యసిద్ధిని కలిగించుట. అసంపూర్తిగా ఆచరించిన ధర్మం అనిష్ట ఫలితం కలిగించదా?

తాభ్యాం యత్పూర్వవృత్తాన్తం తదప్యుక్తం మయాఽనఘ ।
ఆయుషస్తు సుతః శ్రీమాన్ ధన్వన్తరిరుదారధీః ॥ 61 ॥

ఓ పాపరహితుడా! వారితో నేనా పూర్వవృత్తాంతమును చెప్పితిని. ఆయువుకుమారుడగు ధన్వంతరి శ్రీమంతుడు, ఉదారబుద్ధిగలవాడు.

తమసా చ కృతం విఘ్నం విష్ణునా తచ్చ నాశితమ్ ।
పూర్వ జన్మ సువృత్తాన్తమిత్యాది పరికీర్తితమ్ ॥ 62 ॥

తముడు చేసిన విఘ్నమును విష్ణువు నశింపచేసినాడు. పూర్వజన్మయందు కలిగిన వృత్తాంతము మున్నగునవి కీర్తించినాడు.

తచ్ఛ్రుత్వా విస్మితౌ చోభౌ మామేవ పునరూచతుః ॥ 63 ॥

ఆమాటవిని ఆశ్చర్యపడి ఆ యిద్దరూ మళ్ళీ నన్నే అడిగిరి.

ఇంద్రబృహస్పతీ ఊచతుః :- ఇంద్రుడు బృహస్పతులు పలికారు.

తద్దోష ప్రతిబన్ధస్తు కేన స్యాత్సురసత్తమ ॥ 64 ॥

ఓ సురశ్రేష్ఠా! ఆ దోషము పోవుటకేమి చేయవలయును?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పునర్ధ్యాత్వా తావవదం శ్రూయతాం దోషహారకమ్ ।
కారణం సర్వసిద్ధీనాం దుఃఖసంసారతారణమ్ ॥ 65 ॥

నేను మరల ధ్యానించి వారిద్దరితో వినుడని దోషము పోవు విధమును చెప్పితిని. అన్ని సిద్ధించుటకు కావలసినది సంసార దుఃఖమును తరించుటయే ముఖ్యము.

శరణం తప్తచిత్తానాం నిర్వాణం జీవతామపి ।
గత్వా తు గౌతమీం దేవీం స్తూయేతాం హరిశంకరౌ ॥ 66 ॥

తప్తచిత్తులైనవారు శరణుపొందవలసినదీ, జీవించియున్నవారు నిర్వాణము (బౌద్ధులు దీనినే మోక్షమందురు) నొందవలసినదీ సంసారమును తరించుటే. అందువలన మీరిద్దరూ వెళ్ళి గౌతమీ దేవిని, హరిశంకరులను స్తోత్రము చేయుడు.

నోపాయోఽన్యోఽస్తి సంశుద్ధ్యై తౌ తాం హిత్వా జగత్త్రయే ।
తదైవ జగ్మతురుభౌ గౌతమీం మునిసత్తమ ॥
స్నాతౌ కృతేక్షణౌ చోభౌ దేవౌ తుష్టువతుర్ముదా ॥ 67 ॥

శివనారాయణులు, గౌతమి తప్ప ఈ మూడు లోకములలో పవిత్రము చేయుటకు మరొక మార్గములేదు. ఓ మునిశ్రేష్ఠా! ఆ మాట చెప్పగానే వారిద్దరు గౌతమీ నదివద్దకు వెళ్ళిరి. గౌతమిలో స్నానమును చేసి హరిశంకరులను చూస్తూ వారిద్దరూ సంతోషముగా స్తుతించుచుండిరి.

ఇంద్రఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

నమో మత్స్యాయ కూర్మాయ వరాహాయ నమో నమః ।
నరసింహాయ దేవాయ వామనాయ నమో నమః ॥ 68 ॥

మత్స్యకూర్మ వరాహనారసింహ వామన అవతారములు ధరించిన దేవునకు నమస్కారము.

నమోఽస్తు హయరూపాయ త్రివిక్రమ నమోఽస్తు తే ।
నమోఽస్తు బుద్ధరూపాయ రామరూపాయ కల్కినే ॥ 69 ॥

హయగ్రీవరూపమునకు, త్రివిక్రమరూపునకు బుద్ధరూపునకు, రామరూపునకు, కల్కిరూపునకు నమస్కారము.

అనన్తాయాచ్యుతాయేశ జామదగ్న్యాయతే నమః ।
వరుణేన్ద్రస్వరూపాయ యమరూపాయ తే నమః ॥ 70 ॥

అనన్తునకు, అచ్యుతునకు, జమదగ్నికుమారుడగు పరశురామునకు, వరుణునకు, ఇంద్ర స్వరూపునకు, యమరూపునకు నమస్కారము.

పరమేశాయ దేవాయ నమస్త్రైలోక్యరూపిణే ।
బిభ్రత్సరస్వతీం వక్త్రే సర్వజ్ఞోఽసి నమోఽస్తు తే ॥ 71 ॥

పరమేశ్వరునకు, త్రైలోక్యరూపుడగు దేవునకు నమస్కారం. నోటియందు సరస్వతిని ధరించిన సర్వజ్ఞా! నీకు నమస్కారము.

లక్ష్మీవానస్యతో లక్ష్మీం బిభ్రద్వక్షసి చానఘ ।
బహు బాహూరుపాదస్త్వం బహు కర్ణాక్షి శీర్షకః ॥
త్వామేవ సుఖినం ప్రాప్య బహవో సుఖినోఽభవన్ ॥ 72 ॥

ఓ అనఘా! వక్షః స్థలమునందు లక్ష్మిని ధరించి లక్ష్మీవంతుడవైనావు. అనేక బాహువులు, అనేక ఊరువులు, అనేక పాదములు, అనేక కర్ణములు, అనేక నేత్రములు, అనేక శిరస్సులు గలవాడవు. సుఖవంతుడవైన నిన్ను పొంది అనేకులు సుఖమునొందినారు.

తావన్నిః శ్రీకతా పుంసాం మాలిన్యం దైన్యమేవ వా ।
యావన్న యాన్తి శరణం హరే త్వాం కరుణార్ణవమ్ ॥ 73 ॥

ఓ శ్రీహరీ! ఎంతవరకైతే కరుణాసముద్రుడవగు నిన్ను శరణుపొందరో అంతవరకూ మానవులకు దారిద్రము, మాలిన్యము, దైన్యమే యుండును.

బృహస్పతిరువాచ:- బృహస్పతి పలికాడు.

సూక్ష్మం పరం జ్యోతిరనన్తరూపమోంకారమంత్రం ప్రకృతేః పరం యత్ ।
చిద్రూపమానన్దమయం సమస్తమేవం వదన్తీశ ముముక్షవస్త్వామ్ ॥ 74 ॥

ఈశ్వరా! మోక్షమును కోరేవారు నిన్ను సూక్ష్మస్వరూపునిగా, పరంజ్యోతిగా, అనన్తరూపునిగా, ఓంకార మాత్రునిగా,ప్రకృతికంటేయవతలనున్న చిద్రూపముగా, సమస్తమైన ఆనందమయస్వరూపముగా చెప్పుదురు.

ఆరాధయన్త్యత్ర భవన్తమీశం మహాముఖైః పంచభిరప్యకామాః ।
సంసారసిన్ధోః పరమాప్తకామా విశన్తి దివ్యం భువనం వపుస్తే ॥ 75 ॥

కోరికలులేనివారుగూడా ఈశ్వరుడవైన నిన్ను పంచమహాయజ్ఞములతో నారాధింతురు. సంసార సాగరమునుండి పరమును కోరేవారు, నీ శరీరము నారాధించి నీ దివ్యమైన భువనమును ప్రవేశింతురు.

సర్వేషు సత్వేషు సమత్వబుద్ధ్యా సంవీక్ష్య షట్సూర్మిషు శాన్తభావాః ।
జ్ఞానేన తే కర్మ ఫలాని హిత్వా ధ్యానేన తే త్వాం ప్రవిశన్తి శంభో ॥ 76 ॥

ఓ శివా! జీవులందరి యందు సమత్వ బుద్ధిగలిగి, షడూర్ములయందు శాంతమనస్కులై జ్ఞానముతో కర్మఫలములననుభవించి, ధ్యానముతో నిన్నుచేరుదురు.

న జాతి ధర్మాణి న వేదశాస్త్రం న ధ్యానయోగో న సమాధి ధర్మః ।
రుద్రం శివం శంకరం శాన్తచిత్తం భక్త్యా దేవం సోమమహం నమస్యే ॥ 77 ॥

నాకు జాతిధర్మాలు తెలియవు, వేదశాస్త్రములభ్యసించలేదు. ధ్యానయోగములు చేయలేదు, సమాధి ధర్మమునాచరించలేదు. భక్తితో రుద్రుడు, శివుడు, శంకరుడు, శాంతచిత్తుడునగు సోమదేవుని నమస్కరించు చున్నాను.

మూర్ఖోఽపి శంభో తవ పాదభక్త్యా సమాప్నుయాన్ముక్తిమయీం తనుం తే ।
జ్ఞానేషు యజ్ఞేషు తపఃసు చైవ ధ్యానేషు హోమేషు మహాఫలేషు ॥ 78 ॥

సంపన్నమేతత్ఫలముత్తమం యత్ సోమేశ్వరే భక్తిరహర్నిశం యత్ ।
సర్వస్య జీవస్య సదా ప్రియస్య ఫలస్య దృష్టస్య తథా శ్రుతస్య ॥ 79 ॥

స్వర్గస్య మోక్షస్య జగన్నివాస సోపానపంక్తిస్తవ భక్తిరేషా ।
త్వత్పాద సంప్రాప్తి ఫలాప్తయే తు సోపానపంక్తిం న వదన్తి ధీరాః ॥ 80 ॥

ఓ శివా! మూర్ఖుడైనవాడు గూడా నీ పాదములయందు భక్తితో ముక్తిమయమగు నీ శరీరమును పొందగలడు. గొప్పఫలితాన్నిచ్చేవైన జ్ఞానములు, యజ్ఞములు, తపస్సులు, ధ్యానములు హోమములు మున్నగువాటన్నిటికి తగిన ఉత్తమఫలితం యేదంటే రేయింబగళ్ళు పరమేశ్వరుని యందు భక్తి కలిగి ఉండుటే. చూడబడినదీ వినబడినదీ జీవులందరు ఇష్టమైనవైన ఫలితానికీ స్వర్గానికీ, మోక్షానికీ ఓ జగత్ప్రభూ! నీయందు భక్తే మెట్లవరుస. నీ పాదములను పొందుట అను ఫలమును పొందటానికి సోపానపంక్తిని చెప్పటం లేదు.

తస్మాద్దయాలో మమ భక్తిరస్తు నైవాస్త్యుపాయస్తవ రూపసేవా ।
ఆత్మీయమాలోక్య మహత్వమీశ పాపేషు చాస్మాసు కురు ప్రసాదమ్ ॥ 81 ॥

అందువలన దయామయా! నాకు భక్తిని ప్రసాదించు. నీ రూపాన్ని సేవించుట కంటే వేరు ఉపాయము లేదు. ఈశ్వరా! ఆత్మసంబంధాన్ని నీ మహత్తును చూచి పాపులమైన మాయందు నీ అనుగ్రహమును చూపించుము.

స్థూలం చ సూక్ష్మం త్వమనాదినిత్యం పితా చ మాతా యదసచ్చ సచ్చ ।
ఏవం స్తుతో యః శ్రుతిభిః పురాణైర్నమామి సోమేశ్వర మీశితారమ్ ॥ 82 ॥

శ్రుతులు పురాణములు ఎవనిని స్థూలుడని, సూక్ష్ముడని, అనాదివి నీవేనని, తల్లి, దండ్రి, అసత్తు, సత్తు అని స్తుతించినవో, అష్టసిద్ధులలో ఈశితా అనే సిద్ధిగల శాసకుడవు ప్రభువగు సోమేశ్వరునకు నమస్కరించుచున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రీతౌ హరిహరావూచతుస్త్రిదశేశ్వరౌ ॥ 83 ॥

అప్పుడు ముల్లోకాధిపతులగు హరిహరులిట్లనిరి.

హరి హరావూచతుః :– హరిహరులు పలికారు.

ప్రియతాం యన్మనోభీష్టం యద్వరం చాతిదుర్లభమ్ ॥ 84 ॥

మిక్కిలిదుర్లభమైనది. మీ మనోభీష్టమైన వరమును కోరుకొనుడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇంద్రః ప్రాహ సురేశానం మద్రాజ్యం తు పునః పునః ।
జాయతే భ్రశ్యతే చైవ తత్పాపముపశామ్యతామ్ ॥ 85 ॥

నారాజ్యము మాటిమాటికి లభించుచున్నది, తిరిగి నశించుచున్నది. ఆ పాపమును ఉపశమింపచేయుము అని ఇంద్రుడు సురేశానునితో ననెను.

యథా స్థిరోఽహం రాజ్యే స్యాం సర్వం స్యాన్నిశ్చలం మమ ।
సుప్రీతౌ యది దేవేశౌ సర్వం స్యాన్నిశ్చలం సదా ॥ 86 ॥

దేవేశులైన మీరిద్దరూ ప్రీతిచెందినట్లయితే నేను స్థిరముగా రాజ్యమునందుండునట్లుగా, నాకన్నియు నిశ్చలముగా అవి ఎల్లప్పుడు నిశ్చలముగానుండునట్లుగాను చేయుడు.

తథేతి హరివాక్యం తావభినంద్యేద మూచతుః ।
పరం ప్రసాదమాపన్నౌ తావాలోక్యస్మితాననౌ ॥ 87 ॥

శ్రీహరి అట్లే అగుగాకయనెను. హరిహరులిద్దరూ వానినభినందించి చిరునవ్వుతో కూడినముఖం కలవారై

నిరపాయ నిరాధార నిర్వికార స్వరూపిణౌ ।
శరణ్యౌ సర్వలోకానాం భుక్తిముక్తిప్రదావుభౌ ॥ 88 ॥

అపాయమేమీ లేకుండా ఆధారము లేకుండా వికారములేవీ లేని స్వరూపంగలిగి భుక్తిని ముక్తిని ప్రసాదించే ఆ హరిహరులిద్దరూ సమస్తలోకములవారికి శరణుపొందదగినారు.

హరిహరావూచతుః :–హరిహరులు పలికారు.

త్రిదైవత్యం మహాతీర్థం గౌతమీ వాంఛిత ప్రదా ।
తస్యామనేన మన్త్రేణ కురుతాం స్నానమాదరాత్ ॥ 89 ॥

త్రిదైవత్యము, మహాతీర్థము అయిన గౌతమి కోరికలను ఇచ్చునది. ఆ గౌతమీనదియందు ఈ మంత్రమును జపించుచు ఆదరముతో స్నానమును చేయుడు.

అభిషేకం మహేన్ద్రస్య మంగలాయ బృహస్పతిః ।
కరోతు సంస్మరన్నావాం సంపదాం స్థైర్యసిద్ధయే ॥ 90 ॥

మహేంద్రునకు శుభం కలుగుటకొరకు, పదవి వెంటనే సిద్ధించుటకు, స్థైర్యముకలుగుటకు బృహస్పతి మా యిద్దరినీ స్మరించుచు అభిషేకమును చేయవలయును.

ఇహజన్మని పూర్వస్మిన్యత్కించిత్సుకృతం కృతమ్ ।
తత్సర్వం పూర్ణతామేతు గోదావరి నమోఽస్తు తే ॥ 91 ॥

ఓ గోదావరీ! ఈ జన్మలోనూ పూర్వజన్మలోనూ ఏ కొంచమైన సుకృతము నాచరించినచో అదంతయు పరిపూర్ణము కావలయును. నీకు నమస్కారము.

ఏవం స్మృత్వా తు యః కశ్చిద్గౌతమ్యాం స్నానమాచరేత్ ।
ఆవాభ్యాం ప్రసాదేన ధర్మః సంపూర్ణతా మియాత్ ॥
పూర్వజన్మ కృతాద్దోషాత్స ముక్తః పుణ్యవాన్భవేత్ ॥ 92 ॥

ఇట్లు తలుచుకొని ఎవరైనా గౌతమీనది యందు స్నానము చేసినచో మాయిద్దరి యొక్క అనుగ్రహముతో వారి ధర్మము సంపూర్ణతను పొందును. పూర్వజన్మమునందు చేసిన పాపములు నశించి పుణ్యవంతుడై ముక్తుడగును.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేతి చక్రతుః ప్రీతౌ సురేంద్ర ధిషణౌ తతః ॥
మహాభిషేకమిన్ద్రస్య చకార ద్యుసదాం గురుః ॥ 93 ॥

ఇంద్ర బృహస్పతులట్లేయని ప్రీతులై చేసిరి. తరువాత ఇంద్రునికి దేవగురువగు బృహస్పతి అభిషేకమును చేసెను.

తేనాభూద్యానదీ పుణ్యా మంగళేత్యుదితా తు సా ।
తయా చ సంగమః పుణ్యో గంగాయాః శుభదస్త్వసౌ ॥ 94 ॥

ఆ అభిషేకమువలన ఏర్పడిన పుణ్యనదిని మంగళా అందురు. గంగతో నా నది సంగమము పవిత్రము, శుభము నిచ్చునది.

ఇన్ద్రేణ సంస్తుతో విష్ణుః ప్రత్యక్షోఽభూజ్జగన్మయః ।
త్రిలోక సంమితాం శక్రో భూతిం లేభే జగత్పతేః ॥ 95 ॥

ఇంద్రుడు స్తోత్రము చేయగా జగన్మయుడగు విష్ణువు ప్రత్యక్షమాయెను. ముల్లోకపరిమితమగు జగత్పతియొక్క ఐశ్వర్యమును ఇంద్రుడు పొందెను.

తన్నామ్నా చాపి విఖ్యాతో గోవిన్ద ఇతి తత్ర చ ।
త్రిలోక సంమితా లబ్ధా తేన గౌర్వజ్రధారిణా ॥ 96 ॥

అక్కడ సంగమము గోవింద అనేపేరుతో ప్రసిద్ధమైనది. వజ్రధారుడైన ఇంద్రుడు ముల్లోకపరిమిత రాజ్యమును పొందెను.

దత్తా చ హరిణా తత్ర గోవిన్దస్తదభూద్ధరిః ।
త్రైలోక్యరాజ్యం యత్ప్రాప్తం హరిణా చ హరేర్మునే ॥ 97 ॥

నిశ్చలం యేన సంజాతం దేవదేవాన్మహేశ్వరాత్ ।
బృహస్పతిర్దేవగురు ర్యత్రాస్తౌషీన్మహేశ్వరమ్ ॥ 98 ॥

రాజ్యస్య స్థిరభావాయ దేవేన్ద్రస్య మహాత్మనః ।
సిద్ధేశ్వరస్తత్ర దేవో లింగం తు త్రిదశార్చితమ్ ॥ 99 ॥

అక్కడ శ్రీహరి ఇచ్చాడు కనుక ఇంద్రుడు గోవిన్దుడైనాడు ఓ మునీ! శ్రీమహావిష్ణువుచేత ఇంద్రునకే త్రైలోక్యరాజ్యము సంప్రాప్తించినదో, దేవగురువగు బృహస్పతి ఎక్కడైతే మహేశ్వరుని స్తుతించినాడో అక్కడ దేవదేవుడైన మహేశ్వరుని కృపతో అతని పదవి నిశ్చలమైనది. మహాత్ముడైన దేవేంద్రుని యొక్క రాజ్యము స్థిరముగా నుండుటకు అక్కడ సిద్ధేశ్వరునిగా శివదేవుడున్నాడు. ఆ లింగమును దేవతలందరూ ఆరాధిస్తారు.

తతః ప్రభృతి తత్తీర్థం గోవిన్దమితి విశ్రుతమ్ ।
మంగళా సంగమం చైవ పూర్ణతీర్థం తతః పరమ్ ॥ 100 ॥

అప్పటినుండి ఆ తీర్థమును గోవిన్దతీర్థమని, మంగళా సంగమమని, పూర్ణతీర్థమని యందురు. ఆ తరువాత,

ఇన్ద్రతీర్థమితిఖ్యాతం బార్హస్పత్యం చ విశ్రుతమ్ ।
యత్ర సిద్ధేశ్వరో దేవో విష్ణుర్గోవిన్ద ఏవ చ ॥ 101 ॥

తేషు స్నానం చ దానం చ యత్కించిత్సుకృతార్జనమ్ ।
సర్వం తదక్షయం విద్యాత్పితౄణామపి వల్లభమ్ ॥ 102 ॥

ఇంద్ర తీర్థమని, బృహస్పతితీర్థమని పేరుగన్నది. ఎక్కడ శివుడు సిద్ధేశ్వరునిగాను, విష్ణువు గోవిందుని గాను యున్నారో, ఆ తీర్థములో స్నానముచేసినా, దానముచేసినా, అక్కడ ఏ కొంచం పుణ్యం సంపాదించినా అది అక్షయమగును. పితరులు సంతసింతురు.

శృణోతి యశ్చాపి పఠేద్యశ్చ స్మరతి నిత్యశః ।
తస్య తీర్థస్య మాహాత్మ్యం భ్రష్టరాజ్యప్రదాయకమ్ ॥ 103 ॥

ఆ తీర్థమునుగూర్చి విన్నా, చదివినా, స్మరించినా కూడా రాజ్యభ్రష్టునకు తిరిగి రాజ్యము లభించుటే తీర్థమాహాత్మ్యము.

సప్తత్రింశత్సహస్రాణి తీర్థానాం తీరయోర్ద్వయోః ।
ఉభయోర్మునిశార్దూల సర్వసిద్ధి ప్రదాయినామ్ । 104 ॥

ఓ మునిశ్రేష్ఠా! గౌతమీ నదియొక్క రెండు తీరముల వెంబడి సర్వసిద్ధి ప్రదాయకములగు ముప్పది ఏడువేల తీర్థములున్నవి.

న పూర్ణతీర్థసదృశం తీర్థమస్తి మహాఫలమ్ ।
నిష్ఫలం తస్య జన్మాది యో న సేవేత తన్నరః ॥ 105 ॥

పూర్ణతీర్థముతో సమానమగు మహాఫలమునిచ్చే తీర్థము మరొకటి లేదు. ఎవడైతే అటువంటి తీర్థమును సేవించడో అటువంటి వాని జన్మాది వ్యర్థము.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఉభయోస్తీరయోః పూర్ణతీర్థ మంగలా సంగమ గోవిన్ద సిద్ధేశ్వరాది సప్తత్రింశత్సహస్రతీర్థ వర్ణనం నామ ద్విపంచాశోఽధ్యాయః ॥ 52 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములో ఉభయతీరముల యందున్న పూర్ణతీర్థ, మంగలాసంగమ, గోవింద, సిద్ధేశ్వర మొదలగు ముప్పది ఏడువేల తీర్థములవర్ణనమను పేరుగల యాభైరెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిపంచాశోఽధ్యాయః - యాభై మూడవ అధ్యాయం
రామతీర్థాది తీర్థవర్ణనమ్ - రామతీర్థాది తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

రామతీర్థమితి ఖ్యాతం బ్రహ్మహత్యావినాశనమ్ ।
తస్య స్మరణమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 1 ॥

రామతీర్థమనేది చాలా ప్రసిద్ధినందినది. అది బ్రహ్మహత్యాపాపమును నశింపజేయునది. ఆ తీర్థమును స్మరించినంతనే అన్ని పాపములు నశించుతాయి.

ఇక్ష్వాకువంశప్రభవః క్షత్రియో లోకవిశ్రుతః ।
బలవాన్మతిమాన్ శూరో యథా శక్రః పురందరః ॥ 2 ॥

ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు, లోకంలో పేరుగాంచినవాడు, బలవంతుడు, బుద్ధిమంతుడు, శూరుడు, స్వర్గాధిపతి అయిన ఇంద్రుని వంటి క్షత్రియుడు ఉండేవాడు.

పితృపైతామహం రాజ్యం కుర్వన్నాస్తే యథా బలిః ।
తస్య తిస్రో మహిష్యః స్యు రాజ్ఞో దశరథస్య హి ॥ 3 ॥

బలిచక్రవర్తివలె తన తండ్రితాతలనుండి సంక్రమించిన రాజ్యమును పరిపాలిస్తుండేవాడు. ఆ రాజైన దశరథునకు ముగ్గురు భార్యలుండేవారు.

కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ మహామతే ।
ఏతాః కులీనాః సుభగా రూపలక్షణసంయుతాః ॥ 4 ॥

ఓ మహామతీ! వారిపేర్లు కౌసల్యా, సుమిత్రా, కైకేయీ. వీరు మంచివంశంలో పుట్టినవారు, మంచి సౌభాగ్యం కలిగిన వారు, రూపలావణ్యములతో కూడుకొనియున్నవారు.

తస్మిన్ రాజని రాజ్యే తు స్థితేఽయోధ్యాపతౌ మునే ।
వసిష్ఠే బ్రహ్మవిచ్ఛ్రేష్ఠే పురోధసి విశేషతః ॥ 5 ॥

న చ వ్యాధిర్న దుర్భిక్షం న చావృష్టిర్నచాఽఽధయః ।
బ్రహ్మక్షత్రవిశాం నిత్యం శూద్రాణాం చ విశేషతః ॥ 6 ॥

ఓ మునీ! అయోధ్యా నగరరాజగు దశరథుడు రాజ్యపరిపాలనగావిస్తుండగా బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడైన వసిష్ఠుడు విశేషించి పురోహితునిగా నుండగా, వ్యాధికాని, దుర్భిక్షంకాని, వర్షంలేకపోవుటకాని, బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులకు మనో వ్యధగానీ లేదు.

ఆశ్రమాణాం తు సర్వేషామానన్దోఽభూత్ పృథక్ పృథక్ ।
తస్మిన్ శాసతి రాజేన్ద్ర ఇక్ష్వాకూణాం కులోద్వహే ॥ 7 ॥

దేవానాం దానవానాం తు రాజ్యార్థే విగ్రహోఽభవత్ ।
క్వాపి తత్ర జయం ప్రాపుర్దేవాః క్వాపి తథేతరే ॥ 8 ॥

విశేషించి బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసమనే నాలుగాశ్రమాలు వేరువేరుగా అనుష్ఠించి అందరూ ఆనందించారు. ఇక్ష్వాకువంశంలోని ఆ రాజేంద్రుడు రాజ్యం పాలిస్తుండగా, దేవతలకు, దానవులకు రాజ్యంకొరకై యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఒకసారి దేవతలు గెలవగా రెండవసారి రాక్షసులు గెలిచారు.

ఏవం ప్రవర్తమానే తు త్రైలోక్యమతిపీడితమ్ ।
అభూన్నారద తత్రాహమవదం దైత్యదానవాన్ ॥ 9 ॥

నారదా! ఇట్లు జరుగుతుండగా మూడులోకములకు చాలా పీడ కలిగింది. అప్పుడు నేను దైత్యులతో, దానవులతోను చెప్పాను.

దేవాంశ్చాపి విశేషేణ న కృతం తైర్మదీరితమ్ ।
పునశ్చ సంగరస్తేషాం బభూవ సుమహాన్మిథః ॥ 10 ॥

విశేషంగా దేవతలకుకూడా చెప్పాను కాని వారెవ్వరూ నేను చెప్పినట్లుగా నడుచుకొనలేదు. తిరిగి వారిలో నొకరితో నొకరికి గొప్ప యుద్ధం జరిగింది.

విష్ణుం గత్వా సురాః ప్రోచుస్తథేశానం జగన్మయమ్ ।
తావూచతురుభౌ దేవానసురాన్ దైత్యదానవాన్ ॥ 11 ॥

దేవతలంతా విష్ణువువద్దకు, జగన్మయుడైన శివుని వద్దకు వెళ్ళి చెప్పారు. అప్పుడు వారిద్దరూ దేవతలతో, అసురులతో, దైత్యులతో, దానవులతో చెప్పారు.

తపసా బలినో యాన్తు పునః కుర్వన్తు సంగరమ్ ।
తథేత్యాహుర్యయుః సర్వే తపసే నియతవ్రతాః ॥ 12 ॥

మీరంతా ముందు తపస్సు చేసి బలవంతులు కండి, తిరిగి యుద్ధం చేయండి. వారంతా అలాగే అని నియతవ్రతులై తపస్సుచేయుటకు వెళ్ళారు.

యయుస్తు రాక్షసాన్ దేవాః పునస్తే మత్సరాన్వితాః ।
దేవానాం దానవానాం చ సంగరోఽభూత్సుదారుణః ॥ 13 ॥

మాత్సర్యంతో కూడిన ఆ దేవతలు తిరిగి రాక్షసులవద్దకు వెళ్ళారు. దేవతలకు, దానవులకు భయంకరమైన యుద్ధం జరిగింది.

న తత్ర దేవా జేతారో నైవ దైత్యాశ్చ మానవాః ।
సంయుగే వర్తమానే తు వాగువాచాశరీరిణీ ॥ 14 ॥

ఆ యుద్ధంలో దేవతలుగాని, దైత్యులుగాని, మానవులుగాని గెలువలేదు. ఇట్లొక యుగకాలం జరుగుతుండగా అశరీరరవాణి ఇట్లు పలికింది.

ఆకాశవాగువాచ:– ఆకాశవాణి పలికింది.

యేషాం దశరథో రాజా తే జేతారో న చేతరే ॥ 15 ॥

దశరథుడెవరిపక్షంలో నిలుస్తాడో వారే జయిస్తారు ఇతరులెవరూ జయించలేరు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా జయాయోభౌ జగ్మతుర్దేవదానవౌ ।
తత్ర వాయుస్త్వరన్ ప్రాప్తో రాజానమవదత్తదా ॥ 16 ॥

ఆ మాటవిని దేవదానవులిద్దరూ విజయమునకై వెళ్ళారు. వారిలో వాయువు త్వరగా దశరథుని వద్దకు వెళ్ళి చెప్పాడు.

వాయురువాచ :– వాయువు పలికాడు.

ఆగన్తవ్యం త్వయా రాజన్ దేవదానవసంగరే ।
యత్రరాజా దశరథో జయస్తత్రేతి విశ్రుతమ్ ॥ 17 ॥

రాజా! దేవదానవులకు యుద్ధం జరుగుతుంది. దానిలో పాల్గొనుటకు మీరు రావలెను. దశరథమహారాజు ఏ పక్షంలో ఉంటే విజయమా పక్షమని విన్నాము.

తస్మాత్త్వం దేవ పక్షే స్యాః భవేయుర్జయినః సురాః ॥ 18 ॥

అందువలన నీవు దేవతలపక్షంలో నుండవలెను. అప్పుడే దేవతలు జయిస్తారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్వాయువచనం శ్రుత్వా రాజా దశరథో నృపః ।
ఆగమ్యతే మయా సత్యం గచ్ఛ వాయో యథాసుఖమ్ ॥ 19 ॥

వాయువుమాటను విన్న దశరథమహారాజు ఓ వాయూ! నీవు సుఖంగా వెళ్ళు. నేను నిజంగా వస్తాను.

గతే వాయౌ తదా దైత్యా ఆజగ్ముర్భూపతిం ప్రతి ।
తేఽప్యూచుర్భగవన్నస్మత్సాహాయ్యం కర్తుమర్హసి ॥ 20 ॥

వాయువువెళ్ళగానే అప్పుడు రాజుదగ్గరకు దైత్యులు వచ్చారు. వారుకూడా భగవన్! మాకు నీవు సహాయం చేయవలెనని యడిగారు.

రాజన్ దశరథ శ్రీమన్ విజయస్త్వయి సంస్థితః ।
తస్మాత్త్వం వై దైత్యపతేః సాహాయ్యం కర్తుమర్హసి ॥ 21 ॥

పూజ్యుడా! దశరథమహారాజా! విజయము నీయందున్నది. అందువలన దైత్యపతికి నీవు సహాయం చేయవలెను.

తతః ప్రోవాచ నృపతిర్వాయునా ప్రార్థితః పురా ।
ప్రతిజ్ఞాతం మయా తచ్చ యాన్తు దైత్యాశ్చ దానవాః ॥ 22 ॥

అప్పుడు రాజువారితో ముందే వాయువువచ్చి ప్రార్థించినాడు. నేను మాటకూడా ఇచ్చాను. కావున దైత్యదానవులారా! వెళ్ళండి.

స తు రాజా తథా చక్రే గత్వా చైవ త్రివిష్టపమ్ ।
యుద్ధం చక్రే తథా దైత్యైర్దానవైః సహ రాక్షసైః ॥ 23 ॥

ఆ దశరథమహారాజు ఇచ్చిన మాట ప్రకారంగానే స్వర్గమునకు వెళ్ళి, దేవతలకు సహాయంగా దైత్యులతో, దానవులతో, రాక్షసులతో యుద్ధం చేశాడు.

పశ్యత్సు దేవసంఘేషు నముచేర్భ్రాతరస్తదా ।
వివిధుర్నిశితైర్బాణై రథాక్షం నృపతేస్తథా ॥ 24 ॥

అప్పుడు దేవతా గణములు చూస్తుండగా నముచియొక్క సోదరులు దశరథమహారాజు యొక్క రథాక్షమును నిశితమైన బాణములు వేసి విరిచారు.

భిన్నాక్షం తం రథం రాజా న జానాతి ససంభ్రమాత్ ।
రాజాన్తికే స్థితా సుభ్రూః కైకేయ్యాజ్ఞాయి నారద ॥ 25 ॥

ఆ తొందరలో దశరథుడు తన రథంయొక్క అక్షము విరిగినదని తెలుసుకోలేదు. ఓ నారదా! రాజుదగ్గరే వున్న చక్కని కనుబొమలు గలిగిన సుందరి కైకేయి గ్రహించింది.

న జ్ఞాపితం తయా రాజ్ఞే స్వయమాలోక్య సువ్రతా ।
భగ్నమక్షం సమాలక్ష్య చక్రే హస్తం తదా స్వకమ్ ॥ 26 ॥

కైకేయి చూచిగూడా రాజుకు గుర్తుచేయలేదు. సువ్రత అయిన ఆమె విరిగిన అక్షమును తన చేతినడ్డంగా పెట్టింది.

అక్షవన్మునిశార్దూల తదేతన్మహదద్భుతమ్ ।
రథేన రథినాం శ్రేష్ఠస్తయా దత్తకరేణ చ ॥ 27 ॥

జితవాన్ దైత్యదనుజాన్ దేవైః ప్రాప్య వరాన్ బహూన్ ।
తతో దేవైరనుజ్ఞాతస్త్వయోధ్యాం పునరభ్యగాత్ ॥ 28 ॥

అట్లు అక్షంవలె చేతినాస్థానమునందుంచుట యొక మహాద్భుతమైన విషయం. రథులలో శ్రేష్ఠుడైన ఆ దశరథుడు చేతినడ్డముగా నుంచిన రథంతో దైత్యదనుజులను జయించాడు. దేవతలనుండి అనేక వరములను పొంది, తరువాత దేవతల అనుజ్ఞ తీసుకొని తిరిగి అయోధ్యానగరమునకు వచ్చాడు.

స తు మధ్యే మహారాజో మార్గే వీక్ష్య తదా ప్రియామ్ ।
కైకేయ్యాః కర్మ తద్దృష్ట్వా విస్మయం పరమం గతః ॥ 29 ॥

దశరథ మహారాజు మార్గమధ్యంలో ప్రియురాలగు కైకేయిని చూచి, అప్పుడామె చేసిన పనిని చూచి, మిక్కిలి ఆశ్చర్యం పొందాడు.

తతస్తస్యై వరాన్ ప్రాదాత్ త్రీంస్తు నారద సా అపి ।
అనుమాన్య నృపప్రోక్తం కైకేయీ వాక్యమబ్రవీత్ ॥ 30 ॥

నారదా! అప్పుడతడు ఆమెకు మూడు వరముల నిచ్చాడు. ఆమెకూడా రాజు చెప్పిన దానికి అంగీకరించి కైకేయి ఇట్లన్నది.

కైకేయ్యువాచ :- కైకేయి పలికింది.

త్వయి తిష్ఠన్తు రాజేన్ద్ర త్వయా దత్తా వరా అమీ ॥ 31 ॥

ఓ రాజేంద్రా! నీవిచ్చిన ఈవరములు నీవద్దనే ఉండనిమ్ము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విభూషణాని రాజేన్ద్రో దత్వా స ప్రియయా సహ ।
రథేన విజయీ రాజా యయౌ స్వనగరం సుఖీ ॥ 32 ॥

ఆ రాజేంద్రుడు ఆమెకనేక భూషణముల నిచ్చి, విజయము నొందిన ఆ రాజు రథంలో తన ప్రియురాలితోపాటు అయోధ్యా నగరమునకు సుఖంగా చేరాడు.

యోషితాం కిమదేయం హి ప్రియాణాముచితాగమే ।
స కదాచిద్దశరథో మృగయా శీలిభిర్వృతః ॥ 33 ॥

ఆటన్నరణ్యే శర్వర్యాం వారిబంధమథాకరోత్ ।
సప్తవ్యసనహీనేన భవితవ్యం తు భూభుజా ॥ 34 ॥

తగిన సందర్భం వచ్చినప్పుడు ప్రియురాండ్రైన స్త్రీలకు ఇవ్వకూడని దేముంటుంది? ఒకానొకప్పుడు ఆ దశరథమహారాజు వేట చెలికాండ్రతో కూడి, అరణ్యంలో తిరుగుతూ రాత్రిపూట ఏనుగులను పట్టుటకై గోయి తీశాడు. రాజైనవాడు సప్తవ్యసనములు లేకుండా ఉండాలి, (వారి బన్ధనం=ఏనుగులని బంధించే గొయ్యి)

ఇతి జానన్నపి చ తచ్చకార తు విధేర్వశాత్ ।
గర్తం ప్రవిశ్య పానార్థమాగతాన్నిశితైః శరైః ॥ 35 ॥

మృగాన్ హన్తి మహాబాహుః శృణు కాలవిపర్యయమ్ ।
గర్తం ప్రవిష్టే నృపతౌ తస్మిన్నేవ నగోత్తమే ॥ 36 ॥

వృద్ధో వై శ్రవణో నామ న శృణోతి న పశ్యతి ।
తస్య భార్యా తథా భూతా తావబ్రూతాం తదా సుతమ్ ॥ 37 ॥

అని తెలిసి కూడా విధి వశంచే అట్లు చేశాడు. ఆ పల్లంలో ప్రవేశించి నీరు త్రాగుటకు వచ్చే వానిని తన వాడియైన బాణములతో, ఆయా మృగములనా మహాబహువు చంపుతాడు. చూచితివా, వింటివా, కాలవిపరీతమెట్లుండునో? ఆ పల్లంలో ప్రవేశించే ఏనుగుకై రాజు అక్కడే చెట్టుచాటున పొంచియుండగా, శ్రవణుడనే ఒక వృద్ధుడుండేవాడు అతడు వినలేడు (చెవిటి) చూడలేడు (గ్రుడ్డి), అతని భార్యాగూడా అటువంటిదే. అప్పుడు వారిద్దరు తమ కుమారునితో నిట్లన్నారు.

మాతాపితరావూచతుః :- తల్లిదండ్రులు పలికారు.

ఆవాం తృషార్తౌ రాత్రిశ్చ కృష్ణా చాపి ప్రవర్తతే ॥
వృద్ధానాం జీవితం కృత్స్నం బాలస్త్వమసి పుత్రక ॥ 38 ॥

మేము దాహార్తులమై యున్నాము. రాత్రికూడా అయినది. చుట్టూచీకట్లు కమ్ముకొంటున్నాయి. వృద్ధులమైన మాజీవితం ముగియనున్నది. కుమారా! నీవేమో బాలుడవు.

అన్ధానాం బధిరాణాం చ వృద్ధానాం ధిక్ చ జీవితమ్ ।
జరాజర్జరదేహానాం ధిక్ ధిక్ పుత్రక జీవితమ్ ॥ 39 ॥

ఛీఛీ గ్రుడ్డితనం, చెవిటితనంగల వృద్ధుల జీవితం వ్యర్థం. నాయనా! ముసలితనంతో వణికే దేహంగలవారి జీవితం వ్యర్థం.

తావత్ పుంభిర్జీవితవ్యం యావల్లక్ష్మీర్దృఢం వపుః ।
యావదాజ్ఞాऽప్రతిహతా తీర్థాదావన్యథా మృతిః ॥ 40 ॥

ధనము, దృఢమైన శరీరమున్నంతవరకే మనుషులు జీవించవలెను. చెప్పినమాట వినేవారున్నంతవరకే జీవించవలెను. లేదా ఎక్కడైనా తీర్థములలో పడి చావవలెను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యేతద్వచనం శ్రుత్వా వృద్ధయోర్గురువత్సలః ।
పుత్రః ప్రోవాచ తద్దుఃఖం గిరా మధురయా హరన్ ॥ 41 ॥

ఇట్లు మాట్లాడిన వృద్ధుల మాటనువిని వారియందు గురువాత్సల్యం గలిగిన పుత్రుడు వారి దుఃఖమును తొలగిస్తూ , మధురమైన మాటలు పలికాడు.

పుత్ర ఉవాచ :– పుత్రుడు పలికాడు.

మయి జీవతి కిం నామ యువయోః దుఃఖమీదృశమ్ ।
న హరత్యాత్మజః పిత్రోర్యశ్చరిత్రైర్మనోరుజమ్ ॥ 42
తేన కిం తనుజేనేహ కులోద్వేగవిధాయినా ॥ 43 ॥

నేను జీవించియుండగా మీ కిటువంటి దుఃఖమెందులకు? ఎవడైతే తన నడవడితో తల్లిదండ్రుల మనోరుగ్మతను పోగొట్టడో అతడెట్లు కొడుకవుతాడు? వంశమునకు ఉద్వేగం కలిగించు ఆ కొడుకుతో పనియేమి?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా పితరౌ నత్వా తావాశ్వాస్య మహామనాః ।
తరుస్కన్ధే సమారోప్య వృద్ధౌ చ పితరౌ తదా ॥ 44 ॥

హస్తే గృహీత్వా కలశం జగామ ఋషిపుత్రకః ।
స ఋషిర్న తు రాజానం జానాతి నృపతిర్ద్విజమ్ ॥ 45 ॥

ఉభౌ సరభసౌ తత్ర ద్విజో వారి సమావిశత్ ।
సత్వరం కలశే న్యుబ్జే వారిగృహ్ణన్తమాశుగైః ॥ 46 ॥

ద్విజం రాజా ద్విపం మత్వా వివ్యాధ నిశితైః శరైః ।
వనద్విపోఽపి భూపానామవధ్యస్తద్విదన్నపి ॥ 47 ॥

ఇట్లు పలికి ఆ మనీషి తల్లిదండ్రులకు నమస్కరించి, వారినోదార్చి, వృద్ధులైన తల్లిదండ్రులను చెట్టుకొమ్మమీద కూర్చొనబెట్టి, చేతిలో నొక కలశం దీసుకొని ఋషిపుత్రుడు వెళ్ళాడు. ఆ ఋషి రాజు నెరుగడు, రాజు ఋషి నెరుగడు. అక్కడ ఇద్దరూ తొందరలోనే యున్నారు. ఆ ద్విజుడు నీటిలో ప్రవేశించాడు. త్వరగా కలశమును నీటిలో ముంచాడు. నీటిని తీసుకొంటున్నవానిని వేగమైన, వాడియైన బాణములతో నా బ్రాహ్మణుని ఏనుగుగా తలచి (కొట్టాడు) రాజులు అడవి ఏనుగునైనా సరే వధించకూడదని తెలిసి కూడా కొట్టాడు.

వివ్యాధ తం నృపః కుర్యాన్న కిం కిం విధివంచితః ।
స విద్ధో మర్మదేశే తు దుఃఖితో వాక్యమబ్రవీత్ ॥ 48 ॥

రాజు అతనిని కొట్టాడు. విధివంచితుడైనవాడు ఏమేమి చేయకుండావుంటాడు? రాజు కొట్టగా ఆ దెబ్బ మర్మ ప్రదేశంలో తాకి దుఃఖిస్తూ ద్విజుడిట్లన్నాడు.

ద్విజ ఉవాచ :– ద్విజుడు పలికాడు.

కేనేదం దుఃఖదం కర్మ కృతం సద్బ్రాహ్మణస్య మే ।
హా తాత ఇతి స ప్రాహ నాపరాధోఽస్తి కశ్చన ॥ 49 ॥

అయ్యో తండ్రీ! నా తప్పేమీలేదు. సద్బ్రాహ్మణుడనైన నాకు ఇటువంటి దుఃఖంకలిగించే పనిని ఎవరు చేసినారు అని ద్విజుడన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదేతద్వచనం శ్రుత్వా మునేరార్తస్య భూపతిః ।
నిశ్చేష్టశ్చ నిరుత్సాహో శనైస్తం దేశమభ్యగాత్ ॥ 50 ॥

అట్లు పలికిన మునియొక్క ఆర్తస్వరం విని రాజు నిశ్చేష్టుడై, నిరుత్సాహంతో మెల్లగా ఆ ప్రదేశమునకు వెళ్ళాడు.

తం తు దృష్ట్వా ద్విజవరం జ్వలంతమివ తేజసా ।
అసావప్యభవత్తత్ర సశల్య ఇవ మూర్ఛితః ॥ 51 ॥

మండుతున్న అగ్నివలె ప్రకాశిస్తున్న ఆ ద్విజశ్రేష్ఠుని చూచి రాజుకూడా అక్కడ ఎముకగ్రుచ్చుకున్న వానివలె మూర్ఛిల్లాడు.

ఆత్మానమాత్మనా కృత్వా స్థిరం రాజాఽబ్రవీదిదమ్ ॥ 52 ॥

తన్నుతాను సంబాలించుకొని తెప్పరిల్లి రాజిట్లు పలికాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

కో భవాన్ ద్విజశార్దూల కిమర్థమిహ చాఽఽగతః ।
వద పాపకృతే మహ్యం వద మే నిష్కృతిం పరామ్ ॥ 53 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్టుడా! నీవెవరు? ఇక్కడికెందుకు వచ్చినావు? ఈపాపమునాచరించిన నాకు చెప్పు. దీనికి నిష్కృతి ఏదో చెప్పు.

బ్రహ్మహా వర్ణిభిః కింతు శ్వపచైరపి జాతు చిత్ ।
న స్ప్రష్టవ్యో మహాబుద్ధే ద్రష్టవ్యో న కదాచన ॥ 54 ॥

బ్రహ్మహత్యచేసిన వానిని బ్రహ్మచారులుగాని చండాలురుగాని తాకరాదు. ఓ జ్ఞానీ ఎన్నడు చూడరాదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్రాజవచనం శ్రుత్వా మునిపుత్రోఽబ్రవీద్వచః ॥ 55 ॥

రాజు పలికిన మాటనువిని మునిపుత్రుడిట్లన్నాడు.

మునిపుత్ర ఉవాచ :- మునిపుత్రుడు పలికాడు.

ఉత్క్రమిష్యన్తి మే ప్రాణా అతో వక్ష్యామి కించన ।
స్వచ్ఛన్దవృత్తితా జ్ఞానే విద్ధి పాకం చ కర్మణామ్ ॥ 56 ॥

నా ప్రాణములు పోవుతున్నవి. అందువలన కొంచం చెబుతాను. జీవులయొక్క జ్ఞానమునందు పరిపక్వత వారి నిర్మలమైన ప్రవర్తనయే అని తెలుసుకో.

ఆత్మార్థం తు న శోచామి వృద్ధౌ తు పితరౌ మమ ।
తయోః శుశ్రూషకః కః స్యాదన్ధయోరేకపుత్రయోః ॥ 57 ॥

నేను నా కొరకు దుఃఖించుటలేదు. నా తల్లిదండ్రులు వృద్ధులు, వారు గ్రుడ్డివారు, వారికి నేనొక్కడనే కుమారుడను. వారికి సేవచేయుటకెవరున్నారని నా బాధ.

వినా మయా మహారణ్యే కథం తౌ జీవయిష్యతః ।
మమాభాగ్యమహో కీదృక్ పితృశుశ్రూషణే క్షతిః ॥ 58 ॥

నేను లేకుండా ఈమహారణ్యంలో వాళ్ళిద్దరు ఎలా జీవించగలరు? నా దౌర్భాగ్యమెటువంటిది. నా తల్లిదండ్రులకు సేవచేసుకొనుటకు వినాశం ఏర్పడినది కదా!

జాతా మేఽద్య వినాప్రాణైర్వా విధే కిం కృతం త్వయా ।
తథాఽపి గచ్ఛ తత్ర త్వం గృహీతకలశస్త్వరన్ ॥ 59 ॥

ఈరోజు నాప్రాణాలులేకుండా పోతున్నాయి. హా విధీ! ఎంత పని చేశావు? అయినా నీవు చెంబుతీసుకొని త్వరగా అక్కడికి వెళ్ళు.

తాభ్యాం దేహ్యుదపానం త్వం యథా తౌ న మరిష్యతః ॥ 60 ॥

వాళ్ళు మరణించకుండా ముందు వారికి నీవు నీళ్ళనివ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యేవం బ్రువతస్తస్య గతాః ప్రాణాః మహావనే ।
విసృజ్య సశరం చాపమాదాయ కలశం నృపః ॥ 61 ॥

తత్రాగాత్స తు వేగేన యత్ర వృద్ధౌ మహావనే ।
వృద్ధౌ చాపి తదా రాత్రౌ తావన్యోన్యం సమూచతుః ॥ 62 ॥

ఇట్లు చెబుతుండగానే ఆ మహావనంలో అతని ప్రాణములు పోయినాయి. రాజు ధనుర్బాణములను వదిలి పెట్టి, కలశమును తీసుకొని, ఆ మహావనంలో వృద్ధులెక్కడ ఉన్నారో అక్కడకు వేగంగా వెళ్ళాడు. ఆ వృద్ధులు కూడా అప్పుడా రాత్రిలో పరస్పరంగా నిట్లు మాట్లాడుకొంటున్నారు.

వృద్ధావూచతుః :- వృద్ధులు పలికారు.

ఉద్విగ్నః కుపితో వా స్యాదథ వా భక్షితః కథమ్ ।
న ప్రాప్తశ్చాఽఽఽవయోర్యష్టిః కిం కుర్మః కా గతిర్భవేత్ ॥ 63 ॥

అతడు దుఃఖమునకు లోనైనాడో, కోపించాడో లేదా క్రూరమృగములుతిన్నవో ఎందుకింకా మాకాధారుడైన యజమానిరాలేదు. మేం ఏం చేయవలెను? మాగతేమి?

న కోఽపి తాదృశః పుత్రో విద్యతే సచరాచరే ।
యః పిత్రోరన్యథా వాక్యం న కరోత్యపి నిన్దితః ॥ 64 ॥

ఈచరాచరజగత్తులో అటువంటి కుమారుడు ఎవడూ ఉండడు. తల్లిదండ్రులమాట జవదాటడు. నిందించినా వేరేవిధంగా ప్రవర్తించడు.

వజ్రాదపి కఠోరం వా జీవితం తమపశ్యతోః ।
శీఘ్రం న యాన్తి యత్ప్రాణాస్తదేకాయత్తచిత్తయోః ॥ 65 ॥

అతణ్ణి చూడకుండా మా జీవితం వజ్రం కంటే కఠినమైనది. అతని యందే ఆశలు పెట్టుకున్న మా ప్రాణములు తొందరగా పోనన్నాపోవుట లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం బహువిధా వాచో వృద్ధయోర్వదతోర్వనే ।
తదా దశరథో రాజా శనైస్తం దేశమభ్యగాత్ ॥ 66 ॥

ఇట్లా వృద్ధులు అనేక విధములుగా నా వనములో మాట్లాడుకొంటుండగా అప్పుడు దశరథమహారాజు నెమ్మదిగా ఆ ప్రదేశమునకు చేరాడు.

పాదసంచారశబ్దేన మేనాతే సుతమాగతమ్ ॥ 67 ॥

పాదముల సవ్వడితో తమ కుమారుడు వచ్చెనని వారనుకొన్నారు.

వృద్ధావూచతుః :- వృద్ధులు పలికారు.

కుతో వత్స చిరాత్ప్రాప్తస్త్వం దృష్టిస్త్వం పరాయణమ్ ।
న బ్రూతే కింతు రుష్టోఽసి వృద్ధయోరన్ధయోః సుతః ॥ 68 ॥

నాయనా! చాలాసేపైనది. ఎందుకు నీవు రాలేదు? నాకు కంటి చూపు నీవే కదా నాయనా! ఎందుకు పలుకుటలేదు? గ్రుడ్డివారు వృద్ధులైనవారి కుమారుడినని కోపంగా వున్నావా?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సశల్య ఇవ దుఃఖార్తః శోచన్ దుష్కృతమాత్మనః ।
స భీత ఇవ రాజేన్ద్రస్తావువాచాథ నారద ॥ 69 ॥

నారదా! ఆ మాటలు ములుకులవలె తాకగా ఆ రాజేంద్రుడు తాను చేసిన దుష్కృతమును తలచి చింతిస్తూ, భయంతో ఆ వృద్ధదంపతులతో నిట్లన్నాడు.

ఉదపానం చ కురుతాం తచ్ఛ్రుత్వా నృపభాషితమ్ ।
నాయం వక్తా సుతోఽస్మాకం కో భవాన్ తత్పురా వద ॥ 70 ॥

పశ్చాత్పిబావః పానీయం తతో రాజాఽబ్రవీచ్చ తౌ ॥ 71 ॥

నీరు త్రాగండి అని రాజు అనగా ఆ మాటనువిని ఈమాట్లాడినవాడు మా కుమారుడు కాదనుకొని నీవెవరు? ముందు అది చెప్పు. తరువాత నీరు త్రాగుతాము. అప్పుడు రాజు వారితో నిట్లన్నాడు.

రాజోవాచ :– రాజు పలికాడు.

తత్ర తిష్ఠతి వాం పుత్రో యత్ర వారిసమాశ్రయః ॥ 72 ॥

మీ కుమారుడు జలమున్నచోటున నున్నాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వోచతురార్తౌ తౌ సత్యం బ్రూహి న చాన్యథా ।
ఆచచక్షే తతో రాజా సర్వమేవ యథాతథమ్ ॥ 73 ॥

ఆ మాటవిని వారిద్దరు ఆర్తులై నిజం చెప్పు, వేరుగా చెప్పకు అనగా అప్పుడు రాజు ఉన్నదున్నట్లుగా జరిగినదంతా చెప్పాడు.

తతస్తు పతితౌ వృద్ధౌ తత్రాఽఽవాం నయ మా స్పృశ ।
బ్రహ్మఘ్నస్పర్శనం పాపం న కదాచిద్వినశ్యతి ॥ 74 ॥

అప్పుడా వృద్ధులు క్రింద పడిపోయారు. మమ్మల్ని అక్కడికి తీసుకొని పో. మమల్ని తాకుటకు ప్రయత్నించకు. బ్రహ్మహత్యచేసిన వానిని స్పృశించినందున వచ్చే పాపమెప్పుడు నశించదు.

నిన్యే వై శ్రవణం వృద్ధం సభార్యం నృపసత్తమః ।
యత్రాసౌ పతితః పుత్రస్తం స్పృష్ట్వా తౌ విలేపతుః ॥ 75 ॥

అప్పుడా రాజు వారికుమారుడు పడిన చోటునకు వృద్ధశ్రవణుని, అతని భార్యను కూడా తీసుకొని వెళ్ళాడు. ఆ వృద్ధదంపతులు పడిపోయి ఉన్న కుమారుని స్పృశించి, మిక్కిలి విలపించారు.

వృద్ధావూచతుః :– వృద్ధులు పలికారు.

యథా పుత్రవియోగేన మృత్యుర్నౌ విహితస్తథా ।
త్వం చాపి పాప పుత్రస్య వియోగాన్మృత్యుమాప్స్యసి ॥ 76 ॥

ఓ పాపీ! ఎలాగైతే పుత్రవియోగంతో మాయిద్దరికి మృత్యువు విహితమైనదో నీవు కూడా పుత్రుని యొక్క వియోగంతోనే మృత్యువును పొందుతావు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం తు జల్పతోర్బ్రహ్మన్ గతాః ప్రాణాస్తతో నృపః ।
అగ్నినా యోజయామాస వృద్ధౌ చ ఋషిపుత్రకమ్ ॥ 77 ॥

ఓ బ్రహ్మర్షీ! ఇట్లు పలుకుతుండగానే ప్రాణాలు పోయాయి. తరువాత రాజు ఆ వృద్ధదంపతులకు, ఋషిపుత్రునకు అగ్నితో సంయోగంచేసి దహనసంస్కారం చేశాడు.

తతో జగామ నగరం దుఃఖితో నృపతిర్మునే ।
వసిష్ఠాయ చ తత్సర్వం న్యవేదయదశేషతః ॥ 78 ॥

ఓ మునీ! ఇటు తరువాత దుఃఖితుడైన రాజు నగరమునకు వెళ్ళాడు. కులగురువులైన వసిష్ఠునకు జరిగినదంతా నివేదించాడు.

నృపాణాం సూర్యవంశ్యానాం వసిష్ఠో హి పరా గతిః ।
వసిష్ఠోఽపి ద్విజశ్రేష్ఠైః సంమన్త్ర్యాఽఽహ చ నిష్కృతిమ్ ॥ 79 ॥

సూర్యవంశములోని రాజులందరికి వసిష్ఠుడే దిక్కు. ఆ వసిష్ఠుడు కూడా బ్రాహ్మణశ్రేష్ఠులతో నాలోచించి నివారణోపాయం చెప్పాడు.

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

గాలవం వామదేవం చ జాబాలిమథ కశ్యపమ్ ।
ఏతానన్యాన్సమాహూయ హయమేధాయ యత్నతః ॥ 80 ॥

యజస్వ హయమేధైశ్చ బహుభిర్బహుదక్షిణైః ॥ 81 ॥

గాలవుని, వామదేవుని, జాబాలిని, కశ్యపుని, వీరితో పాటు ఇతరులను గూడ పిలిచి అశ్వమేధయజ్ఞమునకై యత్నించి, అనేకమందితో అనేక దక్షిణలతో అశ్వమేధమును చేయుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అకరోద్ధయమేధాంశ్చ రాజా దశరథో ద్విజైః ।
ఏతస్మిన్నన్తరే తత్ర వాగువాచాశరీరిణీ ॥ 82 ॥

దశరథ మహారాజు బ్రాహ్మణులతో హయమేధయజ్ఞములు చేశాడు. ఇంతలో అక్కడ ఆకాశవాణి పలికింది.

ఆకాశవాణ్యువాచ :- ఆకాశవాణి పలికింది.

పూతం శరీరమభవద్రాజ్ఞో దశరథస్య హి ।
వ్యవహార్యశ్చ భవితా భవిష్యన్తి తథా సుతాః ॥
జ్యేష్ఠపుత్రప్రసాదేన రాజాఽపాపో భవిష్యతి ॥ 83 ॥

దశరథ మహారాజు యొక్క శరీరం పవిత్రమైనది. అతని వ్యవహారములు పవిత్రములైనవి. అతనికి కుమారులు జన్మిస్తారు. పెద్దకుమారుని అనుగ్రహంతో రాజు పాపవిముక్తుడవుతాడు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మ పలికాడు.

తతో బహుతిథే కాలే ఋష్యశృంగాన్మునీశ్వరాత్ ।
దేవానాం కార్యసిద్ధ్యర్థం సుతా ఆసన్ సురోపమాః ॥ 84 ॥

ఆ తరువాత కొంతకాలమునకు ఋష్యశృంగమునీశ్వరుని వలన దేవతలకార్యం సిద్ధించుటకే దేవతాసమానులగు సుతులు కలిగారు.

కౌశల్యాయాం తథా రామః సుమిత్రాయాం చ లక్ష్మణః ।
శత్రుఘ్నశ్చాపి కైకేయ్యాం భరతో మతిమత్తరః ॥ 85 ॥

కౌసల్యయందు రాముడు, సుమిత్రయందు లక్ష్మణుడు, కైకేయియందు శత్రుఘ్నుడు మరియు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన భరతుడు పుట్టారు.

తే సర్వే మతిమన్తశ్చ ప్రియా రాజ్ఞో వశే స్థితాః ।
తం రాజానం ఋషిః ప్రాప్య విశ్వామిత్రః ప్రజాపతిః ॥ 86 ॥

రామం చ లక్ష్మణం చాపి అయాచత మహామతే ।
యజ్ఞసంరక్షణార్థాయ జ్ఞాతతన్మహిమా మునిః ॥ 87 ॥

వారందరూ చాలా బుద్ధిమంతులు, ఇష్టులుకూడా. వారంతా రాజువశంలో వుండిరి. ఒకనాడు ఆ రాజు దగ్గరకు ప్రజాపతియైన విశ్వామిత్రుడను ఋషి వచ్చి, ఓ మహామతీ! రామలక్ష్మణులను యజ్ఞసంరక్షణకై పంపుమని అడిగాడు. ఆ ముని వారి మహిమ నెరిగినవాడు.

చిరప్రాప్తసుతో వృద్ధో రాజా నైవేత్యభాషత ॥ 88 ॥

చాలాకాలం తరువాత కలిగిన కుమారుడని ఆ వృద్ధరాజు తాను పంపనన్నాడు.

రాజోవాచ :–రాజు పలికాడు.

మహతా దైవయోగేన కథంచిద్వార్ధకే మునే ।
జాతావానన్దసందోహదాయకౌ మమ బాలకౌ ॥ 89 ॥

ఓ మునీ! నాకు ముసలి వయస్సులో గొప్పదైన యోగంతో ఆనందోత్సవములనిచ్చే కుమారులు ఎట్టకేలకు జన్మించినారు.

సశరీరమిదం రాజ్యం దాస్యే నైవ సుతావిమౌ ॥ 90 ॥

మీరు కోరితే నా శరీరమును, రాజ్యము నిస్తాను, కుమారుల నివ్వను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వసిష్ఠేన తదా ప్రోక్తో రాజా దశరథస్త్వితి ॥ 91 ॥

అప్పుడు వసిష్ఠుడు దశరథమహారాజుతో నిట్లన్నాడు.

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

రఘవః ప్రార్థనాభంగం న రాజన్ క్వాపి శిక్షితాః ॥ 92 ॥

రాజా! రఘువంశపువారు ఎప్పుడూ ఆడినమాట తప్పరు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

రామం చ లక్ష్మణం చైవ కథంచిదవదన్నృపః ॥ 93 ॥

రాజు ఎట్టకేలకు రామలక్ష్మణులతో నిట్లన్నాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

విశ్వామిత్రస్య బ్రహ్మర్షేః కురుతాం యజ్ఞరక్షణమ్ ॥ 94 ॥

బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రునియొక్క యజ్ఞమును రక్షించండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వదన్నితి సుతౌ సోష్ణం నిశ్వసన్ గ్లపితాధరః ।
పుత్రౌ సమర్పయామాస విశ్వామిత్రస్య శాస్త్రకృత్ ॥ 95 ॥

అని చెబుతూ, వేడినిట్టూర్పులతో, అదురుతున్న పెదిమలతో, శాస్త్రముతెలిసిన దశరథుడు విశ్వామిత్రునకు తన కుమారులను సమర్పించాడు.

తథేత్యుక్త్వా దశరథం నమస్య చ పునః పునః ।
జగ్మతూ రక్షణార్థాయ విశ్వామిత్రేణ తౌ ముదా ॥ 96 ॥

అలాగేనని దశరథునికి మాటిమాటికి నమస్కరించి వారిద్దరు సంతోషంగా విశ్వామిత్రునితో యాగరక్షణకు వెళ్ళారు.

తతః ప్రహృష్టః స మునిర్ముదా ప్రాదాత్తదోభయోః ।
మాహేశ్వరీం మహావిద్యాం ధనుర్విద్యాపురస్సరామ్ ॥ 97 ॥

అప్పుడు ఆ ముని సంతోషించి వారిద్దరికి ధనుర్విద్యాపురస్సరంగా మహేశ్వరసంబంధమైన మహా విద్యనిచ్చాడు.

శాస్త్రీమాస్త్రీం లౌకికీం చ రథవిద్యాం గజోద్భవామ్ ।
అశ్వవిద్యాం గదావిద్యాం మంత్రాహ్వానవిసర్జనే ॥ 98 ॥

సర్వవిద్యామథావాప్య ఉభౌ తౌ రామలక్ష్మణౌ ।
వనౌకసాం హితార్థాయ జఘ్నతుస్తాటకాం వనే ॥ 99 ॥

శస్త్రవిద్యను, అస్త్రవిద్యను లౌకికమైన రథవిద్యను గజవిద్యను, అశ్వవిద్యను, గదావిద్యను ప్రయోగ ఉపసంహారమంత్రములతో, సర్వవిద్యనుగూడా ఆ రామలక్ష్మణులు విశ్వామిత్రుని నుండి పొంది, అరణ్యము నందు నివసించేవారి హితమును గోరి వనంలో తాటకను చంపారు.

అహల్యాం శాపనిర్ముక్తాం పాదస్పర్శాచ్చ చక్రతుః ।
యజ్ఞవిధ్వంసనాయాతాన్ జఘ్నతుస్తత్ర రాక్షసాన్ ॥ 100 ॥

తమ పాదస్పర్శతో అహల్యను శాపవిముక్తురాలను చేశారు. యజ్ఞవినాశనమునకై వచ్చిన రాక్షసుల నక్కడ చంపారు.

కృతవిద్యౌ ధనుష్పాణీ చక్రతుర్యజ్ఞరక్షణమ్ ।
తతో మహామఖే వృత్తే విశ్వామిత్రో మునీశ్వరః ॥ 101 ॥

పుత్రాభ్యాం సహితో రాజ్ఞో జనకం ద్రష్టుమభ్యగాత్ ।
చిత్రామదర్శయత్తత్ర రాజమధ్యే నృపాత్మజః ॥ 102 ॥

విద్యలను నేర్చి, ధనుర్బాణములు ధరించి, యాగరక్షణమును చేశారు. అటు తరువాత గొప్పయజ్ఞము నకై విశ్వామిత్రమునీశ్వరుడు, రామలక్ష్మణులతో గూడి జనకుని చూచుటకు వెళ్ళాడు. అక్కడ సభామధ్యంలో రాజకుమారుడు ఒక అప్సరసను చూశాడు.

రామః సౌమిత్రిసహితో ధనుర్విద్యాం గురోర్మతామ్ ।
తత్ప్రీతో జనకః ప్రాదాత్సీతాం లక్ష్మీమయోనిజామ్ ॥ 103 ॥

లక్ష్మణునితో కలసివెళ్ళిన రాముడు గురువు అభీష్టప్రకారంగా ధనుర్విద్యను ప్రదర్శించాడు. దానికి సంతోషించిన జనకుడు అయోనిజ, లక్ష్మీస్వరూపురాలైన సీతను రాముని కిచ్చాడు.

శత్రుఘ్నభరతాదీనాం వసిష్ఠాదిమతే స్థితః । 104 ॥

రాజా దశరథః శ్రీమాన్ వివాహమకరోన్మునే ॥
తతో బహుతిథే కాలే రాజ్యం తస్య ప్రయచ్ఛతి ॥ 105 ॥

నృపతౌ సర్వలోకానామనుమత్యా గురోరపి ।
మన్థరాత్మకదుర్దైవప్రేరితా మత్సరాకులా ॥ 106 ॥

కైకేయీ విఘ్నమాతస్థే వనప్రవ్రజనం తథా ।
భరతస్య చ తద్రాజ్యం రాజా నైవ చ దత్తవాన్ ॥ 107 ॥

ఓ మునీ! వసిష్ఠాది మునుల అభిమతమునననుసరించి శ్రీమంతుడగు దశరథ మహారాజు శత్రుఘ్న భరతాదుల వివాహం చేశాడు. చాలా కాలం తరువాత రాజ్యమునతనికి, లోకులందరి అనుమతితో, గురువుల అనుమతితో రాజు ఇస్తుండగా మన్థర అనే దుర్దైవవశంచే ప్రేరేపించబడిన, మాత్సర్యంతో వ్యాకులపడిన, కైకేయి విఘ్నం చేసింది. రాముని వనమునకు పంపుట, భరతునికి రాజ్యము నిచ్చుటను కోరగా రాజంగీకరించలేదు.

పితరం సత్యవాక్యం తం కుర్వన్ రామో మహావనమ్ ।
వివేశ సీతయా సార్ధం తథా సౌమిత్రిణా సహ ॥ 108 ॥

తండ్రిని సత్యవాక్పరిపాలకునిగా చేస్తూ రాముడు, సీత మరియు లక్ష్మణునితోగూడా మహా అరణ్యమును ప్రవేశించాడు.

సతాం చ మానసం శుద్ధం స వివేశ స్వకైర్గుణైః ।
తస్మిన్వినిర్గతే రామే వనవాసాయ దీక్షితే ॥ 109 ॥

సమం లక్ష్మణసీతాభ్యాం రాజ్యతృష్ణావివర్జితే ।
తం రామం చాపి సౌమిత్రిం సీతాం చ గుణశాలినీమ్ ॥ 110 ॥

దుఃఖేన మహతాఽఽవిష్టో బ్రహ్మశాపం చ సంస్మరన్ ।
తదా దశరథో రాజా ప్రాణాంస్తత్యాజ దుఃఖితః ॥ 111 ॥

సత్పురుషులయొక్క మనస్సు శుద్ధమైనది. రాముడు తన స్వీయగుణములతో దానిలో ప్రవేశించాడు. వనవాసదీక్షను దీసుకొన్న రాముడు అరణ్యావాసమునకై వెళ్ళగానే, సీతాలక్ష్మణులతో గూడా రాజ్య కాంక్షను వదలగానే, ఆ రాముని, లక్ష్మణుని, గుణశాలినియైన సీతను, తలుచుకుంటూ, బ్రాహ్మణుని శాపమును స్మరించి, మిక్కిలి దుఃఖమునకు లోనై దశరథ మహారాజు అప్పుడు తన ప్రాణములను వదిలి పెట్టాడు.

కృతకర్మవిపాకేన రాజా నీతో యమానుగైః ।
తస్మై రాజ్ఞే మహాప్రాజ్ఞ యావత్స్థావరజంగమే ॥ 112

యమసద్మన్యనేకాని తామిస్రాదీని నారద ।
నరకాన్యథ ఘోరాణి భీషణాని బహూని చ ॥ 113 ॥

తత్ర క్షిప్తస్తదా రాజా నరకేషు పృథక్ పృథక్ ।
పచ్యతే ఛిద్యతే రాజా పిష్యతే చూర్ణ్యతే తథా ॥ 114 ॥

రాజు తాను చేసిన కర్మలు పరిపక్వత చెందుటచే యమభటులు అతనిని తీసుకొని వెళ్ళారు. ఓ మహాప్రాజ్ఞా! ఆ రాజుకు స్థావరజంగమములున్నంతవరకు, నారదా! యమలోకంలో తామిస్రమమున్నగు అనేకమైన

భయంకరములు, ఘోరములగు నరకములు, రాజును వేరువేరు నరకములలో ఉంచి వండుతున్నారు. కోస్తున్నారు, దంచుతున్నారు, చూర్ణంగా చేస్తున్నారు.

శోష్యతే దశ్యతే భూయో దహ్యతే చ మహామతే ।
ఏవమాదిషు ఘోరేషు నరకేషు స పచ్యతే ॥ 115 ॥

ఎండగొడుతున్నారు, కొరుకుతున్నారు, కాల్చుతున్నారు. ఓ మహామతీ! ఇట్లు ఘోరమైన నరకాల్లో అతడు బాధపడుతున్నాడు.

రామోஉపి గచ్ఛన్నధ్వానం చిత్రకూటమథాగమత్ ।
తత్రైవ త్రీణి వర్షాణి వ్యతీతాని మహామతే ॥ 116 ॥

రాముడు కూడా అడవిలో వెళుతూ చిత్రకూటమును చేరాడు. ఓ మహామతీ! అక్కడే అతనికి మూడు వత్సరములు గడచాయి.

పునః స దక్షిణామాశామాక్రామద్దండకం వనమ్ ।
విఖ్యాతం త్రిషు లోకేషు దేశానాం తద్ధి పుణ్యదమ్ ॥ 117 ॥

తిరిగి అతడు దక్షిణదిక్కున నున్న దండకారణ్యమును ఆక్రమించాడు. ఆ అరణ్యము ముల్లోకములలో, దేశములలో ప్రసిద్ధి చెందినది, పవిత్రమైనది, పుణ్యము నిచ్చునది.

ప్రావిశత్తన్మహారణ్యం భీషణం దైత్యసేవితమ్ ।
తద్భయాదృషిభిస్త్యక్తం హత్వా దైత్యాంస్తు రాక్షసాన్ ॥ 118 ॥

విచరన్ దణ్డకారణ్యే ఋషిసేవ్యమథాஉకరోత్ ।
తత్రేదం వృత్తమాఖ్యాస్యే శృణునారద యత్నతః ॥ 119 ॥

రాక్షసులు నివసించే భయంకరమైన ఆ మహారణ్యమును రాముడు ప్రవేశించాడు. ఋషులు రాక్షసభయంతో దానిని వదిలారు. రాముడా దైత్యులను రాక్షసులను సంహరించి, దండకారణ్యంలో తిరుగుతూ దానిని ఋషిసేవ్యంగా చేశాడు. నారదా! అక్కడొక కథ ఉన్నది, శ్రద్ధగా విను,

తావచ్ఛనైస్స్వగాద్రామో యావద్యోజనపంచకమ్ ।
గౌతమీం సమనుప్రాప్తో రాజాஉపి నరకే స్థితః ॥ 120 ॥

రాముడు మెల్లగా ఐదు యోజనములు ప్రయాణించి గౌతమీ నదిని చేరాడు. దశరథుడింకా నరకంలోనే యున్నాడు.

యమః స్వకింకరానాహ రామో దశరథాత్మజః ।
గౌతమీమభితో యాతి పితరం తస్య ధీమతః ॥ 121 ॥

ఆకర్షన్త్వథ రాజానం నరకాన్నాత్ర సంశయః ।
ఉత్తీర్య గౌతమీం యాతి యావద్యోజన పంచకమ్ ॥ 122 ॥

రామస్తావత్తస్య పితా నరకే నైవ పచ్యతామ్ ।
యదేతన్మద్వచః పుణ్యం న కుర్యుర్యది దూతకాః ॥ 123 ॥

తతశ్చ నరకే ఘోరే యూయం సర్వే నిమజ్జథ ।
యా కాఽప్యుక్తా పరాశక్తిః శివస్య సమవాయినీ ॥ 124 ॥

తామేవ గౌతమీం సన్తో వదన్త్యంభః స్వరూపిణీమ్ ।
హరిబ్రహ్మమహేశానాం మాన్యా వన్ద్యా చ సైవ యత్ ॥ 125 ॥

యముడు తన కింకరులతో దశరథకుమారుడగు రాముడు గౌతమికి అభిముఖంగా వెళుతున్నాడు. ఆ ధీమంతుని తండ్రియగు దశరథుని, నరకమునుండి లాగుకొని తెండు. ఇందులో సందేహమువద్దు. రాముడు గౌతమీనదినిదాటి ఐదు యోజనములు వెళ్ళునంతవరకు, అతని తండ్రిని నరకమునందు బాధించకండి. నేను చెప్పిన ఈపవిత్రమైన మాటను దూతలు చేయకపోయినట్లైతే, తరువాత ఘోరమైన నరకంలో మీరంతా మునుగండి. శివునితో విడదీయరాని సంబంధం గల ఏ పరాశక్తియున్నదో, ఆమెనే నీటి రూపంగా నున్న గౌతమీయని సత్పురుషులు చెబుతారు. ఆమెయే బ్రహ్మవిష్ణుమహేశులకు గౌరవనీయురాలు, నమస్కరించదగినది.

నిస్తీర్యతే న కేనాపి తదతిక్రమజం త్వఘమ్ ।
పాపినోఽప్యాత్మజః కశ్చిద్యస్య గంగామనుస్మరేత్ ॥ 126 ॥

సోఽనేకదుర్గనిరయాన్నిర్గతో ముక్తతాం వ్రజేత్ ।
కిం పునస్తాదృశః పుత్రో గౌతమీనికటే స్థితః ॥ 127 ॥

ఎవడైనా గంగను దాటితీరాలి. ఆ లాదాటకపోతే అనియమాన్ని అతిక్రమించినందువలన పాపం వస్తుంది. ఎంత పాపియైనా అతని కుమారుడు గంగను స్మరించినట్లైతే, అతడనేక నరక దుర్గమములను దాటి ముక్తిని పొందగలడు. అటువంటి కుమారుడు గౌతమీ సమీపమున నున్నాడు. ఇంకేమి చెప్పాలి?

యస్యాసౌ నరకే పక్తుం న కైరపి హి శక్యతే ।
దక్షిణాశాపతేర్వాక్యం నిశమ్య యమకింకరాః ॥ 128 ॥

నరకే పచ్యమానం తమయోధ్యాధిపతిం నృపమ్ ।
ఉత్తీర్య ఘోరనరకాద్వచనం చేదమబ్రువన్ ॥ 129 ॥

అందువలన ఇతనిని నరకంలో బాధించుటకెవరికీ శక్యంగాదు. ఇట్లు పలికిన దక్షిణదిక్కున కధిపతి యగు యముని మాటలు కింకరులువిని, నరకంలో బాధలననుభవిస్తున్న అయోధ్యా నగరాధిపతియగు దశరథుని ఆ ఘోరనరకమునుండి బయటకు తీసుకొని వచ్చి ఇట్లు పలికారు.

యమకింకరా ఊచుః :- యమకింకరులు పలికారు.

ధన్యోఽసి నృపశార్దూల యస్య పుత్రః స తాదృశః ।
ఇహ చాముత్ర విశ్రాన్తిః సుపుత్రః కేన లభ్యతే ॥ 130 ॥

ఓ రాజశ్రేష్ఠుడా! నీవు ధన్యుడవు. ఎవరికి అటువంటి కుమారుడుంటాడు? ఇహలోకంలో పరలోకంలో విశ్రాంతిని కలుగజేసే సుపుత్రుడెవరికి లభిస్తాడు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స విశ్రాన్తః శనై రాజా కింకరాన్వాక్యమబ్రవీత్ ॥ 131 ॥

ఆ రాజు విశ్రాంతి తీసుకొని నెమ్మదిగా కింకరులతో నిట్లన్నాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

నరకేష్వథ ఘోరేషు పచ్యమానః పునః పునః ।
కథం త్వాకర్షితః శీఘ్రం తన్మే వక్తుమిహార్హథ ॥ 132 ॥

మాటి మాటికి ఘోరమైన నరకాలలో హింసలననుభవిస్తున్న నన్ను ఎట్ల అంత త్వరగా లాగారు. నాకు చెప్పండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్ర కశ్చిచ్ఛాన్తమనాః రాజానమిదమబ్రవీత్ ॥ 133 ॥

వారిలోనొక శాంతమనస్కుడు రాజుతో నిట్లన్నాడు.

యమదూత ఉవాచ :- యమదూత పలికాడు.

వేదశాస్త్రపురాణాదావేతద్గోప్యం ప్రయత్నతః ।
ప్రకాశ్యతే తదపి తే సామర్థ్యం పుత్రతీర్థయోః ॥ 134 ॥

వేదశాస్త్రములయందు దీనినెంతో ప్రయత్నంతో రహస్యంగా నుంచినారు. అయినా ఆ పుత్రతీర్థముల యొక్క రహస్యము, సామర్థ్యమును వెల్లడిస్తున్నాను.

రామస్తవ సుతః శ్రీమాన్ గౌతమీతీరమాగతః ।
తస్మాత్త్వం నరకాద్ఘోరాదాకృష్టోఽసి నరోత్తమ ॥ 135 ॥

నరోత్తమా! నీకుమారుడగు శ్రీమంతుడైన రాముడు గౌతమీనది తీరమునకు వచ్చినాడు. అందువలన భయంకరమైన నరకమునుండి నిన్ను లాగినారు.

యది త్వాం తత్ర గౌతమ్యాం స్మరేద్రామః సలక్ష్మణః ।
స్నానం కృత్వాఽథ పిణ్డాది దద్యాత్స నృపోత్తమ ॥ 136 ॥
తతస్త్వం సర్వపాపేభ్యో ముక్తో యాసి త్రివిష్టపమ్ ।

ఓ రాజశ్రేష్ఠుడా! గౌతమీనదియందు లక్ష్మణునితో గూడా రాముడు నిన్ను స్మరించినట్లయితే, స్నానం చేసి పిండాదులను సమర్పించినట్లయితే, అప్పుడు నీవు సమస్తపాపములనుండి విముక్తుడవై స్వర్గమునకు వెళతావు.

రాజోవాచ :- రాజు పలికాడు.

తత్ర గత్వా భవద్వాక్యమాఖ్యాస్యే స్వసుతౌ ప్రతి ।
భవన్త ఏవ శరణమనుజ్ఞాం దాతుమర్హథ ॥ 137 ॥

నేనక్కడికి వెళ్ళి నా కుమారులతో నీమాట చెబుతాను. నీవే నాకు శరణు. నాకు అనుజ్ఞనివ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్రాజవచనం శ్రుత్వా కృపయా యమకింకరాః ।
ఆజ్ఞాం చ ప్రదదుస్తస్మై రాజా ప్రాగాత్సుతౌ ప్రతి ॥ 138 ॥

రాజుమాటను విని యమకింకరులు దయతో నతనికి అనుజ్ఞనిచ్చారు. రాజు కుమారుల వద్దకు వెళ్ళాడు.

భీషణం యాతనాదేహమాపన్నో నిఃశ్వసన్ముహుః ।
నిరీక్ష్య స్వం లజ్జమానః కృతం కర్మ చ సంస్మరన్ ॥ 139 ॥

భయంకరమైన యాతనాదేహమును పొందిన దశరథుడు మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ, తనను తాను చూచుకొని సిగ్గుపడుతూ, తాను చేసిన కర్మను తలుచుకొంటూ

స్వేచ్ఛయా విహరన్ గంగామాససాద చ రాఘవః ।
గౌతమ్యాస్తటమాశ్రిత్య రామో లక్ష్మణ ఏవ చ ॥ 140 ॥

సీతయా సహ వైదేహ్యా సస్నౌ చైవ యథావిధి ।
నైవ తత్రాభవద్భోజ్యం భక్ష్యం వా గౌతమీ తటే ॥ 141 ॥

స్వేచ్ఛగా విహరిస్తూ, దశరథుడు గంగాతీరం చేరాడు. రాముడు, లక్ష్మణుడు గౌతమీనది ఒడ్డునకు చేరి, విదేహరాజకూతురగు సీతాదేవితోగూడ యథావిధిగా స్నానం చేశారు. అక్కడ ఆ గౌతమీతీరంలో భక్ష్యంగాని, భోజ్యంగాని లేకుండెను.

తద్దినే తత్ర వసతాం గౌతమీతీరవాసినామ్ ।
తద్దృష్ట్వా దుఃఖితో భ్రాతా లక్ష్మణో రామమబ్రవీత్ ॥ 142 ॥

ఆ రోజు అక్కడ నివసించేవారి పరిస్థితిని చూచి, దుఃఖించినటువంటి సోదరుడైన లక్ష్మణుడు రామునితో నిట్లన్నాడు.

లక్ష్మణ ఉవాచ :- లక్ష్మణుడు పలికాడు.

పుత్రౌ దశరథస్యాఽఽవాం తవాపి బలమీదృశమ్ ।
నాస్తి భోజ్యమథాస్మాకం గంగాతీరనివాసినామ్ ॥ 143 ॥

మనము దశరథ మహారాజు పుత్రులము, నీ బలము గూడా గొప్పది, కాని మనకుగాని, గంగాతీర వాసులకుగాని భోజనం లేదు.

రామ ఉవాచ:- రాముడు పలికాడు.

భ్రాతర్యద్విహితం కర్మ నైవ తచ్చాన్యథా భవేత్ ।
పృథివ్యామన్న పూర్ణాయాం వయమన్నాభిలాషిణః ॥ 144 ॥

తమ్ముడూ! నుదుట వ్రాసిన వ్రాత వేరుగా గాదు. అన్నపూర్ణ అయిన భూమిలో మనము అన్నాన్ని కోరుతున్నాం.

సౌమిత్రే నూనమస్మాభిర్న బ్రాహ్మణముఖే హుతమ్ ।
అవజ్ఞయా మహీదేవాన్ తర్పయన్త్యర్చయన్తి న ॥ 145 ॥

లక్ష్మణా! మనము బ్రాహ్మణునిద్వారా హవనం చేయలేదు. అజ్ఞానంతో భూదేవతలైన బ్రాహ్మణులకు తర్పణంగాని, అర్చనగాని చేయుటలేదు.

తే యే లక్ష్మణ జాయన్తే సర్వదైవ బుభుక్షితాః ।
స్నాత్వా దేవానథాభ్యర్చ్య హోతవ్యశ్చ హుతాశనః ॥
తతః స్వసమయే దేవో విధాస్యత్యశనం తు నౌ ॥ 146 ॥

లక్ష్మణా! అటువంటివారే ఎప్పుడూ ఆకలిగలవారుగా పుడతారు. స్నానం చేసి, దేవతల నర్చించి, అగ్నిని వ్రేల్చి హోమమును చేయవలెను. అప్పుడే భగవంతుడు తన సమయానుకూలంగా సరియైన సమయంలో మనకు అన్నము నివ్వగలడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భ్రాత్రోః సంజల్పతోరేవం పశ్యతోః కర్మణో గతిమ్ ।
శనైర్దశరథో రాజా తం దేశముపజగ్మివాన్ ॥ 147 ॥

కర్మగతినిచూస్తూ ఆసోదరులిట్లు మాట్లాడుకొంటుండగా మెల్లగా దశరథ మహారాజు ఆ ప్రదేశమును చేరాడు.

తం దృష్ట్వా లక్ష్మణః శీఘ్రం తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్ ।
ధనురాకృష్య కోపేన రక్షస్త్వం దానవోఽథవా ॥ 148 ॥

అతనిని చూచి లక్ష్మణుడు వెంటనే ఆగు ఆగుమన్నాడు. కోపంతో ధనుస్సునెక్కుపెట్టి నీవు రాక్షసుడవా లేక దానవుడవా?

ఆసన్నం చ పునర్దృష్ట్వా యాహి యాహ్యత్ర పుణ్యభాక్ ।
రామో దాశరథీ రాజా ధర్మభాక్ పశ్య వర్తతే ॥ 149 ॥

దగ్గరగా వచ్చిన వానిని మళ్ళీ తేరిపార జూచి (ఓ పుణ్యమూర్తీ! (రమ్ము రమ్ము) పోపో ఇక్కడ పుణ్యాత్ముడూ ధర్మవర్తీ, దశరథ కుమారుడూ రాజునగు రాముడున్నాడు చూడు.

గురుభక్తః సత్యసంధో దేవబ్రాహ్మణసేవకః ।
త్రైలోక్యరక్షాదక్షోఽసౌ వర్తతే యత్ర రాఘవః ॥ 150 ॥

న తత్ర త్వాదృశామస్తి ప్రవేశః పాపకర్మణామ్ ।
యది ప్రవేశసే పాప తతో వధమవాప్స్యసి ॥ 151 ॥

గురువులయందు భక్తిగలవాడు, నిజమునే మాట్లాడువాడు, దేవబ్రాహ్మణులను సేవించువాడు, ముల్లోకములను రక్షించే సామర్థ్యము గల ఈయన ఇక్కడ ఉన్నాడు. ఎక్కడ రాముడుండునో, అక్కడ నీవంటి పాపకర్ములకు ప్రవేశం లేదు. ఓ పాపీ! ఒకవేళ వచ్చినట్లయితే అప్పుడు చావగలవు.

తత్పుత్రవచనం శ్రుత్వా శనైరాహూయ వాచయా ।
ఉవాచాధోముఖో భూత్వా స్నుషాం పుత్రౌ కృతాంజలిః ॥
ముహురన్తర్వినిధ్యాయన్ గతిం దుష్కృతకర్మణః ॥ 152 ॥

అట్లు మాట్లాడిన కొడుకు మాటలను విని తగ్గుస్వరంతో పిలిచి, తలక్రిందికి వేసుకొని, నమస్కరిస్తూ, కోడలితో, కొడుకులతో లోలోపల తానుచేసిన దుష్కృతములను మాటిమాటికి తలుచుకుంటూ, దానివల్ల పొందే గతిని గూర్చి నెమ్మదిగా పలికాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

అహం దశరథో రాజా పుత్రౌ మే శృణుతం వచః ।
తిసృభిః బ్రహ్మహత్యాభిర్వృతోఽహం దుఃఖమాగతః ॥
ఛిన్నం పశ్యత మే దేహం నరకేషు చ పాచితమ్ ॥ 153 ॥

కుమారులారా! నా మాట వినండి. నేను దశరథరాజును. మూడుబ్రహ్మహత్యలపాపంతో చుట్టి యున్నాను. కష్టంవచ్చినది. నా దేహము నరకములయందు యాతనలననుభవించి ఛిద్రమైనది చూడండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః కృతాంజలీ రామః సీతయా లక్ష్మణేన చ ।
భూమౌ ప్రణేముస్తే సర్వే వచనం చైతదబ్రువన్ ॥ 154 ॥

అప్పుడు రాముడు సీతాలక్ష్మణులతో కలిసి కృతాంజలియై, భూమిమీద పరుండి, అందురూ సాష్టాంగ నమస్కారంచేసి ఇట్లన్నారు.

సీతారామలక్ష్మణా ఊచుః:- సీతారామలక్ష్మణులు పలికారు.

కస్యేదం కర్మణస్తాత ఫలం నృపతిసత్తమ ॥ 155 ॥

రాజశ్రేష్ఠా! తండ్రీ! ఏ కర్మకిది ఫలితము?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స చ ప్రాహ యథావృత్తం బ్రహ్మహత్యాత్రయం తథా ॥ 156 ॥

అపుడు తాను చేసిన మూడు బ్రహ్మహత్యలనుగూర్చి వివరించాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

నిష్కృతిర్బ్రహ్మహన్తౄణాం పుత్రౌ క్వాపి న విద్యతే ॥ 157 ॥

కుమారులారా! బ్రహ్మహత్యచేసిన వారి కెక్కడా (ప్రాయశ్చిత్తం) పరిహారం లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతో దుఃఖేన మహతాఽఽవృతాః సర్వే భువం గతాః ।
రాజానం వనవాసం చ మాతరం పితరం తథా ॥ 158 ॥

దుఃఖాగమం కర్మగతిం నరకే పాతనం తథా ।
ఏవమాద్యథ సంస్మృత్య ముమోహ నృపతేః సుతః ॥
విసంజ్ఞం నృపతిం దృష్ట్వా సీతా వాక్యమథాబ్రవీత్ ॥ 159 ॥

అప్పుడందరూ మిక్కిలి దుఃఖమావరించినవారై నేలగూలారు. రాజును, అరణ్యవాసమును, తల్లిని, తండ్రిని, అట్లే, దుఃఖం కలగడం, కర్మగతి, నరకంలో పడగొట్టడం ఇవన్నీతలుచుకొని రాజకుమారుడగు రాముడు మూర్ఛిల్లాడు. చలనం లేని రాజును చూచి సీత ఇట్లన్నది.

సీతోవాచ:- సీత పలికింది.

న శోచన్తి మహాత్మానస్త్వాదృశా వ్యసనాగమే ।
చిన్తయన్తి ప్రతీకారం దైవమప్యథ మానుషమ్ ॥ 160 ॥

నీవంటి మహాత్ములు వ్యసనములేర్పడినప్పుడు దుఃఖించరు. అది దేవసంబంధమైనా, మనుష్య సంబంధమైనా దానికి ప్రతీకారమును గూర్చి ఆలోచిస్తారు.

శోచద్భిర్యుగసాహస్రం విపత్తిర్నైవ తీర్యతే ।
వ్యామోహమాప్నువన్తీహ న కదాచిద్విచక్షణాః ॥ 161 ॥

వేయి సంవత్సరములు దుఃఖించినా ఆపద దాటలేరు. యుక్తాయుక్తవిచక్షణగలిగినవారు వ్యామోహమును పొందరు.

కిమనేనాత్రదుఃఖేన నిష్ఫలేన జనేశ్వర ।
దేహి హత్యాం ప్రథమతో యా జాతా హ్యతిభీషణా ॥ 162 ॥

ఓ రాజా! ఈనిష్ఫలమైన దుఃఖంతో పని యేమి? మొదట ఏది మిక్కిలి భయంకరంగా జరిగిందో దానిని ఇమ్ము.

పితృభక్తః పుణ్యశీలో వేదవేదాంగపారగః ।
అనాగా యో హతో విప్రస్తత్పాపస్యాత్ర నిష్కృతిమ్ ॥ 163 ॥

ఆచరామి యథాశాస్త్రం మా శోకం కురుతం యువామ్ ।
ద్వితీయాం లక్ష్మణో హత్యాం గృహ్ణాతు త్వపరాం భవాన్ ॥ 164 ॥

తల్లిదండ్రులయందు భక్తిగలవాడు, పుణ్యశీలుడు వేదవేదాంగపారగుడు, నిర్దోషియగు బ్రాహ్మణుని చంపితే ఆ పాపమునకు నిష్కృతిని, నేను యథాశాస్త్రం ఆచరిస్తున్నాను. మీరిద్దరు శోకించకండి. రెండవ బ్రహ్మహత్యను లక్ష్మణుడు, మరొక దానిని మీరు స్వీకరించండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతద్ధర్మయుతం వాక్యం సీతయా భాషితం దృఢమ్ ।
తథేతి చాఽఽహతురుభౌ తతో దశరథోఽబ్రవీత్ ॥ 165 ॥

సీతపలికిన దృఢమైన ధర్మయుక్తమైన మాటవిని రామలక్ష్మణులు అంగీకరించారు. అప్పుడు దశరథుడిట్లన్నాడు.

దశరథ ఉవాచ:- దశరథుడు పలికాడు.

త్వం హి బ్రహ్మవిదః కన్యా జనకస్య త్వయోనిజా ।
భార్యా రామస్య కిం చిత్రం యద్యుక్తమనుభాషసే ॥ 166 ॥

నీవు బ్రహ్మవేత్త అయిన జనకుని కూతురువు. అయోనిజవు. రామునికి భార్యవు. ఏది యుక్తమో అది అన్నావు ఇదేమి ఆశ్చర్యము!

న కోఽపి భవతాం కింతు శ్రమః స్వల్పోఽపి విద్యతే ।
గౌతమ్యాం స్నానదానేన పిణ్డనిర్వపణేన చ ॥ 167 ॥

కాని మీలో ఎవరికి కొంచెంకూడా శ్రమ ఉండదు. గౌతమియందు స్నానం, దానం, పిండదానం చేయండి.

తిసృభిర్బ్రహ్మహత్యాభిర్ముక్తో యామి త్రివిష్టపమ్ ।
త్వయా జనకసంభూతే స్వకులోచితమీరితమ్ ॥ 168 ॥

ఆ పిండదానంచే మూడు బ్రహ్మహత్యలనుండి విముక్తుడనై స్వర్గమును చేరుతాను. జనకునికూతురుగా నీ కులోచితమైన మాట చెప్పావు.

ప్రాపయన్తి పరం పారం భవాబ్ధేః కులయోషితః ।
గోదావర్యాః ప్రసాదేన కిం నామాస్త్యత్ర దుర్లభమ్ ॥ 169 ॥

మంచివంశంలో పుట్టిన స్త్రీలు సంసారసాగరంనుండి దాటించగలరు. గోదావరి అనుగ్రహంతో ఇక్కడ దుర్లభమేమున్నది?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేతి క్రియమాణే తు పిణ్డదానాయ శత్రుహా ।
నైవాపశ్యద్భక్ష్యభోజ్యం తతో లక్ష్మణమబ్రవీత్ ॥ 170 ॥

శత్రుసంహారకుడగు రాముడు అలాగేనని పిండదానం చేయుటకు సిద్ధపడగా అక్కడ భక్ష్యభోజ్యములేవీ కనిపించలేదు. అప్పుడు లక్ష్మణునితో చెప్పాడు.

లక్ష్మణః ప్రాహ వినయాదింగుద్యాశ్చ ఫలాని చ ।
సంతి తేషాం చ పిణ్యాకమానీతం తత్క్షణాదివ ॥ 171 ॥

లక్ష్మణుడు వినయంగా ఇంగుదీఫలములున్నవని చెప్పి వాటిని పిండిగాచేసి ఆ క్షణంలో పిండములను తెచ్చాడు.

పిణ్యాకేనాథ గంగాయాం పిండం దాతుం తథా పితుః ।
మనః కుర్వంస్తతో రామో మన్యోఽభూద్దుఃఖితస్తదా ॥ 172 ॥

ఆ ఇంగుదీ పిండితో చేసిన పిండమును గంగానది యందు తండ్రికి ఇచ్చుటకు మనస్సునుంచిన రాముడు దుఃఖంతో స్తబ్ధుడయ్యాడు.

దైవీవాగభవత్తత్ర దుఃఖం త్యజ నృపాత్మజ ।
రాజ్యభ్రష్టో వనం ప్రాప్తః కిం వై నిష్కించనో భవాన్ ॥ 173 ॥

అప్పుడు దేవవాణి రాజకుమారా! దుఃఖించకు. రాజ్యభ్రష్టుడవైనావు, అరణ్యమునకు వెళ్ళావు. ఇంకా అకించనత్వమేమి?

అశతో ధర్మనిరతో న శోచితుమిహార్హసి ।
విత్తశాఠ్యేన యో ధర్మం కరోతి స తు పాతకీ ॥ 174 ॥

నీవు శరుడవుగావు, ధర్మనిరతుడవు, దుఃఖించుట తగదు. ధర్మమునందు ధనముండికూడా లోభము చేస్తే వాడు పాతకుడు.

శ్రూయతే సర్వశాస్త్రేషు యద్రామ శృణు యత్నతః ।
యదన్నః పురుషో రాజన్ తదన్నాస్తస్య దేవతాః ॥ 175 ॥

రామా! శాస్త్రములన్నిటిలో ఏది చెప్పబడిందో దానిని శ్రద్ధగా విను. ఓ రాజా! కర్మాచరణచేసే యజమాని యే ఆహారాన్ని తింటాడో అతని పితృదేవతలకు కూడా అదే ఆహారం అవుతుంది.

పిణ్డే నిపతితే భూమౌ నాపశ్యత్పితరం తదా ।
శవం చ పతితం యత్ర శవతీర్థమనుత్తమమ్ ॥ 176 ॥

పిండమును భూమిమీద నుంచగానే అప్పుడు తండ్రి కనిపించలేదు. యాతనా శరీరం శవమై గంగలో ఎక్కడ పడిందో ఆ తీర్థం ఉత్తమం అయిన శవతీర్థం అయింది.

మహాపాతకసంఘాతవిఘాతకృదనుస్మృతిః ।
తత్రాఽఽగచ్ఛన్ లోకపాలా రుద్రాదిత్యాస్తథాఽశ్వినౌ ॥ 177 ॥

మహాపాతకసమూహములను పోగొట్టేది అనుస్మృతి. అక్కడికప్పుడు లోకపాలురైన శివుడు, సూర్యుడు మరియు అశ్వినీ దేవతలు వచ్చారు.

స్వం స్వం విమానమారుఢాస్తేషాం మధ్యేఽతిదీప్తిమాన్ ।
విమానవరమారూఢః స్తూయమానైశ్చ కిన్నరైః ॥ 178 ॥

ఆదిత్య సదృశాకారస్తేషాం మధ్యే బభౌ పితా ।
తమదృష్ట్వా స్వపితరం దేవాన్ దృష్ట్వా విమానినః ॥ 179 ॥

కృతాంజలి పుటో రామః పితా మే క్వేత్యభాషత ।
ఇతి దివ్యాఽభవద్వాణీ రామం సంబోధ్య సీతయా ॥ 180 ॥

వారి వారి విమానములను వారు ఎక్కగానే వారిమధ్యలో మరొక విమానాన్ని ఆరోహించి, మిక్కిలి తేజోవంతుడై కిన్నెర గణములు స్తోత్రం చేస్తుండగా, వారి మధ్యలో సూర్యునివలె నా తండ్రి ప్రకాశించాడు. తన తండ్రి కనిపించక విమానములలో నున్న దేవతలకు, నమస్కరిస్తూ రాముడు నా తండ్రెక్కడ అని ప్రశ్నించాడు. అప్పుడు సీతతో పాటు రాముని సంబోధిస్తూ ఆకాశవాణి ఇట్లన్నది.

తిసృభిర్బ్రహ్మహత్యాభిర్ముక్తో దశరథో నృపః ।
వృత్తః పశ్య సురైస్తాత దేవా అప్యూచిరే చ తమ్ ॥ 181 ॥

దశరథమహారాజు మూడు బ్రహ్మహత్యాపాపములనుండి విముక్తుడైనాడు. నాయనా! అప్పుడు దేవతలు ఏం చేశారో దానిని విను. అప్పుడు దేవతలతనితో అన్నారు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

ధన్యోఽసి కృతకృత్యోఽసి రామ స్వర్గం గతః పితా ।
నానానిరయసంఘాతాత్పూర్వజానుద్ధరేత్తు యః ॥ 182 ॥

రామా! నీవు ధన్యుడవు అయినావు. చేయవలసినదానిని చేశావు. నీ తండ్రి స్వర్గానికి చేరాడు. అనేక నరక కూపాలనుండి తన పూర్వులను యెవడు ఉద్ధరించుతాడో

స ధన్యోఽలంకృతం తేన కృతినా భువనత్రయమ్ ।
ఏనం పశ్య మహాబాహో ముక్తపాపం రవిప్రభమ్ ॥ 183 ॥

ఓ మహాబాహూ! కుమారుడు చేసిన సత్కర్మతో ఈముల్లోకములను అలంకరించినాడు. అతడు ధన్యుడు. పాపవిముక్తుడై సూర్యునివలె ప్రకాశిస్తున్న ఇతనిని చూడు.

సర్వసంపత్తియుక్తోఽపి పాపీ దగ్ధద్రుమోపమః ।
నిష్కించనోఽపి సుకృతీ దృశ్యతే చంద్రమౌలివత్ ॥ 184 ॥

పాపాత్ముడు ఎన్ని సంపదలున్నా దగ్ధమైన చెట్టులాంటివాడు. పుణ్యాత్ముడెంత దరిద్రుడైనా చంద్రశేఖరునివలె కనబడతాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

దృష్ట్వాఽబ్రవీత్సుతం రాజా ఆశీభిరభినన్ద్య చ ॥ 185 ॥

కుమారుని చూచి రాజు ఆశీస్సులతో నభినందించి యిట్లన్నాడు.

రాజోవాచ:–రాజు పలికాడు.

కృతకృత్యోఽసి భద్రం తే తారితోఽహం త్వయాఽనఘ ।
ధన్యః స పుత్రో లోకేఽస్మిన్ పితౄణాం యస్తు తారకః ॥ 186 ॥

ఓ పాపరహితాడా! నీవు కృతకృత్యుడవైనావు. నీకు శుభమగుగాక! నేను తరించినాను. ఈ లోకంలో తండ్రులను తరింపచేసే కుమారుడెవడో అతడే ధన్యుడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః సురగణాః ప్రోచుర్దేవానాం కార్యసిద్ధయే ।
రామం చ పురుషశ్రేష్ఠం గచ్ఛ తాత యథాసుఖమ్ ॥
తతస్తద్వచనం శ్రుత్వా రామస్తానబ్రవీత్సురాన్ ॥ 187 ॥

అప్పుడు దేవతల కార్యము సిద్ధించుటకొరకు దేవతాగణమంతా పురుషశ్రేష్ఠుడైన రామునితో నాయనా! యథేచ్ఛగా వెళ్ళుమన్నారు. అప్పుడు రాముడు వారి మాటలను విని దేవతలతో నిట్లన్నాడు.

రామ ఉవాచ :– రాముడు పలికాడు.

గురౌ పితరి మే దేవాః కిం కృత్యమవశిష్యతే ॥ 188 ॥

దేవతలారా! మా తండ్రివిషయంలో నేనింకా చేయవలసినదేమున్నది?

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

నదీ న గంగయా తుల్యా న త్వయా సదృశః సుతః ।
న శివేన సమో దేవో న తారేణ సమో మనుః ॥ 189 ॥

గంగతో సమానమైన నది లేదు. నీతో సమానమైన కుమారుడులేడు. శివునితో సమానమైన దేవుడు లేడు. తారకంతో సమానమైన మంత్రం లేదు.

త్వయా రామ గురూణాం చ కార్యం సర్వమనుష్ఠితమ్ ।
తారితాః పితరో రామ త్వయా పుత్రేణ మానద ॥
గచ్ఛన్తు సర్వే స్వస్థానం త్వం చ గచ్ఛ యథాసుఖమ్ ॥ 190 ॥

రామా! పితరులకు చేయవలసిన కార్యములన్నింటిని నీవు అనుష్ఠించినావు. అభిమానవంతుడవైన రామా! నీ వలన నీ పితరులందరూ తరించినారు. అందరూ మీ మీ స్థానములకు వెళ్ళండి. నీవు కూడా యథాసుఖంగా వెళ్ళు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్దేవవచనాద్ధృష్టః సీతయా లక్ష్మణాగ్రజః ।
దృష్ట్వా తు గంగామాహాత్మ్యం విస్మితో వాక్యమబ్రవీత్ ॥ 191 ॥

అట్లు పలికిన దేవతల మాటనువిని లక్ష్మణాగ్రజుడైన రాముడు సీతతో గూడ సంతోషించినవాడై, గంగానది యొక్క మాహాత్మ్యమును చూచి ఆశ్చర్యంతో నిట్లన్నాడు.

రామ ఉవాచ:– రాముడు పలికాడు.

అహో గంగా ప్రభావోఽయం త్రైలోక్యే నోపమీయతే ।
వయం ధన్యా యతో గంగా దృష్టాఽస్మాభిస్త్రిపావనీ ॥ 192 ॥

ఆహా! ఈగంగాప్రభావము ముల్లోకములలో దేనితోనూ పోల్చలేము. మనము ధన్యులము. ఎందుకనగా మూడులోకములను పావనము చేసే గంగను దర్శించినాము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

హర్షేణ మహతా యుక్తో దేవం స్థాప్య మహేశ్వరమ్ ।
తం షోడశభిరీశానముపచారైః ప్రయత్నతః ॥ 193 ॥

సంపూజ్యాఽఽవరణైర్యుక్తం షట్‌త్రింశత్కలమీశ్వరమ్ ।
కృతాంజలిపుటో భూత్వా రామస్తుష్టావ శంకరమ్ ॥ 194 ॥

మిక్కిలి సంతోషంతో దేవుడైన మహేశ్వరుని ప్రతిష్ఠించి ఆ తరువాత శ్రద్ధగా షోడశోపచారములతో ఆ శివుని, ముప్పై ఆరు కళలతో గూడినవానిని, ఆవరణములతో కూడిన ఈశ్వరుని పూజించి, రాముడు బద్ధాంజలియై, ఆ శంకరునిట్లు స్తుతించాడు.

రామ ఉవాచ:– రాముడు పలికాడు.

నమామి శమ్భుం పురుషం పురాణం నమామి సర్వజ్ఞమపారభావమ్ ।
నమామి రుద్రం ప్రభుమక్షయం తం నమామి శర్వం శిరసా నమామి ॥ 195 ॥

పురాణపురుషుడైన శంభునకు నమస్కరిస్తున్నాను. అపారభావములుగలిగిన సర్వజ్ఞునకు నమస్కరిస్తున్నాను. అక్షయుడు, ప్రభువు ఐన ఆ రుద్రునకు నమస్కరిస్తున్నాను. శర్వుడైన అతనికి శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.

నమామి దేవం పరమవ్యయం త ముమాపతిం లోకగురుం నమామి ।
నమామి దారిద్ర్య విదారణం తం నమామి రోగాపహరం నమామి ॥ 196 ॥

పరలోకమునందుండువాడు, అవ్యయుడునగు వానికి నమస్కరిస్తున్నాను. లోకగురువైన ఆ ఉమాపతికి నమస్కరిస్తున్నాను. దరిద్రమును తొలగించువానికి నమస్కరిస్తున్నాను. రోగములను నశింపజేసేవానికి నమస్కరిస్తున్నాను.

నమామి కల్యాణమచిన్త్యరూపం నమామి విశ్వోద్భవబీజరూపమ్ ।
నమామి విశ్వస్థితికారణం తం నమామి సంహారకరం నమామి ॥ 197 ॥

ఊహించుట కూడా వీలుకాని రూపంగలిగిన కల్యాణకారకునికి నమస్కరిస్తున్నాను. ఈ విశ్వమంతా పుట్టుటకు బీజరూపమైన వానికి నమస్కరిస్తున్నాను. ఈ ప్రపంచమంతా నిలుచుటకు కారణమైనవానికి నమస్కరిస్తున్నాను. లయంచేసేవానికి నమస్కరిస్తున్నాను.

నమామి గౌరీప్రియ మవ్యయం తం నమామి నిత్యం క్షరమక్షరం తమ్ ।
నమామి చిద్రూపమమేయభావం త్రిలోచనం తం శిరసా నమామి ॥ 198 ॥

గౌరీదేవికి ప్రియమైనవాడు, అవ్యయుడగువానికి నమస్కరిస్తున్నాను. క్షరం, అక్షరం, నిత్యం అగువానికి నమస్కరిస్తున్నాను. చిత్‌స్వరూపంగల అమేయునకు నమస్కరిస్తున్నాను. మూడు కన్నులు గలవానికి శిరసువంచి నమస్కరిస్తున్నాను.

నమామి కారుణ్యకరం భవస్య భయంకరం వాఽపి సదా నమామి ।
నమామి దాతార మభీప్సితానాం నమామి సోమేశముమేశమాదౌ ॥ 199 ॥

ఇహలోకంపై కరుణజూపేవానికి నమస్కరిస్తున్నాను. అతడు భయంకరుడైనా కూడా ఎల్లప్పుడు నమస్కరిస్తున్నాను. కోరికలు కోరేవారికందరికిచ్చేవానికి నమస్కరిస్తున్నాను. చంద్రశేఖరుడు పార్వతీశుడునైనవానికి మొదట నమస్కరిస్తున్నాను.

నమామి వేదత్రయలోచనం తం నమామి మూర్తిత్రయవర్జితం తమ్ ।
నమామి పుణ్యం సదసద్వ్యతీతం నమామి తం పాపహరం నమామి ॥ 200 ॥

మూడువేదములే మూడుకన్నులుగా గలవానికి నమస్కరిస్తున్నాను. మూడు బ్రహ్మవిష్ణుమహేశ్వరులనే మూర్తులను వదిలినవానికి నమస్కరిస్తున్నాను. సత్తు అసత్తులకంటే అతీతమైన పుణ్యమునకు నమస్కరిస్తున్నాను. పాపములను హరించే అతనికి నమస్కరిస్తున్నాను.

నమామి విశ్వస్య హితే రతం తం నమామి రూపాణి బహూని ధత్తే ।
యో విశ్వగోప్తా సదసత్ప్రణేతా నమామి తం విశ్వపతిం నమామి ॥ 201 ॥

ప్రపంచానికి హితం కలిగించుటకాసక్తిగలవానికి నమస్కరిస్తున్నాను. అనేక రూపములను ధరించేవానికి నమస్కరిస్తున్నాను. విశ్వాన్నంతటిని దాచిన సదసత్తులకు నేత అయిన ఆ విశ్వపతికి నమస్కరిస్తున్నాను.

యజ్ఞేశ్వరం సంప్రతి హవ్యకవ్యం తథా గతిం లోకసదాశివో యః ।
ఆరాధితో యశ్చ దదాతి సర్వం నమామి దానప్రియమిష్టదేవమ్ ॥ 202 ॥

హవ్యం కవ్యం రెంటికీకూడా ఇప్పుడు యజ్ఞేశ్వరునిగా నున్నవానికి, లోకమునంతటికి సర్వదా శుభమును కలుగచేసి అట్లు దిక్కు అయినవానికి, ఆరాధిస్తే చాలు అతనికి అన్నీ ఇచ్చే దానప్రియుడైన ఇష్టదైవానికి నమస్కరిస్తున్నాను.

నమామి సోమేశ్వరమస్వతంత్రముమాపతిం తం విజయం నమామి ।
నమామి విఘ్నేశ్వరనన్ది నాథం పుత్రప్రియం తం శిరసా నమామి ॥ 203 ॥

భక్తపరతంత్రుడైన సోమేశ్వరునికి నమస్కరిస్తున్నాను. విజయుడైన ఉమాపతికి నమస్కరిస్తున్నాను. విఘ్నేశ్వరునికి, నందికి ప్రభువైనవానికి నమస్కరిస్తున్నాను. పుత్రులకిష్టమైన వానికి తలవంచి నమస్కరిస్తున్నాను.

నమామి దేవం భవదుఃఖశోకవినాశనం చంద్రధరం నమామి ।
నమామి గంగాధరమీశమీడ్యముమాధవం దేవవరం నమామి ॥ 204 ॥

సంసారదుఃఖమును నశింపచేసే చంద్రధరుడగు దేవునకు నమస్కరిస్తున్నాను. గంగను ధరించిన, స్తుతించదగిన ఈశునికి, పార్వతిభర్తకు, దేవతలలో శ్రేష్ఠుడగువానికి నమస్కరిస్తున్నాను.

నమామ్యజాదీశపురందరాది సురాసురైరర్చితపాదయుగ్మమ్ ।
నమామి దేవీముఖవాదనానామీక్షార్థమక్షిత్రితయం య ఐచ్ఛత్ ॥ 205 ॥

బ్రహ్మవిష్ణుఇంద్రాది దేవతలందరర్చించే పాదయుగలం గలవాడూ, పార్వతి తననోటితో వాయించే తంత్రస్వరాది వాదనలు చూచుటకు మూడు కన్నులిష్టపడువానికి నమస్కరిస్తున్నాను.

పంచామృతైర్గంధసుధూపదీపైర్విచిత్రపుష్పైర్వివిధైశ్చ మంత్రైః ।
అన్నప్రకారైః సకలోపచారైః సంపూజితం సోమమహం నమామి ॥ 206 ॥

పంచామృతములతో, గంధముతో, చక్కని ధూపములతో, దీపములతో, విచిత్రములైన పుష్పములతో, వివిధ వేదమంత్రములతో, వివిధాన్నములతో, సకల ఉపచారములతో పూజలందుకొను సోమునకు నేను నమస్కరిస్తున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః స భగవానాహ రామం శంభుః సలక్ష్మణమ్ ।
వరాన్ వృణీష్వ భద్రం తే రామః ప్రాహ వృషధ్వజమ్ ॥ 207 ॥

అప్పుడు శివుడు లక్ష్మణునితో గూడిన రామునితో నిట్లన్నాడు. వరములను కోరుకొమ్ము, నీకు శుభం జరుగుతుంది. అనగానే రాముడా వృషధ్వజునితో నిట్లన్నాడు.

రామ ఉవాచ :– రాముడు పలికాడు.

స్తోత్రేణానేన యే భక్త్యా తోష్యన్తి త్వాం సురోత్తమ ।
తేషాం సర్వాణి కార్యాణి సంసిద్ధిం యాన్తు శంకర ॥ 208 ॥

ఓ శంకరా! ఈస్తోత్రమును భక్తితో చదివి, నిన్ను ఎవరు సంతోషపెడతారో ఓ సురోత్తమా! వారి సమస్త కార్యములు సిద్ధిని పొందవలెను.

యేషాం చ పితరః శంభో పతితా నరకార్ణవే ।
తేషాం పిండాదిదానేన పూతా యాన్తు త్రివిష్టపమ్ ॥ 209 ॥

శివా! ఎవరి పితరులైనా నరకసముద్రంలో పడినట్లైతే వారికిక్కడ పిండదానంచేసిన వారు పవిత్రులై స్వర్గలోకమునకు వెళ్ళవలెను.

జన్మప్రభృతి యత్ చీర్ణం మనోవాక్కాయికం త్వఘమ్ ।
అత్ర తు స్నానమాత్రేణ తత్సద్యో నాశమాప్నుయాత్ ॥ 210 ॥

పుట్టినప్పటినుండి మనోవాక్కాయకర్మలతో సంపాదించుకున్న పాపం ఇక్కడ స్నానంచేసినంతనే వెంటనే నాశమును పొందవలెను.

అత్ర యే భక్తితః శంభో దదత్యర్థిభ్య అణ్వపి ।
సర్వం తదక్షయం శంభో దాతౄణాం ఫలకృద్భవేత్ ॥ 211 ॥

శివా! ఇక్కడ ఎవరైనా యాచకులకు అణుమాత్రమైనా ఇస్తే అదంతా దాతలకు అక్షయమైన ఫలమునిచ్చేదిగా కావలెను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి తం రామం శంకరో హృషితోఽబ్రవీత్ ।
గతే తస్మిన్ సురశ్రేష్ఠే రామోఽప్యనుచరైః సహ ॥ 212 ॥

గౌతమీ యత్ర చోత్పన్నా శనైస్తందేశమభ్యగాత్ ।
తతః ప్రభృతి తత్తీర్థం రామతీర్థముదాహృతమ్ ॥ 213 ॥

అప్పుడు శంకరుడు సంతోషించి రామునితో అట్లే అగుగాక యని పలికాడు. శివుడు వెళ్ళగానే రాముడు కూడా తన అనుచరులతో, గౌతమీనది పుట్టినచోటునకు నెమ్మదిగా వెళ్ళాడు. అప్పటినుండి ఆ తీర్థమునకు రామతీర్థమని పేరు వచ్చింది.

దయాలోరపతద్యత్ర లక్ష్మణస్య కరాచ్ఛరః ।
తద్బాణతీర్థమభవత్సర్వాపద్వినివారణమ్ ॥ 214 ॥

దయాళువైన లక్ష్మణుని చేతినుండి బాణమెక్కడపడిందో అది సమస్త ఆపదలను నివారించే బాణతీర్థమైంది.

యత్ర సౌమిత్రిణా స్నానం శంకరస్యార్చనం కృతమ్ ।
తత్తీర్థం లక్ష్మణం జాతం తథా సీతాసముద్భవమ్ ॥ 215 ॥

ఎక్కడైతే లక్ష్మణుడు స్నానం చేసి, శివుని అర్చించినాడో అది లక్ష్మణతీర్థము. అట్లే సీత స్నానం చేసిన చోటు సీతాతీర్థమని అంటారు.

నానావిధాశేషపాపసంఘనిర్మూలనక్షమమ్ ।
యదంఘ్రిసంగాదభవద్గంగా త్రైలోక్యపావనీ ॥ 216 ॥

అది అనేక విధములగు పాపరాశులను నశింపజేయు సామర్థ్యం గలది. ఎవని పాదసంగమమువల్ల గంగగా మారినదో అది త్రిలోకపావని.

స యత్ర స్నానమకరోత్తద్వైశిష్ట్యం కిముచ్యతే ।
తద్రామతీర్థసదృశం తీర్థం క్వాపి న విద్యతే ॥ 217 ॥

అతడెక్క స్నానంచేసెనో దాని విశిష్టతనేమి చెప్పాలి? ఆ రామతీర్థంతో సమానమైన తీర్థము మరెక్కడను ఉండదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'రామతీర్థాది తీర్థవర్ణనం' నామ త్రిపంచాశోఽధ్యాయః. ॥ 53 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'రామతీర్థాది తీర్థవర్ణన'మనే పేరుగల యాభైమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుఃపంచాశోఽధ్యాయః - యాభై నాల్గవ అధ్యాయం

పుత్రతీర్థాది లక్షతీర్థవర్ణనమ్ - పుత్రతీర్థాది లక్షతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పుత్రతీర్థమితి ఖ్యాతం పుణ్యతీర్థం తదుచ్యతే ।
సర్వాన్కామానవాప్నోతి యన్మహిమ్నః శ్రుతేరపి ॥ 1 ॥

పుత్రతీర్థమనేది చాలా ప్రసిద్ధమైనది. దానినే పుణ్యతీర్థమని అంటారు. ఆ తీర్థమహిమను విన్నంతనే కోరికలన్నీ నెరవేరుతాయి.

తస్య స్వరూపం వక్ష్యామి శృణు యత్నేన నారద ।
దితేః పుత్రాశ్చ దనుజాః పరిక్షీణా యదాఽభవన్ ॥
అదితేస్తు సుతా జ్యేష్ఠాః సర్వభావేన నారద ॥ 2 ॥

నారదా! దానియొక్క స్వరూపమును చెబుతున్నాను. శ్రద్ధగా విను. దితి కుమారులైన దనుజులు ఎప్పుడైతే నశించి పోయారో, అప్పుడు అదితిపుత్రులు సుఖంగా ఉన్నారు.

తదా దితిః పుత్రవియోగదుఃఖాత్సంస్పర్ధమానా దనుమాససాద ॥ 3 ॥

అప్పుడు దితి తన పుత్రవియోగదుఃఖంతో పోటీపడి దనువు వద్దకు చేరింది. అతనితో ఇలా అన్నది.

దితిరువాచ:- దితి పలికింది.

క్షీణాః సుతా ఆవయోరేవ భద్రే కిం కుర్మహే కర్మ లోకే గరీయః ।
పశ్యాదితేర్వంశమభిన్నముత్తమం సౌరాజ్యయుక్తం యశసా జయశ్రియా ॥ 4 ॥

మన పుత్రులే నశించిపోయారు. శుభకరమగు లోకంలో కర్మ చాలా బలీయమైనది. ఏమి చేస్తాము. చూడు, ఆ దితియొక్క వంశం ఉత్తమమైనది. నశించలేదు, చక్కని రాజ్యంతో, కీర్తితో, జయలక్ష్మితో వున్నది.

జితారిమభ్యున్నతకీర్తిధర్మం మచ్చిత్తసంహర్షవినాశదక్షమ్ ।
సమానభర్తృత్వసమానధర్మే సమానగోత్రేఽపి సమానరూపే ॥ 5 ॥

నాతో సమానమైన భర్తృత్వము, సమాన ధర్మము, సమానగోత్రము, సమాన రూపమున్నా కూడా, శత్రువులను జయించి అభివృద్ధిని, కీర్తిని, ధర్మాన్ని నా ఆనందాన్ని నశింపజేసే సామర్థ్యం గలదిగా వున్నది.

న జీవయేయం శ్రియమున్నతిం చ జీర్ణాఽస్మి దృష్ట్వా త్వదితిప్రసూతాన్ ।
కామప్యవస్థామనుయామి దుఃస్థాఽదితేర్విలోక్యాథ పరాం సమృద్ధిమ్ ॥
దావప్రవేశోఽపి సుఖాయ నూనం స్వప్నేఽప్యవేక్ష్యా న సపత్నలక్ష్మీః ॥ 6 ॥

అదితి కుమారుల సంపదను, అభివృద్ధిని చూచి ఉండలేక పోతున్నాను. వారి సమృద్ధిని చూచి ఓర్వలేక పోతున్నాను. నేనేదో ఒక దురవస్థను పొందుతున్నాను. జీవించలేను. దీనికంటె అగ్నిలో దూకి చావడం మేలు. నా సవతిసంపదను స్వప్నంలో కూడా చూడలేను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం బ్రువాణమతిదీనవక్త్రాం వినిశ్వసన్తీం పరమేష్ఠిపుత్రః ।
కృతాభిపూజో విగతశ్రమస్తాం స సాన్త్వయన్నాహ మనోభిరామామ్ ॥ 7 ॥

ఇలా నిట్టూర్పులు విడిస్తూ మిక్కిలి దీనవదనంతో పలికిన ఆమె మాటలను విని, పూజలందుకొని, అలసటను పోగొట్టుకొని ఆ పరమేష్ఠిపుత్రుడు తన మనస్సునకు ఆనందమును కలిగించే ఆమెతో అనునయపూర్వకంగా ఇలా అన్నాడు.

పరమేష్ఠిపుత్ర ఉవాచ :-పరమేష్ఠిపుత్రుడు కశ్యపుడు పలికాడు.

ఖేదో న కార్యః సమభీప్సితం యత్తత్ప్రాప్యతే పుణ్యత ఏవ భద్రే ।
తత్సాధనం వేత్తి మహానుభావః ప్రజాపతిస్తే స తు వక్ష్యతీతి ॥ 8 ॥

ఓ భద్రురాలా! దుఃఖపడకూడదు. మన మంచి పుణ్యము వలననే కోరికలు దీరుతాయి. దానిని పొందుటకు సాధన మేదో తెలిసినవాడు మహానుభావుడైన బ్రహ్మ. అతడు నీకు చెప్పగలడు.

సాధ్వ్యేతత్సర్వభావేన ప్రశ్రయావనతా సతీ ॥ 9 ॥

ఆ సాధ్వి అలాగేనని వినయంగా తలవంచి అంగీకరించింది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం బ్రువాణం చ దితిం దనుః ప్రోవాచ నారద ॥ 10 ॥

ఓ నారదా! ఇట్లు పలికిన దితిమాటలు విని దనువు ఇలా అన్నాడు.

దనురువాచ :- దనువు పలికాడు.

భర్తారం కశ్యపం భద్రే తోషయస్వ నిజైర్గుణైః ।
తుష్టో యది భవేద్భర్తా తతః కామానవాప్స్యసి ॥ 11 ॥

ఓ శుభకరురాలా! నీ భర్తయగు కశ్యపుని నీ మంచి గుణములతో సంతోషపెట్టు. నీ భర్త సంతుష్టుడైతే అప్పుడు నీ కోరికలు నెరవేరుతాయి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా సర్వభావైస్తోషయామాస కశ్యపమ్ ।
దితిం ప్రోవాచ భగవాన్ కశ్యపోఽథ ప్రజాపతిః ॥ 12 ॥

ఆమె అలాగేనని అన్నివిధాలుగా కశ్యపుని సంతోషపెట్టింది. అప్పుడు పూజ్యుడు ప్రజాపతియైన కశ్యపుడు దితితో ఇలా అన్నాడు.

కశ్యప ఉవాచ :– కశ్యపుడు పలికాడు.

కిం దదామి తవాభీష్టం దితే వరయ సువ్రతే ॥ 13 ॥

సద్వ్రతంకల ఓ దితీ! నీకేమికావలెనో కోరుకో ఇస్తా.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

దితిరప్యాహ భర్తారం పుత్రం బహుగుణాన్వితమ్ ।
జేతారం సర్వలోకానాం సర్వలోకనమస్కృతమ్ ॥ 14 ॥

అప్పుడు దితి భర్తతో అనేక గుణములు గల వానిని, సర్వలోకములను జయించువానిని, లోకులందరు నమస్కరించువానిని పుత్రునిగా నిమ్మన్నది.

యేన జాతేన లోకేఽస్మిన్ భవేయం వీరపుత్రిణీ ।
తం వరేయం సురపితరిత్యాహ వినయాన్వితా ॥ 15 ॥

ఓ సురపితా! ఏ కుమారుడు పుట్టుటచే నేను వీరమాతనవుతానో అట్టి కుమారుని ప్రసాదించమని వినయంగా యడిగింది.

కశ్యప ఉవాచ:– కశ్యపుడు పలికాడు.

ఉపదేక్ష్యతే వ్రతం శ్రేష్ఠం ద్వాదశాబ్దఫలప్రదమ్ ।
తత్ర ఆగత్య తే గర్భమాధాస్యే యన్మనోరథమ్ ॥
నిష్పాపతాయాం జాతాయాం సిద్ధ్యన్తి హి మనోరథాః ॥ 16 ॥

నీకొక శ్రేష్ఠమైన వ్రతమునుపదేశిస్తాను. అది పన్నెండు సంత్సరములకు ఫలమునిస్తుంది. అప్పుడు నీ కోరిక ప్రకారంగా వచ్చి గర్భమును ధరించగలవు. పాపమంతా పోతే మనోరథాలు సిద్ధిస్తాయి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భర్తృవాక్యాద్దితిః ప్రీతా తం నమస్యాఽఽయతేక్షణా ।
ఉపదిష్టం వ్రతం చక్రే భర్త్రాఽఽదిష్టం యథావిధి ॥ 17 ॥

భర్త చెప్పిన మాటకు ఆ విశాలమైన కన్నులుగల దితి సంతోషించింది. తన భర్త ఉపదేశించిన వ్రతమును అతని ఆజ్ఞ ప్రకారంగా యథావిధిగా చేసింది.

తీర్థసేవా పాత్రదానవ్రతచర్యాదివర్జితాః ।
కథమాసాదయిష్యన్తి ప్రాణినోఽత్ర మనోరథాన్ ॥ 18 ॥

తీర్థాలలో స్నానం చేయడం, యోగ్యులైనవారికి దానాలివ్వడం, వ్రతాదులనాచరించడం మున్నగునవి చేయనివారు ఇక్కడ తమకోరికలనెలా సఫలం చేసుకొంటారు?

తతశ్చీర్ణే వ్రతే తస్యాం దిత్యాం గర్భమధారయత్ ।
పునః కాన్తామథోవాచ కశ్యపస్తాం దితిం రహః ॥ 19 ॥

వ్రతసమాప్తి ఐన తరువాత దితి గర్భం ధరించింది. అప్పుడు తిరిగి కశ్యపుడు ప్రియురాలైన దితితో రహస్యంగా ఇలా అన్నాడు.

కశ్యప ఉవాచ:- కశ్యపుడు పలికాడు.

న ప్రాప్నువన్తి యత్కామాన్మునయోఽపి తపః స్థితాః ।
యథావిహితకర్మాంగావజ్ఞయా తచ్ఛుచిస్మితే ॥ 20 ॥

పవిత్రమైన చిరునవ్వుగలదానా! తమకు విహితములైన కర్మాంగములను తెలియకుండా తపోనిష్ఠులైన మునులు గూడా తమ కోరికలను పొందలేరు.

నిన్దితం చ న కర్తవ్యం సంధ్యయోరుభోరపి ।
న స్వప్తవ్యం న గన్తవ్యం ముక్తకేశీ చ నో భవ ॥ 21 ॥

సూర్యోదయ, సూర్యాస్తమయసమయాలలో గర్హితమైన పనేమీ చేయకూడదు. ఆ ఉభయ సంధ్యలలో నిద్రించరాదు, ప్రయాణించరాదు, వెంట్రుకలు విరబోసుకొని వుండరాదు.

భోక్తవ్యం సుభగే నైవ క్షుతం వా జృంభణం తథా ।
సంధ్యాకాలే న కర్తవ్యం భూతసంఘసమాకులే ॥ 22 ॥

భూతసంఘములచేత ఆకులమైన సంధ్యాసమయంలో ఓ సుందరీ! భోజనం చేయరాదు, తుమ్మకూడదు, ఆవలించరాదు.

సాంతర్ధానం సదా కార్యం హసితం తు విశేషతః ।
గృహాన్తదేశే సంధ్యాసు న స్థాతవ్యం కదాచన ॥ 23 ॥

పైకేవీ కనిపించకుండా లోలోపలే వుండవలెను. ముఖ్యంగా గట్టిగా నవ్వకూడదు. సంధ్యాసమయాలలో ఇంటి చివరలలో నిల్చి వుండకూడదు.

ముశలోలూఖలాదీని శూర్పపీఠపిధానకమ్ ।
నైవాతిక్రమణీయాని దివారాత్రౌ సదా ప్రియే ॥ 24 ॥

ఓ ప్రియురాలా! రాత్రింబవళ్ళు ఎప్పుడూ కూడా రోలు, రోకలి, చేట, పీట మున్నగు వానిని దాటరాదు.

ఉదక్శీర్షం తు శయనం న సంధ్యాసు విశేషతః ।
వక్తవ్యం నానృతం కించిన్నాన్యగేహాటనం తథా ॥ 25 ॥

సంధ్యాసమయంలో ముఖ్యంగా ఉత్తరం తలపెట్టి పడుకోకూడదు. అబద్ధమాడకూడదు. ఇతరుల ఇండ్లకు వెళ్ళకూడదు.

కాన్తాదన్యో న వీక్షస్తు ప్రయత్నేన నరః క్వచిత్ ।
ఇత్యాది నియమైర్యుక్తా యది త్వమనువర్తసే ॥
తతస్తే భవితా పుత్రస్త్రైలోక్యైశ్వర్యభాజనమ్ ॥ 26 ॥

ప్రయత్నపూర్వకంగా తన భర్తకంటే పరాయివానిని చూడకూడదు. ఇటువంటి నియమాలతో కూడిన వ్రతమును నీవు చేసినట్లయితే ముల్లోకాలలో వుండే ఐశ్వర్యాలను అనుభవించే కుమారుడు నీకు జన్మించగలడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేతి ప్రతిజజ్ఞే సా భర్తారం లోకపూజితమ్ ।
గతశ్చ కశ్యపో బ్రహ్మన్నితశ్చేతః సురాన్ ప్రతి ॥ 27 ॥

ఆమె లోకపూజితుడైన భర్తతో అట్లే అని సమాధానమిచ్చింది. బ్రహ్మన్! కశ్యపుడు ఇటునటు తిరుగుతూ, దేవతల వద్దకు వెళ్ళాడు.

దితేర్గర్భో౽పి వవృధే బలవాన్ పుణ్యసంభవః ।
ఏతత్సర్వం మయో దైత్యో మాయయా వేత్తి తత్త్వతః ॥ 28 ॥

దితియొక్క గర్భం వృద్ధిపొందుతుండెను. మాయచేత బలవంతుడు, పుణ్యవంతుడగు దితి కుమారుడు ఇదంతా తత్త్వతః తెలుసుకొనుచుండెను.

ఇన్ద్రస్య సఖ్యమభవన్మయేన ప్రీతిపూర్వకమ్ ।
మయో గత్వా రహః ప్రాహ ఇన్ద్రం స వినయాన్వితః ॥ 29 ॥

మయునకు ఇంద్రునితో ప్రీతిపూర్వకమైన స్నేహమేర్పడింది. మయుడు ఇంద్రునివద్దకు వెళ్ళి వినయంతో రహస్యంగా నిట్లన్నాడు.

దితేర్దనోరభిప్రాయం వ్రతం గర్భస్య వర్ధనమ్ ।
తస్య వీర్యం చ వివిధం ప్రీత్యేంద్రాయ న్యవేదయత్ ॥ 30 ॥

దితిమనువులయొక్క అభిప్రాయము, దితివ్రతము, ఆమెగర్భము అభివృద్ధిచెందుట, పుట్టబోయే శిశువుయొక్క వివిధ పరాక్రమపటిమ ఇవన్నీ ప్రీతితో ఇంద్రునకు నివేదించాడు.

విశ్వాసైకగృహం మిత్రమపాయత్రాసవర్జితమ్ ।
అర్జితం సుకృతం నానావిధం చేత్తదవాప్యతే ॥ 31 ॥

మిత్రుడు విశ్వాసమునకు స్థానము. అపాయమునుండి, భయమునుండి, రక్షించేవాడు మిత్రుడే. మనమెంతో పుణ్యం చేసుకుంటే తప్ప అటువంటి మిత్రుడు లభించదు.

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

నముచేశ్చ ప్రియో భ్రాతా మయో దైత్యో మహాబలః ।
భ్రాతృహన్త్రా కథం మైత్ర్యం మయస్యాఽఽఽసీత్సురేశ్వర! ॥ 32 ॥

సురేశ్వరా! నముచికి ప్రియమైన సోదరుడు మయుడు. అతడు దైత్యుడు, మహాబలుడు, సోదరుని చంపినవానితో మయునికి మైత్రి ఎట్లు పొసగింది?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దైత్యానామధిపశ్చాఽఽఽసీద్బలవాన్నముచిః పురా ।
ఇన్ద్రేణ వైరమభవద్భీషణం లోమహర్షణమ్ ॥ 33 ॥

పూర్వం బలవంతుడైన నముచి అనేవాడు దైత్యులకు రాజుగా వుండేవాడు. అతనికి ఇంద్రునితో భయంకరము, రోమములు నిక్కబొడుచుకునే విధంగా వైరముండినది.

యుద్ధం హిత్వా కదాచిద్భో గచ్ఛన్తం తు శతక్రతుమ్ ।
దృష్ట్వా దైత్యపతిః శూరో నముచిః పృష్ఠతోఽన్వగాత్ ॥ 34 ॥

ఒకప్పుడు యుద్ధమునందోడిపోయి తిరిగి భూలోకమునకు వెళుతున్న ఇంద్రుని చూచి శూరుడు, దైత్యపతియగు నముచి అతనివెంట అనుసరించాడు.

తమాయాన్తమభిప్రేక్ష్య శచీభర్తా భయాతురః ।
ఐరావతం గజం త్యక్త్వా ఇన్ద్రః ఫేనమథాఽఽఽవిశత్ ॥ 35 ॥

తన వెంట వస్తున్న నముచిని చూచి ఇంద్రుడు భయాతురుడై భద్రగజమగు ఐరావతమును వదిలిపెట్టి నురుగులోకి ప్రవేశించాడు.

స వజ్రపాణిస్తరసా ఫేనేనైవాహనద్రిపుమ్ ।
నముచిర్నాశమగమత్తస్య భ్రాతా మయోఽనుజః ॥ 36 ॥

ఆ వజ్రపాణియైన ఇంద్రుడు ఆ నురుగుతోనే శత్రువును సంహరించాడు. నముచి నశించి పోయాడు. అతని తమ్ముడే మయుడు.

భ్రాతృహన్తృవినాశాయ తపస్తేపే మయో మహత్ ।
మాయాం చ వివిధామాప దేవానామతిభీషణామ్ ॥ 37 ॥

తన సోదరుని చంపినవాని వినాశనమునకై మయుడు గొప్పతపస్సు చేశాడు. దేవతలకు మిక్కిలి భయకారణమైన మాయను కూడా పొందాడు.

వరాంశ్చావాప్య తపసా విష్ణోర్లోకపరాయణాత్ ।
దానశౌణ్డః ప్రియాలాపీ తదాఽభవదసౌ మయః ॥ 38 ॥

అప్పుడీ మయుడు తపస్సుచేసి లోకపరాయణుడైన విష్ణువు నుండి వరములను కూడా పొంది దానశీలునిగా, చక్కగా మాట్లాడువానిగా అయ్యాడు.

అగ్నీంశ్చ బ్రాహ్మణాన్ పూజ్య జేతుమిన్ద్రం కృతక్షణః ।
దాతారం చ తదర్థిభ్యః స్తూయమానం చ వన్దిభిః ॥ 39 ॥

విదిత్వా మఘవా వాయోర్మయం మాయావినం రిపుమ్ ।
ఉపక్రాన్తం సుయుద్ధాయ విప్రో భూత్వా తమభ్యగాత్ ॥
శచీభర్తా మయం దైత్యం ప్రోవాచేదం పునః పునః ॥ 40 ॥

యాచకులకు దానం చేయువానిని, స్తోత్రపాఠకులచే స్తుతులు పొందువానిని, ఇంద్రుని జయించుటకు అగ్నులను వ్రేల్చి, బ్రాహ్మణులను పూజించి శక్తిపొందినవానినిగా వాయువు ద్వారా తెలుసుకొని మాయావి అయిన శత్రువును ఆక్రమించుటకు, యుద్ధముచేయుటకై బ్రాహ్మణ వేషమును ధరించి ఇంద్రుడు అతని వద్దకు వెళ్ళాడు. శచీదేవిభర్త అయిన ఇంద్రుడు మయునితో మాటిమాటికి ఇట్లన్నాడు.

ఇంద్ర ఉవాచ:– ఇంద్రుడు పలికాడు.

దేహి దైత్యపతే మహ్యమర్థినేఽపేక్షితం వరమ్ ।
త్వాం శ్రుత్వా దాతృతిలకమాగతోఽహం ద్విజోత్తమః ॥ 41 ॥

ఓ దైత్యపతీ! నీ గూర్చి శ్రేష్ఠమైన దాతవని విని బ్రాహ్మణుడను వచ్చాను. అర్థినైన నాకు కోరిన వరమునివ్వు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

మయోఽపి బ్రాహ్మణం మత్వాఽవదద్దత్తం మయా తవ ।
విచారయన్తి కృతినో బహ్వల్పం వా పురోఽర్థిని ॥ 42 ॥

మయుడు కూడా అతనిని బ్రాహ్మణునిగా తలచి నీవడిగిన దానినిచ్చానన్నాడు. సత్పురుషులు అడిగినవానికి అతితక్కువగా నున్నవారిమని తలుస్తారా? అలా తలంచరు కదా!

ఇత్యుక్తే తు హరిః ప్రాహ సఖ్యమిచ్ఛే హ్యహం త్వయా ।
ఇంద్రం మయః పునః ప్రాహ కిమనేన ద్విజోత్తమ ॥ 43 ॥

అట్లనగానే ఇంద్రుడు నేను నీతో స్నేహం కోరుతున్నానన్నాడు. అప్పుడు మయుడు ఇంద్రునితో ఓ ద్విజోత్తమా! దీనివలన ప్రయోజనమేమని అడిగాడు.

న త్వయా మమ వైరం భోః స్వస్తీత్యాహ హరిర్మయమ్ ।
తత్త్వం వదేతి స హరిర్దైత్యేనోక్తః స్వకం వపుః ॥ 44 ॥

దర్శయామాస దైత్యాయ సహస్రాక్షం యదుచ్యతే ।
తతః సవిస్మయో దైత్యో మయో హరిమువాచ హ ॥ 45 ॥

నీతో నాకేమీ వైరములేదనగానే, ఇంద్రుడు స్వస్తియని మయునితో పలికాడు. నిజం చెప్పమని దైత్యుడు అనగానే ఇంద్రుడు సహస్రాక్షములు గల తనరూపాన్ని దైత్యునకు చూపెట్టాడు. అప్పుడు దైత్యుడైన మయుడు ఆశ్చర్యంగా నింద్రునితో ఇలా అన్నాడు.

మయ ఉవాచ:- మయుడు పలికాడు.

కిమిదం వజ్రపాణిస్త్వం తవాయోగ్యాకృతిః సఖే ॥ 46 ॥

మిత్రమా! వజ్రపాణివైన నీవు ఇలా ఉన్నా వేమి? ఈ రూపం నీకు తగినదిగాదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విహస్యాథ పరిష్వజ్య కృతమిత్యబ్రవీద్ధరిః ।
కేనాపి సాధయన్త్యత్ర పణ్డితాశ్చ సమీహితమ్ ॥ 47 ॥

ఇంద్రుడు నవ్వి అతనిని కౌగలించుకొని, పండితులైనవారు ఏదో ఒక దానితో వారి కోరికను సాధించుకొంటారు.

తతః ప్రభృతి శక్రస్య మయేన మహతీ హ్యభూత్ ।
సుప్రీతిర్మునిశార్దూల మయో హరిహితః సదా ॥ 48 ॥

ఓ మునిశ్రేష్ఠా! అప్పటినుండి ఇంద్రునికి మయునితో మిక్కిలి ప్రీతి ఏర్పడింది. మయుడు సదా ఇంద్రుని హితం కోరువాడు.

ఇన్ద్రస్య భవనం గత్వా తస్మై సర్వం న్యవేదయత్ ।
కిం మే కృత్యమితి ప్రాహ మయం మాయావినం హరిః ॥ 49 ॥

మయుడు ఇంద్రుని భవనమునకు వెళ్ళి అంతా నివేదించాడు. ఇంద్రుడు మాయావియైన మయునితో నేనిప్పుడేమి చేయవలెనని యడిగాడు.

హరయే చ మయో మాయాం ప్రాదాత్ ప్రీత్యా తథా హరిః ।
ప్రాప్తః సంప్రీతిమానాహ కిం కృత్యం మయ తద్వద ॥ 50 ॥

మయుడు ఇంద్రునకు ప్రేమతో మాయనిచ్చాడు. అప్పుడు ఇంద్రుడు దానిని తీసుకొని సంతోషించి మయా! నేనిప్పుడేమి చేయవలెనో చెప్పమన్నాడు.

మయ ఉవాచ :-మయుడు పలికాడు.

అగస్త్యస్యాఽఽశ్రమం గచ్ఛ తత్రాఽఽస్తే గర్భిణీ దితిః ।
తస్యాః శుశ్రూషణం కుర్వన్నాస్స్వ తత్ర కియన్తి చ ॥ 51 ॥

అహాని మఘవంస్తస్యా గర్భమావిశ్య వజ్రధృక్ ।
వర్ధమానం చ తం ఛింధి యావద్వశ్యోఽథవా మృతిమ్ ॥
ప్రాప్నోతి తావద్వజ్రేణ తతో న భవితా రిపుః ॥ 52 ॥

అగస్త్యునియొక్క ఆశ్రమమునకు వెళ్ళు. అక్కడ గర్భవతియైన దితి యున్నది. ఆమెకు సేవచేస్తూ కొన్ని దినాలు అక్కడ ఉండు. ఇంద్రా! నీవు వజ్రాయుధమును ధరించి ఆమె గర్భమునందు ప్రవేశించి పెరుగుతున్న శిశువును నీకు వశమయ్యే వరకు లేదా మరణించేవరకు ఛేదించు. ఆ తరువాత నీకు శత్రువు వుండడు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు

తథేత్యుక్త్వా మయం పూజ్య మఘవానేక ఏవ హి ।
వినీతవత్తదా ప్రాయాద్దితిం మాతరమంజసా ॥ 53 ॥

అలాగేనని మయుని పూజించి, ఇంద్రుడొంటరిగానే వినయం గలవానివలె వేగంగా తల్లి దితివద్దకు వెళ్ళాడు.

శుశ్రూషమాణస్తాం దేవీం శక్రో దైతేయమాతరమ్ ।
సా న జానతి తచ్చిత్తం శక్రస్య ద్విషతో దితిః ॥ 54 ॥

ఇంద్రుడు దైతేయుని తల్లియగు దితిదేవికి శుశ్రూష చేస్తుండెను. ద్వేషిస్తున్న ఇంద్రునియొక్క చిత్తమును ఆ దితి ఎరుగదు.

గర్భే స్థితం తు యద్భూతం దేవేన్ద్రస్య విచేష్టితమ్ ।
అమోఘం తన్మునేస్తేజః కశ్యపస్య దురాసదమ్ ॥ 55 ॥

ఆ మునియైన కశ్యపునియొక్క దురాసదము, అమోఘము అయిన తేజస్సు(ను), గర్భంలోనున్న భూతము(ను)గాని, దేవేంద్రుని యొక్క కుత్సిత చేష్ట(నామె) నెరుగదు.

తతః ప్రగృహ్య కులిశం సహస్రాక్షః పురందరః ।
అంతః ప్రవేశకామోఽసౌ బహుకాలం సమావసన్ ॥ 56 ॥

సంధ్యోదక్శీర్షనిద్రాం తామవేక్ష్య కులిశాయుధః ।
ఇదమన్తరమిత్యుక్త్వా దిత్యాః కుక్షిం సమావిశత్ ॥ 57 ॥

తరువాత సహస్రాక్షుడైన ఇంద్రుడు చేతిలో వజ్రాయుధమును ధరించి లోపలికి ప్రవేశించగోరినవాడై చాలాకాలంవరకు వేచియుండి, ఒకనాడు సంధ్యాసమయంలో ఉత్తరదిక్కుకు తలయుంచి నిద్రిస్తున్న దితిని చూచి, వజ్రాయుధుడైన ఇంద్రుడు ఇది ప్రవేశించుట కుచితసమయమని దితియొక్క గర్భమునందు ప్రవేశించాడు.

అన్తర్వర్తి చ యద్భూతమిన్ద్రం దృష్ట్వా ధృతాయుధమ్ ।
హన్తుకామం తదోవాచ పునః పునరభీతవత్ ॥ 58 ॥

లోపలనున్న ఆ జీవి ఆయుధమును బట్టుకొని చంపుటకు సిద్ధంగానున్న ఇంద్రుని చూచి అప్పుడు భయపడనివానివలె మాటిమాటి కిట్లన్నది.

గర్భస్థ ఉవాచ:- గర్భంలో నున్నవాడు పలికాడు.

కిం మాం న రక్షసే వజ్రిన్ భ్రాతరం త్వం జిఘాంససి ।
నారణే మారణాదన్యత్పాతకం విద్యతే మహత్ ॥ 59 ॥

వజ్రాయుధధారీ! నన్ను రక్షించవా? సోదరుని చంపుతున్నావు. యుద్ధంలో లేనివానిని చంపుటకంటే గొప్పపాపం మరొకటుందా?

ఋతే యుద్ధాన్మహాబాహో శక్ర యుధ్యస్వ నిర్గతే ।
మయి తస్మాన్నైతదేవం తవ యుక్తం భవిష్యతి ॥ 60 ॥

ఓ మహాబాహూ! ఇంద్రా! నాతో ధర్మంగా యుద్ధం చేయాలనియుంటే నేను బయటకు వచ్చిన తరువాత యుద్ధం చేయి; అందువలన ఇట్లు చేయుట నీకు తగినది కాదు.

శతక్రతుః సహస్రాక్షః శచీభర్తా పురందరః ।
వజ్రపాణిః సురేన్ద్రస్త్వం తే న యుక్తం భవేత్ప్రభో! ॥ 61 ॥

ప్రభూ! నీవు నూరు యజ్ఞములు చేసినవానివి, వేయికన్నులు గలవాడవు, శచీదేవికి భర్తవు, పురందరుడవు, వజ్రాయుధమును ధరించిన వానివి, దేవతాశ్రేష్ఠుడవు, ఇది నీకు యుక్తం గాదు.

అథవా యుద్ధకామస్త్వం మమ నిష్క్రమణం యథా ।
తథా కురు మహాబాహో! మార్గాదస్మాదపాసర ॥ 62 ॥

ఒకవేళ నీకు యుద్ధం చేయాలని ఉంటే నేను ఎలా బయటకు వచ్చెదనో అట్లు చేయి. ఓ మహాబాహూ! ఈమార్గమునుండి నన్ను తొలగించు.

కుమార్గే న ప్రవర్తన్తే మహాన్తోఽపి విపద్గతాః ।
అవిద్యశ్చాప్యశస్త్రశ్చ నైవ చాఽఽయుధసంగ్రహః ॥ 63 ॥

గొప్పవారు ఆపదల్లోపడిపోయినా చెడ్డమార్గంలో ప్రవర్తించరు. నేను విద్యలేనివాడనూ, శాస్త్రధారినికాను, ఆయుధ సంగ్రహం లేదు.

త్వం విద్యావాన్ వజ్రపాణే! మాం నిఘ్నన్ కిం న లజ్జసే ।
కుర్వన్తి గర్హితం కర్మ న కులీనాః కదాచన ॥ 64 ॥

ఓ వజ్రపాణీ! నీవు విద్యావంతుడవు. నన్ను చంపుటకు సిగ్గుపడుటలేదా? కులీనులైనవారు ఎప్పుడూ గర్హితమైన పనిని చేయరు.

హత్వా వా కిం తు జాయేత యశో వా పుణ్యమేవ వా ।
వధ్యన్తే భ్రాతరః కామాద్గర్భస్థాః కిం ను పౌరుషమ్ ॥ 65 ॥

చంపినందువలన ఏమవుతుంది? కీర్తియా? పుణ్యమా? కామంతో గర్భంలో ఉండే సోదరులను చంపుతారా? అది పౌరుషమా?

యది వా యుద్ధభక్తిస్తే మయి భ్రాతరసంశయమ్ ।
తతో ముష్టిం పురస్కృత్య వజ్రిణేఽసౌ వ్యవస్థితః ॥ 66 ॥

సోదరా! ఒకవేళ నీకు నాయందు యుద్ధంచేయాలనే సంకల్పముంటేనే ముష్టిని పురస్కరించుకొని నేను నీతో కలహానికి సిద్ధంగా ఉన్నాను.

బాలఘాతీ భ్రాతృఘాతీ తథా విశ్వాసఘాతకః ।
ఏవం భృతం ఫలం శక్ర కస్మాన్మాం హన్తుముద్యతః ॥ 67 ॥

ఓ ఇంద్రా! బాలహంతకునిగా, భ్రాతృహంతకునిగా, విశ్వాసఘాతకునిగా ఇటువంటి ఫలముల నొందుటకేనా? ఎందుకు నీవు నన్ను చంపుటకు ప్రయత్నిస్తున్నావు?

యస్యాఽఽజ్ఞయా సర్వమిదం వర్తతే సచరాచరమ్ ।
స హన్తా బాలకం మాం వై కిం యశః కింతు పౌరుషమ్ ॥ 68 ॥

ఎవని యాజ్ఞతో ఈచరాచరజగత్తంతా నడుస్తున్నదో అటువంటినీవు బాలకుడనైన నన్ను చంపేవాడివా? ఆహా! ఏమి కీర్తి? ఏమి పౌరుషము?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం బ్రువన్తం తం గర్భం చిచ్ఛేద కులిశేన సః ।
క్రోధాంధానాం లోభినాం చ న ఘృణా క్వాపి విద్యతే ॥ 69 ॥

ఇట్లు పలుకుతున్న ఆ గర్భమును ఇంద్రుడు వజ్రాయుధంతో ఛేదించాడు. కోపంతో గ్రుడ్డివాడైనవానికి, లోభికి దయ అనునది యుండదు.

న మమార తతో దుఃఖాదాహుస్తే భ్రాతరో వయమ్ ।
పునశ్చిచ్ఛేద తాన్ ఖండాన్ మా వధీరితి చాబ్రువన్ ॥ 70 ॥

విశ్వస్తాన్ మాతృగర్భస్థాన్ నిజభ్రాతృాన్ శతక్రతో ।
ద్వేషవిధ్వస్తబుద్ధీనాం న చిత్తే కరుణాకణః ॥ 71 ॥

కానీ ఆ శిశువులు చనిపోలేదు. వారు, మేము నీ సోదరులం మమ్మల్ని చంపకు అని దుఃఖంతో అన్నారు. ఇంద్రా! చంపకు అని అంటున్నా వారిని ఖండ ఖండాలుగా తిరిగి ఛేదించాడు. నమ్మినవారిని, తల్లిగర్భంలో

నున్నవారిని తన సోదరులనట్లు ముక్కలు ముక్కలు చేశాడు. ద్వేషంతో విధ్వంసం చేయాలనే బుద్ధిగలవారి చిత్తంలో లేశం కూడ కరుణ ఉండదు.

ఏవం తు ఖండితం ఖండం హస్తపాదాది జీవవత్ ।
నిర్వికారం తతో దృష్ట్వా సప్త సప్త సువిస్మితః ॥ 72 ॥

ఇలా ఖండించిన ముక్క, చేతులు, కాళ్ళున్న జీవునివలె నిర్వికారంగా నలభై తొమ్మిది భాగాలుగా ఇంద్రుడు నుండటంచూచి ఇంద్రుడు ఆశ్చర్యపడ్డాడు.

ఏకవద్బహు రూపాణి గర్భస్థాని శుభాని చ ।
రుదన్తి బహురూపాణి మా రుతేత్యబ్రవీద్ధరిః ॥ 73 ॥

గర్భంలో నున్న శుభములుగల అవి ఒకదానివలె అనేక రూపాలుగా ఉన్నాయి. ఆ బహురూపాలు ఏడుస్తున్నాయి. ఇంద్రుడు 'మా రుత' ఏడవకుమన్నాడు.

తతస్తే మరుతో జాతా బలవన్తో మహౌజసః ।
గర్భస్థా ఏవ తేఽన్యోన్యమూచుః శక్రం గతభ్రమాః ॥ 74 ॥

అగస్త్యం మునిశార్దూలం మాతా యస్యాఽఽశ్రమే స్థితా ।
అస్మత్పితా తవ భ్రాతా సఖ్యం తే బహు మన్యతే ॥ 75 ॥

అందువలననే వారు సప్తమరుత్తులుగా అయినారు. వారు బలవంతులు, గొప్పతేజోవంతులు. గర్భంలో నుండియే ఇంద్రుని విషయంలో భ్రమతొలగినవారై ఒకరితో నొకరు పలికారు. తమ తల్లి ఎవరి ఆశ్రమంలో నున్నదో ఆ మునిశ్రేష్ఠుడగు అగస్త్యునితో-మా తండ్రి, నీ సోదరుడు నీ స్నేహాన్ని చాలా నమ్ముతాడు.

అస్మానుపరి సస్నేహం మనస్తే విద్మహే మునే ।
న యత్కరోతి శ్వపచః ప్రవృత్తస్తత్ర వజ్రధృక్ ॥ 76 ॥

ఇత్యేతద్వచనం శ్రుత్వా అగస్త్యోఽగాత్ససంభ్రమః ।
దితిం సంబోధయామాస వ్యథితాం గర్భవేదనాత్ ॥ 77 ॥

ఓ మునీ! మా మీద నీ మనస్సు స్నేహపూర్వకంగా నున్నదని నమ్ముతున్నాము. ఆ వజ్రాయుధమును ధరించిన ఇంద్రుడు చండాలుడు కూడ చేయని పనిని చేశాడు. ఈ మాటనువిని అగస్త్యుడు సంభ్రమంతో దితి దగ్గరకు వెళ్ళి గర్భవేదనతో దుఃఖిస్తున్న ఆమెతో ఇలా అన్నాడు.

తత్రాగస్త్యః శచీకాన్తమశపత్కుపితో భృశమ్ ॥ 78 ॥

అక్కడ అగస్త్యుడు మిక్కిలి కోపంతో ఇంద్రుని శపించాడు.

అగస్త్య ఉవాచ :– అగస్త్యుడు పలికాడు.

సంగ్రామే రిపవః పృష్ఠం పశ్యేయుస్తే సదా హరే ।
జీవతామేవ మరణమేతదేవ హి మానినామ్ ॥
పృష్ఠం పలాయమానానాం యత్పశ్యన్త్యహితా రణే ॥ 79 ॥

ఓ ఇంద్రుడా! యుద్ధంలో శత్రువులు ఎప్పుడూ నీ వెన్ను చూతురుగాక! యుద్ధంలో పరుగెత్తేవారి వెన్నును చూచుట అనేదే జీవన్మరణం కదా!

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సాఽపి తం గర్భసంస్థం చ శశాపేన్ద్రం రుషా దితిః ॥ 80 ॥

తన గర్భంలో నున్న ఇంద్రుని ఆ దితి కోపంతో శపించింది.

దితిరువాచ:– దితి పలికింది.

న పౌరుషం కృతం తస్మాచ్ఛాపోఽయం భవితా తవ ।
స్త్రీభిః పరిభవం ప్రాప్య రాజ్యాత్ప్రభ్రశ్యసే హరే ॥ 81 ॥

ఇంద్రా! నీవు పౌరుషమును ప్రదర్శించలేదు. అందుకు నీకు శాపం తగులుతుంది. స్త్రీలతో అవమానించబడి, రాజ్యభ్రష్ఠుడవగుదువు గాక!

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నంతరే తత్ర కశ్యపో వై ప్రజాపతిః ।
ప్రాయాచ్చ వ్యథితోఽగస్త్యాచ్ఛ్రుత్వా శక్రవిచేష్టితమ్ ॥
గర్భాన్తరగతః శక్రః పితరం ప్రాహ భీతవత్ ॥ 82 ॥

ఇంతలో అగస్త్యుని వలన ఇంద్రుడుచేసిన దుష్కృత్యమునువిని వ్యథనుపొందిన కశ్యపప్రజాపతి అక్కడికి వచ్చాడు. గర్భంలో వున్న ఇంద్రుడు భయపడుతూ తండ్రితో నిలా అన్నాడు.

శక్ర ఉవాచ:– ఇంద్రుడు పలికాడు.

అగస్త్యాచ్చ దితేశ్చైవ బిభేమి క్రమితుం బహిః ॥ 83 ॥

అగస్త్యునివలన దితివలన బయటకు వచ్చుటకు భయపడుతున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భార్యాసమీపమాపన్నః కశ్యపోఽపి ప్రజాపతిః ।
పుత్రకర్మ చ తద్దృష్ట్వా గర్భాన్తఃస్థితమేవ చ ॥
దితిశాపమగస్త్యస్య శ్రుత్వాఽఽసౌ దుఃఖితోఽభవత్ ॥ 84 ॥

భార్యదగ్గరకు వచ్చిన కశ్యపప్రజాపతి గర్భంలోనే వున్న పుత్రుని, అతడు చేసిన పనిని చూచి, దితి అగస్త్యుల శాపాలను విని మిక్కిలి దుఃఖితుడయ్యాడు.

కశ్యప ఉవాచ:– కశ్యపుడు పలికాడు.

నిర్గచ్ఛ శక్ర పుత్రైతత్పాపం కిం కృతవానసి ।
న నిర్మలకులోత్పన్నా మనః కుర్వన్తి పాతకే ॥ 85 ॥

ఇంద్రా! నాయనా! ఎందుకీ పాపం చేశావు? బయటకు రా. స్వచ్ఛమైన కులంలో పుట్టినవారు ఇలాంటి పాపాలు తలపెట్టరు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

స నిర్గతో వజ్రపాణిః సవ్రీడోఽధోముఖోఽబ్రవీత్ ।
తన్మూర్తిరేవ వదతి సదసచ్చేష్టితం నృణామ్ ॥ 86 ॥

ఆ వజ్రపాణి సిగ్గుతో తలక్రిందికి వాల్చి, బయటకు వచ్చాడు. మానవుల మంచిచెడుల ప్రవర్తన వాని స్వరూపమే చెబుతుంది.

శక్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

యదుక్తమత్ర శ్రేయః స్యాత్తత్కర్తాఽహమసంశయమ్ ॥ 87 ॥

ఇప్పుడు మీరు ఏది శ్రేయస్సని చెబుతారో దానిని నేను నిస్సందేహంగా చేస్తాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో మమాన్తికం ప్రాయాల్లోకపాలైః స కశ్యపః ।
సర్వం వృత్తమథోవాచ పునః పప్రచ్ఛ మాం సురైః ॥ 88 ॥

దితిర్గర్భస్య వై శాన్తిం సహస్రాక్ష విశాపతామ్ ।
గర్భస్థానాం చ సర్వేషామింద్రేణ సహ మిత్రతామ్ ॥ 89 ॥

తరువాత కశ్యపుడు లోకపాలకులందరితో కలిసి నా వద్దకు వచ్చాడు. జరిగినదంతా చెప్పి తిరిగి దేవతలందరితో కలిసి

తేషామారోగ్యతాం చాపి శచీభర్తురదోషతామ్ ।
అగస్త్యదత్తశాపస్య విశాపత్వమపి క్రమాత్ ॥ 90 ॥

దితి గర్భమునకు శాంతి, ఇంద్రునికి శాపము పోవుట, దితి గర్భంలో నున్న వారందరికి ఇంద్రునితో మైత్రి, వారికారోగ్యము, ఇంద్రునికి నిర్దోషత్వం అగస్త్యుడిచ్చిన శాపంపోవుట మున్నగునవి క్రమంగా నన్నిడిగాడు.

తతోఽహమబ్రవం వాక్యం కశ్యపం వినయాన్వితమ్ ।
ప్రజాపతే కశ్యప త్వం వసుభిర్లోకపాలకైః ॥ 91 ॥

ఇన్ద్రేణ సహితః శీఘ్రం గౌతమీం యాహి మానద ।
తత్ర స్నాత్వా మహేశానం స్తుహి సర్వైః సమన్వితః ॥ 92 ॥

అప్పుడు నేను వినయంతోకూడిన కశ్యపునితో నిట్లన్నాను. ప్రజాపతీ! కశ్యపా! నీవు లోకపాలురైన వసువులతో, ఇంద్రునితో కలిసి త్వరగా గౌతమీ నదివద్దకు వెళ్ళు. ఓ పూజ్యుడా! అక్కడ స్నానంచేసి అందరితో కలిసి మహేశుని స్తుతించు.

తతః శివప్రసాదేన సర్వం శ్రేయో భవేదితి ।
తథేత్యుక్త్వా జగామాసౌ కశ్యపో గౌతమీం తదా ॥ 93 ॥

ఆ తరువాత శివుని అనుగ్రహంతో అంతా మంచే జరుగుతుందని చెప్పాడు. కశ్యపుడు సరేఅని గౌతమీనదికి వెళ్ళాడు.

స్నాత్వా తుష్టావ దేవేశమేభిరేవ పదక్రమైః ।
సర్వదుఃఖాపనోదాయ ద్వయమేవ ప్రకీర్తితమ్ ॥
గౌతమీ వా పుణ్యనదీ శివో వా కరుణాకరః ॥ 94 ॥

గౌతమిలో స్నానం చేసి ఆ దేవేశుని ఈపదక్రమాలతో స్తుతించాడు. సమస్త దుఃఖములు తీరుటకు రెండే మార్గాలు అవి పుణ్యనదియైన గౌతమి, కరుణాకరుడైన శివుడు.

కశ్యప ఉవాచ:-కశ్యపుడు పలికాడు.

పాహి శంకర దేవేశ పాహి లోకనమస్కృత ।
పాహి పావన వాగీశ పాహి పన్నగభూషణ ॥ 95 ॥

ఓ శంకరా! దేవేశా! లోకములన్నింటిచే నమస్కరింపబడువాడా! పావనా! వాగీశా! నాగభూషణా! రక్షించు. రక్షించు.

పాహి ధర్మ వృషారూఢ! పాహి వేదత్రయేక్షణ ।
పాహి గోధర లక్ష్మీశ పాహి శర్వ గజామ్బర ॥ 96 ॥

ఓ ధర్మస్వరూపా! నందివాహనా! మూడువేదములే మూడు కన్నులుగా గలవాడా! గంగాధరా! లక్ష్మీశా! శర్వా! గజ చర్మాన్ని ధరించినవాడా! రక్షించు. రక్షించు.

పాహి త్రిపురహన్నాథ పాహి సోమార్ధభూషణ ।
పాహి యజ్ఞేశ సోమేశ పాహ్యభీష్టప్రదాయక ॥ 97 ॥

త్రిపురాసురుని సంహరించినవాడా! స్వామీ! అర్ధచంద్రుని అలంకారంగా ధరించినవాడా! యజ్ఞేశా! సోమేశా! కోరిన కోరికలనిచ్చేవాడా! రక్షించు. రక్షించు.

పాహి కారుణ్యనిలయ పాహి మంగళదాయక ।
పాహి ప్రభవ సర్వస్య పాహి పాలక వాసవ ॥ 98 ॥

ఓ దయామయా! మంగళదాయకా! అన్నింటిని సృష్టించేవాడా! పాలకా! వాసవా! రక్షించు. రక్షించు.

పాహి భాస్కర విత్తేశ పాహి బ్రహ్మనమస్కృత ।
పాహి విశ్వేశ సిద్ధేశ పాహి పూర్ణ నమోஉస్తు తే ॥ 99 ॥

ఓ భాస్కరా! కుబేరా! బ్రహ్మచే నమస్కరించబడువాడా! విశ్వేశా! సిద్ధేశా! పరిపూర్ణా! రక్షించు. రక్షించు నీకు నమస్కారము.

ఘోరసంసారకాన్తారసంచారోద్విగ్నచేతసామ్ ।
శరీరిణాం కృపాసిన్ధో త్వమేవ శరణం శివ ॥ 100 ॥

ఓ దయాసముద్రుడా! శివా! భయంకరమైన సంసారమనే కారడివిలో తిరుగుతుండే ఉద్విగ్నమానసులగు జీవులకు నీవే శరణం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం సంస్తువతస్తస్య పురతోஉభూద్వృషధ్వజః ।
వరేణ ఛన్దయామాస కశ్యపం తం ప్రజాపతిమ్ ॥ 101 ॥

ఇలా స్తోత్రంచేస్తున్న కశ్యపుని కెదురుగా శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ ప్రజాపతియైన కశ్యపుని వరంతో అనుగ్రహించాడు.

కశ్యపోஉపి శివం ప్రాహ వినీతవదిదం వచః ।
స ప్రాహ విస్తరేణాథ ఇన్ద్రస్య తు విచేష్టితమ్ ॥ 102 ॥

కశ్యపుడు కూడా వినయంగా శివునితో ఆ ఇంద్రుడు చేసిన చెడ్డపనిని వివరంగా చెప్పాడు.

శాపం నాశం చ పుత్రాణాం పరస్పరమమిత్రతామ్ ।
పాపప్రాప్తిం తు శక్రస్య శాపప్రాప్తిం తథైవ చ ॥
తతో వృషాకపిః ప్రాహ దితిం చాగస్త్యమేవ చ ॥ 103 ॥

శాపము, పుత్రులయొక్క నాశనము, పరస్పరశత్రుత్వము, పాపప్రాప్తి, అలాగే ఇంద్రుని శాపం తగులుట, మున్నగునవి చెప్పగా అప్పుడు శివుడు దితితో, అగస్త్యునితో నిలా అన్నాడు.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

మరుతో యే భవత్పుత్రాః పంచాశచ్చైక వర్జితాః ।
సర్వే భవేయుః సుభగా భవేయుర్యజ్ఞభాగినః ॥ 104 ॥

నలభైతొమ్మిదిమంది, మరుత్తులైన నీ కుమారులు అందరూ సుందరులు, యజ్ఞభాగమును స్వీకరించే వారవుతారు.

ఇన్ద్రేణ సహితా నిత్యం వర్తయేయుర్ముదాన్వితాః ॥ 105 ॥

ఇంద్రునితో కలిసి ఎల్లప్పుడు సంతోషంగా ఉంటారు.

ఇన్ద్రస్య తు హవిర్భాగో యత్ర యత్ర మఖే భవేత్ ।
ఆదౌ తు మరుతస్తత్ర భవేయుర్నాత్ర సంశయః ॥ 106 ॥

ఎక్కడెక్కడ యజ్ఞంలో ఇంద్రునికి హవిర్భాగం ఉంటుందో అక్కడ ముందుగా మరుత్తులుంటారు. సందేహం లేదు.

మరుద్భిః సహితం శక్రం న జయేయుః కదాచన ।
జేతా భవేత్సర్వదైవ సుఖం తిష్ఠ ప్రజాపతే ॥ 107 ॥

మరుత్తులతో కూడివున్న ఇంద్రుని ఎవరూ జయించలేరు. అతడెప్పుడూ విజయుడే అవుతాడు. ప్రజాపతీ! సుఖంగా నుండు.

అద్యప్రభృతి యే కుర్యురనయాద్భ్రాతృఘాతనమ్ ।
వంశచ్ఛేదో విపత్తిశ్చ నిత్యం తేషాం భవిష్యతి ॥ 108 ॥

ఈ రోజునుండి అన్యాయంగా నెవరు సోదరులను చంపుతారో వారికి వంశనాశనము, ఆపద సంభవిస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అగస్త్యమృషిశార్దూలం శమ్భురప్యాహ యత్నతః ॥ 109 ॥

తిరిగి శివుడు ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యునితో అన్నాడు.

శంభురువాచ:- శివుడు పలికాడు.

న కుర్యాస్త్వం తు కోపం చ శచీభర్తరి వై మునే ।
శమం వ్రజ మహాప్రాజ్ఞ మరుతస్త్వమరాఽభవన్ ॥ 110 ॥

ఓ మునీ! ఇంద్రునిపై నీవు కోపించకు. మహాప్రాజ్ఞా! శాంతిని వహించు. మరుత్తులమరులైనారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దితిం చాపి శివః ప్రాహ ప్రసన్నో వృషభధ్వజః ॥ 111 ॥

ప్రసన్నుడు, వృషభధ్వజుడైన శివుడు దితితో గూడ ఇలా అన్నాడు.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

ఏకో భూయాన్మమ సుతస్త్రైలోక్యైశ్వర్యమణ్డితః ।
ఇత్యేవం చిన్తయన్తీ త్వం తపసే నియతాఽభవః ॥ 112 ॥

నాకు ఒక్క కుమారుడే కావాలి. అతడు ముల్లోకములలోని ఐశ్వర్యంతో తులతూగాలి అని మాత్రమే అనుకొని నీవు తపస్సు చేయుటకై నియమంగా నున్నావు.

తదేతత్సఫలం తేఽద్య పుత్రాః బహుగుణాః శుభాః ।
అభవన్ బలినః శూరాస్తస్మాజ్జహి మనోరుజమ్ ॥
అన్యానపి వరాన్ సుభ్రూః యాచస్వ గతసంభ్రమా ॥ 113 ॥

అది ఈరోజు సఫలమైంది. నీ కుమారులు బహుగుణవంతులు, శుభము కలవారు, బలశాలురు, శూరులు అయినారు. అందువలన నీవు నీ మనస్సులోని బాధను జయించు. ఓ సుభ్రూ! భ్రమను వదలి మరిన్ని కోరికలను కోరుకో.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదేతద్వచనం శ్రుత్వా దేవదేవస్య సా దితిః ।
కృతాంజలిపుటా నత్వా శంభుం వాక్యమథాబ్రవీత్ ॥ 114 ॥

దేవదేవుని ఈ మాటను విని దితి కృతాంజలియై నమస్కరించి శివునితో నిట్లన్నది.

దితిరువాచ :- దితి పలికింది.

లోకే యదేతత్పరమం యత్పిత్రోః పుత్రదర్శనమ్ ।
విశేషేణ తు తన్మాతుః ప్రియం స్యాత్సురపూజిత ॥ 115 ॥

ఓ సురపూజితా! లోకంలో పుత్రదర్శనమనేది తండ్రికి మిక్కిలి ఆనందము కలిగిస్తుంది. విశేషంగా అది తల్లికి మిక్కిలి ప్రీతిని కలిగిస్తుంది.

తత్రాపి రూపసంపత్తిశౌర్యవిక్రమవాన్భవేత్ ।
ఏకోఽపి తనయః కింతు బహవశ్చేత్కిముచ్యతే ॥ 116 ॥

అక్కడ కూడా రూపము, సంపద, శౌర్యము, విక్రమంగల ఒక్క కుమారుడుంటేనే గొప్ప, ఇక బహుపుత్రులున్న నేమి చెప్పాలి?

మత్పుత్రాస్తే ప్రభావాచ్చ జేతారో బలినో ధ్రువమ్ ।
ఇన్ద్రస్య భ్రాతరః సత్యం పుత్రాశ్చైవ ప్రజాపతేః ॥ 117 ॥

నా కుమారులు నీ ప్రభావంవలన జయశీలురు, బలవంతులు, ఇంద్రునికి సోదరులు, ఇది నిశ్చయం. ప్రజాపతికి వారు కుమారులు ఇది సత్యం.

అగస్త్యస్య ప్రసాదాచ్చ గంగాయాశ్చ ప్రసాదతః ।
యత్ర దేవప్రసాదస్తే తచ్ఛుభం కోఽత్ర సంశయః ॥ 118 ॥

దేవా! అగస్త్యుని అనుగ్రహంవలన, గంగ యనుగ్రహంవలన, ఎక్కడ నీ యనుగ్రహముంటుందో అది శుభము. ఇక్కడ సందేహమేల?

కృతార్థాఽహం తథాఽపి త్వాం భక్త్యా విజ్ఞాపయామ్యహమ్ ।
శృణుష్వ దేవవచనం కురుష్వ చ జగద్ధితమ్ ॥ 119 ॥

నేను కృతార్థురాలనైనాను. అయినప్పటికి నీకు భక్తితో విన్నపం చేస్తున్నాను. దేవతలమాట వినండి. జగత్తునకు హితమును చేకూర్చండి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

వదేత్యుక్తా జగద్ధాత్రా దితిర్నమ్రాఽబ్రవీదిదమ్ ॥ 120 ॥

జగద్రక్షకుడైన శివుడు చెప్పుమనగా దితి ఇలా అన్నది.

దితిరువాచ :– దితి పలికింది.

సన్తతిప్రాపణం లోకే దుర్లభం సురవన్దిత ।
విశేషేణ ప్రియం మాతుః పుత్రశ్చేత్కిం ను వర్ణ్యతే ॥ 121 ॥

ఓ సురవందితా! లోకంలో సంతానమును పొందుట చాలా కష్టము. ముఖ్యంగా కుమారుడంటే తల్లికి ఇక చెప్పేదేమున్నది?

స చాపి గుణవాన్ శ్రీమాన్ ఆయుష్మాన్యది జాయతే ।
కిం తు స్వర్గేణ మోక్షేణ పారమేష్ఠ్యపదేన వా ॥ 122 ॥

అతడు కూడా గుణవంతుడు, శ్రీమంతుడు, ఆయుష్మంతుడుగా పుడితే ఇక స్వర్గంతో, మోక్షంతో, బ్రహ్మపదవితోగాని పని ఏమున్నది?

సర్వేషామపి భూతానామిహాముత్ర ఫలైషిణామ్ ।
గుణవత్పుత్ర సంప్రాప్తిరభీష్టా సర్వదైవ హి ॥
తస్మాదాప్లవనాదత్ర క్రియతాం సమనుగ్రహః ॥ 123 ॥

ఇహపరలోకములను కోరే జీవులకందరికీ గుణవంతుడైన పుత్రుడు లభించుట ఎల్లప్పుడూ కోరదగినదే కదా! అందువలన ఇక్కడ స్నానం చేసిన వారికది లభించునట్లు అనుగ్రహించండి.

శంకర ఉవాచ :- శంకరుడు పలికాడు.

మహాపాపఫలం చేదం యదేతదనపత్యతా ।
స్త్రియా వా పురుషస్యాపి వన్ధ్యత్వం యది జాయతే ॥ 124 ॥

తదత్ర స్నానమాత్రేణ తద్దోషో నాశమాప్నుయాత్ ।
స్నాత్వా తత్ర ఫలం దద్యాత్ స్తోత్రమేతచ్చ యః పఠేత్ ॥ 125 ॥

ఈ సంతానంలేకపోవుట అనేక జన్మల పాపఫలమే. స్త్రీకిగాని, పురుషునకుగాని వన్ధ్యత్వమేర్పడినప్పుడు, ఆ దోషం ఇక్కడ స్నానం చేసినంతనే నశిస్తుంది. స్నానం చేసి, అక్కడ ఈ స్తోత్రమును పఠించేవారికా ఫలం లభిస్తుంది.

స తు పుత్రమవాప్నోతి త్రిమాసస్నానదానతః ।
అపుత్రిణీ త్వత్ర స్నానం కృత్వా పుత్రమవాప్నుయాత్ ॥ 126 ॥

అతడా స్తోత్రపఠనంచే పుత్రుని పొందగలడు. పుత్రసంతానములేనివాడు మూడు మాసములు స్నాన, దానములను చేస్తే పుత్రుని పొందగలడు. ఇక్కడ స్నానం చేసిన అపుత్రవతి పుత్రుని పొందగలదు.

ఋతుస్నాతా తు యా కాచిత్తత్ర స్నాతా సుతాన్ లభేత్ ।
త్రిమాసాభ్యన్తరం యా తు గుర్విణీ భక్తితస్త్విహ ॥ 127 ॥

ఫలైః స్నాత్వా తు మాం పశ్యేత్ స్తోత్రేణ స్తౌతి మాం తథా ।
తస్యాః శక్రసమః పుత్రో జాయతే నాత్ర సంశయః ॥ 128 ॥

ఇక్కడ ఋతుస్నాత ఐన స్త్రీ మూడుమాసాలలోపల భక్తితో స్నానం చేస్తే పుత్రవతి కాగలదు. స్నానంచేసి, ఫలములతో నన్ను దర్శించుకున్నా, అట్లే ఈ స్తోత్రంతో నన్ను స్తుతించినా, ఆమెకు ఇంద్రునితో సమానమైన పుత్రుడు కలుగుతాడు. దీనిలో సందేహం లేదు.

పితృదోషైశ్చ యే పుత్రం న లభన్తే దితే శృణు ।
ధనాపహారదోషైశ్చ తత్రైషా నిష్కృతిః పరా ॥ 129 ॥

ఓ దితీ! విను. ఎవరైతే పితృదోషంవలన కుమారుని పొందరో, డబ్బు దొంగిలించుదోషాలతో కూడి వుంటారో వారికి పరిహారమిక్కడే జరుగుతుంది.

తత్రైషాం పిణ్డదానేన పితౄణాం ప్రీణనేన చ ।
కించిత్సువర్ణదానేన తతః పుత్రో భవేద్ధ్రువమ్ ॥ 130 ॥

అక్కడ తమ పితృదేవతలకు పిండదానంచేసి సంతోషపెట్టేవారికి, కొంచెం బంగారం దానం చేసేవారికి పుత్రసంతతి కలుగుతుంది. ఇది నిశ్చయం.

యే న్యాసాద్యపహర్తారో రత్నాపహ్నవకారకాః ।
శ్రాద్ధకర్మవిహీనాశ్చ తేషాం వంశో న వర్ధతే ॥ 131 ॥

ఇంట్లో దాచిన వస్తువులను దొంగిలించే వారి రత్నాదులను దాచే వారి, శ్రాద్ధ కర్మలచేయని వంశమభివృద్ధి చెందదు.

దోషిణాం తు పరేతానాం గతిరేషా భవేదితి ।
సన్తతిర్జాయతాం శ్లాఘ్యా జీవతాం తీర్థసేవనాత్ ॥ 132 ॥

దోషులకు, ప్రేతలకు ఇదే గతి. తీర్థములను సేవించుటవలన జీవింతురుగాక! కొనియాడదగిన సంతతి కలుగుగాక!

సంగమే దితిగంగాయాః స్నాత్వా సిద్ధేశ్వరం ప్రభుమ్ ।
అనాద్యపారమజరం చిత్సదానందవిగ్రహమ్ ॥ 133 ॥

దేవర్షిసిద్ధగంధర్వయోగీశ్వరనిషేవితమ్ ।
లింగాత్మకం మహాదేవం జ్యోతిర్మయమనామయమ్ ॥ 134 ॥

పూజయిత్వోపచారైశ్చ నిత్యం భక్త్యా యతవ్రతః ।
స్తోత్రేణానేన యః స్తౌతి చతుర్దశ్యష్టమీషు చ ॥ 135 ॥

యథా శక్త్యా స్వర్ణదానం బ్రాహ్మణానాం చ భోజనమ్ ।
యః కరోత్యత్ర గంగాయాం స పుత్రశతమాప్నుయాత్ ॥ 136 ॥

గంగాదితిసంగమంలో స్నానంచేసి, అనాది, అపరుడు, అజుడు, చిత్స్వరూపుడు, ఆనందవిగ్రహుడు అయిన సిద్ధేశ్వరుని, దేవ, ఋషి, గంధర్వ యోగీశ్వరులు సేవించువానిని, లింగరూపుని, మహాదేవుని, జ్యోతిర్మయుని, అనామయుని, ప్రతిరోజు నియమంతో, భక్తితో, షోడశోపచారములతో పూజించి, ఈ స్తోత్రంతో చతుర్దశినాడు, అష్టమినాడు స్తుతించువారికి, శక్తిమేరకు బంగారం దానం, బ్రాహ్మణులకు భోజనం ఈ గంగాతీరంలో చేసేవారికి నూర్గురు పుత్రులు కలుగుతారు.

సంప్రాప్య సకలాన్కామానంతే శివపురం వ్రజేత్ ।
స్తోత్రేణానేన యః కశ్చిదత్ర క్వాపి స్తవీతి మామ్ ॥
షణ్మాసాత్పుత్రమాప్నోతి అపి వన్ధ్యాఽప్యశంకితమ్ ॥ 137 ॥

వారు కోరికలన్నీ పొంది చివరకు కైలాసమును చేరుతారు. ఈ స్తోత్రములో గొడ్రాలైనా, సంతానము లేనివాడైనా ఎక్కడైనా నన్ను స్తుతిస్తే ఆరుమాసాల్లో పుత్రుని పొందగలడు. ఇందులో ఏ సందేహం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రభృతి తత్తీర్థం పుత్రతీర్థముదాహృతమ్ ।
తత్ర తు స్నానదానాద్యైః సర్వకామానవాప్నుయాత్ ॥ 138 ॥

అప్పటినుండి ఆ తీర్థమునకు పుత్రతీర్థమని పేరు వచ్చింది. అక్కడ స్నాన, దానాదులు చేస్తే సమస్త కోరికలు నెరవేరుతాయి.

మరుద్భిః సహ మైత్ర్యేణ మిత్రతీర్థం తదుచ్యతే ।
నిష్పాపత్వేన చేద్రస్య శక్రతీర్థం తదుచ్యతే ॥ 139 ॥

మరుత్తులతో కూడా స్నేహమేర్పడిన చోటుకు మిత్రతీర్థమని పేరు. ఇంద్రునికి పాపం తొలగిన చోటునకు ఇంద్రతీర్థమని పేరు.

ఐన్ద్రీం శ్రియం యత్ర లేభే తత్తీర్థం కమలాభిదమ్ ।
ఏతాని సర్వతీర్థాని సర్వాభీష్టప్రదాని హి ॥ 140 ॥

ఇంద్రుని సంపదను పొందినచోటవున్న తీర్థమును కమలతీర్థమంటారు. ఈ సమస్తతీర్థములు అన్ని కోరికలను తీర్చుతాయి.

సర్వం భవిష్యతీత్యుక్త్వా శివశ్చాంతరధీయత ।
కృతకృత్యాశ్చ తే జగ్ముః సర్వ ఏవ యథాగతమ్ ॥
తీర్థానాం పుణ్యదం తత్ర లక్షమేకం ప్రకీర్తితమ్ ॥ 141 ॥

అన్ని జరుగునని చెప్పి శివుడంతర్ధానమయ్యాడు. అందరు కృతకృత్యులై తమతమ చోటులకు వెళ్ళారు. ఇటువంటి తీర్థములు అక్కడ ఒక లక్ష ఉన్నాయి.

ఇతి శ్రీబ్రహ్మపురణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే స్వయమ్భునారదసంవాదే తీర్థమాహాత్మ్యే 'పుత్రతీర్థాది లక్షతీర్థవర్ణనం'నామ చతుః పంచాశోఽధ్యాయః ॥ 54 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో స్వయంభునారదసంవాదంలో తీర్థమాహాత్మ్యంలో 'పుత్రతీర్థాది లక్షతీర్థవర్ణన'మనే పేరుగల యాభై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచపంచాశోஉధ్యాయః - యాభై ఐదవ అధ్యాయం

యమాగ్న్యాది నవత్యుత్తర త్రిశతాధిక త్రిసహస్ర తీర్థవర్ణనమ్

యమ అగ్ని మొదలుగాగల మూడువేల మూడువందల తొంభైతీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యమతీర్థమితి ఖ్యాతం పితౄణాం తృప్తివర్ధనమ్ ।
దృష్టాదృష్టేష్టదం పుణ్యం సర్వతీర్థనిషేవితమ్ ॥ 1 ॥

యమతీర్థమనేది ప్రసిద్ధమైనది. ఇది పితృదేవతలకు ప్రీతిని పెంచేది, దృష్టాదృష్టములగు ఇష్టమైన ఫలముల నిచ్చేది. పవిత్రమైనది. సర్వతీర్థములచే సేవించబడేది.

తస్య ప్రభావం వక్ష్యామి సర్వపాపప్రణాశనమ్ ।
అనుహ్రాద ఇతి ఖ్యాతః కపోతో బలవానభూత్ ॥ 2 ॥

సర్వపాపాలను హరించేట్టి దాని ప్రభావమును చెబుతున్నాను. అనుహ్రాదుడను పేరుగల బలవంతుడైన కపోతముండేది.

తస్య భార్యా హేతినామ్నీ పక్షిణీ కామరూపిణీ ।
మృత్యోః పౌత్రో హ్యనుహ్రాదో దౌహిత్రీ హేతిరేవ చ ॥ 3 ॥

అతని భార్య పేరు హేతి అనే పక్షిణి. ఆమె కామరూపిణి. మృత్యువుయొక్క పౌత్రుడు అనుహ్రాదుడు, దౌహిత్రి హేతి.

కాలేనాథ తయోః పుత్రాః పౌత్రాశ్చైవ బభూవిరే ।
తస్య శత్రుశ్చ బలవానులూకో నామ పక్షిరాట్ ॥ 4 ॥

కాలం జరుగుతుండగా వారికి పుత్రులు, పౌత్రులు కలిగారు. అతనికి బలవంతుడైన ఉలూకుడను పక్షిరాజు శత్రువు.

తస్య పుత్రాశ్చ పౌత్రాశ్చ ఆగ్నేయాస్తే బలోత్కటాః ।
తయోశ్చ వైరమభవద్బహుకాలం ద్విజన్మనోః ॥ 5 ॥

అతని పుత్రులు, పౌత్రులు అగ్నిసంబంధమైనవారు, బలోత్కటులు. పక్షిజన్ములైన వారికి చాలాకాలంవరకు పరస్పరం వైరముండేది.

గంగాయా ఉత్తరే పారే కపోతస్యాஉஉశ్రమోஉభవత్ ।
తస్యాశ్చ దక్షిణే పారే ఉలూకో నామ పక్షిరాట్ ॥ 6 ॥

వాసం చక్రే తత్ర పుత్రైః పౌత్రైశ్చ ద్విజసత్తమ ।
తయోశ్చ యుద్ధమభవద్బహుకాలం విరుద్ధయోః ॥ 7 ॥

గంగానదియొక్క ఉత్తరతీరంలో కపోతంయొక్క ఆశ్రమముండేది. గంగానదియొక్క దక్షిణతీరంలో ఉలూకుడను పక్షిరాజు, అక్కడ తన పుత్రపౌత్రాదులతో నివాసముండేవాడు. ఓ ద్విజశ్రేష్ఠుడా! విరుద్ధమైన వారిద్దరికి చాలాకాలం యుద్ధం జరిగింది.

పుత్రైః పౌత్రైశ్చ వృతయోర్బలినో బలిభిః సహ ।
ఉలూకో వా కపోతో వా నైవాఽఽప్నోతి జయాజయౌ ॥ 8 ॥

పుత్ర, పౌత్రులు చుట్టూ వుండి బలవంతులు, బలవంతులతో గూడ యుద్ధం చేశారు. అయినా ఉలూకం గాని, కపోతం గాని జయాపజయములను పొందలేదు.

కపోతో యమమారాధ్య మృత్యుం పైతామహం తథా ।
యామ్యమస్త్రమథావాప్య సర్వేభ్యోఽప్యధికోఽభవత్ ॥ 9 ॥

కపోతుడు యముని, తాత అయిన మృత్యువును ఆరాధించి యామ్యమనే అస్త్రమును పొంది, అందరికంటే అధికుడయ్యాడు.

తథోలూకోఽగ్నిమారాధ్య బలవానభవద్భృశమ్ ।
వరైరున్మత్తయోర్యుద్ధమభవచ్చాతిభీషణమ్ ॥ 10 ॥

అట్లే ఉలూకుడు అగ్నినారాధించి మిక్కిలి బలవంతుడయ్యాడు. వరములతో మదించిన వారిద్దరికి భయంకరమైన యుద్ధం జరిగింది.

తత్రాఽఽగ్నేయములూకోఽపి కపోతాయాస్త్రమాక్షిపత్ ।
కపోతోఽప్యథ పాశాన్వై యామ్యానాక్షిప్య శత్రవే ॥ 11 ॥

ఉలూకాయాథ దణ్డం చ మృత్యుపాశానవాసృజత్ ।
పునస్తదభవద్యుద్ధం పురాఽఽడీబకయోర్యథా॥ 12 ॥

అక్కడ ఉలూకుడు కపోతునిమీద ఆగ్నేయాస్త్రం వేశాడు. కపోతుడు కూడా శత్రువుపై యామ్యపాశములు వేసి, ఉలూకునిపై దండము, మృత్యుపాశములను సృజించాడు. పూర్వం ఆడీబకుల యుద్ధంవలె వీరి యుద్ధం సాగింది.

హేతిః కపోతకీ దృష్ట్వా జ్వలనం ప్రాప్తమన్తికే ।
పతివ్రతా మహాయుద్ధే భర్తుః సా దుఃఖవిహ్వలా ॥ 13 ॥

ఆ మహాయుద్ధంలో భర్తయొక్క లోపల చేరిన అగ్నిని చూచి ఆ మహాపతివ్రత అయిన కపోతకీ హేతి మిక్కిలి దుఃఖంతో విచలితురాలయింది.

అగ్నినా వేష్ట్యమానాంశ్చ పుత్రాన్ దృష్ట్వా విశేషతః ।
సా గత్వా జ్వలనం హేతిస్తుష్టావ వివిధోక్తిభిః ॥ 14 ॥

ముఖ్యంగా అగ్నిచే చుట్టబడిన కుమారులను చూచి ఆ హేతి వెళ్ళి వివిధములైన మాటలతో స్తోత్రం చేసింది.

హేతివాచ :– హేతి పలికింది.

రూపం న దానం పరోక్షమస్తి యాస్యాఽఽత్మభూతం చ పదార్థజాతమ్ ॥
అశ్నన్తి హవ్యాని చ యేన దేవాః స్వాహా పతిం యజ్ఞభుజం నమస్యే ॥ 15 ॥

రూపం పరోక్షంగాదు. దానం పరోక్షం గాదు. పదార్థములవల్ల కలిగేవన్నీ ఎవనికి ఆత్మభూతంలో ఎవరివ్వగా దేవతలందరూ హవిస్సును భుజించే యజ్ఞభుజునికి నమస్కారం.

ముఖభూతం చ దేవానాం సర్వజ్ఞం హవ్యవాహనమ్ ।
హోతారం చాపి దేవానాం దేవానాం దూతమేవ చ ॥ 16 ॥

తం దేవం శరణం యామి ఆదిదేవం విభావసుమ్ ।
అన్తః స్థితః ప్రాణరూపో బహిశ్చాన్నప్రదో హి యః ।
యో యజ్ఞసాధనం యామి శరణం తం ధనంజయమ్ ॥ 17 ॥

దేవతలందరికి ముఖభూతమైనవాడు, సర్వజ్ఞుడు, హవ్యమును తీసుకొని వెళ్ళువాడు, దేవతలకు హోత అయినా దేవతలకు దూతమాత్రమే ఐనవాడు, ఆదిదేవుడు, విభావసుడు అయిన ఆ దేవుని శరణు పొందుతున్నాను. లోపల ప్రాణరూపంగా, బయట అన్నదాతగా నున్న అతనిని శరణు పొందుతున్నాను. యజ్ఞమునకు సాధనమైన ఆ ధనంజయుని శరణు పొందుతున్నాను.

అగ్నిరువాచ :– అగ్ని పలికాడు.

అమోఘమేతదస్త్రం మే న్యస్తో యుద్ధే కపోతకి ।
యత్ర విశ్రమయేదస్త్రం తన్మే బ్రూహి పతివ్రతే ॥ 18 ॥

ఓ పతివ్రతా! కపోతకీ! ఈ నా అస్త్రము అమోఘమైనది. దీనిని యుద్ధమునందు ప్రయోగించినారు. ఈ అస్త్రము ఎక్కడ విశ్రమించవలెనో నాకు తెలుపు.

కపోత్యువాచ :–కపోతకి పలికింది.

మయి విశ్రమ్యతామస్త్రం న పుత్రేషు న భర్తరి ।
సత్యవాగ్భవ హవ్యేశ జాతవేదో నమోఽస్తు తే ॥ 19 ॥

ఓ హవ్యాధిపతీ! ఆ అస్త్రము నాయందు విశ్రమించుగాక! నా పుత్రులయందు, నా భర్తయందు వద్దు. ఓ జాతవేదా! సత్యవాక్కుడవు కమ్ము. నీకు నమస్కారము.

జాతవేదా ఉవాచ :- జాతవేదుడు పలికాడు.

తుష్టోఽస్మి తవ వాక్యేన భర్తృభక్త్యా పతివ్రతే ।
తవాపి భర్తృపుత్రాణాం హేతి క్షేమం దదామ్యహమ్ ॥ 20 ॥

ఓ పతివ్రతా! నీ పతిభక్తికి, నీ మాటకు సంతోషించాను. ఓ హేతీ! నీకు, నీ భర్తకు, నీ పుత్రులకు క్షేమము వరంగా ఇస్తున్నాను.

ఆగ్నేయమేతదస్త్రం మే న భర్తారం సుతానపి ।
న త్వాం దహేత్తతో యాహి సుఖేన త్వం కపోతకి ॥ 21 ॥

ఓ కపోతకీ! నా యీ ఆగ్నేయాస్త్రం నీ భర్తనుగాని, నీ కుమారులనుగాని, నిన్నుగాని దహించదు. నీవు సుఖంగా వెళ్ళు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నన్తరే తత్ర ఉలూకీ దదృశే పతిమ్ ।
వేష్ట్యమానం యామ్యపాశైర్యమదణ్డేన తాడితమ్ ॥
ఉలూకీ దుఃఖితా భూత్వా యమం ప్రాయాద్భయాతురా ॥ 22 ॥

ఈ లోపల ఉలూకి అక్కడ యమపాశములతో బంధింపబడి, ధర్మదండంతో దెబ్బలు తింటున్న తన భర్తను చూచింది. అప్పుడామె దుఃఖితురాలై భయాతురతతో యముని వద్దకు వెళ్ళింది.

ఉలూక్యువాచ :- ఉలూకి పలికింది.

త్వద్భీతా అనుద్రవన్తే జనాస్త్వద్భీతా బ్రహ్మచర్యం చరన్తి ।
త్వద్భీతాః సాధు చరన్తి ధీరా స్త్వద్భీతాః కర్మనిష్ఠా భవన్తి ॥ 23 ॥

నీవంటే భయపడి జనులు వణుకుతో ద్రవించి పోతారు. నీవంటే భయంతో బ్రహ్మచర్యమును పాటిస్తారు. నీవంటే భయంతో ధీరులు సాధుమార్గంలో నడుస్తారు. నీవంటే భయంతో కర్మలయందు నిష్ఠతో నుంటారు.

త్వద్భీతా అనాశకమాచరన్తి గ్రామాదరణ్యామభి యచ్చరన్తి ।
త్వద్భీతాః సౌమ్యతామాశ్రయన్తే త్వద్భీతాః సోమపానం భజన్తే ॥
త్వద్భీతాశ్చాన్నగోదాననిష్ఠాస్త్వద్భీతా బ్రహ్మవాదం వదన్తి ॥ 24 ॥

నీవంటే భయపడి నిరశన దీక్షను చేస్తారు. ఉపవాసములుంటారు. గ్రామంనుండి అరణ్యమున కభిముఖులై తపస్సులకై వెళతారు. నీవంటే భయపడి సౌమ్యంగా నుండుట నాశ్రయిస్తారు. నీవంటే భయపడి

సోమయజ్ఞాదులను చేసి సోమరసమును సేవిస్తారు. నీవంటే భయపడి అన్నదానములు, గోదానములు చేస్తారు. నీవంటే భయపడి బ్రహ్మావాదమును చెబుతారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం బ్రువత్యాం తస్యాం తామాహ దక్షిణదిక్పతిః ॥ 25 ॥

ఇలా పలుకుతున్న ఆమెతో దక్షిణదిక్కునకధిపతి ఇట్లన్నాడు.

యమ ఉవాచ :- యముడు పలికాడు.

వరం వరయ భద్రం తే దాస్యేఽహం మనసః ప్రియమ్ ॥ 26 ॥

నీ మనస్సు కిష్టమైన వరం కోరుకో, నేనిస్తాను, శుభమవుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యమస్యేతి వచః శ్రుత్వా సా తమాహ పతివ్రతా ॥ 27 ॥

యముని మాటనువిని ఆ పతివ్రత అతనితో నిట్లన్నది.

ఉలూక్యువాచ :- ఉలూకి పలికింది.

భర్తా మే వేష్టితః పాశైర్దణ్డేనాభిహతస్తవ ।
తస్మాద్రక్ష సురశ్రేష్ఠ పుత్రాన్ భర్తారమేవ చ ॥ 28 ॥

నా భర్త పాశములచే బంధింపబడ్డాడు. నీ దండంతో దెబ్బలు తింటున్నాడు. అందువల్ల, ఓ సురశ్రేష్ఠా! నా భర్తను, పుత్రులను రక్షించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్వాక్యాత్ కృపయా యుక్తో యమః ప్రాహ పునః పునః ॥ 29 ॥

ఆ మాటవిని దయతో కూడిన యముడు మాటిమాటికిట్లన్నాడు.

యమ ఉవాచ :- యముడు పలికాడు.

పాశానాం చాపి దణ్డస్య స్థానం వద శుభాననే ॥ 30 ॥

ఓ శుభాననా! పాశములు, దండము ఎక్కడ వుంచాలో చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సా ప్రోవాచ యమం దేవం మయి పాశాస్త్వయేరితాః ।
ఆవిశన్తు జగన్నాథ దణ్డో మయ్యేవ సంవిశేత్ ॥
తతః ప్రోవాచ భగవాన్ యమస్తాం కృపయా పునః ॥ 31 ॥

అప్పుడామె యమునితో జగన్నాథా! నీవు ప్రయోగించిన పాశములు, దండము నాలోనే ప్రవేశించనీ, అప్పుడు యముడు తిరిగి దయతో నామెతో ఇట్లన్నాడు.

యమ ఉవాచ :- యముడు పలికాడు.

తవ భర్తా చ పుత్రాశ్చ సర్వే జీవన్తు విజ్వరాః । 32 ॥

నీ భర్త పుత్రులు జ్వరరహితులై అందరూ జీవిస్తారు గాక !

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

న్యవారయద్యమః పాశానాగ్నేయాస్త్రం తు హవ్యవాట్ ।
కపోతోలూకయోశ్చాపి ప్రీతిం వై చక్రతుః సురౌ ॥
ఆహతుశ్చ ద్విజన్మానౌ వ్రియతాం వర ఈప్సితః ॥ 33 ॥

యముడు పాశములను నివారించాడు. అగ్నిదేవుడు ఆగ్నేయాస్త్రమును ఉపసంహరించాడు. దేవతలు కపోత ఉలూకములపై ప్రీతిని చూపి ఓ పక్షులారా! మీరు మీ ఇష్టమైన వరము కోరుకోండని చెప్పారు.

పక్షిణావూచతుః :- పక్షులు పలికినవి.

భవతో ర్దర్శనం లబ్ధం వైరవ్యాజేన దుష్కరమ్ ।
వయం చ పక్షిణః పాపాః కిం వరేణ సురోత్తమౌ ॥ 34 ॥

ఓ దేవతా శ్రేష్ఠులారా! మా యిద్దరికి వైరమనే నెపంతో మీ దర్శనం లభించింది. మేమూ పక్షులం, పైగా పాపులం. మాకు వరమెందుకు?

అథ దేయో వరోఽస్మాకం భవద్భ్యాం ప్రీతిపూర్వకమ్ ।
నాఽఽత్మార్థమనుయాచావో దీయమానం వరం శుభమ్ ॥ 36 ॥

మీరు మాకు ప్రీతిపూర్వకంగా వరములిస్తామంటే ఆ వరము మేము మాకొరకు కోరము.

ఆత్మార్థం యస్తు యాచేత స శోచ్యో హి సురేశ్వరౌ ।
జీవితం సఫలం తస్య యః పరార్థోద్యతః సదా ॥ 37 ॥

ఓ సురేశ్వరులారా! స్వార్థంకొరకు వరమడిగేవాడు దుఃఖించవలసినవాడే, నిందింపదగినవాడే కదా! ఎల్లప్పుడు ఇతరులకొరకు ప్రయత్నం చేసేవాని జీవితం సఫలం.

అగ్నిరాపో రవిః పృథ్వీ ధాన్యాని వివిధాని చ ।
పరార్థం వర్తనం తేషాం సతాం చాపి విశేషతః ॥ 38 ॥

అగ్ని, నీరు, సూర్యుడు, భూమి వివిధములైన ధాన్యములు ఇతరులకొరకే వున్నవిగా ప్రవర్తిస్తున్నాయి. విశేషంగా సత్పురుషులుకూడా పరులకొరకే జీవిస్తారు.

బ్రహ్మాదయోఽపి హి యతో యుజ్యన్తే మృత్యునా సహ ।
ఏవం జ్ఞాత్వా తు దేవేశౌ వృథా స్వార్థపరిశ్రమః ॥ 39 ॥

ఓ దేవేశులారా! బ్రహ్మాదులుకూడా చివరకు మృత్యువుతోనే కలుస్తారు. ఇది తెలిసికూడా ఇంకా స్వార్థంకొరకు ప్రయత్నించుట వ్యర్థం.

జన్మనా సహ యత్పుంసాం విహితం పరమేష్ఠినా ।
కదాచిన్నాన్యథా తద్వై వృథా క్లిశ్యన్తి జన్తవః ॥ 40 ॥

జీవులకు పుట్టుకతోనే బ్రహ్మచే విధించిన దానికి భిన్నంగా జరుగదు. ఈ జీవులు వ్యర్థంగా క్లేశపడతారు.

తస్మాద్యాచావహే కించిద్ధితాయ జగతాం శుభమ్ ।
గుణదాయి తు సర్వేషాం తద్యువామనుమన్యతామ్ ॥ 41 ॥

అందువల్ల లోకమునకు శుభం కలిగించేది, జగత్తునకు హితంకొఱకు, అందరికీ గుణదాయిని కోరుతాము. మీరిద్దరూ దానికి అనుమతించవలెను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తావాహతురుభౌ దేవౌ పక్షిణౌ లోకవిశ్రుతౌ ।
ధర్మస్య యశసోఽవాప్త్యై లోకానాం హితకామ్యయా ॥ 42 ॥

లోకమునకు హితంకోరినవారై ధర్మము, యశస్సు పొందుటకై ఆ లోకవిశ్రుతులైన దేవతలు ఇద్దరును ఆ పక్షులతో నిట్లన్నారు.

పక్షిణావూచతుః :– పక్షులు పలికాయి.

ఆవయోరాశ్రమౌ తీర్థే గంగాయా ఉభయే తటే ।
భవేతాం జగతాం నాథావేష ఏవ పరో వరః ॥ 43 ॥

గంగానదియొక్క రెండు తటములయందు ఆ తీర్థములో మా ఇద్దరి ఆశ్రమములుండవలెను. ఓ జగన్నాథా! ఇదే మేము కోరే వరము.

స్నానం దానం జపో హోమః పితౄణాం చాపి పూజనమ్ ।
సుకృతీ దుష్కృతీ చాపి యః కరోతి యథా తథా ॥
సర్వం తదక్షయం పుణ్యం స్యాదిత్యేష పరో వరః ॥ 44 ॥

ఆ తీర్థంలో పుణ్యాత్ముడుగాని పాపాత్ముడుగాని స్నానం, దానం, జపం, హోమం, పితృదేవతలకు పిండ దానాదులు, తర్పణాదులు యథావిధిగా చేసినవారికి అన్నీ అక్షయమైన పుణ్యం లభించవలెను. ఇది మరొక వరము.

దేవావూచతుః :- దేవతలు పలికారు.

ఏవమస్తు తథా చాన్యత్సుప్రీతౌ తు బ్రవావహై ॥ 45 ॥

మేము చాలా ప్రీతులమై చెబుతున్నాము. అట్లే అగుగాక!

యమ ఉవాచ :- యముడు పలికాడు.

ఉత్తరే గౌతమీతీరే యమస్తోత్రం పఠన్తి యే ।
తేషాం సప్తసు వంశేషు నాకాలే మృత్యుమాప్నుయాత్ ॥ 46 ॥

గౌతమీనదికుత్తరతీరంలో యమస్తోత్రమును పఠించేవారి ఏడుతరాలవారు అకాలమృత్యువును పొందరు.

పురుషో భాజనం చ స్యాత్సర్వదా సర్వసంపదామ్ ।
యస్త్విదం పఠతే నిత్యం మృత్యుస్తోత్రం జితాత్మవాన్ ॥ 47 ॥

అష్టాశీతి సహస్రైశ్చ వ్యాధిభిర్న స బాధ్యతే ।
అస్మింస్తీర్థే ద్విజశ్రేష్ఠౌ త్రిమాసాద్గుర్విణీ సతీ ॥ 48 ॥

అటువంటివారు సర్వకాలములయందు అనంతసంపదలను పొందగలరు. ఈ మృత్యుస్తోత్రమును జితేంద్రియుడై నిత్యము పఠించేవారు, ఎనబై ఎనిమిదివేల సంవత్సరములవరకు వ్యాధులచే పీడింపబడరు. ఓ పక్షి శ్రేష్ఠులారా! ఈ తీర్థమునందు మూడుమాసములు స్నానంచేసిన పతివ్రత గర్భవతియవుతుంది.

అర్వాగ్వన్ధ్యా చ షణ్మాసం సప్తాహం స్నానమాచరేత్ ।
వీరసూః సా భవేన్నారీ శతాయుః స సుతో భవేత్ ॥ 49 ॥

సంతానంలేని స్త్రీ వారమునకొక్కసారి చొప్పున ఆరు నెలలు ఈ తీర్థంలో నియమంతో స్నానం చేస్తే ఆ స్త్రీకి వీరుడు, శతాయుష్మంతుడగు కొడుకు పుడతాడు.

లక్ష్మీవాన్ మతిమాన్ శూరః పుత్రపౌత్రవివర్ధనః ।
తత్ర పిండాదిదానేన పితరో ముక్తిమాప్నుయుః ॥
మనోవాక్కాయజాత్పాపాత్స్నానాన్ముక్తో భవేన్నరః ॥ 50 ॥

ఆ పుట్టిన కుమారుడు సంపదగలవాడు, బుద్ధిమంతుడు, శూరుడు, పుత్రపౌత్రులనభివృద్ధి పరచువాడునవుతాడు. అక్కడ పిండాదులు దానం చేస్తే పితరులు ముక్తిని పొందుతారు. అక్కడ స్నానం చేసినంతనే మనోవాక్కాయములతో నొనరించిన పాపములు పోతాయి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యమవాక్యాదను తథా హవ్యవాడాహ పక్షిణౌ ॥ 51 ॥

యముడు పల్కిన తరువాత అగ్ని పక్షులతో నిట్లన్నాడు.

అగ్నిరువాచ :- అగ్ని పలికాడు.

మత్స్తోత్రం దక్షిణే తీరే యే పఠన్తి యతవ్రతాః ।
తేషామారోగ్యమైశ్వర్యం లక్ష్మీం రూపం దదామ్యహమ్ ॥ 52 ॥

నా స్తోత్రమును నియమంతో ఈ గంగానది దక్షిణతీరంలో చదివేవారికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సంపద, రూపములను నేను ఇస్తాను.

ఇదం స్తోత్రం తు యః కశ్చిద్యత్ర క్వాపి పఠేన్నరః ।
నైవాగ్నితో భయం తస్య లిఖితేఽపి గృహే స్థితే ॥ 53 ॥

ఈ స్తోత్రం ఎవరైనా, ఎక్కడైనా పఠించినా, ఇంట్లో ఉండి వ్రాసినా వారికి అగ్నిభయం ఉండదు.

స్నానం దానం చ యః కుర్యాదగ్నితీర్థే శుచిర్నరః ।
అగ్నిష్టోమఫలం తస్య భవేదేవ న సంశయః ॥ 54 ॥

ఈఅగ్ని తీర్థంనందు శుచియై, స్నానము, దానం చేసేవారికి అగ్నిష్టోమయాగం చేసిన ఫలం లభిస్తుంది. దీనిలో సంశయంలేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రభృతి తత్తీర్థం యామ్యమాగ్నేయమేవ చ ।
కపోతం చ తథోలూకం హేత్యులూకం విదుర్బుధాః ॥ 55 ॥

అప్పటినుండి ఆ తీర్థమును యామ్యతీర్థం, ఆగ్నేయతీర్థం, కపోతతీర్థం, ఉలూకతీర్థం, హేత్యులూకతీర్థమని పండితులంటారు.

తత్ర త్రీణి సహస్రాణి తావన్త్యేవ శతాని చ ।
పునర్నవతి తీర్థాని ప్రత్యేకం ముక్తిభాజనమ్ ॥ 56 ॥

అక్కడ మూడువేల మూడువందల తీర్థములున్నాయి. ప్రత్యేకంగా ముక్తినిచ్చేవి మరో తొంబై ఉన్నాయి.

తేషు స్నానేన దానేన ప్రతీభూతాశ్చ యే నరాః ।
పూతాస్తే పుత్రవిత్తాఢ్యా ఆక్రమేయుర్దివం శుభాః ॥ 57 ॥

ఆ తీర్థములయందు నరులు స్నానదానములతో ప్రతీభూతులగువారు పవిత్రులై, పుత్రవంతులు, ధనాఢ్యులునై శుభములను పొంది స్వర్గము నాక్రమిస్తారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే యమాగ్న్యాది నవత్యుత్తర త్రిశతాధిక త్రిసహస్ర తీర్థవర్ణనం నామ పంచపంచాశోఽధ్యాయః ॥ 55 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో యమ అగ్నిమొదలుగాగల మూడువేల మూడువందల తొంబై తీర్థాలవర్ణనమనే పేరుగల యాభై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్ పంచాశోఽధ్యాయః - యాభై ఆరవ అధ్యాయం

తపస్తీర్థాది చతుర్దశశతతీర్థవర్ణనమ్ - తపస్తీర్థం మొదలుగాగల పద్నాలుగువందల తీర్థాలవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తపస్తీర్థమితి ఖ్యాతం తపోవృద్ధికరం మహత్ ।
సర్వకామప్రదం పుణ్యం పితౄణాం ప్రీతివర్ధనమ్ ॥ 1 ॥

తపస్తీర్థమనేది ప్రఖ్యాతమైనది. ఆ తీర్థం తపస్సును వృద్ధి చేస్తుంది. సమస్త కోరికలనిస్తుంది. పవిత్రమైనది. పితృదేవతలకు ప్రీతిని వృద్ధి చేసేది.

తస్మింస్తీర్థే తు యద్వృత్తం శృణు పాపప్రణాశనమ్ ।
అపామగ్నేశ్చ సంవాదమృషీణాం చ పరస్పరమ్ ॥ 2 ॥

ఆ తీర్థమును గూర్చిన వృత్తాంతం విను. అది పాపమును నశింపచేసేది. ఇది జలాగ్నుల సంవాదము, ఋషుల పరస్పర సంవాదం

అపో జ్యేష్ఠతమాః కేచిన్మేనిరేఽగ్నిం తథాఽపరే ।
ఏవం బ్రువన్తో మునయః సంవాదం చాగ్నివారిణోః ॥ 3 ॥

కొందరు జలము పెద్దవాడని, కొందరు అగ్ని పెద్దవాడని అన్నారు. ఇట్లు మాట్లాడుతూ మునులు అగ్నిజలముల గూర్చి సంవాదము చేశారు.

వినాఽగ్నిం జీవనం క్వ స్యాజ్జీవభూతో యతోఽనలః ।
ఆత్మభూతో హవ్యభూతశ్చాగ్నినా జాయతేఽఖిలమ్ ॥ 4 ॥

అగ్నిలేకుండా జీవనమెక్కడిది? ఎందుకనగా అగ్ని జీవభూతుడు, ఆత్మభూతుడు, హవ్యభూతుడు అగ్నివల్లనే సమస్తము కలుగుతుంది.

అగ్నినా ధ్రియతే లోకో హ్యగ్నిర్జ్యోతిర్మయం జగత్ ।
తస్మాదగ్నేః పరం నాస్తి పావనం దైవతం మహత్ ॥ 5 ॥

అగ్ని లోకమును ధరిస్తున్నాడు. లోకమంతా జ్యోతిర్మయమైన అగ్నియే. అందువలన అగ్నికంటే పవిత్రుడు, గొప్పదైన దైవం లేదు.

అన్తర్జ్యోతిః స ఏవోక్తః పరం జ్యోతిః స ఏవ హి ।
వినాఽగ్నినా కించిదస్తి యస్య ధామ జగత్త్రయమ్ ॥ 6 ॥

అతడే అంతర్జ్యోతి. అతడే పరంజ్యోతి. అతడు లేకుండా ఏదీ లేదు. ముల్లోకములు అతని స్థానమే.

తస్మాదగ్నేః పరం నాస్తి భూతానాం జ్యైష్ఠభాజనమ్ ।
యోషిత్క్షేత్రేఽర్పితం బీజం పురుషేణ యథా తథా ॥ 7 ॥

భూతములన్నింటిలోనూ జ్యేష్ఠునిగా నున్నవాడు అగ్నికంటే మరొకడు లేడు. స్త్రీయందు పురుషుడు ప్రవేశపెట్టిన బీజమువలె అగ్ని అటువంటివాడు.

తస్య దేహాదికా శక్తిః కృశానోరేవ నాన్యథా ।
దేవానాం హి ముఖం వహ్నిస్తస్మాన్నాతః పరం విదుః ॥ 8 ॥

పురుషుని దేహాదికమైన శక్తి అగ్నియే, వేరొకడు గాదు. దేవతలకు ముఖస్థానీయుడగ్ని. అతనికంటే వేరెవరూ లేరు.

అపరే తు హ్యపాం జ్యైష్ఠ్యం మేనిరే వేదవాదినః ।
అద్భిః సంపద్యతే హ్యన్నం శుచిరద్భిః ప్రజాయతే ॥ 9 ॥

ఇతరులు కొందరు నీటినే జ్యేష్ఠునిగా తలచారు. వారు వేదవాదులు, నీటివల్లనే అన్నము సమృద్ధిగానవుతుంది నీటివల్లనే శుద్ధి కలుగుతుంది.

అద్భిరేవ ధృతం సర్వమాపో వై మాతరః స్మృతాః ।
త్రైలోక్యజీవనం వారి వదన్తీతి పురావిదః ॥ 10 ॥

నీరే అన్నింటిని ధరిస్తున్నది. నీరే మాతృసదృశులు. ముల్లోకములు జీవించుటకాధారము నీరే యనెదరని పూర్వవిదులు చెబుతారు.

ఉత్పన్నమమృతం హ్యద్భ్యస్తాభ్యశ్చౌషధిసంభవః ।
అగ్నిర్జ్యేష్ఠ ఇతి ప్రాహురాపో జ్యేష్ఠతమాః పరే ॥ 11 ॥

అమృతం నీటినుండే పుట్టింది. వాటినుండి ఔషధులు పుట్టాయి. అగ్నిని జ్యేష్ఠులంటారు. కాని నీరు జ్యేష్ఠతములు.

ఏవం మీమాంసమానాస్తే ఋషయో వేదవాదినః ।
విరుద్ధవాదినో మాం చ సమభ్యేత్యైవమబ్రువన్ ॥ 12 ॥

వేదవాదులైన ఋషులు ఇట్లు చర్చిస్తుండగా దానికి విరుద్ధంగా వాదించేవారు. నా వద్దకు వచ్చి యిట్లన్నారు.

ఋషయ ఊచుః :- ఋషులు పలికారు.

అగ్నేరపాం వద జ్యైష్ఠ్యం త్రైలోక్యస్య భవాన్ ప్రభుః ॥ 13 ॥

అగ్నికంటే నీరే గొప్పవాడని చెప్పండి. మీరు ముల్లోకములకు ప్రభువు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అహమప్యబ్రవం ప్రాప్తానృషీన్సర్వాన్యతవ్రతాన్ ।
ఉభౌ పూజ్యతమౌ లోక ఉభాభ్యాం జాయతే జగత్ ॥ 14 ॥

వచ్చిన యతవ్రతులైన ఋషులందరితో నేనప్పుడు వారిద్దరుకూడా లోకంలో పూజ్యతములే. వారిద్దరి వల్లనే ఈ సృష్టి జరుగుతున్నదని చెప్పాను.

ఉభాభ్యాం జాయతే హవ్యం కవ్యం చామృతమేవ చ ।
ఉభాభ్యాం జీవనం లోకే శరీరస్య చ ధారణమ్ ॥ 15 ॥

హవ్యం, కవ్యం అమృతం వారిద్దరివల్లనే కలుగుతున్నది. శరీరమును ధరించుట, లోకంలో జీవించుట వారిద్దరివల్లనే జరుగుతున్నది.

నానయోశ్చ విశేషోఽస్తి తతో జ్యైష్ఠ్యం సమం మతమ్ ।
తతో మద్వచనాజ్జ్యైష్ఠ్యముభయోర్నైవ కస్యచిత్ ॥ 16 ॥

వీరిద్దరిలో విశేషమేమీ లేదు. అందువలన జ్యేష్ఠత సమానమే. అందువలన నా అభిప్రాయప్రకారంగా నిద్దరిలో నెవరు జ్యేష్ఠులు కారు.

జ్యైష్ఠమన్యతరస్యేతి మేనిరే ఋషిసత్తమాః ।
న తృప్తా మమ వాక్యేన జగ్ముర్వాయుం తపస్వినః ॥ 17 ॥

ఆ ఋషి శ్రేష్ఠులప్పుడు జ్యేష్ఠుడు వేరేవాడనుకొన్నారు. నేను చెప్పినమాట వారికి తృప్తినివ్వక ఆ తాపసులందరూ వాయువువద్దకు వెళ్ళారు.

మునయ ఊచుః :- మునులు పలికారు.

కస్య జ్యైష్ఠ్యం భవాన్ ప్రాణో వాయో సత్యం త్వయి స్థితమ్ ॥ 18 ॥

ఓ వాయూ! నీవు ప్రాణమును కలిగియుండుట సత్యము. అటువంటప్పుడు మరొకరికెవరికి జ్యేష్ఠత్వమున్నది?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వాయురాహానలో జ్యేష్ఠః సర్వమగ్నౌ ప్రతిష్ఠితమ్ ।
నేత్యుక్త్వాఽన్యోన్యమృషయో జగ్ముస్తేఽపి వసున్ధరామ్ ॥ 19 ॥

అప్పుడు వాయువు వారితో అగ్నియే జ్యేష్ఠుడు. ఎందుకనగా, అన్నియును అగ్నియందే ప్రతిష్ఠించబడి యున్నవి. అప్పుడు ఋషులు పరస్పరం అంగీకరించక భూదేవి వద్దకు వెళ్ళారు.

మునయ ఊచుః :- మునులు పలికారు.

సత్యం భూమే వద జ్యేష్ఠమాధారోఽసి చరాచరే ॥ 20 ॥

భూదేవీ! నీవు చరాచరమునకాధారము. జ్యేష్ఠుడెవరో నిజము చెప్పు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భూమిరప్యాహ వినయాదాగతాంస్తానృషీనిదమ్ ॥ 21 ॥

భూదేవి కూడా వినయంగా ఋషులతో నిట్లన్నది.

భూమిరువాచ :- భూమి పలికింది.

మమాప్యాధారభూతాః స్యురాపో దేవ్యః సనాతనాః ।
అద్భ్యస్తు జాయతే సర్వం జ్యైష్ఠ్యమప్సు ప్రతిష్ఠితమ్ ॥ 22 ॥

సనాతనమైన జలదేవతలు నాకు ఆధారభూతమైనవారు. నీటివల్లనే అన్నీ ఏర్పడుతున్నవి. కనుక నీటికే జ్యేష్ఠత్వమున్నది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నేత్యుక్త్వాఽ న్యోన్యమృషయో జగ్ముః క్షీరోదశాయినమ్ ।
తుష్టువుర్వివిధైః స్తోత్రైః శంఖచక్రగదాధరమ్ ॥ 23 ॥

ఋషులా మాటను పరస్పరమంగీకరించక పాలసముద్రమునందు నిద్రించే శ్రీమన్నారాయణుని వద్దకు వెళ్ళారు. శంఖచక్రగదాధరుడైన ఆ స్వామిని వివిధస్తోత్రములచే నుతించారు.

ఋషయ ఊచుః :-ఋషులు పలికారు.

యో వేద సర్వం భువనం భవిష్యద్యజ్జాయమానం చ గుహానివిష్టమ్ ।
లోకత్రయం చిత్ర విచిత్రరూపమన్తే సమస్తం చ యమావివేశ ॥ 24 ॥

యదక్షరం శాశ్వత మప్రమేయం యం వేదవేద్యమృషయో వదన్తి ।
యమాశ్రితాః స్వేప్సితమాప్నువన్తి తద్వస్తు సత్యం శరణం వ్రజామః ॥ 25 ॥

సమస్త భువనములయొక్క భూతభవిష్యద్వర్తమానరహస్యములను, ముల్లోకములయొక్క చిత్రవిచిత్ర రూపమును, ఎరిగినవాడు, చివరకంతా ఎవనియందు లీనమగునో, ఋషులందరూ ఎవనిని అక్షరుడు, శాశ్వతుడు, అప్రమేయుడు, ఎవనిని వేదవేద్యుడని అంటారో, ఎవరిని ఆశ్రయించి తమకోరికలను నెరవేర్చుకొంటారో ఆ సత్యమైన వస్తువును శరణు పొందుతున్నాము.

భూతం మహాభూతజగత్ప్రధానం న విన్దతే యోగినో విష్ణురూపమ్ ।
తద్వక్తుమేతే ఋషయోఽత్ర యాతాః సత్యం వదస్వేహ జగన్నివాస ॥ 26 ॥

ఓ జగన్నివాసా! యోగులు మహాభూతరూపమైన జగత్తులో ప్రధానంగా వ్యాపించి వున్నది, సత్యమైనది అయిన విష్ణురూపాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అందువల్ల ఈ ఋషులు దానిని గురించి అడుగుటకు ఇక్కడకు వచ్చారు. వాస్తవమేదో చెప్పు.

త్వమన్తరాత్మాఽఖిలదేహభాజాం త్వమేవ సర్వం త్వయి సర్వమీశ ।
తథాఽపి జానన్తి న కోఽపి కుత్రాప్యహో భవన్తం ప్రకృతిప్రభావాత్ ॥
అన్తర్బహిః సర్వత ఏవ సన్తం విశ్వాత్మనా సంపరివర్తమానమ్ ॥ 27 ॥

సృష్టిలో జీవులందరిలోను నీవే అంతరాత్మవు. నీవే సర్వస్వము. ఓ ఈశా! సర్వమును నీవే. అయినా కూడా ఈ ప్రకృతి ప్రభావం వలన ఎక్కడ కూడా ఎవ్వరు కూడా నిన్ను తెలుసుకొనుటలేదు. ఎంత విచిత్రము? లోపల, వెలుపల అంతటా వున్నటువంటి నిన్ను, విశ్వాత్మునిగా మార్పుచెందే నిన్ను ఎవరూ కనుగొనుటలేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రాహ జగద్ధాత్రీ దేవీ వాగశరీరిణీ ॥ 28 ॥

అప్పుడు జగద్ధాత్రి దేవియగు అశరీరవాణి ఇలా పలికింది.

దైవీవాగువాచ :– దైవీవాక్కు పలికింది.

ఉభావారాధ్య తపసా భక్త్యా చ నియమేన చ ।
యస్య స్యాత్ప్రథమం సిద్ధిస్తద్భూతం జ్యేష్ఠముచ్యతే ॥ 29 ॥

వారిద్దరి నుద్దేశించి నియమనిష్ఠలతో, భక్తితో, తపస్సుచేసి మొదట ఎవరి వలన సిద్ధిని పొందుతారో ఆ భూతమే జ్యేష్ఠునిగా నిర్ణయిస్తారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా యయుః సర్వే ఋషయో లోకపూజితాః ।
శ్రాన్తాః ఖిన్నాన్తరాత్మానః పరం వైరాగ్యమాశ్రితాః ॥ 30 ॥

సర్వలోకైకజననీం భువనత్రయపావనీమ్ ।
గౌతమీమగమన్సర్వే తపస్తప్తుం యతవ్రతాః ॥ 31 ॥

లోకపూజితులైన ఋషులు అందరూ అలసిపోయి, లోపల ఖిన్నులై, మిక్కిలి వైరాగ్యమును పొంది, వారంతా సమస్తలోకములకు తల్లి, ముల్లోకములను పవిత్రంచేసే గౌతమీనది వద్దకు నియమవ్రతులై తపస్సు చేయుటకు వెళ్ళారు.

అబ్దైవతం తథాఽగ్నిం చ పూజనాయోద్యతాస్తదా ।
అగ్నేశ్చ పూజకా యే చ అపాం వై పూజనే స్థితాః ॥ 32 ॥
తత్ర వాగబ్రవీద్దైవీ వేదమాతా సరస్వతీ ॥

అప్పుడు వారు జలదేవతను, అగ్నిని పూజించుటకు సిద్ధమైనారు. అలా సిద్ధమైన అగ్నిని పూజించేవారిని, జలములను పూజించే వారినుద్దేశించి వేదమాత ఐన సరస్వతి దైవీవాక్కును ఇలా పలికింది.

దైవీవాగువాచ :– దైవీవాక్కు పలికింది.

అగ్నేరాపస్తథా యోనిరద్భిఃశౌచమవాప్యతే ।
అగ్నేశ్చ పూజకా యే చ వినాఽద్భిః పూజనం కథమ్ ॥ 33 ॥

అగ్నినుండి నీరుద్భవించింది. నీటిచేత శుచి ఏర్పడుతుంది. అగ్నిని పూజించువారు నీరు లేకుండా ఎలా పూజిస్తారు?

అప్సు జాతాసు సర్వత్ర కర్మణ్యధికృతో భవేత్ ।
తావత్కర్మణ్యనర్హోఽయమశుచిర్మలినో నరః ॥ 34 ॥

న మగ్నః శ్రద్ధయా యావదప్సు శీతాసు వేదవిత్ ।
తస్మాదాపో వరిష్ఠాః స్యుర్మాతృభూతా యతః స్మృతాః ॥
తస్మాజ్జ్యైష్ఠమపామేవ జనన్యోఽగ్నేర్విశేషతః ॥ 35 ॥

అంతటా నీరు ఏర్పడినప్పుడు అంతటా కర్మలు చేయుట యందధికారమేర్పడుతుంది. శుచిగాని వాడు, మలినుడైన నరుడు, అశుచిగా నున్నంతవరకు కర్మలను చేయుట కర్హుడు గాడు. వేదము తెలిసినవాడు శ్రద్ధగా చల్లని నీటియందు మునిగి స్నానం చేయనంతవరకు మలినుడు. అటువంటి అశుచి అయినవానికి కర్మలు చేసే అధికారంలేదు. అందువలన నీరు శ్రేష్ఠములైనవి. అందుకే వాటిని మాతృరూపులన్నారు. అందువలన జ్యేష్ఠత్వము జలములకే. విశేషించి అగ్నికి జలములు మాతృరూపాలు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్వచః శుశ్రువుస్తేఽథ ఋషయో వేదవాదినః ।
నిశ్చయం చ తతశ్చక్రుర్భవేజ్జ్యైష్ఠ్యమపామితి ॥ 36 ॥

వేదవాదులైన ఋషులు ఆ మాటలు విన్నారు. తరువాత జలములకే జ్యేష్ఠత్వమని నిశ్చయం చేశారు.

యత్ర తీర్థే వృత్తమిదమృషిసత్రే చ నారద ।
తపస్తీర్థం తు తత్ప్రోక్తం సత్రతీర్థం తదుచ్యతే ॥ 37 ॥

ఓ నారదా! ఏ తీర్థంలో, ఏ ఋషిసత్రంలో ఈ కథ జరిగిందో ఆ తీర్థమును తపస్తీర్థమని, సత్రతీర్థమని చెప్పారు.

అగ్నితీర్థం చ తత్ప్రోక్తం తథా సారస్వతం విదుః ।
తేషు స్నానం చ దానం చ సర్వకామప్రదం శుభమ్ ॥ 38 ॥

దానిని అగ్నితీర్థం, అలాగే సారస్వతతీర్థమని కూడా అంటారు. ఈ తీర్థములలో స్నానం, దానం చేస్తే కోరికలన్నీ నెరవేరుతాయి. శుభం కలుగుతుంది.

చతుర్దశ శతాన్యత్ర తీర్థానాం పుణ్యదాయినామ్ ।
తేషు స్నానం చ దానం చ స్వర్గమోక్షప్రదాయకమ్ ॥ 39 ॥

పుణ్యమునిచ్చే ఈ పద్నాలుగు వందల తీర్థములలో స్నానం, దానం చేస్తే స్వర్గమును, మోక్షమును పొందుతారు.

కృతం సందేహహరణమృషీణాం యత్ర భాషయా ।
సరస్వత్యభవత్తత్ర గంగయా సంగతా నదీ ॥
మాహాత్మ్యం తస్య కో వక్తుం సంగమస్య క్షమో నరః ॥ 40 ॥

ఎక్కడ సరస్వతీదేవి ఋషుల సందేహములను తీర్చిందో అక్కడ గంగానదితో సరస్వతీనది సంగమించింది. ఆ సంగమం మాహాత్మ్యాన్ని చెప్పుటకు ఏ మానవుడు సమర్థుడవుతాడు?

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమహాత్మ్యే 'తపస్తీర్థాది చతుర్దశశతతీర్థవర్ణనం' నామ షట్ పంచాశోఽధ్యాయః ॥ 56 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'తపస్తీర్థము మొదలుగా గల పద్నాలుగు వందలతీర్థ వర్ణన'మనే పేరుగల యాభై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తపంచాశోఽధ్యాయః - యాభై ఏడవ అధ్యాయం

ఆర్ష్టిషేణాద్యష్టోత్తర శతాధిక పంచదశ సహస్రతీర్థవర్ణనమ్

ఆర్ష్టిషేణ మొదలుగాగల పదహైదువేల ఎనిమిదివందల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవతీర్థమితి ఖ్యాతం గంగాయా ఉత్తరే తటే ।
తస్య ప్రభావం వక్ష్యామి సర్వపాపప్రణాశనమ్ ॥ 1 ॥

గంగానది ఉత్తర తీరమునందు సమస్త పాపములను హరించే దేవతీర్థమనే చాలా ప్రసిద్ధమైన తీర్థమున్నది. దాని ప్రభావమును చెబుతున్నాను.

ఆర్ష్టిషేణ ఇతి ఖ్యాతో రాజా సర్వగుణాన్వితః ।
తస్య భార్యా జయా నామ సాక్షాల్లక్ష్మీరివాపరా ॥ 2 ॥

సర్వగుణశోభితుడైన ఆర్ష్టిషేణుడను ఒక ప్రసిద్ధుడైన రాజుండేవాడు. అతని భార్యపేరు జయ. ఆమె సాక్షాత్తుగా అపర లక్ష్మీదేవివలె వుండేది.

తస్య పుత్రో భరో నామ మతిమాన్ పితృవత్సలః ।
ధనుర్వేదే చ వేదే చ నిష్ణాతో దక్ష ఏవ చ ॥ 3 ॥

అతని కుమారుని పేరు భరుడు. అతడు బుద్ధిమంతుడు, పితృవత్సలుడు కూడా. భరుడు ధనుర్వేదమునందు వేదమునందు నిష్ణాతుడు. మంచి సమర్థుడు కూడా.

తస్య భార్యా రూపవతీ సుప్రభేత్యభివిశ్రుతా ।
ఆర్ష్టిషేణస్తతో రాజా పుత్రే రాజ్యం నివేశ్య సః ॥ 4 ॥

పురోధసా చ ముఖ్యేన దీక్షాం చక్రే జనేశ్వరః ।
సరస్వత్యాస్తతస్తీరే హయమేధాయ యత్నవాన్ ॥ 5 ॥

అతని భార్య సుప్రభ, మంచి సౌందర్యవంతురాలని పేరొందినది. కొంతకాలమునకా ఆర్ష్టిషేణుడు తన కుమారునికి రాజ్యపట్టాభిషేకం చేసి, ఆ రాజు ముఖ్య పురోహితుని సంప్రదించి, సరస్వతీ నదీతీరమునందు అశ్వమేధ యాగమును చేయుటకై ప్రయత్నించి దీక్షను పొందాడు.

ఋత్విగ్భిర్ఋషిముఖ్యైశ్చ వేదశాస్త్రపరాయణైః ।
దీక్షితం తం నృపశ్రేష్ఠం బ్రాహ్మణాగ్నిసమీపతః ॥ 6 ॥

మిథుర్దానవరాట్ శూరః పాపబుద్ధిః ప్రతాపవాన్ ।
మఖం విధ్వస్య నృపతిం సభార్యం సపురోహితమ్ ॥ 7 ॥

ఆదాయ వేగాత్స ప్రాగాద్రసాతల తలం మునే ।
నీతే తస్మిన్నృపవరే యజ్ఞే నష్టే తతోఽమరాః ॥ 8 ॥

ఋత్విజశ్చ యయుః సర్వే స్వం స్వం స్థానం మఖాత్తతః ।
పురోహితసుతో రాజ్ఞో దేవాపిరితి విశ్రుతః ॥ 9 ॥

బాలస్తాం మాతరం దృష్ట్వా ఆత్మనః పితరం న చ ।
దృష్ట్వా స విస్మయో భూత్వా దుఃఖితోఽతీవ చాభవత్ ॥ 10 ॥

వేదశాస్త్రపరాయణులైన ఋత్విక్కులు, ఋషిముఖ్యులైన వారితో దీక్షలోనున్న ఆ రాజశ్రేష్ఠుని బ్రాహ్మణాగ్ని సమీపంనుండి, మిథుడను పేరుగలవాడు పాపబుద్ధిగలిగి ప్రతాపవంతుడు, శూరుడగు రాక్షసరాజు యజ్ఞమును ధ్వంసంచేసి, రాజును, రాజుభార్యను పురోహితునితో సహ, తీసుకొని వేగంగా అతడు రసాతలం చేరాడు. ఓ మునీ! ఆ రాజును తీసుకొని వెళ్ళగా యజ్ఞము నష్టం కాగా ఆ దేవతలు, ఋత్విక్కులందరు యజ్ఞవాటికనుండి తమ తమ స్థానములకు వెళ్ళారు. రాజపురోహితుని కుమారుడగు దేవాపి యనువాడు, ఆ బాలుడు తన తల్లిని చూచి, తనతండ్రి కానరాక మిక్కిలి ఆశ్చర్యపడి చాలా దుఃఖించాడు.

స మాతరం తు పప్రచ్ఛ పితా మే క్వ గతోఽమ్బికే ।
పితృహీనో న జీవేయం మాతః సత్యం వదస్వ మే ॥ 11 ॥

అతడు తన తల్లితో అమ్మా! నాన్నగారు ఎక్కడికి వెళ్ళారు. నాన్నలేకుండా నేను బ్రతుకలేను. నాకు నిజం చెప్పు.

ధిగ్ధిక్ పితృవిహీనానాం జీవితం పాపకర్మణామ్ ।
న వక్షి యది మే మాతర్జలమగ్నిమథాఽఽవిశే ॥ 12 ॥

ఛీ 'ఛీ' తండ్రిలేనివారి జీవితం పాపకర్మలు చేసిన వారి జీవితంవలె వ్యర్థం. అమ్మా! నీవు చెప్పకపోతే నేను నీటిలోనో, అగ్నిలోనో దూకుతాను.

పుత్రం ప్రోవాచ సా మాతా రాజ్ఞో భార్యా పురోధసః ।
దానవేన తలం నీతో రాజ్ఞా సహ పితా తవ ॥ 13 ॥

అప్పుడా రాజపురోహితుని భార్యయగు ఆ తల్లి తన కొడుకుతో, రాజుతో గూడా నీ తండ్రిని ఆ రాక్షసుడు రసాతలమునకు తీసుకొని వెళ్ళాడని చెప్పింది.

దేవాపిరువాచ :- దేవాపి పలికాడు.

క్వ నీతః కేన వా నీతః కథం నీతః క్వ కర్మణి ।
కేషు పశ్యత్సు కిం స్థానం దానవస్య వదస్వ మే ॥ 14 ॥

ఎక్కడికి తీసుకువెళ్ళినాడు? ఎవరు తీసుకుని వెళ్ళినారు? ఎలా తీసుకొని వెళ్ళినారు? ఏమి పనికై తీసుకొని వెళ్ళినారు? ఎవరు చూస్తుండగా ఈ పని చేసినారు? దానవుడు ఎక్కడవుండునో నాకు చెప్పు.

మాతోవాచ :- తల్లి పలికింది.

దీక్షితం యజ్ఞసదసి సభార్యం సపురోధసమ్ ।
రాజానం తం మిథుర్దైత్యో నీతవాన్ స రసాతలమ్ ॥
పశ్యత్సు దేవసంఘేషు వహ్నిబ్రాహ్మణసన్నిధౌ ॥ 15 ॥

దీక్షతో యజ్ఞమంటపంలోవున్నరాజును, అతని భార్యను, పురోహితుని గూడా మిథుడనే దైత్యుడు అగ్ని, బ్రాహ్మణులుండగానే దేవగణము చూస్తుండగా రసాతలమునకు తీసుకొనివెళ్ళాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తన్మాతృవచనం శ్రుత్వా దేవాపిః కృత్యమస్మరత్ ।
దేవాన్పశ్యేఽథవాఽగ్నిం వా ఋత్విజో వాఽసురాంస్తథా ॥ 16 ॥

తల్లిమాటను విన్న దేవాపి కర్తవ్యాన్ని స్మరించాడు. దేవతలను లేదా అగ్నిని, లేదా ఋత్విక్కులను, అట్లే అసురులను చూస్తాను.

ఏతేష్వేవ పితాఽన్వేష్యో నాన్యత్రేతి మతిర్మమ ।
ఇతి నిశ్చిత్య దేవాపిర్భరం ప్రాహ నృపాత్మజమ్ ॥ 17 ॥

వీరిలోనే నా తండ్రిని వెదుకవలెను. మరొకచోట అవసరంలేదని నా అభిప్రాయం అనుకొని, నిశ్చయించుకొని దేవాపి రాజకుమారుడగు భరునితో ఇలా అన్నాడు.

దేవాపిరువాచ :- దేవాపి పలికాడు.

తపసా బ్రహ్మచర్యేణ వ్రతేన నియమేన చ ।
ఆనేతవ్యా మయా సర్వే నీతా యే చ రసాతలమ్ ॥ 18 ॥

రసాతలమున కెవ్వరిని తీసుకొని వెళ్ళారో వారినందరిని తపస్సుతో, బ్రహ్మచర్యంతో, వ్రతంతో, నియమనిష్ఠలతో సాధించి తీసుకొనిరావలెను.

జాతే పరాభవే ఘోరే యో న కుర్యాత్ప్రతిక్రియామ్ ।
నరాధమేన కిం తేన జీవతా వా మృతేన వా ॥ 19 ॥

తనకు ఘోరమైన పరాభవం జరిగినప్పుడు దానికి తగిన ప్రతిక్రియను చేయని నరాధముడు జీవించినా, మరణించినా ప్రయోజనమేమి?

త్వం ప్రశాధి మహీం కృత్స్నామార్ష్టిషేణః పితా యథా ।
మాతా మమ త్వయా పాల్యా రాజన్యావత్ మమాఽఽగతిః ॥ 20 ॥
భవేచ్చ కృతకార్యస్య అనుజానీహి మాం భర ॥

రాజా! నీ తండ్రి ఆర్ష్టిషేణుడు ఈ భూమినెలా పాలించాడో అలాగే నీవుకూడా ఈ విశాల రాజ్యమును పరిపాలించు. నేను వచ్చేవరకు నా తల్లిని నీవు రక్షించవలెను. ఓ భరా! కార్యం సానుకూలమగునట్లు నాకనుజ్ఞనివ్వు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భరేణోక్తః స దేవాపిః సర్వం నిశ్చిత్య యత్నతః ॥ 21 ॥

దేవాపి చెప్పినది విని అన్నీ నిశ్చయించుకొని భరుడిట్లన్నాడు.

భరోవాచ:– భరుడు పలికాడు.

సిద్ధిం కురు సుఖం యాహి మా చిన్తామల్పికాం భజ ॥ 22 ॥

నీ వే కొంచెమైనా చింతపెట్టుకోకుండా సుఖంగా వెళ్ళు. కార్యసిద్ధిని పొందు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో దేవాపిరమరరాజాంఘ్రిధ్యానతత్పరః ।
ఋత్విజోఽన్వేష్య యత్నేన నత్వా తాన్ ఋత్విజః పృథక్ ॥
కృతాంజలిపుటో బాలో దేవాపిర్వాక్యమబ్రవీత్ ॥ 23 ॥

తరువాత ఆ బాలుడైన దేవాపి ఇంద్రుని గూర్చి ధ్యానంచేసి, మిక్కిలి ప్రయత్నం చేసి, ఋత్విక్కులను వెదకి, వారికి నమస్కరించి వారితో నిట్లన్నాడు.

దేవాపిరువాచ :– దేవాపి పలికాడు.

భవద్భిశ్చ మఖో రక్ష్యో యజమానశ్చ దీక్షితః ।
పురోధాశ్చ తథా రక్ష్యః పత్నీ యా దీక్షితస్య తు ॥ 24 ॥

మీరు యజ్ఞమును, దీక్షను పొందిన యజమానిని, అట్లే పురోహితుని, దీక్షను పొందిన యజమానిభార్యను రక్షించవలసి వున్నది.

భవత్సు తత్ర పశ్యత్సు యజ్ఞం విధ్వస్య ఋత్విజః ।
రాజాదయస్తేన నీతాస్తన్న యుక్తతమం భవేత్ ॥ 25 ॥

మీరంతా చూస్తుండగానే యజ్ఞమును ధ్వంసంచేసి, ఋత్విక్కులను, రాజాదులను అతడు తీసుకొని వెళ్ళాడు. ఇది యుక్తమైనదిగా లేదు.

అథాప్యేతదహం మన్యే భవన్తస్తానరోగిణః ।
దాతుమర్హన్తి విప్రాగ్ర్యా హ్యన్యథా శాపమర్హథ ॥ 26 ॥

ఐనప్పటికి ఓ విప్రశ్రేష్ఠులారా! మీరు వారిని ఆరోగ్యవంతులుగా ఇవ్వండి. లేనిచో శాపమునకు గురికావలసి వస్తుందని నేననుకుంటున్నాను.

ఋత్విజ ఊచుః :– ఋత్విక్కులు పలికారు.

మఖేఽగ్నిః ప్రథమం పూజ్యో హ్యగ్నిరేవాత్ర దైవతమ్ ।
తస్మాద్వయం న జానీమో హ్యగ్నీనాం పరిచారకాః ॥ 27 ॥

యజ్ఞంలో మొదట పూజలందుకొనేవాడు అగ్ని. అక్కడ అగ్నియే దైవం. మేము అగ్నులకు సేవకులం మాత్రమే. అందువలన మాకు తెలియదు.

స ఏవ దాతా భోక్తా చ హర్తా కర్తా చ హవ్యవాట్ ॥ 28 ॥

ఆ అగ్నియే దాత, భోక్త, హర్త, కర్త, హవ్యవాహనుడు అన్నీ అతడే.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఋత్విజః పృష్ఠతః కృత్వా దేవాపిర్జాతవేదసమ్ ।
పూజయిత్వా యథాన్యాయమగ్నయే తన్న్యవేదయత్ ॥ 29 ॥

అప్పుడు దేవాపి ఋత్విక్కులను వెనుకకు పెట్టి, అగ్నిదేవుని పూజించి, ఆ అగ్నికి యథాన్యాయంగా దానిని నివేదించాడు.

అగ్నిరువాచ :– అగ్ని పలికాడు.

యథర్త్విజస్తథా చాహం దేవానాం పరిచారకః ।
హవ్యం వహామి దేవానాం భోక్తారో రక్షకాశ్చ తే ॥ 30 ॥

ఋత్విక్కులెలా పరిచారకులో అలాగే నేను కూడా దేవతలకు పరిచారకుణ్ణి మాత్రమే. దేవతలకు హవ్యమును తీసుకొని వెళుతున్నాను. ఆ యజ్ఞభోక్తలు, రక్షకులు వారే.

దేవాపిరువాచ :–దేవాపి పలికాడు

దేవానాహూయ యత్నేన హవిర్భాగాన్ పృథక్ పృథక్ ।
దాస్యేఽహమేష శీఘ్రం త్వం తస్మాద్యాహి సురాన్ ప్రతి ॥ 31 ॥

దేవతలను ప్రయత్నపూర్వకంగా పిలిచి వారి వారి యజ్ఞభాగాన్ని వేరు వేరుగా నివ్వడమే నా పని. కావున నీవు త్వరగా దేవతల వద్దకు వెళ్ళు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

దేవాపిః స సురాన్ ప్రాప్య నత్వా తేభ్యః పృథక్ పృథక్ ।
ఋత్విగ్వాక్యం చాగ్నివాక్యం శాపం చాపి న్యవేదయత్ ॥ 32 ॥

దేవాపి అప్పుడు దేవతల వద్దకు వెళ్ళి వారికి వేరు వేరుగా నమస్కరించి, ఋత్విక్కులు పలికిన మాటను, అగ్నిహోత్రుడు పలికిన మాటను, తానుశపిస్తానన్న విషయాన్ని కూడా నివేదించాడు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

ఆహూతా వైదికైర్మన్త్రైర్ఋత్విగ్భిశ్చ యథాక్రమమ్ ।
భోక్ష్యామహే హవిర్భాగాన్న స్వతన్త్రా ద్విజోత్తమ ॥ 33 ॥

ఓ ద్విజోత్తమా! ఋత్విక్కులు వైదికమంత్రములు చదివి, యథాక్రమంగా మమ్మల్ని పిలిచారు. అలాగే మేము హవిర్భాగమును భుజిస్తున్నాము. అంతేకాని మేము స్వతంత్రులం కాము.

తస్మాద్వేదానుగా నిత్యం వయం వేదేన చోదితాః ।
పరతన్త్రాస్తతో విప్ర వేదేభ్యస్తన్నివేదయ ॥ 34 ॥

మేము వేదం చెప్పినట్లుగా నడుచుకొనేవారము. నిత్యం వేదము ననుసరించేవారము. మేము వేదమునకు పరతంత్రులమేకాని స్వతంత్రులం కాము. కావున ఓ విప్రా! ఆ విషయమును వేదములకు నివేదించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

స దేవాపిః శుచిర్భూత్వా వేదానాహూయ యత్నతః ।
ధ్యానేన తపసా యుక్తో వేదాశ్చాపి పురోఽభవన్ ॥ 35 ॥

ఆ దేవాపి కూడా శుచియై, ధ్యానంతో, తపస్సుతో కూడి ప్రయత్నించి వేదములను పిలువగా నా వేదములు గూడ నెదురుగా నిలిచాయి.

వేదానువాచ దేవాపిర్నమస్య తు పునః పునః ।
ఋత్విగ్వాక్యం చాగ్నివాక్యం దేవవాక్యం న్యవేదయత్ ॥ 36 ॥

అప్పుడు దేవాపి ఆ వేదములకు మాటిమాటికి నమస్కరించి, ఋత్విక్కులు, అగ్ని, దేవతలు పలికిన మాటను నివేదించాడు.

వేదా ఊచుః :– వేదములు పలికాయి.

పరతంత్రా వయం తాత! ఈశ్వరస్య వశానుగాః ।
అశేషజగదాధారో నిరాధారో నిరంజనః ॥ 37 ॥

సర్వశక్త్యైకసదనం నిధానం సర్వసంపదామ్ ।
స తు కర్తా మహాదేవః సంహర్తా స మహేశ్వరః ॥ 38 ॥

నాయనా! మేము స్వతంత్రులం గాదు. ఈశ్వరుని వశంలోవుండి నడుచుకొనేవారము. జగత్తంతటికీ నిరంజనుడు, ఆధారమైనవాడు, తనకు ఆధారంలేనివాడు, సమస్తశక్తులకొకే స్థానం, సర్వసంపదలకు మూలం, కర్త, ఆ మహాదేవుడే. ఆ మహేశ్వరుడే లయకారకుడు.

వయం శబ్దమయా బ్రహ్మన్వదామో విద్మ ఏవ చ ।
అస్మాకమేతత్కృత్యం స్యాద్వదామో యత్తు పృచ్ఛసి ॥ 39 ॥

బ్రహ్మస్వరూపా మేము కేవలం శబ్దమయులము, చెప్పువారము, తెలుసుకొనువారము. మా పని ఇంత మాత్రమే ఉంటుంది. నీవు అడుగుతున్న దానిని గూర్చి చెబుతాము.

కేన నీతాస్తస్య నామ తత్పురం తద్బలం తథా ।
భక్షితాః కింతు నో నష్టా ఏతజ్జానీమహే వయమ్ ॥ 40 ॥

నీ తండ్రి మొదలైనవానిని ఎవరు తీసుకొని వెళ్ళారో, అతని పేరు, ఆ నగరం, అతని బలం మాకు తెలుసు. వారు భక్షించబడ్డారు కాని నశించలేదు. ఇది మాకు తెలుసు.

యథా చ తవ సామర్థ్యం యమారాధ్య చ యత్ర చ ।
స్యాదిత్యేతచ్చ జానీమో యథా ప్రాప్స్యసి తాన్పునః ॥ 41 ॥

నీ సామర్థ్యమెంతో, ఎక్కడ, ఎవరిని ఆరాధించి తిరిగి వారినెలా పొందగలవో అది కూడా మాకు తెలుసు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వాఽవదద్వేదాన్విచార్య సుచిరం హృది ॥ 42 ॥

ఈ మాటను విని హృదయంలో వేదాలను చక్కగా విచారించి ఇలా పలికాడు.

దేవాపి రువాచ :– దేవాపి పలికాడు.

వేదా వదన్త్వేతదేవ సర్వమాశు యథార్థతః ।
సర్వాన్ ప్రాప్స్యే తలం నీతానలం తేభ్యో నమోఽస్తు వః ॥ 43 ॥

ఓ వేదములారా! రసాతలమునకు తీసుకువెళ్ళిన అగ్ని మున్నగువారిని ఏలా పొందుతానో దానినంతా యథార్థంగా, త్వరగా చెప్పండి నాకదిచాలు. మీకు నమస్కారం.

వేదా ఊచుః :– వేదములు పలికాయి.

గౌతమీం గచ్ఛ దేవాపే! తత్ర స్తుహి మహేశ్వరమ్ ।
సుప్రసన్నస్తవాభీష్టం దాస్యత్యేవ కృపాకరః ॥ 44 ॥

దేవాపీ! నీవు గౌతమీనది వద్దకు వెళ్ళు. అక్కడ మహేశ్వరుని స్తుతించు. కృపాకరుడగు శివుడు సుప్రసన్నుడై నీ కోరికను దీరుస్తాడు.

భవేద్దేవః శివః ప్రీతః స్తుతః సత్యం మహామతే ।
ఆర్ష్టిషేణశ్చ నృపతిస్తస్య జాయా జయా సతీ ॥ 45 ॥
ఉపమన్యుస్తవ పితా తలే తిష్ఠన్త్యరోగిణః ।
వరదానాన్మహేశస్య మిథుం హత్వా చ రాక్షసమ్
యశః ప్రాప్స్యసి ధర్మం చ ఏతచ్ఛక్యం న చేతరమ్! ॥ 46 ॥

ఓ మహామతీ! స్తోత్రమునకా శివదేవుడు ప్రీతుడవుతాడు. ఇది సత్యం. ఆర్ష్టిషేణ మహారాజు, అతని భార్య పతివ్రతయైన జయ, నీ తండ్రి, ఉపమన్యువు రసాతలంలో ఆరోగ్యంగా వున్నారు. మహేశ్వరుని వరదానం వలన రాక్షసుడైన మిథుని చంపి ధర్మమును, కీర్తిని పొందగలవు. ఇంతకంటె వేరేమీలేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్వేదవచనాద్బాలో దేవాపిర్గౌతమీం గతః ।
స్నాత్వా కృతక్షణో విప్రస్తుష్టావ చ మహేశ్వరమ్ ॥ 47 ॥

వేదములు చెప్పినట్లుగా నా బాలుడగు దేవాపి గౌతమీ నదివద్దకు వెళ్ళాడు. స్నానం చేసి, వెంటనే ఆ విప్రుడు మహేశ్వరుని స్తుతించాడు.

దేవాపిరువాచ :- దేవాపి పలికాడు.

బాలోఽహం దేవదేవేశ గురూణాం త్వం గురుర్మమ ।
న మే శక్తిస్త్వత్స్తవనే తుభ్యం శంభో నమోఽస్తు తే ॥ 48 ॥

దేవదేవేశా! నేను బాలుడను. నా గురువులందరిలోనూ నీవే గురుడవు. నిన్ను స్తుతించుటకు నాకు శక్తి లేదు. శంభూ! నీకు నా నమస్కారం.

న త్వాం జానన్తి నిగమా న దేవా మునయో న చ ।
న బ్రహ్మా నాపి వైకుంఠో యోఽసి సోఽసి నమోఽస్తు తే ॥ 49 ॥

వేదములు నిన్నెరుగవు, దేవతలు, మునులు నిన్ను తెలుసుకోలేరు. బ్రహ్మకాని, విష్ణువుకాని నిన్ను తెలుసుకోలేరు. అట్టిస్థితిగల నీకు నమస్కారం.

యేఽనాథా యే చ కృపణా యే దరిద్రాశ్చ రోగిణః ।
పాపాత్మానో యే చ లోకే తాంస్త్వం పాసి మహేశ్వర ॥ 50 ॥

ఓ మహేశ్వరా! ఈ లోకంలో ఎవరైతే అనాథలు, దయనీయులు, దరిద్రులు, రోగులు, పాపాత్ములున్నారో వారినందరినీ నీవు రక్షిస్తున్నావు.

తపసా నియమైర్మన్త్రైః పూజితాస్త్రిదివౌకసః ।
త్వయా దత్తం ఫలం తేభ్యో దాస్యన్తి జగతాం పతే ॥ 51 ॥

ఓ జగత్పతీ! తపస్సుతో, నియమాలతో, మంత్రములతో పూజలందుకొనే దేవతలు నీవిచ్చిన ఫలమును వారికిస్తున్నారు.

యాచితారశ్చ దాతారస్తేభ్యో యద్యన్మనీషితమ్ ।
భవతీతి న చిత్రం స్యాత్త్వం విపర్యయకారకః ॥ 52 ॥

యాచించేవారికి, ఇచ్చేవారికి ఏదేది యిష్టమో అదంతా సిద్ధించడం ఆశ్చర్యమేమీ కాదు. నీవు మాత్రం విపరీతంగా అనగా ఒకరి అనుగ్రహం వలన ఇచ్చే వాడవుగా కాకుండా, నీవే స్వయంగా మనోరథాలనిస్తున్నాను.

యేఽజ్ఞానినో యే చ పాపా యే మగ్నా నరకార్ణవే ।
శివేతి వచనాన్నాథ తాన్పాసి త్వం జగద్గురో ॥ 53 ॥

స్వామీ! జగద్గురూ! అజ్ఞానులు, పాపులు, నరకాల్లో మునిగిన వారొక్కసారి శివా అని పలికితే చాలు వారిని నీవు రక్షిస్తున్నావు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతస్తస్య పురఃప్రాహ త్రిలోచనః ॥ 54 ॥

ఇలా స్తోత్రంచేస్తున్న వానిముందు శివుడు ప్రత్యక్షమై ఇలా అన్నాడు.

శివ ఉవాచ :– శివుడు పలికాడు.

వరం బ్రూహ్యథ దేవాపే! అలం దైన్యేన బాలక! ॥ 55 ॥

దేవాపీ! దైన్యమును వదిలివేయి. బాలకా! ఇక వరం కోరుకో.

దేవాపిరువాచ :– దేవాపి పలికాడు.

రాజానం రాజపత్నీం చ పితరం చ గురుం మమ ।
ప్రాప్తుమిచ్ఛే జగన్నాథ! నిధనం చ రిపోర్మమ ॥ 56 ॥

ఓ జగన్నాథా! రాజును, రాజుభార్యను, నా గురువైన తండ్రిని పొందగోరుతున్నాను. నా శత్రువు మరణించ వలెనని కోరుతున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

దేవాపి వచనం శ్రుత్వా తథేత్యాహాఖిలేశ్వరః ।
దేవాపేః సర్వమభవదాజ్ఞయా శంకరస్య తత్ ॥ 57 ॥

దేవాపి మాటను విని అఖిలేశ్వరుడు. అట్లేయగుగాక అన్నాడు. శంకరుని ఆజ్ఞతో దేవాపి కోరినదంతా నెరవేరింది.

ఆహూయ స్వగణం శమ్భుర్దేవాపి కరుణాకరః ।
నన్దినం ప్రేషయామాస తతః శూలేన నారద ॥ 58 ॥

ఓ నారదా! ఆ తరువాత దేవాపిపై కరుణచూపిన శివుడు తన గణమును పిలిచి శూలంతోగూడ నందిని పంపాడు.

రసాతలే మిథుం నన్దీ హత్వా చాసురపుంగవాన్ ।
తత్పిత్రాదీన్ సమానీయ తస్మై తాన్స నివేదయత్ ॥ 59 ॥

రసాతలంలో నంది మిథుని, అట్లే రాక్షసశ్రేష్ఠులను చంపి దేవాపి తండ్రి మొదలగు వారినందరిని తీసుకొనివచ్చి అప్పగించాడు.

హయమేధశ్చ తత్రాఽఽసీదార్ష్టిషేణస్య ధీమతః ।
అగ్నిశ్చ ఋత్విజో దేవా వేదాశ్చ ఋషయోఽబ్రువన్ ॥ 60 ॥

ధీమంతుడైన ఆర్ష్టిషేణుని అశ్వమేధయాగం కూడా అయింది. అగ్ని, ఋత్విక్కులు, దేవతలు, వేదములు, ఋషులు మున్నగువారందరు ఇలా అన్నారు.

అగ్న్యాదయ ఊచుః :–అగ్న్యాదులు పలికారు.

యత్ర సాక్షాదభూచ్ఛంభుర్దేవాపే భక్తవత్సలః ।
దేవదేవో జగన్నాథో దేవతీర్థమభూచ్చ తత్ ॥ 61 ॥

ఆ దేవదేవుడు, జగన్నాథుడు, భక్తవత్సలుడైన శివుడు దేవాపికి సాక్షాత్కరించి, నిలచిన ఆ ప్రదేశము దేవతీర్థమైంది.

సర్వపాపక్షయకరం సర్వసిద్ధిప్రదం నృణామ్ ।
పుణ్యదం తీర్థమేతత్స్యాత్తవ కీర్తిశ్చ శాశ్వతీ ॥ 62 ॥

ఈ తీర్థం సర్వపాపములను నశింపచేస్తుంది. మానవులకు సర్వసిద్ధులను కలుగజేస్తుంది. పుణ్యమును కలిగిస్తుంది. నీకు శాశ్వతమైన కీర్తిని ప్రసాదిస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

అశ్వమేధే నివృత్తే తు సురాస్తేభ్యో వరాన్దదుః ।
స్నాత్వా కృతార్థా గంగాయాం తతస్తే దివమాక్రమన్ ॥ 63 ॥

అశ్వమేధయాగం పూర్తయిన తర్వాత దేవతలు వారికి వరములిచ్చారు. ఆ తరువాత వారు గంగలో స్నానం చేసి కృతార్థులై, స్వర్గం చేరారు.

తతః ప్రభృతి తత్రాసంస్తీర్థాని దశ పంచ చ ।
సహస్రాణి శతాన్యష్టావుభయోరపి తీరయోః ॥
తేషు స్నానం చ దానం చ హ్యతీవ ఫలదం విదుః ॥ 64 ॥

అప్పటినుండి గంగానది ఉభయతీరాలలో పదహైదువేల ఎనిమిదివందల తీర్థములేర్పడినాయి. వాటిలో స్నానం, దానం చేయడం మిక్కిలి ఫలప్రదమని అంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'ఆర్ష్టిషేణాద్యష్టోత్తర శతాధిక పంచదశ సహస్ర తీర్థవర్ణనం' నామ సప్తపంచాశోఽధ్యాయః ॥ 57 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో ఆర్ష్టి షేణ మొదలుగాగల పదహైదువేల ఎనిమిది వందల తీర్థముల వర్ణనమనే పేరుగల యాభై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టపంచాశోఽధ్యాయః - యాభై ఎనిమిదవ అధ్యాయం

తపోవన నన్దినీ సంగమేశ్వర దేవీదాక్షాయణీ సిద్ధేశ్వర వైష్ణవ శార్దూలాగ్ని చక్రతీర్థాది త్రింశత్ సహస్రతీర్థవర్ణనమ్

తపోవన, నందినీ, సంగమేశ్వర, దేవీదాక్షాయణీ, సిద్ధేశ్వర, వైష్ణవ, శార్దూల, అగ్ని, చక్రతీర్థం మున్నగు ముప్పైవేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తపోవనమితి ఖ్యాతం నన్దినీ సంగమం తథా ।
సిద్ధేశ్వరం తత్ర తీర్థం గౌతమ్యా దక్షిణే తటే ॥ 1 ॥

శార్దూలం చేతి విఖ్యాతం తేషాం వృత్తమిదం శృణు ।
యస్య శ్రవణమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 2 ॥

గౌతమీనది దక్షిణతీరంలో తపోవనం, నందినీసంగమం, సిద్ధేశ్వరం శార్దూలమనే ప్రసిద్ధమైన తీర్థాలున్నాయి. వాటి వృత్తాంతాన్ని చెబుతున్నాను, విను. ఆ తీర్థాల చరిత్రను విన్నంతనే పాపాలన్నీ పోతాయి.

అగ్నిర్హోతా పురా త్వాసీద్దేవానాం హవ్యవాహనః ।
భార్యాం ప్రాప్తో దక్షసుతాం స్వాహాం నామ సురూపిణీమ్ ॥ 3 ॥

పూర్వం హవ్యవాహనుడైన అగ్ని దేవతలకు హోతగా నుండినాడు. అతడు దక్షుని కూతురు, సౌందర్యవతియైన స్వాహా దేవిని భార్యగా పొందాడు.

సాఽనపత్యా పురా చాఽఽసీత్పుత్రార్థం తప ఆవిశత్ ।
తపశ్చరన్తీ విపులం తోషయన్తీ హుతాశనమ్ ।
స భర్తా హుతభుక్ప్రాహ భార్యాం స్వాహామనిన్దితామ్ ॥ 4 ॥

ఆమె పూర్వం సంతానంలేనిదై పుత్రులకై తపమాచరించింది. తపస్సు చేస్తూ, అగ్నిహోత్రుని చక్కగా సంతోషపెడుతుండినది. పవిత్రురాలైన తన భార్య స్వాహాదేవితో భర్తయైన అగ్ని ఇలా అన్నాడు.

అగ్నిరువాచ :- అగ్ని పలికాడు.

అపత్యాని భవిష్యన్తి మా తపః కురు శోభనే ॥ 5 ॥

ఓ శోభనా! సంతానం కలుగుతుంది. తపస్సు చేయకు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా భర్తృవాక్యం తు నివృత్తా తపసోఽభవత్ ।
స్త్రీణామభీష్టదం నాన్యద్భర్తృవాక్యం వినా క్వచిత్ ॥ 6 ॥

ఆమె భర్తపలికిన ఆ మాటవిని తపస్సునుండి విరమించింది. లోకంలో స్త్రీలకు భర్త మాటకంటే ఇష్టమైనదిచ్చేది మరొకటుండదు.

తతః కతిపయే కాలే తారకాద్భయ ఆగతే ।
అనుత్పన్నే కార్తికేయే చిరకాలరహోగతే ॥ 7 ॥

మహేశ్వరే భవాన్యాం చ త్రస్తా దేవాః సమాగతాః ।
దేవానాం కార్యసిద్ధ్యర్థమగ్నిం ప్రోచుర్దివౌకసః ॥ 8 ॥

తరువాత కొంతకాలానికి తారకాసురుని వలన భయంకలిగింది. పార్వతీపరమేశ్వరులిద్దరు చాలాకాలం వరకు ఏకాంతమునందే వుండిపోయారు. కార్తికేయుడింకా జన్మించలేదు. అప్పుడు దేవతలంతా భయపడినవారై కలుసుకొన్నారు. దేవతల కార్యసిద్ధికోసం దేవతలు అగ్నితో ఇలా అన్నారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

దేవం గచ్ఛ మహాభాగ! శంభుం త్రైలోక్యపూజితమ్ ।
తారకాద్భయమాపన్నం శంభవే త్వం నివేదయ ॥ 9 ॥

ఓ మహాభాగా! తారకాసురుని వలన భయమేర్పడింది. ముల్లోకములు పూజించే దేవుడైన శివుని వద్దకు వెళ్ళు. శివునికి నీవు నివేదించు.

అగ్నిరువాచ :- అగ్ని పలికాడు.

న గన్తవ్యం తత్ర దేశే దంపత్యోః స్థితయోరహః ।
సామాన్యమాత్రతో న్యాయః కిం పునః శూలపాణిని? ॥ 10 ॥

దంపతులిద్దరూ ఏకాంతంగా రహస్యంగానున్న చోటునకు వెళ్ళకూడదు. ఇది సామాన్యులకుకూడా వర్తించే న్యాయం. అటువంటి పరిస్థితిలో ఇక శూలపాణియైన శివుని వద్దకు వెళ్ళుట న్యాయమా?

ఏకాంతస్థితయోః స్వైరం జల్పతోశ్చ సరాగయోః ।
దంపత్యోః శృణుయాద్వాక్యం నిరయాత్తస్య నోద్ధతిః ॥ 11 ॥

ఏకాంతస్థితిలో నుండి పరస్పరమనురాగంతో స్వేచ్ఛగా మాట్లాడుకునే దంపతుల మాటలను వినేవానికి నరకాన్ని మించింది లేదు.

స స్వామ్యఖిలలోకానాం మహాకాలత్రిశూలవాన్ ।
నిరీక్షణీయః కేన స్యాద్భవాన్యా రహసి స్థితః ॥ 12 ॥

అతడు సమస్తలోకములకు ప్రభువు. గొప్పసర్పము, త్రిశూలము కలవాడు. పార్వతితో రహస్యంగా ఏకాంతంలోవున్నాడు. ఎవడైనా వేచియుండవలసిందే.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

మహాభయే చానుగతే న్యాయః కో౽న్యత్ర వర్ణ్యతే ।
తారకాద్భయ ఆపన్నే గచ్ఛ త్వం తారకో భవాన్ ॥ 13 ॥

ఒకవైపు మహాభయం తరుముతుంటే న్యాయంగూర్చి ఎవడు మాట్లాడుతాడు? తారకాసురుని వలన భయం తరుముతోంది. నీవు మాత్రమే రక్షకుడవు కావున వెళ్ళు.

మహాభయాబ్ధౌ సాధూనాం యత్పరార్థాయ జీవితమ్ ।
రూపేణాన్యేన వా గచ్ఛ వాచం వద యథా తథా ॥ 14 ॥

ఎందువల్లనంటే మహాభయసముద్రంలో సత్పురుషుల జీవితం ఇతరుల కుపకారం కోసమే. కాబట్టి నీవు వేరే రూపాన్ని ధరించైనా వెళ్ళు. ఉన్నదున్నట్లుగా అక్కడ మాట్లాడు.

విశ్రావ్య దేవవచనం శంభుమాగచ్ఛ సత్వరః ।
తతో దాస్యామహే పూజాముభయోర్లోకయోః కవే! ॥ 15 ॥

ఓ అగ్నీ! శివునకు దేవతలమాటను వినిపించి త్వరగా రా. అటు తరువాత నీకు రెండులోకములలోను గౌరవమునిస్తాము. పూజిస్తాము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శుకో భూత్వా జగామా౽౽శు దేవవాక్యాద్ధుతాశనః ।
యత్రా౽౽సీజ్జగతాం నాథో రమమాణస్తదోమయా ॥ 16 ॥

దేవతలమాటవిన్న తరువాత హుతాశనుడు వెంటనే తానొక చిలుకై, జగత్తునకంతా నాథుడైన శివుడు పార్వతితో రమిస్తున్న చోటుకు వెళ్ళాడు.

స భీతవదథ ప్రాయాచ్ఛుకోభూత్వా తదా౽నలః ।
నాశకద్ద్వారదేశే తు ప్రవేష్టుం హవ్యవాహనః ॥ 17 ॥

ఆ అగ్ని తాను చిలుకవేషం ధరించి భయపడుతూనే వెళ్ళాడు. హవ్యములను దేవతలందరికిమోసే అగ్ని ద్వారంద్వారా లోనికి ప్రవేశించుటకు మాత్రం అశక్తుడయ్యాడు.

తతో గవాక్షదేశే తు తస్థౌ ధున్వన్నధోముఖః ।
తం దృష్ట్వా ప్రహసచ్ఛంభురుమాం ప్రాహ రహోగతః ॥ 18 ॥

అందువలన కిటికి వద్ద భయంతో వణుకుతూ తలవంచుకొని ఉన్నాడు. శివుడతనిని చూచి నవ్వుతూ రహస్యంగా పార్వతితో ఇలా అన్నాడు.

శంభురువాచ :- శివుడు పలికాడు.

పశ్య దేవి శుకం ప్రాప్తం దేవవాక్యాద్ధుతాశనమ్ ॥ 19 ॥

దేవీ! దేవతలమాట ప్రకారం చిలుకగా మారి వచ్చిన అగ్నిహోత్రుని చూడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

లజ్జితా చావదద్దేవమలం దేవేతి పార్వతీ ।
పురశ్చరన్తం దేవేశో హ్యగ్నిం తం ద్విజరూపిణమ్ ॥ 20 ॥

ఆహూయ బహుశశ్చాపి జ్ఞాతోఽస్యగ్నేఽత్ర మా వద ।
విదారయస్వ స్వముఖం గృహాణేదం నయస్వ తత్ ॥ 21 ॥

అప్పుడు పార్వతి సిగ్గుపడి శివునితో చాలు చాలు దేవా! అన్నది. దేవేశుడైన శివుడు తన ముందు పక్షిరూపంలో తిరుగుతున్న ఆ అగ్నిని పలుమార్లు పిలిచి ఓ అగ్నీ! నీ విషయం నాకు తెలుసు కాని ఇక్కడ ఏమీ మాట్లాడకు. నీ నోరు తెరువు. ఇదిగో దీనిని తీసుకొని వెళ్ళు.

ఇత్యుక్త్వా తస్య చాఽఽస్యేఽగ్నే రేతః స ప్రాక్షిపద్బహు ।
రేతోగర్భస్తదా చాగ్నిర్గన్తుం నైవ చ శక్తవాన్ ॥ 22 ॥

ఇలా పలికి ఆ అగ్నియొక్క నోటియందు చాలా రేతస్సు నుంచాడు. రేతోగర్భుడైన ఆ అగ్ని నడుచుటకు కూడా శక్తిలేని వాడయ్యాడు.

సురనద్యాస్తతస్తీరం శ్రాన్తోఽగ్నిరుపతస్థివాన్ ।
కృత్తికాసు చ తద్రేతః ప్రక్షేపాత్కార్తికోఽభవత్ ॥ 23 ॥

అలసిపోయిన ఆ అగ్ని గంగానదియొక్క తీరమునకు చేరాడు. ఆ రేతస్సును కృత్తికలయందుంచగా కార్తికేయుడు జన్మించాడు.

అవశిష్టం చ యత్కించిదగ్నేర్దేహే చ శాంభవమ్ ।
తదేవ రేతో వహ్నిస్తు స్వభార్యాయాం ద్విధాఽక్షిపత్ ॥ 24 ॥

అగ్ని తన దేహమునందు మిగిలిన కొంచెం శివ రేతస్సును రెండుగా జేసి తన భార్య యందుంచాడు.

స్వాహాయాం ప్రియభూతాయాం పుత్రార్థిన్యాం విశేషతః ।
పురా సాఽఽశ్వాసితా తేన సంతతిస్తే భవిష్యతి ॥ 25 ॥

తద్వహ్నినాఽథ సంస్మృత్య తత్క్షిప్తం శాంభవం మహః ।
తదగ్నే రేతసస్తస్యాం జజ్ఞే మిథునముత్తమమ్ ॥ 26 ॥

తనకు ప్రియురాలైన స్వాహాదేవి విశేషంగా పుత్రార్థినియై ఉన్నందున, తాను పూర్వం నీకు సంతానం కలుగుతుందని ఆశ్వాసించినందువలన, దానిని అగ్ని గుర్తుచేసుకొని ఆ శివుని గొప్పరేతస్సును ఆమెయందుంచాడు. ఆ అగ్నిరేతస్సువలన ఆమెకు ఉత్తమమైన కవలలు జన్మించారు.

సువర్ణశ్చ సువర్ణా చ రూపేణాప్రతిమం భువి ।
అగ్నేః ప్రీతికరం నిత్యం లోకానాం ప్రీతివర్ధనమ్ ॥ 27 ॥

ఈ లోకంలో సాటిలేని రూపంతో సువర్ణుడు, సువర్ణా అనే ఇద్దరు పిల్లలు అగ్నికి ప్రీతికరంగాను, నిత్యం లోకానికి ఆనందం కలిగించేవారిగాను నుండేవారు.

అగ్నిః ప్రీత్యా సువర్ణాం తాం ప్రాదాద్ధర్మాయ ధీమతే ।
సువర్ణస్యాథ పుత్రస్య సంకల్పామకరోత్ప్రియామ్ ॥
ఏవం పుత్రస్య పుత్ర్యాశ్చ వివాహమకరోత్కవిః ॥ 28 ॥

అగ్ని బుద్ధిమంతుడైన ధర్మునకు తన కూతురు సువర్ణను ప్రీతితో నిచ్చి వివాహం జరిపించాడు. అట్లే తనకుమారుడు సువర్ణునకు సంకల్ప అనే అమ్మాయితో పెళ్ళి జరిపించాడు. ఇలా తన కుమారునకు, కూతురికి అగ్ని పెళ్ళి చేశాడు.

అన్యోన్య రేతో వ్యతిషంగదోషాదగ్నేరపత్యముభయం తథైవ ।
పుత్రః సువర్ణో బహురూపరూపీ రూపాణి కృత్వా సురసత్తమానామ్ ॥ 29 ॥

ఇన్ద్రస్య వాయోర్ధనదస్య భార్యాం జలేశ్వరస్యాపి మునీశ్వరాణామ్ ।
భార్యాసు గచ్ఛత్యనిశం సువర్ణో యస్యాః ప్రియం యచ్చ వపుః స కృత్వా ॥ 30 ॥

అగ్నిదంపతుల సంగమంలో పరస్పరం రేతస్సుయొక్క వ్యతిషంగదోషముకలుగుట వలన అగ్నియొక్క సంతానం ఇద్దరును అట్లే అయ్యారు. అగ్నిపుత్రుడగు సువర్ణుడు వివిధవిచిత్రరూపములను ధరిస్తూ దేవతా శ్రేష్ఠులైన, ఇంద్రుడు, వాయువు, కుబేరుడు, వరుణుడు మున్నగు దేవతల రూపములను ధరించి ఎవరి భార్యకు ఏ రూపం ధరిస్తే ప్రీతి గలుగునో ఆ రూపం ధరించి నిత్యం ఆ సువర్ణుడు వారి భార్యలతో రమిస్తుండేవాడు. అట్లే మునీశ్వరులయొక్క భార్యలతోను రమిస్తుండేవాడు.

యాతి క్వచిచ్చాపి కవేస్తనూజస్తద్భర్తృరూపం చ పతివ్రతాసు ।
కృత్వాऽనిశం తాభిరుదారభావః కుర్వన్ కృతార్థం మదనం స రేమే ॥ 31 ॥

ఒక్కొక్కప్పుడా అగ్నికుమారుడు పతివ్రతలయొక్క భర్తలరూపమును ధరించి, వారియందు ఉదారభావమును ప్రదర్శిస్తూ, కాముని కృతార్థుని చేస్తూ వారితో రమించాడు.

కృత్యా తదా కృత్యభవత్సువర్ణో ధర్మస్య భార్యాऽపి సువర్ణనామ్నీ ।
స్వాహాసుతా స్వైరిణీ సా బభూవ యస్యాపి యస్యాపి మనోగతా యా ॥ 32 ॥

భార్యా సురూపా సైవ భూత్వా సువర్ణా రేమే పతీన్ మానుషానాసురాంశ్చ ।
దేవాన్ ఋషీన్ పితృరూపాంస్తథాఽన్యాన్ రూపౌదార్యస్థైర్యగంభీరయుక్తాన్ ॥ 33 ॥

ఆ సువర్ణుడప్పుడు కృత్యతో కృతార్థుడయ్యాడు. ఇక స్వాహాదేవికూతురు ధర్ముని భార్యఅయిన సువర్ణ స్వేచ్ఛాచారిణిగా అయింది. ఎవరెవరి మనస్సులలో ఏ, అందమైన భార్యయున్నదో ఆ సువర్ణ తానే ఆ రూపంతో వారివారి భర్తలైన, మనుష్యులలో, అసురులతో, దేవతలతో, ఋషులతో, పితృదేవతలతో, రూప ఔదార్యస్థైర్య గంభీరులైనవారిలో గూడి రమించింది.

యాఽభిప్రేతా యస్య దేవస్య భార్యా తద్రూపా సా రమతే తేన సార్ధమ్ ।
నానాభేదైః కారణైశ్చాప్యనేకైరాకర్షన్తీ తన్మనః కామసిద్ధిమ్ ॥ 34 ॥

ఏ దేవునకు ఏ భార్య ప్రియంగా నుండునో ఆ రూపమును ధరించి ఆ సువర్ణ అనేక భేదములతో అనేక కారణములతో అతని మనస్సు కామసిద్ధిని పొందునట్లుగా ఆకర్షించి అతనితో రమిస్తుండినది.

ఏవం సువర్ణస్య నిరీక్ష్య చేష్టా మగ్నేః సూనోః పుత్రికాయాస్తథాఽగ్నేః ।
సర్వే చ శేపుః కుపితాస్తదాఽగ్నేః పుత్రం చ పుత్రీం చ సురాసురాస్తే ॥ 35 ॥

ఈవిధంగా అగ్నియొక్క కుమారుడు, కూతురు చేస్తున్న చేష్ఠలను చూచి దేవతలు, అసురులు కోపించి వారంతా అగ్నియొక్క కుమారుని, కూతురును శపించారు.

సురాసురా ఊచుః :– సురాసురులు పలికారు.

కృతం యదేతద్వ్యభిచారరూపం యచ్ఛద్మనా వర్తనం పాపరూపమ్ ।
తస్మాత్సుతస్తే వ్యభిచారవాంశ్చ సర్వత్రగామీ జాయతాం హవ్యవాహ! ॥ 36 ॥

ఓ అగ్నీ! నీ కుమారుడు ఈవ్యభిచారరూపమును ధరించి మోసంతో పాపరూపమైన నడవడితో నున్నాడు. కనుక ఇతడు వ్యభిచారియై అంతటా తిరిగేవాడుగా అగుగాక!

తథా సువర్ణాఽపి న చైకనిష్ఠా భూయాదగ్నే నైకతృప్తా బహూంశ్చ ।
నానాజాతీన్నిన్దితా దేహభాజో భజన్త్రీ స్యాదేష దోషశ్చ పుత్ర్యాః ॥ 37 ॥

అట్లే సువర్ణకూడా ఒకనితో వుండక, ఒకనితో తృప్తిపడక, అనేక జాతులవారితో, దుర్మార్గమైన దేహములు గలవారితో రమిస్తుండుగాక! ఇది నీ కుమార్తె దోషమే అవుతుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యేతచ్ఛాపవచనం శ్రుత్వాఽగ్నిరతిభీతవత్ ।
మామభ్యేత్య తదోవాచ నిష్కృతిం వద పుత్రయోః ॥ 38 ॥

ఈవిధమైన శాపపుమాటను విన్న అగ్ని మిక్కిలి భీతిచెంది, నా వద్దకు వచ్చి, నా కుమారునికి, కూతురికి శాపవిమోచనమార్గమును చెప్పమని యడిగాడు.

తదాఽ హమబ్రవం వహ్నే గౌతమీం గచ్ఛ శంకరమ్ ।
స్తుత్వా తత్ర మహాబాహో నివేదయ జగత్పతేః ॥ 39 ॥

అప్పుడు నేను ఓ మహాబాహూ! అగ్నీ! నీవు గౌతమీ నదివద్దకు వెళ్ళు. అక్కడ శంకరుని స్తోత్రం చేసి ఆ జగత్పతికి నివేదించుమని చెప్పాను.

మాహేశ్వరేణ వీర్యేణ తవ దేహస్థితేన చ ।
ఏవం విధం త్వపత్యం తే జాతం వహ్నే తతో భవాన్ ॥ 40 ॥

నివేదయస్వ దేవాయ దేవానాం శాపమీదృశమ్ ।
స్వాపత్యరక్షణాయాసౌ శంభుః శ్రేయః కరిష్యతి ॥ 41 ॥

ఓ అగ్నీ! నీ శరీరమునందున్న మహేశ్వరునియొక్క వీర్యంతో నిటువంటి సంతానం నీకు కలిగింది. అందువలన నీవు, దేవతలిట్లు శపించినారని శివునకు నివేదించు. తన సంతానమును రక్షించుటకై శివుడు శ్రేయస్సును కలుగజేస్తాడు.

స్తుహి దేవం చ దేవీం చ భక్త్యా ప్రీతో భవేచ్ఛివః ।
తతస్త్వపత్యవిషయే ప్రియాన్కామానవాప్స్యసి ॥ 42 ॥

శంకరుని, గౌతమిని భక్తితో స్తుతించు. శివుడు ప్రీతిపొందుతాడు. తరువాత నీ సంతానవిషయంలో నీ కిష్టమైన కోరికలను పొందగలవు.

తతో మద్వచనాదగ్నిర్గంగాం గత్వా మహేశ్వరమ్ ।
తుష్టావ నియతో వాక్యైః స్తుతిభిర్వేదసంమితైః ॥ 43 ॥

ఆ తరువాత ఆ మాటప్రకారంగా అగ్ని గంగానది వద్దకు వెళ్ళి, వేదసంమితమైన మంత్రములతో, స్తుతులతో శివుని నియమంగా సంతోషపెట్టాడు.

అగ్నిరువాచ :- అగ్ని పలికాడు.

విశ్వస్య జగతో ధాతా విశ్వమూర్తిర్నిరంజనః ।
ఆదికర్తా స్వయమ్భూశ్చ తం నమామి జగత్పతిమ్ ॥ 44 ॥

విశ్వమునకు, జగత్తునకు సృష్టికర్త అయినవాడు, విశ్వమే తన రూపంగా గలవాడు, నిరంజనుడు, ఆదికర్త, స్వయంభువు అయిన ఆ జగత్పతికి నమస్కరిస్తున్నాను.

యోఽగ్నిర్భూత్వా సంహరతి స్రష్టా వై జలరూపతః ।
సూర్యరూపేణ యః పాతి తం నమామి చ త్ర్యంబకమ్ ॥ 45 ॥

అగ్నియై లయంచేస్తూ, జలరూపుడై సృష్టిస్తూ, సూర్యరూపుడై రక్షిస్తున్న ఆ త్ర్యంబకునికి నమస్కరిస్తున్నాను.

యజమానస్య రూపేణ సురాణాం తృప్తిహేతవే ।
వాయురూపేణ జీవానాం వ్యవస్థా కరణేన చ ॥ 46 ॥
శివరూపేణ యః పాతి సుఖాయ సతతం హరిః ।
అవకాశం ప్రాణినాం తు ధత్తే వ్యోమస్వరూపతః ॥ 47 ॥

యజమాని రూపంలో దేవతలతృప్తికి కారణమైనవానికి, వాయురూపంతో జీవులందరి వ్యవస్థకు కారణమైనవానికి, శివరూపంలో వుండి ఎల్లప్పుడు సుఖములకై రక్షించే హరి ఆకాశరూపంలో వుండి ప్రాణులకు చోటునిస్తున్న అతనికి నమస్కారము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రసన్నో భగవాననన్తః శంభురవ్యయః ।
వరేణ ఛన్దయామాస పావకం సురపూజితమ్ ॥ 48 ॥

అప్పుడు అవ్యయుడు, అనంతుడు భగవానుడైన శివుడు ప్రసన్నుడై, దేవపూజితుడైన అగ్నిని వరం కోరుకొమన్నాడు.

స వినీతః శివం ప్రాహ తవ వీర్యం మయి స్థితమ్ ।
తేన జాతః సుతో రమ్యః సువర్ణో లోకవిశ్రుతః ॥ 49 ॥

అగ్ని వినయంగా శివునితో నీ వీర్యం నాయందున్నది. దానితో లోకవిశ్రుతుడు, సుందరుడైన సువర్ణుడనే కుమారుడు జన్మించాడు.

తథా సువర్ణా పుత్రీ చ తస్మాదేవ జగత్ప్రభో! ।
అన్యోన్యవీర్యసంగాచ్చ తద్దోషాదుభయం త్విదమ్ ॥ 50 ॥

వ్యభిచారాత్సదోషం చ హ్యపత్యమభవచ్ఛివ ।
శాపం దదుః సురాః సర్వే తయోః శాన్తిం కురు ప్రభో ॥
తదగ్నివచనాచ్ఛంభుః ప్రోవాచేదం శుభోదయమ్ ॥ 51 ॥

జగత్ప్రభూ అలాగే సువర్ణయను కూతురుకూడా ఆ వీర్యంవల్లనే కలిగింది. శివా! అన్యోన్యవీర్యసంగమ దోషంవల్ల వ్యభిచారం వల్ల నా సంతానం దోషభూయిష్ఠమైనది. శివా! వ్యభిచారదోషంతో సంతానం కలిగింది. దేవతలంతా శాపమిచ్చారు. ప్రభూ! వారిద్దరికి శాంతి కలుగజేయి ఇలా పలికిన అగ్నిమాటనువిని శంకరుడు శుభసూచకంగా ఇలా అన్నాడు.

శంభురువాచ :– శివుడు పలికాడు.

మద్వీర్యాదభవత్పుత్రః సువర్ణో భూరివిక్రమః ।
సమగ్రా బుద్ధయః సర్వాః సువర్ణేఽస్మిన్మదాహితాః ॥ 52 ॥

భవిష్యన్తి న సన్దేహో వహ్నే శృణు వచో మమ ।
త్రయాణామపి లోకానాం పావనః స భవిష్యతి ॥ 53 ॥

నా వీర్యంవలన నీనుండి గొప్ప పరాక్రమంగలిగిన సువర్ణుడు జన్మించాడు. అలౌకికశక్తులన్నీ సమగ్రంగా నానుండే సువర్ణునకు సంక్రమించినవిగా అవుతాయి. ఓ అగ్నీ! నామాట విను. మూడులోకములయందు కూడా అతడు పవిత్రుడు కాగలడు. సందేహం లేదు.

స ఏవ చామృతం లోకే స ఏవ సురవల్లభః ।
స ఏవ భుక్తిముక్తీ చ స ఏవ మఖదక్షిణా ॥ 54 ॥

అతడే లోకమునందమృతము, అతడే సురవల్లభుడు, అతడే భుక్తిముక్తి కూడా, అతడే యజ్ఞదక్షిణ అవుతాడు.

స ఏవ రూపం సర్వస్య గురూణామప్యసౌ గురుః ।
వీర్యం శ్రేష్ఠతమం విద్యాద్వీర్యం మత్తో యదుత్తమమ్ ॥ 55 ॥

అన్నింటికీ అతడే రూపము, గురువులకుకూడా గురువు అతడే. నా వీర్యంకంటే శ్రేష్ఠతమం. ఉత్తమమైన వీర్యం గలవాడవుతాడు.

విశేషతస్త్వయి క్షిప్తం తస్య కా స్యాద్విచారణా ।
హీనం తేన వినా సర్వం సంపూర్ణాస్తేన సంపదః ॥ 56 ॥

ముఖ్యంగా నీయందు నిక్షిప్తమైన దాన్నిగూర్చి విచారణెక్కడ? అది లేకుండా అంతా శూన్యమే. దానితోనే సమస్తసంపదలు కలుగుతాయి.

జీవన్తోఽపి మృతాః సర్వే సువర్ణేన వినా నరాః ।
నిర్గుణోఽపి ధనీ మాన్యః సగుణోఽప్యధనో న హి ॥ 57 ॥

సువర్ణం లేకుండా నరులందరు బ్రతికియున్నా మరణించినవారితో సమానము. ఏ గుణములు లేకున్నా ధనవంతుడైతే చాలు అతడు గౌరవనీయుడు. మంచిగుణములున్నా ధనం లేనివాడు గౌరవనీయుడు కాదు గదా!

తస్మాన్నాతఃపరం కించిత్సువర్ణాద్ధి భవిష్యతి ।
తథా చైషా సువర్ణాఽపి స్యాదుత్కృష్టాఽపి చంచలా ॥ 58 ॥

అందువలన సువర్ణంకంటే ఇతరమైన దానివలన ఏమీ జరుగదు కదా! అట్లే ఈ సువర్ణకూడా ఉత్కృష్టమైనదైనప్పటికి చంచలయైయుంటుంది.

అనయా వీక్షితం సర్వం న్యూనం పూర్ణం భవిష్యతి ।
తపసా జపహోమైశ్చ యేయం ప్రాప్యా జగత్త్రయే ॥ 59 ॥

ఈసువర్ణ చూచిన చాలు లోటు ఏదైనా పూర్ణమవుతుంది. ఈ మూడులోకములయందు తపస్సు, జపము, యజ్ఞములతో దీనిని పొందవచ్చు.

తస్యాః ప్రభావం ప్రాశస్త్యమగ్నే కించిచ్చ కీర్త్యతే ।
సర్వత్ర యా తు సంతిష్ఠేదాయాతా విచరిష్యతి ॥ 60 ॥

ఓ అగ్నీ! దాని ప్రభావం, ప్రాశస్త్యం కొంచము చెబుతాను. అంతటా ఏది ఉంటుందో, వచ్చినది తిరిగి మరొక చోటునకు వెళుతుంది.

సువర్ణా కమలా సాక్షాత్పవిత్రా చ భవిష్యతి ।
అద్య ప్రభృత్యాత్మజయోస్తథా స్వైరం విచేష్టతోః ॥
తథాఽపి చైతయోః పుణ్యం న భూతం న భవిష్యతి ॥ 61 ॥

సువర్ణ సాక్షాత్ లక్ష్మీదేవివలె పవిత్రురాలవుతుంది. ఈ రోజునుండి స్వేచ్ఛాప్రవృత్తితో నుండే నీ సంతానమునకు, ఇద్దరికిని పూర్వం లేని, ముందు రాబోని పుణ్యం లభిస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తతః శంభుః సాక్షాత్తత్రాభవచ్ఛివః ।
లింగరూపేణ సర్వేషాం లోకానాం హితకామ్యయా ॥ 62 ॥

ఇట్లు చెప్పి తరువాత ఆ శివుడు మంగళకరునిగా సాక్షాత్తు అక్కడ సమస్తలోకముల హితమును కోరువానిగా లింగరూపమును పొందాడు.

వరాన్ ప్రాప్య సుతాభ్యాం స వహ్నిస్తుష్టోఽభవత్తతః ।
స్వభర్త్రా చ సువర్ణా సా ధర్మేణాగ్నిసుతా ముదా ॥ 63 ॥

అప్పుడు అగ్ని తాను వరములను పొంది, సంతానంతో సంతోషించాడు. అగ్నిసుత అయిన సువర్ణ తన భర్తయగు ధర్మునితో కలిసి సంతోషించింది.

వర్తయామాస పుత్రోఽపి వహ్నేః సంకల్పయా ముదా ।
ఏతస్మిన్నన్తరే స్వర్ణామగ్నేర్దుహితరం మునే ॥ 64 ॥
పరిభూయ చ ధర్మం తం శార్దూలో దానవేశ్వరః ।
అహరద్భాగ్యసౌభాగ్యవిలాసవసతిం ఛలాత్ ॥ 65 ॥

అగ్ని కుమారుడుకూడా సంకల్పనుగూడి సంతోషంగా నడుచుకొంటున్నాడు. ఇంతలో ఓ మునీ! అగ్ని కూతురగు సువర్ణను, సౌభాగ్యభాగ్యవిలాసములకు స్థానమైనదానిని శార్దూలుడనే రాక్షసరాజు ధర్ముని మోసగించి, ఓడించి అపహరించాడు.

నీతా రసాతలం తేన సువర్ణా లోకవిశ్రుతా ।
జామాతాఽగ్నేః స ధర్మశ్చ అగ్నిశ్చైవ స హవ్యవాట్ ॥ 66 ॥

విష్ణవే లోకనాథాయ స్తుత్వా చైవ పునః పునః ।
కార్యవిజ్ఞాపనం చోభౌ చక్రతుః ప్రభవిష్ణవే ॥ 67 ॥

లోకవిశ్రుతురాలైన సువర్ణను రసాతలమునకు తీసుకొని వెళ్ళాడు. అగ్నియొక్క అల్లుడైన ధర్ముడు, హవ్యవాహనుడైన అగ్నియు, ప్రభవిష్ణువు, లోకనాథుడైన విష్ణువును మాటిమాటికి స్తుతించి, వారిద్దరుకూడా తామువచ్చిన పనిని గూర్చి విన్నవించారు.

తతశ్చక్రేణ చిచ్ఛేద శార్దూలస్య శిరో హరిః ।
సాఽఽనీతా విష్ణునా దేవీ సువర్ణా లోకసున్దరీ ॥ 68 ॥

అప్పుడు శ్రీహరి తన చక్రంతో శార్దూలునియొక్క శిరస్సును ఖండించాడు. లోకసుందరియైన దేవి సువర్ణను విష్ణువు తీసుకొని వచ్చాడు.

మహేశ్వరసుతా చైవ అగ్నేశ్చైవ తథా ప్రియా ।
మహేశ్వరాయ తాం విష్ణుర్దర్శయామాస నారద ॥ 69 ॥

ఓ నారదా! మహేశ్వరునియొక్క కూతురు, అగ్నికి చాలా ప్రియమైనది యగు సువర్ణను విష్ణువు శివునకు చూపించాడు.

ప్రీతోఽభవన్మహేశోఽపి సస్వజే తాం పునః పునః ।
చక్రం ప్రక్షాలితం యత్ర శార్దూలచ్ఛేది దీప్తిమత్ ॥ 70 ॥

చక్రతీర్థం తు విఖ్యాతం శార్దూలం చేతి తద్విదుః ।
యత్ర నీతా సువర్ణా సా విష్ణునా శంకరాన్తికమ్ ॥ 71 ॥

తత్తీర్థం శాంకరం జ్ఞేయం వైష్ణవం సిద్ధమేవ తు ।
యత్రాఽఽనందమనుప్రాప్తో హ్యగ్నిర్ధర్మశ్చ శాశ్వతః ॥ 72 ॥
ఆనన్దాశ్రూణి న్యపతన్యత్రాగ్నేర్మునిసత్తమ ।
ఆనన్దేతి నదీ జాతా తథా వై నన్దినీతి చ ॥ 73 ॥

మహేశ్వరుడుకూడా తన వీర్యసంబంధురాలగు సువర్ణను చూచి మాటిమాటికి సంతోషించాడు. ఆమెను కౌగలించుకొన్నాడు. శార్దూలుని ఖండించిన దీప్తిమంతమగు చక్రం ఎక్కడ ప్రక్షాలనచేయబడిందో, ఆ ప్రదేశమును చక్రతీర్థమని, శార్దూలతీర్థమని అంటారు. విష్ణువు సువర్ణను శంకరుని దగ్గరకు తీసుకువెళ్ళిన ప్రదేశమును, ఆ తీర్థమును శాంకర తీర్థమని, వైష్ణవ తీర్థమని, సిద్ధతీర్థమని యంటారు. ఎక్కడ అగ్ని, ధర్ముడును శాశ్వతమైన ఆనందమును పొందారో, ఓ మునిసత్తమా! ఎక్కడ అగ్నియొక్క ఆనందాశ్రువులు జారిపడ్డాయో అక్కడ ఆనన్ద అనే పేరుతో నొక నది ఏర్పడినది. అట్లే నన్దినీ యను నది కూడా ఏర్పడినది.

తస్యాశ్చ సంగమం పుణ్యో గంగాయాం తత్ర వై శివః ।
తత్రైవ సంగమే సాక్షాత్సువర్ణాఽద్యాపి సంస్థితా ॥ 74 ॥

గంగానదియందు సంగమించిన ఆనన్ద, నన్దిని అనే నదులు కలిసిన చోటు చాలా పవిత్రమైనది. అక్కడ శివుడుంటాడు. అక్కడే సంగమమునందు సువర్ణకూడా సాక్షాత్తు నేటికినున్నది.

దాక్షాయణీ సైవ శివా ఆగ్నేయా చేతి విశ్రుతా ।
అమ్బికా జగదాధారా శివా కాత్యాయనీశ్వరీ ॥ 75 ॥
భక్తాభీష్టప్రదా నిత్యమలంకృత్యోభయం తటమ్ ।
తపస్తేపే యత్ర చాగ్నిస్తత్తీర్థం తు తపోవనమ్ ॥ 76 ॥

ఆమెయే దాక్షాయణీ, శివా, ఆగ్నేయీ అని ప్రసిద్ధి చెందినది. ఆమెయే అంబిక, జగదాధార, శివా, కాత్యాయని, ఈశ్వరియు, భక్తుల అభీష్టముల నెరవేర్చునదై, గంగానది రెండుతీరముల నలంకరించి యున్నది. అగ్ని తపస్సును చేసిన ఆ తీర్థమును తపోవన తీర్థమంటారు.

ఏవమాదీని తీర్థాని తీరయోరుభయోర్మునే ।
తేషు స్నానం చ దానం చ సర్వకామప్రదం శుభమ్ ॥ 77 ॥

ఓ మునీ! ఈవిధంగా రెండు తీరములయందున్న తీర్థములలో స్నానం, దానం చేస్తే సమస్తకోరికలు నెరవేరి శుభము కలుగుతుంది.

ఉత్తరే చైవ పారే చ సాహస్రాణి చతుర్దశ ।
దక్షిణే చ తథా పారే సహస్రాణ్యథ షోడశ ॥ 78 ॥

గంగానది ఉత్తరతీరంలో పదునాలుగు వేలు, దక్షిణతీరంలో పదహారువేల తీర్థములున్నాయి.

తత్ర తత్ర చ తీర్థాని సాభిజ్ఞానాని సన్తి వై ।
నామాని చ పృథక్ సన్తి సంక్షేపాత్తన్మయోచ్యతే ॥ 79 ॥

అక్కడక్కడ తీర్థములు గుర్తింపు గలిగినవిగా నున్నాయి. వాటికి వేరువేరుగా పేర్లున్నాయి. వాటిని సంక్షేపంగా చెబుతున్నాను.

ఏతాని యశ్చ శృణుయాద్యశ్చ వా పఠతి స్మరేత్ ।
సర్వేషు తత్ర కామ్యేషు పరిపూర్ణో భవేన్నరః ॥ 80 ॥

ఈ తీర్థములనుగూర్చి ఎవరు విన్నా, ఎవరు చదివినా, ఎవరు స్మరించినా అటువంటివారికి అన్ని కార్యములు ఫలిస్తుంది.

ఏతద్వృత్తం తు యో జ్ఞాత్వా తత్ర స్నానాదికం చరేత్ ।
లక్ష్మీవాన్ జాయతే నిత్యం ధర్మవాంశ్చ విశేషతః ॥ 81 ॥

ఈ వృత్తాంతమును తెలుసుకొని, అక్కడ స్నానాదులను ఆచరిస్తే అతడు సంపద గలవాడై విశేషంగా ధర్మవంతుడవుతాడు.

అబ్జకాత్పశ్చిమే తీర్థం తచ్ఛార్దూలముదాహృతమ్ ।
వారాణస్యాది తీర్థేభ్యః సర్వేభ్యో హ్యధికం భవేత్ ॥ 82 ॥

అబ్జకమునకు (గంగానదికి) పశ్చిమంగానున్న తీర్థమును శార్దూల తీర్థమని యంటారు. వారణ, అసి మున్నగు అన్ని తీర్థములకంటే అధికమైన ఫలము నిచ్చునదీ తీర్థము.

తత్ర స్నాత్వా పితౄన్దేవాన్నవతే తర్పయత్యపి ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకే మహీయతే ॥ 83 ॥

అక్కడ స్నానం చేసి, పితృదేవతలకు నమస్కరించినా, తర్పణాదులు చేసినా, సర్వపాపములనుండి విముక్తుడై విష్ణులోకమునందు విరాజిల్లుతాడు.

తపోవనాచ్చ శార్దూలాన్మధ్యే తీర్థాన్యశేషతః ।
తస్యైకైకస్య మాహాత్మ్యం న కేనాఽప్యత్ర వర్ణ్యతే ॥ 84 ॥

తపోవనతీర్థమునుండి శార్దూల తీర్థంవరకు మధ్యలో అనేకములైన తీర్థములున్నాయి. ఆ ఒక్కొక్క తీర్థ మాహాత్మ్యమును ఎవరూకూడా ఇక్కడ వర్ణించలేరు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'తపోవన నన్దినీ సంగమేశ్వర దేవీ దాక్షాయణీ సిద్ధేశ్వర వైష్ణవశార్దూలాగ్ని చక్రతీర్థాది త్రింశత్సహస్రతీర్థవర్ణనం' నామ అష్టపంచాశోఽధ్యాయః ॥ 58 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో తపోవన, నందినీ, సంగమేశ్వర, దేవీ దాక్షాయణీ, సిద్ధేశ్వర, వైష్ణవ, శార్దూల, అగ్ని, చక్రతీర్థ మున్నగు ముప్పైవేల తీర్థాలవర్ణనమనే పేరు గల యాభై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోన షష్టితమోఽధ్యాయః - యాబై తొమ్మిదవ అధ్యాయం

ఇంద్రేశ్వరాది సప్తసహస్రతీర్థ, దక్షిణ కూలస్థాపస్తంబ సోమేశ్వర ఫేనాసంగమ వృషాకప్యబ్జక వైష్ణవ హనూమతీర్థ మార్జారేత్యాది ఏకాదశ తీర్థవర్ణనమ్

ఇంద్రేశ్వర మున్నగు ఏడువేల తీర్థములు, దక్షిణ తీరమునందున్న ఆపస్తంబ, సోమేశ్వర, ఫేనాసంగమ, వృషాకపి, అబ్జక, వైష్ణవ, హనూమత్తీర్థ, మార్జారతీర్థ మొదలగు పదకొండు తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇన్ద్రతీర్థమితి ఖ్యాతం తత్రైవ చ వృషాకపిమ్ ।
ఫేనాయాః సంగమో యత్ర హనూమన్తః తథైవ చ ॥ 1 ॥

ఇంద్రతీర్థమనే నది ప్రసిద్ధమైనది. అక్కడే వృషాకపి అనే తీర్థం ఉన్నది. నురుగుయొక్క సంగమమెక్కడైతే ఉన్నదో అక్కడే హనుమంత తీర్థమున్నది.

అబ్జకం చాపి యత్రోక్తం యత్ర దేవస్త్రివిక్రమః ।
తత్ర స్నానం చ దానం చ పునరావృత్తిదుర్లభమ్ ॥ 2 ॥

త్రివిక్రముడనే దేవుడున్న అబ్జకమనబడేచోట స్నానం, దానం చేస్తే తిరిగి జన్మించుట యనునది యుండదు.

తత్ర వృత్తాన్యథాఽఽఖ్యాస్యే గంగాయా దక్షిణే తటే ।
ఇంద్రేశ్వరం చోత్తరే చ శృణు భక్త్యా యతవ్రతః ॥ 3 ॥

గంగానదికి దక్షిణతీరంలోని కథలను, ఉత్తరంలో ఇంద్రేశ్వరం వాని వృత్తాంతముల గూర్చి చెబుతున్నాను. నియతివ్రతుడవై, శ్రద్ధగా భక్తితో విను.

నముచిర్బలవానాసీదింద్రశత్రుర్మదోత్కటః ।
తస్యేంద్రేణాభవద్యుద్ధం ఫేనేనేంద్రోఽహరచ్ఛిరః ॥ 4 ॥

మదోత్కటుడైన నముచి యనువాడు బలవంతుడు ఇంద్రునకు శత్రువుగా నుండెను. అతనికి, ఇంద్రునికి యుద్ధం జరిగింది. ఇంద్రుడు నముచి శిరస్సును నురుగుతో ఛేదించాడు.

అపాం చ నముచేః శత్రోస్తత్ఫేనం వజ్రరూపధృక్ ।
శిరశ్ఛిత్వా తచ్చ ఫేనం గంగాయాః దక్షిణే తటే ॥ 5 ॥

న్యపతద్భువి భిత్వా తు రసాతల మథాఽఽవిశత్ ।
రసాతలభవం గాంగం వారి పావనమేవ చ ॥ 6 ॥

వజ్రరూపమును ధరించి ఆ నురుగు జలములకు శత్రువైన నముచియొక్క శిరస్సును ఛేదించి ఆ నురుగును గంగయొక్క దక్షిణతీరంలో, పడవేసింది. ఆ నురుగు భూమిని చీల్చుకొని రసాతలమును ప్రవేశించింది. రసాతలంలోనున్న గంగనీరు పవిత్రమైనదే.

వజ్రాదిష్టేన మార్గేణ వ్యగమద్భూమిమణ్డలమ్ ।
తజ్జలం ఫేన నామ్నాతు నదీ ఫేనేతి గద్యతే ॥ 7 ॥

వజ్రాయుధమాదేశించిన మార్గంలో భూమండలమునకు వెళ్ళింది. ఆ నీరు ఫేనమనే పేరుతో నుంది. ఆ నదిని ఫేనమంటారు.

తస్యాస్తు సంగమః పుణ్యో గంగయా లోకవిశ్రుతః ।
సర్వపాపక్షయకరో గంగాయమునయోరివ ॥ 8 ॥

గంగతో ఫేనసంగమం పుణ్యమైనదని లోకప్రసిద్ధం. గంగాయమునల వలె ఆ సంగమం సర్వపాపక్షయకరం.

హనుమదుపమాతా వై యత్రాఽఽప్లవన మాత్రతః ।
మార్జారత్వాదభూన్ముక్తా విష్ణుగంగా ప్రసాదతః ॥ 9 ॥

హనుమంతుని ఉపమాతకు అక్కడ స్నానం చేసినంతనే విష్ణుగంగయొక్క అనుగ్రహంవలన మార్జాలత్వమునుండి ముక్తి లభించింది.

మార్జారం చేతి తత్తీర్థం పురా ప్రోక్తం మయా తవ ।
హనుమంతం చ తత్రోక్తం తత్రాఽఽఖ్యానం పురోదితమ్ ॥ 10 ॥

ఆ తీర్థమును మార్జార తీర్థమంటారు అని నీకు పూర్వమే చెప్పాను. హనుమంతమను తీర్థమును గూర్చి దాని కథను ముందే చెప్పాను.

వార్షాకపం చాబ్జకం చ తత్రేదం ప్రయతః శృణు ।
హిరణ్య ఇతి విఖ్యాతో దైత్యానాం పూర్వజో బలీ ॥ 11 ॥

వార్షాకపము, అబ్జకతీర్థముల గూర్చి శ్రద్ధగా విను. దైత్యులకు పూర్వజుడు బలవంతుడైన హిరణ్యకుడు అనే ప్రసిద్ధుడుండేవాడు.

తపస్తప్త్వా సురైః సర్వైరజేయోఽభూత్సుదారుణః ।
తస్యాపి బలవాన్ పుత్రో దేవానాం దుర్జయః సదా ॥ 12 ॥

అతడు తపస్సు చేసి దేవతలు జయించలేనివాడుగా భయంకరుడై యుండేవాడు. అతనికి ఎప్పుడూ దేవతలు జయించలేనటువంటి బలవంతుడైన పుత్రుడుండేవాడు.

మహాశనిరితి ఖ్యాతస్తస్య భార్యా పరాజితా ।
తేనేంద్రస్యాభవద్యుద్ధం బహుకాలం నిరంతరమ్ ॥ 13 ॥

అతని పేరు మహాశని. అతని భార్య పేరు పరాజిత. అతనికి, ఇంద్రునికి నిరంతరంగా చాలా కాలం యుద్ధం జరిగింది.

మహాశనిర్మహావీర్యః సతతం రణమూర్ధని ।
జిత్వా నాగేన సహితం శక్రం పిత్రే నివేదయత్ ॥ 14 ॥

మహాశని గొప్పవీరుడు. నిరంతరం యుద్ధంచేసి, ఇంద్రుని ఐరావత గజంతోపాటు జయించి తండ్రికి నివేదించాడు.

బద్ధ్వా హస్తిసమాయుక్తం స్వసారం వీక్ష్య తాం తదా ।
విహాయ క్రూరతాం దైత్యో హిరణ్యాయ న్యవేదయత్ ॥ 15 ॥

ఏనుగుతోపాటు బందీ అయిన ఇంద్రుని, తనసోదరిని శచీదేవిని చూచి ఆ దైత్యుడు క్రౌర్యమును వదిలి హిరణ్యునకు నివేదించాడు.

మహాశనిపితా దైత్యః పూర్వేషాం పూర్వవత్తరః ।
శచీకాన్తం తలే స్థాప్య తస్య రక్షామథాకరోత్ ॥ 16 ॥

మహాశని తండ్రి దైత్యుడు. పూర్వమున్న వారందరికంటె పెద్దవాడు. శచీభర్త ఐన ఇంద్రుని రసాతలమున నుంచి అతనికి రక్షణ నేర్పాటు చేశాడు.

మహాశనిర్హరిం జిత్వా జేతుం వరుణమభ్యగాత్ ।
వరుణోఽపి మహాబుద్ధిః ప్రాదాత్కన్యాం మహాశనేః ॥ 17 ॥

మహాశని ఇంద్రుని జయించి, వరుణుని జయించుటకై వెళ్ళాడు. మహాబుద్ధిగల వరుణుడు మహాశనికి తన కూతురు నిచ్చాడు.

ఉదధిం స్వాలయం ప్రాదాద్వరుణస్తు మహాశనేః ।
తయోశ్చ సఖ్యమభవద్వరుణస్య మహాశనేః ॥ 18 ॥

వరుణుడు తన ఇల్లైన సముద్రమును మహాశనికి ఇచ్చాడు. వరుణునికి, మహాశనికి ఇద్దరికి స్నేహం కుదిరింది.

వారుణీ చాపి యా కన్యా సా ప్రియాఽభూన్మహాశనేః ।
వీర్యేణ యశసా చాపి శౌర్యేణ చ బలేన చ ॥ 19 ॥

మహాశనిర్మహాదైత్యస్త్రైలోక్యే నోపమీయతే ।
నిరింద్రత్వం గతే లోకే దేవాః సర్వే న్యమంత్రయన్ ॥ 20 ॥

వరుణుని కూతురైన ఆ వారుణి కూడా మహాశనికి ప్రియురాలయింది. పరాక్రమము, కీర్తి, శౌర్యం, బలములతో, ముల్లోకములలోను మహాదైత్యుడైన మహాశనితో పోల్చదగిన వాడెవడూ లేదు. స్వర్గలోకంలో ఇంద్రుడు లేకుండుట చూచి దేవతలంతా పరస్పరమాలోచించారు.

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

విష్ణురేవేన్ద్ర దాతా స్యాద్దైత్యహన్తా స ఏవ చ ।
మన్త్రదృగ్వా స ఏవ స్యాదిన్ద్రం చాన్యం కరిష్యతి ॥ 21 ॥

ఇంద్రుని యిచ్చేవాడు విష్ణువే. దైత్యులను సంహరించేవాడు కూడా అతడే. ఆలోచన చేసి చూచేవాడతడే. అతడు మరొక ఇంద్రుని కూడా చేయగలడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం సంమన్త్ర్య తే దేవా విష్ణోర్మంత్రం న్యవేదయన్ ।
మమావధ్యో మహాదైత్యో మహాశనిరితి బ్రువన్ ॥ 22 ॥

ప్రాయాద్వారీశ్వరం విష్ణుః శ్వశురం వరుణం తదా ।
కేశవో వరుణం గత్వా ప్రాహేన్ద్రస్య పరాభవమ్ ॥ 23 ॥

దేవతలిలా ఆలోచించి విష్ణువుకు తమ ఆలోచనను చెప్పారు. మహాదైత్యుడైన మహాశనిని నేను చంపకూడదని పలుకుతూ, విష్ణువు తన మామయగు జలాధిపతియైన వరుణుని వద్దకు వెళ్ళాడు. కేశవుడు వరుణుని వద్దకు వెళ్ళి ఇంద్రునకు జరిగిన అవమానమును గూర్చి చెప్పాడు.

తథా త్వయైతత్కర్తవ్యం యథాఽఽయాతి పురన్దరః ।
తద్విష్ణువచనాచ్ఛీఘ్రం యయౌ జలపతిర్మునే ॥ 24 ॥

ఇంద్రుడు వచ్చేలాగా నీవు చేయవలెను. ఓ మునీ! విష్ణువు మాటను విన్న జలపతి త్వరగా వెళ్ళాడు.

సుతాపతిం హిరణ్యసుతం విక్రాన్తం తం మహాశనిమ్ ।
అతిసంమానితస్తేన జామాత్రా వరుణః ప్రభుః ॥ 25 ॥

తన అల్లుడు, హిరణ్యుని తనయుడు, పరాక్రమం గలవాడు అయిన ఆ మహాశనివద్దకు వెళ్ళగా, అల్లుడైన మహాశని ప్రభువైన వరుణుని చక్కగా మిక్కిలి సమ్మానించాడు.

పప్రచ్ఛాఽఽగమనం దైత్యో వినయాచ్ఛ్వశురం తదా ।
వరుణః ప్రాహ తం దైత్యం యదాగమనకారణమ్ ॥ 26 ॥

అప్పుడా దైత్యుడు వినయంగా వచ్చిన కారణమేమిటని ప్రశ్నించాడు. అపుడు వరుణుడు దైత్యునితో తన రాకకు కారణం తెలిపాడు.

వరుణ ఉవాచ :– వరుణుడు పలికాడు.

ఇన్ద్రం దేహి మహాబాహో యస్త్వయా నిర్జితః పురా ।
బద్ధం రసాతలస్థం తం దేవానామధిపం సఖే ॥ 27 ॥

ఓ మహాబాహూ! మిత్రమా! నీవు ఇంతకు పూర్వం ఓడించి, బంధించి, రసాతలమునందుంచిన దేవతలకు రాజైన ఇంద్రుని యివ్వు.

అస్మాకం సర్వదా మాన్యం దేహి త్వం మమ శత్రుహన్ ।
బధ్వా విమోక్షణం శత్రోర్మహతే యశసే సతామ్ ॥ 28 ॥

ఓ శత్రుహంతకుడా! మాకు సర్వదా పూజింపదగినవాడగు ఇంద్రుని నీవు నాకివ్వు. శత్రువును బంధించి విడిచి పెట్టుట యనునది గొప్పవారికి పెద్దయశస్సు నిస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా కథంచిత్స దైత్యేశో వరుణాయ తమ్ ।
ప్రాదాదింద్రం శచీకాన్తం వారణేన సమన్వితమ్ ॥ 29 ॥

దైత్యేశుడు ఎట్టకేలకు సరేనని ఎలాగో ఒకలాగ శచీభర్త అయిన ఇంద్రుని, అతని ఏనుగుతో సహ వరుణుని కిచ్చాడు.

స దైత్యమధ్యేఽతివిరాజమానో హరిం తదోవాచ జలేశసన్నిధౌ ।
సంపూజ్య చైవాథ మహోపచారైర్మహాశనిర్మఘవన్తం బభాషే ॥ 30 ॥

ఆ దైత్యుల మధ్యలో ప్రకాశిస్తున్న మహాశని ఇంద్రుని అనేక ఉపచారములతో పూజించి వరుణుని ఎదురుగా ఇంద్రునితో ఇలా అన్నాడు.

మహాశనిరువాచ :– మహాశని పలికాడు.

కేన త్వమిన్ద్రోఽద్య కృతోఽసి కేన వీర్యం తవేదృగ్బహు భాషసే చ ।
త్వం సంగరే శత్రుభిర్బాధ్యసే చ తథాఽపి చేన్ద్రో భవతీతి చిత్రమ్ ॥ 31 ॥

నిన్నెవరు ఇంద్రునిగా చేశారు? నీవు యుద్ధంలో శత్రువులచే బాధలు పడతావు. నీ పరాక్రమమిలాంటిది. పైగా చాలా మాట్లాడుతావు. అయినా కూడా నీవు ఇంద్రుడవంటే చిత్రంగా వుంది.

అథాపి బద్ధా పురుషేణ కాచిత్ తస్యాః పతిస్తాం మోచయతీతి యుక్తమ్ ।
స్త్రియోఽస్వతన్త్రాః పురుషప్రధానాస్త్వం వై పుమాన్భవితా శక్ర సాధో ॥ 32 ॥

అయినా ఒక పురుషుడు ఒకామెను బంధించినాడు. ఆమె భర్త ఆమెను వదిలి పెడుతున్నాడనుట యుక్తము. పురుషులే ప్రధానంగాగల స్త్రీలు స్వతంత్రులు కారు. ఇంద్రా! సాధూ! నీవు కూడా మగవాడివౌతావా?

బద్ధో మయా సంగరే వాహనేన క్వాప్యస్త్రం తే వజ్రముద్దామశక్తి ।
చిన్తారత్నం నన్దనం యోషితస్తా యశో బలం దేవారాజోపభోగ్యమ్ ॥
సర్వం హి త్వా కింతు ముక్తో జలేశాదాకాంక్షసే జీవితం ధిక్తవేదమ్ ॥ 33 ॥

యుద్ధంలో నీ వాహనమైన ఐరావతంతో సహ నిన్ను బంధించినాను. నీ గొప్పశక్తికల వజ్రాయుధం ఎక్కడ? చింతామణి, నందనవనం, స్త్రీలు అప్సరసలు, కీర్తి, బలం దేవరాజుగా భోగములు ఇవన్నీ మరిచి ఇప్పుడు జలేశుడైన వరుణుని వలన ముక్తుడవయినావు. బ్రతుకును కోరుతున్నావు. నీదీ ఒక జీవితమేనా? ఛీఛీ.

తజ్జీవనం యత్తు యశోనిధానం స ఏవ మృత్యుర్యశసో యద్విరోధి ।
ఏవం జానన్ శక్ర కథం జలేశాన్ముక్తిం ప్రాప్తో నైవ లజ్జాం భజేథాః ॥ 34 ॥

కీర్తికి స్థానమైనదేదో అదే జీవనము. కీర్తికి విరోధిగా నుండేది మృత్యువు. ఇలా తెలిసికూడా వరుణుని ద్వారా విడువబడ్డావు. నీకు ఇది సిగ్గుగా లేదా?

త్రివిష్టపస్థః పరివేష్టితస్సన్ సర్వైః సురైః కాన్తయా వీజ్యమానః ।
సంస్తూయమానశ్చ తథాఽప్సరోభిర్నూనం లజ్జా తే బిభేతీతి మన్యే ॥ 35 ॥

దేవతలందరూ చుట్టూ చేరి ఉండగా సింహాసనము మీద కూర్చొని, ఒక కాంత విసనకర్రతో విసురుతుండగా, అప్సరస స్త్రీలంతా స్తోత్రం చేస్తుండగా ఉండే నిన్ను ఇప్పుడు చూచిన సిగ్గే భయపడుతుందని నిశ్చయంగా నేను భావిస్తున్నాను.

త్వం వృత్రహా నముచేశ్చాపి హన్తా పురాం భేత్తా గోత్రభిద్వజ్రబాహుః ।
ఏవం సురాస్త్వాం పరిపూజయన్తీత్యతో జిష్ణో సర్వమేతత్త్యజస్వ ॥ 36 ॥

నీవు వృత్రుని చంపినావని, నముచిని చంపినావని, పురములను భేదించినావని, గోత్రములను ఖండించినావని, వజ్రబాహువువని దేవతలంతా పొగిడి నిన్ను పూజిస్తారు. ఓ జిష్ణూ! ఇప్పటినుండి అవన్నీ వదిలివేయి.

వికారమాప్యాప్యహితోద్భవం యే జీవన్తి లోకాననుసంవిశన్తి ।
భవాదృశాం దుశ్చ్యవనాబ్జజన్మా కథం న హృద్భేదమవాప కర్తా ॥ 37 ॥

అహితునివలన ఏర్పడిన వికారమును పొందికూడా జీవిస్తున్నారు. లోకములలో ప్రవేశిస్తున్నారు. నీలాంటి దుష్టుని సృష్టించేముందు ఆ బ్రహ్మకు హృదయం ఎందుకు భిన్నం కాలేదు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తు దైత్యేశో వరుణాయ మహాత్మనే ।
ప్రాదాదింద్రం పునశ్చేదం వచనం తదభాషత ॥ 38 ॥

దైత్యేశుడీవిధంగా పలికి మహాత్ముడైన వరుణునకు ఇంద్రుని యిచ్చాడు. తిరిగి ఈ మాట పలికాడు.

మహాశనిరువాచ :- మహాశని పలికాడు.

అద్య ప్రభృత్యసౌ శిష్యః ఇన్ద్రస్స్యాద్వరుణో గురుః ।
శ్వశురో మమ యేన త్వం ముక్తిమాప్తోఽసి వాసవ ॥ 39 ॥

ఓ ఇంద్రా! ఈ రోజునుండి ఈ ఇంద్రుడు శిష్యుడు. నా మామ వరుణుడు గురువు. ఎందుకంటే ఆయన వలననే నీవు ముక్తి నొందావు.

తథా త్వం భృత్యభావేన వర్తేథా వరుణం ప్రతి ।
నో చేద్బద్ధ్వా పునస్త్వాం వై క్షేప్స్యే చైవ రసాతలమ్ ॥ 40 ॥

అలా నీవు వరుణునియందు భృత్యభావాన్ని ప్రదర్శించాలి. లేకుంటే తిరిగి నిన్ను రసాతలంలో బంధించి ఉంచుతాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం నిర్భర్త్స్య తం శక్రం హసంశ్చాపి పునః పునః ।
అబ్రవీద్గచ్ఛ గచ్ఛేతి వరుణం చానుమన్య తు ॥ 41 ॥

ఇలా ఇంద్రుని భయపెట్టి మాటి మాటికి నవ్వుతూ వెళ్ళు వెళ్ళు మన్నాడు. వరణునకు కూడా అనుమతి నిచ్చాడు.

స తు ప్రాప్తః స్వనిలయం లజ్జయా కలుషీకృతః ।
పౌలోమీం ప్రాహ తత్సర్వం యత్తచ్ఛత్రుపరాభవమ్ ॥ 42 ॥

ఇంద్రుడు సిగ్గుతో కుంచించుకుపోయి తన ఇంటికి చేరాడు. శత్రువువలన జరిగిన పరాభవమంతా శచీదేవికి చెప్పాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

ఏవముక్తః కృతశ్చైవ శత్రుణాఽహం వరాననే ।
నిర్వాపయామి యేన స్వమాత్మానం సుభగే వద ॥ 43 ॥

ఓ వరాననా! ఇలాగ ఈవిధంగా చేసినాడా శత్రువు. దానితో నన్ను నేను ఆత్మార్పణం చేసుకొంటున్నాను. దానికి ఉపాయమును చెప్పుము.

ఇంద్రాణ్యువాచ :– శచీదేవి పలికింది.

దానవానామథోద్భూతిం శక్ర మాయాం పరాభవమ్ ।
వరదానం తథా మృత్యుం జానేఽహం బలసూదన ॥ 44 ॥

ఇంద్రా! దానవుల పుట్టుక, మాయ, వారు చేసిన పరాభవము, వారు పొందిన వరాలు, ఓ బలసూదనా! వారి మృత్యువు గూడా నాకు తెలుసు.

తస్మాద్యస్మాత్తస్య మృత్యురథవాఽపి పరాభవః ।
జాయేత శృణు తత్సర్వం వక్ష్యేఽహం ప్రీతయే తవ ॥ 45 ॥

అందుచే ఏదో ఒకదానివలన అతనికి మృత్యువు గాని లేక పరాభవం గాని జరుగుతుంది. నీ సంతోషం కొరకు దాని నంతా చెబుతాను విను.

హిరణ్యస్య సుతో వీరః పితృవ్యస్య సుతో బలీ ।
తస్మాన్మమ స్యాత్స భ్రాతా వరదానాచ్చ దర్పితః ॥ 46 ॥

హిరణ్యునియొక్క కుమారుడు వీరుడు, బలవంతుడు. నా పినతండ్రి కొడుకు. అందువలన నాకు సోదరుడవుతాడు. వరదానంవలన అతడు మిక్కిలి గర్వంతో నున్నాడు.

బ్రహ్మాణం తోషయామాస తపసా నియమేన చ ।
ఈదృశం బలమాపన్నం తపసా కిం న సిధ్యతి ॥ 47 ॥

అతడు నియమంతో తపస్సుచేసి, బ్రహ్మను సంతోష పెట్టాడు. ఇలా తపస్సుతో బలం పొందిన వానికి సిద్ధంచని దేముంటుంది?

తస్మాత్త్వయా చిత్తరాగో విస్మయో వా కథంచన ।
న కార్యః శృణు తత్రేదం కార్యం యత్తు క్రమాగతమ్ ॥ 48 ॥

అందువలన నీ మనస్సులో భయంగాని, ఆశ్చర్యంగాని కలుగనీయకు. అక్కడ పద్ధతి ప్రకారం చేయవలసిన పనేమిటో విను.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తు పౌలోమీ ప్రాహేంద్రం వినయాన్వితా ॥ 49 ॥

ఇలా పలికి శచీదేవి మహేంద్రునితో వినయంగా ఇలా అన్నది.

ఇంద్రాణ్యువాచ :-శచీదేవి పలికింది.

నాసాధ్యమస్తి తపసో నాసాధ్యం యజ్ఞకర్మణః ।
నాసాధ్యం లోకనాథస్య విష్ణోర్భక్త్యా హరస్య చ ॥ 50 ॥

తపస్సుతో సాధ్యంగానిది లేదు. యజ్ఞకర్మలవలన సాధ్యంగానిది లేదు. లోకనాథునికి సాధ్యం గానిది లేదు. విష్ణువుయందు, శివునియందు భక్తితో సాధ్యంకానిది లేదు.

పునశ్చేదం మయా కాన్త శ్రుతమస్త్యతిశోభనమ్ ।
స్త్రీణాం స్వభావం జానన్తి స్త్రియ ఏవ సురాధిప ॥ 51 ॥

ప్రియా! సురాధిపా! నేను మరొక చక్కనైన ఈమాటను కూడా విన్నాను. స్త్రీల స్వభావం స్త్రీలకే తెలుసు.

తస్మాద్భూమేస్తథా చాపాం నాసాధ్యం విద్యతే ప్రభో ।
తపో వా యజ్ఞకర్మాది తాభ్యామేవ యతో భవేత్ ॥ 52 ॥

భూమికి కాని, నీటికి కాని సాధ్యంకాని దేదీ లేదు. ప్రభూ! ఎందుకంటే తపస్సు కాని, యజ్ఞకర్మాదులు కాని వాటి వలననే జరుగుతాయి.

తత్రాపి తీర్థభూతా తు యా భూమిస్తాం వ్రజేద్భవాన్ ।
తత్ర విష్ణుం శివం పూజ్య సర్వాన్కామానవాప్స్యసి ॥ 53 ॥

అది కూడా తీర్థభూతమైన భూమివద్దకు మీరు వెళ్ళండి. అక్కడ విష్ణువును, శివుని పూజించి కోరికలన్నీ పొందగలరు.

శ్రుతమస్తి పునశ్చేదం స్త్రియో యాశ్చ పతివ్రతాః ।
తా ఏవ సర్వం జానన్తి ధృతం తాభిశ్చరాచరమ్ ॥ 54 ॥

మరొక వాడుక ఉన్నది. పతివ్రతలైన స్త్రీలకే అన్నీ తెలుసు. ఈ చరాచరమంతా వారు ధరిస్తారు.

పృథివ్యాం సారభూతం స్యాత్తన్మధ్యే దణ్డకం వనమ్ ।
తత్ర గంగా జగద్ధాత్రీ తత్రేశం పూజయ ప్రభో ॥ 55 ॥

ప్రభూ! భూమిపై మధ్యభాగంలో సారభూతమైన దండకమనే పేరు గల వనమున్నది. అక్కడ జగద్ధాత్రియైన గంగానది ఉన్నది. అక్కడ ఈశ్వరుని పూజించు.

విష్ణుం వా జగతామీశం దీనార్తార్తిహరం విభుమ్ ।
అనాథానామిహ నృణాం మజ్జతాం దుఃఖసాగరే ॥ 56 ॥

హరో హరిర్వా గంగా వా క్వాప్యన్యచ్ఛరణం న హి ।
తస్మాత్సర్వప్రయత్నేన తోషయైతాన్సమాహితః ॥ 57 ॥

దీనార్తులైన వారి ఆర్తిని తొలగించే ప్రభువు, జగదీశ్వరుడగు విష్ణువునుగాని పూజించు. దుఃఖసాగరంలో మునిగేవారిని, ఈ లోకంలో అనాథలైనవారిని, శివుడుగాని, విష్ణువుగాని, గంగగాని తప్ప మరొకరెవరు రక్షించేవారు లేరు. అందువలన సర్వప్రయత్నములను చేసి వారివద్దకు వెళ్ళి వారిని సంతోషపెట్టు.

భక్త్యా స్తోత్రైశ్చ తపసా కురు చైవ మయా సహ ।
తతః ప్రాప్స్యసి కల్యాణమీశవిష్ణుప్రసాదజమ్ ॥ 58 ॥

నాతో గూడా వారిని భక్తితో స్తోత్రములు, తపస్సు చేయి. తరువాత శివ విష్ణు ప్రసాదములవలన శుభం కలుగుతుంది.

అజ్ఞాత్వైకగుణం కర్మఫలం దాస్యతి కర్మిణః ।
జ్ఞాత్వా శతగుణం తత్స్యాద్భార్యయా చ తదక్షయమ్ ॥ 59 ॥

కర్మలు చేసేవారు తెలియకుండా చేస్తే ఒక గుణము ఫలమిస్తుంది. తెలిసి చేస్తే వందరెట్లు ఫలమిస్తుంది. భార్యతో కలిసి చేస్తే అక్షయమైన ఫలమునిస్తుంది.

పుంసః సర్వేషు కార్యేషు భార్యైవేహ సహాయినీ ।
స్వల్పానామపి కార్యాణాం న హి సిద్ధిస్తయా వినా ॥ 60 ॥

పురుషుల కన్ని కార్యములలో సహాయకురాలు భార్యయే. ఆమె లేకుండా చిన్న పనులకు కూడా సిద్ధి లభించదు.

ఏకేన యత్కృతం కర్మ తస్మాదర్ధఫలం లభేత్ ।
జాయయా తు కృతం నాథ పుష్కలం పురుషో లభేత్ ॥ 61 ॥

నాథా! పురుషుడొక్కడే చేసిన పనికి సగం ఫలితం మాత్రమే పొందగలడు. భార్యతో కలిసి చేసిన పనికి పురుషుడు పుష్కలమైన ఫలము నొందగలడు.

తస్మాదేతత్సువిదితధర్మో జాయా ఇతి శ్రుతేః ।
శ్రూయతే దణ్డకారణ్యే సరిచ్ఛ్రేష్ఠాఽస్తి గౌతమీ ॥ 62 ॥

అందువలననే వేదం భార్యను సువిదితధర్మంగా పేర్కొనింది. దండకారణ్యంలో నదులలో శ్రేష్ఠమైనది గౌతమీ యనే నది కలదంటారు.

అశేషాఘప్రశమనీ సర్వాభీష్టప్రదాయినీ ।
తస్మాద్గచ్ఛ మయా తత్ర కురు పుణ్యం మహాఫలమ్ ॥ 63 ॥

ఆ గౌతమి పాపాలన్నిటినీ శమింపజేసేది. కోరికలన్నిటినీ నెరవేర్చేది. అందువలన నన్ను తీసుకొని వెళ్ళి అక్కడ పుణ్యం చేయి. మహాఫలం లభిస్తుంది.

తతః శత్రూన్నిహత్యాఽఽజౌ మహత్సుఖమవాప్స్యసి ॥ 64 ॥

ఆ తరువాత యుద్ధంలో శత్రువులను జంపి మహాసుఖమును పొందుతావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్తః స గురుణా భార్యయా చ శతక్రతుః ।
యయౌ గంగాం జగద్ధాత్రీం గౌతమీం చేతి విశ్రుతామ్ ॥ 65 ॥

అలాగేనని ఆ ఇంద్రుడు గురువుతో, భార్యతో గూడి జగత్తును వహించునది, గౌతమి అని ప్రసిద్ధి పొందిన గంగకు వెళ్ళాడు.

దణ్డకారణ్యమధ్యస్థాం యయౌ స ప్రీతిమాన్ హరిః ।
తపః కర్తుం మనశ్చక్రే దేవదేవాయ శమ్భవే ॥ 66 ॥

దండకారణ్యం మధ్యలో నున్న గౌతమివద్దకు ఆ ఇంద్రుడు ప్రీతితో వెళ్ళాడు. దేవదేవుడైన శివునిగూర్చి తపస్సు చేయుటకై నిశ్చయించాడు.

గంగాం నత్వా తు ప్రథమం స్నాత్వా చ స కృతాంజలిః ।
శివైకశరణో భూత్వా స్తోత్రం చేదం తతోఽబ్రవీత్ ॥ 67 ॥

మొదట గంగకు నమస్కరించి, స్నానంచేసి, శివుడొక్కడే శరణు అని కృతాంజలియై ఈ స్తోత్రం చేశాడు.

ఇన్ద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

స్వమాయయా యో హ్యఖిలం చరాచరం సృజత్యవత్యత్తి న సజ్జతేఽస్మిన్ ।
ఏకః స్వతన్త్రోఽద్వయచిత్సుఖాత్మకః స నః ప్రసన్నోఽస్తు పినాకపాణిః ॥ 68 ॥

తన మాయతో ఈ అఖిల చరాచరాత్మకమైన దానిని సృష్టించి, రక్షించి, లయం చేస్తున్నటువంటి స్వతంత్రుడు, ఒక్కడు, రెండుకానివాడు, చిత్సుఖాత్మకుడు అయిన ఆ పినాకపాణి ఒక్కడే మాకు ప్రసన్నుడగుగాక.

న యస్య తత్త్వం సనకాదయోఽపి జానన్తి వేదాన్తరహస్యవిజ్ఞాః ।
స పార్వతీశః సకలాభిలాషదాతా ప్రసన్నోఽస్తు మమాన్ధకారిః ॥ 69 ॥

వేదాంతరహస్యములు తెలిసిన సనకాదులుకూడా ఎవని తత్త్వంగూర్చి తెలుసుకోలేరో, సకల అభీష్టములను నెరవేర్చే ఆ పార్వతీశుడు, అంధకారి మాకు ప్రసన్నుడగుగాక.

సృష్ట్వా స్వయమ్భూర్భగవాన్ విరించిం భయంకరం చాస్య శిరోఽన్వపశ్యత్ ।
ఛిత్వా నఖాగ్రైర్నఖసక్తమేతచ్చిక్షేప తస్మాదభవత్త్రివర్గః ॥ 70 ॥

స్వయమ్భువైన భగవానుడు బ్రహ్మను సృష్టించి, ఆ బ్రహ్మకు భయంకరమైన శిరస్సును చూశాడు. తన గోటి చివరలతో దానిని చిదుమగా ఆ గోళ్ళకంటిన శిరస్సే త్రివర్గమయింది.

పాపం దరిద్రం త్వథ లోభయాచ్ఞే మోహో విపచ్చేతి తతోఽప్యనన్తమ్ ।
జాతప్రభావం బహుదుఃఖరూపం బభూవ తైర్వ్యాప్తమిదం సమస్తమ్ ॥ 71 ॥

పాపం, దరిద్రం, లోభం, యాచన, మోహం, ఆపద మున్నగునవి అనంతాలు. వాటి ప్రభావం బహుదుఃఖరూపం. వానిచేతనే ఈ జగత్తంతా వ్యాప్తమైనది.

అవేక్ష్య సర్వం చకితః సురేశో దేవీమవోచజ్జగదస్తమేతి ।
త్వం పాహి లోకేశ్వరి లోకమాతరుమే శరణ్యే సుభగే సుభద్రే ॥ 72 ॥

అదంతా చూచి సురేశుడైన శంకరుడు ఆశ్చర్యపడి దేవితో ఓ లోకేశ్వరీ! లోకమాతా! మంగళకరురాలా! సుభగే! ఉమా! ఈ జగత్తునంతా నీవే రక్షించు. నిన్ను శరణుగోరుతున్నాను.

జగత్ప్రతిష్ఠే వరదే జయ త్వం భుక్తిః సమాధిః పరమా చ ముక్తిః ।
స్వాహా స్వధా స్వస్తిరనాదిసిద్ధిర్గీర్బుద్ధిరాసీరజరామరే త్వమ్ ॥ 73 ॥

జగత్ప్రసిద్ధురాలా! వరముల నిచ్చుదానా! నీవు జయం పొందు. నీవు భుక్తివి, సమాధివి, పరమమైన ముక్తివి, స్వాహవు, స్వధవు, స్వస్తివి, అనాది సిద్ధివి, (సరస్వతివి,) మాటవు, బుద్ధివి, జరామరణములు లేని దానివి, నీవే అవుతున్నావు.

విద్యాదిరూపేణ జగత్త్రయే త్వం రక్షాం కరోష్యేవ మదాజ్ఞయా చ ।
త్వయైవ సృష్టం భువనత్రయం స్యాద్యతః ప్రకృత్యైవ తథైవ చిత్రమ్ ॥ 74 ॥

నా ఆజ్ఞతో నీవు విద్యాదిరూపంలో ఉండి ముల్లోకాలలో రక్షణ చేస్తున్నావు. నీ చేతనే ఈ ముల్లోకాలు సృష్టించబడ్డాయి. ఎందుకంటే ఇదంతా ప్రకృతిచేత నిండినది, అదే ఆశ్చర్యం.

ఇత్యేవముక్తా దయితా హరేణ సంశ్లేషసల్లాపపరా బభూవ ।
శ్రాన్తా భవస్యార్ధతనౌ సులగ్నా చిక్షేప చ స్వేదజలం కరాగ్రైః ॥ 75 ॥

ఈవిధంగా శివుడు పార్వతితో చెప్పగానే ఆమె శివుని కౌగలించుకొని ఆయనతో సల్లాపాలు చేసింది. శివుని అర్ధభాగంలో లగ్నమైనదై అలసి గోళ్ళ చివరలతో చిరుచెమటను చిలకరించింది.

తస్మాద్బభూవ ప్రథమం స ధర్మో లక్ష్మీరథో దానమథో సువృష్టిః ।
సత్త్వం సుసంపన్నధరం సరాంసి ధాన్యాని పుష్పాణి ఫలాని చైవ ॥ 76 ॥

దానినుండి మొదట ధర్మము, లక్ష్మి, దానం, సువృష్టి, జీవము సుసంపన్నమైన భూమి, సరస్సులు, ధాన్యములు, పుష్పములు, ఫలములు మొదలగునవి ఏర్పడ్డాయి.

సౌభాగ్యవస్తూని వపుః సువేషః శృంగారభాజీని మహౌషధాని ।
నృత్యాని గీతాన్యమృతం పురాణం శ్రుతిస్మృతీ నీతిరథాన్నపానే ॥ 77 ॥

శస్త్రాణి శాస్త్రాణి గృహోపయోగ్యాన్యస్త్రాణి తీర్థాని చ కాననాని ।
ఇష్టాని పూర్తాని చ మంగళాని యానాని శుభ్రాభరణాసనాని ॥ 78 ॥

భవాంగసంసర్గసుసంప్రహాససుస్వేదసంలాపరహఃప్రకారైః ।
తథైవ జాతం సచరాచరం చ అపాపకం దేవి తతశ్చ జాతమ్ ॥ 79 ॥

సౌభాగ్య వస్తువులు, శరీరము, మంచివేషము, శృంగార సంబంధమైనవి, మహౌషధములు, నృత్యములు, గీతములు, అమృతము, పురాణము, శ్రుతి, స్మృతులు, నీతి, అన్నపానములు, ఆయుధములు, శాస్త్రములు, గృహోపకరణములు, అస్త్రములు (మంత్రయుక్త శస్త్రములు) తీర్థములు, అడవులు, ఇష్టాపూర్తములనే వ్రతములు, శుభమైన వాహనములు, అందమైన ఆభరణములు, ఆసనములు, మున్నగునవి శివుని కలయికతో, చిరునవ్వుతో, స్వేదంతో రహస్యసంభాషణలప్రకారం, చరాచరజగత్తంతా పాపరహితములుగా ఏర్పడ్డాయి.

సుఖం ప్రభూతం చ శుభం చ నిత్యం విరాజి చైతత్తవ దేవి భావాత్ ।
తస్మాత్తు మాం రక్ష జగజ్జనిత్రి భీతం భవేభ్యో జగతాం ప్రధానే ॥ 80 ॥

దేవీ! సుఖం కలిగినది, నిత్యం శుభం విరాజిల్లినది. ఇవన్నీ నీ భావము వలననే ఏర్పడ్డాయి. అందువలన ఓ జగజ్జననీ! జగత్తులోని వారికందరికి ఐహికమైన వాటివలననే భయం కావున నన్ను రక్షించు.

ఏకే తర్కైర్విముహ్యన్తి లీయన్తే తత్ర చాపరే ।
శివశక్త్యోస్తదాఽద్వైతం సున్దరం నౌమి విగ్రహమ్ ॥ 81 ॥

తర్కంచేత అవన్నీ ఒకదానియందే ఉంటాయి. మరొకదానియందు లీనమవుతాయి. అప్పుడు శివశక్తులయొక్క అద్వైతస్వరూపమైన సుందరవిగ్రహమునకు నమస్కరిస్తున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం తు స్తువతస్తస్య పురస్తాదభవచ్ఛివః ॥ 82 ॥

ఇలా స్తోత్రం చేస్తున్న ఇంద్రునిముందు శివుడు నిలచాడు.

శివ ఉవాచ :- శివుడు పలికాడు.

కిమభీష్టం వరయసే హరే వద పరాయణమ్ ॥ 83 ॥

ఇంద్రా! నీకు మిక్కిలి ఇష్టమైన ఏ వరమును కోరుతున్నావో చెప్పు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

బలవాన్మే రిపుశ్చాఽఽస్తే దర్శనే చాశనిర్యథా ।
తేన బద్ధస్తలం నీతః పరిభూతస్త్వనేకధా ॥ 84 ॥

చూడగా పిడుగువంటి అశనియనేవాడు నాకు బలవంతుడైన శత్రువుగా వున్నాడు. అతడు నన్ను రసాతలమునకు తీసుకొనివెళ్ళి బంధించి అనేక విధములుగా అవమాన పరచాడు.

వాక్సాయకైస్తథా విద్ధస్తద్వధాయ త్వియం కృతిః ।
తదర్థం జగతామీశ యేన జేష్యే రిపుం ప్రభో ॥ 85 ॥

తదేవ దేహి వీర్యం మే యచ్చాన్యద్రిపునాశనమ్ ।
జాతః పరాభవో యస్మాత్తద్వినాశే కృతే సతి ॥
పునర్జాతమహం మన్యే వరం కీర్తిర్జయశ్రియోః ॥ 86 ॥

బాణములవంటి మాటలతో నన్ను గాయపరచాడు. అతనిని చంపుటకే నా యీ ప్రయత్నము. అందువలన ఓ జగదీశా! నేను నా శత్రువును జయించే, శక్తిని, ఇతర శత్రువులను నశింపజేసే శక్తిని నాకివ్వు. నా కవమానం జరిగిన శత్రువు నశిస్తేనే నేను మళ్ళీ పుట్టినట్లు, నా కీర్తి, జయం, సంపద లభించినట్లుగా భావిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స శివః శక్రమాహేదం న మయైకేన తే రిపుః ।
వధమాప్నోతి తస్మాత్త్వం విష్ణుమప్యవ్యయం హరిమ్ ॥ 87 ॥

ఆరాధయస్వ పౌలోమ్యా సహ దేవం జనార్దనమ్ ।
లోకత్రయైకశరణం నారాయణమనన్యధీః ॥ 88 ॥

అప్పుడు శివుడు ఇంద్రునితో నా ఒక్కనితోనే నీ శత్రువు మరణించడు. అందువలన నీవు అవ్యయుడు, విష్ణువునగు శ్రీహరిని, ముల్లోకములు శరణుపొందదగిన నారాయణుని, దేవుడైన జనార్దనుని శచీదేవితో గూడ ఇతరులపై చిత్తం లేనివాడవై ఆరాధించు.

తతః ప్రాప్స్యసి తస్మాచ్చ మత్తశ్చాపి ప్రియం హరే ।
పునశ్చోవాచ భగవానాదికర్తా మహేశ్వరః ॥ 89 ॥

ఇంద్రా! అతనివలన నావలన కూడా ఎక్కువ ప్రియమును పొందగలవు. మళ్ళీ ఆదికర్తయగు మహేశ్వరుడన్నాడు

మన్త్రాభ్యాసస్తపో వాఽపి యోగాభ్యసనమేవ చ ।
సంగమే యత్రకుత్రాపి సిద్ధిదం మునయో విదుః ॥ 90 ॥

మంత్రానుష్ఠానంగాని, తపస్సుకాని, యోగాభ్యాసంగాని ఎక్కడైనా సంగమంలో సిద్ధినిస్తుందని మును లెరుగుదురు.

కిం పునః సంగమే విప్ర గౌతమీసిన్ధుఫేనయోః ।
గిరీణాం గహ్వరే యద్వా సరితామథ సంగమే ॥ 91 ॥

విప్రో ధియైవ భవతి ముకున్దాంఘ్రినివిష్టయా ।
గంగాయా దక్షిణే తీర ఆపస్తమ్బో మునీశ్వరః ॥ 92 ॥

ఓ విప్రా! గౌతమీనది సముద్రంలో కలిసినప్పుడున్న ఫేనంయొక్క సంగమంనందింక చెప్పవలసిందేమున్నది? పర్వతముల గుహలోగాని, నదీసంగమమందుగాని, నారాయణుని పాదముల యందుంచిన బుద్ధిగలవాడే నిజమైన విప్రుడవుతాడు. గంగానదియొక్క దక్షిణతీరంలో ఆపస్తంబుడనే ముని ఉన్నాడు.

ఆస్తే తస్యాప్యహం తోషమగమం బలసూదన ।
తేన త్వం భార్యయా చైవ తోషయస్వ గదాధరమ్ ॥ 93 ॥

ఓ బలసూదనా! నేను కూడా అతని వలన సంతోషమును పొందినాను. నీవు నీ భార్యతో గూడ ఆ గదాధరుని సంతోషపెట్టు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆపస్తంబేన సహితో గంగాయా దక్షిణే తటే ।
తుష్టావ దేవం ప్రయతః స్నాత్వా పుణ్యేఽథ సంగమే ॥ 94 ॥

గంగా దక్షిణతీరంలో ఆపస్తంబునితో కలిసి ఆ పవిత్రమైన సంగమతీర్థంలో స్నానంచేసి, నియమంగా ఆ దేవుని స్తోత్రం చేశాడు.

ఫేనాయాశ్చైవ గంగాయాస్తత్ర దేవం జనార్దనమ్ ।
వైదికైర్వివిధైర్మంత్రైస్తపసాఽతోషయత్తదా ॥ 95 ॥

అప్పుడు ఫేనానది, గంగానదుల సంగమప్రదేశంలో జనార్దనదేవుని వివిధములైన వేదమంత్రములతో, తపస్సుతో సంతోషపెట్టాడు.

తతస్తుష్టోఽభవద్విష్ణుః కిం దేయం చేత్యభాషత ।
దేహి మే శత్రుహన్తారమిత్యాహ భగవాన్ హరిః ॥ 96 ॥

తరువాత విష్ణువు సంతోషించి ఏమివ్వవలెనని యడిగాడు. పూజ్యుడైన ఇంద్రుడు నాకు శత్రువును సంహరించే సాధనమిమ్మని అడిగాడు.

దత్తమిత్యేవ జానీహి తమువాచ జనార్దనః ।
తత్రాభవచ్ఛివస్యైవ గంగావిష్ణోః ప్రసాదతః ॥ 97 ॥

అమ్బుసా పురుషో జాతః శివవిష్ణుస్వరూపధృక్ ।
చక్రపాణిః శూలధరః స గత్వా తు రసాతలమ్ ॥ 98 ॥

నిజఘాన తదా దైత్యమిన్ద్రశత్రుం మహాశనిమ్ ।
సఖాఽభవత్స చేన్ద్రస్య అబ్జకః స వృషాకపిః ॥ 99 ॥

అప్పుడు జనార్దనుడు అతనితో వరమిచ్చానన్నాడు. అక్కడ శివుడు, గంగ, విష్ణువుల అనుగ్రహంతో, నీటిలో శివ విష్ణు స్వరూపములను ధరించిన ఒక పురుషుడుదయించాడు. అతడు చక్రమును, శూలమును ధరించి యున్నాడు. అతడు రసాతలమునకు వెళ్ళి, దైత్యుడు, ఇంద్రశత్రువైన మహాశనిని చంపాడు. అప్పుడు అబ్జకుడైన ఆ వృషాకపి ఇంద్రునికి మిత్రుడయ్యాడు.

దివిస్థోఽపి సదా చేన్ద్రస్తమన్వేతి వృషాకపిమ్ ।
కుపితా ప్రణయేనాభూదన్యాసక్తం విలోక్య తమ్ ॥
శచీం తాం సాన్త్వయన్నాహ శతమన్యుర్హసన్నిదమ్ ॥ 100 ॥

స్వర్గంలో వున్నా ఇంద్రుడెప్పుడూ వృషాకపిని అనుసరించేవాడు. ఇతరులయందాసక్తి కనబరిచే ఇంద్రుని చూచి శచి కుపితురాలయింది. శచీదేవిని ఓదారుస్తూ ఇంద్రుడు నవ్వుతూ ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :- ఇంద్రుడు పలికాడు.

నాహమిన్ద్రాణి శరణమృతే సఖ్యుర్వృషాకపేః ।
వారి వాఽపి హవిర్యస్య అగ్నేః ప్రియకరం సదా ॥ 101 ॥

శచీదేవీ! నాకు వృషాకపి తప్ప ఇతరుడు రక్షకుడు లేడు. అగ్నియొక్క హవిస్సు జలము కూడా ఆ వృషాకపికి సదా ప్రియతమము.

నాహమన్యత్ర గంతాऽస్మి ప్రియే చాంగేన తే శపే ।
తస్మాన్నార్హసి మాం వక్తుం శంకయాऽన్యత్ర భామిని ॥ 102 ॥

ఓ ప్రియురాలా! నేను మరొకచోటు కెక్కడికి వెళ్ళడం లేదు. నేను నాపై ఒట్టుపెట్టుకొని చెబుతున్నాను. ఓ భామినీ! అందువలన మరొకరివిషయంలో నాపై అనుమానంతో మాట్లాడకు.

పతివ్రతా ప్రియా మే త్వం ధర్మే మంత్రే సహాయినీ ।
సాపత్యా చ కులీనా చ త్వత్తోऽన్యా కా ప్రియా మమ ॥ 103 ॥

నీవు నాకు ప్రియమైనదానవు, పతివ్రతవు. నాకు నీవు ధర్మంగా నడుచుటయందు, ఆలోచనయందు సహకారిణివి. గొప్పవంశములోను, నడతలోనూ నీకంటె నాకు ప్రియమెవరు?

తస్మాత్తవోపదేశేన గంగాం ప్రాప్య మహానదీమ్ ।
ప్రసాదాద్దేవదేవస్య విష్ణోర్వై చక్రపాణినః ॥ 104 ॥

తథా శివస్య దేవస్య ప్రసాదాచ్చ వృషాకపేః ।
జలోద్భవాచ్చ మే మిత్రాదబ్జకాల్లోకవిశ్రుతాత్ ॥ 105 ॥

అందువలననే నీ ఉపదేశప్రకారంగా గంగానదికి వెళ్ళి, దేవదేవుడైన, చక్రమును ధరించే విష్ణువు అనుగ్రహంతో, అలాగే దేవదేవుడైన శివునియొక్క, వృషాకపియొక్క, నీటినుండి వచ్చిన ఆ లోకవిశ్రుతుడైన అబ్జకుని దయవలన,

ఉత్తీర్ణదుఃఖః సుభగే ఇత ఇన్ద్రోऽహమచ్యుతః ।
కిం న సాధ్యం యత్ర భార్యా భర్తృచిత్తానుగామినీ ॥ 106 ॥

ఓ సుభగే! నేను దుఃఖమును దాటాను. ఇంద్రపదవిని పోగొట్టుకొనలేదు. భార్య భర్తచిత్తానుసారంగా నడుచుకుంటే సాధ్యంకాని దేముంటుంది?

దుష్కరా తత్ర నో ముక్తిః కిం త్వర్థాది త్రయం శుభే ।
జాయైవ పరమం మిత్రం లోకద్వయహితైషిణీ ॥ 107 ॥

ఓ శుభకరులారా! ధర్మార్థకామములు మాత్రమే కాని వారికి మోక్షమెక్కడిది? అందుకే ఇహపరములను గూర్చి హితమును బోధించే భార్యయే పరమ మిత్రురాలు.

సా చేత్కులీనా ప్రియభాషిణీ చ పతివ్రతా రూపవతీ గుణాఢ్యా ।
సంపత్సు చాపత్సు సమానరూపా తయా హ్యసాధ్యం కిమిహ త్రిలోక్యామ్ ॥ 108 ॥

చక్కని వంశంలో పుట్టినది, ప్రియంగా మాట్లాడేనది, పతివ్రత, మంచి రూపం కలది, గొప్ప గుణములు గలది, ఆపదలోనూ, సంపదలోనూ సమానంగా ప్రవర్తించేది ఐన భార్య ఉన్నప్పుడు ఆమెతో ముల్లోకములలో అసాధ్యమనేది ఏముంటుంది?

తస్మాత్తవ ధియా కాన్తే మమేదం శుభమాగతమ్ ।
ఇతస్త్వోదితం చైవ కర్తవ్యం నాన్యదస్తి మే ॥ 109 ॥

అందువలన ఓ ప్రియా! నీ బుద్ధికౌశల్యంచేతనే నాకీ శుభపరిణామం జరిగింది. ఇప్పటినుండి నీవు చెప్పినది మాత్రమే చేస్తాను. నాకు వేరొకటి లేదు.

పరలోకే చ ధర్మే చ సత్పుత్రసదృశం న చ ।
ఆర్తస్య పురుషస్యేహ భార్యావద్భేషజం న హి ॥ 110 ॥

ధర్మమాచరించుటకుగాని, పరలోకమును పొందుటకుకాని సత్పుత్రునితో సమానుడు లేడు. ఆర్తుడైన పురుషునకు బాధను తొలగించే భార్యకంటె వేరే మందు లేదు.

నిఃశ్రేయసపదప్రాప్త్యై తథా పాపస్య ముక్తయే ।
గంగయా సదృశం నాస్తి శృణు చాన్యద్వరాననే ॥ 111 ॥

ఓ వరాననా! పాపమునుండి విముక్తి కావటానికి ముక్తిపదమును పొందుటానికి గంగకంటె సమానమైనది మరొకటి లేదు. అందువలన విను.

ధర్మార్థకామమోక్షాణాం ప్రాప్తయే పాపముక్తయే ।
శివవిష్ణ్వోరనన్యత్వజ్ఞానాన్నాస్త్యత్ర ముక్తయే ॥ 112 ॥

ధర్మార్థ కామమోక్షములనుగూర్చి, పాపవిముక్తికి శివవిష్ణువులకు భేదములేదను జ్ఞానమే ముక్తికి కారణమవుతున్నది.

తస్మాత్తవ ధియా సాధ్వి సర్వమేతన్మనోగతమ్ ।
అవాప్తం చ శివాద్విష్ణోః గంగాయాశ్చ ప్రసాదతః ॥ 113 ॥

అందువలన ఓ సాధ్వీ! నీ బుద్ధితోనే, శివకేశవుల, గంగయొక్క అనుగ్రహంతో మనస్సులో వున్న దీనినంతా పొందాను.

ఇన్ద్రత్వం మే స్థిరం చేతో మన్యే మిత్రబలాత్పునః ।
వృషాకపిర్మమ సఖా యో జాతస్త్వప్సు భామిని ॥ 114 ॥

నాకీ ఇంద్రత్వం, స్థిరమైన మనస్సు మిత్రుని బలంవల్లనే లభించింది. ఓ భామినీ! నీటినుండి ఉద్భవించిన వృషాకపి నా స్నేహితుడు.

త్వం చ ప్రియసఖీ నిత్యం నాన్యత్ప్రియతరం మమ ।
తీర్థానాం గౌతమీగంగా దేవానాం హరిశంకరౌ ॥ 115 ॥

ప్రియా! నీవు సర్వదా నా ప్రియసఖివి. నీకన్నా ప్రియమైనది మరొకటి లేదు. తీర్థములలో గౌతమీ గంగానది, దేవతలలో హరిశంకరులు ప్రియమైనవారు.

తస్మాదేభ్యః ప్రసాదేన సర్వం చేప్సితమాప్తవాన్ ।
మమ ప్రీతికరం చేదం తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ॥ 116 ॥

అందువలన వీరినుండియే నేను నా కోరికలన్నింటిని పొందాను. ముల్లోకాలలో ప్రసిద్ధమైన ఈ తీర్థం, నాకు చాలా ఇష్టమైనది.

తస్మాదేతద్ధి యాచిష్యే దేవాన్సర్వాననుక్రమాత్ ।
అనుమన్యన్తు ఋషయో గంగా చ హరిశంకరౌ ॥ 117 ॥

నేను దేవతలనందరిని పేరు పేరునా యాచిస్తాను. దీనికి ఋషులు, గంగాదేవి, హరిశంకరులు అనుమతింతురుగాక.

ఇంద్రేశ్వరేచాబ్జకే చ ఉభయోస్తీరయోః సురాః ।
ఏకత్ర శంకరో దేవో హ్యపరత్ర జనార్దనః ॥ 118 ॥

ఈ గంగానది రెండు తీరములలో నున్న ఇంద్రేశ్వరతీర్థమునందు, అబ్జక తీర్థమునందు ఒక దానిలో శంకరుడు, మరొక దానిలో జనార్దనుడుండాలి. ఈ తీరములలో దేవతలుండాలి.

పావయన్దణ్డకారణ్యం సాక్షాద్విష్ణుస్త్రివిక్రమః ।
అన్తరే యాని తీర్థాని సర్వపుణ్యప్రదాని చ ॥ 119 ॥

అత్ర తు స్నానమాత్రేణ సర్వే తే ముక్తిమాప్నుయుః ।
పాపిష్ఠాః పాపతో ముక్తిమాప్నుయుర్యే చ ధర్మిణః ॥ 120 ॥

తేషాం తు పరమా ముక్తిః పితృభిః పంచ పంచభిః ।
అత్ర కించిచ్చ యే దద్యురర్థిభ్యస్తిలమాత్రకమ్ ॥ 121 ॥

దాతృభ్యో హ్యక్షయం తత్స్యాత్కామదం మోక్షదం తథా ।
ధన్యం యశస్యమాయుష్యమారోగ్యం పుణ్యవర్ధనమ్ ॥ 122 ॥

సాక్షాత్తుగా త్రివిక్రమరూపుడైన విష్ణువు దండకారణ్యమును పవిత్రంగా చేస్తూ, ఉంటాడు. దానిలోపల ఎన్ని పవిత్రములైన తీర్థములున్నాయో అవన్నీ స్నానమాత్రంచే అందరికి ముక్తిని ప్రసాదిస్తాయి. పాపాత్ములు తమ పాపంతో ముక్తిని పొందుతారు. ధార్మికులైనవారు పరమముక్తిని పొందుతారు. వారినుండి పదితరముల

పితృదేవతలు ముక్తిని పొందుతారు. ఇక్కడ యాచకులకు నువ్వు గింజంత దానం చేస్తే, అది ఆ దాతలకు అక్షయమై, కోరికలన్నింటినీ తీర్చి, మోక్షమును, ధనమును, కీర్తిని, ఆయుష్షును, ఆరోగ్యమునిచ్చి పుణ్యమును పెంపొందింపచేస్తుంది.

ఆఖ్యానం విష్ణుశంభ్వోశ్చ జ్ఞాత్వా స్నానాచ్చ ముక్తిదమ్ ।
అస్య తీర్థస్య మాహాత్మ్యం యే శృణ్వన్తి పఠన్తి చ ॥ 123 ॥

పుణ్యభాజో భవేయుస్తే తేభ్యోఽత్రైవ స్మృతిర్భవేత్
శివవిష్ణోరశేషాఘసంఘవిచ్ఛేదకారిణీ ।
యాం ప్రార్థయన్తి మునయో విజితేంద్రియమానసాః ॥ 124 ॥

ఈ శివశంకరుల ఆఖ్యానం తెలుసుకొని ఈ తీర్థమునందు స్నానం చేస్తే ముక్తి లభిస్తుంది. ఈ తీర్థంయొక్క మాహాత్మ్యమును విన్నా, చదివినా, ఇక్కడ శివకేశవులను, పాపములన్నీ నశింపజేసే గంగను స్మరించినట్లయితే ఆ శివకేశవులవలన వారు పుణ్యాత్ములవుతారు. మునులు జితేంద్రియులై, గంగానదిని తలిస్తే ఆ గంగ పుణ్యమునిస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భవిష్యత్యేవమేతి తం దేవా ఋషయోఽబ్రువన్ ।
గౌతమ్యా ఉత్తరే పారే తీర్థానాం మోక్షదాయినామ్ ॥ 125 ॥

దేవర్షి సిద్ధసేవ్యానాం సహస్రాణ్యథ సప్త వై ।
తథైవ దక్షిణే తీరే తీర్థాన్యేకాదశైవ తు ॥ 126 ॥

అతనితో ఋషులు, దేవతలు అట్లే జరుగుతుందని పలికారు. గౌతమీనది ఉత్తరతీరంలో దేవతలు, ఋషులు సేవించే మోక్షదాయకమైన తీర్థములు, ఏడువేలున్నాయి. అలాగే, దక్షిణతీరంలో పదకొండు మాత్రమే ఉన్నాయి.

అబ్జకం హృదయం ప్రోక్తం గోదావర్యా మునీశ్వరైః ।
విశ్రామస్థానమీశస్య విష్ణోర్బ్రహ్మణ ఏవ చ ॥ 127 ॥

గోదావరినదికి అబ్జకతీర్థం హృదయమని, మునీశ్వరులందరూ అది విష్ణువుకు, బ్రహ్మకు, శివునకు విశ్రామస్థానమని కూడా అంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే గౌతమ్యుత్తరకూలస్థ 'ఇంద్రేశ్వరాది సప్తసహస్ర తీర్థ, దక్షిణ కూలస్థాపస్తంబ సోమేశ్వర ఫేనాసంగమ వృషాకపృబ్జక వైష్ణవ హనూమతీర్థ మార్జారేత్యాది ఏకాదశ తీర్థ వర్ణనం' నామైకోనషష్టితమోఽధ్యాయః. ॥ 59 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో గౌతమీనది కుత్తరతీరమున ఉన్న 'ఇంద్రేశ్వర మున్నగు ఏడువేల తీర్థములు, దక్షిణతీరమునందున్న ఆపస్తంబ, సోమేశ్వర, ఫేనాసంగమ, వృషాకపి, అబ్జక, వైష్ణవ, హనూమతీర్థ మార్జారతీర్థం మొదలగు పదకొండు తీర్థముల వర్ణన' మనే పేరుగల యాభై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

షష్టితమోఽధ్యాయః - అరవైయవ అధ్యాయం

దక్షిణకూలస్థాపస్తంబ సోమేశ్వర తీర్థవర్ణనమ్ - దక్షిణ తీరంలో ఉన్న ఆపస్తంబ, సోమేశ్వర తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆపస్తంబమితి ఖ్యాతం తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
స్మరణాదప్యశేషాఘసంఘవిధ్వంసనక్షమమ్ ॥ 1 ॥

ముల్లోకములలోనూ విఖ్యాతి పొందిన ఆపస్తంబమనే తీర్థం ఉన్నది. దానిని స్మరించినంతనే సమస్త పాపరాశులను నశింపజేసే శక్తిగలది.

ఆపస్తంబో మహాప్రాజ్ఞో మునిరాసీన్మహాయశాః ।
తస్య భార్యాఽక్షసూత్రేతి పతిధర్మపరాయణా ॥ 2 ॥

ఆపస్తంబుడనే పేరుగల మహాప్రాజ్ఞుడు గొప్పకీర్తి గలిగిన ఒక ముని ఉండేవాడు. ఆతనికి పతి ధర్మపరాయణురాలైన అక్షసూత్ర అను పేరుగల భార్య ఉండినది.

తస్య పుత్రో మహాప్రాజ్ఞః కర్కినామాఽథ తత్త్వవిత్ ।
తస్యాఽఽశ్రమమనుప్రాప్తో హ్యగస్త్యో మునిసత్తమః ॥ 3 ॥

అతనికి మహాప్రాజ్ఞుడు, తత్త్వవేత్త అయిన కర్కి అనే పుత్రుడుండేవాడు. అతని ఆశ్రమమునకు మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు వచ్చాడు.

తమగస్త్యం పూజయిత్వా ఆపస్తంబో మునీశ్వరః ।
శిష్యైరనుగతో ధీమాంస్తం ప్రష్టుముపచక్రమే ॥ 4 ॥

శిష్యులతో కలిసి వెళ్ళి ధీమంతుడైన ఆపస్తంబమునీశ్వరుడు ఆ అగస్త్యమహర్షిని పూజించి ఇలా అడిగాడు.

ఆపస్తంబ ఉవాచ :-ఆపస్తంబుడు పలికాడు.

త్రయాణాం కో ను పూజ్యః స్యాద్దేవానాం మునిసత్తమ ।
భుక్తిర్ముక్తిశ్చ కస్మాత్స్యాదన్నదాతా చ కో భవేత్ ॥ 5 ॥

ఓ మునిసత్తమా! ముగ్గురు దేవతలలో పూజ్యుడెవడు? భుక్తి, ముక్తి ఎవరివలన లభిస్తాయి? అన్నదాత ఎవరు?

అనన్తశ్చాపి కో విప్ర వేదానామపి దైవతమ్ ।
యజ్ఞైః క ఇజ్యతే దేవః కో వేదేష్వనుగీయతే
ఏతం మే సంశయం ఛేత్తుం వదాగస్త్యమహామునే ॥ 6 ॥

ఓ విప్రా! అనంతుడెవరు? వేదాలకు కూడా దైవమెవరు? వేదాలలో ఎవరిని కీర్తిస్తారు? ఓ అగస్త్యమహామునీ! ఈ నా సంశయాన్ని తీర్చేమాటను చెప్పండి.

అగస్త్య ఉవాచ :– అగస్త్యుడు పలికాడు.

ధర్మార్థకామమోక్షాణాం ప్రమాణం శబ్ద ఉచ్యతే ।
తత్రాపి వైదికః శబ్దః ప్రమాణం పరమం మతః ॥ 7 ॥

ధర్మార్థకామమోక్షములకు ప్రమాణము శబ్దమని చెబుతారు. అక్కడ కూడా వైదికమైన శబ్దము పరమ ప్రమాణంగా చెబుతారు.

వేదేన గీయతే యస్తు పురుషః స పరాత్పరః ।
మృతోఽపరః స విజ్ఞేయో హ్యమృతః పర ఉచ్యతే ॥ 8 ॥

వేదములు గానం చేసే పురుషుడు పరాత్పరుడు. మృతుడు అపరుడని, అమృతుడు పరుడని చెబుతారు.

యోఽమూర్తః స పరో జ్ఞేయో హ్యపరో మూర్త ఉచ్యతే ।
గుణాభివ్యాప్తిభేదేన మూర్తోఽసౌ త్రివిధో భవేత్ ॥ 9 ॥

అమూర్తుడు పరుడని, మూర్తుడు అపరుడని అంటారు. గుణముల అభివ్యాప్తి భేదంచే ఈ మూర్తుడు మూడు విధములుగా నుంటాడు.

బ్రహ్మా విష్ణుః శివశ్చేతి ఏక ఏవ త్రిధోచ్యతే ।
త్రయాణామపి దేవానాం వేద్యమేకం పరం హి తత్ ॥ 10 ॥

ఒకనినే బ్రహ్మ అని, విష్ణువు అని, శివుడని మూడు విధాలుగా చెబుతారు. ముగ్గురు దేవతలలో కూడా తెలుసుకొనవలసిన దొకనినే. అదే పరము.

ఏకస్య బహుధా వ్యాప్తిర్గుణకర్మవిభేదతః ।
లోకానాముపకారార్థమాకృతిత్రితయం భవేత్ ॥ 11 ॥

గుణ కర్మ విభేదములనుబట్టి ఒకడే అనేక విధములుగా వ్యాప్తి చెందుతాడు. లోకముల కుపకారము చేయుటకై మూడు ఆకృతులుగా ఉంటాడు.

యస్తత్త్వం వేత్తి పరమం స చ విద్వాన్న చేతరః ।
తత్ర యో భేదమాచష్టే లింగభేదీ స ఉచ్యతే ॥ 12 ॥

పరమతత్త్వమును తెలుసుకుండేవాడే విద్వాంసుడు. మరొకడు కాడు. వానిలో భేదమును చెప్పే వానిని లింగభేది అంటారు.

ప్రాయశ్చిత్తం న తస్యాస్తి యశ్చైషాం వ్యవహారేద్భిదమ్ ।
త్రయాణామపి దేవానాం మూర్తిభేదం పృథక్ పృథక్ ॥ 13 ॥

ఎవరు వీరిని భిన్నరూపులుగా వ్యవహరిస్తే అతనికి ప్రాయశ్చిత్తం లేదు. ఈ దేవతలకు ముగ్గురికి మూర్తిభేదం వేరువేరుగా ఉంటుంది.

వేదాః ప్రమాణం సర్వత్ర సాకారేషు పృథక్ పృథక్ ।
నిరాకారం చ యత్త్వేకం తత్తేభ్యః పరమం మతమ్ ॥ 14 ॥

అంతటా వేదమే ప్రమాణము. ఆకారములున్నవాని విషయంలో వేరువేరుగా నుంటుంది. నిరాకారమైన ఒకటి వాటికంటె పరమైనది.

ఆపస్తంబ ఉవాచ :- ఆపస్తంబుడు పలికాడు.

నానేన నిర్ణయః కశ్చిన్మయాఽత్ర విదితో భవేత్ ।
తత్రాప్యత్ర రహస్యం యత్తద్విమృశ్యాఽఽశు కీర్త్యతామ్ ॥ 15 ॥
నిఃసంశయా నిర్వికల్పం భాజనం సర్వసంపదామ్ ॥

దీనితో ఇక్కడ ఏదో ఒకటి నేను చెప్పుటకు, తెలుసుకొనుటకు వీలులేదు. దానిలో కూడా ఏ రహస్యమున్నదో దానిని విమర్శించి త్వరగా కీర్తించు. సంశయ రహితమైనది, వికల్పంలేనిది సమస్త సంపదలకు మూలము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతదాకర్ణ్య భగవానగస్త్యో వాక్యమబ్రవీత్ ॥ 16 ॥

ఈ మాట విని పూజ్యుడైన అగస్త్యుడిలా అన్నాడు.

అగస్త్య ఉవాచ :-అగస్త్యుడు పలికాడు.

యద్యప్యేషాం న భేదోఽస్తి దేవానాం తు పరస్పరమ్ ।
తథాఽపి సర్వసిద్ధిః స్యాచ్ఛివాదేవ సుఖాత్మనః ॥ 17 ॥

ఈ దేవతలకు పరస్పరంగా భేదం లేకపోయినప్పటికి సుఖాత్ములైనవారికి శివునివలననే సర్వం సిద్ధిస్తుంది.

ప్రపంచస్య నిమిత్తం యత్తజ్జ్యోతిశ్చ పరం శివః ।
తమేవ సాధయ హరం భక్త్యా పరమయా మునే ॥
గౌతమ్యాం సకలాఘౌఘసంహర్తా దండకే వనే ॥ 18 ॥

ఓ మునీ! ప్రపంచనిమిత్తమై జ్యోతిగా నున్నవాడు పరమశివుడే. పరమమైన భక్తితో ఆ శివుని సాధించు. గౌతమీనదియందు సమస్తపాపసంచయమును సంహరించే, దండకారణ్యమునందే ఉండే ఆ శివుని ఆరాధించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా మునేర్వాక్యం పరాం ప్రీతిముపాగతః ।
భక్తిదో ముక్తిదః పుంసాం సాకారోఽథ నిరాకృతిః ॥ 19 ॥

సృష్ట్యాకారస్తతః ప్రోక్తః పాలనాకార ఏవ చ ।
దాతా చ హన్తి సర్వం యో యస్మాదేతత్సమాప్యతే ॥ 20 ॥

ఈవిధంగా పలికిన మాటను విని మిక్కిలి ప్రీతిని పొందినవాడై, మానవులకు భక్తిని, ముక్తినీ ఇచ్చేవాడు, సాకారుడు నిరాకారుడు ఐనవాడు, సృష్టిస్వరూపుడు, పాలనాకారుడని, దాతయని, సర్వమును నశింపచేసేవాడని చెబుతూ, ఎవనివలన ఇది సమాప్తమవుతుందో, అతడే అని చెప్పారు.

అగస్త్య ఉవాచ :– అగస్త్యుడు పలికాడు.

బ్రహ్మకృతిః కర్తృరూపా వైష్ణవీ పాలనీ తథా ।
రుద్రాకృతి ర్నిహంత్రీ సా సర్వవేదేషు పఠ్యతే ॥ 21 ॥

బ్రహ్మ ఆకారంలో సృష్టి చేసేది, విష్ణురూపంలో పరిపాలించేది, రుద్రరూపంలో సంహారం చేసేది ఆమే అని అన్నివేదాలలో చదువుతారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఆపస్తంబస్తదా గంగాం గత్వా స్నాత్వా యతవ్రతః ।
తుష్టావ శంకరం దేవం స్తోత్రేణానేన నారద ॥ 22 ॥

ఓ నారదా! ఆపస్తంబుడప్పుడు గంగకు వెళ్ళి స్నానంచేసి, నియమవ్రతుడై ఈ స్తోత్రంతో శంకరుని సంతోషపెట్టాడు. ఆ దేవుని స్తుతించాడు.

ఆపస్తంబ ఉవాచ :– ఆపస్తంబుడు పలికాడు.

కాష్ఠేషు వహ్నిః కుసుమేషు గంధో బీజేషు వృక్షాది దృషత్సు హేమ ।
భూతేషు సర్వేషు తథాఽస్తి యో వై తం సోమనాథం శరణం వ్రజామి ॥ 23 ॥

కట్టెలలో అగ్ని, పూలలో గంధం, గింజల్లో వృక్షాదులమూలం, రాళ్ళలో బంగారం, సమస్తజీవులలో ఆ విధంగానున్న ఆ సోమనాథుని శరణు పొందుతున్నాను.

యో లీలయా విశ్వమిదం చకార ధాతా విధాతా భువనత్రయస్య ।
యో విశ్వరూపః సదసత్పరో యః సోమేశ్వరం తం శరణం వ్రజామి ॥ 24 ॥

తన లీలతో ఈ విశ్వమునంతటిని సృష్టించి, ముల్లోకములకు ధాత, విధాతయై, సత్తు, అసత్తులకంటె పరుడై, విశ్వరూపుడైన ఆ సోమేశ్వరుని శరణు పొందుతున్నాను.

యం స్మృత్యదారిద్ర్యమహాభిశాపరోగాదిభిర్న స్పృశ్యతే శరీరీ ।
యమాశ్రితాశ్చేప్సితమాప్నువన్తి సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 25 ॥

ఎవరిని స్మరించినంతనే దరిద్రం, మహా అభిశాపములు, రోగాదులు జీవుల దరిచేరవో, ఆశ్రయించుటచే కోరికలు నెరవేర్చే ఆ సోమేశ్వరుని శరణుపొందుతున్నాను.

యేన త్రయీధర్మమవేక్ష్య పూర్వం బ్రహ్మాదయస్తత్ర సమీహితాశ్చ ।
ఏవం ద్విధా యేన కృతం శరీరం సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 26 ॥

పూర్వం ఎవనిచేత వేదధర్మమును చూచి బ్రహ్మాదులందరూ అక్కడికి చేరినారో, తన శరీరాన్ని రెండుగా చేసిన ఆ సోమేశ్వరుని శరణు పొందుతున్నాను.

యస్మై నమో గచ్ఛతి మన్త్రపూతం హుతం హవిర్యా చ కృతా చ పూజా ।
దత్తం హవిర్యేన సురా భజన్తే తం సోమనాథం శరణం ప్రజామి ॥ 27 ॥

యజ్ఞంలో మంత్రపూతమైన హవిస్సును హెూమం చేస్తే ఎవనిని చేరుతుందో, పూజచేస్తే ఎవనికి చెందుతుందో, హవిస్సునివ్వగా దేవతలెవరిని సేవించి నమస్కరిస్తారో ఆ సోమనాథుని శరణుపొందుతున్నాను.

యస్మాత్పరం నాన్యదస్తి ప్రశస్తం యస్మాత్పరం నైవ సుసూక్ష్మమన్యత్ ।
యస్మాత్పరం నో మహతాం మహచ్చ సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 28 ॥

ఎవనికంటె ప్రశస్తమైనది మరొకటి లేదో, ఎవనికంటే సూక్ష్మాతి సూక్ష్మమైనది మరొకటి లేదో, ఎవనికంటె మహత్తులలో మహత్తయినది లేదో, అటువంటి సోమేశ్వరుని శరణు పొందుతున్నాను.

యస్యాఽఽజ్ఞయా విశ్వమిదం విచిత్రమచిన్త్యరూపం వివిధం మహచ్చ ।
ఏకక్రియం యద్వదనుప్రయాతి సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 29 ॥

ఎవని ఆజ్ఞతో ఈ విశ్వమంతా విచిత్రంగా, విచారించడానికి వీలుకాని విధంగా వివిధ రూపాలలో మహత్తుగా ఉన్నదో, ఒకే క్రియనుగా దేనివలె అనుసరిస్తున్నదో ఆ సోమేశ్వరుని శరణు పొందుతున్నాను.

యస్మిన్విభూతిః సకలాధిపత్యం కర్తృత్వదాతృత్వమహత్త్వమేవ ।
ప్రీతిర్యశః సౌఖ్యమనాదిధర్మః సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 30 ॥

ఐశ్వర్యం, సకలలోకాధిపత్యం, కర్తృత్వం, దాతృత్వం, మహత్త్వం, ప్రీతి, కీర్తి, సౌఖ్యం, అనాది ధర్ములున్న ఆ సోమేశ్వరుని శరణుపొందుతున్నాను.

నిత్యం శరణ్యః సకలస్య పూజ్యో నిత్యం ప్రియో యః శరణాగతస్య ।
నిత్యం శివో యః సకలస్య రూపం సోమేశ్వరం తం శరణం ప్రజామి ॥ 31 ॥

నిత్యం అందరికీ పూజ్యుడు, శరణు పొందదగినవాడు, శరణాగతుడైనవానికి నిత్యం ఇష్టుడు, నిత్యం మంగళకరుడు, చరాచర సకలరూపుడైన ఆ సోమేశ్వరుని శరణు పొందుతున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రసన్నో భగవానాహ నారద తం మునిమ్ ।
ఆత్మార్థం చ పరార్థం చ ఆపస్తంబోఽబ్రవీచ్ఛివమ్ ॥ 32 ॥

ఓ నారదా! అప్పుడు ప్రసన్నుడైన భగవానుడు మునినిగూర్చి ఇలా అన్నాడు. ఆపస్తంబుడు ఆత్మార్థం పరార్థం మంగళమును మాట్లాడాడు.

సర్వాన్కామానాప్నుయుస్తే యే స్నాత్వా దేవమీశ్వరమ్ ।
పశ్యేయుర్జగతామీశమస్త్విత్యాహ శివో మునిమ్ ॥ 33 ॥

స్నానం చేసి జగత్ప్రభువు, దేవుడు ఐన శివుని చూచేవారు కోరికలన్నీ పొందుతారు. అప్పుడు శివుడా మునితో అలాగే అగుగాక అన్నాడు.

తతః ప్రభృతి తత్తీర్థమాపస్తంబముదాహృతమ్ ।
అనాద్యవిద్యాతిమిరవ్రాతనిర్మూలనక్షమమ్ ॥ 34 ॥

అప్పటినుండి ఆ తీర్థమును ఆపస్తంబతీర్థమని అంటారు. ఆ తీర్థం అనాది యైన అజ్ఞానమనే చీకటి సమూహాన్ని పోగొట్టుటకు సమర్థమై ఉన్నది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'దక్షిణకూలస్థాపస్తంబ, సోమేశ్వరతీర్థవర్ణనం' నామ షష్టితమోఽధ్యాయః. ॥ 60 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో 'దక్షిణతీరంలో ఉన్న ఆపస్తంబ, సోమేశ్వర తీర్థవర్ణన'మనే పేరుగల అరవైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏక షష్టితమోఽధ్యాయః - అరవై ఒకటవ అధ్యాయం

బాణతీర్థ శార్ఙ్గపాణీయ గోద్వీప దేవయజన బ్రహ్మతీర్థ శక్తి యమాదిత్య సుపర్ణ దైత్యసూదన యమేశ్వర పితృతీర్థాది త్ర్యధికాష్టసహస్ర తీర్థవర్ణనమ్

బాణతీర్థ, శార్ఙ్గపాణితీర్థ గోద్వీప, దేవయజన, బ్రహ్మతీర్థ, శక్తి, యమ, ఆదిత్య, సుపర్ణ, దైత్యసూదన, యమేశ్వర, పితృతీర్థాది ఎనిమిదివేల మూడు తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యమతీర్థమితి ఖ్యాతం పితౄణాం ప్రీతివర్ధనమ్ ।
అశేషపాపశమనం తత్ర వృత్తమిదం శృణు ॥ 1 ॥

పాపములన్నింటిని శమింపజేసేది, పితృదేవతలకు ప్రీతిని పెంపొందించేది, యమతీర్థమనేది ఉన్నది. దాని ఈ కథను విను.

తత్రాఽఽఖ్యానమిదం త్వాసీదితిహాసం పురాతనమ్ ।
సరమేతి ప్రసిద్ధాఽస్తి నామ్నా దేవశునీ మునే ॥ 2 ॥

ఓ మునీ! పురాతనమైన ఐతిహాసిక కథ ఒకటున్నది. సరమ అనే ప్రసిద్ధమైన దేవశుని ఉండినది.

తస్యాః పుత్రౌ మహాశ్రేష్ఠౌ శ్వానౌ నిత్యం జనానను ।
గామినౌ పవనాహారౌ చతురక్షౌ యమప్రియౌ ॥ 3 ॥

దానికి రెండు మొగ కుక్కపిల్లలుండినవి. అవి శ్రేష్ఠమైనవి, నిత్యమూ జనులననుసరించేవి, వాయువాహారంగా గలవి, చాతుర్యం గల కన్నులు గలవి. యమునకు ప్రియమైనవి.

గా రక్షతి స్మ దేవానాం యజ్ఞార్థం కల్పితాన్పశూన్ ।
రక్షన్తీమనుజగ్ముస్తే రాక్షసా దైత్యదానవాః ॥ 4 ॥

దేవతలు యజ్ఞమునకై కల్పించిన పశువులగు గోవులను రక్షిస్తుండినవి. అలా గోవులను రక్షిస్తున్న దేవశునిని రాక్షసులు, దైత్యులు, దానవులు వెంబడించారు.

రక్షన్తీం తాం మహాప్రాజ్ఞాః శ్వానయోర్మాతరం శునీమ్ ।
ప్రలోభయిత్వా వివిధైర్వాక్యైర్దానైశ్చ యత్నతః ॥ 5 ॥
హృతా గా రాక్షసైః పాపైః పశ్వర్థం కల్పితాః శుభాః ।
తత ఆగత్య సా దేవానామిదమాహ క్రమాచ్ఛునీ ॥ 6 ॥

చాలా తెలివి గలిగినవారు కుక్కల తల్లియగు దేవశుని సరమ వానిని రక్షించుట చూచి, ఆమెను అనేక విధములైన మాటలతో, దానములతో ప్రయత్నించి ప్రలోభపెట్టగా, పాపాత్ములైన రాక్షసులు గోవులను దొంగిలించారు. ఆ శుభమైన గోవులను ఆహారంగా చేసుకొన్నారు. అప్పుడా శుని వచ్చి దేవతలతో ఇలా అన్నది.

సరమోవాచ :- సరమ పలికింది.

మాం బద్ధ్వా రాక్షసైః పాశైస్తాడయిత్వా ప్రహారకైః ।
నీతా గా యజ్ఞ సిద్ధ్యర్థం కల్పితాః పశవః సురాః ॥ 7 ॥

ఓ దేవతలారా! ఆ రాక్షసులు నన్ను పాశములతో బంధించి, కర్రలతోకొట్టి, యజ్ఞఫలసిద్ధికై కల్పించిన యజ్ఞపశువులగు గోవులను తీసుకొని వెళ్ళారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తస్యా వాచం నిశమ్యాఽఽశు సురాన్ ప్రాహ బృహస్పతిః ॥ 8 ॥

సరమ మాటను విని వెంటనే బృహస్పతి దేవతలతో ఇలా అన్నాడు.

బృహస్పతిరువాచ :- బృహస్పతి పలికాడు.

ఇయం వికృతరూపాఽఽస్తే అస్యాః పాపం చ లక్షయే ।
అస్యా మతేన తా గావో నీతా నాన్యేన హేతునా ॥
పాపేయం సుకృతీవేతి లక్ష్యతే దేహచేష్టితైః ॥ 9 ॥

ఇది వారి వికృత చేష్ట. దీనిని పాపంగా గుర్తించాలి. ఈమె అభిప్రాయం ప్రకారం వారా గోవులను తీసుకొని వెళ్ళారు. దానికి వేరే కారణం లేదు. ఈ పాపాన్ని వారి దేహచేష్టలతో మంచిపనిగా భావిస్తున్నారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్గురోర్వచనాచ్ఛక్రః పదా తాం ప్రాహరచ్ఛునీమ్ ।
పదాఘాతాత్తదా తస్యా ముఖాత్ క్షీరం ప్రసుస్రువే ॥ 10 ॥

దేవగురువగు బృహస్పతి మాటను విన్న ఇంద్రుడు తన కాలితో శునిని తన్నాడు. అప్పుడా పాదఘాతంతో శునినోటినుండి పాలు స్రవించాయి.

పునః ప్రాహ శచీభర్తా క్షీరం పీతం త్వయా శుని ।
రాక్షసైశ్చ తదా దత్తం తస్మాన్నీతాస్తు గా మమ ॥ 11 ॥

తిరిగి దేవేంద్రుడన్నాడు-ఓ శునీ! రాక్షసులిచ్చిన పాలు నీవు త్రాగావు. అందువలననే వారు నా గోవులను తీసుకొనివెళ్ళారు.

సరమోవాచ :- సరమ పలికింది.

నాపరాధోఽస్తి మే నాథ న చాన్యస్యాపి కస్యచిత్ ।
నాపరాధో న చోపేక్షా మమాస్తి త్రిదశేశ్వర! ॥ 12 ॥

ప్రభూ! నా అపరాధమేమీలేదు. వేరేవిధంగా నేనేమీ చేయలేదు. ఓ త్రిదశేశ్వరా! నేనేమీ ఉపేక్ష చేయలేదు. నా తప్పేమీ లేదు.

గావో యా రాక్షసైర్నీతాస్త్వదాగమనహేతవే ।
తస్మాద్రుష్టోఽసి కిం నాథ రిపవో బలినస్తు తే ॥ 13 ॥

ప్రభూ! రాక్షసులు నీరాక నిమిత్తమై గోవులను తీసుకొని వెళ్ళారు. ఆ శత్రువులు బలవంతులు. అందుకే కోపగిస్తున్నావా ఏమి?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో ధ్యాత్వా దేవగురుః జ్ఞాత్వా తస్యా విచేష్టితమ్ ।
సత్యం శక్ర త్వియం దుష్టా రిపూణాం పక్షకారిణీ ॥ 14 ॥

అప్పుడు దేవగురువు ధ్యానించి, ఆ శునియొక్క విచేష్టితమును తెలుసుకొని, ఇంద్రా! ఇది శత్రుపక్షపాతి, దుష్టురాలు, ఇది నిజం.

తతః శశాప తాం శక్రః పాపిష్ఠే త్వం శునీ భవ ।
మర్త్యలోకే పాపభూతా అజ్ఞానాత్పాపకారిణీ ॥ 15 ॥

అప్పుడింద్రుడు దానిని ఓ పాపిష్ఠురాలా! నీవు కుక్కవు కమ్మని శపించాడు. భూలోకంలో పాపభూతురాలవై, అజ్ఞానంవలన పాపకారిణి వగుదువుగాక అని శపించాడు.

తదేంద్రస్య తు శాపేన మానుషే సా వ్యజాయత ।
యథా శప్తా మఘవతా పాపాత్సా హ్యతిభీషణా ॥ 16 ॥

గావో యా రాక్షసైర్నీతాస్తాసామానయనాయ చ ।
యత్నం కుర్వన్ సురపతిర్విష్ణవే తన్న్యవేదయత్ ॥ 17 ॥

అప్పుడు ఇంద్రుని శాపంతో అది మానవలోకంలో పుట్టింది. ఇంద్రుడు శపించినట్లుగానే అది పాపంవలన మిక్కిలి భయంకరమైనది. రాక్షసులు తీసుకొని వెళ్ళిన ఆ గోవులను తీసుకొని వచ్చుటకై ఇంద్రుడు ప్రయత్నం చేస్తూ దానిని విష్ణువుకు నివేదించాడు.

విష్ణుర్దైత్యాంశ్చ దనుజాన్గోహర్తౄంశ్చైవ రాక్షసాన్ ।
హన్తుం ప్రయత్నమకరోజ్జగృహే చ మహద్ధనుః ॥ 18 ॥

విష్ణువు గోవులను దొంగిలించిన దైత్యులను, దనుజులను, రాక్షసులను సంహరించుటకై ప్రయత్నించాడు. తన గొప్ప ధనువును తీసుకొన్నాడు.

శార్ఙ్గం యత్ లోకవిఖ్యాతం దైత్యనాశనమేవ చ ।
జితారిః పూజితో దేవైః స్వయం స్థిత్వా జనార్దనః ॥ 19 ॥

శార్ఙ్గమనే ధనుస్సు లోక విఖ్యాతమైనది. దైత్యులను నశింపజేసేది. శత్రువులను జయించిన విష్ణువు స్వయంగా నిలిచి దేవతలతో పూజలందుకొన్నాడు.

యత్ర వై దండకారణ్యే శార్ఙ్గపాణిర్జగత్ప్రభుః ।
తత్రస్థాన్దైత్యదనుజాన్ రాక్షసాంశ్చ బలీయసః ॥ 20 ॥

పునర్జఘ్నే స వై విష్ణుర్గా యైర్నీతాశ్చ రాక్షసైః ।
తత్రవై దణ్డకారణ్యే శార్ఙ్గపాణిరితి శ్రుతః ॥ 21 ॥

ఏ దండకారణ్యంలో జగత్ప్రభువు శార్ఙ్గపాణిగా ఉన్నాడో, అక్కడవున్న బలవంతులగు దనుజదైత్య రాక్షసులను, అతడు తిరిగి చంపాడు. రాక్షసులు గోవులను తీసుకొని వెళ్ళిన, ఆ దండకారణ్య ప్రాంతంలో నున్న విష్ణువు శార్ఙ్గపాణి యని ప్రసిద్ధి చెందాడు.

యుధ్యమానస్తతో విష్ణుర్దితిజై రాక్షసైః సహ ।
తే జగ్ముర్దక్షిణామాశాం విష్ణోస్త్రాసాన్మహామునే ॥ 22 ॥

విష్ణువు దైత్యులతో, రాక్షసులతో యుద్ధం చేస్తుండగా, విష్ణువుకు భయపడి వారు దక్షిణపు దిక్కుకు వెళ్ళారు.

అన్వగచ్ఛత్తతో విష్ణుస్తానేవ పరమేశ్వరః ।
గరుత్మతా తానవాప్య శార్ఙ్గముక్తైర్మనోజవైః ॥ 23 ॥

బాణైస్తాన్ వ్యాహనద్విష్ణుర్గంగాయా ఉత్తరేతటే ।
దేవారయః క్షయం నీతా విష్ణునా ప్రభవిష్ణునా ॥ 24 ॥

పరమేశ్వరుడైన విష్ణువు గరుత్మంతుని ఎక్కి, వారిని వెంబడించి, చేరి, శార్ఙ్గమనే ధనుస్సునుండి విడువబడిన మనోజవములైన, బాణములతో గంగానది ఉత్తరతీరంలో వారిని చంపాడు. ప్రభవిష్ణువైన విష్ణువుచే దేవ శత్రువులు నశించారు.

శార్ఙ్గముక్తైర్మహావేగైః సుస్వనైశ్చ సుమంత్రితైః ।
క్షయం ప్రాప్తా విష్ణుబాణైస్తతస్తే దేవశత్రవః ॥ 25 ॥

శార్ఙ్గమునుండి వెలువడిన మహావేగం గల, చక్కని శబ్దం గల, మంత్రపూతములైన విష్ణుబాణములచే దేవశత్రువులు నశించారు.

గావో లబ్ధా యత్ర దేవైర్బాణతీర్థం తదుచ్యతే ।
వైష్ణవం లోకవిదితం గోతీర్థం చేతి విశ్రుతమ్ ॥ 26 ॥

దేవతలకు గోవులు లభించిన దానిని బాణతీర్థమంటారు. లోకవిదితమైన దానిని వైష్ణవం, గోతీర్థమని ప్రసిద్ధంగా చెబుతారు.

పశ్వర్థే కల్పితా గావో గంగాయా దక్షిణే తటే ।
ప్రద్రుతాస్తే సురాః సర్వే గంగాయాం సంన్యవేశయన్ ॥ 27 ॥

యజ్ఞపశువులుగా కల్పించిన గోవులు గంగానది దక్షిణతీరమునందుండగా, వేగంగా దేవతలందరు గంగానదియందు ప్రవేశించారు.

తన్మధ్యే కారయామాసుర్ద్వీపం చైవాఽఽశ్రయం గవామ్ ।
తైర్గోభిస్తత్ర గంగాయాం సురయజ్ఞో వ్యజాయత ॥ 28 ॥

గంగయొక్క మధ్యద్వీపంలో గోవుల కాశ్రయమును ఏర్పాటు చేశారు. ఆ గోవులతో అక్కడ గంగయందు దేవతాయజ్ఞం జరిగింది.

యజ్ఞతీర్థం తు తత్ప్రోక్తం గోద్వీపం గంగమధ్యతః ।
దేవానాం యజనం తచ్చ సర్వకామప్రదం శుభమ్ ॥ 29 ॥

గంగమధ్యలో నున్న దానిని యజ్ఞతీర్థమని, గోద్వీపమని అంటారు. ఆ దేవతల యజ్ఞం శుభం, సర్వకామఫలప్రదం.

స్వయం మూర్తిమతీ భూత్వా గంగాశక్తిర్మహాద్యుతే ।
అసారాపారసంసారసాగరోత్తరణే తరిః ॥ 30 ॥

ఓ మహాద్యుతీ! గంగాశక్తి స్వయంగా మూర్తిమంతమై సారరహితమైన అపార సంసార సాగరం దాటించుటకు నావవంటిది.

విశ్వేశ్వరీ యోగమాయా సద్భక్తాభయదాయినీ ।
గోరక్షం తు తతస్తీర్థం గంగాయా దక్షిణే తటే ॥ 31 ॥

అంతేకాక విశ్వేశ్వరి, యోగంతో పొందేది, సద్భక్తుల కభయమిచ్చేది. గంగానది దక్షిణతీరంలో గోరక్షమని ఆ తీర్థమునకు పేరు.

తౌ శ్వానౌ సరమాపుత్రౌ చతురక్షౌ యమప్రియౌ ।
మాతుః శాపం చాపరాధం సర్వం చాపి సవిస్తరమ్ ॥ 32 ॥

నివేద్య తు యథాన్యాయం కార్యం చాపి సుఖప్రదమ్ ।
విశాపకరణం చాపి పప్రచ్ఛతురుభౌ యమమ్ ॥ 33 ॥

చాతుర్యం కల్గిన నేత్రములు గల, యమునికి ప్రియమైన ఆ సురమపుత్రులైన రెండు కుక్కలు తల్లి శాపమును, అపరాధము నంతా వివరంగా యమునకు నివేదించి, న్యాయముననుసరించి, శాపం తొలగి సుఖం కలిగే విధానాన్ని వారిద్దరడిగారు.

స తాభ్యాం సహితః సౌరిః పిత్రే సూర్యాయ చాబ్రవీత్ ।
శ్రుత్వా సూర్యః సుతం ప్రాహ గంగాయాం సురసత్తమ ॥ 34 ॥

లోకత్రయైకపావన్యాం గౌతమ్యాం దండకే వనే ।
శ్రద్ధయా పరయా వత్స సుస్నాతః సుసమాహితః ॥ 35 ॥

బ్రహ్మాణం చైవ విష్ణుం చ మామీశం చ యథాక్రమమ్ ।
స్తుహి త్వం సర్వభావేన భృత్యౌ ప్రీతిమావాప్స్యతః ॥ 36 ॥

అప్పుడా యముడా ఇద్దరితో కలిసివెళ్ళి సూర్యునడిగాడు. ఆ మాటవిని సూర్యుడు, దేవతాశ్రేష్ఠా! నాయనా! దండకారణ్యంలో ఉన్న, ముల్లోకపావనియైన గౌతమిగంగయందు శ్రద్ధగా స్నానం చేసి, చక్కని నిష్ఠ కలిగి, బ్రహ్మను, విష్ణువును, శివుని, నన్ను యథాక్రమంగా నీవు స్తోత్రం చేయి. నీ భృత్యులు ప్రీతిని పొందగలరు.

తత్పితుర్వచనం శ్రుత్వా యమః ప్రీతమనాస్తదా ।
తయోశ్చ ప్రీతయే ప్రాయాద్దేవతర్పణయోర్యమః ॥ 37 ॥

అలా పలికిన తండ్రి మాటను విని యముడు అపుడు సంతోషించి, వారి ప్రీతికొరకు యముడు దేవతర్పణములకోసం వెళ్ళాడు.

గౌతమ్యామఘహారిణ్యాం సుసమాహితమానసః ।
తథైవ తోషయామాస గంగాయాం సురసత్తమాన్ ॥ 38 ॥

పాపహారియైన గౌతమియందు శ్రద్ధగలవాడయ్యాడు. అలాగే గంగయందు దేవతాశ్రేష్ఠులను సంతోషపరచాడు.

శ్వభ్యాం చ సహితః శ్రీమాన్దక్షిణాశాపతిః ప్రభుః ।
బ్రహ్మాణం తోషయామాస భానుం వై దక్షిణే తటే ॥ 39 ॥

కుక్కలతోపాటు దక్షిణ దిక్కుకు రాజైన యముడు దక్షిణతీరంలో బ్రహ్మను, సూర్యుని సంతోషపరచాడు.

ఈశానముత్తరే విష్ణుం స్వయం ధర్మః ప్రతాపవాన్ ।
దత్తవన్తౌ వరం శ్రేష్ఠం సరమాయా విశాపకమ్ ॥
వరానయాచత బహూల్లోకానాముపకారకాన్ ॥ 40 ॥

ఉత్తర తీరమందు శివుని, విష్ణువును స్వయంగా ప్రతాపవంతుడైన ధర్మమహారాజు సంతోషపెట్టాడు. వారు సరమకు శాపవిమోచనం కలిగేట్లు శ్రేష్ఠమైన వరము నిచ్చారు. లోకాలకు ఉపయోగపడే పలువరాలను యముడు అడిగాడు.

యమ ఉవాచ :- యముడు పలికాడు.

ఏషు స్నానం తు యే కుర్యుర్బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
ఆత్మార్థం చ పరార్థం చ తే కామానాప్నుయుః శుభాన్ ॥ 41 ॥

ఈ తీర్థములలో ఏ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు స్నానం చేస్తారో వారు తమ కొఱకు, ఇతరుల కొఱకు కావలసిన శుభమైన కోరికలను పొందుతారు.

బాణతీర్థే తు యే స్నాత్వా శార్ఙ్గపాణిం స్మరన్తి వై ।
తేభ్యో దారిద్ర్యదుఃఖాని న భవేయుర్యుగే యుగే ॥ 42 ॥

బాణతీర్థంలో స్నానం చేసి, శార్ఙ్గపాణిని స్మరించే వారికి యుగయుగాల్లో దారిద్ర్యం, దుఃఖములు దరిచేరవు.

గోతీర్థే బ్రహ్మతీర్థే వా యస్తు స్నాత్వా యతవ్రతః ।
బ్రహ్మాణం తం నమస్యాథ ద్వీపస్యాపి ప్రదక్షిణమ్ ॥ 43 ॥

యః కుర్యాత్తేన పృథివీ సప్తద్వీపా వసున్ధరా ।
ప్రదక్షిణీకృతా తత్ర కించిద్దత్వా వసు ద్విజమ్ ॥ 44 ॥

తద్దేవయజనం ప్రాప్య కించిద్ధుత్వా హుతాశనే ।
అశ్వమేధాది యజ్ఞానాం ఫలం ప్రాప్నోతి పుష్కలమ్ ॥ 45 ॥

గోతీర్థంలోకాని, బ్రహ్మతీర్థంలోకాని స్నానంచేసి, నియమవ్రతుడై ఆ బ్రహ్మకు నమస్కరించి, ద్వీపమునకు ప్రదక్షిణం చేస్తే వారు ఏడు ద్వీపములతో కూడిన భూమాతకు ప్రదక్షిణం చేసినట్లవుతుంది. అక్కడ బ్రాహ్మణునకు ఏ కొంచెం భూదానాన్ని చేసినా, అది దేవయజ్ఞఫల మిస్తుంది, ఏ కొంచెమైనా అగ్నిలో హెూమం చేసినా అశ్వమేధాది యజ్ఞముల ఫలం పుష్కలంగా పొందుతాడు.

యః సకృత్తత్ర పఠతి గాయత్రీం వేదమాతరమ్ ।
అధీతాస్తేన వేదా వై నిష్కామో ముక్తిభాజనమ్ ॥ 46 ॥

ఒక్కసారి అక్కడ నిష్కాముడై ముక్తి సాధనము వేదమాతయైన గాయత్రీ మంత్రమును పఠిస్తే వేదములను అధ్యయనం చేసినట్లవుతుంది.

స్నాత్వా తు దక్షిణే కూలే శక్తిం దేవీం తు భక్తితః ।
పూజయిత్వా యథాన్యాయం సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 47 ॥

దక్షిణతీరంలో స్నానం చేసి, భక్తితో యథాశాస్త్రంగా దేవియైన శక్తిని పూజిస్తే, కోరికలన్నీ నెరవేరుతాయి.

బ్రహ్మవిష్ణుమహేశానాం శక్తిర్మాతా త్రయీమయీ ।
సర్వాన్కామానవాప్నోతి పుత్రవాన్ ధనవాన్ భవేత్ ॥ 48 ॥

బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు వేదమయి అయిన శక్తి తల్లి. ఆమెను పూజిస్తే పుత్రవంతుడు, ధనవంతుడై కోరికలను పొందుతాడు.

ఆదిత్యం భక్తితో యస్తు దక్షిణే నియతో నరః ।
స్నాత్వా పశ్యేత తేనేష్టా యజ్ఞా వివిధదక్షిణాః ॥ 49 ॥

దక్షిణతీరంలో స్నానం చేసి, నియతవ్రతుడై, భక్తితో సూర్యుని దర్శిస్తే, అతడు దక్షిణ పూర్వకంగా ఇష్టాపూర్తాది యజ్ఞములు చేసిన ఫలమును పొందుతాడు.

కూలే యశ్చోత్తరే చైవ గంగాయా దైత్యసూదనమ్ ।
స్నాత్వా పశ్యేత తం నత్వా తస్య విష్ణోః పరంపదమ్ ॥ 50 ॥

ఎవరు గంగానది ఉత్తరతీరంలో స్నానం చేసి, విష్ణుమూర్తిని చూచి నమస్కరిస్తారో వారికి విష్ణువు స్థానమైన పరమపదం లభిస్తుంది.

యమేశ్వరం తతో యస్తు యమతీర్థే తు పూజితమ్ ।
స్నాతః పశ్యతి యుక్తాత్మా స కరోత్యచిరేణ హి ॥ 51 ॥

పితౄణామక్షయం పుణ్యం ఫలదం కీర్తివర్ధనమ్ ।
తత్ర స్నానేన దానేన జపేన స్తవనేన చ ॥
అపి దుష్కృతకర్మాణః పితరో మోక్షమాప్నుయుః ॥ 52 ॥

యమతీర్థంలో స్నానం చేసి, అక్కడి యమేశ్వరుని దర్శించి, యతాత్ముడై పూజిస్తే త్వరలోనే, వారి తల్లిదండ్రులకు అక్షయమైన పుణ్యం లభిస్తుంది. అక్కడ స్నాన, దాన స్తోత్రాలను చేయడం వలన చక్కని ఫలాన్ని, కీర్తిని పెంపొందింస్తుంది. దుష్కృతకర్ములైన పితరులు మోక్షాన్ని పొందుతారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యాద్యష్టసహస్రాణి తీర్థాని త్రీణి నారద ।
తేషు స్నానం చ దానం చ సర్వమక్షయపుణ్యదమ్ ॥ 53 ॥

ఓ నారదా! ఈవిధంగా ఎనిమిదివేల మూడు తీర్థాలున్నాయి. వాటిలో స్నానం, దానం చేస్తే, అవన్నీ అక్షయ పుణ్యముల నిస్తాయి.

ఏతేషాం స్మరణం పుణ్యం నానాజన్మాఘనాశనమ్ ।
శ్రవణాత్పితృభిః సార్ధం పఠనాత్స్వకులైః సహ ॥ 54 ॥

తేషామప్యతిపాపాని నాశం యాన్తి మమాజ్ఞయా ।
తత్ర స్నానాది యః కృత్వా కించిద్దత్వా యతాత్మవాన్ ॥ 55 ॥

పితౄణాం పిండదానాది కృత్వా నత్వా సురానిమాన్ ।
ధనం ధాన్యం యశో వీర్యమాయురారోగ్యసంపదః ॥ 56 ॥

ఈ తీర్థాలను స్మరించినంతనే పుణ్యం కలుగుతుంది. అనేక జన్మల పాపాలు నశిస్తాయి. విన్నందువలన పితృదేవతలతోగూడ, చదివినందువలన తనవంశం వారితో గూడ, వారందరి పాపాలు నా ఆజ్ఞతో నశిస్తాయి. అక్కడ స్నానం చేసి, నియమంతో ఏ కొంచెమైనా దానం చేస్తే, పితృదేవతలకు పిండదానాదులు చేసి, ఈ దేవతలకు నమస్కరిస్తే ధనము, ధాన్యము, కీర్తి, బలము, ఆయువు, ఆరోగ్యము, సంపదలు,

పుత్రాన్ పౌత్రాన్ ప్రియాం భార్యాం లబ్ధ్వా చాన్యన్మనీషితమ్ ।
అవియుక్తః ప్రీతమనా బన్ధుభిశ్చాతిమానితః ॥ 57 ॥

పుత్రులను, పౌత్రులను, ప్రియమైన భార్యను, ఇతరమైన కోరికలున్నా అవి పొంది, బంధువులతో కలసి, గౌరవాన్ని పొంది సంతోష హృదయుడు కాగలడు.

నరకస్థానపి పిత్రూంస్తారయిత్వా కులాని చ ।
పావయిత్వా ప్రియైర్యుక్తో హ్యన్తే విష్ణుం శివం స్మరేత్ ॥
తతో ముక్తిపదం గచ్ఛేద్దేవానాం వచనం యథా ॥ 58 ॥

నరకంలో ఉన్న పితరులను దాటించి, కులాలను పావనం చేసి, ఇష్టులతోకూడి విష్ణువును, శివుని స్మరిస్తే, దేవతల వచనానుసారంగా ముక్తిపదమును పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే 'బాణతీర్థ శార్ఙ్గపాణీయ గోద్వీప దేవయజన బ్రహ్మతీర్థ శక్తి యమాదిత్య సుపర్ణ దైత్యసూదన యమేశ్వర పితృతీర్థాది త్ర్యధికాష్టసహస్ర తీర్థవర్ణనం' నామైక షష్టితమోஉధ్యాయః.॥ 61 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో, తీర్థమాహాత్మ్యంలో 'బాణతీర్థ, శార్ఙ్గపాణితీర్థ, గోద్వీప, దేవయజన బ్రహ్మతీర్థ, శక్తి, యమ, ఆదిత్య, సుపర్ణ, దైత్యసూదన, యమేశ్వర, పితృతీర్థాది ఏనిమిదివేల మూడు తీర్థములవర్ణన' మనే పేరుగల అరవై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విషష్టితమోఽధ్యాయః - అరవై రెండవ అధ్యాయం

యక్షిణీసంగమ, దుర్గాతీర్థవర్ణనమ్ - యక్షిణీసంగమం, దుర్గాతీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యక్షిణీ సంగమం నామ తీర్థం సర్వఫలప్రదమ్ ।
తత్ర స్నానేన దానేన సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 1 ॥

యక్షిణీ సంగమమనే పేరుగల తీర్థం సమస్తఫలములనిస్తుంది. దానిలో స్నానం చేస్తేచో కోరికలన్నీ తీరుతాయి.

యత్ర యక్షేశ్వరో దేవో దర్శనాద్భుక్తిముక్తిదః ।
తత్ర చ స్నానమాత్రేణ సత్రయాగఫలం లభేత్ ॥ 2 ॥

ఎక్కడ యక్షేశ్వర దేవుడున్నాడో, అక్కడ దర్శనం చేసుకుంటే భుక్తి, ముక్తి లభిస్తాయి. అక్కడ స్నానం చేసినంత మాత్రముననే సత్రయాగ ఫలం లభిస్తుంది.

విశ్వావసోః స్వసా నామ్నా పిప్పలా గురుహాసినీ ।
ఋషీణాం సత్రమగమద్గౌతమీతీరవర్తినామ్ ॥ 3 ॥

విశ్వావసు సోదరి పిప్పలా అనే పేరు గలది, పెద్దగా నవ్వే స్వభావం కలిగి వుండినది. ఒకప్పుడు గౌతమీ తీరంలో ఉండే ఋషులందరు సత్రయాగం చేస్తూ ఉండినారు.

దృష్ట్వా తత్ర ఋషీన్ క్షామాన్ సా జహాసాతిగర్వితా ।
యా గత్వాఽఽశ్రావయ దౌషడస్తు శ్రౌషడితి స్థిరమ్ ॥ 4 ॥

ఓర్పుగల ఆ ఋషులను చూచి ఆమె మిక్కిలి గర్వంతో నవ్వింది. ఆమె వెళ్ళి గట్టిగా వౌషట్ శ్రౌషట్ అంటూ అరుస్తూ నవ్వుతున్నది.

విస్వరేణ బ్రువతీం తాం తే శేపుః స్రావిణీ భవ ।
తతో నద్యభవత్తత్ర యక్షిణీతి సువిశ్రుతా ॥ 5 ॥

వికారస్వరంతో పలుకుతున్న ఆమెను ఋషులు నదివి కమ్మని శపించారు. 'యక్షిణి' అనే పేరుతో ఆ నది ప్రసిద్ధి చెందింది.

తతో విశ్వావసుః పూజ్య ఋషీన్ దేవం త్రిలోచనమ్ ।
సంగమ్య చైవ గౌతమ్యా తాం విశాపామథాకరోత్ ॥ 6 ॥
తత్ర తు స్నానమాత్రేణ సత్రయాగఫలం లభేత్ ॥

తరువాత విశ్వావసువు ఋషులను, త్రినేత్రుడైన శివుని పూజించి, గౌతమీనదిలో స్నానం చేసి, ఆమెను శాపవిముక్తురాలినిగా చేశాడు. కావున ఆ నదిలో స్నానం చేసిన మాత్రం చేత సత్రయాగం చేసిన ఫలం లభిస్తుంది.

తతః ప్రభృతి తత్తీర్థం యక్షిణీసంగమం స్మృతమ్ ।
తత్ర స్నానాదిదానేన సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 7 ॥

అప్పటినుండి ఆ తీర్థానికి యక్షిణీ సంగమమని పేరు వచ్చింది. అక్కడ స్నాన దానాలు చేస్తే అన్ని కోరికలు నెరవేరుతాయి.

విశ్వావసోః ప్రసన్నోఽభూద్యత్ర శంభుః శివాన్వితః ।
శైవం తత్పరమం తీర్థం దుర్గాతీర్థం చ విశ్రుతమ్ ॥ 8 ॥

విశ్వావసుకు పార్వతితో గూడ శివుడు ఎక్కడ ప్రసన్నుడైనాడో దానిని శైవతీర్థమని, దుర్గాతీర్థమని అంటారు.

సర్వపాపౌఘహరణం సర్వదుర్గతినాశనమ్ ।
సర్వేషాం తీర్థముఖ్యానాం తద్ధి సారం మహామునే ॥
తీర్థం మునివరైః ఖ్యాతం సర్వసిద్ధిప్రదం నృణామ్ ॥ 9 ॥

ఓ మహామునీ! తీర్థాలన్నింటిలో ఆ తీర్థం సారభూతమైంది. పాప సమూహములన్నింటినీ పోగొడుతుంది. దుర్గతి సంచయాన్ని నశింపచేస్తుంది. అందువలననే అది మానవులకు సర్వసిద్ధిప్రదమైన తీర్థమని ఋషులన్నారు.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే యక్షిణీసంగమ, దుర్గాతీర్థవర్ణనం నామ ద్విషష్టితమోఽధ్యాయః. ॥ 62 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి, తీర్థమాహాత్మ్యములోని యక్షిణీసంగమము, దుర్గాతీర్థ వర్ణనమను పేరు గల అరవై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిషష్టితమోఽధ్యాయః - అరవై మూడవ అధ్యాయం

శుక్ల తీర్థాది ఉభయ తీరస్థ సప్తసహస్ర తీర్థవర్ణనమ్

రెండు తీర్థాలలోవున్న శుక్లతీర్థం మొదలైన ఏడువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శుక్ల తీర్థమితిఖ్యాతం సర్వసిద్ధికరం నృణామ్ ।
యస్య స్మరణమాత్రేణ సర్వకామానవాప్నుయాత్ ॥ 1 ॥

మానవులకు సర్వసిద్ధులు కలుగచేసే శుక్లతీర్థమని ఉన్నది. దానిని స్మరించినంత మాత్రముననే కోరికలన్నీ నెరవేరుతాయి.

భరద్వాజ ఇతి ఖ్యాతో మునిః పరమధార్మికః ।।
తస్య పైఠీనసీ నామ భార్యా సుకులభూషణా ॥ 2 ॥

పరమధార్మికుడైన భరద్వాజుడను మునిగలడు. అతనికి చక్కని కులభూషణురాలగు పైఠీనసీ అను భార్యగలదు.

గౌతమీతీరమధ్యాస్తే పాతివ్రత్యపరాయణా ।
అగ్నీషోమీయమైన్ద్రాగ్నం పురోడాశ మకల్పయత్ ॥ 3 ॥

పతివ్రతా పరాయణురాలగు ఆమె గౌతమీ తీరమునందు నివసించుచుండినది. వారక్కడ అగ్నీషోమీయము, ఐంద్రాగ్నము, పురోడాశమనే యజ్ఞముల నాచరించారు.

పురోడాశే శ్రప్యమాణే ధూమాత్కశ్చిదజాయత ।
పురోడాశం భక్షయితుం లోకత్రితయభీషణః ॥ 4 ॥

పురోడాశ యజ్ఞమును చేస్తుండగా ఆ ధూమమునుండి ఒక కృత్య రాక్షసుడు ముల్లోకాలను భయపెడుతూ ఆ పురోడాశాన్ని భక్షించడానికి వచ్చాడు.

యజ్ఞం మే హ్యత్ర కో హంసి కోపాత్త్వమితి తం మునిః ।
ప్రోవాచ సత్వరం క్రుద్ధో భరద్వాజో ద్విజోత్తమః ॥
తదృషేర్వచనం శ్రుత్వా రాక్షసః ప్రత్యువాచ తమ్ ॥ 5 ॥

ఇక్కడ నా యజ్ఞాన్ని ధ్వంసం చేసిన నీవెవరు? అని ద్విజోత్తముడైన భరద్వాజుడు వెంటనే కోపంతో అతనిని అడిగాడు. ఆ ఋషి మాటలు విన్న రాక్షసుడు అతనికిలా సమాధానం చెప్పాడు.

రాక్షస ఉవాచ :- రాక్షసుడు పలికాడు.

హవ్యఘ్న ఇతి విఖ్యాతం భరద్వాజ నిబోధ మామ్ ।
సన్ధ్యాసుతోఽహం జ్యేష్ఠశ్చ సుతః ప్రాచీనబర్హిషః ॥ 6 ॥

ఓ భరద్వాజా! నేను సంధ్యాకుమారుడను. ప్రాచీనబర్హియొక్క పెద్దకుమారుడను. నన్ను హవ్యఘ్నుడంటారు.

బ్రహ్మణా మే వరో దత్తో యజ్ఞాన్ ఖాద యథాసుఖమ్ ।
మమానుజః కలిశ్చాపి బలవానతిభీషణః ॥ 7 ॥

నాకు బ్రహ్మ యజ్ఞములను యథేచ్ఛగా తినుమని వరమిచ్చాడు. నా సోదరుడు కలి కూడా బలవంతుడు, మిక్కిలి భయంకరుడు.

అహం కృష్ణః పితా కృష్ణో మాతా కృష్ణా తథాఽనుజః ।
అహం మఖం హనిష్యామి యూపం ఛేద్మి కృతాన్తకః ॥ 8 ॥

నేను నల్లగా వుంటాను, నా తండ్రి నల్లనివాడు, నా తల్లి నల్లనిది. నా సోదరుడు కూడా నల్లనివాడు. నేను కృతాంతకుడను. నేను యజ్ఞాన్ని ధ్వంసం చేస్తాను. యూపస్తంభాన్ని చీల్చుతా.

భరద్వాజ ఉవాచ :- భరద్వాజుడు పలికాడు.

రక్ష్యతాం మే త్వయా యజ్ఞః ప్రియో ధర్మః సనాతనః ।
జానే త్వాం యజ్ఞహన్తారం సద్విజం రక్ష మే క్రతుమ్ ॥ 9 ॥

సనాతనము, ధర్మము, ప్రియమునైన నా యజ్ఞాన్ని నీవు రక్షించాలి. నీవు బ్రాహ్మణోత్తముడవని నేనెరుగుదును. యజ్ఞధ్వంసకుడివని తెలుసు. నా క్రతువును రక్షించు.

యజ్ఞఘ్న ఉవాచ :- యజ్ఞనాశకుడు పలికాడు.

భరద్వాజ నిబోధేదం వాక్యం మమ సమాసతః ।
బ్రాహ్మణోఽహం పురా శప్తో దేవదానవసంనిధౌ॥ 10 ॥

ఓ భరద్వాజా! నేను చెప్పేమాటను జాగ్రత్తగా విను. నేను పూర్వం ఒక బ్రాహ్మణుడను. దేవదానవుల సమక్షంలో నేను శాపాన్ని పొందాను.

తతః ప్రసాదితో దేవో మయా లోకపితామహః ।
అమృతైః ప్రోక్షయిష్యన్తి యదా త్వాం మునిసత్తమాః ॥ 11 ॥

తదా విశాపో భవితా హవ్యఘ్నత్వం న చాన్యథా ।
ఏవం కరిష్యసి యదా తతః సర్వం భవిష్యతి ।
యద్యదాకాంక్షితం బ్రహ్మన్ నైతన్మిథ్యా కదాచన ॥ 12 ॥

అటు తరువాత లోకపితామహుడైన బ్రహ్మ నన్ను అనుగ్రహించినాడు. మునిశ్రేష్ఠులైనవారు నీపై ఎప్పుడు అమృతాన్ని ప్రోక్షిస్తారో, అప్పుడు నీకు శాపవిమోచనమవుతుంది. ఓ హవ్యఘ్నా! దానికి మరో మార్గం లేదు. నీవెప్పుడు ఇలా చేస్తే అప్పుడే నీవు ఏదికోరితే అది సిద్ధిస్తుంది. ఇది ఎప్పుడూ అసత్యము కాదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భరద్వాజః పునః ప్రాహ సఖా మేఽసి మహామతే ।
మఖసంరక్షణం యేన స్యాన్మే వద కరోమి తత్ ॥ 13 ॥

భరద్వాజుడు తిరిగి ఇలా అన్నాడు. ఓ మహామతీ! నీవు నా స్నేహితుడవు. యాగమునకెలా రక్షణ కలుగుతుందో ఆ మార్గాన్ని చెప్పు. దానిని నేను చేస్తాను.

సంభూయ దేవా దైతేయా మమన్థుః క్షీరసాగరమ్ ।
అలభన్తామృతం కష్టాత్తదస్మాత్సులభం కథమ్ ॥ 14 ॥

దేవతలు రాక్షసులు కలిసి క్షీరసాగరాన్ని చిలికారు. అతికష్టముగా దానినుండి అమృతాన్ని పొందినారు. అటువంటిది మాకు సులభమెలా అవుతుంది?

ప్రీత్యా యది ప్రసన్నోఽసి సులభం యద్వదస్వ తత్ ।
తదృషేర్వచనం శ్రుత్వా రక్షః ప్రాహ తదా ముదా ॥ 15 ॥

నీ వొకవేళ నాపై ప్రేమతో ప్రసన్నుడవైతే నాకు సులభమెలా అవుతుందో అది చెప్పు. ఋషి మాటను విన్న రాక్షసుడు అప్పుడు సంతోషంతో ఇలా అన్నాడు.

రక్ష ఉవాచ :- రాక్షసుడు పలికాడు.

అమృతం గౌతమీ వారి అమృతం స్వర్ణముచ్యతే ।
అమృతం గోభవం చాఽఽజ్యమమృతం సోమ ఏవ చ ॥ 16 ॥

గౌతమీనది నీరు అమృతము. బంగారాన్ని అమృతమంటారు. గోవునుండి వచ్చినదమృతం. నేయి అమృతము. సోమము(సోముడు) అమృతము.

ఏతైర్మామభిషించస్వ అథవైతాస్తథా త్రిభిః ।
గంగాయా వారిణాఽఽజ్యేన హిరణ్యేన తథైవ చ ॥
సర్వేభ్యోఽప్యధికం దివ్యమమృతం గౌతమీజలమ్ ॥ 17 ॥

గంగాజలముతో, నేయితో, అలాగే బంగారంతో, ఈ మూడింటితో నన్నభిషేకించు. అన్నింటి కంటె దివ్యమైనది, ముఖ్యమైనది గౌతమీ జలం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతదాకర్ణ్య స ఋషిః పరం సంతోషమాగతః ।
పాణావాదాయ గంగాయాః సలిలామృతమాదరాత్ ॥ 18 ॥

ఈ మాట విని ఋషి మిక్కిలి సంతోషించాడు. దోసిలితో గంగాజలము నాదరముగా తీసుకొని వచ్చి,

తేనాకరోదృషీ రక్షో హ్యభిషిక్తం తదా మఖే ।
పునశ్చ యూపే చ పశావృత్విక్షు మఖమండలే ॥ 19 ॥

దానితో నా ఋషి రాక్షసునకభిషేకం చేశాడు. అప్పుడు యజ్ఞమునందు, యూపస్తంభమునందు, పశువుయందు, ఋత్విక్కులయందు, యజ్ఞమంటపమందును,

సర్వమేవాభవచ్ఛుక్లమభిషేకాన్మహాత్మనః ।
తద్రక్షోఽపి తదా శుక్లో భూత్వోత్పన్నో మహాబలః ॥ 20 ॥

అంతటా ఆ మహాత్ముని యభిషేకమువలన తెల్లగా, స్వచ్ఛముగా అయింది. ఆ రాక్షసుడు కూడా స్వచ్ఛుడై, మహాబలుడై లేచాడు.

యః పురా కృష్ణరూపోఽభూత్సతు శుక్లోఽభవత్ క్షణాత్ ।
యజ్ఞం సర్వం సమాప్యాథ భరద్వాజః ప్రతాపవాన్ ॥ 21 ॥

ఇంతకు పూర్వం నల్లగా ఉన్నవాడు క్షణంలోనే తెల్లగా మారిపోయాడు. ప్రతాపవంతుడైన భరద్వాజుడు యజ్ఞమునంతా పూర్తిచేసి,

ఋత్విజోఽపి విసృజ్యాథ యూపం గంగోదకేఽక్షిపత్ ।
గంగామధ్యే తద్ధి యూపమద్యాప్యాస్తే మహామతే ॥ 22 ॥

ఓ మహామతీ! ఋత్విక్కులందరికి అనుజ్ఞనిచ్చి, యూపస్తంభాన్ని గంగాజలంలో పడవేశాడు. ఆ యూపస్తంభం నేటికీ కూడా గంగానది మధ్యలో ఉన్నది.

అభిషిక్తం చామృతేన అభిజ్ఞానం తు తన్మహత్ ।
తత్ర తీర్థే పునా రక్షో భరద్వాజమువాచ హ ॥ 23 ॥

అమృతంతో అభిషేకించినట్లు గుర్తుగా అది గొప్పగా ఉన్నది. అక్కడ తీర్థంలో మరల రాక్షసుడు భరద్వాజునితో ఇలా అన్నాడు.

రక్ష ఉవాచ :- రాక్షసుడు పలికాడు.

అహం యామి భరద్వాజ కృతః శుక్లస్త్వయా పునః ।
తస్మాత్త్వాత్ర తీర్థే యే స్నానదానాదిపూజనమ్ ॥ 24 ॥

కుర్యుస్తేషామభీష్టాని భవేయుర్యత్ఫలం మఖే ।
స్మరణాదపి పాపాని నాశం యాన్తు సదా మునే ॥ 25 ॥

ఓ భరద్వాజా! నేను నీవలన తిరిగి స్వచ్ఛతను, తెల్లదనాన్ని పొందాను. అందువలన ఎవరు ఈ తీర్థంలో స్నానదానాది పూజలను, చేస్తారో, వారి కోరికలన్నీ, యజ్ఞంలో ఏ ఫలాన్ని పొందుతారో అవన్నీ సిద్ధిస్తాయి. ఓ మునీ! వారు దీనిని స్మరించినా ఆ పాపములన్నీ నశించుగాక.

తతః ప్రభృతి తత్తీర్థం శుక్లతీర్థమితి శ్రుతమ్ ।
గౌతమ్యాం దణ్డకారణ్యే స్వర్గద్వారమపావృతమ్ ॥ 26 ॥

అప్పటి నుండి ఆ తీర్థానికి శుక్లతీర్థమని పేరు వచ్చింది. దండకారణ్యంలోని నందలి గౌతమీ తీర్థంలో స్వర్గద్వారం తెరువబడి ఉన్నది.

ఉభయోస్తీరయోః సప్తసహస్రాణ్యపరాణి చ ।
తీర్థానాం మునిశార్దూల సర్వసిద్ధిప్రదాయినామ్ ॥ 27 ॥

ఓ మునిశ్రేష్ఠా! గంగానదికి రెండు వైపుల తీరాలలో ఏడువేల తీర్థాలు సర్వసిద్ధులను కలుగజేసేవిగా ఉన్నాయి.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యేతీర్థమాహాత్మ్యే శుక్లతీర్థాది ఉభయతీరస్థ సప్తసహస్ర తీర్థవర్ణనం నామ త్రిషష్టితమోఽధ్యాయః. ॥ 63 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములో రెండు తీరములందున్న శుక్లతీర్థం మొదలైన ఏడువేల తీర్థముల వర్ణనమనే పేరుగల అరవై మూడవ అధ్యాయం సంపూర్ణం.

;

చతుః షష్టితమోఽధ్యాయః – అరవైనాల్గవ అధ్యాయం

చక్రతీర్థాది పంచశతతీర్థ వర్ణనమ్ – చక్రతీర్థం మొదలైన ఐదువందల తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

చక్రతీర్థమితిఖ్యాతం స్మరణాత్పాపనాశనమ్ ।
తస్య ప్రభావం వక్ష్యామి శృణు యత్నేన నారద ॥ 1 ॥

నారదా! చక్రతీర్థమనేది. స్మరించినంత మాత్రముననే పాపాన్ని నశింపజేసేది. దాని ప్రభావాన్ని చెప్పబోతున్నాను. శ్రద్ధగా విను.

ఋషయః సప్త విఖ్యాతా వసిష్ఠప్రముఖా మునే ।
గౌతమ్యాస్తీరమాశ్రిత్య సత్రయజ్ఞముపాసతే ॥ 2 ॥

వసిష్ఠాది ఋషులు ఏడుగురు చాలా ప్రసిద్ధి చెందినవారు. వారంతా గౌతమీనదీతీరానికి వెళ్ళి సత్రయాగాన్ని ప్రారంభించారు.

తత్ర విఘ్న ఉపక్రాన్తే రక్షోభిరతిభీషణే ।
మామభ్యేత్యాథ మునయో రక్షఃకృత్యం న్యవేదయన్ ॥ 3 ॥

అక్కడ రాక్షసులు భయంకరమైన విఘ్నాన్ని కలుగజేయగా ఆ ఋషులందరు నా వద్దకు వచ్చి రాక్షసుల కృత్యాలను నివేదించిరి.

తదాఽహం ప్రమదారూపం మాయయాఽఽసృజ్య నారద ।
యస్యాశ్చ దర్శనాదేవ నాశం యాన్త్యథ రాక్షసాః ॥ 4 ॥

ఓ నారదా! అప్పుడు నేను మాయతో ఒక స్త్రీరూపాన్ని సృష్టించాను. ఏ స్త్రీని చూచినంత మాత్రానే రాక్షసులు నశించిపోతారో అటువంటి స్త్రీని సృష్టించాను.

ఏవముక్త్వా తు తాం ప్రాదామృషిభ్యః ప్రమదాం మునే ।
మద్వాక్యాదృషయో మాయామాదాయ పునరాగమన్ ॥ 5 ॥

ఓ మునీ! ఇలా చెప్పి నేనా ఋషులకు ఆ స్త్రీని ఇచ్చాను. నా మాట ప్రకారంగా వారా మాయను తీసుకొని వెళ్ళారు.

అజైకా యా సమాఖ్యాతా కృష్ణలోహితరూపిణీ ।
ముక్తకేశీత్యభిధయా సాఽఽస్తేఽద్యాపి స్వరూపిణీ ॥ 6 ॥

కృష్ణలోహిత వర్ణముగలిగి అజైకా అనే పేరుతోను, ముక్తకేశి అనే పేరుతోను ఆ రూపంలో నేటికిని ఉన్నది.

లోకత్రితయసంమోహదాయినీ కామరూపిణీ ।
తత్బలాత్ స్వస్థమనసః సర్వే చ మునిసత్తమాః ॥ 7 ॥

ముల్లోకాలను మోహింపజేసే కామరూపిణి ఆమె. ఆమె బలంతో మునిశ్రేష్ఠులందరూ స్వస్థమనస్కులైనారు.

గౌతమీం సరితాం శ్రేష్ఠాం పునర్యజ్ఞాయ దీక్షితాః ।
పునస్తన్మఖనాశాయ రాక్షసాః సముపాగమన్ ॥ 8 ॥

ఋషులంతా ఆ శ్రేష్ఠమైన గౌతమీనది వద్దకు వెళ్ళి మరల యజ్ఞము చేయుటకై దీక్షను స్వీకరించారు. మళ్ళీ తిరిగి ఆ యజ్ఞాన్ని పాడుచేయడానికి రాక్షసులు వచ్చారు.

యజ్ఞవాటాన్తికే మాయాం దృష్ట్వా రాక్షసపుంగవాః ।
తతో నృత్యన్తి గాయన్తి హసన్తి చ రుదన్తి చ ॥ 9 ॥

యజ్ఞవాటిక సమీపంలోవున్న మాయను చూచి రాక్షసులు కొందరు నాట్యం చేయగా కొందరు పాడుతున్నారు. కొందరు నవ్వుతున్నారు. కొందరేడుస్తున్నారు.

మాహేశ్వరీ మహామాయా ప్రభావేణాతిదర్పితా ।
తేషాం మధ్యే దైత్యపతిః శమ్బరో నామ వీర్యవాన్ ॥ 10 ॥

ఆ మహామాయ మహేశ్వరి ప్రభావంతో మిక్కిలి దర్పంతో ఉండగా, ఆ రాక్షసుల మధ్యలో రాక్షసరాజైన శంబరుడనే గొప్ప బలవంతుడుండినాడు.

మాయారూపాం తు ప్రమదాం భక్షయామాస నారద ।
తదద్భుతమతీవాఽఽసీత్తన్మాయాబలదర్శినామ్ ॥ 11 ॥

ఓ నారదా! ఆ శంబరుడు మాయారూపిణియైన స్త్రీని భక్షించాడు. అతని బలము చూచినవారి కదొక మిక్కిలి అద్భుతంగా అనిపించింది.

మఖే విధ్వంస్యమానే తు తే విష్ణుం శరణం యయుః ।
ప్రాదాద్విష్ణుశ్చక్రమథో మునీనాం రక్షణాయ తు ॥ 12 ॥

యజ్ఞం ధ్వంసం కాగా ఆ ఋషులంతా విష్ణువును శరణు వేడారు. విష్ణువు మునుల రక్షణకొరకు చక్రము నిచ్చాడు.

చక్రం తద్రాక్షసానాజౌ దైత్యాంశ్చ దనుజాంస్తథా ।
చిచ్ఛేద తద్భయాదేవ మృతా రాక్షసపుంగవాః ॥ 13 ॥

యుద్ధంలో ఆ చక్రం రాక్షసులను, దైత్యులను, దనుజులను ఖండించింది. దాని భయంవలననే రాక్షసశ్రేష్ఠులు మరణించారు.

ఋషిభిస్తన్మహాసత్రం సంపూర్ణమభవత్తదా ।
విష్ణోః ప్రక్షాలితం చక్రం గంగామ్భోభిః సుదర్శనమ్ ॥ 14 ॥

అప్పుడు ఋషులా మహాసత్రమును పూర్తిచేశారు. గంగాజలంతో విష్ణువు సుదర్శనచక్రాన్ని ప్రక్షాళన చేశారు.

తతః ప్రభృతి తత్తీర్థం చక్రతీర్థముదాహృతమ్ ।
తత్ర స్నానేన దానేన సత్రయాగఫలం లభేత్ ॥ 15 ॥

అప్పటినుండి ఆ తీర్థమును చక్రతీర్థమంటారు. అక్కడ స్నాన, దానాలు చేస్తే సత్రయాగఫలం లభిస్తుంది.

తత్ర పంచశతాన్యాసంస్తీర్థానాం పాపహారిణామ్ ।
తేషు స్నానం తథా దానం ప్రత్యేకం ముక్తిదాయకమ్ ॥ 16 ॥

అక్కడ పాపాలను నశింపజేసే ఐదువందల తీర్థాలు ఉన్నాయి. ప్రత్యేకించి వానిలో స్నాన దానాలు చేస్తే ముక్తినిస్తాయి.

ఇతి శ్రీ బ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే చక్రతీర్థాదిపంచశత తీర్థవర్ణనం నామ చతుః షష్టితమోఽధ్యాయః. ॥ 64 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలోని చక్రతీర్థం మొదలైన ఐదువందల తీర్థాల వర్ణనమనే పేరుగల అరవై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచషష్టితమోఽధ్యాయః - అరవై ఐదవ అధ్యాయం

వాణీసంగమ వాగీశ్వరాద్యుభయతటస్థైకోనవింశతి శత తీర్థవర్ణనమ్

రెండు తీరములందున్న వాణీసంగమ వాగీశ్వర మున్నగు పందొమ్మిది వందల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వాణీసంగమమాఖ్యాతం యత్ర వాగీశ్వరో హరః ।
తత్తీర్థం సర్వపాపానాం మోచనం సర్వకామదమ్ ॥ 1 ॥

ఎక్కడ వాగీశ్వరుడైన శివుడుంటాడో దానిని వాణీసంగమమంటారు. ఆ తీర్థం పాపాలన్నిటినీ పోగొట్టి, కోరికలన్నింటిని తీర్చేది.

తత్ర స్నానేన దానేన బ్రహ్మహత్యాదినాశనమ్ ।
బ్రహ్మవిష్ణ్వోశ్చ సంవాదే మహత్వే చ పరస్పరమ్ ॥ 2 ॥

అక్కడ స్నాన, దానాలు చేస్తే బ్రహ్మహత్యాది పాపాలు నశిస్తాయి. ఒకప్పుడు బ్రహ్మ విష్ణువులకు పరస్పరం గొప్పదనం విషయంలో సంవాదం జరిగింది.

తయోర్మధ్యే మహాదేవో జ్యోతిర్మూర్తిరభూత్కిల ।
తత్రైవ వాగువాచేదం దైవీ పుత్ర తయోః శుభా ॥ 3 ॥

నాయనా! వారిద్దరి మధ్యలో శివుడు జ్యోతిస్స్వరూపునిగా నిలిచెనట. అప్పుడు వారితో శుభమైన అశరీరవాణి ఇలా పలికింది.

అహమస్మి మహాంస్తత్ర అహమస్మీతి వై మిథః ।
దైవీవాక్తావుభౌ ప్రాహ యస్త్వస్యాంతం తు పశ్యతి ॥ 4 ॥

నేను గొప్పంటే నేను గొప్పని మీరు ఇద్దరూ పరస్పరము వాదించుకుంటున్నారు. ఇంకనూ దైవీవాక్కు వారిద్దరితో ఇలా పలికింది.

స తు జ్యేష్ఠో భవేత్తస్మాన్మా వాదం కర్తుమర్హథః ।
తద్వాక్యాద్విష్ణురగమదధోఽహం చోర్ధ్వమేవ చ ॥ 5 ॥

మీలో ఎవరు ఆ జ్యోతిర్మూర్తి అంతాన్ని చూస్తారో వారు జ్యేష్ఠులవుతారు. కావున మీరు వాదించుకోవడం మంచిదికాదని చెప్పగా విష్ణువు అధోలోకములకు, నేనూర్ధ్వలోకములకు వెళ్ళాము.

తతో విష్ణుః శీఘ్రమేత్య జ్యోతిః పార్శ్వ ఉపావిశత్ ।
అప్రాప్యాన్తమహం ప్రాయాం దూరాద్దూరతరం మునే ॥ 6 ॥

ఓ మునీ! తరువాత విష్ణువు త్వరగా వచ్చి జ్యోతి ప్రక్కన కూర్చున్నాడు. నేను అంతము దొరకక చాలా దూరం వెళ్ళాను.

తతః శ్రాన్తో నివృత్తోఽహం ద్రష్టుమీశం తు తం ప్రభుమ్ ।
తదైవం మమ ధీరాసీద్దృష్టశ్చాన్తో మయా భృశమ్ ॥ 7 ॥

అటు తరువాత నేను అలసిపోయి ఆ ప్రభువైన ఈశ్వరుని చూచుటకు వచ్చాను. అప్పుడు నాకు జ్ఞానం కలిగింది. నేను వెంటనే అంతాన్ని చూచాను.

అస్య దేవస్య తద్విష్ణోర్మమ జ్యైష్ఠ్యం స్ఫుటం భవేత్ ।
పునశ్చాపి మమ త్వేవం మతిరాసీన్మహామతే ॥ 8 ॥

ఓ మహామతీ! ఈ విష్ణుదేవుడు-నేను, మా యిద్దరిలో జ్యేష్ఠుడెవరో స్పష్టం కావలసి ఉన్నది. మరల నా కిలా అనిపించింది.

సత్యైర్వక్త్రైః కథం వక్ష్యే పీడితోఽప్యనృతం వచః ।
నానావిధేషు పాపేషు నానృతాత్పాతకం పరమ్ ॥ 9 ॥

నేను బాధపడినా నా సత్యవాక్కులు గల నోళ్ళతో ఎలా అసత్యమాడుతాను? అనేక విధాల పాపాలలో అసత్యమున కంటె గొప్ప పాపం లేదు.

సత్యైర్వక్త్రైరసత్యాం వా వాచం వక్ష్యే కథం త్వితి ।
తతోహం పంచమం వక్త్రం గర్దభాకృతిభీషణమ్ ॥ 10 ॥

కృత్వా తేనానృతం వక్ష్య ఇతి ధ్యాత్వా చిరం తదా ।
అబ్రవం తం హరిం తత్ర ఆసీనం జగతాం ప్రభుమ్ ॥ 11 ॥

సత్యం పలికే నా నోళ్ళతో నేనెలా అసత్యాన్ని పలుకుతానని ఆలోచించి తరువాత నా ఐదవముఖాన్ని భయంకరమైన గార్దభాకృతిగా, చేసి దానితో అబద్ధము చెబుతానని చాలాసేపు ధ్యానించి అక్కడ కూర్చొనివున్న జగత్ప్రభువైన విష్ణువుతో ఇలా అన్నాను.

అస్య చాన్తో మయా దృష్టస్తేన జ్యైష్ఠ్యం జనార్దన ।
మమేతి వదతః పార్శ్వే ఉభౌ తౌ హరిశంకరౌ ॥ 12 ॥

ఏకరూపత్వమాపన్నౌ సూర్యచంద్రమసావివ ।
తౌ దృష్ట్వా విస్మితో భీతశ్చాస్తవం తావుభావపి ॥
తతః కృద్ధౌ జగన్నాథౌ వాచం తామిదమూచతుః ॥ 13 ॥

ఓ జనార్దనా! నేను దీని అంతం చూచాను. కావున జ్యేష్ఠత్వం నాకే ఇవ్వాలి అని అంటూండగా, ప్రక్కనవున్న ఆ హరి శంకరు లిద్దరు, సూర్యచంద్రులవలె ఏకరూపత్వాన్ని పొందిరి. వారిని చూచి ఆశ్చర్యం, భయం కలిగి వారిద్దరిని స్తుతించాను. అప్పుడు జగన్నాథులైన వారిద్దరు కోపంతో వాక్కునిలా పలికారు.

హరిహరావూచతుః :– హరిహరులు పలికారు.

దుష్టే త్వం నిమ్నగా భూయా నానృతాదస్తిపాతకమ్ ॥ 14 ॥

దుష్టురాలా! నీవు అధోగతి పొందుతా. అబద్ధమాడుట కంటె పాతకం మరొకటి లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః సా విహ్వలా భూత్వా నదీభావముపాగతా ।
తద్దృష్ట్వా విస్మితో భీతస్తామబ్రవమహం తదా ॥ 15 ॥

అప్పుడాగార్దభం విహ్వలురాలై నదీభావాన్ని పొందింది. అది చూచి నేను విస్మయాన్ని, భయాన్ని పొంది ఇలా అన్నాను.

యస్మాదసత్యముక్తాఽసి బ్రహ్మవాచి స్థితా సతీ ।
తస్మాదదృశ్యా త్వం భూయాః పాపరూపాఽస్యసంశయమ్ ॥ 16 ॥

బ్రహ్మవాక్కు కలిగిన దానివైనా నీవు అసత్యమాడినావు కనుక పాపరూపివైనావు. దీనిలో సందేహం లేదు. అందువలన నీవు అదృశ్యురాలవగుదువు గాక.

ఏతచ్ఛాపం విదిత్వా తు తౌ దేవౌ ప్రణతాం తదా ।
విశాపత్వం ప్రార్థయన్తీ తుష్టావ చ పునః పునః ॥ 17 ॥

ఈ శాపాన్ని తెలుసుకొని అప్పుడు హరిహరులకు నమస్కరిస్తూ, శాపమోచనాన్ని కోరుతూ మాటిమాటికి స్తుతించింది.

తతస్తుష్టౌ దేవదేవౌ ప్రార్థితౌ త్రిదశార్చితౌ ।
ప్రీత్యా హరిహరావేవం వాచం వాచమథోచతుః ॥ 18 ॥

అప్పుడు దేవతలచే పూజింపబడిన ఆ దేవదేవులు ప్రార్థించిన స్తోత్రానికి సంతసించి హరిహరులిలా అన్నారు.

హరిహరావూచతుః :– హరిహరులు పలికారు.

గంగయా సంగతా భద్రే యదా త్వం లోకపావనీ ।
తదా పునర్వపుస్తే స్యాత్పవిత్రం హి సుశోభనే ॥ 19 ॥

సుశోభనా! మంగళకరురాలా! నీవెప్పుడు గంగానదితో సంగమిస్తావో అప్పుడు లోకపావనివై, తిరిగి నీ శరీరం నీకు వచ్చి పవిత్రమవుతావు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా సాఽపి దేవీ గంగయా సంగతాఽభవత్ ।
భాగీరథీ గౌతమీ చ తతశ్చాపి స్వకం వపుః ॥ 20 ॥

అలాగేనని ఆ దేవి గంగానదితో సంగమించింది. సంగమించిన తరువాత భాగీరథి, గౌతమి, తన శరీరం వీటి రూపాన్ని పొందినాయి.

దేవీ సా వ్యగమద్బ్రహ్మన్ దేవానామపి దుర్లభమ్ ।
గౌతమ్యాం సైవ విఖ్యాతా నామ్నా వాణీతి పుణ్యదా ॥ 21॥

ఓ బ్రహ్మస్వరూపుడా! ఆ దేవి దేవతలెవరికీ లభ్యంకాని గౌతమియందు వాణి అనే పేరుతో ప్రఖ్యాతి పొంది పుణ్యముల నిచ్చేదయింది.

భాగీరథ్యాం సైవ దేవీ సరస్వత్యభిధీయతే ।
ఉభయత్రాపి విఖ్యాతః సంగమో లోకపూజితః ॥ 22 ॥

భాగీరథియందున్న ఆ దేవిని సరస్వతి అంటారు. ఈ సంగమం ఇహపరాలు రెండింటిలోను ప్రసిద్ధి చెంది లోకం పూజించేటట్లుయింది.

సరస్వతీసంగమశ్చ వాణీసంగమ ఏవ చ ।
గౌతమ్యా సంగతా దేవీ వాణీ వాచా సరస్వతీ ॥ 23 ॥

సరస్వతీసంగమమని, వాణీసంగమమని అంటారు. గౌతమి యందు సంగమించిన దేవి వాణి. ఆమెయే వాక్కుతో సరస్వతి.

సర్వత్ర పూజితం తీర్థం తత్ర వాచా శివం ప్రభుమ్ ।
దేవేశ్వరం పూజయిత్వా విశాపమగమద్యతః ॥ 24 ॥

అంతటా ఆ తీర్థం పూజించబడింది. అక్కడ వాక్కుతో దేవేశ్వరుడు, ప్రభువు అయిన శివుని పూజించి శాపవిమోచనం పొందింది.

బ్రహ్మ విధూయ వాగ్దౌష్ట్యం స్వం చ ధామాగమత్పునః ।
తస్మాత్తత్ర శుచిర్భూత్వా స్నాత్వా తత్ర చ సంగమే ॥ 25 ॥

బ్రహ్మ ఆ సంగమమునందు స్నానం చేసి, శుచియై, తన వాగ్దోషాన్ని పోగొట్టుకొని, తిరిగి తన లోకానికి వెళ్ళాడు.

వాగీశ్వరం తతో దృష్ట్వా తావతా ముక్తిమాప్నుయాత్ ।
దానహెూమాదికం కించిదుపవాసాదికాం క్రియామ్ ॥ 26 ॥

యః కుర్యాత్సంగమే పుణ్యే సంసారే న భవేత్పునః ।
ఏకోనవింశతిశతం తీర్థానాం తీరయోర్ద్వయోః ॥
నానాజన్మార్జితాశేషపాపక్షయవిధాయినామ్ ॥ 27 ॥

ఆ సంగమంలో స్నానం చేసి శుచియై వాగీశ్వరుని దర్శిస్తే ముక్తిని పొందుతారు. ఎవరు ఆ సంగమమునందు దానం, హోమం, కొంచెం ఉపవాసం మొదలైన క్రియలను, చేస్తారో వారికి తిరిగి ఈ సంసారంలో పునర్జన్మ అంటూ ఉండదు. అక్కడ రెండు తీరములందున్న పందొమ్మిది వందల తీర్థములు అనేక జన్మలనుండి పొందిన పాపములను నశింపజేస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే వాణీసంగమ, వాగీశ్వరాద్యుభయతట స్థైకోనవింశతి శత తీర్థవర్ణనం నామ పంచషష్టితమోఽధ్యాయః. ॥ 65 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని వాణీసంగమ, వాగీశ్వర మున్నగు రెండుతీరములందున్న పందొమ్మిది వందల తీర్థముల వర్ణనమనే పేరుగల అరవై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్ షష్టితమోఽధ్యాయః - అరవై ఆరవ అధ్యాయం
మౌద్గల్య,విష్ణుతీర్థాద్యేకాదశసహస్రతీర్థవర్ణనమ్
మౌద్గల్య, విష్ణుతీర్థములు మొదలైన పదకొండువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విష్ణుతీర్థమితి ఖ్యాతం తత్ర వృత్తమిదం శృణు ।
మౌద్గల్య ఇతి విఖ్యాతో ముద్గలస్య సుతో ఋషిః ॥ 1 ॥

విష్ణుతీర్థమనునది ప్రసిద్ధమైనది కలదు. దాని వృత్తాంతాన్ని చెబుతున్నాను, విను. ముద్గలఋషి కుమారుడు మౌద్గల్యుడనే పేరుకలవాడున్నాడు.

తస్య భార్యా తు జాబాలా నామ్నా ఖ్యాతా సుపుత్రిణీ ।
పితా ఋషిస్తథా వృద్ధో ముద్గలో లోకవిశ్రుతః ॥ 2 ॥

అతని భార్యపేరు జాబాల. ఆమె మంచి సంతానము గలది. తండ్రి, ముద్గలుడు ఋషి, వృద్ధుడు అని లోకంలో పేరు పొందినవాడు.

తస్య భార్యా తథా ఖ్యాతా నామ్నా భాగీరథీ శుభా ।
స మౌద్గల్యః ప్రాతరేవ గంగాం స్నాతి యతవ్రతః ॥ 3 ॥

మంగళస్వరూపిణియైన అతని భార్య భాగీరథి అనే పేరుతో ప్రసిద్ధిచెందింది. ఆ మౌద్గల్యుడు ఉదయాన్నే నియమంగా గంగానదికి వెళ్ళి స్నానం చేస్తాడు.

నిత్యమేవ త్విదం కర్మ తస్యాఽఽసీన్మునిసత్తమ ।
గంగాతీరే కుశైర్మృద్భిః శమీపుష్పైరహర్నిశమ్ ॥ 4 ॥

గూరూదితేన మార్గేణ స్వమానససరోరుహే ।
ఆవాహనం నిత్యమేవ విష్ణోశ్చక్రే స మౌద్గలిః ॥ 5 ॥

ఓ మునిశ్రేష్ఠా! ఆ మౌద్గల్యుడు గంగానదిలో ప్రతిదినం కూడా నియమం తప్పకుండా ఇదే పనిని చేస్తూ, అక్కడ దర్భలు, మట్టి, జమ్మిపూలతో రాత్రింబవళ్లు, గురువు బోధించిన మార్గాన్ననుసరించి తన మనఃకమలంలోనికి నిత్యం విష్ణువునాహ్వానిస్తూండేవాడు.

తేనాఽఽహూతస్త్వరన్నేతి లక్ష్మీభర్తా జగత్పతిః ।
వైనతేయమథాఽఽరుహ్య శంఖచక్రగదాధరః ॥ 6 ॥

లక్ష్మీదేవికి భర్త, శంఖచక్రగదలను ధరించినవాడు, జగత్తునకంతా ప్రభువైన శ్రీమన్నారాయణుడు ఆ మౌద్గల్యుడు పిలువగానే గరుత్మంతునెక్కి త్వరగా వచ్చేవాడు.

పూజితస్తేన ఋషిణా స మౌద్గల్యేన యత్నతః ।
ప్రబ్రూతే చ కథాశ్చిత్రా మౌద్గల్యాయ జగత్ప్రభుః ॥ 7 ॥

మౌద్గల్యఋషి శ్రద్ధగా చేసిన పూజలు, స్వీకరించి జగత్ప్రభువు మౌద్గల్యఋషికి చిత్రకథలను చెప్పేవాడు.

తతోఽపరాహ్ణసమయే విష్ణుః ప్రాహ స మౌద్గలిమ్ ।
యాహి వత్స స్వభవనం శ్రాన్తోఽసీతి పునః పునః ॥ 8 ॥

తరువాత మధ్యాహ్నసమయమున విష్ణువు మౌద్గల్యునితో నాయనా! అలసిపోయినావు. ఇంటికి వెళ్ళుమని మాటిమాటికి చెప్పేవాడు.

ఏవముక్తః స దేవేన విష్ణునా యాతి స ద్విజః ।
జగత్ప్రభుస్తతో యాతి దేవైర్యుక్తః స్వమందిరమ్ ॥ 9 ॥

ఇలా విష్ణువు చెప్పగానే ఆ బ్రాహ్మణుడు వెడతాడు. ఆ తరువాత జగత్ప్రభువైన విష్ణువు దేవతలతో కలిసి తన వైకుంఠానికి వెడతాడు.

మౌద్గల్యోఽపి తథాఽభ్యేత్య కించిదాదాయ నిత్యశః ।
స్వమేవ భవనం విద్వాన్ భార్యాయై స్వార్జితం ధనమ్ ॥ 10 ॥

దదాతి స మహావిష్ణుచరణాబ్జపరాయణః ।
మౌద్గల్యస్య ప్రియా సాఽపి పతివ్రతపరాయణా ॥ 11 ॥

మహావిష్ణుపాదపద్మపరాయణుడు, విద్వాంసుడైన మౌద్గల్యుడు కూడా అలా తన ఇంటికి వచ్చి నిత్యం తాను సంపాదించిన కొంచెం ధనాన్ని తన భార్యకు ఇచ్చేవాడు. మౌద్గల్యుని భార్య కూడా పతిభక్తి పరాయణురాలు.

శాకం మూలం ఫలం వాఽపి భర్త్రాఽఽనీతం తు యత్నతః ।
సుసంస్కృత్యాతిథీనాం చ బాలానాం భర్తురేవ చ ॥ 12 ॥

దత్వా తు భోజనం తేభ్యః పశ్చాద్భుక్తే యతవ్రతా ।
భుక్తవత్స్వథ సర్వేషు రాత్రౌ నిత్యం స మౌద్గలిః ॥ 13 ॥

విష్ణోః శ్రుతాః కథాశ్చిత్రాస్తేభ్యో వక్త్యథ హర్షితః ।
ఏవం బహుతిథే కాలే వ్యతీతే చాతివిస్మితా ॥
మౌద్గల్యస్య రహో భార్యా భర్తారం వాక్యమబ్రవీత్ ॥ 14 ॥

ఆయన తెచ్చిన శాకములో, కందమూలఫలాలో శ్రద్ధగా శుద్ధిచేసి అతిథులకు, పిల్లలకు, భర్తకు, భోజనము పెట్టి తరువాత ఆ నియతవ్రతురాలు తినేది. అందరూ తిన్న తరువాత రాత్రిపూట ఆ మౌద్గల్యఋషి, విష్ణువుద్వారా తాను విన్న చిత్రకథలను వారికి ఆనందంగా చెప్పేవాడు. ఇలా చాలా కాలం గడిచిన తర్వాత మౌద్గల్యఋషి భార్య మిక్కిలి ఆశ్చర్యంతో ఏకాంతంలో భర్తతో ఇలా అన్నది.

జాబాలోవాచ:- జాబాల పలికింది.

యది తే విష్ణురభ్యేతి సమీపం త్రిదశార్చితః ।
తథాఽపి కష్టమస్మాకం కస్మాదితి జగత్ప్రభుమ్ ॥ 15 ॥

తత్ పృచ్ఛ త్వం మహాప్రాజ్ఞ యదాఽసౌ విష్ణురేతి చ ।
యస్మింశ్చ స్మృతమాత్రే తు జరాజన్మరుజోమృతిః ॥
నాశం యాన్తి కుతో దృష్టే తస్మాత్పృచ్ఛ జగత్పతిమ్ ॥ 16 ॥

ఒకవేళ నీ దగ్గరకు దేవతలు పూజించే విష్ణువు వచ్చినట్లైతే మనకీ కష్టాలు ఎందుకు వస్తున్నాయని ఆ జగత్ప్రభువును, అడుగు. ఓ మహాజ్ఞానీ! ఎవరిని స్మరించినంత మాత్రముననే ముసలితనము, పునర్జన్మ, రోగము, మరణము ఉండవో, అటువంటి విష్ణువును దర్శించినా కూడా కష్టాలెందుకు వస్తున్నాయో ఆ జగత్పతిని అడుగు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా ప్రియావాక్యాన్మౌద్గల్యో నిత్యవద్ధరిమ్ ।
పూజయిత్వా వినీతశ్చ పప్రచ్ఛ స కృతాంజలిః ॥ 17 ॥

అలాగేనని ప్రియురాలి మాట ప్రకారంగా మౌద్గల్యుడు ఎప్పటిలాగానే స్వామిని పూజించి, వినయంగా నమస్కరిస్తూ అడిగాడు.

మౌద్గల్య ఉవాచ:- మౌద్గల్యుడు పలికాడు.

త్వయి స్మృతే జగన్నాథ శోకదారిద్ర్యదుష్కృతమ్ ।
నాశం యాతి విపత్తిర్మే త్వయి దృష్టే కథం స్థితా ॥ 18 ॥

ఓ జగన్నాథా! నిన్ను స్మరించినంత మాత్రముననే శోకదరిద్రాలు, పాపాలు నశిస్తాయి కదా! మరి నీ చూపు నా మీద ఉన్నప్పుడు నాకీ విపత్తులెందుకున్నాయి?

శ్రీవిష్ణురువాచ:- శ్రీవిష్ణువు పలికాడు.

స్వకృతం భుజ్యతే భూతైః సర్వైః సర్వత్ర సర్వదా ।
న కోఽపి కస్యచిత్కించిత్కరోత్యత్ర హితాహితే ॥ 19 ॥

లోకంలో జీవులందరు వారు చేసిన కర్మఫలాలను అనుభవిస్తారే కాని వారి హితాహితముల నెవ్వరూ కొంచెం కూడా చేయలేరు.

యాదృశం చోప్యతే బీజం ఫలం భవతి తాదృశమ్ ।
రసాలః స్యాన్న నిమ్బస్య బీజాజ్జాత్వపి కుత్రచిత్ ॥ 20 ॥

ఏ విత్తనం నాటితే దాని ఫలమే వస్తుంది. ఎక్కడైనా వేపవిత్తనం పెడితే మామిడిపండు రాదు కదా!

న కృతా గౌతమీసేవా నార్చితౌ హరిశంకరౌ ।
న దత్తం యైశ్చ విప్రేభ్యస్తే కథం భాజనం శ్రియః ॥ 21 ॥

గౌతమీనదికి సేవ చేయకుండా, హరిశంకరులనర్చించకుండా, బ్రాహ్మణులకు దానం చేయకుండా వారికి సంపదలెలా లభిస్తాయి?

త్వయా న దత్తం కించిచ్చ బ్రాహ్మణేభ్యో మమాపి చ ।
యద్దీయతే తదేవేహ పరస్మింశ్చోపతిష్ఠతి ॥ 22 ॥

నీవు నాకు గాని, బ్రాహ్మణులకు గాని కొంచెం కూడా దానం ఇవ్వలేదు. మనమిక్కడెంత దానం చేస్తామో దాని ఫలం ఇక్కడ, పరలోకంలోనూ లభిస్తుంది.

మృద్భిర్వార్భిః కుశైర్మంత్రైః శుచికర్మ సదైవ యత్ ।
కరోతి తస్మాత్ పూతాత్మా శరీరస్య చ శోషణాత్ ॥ 23 ॥

మట్టితో, నీటితో, దర్భలతో, మంత్రములతో శుచికర్మను ఎల్లప్పుడూ చేస్తూ, ఉపవాసముల ద్వారా శరీరాన్ని శోషింపచేయడం వలన పూతాత్ముడవుతాడు.

వినా దానేన న క్వాపి భోగావాప్తిర్నృణాం భవేత్ ।
సత్కర్మాచరణాచ్ఛుద్ధో విరక్తః స్యాత్తతో నరః ॥ 24 ॥

మానవులకు దానం చేయకుండా ఎక్కడ కూడా భోగములను పొందుట సిద్ధించదు. మానవుడు సత్కర్మల నాచరించుట వలన శుద్ధుడై వైరాగ్యాన్ని పొందుతాడు.

తతోఽప్రతిహతజ్ఞానో జీవన్ముక్తస్తతో భవేత్ ।
సర్వేషాం సులభా ముక్తిర్మద్భక్త్యా చేహ పూర్వతః ॥ 25

ఆ తరువాత పరిశుద్ధజ్ఞానియై జీవన్ముక్తుడవుతాడు. మొదట నాయందు భక్తి గలిగినట్లైతే అందరికీ ముక్తి సులభం.

భుక్తిర్దానాదినా సర్వభూతదుఃఖనిబర్హణాత్ ।
అథవా లప్స్యసే ముక్తిం భక్త్యా భుక్తిం న లప్స్యసే ॥ 26 ॥

దానాదులవలన లేదా సమస్తజీవుల దుఃఖమును పోగొట్టినందువలన భుక్తీ, ముక్తీ గూడా లభిస్తాయి. దానాది గుణములు లేని కేవల భక్తివలన భుక్తి లభించదు.

మౌద్గల్య ఉవాచ:– మౌద్గల్యుడు పలికాడు.

భక్త్యా ముక్తిః కథం భూయాద్భుక్తేర్ముక్తిః సుదుర్లభా ।
జాతా చేద్దేహినాం ముక్తిః కిమన్యేన ప్రయోజనమ్ ॥ 27 ॥

భక్తితో ముక్తి ఎలా వస్తుంది? భుక్తితో ముక్తి అనేది సాధ్యం కాదు. ఒకవేళ అలా ముక్తి లభిస్తుందంటే ఈ ప్రాణులకు ఇక ఇతరమైన వాటితో ప్రయోజన మేముంది?

భక్త్యా ముక్తిః సర్వపూజ్యా తామిచ్ఛేయం జగన్మయ ॥ 28 ॥

ఓ జగన్నాథా! భక్తితో లభించే సర్వపూజ్యయైన ముక్తి ఏదో దానిని కోరుతున్నాను.

విష్ణురువాచ:- విష్ణువు పలికాడు.

ఏతదేవాన్తరం బ్రహ్మన్ దీయతే మామనుస్మరన్ ।
బ్రాహ్మణాయాథవాఽర్థిభ్యస్తదేవాక్షయతాం వ్రజేత్ ॥ 29 ॥

ఓ బ్రహ్మరూపుడా! ఇదే తేడా. నన్ను స్మరించుకుంటూ బ్రాహ్మణునకు లేదా యాచకునకు ఏదైనా ఇచ్చినట్లైతే అదే అక్షయమైన ఫలము నిస్తుంది.

మామధ్యాత్వాఽథ యద్దద్యాత్తత్తన్మాత్రఫలప్రదమ్ ।
తత్పునర్దత్తమేవేహ న భోగాయాత్ర కల్పతే ॥ 30 ॥

నన్ను స్మరించకుండా ఏది దానం చేస్తారో అది ఆయా ఫలమును మాత్రమే ఇస్తుంది. దానిని ఇచ్చినట్లే కాని ఇక్కడ భోగము ననుభవించుటకు పనికిరాదు.

తస్మాద్దేహి మహాబుద్ధే భోజ్యం కించిన్మమ ధ్రువమ్ ।
అథవా విప్రముఖ్యాయ గౌతమీతీరమాశ్రితః ॥ 31 ॥

అందువలన ఓ మహాజ్ఞానీ! నీవు తినే పదార్థాన్ని కొంచెం తప్పక నాకు సమర్పించు. లేదా గౌతమీ తీరానికి వెళ్ళి ఒక బ్రాహ్మణోత్తమున కివ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మౌద్గల్యః ప్రాహ తం విష్ణుం దేయం మమ న విద్యతే ।
నాన్యత్కించన దేహాది యత్తత్త్వయి సమర్పితమ్ ॥ 32 ॥

అప్పుడు మౌద్గల్యుడు విష్ణువుతో నావద్ద ఇవ్వదగినది ఏదీ లేదు. నా శరీరము తప్ప మరొకటి లేదు. ఉన్నవన్నీ నీకే సమర్పించాను.

తతో విష్ణుర్గరుత్మన్తం ప్రాహ శీఘ్రం జగత్పతిః ।
ఇహాఽఽనయస్వ కణిశం మయాయం చార్పయిష్యతి ॥ 33 ॥

అప్పుడు విష్ణుమూర్తి గరుత్మంతునితో నీవు వెళ్ళి త్వరగా పైరుకంకిని తీసుకొని రా. ఇతడు దానిని నాకర్పిస్తాడు.

తతో యోగ్యానయం భోగాన్ ప్రాప్స్యతే మనసః ప్రియాన్ ।
ఆకర్ణ్య స్వామినాఽఽదిష్టం తథా చక్రే స పక్షిరాట్ ॥ 34 ॥

తరువాత ఇతడు తన మనస్సుకు ఇష్టమైన యోగ్యమైన భోగాల ననుభవిస్తాడు. స్వామి చెప్పినది విని పక్షిరాజు అలాగే చేశాడు.

విష్ణుహస్తే కణాన్ ప్రాదాత్స మౌద్గల్యో యతవ్రతః ।
ఏతస్మిన్నన్తరే విష్ణుర్విశ్వకర్మాణమబ్రవీత్ ॥ 35 ॥

నియమవ్రతుడైన మౌద్గల్యుడు ధాన్య కణాలను విష్ణుమూర్తి చేతియందుంచాడు. ఇంతలో విష్ణుమూర్తి విశ్వకర్మతో ఇలా అన్నాడు.

విష్ణురువాచ:- విష్ణుమూర్తి పలికాడు.

యావచ్చాస్య కులే సప్త పురుషాస్తావదేవ తు ।
భవితారో మహాబుద్ధే తావత్కామా మనీషితాః ॥
గావో హిరణ్యం ధాన్యాని వస్త్రాణ్యాభరణాని చ ॥ 36 ॥

ఓ మహాబుద్ధీ! ఇతని వంశంలో ఏడుగురు పురుషులుదయించే వరకు, ఏడు తరాల వరకు మనస్సుకు నచ్చిన కోరికలు గోవులు, బంగారం, ధాన్యాలు, వస్త్రాలు, ఆభరణాలు, అన్నీ లభించాలి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యచ్చ కించిన్మనఃప్రీత్యై లోకే భవతి భూషణమ్ ।
తత్సర్వమాప మౌద్గల్యో విష్ణుగంగాప్రభావతః ॥ 37 ॥

మనస్సున కానందాన్ని కలిగించేదీ, లోకంలో అలంకారంగా ఏది ఉంటుందో అదంతా విష్ణుమూర్తి, గంగ ప్రభావంవలన మౌద్గల్యుడు పొందాడు.

గృహం గచ్ఛేతి మౌద్గల్యో విష్ణునోక్తస్తతో యయౌ ।
ఆశ్రమే స్వస్య సర్వర్ధిం దృష్ట్వా ఋషిరభాషత ॥ 38 ॥

విష్ణుమూర్తి మౌద్గల్యుని ఇంటికి వెళ్ళమని చెప్పగా నతడలాగే వెళ్ళాడు. తన ఆశ్రమంలో అన్ని విధాలుగా జరిగిన వృద్ధిని చూచి ఆ ఋషి ఇలా అన్నాడు.

ఋషిరువాచ:- ఋషి పలికాడు.

అహో దానప్రభావోఽయమహో విష్ణోరనుస్మృతిః ।
అహో గంగాప్రభావశ్చ కైర్విచార్యో మహానయమ్ ॥ 39 ॥

ఆహా! దానప్రభావం! ఆహా! ఈ విష్ణుస్మరణ ప్రభావం! ఆహా! గంగాప్రభావం! ఈ గొప్పతనాన్ని ఎవరు తెలుసుకుంటారు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మౌద్గల్యో భార్యయా సార్ధం పుత్త్రైః పౌత్త్రైశ్చ బంధుభిః ।
పితృభ్యాం బుభుజే భోగాన్ భుక్తిం ముక్తిమవాప చ ॥ 40 ॥

మౌద్గల్యుడు తన భార్యతో, పుత్ర పౌత్ర బంధువులతో, తల్లిదండ్రులతో భోగముల ననుభవించి భుక్తిని ముక్తిని పొందాడు.

తతః ప్రభృతి తత్తీర్థం మౌద్గల్యం వైష్ణవం తథా ।
తత్ర స్నానం చ దానం చ భుక్తిముక్తిఫలప్రదమ్ ॥ 41 ॥

అప్పటినుండి ఆ తీర్థము మౌద్గల్యతీర్థమని, అలాగే వైష్ణవతీర్థమని ప్రసిద్ధి చెందింది. అక్కడ ఆచరించే స్నానం, దానం భుక్తిని, ముక్తిని ఇస్తాయి.

తత్ర శ్రుతిః స్మృతిర్వాఽపి తీర్థస్య స్యాత్కథంచన ।
తస్య విష్ణుర్భవేత్ప్రీతః పాపైర్ముక్తః సుఖీ భవేత్ ॥ 42 ॥

అక్కడ ఆ తీర్థాన్ని గూర్చి విన్నా, స్మరించినా కూడా విష్ణువు ప్రీతి పొందుతాడు. పాపాలన్నీ పోయి అతడు సుఖపడతాడు.

ఏకాదశ సహస్రాణి తీర్థానాం తీరయోర్ద్వయోః ।
సర్వార్థదాయినాం తత్ర స్నానదానజపాదిభిః ॥ 43 ॥

గౌతమీనది రెండు తీరాల వెంబడి వున్న పదకొండువేలతీర్థాలలో స్నానం దానం జపం మొదలైనవి చేస్తే ఆ తీర్థాలు కోరికలన్నిటినీ నెరవేర్చుతాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే మౌద్గల్య విష్ణుతీర్థాద్యేకాదశ సహస్ర తీర్థవర్ణనం నామ షట్షష్టితమోఽధ్యాయః. ॥ 66 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని మౌద్గల్య, విష్ణుతీర్థములు మొదలుగాగల పదకొండువేల తీర్థవర్ణనమనే పేరుగల అరవై ఆరవ అధ్యాయం ॥ 66 ॥

సప్తషష్టితమోఽధ్యాయః - అరవై ఏడవ అధ్యాయం

లక్ష్మీతీర్థాది షట్సహస్ర తీర్థవర్ణనమ్ - లక్ష్మీతీర్థం మొదలైన ఆరువేల తీర్థాల వర్ణన

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

లక్ష్మీతీర్థమితి ఖ్యాతం సాక్షాల్లక్ష్మీవివర్ధనమ్ ।
అలక్ష్మీనాశనం పుణ్యమాఖ్యానం శృణు నారద ॥ 1 ॥

నారదా! సాక్షాత్తుగా సంపదల నభివృద్ధిపరచేది, దారిద్ర్యాన్ని పారద్రోలేది లక్ష్మీతీర్థమనేది కలదు. అది చాలా పవిత్రమైనది. దాని కథను విను.

సంవాదశ్చ పురా త్వాసీల్లక్ష్మ్యాః పుత్ర దరిద్రయా ।
పరస్పర విరోధిన్యావుభే విశ్వం సమీయతుః ॥ 2 ॥

నాయనా! పూర్వం లక్ష్మీదేవికి దరిద్రదేవతకు సంవాదం జరిగింది. పరస్పర విరోధులైన వారిద్దరు విష్ణువు వద్దకు వెళ్ళారు.

తాభ్యామవ్యాపృతం వస్తు తన్నాస్తి భువనత్రయే ।
మమ జ్యైష్ఠ్యం మమజ్యైష్ఠమిత్యూచతురుభే మిథః ॥
అహం పూర్వం సముద్భూతా ఇత్యాహ శ్రియమోజసా ॥ 3 ॥

వారిద్దరిచేత వ్యాప్తముగాని వస్తువంటూ ఈ ముల్లోకాలలో ఎక్కడా లేదు. వారు నేను గొప్ప అంటే నేను గొప్ప అని పరస్పర మిద్దరూ వాదులాడుకొంటుండగా నేను ముందుపుట్టినానని దరిద్రదేవత గర్వంతో లక్ష్మితో అంది.

శ్రీలక్ష్మీరువాచ:- శ్రీలక్ష్మి పలికింది.

కులం శీలం జీవితం వా దేహినామహమేవ తు ।
మయా వినా దేహభాజో జీవన్తోఽపి మృతా ఇవ ॥ 4 ॥

జీవులందరికి కులము, శీలము, జీవితము అన్నీ నేనే. నేను లేకుండా జీవులు జీవించినా మరణించినట్లే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దరిద్రయా చ సా ప్రోక్తా సర్వేభ్యో హ్యధికా హ్యహమ్ ।
ముక్తిర్మదాశ్రితా నిత్యం దరిద్రైవం వచోఽబ్రవీత్ ॥ 5 ॥

నన్నాశ్రయించినందువలననే ముక్తి వస్తుంది. అందువలన అందరికంటె నేనే అధికురాలనని లక్ష్మి దరిద్రతో చెప్పింది. అప్పుడు దరిద్ర ఇలా అన్నది.

కామః క్రోధశ్చ లోభశ్చ మదో మాత్సర్యమేవ చ ॥ 6 ॥

న భయోద్భ్రాతిరున్మాద ఈర్ష్యా ఉద్ధతవృత్తితా ।
యత్రాహమస్మి తత్రైతే న తిష్ఠన్తి కదాచన ॥ 7 ॥

నేనెక్కడుంటానో అక్కడ కామ క్రోధ లోభ మద మాత్సర్యాలనేవి ఎప్పుడూ ఉండవు. నేనున్న చోట భయము, పిచ్చి, ఈర్ష్య, గర్వము అనేవి ఎప్పుడూ ఉండవు.

దరిద్రాయా వచః శ్రుత్వా లక్ష్మీస్తాం ప్రత్యభాషత ॥ 8 ॥

దరిద్ర అన్న మాటలు విని లక్ష్మి ఆమెతో ఇలా అన్నది.

లక్ష్మీరువాచ:- లక్ష్మి పలికింది.

అలంకృతో మయా జన్తుః సర్వో భవతి పూజితః ।
నిర్ధనః శివతుల్యోఽపి సర్వైరప్యభిభూయతే ॥ 9 ॥

నేనుంటే మనిషి అలంకారాన్ని, గౌరవాన్ని పొందుతాడు. అందరూ అతణ్ణి పూజిస్తారు. పూజలందు కొంటాడు. ధనం లేనివాడు శివునితో సమానమైనవాడు కూడా అందరిలో అవమానం పొందుతాడు.

దేహీతి వచనద్వారా దేహస్థాః పంచదేవతాః ।
సద్యో నిర్గత్య గచ్ఛన్తి ధీశ్రీహ్రీశాన్తికీర్తయః ॥ 10 ॥

మన శరీరంలో ధీ, శ్రీ, హ్రీ, శాంతి, కీర్తి అనే ఐదుగురు దేవతలుంటారు. మనం దేహి అని యాచించిన మరు క్షణంలో ఆ దేవతలందరూ బయటకు వెళ్ళిపోతారు.

తావద్గుణా గురుత్వం చ యావన్నార్థయతే పరమ్ ।
అర్థీచేత్పురుషో జాతః క్వ గుణాః క్వ చ గౌరవమ్ ॥ 11 ॥

ఇతరులను యాచించనంతవరకే గుణాలకు గొప్పతన ముంటుంది, గౌరవ ముంటుంది. యాచకుడైనాడో ఇంక అతనికి గుణములెక్కడివి? గౌరవమెక్కడిది?

తావత్సర్వోత్తమో జన్తుస్తావత్సర్వగుణాలయః ।
నమస్యః సర్వలోకానాం యావన్నార్థయతే పరమ్ ॥ 12 ॥

మనిషి ఇతరులను యాచించనంతవరకే లోకులందరికి నమస్కరించదగినవాడు, సర్వోత్తముడు, గుణాలన్నింటికీ స్థానమైనవాడు. యాచిస్తే వ్యర్థుడే.

కష్టమేతన్మహాపాపం నిర్ధనత్వం శరీరిణామ్ ।
న మానయతి నో వక్తి న స్పృశత్యధనం జనః ॥ 13 ॥

మానవులకు ధనం లేకపోవటం అనేది కష్టం, మహాపాపం. ధనం లేనివారిని జనం గౌరవించరు, మాట్లాడరు, కనీసం ముట్టుకోరు కూడా.

అహమేవ తతః శ్రేష్ఠా దరిద్రే శృణు మే వచః ॥ 14 ॥

అందువలన ఓ దరిద్రా! నేనే గొప్పదానిని. నా మాట విను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తల్లక్ష్మీవచనం శ్రుత్వా దరిద్రా వాక్యమబ్రవీత్ ॥ 15 ॥

అలా పలికిన లక్ష్మి మాటను విని దరిద్ర ఇలా అన్నది.

దరిద్రోవాచః–దరిద్ర పలికింది.

వక్తుం న లక్ష్మి జ్యేష్ఠాఽహమితి వై లజ్జసే ముహుః ।
పాపేషు రమసే నిత్యం విహాయ పురుషోత్తమమ్ ॥ 16 ॥

లక్ష్మీ! మాటిమాటికి నేనే గొప్పదానినని చెప్పుటకు సిగ్గులేదా? పురుషోత్తముని వదిలిపెట్టి పాపులతో నిత్యం రమిస్తున్నావు.

విశ్వస్తవంచకా నిత్యం భవతీ శ్లాఘతే కథమ్ ।
సుఖం న తాదృక్ త్వత్ప్రాప్తౌ పశ్చాత్తాపో యథా గురుః ॥ 17 ॥

ప్రపంచములోని వంచకులందరూ నిన్ను నిత్యం ఎలా పొగుడుతారో అటువంటి సుఖాన్ని మాత్రం నీవలన పొందక గురువువలె పశ్చాత్తాపాన్ని పొందుతారు. నీవు నమ్మినవారిని మోసం చేసేదానివి. అటువంటి నీవు ఎలా పొగడుకొంటున్నావు? నిన్ను పొందడం చేత సుఖం కన్నా పశ్చాత్తాపమే ఎక్కువ కలుగుతుంది.

న తథా జాయతే పుంసాం సురయా దారుణో మదః ।
త్వత్సన్నిధానమాత్రేణ యథా వై విదుషామపి ॥ 18 ॥

మత్తుపదార్థాలను, మద్యాన్ని సేవించినవానికి కూడా కలగని మదం నీవు లభించిన చాలు పండితునికి కూడా కలుగుతుంది.

సదైవ రమసే లక్ష్మి ప్రాయస్త్వం పాపకారిషు ।
అహం వసామి యోగ్యేషు ధర్మశీలేషు సర్వదా ॥ 19 ॥

లక్ష్మీ! నీవు తరచుగా పాపాలు చేసే వారియందే రమిస్తున్నావు. నేను యోగ్యులయందు, ధర్మశీలుర యందు సర్వదా నివసిస్తాను.

శివవిష్ణ్వనురక్తేషు కృతజ్ఞేషు మహత్సు చ ।
సదాచారేషు శాన్తేషు గురుసేవోద్యతేషు చ ॥ 20 ॥

సత్సు విద్వత్సు శూరేషు కృతబుద్ధిషు సాధుషు ।
నివసామి సదా లక్ష్మి తస్మాజ్జ్యేష్ఠం మయి స్థితమ్ ॥ 21 ॥

శివుని, విష్ణువు నారాధించే వారియందు, కృతజ్ఞతను ప్రకటించే వారియందు, మహానుభావులయందు, సదాచారమును పాటించే వారియందు, శాంతముగా ఉండేవారియందు, గురుసేవను చేసే వారియందును,

సత్పురుషులయందు, విద్వాంసులయందు, శూరులయందు, సద్బుద్ధిగల వారియందు, సాధువులయందెప్పుడూ వుంటాను. అందువలన జ్యేష్ఠత్వము నాకే దక్కాలి.

బ్రాహ్మణేషు శుచిష్మత్సు వ్రతచారిషు భిక్షుషు ।
నిర్భయేషు వసిష్యామి లక్ష్మీస్త్వం శృణు తే స్థితిమ్ ॥ 22 ॥

బ్రాహ్మణులయందు, శుచిగా వుండే వారియందు, వ్రతాచరణపాటించే వారియందు, భిక్షుకులయందు, భయములేని వారియందు నేనుంటాను? లక్ష్మీ! నీ స్థితి ఏమిటో విను.

రాజవర్తిషు పాపేషు నిష్ఠురేషు ఖలేషు చ ।
పిశునేషు చ లుబ్ధేషు వికృతేషు శఠేషు చ ॥ 23 ॥

అనార్యేషు కృతఘ్నేషు ధర్మఘాతిషు సర్వదా ।
మిత్రద్రోహిష్వనిష్టేషు భగ్నచిత్తేషు వర్తసే ॥ 24 ॥

రాజ్యాధికారం కలవారియందు, పాపులయందు, నిష్ఠురాలాడే వారియందు, మూర్ఖులయందు, కొండెములు చెప్పేవాళ్ళయందు, పిసినారులయందు, అందవికారులయందు, మొండివారియందు, అనార్యులయందు, కృతఘ్నులయందు, ధర్మమును దెబ్బతీయువారియందు, మిత్రులను మోసము చేసేవారియందు, ఇష్టములేని వారియందు, భగ్నమనస్కులయందెప్పుడూ వుంటావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం వివదమానే తే జగ్మతుర్మాముభే అపి ।
తయోర్వాక్యముపశ్రుత్య మయోక్తే తే ఉభే అపి ॥ 25 ॥

ఇలా వాదులాడుకొంటూ ఇద్దరూ నా వద్దకు వచ్చారు. నేను వారి మాటలు విని వారిద్దరితో ఇలా అన్నాను.

మత్తః పూర్వతరా పృథ్వీ ఆపః పూర్వతరాస్తతః ।
స్త్రీణాం వివాదం తా ఏవ స్త్రియో జానన్తి నేతరే ॥ 26 ॥

నాకంటె ముందు స్త్రీ అయిన భూమి, దానికంటె ముందు స్త్రీ అయిన నీరు ఉన్నాయి. స్త్రీల వివాదాన్ని ఆ స్త్రీలే యెరుగుదురు. ఇతరులు తెలుసుకోలేరు.

విశేషతః పునస్తాభ్యః కమణ్డలుభవాశ్చ యాః ।
తత్రాపి గౌతమీ దేవీ నిశ్చయం కథయిష్యతి ॥ 27 ॥

విశేషంగా వారిలో కమండలం నుండి పుట్టినవారు అక్కడ కూడా గౌతమీదేవి నిశ్చయంగా చెప్పగలదు.

సైవ సర్వార్తిసంహర్త్రీ సైవ సన్దేహకర్తరీ ।
తే మద్వాక్యాద్ధ్రువం గత్వా భూమ్యా చ సహితే అపి ॥ 28 ॥

అద్భిశ్చ సహితాః సర్వా గౌతమీం యయురాపగామ్ ।
భూమిరాపస్తయోర్వాక్యం గౌతమ్యై క్రమశః స్ఫుటమ్ ॥ 29 ॥

ఆమెయే అందరి ఆర్తిని పోగొట్టేది, ఆమెయే సందేహాలను తీర్చేది అని చెప్పగా వారు నా మాట ప్రకారం భూదేవితోగూడ, జలములతో బాటు అందరూ గౌతమీనదివద్దకు వెళ్ళారు. వారిద్దరి మాటలను క్రమంగా, స్పష్టంగా గౌతమికి చెప్పారు.

సర్వం నివేదయామాసుర్యథావృత్తం ప్రణమ్య తామ్ ।
దరిద్రాయాశ్చ లక్ష్మ్యాశ్చ వాక్యం మధ్యస్థవత్తదా ॥ 30 ॥

ఆ గౌతమీనదికి నమస్కరించి దరిద్రమాటను, లక్ష్మిమాటను జరిగినది జరిగినట్లుగా అంతా మధ్యవర్తులుగా నివేదించారు.

శృణ్వత్సు లోకపాలేషు శృణ్వత్యాం భువి నారద ।
శృణ్వతీష్వప్సు సా గంగా దరిద్రాం వాక్యమబ్రవీత్ ॥
సంప్రశస్య తథా లక్ష్మీం గౌతమీ వాక్యమబ్రవీత్ ॥ 31 ॥

ఓ నారదా! లోకపాలురు వింటుండగా, భూదేవి వింటుండగా, నదులు వింటుండగా, ఆ గౌతమి గంగాదేవి దరిద్రతో ఇలా అన్నది. అలాగే లక్ష్మిని ప్రశంసిస్తూ గౌతమి గంగ ఇలా అన్నది.

గౌతమ్యువాచ:– గౌతమి గంగ పలికింది.

బ్రహ్మశ్రీశ్చ తపఃశ్రీశ్చ యజ్ఞశ్రీః కీర్తిసంజ్ఞితా ।
ధనశ్రీశ్చ యశశ్రీశ్చ విద్యా ప్రజ్ఞా సరస్వతీ ॥ 32 ॥

బ్రహ్మ, తపస్సు, యజ్ఞము, కీర్తి, ధనము, యశస్సు, విద్య, ప్రజ్ఞ, సరస్వతి అన్నీ లక్ష్మీస్వరూపాలే.

భుక్తిశ్రీశ్చాథముక్తిశ్చ స్మృతిర్లజ్జా ధృతిః క్షమా ।
సిద్ధిస్తుష్టిస్తథా పుష్టిః శాన్తిరాపస్తథా మహీ ॥ 33 ॥

భుక్తి, ముక్తి, స్మృతి, లజ్జ, ధృతి, క్షమ, సిద్ధి, తుష్టి, పుష్టి, శాంతి, జలము, భూమి ఇవన్నీ లక్ష్మీరూపాలే.

అహంశక్తిరథౌషధ్యః శ్రుతిః శుద్ధిర్విభావరీ ।
ద్యౌర్జ్యోత్స్నా ఆశిషః స్వస్తిర్వ్యాప్తిర్మాయా ఉషా శివా ॥ 34 ॥

అహంకారం, శక్తి, ఓషధులు, శ్రుతి, శుద్ధి, విభావరి, ఆకాశం, స్వర్గం, వెన్నెల, ఆశీస్సు, స్వస్తి, వ్యాప్తి, మాయ, ఉష, శివ అన్నీ లక్ష్మీరూపాలే.

యత్కించిద్విద్యతే లోకే లక్ష్మ్యా వ్యాప్తం చరాచరమ్ ।
బ్రాహ్మణేష్వథ ధీరేషు క్షమావత్స్వథ సాధుషు ॥ 35 ॥

విద్యాయుక్తేషు చాన్యేషు భుక్తిముక్త్యనుసారిషు ।
యద్యద్రమ్యం సున్దరం వా తత్తల్లక్ష్మీవిజృమ్భితమ్ ॥ 36 ॥

కనిపించే దానిలో చరాచరములన్నిటిలో లక్ష్మి వ్యాప్తమైంది. బ్రాహ్మణులలో,ధీరులలో, క్షమాగుణంగల వారిలో సాధువులయందును, విద్యావంతులయందు, భక్తిముక్తులననుసరించే వారియందు ఇంకా ఇతరులయందు, ఏదేది రమ్యమో లేక సుందరమో అదంతా లక్ష్మీవిలసితమైనదే.

కిమత్ర బహునోక్తేన సర్వం లక్ష్మీమయం జగత్ ।
యస్మిన్నస్మింశ్చ యత్కించిదుత్కృష్టం పరిదృశ్యతే ॥ 37 ॥

లక్ష్మీమయం తు తత్సర్వం తయా హీనం న కించన ।
అత్రేమాం సున్దరీం దేవీం స్పర్ధయన్తీ న లజ్జసే ॥ 38 ॥

ఇంకా చెప్పవలసినదేమున్నది? ఈ జగత్తంతా లక్ష్మీమయమే. ఏదో ఒకదానిలో ఏ కొంచెం విశేషంగా కనిపించినా, ఉత్కృష్టమైనదిగా కనిపించినా కూడా, అంతా లక్ష్మీమయమే. ఆమె లేకుండా ఏదీ లేదు. ఇక్కడ అటువంటి సుందరమైనదేవితో పోటీపడుటకు సిగ్గు లేదా?

గచ్ఛ గచ్ఛేతి తాం గంగా దరిద్రాం వాక్యమబ్రవీత్ ।
తతః ప్రభృతి గంగామ్బా దరిద్రా వైరకార్యభూత్ ॥ 39 ॥

వెళ్ళు వెళ్ళుమని గంగ ఆ దరిద్రతో అన్నది. అప్పటి నుండి గంగ దరిద్రకు శత్రువు అయింది.

తావద్దరిద్రాభిభవో గంగా యావన్న సేవ్యతే ।
తతః ప్రభృతి తత్తీర్థమలక్ష్మీనాశనం శుభమ్ ॥ 40 ॥

ఎంతవరకైతే గంగను సేవించడో అంతవరకు దరిద్రంతో అవమానించబడతాడు. అప్పటినుండి ఆ తీర్థాన్ని శుభమును గూర్చే అలక్ష్మీనాశనతీర్థమంటారు.

తత్ర స్నానేన దానేన లక్ష్మీవాన్ పుణ్యవాన్ భవేత్ ।
తీర్థానాం షట్ సహస్రాణి తస్మింస్తీర్థే మహామతే ॥ 41 ॥
దేవర్షిమునిజుష్టానాం సర్వసిద్ధిప్రదాయినామ్ ॥

ఓ మహామతీ! అక్కడ స్నానదానాదులు చేస్తే ధనవంతుడు, పుణ్యవంతుడవుతాడు. ఆ తీర్థంలో ఆరువేల తీర్థాలున్నాయి. అవన్నీ దేవ ఋషి సంఘాలతో గూడి, సర్వసిద్ధులను సమకూరుస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే లక్ష్మీతీర్థాదిషట్సహస్రతీర్థవర్ణనం నామ సప్తషష్టితమోఽధ్యాయః. ॥ 67 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని లక్ష్మీతీర్థం మొదలైన ఆరువేల తీర్థాల వర్ణనమనే పేరు గల అరవై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టషష్టితమోఽధ్యాయః - అరవై ఎనిమిదవ అధ్యాయం

భాన్వాది త్రిసహస్ర తీర్థవర్ణనమ్ - భానుతీర్థం మొదలైన మూడువేల తీర్థముల వర్ణనం

భానుతీర్థమితిఖ్యాతం సర్వసిద్ధికరం నృణామ్ ।
తత్రేదం వృత్తమాఖ్యాస్యే మహాపాతకనాశనమ్ ॥ 1 ॥

మహాపాతకాలను నశింపజేసేది, మానవులకు సర్వసిద్ధులు కలుగచేసేది భానుతీర్థమనేది కలదు. దాని వృత్తాంతాన్ని చెబుతున్నాను.

శర్యాతిరితి విఖ్యాతో రాజా పరమధార్మికః ।
తస్య భార్యా స్థవిష్ఠేతి రూపేణాప్రతిమా భువి ॥ 2 ॥

శర్యాతి అనే పేరుగల పరమధార్మికుడైన రాజు గలడు. ఆతని భార్య పేరు స్థవిష్ఠ. భూలోకంలో ఆమె అందంతో పోల్చదగిన వారెవరూ లేరు.

మధుచ్ఛన్దా ఇతి ఖ్యాతో విశ్వామిత్రకులోద్భవః ।
పురోధాస్తస్య నృపతేర్బ్రహ్మర్షిః శమినాం ప్రభుః ॥ 3 ॥

ఆ రాజుకు విశ్వామిత్ర వంశంలో పుట్టిన మధుచ్ఛందుడనే పేరు గలవాడు పురోహితునిగా ఉండినాడు. అతడు బ్రహ్మర్షి, గొప్ప శాంతమూర్తి.

దిశో విజేతుం స జగామ రాజా పురోధసా తేన నృపప్రవీరః ।
పురోధసం ప్రాహ మహానుభావం జిత్వా దిశశ్చాధ్వని సంనివిష్టః ॥ 4 ॥

పప్రచ్ఛేదం కేన ఖేదం గతోఽసి హేతుం వదస్వేతి మహానుభావ ।
త్వమేవ రాజ్యే మమ సర్వమాన్యః సమస్తవిద్యానిరవద్యబోధః ॥ 5 ॥

రాజులలో గొప్పవీరుడైన ఆ రాజు ఆ పురోహితునితో కలిసి జైత్రయాత్రగా దిక్కులను జయించుటకై వెళ్ళినాడు. దిక్కులను జయించి, మార్గమధ్యంలో మహానుభావుడైన పురోహితుని వద్దకు వచ్చి ఇలా అడిగాడు. ఓ మహానుభావా! నీవు ఎవ్వరివలన ఖేదపడుచున్నావు? నా రాజ్యంలో నీవే నాకు సర్వమాన్యుడవు. సమస్తవిద్యలలో నిర్దుష్టమైన జ్ఞానంకలవాడవు. అటువంటి నీవు ఎవరివలన ఖేదపడుతున్నావు? కారణం చెప్పు.

విధూతపాపః పరితాపశూన్యః కిమన్యచేతా ఇవ లక్ష్యసే త్వమ్ ।
జితేయముర్వీ విజితా నరేన్ద్రా హర్షస్య హేతౌ మహతీహ జాతే ॥ 6 ॥

రాజులందరూ ఓడిపోయినారు. ఈ భూమిని జయించినాను. ఇటువంటి ఆనందము గొప్పగా ప్రకటించుకునే సమయంలో పాపరహితుడవైన నీవు సంతోషించక అన్యమనస్కుడవై కనబడుతున్నావెందుకు?

కిం త్వం కృశో మే వద సత్యమేవ ద్విజాతివర్యాతిమహానుభావ ।
సంబోధ్య శర్యాతిమువాచ విప్రో మధుచ్ఛందాః ప్రేమమయీం ప్రియోక్తిమ్ ॥ 7 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! మహానుభావా! నీవు కృశించినావా? సత్యమునే నాకు చెప్పు మనగా ఆ విప్రుడైన మధుచ్ఛందుడు శర్యాతిని సంబోధిస్తూ ప్రేమమయమైన, ప్రియమైన మాటను పలికాడు.

మధుచ్ఛన్దా ఉవాచ :- మధుచ్ఛందుడు పలికాడు.

శృణు భూపాల మద్వాక్యం భార్యయా యదుదీరితమ్ ।
స్థితే యామే వయం యామో యామినీ చార్ధగామినీ ॥ 8 ॥

ఓ మహారాజా! నా మాట విను. నా భార్య ఏమన్నదంటే మనము జాము ఇంకా మిగిలి వుండగా బయలుదేరు తున్నాము. అర్ధరాత్రి కానున్నది.

స్వామినీ చాస్య దేహస్య కామినీ మాం ప్రతీక్షతే ।
స్మృత్వా తత్కామినీవాక్యం శోషం యాతి కలేబరమ్ ॥ 9 ॥

ఆమె ఈ శరీరానికి యజమానురాలు. ఆమె నాగురించి కోరికతో ఎదురు చూస్తున్నది. ఆమె మాట గుర్తుకు వచ్చి నా శరీరం శోషబోతున్నది.

వికారే స్మరసంజాతే జీవాతుర్నలినాననా ॥ 10 ॥

నాకు మన్మథవికార మేర్పడినప్పుడు ఆ కమలం వంటి ముఖం గలది సంజీవిని వంటిది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విహస్య చాబ్రవీద్రాజా పురోధసమరిందమః ॥

శత్రుంజయుడైన రాజు నవ్వి పురోహితునితో ఇలా అన్నాడు.

రాజోవాచ:- రాజు పలికాడు.

త్వం గురుర్మమ మిత్రం చ కిమాత్మానం విడమ్బసే ।
కిమనేన మహాప్రాజ్ఞ మమ వాక్యేన మానద ॥
క్షణవిధ్వంసిని సుఖే కా నామాஉஉస్థా మహాత్మనామ్ ॥ 11 ॥

ఓ మానదా! నీవు నా గురువువు. నా మిత్రునివి గూడా. ఓ మహాప్రాజ్ఞా! నిన్ను నీవు ఎందుకు వంచించుకొంటున్నావు. దానితో పని యేమి? నా మాట విను. మహాత్ములకు క్షణంలో విధ్వంసమయ్యే సుఖం కొరకు వెంపర్లాటెందుకు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతదాకర్ణ్య మతిమాన్ మధుచ్ఛన్దా వచోஉబ్రవీత్ ॥ 12 ॥

ఈ మాట విని తెలివిగల మధుచ్ఛందు డిలా అన్నాడు.

మధుచ్ఛన్దా ఉవాచ :- మధుచ్ఛందుడు పలికాడు.

యత్రాఽఽనుకూల్యం దంపత్యోస్త్రివర్గస్తత్ర వర్ధతే ।
తత్రేదం దూషణం రాజన్ భూషణం చాతిమాన్యతామ్ ॥ 13 ॥

ఓ రాజా! ఎక్కడ దంపతులనుకూలంగా వుంటారో అక్కడ త్రివర్గ మభివృద్ధి చెందుతుంది. ఇక్కడ నీవు చేసిన దూషణ కూడా భూషణంగానే గొప్పదిగా అవుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆజగామ స్వకం దేశం మహత్యా సేనయా వృతః ।
పరీక్షార్థం చ తత్ప్రేమ పుర్యాం వార్తామదీదిశత్ ॥ 14 ॥

రాజు వారి ప్రేమను పరీక్షించుటకై "రాజుగారు గొప్పసేనను తీసుకొని తన దేశమునుండి బయలుదేరారు". అనే వార్తను నగరానికి పంపించాడు.

దిశో విజేతుం శర్యాతౌ యాతే రాక్షసపుంగవః ।
హత్వా రసాతలం యాతో రాజానం సపురోధసమ్ ॥ 15 ॥

"శర్యాతిరాజు దిగ్విజయయాత్రకు వెళ్ళగా నొక రాక్షసపుంగవుడు రాజును, రాజపురోహితుని చంపి రసాతలానికి వెళ్ళాడు" అనే వార్తను పంపాడు.

రాజ్ఞో భార్యా నిశ్చయాయ ప్రవృత్తా మునిసత్తమ ।
వార్తాం శ్రుత్వా దూతముఖాత్ మధుచ్ఛన్దఃప్రియా పునః ॥ 16 ॥

ఓ మునిశ్రేష్ఠా! రాజుగారి భార్య ఇది నిజమా, కాదా అని తిరిగి నిర్ధారించుకోవడానికి ప్రయత్నించింది. దూతద్వారా వార్తను విన్న మధుచ్ఛందుని భార్య,

తదైవాభూద్గతప్రాణా తద్విచిత్రమివాభవత్ ।
పుర్యాం వృత్తం తు తే దృష్ట్వా దూతా రాజ్ఞే న్యవేదయన్ ॥ 17 ॥

అప్పుడే వెంటనే ప్రాణాలు వదిలింది. ఇది అక్కడ ఉన్నవారందరికి విచిత్రంగా అనిపించింది. నగరంలో జరిగింది చూచి, దూతలు ఈ వృత్తాంతాన్ని రాజున కెరిగించారు.

యత్కృతం రాజపత్నీభిః ప్రియయా చ పురోధసః ।
విస్మితో దుఃఖితో రాజా పునర్దూతానభాషత ॥ 18 ॥

రాజభార్యలు చేసినది, పురోహితుని భార్య చేసినది తెలుసుకొన్న రాజు ఆశ్చర్యపడి, దుఃఖించి తిరిగి దూతలతో ఇలా అన్నాడు.

రాజోవాచ:- రాజు పలికాడు.

శీఘ్రం గచ్ఛన్తు హే దూతా బ్రాహ్మణ్యా యత్కలేబరమ్ ।
రక్షన్తు వార్తాం కురుత రాజాఽఽగన్తా పురోధసా ॥ 19 ॥

ఓ దూతలారా! మీరు త్వరగా వెళ్ళండి, బ్రాహ్మణి కలేబరాన్ని రక్షించండి. పురోహితునితో గూడ రాజు వస్తున్నాడనే వార్తను చెప్పండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి చిన్తాతురే రాజ్ఞి వాగువాచాశరీరిణీ ॥ 20 ॥

ఇలా రాజు చింతిల్లుతుండగా ఆకాశవాణి ఇలా పలికింది.

ఆకాశవాగువాచ:- ఆకాశవాణి పలికింది.

విధాస్యత్యఖిలం గంగా రాజంస్తవ సమీహితమ్ ।
సర్వాభిషంగశమనీ పావనీ భువి గౌతమీ ॥ 21 ॥

ఓ రాజా! సమస్త ఆపదలను పోగొట్టునది. భూలోకంలో పవిత్రమైనది ఐన గౌతమీగంగ నీ కోరికలన్నింటిని తీర్చగలదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా స శర్యాతిర్గౌతమీతీరమాశ్రితః ।
బ్రాహ్మణేభ్యో ధనం దత్వా తర్పయిత్వా పితౄన్ద్విజాన్ ॥ 22 ॥

పురోహితం ద్విజశ్రేష్ఠం ప్రేషయిత్వా ధనాన్వితమ్ ।
అన్యత్ర తీర్థే సార్థేషు దానం దేహి ప్రయత్నతః ॥ 23 ॥

ఈ మాటను విని శర్యాతి గౌతమీనదివద్దకు వెళ్ళి, పితృదేవతలకు తర్పణాదులు చేసి, బ్రాహ్మణులకు దక్షిణలనిచ్చి, బ్రాహ్మణశ్రేష్ఠుడైన పురోహితునికి ధనమునిచ్చి ఈ ధనంతో శ్రద్ధగా ఇతర తీర్థాలలో దానాలను చేయుమని చెప్పి పంపించాడు.

ఏతత్సర్వం న జానాతి రాజ్ఞః కృత్యం పురోహితః ।
గతే తస్మిన్గురౌ రాజా వైశ్వామిత్రే మహాత్మని ॥ 24 ॥

సర్వం బలం ప్రేషయిత్వా గంగా తీరేఽగ్నిమావిశత్ ।
ఇత్యుక్త్వా స తు రాజేన్ద్రో గంగాం భానుం సురానపి ॥ 25 ॥

యది దత్తం యది హుతం యది త్రాతం ప్రజా మయా ।
తేన సత్యేన సా సాధ్వీ మమాఽఽయుష్యేణ జీవతు ॥ 26 ॥

రాజు చేసిన దంతా పురోహితుడెరుగడు. తన గురువూ, వైశ్వామిత్రుడు ఐన పురోహితుడు వెళ్ళగానే రాజు తన సైన్యమునంతా పంపి, గంగ, సూర్యుడు, దేవతలు వీరందరితో "నేను దానం చేసినట్లైతే, హోమం చేసినట్లైతే ప్రజలను చక్కగా పాలించినట్లైతే ఆ సత్యంతో ఆ పతివ్రత నా ఆయుష్షుతో జీవించుగాక". అని పలికి అగ్నిలో ప్రవేశించాడు.

ఇత్యుక్త్వాఽగ్నౌ ప్రవిష్టే తు శర్యాతౌ నృపసత్తమే ।
తదైవ జీవితా భార్యా రాజ్ఞస్తస్య పురోధసః ॥ 27 ॥

అని పలికి రాజశ్రేష్ఠుడైన శర్యాతి అగ్నిప్రవేశం చేయగానే ఆ రాజు పురోహితుని భార్య జీవించింది.

అగ్నిప్రవిష్టం రాజానం శ్రుత్వా విస్మయకారణమ్ ।
పతివ్రతాం తథా భార్యాం మృతాం జీవాన్వితాం పునః ॥ 28 ॥

తదర్థం చాపి రాజానం త్యక్తాత్మానం విశేషతః ।
ఆత్మనశ్చ పునః కృత్యమస్మరన్నృపతేర్గురుః ॥ 29 ॥

రాజు అగ్నిప్రవేశానికి గల కారణాన్ని ఆశ్చర్యంతో విని, అలాగే పతివ్రతయైన తన భార్య మరణించుటను, తిరిగి జీవించుటను విని, ఆమె కొరకు రాజు తన ప్రాణాలనర్పించటం విశేషంగా భావించి, తిరిగి తాను చేయవలసిన దేమిటో ఆ రాజగురువు తలుచుకొన్నాడు.

అహమప్యగ్నిమావేక్ష్య ఉత యాస్యే ప్రియాన్తికమ్ ।
అథవేహ తపస్తప్స్యే తతో నిశ్చయవాన్ ద్విజః ॥ 30 ॥

ఇప్పుడు నేను అగ్ని కాహుతి కావాలా? భార్య దగ్గరకు వెళ్ళాలా? లేక తపస్సు చేయాలా? అని అనుకొని చివరకు ఆ ద్విజుడు నిశ్చయించుకొన్నాడు.

ఏతదేవాఽఽత్మనః కృత్యం మన్యే సుకృతమేవ చ ।
జీవయామి చ రాజానం తతో యామి ప్రియాం పునః ॥ 31 ॥

నేను చేయవలసినదిదే. అదే సుకృతంగా భావిస్తాను. మొదట రాజును బ్రతికిస్తాను. తరువాత నా భార్యవద్దకు వెళతాను.

ఏతదేవ శుభం మే స్యాత్తతస్తుష్టావ భాస్కరమ్ ।
న హ్యన్యః కోఽపి దేవోఽస్తి సర్వాభీష్టప్రదో రవేః ॥ 32 ॥

ఇదే నాకు శుభాన్నిస్తుంది. అన్ని కోరికలు తీర్చేవాడు సూర్యునికంటె మరొక దేవుడు లేదని సూర్యుని స్తుతించాడు.

మధుచ్ఛన్దా ఉవాచ:- మధుచ్ఛందుడు పలికాడు.

నమోఽస్తు తస్మై సూర్యాయ ముక్తయేఽమితతేజసే ।
ఛన్దోమయాయ దేవాయ ఓంకారార్థాయ తే నమః ॥ 33 ॥

మిక్కిలి తేజస్సు గలిగిన, ముక్తిస్వరూపుడైన సూర్యునికి నమస్కారం, ఛన్దోమయుడై, ఓంకారార్థరూపుడైన దేవునికి నమస్కారం.

విరూపాయ సురూపాయ త్రిగుణాయ త్రిమూర్తయే ।
స్థిత్యుత్పత్తివినాశానాం హేతవే ప్రభవిష్ణవే ॥ 34 ॥

సురూపము, విరూపము గలిగిన వానికి, త్రిగుణములు కలిగిన వానికి, త్రిమూర్తి స్వరూపునికి, సృష్టి స్థితి లయాలకు కారణభూతుడైన ప్రభవిష్ణువుకు నమస్కారం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రసన్నః సూర్యోఽభూద్వరయస్వేత్యభాషత ॥ 35 ॥

అప్పుడు సూర్యుడు ప్రసన్నుడై వరం కోరుకోమన్నాడు.

మధుచ్ఛన్దా ఉవాచ:- మధుచ్ఛందుడు పలికాడు.

రాజానం దేహి దేవేశ భార్యాం చ ప్రియవాదినీమ్ ।
ఆత్మనశ్చ శుభాన్ పుత్రాన్ రాజ్ఞశ్చైవ శుభాన్ వరాన్ ॥ 36 ॥

ఓ దేవేశా! రాజును, ప్రియవాదిని ఐన నా భార్యను, నాకు శుభమైన పుత్రులను, రాజుకు శుభమైన వరాలను ఇవ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రాదాజ్జగన్నాథః శర్యాతిం రత్నభూషితమ్ ।
తాం చ భార్యాం వరానన్యాన్ సర్వం క్షేమమయం తథా ॥ 37 ॥

తరువాత ఆ జగన్నాథుడు రత్నభూషితుడైన శర్యాతిని, పురోహితుని భార్యను, ఇతర వరాలను అన్నీ ఇచ్చాడు. ఈ విధంగా అంతా క్షేమమయ మయింది.

తతో యాతః ప్రియావిష్టః ప్రీతేన చ పురోధసా ।
యయౌ సుఖీ స్వకం దేశం తత్తు తీర్థం శుభం స్మృతమ్ ॥ 38 ॥

అటు తరువాత రాజు తన భార్యతో కూడి, ప్రీతినొందిన పురోహితునితో కూడా గూడి సుఖంగా తన దేశానికి వెళ్ళాడు. కావున ఆ తీర్థాన్ని శుభమైనదానిగా పేర్కొంటారు.

తత్ర త్రీణి సహస్రాణి తీర్థాని గుణవన్తి చ ।
తతః ప్రభృతి తత్తీర్థం భానుతీర్థముదాహృతమ్ ॥ 39 ॥

అప్పటినుండి ఆ తీర్థానికి భానుతీర్థమని పేరు కలిగింది. అక్కడ గుణవంతాలైన మూడువేల తీర్థాలు ఉన్నాయి.

మృతసంజీవనం చైవ శర్యాతం చేతి విశ్రుతమ్ ।
మధుచ్ఛందసమాఖ్యాతం స్మరణాత్పాపనున్మునే ॥ 40 ॥

ఓ మునీ! ఇంకా ఆ తీర్థాలకు మృతసంజీవనం, శర్యాతం, మధుచ్ఛందం అనే పేర్లు కూడా కలవు. వాటిని స్మరించినంత మాత్రానే పాపాలు నశిస్తాయి.

తేషు స్నానం చ దానం చ సర్వక్రతుఫలప్రదమ్ ।
మృతసంజీవనం తత్స్యాదాయురారోగ్యవర్ధనమ్ ॥ 41 ॥

ఆ తీర్థాలలో స్నానం, దానం, మొదలైనవి చేస్తే సర్వక్రతుఫలాల నిస్తాయి. మృతసంజీవనతీర్థం ఆయురారోగ్యాలను వృద్ధిచేస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే భాన్వాదిత్రిసహస్రతీర్థవర్ణనం నామ అష్టషష్టితమోఽధ్యాయః. ॥ 68 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని భానుతీర్థం మొదలైన మూడువేల తీర్థాల వర్ణనమనే పేరుగల అరవై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనసప్తతితమోఽధ్యాయః - అరవై తొమ్మిదవ అధ్యాయం

ఖడ్గతీర్థ వర్ణనమ్ - ఖడ్గతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఖడ్గతీర్థమితిఖ్యాతం గౌతమ్యా ఉత్తరే తటే ।
తత్ర స్నానేన దానేన ముక్తిభాగీ భవేన్నరః ॥ 1 ॥

గౌతమీనది ఉత్తరతీరాన ఖడ్గతీర్థమనేది కలదు. దానిలో స్నానం, దానం చేసిన మానవుడు ముక్తిని పొందుతాడు.

తత్ర వృత్తం ప్రవక్ష్యామి శృణు నారద యత్నతః ।
పైలూష ఇతి విఖ్యాతః కవషస్య సుతో ద్విజః ॥ 2 ॥

నారదా! దాని వృత్తాంతాన్ని చెప్పబోతున్నాను. శ్రద్ధగా విను. కవషుని కుమారుడు పైలూషుడు అనేవాడు కలదు. అతడు బ్రాహ్మణుడు.

కుటుమ్బభారాత్పరితో హ్యర్థార్థీ పరిధావతి ।
న కిమప్యాససాదాసౌ తతో వైరాగ్యమాస్థితః ॥ 3 ॥

తన కుటుంబాన్ని పోషించుకోవడానికి ధనంకోసం ఇటునటు పరుగెత్తుచుండినాడు. కాని అతడేమీ సంపాదింప లేకపోయాడు. దానితో వైరాగ్యాన్ని పొందాడు.

అత్యన్తవిముఖో దేవే వ్యర్థే భూతే తు పౌరుషే ।
న వైరాగ్యాదన్యదస్తి పణ్డితస్యావలమ్బనమ్ ॥ 4 ॥

తన పురుషప్రయత్నం వ్యర్థం కాగా, భగవంతుని యందు కూడా విముఖుడై, పండితునికి వైరాగ్యం కంటె మరేదీ తోడు లేదని భావించాడు.

ఇతి సంచింతయామాస తదాఽసౌ నిఃశ్వసన్ముహుః ।
క్రమాగతం ధనం నాస్తి పోష్యాశ్చ బహవో మమ ॥ 5 ॥

అప్పుడతడు నిట్టూర్పులు విడుస్తూ వంశపరంపరగా వచ్చిన ధనం లేదు, నేను పోషించవలసినవారు చాలామంది ఉన్నారని చింతించుచుండినాడు.

మానీ చాఽఽత్మా న కష్టార్హో హా ధిగ్దైవస్య చేష్టితమ్ ।
స కదాచిత్ వృత్తియుతో వృత్తిభిః పరివర్తయన్ ॥ 6 ॥

అభిమానవంతుడైన తను కష్టమునకు పనికిరాడు. ఆహా! దైవం చేష్టలు నిందింపతగినట్లుగా ఉన్నాయి కదా! అతడు ఒకనాడు వృత్తినవలంబించాడు. పిమ్మట అనేక వృత్తులను మార్చి కూడా

నాలభం చ ధనం వృత్తేర్విరాగమగమత్తదా ।
సేవా నిషిద్ధా యా కాచిద్గహనా దుష్కరం తపః ॥ 7 ॥

ధనము లభించక విరాగి అయ్యాడు. కష్టసాధ్యమైన కొంచెం సేవ చేయడం కూడా మానివేశాడు. తపస్సు నాచరించటం సులభం కాదు.

బలాదాకర్షయన్తీ మాం తృష్ణా సర్వత్ర దుష్కృతే ।
త్వయాఽపకృతమజ్ఞానాత్తస్మాత్తృష్ణే నమోఽస్తు తే ॥ 8 ॥

నీవు ఓ కోరికా! నన్ను చెడ్డపనులందంతటా బలవంతంగా ఆకర్షిస్తున్నావు. నీవల్ల నేను తెలియక తప్పు చేశాను. నీకు నమస్కారం.

ఏవం విచిన్త్య మేధావీ బంధచ్ఛేదాయ కిం భవేత్ ।
ఇత్యాలోచ్య స పైలూషః పితరం వాక్యమబ్రవీత్ ॥ 9 ॥

ఇలా చింతించిన మేధావి ఐన ఆ పైలూషుడు ఈ బంధనం తొలగడానికి ఏమి చేయాలని ఆలోచించి తండ్రినడిగాడు.

పైలూష ఉవాచ:- పైలూషుడు పలికాడు.

జ్ఞానాసినా క్రోధలోభౌ సంసృతిం చాతిదుస్తరామ్ ।
ఛేద్మీమాం కేన హే తాత తముపాయం వద ప్రభో ॥ 10 ॥

ఓ తండ్రీ! నేను ఏ జ్ఞానఖడ్గంతో క్రోధలోభాలను, దాటశక్యంగాని సంసారాన్ని ఛేదించగలనో ఆ ఉపాయాన్ని చెప్పండి.(సంసృతి=సంసారము)

కవష ఉవాచ:- కవషుడు పలికాడు.

ఈశ్వరాజ్జ్ఞానమన్విచ్ఛేదిత్యేషా వైదికీ శ్రుతిః ।
తస్మాదారాధయేశానం తతో జ్ఞానమవాప్స్యసి ॥ 11 ॥

ఈశ్వరుని నుండే జ్ఞానమునన్వేషించి పొందాలి అనేది వేదం చెప్పిన మాట. అందువలన ఈశానుని ఆరాధించు. అప్పుడు జ్ఞానాన్ని పొందగలవు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా స పైలూషో జ్ఞానాయేశ్వరమార్చయత్ ।
తతస్తుష్టో మహేశానో జ్ఞానం ప్రాదాద్ద్విజాతయే ॥
ప్రాప్తజ్ఞానో మహాబుద్ధిర్గాథాః ప్రోవాచ ముక్తిదాః ॥ 12 ॥

అలాగేనని ఆ పైలూషుడు జ్ఞానంకొరకై ఈశ్వరుని అర్చించాడు. అప్పుడు సంతోషించిన ఆ మహేశానుడు పైలూషునికి జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆ మహాబుద్ధి జ్ఞానాన్ని పొందినవాడై ముక్తినిచ్చే గాథలను చెప్పాడు.

పైలూష ఉవాచ:- పైలూషుడు పలికాడు.

క్రోధస్తు ప్రథమం శత్రుర్నిష్ఫలో దేహనాశనః ।
జ్ఞానఖడ్గేన తం ఛిత్త్వా పరమం సుఖమాప్నుయాత్ ॥ 13 ॥

క్రోధమనేది మొదటి శత్రువు. అది దేహాన్ని నశింపజేసేది, నిష్ఫలమైనది. ఆ కోపాన్ని జ్ఞానమనే ఖడ్గంతో ఛేదిస్తే పరమసుఖం లభిస్తుంది.

తృష్ణా బహువిధా మాయా బంధనీ పాపకారిణీ ।
ఛిత్త్వైతాం జ్ఞానఖడ్గేన సుఖం తిష్ఠతి మానవః ॥ 14 ॥

తృష్ణ అనేది అనేక విధాలుగా ఉంటుంది. అది మాయాస్వరూపిణి, బంధించే స్వభావం గలది. పాపాలను చేయించేది. దానిని జ్ఞానఖడ్గంతో ఛేదిస్తే మానవుడు సుఖంగా ఉంటాడు.

సంగస్తు పరమోఽధర్మః దేవాదీనామితి శ్రుతిః ।
అసంగస్యాఽఽత్మనోఽప్యస్య సంగోఽయం పరమో రిపుః ॥ 15 ॥

సంగమనేది దేవతలకు కూడా ధర్మం కానిదని శ్రుతి చెబుతున్నది. సంగమే లేనటువంటి ఆత్మకు కూడా ఈ సంగం పరమశత్రువు.

ఛిత్త్వైనం జ్ఞానఖడ్గేన శివైకత్వమవాప్నుయాత్ ।
సంశయః పరమో నాశో ధర్మార్థానాం వినాశకృత్ ॥ 16 ॥

దీనిని జ్ఞానమనే ఖడ్గంతో ఖండిస్తే శివునిలో ఐక్యమవుతారు. సంశయమనేది మిక్కిలి నాశకరం. అది ధర్మార్థాలను నశింపజేస్తుంది.

ఛిత్త్వైనం సంశయం జన్తుః పరమేప్సితమాప్నుయాత్ ।
పిశాచీవ విశత్యాశా నిర్దహత్యఖిలం సుఖమ్ ॥ 17 ॥
పూర్ణాహన్తాసినా ఛిత్త్వా జీవన్ముక్తిమవాప్నుయాత్ ।

ఈ సంశయాన్ని జ్ఞానఖడ్గంతో ఛేదిస్తే మేలైన అభీష్టాన్ని పొందుతాడు. ఆశ యనేది పిశాచివలె ప్రవేశిస్తుంది. సమస్త సుఖాలను నశింపజేస్తుంది. బ్రహ్మాత్మభావన అనే ఖడ్గంతో ఆశను నశింపచేసి జీవన్ముక్తిని పొందాలి. (పూర్ణాహన్తా=నేనే పూర్ణుడను, నేను బ్రహ్మమును అనే భావన)

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతో జ్ఞానమవాప్యాసౌ గంగాతీరం సమాశ్రితః ।
జ్ఞానఖడ్గేన నిర్మోహస్తతో ముక్తిమవాప సః ॥ 18 ॥

అటు తరువాత ఇతడు జ్ఞానాన్ని పొంది, గంగాతీరాన్ని చేరాడు. జ్ఞానఖడ్గంతో మోహన్ని ఛేదించి తరువాత అతడు ముక్తిని పొందాడు.

తతః ప్రభృతి తత్తీర్థం ఖడ్గతీర్థమితి స్మృతమ్ ।
జ్ఞానతీర్థం చ కవషం పైలూషం సర్వకామదమ్ ॥ 19 ॥

అప్పటి నుండి ఆ తీర్థాన్ని ఖడ్గతీర్థమని, జ్ఞానతీర్థమని, కవష తీర్థమని, పైలూష తీర్థమని ప్రసిద్ధి చెందింది. ఇది సమస్త కోరికలను తీర్చేది.

ఇత్యాది షట్ సహస్రాణి తీర్థాన్యాహుర్మహర్షయః ।
అశేషపాపతాపౌఘహరాణీష్టప్రదాని చ ॥ 20 ॥

ఇటువంటివి ఆరువేల తీర్థాలున్నాయని మహర్షులంటారు. అవి సమస్త పాప తాప సమూహాలను పోగొట్టి ఇష్టాల నిచ్చేవి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఖడ్గతీర్థవర్ణనం నామ అష్టషష్టితమోఽధ్యాయః. ॥ 69 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలోని ఖడ్గతీర్థవర్ణనమనే పేరుగల అరవై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

సప్తతితమోఽధ్యాయః - డెబ్బైయవ అధ్యాయం

అన్వింద్రాత్రేయాది పంచసహస్రతీర్థవర్ణనమ్ - అన్వింద్ర, ఆత్రేయ మున్నగు ఐదువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఆత్రేయమితి విఖ్యాతమన్విన్ద్రం తీర్థముత్తమమ్ ॥
తస్య ప్రభావం వక్ష్యామి భ్రష్టరాజ్యప్రదాయకమ్ ॥ 1 ॥

రాజ్యభ్రష్టులైన వారికి రాజ్యప్రదాయకమైన, అన్వింద్రమనే, ఆత్రేయమనే ఉత్తమమైన తీర్థం గలదు. దాని ప్రభావాన్ని చెప్పబోతున్నాను.

గౌతమ్యా ఉత్తరే తీరే ఆత్రేయో భగవాన్ ఋషిః ।
అన్వారేభేఽథ సత్రాణి ఋత్విగ్భిర్మునిభిర్వృతః ॥ 2 ॥

గౌతమీనదికి ఉత్తరతీరంలో ఆత్రేయుడనే గొప్ప ఋషి ఉండినాడు. అతడు ఋత్విక్కులందరితో కలిసి అనేక సత్రయాగాలను ప్రారంభించాడు.

తస్య హోతాఽభవత్త్వగ్నిర్హవ్యవాహన ఏవ చ ।
ఏవం సత్రే తు సంపూర్ణ ఇష్టిం మాహేశ్వరీం పునః ॥ 3 ॥

అతనికి హవ్యవాహనుడైన అగ్నియే హోతగా ఉండినాడు. ఇలా సత్రయాగం పూర్తికాగానే మరల మాహేశ్వరీ ఇష్టిని ప్రారంభించాడు.

కృత్వైశ్వర్యమగాద్విప్రః సర్వత్ర గతిమేవ చ ।
ఇంద్రస్య భవనం రమ్యం స్వర్గలోకం రసాతలమ్ ॥ 4 ॥

స్వేచ్ఛయా యాతి విప్రేన్ద్రః ప్రభావాత్తపసః శుభాత్ ।
స కదాచిద్దివం గత్వా ఇన్ద్రలోకమగాత్పునః ॥ 5 ॥

ఆ విప్రుడు ఆ ఇష్టిని చేసి ఐశ్వర్యాన్ని, స్వేచ్ఛాగమనాన్ని పొందాడు. ఇంద్రుని సుందరభవనాన్ని, స్వర్గలోకాన్ని, రసాతలాన్ని, స్వేచ్ఛగా సంచరిస్తూ ఒకనాడు శుభమైన తపఃప్రభావం వలన తిరిగి ఇంద్రలోకానికి వెళ్ళాడు.

తత్రాపశ్యత్సహస్రాక్షం సురైః పరివృతం శుభైః ।
స్తూయమానం సిద్ధసాధ్యైః ప్రేక్షన్తం నృత్యముత్తమమ్ ॥
శృణ్వానం మధుకం గీతమప్సరోభిశ్చ వీజితమ్ ॥ 6 ॥

అక్కడ సిద్ధులు, సాధ్యులు స్తుతిస్తుండగా, చక్కని నృత్యాన్ని చూస్తూ, మధురమైన గీతాలను వింటూ, అప్సరసలు వింజామరలు వీస్తుండగా, శుభకరులైన దేవతలందరూ చుట్టూచేరివున్న సహస్రాక్షుడైన ఇంద్రునిచూశాడు.

ఉపోపవిష్టైః సురనాయకైస్తైః సంపూజ్యమానం మహదాసనస్థమ్ ।
జయన్తమంకే వినిధాయ సూనుం శచ్యాయుతం ప్రాప్తరతిం మహిష్ఠమ్ ॥ 7 ॥

సతాం శరణ్యం వరదం మహేన్ద్రం సమీక్ష్య విప్రాధిపతిర్మహాత్మా ।
విమోహితోఽసౌ మునిరింద్రలక్ష్మ్యా సమీహయామాస తదింద్రరాజ్యమ్ ॥ 8 ॥

ప్రక్కన ఆసనాలలో కూర్చున్న సురనాయకు లందరితో పూజలందుకొంటూ గొప్ప సింహాసనం మీద కూర్చొని తన పట్టమహిషియైన శచీదేవితో కూడుకొని కుమారుడైన జయంతుని ఒడిలో కూర్చోబెట్టుకొని, సింహాసనం మీద కూర్చొనివున్న, సత్పురుషులకు శరణు ఇచ్చేవాడు, వరములనిచ్చేవాడునైన మహేంద్రుని చూచి, విప్రాధిపతి, మహాత్ముడు అయిన ఈ ఆత్రేయముని ఇంద్రుని సంపదను చూచి మోహపడి ఆ ఇంద్రరాజ్యం కావాలని కోరుకొన్నాడు.

సంపూజితో దేవగణైర్యథావత్ స్వమాశ్రమం వై పునరాజగామ ।
సమీక్ష్య తాం శక్రపురీం సురమ్యాం రత్నైర్యుతాం పుణ్యగుణైః సుపూర్ణామ్ ॥ 9 ॥

స్వమాశ్రమం నిష్ప్రభహేమవర్జ్యం సమీక్ష్య విప్రో విరమం జగామ ।
సమీహమానః సురరాజ్యమాశు ప్రియాం తదోవాచ మహాత్రిపుత్రః ॥ 10 ॥

అతడు దేవగణాలచే యథావిథిగా పూజలందుకొని, తిరిగి తన ఆశ్రమానికి వచ్చాడు. రత్నాలతో కూడుకొని పుణ్యగణాలతోనిండిన అందమైన ఆ ఇంద్రపురిని చూచి, తన ఆశ్రమం బంగారు కాంతులు లేక వెలవెల పోతుండటం చూచి ఆ విప్రుడు విరక్తుడయ్యాడు. దేవలోకరాజ్యాన్ని త్వరగా పొందాలని కోరుతూ గొప్పవాడైన అత్రిపుత్రుడు తన భార్యతో ఇలా అన్నాడు.

ఆత్రేయ ఉవాచ:– ఆత్రేయుడు పలికాడు.

భోక్తుం న శక్తోఽస్మి ఫలాని మూలాన్యనుత్తమాన్యప్యతిసంస్కృతాని ।
స్మృత్వాఽమృతం పుణ్యతమం చ తత్ర భక్ష్యం చ భోజ్యం చ వరాసనాని ॥ 11 ॥
స్తుతిం చ దానం చ సభాం శుభాం చ అస్త్రం చ వాసాంసి పురీం వనాని ॥

దేవేంద్రుని వద్దనున్న అమృతాన్ని, పుణ్యతమమైన భక్ష్యాన్ని, భోజ్యాన్ని, శ్రేష్ఠమైన ఆసనాలను, అక్కడ చేసే స్తోత్రాన్ని, దానాన్ని, శుభమైన ఆ సభను, అస్త్రమును, వస్త్రాలను, ఆ నగరాన్ని, వనాలను తలచి, ఉత్తమమైనవి, సంస్కరించబడినవి ఐనా ఈ కందమూలంలను, ఫలాలను తినడానికి అశక్తుడ నవుతున్నాను.

తతో మహాత్మా తపసః ప్రభావాత్ త్వష్టారమాహూయ వచో బభాషే ॥ 12 ॥

అటు తరువాత ఆ మహాత్ముడు తన తపఃప్రభావంతో త్వష్టను పిలిచి ఇలా అన్నాడు.

ఆత్రేయ ఉవాచ:– ఆత్రేయుడు పలికాడు.

ఇచ్ఛేయమిన్ద్రత్వమహం మహాత్మన్ కురుష్వ శీఘ్రం పదమైన్ద్రమత్ర ।
బ్రూషేఽన్యథా చేన్మదుదీరితం త్వం భస్మీకరోమ్యేవ న సంశయోఽత్ర ॥ 13 ॥

ఓ మహాత్మా! నేను ఇంద్రపదవిని కోరుతున్నాను. కావున ఇక్కడ తొందరగా ఆ స్థానాన్ని సృష్టించు. ఒకవేళ నీవు నేను చెప్పిన దానికి వ్యతిరేకంగా కాదని చెబితే ఇక్కడే నిన్ను భస్మం చేస్తాను. దీనిలో సందేహం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తదత్రివాక్యాత్త్వరితః ప్రజానాం స్రష్టా విభుర్విశ్వకర్మా తదైవ ।
చకార మేరుం చ పురీం సురాణాం కల్పద్రుమాం కల్పలతాం చ ధేనుమ్ ॥ 14 ॥

ఆ ఆత్రేయుని మాటను విన్న తరువాత ప్రజలను సృష్టించే విభుడైన విశ్వకర్మ త్వరపడి అప్పుడే మేరువును, స్వర్గాన్ని, కల్పవృక్షాన్ని, పారిజాతలతను, కామధేనువును తయారు చేశాడు.

చకార వజ్రాదివిభూషితాని గృహాదిశుభ్రాణ్యతిచిత్రితాని ।
చకార సర్వావయవానవద్యాం శచీం స్మరస్యైవ విహారశాలామ్ ॥ 15 ॥

వజ్రాదులతో కూడివున్న విభూషణాలను, చక్కని శుభ్రమైన చిత్రవిచిత్రాలైన గృహాలను, సమస్త అవయవాలతో సౌందర్యవతియైన శచీదేవిని, మన్మథునికి విహారశాలగా ఉండేటట్లుగా తయారుచేశాడు.

సభాం సుధర్మాణమహో క్షణేన తథా చకారాప్సరసో మనోజ్ఞాః ।
చకార చోచ్చైఃశ్రవసం గజం చ వజ్రాది చాస్త్రాది సురానశేషాన్ ॥ 16 ॥

ఆహా! ఒక్క క్షణంలో సుధర్మా అనే ఇంద్రసభను, మనోహరులైన అప్సరసలను, ఉచ్చైఃశ్రవమనే గుఱ్ఱాన్ని, ఐరావతమనే గజాన్ని, వజ్రాయుధం మున్నగు అస్త్రాలను, లెక్కలేనంతమంది దేవతలను సృష్టించాడు.

నివార్యమాణః ప్రియయాఽత్రిపుత్రః శచీసమామాత్మవధూం చకార ।
తదాత్రిపుత్రోఽత్రిముఖ్యైస్సమేతో వజ్రాదిరూపం చ చకార చాస్త్రమ్ ॥ 17 ॥

తన భార్య నివారిస్తున్నప్పటికి ఆ అత్రికుమారుడు తన భార్యను శచీదేవితో సమానంగా చేశాడు. అత్రిమున్నగువారు పరివేష్టించి ఉండగా అప్పుడు తన అస్త్రాన్ని వజ్రాయుధం మొదలైన వాటిగా మార్చాడు.

నృత్యాది గీతాది చ సర్వమేవ చకార శక్రస్య పురే చ దృష్టమ్ ।
తత్సర్వమాసాద్య తదా మునీన్ద్రః ప్రహృష్టచేతాః సుతరాం బభూవ ॥ 18 ॥

ఆ మునీంద్రుడు తాను ఇంద్రసభలో చూచిన విధంగానే నృత్యం గీతం వాద్యం మున్నగు వానినన్నింటినీ సమకూర్చుకొని తన హృదయంలో మిక్కిలి ఆనందించాడు.

ఆపాతరమ్యేష్వపి కస్య నామ భవత్యపేక్షా న హి గోచరేషు ।
శ్రుత్వా చ దైత్యా దనుజాః సమేతా రక్షాంసి కోపేన యుతాని సద్యః ॥ 19 ॥

ఎప్పటికీ రమ్యాలైన వస్తువులయందు ఎవరికి కోరిక కలుగదు? ఇది విని దైత్యులు, దనుజులు, రాక్షసులు వెంటనే కోపావిష్టులైనారు.

స్వర్గం పరిత్యజ్య కుతో హరిర్భువం సమాగతోఽన్వేష మిథః సుఖాయ ।
తస్మాద్వయం యామ ఇతోఽనుయోద్ధుం వృత్రస్య హన్తారమదీర్ఘసత్రమ్ ॥ 20 ॥

స్వర్గాన్ని వదిలిపెట్టి ఇంద్రుడు ఎందుకు భూమి మీదికి వచినట్లు? ఇతడు రెంటిలో సుఖాలను పొందాలనుకుంటున్నాడు. అందువలన మనం ఇక్కడి నుండి బయలుదేరి ఆ వృత్రహంతకుడు, దీర్ఘసత్రయాగం చేయని వానితో యుద్ధం చేయాలి.

తతః సమాగత్య తదాత్రిపుత్రం సంవేష్టయామాసురథాసురాస్తే ।
సంవేష్టయిత్వా పురమత్రిపుత్రకృతం తథా చేన్ద్రపురాభిధానమ్ ॥ 21॥
తైర్వధ్యమానః శస్త్రపాతైర్మహద్భిస్తతో భీతో వాక్యమిదం జగాద ॥

తరువాత ఆ అసురులు వచ్చి ఆ అత్రిపుత్రుని చుట్టుముట్టారు. అలాగే అత్రిపుత్రు డేర్పరుచుకున్న ఇంద్రపురమనే దానిని చుట్టుముట్టి, గొప్ప ఆయుధాలతో చంపటానికి సిద్ధపడగా అతడు భయపడి వారితో ఇలా అన్నాడు.

ఆత్రేయ ఉవాచ:- ఆత్రేయుడు పలికాడు.

యో జాత ఏవ ప్రథమో మనస్వాన్ దేవో దేవాన్ క్రతునా పర్యభూషత్ ।
యస్య సుష్మాద్రోదసీ అభ్యసేతాం నృమ్ణస్య మహ్నా స జనాస ఇన్ద్రః ॥ 22 ॥

ఎవడు పుడుతూనే ఆందరిలోనూ ముఖ్యుడయ్యాడో, అభిమానవంతుడైన ఆ ఇంద్రుడు స్వయంగా దైవమై మిగిలిన దేవతలందరినీ తన అధీనంలో ఉంచుకొన్నాడు. అతని శరీరబలం వలన భూలోక స్వర్గలోకాలు కంపించాయి. ఓ అసురులారా! ఐశ్వర్యశాలి అయిన అతడే ఇంద్రుడు. (నేను ఇంద్రుడను కాను.)

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యాదిసూక్తేన రిపూనువాచ హరిం చ తుష్టావ తదాఽత్రిపుత్రః ॥ 23 ॥

ఇటువంటి సూక్తముతో శ్రీహరిని స్తుతించాడు. అప్పుడు ఆ అత్రిపుత్రుడు శత్రువులతో ఇలా అన్నాడు.

ఆత్రేయ ఉవాచ:- ఆత్రేయుడు పలికాడు.

నాహం హరిర్నైవ శచీ మదీయా నేయం పురీ నైవ వనం తదైన్ద్రమ్ ।
స ఏవ చేన్ద్రో వృత్రహన్తా స వజ్రీ సహస్రాక్షో గోత్రభిద్వజ్రబాహుః ॥ 24 ॥

నేను ఇంద్రుణ్ణి కాను, నా భార్య అయిన ఈమె శచీదేవి కాదు, ఇది అమరావతి కాదు, ఇది నందనవనం కాదు, ఇంద్రసంబంధం లేదు. అతడే ఇంద్రుడు, వృత్రుని జంపినవాడు, వజ్రాయుధం కలవాడు, వేయి కన్నులు కలవాడు, పర్వతాలను ఖండించినవాడు, వజ్రాయుధాన్ని ధరించిన బాహువు కలవాడు.

అహం తు విప్రో వేదవిద్బ్రహ్మవృన్దైః సమావిష్టో గౌతమీతీరసంస్థః ।
యత్రాఽఽయత్యాం నాద్య వా సౌఖ్యహేతుస్తచ్చాకార్షం కర్మ దుర్దైవయోగాత్ ॥ 25 ॥

నేనొక బ్రాహ్మణుడను. వేదవేత్తల సమూహాలతోకూడి గౌతమీనదీతీరాన ఉండే వాడిని. దురదృష్టవశాత్తు నేను ఇప్పుడు గాని, రాబోవు కాలంలో గాని సుఖాన్ని కల్గించని పనిని చేశాను.

అసురా ఊచుః :- అసురులు పలికారు.

సంహరస్వేదమాత్రేయ యదింద్రస్య విడమ్బనమ్ ।
క్షేమస్తే భవితా సత్యం నాత్ర కార్యా విచారణా ॥ 26 ॥

ఆత్రేయా! దీనినుపసంహరించు. ఇంద్రుని అనుకరణాన్ని విడనాడు. నీకు క్షేమం కలుగుతుంది. ఇది సత్యం. దీనికి ఆలోచించవలసిన పని లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదాఽఽత్రేయోఽబ్రవీద్వాక్యం యథా వక్ష్యన్తి మామిహ ।
కరోమ్యేవ మహాభాగాః సత్యేనాగ్నిం సమాలభే ॥ 27 ॥

అప్పుడాత్రేయుడు వారితో ఇలా అన్నాడు. ఓ మహానుభావులారా! నేను మీరు చెప్పినట్లే చేస్తాను. ఇది నిజం. అగ్నిసాక్షిగా చెబుతున్నాను.

ఏవముక్త్వా స దైతేయాంస్త్వష్టారం పునరబ్రవీత్ ॥ 28 ॥

దైతేయులతో ఇలా పలికి తిరిగి త్వష్టతో ఇలా అన్నాడు.

ఆత్రేయ ఉవాచ:- ఆత్రేయుడు పలికాడు.

యత్కృతం త్వత్ర మత్ప్రీత్యా ఐన్ద్రం త్వష్టః పదం త్వయా ।
సంహరస్వ పునః శీఘ్రం రక్షతాం బ్రాహ్మణం భవాన్ ॥ 29 ॥

ఓ త్వష్టా! నీవు నా ప్రీతి కొరకు ఇక్కడ ఇంద్రపదమునేది చేశావో దానిని తిరిగి త్వరగా ఉపసంహరించు. నీవు బ్రాహ్మణుడవైన నన్ను రక్షించు.

పునర్దేహి పదం మహ్యమాశ్రమం మృగపక్షిణః ।
వృక్షాంశ్చ వారి యత్రాఽఽసీన్న దివ్యేన ప్రయోజనమ్ ॥
సర్వమక్రమ మాయాతం న సుఖాయ మనీషిణామ్ ॥ 30 ॥

నాకు మరల నా స్థానాన్ని, ఆశ్రమాన్ని, మృగాలను, పక్షులను, వృక్షాలను, నీటిని ఎక్కడ ఎలా ముందు ఉన్నాయో అలాగే ఇవ్వు. నాకు దివ్యమైనదానితో ప్రయోజనం లేదు. బుద్ధిమంతులకు అక్రమంగా వచ్చినదేదీ సుఖాన్నివ్వదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా ప్రజానాథస్త్వష్టా సంహృతవాంస్తదా ।
దైత్యాశ్చ జగ్ముః స్వస్థానం కృత్వా దేశమకణ్టకమ్ ॥ 31 ॥

ప్రజానాధుడైన త్వష్ట అలాగేనని దానినంతా తీసివేశాడు. ఆ ప్రదేశాన్ని శత్రుభయం లేకుండా చేసి దైత్యులు తమ చోటుకు వెళ్ళారు.

త్వష్టా చాపి యయౌ స్థానం స్వకం సంప్రహసన్నివ ।
ఆత్రేయో౽పి తదా శిష్యైః సంవృతః సహ భార్యయా ॥ 32 ॥

గౌతమీ తీరమాశ్రిత్య తపోనిష్ఠస్తు నిర్వృతః ।
వర్తమానే మహాయజ్ఞే లజ్జితో వాక్యమబ్రవీత్ ॥ 33 ॥

త్వష్ట కూడా తనలో తాను నవ్వుకుంటూ తన స్థానానికి వెళ్ళాడు. ఆత్రేయుడు కూడా భార్యతో, శిష్యులతో, కలిసి గౌతమీ తీరాన్ని ఆశ్రయించి తపోనిష్ఠలో వుండి ఆనందాన్ని పొందాడు. మహాయజ్ఞం జరుగుతుండగా ఆత్రేయుడు సిగ్గుతో ఇలా అన్నాడు

ఆత్రేయ ఉవాచ:– ఆత్రేయుడు పలికాడు.

అహో మోహస్య మహిమా మమాపి భ్రాన్తచిత్తతా ।
కిం మహేన్ద్రపదం లబ్ధం కిం మయా౽త్ర పురా కృతమ్ ॥ 34 ॥

ఆహా! ఏమి ఈ మోహము యొక్క మహిమ! నన్నుకూడా భ్రాంతిలో పడవేసింది. నేనింతకు పూర్వమేమి చేశాను? మహేంద్రపదవిని పొందానా ఏమి?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం వదన్తమాత్రేయం లజ్జితం ప్రాబ్రువన్ సురాః ॥ 35 ॥

ఇలా మాట్లాడుతూ సిగ్గుపడుతున్న ఆత్రేయునివద్దకు దేవతలు వచ్చారు.

సురా ఊచుః :– దేవతలు పలికారు.

లజ్జాం జహి మహాబాహో భవితా ఖ్యాతిరుత్తమా ।
ఆత్రేయతీర్థే యే స్నానం ప్రాణినః కుర్యురంజసా ॥ 36 ॥

ఇన్ద్రాస్తే భవితారో వై స్మరణాత్సుఖభాగినః ।
తత్ర పంచ సహస్రాణి తీర్థాన్యాహుర్మనీషిణః ॥ 37 ॥

ఓ మహాబాహూ! నీవు సిగ్గుపడకు. అవమానముగా భావించకు. నీకు ఉత్తమమైన ఖ్యాతి లభిస్తుంది. ఎవరు ఈ ఆత్రేయ తీర్థంలో ఉచితరీతిగా స్నానం చేశారో, వారు ఇంద్రపదవిని పొందుతారు. ఎవరు స్మరిస్తారో వారు సుఖాలను పొందుతారు. అక్కడ ఐదువేల తీర్థాలున్నాయని బుద్ధిమంతులు చెబుతారు.

అన్విన్ద్రాత్రేయదైతేయనామభిః కీర్తితాని చ ।
తేషు స్నానం చ దానం చ సర్వమక్షయపుణ్యదమ్ ॥ 38 ॥

అన్వింద్రం, ఆత్రేయం, దైతేయమనే పేర్లతో ఈ తీర్థాలు ప్రసిద్ధి పొందాయి. వాటిలో స్నాన దానం మొదలైనవి చేస్తే అక్షయమైన పుణ్యం లభిస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా విబుధా యాతాః సంతుష్టశ్చాభవన్మునిః ॥ 39 ॥

ఇలా పలికి దేవతలు వెళ్ళారు. ముని కూడా సంతోషించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యేఽన్వింద్రాత్రేయాది పంచసహస్రతీర్థవర్ణనం నామ సప్తతితమోఽధ్యాయః. ॥ 70 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో అన్వింద్ర, ఆత్రేయ మున్నగు ఐదువేల తీర్థాలు వర్ణనమనే పేరు గల డెబ్బైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకసప్తతి తమోఽధ్యాయః - డెబ్బై ఒకటవ అధ్యాయం

కపిలాసంగమాద్యష్టాశీతిసహస్రతీర్థవర్ణనమ్-కపిలా సంగమం మొదలైన ఎనభై ఎనిమిదివేల తీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కపిలా సంగమం నామ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
శృణు నారద వక్ష్యామి కథాం పుణ్యామనుత్తమామ్ ॥ 1 ॥

ఓ నారదా! ముల్లోకాలలో ప్రసిద్ధిచెందిన కపిలాసంగమమనే పేరుగల తీర్థమున్నది. దాని పవిత్రమైన కథను చెప్పబోతున్నాను విను.

కపిలో నామ తత్త్వజ్ఞో మునిరాసీన్మహాయశాః ।
క్రూరశ్చాపి ప్రసన్నశ్చ తపోవ్రతపరాయణః ॥ 2 ॥

పూర్వం గొప్పకీర్తి గలిగిన కపిలుడనే పేరుగల తత్త్వం తెలిసిన ముని ఉండినాడు. అతడు క్రూరుడైనప్పటికి ప్రసన్నుడు, తపోవ్రతపరాయణుడు కూడా.

తపస్యన్తం మునిశ్రేష్ఠం గౌతమీతీరమాశ్రితమ్ ।
తమాగత్య మహాత్మానం వామదేవాదయోఽబ్రువన్ ॥ 3 ॥

గౌతమీతీరంలో తపస్సు చేసుకొంటున్న ఆ మునిశ్రేష్ఠుని వద్దకు వామదేవాదులు వచ్చి ఆ మహాత్మునితో ఇలా అన్నారు.

హత్వా వేనం బ్రహ్మశాపైర్నష్టధర్మే త్వరాజకే ।
కపిలం సిద్ధమాచార్యమూచుర్మునిగణాస్తదా ॥ 4 ॥

బ్రహ్మదేవుని శాపాలతో వేనుని చంపి, అరాజకం వలన ధర్మం నశించగా అప్పుడు మునిగణాలన్నీ సిద్ధాచార్యుడైన కపిలునితో ఇలా అన్నాడు.

మునిగణా ఊచుః :- మునిగణాలు పలికాయి.

గతే వేదే గతే ధర్మే కిం కర్తవ్యం మునీశ్వర ॥ 5 ॥

ఓ మునీశ్వరా! వేదము, ధర్మమూ నశించగా మేమేమి చేయాలి?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతోఽబ్రవీన్మునిర్ధ్యాత్వా కపిలస్త్వాగతాన్మునీన్ ॥ 6 ॥

అప్పుడు కపిలముని కొంతసేపు ధ్యానించి వచ్చిన మునులతో ఇలా అన్నాడు.

కపిల ఉవాచ:- కపిలుడు పలికాడు.

వేనస్యోరు ర్విమథ్యో వై తతః కశ్చిద్భవిష్యతి ॥ 7 ॥

వేనుని తొడను మీరు చిలకండి. దానివలన ఎవరో ఒకరు పుడతారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథైవ చక్రుర్మునయో వేనస్యోరుం విమథ్య వై ।
తత్రోత్పన్నో మహాపాపః కృష్ణో రౌద్రపరాక్రమః ॥ 8 ॥

మునులందరు అలాగే వేనుని ఊరువును మథించారు. దానినుండి మహాపాపి, నల్లనివాడు, రౌద్రపరాక్రమం కలవాడు పుట్టాడు.

తం దృష్ట్వా మునయో భీతా నిషీదస్వేతి చాబ్రువన్ ।
నిషాదః సోఽభవత్తస్మాన్నిషాదాశ్చాభవంస్తతః ॥ 9 ॥

అతనిని చూచి మునులు భయపడి నిషీదస్వ అని పలికారు. అతడు నిషాదుడయ్యాడు. అతనినుండే తరువాత నిషాదులు పుట్టారు.

వేనబాహుం మమన్థుస్తే దక్షిణం ధర్మసంహితమ్ ।
తతః పృథుస్వరశ్చైవ సర్వలక్షణలక్షితః ॥ 10 ॥

తరువాత ధర్మసంహితమైన వేనుని దక్షిణబాహువును వారు మథించారు. దానినుండి సర్వలక్షణాలతో గూడిన పృథుస్వరు డుదయించాడు.

రాజాఽభవత్పృథుః శ్రీమాన్ బ్రహ్మసామర్థ్యసంయుతః ।
తమాగత్య సురాః సర్వే అభినన్ద్య వరాన్ శుభాన్ ॥ 11 ॥

తస్మై దదుస్తథాఽస్త్రాణి మన్త్రాణి గుణవన్తి చ ।
తతోఽబ్రువన్ మునిగణాస్తం పృథుం కపిలేన చ ॥ 12 ॥

పూజ్యుడైన పృథువు బ్రహ్మసామర్థ్యాన్ని గలిగినవాడై రాజయ్యాడు. దేవతలందరూ అతని వద్దకు వచ్చి, అభినందించి, శుభాలైన వరాలను, ఇచ్చారు. అలాగే అతనికి అస్త్రాలను, గుణవంతాలైన మంత్రాలను ఇచ్చి కపిలునితో సహ మునిగణమంతా పృథువుతో ఇలా అన్నాడు.

మునయః ఊచుః :- మునులు పలికారు.

ఆహారం దేహి జీవేభ్యో భువా గ్రస్తౌషధీరపి ॥ 13 ॥

జీవులందరికీ ఆహారాన్ని, భూమికబళించిన ఔషధాలను కూడా ఇవ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః స ధనురాదాయ భువమాహ నృపోత్తమః ॥ 14 ॥

తరువాత ఆ నృపోత్తముడు ధనుస్సు తీసుకొని భూమినడిగాడు.

పృథురువాచ:– పృథువు పలికాడు.

ఓషధీర్దేహి యా గ్రస్తాః ప్రజానాం హితకామ్యయా ॥ 15 ॥

ప్రజల హితం కోరి నీవు కబళించిన ఓషధుల నివ్వు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తమువాచ మహీభీతా పృథుం తం పృథులోచనమ్ ॥ 16 ॥

ఆ విశాలమైన కన్నులుగల పృథువును చూచి భూదేవి భయపడి అతనితో ఇలా అన్నాడు.

మహ్యువాచ:– భూదేవి పలికింది.

మయి జీర్ణా మహౌషధ్యః కథం దాతుమహం క్షమా ॥ 17 ॥

మహౌషధులన్నీ నాలో జీర్ణమైనాయి. నెనెలా ఈయగలను?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః సకోపో నృపతిస్తామాహ పృథివీం పునః ॥ 18 ॥

అప్పుడు కోపంతో ఆ రాజు భూమితో తిరిగి ఇలా అన్నాడు.

పృథురువాచ:– పృథువు పలికాడు.

నోచేద్దదాస్యద్య త్వాం వై హత్వా దాస్యే మహౌషధీః ॥ 19 ॥

నీవీ రోజు ఇవ్వనట్లైతే నిన్ను చంపి మహౌషధుల నిస్తాను.

భూమిరువాచ:– భూమి పలికింది.

కథం హంసి స్త్రియం రాజన్ జ్ఞానీ భూత్వా నృపోత్తమ ।
వినా మయా కథం చేమాః ప్రజాః సంధారయిష్యసి ॥ 20 ॥

ఓ రాజా! స్త్రీనెలా చంపుతావు? జ్ఞానివై కూడా చంపుతావా? ఓ రాజశ్రేష్ఠా! నేను లేకుండా ఈ ప్రజలనెలా ధరిస్తావు?

పృథురువాచ:– పృథువు పలికాడు.

యత్రోపకారోఽనేకానామేకనాశే భవిష్యతి ।
న దోషస్తత్ర పృథివి తపసా ధారయే ప్రజాః ॥ 21 ॥

అనేకమందికి ఉపకారమయ్యేటప్పుడు ఒకరు నశించినా అక్కడ దోషముండదు. ఓ భూదేవీ! తపస్సుతో ప్రజలను ధరించగలను.

న దోషమత్ర పశ్యామి నాఽఽచక్షేఽనర్థకం వచః ।
యస్మిన్నిపాతితే సౌఖ్యం బహూనాముపజాయతే ॥
మునయస్తద్వధం ప్రాహురశ్వమేధశతాధికమ్ ॥ 22 ॥

నేనిక్కడ దోషాన్ని చూడటం లేదు. వ్యర్థమైన మాటను చెప్పటం లేదు. దేనిని చంపితే చాలామందికి సౌఖ్యం కలుగుతుందో దానిని చంపమని మునులు చెప్పారు. అది వంద అశ్వమేధయజ్ఞాలకన్న గొప్పదన్నారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో దేవాశ్చ ఋషయః సాన్త్వయిత్వా నృపోత్తమమ్ ।
మహీం చ మాతరం దేవీమూచుః సురగణాస్తదా ॥ 23 ॥

అప్పుడు దేవతలు, ఋషులు ఆ నృపోత్తముని శాంతపరచి, దేవతాగణం మాతయైన భూదేవితో ఇలా అన్నాడు

దేవా ఊచుః :– దేవతలు పలికారు.

భూమే గోరూపిణీ భూత్వా పయోరూపా మహౌషధీః ।
దేహి త్వం పృథవే రాజ్ఞే తతః ప్రీతో భవేన్నృపః ॥
ప్రజాసంరక్షణం చ స్యాత్తతః క్షేమం భవిష్యతి ॥ 24 ॥

ఓ భూదేవీ! నీవు గోరూపిణివై పాలరూపంగా మహౌషధులన్నింటినీ ఆ పృథురాజుకివ్వు. అప్పుడారాజు సంతసిస్తాడు. అంతేకాక ప్రజాసంరక్షణ కూడా జరుగుతుంది. అప్పుడు క్షేమమవుతుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతో గోరూపమాస్థాయ కపిలా కపిలాన్తికే ।
దుదోహ చ మహౌషధ్యో రాజా వేనకరోద్భవః ॥ 25 ॥

తరువాత భూదేవి కపిల గోరూపాన్ని పొందగా, కపిలుని సమక్షంలో వేనుని చేతినుండి పుట్టిన పృథుచక్రవర్తి ఆ గోవునుండి మహౌషధులను పితికాడు.

యత్ర దేవా సగన్ధర్వా ఋషయః కపిలో మునిః ।
మహీం గోరూపమాపన్నాం నర్మదాయాం మహామునే ॥ 26 ॥

భాగీరథ్యాం సరస్వత్యాం గోదావర్యాం విశేషతః ।
మహానదీషు సర్వాసు దుదుహేఽసౌ పయో మహత్॥ 27 ॥

ఓ మహామునీ! దేవతలు, గంధర్వులు, ఋషులు, కపిలమహర్షి వీరందరి సమక్షంలో గోరూపం ధరించిన భూదేవిని నర్మదా నదిలో, భాగీరథీ నదిలో, సరస్వతీనదిలో, విశేషంగా గోదావరినదిలో, మహానదులన్నింటిలో గూడా గొప్ప క్షీరాన్ని ఇతడు పితికాడు.

సా దుహ్యమానా పృథునా పుణ్యతోయాఽభవన్నదీ ।
గౌతమ్యా సంగతా చాభూత్తదద్భుతమివాభవత్ ॥ 28 ॥

పృథువుచే పితుకబడిన ఆ గోవు పవిత్రజలంగల నది అయింది. గౌతమీనదితో సంగమించి అదొక అద్భుతంగా మారింది.

తతః ప్రభృతి తత్తీర్థం కపిలాసంగమం విదుః ।
తత్రాష్టాశీతిః పూజ్యాని సహస్రాణి మహామతే ॥ 29 ॥

ఓ మహామతీ! అప్పటినుండి ఆ తీర్థాన్ని కపిలాసంగమమంటారు. అక్కడ ఎనభైఎనిమిది వేల పూజనీయాలైన తీర్థాలున్నాయి.

తీర్థాన్యాహుర్మునిగణాః స్మరణాదపి నారద ।
పావనాని జగత్యస్మింస్తాని సర్వాణ్యనుక్రమాత్ ॥ 30 ॥

నారదా! ఈ జగత్తులో వాటన్నిటినీ వరుసగా స్మరిస్తే కూడా పవిత్రమవుతారని మునిగణాలు చెప్పారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే స్వయమ్భూనారదసంవాదే తీర్థమాహాత్మ్యే కపిలాసంగమాద్యష్టాశీతిసహస్రతీర్థవర్ణనం నామైకసప్తతితమోఽధ్యాయః. ॥ 71 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి బ్రహ్మనారద సంవాదంలోని తీర్థమాహాత్మ్యము నందలి కపిలాసంగమము మొదలైన ఎనభైఎనిమిదివేల తీర్థాల వర్ణనమనే పేరుగల డెబ్బైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విసప్తతితమోఽధ్యాయః - డెబ్బైరెండవ అధ్యాయం

దేవస్థానాద్యష్టాదశతీర్థవర్ణనమ్ - దేవస్థానం మున్నగు పద్దెనిమిది తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవస్థానమితిఖ్యాతం తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
తస్య ప్రభావం వక్ష్యామి శృణు యత్నేన నారద ॥ 1 ॥

ఓ నారదా! ముల్లోకాలలో ప్రసిద్ధిచెందిన, దేవస్థానమనే తీర్థం కలదు. దాని ప్రభావాన్ని చెబుతున్నాను శ్రద్ధగా విను.

పురాకృతయుగస్యాదౌ దేవదానవసంగరే ।
ప్రవృత్తే సింహికేతి విఖ్యాతా దైత్యసున్దరీ ॥ 2 ॥

పూర్వం కృతయుగంలో మొదట దేవదానవులకు యుద్ధం జరుగగా సింహిక అనే ప్రసిద్ధిచెందిన దైత్యసుందరి ఉండినది.

తస్యాః పుత్రో మహాదైత్యో రాహుర్నామ మహాబలః ।
అమృతే తు సముత్పన్నే సైంహికేయే చ భేదితే ॥ 3 ॥

తస్య పుత్రో మహాదైత్యో మేఘహాస ఇతి శ్రుతః ।
పితరం ఘాతితం శ్రుత్వా తపస్తేపేఽతిదుఃఖితః ॥ 4 ॥

ఆమె కుమారుడు మహాదైత్యుడు, మహాబలుడూ అయిన రాహువు అనే వాడుండినాడు. అమృతం పుట్టగా సింహికపుత్రుడైన రాహువు భేదించబడగా, అతని కుమారుడు మేఘహాసుడనే మహాదైత్యుడు తన తండ్రిని చంపారని విని చాలా దుఃఖించి తపస్సు చేశాడు.

తపస్యన్తం రాహుసుతం గౌతమీతీరమాశ్రితమ్ ।
దేవాశ్చ ఋషయః సర్వే తమూచురతిభీతవత్ ॥ 5 ॥

గౌతమీనది ఒడ్డున తపస్సు చేసుకొంటున్న రాహుపుత్రుడైన మేఘహాసుని వద్దకు దేవతలు, ఋషులు వచ్చి మహాభయంతో ఇలా అన్నారు.

దేవర్షయ ఊచుః :- దేవతలు, ఋషులు పలికారు.

తపో జహి మహాబాహో యత్తే మనసి సంస్థితమ్ ।
సర్వం భవతు నామేదం శివగంగాప్రసాదతః ॥
శివగంగాప్రసాదేన కిం నామాస్త్యత్ర దుర్లభమ్ ॥ 6 ॥

ఓ మహాబాహూ! తపస్సు వదిలిపెట్టు. ఈ శివగంగ అనుగ్రహంవలన నీ మనస్సులో ఉన్నదంతా జరుగుగాక! శివగంగ అనుగ్రహముంటే దుర్లభమేమున్నది?

మేఘహాస ఉవాచ:- మేఘహాసుడు పలికాడు.

పరిభూతః పితా పూజ్యో యుష్మాభిర్మమ దైవతమ్ ।
తస్యాపి మమచాత్యన్తం ప్రీతిశ్చ క్రియతే యది ॥ 7 ॥

భవద్భిస్తపసోఽస్మాచ్చ అహం వైరాన్నివర్తయే ।
వైరనిర్యాతనం కార్యం పుత్రేణ పితురాదరాత్ ॥
ప్రార్థయన్తే భవన్తశ్చేత్పూర్ణాస్తన్మే మనోరథాః ॥ 8 ॥

నాకు దైవం పూజ్యుడు ఐన నా తండ్రిని మీరు చంపినారు. ఒకవేళ మీరు నా తండ్రికి, నాకు తృప్తిని కల్గిస్తే, నేను ఈ తపస్సు నుండి, వైరమునుండి మరలుతాను. తండ్రిపట్ల ఆదరం కారణంగా పుత్రుడు వైరాన్ని నశింపచేయాలి. మీరందకు అంగీకరించినట్లయితే నా కోరికలన్నీ నెరవేరినట్లే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః సురగణాః సర్వే రాహుం చక్రుర్గ్రహానుగమ్ ।
తం చాపి మేఘహాసం తే చక్రూ రాక్షసపూజితమ్ ॥ 9 ॥

తరువాత దేవతలందరూ రాహువును గ్రహానుగతునిగా చేశారు. ఆ మేఘహాసుని కూడా రాక్షసరాజుగా చేశారు.

తతోఽభవద్రాహుసుతో నైరృతాధిపతిః ప్రభుః ।
పునశ్చాహ సురాన్ దైత్యో మమ ఖ్యాతిర్యథా భవేత్ ॥ 10 ॥

తీర్థస్యాస్య ప్రభావశ్చ దాతవ్య ఇతి మే మతిః ।
తథేత్యుక్త్వా దదుర్దేవాః సర్వమేవ మనోగతమ్ ॥ 11 ॥

దానితో రాహుసుతుడు నైరుతి దిక్కున కధిపతి అయ్యాడు. తిరిగి ఆ రాక్షసుడు దేవతలతో నాకు పేరెలావస్తుందో అలా ఈ తీర్థానికి ప్రభావాన్ని మీరివ్వవలసిందిగా నా ప్రార్థన అన్నాడు. అలాగేనని దేవతలు ఆ రాక్షసుని కోరికలన్నింటనీ నెరవేర్చారు.

దైత్యేశ్వరస్య దేవర్షే తన్నామ్నా తీర్థముచ్యతే ।
దేవా యతోఽభవన్ సర్వే తత్ర స్థానే మహామతే ॥ 12 ॥

దేవస్థానం తు తత్తీర్థం దేవానామపి దుర్లభమ్ ।
యత్ర దేవేశ్వరో దేవో దేవతీర్థం తతః స్మృతమ్॥ 13 ॥

ఓ మహామతీ దేవర్షీ! దైత్యేశ్వరుని పేరుతోనే ఆ తీర్థం ప్రసిద్ధి చెందింది. దేవతలందరూ ఆ స్థానంలో ఉన్నారు కనుక, ఆ తీర్థాన్ని దేవస్థానమన్నారు. అది దేవతలకు కూడా దుర్లభం. ఎక్కడ దేవేశ్వరుడనే దేవుడున్నాడో దానిని దేవతీర్థమంటారు.

తత్రాష్టాదశ తీర్థాని దైత్యపూజ్యాని నారద ।
తేషు స్నానం చ దానం చ మహాపాతకనాశనమ్ ॥ 14 ॥

అక్కడ దైత్యులు పూజించే పద్ధెనిమిది తీర్థాలున్నాయి. వాటిలో స్నానం, దానం చేస్తే మహాపాతకాలు నశిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే దేవస్థానాద్యష్టాదశతీర్థ వర్ణనం నామ ద్విసప్తతితమోఽధ్యాయః. ॥ 72 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని దేవస్థానం మొదలైన పద్ధెనిమిది తీర్థాలవర్ణన మనే పేరుగల డెబ్బై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిసప్తతితమోఽధ్యాయః - డెబ్బైమూడవ అధ్యాయం

సిద్ధతీర్థాద్యష్టోత్తరశతతీర్థవర్ణనమ్ - సిద్ధతీర్థం మున్నగు నూటఎనిమిది తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సిద్ధతీర్థమితి ఖ్యాతం తత్ర సిద్ధేశ్వరో హరః ।
తస్య ప్రభావం వక్ష్యామి సర్వసిద్ధికరం నృణామ్ ॥ 1 ॥

సిద్ధతీర్థమనే తీర్థం ప్రఖ్యాతి గలది. అక్కడ సిద్ధేశ్వరుడనే పేరుగల శివుడున్నాడు. అది మానవులకు సర్వసిద్ధులు కలుగజేస్తుంది. దాని ప్రభావాన్ని చెబుతున్నాను విను.

పులస్త్యవంశసంభూతో రావణో లోకరావణః ।
దిశో విజిత్య సర్వాశ్చ సోమలోకమజీగమత్ ॥ 2 ॥

పులస్త్యవంశ సంభూతుడైన రావణుడు లోకరావణుడు. అతడు దిక్కులన్నింటిని జయించి సోమలోకానికి వెళ్ళాడు.

సోమేన సహ యోత్స్యన్తం దశాస్యమహమబ్రవమ్ ।
మన్త్రం దాస్యే నివర్తస్వ సోమయుద్ధాద్దశానన ॥ 3 ॥

సోమునితో యుద్ధం చేస్తున్న రావణునితో నేనిలా అన్నాను. ఓ దశాననా! నీకు మంత్రమిస్తాను. సోమయుద్ధం నుండి మరలు.

ఇత్యుక్త్వాఽష్టోత్తరం మంత్రం శతనామభిరన్వితమ్ ।
శివస్య రాక్షసేన్ద్రాయ ప్రాదాం నారదశాన్తయే ॥ 4 ॥

నారదా! ఇలా చెప్పి శివుని నూరు నామాలతో గూడిన అష్టోత్తరమంత్రాన్ని ఆ రాక్షసరాజు శాంతించుటకై ఇచ్చాను.

నిఃశ్రీకాణాం విపన్నానాం నానాక్లేశజుషాం నృణామ్ ।
శరణం శివ ఏవాత్ర సంసారేఽన్యో న కశ్చన ॥ 5 ॥

సంపదలులేనివారికి, ఆపదలు గలవారికి, అనేకబాధల ననుభవించేవారికి ఈ సంసారంలో శరణు పొందదగినవాడు శివుడు మాత్రమే. మరెవరూ లేరు.

తతో నివృత్తః సహమన్త్రియుక్తస్తత్సోమలోకాజ్జయమాప్య రక్షః ।
స పుష్పకారూఢగతిః సగర్వో లోకాన్ పునః ప్రాప జవాద్దశాస్యః ॥ 6 ॥

తరువాత ఆ రావణుడు మంత్రులతో కలిసి సోమలోకాన్ని జయించి వెనుదిరిగాడు. అతడు పుష్పకవిమానంలో గర్వంతో ప్రయాణిస్తూ తిరిగి లోకాలకు చేరాడు.

స ప్రేక్షమాణో దివమన్తరిక్షం భువం చ నాగాంశ్చ గజాంశ్చ విప్రాన్ ।
ఆలోకయామాస నగం మహాన్తం కైలాసమావాసముమాపతేర్యః ॥ 7 ॥

అతడలా వేగంగా ప్రయాణస్తూ స్వర్గాన్ని, అంతరిక్షాన్ని, భూమిని, నాగులను, ఏనుగులను, బ్రాహ్మణులను చూస్తూ ఉమాపతియైన శివుని నివాసస్థలమైన గొప్పకైలాస పర్వతాన్ని చూశాడు.

దృష్ట్వా స్మయోత్ఫుల్లదృగద్రిరాజం స మంత్రిణౌ రావణ ఇత్యువాచ ॥ 8 ॥

చిరునవ్వుతో వికసించిన కన్నులుగల ఆ రావణుడు అద్రిరాజుని అనగా కైలాసపర్వతాన్ని చూచి తన మంత్రులతో ఇలా అన్నాడు.

రావణ ఉవాచ:-రావణుడు పలికాడు.

కో వా గిరావత్ర వసేన్మహాత్మా గిరిం నయామ్యేనమథాధిభూమేః ।
లంకాగతోఽయం గిరిరాశుశోభాం లంకాఽపి సత్యం శ్రియమాతనోతి ॥ 9 ॥

ఏ మహాత్ముడీ పర్వతంపై నివసిస్తున్నాడు? నేనీగిరిని క్రిందికి భూలోకానికి తీసుకొని వెళ్ళుతున్నాను. లంకలో వుంటే ఈ పర్వతం శోభిస్తుంది. ఈ పర్వత ముంటే లంక శోభిస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్థం వచో రాక్షసమన్త్రిణౌ తౌ నిశమ్య రక్షోధిపతేశ్చ భావమ్ ।
న యుక్తమిత్యూచతురిష్టబుద్ధ్యా నిశాచరస్తద్వచనం న మేనే ॥ 10 ॥

ఇలా పలికిన రావణుని మాటను విన్న రాక్షసమంత్రులు రావణుని భావాన్ని తెలుసుకొని ఇష్టబుద్ధితో ఇది సమంజసం కాదని చెప్పారు. కాని నిశాచరు డామాటను ఒప్పుకోలేదు.

సంస్థాప్య తత్పుష్పకమాశు రక్షః పుప్లావ కైలాసగిరేశ్చ మూలే ।
హిందోలయామాస గిరిం దశాస్యో జ్ఞాత్వా భవః కృత్యమిదం చకార ॥ 11 ॥

ఆ రాక్షసుడు వెంటనే పుష్పకవిమానాన్ని నిలిపి, కైలాసగిరి క్రిందిభాగానికి దిగి, ఆ కైలాసగిరిని పెళ్ళగించుటకై కదుపుచుండినాడు. శివుడది తెలుసుకొని ఇలా చేశాడు.

జిత్వా జిగీశాంశ్చ సగర్వితస్య కైలాసమాందోలయతః సురారేః ।
అంగుష్ఠకృత్యైవ రసాతలాదిలోకాంశ్చ యాతస్య దశాననస్య ॥ 12 ॥

ఆలూనకాయస్య గిరిం నిశమ్య విహస్య దేవ్యా సహ దత్తమిష్టమ్ ।
తస్మై ప్రసన్నః కుపితోఽపి శమ్భురయుక్తదాతేతి న సంశయోఽత్ర॥ 13 ॥

రావణాసురుడు దిక్పాలకులను జయించి గర్వితుడై, కైలాసపర్వతాన్ని పెళ్ళగిస్తూండగా పరమశివుడు ఆ కైలాసపర్వతాన్ని తన బొటనవ్రేలితో నొక్కాడు. ఆ ఒత్తిడికి రావణాసురుడు పాతాళాది లోకాలలో దిగబడ్డాడు.

అటువంటి క్షతగాత్రుడైన రావణుని రోదనను విని శివుడు పార్వతితోగూడ నవ్వుకొని, కోపమున్నా కూడా ఆ రావణునికి ప్రసన్నుడై ఇష్టమైన వరాలను ఇచ్చాడు. ఇక్కడ శివుడు అపాత్రదానం చేసినాడనటంలో ఏ మాత్రం సందేహం లేదు.

తతో౽యమావాప్య వరాన్ సువీరో భవప్రసాదాత్కుసుమం జగామ ।
గచ్ఛన్ స లంకాం భవపూజనాయ గంగామగాచ్ఛంభుజటాప్రసూతామ్ ॥ 14 ॥

తరువాత ఆ గొప్పవీరుడు శివుని అనుగ్రహంతో వరాలను పొంది, కుసుమానికి అనగా పుష్పకవిమానం వద్దకు వెళ్ళాడు. అతడు లంకకు వెళ్ళుతూ శివుని పూజించుటకై శివుని జటాజూటంనుండి పుట్టిన గంగ వద్దకు వెళ్ళాడు.

సంపూజయిత్వా వివిధైశ్చ మన్త్రైర్గంగాజలైః శమ్భుమదీనసత్త్వః ।
అసిం చ లేభే శశిఖణ్డభూషాత్ సిద్ధిం చ సర్వర్ద్ధిమభీప్సితాం చ ॥ 15 ॥

అనేక మంత్రాలతో, గంగాజలాలతో అలసిపోకుండా శివుని పూజించి, ఆ శివునినుండి కత్తిని, సిద్ధిని ఇష్టమైన సర్వవిధ అభివృద్ధిని కూడా పొందాడు.

మద్దత్తమన్త్రం శశిరక్షణాయ స సాధయామాస భవం ప్రపూజ్య ।
సిద్ధే తు మన్త్రే పునరేవ లంకామయాత్స రక్షోధిపతిస్తు తుష్టః ॥ 16 ॥

నేనిచ్చిన మంత్రం చంద్రుని రక్షించుట కిచ్చినది. ఆ రావణుడా మంత్రంతో శివుని పూజించి, మంత్రసిద్ధిని పొంది తిరిగి లంకకు సంతుష్టుడై వెళ్ళాడు.

తతః ప్రభృత్యేతదతిప్రభావం తీర్థం మహాసిద్ధిదమిష్టదం చ ।
సమస్తపాపౌఘవినాశనం చ సిద్ధైరశేషైః పరిసేవితం చ ॥ 17 ॥

అప్పటినుండి ఈ తీర్థం మహాప్రభావం గలది, మహాసిద్ధుల నిచ్చేది, ఇష్టమైన వానినిచ్చేది, సమస్త పాప సమూహాలను నశింపజేసేది. అనేకమంది సిద్ధులచేత సేవించబడినదీ అయింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే సిద్ధతీర్థాద్యష్టోత్తరశతతీర్థవర్ణనం నామ త్రిసప్తతితమో౽ధ్యాయః. ॥ 73 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలోని సిద్ధతీర్థం మున్నగు నూట ఎనిమిదితీర్థాలవర్ణనమనే పేరుగల డెబ్బై మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుఃసప్తతితమోఽధ్యాయః - డెబ్బై నాల్గవ అధ్యాయం
పరుష్ణీసంగమాది త్రిసహస్ర తీర్థ వర్ణనమ్
పరుష్ణీసంగమం మొదలుగాగల మూడువేల తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పరూష్ణీసంగమం నామ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
తస్య స్వరూపం వక్ష్యామి సర్వపాపవినాశనమ్ ॥ 1 ॥

పరూష్ణీసంగమమను తీర్థము ముల్లోకములలో ప్రసిద్ధికెక్కినది. అది సర్వపాపములను పోగొట్టునది. దాని స్వరూపమును చెప్పుచున్నాను.

అత్రిరారాధయామాస బ్రహ్మవిష్ణుమహేశ్వరాన్ ।
తేషు తుష్టేషు స ప్రాహ పుత్రా యూయం భవిష్యథ ॥ 2 ॥

అత్రి అను మహర్షి బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ఆరాధించెను. వారతని ఆరాధనకు సంతుష్టులు కాగా అత్రి మీరు నాకు పుత్రులుగా జన్మించుడని కోరెను.

తథా చైకా రూపవతీ కన్యా మమ భవేత్సురాః ।
తథా పుత్రత్వమాపుస్తే బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥ 3 ॥

ఓ దేవతలారా! అట్లే నాకో రూపవతియైన కన్య కావలయును. అలాగే ఓ బ్రహ్మవిష్ణుమహేశ్వరులారా! మీరు నాకు పుత్రులుగా నుండుడు.

కన్యాం చ జనయామాస శుభాఽఽత్రేయీతినామతః ।
దత్తః సోమోఽథ దుర్వాసాః పుత్రాస్తస్య మహాత్మనః ॥ 4 ॥

ఆత్రేయి అనుపేరుగల ఒక కన్యను పుట్టించెను. అత్రియను ఆ మహాత్మునికి దత్తుడు, సోముడు మరియు దుర్వాసుడు అను పుత్రులు కలిగారు.

అగ్నేరంగిరసో జాతో హ్యంగారైరంగిరా యతః ।
తస్మాదంగిరసే ప్రాదాదాత్రేయీ మతిరోచిషామ్ ॥ 5 ॥

అగ్నివలన అంగీరసుడు జన్మించాడు. అంగారులతో అంగిరులు జన్మించిరి. అందువలన అంగిరసునకు మిక్కిలి కాంతిగల ఆత్రేయినిచ్చిరి.

అగ్నేః ప్రభావాత్పరుషమాత్రేయీం సర్వదాఽవదత్ ।
ఆత్రేయ్యపి చ శుశ్రూషాం కుర్వతీ సర్వదాఽభవత్ ॥ 6 ॥

అగ్నిప్రభావమువలన ఆత్రేయిని అంగిరసుడు సర్వదా పరుషముగా మాట్లాడుచుండెను. ఆత్రేయి మాత్రం సర్వదా శుశ్రూషను చేయుచుండెను.

తస్యామాంగిరసా జాతా మహాబలపరాక్రమాః ।
అంగిరాః పరుషం వాదీదాత్రేయీ నిత్యమేవ చ ॥ 7 ॥

అంగిరసుని వలన ఆమెకు మహాబలపరాక్రముగలవారు పుట్టిరి. అంగిరసుడు నిత్యము ఆత్రేయిని పరుషపదజాలముతో బాధపెట్టుచునే యుండెను.

పుత్రాస్త్వాంగిరసా నిత్యం పితరం శమయన్తి తే ।
సా కదాచిద్భర్తృవాక్యా దుద్విగ్న పరుషాక్షరాత్ ॥
కృతాంజలిపుటా దీనా ప్రాబ్రవీచ్ఛ్వశురం గురుమ్ ॥ 8

పుత్రులైన అంగిరసులు నిత్యము తండ్రిని శమింపజేయుచునేయున్నారు. ఒకనాడు భర్త పలికిన కఠినమైన పరుషమైన మాటలకు ఉద్విగ్నురాలై పెద్దవాడగు తనమామ ముందు చేతులు జోడించి దీనురాలై ఇట్లనెను.

ఆత్రేయ్యువాచ:– ఆత్రేయి పలికింది.

అత్రిజాఽహం హవ్యవాహ భార్యా తవ సుతస్య వై ।
శుశ్రూషణపరా నిత్యం పుత్రాణాం భర్తురేవ చ ॥ 9 ॥

ఓ హవ్యవాహనుడా! నేను అత్రి కూతురును. నీ కుమారునికి భార్యను. నిత్యము పుత్రులకు, భర్తకు సేవలను చేస్తూ శుశ్రూషణపరురాలనై యున్నాను.

పతిర్మాం పరుషం వక్తి వృథైవోద్వీక్షతే రుషా ।
ప్రశాధి మాం సురజ్యేష్ఠ భర్తారం మమ దైవతమ్ ॥ 10॥

నా భర్త నన్ను పరుషపదములతో దూషించుచున్నాడు. వృథాగా కోపంతో చూచుచున్నాడు. కావున నన్ను నాకు దైవమైన నా భర్తను శాసించుము.

జ్వలన ఉవాచ:– అగ్ని పలికాడు.

అంగారేభ్యః సముద్భూతో భర్తా తే హ్యంగిరా ఋషిః ।
యథా శాన్తో భవేద్భద్రే తథా నీతిర్విధీయతామ్ ॥ 11 ॥

అంగారముల వలన నీ భర్త అంగిర ఋషి పుట్టినాడు. ఓ మంగళ కరురాలా! నీ భర్త శాంతించునట్లుగా ఉపాయమును చేయుము.

ఆగ్నేయోఽగ్నిం సమాయాతో తవ భర్తా వరాననే ।
తదా త్వం జలరూపేణ ప్లావయేథాః మదాజ్ఞయా ॥ 12 ॥

ఓ వరాననా! నీ భర్త ఆగ్నేయుడు అగ్నితో సమాగమము చేసినప్పుడు నీవు నా ఆజ్ఞయా జలరూపముగా ప్రవహించుము.

ఆత్రేయ్యువాచ:- ఆత్రేయి పలికింది.

సహేయం పరుషం వాక్యం మా భర్తాగ్నిం సమావిశేత్ ।
భర్తరి ప్రతికూలానాం యోషితాం జీవనేన కిమ్ ॥ 13 ॥

నా భర్త పరుషముగా మాట్లాడినా సహిస్తాను. కాని నా భర్త అగ్నిని ప్రవేశించకూడదు. భర్తకు ప్రతికూలముగా నుండు స్త్రీలు జీవించుట ఎందుకు?

ఇచ్ఛేయం శాన్తివాక్యాని భర్తారం చ లభే తథా ॥ 14 ॥

నేను భర్తను పొందేటట్లుగా శాంతివాక్యములు కోరుకుంటున్నాను.

జ్వలన ఉవాచ:-అగ్ని పలికాడు.

అగ్నిస్త్వప్సు శరీరేషు స్థావరే జంగమే తథా ।
తవ భర్తురహం ధామ నిత్యం చ జనకో మతః ॥ 15 ॥

అగ్ని, జలములయందు, శరీరములయందు, స్థావరజంగమములందు ఉంటాడు. నీ భర్తకు నేను తండ్రిని మరియు ఆశ్రయభూతుడను.

యోఽహం సోఽహమితి జ్ఞాత్వా న చిన్తాం కర్తుమర్హసి ।
కిం చాఽఽపో మాతరో దేవ్యో హ్యగ్నిః శ్వశుర ఇత్యపి ॥
ఇతి బుద్ధ్వా వినిశ్చిత్య మా విషణ్ణా భవ స్నుషే ॥ 16 ॥

ఓ కోడలా! నీ భర్తకు నేను తండ్రినని నీవు తెలిసుకొని నీవు చింతించవలదు. జలములు దేవీస్వరూపములైన మాతృస్వరూపములు. అగ్ని నీ మామగారు అని తెలుసుకొని నీవు దుఃఖితురాలవు కావద్దు.

ఆత్రేయ్యువాచ:- ఆత్రేయి పలికింది.

ఆపో జనన్య ఇతి యద్బభాషే అగ్నే రహం తవ పుత్రస్య భార్యా ।
కథంభూత్వా జననీ చాపి భార్యా విరుద్ధ మేతజ్జలరూపేణ నాథ ॥ 17 ॥

జలములు, తల్లులు అని ఏది మాట్లాడుచున్నావో అది సమంజసమేనా నీకుమారుడైన అగ్నికి నేను భార్యను. నేను భార్యగానుండి అగ్నికి తల్లిగానెట్లవుతాను? కావున ప్రభూ! జలరూపంగా ఉండమని నీవు ఆదేశించుట విరుద్ధముగా ఉన్నది.

జ్వలన ఉవాచ:- అగ్ని పలికాడు.

ఆదౌ తు పత్నీ భరణాత్తు భార్యా జనేస్తు జాయా స్వగుణైః కళత్రమ్ ।
ఇత్యాది రూపాణి బిభర్షి భద్రే కురుష్వ వాక్యం మదుదీరితం యత్ ॥ 18 ॥

మొదటపత్నిగా భరించుట వలన భార్యగా, సంతానమును కన్నందువలన జాయగా, స్వీయగుణములతో కళత్రముగా ఓ మంగళకరురాలా! అనేక రూపములను ధరించుచున్నావు. నేను చెప్పెడి మాటను చేయుము.

యోఽస్యాం ప్రజాతః స తు పుత్ర ఏవ సా తస్య మాతైవ న సంశయోఽత్ర ।
తస్మాద్వదన్తి శ్రుతితత్త్వవిజ్ఞాః సా నైవ యోషిత్తనయేఽభిజాతే ॥ 19 ॥

ఈమె యందు పుట్టినవాడు కుమారుడేయగును. అందుకే శ్రుతితత్త్వమును గూర్చి తెలిసిన పెద్దలు కుమారుడు పుట్టిన తరువాత స్త్రీ భార్యగాదు తల్లియే యందురు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

శ్వశురస్య తు తద్వాక్యం శ్రుత్వాఽఽత్రేయీ తదైవ తత్ ।
ఆగ్నేయం రూపమాపన్నమమ్భసాఽప్లావయత్ పతిమ్ ॥ 20 ॥

మామగారి మాటనువిన్న ఆత్రేయి అప్పుడే అగ్నిరూపముననున్న తనపతిని నీటితో నభిషేకించెను.

ఉభౌ తౌ దంపతీ బ్రహ్మన్ సంగతౌ గాంగవారిణా ।
శాన్తరూపధరౌ చోభౌ దంపతీ సంబభూవతుః ॥ 21 ॥

ఓ బ్రహ్మస్వరూపుడా! ఎప్పుడైతే వారిద్దరు గంగాజలముతో సంగమించినారో అప్పుడు ఆ దంపతులిద్దరూ శాంతరూపములను ధరించినవారైరి.

లక్ష్మ్యా యుక్తో యథా విష్ణు రుమయా శంకరో యథా ।
రోహిణ్యా చ యథా చంద్రస్తథాభూన్మిథునం తథా ॥ 22 ॥

లక్ష్మితోగూడిన విష్ణువువలె, పార్వతీదేవితో గూడిన శంకరునివలె, రోహిణీనక్షత్రముతో గూడిన చంద్రునివలె ఆ జంట ఆయెను.

భర్తారం ప్లావయన్తీ సా దధారామ్బుమయం వపుః ।
పరుష్ణీ చేతి విఖ్యాతా గంగయా సంగతా నదీ ॥ 23 ॥

తన భర్తను తడుపుతూ ఆమె జలరూపిణియాయెను. గంగతో సంగమించిన ఆమె పరుష్ణీనది యని ప్రసిద్ధి చెందెను.

గోశతార్పణజం పుణ్యం పరుష్ణీ స్నానతో భవేత్ ।
తత్ర చాంఽఽగిరసా చక్రుర్యజ్ఞాంశ్చ బహు దక్షిణాన్ ॥ 24 ॥

పరుష్ణీనదిలో స్నానము చేసినందువలన నూరుగోవులను దానముచేసిన పుణ్యము లభించును. అక్కడ అంగిరసుడు అనేక యజ్ఞములను చేసి అనేక దక్షిణల నిచ్చెను.

తత్ర త్రీణి సహస్రాణి తీర్థాన్యాహుః పురాణగాః ।
ఉభయోస్తీరయోస్తాత పృథగ్యాగఫలం విదుః ॥ 25 ॥

నాయనా! ఆ నది రెండుతీరములలో మూడువేల తీర్థములున్నాయని పురాణములు తెలిసినవారు చెప్పుదురు. ఆ తీర్థములు పృథగ్యాగఫలము నిచ్చునవి.

తేషు స్నానం చ దానం చ వాజపేయాధికం మతమ్ ।
విశేషతస్తు గంగాయాః పరుష్ణ్యా సహ సంగమే ॥ 26 ॥

స్నానదానాధిభిః పుణ్యం యత్తదుక్తం న శక్యతే ॥ 27 ॥

వానిలో స్నానదానములు చేసిన వాజపేయ యాగమున కన్న అధికఫలమునిచ్చునని చెప్పుదురు. విశేషముగా గంగానది పరుష్ణీనది సంగమప్రదేశములో, స్నానదానాదులు చేసినందువలన వచ్చేఫలము ఇంతఅని చెప్పలేము.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గత గౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే పరుష్ణీ సంగమాది త్రిసహస్రతీర్థవర్ణనం నామ చతుః సప్తతితమోఽధ్యాయః. ॥ 74 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని పరుష్ణీసంగమము మొదలుగాగల మూడువేలతీర్థములవర్ణనమనుపేరుగల డెబ్బై నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

పంచసప్తతితమోఽధ్యాయః - డెబ్బై ఐదవ అధ్యాయం

మార్కండేయాద్యష్టనవతి తీర్థవర్ణనమ్–మార్కండేయతీర్థం మొదలగు తొంబై ఎనిమిది తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

మార్కండేయమితి ఖ్యాతం తీర్థం పాపవిమోచనమ్ ।
సర్వక్రతుఫలం పుణ్యమఘౌఘవినివారణమ్ ॥ 1 ॥

మార్కండేయతీర్థమనునది కలదు. అది పాపములను పోగొట్టునది. సమస్తక్రతువుల యొక్క ఫలమునిచ్చునది. పాపసమూహములన్నింటిని నివారించి పుణ్యము కలిగించునది.

తస్య ప్రభావం వక్ష్యామి శృణు నారద యత్నతః ।
మార్కండేయో భరద్వాజో వసిష్ఠోఽత్రిశ్చ గౌతమః ॥ 2 ॥

యాజ్ఞవల్క్యశ్చ జాబాలిర్మునయోఽన్యేఽపి నారద ।
ఏతే శాస్త్రప్రణేతారో వేదవేదాంగపారగాః ॥ 3 ॥

నారదా! దానిప్రభావమును చెప్పుచున్నాను శ్రద్ధగా వినుము. మార్కండేయుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, అత్రి,గౌతముడు, నారదా! యాజ్ఞవల్క్యుడు, జాబాలి, ఇతరమునులు కూడా వీరంతా వేదవేదాంగములయందు నిష్ణాతులు, శాస్త్రములు రచించినవారు.

పురాణన్యాయమీమాంసాకథాసు పరినిష్ఠితాః ।
మిథః సమూచుర్విద్వాంసో ముక్తిం ప్రతి యథామతి ॥ 4 ॥

పురాణములు, న్యాయశాస్త్రము, పూర్వోత్తర మీమాంసలు వీటి ప్రసంగములు లేదా చర్చలయందు వారు గొప్పవారు. ఆ విద్వాంసులు మోక్షమును గూర్చి వారివారి జ్ఞానము ననుసరించి పరస్పరముగా మాట్లాడుచుండిరి.

కేచిత్ జ్ఞానం ప్రశంసన్తి కేచిత్కర్మ తథోభయమ్ ।
ఏవం వివిదమానాస్తే మామూచురుభయం మతమ్ ॥ 5 ॥

కొందరు జ్ఞానమును ప్రశంసించగా మరికొందరు కర్మను ప్రశంసించిరి. వారట్లు వాదములను సల్పుచు రెంటిని గూర్చి నన్నడిగిరి.

మదీయం తు మతం జ్ఞాత్వా యయుశ్చక్రగదాధరమ్ ।
తస్య చాపి మతం జ్ఞాత్వా ఋషయస్తే మహౌజసః ॥ 6 ॥

పునర్వివదమానాస్తే శంకరం ప్రష్టుముద్యతాః ।
గంగాయాం చ భవం పూజ్య తమేవార్థం శశంసిరే ॥ 7 ॥

నా అభిప్రాయమును తెలుసుకొని శంఖచక్రగదాధరుడగు విష్ణుమూర్తి వద్దకు వెళ్ళిరి. ఆ గొప్ప తేజస్సుగల ఋషులు అతని అభిప్రాయమును గూడా తెలుసుకొని, తిరిగివారు ఒకరితో నొకరు వాదించుకొనుచు శంకరుని యడుగుటకు సిద్ధపడిరి. గంగానది వద్ద శివుని పూజించి ఆ విషయమునే ప్రస్తావించిరి.

కర్మణస్తు ప్రధానత్వమువాచ త్రిపురాన్తకః ।
క్రియారూపం చ తజ్జ్ఞానం క్రియా సైవ తదుచ్యతే ॥ 8 ॥

శివుడు కర్మకే ప్రాధాన్యమని చెప్పెను. ఆ జ్ఞానం క్రియారూపముగా నుండునని దానినే క్రియ అనికూడా అందురనెను.

తస్మాత్సర్వాణి భూతాని కర్మణా సిద్ధిమాప్నుయుః ।
కర్మైవ విశ్వతో వ్యాపి తదృతే నాస్తి కించన ॥ 9 ॥

అందువలననే సమస్తజీవులు కర్మతోనే సిద్ధి పొందుదురు. కర్మయే విశ్వమంతా వ్యాపించియున్నది. దానికంటే వేరు మరొకటి లేదు.

విద్యాభ్యాసో యజ్ఞకృతిర్యోగాభ్యాసః శివార్చనమ్ ।
సర్వం కర్మైవ నాకర్మ ప్రాణీ కాప్యత్ర విద్యతే ॥ 10 ॥

విద్యాభ్యాసంకాని, యజ్ఞములు చేయుటగాని, యోగాభ్యాసముగాని, శివార్చనగాని అన్నియును కర్మతోనే ముడిపడియున్నవి. కర్మచేయకుండా ఏ ప్రాణి కూడాయుండదు. "న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్" అంటారు కదా!

కర్మైవ కారణం తస్మాదన్యదున్మత్తచేష్టితమ్ ।
ఋషీణాం యత్ర సంవాదో యత్ర దేవో మహేశ్వరః ॥ 11 ॥

చకార నిర్ణయం సర్వం కర్మణాఽవాప్యతే నృభిః ।
మార్కండం ముఖ్యతః కృత్వా తతో మార్కణ్డముచ్యతే ॥ 12 ॥

తీర్థం ఋషిగణాకీర్ణం గంగాయా ఉత్తరే తటే ।
పితౄణాం పావనం పుణ్యం స్మరణాదపి సర్వదా ॥ 13 ॥

అందువలన కర్మయే కారణము. దానికంటే ఇతరమైనది ఉన్మత్తచేష్టితమే. ఋషులు ఎక్కడ వాదించుకొను చున్నారో అక్కడే ఆ పరమశివుడు మానవులు చేయునదంతా కర్మవలననే యని నిర్ణయించెను. మార్కండుని ప్రధానముగ జేసుకొని శివుడు చెప్పెను కనుక, అది మార్కండేయతీర్థమైనది. గంగానది ఉత్తరతీరంలో ఋషులందరితో నిండియున్నదాతీర్థము. ఆ తీర్థమును స్మరించినా కూడా పితృదేవతలందరకు పవిత్రమైనది పుణ్యమును కలుగజేయునది.

తత్రాష్టౌ నవతి స్తాత తీర్థాన్యాహ జగన్మయః ।
వేదేన చాపి తత్రోక్తమృషయో మేనిరే చ తత్ ॥ 14 ॥

జగన్మయుడైన శివుడు అక్కడ తొంబదిఎనిమిది తీర్థములున్నవని చెప్పెను. వేదమునందు కూడా అట్లే చెప్పిరి. ఋషులు దానినంగీకరించిరి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే మార్కండేయాద్యష్టనవతి తీర్థవర్ణనం నామ పంచసప్తతితమోఽధ్యాయః ॥ 75 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని మార్కండేయతీర్థ మొదలగు తొంబై ఎనిమిది తీర్థముల వర్ణనమనుపేరుగల డెబ్బై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్ సప్తతితమోऽధ్యాయః – డెబ్బై ఆరవ అధ్యాయం

కాలంజరాద్యష్టోత్తర శతతీర్థ వర్ణనమ్ – కాలంజర మొదలగు నూట ఎనిమిది తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

యాయాతమపరం తీర్థం యత్ర కాలంజరః శివః ।
సర్వపాపప్రశమనం వృష్టిస్తత్రోచ్యతే మయా ॥ 1 ॥

యాయాతమను మరొక తీర్థము గలదు. ఎక్కడ కాలంజరుడనే పేరుతో శివుడున్నాడో అదే యాయాత తీర్థము. అది సర్వపాపములను పోగొట్టునది. దాని కథ చెప్పుచున్నాను వినుము.

యయాతిర్నాహుషో రాజా సాక్షాదింద్ర ఇవాపరః ।
తస్య భార్యాద్వయం చాऽऽసీత్కులలక్షణభూషితమ్ ॥ 2 ॥

యయాతి యనుపేరుగల నహుష పుత్రుడైన మహారాజుండెను. అతడు సాక్షాత్తుగా అపరఇంద్రుడని యందురు. అతనికి చక్కని వంశలక్షణములుగల భార్యలిద్దరుండిరి.

జ్యేష్ఠా తు దేవయానీతి నామ్నా శుక్రసుతా శుభా ।
శర్మిష్ఠేతి ద్వితీయా సా సుతా స్యాద్ వృషపర్వణః ॥ 3 ॥

శుక్రుని కూతురు శుభకరురాలగు దేవయానియనునది పెద్దభార్య. వృషపర్వుని యొక్క కూతురు షర్మిష్ఠయనునది చిన్నభార్య.

బ్రాహ్మణ్యపి మహాప్రాజ్ఞా దేవయానీ సుమధ్యమా ।
యయాతేరభవద్భార్యా సా తు శుక్రప్రసాదతః ॥ 4 ॥

దేవయాని చక్కని నడుము గలది. ఆమె బ్రాహ్మణస్త్రీ, మహాప్రాజ్ఞురాలు. ఆమె శుక్రుని యొక్క అనుగ్రహము వలన యయాతికి భార్యగానాయెను.

శర్మిష్ఠా చాపి తస్యైవ భార్యా యా వృషపర్వజా ।
దేవయానీ శుక్రసుతా ద్వౌ పుత్రౌ సమజీజనత్ ॥ 5 ॥

వృషపర్వుని కూతురయిన శర్మిష్ఠకూడా అతని భార్యయే. శుక్రునికూతురగు దేవయానికి ఇద్దరు కుమారులు కలిగిరి.

యదుం చ తుర్వసుం చైవ దేవపుత్రసమావుభౌ ।
శర్మిష్ఠా చ నృపాల్లేభే త్రీన్‌పుత్రాన్ దేవసంనిభాన్ ॥ 6 ॥

వారు యదువు మరియు తుర్వసుడు. వారిద్దరు దేవపుత్రులతో సమానముగా నుండిరి. రాజు వలన శర్మిష్ఠకు ముగ్గురు పుత్రులు కలిగిరి. వారును దేవతలవలె నుండిరి.

ద్రుహ్యుం చానుం చ పూరుం చ యయాతే ర్నృపసత్తమాత్ ।
దేవయాన్యాః సుతౌ బ్రహ్మన్ సదృశౌ శుక్రరూపతః ॥ 7 ॥

ఓ బ్రహ్మరూపుడా! వారిపేర్లు ద్రుహ్యుడు, అనుడు, పూరుడు అని. వారు రాజశ్రేష్ఠుడగు యయాతి వలన కలిగిరి. దేవయాని కుమారులిద్దరూ రూపంలో శుక్రునివలె యుండిరి.

శర్మిష్ఠాయాస్తు తనయాః శక్రాగ్నివరుణప్రభాః ।
దేవయానీ కదాచిత్తు పితరం ప్రాహ దుఃఖితా ॥ 8 ॥

శర్మిష్ఠయొక్క కుమారులు ఇంద్ర అగ్ని వరుణకాంతులతో నుండిరి. ఒకనాడు దేవయాని దుఃఖిస్తూ తన తండ్రితో నిట్లు పలికెను.

దేవయాన్యువాచ:- దేవయాని పలికింది.

మమ త్వపత్యద్వితయమభాగ్యాయా భృగూద్వహ ।
మమ దాస్యాః సభాగ్యాయా అపత్యత్రితయం పితః ॥ 9 ॥

ఓ తండ్రీ! భృగువంశశ్రేష్ఠుడా! దురదృష్టవంతురాలిని నేను. నాకిద్దరే సంతానము. ఓ తండ్రీ! నా దాసికి ముగ్గురు సంతానము. ఆమె భాగ్యవంతురాలు.

తదేతదనుమృశ్యాహం దుఃఖమత్యన్తమాగతా ।
మరిష్యే దానవగురో యయాతికృత విప్రియాత్ ॥
మానభంగాద్వరం తాత మరణం హి మనస్వినామ్ ॥ 10 ॥

ఇది ఆలోచించుకుంటే నాకు చాలా దుఃఖం వస్తుంది. ఓ రాక్షసుగురూ! ఆ యయాతి చేసిన విప్రియానికి మరణిస్తాను. తండ్రీ! అభిమానవంతులకు మానహానికంటే మరణమే మేలు కదా!

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తదేత్పుత్రికావాక్యం శ్రుత్వా శుక్రః ప్రతాపవాన్ ।
కుపితోఽభ్యాయయౌ శీఘ్రం యయాతిమిదమబ్రవీత్ ॥ 11 ॥

ఇట్లు పలికిన కూతురు మాటను విన్న ప్రతాపవంతుడగు శుక్రుడు కోపంతో త్వరత్వరగా యయాతి వద్దకు వెళ్ళి ఇట్లనెను.

శుక్ర ఉవాచ :- శుక్రుడు పలికాడు.

యదిదం విప్రియం మేఽద్య సుతాయామాదృతం త్వయా ।
రూపోన్మత్తేన రాజేన్ద్ర తస్మాద్వృద్ధో భవిష్యసి ॥ 12 ॥

ఓ రాజేంద్రా! నా కూతురునికిట్లు రూపవంతుడననే గర్వముతో విప్రియమును చేసితివి కావున నీవు వృద్ధుడవగుదువు.

న చ భోక్తుం న చ త్యక్తుం శక్నోతి విషయాతురః ।
స్పృహయన్మనసైవాఽఽస్తే నిఃశ్వాసోచ్ఛ్వాసనష్టధీః ॥ 13 ॥

నీవు విషయాతురుడవై అనుభవించుటకుగాని వదిలివేయుటకుగాని శక్తిలేనివాడవగుదువు. నీవు వాటిని తలుచుకొనుచు ఉచ్ఛ్వాసనిఃశ్వాసములను మాత్రము దీసుకొనుచు, తెలివి నశించినవానివై యుందువు.

వృద్ధత్వమేవ మరణం జీవతామపి దేహినామ్ ।
తస్మాచ్ఛీఘ్రం ప్రయాహి త్వం జరాం భూపాతిదుర్ధరామ్ ॥ 14 ॥

శరీరులకు వృద్ధత్వము అనునది జీవించియున్నా మరణముతో సమానము. అందువలన ఓ రాజా! నీవు ఆ భరింపరాని వృద్ధత్వమును త్వరగా పొందుము.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా యయాతిస్తు శాపం శుక్రస్య ధీమతః ।
కృతాంజలిపుటో రాజా యయాతిః శుక్రమబ్రవీత్ ॥ 15 ॥

ధీమంతుడైన శుక్రుని శాపమును విని యయాతి రాజు శుక్రునకు నమస్కరించుచు వినయముగా నిట్లనెను.

యయాతి రువాచ:– యయాతి పలికాడు.

నాపరాధ్యే న సంకుప్యే నైవాధర్మే ప్రవర్తయే ।
అధర్మకారిణః పాపాః శాస్యా ఏవ మహాత్మనామ్ ॥ 16 ॥

నేనే అపరాధమును చేయలేదు, అధర్మముగా ప్రవర్తించలేదు. నాకే కోపమూ లేదు. మహాత్ములు అధర్మకారులను పాపులను మాత్రమే శాసించవలయును.

ధర్మమేవ చరన్తం వై కథం మాం శప్తవానసి ।
దేవయానీ ద్విజశ్రేష్ఠ వృథా మాం వక్తి కించన ॥ 17 ॥

ఓ ద్విజశ్రేష్ఠుడా! నేను ధర్మమునే ఆచరించుచున్నాను. నన్ను నీవెట్లు శపించితివి? దేవయాని నన్ను వ్యర్థముగా ఏదో ఒకటి అనుచున్నది.

తస్మాన్న మమ విప్రేన్ద్ర! శాపం దాతుం త్వమర్హసి ।
విద్వాంసోఽపి హి నిర్దోషే యది కుప్యన్తి మోహితాః ॥
తదా న దోషో మూర్ఖాణాం ద్వేషాగ్నిప్లుష్టచేతసామ్ ॥ 18 ॥

అందువలన ఓ విప్రేన్ద్రా! నీవు నన్ను శపించుట న్యాయముగాదు. విద్వాంసులైనవారే మోహముతో దోషరహితుని యందు కోపిస్తే ద్వేషాగ్నితో రగులుతున్న మనసు కలిగిన మూర్ఖులు కోపించినా తప్పు లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

యయాతి వాక్యాచ్ఛుక్రోఽపి సస్మార సుతయా కృతమ్ ।
అసకృద్విప్రియం తస్య దివారాత్రౌ ప్రచణ్డయా ॥ 19 ॥

గత కోపోఽహ మిత్యుక్త్వా కావ్యో రాజానమబ్రవీత్ ॥ 20 ॥

యయాతి పలికిన మాటలతో శుక్రుడు కూడా తన కూతురుచేసినది తలుచుకొనెను. రాత్రింబగళ్ళు చాలా ఆలోచించి రాజుచేసిన విప్రియమేమీలేదని యనుకొని, నాకు కోపము పోయినదని శుక్రుడు రాజుతో నిట్లనెను.

శుక్ర ఉవాచ:- శుక్రుడు పలికాడు.

జ్ఞానాదజ్ఞానతో వాఽపి స్వైరేఽపి న వదేఽనృతమ్ ।
శాపస్యేమం కరిష్యామి శృణుష్వానుగ్రహం నృప ॥ 21 ॥

ఓ రాజా! తెలిసీతెలియకుండా స్వైరునియందు కూడా అబద్ధమును చెప్పను. ఈ శాపమును అనుగ్రహముగా చేయుదును వినుము.

యస్మై పుత్రాయ సందాతుం జరామిచ్ఛసి మానద ।
తస్య సా యాత్వియం రాజన్ జరా పుత్రాయ మద్వరాత్ ॥ 22 ॥

ఓ మానదా! ఏ పుత్రునికి, ముసలితనమును ఇవ్వాలని సంకల్పిస్తావో, ఓ రాజా! నా వరమువలన ఆ పుత్రునకు ఈ ముసలితనము వెళ్ళుగాక!

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పునర్యయాతిః శ్వశురం శుక్రం ప్రాహ వినీతవత్ ॥ 23 ॥

తిరిగి యయాతి తనమామయగు శుక్రునితో వినయముగా నిట్లనెను.

యయాతి రువాచ:- యయాతి పలికాడు.

యో గృహ్ణాతి మయా దత్తాం జరాం భక్తిసమన్వితః ।
స రాజా స్యాద్దైత్యగురో తదేతదనుమన్యతామ్ ॥ 24 ॥

ఎవరు భక్తితో గూడి నేనిచ్చు నా ఈ ముసలితనమును స్వీకరించునో ఓ రాక్షసగురూ! అతడు రాజగుగాక! దీనిని మీరు అనుమతించుడు.

యో మద్వాక్యం నాభినన్దేత్సుతో దైత్యగురో దృఢమ్ ।
తం శపేయమనుజ్ఞాఽత్ర దాతవ్యైవ త్వయా గురో ॥ 25 ॥

ఓ దైత్యగురూ! ఏ కొడుకు నా మాటనంగీకరించడో అతనిని శపించుటకు తమరు తప్పక అనుమతించవలెను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవమస్త్వితి రాజానమువాచ భృగునందనః ।
తతో యయాతిః స్వం పుత్రమాహూయేదం వచోఽబ్రవీత్॥ 26 ॥

అప్పుడా శుక్రుడు రాజుతో అట్లేయగుగాక! అన్నాడు. తరువాత యయాతిరాజు తన కుమారుని పిలిచి ఇట్లన్నాడు.

యయాతి రువాచ:- యయాతి పలికాడు.

యదో గృహాణ మే శాపాత్ జరాం జాతాం సుతో భవాన్ ।
జ్యేష్ఠ సర్వార్థవిత్ప్రౌఢః పుత్రాణాం ధురి సంస్థితః ॥
పుత్ర తేనైవ జనకో యస్తదాజ్ఞావశే స్థితః ॥ 26 ॥

నాయనా యదూ! నీవు నాకు పెద్దకుమారుడవు. పుత్రులలో గొప్పవాడవు. సమస్త సంపదలతో ప్రౌఢుడవు నేను శాపమువలన ముసలితనమును పొందినాను. దానిని నీవు గ్రహించుము. ఎవడు తండ్రి ఆజ్ఞలో నుండునో వాడే పుత్రుడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నేత్యువాచ యదుస్తాతం యయాతిం భూరిదక్షిణమ్ ।
యయాతిశ్చ యదుం శప్త్వా తుర్వసుం కామమబ్రవీత్ ॥ 28 ॥

యజ్ఞయాగాదులు చేసి భూరి దక్షిణలనిచ్చిన యయాతితో యదుడు తాను ముసలితనమును స్వీకరించనని చెప్పెను. యయాతి యదుని శపించి, తుర్వసుడికి తన కోరికను వెల్లడించాడు.

నాగృహ్ణాత్తుర్వసుశ్చాపి పిత్రా దత్తాం జరాం తదా ।
తం శప్త్వా చాబ్రవీద్ద్రుహ్యుం గృహాణేమాం జరాం మమ ॥ 29 ॥

తుర్వసుడు కూడా తండ్రి ఇచ్చిన ముసలితనమును స్వీకరించలేదు. అప్పుడు అతణ్ణి శపించి ద్రుహ్యునితో నా ముసలితనాన్ని స్వీకరించుమని అడిగాడు.

ద్రుహ్యుశ్చ నైచ్ఛత్తాం దత్తాం జరాం రూపవినాశినీమ్ ।
అనుమప్యబ్రవీద్రాజా గృహాణేమాం జరాం మమ ॥ 30 ॥

రూపవినాశినియగు ముసలితనాన్ని ద్రుహ్యుడు తీసుకొనుట కంగీకరించలేదు. అప్పుడు అనునితో తన ముసలితనాన్ని తీసుకో అని రాజడిగాడు.

అనుర్నేతి తదోవాచ శప్త్వా తం పూరుమబ్రవీత్ ।
అభినన్ద్య తదా పూరుర్జరాం తాం జగృహే పితుః ॥ 31 ॥

అనుడు కూడా నేను తీసుకోనన్నాడు. రాజు అతనిని శపించి పూరుణ్ణి అడిగాడు. అప్పుడు పూరుడు అభినందించి తండ్రియొక్క ముసలితనాన్ని స్వీకరించాడు.

సహస్రమేకం వర్షాణాం యావత్ప్రీతోఽభవత్పితా ।
యౌవనే యాని యోగ్యాని వస్తూని వివిధాని చ ॥ 32 ॥

యౌవనవయస్సులో యోగ్యమైన వివిధ వస్తువులను ఉపయోగిస్తూ ఆ తండ్రి ఒకవేయి సంవత్సరాలవరకు ప్రీతిపొందాడు.

పుత్రయౌవనసంతుష్టో యయాతి ర్బుభుజే సుఖమ్ ।
తతస్తృప్తోఽభవద్రాజా సర్వభోగేషు నాహుషః ॥
తతో హర్షాత్సమాహూయ పూరుం పుత్రమథాబ్రవీత్ ॥ 33 ॥

కుమారునివలన పొందిన యౌవనంతో యయాతి సర్వభోగసుఖాల్ననుభవించాడు. తర్వాత నహుషుని పుత్రుడగు ఆ రాజు యయాతి తృప్తి పొందాడు. తర్వాత తన పుత్రుడైన పూరుని సంతోషంతో పిలిచి యిట్లన్నాడు.

యయాతిరువాచ:- యయాతి పలికాడు.

తృప్తోఽస్మి సర్వభోగేషు యౌవనేన తవానఘ ।
గృహాణ యౌవనం పుత్ర జరాం మే దేహి కశ్మలామ్ ॥ 34 ॥

నాయనా! పాపరహితుడా! నీ యౌవనముతో సర్వభోగాలననుభవించి తృప్తి పడ్డాను. కుమారా! నీ యౌవనాన్ని తీసుకో. ఆ కశ్మలమైన ముసలితనాన్ని నా కివ్వు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నేత్యువాచ తదా పూరుర్జరయా క్షీయతే మయా ।
వికారాస్తాత భావానాం దుర్నివారాః శరీరిణామ్ ॥ 35 ॥

అప్పుడు పూరుడు తండ్రీ! జీవులకు, వారిభావాలకు వికారాలు నివారించ శక్యంగానివి. ముసలితనంతో నేను క్షీణిస్తాను. కావున నాకు యౌవనమవసరం లేదని చెప్పాడు.

బలాత్కాలాగతా సహ్యా జరాఽప్యఖిలదేహిభిః ।
సా చేద్గురూపకారాయ గృహీతా త్యజ్యతే కథమ్ ॥ 36 ॥

జీవులందరూ కాలగతమైన ముసలితనాన్ని బలాత్కారంగానైనా సహించాలి. గురువైన తండ్రికి ఉపకారం కొరకు గ్రహించిన దానినెట్లు వదలిపెడతా?

స్వీకృతత్యాగపాపాద్ధి దేహినాం మరణం వరమ్ ।
అథవా తు జరాం రాజంస్తపసా నాశయామ్యహమ్ ॥ 37 ॥

జీవులు తాము త్యాగం చేసి స్వీకరించినదానిని తిరిగి వదులుకొనుట పాపము. దానికన్నా మరణమే మేలు గదా! లేదా నేను తపస్సుచేసి ముసలితనాన్ని పోగొట్టుకొంటా.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తు పితరం యయౌ గంగామనుత్తమామ్ ।
గౌతమ్యా దక్షిణే పారే తతస్తేపే తపో మహత్ ॥ 38 ॥

తండ్రికి ఇట్లు చెప్పి పవిత్రమైన గంగానదివద్దకు వెళ్లాడు. గౌతమీనది దక్షిణతీరంలో గొప్పతపస్సు చేశాడు.

తతః ప్రీతోఽభవద్దేవః కాలేన మహతా శివః ।
లోకాతీతమహోదారగుణసన్మణిభూషితమ్ ॥
కిం దదామీతి తం ప్రాహ పూరుం స సురసత్తమః ॥ 39 ॥

తర్వాత చాలా కాలానికి శివుడు సంతోషించి, లోకాతీతము, మహోదారమూ అయిన గుణములనే మంచిమణులతో శోభించేదేది కావాలని ఆ సురసత్తముడు పూరుని అడిగాడు.

పూరురువాచ:– పూరుడు పలికాడు.

శాపప్రాప్తాం జరాం నాథ పితుర్మమ సురాధిప ।
తాం నాశయస్వ దేవేశ పితృశప్తాంశ్చ కోపతః ॥
మద్భ్రాతౄన్ శాపతో ముక్తాన్ కురుష్వ సురపూజిత ॥ 40 ॥

ఓ సురాధిపా! నాతండ్రి శాపవశాత్తు పొందిన ఆ ముసలితనాన్ని పోగొట్టు. ఓ దేవేశా! తండ్రి కోపంతో శపించిన, నా సోదరులను శాపవిముక్తుల్ని చేయి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా జగన్నాథః శాపాజ్జాతాం జరాం తదా ।
అనాశయజ్జగన్నాథో భ్రాతౄంశ్చక్రే విశాపినః ॥ 41 ॥

జగన్నాథుడు అట్లేయని పలికి శాపంవలన కలిగిన ముసలితనాన్ని పొగొట్టాడు. అట్లే ఆ జగన్నాథుడు సోదరులను శాపవిముక్తుల్ని కూడా చేశాడు.

తతః ప్రభృతి తత్తీర్థం జరారోగవినాశనమ్ ।
అకాలజజరాదీనాం స్మరణాదపి నాశనమ్ ॥ 42 ॥

అప్పటినుండి ఆ తీర్థం జరారోగవినాశతీర్థంగా పేరు పొందింది. దానిని స్మరించినంత మాత్రాన అకాలంలో వచ్చే జరాదులన్నీ నశిస్తాయి.

తన్నామ్నా చాపి విఖ్యాతం కాలంజరముదాహృతమ్ ।
యాయాతం నాహుషం పౌరం శౌక్రం శార్మిష్ఠమేవ చ ॥ 43 ॥

ఆ తీర్థము కాలంజరము, యాయాతం, నాహుషం, పౌరం, శౌక్రం, శార్మిష్ఠమను పేర్లతో ప్రసిద్ధి పొందింది.

ఏవమాదీని తీర్థాని తత్రాష్టోత్తరమేవ చ ।
శతం విద్యాన్మహాబుద్ధే సర్వసిద్ధికరం తథా ॥ 44 ॥

ఓ మహాబుద్ధీ! ఈ విధంగా నక్కడ నూట ఎనిమిది తీర్థాలున్నాయి. అవన్నీ సర్వసిద్ధులు కలుగజేసే తీర్థాలు.

తేషు స్నానం చ దానం చ శ్రవణం పఠనం తథా ।
సర్వపాపప్రశమనం భుక్తిముక్తిప్రదం భవేత్ ॥ 45 ॥

ఆ తీర్థాలలో స్నానదానాలు చేసినా, ఆ తీర్థాన్ని గూరించి విన్నా, చదివినా భుక్తి,ముక్తి లభిస్తాయి. సర్వపాపాలు పోతాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే కాలంజరాద్యష్టోత్తరశతతీర్థవర్ణనం నామ షట్ సప్తతితమోఽధ్యాయః ॥ 76 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని కాలంజర మొదలగు నూట ఎనిమిది తీర్థములవర్ణనమనెడుపేరుగల డెబ్బై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తసప్తతితమోఽధ్యాయః - డెబ్బై ఏడవ అధ్యాయం
అప్సరోయుగసంగమతీర్థవర్ణనమ్ - అప్సరోయుగసంగమ తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

అప్సరోయుగమాఖ్యాతమప్సరాసంగమం తతః ।
తీరే చ దక్షిణే పుణ్యం స్మరణాత్సుభగో భవేత్ ॥ 1 ॥

గౌతమీనది దక్షిణతీరంలో పవిత్రమైన అప్సరోయుగం, అప్సరాసంగమం అను తీర్థం ఉంది. దాన్ని స్మరించినంతమాత్రాన సౌందర్యం కలుగుతుంది.

ముక్తో భవత్యసందేహం తత్ర స్నానాదినా నరః ।
స్త్రీ సతీ సంగమే తస్మిన్నృతుస్నాతా చ నారద ॥ 2 ॥

నారదా! అక్కడ స్నానాదులు చేసిన మానవుడు ముక్తుడవుతాడు. దీనిలో సందేహం లేదు. పతివ్రత అయిన ఋతుస్నాత అయిన స్త్రీ ఆ సంగమతీర్థంలో స్నానం చేస్తే,

వన్ధ్యాపి జనయేత్పుత్రం త్రిమాసాత్పతినా సహ ।
స్నానదానేన వర్తన్తీ నాన్యథా మద్వచో భవేత్ ॥ 3 ॥

గొడ్రాలైనా సరే మూడు మాసాలు భర్తతోగూడి, ఆ తీర్థంలో స్నానం చేస్తే, దానాలు చేస్తే సంతానవతి అవుతుంది. నా మాటకు తిరుగు లేదు.

అప్సరోయుగ మాఖ్యాతం తీర్థం యేన చ హేతునా ।
తత్రేదం కారణం వక్ష్యే శృణు నారద యత్నతః ॥ 4 ॥

నారదా! ఏ కారణంచే దాన్ని అప్సరోయుగతీర్థమన్నారో దానికి గల కారణాన్ని చెబుతాను. శ్రద్ధగా విను.

స్పర్ధాఽఽసీన్మహతీ బ్రహ్మన్విశ్వామిత్రవసిష్ఠయోః ।
తపస్యన్తం గాధిసుతం బ్రాహ్మణ్యార్థే యతవ్రతమ్ ॥ 5 ॥

గంగాద్వారే సమాసీనం ప్రేరితేంద్రేణ మేనకా ।
తం గత్వా తపసో భ్రష్టం కురు భద్రే మమాఽఽజ్ఞయా ॥ 6 ॥

ఓ బ్రహ్మరూపుడా! విశ్వామిత్ర వసిష్ఠులకు గొప్పపోటీ జరిగింది. బ్రాహ్మణ్యం కొరకు నియతవ్రతుడై తపస్సుచేసుకొంటున్న విశ్వామిత్రుని, గంగాతీరంలో తపస్సు చేసుకుంటున్నవాణ్ణి చూచి ఇంద్రుడు మేనకతో ఓ భద్రురాలా! నీవు నా ఆజ్ఞగా వెళ్లి అతని తపస్సును భంగపరచమన్నాడు.

తథోక్తేంద్రేణ సా మేనా విశ్వామిత్రం తపశ్చ్యుతమ్ ।
కృత్వా కన్యాం తథా దత్త్వా జగామేన్ద్రపురం తతః ॥ 7 ॥

ఇంద్రుడట్లు ఆజ్ఞాపించగా మేనక వెళ్ళి విశ్వామిత్రుని తపస్సును భగ్నం చేసి, అతనిద్వారా కూతురును కని, అతనికే ఇచ్చి, తిరిగి ఇంద్రపురానికి వెళ్ళింది.

తస్యాం గతాయాం సస్మార గాధిపుత్రోఽఖిలం కృతమ్ ।
తం తు దేశం పరిత్యజ్య తీర్థం తు సురవల్లభమ్ ॥ 8 ॥

జగామ దక్షిణాం గంగాం యత్ర కాలంజరో హరః ।
తపస్యన్తం తదోవాచ పునరింద్రః సహస్రదృక్ ॥ 9 ॥

ఆమె వెళ్ళగానే విశ్వామిత్రుడు తాను జేసినదంతా స్మరించుకొన్నాడు. ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి సురవల్లభ తీర్థానికి, వెళ్ళాడు. కాలంజరుడనేపేరుతో శివుడున్న గంగానది దక్షిణతీరాన తపస్సు చేసుకొంటూ ఉన్న విశ్వామిత్రుని చూసి, తిరిగి సహస్రనేత్రుడైన ఇంద్రు డిట్లన్నాడు.

ఊర్వశీం చ తతో మేనాం రంభాం చాపి తిలోత్తమామ్ ।
నైవేత్యూచుర్భయత్రస్తాః పునరాహ శచీపతిః ॥ 10 ॥

గమ్భీరాం చాతిగమ్భీరా ముభే యే గర్వితే తదా ।
తే ఊచతురుభే దేవం సహస్రాక్షం పురందరమ్ ॥ 11 ॥

ఓ ఊర్వశీ మేనా రంభా తిలోత్తములారా! మీరువెళ్ళి విశ్వామిత్రుని తపస్సు భంగపరుచుడనగా వాళ్ళు భయంతో వణుకుతూ కాదన్నారు. తమకు శక్తిలేదని పలికారు. తిరిగి ఇంద్రుడు, గంభీరా, అతిగంభీరా అను ఇద్దరి నాజ్ఞాపించాడు. అప్పుడా ఇద్దరు గర్వంతో సహస్రాక్షుడు, పురందరుడు అయిన ఇంద్రునితో నిట్లన్నారు.

గంభీరాతిగంభీరే ఊచతుః :– గంభీరాతిగంభీరలు పలికారు.

ఆవాం గత్వా తపస్యన్తం గాధిపుత్రం మహాద్యుతిమ్ ।
చ్యావయామో నృత్యగీతై రూపయౌవనసంపదా ॥ 12 ॥

ఆ గొప్ప తేజః సంపన్నుడైన విశ్వామిత్రుని మేమిద్దరం వెళ్ళి మా రూపలావణ్య సంపదతో నృత్యగీతాలతో అతణ్ణి తపోభ్రష్టుణ్ణి చేస్తాము.

యాసామపాంగే హసితే వాచి విభ్రమసంపది ।
నిత్యం వసతి పంచేషుస్తాభిః కోఽత్ర న జీయతే ॥ 13 ॥

స్త్రీల చూపులో నవ్వులో, మాటలో, విలాసవంతమైన చేష్టల్లో మన్మథుడు నిత్యం నివాసముంటాడు. అటువంటి స్త్రీలచే ఎవడు జయింపబడడు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్తే సహస్రాక్షే తే ఆగత్య మహానదీమ్ ।
దదృశాతే తపస్యన్తం విశ్వామిత్రం మహామునిమ్ ॥ 14 ॥

ఇంద్రుడు తన సమ్మతిని తెలుపగా వారు గంగానదివద్దకు వచ్చి తపస్సుచేసుకొనుచున్న విశ్వామిత్ర మహామునిని చూశారు.

మృత్యోరపి దురాధర్షం భూమిస్థమివ ధూర్జటిమ్ ।
సహస్రమేకం వర్షాణామీక్షితుం న చ శక్నుతః ॥ 15 ॥

మృత్యువు కూడా ఆక్రమించలేని, మూడవకన్నుప్రళయకాలంలో తెరిచిన శివునివలెనున్న ఆ విశ్వామిత్రుని వేయి సంవత్సరాల వరకు వాళ్ళకు చూడటానికి కూడా శక్తి చాల్లేదు.

దూరే స్థితే నృత్యగీతచాటుకారరతే తదా ।
విలోక్య మునిశార్దూలస్తతః కోపాకులోఽభవత్ ॥ 16 ॥

దూరంగా వుండి ఆడుతూ పాడుతూ చాటు వాక్యాలు పలుకుతుండగా చూసి ఆ మునిశ్రేష్ఠుడు కోపాన్ని ప్రదర్శించాడు.

ప్రతీపాచరణం దృష్ట్వా క్రోధః కస్య న జాయతే ।
నిస్పృహోఽపి మహాబాహుస్తమింద్రం ప్రహసన్నివ ॥ 17 ॥

ఆభ్యాం ముక్తః సహస్రాక్షో హ్యప్సరోభ్యాం బ్రువన్నివ ।
శశాప తే స గాధేయో ద్రవరూపే భవిష్యథః ॥ 18 ॥

ప్రతికూలమైన పనులను చూచి కోపం ఎవరికి రాకుండా ఉంటుంది? నిస్పృహతో నున్నాకూడా ఆ మహాబాహువు ఇంద్రుని హేళనచేస్తున్నట్లుగా, అప్సరసలతో పలుకుతున్నట్లుగా "వీరివల్ల ఆ ఇంద్రుడు బ్రతికి పోయాడు" అని ఆ విశ్వామిత్రుడు వాళ్లిద్దరిని మీరు ద్రవరూపంగా కండు అని శపించాడు.

ద్రవితుం మాం సమాయాతే యతస్త్విహ తతో లఘు ।
తతః ప్రసాదితస్తాభ్యాం శాపమోక్షం చకార సః ॥ 19 ॥

అక్కడినుండి వాళ్లు మెల్లగా ద్రవించుటకై నావద్దకు రాగా ఆ మహర్షి వాళ్లిద్దరికి శాపమోక్షాన్ననుగ్రహించాడు.

భవేతాం దివ్యరూపే వాం గంగాయా సంగతే యదా ।
తచ్ఛాపాత్తే నదీరూపే తత్క్షణాత్సంబభూవతుః ॥ 20 ॥

గంగానది సంగమము కలిగినప్పుడు మీరు దివ్యరూపులుగా అవుతారు. ఆ శాపంనుండి ఆ క్షణమే వారు నదీరూపాన్ని పొందారు.

అప్సరోయుగ్మమాఖ్యాతం నదీద్వయమతోఽభవత్ ।
తాభ్యాం పరస్పరం చాపి తాభ్యాం గంగాసుసంగమః ॥ 21 ॥

ఇద్దరప్సరసల గురించి చెప్పినకథ రెండునదులుగా అయ్యింది. వాళ్లలో పరస్పరంకూడా వాళ్లకి గంగానది సంగమం శుభమైంది.

సర్వలోకేషు విఖ్యాతో భుక్తిముక్తిప్రదః శివః ।
తత్రాఽఽస్తే దృష్ట ఏవాసౌ సర్వసిద్ధిప్రదాయకః ॥ 22 ॥

సమస్తలోకాలలో విఖ్యాతుడు, భుక్తిని ముక్తిని ఇచ్చేవాడు, దర్శనం మాత్రంచేతనే సర్వసిద్ధులను ఇచ్చే ఈ శివుడు అక్కడ కొలువై యున్నాడు.

తత్ర స్నాత్వా తు తం దృష్ట్వా ముచ్యతే సర్వబంధనాత్ । 23 ॥

అక్కడ స్నానం చేసి అతన్ని దర్శిస్తే సమస్తబంధాలనుండి విముక్తి కలుగుతుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యేఽప్సరోయుగసంగమతీర్థవర్ణనం నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥ 77 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యములోని అప్సరోయుగసంగమ తీర్థవర్ణనమనే పేరుగల డెబ్బై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టసప్తతితమోఽధ్యాయః - డెబ్బై ఎనిమిదవ అధ్యాయం

కాణ్వాద్యేకోన పంచాశత్తీర్థ వర్ణనమ్ - కాణ్వతీర్థం మొదలుగాగల నలబై తొమ్మిది తీర్థముల వర్ణనం

కోటి తీర్థమితి ఖ్యాతం గంగాయా దక్షిణే తటే ।
యస్యానుస్మరణాదేవ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 1 ॥

గంగానది దక్షిణతీరంలో కోటితీర్థమను ప్రసిద్ధ తీర్థముంది. దానిని స్మరిస్తేనే సర్వపాపాలనుండి విముక్తులవుతారు.

యత్ర కోటీశ్వరో దేవః సర్వం కోటి గుణం భవేత్ ।
కోటిద్వయం తత్ర పూర్ణం తీర్థానాం శుభదాయినామ్ ॥ 2 ॥

ఎక్కడ కోటీశ్వరుడనే దేవుడున్నాడో అక్కడ అన్ని కోటిరెట్లగును. అక్కడ శుభదాయకాలైన రెండు కోట్ల తీర్థాలు నిండుగా ఉన్నాయి.

తత్ర వృష్టిం ప్రవక్ష్యామి శృణు నారద తన్మనాః ।
కణ్వస్య తు సుతో జ్యేష్ఠో బాహ్లీక ఇతి విశ్రుతః ॥ 3 ॥

ఓ నారదా! దాని కథను చెబుతున్నాను. దానియందే మనస్సు లగ్నం చేసి విను. కణ్వునియొక్క పెద్ద కుమారుడు బాహ్లీకుడనువాడున్నాడు.

కాణ్వశ్చేతి జనైః ఖ్యాతో వేదవేదాంగపారగః ।
ఇష్టీః పార్వాయణానీర్యాః సభార్యో వేదపారగః ॥ 4 ॥

జనులందరు అతనిని కాణ్వుడనేవారు. అతడు వేదవేదాంగములు క్షుణ్ణముగా తెలిసినవాడు. అతడు వేదవేత్త కనుక భార్యతో గూడ ఎన్నో ఇష్టులను, చాంద్రయణాది వ్రతములను పర్వణులనెన్నింటినో, చేస్తూ ఉండేవాడు.

కుర్వన్నాస్తే స గౌతమ్యాస్తీరస్థో లోకపూజితః ।
ప్రాతఃకాలే సభార్యోఽసౌ జుహ్వదగ్నౌ సమీహితః ॥ 5 ॥

సర్వదాఽస్తే కదాచిత్తు హవనాయ సముద్యతః ।
ఏకాహుతిం స హుత్వా తు సమిద్ధే హవ్యవాహనే ॥ 6 ॥

ఆహుత్యన్తరదానాయ హవిర్ద్రవ్యం కరేఽగ్రహీత్ ।
ఏతస్మిన్నన్తరే వహ్నిరుపశాన్తోఽభవత్తదా ॥ 7 ॥

లోకపూజితుడైన అతడు గౌతమీ తీరములో ఉంటూ సర్వదా ప్రాతఃకాలముననే గౌతమీనది యొద్దున ఉండి హోమాలను చేస్తూండేవాడు. అట్లెప్పుడూ చేస్తూండగా ఒకరోజు హోమానికై సిద్ధపడి సమిధలతోనున్న

అగ్నిహోత్రంలో ఒక ఆహుతి నిచ్చి, ఇంకొక ఆహుతి వేయుటకై హవిర్ద్రవ్యాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. ఇంతలోనే అగ్ని చల్లారిపోయింది.

తతశ్చిన్తాపరఃకాణ్వః కర్తవ్యం కిం భవేదితి ।
అన్తర్విచారయామాస విషాదం పరమం గతః ॥ 8 ॥

దానికి చింతించిన కాణ్వుడు ఇప్పుడేమి చేయాలనుకొన్నాడు. లోలోపల విచారిస్తూ మిక్కిలి విషాదం పొందాడు.

ఆహుత్యోశ్చ ద్వయోర్మధ్య ఉపశాన్తో హుతాశనః ।
అగ్న్యన్తరముపాదేయం వైదికం లౌకికం తథా ॥ 9 ॥

రెండు ఆహుతుల మధ్యన అగ్ని చల్లారినది. ఇక్కడ వైదికమైన అగ్నిగాని, లౌకికమైన అగ్నిగాని అగ్న్యంతరమును చేయవలసియున్నది.

క్వ హోష్యం స్యాద్ద్వితీయం తు ఆహుత్యన్తరమేవ చ ।
ఏవం మీమాంసమానే తు దైవీవాగబ్రవీత్తదా ॥ 10 ॥

రెండవ దానినెక్కడ హోమం చేయాలి? ఆహుతి అంతరంలోనే చేయాలి కదా - అని ఇట్లు మీమాంస చేస్తుండగా అశరీరవాణి పలికింది.

అభ్యన్తరం నైవ తేఽత్ర ఉపాదేయం భవిష్యతి ।
యాని తత్ర భవిష్యన్తి శకలాని సమీపతః ॥ 11 ॥

అర్ధదగ్ధేషు కాష్ఠేషు విప్రరాజ ప్రహూయతామ్ ।
నేత్యువాచ తదా కాణ్వః సైవ వాగబ్రవీత్పునః ॥ 12 ॥

ఇక్కడ నీకు అభ్యన్తరమైన ఉపాదేయమేమీ లేదు. దాని దగ్గర ఎన్ని ముక్కలున్నాయో చూచి, ఓ విప్రశ్రేష్ఠా! సగం కాలిన సమిధలలో హోమము చేయుమని చెప్పగా, దానికి కాణ్వుడంగీకరించలేదు. అప్పుడు తిరిగి దైవీవాక్కు ఇట్లనెను.

అగ్నేః పుత్రో హిరణ్యస్తు పితా పుత్రః స ఏవ తు ।
పుత్రే దత్తం ప్రియాయైవ పితుః ప్రీత్యై భవిష్యతి ॥ 13 ॥

హిరణ్యుడు అగ్నిపుత్రుడు, తండ్రీకొడుకు అతడే. కుమారుడిచ్చింది తండ్రికి సంతోషం కలిగిస్తుంది.

పిత్రే దేయం సుతే దద్యాత్కోటి ప్రీతి గుణం భవేత్ ।
దైవీ వాగబ్రవీదేవం తతః సర్వే మహర్షయః ॥ 14 ॥

తండ్రికివ్వవలసినది కొడుకు కిచ్చినచో అది కోటి రెట్లు ప్రీతిని కలిగించునని దైవీవాక్కు చెప్పగా తరువాత మహర్షులందరూ,

నిశ్చిత్య ధర్మం సర్వస్వం తథా చక్రుర్యథోదితమ్ ।
ఏతజ్జ్ఞాత్వా జగత్యత్ర పుత్రే దత్తం పితుర్భవేత్ ॥ 15 ॥

ధర్మాన్నంతా నిశ్చయించి ఆకాశవాణి చెప్పినట్లునే చేశారు. ఇది తెలుసుకొని లోకంలో కుమారుని కిచ్చింది తండ్రికి చెందుతుందన్నారు.

అపత్యాదుపకారేణ పిత్రోః ప్రీతిర్యథా భవేత్ ।
తథా నాన్యేన కేనాపి జగత్యేతద్ధి విశ్రుతమ్ ॥ 16 ॥

కుమారుడు చేసిన ఉపకారముతో తండ్రి ఎంత ప్రీతిచెందునో మరొకడెవరు చేసినా అంతతృప్తి కలుగదని లోకంలో ప్రసిద్ధి చెందింది.

సుప్రసిద్ధం జగత్యేతత్సర్వలోకేషు పూజితమ్ ।
తస్మిన్దత్తే భవేత్పుణ్యం సర్వం కోటిగుణం సుత ॥ 17 ॥

ఇలా ఈ లోకంలో ప్రసిద్ధమైంది అన్నిలోకాలలో పూజింపబడింది. అతనికిస్తే పుణ్యమంతా కోటిగుణిత మవుతుంది.

మనోగ్లాని నివృత్తిశ్చ జాయతే చ మహత్సుఖమ్ ।
పునరప్యాహ సా వాణీ కాణ్వేఽస్మింస్తీర్థ ఉత్తమే ॥ 18 ॥

అభవత్తన్మహత్తీర్థం కాణ్వపుణ్యప్రభావతః ।
లోకత్రయాశ్రయాశేషతీర్థేభ్యోఽపి మహాఫలమ్ ॥ 19 ॥

మనఃక్లేశము తొలుగుతుంది. గొప్పసుఖం కలుగుతుంది. తిరిగి అశరీరవాణి ఇట్లనింది. ఈ ఉత్తమమైన కాణ్వతీర్థమునందు, కాణ్వుని పుణ్యప్రభావంవల్ల మహత్తీర్థమైంది. మూడు లోకాలలోని అనేక తీర్థాలకంటే కూడా గొప్ప ఫలాన్నిచ్చేదయ్యింది.

స్నానదానాదికం కించిద్భక్త్యా కుర్వన్సమాహితః ।
ఫలం ప్రాప్స్యస్యశేషేణ సర్వం కోటిగుణం మునే ॥ 20 ॥

ఓ మునీ! ఇక్కడ భక్తితో స్నాన దానాదులు చేస్తూ విశేషంగా నంతయును కోటిగుణితమగు ఫలాన్ని పొందగలవు.

యత్కించిత్క్రియతే చాత్ర స్నానదానాదికం నరైః ।
సర్వం కోటిగుణం విద్యాత్కోటితీర్థం తతో విదుః ॥ 21 ॥

నరులు ఇక్కడే కొంచమైనా స్నానదానాలు చేస్తే సర్వమూ కోటిరెట్లుఫలమిస్తుంది కాబట్టి దీన్ని కోటితీర్థమన్నారు.

యత్రైతద్వృత్తమాగ్నేయం కాణ్వం పౌత్రం హిరణ్యకమ్ ।
వాణీసంజ్ఞం కోటితీర్థం కోటితీర్థఫలం యతః ॥ 22 ॥

ఎక్కడైతే ఈ వృత్తాంతం జరిగిందో కోటిగుణితఫలము లభిస్తుందో దాన్నే ఆగ్నేయం, కాణ్వం, పౌత్రం, హిరణ్యకం, వాణీసంజ్ఞం, కోటి తీర్థం అనే పేర్లతో పిలుస్తారు.

కోటితీర్థస్య మాహాత్మ్యమత్ర వక్తుం న శక్యతే ।
వాచస్పతి ప్రభృతిభిరథవాఽన్యైః సురైరపి ॥ 23 ॥

బ్రహ్మ మొదలుకొని ఇతరమైన దేవతలుకూడా ఈ కోటితీర్థమాహాత్మ్యాన్ని చెప్పలేరు.

యత్రానుష్ఠీయమానం హి సర్వం కర్మ యథా తథా ।
గోదావర్యాః ప్రసాదేన సర్వం కోటిగుణం భవేత్ ॥ 24 ॥

కోటితీర్థే ద్విజాగ్ర్యాయ గామేకాం యః ప్రయచ్ఛతి ।
తస్య తీర్థస్య మాహాత్మ్యాద్గోకోటిఫలమశ్నుతే ॥ 25 ॥

ఎక్కడైతే కర్మలన్నీ యథాతథంగా ఆచరిస్తే గోదావరీ అనుగ్రహంవల్ల కోటిరెట్లు ఫలమిస్తాయో, ఈ కోటితీర్థంలో ఉత్తముడైన బ్రాహ్మణునకు ఒక ఆవును దానం చేస్తే ఆ తీర్థంయొక్క మాహాత్మ్యంవల్ల కోటిగోవుల దానం చేసిన ఫలం వస్తుంది.

తస్మింస్తీర్థే శుచిర్భూత్వా భూమిదానం కరోతి యః ।
శ్రద్ధాయుక్తేన మనసా స్యాత్తత్కోటి గుణోత్తరమ్ ॥ 26 ॥

ఆ తీర్థంలో స్నానం చేసి ఎవరు భూమిదానాన్ని శ్రద్ధతో చేస్తారో, వారికి కోటిగుణోత్తరమగు ఫలం లభిస్తుంది.

సర్వత్ర గౌతమీతీరే పితౄణాం దానముత్తమమ్ ।
విశేషతః కోటితీర్థే తదనన్తఫలప్రదమ్ ॥
అత్రైకన్యూనపంచాశత్తీర్థాని మునయో విదుః ॥ 27 ॥

గౌతమీ నదీ తీరంలో అంతటా పితృదేవతలకు పిండప్రదానం చేస్తే ఉత్తమఫలితం లబిస్తుంది. విశేషంగా కోటితీర్థంలో చేసిన అనంతఫలం లభిస్తుంది. ఇక్కడ నలుబది తొమ్మిది తీర్థాలున్నాయని మునులు చెబుతారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే కాణ్వాద్యేకోనపంచాశత్తీర్థవర్ణనం నామ అష్ట సప్తతితమోఽధ్యాయః ॥ 78 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యమునందలి తీర్థమహాత్మ్యములోని కాణ్వతీర్థము మొదలుగాగల నలుబది తొమ్మిది తీర్థముల వర్ణనమను పేరుగల డెబ్బై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనాశీతితమోఽధ్యాయః - డెబ్బై తొమ్మిదవ అధ్యాయం

నారసింహాద్యష్టతీర్థవర్ణనమ్ - నారసింహతీర్థం మొదలుగాగల ఎనిమిది తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నారసింహమితి ఖ్యాతం గంగాయా ఉత్తరే తటే ।
తస్యానుభావం వక్ష్యామి సర్వరక్షావిధాయకమ్ ॥ 1 ॥

గంగానది యొక్క ఉత్తరతీరంలో అందరికి రక్షణనిచ్చే నారసింహతీర్థమనే నది ఉన్నది. ఆ తీర్థాన్ని గురించి చెబుతాను.

హిరణ్యకశిపుః పూర్వమభవద్బలినాం వరః ।
తపసా విక్రమేణాపి దేవానామపరాజితః ॥ 2 ॥

పూర్వము బలిచక్రవర్తి వంశంలో హిరణ్యకశిపుడు అనే శ్రేష్ఠుడుండేవాడు. అతడు తపస్సుతో, పరాక్రమంతో దేవతలకు ఓడింపరానివాడై ఉండేవాడు.

హరిభక్తాత్మజద్వేష కలుషీకృతమానసః ।
ఆవిర్భూయ సభాస్తంభా ద్విశ్వాత్మత్వం ప్రదర్శయన్ ॥ 3 ॥

తం హత్వా నరసింహస్తత్సైన్యమద్రావయత్తదా ।
సర్వాన్హత్వా మహాదైత్యాన్ క్రమేణాఽఽజౌ మహామృగః ॥ 4 ॥

రసాతలస్థాన్ శత్రూంశ్చ జిత్వా స్వర్లోకమీయివాన్ ।
తత్ర జిత్వా భువం గత్వా దైత్యాన్ జిత్వా నగస్థితాన్ ॥ 5 ॥

సముద్రస్థాన్నదీసంస్థాన్ గ్రామస్థాన్వనవాసినః ।
నానారూపధరాన్ దైత్యాన్నిజఘాన మృగాకృతిః ॥ 6 ॥

విష్ణుభక్తుడైన తన కుమారునియందు ద్వేషాన్ని పెంచుకొని తన మనస్సును కలుషితం చేసికొన్నాడు, సభాస్తంభం నుండి ఆవిర్భవించి తన విశ్వాత్వాన్ని ప్రదర్శిస్తూ, నరసింహుడు అతణ్ణి చంపి అతని సైన్యాన్నంతా పారదోలాడు. అందర్నీ జయించి మహారాక్షసులందర్నీ క్రమంగా మట్టుపెట్టి, ఆ యుద్ధంలో ఆ సింహం క్రమంగా, రసాతలము నందుండే శత్రువులను జయించి, సువర్లోకమునకు వెళ్లాడు. అక్కడ జయించి, భూమిపైకి వెళ్ళి కొండలపై నున్న రాక్షసులను జయించి, సంద్రంలోను, నదులలోను, గ్రామాలలోను, వనాలలోను అనేక రూపాలను ధరిస్తూ ఉన్న రాక్షసులను మృగాకృతిలో నున్న నరసింహుడు సంహరించాడు.

ఆకాశగాన్ వాయుసంస్థాన్ జ్యోతిర్లోకముపాగతాన్ ।
వజ్రపాతాధికనఖః సముద్భూత మహాసటః ॥ 7 ॥

ఆకాశంలో వెళ్లేవాళ్లను, వాయులోకంలో వుండేవాళ్లను, జ్యోతిర్లోకంలో వుండేవాళ్లను, వజ్రాయుధంకంటే అధికశక్తిగల గోళ్ళుగలవాడు, గొప్ప జూలును కల్గినరాజు

దైత్యగర్భస్రావిగర్జీ నిర్జితాశేషరాక్షసః ।
మహానాదైర్వీక్షితైశ్చ ప్రలయానిల సంనిభైః ॥ 8 ॥

చపేటై రస్త్ర విక్షేపై రసురాన్ పర్యచూర్ణయత్ ।
ఏవం హత్వా బహువిధాన్ గౌతమీమగమద్ధరిః ॥ 9 ॥

దైత్యుల గర్భాలు జారిపోయేటట్లు గర్జించేవాడు. రాక్షసులందరిని సంహరించినవాడు, గొప్పనాదాలతో, తీక్ష్ణమైన చూపులతో, ప్రళయకాలంలో వాయువు చేసే శబ్దంలాగా, పటపటధ్వనులతో, ప్రేగులను విసిరివేస్తూ రాక్షసులను నరసింహుడు పిండిపిండి జేశాడు. ఇట్లు అనేక విధాలుగా ఉన్న వాళ్ళను చంపి ఆ హరి గౌతమీనది వద్దకు చేరాడు.

స్వపదాంబుజ సంభూతాం మనోనయననన్దినీమ్ ।
తత్రామ్బుర్య ఇతి ఖ్యాతో దణ్డకాధిపతే రిపుః ॥ 10 ॥

తన పాదపద్మాలనుండి పుట్టిన, మనోనయనాల కానందం కలుగజేసే గౌతమీనది వద్దకాహరి చేరాడు. అక్కడ దండకాధిపతికి శత్రువగు అంబర్యుడనువాడుండేవాడు.

దేవానాం దుర్జయో యోద్ధా బలేన మహతాఽఽవృతః ।
తేనాభవన్మహారౌద్రం భీషణం లోమహర్షణమ్ ॥ 11 ॥

శస్త్రాస్త్రవర్షణం యుద్ధం హరిణా దైత్యసూనునా ।
నిజఘాన హరిః శ్రీమాన్ తం రిపుం హ్యుత్తరే తటే ॥ 12 ॥

అతడు దేవతలు జయించలేని యోధుడు. గొప్ప సైన్యంతో కూడినవాడు. అతనితో భయంకరం, రోమ హర్షణమూ అయిన (యుద్ధం జరిగింది) యుద్ధం శ్రీహరికి రాక్షసునితో జరిగింది. వాళ్లిద్దరు శస్త్రాస్త్రాలను వర్షంవలె ప్రయోగించారు, గంగానది ఉత్తరతీరాన శ్రీహరి (అతణ్ణి) చంపాడు. ఆ శత్రువును

గంగాయాం నరసింహం తు తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
స్నానదానాదికం తత్ర సర్వపాపగ్రహార్దనమ్ ॥ 13 ॥

గంగానదివద్ద ఉండే ఆ నరసింహతీర్థం ముల్లోకప్రసిద్ధమైంది. అక్కడ స్నానదానాదులు చేసిన సమస్తపాప గ్రహాలన్నీ నశిస్తాయి.

సర్వరక్షాకరం నిత్యం జరామరణవారణమ్ ।
యథా సురాణాం సర్వేషాం న కోఽపి హరిణా సమః ॥ 14 ॥

తీర్థానామప్యశేషాణాం తథా తత్తీర్థముత్తమమ్ ।
తత్ర తీర్థే నరః స్నాత్వా కుర్యాన్నృహరిపూజనమ్ ॥ 15 ॥

ఆ తీర్థం సర్వరక్షాకరం. ముసలితనాన్ని, మరణాన్ని రాకుండా చేస్తుంది. అందరూ దేవతలవలె ఉంటారు. హరితో సమానమైనవాడెవడూ లేనట్లే. తీర్థాలన్నింటిలో నరసింహతీర్థముత్తమమైంది. అక్కడి తీర్థంలో స్నానంచేసి నరహరిని పూజించినవాడు,

స్వర్గే మర్త్యే తలే వాఽపి తస్య కించిన్న దుర్లభమ్ ।
ఇత్యాద్యష్టౌ మునే తత్ర మహాతీర్థాని నారద ॥ 16 ॥

స్వర్గమర్త్య పాతాళలోకాలలో అతనికి దుర్లభం అనేది లేదు. ఓ నారదమునీ! అక్కడ ఎనిమిది మహా తీర్థాలున్నాయి.

పృథక్ పృథక్ తీర్థకోటి ఫలమాహుర్మనీషిణః ।
అశ్రద్ధయాఽపి యన్నామ్ని స్మృతే సర్వాఘసంక్షయః ॥ 17 ॥

ఒక్కొక్కటి కోటి తీర్థాల ఫలమిస్తుందని పెద్దలంటారు. అశ్రద్ధగానైనా దానిపేరు తలచినా సర్వపాపాలు నశిస్తాయి.

భవేత్సాక్షాన్నృసింహోఽసౌ సర్వదా యత్ర సంస్థితః ॥
తత్తీర్థసేవా సంజాతం ఫలం కైరిహ వర్ణ్యతే ॥ 18 ॥

నరసింహుడే అక్కడ సాక్షాత్తుగా ఉంటాడు. సర్వదా అతడున్నచోట ఉండే ఆ తీర్థాన్ని సేవించిన ఫలాన్నెవరు వర్ణిస్తారు?

యథా న దేవో నృహరేరధికః క్వాపి వర్తతే ।
తథా నృసింహతీర్థేన సమం తీర్థం న కుత్రచిత్ ॥ 19 ॥

నరసింహుని కంటే అధికుడగు దేవుడెలా ఎక్కడకూడా వుండడో, అట్లే నరసింహతీర్థంతో సమానమైన తీర్థమెక్కడా వుండదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే నారసింహాద్యష్టతీర్థవర్ణనం నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥ 79 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో నారసింహతీర్థం మొదలుగాగల ఎనిమిది తీర్థాల వర్ణనమనే పేరుగల డెబ్బై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అశీతితమోఽధ్యాయః – ఎనభైయవ అధ్యాయం

పిశాచాది శతత్రయ తీర్థవర్ణనమ్ – పిశాచాది మూడువందల తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

పైశాచం తీర్థమాఖ్యాతం గంగాయా ఉత్తరే తటే ।
పిశాచత్వాత్పురా విప్రో ముక్తిమాప మహామతే ॥ 1 ॥

ఓ మహామతీ! గంగానదికి ఉత్తరతీరాన పైశాచమనే తీర్థముంది. పూర్వమొక విప్రుడు పిశాచత్వంనుండి అక్కడ ముక్తి పొందాడు.

సుయవస్యాఽఽత్మజో లోకే జీగర్తిరితి విశ్రుతః ।
కుటుమ్బభారదుఃఖార్తో దుర్భిక్షేణ చ పీడితః ॥ 2 ॥

ఈ లోకంలో సుయవుడనేవాని కుమారుడు అజీగర్తుడనే వాడుండేవాడు. అక్కడ దుర్భిక్షమేర్పడగా పీడితుడై, అతడు కుటుంబభారంతో దుఃఖార్తుడై ఉండినాడు.

మధ్యమం తు శునఃశేపం పుత్రం బ్రహ్మవిదాం వరమ్ ।
విక్రీతవాన్ క్షత్రియాయ వధాయ బహులైర్ధనైః ॥ 3 ॥

అతని మధ్యమపుత్రుడు శునఃశేపుడనేవాడుండేవాడు. అతడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు. ఒక క్షత్రియుని వద్ద చాలా ధనాన్ని తీసుకొని నరమేధానికై అతనికి అమ్మాడు.

కిం నామాఽఽపద్గతః పాపం నాఽఽచరత్యపి పణ్డితః ।
శమితృత్వే ధనం చాపి జగృహే బహులం మునిః ॥ 4 ॥

ఆపదలో ఉన్నప్పుడు ఎంత పండితుడైనాసరే పాపం చేయకుండా ఎలా వుంటాడు? చాలా ధనమతణ్ణి శమింపజేయగా ఆ ముని అధికమైన ధనాన్ని గ్రహించాడు. తీసుకొన్నాడు.

విదారణార్థం చ ధనం జగృహే బ్రాహ్మణాధమః ।
తతోఽప్రతిసమాధేయ మహారోగనిపీడితః ॥ 5 ॥

ఆ బ్రాహ్మణాధముడు నరమేధంకోసం ధనాన్ని తీసుకొన్నాడు. అందువల్ల తగ్గించలేని రోగపీడితుడైనాడు.

స మృతః కాలపర్యాయే నరకేష్వథ పాతితః ।
భోగాదృతే న క్షయోఽస్తి ప్రాక్తనానామిహాంహసామ్ ॥ 6 ॥

కాలచక్రభ్రమణంలో అతడు మరణించాడు. అతణ్ణి నరకాలలో పడవేశారు. తాము పూర్వజన్మలోను ఈ జన్మలోనూ చేసిన పాపాలననుభవించుట కంటే క్షయం మరొకటి లేదు.

కింకరైర్యమవాక్యేన బహుయోన్యన్తరం గతః ।
తతః పిశాచో హ్యభవద్దారుణో దారుణాకృతిః ॥ 7 ॥

యముని ఆజ్ఞప్రకారం కింకరులు పడవేయగా నతడు అనేక జన్మలనెత్తాడు. ఆ తర్వాత దారుణమైన పిశాచమై భయంకరాకారాన్ని పొందాడు.

శుష్కకాష్ఠే తథారణ్యే నిర్జలే నిర్జనే తథా ।
గ్రీష్మే గ్రీష్మదవవ్యాప్తే క్షిప్యతే యమకింకరైః ॥ 8 ॥

యమకింకరులతనిని ఎండిన కఱ్ఱలో, అరణ్యంలో, నీరు లేని చోటులో, జనం లేని చోటులో, ఎండలో, ఎండలో మండే అగ్నిలో పడవేశారు.

కన్యాపుత్రమహీవాజిగవాంవిక్రియకారిణః ।
నరకాన్న నివర్తన్తే యావదా భూతసంప్లవమ్ ॥ 9 ॥

కన్యలను, కుమారులను, భూమిని, గుఱ్ఱాలను, గోవులను అమ్ముకునేవారు పంచభూతాలన్నీ ఒకటయ్యే వరకు (ప్రళయం వరకు) నరకంనుండి తిరిగిరారు.

స్వకృతాఘవిపాకేన దారుణైర్యమకింకరైః ।
సంఘాతే పచ్యమానోఽసౌ రురోదోచ్చైః కృతం స్మరన్ ॥ 10 ॥

తాను చేసిన పాపం పరిపక్వమగుటచే యమకింకరులు కొట్టగా, వండగా నితడు గట్టిగా నేడ్చుచు తాను చేసింది స్మరిస్తూ గట్టిగా ఏడ్చేవాడు.

పథి గచ్ఛన్ కదాచిత్స జీగర్తేర్మధ్యమః సుతః ।
శుశ్రావ రుదతో వాణీం పిశాచస్య ముహుర్ముహుః ॥ 11 ॥

ఒకనాడు అజీగర్తుని మధ్యమ కుమారుడు మార్గమధ్యమున మాటిమాటికి ఏడుస్తు పిశాచముయొక్క రోదన శబ్దాన్ని విన్నాడు.

పుత్రక్రేతుర్బ్రహ్మహన్తుర్జీగర్తేస్తు పితుస్తదా ।
పాపినః పుత్రవిక్రేతుర్బ్రహ్మహన్తుః పితుశ్చ తామ్ ॥ 12 ॥

అప్పుడతడు కుమారుని అమ్మినవాడు, బ్రహ్మహంతకుడు పాపి, పుత్రవిక్రేత, బ్రహ్మహంత అయిన తండ్రి జీగర్తుని రోదనను విన్నాడు.

శునఃశేపస్తదోవాచ కో భవానతిదుఃఖితః ।
జీగర్తి రబ్రవీద్దుఃఖాచ్ఛునఃశేపపితా హ్యహమ్ ॥ 13 ॥

శునఃశేపుడా మిక్కిలి దుఃఖిస్తున్నవాణ్ణి నీవెవరని అడిగాడు. జీగర్తుడు దుఃఖిస్తూ నేను శునఃశేపుని తండ్రినన్నాడు.

పాపీయసీం క్రియాం కృత్వా యోనిం ప్రాప్తోఽస్మి దారుణామ్ ।
నరకేష్వథ పక్వశ్చ పునః ప్రాప్తోఽన్తరాలకమ్ ॥
యే యే దుష్కృత కర్మాణః తేషాం తేషా మియం గతిః ॥ 14 ॥

పాపపు పనిని చేసి ఈ దారుణమైన జన్మనెత్తాను. నరకాలలో పాపఫలాలననుభవించి తిరిగి అంతరాళాన్ని చేరుకున్నాను. నేను చేసిన చెడ్డపనులేవేవి ఉన్నాయో వాటికీ గతి పొందాను.

జీగర్తిపుత్రస్తమువాచ దుఃఖాత్సోఽహం సుతస్తే మమ దోషేణ తాత ।
విక్రీత్వా మాం నరకానేవ ప్రాప్తస్తతః కరిష్యే స్వర్గతం త్వామిదానీమ్ ॥ 15 ॥

జీగర్తుని కుమారుడు దుఃఖిస్తూ అతనితో అన్నాడు. తండ్రీ! నేను నీ కుమారుణ్ణి. నన్ను అమ్మిన తప్పువలననే నీవు నరకాన్ని పొందావు. అందువలన ఇప్పుడు ఆ నరకాలనుండి స్వర్గం చేరునట్లు చేస్తాను.

ఏవం ప్రతిజ్ఞాయ స గాధిపుత్ర పుత్రత్వ మాప్తోఽథ మునిప్రవీరః ।
గంగామభిధ్యాయ పితుశ్చ లోకాననుత్తమానీహమానో జగామ ॥ 16 ॥

ఇలా ప్రతిజ్ఞచేసి ఆ మునికుమారుడు విశ్వామిత్రునకు పుత్రుడుగానయి, గంగాదేవికి నమస్కరించి ధ్యానించి తన తండ్రికి ఉత్తమలోకాలను కోరుతూ బయలుదేరాడు.

అశేష దుఃఖానలధూపితానాం నిమజ్జతాం మోహమహాసముద్రే ।
శరీరిణాం నాన్యదహో త్రిలోక్యామాలమ్బనం విష్ణుపదీం విహాయ ॥ 17 ॥

మిక్కిలి దుఃఖాగ్ని ధూపాల బారినపడినవారికి, మోహమనే మహాసముద్రంలో మునిగి పోయేవారికి ముల్లోకాలలో ఆధారంగా పట్టుకొనుటకు విష్ణుపాదాలు తప్ప మరొక దారిలేదు.

ఏవం వినిశ్చిత్యమునిర్మహాత్మా సముద్దిధీర్షుః పితరం సదుర్గతేః ।
శుచిస్తతో గౌతమీమాశు గత్వా తత్ర స్నాత్వా సంస్మరన్ శంభువిష్ణూ ॥ 18 ॥

దదౌ జలం ప్రేతరూపాయ పిత్రే పిశాచరూపాయ సుదుఃఖితాయ ।
తద్దానమాత్రేణ తదైవ పూతోజీగర్తిరావాప వపుః సుపుణ్యమ్ ॥ 19 ॥

ఇలా నిశ్చయించుకొని ఆ మహాత్ముడైన ముని తన తండ్రిని దుర్గతినుండి ఉద్ధరించగోరినవాడై గౌతమీనది వద్దకు వేగంగా వెళ్ళి స్నానం చేసి శుచియై శివకేశవులను స్మరిస్తూ, పిశాచరూపంలో ఉండి మిక్కిలి దుఃఖిస్తున్న ప్రేతరూపంతో వున్న తండ్రికి నీటితో తర్పణం చేశాడు. నీటిని దానం చేసినంతమాత్రముననే వెంటనే అజీగర్తి పవిత్రుడై పుణ్యశరీరాన్ని పొందాడు.

విమానయుక్తః సురసంఘజుష్టం విష్ణోః పదం ప్రాప సుతప్రభావాత్ ।
గంగా ప్రభావాచ్చ హరేశ్చ శంభోః విధాతురర్కాయుతతుల్యతేజాః ॥ 20 ॥

తన కుమారుని ప్రభావంవల్ల, గంగానది ప్రభావం వల్ల, విష్ణువుయొక్క,శివునియొక్క బ్రహ్మయొక్క అనుగ్రహం వల్ల పదివేల సూర్యులకాంతితో సమానమైన తేజస్సుగలవాడై దేవతలందరితో గూడి విమానాన్నెక్కి వైకుంఠాన్ని చేరాడు.

తతః ప్రభృత్యేతదతిప్రసిద్ధం పైశాచనాశం చ మహాగదం చ ।
మహాన్తి పాపాని చ నాశమాశు ప్రయాన్తి యస్య స్మరణేన పుంసామ్ ॥ 21 ॥

ఈ తీర్థం అప్పటి నుండి పైశాచనాశమని, మహాగదమని మిక్కిలి ప్రసిద్ధి చెందింది. దీన్ని స్మరించినంత మాత్రముననే మానవులు మహాపాపాలనుండి త్వరగా విముక్తులవుతారు.

తీర్థస్య చేదం గదితం తవాద్య మాహాత్మ్య మేతత్త్రిశతాని యత్ర ।
తీర్థాన్యథాన్యాని భవన్తి భుక్తిముక్తిప్రదాయీని కిమన్యదత్ర ॥ 22 ॥

నేనీనాడు నీకు ఈ తీర్థమాహాత్మ్యాన్ని చెప్పాను. ఇదికాక ఇంకా మూడువందల తీర్థాలు, ఇతర తీర్థాలు కూడా భుక్తినీ, ముక్తినీ యిచ్చేవి ఉన్నాయి. ఇంకేమి కావాలి?

సర్వసిద్ధిదమాఖ్యాతమిత్యాద్యత్ర శతత్రయమ్ ।
తీర్థానాం మునిజుష్టానాం స్మరణాదప్యభీష్టదమ్ ॥ 23 ॥

సర్వసిద్ధులను కలుగజేసే, మునులచే సేవించబడిన, స్మరించినంత మాత్రముననే అభీష్టములనిచ్చే మూడువందల తీర్థాలగూర్చి చెప్పాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే పిశాచాది శతత్రయతీర్థవర్ణనం నామ అశీతితమోఽధ్యాయః ॥ 80 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యములోని పిశాచాది మూడువందల తీర్థాల వర్ణనమనే పేరుగల ఎనబైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకాశీతితమోఽధ్యాయః – ఎనబై ఒకటవ అధ్యాయం

నిమ్నభేదాది సప్తశతతీర్థ వర్ణనమ్ – నిమ్నభేదాది సప్తశతతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

నిమ్నభేదమితిఖ్యాతం సర్వపాపప్రణాశనమ్ ।
గంగాయా ఉత్తరే పారే తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ॥ 1 ॥

గంగానదికి ఉత్తరతీరంలో నిమ్నభేదమనే తీర్థం ఉంది, ఇది ముల్లోకాలలోను ప్రసిద్ధి చెందింది. సమస్త పాపాలను నశింపచేస్తుంది.

యస్య సంస్మరణేనాపి సర్వపాపక్షయో భవేత్ ।
వేదద్వీపస్య తత్రైవ దర్శనాద్వేదవిద్భవేత్ ॥ 2 ॥

ఆ తీర్థాన్ని స్మరిస్తే సమస్తపాపాలు నశిస్తాయి. అక్కడుండే వేదద్వీపాన్ని దర్శిస్తే వేదవేత్త అవుతాడు.

ఊర్వశీం చకమే రాజా ఐలః పరమధార్మికః ।
కో న మోహముపాయాతి విలోక్య మదిరేక్షణామ్ ॥ 3 ॥

ఐలుడను పరమధార్మికుడగు రాజు ఊర్వశి యందు కోరిక గల వాడైనాడు. కామించాడు. మత్తిల్లిన చూపులుగల దాన్ని చూసి ఎవడు మోహాన్ని పొందడు?

సా ప్రాయాద్యత్ర రాజాఽసౌ ఘృతం స్తోకం సమశ్నుతే ।
అనగ్నదర్శనాత్కృత్వా తస్యాః కాలావధిం నృపః ॥ 4 ॥

తాం స్వీచకార లలనాం యూనాం రమ్యాం నవాం నవామ్ ।
సుప్తాయాం శయనే తస్యాం సముత్తస్థౌ పురూరవాః ॥ 5 ॥

రాజు స్వల్ప పరిమాణంగా నేతిని తింటున్న సమయంలో ఆమె వెళ్ళింది. నగ్నంగా తన్ను చూచేవరకూ కాలావధి నిర్ణయించుకొని ఆమెను రాజు దర్శించుట వల్ల ఆ కోమలమూ, యౌవనమూ, నవసౌందర్యమూగల ఆమెను స్వీకరించాడు. ఆమె పడకలో పడుకొన్న తర్వాత పురూరవుడు లేచాడు.

విలోక్య తం వివసనం తదైవాసౌ వినిర్గతా ।
విద్యుచ్చంచలచిత్తానాం క్వస్థైర్యం నను యోషితామ్ ॥ 6 ॥

దిగంబరంగా ఉన్న అతనిని చూడగానే ఆమె బయటకు వెళ్ళింది. విద్యుత్తువలె చంచలస్వభావం గల స్త్రీలకు స్థైర్యం ఎక్కడవుంటుంది.

ఏతస్మిన్నన్తరే రాజా యుద్ధాయాగాత్ రిపూన్ ప్రతి ॥ 7 ॥

ఇంతలో రాజు శత్రువులతో యుద్ధం చేయడానికి వెళ్లాడు.

తాన్‌జిత్వా పునరప్యాగాద్దేవలోకం సుపూజితమ్ ।
స చాஉఽగత్య మహారాజో వశిష్ఠాచ్చ పురోధసః ॥ 8 ॥

ఉర్వశ్యా గమనం శ్రుత్వా తతో దుఃఖసమన్వితః ।
న జుహోతి న చాశ్నాతి న శృణోతి న పశ్యతి ॥ 9 ॥

శత్రువులను జయించి ఆ మహారాజు తిరిగి వచ్చాడు. ఊర్వశి పూజనీయమైన దేవలోకానికి తిరిగి వచ్చింది. యుద్ధం నుండి తిరిగి వచ్చిన మహారాజు పురోహితుడైన వశిష్ఠుని వలన ఊర్వశి వెళ్ళి పోయిందని విని అతడు మిక్కిలి దుఃఖించినవాడై యజ్ఞాన్ని చేయడు, భుజించడు, వినడు, చూడడు.

ఏతస్మిన్నన్తరే తత్ర మృతావస్థం నృపోత్తమమ్ ।
బోధయామాస వాక్యైశ్చ హేతుభూతైః పురోహితః ॥ 10 ॥

ఇంతలోనే అక్కడ మరణావస్థలో నున్న ఆ రాజశేఖరుని పురోహితుడు సహేతుకములూ, హితకరములూ అయిన మాటలతో ఉద్బోధించాడు.

వసిష్ఠ ఉవాచ :- వసిష్ఠుడు పలికాడు.

సా మృతాஉఽద్య మహారాజ మాశుచస్త్వం మహామతే ।
ఏవం స్థితం తు మా త్వాం వై అశివాః స్పృశ్యురాశుగాః ॥ 11 ॥

ఓ మహారాజా! ఆమె ఈ రోజు మరణించింది. ఓ మహామతీ! నీవు దుఃఖించకుము. ఇట్లు నీవుంటే అమంగళములు త్వరగానే నిన్ను స్పృశించగలవు.

నవై స్త్రైణాని జానీషే హృదయాని మహామతే ।
శాలావృకాణాం యాదృంశి తస్మాత్త్వం భూప మా శుచః ॥ 12 ॥

ఓ మహామతీ! స్త్రీల హృదయాలు నీకు తెలియవు. వాళ్ళ హృదయాలు కొట్టంలో నున్న తోడేళ్లలాంటివి. కావున రాజా! నువ్వు దుఃఖించకు.

కో నామ లోకే రాజేన్ద్ర కామినీభిర్నవంచితః ।
వంచకత్వం నృశంసత్వం చంచలత్వం కుశీలతా ॥ 13 ॥

ఇతి స్వాభావికం యాసాం తాః కథం సుఖహేతవః ।
కాలేన కో నిహితః కోஉఽర్థీ గౌరవమాగతః ॥ 14 ॥

ఓ రాజేంద్రా! లోకంలో కామిను మోసగించని దెవరిని? మోసం, హింస, చంచలత్వం, కుశీలత అనునవి వారికి స్వాభావికమైన గుణములు. వాళ్లెలా సుఖ మాత్రహేతువులతారు? ఈ కాలం మధ్యలో ఎవరున్నారు? అర్థించిన వాడెవడు గౌరవం పొందినాడు?

శ్రియా న భ్రమితః కో వా యోషిద్భిః కో న ఖండితః ।
స్వప్నమాయోపమా రాజన్ మదవిప్లుతచేతసః ॥ 15 ॥

ఓ రాజా! సంపదతో ఎవడు భ్రమను పొందలేదు? స్త్రీలతోనెవడు ఖండింప బడలేదు? మదంతో విపరీతమైన చేతసులు కలలోని మాయలాంటివారు.

సుఖాయ యోషితః కస్య జ్ఞాత్వైతద్ధి స్థిరో భవ ।
విహాయ శంకరం విష్ణుం గౌతమీం వా మహామతే ॥

దుఃఖినాం శరణం నాన్యద్విద్యతే భువనత్రయే ॥ 16 ॥

ఓ మహాజ్ఞానీ! స్త్రీలు ఎవరిని సుఖపెడతారు? దీనిని తెలుసుకొని నిశ్చింతగా నుండుము. శంకరుని, విష్ణువును, గౌతమిని వదిలి, తక్కిన వారినెవరిని గూడా ఈ ముల్లోకాలలో శరణు పొందుటకు అవకాశం లేదు. వారెవరూ రక్షించరు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా తతో రాజా దుఃఖం సంహృత్య యత్నతః ।
గౌతమ్యా మధ్యసంస్థోఽసావైలః పరమధార్మికః ॥ 17 ॥

తత్ర చాఽఽరాధయామాస శివం దేవం జనార్దనమ్ ।
బ్రహ్మాణం భాస్కరం గంగాం దేవానన్యాంశ్చ యత్నతః ॥ 18 ॥

ఈ మాటను విని పరమధార్మికుడు రాజుఐన ఐలుడు అతికష్టంగా దుఃఖాన్ని దిగమింగుకొని గౌతమీనది మధ్యలోనుండి అక్కడ శివుణ్ణి, విష్ణువును, బ్రహ్మను, సూర్యుణ్ణి, గంగను ఇతర దేవతలను కూడా శ్రద్ధగా నారాధించాడు.

యో విపన్నో న తీర్థాని దేవతాశ్చ న సేవతే ।
సకాలవశగో జన్తుః కాం దశామనుయాస్యతి ॥ 19 ॥

తదీశ్వరైకశరణో గౌతమీసేవనోత్సుకః ।
పరాం శ్రద్ధాముపగతః సంసారాస్థాపరాఙ్ముఖః ॥ 20 ॥

ఆపదలు కలిగిన వాడెవడైనా తీర్థాలను సేవించడో, దేవతలను సేవించడో అటువంటి జీవుడు కాలవశుడై ఎటువంటి దశను పొందుతాడో? అందువలన అతడు ఈశ్వరుణ్ణే శరణు పొంది సంసారంలో విరక్తుడై మిక్కిలి శ్రద్ధతో గౌతమిని సేవించుటకై ఉత్సుకుడై.

ఈజే యజ్ఞాంశ్చ బహులానృత్విగ్భిర్బహుదక్షిణాన్ ।
వేదద్వీపోఽభవత్తేన యజ్ఞద్వీపః స ఉచ్యతే ॥ 21 ॥

పౌర్ణమాస్యాం తు శర్వర్యాం తత్రాఽఽయాతి సదోర్వశీ ।
తస్య ద్వీపస్య యః కుర్యాత్ప్రదక్షిణమథో నరః ॥ 22 ॥

ప్రదక్షిణీకృతా తేన పృథివీ సాగరామ్బరా ।
వేదానాం స్మరణం తత్ర యజ్ఞానాం స్మరణం తథా ॥ 23 ॥

సుకృతీ యః కుర్యా ద్వేదయజ్ఞఫలం లభేత్ ।
ఐలతీర్థం తు తజ్జ్ఞేయం తదేవ చ పురూరవమ్ ॥ 24 ॥

అనేక యజ్ఞాలు చేశాడు. ఋత్విక్కులకు అనేకాలైన దక్షిణలనిచ్చాడు. అతనివల్ల ఆ ప్రదేశం వేద ద్వీపమయ్యింది. దానినే యజ్ఞద్వీపమని కూడా అంటారు. ప్రతి పౌర్ణమిరాత్రి యందు అక్కడికి ఊర్వశి వస్తుంది. ఎవరు ఆ ద్వీపానికి ప్రదక్షిణం చేస్తారో, ఆ ద్వీపప్రదక్షిణ ప్రభావం వల్ల అతడు భూమిని, సముద్రాన్ని, ఆకాశాన్ని ప్రదక్షిణం చేసిన ఫలం పొందుతాడు. అక్కడ వేదాలను స్మరించినా, యజ్ఞాలను స్మరించినా అతడు వేదయజ్ఞ ఫలాల్ని పొందుతాడు. దానిని ఐల తీర్థమని, దాన్నే పురూరవతీర్థమని కూడా అంటారు.

వాసిష్ఠం చాపి తత్తుస్యాన్నిమ్నభేదం తదుచ్యతే ।
ఐలే రాజ్ఞి న కించిత్స్యాన్నిమ్నం సర్వేషు కర్మసు ॥ 25 ॥

దానినే వాసిష్ఠమనీ, నిమ్నభేదమనీ అంటారు. ఇలమహారాజుయందు అన్ని పనులలో కూడా కొంచమైనను నిమ్నం కాలేదు.

యదేతన్నిమ్నమూర్వశ్యాం సర్వభావేన వర్తనమ్ ।
తచ్చాపి భేదితం నిమ్నం వసిష్ఠేన చ గంగయా ॥ 26 ॥

ఉర్వశి యందు సర్వవిధములుగా నెట్లు ఈ నిమ్నత్వము కలిగెనో అదికూడా వసిష్ఠుడివల్ల గంగవల్ల నిమ్నత్వం భేదించింది.

నిమ్నభేదమభూత్తేన దృష్టాదృష్టేష్ట సిద్ధిదమ్ ।
తత్ర సప్తశతాన్యాహుస్తీర్థాని గుణవన్తి చ ॥ 27 ॥

దృష్టా దృష్టార్థఫలములనిచ్చేదిగా నిమ్న భేదమైంది. అక్కడ ఏడు వందల గుణవంతాలైన తీర్థములున్నాయి.

తేషు స్నానం చ దానం చ సర్వక్రతుఫలప్రదమ్ ।
స్నానం కృత్వా నిమ్నభేదే యః పశ్యతి సురానిమాన్ ॥ 28 ॥

ఇహ చాముత్ర వా నిమ్నం న కించిత్తస్య విద్యతే ।
సర్వోన్నతిమవాప్యాసౌ మోదతే దివి శక్రవత్ ॥ 29 ॥

వానిలో స్నానదానాలు చేసినా సమస్త క్రతువులాచరించిన ఫలం లభిస్తుంది. ఎవరైతే నిమ్న భేదమునందు స్నానం చేసి దేవతలను దర్శిస్తారో, వారికి ఈలోకంలో, పైలోకంలోను నిమ్నమనేది ఉండదు. అతడు సర్వోన్నతిని పొంది, స్వర్గంలోని ఇంద్రునిలాగా సుఖిస్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే నిమ్నభేదాది సప్తశతతీర్థ వర్ణనం నామైకాశీతి తమోఽధ్యాయః ॥ 81 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలోని నిమ్నభేదం మొదలుగాగల ఏడు వందల తీర్థముల వర్ణనమనే పేరుగల ఎనబై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వ్యశీతితమోऽధ్యాయః - ఎనబై రెండవ అధ్యాయం

నన్దీతీర్థాది పంచసహస్రతీర్థ వర్ణనమ్ - నందితీర్థం మున్నగు ఐదువేల తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

నన్దీతటమితిఖ్యాతం తీర్థం వేదవిదో విదుః ।
తస్య ప్రభావం వక్ష్యామి శృణు యత్నేన నారద ॥ 1 ॥

ఓ నారదా! వేదవేత్తలు ప్రఖ్యాతమైనదిగా చెప్పిన నన్దీతట మనే నది ఉంది. దాని ప్రభావాన్ని చెబుతున్నాను శ్రద్ధగా విను.

అత్రిపుత్రో మహాతేజాశ్చన్ద్రమా ఇతి విశ్రుతః ।
సర్వాన్వేదాంశ్చ విధివద్ధనుర్వేదం యథావిధి ॥ 2 ॥

అధీత్య జీవాత్సర్వాశ్చ విద్యాశ్చాన్యా మహామతే ।
గురుపూజాం కరోమీతి జీవమాహ స చంద్రమాః ॥
బృహస్పతిస్తదా ప్రాహ చంద్రం శిష్యం ముదాన్వితః ॥ 3 ॥

అత్రి మహర్షికి గొప్ప తేజస్సు గలిగిన చంద్రుడను పేరుగల పుత్రుడున్నాడు. అతడు శాస్త్రప్రకారంగా చతుర్వేదాలను, ధనుర్వేదాన్నీ, ఇతరమైన అన్నివిద్యలను గూడా బృహస్పతి వద్ద అభ్యసించి, చంద్రుడు బృహస్పతిని గురుపూజ చేస్తానని అడిగాడు. అప్పుడు బృహస్పతి సంతోషించి తన శిష్యుడైన చంద్రునితో నిట్లన్నాడు.

బృహస్పతి రువాచ :- బృహస్పతి పలికాడు.

మమ ప్రియా తు జానీతే తారా రతిసమప్రభా ॥ 4 ॥

రతీదేవితో సమానమైన కాంతిగల నాభార్య తార యెరుగును.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ప్రష్టుం తాం చ తదా ప్రాయాదన్తర్వేశ్మ సచంద్రమాః ।
తారాం తారాముఖీం దృష్ట్వా జగృహే తాం కరేణ సః ॥ 5 ॥

ఆమెనడుగుటకై చంద్రుడు అంతఃపురములోకి వెళ్ళాడు. నక్షత్రంవలె మెరిసిపోతున్న ముఖం గల తారను చూసి చంద్రుడామెను చేతితో పట్టుకొన్నాడు.

స్వవేశ్మ ప్రతి తాం లోభాద్బలాదాకర్షయత్తదా ।
తావద్ధైర్యనిధిర్ జ్ఞానీ మతిమాన్విజితేన్ద్రియః ॥ 6 ॥

అప్పుడతడాశతో ఆమెను తన ఇంటిలోకి లాగినాడు. ధైర్యవంతుడు, జ్ఞానియైనవాడు, తెలివి గలవాడు, జితేంద్రియుడు.

యావన్న కామినీ నేత్ర వాగురాభిర్నిబధ్యతే ।
విశేషతో రహః సంస్థాం కామినీమాయతేక్షణామ్ ॥ 7 ॥

విలోక్యనమనో యాతి కస్య కామేషు వశ్యతామ్ ।
అతఏవాన్యపురుష దర్శనం న కదాచన ॥ 8 ॥

ఎంత వరకైతే కామినీ నయనబాణాలకు గురికాడో, వారి వాలుచూపులకు లొంగడో, ముఖ్యంగా రహస్యంగా వున్న విశాలమైన కన్నులు గల కామినిని చూచిగూడ ఎవని మనస్సు కోరికలకు వశం కాదో అంతవరకే పై గుణాలు గలవాడౌతాడు. అందువలననే అన్యపురుషదర్శనం కూడా ఎప్పుడు తగదు.

కులవధ్వా రహః కార్యం భీతయా శీలవిప్లుతేః ।
విజ్ఞాయ తత్పరిజనాత్సహసోత్థాయ నిర్గతః ॥ 9 ॥

కులస్త్రీతో రహస్యంగా, భయంతో కలవడం శీలానికి మచ్చఅని అది చుట్టూ ఉన్నవారి ద్వారా కూడా తెలుసుకొని వెంటనేలేచి బయటకు వెళ్ళినాడు.

దృష్ట్వా తద్దుష్కృతం కర్మ బృహస్పతిరుదారధీః ।
శశాప కోపాచ్చాఽక్షిప్య వాగ్భిర్విప్రియకారిభిః ॥ 10 ॥

చంద్రుడు చేసిన చెడ్డపనిని చూచిన ఉదారబుద్ధి గలిగిన బృహస్పతి కోపంతో చంద్రునిపైన నేరం చూపి విప్రియాన్ని కలిగించే మాటలతో శపించాడు.

పరాభిభూతా మాలోక్య కాన్తాం కః సోఢుమీశ్వరః ।
యుయుధే తేన జీవోఽపి దేవైశ్చన్ద్రమసా రుషా ॥ 11 ॥

ఇతరులచేత లొంగదీసుకోబడిన భార్యను చూచి ఏ భర్త మాత్రం సహిస్తాడు? అందువలన కోపంతో బృహస్పతి దేవతలతో ఆ చంద్రునితోకూడ యుద్ధం చేశాడు.

న శాపైర్హన్యతే చన్ద్రో నాఽఽయుధైః సురమన్త్రితైః ।
బృహస్పతి ప్రణీతైశ్చ న మన్త్రైర్హన్యతే శశీ ॥ 12 ॥

చంద్రుడు శాపాలతో, దేవతా మన్త్రాలతో గూడిన అస్త్రాలతోకూడా చావడు, ఆ చంద్రుడు బృహస్పతి రచించిన మంత్రములతో నూ చావడు.

తదా చంద్రస్తు తాం తారాం నీత్వా సంస్థాప్య మన్దిరే ।
బుభుజే బహు వర్షాణి రోహిణీం చాకుతోభయః ॥ 13 ॥

అప్పుడు చంద్రుడు తారను తన మందిరానికి తీసుకొని వెళ్ళి వుంచి ఏ మాత్రం భయం లేకుండా అనేక సంవత్సరాలు రోహిణిని కూడా అనుభవించాడు.

న జీయేత తదా దేవైర్న కోపై శ్శాపమన్త్రకైః ।
న రాజభి ర్న ఋషిభి ర్న సామ్నా భేదదణ్డనైః ॥ 14 ॥

అప్పుడు దేవతలుగాని, కోపశాపమంత్రాలు గాని, రాజులుగాని, ఋషులుగాని సామ దాన భేద దండోపాయాలుగాని అతణ్ణి జయించలేకపోయాయి.

యదా భార్యాం న లేభేఽసౌ గురుః సర్వప్రయత్నతః ।
సర్వోపాయక్షయే జీవః తదా నీతి మథాస్మరత్ ॥ 15 ॥

ఎన్ని ప్రయత్నాలు చేసినా బృహస్పతి తన భార్యను పొందలేక ఉపాయాలన్నీ నిష్ఫలాలుకాగా గురుడు అప్పుడు నీతిని స్మరించాడు.

అపమానం పురస్కృత్య మానం కృత్వా తు పృష్ఠతః।
స్వార్థ ముద్ధరతే ప్రాజ్ఞః స్వార్థభ్రంశో హి మూర్ఖతా ॥ 16 ॥

అవమానమును ముందుంచుకొని, అభిమానమును వెనుక పెట్టుకొని ఎవడు స్వార్థాన్నాలోచించుతాడో వాడు ప్రాజ్ఞుడు. స్వార్థభ్రంశం గలవాడు మూర్ఖుడు.

సాధ్యం కేనాప్యుపాయేన జానద్భిః పురుషైః ఫలమ్ ।
వృథాభిమానినః శీఘ్రం విపద్యన్తే విమోహితాః ॥ 17 ॥

ఏదో ఒక ఉపాయంతో సాధ్యఫలాన్ని గురించి పురుషులు తెలుసుకోవాలి. అంతేకాని వ్యర్థమైన అభిమానానికి పోయి మోహానికిలోనైన ఆపదలకు తాములోనగుదురు.

ఏవం నిశ్చిత్య మేధావీ శుక్రం గత్వా న్యవేదయత్ ।
తమాగతం కవిర్జ్ఞాత్వా సంమానేనాభ్యనన్దయత్ ॥ 18 ॥

ఇట్లు నిశ్చయించుకొని ఆ జ్ఞాని శుక్రుడి వద్దకు వెళ్ళి నివేదించాడు. వచ్చిన వాణ్ణి బృహస్పతిగా తెలుసుకొని శుక్రుడు తగినవిధంగా గౌరవించి అభినందించాడు.

ఉపవిష్టం సువిశ్రాన్తం పూజితం చ యథావిధి ।
పర్యపృచ్ఛద్దైత్యగురు స్తదా గమనకారణమ్ ॥ 19 ॥

అతడు కూర్చొని విశ్రాంతి తీసుకొని పూజలందుకొన్న తర్వాత రాక్షసగురువు శుక్రాచార్యుడు బృహస్పతిని వచ్చిన కారణ మేమని ప్రశ్నించాడు.

గృహాగతస్య విముఖాః శత్రవోఽప్యుత్తమా న హి ।
తస్మై స విస్తరేణాఽహ భార్యాహరణ మాదితః ॥ 20 ॥

ఇంటికి వచ్చినవారు శత్రువులైనా సరే వారిపట్ల విముఖులుగా నుండుట ఉత్తముల లక్షణము కాదుగదా! బృహస్పతి శుక్రుడికి చంద్రుడు తన భార్యను అపహరించుట మొదలుకొని అన్ని విషయాలు వివరంగా చెప్పాడు.

బృహస్పతేస్తదా వాక్యం శ్రుత్వా కోపాన్వితః కవిః ।
అపరాధం తు చన్ద్రస్య మేనే శిష్యస్య నారద ॥
అతిక్రమమిదం శ్రుత్వా కోపాత్కవిరథాబ్రవీత్ ॥ 21 ॥

నారదా! బృహస్పతి చెప్పిన మాటను విన్న శుక్రుడు కోపగించాడు. శిష్యుడైన చంద్రునిది తప్పని భావించాడు. అంతేకాక అతడు ఆవిధముగా నియమాన్నతిక్రమించుటను విని శుక్రుడు కోపంగా ఇట్లన్నాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు పలికాడు.

తదా భోక్ష్యే తదా పాస్యే తదా స్వప్స్యే తదా వదే ।
యదాఽఽనయే ప్రియాం భ్రాతస్తవ భార్యాం పరార్దితామ్ ॥ 22 ॥

సోదరా! ఇతరులచేత తీసికునిపోబడిన నీప్రియమైనభార్యను తీసుకొని వచ్చేవరకు నేను ఆహారం తినను. నీటిని త్రాగను, నిద్రించను, మాట్లాడనుకూడా.

తామానీయ భవం పూజ్య చంద్రం శప్త్వా గురుద్రుహమ్ ।
పశ్చా ద్భోక్ష్యే మహాబాహో శృణు వాచం గ్రహేశ్వర ॥ 23 ॥

ఓ గ్రహాధిపతీ! మహాబాహూ! చంద్రుడామెను తెచ్చి నీకప్పగించి నిన్ను పూజించినతర్వాత ఆ గురుద్రోహిని శపించి ఆతరువాతనే నేను భుజిస్తాను. ఇదే మాట విను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా స జీవేన దైత్యాచార్యో జగామ హ ।
శివమారాధ్య యత్నేన పరం సామర్థ్యమాప్తవాన్ ॥ 24 ॥

ఇట్లు బృహస్పతికి చెప్పి దైత్యాచార్యుడగు శుక్రుడు వెళ్లాడు. ఎంతో నియమంతో శివుణ్ణారాధించి గొప్ప శక్తిని పొందాడు.

వరానవాప్య వివిధాన్ శంకరాత్ భావపూజితాత్ ।
శివప్రసాదాత్కిం నామ దేహినామిహ దుర్లభమ్ ॥ 25 ॥

సద్భావనతో కూడి యున్న శంకరుని పూజించినందువల్ల అనేకవరాలను, గొప్పశక్తిని పొందాడు. జీవులకు శివుని యనుగ్రహముంటే దుర్లభమనే దేమున్నది?

జగామ శుక్రో జీవేన తారయా యత్ర చన్ద్రమాః ।
వర్తతే తం శశాపోచ్చైః శృణు త్వం చంద్ర మే వచః ॥ 26 ॥

తారతో కూడియున్న చంద్రునివద్దకు బృహస్పతితో గూడి శుక్రుడు వెళ్లాడు. ఓ చంద్రా! నా మాట విను అని గట్టిగా పలుకుతూ ఇలా శపించాడు.

యస్మాత్పాపతరం కర్మ త్వయా పాపమదాత్కృతమ్ ।
కుష్ఠీ భూయాస్తత శ్చన్ద్రం శశాపైవం రుషా కవిః ॥ 27 ॥

నువ్వు పాపమదంతో పాపాలలోకెల్లా ఘోరమైన పాపకర్మను చేశావు. కనుక కుష్ఠురోగివి ఔదువుగాక! అని శుక్రుడు రోషంతో శపించాడు.

కవి శాపప్రదగ్ధోఽభూత్త దైవ మృగలాంఛనః ।
ప్రాపుః క్షయం న కే నామ గురుస్వామి సఖిద్రుహః ॥ 28 ॥

చంద్రుడా శాపానికి వెంటనే గురియై దెబ్బతిన్నాడు. గురువుకు, యజమానికి, మిత్రుడికి ద్రోహం చేసిన వాడెవడైనా క్షయాన్ని పొందకుండా వుండడు.

తత్యాజ తాం స చన్ద్రోఽపి తారాం తు జగృహే కవిః ।
శుక్రోఽపి దేవా నాహూయ ఋషీన్ పితృగణాంస్తథా ॥ 29 ॥

నదీర్నదాంశ్చ వివిధానోషధీశ్చ పతివ్రతాః ।
తతః సంప్రష్టుమారేభే తారావృత్తవినిష్కయమ్ ॥ 30 ॥

చంద్రుడా తారను వదిలి పెట్టాడు. శుక్రుడు ఆమెను గ్రహించాడు. శుక్రుడప్పుడు దేవతలను,ఋషులను, పితృగణాలను (నాహ్వానించి), నదీనదాలను, అనేక ఓషధులను, పతివ్రతల నాహ్వానించి, తర్వాత వారందరితో తారా వృత్తాంతాన్ని చెప్పి దానికి ప్రాయశ్చిత్తాన్ని అడుగ నారంభించాడు.

తతః శ్రుతిః సురానాహ గౌతమ్యాం భక్తిత స్త్వియమ్ ।
స్నానం కరోతు జీవేన తారా పూతా భవిష్యతి ॥ 31 ॥

అప్పుడు శ్రుతి దేవతలతో ఈ తార బృహస్పతితో గౌతమియందు భక్తితో స్నానం చేస్తే పవిత్రు రాలవుతుందన్నాడు.

రహస్యమేత త్పరమం న వాచ్యం యస్య కస్యచిత్ ।
సర్వాస్వపి దశాస్వేషా శరణం గౌతమీ నృణామ్ ॥ 32 ॥

ఇదిచాలా రహస్యమైంది. దీనినెవరికీ చెప్పకూడదు. మానవులకన్ని దశలలోనూ గౌతమియే శరణం.

తథాఽకరోచ్చైవ తారా భర్త్రా స్నానం యథావిధి ।
పుష్పవృష్టిరభూత్తత్ర జయశబ్దో వ్యవర్తత ॥ 33 ॥

అప్పుడు తార భర్తతో కలిసి గౌతమీ నదిలో యథావిధిగా స్నానం చేసింది. అప్పుడాకాశంనుండి పుష్ప వర్షం కురిసింది. జయజయశబ్దాలు మారుమ్రోగాయి.

పునర్వై దేవా అదదుః పునర్మనుష్యా ఉత ।
రాజానః సత్యం కృణ్వానో బ్రహ్మజాయాం పునర్దదుః ॥ 34 ॥

దేవతలు, మనుష్యులు, రాజులు, మొదలగు వారందరుకూడా ఆ సత్యాన్ని తిరిగి అందరూ కలిసిపలికి బ్రాహ్మణుడికి భార్యనిచ్చారు.

పునర్దత్వా బ్రహ్మజాయాం కృతాం దేవైరకల్మషామ్ ।
సర్వం క్షేమ మభూత్తత్ర తస్మాత్తీర్థం మహామునే! ॥ 35 ॥

ఓ మహామునీ! దేవతలందరూ కలిసి కల్మషరహితంగా చేసి భార్యను తిరిగి ఆ బ్రాహ్మణునకిచ్చినందు వల్ల అక్కడ అందరికి క్షేమం కలిగి, ఒక తీర్థమేర్పడింది.

తదభూత్సకలాఘౌఘ ధ్వంసనం సర్వకామదమ్ ।
ఆనన్దం క్షేమ మభవత్సురాణా మసురారిణామ్ ॥ 36 ॥

ఆ తీర్థం సమస్తపాపాలను ధ్వంసం చేస్తుంది. సకలకోరికలను తీరుస్తుంది. రాక్షసశత్రువులైన దేవతలందరికి క్షేమాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది.

బృహస్పతేశ్చ శుక్రస్య తారాయాశ్చ విశేషతః ।
పరమానన్దమాపన్నో గురు ర్గంగామభాషత ॥ 37 ॥

బృహస్పతికి, శుక్రుడికి, తారకు విశేషంగా ఆనందం కలిగింది. ఆ ఆనందంతో బృహస్పతి గంగతో ఇట్లన్నాడు.

గురురువాచ :– బృహస్పతి పలికాడు.

త్వం గౌతమి సదా పూజ్యా సర్వేషామపి ముక్తిదా ।
విశేషతస్తు సింహస్థే మయి త్రైలోకపావనీ ॥ 38 ॥

అమ్మా గౌతమీ! నీవు సర్వదా పూజనీయురాలవు. అందరికి ముక్తిని ప్రసాదించు దానివి. ముఖ్యంగా నేను సింహరాశిలో సంచరించేటప్పుడు త్రైలోక్యపావనివి.

భవిష్యసి సరిచ్ఛ్రేష్ఠే సర్వతీర్థైః సమన్వితా ।
యాని కాని చ తీర్థాని స్వర్గమృత్యురసాతలే ॥
త్వాం స్నాతుం తాని యాస్యన్తి మయి సింహస్థితేఽమ్బికే ॥ 39 ॥

ఓ నదీశ్రేష్ఠురాలా! స్వర్గమర్త్యపాతాల లోకాలలో ఎన్ని తీర్థాలున్నాయో వాటన్నిటితో కూడి పవిత్రం చేస్తావు. ఎందుకంటే నేను సింహరాశిలో ఉండేటప్పుడు అవన్నీ నీ దగ్గరకు స్నానానికి వస్తాయి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ధన్యం యశస్యమాయుష్యమారోగ్య శ్రీవివర్ధనమ్ ।
సౌభాగ్యైశ్వర్యజననం తీర్థమానన్దనామకమ్ ॥ 40 ॥

ఈ ఆనందతీర్థం దివ్యమైంది. కీర్తిని, ఆయువును, ఆరోగ్య సంపదలను, సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాలు కలిగించునది.

తత్ర పంచ సహస్రాణి తీర్థాన్యాహ స గౌతమః ।
స్మరణా త్పఠనాద్వాపి ఇష్టైః సంయుజ్యతే సదా ॥ 41 ॥

గౌతము డక్కడ ఐదు వేల తీర్థాలున్నాయని చెప్పాడు. వాటిని స్మరించినా, వాటిని గురించి చదివినా సదా కోరికలు నెరవేరుతాయి.

శివస్యాత్ర నివిష్టస్య నందీ గంగాతటేఽనిశమ్ ।
సాక్షా చ్చరత్యసౌ ధర్మస్తస్మాన్నన్దీతటం స్మృతమ్ ॥
ఆనన్దమపి తత్తీర్థం సర్వానన్దవివర్ధనాత్ ॥ 42 ॥

ఈ గంగానదీ తీరాన శివుడు నియమించిన నన్ది నిరంతరం ధర్మాన్నాచరిస్తూ సాక్షాత్తుగా సంచరిస్తున్నాడు. అందుకే దీన్ని నన్దీతటమంటారు. అందరికీ ఆనందాన్ని పెంచేది కనుక ఆనందతీర్థమంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థ మాహాత్మ్యే నన్దీతీర్థాది పంచసహస్రతీర్థ వర్ణనం నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥ 82 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని నందీతీర్థము మున్నగు ఐదు వేలతీర్థాల వర్ణనమనే పేరుగల ఎనభై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్ర్యశీతితమోఽధ్యాయః – ఎనబై మూడవ అధ్యాయం

భావతీర్థాది సప్తతి తీర్థ వర్ణనమ్ – భావతీర్థం మొదలుగాగల డెబ్బది తీర్థముల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

భావతీర్థమితి ప్రోక్తం యత్ర సాక్షాద్భవః స్థితః ।
అశేష జగదన్తస్థో భూతాత్మా సచ్చిదాకృతిః ॥ 1 ॥

సాక్షాత్ శివుడున్న ప్రదేశాన్ని భావతీర్థమని అంటారు. అతడు సమస్త జగత్తులోపల నిండినవాడు, భూతాలకాత్మ, సచ్చిదానంద స్వరూపుడు.

తత్రేమాం శృణు వక్ష్యామి కథాం పుణ్యతమాం శుభామ్ ।
సూర్యవంశకరః శ్రీమాన్ క్షత్రియాణాం ధురంధరః ॥ 2 ॥

ప్రాచీన బర్హిరాఖ్యాతః సర్వధర్మేషు పారగః ।
తిస్రః కోట్యోఽర్ధకోటిశ్చ వర్షాణాం రాజ్య ఆస్థితః ॥ 3 ॥

దానికి సంబంధించిన పుణ్యతమం, శుభం ఐన కథను చెబుతున్నాను విను. పూర్వం సూర్యవంశకర్త క్షత్రియులందరిలోను గొప్పవాడూ, పరిపాలించువాడూ, ప్రాచీనబర్హి యనురాజు ధర్మాలన్నింటిలో నిష్ణాతుడు. అతడు మూడున్నరకోట్ల సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశాడు.

తస్యేదృశం వ్రతం చాఽసీద్యదహం యౌవనచ్యుతః ।
భవేయం ప్రియయా వాఽపి పుత్రైర్వా ప్రియవస్తుభిః ॥ 4 ॥

వియుజ్యేయం తతో రాజ్యం త్యక్ష్యేఽహం నాత్రసంశయః ।
వివేకినాం కులీనానామిదవేవోచితం నృణామ్ ॥ 5 ॥

అతనికి ఈ విధమైన వ్రతం ఉంది. నేను ఒక వేళ యౌవనాన్ని కోల్పోయినవాడనైతే భార్యను, సంతానాన్ని, ప్రియ వస్తువులను కోల్పోయినవాడనైనా అప్పుడు రాజ్యాన్ని వదిలేస్తాను. ఇందులో సందేహమేదీలేదు. వివేకవంతులు, మంచి కులంలో, వంశంలో పుట్టిన మానవులకు ఇదే సరైన మార్గం.

స్థీయతే విజనే క్వాపి విరక్తైర్విభవక్షయే ।
తస్మిన్ ప్రశాసతి మహీం న వియోగః ప్రియైః క్వచిత్ ॥ 6 ॥

ఐశ్వర్యం నశిస్తే విరక్తులైన వారితో (ఋషులతో) ఎవరూ లేని చోట ఎక్కడనో ఉండవచ్చు. ఆ రాజు రాజ్యాన్ని పరిపాలిస్తున్నప్పుడు ప్రియమైనవారితో వియోగం ఎప్పుడూ కలుగలేదు.

నాఽఽధివ్యాధీ న దుర్భిక్షం న బంధు కలహో నృణామ్ ।
తస్మిన్ శాసతి రాజ్యం తు న చ కశ్చిద్వియుజ్యతే ॥ 7 ॥

అతడు రాజ్యమును చక్కగా పరిపాలించుచున్నపుడు ప్రజలకు ఆధివ్యాధులుగాని, దుర్భిక్షంగాని, బంధువులతో కలహం గాని ఎప్పుడూ కలుగలేదు.

తతః పుత్రార్థమకరో ద్యజ్ఞం రాజా మహామతిః ।
తతః ప్రసన్నో భగవాన్ వరం ప్రాదాద్యథేప్సితమ్ ॥ 8 ॥

గౌతమీతీరసంస్థాయ రాజ్ఞే దేవో మహేశ్వరః ।
పుత్రం దేహీతి రాజా వై భవం ప్రాహ సభార్యయా ॥ 9 ॥

చాలా తెలివిగలిగిన ఆరాజు సంతానం కొఱకు యజ్ఞం చేశాడు. అప్పుడు భగవంతుడు అయిన ఈశ్వరుడు ప్రసన్నుడై గౌతమీ ఒడ్డున ఉన్న రాజుకు ఆయనకోరిన వరాన్నిచ్చాడు. రాజు తనకు పుత్రుని యిమ్మని భార్యతో గూడి ప్రార్థించినాడు. దేవుడు రాజుతో.

భవః ప్రాహ నృపం ప్రీత్యా పశ్య నేత్రం తృతీయకమ్ ।
తతః పశ్యతి రాజేన్ద్రే భవస్యాక్షి తు మానద ॥ 10 ॥

చక్షు ర్దీప్త్యాఽ భవత్పుత్రో మహిమా నామ విశ్రుతః ।
యేనా కారి స్తుతిః పుణ్యా మహిమ్న ఇతి విశ్రుతా ॥ 11 ॥

అప్పుడు శంకరుడు రాజుతో మూడవకంటిని చూడమన్నాడు. అహంకారాన్ని ఖండించినవాడా! ఓ మానదా! తరువాత రాజా శివుని మూడవ కన్నుచూడగా, నేత్రకాంతితో కుమారుడు పుట్టాడు. అతడిని మహిము డంటారు. అతడు చేసిన స్తోత్రమే పవిత్రమైన మహిమ్న స్తోత్రమని ప్రసిద్ధి.

కిమలభ్యం భగవతి ప్రసన్నే త్రిపురాన్తకే ।
యే నిత్యమనువర్తన్తే హరి బ్రహ్మాదయః సురాః ॥ 12 ॥

త్రిపురాన్తకుడైన భగవంతుడు శివుడు ప్రసన్నుడైన తరువాత పొందరాని దేముంటుంది? బ్రహ్మ విష్ణువు మొదలుగాగల దేవతలందరూ నిత్యమతన్ననుసరిస్తారు.

ప్రాప్త పుత్రశ్చ నృపతిస్తీర్థ శ్రైష్ఠ్య మయాచత ।
మహాపాప మహారోగ మహావ్యసనినాం నృణామ్ ॥ 13 ॥

నానా విపద్గణార్తానాం సర్వాభిమతలబ్ధయే ।
ప్రాదాజ్ఞైష్ఠ్యం భవ శ్చాపి భావతీర్థం తదుచ్యతే ॥ 14 ॥

కుమారుని పొందిన రాజు ఈ తీర్థం విశిష్టంగా ఉండాలని కోరాడు. మహాపాపాలు చేసినవారికి, మహా రోగాలు గలవారికి, మహావ్యసనాలకు లోనైనవారికి, అనేక ఆపద్గణసమూహాలతో ఆర్తి పొందినవారికి వారి వారి కోరికలు నెరవేరునట్లుగా దానికి ప్రాధాన్య మిచ్చాడు. అందుకే దాన్ని భావతీర్థమని అంటారు.

తత్ర స్నానేన దానేన సర్వాన్కామానవాప్నుయాత్ ।
భవప్రసాదా దభవత్సుతః ప్రాచీనబర్హిషః ॥ 15 ॥

అక్కడ స్నానదానాదులు చేస్తే కోరికలన్నీ నెరవేరతాయి. ప్రాచీన బర్హిస్సుకు శివునియొక్క అనుగ్రహంతో కుమారుడు పుట్టినాడు.

మహిమా గౌతమీతీరే భావతీర్థం తదుచ్యతే ।
తత్ర సప్తతి తీర్థాని పుణ్యాన్యఖిలదాని చ ॥ 16 ॥

మహిమునివల్లనే గౌతమీ తీరమునందున్న భావతీర్థము. అక్కడ డెబ్బై పవిత్రాలైన తీర్థాలున్నావి. అవి అన్ని కోరికలను నెరవేరుస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే భావతీర్థాది సప్తతి తీర్థ వర్ణనం నామ త్ర్యశీతితమోఽధ్యాయః ॥ 83 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో భావతీర్థం మొదలుగాగల డెబ్బై తీర్థాల వర్ణమనే ఎనబై మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతురశీతితమోఽధ్యాయః - ఎనబై నాల్గవ అధ్యాయం

సహస్ర కుణ్డాది దశతీర్థవర్ణనమ్ - సహస్రకుండం మొదలుగాగల పది తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సహస్రకుణ్డ మాఖ్యాతం తీర్థం వేదవిదో విదుః ।
యస్య స్మరణమాత్రేణ సుఖీ సంపద్యతే నరః ॥ 1 ॥

వేదవేత్తలకు తెలిసిన సహస్రకుండమనే తీర్థంఉంది. దాన్ని స్మరిస్తేనే సంపదలు, సుఖం కలుగుతాయి.

పురా దాశరథీ రామః సేతుం బద్ధ్వా మహార్ణవే ।
లంకాం దగ్ధ్వా రిపూన్ హత్వా రావణాదీన్ రణే శరైః ॥ 2 ॥

వైదేహీం చ సమాసాద్య రామో వచనమబ్రవీత్ ।
పశ్యత్సు లోకపాలేషు తస్యాఽఽచార్యే పురః స్థితే ॥ 3 ॥

పూర్వం దశరథునికుమారుడు రాముడుండేవాడు. అతడు సముద్రంపై సేతువును నిర్మించి, తన బాణాలతో రావణాది శత్రువులందర్ని చంపి, లంకను దహించి, సీతాదేవిని చేరుకొని, దేవతలందరూ చూచు చుండగా, ఆచార్యుడు ముందుండగా రాముడిట్లనెను.

అగ్నౌ శుద్ధిగతాం సీతాం రామో లక్ష్మణసన్నిధౌ ।
ఏహి వైదేహి శుద్ధాఽసి అంకమారోఢుమర్హసి ॥ 4 ॥

లక్ష్మణుని ఎదురుగానే అగ్నితో పునీతమైన సీతతో, సీతా! నీవు శుద్ధురాలవైనావు. రా. నా ఒడిలో కూర్చోవటానికి నీకర్హతవచ్చిందన్నాడు.

నేత్యువాచ తదా శ్రీమానంగదో హనుమాంస్తథా ।
అయోధ్యాయాం తు వైదేహీ సార్ధం యామః సుహృజ్జనైః ॥ 5 ॥

అప్పుడు అంగదుడు, హనుమంతుడు అంగీకరించక అయోధ్యకు మన మిత్రులందరితో కలిసివెళ్ళి అయోధ్యలో వైదేహి కూర్చోవాలన్నారు.

తత్ర శుద్ధిమవాప్యాథ పునర్భ్రాతృషు మాతృషు ।
లౌకికేష్వపి పశ్యత్సు తతః శుద్ధా నృపాత్మజా ॥ 6 ॥

అయోధ్యాయాం సుపుణ్యేఽహ్ని అంకమారోఢుమర్హసి ।
అస్యాశ్చరిత్రవిషయే సందేహః కస్య జాయతే ॥ 7 ॥

అయోధ్యలో సోదరులు, తల్లులు, ప్రజలు చూస్తుండగా మరల శుద్ధినిపొంది ఈ రాజకుమారి పవిత్రురాలు అయి అయోధ్యలో నొక మంచి రోజున ఈమెను కూర్చోబెట్టుకో. అప్పుడు ఈమె శీలం విషయంలో సందేహమెవరకి కలుగుతుంది?

లోకాపవాదస్తదపి నిరస్యః స్వజనేషు హి ।
తయోర్వాక్యమనాదృత్య లక్ష్మణః సవిభీషణః ॥ 8 ॥

రామశ్చ జామ్బవాం శ్చైవ తామాహ్వయ న్నృపాత్మజామ్ ।
స్వస్తీత్యుక్త్వా దేవతాభీ రాజ్ఞోఽఙ్కం చాఽరురోహ సా ॥ 9 ॥

తమ వారియందు లోకాపవాదంకూడా కలుగదుకదా! అనగా వారి మాటలను ఖండిస్తూ లక్ష్మణుడు, విభీషణుడు, రాముడు, జాంబవంతుడు, రాజకుమారి అయిన సీతను పిలిచారు. దేవతలందరు స్వస్తివాచనం చేయగా ఆమె రాముడి అంకాన్ననధిరోహించింది.

ముదితాస్తే యయుః శీఘ్రం పుష్పకేణ విరాజతా ।
అయోధ్యాం నగరీం ప్రాప్య తథా రాజ్యం స్వకం తు యత్ ॥ 10 ॥

ప్రకాశిస్తున్న పుష్పకవిమానంలో తమరాజ్యమైన అయోధ్యకు సంతోషంతో త్వరగా వెళ్ళారు.

ముదితాస్తేఽ భవన్సర్వే సదా రామానువర్తినః ।
తతః కతిపయాహ్నేషు అనార్యేభ్యో విరూపికామ్ ॥ 11 ॥

వాచం శ్రుత్వా స తత్యాజ గుర్విణీం తామయోనిజామ్ ।
మిథ్యాపవాదమపి హి న సహన్తే కులోన్నతాః ॥ 12 ॥

అక్కడందరూ రాముణ్ణి అనుసరిస్తూ సంతోషించారు. ఇట్లు కొంతకాలం జరుగగా ఒకనాడు అనార్యులైనవారు వికారంగా మాట్లాడిన మాటనువిని గర్భిణియగు ఆ అయోనిజను వదిలి పెట్టాడు. అసత్యమగు నిందను కూడా కులోన్నతులు సహించరుగదా!

వాల్మీకేర్మునిముఖ్యస్య ఆశ్రమస్య సమీపతః ।
తత్యాజ లక్ష్మణః సీతామదుష్టాం రుదతీం రుదన్ ॥ 13 ॥

లక్ష్మణుడు ఏడుస్తున్న పవిత్రురాలైన సీతను తాను కూడా దుఃఖిస్తూ వాల్మీకి మహర్షియొక్క ఆశ్రమ సమీపంలో వదిలిపెట్టాడు.

నోల్లంఘ్యాఽఽజ్ఞా గురూణా మిత్యసౌ తదకరోద్భియా ।
తతః కతిపయాహేషు వ్యతీతేషు నృపాత్మజః ॥ 14 ॥

రామః సౌమిత్రిణా సార్ధం హయమేధాయ దీక్షితః ।
తత్రైవాఽఽజగ్మతురుభౌ రామపుత్రౌ యశస్వినౌ ॥ 15 ॥

పెద్దల మాట మీరగూడదనే భయంతో ఆపని చేశాడు. తరువాత కొంతకాలం గడిచిన తరువాత రాజకుమారుడైన రాముడు లక్ష్మణునితో గూడ అశ్వమేథయాగాన్ని చేయడానికి దీక్ష పూనాడు. అక్కడికి గొప్ప కీర్తిగల రామచంద్రుడి పుత్రులిద్దరు వచ్చారు.

లవః కుశశ్చ విఖ్యాతౌ నారదావివ గాయకౌ ।
రామాయణం సమగ్రం తద్గన్ధర్వా వివ సుస్వరౌ ॥ 16 ॥

రామస్య చరితం సర్వం గాయమానౌ సమీయతుః ।
యజ్ఞవాటం రాజసుతౌ హేతుభిర్లక్షితౌ తదా ॥ 17 ॥

లవుడు, కుశుడు అనేవారిద్దరు నారదతుంబురులవలె పాడేవారు, గన్ధర్వులవలె సుస్వరము గలిగినవారు, రామాయణాన్నంతా, రాముడి చరిత్రనంతా పాడుకుంటూ వారిద్దరు రాజకుమారులవలె లక్షితులైన వారు ఆ యజ్ఞ వాటికకు వచ్చారు.

రామపుత్రావుభౌ శూరౌ వైదేహ్యాస్తనయావితి ।
తావానీయ తతః పుత్రావభిషిచ్య యథాక్రమమ్ ॥ 18 ॥

అంకారూఢౌ తతః కృత్వా సస్వజే తౌ పునః పునః ।
సంసారదుఃఖఖిన్నానామగతీనాం శరీరిణామ్ ॥ 19 ॥
పుత్రాలింగనమే వాత్ర పరం విశ్రాన్తికారణమ్ ।
ముహు రాలింగ్య తౌ పుత్రౌ ముహుః స్వజతి చుమ్బతి ॥ 20 ॥

కిమప్యన్తర్ధ్యాయతి చ నిఃశ్వసత్యపి వై ముహుః ।
ప్రాప్తా లంకా వాసినస్తు రాక్షసా ఏతదన్తరే ॥ 21 ॥

వారిద్దరూ వైదేహి యొక్క కుమారులని, రామునిపుత్రులని, శూరులని వారిని తీసుకొనివచ్చి వారికి యథా క్రమంగా స్నానం చేయించి, వారు తన కుమారులని మాటి మాటికి తన ఒడిలో కూర్చోపెట్టుకొన్నారు. సంసారదుఃఖంతో ఖిన్నులై దిక్కులేక యున్న జీవులకు. పుత్రుని కౌగిలింతే పరమవిశ్రాన్తికి కారణమవుతుంది మాటి మాటికి వారిని కౌగలించుకొని ముద్దాడాడు. మాటి మాటికి నిట్టూర్పులను వదులుచు లోలోపల ఏదో ధ్యానిస్తూండేవాడు. తలుచుకొంటూవుండేవాడు. ఇంతలో లంకావాసులైన రాక్షసులు వచ్చారు.

సుగ్రీవో హనుమాంశ్చైవ అంగదో జామ్బవాంస్తథా ।
అన్యే చ వానరాః సర్వే విభీషణ పురః సరాః ॥ 22 ॥

విభీషణుడు ముందుండగా సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు ఇతర వానరులు కూడా వచ్చారు.

తే చాఽఽగత్య నృపం ప్రాప్తాః సింహాసనముపస్థితమ్ ।
సీతామదృష్ట్వా హనుమానంగదః కనకాంగదః ॥ 23 ॥

క్వ గతాఽఽయోనిజా మాతా ఏకో రామోఽత్ర దృశ్యతే ।
రామేణ సా పరిత్యక్తా ఇత్యూచు ర్ద్వారపాలకాః ॥ 24 ॥

వారంతా సింహాసనంమీద కూర్చున్న రాజును చేరారు. అక్కడ సీత లేకపోవుట చూచి హనుమంతుడు, అంగదుడు, కనకాంగదుడు అయోనిజయగు మాతల్లి సీత ఎక్కడకు వెళ్లింది? రాముడొక్కడే కనిపిస్తున్నాడు అని అంటుండగా అక్కడ ఉన్న ద్వారపాలకులు రాముడు సీతను పరిత్యజించినాడని చెప్పారు.

పశ్యత్సు లోకపాలేషు ఆర్యే తత్ర ప్రవాదిని ।
అగ్నౌ శుద్ధిం గతా సీతా కింతు రాజా నిరంకుశః ॥ 25 ॥

అక్కడ లోకపాలురందరూ చూస్తుండగా పూజ్యురాలైన సీతను గురించి వాదించగా అగ్నియందు నిలచి శుద్ధిని పొందింది. కాని రాజు నిరంకుశుడు.

ఉత్పన్నై ర్లౌకికైర్వాక్యై రామస్త్యజతి తాం ప్రియామ్ ।
మరిష్యావ ఇతి హ్యుక్త్వా గౌతమీం పునరీయతుః ॥ 26 ॥

లోకులు పుట్టించిన మాటలతో రాముడు ఆ సీతను వదలి పెడతాడు. ఇక మనం మరణిద్దాం అని చెప్పి తిరిగి గౌతమీ నది వద్దకు వెళ్ళారు.

రామ స్తౌ పృష్ఠతోఽభ్యేత్య అయోధ్యా వాసిభిఃసహ ।
ఆగత్య గౌతమీం తత్రా కుర్వం స్తే పరమం తపః ॥ 27 ॥

రాముడు అయోధ్యావాసులతో గూడి వారివెనుకనే గౌతమీ నదివద్దకు వచ్చి గొప్పతపస్సు నక్కడ చేశారు.

స్మారం స్మారం నిశ్వసన్తస్తాం సీతాం లోకమాతరమ్ ।
సంసారాస్థా విరహితా గౌతమీ సేవనోత్సుకాః ॥ 28 ॥

ఆ లోకమాతసీతను తలుచుకొనుచు, మాటిమాటికి నిట్టూర్పులు వదలుతూ సంసారపైన కోరికలేనివారై దానియందు విముఖులై గౌతమిని సేవించుటకై ఉత్సహించారు.

లోకత్రయపతిః సాక్షాద్రామోఽనుజ సమన్వితః ।
ప్రాప్తః స్నాత్వా చ గౌతమ్యాం శివారాధనతత్పరః ॥ 29 ॥

ముల్లోకాల కధిపతి యైన రాముడు తన తమ్మునితో గూడి గంగానదికి వెళ్ళి స్నానం చేసి, శివారాధన తత్పరుడైనాడు.

పరితాపం జహౌ సర్వం సహస్రపరివారితః ।
యత్ర చాఽసీత్స వృత్తాన్తః సహస్రకుణ్డముచ్యతే ॥ 30 ॥

వేలమంది చుట్టూ చేరగా రాముడు తన పరితాపాన్నంతా పోగొట్టుకొన్నాడు. ఇది ఎక్కడ జరిగిందో ఆ ప్రదేశాన్ని సహస్రకుండమని పిలుస్తారు.

దశాపరాణి తీర్థాని తత్ర సర్వార్థదాని చ ।
తత్ర స్నానం చ దానం చ సహస్రఫలదాయకమ్ ॥ 31 ॥

అక్కడ సర్వార్థాలను కలుగజేసే మరొక పది తీర్థాలున్నాయి. అక్కడ స్నానదానాదులు చేస్తే వేయిరెట్లు ఫలాన్నిస్తాయి.

యత్ర శ్రీగౌతమీతీరే వసిష్ఠాది మునీశ్వరైః ।
సర్వాపత్తారకం హోమమకారయదఘాన్తకమ్ ॥ 32 ॥

వసిష్ఠాదిమునులందరితో ఆ గౌతమీతీరాన సర్వ ఆపదలను దాటించి పాపాలను పోగొట్టు హోమాన్ని చేయించాడు.

సహస్రసంఖ్యాయుక్తేషు కుణ్డేషు వసుధారయా ।
సర్వానపేక్షితాన్కామానవాపాసౌ మహాతపాః ॥ 33 ॥

మహాతపస్వి యైన రాముడు వేయి సంఖ్య గల కుండములలో వసుధారతో యజ్ఞముచేయగా సమస్తకోరికలను పొందెను.

గౌతమ్యాః సరిదమ్బాయాః ప్రసాదాద్రాక్షసాన్తకః ।
సహస్రకుణ్డాభిజ్ఞం తదభూత్తీర్థం మహాఫలమ్ ॥ 34 ॥

నదీ మాతయగు గౌతమి యనుగ్రహంతో రాముడు రాక్షసాన్తకుడైనాడు. ఆ తీర్థం గొప్పఫలంగల సహస్ర కుండమనే పేరుతో గొప్ప తీర్థమయ్యింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే సహస్రకుణ్డాది దశతీర్థవర్ణనం నామ చతురశీతితమోఽధ్యాయః ॥ 84 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని సహస్రకుండం మొదలుగాగల పదితీర్థాల వర్ణనమనే ఎనభై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచాశీతితమోఽధ్యాయః - ఎనబై ఐదవ అధ్యాయం

కపిలా సంగమాది శతతీర్థ వర్ణనమ్ - కపిలాసంగమం మొదలైన నూరు తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కపిలాతీర్థమాఖ్యాతం తదేవాంగిరసం స్మృతమ్ ।
తదేవాఽఽదిత్యమాథాఖ్యాతం సైంహికేయం తదుచ్యతే ॥ 1 ॥

ఈ తీర్థాలలో మరొకటి కపిలాతీర్థమనే నది ఉంది. దానికే ఆంగిరసం, ఆదిత్య, సైంహికేయమను పేర్లు కూడా కలవు.

గౌతమ్యా దక్షిణే పారే ఆదిత్యాన్ మునిసత్తమ ।
అయాజయన్ అంగిరసో దక్షిణాంతే భువం దదుః ॥ 2 ॥

గౌతమీనది దక్షిణతీరంలో ఆదిత్యుల గూర్చి అంగిరసుడు యజ్ఞం చేశాడు. వారు దక్షిణగా భూమినిచ్చారు.

అంగిరోభ్యస్తదాఽఽదిత్యా స్తపసేఽంగిరసో యయుః ।
సా భూమిః సైంహికీ భూత్వా జనాన్సర్వానభక్షయత్ ॥ 3 ॥

అప్పుడు అంగిరసుల నుండి ఆదిత్యులు కలిగారు. ఆ అంగిరసులు తపస్సు కొరకు వెళ్ళారు. ఆ భూమి సైంహికి యై జనులందర్నీ భక్షించెను.

తత్రసుస్తే జనాః సర్వే అంగిరోభ్యో న్యవేదయన్ ।
విభీతా జ్ఞానతో జ్ఞాత్వా భువం తాం సైంహికీమితి ॥ 4 ॥

అక్కడ ఉన్న జనులందరు ఆ భూమి సైంహికదని తమ జ్ఞానం ద్వారా తెలుసుకొని భయంతో అంగిరులకు నివేదించారు.

ఆదిత్యా ననుగత్వాథ వాచమంగిరసోఽబ్రువన్ ।
భువం గృహ్ణన్తు యా దత్తా నేత్యాదిత్యాస్తదాఽబ్రువన్ ॥ 5 ॥

అంగిరసులప్పుడు ఆదిత్యులవద్దకు వెళ్ళి మీరిచ్చిన భూమిని మీరు తీసుకోమన్నారు. కాని ఆదిత్యులంగీకరించకుండా ఇట్లన్నారు.

నివృత్తాం దక్షిణాం నైవ ప్రతిగృహ్ణన్తి సూరయః ।
స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసున్ధరామ్ ॥ 6 ॥
షష్టి వర్ష సహస్రాణి విష్ఠాయాం జాయతే కృమిః ।
భూమేః స్వపరదత్తాయా హరణా న్నాధికం క్వచిత్ ॥ 7 ॥

వివేకులు తాము ఇచ్చివేసిన దక్షిణను తిరిగి తీసికొనరు. యెవడు అయితే తాను ఇచ్చిన దానినిగాని ఇతరులు ఇచ్చినదానినైనా భూమిని హరించుతారో, ఆరువేల సంవత్సరములు మలమూత్రాదిదూషితములలో కృమిగా జన్మించును. తానుగాని ఇతరులు గాని ఇచ్చిన భూమిని హరించుట కంటే ఇంకా గొప్ప పాపం ఏదీ లేదు.

పాపమస్తి మహా రౌద్రం న స్వీకుర్మః పునస్తు తామ్ ।
ఏవం యదా స్వదత్తాయా హరణే కిం తదా భవేత్ ॥ 8 ॥

పాపమను నది చాలా రౌద్రమైనది. దాన్నైతే తిరిగి తీసుకోముకదా! అట్లే మన మిచ్చినదే తిరిగి మనం హరిస్తే అప్పుడే మౌతుంది?

తథాఽపి క్రయరూపేణ గృహ్ణీమో దక్షిణాం భువమ్ ।
తథేత్యుక్తే తు తే దేవాః కపిలాం శుభలక్షణామ్ ॥ 9 ॥

గంగాయా దక్షిణే పారే భువః స్థానే తు తాం దదుః ।
భుక్తిముక్తిప్రదః సాక్షా ద్విష్ణు స్తిష్ఠతి మూర్తిమాన్ ॥ 10 ॥

అయినా కూడా దక్షిణపుభూమిని కొనుక్కున్నట్లుగా తీసుకుంటాము. అప్పుడా దేవతలు సరేయని శుభలక్షణంగల కపిలను భూమి యొక్క స్థానంలో గంగానది దక్షిణతీరంలో ఇచ్చారు. కపిలలో భుక్తిముక్తిప్రదుడైన నారాయణుడు సాక్షాత్తుగా మూర్తిమంతుడై యున్నాడు.

కపిలా సంగమం తచ్చ సర్వాఘౌఘా వినాశనమ్ ।
తత్రా భవద్దానతోయాదాపగా కపిలాభిధా ॥ 11 ॥

కపిలా సంగమము సకల పాపసంఘాలను తొలగిస్తుంది. అక్కడ దాన తర్పణాదులవలన ఏర్పడిన నది కపిల అనే పేరుగలది.

సస్యవత్యా అపి భువో దానాద్గోదానముత్తమమ్ ।
లోకరక్షాం చకారాసౌ కృత్వా వినిమయం మునిః ॥ 12 ॥

పంటతో కూడిన భూమిని దానముచేసిన దానికంటే గోదానము చాలా ఉత్తమమైంది. ఆ ముని ఇట్లు వినిమయం చేసి లోకాన్ని రక్షించాడు.

యత్ర తీర్థే చ తద్వృత్తం గోతీర్థం తదుదాహృతమ్ ।
పుణ్యదం తత్ర తీర్థానాం శతముక్తం మనీషిభిః ॥ 13 ॥

ఎక్కడైతే ఆ గోవును స్వీకరించారో ఆ ప్రదేశాన్ని గో తీర్థమంటారు. ఈ తీర్థం ఇతర తీర్థాల కంటెకూడా నూరు రెట్లు పుణ్యాన్నిస్తుంది. అట్టి నూరు తీర్థాలు ఉన్నాయి.

తత్ర స్నానేన దానేన భూమిదానఫలం భవేత్ ।
సంగతా గంగయా తచ్చ కపిలా సంగమం విదుః ॥ 14 ॥

గంగానదితో సంగమించిన ఆప్రదేశాన్ని కపిలా సంగమ మంటారు. అక్కడ స్నానదానాలు చేస్తే భూదాన ఫలం లభిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే కపిలా సంగమాది శతతీర్థవర్ణనం నామ పంచాశీతితమోఽధ్యాయః ॥ 85 ॥

శ్రీబ్రహ్మ పురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని కపిలా సంగమము మున్నగు నూరు తీర్థాల వర్ణనమనే పేరుగల ఎనభై ఐదవ అధ్యాయం సంపూర్ణం.

షడశీతితమోऽధ్యాయః - ఎనబై ఆరవ అధ్యాయం

శంఖతీర్థాది అయుత తీర్థ వర్ణనమ్ - శంఖతీర్థం మున్నగు పదివేల తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శంఖ హ్రదం నామ తీర్థం యత్ర శంఖగదాధరః ।
తత్ర స్నాత్వా చ తం దృష్ట్వా ముచ్యతే భవబంధనాత్ ॥ 1 ॥

శంఖచక్రగదాధరుడు వెలసిన చోటున శంఖహ్రదమనే తీర్థం ఉంది. అక్కడ స్నానం చేసి ఆ శంఖచక్ర గదాధరుని దర్శిస్తే భవబంధాలు తొలగిపోతాయి.

తత్రేదం వృత్త మాఖ్యాస్యే భుక్తిముక్తిప్రదాయకమ్ ।
పురా కృతయుగస్యాదౌ బ్రాహ్మణః సామగాయనః ॥ 2 ॥

భుక్తిముక్తి ప్రదాయకమగు ఆ కథను చెబుతాను విను. పూర్వం కృతయుగారంభంలో సామవేదాన్ని గానం చేసే బ్రాహ్మణుకొకడుండేవాడు.

బ్రహ్మాణ్డాగారసంభూతా రాక్షసా బహురూపిణః ।
బ్రాహ్మణం ఖాదితుం ప్రాప్తా బలోన్మత్తా ధృతాయుధాః ॥ 3 ॥

బ్రహ్మాండాగారంలో పుట్టి మాయారూపాలు ధరించే స్వభావం గల రాక్షసులు బలంచే మదించినవారై ఆయుధాలు ధరించి బ్రాహ్మణుణ్ణి తినడానికి వచ్చారు.

తదాऽహమబ్రవం విష్ణుం రక్షణాయ జగద్గురుమ్ ।
స విష్ణుస్తాని రక్షాంసి హన్తుం చక్రేణ చోద్యతః ॥ 4 ॥

అప్పుడు నేను జగద్గురువైన విష్ణువును రక్షణ కొరకర్థించాను. ఆ విష్ణువు చక్రాయుధాన్ని ధరించి రాక్షసులను సంహరించటానికి ఉద్యుక్తుడైనాడు.

ఛిత్వా చక్రేణ రక్షాంసి శంఖమాపూరయత్తదా ।
నిష్కణ్టకం తలం కృత్వా స్వర్గం నిర్వైరమేవ చ ॥ 5 ॥

చక్రంతో రాక్షసులనందరిని ఛేదించి భూతలంలో, స్వర్గంలో శత్రువులెవరూ లేకుండా నిష్కంటకంచేసి అప్పుడు శంఖాన్ని పూరించాడు.

తతో హర్షప్రకర్షేణ శంఖ మాపూరయద్ధరిః ।
తతో రక్షాంసి సర్వాణి హ్యనీనశురశేషతః ॥ 6 ॥

శత్రునాశనాని కాహరి గొప్పసంతోషంతో శంఖాన్ని పూరించగా రాక్షసులందరూ నశించారు.

యత్రైతద్వృత్తమఖిలం విష్ణుశంఖప్రభావతః ।
శంఖతీర్థం తు తత్ప్రోక్తం సర్వక్షేమకరం నృణామ్ ॥ 7 ॥

విష్ణువు యొక్క శంఖప్రభావము వలన ఈ వృత్తాంత మెక్కడ జరిగిందో దాన్ని శంఖతీర్థమంటారు. ఇది మానవులకు సర్వవిధ క్షేమాలను కలిగిస్తుంది.

సర్వాభీష్టప్రదం పుణ్యం స్మరణాన్మంగళప్రదమ్ ।
ఆయురారోగ్యజననం లక్ష్మీపుత్రప్రవర్ధనమ్ ॥ 8 ॥

ఈ తీర్థాన్ని స్మరించినంతమాత్రాన ఆయురారోగ్యాలను కలిగించి, సంపదలను సంతానాన్ని పెంచుతుంది. సమస్త కోరికలను తీర్చే మంగళప్రదమైందీ తీర్థం.

స్మరణా త్పఠనాద్వాఽపి సర్వకామానవాప్నుయాత్ ।
తీర్థానామయుతం తత్ర సర్వపాపనుదం మునే ॥ 9 ॥

ఈ తీర్థాన్ని గూర్చి స్మరించినా, పఠించినా కూడా సమస్త కోరికలు నెరవేరతాయి. ఓ మునీ! సమస్తపాపాలను హరించే పదివేలతీర్థాలక్కడున్నాయి.

తీర్థాన్యయుతసంఖ్యాని సర్వపాపహరాణి చ ।
యేషాం ప్రభావం జానాతి వక్తుం నాపి మహేశ్వరః ॥ 10 ॥

పాపాలను హరించే ఈ పది వేల తీర్థాల ప్రభావాన్ని తెలుసుకోవటానికి గాని, చెప్పుటకు గాని పరమేశ్వరునికి కూడా శక్తి చాలదు.

పాపక్షయ ప్రతినిధిర్నైతేభ్యోఽస్త్యపరఃక్వచిత్ ॥ 11 ॥

ఈ తీర్థాలు తప్ప పాపక్షయాన్ని చేయటానికి వీటికంటే మరొక ప్రతినిధి అంటూ ఎవరూ లేరు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే శంఖతీర్థాని అయుతతీర్థవర్ణనం నామ షడశీతితమోఽధ్యాయః ॥ 86 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో శంఖతీర్థం మున్నగుపదివేల తీర్థవర్ణనమనే పేరుగల ఎనబై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తాశీతితమోఽధ్యాయః - ఎనబై ఏడవ అధ్యాయం

కిష్కింధా తీర్థవర్ణనమ్ - కిష్కంధా తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కిష్కిన్ధాతీర్థమాఖ్యాతం సర్వకామప్రదం నృణామ్ ।
సర్వపాపప్రశమనం యత్ర సంనిహితో భవః ॥ 1 ॥

మానవుల సమస్తకోరికలను నెరవేర్చే కిష్కింధా తీర్థముంది. అక్కడ శివుడున్నాడు. అది సమస్తపాపాలను పోగొడుతుంది.

తస్య స్వరూపం వక్ష్యామి యత్నేన శృణు నారద ।
పురా దాశరథీ రామో రావణం లోకరావణమ్ ॥ 2 ॥

కిష్కింధా వాసిభిః సార్ధం జఘాన రణమూర్ధని ।
సపుత్రం సబలం హత్వా సీతామాదాయ శత్రుహా ॥ 3 ॥
భ్రాత్రా సౌమిత్రిణా సార్ధం వానరైశ్చ మహాబలైః ।
విభీషణేన బలినా దేవైః ప్రత్యాగతో నృపః ॥ 4 ॥

కృత స్వస్త్యయనః శ్రీమాన్ పుష్పకేన విరాజితః ।
యదాసీద్ధనరాజస్య కామగేనాऽऽశుగామినా ॥ 5 ॥

ఓ నారదా! ఈ తీర్థము యొక్క స్వరూపాన్ని చెబుతున్నాను శ్రద్ధగా విను. పూర్వం దశరథ కుమారుడైన శ్రీరాముడు లోకాలను బెదిరించు రావణుని కిష్కింధావాసులతో కలిసి వెళ్ళి యుద్ధంలో చంపాడు. అట్లు పుత్రులతో, సైన్యంతోగూడ అతణ్ణి చంపి, ఆ శత్రుంజయుడు సీతను తీసుకొనివచ్చి, తనసోదరుడైన లక్ష్మణునితో, బలవంతుడైన విభీషణునితో, మహా బలులైన వానరులతో, దేవతలతో నారాజు తిరిగి వచ్చి, ధనాధిపతి యగు కుబేరుని యొక్క సర్వకోరికలను దీర్చే, వేగంగా ప్రయాణం చేసే స్వభావం గల పుష్పకవిమానంలో విరాజమానుడై ఆ శ్రీమంతుడు స్వస్తివాచనాలను పొందినాడు.

అయోధ్యామగమన్సర్వే గచ్ఛన్గంగా మపశ్యత ।
రామో విరామః శత్రూణాం శరణ్యః శరణార్థినామ్ ॥ 6 ॥

అందరూ అయోధ్యానగరానికి వెళ్లారు. దారిలో గంగానదిని చూశారు. రాముడు శత్రువులను నాశనం చేసేవాడు. శరణం కోరినవారికి రక్షకుడు.

గౌతమీం తు జగత్పుణ్యాం సర్వకామప్రదాయినీమ్ ।
మనో నయన సంతాప నివారణ పరాయణామ్ ॥ 7 ॥

తాం దృష్ట్వా నృపతిః శ్రీమాన్ గంగాతీరమథాఽఽవిశత్ ।
తాం దృష్ట్వా ప్రాహ నృపతిర్హర్ష గద్గదయా గిరా
హరీన్ సర్వాన్ అథాఽఽమన్త్ర్య హనుమత్ప్రముఖాన్ మునే ॥ 8 ॥

జగత్తులో పవిత్రమైనది, సమస్త అభీష్టములను నెరవేర్చునది, మనో నేత్రముల యొక్క సంతాపములను పోగొట్టుటయందా సక్తి గలిగిన ఈ గౌతమీ నదిని చూచి శ్రీమంతుడైన ఆ రాజు గంగా తీరంలో ప్రవేశించాడు. ఓ మునీ! ఆ గంగానదిని చూడగానే రాజు హర్షాతిరేకంతో గొంతు బొంగురు పోయి దగ్గుత్తికతో హనుమంతుడు మున్నగు వానరుల నందరిని పిలిచి యిట్లన్నాడు.

రామఉవాచ :– రాముడు పలికాడు.

అస్యాః ప్రభావా ద్ధరయో యోఽసౌ మమ పితా ప్రభుః ।
సర్వపాప వినిర్ముక్తస్తతో యాతస్త్రివిష్టపమ్ ॥ 9 ॥

ఓ వానరులారా! ఈ గంగానది ప్రభావం వలన రాజైన మాతండ్రి దశరథుడు సమస్తపాపాలు తొలగిన వాడై తరువాత స్వర్గాన్ని చేరాడు.

ఇయం జనిత్రీ సకలస్య జన్తో ర్భుక్తిప్రదా ముక్తి మథాఽపి దద్యాత్ ।
పాపాని హన్యాదపి దారుణాని కాఽన్యానయాస్త్యత్ర నదీ సమానా ॥ 10 ॥

ఈ తల్లి సమస్త జీవులకు భుక్తిని, ముక్తిని యిస్తుంది. దారుణమైన పాపాలను నశింపచేస్తుంది. ఈ నదితో సమానమైనది మరొక టేమున్నది?

హతాని శశ్వద్దురితాని చైవ అస్యాః ప్రభావాదరయః సఖాయః ।
విభీషణో మైత్రముపైతి నిత్యం సీతా చ లబ్ధా హనుమాంశ్చ బన్ధుః ॥ 11

ఈ నది ప్రభావం వలన మాటి మాటికి వచ్చే పాపాలు నశించాయి. శత్రువులు మిత్రులైనారు. విభీషణుడు శాశ్వత స్నేహాన్ని పొందాడు. సీత లభించింది. హనుమంతునివంటి బంధువు లభించినాడు.

లంకా చ భగ్నా సగణం హి రక్షో హతం హి యస్యాః పరిసేవనేన ।
యాం గౌతమో దేవవరం ప్రపూజ్య శివం శరణ్యం స జటామవాప ॥ 12 ॥

ఈ నదిని సేవించుటవలన లంక భగ్నమైంది. రాక్షస సమూహాలన్నీ అంతరించాయి. గౌతముడు దేవశ్రేష్ఠుడైన, శరణాగతరక్షకుడైన శివుని పూజించి పాయలతో కూడుకొనియున్న ఈ గౌతమిని పొందాడు.

సేయం జనిత్రీ సకలేప్సితానా మమంగళానామపి సంనిహంత్రీ ।
జగత్పవిత్రీకరణైకదక్షా దృష్టాఽద్య సాక్షాత్సరితాం సవిత్రీ ॥ 13 ॥

అటువంటి సకల కోరికలనిచ్చేదీ, సకల అమంగళాలను తొలగించేదీ జగత్తు నంతటిని పావనం జేసే సామర్థ్యంగల సాక్షాత్తుగా నదులన్నింటికీ సవిత్రిరూపమైన దీన్ని ఈ రోజు దర్శించాము.

కాయేన వాచా మనసా సదైనాం వ్రజామి గంగాం శరణం శరణ్యామ్ ।
వన్దే సతాం మాతరం సర్వభావాం శంభోర్జటాజూట కృతాధివాసామ్ ॥ 14 ॥

మనో వాక్కాయ కర్మలతో ఎప్పుడూ శరణుపొంద దగిన ఈ గంగను శరణు పొందుతున్నాను. సర్వభావాలు గలిగి, సత్పురుషులకు తల్లియైన శివుని జటాజూటమునందుండు తల్లికి నమస్కరిస్తున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతత్సమాకర్ణ్య వచో నృపస్య తత్రాఽఽప్లవన్ హరయః సర్వ ఏవ ।
పూజాం చక్రు ర్విధివత్తే పృథక్చ పుష్పైరనేకైః సర్వలోకోపహారైః ॥ 15 ॥

ఇట్లు పలికిన రాజు మాటలు విని వానరులందరు ఆ గౌతమి నదిలో స్నానం చేసి సర్వలోక ఉపహారాలతో, అనేక పుష్పాలతో విధిపూర్వకంగా పూజను చేశారు.

సంపూజ్య శర్వం నృపతి ర్యథావత్ స్తుత్వా వాక్యైః సర్వభావోపయుక్తైః ।
తే వానరా ముదితాః సర్వ ఏవ నృత్యం చ గీతం చ తథైవ చక్రుః ॥ 16 ॥

రాజావిధంగా విధిపూర్వకంగా తన భావోపయుక్తాలైన మాటలతో శివుని పూజించి స్తోత్రం చేయగా వానరులందరు ఎంతో సంతోషంతో పాటలు పాడుతు నృత్యాలు చేశారు.

సుఖోషితస్తాం రజనీం మహాత్మా ప్రియానుయుక్తః సంవృతః ప్రేమవద్భిః ।
దుఃఖం జహౌ సర్వమమిత్రసంభవం కిం నాఽఽప్యతే గౌతమీ సేవనేన ॥ 17 ॥

ప్రియురాలితో కూడి ప్రేమవంతులైనవారు చుట్టు ఉండగా, శత్రువులవల్ల కలిగిన దుఃఖాన్నంతా వదిలి ఆ రాత్రి ఎంతో సంతోషంగా గడిపాడు. గౌతమిని సేవించిన ఏమి లభించకుండా ఉంటుంది?

సవిస్మయః పశ్యతి భృత్యవర్గం గోదావరీం స్తౌతి చ సంప్రహృష్టః ॥
సంమానయన్ భృత్యగణం సమగ్ర మవాప రామః కమపి ప్రమోదమ్ ॥
పునః ప్రభాతే విమలే తు సూర్యే విభీషణో దాశరథిం బభాషే ॥ 18 ॥

తన భృత్యవర్గాన్ని ఆశ్చర్యంతో చూచాడు. గోదావరిని ఎంతో ఆనందంగా స్తుతించాడు. తన సేవక గణాన్నంతటిని గౌరవిస్తూ రాముడేదో తెలియని యానందాన్ని పొందాడు. తిరిగి సూర్యోదయం కాగానే విభీషణుడు రామచంద్రుడితో ఇట్లన్నాడు.

విభీషణ ఉవాచ :– విభీషణుడు పలికాడు.

నాద్యాపి తృప్తాస్తు భవామ తీర్థే కంచిచ్చ కాలం నివసామ చాత్ర ।
వత్స్యామ చాత్రైవ పరాశ్చతస్రో రాత్రీరథో యామ వృతాస్త్వయోధ్యామ్ ॥ 19 ॥

ఈ తీర్థంలో ఇంకా తనివి తీరలేదు. ఇక్కడే ఇంకా కొంతకాలముందాం. ఇంకొక నాలుగు రోజులిక్కడే ఉందాం. తరువాత అందరం కలిసి అయోధ్యకు పోదాం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తస్యాథ వాక్యం హరయోఽనుమేనిరే తథైవ రాత్రీరపరాశ్చతస్రః ।
సంపూజ్య దేవం సకలేశ్వరం తం భ్రాతృప్రియం తీర్థమథో జగామ ॥ 20 ॥

ఆ విభీషణుడు పలికిన మాటలకు వానరులందరు అంగీకరించారు. అట్లే నాలుగు రాత్రులక్కడ గడిపారు. సకలేశ్వరుడు సోదరుల యందు ప్రీతి గల అతనిని పూజించి, మరొక తీర్థానికి వెళ్లాడు.

సిద్ధేశ్వరం నామ జగత్ప్రసిద్ధం యస్య ప్రసాదాత్ప్రబలో దశాస్యః ।
ఏవం తు పంచాహమథోషిరే తే స్వం స్వం ప్రతిష్ఠాపిత లింగమర్చ్య ॥ 21 ॥

రావణుడెవరి అనుగ్రహంతో మిక్కిలి బలవంతుడైనాడో ఆ తీర్థం సిద్ధేశ్వరమని జగత్ప్రసిద్ధమైంది. అక్కడ వారంతా ఎవరికి వారే లింగప్రతిష్ఠచేసి దానిని అర్చించి ఇట్లు ఐదురోజులు గడిపారు.

శుశ్రూషణం తత్ర కరోతి వాయోః సుతోఽనుగామీ హనుమాన్నృపస్య ।
గచ్ఛన్నృపేన్ద్రో హనుమన్తమాహ లింగాని సర్వాణి విసర్జయస్వ ॥ 22 ॥

వాయుకుమారుడైన హనుమంతుడు రాముని అక్కడ అనుసరిస్తూ సేవ చేస్తుండగా అప్పుడు రాముడు హనుమంతునితో లింగాలన్నింటిని విసర్జించు మని చెప్పాడు.

మత్స్థాపితాన్యుత్తమ మన్త్రవిద్భి స్తథేతరైః శంకరకింకరైశ్చ ।
నోద్వాస్య పూజాం పరశంకరేణ బాహ్యం సమాయోజ్యమహో భవస్య ॥ 23 ॥

నేను ఉత్తమ మంత్రాలతో స్థాపించినవాటికి, అట్లే శంకరసేవకులు స్థాపించినవాటికి, పరుడగు శంకరుని పూజోద్యాపనమును చెయ్యకుండా శివుని యొక్క బాహ్యకర్మలని సమకూర్చరాదు.

తిష్ఠన్తి సుస్థాస్తదనాదరేణ తే ఖడ్గ పత్రాదిషు సంభవన్తి ।
యేఽశ్రద్ధధానాః శివలింగపూజాం విధాయ కృత్యం న సమాచరన్తి ॥ 24 ॥

యథోచితం తే యమకింకరై ర్హి పచ్యన్త ఏవాఖిల దుర్గతీషు ।
రామాజ్ఞయా వాయుసుతో జగామ దోర్భ్యాం న చోత్పాటయితుం శశాక ॥ 25 ॥

కేవలం వేషం మాత్రమే ధరించి, అనాదరంతో నుంటారో అట్టివారు ఖడ్గపత్రం అనే నరకంలో పడతారు. ఎవరైతే అశ్రద్ధగలవారై శివలింగపూజను విధివిధానంగా చేయకుండా తమ పనులని చేస్తారో అటువంటివారిని వారి వారి పాపానికి తగినట్లుగా యమకింకరులు అనేక దుర్గతులతో శిక్షిస్తారు. రాముడి ఆజ్ఞప్రకారం హనుమంతుడు వెళ్లాడు కాని తన చేతులతో వాటిని పెకిలించలేక పోయాడు.

తతః స్వపుచ్ఛేన గ్రహీతుకామః సంవేష్ట్య లింగం తు విసృష్టకామః ।
నైవాశకత్తన్మహదద్భుతం స్యాత్ కపీశ్వరాణాం నృపతే స్తథైవ ॥ 26 ॥

అప్పుడు తన తోకను లింగానికి చుట్టి తన తోకతో దానిని లాగటానికి ప్రయత్నించాడు. కాని దాన్ని లాగ లేక పోయాడు. ఇది రాజుకు, వానరోత్తములకొక అద్భుతంగా అనిపించింది.

కశ్చాలయేల్లబ్ధ మహానుభావం మహేశలింగం పురుషో మనస్వీ ।
తన్నిశ్చలం ప్రేక్ష్య మహానుభావో నృప ప్రవీరః సహసా జగామ ॥ 27 ॥

గొప్పమహిమను చూపిన మహానుభావుడు లింగరూపుడైన పరమేశ్వరుని మనస్వియైన ఏ పురుషుడు కదిలించగలడు? ఆ శివలింగం కదలకుండా ఉండుట చూచిన రాజశేఖరుడైన రాముడు అక్కడికి త్వరగా వెళ్లాడు.

విప్రానథాఽఽమన్త్ర్య విధాయ పూజాం ప్రదక్షిణీకృత్య చ రామచన్ద్రః ।
శుద్ధాతి శుద్ధేన హ్రదాఖిలైస్తైః లింగాని సర్వాణి ననామ రామః ॥ 28 ॥

రామచంద్రుడు బ్రాహ్మణులను పిలిచి మిక్కిలి పవిత్రమైన ఆ సరస్సులనీటితో లింగాలని అభిషేకించి, పూజించి, ప్రదక్షిణం చేసి నమస్కరించాడు.

కిష్కిన్ధా వాసి ప్రవరైరశేషైః సంసేవితం తీర్థ మతో బభూవ ।
అత్రాఽఽప్లవా దేవ మహాన్తి పాపా న్యపి క్షయం యాన్తి న సంశయోఽత్ర ॥ 29 ॥

కిష్కింధావాసులైన శ్రేష్ఠులందరు ఈ తీర్థాన్ని సేవించారు. ఇక్కడ స్నానం చేసినంతమాత్రాన గొప్ప పాపాలన్నీ నశిస్తాయి సందేహం లేదు. అందువలన ఈ తీర్థం కిష్కంధా తీర్థం అయింది.

పునశ్చ గంగాం ప్రణనామ భక్త్యా ప్రసీద మాతర్మమ గౌతమీతి ।
జల్పన్ముహుర్విస్మిత చిత్తవృత్తి ర్విలోకయన్ ప్రణమన్ గౌతమీం తామ్ ॥ 30 ॥

అమ్మా గౌతమీ! నన్ననుగ్రహించు అనియడుగుతూ భక్తితో మాటిమాటికి పలుకుతూ, ఆశ్చర్యపడుతున్న మనస్సుగలవాడై చూస్తూ ఆ గౌతమికి నమస్కరించాడు.

తతః ప్రభృత్యేతదతీవపుణ్యం కిష్కింధతీర్థం విబుధా వదన్తి ।
పఠేత్స్మరేద్వాఽపి శృణోతి భక్త్యా పాపాపహం కిం పునఃస్నానదానైః ॥ 31 ॥

అప్పటి నుండి దీన్ని పవిత్రమైన కిష్కంధతీర్థమని పెద్దలు చెబుతారు. ఈ తీర్థాన్ని గూర్చి చదివినా, స్మరించినా, భక్తితో విన్నా పాపాలన్ని నశిస్తాయి. ఇక స్నానదానాలు చేస్తే ఇంక దాని ఫలితమేమని చెప్పెదము?

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే కిష్కింధా తీర్థ వర్ణనం నామ సప్తాశీతి తమోఽధ్యాయః ॥ 87 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో కిష్కింధా తీర్థ వర్ణనమనే పేరుగల ఎనభై ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాశీతితమో౽ధ్యాయః – ఎనబై ఎనిమిదవ అధ్యాయం
వ్యాసతీర్థ వర్ణనం – బ్రహ్మకు స్వపుత్రీగమన దోషం లేదనుట.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

వ్యాసతీర్థమితిఖ్యాతం ప్రాచేతస మతఃపరమ్ ।
నాతః పరతరం కించిత్పావనం సర్వసిద్ధిదమ్ ॥ 1 ॥

వ్యాసతీర్థమని పేరు పొందిన ప్రాచేతసమనే తీర్థముంది. దీనికంటే గొప్పదీ, పవిత్రమైనదీ, అన్నింటినీ ఇచ్చేదీ మరొకటి లేదు.

దశ మే మానసాః పుత్రాః స్రష్టారో జగతామపి ।
అన్తం జిజ్ఞాసవస్తే వై పృథివ్యా జగ్మురోజసా ॥ 2 ॥

(స్రష్టయొక్క) నా మానసపుత్రులు పదిమంది జగత్తును సృష్టించు సామర్థ్యం గలిగినవారు. జగత్తు యొక్క అంతాన్ని తెలుసుకోవాలనే కోరికతో ఓజస్సుతో భూలోకానికి వెళ్ళిపోయారు.

పునఃసృష్టాః పునస్తే౽పి యాతాస్తాన్సమవేక్షితుమ్ ।
నైవ తే౽పి సమాయాతా యే గతాస్తే గతా గతాః ॥ 3 ॥

బ్రహ్మచే మానసికపుత్రులు మళ్ళీ పుట్టింపబడ్డారు. వారు ముందువెళ్ళిన వారిని వెతకడానికి వెళ్ళారు. కానీ వారూ వెళ్ళినవారు వెళ్లినట్లే తిరిగిరాలేదు.

తదోత్పన్నా మహాప్రాజ్ఞా దివ్యా ఆంగిరసో మునే ।
వేదవేదాంగతత్త్వజ్ఞాః సర్వశాస్త్రవిశారదాః ॥ 4 ॥

ఓ మునీ! అప్పుడు మహాప్రాజ్ఞులు, వేదవేదాంగతత్త్వజ్ఞులు, సర్వశాస్త్రాల్లో నిష్ణాతులు, దివ్యులయిన ఆంగిరసులు జన్మించారు.

తే౽నుజ్ఞాతా ఆంగిరసా గురుం నత్వా తపోధనాః ।
తపసే నిశ్చితాః సర్వే నైవ పృష్ట్వా తు మాతరమ్ ॥ 5 ॥

ఆ తపోధనులైన ఆంగీరసులు తపస్సు చేయటానికి నిశ్చయించుకొని గురువుగారికి నమస్కరించి వారియను మతిని పొందారు. కాని తల్లిని అడగలేదు.

సర్వేభ్యోహ్యధికా మాతా గురుభ్యో గౌరవేణ హి ।
తదా నారదకోపేన సా శశాప నిజాత్మజాన్ ॥ 6 ॥

అందరికంటే తల్లి గొప్పది. గురువుల కంటే కూడా గౌరవంలో గొప్పది. ఓ నారదా! అప్పుడామె కోపంతో తన పుత్రులను శపించింది.

మాతోవాచ :– తల్లి పలికింది.

మామనాదృత్య యే పుత్రాః ప్రవృత్తాశ్చరితుం తపః ।
సర్వైరపి ప్రకారైస్తే సిద్ధిం నేష్యన్తి తత్త్వతః ॥ 7 ॥

ఏ నా కుమారులు నన్నులెక్క చేయక తపస్సు చేయటానికి పూనుకున్నారో వారు అన్నివిధాలుగా కూడా తత్త్వతః సిద్ధిని పొందరు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

నానాదేశాంశ్చ చిన్వానాస్తపః సిద్ధిం న యాన్తి చ ।
విఘ్నమన్వేతి తాన్సర్వానితశ్చేతశ్చ ధావతః ॥ 8 ॥

వారనేక దేశాల్లో తపస్సు చేసినా సిద్ధిని పొందలేరు. వారటునిటు ఆ దేశాలలో తిరుగుతున్నా వారిని విఘ్నం వెంబడించింది.

క్వాపి తద్రాక్షసై ర్విఘ్నం క్వాపి తన్మానుషైరభూత్ ।
ప్రమదాభిః క్వచిచ్చాపి క్వాపి తద్దేహదోషతః ॥ 9 ॥

ఒకచోట రాక్షసులతో, ఒక చోట మానవులతో, ఒక్కోచోట స్త్రీలతో, ఒక్కోమారు వారి దేహదోషాల వల్లనూ విఘ్నం కలిగింది.

ఏవంతు భ్రమమాణాస్తే యయుః సర్వే తపోనిధిమ్ ।
అగస్త్యం తపతాం శ్రేష్ఠం కుంభయోనిం జగద్గురుమ్ ॥ 10 ॥

ఇట్లు తిరుగుతూ వారంతా తపస్సు చేసుకునే వారిలో శ్రేష్ఠుడు, తపోనిధియు, జగద్గురువు, కుంభసంభవుడైన అగస్త్యుని వద్దకు వెళ్లారు.

నమస్కృత్వాహ్యాంగిరసాహ్యగ్నివంశసముద్భవాః ।
దక్షిణాశాపతిం శాన్తం వినీతాః ప్రష్టుముద్యతాః ॥ 11 ॥

అగ్నివంశంలో పుట్టిన ఆ ఆంగిరసులు శాంతుడూ దక్షిణ దిక్పతీ యగు నతనికి వినయంగా నమస్కరించి ఇలా అడగడానికి ఉపక్రమించారు.

ఆంగిరసా ఊచుః :– అంగిరసులు పలికారు.

భగవన్ కేన దోషేణ తపోఽస్మాకం న సిధ్యతి ।
నానావిధైరుపాయై కుర్వతాం చ పునఃపునః ॥ 12 ॥

ఓ పూజ్యుడా! మేమనేకవిధాలైన ఉపాయాలతో మాటిమాటికీ తపస్సు చేస్తూన్నా మాతపస్సు సిద్ధించుట లేదు. దీనికి గల కారణ మేదో తెలుపుము.

కిం కుర్మః కః ప్రకారోఽత్ర తపస్యేవ భవామ కిమ్ ।
ఉపాయం బ్రూహి విప్రేన్ద్ర జ్యేష్ఠోఽసి తపసా ధ్రువమ్ ॥ 13 ॥

మేమిప్పుడేమి చేయాలి? ఏ పద్ధతిననుసరించాలి? తపస్సు చేస్తూనే ఉండాలా? ఓ బ్రాహ్మణ శ్రేష్ఠుడా! తపస్సులో మీరు చాలా గొప్పవారు. ఇది సత్యం కావున మాకు ఏదైనా ఉపాయాన్ని చెప్పుము.

జ్ఞాతాऽసి జ్ఞానినాం బ్రహ్మన్ వక్తాऽసి వదతాం వరః ।
శాన్తోऽసి యమినాం నిత్యం దయావాన్ప్రియకృత్తథా ॥ 14 ॥

నీవు జ్ఞానులకు కూడా జ్ఞానివి. వక్తలలో శ్రేష్ఠమగు వక్తవు. ఋషులలో శాంతుడవు. సర్వదా దయను చూపెడుతూ ప్రియం చేసేవాడివి.

అక్రోధనశ్చ న ద్వేష్టా తస్మాద్బ్రూహి వివక్షితమ్ ।
సాహంకారా దయాహీనా గురుసేవా వివర్జితాః ॥
అసత్యవాదినః క్రూరా న తే తత్త్వం విజానతే ॥ 15 ॥

నీవు కోపం లేనివాడవు, ద్వేషించనివాడవు కావున మేమడిగిన దానికి సమాధానపరచుము. అహంకారం గలవారూ, దయలేనివారూ, గురువులను సేవించని వారూ, అబద్ధాలాడువారూ, క్రూరులూ నీ తత్త్వాన్ని తెలుసు కోలేరు. అటువంటి వారు నీ తత్త్వజ్ఞానాన్ని పొందలేరు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

అగస్త్యఃప్రాహ తాన్సర్వాన్ క్షణం ధ్యాత్వా శనైః శనైః ॥ 16 ॥

అగస్త్యుడు కొంచెంసేపు ధ్యానించి మెల్ల మెల్లగా వారితో నిట్లన్నాడు.

అగస్త్య ఉవాచ :- అగస్త్యుడు పలికాడు.

శాన్తాత్మానో భవన్తో వై స్రష్టారో బ్రహ్మణాకృతాః ।
న పర్యాప్తం తపశ్చాభూత్స్మరధ్వం స్మయకారణమ్ ॥ 17 ॥

మీరు శాంతస్వభావులు. బ్రహ్మ మిమ్ములను స్రష్టలనుగా కూడా చేసినాడు. మీరు చేసిన తపస్సు సరిపోలేదు. ఈ ఆశ్చర్యకరమైన దానికి కారణమేమిటో స్మరించుడు.

బ్రహ్మణా నిర్మితాః పూర్వం యే గతాః సుఖమేధతే ।
యే గతాః పునరన్వేష్టుం తే చ త్వాంగిరసోऽభవన్ ॥ 18 ॥

పూర్వం బ్రహ్మచే సృష్టింపబడి వెళ్ళినవారు సుఖంగానే ఉన్నారు. ఎవరు తిరిగి వానిని అన్వేషించుటకు వెళ్ళినారో వారు ఆంగిరసులుగా అయ్యారు.

తే యూయం చ పునః కాలే యాతా యాతాః శనైః శనైః ।
ప్రజాపతేరప్యధికా భవితారో న సంశయః ॥ 19 ॥

అటువంటి మీరు కాలాంతరంలో మెల్లగా తిరిగి గడుచుచుండగా మీరు బ్రహ్మ కన్నా గొప్పవారౌతారు. సందేహం లేదు.

ఇతో యాన్తు తపస్తప్తుం గంగాం త్రైలోక్యపావనీమ్ ।
నోపాయోఽన్యోఽస్తి సంసారే వినా గంగాం శివప్రియామ్ ॥ 20 ॥

ముల్లోకపావని యగు గంగానది వద్దకు వెళ్ళి తపస్సు చేయుడు. ఈ ప్రపంచంలో శివప్రియమైన గంగకంటే మరొక ఉపాయమేదీ లేదు.

తత్రాఽఽశ్రమే పుణ్యదేశే జ్ఞానదం పూజయిష్యథ ।
సచ్ఛేదయిష్యత్యఖిలం సంశయం వో మహామతిః ॥
న సిద్ధిః క్వాపి కేషాంచిద్వినా సద్గురుణా యతః ॥ 21 ॥

అక్కడి ఆశ్రమమునందా పుణ్యప్రదేశంలో జ్ఞానమిచ్చేవానిని పూజించండి. ఆ మహాత్ముడు మీ సంశయాలన్నింటిని తీసేస్తాడు. ఎందుకంటే సద్గురువు లేకుండా ఎక్కడా ఎవరికీ సిద్ధి లభించదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తే తమూచుర్మునివరం జ్ఞానదః కోఽభిధీయతే ।
బ్రహ్మ విష్ణుర్మహేశో వా ఆదిత్యో వాఽపి చన్ద్రమాః ॥ 22 ॥

అగ్నిశ్చ వరుణః కః స్యాత్ జ్ఞానదో మునిసత్తమ ।
అగస్త్యః పునరప్యాహ జ్ఞానదః శ్రూయతా మయమ్ ॥ 23 ॥

అప్పుడు వారామునివరునితో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, ఆదిత్య చంద్రులలో జ్ఞానదుడని ఎవరినంటారు (అడిగారు) అగ్నియా? వరణుడా? ఓ మునిసత్తమా! జ్ఞానదుడనగా నెవరో చెప్పుడనగా అప్పుడగస్త్యుడు తిరిగివారితో జ్ఞానదుడంటే ఎవరో చెప్పుచున్నాను విను.

యా ఆపః సోఽగ్ని రిత్యుక్తో యోఽగ్నిః సూర్యః స ఉచ్యతే ।
యశ్చ సూర్యః స వై విష్ణుర్యశ్చ విష్ణుః స భాస్కరః ॥ 24 ॥

జలాన్ని అగ్ని అంటారు. అగ్నిని సూర్యుడంటారు. సూర్యుడే విష్ణువు, విష్ణువే భాస్కరుడు.

యశ్చ బ్రహ్మ స వై రుద్రో యో రుద్రో సర్వమేవ తత్ ।
యస్య సర్వం తు తజ్జ్ఞానం జ్ఞానద స్సోఽత్ర కీర్త్యతే ॥ 25 ॥

బ్రహ్మే రుద్రుడు. ఆ రుద్రుడే సమస్తమున్నూ. సర్వజ్ఞానమూ ఎవరికి చెంది ఉందో! అతడే జ్ఞానదుడు.

దేశిక ప్రేరక వ్యాఖ్యాకృదుపాధ్యాయదేహదాః ।
గురవః సన్తి బహవస్తేషాం జ్ఞానప్రదో మహాన్ ॥ 26 ॥

దేశికుడూ, ప్రేరకుడూ, వివరించి చెప్పేవాడూ, దేహాన్ని ఇచ్చేతండ్రి ఇలా గురువు లెందరో ఉన్నారు. వారందరిలోనూ జ్ఞానమిచ్చేవాడే గొప్పవాడు.

తదేవ జ్ఞానమత్రోక్తం యేన భేదో విహన్యతే ।
ఏక ఏవాద్వయః శంభురింద్రమిత్రాగ్నినామభిః ॥
వదన్తి బహుధా విప్రా భ్రాన్త్యోపకృతిహేతవే ॥ 27 ॥

ఏది భేదం లేకుండా చేస్తూందో అదే జ్ఞానం అని ఇక్కడ చెప్పబడింది. ఇంద్రుడు, మిత్రుడు, అగ్ని అని అనేక పేర్లతో నెవనిని చెప్పుచున్నారో వారందరూ ఒక్కడే అయిన శివుడే. విప్రులు భ్రాంతి కారణంగా అలా వేర్వేరుగా చెప్పుచున్నారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా మునేర్వాక్యం గాథా గాయన్త ఏవ తే ।
జగ్ముః పంచోత్తరాం గంగాం పంచ జగ్ముశ్చ దక్షిణామ్ ॥ 28 ॥

ఈ మాటను విని ముని చెప్పిన ప్రకారంగా ఐదుగురూ గంగానది కుత్తరతీరానికి, మరొక ఐదుగురు గంగానది దక్షిణ తీరానికి జ్ఞానప్రదునిగాథను గానం చేస్తూ వెళ్లారు.

అగస్త్యేనోదితాన్ దేవాన్ పూజయన్తో యథావిధి ।
ఆసనేషు విశేషేణ హ్యాసీనాస్తత్త్వచిన్తకాః ॥ 29 ॥

అగస్త్యమహర్షి చెప్పిన ప్రకారంగా ఆ యా దేవతలను యథావిధిగా పూజిస్తూ ఆ తత్త్వచింతకులు విశేషంగా వారి వారి ఆసనాల్లో ఆసీనులైనారు.

తేషాం సర్వే సురగణాః ప్రీతిమన్తోఽభవన్మునే ।
స్రష్టృత్వం తు యుగాదౌ యత్కల్పితం విశ్వయోనినా ॥ 30 ॥

అధర్మాణాం నివృత్త్యర్థం వేదానాం స్థాపనాయ చ ।
లోకానా ముపకారార్థం ధర్మకామార్థసిద్ధయే ॥ 31 ॥

పురాణస్మృతివేదార్థ ధర్మశాస్త్రార్థనిశ్చయే ।
స్రష్టృత్వం జగతామిష్టం తాదృగ్రూపా భవిష్యథ ॥ 32 ॥

ఓ మునీ! వారు జేసిన పూజలకు దేవతాగణమంతా సంతోషపడ్డారు. యుగాది యందు బ్రహ్మచేత ఏ సృష్టికార్యం నిర్ణయింపబడిందో! అధర్మాన్ని తొలగించటానికీ, వేదమతాన్ని స్థాపించటానికీ, లోకాని కుపకరించటానికీ, ధర్మార్థకామాలు సిద్ధించటానికీ. పురాణాలూ, స్మృతులూ, వేదాల యొక్క అర్థాలూ, ధర్మశాస్త్రాల యొక్క అర్థాలూ నిశ్చయించటానికే ఈ సృష్టి అనేది జగత్తున కిష్టమైన విధంగా ప్రవర్తింపగలరు.

ప్రజాపతిత్వం తేషాం వై భవిష్యతి శనైః క్రమాత్ ।
యదాహ్యధర్మో భవితా వేదానాం చ పరాభవః ॥ 33 ॥

వేదానాం వ్యసనం తేభ్యో భావి వ్యాసాస్తతస్తుతే ।
యదా యదా తు ధర్మస్య గ్లానిర్వేదస్య దృశ్యతే ॥ 34 ॥

తదా తదా తు తే వ్యాసా భవిష్యన్త్యుపకారిణః ।
తేషాం యత్తపసః స్థానం గంగాయాస్తీరముత్తమమ్ ॥ 35 ॥

నెమ్మదిగా క్రమంగా వారికి ప్రజాపతిత్వం లభిస్తుంది. ఎప్పుడైతే అధర్మమేర్పడుతుందో, వేదములకవమానం జరుగుతుందో వేదాలపై ఉండే ఆసక్తి వలన వారికి భవిష్యత్తులో వ్యాసత్వం లభించి వ్యాసులౌతారు. ఎప్పుడెప్పుడు ధర్మానికి, వేదానికి గ్లాని ఏర్పడుతుందో. అప్పుడప్పుడా వ్యాసులు వేదాలకు ఉపకరించే వారౌతారు. వారు తపస్సు చేయటానికి చేరే స్థానం. ఉత్తమమైన గంగాతీరం.

తత్ర తత్ర శివో విష్ణురహమాదిత్య ఏవ చ ।
అగ్నిరాపః సర్వమితి తత్ర సంనిహితం సదా ॥ 36 ॥

అక్కడక్కడ శివుడు, విష్ణువు, నేను, సూర్యుడు, అగ్ని, వరుణుడు, అందరూ సర్వదా అక్కడ ఉంటాము. 'అగ్ని రాపః' అన్నట్లుగా సన్నిహితంగా నుంటాము.

నైతేభ్యః పావనం కించిన్నైతేభ్యస్త్వధికం క్వచిత్ ।
తత్తదాకారతాం ప్రాప్తం పరం బ్రహ్మైవ కేవలమ్ ॥ 37 ॥

వీరికంటే పవిత్రమైంది మరొకటి లేదు. వీరికంటే అధికమైందీ ఏదీ లేదు. పరంబ్రహ్మమే కేవలంగా ఆయా ఆకారాలను పొందింది.

సర్వాత్మకః శివో వ్యాపీ సర్వభావస్వరూపధృక్ ।
విశేషతస్తత్ర తీర్థే సర్వప్రాణ్యనుకమ్పయా ॥ 38 ॥

సర్వై ర్దేవైరనువృతస్తత్తదనుగ్రహకారకః ।
ధర్మవ్యాసాస్తు తే జ్ఞేయా వేదవ్యాసాస్తథైవ చ ॥ 39 ॥

సర్వాత్మకుడా! సర్వభావస్వరూపాన్ని ధరించినవాడా! వ్యాపకుడైన శివుడు జీవులందరియందుండే దయతో విశేషంగా ఆ తీర్థంలో సమస్త దేవతలతో గూడినవాడై వారిననుగ్రహించే కారకునిగానున్నాడు. అందుకే వారినందరిని ధర్మవ్యాసులనీ అట్లే వేదవ్యాసులని యెరుగవలెను.

తేషాం తీర్థం తేన నామ్నా వ్యపదిష్టం జగత్త్రయే ।
పాపపంకక్షాలనామ్నో మోహధ్వాన్తమదాపహమ్ ॥
సర్వసిద్ధిప్రదం పుంసాం వ్యాసతీర్థమనుత్తమమ్ ॥ 40 ॥

ఈ ముల్లోకాలలో ఆ ఆంగిరస తీర్థం అతని పేరుతోనే ప్రసిద్ధి చెందింది. ఆ తీర్థం పాపపంకాన్ని కడిగి మోహమనే గర్వాన్నీ, చీకటినీ తొలగిస్తుంది. మానవులందరికీ సర్వసిద్ధులనూ కలుగ జేస్తుంది. అదే ఉత్తమమైన వ్యాసతీర్థం.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే వ్యాసతీర్థవర్ణనం నామాష్టాశీతితమోఽధ్యాయః ॥ 88 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థ మాహాత్మ్యంలోని వ్యాసతీర్థ వర్ణనమనే పేరుగల ఎనబై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోన నవతితమోఽధ్యాయః - ఎనభై తొమ్మిదవ అధ్యాయం

వంజరాసంగమాది సపాదలక్షతీర్థ వర్ణనమ్-వంజరా సంగమం మున్నగు లక్షా ఇరవైవేల తీర్థాల వర్ణనం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వంజరా సంగమం నామ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ।
ఋషిభిః సేవితం నిత్యం సిద్ధైః రాజర్షిభిస్తథా ॥ 1 ॥

వంజరా తీర్థమనేది ముల్లోకాలలో పేరుగాంచింది. ఆ సంగమతీర్థాన్ని ప్రతిదినం సిద్ధులూ, రాజర్షులూ, ఋషులూ సేవించేవారు.

దాసత్వమగమత్పూర్వం నాగానాం గరుడఃఖగః ।
మాతృదాస్యాత్తదా దుఃఖపరిసంతప్తమానసః ॥
కదా చిచ్చింతయామాస రహః స్థిత్వా వినిశ్వసన్ ॥ 2 ॥

పూర్వం గరుడుడనే పక్షిరాజు నాగులకు దాసుడిగా ఉండేవాడు. తన తల్లి దాస్యం చేస్తూండటం చూచి మనస్సులో చాలా దుఃఖించాడు. ఒకనాడు ఒంటరిగా నిట్టూర్పులు వదులుతూ ఇలా చింతించాడు.

గరుడ ఉవాచ :- గరుడుడు పలికాడు.

త ఏవ ధన్యా లోకేఽస్మిన్ కృతపుణ్యాస్త ఏవ హి ।
నాన్యసేవా కృతా యైస్తు న యేషాం వ్యసనాగమః ॥ 3 ॥

ఈలోకంలో ఎవరైతే ఇతరులకు సేవలు చేయకుండా ఉంటారో వారే ధన్యులు. వాళ్లే పుణ్యాత్ములు. ఎవరికి కష్టాలు రావో వాళ్లే ధన్యులు కదా!

సుఖం తిష్ఠన్తి గాయన్తి స్వపన్తి చ హసన్తి చ ।
స్వదేహప్రభవో ధన్యా ధిగ్ధిగన్యవశే స్థితాః ॥ 4 ॥

ఎవరైతే సుఖంగా పాడుకుంటారో, నిద్రిస్తారో, నవ్వుతూ ఉంటారో, తమకు తామే యజమానులుగా ఉంటారో వాళ్లే ధన్యులు. ఛీ ఛీ ఇతరులవశంలో ఉండి సేవకులుగా నుండు వారి జీవితం ఏం జీవితం?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి చిన్తా సమావిష్టో జననీమేత్య దుఃఖితః ।
పర్యపృచ్ఛదమేయాత్మా వైనతేయోఽథ మాతరమ్ ॥ 5 ॥

ఇట్లు మిక్కిలి చింతించి దుఃఖిస్తూ అమేయాత్ముడైన గరుత్మంతుడు తల్లినిచేరి తల్లినిలా అడిగాడు.

గరుడ ఉవాచ :- గరుడుడు పలికాడు.

కస్యాపరాధాన్మాతస్త్వం పితుర్వా మమ వాఽన్యతః ।
దాసీత్వమాప్తావద తత్కారణం మమ పృచ్ఛతః ॥ 6 ॥

అమ్మా! నీ విట్లు దాసిగా నుండుటకు కారణమేమి? ఇది నా తప్పువల్లా, నాన్నగారి వల్లా? లేక ఇతరులవల్లా? నేనడుగుతున్నా వివరించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సాఽబ్రవీత్పుత్రమాత్మీయమరుణస్యానుజం ప్రియమ్ ॥ 7 ॥

అప్పుడామె అరుణుని సోదరుడూ తనకాత్మీయుడైన తన పుత్రుడితో ఇట్లన్నాడు.

వినతోవాచ :- వినత పలికింది.

నైవ కస్యాపరాధోఽస్తి స్వాపరాధో మయోదితః ।
యస్యా వాక్యం విపర్యేతి సా దాసీ స్యాన్మయోదితమ్ ॥ 8 ॥

ఇక్కడ ఎవరి దోషంలేదు. నేను మాట్లాడినదే దోషం. ఎవరిమాట విపరీతమైతే వారు దాసి కావాలని నేనన్నాను.

కద్రూశ్చాపి తథైవాహం సా మయా సంయుతా యయౌ ।
కద్ర్వా మమాఽభవద్వాదశ్ఛద్మనాఽహం తయా జితా ॥ 9 ॥

కద్రువ గూడా అట్లేయన్నది. మేమిద్దరమట్లే వెళ్లాము. కద్రువకు నాకూ వాదం జరిగింది. కద్రువ నన్ను మోసంతో జయించింది.

విధిర్హి బలవాంస్తాత! కాం కాం చేష్టాం న చేష్టతే ।
ఏవం దాసీత్వ మగమం కద్ర్వాః కశ్యపనన్దన ॥
యదా దాసీ తు జాతాహం దాసోఽభూస్త్వం ద్విజన్మజ ॥ 10 ॥

నాయనా! కశ్యపకుమారా! విధి చాలా బలవత్తరమైంది. అది ఏ ఏ చేష్టలు చేయకుండా ఉంటుంది? ఇదిగో ఇలా నేను కద్రువకు దాసినైనాను. నేనెప్పుడు దాసిదానినైనానో పక్షిజన్మగలవాడా! నువ్వుకూడా దాసుడవైనావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తూష్ణీం తదా బభూవాసౌ గరుడోఽతీవదుఃఖితః ।
న కించిదూచే జననీం చిన్తయన్ భవితవ్యతామ్ ॥ 11 ॥

అప్పుడు గరుడుడు మిక్కిలి దుఃఖించి మాట్లాడకుండా ఉండినాడు. భవిష్యత్తును గూర్చి ఆలోచిస్తూ తల్లితో ఏమీ అనలేదు.

కద్రూః కదాచిత్సా ప్రాహ పుత్రాణాం హితమిచ్ఛతీ ।
ఆత్మనో భూతిమిచ్ఛన్తీ వినతాం ఖగమాతరమ్ ॥ 12 ॥

ఒకనాడు తన పుత్రుల హితాన్ని కోరుతూ, తనకైశ్వర్యాన్ని కోరుతూ గరుడుడి తల్లియైన వినతతో కద్రువ ఇలా అంది.

కద్రూరువాచ :- కద్రువ పలికింది.

పుత్రః సూర్యం నమస్కర్తుం తవ యాత్యనివారితః ।
అహో లోకత్రయేఽప్యస్మిన్ ధన్యాఽసి బత దాస్యపి ॥ 13 ॥

నీకుమారుడు క్రమం తప్పకుండా సూర్యుని నమస్కరించటానికి రోజూ వెళ్తూ ఉంటాడు. ఆహా! దాసివైనా నువ్వు ముల్లోకాల్లోనూ ధన్యురాలవు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స్వదుఃఖం గూహమానా సా కద్రూం ప్రాహ సువిస్మితా ॥ 14 ॥

తన దుఃఖాన్ని లోలోపల దాచుకొని వినత ఆశ్చర్యంగా కద్రువతో ఇట్లంది.

వినతోవాచ :- వినత పలికింది.

తవ పుత్రాస్తు కిమితి రవిం ద్రష్టుం న యాన్తి చ ॥ 15 ॥

నీకుమారులు సూర్యుని దర్శించుట కెందుకు వెళ్లరు?

కద్రూరువాచ :- కద్రువ పలికింది.

పుత్రాన్ మదీయాన్ సుభగే నయ నాగాలయం ప్రతి ।
సముద్రస్య సమీపే తు తదాస్తే శీతలం సరః ॥ 16 ॥

ఓ సౌభాగ్యవతీ! సముద్రం దగ్గర చల్లని సరస్సు ఉంది. నాకుమారులను ఆ నాగాలయం వద్దకు తీసుకొని వెళ్లు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సుపర్ణస్త్వ వహన్నాగాన్ కద్రూం చ వినతా తథా ।
తతః ప్రోవాచ ముదితా వైనతేయస్య మాతరమ్ ॥ 17 ॥

గరుత్మంతుడు నాగులను మోయగా, వినత కద్రువను మోస్తుండగా అప్పుడు కద్రువ సంతోషిస్తూ గరుడుడి తల్లియైన వినతతో ఇట్లంది.

సురాణాం నేతు నిలయం గరుడో మత్సుతానితి ।
సర్పమాతా పునః ప్రాహ గరుడం వినయాన్వితమ్ ॥ 18 ॥

నాకుమారులను గరుత్మంతుడు దేవతలుండే స్వర్గానికి తీసుకుపోవాలి. తిరిగి సర్పమాతయైన కద్రువ వినయాన్వితుడైన గరుడునితో ఇట్లంది.

సర్పమాతోవాచ :– కద్రువ పలికింది.

పుత్రా మే ద్రష్టుమిచ్ఛన్తి హంసం త్రిజగతాం గురుమ్ ।
నమస్కృత్వా తతః సూర్యమేష్యన్తి నిలయం మమ ॥
వినతే నయ పుత్రాన్మే సూర్యమణ్డలమన్వహమ్ ॥ 19 ॥

నాకుమారులు ముల్లోకాలకు గురువైన రవిని చూచుటకుబలాట పడుతున్నారు. సూర్యునికి నమస్కరించి తిరిగి ఇంటికి రాగలరు. వినతా! నా కుమారులను రోజూ సూర్యమండల మార్గానికి తీసుకొని పో.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సా వేపమానా వినతా దీనా కద్రూమభాషత ॥ 20 ॥

వినత దుఃఖిస్తూ దీనంగా కద్రువతో ఇలా అంది.

వినతోవాచ :– వినత పలికింది.

నాహం క్షమా సర్పమాతః పుత్రో మే నేష్యతే సుతాన్ ।
దృష్ట్వా దినకరం దేవం పునరేవ ప్రయాన్తు తే ॥ 21 ॥

ఓ సర్పమాతా! నాకు శక్తిలేదు. నీకుమారులను నాకుమారుడు తీసుకొనివెళ్ళగలడు. సూర్యదేవుని దర్శించి వారు తిరిగి వస్తారు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

వినతా స్వసుతం ప్రాహ విహగానామధీశ్వరమ్ ।
నమస్కర్తుమథేచ్ఛన్తి నాగాః స్వామిత్వమాగతాః ॥ 22 ॥

భాస్వన్తమిత్యువాచేయం మాం సర్పజననీ హఠాత్ ।
తథేత్యుక్త్వా స గరుడో మామారోహన్తు పన్నగాః ॥ 23 ॥

పక్షిరాజగు తనకుమారునితో వినత ఇట్లంది. మనకు యజమానులయిన నాగులు రవిని నమస్కరించ గోరుతున్నారు. నాగులు సూర్యుని చూడగోరుతున్నారని, నాతో ఆ సర్పమాత ఆకస్మికంగా చెప్పింది. అప్పుడు గరుడుడు అలాగేయని నాగులారా! నాపై కెక్కమన్నాడు.

తదాఽఽరూఢం సర్పసైన్యం గరుడం విహగాధిపమ్ ।
శనైః శనైరుపాగమద్యత్ర దేవో దివాకరః ॥
తే దహ్యమానాస్తీక్ష్ణేన భానుతాపేన వివ్యథుః ॥ 24 ॥

అప్పుడు పక్షిరాజైన గరుత్మంతునిపై సర్ప సైన్యమెక్కగా, ఆ గరుడుడు మెల్లమెల్లగా సూర్యదేవుడున్న చోటుకు వెళ్లాడు. వారు సూర్యుని తీక్ష్ణమైన వేడికి మండిపోతూ వ్యథ చెందారు.

సర్పా ఊచు :- సర్పాలు పలికాయి.

నివర్తస్వ మహాప్రాజ్ఞ పతంగాయ నమో నమః ।
అలం సూర్యస్య సదనం దగ్ధాః సూర్యస్య తేజసా
యామస్త్వయా వా గరుడ విహాయ త్వామథాపి వా ॥ 25 ॥

ఓ మహాప్రాజ్ఞా! పక్షిరాజా! నీకునమస్కారం వెనుకకు తిరుగు. సూర్యుని సదనానికి పోవుట చాలు. మేం సూర్యుని తేజస్సుతో మాడిపోతున్నాము. ఓగరుడా! మేము నీతోనైనా లేదా నిన్ను వదలి అయినా క్రిందికి పోతాం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం నాగైరుచ్యమాన ఆదిత్యం దర్శయామి వః ।
ఇత్యుక్త్వా గగనం శీఘ్రం జగామాఽఽదిత్య సంముఖః ॥ 26 ॥

ఇట్లు నాగులంటున్నా గూడా మీకు సూర్యుని చూపిస్తాను అని వేగంగా సూర్యాభిముఖంగా ఆకాశంలో ప్రయాణించాడు.

దగ్ధభోగా నిపేతుస్తే ద్వీపం తం వీరణం ప్రతి ।
బహవః శతసాహస్రాః పీడితా దగ్ధవిగ్రహాః ॥ 27 ॥

కాలిన సర్పాలు వీరణద్వీపంలో పడిపోయాయి. వందలవేల నాగులపడగలు, శరీరాలు కాలి పీడను పొందినాయి.

శ్రుత్వార్తనాదం పుత్రాణాం పతితానాం భువస్తలే ।
ఆశ్వాసితుం సమాయాతా తాన్ సా కద్రూః సువిహ్వలా ॥ 28 ॥

భూమిమీద పడిన తనకుమారుల ఆర్తనాదాన్ని విని మిక్కిలి విహ్వలురాలై కద్రువ వాళ్లను ఓదార్చటానికి వాళ్ల వద్దకు వచ్చింది.

ఉవాచ వినతాం కద్రూస్తవ పుత్రోఽతిదుష్కృతమ్ ।
కృత వానతి దుర్మేధా యేషాం శాన్తిర్న విద్యతే ॥ 29 ॥

కద్రువ వినతతో "నీకుమారుడు మిక్కిలి దుష్కర్మ చేశాడు. దుర్బుద్ధితో వాళ్లకు శాంతి లేకుండా చేసినా"దని పలికింది.

నాన్యథాకర్తుమాయాతి స్వామివాక్యం ఫణీశ్వరః ।
స కాశ్యపో బృహత్తేజా యద్యత్ర స్యాదనామయమ్ ॥ 30 ॥

గొప్ప తేజస్కుడూ, నాగులకి శ్రేష్ఠుడూ, కశ్యపుని కుమారుడూ అయిన ఆదిశేషుడు ఇక్కడున్నచో యజమానుల ఆజ్ఞను గరుడుడు ఇలా చెయ్యడు. సర్పాలకు దుఃఖం కలిగేది కాదు.

భవేచ్చైవం కథం శాన్తిః పుత్రాణాం మమ భామిని ।
కద్ర్వా స్తద్వచనం శ్రుత్వా వినతాహ్యతిభీతవత్ ॥ 31 ॥

పుత్రమాహ మహాత్మానం గరుడం విహగాధిపమ్ ॥ 32 ॥

ఇట్లైతే ఓ భామినీ! నా కుమారుల కెట్లు శాంతి కలుగుతుంది ? అని ఇలా పలికిన కద్రువమాటలను విని వినత మిక్కిలి భయపడి, పక్షిరాజు మహాత్ముడు తన పుత్రుడైన గరుడుడితో ఇట్లన్నాడు.

వినతోవాచ :– వినత పలికింది.

నేదం యుక్తతరం పుత్ర భూషణం వినయేన హి ।
వర్తితుం యుక్తమిత్యుక్తం వైపరీత్యం న యుజ్యతే ॥ 33 ॥

నాయనా! ఇది సరైందికాదు. వినయంగా ప్రవర్తించుటే అలంకారమంటారు. విపరీతంగానుండుట యుక్తంగాదు.

నామిత్రేష్వపి కర్తవ్యం సద్భిర్జిహ్మం కదాచన ।
శ్రోత్రియే చాన్త్యజే వాఽపి సమం చంద్రః ప్రకాశతే ॥ 34 ॥

శత్రువులయందు కూడా సత్పురుషుడైనవాడు కపటంగా ప్రవర్తించరాదు. చంద్రుడు శ్రోత్రియుని యందూ అంత్యజుని యందునూ సమానంగనే ప్రకాశిస్తాడు.

కుర్వన్త్యనిష్టం కపటైస్త ఏవ మమ పుత్రక ।
ప్రసహ్య కర్తుం యే సాక్షా దశక్తాః పురుషాధమాః ॥ 35 ॥

నాయనా! వారే కపటంతో నాకు కష్టమును కలిగించువిధంగా ప్రవర్తిస్తారు? ఎవరు చాటుగా కాకుండా ఎదురుగా నిలచి చేయరో వారు పురుషాధములందురు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ పలికాడు.

వినతా చ తతః ప్రాహకద్రూం తాం సర్పమాతరమ్ ॥ 36 ॥

అప్పుడు నాగమాత కద్రువతో వినత ఇలా అంది.

వినతోవాచ :– వినత పలికింది.

కిం కృత్వా శాన్తిరభ్యేతి పుత్రాణాం తే కరోమి తత్ ।
జరయా తు గృహీతా స్తే వద శాన్తిం కరోమి తత్ ॥ 37 ॥

ఓ కద్రువా! నీ పుత్రులకి ఏంచేస్తే ఉపశమనం కలుగుతుంది? వారు వ్యాధి పీడితులై ఉన్నారు. వారి శాంతి కోసం ఏం చెయ్యాలో చెప్పు? వారికి నే నెట్లు శాంతిని కలుగజేస్తా? అది చెప్పుము.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కద్రూరప్యాహ వినతాం రసాతలగతం పయః ।
తేనాభిషేచితానాం మే పుత్రాణాం శాన్తి రేష్యతి ॥ 38 ॥

కద్రువకూడా వినతతో ఇట్లంది. రసాతలం నుండి జలాన్ని తీసుకొనివచ్చి నా పుత్రులకు స్నానం చేస్తే శాంతి కలుగుతుంది.

కద్ర్వా స్తద్వచనం శ్రుత్వా రసాతలగతం పయః ।
క్షణే నైవ సమానీయ నాగాంస్తానభ్యషేచయత్ ॥
తతః ప్రోవాచ గరుడో మఘవానం శతక్రతుమ్ ॥ 39 ॥

కద్రువ మాటలు విన్న గరుడుడు వెంటనే రసాతలం వెళ్ళి క్షణంలో రసాతలజలాన్ని తీసుకొని వచ్చి నాగుల కభిషేకం చేశాడు. తరువాత నా గరుడుడు శతక్రతుడైన ఇంద్రునితో ఇట్లన్నాడు.

గరుడ ఉవాచ :- గరుడుడు పలికాడు.

మేఘాశ్చాప్యత్ర వర్షన్తు త్రైలోక్యస్యోపకారిణః ॥ 40 ॥

ముల్లోకాల కుపకారం చేసే మేఘాలు కూడా ఇక్కడ వర్షించును గాక!

బ్రహ్మోవాచ:- బ్రహ్మ పలికాడు.

తథా వవర్ష పర్జన్యో నాగానామభవచ్ఛివమ్ ।
రసాతలభవం గాంగం నాగసంజీవనం పయః ॥ 41 ॥

అప్పుడా పర్జన్యుడట్లే వర్షించాడు. నాగులకు శుభం కలిగింది. రసాతలంలో పుట్టిన గంగాజలం నాగులకు బ్రతుకు నిచ్చింది.

జరాశోక వినాశార్థమానీతం గరుడేన యత్ ।
యత్రాభిషేచితా నాగాస్తన్నాగాలయముచ్యతే ॥ 42 ॥

ముసలితనాన్నీ, శోకాన్ని పోగొట్టటానికి గరుడుడు పాతాళగంగ తెచ్చి ఎక్కడ నాగులనభిషేకించినాడో, ఆ జలంగల ప్రదేశాన్ని నాగాలయమంటారు.

గరుడేన యతో వారి ఆనీతం తద్రసాతలాత్ ।
తద్గాంగం వారి సర్వేషాం సర్వాఘౌఘవినాశనమ్ ॥ 43 ॥

రసాతలంనుండి గరుడుడు తీసుకొని వచ్చినందున ఆ గంగాజలం అందరికీ పాపాలను పోగొడుతుంది.

జరాయా వారణం యస్మాన్నాగానా మభవచ్ఛివమ్ ।
రసాతలభవం గాంగం నాగసంజీవనం యతః ॥ 44 ॥

జరాశోక వినాశార్థం గంగాయా దక్షిణే తటే ।
సాక్షాదమృతసంవాహో వంజరా సాఽభవన్నదీ ॥ 45 ॥

నాగులకు ముసలితనాన్ని పోగొట్టుట, శుభాన్ని కలిగించుట, రసాతలం నుండి పుట్టిన గంగ నాగులకు సంజీవనమగుట వలననూ, గంగానది దక్షిణతీరంలో జరాశోకాలను నశింపజేయటానికి సాక్షాత్తు అమృతప్రవాహమే వంజరా అనే పేరుతో నదిగా అయ్యింది.

జరా దారిద్ర్య సంతాపహారిణీ క్లేశవారిణీ ।
రసాతలభవాగంగా మర్త్యలోకభవా తు యా ॥ 46 ॥

రసాతలంలో పుట్టిన గంగ భూలోకానికి వచ్చింది. అది ముసలితనాన్నీ, దారిద్ర్యాన్నీ, సంతాపాన్నీ పోగొట్టి క్లేశాలను నివారిస్తుంది.

తయోశ్చ సంగమో యః స్యాత్కిం పునస్తత్ర వర్ణ్యతే ।
యస్యానుస్మరణా దేవ నాశం యాన్త్యఘసంచయాః ॥ 47 ॥

ఆ రెంటి సంగమం గూర్చి ఇంకా ఏమి వర్ణించాలి? దేనిని స్మరించగానే సమస్తపాపసమూహాలు నశిస్తాయో అదే ఈ తీర్థం.

తత్ర చ స్నానదానానాం ఫలం కో వక్తు మీశ్వరః ।
సపాదం తత్ర తీర్థానాం లక్షమాహుర్మనీషిణః ॥ 48 ॥

అక్కడ స్నానదానాలు చేసినచో ఇంతఫలము వస్తుందని చెప్పే ప్రభువెవరున్నారు? అక్కడ లక్షా ఇరువది ఐదు వేల తీర్థాలున్నాయని పెద్దలు చెబుతారు.

సర్వసంపత్తి దాతౄణాం సర్వపాపౌఘహారిణామ్ ।
వంజరా సంగమసమం తీర్థం క్వాపి న విద్యతే ॥ 49 ॥
యదనుస్మరణేనాపి విపద్యన్తే విపత్తయః ॥

సర్వ సంపదలనిచ్చే, సర్వపాపసమూహాలను పోగొట్టే తీర్థాలన్నింటిలో వంజరా సంగమంతో సమానమైన తీర్థం మరెక్కడా లేదు. దానిని స్మరించినంతమాత్రాన విపత్తులన్నీ తొలగిపోతాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థ మాహాత్మ్యే వంజరా సంగమాది సపాదలక్షతీర్థ వర్ణనం నామైకోన నవతితమోఽధ్యాయః ॥ 89 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని వంజరాసంగమం మున్నగు లక్షా ఇరువది వేల తీర్థాలవర్ణనమనే పేరుగల ఎనబై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

నవతితమోఽధ్యాయః - తొంబైయవ అధ్యాయం

దేవాగమ తీర్థవర్ణనమ్ - దేవాగమ తీర్థవర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దేవాగమం నామ తీర్థం సర్వకామప్రదం శివమ్ ।
భుక్తిముక్తిప్రదం నృణాం పితౄణాం తృప్తికారకమ్ ॥ 1 ॥

దేవాగమం అను తీర్థం అన్ని కోరికలనూ తీరుస్తుంది. మంగళకరమైంది. మానవులకు భుక్తిని ముక్తిని కలిగిస్తుంది. పితృదేవతలకు తృప్తిని కలిగిస్తుంది.

తత్ర వృత్తం సమాఖ్యాస్యే తవ యత్నేన నారద ।
దేవానామసురాణాం చ స్పర్ధాఽభూద్ధనహేతవే ॥ 2 ॥

నారదా! నీకు దాని కథ చెబుతున్నాను విను. దేవతలకు, అసురులకు ధనంకారణంగా పోటీ జరిగింది.

స్వర్గః సురాణామభవదసురాణామిలాఽభవత్ ।
కర్మభూమిమవష్టభ్య హ్యసురాః సర్వతోఽభవన్ ॥ 3 ॥

స్వర్గం దేవతలదయ్యింది. భూమి అసురులదయ్యింది. కర్మభూమి నాక్రమించి అసురులంతా నిండి ఉండినారు.

దేవానాం యజ్ఞభాగాంశ్చ దాతౄన్ ఘ్నన్త్యసురాస్తతః ।
తతః సురగణాః సర్వే యజ్ఞభాగైర్వినా కృతాః ॥ 4 ॥

వారు దేవతలకు యజ్ఞభాగాల నిచ్చే వాళ్లను చంపుచుండిరి. అప్పుడు దేవతలందరూ యజ్ఞభాగం లేని వారైనారు.

వ్యథితా మాముపాజగ్ముః కింకృత్యమితి చాబ్రువన్ ।
మయా చోక్తాః సురగణా యుద్ధే జిత్వాఽఽసురాన్ బలాన్ ॥ 5 ॥

భువం ప్రాప్స్యథ కర్మాణి హవీంషి చ యశాంసి చ ।
తథేత్యుక్త్వా గతా దేవా భూమిం తే సమరార్థినః ॥ 6 ॥

వారు బాధతో నా దగ్గరకు వచ్చి ఏమి చేయాలని యడిగినారు. అప్పుడు నేను వారితో మీరు అసుర బలాలను యుద్ధంలో జయించి, భూమినీ, కర్మలనూ, హవిస్సులను, కీర్తులను పొందండి. దేవతల్లాగే అని చెప్పి యుద్ధానికి భూలోకానికి వెళ్లారు.

దైత్యాశ్చ దానవాశ్చైవ రాక్షసా బలదర్పితాః ।
ఏకీభూత్వా యయుస్తేఽపి జయినో యుద్ధకాంక్షిణః ॥ 7 ॥

బలగర్వితులైన దైత్యులు, దానవులు, రాక్షసులు అంతా ఒక్కటై యుద్ధంలో జయించటానికి వెళ్ళారు.

అహిర్వృత్రో బలిస్త్వాష్ట్రిర్నముచిః శమ్బరో మయః ।
ఏతే చాన్యే చ బహవో యోద్ధారో బలదర్పితాః ॥ 8 ॥

అహి, వృత్రుడు, బలి, త్వాష్ట్రి, నముచి, శంబరుడు, మయుడు ఇంకా ఇతరమైన వారనేకులు బలగర్వితులు వచ్చారు.

అగ్నిరిన్ద్రోఽథ వరుణస్త్వష్టా పూషా తథాఽశ్వినౌ ।
మారుతో లోకపాలాశ్చ నానాయుద్ధవిశారదాః ॥ 9 ॥

అనేక యుద్ధ తంత్రాలు తెలిసిన అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, త్వష్టా, పూషా, అశ్వినీ దేవతలు, వాయువు, లోకపాలకులు వారందరూ వచ్చారు.

తే దానవాః సర్వ ఏవ యామ్యాం వై దిశి సంగరే ।
అకుర్వన్త మహాయత్నం దక్షిణార్ణవసంస్థితాః ॥ 10 ॥

ఆ దానవులందరు యుద్ధంలో దక్షిణ దిక్కులోఉన్న దక్షిణ సముద్రము ఒడ్డున నుండి గొప్పప్రయత్నం చేశారు.

త్రికూటః పర్వతశ్రేష్ఠో రాక్షసానాం పురాఽభవత్ ।
తద్వనేన యయుః సర్వే తైః సార్ధం దక్షిణార్ణవమ్ ॥ 11 ॥

పూర్వం త్రికూటమనే గొప్పపర్వతం రాక్షసులదిగా ఉంది. ఆ వనమార్గంలో వారంతా దక్షిణ సముద్రంవైపు వెళ్ళారు.

సర్వేషాం మేలనం యత్ర పర్వతో మలయస్తు సః ।
మలయస్యాపి దేశోఽసౌ దేవారీణామభూత్తదా ॥ 12 ॥

ఎక్కడ మలయపర్వతం ఉందో అక్కడే అందరూ కలిశారు. ఈ మలయపర్వతప్రదేశం కూడా రాక్షసుల దయ్యింది.

దేవానాం గౌతమీతీరే తత్ర సంనిహితః శివః ।
ఇతి తేషాం సమాయోగో దేవానామభవత్కిల ॥ 13 ॥

గౌతమీనదీతీరంలో శివుడు కొలువై ఉన్నాడని దేవతలందరూ అక్కడ కలిశారు.

దేవాః స్వరథ మారూఢాస్తత్ర తత్ర సమాగమన్ ।
గౌతమ్యాః సరిదమ్బాయాః పులినే విమలాశయాః ॥ 14 ॥

దేవతలు విమలాశయాలు గలవారై వారి వారి రథాల నెక్కి నదీమతల్లి యగు గౌతమీనదియొక్క ఇసుక తిన్నెలపై అక్కడక్కడ సమావేశులైనారు.

ప్రసన్నాఽభీష్టదా యా స్యాత్పితౄణామఖిలస్య తు ।
తతో దేవగణాః సర్వే స్తుత్వా దేవం మహేశ్వరమ్ ॥
అభయం చిన్తయామాసుస్తే సర్వేఽథ పరస్పరమ్ ॥ 15 ॥

ప్రసన్నురాలు ఆ గౌతమి కోరికలు తీరుస్తుంది. పితృదేవతల కందరికి అభీష్టాలనిస్తుంది. అప్పుడు దేవగణాలన్నీ దేవుడైన మహేశ్వరుణ్ణి స్తోత్రం చేసి ఆయన అభయం ఎప్పుడు ఇస్తారో అని అందరు పరస్పరం అనుకొంటున్నారు.

దేవా ఊచు :- దేవతలు పలికారు.

అత్రాప్యుపాయః కోఽస్మాకం నిర్జితానాం పరైర్హి యత్ ।
ఏకమేవాత్ర నః శ్రేయో విజయో వాఽథవా మృతిః ॥ 16 ॥
సపత్నైరభిభూతానాం జీవితం ధిక్ మనస్వినామ్ ॥

శత్రువులతో ఓడిపోయిన మాకు ఇక్కడ ఏమి ఉపాయ మున్నది? మాకు శ్రేయస్సును కలిగించేది ఒకటే యున్నది. అయితే విజయమో! లేదా మరణమో! శత్రువులచే అవమానం పొందిన మనస్వినుల యొక్క జీవితం ఛీ ఛీ ఎంతదుర్భరమైనది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నన్తరే పుత్ర! వాగువాచాశరీరిణీ ॥ 17 ॥

నాయనా! ఇంతలో ఆకాశవాణి ఇట్లు పలికింది.

క్లేశేనాలం సురగణా గౌతమీమాశు గచ్ఛత ।
భక్త్యా హరిహరౌ తత్ర సమారాధయతేశ్వరౌ ॥ 18 ॥

ఓ దేవతలారా! ఇక చింతించింది చాలు. త్వరగా గౌతమీనది వద్దకు వెళ్లండి. అక్కడ ఈశ్వరులైన హరి హరుల నారాధించండి.

గోదావర్యాస్తయోశ్చైవ ప్రసాదాత్కింను దుష్కరమ్ ॥ 19 ॥

గోదావరి మరియు హరి హరుల అనుగ్రహముంటే దుష్కరమనునది ఉండదు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మ పలికాడు

హరీశాభ్యాం ప్రసన్నాభ్యాం దేవా జయమభీప్సితమ్ ।
అవాప్య సర్వతో జగ్ముః పాలయన్తో దివౌకసః ॥ 20 ॥

ప్రసన్నులైన హరిహరులవల్ల దేవతలు తాము కోరిన జయాన్ని పొందారు. వెంటనే ఆకాశమార్గంలో ఆ దేవతలు అన్నివైపులా ఆకాశవాణిమాట పరిపాలిస్తూ వెళ్లారు.

యత్ర దేవాగమో జాతస్తత్తీర్థం తేన విశ్రుతమ్ ।
దేవాగమం ప్రశంసన్తి మునయస్తత్త్వదర్శినః ॥ 21 ॥

ఎక్కడ దేవతల ఆగమనం జరిగిందో ఆప్రదేశం ఆ దేవాగమ తీర్థంగా ప్రసిద్ధి చెందింది. తత్త్వదర్శనులైన మునులు, దేవాగమతీర్థాన్ని కొనియాడతారు.

తత్రాశీతి సహస్రాణి శివలింగాని నారద ।
దేవాగమః పర్వతోఽసౌ ప్రియ ఇత్యపి కథ్యతే ॥ 22 ॥
తతః ప్రభృతి తత్తీర్థం దేవ ప్రియమతో విదుః ॥

నారదా! అక్కడ ఎనబై వేల శివలింగాలున్నాయి. ఆ పర్వతం దేవాగమమనీ, ప్రియమనీ అంటారు అప్పటినుండి ఆ తీర్థాన్ని దేవప్రియ మని కూడా అంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే దేవాగమతీర్థవర్ణనం నామ నవతి తమోఽధ్యాయః ॥ 90 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలో తీర్థ మాహాత్మ్యములోని దేవాగమ తీర్థవర్ణనమనే పేరుగల తొంబయ్యవ అధ్యాయం సంపూర్ణం.

ఏక నవతితమోఽధ్యాయః – తొంబై ఒకటవ అధ్యాయం

కుశతర్పణాది షడశీతి సహస్ర తీర్థవర్ణనమ్

కుశతర్పణం మొదలుగాగల ఎనుబది ఆరువేల తీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

కుశతర్పణ మాఖ్యాతం ప్రణీతా సంగమం తథా ।
తీర్థం సర్వేషు లోకేషు భుక్తిముక్తిప్రదాయకమ్ ॥ 1 ॥

కుశతర్పణమను తీర్థమూ ప్రణీతా సంగమం అనునవి అన్నిలోకాలలో ప్రసిద్ధి చెందాయి. అవి భుక్తిముక్తి ప్రదాలు.

తస్య స్వరూపం వక్ష్యామి శృణు పాపహరం శుభమ్ ।
విన్ధ్యస్య దక్షిణే పార్శ్వే సహ్యో నామ మహాగిరిః ॥ 2 ॥

పాపాన్ని హరించి శుభాన్ని కలిగించే ఆ తీర్థం యొక్క స్వరూపాన్ని చెబుతున్నాను విను. వింధ్యపర్వతానికి దక్షిణపుదిక్కున సహ్యమనే పేరుగల గొప్ప పర్వతముంది.

యదంఘ్రిభ్యోఽభవన్నద్యో గోదాభీమరథీముఖాః ।
యత్రాభవత్త ద్విరజమేకవీరా చ యత్ర సా ॥ 3 ॥

ఆ పర్వతపాదాలనుండి గోదాభీమరథీ మున్నగు నదులు పుట్టాయి. రజోగుణం లేని విరజానదీ, ఏకవీరా నదీ కూడా అక్కడన్నాయి.

న తస్య మహిమా కైశ్చిదపి శక్యోఽనువర్ణితుమ్ ।
తస్మిన్ గిరౌ పుణ్యదేశే శృణు నారద యత్నతః ॥ 4 ॥

ఓ నారదా! ఆ పవిత్రమైన ప్రదేశంలో ఆ పర్వతమునందున్న దాని మహిమను వర్ణించుటకు ఎవరికి సాధ్యపడదు. కావున శ్రద్ధగా విను.

గుహ్యాద్గుహ్యతరం వక్ష్యే సాక్షాద్వేదోదితం శుభమ్ ।
యన్న జానన్తి మునయో దేవాశ్చ పితరోఽసురాః ॥ 5 ॥

మునులు గాని, దేవతలుగాని, పితృదేవతలు గాని అసురులుగాని, ఎరుగని, రహస్యాలలో కెల్లా రహస్యమైన దాన్ని, శుభమైనదాన్ని, సాక్షాత్తుగా వేదం చెప్పినదాన్ని చెబుతున్నాను.

తదహం ప్రీతయే వక్ష్యే శ్రవణాత్సర్వకామదమ్ ।
పరః స పురుషో జ్ఞేయో హ్యవ్యక్తోఽక్షర ఏవ తు ॥ 6 ॥

విన్నంతమాత్రాననే అన్ని కోరికలను దీర్చేదాని గూర్చి నీ ఆనందం కొరకు నేను చెబుతున్నాను. అవ్యక్తుడూ, అక్షరుడూ అయిన ఆ పరమపురుషుడే తెలుసుకోదగినవాడు.

అపరశ్చ క్షరస్తస్మాత్ప్రకృత్యన్విత ఏవ చ ।
నిరాకారాత్సావయవః పురుషః సమజాయత ॥ 7 ॥

దాని నుండి ప్రకృతి ననుసరించువాడు మరొకడు క్షరుడు నిరాకారం నుండి సాకారునిగా ఉదయించాడు.

తస్మాదాపః సముద్భూతా అద్భ్యశ్చ పురుషస్తతః ।
తాభ్యామబ్జం సముద్భూతం తత్రాహమభవం మునే ॥ 8 ॥

ఓ మునీ! ఆ పురుషుడినుండి నీరూ, నీటినుండొక పురుషుడూ నీరు, వారి నుండి పద్మమూ, ఆ పద్మంలో నేనూ పుట్టినాను.

పృథివీవాయురాకాశ ఆపో జ్యోతిస్తథైవ చ ।
ఏతే మత్తః పూర్వతరా ఏకదైవాభవన్మునే ॥ 9 ॥

ఓమునీ! పృథివ్యప్తేజో వాయురాకాశాలను పంచభూతాలు నాకన్నముందే ఒకేసారిగా ఉద్భవించాయి.

ఏతానేవ ప్రపశ్యామి నాన్యత్స్థావరజంగమమ్ ।
నైవ వేదాస్తదా చాఽఽసన్నాహం ద్రష్టాఽస్మి కించన ॥ 10 ॥

నేను వీటినే చూస్తున్నాను కాని ఇతర స్థావర జంగమాలు లేవు. వేదాలు కూడా అప్పుడు లేవు. నేను వేటినీ చూడలేదు.

యస్మా దహం సముద్భూతో న పశ్యేయం తమప్యథ ।
తూష్ణీం స్థితే మయి తదా అశ్రౌషం వాచముత్తమామ్ ॥ 11 ॥

నెనెవడి నుండి పుట్టినానో అతడినీ చూడలేదు. నేను మౌనంగా ఉండగా ఒక ఉత్తమమైన మాటను విన్నాను.

ఆకాశవాగువాచ :– ఆకాశవాణి పలికింది.

బ్రహ్మన్! కురు జగత్సృష్టిం స్థావరస్య చరస్య చ ॥ 12 ॥

ఓ బ్రహ్మా! చరాచరజగత్తును సృష్టించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతోఽహమబ్రవం వాచం పౌరుషీం తత్ర నారద ।
కథం స్రక్ష్యే క్వ వా స్రక్ష్యే కేన స్రక్ష్య ఇదం జగత్ ॥ 13 ॥

ఓ నారదా! నేనప్పుడు పౌరుషీ వాక్కును పలికాను. ఎలా సృష్టించాలి? ఎక్కడ సృష్టించాలి? ఈ జగత్తును దేనితో సృష్టించాలి? ఎవరు సృష్టించారు?

సైవ వాగబ్రవీద్దేవీ ప్రకృతిర్యాఽభిధీయతే ।
విష్ణునా ప్రేరితా మాతా జగదీశా జగన్మయీ ॥ 14 ॥

విష్ణువు చేత ప్రేరేపించిన జగన్మాత, జగన్మయి అయిన ఆ తల్లి ప్రకృతి యని పిలువబడే దేవి ఇలా పలికింది.

ఆకాశవాగువాచ :– ఆకాశవాణి పలికింది.

యజ్ఞం కురు తతః శక్తిస్తే భవిత్రీ న సంశయః ।
యజ్ఞో వై విష్ణురిత్యేషా శ్రుతిర్బ్రహ్మన్ సనాతనీ ॥ 15 ॥

కిం యజ్వనామసాధ్యం స్యాదిహ లోకే పరత్ర చ ॥ 16 ॥

బ్రహ్మన్! యజ్ఞాన్ని చేయి. అప్పుడు శక్తి వస్తుంది. ఇందులో సందేహంలేదు యజ్ఞమే విష్ణువు అనునది సనాతనమైన శ్రుతి కదా! యజ్ఞము చేసే వారికి ఈలోకంలోనూ, పరలోకంలోనూ అసాధ్యమనేది ఏమి వుంటుంది?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

పునస్తామబ్రవం దేవీం క్వ వా కేనేతి తద్వద ।
యజ్ఞః కార్యో మహాభాగే తతః సోవాచ మాం ప్రతి ॥ 17 ॥

తిరిగి నేనాదేవితో ఎక్కడ, ఎవరితో, దేనితో చేయవలెనో చెప్పండి. ఓ మహాభాగా! ఆ యజ్ఞకార్యం ఎలా చేయవలెనో చెప్పండి అప్పుడామె నాతో ఇట్లంది.

ఆకాశవాగువాచ :– ఆకాశవాణి పలికింది.

ఓంకారభూతా యా దేవీ మాతృకల్పా జగన్మయీ ।
కర్మభూమౌ యజస్వేహ యజ్ఞేశం యజ్ఞపూరుషమ్ ॥ 18 ॥

ఓంకార రూపురాలూ, మాతృస్వరూపిణీ, జగన్మయీ ఏ దేవి యైతే యున్నదో, ఈభూలోకంలో కర్మభూమియందు యజ్ఞపురుషుడూ, యజ్ఞేశుడగు శ్రీమన్నారాయణునిగూర్చి యజ్ఞం చేయి.

స ఏవ సాధనం తే స్యాత్తేన తం యజ సువ్రత ।
యజ్ఞః స్వాహా స్వధా మన్త్రా బ్రాహ్మణా హవిరాదికమ్ ॥ 19 ॥

ఓ సువ్రతుడా! అతడే నీకు సాధన మవుతాడు. అతనితోనే యజ్ఞం చేయి. ఆ యజ్ఞం స్వాహా స్వధాకారాలతో, మంత్రాలతో, బ్రాహ్మణాలతో, హవిస్సులతో ఉంటుంది.

హరిరేవాఖిలం తేన సర్వం విష్ణోరవాప్యతే ॥ 20 ॥

హరియే సర్వం. అతని చేతనే సర్వమూ పొందబడుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పునస్తామబ్రవం దేవీం కర్మభూః క్వ విధీయతే ।
తదా నారద నైవాఽసీ ద్భాగీరథ్యథ నర్మదా ॥ 21 ॥

యమునా నైవ తాపీ సా సరస్వత్యథ గౌతమీ ।
సముద్రో వా నదః కశ్చిన్న సరః సరితోఽమలాః ॥
సా శక్తిః పునరప్యేవం మామువాచ పునః పునః ॥ 22 ॥

నేను తిరిగి దేవిని యజ్ఞం చేయటానికి ప్రదేశమెక్కడ అని అడిగాను. నారదా! అప్పుడామె భాగీరథికానీ, నర్మదకానీ. యమునకానీ, తాపీనదికానీ, సరస్వతికానీ, గౌతమీనదికానీ, సముద్రంకానీ, నదంకానీ, పవిత్రములైన నదులుకానీ, సరస్సుకానీ లేవు. ఎలా? అని అనగా తిరిగి ఆ శక్తి నాతో ఇలా అంది.

దైవీవాగువాచ :- దైవీ వాక్కు పలికింది.

సుమేరోర్దక్షిణే పార్శ్వే తథా హిమవతో గిరేః ।
దక్షిణే చాపి విన్ధ్యస్య సహ్యస్యైవ దక్షిణే ॥
సర్వస్య సర్వకాలే తు కర్మభూమిః శుభోదయా ॥ 23 ॥

సుమేరు పర్వతం యొక్క దక్షిణభాగంలోగాని, హిమవత్పర్వతం దక్షిణంలోగానీ, విన్ధ్యపర్వతం దక్షిణభాగమున గానీ, సహ్యపర్వతం దక్షిణభాగానగానీ అన్ని పనులకూ అందరికీ, అన్ని సమయములలోనూ కర్మభూమిగా శుభమైనది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్తు వాక్యమథో శ్రుత్వా త్యక్త్వా మేరుం మహాగిరిమ్ ।
తం ప్రదేశమథాఽగత్య స్థాతవ్యం క్వేత్యచిన్తయమ్ ॥ 24 ॥
తతో మమాబ్రవీత్సైవ విష్ణోర్వాణ్యశరీరిణీ ॥

తరువాత ఆ మాట విని మహాపర్వతమైన మేరుపర్వతాన్ని వదిలి ఆప్రదేశానికి వచ్చి ఎక్కడ ఉండాలి? అని ఆలోచించాను. అప్పుడు ఆ విష్ణువాక్కగు అశరీరవాణియే తిరిగి నాతో ఇట్లంది.

ఆకాశవాగువాచ :- ఆకాశవాణి పలికింది.

ఇతో గచ్ఛ ఇతస్తిష్ఠ తథోపవిశ చాత్ర హి ।
సంకల్పం కురు యజ్ఞస్య స తే యజ్ఞః సమాప్యతే ॥ 25 ॥

ఇక్కడ నుండి వెళ్లు, ఇక్కడ నిలు, ఇక్కడ కూర్చో, ఇక్కడే యజ్ఞానికి సంకల్పం చేయి. అప్పుడు నీ యజ్ఞం సమాప్తి అవుతుంది.

కృతే చైవాథ సంకల్పే యజ్ఞార్థే సురసత్తమ ।
యద్వదన్త్యఖిలా వేదా విధే! తత్తత్సమాచర ॥ 26 ॥

ఓ సురసత్తమా! సంకల్పం చేసిన తరువాత యజ్ఞానికై వేదాలన్నీ వేటిని విధించాయో ఆయా విధులనాచరించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతిహాసపురాణాని యదన్యచ్ఛబ్దగోచరమ్ ।
స్వతో ముఖే మమ ప్రాయాదభూచ్చ స్మృతిగోచరమ్ ॥ 27 ॥

ఇతిహాస పురాణాలూ, ఇతరమైన శబ్దశక్తితో వ్యక్తమయ్యేవి. అన్నీ స్వతఃసిద్ధంగా స్మృతిగోచరాలై నాముఖంనుండి వెలువడ్డాయి.

వేదార్థశ్చ మయా సర్వో జ్ఞాతోఽసౌ తత్‌క్షణేన చ ।
తతః పురుషసూక్తం తదస్మరం లోకవిశ్రుతమ్ ॥ 28 ॥

ఆక్షణమునందే నాకు వేదార్థమంతా తెలిసింది. వెంటనే లోకప్రసిద్ధమైన పురుష సూక్తాన్ని స్మరించాను.

యజ్ఞోపకరణం సర్వం తదుక్తం చ త్వకల్పయమ్ ।
తదుక్తేన ప్రకారేణ యజ్ఞపాత్రాణ్యకల్పయమ్ ॥ 29 ॥

వేదం చెప్పినట్లు యజ్ఞోపకరణాన్ని సిద్ధం చేశాను. తదుక్తప్రకారంగా యజ్ఞపాత్రలను సిద్ధం చేశాను.

అహం స్థిత్వా యత్ర దేశే శుచిర్భూత్వా యతాత్మవాన్ ।
దీక్షితో విప్రదేశోఽసౌ మన్నామ్నా తు ప్రకీర్తితః ॥ 30 ॥

నేనెక్కడ శుచిగానుండి నియమంగా దీక్షను పొందానో ఆ భూమి నా పేరుతో ప్రసిద్ధి చెందింది.

మద్దేవయజనం పుణ్యం నామ్నా బ్రహ్మగిరిః స్మృతః ।
చతుర్వింశతి పర్యన్తం యోజనాని మహామునే ॥ 31 ॥

మద్దేవయజనం పుణ్యం పూర్వతో బ్రహ్మణో గిరేః ।
తత్ర మధ్యే వేదికాయా గార్హపత్యోఽథ దక్షిణః ॥ 32 ॥

తథా చాఽఽహవనీయశ్చ వహ్నీనేవమకల్పయమ్ ।
వినా పత్న్యా న సిధ్యేత యజ్ఞః శ్రుతినిదర్శనాత్ ॥ 33 ॥

ఓ మహామునీ! నా దేవయజ్ఞ ఫలితంగా ఇరవై నాలుగు యోజనాల వరకూ ప్రదేశానికి బ్రహ్మగిరి యని పేరువచ్చింది. బ్రహ్మగిరి యొక్క తూర్పున 24 యోజనాలవరకూ నేను చేసిన దేవయజ్ఞం వ్యాపించి జరిగింది.

దానికి మధ్యలో యజ్ఞవేదిక ఉంది. దాని దక్షిణ భాగంలో గార్హపత్యాగ్నినీ, అట్లే ఆహవనీయాగ్నినీ కల్పించాను. శ్రుతుల నిదర్శనాన్ననుసరించి యజ్ఞం భార్య (ధర్మపత్ని) లేకుండా సిద్ధించదు.

శరీరమాత్మనోఽహం వై ద్వేధా చాకరవం మునే ।
పూర్వార్ధేన తతః పత్నీ మమాభూద్యజ్ఞసిద్ధయే ॥ 34 ॥

ఓ మునీ! నేను నా శరీరాన్ని రెండుగా చేసుకొన్నాను. యజ్ఞంసిద్ధించటానికి నా శరీరపూర్వార్ధం నాకు పత్నిగా అయ్యింది.

ఉత్తరేణ త్వహం తద్వదర్ధో జాయా ఇతి శ్రుతేః ।
కాలం వసన్తముత్కృష్టమాజ్యరూపేణ నారద ॥ 35 ॥

ఓ నారదా! 'అర్ధోజాయా' అని శ్రుతి చెప్పినట్లుగా ఉత్తరార్ధంగా నేను అయ్యాను. ఉత్కృష్టమగు వసంతకాలము నేయిగా అయ్యింది.

అకల్పయం తథా చేధ్మం గ్రీష్మం చాపి శరద్ధవిః ।
ఋతుం చ ప్రావృషం పుత్ర తదా బర్హిరకల్పయమ్ ॥ 36 ॥

నాయనా! గ్రీష్మఋతువును సమిధలుగానూ, శరదృతువును హవిస్సుగానూ, వర్ష ఋతువును దర్భలుగానూ కల్పించాను.

ఛన్దాంసి సప్త వై తత్ర తదా పరిధయోఽభవన్ ।
కలా కాష్ఠా నిమేషా హి సమిత్పాత్రకుశాః స్మృతాః ॥ 37 ॥

అప్పుడక్కడ ఏడు ఛన్దస్సులు పరిధులుగా అయ్యాయి. కళ సమిధలుగా, కాష్ఠపాత్రగా, నిమేషములు కుశలుగా అయ్యాయి.

యోఽనాదిశ్చ త్వనన్తశ్చ స్వయం కాలోఽభవత్తదా ।
యూపరూపేణ దేవర్షే యోక్త్రం చ పశుబన్ధనమ్ ॥ 38 ॥

సత్త్వాది త్రిగుణాః పాశాః నైవ తత్రాభవత్పశుః ।
తతోఽహమబ్రవం వాచం వైష్ణవీమశరీరిణీమ్ ॥ 39 ॥

ఓ నారదా! అపుడు ఆదిలేనివాడూ! స్వయంగా కాలస్వరూపుడూ అయిన విష్ణువు యూపమయ్యాడు. పశువును కట్టే త్రాడు ఐన యోక్త్రంగా సత్త్వ, రజస్తమోగుణాలే పాశాలయ్యాయి. కానీ పశువు మాత్రం లేదు. అపుడు నేను శరీరం లేని వైష్ణవీ వాక్కును ఇలా అడిగాను.

వినైవ పశునా నాయం యజ్ఞః పరిసమాప్యతే ।
తతో మామవదద్దేవీ సైవ నిత్యాఽశరీరిణీ ॥ 40 ॥

యజ్ఞ పశువులేకుండా ఈ యజ్ఞముపూర్తిగాదు. అప్పుడు నిత్యము, అశరీరిణి యగు ఆ దేవియే నాతో ఇట్లంది.

పౌరుషేణాథ సూక్తేన స్తుహి తం పురుషం పరమ్ ॥ 41 ॥

పురుషసూక్తంతో ఆ పరమపురుషుని స్తుతించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా స్తూయమానే దేవదేవే జనార్దనే ।
మమ చోత్పాదకే భక్త్యా సూక్తేన పురుషస్య హి ॥ 42 ॥

సా చ మామబ్రవీద్దేవీ బ్రహ్మన్ మాం త్వం పశుం కురు ।
తదా విజ్ఞాయ పురుషం జనకం మమ చావ్యయమ్ ॥ 43 ॥

కాలయూపస్య పార్శ్వే తం గుణపాశైర్నివేశితమ్ ।
బహిఃస్థితమహం ప్రోక్షం పురుషం జాతమగ్రతః ॥ 44 ॥

అలాగేనని నన్ను పుట్టించిన దేవదేవుడైన జనార్దనుని పురుషసూక్తంతో భక్తిగా స్తోత్రం చేయగానే, ఆ దేవి నాతో నన్ను పశువుగా చేయమని చెప్పింది. అప్పుడు అవ్యయుడైన నా తండ్రిని పురుషునిగానెరిగి, కాలరూపుడైన యూపం యొక్క ప్రక్కన అతనిని గుణములనే పాశాలతో నుంచిన వానిని, బయట నున్నవానిని మొదటగా పుట్టిన పురుషునిపై మొదటగా చల్లాను.

ఏతస్మిన్నన్తరే తత్ర తస్మాత్సర్వమభూదిదమ్ ।
బ్రాహ్మణాస్తు ముఖాత్తస్యాభవన్ బాహ్వోశ్చ క్షత్రియాః ॥ 45 ॥

ఇంతలో అక్కడ అతని నుండి ఈ సృష్టి జరిగింది. అతని ముఖంనుండి బ్రాహ్మణులూ, బాహువులనుండి క్షత్రియులూ ఉద్భవించారు.

ముఖాదిన్ద్రస్తథాఽగ్నిశ్చ శ్వసనః ప్రాణతోఽభవత్ ।
దిశః శ్రోత్రాత్తథా శీర్ష్ణః సర్వః స్వర్గోఽభవత్తదా ॥ 46 ॥

ముఖమునుండి ఇంద్రాగ్నులు, ప్రాణమునుండి వాయువూ వచ్చాయి. చెవులనుండి దిక్కులూ, తలనుండి సమస్త స్వర్గం జనించింది.

మనసశ్చన్ద్రమా జాతః సూర్యోఽభూచ్చక్షుషస్తథా ।
అన్తరిక్షం తథా నాభేరూరుభ్యాం విశ ఏవ చ ॥ 47 ॥

మనస్సునుండి చంద్రుడు పుట్టాడు. నేత్రముల నుండి సూర్యుడుదయించాడు. నాభినుండి అంతరిక్షం కలిగింది. తొడలనుండి వైశ్యులూ పుట్టారు.

పద్భ్యాం శూద్రశ్చ సంజాత స్తథా భూమి రజాయత ।
ఋషయో రోమకూపేభ్య ఓషధ్యః కేశతో౽భవన్ ॥ 48 ॥

పాదాలనుండి శూద్రుడు పుట్టాడు. అట్లే భూమిఏర్పడింది. రోమకూపాలనుండి ఋషులూ, కేశాలనుండి ఓషధులూ పుట్టాయి.

గ్రామ్యారణ్యాశ్చ పశవో నఖేభ్యః సర్వతో౽భవన్ ।
కృమికీట పతంగాది పాయూపస్థాదజాయత ॥ 49 ॥

గోళ్ళనుండి గ్రామంలో ఉండేవారూ అరణ్యంలో ఉండేవీ అయిన పశువులు అంతటా ఏర్పడ్డాయి. మూత్రగుద ద్వారాలనుండి క్రిమికీటపతంగాదులు పుట్టాయి.

స్థావరం జంగమం కించిద్దృశ్యాదృశ్యం చ కించన ।
తస్మాత్సర్వమభూద్దేవా మత్తశ్చాప్యభవన్ పునః ॥
ఏతస్మిన్నన్తరేసైవ విష్ణోర్వాగబ్రవీచ్చ మామ్ ॥ 50 ॥

స్థావరజంగమాలు కొంచెం దృశ్యాదృశ్యాలుగా ఏర్పడ్డా, వానినుండి సమస్తం పుట్టింది. తిరిగి దేవతలు నానుండి పుట్టారు. ఇంతలో విష్ణువుయొక్క వాక్కే నాతో ఇట్లంది.

ఆకాశవాగువాచ :– ఆకాశవాణి పలికింది.

సర్వం సమ్పూర్ణమభవత్సృష్టిర్జాతా తథేప్సితా ।
ఇదానీం జుహుధి హ్యగ్నౌ పాత్రాణి చ సమాని చ ॥ 51 ॥

కోరిన విధంగా సృష్టిఅంతా పూర్తిగా ఏర్పడింది. ఇప్పుడు యోగ్యమైనవాటిని సమంగా అగ్నియందాహుతి నిమ్ము.

విసర్జయ తథా యూపం ప్రణీతాం చ కుశాంస్తథా ।
ఋత్విగ్రూపం యజ్ఞరూపముద్దేశ్యం ధ్యేయమేవ చ ॥ 52 ॥

యూపమును, ప్రణీతను, దర్భలనూ, ఋత్విక్ రూపమూ ఉద్దేశ్యమునూ, యజ్ఞరూపమునూ, ధ్యేయమునూ అన్నిటినీ వదులుము.

స్రువం చ పురుషం పాశాన్ సర్వం బ్రహ్మన్ విసర్జయ । 53 ॥

బ్రహ్మన్! స్రువాన్నీ, పురుషుణ్ణీ, పాశాలను అన్నింటిని విడిచిపెట్టు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్వాక్య సమకాలం తు క్రమశో యజ్ఞయోనిషు ।
గార్హపత్యే దక్షిణాగ్నౌ తథా చైవ మహామునే ॥ 54 ॥

పూర్వస్మిన్నపి చైవాగ్నౌ క్రమశో జుహ్వతస్తదా ।
తత్ర తత్ర జగద్యోనిమనుసంధాయ పూరుషమ్ ॥ 55 ॥

మన్త్రపూతం శుచిః సమ్యగ్యజ్ఞదేవో జగన్మయః ।
లోకనాథో విశ్వకర్తా కుణ్డానాం తత్ర సంనిధౌ ॥ 56 ॥

శుక్లరూపధరో విష్ణుర్భవేదాహవనీయకే ।
శ్యామో విష్ణుర్దక్షిణాగ్నేః పీతో గృహపతేః కవేః ॥ 57 ॥

సర్వకాలో తేషు విష్ణురతో దేశేషు సంస్థితః ।
న తేన రహితం కించి ద్విష్ణునా విశ్వయోనినా ॥ 58 ॥

ఓ మహామునీ! అట్లు పలుకుచుండగానే యజ్ఞయోనులలో క్రమంగా గార్హపత్యమునందూ, దక్షిణాగ్నిలోనూ పూర్వమున్న అగ్నిలో కూడా క్రమంగా అక్కడక్కడ జగత్సృష్టికర్త అయిన పురుషుని ధ్యానించి హోమం చేస్తూ మంత్రపూతంగా శుచిగా బాగుగా చేయగా, జగన్మయుడు, లోకనాథుడు, విశ్వకర్తఅయిన యజ్ఞదేవుడు ఆ కుండాల దగ్గర, ఆహవనీయాగ్నియందు శుక్లరూపాన్నిధరించిన విష్ణువూ, దక్షిణాగ్నియందు శ్యామరూపుడైన విష్ణువూ, గృహపతియగు కవికి పచ్చని రూపుగల విష్ణువూ, అన్ని ప్రదేశాలలో సర్వకాలుడైన విష్ణువూ వాటిలోవుండి కనిపించాడు. విశ్వయోనియగు విష్ణువు లేకుండా ఏదీలేదు కదా!

ప్రణీతాయాః ప్రణయనం మన్త్రైశ్చాకరవం తతః ।
ప్రణీతోదకమప్యేతత్ప్రణీతేతి నదీ శుభా ॥ 59 ॥

అటు తరువాత మంత్రాలతో ప్రణీతాప్రణయాన్ని చేశాను. ప్రణీతలోనున్న నీటితో ఏర్పడింది ఈ శుభకరమైన ప్రణీతానది.

వ్యసర్జయం ప్రణీతాం తాం మార్జయిత్వా కుశైరథ ।
మార్జనే క్రియమాణే తు ప్రణీతోదకబిన్దవః ॥ 60 ॥

పతితాస్తత్ర తీర్థాని జాతాని గుణవన్తి చ ।
సంజాతా మునిశార్దూల స్నానాత్క్రతుఫలప్రదా ॥ 61 ॥

దర్భలతో మార్జనంచేసి ఆ ప్రణీతను వదిలిపెట్టాను. మార్జనచేయునప్పుడాప్రణీతలోని నీటిబిందువులు, పడినచోటున గుణవంతాలైన తీర్థాలు పుట్టాయి. ఓ మునిశ్రేష్ఠా! అవి స్నానం చేసినంత మాత్రాననే క్రతు ఫలాన్నివ్వగలవు.

యాఽలంకృతా సర్వకాలం దేవదేవేన శార్ఙ్గిణా ।
సోపానపంక్తిః సర్వేషాం వైకుణ్ఠారోహణాయ సా ॥ 62 ॥

సర్వకాలములయందక్కడ దేవదేవుడైన శ్రీమహావిష్ణువుండును. అక్కడవున్న సోపానపంక్తి వైకుంఠానికి వెళ్లటానికి మార్గంగా ఉంటుంది.

సమ్మార్జితాః కుశా యత్ర పతితా భూతలే శుభే ।
కుశతర్పణమాఖ్యాతం బహుపుణ్యఫలప్రదమ్ ॥ 63 ॥

నీరుచల్లినదర్భలే శుభమైన భూమిమీద ఎక్కడపడినవో దానిని కుశతర్పణమంటారు. అది మిక్కిలి పుణ్యప్రదమైంది.

కుశైశ్చ తర్పితా సర్వే కుశతర్పణముచ్యతే ।
పశ్చాచ్చ సంగతా తత్ర గౌతమీకారణాన్తరాత్ ॥ 64 ॥

అందరూ అక్కడ దర్భలతో తర్పణం చేశారు. అందువలన దాన్ని కుశతర్పణమంటారు. ఆ తరువాత అక్కడ కారణాంతరాల వలన గౌతమి సంగమించింది.

ప్రణీతాయాం మహాబుద్ధే ప్రణీతా సంగమోఽభవత్ ।
కుశతర్పణదేశే తు తత్తీర్థం కుశతర్పణమ్ ॥ 65 ॥

ఓ మహాజ్ఞానీ! గౌతమి ప్రణీతయందు సంగమించిన ప్రదేశం ప్రణీతా సంగమమయ్యింది. కుశతర్పణం చేసిన ప్రదేశం ఆ తీర్థం కుశతర్పణమంటారు.

తత్రైవ కల్పితో యూపో మయా విన్ధ్యస్య చోత్తరే ।
విసృష్టో లోకపూజ్యోఽసౌ విష్ణోరాసీత్సమాశ్రయః ॥ 66 ॥

అక్కడే విన్ధ్యపర్వతంయొక్క ఉత్తరదిక్కున నేను యూపాన్ని కల్పించాను. లోకపూజ్యుడైన విష్ణువు అక్కడ నివసించి ఉన్నాడు.

అక్షయశ్చాభవచ్ఛ్రీమానక్షయోఽసౌ వటోఽభవత్ ।
నిత్యశ్చ కాలరూపోఽసౌ స్మరణాత్క్రతుపుణ్యదః ॥ 67 ॥

హరి అక్కడ అచ్యుతుడయ్యాడు. శ్రీమన్నారాయణుడు అక్షయవటంగా అయినాడు. నిత్యమూ, కాలరూపమూ అగు ఆ మఱ్రి స్మరించినంతమాత్రముననే క్రతువు చేసిన పుణ్యాన్నిస్తుంది.

మద్దేవ యజనం చేదం దణ్డకారణ్యముచ్యతే ।
సమ్పూర్ణే తు క్రతౌ విష్ణుర్మయా భక్త్యా ప్రసాదితః ॥ 68 ॥

నేను యజ్ఞంచేసిన ఈ ప్రదేశం దండకారణ్యమంటారు. యజ్ఞం సమాప్తమైన తరువాత విష్ణువు దీనిని ప్రసాదించాడు.

యో విరాడుచ్యతే వేదే యస్మాన్మూర్తమజాయత ।
యస్మాచ్చ మమ చోత్పత్తి ర్యస్యేదం వికృతం జగత్ ॥ 69 ॥

వేదములో ఏ విరాట్పురుషుడు చెప్పబడ్డాడో! అతని నుండి ఏ మూర్తం పుట్టిందో! దాని నుండి నేను పుట్టాను. నా నుండి వికృతి ఐన సర్వవిశ్వమూ పుట్టింది.

తమహం దేవదేవేశమభివన్ద్య వ్యసర్జయమ్ ।
యోజనాని చతుర్వింశన్మద్దేవయజనం శుభమ్ ॥ 70 ॥

నేనా దేవదేవునికి నమస్కరించి వీడుకోలు చెప్పాను. నేను యజ్ఞంచేసిన ప్రదేశం శుభమైంది. అది ఇరవైనాలుగు యోజనాలున్నది.

తస్మాదద్యాపి కుణ్డాని సన్తి చ త్రీణి నారద ।
యజ్ఞేశ్వరస్వరూపాణి విష్ణోర్వై చక్రపాణినః ॥ 71 ॥

ఓ నారదా! వాటిలో నేటికినీ మూడుకుండాలున్నాయి. అవి చక్రపాణియగు విష్ణువుయొక్క యజ్ఞేశ్వరస్వరూపాలు.

తతః ప్రభృతి చాఽఽఖ్యాతం మద్దేవయజనం చ తత్ ।
తత్రస్థ కృమికీటాదిః సోఽప్యన్తే ముక్తిభాజనమ్ ॥ 72 ॥

అప్పటినుండి దానిని బ్రహ్మదేవయజనమంటారు. అక్కడవున్న క్రిమికీటాదులుసైతం ముక్తి పొందేటట్లు చేస్తుందాతీర్థం.

ధర్మబీజం ముక్తిబీజం దణ్డకారణ్యముచ్యతే ।
విశేషాద్గౌతమీ శ్లిష్టో దేశః పుణ్యతమోఽభవత్ ॥ 73 ॥

ధర్మబీజమూ, ముక్తిబీజమూ అని దండవనాన్నే అంటారు. విశేషంగా గౌతమీనదియున్నదేశం పవిత్రాతిపవిత్ర మైంది.

ప్రణీతాసంగమే చాపి కుశతర్పణ ఏవ వా ।
స్నానదానాది యః కుర్యాత్స గచ్ఛేత్పరమం పదమ్ ॥ 74 ॥

ఎవడు ప్రణీతాసంగమంలోనూ, కుశతర్పణంలోనూ స్నానదానాదులు చేస్తాడో వాడు పరమపదం పొందుతాడు.

స్మరణం పఠనం వాఽపి శ్రవణం చాపి భక్తితః ।
సర్వకామప్రదం పుంసాం భుక్తిముక్తిప్రదం విదుః ॥ 75 ॥

భక్తితో దానిని స్మరించినా, దాన్నిగూర్చి పఠించినా, వినినాకూడా మానవులకు భుక్తిముక్తులనిస్తుంది. అన్నికోరికలనూ తీరుస్తుంది.

ఉభయోస్తీరయోస్తత్ర తీర్థాన్యాహుర్మనీషిణః ।
షడశీతి సహస్రాణి తేషు పుణ్యం పురోదితమ్ ॥ 76 ॥

గౌతమికి రెండుతీరాలలో ఎనుబదియారువేల తీర్థాలున్నాయని పెద్దలు చెబుతారు. వాటిలో స్నానదానాలవలన గలిగే ఫలం ఇంతకుపూర్వమే చెప్పాను.

వారాణస్యా అపి మునే కుశతర్పణముత్తమమ్ ।
నానేన సదృశం తీర్థం విద్యతే సచరాచరే ॥ 77 ॥

ఓ మునీ! కాశి కంటే కూడా కుశతర్పణతీర్థం శ్రేష్ఠమైనది. ఈ చరాచరజగత్తులో దీనితో సదృశమైన తీర్థం మరొకటి లేదు.

బ్రహ్మహత్యాదిపాపానాం స్మరణాదపి నాశనమ్ ।
తీర్థమేతన్మునే ప్రోక్తం స్వర్గద్వారం మహీతలే ॥ 78 ॥

దీనిని స్మరించినంతమాత్రముననే బ్రహ్మహత్యాదిపాపాలు తొలగిపోతాయి. ఓ మునీ! ఈ లోకంలో స్వర్గానికి ద్వారం వంటిదీ తీర్థం.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ప్రణీతాసంగమ కుశతర్పణాది షడశీతిసహస్ర తీర్థవర్ణనం నామ ఏకనవతితమోఽధ్యాయః ॥ 91 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలో ప్రణీతసంగమం, కుశతర్పణం మొదలుగాగల ఎనుబదిఆరువేల తీర్థాల వర్ణనమని పేరుగల తొంబైయవ అధ్యాయం సంపూర్ణం.

ద్వినవతితమోఽధ్యాయః - తొంబై రెండవ అధ్యాయం

మన్యుతీర్థ వర్ణనమ్ - మన్యుతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ అన్నాడు.

మన్యుతీర్థమితిఖ్యాతం సర్వపాపప్రణాశనమ్ ।
సర్వకామప్రదం నృణాం స్మరణాదఘనాశనమ్ ॥ 1 ॥

మన్యుతీర్థమనే ప్రసిద్ధమైన ఒక తీర్థం ఉంది. అది సమస్త పాపాలను పోగొడుతుంది. అన్ని కోరికలను తీరుస్తుంది. దాన్ని స్మరించినంతమాత్రాననే పాపాలు పోతాయి.

తస్య ప్రభావం వక్ష్యామి శృణుష్వావహితో మునే ।
దేవానాం దానవానాం చ సంగరోఽభూన్మిథః పురా ॥ 2 ॥

ఓ మునీ! దాని ప్రభావం చెబుతున్నాను శ్రద్ధగా విను. పూర్వం దేవతలకు దానవులకు పరస్పరం యుద్ధం జరిగింది.

తత్రాజయన్నైవ సురా దానవా జయినోఽభవన్ ।
పరాఙ్ముఖాః సురగణాః సంగరాద్గతచేతసః ॥ 3 ॥

ఆ రణంలో దేవతలు ఓడిపోయారు. దానవులు గెలిచారు. యుద్ధంనుండి దేవతలు శక్తియుడిగి పరాఙ్ముఖులైనారు.

మామభ్యేత్య సమూచుస్తే దేహినోఽభయకారణమ్ ।
తానహం ప్రత్యవోచం వై గంగాం గచ్ఛత సర్వశః ॥ 4 ॥

వారంతా వచ్చి తమకు భయంలేకుండా ఉండుటకేదైనా ఉపాయం చెప్పుమని అడిగారు. నేను వారినందరిని గంగానది వద్దకు వెళ్లండని బదులు చెప్పాను.

తత్ర వై గౌతమీ తీరే స్తుత్వా దేవం మహేశ్వరమ్ ।
అనపాయనిరాయాససహజానన్దసున్దరమ్ ॥ 5 ॥

అక్కడ అపాయరహితుడూ, ఆయాసరహితుడూ సహజమైన ఆనన్దంతో సుందరంగానుండు మహేశ్వరదేవుని గౌతమీతీరాన స్తుతించి,

లప్స్యతే సర్వవిబుధా జయహేతుం మహేశ్వరాత్ ।
తథేత్యుక్త్వా సురగణా స్తువన్తిస్మ మహేశ్వరమ్ ॥ 6 ॥

దేవతలంతా శివుడినుండి జయానికి కావలసిన ఉపాయాన్ని పొందుతారు. దేవతలంతా ఆ మాటవిని సరేయని మహేశ్వరుని స్తోత్రం చేస్తూ ఉండినారు.

తపో౾ తప్యన్త కేచిద్వై ననృతుశ్చ తథా౾ పరే ।
అస్నాపయంశ్చ కేచిచ్చాపూజయంశ్చ తథా౾ పరే ॥ 7 ॥

కొందరు తపస్సును చేస్తూ ఉన్నారు. కొందరు నాట్యం చేస్తూ ఉన్నారు. మరి కొందరభిషేకాలను చేస్తూ ఉన్నారు. కొందరు పూజలను చేస్తూ ఉన్నారు.

తతః ప్రసన్నో భగవాన్ శూలపాణిర్మహేశ్వరః ।
దేవానథాబ్రవీత్తుష్టో వ్రియతాం యదభీప్సితమ్ ॥ 8 ॥

అప్పుడు శూలపాణీ, భగవంతుడూ అయిన శివుడు ప్రసన్నుడై వారు చేసిన సేవలకు సంతసించి దేవతలతో మీకిష్టమైనదేదో కోరుకోండన్నాడు.

దేవా ఊచుః సురపతిం విజయాయ దదస్వ నః ।
పురుషం పరమశ్లాఘ్యం రణేషు పురతః స్థితమ్ ॥ 9 ॥

అప్పుడు దేవతలు యుద్ధంలో ముందు నిలిచి మాకు విజయం చేకూర్చునటువంటి మిక్కిలి కొనియాడదగిన, పురుషుణ్ణి మాకిమ్మని పరమేశ్వరునడిగారు.

యద్బాహు బలమాశ్రిత్య భవామః సుఖినో వయమ్ ।
తథేత్యువాచ భగవాన్ దేవాన్ ప్రతి మహేశ్వరః ॥ 10 ॥

అతని బలాన్నాశ్రయించి మేము సుఖంగా ఉంటాం. దేవతలతో అప్పుడు భగవంతుడగు మహేశ్వరుడలాగే అగుగాక అన్నాడు.

ఆత్మనస్తేజసా కశ్చిన్నిర్మితః పరమేష్ఠినా ।
మన్యునామానమత్యుగ్రం దేవసైన్యపురోగమమ్ ॥ 11 ॥

దేవసైన్యాన్నంతా ముందుకు నడిపించటానికి మన్యువనే పేరుగల మిక్కిలి భయంకరమైన వాణ్ణి పరమాత్మ తన తేజస్సుతో సృష్టించాడు.

తం లబ్ధ్వా త్రిదశాః సర్వే శివం నత్వా స్వమాలయమ్ ।
మన్యునా సహ చాభ్యేత్య పునర్యుద్ధాయ తస్థిరే ॥ 12 ॥

దేవతలంతా అతణ్ణి పొంది, శివుని వద్దకు వెళ్ళి నమస్కరించి, తిరిగి మన్యువుతో గూడా స్వర్గానికి వచ్చి, తిరిగి యుద్ధానికి వెళ్లారు.

యుద్ధే స్థిత్వా తు దనుజైర్దైతేయైశ్చ మహాబలైః ।
విబుధా జాతసంనద్ధా మన్యుమూచుః పురః స్థితాః ॥13 ॥

దేవతలు యుద్ధానికి సిద్ధమై యుద్ధంలో మహాబలులైన దనుజులు, దైతేయులుండగా మన్యుని ముందు నిలిచి ఇలా అన్నారు.

దేవా ఊచుః :- దేవతలు పలికారు.

సామర్థ్యం తవ పశ్యామః పశ్చాద్యోత్స్యామహే పరైః ।
తస్మాద్దర్శయ చాఽఽత్మానం మన్యోఽస్మాకం యుయుత్సతామ్ ॥ 14 ॥

"మన్యూ! యుద్ధం చేయాలని ఉత్సాహముతోవున్న మాకు నీ శక్తిని చూపించు. మేము నీ సామర్థ్యాన్ని చూస్తాం. అటుతరువాత శత్రువులతో యుద్ధం చేద్దాం" అన్నారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్దేవవచనం శ్రుత్వా మన్యురాహ స్మయన్నివ ॥ 15 ॥

ఆ దేవతల మాటను విని మన్యు నవ్వుతున్నట్లుగా ఇలా అన్నాడు.

మన్యురువాచ:- మన్యువు పలికాడు.

జనితా మమ దేవేశః సర్వజ్ఞః సర్వదృక్ ప్రభుః ।
యః సర్వం వేత్తి సర్వేషాం ధామ నామ మనఃస్థితామ్ ॥ 16

అందరికీ స్థానమైనవాడూ, అందరి మనస్సుల్నీ తెలిసినవాడూ, అన్నీ తెలిసినవాడూ, అంతా చూసేవాడూ, దేవదేవుడు అయిన ప్రభువు నా జన్మకు కారకుడు.

నైవ కశ్చిచ్చ తం వేత్తి యః సర్వం వేత్తి సర్వదా ।
అమూర్తం మూర్తమప్యేతద్వేత్తి కర్తా జగన్మయః ॥ 17 ॥

అతని నెవరూ ఎరుగరు. అతని కెప్పుడూ అంతా తెలుసు. అతడు జగన్మయుడు, కర్త, మూర్తామూర్త స్వరూపాలన్నీ అతనికి తెలుసు.

పరోఽసౌ భగవాన్ సాక్షాత్తథా దివ్యన్తరిక్షగః ।
కస్తస్య రూపం యో వేద కస్య కర్తా జగన్మయః ॥ 18 ॥

అతడు పరలోకము నందుంటాడు. సాక్షాత్తుగా స్వర్గాంతరిక్షాలలో సంచరిస్తూంటాడు. అతడు దేనికి కర్తయో, అతని రూపమేమిటో ఎవరెరుగగలరు? అతడు జగన్మయుడు.

ఏవం విధాదహం జాతో మాం కథం వేత్తుమర్హథ ।
అథవా ద్రష్టుకామా వై భవన్తో మాఽనుపశ్యత ॥ 19 ॥

ఇటువంటి వానినుండి పుట్టిన నన్ను ఎలా తెలుసుకొంటారు? లేదా చూడవలెనని కోరిక ఉన్న మీరు నన్ను చూడండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్త్వా దర్శయామాస మన్యూ రూపం స్వకం మహత్ ।
తార్తీయచక్షుషోద్భూతం భవస్య పరమేష్ఠినః ॥ 20 ॥

మన్యువు ఇలా చెప్పి భవుడు, పరమేష్ఠి అయిన త్రినేత్రుని మూడవ కంటినుండి పుట్టిన తన గొప్ప రూపాన్ని వారికి చూపించాడు.

తేజసా సంభృతం రూపం యతః సర్వం తదుచ్యతే ।
పౌరుషం పురుషేష్వేవ అహంకారశ్చ జన్తుషు ॥ 21 ॥

తేజస్సుతో నిండిన ఆ రూపం సమస్తం ఎవనినుండి ఉద్భవించిందో దాన్ని పురుషులలో పౌరుషంగాను, జీవులలో అహంకారంగాను చెబుతారు.

క్రోధః సర్వస్య యో భీమ ఉపసంహారకృద్భవేత్ ।
తం శంకరప్రతినిధిం జ్వలన్తం నిజతేజసా ॥ 22 ॥

సర్వాయుధధరం దృష్ట్వా ప్రణేముః సర్వదేవతాః ।
విత్రేసుర్దైత్యదనుజా కృతాంజలిపుటాః సురాః ॥ 23 ॥

భూత్వా మన్యుమథోచుస్తే త్వం సేనానీః ప్రభో భవ ।
త్వయా దత్తమిదం రాజ్యం మన్యో భోక్ష్యామహే వయమ్ ॥ 24 ॥

అందరిలో నుండే క్రోధం, ప్రళయకాలంలోని భయంకరరూపం. తన తేజస్సుతో మండుతున్న ఆ శివుని ప్రతినిధివలెనున్న, అన్ని ఆయుధాలను ధరించిన అతడిని చూచి దేవతలందరూ నమస్కరించారు. దైత్యదానవులు భయపడ్డారు. అప్పుడు దేవతలందరు రెండుచేతులు జోడించి, నమస్కరిస్తూ మన్యువుతో ప్రభూ! నువ్వు మాకు సేనానివి కమ్ము అని వేడారు. ఓ మన్యూ! నీవిచ్చిన ఈ రాజ్యాన్ని మేమనుభవించగలం.

తస్మాత్ సర్వేషు కార్యేషు జేతా త్వం జయవర్ధనః ।
త్వమిన్ద్రస్త్వం చ వరుణో లోకపాలాస్త్వమేవ చ ॥ 25 ॥

అందువలన ప్రతి పనియందూకూడా జయము నీదే. నీవు జయవర్ధనుడవు. నీవే ఇంద్రుడవు. నీవే వరుణడవు లోకపాలకులందరూ నీవే.

అస్మాసు సర్వదేవేషు ప్రవిశ త్వం జయాయ వై ।
మన్యుః ప్రోవాచ తాన్ సర్వాన్ వినా మత్తో న కించన ॥ 26 ॥

మేము జయించుటకై మా దేవతలందరిలోకి నీవు ప్రవేశించు అని దేవతలనగా మన్యువు వారితో నేను లేకుండా ఏదీ లేదని చెప్పాడు.

సర్వేష్వన్తః ప్రవిష్టోఽహం న మాం జానాతి కశ్చన ।
స ఏవ భగవాన్ మన్యుస్తతో జాతః పృథక్ పృథక్ ॥ 27 ॥

నేను అందరిలోనూ ప్రవేశించే ఉన్నాను. కానీ నన్నెవరూ తెలుసుకోలేరు. అటుతరువాత నా పూజ్యుడైన మన్యువే వేరువేరుగా పుట్టాడు.

స ఏవ రుద్రరూపీ స్యాద్రుద్రో మన్యుః శివోఽభవత్ ।
స్థావరం జంగమం చైవ సర్వం వ్యాప్తం హి మన్యునా ॥ 28

అతడే రుద్రస్వరూపుడు. ఆ రుద్రుడే మన్యువు. అతడే శివుడైనాడు. స్థావర జంగమా లన్నింటిలో మన్యువు వ్యాపించి వున్నాడు. అవన్నీ అతడిచేతనే వ్యాప్తి పొందుతాయి.

తమవాప్య సురాః సర్వే జయమాపుశ్చ సంగరే ।
జయో మన్యుశ్చ శౌర్యం చ ఈశతేజః సముద్భవమ్ ॥ 29 ॥

అతడిని పొంది దేవతలందరూ యుద్ధంలో జయం పొందారు. ఈశ్వరుని తేజస్సు నుండి మన్యువూ జయమూ, శౌర్యమూ ఉద్భవించాయి.

మన్యునా జయమాప్యాథ కృత్వా దైత్యైశ్చ సంగరమ్ ।
యథాగతం యయుః సర్వే మన్యునా పరిరక్షితాః ॥ 30 ॥

దైత్యులందరితో యుద్ధం చేసి, మన్యురక్షణలో జయాన్ని పొంది, దేవతలందరూ తమ తమ నివాసాలకు వెళ్ళారు.

యత్ర వై గౌతమీ తీరే శివమారాధ్యతే సురాః ।
మన్యుమాపుర్జ్యయం చైవ మన్యుతీర్థం తదుచ్యతే ॥ 31 ॥

ఏ గౌతమీ తీరంలో దేవతలు శివున్ని ఆరాధించి మన్యువునూ, జయాన్ని పొందారో దానిని మన్యుతీర్థ మంటారు.

ఉత్పత్తిం చ తథా మన్యోర్యో నరః ప్రయతః స్మరేత్ ।
విజయో జాయతే తస్య న కైశ్చిత్పరిభూయతే ॥ 32 ॥

మన్యువును గాని, మన్యు ఉత్పత్తిని గూర్చిగాని ఎవరు శ్రద్ధతో స్మరిస్తారో వారికి విజయం లభిస్తుంది. వారి నెవరూ కూడా ఓడించలేరు. అవమానించలేరు.

న మన్యుతీర్థసదృశం పావనం హి మహామునే ।
యత్ర సాక్షాన్మన్యురూపీ సర్వదా శంకరః స్థితః ॥ 33 ॥

ఓ మహామునీ! ఎక్కడ సాక్షాత్తుగా శంకరుడు మన్యురూపాన్ని ధరించి సర్వదా ఉంటాడో అటువంటి మన్యుతీర్థంతో సమానమైందీ, పవిత్రమైనదీ మరొకటి లేదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే మన్యుతీర్థవర్ణనం నామ ద్వినవతితమోఽధ్యాయః. ॥ 92 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని మన్యుతీర్థవర్ణనమనే పేరుగల తొంబై రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రినవతితమోఽధ్యాయః - తొంబై మూడవ అధ్యాయం

శ్వేత పర్వతస్థ శాకల్యాది తీర్థవర్ణనమ్ - శ్వేతపర్వతమునందుగల శాకల్య మున్నగు తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సారస్వతం నామ తీర్థం సర్వకామఫలప్రదమ్ ।
భుక్తిముక్తిప్రదం నృణాం సర్వపాపప్రణాశనమ్ ॥ 1 ॥

సారస్వతమనే తీర్థం మానవులకు సమస్త కోరికలను తీరుస్తుంది. భుక్తిని, ముక్తిని కలిగిస్తుంది. పాపాలన్నీ పోగొడుతుంది.

సర్వరోగాపశమనం సర్వసిద్ధిప్రదాయకమ్ ।
తత్రేమం శృణు వృత్తాన్తం విస్తరేణాథ నారద॥ 2 ॥

ఓ నారదా! రోగాలన్నీ పోగొట్టే, సర్వసిద్ధులను కలిగించే ఆ సారస్వత తీర్థవృత్తాంతాన్ని వివరంగా చెబుతున్నాను విను.

పుష్పోత్కటాత్పూర్వభాగే పర్వతో లోకవిశ్రుతః ।
శుభ్రో నామ గిరిశ్రేష్ఠో గౌతమ్యా దక్షిణే తటే ॥ 3 ॥

గౌతమీనది దక్షిణతీరాన పుష్పోత్కటానికి పూర్వభాగాన లోకాలన్నింటిలోను చాలా ప్రసిద్ధి పొందిన 'శుభ్ర' అనే ఒక శ్రేష్ఠమైన పర్వతం ఉంది.

శాకల్య ఇతి విఖ్యాతో మునిః పరమనైష్ఠికః ।
తస్మిన్ శుభ్రే పుణ్యగిరౌ తపస్తేపే హ్యనుత్తమమ్ ॥ 4 ॥

ఆ పవిత్రమైన శుభ్రగిరిపై శాకల్యుడనే పేరుగల పరమనైష్ఠికుడైన ఒక ముని గొప్ప తపస్సు చేశాడు.

తపస్యన్తం ద్విజశ్రేష్ఠం గౌతమీ తీరమాశ్రితమ్ ।
సర్వే భూతగణా నిత్యం ప్రణమన్తి స్తువన్తి తమ్ ॥ 5 ॥

అగ్ని శుశ్రూషణపరం వేదాధ్యయనతత్పరమ్ ।
ఋషిగన్ధర్వసుమనః సేవితే తత్ర పర్వతే ॥ 6 ॥

గౌతమీనది తీరాన్నాశ్రయించి తపస్సుచేసుకొంటున్న ఆ బ్రాహ్మణోత్తమునికి అక్కడి భూతగణాలన్నీ నిత్యం నమస్కరించి స్తోత్రం చేస్తాయి. అతడు నిత్యాగ్నిహోత్రి. అగ్నికి సేవ చేసేవాడు. వేదము నభ్యసించుటయందే మనస్సు కలవాడు. అతనిని ఋషులు, గంధర్వులు ఆ పర్వతంపై సేవిస్తున్నారు.

తస్మిన్ గిరౌ మహాపుణ్యే దేవద్విజభయంకరః ।
యజ్ఞద్వేషీ బ్రహ్మహన్తా పరశుర్నామ రాక్షసః ॥ 7 ॥

కామరూపీ విచరతి నానారూపధరో వనే ।
క్షణం చ బ్రహ్మరూపేణ కదాచిత్ వ్యాఘ్రరూపధృక్ ॥ 8 ॥

ఆ పవిత్రమైన పర్వతంపై దేవ బ్రాహ్మణులకు భయాన్ని కలిగించే యజ్ఞాలను ద్వేషించే బ్రాహ్మణులను చంపే పరశు అనే పేరుగల ఒక రాక్షసుడు కామరూపుడై అడవిలో తిరుగుతుంటాడు. ఆ రాక్షసుడు క్షణంలో బ్రాహ్మణరూపంతో, మరొకసారి పులిరూపంతో ఇలా అనేక రూపాలను ధరిస్తూ ఆ వనంలో సంచరిస్తుంటాడు.

కదాచిద్దేవరూపేణ కదాచిత్పశురూపధృక్ ।
కదాచిత్ప్రమదారూపః కదాచిన్మృగరూపతః ॥ 9 ॥

ఒకప్పుడు దేవతారూపాన్ని, ఒకప్పుడు పశురూపాన్ని, మరొకప్పుడు అందమైన స్త్రీరూపాన్ని, ఇంకొకప్పుడు మృగ (జింక) రూపాన్ని ధరిస్తాడు.

కదాచిద్బాలరూపేణ ఏవం చరతి పాపకృత్ ।
యత్రాఽఽస్తే బ్రాహ్మణో విద్వాన్ శాకల్యో మునిసత్తమః ॥ 10 ॥

ఆ పాపాత్ముడు ఒకప్పుడు బాలుని రూపం ధరించి ఇలా తిరుగుతూ బ్రాహ్మణుడు, మునిశ్రేష్ఠుడు, విద్వాంసుడు ఐన శాకల్యుడున్న చోటుకు, వస్తూవుండేవాడు.

తమాయాతి మహాపాపీ పరశూ రాక్షసాధమః ।
శుచిష్మన్తం ద్విజశ్రేష్ఠం పరశుర్నిత్యమేవ చ ॥ 11 ॥

శుచితో ఉండేవాడు బ్రాహ్మణశ్రేష్ఠుడు ఐన శాకల్యునివద్దకు రాక్షసాధముడు, మహాపాపి అయిన పరశువు ప్రతిరోజు వస్తూ వుండేవాడు.

నేతుం హన్తుం ప్రవృత్తోఽపి న శశాక స పాపకృత్ ।
స కదాచిద్విజశ్రేష్ఠో దేవానభ్యర్చ్య యత్నతః ॥ 12 ॥

భోక్తుకామః కిలాఽఽయాతస్తత్రాయాత్పరశుర్మునే ।
బ్రహ్మరూపధరో భూత్వా శిథిలః పలితోఽబలీ ॥
కన్యామాదాయ కాంచిచ్చ శాకల్యం వాక్యమబ్రవీత్ ॥ 13 ॥

ఓ మునీ! ఆ పాపాత్ముడు శాకల్యునెత్తుకు పోవుటానికి, చంపటానికి ప్రయత్నించి సఫలుడు కాలేదు. ఆ ద్విజశ్రేష్ఠుడొకనాడు శ్రద్ధగా దేవతలనారాధించి, భోజనం చేయడానికై సిద్ధపడుతుండగా, పరశువు బక్కచిక్కిన, వెండ్రుకలన్నీ తెల్లబడిన, బలహీనంగా నుండిన, బ్రహ్మణరూపాన్ని ధరించి ఒక కన్యను తీసుకొని, అక్కడికి వచ్చి శాకల్యునితో ఇలా అన్నాడు.

పరశు రువాచ:- పరశువు పలికాడు.

భోజనస్యార్థినం విద్ధి మాం చ కన్యామిమాం ద్విజ ।
అతిథ్యకాలే సంప్రాప్తం కృతకృత్యోఽసి మానద ॥ 14 ॥

ఓ బ్రాహ్మణా! అతిథులు వచ్చే మధ్యాహ్నసమయంలో ఈ కన్య, నేను భోజనానికి వచ్చాము. ఓ అహంకారం లేనివాడా! నీవు అదృష్టవంతుడవు.

త ఏవ ధన్యా లోకేఽస్మిన్ యేషామతిథయో గృహాత్ ।
పూర్ణాభిలాషా నిర్యాన్తి జీవన్తోఽపి మృతాః పరే ॥ 15 ॥

ఈ లోకంలో ఎవరింటికి వచ్చిన అతిథులు పూర్ణమనోరథులై తిరిగి వెళ్ళుతారో. వారే ధన్యులు. ఇతరులు జీవించినా మరణించిన వారితో సమానులు.

భోజనే తూపవిష్టే చ ఆత్మార్థం కల్పితం తు యత్ ।
అతిథిభ్యస్తు యో దద్యాద్దత్తా తేన వసున్ధరా ॥ 16 ॥

తనకొరకై సిద్ధం చేసుకొని భోజనానికి కూర్చొన్నవాడు, ఆ భోజనాన్ని అతిథులకు సమర్పిస్తే అతనికి భూదానఫలం లభిస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా తు శాకల్యో దదామీత్యేవమబ్రవీత్ ।
ఆసనే చోపవేశ్యాథాజ్ఞానాత్తం పరశుం ద్విజమ్ ॥ 17 ॥

ఆ మాట విని పరశువును గురించి తెలియక, బ్రాహ్మణునిగానే భావించి శాకల్యుడు అతనిని ఆసనం మీద కూర్చోబెట్టి భోజనాన్ని వడిస్తానన్నాడు.

యథాన్యాయం పూజయిత్వా శాకల్యో భోజనం దదౌ ।
ఆపోశనం కరే కృత్వా పరశుర్వాక్యమబ్రవీత్ ॥ 18 ॥

శాస్త్రప్రకారం పూజించి శాకల్యుడు భోజనం వడ్డించాడు. చేతిలో ఆపోశనాన్నుంచుకొని పరశువు శాకల్యునితో ఇలా అన్నాడు.

పరశు రువాచ:– పరశువు పలికాడు

దూరాదభ్యాగతం శ్రాన్తమనుగచ్ఛన్తి దేవతాః ।
తస్మింస్తృప్తే తు తృప్తాః స్యురతృప్తే తు విపర్యయః ॥ 19 ॥

'అభ్యాగతః స్వయం విష్ణుః' అన్నట్లుగా దూరంనుండి వచ్చిన, అలసిన అతిథిలో దేవతలుంటారు. వచ్చిన అభ్యాగతుడు తృప్తి చెందితే దేవతలు తృప్తి చెందుతారు. అతడు తృప్తి చెందకపోతే దేవతలు కూడా తృప్తి చెందరు.

అతిథిశ్చాపవాదీ చ ద్వావేతౌ విశ్వబాన్ధవౌ ।
అపవాదీ హరేత్పాపమతిథిః స్వర్గదాయకః ॥ 20 ॥

ఈ ప్రపంచంలో అతిథి, అపవాది అనేవారు విశ్వబంధువులు. తప్పులు చెప్పేవాడు పాపాలను హరిస్తాడు. అతిథి స్వర్గాన్నిస్తాడు.

అభ్యాగతం పథి శ్రాన్తం సావజ్ఞం యోఽభివీక్షతే ।
తత్క్షణాదేవ నశ్యన్తి తస్య ధర్మయశఃశ్రియః ॥ 21 ॥

అభ్యాగతుని, దారిలో శ్రాన్తుడైనవానిని ఎవరు అవహేళనగా చూస్తారో ఆ క్షణంలోనే వారి ధర్మం, కీర్తి సంపదలు అన్నీ నశిస్తాయి.

తస్మాదభ్యాగతః శ్రాన్తో యాచేఽహం త్వాం ద్విజోత్తమ! ।
దాస్యసే యది మే కామం తద్భోక్ష్యేఽహం న చాన్యథా ॥ 22 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! అందువలన అభ్యాగతుణ్ణి, శ్రాంతుణ్ణి అయిన నేను నిన్ను యాచిస్తున్నాను. నీవు నా కోరికను తీర్చినట్లయితే నేను భుజిస్తాను లేదా భుజించను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

దత్తమిత్యేవ శాకల్యో భుంక్ష్వేత్యేవాఽఽహ రాక్షసమ్ ।
తతః ప్రోవాచ పరశురహం రాక్షససత్తమః ॥ 23 ॥

అప్పుడు శాకల్యుడు మీకోరిక తీరుస్తాను, మీరు భుజించుడని రాక్షసునితో అన్నాడు. అప్పుడు పరశువు నేను రాక్షసోత్తముణ్ణని చెప్పాడు.

నాహం ద్విజస్తవ రిపుర్న వృద్ధః పలితః కృశః ।
బహూని మే వ్యతీతాని వర్షాణి త్వాం ప్రపశ్యతః ॥ 24 ॥

నేను బ్రాహ్మణుణ్ణి, వృద్ధుణ్ణి, జుట్టునెరిసినవాణ్ణి, కృశించినవాణ్ణి కాదు. నీ శత్రువును. నేను చాలా సంవత్సరాలనుండి నిన్ను చూస్తున్నాను.

శుష్యన్తి మమ గాత్రాణి గ్రీష్మే స్వల్పోదకం యథా ।
తస్మాన్నేష్యే సానుగం త్వాం భక్షయిష్యే ద్విజోత్తమ! ॥ 25 ॥

ఓ బ్రాహ్మణోత్తమా! వేసవికాలంలో చిన్నమడుగులోని నీరు ఎలా ఇంకిపోతుందో అలా నా శరీరావయవాలు తపిస్తున్నాయి. అందువలన నాతో నిన్ను దీసికొనిపోయి భక్షిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శ్రుత్వా పరశువాక్యం తచ్ఛాకల్యో వాక్యమబ్రవీత్ ॥ 26 ॥

పరశువు మాటలను విని ఆ శాకల్యుడిలా అన్నాడు.

శాకల్య ఉవాచ :- శాకల్యుడు పలికాడు.

యే మహాకులసంభూతా విజ్ఞాతసకలాగమాః ।
తత్ర్పతిశ్రుతమభ్యేతి న జాత్వత్ర విపర్యయమ్ ॥ 27 ॥

గొప్పకులంలో పుట్టినవారు, సమస్తఆగమశాస్త్రాలు తెలిసినవారు ఇచ్చిన మాటను నెరవేరుస్తారు. కావున ఈ విషయంలో ఎంతమాత్రం విరుద్ధంగా జరుగదు.

యథోచితం కురు సఖే తథాఽపి శృణు మే వచః ।
నిహన్తుమప్యుద్యతేషు వక్తవ్యం హితముత్తమమ్ ॥ 28 ॥

మిత్రమా! నీకుచిత మనిపించింది చేయి. అయినా నా మాట విను. చంపుటకు సిద్ధమైనవారికి కూడా ఉత్తమమైన హితాన్ని చెప్పాలి.

బ్రాహ్మణోఽహం వజ్రతనుః సర్వతో రక్షకో హరిః ।
పాదౌ రక్షతు మే విష్ణుః శిరో దేవో జనార్దనః ॥ 29 ॥

నేను బ్రాహ్మణుణ్ణి. వజ్రశరీరుడైన హరి అంతటా రక్షకుడు. నా పాదాలను విష్ణువు రక్షించుగాక, నా శిరస్సును దేవుడైన జనార్దనుడు రక్షించుగాక.

బాహూ రక్షతు వారాహః పృష్ఠం రక్షతు ధర్మరాట్ ।
హృదయం రక్షతాత్ కృష్ణో హ్యంగులీ రక్షతాన్నృగః ॥ 30 ॥

వరాహరూపుడు నా రెండు చేతులను రక్షించుగాక, ధర్మరాజు వెనుక భాగాన్ని రక్షించుగాక, కృష్ణుడు నా హృదయాన్ని రక్షించుగాక, నారసింహుడు నా వ్రేళ్ళను రక్షించుగాక.

ముఖం రక్షతు వాగీశో నేత్రే రక్షతు పక్షిగః ।
శ్రోత్రం రక్షతు విత్తేశః సర్వతో రక్షతాద్భవః ॥
నానాపత్స్వేకశరణం దేవో నారాయణః స్వయమ్ ॥ 31 ॥

హయగ్రీవుడు నా ముఖాన్ని రక్షించుగాక. గరుత్మంతునిపై వెళ్ళేవాడు నా నేత్రాలను రక్షించుగాక. లక్ష్మీనాథుడు నా రెండు చెవులను రక్షించుగాక. భవుడంతటినీ రక్షించుగాక. అనేక ఆపదలు వచ్చినప్పుడు దేవుడైన నారాయణు డొక్కడే శరణం.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా తు శాకల్యో నయ వా భక్ష వా సుఖమ్ ।
మాం రాక్షసేన్ద్ర! పరశో! త్వమిదానీమతన్ద్రితః ॥ 32 ॥

శాకల్యుడిలాచెప్పి ఓ రాక్షసశ్రేష్ఠా! పరశూ! నీవిప్పుడు సావధానుడవై, నన్ను తీసుకొని వెళ్ళు లేదా భక్షించు అన్నాడు.

రాక్షసస్తస్యవచనాద్భక్షణాయ సముద్యతః ।
నాస్త్యేవ హృదయే నూనం పాపినాం కరుణాకణః ॥ 33 ॥

శాకల్యుని మాటలు విని రాక్షసుడు అతనిని తినడానికి సిద్ధమైనాడు. పాపాత్ముల హృదయంలో కరుణ కొంచెం కూడా ఉండనే ఉండదు.

దంష్ట్రాకరాళవదనో గత్వా తస్యాన్తికం తదా ।
బ్రాహ్మణం తం నిరీక్ష్యైవం పరశుర్వాక్యమబ్రవీత్ ॥ 34 ॥

భయంకరమైన కోరలతో, ముఖంతో అతని దగ్గరకు వెళ్ళి, ఆ బ్రాహ్మణుని చూచి పరశువు ఇలా అన్నాడు.

పరశు రువాచ:- పరశువు పలికాడు.

శంఖచక్రగదాపాణిం త్వాం పశ్యేఽహం ద్విజోత్తమ ।
సహస్రపాదశిరసం సహస్రాక్షకరం విభుమ్ ॥ 35 ॥

ఓ బ్రాహ్మణోత్తమా! శంఖ చక్ర గదలను ధరించిన వానిగా, వేయి పాదాలు, వేయి శిరస్సులు గలవానిగా, వేయి నేత్రాలు, వేయి చేతులు గల విభుడవైన విష్ణునిగా నిన్ను చూస్తున్నాను.

సర్వభూతైకనిలయం, ఛన్దోరూపం జగన్మయమ్ ।
త్వామద్య విప్ర పశ్యామి నాస్తి తే పూర్వకం వపుః ॥ 36 ॥

సమస్తభూతాలకు స్థానమైనవానిగా, వేదస్వరూపునిగా, జగత్తంతా నిండినవానిగా నేనిప్పుడు నిన్ను చూస్తున్నాను. నీకింతకు ముందున్న రూపం కనిపించుట లేదు.

తస్మాత్ప్రసాదయే విప్ర! త్వమేవ శరణం భవ ।
జ్ఞానం దేహి మహాబుద్ధే! తీర్థం బ్రూహ్యఘనిష్కృతిమ్ ॥ 37 ॥

అందువలన ఓ విప్రా! నన్ననుగ్రహించు. నీవే రక్షకుడవు. ఓ మహాబుద్ధీ! నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. ఈ పాపాన్ని పోగొట్టే తీర్థమేదో చెప్పు.

మహతాం దర్శనం బ్రహ్మన్ జాయతే న హి నిష్ఫలమ్ ।
ద్వేషాదజ్ఞానతో వాఽపి ప్రసంగాద్వా ప్రమాదతః ॥ 38 ॥

అయసః స్పర్శసంస్పర్శో రుక్మత్వాయైవ జాయతే ॥ 39 ॥

బ్రహ్మస్వరూపా! ద్వేషంతోనో అజ్ఞానంతోనో, ప్రసంగవశాన గాని, ప్రమాదవశాన గాని, గొప్పవారి దర్శనం నిష్ఫలం కాదు. పాదరసాన్ని తాకిన ఇనుము బంగారమే అవుతుంది కదా!

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతద్వాక్యం సమాకర్ణ్య రాక్షసేన సమీరితమ్।
శాకల్యః కృపయా ప్రాహ వరదా సా సరస్వతీ ॥ 40 ॥

రాక్షసుడు ఇలా అనగా విని శాకల్యుడు దయతో ఇలా అన్నాడు. ఆ సరస్వతీమాతయే వరాలనిస్తుంది.

తవాచిరాద్దైత్యపతే! తతః స్తుహి జనార్దనమ్ ।
మనోరథఫలప్రాప్తౌ నాన్యన్నారాయణస్తుతేః ॥ 41 ॥

కించిదప్యస్తి లోకేஉస్మిన్ కారణం శృణు రాక్షస ।
ప్రసన్నా తవ సా దేవీ మద్వాక్యాచ్చ భవిష్యతి ॥ 42 ॥

ఓ రాక్షసరాజా! అందువలన జనార్దనుని స్తుతించు. నీకు త్వరలోనే వరమిస్తాడు. మనస్సులో వున్న కోరికలు ఫలించడానికి నారాయణుని స్తుతించడంకంటె, ఈ లోకంలో వేరే కారణం లేదు. ఓ రాక్షసా! విను. నా మాట ప్రకారం నీకు ఆ దేవి ప్రసన్నురాలవుతుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా స పరశుర్గంగాం త్రైలోక్యపావనీమ్ ।
స్నాత్వా శుచిర్యతమనా గంగామభిముఖః స్థితః ॥ 43 ॥

తత్రాపశ్యద్దివ్యరూపాం దివ్యగంధానులేపనామ్ ।
సరస్వతీం జగద్ధాత్రీం శాకల్యవచనే స్థితామ్ ॥ 44 ॥

ఆ పరశువు అలాగేనని పలికి ముల్లోకపావనియైన గంగానదిలో స్నానం చేసి శుచియై, నియమంతోగూడిన మనస్సుతో గంగకెదురుగా నిలచినవాడై శాకల్యుడు చెప్పినట్లుగా(వున్న) దివ్యమైనరూపంతో, దివ్యమైన గంధాన్ని పూసుకొని, జగత్తు కంతా రక్షకురాలిగా వున్న సరస్వతిని చూచాడు.

జగజ్జాడ్యహరాం విశ్వజననీం భువనేశ్వరీమ్ ।
తామువాచ వినీతాత్మా పరశుర్గతకల్మషః ॥ 45 ॥

కల్మషరహితుడైన ఆ పరశు వినయంగా జగత్తులోని జాడ్యాన్ని హరించే, విశ్వానికంతటికి తల్లియైన ఆ భువనేశ్వరితో ఇలా అన్నాడు.

పరశురువాచ:– పరశువు పలికాడు.

గురుః శాకల్య ఇత్యాహ మాకాన్తం స్తుహి విధ్వజమ్ ।
తవ ప్రసాదాత్సా శక్తిర్యథా మే స్యాత్తథా కురు ॥ 46 ॥

గురువైన శాకల్యుడు రమాపతి, గరుడధ్వజుడు ఐన శ్రీమన్నారాయణుని స్తుతించమన్నాడు. నీ అనుగ్రహం వలన నాకు శక్తి కలగేటట్లు చేయి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథాஉస్త్వితి చ సా ప్రాహ పరశుం శ్రీసరస్వతీ ।
సరస్వత్యాః ప్రసాదేన పరశుస్తం జనార్దనమ్ ॥ 47 ॥

తుష్టావ వివిధైర్వాక్యైస్తతస్తుష్టోஉభవద్ధరిః ।
వరం ప్రాదాద్రాక్షసాయ కృపాసిన్ధుర్జనార్దనః ॥ 48 ॥

ఆ సరస్వతి పరశువుతో అలాగే అగుగాక అన్నది. సరస్వతి అనుగ్రహంతో పరశువు జనార్దనుని, అనేక వాక్యాలతో స్తోత్రం చేశాడు. అప్పుడు ఆ స్తోత్రానికి హరి సంతోషించాడు. దయాసముద్రుడైన ఆ జనార్దనుడు రాక్షసునికి వరమిచ్చాడు.

జనార్దన ఉవాచ :- జనార్దనుడు పలికాడు.

యద్యన్మనోగతం రక్షస్తత్సర్వం భవిష్యతి ॥ 49 ॥

ఓ రాక్షసా! నీ మనసులో ఏదేదున్నదో అదంతా ఫలిస్తుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శాకల్యస్య ప్రసాదేన గౌతమ్యాశ్చ ప్రసాదతః ।
సరస్వత్యాః ప్రసాదేన నరసింహప్రసాదతః ॥ 50 ॥

పాపిష్ఠోఽపి తదా రక్షః పరశుర్దివమీయివాన్ ।
సర్వతీర్థాంఘ్రిపద్మస్య ప్రసాదాత్ శార్ఙ్గధన్వినః ॥ 51 ॥

గౌతమీనదియొక్క, సరస్వతి నరసింహస్వామి, శాకల్యుని అనుగ్రహంవలన, తీర్థములన్నీకలిగిన, పద్మాలవంటి పాదాలు కల శార్ఙ్గం అనే ధనుస్సు ధరించే శ్రీమన్నారాయణుని అనుగ్రహంవలన పరశు అనే రాక్షసుడు పాపిష్ఠుడైనా స్వర్గాన్ని పొందాడు.

తతః ప్రభృతి తత్తీర్థం సారస్వతమితి శ్రుతమ్ ।
తత్ర స్నానేన దానేన విష్ణులోకే మహీయతే ॥ 52 ॥

అప్పటినుండి ఆ తీర్థానికి సారస్వత తీర్థమని పేరు వచ్చింది. అక్కడ స్నానదానాదులు చేస్తే విష్ణులోకంలో ఉంటారు.

వాగ్జవైష్ణవశాకల్యపరశుప్రభవాణి హి ।
బహూన్యభూవంస్తీర్థాని తస్మిన్ వై శ్వేతపర్వతే ॥ 53 ॥

ఆ శ్వేతపర్వతంపై సరస్వతీజ (వాగ్జ)తీర్థం, వైష్ణవతీర్థం, శాకల్యతీర్థం, పరశుప్రభవతీర్థం ఇలా అనేకాలైన తీర్థాలున్నాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే శ్వేతపర్వతస్థశాకల్యాది తీర్థవర్ణనం నామ త్రినవతితమోఽధ్యాయః ॥ 93 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని శ్వేతపర్వతంలోగల శాకల్య మున్నగు తీర్థాల వర్ణనమనే పేరు గల తొంబై మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్నవతితమోఽధ్యాయః - తొంబై నాల్గవ అధ్యాయం

పావమాన చిచ్చిక గదాధర కోటితీర్థ వర్ణనమ్-పావమానతీర్థ,చిచ్చికతీర్థ,గదాధరతీర్థ,కోటితీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

చిచ్చికాతీర్థమిత్యుక్తం సర్వరోగవినాశకమ్. ।
సర్వచిన్తాప్రహరణం సర్వశాన్తికరం నృణామ్ ॥ 1 ॥

మానవులకు సమస్తరోగాలను పోగొట్టేది, సమస్తచింతలను దూరం చేసేది, శాంతిని కలిగించేది చిచ్చికాతీర్థమనే నదొకటి ఉంది.

తస్య స్వరూపం వక్ష్యామి శుభ్రే తస్మిన్నగోత్తమే ।
గంగాయా ఉత్తరే పారే యత్ర దేవో గదాధరః ॥ 2 ॥

దానిస్వరూపాన్ని తెల్పుతాను. గంగానది కుత్తరతీరంలో శుభ్రపర్వతంపైన ఎక్కడ గదాధరుడనే దేవుడున్నాడో,

చిచ్చికః పక్షిరాట్ తత్ర భేరుణ్డో యోఽభిధీయతే ।
సదా వసతి తత్రైవ మాంసాశీ శ్వేతపర్వతే ॥ 3 ॥

అక్కడ చిచ్చికుడనే పక్షిరాజు ఉన్నాడు. అతణ్ణి భేరుండు డంటారు. మాంసాహారుడైన అతడు అక్కడనే శ్వేతపర్వతము నందెప్పుడూ ఉంటాడు.

నానాపుష్పఫలాకీర్ణైః సర్వర్తుకుసుమైర్నగైః ।
సేవితే ద్విజముఖ్యైశ్చ గౌతమ్యాచోపశోభితే ॥ 4 ॥

సిద్ధచారణగంధర్వకింనరామరసంకులే ।
తత్సమీపే నగః కశ్చిద్ద్విపదాం చ చతుష్పదామ్ ॥ 5 ॥

అనేక పుష్పఫల భరితమైన, అన్నిఋతువులలో పూచే పుష్పాలతో కూడిన చెట్లతోనున్న, అనేక పక్షులతో గూడిన, ప్రక్కనే గౌతమీనదితో ప్రకాశించే, సిద్ధులు, చారణులు, గంధర్వులు, కిన్నరులు, దేవతల సమూహాలు కలిగివున్న ఆ పర్వతసమీపంలో ఒక చెట్టు ఉన్నది. దానినాశ్రయించి అనేక పక్షులు జంతువులు కూడా వున్నాయి.

రోగార్తిక్షుత్తృషాచిన్తామరణానాం న భాజనమ్ ।
ఏవం గుణాన్వితే శైలే నానామునిగణావృతే ॥ 6 ॥

పూర్వదేశాధిపః కశ్చిత్పవమాన ఇతిశ్రుతః ।
క్షత్రధర్మరతః శ్రీమాన్ దేవబ్రాహ్మణపాలకః ॥ 7 ॥

రోగాలు, బాధలు, ఆకలి, దప్పిక, చింత, మరణం మొదలైనవి దరిజేరని, అనేక మునుల సమూహం గలిగి ఇటువంటి సద్గుణాలతో గూడిన ఆ పర్వతంలో, క్షత్రియ ధర్మాన్ని పాలించేవాడు, దేవబ్రాహ్మణులను పూజించేవాడు, శ్రీమంతుడు, తూరుపు దేశాధిపతి అయిన పవమానుడనే ప్రసిద్ధరాజుండేవాడు.

బలేన మహతా యుక్తః సపురోధా వనం యయౌ ।
రేమే స్త్రీభిర్మనోజ్ఞాభిర్నృత్యవాదిత్రజైః సుఖైః ॥ 8 ॥

ఆ రాజు గొప్పసైన్యంతో సుందరమైన స్త్రీలు నాట్యం చేస్తుండగా, మంగళవాద్యాలు మ్రోగుతుండగా, సుఖాలతో ఆనందిస్తూ, పురోహితులతో గూడ వనానికి వెళ్లాడు.

స చ ఏవం ధనుష్పాణిర్మృగయాశీలిభిః వృతః ।
ఏవం భ్రమన్ కదాచిత్స శ్రాన్తో ద్రుమముపాగతః ॥ 9 ॥

వేటయందాసక్తిగలిగిన వారితో కలసి ఆ రాజు ధనుస్సును ధరించి, అడవిలో సంచరిస్తూ అలసిపోయి ఒక చెట్టువద్దకు చేరాడు.

గౌతమీతీరసంభూతం నానాపక్షిగణైర్వృతమ్।
ఆశ్రమాణాం గృహపతిం ధర్మజ్ఞమివ సేవితమ్ ॥ 10 ॥

తమాశ్రిత్య నగశ్రేష్ఠం పవమానో నృపోత్తమః ।
సవిశ్రాన్తో జనవృత ఈక్షాం చక్రే నగోత్తమమ్ ॥ 11 ॥

ధర్మజ్ఞుడైన గృహస్థుడు నాలుగు ఆశ్రమాల నవలంబించే వారికోసం ఉండేటట్లుగా గౌతమీతీరంలో మొలచిన అనేక పక్షిసమూహాలతో కూడినదై ఆ గొప్ప వృక్షముండినది. ఆ చెట్టువద్దకు చేరి తన పరివారంతో కలిసి పవమానరాజు విశ్రాంతి తీసుకొని, ఆ వృక్షరాజాన్ని చూచాడు.

తత్రాపశ్యద్ద్విజం స్థూలం ద్విముఖం శోభనాకృతిమ్ ।
చిన్తావిష్టం తథా శ్రాన్తం తమపృచ్ఛన్నృపోత్తమః ॥ 12 ॥

ఆ చెట్టుపై ఒక స్థూలమైన, అందమైన ఆకారంగల, రెండు ముఖాలు గలిగి చింతతో కూర్చున్న పక్షిని చూచి ఆ రాజశ్రేష్ఠుడిలా అన్నాడు.

రాజోవాచ :– రాజు పలికాడు.

కో భవాన్ ద్విముఖః పక్షీ చిన్తవానివ లక్ష్యతే ।
నైవాత్ర కశ్చిద్దుఃఖార్తః కస్మాత్తే దుఃఖమాగతమ్ ॥ 13 ॥

రెండు ముఖముల పక్షివైన నీవెవరు? నీవు చాలా చింతిస్తూ, కన్పిస్తున్నావు. ఇక్కడెవరూ దుఃఖార్తులు లేరు. నీకెవరి వలన దుఃఖం కలిగింది?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతః ప్రోవాచ నృపతిం పవమానం శనైః శనైః ।
సమాశ్వస్తమనాః పక్షీ చిచ్చికో నిఃశ్వసన్ ముహుః ॥ 14 ॥

అప్పుడు చిచ్చికుడనే పక్షి ఓదార్పుతో కొంత మనస్సు చల్లబడి, మాటిమాటికి నిట్టూరుస్తూ, మెల్లమెల్లగా పవమాన రాజుతో ఇలా అన్నది.

మత్తో భయం న చాన్యేషాం మమ చాఽన్యోపపాదితమ్ ।
నానాపుష్పఫలాకీర్ణం మునిభిః పరిసేవితమ్ ॥ 15 ॥

పశ్యేయం శూన్యమేవాద్రిం తతః శోచామి మామకమ్ ।
న లభామి సుఖం కించిత్ న తృప్యామి కదాచన ॥
నిద్రాం ప్రాప్నోమి న క్వాపి న విశ్రాన్తిం న నిర్వృతిమ్ ॥ 16 ॥

నావలన ఇతరులకు భయం లేదు, నాకూ ఇతరుల వలన భయం లేదు. అనేక పుష్పఫలాలతో గూడి, మునులు సేవిస్తున్న ఈ పర్వతం శూన్యంగా ఉండటం చూసి బాధపడుతున్నాను. తరువాత నా గురించి చింతిస్తున్నాను. నేను ఏ కొంచెం గూడా సుఖాన్ని, తృప్తిని పొందటం లేదు. నిద్ర రావడం లేదు. విశ్రాంతి దొరకటం లేదు. ఆనందాన్ని పొందటం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ద్విముఖస్య ద్విజస్యోక్తం శ్రుత్వా రాజాఽతి విస్మితః ॥ 17 ॥

రెండు ముఖములు గల పక్షి మాటను విని రాజు మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు.

రాజోవాచ :– రాజు పలికాడు.

కో భవాన్ కిం కృతం పాపం కస్మాచ్ఛూన్యశ్చ పర్వతః ।
ఏకేనాస్యేన తృప్యన్తి ప్రాణినోఽత్ర నగోత్తమే ॥ 18 ॥

నీవెవరు? ఏం పాపం చేశావు? ఈ పర్వతం శూన్యంగా ఎందుకుంది? ఈ పర్వతంపై ప్రాణులన్నీ ఒకే నోటితో తృప్తిపొందుతున్నాయి.

కిముతాఽఽస్యద్వయేన త్వం న తృప్తిముపయాస్యసి ।
కిం వా తే దుష్కృతం ప్రాప్తమిహ జన్మన్యథో పురా ॥ 19 ॥

రెండు నోళ్ళున్నా నీవు ఎందుకు తృప్తిపడటం లేదు. నీవు ఈ జన్మలోగాని, పూర్వజన్మలోగాని ఏమి పాపం చేశావు?

తత్సర్వం శంస మే సత్యం త్రాస్యే త్వాం మహతో భయాత్ ॥ 20 ॥

అదంతా నాకు నిజంగా చెప్పు. నిన్నా మహాభయం నుండి రక్షిస్తాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

రాజానం తం ద్విజః ప్రాహ నిఃశ్వసన్నథ చిచ్చికః ॥ 21 ॥

అప్పుడా చిచ్చికపక్షి నిట్టూరుస్తూ రాజుతో ఇలా అన్నది.

చిచ్చిక ఉవాచ :– చిచ్చిక పలికింది.

వక్ష్యేఽహం త్వాం పూర్వవృత్తం పవమాన శృణుష్వ తత్ ।
అహం ద్విజాతిప్రవరో వేదవేదాంగపారగః ॥ 22 ॥

ఓ పవమాన మహారాజా! నీకు నా పూర్వవృత్తాంతాన్ని చెబుతాను విను. నేనొక బ్రహ్మణోత్తముణ్ణి. వేదవేదాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాను.

కులీనో విదితః ప్రాజ్ఞః కార్యహన్తా కలిప్రియః ।
వదే పురస్తదా పృష్ఠే అన్యదన్యచ్చ జన్తుషు ॥ 23 ॥

మంచివంశంలో పుట్టాను. అన్నీ తెలిసినవాణ్ణి, ప్రాజ్ఞుణ్ణి. కాని కార్యాలను చెడగొట్టేవాణ్ణి. తగువులాటలంటే ఇష్టం. ప్రాణులవిషయంలో ముందొక విధంగా చెప్పి తరువాత మరొకవిధంగా చెప్పేవాణ్ణి.

పరవృద్ధ్యా సదా దుఃఖీ మాయయా విశ్వవంచకః ।
కృతఘ్నః సత్యరహితః పరనిన్దావిచక్షణః ॥ 24 ॥

ఇతరుల అభివృద్ధి చూసి ఎప్పుడూ ఏడ్చేవాణ్ణి. మాయతో ప్రపంచాన్ని మోసం చేసేవాణ్ణి. చేసిన మేలు మరచి అపకారాన్ని చేసేవాడిని. అబద్ధాలాడేవాడిని. ఇతరులను నిందించేవాణ్ణి.

మిత్రస్వామిగురుద్రోహీ దమ్భాచారోఽతినిర్ఘృణః ।
మనసా కర్మణా వాచా తాపయామి జనాన్బహూన్ ॥ 25 ॥

మిత్రులకు, యజమానికి, గురువుకు ద్రోహంచేసేవాడిని. దంభంతో ఆచారాలను చూపేవాడిని. ఏ మాత్రం దయలేనివాడిని. మనోవాక్కాయకర్మలతో అనేకులను బాధించాను.

అయమేవ వినోదో మే సదా యత్పరహింసనమ్ ।
యుగ్మభేదం గణోచ్ఛేదం మర్యాదాభేదనం సదా ॥ 26 ॥

కరోమి నిర్విచారోఽహం విద్వత్సేవాపరాఙ్ముఖః ।
న మయా సదృశః కశ్చిత్పాతకీ భువనత్రయే ॥ 27 ॥

ఇతరులనెప్పుడూ హింసించడం, ఇద్దరి మధ్య భేదం కలిగించడం, గుంపును విడదీయడం, కట్టుబాటు నతిక్రమించడం ఇవే నాకు వినోదాలుగా ఉండేవి. ఈ పై పనులన్నీ ఏ మాత్రం విచారణలేకుండా చేసేవాడిని. విద్వాంసులకు సేవ అంటే ఇష్టపడేవాడిని కాదు. నావంటి పాతకుడు ఈ ముల్లోకాలలో ఎవడూ ఉండడు.

తేనాహం ద్విముఖో జాతస్తాపనాదుఃఖభాగ్యహమ్ ।
తస్మాద్దుఃఖేన సంతప్తః శూన్యోఽయం పర్వతో మమ ॥ 28 ॥

అందువలన రెండుముఖాలు గలవానిగా పుట్టినాను. నేను తాపాన్ని, దుఃఖాన్ని పొందాను. అందుకే దుఃఖంతో దహించిపోతున్నాను. అందువల్ల నాకీ పర్వతం శూన్యంగా కనిపిస్తోంది.

అన్యచ్చ శృణు భూపాల! వాక్యం ధర్మార్థసంహితమ్ ।
బ్రహ్మహత్యాసమం పాపం తద్వినా తదవాప్యతే ॥ 29 ॥

ఓ రాజా! ధర్మార్థాలతో కూడిన మరొక మాట విను. అది బ్రహ్మహత్యతో సమానమైన పాపం. అది చేయకున్నా వస్తుంది.

క్షత్రియః సంగరం గత్వా అథవాఽన్యత్ర సంగరాత్ ।
పలాయన్తం న్యస్తశస్త్రం విశ్వస్తం చ పరాఙ్ముఖమ్ ॥ 30 ॥

అవిజ్ఞాతం చోపవిష్టం బిభేమీతి చ వాదినమ్ ।
తం యది క్షత్రియో హన్యాత్ స తు స్యాద్బ్రహ్మఘాతకః ॥ 31 ॥

క్షత్రియుడు యుద్ధానికి వెళ్ళిగాని, లేదా మరొక చోటగాని యుద్ధంనుండి వెనుదిరిగినవాడిని, పారిపోయేవాడిని, ఆయుధాలు వదలినవాడిని, తనను నమ్మినవాడిని, తెలియనివాడిని, కూర్చున్నవాడిని, భయపడుతున్నాననేవాడిని ఏ క్షత్రియుడు చంపుతాడో వాడు బ్రహ్మఘాతకుడు.

అధీతం విస్మరతి యస్త్వంకరోతి తథోత్తమమ్ ।
అనాదరం చ గురుషు తమాహుర్బ్రహ్మఘాతకమ్ ॥ 32 ॥

చదివినదానిని మరచిపోయేవాడిని, పెద్దలను 'నీవు' అని సంబోధించేవాడిని, గురువులయందనాదరం చూపెట్టేవాడిని బ్రహ్మఘాతకుడంటారు.

ప్రత్యక్షే తు ప్రియం వక్తి పరోక్షే పరుషాణి చ ।
అన్యద్ధృది వచస్యన్యత్కరోత్యన్యత్సదేవ యః ॥ 33 ॥

గురూణాం శపథం కర్తా, ద్వేష్టా బ్రాహ్మణనిన్దకః ।
మిథ్యావినీతః పాపాత్మా స తు స్యాద్బ్రహ్మఘాతకః ॥ 34 ॥

ఎవడు ఎదురుగా తియ్యగా మాట్లాడి పరోక్షంలో పరుషంగా మాట్లాడతాడో, మనస్సులో ఒక ఆలోచన పెట్టుకొని మాటలో ఒకటి, పనిలో ఒకటి ఇలా వేరు వేరుగా నెవడెప్పుడూ ప్రవర్తిస్తాడో, గురువులను తిట్టేవాడు, ద్వేషించేవాడు, బ్రాహ్మణులను నిందించేవాడు, ద్వేషించేవాడు, కపటంగా వినయాన్ని చూపెట్టేవాడు, పాపాత్ముడయినవానిని బ్రహ్మఘాతకుడంటారు.

దేవం చ వేదమధ్యాత్మం ధర్మబ్రాహ్మణసంగతిమ్ ।
ఏతాన్నిన్దతి యో ద్వేషాత్సతు స్యాద్బ్రహ్మఘాతకః ॥ 35 ॥

దేవుణ్ణి, వేదాన్ని, ఆత్మతత్త్వాన్ని, ధర్మాన్ని బ్రాహ్మణసంగతిని వీటినెవడు ద్వేషంతో నిందిస్తాడో వాణ్ణి బ్రహ్మఘాతకు డంటారు.

ఏవం భూతో౭ ప్యహం రాజన్ దంభార్థం లజ్జయా తథా ।
సద్వృత్త ఇవ వర్తే౭ హం తస్మాద్రాజన్ ద్విజో౭ భవమ్ ॥ 36 ॥

రాజా! నేను కూడా అలాగే దంభంతో ప్రవర్తించి, సిగ్గుపడి పైకి మంచివానిగా ప్రవర్తించినందువలన ఈ విధమైన పక్షినైనాను.

ఏవం భూతో౭ పి సత్కర్మ కించిత్కర్తా౭ స్మి కుత్రచిత్ ।
తేనాహం కర్మణా రాజన్ స్వతః స్మర్తా పురా కృతమ్ ॥ 37 ॥

ఓ రాజా! ఇలా ఉన్న నేను ఎక్కడో ఒకచోట ఏదో ఒక సత్కర్మ చేశాను. దానితోనే స్వయంగా నేను పూర్వం చేసిన వాటిని స్మరించాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్చిచ్చికవచః శ్రుత్వా పావమానః సువిస్మితః ।
కర్మణా కేన తే ముక్తిరిత్యాహ నృపతిర్ద్విజమ్ ॥ 38 ॥

ఆ చిచ్చికుడు చెప్పిన మాటలను విని పావమానుడు చాలా ఆశ్చర్యపోయాడు. ఆ రాజు పక్షితో ఏం చేస్తే నీకు ముక్తి లభిస్తుందని అడిగాడు.

ఇతి తస్య వచః శ్రుత్వా నృపతిం ప్రాహ పక్షిరాట్ ॥ 39 ॥

ఇలా అడిగిన రాజుతో ఆ పక్షిరాజిలా అన్నాడు.

చిచ్చిక ఉవాచ :- చిచ్చిక పలికింది.

అస్మిన్నేవ నగశ్రేష్ఠే గౌతమ్యా ఉత్తరే తటే ।
గదాధరం నామ తీర్థం సర్వపాపప్రణాశనమ్ ॥ 40 ॥

గౌతమీనది కుత్తర తీరాన ఈ శ్రేష్ఠమైన పర్వతంపై సమస్తపాపాలను నశింపజేసే గదాధరమనే తీర్థం ఉంది.

తద్ధి తీర్థం పుణ్యతమం తత్ర మాం నయ సువ్రత! ।
సర్వకామప్రదం చేతి మహద్భిర్మునిభిః శ్రుతమ్ ॥ 41 ॥

ఆ తీర్థం కోరికలన్నింటినీ తీరుస్తుందని గొప్ప మునులద్వారా విన్నాను. నన్ను ఆ పుణ్యతమమైన తీర్థం వద్దకు తీసికొని పో.

న గౌతమ్యాస్తథా విష్ణోరపరం క్లేశనాశనమ్ ।
సర్వభావేన తత్తీర్థం పశ్యేయమితి మే మతిః ॥ 42 ॥

గౌతమీనది, విష్ణువు అనే వీరికంటె ఇతరులెవరూ దుఃఖాలను దూరం చేసేవారు లేరు. మనస్ఫూర్తిగా నేనా తీర్థాన్ని దర్శించగలనని నా అభిప్రాయం.

మత్కృతేన ప్రయత్నేన నైతచ్ఛక్యం కదాచన ।
కథమాకాంక్షితప్రాప్తిర్భవేద్దుష్కృత కర్మణామ్ ॥ 43 ॥

నా ప్రయత్నం చేత ఇది ఎప్పటికీ సిద్ధించదు. దుష్కార్యాలు చేసేవారు కోరిందెలా లభిస్తుంది?

సప్రయత్నోఽప్యహం వీర న పశ్యే తత్సుదుష్కరమ్ ।
తస్మాత్తవ ప్రసాదాచ్చ పశ్యేయం హి గదాధరమ్ ॥ 44 ॥

ఓ వీరుడా! నా ప్రయత్నంతో ఆ దుష్కరమైనదానిని నేను చూడలేను. కావున నీ అనుగ్రహంతో ఆ గదాధరుని దర్శిస్తాను.

అవిజ్ఞాపితదుఃఖజ్ఞం కరుణావరుణాలయమ్ ।
యస్మిన్ దృష్టే భవక్లేశాః న దృశ్యన్తే పునర్నరైః ॥ 45 ॥

దృష్ట్వైవ తం దివం యాస్యే ప్రసాదాత్తవ సువ్రత ॥ 46 ॥

ఎవని దృష్టిపడినంతమాత్రానే నరులు తిరిగి ఈ లోకంలోని దుఃఖాలను చూడరో, అటువంటి కరుణా సముద్రుని, మనము విన్నవించుకోని దుఃఖాలను కూడా ఎరిగినవాడైన ఆ గదాధరుని నీ అనుగ్రహంవలన దర్శించి స్వర్గం చేరుతాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవముక్తః స నృపతిశ్చిచ్చికేన ద్విజన్మనా ।
దర్శయామాస తం దేవం తాం చ గంగాం ద్విజన్మనే ॥ 47 ॥

ఇలా పక్షిరూపుడైన చిచ్చికుడు రాజుతో చెప్పగా రాజాపక్షికి దేవుడైన గదాధరుని, గంగను దర్శింపజేశాడు.

తతః స చిచ్చికః ప్రాహ గంగాం త్రైలోక్యపావనీమ్ ॥ 48 ॥

అప్పుడాచిచ్చికుడు ముల్లోకపావనియైన గంగతో ఇలా అన్నాడు.

చిచ్చిక ఉవాచ :– చిచ్చికుడు పలికాడు.

గంగే గౌతమి యావత్త్వాం త్రిజగత్పావనీం నరః ।
న పశ్యత్యుచ్యతే తావదిహాముత్రాపి పాతకీ ॥ 49 ॥

ఓ గంగా! గౌతమీ! ముల్లోకపావనియైన నిన్ను దర్శించనంతవరకు పాతకుడైన ఆ నరునకు ఇహపరలోకాలు లేవంటారు.

తస్మాత్సర్వాగసమపి మాముద్ధర సరిద్వరే ।
సంసారే దేహినామన్యా న గతిః కాఽపి కుత్రచిత్ ॥ 50 ॥
త్వాం వినా విష్ణుచరణసరోరుహసముద్భవే! ।

అందువలన ఓ శ్రేష్ఠమైననదీ! అన్ని విధాలా అపరాధిని, పాపిని యైన నన్ను ఉద్ధరించు. ఓ శ్రీమన్నారాయణుని పాదపద్మాలనుండి ఉద్భవించినదానా! ఈ ప్రపంచంలో ఎక్కడా కూడా మానవులకు నీవు తప్ప మరొకరెవరు దిక్కు లేరు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రద్ధావిశుద్ధాత్మా గంగైకశరణో ద్విజః ।
స్నానం చక్రే స్మరన్నన్తర్గంగే! త్రాయస్వ మామితి ॥ 51 ॥

ఇలా శ్రద్ధతో విశుద్ధాత్ముడై, గంగ ఒక్కతే శరణమని ఆ పక్షి గంగను స్మరించి రక్షించమని వేడుతూ ఆ గంగలో మునిగి స్నానం చేసింది.

గదాధరం తతో నత్వా పశ్యత్సు నగవాసిషు ।
పవమానాభ్యనుజ్ఞాతస్తదైవ దివమాక్రమత్ ॥ 52 ॥

అటు తరువాత గదాధరునికి నమస్కరించి పవమానుని వద్ద సెలవు తీసుకొని పర్వతం మీద ఉన్నవారందరూ చూస్తుండగా అప్పుడే స్వర్గానికి వెళ్ళింది.

పవమానః స్వనగరం ప్రయయౌ సానుగస్తతః ।
తతః ప్రభృతి తత్తీర్థం పావమానం సచిచ్చికమ్ ॥ 53 ॥

గదాధరం కోటితీర్థమితి వేదవిదో విదుః ।
కోటికోటిగుణం కర్మ కృతం తత్ర భవేన్నృణామ్ ॥ 54 ॥

పవమానుడు తనవారితో గూడి తన నగరానికి వెళ్లాడు. అప్పటినుండి ఆ తీర్థానికి పావమానం తీర్థమని చిచ్చిక తీర్థమని పేరు వచ్చింది. దీనినే గదాధరతీర్థమని, కోటితీర్థమని వేదవేత్త లంటారు. అక్కడ ఏ కర్మ చేసినా కోటికోటిరెట్లు ఫలమిస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే పావమాన చిచ్చిక గదాధర కోటితీర్థ వర్ణనం నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥ 94 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో పావమానతీర్థ,చిచ్చికతీర్థ, గదాధరతీర్థ, కోటితీర్థ వర్ణనమనే పేరుగల తొంబై నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచ నవతితమోఽధ్యాయః - తొంబై ఐదవ అధ్యాయం

భద్రతీర్థవర్ణనమ్ - భద్రతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భద్రతీర్థమితి ప్రోక్తం సర్వారిష్టనివారణమ్ ।
సర్వపాపప్రశమనం మహాశాన్తిప్రదాయకమ్ ॥ 1 ॥

సమస్త అరిష్టాలను తొలగించేది, సమస్తపాపాలను శమింపజేసేది, గొప్ప శాంతిని కలుగజేసేది అయిన భద్రతీర్థమనే నది కలదు.

ఆదిత్యస్య ప్రియా భార్యా ఉషా త్వాష్ట్రీ పతివ్రతా ।
ఛాయాఽపి భార్యా సవితుస్తస్యాః పుత్రః శనైశ్చరః ॥ 2 ॥

త్వష్ట కూతురైన ఉష సూర్యునికి ప్రియమైన భార్య. ఆమె పతివ్రత. అలాగే సూర్యునికి మరొక భార్య ఛాయ. ఆమె కుమారుడు శనైశ్చరుడు.

తస్య స్వసా విష్టిరితి భీషణా పాపరూపిణీ ।
తాం కన్యాం సవితా కస్మై దదామీతి మతిం దధే ॥ 3 ॥

అతని సోదరి విష్టి. ఆమె మిక్కిలి భయంకరురాలు. పాపరూపం గలది. ఆమెను ఎవరికిచ్చి వివాహం చేయాలని సూర్యుడు చింతిస్తుండేవాడు.

యస్మై యస్మై దాతుకామః సూర్యో లోకగురుః ప్రభుః ।
తచ్ఛ్రుత్వా భీషణా చేతి కిం కుర్మో భార్యయాఽనయా ॥ 4 ॥

ఎవరెవరికివ్వాలని లోకగురువు, ప్రభువు అయిన సూర్యుడు సంకల్పించాడో, అది విని భయంకరమైన ఈమెను భార్యగా చేసుకొని ఏమి చేయాలన్నారు.

ఏవం తు వర్తమానా సా పితరం ప్రాహ దుఃఖితా ॥ 5 ॥

ఇలా జరుగగా ఆమె దుఃఖిస్తూ తండ్రితో ఇలా అనింది.

విష్టిరువాచ :- విష్టి పలికాడు.

బాలామేవ పితా యస్తు దద్యాత్కన్యాం సురూపిణే ।
స కృతార్థో భవేల్లోకే న చేద్దుష్కృతవాన్ పితా ॥ 6 ॥

తండ్రి తన కూతురు బాలగా వున్నప్పుడే ఆ కన్యను అందమైన వానికిచ్చి చేస్తే లోకంలో కృతార్థు డౌతాడు. లేనిచో ఆ తండ్రి దుష్కృతుడే అవుతాడు.

**చతుర్థాద్వత్సరాదూర్ధ్వం యావన్న దశమాత్యయః ।
తావద్వివాహః కన్యాయాః పిత్రా కార్యః ప్రయత్నతః ॥ 7 ॥**

నాలుగు సంవత్సరములు దాటిన తరువాత పదిసంవత్సరములలోపు తండ్రి ప్రయత్నించి తన కూతురుకు వివాహం చేయాలి.

**శ్రీమతే విదుషే యూనే కులీనాయ యశస్వినే ।
ఉదారాయ సనాథాయ కన్యా దేయా వరాయ వై ॥ 8 ॥**

మంచిధనవంతుడు, పండితుడు, మంచి వంశంలో పుట్టినవాడు, కీర్తిగలవాడు, ఉదారుడు, సనాథుడైన వరునికి కన్యనీయాలి.

**ఏతచ్చేదన్యథా కుర్యాత్పితా స నిరయీ సదా ।
ధర్మస్య సాధనం కన్యా విదుషామపి భాస్కర ॥ 9 ॥**

ఇలా కాక వేరే విధంగా చేస్తే ఆ తండ్రి సదా నరకవాసి అవుతాడు. ఓ సూర్యా! పండితులకు కూడా కన్య ధర్మానికి సాధనం.

**నరకస్త్యేవ మూర్ఖాణాం కామోపహతచేతసామ్ ।
ఏకతః పృథివీ కృత్స్నా సశైలవనకాననా ॥ 10 ॥**

**స్వలంకృతోపాధిహీనా సుకన్యా చైకతః స్మృతా ।
విక్రీణీతే యశ్చ కన్యామశ్వం వా గాం తిలానపి ॥ 11 ॥**

**న తస్య రౌరవాదిభ్యః కదాచిన్నిష్కృతిర్భవేత్ ।
వివాహోతిక్రమః కార్యో న కన్యాయాః కదాచన ॥ 12 ॥**

కామోపహత చేతసులైన మూర్ఖులకు నరకమే శరణ్యం పర్వతారణ్య కాననాలతో గూడిన భూమి ఒకవైపు, అలంకరించిన ఉపాధిలేని కన్య ఒకవైపు ఉంచిన రెండు సమానులని స్మృతి చెప్తుతున్నది. కన్యనుగాని, గుఱ్ఱమునుగాని, గోవునుగాని, నువ్వులుగాని ఎవడు అమ్ముకొంటాడో, అటువంటివానికి రౌరవాది నరకాల నుండికూడా నిష్కృతి ఎన్నటికీ లభించదు. వివాహాన్నతిక్రమించవచ్చు కాని ఎప్పుడూ కన్యనతిక్రమించ కూడదు.

**తస్మిన్ కృతే యత్పితుః స్యాత్పాపం తత్కేన కథ్యతే ।
యావల్లజ్జాం న జానాతి యావత్క్రీడతి పాంశుభిః ॥ 13 ॥**

ఆ పాపం చేసిన తండ్రికి జరుగబోయే పాపాన్నిగూర్చి ఎవరు చెప్పగలరు? సిగ్గెరుగక, ధూళి దూసరాలతో ఆడుకొనే వయస్సులోపలే

**తావత్కన్యా ప్రదాతవ్యా నోచేత్పిత్రోరధోగతిః ।
పితుః స్వరూపం పుత్రః స్యాద్యః పితా పుత్ర ఏవ సః ॥ 14 ॥**

కన్యగా ఉండగానే వివాహం జరిపించాలి. లేనిచో ఆ తండ్రికి అధోగతియే. తండ్రి స్వరూపమే పుత్రుడౌతుంది. ఎవడు తండ్రియో అతడు పుత్రుడే.

ఆత్మనః సుఖితాం లోకే కో న కుర్యాత్ కరోతి చ ।
యత్కన్యాయాం పితా కుర్యాద్దానం పూజనమీక్షణమ్ ॥ 15 ॥

యత్కృతం తత్కృతం విద్యాత్తాసు దత్తం తదక్షయమ్ ।
యద్దత్తం తాసు కన్యాసు తదానన్త్యాయ కల్పతే ॥ 16 ॥

లోకంలో సుఖంగా తానుండాలని ఎవడు చేయడు? తప్పక చేస్తాడు. కన్యగూర్చి తండ్రి దానం, పూజనం, ఈక్షణం అనేది ఏమి చేస్తాడో, అదే చేసినట్లవుతుందని తెలియాలి. కన్యల కిచ్చింది అక్షయంగా ఉంటుంది. వారికిచ్చింది అనంత ఫలమిస్తుంది.

పుత్రేషు చైవ పౌత్రేషు కో న కుర్యాత్సుఖం రవే ।
కరోతి యః కన్యకానాం స సంపద్భాజనం భవేత్ ॥ 17 ॥

ఓ సూర్యా! కొడుకుల మనుమల సుఖానికై ఎవడు ప్రయత్నం చేయకుండా ఉంటాడు? ఎవరు కన్యల సుఖం కొరకు చేస్తారో అది సంపదలకు స్థానమౌతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం తాం వాదినీం కన్యాం విష్టిం ప్రోవాచ భాస్కరః ॥ 18 ॥

ఇలా మాట్లాడిన తన కూతురైన విష్టితో సూర్యుడిలా అన్నాడు.

సూర్య ఉవాచ :- సూర్యుడు పలికాడు.

కిం కరోమి న గృహ్ణాతి త్వాం కశ్చిద్భీషణాకృతిమ్ ।
కులం రూపవయోవిత్తవిద్యాం వృత్తం సుశీలతామ్ ॥ 19 ॥

మిథః పశ్యన్తి సంబంధే వివాహే స్త్రీషు పుంసు చ ।
అస్మాసు సర్వమప్యస్తి వినా తవ గుణైః శుభే ॥
కిం కరోమి క్వ దాస్యామి వృథా మాం ధిక్కరోషి కిమ్ ॥ 20 ॥

భీషణాకారంతోవున్న నిన్ను ఎవరూ గ్రహించుటలేదు. నేనేమి చేస్తాను? కులం, రూపం, వయస్సు, ధనం, విద్య, చరిత్ర, సౌశీల్యాలను, వివాహ సంబంధాలలో పురుషులలోను, స్త్రీలలోను పరస్పరం చూస్తారు. ఓ శుభమైనదానా! నీ గుణాలు తప్ప మాయందన్నీ ఉన్నాయి. నేనేమి చేస్తాను? ఎవరికి ఇస్తాను? నీవు నన్ను వ్యర్థంగా ధిక్కరిస్తున్నావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్త్వా పునస్తాం చ విష్టిం ప్రోవాచ భాస్కరః ॥ 21 ॥

ఇలాగని సూర్యుడు విష్టితో మరల ఇలా పలికాడు.

సూర్య ఉవాచ :- సూర్యుడు పలికాడు.

యస్మై కస్మై చ దాతవ్యా త్వం వై యద్యనుమన్యసే ।
దీయసేఽద్య మయా విష్టే అనుజానీహి మాం తతః ॥ 22 ॥

ఓ విష్టీ! నీ వనుమతించినట్లైతే ఎవరికో ఒకరికి నీవు ఇవ్వవలసినదానివే. అందువల్ల ఇప్పుడు అనుమతించు. నిన్ను ఇస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పితరం ప్రాహ సా విష్టిర్భర్తా పుత్రా ధనం సుఖమ్ ।
ఆయూ రూపం చ సంప్రీతిర్జాయతే ప్రాక్తనానుగమ్ ॥ 23 ॥

అప్పుడా విష్టి తండ్రితో భర్త, పుత్రులు, ధనం, సుఖం, ఆయువు, రూపం, సంతోషం అనేవి పూర్వజన్మ ననుసరించి కలుగుతాయి.

యత్పురా విహితం కర్మ ప్రాణినా సాధ్వసాధు వా ।
ఫలం తదనురోధేన ప్రాప్యతేఽపి భవాన్తరే ॥ 24 ॥

జీవులు పూర్వజన్మలో చేసిన మంచిచెడుల ననుసరించి దాని ఫలం పూర్వం విహితమైనట్లుగానే ఈ లోకంలో లభిస్తుంది.

స్వదోష ఏవ తత్పిత్రా పరిహర్తవ్య ఆదరాత్ ।
తాదృగేవ ఫలం తు స్యాద్యాదృగాచరితం పురా ॥ 25 ॥

తండ్రి తన దోషాన్నే ఆదరంతో పరిహరించాలి. పూర్వమెలా ఆచరించామో అటువంటి ఫలమే లభిస్తుంది.

తస్మాత్తద్దానసంబంధం స్వవంశానుగతం పితా ।
కరోతి శేషం దైవేన యద్భావ్యం తద్భవిష్యతి ॥ 26 ॥

అందువలన తండ్రి కన్యాదానసంబంధం తన వంశాచార ప్రకారం చేస్తాడు. మిగతాది దైవమెలా తలస్తే అలా జరుగుతుంది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తచ్ఛ్రుత్వా దుహితుర్వాక్యం త్వష్టుః పుత్రాయ భీషణామ్ ।
విశ్వరూపాయ తాం ప్రాదాద్విష్టిం లోకభయంకరీమ్॥ 27 ॥

తన కూతురు మాట విన్న సూర్యుడు లోకభయంకరురాలు, భీషణురాలు అయిన విష్టిని త్వష్ట కొడుకైన విశ్వరూపున కిచ్చాడు.

విశ్వరూపోఽపి తద్వచ్చ భీషణో భీషణాకృతిః ।
ఏవం మిథః సంచరతోః శీలరూపసమానయోః ॥ 28 ॥

ప్రీతిః కదాచిద్వైషమ్యం దంపత్యోరభవన్మిథః ।
గండో నామాభవత్పుత్రో హ్యతిగండస్తథైవ చ ॥ 29 ॥

విశ్వరూపుడు కూడా ఆమెవలెనే భయంకరుడు భీకరమైన ఆకారం గలవాడు. శీలరూపాలిద్దరిలో సమానంగా ఉండే వారిద్దరిలా సంచరిస్తుండగా, ఆ దంపతులిద్దరికి ఒకనాడు ప్రీతిపోయి పరస్పరం ఇద్దరిలో వైషమ్య మేర్పడింది. వారికి గండుడు, అతిగండుడు అనే పుత్రులిద్దరు కలిగారు.

రక్తాక్షః క్రోధనశ్చైవ వ్యయో దుర్ముఖ ఏవ చ ।
తేభ్యః కనీయానభవద్ధర్షణో నామ పుణ్యభాక్ ॥ 30 ॥

రక్తాక్షుడు, క్రోధనుడు, వ్యయుడు, దుర్ముఖుడు, హర్షణుడు అనే పుత్రులు కలిగారు. వారందరిలో చిన్నవాడు హర్షణుడనేవాడు మంచివాడు. పుణ్యవంతుడు.

సుతః సుశీలః సుభగః శాన్తః శుద్ధమతిః శుచిః ।
స కదాచిద్యమగృహం ద్రష్టుం మాతులమభ్యగాత్ ॥ 31 ॥

ఆ కుమారుడు మంచిశీలం గలవాడు, సుందరుడు, శాంతుడు, మంచి బుద్ధిగలవాడు, శుచియైనవాడు. అతడు ఒకనాడు తన మేనమామను చూడటానికి యమలోకానికి వెళ్లాడు.

స దదర్శ బహూన్ జన్తూన్ స్వర్గస్థానివ దుఃఖినః ।
స మాతులం తు పప్రచ్ఛ నత్వా ధర్మం సనాతనమ్ ॥ 32 ॥

అతడక్కడ మృతి చెందిన జీవులు అనేకులు దుఃఖిస్తుండగా చూచాడు. సనాతన ధర్మస్వరూపుడైన తన మేనమామను అడిగాడు.

హర్షణ ఉవాచ :– హర్షణుడు పలికాడు.

క ఇమే సుఖినస్తాత పచ్యన్తే నరకే చ కే ॥ 33 ॥

తండ్రీ! ఈ సుఖపడే వారెవరు? ఈ నరకంలో దుఃఖించే వారెవరు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం పృష్టో ధర్మరాజః సర్వం ప్రాహ యథార్థవత్ ।
తత్కర్మణాం గతిం సర్వామశేషేణ న్యవేదయత్ ॥ 34 ॥

యమధర్మరాజుని ఇలా అడుగగా నతడు కర్మల గతిని ఉన్నదున్నట్లుగా అంతా వివరంగా చెప్పాడు.

యమఉవాచ :– యముడు పలికాడు.

విహితస్య న కుర్వన్తి యే కదాచిదతిక్రమమ్ ।
న తే పశ్యన్తి నిరయం కదాచిదపి మానవాః ॥ 35 ॥

వేదవిహితమైన కర్మలను అతిక్రమించకుండా ఆచరించే మానవులు ఎప్పుడూ యమలోకాన్ని చూడరు.

న మానయన్తి యే శాస్త్రం నాఽఽచారం న బహుశ్రుతాన్ ।
విహితాతిక్రమం కుర్యుర్యే తే నరకవాసినః ॥ 36 ॥

ఎవరు శాస్త్రాలను అంగీకరించరో, ఆచారాన్ని పాటించరో, పెద్దలు చెప్పిన పురాణేతిహాసాల మాటలను వినరో, వారు తమకు విహితమైన వాటినతిక్రమిస్తారో, అటువంటివారు నరకానికి పోతారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స తు శ్రుత్వా ధర్మవాక్యం హర్షణః పునరబ్రవీత్ ॥ 37 ॥

ధర్మరాజు మాటను విని హర్షణుడు తిరిగి ఇలా పలికాడు.

హర్షణ ఉవాచ :- హర్షణుడు పలికాడు.

పితా త్వాష్ట్రో భీషణశ్చ మాతా విష్టిశ్చ భీషణా ।
భ్రాతరశ్చ మహాత్మానో యేన తే శాన్తబుద్ధయః ॥ 38 ॥

సురూపాశ్చ భవిష్యన్తి నిర్దోషా మంగళప్రదాః ।
తన్మే కర్మ వదస్వాద్య తత్కర్తాఽస్మి సురోత్తమ ॥ 39 ॥

మా తండ్రి త్వాష్టుడు భయంకరుడు. తల్లి విష్టి కూడా భీషణురాలు. మహాత్ములైన నా సోదరులు శాంతబుద్ధులు. ఓ సురోత్తమా! వారు సురూపులు, దోషరహితులు, మంగళప్రదులు కావడానికి నేనే కర్మ చేయాలో చెప్పు. నేనాపని నిప్పుడు చేయటానికి సిద్ధంగా ఉన్నాను.

అన్యథా తాన్నగచ్ఛేయమిత్యుక్తః ప్రాహ ధర్మరాట్ ।
హర్షణం శుద్ధబుద్ధిం తం హర్షణోఽసి న సంశయః ॥ 40 ॥

లేదంటే తిరిగి నేను వారివద్దకు వెళ్ళను-అని చెప్పగా యమధర్మరాజు శుద్ధబుద్ధి గలిగిన హర్షణునితో నీవు నిజంగా పేరుకు తగినట్లుగా హర్షణుడవే సందేహం లేదు.

బహవః స్యు సుతాః కేచిన్నైవ తే కులతన్తవః ।
ఏక ఏవ సుతః కశ్చిద్యేన తద్ధియతే కులమ్ ॥ 41 ॥

కొడుకులు చాలామంది ఉండవచ్చును కాని వంశాభివృద్ధిని చేసేవారు కొంతమంది మాత్రమే, ఒక్క కొడుకు చాలు. ఎవనితో వాని వంశమున్నతమవుతుందో, అతడే నిజమైన కుమారుడు.

కులస్యాఽఽధారభూతో యో యః పిత్రోః ప్రియకారకః ।
యః పూర్వజానుద్ధరతి స పుత్రస్త్వితరో గదః ॥ 42 ॥

ఎవడు కులానికాధారభూతుడో, తల్లిదండ్రులకు ప్రియాన్ని కలిగిస్తాడో, తన వంశపెద్దల నుద్ధరిస్తాడో అతడే పుత్రుడని పెద్దలు చెబుతారు. ఆ విధంగా కానివాడు వ్యాధివంటివాడు.

యస్మాత్త్వయాఽనురూపం మే ప్రోక్తం మాతామహప్రియమ్ ।
తస్మాత్త్వం గౌతమీం గచ్ఛ స్నాత్వా నియతమానసః ॥ 43 ॥

స్తుహి విష్ణుం జగద్యోనిం శాన్తం ప్రీతేన చేతసా ।
స తు ప్రీతో యది భవేత్సర్వమిష్టం ప్రదాస్యతి॥ 44 ॥

మాతామహులకు ప్రియం కలుగునట్లుగా, నీకు దగినట్లుగా నాకు చెప్పావు. అందువలన నీవు గౌతమీ నదికి వెళ్ళు. అక్కడ స్నానం చేసి నియమంతో, మనఃప్రీతితో జగత్కారణుడు, శాంతుడైన విష్ణువును స్తుతించు. అతడు సంతోషించినట్లైతే నీకిష్టమైనదంతా ఇస్తాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా ధర్మవాక్యం హర్షణో గౌతమీం యయౌ ।
శుచిస్తుష్టావ దేవేశం హరిం ప్రీతోఽభవద్ధరిః ॥ 45 ॥

ఇలా యమధర్మరాజు చెప్పగా విని హర్షణుడు గౌతమీనది వద్దకు వెళ్ళాడు. అక్కడ శుచియై దేవేశుడైన హరిని స్తుతించాడు. హరి సంతోషించాడు.

హర్షణాయ తతః ప్రాదాత్కులభద్రం తతస్తు సః ।
సర్వాభద్రప్రశమనపూర్వకం భద్రమస్తు తే ॥ 46 ॥

అప్పుడా హరి నీకు అన్ని అమంగళములు శమించి శుభం కలుగుగాక- అని హర్షణునికి కులభద్రమునిచ్చాడు.

తద్భద్రా ప్రోచ్యతే విష్టిః పితా భద్రస్తథా సుతాః ।
తతః ప్రభృతి తత్తీర్థం భద్రతీర్థం తదుచ్యతే ॥ 47 ॥

అందువల్ల విష్టిని భద్రా అంటారు. తండ్రి, అలాగే పుత్రులు అందరు భద్రులే శుభములను పొందినారు. అప్పటి నుండి ఆ తీర్థాన్ని భద్ర తీర్థమంటారు.

సర్వమంగళదం పుంసాం తత్ర భద్రపతిః హరిః ।
తత్తీర్థసేవినాం పుంసాం సర్వసిద్ధిప్రదాయకమ్ ॥
మంగలైకనిధిః సాక్షాద్దేవదేవో జనార్దనః ॥ 48 ॥

అది మానవులకు సమస్త మంగళాలనిస్తుంది. ఆ తీర్థాన్ని సేవించినవారికి సర్వసిద్ధులనిస్తుంది. అక్కడ విష్ణువు భద్రపతి, మంగళాలన్నింటికీ నిధి. సాక్షాత్తుగా దేవదేవుడైన జనార్దనుడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే భద్రతీర్థవర్ణనం నామ పంచ నవతితమోఽధ్యాయః. ॥ 95 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యమునందలి తీర్థమాహాత్మ్యంలోని భద్రతీర్థ వర్ణనమనే పేరుగల తొంబైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షణ్ణవతితమోఽధ్యాయః - తొంబై ఆరవ అధ్యాయం

పతత్రితీర్థవర్ణనమ్ - పతత్రితీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పతత్రితీర్థమాఖ్యాతం రోగఘ్నం పాపనాశనమ్ ।
తస్య శ్రవణమాత్రేణ కృతకృత్యో భవేన్నరః ॥ 1 ॥

పతత్రి తీర్థమనేది చాలా శ్రేష్ఠమైనది. అది రోగాలను, పాపాలను హరిస్తుంది. దాని పేరు విన్నంత మాత్రాననే నరుడు కృతకృత్యుడౌతాడు.

బభూవతుః కశ్యపస్య సుతావరుణవీశ్వరౌ ।
సంపాతిశ్చ జటాయుశ్చ సమ్భవేతాం తదన్వయే ॥ 2 ॥

కశ్యపమహర్షికి అరుణులు, ఈశ్వరులను ఇద్దరు సుతులు ఉన్నారు. ఆ వంశంలో సంపాతి జటాయువులు పుట్టారు.

తార్క్ష్యప్రజాపతేః పుత్రా వరుణో గరుడస్తథా ।
తదన్వయే చ సంభూతః సంపాతిః పతగోత్తమః ॥ 3 ॥

తార్క్ష్యప్రజాపతికి అరుణుడు, గరుడుడు అనే ఇద్దరు పుత్రులు. ఆ వంశంలో పుట్టినవాడు పక్షిశ్రేష్ఠుడైన సంపాతి అనేవాడు.

జటాయురితి విఖ్యాతో హ్యపరః సోదరోఽనుజః ।
అన్యోన్యస్పర్ధయా యుక్తావున్మత్తౌ స్వబలేన తౌ ॥ 4 ॥

జటాయువని ప్రఖ్యాతి చెందినవాడతని సోదరుడు మరొకడు. తమ బలంతో మదించిన వీరు ఒకరితో ఒకరు పోటీపడ్డారు.

సంజగ్మతుర్దినకరం నమస్కర్తుం విహాయసి ।
యావత్సూర్యస్య సామీప్యం ప్రాప్తౌ తౌ విహగోత్తమౌ ॥ 5 ॥

పక్షిశ్రేష్ఠులైన వారిద్దరూ సూర్యునికి నమస్కరించడానికి ఆకాశానికి ఎగిరారు. వారిద్దరు ఎప్పుడైతే సూర్యునికి దగ్గరగా వెళ్ళినారో,

దగ్ధపక్షావుభౌ శ్రాన్తౌ పతితౌ గిరిమూర్ధని ।
బాన్ధవౌ పతితౌ దృష్ట్వా నిశ్చేష్టౌ గతచేతనౌ ॥ 6 ॥
తావద్దుఃఖాభిభూతోఽసావరుణః ప్రాహ భాస్కరమ్ ।
అస్మద్వంశసముత్పన్నౌ దగ్ధపక్షౌ భువం గతౌ ॥
ఆశ్వాసయ త్వం తిగ్మాంశో యావన్నేతౌ మరిష్యతః ॥ 7 ॥

అప్పుడు వారిద్దరి రెక్కలు కాలి, అలిసిపోయి, పర్వతశిఖరంపై పడ్డారు. కదలిక లేక క్రిందపడిపోయివున్న బంధువులిద్దరిని చూచి, అంత దుఃఖాన్ని పొందిన ఈ అరుణుడు సూర్యునితో ఇలా అన్నాడు. మా వంశంలో పుట్టినవారు రెక్కలు కాలి నేలమీద పడినారు. సూర్యా! వారు మరణించక ముందే వారిని ఓదార్చు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా దినకరో జీవయామాస తౌ ఖగౌ ।
గరుడోఽపి తయోః శ్రుత్వా అవస్థాం సహ విష్ణునా ॥ 8 ॥

ఆగత్యాఽఽశ్వాసయామాస సుఖం చక్రే చ నారద ।
సర్వ ఏవ తదా జగ్ముర్గంగాం తాపాపనుత్తయే ॥ 9 ॥

సూర్యుడలాగే అని ఆ పక్షులను బ్రతికించాడు. గరుడుడు కూడా వారి అవస్థను విని విష్ణువుతో వచ్చి వారిని ఓదార్చాడు. వారికి సుఖాన్ని కలిగించాడు. ఓ నారదా! వారంతా అప్పుడు తాపాన్ని తొలగించుకోవడానికి గంగానది వద్దకు వెళ్ళారు.

జటాయుశ్చారుణశ్చైవ సంపాతిర్గరుడస్తథా ।
సూర్యో విష్ణుస్తత్ప్రియాయ తత్తీర్థం బహుపుణ్యదమ్ ॥ 10 ॥

జటాయువు, అరుణుడు, సంపాతి, గరుడుడు, సూర్యుడు, విష్ణువు వారికి ప్రియాన్ని కలిగించటానికి వెళ్ళారు. ఆ తీర్థం మిక్కిలి శ్రేష్ఠం.

పతత్రితీర్థమాఖ్యాతం విషఘ్నం సర్వకామదమ్ ।
స్వయం సూర్యస్తథా విష్ణుః సుపర్ణేనారుణేన చ ॥ 11 ॥

ఆసతే గౌతమీతీరే తత్రైవ వృషభధ్వజః ।
త్రయాణామపి దేవానాం స్థితేస్తత్తీర్థముత్తమమ్ ॥ 12 ॥

దానిని పతత్రి తీర్థమన్నారు. అది విషాన్ని తొలగిస్తుంది. సమస్త కోరికలను తీరుస్తుంది. సూర్యుడు, విష్ణువు గరుడుడు, అరుణులతో స్వయంగా అక్కడ గౌతమీతీరంలో ఉంటారు. అలాగే అక్కడ శివుడు కూడా ఉంటాడు. ముగ్గురు దేవతలున్నందువలన ఆ తీర్థం ఉత్తమమైంది.

తత్ర స్నాత్వా శుచిర్భూత్వా నమస్కుర్యాత్సురానిమాన్ ।
ఆధివ్యాధి వినిర్ముక్తః స పరం సౌఖ్యమాప్నుయాత్ ॥ 13 ॥

ఆ పతత్రి తీర్థంలో స్నానం చేసి ఈ ముగ్గురు దేవతలకు నమస్కరించాలి. అలా చేసినవాడు ఆధివ్యాధుల నుండి విముక్తుడై పరమసుఖాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే పతత్రితీర్థవర్ణనం నామ షణ్ణవతితమోఽధ్యాయః. ॥ 96 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీమాహాత్మ్యంలోని తీర్థమాహాత్మ్యంలో పతత్రి తీర్థ వర్ణనమనే పేరు గల తొంబైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్త నవతితమోఽధ్యాయః - తొంబై ఏడవ అధ్యాయం

విప్రనారాయణతీర్థ వర్ణనమ్ - విప్రతీర్థ, నారాయణతీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విప్రతీర్థమితిఖ్యాతం తథా నారాయణం విదుః ।
తస్యాఽఽఖ్యానం ప్రవక్ష్యామి శృణు విస్మయకారణమ్ ॥ 1 ॥

విప్రతీర్థమనే దాన్ని గూర్చి చెబుతున్నాను. దీనినే నారాయణతీర్థమని కూడా అంటారు. దాన్ని గూర్చిన కథ చాలా ఆశ్చర్యకరమైనది విను.

అన్తర్వేద్యాం ద్విజః కశ్చిద్బ్రాహ్మణో వేదపారగః ।
తస్యపుత్రా మహాప్రాజ్ఞా గుణరూపదయాన్వితాః ॥ 2 ॥

అంతర్వేదిలో వేదాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఒక బ్రాహ్మణుడు కలడు. అతని కుమారులు గొప్పతెలివి తేటలు గలవారు, గుణాలతో, రూపంతో కూడిన దయాపరులు.

తేషాం కనీయాన్యో భ్రాతా శాన్తో గుణగణైర్వృతః ।
ఆసన్ దివ ఇతిఖ్యాతః సర్వజ్ఞానో మహామతిః ॥ 3 ॥

వారిలో చిన్నవాడు శాంతుడు, మంచి గుణగణాలతో కూడివున్నవాడు, అన్నీ తెలిసినవాడు, మహాబుద్ధిశాలిగా ఉండినాడు. అతని పేరు ఆసందివుడు.

ఆసన్దివవివాహార్థం పితా యత్నమథాకరోత్ ।
ఏతస్మిన్నన్తరే రాత్రౌ సుప్తం తం ద్విజపుత్రకమ్ ॥ 4 ॥

అవిష్ణుస్మరణం సౌమ్యశిరస్కమసమాహితమ్ ।
ఆసన్దివం క్రూరరూపా రాక్షసీ కామరూపిణీ ॥ 5 ॥

తమాదాయాగమచ్ఛీఘ్రం గౌతమ్యా దక్షిణే తటే ।
శ్రీగిరేరుత్తరే పారే బహుబ్రాహ్మణసేవితమ్ ॥ 6 ॥

నగరం ధర్మనిలయం లక్ష్మ్యా నిలయమేవ చ ।
తత్ర రాజా బృహత్కీర్తిః సర్వక్షత్రగుణాన్వితః ॥ 7 ॥

అతని తండ్రి ఆసన్దివునకు వివాహం చేయుటకై ప్రయత్నం చేశాడు. ఇంతలో రాత్రి నిద్రించిన విప్రకుమారుని, విష్ణుస్మరణచేయకుండా, సౌమ్యశిరస్కుడు, అసమాహితుడైన ఆసన్దివుని కామరూపిణి, క్రూరరూపంగల ఒకరాక్షసి, అతనిని తీసుకొని వేగంగా గౌతమీనది దక్షిణ తీరంలోఉన్న శ్రీగిరి అనే పర్వతం ఉత్తర భాగాన గల అనేక బ్రాహ్మణులచేత సేవించబడే, లక్ష్మీనిలయమైన ధర్మనిలయమనే నగరానికి తీసుకొని వెళ్ళింది. అక్కడ రాజు సమస్త క్షత్రియగుణాలతో ఉండే బృహత్కీర్తి అనేవాడు.

తస్యామితక్షేమసుభిక్షయుక్తం నిశావసానే ద్విజపుత్రయుక్తా ।
సా రాక్షసీ తత్పురమాససాద మనోజ్ఞరూపాణి బిభర్తి నిత్యమ్ ॥ 8 ॥

ఆ రాజ్యంలో మిక్కిలి క్షేమం గలిగి సుభిక్షంగా ఉంటుంది. తెల్లవారుఝామున ఆ రాక్షసి బ్రాహ్మణకుమారునితో కలిసి ఆ పురాన్ని చేరింది. ఆ రాక్షసి నిత్యం సుందరమైన రూపాలను ధరించింది.

సా కామరూపేణ చరత్యశేషాం మహీమిమాం తేన సమం ద్విజేన ।
గోదావరీదక్షిణతీరభాగే వృద్ధాకృతిస్తం ద్విజమాహ భీమా ॥ 9 ॥

ఆమె కామరూపాన్ని ధరించి ఈ భూమండలమంతా ఆ బ్రాహ్మణకుమారుని దీసుకొని సంచరిస్తుంది. గోదావరి దక్షిణ తీరాన వృద్ధురాలి వేషం ధరించి భయంకరురాలైన ఆ రాక్షసి బ్రాహ్మణుడితో ఇలా అనింది.

రాక్షస్యువాచ :– రాక్షసి పలికింది.

ఏషా తు గంగా ద్విజముఖ్యసంధ్యా ఉపాస్యతాం విప్రవరైః సమేత్య ।
యథోచితం విప్రవరాస్తు కాలే నోపాసతే యత్నత ఏవ సన్ధ్యామ్ ॥ 10 ॥

జీవన్తఏవాభిహితామునీశ్వరైరన్యావసాయిప్రవరాస్త ఏతే ।
అహం జనిత్రీ తవ చేతి వాచ్యం నోచేదిదానీం త్వముపైషి నాశమ్ ॥ 11 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! ఇది గంగానది. నీవీ బ్రాహ్మణశ్రేష్ఠులతో కూడి సంధ్యావందనం చేయి. బ్రాహ్మణ శ్రేష్ఠులు త్రికాలాలలో శ్రద్ధతో యథావిధిగా సంధ్యావందనం చేయకుంటే, జీవించి కూడా వీరు మరణానికి ఆసన్నులవుతారని మునీశ్వరులు చెబుతారు. నేను నీకు తల్లినని చెబుతున్నాను. లేకుంటే నీవిప్పుడే నాశాన్ని పొందుతావు.

మద్వాక్యకర్తాఽసి యది ద్విజేన్ద్ర సుఖం కరిష్యే తవ యత్ప్రియం చ ।
పునశ్చ దేశం నిలయం గురూంశ్చ సంప్రాపయిష్యే నను సత్యమేతత్ ॥ 12 ॥

ఓ విప్రోత్తమా! నేను చెప్పినట్లుగా విన్నట్లైతే నేను నీకిష్టమైన ప్రియాన్ని, సుఖాన్ని అందించగలను. తిరిగి నిన్ను నీ దేశానికి, నీ యింటికి, నీ గురువుల వద్దకు చేర్చగలను. ఇది ప్రమాణపూర్తిగా చెబుతున్నాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

స ప్రాహ కా త్వం ద్విజపుంగవోఽపి సోవాచ తం రాక్షసీ కామరూపా ।
విశ్వాసయన్తీ శపథైరనేకైః తం భ్రాన్తచిత్తం మునిరాజపుత్రమ్ ॥ 13 ॥

అప్పుడా బ్రాహ్మణశ్రేష్ఠుడు నీవెవరని అడిగాడు. అప్పుడా కామరూపిణి అయిన రాక్షసి అనేక ఒట్లను పెట్టుకుని అతనికి విశ్వాసాన్ని కలిగిస్తూ, భ్రాంతితో కూడిన చిత్తంగల బ్రాహ్మణ కుమారునితో ఇలా అంది.

కంకాలినీ నామ జగత్ప్రసిద్ధా విప్రోఽపి తామాహ నివేదితం యత్ ।
తదేవ కర్తాఽస్మి న సంశయోఽత్ర యత్త్ప్రియం వచ్మి కరోమి చైవ ॥ 14 ॥

నేను జగత్ప్రసిద్ధురాలనైన కంకాలినీ అనే పేరుగలదానను. అప్పుడు బ్రాహ్మణుడు కూడా ఆమెతో నీవు చెప్పింది చేస్తాను. ఏది ప్రియమో అది చెబుతాను. చేస్తాను కూడా దీనిలో ఏమాత్రం సంశయం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తద్విప్రవచనం శ్రుత్వా రాక్షసీ కామరూపిణీ ।
వృద్ధా తథాఽపి చార్వంగీ దివ్యాలంకారభూషణా ॥ 15 ॥

ఆ విప్రుని మాటను విని కామరూపిణియైన రాక్షసి వృద్ధురాలుగా ఉన్నప్పటికి చక్కని రూపంతో దివ్యాలంకారాలు ధరించి దివ్యసుందరిగా మారింది.

ద్విజమాదాయ సర్వత్ర మత్సుతోఽయం గుణాకరః ।
ఏవం వదన్తీ సర్వత్ర యాతి వక్తి కరోతి చ ॥ 16 ॥

ఆ బ్రాహ్మణుని దీసుకొని అంతటా తిరుగుతూ ఇతడు నా కుమారుడు, మంచి గుణవంతుడు అని చెబుతూ అంతటా వెళుతూ, చెబుతూ తిరుగుతుండింది.

తం విప్రం రూపసౌభాగ్యవయోవిద్యావిభూషితమ్ ।
తాం చ వృద్ధాం గుణోపేతామస్య మాతేతి మేనిరే ॥ 17 ॥

రూపం, సౌభాగ్యం, వయస్సు, విద్యలతో విభూషితుడైన ఆ బ్రాహ్మణునికి చక్కని గుణాలతో గూడి వృద్ధురాలిగావున్న ఆమెను అతని తల్లిగానే తలచారు.

తత్ర ద్విజవరః కశ్చిత్ స్వాం కన్యాం భూషణాన్వితామ్ ।
రాక్షసీం తాం పురస్కృత్య ప్రాదాత్తస్మై ద్విజన్మనే ॥ 18 ॥

అక్కడొక బ్రాహ్మణశ్రేష్ఠుడు తన కూతురును చక్కగా నగలతో అలంకరించి ఆ రాక్షసిని ముందుంచుకొని ఆ ద్విజవరుడికి ఇచ్చాడు.

సా కన్యా తం ద్విజం ప్రాప్య కృతార్థాఽస్మీత్యచిన్తయత్ ।
స ద్విజోఽపి గుణైర్యుక్తాం పత్నీం దృష్ట్వా సుదుఃఖితః ॥ 19 ॥

ద్విజ ఉవాచ :– ద్విజుడు పలికాడు.

మామియం భక్షయేదేవ రాక్షసీ పాపరూపిణీ ।
కిం కరోమి క్వ గచ్ఛామి కస్మై తత్కథయామి వా ॥ 20 ॥

ఆ కన్య అతడిని వివాహం చేసుకొని కృతార్థురాలనైనానని భావించింది. ఆ బ్రాహ్మణుడుకూడా చక్కని గుణాలతో గూడిన భార్యను చూచి మిక్కిలి దుఃఖిస్తూ, ఈ పాపరూపిణియైన రాక్షసి నన్ను తినగలదు. ఇప్పుడేం చేయాలి? ఎక్కడికి వెళ్లాలి? ఈ విషయాన్నెవరితో చెప్పుకోవాలి?

మహత్సంకటమాపన్నం రక్షయిష్యతి కోఽత్ర మామ్ ।
భార్యా మమేయం కల్యాణీ గుణరూపవయోయుతా ॥
ఏనామప్యశుభాఽకస్మాద్భక్షయిష్యతి రాక్షసీ ॥ 21 ॥

చాలా కష్టంవచ్చింది. ఎవరు నన్ను రక్షిస్తారు? నా యీ భార్య శుభకరురాలు, గుణ రూప వయో వంతురాలు ఈమెను గూడ ఆ దుర్మార్గురాలగు రాక్షసి అకస్మాత్తుగా తినగలదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతస్మిన్నన్తరే తత్ర భార్యా సా గుణశాలినీ ।
వృద్ధాஉప్యతిదురాధర్షా సాஉஉగతా కుత్రచిత్తదా ॥ 22 ॥

ఇలా చింతిస్తుండగా ఇంతలో గుణవంతురాలగు అతనిభార్య, మిక్కిలి భయంకరురాలైన ఆ వృద్ధురాలు కూడా ఎక్కడినుండో వచ్చారు.

ప్రశ్రయావనతా భూత్వా బాలా చాపి పతివ్రతా ।
భర్తారం దుఃఖితం జ్ఞాత్వా పతిం ప్రాహ రహః శనైః ॥ 23 ॥

పతివ్రతయైన ఆ బాల కూడా వినయంతో నమ్రతగా దుఃఖిస్తున్న భర్తను చూసి రహస్యంగా మెల్లగా భర్తతో ఇలా అంది.

భార్యోవాచ:– భార్య పలికింది.

కస్మాత్తే దుఃఖమాపన్నం స్వామింస్తత్త్వం వదస్వ మే ॥ 24 ॥

స్వామీ! నీకు దుఃఖమెందుకు కలిగింది? దానిని గూర్చి నీవు నాకు చెప్పు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

శనైః ప్రోవాచ తాం భార్యాం యథావత్పూర్వవిస్తరమ్ ।
కిమకథ్యం ప్రియే మిత్రే కులీనాయాం చ యోషితే ॥ 25 ॥

అప్పుడతడు తనభార్యతో మెల్లగా జరిగినదంతా విశదంగా చెప్పాడు. కులీనురాలు, స్నేహంగా వుండే ప్రియురాలైన భార్యకు చెప్పకుండా దాచవలసిన దేముంటుంది?

భర్తృవాక్యం నిశమ్యేదం ప్రోవాచ వదతాం వరా ॥ 26 ॥

భర్త చెప్పిన మాటను విని మాటనేర్పుగల ఆమె ఇలా అంది.

భార్యోవాచ:– భార్య పలికింది.

అనాత్మనః సర్వతోஉపి భయమస్తి గృహేష్వపి ।
కుతో భయం హ్యాత్మవతాం కిం పునర్గౌతమీతటే ॥ 27 ॥

అనాత్ములైనవారికి అంతటా భయముంటుంది. చివరకు ఇళ్లలో కూడా భయమే. ఆత్మవంతుల కెందుకు భయం? అదీగాక గౌతమీ తీరాన భయమేల?

వసతాం విష్ణుభక్తానాం విరక్తానాం వివేకినామ్ ।
అత్ర స్నాత్వా శుచిర్భూత్వా స్తుహి దేవమనామయమ్ ॥ 28 ॥

గౌతమీ నది ఒడ్డున నివసించే వివేకులు, విరక్తులు ఐన విష్ణుభక్తులకు భయమనే దేముండదు. ఇక్కడ స్నానం చేసి శుచియై అనామయుడైన ఆ దేవుని స్తుతించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతదాకర్ణ్య గంగాయాం స్నాత్వా విగతకల్మషః ।
తుష్టావ గౌతమీతీరే ద్విజో నారాయణం తథా ॥ 29 ॥

భార్య చెప్పిన మాటను విని గంగలో స్నానం చేసి కల్మషరహితుడై ఆ బ్రాహ్మణుడు గౌతమీ తీరంలో నారాయణుని స్తుతించాడు.

ద్విజ ఉవాచ :- బ్రాహ్మణుడు పలికాడు.

త్వమన్తరాత్మా జగతోఽస్య నాథ త్వమేవ కర్తాస్య ముకున్దహర్తా ।
త్వం పాలకః పాలయసే న దీనమనాథబన్ధో నరసింహ కస్మాత్ ॥ 30 ॥

ప్రభూ! నీవు. ఈ జగత్తు కంతటికి అంతరాత్మవు నీవే కర్తవు. ముకుందుని చంపిన వానివి నీవే. నీవు పాలకుడవు. ఓ అనాథబంధువా! నారసింహా! ఈ దీనుని ఎందుకు పాలించుట లేదు?

శ్రుత్వైతత్ప్రార్థనం తస్య జగచ్ఛోకనివారణః ।
నారాయణోఽపి తాం పాపాం నిజఘాన స రాక్షసీమ్ ॥ 31 ॥

జగత్తుయొక్క శోకాన్ని పోగొట్టే నారాయణుడు కూడా అతని ప్రార్థనను విని ఆ పాపాత్మురాలైన రాక్షసిని చంపాడు.

సుదర్శనేన చక్రేణ సహస్రారేణ భాస్వతా ।
తస్మై ప్రాదాద్వరానిష్టాన్ ప్రాపయచ్చ గురుం ప్రభుః ॥ 32 ॥

అదీ వేయి అరలతో ప్రకాశించే సుదర్శనచక్రంతో సంహరించాడు. అంతేకాక అతనికిష్టమైన అనేక వరాల నిచ్చాడు. అలాగే ఆ ప్రభువు అతనిని తండ్రి దగ్గరకు చేర్చాడు.

తతః ప్రభృతి తత్తీర్థం విప్రం నారాయణం విదుః ।
స్నానదానేన పూజాద్యైర్యత్ర సిధ్యతి వాంఛితమ్ ॥ 33 ॥

అప్పటినుండి ఆ తీర్థాన్ని విప్రతీర్థమని, నారాయణతీర్థమని అంటారు. అక్కడ స్నానం, దానం, పూజాదికాలను చేస్తే కోరికలు సిద్ధిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే విప్రనారాయణతీర్థవర్ణనం నామ సప్తనవతి తమోఽధ్యాయః. ॥ 97 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని విప్రతీర్థం, నారాయణ తీర్థ వర్ణనమనే పేరుగల తొంబైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టనవతి తమోఽధ్యాయః - తొంబై ఎనిమిదవ అధ్యాయం

భాన్వాదిశతతీర్థవర్ణనమ్ - భానుతీర్థం మొదలైన నూరు తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భానుతీర్థమితి ఖ్యాతం త్వాష్టం మాహేశ్వరం తథా ॥
ఐన్ద్రం యామ్యం తథాఽఽగ్నేయం సర్వపాపప్రణాశనమ్ ॥ 1 ॥

భానుతీర్థమనేది, త్వాష్టం, మాహేశ్వరం ఐంద్రం, యామ్యం, అలాగే ఆగ్నేయమనే పేర్లతో ప్రసిద్ధి చెందింది. అది సమస్త పాపాలను పోగొడుతుంది.

అభిష్టుత ఇతి ఖ్యాతో రాజాఽఽసీత్ప్రియదర్శనః ।
హయమేధేన పుణ్యేన యష్టుమారబ్ధవాన్ సురాన్ ॥ 2 ॥

అభిష్టుతుడని ప్రసిద్ధిచెందిన సుందరుడైన రాజుండేవాడు. అతడు దేవతలను తృప్తిపరచుటకై పవిత్ర అశ్వమేధ యజ్ఞాన్ని ప్రారంభించాడు.

తత్రర్త్విజః షోడశాసన్ వసిష్ఠా త్రిపురోగమాః ।
క్షత్రియే యజమానే తు యజ్ఞభూమిః కథం భవేత్ ॥ 3 ॥

ఆ యజ్ఞానికి వసిష్ఠుడు అత్రి మున్నగు పురోహితులు పదహారుగురు ఋత్విక్కులుగా వుండినారు. క్షత్రియుడే యజమానిగా ఉన్నప్పుడు యజ్ఞభూమి ఎలా ఉంటుంది?

బ్రాహ్మణే దీక్షితే రాజా భువం దాస్యతి యాజ్ఞికమ్ ।
భూపతౌ దీక్షితే దాతా కో భవేత్ కో ను యాచతే ॥ 4 ॥

బ్రాహ్మణుడు యజ్ఞదీక్షను తీసుకుంటే రాజు యాజ్ఞికునకు భూదానం చేస్తాడు. రాజే దీక్షను తీసుకుంటే దాత ఎవరు? ఎవరిని ఎవరు యాచిస్తారు?

యాచ్నేయమఖిలాశర్మజననీ పాపరూపిణీ ।
కేనాప్యతో న కార్యైవ క్షత్రియేణ విశేషతః ॥ 5 ॥

యాచన పాపరూపమైనది, అవమానము లన్నింటికి తల్లి లాంటిది. అందువలన ఎవరూ యాచించ గూడదు. ముఖ్యంగా క్షత్రియుడు యాచించకూడదు.

ఏవం మీమాంసమానేషు బ్రాహ్మణేషు పరస్పరమ్ ।
తత్ర ప్రాహ మహాప్రాజ్ఞో వసిష్ఠో ధర్మవిత్తమః ॥ 6 ॥

ఇలా బ్రాహ్మణులందరు పరస్పరం చర్చించుకొంటుండగా మహాప్రాజ్ఞుడు, ధర్మవేత్తలలో శ్రేష్ఠుడైన వసిష్ఠుడు అప్పుడు వారితో ఇలా అన్నాడు.

వసిష్ఠ ఉవాచ :– వసిష్ఠుడు పలికాడు.

రాజ్ఞి దీక్షాయమాణే తు సూర్యో యాచ్యో భువం ప్రతి ।
దేహి మే దేవ సవితర్యజనం దేవతోచితమ్ ॥ 7 ॥

రాజు యజ్ఞదీక్షను తీసుకుంటే భూమినిగూర్చి సూర్యుని యాచించాలి. ఓ సవితా! దేవతల కుచితమైన యజ్ఞభూమిని నాకివ్వు దేవా! అని యాచించాలి.

దైవం క్షత్ర మసి బ్రహ్మన్ భూతనాథ నమోఽ స్తు తే ।
యాచితః సవితా రాజ్ఞా దేవానాం యజనం శుభమ్ ॥ 8 ॥
దదాత్యేవ తతో రాజన్ ప్రార్థయేశం దివాకరమ్ ॥ 9 ॥

బ్రహ్మన్! నీవు దైవం, క్షత్రియుడవునై వున్నావు. ఓ భూతనాథా ! నీకు నమస్కారం. రాజు యాచించగా సూర్యుడు దేవతలకు యోగ్యమైన, శుభమైన యాగభూమిని ఇస్తాడు. ఓ రాజా! అందువలన ప్రభువైన సూర్యుని ప్రార్థించు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వాఽ భిష్టుతోఽ థ దేవదేవం దివాకరమ్ ।
శ్రద్ధయా ప్రార్థయామాస హరీశాజాత్మకం రవిమ్ ॥ 10

అలాగేనని అప్పుడా దేవదేవుడగు సూర్యుని స్తుతిస్తూ విష్ణు రుద్ర బ్రహ్మ రూపుడైన రవిని శ్రద్ధతో ప్రార్థించాడు.

రాజోవాచ :– రాజు పలికాడు.

దేవానాం యజనం దేహి సవితస్తే నమోఽ స్తు తే ॥ 11 ॥

ఓ సూర్యా! దేవతలకు యజ్ఞభూమిని ఇవ్వు. నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

క్షత్రం దైవం యతః సూర్యో దత్తా భూర్భూపతేస్తతః ।
సవితా దేవదేవేశో దదామీత్యభ్యభాషత ॥ 12 ॥

అటు తరువాత క్షత్రసంబంధం దైవసంబంధం, కలిగిన సూర్యుడు ఆ రాజుకు భూమి నిచ్చాడు. దేవ దేవేశుడైన సూర్యుడు ఇస్తానని పలికాడు.

ఏవం కరోతి యో యజ్ఞం తస్య రిష్టిర్న కాచన ।
తథా వాజిమఖే సత్రే బ్రాహ్మణైర్వేదపారగైః ॥ 13 ॥

ప్రారబ్ధేఽ భిష్టుతా రాజ్ఞా యత్రాగాద్భూపతిం రవిః ।
దేవానాం యజనం దాతుం భానుతీర్థం తదుచ్యతే ॥ 14 ॥

ఇలా యజ్ఞం చేసినవానికి ఏ ఆపద కలుగదు. అలా అశ్వమేధయాగంలో వేదపారగులైన బ్రాహ్మణులు ప్రారంభించగా, రాజు స్తోత్రం చేయగా, సూర్యుడు దేవతలకొరకై యాగభూమిని దానం చేయటానికి రాజువద్దకు వచ్చిన స్థలాన్ని భానుతీర్థ మంటారు.

తం దేవక్రతుముత్కృష్టం హయమేధం సురైర్యుతమ్ ।
దైత్యాశ్చ దనుజాశ్చైవ తథాऽన్యే యజ్ఞఘాతకాః ॥ 15 ॥

బ్రహ్మవేషధరాః సర్వే గాయన్తః సామగా ఇవ ।
తేऽపి తత్ర మహాప్రాజ్ఞాః ప్రావిశన్ననివారితాః ॥ 16 ॥

దేవతలతో కూడిన దేవక్రతువైన అశ్వమేధయాగాన్ని చేయబూనగా యజ్ఞఘాతకులైన దైత్యులు, దనుజులు ఇంకా ఇతరులు, బ్రాహ్మణవేషాన్ని ధరించి సామవేదాన్ని గానం చేసేవారివలె మహాప్రాజ్ఞులన్నట్లుగా వారందరు అక్కడికి వచ్చారు. వారినెవరూ అడ్డుకోలేదు.

చమసాని చ పాత్రాణి చషాలం సామమేవ చ ।
సోమపానం హవిస్త్యాగమృత్విజో భూపతిం తథా ॥ 17 ॥

నిన్దన్తి నిక్షిపన్త్యన్యే హసన్త్యన్యే తథాऽసురాః ।
తేషాం చేష్టాం న జానన్తి విశ్వరూపం వినా మునే ॥ 18 ॥

వారు చమస పాత్రలను, సామాన్ని, ఛషాలాన్ని, సోమపానాన్ని, యజ్ఞాన్ని, ఋత్విక్కులను, రాజును, నిందిస్తున్నారు. ఓ మునీ! కొందరు వానిలో వేరు పదార్థాలుంచుతున్నారు. కొందరు రాక్షసులు నవ్వుతున్నారు. వారి చేష్టను విశ్వరూపుడు దప్ప ఇతరులెవరూ తెలుసుకోలేరు.

విశ్వరూపోऽపి పితరం ప్రాహ దైత్యా ఇమే ఇతి ।
తత్పుత్రవచనం శ్రుత్వా త్వష్టా ప్రాహ సురానిదమ్ ॥ 19 ॥

విశ్వరూపుడప్పుడు తండ్రితో వీరు దైత్యులని చెప్పాడు. ఆ కుమారుని మాటలు విని త్వష్ట దేవతలతో ఇలా అన్నాడు.

త్వష్టోవాచ :– త్వష్ట పలికాడు.

గృహీత్వా వారిదర్భాంశ్చ ప్రోక్షయధ్వం సమన్తతః ।
యే నిన్దన్తి మఖం పుణ్యం చమసం సోమమేవ చ ॥ 20 ॥

మయా త్వపహృతాః సర్వ ఇత్యుక్త్వా పరిషించత ॥ 21 ॥

నీటిని, దర్భలను తీసుకొని అంతట చల్లండి. ఎవరు ఈ పవిత్రమైన యజ్ఞాన్ని, చమసాన్ని, సోమాన్ని నిందిస్తారో, వారంతా నాచేత అపహరించబడుతారుగాక అని అంతటా ప్రోక్షణ చేయండి.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథా చక్రుః సురగణాస్త్వష్టా చాపి తథాఽకరోత్ ।
భస్మీభూతాస్తతః సర్వే కాందిశీకాస్తతోఽభవన్ ॥ 22 ॥

దేవతలందరు అలాగే చేశారు. త్వష్ట కూడా అలాగే చేశాడు. అప్పుడా రాక్షసులు కొందరు భస్మమైనారు. కొందరు పారిపోయారు.

హతా మయా మహాపాపా ఇత్యుక్త్వా వార్యవాక్షిపత్ ।
తతః క్షీణాయుషో దైత్యాః ప్రాతిష్ఠన్ కుపితాస్తతః ॥ 23 ॥

నా చేత ఆ పాపాత్ములు చచ్చారు అని నీటిని జల్లాను. అప్పుడు కోపంతో నున్న రాక్షసులు క్షీణాయుష్కులైనారు.

యత్రైతత్ప్రాక్షిపద్వారి త్వష్టా లోకప్రజాపతిః ।
త్వాష్ట్రం తీర్థం తదాఖ్యాతం సర్వపాపప్రణాశనమ్ ॥ 24 ॥

ఎక్కడ త్వష్ట అనే లోకప్రజాపతి నీటిని జల్లాడో, అక్కడ ఏర్పడిన దానిని త్వాష్ట్రతీర్థ మంటారు. ఆ తీర్థం సర్వపాపాలను నశింపజేస్తుంది.

త్వష్టుర్వాక్యాచ్చ్యుతాన్ దైత్యాన్ నిజఘాన యమస్తదా ।
కాలదణ్డేన చక్రేణ కాలపాశేన మన్యునా ॥ 25 ॥

త్వష్ట మాటలతో క్రింద పడిన దైత్యులను యముడు కోపంతో కాలదండంతో, చక్రంతో, కాలపాశంతో చంపాడు.

యత్ర తే నిహతా దైత్యాస్తత్తీర్థం యామ్యముచ్యతే ।
యత్రాభవత్క్రతుః పూర్ణో హుత్వాఽగ్నీ చామృతం బహు ॥ 26 ॥

ఆ రాక్షసులు యెక్కడ చంపబడ్డారో ఆ ప్రదేశాన్ని యామ్యతీర్థ మంటారు. క్రతువు సంపూర్ణ మవటానికి చాలా అమృతాన్ని అగ్నిలో ఆహుతి చేసి,

ధారాభిః శరమానాభిరఖండాభిర్మహాధ్వరే ।
యత్రాభవద్ధవ్యవాహస్తృప్తస్తస్య హ్యభిష్టుతః ॥ 27 ॥

అగ్నితీర్థం తదాఖ్యాతమశ్వమేధఫలప్రదమ్ ।
ఇన్ద్రోమరుద్భిర్నృపతిం ప్రాహేదం వచనం శుభమ్ ॥ 28 ॥

'వసోర్ధారా' అంటూ అఖండమైన బాణధారలవంటి ధారలతో, ఎక్కడ హవ్యవాహనుడైన అగ్ని స్తోత్రంతో తృప్తిచెందాడో, దానిని అగ్నితీర్థ మంటారు. అది అశ్వమేధయాగ ఫలాన్నిస్తుంది. ఇంద్రుడప్పుడు మరుద్గణంతో, కలిసి రాజుతో శుభమైన మాట నిలా పలికాడు.

త్వం సమ్రాడ్భవితా రాజన్ ఉభయోరపి లోకయోః ।
సఖా మమ ప్రియో నిత్యం భవితా నాత్ర సంశయః ॥ 29 ॥

ఓ రాజా! నీ విప్పుడు రెండు లోకాలకు చక్రవర్తి వైనావు. నీవెప్పుడూ నాకు ప్రియుడవు, స్నేహితుడవు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

స కృతార్థో మర్త్యలోక ఇన్ద్రతీర్థే చ తర్పణమ్ ।
కుర్యాత్పితౄణాం ప్రీత్యర్థం యమతీర్థే విశేషతః ॥ 30 ॥

ఎవరు భూలోకంలో ఇంద్రతీర్థంలో తర్పణం చేస్తారో వారు కృతార్థులౌతారు. ముఖ్యంగా యమతీర్థంలో పితృదేవతల ప్రీతికొరకు తర్పణం చేసేవాళ్లు కృతార్థులవుతారు.

మాహేశ్వరం తు తత్తీర్థం పూజితోఽభిష్టుతః శివః ।
భక్తియుక్తేన విప్రైశ్చ సర్వకర్మవిశారదైః ॥ 31 ॥

శివుని స్తోత్రం చేసి పూజించింది మాహేశ్వరతీర్థం. సర్వకర్మవిశారదులైన బ్రాహ్మణులు భక్తితో పూజించింది.

వైదికైర్లౌకికైశ్చైవ మన్త్రైః పూజ్యం మహేశ్వరమ్ ।
నృత్యగీతైస్తథా వాద్యైరమృతైః పంచసంభవైః ॥ 32 ॥

ఆవు నెయ్యి, పెరుగు, పాలు, మూత్రం, తేనె మున్నగు పంచామృతాలతో వైదిక లౌకిక మంత్రాలతో, నృత్య గీత వాద్యాలతో పూజ్యుడైన మహేశ్వరుణ్ణి అర్చించారు.

ఉపచారైశ్చ బహుభిర్దణ్డపాతప్రదక్షిణైః ।
ధూపైర్దీపైశ్చ నైవేద్యైః పుష్పగన్ధైః సుగన్ధిభిః ॥ 33 ॥

పూజయామాస దేవేశం విష్ణుం శమ్భుం ధియైకయా ।
తతః ప్రసన్నౌ దేవేశౌ వరాన్ దదతు రోజసా ॥ 34 ॥

షోడశ ఉపచారాలతో, పొర్లుదండ ప్రదక్షిణాలతో, ధూప దీప నైవేద్యాలతో, చక్కని సువాసన గల పుష్ప గంధాలతో, ఏకాగ్రచిత్తంతో దేవేశుడైన విష్ణువును, శివుణ్ణి పూజించారు. అటు తరువాత ప్రసన్నులైన శివకేశవులు తేజోవంతంగా వరాల నిచ్చారు.

అభిష్టుతే నరేన్ద్రాయ భుక్తిముక్తీ ఉభే అపి ।
మాహాత్మ్యమస్య తీర్థస్య తథా దదతురుత్తమమ్ ॥ 35 ॥

స్తోత్రం చేసిన రాజుకి భుక్తిని, ముక్తిని రెంటిని కూడా ఇచ్చి, ఉత్తమమైన ఈ తీర్థమాహాత్మ్యాన్ని కూడా ఇచ్చారు.

తతః ప్రభృతి తత్తీర్థం శైవం వైష్ణవముచ్యతే ।
తత్ర స్నానం చ దానం చ సర్వకామప్రదం విదుః ॥ 36 ॥

అప్పటినుండి ఆ తీర్థాన్ని శైవతీర్థమని, వైష్ణవతీర్థమని అంటారు. అక్కడ స్నాన దానాదులు చేస్తే కోరికల నన్నింటిని నెరవేరుస్తుంది.

ఇమాని సర్వతీర్థాని స్మరేదపి పఠేత వా ।
విముక్తః సర్వపాపేభ్యః శివవిష్ణుపురం వ్రజేత్ ॥ 37 ॥

ఈ సమస్త తీర్థాలను స్మరించినా, వీటినిగూర్చి పఠించినా సమస్త పాపాలు పోయి, కైలాసాన్ని, వైకుంఠాన్ని పొందుతారు.

భానుతీర్థం విశేషేణ స్నానం సర్వార్థసిద్ధిదమ్ ।
తత్ర తీర్థే మహాపుణ్యం తీర్థానాం శతమత్ర హి ॥ 38 ॥

ముఖ్యంగా భానుతీర్థంలో స్నానం సకల సంపదలను కలుగజేస్తుంది. ఆ తీర్థంలో మహాపుణ్యాలనిచ్చే నూరు తీర్థాలు కలవు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే భాన్వాది శతతీర్థవర్ణనం నామాష్టనవతితమోఽధ్యాయః. ॥ 98 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో, తీర్థమాహాత్మ్యంలోని భానుతీర్థం మొదలైన నూరు తీర్థాల వర్ణనమనే తొంబైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోన శతతమోఽధ్యాయః - తొంబై తొమ్మిదవ అధ్యాయం

భిల్లతీర్థమహిమవర్ణనమ్ - భిల్లతీర్థ మహిమ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

భిల్లతీర్థమితి ఖ్యాతం రోగఘ్నం పాపనాశనమ్ ।
మహాదేవపదామ్భోజయుగభక్తిప్రదాయకమ్ ॥ 1 ॥

భిల్ల తీర్థమనేది రోగాలను, పాపాలను నశింపచేస్తుంది. శ్రీపరమేశ్వరుని పాదపద్మాలయందు భక్తిని కలిగిస్తుంది.

తత్రాప్యేవంవిధాం పుణ్యాం కథాం శృణు మహామతే ।
గంగాయా దక్షిణే తీరే శ్రీగిరేరుత్తరే తటే ॥ 2 ॥

ఆదికేశ ఇతి ఖ్యాత ఋషిభిః పరిపూజితః ।
మహాదేవో లింగరూపీ సదాఽఽస్తే సర్వకామదః ॥ 3 ॥

ఓ మహాజ్ఞానీ! అక్కడ కూడ ఈ విధంగా ఉన్న పుణ్యకథను విను. గంగానది దక్షిణతీరంలో ఉన్న శ్రీగిరి అనే పర్వతం ఉత్తరభాగాన, ఆదికేశుడని పేరుపొంది, ఋషులందరిచేత పూజలందుకుంటూ ఆ మహాదేవుడు కోరికలన్నీ తీరుస్తాడు ఎప్పుడూ లింగరూపుడై ఉంటాడు.

సింధుద్వీప ఇతి ఖ్యాతో మునిః పరమధార్మికః ।
తస్య భ్రాతా వేద ఇతి స చాపి పరమో ఋషిః ॥ 4 ॥

సింధుద్వీపుడనే పేరుగల పరమధార్మికుడైన ముని కలడు. అతనికి సోదరుడు వేదుడనేవాడు కూడా గొప్ప ఋషి కలడు.

తమాదికేశం వై దేవం త్రిపురారిం త్రిలోచనమ్ ।
నిత్యం పూజయతే భక్త్యా ప్రాప్తే మధ్యందినే రవౌ ॥ 5 ॥

త్రిపురాసురుని సంహరించినవాడు, మూడు కన్నులు గలవాడు అయిన ఆ ఆదికేశ దేవుని మధ్యాహ్న సమయంలో సూర్యుడున్నప్పుడు భక్తితో నిత్యం పూజించేవాడు.

భిక్షాటనాయ వేదోఽపి యాతి గ్రామం విచక్షణః ।
యాతే తస్మిన్ ద్విజవరే వ్యాధః పరమధార్మికః ॥ 6 ॥

తస్మిన్గిరివరే పుణ్యే మృగయాం యాతి నిత్యశః ।
అటిత్వా వివిధాన్దేశాన్ మృగాన్ హత్వా యథాసుఖమ్ ॥ 7 ॥

న్యస్య మాంసం ధనుష్కోట్యాం శ్రాన్తో వ్యాధః శివం ప్రభుమ్ ॥ 8 ॥

ఆదికేశం సమాగత్య న్యస్య మాంసం తతో బహిః ।
గంగాం గత్వా ముఖే వారి గృహీత్వాఽఽగత్య తం శివమ్ ॥ 9 ॥

యస్య కస్యాపి పత్రాణి కరేణాఽఽదాయ భక్తితః ।
అపరేణ చ మాంసాని నైవేద్యార్థం చ తన్మనాః ॥ 10 ॥

ఆదికేశం సమాగత్య వేదేనార్చితమోజసా ।
పాదేనాఽఽహత్య తాం పూజాం ముఖానీతేన వారిణా ॥ 11 ॥

స్నాపయిత్వా శివం దేవ మర్చయిత్వా తు పత్రకైః ।
కల్పయిత్వా తు తన్మాంసం శివో మే ప్రీయతామితి ॥ 12 ॥

ఇక విచక్షణుడైన వేదుడు భిక్షాటనకై గ్రామానికి వెళ్లేవాడు. బ్రాహ్మణశ్రేష్ఠుడు వెళ్ళగానే పరమ ధార్మికుడైన బోయవాడొకడు ఆ పవిత్రమైన పర్వతానికి వేటకొరకై ప్రతిదినం వచ్చేవాడు. అతడనేక ప్రదేశాలను తిరిగి జంతువులను చంపి, తనకనువుగా ధనుష్కోటిలో మాంసాన్ని పెట్టుకొని, అలసిపోయిన ఆ బోయవాడు శివుడు, ప్రభువైన ఆదికేశుని వద్దకు వచ్చి, బయట మాంసాన్నుంచి, తరువాత గంగానది వద్దకు వెళ్ళి నోటితో పుక్కిట నీటిని తీసుకొనివచ్చి ఆ శివుణ్ణి, ఏదో ఒక ఆకులను చేతితో తీసుకొని(వచ్చి), భక్తితో మరో చేతితో మాంసాలను నైవేద్యంకొరకుంచి తన్మయుడై, ఆదికేశుని చెంత శక్తిగల వేదంతో అర్చించిన పూజాసామగ్రిని కాలుతో ప్రక్కకు తొలగించి, తన నోటితో తెచ్చిన నీటితో, శివుని అభిషేకించి, తెచ్చిన ఆకులతో ఆ దేవుని అర్చించి, ఆ మాంసాన్ని నైవేద్యంగా కల్పించి శివుడు సంతోషించుగాక యని అనుకొనేవాడు.

నైవ కించిత్స జానాతి శివభక్తిం వినా శుభామ్ ।
తతో యాతి స్వకం స్థానం మాంసేన తు యథాగతమ్ ॥ 13 ॥

అతనికి శివునియందు భక్తితప్ప మంచిచెడ్డలేవీ తెలియవు. అటు తరువాత తన మాంసాన్ని తీసుకొని యథాప్రకారంగా ఇంటికి వెళ్లేవాడు.

కరోత్యేతాదృగాగత్యాఽఽగత్య ప్రత్యహమేవ సః ।
తథాపీశస్తుతోషాస్య విచిత్రా హీశ్వరస్థితిః ॥ 14 ॥

ఈ విధంగానే ప్రతిదినం అతడు వచ్చి ఇలాగే చేస్తుండేవాడు. అయినప్పటికీ శివుడు సంతోషిస్తుండేవాడు. ఈశ్వరుని స్థితి విచిత్రమైంది.

యావన్నయాత్యసౌ భిల్లః శివస్తావన్నసౌఖ్యభాక్ ।
భక్తానుకమ్పితాం శంభోర్మానాతీతాం తు వేత్తి కః ॥ 15 ॥

ఆ భిల్లుడు ఎంతవరకైతే రాడో శివుడంత వరకు సుఖంగా ఉండడు. నిర్వికారుడైన, శివునికి భక్తులయందుండే ఊహాతీతమైన దయనెవడు గ్రహిస్తాడు?

సంపూజయత్యాఽఽదికేశముమయా ప్రత్యహం శివమ్ ।
ఏవం బహుతిథే కాలే యాతే వేదశ్చుకోప హ ॥ 16 ॥

అతడిలా ప్రతిదినం పార్వతీ సమేతుడైన ఆదికేశుని పూజిస్తుండేవాడు. ఇలా చాలా కాలం జరుగగా వేదుడతనిపై కోపించాడు.

పూజాం మన్త్రవతీం చిత్రాం శివభక్తిసమన్వితామ్ ।
కో ను విధ్వంసతే పాపో మత్తస్స వధమాప్నుయాత్ ॥ 17 ॥

మంత్రపూర్వకంగా, శివభక్తితో కూడుకొనియున్న చిత్రమైన శివారాధనను ఏ పాపి, మత్తుడు ధ్వంసం చేస్తున్నాడో, వాడు చావాలి.

గురుదేవద్విజస్వామిద్రోహీ వధ్యో మునేరపి ।
సర్వస్యాపి వధార్హోఽసౌ శివస్య ద్రోహకృన్నరః ॥ 18 ॥

గురువులకు, దేవతలకు, బ్రాహ్మణులకు, యజమానులకు ద్రోహం చేసినవాడు మునియైనప్పటికి చంపదగినవాడే. మునికి ద్రోహం చేసినా కూడా అంతే. అన్నింటికంటె కూడా శివునికి ద్రోహం చేసినవాడు చంపుట కర్హుడే.

ఏవం నిశ్చిత్య మేధావీ వేదః సింధోస్తథాఽనుజః ।
కస్యేయం పాపచేష్టా స్యాత్పాపిష్ఠస్య దురాత్మనః ॥ 19 ॥

పుష్పైః వన్యభవైర్దివ్యైః కందైర్మూలఫలైః శుభైః ।
కృతాం పూజాం స విధ్వస్య హ్యన్యాం పూజాం కరోతి యః ॥ 20 ॥

మాంసేన తరుపత్రైశ్చ స చ వధ్యో భవేన్మమ ।
ఏవం సంచిన్త్య మేధావీ గోపయిత్వా తనుం తదా ॥ 21 ॥

తం పశ్యేయమహం పాపం పూజాకర్తారమీశ్వరే ।
ఏతస్మిన్నన్తరే ప్రాయాద్వ్యాధో దేవం యథా పురా ॥ 22 ॥

సింధువు సోదరుడు, మేధావియైన వేదుడు ఇలా నిశ్చయించుకొని ఇది ఏ దుర్మార్గుడు, పాపిష్ఠుడైనవాని పాపచేష్ట అని చింతించి, చక్కగా అడవులలో దొరికే పుష్పాలు, కందమూల ఫలాలతో చేసిన దివ్యమైన, శుభమైన వాటితో నలకరించిన పూజను ధ్వంసం చేసి ఇతరమైన పూజను చేసిన వాడెవడో, మాంసంతో, చెట్ల ఆకులతో పూజచేస్తున్నాడు. నేను వానిని తప్పక చంపవలసిందే అని నిశ్చయించుకొని ఆ మేధావి తాను కనపడకుండా చాటుగా దాగుకొని, నేను తప్పకుండా ఆ విధంగా ఈశ్వరుని పూజించేవానిని చూస్తాననుకొన్నాడు. ఇంతలో ఆ బోయవాడు పూర్వం వలెనే ఆ దేవుని వద్దకు వచ్చాడు.

నిత్యవత్పూజయన్తం తమాదికేశస్తదాఽబ్రవీత్ ॥ 23 ॥

రోజుటి మాదిరిగానే పూజచేస్తున్న బోయవానితో ఆదికేశు డిలా అన్నాడు.

ఆదికేశ ఉవాచ :- ఆదికేశుడు పలికాడు.

భో భో వ్యాధ మహాబుద్ధే శ్రాన్తోఽసీతి పునః పునః ।
చిరాయ కథమాయాతస్త్వాం వినా తాత దుఃఖితః ॥
న విన్దామి సుఖం కించిత్సమాశ్వసి హి పుత్రక ॥ 24 ॥

ఓ మహాబుద్ధీ! వ్యాధుడా ! చాలా అలసిపోయావా? ఎందుకాలస్యంగా వచ్చావు? నీవు లేకపోతే నాకు బాధ కలుగుతుంది. నాకానందం కలగడంలేదు. నాయనా ఊరడిల్లు, సేదతీరు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తమేవం వాదినం దేవం వేదః శ్రుత్వా విలోక్య తు ।
చుకోప విస్మయావిష్టో న చ కించిదువాచ హ ॥ 25 ॥

ఇలా అతనితో పలుకుతున్న శివుని మాటను విని, అతణ్ణి చూచి, వేదుడాశ్చర్యపడి, కోపగించుకొని, ఏమీ మాటలాడలేక పోయాడు.

వ్యాధశ్చ నిత్యవత్పూజాం కృత్వా స్వభవనం యయౌ ।
వేదశ్చ కుపితో భూత్వా ఆగత్యేశమువాచ హ ॥ 26 ॥

ఆ బోయవాడు ప్రతిరోజు చేసినట్లుగానే పూజచేసి తన ఇంటికి వెళ్లాడు. వేదుడు కోపంతో శివుని వద్దకు వచ్చి యిలా అన్నాడు.

వేద ఉవాచ :- వేదుడు పలికాడు.

అయం వ్యాధః పాపరతః క్రియాజ్ఞానవివర్జితః ।
ప్రాణిహింసారతః క్రూరో నిర్దయః సర్వజన్తుషు ॥ 27 ॥

ఈ బోయవాడు పాపాలు చేస్తాడు. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేనివాడు. ప్రాణులను హింసిస్తాడు, క్రూరుడు, ప్రాణులయం దేమాత్రం దయ చూపెట్టడు.

హీనజాతిరకించిజ్ఞో గురుక్రమవివర్జితః ।
సదాఽనుచితకారీ చనిర్జితాఖిలగోగణః ॥ 28 ॥

హీనజాతివాడు, అజ్ఞాని, గురుక్రమాన్ని తెలియనివాడు, ఎప్పుడూ ఉచితాలు కానివి చేసేవాడు, గోవుల సమూహాలను చంపేవాడు.

తస్యాఽఽత్మానం దర్శితవాన్న మాం కించన వక్ష్యసి ।
పూజాం మన్త్రవిధానేన కరోమీశ యతవ్రతః ॥ 29 ॥

ఈశ్వరా! నేను నియమాలతో మంత్రవిధాన పూర్వకంగా పూజ చేసేవాణ్ణి. నాతో మాట్లాడవేమి. కాని అతనికి నీవు దర్శనమిచ్చావు.

త్వదేకశరణో నిత్యం భార్యాపుత్రవివర్జితః ।
వ్యాధో మాంసేన దుష్టేన పూజాం తవ కరోత్యసౌ ॥ 30 ॥

నేను నా భార్యాపుత్రులను వదలి, నీవే శరణని నమ్మి, నిత్యము నీవద్దనే ఉంటున్నాను. బోయవాడు దుష్టమైన మాంసంతో నీకు పూజచేస్తున్నాడు.

తస్య ప్రసన్నో భగవాన్న మమేతి మహాద్భుతమ్ ।
శాస్తిమస్య కరిష్యామి భిల్లస్య హ్యపకారిణః ॥ 31 ॥

భగవంతుడా! నీవటువంటివానికి ప్రసన్నుడ వవుతున్నావు. నాకు అగుట లేదు. ఇది చాలా ఆశ్చర్యం. అపకారియైన ఆ భిల్లునకు తగిన శాస్తి చేస్తాను.

మృదోః కోఽపి భవే త్ప్రీతిః కోఽపి తద్వద్దురాత్మనః ।
తస్మాదహం మూర్ధ్ని శిలాం పాతయేయమసంశయమ్ ॥ 32

ఎవనికైనా మెత్తనివానిపై ప్రేమ ఎందుకుంటుంది? అటువంటి దుర్మార్గులపైనే వుంటుంది. అందువలన నేను నీ తలపై బండతో మోదుతాను. సందేహం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఇత్యుక్తవతి వై వేదే విహస్యేశోఽబ్రవీదిదమ్ ॥ 33 ॥

వేదుడిలా అనగా ఈశ్వరుదు నవ్వి అతనితో ఇలా అన్నాడు.

ఆదికేశ ఉవాచ :– ఆదికేశుదు పలికాదు.

శ్వః ప్రతీక్షస్వ పశ్చాన్మే శిలాం పాతయ మూర్ధని ॥ 34 ॥

రేపటివరకు వేచి ఉండు. తరువాత నా తలపై రాతితో కొట్టు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా స వేదోఽపి శిలాం సంత్యజ్య బాహునా ।
ఉపసంహృత్య తం కోపం శ్వః కరోమీత్యువాచ హ ॥ 35 ॥

ఆ వేదుడు అలాగేనని చేతిలోని రాయిని విసిరివేసి, కోపాన్ని దిగమింగుకొని, రేపు చేస్తానన్నాడు.

తతః ప్రాతః సమాగత్య కృత్వా స్నానాదికర్మ చ ।
వేదోఽపి నిత్యవత్పూజాం కుర్వన్పశ్యతి మస్తకే ॥ 36 ॥

తరువాత వేదుడు ప్రాతఃకాలాన్నే వచ్చి స్నాన సంధ్యాది కర్మలను పూర్తిచేసుకొని ప్రతిదినం చేసినట్లుగానే నిత్యపూజను చేస్తూ శివుని తలపై చూడగా

లింగస్య సవ్రణాం భీమాం ధారాం చ రుధిరాప్లుతామ్ ।
వేదః స విస్మితో భూత్వా కిమిదం లింగమూర్ధని ॥ 37 ॥

మహోత్పాతో భవేత్కస్య సూచయేదిత్యచిన్తయత్ ।
మృద్భిశ్చ గోమయేనాపి కుశైస్తం గంగవారిభిః ॥ 38 ॥

ప్రక్షాళయిత్వా తాం పూజాం కృతవాన్నిత్యవత్తదా ।
ఏతస్మిన్నన్తరే ప్రాయాద్వ్యాధో విగతకల్మషః ॥ 39 ॥

లింగపుతల పైభాగాన భయంకరమైన వ్రణం, దాని నుండి రక్తపుధారలు కనిపించగా వేదుడాశ్చర్యపడి ఇదేమి? లింగం తలపై, ఇదేదో గొప్ప ఉత్పాతకమునకు సూచనగా కన్పడుచున్నదని చింతిస్తూ, మట్టి, గోమయం, దర్భలు, గంగనీటితోను, కడిగి రోజువలెనే ఆ పూజను పూర్తిచేశాడు. ఇంతలో కల్మషరహితుడైన వ్యాధుడు వచ్చాడు.

మూర్ధానం వ్రణసంయుక్తం సరక్తం లింగమస్తకే ।
శంకరస్యాఽఽదికేశస్య దదృశేఽన్తర్గతస్తదా ॥ 40 ॥

లింగము తలమీద రక్తంతో కూడిన పుండుతోనుండటం చూచి, వెళ్ళిలోనికి ఆదికేశుడైన శంకరుని తలను చూచాడు.

దృష్ట్వైవ కిమిదం చిత్రమిత్యుక్త్వా నిశితైః శరైః ।
ఆత్మానం భేదయామాస శతధా చ సహస్రధా ॥ 41 ॥

చూడగానే ఇదేమి చిత్రమని పలికి వాడియైన బాణాలతో తన శరీరాన్ని వందలు, వేలుగా కోసుకొన్నాడు.

స్వామినో వైకృతం దృష్ట్వా కః క్షమేతోత్తమాశయః ।
ముహుర్నినిన్ద చాత్మానం మయి జీవత్యభూదిదమ్ ॥ 42 ॥

స్వామికి వికృతమైన రూపం కలిగినప్పుడు చూచి ఉత్తమాశయం గలిగిన వాడెవ్వ డోర్చుకొనగలడు? నేను బ్రతికి ఉండగా స్వామికిలా జరిగిందని తలచుకొంటూ తన్ను తాను మిక్కిలి నిందించుకొన్నాడు.

కష్టమాపతితం కీదృగహో దుర్విధివైశసాత్ ।
తత్కర్మ తస్య సంవీక్ష్య మహాదేవోఽతి విస్మితః ॥
తతః ప్రోవాచ భగవాన్ వేదం వేదవిదాంవరమ్ ॥ 43 ॥

ఆహా! విధివైపరీత్యంవల్ల ఎటువంటి కష్టం వచ్చిపడింది అని చింతించాడు. అతడు చేసిన పనిని చూచి మహాదేవుడు మిక్కిలి ఆశ్చర్యపడి అప్పుడు వేదవేత్తలలో శ్రేష్ఠుడైన వేదునితో పూజ్యుడైన శివుడిలా అన్నాడు.

ఆదికేశ ఉవాచ :– ఆదికేశుడు పలికాడు.

పశ్య వ్యాధం మహాబుద్ధే భక్తం భావేన సంయుతమ్ ।
త్వం తు మృద్భిః కుశైర్వార్భిర్మూర్ధానం స్పృష్టవానసి ॥ 44 ॥

ఓ మహాజ్ఞానీ! భావసంయుక్తమైన భక్తిగల వ్యాధుని చూడు. నీవైతే మట్టితో, దర్భలతో, నీటితో తలను స్పృశించావు.

అనేన సహసా బ్రహ్మన్ మమాఽఽత్మాఽపి నివేదితః ॥
భక్తిః ప్రేమాథవా శక్తిర్విచారో యత్ర విద్యతే ॥
తస్మాదస్మై వరాన్ దాస్యే పశ్చాత్తుభ్యం ద్విజోత్తమ ॥ 45 ॥

ఓ బ్రాహ్మణుడా! ఇతడు నాకు తన్ను తాను సమర్పించుకున్నాడు. భక్తి, ప్రేమ లేదా శక్తి అనే విచారమెక్కడ? అందువలన మొదట ఇతనికి నేను వరాల నిస్తాను. ఓ ద్విజోత్తమా! తరువాత నీకు వరాల నిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

వరేణ ఛన్దయామాస వ్యాధం దేవో మహేశ్వరః ।
వ్యాధః ప్రోవాచ దేవేశం నిర్మాల్యం తవ యద్భవేత్ ॥ 46 ॥

తదస్మాకం భవేన్నాథ మన్నామ్నా తీర్థముచ్యతామ్ ।
సర్వక్రతుఫలం తీర్థం స్మరణాదేవ జాయతామ్ ॥ 47 ॥

అప్పుడా దేవుడైన మహేశ్వరుడు బోయవానికనేక వరాల ననుగ్రహించాడు. అప్పుడు వ్యాధు డా దేవేశునితో ప్రభూ! నీ నిర్మాల్య మేదైతే ఉన్నదో, అదిమాకు కావాలి. నా పేరుతో తీర్థముండాలి. దానిని స్మరించినంతమాత్రాన్నే సమస్తక్రతువులు చేసిన ఫలం లభించాలి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యువాచ దేవేశస్తతస్తత్తీర్థముత్తమమ్ ।
భిల్లతీర్థం సమస్తాఘసంఘవిచ్ఛేదకారణమ్ ॥ 48 ॥

దేవేశుడు సరే అన్నాడు. అందువలన ఆ తీర్థం ఉత్తమమైన భిల్లతీర్థమైంది. సమస్త పాపసంఘాలను నాశనం చెయ్యటానికి కారణం అవుతుంది.

శ్రీమహాదేవచరణ మహాభక్తి విధాయకమ్ ।
అభవత్స్నానదానాద్యైర్భుక్తిముక్తిప్రదాయకమ్ ॥
వేదస్యాపి వరాన్ ప్రాదాచ్ఛివో నానావిధాన్ బహూన్ ॥ 49 ॥

ఆ భిల్లతీర్థం పరమేశ్వరుడి పాదపద్మాలపైన భక్తిని కలిగించుతుంది. ఆ తీర్థంలో స్నానం, దానం, తర్పణాలు చేస్తే భుక్తిని ముక్తిని ఇస్తుంది. పరమేశ్వరుడు వేదునికి అనేక వరాల నిచ్చాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే భిల్లతీర్థమహిమవర్ణనం నామైకోన శతతమోఽధ్యాయః. ॥ 99 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యములోని భిల్లతీర్థవర్ణనమనే తొంబై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శతతమోఽధ్యాయః - నూరవ అధ్యాయం

చక్షుతీర్థవర్ణనమ్ - చక్షుతీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

చక్షుతీర్థమితి ఖ్యాతం రూపసౌభాగ్యదాయకమ్ ।
యత్ర యోగేశ్వరో దేవో గౌతమ్యా దక్షిణే తటే ॥ 1 ॥

గౌతమీనదికి దక్షిణతీరంలో యోగేశ్వరుడనే దేవుడున్న ప్రదేశాన్ని చక్షుతీర్థ మంటారు. ఆ తీర్థం రూప సౌభాగ్యాల నిస్తుంది.

పురం భౌవనమాఖ్యాతం గిరిమూర్ధ్న్యభిధీయతే ।
యత్రాసౌ భౌవనో రాజా క్షత్రధర్మపరాయణః ॥ 2 ॥

అక్కడ భౌవనమనే పురముంది. దానిని గిరిమూర్ధ్ని అని కూడా అంటారు. దానికి క్షత్రియధర్మాన్ని చక్కగా నెరవేర్చే భౌవనుడు రాజుగా ఉండినాడు.

తస్మిన్ పురవరే కశ్చిద్బ్రాహ్మణో వృద్ధకౌశికః ।
తత్పుత్రో గౌతమ ఇతి ఖ్యాతో వేదవిదుత్తమః ॥ 3 ॥

ఆ పురంలో వృద్ధకౌశికుడనే బ్రాహ్మణుడు ఒకడు కలడు. అతని కుమారుడు గౌతముడు. అతడు వేదవేత్త, ఉత్తముడని ప్రసిద్ధిచెందాడు.

తస్య మాతుర్మనోదోషాద్విపరీతోఽభవద్ద్విజః ।
సఖా తస్య వణిక్కశ్చిన్మణికుణ్డల ఉచ్యతే ॥ 4 ॥

అతని తల్లి మానసిక దోషంవలన ఆ బ్రాహ్మణుడు విపరీతంగా ప్రవర్తించేవాడు. అతనికి మణికుండలుడనే వైశ్యుడు మిత్రుడిగా ఉండేవాడు.

తేన సఖ్యం ద్విజస్యాఽఽసీద్విషమం ద్విజవైశ్యయోః ।
శ్రీమద్దరిద్రయోర్నిత్యం పరస్పరహితైషిణోః ॥ 5 ॥

ఆ బ్రాహ్మణుని కతనితో స్నేహం కుదిరింది. వైశ్యబ్రాహ్మణులకు పరస్పర హితాన్ని కోరే వారిద్దరికి విషమమైన స్నేహం కుదిరింది. ఒకరు శ్రీమంతుడు, మరొకడు దరిద్రుడు. వారికి స్నేహమైంది.

కదాచిద్గౌతమో వైశ్యం విత్తేశం మణికుణ్డలమ్ ।
ప్రాహేదం వచనం ప్రీత్యా రహః స్థిత్వా పునః పునః ॥ 6 ॥

ఒకనాడు గౌతముడు ధనవంతుడు, వైశ్యుడు ఐన మణికుండలునితో రహస్యంగా ప్రీతితో మాటి మాటికిలా అడిగాడు.

గచ్ఛామో ధనమాదాతుం పర్వతానుదధీనపి ।
యౌవనం తద్వృథా జ్ఞేయం వినా సౌఖ్యానుకూల్యతః
ధనం వినా తత్కథం స్యాదహో ధిక్ నిర్ధనం నరమ్ ॥ 7 ॥

ధనాన్ని సంపాదించటానికి కొండలలోకి, సముద్రాలపైకి వెళ్ళుదాము. సుఖానుభవయోగం లేని యౌవనం వ్యర్థం. ధనం లేకుండా ఆ సుఖమెలా లభిస్తుంది? ఆహా! ధనం లేని నరుని జీవిత మెటువంటిది? ఛీ, ఛీ.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

కుణ్డలో ద్విజమాహేదం మత్పిత్రోపార్జితం ధనమ్ ।
బహ్వస్తి కిం ధనేనాద్య కరిష్యే ద్విజసత్తమ ॥
ద్విజః పునరువాచేదం మణికుండలమోజసా ॥ 8 ॥

కుండలుడు బ్రాహ్మణునితో ఇలా అన్నాడు. ఓ బ్రాహ్మణోత్తమా! నా తండ్రి సంపాదించిన ధనం చాలా వుంది. ఇప్పుడు ధనం సంపాదించి ఏమి చేయాలి? తిరిగి ఆ బ్రాహ్మణుడు మణికుండలునితో దీప్తితో ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ :– గౌతముడు పలికాడు.

ధర్మార్థజ్ఞానకామానాం కోను తృప్తః ప్రశస్యతే ।
ఉత్కర్షప్రాప్తిరేవైషాం సఖే శ్లాఘ్యా శరీరిణామ్ ॥ 9 ॥

మిత్రమా! ధర్మార్థ జ్ఞాన కామాలలో ఎవడు తృప్తుడైనాడని ప్రశంసించబడతాడు? మానవులకు వాటి నెక్కువగా పొందుటే ప్రశంసించ తగినది.

స్వేనైవ వ్యవసాయేన ధన్యా జీవన్తి జన్తవః ।
పరదత్తార్థసంతుష్టాః కష్టజీవిన ఏవ తే ॥ 10 ॥

ఏ జీవులు తాము కష్టపడి, ప్రయత్నించి, సంపాదించి, జీవిస్తారో వారు ధన్యులు. ఇతరు లిచ్చిన ధనంతో సంతుష్టులయ్యే వారు కష్టజీవులే.

స పుత్రః శస్యతే లోకే పితృభిశ్చాభినన్ద్యతే ।
యః పైత్రమభిలిప్సేత న వాచాఽపి తు కుణ్డల ॥ 11 ॥

ఓ కుండలుడా! ఎవడు పిత్రార్జితాన్ని మాటమాత్రానికైనా అభిలషించడో అతడిని లోకంలో పితృదేవతలు కూడా అభినందిస్తారు.

స్వబాహుబలమాశ్రిత్య యోఽర్థానార్జయతే సుతః ।
స కృతార్థో భవేల్లోకే పైత్ర్యం విత్తం న తు స్పృశేత్ ॥ 12 ॥

ఏ కుమారుడు పిత్రార్జితమైన ధనాన్ని ముట్టుకోకుండా తన బాహుబలాన్ని ఆశ్రయించి ధనాన్ని సంపాదిస్తాడో అటువంటివాడు లోకంలో కృతార్థుడు.

స్వయమార్జ్య సుతోవిత్తం పిత్రే దాస్యతి బన్ధవే ।
తం తు పుత్రం విజానీయాదితరో యోనికీటకః ॥ 13 ॥

ఏ కుమారుడు తాను స్వయంగా ధనం సంపాదించి బంధం గల తండ్రికిస్తాడో అతడిని కొడుకనాలి. అలా కానివాడు కడుపున పుట్టిన కీటకమే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా తు తద్వాక్యం బ్రాహ్మణస్యాభిలాషిణః ।
తథేతిమత్వా తద్వాక్యం రత్నాన్యాదాయ సత్వరః ॥ 14 ॥

ధనంపైన కోరిక కలిగిన ఆ బ్రాహ్మణుని ఆ మాటను విని సరే అని తలచి త్వరగా రత్నాలను తీసుకొనివచ్చి,

ఆత్మకీయాని విత్తాని గౌతమాయ న్యవేదయత్ ।
ధనేనైతేన దేశాంశ్చ పరిభ్రమ్య యథాసుఖమ్ ॥ 15 ॥

ధనాన్యాదాయ విత్తాని పునరేష్యామహే గృహమ్ ।
సత్యమేవ వణిగ్వక్తి స తు విప్రః ప్రతారకః ॥ 16 ॥

అతడు తన ధనాలను గౌతమునికి ఇచ్చాడు. ఈ ధనంతో సుఖంగా దేశాలను తిరిగి, ధనాన్ని సంపాదించి ఆ సంపదలతో తిరిగి ఇంటికి వద్దాం అని వైశ్యుడు సత్యాన్నే చెబుతున్నాడు. కాని ఆ విప్రుడు మోసగాడు, వంచకుడు.

పాపాత్మా పాపచిత్తం చ న బుబోధ వణిగ్ద్విజమ్ ।
తౌ పరస్పరమామన్త్ర్య మాతాపిత్రోరజానతోః ॥ 17 ॥

దేశదేశాన్తరం యాతౌ ధనార్థం తౌ వణిగ్ద్విజౌ ।
వణిగ్హస్తస్థితం విత్తం బ్రాహ్మణో హర్తుమిచ్ఛతి ॥ 18 ॥

పాపాత్ముడు, పాపచిత్తుడని వైశ్యుడా ద్విజుని మనస్సు తెలుసుకొనలేక పోయాడు. వారిద్దరూ పరస్పరం కూడబలుక్కొని, విచారించి, తమ తల్లిదండ్రులకు తెలియకుండా, వైశ్యుడు, బ్రాహ్మణుడు ఇద్దరూ ధనంకొరకు దేశదేశాంతరాలకు వెళ్లారు. వైశ్యుని చేతిలోఉన్న ధనాన్ని బ్రాహ్మణుడు దొంగిలించ తలచాడు.

గౌతమ ఉవాచ :- గౌతముడు పలికాడు.

యేన కేనాప్యుపాయేన తద్ధనం హి సమాహరే ।
అహో పృథివ్యాం రమ్యాణి నగరాణి సహస్రశః ॥ 19 ॥

ఏదో ఒక ఉపాయంతో ఆ ధనాన్ని హరిస్తాను. ఆహా! ఈ భూమిమీద వేలకొలది సుందర నగరా లున్నాయి.

ఇష్టప్రదాత్ర్యః కామస్య దేవతా ఇవ యోషితః ।
మనోహరాస్తత్ర తత్ర సన్తి కిం క్రియతే మయా ॥ 20 ॥

అవి ఇష్టమైనవాటిని ఇచ్చేవి. కామానికి దేవతలవంటి స్త్రీలున్నారు. వారు చాలా సుందరమైనవారు అక్కడక్కడ ఉన్నారు. నేనేం చేయగలను?

ధనమాహృత్య యత్నేన యోషిద్భ్యో యది దీయతే ।
భుజ్యన్తే తాస్తతో నిత్యం సఫలం జీవితం హి తత్ ॥ 21 ॥

నేనెలాగైనా ధనాన్ని దొంగిలించి స్త్రీలకు ఇస్తే వారు దానిని అనుభవిస్తారు. అటు తరువాత నా జీవితం నిత్యమూ ఫలవంతమే.

నృత్యగీతరతో నిత్యం పణ్యస్త్రీభిరలంకృతః ।
భోక్ష్యే కథం తు తద్విత్తం వైశ్యాన్మద్ధస్తమాగతమ్ ॥ 22 ॥

వైశ్యుని వద్దనుండి ఆ ధనం ఏదోవిధంగా నా చేతిలో పడినట్లైతే నిత్యం వేశ్యలలంకరించగా ఆటపాటలలో మునిగి అనుభవిస్తాను.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏవం చిన్తయమానోఽసౌ గౌతమః ప్రహసన్నివ ।
మణికుండలమాహేదమధర్మాదేవ జన్తవః ॥ 23 ॥

వృద్ధిం సుఖమభీష్టాని ప్రాప్నువన్తి న సంశయః ।
ధర్మిష్ఠాః ప్రాణినో లోకే దృశ్యన్తే దుఃఖభాగినః ॥ 24 ॥

ఇలా చింతిస్తూ ఆ గౌతముడు నవ్వుతూ అన్నట్లుగా మణికుండలునితో ఇలా అన్నాడు. జీవులు అధర్మమార్గంలోనే వృద్ధిని, సుఖాన్ని, కోరికలను పొందుతారు. దీనిలో ఏమాత్రం సందేహం లేదు. ధర్మాన్ని చక్కగా ఆచరించేవారు లోకంలో దుఃఖభాగులుగా కనిపిస్తారు.

తస్మాద్ధర్మేణ కిం తేన దుఃఖైకఫలహేతునా ॥ 25 ॥

అందువలన దుఃఖానికి మాత్రమే కారణమైన ఆ ధర్మంతో ఏమి పని?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

నేత్యువాచ తతో వైశ్యః సుఖం ధర్మే ప్రతిష్ఠితమ్ ।
పాపే దుఃఖం భయం శోకో దారిద్ర్యం క్లేశ ఏవ చ ॥
యతో ధర్మస్తతో ముక్తిః స్వధర్మః కిం వినశ్యతి ॥ 26 ॥

అప్పుడు వైశ్యుడు దాని కంగీకరించ లేదు. ధర్మంలోనే సుఖం ప్రతిష్ఠితమై వున్నది. పాపంలో దుఃఖం, భయం, శోకం, దారిద్ర్యం, క్లేశాలే ఉంటాయి. ఎక్కడ ధర్మముంటుందో అక్కడ ముక్తి లభిస్తుంది. తన ధర్మం నశిస్తుందా? ఎన్నటికీ నశించదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం వివదతోస్తత్ర సంపరాయస్తయోరభూత్ ।
యస్య పక్షో భవేజ్జ్యాయాన్స పరార్థమవాప్నుయాత్ ॥ 27 ॥

ఇలా పరస్పరం వాదించుకొంటున్న వారిద్దరికొక ఒప్పందం కుదిరింది. ఎవరి పక్షం సర్వోత్తమమైందో వారు రెండవవారి ధనాన్ని తీసుకోవాలి.

పృచ్ఛావః కస్య ప్రాబల్యం ధర్మిణో వాఽ ప్యధర్మిణః ।
వేదాత్తు లౌకికం జ్యేష్ఠం లోకే ధర్మాత్సుఖం భవేత్ ॥ 28 ॥

ఎవరు గొప్పవారో అడుగుదాం ధార్మికులా? అధార్మికులా? వేదాల కంటె లోకాచారం గొప్పది. లోకంలో ధర్మం వల్లనే సుఖం కలుగుతుంది.

ఏవం వివదమానౌ తావూచతుః సకలాన్ జనాన్ ।
ధర్మస్య వాప్యధర్మస్య ప్రాబల్యమనయోర్భువి ॥ 29 ॥

ఇలా వారు పరస్పరం వాదించుకొంటూ జనులందరిని ఈ భూమిమీద ధర్మం గొప్పదా? అధర్మం గొప్పదా? అని అడిగారు.

తద్వదన్తు యథావృత్తమేవ మూచతురోజసా ।
ఏవం తత్రోచిరే కేచిద్యేఽ ధర్మేణానువర్తినః ॥ 30 ॥

అనుభూయతే చ తైర్దుఃఖం పాపిష్ఠా సుఖినో జనాః ।
సంపరాయే ధనం సర్వం జితం విప్రే న్యవేదయత్ ॥ 31 ॥

జరిగిన దానినంతా చెప్పి మీరు చెప్పండి మీరు చెప్పండిని బలవంతంగా అడిగారు. అక్కడ అధర్మాన్ననుసరించేవారు, కొందరన్నారు. ధర్మం ప్రకారం నడిచేవారు దుఃఖాన్ననుభవిస్తారు. పాపిష్ఠులైన జనులు సుఖాన్ననుభవిస్తారు. వారి ఒప్పందం ప్రకారం జయించిన బ్రాహ్మణుడికి ధనాన్నంతా ఇచ్చారు.

మణిమాన్ధర్మవిచ్ఛ్రేష్ఠః పునర్ధర్మం ప్రశంసతి ।
మణిమన్తం ద్విజఃప్రాహ కిం ధర్మమనుశంససి ॥ 32 ॥

ధర్మవేత్త, శ్రేష్ఠుడైన మణిమంతుడు మరల ధర్మాన్ని పొగుడుతుండగా ఆ బ్రాహ్మణుడు మణిమంతునితో ఇంకా ధర్మాన్నే ప్రశంసిస్తున్నావా? అన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేతి చేత్యాహ వైశ్యో బ్రాహ్మణః పునరబ్రవీత్ ।

అప్పుడు వైశ్యుడు అవుననగా బ్రాహ్మణుడు తిరిగి ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

జితం మయా ధనం వైశ్య నిర్లజ్జః కిం ను భాషసే ।
మయైవ విజితో ధర్మో యథేష్టాచరణాత్మకః ॥ 33 ॥

ఓ వైశ్యుడా! నేను ధనాన్నంతా గెలిచాను. ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతున్నావా? విచ్చలవిడిగా ప్రవర్తించే నేను గెలిచిందే ధర్మం.

తద్బ్రాహ్మణవచః శ్రుత్వా వైశ్యః సస్మిత ఊచివాన్ ॥ 34 ॥

ఆ బ్రాహ్మణుని మాటలను విని వైశ్యుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు.

వైశ్య ఉవాచ :- వైశ్యుడు పలికాడు.

పులాకా ఇవ ధాన్యేషు పుత్తికా ఇవ పక్షిషు ।
తథైవ తాన్ సఖే మన్యే యేషాం ధర్మో న విద్యతే ॥ 35 ॥

మిత్రమా! ఎవరిలో ధర్మముండదో వారిని గింజలలో తాలుగింజవలె, పక్షులలో తేనెటీగవలె ఉండేవారిగా తలుస్తాను.

చతుర్ణాం పురుషార్థానాం ధర్మః ప్రథమ ఉచ్యతే ।
పశ్చాదర్థశ్చ కామశ్చ స ధర్మో మయి తిష్ఠతి ॥
కథం బ్రూషే ద్విజశ్రేష్ఠ మయా విజితమిత్యదః ॥ 36 ॥

ధర్మార్థకామమోక్షాలను నాలుగు పురుషార్థాలలో మొదట చెప్పేది ధర్మం. దాని తరువాతనే అర్థం, కామమని చెబుతారు. ఆ మొదటి ధర్మమే నా యందున్నది. ఓ ద్విజోత్తమా! నేను జయించానని ఎలా అంటావు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ద్విజో వైశ్యం పునః ప్రాహ హస్తాభ్యాం జాయతాం పణః ।
తథేతి మన్యతే వైశ్యస్తౌ గత్వా పునరూచతుః ॥ 37 ॥

బ్రాహ్మణుడు వైశ్యునితో తిరిగి అన్నాడు. చేతులతోనే డబ్బు పుట్టించగలం. వైశ్యుడు అవునని అంగీకరించాడు. తిరిగి వారిద్దరువెళ్ళి అడిగారు.

పూర్వవల్లౌకికాన్గత్వా జితమిత్యబ్రవీద్ద్విజః ।
కరౌ ఛిత్వా తతః ప్రాహ కథం ధర్మం తు మన్యసే ॥
ఆక్షిప్తో బ్రాహ్మణేనైవం వైశ్యో వచనమబ్రవీత్ ॥ 38 ॥

పూర్వంవలెనే లోకజనుల వద్దకు వెళ్ళి వివాదం చెప్పి నేను గెలిచానని బ్రాహ్మణుడు చెప్పాడు. వైశ్యుని రెండు చేతులను ఖండించి అప్పుడు నీవు ధర్మాన్నెలా అంగీకరించావన్నాడు. బ్రాహ్మణుడాక్షేపించిన దానికి వైశ్యుడిలా సమాధానమిచ్చాడు.

వైశ్య ఉవాచ :- వైశ్యుడు పలికాడు.

ధర్మమేవ పరం మన్యే ప్రాణైః కణ్ఠగతైరపి ।
మాతా పితా సుహృద్బన్ధుర్ధర్మ ఏవ శరీరిణామ్ ॥ 39 ॥

నా ప్రాణాలు కంఠగతాలైనప్పటికీ ధర్మమే ఉత్తమమైందని నమ్ముతున్నాను. మానవులకు తల్లి, తండ్రి మిత్రుడు, బంధువు అన్నీ ధర్మమే.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవం వివదమానౌ తావర్థవాన్ బ్రహ్మణోఽభవత్ ।
విముక్తో వైశ్యకస్తత్ర బాహుభ్యాం చ ధనేన చ ॥ 40 ॥

అక్కడ వారిద్దరిలా వాదించుకోగా బ్రాహ్మణుడు ధనవంతుడయ్యాడు. వైశ్యుడు బాహువులు, ధనం లేనివాడైనాడు.

ఏవం భ్రమన్తౌ సంప్రాప్తౌ గంగాం యోగేశ్వరం హరిమ్ ।
యదృచ్ఛయా మునిశ్రేష్ఠ మిథస్తావూచతుః పునః ॥ 41 ॥

ఓ మునిశ్రేష్ఠా! వారిలా తిరుగుతూ అనుకోకుండా గంగానదికి, యోగేశ్వరుడైన శ్రీహరి వద్దకు వచ్చారు. తిరిగి వారిద్దరు వాదులాడుకొన్నారు.

వైశ్యో గంగాం తు యోగేశం ధర్మమేవ ప్రశంసతి ।
అతికోపాద్ద్విజో వైశ్యమాక్షిపన్ పునరబ్రవీత్ ॥ 42 ॥

వైశ్యుడు గంగను, యోగేశ్వరుడైన హరిని, ధర్మాన్ని ప్రశంసింస్తూనే ఉండినాడు. అప్పుడు బ్రాహ్మణుడు మిక్కిలి కోపంతో వైశ్యుని ఆక్షేపిస్తూ మరల ఇలా అన్నాడు.

బ్రాహ్మణ ఉవాచ :- బ్రాహ్మణుడు పలికాడు.

గతం ధనం కరౌ ఛిన్నావవశిష్టోఽసుభిర్భవాన్ ।
త్వమన్యథా యది బ్రూష ఆహరిష్యేఽసినా శిరః ॥ 43 ॥

నీ ధనం పోయింది, చేతులు తెగినాయి, కేవలం ఇంకా ప్రాణాలు మాత్రం మిగిలి వున్నాయి. నీవు వేరు విధంగా మాట్లాడితే కత్తితో నీ శిరస్సు ఖండిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విహస్య పునరాహేదం వైశ్యో గౌతమమంజసా ॥ 44 ॥

వైశ్యుడు నవ్వి గౌతమునితో ఉచితరీతిగా ఇలా అన్నాడు.

వైశ్యుదు ఉవాచ :- వైశ్యుడు పలికాడు.

ధర్మమేవ పరం మన్యే యథేచ్ఛసి తథా కురు ।
బ్రాహ్మణాంశ్చ గురూన్దేవాన్ వేదాన్ ధర్మం జనార్దనమ్ ॥ 45 ॥

యస్తు నిన్దయతే పాపో నాసౌ స్పృశ్యోఽథ పాపకృత్ ।
ఉపేక్షణీయో దుర్వృత్తః పాపాత్మా ధర్మదూషకః ॥ 46 ॥

నేను ధర్మాన్నే ఉత్తమమైన దంటాను. నీ కెలా తోచితే అలా చేయి. బ్రాహ్మణులను, గురువులను, దేవతలను, ధర్మాన్ని, జనార్దనుణ్ణి, ఏ పాపి నిందిస్తాడో ఆ పాపకారిని ముట్టుకోరాదు. ధర్మాన్ని దూషించే దుర్మార్గుడైన పాపాత్ముడు ఉపేక్షణీయుడు. వదిలేయ తగినవాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రాహ స కోపేన ధర్మం యద్యనుశంససి ।
ఆవయోః ప్రాణయోరత్ర పణః స్యాదితి వై మునే ॥ 47 ॥

ఓ మునీ! అప్పుడా బ్రాహ్మణుడు కోపంగా నీవు ఒకవేళ ఇంకా ధర్మమే గొప్పదన్నట్లయితే ఇక్కడ మన ప్రాణాన్నే పందెంగా పెట్టుకుందా మన్నాడు.

ఏవముక్తే గౌతమేన తథేత్యాహ వణిక్తదా ।
పునరప్యూచతురుభౌ లోకాంల్లోకాస్తథోచిరే ॥ 48 ॥

గౌతము డిలా అనగా వైశ్యుడు సరే అన్నాడు. తిరిగి వారిద్దరు ప్రజల నడిగారు. ప్రజలలాగే అన్నారు.

యోగేశ్వరస్య పురతో గౌతమ్యా దక్షిణే తటే ।
తం నిపాత్య విశం విప్రశ్చక్షురుత్పాట్య చాబ్రవీత్ ॥ 49 ॥

గౌతమీనది దక్షిణతీరాన యోగేశ్వరున కెదురుగా ఆ బ్రాహ్మణుడా వైశ్యుని క్రింద పడవేసి కళ్ళను పెరికి ఇలా అన్నాడు.

విప్ర ఉవాచ :- విప్రుడు పలికాడు.

గతోఽసీమాం దశాం వైశ్య నిత్యం ధర్మప్రశంసయా ।
గతం ధనం గతం చక్షుశ్ఛేదితౌ కరపల్లవౌ ॥
పృష్టోఽసి మిత్ర గచ్ఛామి మైవం బ్రూయాః కథాన్తరే ॥ 50 ॥

ఓ వైశ్యుడా! నిత్యం ధర్మప్రశంస చేయుటచేత ఎల్లలు లేని దుర్దశను పొందావు. ధనం పోయింది. కళ్ళు పోయాయి. చిగురుటాకులవంటి చేతులు పోయాయి. అడిగినానుకదా! మిత్రమా! ఇంకెప్పుడిటువంటి కథలు చెప్పకు వెళుతున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తస్మిన్ ప్రయాతే వైశ్యోఽసౌ చిన్తయామాస చేతసి ।
హా కష్టం మే కిమభవద్ధర్మైకమనసో హరే ॥ 51 ॥

ఆ బ్రాహ్మణుడు వెళ్ళగానే ఈ వైశ్యుడు తన మనస్సులో ఇలా చింతించాడు. ఓ శ్రీహరీ! ధర్మమే దిక్కని నమ్మిన నాకు అయ్యో! ఎంత కష్టం వచ్చింది?

స కుణ్డలో వణిక్‌శ్రేష్ఠో నిర్ధనో గతబాహుకః ।
గతనేత్రః శుచం ప్రాప్తో ధర్మమేవానుసంస్మరన్ ॥ 52 ॥

వైశ్యశ్రేష్ఠుడైన కుండలుడు బీదవాడు, చేతులు పోయినవాడు, కళ్ళు పోయినవాడై, ధర్మాన్నే స్మరిస్తూ దుఃఖించాడు.

ఏవం బహువిధాం చిన్తాం కుర్వన్నాస్తే మహీతలే ।
నిశ్చేష్టోఽథ నిరుత్సాహః పతితః శోకసాగరే ॥ 53 ॥

ఇలా అనేకవిధాలుగా చింతిస్తూ నేలపై చలనం లేక, నిరుత్సాహుడై శోకసముద్రంలో మునిగాడు.

దినావసానే శర్వర్యాముదితే చన్ద్రమణ్డలే ।
ఏకాదశ్యాం శుక్లపక్షే తత్రాఽఽయాతి విభీషణః ॥ 54 ॥

చీకటిపడిన తరువాత రాత్రిపూట శుక్లపక్ష ఏకాదశీతిథిన చంద్రమండలంలో చంద్రుడుదయించగా అక్కడికి విభీషణుడు వచ్చాడు.

స తు యోగేశ్వరం దేవం పూజయిత్వా యథావిధి ।
స్నాత్వా తు గౌతమీం గంగాం సపుత్రో రాక్షసైర్వృతః ॥ 55 ॥

అతడు రాక్షసులందరితోను, తన కుమారునితోను గౌతమీగంగానదిలో స్నానం చేసి యథావిధిగా యోగీశ్వరుడైన హరిని పూజించాడు.

విభీషణస్య హి సుతో విభీషణ ఇవాపరః ।
వైభీషణిరితి ఖ్యాతస్తమపశ్యదువాచ హ ॥ 56 ॥

రెండవ విభీషణునివలె ఉన్న విభీషణుని కుమారుడైన విభీషణి ఆ వైశ్యుని చూచి మాట్లాడినాడు.

వైశ్యస్య వచనం శ్రుత్వా యథావృత్తం స ధర్మవిత్ ।
పిత్రే నివేదయామాస లంకేశాయ మహాత్మనే ॥
స తు లంకేశ్వరః ప్రాహ పుత్రం ప్రీత్యా గుణాకరమ్ ॥ 57 ॥

ధర్మజ్ఞుడైన అతడు వైశ్యుడు చెప్పిన వృత్తాంతమంతా విని లంకాధిపతి, మహాత్ముడైన తన తండ్రికి చెప్పాడు. అప్పుడా లంకేశ్వరుడైన విభీషణుడు గుణాకరుడైన తన కుమారునితో ప్రేమగా ఇలా అన్నాడు.

విభీషణ ఉవాచ :- విభీషణుడు పలికాడు.

శ్రీమాన్ రామో మమ గురుస్తస్య మాన్యః సఖా మమ ।
హనుమానితి విఖ్యాతస్తేనాఽఽనీతో గిరిర్మహాన్ ॥ 58 ॥

పూజ్యుడైన రామచంద్రుడు నాకు గురువు. అతనికి గౌరవనీయుడు, నాకు స్నేహితుడు అయిన హనుమంతుడని పేరుపొందిన వాడొక గొప్పపర్వతం తెచ్చాడు.

పురా కార్యాన్తరే ప్రాప్తే సర్వౌషధ్యాశ్రయోఽచలః ।
జాతే కార్యే తమాదాయ హిమవన్తమథాగమత్ ॥ 59 ॥

పూర్వమొక అవసర మేర్పడినప్పుడు సమస్త ఓషధులుండే ఆ పర్వతాన్ని తెచ్చి పనిపై అతడు హిమవత్పర్వతం వద్దకు వచ్చాడు.

విశల్యకరణీ చేతి మృతసంజీవనీతి చ ।
తదాఽఽనీయ మహాబుద్ధీ రామాయాక్లిష్టకర్మణే ॥ 60 ॥

నివేదయిత్వా తత్సాధ్యం తస్మిన్ వృత్తే సమాగతః ।
పునర్గిరిం సమాదాయ ఆగచ్ఛద్దేవపర్వతమ్ ॥ 61 ॥

అక్కడ విశల్యకరణి అని మృతసంజీవని అనే వానిని తెచ్చి ఆ మహాబుద్ధిగల హనుమంతుడు ఎంతటి అసాధ్యాన్నైనా సునాయాసంగా చేసే రామునికి, తాను సాధించిన దానిని ఇచ్చి, ఆ సంఘటన తరువాత హనుమంతుడు తిరిగి ఆ పర్వతాన్ని తీసుకొని దేవపర్వతానికి వచ్చాడు.

తామానీయాస్య హృదయే నివేశయ హరిం స్మరన్ ।
తతః ప్రాప్స్యత్యయం సర్వమపేక్షితముదారధీః ॥ 62 ॥

దానిని తీసుకొనివచ్చి శ్రీహరిని స్మరిస్తూ ఇతని హృదయంలో ఉంచు. తరువాత ఉదారబుద్ధిగల ఇతడు తాను కోరినదంతా పొందుతాడు.

గచ్ఛతస్తస్య వేగేన విశల్యకరణీ పునః ।
అపతద్గౌతమీతీరే యత్ర యోగేశ్వరో హరిః ॥ 63 ॥

తిరిగి వేగంగా వెళుతున్నప్పుడు ఎక్కడ గౌతమీతీరంలో యోగేశ్వరుడైన హరి ఉన్నాడో అక్కడ విశల్యకరణి పడింది.

వైభీషణిరువాచ :- వైభీషణుడు పలికాడు.

తమోషధీం మమ పితర్దర్శయాఽఽశు విలమ్బ మా ।
పరార్తిశమనాదన్యచ్ఛ్రేయో న భువనత్రయే ॥ 64 ॥

ఓ నా తండ్రీ! తొందరగా నాకా ఔషధాన్ని చూపించు. ఆలస్యం చేయకు. ఈ ముల్లోకాలలో ఇతరుల ఆర్తిని పోగొట్టడంకంటె శ్రేష్ఠమైనది వేరేదేది లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

విభీషణస్తథేత్యుక్త్వా తాం పుత్రస్యాప్యదర్శయత్ ।
ఇషేత్వేత్యస్య వృక్షస్య శాఖాం చిచ్ఛేద తత్సుతః ॥
వైశ్యస్య చాపి వై ప్రీత్యా సన్తః పరహితే రతాః ॥ 65 ॥

విభీషణుడలాగేనని కుమారునకా ఔషధిని చూపెట్టాడు. వైశ్యుని పైన అభిమానంతో కూడా అతనా వృక్షశాఖను 'ఇషేత్వా' అని ఛేదించాడు. సత్పురుషులు ఎప్పుడూ ఇతరులకు హితం చేయటంలోనే రతులై ఉంటారు.

విభీషణ ఉవాచ :- విభీషణుడు పలికాడు.

యత్రాపతన్నగే చాస్మిన్స వృక్షస్తు ప్రతాపవాన్ ।
తస్య శాఖాం సమాదాయ హృదయేఽస్య నివేశయ ॥
తత్స్పృష్టమాత్ర ఏవాసౌ స్వకం రూపమవాప్నుయాత్ ॥ 66 ॥

ఈ పర్వతం మీద పడిన ఆ వృక్షం చాలా శక్తిగలది. దాని కొమ్మను తీసుకొనివచ్చి ఇతని హృదయంపై ఉంచు. దానిని స్పృశించినంత మాత్రాన్నే ఇతడు తన రూపాన్ని పొందుతాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా పితుర్వాక్యం వైభీషణిరుదారధీః ।
తథా చకార వై సమ్యక్ కాష్ఠఖణ్డం న్యవేశయత్ ॥ 67 ॥

ఇలా పలికిన తండ్రి మాటలను విని ఉదారబుద్ధిగల వైభీషణుడు వైశ్యుని హృదయంపైన చక్కగా చెట్టుకొమ్మనుంచాడు.

హృదయే స తు వైశ్యోఽపి స చక్షుః సకరోఽభవత్ ।
మణిమన్త్రౌషధీనాం హి వీర్యం కోపి న బుధ్యతే ॥ 68 ॥

హృదయంపై ఉంచగానే ఆ వైశ్యుడు కన్నులు, చేతులు కలవాడైనాడు. మణి మంత్ర ఓషధుల శక్తి నెవ రెరుగలేరు.

తదేవ కాష్ఠమాదాయ ధర్మమేవానుసంస్మరన్ ।
స్నాత్వా తు గౌతమీం గంగాం తథా యోగేశ్వరం హరిమ్ ॥ 69 ॥

నమస్కృత్వా పునరగాత్కాష్ఠఖండేన వైశ్యకః ।
పరిభ్రమన్నృపపురం మహాపురమితి శ్రుతమ్ ॥ 70 ॥

ఆ హృదయంమీద ఉంచిన కొమ్మను దీసుకొని ధర్మాన్నే స్మరిస్తూ గౌతమీ గంగలో స్నానం చేసి అలాగే యోగేశ్వరుడైన హరికి నమస్కరించి, ఆ కొమ్మముక్కను తీసుకొని ఆ వైశ్యుడు తిరుగుతూ తిరుగుతూ మహాపురమనే పేరుగల రాజనగరికి తిరిగి చేరాడు.

మహారాజ ఇతిఖ్యాతస్తత్ర రాజా మహాబలః ।
తస్య నాస్తి సుతః కశ్చిత్ పుత్రికా నష్టలోచనా ॥ 71 ॥

అక్కడ మహారాజని పేరు పొందిన మహాబలుడు రాజుగా ఉండినాడు. అతనికి కుమారుడు లేదు. కళ్ళులేని ఒక కూతురు మాత్రముండినది.

సైవ తస్య సుతా పుత్రస్తస్యాపి వ్రతమీదృశమ్ ।
దేవో వా దానవో వాఽపి బ్రాహ్మణః క్షత్రియో భవేత్ ॥ 72 ॥

వైశ్యో వా శూద్రయోనిర్వా సగుణో నిర్గుణోఽపి వా ।
తస్మై దేయా ఇయం పుత్రీ యో నేత్రే ఆహరిష్యతి ॥ 73 ॥

ఆ కూతురునే అతడు పుత్రుడిగా భావించాడు. అతడు ఒక నియమాన్ని పెట్టుకొన్నాడు. దేవుడుకాని దానవుడుకాని, బ్రాహ్మణుడుకాని, క్షత్రియుడుకాని, వైశ్యుడుగాని, శూద్రజాతిలో పుట్టినవాడుగానీ, అతడు గుణవంతుడైనా, గుణహీనుడైనా ఎవరు నా కూతురుకు కళ్ళు వచ్చేటట్లుగా చేస్తారో అతనికే నా కూతురును ఇస్తాను.

రాజ్యేన సహ దేయేయమితి రాజా హ్యఘోషయత్ ।
అహర్నిశమసౌ వైశ్యః శ్రుత్వా ఘోషమథాబ్రవీత్ ॥ 74 ॥

అంతేకాక నా రాజ్యంతో కూడా ఈమెనిస్తాను అని రాజు చాటింపు చేయించాడు. రాత్రింబవళ్ళు వారలాగే, చాటించారు. వైశ్యుడా ప్రకటనను విని ఇలా అన్నాడు.

వైశ్య ఉవాచ :– వైశ్యుడు పలికాడు.

అహం నేత్రే ఆహరిష్యే రాజపుత్ర్యా అసంశయమ్ ॥ 75 ॥

నేను రాజకుమారికి కళ్ళు తెప్పిస్తాను. సందియం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తం వైశ్యం తరసాऽऽదాయ మహారాజ్ఞే న్యవేదయత్ ।
తత్కాష్ఠస్పర్శమాత్రేణ సనేత్రాऽభూన్నృపాత్మజా ॥ 76 ॥

భటులా వైశ్యుని దీసుకొనివచ్చి మహారాజు ముందుంచారు. ఆ చెట్టుకొమ్మ స్పర్శమాత్రాననే రాజకూమారికి కళ్ళు వచ్చాయి.

తతః సవిస్మయో రాజా కో భవానితి చాబ్రవీత్ ।
వైశ్యో రాజ్ఞే యథావృత్తం న్యవేదయదశేషతః ॥ 77 ॥

అప్పుడు రాజు ఆశ్చర్యపడి నీవెవరని అడిగాడు. వైశ్యుడు రాజుకు జరిగినదంతా వివరంగా విన్నవించాడు.

వైశ్య ఉవాచ :- వైశ్యుడు పలికాడు.

బ్రాహ్మణానాం ప్రసాదేన ధర్మస్య తపసస్తథా ।
దానప్రభావాద్యజ్ఞైశ్చ వివిధైర్భూరిదక్షిణైః ॥
దివ్యౌషధిప్రభావేణ మమ సామర్థ్యమీదృశమ్ ॥ 78 ॥

బ్రాహ్మణుల అనుగ్రహం, ధర్మాన్ని గూర్చి తపస్సు, దానం ప్రభావం, యజ్ఞం ప్రభావం, అనేక భూరి దక్షిణల నివ్వటంవల్ల, దివ్యమైన ఔషధి ప్రభావంతో నాకిటువంటి శక్తి కలిగింది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతద్వైశ్యవచః శ్రుత్వా విస్మితోఽభూన్మహీపతిః ॥ 79 ॥

ఈ విధంగా చెప్పిన వైశ్యుని మాటలు విని రాజు ఆశ్చర్యపడ్డాడు.

రాజోవాచ :- రాజు పలికాడు.

అహో మహానుభావోఽయం ప్రాయో వృన్దారకో భవేత్ ।
అన్యథైతాదృగన్యస్య సామర్థ్యం దృశ్యతే కథమ్ ॥
తస్మాదస్మై తు తాం కన్యాం ప్రదాస్యే రాజ్యపూర్వికామ్ ॥ 80 ॥

ఆహా! ఈ మహానుభావుడు బహుశః దేవుడై ఉంటాడు. లేకపోతే ఇటువంటి శక్తి ఇతరునిలో ఎలా కనిపిస్తుంది? అందువలన ఇతనికి నా రాజ్యంతో పాటు కూతురిని కూడా సమర్పిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఇతి సంకల్ప్య మనసి కన్యాం రాజ్యం చ దత్తవాన్ ।
విహారార్థం గతః స్వైరం పరం ఖేదముపాగతః ॥ 81 ॥

అని ఇలా రాజు మనస్సులో నిశ్చయించుకొని తన కూతురును, రాజ్యాన్ని ఆ వైశ్యునకిచ్చాడు. ఒకనాడు వైశ్యుడు స్వేచ్ఛగా విహరించడానికి వెళ్ళి మిక్కిలి దుఃఖించాడు.

న మిత్రేణ వినా రాజ్యం న మిత్రేణ వినా సుఖమ్ ।
తమేవ సతతం విప్రం చిన్తయన్ వైశ్యనన్దనః ॥ 82 ॥

మిత్రుడు లేకుండా ఈ రాజ్యమెందుకు? మిత్రుడు లేకుండా సుఖం లేదు. అని మాటమాటికి వైశ్యకుమారుడు తన మిత్రునిగూర్చి చింతిస్తుండేవాడు.

ఏతదేవ సుజాతానాం లక్షణం భువి దేహినామ్ ।
కృపార్ద్రం యన్మనో నిత్యం తేషామప్యహితేషు హి ॥ 83 ॥

తనకపకారం చేసినవానియందు కూడా ఎవని మనస్సు నిత్యమూ దయతో కూడి ఉంటుందో అదే ఈ లోకంలోని ఉత్తమజన్మగల జీవుల లక్షణం.

మహాన్నృపో వనం ప్రాయాత్స రాజా మణికుణ్డలః ।
తస్మిన్ శాసతి రాజ్యం తు కదాచిద్గౌతమం ద్విజమ్ ॥ 84 ॥

మహారాజు తపోవనానికి వెళ్లాడు. మణికంఠుడు రాజైనాడు. అతడు రాజ్యాన్ని పరిపాలిస్తుండగా ఒకనాడు బ్రాహ్మణుడైన గౌతముని

హృతస్వం ద్యూతకైః పాపైరపశ్యన్మణికుణ్డలః ।
తమాదాయ ద్విజం మిత్రం పూజయామాస ధర్మవిత్ ॥ 85 ॥

పాపిష్ఠులైన జూదరులు అతని సొమ్మును దొంగిలించివుండగా ఆ మణికుండలుడు చూచాడు. ధర్మవేత్త అయిన మణికుండలుడు తన మిత్రుడైన బ్రాహ్మణుని తీసుకొనివచ్చి పూజించాడు.

ధర్మాణాం తు ప్రభావం తం తస్మై సర్వం న్యవేదయత్ ।
స్నాపయామాస గంగాయాం తం సర్వాఘనివృత్తయే ॥ 86 ॥

తరువాత ధర్మాల ప్రభావాన్నంతా ఆ బ్రాహ్మణునికి నివేదించాడు. సమస్తపాపాలు తొలగుటకై గంగానదికి తీసుకొనివెళ్ళి స్నానం చేయించాడు.

తేన విప్రేణ సర్వైస్తైః స్వకీయైర్గోత్రజైర్వృతః ।
వైశ్యైః స్వదేశసంభూతైర్బ్రాహ్మణస్య తు బాన్ధవైః ॥ 87 ॥

వృద్ధకౌశికముఖ్యైశ్చ తస్మిన్ యోగేశ్వరాన్తికే ।
యజ్ఞానిష్ట్వా సురాన్ పూజ్య తతః స్వర్గముపేయివాన్ ॥ 88 ॥

ఆ బ్రాహ్మణునితో, తన గోత్రజులైన వైశ్యులందరితోను, తన దేశంలో పుట్టినవారితోను, బ్రాహ్మణుని బంధువులతోను, వృద్ధకౌశికుడు మున్నగు పెద్దలతోను ఆ యోగేశ్వరుని సన్నిధిలో యజ్ఞాలను చేసి, దేవతలను పూజించి, అటుతరువాత స్వర్గాన్ని పొందాడు.

తతః ప్రభృతి తత్తీర్థం మృతసంజీవనం విదుః ।
చక్షుస్తీర్థం సయోగేశం స్మరణాదపి పుణ్యదమ్ ॥
మనః ప్రసాదజననం సర్వదుఃఖవినాశనమ్ ॥ 89 ॥

అప్పటినుండి ఆ తీర్థాన్ని మృతసంజీవనం, చక్షుస్తీర్థం, సయోగేశమనే పేర్లతో పిలుస్తారు. దానిని స్మరించినంత మాత్రాన్నే పుణ్యాణ్యాన్నిస్తుంది. మనస్సునకు శాంతి కలిగిస్తుంది. సమస్తదుఃఖాలను నశింపజేస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే చక్షుస్తీర్థ వర్ణనం నామ శతతమోఽధ్యాయః. ॥ 100 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యములోని చక్షుస్తీర్థ వర్ణనమనే పేరుగల నూరవ అధ్యాయం సంపూర్ణం.

ఏకశతతమోஉధ్యాయః – నూట ఒకటవ అధ్యాయం

ఉర్వశ్యాదితీర్థవర్ణనమ్ – ఉర్వశీ మొదలైన తీర్థాల వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఉర్వశీతీర్థమాఖ్యాతమశ్వమేధఫలప్రదమ్ ।
స్నానదానమహాదేవవాసుదేవార్చనాదిభిః ॥ 1 ॥

ఉర్వశీ తీర్థమనే నది స్నానదానాదులతో, మహాదేవ, వాసుదేవుల పూజాదులతో అశ్వమేధ యజ్ఞఫల మిస్తుంది అని బాగా ప్రసిద్ధమైంది.

మహేశ్వరో యత్ర దేవో యత్ర శార్ఙ్గధరో హరిః ।
ప్రమతిర్నామ రాజాஉஉసీత్సార్వభౌమః ప్రతాపవాన్ ॥ 2 ॥

దేవుడైన మహేశ్వరుడు శార్ఙ్గధరుడైన హరి ఎక్కడ వుండేవారో ఆ ప్రదేశాన ప్రమతి అనే రాజుండేవాడు. అతడు గొప్ప ప్రతాపవంతుడు సార్వభౌముడు అయి ఉండేవాడు.

రిపూన్ జిత్వా జగామాஉஉశు ఇన్ద్రలోకం సురైర్వృతమ్ ।
తత్రాపశ్యత్సురపతిం మరుద్భిః సహ నారద ॥ 3 ॥

ఓ నారదా! అతడు శత్రువులను జయించి వేగంగా దేవతలతో కూడివున్న ఇంద్రలోకానికి వెళ్లాడు. అక్కడ మరుద్గణాలతో వున్న ఇంద్రుని చూశాడు.

జహాసేన్ద్రం పాశహస్తం ప్రమతిః క్షత్రియర్షభః ।
తం హసన్తమథాஉஉలక్ష్య హరిః ప్రమతిమబ్రవీత్ ॥ 4 ॥

క్షత్రియశ్రేష్ఠుడైన ప్రమతి పాశహస్తుడైవున్న ఇంద్రుని చూచి నవ్వాడు. అలా నవ్వుతున్న ప్రమతిని గుర్తించి ఇంద్రు డతనితో ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

దేవాలయే మహాబుద్ధే మరుద్భిః క్రీడితైరలమ్ ।
దిశో జిత్వా దివం ప్రాప్తః కురు క్రీడాం మయా సహ ॥ 5 ॥

ఓ మహాబుద్ధీ! దేవలోకంలో మరుత్తులతో ఆడిన ఆట చాలు. దిక్కులను జయించి స్వర్గానికి చేరావు. నాతో ఆటలాడుకో.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సకషాయం హరివచో నిశమ్య ప్రమతిర్నృపః ।
తథేత్యువాచ దేవేన్ద్రం నిష్కృతిం కాం తు మన్యసే ॥
తచ్ఛ్రుత్వా ప్రమతేర్వాక్యం సురరాణ్నృపమబ్రవీత్ ॥ 6 ॥

కోపాన్ని కలిగించే విధంగా ఉన్న ఇంద్రుని మాటలు విన్న ప్రమతిరాజు దేవేంద్రునితో సరే అలాగేకాని అని పణంగా దేనినెన్నుకొంటావని అడుగగా ఆ మాట విని దేవేంద్రుడు ప్రమతితో ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు పలికాడు.

ఉర్వశ్యేవ పణోఽస్మాకం ప్రాప్యా యా నిఖిలైర్మఖైః ।
ఉర్వశీం నిష్కృతిం మన్యే త్వం రాజన్ కిం ను మన్యసే ॥ 7 ॥

సమస్త యజ్ఞాలతో ఏ ఉర్వశి పొందదగిందో ఆ ఉర్వశినే మనకు పందెంగా ఒడ్డుతున్నాను. ఓ రాజా! నీవు దాని కంగీకరిస్తావా?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వేంద్రవచనం ప్రమతిః ప్రాహ గర్వితః ।
యద్బ్రవీషి సురేశాన తన్మన్యేఽహం శతక్రతో ॥ 8 ॥

ఇలా పలికిన ఇంద్రుని మాటను విని ప్రమతి గర్వంతో ఓ సురేశ్వరా! నీవు ఏమంటావో దానికి ఓ శతక్రతూ! నేనంగీకరిస్తాను.

ప్రాహేన్ద్రః ప్రమతిం తద్వన్నిష్కృత్యై దక్షిణం కరమ్ ।
సవర్మ సశరం ధర్మ్యం దేహి దీవ్యామహే వయమ్ ॥ 9 ॥

అప్పుడింద్రుడు ప్రమతితో కవచంతోనూ, బాణంతో కూడిన నీ కుడి చేతిని ధర్మబద్ధంగా నిష్కృతిగా ఇవ్వు. అప్పుడు మనం జూదమాడదాం.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తావేవం సంవిదం కృత్వా దేవనాయోపతస్థతుః ।
ప్రమతిర్జితవాంస్తత్ర ఉర్వశీం దైవత స్త్రియమ్ ॥

తాం జిత్వా ప్రమతిః ప్రాహ సంరంభాత్తం శతక్రతుమ్ ॥ 10 ॥

వారిద్దరిలా సంవాదం చేసుకొని జూదానికి కూర్చొన్నారు. ఆ ఆటలో అక్కడ దేవతా స్త్రీ అయిన ఉర్వశిని ప్రమతి జయించాడు. ఆమెను జయించి తొట్రుపాటుపడుతున్న ఇంద్రునితో ప్రమతి ఇలా అన్నాడు.

ప్రమతి రువాచ:– ప్రమతి పలికాడు.

నిష్కృత్యై పునరన్యన్మే పశ్చాద్దీవ్యే త్వయా ప్రభో ॥ 11 ॥

ప్రభూ! మరల ఒకమారు పందెమునకై నీతో ఆడుతాను.

ఇంద్ర ఉవాచ:– ఇంద్రుడు పలికాడు.

దేవయోగ్యమథో వజ్రం జైత్రం సరథముత్తమమ్ ।
దీవ్యేఽహం తేన నృపతే కరేణాప్యవిచారయన్ ॥ 12 ॥

ఓ రాజా! ఇక ఇప్పుడు విజయశీలం అయిన రథంతో కూడినదీ, దేవతలకి యోగ్యం అయిన వజ్రాన్నీ నీ చేతితో కూడా విచారం లేకుండా పణంగా ఒడ్డుతున్నాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

స గృహీత్వా తదా పాశానన్యాంశ్చ మణిభూషితాన్ ।
జితమిత్యబ్రవీచ్ఛక్రం ప్రమతిః ప్రహసం స్తదా ॥ 13 ॥

అప్పుడా ప్రమతి పాచికలను, ఇతర మణిభూషణాలను తీసుకొని నవ్వుతూ ఇంద్రునితో నేను గెలిచా నన్నాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాయాదక్షజ్ఞస్తత్ర నారద ।
విశ్వావసురితి ఖ్యాతో గన్ధర్వాణాం మహేశ్వరః ॥ 14 ॥

ఓ నారదా! ఇంతలో అక్షవిద్య బాగా తెలిసిన గంధర్వరాజైన విశ్వావసు వనువాడు అక్కడికి వచ్చాడు.

విశ్వావసురువాచ :- విశ్వావసువు పలికాడు.

గన్ధర్వవిద్యయా రాజంస్తయా దీవ్యామహే త్వయా ।
తథేత్యుక్త్వా స నృపతిర్జితమిత్యబ్రవీత్తదా ॥ 15 ॥

ఓ రాజా! నీతో ఆ గంధర్వవిద్యతో ఆడుదామనగా సరే అని ఆడి ప్రమతిరాజు నేను గెలిచా నన్నాడు.

తౌ జిత్వా నృపతిర్మౌర్ఖ్యాద్దేవేన్ద్రం ప్రాహ కశ్మలమ్ ॥ 16 ॥

వారిద్దరిని గెలిచి ప్రమతిరాజు మూర్ఖంగా అవమానభారంతో సిగ్గుపడుతున్న దేవేంద్రునితో ఇలా అన్నాడు.

ప్రమతి రువాచ:- ప్రమతి పలికాడు.

రణే వా దేవనే వాఽపి న త్వం జేతా కథంచన ।
మహేన్ద్ర సతతం తస్మాదస్మదారాధకో భవ ॥
వద కేన ప్రకారేణ జాతా దేవేన్ద్రతా తవ ॥ 17 ॥

ఓ మహేంద్రా! యుద్ధంలోకాని, ద్యూతంలో గాని నీవెప్పుడూ గెలువలేవు. అందువలన నీవు మా ఆరాధకునిగా సేవకునిగా ఉండు. నీకేవిధంగా యీ దేవేంద్ర పదవి కలిగింది వివరించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథా ప్రాహోర్వశీం గర్వాద్గచ్ఛ కర్మకరీ భవ ।
ఊర్వశీ ప్రాహ దేవేషు యథా వర్తే తథా త్వయి ॥
వర్తేయ సర్వభావేన న మాం ధిక్కర్తుమర్హసి ॥ 18 ॥

అప్పుడు ప్రమతి గర్వంగా ఊర్వశితో వెళ్ళు నీ పని నీవు చూచుకో అనగా అప్పుడు ఉర్వశి దేవతలయందు ఎలా ప్రవర్తిస్తానో అలాగే నీకు కూడా సేవచేస్తాను. నీవు నన్ను చిన్నచూపుగా ఛీకొట్టుట తగింది కాదు అన్నది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తతస్తాం ప్రమతిః ప్రాహ త్వాదృశ్యః సన్తి చారికాః ।
త్వం కిం విలజ్జసే భద్రే గచ్ఛ కర్మకరీ భవ ॥ 19 ॥

అప్పుడు ప్రమతి ఆమెతో నీలాంటివాళ్ళనేకులు పరిచారిక లున్నారు. నీవెందుకు సిగ్గుపడుతున్నావు? ఓ శుభకరురాలా! వెళ్ళు. నీపని నీవు చేయి.

ఏతచ్ఛ్రుత్వా నృపేణోక్తం గన్ధర్వాధిపతిస్తదా ।

చిత్రసేన ఇతి ఖ్యాతః సుతో విశ్వావసోర్బలీ ॥ 20 ॥

రాజిలా చెప్పగా విశ్వావసువు కుమారుడూ, బలవంతుడూ, గంధర్వాధిపతీ అయిన చిత్రసేను డనేవాడు ఇది విని ఇలా అన్నాడు.

చిత్రసేన ఉవాచ :– చిత్రసేనుడు పలికాడు.

దీవ్యేఽహం వై త్వయా రాజన్ సర్వేణానేన భూపతే ।
రాజ్యేన జీవితేనాపి మదీయేన తవాపి చ ॥ 21 ॥

ఓ రాజా! నేను నీతో జూదమాడతాను. ఓ భూపతీ! నా రాజ్యం, జీవితం సర్వం పణంగా పెడుతున్నాను. నీది కూడా అలాగే పణంగా పెట్టు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా పునరుభౌ చిత్రసేననృపోత్తమౌ ।
దీవ్యేతామభిసంరబ్ధౌ చిత్రసేనోఽజయత్తదా ॥ 22 ॥

అలాగేనని చిత్రసేనుడు, రాజశ్రేష్ఠుడు ఇద్దరును మిక్కిలి సంరంభంతో జూదమాడారు. అప్పుడు చిత్రసేనుడు గెలిచాడు.

గాన్ధర్వైస్తం మహాపాశైర్బబంధ నృపతిం తదా ।
చిత్రసేనోఽజయత్సర్వముర్వశీముఖ్యమాదితః ॥ 23 ॥

అప్పుడు గాంధర్వపాశాలతో రాజును బంధించాడు. ఉర్వశి మొదలగు ముఖ్యమైన వారిని చిత్రసేనుడు గెలిచాడు.

రాజ్యం కోశం బలం చైవ యదన్యద్వసు కించన ।
చిత్రసేనస్య తజ్జాతం యదాసీత్ప్రమతేర్ధనమ్ ॥ 24 ॥

ప్రమతికి సంబంధించిన ధనం, రాజ్యం, కోశాగారం, సైన్యబలం మొదలైనవన్నీ చిత్రసేనుని వశమైనాయి.

తస్య పుత్రో బాల ఏవ పురోధసమువాచ హ ।
వైశ్వామిత్రం మహాప్రాజ్ఞం మధుచ్ఛన్దసమోజసా ॥ 25 ॥

ప్రమతి కుమారుడు చిన్నవాడే. అయినా జ్ఞానీ, పురోహితుడూ, విశ్వామిత్రుని కొడుకూ అయిన మధచ్ఛందసునితో ఈ విధంగా అన్నాడు.

ప్రమతి పుత్ర ఉవాచ:– ప్రమతి పుత్రుడు పలికాడు.

కిం మే పిత్రా కృతం పాపం క్వ వా బద్ధో మహామతిః ।
కథమేష్యతి స్వం స్థానం కథం పాశైర్విమోక్ష్యతే ॥ 26 ॥

నా తండ్రి చేసిన పాపమేమి? ఆ మహామతి ఎక్కడ బందీ అయినాడు? పాశాలనుండెలా తప్పించు కోగలడు? తిరిగి స్వస్థానానికెలా వస్తాడు?

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సుమతేర్వచనం శ్రుత్వా ధ్యాత్వా స మునిసత్తమః ।
మధుచ్ఛన్దా జగాదేదం ప్రమతేర్వర్తనం తదా ॥ 27 ॥

సుమతి మాటలను విన్న మునిసత్తముడైన మధుచ్ఛందుడు తన ధ్యానంలో చూచి ప్రమతి స్థితి నప్పుడిలా చెప్పాడు.

మధుచ్ఛన్ద ఉవాచ :– మధుచ్ఛన్దుడు పలికాడు.

దేవలోకే తవ పితా బద్ధ ఆస్తే మహామతే ।
కైతవైర్బహుదోషైశ్చ భ్రష్టరాజ్యో బభూవ హ ॥ 28 ॥

ఓ మహామతీ! నీ తండ్రి దేవలోకంలో బందీ అయి ఉన్నాడు. మోసాలతో (జూదం), అనేక దోషాలతో కూడిన జూదగాండ్రతో జూదం ఆడి రాజ్యాన్ని పొగొట్టుకొన్నాడు.

యో యాతి కైతవసభాం స చాపి క్లేశభాగ్భవేత్ ।
ద్యూతమద్యామిషాదీని వ్యసనాని నృపాత్మజ ॥ 29 ॥

ఓ రాజకుమారా! జూదశాల కెవడు వెళతాడో వాడు క్లేశాలను పొందుతాడు. జూదం, మద్యం, మాంసం అనేవి వ్యసనాలు.

పాపినామిహ జాయన్తే సదా పాపాత్మకాని చ ।
ఏకైకమప్యనర్థాయ పాపాయ నరకాయ చ ॥ 30 ॥

పాపాత్మకాలైన ఇవి ఈ లోకంలో పాపులకే కలుగుతాయి. ఒక్కొక్కటి అనర్థానికి, పాపానికి నరకానికి కారణం అవుతాయి.

యానాసనాభిలాషాద్యైః కృతైః కైతవవర్త్మభిః ।
కులీనాః కలహప్రీతాః కిం పునః కితవో జనః ॥ 31 ॥

వాహనాలు, అధికారపీఠాలు మున్నగువాటిని కోరేవారు చేసే మోసం (కారుల)చేత మంచివారు కూడా కలహప్రియు లవుతారు. ఇక జూదగాళ్ళ విషయంలో ఏ మున్నది?

కితవస్య తు యా జాయా తప్యతే నిత్యమేవ సా ।
స చాపి కితవః పాపో యోషితం వీక్ష్య తప్యతే ॥ 32 ॥

జూదగాడి భార్య నిత్యం తపించి పోతుంది. ఆ జూదగాడు కూడా పాపి కనుక భార్యను చూచి బాధపడతాడు.

తాం దృష్ట్వా విగతానన్దో నిత్యం వదతి పాపకృత్ ।
అహో సంసారచక్రేఽస్మిన్ మయా తుల్యో న పాతకీ ॥ 33 ॥

ఆ పాపి ఆమెను చూచి సంతోషమనేది లేక నిత్యం ఏదో ఒకటి అంటుండేవాడు. ఆహా! ఈ సంసారచక్రంలో నావంటి పాతకుడు లేడు.

న కించిదపి యస్యాఽఽస్తే లోకే విషయజం సుఖమ్ ।

లోకద్వయేఽపి న సుఖీ కితవః కోఽపి దృశ్యతే ॥ 34 ॥

లోకంలో విషయాల వల్ల పుట్టే సుఖం కొంచెం కూడా ఉండదు. జూదగాడు ఎవడైనా రెండులోకాలలోనూ సుఖంగా ఉన్నట్లు కనపడదు.

విభాతి చ తథా నిత్యం లజ్జయా దగ్ధమానసః ।
గతధర్మో నిరానన్దో గ్రస్తగర్వస్తథాఽటతి ॥ 35 ॥

అలా నిత్యం సిగ్గుతో మనస్సు కాలిపోయి కన్పిస్తాడు. అటువంటివాడు ధర్మం పోయి, ఆనన్దం పోయి గర్వంతో మింగబడి ఇటు అటు తిరుగుతాడు.

అకైతవీ చ యా వృత్తిః సా ప్రశస్తా ద్విజన్మనామ్ ।
కృషిగోరక్షవాణిజ్యమపి కుర్యాన్నకైతవమ్ ॥ 36 ॥

బ్రాహ్మణులకు మోసం చేయకుండా ప్రవర్తించే నడవడికే ప్రశస్తమైంది. వ్యవసాయం, గోవులను రక్షించడం, వ్యాపారం కూడా మోసం లేకుండా చేయవచ్చు.

యస్తు కైతవవృత్యా హి ధనమాహర్తుమిచ్ఛతి ।
ధర్మార్థకామాభిజనైః స విముచ్యేత పౌరుషాత్ ॥ 37 ॥

ఎవడు మోసప్రవృత్తితో ధనాన్ని సంపాదించాలని కోరుకుంటాడో అటువంటివాడు ధర్మం, అర్థం, కామం, బంధువులు, పౌరుషం వదులుకోవలసి వస్తుంది.

వేదేఽపి దూషితం కర్మ తవ పిత్రా తదాఽఽహృతమ్ ।
తస్మాత్కిం కుర్మహే వత్స యదుక్తం తే విధీయతే ॥ 38 ॥

వేదంలో చేయకూడదని నిషేధించిన పనిని నీతండ్రి అప్పుడు చేసినాడు. నాయనా! దానివలన మనమేం చేస్తాం. శాస్త్రంలో యేది చెప్పబడినదో అదే నీకు విధించబడుతున్నది.

విధాతృవిహితం మార్గం కోను వాఽత్యేతి పణ్డితః ॥ 39 ॥

బ్రహ్మ విధించిన మార్గాన్ని ఏ పండితుడు దాటగలడు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతత్పురోధసో వాక్యం శ్రుత్వా సుమతిరబ్రవీత్ ॥ 40 ॥

ఈ పురోహితుని మాటలు విన్న సుమతి అతనితో ఇలా అన్నాడు.

సుమతి రువాచ :- సుమతి పలికాడు.

కిం కృత్వా ప్రమతిస్తాతః పునా రాజ్యమవాప్నుయాత్ ॥ 41 ॥

స్వామీ! ఏమి చేస్తే ప్రమతి తిరిగి రాజ్యాన్ని పొందుతాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పునర్ధ్యాత్వా మధుచ్ఛన్దాః సుమతిం చేదమబ్రవీత్ ॥ 42 ॥

మధుచ్ఛందుడు తిరిగి ధ్యానించి సుమతితో ఇలా అన్నాడు.

గౌతమీం యాహి వత్స త్వం తత్ర పూజయ శంకరమ్ ।

అదితిం వరుణం విష్ణుం తతః పాశాద్విమోక్ష్యతే ॥ 43 ॥

నాయనా! నీవు గౌతమీనది వద్దకు వెళ్ళు. అక్కడ శంకరుని, అదితిని, వరుణుని, విష్ణువును పూజించు. అప్పుడతడు పాశంనుండి విముక్తుడు కాగలడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తథేత్యుక్త్వా జగామాఽఽశు గంగాం నత్వా జనార్దనమ్ ।
పూజయామాస శమ్భుం చ తపస్తేపే యతవ్రతః ॥ 44 ॥

అతడు సరేనని వేగంగా గంగకు వెళ్ళి జనార్దనునకు, శంభునకు నమస్కరించి పూజించాడు. నియమంతో తపస్సు చేశాడు.

సహస్రమేకం వర్షాణాం బద్ధం పితరమాత్మనః ।
మోచయామాస దేవేభ్యః పునా రాజ్యమవాప సః ॥ 45 ॥

వేయి సంవత్సరాలు బందీగావున్న తన తండ్రిని దేవతలనుండి విడిపించాడు. ప్రమతి తిరిగి రాజ్యాన్ని పొందాడు.

శివేశాభ్యాం ముక్తపాశో రాజ్యం ప్రాప సుతాత్స్వకాత్ ।
అవాప్య విద్యాం గాన్ధర్వీం ప్రియశ్చాఽఽసీచ్ఛతక్రతోః ॥ 46 ॥

శివకేశవులవలన పాశాలనుండి విముక్తిపొంది, తన కుమారునివలన రాజ్యాన్ని పొందాడు. గాంధర్వవిద్యను పొంది ఇంద్రునికి ప్రియమైనవాడైనాడు.

శామ్భవం వైష్ణవం చైవ ఉర్వశీతీర్థమేవ చ ।
తతః ప్రభృతి తత్తీర్థం కైతవం చేతి విశ్రుతమ్ ॥ 47 ॥

శామ్భవ తీర్థం, వైష్ణవ తీరం, ఉర్వశీ తీర్థం అనేది అప్పటి నుండి కైతవ తీర్థమని పేరుపొందింది.

శివవిష్ణుసరిన్మాతృప్రసాదాదాప్యతే న కిమ్ ।
తత్ర స్నానం చ దానం చ బహుపుణ్యఫలప్రదమ్ ॥
పాపపాశవిమోక్తం తు సర్వదుర్గతినాశనమ్ ॥ 48 ॥

శివుడు, విష్ణువు, నదీమతల్లియైన గౌతమి అనుగ్రహముంటే ఏది లభించకుండా ఉంటుంది? అక్కడ స్నానం, దానం చేస్తే అనేక పుణ్యఫలాల నిస్తుంది. ఆ తీర్థం పాపపాశాలను త్రెంచుటే కాక దుర్గతులన్నిటినీ నశింపచేస్తుంది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఉర్వశ్యాదితీర్థవర్ణనం నామైకాధికశతతమోఽధ్యాయః. ॥ 101 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థమాహాత్మ్యములోని ఉర్వశీ మొదలైన తీర్థ వర్ణనమనే పేరుగల నూట ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వ్యధిక శతతమోఽధ్యాయః – నూట రెండవ అధ్యాయం

సప్తధా గోదావరీ సముద్రగమన వర్ణనమ్ –గోదావరి ఏడు విధాలుగా సముద్రుని పొందుటను వర్ణించుట

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

సాముద్రం తీర్థమాఖ్యాతం సర్వతీర్థఫలప్రదమ్ ।
తస్య స్వరూపం వక్ష్యామి శృణు నారద తన్మనాః ॥ 1 ॥

ఓ నారదా! సాముద్రతీర్థమనే నది ఉంది. అది అన్ని తీర్థాల ఫలాల నిస్తుంది. ఆ తీర్థం స్వరూపాన్ని చెబుతున్నాను. తన్మయుడవై విను.

విసృష్టా గౌతమేనాసౌ గంగా పాపప్రణాశినీ ।
లోకానాముపకారార్థం ప్రాయాత్ పూర్వార్ణవం ప్రతి ॥ 2 ॥

పాపాలను నశింపజేసే గంగను గౌతముడు సృష్టించాడు. లోకాల కుపకారం చేయటానికి సృష్టించిన గంగ తూర్పుసముద్రం వైపు వెళ్లింది.

ఆగచ్ఛన్తీ దేవనదీ కమణ్డలుధృతా మయా ।
శిరసా చ ధృతా దేవీ శంభునా పరమాత్మనా ॥ 3 ॥

వస్తున్న దేవనదిని నేను కమండలంతో ధరించాను. పరమాత్మయైన శివుడు తలపై ధరించాడు.

విష్ణుపాదప్రసూతాం తాం బ్రాహ్మణేన మహాత్మనా ।
ఆనీతాం మర్త్యభవనం స్మరణాదఘనాశినీమ్ ॥ 4 ॥

గురోర్గురుతమాం సిన్ధుర్దృష్ట్వా కృత్యమచిన్తయత్ ।
యా వన్ద్యా జగతామీశా బ్రహ్మేశాద్యైర్నమస్కృతా ॥ 5 ॥

తామహం ప్రతిగచ్ఛేయం నో చేత్స్యాద్ధర్మదూషణమ్ ।
ఆగచ్ఛన్తం మహాత్మానం యో మోహాన్నోపతిష్ఠతే॥ 6 ॥

న తస్య కోఽపి త్రాతాఽస్తి పాపినో లోకయోర్ద్వయోః ।
ఏవం విమృశ్య రత్నేశో మూర్తిమాన్వినయాన్వితః ॥ 7 ॥
కృతాంజలిపుటో గంగామాహేదం సరితాంపతిః ॥

విష్ణుపాదాలనుండి పుట్టినదానిని, మహాత్ముడైన బ్రాహ్మణుడు ఈ భూలోకానికి తెచ్చిన దానిని, స్మరించినంత మాత్రముననే పాపాలను హరించు దానిని, గొప్పనైనవారిలోకెల్లా గొప్పదైన దానిని సముద్రుడు చూచి చేయవలసినది ఏమిటని చింతించాడు. ఏ నది ఐతే స్తోత్రం చేయదగినదో, జగత్తు కంతా ఈశ్వరియో, బ్రహ్మశివాదులందరూ నమస్కరిస్తారో, నేనామె కెదురుగా వెళ్తాను. లేకపోతే ధర్మాన్ని దూషించినట్లవుతుంది. మహాత్ముడు వస్తున్నప్పు డెదురుగా ఎవడు నిలచి ఉంటాడో, గర్వపడతాడో, అటువంటి పాపిని రక్షించే వాడెవడూ ఇహ పర లోకాలలో

లేదు. ఇలా ఆలోచించిన సముద్రుడు మూర్తిమంతుడై వినయంగా, రెండు చేతులెత్తి నమస్కరిస్తూ ఆ సరిత్పతి గంగతో ఇలా అన్నాడు.

సిన్ధురువాచ :- సముద్రుడు పలికాడు.

రసాతలగతం వారి పృథివ్యాం యన్నభస్తలే ।
తన్మామేవాత్ర విశతు నాహం వక్ష్యామి కించన ॥ 8 ॥

ఆకాశంలోని నీరూ, రసాతలానికి వెళ్ళే నీరూ, ఈ భూమిలోనిదీ ఈ మూడూ ఇక్కడ నన్నే పొందాలి. నా లోనే ప్రవేశించాలి. నేనింతకంటె ఏమీ చెప్పను.

మయి రత్నాని పీయూషం పర్వతా రాక్షసాః సురాః ।
ఏతానప్యఖిలానన్యాన్ భీమాన్ సంధారయామ్యహమ్ ॥ 9 ॥

నాలో రత్నాలు, అమృతం, పర్వతాలు, రాక్షసులు, దేవతలూ ఉన్నారు. వీరినే కాక ఇంకా ఇతరమైన భయంకరమైన వానిని నేను ధరిస్తున్నాను.

మమాన్తః కమలాయుక్తో విష్ణుః స్వపితి నిత్యదా ।
మమాశక్యం నకిమపి విద్యతే సచరాచరే ॥ 10 ॥

నా లోపల లక్ష్మీదేవితోగూడ విష్ణువు ఎప్పుడూ నిద్రిస్తూ ఉంటాడు. ఈ చరాచర జగత్తునందు నాకు శక్యం కానిదేదీ లేదు.

మహత్యభ్యాగతే కుర్యాత్ప్రత్యుత్థానం న యో మదాత్ ।
స ధర్మాదిపరిభ్రష్టో నిరయం తు సమాప్నుయాత్ ॥ 11 ॥

పెద్దలు వచ్చినప్పు డెవడు గర్వంతో లేచి నిలబడడో అతడు ధర్మాది భ్రష్టుడై నరకానికి పోతాడు.

నైతాన్మే బిభ్రతః ఖేదో వినాఽగస్త్యపరాభవాత్ ।
కిం తు త్వం గౌరవేణైషామతిరిక్తా తతస్త్వహమ్ ॥ 12 ॥

వీటినన్నింటినీ మోస్తున్న నాకు అగస్త్యుని వలన జరిగిన పరాభవం కంటె వేరే దుఃఖం లేదు. కానీ నేను ధరించే పై అన్నింటిలోనూ గౌరవంగా చూడవలసిన దానివి నీవు. ఆ తర్వాతే నా గౌరవం.

బ్రవీమి దేవి గంగే వా త్వం సామ్యాత్సంగతా భవ ।
నైకరూపామహం శక్తః సంగన్తుం బహుధా యది ॥ 13 ॥

ఓ గంగాదేవీ! సామ్యంవలన నీవు నాతో సంగమించు. అనేకరూపాలుగా వున్న నిన్ను నీవుకోరినట్లైతే అనేకవిధాలుగా సంగమించడానికి నేను సమర్థుడనని చెబుతున్నాను.

సంగమేష్యసి దేవి త్వం సంగచ్ఛేఽహం న చాన్యథా ।
గంగే సమేష్యసి యది బహుధా తద్విచారయే ॥ 14 ॥

దేవీ! నీవు సంగమించుట కిష్టపడితే నేను సంగమాన్ని పొందుతాను. లేనిచో లేదు. ఓ గంగా! నీవు చక్కగా వచ్చెదవా లేక బహువిధాలుగానా? విచారిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తమేవం వాదినం సిన్ధుమపామీశం తదాఽబ్రవీత్ ।
గంగా సా గౌతమీదేవీ కురు చైతద్వచో మమ ॥15॥

ఇలా మాట్లాడుతున్న జలాధీశుడైన సింధువుతో ఆ గౌతమిగంగ ఇలా అంది. నీవు నా యీ మాటను నిర్వర్తించు.

సప్తర్షీణాం చ యా భార్యా అరున్ధతిపురోగమాః ।
భర్తృభిః సహితాః సర్వా ఆనయ త్వం తదా త్వహమ్ ॥ 16 ॥

అల్పభూతా భవిష్యామి తతః స్యాం తవ సంగతా ।
సప్తర్షీణాం తథేత్యుక్త్వా భార్యాభిరృషిభిర్వృతః ॥ 17 ॥

ఆనయామాస తాం దేవీం సప్తధా సా వ్యభజ్యత ।
సా చేయం గౌతమీ గంగా సప్తధా సాగరం గతా ॥ 18 ॥

సప్తఋషుల యొక్క భార్యలు అరుంధతిని ముందుంచుకొని వారి భర్తలతో గూడి అందరినీ తీసుకొని రా. అప్పుడు నేను, చిన్నదానిగా మారుతాను. అటుతరువాత నీతో సంగమిస్తాను. అతడు సరేనని చెప్పి సప్తఋషులను భార్యలతో కూడినవాడై తీసుకొనివచ్చాడు. అప్పుడా నదీదేవి ఏడుగా విభజించబడి తీసుకురాబడింది. ఆ గౌతమీగంగయే ఏడు విధాలుగా సాగరుని చేరింది.

సప్తర్షీణాం తు నామ్నైతా సప్తగంగాస్తతోఽభవన్ ।
తత్ర స్నానం చ దానం చ శ్రవణం పఠనం తథా ॥ 19 ॥

స్మరణం చాపి యద్భక్త్యా సర్వకామప్రదం శుభమ్ ।
నాస్మాదన్యత్పరం తీర్థం సముద్రాద్భువనత్రయే॥
పాపహానౌ భుక్తిముక్తిప్రాప్తౌ చ మనసో ముదే ॥ 20 ॥

సప్తఋషుల పేర్లతో ఈ గౌతమి ఏడు గంగలుగా అయింది. అక్కడ స్నానం, దానం, శ్రవణం, పఠనమూ, స్మరణం కూడా భక్తితో చేస్తే కోరికలన్నీ నెరవేరుస్తుంది. శుభమైంది. ఈ సప్తగంగతో కూడిన సముద్రం కంటె పరమైన తీర్థం ముల్లోకాలలో లేదు. పాపాన్ని తొలగించటంలో, భుక్తిని, ముక్తిని యిష్టంలో మనస్సు కానందం, కలిగించటంలో దీనికి ఏదీ సాటిరాదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే సప్తధా గోదావరీ సముద్రాగమనవర్ణనం నామ ద్వ్యధికశతతమోఽధ్యాయః. ॥ 102 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యంలోని గోదావరి ఏడు విధాలుగా సముద్రుని పొందుటాన్ని వర్ణించటం నూట రెండవ అధ్యాయం సంపూర్ణం.

త్ర్యధిక శతతమోఽధ్యాయః – నూట మూడవ అధ్యాయం

ఋషి సత్ర భీమేశ్వర తీర్థవర్ణనమ్ – ఋషిసత్ర భీమేశ్వర తీర్థ వర్ణనం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఋషిసత్రమితి ఖ్యాతమృషయః సప్త నారద ।
నిషేదుస్తపసే యత్ర యత్ర భీమేశ్వరః శివః ॥ 1 ॥

ఓ నారదా! సప్తఋషులు ఎక్కడ తపస్సుకోసం చేరారో, ఎక్కడ భీమేశ్వరుడనే పేరుతో శివుడున్నాడో అక్కడ ఋషిసత్రమనే పేరుగల తీర్థముంది.

తత్రేదం వృత్తమాఖ్యాస్యే దేవర్షిపితృబృంహితమ్ ।
శృణు యత్నేన వక్ష్యామి సర్వకామప్రదం శుభమ్ ॥ 2 ॥

దేవతలు, ఋషులు, పితరులు చెప్పిన ఆ కథను చెబుతున్నాను. శ్రద్ధగావిను. అది అన్ని కోరికలూ తీరుస్తూ శుభాన్నిస్తుంది.

సప్తధా వ్యభజన్గంగామృషయః సప్త నారద ।
వాసిష్ఠీ దాక్షిణేయా స్యాద్వైశ్వామిత్రీ తదుత్తరా ॥ 3 ॥

వామదేవ్యపరా జ్ఞేయా గౌతమీ మధ్యతః శుభా ।
భారద్వాజీ స్మృతా చాన్యా ఆత్రేయా చేత్యథాపరా ॥ 4 ॥

జామదగ్నీ తథా చాన్యా వ్యపదిష్టా తు సప్తధా ।
తైస్సర్వైరృషిభిస్తత్ర యష్టుమిష్టైర్మహాత్మభిః ॥ 5 ॥

నిష్పాదితం మహాసత్రమృషిభిః పారదర్శిభిః ।
ఏతస్మిన్నన్తరే తత్ర దేవానాం ప్రబలో రిపుః ॥
విశ్వరూప ఇతి ఖ్యాతో మునీనాం సత్రమభ్యగాత్ ॥ 6 ॥
బ్రహ్మచర్యేణ తపసా తానారాధ్య యథావిధి ॥
వినయేనాథ పప్రచ్ఛ ఋషీన్ సర్వాననుక్రమాత్ ॥ 7 ॥

నారదా! ఆ సప్తఋషులు గంగను ఏడు విధాలుగా విభజించారు. వానిలో వాసిష్ఠి దక్షిణాభిముఖంగా, వైశ్వామిత్రి ఉత్తరాభిముఖంగానూ, మరొకటి వామదేవీ, మధ్యనుండి శుభమైన గౌతమీ, ఇంకొకటి భారద్వాజీ, వేరొకటి ఆత్రేయా, మరొకటి జామదగ్నీ ఇలా ఏడుగా విభజించబడింది. మహాత్ములైన ఋషులందరూ అక్కడ యజ్ఞాలు చేయటానికి, పారదర్శకులైన ఋషులందరు మహాసత్రయాగాన్ని సంకల్పించారు. ఇంతలో అక్కడికి దేవతల ప్రబల శత్రువైన, విశ్వరూపుడనేవాడు మునుల సత్రయాగానికి వచ్చాడు. బ్రహ్మచర్యంతో, తపస్సుతో మునుల నారాధించి, ఋషులందరిని ఒక్కొక్కరిని వినయంగా ఇలా ప్రశ్నించాడు.

విశ్వరూప ఉవాచ :- విశ్వరూపుడు పలికాడు.

ధ్రువం సర్వే యథాకామం మమ స్వాస్థ్యేన హేతునా ।
యథా స్యాద్బలవాన్ పుత్రో దేవానామపి దుర్ధరః ॥
యజ్ఞైర్వా తపసా వాஉపి మునయో వక్తుమర్హథ ॥ 8 ॥

నేను ఆరోగ్యంగా ఉండటం వలన అందరూ యథేచ్ఛగా, క్షేమంగా ఉన్నారని భావిస్తాను. ఓ మునులారా! దేవతలు గూడా జయించలేని బలవంతుడైన కుమారుడు నాకు ఎలా కలుగుతాడు? యజ్ఞాలచేతనా? తపస్సుచేతనా? చెప్పండి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తత్ర ప్రాహ మహాబుద్ధిర్విశ్వామిత్రో మహామనాః ॥ 9 ॥

అప్పుడు మహామనీషి, మహాబుద్ధియైన విశ్వామిత్రు డిలా అన్నాడు.

విశ్వామిత్ర ఉవాచ :- విశ్వామిత్రుడు పలికాడు.

కర్మణా తాత లభ్యన్తే ఫలాని వివిధాని చ ।
త్రయాణాం కారణానాం చ కర్మ ప్రథమకారణమ్ ॥ 10 ॥

నాయనా! కర్మతోనే అనేకవిధాలైన ఫలాలు లభిస్తున్నాయి. మూడు కారణాలలో కర్మే ప్రధానకారణం.

తతశ్చ కారణం కర్తా తతశ్చాన్యత్ప్రకీర్తితమ్ ।
ఉపాదానం తథా బీజం న చ కర్మవిదుర్బుధాః ॥ 11 ॥

అటుతర్వాత కారణం కర్త. ఆ తరువాత వేరేది అని చెప్పారు. పండితులు దానిని ఉపాదాన కారణమని అంటారు. కర్మయే బీజమని కొందరొప్పుకోరు.

కర్మణాం కారణత్వం చ కారణే పుష్కలే సతి ।
భావాభావౌ ఫలే దృష్టౌ తస్మాత్కర్మాశ్రితం ఫలమ్ ॥ 12 ॥

కర్మలకు కారణత్వమనేది కారణంలో పుష్కలంగా ఉంటున్నప్పుడు భావాభావ ఫలాలు రెండూ కన్పిస్తున్నాయి. అందువలన కర్మనాశ్రయించే ఫలముంటుంది.

కర్మాపి ద్వివిధం జ్ఞేయం క్రియమాణం తథా కృతమ్ ।
కర్తవ్యం, క్రియమాణస్య సాధనం యద్యదుచ్యతే ॥ 13 ॥

కర్మ కూడా రెండు విధాలని తెలుసుకోవాలి. ఒకటి చేస్తున్నదీ. రెండవది చేసిందీ. చేస్తునది చేయవలసిన దానికి సాధనమని చెప్పినట్లయితే,

తద్భావాః కర్మసిద్ధౌ చ ఉభయత్రాపి కారణమ్ ।
యద్యద్భావయతే జన్తుః కర్మ కుర్వన్విచక్షణః ॥ 14 ॥

తద్భావనానురూపేణ ఫలనిష్పత్తిరుచ్యతే ।
కరోతి కర్మ విధివద్వినా భావనయా యది ॥ 15 ॥

అన్యథాస్యాత్ఫలం సర్వం తస్య భావానురూపతః ।
తస్మాత్తపో వ్రతం దానం జపయజ్ఞాదికాః క్రియాః ॥ 16 ॥

కర్మణస్త్వనురూపేణ ఫలం దాస్యన్తి భావతః ।
తస్మాద్భావానురూపేణ కర్మ వై దాస్యతే ఫలమ్ ॥ 17 ॥

ఆ భావాలే కర్మ సిద్ధించడానికి రెండు చోట్లా కారణాలౌతాయి. వివేకం కల ప్రాణి ఏది భావిస్తూ కర్మ చేస్తాడో, అతని భావన ననుసరించే ఫలనిష్పత్తి కలుగుతుందని పెద్దలంటారు. ఒక భావనంటూ ఏదీ లేక విధిపూర్వకంగా కర్మను చేసినట్లయితే, అతని భావానికి అనుగుణానికంటె వేరుగా ఫలం లభిస్తుంది. అందువలన తపస్సు, వ్రతం, దానం, జపం, యజ్ఞం మున్నగు క్రియలు. క్రియకు అనురూపమైన ఫలం భావాన్నిబట్టి ఇస్తాయి. అందువలన భావానురూపమైన కర్మయే ఫలమిస్తుంది.

భావస్తు త్రివిధో జ్ఞేయః సాత్త్వికో రాజసస్తథా ।
తామసస్తు తథా జ్ఞేయః ఫలం కర్మానుసారతః ॥ 18 ॥

భావం మూడువిధాలు. సాత్త్వికభావం, రాజసభావం, తామసభావం అని. ఇక చేసిన కర్మను అనుసరించి ఫలితం ఉంటుంది.

భావనానుగుణం చేతి విచిత్రా కర్మణాం స్థితిః ।
తస్మాదిచ్ఛానుసారేణ భావం కుర్యాద్విచక్షణః ॥ 19 ॥

కర్మల స్థితి భావనానుగుణ మనేది విచిత్రమైంది. అందువలన యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం కలవాడు ఇచ్ఛానుసారమే భావించాలి.

పశ్చాత్కర్మాపి కర్తవ్యం ఫలదాతాఽపి తద్విధమ్ ।
ఫలం దదాతి ఫలినాం ఫలే యది ప్రవర్తతే ॥ 20 ॥

తరువాత కర్మ కూడా చేయాలి. ఫలదాత కూడా అలాగే ఉంటాడు. కర్మ చేసే వాని భావనకు అనుకూలంగానే ఫలదాత ఫలం ఇస్తాడు.

కర్మకారో న తత్రాస్తి కుర్యాత్కర్మస్వభావతః ।
తదేవ చోపాదానాది సత్త్వాది గుణభేదతః ॥ 21 ॥

అక్కడ కర్మచేసేవాడంటూ మరొకడుండడు. స్వభావసిద్ధంగానే కర్మ చేయాలి. అదే ఉపాదాన కర్మలని సత్త్వరజస్తమో భేదములతో ఉంటుంది.

భావాత్ప్రారభతే తద్వద్భావైః ఫలమవాప్యతే ।
ధర్మార్థకామమోక్షాణాం కర్మ చైవ హి కారణమ్ ॥ 22 ॥

భావం వలననే కర్మ ప్రారంభమవుతుంది. భావాల చేతనే ఫలం పొందబడుతోంది. ధర్మార్థకామమోక్షాలకు కర్మయే కారణం కదా!

భావస్థితం భవేత్కర్మ ముక్తిదం బన్ధకారణమ్ ।
స్వభావానుగుణం కర్మ స్వస్యైవేహ పరత్ర చ ॥ 23 ॥

ఫలాని వివిధాన్యాశు కరోతి సమతానుగమ్ ।
ఏకఏవ పదార్థో౽సౌ భావైర్భేదః ప్రదృశ్యతే ॥ 24 ॥

భావాన్నిబట్టి కర్మ బన్ధకారణంగానీ, ముక్తినిచ్చేదికానీ అవుతుంది. స్వభావానుగుణమైన తన కర్మయే ఇహంలో, పరంలో కూడా వివిధ ఫలితాన్ని శీఘ్రంగా ఇస్తుంది. ఒకే పదార్థమే భావాలతో భిన్నంగా కనిపిస్తుంది.

క్రియతే భుజ్యతే వా౽పి తస్మాద్భావో విశిష్యతే ।
యథాభావం కర్మ కురు యథేప్సితమవాప్స్యసి ॥ 25 ॥

అది చేయబడుతుంది. అనుభవింపబడుతుందీ కూడా. అందుకని భావమే ప్రధానం. భావాన్ని అనుసరించి కర్మ చేయి. దానికి తగిన ఫలం పొందుతావు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏతచ్ఛ్రుత్వా ఋషేర్వాక్యం విశ్వామిత్రస్య ధీమతః ।
బహుకాలం తపస్తప్త్వా తామసం భావమాశ్రితః ॥ 26 ॥

విశ్వరూపః కర్మ భీమం చకార సురభీషణమ్ ।
పశ్యత్సు ఋషిముఖ్యేషు వార్యమాణో౽పి నిత్యశః ॥ 27 ॥

విశ్వరూపుడు జ్ఞానియైన విశ్వామిత్రఋషి చెప్పిన ఈ మాటలు విని, చాలా కాలం తామసభావా న్నాశ్రయించి తపస్సు చేసి, ఋషిముఖ్యులు చూస్తూండగా, మునులు వారిస్తున్నా, దేవతలకు భయంకరమైన కర్మ చేశాడు.

ఆత్మకోపానుసారేణ భీమం కర్మ తథా౽కరోత్ ।
భీషణే కుణ్డఖాతే తు భీషణే జాతవేదసి ॥ 28 ॥

భీషణం రౌద్రపురుషం ధ్యాత్వా౽౽త్మానం గుహాశయమ్ ।
తపస్యన్తం సమాలక్ష్య వాగువాచాశరీరిణీ ॥ 29 ॥

తన కోపానికి తగినట్లుగానే ప్రతిరోజు భయంకరమైన కర్మ అలాగే చేశాడు. ఒక పెద్ద భయంకరమైన హోమకుండాన్ని త్రవ్వి, పెద్దమంటతో గూడిన భయంకరమైన అగ్నిజ్వాలలలో, తనలోని ఆత్మరూపుని భయంకరమైన రౌద్రపురుషునిగా ధ్యానిస్తూ తపస్సు చేస్తున్న అతణ్ణి చూసి అశరీరవాణి ఇలా అంది.

జటాజూటం వినాఽఽత్మానం తవ పుత్రో భవిష్యతి ।
తథాఽఽత్మానం విశ్వరూప జుహుయాజ్జాతవేదసి ॥ 30 ॥

ఓ విశ్వరూపా! జటాజూటం మాత్రం అగ్నిలో ఆహుతి చెయ్యి. నిన్ను నువ్వు ఆహుతి చేసుకోకు. అప్పుడు నీకు పుత్రుడు కలుగుతాడు.

స ఏవేన్ద్రః స వరుణః స చ స్యాత్సర్వమేవ చ ।
త్యక్త్వాఽఽత్మానం జటామాత్రం హుతవాన్ వృజినోద్భవః ॥ 31 ॥

వృత్ర ఇత్యుచ్యతే వేదే స చాపి వృజినోఽభవత్ ।
భీమస్య మహిమానం కో జానాతి జగదీశితుః ॥ 32 ॥

అతడే ఇంద్రుడు, వరుణుడు, సర్వము నతడే, అగ్ని. నిన్ను వదిలి జటను మాత్రమే కాల్చినందున ఆ పాపపు వెంట్రుకల నుండి పుట్టినవాడు, వృత్రుడని అంటారు. వేదంలో అతడే వృజినుడైనాడు. జగదీశ్వరుడైన భీమేశ్వరుని మహిమ నెవడు తెలుసుకో గలడు?

సృజత్యశేషమపి యో న చ సంగేన లిప్యతే ।
విరరామేతి సంకీర్త్య సా వాణ్యేనం మునీశ్వరాః ॥ 33 ॥

మునులారా! అశేషమైన దానిని సృష్టించి కూడా ఆ సంగమేమాత్రం ఆ స్వామిని అంటుకోదని ఆకాశవాణి భీమేశ్వరుణ్ణి స్తుతించి విరమించింది.

భీమేశ్వరం నమస్కృత్య జగ్ముః స్వం స్వమథాఽఽశ్రమమ్ ।
విశ్వరూపో మహాభీమో భీమకర్మా తథాఽఽకృతిః ॥ 34 ॥

మునులు భీమేశ్వరునకు నమస్కరించి తమ తమ ఆశ్రమాలకు వెళ్లారు. మహాభయంకరుడూ, భయంకరమైన పనిచేసేవాడూ భీషణాకారంగల విశ్వరూపుడు,

భీమభావో భీమతనుం ధ్యాత్వాఽఽత్మానం జుహావ హ ।
తస్మాద్భీమేశ్వరో దేవః పురాణే పరిపఠ్యతే ॥
తత్ర స్నానం చ దానం చ ముక్తిదం నాత్ర సంశయః ॥ 35 ॥

భీమభావుడు, భీమతనువుగల వానిని ధ్యానించి తనను ఆహుతిగా ఇచ్చాడు. అందువలననే భీమేశ్వరదేవుడని పురాణాలలో కీర్తింపబడుతున్నాడు. అక్కడ స్నానం, దానం చేస్తే ఆ తీర్థం ముక్తినిస్తుంది. సందేహం లేదు.

ఇతి పఠతి శృణోతి యశ్చ భక్త్యా విబుధపతిం శివమత్ర భీమరూపమ్ ।
నమతి విదితమశేషపాపహారి స్మృతిపదశరణం చ ముక్తిదం చ ॥ 36 ॥

ఎవరు భక్తితో చదువుతారో, వింటారో, దేవాధిపతియైన భీమరూపుడైన, శివుని సర్వపాపహారిగా, అతనిని శరణ్యునిగా తలచి నమస్కరిస్తారో! వారికి శివుడు ముక్తినిస్తాడు.

గోదావరీ తావదశేషపాప సమూహహన్త్రీ పరమార్థదాత్రీ ।
సదేవ సర్వత్ర విశేషతస్తు, యత్రాంబురాశిం సమనుప్రవిష్టా ॥ 37 ॥

ఎక్కడ గోదావరి ఏడుచోట్ల సముద్రంలో కలిసిందో, అక్కడెప్పుడూ, అంతటా గోదావరి అన్ని పాపాల్నీ పోగొడుతుంది. మోక్షాన్నిస్తుంది.

స్నాత్వా తు తస్మిన్ సుకృతీ శరీరీ, గోదావరీవారిధిసంగమే యః ।
ఉద్ధృత్య తీవ్రాన్నిరయాదశేషాత్సపూర్వజాన్యాతి పురం పురారేః ॥ 38 ॥

ఆ గోదావరినది సముద్రంలో కలిసిన సంగమస్థానంలో స్నానమెవడు చేస్తాడో, వాడు తన పూర్వ వంశీకుల నందర్నీ నరకాలనుండి ఉద్ధరించి కైలాసపురానికి వెళ్తాడు.

వేదాన్తవేద్యం యదుపాసితవ్యం, తద్బ్రహ్మ సాక్షాత్ ఖలు భీమనాథః ।
దృష్టే హి తస్మిన్ న పునర్విశన్తి, శరీరిణః సంసృతిముగ్రదుఃఖామ్ ॥ 39 ॥

వేదాంతవేద్యుడూ, ఉపాసించ దగినవాడూ ఆ భీమనాథుడు. అతడు సాక్షాత్ బ్రహ్మస్వరూపుడు. అతని దృష్టిపడితే జీవులు ఈ సంసారమనే భయంకర దుఃఖంలో తిరిగి ప్రవేశించరు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే ఋషిసత్ర, భీమేశ్వరతీర్థవర్ణనం నామ త్ర్యధిక శతతమోஉధ్యాయః. ॥ 103 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమాహాత్మ్యములోని ఋషిసత్ర, భీమేశ్వరతీర్థ వర్ణనమనే పేరు గల నూట మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతురధిక శతతమోఽధ్యాయః - నూట నాల్గవ అధ్యాయం

గంగాసాగర సంగమ వర్ణనమ్ - గంగా సాగర సంగమ వర్ణనం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

సా సంగతా పూర్వమపాంపతిం తం గంగా సురాణామపి వన్దనీయా ।
దేవైశ్చ సర్వైరనుగమ్యమానా సంస్తూయమానా మునిభిర్మరుద్భిః ॥ 1 ॥

దేవతలందరికి వందనీయురాలు, దేవతలందరిచేత అనుసరించబడేది, మునులు, మరుద్గణాలచే స్తుతించబడేది అయిన ఆ గంగ పూర్వం ఆ జలాధిపతి అయిన సముద్రునితో సంగమించింది.

వశిష్ఠజాబాలి స యాజ్ఞవల్క్యక్రత్వంగిరోదక్షమరీచివైష్ణవాః ।
శాతాతపః శౌనకదేవరాతభృగ్వగ్నివేశ్యాత్రిమరీచిదక్షాః ॥ 2 ॥

సుధూతపాపాః మనుగౌతమాదయః సకౌశికాస్తుంబురుపర్వతాద్యాః ।
అగస్త్యమార్కణ్డసపిప్పలాద్యాః సగాలవా యోగపరాయణాశ్చ ॥ 3 ॥

స వామదేవాంగిరసోఽథ భార్గవాః స్మృతిప్రవీణాః శ్రుతిభిర్మనోజ్ఞాః ।
సర్వే పురాణార్థవిదోబహుజ్ఞాస్తే గౌతమీం దేవనదీం తు గత్వా ॥ 4 ॥

స్తోష్యన్తి మన్త్రైః శ్రుతిభిః ప్రభూతైః హృద్యైశ్చ తుష్టైర్ముదితైర్మనోభిః ।
తాం సంగతాం వీక్ష్య శివో హరిశ్చ ఆత్మానమాదర్శయతాం మునిభ్యః ॥ 5 ॥

వసిష్ఠుడు, జాబాలి, యాజ్ఞవల్క్యుడు, క్రతువు, అంగిరసుడు, దక్షుడు, మరీచి, శాతాతపుడు, శౌనకుడు, దేవరాతుడు, భృగువు, అగ్నివేశ్యుడు, అత్రి, మరీచి, మొదలగు సమర్థులూ, పాపాలు పోగొట్టుకొన్నారు. మను, గౌతమాదులూ, కౌశిక తుంబురు, పర్వతాదులూ, అగస్త్యుడూ, మార్కండేయుడూ, పిప్పలుడు మున్నగువారూ, గాలవుడూ మొదలగు యోగపరాయణులూ, వామదేవుడూ, అంగిరసుడూ, భార్గవులూ, స్మృతుల యందు ప్రవీణులూ, వేదాలచే మనోజ్ఞులు అయినవారు కూడా, పురాణాలలోఉండే అర్థాలను బాగుగా అనేక విధాలుగా తెలిసినవారూ, అందరూ దేవనది అయిన గౌతమీనది వద్దకు వెళ్లి, మంత్రాలతో, శ్రుతులతో హృదయానికి ఆనందం కలిగించే, తృప్తి కలిగించే, సంతోషంతో కూడుకున్న మనస్సులతో స్తోత్రం చేస్తున్నారు. సాగరునితో సంగమించిన గౌతమిని చూచి వారు చేసిన ఈ స్తుతుల కానందించి శివకేశవు లిద్దరూ ముని లందరికి దర్శన మిచ్చారు.

తథామరాస్తౌ పితృభిశ్చ దృష్ట్వా స్తువన్తి దేవౌ సకలార్తిహారిణౌ ॥ 6 ॥

అలాగే దేవతలూ, పితరులూ సకల దుఃఖాలను తొలగించే వారిద్దరినీ చూసినవారై స్తుతించారు.

ఆదిత్యా వసవో రుద్రా మరుతో లోకపాలకాః ।
కృతాంజలిపుటాః సర్వే స్తువన్తి హరిశంకరౌ ॥ 7 ॥

ద్వాదశాదిత్యులు, అష్ట వసువులు, ఏకాదశ రుద్రులు, సప్త మరుత్తులు, లోకపాలకులు అందరూ చేతులు జోడించి హరిశంకరులను స్తుతిస్తున్నారు.

సంగమేషు ప్రసిద్ధేషు నిత్యం సప్తసు నారద ।
సముద్రస్య చ గంగాయా నిత్యం దేవౌ ప్రతిష్ఠితౌ ॥ 8 ॥

ఓ నారదా! ప్రసిద్ధమైన సముద్రుడూ గంగా సంగమించిన ఆ ఏడు సంగమాలలో శివకేశవు లిద్దరూ ఎప్పుడూ ఉంటారు.

గౌతమేశ్వర ఆఖ్యాతో యత్ర దేవో మహేశ్వరః ।
నిత్యం సంనిహితస్తత్ర మాధవో రమయా సహ ॥ 9 ॥

ఆ సంగమప్రదేశంలో ఉన్న మహేశ్వరుని గౌతమేశ్వరు డంటారు. అక్కడ లక్ష్మీదేవితో గూడ మాధవుడు సంనిహితుడై సర్వదా ఉంటాడు.

బ్రహ్మేశ్వర ఇతి ఖ్యాతో మయైవ స్థాపితః శివః ।
లోకానాముపకారార్థమాత్మనః కారణాన్తరే ॥ 10 ॥

నేను స్థాపించిన శివునకే బ్రహ్మేశ్వరుడని పేరు. నా పేరు కారణంచేత లోకోపకారం కోసం శివుడు బ్రహ్మేశ్వరుడుగా నాచే ప్రతిష్ఠితుడయ్యాడు.

చక్రపాణిరితి ఖ్యాతః స్తుతో దేవైర్మయా సహ ।
తత్ర సంనిహితో విష్ణుర్దేవైః సహ మరుద్గణైః ॥ 11 ॥

అక్కడ నాతోపాటు దేవతలచే స్తుతింపబడినవాడు చక్రపాణి అని పేరు పొందాడు. అక్కడ దేవతలతో, మరుద్గణాలతో విష్ణువు సంనిహితుడై ఉంటాడు.

ఐన్ద్రతీర్థమితి ఖ్యాతం తదేవహయమూర్ధకమ్ ।
హయమూర్ధా తత్ర విష్ణుస్తన్మూర్ధని సురా అపి ॥
సోమతీర్థమితి ఖ్యాతం యత్ర సోమేశ్వరః శివః ॥ 12 ॥

ఐంద్రతీర్థమనేది ప్రసిద్ధమైంది. దానినే హయమూర్ధక మంటారు. అక్కడ విష్ణువు గుఱ్ఱపు తలతోఉంటాడు. ఆ హయగ్రీవుని తలమీద దేవతలుంటారు. ఎక్కడ శివుడు సోమేశ్వరునిగా ఉన్నాడో దానిని సోమతీర్థమని పిలుస్తారు.

ఇన్ద్రస్య సోమశ్రవసో దేవైశ్చ ఋషిభిస్తథా ।
ప్రార్థితః సోమ ఏవాఽఽ ఽ దావిన్ద్రాయేన్దో పరిస్రవ ॥ 13 ॥

ఇంద్రుని యొక్క సోమశ్రవసమనే యజ్ఞంలో దేవతలచేతా, ఋషులచేతా శివుడు (సోముడు) ప్రార్థింపబడినాడు. ఓ చంద్రుడా ఇంద్రుని కోసం సోమరసాన్ని స్రవించు.

సప్తదిశో నానాసూర్యాః సప్తహోతార ఋత్విజః ।
దేవా ఆదిత్యా యే సప్త తేభిః సోమాభిరక్ష నః ॥
ఇన్ద్రాయేన్దో పరిస్రవ ॥ 14 ॥

ఏడు దిక్కులూ, అనేకమంది సూర్యులు, ఏడుగురు హోతలూ, ఋత్విక్కులూ, దేవతలూ,ఆదిత్యులూ ఏ ఏడుగురు ఉన్నారో వారితోబాటు ఓసోమా! మమ్ము రక్షించు. సోమా! ఇంద్రునకు స్రవించు.

యత్తే రాజన్ఛృతం హవిస్తేన సోమాభిరక్ష నః ।
అరాతీ వా మా నస్తారీన్మో చ నః కించ నామ ॥
మదిన్ద్రాయేన్దో పరిస్రవ ॥ 15 ॥

ఓ రాజా! చంద్రుడా! నీకొరకై హవిస్సు నిచ్చాము. దానితో మమ్ము రక్షించు. మాకు దుఃఖాన్ని కలిగించే శత్రువులను వదిలి పెట్టకు. ఇంకేమి? ఓ చంద్రా! మా ఇంద్రునకు సోమాన్ని స్రవించు.

ఋషే మన్త్రకృతాం స్తోమైః కశ్యపోద్వర్ధయన్ గిరః ।
సోమం నమస్య రాజానం యో జజ్ఞే వీరుధాం పతిరిన్ద్రాయేన్దో పరిస్రవ ॥ 16 ॥

ఋషీ కశ్యప మంత్రకృతాలైన స్తోమాలతో వాక్కుల నింపుతూ ఎవడు యజ్ఞమునందు లతల నభివృద్ధి చేయుటకై వానికి పతిగా ఉన్నాడో ఆ రాజైన సోమునికి నమస్కరించి, ఓ సోమా! ఇంద్రునకై సోమాన్ని స్రవించు.

కారురహం తతో భిషగుపల ప్రక్షిణీ న నా ।
నానాధియో వసూయవో౽ను గా ఇవ తస్థిమేన్ద్రాయేన్దో పరిస్రవ ॥ 17 ॥

ఎవరు దుఃఖిస్తున్న వైద్యశిలలయందు, లతావృక్షములందు అనేకవిధాలుగావుండే, అనేక బుద్ధులతో ఉండే వారు యవలను అనుసరించేటట్లుగా వాని యందున్నాడో ఆ సోమా ఇంద్రునకై స్రవించు.

ఏవముక్త్వా చ ఋషిభిః సోమ ప్రాప్య చ వజ్రిణే ।
తేభ్యో దత్వా తతో యజ్ఞః పూర్ణో జాతః శతక్రతోః ॥ 18 ॥

ఋషులందరూ ఇలా పలికి ఇంద్రునికై సోమాన్ని పొంది, వారికీయగా అప్పుడు ఇంద్రుని యజ్ఞం సంపూర్ణమైంది.

తత్సోమతీర్థమాఖ్యాతమాగ్నేయం పురతస్తు తత్ ।
అగ్నిరిష్ట్వా మహాయజ్ఞైర్మామారాధ్య మనీషితమ్ ॥ 19 ॥

సంప్రాప్తవాన్మత్ప్రసాదాదహం తత్రైవ నిత్యశః ।
స్థితో లోకోపకారార్థం తత్ర విష్ణుః శివస్తథా ॥ 20 ॥

దానిని సోమతీర్థ మంటారు. దానికి ముందు ఆగ్నేయతీర్థ ముంది. అగ్నిని మహాయజ్ఞాలతో ఇష్టి చేసి, నన్నారాధించి, మనస్సులో వున్న కోరికను, నా అనుగ్రహం వలన పొందాడు. నేనక్కడే నిత్యం ఉన్నాను. లోకోపకారానికై అక్కడ నాతో పాటు విష్ణువూ, శివుడూ ఉన్నారు.

తస్మాదాగ్నేయమాఖ్యాతమాదిత్యం తదనన్తరమ్ ।
యత్రాఽఽఽదిత్యో వేదమయో నిత్యమేతి హ్యుపాసితుమ్ ॥ 21 ॥

అందువలన దాన్ని ఆగ్నేయ తీర్థమంటారు. తరువాతది ఆదిత్యతీర్థమంటారు. వేదమయుడైన ఆదిత్యుడు నిత్యమూ ఉపాసించడానికి అక్కడకు వస్తాడు కనుక దాన్ని ఆదిత్యతీర్థమంటారు.

రూపాన్తరేణ మధ్యాహ్నే ద్రష్టుం మాం శంకరం హరిమ్ ।
నమస్కార్యస్తత్ర సదా మధ్యాహ్నే సకలో జనః ॥ 22 ॥

ఆ సూర్యుడు రూపాంతరాన్ని పొంది మధ్యాహ్న సమయంలో అక్కడ నన్నూ, శంకరున్నీ, హరినీ ఉపాసించడానికి వస్తాడు. అందరికీ అతడు ఎప్పుడూ నమస్కరించ తగినవాడు.

రూపేణ కేన సవితా సమాయాతీత్యనిశ్చయాత్ ।
తస్మాదాదిత్యమాఖ్యాతం బార్హస్పత్యమనన్తరమ్ ॥ 23 ॥

ఏ రూపంలో సూర్యుడు వస్తాడో నిశ్చయంగా తెలియదు కనుక ఎవరు వచ్చినా నమస్కరింప దగినవారే. తరువాతది బార్హస్పత్య మన్నారు.

బృహస్పతిః సురైః పూజాం తస్మాత్తీర్థాదవాప హ ।
ఈజే చ యజ్ఞాన్ వివిధాన్ బార్హస్పత్యం తతో విదుః ॥ 24 ॥

ఆ తీర్థమునుండే బృహస్పతి దేవతల పూజ పొందాడు. అనేక యజ్ఞాలు చేశారు కనుక దాన్ని బార్హస్పత్యతీర్థ మంటారు.

తత్తీర్థస్మరణాదేవ గ్రహశాన్తిర్భవిష్యతి ।
తస్మాదప్యపరం తీర్థమిన్ద్రగోపే నగోత్తమే ॥ 25 ॥

ఆ తీర్థాన్ని స్మరించినంత మాత్రాననే గ్రహశాంతి జరుగుతుంది. ఇన్ద్రగోపం అనే పర్వతశ్రేష్ఠంపైన దానికంటె వేరైన మరొక తీర్థముంది.

ప్రతిష్ఠితం మహాలింగం కస్మింశ్చిత్కారణాన్తరే ।
హిమాలయేన తత్తీర్థమద్రితీర్థం తదుచ్యతే ॥ 26 ॥

ఆ పర్వతంపై ఒక కారణాంతరంవలన హిమవంతుడు మహాలింగాన్ని ప్రతిష్ఠించాడు. అందువలన దానిని అద్రి తీర్థమంటారు.

తత్ర స్నానం చ దానం చ సర్వకామప్రదం శుభమ్ ।
ఏవం సా గౌతమీ గంగా బ్రహ్మాద్రేశ్చ వినిఃసృతా ॥ 27 ॥

అక్కడ స్నానదానాదులు చేసిన యెడల కోరికలన్నింటిని తీరుస్తుంది. శుభమైంది. ఇలా ఆ గౌతమీగంగ బ్రహ్మాద్రి నుండి ప్రవహించింది.

యావత్సాగరగా దేవీ తత్ర తీర్థాని కానిచిత్ ।
సంక్షేపేణ మయోక్తాని రహస్యాని శుభాని చ ॥ 28 ॥

ఆ బ్రహ్మాద్రి నుండి పుట్టిన గంగాదేవి సముద్రం చేరడానికి ప్రవహించే మార్గంలో అక్కడ కొన్ని తీర్థాలున్నాయి. సంక్షేపంగా నేను చెప్పినవి రహస్యాలు, శుభమైనవి కూడా.

వేదే పురాణే ఋషిభిః ప్రసిద్ధా యా గౌతమీ లోకనమస్కృతా చ ।
వక్తుం కథం తామతిసుప్రభావామశేషతో నారద కస్య శక్తిః ॥ 29 ॥

ఓ నారదా! వేదంలో, పురాణంలో ఏ గౌతమి ఋషులందరి చేత ప్రసిద్ధిచెందిందో, లోకాలన్నీ నమస్కరిస్తున్నవో, అటువంటి మంచి ప్రభావంగల గౌతమిని గూర్చి పూర్తిగా చెప్పటానికి ఎవరికి శక్తి గలదు?

భక్త్యా ప్రవృత్తస్య యథా కథంచిన్నైవాపరాధోఽస్తి న సంశయోఽత్ర ।
తస్మాచ్చ దిఙ్మాత్రమతిప్రయాసాత్సంసూచితం లోకహితాయ తస్యాః ॥ 30 ॥

భక్తితో ఏదో విధంగా ప్రవర్తించేవానికి ఏ దోషం లేదు. ఈ విషయంలో అనుమానమేమీ లేదు. అందువలన ఆ గౌతమినిగూర్చి మిక్కిలి ప్రయాసతో సంగ్రహంగా లోకహితానికి సూచించటం జరిగింది.

కస్తస్యాః ప్రతితీర్థం తు ప్రభావం వక్తుమీశ్వరాః ।
అపి లక్ష్మీపతిర్విష్ణురలం సోమేశ్వరః శివః ॥ 31 ॥

ఆ గౌతమికి సంబంధించిన ప్రతితీర్థం ప్రభావాన్నీ చెప్పేశక్తి కల సమర్థు లెవరున్నారు? లక్ష్మీపతియైన విష్ణువు, సోమేశ్వరుడైన శివుడు మాత్రమే సమర్థులు.

క్వచిత్కస్మింశ్చ తీర్థాని కాలయోగే భవన్తి హి ।
గుణవన్తి మహాప్రాజ్ఞ! గౌతమీ తు సదా నృణామ్ ॥ 32 ॥

ఏదో కారణంతో ఎక్కడో ఒకచోట కాలయోగంలో గొప్ప తీర్థాలు ఏర్పడుతాయి. ఓ మహాజ్ఞానీ! గౌతమీ నదైతే మానవులకెప్పుడూ,

సర్వత్ర సర్వదా పుణ్యా, కో న్వస్యా గుణకీర్తనమ్ ।
వక్తుం శక్తస్తతస్తస్యై నమ ఇత్యేవ యుజ్యతే ॥ 33 ॥

అంతటా ఎల్లప్పుడూ పవిత్రమై పుణ్యమిస్తుంది. గౌతమి గుణకీర్తనం చేయటానికి సమర్థు డెవడున్నాడు? అందువలన ఆమెకు నమస్కార మనటమే తగివున్నది.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే గంగాసాగరసంగమవర్ణనం నామ చతురధిక శతతమోఽధ్యాయః, ॥ 104 ॥

శ్రీబ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యంలో తీర్థమహాత్మ్యంలోని గంగాసాగర సంగమ వర్ణనమనే పేరుగల నూట నాలుగవ అధ్యాయం సంపూర్ణం.

పంచాధిక శతతమోఽధ్యాయః - నూట ఐదవ అధ్యాయం

బ్రహ్మనారద సంవాదే గంగా మాహాత్మ్యశ్రవణాది ఫలవర్ణనం

బ్రహ్మనారద సంవాదంలోని గంగామాహాత్మ్య శ్రవణం మున్నగు ఫలవర్ణనం

నారద ఉవాచ:- నారదుడు పలికాడు.

త్రిదైవత్యాం సురేశాన గంగాం బ్రూషే సురేశ్వర ।
బ్రాహ్మణేనాఽఽహృతాం పుణ్యాం జగతః పావనీం శుభామ్ ॥ 1 ॥

ఓ సురాధిపతీ! ముల్లోకాలకు దేవత, బ్రాహ్మణుడు తెచ్చింది, పవిత్రమైనది, ముల్లోకాలను పావనం చేస్తున్న శుభకరమైన గంగను గూర్చి చెబుతున్నావు.

ఆదిమధ్యావసానేషు హ్యుభయోస్తీరయోరపి ।
యా వ్యాప్తా విష్ణునేశేన త్వయా చ సురసత్తమ ॥
పునః సంక్షేపతో బ్రూహి న మే తృప్తిః ప్రజాయతే ॥ 2 ॥

ఓ సురశ్రేష్ఠా! విష్ణువుతోను, శివునితోను, నీతోను, మొదలు, మధ్య, చివరలలో రెండు తీరాలలో వ్యాపించివున్న ఆ గంగను గూర్చి మరల సంక్షేపంగా చెప్పు. నాకు తృప్తి కలగడం లేదు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

కమణ్డలుస్థితా పూర్వం తతో విష్ణుపదానుగా ।
మహేశ్వరజటాజూటే స్థితా సైవ నమస్కృతా ॥ 3 ॥

పూర్వం విష్ణు పాదానుగయైన ఆమె మొదట కమండలంలో ఉంది. తరువాత శివుని జటాజూటమునందుంది. ఆమెయే నమస్కారాలను పొందింది.

బ్రహ్మతేజః ప్రభావేణ శివమారాధ్య యత్నతః ।
తతః ప్రాప్తా గిరిం పుణ్యం తతః పూర్వార్ణవం ప్రతి ॥ 4 ॥

ఆగత్య సంగతా దేవీ సర్వతీర్థమయీ నృణామ్ ।
ఈప్సితానాం తథా దాత్రీ ప్రభావోఽస్యా విశిష్యతే ॥ 5 ॥

బ్రహ్మతేజస్సు ప్రభావంతో శ్రద్ధగా శివుని ఆరాధించి తరువాత పవిత్రమైన (హిమాలయ) పర్వతాన్ని చేరింది. అటు తరువాత తూర్పు సముద్రానికి వచ్చి సముద్రునితో సంగమించింది. ఆమె సర్వతీర్థాలతో కూడింది. మానవులకు కోరిన కోరికలన్నింటిని ఇచ్చేది. ఆమె ప్రభావం చాలా విశేషమైంది.

ఏతస్యా నాధికం మన్యే కించిత్తీర్థం జగత్త్రయే ।
అస్యాశ్చైవ ప్రభావేణ భావ్యం యచ్చ మనః స్థితమ్ ॥ 6 ॥

ఈ గౌతమికంటె అధికమైన తీర్థం ఈ ముల్లోకాలలో మరొకటి లేదని తలస్తున్నాను. ఈమె ప్రభావం వల్ల మనస్సులో వున్న దానిని పొందవచ్చు.

అద్యాప్యస్యా హి మాహాత్మ్యం వక్తుం కైశ్చిన్న శక్యతే ।
భక్తితో వక్ష్యతే నిత్యం యా బ్రహ్మ పరమార్థతః ॥ 7 ॥

ఈ నాటికి కూడా ఈ నది మాహాత్మ్యాన్ని చెప్పటం ఎవరి తరం కాదు. ఆమె సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపిణి. నిత్యం ఆమె భక్తితో స్తుతించబడుతున్నది.

తస్యాః పరతరం తీర్థం న స్యాదితి మతిర్మమ ।
అన్యతీర్థేన సాధర్మ్యం న యుజ్యేత కథంచన ॥ 8 ॥

గౌతమి కంటె ఉత్కృష్టమైన తీర్థం ఉండదని నా అభిప్రాయం. ఇతర తీర్థంతో పోలిక ఎప్పుడూ కుదురదు.

శ్రుత్వా మద్వాక్యపీయూషైర్గంగాయా గుణకీర్తనమ్ ।
సర్వేషాం న మతిః కస్మాత్తత్రైవోపరతిం గతా ॥
ఇతి భాతి విచిత్రం మే మునే ఖలు జగత్త్రయే. ॥ 9 ॥

నా వాగమృతం ద్వారా గంగాదేవి గుణకీర్తనాన్ని విన్న తర్వాత కూడా ఆమె పట్ల ఆసక్తిని అందరూ పొందడం లేదనేది నాకీ మూడులోకాల్లో విచిత్రంగా తోస్తున్నది కదా!

నారద ఉవాచ :- నారదుడు పలికాడు.

ధర్మార్థకామమోక్షాణాం త్వం వేత్తా చోపదేశకః ।
ఛన్దాంసి సరహస్యాని పురాణస్మృతయోఽపి చ ॥ 10 ॥

నీవు ధర్మార్థకామమోక్షాలనుగూర్చి, వేదాలు, పురాణాలు, స్మృతులను గూర్చి, వాటి రహస్యాలను తెలిసినవాడివి. అంతేకాక వాటిని ఉపదేశించేవాడివి కూడా.

ధర్మశాస్త్రాణి యచ్చాన్యత్త్వ వాక్యే ప్రతిష్ఠితమ్ ।
తీర్థానామథ దానానాం యజ్ఞానాం తపసాం తథా ॥ 11 ॥

దేవతామంత్రసేవానామధికం కిం వద ప్రభో ।
యద్రూపే భగవన్ భక్త్యా తథా భావ్యం న చాన్యథా ॥ 12 ॥

ధర్మశాస్త్రాలు, ఇంకా ఇతరములైనవి నీ మాటలోనే ప్రతిష్ఠించబడ్డాయి. తీర్థాలకు, దానాలకు, యజ్ఞాలకు, తపస్సులకు అలాగే దేవతామంత్రసేవలకు, అన్నింటికీ ప్రభూ! నీ కంటె అధికమైంది ఏముంది? చెప్పు. భగవంతుడా! భక్తితో ఏ రూపంలోనైనా అలా భావించవచ్చు. వేరు విధంగా కాదు.

ఏవం మే సంశయం బ్రహ్మన్ వాక్యాత్త్వం ఛేత్తుమర్హసి ।
ఇష్టం మనోగతం శ్రుత్వా తస్మాద్విస్మయమాగతః ॥ 13 ॥

బ్రహ్మస్వరూపా! ఇలా నా సందేహాన్ని నీవొక్కమాటలో తీర్చగలవు. కావున నా మనస్సులో వున్నది, ఇష్టమైంది విని నాకు ఆశ్చర్యం కలిగింది.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

శృణు నారద వక్ష్యామి రహస్యం ధర్మముత్తమమ్ ।
చతుర్విధాని తీర్థాని తావన్త్యేవ యుగాని చ ॥ 14 ॥

నారదా! ఉత్తమమైన ధర్మరహస్యాన్ని చెబుతున్నాను విను. తీర్థాలు నాలుగు విధాలు. యుగాలు కూడా నాలుగే. (అవి కృత త్రేత ద్వాపర కలియుగాలు.).

గుణాస్త్రయశ్చ పురుషాస్త్రయో దేవాః సనాతనాః ।
వేదాశ్చ స్మృతిభిర్యుక్తాశ్చత్వారస్తే ప్రకీర్తితాః ॥ 15 ॥

గుణాలు మూడు. (సత్వరజస్తమస్సులు.) సనాతనులైన దేవతాపురుషులు ముగ్గురు. (వారు బ్రహ్మవిష్ణు మహేశ్వరులు.) స్మృతులతో కూడిన వేదాలు నాలుగుగా చెప్పబడుతున్నాయి.

పురుషార్థాశ్చ చత్వారో వాణీ చాపి చతుర్విధా ।
గుణాహ్యపి తు చత్వారః సమత్వేనేతి నారద! ॥ 16 ॥

నారదా! పురుషార్థాలు నాలుగు. (ధర్మార్థకామమోక్షాలు.)మాట కూడా నాలుగు విధాలు. సమతాభావంతో గుణాలు నాలుగు. వీనికి సమత్వమున్నది.

సర్వత్ర ధర్మః సామాన్యో యతో ధర్మః సనాతనః ।
సాధ్యసాధనభావేన స ఏవ బహుధా మతః ॥ 17 ॥

ధర్మం అంతటా సామాన్యమైనదే. ఎందుకనగా ధర్మం సనాతనమైంది. సాధ్య సాధన భావంతో అదే అనేక విధాలుగా భావించబడుతున్నది.

తస్యాఽఽశ్రయశ్చ ద్వివిధో దేశః కాలశ్చ సర్వదా ।
కాలాశ్రయశ్చ యో ధర్మో హీయతే వర్ధతే సదా ॥ 18 ॥

ధర్మాని కాశ్రయం కూడా రెండు విధాలుగా ఉంటుంది. అవి దేశం, కాలం అని. కాలాశ్రయమైన ధర్మం ఒకసారి తగ్గి ఉంటుంది. మరొక మారు వృద్ధి చెందుతుంది.

యుగానామనురూపేణ పాదః పాదోఽస్య హీయతే ।
ధర్మస్యేతి మహాప్రాజ్ఞ దేశాపేక్షా తథోభయమ్ ॥ 19 ॥

యుగాల ననుసరించి ఒక్కొక్క ధర్మం పాదం క్షీణిస్తుంది. ఓ మహాజ్ఞానీ! ధర్మం దేశాపేక్ష కూడా రెండు విధాలు.

కాలేన చాఽఽ ఽశ్రితో ధర్మో దేశే నిత్యం ప్రతిష్ఠితః ।
యుగేషు క్షీయమాణేషు న దేశేషు స హీయతే ॥ 20 ॥

కాలంచేత ఆశ్రితమైన ధర్మం దేశంలో నిత్యంగా ఉంటుంది. యుగాలు క్షీణిస్తున్నప్పటికి దేశాలలో మాత్రం క్షీణించదు.

ఉభయత్ర విహీనే చ ధర్మస్య స్యాదభావతా ।
తస్మాద్దేశాశ్రితో ధర్మశ్చతుష్పాత్సుప్రతిష్ఠితః ॥ 21 ॥

రెండుచోట్ల హీనమైతే ధర్మం లేకుండా పోతుంది. అందువలన దేశాశ్రితమైన ధర్మం నాలుగు పాదాలతో ఉంటుంది.

స చాపి ధర్మో దేశేషు తీర్థరూపేణ తిష్ఠతి ।
కృతే దేశం చ కాలం చ ధర్మోఽవష్టభ్య తిష్ఠతి ॥ 22 ॥

ఆ ధర్మం కూడా దేశాలలో తీర్థరూపంగా ఉంటుంది. కృతయుగంలో ధర్మం దేశకాలాల ననుసరించి ఉంటుంది.

త్రేతాయాం పాదహీనేన స తు పాదః ప్రదేశతః ।
ద్వాపరే చార్ధతః కాలే ధర్మో దేశే సమాస్థితః ॥ 23 ॥

త్రేతాయుగంలో ధర్మం ఒక పాదం లేకుండా మూడు పాదాలతో ఉంటుంది. ఆ పాదం ప్రదేశాన్నిబట్టి ఉంటుంది. ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలతో ఉంటుంది. ఒకటి కాలంలో, ఒకటి దేశంలో నిలిచి ఉంటుంది.

కలౌ పాదేన చైకేన ధర్మశ్చలతి సంకటమ్ ।
ఏవం విధం తు యో ధర్మం వేత్తి తస్య న హీయతే ॥ 24 ॥

కలియుగంలో ధర్మం ఒంటికాలితో కుంటుతూ ఉంటుంది. ఈ విధంగా ధర్మాన్ని గూర్చి ఎవరు తెలుసు కుంటారో వారికి ధర్మం క్షీణించదు.

యుగానామనుభావేన జాతిభేదాశ్చ సంస్థితాః ।
గుణేభ్యో గుణకర్తృభ్యో విచిత్రా ధర్మసంస్థితిః ॥ 25 ॥

యుగాల ననుసరించి జాతిభేదాలు కూడా ఉంటాయి. గుణాల వలన, గుణకర్తల వలన ధర్మం స్థితి విచిత్రంగా ఉంటుంది.

గుణానామనుభావేన ఉద్భవాభిభవౌ తథా ।
తీర్థానామపి వర్ణానాం వేదానాం స్వర్గమోక్షయోః ॥ 26 ॥

తీర్థాలకు, వర్ణాలకు, వేదాలకు, స్వర్గమోక్షాలకు, గుణాల ననుసరించి ఉద్భవం, అభిభవ ముంటుంది.

తాదృగ్రూప ప్రవృత్త్యా తు తదేవ చ విశిష్యతే ।
కాలోఽభివ్యంజకః ప్రోక్తో దేశోఽభివ్యంగ్య ఉచ్యతే ॥ 27 ॥

ఆయా రూప ప్రవృత్తితో అదే విశేషంగా ఉంటుంది. కాలం అభివ్యంజక మంటారు. దేశం అభివ్యంగ్య మంటారు.

యదా యదా అభివ్యక్తిం కాలో ధత్తే తదా తదా ।
తదేవ వ్యంజనం బ్రహ్మన్ తస్మాన్నాస్త్యత్ర సంశయః ॥ 28 ॥

బ్రాహ్మణా! కాలమెప్పుడెప్పుడు అభివ్యక్తిని ధరిస్తుందో అప్పుడప్పు డదే వ్యంజన మవుతుంది. అందువలన ఈ విషయంలో సందేహం లేదు.

యుగానురూపా మూర్తిః స్యాద్దేవానాం వైదికీ తథా ।
కర్మణామపి తీర్థానాం జాతీనామాశ్రమస్య తు ॥ 29 ॥

యుగాల ననుసరించి దేవతలకు వైదికరూప ముంటుంది. అలాగే కర్మలకూ, తీర్థాలకూ, జాతులకూ, ఆశ్రమానికీ రూపా లుంటాయి.

త్రిదైవత్యం సత్యయుగే తీర్థం లోకేషు పూజ్యతే ।
ద్విదైవత్యం యుగేఽన్యస్మిన్ ద్వాపరే చైకదైవికమ్ ॥ 30 ॥

సత్యయుగమని పిలిచే కృతయుగంలో ముగ్గురు దేవతలతో గూడిన తీర్థం పూజింపబడుతుంది. త్రేతలో ఇద్దరు దేవతలతో కూడిందీ, ద్వాపరయుగంలో ఏకదైవికమైన తీర్థమూ పూజింపబడుతుంది.

కలౌ న కించిద్విజ్ఞేయమథాన్యదపి తచ్ఛృణు ।
దైవం కృతయుగే తీర్థం త్రేతాయామాసురం విదుః ॥ 31 ॥

ఇక కలియుగంలో తెలుసుకొన వలసిన దేదీ లేదు. ఇక మరొకటి కూడా విను. కృతయుగంలోనిది దైవ తీర్థం. త్రేతాయుగంలో ఆసురం అనే పేరు కల తీర్థం.

ఆర్షం చ ద్వాపరే ప్రోక్తం కలౌ మానుషముచ్యతే ।
అథాన్యదపి వక్ష్యామి శృణు నారద కారణమ్ ॥ 32 ॥

ద్వాపరయుగంలో ఆర్షమని చెప్పారు. కలియుగంలో తీర్థాన్ని మానుష మంటారు. ఇక నారదా! మరొక కారణాన్ని కూడా చెబుతున్నాను విను.

గౌతమ్యాం యత్త్వయా పృష్టం తత్తే వక్ష్యామి విస్తరాత్ ।
యదా చేయం హరశిరః ప్రాప్తా గంగా మహామునే ॥ 33 ॥

తదా ప్రభృతి సా గంగా శంభోః ప్రియతరాऽభవత్ ।
తద్దేవస్య మతం జ్ఞాత్వా గజవక్త్రమువాచ సా ॥ 34 ॥

ఓ మహామునీ! గౌతమిని గూర్చి నీవేదైతే అడిగావో దానినిగూర్చి నీకు వివరంగా చెబుతాను. ఎప్పుడైతే ఈ గంగ శివుని తలపైకి చేరిందో, అప్పటి నుండి ఆ గంగ శివునికి మిక్కిలి ప్రీతిపాత్రురా లయ్యింది. ఆ శివుని అభిప్రాయం తెలుసుకొని ఆమె గజాననునితో ఇలా అంది.

ఉమా లోకత్రయేశానా మాతా చ జగతో హితా ।
శాన్తా శ్రుతిరితి ఖ్యాతా భుక్తిముక్తిప్రదాయినీ ॥ 35 ॥

పార్వతి ముల్లోకాలకు ఈశ్వరి. తల్లి. జగత్తుకు హితాన్ని కూర్చునది. శాంతస్వభావురాలు. శ్రుతి అని పేరొందింది. భుక్తినీ ముక్తినీ ఇస్తుంది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

తన్మాతుర్వచనం శ్రుత్వా గజవక్త్రోऽభ్యభాషత ॥ 36 ॥

ఆ తల్లి మాటలను విని గజముఖు డిలా అన్నాడు.

గజవక్త్ర ఉవాచ:– గజాననుడు పలికాడు.

కిం కృత్యం శాధి మాం మాతస్తత్కర్తాऽహమసంశయమ్ ॥ 37 ॥

అమ్మా! నేనేమి చేయాలో ఆజ్ఞాపించు. నేను దానిని చేయడానికి సిద్ధంగా ఉన్నాను. సందేహం లేదు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ పలికాడు.

ఉమాసుతమువాచేదం మహేశ్వరజటాస్థితా ।
త్వయాऽవతార్యతాం గంగా సత్యమీశప్రియా సతీ ॥ 38 ॥

మహేశ్వరుని జటాజూటమునందున్న గంగ పార్వతీ పుత్రుడితో ఇలా అంది. ఈశ్వరునికి గంగ ప్రియురాలు అన్నది సత్యం. ఆమెను క్రిందకు అవతరింప జెయ్యి.

పునశ్చేశస్తత్ర చిత్రమధ్యాస్తే సర్వదా సుత ।
శివో యత్ర సురాస్తత్ర తత్ర వేదాః సనాతనాః ॥ 39 ॥

నాయనా! ఇక శివుడైతే చిత్రంగా ఎప్పుడూ ఆమె వద్దే ఉంటాడు. శివుడున్న చోటుననే దేవతలు, సనాతనమైన వేదాలూ ఉంటాయి.

తత్రైవ ఋషయః సర్వే మనుష్యాః పితరస్తథా ॥
తస్మాన్నివర్తయేశానం దేవదేవం మహేశ్వరమ్ ॥ 40 ॥

అక్కడనే ఋషులు, మనుష్యులు, పితరులు అందరూ ఉంటారు. అందువలన దేవులకే దేవుడైన ఈశానుని మహేశ్వరుని గంగనుండి మరల్చు.

తస్యా నివర్తితే దేవే గంగాయాః సర్వ ఏవ హి ।
నివృత్తాస్తే భవిష్యన్తి శృణు చేదం వచో మమ ॥
నివర్తయ తతస్తస్యాః సర్వభావేన శంకరమ్ ॥ 41 ॥

ఆ గంగాదేవి నుండి పరమేశ్వరుని మరలించితే మన కోరిక తీరుతుంది. ఈ నా మాటని విను. అన్ని విధాలుగా శంకరుని మనస్సును గంగపైనుండి మరల్చు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

మాతుస్తద్వచనం శ్రుత్వా పునరాహ గణేశ్వరః ॥ 42 ॥

తల్లి పలికిన ఆ మాటలు విని గణేశుడు తిరిగి ఇలా అన్నాడు.

గణేశ్వర ఉవాచ:- గణేశ్వరుడు పలికాడు.

నైవ శక్యః శివో దేవో మయా తస్యా నివర్తితుమ్ ।
అనివృత్తే శివే తస్యా దేవా అపి నివర్తితుమ్ ॥ 43 ॥

న శక్యా జగతాం మాత రథాన్యచ్చాపి కారణమ్ ।
గంగాఽవతారితా పూర్వం గౌతమేన మహాత్మనా ॥ 44 ॥

శివదేవుని గంగనుండి మరల్చుటకు నాకు శక్తి లేదు. గంగనుండి మరల అటువంటి శివుని మరల్చడానికి దేవతలకు కూడా, శక్యం గాదు. ఓ జగజ్జననీ! ఇంకా మరొక కారణం కూడా ఉన్నది. పూర్వం మహాత్ముడైన గౌతముడు గంగ నవతరింప చేశాడు.

ఋషిణా లోకపూజ్యేన త్రైలోక్యహితకారిణా ।
మమోపాయేన త్వద్వాక్యాత్ పూజ్యేన బ్రహ్మతేజసా ॥ 45 ॥

లోకపూజ్యుడు, ముల్లోకాలకు హితాన్ని గోరేవాడైన గౌతమఋషిచేత నా ఉపాయంతో, నీ మాటతో ఆ పూజ్యుడు బ్రహ్మతేజస్సుగలవాడు,

ఆరాధయిత్వా దేవేశం తపోభిః స్తుతిభిర్భవమ్ ।
తుష్టేన శంకరేణేదముక్తోఽసౌ గౌతమస్తదా॥ 46 ॥

దేవేశుడైన శివుణ్ణి తపస్సులతో, స్తుతులతో ఆరాధించాడు. అప్పుడు సంతుష్టుడైన శంకరుడు ఈ గౌతమునితో ఇలా అన్నాడు.

శంకర ఉవాచ :- శంకరుడు పలికాడు.

వరాన్వరయ పుణ్యాంశ్చ ప్రియాంశ్చ మనసేప్సితాన్ ।
యద్యదిచ్ఛసి తత్సర్వం దాతా తేఽద్య మహామతే ॥ 47 ॥

ఓ మహాజ్ఞానీ! నీ మనస్సులో వున్న ప్రియమైన పవిత్రమైన వరాలను కోరుకో. నీవు ఏదేది కోరితే అదంతా ఇప్పు డిస్తాను.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్తః శివేనాసౌ గౌతమో మయి శృణ్వతి ।
ఇదమేవ తదోవాచ సజటాం దేహి శంకర ॥
గంగాం మే యాచతే శర్వ కిమన్యేన వరేణ మే ॥ 48 ॥

శివుడలా అనగా గౌతముడు ఓ శంకరా! నా మనవి విన్నట్లైతే ఇదే కోరుతున్నాను. జటతో కూడుకున్న గంగను నా కొర కివ్వు. నా కింకా వేరే వరమెందుకు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

పునః ప్రోవాచ తం శమ్భుః సర్వలోకోపకారకః ॥ 49 ॥

లోకాలన్నింటికీ ఉపకారం చేసే శివు డతనితో మరల ఇలా అన్నాడు.

శమ్భురువాచ:- శివుడు పలికాడు.

ఉక్తం న చాఽఽత్మనః కిం చిన్నతద్యాచస్వ దుష్కరమ్ ॥ 50 ॥

నీగూర్చి ఏమీ చెప్పలేదు. ఆ దుష్కరమైన దానిని అడగవద్దు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

గౌతమోఽదీనసత్త్వస్తం భవమాహ కృతాంజలిః ॥ 51 ॥

దీనస్వభావం లేని గౌతముడు ఆ శివునికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

ఏతదేవ చ సర్వేషాం దుష్కరం తవ దర్శనమ్ ।
మయా తదద్య సంప్రాప్తం కృపయా తవ శంకర ॥ 52 ॥

అందరికి నీ దర్శనం లభించుటే కష్టం. ఓ శంకరా! నీ దయవలన ఈ రోజు నాకది లభించింది.

స్మరణాదేవ తే పద్భ్యాం కృతకృత్యా మనీషిణః ।
భవన్తి కిం పునః సాక్షాత్త్వయి దృష్టే మహేశ్వరే ॥ 53 ॥

నీ పాదాలను స్మరించినంత మాత్రాననే మనీషులు కృతకృత్యు లౌతారు. అటువంటి మహేశ్వరుని సాక్షాత్తుగా దర్శించినపుడు ఇంక చెప్పవలసిన దేమున్నది?

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

ఏవముక్తో గౌతమేన భవో హర్షసమన్వితః ।
త్రయాణాముపకారార్థం లోకానాం యాచితం త్వయా ॥ 54 ॥

గౌతముడిలా అనగా శంకరు డానందంతో నీవు మూడు లోకాలకు ఉపకారం చేయడానికి యాచించావు.

న చాఽఽత్మనో మహాబుద్ధే యాచేత్యాహ శివో ద్విజమ్ ।
ఏవం ప్రోక్తః పునర్విప్రో ధ్యాత్వా ప్రాహ శివం తథా ॥ 55 ॥

ఓ మహాబుద్ధీ! నీవు నీ కొరకై యాచించలేదని శివుడు ద్విజునితో అన్నాడు. ఇలా పలుకగా గౌతముడా శివుని ధ్యానించి తిరిగి ఇలా అన్నాడు.

వినీతవదదీనాత్మా శివభక్తిసమన్వితః ।
సర్వలోకోపకారాయ పునర్యాచితవానిదమ్ ॥
శృణ్వత్సు లోకపాలేషు జగాదేదం స గౌతమః ॥ 56 ॥

శివభక్తితోకూడి, దైన్యం లేనివాడై, వినమ్రతతో, లోకపాలురందరూ వింటుండగా సమస్త లోకాలకుపకారం చేయడానికి ఆ గౌతముడు తిరిగి ఇలా అన్నాడు.

గౌతమ ఉవాచ:- గౌతముడు పలికాడు.

యావత్సాగరగా దేవీ నిసృష్టా బ్రహ్మణో గిరేః ।
సర్వత్ర సర్వదా తస్యాం స్థాతవ్యం వృషభధ్వజ ॥ 57 ॥

ఓ శివా! బ్రహ్మపర్వతంనుండి బయలుదేరిన గంగాదేవి సముద్రాన్ని చేరేంతవరకు అంతటా, అన్నివేళలా ఆ గంగలో నీవుండాలి.

ఫలేప్సూనాం ఫలం దాతా త్వమేవ జగతః ప్రభో ।
తీర్థాన్యన్యాని దేవేశ క్వాపి క్వాపి శుభాని చ ॥ 58 ॥

యత్ర తే సన్నిధి ర్నిత్యం తదేవ శుభదం విదుః ।
యత్ర గంగా త్వయా దత్తా జటాముకుటసంస్థితా ॥
సర్వత్ర తవ సాన్నిధ్యాత్సర్వతీర్థాని శంకర ॥ 59 ॥

ఓ జగన్నాథా! ఫలాలను కోరేవారికి ఫలమిచ్చే వానివి నీవే. ఓ దేవేశా! ఎక్కడెక్కడ శుభావహాలైన ఇతర తీర్థాలున్నాయో, ఓ శంకరా! ఎక్కడ నీ సాన్నిధ్య ముంటే అదే శుభాన్నిస్తుం దంటారు. నీ జటాజూటంలో వున్న గంగ నెక్కడ నీ విచ్చావో అక్కడ అంతటా నీ సాన్నిధ్య ముండుటం వలన అవి సమస్తం తీర్థాలౌతాయి.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తద్గౌతమవచః శ్రుత్వా పునర్హర్షాచ్ఛివోఽబ్రవీత్ ॥ 60 ॥

ఆ గౌతముని మాటలు విని తిరిగి శివుడానందంతో ఇలా అన్నాడు.

శివ ఉవాచ:- శివుడు పలికాడు.

యత్ర క్వాపి చ యత్కించిద్యోవా భక్తిసమన్వితః ।
యాత్రాం స్నానమథో దానం పితౄణాం వాఽపి తర్పణమ్ ॥ 61 ॥

శ్రవణం పఠనం వాఽపి స్మరణం వాఽపి గౌతమ ।
యః కరోతి నరో భక్త్యా గోదావర్యా యతవ్రతః ॥ 62 ॥

సప్తద్వీపవతీ పృథ్వీ సశైలవనకాననా ।
సరత్నా సౌషధీ రమ్యా సార్ణవా ధర్మభూషితా ॥ 63 ॥

దత్వా తాం యో భవేద్ధర్మః స భవేత్ గౌతమీస్మృతేః ।
ఏవంవిధా ఇలా విప్ర గోదానాద్యాఽభిధీయతే ॥ 64 ॥

గౌతమా! ఎక్కడైనా, ఎవరైనా, ఎంతైనా, భక్తితో కూడినవాడై యాత్రను, స్నానాన్ని, దానాన్ని, పితృదేవతలకు తర్పణం గాని, శ్రవణం గాని, పఠనం గాని, స్మరణం గాని ఎవడు భక్తితో గోదావరీ తీరాన నియమవ్రతుడై చేస్తాడో ఏడు ద్వీపాలు, పర్వతాలు, వనాలు, అరణ్యాలు, రత్నాలు, ఓషధులు, సముద్రంతో కూడిన భూమిని ధర్మభూషితమైన దానిని, ఇస్తే ఏ ధర్మం, ఏ పుణ్యం వస్తుందో గౌతమిని స్మరిస్తే ఆ పుణ్యం వస్తుంది. ఓ విప్రా! ఈ విధంగా ఉన్న భూమిని ఇస్తే అది గోదానం కంటె గొప్పదని చెప్పబడుతున్నది.

చన్ద్రసూర్యగ్రహే కాలే మత్సాన్నిధ్యే యతవ్రతః ।
భూభృతే విష్ణవే భక్త్యా సర్వకాలం కృతా సుధీః ॥ 65 ॥

గాః సున్దరాః సవత్సాశ్చ సంగమే లోకవిశ్రుతే ।
యో దదాతి ద్విజశ్రేష్ఠ తత్ర యత్పుణ్యమాప్నుయాత్ ॥ 66 ॥

తస్మాద్వరం పుణ్యమేతి స్నానదానాదినా నరః ।
గౌతమ్యాం విశ్వవన్ద్యాయాం మహానద్యాం తు భక్తితః ॥ 67 ॥

సూర్యగ్రహణం, చంద్రగ్రహణ మేర్పడిన సమయంలో నా దగ్గర నియమవ్రతుడై, భూధరుడైన విష్ణుమూర్తికి ఎప్పుడూ భక్తితో ఏ జ్ఞానవంతుడు, ఓ బ్రహ్మణోత్తమా! లేగదూడతో కూడిన సుందరమైన ఆవులను, లోకంలో ప్రసిద్ధమైన సంగమ ప్రదేశంలో దానం చేస్తే దానివలన అక్కడ ఏ పుణ్యం వస్తుందో, విశ్వంలో వందనీయమైన గౌతమీనదిలో భక్తితో స్నాన, దానాదులు చేస్తే అంతకంటె గొప్పదైన పుణ్యం వస్తుంది.

తస్మాద్గోదావరీగంగా త్వయా నీతా భవిష్యతి ।
సర్వపాపక్షయకరీ సర్వాభీష్టప్రదాయినీ ॥ 68 ॥

అందువలన సమస్త పాపాలనీ నాశనం చేసేదీ, అన్ని కోరికలనిచ్చేదైన ఈ గోదావరీ గంగని తీసికొని వెళ్ళు.

గణేశ్వర ఉవాచ :- గణేశ్వరుడు పలికాడు.

ఏతచ్ఛ్రుతం మయా మాతర్వదతో గౌతమం శివాత్ ।
ఏతస్మాత్కారణాచ్ఛంభుర్గంగాయాం నియతః స్థితః ॥ 69 ॥

తల్లీ! నేనీ మాటలు శివుడు గౌతమునకు చెబుతుండగా విన్నాను. అందువలన శివుడు గంగతో విడదీయలేని సంబంధం కలిగి ఉన్నాడు.

కో నివర్తయితుం శక్తస్తమమ్బ కరుణోదధిమ్ ।
అథాపి మాత రేతత్స్యాన్మానుషా విఘ్నపాశకైః ॥ 70 ॥

వినిబద్ధా న గచ్ఛన్తి గోదామప్యన్తికస్థితామ్ ।
న నమన్తి శివం దేవం న స్మరన్తి స్తువన్తి న ॥ 71 ॥

అమ్మా! ఆ కరుణాసముద్రుని మరల్చడానికి కెవరు సమర్థులు? అయినా తల్లీ! మానవులు విఘ్నపాశాలచేత కట్టివేయబడి దగ్గరగా ఉన్నప్పటికీ గోదావరికిపోరు, శివదేవుని నమస్కరించరు, తలచరు, స్తోత్రం చేయ్యరు.

తథా మాతః కరిష్యామి తవ సన్తోషహేతవే ।
సంనిరోద్ధుమథో క్లేశస్తవ వాక్యం క్షమస్వ మే ॥ 72 ॥

తల్లీ! నీ సంతోషంకొరకు ఆ విధంగా చేయగలను. నీవు చెప్పినట్లుగా అతనిని మరల్చుట మాత్రం కష్టం. నన్ను క్షమించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ పలికాడు.

తతః ప్రభృతి విఘ్నేశో మానుషాన్ ప్రతి కించన ।
విఘ్నమాచరతే యస్తు తముపాస్య ప్రవర్తతే ॥ 73 ॥

అథో విఘ్నమనాదృత్య గౌతమీం యాతి భక్తితః ।
స కృతార్థో భవేల్లోకే న కృత్యమవశిష్యతే ॥ 74 ॥

అప్పటినుండి విఘ్నేశుడు మానవులకు కొంచం విఘ్నాన్ని చేస్తున్నాడు. ఎవడు అతనిని ఉపాసించి ప్రవర్తిస్తాడో, అతడు విఘ్నాలు లేకుండా భక్తితో గౌతమికి వెళ్ళగలడు. అటువంటివాడే లోకంలో కృతార్థుడు కాగలడు. అతడు చేయవలసిన దింకేమీ యుండదు.

విఘ్నాన్యనేకాని భవన్తి గేహాన్నిర్గన్తు కామస్య నరాధమస్య ।
నిధాయ తన్మూర్ధ్ని పదం ప్రయాతి గంగాం న కిం తేన ఫలం ప్రలబ్ధమ్ ॥ 75 ॥

ఇంటినుండి బయటికి వెళ్ళుదామనుకున్న నరాధమునికి అనేక విఘ్నాలు వస్తాయి. అతని తలమీద పాదాన్ని ఉంచి, గంగను ప్రవహింప చేయి. అప్పుడతడు ఏ ఫలాన్ని పొందకుండా ఉంటాడు?

అస్యాః ప్రభావం కో బ్రూయాదపి సాక్షాత్సదాశివః ।
సంక్షేపేణ మయా ప్రోక్తమితిహాసపదానుగమ్ ॥ 76 ॥

గౌతమి ప్రభావా న్నెవరు చెప్తారు? సాక్షాత్తుగా సదాశివుడు కూడా చెప్పలేడు. ఈ ఇతిహాస వాక్యాల ననుసరించి నేను సంక్షేపంగా చెప్పినాను.

ధర్మార్థకామమోక్షాణాం సాధనం యచ్చరాచరే ।
తదత్ర విద్యతే సర్వమితిహాసే సవిస్తరే ॥ 77 ॥

ఈ చరాచర జగత్తులో ధర్మార్థ కామ మోక్షాలకు సాధనమేదో అది ఈ ఇతిహాసంలో సవిస్తరంగా ఉంటుంది.

వేదోదితం శ్రుతిసమగ్రరహస్యయుక్తం సత్కారణం సమభిధానమిదం సదైవ ।
సమ్యక్చ దృష్టం జగతాం హితాయ ప్రోక్తం పురాణం బహుధర్మయుక్తమ్ ॥ 78 ॥

వేదంలో చెప్పబడినదీ, శ్రుతులలో వుండే రహస్యా లన్నింటితో కూడినదీ, సత్కారణం అయినది, చక్కని మాటలతో కూడుకున్నది, ఎల్లప్పుడూ సమదృష్టీ గలదీ అనేక ధర్మాలతో కూడుకొని ఉన్నదీ అయిన ఈ పురాణాన్ని జగత్తుకు హితాన్ని కలిగించడానికై చెప్పినాను.

అస్య శ్లోకం పదం వాపి భక్తితః శృణుయాత్పఠేత్ ।
గంగా గంగేతి వా వాక్యం స తు పుణ్యమవాప్నుయాత్ ॥ 79 ॥

ఈ పురాణం, శ్లోకాన్నిగాని, పదాన్నిగాని, భక్తితో విన్నా, చదివినా, లేదా గంగా గంగా అనే వాక్యాన్ని విన్నా, చదివినా గూడా అతడు పుణ్యాన్ని పొందుతాడు.

కలికలంకవినాశపటు త్విదం సకలసిద్ధికరం శుభదం శివమ్ ।
జగతి పూజ్యమభీష్టఫలప్రదం భవతి గాంగముదీరితముత్తమమ్ ॥ 80 ॥

గంగాశబ్దం కలి కళంకాన్ని వినాశం చేసే సామర్థ్యం కలదీ, సకల సిద్ధులను కలుగజేసేదీ, శుభాన్నిచ్చేదీ, లోకంలో పూజనీయురాలూ, కోరినఫలాలనిచ్చేదీ అవుతుంది. అందువలన గంగానదీ తీర్థం ఉత్తమ మన్నారు.

సాధు గౌతమ భద్రం తే కోఽన్యోఽస్తి సదృశస్త్వయా ।
య ఏనామానయేద్గంగాం దణ్డకారణ్యమాదరాత్ ॥ 81 ॥

మంచిది గౌతమా! నీకు శుభమగుగాక! నీ వంటివాడు మరొక డెవరున్నారు? ఎవరు ఈ గంగను దండ కారణ్యంనుండి ఆదరంగా తీసుకొని రాగలరు?

గంగా గంగేతి యో బ్రూయాద్యోజనానాం శతైరపి ।
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ॥ 82 ॥

వందల యోజనాల కొలది దూరంగా ఉన్నా, ఎవరు గంగా, గంగా, అని పలికితే వారు సర్వ పాపాలనుండి విముక్తులై విష్ణులోకాన్ని చేరగలరు.

తిస్రః కోట్యో౽ర్ధకోటీ చ తీర్థాని భువనత్రయే ।
తాని స్నాతుం సమాయాన్తి గంగాయాం సింహగే గురౌ ॥ 83 ॥

బృహస్పతి సింహరాశిలో ఉన్నప్పుడు ముల్లోకాలలో ఉన్న మూడున్నర కోట్ల తీర్థాలు గంగానదిలో స్నానం చేయటానికి వస్తాయి.

షష్టివర్షసహస్రాణి భాగీరథ్యావగాహనమ్ ।
సకృద్గోదావరీస్నానం సింహయుక్తే బృహస్పతౌ ॥ 84 ॥

భాగీరథీనదిలో ఆరువేల సంవత్సరాలు స్నానం చేస్తే ఏ ఫలం లభిస్తుందో, సింహరాశిలో బృహస్పతి వున్నప్పుడు గోదావరిలో స్నానం చేస్తే ఆ ఫలం లభిస్తుంది.

ఇయం తు గౌతమీపుత్ర యత్ర క్వాపి శివాజ్ఞయా ।
సర్వేషాం సర్వదా నృణాం స్నానాన్ముక్తిం ప్రదాస్యతి ॥ 85 ॥

నాయనా! ఈ గౌతమి అయితే శివుని ఆజ్ఞతో ఎక్కడైనా, ఎల్లప్పుడు మానవులందరికి స్నానం చేసినంత మాత్రాన్నే ముక్తినిస్తుంది.

అశ్వమేధసహస్రాణి వాజపేయశతాని చ ।
కృత్వా యత్ఫలమాప్నోతి తదస్య శ్రవణాద్భవేత్ ॥ 86 ॥

వేయి అశ్వమేధ యజ్ఞాలు చేస్తే, నూరు వాజపేయాలు చేస్తే ఏ ఫలం లభిస్తుందో ఆ ఫలం గౌతమీ శబ్దాన్ని వినటం చేతనే గలుగుతుంది.

యస్యైతత్తిష్ఠతి గృహే పురాణం బ్రహ్మణోదితమ్ ।
న భయం విద్యతే తస్య కలికాలస్య నారద ॥ 87 ॥

ఓ నారదా! బ్రహ్మచెప్పిన ఈ పురాణం ఎవరి ఇంటిలో ఉంటుందో వారికి కలియుగంలో కలివలన వచ్చే భయముండదు.

యస్య కస్యాపి నాఽఽఖ్యేయం పురాణమిదముత్తమమ్ ।
శ్రద్ధధానాయ శాన్తాయ వైష్ణవాయ మహాత్మనే ॥ 88 ॥

ఈ ఉత్తమమైన పురాణాన్ని ఎవరిబడితే వారికి చెప్పగూడదు. ఎవనికి శ్రద్ధగలదో, ఎవరు శాంతంగా ఉంటారో, ఎవరు వైష్ణవులో, ఎవరు మహాత్ములో వారికి మాత్రమే చెప్పాలి.

ఇదం కీర్త్యం భుక్తిముక్తిదాయకం పాపనాశనమ్ ।
ఏతచ్ఛ్రవణమాత్రేణ కృతకృత్యో భవేన్నరః ॥ 89 ॥

ఇది కీర్తించదగింది. భుక్తిని, ముక్తిని ఇచ్చేది. పాపం నశింపజేసేది. దీనిని విన్నంత మాత్రాననే మానవుడు కృతకృత్యుడవుతాడు.

లిఖిత్వా పుస్తకం యస్తు బ్రాహ్మణాయ ప్రయచ్ఛతి ।
సర్వపాపవినిర్ముక్తః స గర్భం నపునర్విశేత్ ॥ 90 ॥

ఈ బ్రహ్మపురాణాన్ని వ్రాసి ఆ పుస్తకాన్ని బ్రాహ్మణుడికి దానం చేస్తే, సమస్త పాపలనుండి విముకుడై పునర్జన్మపొందదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణాన్తర్గతగౌతమీమాహాత్మ్యే తీర్థమాహాత్మ్యే గంగామాహాత్మ్యశ్రవణాదిఫలవర్ణనం నామ పంచాధిక శతతమోఽధ్యాయః ॥ 105 ॥

శ్రీ బ్రహ్మపురాణంలోని గౌతమీ మాహాత్మ్యము నందలి తీర్థమహాత్మ్యములోని బ్రహ్మానారద సంవాదంలోని గంగా మాహాత్మ్య శ్రవణం మున్నగు ఫల వర్ణనమనే నూట ఐదవ అధ్యాయం సంపూర్ణం.

సమాప్తం గౌతమీమాహాత్మ్యసహితం బ్రహ్మపురాణమ్ ।

గౌతమీ మాహాత్మ్యంతో కూడిన బ్రహ్మపురాణం సమాప్తం.

ఓం తత్సత్ శ్రీ వేంకటేశ్వరచరణారవిందార్పణమస్తు.

ఓం శాంతిః శాంతిః శాంతిః.